కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 7

ఉద్యోగపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Udyogaparvamu of Tikkana Somayaji
Vol.VII.

Commentary by
Dr. Jonnalagadda Mrityunjaya Rao- 1,2 Cantos
Sri Mudivarthi Kondamacharyulu- 3,4 Cantos

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.606
First Edition : August 2000
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్‌సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

ఉద్యోగ పర్వం ధర్మానికి జయం అనే నానుడిని సార్థకం చేసే భారతంలో ఉద్యోగానికి ఆరంభ ఘట్టమని చెప్పవచ్చు. సామాన్యంగా విరాట, ఉద్యోగ పర్వాలనుకలిపి పారాయణం చేయడం, వ్యాఖ్యానించడం ఆనవాయితీగా ఉన్నప్పటికి తిరుమల తిరుపతి దేవస్థానాలు తిక్కన విరాట పర్వాన్ని సవ్యాఖ్యానంగా గోదావరి పుష్కరాలలో విడుదల చేయడం జరిగింది. ఇప్పుడు కృష్ణా పుష్కరాలకు ముందు ఉద్యోగ పర్వాన్ని విడుదల చేయడం జరుగుతున్నది.

ఉద్యోగ పర్వం ఒక విధంగా మహా భారత పాత్రల అంతరంగాల వివరణ పర్వం. ఇక్కడ సమరమో, సంధానమో అనే చర్చ జరిగింది. ధర్మరాజు, భీముడు మున్నగు వారి మనస్తు ములాన్ని ప్రకటించే ఘట్టం. దానికి తోడు ద్రౌపది మున్నగువారి మనసును కూడ తెరిచిపెట్టేందుకు అవకాశం. ఈ మధ్యలో ఆవలిగట్టుపైన దుర్యోధనాది దుష్ట చతుష్టయం, కుంతి, విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి, భీష్మద్రోణుల అంతరంగం కూడ స్పష్టమౌతోంది. మరొకవైపు కర్ణ భేదనము, కుంతీ కర్ణ సంవాదము మొదలైనవి ముఖ్య ఘట్టాలిందున్నాయి. అన్నిటికంటే ముఖ్యమైంది పరమాత్ముని అతి మానుషలీలాచేష్టితాలైన పరస్పర విరుద్ధ విపరీత శక్తులను శ్రీ కృష్ణుడు తన కార్యంలో అనగా ధర్మసంస్థాపనలో వినియోగించుటకు పన్నే పన్నాగం అంటే ఆయన సర్వ శ్రేష్ఠ రాజ కార్య దురంధరత్వం గురు లఘు విన్యాసాలతో ఇందు నిరూపించబడింది. అందువలననే ఉద్యోగపర్వం పాఠకుల మనస్సులను లెస్సగా ఆకట్టుకుంటుంది.

ముఖ్యంగా ధృతరాష్ట్రుడి సభలో సంధిసమకూర్చడానికి వచ్చిన పరమాత్మను పట్టి బంధించడానికి దుర్యోధనాదులు ప్రయత్నించినపుడు ఆయన విశ్వరూపాన్ని ప్రకటించడం, దాన్ని ధృతరాష్ట్రుడు విశేష జ్ఞాన దృష్టితో చూడడం జరుగుతుంది. మరల తాను అంధుడు కావాలను కోవడం అతడి మానసిక పరిస్థితిని విస్ఫుటంగా తెలియజేస్తుంది. తిక్కన సోమయాజి వ్యాసులవారిని అనుసరించి అనువదించినా తెలుగులో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన మహాకృతిని వ్రాసి ఆంధ్రులకు మహోపకారం చేశారు. దానికి వ్యాఖ్యానాన్ని డా. జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, మహాకవి ముదివర్తి కొండమాచార్యులవారు రచించి భారతార్థాన్ని ఆంధ్రులకు సుగమం చేశారు. వారికి ధన్యవాదములు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యాన సహిత మహాభారతానికి ప్రధాన సంపాదకులుగా శ్లాఘ్యమైన కృషి చేస్తున్నారు. ఆయన సంతరించిన విశేషవివరణలు, పీఠికలు, కథాసంగ్రహాలు ఆంధ్రమహాభారత పరమార్థాన్ని, స్పష్టంగా, సరళంగా తెలియజేస్తున్నాయి. అందుకు వారికి నమోవాకాలు.

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పుస్తకాన్ని పునర్ముద్రిస్తున్నాము (2006). ఎప్పటిలాగే చదువరులు ఉద్యోగపర్వాన్ని ఆదరాభిమానాలతో స్వాగతిస్తారని ఆశిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి,
తి.తి. దేవస్థానములు,తిరుపతి.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహనిర్మాణం, పోతన భాగవత ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్దారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్**

సలహాసంఘం

ఆచార్య తూమాటిదొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీకాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నందూరి రామకృష్ణమాచార్య	**శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్దారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిని పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్‌డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25 వ తేదిన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాతి కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తక్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడ నున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల

తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్‌కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానికపండితవర్యుల ఒక ఉప సంఘం (ఎడిటోరియల్‌సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె. సర్వోత్తమరావు, స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే ఆరణ్యపర్వం మొదలుకొని తక్కినపర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు అతి తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ. పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఎ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీపొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి, ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
ఆను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

పీఠిక

ఉ. ‘సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్షసేసి రది వారల చేటగుఁ గాని ధర్మ ని
స్తారక మయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్.’ **(ఉద్యో.3.273)**

“భారతే సార ముద్యోగమ్” -అని ప్రసిద్ధి. మహాభారతంలో ఉద్యోగపర్వం సారవంతం. ఆ పర్వంలోని సారమంతా ఈ పద్యం.

“యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ,
హన్యతే ప్రేక్షమాణానాం హతా స్తత్ర సభాసదః”. **(సం. 5.93.48)**

ధర్మం అధర్మంచేత, సత్యం అబద్ధంచేత చంపబడుతున్నప్పుడు ఎవరు కళ్ళొప్పగించి చూస్తూ ఉండిపోతారో, ఆ సభాసదులు నశిస్తారని వ్యాసభట్టారకుడు శ్రీకృష్ణుడినోట పలికించగా, దక్షు లుపేక్ష చేసినా, ధర్మాన్ని ఉద్ధరిస్తూ, సత్యానికి శుభాన్ని కలిగిస్తూ రక్షిస్తూ దైవం ఎల్లప్పుడూ ఉంటాడని తిక్కనసోమయాజి గోవిందుడినోట అదనంగా అనిపించి అద్భుతమైన ముగింపు నిచ్చాడు. అంతేకాదు. సత్యధర్మాలు అసత్యాధర్మాలచేత పీడించబడి లక్ష్యాలను సాధించలేని దీనస్థితికి చేరుతాయే కాని నశించవని తిక్కన తీర్పు. వాటిని ఉద్ధరించవలసిన బాధ్యత దైవాంశసంభూతులైన రక్షకులకు సహజంగా ఉంటుంది.

అది వారి ధర్మం, నిత్య సత్యం. దానిని విస్మరించే వారికి చావు తప్పదని వ్యాసభగవానుడు, కీడు తప్పదని తిక్కన సోమయాజి. మూలంలో ఈ ప్రభావం సభాసదులకు మాత్రమే పరిమితమైనట్లు స్ఫురిస్తుంది. తెలుగులో ఇది సార్వకాలీనమైన, సర్వజనీనమైన సత్యంగా వెలుగొందుతుంది. అంతేకాదు- వ్యాసవాక్యం నిష్ఠుర సత్యం. తిక్కన పద్యం నిర్మలసత్యం. వ్యాస భట్టారకుడి వ్యాఖ్య సభలకు ప్రాధాన్యమున్న సభాపర్వానికీ, ఉద్యోగపర్వానికీ వర్తించేటట్లు కనబడుతుంది. తిక్కనసూక్తి అష్టాదశపర్వాలనూ ఆవరించేదిగా వినబడుతుంది. ఈపద్యం ఉద్యోగపర్వసారమే కాదు; మహాభారత పరమార్థ సారం.

1. ఉద్యోగపర్వం ఉత్కంఠాపర్వం

''ఉద్యోగః పురుషలక్షణమ్''-అని ఒక సాధారణ సూక్తి. ''ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మీః''-అని హితోపదేశసూక్తి. ప్రయత్నంచేయటం పురుషలక్షణం, ఉద్యోగియైన పురుషసింహుడిని లక్ష్మి చేరుతుంది. మహాభారతంలో పురుషసింహులు పాండవులు. వారు రాజ్యసంపదకోసం చేసే విశేషయత్నం ఉద్యోగపర్వ కథాంశం.

పంచమవేదమనీ, కావ్యేతిహాసమనీ పేరుపొందిన ఆంధ్రమహాభారతంలో విరాట-ఉద్యోగపర్వాలు కేంద్రబిందువులు. పద్ధెనిమిది పర్వాల భారత కథ ఒక త్రాసైతే, ఈరెండు పర్వాలూ త్రాసులో మొగ్గుచూపే ముల్లువంటివి. విరాటపర్వంలో పాండవులు అజ్ఞాతవాసాన్ని నిర్విఘ్నంగా నిర్వహించారు. పాండవులు బయలు మెరశారు. అభిమన్యుడికీ ఉత్తరకూ వివాహమయింది. పాంచాల యాదవాది దేశాధిపతులు వివాహశుభకార్యం ముగిసిన తరువాత పాండవుల భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించటానికి విరాటరాజు సభాభవనంలో ధర్మరాజువద్ద పెద్ద సభతీర్చారు. పాండవులు రెండవసారి జూదం ఆడినప్పుడు రాజ్యాధికారాన్ని పొంది ఉన్నారు. జూదంలో పెట్టిన నియమాలలో రాజ్యప్రసక్తి లేదు. కాబట్టి అరణ్యాజ్ఞాతవాసాలు ముగిసిన తరువాత పాండవులకు వారి రాజ్యభాగం రావటమే న్యాయం. దానికోసం ప్రయత్నం చేయాలని నిశ్చయించారు.

ఉద్యోగమంటే ప్రయత్నం. పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగంకోసం చేసే ప్రయత్నం ఉద్యోగం. ఆ యత్నాన్ని వివరించే కథా భాగం ఉద్యోగపర్వం. రాజ్యయత్నం రాజనీతి నాశ్రయించి సాగాలి. రాజనీతిలో ఉపాయాలు నాలుగున్నాయి. అవి సామ, దాన, భేద, దండోపాయాలు. మొదటి మూడు విఫలమైతే చివర ప్రయోగించదగింది దండోపాయం- అంటే యుద్ధం. యుద్ధానికి సిద్ధమయ్యే సామదానభేదదండోపాయాలను సాగించటం రాజనీతి. దీనిని నిర్వహించటమే ఉద్యోగపర్వంలోని ప్రధానవస్తువు.

మహాభారతం ఒక మహానాటకమైతే విరాటోద్యోగ పర్వాలు అందులో గర్భసంధిగల భాగంవంటివి. అంటే- ఇంగ్లీషు డ్రామాలో క్లైమాక్స్ (**climax**) వంటివి. పాండవులు ఏ క్షణంలో గుర్తించబడతారో, ఎప్పుడు అజ్ఞాతవాస నియమం భంగం కాకుండా పూర్తవుతుందో-అని పఠిత ఉత్కంఠను పొందుతాడు విరాటపర్వం చదివేటప్పుడు. అందువలన ఆ పర్వం నానారసాభ్యుదయోల్లాసి. ఉద్యోగపర్వంలో పాండవులకు రాజ్యం దక్కుతుందా? దక్కదా?-అనే ఉత్కంఠ బలంగా కలుగుతుంది. మూడు రాయబారాలు సాగినా కథ ముడివీడదు. చివరకు యుద్ధమే శరణ్యమని నిశ్చయించేంతవరకు కథలో ఇదమిత్థమని చెప్పలేని ఒక అనిశ్చిత భావం ఉంటుంది. అందువలన ఉద్యోగపర్వం ఉత్కంఠాపర్వం.

2. నాలుగు ఉపాయాలు: నాలుగు ఆశ్వాసాలు

ఉద్యోగం ఉపాయాశ్రితం. పాండవోద్యోగంలో ప్రవర్తిల్లిన నాలుగు రకాల ఉపాయాలను వివరించేందుకా అన్నట్లు సహజంగా నాలుగు ఆశ్వాసాలు అమరి ఉండటం విశేషం.

(1). సామోపాయం: ప్రథమాశ్వాసం

ప్రథమాశ్వాసంలో పాండవ పక్షాన సామోపాయ ప్రయోగానికి ప్రయత్నం ప్రారంభమయింది. బలరాముడి మాటలలో అది సూచించబడింది.

చ. 'తమ సగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరు వీరికిన్
సముచితవృత్తి నిచ్చి తమసామున సంతసమంది యున్కి యు
క్తము ధృతరాష్ట్ర సూనునకు; దాన నపాయము లేకయుండుఁ; గో
ప ముడిగి వీరు సేయుదురు బాంధవ; మిజ్జగముం బ్రియంపడున్'. **(ఉద్యో. 1. 19)**

వ. 'కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుపవలయు.......' **(ఉద్యో. 1.20)**

అరణ్యాజ్ఞాతవాసాల తరువాత పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగాన్ని రాజైన ధృతరాష్ట్రుడు పిలిచి ఇవ్వాలా? లేక పాండవులే ఆక్రమించుకొనాలా? అన్నది సమస్య. ధృతరాష్ట్ర దుర్యోధనులు కుత్సితులు కాబట్టి పాండవులను పిలిచి భాగమివ్వరు. ధర్మరాజు బలప్రయోగంతో తన రాజ్యభాగాన్ని అధీనంలోకి తెచ్చికొనవచ్చును. కాని, పెదతండ్రి అనుమతిని కోరటానికే నిర్ణయించాడు. ధృతరాష్ట్రుడు పేరుకు ప్రభువైనా ప్రభుత్వం చెలాయిస్తున్నది దుర్యోధనుడు. అడిగితే అతడు అంగీకరించడు, తండ్రిచేత అంగీకరింపచేయడు. పాండవులు బలవంతులే అయినా ఒంటరిగా భీష్మాదులతో పోరి రాజ్యాక్రమణం చేయటం లోకులు మెచ్చేపని కాదు. అదీకాక సహాయ సహకారాలు తక్కువగా ఉన్నరాజు తాను బలవంతుడైనా యుద్ధానికి సిద్ధంకావటం రాజనీతికాదు. సామోపాయంతో కార్యసాధనం చేయటం సమంజసం. శ్రీకృష్ణ బలరామాదులు చెప్పిన సలహా అదే. ధర్మజుడు పెద్దల సలహాలను శిరసా వహించి సామోపాయానికి సమ్మతించాడు. ద్రుపద పురోహితుడిని రాయబారిగా పంపే ప్రయత్నానికి అనుమతించాడు.

ద్రుపదపురోహితుడి రాయబారం సామోపాయంలో ఉండదగినంత సౌమ్యంగా లేదని భీష్మాదులు భావించారు.

క. 'నీ వాక్యము విప్రస్వా । భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్
భావింపఁ గార్యమున యం । దే విధమున సభకు నింత యిష్టంబగునే?' **(ఉద్యో. 1. 243)**

అని పితామహుడే వ్యాఖ్యానించాడు. రాజ్యభాగ ప్రసక్తితోపాటు పాండవ పౌరుష ప్రశంస దుర్యోధనాదుల కోపాగ్నికి ఆజ్యం పోసినట్లయింది. సామప్రయోగసాధనమైన సంధియత్నం విఫలమయింది. బ్రాహ్మణ వచనంకంటె కురుసభలో పాండవులనూ, పార్థపరాక్రమాన్నీ కీర్తించిన భీష్ముడి వాక్కులు కర్ణాదులను కలతపెట్టాయి. సభలో రభస జరిగేవరకు వచ్చింది. ధృతరాష్ట్రుడు పాండవదూతను సౌమ్యంగా వారించి, తానూ సామోపాయాన్ని ప్రయోగించనున్నట్లు ప్రతివ్యూహాన్ని ప్రకటించాడు.

ఉ. 'మంచిగ నేను బంధులును మంత్రిజనంబులుఁ బెద్దలున్ విచా
రించి సమస్త భూప్రజకుఁ బ్రీతిగ బిడ్డలపాలి కిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు; మదీయ మనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట దెల్లము కౌరవజాతి కెంతయున్'. **(ఉద్యో. 1. 256)**

పాండవుల రాయబారం దుష్టచతుష్టయానికి అంగీకారం కాలేదు. మరి, ధృతరాష్ట్రుడు నిండుకొలువులో తేల్చి చెప్పకుండా, తానూ ఒక రాయబారం నడుపుతానని పూనుకొన్నాడు. అయితే, ఆ రాయబారం-విఫలమైన పాండవ సామోపాయాన్ని సఫలం చేయటానికా? సఫలమైన కౌరవయత్నాన్ని కప్పిపుచ్చుకొనటానికా? పాండవ ప్రయత్నాన్ని

తిప్పికొట్టటానికా? సామోపాయాన్ని ప్రయోగించిన పాండవుల యత్నానికి ప్రతివ్యూహం పన్ని దాన్ని సమూలంగా కుప్పకూల్చటానికా? సభలో ఎవరికీ అంచనాలకు అందనట్లు నిపుణంగా మాట్లాడాడు ధృతరాష్ట్రుడు. ఏమైనా, ధర్మరాజు యుద్ధోద్యోగప్రగతిలో ఒకమెట్టు పైకెక్కటానికి బ్రాహ్మణుడి రాయబారం తోడ్పడింది.

ప్రథమాశ్వాసంలో సంజయుడి రాయబారంకూడా ఉండటం సమంజసం. సంజయుడి రాయబారం ధృతరాష్ట్రుడి వక్రరాజనీతిలో కుటిల సామోపాయానికి చక్కని నిదర్శనం. పాండవులు తమ రాయబారం ద్వారా సంధినీ, సహజీవనాన్ని కోరారు. అది లభించకపోతే సమరానికి సిద్ధమని ప్రకటించారు. దుర్యోధనుడు పాండవులతోడి సంధికి గాని, సహజీవనానికిగాని సమ్మతించడు. కాని, యుద్ధానికి కాలుదువ్వుతాడు. ధృతరాష్ట్రుడు కొడుకుమాటను కాదనలేడు; కాని, యుద్ధమంటే భయపడతాడు. కొడుకు కోరిక తీరాలి, కొడుకు యుద్ధంలో చావకుండ సుఖంగా ఉండాలి. దానికి మార్గం ఒక్కటే. ధర్మరాజు రాజ్యం కోరకూడదు, యుద్ధం చేయకూడదు. అతడిని శాంతచిత్తుడిగా మార్చి, సంపదలకు దూరంగా, సమరానికి విముఖంగా సాధువృత్తిలో జీవించేటట్లు బోధించాలి. మరొకమాటలో చెప్పాలంటే - ధర్మజుడు యుద్ధోద్యోగంలో మొదటి ఉపాయాన్ని - సామాన్ని ప్రయోగిస్తే, ధృతరాష్ట్రుడు ధర్మరాజు యుద్ధోద్యోగాన్నే పూర్తిగా మాన్పించి. శత్రువిజయాన్ని సౌమ్యంగా సాధించాలని యత్నించాడు. ఇది శుక్రరాజనీతిలోని వక్రసామోపాయం.

క. 'నెయ్యము వాటించి కడుం । దియ్య మెసఁగ నలుక లెల్లఁ దీఱునటులుగాఁ
గయ్యమను తలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్'. **(ఉద్యో.1.271)**

ప్రయోగించిన ధృతరాష్ట్రుడి వక్రనీతి ధర్మరాజువద్ద వికటించింది. తండ్రి నీతిలోని అవినీతిని బట్టబయలుచేసి సంజయుడిని సర్దుమణిగేటట్లు చేశాడు యుధిష్ఠిరుడు.

క. 'ఎదిరిం దమయట్టుల కా । మదిఁ దలఁచినఁ బొసఁగుఁ గాక! మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁ డని । చదురడిచిన మనసుపొందు చక్కంబడునే!' **(ఉద్యో.1.312)**

సామోపాయంలో సక్రమనీతికి ధర్మరాజు, వక్రనీతికి ధృతరాష్ట్రుడు ప్రతినిధులుగా గోచరిస్తారు. న్యాయమైనా కౌరవులకు ఇష్టంలేని మాటలను కష్టం తోచేటట్లు చెప్పినందుకు బ్రాహ్మణుడి రాయబారం విఫలమైనదని భీష్మాదులు భావించారు. తేనెపూసిన కత్తులవంటి మాటలతో పాండవులకు నష్టం కలిగించే నయ వంచనా వాక్యాలను పలికి ధర్మజాదుల నిష్ఠురాలకు గురికావటం వలన సంజయుడి రాయబారం విఫలమైనదని కృష్ణాదులు భావించారు. విఫలమైన సామోపాయం పాండవులకు ప్రగతి సూచిక; కౌరవులకు దుర్గతి సూచిక! నాయక ప్రతినాయక పక్షాల సామోపాయ విఫల చిత్రణాల వలన ప్రథమాశ్వాసానికి నిండుదనం కలిగింది.

(2). దానోపాయం: ద్వితీయాశ్వాసం

శత్రువులు బలవంతులైనప్పుడు కాని, జయాపజయాలు సందిగ్ధావస్థలో ఉన్నప్పుడుగాని, యుద్ధంవలన కలిగే లాభంకంటె నష్టం అధికంగా ఉన్నప్పుడుగాని, సంధికుదుర్చుకొని శాంతిని పొందుదామనుకొన్నప్పుడుగాని, తాను తగినంత బలాన్ని సమీకరించుకొనలేనిస్థితిలో ఉన్నప్పుడుగాని సామాన్యంగా ప్రభువు దానోపాయాన్ని ప్రయోగిస్తాడు. అంతేకాదు, బలోన్నతికి కొంత సమయం కావలసివచ్చినప్పుడు కూడా దానాన్ని కాలయాపనకు ఒక అవకాశంగా రాజనీతిలో ప్రభువులు వాడుకొంటారు.

ఉద్యోగపర్వంలో ధర్మజుడు యుద్ధోద్యోగంలో ఒక భాగంలో దానోపాయాన్ని నిపుణంగా ప్రయోగించాడు. దీనిని గురించిన విచారమే ద్వితీయాశ్వాసకథా జీవితంగా వ్యాఖ్యానించ వచ్చును. ఉపప్లావ్యంలో విడిదిచేసి ఉన్న ధర్మరాజు

ప్రస్తుతం రాజ్యసంపద లేనివాడు, కాని, బంధుసంపద కలవాడు. ధృతరాష్ట్ర దుర్యోధనులు పాండవరాజ్యాన్ని హరించి, వారికి మరల రాజ్యావకాశం కలిగించకుండా, దానిని శాశ్వతంగా అనుభవించాలని కుతంత్రాన్ని పన్నుతున్న కుత్సితులు, భౌతికంగా చూస్తే కౌరవులు రాజ్యసంపన్నులు, బలవంతులుగా కనబడతారు. రాజ్యం లేకపోయినా స్వీయబలంతో ఎంతటి రాజ్యాన్నైనా కబళించివేయగల సమర్థుడు ధర్మరాజు. అయినా ధర్మనీతితో రాజ్యాన్ని పొందాలని భావించే ధర్మమూర్తి. అతడు ప్రయోగించే దానోపాయం ఈ పరిస్థితులలో గడుసుగా ఉంటుంది. సంజయుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు-

క. ‘రండని పిలువఁ బనిచి, పా । లిండని కొడుకులకుఁ జెప్పి, యింద్రప్రస్థం
బొండెను వేఱొక పట్టణ । మొండెను మా కిచ్చి యనుచు టుచితమ కాదే?’ **(ఉద్యో. 1.327)**

పాండవులకు రావలసిన రాజ్యభాగాన్ని ధృతరాష్ట్రుడు గౌరవంగా ఇవ్వాలని కోరుతూ, ఇంద్రప్రస్థమే కాకపోతే, మరేపట్టణమైనా ఇవ్వవచ్చునని ధర్మరాజు అడిగాడు. పూర్వం పాండవుల కిచ్చిన రాజ్యభాగానికి రాజధాని ఇంద్రప్రస్థం. దానిని పాండవులు పునర్నిర్మాణంచేసి అభివృద్ధిచేశారు. అక్కడినుండి దిగ్విజయంచేశారు. అక్కడే రాజసూయం చేశారు. మయసభాది అపూర్వ నిర్మాణవైభవాన్ని దానికి కల్పించారు. అదే దుర్యోధనుడి అసూయకు ఆలంబనమయింది; పాండవసంపదను హరించే దుర్యోధనుడి దుర్నీతికి ఆ పట్టణసంపదే మూలహేతువయింది. ఒకవేళ ఆ సంపదను దుర్యోధనుడు పాండవులకు తిరిగి ఇచ్చే తెంపు ప్రకటించలేకపోతే, మరొక పట్టణమైనా ఇమ్మని ధృతరాష్ట్రుడిని కోరటం ఇందులోని తాత్పర్యం. అభివృద్ధిచెందిన రాజ్యాన్ని త్యాగంచేసి అభివృద్ధిచెందని మరొక ప్రాంతాన్ని కోరుకొనటంలో కొంత త్యాగరూపమైన దానోపాయం భాసిస్తుంది. ధర్మరాజు బలహీనుడై ఈ మాట అనలేదు. రాజనీతిలో భాగంగా ఆ ఉపాయాన్ని ప్రయోగించాడు. అతడా ప్రతిపాదన చేయటానికి ముందు దానిని ఎవరికీ చెప్పలేదు. ఎవరి సలహాకూడా తీసికొనలేదు. వినేవారు ఆశ్చర్యపడేటట్లు ప్రకటించాడు. అయినా అది ఫలించలేదు. శ్రీకృష్ణుడితో ఈ అంశాన్ని గురించి ఇట్లా ప్రస్తావించాడు.

క. ‘ఇచ్చుటి బంధులు నీవును । నచ్చెరువడి వినుచునుండ నయిదూళులు మా
కిచ్చినను జాలునంటిని । బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ!’ **(ఉద్యో. 3.11)**

ధర్మజుడు ప్రయోగించిన దానోపాయం ధృతరాష్ట్రుడి హృదయంలో కల్లోలాన్నీ, సంక్షోభాన్నీ సృష్టించింది. రాత్రిళ్ళు అతడు నిద్రపోలేకపోయాడు. విదురాదుల ప్రబోధాలను వింటూ వేదననుండి తేరుకొనాలని ప్రయత్నించాడు. కాని, అతడి హితులందరూ ధర్మజుడి రాజ్యభాగాన్ని గురించి ప్రస్తావించి, దానిని తిరిగి దానంచేస్తే, అతడికి మనశ్శాంతి లభిస్తుందనీ, కులక్షయం కాకుండా శుభం కలుగుతుందనీ బోధించారు. మచ్చుకు - విదురుడు విజ్ఞతతో చేసిన మందలింపు ధృతరాష్ట్రుడికి దిగ్భ్రాంతిని కలిగించింది.

ఉ. ‘డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె; దది యెట్లఱుగున్? విను; మీను లోలతన్
గ్రక్కున నామిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు సూవె; యి
ట్లుక్కివుఁడైన నీ కొడుకు నుల్లము నున్నటు లాడఁ గూడునే?’ **(ఉద్యో. 2.52)**

తమ్ముడి భాగమైన రాజ్యాన్ని తిరిగి తమ్ముడి కొడుకులకు ఇవ్వటమే దానమనుకొన్నా, ధృతరాష్ట్రుడు అంత బాధపడవలసిన పనిలేదు. రాజ్యాన్ని దిగమ్రింగబూనటం అతడి అవివేకం, దుర్యోధనుడి ధూర్తలక్షణం. ఆహారమనుకొని గాలాన్ని మ్రింగిన చేప చందంగా పాండవరాజ్యభాగాన్ని హరించి కౌరవులు మృత్యువుపాలు కావద్దని హెచ్చరించాడు విదురుడు. న్యాయంగా తనకు రావలసిన రాజ్యభాగాన్ని కూడా దానోపాయంలో భాగంగా చేర్చి ధర్మరాజు సాగించే ధర్మనీతి శత్రువులకు ప్రాణసంకటంగా తయారుకావటం విశేషం.

పీఠిక : 6

కౌరవులకున్న సైన్యసంపదను లెక్కించి, ధర్మజుడు ఏ ధైర్యంతో యుద్ధానికి సిద్ధం కాగలడని ధృతరాష్ట్రుడు విదురుడిని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు విదురుడు తలపట్టుకొన్నాడు. మూర్ఛపోయినంత బాధపడ్డాడు. అతడి అవివేకానికి ఆవేదన పడ్డాడు. చివరకు ఇట్లా అన్నాడు:

చ. 'వినుము నరేంద్ర! పాండుపృథివీపతి యగ్రసుతుండు సంధి సే
యన మదిఁ గోరు; మీరు తమ యయ్య సగంబును భూమి యీకత
క్కిన మఱి కాని ముంద రొక కీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొసందలంచినన్'. **(ఉద్యో. 2.170)**

దండోపాయానికి ధర్మరాజు పూనుకొంటే కౌరవసైన్యం అతడి కొకలెక్కలోకి రాదని చెప్పి, వారి తండ్రిపాలు నేల వారికిచ్చి దానోపాయాన్ని గౌరవిస్తే దండోపాయందాకా దారితీయ నవసరముండదని హితవు చెప్పాడు విదురుడు. గ్రుడ్డిరాజుకు ఆ మాట రుచించలేదు.

అయినా, సంజయాదులు ధృతరాష్ట్రుడికి ఎన్నో హితవులు చెప్పారు. పాండవ బలపరాక్రమాలను నిరూపించి చెప్పారు. చివరకు ధర్మరాజును శరణువేడితే శాంతి లభిస్తుందని హెచ్చరిక చేశారు. ధృతరాష్ట్రుడు దిమ్మరపోయి రాజ్యభాగాన్ని ధర్మజుడి కిమ్మని కొడుకును కోరాడు (2.246). అతడు తృణీకరించాడు. అంతటితో అయిదూళ్ళ ప్రసక్తికూడా అడుగంటి పోయింది. వాడి సూదిమొనమోపినంత నేలకూడా ఇవ్వనని తేల్చి చెప్పిన దుర్యోధనుడి మొండితనం ధర్మజుడి దానోపాయాన్ని విఫలంచేసి, యుద్ధోపాయానికి దారిని సుకరం చేసింది.

ధర్మజుడి దానోపాయం శత్రువులకూటమిలో రేపిన సంచలనాన్ని సర్వాంగంగా చిత్రించిన కథాభాగం ద్వితీయాశ్వాసం!

(3). భేదోపాయం: తృతీయాశ్వాసం

సామోపాయాన్ని ప్రయోగించగల రాజు సమయజ్ఞుడై ఉండాలి. దాన ప్రయోగనిపుణుడు దక్షుడై ఉండాలి. భేదోపాయప్రయోక్త లోకజ్ఞుడైన నీతిజ్ఞుడై ఉండాలి. యుద్ధోపాయాన్ని నిర్వహించే రాజు వ్యూహకుశలుడై ఉండాలి. ధర్మరాజు ఉద్యోగపర్వంలో చతురుపాయ సమర్థుడుగా చిత్రించబడ్డాడు. అందులోనూ - తృతీయాశ్వాసం ధర్మజుడి భేదోపాయ ప్రయోగ పాండిత్యానికి ప్రజ్ఞాపతాక!

శాస్త్రబద్ధంగా ప్రయోగించే రాజనీతి ధర్మనీతిగా మారుతుంది. యుద్ధం తప్పదని తెలిసిన ధర్మరాజు, సమరాన్ని సరాసరి ప్రకటించకుండా సామదానభేదాలను ముందుగా ప్రయోగించాడు. దానిరూపమే రాయబారపు ప్రయత్నం. పురోహితుడి, సంజయుడి రాయబారాల నాధారంగా చేసికొని ధర్మరాజు నిపుణంగా సామదానోపాయాలను ప్రయోగించి, కౌరవుల దుర్నీతి వలన అవి విఫలమైనట్లు స్పృహను లోకంలో సృష్టించాడు. తృతీయాశ్వాసంలో సామదానరూపంగా పైకి కనబడుతూనే గూఢంగా సాగే భేదోపాయాన్ని సారించాడు. ఈ ఉపాయం పైకి స్నేహహస్తం చాచినట్లుంటుంది. లోన శత్రుశిబిరంలో భేదాన్ని ప్రయోగిస్తున్నట్లుంటుంది. దానిని ధర్మరాజు శ్రీకృష్ణుడి రాయబారం ద్వారా సాధింపదలచాడు. శ్రీకృష్ణుడితో ధర్మజుడు పలికిన మాటలు మెత్తని పులి పలికే ధర్మనీతి సూక్తులు. ఆ రాయబారం ఒక వ్యూహం. దాని ప్రవక్త ధర్మరాజు, ప్రయోక్త శ్రీకృష్ణుడు.

సంజయుడి రాయబారం వలన ధృతరాష్ట్రుడు రాజ్యభాగ మిచ్చేది లేదనీ, అతడు దుర్యోధనుడి వక్రబుద్ధిని మార్చలేడనీ స్పష్టమయింది. శకుని కర్ణాదులను నిలువరించలేడని తేలింది. అయితే, భీష్మాది కురువృద్ధులూ, ఆచార్యాది

విజ్ఞులూ, విదురాది ధర్మవేత్తలూ ధర్మజుడి ధర్మనీతి వర్తనాన్ని గ్రహించగలరు, హర్షించగలరు, సమర్థించగలరు, ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు హితబోధ చేయగలరు. అయినా, వారి మాటలు దుర్యోధనాదులు వినరు. వారు యుద్ధాన్నే కోరుతారు. విజయం తమకే దక్కుతుందనీ, పాండవులు రణంలో నిహతులౌతారనీ వారి నమ్మకం. ధృతరాష్ట్రుడు కొడుకును కాదనలేడు; యుద్ధాన్ని సమర్థించలేడు. డోలాయమానచిత్తుడై సమస్యను పరిష్కరించలేక కటకట పడతాడు. కాబట్టి, ఆయనముందు యుద్ధసమస్యనే పెద్దదిగా చేసి భయపెట్టాలి. అప్పుడు యుద్ధంచేయాలని భావించే దుర్యోధన వర్గానికీ, వద్దని వాదించే గురుభీష్మాది వీరవర్గానికీ భేదం ఏర్పడుతుంది. ధృతరాష్ట్రుడు ఏదో ఒక పక్షం వహించవలసి వస్తుంది. లేదా యుద్ధంవలన కలిగే వంశనాశనానికి నాంది నాలపించవలసి వస్తుంది. నింద మోయవలసి వస్తుంది. అందువలన, యుధిష్ఠిరుడు శాంతివచనాలతో రాయబారాన్ని మొదలు పెట్టాడు.

అయిదూళ్ళడిగినా ఇవ్వని దుర్యోధనుడి దౌష్ట్యంవలన యుద్ధం తప్పనిసరి ఔతుంది. యుద్ధంవలన రాజ్యంలోని భాగమే కాదు మొత్తం రాజ్యం పాండవుల వశమౌతుంది. అంటే, ధృతరాష్ట్ర దుర్యోధనుల పాలన హస్తినలో అస్తమిస్తుంది. ఆ మాటలు కౌరవసభలో ప్రకటించి, తన ఉద్యోగాన్ని (ప్రయత్నాన్ని) భీష్మద్రోణాది వృద్ధ గురు జనానికీ, రాజులకూ, ప్రజలకూ తెలియచెప్పి, యుద్ధంవలన కలిగే అనర్థాలను వారికి వివరించుమన్నాడు ధర్మరాజు. యుద్ధంవలన కౌరవవీరుల నాశనమే కాక, ఇరువైపులకు చెందిన వీరులు మరెందరో ప్రాణాలు కోల్పోవచ్చును. ఆ యుద్ధక్రూరకర్మకు మూలం పగ. దుర్యోధనుడు మూర్తీభవించిన పగ. అతడు పగ చల్లార్చుకొని స్నేహంతో కలిసి ఉండటానికి అంగీకరిస్తేనే శాంతి. లేదా, అది అతడి దోషమే ఔతుంది; వంశనాశనానికీ, రక్త ప్రవాహాలకూ దారితీస్తుంది. ఈ విషయం కురుసభలో అందరిముందు చెప్పి, నేరమంతా కౌరవపక్షంలోనే ఉన్నదని నిరూపించటానికీ, పాండవులు దండోపాయం ప్రయోగించటానికీ కౌరవుల దుష్టవర్తనమే మూల కారణమని లోకానికి తెలియచెప్పటానికీ చేసే యత్నమే శ్రీకృష్ణుడి రాయబారం. సంజయుడు అన్నట్లుగా 'అధర్మం చేస్తున్నది ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులే' అని అందరూ నమ్మేటట్లు చేయటం ఈ రాయబారం వెనుక ఉన్న వ్యూహం. ఇది రాజనీతిలోని భేదోపాయ రహస్యం.

ఉద్యోగపర్వంలో రెండు సభలున్నాయి. ఒకటి- ఉపప్లావ్యంలో ధర్మరాజున్న సభ. రెండు- హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు కొలువుదీరిన కౌరవసభ. ఈ రెండు సభలలో నాయకులు వరుసగా ధర్మరాజు, దుర్యోధనుడు. ధర్మరాజుకు దైవ సమానుడు, హితుడు, స్నేహితుడు శ్రీకృష్ణుడు. అతడి నిర్ణయాన్ని ధర్మరాజు శిరసావహిస్తాడు. భీమాదులు ధర్మరాజు వాదంతో కొంత భేదించినా, అన్నగారిమాట జవదాటరు. సంధిచేసికొనటం వారికి అంతరాంతరాలలో ఇష్టంలేకపోయినా, సంధిజరిగే పరిస్థితులు కౌరవసభలో లేవని తెలిసినా, ధర్మరాజు చేసే ప్రయత్నాన్ని భీమాదులు సమర్థించారు. అందువలన పాండవసభలో ఐక్యత, నాయకత్వం స్థిరంగా ఉన్నాయి. దివ్యాదివ్యుడైన శ్రీకృష్ణుడి వ్యూహసారథ్యం వారి కెప్పుడూ ఉన్నది. పురుషకారం, దైవయత్నం రెండూ పాండవులకు సమకూరాయి.

పాండవసభలో ఉన్న సమైక్య ధర్మస్థితి హస్తినాపురంలోని కౌరవసభలో లేదు. దుష్టచతుష్టయం సంధికిష్టపడదు. ధృతరాష్ట్రుడు కొడుకును కాదనలేడు. పాండవ పక్షంలో శ్రీకృష్ణుడివలె కౌరవపక్షంలో పెద్దరికపు గౌరవాన్ని పొందే నాథుడు లేడు. భీష్మాదులు, ఒక్కొకసారి ధృతరాష్ట్రుడు కూడా దుర్యోధన తిరస్కారాలకు గురి ఔతూ ఉంటారు. సభలో ఉన్న సభ్యులలోకూడా ఏకాభిప్రాయం లేదు. కౌరవసభ ఐక్యతలేని విభిన్న శక్తుల వింత కూటమి; దైవానుకూల్యంలేని దర్పభూమి; ధర్మశక్తిలేని కార్యక్షేత్రం. శ్రీకృష్ణుడికి కౌరవసభలో జరిగే అవమానం దైవానికీ, ధర్మానికీ జరిగే అవమానం. దానివలన యుద్ధం, కౌరవనాశనం తథ్యం. పాండవులకు యుద్ధానంతరం లభించేది రాజ్యభాగమే కాదు, కౌరవమహాసామ్రాజ్యం. ఈ ఫలసిద్ధిని పొందటానికి సాగించే యుద్ధోద్యోగంలో- శ్రీకృష్ణుడి రాయబారం కౌరవసభలో, స్కంధావారంలో, వీరులలో భేదభావసృష్టి చేసే ప్రయోజనాన్ని సాధించింది. కాని, యుద్ధాన్ని మాన్పజాలకపోయింది. యుద్ధాన్ని వద్దన్న భీష్మాదులు కూడా యుద్ధాన్ని వారించలేకపోయారు. శ్రీకృష్ణుడు కర్ణుడికి జన్మరహస్యం చెప్పి పాండవపక్షంలోకి అతడిని రప్పించటానికి

యత్నించాడు. ఈ అంశం ధర్మరాజు లక్ష్యంలో లేనిది. శ్రీకృష్ణుడు స్వతంత్రించి యత్నించింది. అక్కడా భేదోపాయం బెడిసికొట్టింది. కాని, కుంతికి కర్ణుడిచ్చిన వరాలలో అది కొంత ఫలించింది. మొత్తంమీద శ్రీకృష్ణుడి రాయబారం భేదాన్ని సృష్టించి ఫలించింది; యుద్ధాన్ని మాన్పలేక విఫలమయింది. భేదోపాయ వైఫల్యమే దండోపాయానికి దారితీసింది. ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు యుద్ధానికి ముహూర్తాన్ని ప్రకటించి వచ్చాడు. ధర్మరాజు శాస్త్రీయంగా సాగించిన యుద్ధోద్యోగంలోని దండోపాయాన్ని శ్రీకృష్ణుడు సమర్థనీయంగా ప్రదర్శించాడు.

ఈ తాత్పర్యమంతా ఈ క్రింది పద్యంలో ధర్మరాజు పొదివి చెప్పాడు.

మ. 'సుతువాఁడై వినయంబు సేకొనక యే చొప్పం దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే
గ తెగంబాఱకు; తెంపు సేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ!' **(ఉద్యో. 3.25)**

ధర్మజుడు ఊహించినదంతా శ్రీకృష్ణుడు ఉజ్జ్వలంగా సాధించి పెట్టాడు.

(4). దండోపాయం: చతుర్థాశ్వాసం

ధర్మరాజు రాయబారం ద్వారా సాధింపదలచుకొన్న ఫలితాలకు పరిమితమైనది తృతీయాశ్వాసం. ఆ పరిధికి మించి శ్రీకృష్ణుడూ కుంతీ సాధించిన భేదోపాయాలను చతుర్థాశ్వాసంలో చెప్పటం ఔచిత్యం. పాండవవీరులు భయపడే భీష్మద్రోణాదులు శ్రీకృష్ణుడి రాయబారంవలన మెత్తబడ్డారు. కర్ణుడు ధర్మరాజుకు సింహస్వప్నంవలె మిగిలిపోయాడు. అర్జునుడి పాశుపతాస్త్రం ఉన్నా, దానిని అతడు ప్రయోగించడు. కర్ణుడి 'శక్తి' పార్థుడి ప్రాణాలను హరించే అవకాశం ఉన్నది. కర్ణుడు ధర్మజాదులను సంహరించే వీలున్నది. ఈ ఆపదనుండి తప్పించుకొనే ఉపాయాన్ని శ్రీకృష్ణుడూ కుంతీ సమకూర్చిపెట్టారు. ఇక యుద్ధోపాయాన్ని నిర్విఘ్నంగా ప్రయోగించవచ్చును. కార్యనిర్దేశం చేయుమని శ్రీకృష్ణుడిని ధర్మరాజు ప్రార్థించాడు.

ఉ. 'యుద్ధమ కాక కార్యమును నొండొకఁ డెద్దియుఁ గల్గ నేర్చునే?
బుద్ధులు సెప్ప వాక్యముల పోల వినం డన నేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁ బట్టి సుయోధనుఁ; డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నామతిఁ దోఁప దెమ్మెయిన్'. **(ఉద్యో. 4.88)**

అని శ్రీకృష్ణుడు యుద్ధమే తగిన కార్యమని నిశ్చయించాడు. యుద్ధోపాయం ప్రారంభమయింది. చతుర్థాశ్వాసమంతా యుద్ధసన్నాహ సంభారమే. ఉభయ పక్షాల బలాబల నిరూపణం జరిగింది. ఆయా వీరుల విశేషవృత్తాంతాలు చెప్పబడ్డాయి. కౌరవులు పంపిన ఉలూకుడి రాయబారం దుర్యోధనుడి దురహంకారాన్ని ప్రదర్శించింది. పాండవులలో రణోత్సాహాన్ని రెట్టింపుచేసింది. శ్రీకృష్ణు డిచ్చిన సమాధానం భావికథార్థ సూచకం; దుర్యోధన దుశ్శాసనులకు దైవశాపం.

తే. 'బవర మెల్లియ; బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగరాదు;
కృష్ణ సారథికంబగు జిష్ణురథము । దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు'.

క. 'రిత్తలు రజ్జెడు వాఁడే । మత్తగజాయుత బలుండు మారుతి యని ను
ద్వృత్తుఁ డగు దుస్ససేనుని । నెత్తు రురము వ్రచ్చి త్రావు నీవుం జూడన్'. **(ఉద్యో. 4.203, 204)**

'చావక తొలగరాదు' - అనేమాట దుర్యోధనుడు తొడలు విరిగి పడిపోయే దురవస్థను సూచిస్తున్నది. యుద్ధపంచకమంతా ఈ వాక్యంలో ధ్వనిస్తుంది. ఉద్యోగపర్వం ఊర్జితకథోపేతం!

3. ఉద్యోగపర్వంలో షాడ్గుణ్య ప్రయోగరంగం

రాజు రాజ్యాన్ని సంపాదించాలన్నా, స్వీయరాజ్యాన్ని రక్షించుకొనాలన్నా షడ్గుణాలను పాటించాలని రాజనీతిజ్ఞులంటారు. దీనినే షాడ్గుణ్యమని పిలుస్తారు.

"సంధిం చ విగ్రహం చైవ యాన మాసన మేవ చ
ద్వైధీభావం సంశ్రయం చ షడ్గుణాం శ్చింతయే త్సదా". **(మనుస్మృతి. 7.160)**

అని మనుస్మృతి చెపుతున్నది. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సంశ్రయం- అనేవి షడ్గుణాలు. అవి ఇవే వరుసలో ప్రయోగించబడాలని చెప్పటంకంటె సమయానుకూలంగా వాటిని ప్రవర్తిల్లచేయాలని శాస్త్రం. మహాభారత శాంతి పర్వంలో రాజనీతి విశేషాలలో చతురుపాయాలతోపాటు షడ్గుణాలు కూడా చెప్పబడి ఉన్నాయి. (శాంతి.2.285). "సంధిర్నా విగ్రహోయాన మాసనం ద్వైధమాశ్రయః షడ్గుణాః" అని అమరకోశం. పాండవులు రాజ్యప్రాప్తికోసం, కౌరవులు రాజ్యరక్షణకోసం షాడ్గుణ్యాన్ని పాటించటం రాజనీతిలో భాగం. ఉద్యోగపర్వం షాడ్గుణ్య ప్రయోగరంగం.

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో షాడ్గుణ్యానికి ఒక అధ్యాయమే కేటాయించాడు. (సప్తమాధికరణంలోని ప్రథమాధ్యాయం)

1. "షాడ్గుణ్యస్య ప్రకృతి మణ్డలం యోనిః"

(సంధి మొదలైన ఆరుగుణాలకు స్వామ్యాదులైన ఐదు ప్రకృతులూ, ద్వాదశరాజమండలమూ మూలకారణం).

2. "సంధి విగ్రహాసన యాన సంశ్రయ ద్వైధీభావాః షాడ్గుణ్యం ఇత్యాచార్యాః"

(సంధి, విగ్రహం, ఆసనం, యానం, సంశ్రయం, ద్వైధీభావం- ఇవి ఆరూ షాడ్గుణ్యం- అని ప్రాచీనాచార్యులు చెప్పారు).

3. "ద్వైగుణ్యమ్ ఇతి వాతవ్యాధిః, సంధి విగ్రహాభ్యాం హి షాడ్గుణ్యం సంపద్యతే ఇతి"

(సంధి, విగ్రహం- అనే రెండు గుణాలే ప్రధానమైనవి. ఎందువల్లననగా సంధివిగ్రహాల చేత షాడ్గుణ్యం ఏర్పడుతుంది. అనగా ఆసనం మొదలైన నాలుగు, సంధివిగ్రహాలచేతనే ఏర్పడతాయి గాని వాటిలోనే అంతర్గతాలు అని వాతవ్యాధి అనే ఆచార్యుడి అభిప్రాయం). (ఈ వాతవ్యాధి ఉద్ధవుడు కావచ్చును).

4. "షాడ్గుణ్య మేవైతదవస్థాభేదాత్ ఇతి కౌటిల్యః"

(అవస్థలలో (పరిస్థితులలో) భేదం ఉండటంచేత ఆరుగుణాలు వేరు వేరు. అందుచేత షాడ్గుణ్యాన్నే అంగీకరించాలని కౌటిల్యుడి అభిప్రాయం).

5. "తత్ర పణబన్ధః సంధిః అపకారో విగ్రహః ఉపేక్షణ మాసనమ్. అభ్యుచ్చయో యానమ్. పరార్పణం సంశ్రయః సంధివిగ్రహోపాదానం ద్వైధీభావ ఇతి షడ్గుణాః"

(వాటిలో - 'సంధి' అనగా ఒప్పందం కుదుర్చుకొనటం. అపకారం చేయటం 'విగ్రహం'. సంధిచేసికొనకుండా, అపకారం చేయకుండా ఉండటం- 'ఆసనం'. శక్తినీ దేశకాలాదులలో అభివృద్ధినీ సంపాదించటం 'యానం'. ఈ విధమైన అభివృద్ధి ఉన్నప్పుడే శత్రువుమీదికి దండెత్తి వెళ్ళటం కుదురుతుంది కావున దీనికి యానం అని పేరు పెట్టబడింది. యానం అనగా అర్థం- దండెత్తి వెళ్ళటం. శత్రువు బలవంతుడైనప్పుడు తనను వాడికి సమర్పించటం (లొంగిపోవడం) సంశ్రయం.

లేదా, సహాయం కోరి మరొక బలవంతుడిని ఆశ్రయించడం సంశ్రయం. సంధివిగ్రహాలు రెండింటిని నడిపించటం- అనగా ఒక శత్రువుతో సంధి చేసికొని రెండవ శత్రువుతో వైరం కొనసాగించడం ద్వైధీభావం. ఈ విధంగా గుణాలు ఆరు.)

శ్లో. ''ఏవం షడ్భిర్గుణై రేతైః స్థితః ప్రకృతి మణ్డలే
పర్యేషేత క్షయాత్ స్థానం స్థానా ద్వృద్ధిం చ కర్మసు''

(ప్రకృతి మండలంలో ఉన్నరాజు ఈ విధంగా ఈ ఆరు గుణాలను అనుసరిస్తూ క్షీణదశనుండి స్థానాన్ని (నిలకడను), స్థానంనుండి (స్థానంద్వారా) తన కర్మలలో వృద్ధినీ సంపాదించటానికి ప్రయత్నించాలి.)

(అర్థశాస్త్రమ్- బాలానందిని వ్యాఖ్య- ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు.) **(పుట 544, 545, 550)**

ధర్మరాజు ధర్మనీతి వర్తనుడైన ఉదాత్తుడు. ధర్మం తప్పని రాజనీతి అతడి విధానం. తనకు రావలసిన రాజ్యభాగాన్ని బలప్రయోగంతో సంపాదించగలిగే శక్తియుక్తులు తనకున్నా ధర్మబద్ధమైన రాజనీతితో కూడిన విధానాన్ని అనుసరించి రాజులకు ఆదర్శప్రాయు డయ్యాడు. అతడు ఉద్యోగపర్వంలో నిర్వహించిన నీతివర్తనం షాడ్గుణ్య ప్రయోగానికి శాస్త్రసమ్మతమైన ఉదాహరణం.

షాడ్గుణ్యంలో సంధివిగ్రహాలకు ప్రధానపాత్ర ఉంటుందని ప్రాచీనులు పేర్కొన్నారు. మిగిలిన నాలుగు గుణాలూ వాటినుండి పుట్టి వాటిలోనే అంతర్భవిస్తాయని కొందరు భావించగా, ఆరు గుణాలకూ అవసరాన్నిబట్టి ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడవచ్చుననీ, వాటివలన ప్రత్యేక ప్రయోజనాలుకూడా సాధించవచ్చుననీ కౌటిల్యుడు పేర్కొన్నాడు. ధర్మరాజు సమయోచితంగా షడ్గుణాలను ప్రయోగించి సమర్థు డనిపించుకొన్నాడు. షడ్గుణప్రయోగంవలన ధర్మజుడు రెండు దశలను సాధించాడు. 1.క్షీణదశనుండి స్థానాన్ని సంపాదించటం. 2.స్థానంనుండి శత్రువుమీద దాడిచేయగల సామర్థ్యాన్ని పెంపొందించుకొనటం. ఈ రెండు దశలను ధర్మనీతి వర్తనం వలన సాధించటం విశేషం.

(1). సంధి:- ఉపప్లావ్యంలో శ్రీకృష్ణుడు నిండుసభలో ధర్మజుడి ధర్మప్రవృత్తిని ప్రతిపాదించి అతడి రాజనీతికి గల ప్రాతిపదికను తెలియపరచాడు.

తే. 'ధర్మమార్గంబు దప్పక తలఁపుఁ డొక్క తెఱఁగు, ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
వడయ నొడఁబడఁ డయ్యింద్రపదవియైన; । నుచితగతి నెంత వడసిన నుల్లసిల్లు'. **(ఉద్యో. 1.11)**

పాండవులు పితృధనమైన రాజ్యం అనుభవిస్తూ ఉండగా దానిని దుర్యోధనుడు కపటద్యూతం మిషగా అపహరించి అపకారం చేశాడు. ధర్మరాజు దిగ్విజయం చేసి తన రాజ్యానికి మహత్వాన్ని కల్పించుకొన్నాడు. చక్రవర్తిగా చెలామణి అయ్యాడు. కపటోపాయంతో దుర్యోధనుడు కాజేసిన రాజ్యాన్ని కపటమార్గంలో విగ్రహాన్ని ప్రదర్శించి సాధించవచ్చును. కాని, అత డామార్గాన్ని ఆశ్రయించటం లేదు. కాబట్టి, సంధి విగ్రహాలలో సంధి ఉపాదేయమయింది. అంతేకాక, పాండవులు-

క. 'అలఘుబల విక్రమోదా । త్తుల కైనను బలములేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె? సహాయము । కలిమి ననంతంబులగు పగఱ సైన్యములన్?' **(ఉద్యో. 1.15)**

పాండవులు స్వీయబల సంపన్నులైనా, సహాయసంపత్తి లేకుండా బలవంతులైన శత్రువులతో కార్యసాధనం చేయటం కష్టం. అందువలన బలసమీకరణకైనా కొంత వ్యవధానం కావాలి. ఆలోగా సంధియత్నం చేయటం ఉత్తమమని నిర్ణయం తీసికొనటం జరిగింది.

ఉపప్లావ్య సభలో సంధిని సమర్థించిన వారూ ఉన్నారు. సమరాన్ని సమర్థించిన వారూ ఉన్నారు. ఆ రెండు వర్గాలకూ నాయకులు- యాదవవీరులైన శ్రీకృష్ణ బలరాములూ, సాత్యకీ కావటం గమనించదగిన అంశం. అయితే, సాత్యకి శ్రీకృష్ణుడి అభిప్రాయాన్ని వ్యతిరేకించినా ఒక మధ్యేమార్గాన్ని ప్రతిపాదించాడు.

క. 'నా మతమునఁ గార్యము సం । గ్రామము సేయుటయ; యిట్లు గా కీలోనన్
సామవచనంబు లక్కురు । భూమీశ్వరుతోడ నాడఁ బుచ్చెద రేనిన్'.

ఉ. 'దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండునృపాలు పాలు రా
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్నలోక సా
మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద; మ
న్యోన్య విరుద్ధభాషణము లాడినఁ దత్ఫల మాతఁ డందెడున్'. **(ఉద్యో. 1. 31, 32)**

ఈ అంశాన్ని ద్రుపదుడు సమర్థించాడు. సభ్యులందరూ అంగీకరించారు. ఫలితాంశమేమంటే- దుర్యోధనుడితో సామంగా మాట్లాడే రాయబారిని పంపాలి. కాని, అతడు దీనంగా రాజ్యాన్ని యాచించకూడదు. 'రాజపరమేశ్వరుడైన ధర్మరాజు తన రాజ్యభాగాన్ని తాను పొందటానికి అంగీకారాన్ని అర్థిస్తున్నాడు' అని మాత్రమే ఉండాలి. సంధియత్నం వలన ఆత్మాభిమానానికి ఏ మాత్రం తక్కువదనం రాకూడదు- అని నిశ్చయించారు. 'దుర్యోధనుడు అన్యోన్యవిరుద్ధ భాషణం చేస్తే ఎట్లాగూ జరుగబోయే యుద్ధంలో తగిన ఫలాన్ని అనుభవిస్తాడు'- అన్నాడు సాత్యకి. ఇందులో ఒక ధర్మసూక్ష్మం ఉన్నది. అరణ్యాజ్ఞాతవాసాలు పూర్తిచేసిన ధర్మరాజుకు రాజ్యభాగం న్యాయంగా సంక్రమించినట్లే. కాని, పెద్దల సమ్మతికోసం మర్యాదకు మారుపేరుగా రాయబారం నడపాలని నిర్ణయం.

మూలంలో సాత్యకి పలికిన మాటలలో ఈ తీర్పరితనం, నేర్పరితనం కానరావు. అతడు యశో వా, మృత్యుర్వా అన్నట్లు యుద్ధాన్నే ప్రతిపాదించాడు.

"నా ధర్మో విద్యతే కశ్చి చ్ఛత్రూన్ హత్వాఽఽతతాయినః॥
అధర్మ్య మయశస్యం చ శాత్రవాణాం ప్రయాచనమ్
హృద్గత స్తస్య యః కామ స్తం కురుధ్వ మతన్ద్రితాః॥
నిసృష్టం ధృతరాష్ట్రేణ రాజ్యం ప్రాప్నోతు పాణ్డవః
అద్య పాణ్డుసుతో రాజ్యం లభతాం వా యుధిష్ఠిరః
నిహతా వా రణే సర్వే స్వప్స్యన్తి వసుధాతలే॥". **(సం. 5.3.21, 22, 23)**

'క్రూరకర్ములైన శత్రువులను చంపటం అధర్మం కాదు. పగవారిని బిచ్చమెత్తటం ధర్మయుక్తం కాదు, కీర్తికరంకూడా కాదు. ధర్మరాజు మనసులో ఏముందో దానిని మెలకువతో సాధించండి. ధృతరాష్ట్రుడు మన్ననతో ఇచ్చే రాజ్యాన్నే ధర్మరాజు పొందుతాడు. ఆ విధంగా యుధిష్ఠిరుడు రాజ్యాన్ని పొందాలి. లేదా అందరూ యుద్ధంలో చచ్చి నేలపై దీర్ఘనిద్రపోవాలి!'- అన్నాడు.

తిక్కన మూలాన్ని చికిలిపెట్టి శిల్పం చేశాడు. షాడ్గుణ్యానికి అనువుగా సంభాషణలను సంస్కరించాడు. సంధిజరగాలి. కాని, రాజ్యాన్ని యాచిస్తున్నట్లు కాదు. తమ వాటాను మర్యాదగా పొందటానికి సమ్మతిని పొందటానికే. లేదా, యుద్ధం తప్పదని స్పష్టంచేయటానికే. అంటే - సంధి ప్రవర్తింపచేయటం 'సమ్మతి'కోసమే. సమ్మతించకపోతే విగ్రహాదులను

ప్రయోగించవలసి వస్తుంది- అని హెచ్చరిక! ఇది తిక్కన చేసిన నిష్కర్ష. దీనిని సమర్థించిన ద్రుపదుడు కూడా సంధిలో మార్దవం, ప్రసన్నత అవసరం లేదని స్పష్టంచేశాడు.

క. 'మృదుభాషణముల దుర్జన । హృదయములు ప్రసన్నతామహిమఁ బొందునె? యె
ల్లిదముగఁ గొని యంతంతకు । మద మెక్కుం గాక దురభిమానము పేర్మిన్'. **(ఉద్యో. 1. 34)**

ద్రుపదుడు తన పురోహితుడి ద్వారా నడపదలచింది స్వాభిమానంతో కూడిన సంధికాని, క్షీణదశలోనుండి నిలకడకోసం ధర్మరాజు చేసే సవినయ సంధికాదని స్పష్టం చేశాడు. అయినా, సంధి చేస్తూనే, సైన్యసహాయ సాధన సాగించి సమర సన్నాహాన్ని చేసేయత్నం చేశారు పాండవులు. అంటే- ధర్మరాజు విగ్రహంలేని సంధిని మొదటి గుణంగా ఎన్నుకొన్నాడన్నమాట! (కొందరు విగ్రహమంటే సైన్యంతో శత్రువు నెదుర్కొనటం అని అర్థం చెపుతారు. అయినా సైన్యసాధన యుద్ధయత్నమే కాని ఎదురుదాడి కాదు). సంధివిగ్రహాలు జంటగా నడుస్తాయని భావించే ప్రాచీనాచార్యులకంటె, పరిస్థితులనుబట్టి షడ్గుణాలను విడివిడిగా ప్రయోగించ వచ్చుననే కౌటిల్యుడు అభిప్రాయాన్ని తిక్కన తెలుగు భారతంలో బలపరిచాడు. సంధి విఫలమైతే విగ్రహం. ఇది ధర్మజుడి ధర్మనీతి. అంతేకాదు, శత్రువు ముందుగా విగ్రహానికి తలపడితే తాను దానికి పైచేయిగా ఎత్తువేసి విరుగుడు పెట్టాలని భావించినట్లున్నాడు. ధర్మరాజు చర్యలు ఫలానుమేయాలు!

(2). విగ్రహం:- అపకారం చేయటం విగ్రహమని నిర్వచనం. దీనిని ధర్మరాజు స్వయంగా చేయడు. అయితే, రాజనీతిలో పరిస్థితుల ప్రభావంవలన దానిని ప్రయోగించక తప్పదు. అటువంటి సన్నివేశం ఉద్యోగపర్వంలో ఏర్పడింది. ద్రుపదపురోహితుడు రాయబారిగా హస్తినాపురం వెళ్ళాడు. అక్కడ పెద్దలతో పరిచయాలు పెంచుకొంటున్నాడు. ఆ సమయంలో కౌరవ పాండవుల అభ్యర్థనల మేరకు రాజులు ఆయా స్కంధావారలలో చేరుతూ ఉన్నారు. శల్యుడు ధర్మరాజుకు మాట ఇచ్చి, అతడి వైపు చేరటానికి విపుల సైన్యంతో బయలుదేరి యాత్రసాగిస్తున్నాడు. దుర్యోధనుడు ఆ అదను కనిపెట్టి చారులను పంపి, శల్యుడికి మార్గంలో వలసిన సౌకర్యాలన్నీ చేయించాడు. శల్యుడు ఆ సౌకర్యాలు చేయిస్తున్నది ధర్మరాజని భావించి, ఆ చారులకు వరాలనివ్వటానికి సిద్ధమయ్యాడు. అప్పుడు దుర్యోధనుడు రంగప్రవేశం చేసి, నిజాన్ని చెప్పి, వరంగా అతడి సహాయాన్ని కోరాడు. ఇచ్చిన మాట ప్రకారం దుర్యోధనుడికి సహాయం చేయటానికి అంగీకరించాడు. అయితే, ఆ సంగతి ధర్మరాజుకు చెప్పి వస్తానని ససైన్యుడై ఉపప్లావ్యానికి వెళ్ళాడు. అక్కడ జరిగినదంతా ధర్మరాజుకు చెప్పాడు. శత్రుకృత విగ్రహ ప్రయోగాన్ని గ్రహించిన ధర్మరాజు తిరిగి తానుకూడా విగ్రహంతోనే తిప్పికొట్టాడు. యుద్ధంలో శల్యుడు కర్ణసారథ్యం చేస్తూ, అతడి మనసు కలతపడి యుద్ధం చేయలేనట్లుగా పరుషవాక్యాలు పలికి అర్జునుడిని రక్షించాలని కోరాడు. అందుకు శల్యుడు అంగీకరించాడు. అలనాడు నిండుసభలో ద్రౌపదిని తూలనాడిన కర్ణుడు వధార్హుడని నిశ్చయించాడు. తాను కర్ణుడికి అపకారం చేయటానికి అంగీకరించాడు. దీని తాత్పర్య మిది- దుర్యోధనుడు సంధిచేయదలచలేదు కాబట్టి ధర్మరాజుకు అపకారం చేయతలపెట్టాడు. ధర్మరాజు అపకారం చేయకుండా సంధియత్నం మొదలుపెట్టినా, దుర్యోధనుడే అపకారం తలపెట్టినప్పుడు స్వీయరక్షణకోసం శత్రువుకు విగ్రహాన్ని (అపకారాన్ని) తలపెట్టాడు. ఇది దుర్యోధనుడి స్వయంకృతాపరాధ ఫలమే. అందువలన ధర్మరాజుకు దోషం లేదు. శల్యసహాయం పోవటంవలన తనకు కలిగే అపాయంకంటె, ఆరవప్రాణమైన కర్ణుడు చావటంవలన దుర్యోధనుడికి కలిగే అపకారం అపారం! అదే ధర్మజుడి విగ్రహ ప్రయోగ విశేషం.

(3). ఆసనం:- శత్రువు సమానబలం కలవాడై ఉంటే, అతడిని కదిలించకుండ, నిర్లిప్తంగా ఉంటూ, తన బలాన్ని క్రమంగా పెంచుకొని, అదనుచూచి అతడిపై దాడిచేయటం రాజనీతి. ఆ పరిస్థితులలో నిర్లిప్తంగా ఉండే స్థితిని ఆసనంగా పరిగణించాలి. ధర్మరాజుకు 'ఆసనం' అనే గుణాన్ని ప్రదర్శించటానికి అవకాశమే లేదు. ఎందువలన అంటే- అతడికి రాజ్యం

లేదు. క్షీణదశనుండి స్థానాన్ని (నిలకడను) పొందటానికి బంధువులు పట్టుబట్టి సాగించే ద్రుపదపురోహిత దౌత్యానికి అంగీకరించాడు. అది ధర్మరాజుకు ఒక స్థానాన్ని కలిగించింది. అంతేకాదు. ధర్మజుడి క్రోధాగ్ని ధృతరాష్ట్రుడి గుండెలో భయాన్ని రేపింది. ధర్మజుడి యుద్ధోద్యోగాన్ని రాజనీతితో భగ్నం చేయటానికి ధృతరాష్ట్రుడు సంజయుడి రాయబారంతో యత్నించాడు. ఆ రాయబారం ఫలిస్తే ధర్మజుడు సంధియత్నం చేయడు; కౌరవులకు అపకారం తలపెట్టడు. పోగా, క్రోధశాంతివలన మునివృత్తిని స్వీకరించి తనకు తానే అపకారం చేసికొంటాడు. ఇంతటి లోతైన వ్యూహం ధర్మరాజును ఆసనంలోకి త్రోసివేసేదే. కాని, ధర్మజుడు ఆ విపత్తునుండి తనను తాను రక్షించుకొన్నాడు. శ్రీకృష్ణు డందుకు సాయంచేశాడు. దానితో ధర్మరాజు సంజయుడి రాయబారాన్ని తిరస్కరించాడు. ధృతరాష్ట్రుడి వ్యూహాన్ని భగ్నంచేశాడు. గ్రుడ్డిరాజుకు నిద్రపట్టకుండా, దిక్కుతోచకుండా చేసి, అతడిని సంక్షోభంలో పడవేశాడు. 'మెత్తని పులి' అనిపించుకొన్నాడు.

(4). సంశ్రయం:- శత్రువుతో యుద్ధంచేయలేని రాజు తనను తాను కొంతకాలం రక్షించుకొనటానికి గాని, యుద్ధసన్నాహాలకోసం కొంతవ్యవధానం పొందటానికి గాని సంశ్రయగుణాన్ని ప్రయోగించటం రాజనీతి. ధర్మరాజు కీస్థితి లేదు. దుర్యోధనుడికి ఆ స్థితి రాలేదు. కాని, బంధుమిత్రుల కందరికీ ఆశ్చర్యం కలిగించేటట్లు ధర్మరాజు అర్ధరాజ్యానికి బదులు ఐదూళ్ళిస్తే చాలునని సంజయుడితో చెప్పాడు. ఇది ఒకవిధమైన లొంగుబాటు కాబట్టి సంశ్రయమే ఔతుంది. దీనికి దుర్యోధను డంగీకరించలేదు. దానివలన దుర్యోధనుడు అపకీర్తిపాలయ్యాడు. ధర్మరాజు కురువృద్ధుల సానుభూతిని పొందగలిగాడు. సంశ్రయాన్ని సాభిప్రాయంగా, సార్థకంగా, సమయోచితంగా వాడుకొన్న సమర్థుడు ధర్మరాజు.

(5). ద్వైధీభావం:- ధర్మరాజు నిర్వహించిన శ్రీకృష్ణుడి రాయబారం ద్వైధీభావానికి దివ్యోదాహరణం: ఇందులో సంధివిగ్రహాలు రెండూ ఒకేసారి సాగించటం జరిగింది.

ఉ. 'కావున శాంతిఁ బొందుటయ కర్జము; దా నది యట్టులుండె; శ్రీ
గావలె నంచుఁ బోరితము గామియుఁ గోరెద; మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము వుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నే విధి నైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా!' **(ఉద్యో. 3.22)**

ఈ పద్యం పై గుణానికి చక్కని నిదర్శనం. సంధివలన శాంతి పొందటం కర్తవ్యం. అయితే రాజ్య సంపదమాత్రం కావాలి. ఆ సంపద యుద్ధం జరగకుండా, కులక్షయం కాకుండా లభించాలి. దానికేదైనా విగ్రహం- అంటే భేదోపాయం- ప్రయోగించాలి. కార్యాన్ని సాధించాలి- అని ధర్మజుడి అభిప్రాయం. కౌరవసభలో ధృతరాష్ట్ర దుర్యోధనులు ప్రభుస్థానంలో ఉన్నవారు. వారిలో ధృతరాష్ట్రుడిని గౌరవిస్తూ సంధి జరుపుతున్నట్లు, గురుభీష్మాది వీరులతో మన్ననతో వర్తిస్తున్నట్లు, దుర్యోధనాదులతో వైరం సాగిస్తున్నట్లు శ్రీకృష్ణుడి రాయబారపు వైఖరి సాగటం ద్వైదీభావగుణ ప్రయోగప్రభావమే. దుర్యోధనుడిని సమర్థిస్తూ అతడి దుర్మార్గానికి దోహదకారి అయిన కర్ణుడితో చెలిమికట్టటానికి యత్నించటంకూడా ద్వైధీభావమే. శ్రీకృష్ణుడి రాయబారం అంత రమణీయంగా ఉండటానికి కారణం ధర్మజనీతిలోని ద్వైధీభావ ప్రదర్శనమే!

(6). యానం:- కౌరవులకు సైన్యసంఖ్యాబలం అధికంగా ఉన్నా, పాండవులు స్వీయబలంమీది విశ్వాసంతో, శ్రీకృష్ణుడి సహాయ సంపత్తితో యుద్ధాన్ని ప్రకటించగలిగారు. ఇక్కడ మరొక విషయం గమనించాలి. రాయబారాల ఘట్టాలలోనూ, రాయబారుల వార్తలను విని విశ్లేషించుకొనే చర్చాగోష్ఠులలోనూ కౌరవ పాండవబల తారతమ్య చర్య విస్తారంగా సాగింది. భీష్ముడు సర్వసైన్యాధ్యక్షుడైన తరువాత విశదంగా ఈ అంశాన్ని వివరించటంకూడా జరిగింది. ఇవన్నీ

పాండవులు క్షీణదశనుండి మహోన్నత దశకు వృద్ధిచెందిన స్థితిని తెలుపుతున్నాయి. ఈ విధంగా ఉద్యోగపర్వంలో షాడ్గుణ్యం సర్వాంగ సుందరంగా, సమర్థంగా చిత్రించబడింది.

ఉద్యోగపర్వంలో ధర్మజుడి వర్తనాన్ని తెలిసికొనాలంటే ఈ క్రింది అర్థశాస్త్ర సూత్రం తెలియాలి-

శ్లో. "ఆత్మవాం స్స్వల్పదేశోఽపి యుక్తః ప్రకృతి సంపదా
నయజ్ఞః పృథివీం కృత్స్నాం జయత్యేవ న హీయతే॥" **(అర్థశాస్త్రమ్. 6 అధి. 1అధ్యా. చివరి శ్లో.)**

(ఆత్మవంతుడై ఉండి ప్రకృతి సంపదతో కూడిన, నీతి శాస్త్రవేత్తయైన రాజు చిన్న దేశం మాత్రమే కలవాడైనాకూడా సమస్తభూమిని జయించి తీరుతాడు. ఎప్పటికీ నశించడు). అయిదూళ్ళిచ్చినా చాలునని అడిగిన ధర్మరాజు హృదయంలోని రాజనీతి రహస్యం ఈ శ్లోకంలో ధ్వనిస్తుంది.

4. రాయబారాల చదరంగం ఉద్యోగపర్వం

ఉద్యోగపర్వం సంధియత్నంతో మొదలై యుద్ధయత్నంతో ముగుస్తుంది. సామదానభేదోపాయాలు సంధిలోనే ప్రవర్తిల్లుతాయి. అందులోనే విఫలమౌతాయి. సంధియత్నాలలో రాయబారాల పాత్ర బలంగా ఉంటుంది. అర్హతలనుబట్టి రాయబారాలు-లేక-దూతలు-మూడు విధాలని అర్థశాస్త్రం విశ్లేషించింది. "ఉద్ధృత మన్త్రో దూతప్రణిధిః అమాత్యసంపదోపేతో నిసృష్టార్థః, పాదగుణహీనః పరిమితార్థః అర్ధగుణహీనః శాసనహరః" (అర్థశాస్త్రమ్. 16వ అధ్యాయం 12వ ప్రకరణం, సూత్రం-1.) (మంత్రం నిశ్చితమైన తరువాత దూతల ప్రయోగం జరగాలి. అమాత్యులకు ఉండే గుణసంపద అంతా ఉన్న దూత 'నిసృష్టార్థుడు'. అనగా కార్యభారం అంతా అతడిమీద విడిచివేయవచ్చునని అర్థం. నాల్గవవంతు గుణాలు తక్కువ ఉన్నవాడు 'పరిమితార్థుడు'. (పరిమితమైన ప్రయోజనం కలవాడు అనగా కొంతవరకే అతడికి కార్యభారం అప్పగించాలి). సగం గుణాలు లేనివాడు 'శాసనహరుడు' (అనగా రాజుపంపే వార్తలు తీసికొని వెళ్ళడానికి మాత్రమే తగినవాడు). (బాలానందిని వ్యాఖ్య ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు- పుట.61, 62).

మంత్రానికి తగిన దూతను ఎన్నుకొనటం రాజ్యతంత్ర రహస్యం. మంత్రం పంచాంగసహితం (అయిదంగాలతోకూడి ఉంటుంది). అవి - "కర్మణామారంభోపాయః. పురుష ద్రవ్య సంపత్, దేశకాల విభాగః । వినిపాత ప్రతీకారః, కార్యసిద్ధి రితి పంచాంగో మంత్రః". ఉద్దిష్ట కార్యాన్ని ఆరంభించటానికి అనువైన ఉపాయాన్ని నిర్ణయించటం, అంగబలాన్నీ, అర్థబలాన్నీ అంచనా వేసికొనటం, దేశకాల విభాగ వివేచనను గాఢంగా చేయటం, కార్యసాధనలో ఏర్పడే అవరోధాలకు, విఘ్నాలకు ప్రతిక్రియలను చేయటం, లక్షించిన కార్యాన్ని సాధించి ఫలాన్ని పొందటం- అనే అయిదంగాలనూ రాజనీతి చతురుడైన రాజు నిపుణంగా నిర్వహిస్తాడు. ఉద్యోగపర్వంలోని మంత్రనిర్వహణంలో ధర్మరాజు అగ్రగణ్యుడు; శ్రీకృష్ణుడు సాటిలేనివాడు. వీరిలో ఒకరు రాజు. మరొకరు దూత కావటం ఉద్యోగపర్వ విశేషం.

ఉద్యోగపర్వంలో నలుగురు దూతలు రాజకార్య నిర్వహణంలో తమ తమ పాత్రలను నిర్వహించారు. వారు - 1.ద్రుపదపురోహితుడు; 2.సంజయుడు; 3.శ్రీకృష్ణుడు; 4.ఉలూకుడు. ఈ దూతలను ప్రయోగించినవారు వరుసగా ద్రుపదుడు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు, దుర్యోధనుడు. దూతలనుబట్టి వారి నెన్నుకొన్న రాజుల యోగ్యతలు బయటపడతాయి. వారు నిశ్చయించిన మంత్రబలాలు కూడా వ్యక్తమౌతాయి.

రాజనీతి నిపుణుడైన రాజు మంత్రాన్నిబట్టి దూతలను మంత్రులనుండి కాని, పురోహితులనుండికాని ఎన్నుకొంటాడు.

శ్లో "బ్రాహ్మణే నైధితం క్షత్రం మన్త్రి మన్త్రాభిమన్త్రితమ్
జయ త్యజిత మత్యన్తం శాస్త్రానుగమశస్త్రితమ్". **(అర్థశాస్త్రమ్ 1 అధిక. 9వ అ. చి.శ్లోకం)**

గుణసంపన్నుడైన పురోహితుడిచేత వృద్ధిపొందబడిందీ, మంత్రియొక్క మంతనం అనే మంత్రంచేత పవిత్రీకృతమయిందీ అయిన దండనీతిని అనుసరించటం అనే శాస్త్రాన్ని పట్టిన క్షత్రియకులం మిక్కిలి అభివృద్ధి చెందుతుంది. దానిని ఎవరూ జయించలేరు- అని కౌటిల్యుడు పేర్కొన్నాడు. ఈ సూత్రం ఉద్యోగపర్వానికి అన్ని విధాలా అన్వయిస్తుంది. ఇందులోని దూతలు పురోహితుడు, మంత్రి, బంధువు, స్నేహితుడు మొదలైనవారు కావటం విశేషం!

అర్థశాస్త్రంలో అమాత్యపురోహిత గుణాలు స్పష్టంగా పేర్కొనబడి ఉన్నాయి. అమాత్య లక్షణాలు "జానపదః, అభిజాతః, స్వవగ్రహః, కృతశిల్పః, చక్షుష్మాన్, ప్రాజ్ఞః, ధారయిష్ణుః, దక్షః, వాగ్మీ, ప్రగల్భః, ప్రతిపత్తిమాన్, ఉత్సాహ ప్రభావయుక్తః, క్లేశసహః, శుచిః, మైత్రః, దృఢభక్తిః, శీలబలారోగ్య సత్త్వ సంయుక్తః, స్తమ్భచాపల్య వర్జితః, సంప్రియః, వైరాణా మకర్తేత్యమాత్య సంపత్, అతః పాదార్థ గుణహీనౌ మధ్యమావరౌ". (అర్థశాస్త్రమ్. నవమోఽధ్యాయః, పంచమ ప్రకరణమ్- మంత్రిపురోహితోత్పత్తిః పు.32)

అమాత్యుడు తనదేశానికి చెందినవాడు, మంచివంశంలో పుట్టినవాడు. పొరపాట్లను సులభంగా సరిదిద్ద దగినవాడు, శిల్పాలలో నేర్పరి, రాజుకు నేత్రంవంటిదైన అర్థశాస్త్రంలో పండితుడు, సహజబుద్ధి సంపన్నుడు, జ్ఞాపకశక్తి-లేదా-పట్టుదల కలవాడు, సమర్థుడు, వాక్చాతుర్యం కలవాడు, ప్రగల్భుడు(**bold**), సమయస్ఫూర్తి కలవాడు, ఉత్సాహమూ, ప్రభుశక్తీ ఉన్నవాడు, కష్టాలు సహించగలవాడు, శుచి అయినవాడు, స్నేహశీలుడు, దృఢమైన భక్తికలవాడు, శీలవంతుడు, ఆరోగ్యధైర్యాలు కలవాడు. మొండితనం, చాపల్యం లేనివాడు, అందరినీ ఆకట్టుకోగలవాడు, అనవసరమైన తగాదాలు సృష్టించనివాడు అయి ఉండాలి. ఈ గుణాలన్నీ కలవాడు ఉత్తముడు. వీటిలో నాల్గవవంతు లేనివాడు మధ్యముడు. సగం లేనివాడు అధముడు.

పురోహితుడి గుణాలు:- "పురోహిత ముదితోదిత కులశీలం షడఙ్గే వేదే దైవే నిమిత్తే దణ్డనీత్యాం చ అభివినీతమ్. ఆపదాం దైవమానుషీణామ్ అథర్వభిరుపాయైశ్చ ప్రతికర్తారం కుర్వీత. తమాచార్యం శిష్యః పితరం పుత్రో భృత్యః స్వామిన మివ చాను వర్తేత". (అర్థశాస్త్రమ్. పు. 33)

ఉన్నత కులసంజాతుడు, శీలవంతుడు, వేదవేదాంగాలనూ జ్యోతిషాది దైవసూచనలు గల శాస్త్రాలనూ తెలిసినవాడూ, శకునజ్ఞుడు, దండనీతిశాస్త్రజ్ఞుడు, దైవంవలన గాని, మానవులవలనగాని కలిగే ఆపదలను తొలగించగల అథర్వవేదమంత్ర ప్రయోగాలు గాని, ఇతరోపాయాలుగాని ప్రతిక్రియలుగా చేయగలవాడు పురోహితుడు. అన్ని పనులలోనూ అగ్రస్థానంలో ఉంచబడదగిన పురోహితుడిని- శిష్యుడు ఆచార్యుడినివలె, పుత్రుడు తండ్రినివలె, భృత్యుడు యజమానునివలె రాజు ఎప్పుడూ అనుసరించి ఉండాలి. (అర్థశాస్త్రమ్ పు.34).

(1). ధర్మరాజుకొరకు హితులు సాగించిన పురోహిత దౌత్యం

ద్రుపద పురోహితుడు దూతగా పంపదగిన యోగ్యత కలవాడు.

క. 'హితుఁడవు, మతిమంతుండవు, । చతురవచనకోవిదుఁడవు, సమయజ్ఞుఁడ, వు
న్నతవంశవర్ధనుఁడ, విం । గితవేదివి, నెచ్చెలివి, సుకృతి; వట్లగుటన్' **(ఉద్యో. 1.53)**

పాండవ దూతగా పంపటానికి పూనుకొన్నట్లు ద్రుపదుడు పేర్కొన్నాడు. అమాత్యలక్షణాలు కొన్ని కలిగి ఉన్న రాజపురోహితుడు ఈ దూత. ఇతడు ఉత్తమ పురోహిత దూత. ఇతడిని నియోగించినవాడు ద్రుపదుడు. అతడు నిర్వహింపదలచుకొన్నది బంధుకార్యం. పాండవులు అతడి అల్లుళ్ళు కావటంచేత అతడికి బంధుత్వంతోపాటు గురుత్వంకూడా ఉన్నది, బాధ్యతకూడా ఉన్నది. దూతను నియోగించి అతడిని వినియోగించుకొనే విధానాన్ని కూడా ద్రుపదుడు స్పష్టం చేశాడు.

క. 'ఇతఁడు మదీయాగ్ర పురో । హితుఁ; డితనికి నెల్లపనులు నెఱిఁగించి తగన్
ధృతరాష్ట్రు కడకుఁ బనుపుఁడు । చతుర వచన రచనఁ గఱపి సంప్రీతిమెయిన్.'

ఉ. 'ఆతని సమ్ముఖంబునఁ దదగ్రతనూజు కడన్ మరున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవు నొద్దఁ గ్రమోచితంబుగా
నీ తెఱఁ గిట్టు లాడుమని యేర్పడ నంతయుఁ జెప్పి పుచ్చఁగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభముఁ బెంపు జొప్పడున్'. **(ఉద్యో. 1.38, 39)**

అర్థశాస్త్రాన్ని అనుసరించి ద్రుపదపురోహితుడు శాసనహరుడివంటివాడు. కురుసభలో ఎవరెవరితో ఏయే విధంగా మాట్లాడాలో రాజు నిర్దేశించినట్లు అతడు మాట్లాడి ఫలితాంశం పరిస్థితులమీదనే వదలేవాడు. పాండవపక్షాన ఎటువంటి నిర్ణయం స్వయంగా తీసికొనే చొరవ అతడికి లేదు. రాజనీతి తెలిసినవాడు కాబట్టి అతడు నిపుణంగా మాట్లాడగలడు. ఆ మాటలవలన సాధించబడవలసిన ప్రయోజనాలు మూడు- 1. కౌరవపాండవుల మధ్య స్నేహం. 2. పాండవులకు రాజ్యలాభం. 3. పాండవులకు అభ్యుదయం. ఈ ఫలితాలు సాధించగలిగే చతురవచన రచనను పురోహితుడికి ధర్మరాజాదులు నేర్పాలని ద్రుపదుడు నిర్దేశించాడు. అంటే ద్రుపదపురోహితుడి శక్తి యుక్తులు స్వతంత్రదూతకార్యానికి సమర్థాలు కావని స్పష్టంచేశాడు. అతడికి కౌరవసభలో చేయవలసిన 'ఎల్లపను'లనుకూడా పూసగ్రుచ్చినట్లు చెప్పిపంపవలసి ఉంటుందని కూడా పేర్కొన్నాడు. అందువలన పురోహితదూత ఉత్తమ శాసనహరుడు.

దైన్యం లేకుండా, రాజ్యభాగాన్ని యాచిస్తున్నట్లు కాకుండా, ధర్మరాజు తన రాజ్యభాగాన్ని ఏలుకొనే హక్కును అమలు పరచుకొనటానికి ధృతరాష్ట్రుడి సమ్మతిని కోరుతున్నట్లుగా కురుసభలో దూత మాట్లాడాలి. ఇది లోకమర్యాదను పాటించే పద్ధతిలో సాగించే రాయబారం. దీనికి ధృతరాష్ట్రుడు సహజంగా, న్యాయపద్ధతి ననుసరించి సమ్మతి తెలపాలి. అందులో అవరోధాలు ఉండటానికి వీలులేదు. కాబట్టి గౌరవప్రదంగా పాండవభాగాన్ని అనుభవించటానికి వారిని ఆహ్వానించాలి లేదా అనుమతించాలి. దానికి భిన్నంగా ఎటువంటి అసంబద్ధపు మాటలు పలికినా దానికి ఫలితాలు ఎట్లా ఉంటాయో కూడా వారికి తెలియచెప్పాలి. ఆ తరువాత జరిగేది జరుగుతుంది. ఇదీ రాయబారపు స్వభావం. ఇందులో పాండవపక్షంలోని అభిప్రాయాలకు అనుగుణంగా పలుకుమని చెప్పిన పద్ధతిలో మాటలాడటమే దూతకార్యం. ఇది మర్యాదగా పంపుతున్న పాండవుల హెచ్చరిక. అంతేకాదు, పాండవులు స్వయంగా పంపేదేకాకుండా పాండవ హితులూ బంధువులూ స్నేహితులూ కలిసి పంపుతున్న హితవాక్యం. ఇందులో మంచిమాటలూ ఉంటాయి. మందలింపులూ ఉంటాయి. హితవూ ఉంటుంది. తగవూ ఉంటుంది. వినయమూ ఉంటుంది. వీరాలాపమూ ఉంటుంది. ఇందులో చెప్పటమే ముఖ్యం. కౌరవులు వినకపోతే వారి కర్మకు వారే బాధ్యులు. ఈ రాయబారంలో పాండవుల రాజ్యభాగానికి సంబంధించిన హక్కును భుక్తంచేసికొనే సమ్మతి కొరకు మర్యాదగా ధృతరాష్ట్రుడి ఎదుట ప్రస్తావించటం ముఖ్యం. వారి ప్రతిస్పందన అనుకూలమైతే స్నేహం, లాభం, అభ్యుదయం. విపరీతమైతే యుద్ధం, నష్టం, వంశనాశం ఏర్పడతాయి. ఈ తులనాత్మక అవగాహన కలిగేటట్లు కురుసభలో పలికి ధృతరాష్ట్రుడు తగిన నిర్ణయం తీసికొనేటట్లు చేయటం దూతకార్యం. ఇందులో దూతకు స్వాతంత్ర్యం

లేదు. చెప్పినట్లు చేయటమే కార్యం. రాయబారం వలన కలిగే ఫలితాలకు అతడు బాధ్యుడు కాడు. అయితే, నిర్దేశించిన పనులనుగాని, పలుకుమన్న మాటలుగాని వివేకంతో చేయాలి, చెప్పాలి. దానికి తగిన సంస్కారం ఉన్నవాడు ద్రుపదపురోహితుడు. అందుకే అతడు ఉత్తమ శాసనహరుడు.

ద్రుపదపురోహితుడి రాయబారం పాండవపక్షంలో ఉన్న పెద్దలందరి అభిప్రాయాల సారాంశంగా కనబడుతుంది. ప్రత్యేకంగా ధర్మరాజాదులు చెప్పి పంపిన మాటలు కావు. అయినా, అవి ధర్మరాజుయొక్క అంగీకారాన్ని పొందినవే. ద్రుపదపురోహితుడు కౌరవసభలో ఒక హితవరి, మధ్యవర్తి, పెద్దమనిషి, ఇంగితజ్ఞుడు, అభిమానధనుడు మాట్లాడుతున్నట్లుంటుంది. అయితే, ఆ మాటలన్నీ అతడివి కావు, పాండవ పక్షంలో ఉన్న పెద్దలమాటలు. ఈ అభిప్రాయం వీరిది అని ప్రత్యేకంగా పేర్కొనకుండా పలికిన సామూహిక సందేశసారాలు. అందువలన పురోహిత దూతకు ఆ మాటలలో ఎటువంటి కర్తృత్వ భోక్తృత్వాలు లేవు.

ఒక్కమాటలో చెప్పాలంటే ద్రుపదపురోహితుడి దౌత్యం పాండవహితులు ధర్మరాజు కొరకు నడిపిన రాయబారం! అతడు పలికిన తీరులో ఉన్న పారుష్యం బ్రాహ్మణ స్వభావంగా భీష్ముడికి తోచింది. అయినా, ఆ కరకుదనం ఆయనకు చెప్పి పంపిన వారిదే. దానిని కప్పిపుచ్చి దూతమీద పెట్టి మాట్లాడాడు భీష్ముడు. అది ధృతరాష్ట్రుడి మనసుకు రాపిడి కలిగించింది. కాని, అతడు పాండవులు రాజ్యభాగం అనుభవించే హక్కుకు 'సమ్మతి' ప్రకటించలేకపోయాడు. అందుకే సంజయుడి రాయబారం పంపవలసివచ్చింది. విరుద్ధభాషణం సభలో చేయకుండా రాయబారి ద్వారా పలకటం ధృతరాష్ట్రుడి రాజనీతి!

(2). ధర్మరాజుగురించి ధృతరాష్ట్రుడు చేసిన అమాత్యదౌత్యం

సంజయుడు ధృతరాష్ట్రుడి హితుడు, అమాత్యుడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో చెప్పబడిన అమాత్యగుణాలన్నీ ప్రధానమంత్రికి ఉండదగినవి. సంజయుడు ప్రధానమంత్రి కాడు. సన్నిహితుడైన అమాత్యుడు, హితుడు, బంధువు, శాస్త్రోక్తంగా చెప్పాలంటే ప్రధానమంత్రి విదురుడికంటె కొన్నిగుణాలు తక్కువవాడని చెప్పాలి. అయినా బుద్ధిమంతుడు, విశ్వాసపాత్రుడు. అందువలననే దూతగా ధృతరాష్ట్రుడు ఎన్నుకొన్నాడు. అతడు సంజయుడి రాయబారం ద్వారా సాధింపదలచుకొన్న కార్యం పరిమితమైనది. దాన్ని స్పష్టంగా సంజయుడికి తెల్పాడు.

క. 'నెయ్యము వాటించి కడుం । దియ్య మెసఁగ నలుకలెల్లఁ దీఱునటులుగాఁ
గయ్య మనుతలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగాన్'. **(ఉద్యో. 1.271)**

ధర్మజుడి కోపాన్ని తగ్గించేటట్లు, అతడు యుద్ధం మాట మానేటట్లు, నిపుణంగా మాట్లాడాలి. ఆ మాటలలో స్నేహం, తియ్యదనం జాలువారాలి. వాటిని విన్న ధర్మరాజు కోపాన్ని మరచిపోయి 'శాంతి ప్రకారంబునం కార్యంబు నడపి, యొక్కటియై మనేటట్లు ఒడబరచాలి'- అనేది దౌత్యలక్ష్యం. ధర్మజుడు శాంతిస్తే రాజ్యభాగం ఇస్తాననలేదు; కౌరవులూ పాండవులూ ఒక్కటియై ఎట్లా ఉంటారో సూచించలేదు. అందువలన సంజయుడు ఆ అంశాలమీద మాట్లాడే వీలులేదు. వాటిని తేల్చి చెప్పకపోతే ధర్మజుడు శాంతించే అవకాశమే లేదు. అయినా, సంజయుడు మాట నేర్పరితనంతో ధర్మరాజును శాంతమూర్తిగా మార్చాలి. ధర్మజుడి మనసు మారితే చరిత్ర మారుతుంది. పాండవపక్షం అతడి ఆనతిని శిరసావహిస్తుంది. భీమాదులు ధర్మజవాక్యబద్ధులై ఉంటారు. శాంతుడైన ధర్మరాజులో రాజ్యకాంక్ష సమసిపోయే శమభావం మోసులెత్తాలి. అంటే- యుద్ధోత్సాహానికి మూలమైన రాజ్యకాంక్షను తొలగిస్తే ధర్మజుడు మునివృత్తిని స్వీకరించవలసిందే. జీవితాంతం అడవులలో తాపసజీవితం గడుపుకొంటూ ఉండవలసిందే. అదే ధృతరాష్ట్రుడు లక్షిస్తున్న పరిష్కారం. అదే ఆయన దృష్టిలో 'ఒకటియై ఉండటం'. ఈ పరిమిత ప్రయోజనం కొరకు రాయబారం చేసే సంజయుడు 'పరిమితార్థుడు'.

ద్రుపదపురోహితుడి దౌత్యంలో ధృతరాష్ట్రుడు హితులచేత రెచ్చగొట్టబడిన ధర్మరాజును ఊహించాడు. అతడి కోరికను మన్నించటం గ్రుడ్డిరాజుకు ఇష్టంలేదు. అందువలన ధర్మరాజులో మానసిక పరిణామాన్ని తెస్తే యుద్ధోద్యోగమే ఆగిపోతుందని, అసలుకే మోసం తెచ్చే భేదనీతిని ప్రయోగించాడు. ఈ నీతి అందరికీ తెలిపి చేసింది కాదు. తన చుట్టుప్రక్కల ఉన్న మంత్రి మండలికీ, హితులకూ చెప్పిన తీరు వేరు. ఆ తరువాత సంజయుడికి ఏకాంతంలో బోధించిన విధం వేరు కావటంచేత ఈ రాయబారం అందరికీ తెలిసేటట్లు చేసినా, అందరి అభిప్రాయాలకూ ప్రాతినిధ్యం వహించదు. 'ధృతరాష్ట్రు డొక్కడూ రాజ్యభాగానికి అంగీకరిస్తే ఇతరులందరూ అంగీకరించినట్లే ఔతుం'దని ధర్మరాజు భావిస్తే, దానికి ప్రతిగా 'ధర్మరాజుకూడా శాంతిస్తే అందరూ శాంతించినట్లే ఔతుం'దని ధృతరాష్ట్రుడు దూతను ప్రయోగించాడు. సంజయదౌత్యంవలన సాధించబడేది ఏమీ ఉండదని తెలుసు. కాని, అదృష్టవశాత్తు ధర్మజుడు మారితే ఆపద తప్పుతుందని అనుకొన్నాడు ధృతరాష్ట్రుడు. అతడు చేసిన ఈ గూఢప్రయోగం (విగ్రహం) అతడికే కాక, అతడి పక్షం వారికంతా సుడిగుండంవలె చుట్టుకొంటుందని భావించలేకపోయాడు. ఒకవేళ రాయబారాన్ని సమగ్రస్ఫూర్తితో నిర్వహించుమని సంజయుడిని కోరి ఉన్నట్లయితే ఫలితం మరొకరకంగా ఉండేది. అట్లా కావటం ధృతరాష్ట్రుడి అభిమతం కాదు. అందుకే ఉత్తముడు కాని రాజుచేత ప్రయోగించబడిన సంజయుడు ఉత్తమదూత కాలేకపోయాడు. రాయబారం సఫలం కాదని సంజయుడికీ తెలుసు. కాని, సంధి యత్నంలో సామర్థ్యాన్ని ప్రదర్శిస్తే సహృదయుల సానుభూతిని పొందవచ్చునని తన ధర్మాన్ని శక్తివంచన లేకుండా నిర్వహించాడు. చివరకు ధర్మజుడి ప్రశంసల నందుకొన్నాడు కూడా!

క. 'ఎదురున్న రూపు వలుకఁగఁ । దుదిఁ గటకటఁ బడవు; నీవు దుర్ణయమును బె
ట్టిదమును, బెండును నగుపలు । కొదవదు నీ నాలుకకు నయోన్నత! యెపుడున్'.

క. 'నీ వొండె విదురుఁ డొండెను । గావలయుంగాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె తగువా? । రీ వినయము నేర్పుగలదె యితరుల కెందున్?'. **(ఉద్యో. 1. 363,364)**

మొత్తం మీద సంజయ దౌత్యం ధర్మరాజును గురించి (ఉద్దేశించి) సాగించిన రాయబారమే.

(3). ధర్మరాజే ధర్మనీతి కొరకు చేసిన రాయబారం శ్రీకృష్ణ దౌత్యం

శ్రీకృష్ణుడు అమాత్యుడు కాడు; పరమాత్ముడు. పాండవులకు ఆరాధ్యదైవం. ఆత్మబంధువు. మార్గదర్శి. ఆయన తనంతట తానే హస్తినాపురానికి పోయి ధృతరాష్ట్రుడికి హితవు చెప్పి, కులక్షయం కాకుండా, సంధి కుదిరించి పాండవులకు రాజ్యలాభం కలిగిస్తానని ప్రకటించుకొన్నాడు. అతడు స్వయంగా నియోగించుకొన్న పెద్దమనిషి రాయబారి. కౌరవపాండవులకు హితంకోరే మధ్యవర్తి. అయినా, పాండవపక్షవర్తి, ధర్మపక్షపాతి. ఆయనకు ధర్మరాజు తన అభిప్రాయాన్ని చెప్పి, తమకు హితంజరిగేటట్లు సంధినడుపుమని ప్రార్థించాడు. శ్రీకృష్ణ డాయన ఆనతిని పాటిస్తానని మాటయిచ్చాడు. ఆయన ఆశించే ఫలితాలు సిద్ధించేటట్లు దౌత్యం చేస్తానని ధైర్యం చెప్పాడు. సంజయుడి వర్తమానం ప్రకారం శ్రీకృష్ణుడు ఉభయులు (కౌరవపాండవుల) శ్రేయోభిలాషిగా హస్తినకు వస్తున్నాడు. పాండవుల దృష్టిలో అతడు ధర్మరాజునియోగాన్ని నిర్వహించటానికి హస్తినకు వెళ్ళుతున్నాడు. మరి, పఠితల దృష్టిలో ఆయన యుద్ధాన్ని సిద్ధాంతీకరించటానికి హస్తినకు సర్వాధికారిగా చేరుతున్నాడు. ఆయనను రాయబారి అన్నదానికంటె హితవరి అని అనటం మేలు. అయినా, దుర్యోధనాదులైన కౌరవులందరూ అతడిని పాండవదూతగానే భావించారు, వ్యవహరించారు. అందువలన దూతకార్యంలో నియుక్తుడైన హితవరి సర్వాధికారి శ్రీకృష్ణుడు.

కౌటిల్యుడి అర్థశాస్త్రం ప్రకారం శ్రీకృష్ణుడు ప్రధానామాత్య లక్షణాలన్నీ సంతరించుకొన్న 'నిసృష్టార్థుడు'. దౌత్య లక్ష్యాలన్నింటినీ పేర్కొన్న ధర్మరాజు వాటిని సాధించే ఉపాయాలను కొన్ని సూచించాడే కాని, అన్నీ ఆయనకు వివరించి చెప్పలేదు. చివరకు-

క. 'మమ్మొఱుఁగు, దెదిరి నెఱుఁగుదు, । నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు, । పొ మ్మెవ్వఁడ నీకు నేను బుద్ధులు సెప్పన్?' **(ఉద్యో. 3.34)**

అని శ్రీకృష్ణుడిపై సర్వకార్య నిర్వహణ భారాన్ని వదలివేశాడు. అర్జునాదులు శ్రీకృష్ణు డేనిర్ణయం చేస్తే దానినే శిరసావహిస్తామన్నారు. పురుషకారం, దైవానుకూల్యం రెండూ శ్రీకృష్ణుడే అని భావించారు. ఆయన తిమ్మిఅంటే తిమ్మి, బ్రహ్మి అంటే బ్రహ్మి ఔతుందని విశ్వసించారు. అందుకే సంధికై వెళ్ళిన శ్రీకృష్ణుడు యుద్ధాన్ని ప్రకటించి వచ్చాడు. శ్రీకృష్ణుడు సర్వస్వతంత్రుడైన పాండవదూత. ధర్మరాజుహృదయంలోని ధర్మనీతికి క్రియాశక్తి!

సర్వధర్మాభిజ్ఞుడైన శ్రీకృష్ణుడు దూతపాత్రను నిర్వహిస్తున్నప్పుడు దూత చేయవలసిన పనులన్నీ నిర్వహించి ఆ వృత్తికి ఒక ఆదర్శాన్ని కల్పించాడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో దూత కార్యాలు ఇట్లా చెప్పబడ్డాయి.

శ్లో. ''ప్రేషణం సంధిపాలత్వం ప్రతాపో మిత్రసంగ్రహః
ఉపజాపః సుహృద్భేదో దణ్డ గూఢాతిసారణమ్
బన్ధురత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః
సమాధిమోక్షో దూతస్య కర్మయోగస్య చాశ్రయః''. **(అర్థశాస్త్రమ్. 1 అధికరణం. 16వ. అధ్యా. పు.68.)**

వార్తలు పంపటం, ఇతర రాజులతో తనస్వామి చేసికొన్న సంధులను గట్టిచేయటం, తన స్వామి గొప్పతనాన్ని చాటడం, మిత్రులను సంపాదించటం, కృత్యాదులను రెచ్చగొట్టడం శత్రువుల స్నేహితులలో భేదం కలిగించటం (వాళ్ళను విడదీయటం). సైన్యాన్నీ, గూఢపురుషుల్నీ శత్రురాజ్యంలోనికి ప్రవేశపెట్టడం, శత్రువుల బంధువులను, రత్నాలను అపహరించడం, రహస్య సమాచారాలు తెలిసికొనటం. పరాక్రమం చూపడం, సమాధిని (పూచీకత్తుకోసం పట్టుబడిన వాడు **Hostage**) విడిపించటం, రహస్యమైన ఉపాయాలు పన్నడం- ఇవి దూతలు చేయవలసిన పనులు. (వ్యాఖ్య: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు. పు.68).

శ్రీకృష్ణుడు దూతగా ఈ పనులనన్నింటినీ కార్యసాధనకు అనువుగా నిర్వహించిన నిపుణుడు. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి చేరే వార్తల ప్రసారం విస్తారంగా సాగింది. విదురాది పాండవ శ్రేయోభిలాషుల హృదయాలలో చెరగకుండా ఉన్న పాండవాభిమానాన్ని పక్షపాతంగా పరివర్తింపచేశాడు శ్రీకృష్ణుడు. కురుసభలో పాండవ ధర్మనీతిని, వారి పరాక్రమ విశేషాలను శత్రుభయంకరంగా పొగడి వారి గొప్పతనాన్ని చాటాడు. శ్రీకృష్ణుడి ఉపన్యాసం విన్న రాజులు పాండవ ధర్మవర్తనంమీద సానుభూతిని పెంచుకొన్నారు. దుర్యోధన దుర్నీతిని అంతరాంతరాలలో గర్హించారు. శ్రీకృష్ణుడు కర్ణాది దురభిమానులను రెచ్చగొట్టి కురుసభలో కల్లోలం సృష్టించాడు. దుర్యోధనుడి బహిఃప్రాణమైన కర్ణుడి జన్మరహస్యం చెప్పి భేదోపాయాన్ని ప్రయోగించాడు. హస్తినాపురంలో సమకూడిన శత్రు శిబిరాలలోని వీరుల తీరులను, వారి బలాబలాలను, రహస్యాలను తెలిసికొన్నాడు. దుష్టచతుష్టయం శ్రీకృష్ణుడిని లంచాలతో వశంచేసుకొనటానికీ, ఆహారంలో విషం పెట్టి చంపడానికీ, ఒంటరివాడిని చేసి బంధించి వధించటానికీ యత్నించగా, స్వీయప్రతాపాన్ని ప్రదర్శించి తనను తాను రక్షించుకొన్నాడు, చతుర్విధోపాయాలను యథావకాశంగా ప్రయోగించాడు. దూతకార్యాల నన్నింటినీ ప్రదీప్తంగా నిర్వహించిన శ్రీకృష్ణుడు ఉత్తమదూత! విశ్వరూపాన్ని ప్రదర్శించి ధృతరాష్ట్రుడిని అనుగ్రహించి దివ్యాదివ్యుడనిపించుకొన్న శ్రీకృష్ణుడు పాండవదూతయే కాక, ధర్మదూత అనిపించుకొన్నాడు. శ్రీకృష్ణుడివంటి దివ్యాత్ముడైన దూత న భూతో న భవిష్యతి.

ముగ్గురు దూతల ముచ్చటను ఒక్కచోట ముడివేస్తే ఇట్లా చెప్పవచ్చును.

1. ధర్మరాజు కొరకు హితులు చేపట్టిన రాయబారం పురోహిత దౌత్యం. పురోహితుడు 'శాసనహరుడు'.

2. ధర్మరాజు నుద్దేశించి ధృతరాష్ట్రుడు నడిపిన అమాత్యదౌత్యం సంజయదౌత్యం. సంజయుడు 'పరిమితార్థుడు'.

3. ధర్మరాజు స్వయంగా ధర్మనీతి కొరకు చేసిన రాయబారం శ్రీకృష్ణ దౌత్యం. శ్రీకృష్ణుడు - 'నిసృష్టార్థుడు'.

(4). అహంకారి చేపట్టిన అధిక్షేపదౌత్యం ఉలూకుడి రాయబారం

ఉద్యోగపర్వం చివర దుర్యోధనుడు దురహంకారంతో పాండవ ప్రతిజ్ఞలను అధిక్షేపిస్తూ ఉలూకుడితో పంపిన సందేశం ఆవేశ ప్రధానంగా, అధిక్షేపాత్మకంగా సాగింది. ఉలూకుడు వస్తుతః శాసనహరుడివంటి దూత. మర్యాదలేకుండా మాట్లాడినా, ఉలూకుడిని మర్యాదతో చూచి, మర్యాద తెలియని దుర్యోధనుడికి తగిన సమాధానాన్ని తిప్పి పంపిన పాండవపక్షం గౌరవాన్ని గడించింది. దుర్యోధనుడి అధిక్షేపం పాండవవీరులలో యుద్ధోత్సాహాన్ని ఇనుమడింపజేసింది.

రాయబారపు ఘట్టాలలో గమనించదగిన మరొక అంశం- ఏమంటే. ఉలూకుడు, పురోహితుడు, సంజయుడు రాయబారులుగా వెళ్ళేముందు వారి ప్రభువులు వారికి చెప్పిన మాటలు తిక్కన వివరించలేదు. కాని, శ్రీకృష్ణుడు హస్తినాపురికి వెళ్ళేముందు ఉపప్లావ్యంలో పాండవవర్గంవారందరూ తమ తమ అభిప్రాయాలు చెప్పారు. హస్తినలో కౌరవ ముఖ్యులందరూ ఆయనతో చర్చించారు. శ్రీకృష్ణుడు ఇక్కడా, అక్కడాకూడా విశదంగా మాట్లాడాడు. ఉత్తముడైన రాయబారిని చిత్రించటంలో పాటించవలసిన సమగ్రశిల్పం శ్రీకృష్ణుడి రాయబారానికే దక్కింది. అందుకు కారణం రాజు ఉదాత్తుడు కావటం, రాయబారి ఉత్తముడు కావటమే. అంతేకాదు భావికథకు పోషకమైనది శ్రీకృష్ణుడి రాయబారమే.

కాగా, ఆయా రాజులయెదుట రాయబారులు మాట్లాడిన తీరు తెన్నులను తీర్చిదిద్దటంలో తిక్కన కావ్యకళాశిల్పాన్ని కమనీయంగా పోషించాడు. మరేపర్వంలోనూ ఇంతటి రాజనీతి చర్చ కానరాదు, రూపకోచిత రసోల్లాసం రాణించదు; పాండవకౌరవ పరాక్రమ తులనాత్మక చర్చ ఇంతగా ప్రత్యక్షం కాదు. దానిని అనుశీలించటం ఉద్యోగపర్వ శిల్ప కళావైభవాన్ని దర్శించటం!

5. తిక్కన రచన : నాటకీయత

తిక్కన సోమయాజి 'ఉభయకవిమిత్రుడు'. సంస్కృతాంధ్రభాషలలో కవిత్వం చెప్పటంవలన, దృశ్యశ్రవ్య ప్రక్రియలను రచనలో పోషించటంవలన, మార్గదేశీ పద్ధతులను సమన్వయించటంవలన, నిర్వచన చంపూకావ్య ప్రక్రియలను నిర్వహించటంవలన, కావ్యాన్నీ ఇతిహాసాన్నీ సంవిధానం చేయటంవలన, తత్సమ ఆచ్ఛికపదాలను నిపుణంగా మేళవించటంవలన- ఇటువంటి కారణాలవలన తిక్కనకు 'ఉభయకవి మిత్రు'డనే బిరుదు సార్థకమైనది. పై లక్షణాలలో శ్రవ్యకావ్య ప్రక్రియలో దృశ్యస్వభావాన్ని పొందుపరచి చెప్పే కావ్యరచనా విధానాన్ని 'నాటకీయత' అని అంటారు.

కావ్యంలో నాటకీయత - రంగపరికల్పన, చతుర్విధాభినయ ప్రదర్శన, వర్ణన, రూపకోచిత కావ్యాంశాల సంవిధానం మొదలైన అంశాలమీద ఆధారపడి ఉంటుంది. ఒక సన్నివేశాన్ని కొన్ని రంగాలుగా చిత్రించటానికి వీలుంటే, వాటిని కల్పించి రూపక స్వభావాన్ని కావ్యంలో చూపించటం రంగపరికల్పన. అభినయం నాలుగు రకాలు. 1.ఆంగికం, 2.ఆహార్యం, 3.వాచికం, 4.సాత్త్వికం. తిక్కన ఈ నాల్గింటిని యథోచితంగా పాత్రల అభినయంలో వర్ణించి రసాన్ని రక్తికట్టించటం చతుర్విధాభినయ ప్రదర్శనం. కావ్యనాటకోచిత వర్ణన. పతాకాది రూపకోచిత అంశాలను కావ్యంలో సంవదించటం మరొక లక్షణం. వీటిని ఉద్యోగపర్వ శిల్పానుశీలనలో భాగంగా పరిశీలించటం ప్రస్తుతాంశం.

నాటకీయతకు నారుపోసినట్లుంటుంది ఉద్యోగపర్వం. కథలో సహజంగా అమరిన సభలూ, సమావేశాలూ, సన్నివేశాలూ, సంభాషణలూ నాటకీయతకు జీవితాన్ని కల్పించాయి. సభలు నాటకంలోని అంకాలవలె, సమావేశాలు రంగాలవలె, సన్నివేశాలు దృశ్యాలవలె, సంభాషణలు సంఘటనలవలె రాణించటం విశేషం. కథన వర్ణనలు పూలదండలోని దారంవలె, యక్షగానంలో సూత్రధారవచనంవలె అమరి నాటకీయతకు కావ్యకళా గౌరవాన్ని కలిగిస్తున్నాయి.

రాజనీతి ప్రధానమైన ఉద్యోగపర్వంలో వ్యర్థ సన్నివేశంగాని, సంభాషణంగాని లేదు. అందుచేత రచన చక్కగా చిక్కగా సాగింది. అర్థవంతంగా నడిచింది. ఆలోచనామృతంగా ఆస్వాదనీయ గౌరవాన్ని పొందింది. తిక్కనలోని మహాకవి మహామంత్రిగా ఉద్యోగంలో ఉన్మీలించాడు. ఉదాత్తమైన ఒక మహానాటకం వంటి గొప్పకావ్యం (ఉద్యోగపర్వం) తెలుగువారికి దక్కింది.

మహానాటకంలో పది అంకాలున్నట్లుగా ఉద్యోగపర్వంలో పదిసభలు అంకాలుగా చిత్రించబడ్డాయి. ప్రధానపాత్రలతో రసవత్తరమైన సంభాషణలతో ఏకదివస వృత్తం ప్రదర్శితమైతే అంకం. అట్లాగే ఉద్యోగపర్వంలోని సభారంగాలు పది అంకాలుగా ప్రకాశిస్తున్నాయి. వాటిని ఈ క్రింది విధంగా గుర్తించవచ్చును.

(1). అంకాలుగా గోచరించే సభలు

1. ఉపప్లావ్యంలోని ధర్మరాజు సభ	1. 6-50
2. ద్రుపదపురోహితుడి రాయబారం సాగిన ధృతరాష్ట్రుడి నిండుసభ.	1. 230-257
3. సంజయుడి రాయబారం నడిచిన ధర్మరాజు పేరోలగం.	1. 272-380
4. సంజయుడి పాండవసందేశాలు వినిపించిన ధృతరాష్ట్ర సభ.	2. 116-302
5. పాండవులు శ్రీకృష్ణుడికి తమ సందేశాలను వినిపించిన శ్రీకృష్ణమందిర సభ.	3. 5-129
6. శ్రీకృష్ణుడి రాకనుగురించి సమాలోచించిన ధృతరాష్ట్రుడి సభ	3. 148-172
7. శ్రీకృష్ణుడి రాయబారం సాగిన ధృతరాష్ట్ర మహాసభ	3. 247-411
8. శ్రీకృష్ణుడి తన రాయబారపు విశేషాలు తెలిపిన ధర్మరాజు సభ	4. 72-112
9. ఉలూకుడి రాయబారం సాగిన పాండవ స్కంధావారం	4. 817-210
10. భీష్ముడు కౌరవపాండవ వీరుల బలాబల నిరూపణం చేసిన స్వీయ స్కంధావార మందిర సభ	4. 211-425

దశాంక సదృశమైన ఈ సభాఘట్టాలలో మహానాటకంలోవలె ప్రతిరెండు (అంకాలవంటి) సభలలోనూ కలిసి, ఒక్కొక్క సంధి నిర్వహించబడుతూ మొత్తంమీద పంచసంధులు పోషించబడేటట్లు వస్తునిర్మాణం జరగటం ఈ పర్వ విశేషం. ఉపప్లావ్యనగరంలో ఉద్యోగానికి బీజావాపనం జరిగింది. ధృతరాష్ట్రుడి సభలో ద్రుపదపురోహితుడు దానిని కార్యారంభంగా మలచి ప్రదర్శించాడు. ముఖసంధి అక్కడ భాసించింది. ధృతరాష్ట్రుడు సంజయుడిని రాయబారిగా పంపటం, ఆ గ్రుడ్డిరాజుమనోగతాన్ని సంజయుడు ధర్మరాజు సభలో వివరించటం, దానిమీద ధర్మజాదులు ఆగ్రహాన్ని వ్యక్తం చేయుటం, శ్రీకృష్ణుడు హస్తినకు పోయి శాంతియత్నం చేయటానికి ముందుకు రావటం బిందువువంటిది. ఆ బిందువే కార్యక్షేత్రమంతా నీటిపై తైలబిందువువలె వ్యాపిస్తుంది. ధృతరాష్ట్రుడి సభలో సంజయుడు పాండవసందేశాలను వినిపించటం, వాటిపై కౌరవవీరుల పరస్పర చర్చలు, తీవ్రవాదోపవాదాలు రేగటంవంటివి తీవ్రయత్నాన్ని సూచిస్తున్నవి. ప్రయత్న బిందు సంబంధం గలది ప్రతిముఖసంధి. పాండవులు సంధి సందేశాలను శ్రీకృష్ణుడికి వినిపించటంలోనూ సంధి జరగదనే అనుమానంతోనే చతుర్విధోపాయాలను సారించటంలోనూ ప్రాప్త్యాశ, శ్రీకృష్ణుడు హస్తినాపురంలో ప్రవేశించటంతో అక్కడ చెలరేగిన భావవైరుధ్యాల సందడి, మహర్షులు సభకు రావటం వంటి సన్నివేశాలలో పతాక ప్రకాశించింది. ప్రాప్త్యాశా పతాకల సంబంధం కలది

గర్భసంధి. శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టం నియతాప్తిని సూచించింది. కర్ణాదుల వృత్తాంతాలు ప్రకరి గౌరవాన్ని సంతరించుకొన్నాయి. శ్రీకృష్ణుడు ధర్మరాజు సభలో కౌరవ సభావృత్తాంతాన్ని నివేదించిన ఘట్టంలో అవ(వి)మర్శసంధి స్ఫురించింది. క్రోధవ్యసనాదులచేత గర్భసంధిలో ప్రకాశించిన బీజార్థాలను గురించి చేయబడే పర్యాలోచనమే ఈ కథా ఘట్టంలో ప్రధానాంశం. అదే అవ(వి)మర్శసంధి. ఉలూక ప్రలాపాలు, పాండవవీరుల ప్రతిజ్ఞలు కార్యరూపంతాల్చే ఉత్సాహాన్ని ఉద్దరింపజేశాయి. భీష్మవచనాలు యుద్ధ నిర్వహణంలో పాండవ విజయాన్ని సూచిస్తూ ముగిశాయి. దానితో యుద్ధోద్యోగ ఫలాగమం సూచించబడింది. ఈ విధంగా పది అంకాలవంటి సభారంగాలు సమగ్ర నాటక కార్యస్వరూపాన్ని ప్రత్యక్షంచేయగలిగాయి. ఇది నాటకీయతలోని వస్తు నిర్మాణ శిల్ప మహత్త్వం!

ధర్మరాజును 'మెత్తనిపులి'గా చిత్రించాడు తిక్కన. పైకి మెత్తగా కనపడినా లోన పులివంటి పౌరుషశాలి, గూఢాభిమాని. అవసరం వచ్చినప్పుడు క్రౌర్యంకూడా ప్రదర్శించగలడు. కౌరవులు చేసిన అపకారం ధర్మరాజుకు ఆగ్రహం కలిగించాలి. హింసకు దారితీయాలి, యుద్ధానికి ప్రేరణ కావాలి. కాని, అతడు 'వశీకృతచిత్తుడు'. యుధిష్ఠిరనామధేయుడైనా మనస్సును అదుపులో ఉంచుకోగలడు. సమయజ్ఞుడు. ఎప్పుడు ఆగ్రహించాలో తెలుసు, ఎప్పుడు అనుగ్రహించాలో తెలుసు. ఆగ్రహానుగ్రహాలను కూడా ధర్మబద్ధం చేయటం ధర్మరాజు ప్రవృత్తి.

ధర్మరాజు సహజంగా ఉభయాయత్తసిద్ధి. కార్యసాధనం స్వయంగా నిర్వహించుకొని ఫలసిద్ధి పొందేవాడు స్వాయత్తసిద్ధి. మంత్రుల సహాయంతో సాధించేవాడు సచివాయత్త సిద్ధి. తాను మంత్రులతో కలిసి సమష్టిగా కృషి చేసి ఫలాన్ని పొందేవాడు ఉభయాయత్త సిద్ధి. పాండవులు స్వయంగా బలవంతులైన నాయకులు. శ్రీకృష్ణుడు వారికి మిత్రుడు, గురువు, దైవం, మార్గదర్శకుడు. అయినా ఉద్యోగంలో వారికి సచివోత్తముడు. ధర్మజుడు ఇచ్ఛాశక్తి, భీమార్జునులు క్రియాశక్తులు, శ్రీకృష్ణుడు జ్ఞానశక్తి. ధర్మరాజు తన ఉద్యోగాన్ని శ్రీకృష్ణముఖంగా సాగించాడు. భీమార్జునులు ధర్మజుడిని బలపరిచారు. ఇచ్ఛాక్రియాశక్తులు జ్ఞానప్రకాశంతో ప్రవర్తిల్లుతాయి. ఈ తత్త్వాన్ని రాజనీతి నాశ్రయించి సాగే ఉద్యోగపర్వం వ్యాఖ్యానించి చెప్పింది. పై పది అంకాలవంటి సభలూ ఆ పరమార్థాన్నే ప్రదర్శిస్తున్నాయి. ఈ పర్వ కార్యతత్త్వ కరదీపిక శ్రీకృష్ణుడి వ్యాఖ్య!

ఆ. 'రోషమయ మహాతరువు సుయోధనుఁ; డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ డలరుఁ;
గొమ్మ సౌబలుండు; గుసుమ ఫలములు దు । శ్శాసనుండు; మూల శక్తి తండ్రి'.

ఆ. 'ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన । స్కంధ; మనిలసుతుఁడు శాఖ; కవలు
పుష్పఫలము; లేను భూసురులును వేద । ములుఁ దదీయమైన మూలచయము'.

క. 'ఈరెంటియందు నరసి య । సారం బిది, గాఢసార సహితం బిది నా
నేరవలయు; నదియును గా । కేరూపం బయ్యెనేని నీ సేమిటికిన్'? **(ఉద్యో. 1.355-357)**

ఉద్యోగపర్వంలో ధర్మనిర్ణాయశక్తిగా శ్రీకృష్ణుడు పోషించబడటం పై సభాకార్యక్రమాలలో పాటించిన శిల్పం. ధర్మతరువుకు మూలబలాన్ని నిరూపించటం ఈ పర్వ పరమతాత్పర్యం. దానికి ప్రతిగా రోషమయ మహాతరువుకు మూలమైన, లోభశక్తి అయిన ధృతరాష్ట్రుడి బలహీనతను ప్రదర్శించటం కూడా పర్వకథార్థ ప్రయోజనమే. ఈ రెండింటి చిత్రణలో కానవచ్చే ప్రతిస్పర్ధి శిల్పం ప్రశంసనీయం.

1. ఉపప్లావ్య నగరంలోని ధర్మరాజుసభలో ఉద్యోగపర్వంలో నిర్వహించబడే కార్యసూత్రానికి నాందిపలికింది శ్రీకృష్ణుడే. అతడి ప్రతిపాదన ప్రాతిపదికగా బలరామసాత్యకి ద్రుపదాదుల ఆలోచన సాగింది. పురోహితుడి రాయబారం రూపొందింది. దానిని అంగీకరించి ధర్మరాజు శ్రీకృష్ణుడి ప్రయత్నాన్ని సమ్మతించాడు.

'ఎదిరిమతం బెఱుంగక యెట్టికార్యంబు నిశ్చయింప వెరవగునే? కావున నియ్యవసరంబునఁ దగిన మానిసి నందులకుం బుచ్చవలయు! దుర్యోధనుడు వీరికి రాజ్యంబుపాలిచ్చిన మేలగుఁగాక! తక్కిన నప్పటికిఁ బోలిన పని సూచుకొందము' (ఉద్యో. 1.17) అన్న శ్రీకృష్ణుడి వాక్యం ధర్మజుడి ధర్మనీతి వర్తనానికి మూలం; పాండవోద్యోగానికి ప్రారంభం.

2. ద్రుపదపురోహితుడు ధృతరాష్ట్రుడి సభలో భీమార్జున సాత్యక్యాదుల పరాక్రమాలను ప్రశంసించి చివరకు 'శ్రీకృష్ణుడు పాండవుల కండగా ఉండగా వారు అసాధ్యులయ్యా'రని కీర్తించాడు.

మ. 'వివిధోపాయ పరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు, మంత్రరక్షణ కళా ప్రావీణ్య గణ్యుండు, ధై
ర్యవివేకాది గుణోత్తరుం, డఖిల విద్యాజాల సంవేది మా
ధవుఁ డా దిక్కటె! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే?' **(ఉద్యో. 1.240)**

ఇందులో శ్రీకృష్ణుడికి అయిదు విశేషణాలు వాడబడ్డాయి. పంచపాండవులకు ఆయా విశేషణాలు వరుసగా అన్వర్థం కాగలవిగాకూడా కనబడుతున్నాయి. వారి కాయా విశేషణాలు అబ్బటానికి ఆదిశక్తి శ్రీకృష్ణుడు. వాటిని అలవరచుకొని అసాధ్యు లనిపించుకొన్నారు వారు. శ్రీకృష్ణుడు సర్వశక్తి సంపన్నుడు కాబట్టే పంచపాండవుల విశిష్టగుణాలన్నీ తనయందే పండించుకొని పరిపూర్ణ రాజనీతి పురుషుడుగా రాణించాడు. పాండవులకు వాటి సిద్ధిని ప్రసాదించాడు. అంతటి మహిమగల వ్యక్తి కౌరవపక్షంలో లేడు. అస లాకాలంలోనే లేడు. శ్రీకృష్ణుడు నాయకులకే నాయకుడు. అతడు పాండవులకు సహాయకుడు.

3. సంజయ దౌత్యంలో దుర్యోధనాదులు రాజ్యం భోగించటానికే పుట్టారన్నట్లూ, వారిని మార్చటం కష్టమన్నట్లూ, వారివర్తనకు ఫలం వారనుభవిస్తారన్నట్లూ సరిపుచ్చి, ధర్మరాజు మాత్రం ఉత్తముడు కాబట్టి అతడికి 'రుధిరాభీలాన్నముకంటెను మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్' అని నియోగించాడు. దానికి మండిపడిన ధర్మరాజు, ఉభయపక్షాలలో ధర్మాధర్మనిర్ణయం చేయదగిన మహాత్ముడు శ్రీకృష్ణుడే అని ప్రశంసించి, అతడి మాటే పాండవులకు వేదవాక్యమని ప్రకటించాడు.

'ఇది కర్తవ్యం బిది యకర్తవ్యం బని మనల శాసింప వాసుదేవుండు గలండు; మన కీ వితర్కం బేటికి? నితండు ధర్మాధర్మవిదులకు గురుండు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుం, డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం; డితని పంపున గాదె యదుభోజాంధక వృష్ణి సంజయ కేకయ ప్రభృతి భూపతి ప్రకరంబు ప్రశస్తపథంబునం బ్రవర్తిల్లుచున్నయది; విశేషించి మాకు నితని బుద్ధియ సమస్త పురుషార్థంబులకు మూలంబగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయంబు'. (ఉద్యో. 1.335)

శ్రీకృష్ణుడు బ్రాహ్మణుడిని రాయబారానికి పంపటానికి అంగీకరించాడు. పురోహితదౌత్యం ప్రవర్తిల్లింది కాని ఫలవంతం కాలేదు. సంజయుడి రాయబారం ధర్మరాజుకు ధర్మసంకటం తెచ్చిపెట్టింది. క్షత్రియులకు అహింసయా ధర్మం? శత్రువులను యుద్ధంలో సంహరించి రాజ్యాన్ని పాలించుటయా ధర్మం?- అన్న మీమాంస ఏర్పడింది; ఈ ప్రశ్న సంజయుడి రాయబారం వలననే ఏర్పడింది. ధర్మరాజు ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని తిరస్కరించి కౌరవపాండవుల కిరువురికీ శ్రీకృష్ణుడి హితవే శ్రేయస్కరమని ప్రతిపాదించాడు. సంజయుడి రాయబారం విఫలమయిన తరువాత మరల కార్యక్రమాన్ని సూచించవలసిన వ్యూహకర్త. బుద్ధిశక్తి శ్రీకృష్ణుడే కాబట్టి, ఆతడిని చూపించి భావికథాగతికి మార్గదర్శకుడిగా నియోగించాడు ధర్మరాజు. ఉపప్లావ్య సభలో

చెప్పిన కార్యానికి తరువాయి భాగం నిర్వహించవలసిన బాధ్యతను శ్రీకృష్ణుడిపై ఉంచాడు. ఉద్యోగ పర్వంలో ఇక శ్రీకృష్ణుడే కార్యనిర్దేశకుడని ధర్మరాజు నిశ్చయించటంతో ఈ పర్వంలో శ్రీకృష్ణుడిది కీలకస్థానమని స్పష్టమయింది. ప్రవర్తిల్లబోయే శ్రీకృష్ణుడి రాయబారానికి ఈ ప్రకటన భావికథార్థ సూచన!

4. సంజయుడు ధృతరాష్ట్రుడి సభలో, తాను జరిపిన సంధికార్య విశేషాలను తెలిపిన సందర్భంలో, ఆ గ్రుడ్డిరాజు పాండవ కౌరవ సేనల బలాబలాలను గురించి అనేక విధాలుగా వితర్కించాడు. అప్పుడు సంజయుడు ఇట్లా తేల్చి చెప్పాడు.

క. 'ఆ సేనకు నీ సేనకు । వాసి యడిగె దీవు నన్ను; వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు; తత్సము । నీ సేనం జూపుమా నరేశ్వర! నాకున్'.

క. 'పలుమఱుఁ బాండుతనూజుల । కొలఁది వితర్కించెదవు; నిగూఢం బది; యేఁ
దెలియం బలికెద; వారికి । బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా!' **(ఉద్యో. 2.308,313)**

శ్రీకృష్ణుడి రాయబారం ప్రవర్తిల్లేముందు సంజయుడు చేసిన ఈ ప్రశంస కౌరవులకు కనువిప్పు కలిగించే శంఖారావం. హస్తినకు రానున్న శ్రీకృష్ణుడికి ఇది ప్రస్తావన. శ్రీకృష్ణుడి దివ్యశక్తి సూచిక.

5. పాండవులు తమ అభిప్రాయాలను తెలిపి సంధికార్యం నిర్వహించుమని ప్రార్థించేటప్పుడు శ్రీకృష్ణుడిని పురుషకారదైవానుకూల్యాల నిర్దేశకశక్తిగా కీర్తించి, అతడిని దైవంగా భావించి ప్రశంసించారు. మచ్చుకు అర్జునుడి ప్రశంస.

ఉ. 'నీ వొనరింపఁ బూనినపనిం గమలోదర! కీడు వుట్టునే?
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావనసేఁత పౌరుషము పద్ధతి; తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్'. **(ఉద్యో. 3.73)**

పాండవులకు పరమదైవమైన పురుషోత్తముడు చేపట్టిన పనివలన వారికి కీడు ఏర్పడదన్న విశ్వాసం ఉద్యోగపర్వ కార్యమూలం. చేపట్టిన కార్యం పైకి కానట్లుగానే కనపడుతున్నా ఆ పని పూర్తిగా అయిన ఫలితాలు పాండవుల కందుతాయి. అది శ్రీకృష్ణుడి దివ్యశక్తి. ఉద్యోగపర్వంలో సంధికార్యం విఫలమైనా పాండవుల ప్రయోజనాలన్నీ సాధించబడటం విశేషం. రాబోయే యుద్ధంలో విజయమార్గాలన్నీ భద్రంచేయబడ్డాయి. అవరోధాల కన్నిటికీ నివారణోపాయాలు నిగూఢంగా ప్రారంభించబడ్డాయి. అది శ్రీకృష్ణుడి దివ్యమహిమ. పురుషకారం ఎంతచేసినా దైవం అనుకూలించనిదే కార్యం సిద్ధించదు. శ్రీకృష్ణుడు దూత పాత్రలో సంధియత్నం చేసే నెపంగా ధర్మజుడి ధర్మనీతికి ఫలసిద్ధి కలిగేటట్లు కార్యనిర్వహణం చేయగలడని పాండవుల స్థిరవిశ్వాసం. అది శ్రీకృష్ణుడి దివ్యలీలావినోదం. దివ్యశక్తి మహిమ వినోదాలు శ్రీకృష్ణుడి దైవవ్యక్తిత్వ విభూతులు. వాటి ప్రదర్శనయే ఉద్యోగపర్వ తాత్పర్యం.

6. శ్రీకృష్ణుడు వస్తున్నాడన్న వార్త ధృతరాష్ట్రుడిలో, అతడి కుటుంబంలో, రాజధానిలో, సభామంటపంలో చిత్రమైన చైతన్యాన్ని జాగృతం చేసింది. వార్త వినగానే వృద్ధరాజుకు గలిగిన మొదటి స్పందన శ్రీకృష్ణుడి దివ్యవ్యక్తిత్వ స్ఫూర్తికి సూచిక! దుర్యోధనుడితో ఆత డన్నమాట లివి-

'సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి; మన కింతకంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుం డయ్యె వారికి శుభంబున నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుట దప్పు; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము......' (ఉద్యో. 3.149)

ఇది నాటకీయ పరిభాషలో గండమని చెప్పవచ్చును. ధృతరాష్ట్రుడి మాటలలో అతడి మనసులోని దివ్యచైతన్యం జాగృతమైన లక్షణం స్ఫుటంగా గోచరిస్తుంది. కౌరవసభలో శ్రీకృష్ణుడి దివ్యదర్శనం చేయగల దివ్యదృష్టిని పొందటానికి అర్హమైన సంస్కార బీజం ఈ వాక్యంలో ఉన్నది. శ్రీకృష్ణుడిని అనాదరం చేసినవారికి అశుభం కలుగుతుందని చెప్పినమాట అతడి అంతర్వాణి స్పందన భావికథార్థ సూచకమైన గండం!

7. శ్రీకృష్ణుడి రాయబారపు సభ హస్తినాపుర చరిత్రలోనే అపూర్వసన్నివేశం. లోకహితం కోరి ధర్మరక్షణ, దుష్టశిక్షణ చేయటానికి అవతరించిన నారాయణుడు శాంతి సందేశాన్ని ఇచ్చే దివ్యసభ. అందులో దివ్యులైన మహామునులున్నారు, భవ్యులైన భీష్మాదులున్నారు, మరెందరో పుణ్యాత్ములున్నారు. వారందరూ దైవీశక్తులు. దుర్యోధనాది దుష్టవర్గంలోని వారందరూ ఆసురీశక్తులు. వారి మధ్య పరమాత్మ రూపుడైన శ్రీకృష్ణుడు. ఆ మహాత్ముడు ఆయా ప్రవృత్తులు కలవారికి ఆయా రూపాలలో మనోగోచరమయ్యాడు. మచ్చుకు రెండు ఉదాహరణలు.

(1). సభాసదులు పుండరీకాక్షుడి దివ్యరూపాన్ని చూచి దైవీసంపన్నులవలె తన్మయత్వాన్ని చెందారు. ఇది సామూహిక సాధారణ స్పందన.

క. ‘అంబుద శుభగాత్రుం బీ । తాంబరధరుఁ గమలదళనిభాక్షున్ హరిఁ జూ
డంబడసి లోచనము లమృ । తం బానినమాడ్కి సమ్మదంబునఁ దేలన్’.

క. ‘ఆ కొలువువారు గర మచ । లాకృతి నొకపలుకు లేక యందఱు వింజం
బాఁ కిడిన కరణి నవశము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్’. **(ఉద్యో. 3.254, 255)**

(2) ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడిని విష్ణువుగా గుర్తించి పలికిన మాటలు.

క. ‘కరుణింపుము సంశ్రితభయ । హరణధురీణా! సహింపు మజ్ఞానంబున్;
శరణంబు వేడెద భవ । చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁ గదే!’ **(ఉద్యో. 3.408)**

శ్రీకృష్ణుడి రాకను గురించి విన్నప్పుడు ధృతరాష్ట్రుడి అంతరాత్మ స్పందించిన విధంతో మొదలైన ఈ ఘట్టం అతడు ఆ పరమాత్ముడిని దర్శించి శరణువేడటంతో ముగియటం గమనిస్తే భావికథలో ఆసురీ ప్రవృత్తులలో ప్రాణాలతో మిగిలేది ధృతరాష్ట్రుడే అని అర్థమౌతున్నది. కురుసభలో శ్రీకృష్ణుడి దివ్యత్వం విశ్వరూపం తాల్చటం ఆ పాత్ర చిత్రణలో పరాకాష్ఠ.

8. శ్రీకృష్ణ డందించిన కౌరవసభాదౌత్యనివేదిక విని, వంశనాశనకారి అయిన యుద్ధసంకల్పం చేయటానికి ధర్మరాజు తటపటాయిస్తూ వితర్కిస్తూ ఉండగా అర్జునుడు ఈ విధంగా నిశ్చయించాడు.

ఆ. ‘(అనిన నట్ల కాక) యఖిల ధర్మజ్ఞాన । ఘనుఁడు మనకు నేడుగడయుఁ దాన
శౌరి నిశ్చయింప సంశయం బేటికి? । సంఘటింపుఁ డుగ్రసమరవిధము’. **(ఉద్యో. 4.93)**

శ్రీకృష్ణుడు చేసిన నిశ్చయాన్ని దైవనిర్ణయంగా భావించాడు ధర్మరాజు.

9. ఉలూకుడి రాయబారంలో దుర్యోధనుడు పాండవవీరుల నందరినీ అధిక్షేపించటమే కాక ప్రత్యేకంగా పార్థ శ్రీకృష్ణుల నుద్దేశించి ప్రగల్భాలు పలికాడు.

ఉ. 'మాయలు నింద్రజాలములు మాధవుఁ డిందును గొన్ని వన్నినన్
బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడితేనియున్;
వేయును నేల? పార్థులును విష్ణులు వే పదివేలు వచ్చినం
జేయుదు మేము గయ్య; మొక చీరియు సంపదఁ బంచియిత్తుమే?' **(ఉద్యో. 4.201)**

ఈ మాటలకు శ్రీకృష్ణుడే అధిక్షేపహాస్యం చేస్తూ ఇట్లా సమాధాన మిచ్చాడు.

తే. 'బవర మెల్లియ; బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగరాదు;
కృష్ణ సారథికం బగు జిష్ణురథము । దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు'. **(ఉద్యో. 4.203)**

దుర్యోధనుడికి ఈ మాటలు 'యముని మహిషపు లోహఘంటలు'. దుష్టసంహార రూపుడైన శ్రీకృష్ణుడి రౌద్రహాసం.

10. భీష్ముడు కౌరవపాండవ బలనిరూపణం చేస్తూ నిరుపమానమైన అర్జున శ్రీకృష్ణ పరాక్రమాన్ని అద్భుతంగా పేర్కొన్నాడు.

మ. 'నరుఁ డీ మానమువాఁ డనంగ వశమే? నా కంతవా రెందు నె
వ్వరు లే; రింకను బుట్ట; రా పులికి దుర్వారోద్యముం డైన యా
హరియుం దోడటె! యేమి చెప్పుదు? నతం డా సేనలం గాచు నొ
క్కరుఁడుం గీ టడఁగించు నీ బలములన్ గాండీవదుర్దాంతుఁడై'. **(ఉద్యో. 4.258)**

ఇది యుద్ధపంచక రణయజ్ఞానికి నాందీ గీతి.

ఉద్యోగపర్వ మహానాటకంలో దైవీశక్తి శ్రీకృష్ణుడు. ధర్మశక్తి ధర్మరాజు. బలశక్తి భీముడు, వీరభక్తి శక్తి అర్జునుడు, సేవాశక్తి కవలు- ఈ తత్త్వాన్ని ప్రకటించటమే ఈ అంకాలవంటి సభారంగాల పరమార్థం.

(2). రంగాలుగా గోచరించే సమావేశాలు

ప్రసిద్ధపాత్రలు కొద్దికాలంపాటు సమావేశమై సారవంతంగా గానీ, ప్రయోజనవంతంగాగానీ, చమత్కారవంతంగా గానీ సంభాషణలు సాగించి కార్యసాధన ప్రగతికి తోడ్పడేవి రంగాలుగా పరిగణించవచ్చును. అటువంటివి మరొక పది ఉద్యోగపర్వంలో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ నాటకీయ శిల్పానికి కాంతిని ప్రసాదిస్తున్నాయి. తిక్కన వాటిని తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. రంగాలవంటి సమావేశాలు ఈ క్రిందివి-

1. శ్రీకృష్ణుడు దుర్యోధనార్జునులతో జరిపిన సమావేశం.	1. 60-90
2. శల్య ధర్మజుల సమావేశం.	1. 104-216
3. కృష్ణద్వైపాయనుడు ధృతరాష్ట్ర దుర్యోధన సంజయాదులతో జరిపిన సమావేశం.	2. 305-331
4. శ్రీకృష్ణుడు కుంతీదేవితో జరిపిన సమావేశం.	3. 182-208
5. శ్రీకృష్ణుడి దుర్యోధన మందిర సమావేశం.	3. 209-228
6. శ్రీకృష్ణుడు కుంతిదేవి మందిరంలో జరిపిన సమావేశం.	4. 9-19

7. శ్రీకృష్ణుడు కర్ణుడితో రహస్యమంతనాలు చేసిన సమావేశం.	4. 29-53
8. కుంతీకర్ణుల సమావేశం.	4. 58-71
9. దుర్యోధనుడు ఆత్మీయులతో జరిపిన సమావేశం.	4. 133-141
10. దుర్యోధనుడు భీష్మమందిరంలో జరిపిన సమావేశం.	4. 143-162

1. పాండవులు యుద్ధసహాయం కొరకు వివిధదేశాల రాజులను ఉచిత పద్ధతులలో ఆహ్వానించారు. వారందరిలో శ్రీకృష్ణ సహాయాన్ని అర్థించే సంఘటన మహాభారతంలోనే మరపురాని ఘట్టంగా నిలిచిపోయింది. ధర్మజుడు కార్యాన్ని సంకల్పించి, అది పురుషకార ప్రధానమైతే, దానిని భీముడు నిర్వహించే అవకాశం కల్పిస్తాడు. దైవానుకూల్య ప్రధానమైతే అర్జునుడికి అవకాశం కలిగిస్తాడు. శ్రీకృష్ణ సహాయం దైవసహాయం కాబట్టి పార్థుడినే ద్వారకకు పంపించాడు. అటు దుర్యోధనుడుకూడా శ్రీకృష్ణునంతటి వాడిని సహాయం అడగటానికి దూతను పంపినదానికంటె తానే స్వయంగా పోవటం సముచితమని భావించి ద్వారకకు చేరాడు. అక్కడ శ్రీకృష్ణుడు పగటిపూట నిద్రిస్తున్నాడు. దుర్యోధనుడు అభిమానధనుడు కాబట్టి గోవిందుడి శయ్యవద్ద తలవైపు కూర్చున్నాడు. సహాయార్థియై వచ్చాడు కాబట్టి కృష్ణుడు మేల్కొనేంతవరకు మిన్నకున్నాడు. అర్జునుడు ఆ తరువాత వచ్చాడు. శ్రీకృష్ణుడి పాదాల సమీపంలో వినయభక్తి ప్రపత్తులు ఉట్టిపడేటట్లు నిలిచి ఉన్నాడు. శ్రీకృష్ణుడు నిద్రలేచి ముందుగా కనబడిన అర్జునుడిని పలకరించాడు. ముందువచ్చిన దుర్యోధనుడిని ఆ తరువాత యోగక్షేమాల నడిగాడు. సహాయం ఇద్దరికీ చేస్తానని మాట యిచ్చాడు. నారాయణాభిధానులైన గోపాలురు పదివేలమందిగల మూలబలాన్ని ఒకవైపూ, యుద్ధం చేయని తనొక్కడిని మరొకవైపూ భాగాలుగా ఉంచి, కోరుకొనే అవకాశం చిన్నవాడూ, అన్నచాటువాడూ అయిన అర్జునుడికి కల్పించాడు. అతడు ఆయుధంపట్టని శ్రీకృష్ణుడినే కోరుకొన్నాడు. దుర్యోధనుడు సంతోషించి పరిశేషన్యాయంతో నారాయణాఖ్య యాదవవీరులను గ్రహించి తిరిగివెళ్ళాడు. బలరాముడు యుద్ధంలో పాల్గొనని తేల్చి చెప్పాడు. అర్జునుడు శ్రీకృష్ణుడినే ఎందుకు కోరుకొన్నాడు?- అన్నది మహాభారత యుద్ధంలో హిమాలయమంత ప్రశ్న. అర్జునుడు యుద్ధంలో అన్యులసహాయం కోరడు. శ్రీకృష్ణుడు యుద్ధం చేస్తే అర్జునుడికి కీర్తి దక్కదు. శ్రీకృష్ణుడు కౌరవపక్షంలో చేరితే అతడికి ఎదురుపడ్డవాడు ఎండిపోతాడు కాబట్టి పాండవపక్షంలోనే ఉండాలి. అందుచేత సమరంచేయని శ్రీకృష్ణుడే పార్థుడికి సమ్మతుడౌతాడు. ఇవన్నీ ఇట్లా ఉండగా శ్రీకృష్ణుడిని రథసారథిగా చేసికొని యుద్ధం చేయాలని పార్థుడి మనసులోని కోరిక!

క. 'సారథ్యం బొనరింపు మ । పారకృపాలీల నెల్లభంగుల నా కీ
గౌరవమును జిరకాలము । గోరినయది; దీని నిమ్ము గుణరత్ననిధీ!' **(ఉద్యో. 1.88)**

అని కోరుకొన్నాడు. అడగటం ఒక ఆచారమన్నట్లు దుర్యోధనుడు వర్తిస్తే, అదికూడా ఒక కళ అని అర్జునుడు నిరూపించాడు. సహాయంచేయటం ఒక పరిపాటిగా దుర్యోధనుడు భావిస్తే, రాజనీతిగా నిర్వహించాడు శ్రీకృష్ణుడు. గోవిందుడు చతురోపాయ నిపుణు డనటానికి సాక్షిగా నిలిచే రంగం వంటి ఈ సన్నివేశం రత్నంవంటి ఉదాహరణ.

2. మహాభారతంలో కృష్ణసారథ్యం ఎంత ప్రశస్తమైనదో శల్యసారథ్యం అంత ప్రసిద్ధమైనది. ఒకటి భక్త రక్షణ కళాపారీణతకు బిరుదు పేరైతే, మరొకటి నయవంచన రూప విద్రోహచర్యకు మారుపేరు. శల్యుడు అశ్వహృదయం తెలిసిన విజ్ఞుడు. రథసారథ్యంలో శ్రీకృష్ణుడితో దీటైనవాడు. అందుకే దుర్యోధను డతడిని వంచనతో తనవైపు త్రిప్పుకొన్నాడు. శల్యుడు నిజాయితీపరుడు. అతడితీరును గమనించి ధర్మజుడు అతడిని తన కనుకూలంగా మలచుకొన్నాడు. కృష్ణసారథ్యంతో అర్జునుడు రణరంగంలో నిలిచినప్పుడు, దుర్యోధనుడు శల్యసారథ్యంతో కర్ణుడిని ప్రవేశపెట్టటం యుద్ధవ్యూహం. ఆ

తరుణంలో శల్యుడు హృదయశల్యాలవంటి మాటలతో కర్ణుడిని బాధించి, అర్జునుడికి పరోక్షంగా సహాయం చేయుమని ధర్మజుడు కోరాడు. సహజంగా కర్ణవిరోధి అయిన శల్యుడు కర్ణుడికే మృత్యుద్వారం చూపించే యమభటుడయ్యేటట్లు సన్నివేశాన్ని మలచుకొన్న ధర్మరాజు రాజనీతి కుశలుడు. భేదోపాయ మర్మజ్ఞుడు. ఈ ఘట్టం కర్ణపర్వంలోని ఒక విషాదాంత వీర చరిత్రకు కారణం కాబోతున్నది. అంతేకాదు, మహాభారత యుద్ధంలో వినవచ్చే కీలకమైన రహస్యపుటొప్పందాలతో ఇది ఒకటి. అందువలన ఇది రసవత్తరమైన రంగం.

3. కృష్ణద్వైపాయనుడు ప్రసన్నుడై సంజయుడిని తనకు బదులు ధృతరాష్ట్రుడికి వలసిన సలహాలివ్వటానికి నియోగించటం ఒక అపూర్వ సన్నివేశం. ఇకముందు సంజయుడు నిర్వహించే సార్థకమైన పాత్రకు ఇది శుభసూచన. సంజయ వ్యాసవాక్యతాత్పర్యాలు తత్త్వతః సమానార్థ బోధకాలని ఈ సన్నివేశం ధ్వనిస్తున్నది. సంజయవాక్యం:

సీ. 'పురుషోత్తముం డెల్లభువనంబులును దాన । యఖిల భూతాత్మకుండై విహార
లీల విచేష్టించు; నీ లోకముల మాయ । దొట్టి యొక్కొక మరి పుట్టి పెరిగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు; । శిష్టరక్షణమును దుష్టవిగ్ర
హంబును దనపను లగుటఁ బాండవుల నె । పం బిడుకొని ధర్మబాహ్యు లైన

తె. నీ తనూజుల నిక్కమ నిగ్రహింపఁ । దలఁచినాఁ డమ్మహాత్ముండు; తథ్య; మతని
నిట్టి చందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ । రాశ్రయింతురు బ్రదుకుదు రట్టివారు'. **(ఉద్యో. 2.318)**

విష్ణువు శ్రీకృష్ణుడుగా అవతరించి శిష్టరక్షణకై పాండవులతో స్నేహంచేసి, దుష్టశిక్షణకై కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొనబోతున్నాడన్న సత్యం మహాభారతంలో ద్రష్టలైన ఋషులు చెప్పేవాక్యం. వ్యాసు డాతాత్పర్యాన్నే సంజయుడిచేత చెప్పించాడు. అయినా గ్రుడ్డిరాజు నమ్మీనమ్మనట్లు నడయాడాడు. గాంధారిచేత దుర్యోధనుడికి చెప్పించాడు. అతడు మౌనం వహించాడు. అప్పుడు వ్యాసుడే స్వయంగా నారాయణతత్త్వాన్ని వివరించాడు. అతడి నాశ్రయించుమని బుజ్జగించి చెప్పాడు. ఆ మహర్షిముందు ధృతరాష్ట్రుడు ఎంతో ఆసక్తితో వాసుదేవనామనిర్వచనాన్ని, అతడిని పొందే ఉపాయాన్ని చెప్పుమని వేడాడు. వ్యాసుడు సంజయుడిచేత వాటిని ప్రబోధింపజేశాడు. ధృతరాష్ట్రుడు వారి మాటలు విన్నట్లే విన్నాడు. శ్రీకృష్ణుడిని దర్శించాలన్న కోరికను ప్రకటించాడు. ఎదుటివారు అది నిజమని నమ్మేటట్లు మాట్లాడాడు.

క. 'నాకు నయనేంద్రియముగతి । లేకుండుట కంతవగపు లే; దఖిల మనో
జ్ఞాకారుఁడైన హరి నా । లోకింపం గానమికిఁ గలుగు వగ పెపుడున్'.

ఉ. 'ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండు వా
రే తప మాచరించిరొ? యుపేంద్రుని నాశ్రితవత్సలున్ విని
ర్ధూతకలంకు ధర్మనిరతుం గరుణాకరు సర్వలోక వి
ఖ్యాతుఁ బవిత్రమూర్తి శరణాగతరక్షకు నాశ్రయించెదన్'. **(ఉద్యో. 2.329,330)**

వ్యాసమహర్షిముందు వాసుదేవుడిని శరణు వేడుతానని మాటయిచ్చాడు. ఆయన అంతర్ధానం కాగానే అంతఃపురం చేరి దానిని మరచిపోయాడు. ధృతరాష్ట్రుడి ద్వంద్వ ప్రవృత్తికి ఈ రంగం దర్పణం వంటిది.

4. విదురునింట నివసిస్తున్న కుంతీదేవి పొందే మానసిక వేదనను తెలిసికొనటానికి వీలైన ఏకైక సన్నివేశం శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించిన రంగం. ఆమె వేదనకు ఈ క్రింది పద్యం దర్పణం.

సీ. 'బావ యొప్పం డను పలుకుల నే మగు । నాతని కొడుకుఁ గీడాడ నేల?
కురువృద్ధుఁ డగు బాహ్లికుని దూఱ నేటికి? । భీష్మునిపైఁ బ్రయి వెట్ట నగునె?
యిట్టి క్రూరులయింటి కిచ్చిన మనవారి । నందుఁ గా; కట్లు దా ననుట మేలె?
యర్జును పుట్టిన యప్పుడు 'వీఁడు లో । కములెల్ల గెల్చుపొగడ్త మొగులు

తే. 'ముట్టునట్టిద యగు; రణమున జయించుఁ; । గౌరవుల; సోదరులుఁ దాను భూరిరాజ్య
గౌరవముఁ బొందు' నని యశరీరవాణి । వలికె; నది దిట్టువడు గాక వలయు నేని'.

వ. 'ధర్మంబు గలుగునే నది నిక్కం బయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె'.

(ఉద్యో. 3.195, 196)

శ్రీకృష్ణుడు కుంతీదేవి నోదార్చే ఘట్టం ద్రౌపది నోదార్చిన ఘట్టాన్ని తలపిస్తుంది. అందువలన ఈ రంగం విలువైనది. కుంతి పాండవుల కిచ్చే సందేశాలు వీరమాత ప్రవృత్తికి తగినవి.

5. దుర్యోధనునింట జరిగిన సమావేశంలో విందుముచ్చట వచ్చింది. అది విందురాజకీయం. తనయింటికి శ్రీకృష్ణుడు వచ్చాడు కాబట్టి అక్కడే భోజనం చేయాలనీ, అట్లాచేస్తే పాండవకౌరవు లిరువురి యోగక్షేమం కోరి శ్రీకృష్ణుడు సంధినడుప వచ్చినట్లు స్పష్టమౌతుందనీ దుర్యోధనుడివాదం. శ్రీకృష్ణుడు తాను దూతననీ, దౌత్యం ముగిసేవరకూ ఇరుపక్షాల వారియిండ్లలో భుజించటం న్యాయం కాదనీ, ఒకవేళ విందు వికటిస్తే దుర్యోధనుడికి అపనింద రావచ్చునని వాదించాడు. 'నేను శత్రువునా?' అని ప్రశ్నించిన దుర్యోధనుడికి 'నీవు పాండవులకు శత్రువువి. నాకు పాండవులు ప్రాణాలవంటివారు. నా ప్రాణశత్రువు నాకు శత్రువే ఔతా'డని ఘంటాపథంగా చెప్పాడు. అంతేకాదు విందురాజకీయాన్ని నీతిబద్ధం చేసి వ్యాఖ్యానించాడు.

చ. 'ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
క్కయ నయహీనతం దమకు నాపద యై నెడ నిట్టు నట్టు నే
మియు నన లేని కూ డెదిరి మేవడి యై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు, మాకు ధృతి పెంపఱ నాపద లే దొకింతయున్'. **(ఉద్యో. 3.222)**

విందు వికటిస్తే సంధి వికటించినట్లే. ఆ వికటించటానికి కూడా దుర్యోధనుడే హేతువని పేర్కొనటం శ్రీకృష్ణుడి నేర్పు.

6. సంధికార్యాన్ని ముగించుకొని తిరిగిపోతూ శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించాడు. అప్పు డామె పుత్రుల కందించిన సందేశాలు పౌరుషోపేతంగా ఉన్నాయి. మచ్చు కొకపద్యం.

ఉ. 'రాజుల కెందు నారయఁ బరాక్రమ జీవనవృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మంద్రు మును; ఉత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజితభంగిఁ జేయుదురు; బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁగూటి కియ్యకొని దీనతఁ బొందుదు రంబుజోదరా!'. **(ఉద్యో. 4.14)**

ఆమె మాటలు భీష్మాదులకు ఆశ్చర్యం కలిగించాయి.

చ. 'పలుకునె యిట్లు గొంతి; విని బమ్మెరపోయితి; మింత బెట్టిదం
బు లగునె మాట? లయ్యమయుఁ బుణ్యుఁడు గృష్ణుఁడు గార్యవాదముల్
వలికెడువార లిట్లు దెగఁ బాఱిరి; ధర్మజ వారిరాశికిం
జెలియలికట్ట వాసె; మనచే నగు కర్జముచంద మెట్టిదో!' **(ఉద్యో. 4.22)**

ధర్మజుడు యుద్ధ నిర్ణయాన్ని తీసికొనటానికి కుంతి పౌరుషోక్తులు కూడా దోహదం కాబోతున్నాయి. కుంతిలోసైతం మండుతున్న క్రోధాగ్నిని తెలిసికొనటానికి భీష్మాదులకు అవకాశం కలిగిన ఈ రంగం (సన్నివేశం) యుద్ధోద్యోగ పరిపోషకం!

7. ఉద్యోగపర్వంలోని రాజకీయపుటెత్తులలో మేటిగా పరిగణించబడేది శ్రీకృష్ణుడు కర్ణుడితో రహస్యమంతనాలు చేసి అతడి జన్మరహస్యం చెప్పే సన్నివేశరంగం. తెలుగులోని మహాభారత నాటకాలలో (విశేషించి తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ నాటకంలో) ఈ రంగం హృదయంగమం. పాత్రల అంతర్వర్తనాల అసలురూపం బైటపెట్టే ఈ రంగం పాండవులు ప్రయోగించే భేదోపాయంలో భాగంగా శ్రీకృష్ణుడు స్వతంత్రించి ప్రయోగించింది. శ్రీకృష్ణుడి రాజనీతికి, కర్ణుడి ధర్మనీతికి ఇది మకుటాయమానమైన ఉదాహరణం.

శ్రీకృష్ణుడు దేవరహస్యంవంటి కర్ణుడి జన్మరహస్యాన్ని వాస్తవాన్ని ప్రకటిస్తున్నట్లు పూసగ్రుచ్చినట్లు సంగ్రహసుందరంగా చెప్పాడు. పాండవులు బంధుమిత్ర పరివారసమేతంగా కర్ణుడికి రాజ్యం పట్టంకట్టి సేవించగలరని నమ్మబలికాడు. రాజ్యాభిషిక్తుడైన కర్ణుడు అనుభవించే మహేంద్రవైభవాన్ని నూరురెట్లు చవులుపుట్టేటట్లు వర్ణించి ఆశ కల్పించాడు. ఆ తరువాత పాంచాల రాజపుత్రి కర్ణుడిని ఆరవ భర్తగా గ్రహించి వరుసగా ఏలుకొనేటట్లు ఒప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఇన్ని అదృష్టాలు కలిసివచ్చిన పుణ్యాత్ముడుగా కర్ణుడిని అభివర్ణించి, అనుమానంలేకుండా పాండవపక్షంలో చేరుమని ఆహ్వానించాడు. ఆ పక్షంలో చేరితే కన్నతల్లి అయిన కుంతి సంతోషిస్తుందనీ సమస్త బంధుహిత వర్గాలవారు ఆనందిస్తారనీ ఉత్సాహపరిచాడు.

శ్రీకృష్ణుడి మాటలు అవాస్తవాలనటానికి వీలులేదు. కాని, ఆ సమయంలో అవి ఆచరణయోగ్యాలు కావని కర్ణుడు భావించాడు. కారణాలు వరుసగా నిజాయితీతో ఏకరువుపెట్టాడు. శ్రీకృష్ణుడు కర్ణుడిని వృద్ధజనోపసేవిగా, ధర్మసంవేదిగా కీర్తించాడు. దానికి చలించని కర్ణుడు కన్నతల్లి తనను గంగపాలుచేయగా, దరికిచేర్చి, పాలిచ్చి పెంచి, ఎన్నో కష్టాల కోర్చి పెద్దచేసి, ప్రేమతో చూస్తున్న పెంపుడు తల్లిదండ్రులను వదలిరావటం న్యాయమా? అని అడిగాడు. సూతదంపతులు కర్ణుడికి జాతకర్మాది సంస్కారాలు చేశారు. పెళ్ళిచేశారు. అట్టివారికి పుత్రుడు చేయవలసిన ఇహపర కర్మలను ఆచరించటం ధర్మంకాదా? అని ప్రశ్నించాడు. భార్యను, సంతతిని, బంధువర్గాన్ని వదలి పాండవులలో చేరటం ఉచితమా? అని సూటిగా అడిగాడు. అన్నింటికంటె మించి కర్ణుడి ఆరవప్రాణం దుర్యోధనుడు.

ఉ. 'సూతసుతుండు వీఁ డనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతి యొనర్చి తేజమును బెంపును నాఁటికి నాఁటి కగ్గలం
బై తనరార నన్నుఁ దనయంతటి మానిసిఁ జేసియుండ నే
నే తగవూది యా కురుకులేశ్వరుఁ బాయుదు? ముట్ట వచ్చినన్'. **(ఉద్యో. 4.39)**

అని సర్వధర్మవేది అయిన శ్రీకృష్ణుడిని రాజనీతి పరంగా సమాధానం చెప్పుమని అడిగాడు.

ఇక వీరనీతి ననుసరించి మరొక సూక్ష్మాంశాన్ని పేర్కొన్నాడు. కౌరవపాండవులలో మేటి విలుకాండ్రు కర్ణార్జునులని దుర్యోధనుడి తీర్పు. కర్ణుడు అర్జునుడిని యుద్ధంలో చంపి రాజ్యాన్ని నిష్కంటకం చేస్తాడని రారాజు నమ్మిక. దానిని వమ్ముచేయటం వీరనీతి కాదు. కర్ణార్జునులు సమవీరులు కావటంచేత ఎవరు ఎవరి పక్షం చేరినా వారికి అపకీర్తి వస్తుంది.

అందువలన కర్ణుడు కౌరవపక్షం వదలి పాండవపక్షంలో చేరటం కర్ణుడికే అపకీర్తి. కర్ణుడు అర్జునుడికి భయపడి యుద్ధారంభ సమయంలో పాండవపక్షంలో చేరాడని లోకం నిందిస్తుంది. అందువలన వ్యక్తి ధర్మాన్ని ఆశ్రయించి చూచినా అది న్యాయం కాదు.

ఇక లోకశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఆలోచించినా శ్రీకృష్ణుడి ప్రతిపాదన ఆచరణయోగ్యం కాదు. తనకంటె పెద్దవాడు కర్ణుడని తెలిసిన ధర్మరాజు తాను రాజ్యానికి పట్టాభిషిక్తుడు కాడు. అది లోక శ్రేయస్కరం కాదు. ధర్మరాజువంటి ధర్మవీరుడు భూమిని శాశ్వతంగా పాలించాలి అని కర్ణుడు అంతరాంతరాలలో ఆశించాడు. అంతే కాదు కర్ణుడు యుద్ధాన్ని రణయజ్ఞంగా భావించాడు.

క. ‘అనుజులు ఋత్విజులుగ నీ । పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా
విను! కురుకుమార పశువిశ । సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్’. **(ఉద్యో. 4.45)**

అని చెప్పాడు. కర్ణుడి అంతరంగంలో ఉన్న ఆధ్యాత్మిక భావ మిది. కాని, తనను తనంతటివాడిగా చేసి గౌరవించిన దుర్యోధనుడికి ఋణం తీర్చుకొనటం సేవాధర్మం. కర్ణుడి కృతజ్ఞతాభావం అతడి వ్యక్తిత్వ సంస్కారానికి సంబంధించింది. దుర్యోధనుడికి సంతోషం కలిగే పనులు చేస్తూ, ఏవిధంగానైనా సరే అతడి చేత రాజ్యం ఏలిస్తూ ఉండటం అతడు కుదుర్చుకొన్న స్నేహసంధి నియమం. రాజనీతి బలి కోరింది. ధర్మనీతి కీర్తి నిచ్చింది- ఇది కర్ణుడి కథలోని విరుద్ధ ధర్మాల విపరీత ఫలం!

కర్ణుడి అంతరంగంలోని అవ్యక్తవేదన వినిపించే ఈ ఘట్టం పఠితకు విషాదమధురంగా ఉంటుంది.

8. కుంతీకర్ణుల సమావేశం మహాభారతకథలోనే పేరొందిన విషాద గంభీర దృశ్యం. అలనాడు కన్యగా కుంతి సూర్యుడి వరాన కర్ణుడిని కని గంగలో వదలిన తరువాత, మరల తల్లిగా అతడిని కలిసి మాట్లాడటం ఇదే మొదటిసారి. సూర్యుడు కర్ణుడి పుట్టుక కథను దేవరహస్యంగా కాపాడాడు. అయినా, అది సూచనగా కొందరికి తెలియకపోలేదు. కర్ణుడికి కూడా కొంత వినబడింది. కాని, బహిర్గతం కాలేదు. శ్రీకృష్ణుడు భేదోపాయ ప్రయోగంలోని భాగంగా కర్ణజన్మవృత్తాంతాన్ని ఆయనతో రహస్యంగా చెప్పాడు. ఆ తరువాత కుంతి పాండవ ప్రాణరక్షణార్థం కర్ణుడితో జన్మరహస్యాన్ని చెప్పటానికి ఉద్యుక్తురాలయింది. పరోక్షంగా ఇది కూడా యుద్ధోద్యోగంలో భాగంగా మారింది. అచ్చమైన వాత్సల్యంలో స్వార్థం, రాజనీతి ప్రవేశించి ఆమెను యమునాతీరం వరకు నడిపించాయి. దానికి దారితీసిన ఆమె ఆలోచన ఇది-

మ. ‘తమవారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశకృ
త్యమె? తాఁ గయ్యము ద్రోణభీష్మకృప కర్ణాటోపముల్ మాన్పుట
ల్పములం దీఱునె? యందు నర్జుని యుల్లం బెప్పుడుం గ్రోధ దీ
ప్తము భీమాదులమీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్’. **(ఉద్యో. 4. 57)**

రాజ్యసంపదకొరకు బంధువులను పరస్పరం చంపుకొనటం ధర్మంకాదని భావించిన తీరు అటు పాండవులకూ, ఇటు కౌరవులకూ వర్తిస్తుంది. అయినా, సందర్భాన్నిబట్టి పాండవులకే అది ఎక్కువగా చెందుతుంది. అప్పు డున్న పరిస్థితులలో యుద్ధోద్యోగం చేయటం ఎన్నో ఇబ్బందులతో కూడిన పని. ఆ ఇబ్బందులలో ముఖ్యంగా పేర్కొనదగినవి- ద్రోణ, భీష్మ, కృప, కర్ణులను సంహరించగల ఉపాయాలను అన్వేషించటమే. ఆ యోధచతుష్టయంలో పాండవులను తీవ్రంగా వ్యతిరేకించేది కర్ణుడు. మిగిలినవారికి అతడి కున్నంత యుద్ధపిపాస లేదు. అందులోనూ కర్ణుడికి ధర్మరాజుమీదకంటె భీమాదులమీద కోపం ఎక్కువ. అర్జునుడిమీద అతడికి పగ అపారం. ఈ సంగతి తెలిసిన కుంతి-కౌరవవీరులలో కర్ణుడు శాంతిస్తే యుద్ధం ఆగిపోతుందనీ, ప్రాణహాని లేకుండా పాండవులకు రాజ్యం లభిస్తుందనీ, కర్ణుడు పాండవులతో కలిస్తే తన పుత్రులందరూ

ఐకమత్యంతో స్నేహంగా బ్రతుకవచ్చుననీ, వారిని ఎదిరించగల వీరులు లోకంలో ఎవరూ ఉండరనీ భావించింది. దానికి ఒక వ్యక్తిగత రహస్యవ్యూహాన్ని ఆమె పన్నింది. కర్ణుడి జన్మరహస్యం అతడికి తెలిపి, పాండవులమీద సోదరస్నేహం పొంగులువారేటట్లు చేయాలని లక్షించింది. ఊహ వచ్చిన తరువాత మొట్టమొదటిసారి కర్ణుడిని 'కొడుకుఁగుఱ్ఱ' (చిన్ని నాన్నా!) అని పిలిచి ఏకాంతంగా తన మనసులోని మాట చెప్పింది. సూర్యుడు 'అది నిజ'మని ప్రకటించాడు. నిజం బయటపడింది.

అయితే, ఆమె మాటలతీరులో ఆర్ద్రతకంటె అవసరం ఎక్కువగా కనబడింది.

సీ. 'వినుము! సూతాన్వయంబున నీవు పుట్టుట । బొం; కేను మా కుంతిభోజునింటఁ
గన్నియనాఁడు భాస్కరుని రావించితి । వరమంత్ర బలమున; వచ్చి యతఁడు
సంప్రీతి నొసగంగ జన్మించినాఁడవు । నాకుఁ; గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టి నీ వితరులఁ । గొలువ నేటికిఁ గురుకులవరేణ్య!

తే. ధర్మతనయాదులైన నీ తమ్ములకును । ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ;
వేలు మీ లోకమెల్ల; నీ కేల రాధ । కొడు కితం డను తక్కువ? కొడుకుఁగుఱ్ఱ!' **(ఉద్యో. 4. 59)**

ఈ మాటలలో ఒక క్రమం ఉన్నది. కర్ణుడి మనసు మార్చటానికి ఆభిజాత్యాన్ని మొదటి అంశంగా ఎన్నుకొన్నది. అది నాయకుల లక్షణాలలో మొదటిది కూడా. అందుకే కర్ణుడు సూతవంశంలో పుట్టటం అబద్ధంగా చెప్పింది. సూర్యవరప్రసాదంవలన కుంతికి పుట్టటం వలన ధర్మస్థితి ననుసరించి పాండునందనుడుగా పరిగణించబడతాడని పేర్కొన్నది. ఇక్కడ నీవు రాధేయుడవు కావని అనకుండా సూతకులజుడవు కావనటం విశేషం. కౌంతేయుడ వనకుండా పాండునందనుడవు అనటం విశేషం. పెంచిన తల్లికంటె, కన్నతల్లికంటె పోషించిన తండ్రీ, కన్నతల్లి భర్తా అభిజాత్యకారకు లౌతున్నారు. వారి వారసత్వగౌరవాలు పుత్రులకు రావటం కూడా ధర్మస్థితి. దీనిని మొదట చెప్పి, ఆపై కర్ణుడి సేవావృత్తిని ప్రస్తావించింది. పాండవులు కౌరవులవలె స్వతంత్రులు కాబట్టి ప్రభుత్వానికి అర్హులు కాని, సేవకవృత్తికి కాదని హెచ్చరించింది. ఆభిజాత్యంచేత కర్ణుడు పాండవాగ్రజు డౌతాడు. సేవావృత్తిని పరిత్యజించటంవలన దుర్యోధనుడికి దూరమౌతాడు. పాండవ కౌరవులలో కర్ణుడే పెద్దవాడు కావటంచేత 'కురుకులవరేణ్యు'డౌతాడు. కౌరవపాండవులందరూ కర్ణుడినే రాజుగా మన్నిస్తారు. అప్పుడు రాధేయుడనే పేరు మాసిపోతుంది. (పైకి చెప్పకపోయినా) కౌంతేయుడనే పేరు నిలుస్తుంది- అని కుంతి భావించింది. ఆభిజాత్యాన్నీ, అధికారాన్నీ ఎరగాచూపి రాధేయుడనే ప్రసిద్ధినుండి కౌంతేయుడనే ప్రసిద్ధస్థితికి రమ్మని కర్ణుడిని కోరింది. కుంతి మాటలలో శ్రీకృష్ణుడు చూపిన ఎరలకంటె ఎక్కువేమీ లేవు. ఆరవభర్తగా కర్ణుడిని స్వీకరించేటట్లు ద్రౌపదిని ఒప్పిస్తానని ఆడది కాబట్టి కుంతి అనలేకపోయింది. ఆమె మాట ప్రకారమే ద్రౌపది పంచపాండవులు పంచుకొన్న భిక్ష. ఆరవభాగం ఆమెకు అంగీకారమో కాదో తెలియబరచలేదు. శ్రీకృష్ణుడిది శుద్ధమైన రాజకీయపుటెత్తు. కుంతిది మమతతో కూడుకొన్న రాజనీతి పథకం.

అందుకే కర్ణుడు ఆమె మాటలకు కరిగి నీరైపోలేదు. సూర్యబింబంనుండి వెలువడిన వాక్యాలు వినికూడా తబ్బిబ్బైపోలేదు. ధీరమనఃప్రవృత్తితో తీర్పరితనంతో మాట్లాడాడు. మొదట ఆభిజాత్యాన్ని గురించి ఎత్తుకొన్నాడు. పుట్టుక ఎట్టిదైనా సంస్కారాలనుబట్టి అభిజాత్య గౌరవం నిర్ణయించబడుతుంది. ఇది లోకనీతి. కుంతి కర్ణుడిని కనినా, క్షత్రియ సంస్కారాలకు దూరంచేసింది. అందువలన ఆమెకు గాని, పాండువంశజులకుగాని ఇహపరలోకాలకు సంబంధించిన సుఖాలను కలిగించే అవకాశం అతడికి లేకుండా చేసింది. ఆమె చేసిన నేరం కారణంగానే కర్ణుడు సూత సంస్కారాలకు గురికావలసి వచ్చింది. ఇప్పుడు ఆ స్థితిని మార్చి కుంతీపుత్రుడని వెల్లడిచేసికొంటే సంస్కారాలు మారవు, సంసార పరిస్థితులు మారవు. అవి మారకుండా క్షత్రియుడని ప్రకటించుకొనటం హాస్యాస్పదం. ఆ దీనస్థితిని కల్పించింది కుంతి.

జగత్ప్రకాశకారకుడైన సూర్యుడి పుత్రుడిని చీకటిలోకి నెట్టిన నేరం ఆమెది. అది తెలిసివచ్చేటట్లు తేటతెల్లంగా మాట్లాడాడు కర్ణుడు. 'నీకుఁ బుత్రుఁడ నని వచ్చు టింకఁ బోలునె చెపుమా!'- అనే వాక్యంలో పోలదని చెప్పటమే పరమతాత్పర్యం.

కుంతీదేవి కర్ణజన్మాన్ని పరమరహస్యంగా అంతవరకు కాపాడి, యుద్ధానికి ముందు దానిని ప్రకాశంచేయటం అనేకమైన అపోహలకు దారితీస్తుంది. కర్ణుడి జీవితంలో ధర్మసంక్షోభం కలిగిస్తుంది. కడుపుతీపితో కొడుకు పుట్టుకను బైటపెట్టినా అది అతడికి కడుపుకోతగా పరిణమించే పరిస్థితికి దారితీయవచ్చునని కర్ణుడు తన జన్మ రహస్యప్రకటనాన్ని వారించాడు.

లోకంలో అర్జునుడి పరాక్రమకీర్తి అపారంగా వ్యాపించి ఉండగా కర్ణుడు కుంతికొడుకు నంటూ, భానుపుత్రుడనంటూ ప్రకటించుకొని అతడితో కలిస్తే, అతడికి భయపడి పోయాడని నిందిస్తారు. అంతేకాక, దుర్యోధనుడి మూలంగా ప్రసిద్ధికెక్కాడు కర్ణుడు. శత్రువిజయాన్ని సాధించిపెడతాడనే ఆశతో యుద్ధసాగరంలో అతడిని నావగా చేసికొని ముందుకు సాగుతున్న తరుణంలో దుర్యోధనుడిని నట్టేట ముంచటం ధర్మనీతి కాదని నిశ్చయించాడు. కౌరవుల తిండి తింటున్న భీష్మాదులే యుద్ధంలో పాల్గొంటుంటే కర్ణుడు తప్పించుకొనటం సబబుకాదు. అంతేకాక, యుద్ధారంభకాలంలో మిత్రులను వదలి వెళ్ళితే వారిని సాటిరాజులు మెచ్చుకోరు. కాబట్టి కర్ణుడు ఆభిజాత్యాన్ని, అధికారాన్ని తృణీకరించి సూతవంశాన్నీ సేవాధర్మాన్నీ రక్షింపదలచుకొన్నాడు. అంటే కుంతీ ప్రార్థనను తిరస్కరించటమే న్యాయమని నిశ్చయించాడన్నమాట!

కాని, కన్నతల్లి జన్మ కొక్కసారి కోరిన కోర్కెను తీర్చలేకపోయినా, ఆ కోరిక వెనుక ఆమె మనసులో ఉన్న కడుపుతీపినీ, దానిని తగిన సమయంలో వాడుకొని పాండవులకు మేలు చెయ్యాలనుకొన్న రాజనీతినీ, కాదనకుండా మాతృఋణం తీర్చుకొందామనుకొన్నాడు దానవీరుడు కర్ణుడు.

ఉ. 'నీ పలుకెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండులే;
దీపనిమీఁది భారమున నీ విట వచ్చితి గాన పాండవుల్
సేపడి రేనిఁ జంప; నఱసేయక చెప్పెద, సవ్యసాచిపైఁ
గోపముపెద్ద; వాఁడు సమకూరిన బిట్టఱిఁ జంపుదుం జుమీ!'

ఆ. 'సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి । కరమ; యతఁడు లోనుగాఁగ నేవు,
రేను లోనుగాఁగ నేవురు గాని, నీ । కొడుకు లార్వు రనుట విడువు మింక'. **(ఉద్యో. 4. 68,69)**

మహాభారత చరిత్రను మార్చిన రహస్యపుటొప్పందాలలో ఇది ఒకటి. విశేషమేమంటే ఇటువంటి రహస్య సంధులు చేసికొన్న వీరులు కౌరవపక్షంలోనే ఎక్కువ. వారిలో కర్ణుడు, శల్యుడు ముఖ్యులు. వీరిరువురిమీద దుర్యోధనుడికి ఆశలు అధికం. అయినా, దుర్యోధనుడి కిచ్చిన మాటకు విఘ్నం రాకుండా వ్యక్తిగత ధర్మాలకు ప్రాధాన్యమిచ్చిన వీరులు వీరు. స్వీయధర్మం సేవాధర్మానికి తత్త్వతః, విరోధం కావచ్చును. లేదా బాధకం కావచ్చును. అయినా కుడిచేతి దానం కుడిచేతిదే, ఎడమచేతి దానం ఎడమచేతిదే. దుర్యోధనుడి బలశక్తి బీటలు వారిన చప్పుడు ఈరంగంలో బాగా వినబడుతుంది. ఇది కుంతి ధర్మరాజుకొరకు చేసే యుద్ధోద్యోగానికి సమకూరే విజయదుందుభి! 'కర్ణుడు లేని భారతం నీరసం' అన్నసూక్తికి ఈ రంగం మూలం!

9. పాండవులు యుద్ధానికి సిద్ధమై కురుక్షేత్రంలో విడిసి ఉన్నారన్న వార్తలు చారుల వలన వినికూడా, విననివాడివలె నటిస్తూ, ముఖంలో ఎటువంటి భావాలనూ ప్రదర్శించకుండా దుర్యోధనుడు ఆత్మీయులను పిలిపించి కొలువుతీర్చి ఇట్లా అన్నాడు.

క. 'తన వచ్చిన కార్యము మన । మనుకూలతఁ జేయకున్న హరి యలుకమెయిన్
జని యప్పాండు తనూజులు । మనములఁ గిను కూనునట్టి మాటలు సెప్పన్'.

చ. 'మును మనచేత భంగపడి ముచ్చిరి యుండుటఁ జేసి పాండునం
దనులును నెత్తివత్తు రుచితంబుగ; సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చిన బహుసైన్యముల్ బయలఁ జేరఁ దగన్ విడియింత; మెల్లి దం
డని పురిఁ జాటఁ బంచి దొరలందఱకున్ బడిసేయుఁ డేడ్తెఱన్'. **(ఉద్యో. 4. 134, 135)**

ఈ మాటలు దుర్యోధనుడికి ఉండదగినంత రాజనీతి పరిజ్ఞానం లేనట్లు స్ఫురింపజేస్తున్నాయి. శత్రుబలాన్ని గురించి అంచనావేయగల శక్తి అతడి బుద్ధికి ఉన్నట్లులేదు. శ్రీకృష్ణుడి మాటలు పాండవులలో కోపం రేకెత్తింపజేయగా, ఇదివరకు పడినపాట్లను స్మరించుకొంటూ వారు యుద్ధానికి సిద్ధమై వస్తారని అలవోకగా చెప్పాడు. సన్నివేశాన్నిబట్టి దుర్యోధను డీమాటలు వాస్తవాలను కప్పిపుచ్చిమాట్లాడుతున్నాడనీ భావించవచ్చును. అవగాహనలేని ఆహవనీతిని ప్రయోగిస్తున్నాడనీ వ్యాఖ్యానించవచ్చును. తనమాటకు తిరుగులేదన్న అహంకారంతో వ్యవహరిస్తున్నాడనీ తలంచవచ్చును. ఏమైనా, ప్రతినాయకుడి అపరిణత యుద్ధనీతిని తెలిపే చిన్ని ఘట్టం ఈ రంగం.

10. దుర్యోధనుడు భీష్మమందిరంలో జరిపిన సమావేశం యుద్ధోద్యోగ రీత్యా ఎంతో ప్రాధాన్యాన్ని సంపాదించుకొన్నది. భారత వీరుల గుట్టుమట్టులు తెలిసిన మహావీరుడు భీష్ముడు. అతడు కౌరవసేనకు ప్రథమ సైన్యాధ్యక్షుడు. అతడి మాటలు పితామహశాసనాలవలె ఉంటాయి. శత్రుమిత్ర బలాబల నిరూపణం సైన్యాధ్యక్షుడి ప్రథమ కర్తవ్యం. అందులోనే జయాపజయాలు వస్తుధ్వని నాశ్రయించి ప్రకటితమౌతాయి. వాటిని సూచించే విలువైన రంగం ఇది.

సర్వసైన్యాధ్యక్ష పదవి చేపట్టటానికి భీష్ముడు షరతులు పెట్టాడు. ఇట్టివి పాండవపక్షంలో వినబడవు. కౌరవవీరులలో ఉన్న రవరవలకు అవి సంకేతాలు.

1. 'యుద్ధకార్యాలలో ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా చెప్పాలి. మారుమాటలు పనికిరావు. నాకు కౌరవపాండవు లొక్కటే. నేను మీతో కలిసి ఉంటున్నాను కాబట్టి యుద్ధానికి రమ్మంటే వస్తాను. అది ఉచితం కూడా.

2. మీరు కోరటంవలన సైన్యాధిపత్యాన్ని స్వీకరిస్తాను. ఒక అర్జునుడు తప్ప న న్నెదిరించి నిలిచే వీరులు లేరు. అర్జునుడు నాకంటె ఎక్కువ శరాలు కలిగి ఉండటంచేత అతడిని ఎదురొడ్డి నిలవలేను.

3. మిగిలినవారి నందరినీ యుద్ధంలో వధించగలను. అయితే, పాండురాజనందనులను మాత్రం నేను చేజేతుల చంపలేను. వారుకూడా నా మీద భయంకరంగా దాడిచేయరు.

4. అది అట్లుండగా మరొకమాట! ముందుగా కర్ణుడినిగాని, నన్నుగాని యుద్ధంచేయటానికి అనుమతించుము. అట్లా చేయకపోతే నేను సైన్యాధ్యక్ష పదవిని స్వీకరించను'.

ఈ మాటలు నిష్ఠురాలుగా కనపడినా నిజాయితీతో కూడుకొన్న నిజాలు. కర్ణు డిదివరకే భీష్ముడు కూలేంతవరకు ఆయుధం పట్టనని శపథం చేశాడు. దాని నతడు ఈ సందర్భంలో మరల పేర్కొన్నాడు. భీష్ముడు సర్వసైన్యాధ్యక్షు డైనాడు. ఈ సన్నివేశంలో పాల్గొన్న పాత్రలు మూడైనా మూడూ మొదట్లోనే హంసపాదం వేశాయి. భీష్ముడిని ఎన్నికచేయక తప్పదుకాబట్టి

దుర్యోధనుడు సేనాధ్యక్షుడిగా చేశాడు. భీష్ముడు యుద్ధం చేయకతప్పదు కాబట్టి యుద్ధానికి ఒప్పుకొన్నాడు. కాని, అర్జునుడి ముందు తాను నిలువలేనన్నాడు. అతడిచేతిలో మరణిస్తా ననలేదు. కర్ణుడుండగా ఆయన యుద్ధం చేయనన్నాడు. భీష్ముడుండగా తాను యుద్ధం చేయనన్నాడు కర్ణుడు. దీనినిబట్టి ముందు పితామహుడు నాయకుడైనా అతడు మృతుడు కావటం తథ్యమని భావికథార్థధ్వని. మంగళారంభంగా సాగవలసిన ఈ రంగం అమంగళస్వరాలతో ఆరంభమైనది. కౌరవ పరాజయం తప్పదని సూచించబడింది. యుద్ధపర్వాలలో పాండవ విజయసూచనలు ప్రత్యర్థుల స్కంధావారంలోనే వినబడటంచేత యుద్ధోద్యోగం సఫలమైనదని స్పష్టమౌతున్నది.

(3). దృశ్యాలుగా గోచరించే సన్నివేశాలు

ఒకటిరెండు పాత్రలు ఒకసన్నివేశంలో తారసిల్లి ఏదైనా ప్రయోజనాన్ని సాధించే సంభాషణలను స్వల్పకాలంపాటు సాగించిన ఘట్టాన్ని దృశ్యంగా పరిగణించవచ్చును. అటువంటివి కూడా పది కనబడుతున్నాయి ఉద్యోగపర్వంలో.

1. శల్య దుర్యోధన సమావేశ సన్నివేశం.	1. 94-103
2. సంజయుడు ధృతరాష్ట్రుడితో రాయబారపు వృత్తాంతం చెప్పే సన్నివేశం.	2. 2-16
3. ధర్మరాజు ఆత్మీయులతో సభచేసిన సన్నివేశం.	3. 3-4
4. పాండవులు శ్రీకృష్ణుడిని సాగనంపే సన్నివేశం.	3. 133-144
5. శ్రీకృష్ణుడి హస్తినగర ప్రవేశ సన్నివేశం.	3. 174-180
6. శ్రీకృష్ణుడి విదురమందిర సన్నివేశం.	3. 229-244
7. సభానంతరం ధృతరాష్ట్రాదులతో శ్రీకృష్ణుడి సన్నివేశం.	4. 4-8
8. భీష్మద్రోణులు దుర్యోధనుడికి హితవు చెప్పిన సన్నివేశం.	4. 19-27
9. బలరాముడు తీర్థయాత్రలకు పోయే సన్నివేశం.	4. 165-173
10. రుక్మి ప్రగల్భాలాడిన సన్నివేశం.	4. 174-180

దృశ్యాలలో సంఘటన కెంత ప్రాధాన్యముంటుందో సంభాషణలకూ అంతే ప్రాముఖ్యముంటుంది. ముడివంటి ఒక సమస్య ముడిపడటమో, విడిపడటమో దృశ్యంలో గమనిస్తాం.

1. శల్య దుర్యోధన సమావేశం దుర్యోధనుడు ప్రయోగించిన నీతి కౌశలానికి ఫలంగా ఏర్పడింది. చారులు చేసిన సేవలకు మెచ్చి వరాలిద్దామనుకొన్న శల్యుడి ముందు దుర్యోధనుడు తారసిల్లి, అతడి సైన్య సహాయాన్ని పొందగలుగుతాడు.

క. 'సత్య సరస్వతి వగు; మౌ । చిత్య విశారదము నీదు చిత్తము; నియమౌ
దాత్త్యంబు మెఱయ నాకు న । మాత్యుఁడవై పూని నడవు మత్సైన్యంబున్'.

ఆ. 'తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు । నొక్కరూప; భక్తియుక్తిఁ జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న । నుగ్రహించి తగఁ బరిగ్రహింపు'. **(ఉద్యో. 1. 95-96)**

ఇవి దుర్యోధనుడు పలికిన మాటలా? అని ఆశ్చర్యం వేస్తుంది. ధర్మజుడి వాక్యసంస్కారం గుబాళిస్తున్న దిందులో. ధర్మరాజుకు సాయంచేయబోయే శల్యుడిని తనవైపు త్రిప్పుకొనటంలో దుర్యోధనుడు కార్యచాతుర్యంతో పాటు వాక్యచాతుర్యంకూడా చూపి సాత్త్వికుడివలె చెలువొందిన ఈ దృశ్యం అరుదైనది.

2. ఉపప్లావ్య నగరం నుండి తిరిగి వచ్చిన సంజయుడు, సంజవేళలో ధృతరాష్ట్ర మహారాజుకు దౌత్య ఫలితాంశాలపై ప్రాథమిక నివేదికను మౌఖికంగా సమర్పించిన ఈ సన్నివేశం కథలో కీలకమైనది. సంజయుడు సూత్రకారుడివలె కొన్ని వాక్యాలే మాట్లాడాడు. అందులోనూ ఈ క్రింది పద్యం బ్రహ్మసూత్రంవలె రాణించింది.

చ. 'అనయము పుట్టె జూదమున; యప్పుడ యెంతయుఁ జిచ్చు వెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?' **(ఉద్యో. 2.14)**

ఉద్యోగపర్వంలోని ధర్మరాజువ్యూహాన్ని సూత్రబద్ధం చేసిన గొప్ప పద్య మిది. దీని వ్యాఖ్యానమే ఈ పర్వకథాంశం. ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు నిద్రపోలేదు. కథను నిద్రపోనివ్వలేదు. అంతటి చైతన్య బీజం ఈ సన్నివేశం.

3. సంజయుడు హస్తినాపురానికి తిరిగివెళ్ళిన మరునాడు ధర్మరాజు తన తమ్ములను, సుతులను, ఇష్టభృత్యవర్గాన్నీ పిలిచి తనయింట చిన్న సమావేశం ఏర్పరచి చేసి వారిముందు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు.

క. 'మనము జనార్దను పాలికిఁ । జని కౌరవసభకు నతనిఁ జను మని ప్రార్థిం
చిన మేలు; బంధుహిత గురు । జనములతో రణము గాక సంప్రీతి యగున్'. **(ఉద్యో. 3.4)**

ఈ పద్యం శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టానికి ముందుమాట, లేదా నాందీవాక్యం. అల్పాక్షరాలలో అనల్పార్థం ఇమిడి ఉండే సారవంతమైన వాక్కు. ధర్మజుడి మాట సభ శిరసావహించింది. అందరూ కలిసి సామూహికంగా శ్రీకృష్ణమందిరానికి వెళ్ళారు. ఏకగ్రీవంగా తీసికొనే సభ తీర్మానాన్ని మరపించే ఈ దృశ్యం ధర్మజ నాయకత్వ దీప్తికి కరదీపిక!

4. హస్తినాపురికి బయలుదేరిన శ్రీకృష్ణుడితో పలికిన సాగనంపు మాటలలో ధర్మజుడు కుంతీదేవి ప్రసక్తితెచ్చి, ఆమెను దర్శించి రమ్మని ఆర్ద్రంగా అడిగాడు.

ఉ. 'వచ్చె జనార్దనుం డనినవార్తకుఁ బ్రాణము మేని కంతకున్
వచ్చిన సేదఁ దేఱుఁ గురువంశ పవిత్ర చరిత్ర గొంతి; నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మా ఱని చెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ!' **(ఉద్యో. 3.134)**

కుంతిపట్ల పాండవాగ్రజుడికున్న ఆదరాభిమానాలతో కూడుకొన్న ప్రేమ అపారం. 'కురువంశ పవిత్ర చరిత్ర'- అనే విశేషణం ఆ పాత్ర స్వభావ సర్వస్వం. శ్రీకృష్ణుడు కుంతిని దర్శించి కొడుకుల భక్తి తాత్పర్యాలను స్వయంగా అందజేస్తాడు. ఆమెవద్ద నుండి పాండవులకు యుద్ధోత్సాహం కలిగించే పౌరుష సందేశాలను తెచ్చి వినిపిస్తాడు. ధర్మరాజు యుద్ధాన్ని ప్రారంభించటానికి ఆ తల్లి సందేశం ఒక ప్రధాన కారణం. అందువలన ఈ దృశ్యం భావికథా జీవిత పరిపోషకం.

ఈ సన్నివేశంలోనే అర్జునుడు జనులు వినేటట్లు చెప్పుమని తన వీరసందేశం వినిపించాడు.

చ. 'జనులు వినంగ రాజ్యమున సాము గొనం గలవార మన్న యీ
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములన్ సఖులు దానికి నేమును నియ్యకొందు; మొం
డనిన సుపుత్రమిత్రముగ నద్దెస నందఱఁ గ్రొచ్చి పోఁతుదున్'. **(ఉద్యో. 3.142)**

కొసమెరుపుగా మెరిసే ఈ పద్యంలో పాండవ హృదయం స్పష్టంగా ప్రకాశించి ఒక మెరుగైన ముగింపును పాండవ సందేశ ఘట్టానికి సమకూర్చింది.

5. శ్రీకృష్ణుడు హస్తినాపురంలో ప్రవేశించి పురవీథులలో ఊరేగుతూ ధృతరాష్ట్ర మందిరానికి చేరిన ఘట్టం మనోహరమైన మధుర దృశ్యం. భారతంలో భాగవతం ప్రవేశించినట్లుంటుంది. రమ్యహర్మ్యాలపై నిలిచి పూలగుత్తులను చల్లుతూ శ్రీకృష్ణ మహిమలను కీర్తించే అంగనామణులు గోపికల కెందులోనూ తీసిపోనట్లు గోచరిస్తారు.

సీ. 'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల । పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!
ప్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల । మెచ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ । బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల । కోర్కిదీర్చిన రసికుం డితండె!

తె. వెన్నలును గోపికాచిత్తవృత్తములును । నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె!
శ్రుతి శిరోభాగములఁ దన సుభగచరణ । సరసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె!'.
(ఉద్యో. 3.175)

మానవాకారంలో నున్న మాధవుడిని చూచిన మాన్యులు హస్తినాపురం ప్రజలు. ఆ ప్రజలను పాలించే సంస్కారం గ్రుడ్డిరాజుకు లేదనీ, మదాంధులైన దుర్యోధనాదులకు లేదనీ ధ్వని. (మిగిలిన వివరాలకు వ్యాఖ్య చూడండి).

6. హస్తినాపురంలోని విదుర మందిరం గంజాయి తోటలో ఉన్న తులసి వనం. అందులో ప్రవేశించిన తులసీదాముడు విదురుడితో సలిపిన సంభాషణలు శ్రీకృష్ణుడి రాయబారపు పరమార్థాన్ని ప్రపంచించే సారవచనాలు. కౌరవులు నిండు సభలో చేయ తలపెట్టిన దౌష్ట్యాన్ని గురించి శ్రీకృష్ణుడికి ఏకాంతంలో నివేదించి, మరునాటి కురుసభకు వెళ్ళవలదని సూచించాడు విదురుడు. దానికి శ్రీకృష్ణు డిచ్చిన సమాధానం రాజనీతి తిలకం. దుర్యోధనుడు వ్యర్థుడనీ తెలుసు. అతడిని సమర్థించే రాజులు పగను మనసులలో పెట్టుకొని సంధి కుదరనీయరనీ తెలుసు. అయినా ఉత్తములు ఊరకుండరాదు.

ఆ. 'పుడమి యెల్ల నొడ్డగెడవయి గజవాజి । యుతముగాఁ గడంగి యుగ్రమృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్పుట । యధికమైన పుణ్య మనఘచరిత'.**(ఉద్యో. 3.238)**

శ్రీకృష్ణుడి రాయబారం ఈ దృష్టితో ఒక పుణ్యకర్మ. మానవులు పుణ్యంకాని పాపంకాని చేస్తూ చేస్తూ ఉండగా మధ్యలో అది విఫలమైనా, దాని ఫలితాన్ని అనుభవిస్తారని ధర్మవేత్త లంటారు. అది అట్లా ఉండగా ఈ యత్నం సామాజిక, కుటుంబ ధర్మాలను గౌరవించే శాంతియత్నం.

తే. 'చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు । డడ్డపడి వారితోడఁ గొట్లాడి యైనఁ
దాని నుడుపంగఁ జొరకున్న వానిఁ గ్రూర । కర్ముఁ డని చెప్పుదురు కర్మకాండవిదులు'. **(ఉద్యో. 3.242)**

క్రూరకర్ము డనే నింద పడకుండా ఈ శాంతియాత్ర చేస్తున్నట్లు శ్రీకృష్ణుడు తన హృదయగీతను విదురుడికి వినిపించాడు. ధర్మజుడికి వినిపించింది ధర్మనీతిగీత; విదురుడికి వినిపించింది కర్మనీతిగీత. ఎవరికి, ఎప్పటికి ఎయ్యది ప్రస్తుతమో దానిని ప్రపంచించటం ఆ పురుషోత్తముడి లీలావిలాసం. శ్రీకృష్ణుడి రాయబారంలోని నైతికకోణాన్ని ఈ దృశ్యం ప్రదర్శించింది.

7. శ్రీకృష్ణుడి రాయబారపుసభ ముగిసింది. గాంధారి అంతఃపురానికి తిరిగి వెళ్ళింది. శ్రీకృష్ణుడు కుంతీగృహానికి బయలుదేరుతుండగా ధృతరాష్ట్రుడు చొరవతీసికొని తనయం దేమీ తప్పులేనట్లు శ్రీకృష్ణుడికి నివేదించుకొన్నాడు.

ఉ. 'వీరును బాండుపుత్రులును వేరము దక్కి పొసంగి మన్కికై
పోరిత మాడి యే నటులు బుద్ధులు సెప్పిన భంగియుం, గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కౌరవజాతికిం దెలిసెఁ గాదె గదాధర! నీదు సన్నిధిన్'.

తే. 'నీకు శుద్ధుండ నగుటయ నిఖిల బంధు । మిత్ర గురుజన కోటికి ధాత్రి కెల్ల
నంబుజాక్ష! నిర్దోషుండ వగుట; గాన । నా తెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు'. **(ఉద్యో. 4.3,5)**

కౌరవులూ పాండవులూ కలిసి ఉండాలని సభలో కొడుకులకు ఎన్నో బుద్ధులు చెప్పాడట!, ఎంతో కష్టపడ్డాడట! వంశగౌరవాన్ని నిలపటానికి అనేక విధాలుగా శ్రీకృష్ణుడి సన్నిధిలో కృషిచేసినట్లు కౌరవజాతికి స్పష్టమయిందట! శ్రీకృష్ణుడు నిర్మలాత్ముడు కావటంచేత ధృతరాష్ట్రుడి నిర్దోషిత్వాన్ని గుర్తిస్తే బంధుమిత్రజనకోటి కూడా గుర్తించినట్లేనట! ఈ మాట లంటున్న ధృతరాష్ట్రుడు దేవుడిముందు తన నిజాయితీని నివేదించుకొంటున్నట్లున్నది. అయితే, తాను కళ్ళుమూసికొని మాట్లాడితే దేవుడుకూడా కళ్ళుమూసికొని వింటాడనీ, అందరూ కళ్ళుమూసికొని అంగీకరిస్తారనీ భావించాడు. కాని, నీతులు చెప్పటంతో తన బాధ్యత తీరిపోయిం దనటం బాధ్యతారాహిత్యం. తాను రాజై తీర్పు చెప్పలేక, పాండవులకు పాలీయలేక, సంధి జరగటానికి అనుకూలంగా సాహసించి ఒక్క అడుగు ముందుకు వేయలేక, తాను నిర్దోషినని చెప్పుకుంటున్న ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికంటె దుర్మార్గుడు. అతడి ఉపేక్షయే అతడి వంశానికి ఊపిరికుట్టుగా దాపురించింది. శ్రీకృష్ణుడు అతడి వక్రనీతిని అధిక్షేపిస్తున్నట్లు, అక్కడున్న పెద్దలందరికీ ధృతరాష్ట్రుడిమాట లుట్టంకించి చెప్పి, అతడు ప్రధానవ్యక్తి కాడనీ, అతడేమీ చేయలేడనీ తేల్చి చెప్పిన తరువాత ఇక హస్తినాపురంలో ఉండటం నిరర్థకమని పలికి, ప్రస్థానం సాగించాడు. సంధియత్నానికి ధృతరాష్ట్రుడు పాడిన చరమగీతం ఈ దృశ్యం.

8. శ్రీకృష్ణుడు హస్తినాపురాన్ని విడిచిపోతున్న సందర్భంలో భీష్మద్రోణులు దుర్యోధనుడికి చివరిసారిగా హితవును ఇట్లా బోధించారు.

శా. 'మాకుం జూడఁగఁ బోలు కార్య మిది ధర్మప్రీతి నీ వేఁగి సు
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యుల నెల్లఁ గాచికొనవే యే పొప్పు; దెందుం దుదిన్
శోకం బొందక వేగమైఁ గదలి కృష్ణుం గూడఁ బోవే నృపా!'. **(ఉద్యో. 4. 24)**

ఈ హితవును దుర్యోధనుడు పెడచెవిని పెట్టాడు. దీనితో యుద్ధారంభానికి అడ్డంకు లేవీ లేకుండా పోయాయి. శాంతి విఫలం కావటానికి దుర్యోధనుడే కారకుడని కౌరవవీరులే నిశ్చయించినట్లు ఈ దృశ్యం బోధపరిచింది.

9. బలరాము డదృష్టవంతుడు. శ్రీకృష్ణు డంతటి తమ్ము డతడికున్నాడు. అందువలన భారమంతా ఆయనమీద ఉంచి నిశ్చింతగా జీవితం గడపటం, అప్పుడప్పుడూ శ్రీకృష్ణుడిమీద, బంధువులమీద తన పెద్దరికాన్ని చూపుతూ ఉండటం, ఆయనకు పరిపాటి. ఆ అలవాటులో భాగంగానే ధర్మరాజు సభకు వచ్చాడు. నిజానికి, ధర్మరాజు ఆయన సహాయం అడగలేదు. దుర్యోధనుడు అడిగాడు. అన్నదమ్ముల నడుమ జరిగే యుద్ధంలో పాల్గొనని బలరాముడు కచ్చితంగా చెప్పాడు. అందువలన ఎట్టి పరిస్థితులలోకూడా దుర్యోధనుడి వద్దకు పోలేదు. బలరాముడు యుద్ధంవలన కలిగే దారుణఫలితాలను వినలేక, చూడలేక తీర్థయాత్రకు పోదలచాడు. కాని, అతడి బహిఃప్రాణమైన శ్రీకృష్ణుడు ధర్మరాజాదుల పక్షంలో ఉన్నాడు. సంధికొరకు ప్రయత్నించేసి దానిని కౌరవుల మూర్ఖతవలన సాధించలేకపోయాడు. యుద్ధం మొదలు కాబోతున్నది. శ్రీకృష్ణుడికి చెప్పిపోవాలని వచ్చాడు. కాని, ధర్మరాజు ప్రభువు కాబట్టి అతడిని కొలువులో కలిశాడు. బలరాముడికి పాండవులమీద జాలి. తమ్ముడు వారి పక్షంలో ఉండి వారిని యుద్ధంబారినుండి తప్పిస్తాడేమోనని ఆశించాడు. శ్రీకృష్ణుడికి సాధ్యంకానిది లేదని అతడివిశ్వాసం. సంధి కుదరలేదంటే శ్రీకృష్ణుడే సంధికి సుముఖుడు కాడేమో! అని అతడి ఊహ. దానికి కారణం గోవిందుడికి అర్జునుడిపై ఉండే మిక్కుటమైన మక్కువ- అని అతడి అనుమానం. ఇవన్నీ కలిసి అతడిని తీర్థయాత్రలకు పంపుతున్నాయి. ఈ ఒత్తిడితో ధర్మజుడిని దర్శించి, అతడిమీద జాలి చూపించబోయి, తన తమ్ముడిమీద చనువుగా చణుకులు విసిరాడు.

కౌరవపాండవులు క్రూరులై యుద్ధానికి దిగి బంధుమిత్రాదులకు ప్రాణహాని కలిగించటం దారుణకర్మగా గర్హించాడు బలరాముడు. ఇరుతెరగుల వారికీ సర్దిచెప్పి సంధిచేయుమని తానెన్నోసార్లు చెప్పినా శ్రీకృష్ణుడు పట్టించుకొనలేదని నొచ్చుకొన్నాడు. మాటల పొందికా, మన్ననా లేని కౌరవులకు ఏదో విధంగా నచ్చచెప్పి కార్యాన్ని చక్కజేసే బాధ్యత శ్రీకృష్ణుడికి ఉన్నదని భావించాడు. కాని, ఏదో కారణంవలన అతడు సంధి కుదిరించి ఉండడని అనుమానించాడు. ఉభయులకూ కావలసిన వాడైన శ్రీకృష్ణుడు అర్జునపక్షపాతి కాబట్టి పాండవులను వదలిపెట్టడని నిశ్చయించాడు.

ఉ. ‘కావున వీరికిం జయము గల్గుట నిశ్చయ మెల్ల భంగులం;
జావు నిజంబు వారికి; నసంశయమై యిటులుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తు? దగ నింత ప్రవీణుల నేన చేసితిం
జూవె! సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే?’ **(ఉద్యో. 4.171)**

శ్రీకృష్ణుడు పాండవ పక్షంలో ఉన్నందున పాండవులకు విజయం తథ్యమనీ, కౌరవులకు చావు తప్పదనీ నిస్సంశయంగా చెప్పాడు. చివరకు ఆయన బాధంతా తేల్చి చెప్పాడు. తన ప్రియశిష్యులైన దుర్యోధన భీముల నడుమ గదాయుద్ధం జరిగితే వారిరువురూ సమాన బలసంపన్నులు కాబట్టి ఉభయులూ చనిపోతారేమో అని శంకించాడు. ఆ విషాదాన్ని ఆయన చూడలేక తీర్థయాత్రలకు బయలుదేరాడు. బలరాము డెన్ని మాటలు మాట్లాడినా అటు ధర్మరాజు గాని, ఇటు కృష్ణుడు గాని కిమ్మనకుండా నమస్కరించి సాగనంపారు. ఆ నిశ్శబ్దంలో ఎంత ఔచిత్యముందో!

తమ్ముడైన శ్రీకృష్ణుడిని చనువుతో ఎన్నిమాటలన్నా, ఆయనచర్యలోని అంతరార్థం తెలిసికొనటం కష్టమని బలరాముడికి బాగా తెలుసు. అందుకే ‘హరి యెఱుఁగని చక్కటియుం । బురుషార్థము నా కెఱుంగఁ బోలునె?’ అని విజ్ఞుడుగా విన్నవించుకొన్నాడు. తమ్ముడు దేవుడని తెలిసికూడా తన పెద్దరికం చాటుకొనే భోళా పెద్దమనిషి బలరాముడు. అతడి పాత్ర చిత్రణాన్ని ఒక్కదృశ్యంలో పరిపూర్ణంగా చూపగలిగిన ఈ సన్నివేశం కడుసున్నితం.

10. గంభీరమైన యుద్ధ వాతావరణంలో రుక్మివృత్తాంతం ఒక చక్కని హాస్యవిరామం. రుక్మిణి అన్న అయిన రుక్మి విజయమనే దివ్య చాపం కలవాడు. కాని, చపలచిత్తుడు. అతడిని ఎవరూ యుద్ధానికి పిలవలేదు. అయినా, ససైన్యుడై ధర్మజుడి వద్దకు వచ్చి, సత్కారాలు పొంది అర్జునుడిని చూచి ప్రగల్భా లాడటం మొదలు పెట్టాడు.

'అర్జునా! యుద్ధం చేయటానికి నీకు భయంగా ఉంటే నాతో చెప్పుము. నాకు ఎదురుగా నిలబడగలిగిన వీరుడు లేడు. ఎటువంటి వీరుడినైనా యుద్ధంలో ఓడించి నీకు సాయంచేస్తాను!' అని అన్నాడు. రుక్మి నోడించి రుక్మిణిని తెచ్చి రాక్షస వివాహం చేసికొన్న శ్రీకృష్ణుడున్న సభలో ఆత డట్లా సిగ్గులేక మాట్లాడటం అందరికీ ఎబ్బెట్టుగా తోచింది. అర్జునుడు వెటకారంగా నవ్వి ఇట్లా అన్నాడు. 'గంధర్వరాజైన చిత్రరథుడిని గెలిచినప్పుడూ, విరాటరాజుగోవులను మరల్చి తెచ్చినప్పుడూ నీవెక్కడున్నావో తెలియక పిలవకపోవటం పొరపాటైపోయింది. ఇకముం దెప్పుడైనా నాకు తోడు వద్దువుగానిలే. అయితే, యుద్ధంలో నే నెవరి సహాయాన్నీ కోరను. అయినా విజయాలు కలుగుతున్నాయి. శ్రీకృష్ణుడు నాకు అండగా ఉన్నాడు. నేను భయపడవలసిన అవసరం లేదు. నాకు భయం తీర్చవలసిన అవసరం లే' దని రుక్మిని తృణీకరించాడు. అతడు వెళ్ళి దుర్యోధనుడిని అడిగాడు. అతడూ తిరస్కరించాడు. చివరకు రుక్మి తలవంచుకొని తన పట్టణానికి తిరిగిపోయాడు.

ఈ ఉదంతం వలన కౌరవపాండవు లిరువురూ మాటల పోటుగాళ్లను కాక యుద్ధవిశారదులనే సహాయసహకారాలకై అర్థించారనీ, పరాక్రమవంతులు కానివారు ప్రాధేయపడ్డా తమ పక్షాన చేర్చుకొనలేదనీ తెలుస్తున్నది. యుద్ధోద్యోగంలో అది ఒక ఉన్నత ప్రమాణం!

(4). చతుర్విధాభినయం

నాటకానికి చతుర్విధాభినయం జీవితం. కావ్యంలోని నాటకీయతకు చతుర్విధాభినయ వర్ణనం రసవదలంకారం. తిక్కన రచనలో అభినయ ప్రశంస క్షీరనీరన్యాయంగా కలసిమెలసి ఉంటుంది. విరాటపర్వం చతుర్విధాభినయ చంద్రాలోకం. షోడశ కళాపూర్ణుడైన చంద్రుడు శరత్కాలంలో ఎంత సమగ్రంగా ప్రకాశిస్తాడో విరాటపర్వంలో అభినయ చంద్రిక అంత పరిపూర్ణంగా విరాజిల్లింది. ఉద్యోగపర్వం అభినయ రీత్యా విరాటపర్వమంత విరాజమానం కాదు. అయితే అభినయాన్ని కావలసిన చోట సందర్భశుద్ధితో అనువుగా వాడుకొన్న జాగరూకత ఇందులో కనబడుతుంది. దానికి కారణం కూడా ఊహించవచ్చును. విరాటపర్వంలో పాండవులు వేషధారులు. అందువలన అభినయం వారికి లలితంగా, స్వభావ సుందరంగా ఉంటుంది. ఉద్యోగపర్వంలో రాజనీతి వర్తనం, పౌరుష ప్రవర్తనం ముఖ్యం. అందువలన లలితాభినయానికి పెద్దగా తావుండదు.

విరాటపర్వంలో ఆంగికానికీ ఆహార్యానికీ అవకాశం ఉన్నది. ఉద్యోగంలో తక్కువ. కీచకోదంతం విరాటపర్వంలో కీలకమైన పాత్ర నిర్వహించటం చేత సాత్త్వికాభినయానికి చక్కని అవకాశం దక్కింది. మొత్తానికి కీచకవధ ఘట్టం మినహాయిస్తే మిగిలిన ఘట్టాలలో కూడా అంతటి ముమ్మరమైన సాత్త్వికాభినయం కనబడదు. దక్షిణ ఉత్తర గోగ్రహణ ఘట్టాలలో వీరం పొంగులువారింది. క్రమంగా సాత్త్వికాభినయ వర్ణనం పలచబారింది. కొసమెరుపుగా ఉత్తరాభిమన్యుల వివాహ ఘట్టంలో సున్నితమైన సాత్త్వికం సొగసులు పోయింది. మరి ఉద్యోగ పర్వం కథ వేరు. ఇందులోనూ ద్రౌపదీ, కుంతీ మొదలైన స్త్రీ పాత్రలు ప్రవేశించిన ఘట్టాలలో సాత్త్వికం మృదువుగా మెరుస్తుంది. మిగిలిన చోట్ల అక్కడక్కడ కనబడుతుంది. విరాటపర్వంలో కంటె ఉద్యోగం వాచికాభినయంలో విస్తృతిని సంతరించుకొన్నది. ఉద్యోగపర్వంలో పాత్రలు తమ సంభాషణల ద్వారా తమ తమ అభిప్రాయాలనూ వ్యక్తిత్వాలనూ ప్రదర్శించుకొంటూ ఉంటాయి. పాత్రలు మాట్లాడిన

మాటలకే ఇందులో ప్రాధాన్యం కాని ఆ మాటలాడుతున్నప్పుడు అవి ప్రదర్శించే హావభావాలకు అభినయ ముద్రలకు అంత ప్రాధాన్యం కనబడదు. ఎప్పుడో భావతీవ్రత పరమస్థితికి అందుకొన్నపుడు అభినయ రేఖను తిక్కన అరుదుగా చిత్రించాడు.

(అ). ఆంగికాభినయం

ఉద్యోగపర్వంలో తిక్కన నిర్వహించిన ఆంగికాభినయాన్ని స్థూలంగా సమీక్షిస్తే ఈ క్రింది అంశాలను గమనించవచ్చును.

1. పాత్రల ఆకార భంగిమల కంటె ప్రవర్తన భంగిమలకు తిక్కన ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఉదాహరణకు- దుర్యోధన అర్జునుల స్వభావాలను వారి ఆంగిక అభినయాలతో సహజంగా వ్యక్తం చేసిన తిక్కన తేటగీతి పద్యం

తే. 'అత(డు పవడింప మును కౌరవాధినాథు(। డరిగి తలయంపిదెస నున్నతాసనమున
నుండె(; బదపడి కాల్కడయొద్ద కల్ల(। జని వినమ్రు(డై నిలుచుండె సవ్యసాచి'. **(ఉద్యో. 1.65)**

శ్రీకృష్ణుడి సన్నిధిలో ఉన్నతాసనంలో కూర్చున్న దుర్యోధనుడి అహంకారం, వినమ్రుడై నిలుచున్న సవ్యసాచి వినయం ఆ పాత్రల స్వభావాలకు సహజ సూచికలు. ఇటువంటి ఆంగికాభినయాలు ఉద్యోగపర్వంలో రసధ్వనికి పోషకాలుగా నిలుస్తాయి.

2. ఒక్కొక్క పాత్రకు ఆ పాత్రకు మాత్రమే సహజంగా గోచరించే ఆంగిక చేష్టను రంగంలో చిత్రించటం తిక్కన ప్రత్యేకత. ఉదాహరణకు- మద్రభూపాలుడైన శల్యుడు మిత్రులను కాని ఆత్మీయులను కాని కలిసినపుడు గాఢాలింగనం చేసికొనటం అలవాటు. సైన్య సహాయాన్ని కోరే మిషతో తనను కలిసిన దుర్యోధనుడిని సంభ్రమంతో గాఢాలింగనం చేసికొన్నాడు. ఈ ఆంగికాభినయంలో సంభ్రమం గౌరవ సూచకమే కాక కృతజ్ఞతా సూచకం కూడా. తన యుద్ధయాత్రలో దుర్యోధనుడు కల్పించిన సౌకర్యాలకు తన నిండు హర్షాన్ని తెలపటానికై నిండు కౌగిలింతను కల్పించాడు. హర్షాతిశయం కలిగినపుడు గాఢాలింగనం చేయటం శల్యుడి అలవాటు. ఈ అలవాటును ఆంగికాభినయంగా సన్నివేశంలో సందర్భోచితంగా వర్ణించి పాత్ర మనోగతభావాలను వ్యక్తం చేయటం తిక్కన శిల్పం.

ఇష్టం ఉన్నా లేకపోయినా, అన్నమాట ప్రకారం తన సహాయాన్ని అందిస్తానని దుర్యోధనుడికి మాట ఇచ్చిన శల్యుడు, ధర్మజుడి వద్ద సెలవు తీసికొని రావటానికీ బయలుదేరాడు. 'ఇచ్చినమాట తప్పవద్దనీ, వెంటనే తిరిగి రావా'లనీ కోరిన దుర్యోధనుడిని శల్యుడు మందహాసంతో ఆలింగనం చేసికొన్నాడు (ఉద్యో. 1.103). ఇక్కడ తిక్కన గాఢాలింగన ప్రసక్తి చేయలేదు. దరహాసాన్ని ప్రవేశపెట్టాడు. మొదటి కౌగిలింతలో ఉన్న గాఢత ఇందులో లేదు. దుర్యోధనుడి అదృష్టాన్ని చూచి నవ్వినట్లున్నది ఇక్కడి దరహాసం.

ఉపప్లావ్య స్కంధావారానికి చేరిన శల్యుడు, ధర్మరాజును అభినందించి పునరాలింగనం చేసినట్లు తిక్కన అభివర్ణించాడు (ఉద్యో. 1.104). యుధిష్ఠిరుడి మీద అతడికున్న అభిమానానికి ఈ పునరాలింగనం ఒక సంకేతం. ధర్మజుడి మనస్సు నొవ్వకుండా ఇంద్ర వృత్రాసుర వృత్తాంతాన్ని చెప్పి ధైర్యం చెప్పాడు. కర్ణుడి రథసారథ్యంలో విజయుడికి విజయం చేకూర్చేటట్లుగా రహస్యపు ఒప్పందం చేశాడు. ధర్మరాజునుండి విడిపోయినట్లు అతడు భావించకుండా ఉండేటట్లు నచ్చపలికాడు. తన రహస్య సహకారం అతడి కుంటుందని సూచిస్తున్నట్లుగా ధర్మరాజును గాఢతరంగా ఆలింగనం చేసికొన్నాడు. నిజానికి భౌతికంగా కౌరవపక్షంలో యుద్ధం చేస్తున్న శల్యుడు ధర్మరాజుకే విజయం చేకూరుస్తున్నాడు. ఈ రహస్యాన్ని కౌగిలింత అనే అలవాటును శల్యుడి పాత్రకు కలిగించి, ఆంగికాభినయంలో భాగంగా రచనలో చిత్రించి, నాటకీయతను తిక్కన పోషించాడు. ఇది ఒక విధమైన నిగూఢ అంతఃశిల్పం.

ఒక సన్నివేశంలో కార్యసాధన కొరకు ఒక్కొక్క పాత్ర ఒకరకమైన ఆంగికాభినయాన్ని పలుసార్లు ప్రకటిస్తున్నట్లు వర్ణించటం విశేషం. ఉదా॥ సంజయుడు ధృతరాష్ట్రుడి రాయబారిగా పాండవుల వద్దకు పోయినప్పుడు, వంగి వంగి నమస్కారాలు, సాష్టాంగ దండప్రణామాలు చేసినట్లు తిక్కన వర్ణించాడు. (చూడు. వివరాలకు ఉద్యోగం. 1.216, 1.272, 1.292, 1.303). పాండవులు రాజ్యభాగం కోరకుండా వారి మనస్సులు మెప్పించటమే అతడి రాయబారంలోని తాత్పర్యం. ఆ ప్రయోజనసాధనకై వినయాన్ని అతి వినయంగా ప్రదర్శించటం తిక్కన సంజయుడికి నేర్పిన అభినయం.

సమావేశాలకు, సభా చర్చలకు, వాదోపవాదాలకు, ఉపన్యాసాలకు, ఉపదేశాలకు, ఆలవాలమైన ఉద్యోగపర్వంలో వీరులుగా, నాయకులుగా చెలామణి అయిన పాత్రలు కొలువులలో మాట్లాడేటప్పుడు 'కలయం గనుగొని' మాట్లాడటం ఒక సభా మర్యాద రూపమైన ఆంగికాభినయాంశంగా తిక్కన తీర్చిదిద్దాడు. ఇది ఉద్యోగ పర్వమంతా కనబడే ప్రధానాంశం. (వివరాలకు చూడు. 1.6, 1.17, 1.307, 2.115, 3.130, 4.239 మొ.).

(ఆ). ఆహార్యాభినయం

ఉద్యోగపర్వంలో పాత్రల వస్త్రాద్యలంకరణాలు వర్ణించటం దాదాపు మృగ్యమే. వీరులను వర్ణించేటప్పుడు వారి ఆయుధాలను పేర్కొనటం భీమార్జునుల యందు ప్రచురంగా కనబడుతుంది. గాండీవధారియైన అర్జునుడు, గదాధారియైన భీముడు పలువురి చేత పలుమార్లు కీర్తింపబడతారు. శ్రీకృష్ణుడు చక్రధారి, కాని, యుద్ధంలో చక్రం పట్టనని ప్రతిజ్ఞ చేశాడు. రాజనీతిచక్రం పట్టాడు. అందువలన కాబోలు తిక్కన ఆతడి ఆంగిక ఆహార్య వైభవాన్ని మాత్రమే ఒక రమణీయమైన పద్యంలో వర్ణించాడు.

క. అంబుదశుభగాత్రుం బీ । తాంబరధరుఁ గమలదళనిభాక్షున్ హరిఁ జూ
డం బడసి లోచనము లమ్మ । తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్.' **(ఉద్యో. 3.254)**

నీలమేఘశ్యాముడు, పీతాంబరధరుడు, కమలదళాక్షుడు అనే విశేషణాలు శ్రీకృష్ణుడి దివ్యాదివ్యమూర్తిని ధ్వనింపజేసే అభినయ సంకేతాలు. ఈ నాలుగు విశేషణాలు ఉద్యోగ పర్వంలో మరే పాత్రకు వాడబడవు. శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడు అని ధ్వనింపజేసే ఈ పద్యం ఉద్యోగ పర్వానికే ఒక మణిదీపం.

ఆంగిక ఆహార్యాభినయ స్ఫూర్తితో వెలువడిన మరొక పద్యం కూడా కృష్ణ నామధేయురాలైన ద్రౌపదిని గురించి కావటం విశేషం.

ఉ. 'ద్రోవది బంధురం బయినక్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెంట్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మనంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై'. **(ఉద్యో. 3.114)**

విషాద రోషాలను వెలిగ్రక్కే ఆహార్యాభినయం ఇందులో ద్రోవది బంధురమైన క్రొమ్ముడి నాశ్రయించి సాగటం సార్థకం. ఆమె జడ నల్లనికాంతులతో మిలమిలలాడుతూ బుసకొట్టే మహాభుజంగమో అన్నట్లు వ్రేలాడటం ఆశ్చర్యకరమైన అభినయం. తెలుగు సాహిత్యంతో విషాద రోషాభినయానికి విశిష్టమైన ఆహార్యాభినయానికి ఉదాహరణం ఈ పద్యం.

(ఇ). వాచికాభినయం

ఉద్యోగపర్వంలో మూడింట రెండు పాళ్ళు సంభాషణలే ఉన్నాయి. పద్యనాటకాలలోని పాత్రలు పాడే పద్యాలవలె అనేక పద్యాలు ఉద్యోగం నిండా ఉజ్జ్వలంగా భాసిస్తున్నాయి. పద్యాలు పాత్రోచితంగా, సందర్భోచితంగా, రసోచితంగా

తిక్కన రచించాడు. ఆయనే అక్కడక్కడ ఈ రహస్యాన్ని సూచించాడు కూడా. శ్రీకృష్ణుడు కౌరవసభలో రాయబారం జరుపుతూ ప్రదర్శించిన నేర్పరితనాన్ని ధర్మరాజుతో సంగ్రహంగా, విశ్లేషణాత్మకంగా పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడి రాయబారాన్ని ప్రసిద్ధమైన తెలుగు పద్యాలతో తిక్కన నింపివేశాడు. అవి నాటకీయమైన శైలికి నాణ్యమైన ఉదాహరణాలు. ఆ పద్యాలలో కృష్ణుడు ప్రదర్శించిన వివిధ భావ దశలను ఆయన మాటల్లోనే ఈ విధంగా గమనించవచ్చును.

'...... ఏనును నాయోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధులు సెప్పునట్లు సేసితి; నేమిసెప్పినను నెంతటం బోకున్నం గినుక దెచ్చికొని జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ; గార్యంబు భగ్నం బగుట కొల్లక వెండియు శాంతవచనంబులు పలికితి; నతం డశక్తదుర్జనత సేయం జూచిన నమానుషంబు లగు వానం గొన్ని వెడమాయలం బన్ని పెక్కు పోకలం బోయితి; నెన్నిభంగుల సంధియ కావలయు నని పొరలం గల యంతయుం బొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక తనచలంబుతోన పొట్టుపొర లయ్యుఁ గయ్యంబు వొడుచుం గాని యవశ్యంబును రాజ్యంబు పాలిచ్చువాఁడు గాఁడు; కౌరవులయెడ దండంబు దక్క నొండుపాయంబు లేదు; మీకుం బోలిన తెఱంగు సేయుండు'. (ఉద్యో. 4.33)

(ఈ). సాత్త్వికాభినయం

సాత్త్వికాభినయ వర్ణనలో తిక్కన అందెవేసిన చేయి. నాట్యశాస్త్ర మర్యాదలో సాత్త్వికాభినయానికి ఉన్న శక్తిస్థానాల నన్నింటిని విరాటపర్వంలో పరిణామక్రమస్ఫూర్తితో వర్ణించాడు. నానారసాభ్యుదయోల్లాసియైన విరాట పర్వంలో ఆ రచనా శిల్పం రక్తికట్టింది. విరాటపర్వంతో పోల్చి చూస్తే ఉద్యోగ పర్వంలో సాత్త్వికభావవర్ణనా వైచిత్రి తక్కువనే చెప్పాలి. ఎందరో పాత్రలు నానా భావ రసస్ఫోరకంగా మాట్లాడుతున్న సందర్భాలలో కూడా వారి సాత్త్వికాభినయాన్ని తిక్కన వర్ణించ లేదు. దానివలన వాచికాభినయానికి వాసి బాగా పెరిగింది. సూక్ష్మంగా పరిశీలించి చూస్తే ఒకటి రెండు విషయాలు గమనించవచ్చును.

1. సాత్త్విక సూచకంగా హాసాన్ని ఎడనెడ ప్రదర్శించటం. అందులోనూ కలకల నవ్వటం అనే అభినయాన్ని విశేషించి చెప్పటం.

(అ) శ్రీకృష్ణుడు ధర్మరాజుతో కౌరవులు చేసిన దుర్నయాలను పేర్కొంటూ దుష్టచతుష్టయం 'పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింప వచ్చునే' అని శ్రీకృష్ణుడు అన్నాడు (ఉద్యో. 3.37). శత్రుకృత అపహాస్యానికి సూచకం ఇక్కడి కలకల నవ్వటం.

(ఆ)క. 'వెఱ పెట్టిదియో యెన్నఁడు । నెఱుఁగని నీయట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ । గఱపినవా?'రనుచు శౌరి గలకల నవ్వెన్. **(ఉద్యో. 3.57)**

శ్రీకృష్ణుడి నవ్వు ఎగతాళి చేసేది కాదు ఎకసక్కెమాడేది.

(ఇ) కన్నీరు మున్నీరౌతున్న ద్రౌపదిని ఓదార్చటానికి ఉపాయంగా కలకల నవ్వును వాడిన వైనం విశిష్టం.

క. 'లలనా! యుడుగుము నీయే । డ్పుల కొలఁదియె కురునృపాల పుత్రకళత్రం
బులయేడ్పు? లింక వానిం । గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్.' **(ఉద్యో. 3.121)**

దుష్టచతుష్టయం కలకల నవ్వుతూ పాండవులను అవహేళన చేసిన దృశ్యాన్ని మరపించేటట్లు ఈ పద్యాన్ని నిర్వహించటం గమనించదగిన విషయం. కౌరవుల కళత్రాలు బావురుమని ఏడుస్తుంటే ఆ శోకనాదానికి ప్రతిగా ద్రౌపది కలకల నవ్వుతూ కసి తీర్చుకొనే ఒక భావచిత్రాన్ని కన్నుల ముందు రూపుకట్టించే కమనీయ పద్యశిల్ప మిది. ఉద్యోగపర్వం

గాంగేయుడు కలకల నవ్వటంతో ముగిసినట్లు చిత్రించటం కావ్యకళాశిల్పం. కర్ణుడు పాండవ సేనా సాగరాన్ని తన పరాక్రమ ప్రతాపంతో ఐదు రోజులలో ఇంకింప జేస్తానని శపథం చేసినపుడు భీష్ముడు కలకల నవ్వాడు. 'వట్టి మాటలు పలకటం కాదు గాండీవ గుణధ్వనికి ఎదురు నిల్చి పరాక్రమాన్ని ప్రదర్శించు' మని అపహసిస్తాడు. అంటే భీష్ముడు కలకల నవ్వటం భావికథార్థ సూచకం. పాండవ విజయ సంకేతం.

2. కలకల నవ్వటం అనుభావం ఔతుందా సాత్త్విక భావమౌతుందా అనే అనుమానం కొందరికి రావచ్చును. పై సన్నివేశాలలో కలకల నవ్వటం వివిధ భావస్థితులనే కాక మానసిక స్థితులను కూడ వ్యక్తం చేస్తున్నది. ఉద్యోగ పర్వంలో చాలా చోట్ల మానసిక స్థితి వ్యంజకాలైన అభినయాలనే వర్ణించాడు తిక్కన. అవి రసస్థితినందుకొన్న సాత్త్విక భావ దశలు. వాటిలో కావ్య నాటక మర్యాదలు రెండూ కలిసి కళామయంగా ప్రదర్శించబడ్డాయి. మచ్చుకు కొన్ని.

(అ) కౌరవ సభలో శ్రీకృష్ణుడి దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించిన సభాసదుల స్థితిని తిక్కన ఈ విధంగా వర్ణించాడు.

క. 'ఆ కొలువువారు గర మచ । లాకృతి నొక పలుకు లేక యందఱు వింజం
బాఁ కిడిన కరణి నవశ ము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్'. **(ఉద్యో. 3.255)**

ఈ పద్యంలోని చిత్తవృత్తి పరమాత్మను దర్శిస్తున్న మహర్షులు పొందే శాంతరసావస్థకు దీటుగా కనబడుతున్నది. శాంత చిత్తవృత్తులకే అటువంటి నిర్వికార మానసికావస్థ సాధ్యమౌతుంది. శ్రీకృష్ణుడి తేజోరూపం దర్శించిన భీష్మ విదుర ద్రోణ సంజయులు కన్నులు మూసికొన్నారట. అద్భుత భయానక రసాలు మనస్సులో నిండగా పుండరీకాక్షుడిని చూచి సాంద్రానందం పొందారట. (ఉద్యో. 3.405). ఇది కూడా అట్లాంటి బ్రహ్మానంద స్థితియే. ఆ తరువాత ధృతరాష్ట్ర విష్ణు దివ్య విజృంభణాన్ని దివ్యదృష్టితో చూచి ఆశ్చర్య రస నిమగ్నుడైనాడు (ఉద్యో. 3.410). ధృతరాష్ట్రుడు పొందింది, సాంద్రానంద స్థితి కాదు, ఆశ్చర్యమగ్న స్థితి. ఇట్లా పరిశీలిస్తే శాంత రసానందావస్థలను తిక్కన స్వయంగా అనుభవించి వాటిని ఆయా పాత్రల ద్వారా ప్రదర్శింపజేసినట్లున్నది.

(ఆ) వివిధ రసభావాలకు సంబంధించిన చిత్తావస్థలను సాత్త్విక స్ఫూర్తితో తిక్కన తేటతెల్లం చేశాడు. 'కినుక యెదఁగదురన్' (1.13), 'పరమానందంబు నొంది' (1.94), (వికచవదనుఁడగుచు' (1.99), 'మది వికాసముఁ బొందన్' (1.103, 1.276) 'చిత్తంబు కలఁత దేరె' (1.214), 'చిత్తంబు ప్రసన్నతం బొంద (3.132), 'గద్గద కంఠి' (3.100, 3.182), 'మోము విచ్చుచు' (3.207), 'మొగంబు రాజుచుండ' (4.25), 'దరహసిత వదనుండు' (3.58).

తిక్కనగారి సాత్త్విక భావ పరిణామ వర్ణన నైపుణ్యాన్ని తెలిసికొనటానికి గ్రుడ్డిరాజైన ధృతరాష్ట్రుడి హావభావాల చిత్రణం ఒక చక్కని ఉదాహరణం.

క. 'అన విని నిరుత్తరుం డయి । మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి తలఁపుల్
పెనఁగొన నిద్రాహీనిం । దను వలయఁగ విదురుతోడఁ దా నిట్లనియెన్''. **(ఉద్యో. 3.53)**

జడపదార్థాలుగా భావింపబడే సూర్యచంద్రాదులను సైతం మానవీకరణం చేసి వారి చేత సాత్త్విక భావాలను ప్రదర్శింప చేయటం తిక్కన ప్రకృతి వర్ణనలో ప్రదర్శించే ప్రతిభ. మచ్చుకు.

తే. 'తనకులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్ర । లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట
కుమ్మలించి వివర్ణత నొందినట్లు । గంది యెంతయుఁ జెలువేదెఁ జందురుండు'. **(ఉద్యో. 2.107)**

6. ఉద్యోగపర్వం - శిల్పానుశీలనం

మహాభారత విమర్శకులు ఉద్యోగపర్వాన్ని అనేక ముఖాలుగా సమీక్షించారు. నీతిశాస్త్రజ్ఞులకు నీతిశాస్త్రంగా మహాభారతం ప్రమాణంగా నిలవటానికి ప్రామాణికమైన ప్రయోగభాగంగా ఉద్యోగ పర్వాన్ని సంభావించారు. రాజనీతిలోని నీతిచాతుర్యం ఆరు రకాలుగా ప్రకాశిస్తూ ఉంటుంది.

1.వ్యూహాత్మకం 2.ప్రసంగాత్మకం 3.చతుర వచన రచనాత్మకం 4.ఉపన్యాసాత్మకం 5.క్రియాత్మకం 6.శాస్త్రబోధాత్మకం.

ఈ ఆరు లక్షణాలు ఉద్యోగపర్వంలో నిర్వహింపబడినా వాటిలో ప్రధానంగా ప్రసంగాత్మకాలూ ఉపన్యాసాత్మకాలూ పోషించబడ్డాయని విమర్శకులు భావించారు. రాజనీతిపరమైన ప్రసంగోపన్యాసాల శిల్పకళాలక్ష్మికి వజ్రకిరీటం వంటిది ఉద్యోగపర్వమని కీర్తించారు. ఈ పర్వానుశీలనంలో ఈ అంశమే మొదట ఎన్నదగింది.

ఆంధ్ర మహాభారతోపన్యాసాలలో ఉద్యోగపర్వాన్ని సమీక్షిస్తూ కీ.శే.నండూరి బంగారయ్యగారు ఈ అంశంమీద ప్రకటించిన కొన్ని అభిప్రాయాలు సాహితీ లోకంలో బాగా ప్రచారం చెందాయి. వాటిలో కొన్ని:

1. "ఉద్యోగ పర్వమున నన్నిటికంటెను మిక్కిలి మెచ్చుకొనదగినది వస్తుసంవిధాన చాతుర్యము. దీనినే వస్తు ప్రదర్శన శక్తి యని కూడా పేర్కొనవచ్చును. ఇందున్న రాయబారములకు గాని ప్రసంగములకు గాని సారాంశము తేల్చవలసివచ్చినచో మూడు వాక్యములలో జెప్పవచ్చును. "దుర్యోధనాదులు పాండవులపై నకారణముగ బగబూని శైశవము నుండియు బడరాని యిడుమలకు బాల్పరచిరి. అన్నిటికిని నోర్చుకొని పాండవులు శాంతాత్ములై తమ తండ్రి పాలు తమ కిచ్చినచో సంధియగునని వార్త పంపుచున్నారు. వారు తండ్రి పాలు వారి కిచ్చుట కంటెను న్యాయమేమున్నది?" కృష్ణుడే కానిండు. ఎవరు చెప్పిన వాక్యములకైన నింతే సారాంశము. అందుచే పర్వమునందలి వస్తువునంతను నించుమించుగఁ బునరుక్తి క్రింద జమకట్టుకొనవలసి యున్నది. కాని ఈ పునరుక్తిని ఏ మాత్రమును విసుగురానీకుండ ప్రపంచించుటలోనే ప్రదర్శన ప్రాగల్భ్యమున్నది." (పుట.150)

2. ఉద్యోగ పర్వంలోని ప్రసంగాల వంటివి మరే పర్వంలోనూ సాధారణంగా కనబడవు. వాటిని 1.పరస్పర ప్రసంగాలని, 2.ఉపన్యాసాలని రెండు విధాలుగా విభజించవచ్చును. వ్యక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకొనే ప్రసంగాలు, పరిమిత సంఖ్యలో కూడి మాట్లాడుకొనే ప్రసంగాలు ఒక రకమైతే, వేదికలపై నిలిచి చేసే ప్రసంగాలు ఉపన్యాసాలు మరొక రకం. అన్ని రకాలకూ ఆదర్శప్రాయమైన ఉదాహరణలు ఉద్యోగపర్వంలో లభిస్తాయి. ఈ అంశాన్ని కీ.శే.నండూరి బంగారయ్యగారి మాటలలో గమనిద్దాం.

"ఈనాడు పార్లమెంటరీ చర్చలలో నేమి, సమర ప్రచారమున నేమి, ఎలక్షనులలో నేమి, వక్తృత్వమున కొక ప్రత్యేక గౌరవమున్నది. దీని నొక కళగా నభ్యసించి యారాధించుచున్నాము. ఉపన్యాసము నెట్లు మొదలు పెట్టవలెనో క్రమముగా ప్రతిపాద్య విషయము నెట్లు విపులీకరించుకొనవలయునో ఈ యంశముల నన్నిటిని జాగరూకతతో కృషి చేసి సాధించుచున్నాము. భారతములో గూడ "సభలో నెట్లుపన్యసింప వలయును" అను ప్రశ్నకు సమాధానము లభ్యమగుచున్నది.

క. మనమునకుఁ బ్రియంబును హిత । మును బథ్యము తథ్యమును నమోఘము మధురం
బును బరిమితమును నగుపలు । కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్.

ఈ గుణము లన్నింటికి లక్ష్య భూతములు కాదగియున్నవి సంజయ శ్రీకృష్ణుల యుపన్యాసములు. వాక్యోపవాక్యముల నిర్మాణమునందును, విషయ విభాగము నందును, వస్తు ప్రదర్శన శక్తియందును, నివి ప్రత్యేకముగా బరిశోధనార్హములు, ఉపన్యాసకళకు ఆదర్శముగ గ్రహించి వీని నారాధించినను నారాధింపవచ్చును." (పుట 158)

3. "ఈ యుద్యోగ పర్వమును బఠించుచుండగ నీనాటి యుద్ధ సన్నాహములు, ఈనాటి కపట ప్రచారములు, ఈనాటి యుపన్యాస నైపుణ్యము లన్నియు ప్రత్యక్ష మగుచుండును. అందుచేతనే ఈ పర్వము మన కింత యామోదదాయకముగ నున్నది."

"ఇందలి (**Repartee**) సమాధాన నైపుణ్యమొకటి ప్రత్యేకముగా గణనీయము. ఎదుటివారి మనస్సులోని కౌటిల్యములను వారి వాక్కులలోని నక్కవినయములను గ్రహించి వాత పెట్టినట్లుగ సమాధానమిచ్చుట పలు తావుల గనవచ్చుచున్నది.

క. 'అనుజులు నీవును ద్రోవది । యును బుత్త్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁగారయఁ బుత్తెం । చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్'. **(ఉద్యో. 1.274)**

అని సంజయుడు ధృతరాష్ట్రుని పక్షమున పాండవుల క్షేమము విచారింపగా దానికి ధర్మరాజిచ్చిన సమాధానము.

క. 'ఆరాజు మాదెసంగల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్.' **(ఉద్యో. 1.276)**

దీనిలోని భావమును సంజయుడు గ్రహింపక పోలేదు. మరల నీ యంశమును గూర్చి ధృతరాష్ట్రునితో ముచ్చటింప వలసి వచ్చినపుడు

క. 'వా రెల్లను భవదీయ । స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నారమని పలుకుదురు; నిజ । మారయఁగా నట్లగాదె యది జననాథా!' **(ఉద్యో. 2.6)**

అని వ్యాఖ్యానించుచున్నాడు.

సంజయుని దుర్యోధనాదుల కుశలము నడుగుటలో ధర్మరాజు నిష్ఠురము నెంతో నిపుణముగ బ్రయోగించుచున్నాడు (ఆ.2.ప.277-281) అతని వాక్య విజృంభణము నంతను సంజయు డొక్కమాటలో గట్టివేయుచున్నాడు.

క. 'పొం దొందఁగ దలఁచితి వీ । విందుశిశిరమైన విమల హృదయంబున వా
రందఱకును సేమం బిట । ముందఱ లేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్'. **(ఉద్యో. 1.283)**

కొన్ని కొన్ని స్వల్పాంశములను బెద్దగ కొనియాడుటయు, ప్రధానాంశమును దాచి పెట్టుటయు నిప్పటికి అప్పటి సామాన్య ధర్మమే.

ఉ. 'శాంతత బొంది కార్యము దెసన్ ధృతరాష్ట్రమహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేఱి న న్నిటఁ బ్రియంబునఁ బంపెడునప్డు నాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్నఁబంచె; ని
ట్లింత ఘటించెఁ బొందు; మన మీ పదనం దెలివొందఁగాఁ దగున్'. **(ఉద్యో. 1.293)**

ధృతరాష్ట్రుడు పాండవులకడకు బోవుచున్న సంజయుని రథమును స్వయముగ బన్నించినాడట. ఇదియొక గొప్పగ నాతడు గొనియాడుచున్నాడు. కాని పాలిచ్చుట గూర్చి యేమియు బలుకడు. అంతస్సారము శూన్యమైన ఈ యుపన్యాసము నొక్కమాటలో వాసుదేవుడు ఖండించుచున్నాడు.

క. 'ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁదీపులుగా
వీరు దమపాలు వడయక । నేరిమి మాటలనె తీరనేర్తురె చెపుమా?' **(ఉద్యో. 1.340)**

అసలు విషయమును గప్పిపుచ్చి అప్రధాన విషయములకు బ్రాధాన్యమిచ్చి మాటలాడుటయు నీ దొంగతనమును బట్టుకొని యెదిరి వారల్లరి చేయుటయు నేడే కాదు, నాడు గూడ గన వచ్చుచున్నది. దానినే మా ప్రాంతములలో నరచేతిలో తేనెవేసి మోచేతి వరకు నాకించుట యని వ్యవహరింతురు. ఈ నైపుణ్యమంతయు ప్రదర్శనశక్తిలోనే చేరును.

సంప్రదింపు సభలలోని ప్రసంగములలో పైగుణములు మాత్రమేగాక యిప్పటి **Symposiums** లోను పార్లమెంటరీ డిబేట్సులోను గానవచ్చు చర్చా నైపుణ్యము, ఒక మతమువా రిచ్చిన యుపన్యాసములోని ఒక్కొక్క యంశమునే గైకొని వరుసగా సమాధానమిచ్చు క్రమప్రకారమును ఇందు గానవచ్చుచున్నది. భారతము నందలి యుపన్యాసములను పరిశోధించినపుడు వాక్యోపవాక్యముల తార్కిక క్రమము (**Logical sequence**) లోగాని, అలంకారశోభ (**Rhetoric**) లోగాని, సమష్టియై గనవచ్చు స్నిగ్ధతాసంసిద్ధి (**Total finish**) లోగాని, విమర్శనాశక్తిలోగాని, వ్యాఖ్యాన పాటవములోగాని, సమాధాన నైపుణ్యములోగాని వక్తృత్వము ఎంతో యభివృద్ధినందిన దనుకొనుచున్న యీనాటి యుత్తమోపన్యాసముల కేమాత్రము దీసిపోవు. లాయడ్ జార్జి-(**Lloyd George**), విన్‌స్టన్ చర్చిల్ (**Winston Churchill**) మున్నగు నాధునిక మహావక్తల యుద్ధ సమయములందలి యుపన్యాసములను గైకొని సంజయ శ్రీకృష్ణుల యుపన్యాసములతో బోల్చి చూచినచో మనము భారతీయులమను పక్షపాత బుద్ధిని దూరముగా నుంచి విమర్శించినను కడపటివారిదే పైచేయియని నిర్ణయింపక తప్పదు.

శిల్ప విధానము (**Technique**) స్థూలదృష్టి కించుమించుగా నొక్కటిగానే కానవచ్చుచున్నను వ్యక్తుల తారతమ్యమును బట్టి వానిలో సూక్ష్మ వ్యత్యాస మేర్పడకపోదు. ఏ కళయైనను సరే కావ్య రచనయే కానిండు. ఉపన్యాస ప్రధానమే కానిండు, విమర్శనమే కానిండు వ్యక్తుల యనుభావముపై (**personality**) గాఢముగ నాధారపడియుండును. శ్రీకృష్ణుని యనుభావము వేరుగ వివరించి చెప్పనక్కరలేదు. ఇక సంజయుడు కూడ సామాన్య వ్యక్తి కాడు. జీవన్ముక్తుడై ఈశ్వర సాక్షాత్కృతి నందిన మహాపురుషుడు. (ద్వి. ఆ.319, 320) అందుచే వ్యక్తిగతమైన యీతని యనుభావమంతయు నాతని ప్రసంగములలో ప్రతిబింబించుచున్నది. కార్యమెట్లయినను సంఘటింపవలెను. నుదారభావముతో బాండవుల కడకు వచ్చినపుడు కౌరవుల పక్షమున మాటలాడినాడే కాని నిజమున కాతనికున్న ధర్మోత్సాహ మపారము. ఇది కౌరవుల సభలో పాండవుల కడ నడచిన వృత్తాంతమును గూర్చి యాతడు చేసిన నివేదనములో ప్రత్యక్షమగుచున్నది. సంజయ శ్రీకృష్ణులకున్న మాహాత్మ్యమును ధర్మోత్సాహమును వారి యుపన్యాసములకు నుజ్జ్వలమైన శక్తిని ప్రసాదించుచున్నవి. అతీత భూముల నుండియు, సమదర్శనము నుండియు నుదయించువారి యుపన్యాసములలో సంచరించు దివ్యశక్తి స్వార్థ పరత్వము తోడను, హింసాపంకిలమైన యుద్రేకము తోడను నాడిన లాయడ్ జార్జి, చర్చిల్ మున్నగు వక్తల సమరోపన్యాసములలో నెట్లు ప్రత్యక్షము కాగలదు? కొంత కాలమునకు పూర్వము జాతీయత (**Nationalism**) అనగా నేదో మహోన్నతమైన యాదర్శముగా గౌరవించుచుండిరి. కాని రెండు ప్రపంచ మహాసంగ్రామములు చెలరేగి దాని గుట్టు నంతను బయట పెట్టినవిగదా?'' (పుటలు 163-166).

(1). ఉపన్యాస శిల్పం

పాండవ కౌరవ పక్షాలలో ప్రసిద్ధులైనవారందరూ ఉద్యోగపర్వంలో ఆయా సందర్భాలలో ఏదో రకంగా ఉపన్యసిస్తారు. కథ యుద్ధం వైపు నడుస్తున్నది కాబట్టి దానికి ఉన్ముఖంగా ఒకవైపు. ఉపశమనాత్మకంగా మరోవైపు తర్కబద్ధమైన వాక్య

సముదాయంతో స్వీయ తాత్పర్య ప్రతిపాదనం చేయడానికి పాత్రలు ప్రయత్నిస్తాయి. సత్య ప్రతిపాదన లక్ష్యంతో సాగే ఉపన్యాసానికి తర్కం అంతస్సూత్రం. ఎవరి తర్కం వారిదిగా కనబడుతున్న పాత్రల ఉపన్యాసాలలోనూ, ప్రసంగాలలోనూ తర్కశాస్త్ర ప్రమాణాలు ప్రతిఫలిస్తూనే ఉంటాయి. రాజనీతిశాస్త్రానికి అనుగుణమైన తర్కశాస్త్ర మర్యాదలు తొణికిసలాడుతూ ఉంటాయి. వాటిని వివిధ వాక్య విన్యాసాలలో ఉపన్యాస శిల్పంగా వెలువరించిన తిక్కన ప్రజ్ఞ ఉద్యోగపర్వానికి సాహిత్యోపాయనంగా లభించింది. రాజనీతిశాస్త్ర దృక్పథంతోకాని, తర్కశాస్త్ర దృక్పథంతోకాని ఉద్యోగపర్వాన్ని విస్తృతంగా వ్యాఖ్యానించవచ్చును. కాని, ఇక్కడ స్థాలీపులాక న్యాయంగా సమీక్షించటానికే వీలౌతుంది.

ప్రతిపాద్యాంశానికి లక్షణ పరిష్కారం చేస్తూ పదార్థ స్వరూప స్వభావాలను విశదీకరించడం తర్కశాస్త్ర పద్ధతి. తర్కం వాదాన్ని ఆశ్రయించి సాగుతుంది. అందువలన తర్కశాస్త్ర పద్ధతి వాదశైలి మీద ప్రధానంగా ఆధారపడిఉంటుంది. ఒక చిన్న విషయాన్నికానీ, ఒక పెద్ద విషయాన్నికానీ ఎంతగా విపులీకరిస్తే బాగుంటుందో, ఎంత సంగ్రహంగా చెబితే సరిపోతుందో వక్త తన వాదవిధానంలో నిర్ణయించుకొంటాడు. వాదంలో ప్రమాణం ఉండాలి. హేతువుండాలి. వాటిని ప్రయోగించే శక్తియుక్తులుండాలి. ఉద్యోగపర్వంలోని నాయక పక్షంలోని పాత్రలు హేతుబద్ధంగా మాట్లాడుతాయి. దుర్యోధనాదులు హేత్వాభాసను అమితంగా ఆశ్రయిస్తారు. ఈ భేదం వారి ప్రసంగాలలో ఉపన్యాసాలలో స్పష్టంగా కనబడుతుంది.

స్థూలంగా పరిశీలిస్తే ఉద్యోగపర్వంలోని దూతలు చేసే ఉపన్యాసాలు మూడు. వాటిలో ద్రుపద పురోహితుడి ఉపన్యాసం ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆశ్రయించి సాగుతుంది. సంజయుడి రాయబారపు ప్రసంగం అనుమాన ప్రమాణం ప్రాతిపదికగా ప్రవర్తిల్లుతుంది. శ్రీకృష్ణుడి ఉపన్యాసాలు ఆప్తవాక్య ప్రమాణ ప్రాతిపదికగా ప్రకాశిస్తాయి. విశేషమేమంటే పంచపాండవులు, ద్రౌపది చేసే ఉపన్యాసాలలో జంటలు జంటలుగా ఒక్కొక్క ప్రమాణాన్ని ఆశ్రయించుకొని మాట్లాడుతారు. ఉదాహరణకు ద్రౌపది, సహదేవుడు ప్రత్యక్ష ప్రమాణవాదులు. భీముడు, అర్జునుడు అనుమాన ప్రమాణవాదులు. ధర్మజుడు, నకులుడు శబ్ద ప్రమాణవాదులు. ఈ విధంగా పాండవ పక్షం సాగించే ఉద్యోగపర్వకథాఘట్టం తర్కశాస్త్రజ్ఞులు తర్కశాస్త్రమని కీర్తించే విధంగా సాగుతుంది.

కౌరవపక్షంలో విపరీత తర్కం విశేషంగా ప్రకటితమౌతుంది. వారి వాదనలలో హేత్వాభాసతో కూడిన వితండవాదం గోచరమౌతుంది. అందులోను దుర్యోధనుడు ప్రత్యక్ష ప్రతికూల ప్రమాణవాది; కర్ణాదులు విపరీత అనుమాన ప్రమాణవాదులు. ధృతరాష్ట్రుడు ఆప్తవాక్య ప్రతికూలవాది. వ్యాసాదులు ప్రత్యక్ష ప్రమాణవాదులు. భీష్మాదులు అనుమాన ప్రమాణవాదులు. విదురాదులు శబ్ద ప్రమాణవాదులు. ఈ విధంగా కౌరవపక్షంలో తర్కవితర్క హేతువాద శక్తుల పరస్పర వైరుద్ధ్య విలాసం ప్రకటితమౌతుంది. శాస్త్రం తెలిసిన వారు ఈ లోగుట్టులను విశ్లేషించుకొని ఉద్యోగపర్వంలోని ఉపన్యాసాలలో ప్రసంగాలలో ప్రదర్శితమయ్యే వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని తెలిసికొనగల్గుతారు. ఒకవేళ శాస్త్ర విశ్లేషణ తెలియకపోయినా అపూర్వ చమత్కార ప్రసంగ విన్యాసాల ప్రతిభా పరిమళాలను సహృదయులు ఆమోదించి సంతోషిస్తారు. సుప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్త రఘునాథ శిరోమణి,

> ''విదుషాం నివహై రిహైకమత్యాత్
> య దదుష్టం నిరటఙ్కి యచ్చ దుష్టమ్
> మయి జల్పతి కల్పనాధినాథే
> రఘునాథే మనుతాం తదన్యథైవ''   (తత్త్వచింతామణి, వ్యాఖ్యదీధితి, ఈశ్వరానుమానం చివర)

పండితులందరు కలసి నిర్దుష్టమని నిరూపించిన విషయాన్ని దుష్టంగానూ, వారు దుష్టమని నిరూపించినదాన్ని నిర్దుష్టంగానూ నిరూపించగలగటం తర్క పండితుడి ప్రజ్ఞ. ఉద్యోగపర్వంలో పాండవులు ఏది నిర్దుష్టమంటారో కౌరవులు

దాన్ని దుష్టమంటారు. పాండవులు దేన్ని దుష్టమని పేర్కొంటారో కౌరవులు దాన్ని నిర్దుష్టమని నిరూపిస్తారు. ఈ తార్కికవాదబలమే ఇన్ని ఉపన్యాసాలకూ, ప్రసంగాలకూ మూలకందమై నిలవటం ఈ పర్వంలోని విశేషం.

(2). ద్రుపద పురోహితుడు ప్రత్యక్ష ప్రమాణవాది

1. పురోహిత దౌత్యానికి ప్రాతిపదిక ఉపప్లావ్యంలో శ్రీకృష్ణాదులు నిశ్చయించిన వ్యూహం. వారు అందరు వ్యక్తం చేసిన భావాలను ప్రత్యక్ష ప్రమాణాలుగా గ్రహించి కౌరవసభలో ప్రతిపాదించటమే పురోహితుడి కర్తవ్యం.

2. జరిగిన కథను ప్రత్యక్ష ప్రమాణంతో పూసగ్రుచ్చినట్లుగా చెప్పి కౌరవుల దుర్ణయాన్ని సభలో బట్టబయలు చేయటమే ఇతడి ఉపన్యాస ఆరంభ శిల్పం. ఉద్యోగపర్వంలోని ప్రథమాశ్వాసంలో 231వ పద్యం నుండి 241వ పద్యం వరకు సాగించిన అతడి ఉపన్యాసం వాస్తవాన్ని సమీక్షించి అవినీతిని నిందించి శ్రేయస్సును బోధించే సత్యప్రతిపాదన స్వభావం కలిగిన వాక్యజాతం. నిజాల నిప్పులను వెదజల్లినట్లు అతడి మాటలు నిష్ఠురంగానే ఉంటాయి. ఇది ప్రత్యక్ష ప్రమాణవాది ప్రసంగ స్వభావం. ఇదే స్వభావం సహదేవుడి వాక్యాలలో ద్రౌపది ఉపన్యాసంలో గోచరిస్తుంది. ప్రత్యక్ష ప్రమాణవాదుల ఉపన్యాస సంభాషణ శిల్పంలో ఒక సమాంతర రచనా శిల్పాన్ని తిక్కన పోషించాడు. ఇక వైవిధ్య దృష్టితో పరిశీలిస్తే బ్రాహ్మణవాక్యం నిర్వికారమైన నిష్ఠుర సత్యం. సహదేవుడి ప్రసంగం సాభిమాన సత్యావేశం. ద్రౌపది ఉద్వేగపూరిత ఉపన్యాసం ప్రత్యక్ష ప్రమాణాల నాధారంగా చేసికొని సాగిన రోషావేశపూరితమైన నిష్ఠుర ప్రసంగం. ప్రత్యక్షవాదుల వాక్యాలలో నిజాలతో కూడిన నిష్ఠురత నిండి ఉండటం వారి ఉపన్యాస శిల్పమని తిక్కన నిష్కర్ష.

(3). సంజయుడు అనుమాన ప్రమాణవాది

''అనుమితి కరణం అనుమానం పరామర్శ జన్యం జ్ఞానమ్ అనుమితిః''. (తర్కసంగ్రహం పుట.57).

అనుమితి అనే యథార్థ అనుభవానికి అసాధారణ కారణమైనది అనుమానం. పరామర్శ వలన కలిగే జ్ఞానం అనుమితి అనబడుతుంది. తెలిసిన దానితో తెలియని మరో దానిని ఊహించటంలో తోడ్పడేది హేతువు. హేతువుకూ సాధ్యానికీ అవినాభావ సంబంధం ఉన్నప్పుడే కార్యం సాధించబడుతుంది. దానినే వ్యాప్తి అంటారు. దీనిని ధృతరాష్ట్రపరంగా, ధర్మరాజుపరంగా అన్వయించవచ్చును. ధృతరాష్ట్రుడు పురోహితుడి సందేశం వలన పాండవులు యుద్ధ ప్రయత్నంలో ఉన్నారనీ, ధర్మరాజు క్రోధమూర్తి అయి ఉన్నాడనీ తెలిసికొన్నాడు. ''యత్ర యత్ర ధూమ స్తత్ర తత్ర అగ్నిః'' అనే హేతువును పురస్కరించుకొని ద్రుపద పురోహితుడి వాక్యాలు ధూమరాశిగా భావించి ధర్మజుడి కోపమనే అగ్నిని ధృతరాష్ట్రుడు అనుమానించాడు. దానిని ఆర్పటానికి చేసే విశిష్ట రాజనీతి యత్నమే సంజయుడి రాయబారం. అనుమానం రెండు విధాలు. 1.స్వార్థానుమానం. 2.పరార్థానుమానం. తనకు స్వయంగా కల్గిన అనుమితికి కారణమైన అనుమానం స్వార్థానుమానం. ధృతరాష్ట్రుడు మంత్రులకు, హితులకు చెప్పకుండా ధర్మరాజును శాంతపరిస్తే అతడి క్రోధం వలన కలుగబోయే యుద్ధం సమసిపోతుందని భావించాడు. ఈ స్వార్థానుమానాన్ని సంజయుడి ద్వారా పరార్థానుమానంగా పరివర్తింపజేశాడు. పొగవలన అగ్ని ఉంటుందని నిశ్చయించుకొన్నవాడు తన వెంటనున్న మిత్రుడికి ఆ నిశ్చయాన్ని కల్గించడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా ధర్మజుడి క్రోధోపశాంతి కోసం దూతగా సంజయుడిని పంపుతాడు. ఇందులో ప్రధానంగా ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, నిగమనం అనే అయిదు అంగాలు ప్రయోగించబడుతూ ఉంటాయి. సంజయుడి రాయబారంలో తిక్కన ఈ అయిదంగాలనూ నిపుణంగా ప్రయోగించాడు. సంజయుడి రాయబారపు ఉపన్యాసంలో ఉన్న సంవిధానశిల్ప మిదే. స్వార్థానుమితి పరార్థానుమితులకు పరామర్శయే ప్రధాన స్వభావం. అందువలన సంజయుడి వాక్యాలలో పరామర్శయే ఉంటుంది కాని మరే పరమార్థ సాధనమూ ఉండదు. ఈ విషయాన్ని గమనించిన ధర్మరాజు

క. 'ఆ రాజు మాదెసం గల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్.' (ఉద్యో. 1.276)

అని ఎత్తిపొడిచాడు. జనార్దనుడు కూడ జంకు గొంకు లేకుండ ఈ విధంగా ఎత్తిపొడిచాడు.

క. 'ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁదీపులు గా
వీరు దమపాలు వడయక । నేరిమి మాటలన తీర నేర్తురె చెపుమా!' (ఉద్యో. 1.340)

సంజయుడి రాయబారాన్ని సమగ్రంగా సమీక్షిస్తే స్వార్థపరార్థ అనుమానాలు రాజనీతిపరమైన సామోపాయాన్ని ఆశ్రయించి లక్ష్యాన్ని సాధించటానికి ప్రయత్నించాయి. కాని, హేతుఫలసిద్ధి దానికి లేకపోవటంచేత అవి హేత్వాభాసంగా మిగిలిపోయాయి. నిశ్చయించబడిన సాధ్యం కల కార్యం స్వపక్షం అనబడుతుంది. నిశ్చిత సాధ్యాభావం కలది విపక్షం అనబడుతుంది. ధృతరాష్ట్రుడు స్వపక్షంగా ప్రారంభించినా సంజయుడి రాయబారం విపక్షంగా ముగిసింది.

ధర్మరాజాదులు కూడ సంజయుడి రాయబారం వలన రాజ్యప్రాప్తి సాధ్యమౌతుందని భావించారు. చివరకు సంజయుడు పొగ కాదనీ, రాజ్యప్రాప్తి అనే అగ్ని అనుమానించబడినా అది విపక్షమైపోయిందని తెలిసికొన్నారు. అనుమాన ప్రమాణాలతో సాగిన సంజయుడి రాయబారపుఘట్టం సఫలమౌతుందన్న ఆశతో మొదలై విఫలం కావటంతో ముగియటం వలన ఏర్పడిన పరామర్శ రూపమైన సంభాషణల చమత్కారం వైరుధ్య శిల్పంతో పోటాపోటీగా ఈ ఘట్టంలో రాణిస్తుంది. ఇది ఇందులోని వైచిత్ర్యం. ఇందులో మరొక విశేషమున్నది. సంధికార్యం వలన యుద్ధనీతిని శాస్త్రోక్తంగా ప్రదర్శించవచ్చునని భావించినా, ధర్మరాజు ఉపన్యాసం భీమార్జునులకు రుచించకపోయినా దానిని పరామర్శిస్తూ అంగీకరించారు. అందులో ధర్మజుడి స్వార్థానుమానం భీమార్జునులలో పరార్థానుమానంగా ప్రకాశించింది. దానివలన భీమార్జునులతో శ్రీకృష్ణుడు చేసిన సంభాషణలు చమత్కారవంతంగానూ రమ్యగంభీరంగానూ ఉండగల్గాయి. ఈ విధంగా స్వార్థానుమితి పరార్థానుమితిగా వ్యాపించి విపక్షంగా పరిణమించే ఘట్టంలోని పరామర్శ వాక్య చమత్కారాలకు ఉద్యోగపర్వం ఉదాత్త ఉదాహరణంగా నిలుస్తున్నది.

(4). శ్రీకృష్ణుడు ఆప్తవాక్యప్రమాణవాది

'ఆప్తవాక్యమ్ శబ్దః' 'ఆప్తస్తు యథార్థవక్తా' అని తర్క సంగ్రహం. ఆప్తుడి మాట శబ్ద ప్రమాణం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవాడు ఆప్తుడు. పాండవులకు అన్ని విధాలా ఆప్తుడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడి వాక్యమే పాండవులకు వేదవాక్యమని ధర్మరాజు సంజయుడి ముందు ప్రకటించాడు. "వాక్యమ్ ద్వివిధమ్, వైదికమ్ లౌకికం చేతి వైదిక మీశ్వరోక్తత్వాత్ సర్వమపి ప్రమాణమ్. లౌకికంతు ఆప్తోక్తం ప్రమాణమ్, అన్యదప్రమాణమ్" అని తర్క సంగ్రహం. శ్రీకృష్ణుడు దివ్యాదివ్యుడుగా పాండవులకు ఆప్తుడైనాడు. కృష్ణుడి వాక్యం పాండవులకు ఈశ్వరవాక్యం, ఆప్తవాక్యం కూడ. ఈ ఉభయ ప్రవృత్తులు ఉద్యోగపర్వంలోని శ్రీకృష్ణుడి ప్రసంగాలలో, ఉపన్యాసాలలో ప్రకటితమౌతూ ఉంటాయి. ఆ పాత్రలోని వాక్య చమత్కారమంతా ద్వివిధ వాక్య ప్రమాణాశ్రితమైన సంభాషణల మీదనే ఆధారపడి ఉన్నది. దీనిని సాంగంగా ఆవిష్కరించటమే శ్రీకృష్ణపాత్రలోని అంతరార్థం.

కౌరవసభలో శ్రీకృష్ణుడు చేసిన ఉపన్యాసం ఆప్తవాక్య ప్రమాణంతోనే చేసే తార్కిక వాక్య విన్యాసానికి చక్కని తార్కాణం. ఎత్తుగడయే దాన్ని ధ్వనింపజేస్తున్నది.

క. 'జననాథ! నీ యెఱుంగని । పనులు గలవె? యైనఁ దగవుఁ బరమ హితంబుం
దనవారికిఁ జెప్పన తగు । నని వచ్చితి భారతాన్వయము ప్రియ మొందన్.' (ఉద్యో. 3.257)

ఈ పద్యం ప్రత్యక్షర సార్థకం. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడికి బంధువు కావచ్చును కాని, నిండుకొలువులో ఆయనను జననాథుడి గనే భావించి సంబోధిస్తున్నాడు. శ్రీకృష్ణుడు వచ్చిన కార్యం జనహితానికి సంబంధించినది. జనహితం తెలిసిన వాడే జననాథుడు. అందువలన ధృతరాష్ట్రుడు ధర్మస్వరూపం తెలిసినవాడు అయిన జ్ఞాని అయి ఉండాలి. అట్టి జ్ఞానం కలవాడై ఉండాలని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. 'నీ యెఱుంగని పనులు గలవె' అని గౌరవంగా మెచ్చుకోలు మాటతో అతడి మనసును మెత్తపరిచాడు. తెలిసినవాడికి తెలియచెప్పవలసిన అవసరమేముంటుంది? ఐనా శ్రీకృష్ణుడు పరమహితాన్ని కోరి భరతాన్వయం ప్రీతి పొందేటట్లు ఆప్తవాక్యాన్ని పలకటానికి వచ్చాడు. శ్రీకృష్ణుడి ఉపన్యాసం ఆప్తవాక్యమని తాత్పర్యం.

'ఆకాంక్షా యోగ్యతా సన్నిధిశ్చ వాక్యార్థ జ్ఞానహేతుః
పదస్య పదాంతర వ్యతిరేక ప్రయుక్తాన్వయాననుభావకత్వ మాకాంక్షా.'

అని వాక్యలక్షణాన్ని లాక్షణికులు చెప్పారు. వాక్యం ఆకాంక్షాదులతో కూడుకొని ఉంటుంది. అది ఒక వాక్యం కావచ్చును. ఒక తాత్పర్యాన్ని ప్రదర్శించే సంభాషణ కావచ్చును. ఉపన్యాసం కావచ్చును. చివరకు కావ్యమూ కావచ్చును. ఇక్కడ శ్రీకృష్ణుడి ఉపన్యాసం సలక్షణమైన వాక్యం.

వాక్యంలో ఉండవలసిన మొదటి లక్షణం ఆకాంక్ష. ఆకాంక్ష అంటే ఎందుకు? ఏమిటి? మొదలైన ప్రశ్నలతో జిజ్ఞాసను రేపి వాక్య తాత్పర్యాన్ని గ్రహించాలన్న ఉత్కంఠను కల్గించటం. శ్రీకృష్ణుడి ఉపన్యాసం ఆప్తవాక్యంగా ఆరంభమౌతూండగానే ఆతడు చెప్పబోయే తాత్పర్యాన్ని గురించి పై పద్యం శ్రోతలలో ఒక ప్రామాణిక భావాన్ని ప్రకటిస్తూ, ఆయన చెప్పబోయే ప్రతి మాటను అవధానంతో వినాలి అనే ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

''అర్థాబాధా యోగ్యతా'' అని యోగ్యత లక్షణం. శ్రీకృష్ణుడు చెప్పదలచుకొన్న పరమ తాత్పర్యానికి బాధ కలుగకుండా అర్థవివరణం చేయటం ఆప్తవాక్యంలోని యోగ్యత. ప్రతిపాదనం, వివరణం, వివేచనం, విమర్శనం, సంస్థాపనం అని యోగ్యతకు ఐదు లక్షణాలు భాసిస్తాయి.

క. 'క్షీరోదక గతిఁ బాండవ । కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము; వారన । వీరనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే?' **(ఉద్యో. 3.258)**

శ్రీకృష్ణుడి ఉపన్యాసంలో ప్రతిపాదించబడుతున్న ప్రధాన తాత్పర్యమిదే. దానిని మూడు వాక్యాలతో ముడిపెట్టి ప్రతిపాదించాడు శ్రీకృష్ణుడు. 1. పాండవ కౌరవులు పాలు నీరువలె కలిసి ఉండటం ఈ ఆప్త వాక్యం సాధించే పరమార్థం. 2. ఆ పరమార్థాన్ని ధృతరాష్ట్రుడు లెస్సగా అమలు చేయటం. 3.పాండవ కౌరవులందరూ పెరవారనీ, తన వారనీ భావించకుండా ప్రవర్తించేటట్లు చూడటం వలన కురుముఖ్యుడుగా ధృతరాష్ట్రుడు తన బాధ్యతను నిర్వర్తించడం. శ్రీకృష్ణుడు చెప్పబోయే ఆప్తవాక్యంలోని ప్రతిపాద్యాంశం ఇదే.

కురుముఖ్యా! అని సంబోధించిన శ్రీకృష్ణుడు కౌరవ వంశ శ్రేష్ఠుడుగా చేయవలసిన కర్తవ్యాన్ని మొదట వివరించాడు.

చ. 'భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గియుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీయనుఁగుఁ దమ్ముఁడు నీ తనయుల్ యశోధురం
ధరశుభశీలు; రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్పనేటికిన్?' **(ఉద్యో. 3.259)**

అప్పుడైన శ్రీకృష్ణుడు ఏదో ఒక పక్షాన్ని వహించకుండా వంశక్షేమాన్ని భావించటం విశేషం. వంశ క్షేమం ఆరు గుణాల మీద ఆధారపడి ఉన్నది. ధర్మాన్ని తెలిసికొనటం, న్యాయంగా వ్యవహరించటం, సత్యం తప్పకుండా ఉండటం, కలిసి మెలిసి ఉండే మైత్రిని పెంపొందించుకొనటం, అభ్యుదయాన్ని కోరటం, ప్రజలయందు కరుణభావాన్ని కలిగి ఉండటం, ఈ గుణాలను ధృతరాష్ట్ర పాండురాజుల తరం వరకూ ప్రభువులు పోషించుకొంటూ వచ్చారు. దాన్ని ధృతరాష్ట్రుడు భగ్నం చేయకుండా పాండవ కౌరవులు కలిసి ఉండేటట్లు చూడటం ధర్మం. పాండవులకు రావలసిన రాజ్యభాగం ఇవ్వటం న్యాయం. ఇదివరలో ధృతరాష్ట్రుడే పాండవుల కిచ్చిన మాట ప్రకారం పాండవ రాజ్యభాగాన్ని ఇచ్చి మన్నించటం సత్యం. పాండవ కౌరవుల మధ్య యుద్ధం రాకుండా వంశనాశనం కలగకుండా మైత్రిని పెంపొందించటం సాధించవలసిన పొత్తు. పాండవులు, కౌరవులు కలిసి ఉంటే వంశం బలోపేతంగా వర్ధిల్లుతుంది. ఈ అయిదు అంశాలు ఆచరణలోకి రావాలంటే ధృతరాష్ట్రుడు స్వార్థాన్నీ, కాపట్యాన్నీ, క్రౌర్యాన్నీ మాని కరుణ భావాన్ని ప్రదర్శించాలి. శ్రీకృష్ణుడు పలికిన ఈ మాటలలో కార్యాన్ని సాధించే వివరణం సూచించబడింది కాబట్టి ఆప్త వాక్యంలోని వివరణాంశ మిది.

వివరణం తరువాత శ్రీకృష్ణుడు నిపుణంగా వివేచనంతో విషయ విజ్ఞానాన్ని ధృతరాష్ట్రుడికి నివేదించాడు.

"ఈ వంశంబున కెల్ల నీవ కుదురు" అనే పద్యంలో పాండవ కౌరవులు కలిసి ఉండే కార్యాన్నీ తీర్చదగిన బాధ్యత వంశానికెల్లా కుదురైన ధృతరాష్ట్రుడిదే అని స్పష్టం చేశాడు. ఎవరికి మేలు జరిగినా, కీడు జరిగినా నిజానికి నష్టపోయేది ధృతరాష్ట్రుడేనని తేల్చి చెప్పాడు. బాగుపడదలచుకొంటే సద్భావంతో సమస్యను ఆలోచించుమన్నాడు. సద్భావమంటే త్రికరణశుద్ధి మనసులో పొత్తును కోరాలి. మాటలలో అది వెలువడాలి. చర్యలో అది కనబడాలి. ఈ మూడింటినీ ఏకం చేసి వంశాన్ని నిలుపుమని శ్రీకృష్ణుడు వివేచనాత్మకమైన వివేకాన్ని అందించాడు.

వివేచనాన్ని విన్న తరువాత ధృతరాష్ట్రుడికి యథార్థజ్ఞానం కలగాలి. అది కలగటానికి మూడు అవరోధాలు ఏర్పడవచ్చును.

"అయథార్థానుభవ స్త్రివిధః, సంశయ విపర్యయ తర్కభేదాత్" అని తర్క సంగ్రహం. అయథార్థానుభవం మూడు రకాలు. 1.సంశయం 2.విపర్యయం. 3.తర్కం. విరుద్ధములైన అనేక అంశాలను అన్వయించుకొని అవగాహన కలిగించే జ్ఞానం లేకపోవటం సంశయం. దానిని తొలగించటం ఆప్తవాక్యంలోని ఒక ముఖ్యలక్షణం.

'వినుము సుయోధనాదులగు వీరు సధర్ములుగాక...' 'కౌరవ పాండవుల్ తెఱఁగుఁ గైకొని శాంతతఁ బొందియున్కిమేల్' 'నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు నధిప' 'అందు వృకోదరార్జునుల...' 'జగతిఁ గల జనపతులు నీ చరణపీఠ మర్థిఁ గొలువ...' అనే పద్యాలలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి మనసులోని సంశయాలు తొలగిపోయేటట్లు సవిమర్శంగా మాట్లాడాడు. 'మిథ్యాజ్ఞానం విపర్యయమ్' అని విపర్యయానికి లక్షణం. విపర్యయాన్ని తొలగించటం ఆప్తవాక్య లక్షణం. ఆప్తవాక్యాన్ని గ్రహించటానికి అడ్డం పడే అవగుణం విపర్యయం. అది ధృతరాష్ట్రుడిలో పుష్కలంగా ఉన్నది. దానివలన అతడు సంకట పరిస్థితులలోబడి, ధర్మనిర్ణయాన్ని చేయలేక ఉపేక్షాభావాన్ని ప్రదర్శిస్తాడు. 'అనయము పుట్టె జూదమున యప్పుడ యంతయుఁ జిచ్చువెట్టి కాల్చినయది నీ యుపేక్షయ' (ఉద్యో. 2.14) అని సంజయుడు ఇదివరలోనే ఈ అంశాన్ని ధృతరాష్ట్రుడి మొగాన చెప్పాడు. ఇప్పుడు శ్రీకృష్ణుడు

క. 'నరనాథ! నీ వుపేక్షా । పరుఁడ వయినఁ గౌరవులక పాండవులక కా
దరయఁగ భూప్రజ కెల్లను । దురితం బొనరించినట్ల; తుదిఁ గీడు సుమీ!' **(ఉద్యో. 3.266)**

అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పి మిథ్యాజ్ఞానాన్ని తొలగించప్రయత్నించాడు. ఆ తరువాత తాను చెప్పదలచుకొన్న తాత్పర్యానికి అనుకూలమైన తర్కాన్ని సునిశితంగా ప్రదర్శించాడు. "వ్యాప్యారోపేణ వ్యాపకారోప స్తర్కః" అని తర్కాన్ని నిర్వచించింది తర్కసంగ్రహం. వ్యాప్యముంటే వ్యాపకమూ ఉండేది అనే ఆరోపం తర్కం. ఈ అంశానికి చక్కని ఉదాహరణలు-

క. 'కౌరవ పాండవులం దెవ్వారలకున్ జావు నొవ్వు వచ్చిన....'

ఉ. 'వీరును వారుఁ బండితులు...'

ఆ. 'అట్లుగాక యుండ నీ రెండు తెఱఁగుల...' **(ఉద్యో. 3.267,268,269)**

ఈ మూడు పద్యాలు శ్రీకృష్ణుడు ప్రతిపాదించ దలచుకొన్న ఉపన్యాస ఫలితాంశానికి తర్కబద్ధమైన జిజ్ఞాసను కల్పించేవి. అంతటి వీరులూ, పండితులూ అయినవారు యుద్ధంలో చనిపోతే ఎంత దారుణమో ఊహించుకొమ్మని చెప్పటం ఇక్కడ తర్కం. దానివలన మిథ్యాజ్ఞానం తొలగి యథార్థ జ్ఞానం ఏర్పడుతుంది.

వాక్యానికి వన్నె తెచ్చేది సన్నిధి. ''పదానా మవిలంబేనోచ్చారణం సన్నిధిః'' అని తర్కసంగ్రహం. విలంబనం లేకుండా వాక్యంలోనే వివిధాంశాలను చెప్పటం సన్నిధి. శ్రీకృష్ణుడి ఉపన్యాసంలో-

తే. 'పాండవులు దండ్రి సచ్చిన ప్రజలు వారి । నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ;
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె? । పారమొందంగ రక్షింపు గారవమున.' **(ఉద్యో. 3.271)**

ఈ పద్యం శ్రీకృష్ణుడి ఉపన్యాసంలోని అంశాలనన్నింటినీ అవిలంబంగా అన్వయించుకొనే తాత్పర్యానికి చక్కని అభివ్యక్తి. అంతే కాదు ధర్మరాజు శ్రీకృష్ణుడిని రాయబారిగా వెళ్ళుమని ప్రార్థిస్తూ

'ఆపద కడవం బెట్టఁగ నోపి... మాకీ పుట్టువునకుఁ బాండుక్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా!' అని పలికిన మాటలు ఇక్కడ అన్వయిస్తాయి. దీనిని కావ్య వాక్యార్థ సన్నిధి అని కూడ అనవచ్చును. పాండురాజు చనిపోతూ పాండవుల యోగక్షేమాలు చూడుమని ఎవరినీ ప్రార్థించలేదు. కాని, తండ్రి తరువాత తండ్రి అంతటి వాడు ధృతరాష్ట్రుడా? శ్రీకృష్ణుడా? వంశ మర్యాదను పాటిస్తే ధృతరాష్ట్రుడు. ఆప్త మర్యాదను పాటిస్తే శ్రీకృష్ణుడు. ఆప్తుడైన శ్రీకృష్ణుడు పాండవుల యోగక్షేమాలను చూచే బాధ్యతను చేపట్టాలని ధర్మజుడు మనవి చేసికొన్నాడు. దీనిని శ్రీకృష్ణు డంగీకరించాడు. మరి ధృతరాష్ట్రుడు వంశ మర్యాదను పాటించి వారి యోగక్షేమాలను చూడవలసినదిగా శ్రీకృష్ణుడు తేల్చి చెప్పాడు. కాని-

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి ఆప్త వాక్యాన్ని ప్రమాణంగా గ్రహించలేదు. పెదతండ్రిగా పాండవులకు చేయవలసిన న్యాయాన్ని అతడు భావించలేదు. వంశజులు వారి ధర్మాన్ని నిర్వహించక వంశధర్మానికి విఘాతం కల్పిస్తే, వారికి ఆప్తులైనవారు కూడ వారిని ధర్మమార్గంలో నడిపించలేకపోతే, ధర్మం వంచించబడినా నశించిపోదనీ దానిని దైవం రక్షిస్తాడని శ్రీకృష్ణుడు నిండుసభలో ప్రకటించాడు. ఇది ఆప్తవాక్యం చివర మెరిసే యథార్థ జ్ఞాన ప్రకాశం. ''వాక్యార్థజ్ఞానమ్ శబ్దజ్ఞానమ్'' అని తర్కసంగ్రహం. వాక్యం వలన కలిగిన పూర్ణవాక్యార్థ జ్ఞానమే శబ్దజ్ఞానం. దానికి ఉపకరణమైనది శబ్ద ప్రమాణం. శ్రీకృష్ణుడి ఉపన్యాసం శబ్ద ప్రమాణానికే ప్రమాణం.

శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టం ఆప్తవాక్య కల్పద్రుమంవలె ప్రకాశిస్తున్నది. పాండవులకు శ్రీకృష్ణోపదేశం ఆప్తవాక్యం. ఆయన కౌరవులకు గూడ ఆప్తవాక్య ప్రమాణ జ్ఞానాన్ని ప్రబోధించ ప్రయత్నించాడు. దాని కొఱకు అనేక విధాలుగా యత్నించాడు. ముందు తాను చెప్పాడు. నారదాది మహామునుల చేత చెప్పించాడు. భీష్మద్రోణాదుల చేత దుర్యోధన ధృతరాష్ట్రులకు చెప్పించి ఒప్పించటానికి ప్రయత్నం చేశాడు. చివరకు ధృతరాష్ట్ర, గాంధారులచేత కూడ దుర్యోధనుడికి శ్రీకృష్ణ వాక్య తాత్పర్యాన్ని పాటించుమని ప్రబోధింపజేశాడు. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి పోయి ఆప్తవాక్య ప్రమాణవాదులనందరినీ జాగృతం చేసి, ప్రేరేపించి దుర్యోధనుడికి యథార్థజ్ఞానం కలిగించడానికి శతవిధాల యత్నించాడు. కాని, దుర్యోధనుడికి కర్ణుడి వాక్యమే ప్రమాణం. అందువలన సంధి కుదరలేదు. శ్రీకృష్ణుడు, కర్ణుడు వీరిరువురు ఆప్తవాక్య ప్రమాణవాదులు.

ఐతే ఒకరు యథార్థ జ్ఞానాన్నీ మరొకరు అయథార్థ జ్ఞానాన్నీ ఆశ్రయించారు. అయథార్థజ్ఞానలాభం వలన దుర్యోధనుడు నశిస్తాడు. యథార్థజ్ఞానం వలన పాండవులు విజయం సాధిస్తారు. ఈ తాత్పర్యాన్ని కావ్యశిల్పమయంగా చిత్రించటం తిక్కన నైపుణ్యం.

తర్కశాస్త్రంలో ఉపమాన ప్రమాణాన్ని కూడ పేర్కొంటారు. పదార్థ తత్త్వ జ్ఞానసాధనకు ఉపమానం బాగా తోడ్పడుతుంది. తెలిసిన వస్తువును సాదృశ్యంగా చూపించి మరొక వస్తువు తెలిపే ప్రమాణాన్ని ఉపమాన ప్రమాణం అంటారు. ఉద్యోగపర్వంలోని ఉపాఖ్యానాలు కొన్ని దానికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. శల్యుడు పేర్కొన్న నహుష వృత్తాంతం, కణ్వుడు దుర్యోధనుడికి చెప్పిన గరుత్మంతుడి వృత్తాంతం ఇందుకు సాక్ష్యాలు.

(5). ధర్మరాజు సమన్వయవాది

ఉద్యోగ పర్వ తృతీయాశ్వాసంలోని ధర్మజుడి ఉపన్యాసం ఆప్తవాక్య ప్రమాణవాది మాట్లాడే తీరుకు మంచి నిదర్శనం. ధర్మరాజు ఉపన్యాసాన్ని విశ్లేషిస్తే ప్రత్యక్ష అనుమాన శబ్ద ప్రమాణాలను వరుసగా ప్రదర్శిస్తూనే ఆ మూడింటిలో ఆప్తవాక్య ప్రమాణం శ్రేష్ఠమైనదని నిరూపించిన వైఖరి కనబడుతుంది.

1. ధర్మరాజు శ్రీకృష్ణుడిని తండ్రి తరువాత అంతటి వాడిగా భావించి గౌరవించటం, పాండవులను ప్రద్యుమ్నాది కుమారులతో సమానంగా మన్నించుమని అభ్యర్థించటం, తమ ప్రయత్నంలో ఎటువంటి దోషం రాకుండా ప్రబోధించి రక్షించుమని కోరటం ఆప్తవాక్య ప్రమాణం గౌరవమున్న ధర్మరాజు స్వభావాన్ని తెలుపుతున్నాయి. ఆ తరువాత 'మా తండ్రి తలపును నాతని నందను చందంబు....'' (ఉద్యోగ. 3.9) అనే పద్యం నుండి ''అక్కట లాఁతులైనఁ బగతైనను జంపఁగఁ గోరనేల'' (ఉద్యో. 3.13) అనే పద్యం వరకు ధర్మరాజు యథార్థ విషయ కథనమే చేశాడు. ఈ మాటలు పల్కుతున్నప్పుడు ధర్మరాజు ప్రత్యక్ష ప్రమాణవాదిగా కన్పడుతాడు.

ఆ తరువాత 'క్షత్రధర్మమింత కష్టమగునె...' (ఉద్యో. 3.15) అనే పద్యం నుండి 'కావున శాంతిఁ బొందుటయ కర్జము' (ఉద్యో. 3.28) వరకు అనుమాన ప్రమాణ వాదిగా అత్యద్భుతంగా మాట్లాడాడు. 'మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము' (ఉద్యో. 3.23) అనే పద్యం నుండి. 'ఎన్ని సంకటముల నెబ్భంగినెంతయు' (ఉద్యో. 3.26) వరకు ఆప్తవాక్య ప్రమాణవాదిగా అచ్చమైన నీతిని ప్రదర్శించాడు. ఆ తరువాత 'నీవు సుయోధను పాలికిఁ బోవఁగవలదు...' (ఉద్యో. 3.28) 'కుటిలమతు లవినీతులు క్రూరకర్ములు...' (ఉద్యో. 3.29) అను పద్యం వరకు తర్కాన్ని ప్రదర్శించాడు.

ఈ విధంగా ప్రత్యక్ష, అనుమాన, ఆప్తవాక్య, తర్క లక్షణాలను వరుసగా ప్రదర్శించి చివరకు వాటి నన్నింటిని ఆప్తవాక్య ప్రమాణ ప్రతిపాదనలో విలీనం చేసి తన సంవిధాన నైపుణ్యాన్ని ప్రకటించాడు.

ఆ. 'మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం । దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లుగాఁగ నొడఁ బాటు గావింపు । మెల్లభంగి మనకు నిదియ లెస్స'. **(ఉద్యో. 3.33)**

క. 'మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు, । నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు; । పా మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్?' **(ఉద్యో. 3.34)**

ధర్మరాజు తర్క ప్రమాణబద్ధంగా, ధర్మసమ్మతంగా, ధర్మనీతి వర్తనాన్ని తలపులలో, మాటలలో, చేతలలో ప్రదర్శించిన సమన్వయమూర్తి.

(6). పాత్రోచిత తర్కవైఖరులు

ఉద్యోగపర్వంలో పాత్రలన్నీ ప్రసంగిస్తాయి. ఆ ప్రసంగాలు ఆ పాత్రల ప్రవృత్తులను ప్రదీప్తం చేస్తుంటాయి. యుద్ధోద్యోగానికి సంబంధించిన తమ అభిప్రాయాలను ప్రకటిస్తుంటాయి. వాటన్నింటిలో ఒక అంతర్గతమైన వాక్యశిల్పం (ఉపన్యాస శిల్పం లేదా సంభాషణ శిల్పం) కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది. శ్రీకృష్ణుడి వంటి ప్రధాన పాత్ర నుండి ఉలూకుడి వంటి స్వల్ప పాత్ర వరకు మాటలతో రూపురేఖలు చిత్రించిన వైఖరి తిక్కనగారి నాటకీయ శిల్పం.

ఆయా పాత్రలు పాత్రోచితంగా, సందర్భోచితంగా ప్రదర్శించిన వాఙ్మయ శిల్పాన్ని ఆయా పద్యాల విశేషాంశాలలో విపులంగా వివరించడం జరిగింది. రసజ్ఞులు వాటిని పరిశీలించగలరు.

7. ఉపాఖ్యాన శిల్పం

ఉద్యోగపర్వంలో ఉపాఖ్యానాలు మూడున్నాయి. ఒకటి- శల్యుడు ధర్మరాజుతో చెప్పిన నహుషుడి కథ లేదా పురందర విజయోపాఖ్యానం. రెండు- కౌరవ సభలో కణ్వ మహర్షి దుర్యోధనుడితో చెప్పిన గరుత్మంతుడి ఉపాఖ్యానం. మూడు- భీష్ముడు దుర్యోధనుడికి చెప్పిన అంబోపాఖ్యానం. ఈ మూడింటినీ మూడు రకాల ప్రయోజనాలకు వాడటమే కాక మూడు రకాల కావ్య కళాశిల్పాలకు ప్రతినిధులుగా తిక్కన తీర్చిదిద్దాడు.

ఒకటి- శల్యుడు చెప్పిన కథ సందర్భాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి ప్రత్యేకతను సంతరించుకొన్నది. 'కథ చెప్పినవాడు శల్యుడు. అతడు ఉపచారప్రియుడు. తనను సేవించిన వారికి ఒడలు మరిచి వరాలు ఇవ్వగలిగినవాడు. అందువలన ధర్మజుడికి సాయం చేయవలసిన తాను దుర్యోధనుడికి సాయం చేసే పరిస్థితి కల్పించుకొన్నాడు. మాట దుర్యోధనుడికి ఇచ్చినా మనసు ధర్మరాజు కిచ్చినవాడు. సాయం దుర్యోధనుడికి చేసినా, హితం ధర్మరాజుకు చేయనెంచినవాడు. కౌరవ పక్షాన యుద్ధం చేస్తున్నా, స్వీయ రథికుడైన కర్ణుడిని కలతపరచి, అర్జునుడి విజయానికి తోడ్పడుతానని మాట ఇచ్చినవాడు. ఆపద్ధర్మంతో కౌరవ పక్షాన నిలిచినా, అంతరంగ ధర్మంతో పాండవ విజయానికి తోడ్పడినవాడు. ఒకవైపు కృష్ణుడు పార్థసారథియై పాండవులకు ప్రత్యక్షంగా సాయపడ్డాడు. మరొక వైపు శల్యుడు కర్ణసారథియై పాండవులకు పరోక్షంగా సాయపడ్డాడు. త్వరపడి మాట ఇవ్వటం మూలంగా ధర్మరాజుకు దూరమౌతున్నందుకు ధర్మజుడికి ఊరట కలిగించటానికై ఇంద్ర విజయోపాఖ్యానాన్ని చెప్పాడు. ఆ కథా ప్రయోజనాన్ని ఈ క్రింది మాటలలో స్పష్టం చేశాడు.

ఉ. 'కౌరవనాథుఁ డా నహుషుకైవడి నాశముఁ బొందు వాసవ
శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశివే
లా రశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సారసమగ్ర భోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్.' **(ఉద్యో. 1.210)**

శల్యుడు పరంపరగా విన్న ఒక ఇతిహాసాన్ని సందర్భోచితంగా, సార్థకంగా ఉపాఖ్యానంగా చెప్పాడు. ఆఖ్యానానికి తోడ్పడేది ఉపాఖ్యానం. వస్తుధ్వనిని ఆశ్రయించి ఈ ఉపాఖ్యానం పాండవ విజయాన్ని ధ్వనింపజేస్తుంది. వృత్రాసురుడితో పోరి, ఓడిపోయి అజ్ఞాతవాసంలో నివసించాడు ఇంద్రుడు. ధర్మరాజు కూడా దుష్టచతుష్టయ దుర్నీతికి గురియై, అరణ్య, అజ్ఞాత వాసాలను గడిపాడు. ఇంద్రుడి తరువాత ఇంద్ర పదవిని అలంకరించిన నహుషుడు, ఇంద్ర సామ్రాజ్య లక్ష్మినే కాక శచీదేవిని కూడా కోరాడు. దుర్యోధనుడు కూడా మాయాద్యూతంలో పాండవ రాజ్యాన్ని హరించి, ద్రౌపదిని అవమానాల పాలుచేశాడు. నహుషుడికి పాపం పండి సప్త ఋషుల శాపానికి గురై, కొండచిలువగా మారి రాజ్యభ్రష్టుడైనాడు. అట్లాగే

దుర్యోధనుడు కూడ పాండవ రాజ్యభాగ మీయక అవినీతి పాలై, పూజ్యులను ఆప్తులను అవమానించి, రాజ్యభ్రష్టు డౌతాడని శల్యుడు సూచించాడు. ఇంద్రుడు దేవతల తేజస్సులను సమీకరించుకొని ఇంద్రపదవిని తిరిగి సాధించాడు. అట్లాగే ధర్మరాజు కౌరవులను ఓడించి, రాజ్యాన్ని త్వరలో తిరిగి పొందుతాడని శల్యుడు ఆకాంక్షించాడు. ఆశీర్వదించాడు. శత్రు సైన్యంలో చేరనున్న మహావీరుడైన శల్యుడు పాండవ విజయాన్ని వస్తుధ్వనిని ఆశ్రయించి భావికథార్థ సూచికగా చెప్పటం ఈ ఉపాఖ్యాన సార్థక్యం.

ప్రధానకథ కిది ఉపాంగమైనా ఆఖ్యానాన్ని ఉపమాన ప్రమాణంతో సమర్థిస్తున్న ఉపాఖ్యానం, దీని ప్రత్యేకత ఇది.

కణ్వమహర్షి దుర్యోధనుడికి చెప్పినది గరుత్మంతుడి వృత్తాంతం. పాండవ బలాన్ని, ప్రత్యేకించి నరనారాయణుల మహిమను తెలియక, దురహంకారంతో యుద్ధానికి తలపడి, అవమానం పొందిన దానికంటే, పాండవులతో కలిసి మెలసి ఉండటం మంచిదని హితవు చెబుతూ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. 'అది వోలుఁ దన్ను నెదిరిని । మది నెఱుఁగక నిగ్రహించి మదమెత్తుట యొ
ప్ప; దహంకారం బొనరిం । పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్.' **(ఉద్యో. 3.289)**

ఒకసారి మాతలికీ, గరుత్మంతుడికీ వాదు ఏర్పడింది. అన్నదమ్ముల మధ్య ఏర్పడిన ఆ తగాదాలో గరుత్మంతుడు ధిక్కరించి, మాతలిమీద మండిపడి విజృంభించాడు. దానికి వాసుదేవుడు కోపించి గరుత్మంతుడికి గర్వభంగం చేశాడు. ఈ కథలో అన్యాపదేశంగా దుర్యోధనుడికి హితబోధచేశాడు కణ్వుడు. ఉపాఖ్యానంలోని మాతలి వంటి వాడు ధర్మరాజు. అతడికి బలంతోపాటు న్యాయం కూడా తోడున్నది. ధర్మరాజుకు శ్రీకృష్ణుడి సాయం బలంగా ఉన్నది. గరుత్మంతుడి వంటివాడు దుర్యోధనుడు. అతడికి దేహబలం తప్ప, ధర్మబలం లేదు. అందువలన వాసుదేవుడి కోపానికి గురై అవమానాల పాలైనాడు. అట్లాగే దుర్యోధనుడు స్వీయబలంతో గర్వించి, ధర్మజుడితో యుద్ధం ప్రకటిస్తే, వాసుదేవుడి కోపానికి గురై నశించక తప్పదని వ్యంగ్యంగా సూచించాడు కణ్వుడు. ఇది ఉపమాన ప్రమాణంలో భాగం మాత్రమే. హితవును పెడచెవిని పెట్టిన దుర్యోధనుడికి నాశనం తప్పదని ఈ కథ నీతి చెబుతుంది.

క. 'బలవంతుల బలములు న । గ్గల మగుబల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు నే
కొలఁదుల వారికి గర్వము । నిలుచునె నయమార్గ వృత్తి నిలిచిన భంగిన్'. **(ఉద్యో. 3.303)**

కురుసభలో గుమికూడిన మునిజనులొక్కొక్కరూ చిన్నదో పెద్దదో ఏదో ఒక కథను చెప్పి, ఉపమాన ప్రమాణంతో దుర్యోధనుడికి ఉపదేశం నిర్వహించారు. జమదగ్ని మహర్షి దంభోద్భవుడి కథ చెప్పాడు. నారద మహర్షి గాలవుడి కథ చెప్పాడు. ఇట్లా మునులు చెప్పిన కథలన్నింటిలో ముక్తసరిగా చెప్పిన ఉపాఖ్యానం గరుత్మంతుడి కథ. ఆ తరువాత పేర్కొనదగినది గాలవుడి కథ. దంభోద్భవుడి కథ తిక్కన ఒక పద్యంలోనే కుదించివేశాడు. శల్యుడు చెప్పిన నహుషుడి కథ ఉపమానం కొరకు అయితే, మునులు చెప్పిన కథలు ఉపదేశం కొరకు. అందువలన ఉపాఖ్యాన శిల్పంలో వైవిధ్యం ఏర్పడింది.

భీష్ముడు చెప్పిన అంబోపాఖ్యానం ఆఖ్యానకం వంటిది. అంబ శిఖండిగా మారి భీష్ముడిపై ప్రతీకారం తీసికొనిరావటానికి పాండవ పక్షంలో నిలిచి ఉన్న వృత్తాంతాన్ని భీష్ముడే స్వయంగా చెప్పాడు. అంబ వృత్తాంతం భీష్ముడి చరిత్ర నుంచి పుట్టిందే. అతడి చర్యల వలన పెరిగిందే. అతడి నైష్ఠిక వ్రతం వలన ఎదురు తిరిగిందే. స్వయంవరంలో అంబను బలవంతాన తెచ్చి, ఆమె బ్రతుకుబాటను మార్చాడు భీష్ముడు. ఆమె హృదయాన్ని తెలిసికొని సాల్వుడి దగ్గరకు పంపి, ఔదార్యాన్ని ప్రకటించినా, సాల్వుడు ఆమెను గ్రహించకపోవటంతో ఆమె జీవితం విషాదభరితమైపోయింది. భీష్ముడి బ్రహ్మచర్య వ్రతం ఆమెను పెండ్లాడటానికి అడ్డం వచ్చింది. దానితో అంబ జీవితం అగమ్యగోచరంగా మారింది. ఆమె పరశురాముడిని ఆశ్రయించింది. పరశురాముడు భీష్ముడికి హితవు చెప్పాడు. భీష్ముడు ఆజన్మ బ్రహ్మచర్యవ్రతాన్ని విడవటానికి అంగీకరించలేదు. కాగా, వసువుల సాయంతో పరశురాముడిని ఓడించాడు. ధర్మదృష్టిలో భీష్ముడు విజయుడై నిలిచాడు.

కాని, అంబ తోకత్రొక్కిన త్రాచువలె పగబూని భీష్మ సంహారానికి తపస్సు చేసింది. శిఖండిగా మారింది. భీష్ముడిని యుద్ధంలో చంపటానికి సమయం కొరకు ఎదురు చూస్తున్నది. పేడివాడితో యుద్ధం చేయనని భీష్మ ప్రతిజ్ఞ. దాని నాధారంగా చేసికొని అర్జునుడు శిఖండిని ముందుంచుకొని భీష్ముడిపై దాడిచేస్తే అతడు దుర్మరణం పొందక తప్పదు. సంకల్ప మరణం వరంగా పొందిన భీష్ముడికి అంబవలన అసమయ మరణం ఏర్పడే అవకాశం ఉన్నది. దానిని దుర్యోధనుడికి తెలియజెప్పటం కొరకు అంబ వృత్తాంతాన్ని భీష్ముడు వివరించాడు. 'పాండవ వీరులనందరినీ చంపగలను కానీ, ఒక్క శిఖండిని మాత్రం చంపలేను' అని ప్రకటించిన భీష్ముడి వాక్యాన్ని వివరించుమని అడిగినపుడు 'ఏ నా శిఖండినిఁ జంపమికి మూలంబు సాలంగలదు. తత్ప్రపంచంబంతయు వివరించెద నాకర్ణింపుము' అని దాదాపు 150 పద్యాల విస్తృతి గల కథను పేర్కొన్నాడు. ఈ కథలో భీష్ముడు కన్నది, విన్నది, మునులు వివరించింది అయిన మూడు రకాల కథ ముడిపడి ఉంటుంది. భీష్ముడి ఆత్మకథలోని అంతర్భాగంగాను, భీష్ముడి విషాదాంతానికి సూచికగాను, కౌరవ మహాసైన్యాధ్యక్షుడు చనిపోక తప్పదనే కథార్థసూచనానికి సంకేతంగాను ఈ ఉపాఖ్యానం చెప్పబడింది. ఇదే కథ కథకుడు చెబితే ఆఖ్యానమై ఉండేది. భీష్ముడు చెప్పటం మూలాన ఆఖ్యానకమైనది. అందులోనూ నారదుడు చెప్పిన అంబ వృత్తాంతం ఉపాఖ్యానంగా భాసిస్తున్నది. అందువలన ఈ కథ ఆఖ్యానక, ఉపాఖ్యాన, కథాశిల్పాల త్రివేణి సంగమం.

తిక్కన ఆయా కథల స్వభావాన్ని బట్టి కథన శిల్పాన్ని కూడా మార్చాడు. నహుషుడి కథ వర్ణనాత్మక కథాకథన ప్రధానం. గరుత్మంతుడి కథ, కథాకథన ప్రధానం. అంబోపాఖ్యానం కావ్యరూపక కథాశిల్ప ప్రధానం.

8. మరికొన్ని విశేషాలు

1. ''మూలము నందలి సనత్సుజాతీయము తెలుగున నించుమించుగా లుప్తమైనట్లే యెంచవచ్చును. ఇందులకు గొందఱు తిక్కనను మహాపరాధిగా బరిగణించుచున్నారు. కాని, కావ్యరసదృష్టితో జూచినపుడు ఈ శాస్త్ర గ్రంథ మిక్కడ లేకుండుట వలన రసము. వస్తువు రెండును విక్షిప్తములు గాలేదు. శాస్త్ర భాగము నంతను శాంతి, అనుశాసనికము, అశ్వమేధము మున్నగు పర్వములలో విశదీకరింప వచ్చుననియు, అచ్చట నున్నచో వస్తుగమనము నరికట్టవనియు కావ్యరసతత్త్వవేత్తయగు తిక్కన నిర్ణయించుకొని యుండవచ్చును. కొంద ఱిది గుహ్యమైన యోగశాస్త్రము గావున నాతడు విడిచి పెట్టి యుండవచ్చునని యూహించుచున్నారు. ''పరతత్త్వము ప్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ'' అను వాక్యభాగము వారి యీ వాదనకు జేయూతగా నున్నది. కాని, యోగశాస్త్రమును గూఢమని యెంచి విసర్జింపవలసివచ్చినచో పైన చెప్పిన మూడు పర్వములలో విస్తర భాగము లుప్తము కావలసినదే. భారతమున శాస్త్ర భాగమున చాల పునరుక్తి యున్నది. సనత్సుజాతీయము, భగవద్గీత, ఉత్తరగీత, అనుగీత మున్నగున వెన్నియో ఒక్కొక్కటి ప్రత్యేకముగ గైకొన్నప్పుడు ఎంతో మనోహరములగు గ్రంథరాజములే యయ్యును సమూహముగ చేర్చి చూచినపుడు చాలా భాగము చెప్పినదే చెప్పుటయగుచున్నది. తిక్కన కేవలము ''వేద భారవాహి''గా నందున ఆధ్యాత్మిక సంపద నంతయు గ్రంథముల మూలముననే గాకుండ అనుభవమున గూడ నాపోశనము పట్టిన వాడగుటచే శాస్త్రభాగము నాతడు పూర్ణముగ జీర్ణము చేసికొని వానిని ప్రత్యేకముగ కేటాయించి సమర సంరంభము ముగిసిన వెనుక శాంతియుతముగ గూర్చున్నప్పుడు ధర్మజాదుల ప్రసంగములలో క్రోడీకరించినాడు. ఇట్లగుటచే విషయ విభాగమునందును రసస్ఫూర్తి యందును గూడ నాంధ్ర మహాభారత మున్నత సోపానము లధిరోహించుచు మూలమును మించుచున్నది. దేనిని లోపముగ గొందఱు మనీషులు పరిగణింప జూచుచున్నారో అదియే తిక్కన విమర్శనా శక్తికిని, ఉచితజ్ఞతకును నిశితమైన తార్కాణముగా నాకు దోచుచున్నది.'' - నండూరి బంగారయ్యగారు. (ఆంధ్రమహాభారతోపన్యాసములు - తిక్కన - ఉద్యోగ పర్వము - పుట 148)

2. ''ద్వితీయాశ్వాసమున నొక్కచో (107వ పద్యము మొదలు 115వ పద్యము వరకు) ప్రాతఃకాల వర్ణనమున్నది. దీనిని వర్ణించినను, వర్ణించకపోయినను కావ్య సౌందర్యమున కెట్టి లోపము రానేరాదు. వాల్మీకివలెగాని, కాళిదాసు వలె గాని ప్రకృతి తాదాత్మ్యము నొంది చేసిన వర్ణనము గాదిది. మధ్యకాలము నందలి సంస్కృత కవుల కృత్రిమ వర్ణనలతో

వియ్యమందుచున్నది. దీనినంత దోషముగా ఖండింపనక్కర లేదు గాని గుణముగా నెంచి పూజించుటకు మాత్రము బుద్ధి పుట్టకున్నది.'' - నండూరి బంగారయ్యగారు (ఆంధ్ర మహాభారతోపన్యాసములు - తిక్కన - ఉద్యోగపర్వము - పుట 149)

3. ''కావ్యతాస్ఫోరకముగనే గాక, సందర్భాలంకారములకై కూర్చిన వర్ణనలు పెక్కులు. అవి యిట్లుండును. 'తనకులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు లన్నదమ్ములతో నిగ్రహంబు గొనుట కుమ్మలించి వివర్ణతఁ నొంది నట్లు గంది యెంతయుఁ జెలువేదెఁ జందురుండు'' ఇత్యాదిగాఁ జంద్రాస్తమయ, తారకోదయములు, చక్రవాక, శుకకోకిల భృంగవిహారములు, మలయానిల సంచారములు, సూర్యోదయ సూర్యాతప ప్రసారములు వర్ణించెను. 'కలయట్టి వివిధార్థములు విశేషంబుగఁ దగ నొసంగుండు సత్పాత్రములకు' అని శ్రీకృష్ణుడు కౌరవుల నుద్బోధించి పలికిన మాటలు, 'కోల్పులి వీఁకమై గొదగొని లేళ్ళకు నుఱుకు తెఱంగునఁ దఱియఁ జొచ్చి' 'ఇత్యాదిగా భీమసేనాదుల భుజాటోప విజృంభణములు, 'గాండీవ గుణరవం బొండొండఁ జెలఁగంగ, శరపరంపర లాకసంబు గప్ప' నని యర్జునుని యస్త్రపాండిత్యప్రాభవము, 'అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశమొనరించు దానికై యుద్భవించె' నని. ధృష్టద్యుమ్ను దొడ్డతనము, 'వక్షస్థలంబున వనమాల గ్రాలంగ వెలిమావు గెడలు వాగెలు ధరించి' అని అర్జున సారథియగు కృష్ణ వర్ణనము, 'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె' యని పురస్త్రీలు గోపాలు వర్ణించిన ఘట్టము ఇట్టివెన్నియో యిందు నచ్చటచ్చటఁ దమయున్కి జ్ఞప్తి చేయుచుండును. శ్రీకృష్ణుఁడు ప్రాకృతమూర్తిగా మొదలై పరమార్థ తత్త్వము వరకు వ్యాపించిన వివిధ రంగ విన్యాసములును యథాశక్తి సంవేద్యములుగాఁ జెప్పుట యిందులో గొప్పలో గొప్ప. తెలుగు బాసకు నిండుదనము గండతనము కరగించి పోతపోయుటలో నితఁడు సిద్ధహస్తుఁడు. మహాకవియైనవాఁడు మహామంత్రిగా మనసు పండిన లోకజ్ఞుఁడుగా నుండిన 'నిట్లుండు'ననుట యిందు ప్రతిపద్యమునఁ బ్రత్యక్షమగును. ఇంతయు తెలుగువారు చేసిన పుణ్యఫలమనుటలో నతిశయోక్తిలేదు.'' - గడియారము వేంకట శేషశాస్త్రిగారు. (ఆంధ్ర మహాభారతము-ఉద్యోగ పర్వము - పీఠిక 5 - పుట 28-29).

4. ''తిక్కనగారి భాషా ప్రాభవమపూర్వమైనది. ఆంధ్ర విద్వల్లోకము వేవిధముల ముక్తకంఠముగాఁ గొనియాడినది. కొంచెముగానైన దానిని రుచిచూచుట యుచితము. తిక్కనగారి పదకోశమునఁ జేరి ప్రజావదనములఁ బారాడు పదప్రయోగము లిట్టివి; వెసగలకాలరులు, వెలివీడు, కొట్టిన తిండికాఁడు, పవడించు, కొండుక, పల్లాయనంబువారు, ఒత్తారువు, హోరాటము, అడియాసలు, కొఱతనుఱుకులు, పొంతువ, బెండు, వెడవెడయలుక, వాయోడు కూటువమూఁక, ఏలిమాటలు, ముక్కునవాని, చావడము, వేరిమి, క్రొత్తది, కోరడము, వేసరి, వాయపురజ్జులు, గూఢచర్య, కడవఁబడు, ఉవ్వెత్తుకొను, కవణము, లఘుసంచరణము, అడియరితనము, చక్కసగము, ఒట్టిన మంటలు, నమ్మిగ, చిడిముడిపడు, చిదురుపాలు, వీరమదము, పానుపడు, ఆతల-ఇత్యాదులు.'' (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 29-30)

5. ''తిక్కనగారి పదబంధ విన్యాసము లిట్టివి: వారొకతల - నేనొకతల, నేలయొత్తికొన, పెట్టని కోటనీకు హరి, గొడ్డు వోయిన వారు, కుదుటఁ గూడవెట్టి కుడుచువారు, చెవులు చీములు కట్టు, ధర్మసూతి మెత్తని పులి, ఎరవయి నిల్చు, పతివోదురు, చిచ్చయినఁ బిడికిలింతము, అరచేతికిఁ దేరఁజాలు, ముక్కూరి వగచు, కడకొఱవులట్లు, ముకుఁద్రాటఁగాలు గ్రుచ్చు, పుడమి యెల్లనొడ్డగెడవయి, తోడు దొనలేని, బఱిపికొనిపోయి, నీకై పొరలితిమి, ఒక చాలు వాని బలుతీర్పు, వెఱగునఁ బుల్లవడు, ఒంటర మింటరములు, చీదకనుపడు, మీకభరము, విడిదల పయనములు, వెలలి బలరిపుఁడు, చిక్కని పోటు మానిసివి, అరవాయిగొను, పరివింటివాఁడు, అది ప్రాప్తకాలంబు, ఉక్కుఁగలఁడు, గద నేర్పు ముసురు కవిసి, తిట్లుపాట్లు, పాముల నెట్లట్ల, తూలపుచ్చు, అడుగుమాలిపోవు ఇత్యాదులు.'' (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 30).

6. ''తిక్కనగారి వాక్యరచనాచాతురి యిట్టిది- మిముఁ జేరి నెగడు వాఁడ । కారుణ్యమున నిట నరసియుండుఁడు, తానైన నపుడు నీతిపథము విడిచె- మమ్మైన నిపుడు. చక్కని పథమున నడవుఁడనె, పిల్లిపట్టిన యీరువువేసియున్న, వీవు

చక్కనయి నిల్చుఁగాక, నా మోమున వ్రేలెడున్, విరిగిన బారసాప వచ్చునే వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపఁగన్, రథము రథము కదియ రానిచ్చి, దుఃఖములైనవి తెగు సమయము, మీమేనత్త నూఱడింపుము, పాలకడలి పాటయై యొప్పు మొనతలఁబడు, భూమి యొనర్చి పాండునృపపుత్త్రుల కిత్తునె, ధర్మజ వారిరాశిన్, జెలియలికట్టవాసె, పొట్టు పొరలయ్యుఁ గయ్యంబునాచు, ఉఱుకడ కేగి తోడుపడు, ఇంతలేక యాడు మెల్ల వినఁగ, తిగిచి కొనివచ్చునెడ, లభిమతం బిదికాకయుఁ గల్గెనేనియన్, బూని యొనర్తు, నెత్తురు నీరఁదేల్చు, కురుక్షితీశుఁడను బ్రహ్మకు వేయును నిండు, సర్వకురు సంతతికిన్, గలవాఁడు కాఁడె, నా మోమునన్ వ్రేలెడున్, విచ్చుఁడు వెసవచ్చు గాండివంబును దానున్, అర్చిన మూరెఁడు నేర్చు, చేతుల తీటం బుత్తుము, విచార వివేకంబుల నాయెత్తు వత్తురె, గాలియును జిట్టాడంగ నీను, ఇది యిట్లయ్యె దక్కినది యట్లుండె, మనఁ బోవఁగరాదు, కైపెక్కి నట్టి తలఁపు, మాఱటనోరి దానను, ఒద్దియేఱు విడిసి - ఇత్యాదులు పరశ్శతములు." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట 30, 31)

7. "తిక్కనగారి యుపమానము లర్థాంతర న్యాసము లిట్టివి: మడుగుఁ జీరయందు మసి దాకినట్లు, మాకుం గుడు మిండు మీరు ప్రక్క గొనుఁడు, రోషమయ మహాతరువు, ధర్మతరువు, సాదు రేఁగెనేనిం దలపాలమునఁ గాని నిలువఁ బోఁడు, పాలలోఁ బడిన బల్లివిధంబున, నిప్పులు వేఁడిమి సెడినట్లు, వింజం బాఁకిడిన కరణి, విధిసేసినగతిఁ బడకయుండ శివునకు వశమే, కొండం గని తగరు దాఁకఁ గోరుటఁ గాదే, నిప్పులన్ బొరలినయట్లు, మీనంబు చవిఁ గాలము మ్రింగినయట్లు, నీళుల నగ్ని పుట్టిన యట్టిది, అట మిన్నందినయంత వానిపొడ వెంతన్నట్లు, మంటలో మిడుత లుదగ్రవృత్తి నుఱుకఁదలఁచినట్లు, నేవోసిన యగ్నిభంగి, కావి సెలయేఱుల తోడినగంబు లట్లు, పామున్న యింటిలో నున్నయట్లు, చిచ్చొడిం గట్టినయట్లు, గజంబు గజంబు పల్లవం బల్లన దెమల్చులీల, శ్రీరామోకాలొడ్డిన వాని విధము - ఇత్యాదులు పెక్కులు." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 31)

8. "తిక్కన గారి వ్యాకరణ విశేషము లిట్టివి: సురరాజ్యశ్రీ వాలింపఁగ, యోగక్షేమంబున తెఱఁగు, కాన తగంబొందుట, (ఇచ్చట కాన కళ) కాన నవశ్యము (ఇచ్చట కాన ద్రుతప్రకృతికము), వేగ తెగం బాఱకు (ఇచ్చట వేగ కళ) జగంబులన్నిని, పోవఁగఁద్రోతున్ (త్రోచు ధాతువు), అట్టిదిం గలదె, ప్రాణానం గలుగంగ, సంధియ కావింపంబడిరి, మఱాకుమన్న ఎన్నఁడేని కృష్ణుని తోడనే జెప్పితి, భూరిశ్రవుం డతిరథంబుల మొదలి, జెట్టానజెట్లు, సుఖమున్న వారె, ఎల్లవెంట, సంభావింపుము. విదురునితో ప్రాణగొడ్డము, కూడదు నార, బోనాలు వేర్పింప, చంపుదమ యిర్వురము, ఇత్యాదులు మఱియుంగొన్ని." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 31)

9. తిక్కనగారి రచనలో రెండు మూడు ప్రౌఢ రచనా విన్యాసములు గూడ గనఁబడును. చూడుఁడు:-

"ఒకటి గొని, రెండు నిశ్చలయుక్తిఁ జేర్చిఁ మూఁటి నాల్గింటిఁ కడు వశ్యములుగఁ జేసి" "జ్ఞాతుల పోరితమును, గోవ్రాతము నాక్రమము, విప్ర వర్ణముచనవున్" "తుది రాజ్యమ్ము సగమ్ముగొ మ్మడవియందున్ బేరు వంచించియున్, పదుమూఁడేఁడుల నీవునుం దిరిగిరా, పాలీక పోవచ్చునే" ఇత్యాదులు దిక్సూచి ప్రాయములు. (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వం - పీఠిక - పుట. 31)

9. ఉద్యోగ పర్వం - అంతరార్థం

అధ్యాత్మవిదులు మహాభారతాన్ని వేదాంతమని కీర్తిస్తారని నన్నయ భట్టారకుడు పేర్కొన్నాడు. అంతేకాక భారతీయ ఇతిహాసంలోని కథ ఆధ్యాత్మికమైన అంతరార్థాన్ని కూడా గలిగి ఉండాలని ప్రసిద్ధి. అందువలన మహాభారతం ఆధ్యాత్మికపరమైన సాధన మార్గాన్ని బోధించే వేదాంత గ్రంథంగా జిజ్ఞాసువులు భావిస్తారు.

పీఠిక : 60

1. ఉద్యోగం అంటే ఉత్+యోగం. ఉత్ అంటే ఉన్నతులైన సాధనా మనోవృత్తులతో, యోగం అంటే కలయిక, ఉద్యోగ పర్వంలో పాండవపక్షం సాత్త్విక వృత్తుల సమీకరణం. కౌరవపక్షం తామసిక వృత్తుల సమీకరణం. ఈ రెండు వృత్తులూ యుద్ధానికి తలపడి తమ తమ ఉన్నతులకు బలం చేకూర్చుకొనే యత్నం చేయటమే ఉద్యోగం అన్నమాట.

(1). ఉపప్లావ్య నగర సమావేశం:- ఉపప్లావ్య నగరంలో ధర్మజుడి సభలో శ్రీకృష్ణాదులు సమావేశమై ఉద్యోగ ప్రయత్నం ఆరంభించటం ఉన్నత సాత్త్విక మనోవృత్తుల సమీకరణం. అభిమన్యుడితో ఉత్తరకు వివాహమయింది. "అభితః మనుతే ఇతి అభిమన్యుః" అనే వ్యుత్పత్తిని ఆశ్రయించి అభిమన్యుడంటే అంతటా భగవంతుడిని భావించే సాధన అని అర్థం. ఉత్తర అంటే శ్రేష్ఠురాలైనదని అర్థం. ఉత్తరాభిమన్యుల వివాహం అంటే అంతటా భగవంతుడిని దర్శించే సాధకుడు సాగించే శ్రేష్ఠమైన సాధన. దీనినే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే ఆధ్యాత్మిక పరమ సాధన అంటారు. ఈ సాధనలో పంచసాత్త్విక వృత్తులకు తోడ్పడే ఇతర మనోవృత్తులే ఉత్తరాభిమన్యుల వివాహానికి హాజరైన రాజులుగా భావించాలి.

పంచ సాత్త్విక ప్రవృత్తులకు తోడ్పడే నిర్వృతి మనోవృత్తికి శ్రీకృష్ణుడు ప్రతీక. ముక్తిసాధనకు మరే విధమైన అడ్డంకులు కలిగించకుండా తామసికవృత్తి అంత తేలికగా లొంగదనే సత్యాన్ని గ్రహించి, యుద్ధం చేసి తామసిక వృత్తులను ఓడించటం కంటే గత్యంతరం లేదని నిర్ణయించుకొనటమే సాత్యకి మొదలగు రాజులు యుద్ధానికి సిద్ధపడాలన్న వాదనకు అంతరార్థం.

సాత్యకి అంటే సత్యాన్ని గ్రహించగల్గిన సాధకుడిలోని సత్యజ్ఞాన మనోవృత్తి. ద్రుపదుడు అంటే మూల ప్రకృతి. యుద్ధ సన్నాహాలు పూర్తి చేసిన తరువాతనే ద్రుపదుడు తన పురోహితుడితో రాయబారం పంపిద్దామన్నాడు. అంటే సాధకుడిలోని పంచసాత్త్విక వృత్తులపరమైన మూలసాత్త్వికప్రవృత్తి (ద్రుపదుడు), తామసిక వృత్తితో (దుర్యోధనుడితో) యుద్ధం తప్పదని అనుకొంటూ, యుద్ధానికి కావలసిన సాత్త్విక మనోవృత్తుల బలం (పాండవుల బలం) సమీకరించి ఉభయ పక్షాల బలం చూసికొని ఆపైన భవిష్యత్ క్షేమం కొరకు తామసిక మనోవృత్తులతో సఖ్యప్రయత్నం జరపాలని ద్రుపద ప్రయత్నంలోని అంతరార్థంగా మనం గ్రహించవచ్చును. శ్రీకృష్ణుడు ద్రుపదుడి సలహాను మెచ్చుకొన్నాడు. అంటే నిర్వృతి తత్త్వం శాంతి ప్రయత్నంతో ఉంటూ యుద్ధానికే మొగ్గుచూపిందని అంతరార్థం చెప్పాలి. మొత్తానికి ఈ ఘట్టంలో ఆధ్యాత్మిక సాధనపరంగా తేలిన తాత్పర్య మేమంటే - సాధకుడు తనలోని అన్ని వృత్తుల యొక్క పర్యాలోచనలను సాగించి, తామసిక వృత్తిని ఎదిరించి నెట్టివేసేందుకు తన ముక్తి సాధనలో తోడ్పడే మనోవృత్తులను కూడకట్టుకునేందుకు, గొప్ప యత్నం చేయాల్సి ఉంటుంది అని భావించి తత్సాధనకు పూనుకొంటాడు. ఇదే సాధకుడి ఆధ్యాత్మికపరమైన ఉద్యోగం.

(2). శ్రీకృష్ణుడి సాహాయ్యక ఘట్టం:- ఒకవైపు దుర్యోధనుడు మరొకవైపు అర్జునుడు శ్రీకృష్ణుడి సహాయాన్ని ఒకేసారి అర్థించారు. శ్రీకృష్ణుడు తన బలాన్ని ఒకవైపు, యుద్ధం చేయని తనను మరొకవైపు ఏర్పాటు చేసి క్రమంగా దుర్యోధనుడికి, అర్జునుడికి సమకూర్చాడు. పైకి కనబడే కథ ఇది. లోన అంతరార్థం ఈ విధంగా గోచరిస్తుంది. "తామసిక వృత్తి నిర్వృతి తత్త్వాన్ని తనకు తోడుగా ఉండాలని ఎప్పుడూ కోరదు. అట్లా కోరితే తామసిక వృత్తి నిర్వృతి తత్త్వం వలన తాను మఱుగునపడి పోవలసి వస్తుంది. అసలది దాని సమీపానికి పోనే పోదు. తామసిక వృత్తి ముక్తికి సంబంధించిన మనోవృత్తి కాదు. కాన అది, ముక్తి స్వరూపమే అయిన నిర్వృతి వృత్తిని తనకు సాయంగా ప్రక్కన ఉండటానికి సహించనే సహించదు. తానై దాని ప్రక్కన ఉండనే ఉండదు. తామసిక వృత్తి, ప్రవృత్తి తత్త్వాన్ని కోరుతుంది. కాని, నిర్వృత్తితత్త్వం దానికి కిట్టనే కిట్టదు కూడ. కృష్ణుడి యొక్క సైన్యం పదివేల సంఖ్యల గోపాలురను ఇంద్రియ సంబంధములైన ప్రవృత్తి వృత్తులుగా అంతరార్థం చెప్పుకోవాలి. గోశబ్దానికి ఇంద్రియమని అర్థం కాన గోపాలురంటే ఇంద్రియాలను పోషించే తామసిక వృత్తులు అని అర్థం. ఆ ఇంద్రియాలను పోషించే తామసిక ప్రకృతికి కావాలి అనే దానికి లభించా యన్నదే కృష్ణసైన్యం దుర్యోధనుడికి లభించిందన్న దానికీ, అందుకు దుర్యోధను డానందించాడన్నదానికీ అంతరార్థంగా భావించాలి. ఇతరులకు పరమాత్మ

తత్త్వాన్ని తెలియబడనీయకుండా ఆ పరమాత్మ తత్త్వం చుట్టూ ఆవరించి ఉండే మాయావరణ వృత్తులే గోపాలురైన కృష్ణసైనికులంటే. అర్జునుడు అంటే సాధకుడిలోని ఋజు ప్రవర్తనా సాత్త్విక వృత్తి. అది ముక్తిని కోరే వృత్తి కాన అది ముక్తి స్వరూపమేయైన నిర్వృతి తత్త్వాన్నే వాంఛిస్తుంది. అర్జునుడు శ్రీకృష్ణుడిని ఎన్నుకొన్నాడన్న దానికి అదే అంతరార్థం. కృష్ణుడు యుద్ధం చెయ్యడు, ఆయుధం పట్టడు, సాక్షి మాత్రంగా యుద్ధంలో ఉంటాడు. అయినా సరే, అర్జునుడు కృష్ణుడిని ఎంచుకొన్నాడు అంటే ముక్తిసాధనలో సాత్త్విక వృత్తులకు తామసిక వృత్తులు ఆవరించి అడ్డపడకుండా ఉండే జాగ్రత్త నిరంతరం వహిస్తూ ఉండాలి. నిర్వృతి తత్త్వం యొక్క పరిధిలో సాత్త్విక వృత్తులుంటే దేనితోనూ కలయిక అనేది లేక పరిశుద్ధములైన సాత్త్విక వృత్తులను తామసిక వృత్తులు ఎన్నటికీ కదల్పనే లేవు. సాత్త్విక వృత్తులలో ఏ కొంచెం లోపం ఉన్నా తామసిక వృత్తులకు సాత్త్విక వృత్తులను పూర్తిగా నాశనం చేసివేసే బలం వస్తుంది. కనుక సాత్త్విక వృత్తులు ఇంకొక వృత్తితో కలియకుండా ఉండటమే ముఖ్యాతిముఖ్యమైనది. కనుకనే నిర్వృతి తత్త్వాన్ని సాత్త్విక వృత్తులు కోటను ఆశ్రయించి ఉండునట్లు నిరంతరమూ ఆశ్రయించి ఉండటానికి కోరుతుంటాయి. నిర్వృతి తత్త్వం తమ్ము విడిచి పెట్టకుండా తమలో సాక్షి మాత్రంగా ఉంటేచాలు. నిర్వృతి మనోవృత్తితో చేరికవలననే తామసిక వృత్తులు సాత్త్వికవృత్తులను సమీపించలేవు. విడవకుండా తనలో ఉండటం తప్ప నిర్వృతి తత్త్వ మనోవృత్తి వేరే సాధనకు సాయం చేయనక్కర్లేదు. అదే, ఆయుధం పట్టి యుద్ధం చేయక సాక్షి మాత్రంగా ఉంటానన్న కృష్ణుడిని అర్జునుడు ఎంచుకోవడంలో ఉన్న రహస్యాన్ని మనం అంతరార్థపరంగా గ్రహించాల్సి ఉన్నది.

(3). శల్యుడు కౌరవ పాండవులకు ఇరువురకూ సహాయం చేయటం

మద్రదేశాధిపతి శల్యుడు. మద్ర (మత్+అర) శబ్దానికి అహంకార మమకార నాశక మనోవృత్తి అని అర్థం. శల్యుడు అంటే కప్ప, సరిహద్దు అనే అర్థాలున్నాయి. కప్ప అటు జలతీరం (సరిహద్దు)లోనూ ఇటు జలంలోనూ దూకుతూ ఉంటుంది. అట్లాగే శల్యుడు అటు సాత్త్విక వృత్తుల (పాండవుల) వైపూ, ఇటు తామసిక వృత్తులవైపూ దాట్లు వేసే మనోవృత్తి వంటి వాడు. ఇటువంటి మనోవృత్తిని 'శల్యవృత్తి' అని కూడా అంటారు. సహజంగా సత్త్వగుణం మీద ఆసక్తి ఉన్నా తామసగుణంమీద ఇష్టం లేకపోయినా శల్యవృత్తి దానికి సాయపడే దౌర్బల్యానికి లోనయింది. ఇటువంటి మనస్తత్త్వం సాధకులలో అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. అటువంటప్పుడు బహిరంగంగా తామసికం వైపు ఉంటూ సాత్త్విక విజయానికి తోడ్పడుతూ ఉండటం జరుగుతూ ఉంటుంది. ఇరువైపులకూ చేరికగా సరిహద్దులో ఉండి, రెండు వైపులకూ కప్పవలె అటూ ఇటూ కూడా దాట్లు వేస్తూనే సాత్త్విక విజయం చేకూర్చే శల్యవృత్తి వంటిది శల్య సహాయం.

(4). పాండవ కౌరవ సైన్య బల సమీకరణం

అంటే- సాత్త్విక తామసిక వృత్తుల స్వస్వబల సమీకరణ మన్న మాట! 1.ధృష్టకేతుడు, 2.జయత్సేనుడు, 3.జరాసంధి, 4.పాండ్యుడు, 5. నీలుడు, 6.ద్రుపదుడు, 7.విరాటుడు అనే రాజులు ఒక్కొక్కరు ఒక్కొక్క అక్షౌహిణి సేనతో పాండవ సేనలో చేరారు. అక్ష+ఉహినులు=అక్షోహిణులు. అంటే ఇంద్రియాలకు సంబంధించిన మనోవృత్తులు. సప్త+అక్షోహిణులు= అంటే సాధకుడి శరీరంలోని సాత్త్విక గుణాలుగల సప్త ధాతువులు. సప్తాక్షోహిణులకు ఏడుగురు నాయకులు. వారు ముక్తి సాధకుడిలోని సప్తసాత్త్విక లక్షణాలయిన 1.నిశ్చలత, 2.సర్వోత్కృష్టత, 3.శిథిలతారాహిత్యం, 4.జ్ఞానస్థితి, 5.అసంగతత్త్వం, 6.ప్రకృతి మూలస్థితి, 7.చైతన్యసుస్థిరస్థితి అనే వాటికి ప్రతీకలు. ఆ సప్తసాత్త్విక లక్షణాలు ముక్తిసాధన చేసే సాత్త్విక వృత్తులకు బలాన్నిస్తాయి. పాండవులకు ఏడక్షౌహిణుల సైన్యం సమకూరిందంటే అందులోని అంతరార్థ మిది.

కౌరవసేనలో 11 మంది రాజులు ఒక్కొక్క అక్షౌహిణీసేనతో చేరారు. వారు- 1.భగదత్తుడు, 2.భూరిశ్రవుడు, 3.శల్యుడు, 4.కృతవర్మ, 5.హార్దిక్యుడు, 6.జయద్రథుడు, 7.సుదక్షిణుడు, 8.కాంభోజరాజు, 9.బహురూపుడు, 10,11

అవంతిరాజులిద్దరు. మొత్తం కౌరవసైన్యం పదకొండు అక్షౌహిణులు. సాధకుడిలోని ముక్తివృత్తులను నాశనం చేయ సంకల్పించి, దశేంద్రియాలూ, మనస్సు అనే ప్రకృతి తత్త్వాల్లోనూ ఉన్న తామసిక గుణానికి తోడ్పాటును అందించే మనోవృత్తులు పదకొండు అక్షౌహిణులుగా చెప్పబడ్డాయి. పదకొండుమంది అక్షౌహిణీపతులు పదకొండు ప్రవృత్తులకు ప్రతినిధులు. భగవద్దత్తమౌ జన్మకారణమైన కర్మవాసన (భగదత్తుడు). అహంకారంతో పేరుపొందాలనే అశాశ్వత కీర్తి కాంక్ష (భూరిశ్రవుడు), సాత్త్విక తామసిక వృత్తులకు మధ్యస్థితిలో ఉండే శల్య ప్రవృత్తి (శల్యుడు), సంచిత కర్మవలన కలిగే తామసిక ప్రవృత్తి (కృతవర్మ), వినాశకరమైన మనోవృత్తి (హార్దికుడు), జనన మరణ పరిభ్రమణాలుగల శరీరస్థితి (జయద్రథుడు), వివిధ వృత్తులతో గల భోగాసక్తత (సుదక్షిణుడు), సుఖాసక్తత (కాంభోజరాజు), చంచలత్వదృష్టి (బహురూపుడు), సుఖదుఃఖాది ద్వంద్వగుణాలు (అవంతి రాజద్వయం) అనే ప్రవృత్తులు అక్షౌహిణీపతులు. ఈ ప్రవృత్తులు తామసిక గుణంతో చెలిమి చేస్తూ సాధకుడిలోని ముక్తిసాధనను భ్రష్టం చేస్తూ నిత్యమూ ఘర్షణను సృష్టించే ఐహికపరమైన పదకొండు మనోవృత్తులు. ఇవి ముక్తిసాధనను నాశనం చెయ్యటానికి తామసవృత్తికి తోడ్పడతాయి అని అంతరార్థంగా గ్రహించాలి.

(5). శ్రీకృష్ణుడి రాయబారం

తామసిక వృత్తులను నిరోధించి నివృత్తి తత్త్వ ప్రబోధాన్ని సాధించటం శ్రీకృష్ణుడి రాయబారంలోని పరమార్థం. అయితే, తామసిక వృత్తుల నిరోధం యుద్ధంతో సాధించటమా? (అంటే సర్వతామసిక వృత్తులను నశింపచేయటమా లేక జ్ఞానంలో విలీనం చేయటమా?) లేక పంచేంద్రియాలలోని తామసిక వృత్తులను విఘ్నకారులు కాకుండా చేస్తే సరిపోదా? అన్న సులభ సాధనాభ్యాస విమర్శయే కౌరవులతో అయిదూళ్ళతో సంధియా? లేక యుద్ధమా? అన్న ఆలోచనలోని అంతరార్థం.

కొన్ని సాత్త్విక సాధనావృత్తులు సర్వతామసిక వృత్తులను వినాశం పొందించి తీరవలసిందే అని నిశ్చయించగా, మరికొన్ని పంచేంద్రియాలలోనూ తామసిక వృత్తులను లేకుండా చేస్తే సరిపోతుందనీ, ముక్తి పొందటానికి అదే చాలునని అభిప్రాయపడతాయి అన్నదే ధర్మరాజు సంధికి అంతరార్థం. ముక్తి మనోవృత్తి సర్వసంపూర్ణ ముక్తినే కాంక్షిస్తుందన్నది ద్రౌపది మాటల కంతరార్థం. నివృత్తి తత్త్వమైన శ్రీకృష్ణుడు కూడా అనగా పరమాత్మ వృత్తి కూడా సర్వసంపూర్ణ తామసిక నాశనాన్నే లోలోన అభిలషిస్తుంది.

సత్యం, శివం, సుందరం అనేవి నిర్గుణ పరమాత్మను చెప్పే పదాలు. సాధకుడిలో సత్యవృత్తి (సాత్యకి) కూడా తామసిక వినాశం వలననే ముక్తి యొక్క సంపూర్ణత సిద్ధిస్తుందని చెప్పుతుంది. జ్ఞానదీప్తి (సహదేవుడు) కూడా సర్వతామసిక వృత్తి యొక్క వినాశనాన్నే కోరుతుంది. ద్రౌపది, కృష్ణుడు, సాత్యకి, సహదేవుడు కేవలం యుద్ధాన్నే కోరారనటంలోని తాత్పర్య మిదే.

భీమార్జునులు యుద్ధమైనా సరే, సంధి అయినా సరే అన్నారంటే- అభయవృత్తీ, ఋజువృత్తీ రెండు మార్గాలలో కూడా ప్రవర్తించే వన్నమాట! యుధిష్ఠిరుడు మాత్రం కేవలం సంధినే కోరాడంటే యమనియమాది అష్టాంగ యోగవృత్తి శరీరంలో పంచేంద్రియ తామసికప్రవృత్తులను అణచివేసే వృత్తియేకాని, అది జ్ఞానంలో శక్తిగల వృత్తి కాదు. కాన, దానికి అయిదు ఇంద్రియాలలోనూ తామసిక వృత్తులు లేకపోతే సర్వసంపూర్ణ ముక్తి అదే సిద్ధిస్తుందని ధర్మరాజు సంధి యత్నంలోని అంతరార్థం.

సాధకుల ఇచ్ఛానుసారం ఎవరికి వారు ముక్తిసాధనలను ఎంచుకొని సాగించుకొంటారనే తత్త్వాన్ని చెప్పే కథాభాగమే- సంధియా? యుద్ధమా? అన్న చర్చ.

(6). ధృతరాష్ట్రుడి సభలో శ్రీకృష్ణుడి విశ్వరూప ప్రదర్శనం

"విదురుడు అంటే జ్ఞానం. కృష్ణుడు అంటే నిర్వృతితత్త్వం. నిర్వృతి తత్త్వం జ్ఞానంతో విడవకుండా కలిసియే ఉంటుందన్నదే కృష్ణుడు విదురునింట్లో మకాం చేశాడు, విదురునితో సభాభవనానికి వెళ్ళాడు అన్నదానికి అంతరార్థం.

తామసిక వృత్తులు, సాత్త్విక వృత్తులతో ఏదో విధంగా పొత్తుగా ఉంటే వాటి మనుగడ సాగుతుందనీ, తాత్కాలికంగా తామసిక వృత్తులు సాత్త్విక వృత్తులను అణచగలిగినా చిట్టచివరకు సాత్త్విక వృత్తులు ఎప్పటికైనా ముక్తిని సాధించియే తీరుతాయనీ, కృష్ణుడి రాయబారంలోని అంతరార్థ సారాంశంగా మనకు తెలుస్తున్నది. ధృతరాష్ట్రునకు దివ్యదృష్టి ప్రసాదించబడి కృష్ణునిచే విశ్వరూపం చూపించబడింది. అంతలో అది ఉపసంహరింపబడింది. అంటే సాధకునిలోనున్న మూల తామసిక వృత్తికి అంతలోనే నిర్వృతి తత్త్వం ఆవహించి జ్ఞానోదయం కల్గి అంతలోనే అంతర్హితమైంది అనేది అంతరార్థంగా భావించాలి. అంటే సాధకునిలోని తామసిక గుణానికి కూడా తాను జరుపుతున్న సాత్త్విక గుణ వినాశన కార్యంలో తన శక్తిమీద ధైర్యం సడలి పోతుండడమూ, అంతలోనే తిరిగి స్వశక్తి మీద విశ్వాసం కల్గుతూండడమూ, జరుగుతూంటుందని అర్థం. మనస్సుచే కల్పితములగు విషయములందు సంగము అనేది లేకపోవడమే దివ్యదృష్టి అంటే. ఈ దివ్యదృష్టితో దేహదృష్టి నష్టమౌతుంది. వివిధంగా ఉండే విశ్వమంతటినీ విరాట్‌స్వరూప భగవంతుని అవయవములుగా గ్రహించు జ్ఞానప్రాప్తియే విశ్వరూప సందర్శన యోగమంటే "విశతి పరమాత్మా అత్ర ఇతి విశ్వం" అని వ్యుత్పత్తిలో ప్రపంచ స్వరూపాన్ని పరమాత్మ స్వరూపంగా తెలిసికొనే జ్ఞానం పొందడం విశ్వరూప సందర్శనానికి అర్థం. ధృతరాష్ట్రునకు తన పుత్రుల దురాగత కృత్యాలవలన ముందు ముందు కలిగే నష్టం కండ్లకు కట్టినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా దుర్యోధనుని మరలించలేకపోయాడంటే సాధకులలోని తమోగుణం తన ప్రవృత్తి వల్ల తనకు నష్టం కల్గుతుందని తనకు స్పష్టంగా అనిపించినా దానిని లెక్కచేయక అహంకార మమకారాల ప్రాబల్యంతో సహజమైన తామసిక వృత్తుల్ని వదలియుండలేడన్న సంగతిని సాధకులు గుర్తించాలి. ఎన్ని విధాల జ్ఞానప్రబోధం జరిగినా తామసిక వృత్తి తన సహజతత్త్వం విడవదన్నదే గాంధారీ విదుర భీష్మద్రోణాదులు చెప్పినా దుర్యోధనుడు వినలేదన్న దానికి అంతరార్థం. కృష్ణుణ్ణి దుర్యోధనాదులు బంధించే యత్నం చేసేరంటే తామసిక వృత్తులు నిర్వృతి తత్త్వం తమ్ము ఆవరిస్తే తమ ఉనికికే భంగం కల్గుతుంది కాన అది తమ్ము ఆవరించకుండా చేసికొనే తామసిక ప్రకృతి యొక్క ప్రబల ప్రయత్నంగా దానిని భావించాలి."

(7). శ్రీకృష్ణుడు కర్ణుడిని దుర్యోధనుడి పక్షం నుండి విడదీయటానికి చేసిన యత్నం

"కర్ణుని పాండవ పక్షంలో చేరడానికి కృష్ణుడు ఎన్ని విధాలుగానో యత్నించేడు. కర్ణుడు అంటే యోగమార్గంలోని పాక్షికంగా అమనస్కసుఖం అనుభవించే కుంభక ప్రాణాయామంగా మనం లోగడ అంతరార్థపరంగా చెప్పుకొని ఉన్నాం. సర్వసంపూర్ణమైన అమనస్కతయే నిర్వృతి తత్త్వం అలవడడానికి కారణం. నిర్వృతియే ముక్తి అంటే.

ముక్తితత్త్వం సాధించాలంటే సంపూర్ణమైన అమనస్కత కావాలి. ఆ అమనస్కత కుంభక ప్రాణాయామ ధ్యానం వల్ల కొంతసేపు మాత్రమే సిద్ధిస్తుంది. సాత్త్విక వృత్తులు మాత్రమే జ్ఞానమార్గంలో సర్వసంపూర్ణమైన అమనస్కతను సాధించగల్గుతాయి. అమనస్కతను స్థిరంగా నిల్పుకోవడానికి ఎక్కువ అభ్యాసం శ్రమ అవసరం. అయితే జ్ఞానమార్గంలో సాధించిన అమనస్కతయే సర్వ సంపూర్ణమైన, శాశ్వతమైన అమనస్కత అవుతుంది. కుంభక ప్రాణాయామంతో కల్గే అమనస్కత అసంపూర్ణమై అశాశ్వతమైనది మాత్రమే అవుతుంది. అది సులభంగా సాధ్యమయ్యేదే. సాధకులు యోగమార్గంలో కుంభకంతో అమనస్కతను అభ్యాసం చేసి ఆ అభ్యాసపాటవంవల్ల కుంభకం విడిచిన తర్వాత కూడ దానిని శాశ్వతంగా నిల్పుకొని సులభంగా ముక్తిని సాధించటం అనేది, యోగజ్ఞానమార్గాల రెండింటి యొక్క కలయిక వల్ల కల్గే ఫలితం. ఇది ముక్తి సాధకుల చేత అభ్యసింపబడుతుంది. ఈ సంగతి సాధకులకు తెల్పడమే కర్ణుణ్ణి పాండవులలో చేర్చడానికి కృష్ణుడు చేసిన ప్రయత్నానికి అంతరార్థం. నీవు కౌరవులలో ఉన్నా కుంతీపుత్రుడవుగా పాండురాజుకు కొడుకువే అవుతావనీ, పాండవులకు నీవు అన్నవౌతావనీ, ఆ కారణంగా నీకు రాజ్య పట్టాభిషేకం జరుపుతామనీ, ద్రౌపది ఆరవ భర్తగా నిన్ను వరిస్తుందని కృష్ణుడు కర్ణుని హెచ్చరించాడు. అంటే తమో వృత్తులతో (కౌరవులతో) కుంభకయోగం (కర్ణుడు) కలిసియున్నా పరంపరా సంబంధం వల్ల అది సాత్త్విక వర్గంలోనిదే అవుతుంది. కాన ముక్తిని కోరే పంచ సాత్త్విక వృత్తులతో (పాండవులతో) సోదరత్వం దానికి సిద్ధిస్తుందనీ, సాధకునిలోని ముక్తి తపన (ద్రౌపది) ముక్తి సాధనల్లో ఆరవ సూచనగా అంతరార్థం ఇందు గోచరిస్తుంది.

తామసిక వృత్తితో కాక కుంభక యోగం సాత్త్విక వృత్తుల చేరికతో అభ్యాసం సాగిస్తే కుంభకాన్ని విడిచినప్పుడు కూడ అమనస్కత సిద్ధించే వీలుంది. అలాగు సాత్త్విక వృత్తులతో కలవకపోతే కుంభక యోగంలోని పాక్షిక తామసిక గుణాన్ని జ్ఞానయోగంలోని ఋజువర్తనా వృత్తితో నాశం చేయడం జరగవలసి వస్తుంది- అని సాధకులకు తెలియచెప్పటమే కృష్ణుని పరుషోక్తులకు అంతరార్థం. కృష్ణుడు పాండవుల నివాసమైన ఉపప్లావ్యానికి చేరుకున్నాడు. 'ఉప' అంటే సమీపం అని అర్థం. ప్లవము అంటే తేలింపజేసేది తెప్ప అని అర్థం. ప్లావ్యం అంటే తేలింపజేయదగ్గది. తరింపజేసే సాధనా స్థితి అని అర్థం. ఆ స్థితి యొక్క సామీప్యంలో అనగా ముక్తి సామీప్యంలో సాత్త్విక వృత్తులున్నాయని అక్కడకు నిర్వృతి తత్త్వం చేరుకొంది అని కృష్ణుడు ఉపప్లావ్యానికి చేరాడన్నదానికి అంతరార్థం గ్రహించాలి.''

(8). కర్ణుడిని పాండవులలో చేర్చటానికి కుంతీ ప్రబోధం: కర్ణుడి తిరస్కారం

''కుంతి అంటే 'కుంధీ' అని. అనగా సాధకునిలోని ఐహిక బుద్ధివృత్తి అనీ లోగడ చెప్పుకున్నాం. కర్ణుడు ఆమెకు సూర్యునివల్ల కల్గిన కుమారుడు కాన అతనిలో పిత్రంశంగా జ్ఞానదీప్తి, మాత్రంశంగా ఐహిక తామసిక వృత్తి కూడా చోటుచేసికొని ఉన్నాయి. కర్ణ పదానికి కుంభక యోగం అని అర్థం చెప్పుకొని ఉన్నాం. కుంభక యోగంలో వాయువును కుంభించి అమనస్కత కల్గినప్పుడు జ్ఞానదీప్తి, వాయువును విడిచివేసినపుడు ఐహిక తామస వృత్తి నిలిచి ఉంటాయి. కాన, కుంతి కర్ణుని ప్రబోధించిందంటే సాధకునిలోని కుంధీ వృత్తి అనగా ఐహిక భోగ వాంఛా వృత్తి కుంభకంలో పాక్షికంగా ఉండే ఐహిక వృత్తిని మేల్కొలిపే యత్నం చేసిందన్నమాట.

సూర్యుడు ''తల్లి మాట ప్రకారం ఆచరింపుమని ప్రబోధించే''డంటే సాధకునిలోని కుంభకయోగంలోని అమనస్కతతో పాక్షికంగా ఉన్న జ్ఞానదీప్తి సాత్త్వికవృత్తితో కాక పాండవులతో కాక తామసిక వృత్తితో (దుర్యోధనునితో) చెలిమి చేస్తూంటుంది. కావటం వల్ల కుంభకంలో వాయు నిరోధంతో వున్నప్పుడు కల్గిన అమనస్క జ్ఞానదీప్తికి సుస్థిరత రాదనీ తామసిక వృత్తులతో కాక సాత్త్విక వృత్తుల (పాండవుల) పొత్తుతోనే దానికి సుస్థిరత ఏర్పడి ఫలితం కల్గుతుందని ఆ ప్రబోధంలో అంతరార్థపరంగా యోగజ్ఞాన మార్గాలలో సాధన చేసే సాధకులకు తెలియజెప్పటమే అని మనం స్పష్టంగా గ్రహించవచ్చు.

కర్ణుడు ''అర్జునుడిని'' తప్ప మిగిలిన యుధిష్ఠిర భీమనకుల సహదేవులను యుద్ధంలో తనను ఎంత హింసించినా తాను వారిని చంపను అన్నాడు. అర్జునుడు అంటే సాధకునిలోని ఋజువర్తనా సాధన. దానివల్ల కలిగే ఫలితము కూడా ఒక్కటే. రెండూ జ్ఞాన ప్రదాయకములైన సాధనలే కాక ఒకటి ఉంటే రెండవది ఉండనక్కరలేదు. ఉండదు కూడ 'ఒకటి జ్ఞానమార్గంలోనిది' రెండవది యోగమార్గం లోనిది అనే పేర్లకు సంబంధించిన భేదమే తప్ప రెండూ ఇచ్చే ఫలితం ఒక్కటే. జ్ఞాన ప్రబోధం, యోగ ప్రబోధం రెండూ ముక్తిని సిద్ధింపజేయడంలో ఒకటే గనుక ఒకటి వుంటే రెండవది ఉండే అవసరం లేదు. అట్లా రెండూ వుండడం సంభవమూ కాదని సాధకులకు తెలియజేయడమే కర్ణుడు చేసిన అర్జున వధ ప్రతిజ్ఞలోని అంతరార్థంగా గ్రహించాలి. అయితే కుంతి, కర్ణుని పాండవుల పక్షంలోనికి రమ్మన్నది అన్నదానికి అంతరార్థ ప్రయోజనం ఏముంది? అనే ప్రశ్న ఇచ్చట సాధకులకు కల్గవచ్చు. తామసిక వృత్తితో కలయికే లేకపోతే ఋజు ప్రవర్తనా వృత్తితో కుంభక వృత్తి ముక్తి సంపాదనలో సమానమే అవుతుంది. యోగమార్గంలో కుంభక సాధన చేసే సాధకులు సాత్త్విక గుణాసక్తులుగా ఉండాలని వ్యాసుడు అంతరార్థపరంగా సాధకులకు చేసిన హెచ్చరికగా ఈ కుంతీ ప్రబోధాన్ని మనం గుర్తించాల్సి ఉంది. యుధిష్ఠిరుడంటే యమనియమాది యోగ సాధన. భీముడు అంటే అభయ వృత్తి. నకులుడంటే ఐహిక భోగ నివృత్తి; సహదేవుడంటే జ్ఞానదీప్తి. ఈ వృత్తులు కుంభక వృత్తికి సహకారులే కాని బాధాకరములు కావు. కాన అవి కర్ణుని అనగా కుంభక యోగవృత్తిని బాధించవు. ఒకవేళ బాధించినా కుంభక వృత్తి వానిని నశింపజేయవలసిన పనిలేదు. ఈ విధంగా కుంభక వృత్తి కుంభకాన్ని విడిచినప్పుడు ఒక ఋజు ప్రవర్తనా వృత్తిని తప్ప మిగిలిన వానిని నశింపజేయకుండా జాగ్రత్త వహింపవచ్చునని చెప్పడమే యుధిష్ఠిరాదులను చంపనని కర్ణుడన్న దానికి అంతరార్థపరమైన అర్థం. జ్ఞాన మార్గంలోని

ఋజు వృత్తిని పొందటం శక్యం కాకపోతే సాత్త్విక గుణశక్తితో కుంభక యోగవృత్తి యొక్క అభ్యాసంతో దాని లోటు భర్తీ చేసుకోవచ్చుననీ, యోగమార్గంలోని కుంభక యోగవృత్తిని నిర్వర్తించుకోలేకపోతే జ్ఞానమార్గంలోని ఋజువర్తనా వృత్తిని చేపట్టి మిగిలిన నాలుగు సాత్త్విక వృత్తులతో కూడి కొంత ఫలితం పొందవచ్చుననీ చెప్పడమే కర్ణుడు చనిపోయి అర్జునుడున్నా, అర్జునుడు చనిపోయి కర్ణుడున్నా నీకు అయిదుగురు పుత్రులు ఎప్పుడూ ఉండనే ఉంటారని కర్ణుడు, తల్లికి చివరిమాటగా చెప్పినదానికి అంతరార్థం. నేడు తమోగుణం వదలక యోగమార్గంలో కుంభక యోగంతో కల్గిన పాక్షిక అమనస్కతా శక్తివల్ల అణిమాది ఐహిక సిద్ధులు సిద్ధింపజేసికొని కొందరు బాబాలు, యోగులు ప్రజలకు దైవశక్తులుగా వానిని నమ్మించి ముక్తిసాధనను పూర్తి చేయకుండా ఆత్మద్రోహానికి పాల్పడే వారిని దుర్యోధనునికి తోడ్పడిన సూతపుత్రునిగా రాధేయునిగా, వసుషేణునిగా ముక్తిమార్గదూరులుగా వేర్పడిన కర్ణనామధారులనుగా తెలిసికోవాలనే హెచ్చరికను కూడా ఇందు అంతరార్థపరంగా ముక్తి సాధకులు గ్రహించాలి."

(ఉద్యోగపర్వం: అంతరార్థం - అనే ఈ అంశాన్ని కళాప్రపూర్ణ, సరస్వతీ కంఠాభరణ, తత్త్వార్థ ప్రబోధక, విద్వాన్ డా.వేదుల సూర్యనారాయణశర్మగారి 'అంతరార్థ మహాభారతము' (ముక్తిసాధనా మార్గము) నుండి కృతజ్ఞతలతో గ్రహించటమైనది.)

10. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం

ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం తెలుగులో అవతరించి దాదాపు వెయ్యేళ్ళు ఔతున్నా, ఇంత వరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళ వ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వమైన సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మ ప్రచారమహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమ వేదవ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండల రాయడు మాత్రమే చేపట్టి, ధర్మరక్షణ కళాప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమ దయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధ మండలిని పరిష్కరించి, ప్రతిపద్యానికి వ్యాఖ్యానం వెలయించి, సవిమర్శకమైన పీఠికలు సమకూర్చి, కథాసారాదులతో సర్వార్థ సాధకంగా సంతరించి, సర్వాంగ సుందరంగా ప్రచురించి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీతిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి అభ్యుదయపరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి బోర్డ్ ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదకులూ, వారి సహకారులూ, సంపాదక సలహా మండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్‌సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికార, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన అరణ్యపర్వం మూడవ సంపుటిగా రెండు భాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన అరణ్య పర్వభాగం. రెండవ భాగం ఎఱ్ఱాప్రెగ్గడ పూరించిన అరణ్య పర్వ శేషం. ఈ విధంగా అరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ప్రథమం. ఇక నాల్గవ సంపుటిగా విరాటపర్వం వెలువడింది. ఇప్పటి ఈ అయిదవ సంపుటి ఉద్యోగపర్వం.

ఉద్యోగపర్వ వ్యాఖ్యానంలో ఇద్దరు మహాపండితులు, కవులు, విమర్శకులు పాల్గొన్నారు. మొదటి రెండాశ్వాసాలకు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, మిగిలిన రెండాశ్వాసాలకు శ్రీముదివర్తి కొండమాచార్యులుగారూ వ్యాఖ్యానం

వ్రాశారు. వీరిరువురూ ప్రసిద్ధ సాహిత్యాచార్యులూ, పరిశోధకులే కాక సహృదయశిఖామణులు, వ్యాకరణాలంకార శాస్త్ర నిష్ణాతులు. మీదు మిక్కిలి భారత తత్త్వ దర్శనం చేసిన మనీషులు. వారు ప్రతిభావంతమైన తమ వ్యాఖ్యానంతో ఉద్యోగపర్వాన్ని ఉజ్జ్వలంగా తీర్చిదిద్దారు. వారికి నా నమోవాకాలు.

తిక్కన సోమయాజి కవిత్వంలోని శిల్పకళావిశేషాలను సహృదయులకు అందుబాటులోకి తీసికొని రావటానికి అనువుగా నేను చాలా చోట్ల విశేష వ్యాఖ్యలు వ్రాసి వివరించాను. అవి 'సంపా'. అనే సంకేతాక్షరాలతో సూచించబడ్డాయి. ఉద్యోగ పర్వంలోని రాజనీతి విశేషాలు, రాయబారాల తీరులు, తిక్కన రచనలోని దృశ్యకావ్య వైఖరులు, కావ్యశిల్పానుశీలన సమీక్షలు. అంతరార్థ పరిశీలనలు మొదలైన అంశాలతో సవిమర్శకమైన పీఠికను సంతరించాను. ఉద్యోగపర్వ కథాసారాన్ని సమకూర్చాను. ఈ ప్రయత్నం ఆంధ్రావళి ఆమోదాన్ని పొందుతుందని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ కె.సత్యరామప్రసాద్ గారికీ, శ్రీ జి.రాధాకృష్ణగారికీ, శ్రీబాబుగారికీ, శ్రీమతి సుశీలా లక్ష్మీవిద్యానాథులకూ, డాక్టర్ వి.యస్.లక్ష్మికీ నా హార్దమైన కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామివారు వేదవేద్యుడు, వేదాంతగమ్యుడు, పరతత్త్వరూపుడు అయిన భక్త సులభుడు, సాహిత్య సంగీత ప్రియుడు, రసానందమూర్తి. ఆ స్వామికి ఈ పంచమ వేదం అక్షరమైన తోమాలసేవ. వ్యాఖ్యానం సుగంధపరిమళసేవ. ఉద్యోగ పర్వ విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ. పీఠిక విరాణ్మూర్తికి మంగళ నీరాజనం. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చనం.

సత్య శివ సుందర రూపుడైన స్వామి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజా కుసుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వ శ్రేయస్సును ప్రసాదించుమని స్వామిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
చిత్రభాను మహాశివరాత్రి
1-3-2003

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం

ఉద్యోగపర్వ కథాసారం

ఉత్తరాభిమన్యుల వివాహానికి వచ్చిన రాజబంధువులందరూ ఉపప్లావ్యంలో సమావేశమైనారు. శ్రీకృష్ణుడు పాండవ కార్యార్థియై వారందరినీ ఇట్లా ప్రబోధించాడు.

పాండవోద్యోగం

'పాండవులు కపటద్యూతంలో రాజ్యసంపదనంతా కోల్పోయారు. పరాక్రమవంతులై ఉండి కూడా సత్యనిరతితో అరణ్యాజ్ఞాతవాసాలు పూర్తిచేశారు. పన్నెండేళ్ళ అరణ్యవాసంలో రాక్షసుల వలనా, క్రూరమృగాలవలనా ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యారు. కష్టతరమైన పదమూడో యేడు ఎన్నోఆపద లెదుర్కొని ఎట్లా గట్టెక్కగలిగారో మీకందరికీ తెలిసిందే. ధర్మరాజు ధర్మమార్గం తప్పి ఇంద్రపదవిని కూడా ఆశించడు. పాండవులు పితృధనంగానే కాక, దిగ్విజయం చేసి సంపాదించుకొన్నారు వారి సామ్రాజ్యాన్ని. దాన్ని కపటద్యూతంలో ధార్తరాష్ట్రులు అపహరించారు. అయినా, ధర్మరాజు వారికి కీడు చేయ తలపెట్టడు. ఈ రెండు విధాలను మనం పరిశీలిస్తే ఈ రెండు తెగలవారూ రాజ్యాన్ని పంచుకొని అనుభవించటం తగిన కార్యమని అనిపిస్తున్నది. దీనిపై మీ అభిప్రాయాలు ప్రకటించండి. ముందుగా నా మాట చెపుతున్నాను - పాండవు లింతవరకూ శాంతులై సమయాన్ని పాటించారు. ఇకపై తమ పరాక్రమాన్ని ప్రదర్శించుకొనాలని భావిస్తున్నారు. వీరి తలపు తెలిస్తే దుర్యోధనుడు తన మిత్రులతో కలిసి యుద్ధానికి సిద్ధమౌతాడు. యుద్ధమన్న తరువాత తక్కువబలం ఉన్నవారిమీద ఎక్కువబలం ఉన్నవారి ప్రభావం కనబడుతుంది. పాండవు లెంత బలవంతులైనా సైన్యబలాన్ని, మిత్రబలాన్ని సమీకరించుకోక తప్పదు. అప్పుడు ఈ వైపునా, ఆ వైపునా రాజులకూటమి ఏర్పడక మానదు. దేవాసురుల యుద్ధంలోవలె కొందరు చనిపోవక తీరదు. కాబట్టి ఇక్కడి వారి తలపులు, అక్కడివారి తలపులు ఎట్లా ఉన్నాయో తెలియవు. కార్యనిశ్చయం చేయటం ఇప్పుడు కష్టం. అందువలన తగిన రాయబారిని పంపటం అవసరం. దుర్యోధనుడు రాజ్యభాగం ఇచ్చాడా సరి, లేదా అప్పటికి తగిన విధంగా నడచుకొనటం న్యాయం'.

శ్రీకృష్ణుడి మాటలను బలరాముడు సమర్థించాడు. కాని, సాత్యకి రాయబారపు యత్నాన్ని వ్యతిరేకించాడు. 'సంగ్రామమే అవశ్య కర్తవ్య' మన్నాడు. అయితే, ధర్మరాజు అంగీకరించి రాయబారం నడపదలచుకొంటే - దీనంగా రాజ్యాన్ని అడగకుండా గౌరవపురస్సరంగా వా రిస్తే పుచ్చుకొనే పద్ధతిలోనే మాటలు సాగాలి' అని ప్రతిపాదించాడు. సాత్యకి అభిప్రాయాన్ని ద్రుపదుడు బలపరిచాడు. 'దుష్టాత్ముడైన దుర్యోధనుడు మంచిమాటలతో రాజ్యభాగా న్నివ్వటానికి అంగీకరించడు. దుర్జనుల హృదయాలు మెత్తని మాటలతో ప్రసన్నమౌతాయా? భీష్మద్రోణులు పెద్దవారే కాని, కూటికొరకు వారి ననుసరిస్తారు. ధృతరాష్ట్రుడికి కొడుకుమీద వ్యామోహం పెద్దది. కర్ణుడా వట్టి తులువ. మిగిలిన వారందరూ దుర్యోధనుడే సద్బుద్ధి కలవా డని కీర్తిస్తారు. కాబట్టి అతడు దుర్వినీతుడై ఎప్పుడూ యుద్ధానికే కాలుదువ్వుతుంటాడు. ఈసమయంలో మనం బలాలను సేకరించుకొనాలి. పిలువదగిన రాజులకు పిలుపులు పంపించాలి. దుర్యోధనుడు కూడా తనవారిని తాను పిలుచుకొంటాడు. ముందు పిలిచిన వారికి సహాయం అందజేసే మర్యాద రాజలోకంలో ఉన్నది. మనం త్వరపడి శల్య కేకయ జరాసంధ తనయాదులను, వారిబంధు మిత్రులను మన వైపు చేర్చుకొనటం అవసరం' -అని చెప్పి ద్రుపదుడు తన పురోహితుడిని దూతగా ధృతరాష్ట్రుడి పాలికి పంపాలనీ, ఎవ రెవరితో ఏయే మాటలు ఎట్లా మాట్లాడాలో అతడికి వివరంగా చెప్పితే వాటి నాతడు నిర్వహిస్తాడనీ సూచించాడు.

వాసుదేవుడు 'ద్రుపదుడి మాటలు కూడ ఉచితంగా ఉన్నాయి. అట్లాగే చేయాలి' అని అంటూ - 'నాకు కౌరవులు పాండవులు సమానమే. వారిరువురు రాజ్యాన్ని పంచుకొని అనుభవిస్తే చూచి సంతోషిస్తాను. పెళ్ళికి వచ్చి చాలరోజులయింది. మా ఇళ్ళకు మేము పోవాలి. ద్రుపదు డందరికీ కావలసినవాడు, అన్నీ తెలిసినవాడు; అతడు ఎట్లా చేస్తే అట్లా కానివ్వండి. ఇరువురికీ స్నేహం కుదిరితే సంతోషం. లేదా, మమ్ములను పిలవ బంపండి; వచ్చి సాయం చేస్తాం' ఆపైన అర్జునుడి కోపాగ్ని వారిని చుట్టుముట్టక మానదు' - అని నిష్కర్షచేసి నిజనగరానికి బయలుదేరాడు.

ఉద్యోగపర్వ కథాసారం - 68

విరటుడి ప్రేరణతో యుద్ధోద్యోగం పాండవపక్షంలో ప్రారంభమయింది. పాండవులు, విరాటరాజు, ద్రుపదుడు సైన్యాలతో ఊరివెలుపల గుడారా లెత్తించి తమ కనురక్తులైన రాజులవద్దకు తగిన దూతలను పంపారు. ఈ సంగతిని తెలిసికొన్న దుర్యోధనుడు కూడా తన బంధుమిత్రగణాలను సమీకరించటం మొదలు పెట్టాడు. ఇట్లా రెండువైపులా స్కంధావారాలు సైన్యాలతో సమృద్ధమౌతూ ఉన్నాయి.

ద్రుపద పురోహితుడి రాయబారం

ద్రుపదుడు ధర్మజుడి అనుమతితో వయోజ్ఞానవృద్ధుడైన పురోహితుడిని పిలిపించి ధృతరాష్ట్రుడి పాలికి దూతగా పంప నియోగించి ఇట్లా ప్రబోధించాడు - 'నీవు మతిమంతుడవు, చతురవచన కోవిదుడవు, సమయజ్ఞుడవు, హితుడవు కాబట్టి పాండవార్థమై నిన్ను ధృతరాష్ట్రుడి పాలికి దూతగా పంపుతున్నాను. అతడు పుత్రమమకారం కలవాడు; కుటిలుడు. అతడి వర్తనం, ధర్మజుడి శీలం రెండూ నీకు తెలుసు. పాండవులకు రాజ్యభాగం అడుగుతూ ధర్మనిష్ఠతో మాట్లాడితే అతడి అనుచరులందరూ ఆగ్రహిస్తారు. గురుభీష్మాదుల హృదయాలు యుద్ధంమీదకు పోకుండా, దుర్యోధనుడు సంధికంగీకరించేటట్లు నిపుణంగా మాట్లాడాలి. బంధువుల కందరికీ పాండవులు పడిన పాట్లను వివరిస్తూ, ఎవరికి నచ్చేవిధం వారిపట్ల అనుసరిస్తూ, నీవు చెప్పేదే మంచిమార్గమని వారందరూ భావించేటట్లు పలకాలి. అంతేకాదు, అక్కడి అందరి మనస్సులూ ఇక్కడ వ్రాలేటట్లు ఎన్నిఉపాయాలు దొరికితే అన్నీ ప్రయోగించాలి. కృష్ణాదుల వాదాలు నీవు విన్నావు కదా! వాటికి అనుకూలంగా పాండవులకు తేజోలాభం కలిగేటట్లు కార్యం నిర్వహించాలి. కురువృద్ధుల హృదయాలు గమనిస్తూ మసలుకొనాలి. నీ వాక్యసూత్రానికి సుయోధను డంగీకరించాడా - అదే అందరికీ సంతోషం కలిగిస్తుంది; ధర్మరాజుకు ప్రీతిని కలిగిస్తుంది. ఇక పోయిరా' అని హస్తినాపురికి పంపాడు. అతడు హస్తినాపురం వెళ్ళి కొన్నాళ్ళుండి ధృతరాష్ట్ర దుర్యోధన భీష్మాదులతో తగిన మాటలాడుతూ తగిన సమయంకొరకు ఎదురు చూచాడు.

ఆ సమయంలోనే ఇరుపక్షాలవారు వారివారి మిత్రులను సాయమడిగే యత్నాలు సాగిస్తున్నారు. దుర్యోధనుడు అన్యరాజన్యులను అడిగినట్లుగానే శ్రీకృష్ణుడి సహాయం అడగడానికి దూతను పంపటం ఉచితం కాదని తానే స్వయంగా వెళ్ళాడు. శ్రీకృష్ణుడు తన మందిరంలో శయనించి ఉన్నాడు. దుర్యోధనుడు వెళ్ళి తలవైపున ఉన్నపెద్దగద్దెమీద కూర్చున్నాడు. అదే సమయంలో అర్జునుడు కూడా వచ్చాడు. అతడు శ్రీహరిపాదాలచెంత వినమ్రుడై నిలువబడ్డాడు. కృష్ణుడు నిద్ర లేచి ముందుగా అర్జునుడిని చూచి పలుకరించాడు; ఆ తరువాత దుర్యోధనుడిని చూచి సంభావించాడు. ఇద్దరినీ వచ్చిన పనిని గూర్చి అడిగాడు. రాబోవు యుద్ధంలో తనకు సహాయం చేయు మని అడగటానికి వచ్చానని దుర్యోధనుడు పలికి, వచ్చిన వారిలో తానే మొదటివాడు కాబట్టి అడిగే అవకాశం మొదట కల్పించుమని కోరాడు.

శ్రీకృష్ణుడు అది కాదని, మొదట చూచినవాడు, చిన్నవాడు, అన్నచాటు వాడు అయిన అర్జునుడికి మొదట కోరుకొనే అవకాశం ఇచ్చాడు. తన బలాన్ని రెండు భాగాలు చేశాడు. నారాయణాఖ్యులైన పదివేలమంది గోపాలురు యుద్ధ నిపుణులు ఒకవైపు, ఆయుధం పట్టక యుద్ధం చేయక, సాయం చేసే తా నొక్కడూ ఒక్కవైపు ఏర్పరచాడు. ముందుగా అర్జునుడు శ్రీకృష్ణుడిని కోరుకొన్నాడు. దుర్యోధను డందుకు ఉప్పొంగి పోయి గోపాలురను తీసికొని వెడలి పోయాడు.

ఆ తరువాత సుయోధనుడు బలరాముడి సహాయాన్ని అర్థించాడు. అత డెవ్వరి పక్షాన పోరనని చెప్పాడు. ఆపైన కృతవర్మను కోరగా అక్షౌహిణీ సైన్యంతో అతడి పక్షాన చేరాడు.

పదివేల మంది నారాయణవీరులను కోరకుండా తన నొక్కని నెందుకు కోరుకొన్నావని శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నించాడు. అందుకు అత డిచ్చిన సమాధానం ఇది-

శ్రీకృష్ణా! నేను రణంలో ఎవరి సహాయాన్నీ తీసుకోను. నీవా ప్రసిద్ధుడవు. నీవు యుద్ధం చేస్తే నాకు పేరు రాదు. అంతేకాక నీ కెదురై విజయాన్ని సాధించటం దుర్లభం. విజయమూలమైన నీతోడు నాకుంటే చాలు. నీవు యుద్ధం

చేయకపోయినా సంతోషమే. అందువలననే నిన్ను కోరుకొన్నాను. ఓ మహాత్మా! నా రథానికి నీవు సారథివై నన్ను ముందుకు నడిపించు. అపారకృపారసం నా మీద చిలికి నాకీ వరం ప్రసాదించు. ఇది నా చిరకాలవాంఛితం. మన్నించు' అని పార్థుడు ప్రార్థించాడు.

'అర్జునా! నీ అభిమతం తీర్చటం నాకు ఆనందం. తప్పక నీ రథసారథ్యం నిర్వహిస్తాను. పార్థసారథి అనే పేరుతో ప్రసిద్ధిపొందుతాను' అని అనునయించి కిరీటిని తీసికొని ధర్మరాజు వద్దకు వెళ్ళి పాండవులకు కార్యాలోచనంలో మార్గదర్శిగా వ్యవహరించాడు మాధవుడు.

పాండవ దూతలు శల్య సహాయాన్ని కోరారు. అత డంగీకరించి పుత్రమిత్ర సేనాసమేతంగా బయలుదేరి ఉపప్లావ్యానికి అంచెలంచెలుగా యాత్ర సాగిస్తున్నాడు. దుర్యోధనుడు ప్రచ్ఛన్నంగా తనవారిచేత శల్య సైన్యానికి కావలసిన సౌకర్యాలన్నీచేయించాడు. దాని కతడు మెచ్చి పాండవదూతలే సహాయం చేస్తున్నారని భావించి వరమిస్తానని ప్రకటించాడు. సమయ మదేనని తెలిసికొని దుర్యోధనుడు శల్యుడి ముందుకు వచ్చి తన పక్షంలో చేరి యుద్ధం చేయుమని కోరాడు. దానికి కారణం-శల్యుడికి కౌరవపాండవు లిరువురూ సమానులేననీ, దుర్యోధనుడిని శల్యుడు ముందు చూచాడనీ పేర్కొన్నాడు. శల్యుడు దాని కంగీకరించాడు. కాని, ధర్మరాజుకు ఆ సంగతి చెప్పి వస్తానని ఉపప్లావ్యానికి వెళ్ళాడు. అతడికి జరిగిందంతా తెలిపాడు. ధర్మరాజు కూడా ఒక కోరిక కోరాడు. 'మాపక్షంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు సారథి. వారి పక్షంలో కర్ణుడి రథసారథిగా అశ్వహృదయం తెలిసిన నిన్నే కోరాలని భావించి ఉంటారు. కర్ణసారథ్యం వహించేటప్పుడు అర్జునుడికి విజయం కలిగేటట్లు సహాయం చేయాలని ప్రార్థించాడు ధర్మజుడు. శల్యుడు దానికి అంగీకరించాడు. కర్ణరథసారథ్యం చేసేటప్పుడు అతడి హృదయం వికలమయ్యేటట్లు మాట్లాడి పరోక్షంగా పార్థవిజయానికి దోహదం చేస్తానని వాగ్దానం చేశాడు. కాలం కలిసి రానప్పుడు ఇంద్రుడు సైతం కొంతకాలం అజ్ఞాతంగా ఉండవలసి వచ్చిందనీ, కాలం కలిసివచ్చినప్పుడు సంపదలు కలిసివస్తాయనీ, అంతవరకు ఓర్పుతో జీవించాలని ఇంద్రోపాఖ్యానాన్ని చెప్పి ధర్మరాజును ఊరడించి, ప్రోత్సహించాడు.

ఈ విధంగా కౌరవ పాండవులు బంధుమిత్రుల సహాయంతో సైన్యసమీకరణం చేసికొన్నారు. పాండవులకు ఏడక్షౌహిణులు, కౌరవులకు పదకొండు అక్షౌహిణులు చతురంగబలం సమకూరింది. రెండువైపులా స్కంధావారాలు రణోత్సాహంతో కయ్యానికి కాలుదువ్వుతున్నాయి.

కురుసభలో ద్రుపదపురోహితుడి దూతవాక్యం

ఈ వాతావరణంలో ధృతరాష్ట్రుడు ద్రుపదపురోహితుడి రాయబారాన్ని వినటానికి నిండుసభ తీర్చాడు. పురోహితుడు కౌరవేశ్వరుడికి, భీష్మాదులకు, దుర్యోధనాదులకు, సభాసదులకు అభివాదనం చేసి ఈ విధంగా ఉపన్యసించాడు.

'ధృతరాష్ట్ర పాండురాజులు సోదరులు కావటంచేత వారి వారి పుత్రులు తండ్రుల సంపదలను పొందటం మీకందరికీ ఉచితంగా తోస్తుందని భావిస్తాను. మొదటి రోజులలో వారిద్దరూ అట్లా ఉండటం కూడా మనకు తెలుసు. పాండవులు బాహుబలంతో రాజ్య వైభవాన్ని పొంది ఉండగా వంచనతో దానిని ధార్తరాష్ట్రులు గ్రహించిన విధం కూడా మీకు తెలుసు. ఈ పెద్దరాజు దీనికి అంగీకారం తెలిపాడు. ఇక ఏమని చెప్పేది?

నారీరత్నాన్ని సభలోకి ఆ విధంగా తెచ్చి అందరూ చూస్తుండగా చీరలు కుప్పలుపడేటట్లు విప్పి, సంపదలు హరించి, మహారణ్యంలో నివాసం చేసేటట్లు చేసి, తేలికగా మాట్లాడినప్పటికీ అన్నింటినీ సహించగలిగే పాండవులు ఈ సంధి ప్రయత్నం చేయటంలోని విలువను గమనించవచ్చును.

ధార్తరాష్ట్రుల వర్తనాన్నీ, పాండవుల వర్తనాన్నీ ఎటువంటి పక్షపాతం లేని బుద్ధితో వివేచించి ధృతరాష్ట్రుడికి మీరందరూ తగిన హితవు చెప్పండి.

పాండవులు కౌరవులతో పగను కోరటం లేదు. దానివలన ప్రజాక్షయం బాగా జరుగుతుంది కాబట్టి, దీనిని మీరు తేలికతనంగా తీసికొనవద్దు. వారు ధర్మపరులు కాబట్టి ఈ విధమైన న్యాయమార్గాన్ని అనుసరిస్తున్నారు.

అందున్నవి ఏడక్షౌహిణులు, ఇందుకూడినవి పదకొండు అక్షౌహిణులు అని బలగణాంకాలను గణిస్తారేమో! రణభూమిలో బాహుబలఘనుడు భీముడు, సాహసవీరుడు సాత్యకి వేయి అక్షౌహిణుల పెట్టు. గాండీవాన్ని చేపట్టి యుద్ధానికి సిద్ధమైన బీభత్సుడి పరాక్రమం అప్రతిహతం. అతడిని ఎదుర్కొనటం కొండను పొట్టేలు ఢీకొనటమే. అంతే కాదు, వివిధోపాయ నిపుణుడు, అఖిలవిద్యాజాల సంవేది అయిన మాధవుడు పాండవుల పక్షంలో ఉన్నాడు. ఇక వారికి అసాధ్యమనేది ఏముంటుంది? కాబట్టి, సమయం మించిపోకుండా, ఆ మహాత్ములను పిలిపించి హితం, ప్రియం రెండుపక్షాలవారికి కలిగేటట్లు భావించి న్యాయంగా కొంతరాజ్యం వారి కిచ్చి కలిసి ఉండటంలోనే కలదు సుఖం'.

ఈ విధంగా పలికిన పురోహితుడి సందేశం విని భీష్ముడు లేచి ఇట్లా అన్నాడు: 'పాండవులు ఎటువంటి ఆపదలు పొందకుండా ఉండటం అయ్యో! నిజంగా ఎంత అదృష్టం! శ్రీకృష్ణుడితో కలిసి, ధర్మమార్గాన్ని అనుసరించి, ప్రశాంతచిత్తాలతో ఇటువంటి సాధుమార్గాన్ని అనుసరించటం కూడా చాలమేలే! అయితే! ఓ రాయబారీ! నీ ఉపన్యాసం విప్రస్వభావంతో వినేవారికి పరుషంగా ఉండటం చేత నీ మాటలు కార్యరూపంలో పెట్టటానికి ఇష్టపడతారా? నియమానుసారులై పాండవులు పడిన పాట్లన్నీ లోకానికి తెలుసు. పుణ్యాత్ములను వేధించటం తగదు. వారికి కూడా రాజ్యంలో పాలిచ్చి ధృతరాష్ట్రుడు వారిని కూడా తన సుతులవలె చూచుకొనటం న్యాయం. అట్లా కాకపోతే ధర్మరాజు శాంతమూర్తిగా ఉంటాడేమో కాని అర్జునుడు ఊరుకొనడు. అతడు మోహరిస్తే ఎదురునిలిచే మగవాడున్నాడా ఈ లోకంలో?'

భీష్ముడి మాటలు కర్ణుడికి కోపం తెప్పించాయి. ఆవేశంతో అతడు ఇట్లా అన్నాడు.: 'అందరికీ తెలిసిన ఈ విషయాలను పదేపదే చెప్పటం దేనికి? జూదం దుర్యోధనుడి పక్షాన శకుని ఆడాడు. ధర్మరాజు ఓడిపోయాడు. ఇందులో తప్పేమి ఉన్నది? అరణ్యానికి వెళ్ళిన ధర్మజుడు సమయం ముగియకుండానే బయటపడి తండ్రిపాలు మాకు రావటం న్యాయమని గడుసరితనంతో అడగటం తప్పు. అంతేకాక విరటుడు, ద్రుపదుడు తమతమ సైన్యాలను తనకు సాయంగా చేర్చి యుద్ధానికి స్కంధావారాలను నిలిపి, ఇప్పుడు బలవంతంగా సగంభాగం కావాలని అడిగితే కురుపతి భయపడి ఇస్తాడా? అసలు ఇట్లా అడగటం న్యాయమేనా?' - అని గద్దించాడు. భీష్ము డామాటలకు కటకట పడ్డాడు.

'కర్ణా! నీవు బలే మొనగాడివయ్యా! ఎందుకు? వినేవాళ్ళు నవ్వేటట్లు పెద్దపెద్దమాటలు మాట్లాడతావు? అవక్రపరాక్రమశాలి అయిన అర్జునుడు నిన్న ఉత్తరగోగ్రహణయుద్ధంలో ఒక్కడే మనల్నందర్నీ ఓడించి గెల్చాడు. నీవు రణరంగంలో అతడిని గెలవలేవు కాని మనరాజు కొలువులో మాటలలో మాత్రం గెలుస్తావు. అర్జునుడు ఆవులవెంట తరుముతూ వస్తుంటే దుర్యోధనుడు పాండవుల అజ్ఞాతవాసకాలం ముగిసిందా లేదా అని నన్ను అడిగినప్పుడు నీవు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వింటూ ఉండగా సమయం ముగిసిందని నేను చెప్పలేదా?' -అని కోపగించాడు.

మాటలు ముదురుతున్న ఆ తరుణంలో ధృతరాష్ట్రుడు కల్పించుకొని భీష్ముడిని భక్తితో బ్రతిమలాడి, కర్ణుడిని కసిరి, ద్రుపద పురోహితుడితో ప్రియ ముట్టిపడేటట్లు ఇట్లా అన్నాడు. 'నేనూ, బంధువులు, మంత్రులు, పెద్దలు బాగా ఆలోచించి సమస్తప్రజలకు ప్రీతికలిగేటట్లు బిడ్డలపాలికి ఒక సౌమ్యుడిని పంపుతాను. అతడు నా అభిప్రాయం ప్రకారం వారితో కలిసి చర్చించి ఇకముందు నడువవలసిన తీరును నిర్ణయించుకొనటం కౌరవజాతి కంతా స్పష్టమైన మార్గం. కాబట్టి ముందుగా నీవు వెళ్ళు' మని సగౌరవంగా సాగనంపాడు. పురోహితుడు ధర్మరాజుకు జరిగినదంతా నివేదించాడు.

సంజయుడి రాయబారం

ధృతరాష్ట్రుడు పుత్రవృద్ధామాత్యసహితంగా కొలువుతీర్చి సంజయుడిని పిల్చి ఇట్లా చెప్పాడు:-

'సంజయా! నీవు ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల వద్దకు వెళ్ళి వాసుదేవ సహితంగా వారున్నప్పుడు కలిసి, వారి దుఃఖం ఏవిధంగా ఉపశమిస్తుందో ఆవిధంగా సముచితంగా మాట్లాడాలి. మీ తండ్రి మీరు వనవాసక్లేశాన్ని తరించి అభ్యుదయం పొందటం విని చాల సంతోషించి నన్నిక్కడకు పంపాడని ముందుగా చెప్పుము. ధర్మరాజు నిండుకొలువున్నప్పుడు

అతడిని దర్శించి అతడి తమ్ములకు, బంధువులకు సంతోషం కలిగించేటట్లు మాట్లాడుము; స్నేహాన్ని పాటించి తియ్యని మాటలతో కోపం తీరేటట్లు చేసి, ధర్మజుడు యుద్ధమని మనస్సులో తలంచకుండా ఉండేటట్లు శాంతవచనాలు పలుకుము; కలిసి ఉండేటట్లు యత్నించుము'- అని చెప్పి రథ మెక్కించి పంపాడు. సంజయుడు ఉపప్లావ్యం చేరి ముందుగా నరనారాయణులను దర్శించి తగురీతిగా మాట్లాడి, మరునాడు ధర్మరాజును నిండుకొలువులో కలిసికొన్నాడు. ధర్మజుడితో సంజయు డిట్లా మాట్లాడటం మొదలుపెట్టాడు:

'ధర్మజా! పుణ్యాత్ముడవైన నిన్ను చూచి నేను ధన్యుడనైనాను. మీతండ్రి ధృతరాష్ట్రుడు మీ రిక్కడున్నా రని విని అత్యంతస్నేహపూర్ణమైన హృదయంతో మీ అందరి యోగక్షేమాలు తెలిసికొనటానికి నన్ను పంపాడు' - ఆ మాటలకు ధర్మరా జిట్లా అన్నాడు:

'ఆ రాజుకు మాపట్ల ఉన్న దయ కారణంగా ఇట్లా సుఖంగా ఉన్నాం. నిన్ను పంపించిన మర్యాదకు నా మనస్సెంతో వికసించింది. ఆ మహారాజు పుత్రపౌత్రాదులతో క్షేమమే కదా! దేశంలో అరిష్టాలు లేకుండా శుభపరంపర కలుగుతున్నదా? ద్రోణకృపాశ్వత్థామలు కుశలమేనా? భీష్ముడు క్షేమమా? కౌరవు లాయనకు పెద్దతన మిచ్చి గౌరవిస్తారా? బ్రాహ్మణులకు నేను దానం చేసిన వృత్తులు నేటికీ చెల్లుతున్నాయా? ఎవరైనా దండెత్తి వచ్చినపుడు మా గాండీవిని, భీమసేనుడిని స్మరిస్తున్నారా? మొన్న ఘోషయాత్రలో గంధర్వుల ఉదంతాన్ని అప్పుడప్పుడు మనసులలో నెమరువేసికొంటున్నారా? పక్షపాతం లేకుండా ఆలోచిస్తే అక్కడి వీరులలో అర్జునుడి చేత మానాన్ని, ప్రాణాన్ని దక్కించుకొనని వారెవరున్నారు? సంజయా! ఆ దుర్యోధనుడి మందిరంలో కార్యానికీ, ఖడ్గానికీ నేనే తగుదునంటూ చాతుర్యాన్ని ప్రదర్శించే కర్ణుడి ఆర్యత్వం ఇంకా చెల్లుతూనే ఉన్నదా?' అన్నాడు. ధర్మజుడి మాటలలో అధిక్షేపం తొంగి చూచింది. సంజయుడు సవినయంగా ఇట్లా అన్నాడు:

'కురురాజు కొలువులో అవినీతులూ ఉన్నారు, నీతిమంతులూ ఉన్నారు. దురహంకారులూ ఉన్నారు. సత్త్వ సంపన్నులూ ఉన్నారు. వారిలో ఒకడు చెప్పిన మాట మరొకడు వినడు. వారి మాటకేం గాని, నా విన్నపాన్ని ముందు మన్నించుము. ధర్మజా! వెన్నెల వంటి తెల్లని చల్లని మనస్సుతో స్నేహం చేయాలని భావిస్తున్నావు నీవు. అదే అందరికీ క్షేమం. ఇంతవరకూ అది లేకపోయినా ఇకముందు తప్పకుండా ఉంటుందని మా ఆశ! ధృతరాష్ట్ర మహారాజుకు వార్ధక్యంచేత మనస్సు ఒక విధంగా ఉండదు. అందువలన కొడుకు గర్వాన్ని నాడు మాన్పలేక మనస్తాపం పొంది ఇప్పుడు శాంతుడైనాడు. వారి చేష్టలనన్నింటిని పుణ్యాత్ముడవైన నీవు సహించి అజాతశత్రువనే కీర్తిని పొందగలిగావు. పాప నాశకమైన సత్పురుష జీవన పద్ధతి గైకొన్నవారు హింసాపరులౌతారా? పాండుకుమారులు దుర్వారబలాఢ్యులైనప్పటికీ శాంతస్వభావులు కావటంచేత ఆగ్రహాన్ని ప్రకటించి అధర్మాన్ని ఆచరించరని లోకులందరూ మిమ్మల్ని గురించి భావిస్తున్నారు. నరవరా! మీ తమ్ములూ, వాసుదేవుడూ, ఆప్తులూ, బంధువులూ కూడి ఉన్నప్పుడు మీతో మీ తండ్రి చెప్పుమన్న మాటలు నీకు వినిపిస్తాను' - అన్నాడు సంజయుడు. ధర్మజుడు సంజయుడి మాటలలోని నాన్పుడు స్వభావానికి విసిగి అధిక్షేపాత్మకంగా అతడికి తమ్ములను, గోవిందుడిని చూపించి రాజేమని చెప్పుమన్నాడో త్వరగా నివేదించుమన్నాడు.

సంజయుడు కృష్ణుడికీ, భీమాదులకూ, పాంచాల మత్స్య భూపాలురకూ పేరుపేరున నమస్కరించి, ధర్మజుడి ముందు చేతులు ముడుచుకొని వినయంగా ఇట్లా మాట్లాడ నారంభించాడు -

'ధృతరాష్ట్ర భూపాలుడు ప్రశాంత చిత్తంతో నన్నిక్కడకు పంపేటప్పుడు నారథం దగ్గరికి తానే స్వయంగా వచ్చి ఎంతో ఆప్యాయంగా ఈ మాటలు చెప్పాడు. మీరు సావధానంగా వినండి. మీ వంటి ధర్మజ్ఞులు, శాంతులు, అయిన ప్రసిద్ధులు చులకనైన పనులు చేయటం ఏ విధంగానూ న్యాయమౌతుందా? ధర్మరాజా! మడుగు చీరలో మసి చేరినట్లు దుర్యోధనుడి వలన కురుకులం కల్మషమైపోయింది. అయితే, ఆ కల్మషాన్ని పాపగల సమర్థుడవు నీవే! ఓ దయామయా! యుద్ధం జరిగితే జయాపజయాలు ఏ వైపు కలిగినా అవి సుఖాన్ని కలిగించవు. రణరంగంలో బాలురను, వృద్ధులను, బంధువులను, గురువులను చంపిన తరువాత ఆ సుఖాలు మాత్రం దేనికి? నీకు హరి పెట్టని కోట; భీమార్జున సాత్యకి విరాటాదులు మహావీరులు. వీరందరూ యుద్ధ భూమిలో నిలిస్తే దేవతలే ఎదుర్కొనటానికి భయపడతారు. అయితే, ఆ వైపూ తక్కువవారు లేరు. ద్రోణ భీష్మ కృపాశ్వత్థామ కర్ణశల్యాదులు ఒక్కొక్కరు అజేయులు. వారందరు కలిసి వస్తే

పరమేశ్వరుడైనా జయించటం కష్టం. ఇటువంటి మీ ఉభయ పక్షాలకు అన్యోన్య కలహం మేలుకాదు. ఈ సభలో ఉన్న వాసుదేవాదుల కందరికీ చేతులెత్తి మ్రొక్కుతున్నాను. మీరందరూ అసూయ మాని, కరుణామయుడైన ధర్మరాజును క్రోధశాంతి పొందుమని కోరండి. యుద్ధాన్నుండి ఉపశమిస్తే భీష్మాదులు కూడా సంతోషిస్తారు. సర్వలోకం సమ్మతిస్తుంది.' అని ధర్మజుడి ఎదుట వినమ్రుడై నిలువబడ్డాడు. అపుడు ధర్మజు డిట్లా అన్నాడు -

'సంజయా! నా మాటలలో స్నేహమనేది ఒక్కటే నీ చెవులకు వినిపించింది. కయ్యము లేకుండా ఉండండని మమ్మల్ని నీవు కోరుతున్నావు. బాగానే ఉన్నది. కయ్యం లేకుండానే దానివలన కలిగే అర్థసిద్ధి చేకూరితే ఇక వేరే కయ్యం చేయవలసిన పనేముంటుంది? ధృతరాష్ట్ర మహారాజు ద్యూత సభలో తాను నీతి మార్గానికి నీళ్ళువదిలి వక్రంగా వ్యవహరించాడు. ఇప్పుడు మాకు మాత్రం ఋజుమార్గంలో నడవండని నీతులు చెపుతున్నాడు. తమవలెనే ఎదుటివారిని గూడా భావించాలి. అట్లాకాక - 'మాకు కుడుమిచ్చి మీరు వ్రక్క తీసుకోండి' అన్న సామెతగా వ్యవహరిస్తే పొందు కుదురుతుందా?

మేము సంపద లేనివారమై ఉంటే అశక్తులమని లెక్కకట్టి మమ్మల్ని పిలిచి, గౌరవించి, రాజ్య మిచ్చేంత వెర్రివాడా మహారాజు? అతడి సలహాదారుల బుద్ధిని, కొడుకు కోరికను మన్నిస్తాడు కాని, ధర్మాన్ని పరిగణిస్తాడా? ఎందుకు మీకీ వృథా ప్రయాసలు? మానండి. ఆయన చరిత్రం నీకూ మాకూ ఈ నాటి వింతయా? ఎన్నడైనా తగిన మాటలు చెప్పి కొడుకును మాన్పగలిగాడా? పై పెచ్చు విషం త్రాగినా అతడే వీరుడని నమ్ముతాడు. ఆనాడు జూదపు సిరి వద్దని పెద్ద లనలేదా? దానిని ఆయన పెడచెవిని పెట్టలేదా? ఇక ముందు కూడా ధృతరాష్ట్రుడు దుర్యోధన శకుని కర్ణాదులు తన నే వైపు నడిపిస్తారో ఆ మార్గాన్నే అనుసరిస్తాడు. ఆయన పద్ధతి మార్చుకొంటాడా?

నీవు ఉత్తముల పద్ధతిని గురించి ఉపన్యసించావు. నీకు ఆ దుర్యోధనుడి అవినయం అనివార్యమని తెలియదా? లేక తెలిసిన అజ్ఞానమా? అతడికి శ్రీకృష్ణుడంటే లెక్కలేదు. అర్జునునికి ఎదురుగా కర్ణుడున్నాడని నమ్మి అహంకరిస్తాడు. ద్రోణ భీష్మ కృపాశ్వత్థామ కర్ణ దుర్యోధనాదులు యుద్ధా లెట్లా ఆశాపాశాలో పూర్వం గ్రహించలేదా? బంధువుల పరాక్రమాలు తెలిసి కూడా చావును వరించి యుద్ధాన్ని కోరుతున్నారు. ఇక కపిధ్వజ కాంతులు వారిని అంధీభూతులను చేయక తప్పదు.

నీవు ముందుగా మమ్మల్ని పొగిడావు. ఆ తరువాత కౌరవులను గెలవటం అసాధ్యమన్నావు. నే నీ మాటకు అంగీకరించను. నీవు పక్షపాతం లేకుండా మాట్లాడి ఉండవలసింది. అది అట్లా ఉండనీ. అవమానాలు పొంది కూడా మేము ఓర్పును ప్రదర్శించాం. నీకూ ఈ వివరాలన్నీ తెలుసు. వాటి నన్నింటినీ మా తండ్రి తలంచి మా కెటువంటి కీడు రాకుండా, మేము మరొకవైపు పోకుండా, లోకం మెచ్చేటట్లు మమ్మల్ని తనవద్దకు పిలిపించుకొని, రాజ్యంలో భాగం మాకిమ్మని కొడుకుల కాజ్ఞాపించి, ఇంద్రప్రస్థాన్నో మరొక నగరాన్నో మాకు రాజధానిగా చేసి ఏలుకొమ్మనటం సముచితం కాదా!' అని కొంత రోషాతిశయంతో అన్నాడు ధర్మరాజు. సంజయుడు మరలా ఇట్లా సంభాషణ సాగించాడు.

'ధర్మజా! ఎదుటివారు ఎన్ని తప్పులు చేసినా వాటిని ప్రక్కకు త్రోచి ఓర్పును ప్రదర్శిస్తావు కాబట్టి, నీ విన్ని మాటలు అన్నా తనివి తీరక నీకు నేను ఇంకా మనవి చేస్తాను. నిజంగా నీ గొప్పతనమంతా నీ అహింసా ప్రవృత్తిలో, నీ మచ్చ లేని చరిత్రంలో ఉన్నది. ఒకవేళ కౌరవులు దుర్మార్గులై రాజ్య భాగం ఇవ్వకుండా మీకు అన్యాయం చేశారే అనుకొందాం. మీ నడవడికి రక్తపు కూడు కంటే భిక్షాన్నమే సముచితం. అది ఎట్లాగంటావా? రాజసూయాధ్వరం చేసి దేవతలను మెప్పించి శాంతి దాంతులతో సకల లోకాలు కీర్తించగా బ్రతికిన పుణ్యమూర్తివి నీవు. అట్టి నీ పవిత్ర చరిత్రం హింసా కళంకితం కావటం ఉచితం కాదు. అంతే కాదు. అలనాడు అవినయంతో మాయాద్యూతం కల్పించి అంతటి అవమానం చేసిన వారిని వారి గర్వం చెల్లేటట్లు చేసి లోకుల చేత వారు తిట్లు పడేటట్లు ఎందుకు చేశావు? ఓర్పే సంపదగా ఇంతవరకు అడవులలో ఇడుమల నెందుకు అనుభవించావు? ఇంత ఉత్తమ పథంలో సాగి, ఇప్పుడు క్రూర పద్ధతిలో ప్రవేశించి బంధువులను, గురువులను వెదకి వెదకి వధించటం సౌఖ్యమా? అది ఆర్యనింద్యం; అస్థిరం.

హాలాహలం వంటి కోపాన్ని మ్రింగుకొనటంలో ముందుగా శివుడిని చెప్పి తరువాత నిన్ను పేర్కొనాలి. అటువంటి వాడవు ఆ గుణాన్ని పాటించి అనంత కీర్తిని గడించాలి' అని ప్రబోధించాడు.

దానికి సమాధానంగా ధర్మరా జిట్లా అన్నాడు -

'సంజయా! నీవు పలికింది యథార్థమే. లోకంలో కొన్ని చర్యలు పైకి చూస్తే ధర్మాలవలె అనిపించినా చివరకు అధర్మాలై చెడిపోతాయి. కొన్ని అధర్మాలుగా గోచరిస్తూనే చివరకు ధర్మాలై రూపొందుతాయి. కాబట్టి నన్ను నిందించ దలచుకొన్నట్లయితే నేను చేస్తున్నది ధర్మమనో అధర్మమనో నిరూపించి మరీ దూషించుము. కోపాన్ని పోగొట్టుకొనాలి. అహింసయే ఉత్తమ ధర్మం - ఇవి ధర్మాలే కదా! వంశానికి కళంకం తెచ్చేవారు, లోక కంటకులు అయిన పాపాత్ములను నిర్మూలించటం కూడా ధర్మమని పెద్దలు చెప్పారు. అది అట్లా ఉండనీ. రాజులకు యుద్ధం చేయటం ధర్మమా? అధర్మమా? నీవే చెప్పుము.

మనందరికీ ఇది కర్తవ్యం, ఇది అకర్తవ్యం అని శాసించటానికి వాసుదేవు డున్నాడు. మన కీ వితర్కం దేనికి? ఇతడు ధర్మాధర్మవిదులకు గురుడు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుడు, ఉచితానుచితజ్ఞులకు ప్రదర్శకుడు, యదుభోజ అంధక వృష్ణి సంజయ కేకయ ప్రభృతులైన ప్రభువులందరూ ఆయన ఆజ్ఞ చొప్పున ధర్మమార్గంలో నడుస్తున్నారు. విశేషించి గోవిందుడి బోధయే సమస్త పురుషార్థాలకూ మూలం కావటం చేత అతడి మాట అవశ్యం అలంఘనీయం' - అని ధర్మరాజు పలుకగా శ్రీకృష్ణుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

'నే నెప్పుడూ పాండవుల మేలు కోరేవాడిని. ధృతరాష్ట్రుడు కూడా పుత్ర పౌత్రవంతుడు. అతడికి కూడా కీడెందుకు కలగాలని మనసులో అనుకొంటూ ఉంటాను. ఆ రాజు తెలివితో నిన్నిక్కడికి పంపి నిండుమనసుతో వీరి యోగ క్షేమాలు తెలిసికొనటం నాకెంతో సంతోషంగా ఉన్నది. నీవు సముచితంగా వచ్చి స్నేహం, ధర్మం వినయం తేట పడేటట్లు మాట్లాడటం కూడా నాకు సమ్మదాన్ని కలిగించింది. ఇట్లా అన్నీ కలిసికట్టుగా ఏర్పడినా ధర్మరాజు మాటలు చూడగా సంధి జరిగే పద్ధతి కనపడటంలేదు. అది అంతే.... దుర్యోధనుడు మత్తుడు. చివరకు అందరూ కలిసిఉండటం అనే మాట ఎట్లా కలుగుతుంది? ధృతరాష్ట్రుడి మనసు మనకందరికీ తెలుసు కదా! ఆ రాజు నెరపే స్నేహాన్నీ, ఒలక బోసే వాత్సల్యాన్నీ, నీ వెన్నో తియ్యతియ్యని మాటలలో చెప్పావు. బాగుంది. కాని, పాండవులు తమకు రావలసిన రాజ్యభాగం పొందకుండా వట్టి వట్టి నేర్పు మాటలతో సరిపుచ్చుకొంటారా?

పాండవులు పెద్దగా పట్టించుకొనకుండా శాంతులై కౌరవులతో కలిసి ఉండటానికి కోరుకొంటే మంచిదే. ఓర్పు దయ ప్రకటించటం న్యాయమే. అయితే, తమకు న్యాయంగా రావలసిన రాజ్య భాగం తండ్రి పంచి ఇవ్వలేదని తెంపు చేసి యుద్ధాన్ని వీరు ప్రకటించినా అది ద్రోహమౌతుందా? ఈవిధంగా అవమానాలు పడుతూ తలవంచి బ్రతికిన దానికంటే, ఉజ్జ్వలులై ఎదుర్కొనటమే మేలు. నాకు చూడ పాండవులకు యుద్ధమే శరణ్యంవలె కనబడుతున్నది. క్షత్రియులకు యుద్ధం ధర్మం. రాజులు ఇచ్చేవారే కాని వేడుకొనేవారు కారు. న్యాయార్జిత విత్తంతో జీవిస్తున్నప్పుడు అన్యాయంగా వారి ధనాన్ని ఎవరైనా అపహరిస్తే అప్పుడు శస్త్రాస్త్ర ధర్మాలను ఇంద్రాదులు చెప్పారు.

కౌరవులు క్రిందుమీదు లెరుగకుండా అధర్మమార్గాన నడిచేవారు. నీ విక్కడ చెపుతున్న ధర్మాలను కౌరవులకు కూడా చెప్పవద్దా? లోకంలో జూదా లాడలేదా? కౌరవులు తులువలు కాకపోతే ద్రౌపదిని నిండుసభలో పలువురు చూస్తూ ఉండగా పగపట్టి అంతగా అవమానిస్తారా? అప్పుడు భీష్మాదులైన పెద్దలందరూ నోరెత్తకుండా ఊరకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు నోరెత్తి తన కొడుకులను కోపగించి ఆ దుష్కృత్యాన్ని మాన్పినట్లైతే నా మనసే కాదు లోకులందరి మనసులూ సంతోషించి ఉండేవి. నిందిస్తూ నిండు కొలువులోకి జుట్టు పట్టుకొని దుశ్శాసనుడు ద్రౌపదిని లాక్కొని వచ్చి నిర్దయతో అవమానిస్తుంటే మామ ఆ సతి యేడ్పుకు ఎట్లా ఓర్చుకొన్నాడు? ఆ సన్నివేశాన్ని ఎట్లా సహించాడు? అంతగా సహించిన ఆ రాజు ఈ నాడు ఇంతగా వీరిని ప్రేమిస్తూ యోగక్షేమాలు తెలిసికొనటానికి నిన్ను ఇంతగా పంపాడు. ఇది ఎట్లా సాధ్యపడింది?

అలనాడు నిండు సభలో 'ఇది కూడదు' అని అడ్డుపడే వాడు లేక అందరూ ఊరుకుంటే ద్రౌపది తనను తాను రక్షించుకొనే అదను ఏర్పడింది కాబట్టి సభలో అవమానం తప్పింది. పాండవులు బ్రతికి పోయారు. లేకపోతే ఆ కీడు రాజకుమారులు సహించదగిందేనా? సంజయా! అప్పుడు కర్ణశూలాలుగా కర్ణుడన్నమాటలు నీవు వినలేదా!

'లే రిచట మగలు నీకును । వీరలు జూదమున వోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ । గూరిమి గల మగని వెదకి కొను మొరు ననఁడే?' **(ఉద్యో. 1.250)**

ఈ మాటలు నరుడి హృదయంలో ములుకులవలె గుచ్చుకొంటూ దుర్భర వేదనను కలిగిస్తున్నాయి. ఎప్పుడన్నా ఆ రాజు దీనికి చికిత్స చేయటానికి యత్నించాడా? ఆ దుశ్శాసనుడు పాండవులను గొడ్డువోయిన వారనీ, పౌరుషం లేనివారనీ అనరాని, వినరాని మాటలెన్నో అని కించపరిచాడు. వాటి కేవైనా పలికాడా ఆ రాజు? కాబట్టి ఈసంధి కార్యం సంఘటించటం అసంభవమని నేను భావిస్తున్నాను. అయినా -

పాండవులను ప్రార్థించి, హస్తినాపురానికి నేను వచ్చి, కౌరవులకు బుద్ధిగా చెప్పి, రాజ్యభాగాన్ని ఇప్పిస్తే, వారు మృత్యుపాశాలనుండి తప్పించుకొంటారు. అన్యాయం కాని నామాటలు వారు మన్నించారా సరి, లేక లెక్కలేకుండా వెక్కిరించారా వారు పాండవ బాణాగ్నితో కాదు, స్వీయలోభాగ్నిలోనే పడి మగ్గిపోతారు. నా తలపులో ఇరు పక్షాలవారి కలరూపు ఇటువంటిది -

'రోషమయ మహాతరువు సుయోధనుఁ, డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ డలరుఁ,
గొమ్మ సౌబలుండు, గుసుమ ఫలములు దు । శ్శాసనుండు, మూల శక్తి తండ్రి'.

'ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన । స్కంధ, మనిల సుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము, లేను భూసురులును వేద । ములుఁ దదీయమైన మూల చయము.' **(ఉద్యో.1.355,356)**

ఈ రెండింటిలో సారవంతమైన దేదీ? కాని దేదీ? అని మనం విచారించాలి. అయినా వీరిద్దరి మధ్య అసూయ అనవసరం. వీరిరువురూ కలిసి ఉండటం ఉచితం. ఎట్లాగంటే - ధృతరాష్ట్రుడూ, అతడి పుత్రులూ అరణ్యం వంటివారు. అందులో పాండవులు సింహాల లాంటివారు. సింహాలు లేని వనాన్ని జనం నిర్భయంగా నరుకుతారు. వనగర్భంలో ఉండని సింహాలకు వేగంగా చేటు చేకూరుతుంది. కాబట్టి వీరిద్దరూ ఎల్లప్పుడూ కలిసి ఉండటం సమంజసం. ధృతరాష్ట్రుడు పాండవులను దరికి చేర్చి తన కొడుకులవలె చూచుకొంటే వారు శత్రుమర్దనానికి పనికి వస్తారు. తన సేవలకూ ఉపకరిస్తారు. నేను ఈ పని మీద హస్తినాపురానికి వస్తాను. ఆ రాజు నాయత్నానికి ఒప్పుకొన్నా సరే లేదా ఒప్పుకోకపోయినా సరే. దానిని బట్టి మేము వ్యవహరిస్తాం.'

కృష్ణుడి మాటలు వినిన సంజయుడు తాను వచ్చిన పని అయినదని తెలిసికొని ధర్మజాదుల వద్ద అనుమతి వేడుకొన్నాడు వెళ్ళటానికి. తాను మాట్లాడిన మాటలలో దగనివి ఏమీ లేవుకదా? అని ప్రశ్నించాడు. అందుకు ధర్మజు డిట్లా అన్నాడు - 'నీవిక పోయి రావచ్చును. ఇందరు వింటుండగా ఇంత వివరంగా నీవు మాట్లాడావు. నీ మాటలలో ఉచితములు కానివి ఉన్నాయా? అట్లా అని ఎవరంటారు? ఎదుటివారి స్థితిగతులను చెప్పటంలో నీవు ఎటువంటి ఇబ్బందులూ పడవు. అవినయాన్ని, కాఠిన్యాన్ని నీపలుకెప్పుడూ పొందదు. ఇటువంటి పనులు నిర్వహించటానికి నీవుగాని విదురుడు గాని తగినవారు' అని పేర్కొని కరిపురంలో ఉన్న పెద్దలకు, పిన్నలకు, రాజలోకానికి, పరివారానికి అనువైన సంభావనలను అందించాడు ధర్మరాజు. ధృతరాష్ట్రుడు నిండు కొలువుండగా కొన్ని మాటలు చెప్పుమన్నాడు.

'ఓ పుణ్యాత్ముడా! నీ బలంచేతనే పాండవులు ఆపదలేమీ లేకుండా ఆప్త బంధువులతో కలిసి సుఖంగా ఉన్నారు. వారిని వారి తండ్రిగారి రాజ్య పీఠంమీద నిల్పి, ప్రభుత్వ మిచ్చి బాల్యంలో పోషించావు. ఇప్పుడే మాత్రం దయలేకుండా వారికి అహితం కావాలని కోరటం న్యాయమా? దానితో సంతోషించవద్దు. అంతకంతకు రాజ్యాశ పెరిగితే నిలువరించటం కష్టమౌతుంది. కాబట్టి శత్రువులందరు బెదరి చూడగా కలిసి ఉండటం మంచిది.'

మా తాత భీష్మాచార్యులతో ఇట్లా పలకండి -

'శంతనుడి వంశం అంతరించిపోకుండా నీవే నిలిపావు. అట్లాగే నీ అభిప్రాయాన్ని అనుసరించి నీ మనుమల కందరికీ పొందు కుదిర్చి, అధర్మ వృత్తికీ, చావుకూ వారిని దూరం చేయగలిగితే పండితులందరూ మెచ్చుకొంటారు.'

ఆ సమయంలో అచ్చటివారందరూ వినేటట్లు దుర్యోధనుడితో ఈ విధంగా చెప్పుము- 'బాహుబలాఢ్యులను బలహీనులవలె బయటకు పంపిన వెర్రితనం, చాలకాలం అడవులలో కొండలలో బాధలు పెట్టిన పరుసదనం, సభలో పాంచాలిని ఆ విధంగా తలపట్టి ఈడ్చిన తులువతనం- వీటి నన్నింటినీ ధర్మరాజు సహించాడు. నిజం. కురుకుమారులను రణరంగానికి బలిపెట్టబోకుము. ఇతరుల సొమ్ముకు ఆశపడబోకుము. వారి పాలు వారికిచ్చి కలిసి బ్రతకటం మంచిదనుము. మేము కలహాన్ని కోరకుండా పొందుకోరటం తనకే మేలవుతుంది. తన మనస్సులో ప్రజ్వలించే ఆశాజ్వాలను ఆర్పటానికి ఎవరూ ప్రయత్నం చేయరు. కాబట్టి నేను బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన వద్ద ఉన్నంతమంది మహావీరులు మరెక్కడా లేనిమాట నిజం. మావైపు ధర్మం ఉన్నది. అఖిలలోక సేవితుడైన కృష్ణుడు మాకు రక్షగా ఉన్నాడు. కాబట్టి మమ్మల్ని గెలవటం తనకు సాధ్యం కాదు.

అది అట్లా ఉండనీ, నేను భీమసేనాదులకూ, తమకూ పెద్దవాడను కావటం చేత వీరూ, మీరూ నా ప్రార్థనను భంగం చేయకుండా శాంతి దాంతులను వహించి నన్ను అలజడి పెట్టకుండా యుద్ధం మాని ఎవరి సంపదలు వారు తీసికొని సుఖంగా ఉండటం మంచిది. అది పెద్దలకూ బుద్ధిమంతులకూ సంతోషం కలిగిస్తుంది. మాకు పెద్దగా రాజ్యభాగం ఇవ్వటానికి ఇష్టం లేకపోయినా కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం చాలు; కాదా ఎక్కడైనా పాండవులైదుగురు కలిసి ఉండటానికి వీలైన తావులు ఇస్తే చాలు; సర్వ శాంతి సమకూరుతుంది. బంధుమిత్ర పుత్ర గురు జనాదులతో అందరూ బ్రతికి సుఖంగా జీవించవచ్చును. ఇది నా అభిమతంగా ఆ మహాపురుషుడికి తెలియ జెప్పు' మని ధర్మజుడు విశదపరిచాడు.

సంజయు డందరికీ నమస్కరించి బయలుదేరాడు. అర్జునుడు అతడితో ఇట్లా అన్నాడు -

'సంజయా! నీవు మాకు బాలసఖుడవు. మాబాల్యం నుండి కౌరవ పాండవుల తీరు నీకు తెలియనిది కాదు. మా భీమసేనుడనే మత్తగజాన్ని నాడూ, నేడూ ధర్మజుడి దయాతిశయమనే అంకుశం నిలువరిస్తూ వస్తున్నది. లేకపోతే వారి ఆట ఎప్పుడో కట్టి ఉండేది. ఈ నయ విక్రమ విచార క్లేశాలు వారి కెందుకు?' అని సాధిక్షేపంగా పలికి సవ్యసాచి సగౌరవంగా సంజయుడిని హస్తినాపురానికి సాగనంపాడు.

సంజయుడి నివేదిక

సంజయుడు సంజవేళకు రాజధాని చేరాడు. అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి తన రాక ఎరిగించాడు. సూత్రప్రాయంగా తన సంధియత్నాన్ని వినిపించాడు -

'అనయము వుట్టె జూదమున; యప్పుడ యెంతయు చిచ్చు వెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృత చిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీ పయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే?' **(ఉద్యో. 2.14)**

వివరంగా మరునాడు నిండుకొలువులో వినిపిస్తానని సంజయుడు తన నివాసానికి పోయాడు. సంజయుడి మాటలు ధృతరాష్ట్రుడిలో అలజడి రేపాయి. రాత్రి నిద్ర పట్టలేదు. విదురుడిని పిలిపించుకొని మనశ్శాంతికొరకు రాత్రంతా నీతులు చెప్పించుకొన్నాడు. 'ధర్మరాజును వదలిపెట్టబోకుము; దృఢమతితో కొడుకులకు, మంత్రులకు నచ్చచెప్పి పొందు కుదిరేటట్లు

సాధించుము. దానివలన ధర్మం, కీర్తి, లాభం కలుగుతాయి' - అని విదురుడు బోధించాడు. ధృతరాష్ట్రు డతడి మాటలకు అంగీకారాన్ని తెలిపాడు. అంతటితో మనశ్శాంతి కుదరక విదురుడి సంకల్పంతో సనత్సుజాతుడిని పిలిపించుకొని అతడివలన అధ్యాత్మ తత్త్వాలను శ్రవణం చేశాడు. అంతలో తెల్లవారింది.

ధృతరాష్ట్రుడు కొలువు తీర్చాడు. సంజయుడు తన రాయబారపు వృత్తాంతాన్ని పూసగ్రుచ్చినట్టు చెప్పటం ప్రారంభించాడు. ధృతరాష్ట్రుడు వివిధాంశాలను గ్రుచ్చిగ్రుచ్చి అడిగి వివరాలు తెలిసికొన్నాడు. అతడు వాసుదేవుడి అభిప్రాయాన్ని గురించి సంజయుడిని మొదట ప్రశ్నించాడు. శ్రీకృష్ణుడు సత్యభామా ద్రౌపదులు అర్జునుడు కలిసి ఏకాంత మందిరంలో ఉండగా సంజయుడిని లోనికి పిలిపించుకొన్నాడు. దానివలన వారికి ధృతరాష్ట్రుడి మీద ఉన్న అనురాగం వ్యక్తమౌతుందని చెప్పాడు. నరుడి తొడలపై పాదాలుంచి నారాయణుడు శయనించి ఉన్నాడనీ, సంజయుడిని చూచి ఇరువురూ వినయంతో పలకరించారనీ చెప్పాడు. వారిరువురు కలిసి ధర్మజుడి ఆజ్ఞలు పాటిస్తారట! వారిని కాదని ఎదుర్కొనటం యముడి శిరస్సు త్రెంచటమే కదా అని హెచ్చరించాడు.

అలుగుటయే ఎఱుగని అజాతశత్రుడు అలిగాడంటే నీళ్ళలో అగ్ని పుట్టిందన్నమాటే! ఆ అగ్ని ఆర్పే పద్ధతి లేదు. కాబట్టి నేర్పుతో మీరు పనులు సాగించుకొనాలని గోవిందుడు ధృతరాష్ట్రుడిని ప్రబోధించినట్లు సంజయుడు తెలియపరిచాడు. 'గాండీవి రథానికి సారథినై అశ్వాలను తోలుకొని వస్తున్నప్పుడు కపిధ్వజచ్ఛటలు చూచి మీరు మూర్ఛపోతారు; కిరీటి బాణాలు చవిచూచి విచ్చిపోతారు' అని కృష్ణుడు హెచ్చరించాడు. అప్పుడు భీష్మ ద్రోణుల ప్రాపును కర్ణుడి గర్వాన్ని నమ్ముకొని ఉన్న దుర్యోధనుడి దురదృష్టాన్ని స్మరిస్తూ నిశ్చేష్టుడ నయ్యానని సంజయుడు చెప్పాడు.

ఆ తరువాత ధృతరాష్ట్రుడు అర్జునుడి సందేశాన్ని వినిపించుమని అడిగాడు. సవ్యసాచి పాండవ వాసుదేవ పరాక్రమాలను పేరు పేరున వర్ణించి చెప్పిన విధానాన్ని వివరించాడు సంజయుడు. ఆ మాటలు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా హితవు చెప్పాడు -

'పార్థ వాసుదేవులు కలిసి ఏ వైపుండి యుద్ధానికి వస్తారో ఆ వైపు హరుడు కూడా కన్నెత్తి చూడలేడు. నీవు నే నెన్ని హితవులు చెప్పినా వినవు. బహుశః కౌరవులకు చేటుకాలం దాపురించినట్లుంది. ఈనాడు నా హితవు వినకపోతే రేపు యుద్ధంలో వారు పడిరి వీరు పడిరి అనే మరణవార్తలే వినవలసిన కాలం రావచ్చును. నీకు శకుని కర్ణ దుశ్శాసనుల మాటలే చెవి కెక్కుతాయి. అవే నీకు ఎగ్గును కలిగిస్తాయి.' - అన్న మాటలు విని కర్ణుడు భీష్ముడిపై మండిపడ్డాడు. అప్పుడు ఉత్తర గోగ్రహణ సమయంలో కర్ణుడు అర్జునుడి చేత పొందిన పరాభవాన్ని భీష్ముడు జ్ఞాపకం చేశాడు. అర్జునుడి వంటి విలుకాడిని నేను భూతలంమీద చూడలేదని ప్రశంసించాడు.

భీష్ముడి మాటలు లెక్కచేయకుండానే ధృతరాష్ట్రుడు సంజయుడి వైపు తిరిగి ధర్మజుడి అభిప్రాయాన్ని గురించి అడిగాడు. ఒక్కమాటలో చెప్పాలంటే -

'వినుము నరేంద్ర! పాండు పృథివీపతి యగ్రసుతుండు సంధి సే
యన మదిఁ గోరు; మీరు తమ యయ్య సగంబును భూమి యీక త
క్కిన మఱి కాని ముంద రొక కీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొనం దలంచినన్.' **(ఉద్యో. 2.170)**

ధర్మరాజు భీమాదుల పరాక్రమాలను తెలిపిన పద్ధతిని కూడా సంజయుడు స్పష్టపరిచాడు. ధృతరాష్ట్రుడు భీమసేనాదుల బలాలను విని భయకంపితుడయ్యాడు. అతడి భయాన్ని తొలగించటానికి దుర్యోధనుడు తన వైపున్న వారి బలపరాక్రమాలను ప్రస్తుతించాడు. సంజయుడు పాండవ దివ్య శక్తులను వివరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు- 'కౌరవ వీరులు అసాధ్యులు కదా! వీరిని ఎట్లా సాధించగలమని పాండవులు భావిస్తున్నారో తెల్పు'మని అడిగాడు. సంజయుడు ఇట్లా బదులు చెప్పాడు -

'భీష్ముడు శిఖండి పాలపడతాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి పాలపడతాడు. రారాజూ అతని తమ్ములూ భీముడి పాలబడి ప్రాణాలు వదులుతారు; కుమారులందరు అభిమన్యుడి పాలు; శకుని, సైంధవుడు, అశ్వత్థామ, కర్ణుడు; మిగిలిన మహావీరులు సవ్యసాచి పాలు; కృతవర్మ సాత్యకి పాలు; శకుని ఉలూకాదులు నకుల సహదేవుల పాలు; శల్యుడు ధర్మరాజు పాలు - అని పాండవ పక్షంలో కృతనిశ్చయులై ఉన్నారని సంజయుడు స్పష్టం చేశాడు. 'ధర్మజుడు రాజై హరి జయంవైపు నడిపించగా సాగే పాండవ సైన్యాన్ని దుర్యోధనుడు లెక్కచేయడు. ఇక నాజన్మం దుఃఖభాజన మౌతుందో ఏమో' అని ధృతరాష్ట్రుడు ఖిన్నుడైనాడు. దుర్యోధనుడిని పాండవులతో సంధిచేయుమని సామవాక్యాలు చెప్పాడు. దానిని కాదని దుర్యోధనుడు తన బలపరాక్రమాలను కీర్తించుకొన్నాడు. అతడికి బాసటగా కర్ణుడు వీరవాక్యాలు పలికాడు. భీష్ముడు కర్ణుడి ప్రగల్భాలను నిందించాడు. దానికి కోపగించి భీష్ముడు కర్ణుడి ప్రవర్తనను ఖండించాడు. ఇతడా కౌరవులను రక్షించేది? అని అధిక్షేపించాడు. భీష్ముడి మాటలకు మండిపడి కర్ణుడు పితామహుడు యుద్ధంలో నేల గూలేంతవరకు తాను యుద్ధంలో పాల్గొనని అస్త్రసన్న్యాసం చేశాడు.

సంజయుడి సందేశాన్ని దుర్యోధనుడు పెడచెవిని పెట్టాడు. ధృతరాష్ట్రుడు విని మౌనంగా ఊరకున్నాడు. సభాసదులందరు దిగ్గునలేచి ఇళ్ళకు వెళ్ళిపోయారు. సంజయుడు మాత్రం తండ్రికొడుకుల ముందు సాక్షిగా నిలిచాడు.

ఆ తరువాత వ్యాసుడు ప్రసన్నుడై ధృతరాష్ట్రుడిని శ్రీకృష్ణుడి నాశ్రయించుమని ప్రబోధించాడు. దానికతడు అప్పటికి సుముఖతను ప్రకటించాడు.

శ్రీకృష్ణుడి రాయబారం : పాండవుల సందేశాలు

ఉపప్లావ్య నగరంలో ధర్మరాజు తమ్ములను, బంధువులను, ద్రౌపదిని వెంటబెట్టుకొని శ్రీకృష్ణుడి మందిరానికి వెళ్ళి కౌరవ సభకు అతడిని దూతగా పంపితే శుభం కలుగుతుందనే అభిప్రాయంతో ఇట్లా మనవి చేశాడు.

'మహాత్మా! ఆపదల నుండి రక్షించటానికీ, శుభములు కలిగించటానికీ ఈ జన్మకు పాండుభూపాలుడు నిన్ను చూపించి వెళ్ళాడు. మిత్రకార్యం చక్కజేసే సమయం వచ్చింది. నీవు కారణంగా అవినీతుడైన ఆ దుర్యోధనుడితో యుద్ధం లేకుండా మా వంతు రాజ్యాన్ని మేము పొందగలుగుతాం.' ఆ మాటలకు మాధవుడు సంతోషించి 'మీరు చెప్పినట్లే చేస్తాను' అని పేర్కొన్నాడు. అప్పుడు ధర్మరాజు ఇట్లా అన్నాడు.

'నిన్న సంజయుడు పలికిన మాటలను బట్టి మా తండ్రి ధృతరాష్ట్రుడి తలపు, దుర్యోధనుడి వైఖరి మనకు తెలిశాయి కదా! రాజ్య భాగం ఇవ్వకుండా మంచి మాటలతో మా అలుక తీర్చటానికి యత్నించారు. పదమూడేండ్లు మేము పడరాని పాట్లు పడి నియమం పాటించి వచ్చి ఉన్నా. కుల ధర్మాన్ని పాటింపదలచుకొనడా పెద్దరాజు. కొడుకు వక్రబుద్ధిని మాన్పలేడు. ఇంతకంటె మాకు వేరే కీడేమైనా ఉన్నదా? ఇక్కడి బంధువులు నీవు అబ్బురపడి వినేటట్లు మాకు అయిదూళ్ళిచ్చినా చాలని అన్నాను కదా! దానికీ వారు పూర్తిగా వ్యతిరేకమే. ఆ దుర్యోధనుడు ఆ మాత్రం అంగీకరించలేడా? ఔన్నత్యం లేకపోగా క్రూరత్వం ప్రదర్శిస్తే మరీ సహించలేం. సంపద నాకెందుకని అంటారా? నేను పోషించవలసిన చుట్టాలకు గ్రాసవాసోదైన్యాలు వస్తాయి. కాబట్టి సంపదను మే మిరువురం పంచుకొని అనుభవిస్తే సంతోషం కలుగుతుంది.

లోకంలో పెరవారైనా, పగవారైనా చంపుకోవాలనే ఎందుకు కోరతారో? మరొక మార్గమే లేదా? అది మంచిది కాదా? బంధుమిత్రులు కౌరవుల వైపున్నారన్న సంగతి గణించకుండా సంపద కొరకు వారిని వధించటం, దానివలన పాపాన్ని పొందటం అనే దురవస్థలను సహించవచ్చునా? శస్త్ర జీవితమే క్షత్రధర్మం. మేము మరొక ధర్మాన్ని ఆచరించరాదంటారు. అయినా వంశ నాశనం అభిమతం కాదు. కాబట్టి మా క్షత్రియ ధర్మ నిర్వహణం అత్యంత దుర్లభం. యుద్ధమైతే దానివలన అటు సంపద రావచ్చును లేదా ఇటు ప్రాణం పోవచ్చును. ఒక్కొక్కసారి పలువురు ఒక వీరుడి చేతిలో ఓడి పారిపోవటం సంభవించవచ్చును. బలవంతులు బలహీనుల చేత చెడటం కూడా సంఘటిల్లవచ్చును. రణరంగంలో జయాపజయాలు దైవాధీనాలు. పరాజయమైతే మరణం కంటె మనస్సును అధికంగా బాధిస్తుంది. పోరు లేని ఉపాయంతో శత్రువులను

కడతేర్చగలిగిన వాడు గుండె మీద చేయిపెట్టుకొని నిద్రించగలుగుతాడు. మనసులో పగ ఉంటే పాము న్న యింట్లో ఉన్నట్లుంటుంది. చిత్తశాంతి ఉండదు. కాబట్టి అధిక దీర్ఘ వైర వృత్తి ఎప్పుడూ తగదు.

'పగ యడఁగించు టెంతయు శుభం, బది లెస్స, యడంగునే పగం
బగ? వగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!'. **(ఉద్యో. 3.21)**

కావున శాంతియే తత్‌క్షణ కర్తవ్యం. అది అట్లా ఉండగా సంపద కావాలనీ, యుద్ధం కాకూడదనీ మేం కోరుతున్నాం. మా సంపద కోల్పోకుండా కుల క్షయం కల్గకుండా మరొక పద్ధతిలో ఏ విధంగా చక్కబడినా అది మాకు నచ్చుతుంది. జనార్దనా! మా మీద పక్షపాత వైఖరి ప్రకటించవద్దు. ధర్మ నీతి వర్తనాలలో రెండువైపులా హితం అభ్యుదయం కలిగే విధాన్ని బోధించే విదురాది సజ్జనుల బుద్ధులకు నచ్చేటట్లు నిపుణంగానూ, భూపతులకందరికీ తెలిసేటట్లు పరుషంగానూ వక్తవ్యాంశాన్ని తెలియజెప్పుము.

రాజు అన్యాయంగా పరుషవాక్యాలు పలికినప్పటికీ వాటిని సహించి నిండుసభలో నిలిచి మాట్లాడుము. పెద్దల మాటలనూ, ప్రభువుల తలపులనూ మన్నించని దుర్యోధనుడి యెదుట కురువృద్ధుల తలపులను మనం గౌరవిస్తే జనులు మెచ్చుతారు. దుర్యోధనుడి పక్షం చేరి ధృతరాష్ట్రుడు అవినీతి చేసినప్పటికీ ఇక సంధి యత్నం సఫలం కాదని వెంటనే తిరిగి రాబోకుము. ధైర్యంతో జనులెల్లరూ తెలిసికొనేటట్లు మా అభిప్రాయాలను సభలో నిశ్చింతగా ప్రకటించుము. ఎన్ని సంకటాలు వచ్చినా ఎంత మనస్సు క్షోభించినా ఈ కార్యాన్ని నిర్వహించగలిగిన దక్షుడవు నీవే. నీ వే రకంగా ఈ కార్యాన్ని నడుపుతావో, అదే నాకు ప్రియమైనది.' ధర్మరాజు మాటలకు కృష్ణుడు ఇట్లా అన్నాడు.

'ధర్మనందనా! నీ మాట నిజం. ఆ ధృతరాష్ట్రుడు అట్టివాడే, తండ్రికి తగ్గకొడుకు దుర్యోధనుడు. నీ మనసులోని భావం నేను తెలిసికొన్నాను. అనుమానం పెట్టుకొనకు. వినదలచుకొంటే వినుము. నాకు నిజంగా కోపం వస్తే యుద్ధంలో నా కెదురు నిలిచి పోరాడే వాడు ఒక్కడూ లేడక్కడ కాబట్టి, నన్ను నిశ్చింతగా కౌరవ సభకు పంపుము. నేను వెళ్ళి రావటం వలన మేలు. అర్థసిద్ధి కలుగుతాయి. మనవైపు ఎటువంటి వంకపెట్టకుండా ఉండే స్థితి కలుగుతుంది.' కృష్ణుడి మాటలకు సంతుష్టుడై ధర్మరాజు కృతజ్ఞతా సూచకంగా అన్నమాట లివి-

'మేలగుగాక, నీ యిచ్చ వచ్చిన విధంగా వ్యవహరించి మేమూ వారూ కలిసి ఉండేటట్లు ఏ విధంగానైనా ఒప్పందం కుదిరించుము. మన కది మంచిది. నీకు మేము తెలుసు, వారు తెలుసు. హిత మేదో తెలుసు; సాధించవలసిన అర్థసిద్ధి తెలుసు; వాక్యపద్ధతి విశేషంగా తెలుసు, ఇంత తెలిసిన నీకు బుద్ధులు చెప్పటానికి నేనెవ్వరిని?' అని ఆప్యాయంగా అభినందించాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కౌరవులు చేసిన దుర్ణయాలను జ్ఞాపకంచేసి, ఆ సుయోధనుడు ఆయువున్నంతవరకు మీకు రాజ్యంలో ఆవంతభాగం పంచి ఇవ్వడు. కాబట్టి యుద్ధం తప్పదు. దానికి అనుగుణమైన శకునాలు ఎన్నో కనబడుతున్నాయి. కాబట్టి నీవు ఉత్సాహాన్ని తగ్గించుకొనవద్దు. చతురంగ బలాలను ఆయత్తం చేసికొంటూ, సాయం చేసే దొరలను పురి కొల్పుకొంటూ సమరానికి సన్నాహం సాగించుమని ప్రోత్సహించాడు.

పోరుకు ప్రోత్సాహం కలిగిస్తున్న పురుషోత్తముడిని చూచి భీముడు రోషంతో - 'ధర్మరాజు కోరుతున్నది శాంతిగాని యుద్ధం కా'దని జ్ఞాపకం చేశాడు. పాలూ నీరూవలె పాండవులూ కౌరవులూ కలిసి నివసిస్తూ ఉంటే దుర్యోధనుడు దుర్మార్గపు చేష్టలతో ఇంతపని చేశాడు. కులక్షయానికి కారకుడయ్యాడు. అది తప్పదు. అయినా నీవీ రాయబారి బిరుదంతో సాధ్యమైనంతవరకు సార్థక్యాన్ని సాధించుము. ఏ విధంగానైనా ప్రజలకు హితమయ్యేటట్లు సంధిని సాధించుము' అని నొక్కి చెప్పాడు.

భీముడు శాంతి వాక్యాలు మాట్లాడటం వినేవారికి ఆశ్చర్యం కలిగించింది. అతడి పౌరుషం ఆరిపోకూడదని భావించి గోవిందుడు అతడిని అధిక్షేపించాడు. యుద్ధమంటే భయపడి భీముడు శాంతిని కాంక్షిస్తున్నాడని పరాచకాలాడాడు. దానికి భీము డభిమానపడి శ్రీకృష్ణుడి నెద్దేవ చేశాడు. క్రుద్ధుడైన భీముడిని చూచి శ్రీకృష్ణుడు 'నీకు కోపం అలంకారమైనట్లు శాంతం కా'దని సర్ది చెప్పి యుద్ధోత్సాహాన్ని అతడిలో ఉరకలెత్తించేటట్లు చేశాడు.

అర్జునుడి అభిప్రాయాన్ని అడిగాడు గోవిందుడు. అత డిట్లా అన్నాడు.

'నీ వొనరింపఁబూనిన పనిం గమలోదర! కీడు పుట్టునే?
కావనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావన సేఁత పౌరుషము పద్ధతి; తత్ఫలసిద్ధి వొందుచో
దైవము తోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్.' **(ఉద్యో. 3.73)**

దానికి సమాధానంగా కృష్ణుడు - 'నేను సంధికొరకు ఓపినంత పురుషకారం చేస్తాను. దైవం చేత ఏమౌతుందో నాకు తెలియదు. అయినా, బాల్యంనుండి మీకు కీడు చేయాలని ఇన్ని పాపాలు చేసిన దుర్యోధనుడు ఇప్పుడు సంధి సందేశాన్ని అంగీకరిస్తాడని నేను అనుకోను' - అని ఖచ్చితంగా చెప్పాడు.

నకులుడు - వాసుదేవుడి వ్యక్తిత్వం సంధి జరగటానికి ఎంతో తోడ్పడుతుందనీ, గోగ్రహణం తరువాత కౌరవులు తప్పక మెత్తబడతారనీ ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. కాని, సహదేవుడు మాత్రం పౌరుషంతో సంధి యత్నాన్ని సమర్థించలేదు. సుయోధనుడు రాజ్యభాగాన్ని ఇస్తాడని విశ్వసించలేదు. సాత్యకి సహదేవుడి అభిమతాన్ని సమర్థించాడు. వారిద్దరి వీరాలాపాలను సభికులు విని ప్రశంసించారు.

చివరకు పాంచాలి కూడా తన అభిప్రాయాన్ని వాసుదేవుడికి తెలియపరిచింది. ఆమెకు ధర్మజుడి శాంతి వచనాలు దుఃఖాన్ని కలిగించాయి. గొంతు గద్గదమైపోయింది. అభిమానం అవమానాగ్నిచేత ప్రజ్వలితమైంది. అన్నతో ఆర్ద్రంగా ఇట్లా మొరపెట్టుకొన్నది.

'పద్మనాభా! నేను వరంవలన పుట్టాను. భరతవంశం మెట్టాను; పాండు భూపాలుడికి కోడలైనాను. జనవంద్యులైన పాండవులను భర్తలుగా పొందాను; నీతి విక్రములైన పుత్రులను కన్నాను; అన్నదమ్ముల ప్రాపు గాంచాను, నేను ఇన్ని విధాలుగా ప్రసిద్ధి కెక్కాను. ఇవన్నీ ఒక యెత్తు. రాజసూయావభృథస్నానంతో పవిత్రమైన నా వేణిని ఒక అధముడు ఈ అయిదుగురూ చూస్తూ ఉండగా నిండు సభలో లాగి అవమానించాడు. ఆ సభలో ఏకవస్త్రనయిన నన్ను దుశ్శాసనుడు అట్లా అవమానిస్తూ ఉంటే, వీరు చిత్రపటాలవలె మిన్నకుండి పోతే ముకుందా! నిన్ను నేను విశ్వాసంతో స్మరించాను. ఆ సన్నివేశాన్ని సంధిసమయంలో మరువబోకుము' అని అంటూ

'ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెంట్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మనంబునఁ బొందు విషాదరోషముల్
గావఁగలేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై' **(ఉద్యో. 3.114)**

గోవిందుడి ముందు బెట్టి - 'ఇవి దుశ్శాసనుడి వ్రేళ్ళకు తగిలి సగం తెగిపోగా మిగిలి ఉన్న శిరోజాలు. వీటిని నీవు సంధివచనాలు పలికేటప్పుడు మరచిపోబోకుము. నా క్రొమ్ముడిని పట్టి లాగిన ఆ దుర్మార్గుడు తన శరీరం రణరంగంలో ముక్కలు ముక్కలై గుర్తించటానికి వీలులేనంత దీనంగా చావాలి. అప్పుడు కాని నా గుండెలోని మంట చల్లారదు. నేనిన్ని కష్టాలు పడటానికి కారకుడైన ఆ రారాజు పీనుగును కన్నార చూడకపోతే ఆ భీమసేనుడి పెనుగద, ఆ సవ్యసాచి గాండీవం కాల్పనా?

'నెట్టన యిట్టి యల్క మది నిల్పితి రక్కసతాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు; పెద్దయును గాలము దీనికి నాఖు టెన్నఁడుం
బుట్టదు; దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తో
బుట్టువు తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలుఁ గల్గ నచ్యుతా!'. **(ఉద్యో. 3.118)**

అని గొంతు వణుకుతూ ఉండగా ద్రౌపది ఏడ్చింది.

శ్రీకృష్ణు డామెను ఆదరంతో ఓదార్చాడు. కన్నీరు తుడిచి కూర్చుండబెట్టాడు. ఆమె పెన్నెఱి వేణిని ముడవటానికి ముదితలను ఆదేశించాడు. ఆప్యాయంగా ఆమె కిట్లా ధైర్యం చెప్పాడు.

'చెల్లీ! నే నుండగా నీకెందు కీ శోకం? ధర్మజుడు పంపగా, భీమార్జునులు వెంట రాగా నేను రణరంగంలో శత్రుక్షయాన్ని చేస్తాను. మరొక రకంగా జరిగే అవకాశంలేదు. దురాత్ములైన కౌరవులు రాజ్యం ఇస్తారా? తల్లీ! నీవేడ్చే రోజులు పోయాయి. కౌరవుల భార్యల యేడ్పులు విని నీవు కలకల నవ్వే రోజులు దగ్గర పడ్డాయి. యముడి మహిషపు లోహ ఘంటల వికృత నాదాన్ని వినాలని కుతూహల పడుతున్న కౌరవులకు సంధికార్య శాంతివచనాలు సంతోషాన్ని కలిగిస్తాయా? విధి లిఖితం అట్లాగే ఉన్నది. అది తప్పక జరిగి తీరుతుంది. నేను కూడా ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను - 'పాండవులు శత్రుసంహారంచేసి ఉజ్జ్వల పుణ్య లక్ష్మీ సమేతులై అధిక విభవాన్ని పొందుతారు. నీవు చూస్తావు; ఆలస్యం లేదు; ఇది నిజం' అని ఊరడిస్తూ పలికాడు.

ఆపైన కౌరవ పాండవులకు హితం చేయటానికి ధర్మరాజు పంపగా ధృతరాష్ట్రుడి వద్దకు రాయబారిగా పోతానని శ్రీకృష్ణుడు పయనమైనాడు. శ్రీకృష్ణు డా సాయంకాలానికి కుశస్థలం చేరాడు. ధృతరాష్ట్రుడికి వర్తమానం అందింది. భీష్మాదులను దుర్యోధనాదులను పిలిచి శ్రీకృష్ణుడి రాకను గురించి ఆలోచించాడు. శ్రీకృష్ణుడి రాక శుభప్రదమనీ' అతడి మనస్సుకు నచ్చే పని చేస్తే ఇహపరదాయకమనీ విదురాదులు చెప్పారు. పాండవులకు రాజ్యంలో సగభాగం ఇస్తే గోవిందుడు సంతోషిస్తాడని భీష్మాదులు సూచించారు. దుర్యోధనుడు ఈ రెండింటినీ కాదన్నాడు. భాగమిస్తే భయపడ్డామని అధిక్షేపిస్తారనీ, శ్రీకృష్ణుడికి లంచమిచ్చి వశపరచుకొన్నా, లేదా బంధించి వశం చేసికొన్నా పాండవ పక్షం వారందరూ రెక్కలు విరిగిన పక్షులవలె తనకు వశమైపోతారనీ దుర్యోధనుడు దుష్టభావనం చేశాడు. భీష్మాదులు దానిని గర్హించారు.

కౌరవసభలో శ్రీకృష్ణ సందేశం

మరునాడు శ్రీకృష్ణుడు హస్తినాపురికి వచ్చాడు. ప్రజలు అతడిని ఆసక్తితో చూచి పూలతో సేసలతో గౌరవించారు. మాధవుడు ధృతరాష్ట్ర మందిరంలో కురువీరులందరినీ దర్శించాడు. విదురునింట భోజనంచేశాడు. కుంతిని పలుకరించాడు. ధృతరాష్ట్రుడి నిండుకొలువులో జలదస్వర గంభీర స్వరంతో సకల జనులు, మహర్షులు సమ్మోదాంబుధిలో తేలేటట్లు మాట్లాడాడు.

'భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీ యనుఁగుఁ దమ్ముఁడు నీ తనయుల్ యశోధురం
ధరశుభశీలు రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్ప నేటికిన్?'

'ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ!'

'వినుము సుయోధనాదులగు వీరు సధర్ములు గాక కార్యము
ల్గానక మహార్థ సిద్ధి యెడలుం దమ కిట్లన కన్వయంబు వ
ర్తన మిది గాదు నాక బెడిదంపు(దనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వ(గా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్.'

'కౌరవ పాండవుల్ తెఱ(గు గైకొని శాంతత(బొంది యున్కి మే
లారయ నాకు నీకు(గులమంతకు నీ నృపకోటి కుర్వికిన్;
బోరితమైన నింతకును బుట్టు మహాపద; గావునన్ ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యము(బొం దొనర్పవే.' **(ఉద్యో. 3.259-262)**

శ్రీకృష్ణ సందేశం సభాసదులు శ్రవణానందంగా విన్నారు. పాండవులు చివరకు చెప్పుమన్న మాటలను వివరించాడు. చివరకు సర్వతాత్పర్యాన్ని క్రోడీకరించి ఇట్లా పేర్కొన్నాడు.

'సారపు ధర్మమున్ విమల సత్యము(బాపముచేత బొంకుచే(
బారము(బొంద లేక చెడ(బారిన దైన యవస్థ దక్షులె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగు(గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్.' **(ఉద్యో. 3.284)**

అని సభాసదుల నుద్దేశించి పలికి, ధృతరాష్ట్రుడితో 'వారి తండ్రి పాలు వారి కిచ్చి, నీ పాలు నీవు పుత్ర పౌత్రులతో అనుభవిస్తూ సుఖంగా ఉండటం బంధుమిత్ర కోటి మెచ్చే తెర'గని పేర్కొన్నాడు. చివరకు -

'వారలు శాంత శూరులు భవచ్చరణంబులు గొల్వ(బూని యు
న్నా; రటుగాక మీకది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవర! రెండు తెఱంగులందు నీ
కారయ(బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!' **(ఉద్యో. 3.284)**

శ్రీకృష్ణుడి గంభీరోపన్యాసం దుర్యోధనాదులను తప్ప మిగిలిన వారందరిని ఆకర్షించింది; అతడి వాదాన్ని ఏకగ్రీవంగా అంగీకరించేటట్లు చేసింది. నారదాది మహర్షులు, భీష్మాది కురువృద్ధులు, విదురాదులు దుర్యోధనుడిని సంధికంగీకరించుమని కోరారు. అతడు వారి అభిమతాలను తిరస్కరించాడు. దుర్యోధనుడు చిన్ననాటినుండి పాండవులకు నిష్కారణంగా తలపెట్టిన ఎగ్గులను శ్రీకృష్ణుడు ఏకరువు పెట్టి అధిక్షేపించాడు. కులపాంసనుడిని వధించి కులాన్ని రక్షించుకొనండని ప్రబోధించాడు. గాంధారి కొడుకుకు నీతులు చెప్పింది; ధృతరాష్ట్రుడు సుయోధనుడిని సంధి కొడబడుమని అనునయించాడు. ఎవరెన్ని చెప్పినా దుర్యోధనుడు వినక దుశ్శాసనాదులతో మంతనాలు సలిపి శ్రీకృష్ణుడిని నిండు సభలో బంధించి కారాగారంలో పడవేయాలని యత్నించాడు. అప్పుడు వాసుదేవుడు ధృతరాష్ట్రుడితో ఎలుగెత్తి 'నీకొడుకు నే నొంటరివాడనని బంధించ యత్నిస్తున్నా'డని ప్రకటించి దరహాసం చేశాడు. శ్రీకృష్ణుడు నిండుకొలువులో విశ్వరూప సందర్శనాన్ని ప్రసాదించాడు. ఆ తేజో రూపాన్ని జనం చూడలేక కన్నులు మూసికొన్నారు; నారదాదులు భీష్మ విదుర ద్రోణ సంజయులకు గోవిందుడు దివ్యదృష్టి నిచ్చాడు. వా రా దివ్యరూపాన్ని దర్శించి పరమానందాన్ని పొందారు. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడిని ప్రార్థించి తానుకూడా దివ్యదృష్టిని పొంది దివ్యదర్శనం చేసికొన్నాడు. మరల ఇతరులను చూడకుండానే దివ్యదృష్టిని ఉపసంహరింప చేయుమన్నాడు. అట్లా చేసి శ్రీకృష్ణుడు సాత్యకితో కలిసి సభలోనుండి వెలుపలకు వచ్చాడు.

హస్తినాపురినుండి హరి ఉపప్లావ్యానికి బయలుదేరాడు. కుంతిని దర్శించాడు. కొడుకుల యోగక్షేమాలు తెలిపాడు. వారికి సందేశమిమ్మని ఆమెను అడిగాడు. 'క్షత్రియులు పరాక్రమార్జిత విత్తాన్ని అనుభవించాలి గాని, కందమూలాదులను కా'దని ఆమె చెప్పింది. ఆ నాడు కొలువులో ద్రౌపది పొందిన భంగపాటును మరువవద్దనీ, ప్రతీకారం తీర్చుకొని చిరకీర్తిని గడించుకొమ్మనీ, వీరమాతవలె సందేశం పంపింది.

శ్రీకృష్ణుడు కర్ణుడిని తన రథమెక్కించుకొని కొంతదూరం తీసికొనిపోయి అతడి జన్మవృత్తాంతం చెప్పి, పాండవులలో కలిసిపొమ్మని కోరాడు; పాంచాలి అతడిని ఆరవ భర్తగా అంగీకరిస్తుందని హామీ ఇచ్చాడు. కర్ణుడు కృష్ణుడికి తగిన సమాధానమిచ్చాడు. కుంతీదేవి తనను కనినప్పటికీ సూతపత్ని పెంచింది. అంతకాలం సూతపుత్రుడుగా ప్రసిద్ధి కెక్కి ఇప్పుడు కాదనటం పాలు పిండిన తరువాత పొదుగు కోసినట్లవుతుందని కర్ణుడు భావించాడు. కర్ణుడిని అర్జునుడికి ఎదురుగా నిలుపదగిన శక్తి అని దుర్యోధనుడి విశ్వాసం. అతడి విజయమంతా కర్ణుడిపై గల ఆశ మీదనే ఆధారపడి ఉన్నది. ఇప్పుడు పాండవ పక్షం వహిస్తే పార్థుడికి భయపడి వచ్చాడని అందరూ అంటారు. అంతేకాక నమ్మిన రాజును మోసం చెయ్యట మౌతుంది. కృతఘ్నత అవుతుంది. మరొకటి - యుద్ధానంతరం రాజు కాదగినవాడు ధర్మరాజు. కర్ణుడు తనకు అగ్రజుడని తెలిస్తే అతడు రాజ్యం స్వీకరించడు. ధర్మజుడూ, అతడి తమ్ములూ ఋత్విజులుగా, శ్రీకృష్ణుడు ఉపద్రష్టగా రణయజ్ఞంలో కురుకుమార పశు విశసనం చేస్తాడు' అని కర్ణుడు తన మనోగత భావాలను వ్యక్తం చేశాడు. రాబోయే యుద్ధంలో కర్ణార్జునులలో అర్జునుడిదే విజయమని శ్రీకృష్ణుడు ప్రకటించి, కర్ణుడిని ఇంటికి పంపి తాను ఉపప్లావ్యానికి చేరుకొన్నాడు.

కౌరవాన్వయ మహార్ణవం ఇంకిపోయేటంతగా ఏర్పడిన విపత్తును గురించి విదురుడు కుంతితో చెప్పి విచారించి వెళ్ళిపోయాడు. ఆమె ఈ విపత్తును తొలగించే మార్గంకొరకు ఏకాంతంగా ఆలోచించింది. రహస్యంగా కర్ణుడి వద్దకు వెళ్ళి అతడి జన్మ రహస్యాన్ని తెలిపి, సహోదర స్నేహాన్ని అతడి హృదయంలో పెంపొందింపజేసి, క్రమంగా యుద్ధ యత్నాలను విముఖం చేయవచ్చునని భావించింది. గంగానదికి అనుష్ఠానార్థం కర్ణుడు రాగా అతడిని కుంతి దర్శించింది. అత డామెకు నమస్కరించాడు. ఆమె అతడితో జన్మవృత్తాంతాన్ని వివరించి చెప్పింది. కుంతీకుమారు డగుటచేతనూ, పాండవ ధార్తరాష్ట్రుల కంటె పెద్దవాడు కావటం చేతనూ భూమికి తానే రాజు కాదగినవాడవని ప్రోత్సహించింది. ఆమె మాటలకు అతడు చలించలేదు. 'క్షత్రియ సంస్కారాలు చేయకుండా అప్పుడు నీటిలో ఆవిధంగా పారవేసి, ఈనాడు ఈ విధంగా పలకటం న్యాయమా! సూర్యానుగ్రహం వలన పుట్టిన నేను నింద్యుడను కాకపోయినా నా జన్మ రహస్యంగా ఉండిపోయింది. అది ఇప్పుడు ప్రకటనం చేయటం ఎంతవరకు మేలు? విజయ విక్రమం ప్రసిద్ధి చెంది ఉండగా నే నిప్పుడు పాండవులతో కలిస్తే భయపడి ఈ పని చేశాడని లోకులు నిందించరా? నాపై ఆశలు పెట్టుకొన్న దుర్యోధనుడిని ఈ తరుణంలో విడవటం న్యాయమా? కాబట్టి నేను దుర్యోధనుడి పక్షంలో ఉండి నీ కొడుకులతో యుద్ధం చేస్తా'నని అతడు సేవాధర్మపరాయణుడై పలికాడు. పాండవులలో ఒక్క పార్థుడు తప్ప మిగిలినవారు చేజిక్కినా వారిని చంపనని మాట ఇచ్చాడు. యుద్ధంలో కర్ణుడు గాని, అర్జునుడు గాని ఎవరో ఒకరు మిగులుతారు. అతడితో కలిసి కుంతీపుత్రులు అయిదుగురు కాగలరనీ ఆరుగురు ఎన్నడూ కారని హెచ్చరించాడు. ఆమె కర్ణుడిని కౌగిలించుకొని అదంతా విధివిలాసమని పేర్కొని, కర్ణుడి మాటల కంగీకరించి, అతడిని ఆశీర్వదించి నిజ నివాసానికి వెళ్ళిపోయింది.

యుద్ధ నిర్ణయం : సైన్యాల మోహరింపు

శ్రీకృష్ణుడు ఉపప్లావ్యంలో ధర్మరాజుకు హస్తినాపురి విశేషాలన్నింటినీ వివరించాడు. అప్పుడు 'మాకు ధర్మచ్యుతి లేకుండా భావి కార్యాన్ని నిశ్చయించు'మని నారాయణుడిని ధర్మరాజు ప్రార్థించాడు. అతడి నిర్ణయ మిది -

'యుద్ధమ కాక కార్యమును నొండొక టెద్దియుఁ గల్గ నేర్చునే?
బుద్ధులు సెప్ప వాక్యముల పోల వినండన నేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁ బట్టి సుయోధనుఁ; డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నా మతిఁ దోఁప దెమ్మెయిన్.' **(ఉద్యో. 4.88)**

శ్రీకృష్ణుడి నిర్ణయంతో యుద్ధం నిశ్చయమైనది. అతని సూచనపై ధృష్టద్యుమ్నుడు పాండవ సర్వ సైన్యాధ్యక్షుడుగా అభిషిక్తుడైనాడు. అట్లాగే అక్షౌహిణీపతులైన దండనాథులను శ్రీకృష్ణుడే నిర్దేశించాడు. కౌరవులతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రంలో సైన్యాన్ని సంఘటించాలని నియమించాడు. శుభశకునాల మధ్య యుధిష్ఠిరుడి సైన్యం ఉత్సాహంతో కురుక్షేత్రానికి చేరింది.

దుర్యోధనుడు ద్రోణాదులను పదకొండు మందిని అక్షౌహిణీ పతులుగా చేశాడు. వారలను భీష్ముడికి చూపి అతడిని సర్వ సైన్యాధ్యక్షుడిగా అభిషేకించాడు. బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళాడు. భీష్ముడు కురు పాండవ వీరుల అంతరాలను తెల్పి కర్ణుడిని అర్ధరథుని గానూ, అర్జునుడిని సాటిలేని మహారథుడి గాను పేర్కొన్నాడు. భీష్ముడు తాను శిఖండిని చంపలేనని చెప్పాడు. దానికి కారణమైన అంబోపాఖ్యాన కథనంతా వివరించాడు. అయినను ఆ పాండవ సేనా సాగరం ఇంకిపోయేటట్లు యుద్ధం చేస్తానని సైన్యాన్ని ఉత్తేజపరిచాడు.

- జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

తృతీయాశ్వాసము

చతుర్థాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీగౌరీ పల్లవపుట । యోగాశ్రయ మంజరీ సముజ్జ్వల మూర్తీ !
యోగీంద్ర సంతతాంత । ర్యాగ పరీపాకరూప! హరిహరనాథా ! **1**

ప్రతిపదార్థం: శ్రీగౌరీ= లక్ష్మీపార్వతులనెడి; పల్లవపుట= చిగురుటాకుల దొప్ప యొక్క; యోగ= సంబంధమునకు; ఆశ్రయ= ప్రాపైన; మంజరీ= పూలగుత్తివలె; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; మూర్తీ!= స్వరూపంగలవాడా!; యోగి+ఇంద్ర= ఉత్తమోపాసకుల యొక్క; సంతత= ఎడతెగని; అంతర్యాగ= అంతర్యాగమనే ఒక ఉత్తమోపాసనము యొక్క; పరీపాకరూప!= ఫలరూపమయినవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! చిగురుటాకులతో గూడిన పూలగుత్తి వలె లక్ష్మీ పార్వతులతోగూడి మిక్కిలి ప్రకాశించే స్వరూపంగలవాడా! యోగిశ్రేష్ఠులు నిరంతరం చేసే అంతర్యాగమనే మహోపాసనకు ఫలమైన ఆకారం గలవాడా!

విశేషం: అలం: రూపకం. లక్ష్మీపార్వతులతో కూడిన హరిహరమూర్తి కేవలం హరిహరమూర్తికంటె సముజ్జ్వలతరమైనదని భావం.

'శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మసి'. (సౌందర్యలహరి.1)

(శివుడు శక్తితో కూడినప్పుడే సకల కార్యనిర్వహణసమర్థ డవుతాడు. కానిచో కదలటానికి కూడా అసమర్థుడు.)

తిక్కన ఈ పద్యంలో పల్లవ-పుట-యోగ శబ్దాలతో అపూర్వమైన ఒక ఉత్తమోపాసనరహస్యాన్ని సూచించాడు. ఏదయినా దేవతామంత్రాన్ని ఉపాసించేటప్పుడు ఉపాసకుడు ఆ దేవతామంత్రాన్ని జపిస్తూ దేవతానుగ్రహాన్ని శీఘ్రంగాను, దృఢంగాను పొందాలంటే ఆ ప్రధాన దేవతామంత్రంతోపాటు తదనుకూలాలైన అంగమంత్రాలను గూడా జతచేసి జపించటం ఉపాసనా సంప్రదాయం. ఆ జత చేసే ప్రక్రియలు 1. పల్లవం, 2. సంపుటం, 3. యోజనం అని మూడు విధాలు. పల్లవ మంటే ప్రధాన మంత్రానికి తుదిని ఆ అంగమంత్రాన్ని సమకూర్చటం. సంపుటమంటే ప్రధాన మంత్రానికి తొలుతనే అంగమంత్రాన్ని సమకూర్చటం. యోజనమంటే ప్రధాన మంత్రానికి మొదటా చివరా కూడా అంగమంత్రాన్ని సమకూర్చటం. అట్లా సమకూర్చి జపిస్తే మంత్రశక్తి సముజ్జ్వలతరమై ఎంతటి ఫలాన్నైనా ఈయగల దేవతానుగ్రహం కలుగుతుందని శాస్త్ర హృదయం.

ప్రకృతం పరమేశ్వరరూప ప్రధానమంత్రానికి శ్రీదేవతాబీజాన్నీ, గౌరీదేవతా బీజాన్నీ పల్లవరూపంలోకాని, సంపుట రూపంలోకాని, యోజన రూపంలోకాని సమకూరిస్తే, ఆ పరమేశ్వరమూర్తి అంటే మంత్రం (మంత్ర ఏవ తు దేవతా) సముజ్జ్వలతర మవుతుందని భావం.

పరమేశ్వరుడు అంతర్యాగ పరీపాకరూపుడు. యాగమంటే దేవతాదుల నుద్దేశించి అగ్నిహోత్రంలో ఆజ్యాదిపదార్థాలను మంత్రపూర్వకంగా వేయటం. ఇది బాహ్యమనీ, అంతరమనీ రెండు విధాలు, బాహ్యయాగం ప్రసిద్ధమే. అంతర్యాగమంటే అంతఃకరణంచే భావించబడే పదార్థాలను అంతఃకరణమందే కల్పించబడే అగ్నిహోత్రంలో వేల్చటం. బాహ్యయాగాన్ని పరమేశ్వరార్పణ బుద్ధితో కావించి నిర్మలచిత్తుడైన తిక్కయజ్వ అంతర్యాగపు అతిశయం గ్రహించి పరమేశ్వరుడిని అంతర్యాగ పరీపాకరూపుడిగా ఇందులో సంబోధించాడు.

ఇట్లాగే తిక్కన శాంతిపర్వంలో కూడా-

'హృదయ వేదికయందు సమిద్ధమూర్తి । వెలుఁగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ
ములను; యాజి య ట్లంతరమున నొనర్చు । యాగమున వీతకల్మషుఁడై వెలుంగు'

అనటం గమనార్హం. బాహ్యోపకరణ విశేషాలతో చేయబడే యాగంవలెనే ఆంతరంగా శరీరంలో నిత్యమూ జరిగే వ్యాపారాలందే అపూర్వ భావనా విశేషంతో కావించబడటంచేత ఇది 'అంతర్యాగం' అనబడుతున్నది. ఈ అంతర్యాగానికి పూజాకుసుమాలు అహింస, ఇంద్రియనిగ్రహం, దయ, క్షమ, జ్ఞానాదులు. హోమ విషయంలో హుతవహుడు చైతన్యం, కుండం చిత్కుండం, హోమపదార్థం, హవ్యం - విశ్వం. ఈ అంతర్యాగానికి ఫలం

'ఇ త్యన్తర్యజనం కృత్వా సాక్షాద్బ్రహ్మమయో భవేత్,
న తస్య పాపపుణ్యాని జీవన్ముక్తో భవే ద్ధ్రువమ్'. అని చెప్పబడింది.

తిక్కన హరిహరనాథుడిని అటువంటి అంతర్యాగానికి ఫలస్వరూపుడిగా పేర్కొన్నాడు.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా= ప్రభూ! ఇది కృతిపతియైన హరిహరనాథుడి సంబోధనం; వైశంపాయనుండు= ఆ పేరుగల వ్యాసశిష్యుడు; జనమేజయునకున్= పరీక్షిత్తు కొడుకైన జనమేజయుడనే పేరుగల మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ప్రభూ! హరిహరనాథా! వ్యాసశిష్యుడైన వైశంపాయనముని జనమేజయమహారాజుతో ఈ విధంగా అన్నాడు.

విశేషం: వైశంపాయనుడు వ్యాసుడి శిష్యుడు, ముని, జనమేజయుడు ఉత్తరాభిమన్యుల కుమారుడైన పరీక్షిత్తు కొడుకు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పినట్లు తిక్కన హరిహరనాథుడితో భారత కథ చెప్పుతున్నాడు.

పాండవులు కృష్ణాదులంగూడి భావికార్య విధానము నాలోచించుట (సం. 5.1.1)

తే. ఎలమి నభిమన్యు పెండిలి యివ్విధమునఁ । జేసి, యుల్లాసలక్ష్మిఁ గైసేసి మత్స్య
మనుజపతి యన్వయంబు పావనము సేసి, । దినచతుష్టయానంతరమునఁ బ్రియమున. 3

ప్రతిపదార్థం: (తరువాతి వచనంలోని 'ధర్మతనయుండు' కర్త.) ఎలమిన్= సంతోషంతో; అభిమన్యుపెండిలి= అభిమన్యుడిపెళ్ళి; ఇవ్విధమునన్ (ఈ+విధమునన్)= ఈ రీతిగా; చేసి; ఉల్లాసలక్ష్మిన్= ప్రకాశమనే శ్రీని; కైసేసి= అలంకరించి, మత్స్యమనుజపతి అన్వయంబు= మత్స్యదేశాధీశుడైన విరాటుడియొక్క, వంశం; పావనము సేసి (పావనము+చేసి)= పవిత్రంచేసి; దినచతుష్టయ+ అనంతరమునన్= నాలుగు దినముల తరువాత; ప్రియమునన్= ప్రీతితో.

తాత్పర్యం: ధర్మరాజు అభిమన్యుడి పెళ్ళి ఈ రీతిగా సంతోషంతో చేసి, ప్రకాశమనే సంపద అలంకారంగా శోభిల్లుతూ, విరాటుడి వంశాన్ని పవిత్రం చేసి, నాలుగు దినాలు కడచిన తరువాత ప్రీతితో.

విశేషం: అభిమన్యుడు అర్జునుడి కొడుకు. అతడికి విరాటుడి కూతురైన ఉత్తరతో పెళ్ళి జరిగింది. పాండవుల తోడి ఈ సంబంధం వలన విరాటుడి వంశం పావనమయింది.

వ. ధర్మతనయుండు దమ్ములుం గొడుకులుం బరివేష్టించియుండ, విశాలరమణీయంబగు విరాటు కొలువు కూటంబున కరిగి యందు. 4

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= యముడి కొడుకైన ధర్మరాజు; తమ్ములున్= భీమాదులైన తమ్ములు నలుగురూ; కొడుకులున్= ప్రతివింధ్యాదులైన కొడుకులూ; పరివేష్టించి ఉండన్= చుట్టిఉండగా; విశాలరమణీయంబు+అగు= విశాలమూ, సుందరమూ అయిన; విరాటుకొలువుకూటంబునకున్= విరాటరాజు సభాభవనానికి; అరిగి= వెళ్లి; అందున్= ఆ కొలువులో.

తాత్పర్యం: ధర్మరాజు భీమాదులైన తమ్ములు నలుగురూ, ప్రతివింధ్యాదులైన కుమారులూ చుట్టియుండగా విశాలమూ, సుందరమూ అయిన విరాటరాజు సభాభవనానికి వెళ్ళి అందులో (వచనం 6లోని 'ఉన్న' అనే దానితో అన్వయం).

విశేషం: ధర్మరాజు తమ్ములు భీమార్జుననకులసహదేవులు, కొడుకులు ప్రతివింధ్యుడు, శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు అనే ఉపపాండవులైదుగురూ, భీముడికొడుకు ఘటోత్కచుడూ, అర్జునుడి కొడుకు అభిమన్యుడు మొదలయినవారు. విరాటుడి కొలువు విశాలమైనది అంతేకాక అది రమణీయమైనది.

క. విరటుఁడుఁ, బాంచాలుండును, । హరియును, రాముండు, వారి యనుజ తనూజుల్,
పరిణయ సమాగతాఖిల । ధరణీశులు బలసియుండఁ, దద్దయు నెమ్మిన్. 5

ప్రతిపదార్థం: విరటుఁడున్= విరాటరాజూ; పాంచాలుండును= పాంచాలదేశపురాజగు ద్రుపదుడూ; హరియును= శ్రీకృష్ణుడూ, రాముండు= బలరాముడూ; వారి= ఆ విరాటాదుల; అనుజతనూజుల్= తమ్ములూ, కొడుకులూ; పరిణయసమాగత+ అఖిలధరణీ+ఈశులున్= వివాహానికి విచ్చేసిన ఎల్లరాజులూ; బలసి+ఉండన్= చుట్టుకొనిఉండగా; తద్దయున్= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: విరాటుడూ, ద్రుపదుడూ, శ్రీకృష్ణుడూ, బలరాముడూ, వారి తమ్ములూ, కుమారులూ, వివాహానికి విచ్చేసిన రాజులందరూ పరివేష్టించిఉండగా, మిక్కిలి ప్రీతితో. (తరువాతి వచనంలోని 'ఉన్న' అనే దానితో అన్వయం.)

వ. ఉన్నసమయంబున సభాసదులైన మానవేంద్రులు నానావిధంబులఁ గృష్ణ యుధిష్ఠిరులతో సంభాషణంబులు సేయుచుండఁ, బాండవకార్యార్థియై కృష్ణుండు తదీయ వచనంబులు వారించి, వారలఁ గలయం గనుంగొని యిట్లనియె. 6

ప్రతిపదార్థం: ఉన్నసమయంబునన్= ఆవిధంగా పరివేష్టించి ఉన్నవేళ; సభాసదులు+ఐన= సభ్యులైన; మానవేంద్రులు (మానవ+ఇంద్రులు)= రాజులు; నానావిధంబులన్= అనేకరీతుల; కృష్ణయుధిష్ఠిరులతోన్= కృష్ణుడితోను, ధర్మరాజుతోను; సంభాషణంబులు+చేయుచున్+ఉండన్= మాటలాడుతుండగా, కృష్ణుండు; పాండవకార్య+అర్థి+ఐ= పాండవుల పనిని కోరినవాడయి; తదీయవచనంబులు= వారి మాటలు; వారించి= ఆపి; వారలన్= వారిని; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా వారందరూ కూడిఉన్న సమయంలో సభలోని రాజులు అనేకరీతులుగా కృష్ణుడితోనూ, ధర్మరాజుతోనూ మాటలాడుతుండగా, శ్రీకృష్ణుడు పాండవుల కార్యం కోరినవాడయి వారి మాటలను ఆపి, వారినందరినీ కలయ చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడు 'పాండవకార్యార్థియై' వారలఁ గలయం గనుంగొని' మాట్లాడి నట్లు చెప్పటం సార్థకం. ఉద్యోగపర్వానికి కార్యారంభాన్ని చేస్తూ, అక్కడ ఉన్న రాజలోకమంతా ఏకమై వర్తించేటట్లుగా పలుకుతున్నాడని ధ్వని. నిజానికి పలుకవలసింది ధర్మజుడు. కాని, వచ్చినవారందరూ వివాహ శుభకార్యంలో పాల్గొనటానికి వచ్చిన బంధుమిత్రులు. వారిని ధర్మజుడు ప్రత్యక్షంగా యుద్ధంలో సహాయం చేయండని కోరటం ఉచితం కాదు. అదిగాక పాండవుల అంతరాత్మ వంటివాడు కృష్ణుడు. దైవశక్తిగా వారిచేత భావించబడి పూజించబడేవాడు. అతడిది భవిష్యద్వాణి, తప్పక జరిగేమాట అని వారికి విశ్వాసం ఉన్నది. పాండవులకు శ్రీకృష్ణుడు మార్గదర్శి. మహర్షి, 'యోగక్షేమం వహామ్యహమ్' అని రక్షించే పరమాత్మ. శ్రీకృష్ణుడు ఉద్యోగపర్వంలో పాండవేతివృత్తంలో నిర్వహించే కీలకమైన పాత్రను కవి ఈ మాటల వలన ధ్వనింపచేశాడు.(సంపా.)

మ. 'కపటద్యూతమునందు సౌబలునిచేఁ గౌంతేయు లాత్మీయరా
జ్య పదభ్రంశముఁ బొంది, సత్యనిరతిన్ శక్తాత్ములై యుండియుం
గుపితస్వాంతులు గాక, తత్సమయ సంక్షోభంబు గాకుండఁగా,
విపినావాసము, గూఢచర్యయును గావింపం దలం పొప్పదే? 7

ప్రతిపదార్థం: కౌంతేయులు= కుంతీపుత్రులు-పాండవులు; కపటద్యూతమునందున్= మోసపుజూదంలో; సౌబలునిచేన్= శకునిచేత; ఆత్మీయరాజ్యపదభ్రంశమున్= తమదైన రాజ్యస్థానంనుండి జారుపాటును - స్వీయ రాజ్యభ్రష్టతను; పొంది; సత్యనిరతిన్= సత్యమునందలి అత్యంతాసక్తిచేత; శక్త+ఆత్ములు+ఐ+ఉండియున్= సమర్థులై ఉండికూడా; కుపితస్వాంతులు+ కాక= కోపించిన మనస్సులు కలవారు కాకుండా; తద్+సమయసంక్షోభంబు+కాక+ఉండఁగాన్= ద్యూత నియమానికి భంగం కలుగకుండేటట్లు; విపిన+ఆవాసమున్= అరణ్యావాసమూ; గూఢచర్యయును= రహస్యవర్తనమూ, (అజ్ఞాతవాసమూ); కావింపన్+ తలంపు= చేయాలనే ఆలోచన; ఒప్పదే?= తగదా? బాగుకదా!

తాత్పర్యం: 'పాండవులు జూదంలో శకుని కుటిలత్వం చేత తమ రాజ్యం కోలుపోయి, సమర్థులై ఉండి కూడా, సత్యంపై ఉండే అత్యంతాసక్తిచేత, కుపితమనస్కులుగాక, ద్యూత నియమానికి భంగం కలగకుండా, అరణ్యాజ్ఞాతవాసాలు చేయనెంచడం సముచితం కాదా?

విశేషం: సౌబలుడు (శకుని) గాంధారదేశాధిపతియైన సుబలుడి కొడుకు. గాంధారికి అన్న. దుర్యోధనాదుల మేనమామ. దుర్యోధనుడి పక్షాన ఇతడే ధర్మరాజుతో జూదం ఆడి మోసంతో అతడిని ఓడించాడు. కౌంతేయులంటే కుంతి కొడుకులే

అయినా, పాండవుల కందరికీ వర్తిస్తుంది. సమర్థులై ఉండికూడా, కోపం తెచ్చుకోక, ద్యూత నియమోల్లంఘనం చేయక, అరణ్యాజ్ఞాతవాసాలు చేయ నెంచడం పాండవుల సత్యనిరతికి నిదర్శనం. 'సత్యమేవ జయతే'- అనే న్యాయాన్ని అనుసరించి వారికి విజయం కలుగాలని ధ్వని.

ఆ. తలఁచినట్ల వ్రతము సలిపి యమ్మాడ్కిఁ బం । డ్రెండు వత్సరములు పాండవేయు
లకట! క్రూరసత్త్వ యాతుధానావలి । తోడఁ గాననమునఁ గూడి మనరె? 8

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; పాండవేయులు= పాండవులు; తలఁచినట్ల (తలఁచిన+అట్లు+అ)= అనుకొన్న విధంగానే; వ్రతముసలిపి= నియమం పాటించి; అమ్మాడ్కిన్ (ఆ+మాడ్కిన్)= ఆ రీతిగా; పం(డ్రెండువత్సరములు= పన్నెండేళ్ళు; కాననమునన్= అడవిలో; క్రూరసత్త్వయాతుధాన+ఆవలితోడన్= క్రూరమృగాలతోనూ, రాక్షససమూహంతోనూ; కూడి= కలిసి; మనరె= జీవించరా?

తాత్పర్యం: అయ్యో! పాండవులు అనుకొన్న విధంగానే నియమం పాటించి ఆ రీతిగా పన్నెండేళ్లు అడవిలో క్రూరమృగాలతోనూ, రాక్షస సమూహంతోనూ కలిసి జీవించలేదా?

విశేషం: సత్యధర్మ నిరతి వలన పాండవులు ఉదాత్తు లనిపించుకొన్నారు. కపటద్యూతంలో ధర్మజుడు దిగ్విజయం చేసి సంపాదించుకొన్న సంపదను కౌరవులు అపహరించారు. ఉద్ధతులు, కపటులు అనిపించుకొన్నారు. పాండవులు బలవంతులైనా వారిని కోపంతో మట్టుపెట్టలేదు. సమయ సంక్షోభాన్ని సృష్టించలేదు. సత్యాన్ని పాటించి, ధర్మాన్ని రక్షించారు. కాబట్టి 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయం వారిపట్ల వర్తిస్తుంది అని భావం. ధార్మికులను ధర్మం ధర్మపరుల సహాయరూపంగా సమకూడి రక్షిస్తుందని ధ్వని. శ్రీకృష్ణుడు తన ప్రతిపాదనకు తగిన ప్రాతిపదికను పద్యంలో బలంగా వేసి వాదకుశలు డనిపించుకొన్నాడు. (సంపా.)

క. పదపడి, దుస్తరమగు నీ । పదుమూఁడగునేఁడు గడవఁబడుట యరిది; త
మ్మెదు రెఱుఁగమికై యాపద । లొదవిన సైరించి; రిట్టి యునికియుఁ గలదే? 9

ప్రతిపదార్థం: పదపడి= పిమ్మట; దుస్తరము+అగు= దాటశక్యంకాని; ఈ పదుమూఁడగు+ఏఁడు= ఈ పదమూడో యేడు (అజ్ఞాతవాస సంవత్సరం); కడవన్+పడుట= దాటటం; అరిది= దుష్కరం; తమ్మన్= తమను; ఎదురు= శత్రువును, ఎఱుఁగమికై= తెలిసికొనకుండా ఉండటానికి; ఆపదలు= కష్టాలు; ఒదవినన్= కలిగినా; సైరించిరి= ఓర్చుకొన్నారు; ఇట్టి ఉనికియున్= ఇటువంటి జీవనం కూడా; కలదే= ఉన్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: అరణ్య వాసానంతరం దాటశక్యం కాని అజ్ఞాతవాస సంవత్సరమైన ఈ పదమూడో యేడు గడపటం దుష్కరం. తమను శత్రువు తెలిసికోకుండా ఉండటానికి ఎన్ని ఆపదలు సంభవించినా వీళ్ళు సహించారు. ఇటువంటి బ్రదుకు ఉంటుందా?

విశేషం: తమను శత్రువు తెలిసికొంటే ద్యూతనియమం ప్రకారం మళ్ళీ పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక యేడు అజ్ఞాతవాసం చేయాలి. అందుచేత అజ్ఞాతవాస సంవత్సరంలో ఎన్ని ఆపదలు వచ్చినా పాండవులు సహించారు. ఇంత కష్టపుబ్రదుకు ఎక్కడా ఉండదని భావం. పాండవుల పట్ల పారిషదుల సానుభూతిని సమకూర్చే సంభాషణ మిది.

క. మీరలు ధర్మజు వర్తన । గౌరవ మెఱుఁగుదుర కాదె? కావున నా గాం
ధారీ తనూభవులకును, । వీరలకును హితమగా వివేకప్రౌఢిన్. 10

ప్రతిపదార్థం: మీరలు= మీరు; ధర్మజు= ధర్మరాజుయొక్క; వర్తన గౌరవము= నడవడియొక్క గొప్పతనం; ఎఱుఁగుదురు+అ+ కాదె!= తెలిసినవారే కదా!; కావునన్= కాబట్టి, ఆ గాంధారీ తనూభవులకును= గాంధారి కొడుకులైన ఆ కౌరవులకూ; వీరలకును= వీరికీ- పాండవులకూ; హితము+అ+కాన్= మేలు అయ్యే విధంగా; వివేక ప్రౌఢిన్= విచారణ సామర్థ్యంతో.

తాత్పర్యం: మీరు ధర్మరాజు సత్ప్రవర్తనం తెలిసినవారే కదా! కాబట్టి ఆ కౌరవులకూ, ఈ పాండవులకూ మేలు కలిగే విధంగా విచారణ శక్తితో (తరువాత పద్యంలోని 'తలఁపుఁడు' అనే క్రియతో అన్వయం.)

విశేషం: కౌరవ పాండవులకు ఉభయులకూ మేలు కలుగవలెనంటే బాగా విచారణ చేసే నేర్పు ఉండాల్సిందే.

తే. ధర్మమార్గంబు దప్పక తలఁపుఁ డొక్క । తెఱఁగు; ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
పడయ నొడఁబడఁ డయ్యింద్రపదవియైన; । నుచితగతి నెంత వడసిన నుల్లసిల్లు. 11

ప్రతిపదార్థం: ధర్మమార్గంబు; తప్పక= విడువక; ఒక్క తెఱఁగు= ఒక విధం; తలఁపుఁడు= ఆలోచించండి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధర్మువు+తప్పి= అధర్మంగా; ఆ+ఇంద్రపదవి+ఐనన్= ఉన్నతమైన ఆ ఇంద్రపదవిని కూడా; పడయన్= పొందటానికి; ఒడఁబడఁడు= అంగీకరించడు; ఉచిత గతిన్= తగిన రీతిని; ఎంత+పడసినన్= ఎంత తక్కువ లభించినా; ఉల్లసిల్లున్= సంతోషిస్తాడు.

తాత్పర్యం: ధర్మమార్గం విడిచిపెట్టకుండా ఏదయినా ఒక విధం ఆలోచించండి. ధర్మరాజు అధర్మపద్ధతిన అత్యున్నతమైన ఆ ఇంద్రపదవి లభించినా అంగీకరించడు. సముచితమార్గంలో ఎంత తక్కువ లభించినా సంతోషిస్తాడు.

విశేషం: అలం: వినోక్తి. ధర్మరాజుకు ధర్మం ముఖ్యం. పదవి కాదు అని భావం.

వ. కావునఁ బాండవులకుఁ బితృధనంబగు రాజ్యంబుఁ గపటద్యూతంబున దుర్యోధనుఁ డపహరించుటయు, నది వీరలు దిగ్విజయంబుఁ జేసి యలవరించుకొన్న పదం బగుటయు; ధర్మసూను మహానుభావంబు విచారింపక ధార్తరాష్ట్రులు పరిభవించినం దెగి యితండు వారలకుం గీడు రోయమియు, నీరెండు దెఱంగుల వారికిం బంచి కుడువందగుటయుం దలపోసి, తగిన కార్యంబు సెప్పనర్హులు; రేనును నాకన్నంత సెప్పెద వినుండు. 12

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి, పాండవులకున్; పితృధనంబు+అగు= తండ్రి సొత్తు అయిన; రాజ్యంబున్; కపట ద్యూతంబునన్= మోసపుజూదంలో; దుర్యోధనుఁడు; అపహరించుటయున్= దొంగిలించటం; అది= ఆ రాజ్యం; వీరలు= వీరు (పాండవులు); దిగ్విజయంబున్+చేసి= దిక్కులను (ఆయాదిక్కులలోని రాజ్యాలను) గెలవటంచేత; అలవరించుకొన్న పదంబు= సంపాదించుకొన్న స్థానం; అగుటయున్= కావటం; ధర్మసూను మహానుభావంబు= ధర్మరాజు గొప్పతనం; విచారింపక= ఆలోచించక; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కుమారులు-దుర్యోధనాదులు; పరిభవించినన్= అవమానించగా; తెగి= సాహసించి; ఇతండు= ధర్మరాజు; వారలకున్= కౌరవులకు; కీడు= హాని; రోయమియున్= తలపెట్టకపోవటం; ఈ రెండు తెఱంగులవారికిన్=

ఈ రెండు పక్షాలవారికీ; పంచి కుడువన్+తగుటయున్= విభజించుకొని అనుభవించతగి ఉండటం; తలపోసి= ఆలోచించి; తగిన కార్యంబు= తగిన కర్తవ్యం; చెప్పన్; అర్హులరు= తగినవారు; ఏను= నేను కూడా; నా కన్న+అంత= నేనెరిగినంత; చెప్పెదన్= చెపుతాను; వినుండు= వినండి.

తాత్పర్యం: కాబట్టి, పాండవులకు తండ్రి సొత్తయిన రాజ్యాన్ని మోసపు జూదంలో దుర్యోధనుడు అపహరించటమూ, అది వీరు దిక్కులను జయించి సంపాదించుకొన్నది కావటమూ, ధర్మరాజు మహానుభావం ఆలోచించక దుర్యోధనాదులు అవమానించినా సాహసించి ఈ ధర్మరాజు వాళ్ళకు ఎటువంటి హానీ చేయ తలపెట్టకపోవటమూ, ఈ రెండు పక్షాల వారికీ పంచుకొని అనుభవించదగింది అవటమూ విచారించి, తగిన కర్తవ్యం ఉపదేశించటానికి మీరు తగినవారు. నేను కూడా నేనెరిగినంతలో చెప్పుతాను వినండి.

విశేషం: ఈ మాటలలో శ్రీకృష్ణుడి వాక్చాతుర్యం తెలుస్తున్నది. పాండవులకు రాజ్యం తండ్రి నుండి వచ్చినది. దానిని దుర్యోధనుడు అన్యాయపు జూదంలో అపహరించాడు. అది పాండవుల కష్టార్జితం. ధర్మరాజు ఎంతటి మహానుభావుడో తెలియక దుర్యోధనాదులు అవమానిస్తే, అతడు వాళ్ళకు కీడు తలపెట్టలేదు. రాజ్యం ఈ రెండు పక్షాలవారూ పంచుకొని అనుభవించదగింది. సభ్యులు సముచిత కర్తవ్యోపదేశం చేసే ముందు ఈ అంశాల నన్నిటినీ దృష్టిలో పెట్టుకొనాలి - అని శ్రీకృష్ణుడి హెచ్చరిక. శ్రీకృష్ణుడి మాటలలోని హేతుబద్ధత మెచ్చదగింది.

క. కుంతీతనయులు సమయము । శాంతతమై నడపి, తమ భుజాబలమును, దు
ర్దాంతోద్యమ శౌర్యము నెఱిఁ । గింతు మనుచు నున్నవారు గినుకెదఁ గదురన్. 13

ప్రతిపదార్థం: కుంతీ తనయులు= కుంతి కొడుకులు - పాండవులు; సమయము= (ద్యూత) నియమాన్ని; శాంతతమైన్= శాంతితో; నడపి= పాటించి; కినుక= కోపం; ఎదన్= హృదయంలో; కదురన్= అతిశయించగా; తమ భుజాబలమును= తమ భుజపరాక్రమమునూ; దుర్దాంత+ఉద్యమ శౌర్యమున్= నిగ్రహించవీలుకాని, పూనికగల పరాక్రమమునూ; ఎఱిఁగింతుము+ అనుచున్+ఉన్నవారు= తెలపాలనుకొంటున్నారు.

తాత్పర్యం: పాండవులు ద్యూత నియమాన్ని శాంతంగా పాటించి, కోపం హృదయంలో అతిశయించగా, తమ భుజబలాన్నీ, నిగ్రహించరాని పూనికతోకూడిన పరాక్రమాన్నీ కౌరవులకు చూపాలనుకొంటున్నారు.

విశేషం: జూదానికి ముందు చేసికొన్న నియమాన్ని శాంతంగానే పాటించారు పాండవులు. అంతవరకూ తమ హృదయాలలో అణచిపెట్టబడిన కోపం వెల్లుబికి అనివార్యమైన తమ పరాక్రమం ప్రదర్శించాలనుకొంటున్నారు. ఇది వారి ధర్మనిరతినీ, పరాక్రమాన్నీ సూచిస్తుంది. అంతదాకా వారు ఊరుకొనటం చేతగాక కాదు; ధర్మపరాయణులు అవటం వలన మాత్రమే.

క. వీరి తలం పెఱిఁగిన గాం । ధారీ తనయుఁడు సుహృద్వితానముఁ గూర్చుం,
'పోరఁ బరిమార్తుఁ గొంచెపు । వారై యున్నెడన' యని యవశ్యముఁ గడఁకన్. 14

ప్రతిపదార్థం: వీరి= ఈ పాండవులయొక్క; తలంపు= అభిప్రాయం; ఎఱిఁగిన= తెలిసిన; గాంధారీ తనయుఁడు= గాంధారి కొడుకు- దుర్యోధనుడు; కొంచెపువారై (కొంచెము+వారు+ఐ)= అల్పసంఖ్యాకులయి; ఉన్న+ఎడన్+అ= ఉన్నప్పుడే; పోరన్= యుద్ధంలో; పరిమార్తున్= చంపుతాను; అని; అవశ్యమున్= తప్పనిసరిగా; కడఁకన్= ప్రయత్నంతో; సుహృద్+వితానమున్= మిత్రుల సమూహాన్ని; కూర్చున్= సమకూర్చుకొంటున్నాడు.

తాత్పర్యం: ఈ పాండవుల అభిప్రాయం తెలిసిన దుర్యోధనుడు 'అల్పసంఖ్యాకులై ఉన్నప్పుడే శత్రువులను యుద్ధంలో చంపుతా'నని అనివార్యమైన పూనికతో మిత్రబృందాన్ని సమకూర్చుకుంటున్నాడు.

విశేషం: 'శత్రువు అల్పుడై ఉన్నప్పుడే సాధించాలి' అనే రాజనీతిని దుర్యోధనుడు పాటించి, పాండవులను యుద్ధంలో చంపటానికి మిత్రులను కూర్చుకొని సన్నద్ధుడవుతున్నాడు. ఇది ఆతడి యుద్ధనీతికి నిదర్శనం.

క. అలఘు బల విక్రమోదా । త్తుల కైనను బలము లేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె, సహాయము । కలిమి ననంతంబు లగు పగఱసైన్యములన్? 15

ప్రతిపదార్థం: అలఘు బల విక్రమ+ఉదాత్తులకున్+ఐనను= అధిక బలపరాక్రమాలచేత గొప్పవారైన వారికి కూడా; సహాయము కలిమిన్= తోడ్పాటు ఉండటం చేత; అనంతంబులు+అగు= అంతం లేని; పగఱ సైన్యములన్= శత్రుసేనలను; బలము లేక= సైన్యం లేకుండా; దోర్గర్వముమైన్ (దోః+గర్వము+మైన్)= భుజబలగర్వంతో; గెలువఁగన్+వశమె= గెలువ శక్యమా? (కాదని భావం.)

తాత్పర్యం: ఎంతటి బలపరాక్రమ సంపద కలవారికైనా, సహాయసంపద కలిగిన అనంతమైన శత్రుసైన్యాన్ని, నిస్సహాయంగా కేవల భుజబలగర్వంతోనే గెలవటం సాధ్యమవుతుందా?

విశేషం: దుర్యోధనుడివలెనే, పాండవులు కూడా కేవలం తమ భుజబలాన్నే నమ్ముకొని కూర్చుండక, సహాయసంపద గలిగి అనంతమైన శత్రుసైన్యాన్ని గెలవడానికి మిత్రబలాల్ని కూర్చుకోవాలని శ్రీకృష్ణుడి సూచన.

క. కావునఁ బాండవ పక్షము । భూవల్లభకోటి యిచటఁ బ్రోవగు; నిమ్మై
నీ వీరులు, నా వీరులు । దేవాసురులట్ల యనికిఁ దెగుదురు గడిమిన్. 16

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పాండవ పక్షము భూవల్లభకోటి= పాండవుల పక్షంలోని రాజుల సమూహం; ఇచ్చటన్= ఇక్కడ; ప్రోవు+అగున్= చేరుతుంది; ఇమ్మైన్ (ఈ+మైన్)= ఈ విధంగా; ఈ వీరులున్= పాండవవీరులూ; ఆ వీరులున్= ఆ కౌరవవీరులూ; దేవాసురులట్ల (దేవ+అసురుల+అట్లు+అ)= దేవతలు రాక్షసులు మాదిరిగానే; కడిమిన్= పరాక్రమంతో; అనికిన్= యుద్ధానికి; తెగుదురు= సాహసిస్తారు.

తాత్పర్యం: కాబట్టి, పాండవుల పక్షంలోని రాజుల సమూహం ఇక్కడ కూడుతుంది. ఈ రీతిగా పాండవ వీరులూ, కౌరవవీరులూ దేవతలు రాక్షసుల వలెనే పరాక్రమంతో యుద్ధానికి తెంపు వహిస్తారు.

విశేషం: అలం: ఉపమ, యథాసంఖ్యము. 'ఈ వీరులు నా వీరులు దేవాసురులట్ల' అనటంలోని క్రమాన్వయం చొప్పున పాండవులకు దేవతలతోనూ, కౌరవులకు అసురులతోనూ పోలిక సిద్ధిస్తున్నది. దేవాసుర యుద్ధంలో చివరికి దేవతలదే విజయం కాబట్టి, పాండవ కౌరవ యుద్ధంలో పాండవులదే విజయం అని శ్రీకృష్ణుడు సూచించినట్లయింది. దేవాసురయుద్ధంతో పోలికవలన భావి పాండవ కౌరవ యుద్ధం కూడా అతిభీకరంగా ఉండగలదని సూచన.

వ. ఇది యిక్కడి తెఱంగునకుఁ దోఁచిన తలం; పక్కడివారి చిత్తవృత్తి యెట్టిదగుట యెఱుంగ; మెదిరిమతంబెఱుంగక యెట్టికార్యంబు నిశ్చయింప వెరవగునే? కావున ని య్యవసరంబునం దగిన మానిసి నందులకుం

బుచ్చవలయు; దుర్యోధనుండు వీరికి రాజ్యంబు పా లిచ్చిన మేలగుఁగాక, తక్కిన నప్పటికిఁ బోలినపని సూచుకొంద'మని పలికిన విని బలదేవుం డియ్యకొని రాజలోకంబు నాలోకించి యిట్లనియె. 17

ప్రతిపదార్థం: ఇది; ఇక్కడి తెఱంగునకున్= ఇక్కడి పరిస్థితికి; తోఁచిన తలంపు= స్ఫురించిన అభిప్రాయం; అక్కడి వారి= అక్కడనున్న కౌరవులయొక్క; చిత్తవృత్తి= మనఃస్థితి; ఎట్టిదగుట (ఎట్టిది+అగుట)= ఎట్లా ఉన్నదీ; ఎఱుంగము= తెలియము; ఎదిరిమతంబు= ఎదుటివారి (శత్రువు) అభిప్రాయం; ఎఱుంగక= తెలిసికోకుండా; ఎట్టికార్యంబు= ఏపనినీ; నిశ్చయింపన్= నిర్ణయించడానికి; వెరవు+అగునే?= వీలవుతుందా?; కావునన్; ఇయ్యవసరంబునన్ (ఈ+అవసరంబునన్)= ఈ సమయంలో; తగిన మానిసిన్= అర్హుడైనవాడిని; అందులకున్= అక్కడికి- కౌరవసభకు; పుచ్చవలయున్= పంపాలి; దుర్యోధనుండు; వీరికిన్= పాండవులకు; రాజ్యంబుపాలు= రాజ్యభాగం; ఇచ్చినన్= ఇస్తే; మేలు+అగున్= మంచిది; కాక తక్కినన్= అట్లాకాకపోతే- రాజ్యభాగం ఇవ్వని పక్షంలో; అప్పటికిన్= ఆ సమయానికి; పోలినపని= తగిన కార్యం; చూచుకొందము= ఆలోచిద్దాం; అని; పలికినన్= పలుకగా; విని; బలదేవుండు= బలరాముడు; ఇయ్యకొని= సమ్మతించి; రాజలోకంబున్= రాజుల సమూహాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇదీ ఇక్కడి పరిస్థితికి అనురూపమైన అభిప్రాయం. అక్కడి వారి మనఃస్థితి ఎట్లా ఉందో మనకు తెలియదు. ఎదుటివారి అభిప్రాయం తెలిసికొనకుండా ఏ కార్యాన్నీ నిశ్చయించటం మంచిదికాదు. కాబట్టి ఈ సమయంలో తగినవాడిని కౌరవసభకు పంపాలి. దుర్యోధనుడు వీరికి రాజ్యభాగం ఇస్తాడా మంచిది. ఇవ్వకపోతే ఏం చేయాలో ఆ సమయానికి చూచుకొందాం-' అని పలుకగా విని బలరాముడు దానికి సమ్మతించి రాజసమూహాన్ని చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడి మాటలు అతడి కార్యనిపుణత్వాన్ని సూచిస్తున్నాయి.

క. 'హరి వాక్యము వింటిరె? యిది । యిరు దెఱఁగుల జనములకును హితమును ధర్మో
త్తరమును నైయున్నది యీ । వెరవున శక్యంబు మనకు వీరలఁ దీర్పన్. 18

ప్రతిపదార్థం: హరివాక్యమున్= శ్రీకృష్ణుడు చెప్పినమాట; వింటిరె?= విన్నారా?; ఇది= ఈ వచనం; ఇరు+తెఱఁగుల జనములకును= రెండు పక్షాల జనులకూ; హితమును= మేలును; ధర్మోత్తరమునున్= ధర్మంచేత శ్రేష్ఠమైనదీ; ఐ+ఉన్నది= అయి ఉన్నది; ఈ వెరవునన్= ఈ ఉపాయాన; మనకున్; వీరలన్= ఈ కౌరవపాండవులను; తీర్పన్= సమాధానపరచటానికి; శక్యంబు= సాధ్యం.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెప్పింది విన్నారా? ఇది ఇరుపక్షాల వారికీ మేలయినదీ; ధర్మయుక్తమైనదీ అవడంచేత శ్రేష్ఠమైనదీ అయి ఉంది. ఈ మార్గంలో మనకు ఈ ఉభయుల్నీ సమాధానపరచడం సాధ్యం.

విశేషం: శ్రీకృష్ణుడి హితవులో హితం, ధర్మం రెండూ కలిసి ఉండటం చేత ఆ సలహా పాటిస్తే పాండవకౌరవులకు హితం కలుగుతుంది, ధర్మయుక్తంగా ఉండటం చేత లోకులందరూ సంతోషిస్తారని భావం, (సంపా.).

చ. తమ సగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరు వీరికిన్
సముచితవృత్తి నిచ్చి తమ సామున సంతసమంది యున్కి యు
క్తము ధృతరాష్ట్రసూనునకు; దాన నపాయము లేకయుండుఁ; గో
పముడిగి వీరు సేయుదురు బాంధవ; మిజ్జగముం బ్రియంపడున్. 19

ప్రతిపదార్థం: తమసగపాలు= తమ సగంభాగం; కోలుపడి= పోగొట్టుకొని; దానిన (దానిన్+అ)= దానినే; ఇప్పుడు; కోరువీరికిన్= కోరుకొంటున్న పాండవులకు; సముచిత వృత్తిన్= తగినరీతిగా ఇచ్చి; తమసామునన్= తమ సగం భాగంతో; సంతసము+అంది+ ఉన్కి= సంతోషపడి ఉండటం; ధృతరాష్ట్రసూనునకున్= ధృతరాష్ట్రుడి కొడుకు- దుర్యోధనుడికి; యుక్తము= తగినది; దానన్= దానిచేత; అపాయము లేక+ఉండున్= చెరుపు ఉండదు; వీరు= ఈ పాండవులు; కోపము+ఉడిగి= కోపం విడిచి; బాంధవము= చుట్టరికం; చేయుదురు= కొనసాగిస్తారు; ఇజ్జగమున్ (ఈ+జగమున్)= ఈ లోకం; ప్రియంపడున్ (ప్రియము+పడున్)= సంతోషిస్తుంది.

తాత్పర్యం: తమ సగం భాగం కోలుపోయి దానినే ఇప్పుడు కావాలంటున్న పాండవులకు సముచితంగా దానిని ఇచ్చి, తమ సగంతో తృప్తిపడి ఉండటం దుర్యోధనుడికి మంచిది. దానిచేత కీడు ఉండదు. పాండవులు కోపం విడిచి బంధుత్వం చూపుతారు. ఈ లోకం కూడా సంతోషిస్తుంది.

విశేషం: జూదంలో కోలుపోయింది రాజ్యంలోని తమసగపాలే కాబట్టి, దానిని పాండవులు కోరటం, కౌరవులివ్వడం, ఉన్నదాంతో తృప్తిపడటం దుర్యోధనుడికి మంచిదనీ, జరిగినదానిని మనసులో పెట్టుకొని పగ సాధించకుండా కౌరవులతో కలిసి జీవించటం పాండవులకు మంచిదనీ బలరాముడి అభిప్రాయం. ఇంతవరకూ బలరాముడు శ్రీకృష్ణుడి వాదాన్నే బలపరిచాడు.(సంపా).

వ. కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుపవలయు; వాఁడునుం జని యభిమతంబు సాధించునప్పుడు. 20

ప్రతిపదార్థం: కావునన్; ఇక్కార్యంబు (ఈ+కార్యంబు)= ఈ పని; ఎడ+చేయక= ఆలస్యం చేయకుండా; ఒక్కరున్= ఒక్కడిని; పనుపవలయున్= పంపాలి; వాఁడునున్= ఆతడునూ; చని= వెళ్ళి; అభిమతంబు= అనుకొన్నది; సాధించు+అప్పుడు= సాధించేటప్పుడు.

తాత్పర్యం: కాబట్టి, ఈ పని ఆలస్యం కాకుండా ఒక్కణ్ణి అక్కడికి పంపాలి. అతడు కూడా వెళ్ళి, తాను అనుకొన్నది సాధించేటప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. మాట పొందెఱింగి, యోటమై నల్లన । చేరి, కౌరవేంద్రు చిత్తవృత్తి
కనుగుణంబుగాఁగ నానతుం డగుచుఁ బ్రా । ర్థించి యడుగకున్నఁ దెఱఁగుపడదు. 21

ప్రతిపదార్థం: మాటపొందు= మాటలపొందిక; ఎఱింగి= తెలిసి; ఓటమైన్= వినయంతో; అల్లన= మెల్లగా; చేరి= దగ్గరై; కౌరవేంద్రు (కౌరవ+ఇంద్రు)= కౌరవశ్రేష్ఠునియొక్క - దుర్యోధనుడియొక్క; చిత్తవృత్తికిన్= మనఃస్థితికి; అనుగుణంబు+ కాఁగన్= అనుకూలంగా; ఆనతుండు+అగుచున్= మిక్కిలి నమ్రతతో వంగినవాడు అవుతూ; ప్రార్థించి= వేడుకొని; అడుగక+ ఉన్నన్= అడగకపోతే; తెఱఁగు పడదు= చక్కబడదు.

తాత్పర్యం: మాటతీరు తెలిసి వినయంతో మెల్లగా చేరి దుర్యోధనుడి మనఃస్థితి కనుకూలంగా వినమ్రుడై వేడుకొని అడుగకపోతే వ్యవహారం చక్కబడదు.

విశేషం: రాయబారి అయినవాడు ప్రవర్తించవలసిన తీరు బలరాముడు బాగా వివరించాడు. బలరాముడి మాటలలో పాండవుల దైన్యమూ, కౌరవుల ఆధిక్యమూ ధ్వనిస్తున్నాయి.

వ. అది యెట్లనిన, ధర్మనందనుం డతని యుద్ధతికిం బుయిలోడి, మెయివడిగల నడవడిం బ్రవర్తిల్లుచుండియు, జూదంబు వెంట మోసపోయి, తొడరి చిక్కునం బడియె; అదియును నతం డక్షవిద్యాపాటవంబు దనకు మిగుల లేమింజేసియు, బంధుజనంబులు దన్ను వారించుటయుఁ, దా నాడుట మాని గాంధారరాజును నియమించినం, దత్కళా కౌశలంబునం బరిణతుండు గావున నా శకుని యాడి, యుధిష్ఠిరుం డొడ్డిన యొడ్డిమియు గెలుచుచు వచ్చె నట్లగుట, నాతని యందును గొఱంత లే; దిత్తెఱంగున వార లధర్మపరులని నిందింపరాకునికి కారణంబుగా వీరలు వుచ్చినమానిసి వినయంబుతోన యిక్కార్యంబు దీర్చికొని రావలయు' ననిన, సాత్యకి కోపించి యిట్లనియె. 22

ప్రతిపదార్థం: అది; ఎట్లు; అనినన్; ధర్మనందనుండు= ధర్మరాజు; అతని+ఉద్ధతికిన్= ఆ దుర్యోధనుడి గర్వానికి; పుయిలోడి= సంకోచించి; మెయివడి+కల నడవడిన్= సౌమ్యతగల ప్రవర్తనంతో; ప్రవర్తిల్లుచున్+ఉండియున్= నడచుకొంటూ ఉండీ; జూదంబువెంటన్= ద్యూతద్వారమున; మోసపోయి; తొడరి= తొట్రుపడి; చిక్కునన్+పడియెన్= కష్టం పొందాడు; అదియునున్; అతండు= ఆ దుర్యోధనుడు; అక్షవిద్యాపాటవంబు= ద్యూతకళయందు నేర్పు; మిగులన్= మిక్కిలి; లేమిన్+ చేసియున్= లేకపోవటంచేతను; బంధుజనంబులు= చుట్టాలు; తన్నున్= తనను (దుర్యోధనుడిని); వారించుటయున్= అడ్డగించటంవలనను; తాను+ఆడుటమాని= తాను ఆడటం మాని; గాంధారరాజును= గాంధారదేశపురాజును (శకునిని); నియమించినన్= ఏర్పాటుచేయగా; తద్+కళాకౌశలంబునన్= ఆ ద్యూతవిద్యయందలి నేర్పులో; పరిణతుండు= పండినవాడు- ఆరితేరినవాడు; కావునన్; ఆ-శకుని; ఆడి= జూదమాడి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఒడ్డిన= పందెం కాసిన; ఒడ్డిమియున్= పందెపు ద్రవ్యాన్ని, కాపునూ; గెలుచుచున్ వచ్చెన్= గెలుస్తూ వచ్చాడు. అట్లు+అగుటన్= అట్లా కావడం చేత; ఆతనియందును= ఆ దుర్యోధనుడియందుకూడా; కొఱంత= తప్పు; లేదు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; వారలు= కౌరవులు; అధర్మపరులు+అని= అన్యాయపరులని; నిందింపరాక+ఉనికి= నిందించటానికి వీలులేకపోవటం; కారణంబు+కాన్= కారణం కావటంచేత; వీరలు= పాండవులు; పుచ్చినమానిసి= రాయబారిగా పంపే మనుష్యుడు; వినయంబు+తోన్+అ= అడకువతోనే; ఈ+కార్యంబు= ఈ రాయబారపుపనిని; తీర్చికొని రావలయున్= సాధించుకొనిరావాలి; అనినన్; సాత్యకి= శ్రీకృష్ణబలరాముల తమ్ముడు; కోపించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అది ఎట్లా అంటే - ధర్మరాజు ఆ దుర్యోధనుడి గర్వానికి సంకోచించి సౌమ్యంగానే ప్రవర్తిల్లుతూ, జూదంలో మోసపోయి, తొట్రుపాటుతో కష్టాలలో పడ్డాడు. అదికాక, దుర్యోధనుడు ద్యూతవిద్యలో ఎక్కువ నేర్పు లేకపోవటంచేతా, చుట్టాలు తనను వారించడంచేతా, తను ఆడటంమాని శకునిని నియమించాడు. ఆ శకుని ద్యూతవిద్యలో పండినవాడుకావటంచేత జూదమాడి ధర్మరాజు పందెంలో కాసిన పందెమెల్లా గెలుస్తూ రావటం వలన ఆ దుర్యోధనుడిలో కూడా తప్పులేదు. ఆ విధంగా కౌరవులు అన్యాయపరులని నిందించటానికి వీలుకాకపోవటం కారణంగా, పాండవులు పంపిన మనుష్యుడు వినయంతోనే ఈ రాయబారపు కార్యం సాధించుకొనిరావాలి.' ఆ మాటలు విని సాత్యకి కోపంతో ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడు గదాయుద్ధంలో బలరాముడికి శిష్యుడు. అందుచేతనే అతడి మాటలలో శిష్యవాత్సల్యం కనిపిస్తున్నది. దుర్యోధనుడికి జూదం ఆడటం చేతకాకపోతే ధర్మరాజును జూదానికి పిలవటం ఎందుకు? అది తప్పుకాదా? తన బదులు శకునిని ఆడమనడం తప్పుకాదా? శకుని ద్యూతకళాకౌశలమే ధర్మరాజు ఓడిపోవడానికి కారణం అంటున్నాడు కాని, అతడు మోసం చేశాడు అనటం లేదు. అందుచేత కౌరవులలోనూ దోషం ఉన్నదనడానికి వీలులేదట. ఈ విధమైన బలరాముడి వాదం అతడికి దుర్యోధనుడిపైగల శిష్యవాత్సల్యాన్నే చాటుతున్నది. అది గ్రహించటంవలననే సాత్యకికి అతడిపై కోపం వచ్చింది.

సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపఁగూడదని చెప్పుట (సం. 5-3-1)

ఆ. 'ఇట్టు లాడఁదగునె? యిది నీక పోలు ని । న్నేమనంగ నేర్తు? నిత్తెఱంగు
పాడి గాఁగఁ బూని పలుకంగఁ జెవి యొడ్డి । యాదరించువారి నందుఁగాక! 23

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ విధంగా; ఆడన్+తగునె?= మాటాడవచ్చునా?; ఇది; నీకున్+అ= నీకే; పోలున్= తగును; ఈ+తెఱంగు= ఈ విధానం; పాడి+కాఁగన్= ధర్మంగా; పూని= ప్రయత్నించి; పలుకంగన్= పలికితే; చెవి+ఒడ్డి= చెవిఒగ్గి-శ్రద్ధతో; ఆదరించువారిన్= మన్నించేవాళ్ళను; అందున్+కాక= అంటానుగాని; నిన్నున్; ఏమి+అనంగన్+నేర్తున్?= ఏమి అనగలను?

తాత్పర్యం: 'ఇట్లా మాటాడవచ్చునా? ఇది నీ కొక్కడికే తగును. దుర్యోధనుడు చేసిన పద్ధతి ధర్మబద్ధమని నీవు ప్రయత్నించి అంటూంటే చెవి ఒగ్గి విని నిన్ను మన్నించేవాళ్ళను అంటానుగాని, నేను నిన్ను ఏమనగలను?

విశేషం: బలరాముడి వాదం దుర్యోధన పక్షపాతంతో కూడినదనీ, అది క్షంతవ్యం కాదనీ సాత్యకి అభిప్రాయం. అన్నవాడికంటె విన్నవాడు ఎక్కువ తప్పు చేసినవాడనే తెలుగుజాతీయం తలపునకువస్తుంది సాత్యకి మాటల్లో.

క. వేడుక పుట్టిన జూదం । బాడెనె ధర్మజుఁడు? వార లందఱుఁ దమలోఁ
గూడుకొని పిలిచి బలిమిన । యాడి కపట జయము గొనుట యది దగవగునే? 24

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; వేడుక పుట్టినన్= కోరిక కలుగగా; జూదంబు; ఆడెనె?= ఆడినాడా?; వారలు+అందఱున్= వాళ్ళు అందరూ; తమలోన్+కూడికొని= తమలో తాము కూడి; పిలిచి; బలిమిన్+అ= బలవంతంగా; ఆడి= జూదం ఆడి; కపటజయము+కొనుట= మోసంతో గెలుపొందటం; అది; తగవు+అగునే?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: ధర్మరాజు వేడుక పడి జూదం ఆడినాడా? వాళ్ళు అందరూ - ముఖ్యంగా దుష్టచతుష్టయం - తమలో తాము కూడి ధర్మరాజును జూదానికి రమ్మని పిలిచి బలవంతంగా జూదం ఆడి మోసంతో గెలుపొందటం ధర్మం అనిపించుకొంటుందా?

విశేషం: సాత్యకి ఉన్నమాట అని, బలరాముడి మాటమార్పును బయటపెట్టాడు.

క. ధర్మతనూభవు దెస దు । ష్కర్మము రూపించిన సభ నొకండును మైమైఁ
బేర్మి సెడక పోనేర్చునె? । ధార్మికు లిం కెట్టివారు తథ్యం బరయన్? 25

ప్రతిపదార్థం: ధర్మతనూభవుదెసన్= ధర్మరాజుపక్షాన; దుష్కర్మమున్= దోషం; రూపించి= నిరూపించి; సభన్= సభలో; ఒకండును= ఒక్కడైనా; మైమైన్= సులభంగా; పేర్మి+చెడక-పోన్+నేర్చునె?= గౌరవం చెడగొట్టుకోకుండా ఉండగలడా?; తథ్యంబు+అరయన్= నిజం ఆలోచిస్తే; ధార్మికులు= ధర్మపరాయణులు; ఇంకన్+ఎట్టివారు?= ఇంతకంటె వేరుగా ఎట్లా ఉంటారు?

తాత్పర్యం: ధర్మరాజులో దోషం చూపించి సభలో ఏ ఒక్కడైనా సులభంగా గౌరవం కోలుపోకుండా ఉండగలడా? ఇక నిజానికి ధర్మరాజుకంటె ధార్మికులు ఎట్లా ఉంటారు?

విశేషం: ధర్మరాజులో దోషనిరూపణ చేయటం ఎవరికైనా గౌరవభంగకారణమే అవుతుందని సాత్యకి అభిప్రాయం. అన్నగారని మోమోటపడకుండా సాత్యకి ఉన్నమాట కుండబ్రద్దలు కొట్టినట్లు అనటం మెచ్చదగింది.

చ. పలికినచందముల్ నెఱపి పైతృకమై చను రాజ్యభాగ మి
మ్ముల౦ బడయం దలంచి బలముం జలమున్ నెఱపం గడంగు వీ
రలు నొరు వేఁడఁబోదురె? యరాతులు సాధుల మెత్తురే? రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుటఁ బోలునె యొండొకరాజధర్మముల్? 26

ప్రతిపదార్థం: పలికినచందముల్= ముందు అనుకొన్న రీతులు; నెఱపి= చేసి; పైతృకము+ఐ= పితృ సంబంధమైనదయి; చను= ఒప్పు; రాజ్య-భాగము; ఇమ్ములన్= సుఖంగా; పడయన్+తలంచి= పొందనెంచి; బలమున్= పరాక్రమమూ; చలమున్= పట్టుదలా; నెఱపన్= ప్రకటించటానికి; కడంగువీరలున్= పూనుకొనే ఈ పాండవులు; ఒరున్= ఇతరుని; వేఁడన్+పోదురె?= యాచించబోతారా?; అరాతులు= శత్రువులు; సాధులన్= మంచివాళ్ళను; మెత్తురే?= మెచ్చుకుంటారా? రణంబులన్= యుద్ధాలలో; జయలక్ష్మిన్= విజయమనే సంపదను; చేకొనుటన్= పొందటంతో; ఒండొక= వేరొక రకమైన; రాజ-ధర్మముల్= క్షత్రియధర్మాలు; పోలునె?= సరిపోలుతాయా?

తాత్పర్యం: ముందర అనుకొన్న రీతిగా చేసి, తండ్రివలన సంక్రమించిన రాజ్యభాగం సంతోషంగా పొందాలని బలమూ, చలమూ చూపాలనుకొంటూ ఉన్న ఈ పాండవులు కూడా ఇతరులను యాచించబోతారా? శత్రువులు మంచివాళ్ళను మెచ్చుకొంటారా? యుద్ధాలుచేసి జయలక్ష్మిని పొందటంతో వేరే ఏ రాజధర్మాలైనా సరిపోలుతాయా?

విశేషం: ద్యూత నియమం పాటించిన తరువాత ఎవరి రాజ్యభాగం వాళ్ళు తీసికొనాలని ముందర అనుకొన్న మాటలు. వాటి ప్రకారం పాండవులకు ఇప్పుడు తమభాగం రావాలి. పైగా అది పిత్రార్జితమైన ఆస్తి అవటం చేత పాండవులకు దానిపై హక్కు ఉన్నది. కౌరవులు న్యాయం చేయకపోతే వీళ్ళు పరాక్రమమూ, పట్టుదలా చూపగలరు. అట్లాంటి వీరు ఇతరులను యాచించబోతారా? అట్లా యాచించి మంచిగా ఉంటే శత్రువులు మెచ్చుతారా? అయినా యుద్ధంలో జయలక్ష్మిని పొందడంతో పోలే రాజధర్మం ఇంకొకటి ఏముంది? న్యాయం తమ పక్షాన ఉండగా, తాము శౌర్యవంతులయి ఉండగా పాండవులు కౌరవులను యాచించనక్కరలేదు. యుద్ధం చేసి జయలక్ష్మిని సాధించి రాజధర్మం నెరపాలని సాత్యకి నిశ్చితాభిప్రాయం.

తే. సముచితములగు మాటలఁ జక్కఁబడక । తక్కనే, నుక్కివుం డగు ధార్తరాష్ట్రుఁ
గ్రూరశరముల నే నియ్యకొలుపువాఁడ । నవని కౌంతేయులకు నిచ్చునట్లుగాఁగ. 27

ప్రతిపదార్థం: సముచితములు+అగు= మిక్కిలి తగిన; మాటలన్= మాటలతో; చక్కఁబడక= తిన్నబడక; తక్కనేన్= మానినట్లయితే; ఉక్కివుండు+అగుధార్తరాష్ట్రున్= కపటి అయిన దుర్యోధనుడిని; క్రూరశరములన్= క్రూరములైన బాణాలతో, ఏను= నేను; కౌంతేయులకున్= పాండవులకు; అవని= భూమి; ఇచ్చునట్లు+కాఁగన్= ఇచ్చేటట్లు; ఇయ్యకొలుపువాఁడన్= అంగీకరింపజేస్తాను.

తాత్పర్యం: మంచి మాటలతో చక్కబడకపోతే కపటిఅయిన దుర్యోధనుడిని నేను పరుషాలైన బాణాలతో పాండవులకు వారి భూభాగం ఇచ్చేటట్లు ఒప్పిస్తాను.

విశేషం: సాత్యకి వీరోచిత వాక్యాలు ప్రశంసనీయాలు.

క. భీమార్జునులకు రణమున । నే మగలును బ్రతియె? వీరు నేనును సైన్యో
ద్దాములమై నడచిన, నే । భూమీశులు నెదిరి బ్రదికిపోవం గలరే? 28

ప్రతిపదార్థం: భీమ+అర్జునులకున్= భీముడికీ, అర్జునుడికీ; రణమునన్= యుద్ధంలో; ఏ, మగలును= ఎట్టి వీరులైనా; ప్రతియె?= సాటియా?; వీరున్= ఈ భీమార్జునులూ; ఏనును= నేనూ; సైన్య+ఉద్దాములము+ఐ= సేనతో భయంకరులమై, నడచినన్= దండెత్తితే; ఏ-భూమి+ఈశులున్= ఏ రాజులైనా; ఎదిరి= ఎదిరించి; బ్రతికిపోవన్+కలరే?= బ్రతికిపోగలరా?

తాత్పర్యం: భీమార్జునులకు యుద్ధంలో వీరులెవరైనా సాటియా? వీరూ నేనూ సేనాసమేతులమై శత్రుభయంకరంగా యుద్ధభూమిలో నడిస్తే, ఏ రాజులైనా మమ్మల్ని ఎదిరించి బ్రదికిపోగలరా?

ఆ. కవలవారుఁ, గొడుకుగమియుఁ, బాంచాలవ । ర్గంబు, వృష్ణివరులుఁ గడఁగిరేని,
నొక్క మాత్రలోన నువ్వెత్తుగొనరె? దు । ర్యోధనాది శతము నుద్ధవిడిన. 29

ప్రతిపదార్థం: కవలవారున్= నకుల సహదేవులూ; కొడుకు గమియున్= కొడుకుల సమూహమూ; పాంచాల,వర్గంబున్= పాంచాలదేశపు వీరుల సమూహమూ; వృష్ణి, వరులున్= వృష్ణివంశశ్రేష్ఠులూ; కడఁగిరి+ఏనిన్= యుద్ధానికి పూనినట్లయితే; ఒక్క-మాత్రలోనన్= ఒక రెప్పపాటుకాలంలోనే; దుర్యోధన+ఆది, శతమున్= దుర్యోధనుడూ మొదలైన నూరుగురునీ; ఉద్ధవిడిన్+అ= శీఘ్రంగానే; ఉవ్వెత్తు కొనరె?= నిశ్శేషంగా చంపరా?

తాత్పర్యం: నకుల సహదేవులూ, కుమారుల సమూహం, పాంచాలదేశపు వీరులూ, వృష్ణివంశశ్రేష్ఠులూ యుద్ధసన్నద్ధులయితే, ఒక్క రెప్పపాటుకాలంలోనే దుర్యోధనాదులైన నూరుగురినీ శీఘ్రమే నిశ్శేషంగా నిర్మూలించరా?

క. ఈ మత్స్యపతి సహాయము । గా మాకుం దీర్పరాని కార్యము గలదే?
సామాద్యుపాయపరుఁ, డు । ద్దామ భుజాబలయుతుం డితఁడు కేవలుఁడే? 30

ప్రతిపదార్థం: ఈ, మత్స్యపతి= ఈ మత్స్యదేశపురాజు-విరాటుడు; సహాయము+కాన్= తోడుకాగా; మాకున్; తీర్పన్+రాని-కార్యము+కలదే?= సాధించరాని పని ఉన్నదా?; ఇతఁడు= ఈ విరటుడు; సామ+ఆది+ఉపాయ, పరుఁడు= సామ, దాన, భేద దండములనే నాలుగు ఉపాయాలూ కలవాడు; ఉద్దామ భుజా బల యుతుండు= భయంకరమైన భుజబలంతో కూడినవాడు; కేవలుఁడే?= సామాన్యుడా?

తాత్పర్యం: ఈ విరాటుడి తోడ్పాటుతో మాకు సాధించరాని కార్యం ఉన్నదా? సామ దాన భేద దండములనే నాలుగు ఉపాయాలూ కలవాడూ, భయంకరమైన భుజబలం గలవాడూ అయిన ఇతడు సామాన్యుడా?

క. నా మతమునఁ గార్యము సం । గ్రామము సేయుటయ; యిట్లుగా కీలోనన్
సామవచనంబు లక్కురు । భూమీశ్వరుతోడ నాడఁ బుచ్చెదరేనిన్. 31

ప్రతిపదార్థం: నా-మతమునన్= నా అభిప్రాయంలో; సంగ్రామము+చేయుట+అ= యుద్ధం చేయటమే; కార్యము= కర్తవ్యం; ఇట్లు+కాక= ఈరీతికాక; ఈ-లోనన్= ఈలోగా; ఆ+కురు-భూమి+ఈశ్వరుతోడన్= ఆ కురురాజుతో - దుర్యోధనుడితో; సామ వచనంబులు= శాంతవాక్కులు; ఆడన్= పలకటానికి; పుచ్చెదరు+ఏనిన్= పంపితే.

తాత్పర్యం: నా అభిప్రాయం ప్రకారం యుద్ధం చేయడమే కర్తవ్యం. అట్లా కాక, ఈ లోపల ఆ దుర్యోధనుడితో శాంతవచనాలు పలకటానికి ఎవరినైనా పంపితే - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండునృపాలుపాలు రా**
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్న, లోక సా
మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద; మ
న్యోన్య విరుద్ధభాషణము లాడినఁ, దత్ఫల మాతఁ డందెడున్. **32**

ప్రతిపదార్థం: దైన్యము+తక్కి= దీనత్వం విడిచిపెట్టి; దూత= రాయబారి; ఉచితంబుగన్= తగిన విధంగా; పాండు నృపాలు, పాలు= పాండురాజు భాగం; రాజన్యవరుండు, ధర్మజుఁడు= రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు; సమ్మతిన్= ఇష్టంతో; వేఁడెడున్+అన్నన్= కోరుతున్నాడు అన్నప్పుడు; లోక సామాన్య విధిన్= లోకంలో సాధారణంగా జరిగే న్యాయం చొప్పున; తగంగన్= సముచితంగా; గరిమంబునన్= గౌరవంగా; ఇచ్చినన్= ఇస్తే; పుచ్చికొందము= తీసికొందాం; అన్యోన్య, విరుద్ధ, భాషణములు+అడినన్= ఒకదానికీ, ఇంకొకదానికి పొంతనలేని విధంగా మాటలాడితే; తద్+ఫలము= దాని ఫలం; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; అందెడున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: ఏమాత్రమూ దీనత్వం లేకుండా దూత సముచితంగా పాండురాజు రాజ్యభాగం రాజోత్తముడైన ధర్మరాజు ఇష్టంతో వేడుకుంటున్నా డన్నప్పుడు, లోకసాధారణమైన న్యాయం చొప్పున తగినట్లుగా, సగౌరవంగా ఆ దుర్యోధనుడు ఇస్తే తీసికొందాం. అట్లాకాక పరస్పర విరుద్ధంగా మాటలాడితే దాని ఫలం అతడు అనుభవిస్తాడు.

విశేషం: దూత దైన్యం వహించవలసిన పనిలేదు. అది పాండవులకు పైతృకమైన ఆస్తి. ధర్మరాజు సామాన్యుడు కాడు. రాజోత్తముడు. అతడు దానిని కోరుకొంటున్నాడంటే, మర్యాదగా ఇవ్వటం లోకసాధారణమైన న్యాయం. అట్లాకాక అడ్డదిడ్డంగా మాటలాడినాడా, దుర్యోధనుడు దాని ఫలం - యుద్ధమరణం - అనుభవిస్తాడు. ఇది వీరోచితమైన సాత్యకి హెచ్చరిక.

వ. **అనిన ద్రుపదుం 'డిది వోలు; బలదేవు మాట మాట గాదు. బలపరాక్రమవంతుండును, సహాయ సంపన్నుండును, దుష్టాత్ముండునునైన దుర్యోధనుండు ప్రియవచనంబుల రాజ్యంబు పాలిచ్చుట కియ్యకొనమి సిద్ధంబు; యుద్ధంబునంగాని చక్కంబడఁ' డని పలికి మఱియు నిట్లనియె.** **33**

ప్రతిపదార్థం: అనినన్= అని సాత్యకి అనగా; ద్రుపదుండు; ఇది= సాత్యకి మాట; పోలున్= ఒప్పుతుంది; బలదేవు మాట= బలరాముడాడిన మాట; మాట+కాదు= సరిఅయినమాట కాదు; బలపరాక్రమవంతుండును= బలమూ, పరాక్రమమూ కలవాడూ; సహాయ సంపన్నుండును= మిత్రరాజుల సహకారం కలవాడూ; దుష్ట+ఆత్ముండును= దుష్ట స్వభావం కలవాడూ; ఐన, దుర్యోధనుండు; ప్రియ-వచనంబులన్= ప్రీతిపూర్వకాలైన మాటలతో; రాజ్యంబు, పాలు+ఇచ్చుటకున్= రాజ్యభాగం ఇవ్వటానికి; ఇయ్యకొనమి= అంగీకరించకపోవటం, సిద్ధంబు= తప్పక జరిగేదే; యుద్ధంబునన్+కాని= యుద్ధంచేతగాని; చక్కంబడఁడు= సరిపడడు; అని-పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని సాత్యకి పలుకగా ద్రుపదుడు విని 'సాత్యకి మాట సముచితంగా ఉన్నది. బలరాముడి మాట సమ్మతం కాదు. బలపరాక్రమాలు కలవాడూ, సహాయ సంపత్తి కలవాడూ, దుష్టస్వభావుడూ అయిన దుర్యోధనుడు ప్రీతిపూర్వక వచనాలకు రాజ్యభాగం ఇవ్వడానికి ఇష్టపడడు. అది తప్పదు. యుద్ధంవలనగాని అతడు సరిపడడు' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడు రాజ్యభాగం ఇవ్వడని ద్రుపదుడు ఖచ్చితంగా చెప్పడానికి కారణాలు మూడు. దుర్యోధనుడు బలపరాక్రమాలు కలవాడు. అతడికి మిత్రరాజుల సహకారం ఉంది. అయినా, మంచితనం ఉంటే ఇవ్వవచ్చును. అది లేదు- దుష్టుడు. బలదేవుడిమాట మాట కాదు. మొదటి 'మాట'కూ, రెండో 'మాట'కూ అర్థభేదం లేకున్నా, తాత్పర్య భేదం ఉన్నది. మొదటి మాటకు 'వాక్కు' అనీ, రెండో మాటకు 'సరియైన వాక్కు' అనీ తాత్పర్యం. అందుచేత అలంకారం లాటానుప్రాసం అనే శబ్దాలంకారం.

క. 'మృదుభాషణముల దుర్జన । హృదయములు ప్రసన్నతామహిమఁ బొందునె? యె
ల్లిదముగఁ గొని, యంతంతకు । మద మెక్కుంగాక దురభిమానముపేర్మిన్. 34

ప్రతిపదార్థం: దుర్జన-హృదయములు= దుష్టుల మనస్సులు, మృదుభాషణములన్= మెత్తటి మాటలతో; ప్రసన్నతామహిమన్= సామంజస్యం అనే గొప్పతనాన్ని; పొందునె?= పొందుతాయా?; ఎల్లిదముగన్+కొని= అసమర్థతగా భావించి; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; దురభిమానము-పేర్మిన్= దుర్గర్వం యొక్క అతిశయంచేత; మదము+ఎక్కున్+కాక= మత్తెక్కుతాయికాని.

తాత్పర్యం: 'దుష్టుల హృదయాలు మృదువచనాలతో సామంజస్యం పొందవు. మెత్తగా మాటలాడటం అసమర్థతగా భావించి, దుర్గర్వాతిశయంచేత క్రమక్రమంగా మత్తెక్కుతాయి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది సామాన్యాంశం. 'మృదుభాషణముల దుర్యోధనుడి హృదయం ప్రసన్నతా మహిమ పొందదు' అనే అధ్యాహారమైన విశేషాంశాన్ని సమర్థిస్తున్నది.

వ. అదియునుంగాక. 35

తాత్పర్యం: అంతేకాక.

తే. కూటికై ద్రోణభీష్ములు కుమతి యనక । యనుసరింతురు; ధృతరాష్ట్రుఁడును దనూజు
తృష్ణ నూనినవాఁడు; రాధేయు బోఁటి । తులువ లెల్లను నతని సద్బుద్ధి యండ్రు. 36

ప్రతిపదార్థం: ద్రోణభీష్ములు= ద్రోణుడూ, భీష్ముడూ; కుమతి+అనక= (దుర్యోధనుడిని) దుర్బుద్ధి అనకుండా; కూటికై= తిండికొరకు; అనుసరింతురు= అనుసరిస్తారు; ధృతరాష్ట్రుఁడును; తనూజు తృష్ణన్= కొడుకు మీద వ్యామోహం; ఊనినవాఁడు= వహించినవాడు; రాధేయు, బోఁటి, తులువలు+ఎల్లను= కర్ణుడివంటి దుష్టులందరూ; అతనిన్= ఆ దుర్యోధనుడిని; సత్+బుద్ధి= మంచి బుద్ధిగలవాడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ద్రోణభీష్ములు దుర్యోధనుడిని దుర్బుద్ధి అని అనకుండా అతణ్ణి కూటి కొరకు అనుసరిస్తారు. ధృతరాష్ట్రుడు కూడా కొడుకు మీద వ్యామోహం కలిగి ఉంటాడు. కర్ణుడివంటి దుష్టులందరూ అతడిని మంచివాడంటారు.

వ. కావున నతండు దుర్వినీతుండైయుండు; నెల్లభంగుల సంగరంబు గాఁగలయది; యీ సమయంబున బలంబులంగూర్చికొని పిలువందగు రాజులం బిలిచి పుచ్చవలయు; సుయోధనుండును దోడాసపడి పుచ్చు; నుచితపరులగు నరపతులు దొలుతఁ జెప్పినవారిక సహాయత్వంబుఁ జేయంజూతురు; మనము వెసగల

కాలరుల వేగంబ పుచ్చి, శల్య కేకయ ధృష్టకేతు జరాసంధతనయ ప్రభృతు లయిన భూపతులకును, వారి వారి బంధు మిత్ర జనంబులకునునెఱింగించి పుచ్చుట కార్యం; బిది నాకుం బోలిన తెఱం' గని పలికి తన కెలన సముచితాసనంబున నున్న విప్రవరుం జూపి. 37

ప్రతిపదార్థం: కావునన్; అతండు= దుర్యోధనుడు; దుర్వినీతుండు+ఐ+ఉండున్= దుష్ప్రవర్తకుడై ఉంటాడు; ఎల్ల - భంగులన్= అన్నివిధాల; సంగరంబు= యుద్ధం; కాఁగల+అది= జరుగబోతుంది; ఈ-సమయంబునన్; బలంబులన్= సేనలను; కూర్చికొని= కూడగట్టుకుని; పిలువన్+తగు-రాజులన్= పిలువదగిన రాజులను; పిలిచి పుచ్చున్వలయున్= పిలువనంపాలి; సుయోధనుండును= దుర్యోధనుడుకూడా; తోడు+ఆసపడి= సహాయం ఆశించి; పుచ్చున్= పిలువనంపుతాడు; ఉచిత పరులు+అగు నరపతులు= ఉచితజ్ఞులైన రాజులు; తొలుతన్+చెప్పిన-వారికిన్+అ= మొదట కోరినవారికే; సహాయత్వంబున్= తోడ్పాటును; చేయన్+చూతురు= చేయాలని చూస్తారు; మనము; వెస+కల-కాలరులన్= వడిగల దూతలను; వేగంబు+అ= శీఘ్రంగా; పుచ్చి= పంపి; శల్య,కేకయ, ధృష్టకేతు, జరాసంధతనయ, ప్రభృతులు+అయిన= శల్యుడూ; కేకయుడూ; ధృష్టకేతుడూ; జరాసంధుడి కుమారుడూ మొదలుగాగల; భూపతులకును= రాజులకును; వారి, వారి, బంధు-మిత్ర జనంబులకును= వారి వారి చుట్టాలకూ, స్నేహితులకూ; ఎఱింగించి పుచ్చుట= తెలిపిపంపడం; కార్యంబు= కర్తవ్యం; ఇది; నాకున్+పోలిన తెఱంగు= నాకు తోచిన విధం; అని-పలికి; తన కెలనన్= తన ప్రక్క; సముచిత+ఆసనంబునన్= తగిన పీఠంపై; ఉన్న; విప్రవరున్= బ్రాహ్మణోత్తముడిని; చూపి.

తాత్పర్యం: కాబట్టి, ఆ దుర్యోధనుడు దుశ్చరితుడై ఉంటాడు. ఏ విధంగా చూసినా యుద్ధం జరుగబోతుంది. ఈ సమయంలో సేనలను సమకూర్చికొని పిలువదగిన రాజులను పిలువనంపాలి. దుర్యోధనుడు కూడా తోడ్పాటు నాశించి పిలువనంపుతాడు, ఉచితజ్ఞులైన రాజులు మొదట కోరినవారికే సహాయం చేయజూస్తారు. మనం వడిగల దూతలను శీఘ్రమే పంపి, శల్యుడూ, కేకయుడూ, ధృష్టకేతుడూ, జరాసంధకుమారుడూ మొదలయిన రాజులకు, వారి వారి చుట్టాలకూ స్నేహితులకూ తెలిపి పంపటం కర్తవ్యం. ఇదీ నాకు తోచిన విధం' అని పలికి తన ప్రక్కన సముచితాసనంమీద ఆసీనుడైన బ్రాహ్మణోత్తముడిని చూపి.

క. ఇతఁడు మదీయాగ్ర పురో । హితుఁ; డితనికి నెల్లపనులు నెఱిఁగించి తగన్
ధృతరాష్ట్రు కడకుఁ బనుపుఁడు । చతుర వచన రచనఁ గఱపి సంప్రీతిమెయిన్. 38

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ బ్రాహ్మణుడు; మదీయ+అగ్ర-పురోహితుఁడు= నా ప్రధాన పురోహితుడు; ఇతనికిన్; ఎల్ల పనులున్; ఎఱిఁగించి= తెలిపి; సంప్రీతి మెయిన్= సంతోషంతో; చతుర వచన రచనన్= నేర్పుగల మాటలాడటం; కఱపి= బోధించి; తగన్= ఒప్పేటట్లు; ధృతరాష్ట్రు కడకున్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; పనుపుఁడు= పంపండి.

తాత్పర్యం: ఇతడు నా ప్రధాన పురోహితుడు. ఇతనికి చేయవలసిన పనులన్నీ తెలిపి, సంప్రీతితో నేర్పుగా మాటలాడటం బోధించి తగినట్లుగా ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపండి.

విశేషం: అగ్రపురోహితుడిని పరిచయం చేసిన వాక్యాలు అర్థవంతాలు. పురోహితుడంటేనే రాబోయే హితాన్ని కోరేవాడు. అటువంటివారు ద్రుపదుడి కొలువులో ఎందరో ఉన్నారు. వారిలో అగ్రగణ్యుడు ఈ పురోహితుడు, సామాన్యంగా మంత్రులలో పురోహితుడు ఒకడుగా ఉండటం పరిపాటి. మంత్రి కావటం చేతనే ద్రుపదుడి ప్రక్కన ఉన్నతాసనం మీద అగ్ర పురోహితుడు

కూర్చున్నాడు. అతడిని పంపటం వలన భవిష్యత్తులో హితం జరుగుతుందని ద్రుపదుడి భావం. పురోహితుడిని రాయబారిగా పంపేటప్పుడు అతడు ఏయే పనులు ఏవిధంగా చేయాలో, ఏ విధంగా మాటలు పలకాలో కూడా చెప్పుమన్నాడు ద్రుపదుడు. ఆ రెండూ నేర్పవలసిన వని చెప్పటం గమనార్హం. భావి కథలో పురోహితుడి రాయబారం విఫలం కావటానికి అతడి మాట నేర్పరితనంలో ఉన్న అప్రౌఢియే కారణమని స్పష్టం ఔతుంది. అందుకే ఈ అంశాన్ని తిక్కన బీజప్రాయంగా ఇక్కడ చెప్పించాడు. (సంపా).

ఉ. ఆతని సమ్ముఖంబునఁ దదగ్రతనూజుకడన్ మరున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవునొద్దఁ గ్రమోచితంబుగా
నీతెఱఁ గిట్టులాడుమని యేర్పడ నంతయుఁ జెప్పిపుచ్చఁగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభముఁ, బెంపుఁజొప్పడున్. 39

ప్రతిపదార్థం: ఆతని-సమ్ముఖంబునన్= ఆ ధృతరాష్ట్రుడి ఎదుట; తద్+అగ్ర తనూజు కడన్= అతడి పెద్ద కొడుకు - దుర్యోధనుడి దగ్గర; మరుత్+నదీ-జాతుని సన్నిధిన్= గాంగేయుడి సన్నిధానంలో; కలశసంభవు+ఒద్దన్= ద్రోణుడి వద్ద; క్రమ+ఉచితంబుగాన్= క్రమంగానూ, ఉచితంగానూ; ఈ-తెఱఁగు= ఈ విషయం; ఇట్టులు+ఆడుము+అని= ఇట్లా మాట్లాడుమని; ఏర్పడన్= స్పష్టంగా; అంతయున్; చెప్పి పుచ్చఁగాన్= చెప్పిపంపితే; నీతి మెయిన్= రాజనీతితో; తగన్= ఒప్పుగా; పలుకన్= పలుకగా; నెయ్యము= స్నేహమూ; లాభమున్= లాభమూ; పెంపున్= గౌరవమూ; చొప్పడున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడి ఎదుటా, అతడి పెద్దకొడుకైన దుర్యోధనుడి దగ్గరా, భీష్ముడి సన్నిధానంలోనూ, ద్రోణుడి వద్దా, క్రమంగానూ, ఉచితంగానూ ఈ విషయం ఇట్లా మాటాడుమని స్పష్టంగా అంతా చెప్పి పంపితే, ఇతడు రాజనీతితో ఒప్పుగా ఆ విధంగా పలికితే స్నేహమూ, లాభమూ, గౌరవమూ కలుగుతాయి.'

వ. అనిన వాసుదేవుండు 'పాంచాలపతి వచనంబు లుచితంబులయి యున్నయవి; యిబ్బంగిన చేయవలయు' నని పలికి' మఱియు నిట్లనియె. 40

ప్రతిపదార్థం: అనినన్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; పాంచాల పతి వచనంబులు= ద్రుపదుడి మాటలు; ఉచితంబులు+అయి+ ఉన్న+అవి= తగినవిగా ఉన్నాయి; ఈ+భంగిన్+అ= ఈ విధంగానే; చేయవలయున్+అని= చేయాలని; పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ద్రుపదుడు పలుకగా శ్రీకృష్ణుడు 'ద్రుపదుడి మాటలు ఉచితంగా ఉన్నాయి. ఈ విధంగానే చేయాలి' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'కౌరవులకుఁ బాండవులకు । నారయ నే నొక్కరూప; యట్లగుటఁ దగన్
వారును వీరును దమతమ । నేరిమిమెయి ధరణి యేలి నెగడఁగఁ జూతున్. 41

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించగా; కౌరవులకున్; పాండవులకున్; నేను; ఒక్కరూపు+అ= ఒకలాటివాడనే; అట్లు+అగుటన్= అందుచేత; తగన్= ఒప్పుగా; వారును, వీరును= కౌరవులూ; పాండవులూ; తమ తమ నేరిమి మెయిన్= తమ తమ సామర్థ్యంతో, ధరణి+ఏలి= భూమిని పాలించి; నెగడఁగన్+చూతున్= ప్రసిద్ధి కెక్కాలని చూస్తాను.

తాత్పర్యం: పరిశీలించి చూస్తే నేను కౌరవులకూ, పాండవులకూ ఒకలాటివాడనే. అందుచేత వాళ్ళూ వీళ్ళూ ఒప్పుగా ఎవరి సామర్థ్యం చొప్పున వాళ్ళు భూమినేలి ప్రసిద్ధి వహించాలని భావిస్తాను.

విశేషం: పాఠాంతరం : కౌరవులును బాండవులును నారయ నాకొక్కరూప.

తే. **పెండ్లికని పిల్వఁ బంచినఁ బ్రియముతోడ । నేఁగుదెంచితి; మిన్నాళ్ళు నెల్ల యొప్పి**
దములఁ జూచితి; మియ్యెడఁ దడవుగాఁగ । నిలువఁ దీఱదు పోయిరావలయు మాకు. **42**

ప్రతిపదార్థం: పెండ్లికిన్+అని= పెళ్ళికొరకని, పిల్వన్+పంచినన్= పిలువనంపితే; ప్రియముతోడన్= ప్రీతితో; ఏఁగుదెంచితిమి= వచ్చాము; ఇన్నాళ్ళున్= ఇన్నాళ్ళూ; ఎల్ల+ఒప్పిదములన్= అన్ని ముచ్చట్లూ; చూచితిమి; ఈ+ఎడన్= ఇక్కడ; తడవు+కాఁగన్= ఎక్కువకాలం; మాకున్; నిలువన్+తీఱదు= ఉండే తీరిక లేదు; పోయిరావలయున్.

తాత్పర్యం: పెళ్ళికని పిలిస్తే ప్రీతితో వచ్చాం. ఇన్నాళ్ళూ అన్ని ముచ్చట్లూ చూచాం. ఇక్కడ ఎక్కువ కాలం ఉండే తీరిక లేదు. మేము వెళ్లిరావాలి'.

వ. **అని పలికి ద్రుపదు నాలోకించి 'మీరు మాకెల్లవారికి గురుస్థానంబు; మీ మాట యనిన ధృతరాష్ట్రుండు బహుమానంబు సేయు, మిమ్ము శాంతనవుండునుం గొనియాడు; మీయందు ద్రోణకృపాచార్యులు సఖ్యంబు వాటింతు; రట్లగుటం జేసి.** **43**

ప్రతిపదార్థం: అని; పలికి; ద్రుపదున్; ఆలోకించి= చూసి; మీరు; మాకున్ ఎల్లవారికిన్= మాకందరికీ; గురు-స్థానంబు= గురు సమానులు; మీ మాట+అనినన్= మీ మాట అంటే; ధృతరాష్ట్రుండు; బహుమానంబు+చేయున్= గౌరవిస్తాడు; మిమ్మున్; శాంతనవుండునున్= భీష్ముడునూ; కొనియాడున్= ప్రశంసిస్తాడు; మీయందున్; ద్రోణ-కృపాచార్యులు= ద్రోణుడూ, కృపాచార్యుడూ; సఖ్యంబు+పాటింతురు= మైత్రిని చూపుతారు; అట్లు+అగుటన్+చేసి= అందుచేత.

తాత్పర్యం: అని పలికి, ద్రుపదుడిని చూచి 'మీరు మాకందరికీ గురుస్థానీయులు. మీ మాట అంటే ధృతరాష్ట్రుడికి గౌరవం. మిమ్మల్ని భీష్ముడు కూడా ప్రశంసిస్తాడు. మీతో ద్రోణకృపాచార్యులు మైత్రిని కోరుతారు. అందుచేత. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **పాండవార్థమై యొక్కరుఁ బనుప మీక । భరము; మీ పలు కందఱపలుకు; మీరు**
తెఱఁగు పఱుపంగ మిగిలి యుద్రేకులైన । వార చెడువారు; విమలవిచారవిభవ! **44**

ప్రతిపదార్థం: విమల విచార విభవ!= నిర్మలమైన ఆలోచనా సంపదకలవాడా, ద్రుపదుడా!; పాండవ+అర్థము+ఐ= పాండవుల నిమిత్తం; ఒక్కరున్= ఒకరిని; పనుపన్= పంపటానికి; మీకున్+అ= మీకే-మీదే; భరము= భారం; మీ పలుకు= మీ మాట; అందఱ-పలుకు= అందరిమాట; మీరు; తెఱఁగు పఱుపంగన్= చక్కదిద్దగా; మిగిలి= అతిక్రమించి; ఉద్రేకులు+ఐన+వారు+అ= ఆవేశపడేవాళ్ళే; చెడువారు= చెడిపోయేవాళ్ళు.

తాత్పర్యం: నిర్మలమైన ఆలోచనా సంపదగల ద్రుపదరాజా!, పాండవుల పక్షాన ఒకరిని పంపే భారం మీదే. మీ మాటే అందరి మాట. మీరు ఒక పద్ధతిగా చేసినప్పుడు దాని నతిక్రమించి ఆవేశపడేవారే చెడిపోతారు.

క. పొందైన లెస్స; విరసపుఁ । గ్రం దయ్యెడు చందమైన, రాజుల నెల్లన్
ముందఱ రావించి క్రమం । బొందఁగ, మముఁ బిలువఁ బంపుఁ డొయ్యన పిదపన్. 45

ప్రతిపదార్థం: పొందు+ఐనన్= సంధి జరిగితే; లెస్స= మంచిది; విరసము+క్రందు+అయ్యేడు చందము+ఐనన్= అనిష్టమైన భేదం పుట్టేటట్టయితే; రాజులన్+ఎల్లన్= రాజులనందరినీ; ముందఱన్= ముందుగా; రావించి= రప్పించి; క్రమంబు+ఒందఁగన్= క్రమంగా; పిదపన్= తరువాత; మమున్; ఒయ్యన= ఒప్పుగా; పిలువన్+పంపుఁడు= పిలిపించండి.

తాత్పర్యం: సంధి జరిగితే మంచిది. ఒకవేళ అనిష్టమైన భేదం పుట్టేటట్లయితే, ముందుగా రాజులనందరినీ రప్పించి క్రమంగా తరువాత మమ్ములను ఒప్పుగా పిలిపించండి.

క. మీ పనుపున రాజ్యము పా । లీపాండు తనూభవులకు నీకున్న, భుజా
టోపభయంకరుఁ డర్జును । కోపానల మడరి ముట్టికొనదే వారిన్?' 46

ప్రతిపదార్థం: మీ-పనుపునన్= మీ నియోగం చొప్పున; రాజ్యము పాలు= రాజ్యభాగం; ఈ+పాండు తనూభవులకున్= ఈ పాండవులకు; ఈక+ఉన్నన్= ఇవ్వకపోతే; వారిన్= ఆ కౌరవులను; భుజ+ఆటోప, భయంకరుఁడు+అర్జును-కోప+అనలము= భుజబలగర్వంచేత భీకరుడైన అర్జునుడి యొక్క కోపం అనే అగ్ని; అడరి= విజృంభించి; ముట్టికొనదే?= ఆక్రమించదా?

తాత్పర్యం: మీ ఆజ్ఞ చొప్పున రాజ్యభాగం ఈ పాండవులకు ఇవ్వకపోతే, భుజబలగర్వంచేత భయంకరుడైన అర్జునుడి కోపాగ్ని విజృంభించి ఆ కౌరవుల్ని ఆక్రమించదా?'

విశేషం: కోపానలము= కోపమనే అనలం - రూపకాలంకారం.

చ. అని, గమనోన్ముఖుండయి మురాంతకుఁ డా ద్రుపదుండు ధర్మనం
దనుఁడు వృకోదరాదులగు తమ్ములు మత్స్యమహీవిభుండుఁ ద
న్ననుప, హలాయుధ ప్రభృతి యాదవలోకము తోడరా ముదం
బున నిజపట్టణంబునకుఁ బోయె సముజ్జ్వల వైభవంబునన్. 47

ప్రతిపదార్థం: అని, ముర+అంతకుఁడు= మురుడనే రాక్షసుడిని సంహరించినవాడు - శ్రీకృష్ణుడు; గమన+ఉన్ముఖుండు+అయి= వెళ్ళటానికి సిద్ధపడినవాడై; ఆ-ద్రుపదుండున్; ధర్మనందనుఁడున్= ధర్మరాజూ; వృకోదర+ఆదులు+అగు-తమ్ములున్= భీముడు మొదలుగాగల అతడి తమ్ములూ; మత్స్య మహీవిభుండున్= మత్స్యరాజైన విరాటుడూ; తన్నున్+అనుపన్= తనను సాగనంపగా; హల+ఆయుధ-ప్రభృతి, యాదవ లోకము= నాగలి ఆయుధంగా కలవాడు (బలరాముడు) మున్నగు యాదవుల సమూహం; తోడన్+రాన్=వెంటరాగా; ముదంబునన్= సంతోషంతో; సముజ్జ్వల వైభవంబునన్= మిక్కిలి ప్రకాశించే వైభవంతో; నిజపట్టణంబునకున్= తనదైన పట్టణానికి - ద్వారకకు; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు ప్రయాణ సన్నద్ధుడై, ఆ ద్రుపదుడూ, ధర్మరాజూ, భీమాదులైన అతడి తమ్ములూ, విరాటుడూ, తనను పంపగా, బలరామాది యాదవ సమూహం వెంట రాగా, సంతోషంతో, సముజ్జ్వల వైభవంతో తన పట్టణమైన ద్వారకకు వెళ్ళాడు.

వ. వివాహ మహోత్సవంబునకు వచ్చిన తక్కటి రాజులును సంగ్రామ సన్నాహంబునకై తమ తమ పురంబులకుం జనిరి; తదనంతరంబ. 48

ప్రతిపదార్థం: వివాహమహత్(మహా)+ఉత్సవంబునకున్= వివాహమహోత్సవానికి; వచ్చిన; తక్కటి రాజులును= తక్కిన రాజులూ; సంగ్రామ సన్నాహంబునకై= యుద్ధ ప్రయత్నానికై; తమ, తమ, పురంబులకున్= తమ తమ నగరాలకు; చనిరి= వెళ్లారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వివాహమహోత్సవానికి వచ్చిన మిగిలిన రాజులందరూ యుద్ధప్రయత్నాలు చేసికొనటానికి తమతమ నగరాలకు వెళ్ళారు. ఆ తరువాత.

క. సమరమునకుఁ దగు నుద్యో । గమునఁ బ్రవర్తిల్లి రెలమిఁ గౌంతేయులు; మ
త్స్య మహీనాథుఁడు సన్నా । హము సేసెన్; ద్రుపదవిభుఁడు నాయిత మయ్యెన్. 49

ప్రతిపదార్థం: కౌంతేయులు= పాండవులు; ఎలమిన్= సంతోషంతో; సమరమునకున్= యుద్ధానికి; తగు+ఉద్యోగమునన్= తగిన ప్రయత్నంలో; ప్రవర్తిల్లిరి= ఉన్నారు; మత్స్య మహీనాథుఁడున్= మత్స్యదేశపురాజు-విరాటుడూ; సన్నాహము+చేసెన్= యుద్ధ సన్నద్ధుడయ్యాడు; ద్రుపద విభుఁడున్= ద్రుపదరాజుకూడా; అయితము+అయ్యెన్= యుద్ధ సంసిద్ధుడయ్యాడు.

తాత్పర్యం: పాండవులు సంతోషంతో యుద్ధానికి తగిన ప్రయత్నంలో ఉన్నారు. విరాటుడూ యుద్ధ సన్నద్ధుడయ్యాడు, ద్రుపదరాజు కూడా యుద్ధ సంసిద్ధుడయ్యాడు.

వ. ఇట్లు సన్నద్ధులై వెలివీడు విడిసి తమకు ననురక్తులైన రాజుల పాలికిం దగుదూతలం బుచ్చి; రట దుర్యోధనుండు వీరల చందంబు విని, తానును దన బంధుమిత్రగణంబైన రాజలోకంబు నెల్ల రావించిన. 50

ప్రతిపదార్థం: ఇట్లు, సన్నద్ధులు+ఐ= యుద్ధ సంసిద్ధులై; వెలివీడు విడిసి= వెలుపలి నగరులో విడిది చేసి, తమకున్+అనురక్తులు+ఐన= తమయందు అనురాగం గల; రాజుల పాలికిన్= రాజుల వద్దకు; తగు దూతలన్= తగిన దూతలను; పుచ్చిరి= పంపారు; అటన్= అక్కడ - హస్తినాపురంలో; దుర్యోధనుండున్; వీరల చందంబు= పాండవుల విధం; విని; తానును; తన, బంధు, మిత్ర, గణంబు+ఐన, రాజ, లోకంబున్+ఎల్లన్= తన చుట్టాల, స్నేహితుల సమూహమైన రాజుల సమూహాన్నంతనూ; రావించినన్= రప్పించగా.

తాత్పర్యం: ఇట్లా యుద్ధ సంసిద్ధులై వెలుపలి నగరులో విడిది చేసి, తమయందు అనురాగం గల రాజుల వద్దకు తగిన దూతలను పంపారు. అక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు పాండవుల ప్రయత్నాలను గురించి తెలిసికొని, తాను కూడా తన బంధువులూ మిత్రులూ అయిన రాజుల సమూహాన్నంతటినీ రప్పించగా.

క. ఇభ తురగ స్యందన గతి । రభసంబునఁ బృథివి యద్రువ రాఁ దొడఁగిరి భూ
విభులు నలుదిక్కులను లో । క భయంకరలీల నుభయకటకంబులకున్. 51

ప్రతిపదార్థం: ఇభ, తురగ, స్యందన, గతి, రభసంబునన్= ఏనుగులయొక్క, గుర్రాల యొక్క, రథాలయొక్క, గమనములయొక్క వేగంచేత; పృథివి= భూమి; అద్రువన్= అదరగా; భూ విభులు= రాజులు, నలు దిక్కులను= నాలుగు దిక్కులందును;

ఉభయ కటకంబులకున్= ఇద్దరి శిబిరాలకూ; లోకభయంకర లీలన్= లోకానికి వెరపు పుట్టించే విధంగా; రాన్+తొడఁగిరి= రా నారంభించారు.

తాత్పర్యం: ఏనుగుల గుర్రాల రథాల గమనవేగంతో భూమి అదరగా రాజులు నాలుగు దిక్కుల నుండి ఉభయుల శిబిరాలకూ లోకభీకరంగా రావటం మొదలుపెట్టారు.

ద్రుపదుఁడు తన పురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట (సం. 5-5-28)

వ. అట్టి సమయంబున నజాతశత్రు ననుమతి వడసి పాంచాలపతి వయోజ్ఞానవృద్ధుండైన తన పురోహితుం గురుపతిపాలికిఁ బుచ్చువాఁడై యతని రావించి. 52

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= అప్పుడు; పాంచాలపతి= పాంచాలదేశపురాజు ద్రుపదుడు; అజాతశత్రు+అనుమతి+ పడసి= ధర్మరాజుయొక్క అనుజ్ఞ పొంది; వయస్(ః)+జ్ఞాన-వృద్ధుండు+ఐన= వయస్సు చేతా, జ్ఞానంచేతా పెద్దవాడయిన; తన-పురోహితున్; కురుపతి-పాలికిన్= కురురాజైన ధృతరాష్ట్రుడి దగ్గరకు; పుచ్చు+వాఁడు+ఐ= పంపువాడై; అతనిన్; రావించి= రప్పించి.

తాత్పర్యం: అటువంటి సమయంలో ద్రుపదుడు ధర్మరాజు అనుజ్ఞ పొంది వయస్సుచేతా, జ్ఞానం చేతా పెద్దవాడయిన తన పురోహితుడిని ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపగోరి అతడిని రప్పించి.

క. 'హితుఁడవు, మతిమంతుండవు, । చతుర వచన కోవిదుఁడవు, సమయజ్ఞుఁడ, వు
న్నత వంశవర్ధనుఁడ, విం । గిత వేదివి, నెచ్చెలివి, సుకృతి వ ట్లగుటన్. 53

ప్రతిపదార్థం: హితుఁడవు= ఆప్తుడవు; మతిమంతుండవు= బుద్ధిమంతుండవు; చతుర, వచన, కోవిదుఁడవు= నేర్పుగల మాటలయందు పండితుడవు; సమయజ్ఞుఁడవు= సమయం తెలిసినవాడవు; ఉన్నత, వంశ, వర్ధనుఁడవు= ఉన్నత వంశాన్ని పెంచేవాడవు; ఇంగిత వేదివి= హృదయభావం తెలిసికొనేవాడవు; నెచ్చెలివి= మిత్రుడవు; సుకృతివి= పుణ్యశాలివి; అట్లు+అగుటన్= అందుచేత.

తాత్పర్యం: నీవు ఆప్తుడవు, బుద్ధిమంతుడవు, నేర్పుగా మాటలాడటంలో పండితుడవు, సమయం తెలిసినవాడవు, ఉన్నత వంశాన్ని అభివృద్ధిపరిచేవాడవు, హృదయంలోని భావాన్ని తెలిసికొనేవాడవు. ప్రియమిత్రుడవు, పుణ్యాత్ముడవు. అందుచేత.

విశేషం: ఈ పద్యంలో పురోహితుడు రాయబారిగా నియుక్తుడు కాదగిన లక్షణాలున్నవాడిగా ద్రుపదుడు ప్రశంసించాడు. అతడు చేయవలసిన పనులు తరువాతి పద్యంలో చెప్పాడు. వాటికి తగిన గుణాలనే ఈ పద్యంలో పేర్కొనటం విశేషం. ఈ రెండు పద్యాల భావాలను కలిపి చెప్పితే ఈ విధంగా తాత్పర్య మేర్పడుతుంది. 1. నీవు హితుడవు కాబట్టి కర్తవ్యమైన ఈ పని నీకు చెప్పుతున్నాను. 2. నీవు మతిమంతుడవు కాబట్టి నీ వాపని చేయటం న్యాయం. 3. నీవు చతురవచన కోవిదుడవు కాబట్టి నీ వన్ని విధాల మాట నేర్పరితనాన్ని ప్రకటించి ఆ పనికి ప్రయత్నించాలి. 4. ఉన్నతవంశ వర్ధనుడవు కాబట్టి పాండవార్థం ధృతరాష్ట్రుడి వద్దకు నిన్ను పంపుతున్నాను. 5. ఇంగితవేదివి కాబట్టి నేర్పు ప్రకటించగలవు. 6. నెచ్చెలివి

కాబట్టి నా కార్యాన్ని నీ కార్యంగా భావించగలవు. 7. సుకృతివి కాబట్టి చేపట్టిన పనిని కృతార్థం చేయగలవు(తీర్చగలవు). ద్రుపదుడి కార్య కారణబద్ధమైన వాక్యరచన అతడి చతురవచన రచనను తెలుపుతున్నది. అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో శ్రీకృష్ణదేవరాయలు తనను 'హితుఁడవు, చతురవచోనిధివి' అని ప్రశంసించినట్లు అవతారికలో పేర్కొన్నాడు. (మను. 1.15). తిక్కన చతుర వచన రచన ఆతడిని ప్రభావితం చేసినట్లున్నది. అది సహజం కూడా. తిక్కన 'కవిబ్రహ్మ', పెద్దన 'ఆంధ్ర కవితా పితామహుడు'. (సంపా.).

తే. నాకుఁ గర్తవ్య మగుపని నీకుఁ జేయఁ। దగవుగావున నెల్లవిధములఁ బూని।
పాండవార్థంబు ధృతరాష్ట్రుపాలి కరిగి। నేర్పువాటించి కార్యంబు దీర్పవలయు.' 54

ప్రతిపదార్థం: నాకున్; కర్తవ్యము+అగు పని= చేయదగినపని; నీకున్; చేయన్= చేయుటం; తగవు= న్యాయం; కావునన్= కాబట్టి; ఎల్లవిధములన్= అన్నివిధాలా; పూని= ప్రయత్నించి; పాండవ+అర్థంబు= పాండవుల కొరకు; ధృతరాష్ట్ర-పాలికిన్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; అరిగి= వెళ్ళి; నేర్పు+పాటించి= నేర్పు చూపి; కార్యంబు= పని; తీర్పవలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: నేను చేయవలసి ఉన్న పని నీవు చేయటం న్యాయం కాబట్టి, అన్ని విధాలా ప్రయత్నించి పాండవుల కొరకు ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి నేర్పు చూపి కార్యం సాధించాలి.'

విశేషం: పై(53) పద్య విశేషాంశాన్ని గమనించండి.

వ. అని చెప్పి యొడంబఱిచి యతనితో మఱియు నిట్లనియె. 55

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఒడంబఱిచి= ఒప్పించి; అతనితోన్; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి అంగీకరించేటట్లు చేసి అతడింకా ఇట్లా అన్నాడు.

క. 'విను కొడుకు గొన్న వేఁదుఱ। కొని కొట్టిన తిండికాఁడు కుటిలుం డతఁ; డా
జనపతి చందము, ధర్మజు। ననుపమ శీలంబు నెఱుఁగు; దది యట్లుండెన్. 56

ప్రతిపదార్థం: విను; కొడుకు+కొన్న-వేఁదుఱు+అ= కొడుకుకు పట్టిన పిచ్చియే; కొని, కొట్టిన, తిండికాఁడు= పట్టిన పరమలోభి; అతఁడు; కుటిలుండు= కపటి; ఆ జనపతి చందమున్= ఆ రాజు విధమూ; ధర్మజు+అనుపమ శీలంబు= ధర్మరాజు సాటిలేని స్వభావమూ; ఎఱుఁగుదు+(వు)= తెలిసినవాడవు; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ.

తాత్పర్యం: 'విను. ఆ ధృతరాష్ట్రుడు కొడుక్కు పట్టిన పిచ్చియే పట్టిన పరమలోభి. కపటి. ఆ రాజు విధమూ, ధర్మరాజు సాటిలేని స్వభావమూ ఎరుగుదువు. అది అట్లా ఉండనీ.

తే. పుడమి పాలు పాండవులకు నడుగఁబోయి, । నీవు ధృతరాష్ట్రుతో ధర్మ నిష్ఠమైన
యుచిత మాడిన, నందుఁ బోటొడ్డియున్న। దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె? 57

ప్రతిపదార్థం: పుడమి-పాలు= భూభాగం; పాండవులకున్, అడుగన్+పోయి= అడగడానికి వెళ్లి; నీవు; ధృతరాష్ట్రుతోన్; ధర్మ-నిష్ఠము+ఐన+ఉచితము+ఆడినన్= ధర్మంతో కూడుకొన్న ఉచితమైన మాట పలికితే; అందున్= కౌరవుల పక్షంలో; పోటొడ్డి+ఉన్న=

యుద్ధసన్నద్ధులైన; దొరల, భృత్యుల, మనములు= ప్రభువుల యొక్కయు, సేవకుల యొక్కయు మనస్సులు, తిరుగఁబడవె= వెనుకకు మరలవా?

తాత్పర్యం: పాండవులకు భూభాగం ఇమ్మని అడగటానికి వెళ్ళి నీవు ధృతరాష్ట్రుడితో ధర్మయుక్తమూ, సముచితమూ అయిన మాట పలికితే, కౌరవుల పక్షంలో ఉన్న రాజుల, సేవకుల మనస్సులు మన కనుకూలంగా మారిపోవా?

విశేషం: 'దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె?' - దీనికి మూలం- 'భవాంస్తు ధర్మసంయుక్తం ధృతరాష్ట్రం బ్రువన్ వచః మనాంసి తస్య యోధానాం ధ్రువ మావర్జయిష్యతి.' 'నీవుధృతరాష్ట్రుడితో ధర్మయుక్తమైన మాట చెప్పి అతడి యోధుల మనస్సులను తప్పకుండా వశం చేసికొంటావు.' అనగా, అట్లా వశం చేసుకొనేటట్లూ మాటాడాలని వేడికోలు. 'తిరుగఁబడవె? - అనే క్రియ సార్థకం. వారి వైపున్న మనస్సులు మనవైపు తిరుగబడవా? అనీ, యుద్ధం నుండి విముఖం కావా? అనీ రెండర్థాలు చెప్పుకొనవచ్చును.

క. గురుభీష్మాదుల మనములు । దురమునకుం జొరకయుండ దుర్యోధనుఁ డా
తురుఁడై యొడఁబఱుపఁగ ని । ప్పరుసున నెరవైన జీచ్చవడు బల మెల్లన్. 58

ప్రతిపదార్థం: గురు, భీష్మ+ఆదుల, మనములు= ద్రోణుడు, భీష్ముడు మున్నగువారి మనస్సులు; దురమునకున్= యుద్ధానికి; చొరక+ఉండన్= అంగీకరించకపోగా; దుర్యోధనుడు; ఆతురుఁడు+ఐ= వేగిరపాటుతో బాధపడినవాడయి; ఒడఁబఱుపఁగన్= అంగీకరింపచేయగా; ఈ+పరుసునన్= ఈ విధంగా; నెరవు+ఐనన్= సాధ్యపడితే; బలము+ఎల్లన్= సైన్యమంతా; జీచ్చ+పడున్= నిశ్చేష్టతను పొందుతుంది.

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ మొదలైనవారు యుద్ధానికి సుముఖత చూపకపోగా, దుర్యోధనుడు బాధపడి వారిని అంగీకరించేటట్లు చేయటం నీకు సాధ్యమయితే సైన్యమంతా ఆశ్చర్యంతో నిశ్చేష్టతను పొందుతుంది.

ఉ. పాండుతనూభవుల్ వడిన పాటులు బంధులకెల్లఁ దెల్పుచున్,
బండిత వృద్ధ సజ్జనుల పాలికిఁబోయి కులోచితంబు గా
కుండుట సూపి చెప్పుచుఁ, బ్రియోక్తులఁ దక్కటివారి 'నిట్లు మే
లొండొకచంద మొప్ప' దని యుల్లములం దలపోయఁ జేయుచున్. 59

ప్రతిపదార్థం: పాండు తనూభవుల్= పాండురాజు కొడుకులు పాండవులు; పడిన,పాటులు= పడ్డ కష్టాలు; బంధులకున్+ఎల్లన్= చుట్టాలకందరికీ; తెల్పుచున్= చెపుతూ; పండిత, వృద్ధ, సత్+జనులపాలికిన్= పండితులూ, పెద్దవారూ, మంచివారూ అయిన వారి దగ్గరికి; పోయి, కుల+ఉచితంబు= వంశానికి తగినది; కాక+ఉండుట+చూపి-చెప్పుచున్= కాకపోవటం నిరూపించి చెపుతూ; తక్కటివారిన్= తక్కినవారిని; ప్రియ+ఉక్తులన్= మంచి మాటలతో; ఇట్లు, మేలు= ఈ విధం మంచిది; ఒండొక, చందము= వేరు విధం; ఒప్పదు+అని= తగదని; ఉల్లములన్= మనస్సులలో; తలపోయన్+చేయుచున్= అనుకొనేటట్లు చేస్తూ.

తాత్పర్యం: పాండవులు పడ్డ కష్టాలు బంధువుల కందరికీ చెపుతూ, పండితులూ, వృద్ధులూ, సజ్జనులూ అయిన వారి దగ్గరికి వెళ్ళి 'ఇది వంశానికి తగినది కా'దని నిరూపించి చెపుతూ, తక్కినవారిని మంచిమాటలతో' ఈ విధం మంచిది, వేరే విధం మంచిది కాదు' అని మనస్సులలో అనుకొనేటట్లు చేస్తూ.

విశేషం: పురోహితుడు హస్తినాపురంలో సంప్రదించేవారిని ద్రుపదుడు వర్గీకరించిన విధం విశిష్టం. ముందు ధృతరాష్ట్ర దుర్యోధనాదులైన బంధువులతో, పండితు(గురువు)లైన కృపాచార్య ద్రోణాచార్యాదులతో, భీష్మ బాహ్లికాది వృద్ధులతో, సజ్జనులైన విదుర సంజయాదులతో ప్రతిపాద్యాంశం ఒకటే అయినా, వారి వారి ప్రవృత్తుల కనుగుణంగా ప్రవచించాలని భావం. (సంపా).

వ. మఱియు సమస్తజనంబుల మనంబుల నిక్కడ వ్రాలునట్టి యుపాయంబు లెన్నిగల వన్నియు నయ్యై తగవులమై నాచరించుచుఁజరియించునది; యిచ్చట విరాటు కొలువు కూటంబునం బుట్టిన కృష్ణాదుల సంవాదంబు తెఱంగును మన యెఱింగినయదియె; తదనురూపంబుగాఁ బలికి పాండవులకుఁ దేజోలాభంబు గావించుట కర్తవ్యంబు; నీవు కరినగరంబున వసియించి ధృతరాష్ట్ర ధార్తరాష్ట్ర గాంగేయ విదుర గురుకృపాదుల కడ కరిగి నానాఁటికి వారి వారి చిత్తంబుల తెఱంగెఱింగి ప్రవర్తింపుము; దైవగతింజేసి నీయొడ్డిన సూత్రంబునకు సుయోధనుం డొడంబడియెనేనియు నదియ సకల జనసమ్మతంబయినవిధంబగు; దాన నజాతశత్రుండును బ్రీతుండగుఁ బోయి ర'మ్మని నిశ్చయంబు సేసిన, నమ్మహీసురవరుండు. 60

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; సమస్త జనంబుల, మనంబులున్= ఎల్లజనుల మనస్సులూ; ఇక్కడన్= పాండవులవైపున; వ్రాలు+అట్టి ఉపాయంబులు= చేరే ఉపాయాలు; ఎన్ని+కలవు= ఎన్ని ఉన్నాయో; అన్నియున్= అన్నీ; ఆ+ఆ+ఇ+తగవులమైన్= ఆయా పద్ధతుల ప్రకారం; ఆచరించుచున్= చేస్తూ; చరియించునది= ప్రవర్తించవలెను; ఇచ్చటన్= ఇక్కడ; విరాటు కొలువు-కూటంబునన్= విరాటుడి సభాభవనంలో; పుట్టిన= కలిగిన; కృష్ణ+ఆదుల, సంవాదంబు, తెఱంగును= కృష్ణుడూ మొదలయినవారి సంభాషణ విధమూ; మన+ఎఱింగిన+అది+ఎ= మనకు తెలిసినదే; తద్+అనురూపంబు+కాన్= దానికి తగినట్లుగా; పలికి; పాండవులకున్; తేజస్(ః)+లాభంబు= పరాక్రమ లాభం; కావించుట= చేకూర్చటం; కర్తవ్యంబు= చేయదగింది; నీవు; కరి నగరంబునన్= హస్తినాపురంలో; వసియించి= ఉండి; ధృతరాష్ట్ర, ధార్తరాష్ట్ర, గాంగేయ, విదుర, గురు కృప+ఆదుల; కడకున్= ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులైన దుర్యోధనాదులూ, భీష్ముడూ, విదురుడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలయినవారిదగ్గరికి; అరిగి= వెళ్ళి; నాఁడు+నాఁటికిన్= క్రమక్రమంగా; వారి, వారి, చిత్తంబుల, తెఱంగు= ఆయా వీరుల మనోభావాల రీతిని; ఎఱింగి= తెలిసి; - ప్రవర్తింపుము= నడుచుకొమ్ము; దైవ-గతిన్+చేసి= అదృష్టవశంచేత; నీ+ఒడ్డిన-సూత్రంబునకున్= నీవు పన్నిన పన్నుగడకు; సుయోధనుండు= దుర్యోధనుఁడు; ఒడంబడియెన్+ఏనియున్= అంగీకరించాడా; అది+అ= అదే; సకల, జన, సమ్మతంబు+అయిన-విధంబు= అందరు జనులూ అంగీకరించే విధం; అగున్; దానన్= దానిచేత; అజాతశత్రుండును= ధర్మరాజుకూడా; ప్రీతుండు+అగున్= సంతోషిస్తాడు; పోయి-రమ్ము+అని= వెళ్లిరా అని; నిశ్చయంబు+చేసినన్= నిర్ణయించగా; ఆ+మహీసురవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు.

తాత్పర్యం: ఇంకా, అందరి మనస్సులూ ఇక్కడికి చేరుకునే ఉపాయాలు ఎన్ని ఉన్నాయో అన్నిటినీ ఆయా విధాలుగా చేస్తూ వర్తించుము. ఇక్కడ విరాటుడి కొలువులో పుట్టిన కృష్ణాదుల మాటల తీరూ మనకు తెలిసిందే. దానికి తగ్గట్టుగా మాటాడి పాండవులకు బలం చేకూర్చటం నీవు చేయవలసిన పని. నీవు హస్తినాపురంలో ఉండి ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులైన దుర్యోధనాదులూ, భీష్ముడూ, విదురుడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ మొదలైనవారి దగ్గరికి వెళ్ళి, క్రమక్రమంగా వారి మనోభిప్రాయాలు తెలిసికొని ప్రవర్తించు. అదృష్టవశంచేత నీవు పన్నిన పన్నుగడకు దుర్యోధనుడు అంగీకరించాడా, అదే అందరికీ ఆమోదయోగ్యమైన విధం. దానివలన ధర్మరాజు కూడా సంతోషిస్తాడు. వెళ్లి రమ్ము' అని నిర్ణయించగా, ఆ ద్రుపద పురోహితుడు.

క. మును పాంచాలవిభుని వీ। డ్కొని ధర్మజు భీము నరు నకులు సహదేవుం
గని యనుమతుఁడై యందఱు। ననుపఁగ మన్ననలు వడసి యరిగెం బ్రీతిన్. 61

ప్రతిపదార్థం: మును= ముందుగా; పాంచాల విభునిన్= పాంచాల దేశపు రాజయిన ద్రుపదుడిని; వీడ్కొని= వెళ్ళి వస్తానని విడిచి; ధర్మజున్, భీమున్, నరున్, నకులున్, సహదేవున్= ధర్మరాజునీ, భీముడినీ, అర్జునుడినీ, నకులుడినీ, సహదేవుడినీ; కని= చూచి; అనుమతుఁడు+ఐ= వారిచేత అనుజ్ఞ ఇవ్వబడినవాడయి; అందఱున్= అందరూ; అనుపఁగన్= పంపగా; మన్ననలు+పడసి= సమ్మానాలు పొంది; ప్రీతిన్= సంతోషంతో; అరిగెన్= వెళ్లాడు.

తాత్పర్యం: ముందుగా ద్రుపదుడి దగ్గర సెలవు పుచ్చుకొని, తరువాత ధర్మజుడి, భీముడి, అర్జునుడి, నకులుడి, సహదేవుడి అనుజ్ఞపొంది, సమ్మానాలు పొంది, అందరూ సాగనంపగా సంతోషంతో వెళ్ళాడు.

దుర్యోధనుండును నర్జునుండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట (సం. 5-7-2)

వ. అంత నక్కడ దుర్యోధనుండు, సకల రాజన్య సామాన్యంబుగా గోపాలదేవు పాలికి దూతం బుచ్చుట దగ వగునే?యని విచారించి. 62

ప్రతిపదార్థం: అంతన్; అక్కడన్= హస్తినాపురంలో; దుర్యోధనుండు; సకల, రాజన్య, సామాన్యంబు+కాన్= అందరి రాజులతోపాటు; గోపాల- దేవు పాలికిన్= శ్రీకృష్ణుడి దగ్గరికి; దూతన్= రాయబారిని; పుచ్చుట= పంపటం; తగవు+అగునే= మంచిదా; అని; విచారించి= ఆలోచించి.

తాత్పర్యం: 'అంతట హస్తినాపురంలో దుర్యోధనుడు రాజులందరి వద్దకువలెనే శ్రీకృష్ణుడి వద్దకు కూడా రాయబారిని పంపటం మంచిదా? అని ఆలోచించి.

క. వెరవుమెయిఁ దాన కతిపయ। పరిజన సహితముగ నరిగెఁ బటు తురగ గతి
స్ఫురణానుమోదలీలా। భరితుఁ డగుచు వేగిరంపుఁ బయనములఁ దగన్. 63

ప్రతిపదార్థం: తాను+అ= తానే; వెరవు-మెయిన్= ఉపాయంతో; కతిపయ, పరిజన, సహితముగన్= కొంతమంది పరిజనులతో; పటు, తురగ, గతి, స్ఫురణ+అనుమోద, లీలా, భరితుఁడు+అగుచున్= సమర్థములైన, గుర్రాల గమనం యొక్క ప్రకాశంయొక్క, సమ్మతితో కూడిన, విలాసంతో నిండిన వాడవుతూ; వేగిరము+పయనములన్= త్వరతో గూడిన ప్రయాణాలతో; తగన్= ఒప్పేటట్లు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఉపాయంతో, కొంతమంది పరిజనులను వెంటబెట్టుకొని, సమర్థములైన గుర్రాల వేగ విజృంభణను అనుమోదించే విలాసంతో కూడినవాడై, త్వరిత ప్రయాణాలతో తగినట్లుగా తానే వెళ్ళాడు.

విశేషం: 'వెరవు మెయిన్' అంటే ఉపాయంతో, నేర్పుతో అని అర్థాలు చెప్పవచ్చును. రాజనీత్యుపాయాన్ని ప్రయోగించే నేర్పని తాత్పర్యం ఏర్పడుతుంది. దుర్యోధనుడు శ్రీకృష్ణుడి వద్దకు స్వయంగా పోవాలని భావించటంలో భక్తిగాని, గౌరవంగాని, భయంకాని లేవు. శ్రీకృష్ణుడు యదుసింహుడు. అతడు పాండవపక్షపాతి. పైపెచ్చు బంధువు. పెద్దబలగం కలవాడు. అతడిఅన్న బలరాము డతడు ఎంత చెప్పితే అంత. పైపెచ్చు అర్జునుడికి బహిఃప్రాణం. అతడిని ముందుగా అడిగి తన వైపు

మళ్ళించుకొంటే పాండవ హితులలో భేదాన్ని కలిగించవచ్చునని ఊహ. భేదోపాయమే దుర్యోధనుడి ఊహకు దోహదం చేసింది. (సంపా.) దుర్యోధనుడి విలాసం అతడి రథాశ్వాల వేగానికి అనుగుణంగా ఉందన్నమాట.

వ. చని తదీయ పురప్రవేశంబు సేసె; నా దివసంబున ధనంజయుండును గోవిందుం గానవచ్చె నట్టియెడ. 64

ప్రతిపదార్థం: చని= వెళ్ళి, తదీయ, పుర, ప్రవేశంబు= ఆ కృష్ణుడిదైన నగరం యొక్క ప్రవేశం; చేసెన్; ఆ- దివసంబునన్= ఆ రోజున; ధనంజయుండును= అర్జునుడు కూడా; గోవిందున్= శ్రీకృష్ణుడిని; కానన్+వచ్చెన్= చూడడానికి వచ్చాడు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: వెళ్ళి ఆ శ్రీకృష్ణుడి నగరమైన ద్వారకలో ప్రవేశించాడు. ఆ రోజే అర్జునుడు కూడా శ్రీకృష్ణుడిని చూడటానికి వచ్చాడు. ఆ సమయంలో.

తే. అతఁడు పవడింప మును కౌరవాధినాథుఁ। డరిగి తలయంపి దెస నున్నతాసనమున
నుండెఁ, బదపడి కాల్కడ యొద్ద కల్లఁ। జని వినమ్రుఁడై నిలుచుండె సవ్యసాచి. 65

ప్రతిపదార్థం: అతఁడు= ఆ శ్రీకృష్ణుడు; పవడింపన్= శయనించి ఉండగా; మును= ముందు; కౌరవ+అధినాథుఁడు= కురురాజు - దుర్యోధనుడు; అరిగి= వెళ్ళి; తలయంపి దెసన్= తలాపి దిక్కున; ఉన్నత+ఆసనమునన్= ఎత్తయిన పీఠంపై; ఉండెన్; పదపడి= పిమ్మట; సవ్యసాచి= అర్జునుడు; కాలు+కడ+ఒద్దకున్= కాళ్ళకడవద్దకు; అల్లన్= మెల్లగా; చని= వెళ్లి; వినమ్రుఁడు+ఐ= మిక్కిలి విధేయత కలవాడై; నిలుచుండెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు శయనించి ఉండగా, ముందుగా దుర్యోధనుడు వెళ్ళి తలాపి దిక్కున ఉన్న ఉన్నత పీఠంమీద ఆసీనుడయ్యాడు. తరువాత వచ్చిన అర్జునుడు మెల్లగా కాళ్ళ కడకు వెళ్ళి మిక్కిలి వినయంతో నిలబడ్డాడు.

విశేషం: దుర్యోధనార్జునులు ఆ సమయంలో ప్రవర్తించిన తీరులు వారివారి స్వభావాలకు అనుగుణంగా ఉన్నాయి. దుర్యోధనుడు ఉద్ధతుడు; అర్జునుడు వినయపరుడు. తలనుండి కాళ్ళవరకు చూడటం శ్రీకృష్ణుడిని మానవుడిగా భావించి చూడటం - అది దుర్యోధనుడి దృక్పథం. పాదాలనుండి శిరస్సుదాకా చూడటం శ్రీకృష్ణుడిని మాధవుడిగా దర్శించటం - ఇది అర్జునుడి శరణాగత దృక్పథం.

వ. అంత. 66

ప్రతిపదార్థం: అంతన్= తరువాత.

క. మేలుకని కృష్ణుఁ డర్జును। నాలోకించి మఱి కౌరవాధిపుఁ గని త
త్కాలోచిత బహుమతిమైఁ। జాలఁ బ్రియం బిరువురకుఁ బ్రసన్నతఁ జేసెన్. 67

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; మేలుకని= మేల్కొని; అర్జునున్; ఆలోకించి= చూచి; మఱి= తరువాత; కౌరవ+అధిపున్= కౌరవరాజును - దుర్యోధనుడిని; కని= చూసి; తద్+కాల+ఉచిత-బహుమతిమైన్= ఆ సమయానికి తగిన గౌరవంతో; ఇరువురకున్= అర్జున దుర్యోధనుల కిద్దరికీ; ప్రసన్నతన్= ఆదరంతో; చాలన్+ప్రియంబు+చేసెన్= ఎంతో ప్రీతిని కలిగించాడు.

తాత్పర్యం: కృష్ణుడు నిద్రలేచి అర్జునుడిని ముందు చూచి తరువాత దుర్యోధనుడిని చూచి, ఆ సమయానికి తగిన మర్యాదతో, వారిద్దరినీ ఎంతో ఆదరించి ప్రీతిని గలిగించాడు.

విశేషం: అర్జునుడు కాళ్ళకడ ఉండడంచేత కృష్ణుడు అతడిని ముందుగానూ, దుర్యోధనుడు తలాపి దిక్కున వెనక ఉండడం చేత అతడిని తరువాత చూడడం తటస్థించింది. అంతేకాదు, ఒకరిని ఆలోకించాడు; మరొకరిని చూచాడు. ఆ తేడాను ప్రీతితో కప్పిపుచ్చాడు. ఇరువురికీ ప్రసన్నుడైనట్లుగా ప్రవర్తించాడు.

వ. తదనంతరంబ. **68**

తాత్పర్యం: ఆ పిమ్మటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. వారలఁ జూచి కేశవుఁడు 'వచ్చిన కార్యము సెప్పుఁ'డన్న న
క్కౌరవనాథుఁ డిట్లనియెఁ; 'గయ్యము సేయువగన్ సహాయముం
గోరి భవత్సకాశమునకుం జనుదెంచితి; మేము వీరు నీ
కారయ నొక్కరూప హృదయంబునఁ బేర్చిన బాంధవంబునన్. **69**

ప్రతిపదార్థం: కేశవుఁడు= శ్రీకృష్ణుడు; వారలన్= ఆ దుర్యోధనార్జునులను; చూచి; వచ్చిన, కార్యమున్= వచ్చిన పని; చెప్పుఁడు+అన్నన్= చెప్పండి అనగా; ఆ+కౌరవ నాథుఁడు= ఆ కురురాజు-దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్; కయ్యము+ చేయువగన్= యుద్ధం చేసే తలంపుతో; సహాయమున్= (నీ) తోడ్పాటును; కోరి; భవత్+సకాశమునకున్= నీ దగ్గరకు; చనుదెంచితిమి= వచ్చాము; ఏమున్= మేము కౌరవులమూ; వీరున్= పాండవులూ; నీకున్; ఆరయన్= చూడగా; హృదయంబునన్= మనస్సులో; పేర్చిన= అతిశయించిన; బాంధవంబునన్= చుట్టరికంచేత; ఒక్క రూపు+అ= ఒక్కటే.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు వాళ్ళిద్దరినీ చూచి 'మీరు వచ్చిన పని తెలుపండి' అనగానే, ఆ దుర్యోధనుడు ఇట్లా అన్నాడు. 'యుద్ధం చేసే తలంపుతో నీ తోడ్పాటును కోరి నీ దగ్గరికి వచ్చాము. కౌరవులమైన మేమూ, పాండవులైన వీరూ చూడగా, హృదయంలో నీకు బాగా దగ్గరచుట్టాల మవడంచేత, ఒక్కటే.

విశేషం: అర్జునుణ్ణి కలుపుకొని అతడి సంగతి కూడా దుర్యోధనుడు తానే చెప్పడం గమనించదగింది. అర్జునుడు కూడా తనలాగే కృష్ణ సహాయం కోసమే వచ్చి ఉంటాడని దుర్యోధనుడు సరిగానే ఊహించాడు.

క. ము న్నేను గానవచ్చితి । నిన్నుఁ; సుజనులైనవారు నెమ్మిని మునుమున్
గన్నం దగఁ గైకొండ్రు; స । మున్నత సౌజన్య సారయుతుఁడవు నీవున్. **70**

ప్రతిపదార్థం: ఏను= నేను; నిన్నున్; మున్ను= మొదట; కానన్+వచ్చితిన్= చూడవచ్చాను; సుజనులు+ఐన వారు= మంచివాళ్ళు; నెమ్మిని= ప్రీతితో; మునుమున్= మొట్టమొదట; కన్నన్= చూస్తే; తగన్= ఒప్పుగా; కైకొంద్రు= స్వీకరిస్తారు; ఆదరిస్తారు; నీవున్= నీవుకూడా; సమున్నత, సౌజన్య, సార యుతుఁడవు= మిక్కిలి గొప్పదైన మంచితనంయొక్క సారంతో కూడినవాడవు.

తాత్పర్యం: ముందుగా నేను నిన్ను చూడవచ్చాను. సత్పురుషులు మొట్టమొదట చూచినవాళ్ళను ప్రీతితో సముచితంగా ఆదరిస్తారు. నీవు కూడా ఎంతో మంచివాడవు.

విశేషం: నిన్ను చూడటానికి అర్జునుడికంటె ముందు నేను వచ్చాను. ముందు వచ్చిన వాళ్ళను సజ్జనులు ఆదరిస్తారు. నీవు సజ్జనుడవు' అని దుర్యోధనుడి సహేతుకమైన వాక్యాలకు ధ్వని 'అర్జునుడినికాక నీవు నన్నే స్వీకరించాలి. అప్పుడే నీ సౌజన్యం తెలుస్తుంది' అని.

వ. కావున లోకంబుపాడి విచారించి నాకుం దోడు గావలయు' ననిన వాసుదేవుం డిట్లనియె. 71

ప్రతిపదార్థం: కావునన్; లోకంబు, పాడి= లోకంలో ఉన్న న్యాయం; విచారించి= ఎంచి; నాకున్; తోడు+కావలయున్= సహాయపడాలి; అనినన్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కాబట్టి లోకంలో ఉన్న న్యాయాన్ని పాటించి నాకు నీవు సహాయపడాలి' అని దుర్యోధనుడనగా, శ్రీకృష్ణుడు అతడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'నీ విట మున్న వచ్చితిది నిక్కము; పార్థునిఁ దొల్తఁ గాంచితిం;
గావున మీకు నిద్దఱకు గౌరవ మొప్పఁగఁదోడుపాటు స
ద్భావము; దీనికిం దెఱఁగు దప్పకయుండఁగ నేర్పరించెదన్;
మీ వల పెట్టు లట్ల తగ నీవును నీతఁడు గోరికొం డొగిన్. 72

ప్రతిపదార్థం: నీవు; ఇటన్= ఇక్కడికి; మున్ను+అ= ముందే; వచ్చితి(వి); ఇది; నిక్కము= నిజం; పార్థునిన్= అర్జునుణ్ణి, తొల్తన్= మొదట; కాంచితిన్= చూశాను; కావునన్; మీకున్; ఇద్దఱకున్; గౌరవము+ఒప్పఁగన్= గౌరవం ఒప్పేటట్టు; తోడుపాటు= సహాయపడడం; సత్+భావము= మంచితనం; దీనికిన్= ఇందుకు; తెఱఁగు+తప్పక+ఉండఁగన్= పద్ధతి చెడకుండా ఉండేటట్లు; ఏర్పరించెదన్= విభాగం చేస్తాను; మీ - వలపు+ఎట్టులు+అట్లు+అ= మీ కోరిక ఎలా ఉన్నదో అలాగే; నీవునున్; ఈతఁడున్; తగన్= ఒప్పేటట్లు; ఒగిన్= క్రమంగా; కోరికొండు= కోరుకొనండి.

తాత్పర్యం: 'నీవు ఇక్కడికి ముందే వచ్చావు. ఇది నిజం. కాని నేను ముందుగా అర్జునుడిని చూచాను. కాబట్టి మీకు ఇద్దరికీ సగౌరవంగా సహాయపడడం మంచిది. ఇందుకు క్రమపద్ధతి చెడకుండా ఉండేటట్లు నేను ఒక విభాగం చేస్తాను. కనుక, నీవూ, ఇతడూ మీ మీ కోరికల ననుసరించి ఒప్పుగా క్రమంగా కోరుకొనండి.

విశేషం: తనను చూడటానికి ముందు వచ్చినవాడికీ, తను ముందు చూచిన వాడికీ న్యాయం జరిగే విధంగా ఏర్పాటు చేస్తానని శ్రీకృష్ణుడనటం అతడి ధర్మజ్ఞతకు నిదర్శనం.

క. నా పాటియ పదివేవురు । గోపాలురు గలరు సమరకోవిద బాహా
టోపాభిరామమూర్తులు, । చాపాద్యాయుధ కళా విశారదచిత్తుల్. 73

ప్రతిపదార్థం: సమర= యుద్ధంలో; కోవిద= పాండిత్యంకల; బాహా= భుజాలయొక్క; ఆటోప= గర్వంచేత; అభిరామ= మనోహరాలైన; మూర్తులు= ఆకారాలు కలవారూ; చాప= ధనుస్సు; ఆది= మొదలయిన; ఆయుధకళా= యుద్ధవిద్యయందు; విశారద= నేర్పుగల; చిత్తుల్= మనస్సులు కలవారూ అయిన; పదివేవురు= పదివేలమంది; గోపాలురు= యాదవవీరులు; నా-పాటి+అ= నా యంతటివారే; కలరు.

తాత్పర్యం: యుద్ధపాండిత్యంకలిగి భుజబలగర్వం చేత మనోహరాలైన ఆకారాలు కలవారూ; విల్లూ మొదలయిన ఆయుధాల విద్యలో నేర్పుగల మనస్సులు గలవారూ అయిన పదివేలమంది వీరులైన గోపాలురు నాఅంతటివారే ఉన్నారు.

క. నారాయణాభిధానులు । వారలు గయ్యంబు సేయువా; రొక్కెడ నే
నూరక నిరాయుధ వ్యా । పారతమై నుండువాఁడఁ బరమాప్తుఁడనై. 74

ప్రతిపదార్థం: నారాయణ+అభిధానులు, వారలు= నారాయణ నామధేయులైనవారు; కయ్యంబు= యుద్ధం; చేయువారు= చేస్తారు; నేను; నిరాయుధ, వ్యాపారతమైన్= ఆయుధాలను ప్రయోగించకుండా; పరమ+ఆప్తుఁడన్+ఐ= మిక్కిలిహితుడనై; ఒక్క+ఎడన్= ఒకచోట; ఊరక, ఉండువాఁడన్= ఊరికే ఉంటాను.

తాత్పర్యం: నారాయణ నామధేయులైన ఆ గోపాలవీరులు యుద్ధం చేస్తారు. నేను ఆయుధాల జోలికి పోకుండా, మిక్కిలి హితుడనయి ఒకచోట ఊరకే ఉంటాను.

విశేషం: శ్రీకృష్ణుడి మహానుభావత తెలిసిన ఏ అర్జునుడో తప్ప లౌకికుడు మరెవ్వడైనా, కృష్ణుడిని కాక నారాయణ నామధేయులనే కోరుకొంటాడు. కృష్ణుడు ఒక్కడు, వాళ్ళు పదివేల మంది. కృష్ణుడు ఆయుధం ముట్టడు. వాళ్ళు భుజబల సంపన్నులు, సర్వాయుధ విద్యానిపుణులు. అటువంటప్పుడు చూస్తూ చూస్తూ కృష్ణుడిని ఎవడు కోరుకుంటాడు? దుర్యోధను డంతే చేశాడు.

క. వా రొకతల, యే నొక తల; । యీ రెండు దెఱంగులందు నెయ్యది ప్రియ మె
వ్వారికిఁ జెప్పుఁడు; దొలితొలి । గోరికొనన్ బాలునికిఁ దగుం బాడిమెయిన్.' 75

ప్రతిపదార్థం: వారు= పదివేల మంది నారాయణ నామధేయులు; ఒక తల= ఒక పక్షం; ఏను= నేను ఒక తల= ఒక పక్షం; ఈ, రెండు-తెఱంగులందున్= ఈ రెండు విధాలలోను; ఏ+వారికిన్= ఎవరికి; ఏ+అది= ఏది; ప్రియము= ఇష్టమో; చెప్పుఁడు; తొలి తొలి= మొట్టమొదట; కోరికొనన్= కోరుకోవడానికి; పాడిమెయిన్= న్యాయప్రకారం; బాలునికిన్= చిన్నవాడికి; తగున్.

తాత్పర్యం: ఆ పదివేలమంది నారాయణ నామధేయులైన గోపాలకులు ఒక పక్షం. నేనొక్కడినీ ఒక పక్షం. ఈ రెండు విధాలలోనూ ఎవరికి ఏది ఇష్టమో చెప్పండి. మొట్టమొదట చిన్నవాడు కోరుకొనటం న్యాయం.'

అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట (సం. 5-7-18)

క. అని పలికి హరి కిరీటిం । గనుఁగొని 'కొండుకవు నీవు గావున, నీకున్
మును గోరఁ బాడి' యనవుడు । విని కృష్ణునిఁ గోరికొనియె విజయుం డెలమిన్. 76

ప్రతిపదార్థం: అని; పలికి; హరి= శ్రీకృష్ణుడు; కిరీటిన్= అర్జునుణ్ణి; కనుఁగొని= చూచి; నీవు; కొండుకవు= చిన్నవాడవు; కావునన్; నీకున్; మును= ముందు; కోరన్= కోరుట; పాడి= ధర్మం; అనవుడున్= అనగానే; విని; విజయుండు= అర్జునుడు; ఎలమిన్= సంతోషంతో; కృష్ణునిన్; కోరికొనియెన్.

తాత్పర్యం: అని పలికి శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి 'మీ ఇద్దరిలో నీవు చిన్నవాడవు కాబట్టి, ముందు నీవు కోరుకొనటం ధర్మం' అనగానే విని అర్జునుడు సంతోషంతో శ్రీకృష్ణుడిని కోరుకొన్నాడు.

విశేషం: 'ఎలమిన్' - శ్రీకృష్ణుడు తనకు సహాయపడటం అర్జునుడికి సంతోషప్రదం. 'విజయుండు' అనేపదం ఇందులో సాభిప్రాయంగా ప్రయోగించబడింది. (చూడు: 87వ వచనం).

ఆ. దాని కాత్మ(బొంగి ధార్తరాష్ట్రు(డు వారి । నపహరించికొనినయట్ల కా(గ(
దల(చి, చెన్నుమీఱి, బలముల(గైకొని । చనియె(బ్రీతి రాము సదనమునకు. 77

ప్రతిపదార్థం: దానికిన్= అర్జునుడు పదివేలమంది నారాయణులనుగాక కృష్ణుడిని కోరుకొన్నందుకు; ధార్తరాష్ట్రు(డు= దుర్యోధనుడు; ఆత్మన్= మనస్సులో; పొంగి= సంతోషించి; వారిన్= ఆ నారాయణ నామధేయులను; అపహరించికొనిన+అట్లు+అ,కా(గన్= అర్జునుడి ఏమరుపాటు వలన తాను దక్కించుకొన్నట్లుగానే; తల(చి= ఎంచి; చెన్ను, మీఱి= కాంతి అతిశయించి; బలములన్= సేనలను; కైకొని= తీసికొని; రాము,సదనమునకున్= బలరాముడి ఇంటికి; ప్రీతిన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జునుడు పదివేలమంది గోపకులను కాక కృష్ణుడిని కోరుకొన్నందుకు దుర్యోధనుడు మనస్సులో పొంగి, ఆ గోపకులను తాను అనాయాసంగా దక్కించుకున్నట్లే ఎంచి, సంతోషంతో కాంతి అతిశయించి, తన సేనలను తీసికొని బలరాముడి ఇంటికి ఆనందంతో వెళ్ళాడు.

విశేషం: ముందు కోరుకొనే హక్కు అర్జునుడికి లభించింది. అతడెక్కడ పదివేలమంది గోపవీరులను తన్నుకుపోతాడో అని దుర్యోధనుడి భయం. అర్జునుడు ఆ వీరులనుగాక శ్రీకృష్ణుడిని ఒక్కడినీ కోరుకొన్నందుకు దుర్యోధనుడి సంతోషం అంతా ఇంతా కాదు. ఆ సంతోషంతో వికాసం అతిశయించింది. పదివేలమంది కాదు, నూరువేల మంది అయినా ఒక్క కృష్ణుడికి సాటి రారు. ఆ సంగతి అర్జునుడికి తెలుసు. మూఢ దుర్యోధనుడికి తెలియదు.

వ. చని యతనిం గని సమ్మానంబు వడసి తనవచ్చిన కార్యం బెఱింగించిన దుర్యోధనునకు బలదేవుం డిట్లనియె. 78

ప్రతిపదార్థం: చని= వెళ్ళి, అతనిన్= బలరాముడిని; కని= చూచి; సమ్మానంబు+పడసి= సత్కారం పొంది; తన వచ్చిన కార్యంబు= తాను వచ్చిన పని; ఎఱింగించినన్= తెలుపగా; దుర్యోధనునకున్; బలదేవుండు= బలరాముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: వెళ్ళి బలరాముడిని చూచి అతిథిసత్కారం పొంది, తాను వచ్చిన పని తెలుపగా, బలరాముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. 'అభిమన్యు వివాహమునకు(। బ్రభువర్గం బెల్ల(గూడ(బడియుండ(గ, నా
సభ నీకై యే(బలికితి; । నిభపురమున మాట వుట్ట దె ట్లీవు వినన్? 79

ప్రతిపదార్థం: అభిమన్యు, వివాహమునకున్= అభిమన్యుడి పెళ్ళికి; ప్రభు, వర్గంబు+ఎల్లన్= వచ్చిన రాజసమూహం అంతా; కూడఁబడి+ఉండఁగన్= సమావేశం కాగా; ఆ, సభన్= ఆ సభలో; ఏన్= నేను; నీకై= నీకొరకు; పలికితిన్= మాటాడాను; ఇభపురమునన్= హస్తినాపురంలో; ఈవు= నీవు; వినన్= వినేటట్లు; మాట+పుట్టదు+ఎట్లు?= మాట పుట్టలేదా?

తాత్పర్యం: 'అభిమన్యుడి పెళ్ళి సందర్భంగా వచ్చిన రాజులందరూ సమావేశమయినప్పుడు ఆ సభలో నేను నీ పక్షం పలికాను. నీవు హస్తినాపురంలో ఈ మాట వినలేదా?

వ. **దానికిఁ గొంద ఱసహ్యపడి పాండవ పక్షపాతంబునం బ్రతికూలవచనంబులు వలికిన, నవి కృష్ణునకుఁ బ్రియంబులై యుండె నట్లగుటం జేసి.** **80**

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; కొందఱు; అసహ్యపడి= సహింపజాలక; పాండవ,పక్షపాతంబునన్= పాండవులమీది అభిమానంతో; ప్రతికూల,వచనంబులు+పలికినన్= వ్యతిరేకపు మాటలు పలుకగా; అవి= ఆ మాటలు; కృష్ణునకున్; ప్రియంబులు+ఐ+ఉండెన్= ఇంపులై ఉన్నాయి; అట్లు+అగుటన్+చేసి= అందుచేత.

తాత్పర్యం: నా మాటకు సైపలేక కొందరు పాండవులమీది పక్షపాతంతో వ్యతిరేకించి మాటాడగా, ఆ మాటలు శ్రీకృష్ణుడికి రుచించాయి. అందుచేత.

విశేషం: తన మాటకు అసహ్యపడిన కొందరు 'సాత్యకి ద్రుపదులు.' బలరాముడు వారి పేర్లు చెప్పలేదు.

తే. **అతనిఁ బాసి యొక్కింత ప్రొద్దైన నిలువఁ। జాలమియు మూలముగ, విరసంపు మాట**
లాడ నొల్లమి, నేమియు ననక యంత। నుండి యొక నిశ్చయమ్ముమై నున్నవాఁడ.' **81**

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కృష్ణుడిని; పాసి= విడిచి; ఒక్క+ఇంత-ప్రొద్దు+ఐనన్= కొంచెంసేపు కూడా; నిలువన్+చాలమియున్= ఉండలేకపోవటం; మూలముగన్= మొదటి కారణంగా; విరసము+మాటలు= అనిష్టములైన మాటలు; ఆడన్+ఒల్లమిన్= మాటాడటం ఇష్టంలేకపోవటం చేత; ఏమియున్+అనక= ఏమీ మాటాడకుండా; అంతనుండి= అది మొదలుకొని; ఒక, నిశ్చయమ్ముమైన్= ఒక నిర్ణయంతో; ఉన్నవాఁడన్= ఉన్నాను.

తాత్పర్యం: కృష్ణుడిని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేకపోవటం మూలాన, విరసంగా మాటాడటం ఇష్టం లేకా, ఏమీ అనకుండా, అది మొదలుకొని నేను ఒక నిర్ణయం చేసికొన్నాను.'

వ. **అది యెయ్యది యంటేని.** **82**

ప్రతిపదార్థం: అది= ఆ నా నిశ్చయం; ఏ+అది= ఏది; అంటి(వి)+ఏనిన్= అంటే-

తాత్పర్యం: ఆ నా నిశ్చయం ఏమిటని అడిగితే.

క. **మీరును వారును జలమునఁ। బోరెడునెడ, నెద్ది యెట్లు వోయిన నెఱి నే**
నూరకయుండుదుఁ; దో డె। వ్వారికిఁ బోఁ; నింత నిక్కువం బెబ్బంగిన్.' **83**

ప్రతిపదార్థం: మీరును; వారును= పాండవులును; చలమునన్= పట్టుదలతో; పోరెడు+ఎడన్= యుద్ధం చేసేటప్పుడు; ఎద్ది= ఏది; ఎట్లు+పోయినన్= ఎట్లాపోయినా - జయాపజయాలు ఎవరికైనా; నెటిన్= తటస్థంగా; ఏను= నేను; ఊరక+ఉండుదున్= ఊరుకుంటాను; ఎవ్వారికిన్= ఎవరికీ; తోడు= సహాయం; పోను= పోవను; ఏ+భంగిన్= ఏవిధంగానైనా; ఇంత; నిక్కువంబు= నిజం.

తాత్పర్యం: మీరూ, వాళ్లూ పట్టుదలతో పోరాడేటప్పుడు, జయాపజయాలు ఎవరికైనా నేను తటస్థంగా ఊరుకుంటాను. ఎవరికీ సహాయం చేయను. ఏ విధంగానైనా ఇది నిజం.'

వ. అనిన విని, దుర్యోధనుండు దాని కియ్యకొని, సవినయంబుగా బలదేవుని వీడ్కొని, వాసుదేవు నామంత్రణంబుసేసి, కృతవర్మ పాలికిం జని, యాతం డొక్క యక్షౌహిణితోడఁ దన్నుంగలయవచ్చువాఁడయి యూఱడం బలికినఁ బ్రియంబంది, నిజపురంబున కరిగెఁ; దదనంతరంబ కృష్ణుం డర్జునున కిట్లనియె. 84

ప్రతిపదార్థం: అనినన్; విని; దుర్యోధనుండు; దానికిన్; ఇయ్యకొని= అంగీకరించి; సవినయంబుగాన్= అణకువతో; బలదేవునిన్= బలరాముణ్ణి; వీడ్కొని= విడిచి; వాసుదేవున్= శ్రీకృష్ణుణ్ణి, ఆమంత్రణంబు+చేసి= వెళ్ళివస్తానని చెప్పి; కృతవర్మ పాలికిన్= కృతవర్మవద్దకు; చని; ఆతండు; ఒక్క+అక్షౌహిణి తోడన్= ఒక అక్షౌహిణి సేనతో; తన్నున్= తనను; కలయున్+ వచ్చువాఁడు+అయి= చేరవచ్చువాడై; ఊఱడన్= ఊరట కలిగేటట్లు; పలికినన్= పలుకగా; ప్రియంబు+అంది= సంతోషించి; నిజపురంబునకున్= తన నగరానికి; అరిగెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మటనే; కృష్ణుండు; అర్జుననకున్; ఇట్లు+అనియెన్= ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: బలరాముడి మాటలు విని దుర్యోధనుడు అందుకంగీకరించి వినయపూర్వకంగా అతడిని వీడుకొని, కృష్ణుడిని మళ్ళీపలకరించి, కృతవర్మవద్దకు వెళ్ళి, అతడు 'ఒక అక్షౌహిణీ సేనతో నీకు తోడ్పడ వస్తా' నని ఊరట కలిగేటట్లు పలుకగా, సంతోషించి తన నగరానికి - హస్తినాపురానికి వెళ్లాడు. ఆ తరువాత కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: కృతవర్మ భోజదేశాధిపతి, దుర్యోధనుడి పక్షంలో ఉండి పాండవులతో పోరాడినవాడు. అక్షౌహిణి- అక్ష+ఊహిని- గుణం వచ్చి అక్షోహిణి కావలసి ఉండగా, వృద్ధి వచ్చి అక్షౌహిణి అయింది. అక్షోహిణి అనే గుణం వచ్చిన రూపాన్ని కూడా తిక్కనే ఉద్యోగపర్వం 1-236లో ప్రయోగించాడు. 'సహస్రా, క్షోహిణు లట్లగుట మీరు సూడరె యెందున్'. అక్షౌహిణీ సేన అంటే- 21,870 రథాలూ, అన్నే ఏనుగులూ, ఏనుగులకు మూడు రెట్లు గుర్రాలూ, ఆ మూడూ కలిస్తే అయ్యేటంత మంది కాలిబంట్లూ గల సేన.

క. 'నారాయణ గోపాలుర । భూరిపరాక్రములఁ గురువిభుఁడు గొన, సంగ్రా
మారంభరహితు నన్నుం । గోరికొనుట నీకు మేలగునె తలపోయన్?' 85

ప్రతిపదార్థం: కురువిభుఁడు= కురురాజు-దుర్యోధనుడు; భూరిపరాక్రములన్= అధిక పరాక్రమవంతులను; నారాయణగోపాలురన్= నారాయణులనే పేరు గల గోపకులను; కొనన్= తీసికొనగా; సంగ్రామ+ఆరంభ, రహితున్+నన్నున్= యుద్ధప్రయత్నం లేని నన్ను, కోరికొనుట= కోరుకొనటం; తలపోయన్= ఆలోచించగా; నీకున్; మేలు+అగునె?= మంచిదా?

తాత్పర్యం: 'దుర్యోధనుడు అధిక పరాక్రమవంతులైన నారాయణ నామధేయులైన గోపకులను కోరుకొనగా, యుద్ధం చేయనంటున్న నన్ను కోరుకోవటం వలన ఆలోచించగా నీకు ఏ విధంగా మేలు కలుగుతుంది?'

క. అనుటయు, నాతఁడు హరి కి । ట్లను: 'నేను రణంబునకు సహాయం బొల్లన్;
విను, సుప్రసిద్ధుఁడవు నీ । వని సేసినఁ, బేరు నీక యగు నెప్పాటన్. 86

ప్రతిపదార్థం: అనుటయున్= అని కృష్ణు డనగానే; ఆతఁడు= అర్జునుడు; హరికిన్+ఇట్లు+అనున్= కృష్ణుడితో ఇట్లా అన్నాడు; నేను; రణంబునకున్= యుద్ధానికి; సహాయంబు= తోడ్పాటు; ఒల్లన్= అంగీకరించను; విను; సుప్రసిద్ధుఁడవు-నీవు= మిక్కిలి వాసికెక్కిన నీవు; అని+చేసినన్= యుద్ధం చేస్తే; ఏ+పాటన్= ఏవిధంగా నైనా; పేరు= కీర్తి; నీకున్+అ= నీకే; అగున్.

తాత్పర్యం: కృష్ణుడి మాటలు విని అర్జునుడు అతడితో ఇట్లా అన్నాడు. 'నేను యుద్ధానికి తోడ్పాటు కోరను. వినుము. మిక్కిలి ప్రఖ్యాతుడవైన నీవు యుద్ధం చేస్తే, ఏవిధంగా నైనా, పేరు నీకే వస్తుంది.'

విశేషం: ఈ మాటవలన అర్జునుడు ఎటువంటి అసహాయశూరుడో తెలుస్తుంది.

వ. నీ కెదురై జయంబు గొనరా; దట్లగుటం జేసి, విజయమూలం బగు నీతోడును వలయు; నీవు సమరంబు సేయకునికియుం బ్రియంబు కావున నిన్నుం గోరికొంటి' నని చెప్పి మఱియు నిట్లనియె. 87

ప్రతిపదార్థం: నీకున్; ఎదురు+ఐ= ప్రతిపక్షంలో ఉండి; జయంబు= గెలుపు; కొనన్+రాదు= పొందటం అశక్యం; అట్లు+అగుటన్+చేసి= అందుచేత; విజయమూలంబు+అగు= విజయానికి ప్రధాన కారణమైన; నీతోడును= నీ సహాయం కూడా; వలయున్= కావాలి; నీవు; సమరంబు+చేయక+ఉనికియున్= యుద్ధం చేయకపోవటం కూడా; ప్రియంబు= ఇష్టం; కావునన్; నిన్నున్; కోరికొంటిన్; అని; చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ప్రతిపక్షంలో ఉంటే నిన్ను గెలవటం అశక్యం. అందుచేత విజయానికి ప్రధాన కారణమైన నీ తోడ్పాటు కావలసినదే. నీవు యుద్ధం చేయకుండా ఉండటం కూడా నాకిష్టమే. కాబట్టి నిన్ను కోరుకొన్నాను' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: కృష్ణుడు ప్రతిపక్షంలోనే ఉంటే తమకు గెలుపు అసాధ్యం. అందుచేత అతడు తమ పక్షంలోనే ఉండాలి. తమ పక్షంలో ఉండి కృష్ణుడు యుద్ధం చేస్తే, పేరు తనకు గాక అతడికి దక్కుతుంది. కృష్ణుడు యుద్ధం చేయనన్నాడు. కాబట్టి అది తన కిష్టం. ఇదీ అర్జునుడు కృష్ణుడిని కోరుకొనటానికి హేతువు. ఈ మాటలవలన ఉభయుల పరాక్రమాతిశయం విదితమవుతుంది.

క. 'సారథ్యం బొనరింపు మ । పారకృపాలీల నెల్లభంగుల నా; కీ
గౌరవమును జిరకాలము । గోరినయది; దీని నిమ్ము గుణరత్ననిధీ!' 88

ప్రతిపదార్థం: గుణ,రత్న,నిధీ!= గుణములనే రత్నాలకు నిధానమైనవాడా! కృష్ణా!; అపార కృప లీలన్= అంతులేని దయావిలాసంతో; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; నాకున్; సారథ్యంబు; ఒనరింపుము= చేయుము; ఈ గౌరవమును= ఈ గౌరవం; చిరకాలము= ఎంతోకాలంగా; కోరిన+అది= కోరినట్టిది; దీనిన్= ఈ కోరికను; ఇమ్ము.

తాత్పర్యం: సద్గుణ రత్నాలకు నిధిఅయినవాడా, శ్రీకృష్ణా! నీవు అపారమైన దయతో అన్ని విధాలా నా రథానికి సారథ్యం చేయుము. ఈ గౌరవాన్ని నేను ఎప్పటినుండో కోరుకొంటున్నాను. నా కోరిక తీర్చుము.'

క. అనినఁ గిరీటికి హరి యి । ట్లను 'నీదగు కోర్కి దీర్చు టది నాకు వ్రతం
బనఘా! తగ సారథ్యం । బొనరించెద నీకు నసమయుద్ధక్రీడన్'. 89

ప్రతిపదార్థం: అనినన్; హరి= కృష్ణుడు; కిరీటికిన్= అర్జునుడికి; ఇట్లు+అనున్; అనఘా!= పాపరహితుడా! నీదు+అగు+కోర్కి= నీదయిన కోరిక; తీర్చుట= నెరవేర్చటం; అది; నాకున్; వ్రతంబు= నియమం; నీకున్; అసమ యుద్ధ-క్రీడన్= అసమానమైన యుద్ధకేళిలో; తగన్= ఒప్పేటట్లు; సారథ్యంబు; ఒనరించెదన్= చేస్తాను.

తాత్పర్యం: అనగా అర్జునుడితో కృష్ణుడు ఇట్లా అన్నాడు. 'పాపరహితుడా! నీ కోరిక తీర్చటం నాకు వ్రతం. అసమానమైన యుద్ధకేళిలో నేను నీకు సారథ్యం చేస్తాను.'

విశేషం: 'నీ కోరిక తీర్చటం నాకు వ్రతం' అనటంలో తప్పకుండా తీరుస్తాననీ, దానిని తాను పవిత్రకార్యంగా భావిస్తాననీ ధ్వని.

క. అని యూఱడించి, నరుఁ దో । డ్కొని, ధర్మతనూజునొద్దకుం బ్రియ మెసఁగం
జనుదెంచెం గార్యాలో । చనమును దగఁజేయు బుద్ధి శౌరి గడంకన్. 90

ప్రతిపదార్థం: అని, ఊఱడించి= ఓదార్చి; శౌరి= కృష్ణుడు; నరున్= అర్జునుడిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; కార్య+ఆలోచనమును= కర్తవ్య విచారం; తగన్= ఒప్పేటట్టు; చేయుబుద్ధిన్= చేసే తలంపుతో; ధర్మతనూజు+ఒద్దకున్= ధర్మరాజు దగ్గరికి; ప్రియము+ఎసఁగన్= సంతోషం అతిశయించగా; కడంకన్= పూనికతో; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అని ఓదార్చి కృష్ణుడు అర్జునుడిని వెంటబెట్టుకుని అనంతర కర్తవ్యం ఆలోచించే తలంపుతో ధర్మరాజు వద్దకు సంతోషాతిశయంతో, పూనికతో వచ్చాడు.

వ. అంత నట శల్యుపాలికిం బోయినదూత లతనిం గని సముచితాలాపంబుల సమరసహాయత్వంబునకుఁ గోరి పిలిచినం బ్రీతుండై యతండును బుత్త్రమిత్త్రసమేతంబుగా నానాసేనాతిసంకులంబుగాఁ గదలి పాండవు లున్నయెడకు నిత్యప్రయాణంబుల నడచు సమయంబున. 91

ప్రతిపదార్థం: అంతన్; అటన్= అక్కడ; శల్యుపాలికిన్= శల్యుడి వద్దకు; పోయిన దూతలు= వెళ్ళిన రాయబారులు; అతనిన్; కని; సముచిత+ఆలాపంబులన్= తగిన మాటలతో; సమరసహాయత్వంబునకున్= యుద్ధంలో తోడ్పడటానికి; కోరి; పిలిచినన్; అతండును; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడయి; పుత్త్ర,మిత్త్ర,సమేతంబుగాన్= కొడుకులతోను, స్నేహితులతోను; నానా-సేనా+అతిసంకులంబుగాన్= పెక్కు సంఖ్యలుగల సేనల మిక్కిలి సమ్మర్దంతో; కదలి; పాండవులు; ఉన్న+ఎడకున్= ఉన్నచోటికి; నిత్య-ప్రయాణంబులన్= ఎడతెగని పయనాలతో; నడచు సమయంబునన్= నడిచేటప్పుడు.

తాత్పర్యం: తరువాత అక్కడ శల్యుడి వద్దకు వెళ్లిన దూతలు అతడిని చూచి తగిన మాటలతో యుద్ధంలో తోడ్పడవలసినదిగా కోరి పిలువగా, శల్యుడునూ సంతోషించి పుత్రులతోనూ, మిత్రులతోనూ కూడి పెక్కు సేనలను తీసికొని కదలి పాండవులున్నచోటికి ఎడతెగని ప్రయాణాలతో నడిచేటప్పుడు.

దుర్యోధనుండు శల్యసహాయంబు గోరుట (సం. 5-8-6)

తే. ఇంతయును విని కౌరవాధీశ్వరుండు । దక్షులగు నాప్తజనములఁ దత్క్షణంబ
మద్రనాథుని చనియెడు మార్గమునకుఁ । బుచ్చి యెడనెడ నతుల విభూతి మెఱయ. 92

ప్రతిపదార్థం: కౌరవ+అధి+ఈశ్వరుండు= కురుపతి-దుర్యోధనుడు; ఇంతయును; విని; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే; దక్షులు+అగు= సమర్థులైన; ఆప్తజనములన్= విశ్వాసపాత్రులైన జనులను; మద్రనాథుని, చనియెడు, మార్గమునకున్= శల్యుడు వెళ్ళేదారికి; పుచ్చి= పంపి; ఎడనెడన్= అక్కడక్కడ; అతుల విభూతి= సాటిలేని సంపద; మెఱయన్= ప్రకాశించగా.

తాత్పర్యం: దుర్యోధనుడు పాండవుల సహాయార్థం శల్యుడు వస్తున్నాడనే వార్త విని ఆ క్షణమే సమర్థులూ, విశ్వాసపాత్రులూ అయిన జనులను శల్యుడు వెళ్ళేదారికి పంపి, సాటిలేని సంపద మెరయగా అక్కడక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. అరుదారు మేలుక ట్లాయితం బై చూడ । నొప్పారి తను పగు చప్పరములుఁ,
బరపైన చెలువంబు గరగరికయుఁ దియ్య । తెలి నీరుఁ గలిగిన దీర్ఘికలును;
బొడవైన మువ్వంచఁ బొలుచునట్లుగ నేనుఁ । గులకు గుఱ్ఱములకుఁ గొట్టములును,
ముందర బయలైన చందంబుఁ జతురాభి । మతమైన యాస్థానమండపములు

ఆ. బియ్యములును, నేయుఁ, బెరుఁగును, గూరఁగా । యలును, వంటకట్టియలును, గడ్డి,
కవణములును బెల్లుగా నొడఁగూర్చి ని । గూఢవృత్తిఁ దానుఁ గూడ నడచె. 93

ప్రతిపదార్థం: అరుదారు= అపురూపమైన; మేలుకట్లు= చాందినులు; ఆయితంబు+ఐ= సిద్ధమై; చూడన్+ఒప్పారి= చూడదగి; తనుపు+అగు= చల్లదనంచేత తృప్తిని కలిగించేవైన; చప్పరములున్= పందిరులూ; పరపు+ఐన= విశాలమైనట్టియు; చెలువంబున్= అందమూ; గరగరికయున్= నైర్మల్యమూ; తియ్య తెలి నీరున్= తీయనైన స్వచ్ఛమైన నీరూ; కలిగిన; దీర్ఘికలును= నడబావులూ; పొడవు+ఐన; మూఁడు+వంచన్= మూడు వంచలతో; పొలుచునట్లుగన్= ఒప్పేటట్టు; ఏనుఁగులకున్; గుఱ్ఱములకున్; కొట్టములును= చావళ్ళూ; ముందరన్= ముందు; బయలు+ఐన, చందంబున్= బయలుగల విధమూ; చతుర+అభిమతము+ఐన= సుందరమూ; సమ్మతమూ అయిన; ఆస్థానమండపములున్= సభామండపాలూ; బియ్యములును; నేయున్= నేయీ; పెరుఁగును; కూరగాయలును; వంటకట్టియలును; గడ్డి; కవణములును= గుఱ్ఱాలూ మొదలైనవాటికి వేసే ఉలవల దాణాలూ; పెల్లుగాన్= అధికంగా; ఒడఁగూర్చి= సమకూర్చి; నిగూఢవృత్తిన్= రహస్యమైన వర్తనంతో; తానున్+కూడన్= తనుకూడా, నడచెన్.

తాత్పర్యం: అపురూపాలైన చాందినులు సిద్ధమై చూడదగిన చల్లటి పందిళ్ళూ, విశాలమైన, అందమూ, నైర్మల్యమూ, తీయని తెల్లని నీరు కల నడబావులూ, పొడవైన మూడు వంచలు ఒప్పేటట్లు ఏనుగులకూ గుఱ్ఱాలకూ చావళ్ళూ, ముందు బయలు గలవై, సుందరములూ సమ్మతములూ అయిన ఆస్థానమండపాలూ, బియ్యాలూ, నేయీ, పెరుగూ, కూరగాయలూ, వంటకట్టెలూ, గడ్డీ, ఉలవల దాణాలూ అధికంగా సమకూర్చి రహస్యంగా తను కూడా నడిచాడు.

వ. ఇవ్విధంబున విడిదల పయనంపు సంపదలు వొంపిరివోవం దనకు సమకట్టిన సమస్త వస్తువుల యవైకల్యంబునకు శల్యుండు సంతుష్టాంతరంగుండై నిజపరిజనంబులం జూచి 'యిట్లు చతురంబుగా మనకు వలయువాని సంపాదించుటకుఁ బ్రవర్తకులైన యుధిష్ఠిరామాత్యు లెవ్వారు? వారలం దోడ్కొని రండు; వారలు ప్రసాదదానంబున కర్హు'లని పలుకు నవసరంబున, నటమున్న పలుదెఱంగులఁ బనులు సేయుచున్న తన పల్లాయనంబువారిలోఁ గలసి మఱువడియున్న కౌరవేశ్వరుం డమ్మాటలు విని, యతనికిం బొడసూప నిదియ సమయంబని సముచిత ప్రకారంబునఁ దన్నెఱింగించికొని వినయంబునఁ గనిన, నతండును సంభ్రమంబున గాఢాలింగనంబు సేసి కనకాసనంబున నునిచి, 'యింతయు నిమ్మహాత్ము నుద్యోగంబున నయ్యెం గావలయు' నని తలంచి విస్మయంబంది 'నీ కెయ్యది యిష్టంబు గోరు మిచ్చెద' ననిన, గాంధారీ నందనుండు పరమానందంబునం బొంది యిట్లనియె. 94

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విడిదల, పయనము+సంపదలు= విడిదుల ప్రయాణపు సంపదలు; పొంపిరి+పోవన్= అతిశయించగా; తనకున్; సమకట్టిన= సమకూర్చిన; సమస్త-వస్తువుల+అవైకల్యంబునకున్= ఎల్ల వస్తువుల సంపూర్ణతకూ; శల్యుండు; సంతుష్ట+అంతరంగుండు+ఐ= సంతోషించిన మనస్సుకలవాడయి; నిజ పరిజనంబులన్+చూచి= తన పరిజనులను చూచి; ఇట్లు; చతురంబుగాన్= నేర్పుగా - మనోహరంగా; మనకున్; వలయువానిన్; సంపాదించుటకున్= సమకూర్చటానికి; ప్రవర్తకులు+ఐన= కారకులైన; యుధిష్ఠిర+అమాత్యులు= ధర్మరాజు మంత్రులు; ఏ+వారు?= ఎవరు?; వారలన్; తోడ్కొని,రండు= తీసికొని రండి; వారలు; ప్రసాద,దానంబునకున్= అనుగ్రహం ప్రసాదించటానికి; అర్హులు= తగినవారు; అని; పలుకు+అవసరంబునన్= పలికే సమయంలో; అట,మున్ను+అ= అంతకుముందే; పలు+తెఱంగులన్= అనేక విధాల; పనులు+చేయుచున్+ఉన్న= పనులు చేస్తున్న; తన, పల్లాయనంబు వారిలోన్= తన రౌతులలో (ఆప్తులలో - శ.ర.); కలసి; మఱువడి+ఉన్న= దాగిఉన్న; కౌరవ+ఈశ్వరుండు= కురుపతి- దుర్యోధనుడు; ఆ+మాటలు; విని; అతనికిన్= ఆ శల్యుడికి; పొడసూపన్= కనబడటానికి; ఇది+అ= ఇదే; సమయంబు+అని= అదనని; సముచిత-ప్రకారంబునన్= తగిన విధంగా; తన్నున్+ఎఱింగించికొని= తను ఫలానా అని చెప్పుకొని; వినయంబునన్= నమ్రతతో; కనినన్= చూడగా; అతండును; సంభ్రమంబునన్= గౌరవంతో; గాఢ+ఆలింగనంబు+చేసి= గట్టిగా కౌగిలించుకొని; కనక+ఆసనంబునన్= బంగారుపీఠంపై; ఉనిచి= ఉంచి; ఇంతయున్= ఇదంతా; ఈ+మహాత్ము+ఉద్యోగంబునన్= ఈ మహనీయుడి పూనికతో; అయ్యెన్+కావలయున్= జరిగింది కాబోలు; అని; తలంచి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; నీకున్; ఎయ్యది= ఏది; ఇష్టంబు; కోరుము; ఇచ్చెదన్; అనినన్; గాంధారీ-నందనుండు= గాంధారి కొడుకు - దుర్యోధనుడు; పరమ+ఆనందంబునన్+పొంది= మిక్కిలి ఆనందించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా విడిదుల ప్రయాణాలకు సౌకర్యాలు ఎక్కువయ్యేటట్లు తనకు సమకూర్చిన ఎల్ల వస్తువుల సమగ్రతకూ శల్యుడు సంతోషించి తన పరిజనులను చూసి 'ఇట్లా మనోహరంగా మనకు కావలసిన వాటిని సమకూర్చటానికి కారకులైన ధర్మరాజు మంత్రు లెవరు? వారిని తీసికొని రండి. వారు మా అనుగ్రహానికి పాత్రులు' అని పలికే సమయంలో, అంతకుముందే అనేక విధాల పనులు చేస్తూన్న తన రౌతులలో కలసి దాగిఉన్న దుర్యోధనుడు ఆ మాటలు విని, అతడికి కనిపించటానికి ఇదే అదనని తగిన రీతిగా తనను తెలియపరచుకొని, నమ్రతతో చూడగా, శల్యుడును గౌరవంతో గట్టిగా కౌగిలించుకొని బంగారు పీఠంమీద కూర్చుండబెట్టి 'ఇదంతా ఈ మహనీయుడి పూనికవలన జరిగింది కాబోలు' అని ఎంచి ఆశ్చర్యపడి 'నీ కేమి కావాలో కోరుకొమ్ము' అనగా, దుర్యోధనుడు మిక్కిలి ఆనందించి ఇట్లా అన్నాడు.

క. 'సత్యసరస్వతి వగు; మౌ । చిత్య విశారదము నీదు చిత్తము; నియమౌ
దాత్త్యంబు మెఱయ నాకు న । మాత్యుఁడవై పూని నడపు మత్సైన్యంబున్. 95

ప్రతిపదార్థం: సత్యసరస్వతివి+అగుము= సత్యవచనుడివి కమ్ము; నీ+చిత్తము= నీ మనస్సు; ఔచిత్య, విశారదము= ఔచిత్యం తెలిసినట్టిది; నియమ+ఔదాత్త్యంబు= నియమపు ఒప్పిదం; మెఱయన్= ప్రకాశించగా; నాకున్; అమాత్యుఁడవు+ఐ= మంత్రివయి; పూని; మత్+సైన్యంబున్= నా సేనను; నడపు(ము)= నడిపించుము.

తాత్పర్యం: 'నీవు సత్యవచనుడివి కమ్ము. అన్న ప్రకారం చేయుము. నీ మనస్సు ఔచిత్యం తెలిసినట్టిది. నియమపు ఉదాత్తత ప్రకాశించేటట్లు' నాకు మంత్రివయి పూని నా సైన్యాన్ని నడిపించుము.

ఆ. తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు । నొక్క రూప; భక్తియుక్తిఁ జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న । నుగ్రహించి తగఁ బరిగ్రహింపు.' 96

ప్రతిపదార్థం: తలఁపన్= ఆలోచించగా; నీకున్; పాండవులును; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుడి కొడుకులు - కౌరవులూ; ఒక్కరూపు+అ= ఒక్కరే, సమానులే; నీవు; నన్నున్; భక్తి యుక్తిన్= భక్తితో; చాలన్= ఎక్కువగా; మాననీయుండు+కాఁగన్= మన్నించదగినవాడుగా; అనుగ్రహించి; తగన్= తగినవిధంగా; పరిగ్రహింపు(ము)= స్వీకరించుము.

తాత్పర్యం: ఆలోచించగా నీకు పాండవులూ, కౌరవులూ ఒక్కటే. నీవు నన్ను భక్తితో మిక్కిలి మాన్యుడిగా అనుగ్రహించి స్వీకరించుము.'

చ. అనవుడు శల్యుఁ డియ్యకొని, 'యట్టిద కాదె, విభేదవృత్తి నా
మనమున లేదు; పాండవసమాజము మీరును నొక్కరూప కా
వున నిది లెస్సమాట దగవుం దలపోయఁగ; మున్ను ప్రీతిఁ గాం
చిన నిను నెమ్మిఁ గూడుటయ చేయుదు నిట్టుల యెల్లభంగులన్. 97

ప్రతిపదార్థం: అనవుడున్= అని దుర్యోధను డనినంతనే; శల్యుఁడు; ఇయ్యకొని= అంగీకరించి; అట్టిది+అ= అటువంటిదే; కాదె= కాదా; విభేదవృత్తి= పాండవులు; కౌరవులు వేర్వేరు అనే వ్యాపారం; నా, మనమునన్= నా మనస్సులో; లేదు; పాండవసమాజమున్= పాండవుల సమూహమూ; మీరునున్= మీరూ; ఒక్కరూపు+అ= ఒక్కటే; కావునన్; తగవున్= న్యాయం; తలపోయఁగన్= ఆలోచిస్తే; ఇది; లెస్సమాట= మంచిమాట; మున్ను= ముందు; ప్రీతిన్= ఆదరంతో; కాంచిన,నినున్= చూసిన నిన్ను; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఇట్టులు+అ= ఇట్లే; నెమ్మిన్= ప్రీతితో; కూడుట+అ, చేయుదున్= చేరటమే చేస్తాను.

తాత్పర్యం: అని దుర్యోధనుడనగానే శల్యుడు సమ్మతించి 'అటువంటిదే కాదా? నా మనస్సులో పాండవులు వేరు, కౌరవులు వేరు అనే భేదబుద్ధి లేదు. పాండవులూ మీరూ ఒక్కటే. కాబట్టి న్యాయం ఆలోచిస్తే ఇది మంచి మాట. ముందుగా నన్ను సాదరంగా చూడడానికి వచ్చిన నిన్ను ఈ రీతిగా అన్ని విధాలా ప్రీతితో చేరతాను.

ఉ. దానఁ గొఱంత లే; దభిమతం బిది గాకయుఁ గల్గెనేనియుం
బూని యొనర్తు' నన్నఁ, గురుపుంగవుఁ డెంతయుఁ బొంగి 'నీవు స

మ్మానము సేసి నా కిటు లమాత్యుఁడవైన పదంబుకంటె మే
లై నుతికెక్కు కోర్కి యెటు లారసి చూచిన నొండు గల్గునే?' 98

ప్రతిపదార్థం: దానన్= ఆ విషయంలో - నిన్ను చేరే విషయంలో; కొఱంత,లేదు= లోపం లేదు; ఇది+కాకయున్= ఈ కోరిక కాకుండా; అభిమతంబు= వేరే కోరిక; కల్గెన్+ఏనియున్= ఉన్నప్పటికీ; పూని+ఒనర్తున్= ప్రయత్నించి చేస్తాను; అన్నన్= అని శల్యుడనగా; కురుపుంగవుఁడు= కురుశ్రేష్ఠుడు - దుర్యోధనుడు; ఎంతయున్+పొంగి= ఎంతో సంతోషించి; నీవు; సమ్మానము+చేసి= గౌరవం చేసి; నాకున్; ఇటులు= ఇట్లు; అమాత్యుఁడవు+ఐన-పదంబు కంటెన్= మంత్రివైన స్థానం కంటె; మేలు+ఐ= గొప్పదయి; నుతికిన్+ఎక్కు,కోర్కి= పొగడ్త కెక్కే కోరిక; ఎటుల+ఆరసి-చూచినన్= ఎట్లా పరిశీలించి చూచినా; ఒండు= ఇంకొకటి; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: నేను నిన్ను చేరే విషయంలో అనుమానం లేదు. ఇదికాక ఇంకా ఏదయినా కోరిక ఉంటే చెప్పు, దానిని కూడా తీరుస్తాను' అని శల్యుడనగా, దుర్యోధనుడు ఎంతో సంతోషించి 'నీవు గౌరవం చేసి నాకీ విధంగా మంత్రి వైనదానికంటె గొప్పదయి పొగడ్త కెక్కే కోరిక ఎట్లా పరిశీలించి చూచిన ఇంకొకటి ఉంటుందా?' (ఉండదని భావం.)

వ. అనిన విని, వికచవదనుం డగుచు మద్రేశ్వరుండు. 99

ప్రతిపదార్థం: అనినన్; విని; మద్ర+ఈశ్వరుండు= మద్ర దేశాధిపతి - శల్యుడు; వికచ,వదనుండు+అగుచున్= వికసించిన ముఖం కలవాడు అవుతూ.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా విని శల్యుడు వికసించిన ముఖం కలవాడవుతూ.

క. 'చను నీవు హస్తి నగరం । బున; కేనును బాండుభూపపుత్త్రులఁ బ్రీతిం
గని యట వత్తు; నవశ్యం । బును వారలఁ జూడవలయుఁ, బోయెద' ననినన్. 100

ప్రతిపదార్థం: నీవు; హస్తినగరంబునకున్= హస్తినాపురానికి; చను(ము)= వెళ్ళుము; ఏనును= నేను కూడా; పాండుభూపపుత్త్రులన్= పాండురాజు కొడుకులను - పాండవులను; ప్రీతిన్= సంతోషంతో; కని= చూసి; అట వత్తున్= హస్తినాపురం వస్తాను; వారలన్= పాండవులను; అవశ్యంబును= తప్పకుండా; చూడవలయున్= చూడాలి, పోయెదన్+అనినన్= వెళ్ళుతాను అనగా.

తాత్పర్యం: 'నువ్వు హస్తినాపురానికి వెళ్ళు. నేను కూడా పాండవుల్ని ఇష్టంతో చూసి హస్తినాపురం వస్తాను. నేను తప్పకుండా వాళ్ళను చూడాలి. వెళ్ళుతాను' అనగా.

ఆ. 'అట్లకాక; వేగ మట వోయి మరలుండు; । వరము మఱవకుండవలయు ! మిమ్ముఁ ।
జేరి నెగడువాఁడఁ; గారుణ్యమున నిట । యరసి యుండుఁ'డనియెఁ గురువిభుండు. 101

ప్రతిపదార్థం: కురు-విభుండు= కురుపతి - దుర్యోధనుడు; అట్లు+అ-కాక= అలాగే; వేగము= శీఘ్రంగా; అట+పోయి= అక్కడికి వెళ్ళి; మరలుండు+తిరిగి రండి; వరము= మీరు నాకిచ్చిన వరం; మఱవక+ఉండవలయున్= మరచిపోగూడదు; మిమ్మున్; చేరి; నెగడువాఁడన్= వర్ధిల్లుతాను; కారుణ్యమునన్= దయతో; ఇట+అరసిఉండుఁడు= ఈవైపు దృష్టి పెట్టండి; అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు 'అలాగే చేయండి. అక్కడికి వెళ్లి శీఘ్రంగా తిరిగి రండి. నాకు మీరిచ్చిన వరం మాట మరచిపోగూడదు. మీతో చేరి వర్ధిల్లుతాను. దయతో ఈ వైపు కనిపెట్టుకొని ఉండండి.

వ. అనవుడు. 102

తాత్పర్యం: అనగానే.

క. దరహాసముతో మద్రే । శ్వరుఁ డాలింగనము సేసి, 'సందియపడ కీ
వరుగు' మని యనుప, నాతఁడు । కరిపురికిం జనియె మది వికాసముఁ బొందన్. 103

ప్రతిపదార్థం: మద్ర+ఈశ్వరుఁడు= మద్రదేశరాజు - శల్యుడు; దరహాసముతోన్= చిరునవ్వుతో; ఆలింగనము+చేసి= కౌగిలించుకొని; సందియపడక= అనుమానించక; ఈవు= నీవు; అరుగుము= వెళ్ళుము; అని; అనుపన్= పంపగా; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; మది= మనస్సు; వికాసమున్+పొందన్= వికసించగా, ఆనందపడగా; కరిపురికిన్= హస్తినాపురానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శల్యుడు చిరునవ్వుతో దుర్యోధనుడిని కౌగిలించుకొని 'నువ్వు సందేహపడకుండా వెళ్ళుము.' అని పంపగా, అతడు మనస్సులో ఆనందించి హస్తినాపురానికి వెళ్ళాడు.

శల్యుఁడు పాండవులం జూడ నుపప్లావ్యంబునకు వచ్చుట (సం. 5-8-15)

వ. అంత శల్యుండు నుపప్లావ్యంబునకుం జని, స్కంధావారంబు దఱియం జొచ్చి, ధర్మనందనుని నివాసంబున కరిగిన, నతండు దమ్ములుం, దానును, ద్రౌపదీ సుభద్రలు, నభిమన్యు ప్రభృతి పుత్త్ర వర్గంబును నెదురువచ్చి, కృతప్రణాముండై, తోడ్కొనిపోయి, కాంచనాసనంబున నునిచి, యర్ఘ్యపాద్యంబు లిచ్చి, కుశలం బడిగిన, 'సర్వంబును గుశల సంపన్నంబ' యని వారల నందఱ నభినందించి, యుధిష్ఠిరుం బునరాలింగనంబు సేసి యిట్లనియె. 104

ప్రతిపదార్థం: అంతన్; శల్యుండున్; ఉపప్లావ్యంబునకున్; చని; స్కంధావారంబు= సేనలబిడారం; తఱియన్+చొచ్చి= ప్రవేశించి; ధర్మనందను నివాసంబునకున్= ధర్మరాజు ఉన్నచోటికి; అరిగినన్= వెళ్ళగా; అతండు= ధర్మరాజు; తమ్ములున్; తానును; ద్రౌపదీ సుభద్రలున్; అభిమన్యు ప్రభృతి పుత్త్ర వర్గంబును= అభిమన్యుడు మొదలైన కుమారుల సమూహమూ; ఎదురు వచ్చి; కృతప్రణాముండు+ఐ= నమస్కరించినవాడయి; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్లి; కాంచన+ఆసనంబునన్= బంగారుపీఠం మీద; ఉనిచి= కూర్చుండజేసి; అర్ఘ్య,పాద్యంబులు= పూజాద్రవ్యములు, కాళ్ళు కడుగుకొను నీళ్ళు; ఇచ్చి; కుశలంబు+అడిగినన్= క్షేమం అడుగగా; సర్వంబును= అంతా; కుశలసంపన్నంబు+అ= క్షేమంతో కూడినదే; అని; వారలన్+అందఱన్= వాళ్ళనందరినీ; అభినందించి= సంతోషపెట్టి; యుధిష్ఠిరున్= ధర్మరాజును; పునః+ఆలింగనంబు+చేసి= మళ్ళీ కౌగిలించుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పిమ్మట శల్యుడు ఉపప్లావ్యపురానికి వెళ్ళి పాండవుల బిడారం ప్రవేశించి, ధర్మరాజు నివాసానికి వెళ్ళగా, ధర్మరాజూ, తమ్ములూ, ద్రౌపదీ, సుభద్రా, అభిమన్యుడూ మొదలైన కుమారుల సమూహమూ ఎదురేగారు. ధర్మరాజు అతడికి నమస్కరించి తీసికొని వెళ్ళి బంగరుపీఠంపై కూర్చుండబెట్టి, అర్ఘ్యపాద్యాదులిచ్చి,

క్షేమ మడుగగా, 'అంతా క్షేమమే' అని వాళ్ళనందరినీ అభినందించి, శల్యుడు ధర్మరాజును మళ్ళీ కౌగిలించుకొని ఇట్లా అన్నాడు.

క. 'జనరహితంబగు వనమున । ననుజన్ములు, ద్రుపదభూవరాత్మజయును, నీ
వును నింతకాల మలయక । యునికి కడున్ దుష్కరము, మహోదాత్తమతీ! 105

ప్రతిపదార్థం: మహోదాత్తమతీ!= మిక్కిలి గొప్ప మనస్సుకలవాడా, ధర్మరాజా!; జన-రహితంబు+అగు-వనమునన్= నిర్జనారణ్యంలో; అనుజన్ములున్= తమ్ములూ; ద్రుపద-భూవర+ఆత్మజయును= ద్రుపదరాజు కూతురు-ద్రౌపదీ; నీవునున్; ఇంత-కాలము; అలయక+ఉనికి= అశ్రమంగా ఉండడం - క్షేమంగా ఉండడం; కడున్= మిక్కిలి; దుష్కరము= కష్టసాధ్యం.

తాత్పర్యం: 'మిక్కిలి గొప్ప మనస్సుకల ధర్మరాజా! నిర్జనమైన అరణ్యంలో తమ్ములూ, ద్రౌపదీ, నీవూ ఇంతకాలం క్షేమంగా ఉండటం మిక్కిలి కష్టసాధ్యం.

ఆ. దానికంటె నరిది దలపోయ నజ్ఞాత । వాస ముజ్జ్వలాంగభాసమాను
లైన, మీకు; మీ దయాసూనృతాదుల । పెంపు మిమ్ముఁ గడవఁ బెట్టకున్నె? 106

ప్రతిపదార్థం: తలపోయన్= ఆలోచించగా; ఉజ్జ్వల+అంగ, భాసమానులు+ఐన, మీకున్= ప్రకాశించే శరీరాలతో ఒప్పే మీకు; అజ్ఞాతవాసము; దానికంటెన్= ఆ అరణ్యావాసం కంటె; అరిది= ఆశ్చర్యకరం; మీ,దయా,సూనృత+ఆదుల, పెంపు= మీ దయా, సత్యమూ మొదలైనవాటి అతిశయం; మిమ్మున్; కడవన్+పెట్టక+ఉన్నె= కష్టాలనుండి దాటించకుండా ఉంటుందా?

తాత్పర్యం: ఆలోచించగా, ప్రకాశించే శరీరాలతో ఒప్పే మీకు అజ్ఞాతవాసం ఆ అరణ్యావాసంకంటె మరీ కష్టం. దయా, సత్యమూ మొదలైన మీ గుణాల అతిశయం మిమ్ములను ఆపదలనుండి దాటించకుండా ఉంటుందా?

క. ఇమ్మహి యెల్లను నీ మది । యుమ్మలికకుఁ జాల నొచ్చె, నుర్వీవర! నీ
విమ్మెయి నిప్పు డఖిల దురి । తమ్ములుఁ గడచుటకు సమ్మదమ్మునఁ బొదలెన్.' 107

ప్రతిపదార్థం: ఉర్వీవర!= రాజా! (ధర్మరాజా!,) ఈ+మహి+ఎల్లను= ఈ భూమి అంతా; నీ,మది,ఉమ్మలికకున్= నీమనస్సులోని దుఃఖానికి; చాలన్= మిక్కిలి; నొచ్చెన్= బాధపడింది; నీవు; ఈ+మెయిన్= ఈ విధంగా; ఇప్పుడు; అఖిల, దురితమ్ములున్= అన్ని కష్టాలూ; కడచుటకున్= దాటినందుకు; సమ్మదమ్మునన్= సంతోషంతో; పొదలెన్= ఒప్పింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ భూప్రజలందరూ నీ మనోవేదనకు చాలా బాధపడ్డారు. ఇప్పుడు నీవు ఈ విధంగా కష్టాలన్నీ గట్టెక్కినందుకు వాళ్ళు ఆనందిస్తున్నారు.'

వ. అని యుచితసంభాషణంబులు సేసి, దుర్యోధనుండు తన్నుం గాంచిన విధంబును, నతండు ప్రార్థించిన తెఱంగును, దానికిఁ దా నియ్యకొనుటయుం జెప్పిన, ధర్మనందనుం డతని కిట్లనియె. 108

ప్రతిపదార్థం: అని; ఉచిత, సంభాషణంబులు+చేసి= తగిన మాటలాడి; దుర్యోధనుండు; తన్నున్; కాంచిన, విధంబునున్= చూసిన రీతీ; అతండు; ప్రార్థించిన,తెఱంగునున్= కోరినరీతీ; దానికిన్; తాను; ఇయ్యకొనుటయున్= సమ్మతించటమూ; చెప్పినన్= చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; అతనికిన్= శల్యుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని తగిన మాటలాడి, దుర్యోధనుడు తనను ఆదరంతో చూచిన విధమూ, అట్లు చూచి ప్రార్థించిన విధమూ, దానికి తాను సమ్మతించటమూ చెప్పగా, ధర్మరాజు శల్యుడితో ఇట్లా అన్నాడు.

తే. 'మేలు సేసితి; రొక్కరి మెచ్చి వారి । కోర్కి దీర్చుట పెద్దల గుణము కాదె?
యది మదీయ చిత్తమునకు హర్షకరమ; । తివిరి యొక్కటి వేఁడెద నవధరింపు. 109

ప్రతిపదార్థం: మేలు+చేసితిరి= మంచిపని చేశారు; ఒక్కరిన్; మెచ్చి; వారికోర్కి= వారి కోరిక; తీర్చుట= నెరవేర్చటం; పెద్దల-గుణము+అ,కాదె= పెద్దవారి లక్షణమే కదా!; అది= మీరు చేసిన పని; మదీయ,చిత్తమునకున్= నా మనస్సుకు; హర్షకరము+అ= సంతోషదాయకమే; తివిరి= పూని; ఒక్కటి; వేఁడెదన్= కోరతాను; అవధరింపు(ము)= చిత్తగించుము.

తాత్పర్యం: 'మంచిపని చేశారు. ఒకరిని మెచ్చి వారి కోరిక తీర్చటం పెద్దవారి లక్షణమే కదా! అది నా మనస్సుకు ఆనందం కలిగించేదే. మిమ్మల్ని నేను ఒక్కటి కోరుకొంటాను. చిత్తగించండి.

విశేషం: 'మంచిపని చేశా'రంటూ ధర్మరాజు శల్యుడిని అభినందిస్తూనే ఎలా అతడిని తనకే సహాయపడేటట్లు చేసుకొంటున్నాడో చూస్తే, ధర్మరాజు రాజనీతిజ్ఞత, అతడి 'మెత్తనిపులితనం' ముందుచూపూ బోధపడతాయి. ఈ కోరిక వలన శల్యుడు తన పక్షంలో ఉన్నదానికంటె, పరపక్షంలో ఉండటమే ధర్మరాజుకు అధికతరమైన మేలు చేకూర్చింది.

వ. పార్థునకుఁ గృష్ణుండు సారథ్యంబు సేయువాఁడై యున్నవాఁడు; కర్ణుండు పార్థుతో నెప్పుడు మచ్చరించుచునుండు; వీరిరువురకు సంగ్రామం బైనయప్పుడు కృష్ణునకుఁ బ్రతిసారథ్యం బొనరింప మీరకాని యక్కడం దక్కొరుండు లేఁడు; గావున, నవశ్యంబును మీకుం గర్ణసారథ్యంబు గర్తవ్యంబు గాఁగలయది; సమర సమయంబున నిరాకరించి పలికి కర్ణు చిత్తంబునకుం గలంకవుట్టించి పార్థు రక్షింపవలయు; నకృత్యంబని యనుమానింపక మత్ప్రార్థనంబున నెల్లభంగుల నివ్విధం బనుష్ఠించువా'రని యభ్యర్థించిన, సమ్మతించి శల్యుం డిట్లనియె. 110

ప్రతిపదార్థం: పార్థునకున్= అర్జునుడికి; కృష్ణుండు; సారథ్యంబు; చేయువాఁడు+ఐ+ఉన్నవాఁడు= చేయబోతున్నాడు; కర్ణుండు; పార్థుతోన్; ఎప్పుడున్; మచ్చరించుచున్+ఉండున్= పోటీపడుతూ ఉంటాడు; వీరు+ఇరువురకున్= వీరిద్దరికీ; సంగ్రామంబు+ఐన+అప్పుడు= యుద్ధం సంభవించినప్పుడు; కృష్ణునకున్; ప్రతిసారథ్యంబు= సాటియైన సారథ్యం; ఒనరింపన్= చేయడానికి; మీరు+అ-కాని= మీరేకాని; అక్కడన్= కౌరవ పక్షంలో; తక్కు+ఒరుండు= ఇంకొకడు; లేఁడు; కావునన్; అవశ్యంబును= తప్పక; మీకున్; కర్ణ-సారథ్యంబు; కర్తవ్యంబు= చేయవలసినదిగా; కాఁగలయది= కాబోతుంది; సమర-సమయంబునన్= యుద్ధ సమయంలో; నిరాకరించి,పలికి= అనాదరించి పలికి; కర్ణుచిత్తంబునకున్= కర్ణుడి మనస్సుకు; కలంక= వ్యాకులత; పుట్టించి= కలిగించి; పార్థున్= అర్జునుడిని; రక్షింపవలయున్= కాపాడాలి; అకృత్యంబు+అని= చేయదగని పని అని; అనుమానింపక= సందేహించక; మత్+ప్రార్థనంబునన్= నా కోరికపై; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఈ+విధంబు; అనుష్ఠించువారు= చేస్తారు(మీరు తప్పక చేయాలి అని భావం); అని; అభ్యర్థించినన్= కోరగా; శల్యుండు; సమ్మతించి= అంగీకరించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడికి కృష్ణుడు సారథ్యం చేయబోతాడు. కర్ణుడు అర్జునుడితో ఎప్పుడూ పోటీపడుతూఉంటాడు. వీళ్ళకిద్దరికీ యుద్ధం జరిగినప్పుడు కృష్ణుడికి ప్రతిగా సారథ్యం చేయటానికి మీరు తప్ప అక్కడ ఇంకొకడు లేడు.

కాబట్టి మీకు తప్పక కర్ణ సారథ్యం కర్తవ్యం అవుతుంది. యుద్ధ సమయంలో మీరు అనాదరించి పలికి, కర్ణుడి మనస్సుకు కలత పుట్టించి అర్జునుడిని రక్షించాలి. ఇది అకార్యం అని సందేహించక నా ప్రార్థనపై ఏ విధంగానైనా సరే దీన్ని చేయాలి' అని ప్రాధేయపడగా శల్యుడు సమ్మతించి ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు ఎంత లెస్సగా ఊహించాడో చూస్తే అతడి దూరదృష్టి అవగతం అవుతుంది. దుర్యోధనుడి ఎత్తుకు పైఎత్తు వేసి ధర్మరాజు అతడిని చిత్తు చేశాడు. 'అకృత్యం బని యనుమానింపక' - తన కోరిక అకృత్యం అని ధర్మరాజుకు తెలుసు. అయితే రాజకీయాలలో కృత్యాకృత్యాలు లేకపోవటం ఎప్పుడూ ఉంది. ధర్మరాజువంటివాడు కూడా రాజకీయాలకు అతీతుడు కాడని తెలుస్తున్నది.

క. 'అగు నిది వోలును; నాకుం । దగ వట్టిద; 'కర్ణునకు రథంబు గడప నీ
వగు' దని కోరిన కౌరవ । జగతీశ్వరు ప్రార్థనంబు సలుపఁగవలయున్. 111

ప్రతిపదార్థం: అగును= అవును; ఇది+పోలును= ఇది యుక్తమే; నాకున్; తగవు= న్యాయం; అట్టిది+అ= అదే; కర్ణునకున్; రథంబు; కడపన్= నడపటానికి; నీవు; అగుదు(వు)+అని= తగుదువని; కోరిన,కౌరవ,జగతీ+ఈశ్వరు,ప్రార్థనంబు= కోరిన దుర్యోధనుడి కోరిక; సలుపఁగవలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: 'అవును. నీవు చెప్పింది యుక్తం. నాకు న్యాయం అదే. కర్ణుడికి రథం నడపటానికి నీవు తగుదువని కోరితే దుర్యోధనుడి కోరిక నేను తీర్చవలసిందే.

క. కర్ణుని సారథినైనను । నిర్ణయమున కేను బార్థునిం గాచెద; నా
దుర్ణయవిచారు నెమ్మెయిఁ । గర్ణకఠోరంబు లాడి కలఁతుం బోరన్. 112

ప్రతిపదార్థం: కర్ణుని సారథిన్+ఐనను= కర్ణుడికి సారథినైనా; ఏను= నేను; నిర్ణయమునకున్= నిశ్చయానికి; పార్థునిన్= అర్జునుడిని; కాచెదన్= రక్షిస్తాను; ఆ దుర్ణయ విచారున్= ఆ అవినీతిపరుడిని - కర్ణుడిని, ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కర్ణకఠోరంబులు= చెవులకు కఠినములైన మాటలు; ఆడి= పలికి; పోరన్= యుద్ధంలో; కలఁతున్= కలచివేస్తాను.

తాత్పర్యం: నేను కర్ణుడికి సారథినైనా, నిజానికి అర్జునుడిని రక్షిస్తాను. అవినీతిపరుడైన ఆ కర్ణుడిని ఏ విధంగానైనా కర్ణకఠోరాలైన పలుకులు పలికి యుద్ధంలో కలవరపరుస్తాను.

విశేషం: ధర్మరాజు స్వార్థంతో కోరితే కోరాడు. మొదట దుర్యోధనుడికి సాయం చేస్తానని ఒప్పుకొన్న పెద్దమనిషి శల్యుడు. మళ్ళీ ధర్మరాజుకు ఇట్లా ఎందుకు మాటిచ్చాడు? దానికి కారణాలు రెండు. ఒకటి- శల్యుడు పాండవులకు దగ్గర బంధువు. నకుల సహదేవులకు మేనమామ. అతడికి పాండవులవైపే మొగ్గు. వారికి సహాయపడటానికే వస్తూండగా, తనకు దారిలో బ్రహ్మాండములైన ఏర్పాట్లు చేసినవాడు దుర్యోధను డని తెలిసికొని అతడికి సాయం చేస్తానని మాటిచ్చాడు. రెండోది- కర్ణుడు దుర్ణయపరుడు. కులం తక్కువవాడు. అతడికి తాను సారథ్యం వహించడం అవమానంగా భావించాడు. అందుచేత అతడు ధర్మరాజుకు ఆ విధమైన మాట ఇచ్చాడు.

తే. దర్పమును దేజమును మాయఁ దలరఁ బలికి । చిక్కువఱిచిన, నేయంగఁ జేతులాడ
కునికి, రాధాతనూజు నర్జునుఁడు తీవ్ర । బహుళ బాణపరంపర పాలుపఱుచు. 113

ప్రతిపదార్థం: దర్పమును= గర్వమూ; తేజమును= పరాక్రమమూ; మాయన్= నశించేటట్లు; తలరన్= జంకేటట్లు; పలికి; చిక్కు+పఱిచినన్= కలతపెట్టితే; ఏయంగన్= కొట్టటానికి; చేతులు+ఆడక+ఉనికిన్= చేతులాడకపోవటం చేత; రాధాతనూజున్= రాధేయుడిని-కర్ణుడిని; అర్జునుఁడు, తీవ్ర= క్రూరములైన; బహుళ= అనేకములైన; బాణ,పరంపర,పాలు,పఱుచున్= బాణాలవరుసకు గురిచేస్తాడు.

తాత్పర్యం: బలగర్వమూ, తేజస్సూ నశించి జంకే విధంగా మాట లని కర్ణుడిని కలతపెట్టితే, బాణప్రయోగం చేయటానికి అతడికి చేతులాడకపోవడం వలన, కర్ణుడిని అర్జునుడు తీవ్రాలైన అనేక బాణాల పాలు చేస్తాడు.

చ. **ఇది యొకఁ డేల? నీవు మది నెయ్యదిగోరినఁ జేయువాఁ డ; నాఁ**
డదయత సూతసూతి సభ నాడినమాటకుఁ జాల నొచ్చి మా
హృదయము లెల్ల నీవలన నెంతయుఁ బక్షముసేయు; నక్కటా!
యదియునుగాక మీ పడిన యాపద లెవ్వరి నొవ్వఁజేయవే? **114**

ప్రతిపదార్థం: ఇది, ఒకఁడు+ఏల= ఇది ఒక్కటే కాదు; నీవు; మదిన్= మనస్సులో; ఏ+అది= ఏది; కోరినన్= కోరినా; చేయువాఁడన్= చేస్తాను; నాఁడు= ఆ వేళ, అదయతన్= నిర్దయత్వంతో; సూతసూతి= సూతపుత్రుడు-కర్ణుడు; సభన్= సభలో; ఆడిన-మాటకున్= పలికిన పలుకునకు; మా హృదయములు+ఎల్లన్= మా మనస్సులన్నీ; చాలన్+నొచ్చి= మిక్కిలి బాధపడి; నీవలనన్= నీమీద; ఎంతయున్= మిక్కిలి; పక్షము+చేయున్= పక్షపాతం వహిస్తాయి; అక్కటా!= అయ్యో!; అదియును+కాక= అదీ కాక; మీ, పడిన, ఆపదలు= మీరు అనుభవించిన కష్టాలు; ఎవ్వరిన్= ఎవరినైనా; నొవ్వన్+చేయవే?= నొప్పించవా?

తాత్పర్యం: ఈ ఒక్క కోరికే కాదు. నీవు మనస్సులో ఏది కోరినా, దానిని తీరుస్తాను. ఆ రోజున కురుసభలో సూతపుత్రుడు పలికిన మాటకు మా మనస్సులన్నీ మిక్కిలి నొచ్చి నీపై పక్షపాతం వహిస్తున్నాయి. అయ్యో! అదీకాక మీరు పడ్డపాట్లు ఎవరినైనా బాధించవా?

విశేషం: 'సూతసూతి సభ నాడిన మాటకు'- అప్పుడు కర్ణు డాడినమాట ఇది. ధర్మరాజు తన సర్వస్వం జూదంలో ఒడ్డి ఓడిపోయినప్పుడు ద్రౌపది కూడా అందులోనిదే కాబట్టి ఆమె ధర్మవిజిత. 'ఏకవస్త్రయై ఉండగా సభకు తీసికొనిరావచ్చునా? అన్నదానికి- భార్యకు దైవవిహితుండైన భర్త యొక్కరుండ'. ఇది యనేక భర్తృక గావున బంధకి యనంబడు; నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చిన ధర్మవిరోధంబు లేదు' - ఇవి వికర్ణుడి వచనాలను ప్రత్యాఖ్యానం చేస్తూ కర్ణుడు పలికిన పలుకులు. ఈ మాటలకు సభలోనివారంతా బాధపడ్డారు. కర్ణుడు దుర్ణయవిచారుడని శల్యు డనటం ఇందువల్లనే.

ఆ. **ఇట్లు వడితి ననుచు నెద నీవు వగవకు; । గారవమున నీ మనోరథమ్ము**
ఫలము నొందు నెల్లభంగులఁ; దేవత । లయినఁ బడుదు రొక్క యవసరమున. **115**

ప్రతిపదార్థం: ఇట్లు+పడితిన్+అనుచున్= ఇట్లా బాధలు పడ్డానంటూ; నీవు; ఎదన్= హృదయంలో; వగవకు= విచారపడకు; గారవమునన్= గొప్పగా; నీమనోరథమ్ము= నీ కోరిక; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఫలమున్+ఒందున్= ఫలిస్తుంది; ఒక్క+అవసరమునన్= ఒక్కొక్క సమయంలో; దేవతలు+అయినన్= దేవతలు కూడా; పడుదురు= కష్టాలు అనుభవిస్తారు.

తాత్పర్యం: ఇట్లా బాధలు పడ్డానంటూ నీవు మనస్సులో ఏమీ విచారపడకు. నీ కోరిక అన్నివిధాలా గొప్పగా ఫలిస్తుంది. ఒక్కొక్క సమయంలో దేవతలు కూడా కష్టా లనుభవిస్తారు.

విశేషం: అలం: కావ్యార్థాపత్తి, 'దేవతలయినఁ బడుదు రొక్క యవసరమున' అనటం వలన, ఇంక మీ విషయం వేరే చెప్పాలా? అనే అర్థం కైముత్యన్యాయంచేత సిద్ధిస్తున్నది కాబట్టి, అలంకారం కావ్యార్థాపత్తి.

క. వాసవుఁడు దొల్లి నిజకాం । తా సహితము గాఁగ నధికదైన్యము నొందెన్;
మీ సంపద పెద్దయె? విధి । సేసిన గతిఁ బడకయుండ శివునకు వశమే?' 116

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; వాసవుఁడు= ఇంద్రుడు; నిజకాంతా, సహితము+కాఁగన్= తన భార్యతో కూడా; అధిక దైన్యమున్+ఒందెన్= మిక్కిలి దీనత్వం పొందాడు; మీ, సంపద; పెద్దయె= ఎక్కువా?; విధి= దైవం; చేసిన గతిన్= నిర్ణయించిన విధంగా; పడక+ఉండన్= అనుభవించకుండా ఉండడానికి; శివునకున్= శివుడికైనా; వశమే= తరమా?

తాత్పర్యం: పూర్వం ఇంద్రుడు తన భార్యతో కూడా మిక్కిలి దీనత్వం పొందాడు. ఇంద్రుడి సంపదముందు మీ సంపద ఎంత? దైవం నిర్ణయించిన విధంగా అనుభవించకుండా ఉండడానికి శివుడికి కూడా శక్యం కాదు'.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం, కావ్యార్థాపత్తి, 'విధి సేసినగతిఁ బడకయుండ శివునకు వశమే?' అను సామాన్యాంశంచేత వాసవుడు కష్టాలు పడటం, పాండవులు పడడం అనే విశేషాంశాలు సమర్థించబడ్డాయి కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. 'శివునకు వశమే' అనటం వలన మీకు అసలే వశం కాదు-అనే అర్థం సిద్ధిస్తున్నది కావున కావ్యార్థాపత్తికూడా.

వ. అనిన విని ధర్మనందనుం 'డింద్రుండు శచీసమేతంబుగా నట్టి దురవస్థ యేమికారణంబున నెత్తెఱంగున ననుభవించె?'నని యడిగిన, మద్రపతి 'దొల్లింటి యితిహాసంబు సెప్పెద విను'మని యిట్లనియె; 'దేవతలయందు మాన్యుండై త్వష్ట యనుపేరం బరఁగువాఁడు వాసవునకుఁ గీడు దలంచి మూఁడుదలలవాని నొక్కని సృజియించి, విశ్వరూప నామధేయుం జేసిన, నతం డింద్రపదవిం గోరి ఘోరతపంబు సేయుచున్న, దానికి భయంబంది నిలింపపతి యప్సరః స్త్రీలఁ 'దత్తపోభంగంబు సేయుం' డని నియమించి పంచిన. 117

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మనందనుండు; ఇంద్రుండు; శచీసమేతంబుగాన్= శచీదేవితోకూడా; అట్టి; దురవస్థ= దుస్స్థితి; ఏమి కారణంబునన్; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; అనుభవించెన్; అని; అడిగినన్; మద్రపతి= మద్రదేశపురాజు-శల్యుడు; తొల్లింటి= పూర్వపు; ఇతిహాసంబు= చరిత్ర; చెప్పెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్; దేవతలఅందున్; మాన్యుండు+ఐ= మన్నించతగ్గవాడయి; త్వష్ట+అనుపేరన్; పరఁగువాఁడు= ఒప్పేవాడు; వాసవునకున్= ఇంద్రుడికి; కీడు= హాని; తలంచి= ఎంచి; మూఁడు+తలలవానిన్; ఒక్కనిన్; సృజియించి= పుట్టించి; విశ్వరూప నామధేయున్+చేసినన్= విశ్వరూపుడనే పేరుగలవాడినిగా చేయగా; అతండు; ఇంద్ర పదవిన్= ఇంద్రత్వాన్ని; కోరి; ఘోర తపంబు+చేయుచున్+ఉన్నన్= భయంకరమైన తపస్సు చేస్తూఉండగా; నిలింపపతి= దేవతలరాజు - ఇంద్రుడు; దానికిన్; భయంబు+అంది= భయపడి; అప్సరస్+స్త్రీలన్= అచ్చరలను; తద్+తపస్(ః)+భంగంబు= వాడి తపస్సుకు విఘ్నం; చేయుండు+అని; నియమించి= ఏర్పాటు చేసి; పంచినన్= పంపగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు - 'ఇంద్రుడు శచీదేవితో కూడ అటువంటి దుస్థ్సితిని ఏ కారణంగా, ఏ విధంగా అనుభవించాడు?' అని అడుగగా, శల్యుడు 'పూర్వపు చరిత్ర చెపుతా వినుము' అని ఇట్లా అన్నాడు. దేవతలలో ఆదరణీయుడై త్వష్ట అను పేరు గలవాడు ఇంద్రుడికి హాని తలపెట్టి, మూడుతలలవాడిని ఒకడిని పుట్టించి విశ్వరూపుడనే పేరు పెట్టాడు. అతడు ఇంద్రపదవిని కోరి ఘోరతపస్సు చేస్తుండగా, దానికి ఇంద్రుడు భయపడి వాడి తపస్సును చెరచండని అప్సరసలను ఆజ్ఞాపించి పంపగా.

క. వారి విలాసంబులను, వి । హారముల, విలోకనముల, నాలాపములన్
మారవికారం బాతనిఁ । జేరద; యన్నాకపతియు సి గ్గెదఁ గదురన్. 118

ప్రతిపదార్థం: వారి= ఆ అప్సరసల యొక్క; విలాసంబులను= ఒయ్యారాలచేతా; విహారములన్= క్రీడలచేతా; విలోకనములన్= చూపులచేతా; ఆలాపములన్= మాటలచేతా; మార వికారంబు= మన్మథ వికారం; ఆతనిన్= ఆ విశ్వరూపుడిని; చేరదు+అ; ఆ+నాకపతియున్= ఆ స్వర్గాధిపతియూ (ఇంద్రుడునూ); సిగ్గు; ఎదన్= హృదయంలో; కదురన్= అతిశయించగా.

తాత్పర్యం: ఆ అప్సరసల ఒయ్యారాలూ, క్రీడలూ, చూపులూ, మాటలూ ఆ విశ్వరూపుడికి మన్మథ వికారం కలిగించలేకపోయాయి. ఇంద్రుడు మిక్కిలి సిగ్గుపడి.

తే. తలరి యమ్మునిఁ దెగఁజూచి ధర్మరహితుఁ । డగుట, యెవ్వరు నెఱుఁగనియట్లు గాఁగ
నేఁడు గాలంబు గడపిన, నెఱిఁగి భూత । గణము లాక్రోశ మొనరింపఁగా నతండు. 119

ప్రతిపదార్థం: తలరి= చింతించి, వ్యాకులతచెంది; ఆ+మునిన్= ఆ మునిని; తెగన్+చూచి= వధించి; ధర్మరహితుఁడు+ అగుట= ధర్మహీనుడవడం; ఎవ్వరున్= ఎవరూ; ఎఱుఁగని+అట్లు+కాఁగన్= ఎరుగని అట్లుగా; ఏఁడు+కాలంబు= ఒక్క సంవత్సర కాలం; కడపినన్= కడపగా, భూత గణములు= భూత సమూహాలు; ఆక్రోశము+ఒనరింపఁగాన్= అరవగా; అతండు= ఆ ఇంద్రుడు.

తాత్పర్యం: దేవేంద్రుడు వ్యాకులపడి ఆ మునిని వధించి అధర్మపరు డవటం ఎవరూ ఎరుగనట్లు ఒక సంవత్సరకాలం గడపగా, భూతసమూహాలు ఆక్రోశించాయి. అప్పుడు ఇంద్రుడు.

వ. తన దుష్కర్మంబు ప్రకటంబగుటకు రోసి, యొక్కవిషమవ్రతం బాచరించి, సముద్ర తరు ధరణీ స్త్రీజనంబులయందు బ్రహ్మహత్య విభాగించి పెట్టి, నిజకల్మషంబుఁ బాపికొని, మునిగణ సేవితుండయి సముల్లాసంబునం బొంది యునికికిఁ ద్వష్ట కోపించి. 120

ప్రతిపదార్థం: తన దుష్కర్మంబు= తన దుష్కార్యం; ప్రకటంబు+అగుటకున్= అందరికీ తెలిసిపోవటానికి; రోసి= ఏవగించుకొని; ఒక విషమ వ్రతంబు= ఒక కఠోరమైన వ్రతం; ఆచరించి= చేసి; సముద్రతరుధరణీ స్త్రీజనంబులయందున్= సముద్రంలోనూ, చెట్లమీదా, నేలమీదా, స్త్రీలయందూ; బ్రహ్మహత్య= బ్రాహ్మణవధ వలన కలిగిన పాపం; విభాగించిపెట్టి= పంచిపెట్టి; నిజకల్మషంబున్= తన పాపమును; పాపికొని= పోగొట్టుకొని; మునిగణ సేవితుండు+అయి= మునుల సమూహంచేత సేవించబడినవాడయి; సముల్లాసంబునన్+పొంది+ఉనికికిన్= సంతోషంతో ఉన్నందుకు; త్వష్ట; కోపించి.

తాత్పర్యం: తన పాపకార్యం అందరికీ తెలిసిపోవటం వలన ఏవగించుకొని, ఒక కఠోరవ్రతం చేసి, ఆ బ్రహ్మహత్యా పాతకాన్ని, సముద్రంలోనూ, చెట్లలో, నేలమీదా, స్త్రీల యందూ విభజించిపెట్టి, తన పాపం పోగొట్టుకొని, మునుల సమూహంచేత సేవించబడుతూ సంతోషంతో ఉండడాన్ని చూచి త్వష్ట కోపించి.

తే. 'అనపరాధుఁ, దపోనిధి, నధికశాంతి । యుక్తుఁ జంపిన పాపాత్ము నుఱక పట్టి
మ్రింగఁ జాలెడు వాని, నుత్తుంగదేహు । నేను సృజియింతుఁ జూడుఁడీ యీ క్షణంబ.' 121

ప్రతిపదార్థం: అనపరాధున్= నిరపరాధుడినీ; తపస్(ః)+నిధిన్= తపోనిధిఅయిన వాడినీ; అధిక శాంతి యుక్తున్= మిక్కిలి శాంతగుణంతో కూడినవాణ్ణీ; చంపిన పాప+ఆత్మున్= చంపిన పాపిని; ఉఱక= లెక్క లేకుండా; పట్టి= పట్టుకొని; మ్రింగన్+చాలెడు వానిన్= మ్రింగివేయగలవాడిని; ఉత్తుంగ దేహున్= మిక్కిలి ఎత్తైన శరీరం కలవాడిని; ఈ క్షణంబు+అ= ఇప్పుడే; ఏను= నేను; సృజియింతున్= పుట్టిస్తాను; చూడుఁడీ= చూడండి.

తాత్పర్యం: 'నిరపరాధుడూ, తపోనిధీ, అధికశాంతుడూ అయినవాడిని చంపిన పాపిని లక్ష్యపెట్టక పట్టుకొని మ్రింగివేయగలవాడిని నేను ఈ క్షణంలోనే పుట్టిస్తాను చూడండి.'

చ. అనుచుఁ గడంగి నిష్ఠమెయి నగ్నిముఖం బొనరించి, వేలిమిం
దనయు సృజించి, లోకవిదితంబుగ వృత్ర సమాఖ్య యిచ్చి 'మ
ద్వినుత తపోబలంబునఁ బ్రదీపిత తేజుఁడవై జయింపు నీ'
వని నియమించి పంచె నమరాధిపుతో సమరంబు సేయఁగన్. 122

ప్రతిపదార్థం: అనుచున్; కడంగి= పూని; నిష్ఠమెయిన్= నియమంతో; అగ్ని ముఖంబు+ఒనరించి= అగ్ని సాధ్యాలైన కర్మలకు ముందు చేసే అంగకర్మ సముదాయం చేసి; వేలిమిన్= హోమమునందు; తనయున్= కుమారుడిని; సృజించి= పుట్టించి; లోక విదితంబుగన్= జగత్ప్రసిద్ధంగా; వృత్ర సమాఖ్య+ఇచ్చి= వృత్రుడనే పేరు పెట్టి; మత్+వినుత తపస్(ః)+బలంబునన్= నా పొగడబడే తపశ్శక్తిచేత; ప్రదీపిత తేజుఁడవు+ఐ= ప్రకాశించిన తేజస్సు గలవాడవై; నీవు; జయింపు(ము); అని; నియమించి= ఆజ్ఞాపించి; అమర+అధిపుతోన్= దేవరాజుతో-ఇంద్రుడితో; సమరంబు+చేయఁగన్= యుద్ధం చేయటానికి; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: అంటూ పూని నియమంతో హోమం చేసి అగ్నికుండంలో కుమారుడిని పుట్టించి, జగత్ప్రసిద్ధంగా వృత్రుడనే పేరు పెట్టి 'నా గొప్ప తపశ్శక్తి చేత ప్రకాశించిన తేజస్సు గలవాడవై నీవు జయించుము' అని ఆజ్ఞాపించి, ఇంద్రుడితో యుద్ధం చేయటానికి పంపాడు.

ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట (సం. 5-9-45)

చ. పనిచిన నాతఁడుం జనియె బాహుబలంబున నేచి; వాసవుం
డని కెదురేఁగుదెంచె; నిటు లద్భుతసంగరమైనచోట న
య్యనిమిషనాథుఁ బట్టుకొని యంగద వృత్రుఁడు మ్రింగె, దేవత
ల్మనమున బెగ్గలింపఁగఁ జలంబు బలంబును జూపి యుగ్రుఁడై. 123

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; ఆతఁడున్= ఆ వృత్రుడు కూడా; బాహు బలంబునన్= భుజబలంతో; ఏచి= విజృంభించి; చనియెన్= వెళ్ళాడు; వాసవుండు= ఇంద్రుడు; అనికిన్= యుద్ధానికి; ఎదురు+ఏఁగుదెంచెన్= ఎదురువచ్చాడు; ఇటులు= ఇట్లా; అద్భుత సంగరము+ఐన చోటన్= ఆశ్చర్యకర యుద్ధం అయినప్పుడు; వృత్రుఁడు; దేవతల్; మనమునన్= మనస్సులో; బెగ్గలింపఁగన్= భయపడగా; చలంబున్= పట్టుదలా; బలంబును; చూపి; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; ఆ+అనిమిషనాథున్= ఆ దేవరాజును - ఇంద్రుడిని; పట్టుకొని; అంగదన్= ఆకలితో; మ్రింగెన్= మ్రింగాడు.

తాత్పర్యం: పంపగా ఆ వృత్రుడునూ భుజబలంతో విజృంభించి వెళ్ళాడు. ఇంద్రుడు యుద్ధానికి ఎదురేగాడు. ఇట్లా ఆశ్చర్యకరమైన యుద్ధం జరిగినప్పుడు వృత్రుడు దేవతలు మనస్సులలో భయపడేటట్లు, పట్టుదలా, బలమూ చూపి భయంకరుడై ఆ ఇంద్రుడిని పట్టుకొని ఆకలితో మ్రింగాడు.

వ. ఇట్లు మ్రింగినం ద్రిదశగణంబులు దత్క్షణంబ యాదైత్యునకు నావులించునట్టి యాలస్యం బావహించిన. 124

ప్రతిపదార్థం: ఇట్లు, మ్రింగినన్= మ్రింగగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే; త్రిదశ గణంబులు= దేవతల సమూహాలు; ఆ దైత్యునకున్= ఆ రాక్షసుడికి; ఆవులించు+అట్టి= ఆవులించే; ఆలస్యంబు= మాంద్యం; ఆవహించినన్= కలిగించగా.

తాత్పర్యం: ఇట్లా మ్రింగగానే దేవతలు ఆ క్షణమే ఆ రాక్షసుడికి ఆవులించే బడలిక కలిగించగా.

తే. అసురనాథుండు నలసత యడర నీల్గి । యావులించిన, నత్తఱి నమరవిభుఁడు
దన శరీరంబు సంకుచితంబు సేసి, । కడుజవంబునఁ గుప్పించి వెడల నుఱికె. 125

ప్రతిపదార్థం: అసుర నాథుండున్= రాక్షస ప్రభువూ; అలసత= మాంద్యం; అడరన్= అతిశయించగా; నీల్గి= ఒళ్ళు విరుచుకొని; ఆవులించినన్= ఆవులించగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; అమర విభుఁడు= దేవతల రాజు- ఇంద్రుడు; తన శరీరంబున్; సంకుచితంబు+చేసి= ముడుచుకొని; కడు జవంబునన్= మిక్కిలి వేగంతో; కుప్పించి= దుమికి; వెడలన్+ఉఱికెన్= బయటికి ఉరికాడు.

తాత్పర్యం: రాక్షసరాజైన ఆ వృత్రుడునూ మాంద్యం అతిశయించి, ఒడలు విరుచుకొని ఆవులించగా, ఆసమయంలో ఇంద్రుడు తన శరీరాన్ని చిన్నదిగా చేసికొని మిక్కిలివేగంతో వెలుపలికి కుప్పించి దుమికాడు.

క. వెలలి బలరిపుఁడు చలమునఁ । గలహమునకుం జొచ్చె; వృత్రు ఘనబాహుబలం
బలవికి మీఱెను దండ్రి వి । మల తపమునఁ జేసి సురల మనములు దలఁకన్. 126

ప్రతిపదార్థం: బలరిపుఁడు= బలుడనే రాక్షసుడి శత్రువు- ఇంద్రుడు; వెలలి= వృత్రుని నోటినుండి; వెలికి వచ్చి; చలమునన్= పట్టుదలతో; కలహమునకున్= యుద్ధానికి; చొచ్చెన్= ప్రవేశించాడు- యుద్ధానికి పూనుకొన్నాడు; తండ్రి విమల తపమునన్+చేసి= తండ్రిఅయిన త్వష్టయొక్క నిర్మలమైన తపస్సుచేత; సురల మనములు= దేవతల మనస్సులు; తలఁకన్= భయపడగా; వృత్రు ఘనబాహుబలంబు= వృత్రాసురుడి గొప్పదైన భుజబలం; అలవికిన్ మీఱెను= ఇంద్రుడి శక్తికి మించినది.

తాత్పర్యం: ఇంద్రుడు వెలికి వచ్చి పట్టుదలతో వృత్రుడితో యుద్ధానికి దిగాడు. తండ్రిఅయిన త్వష్ట యొక్క నిర్మల తపస్సు కారణంగా, వృత్రుడి గొప్ప భుజబలం దేవతల మనస్సులు భయపడేటట్లు, ఇంద్రుడిశక్తికి మించినదయింది.

వ. ఇట్లధికబలుండైన వృత్రు నాటోపంబు సహింపంజాలక సురపతి దెరలి మరలి పఱచి మందరగిరి శిఖరంబున కరిగినం, గనుకనిం జని యనిమిషు లతనిం గూడుకొని, వృత్రవధోపాయంబు విచారించునెడ, నవ్వాసవుండును దన మనంబున నిశ్చయించి. 127

ప్రతిపదార్థం: ఇట్లు; అధిక బలుండు+ఐన= మిక్కిలి బలం కలవాడయిన; వృత్రు+ఆటోపంబున్= వృత్రుడి విజృంభణను; సహింపన్+చాలక= ఓర్చుకొనలేక; సురపతి= ఇంద్రుడు; తెరలి= తొలగి; మరలి= వెనుకకు తిరిగి; పఱచి= పారి; మందరగిరి; శిఖరంబునకున్= మందర పర్వత శిఖరానికి; అరిగినన్= వెళ్ళగా; అనిమిషులు= దేవతలు; కనుకనిన్+చని= సంభ్రమంతో

వెళ్ళి; అతనిన్; కూడుకొని= కలిసికొని; వృత్రవధ+ఉపాయంబు= వృత్రుడిని చంపటానికైన ఉపాయం; విచారించు+ఎడన్= ఆలోచించేటప్పుడు; ఆ+వాసవుండును= ఆ ఇంద్రుడును; తన మనంబునన్= తన మనస్సులో; నిశ్చయించి= నిర్ణయించి.

తాత్పర్యం: ఈ విధంగా అమితబలం కల వృత్రుడి విజృంభణం తట్టుకోలేక ఇంద్రుడు తొలగి మరలి పారి మందర పర్వత శిఖరానికి వెళ్ళగా, దేవతలు సంభ్రమంతో వెళ్ళి అతడిని కలిసికొని వృత్రుడిని చంపే ఉపాయం ఆలోచించేటప్పుడు ఆ ఇంద్రుడు తన మనస్సులో నిర్ణయం చేసికొని.

క. 'హరిఁ గాంచి యతని చెప్పిన । పరమోపాయంబు సేసి బ్రతుకుద' మనినన్.
సుర లదియ కర్జమని య । మ్మురమర్దను కడకుఁ జనిరి మునులుం దారున్. 128

ప్రతిపదార్థం: హరిన్= విష్ణుమూర్తిని; కాంచి= చూచి; అతని చెప్పిన; పరమ+ఉపాయంబు= గొప్ప ఉపాయం; చేసి; బ్రతుకుదము; అనినన్; సురలు= దేవతలు; అది+అ= అదే; కర్జము+అని= కార్యమని; మునులున్+తారున్= మునులూ; తామూ; ఆ+మురమర్దను కడకున్= ఆ విష్ణువు దగ్గరికి; చనిరి.

తాత్పర్యం: 'విష్ణుమూర్తిని దర్శించి, అతడు చెప్పే ఉపాయాన్ని ఆచరణలో పెట్టి బ్రదుకుదాం' అనగా దేవతలు అదే కార్యమని మునులూ, తామూ కలిసి ఆ విష్ణుమూర్తిదగ్గరికి వెళ్ళారు.

వ. ఇట్లు దివిజానీకంబును పాకశాసనుం బురస్కరించుకొని 129

ప్రతిపదార్థం: ఇట్లు; దివిజ+అనీకంబును= దేవతల సమూహమూ; మునిలోకంబును= మునుల సమూహమూ, పాకశాసనున్= ఇంద్రుడిని; పురస్కరించుకొని= ముందుపెట్టుకొని.

తాత్పర్యం: ఈ విధంగా దేవతల సమూహమూ, మునుల సమూహమూ ఇంద్రుడిని ముందిడుకొని.

మ. చని యా దైత్యుతెఱంగు సెప్పి, 'యతులోత్సాహంబుమై నెప్పుడున్
దనుజవ్రాతము త్రు ళ్ళడంచి, దివిజేంద్రశ్రీవిలాసంబు పెం
పునఁ బొందించుట నీకు నైజము గదా, భూతేశ! ఘోరారిమ
ర్దన సంక్రీడ యొనర్పు లోకముల కత్యంతప్రమోదంబుగాన్.' 130

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ దైత్యుతెఱంగు+చెప్పి= ఆ రాక్షసుడి విధం చెప్పి; భూత+ఈశ!= భూతనాథా!; అతుల+ఉత్సాహంబుమైన్= సాటిలేని వేడుకతో; ఎప్పుడున్= ఎప్పుడూ; దనుజవ్రాతము త్రుళ్ళు+అడంచి= రాక్షస సమూహం యొక్క గర్వం నశింపజేసి; దివిజ+ఇంద్రశ్రీ విలాసంబు= ఇంద్రుడి సంపదయొక్క విలాసం; పెంపునన్+పొందించుట= అభివృద్ధి చెందించడం; నీకున్; నైజము+కదా!= సహజం కదా!; లోకములకున్; అత్యంత ప్రమోదంబు+కాన్= మిక్కిలి సంతోషం అయ్యేటట్లు; ఘోర+అరిమర్దన సంక్రీడ= భయంకరులైన శత్రువులను నలగగొట్టడం అనే ఆట; ఒనర్పు(ము)= చేయుము.

తాత్పర్యం: వెళ్ళి ఆ రాక్షసుడి ప్రకారం చెప్పి, 'ఓ భూతనాథా! ఎంతో ఉత్సాహంతో ఎప్పుడూ రాక్షసుల గర్వం అణచి దేవేంద్రుడి లక్ష్మీ విలాసాన్ని అభివృద్ధి పొందించటం నీకు సహజం కదా! లోకాలకు మిక్కిలి ఆనందం కలిగేటట్లు భయంకర శత్రుసంహారక్రీడ చేయుము'- అని దేవతలు, మునులు విష్ణువును ప్రార్థించారు.

క. అనిన విని, 'యొకటి సెప్పెద । వినుఁ డాతనితోడ సమరవిభునకుఁ దగఁ బొం
దొనరింపుఁ; డొక్క సమయం । బున నడఁకువఁ గులిశధారఁ బొందెద నేనున్. 131

ప్రతిపదార్థం: అనినన్; విని; ఒకటి; చెప్పెదన్; వినుఁడు; ఆతని తోడన్= ఆ వృత్రునితో; అమర విభునకున్= దేవేంద్రుడికి; తగన్= ఒప్పుగా; పొందు+ఒనరింపుఁడు= మైత్రి చేయండి; ఒక్క సమయంబునన్= ఒక సమయంలో; నేనున్= నేనూ; అడఁకువన్= అణకువతో; కులిశధారన్= వజ్రాయుధపుటంచును; పొందెదన్.

తాత్పర్యం: అనగా విని 'ఒక్కటి చెపుతా వినండి. అతడితో దేవేంద్రుడికి సంధి చేయండి. ఒక సమయంలో నేనూ వజ్రాయుధపువాదరలో రహస్యంగా చేరి ఉంటాను.

వ. మదీయ తేజో విశేషంబున నప్పురుహూతున కుత్సాహంబు సంభవింపంగలయది. అప్పు డనాయాసంబునఁ బగతు వధియింప నగు'నని గదాధరుం డూఱడిలం బలికిన, బలసూదన ప్రముఖ నిఖిల సురలోకంబును సంతసిల్లి మగిడి వచ్చి వృత్రుకడకు మునిజనంబులం బుచ్చిన, వారునుం జని యతని కిట్లనిరి. 132

ప్రతిపదార్థం: మదీయ తేజస్(ః)+విశేషంబునన్= నాదైన తేజస్సు యొక్క అధిక్యం చేత; ఆ+పురుహూతునకున్= ఆ ఇంద్రుడికి; ఉత్సాహంబు; సంభవింపన్+కలయది= పుట్టుతుంది; అప్పుడు; అనాయాసంబునన్= అశ్రమంగా, శ్రమలేకుండా; పగతున్= శత్రువును; వధియింపన్+అగున్= చంపవచ్చును; అని; గదాధరుండు= కౌమోదకి అనే గదను ధరించేవాడు-విష్ణువు; ఊఱడిలన్+పలికినన్= ఓదార్పు కలిగేటట్లు పలుకగా; బలసూదన ప్రముఖ నిఖిల సుర లోకంబును= ఇంద్రుడూ మొదలైన ఎల్ల దేవతల సమూహమూ; సంతసిల్లి= సంతోషించి; మగిడి వచ్చి= తిరిగి వచ్చి; వృత్రుకడకున్= వృత్రుడి వద్దకు; ముని జనంబులన్= మునులను; పుచ్చినన్= పంపగా; వారును; చని; అతనికిన్; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: నా తేజోవిశేషంచేత ఆ ఇంద్రుడికి ఉత్సాహం పుట్టుకొస్తుంది. అప్పుడు అశ్రమంగా శత్రువును సంహరింపవచ్చును.' అని విష్ణువు ఊరట కలిగేటట్లు చెప్పగా, ఇంద్రాది సకలదేవతలూ సంతోషంతో తిరిగి వచ్చి వృత్రాసురుడి వద్దకు మునులను పంపారు. వారు వెళ్ళి అతడితో ఇట్లా అన్నారు.

క. 'భుజ బల దుర్జయుఁ డింద్రుం; । డజయ్యుఁడవు నీవు; నీకు నతనికి మీలో
విజయము దక్కదు; మీరే । చి జగంబులు నొవ్వ రణము సేయఁగనేలా? 133

ప్రతిపదార్థం: ఇంద్రుండు; భుజ బల దుర్జయుఁడు= భుజబలంచేత జయించ శక్యం కానివాడు; నీవున్= నువ్వు కూడా; అజయ్యుఁడవు= జయించరానివాడవు; మీలోన్; నీకున్; అతనికిన్; విజయము= గెలుపు; దక్కదు= లభించదు; మీరు; ఏచి= విజృంభించి; జగంబులు= లోకాలు; నొవ్వన్= బాధపడేటట్టు; రణము= యుద్ధం; చేయఁగన్+ఏలా= చేయడమెందుకు?

తాత్పర్యం: 'ఇంద్రుడు భుజబలం చేత జయించ శక్యం కానివాడు. నువ్వూ జయించరానివాడవే. మీ యిద్దరిలో ఎవరికీ గెలుపు లభించదు. మరి మీరు విజృంభించి లోకాలు బాధపడేటట్టు యుద్ధం చేయడ మెందుకు?

క. మైత్రీ సౌఖ్యముఁబోలునె । శాత్రవ మెమ్మెయిఁ దలంప? శక్రశ్రీకిం
బాత్రమవై యింపుగఁ ద । న్మిత్రుఁడవగు; మిదియ మేలు మీ యిద్దఱకున్.' 134

ప్రతిపదార్థం: ఎమ్మెయిన్(ఏ+మెయిన్)+తలంపన్= ఏ విధంగా ఆలోచించినా, శాత్రవము= శత్రుత్వం, మైత్రీ-సౌఖ్యమున్= స్నేహ సుఖాన్ని, పోలునె= పోలుతుందా?, శక్ర శ్రీకిన్= ఇంద్రుడి సంపదకు; పాత్రమవు+ఐ= యోగ్యుడవయి; ఇంపుగన్= ఆనందంగా; తన్మిత్రుఁడవు (తద్+మిత్రుఁడవు)= అతడి స్నేహితుడవు; అగుము; మీ+ఇద్దఱకున్= మీ ఇరువురకూ; ఇది+అ= ఇదే; మేలు= లాభం.

తాత్పర్యం: ఏ విధంగా ఆలోచించినా మైత్రీసౌఖ్యంతో శత్రుత్వం సాటికాదు. ఇంద్రుడి సంపదకు యోగ్యుడవై ఆనందంగా అతడి మిత్రుడవు కమ్ము. ఇదే ఉభయతారకం.

వ. అనవుడు వృత్రాసురుండు 'తేజంబువాసికి నాసపడియెడు మా యిరువురకు సఖ్యంబు సమకూర నేర్చునే?' యనుటయు నమ్మునులు' సత్పురుష సాంగత్యంబు సంభవించినఁ జేయమి నీతి గాదు. మహేంద్రుండు సకల లోక సమ్మత సద్భావుండుగావున నతనితోడి చుట్టఱికంబు మే'లనిన నొడంబడి యతండు వారల కిట్లనియె. 135

ప్రతిపదార్థం: అనవుడున్= అనినంతనే; వృత్ర+అసురుండు= వృత్రుడనే రాక్షసుడు; తేజంబు వాసికిన్= తేజస్సు యొక్క ఆధిక్యం కొరకు; ఆసపడియెడు మా+ఇరువురకున్= ఆశించే మా ఇద్దరికీ; సఖ్యంబు= స్నేహం; సమకూరన్+నేర్చునే?= లభించగలదా?; అనుటయున్; ఆ+మునులు; సత్+పురుష సాంగత్యంబు= మంచివారితో మైత్రి; సంభవించినన్= కలిగితే; చేయమి= చేయకుండా ఉండటం; నీతి+కాదు; మహేంద్రుండు; సకల లోక సమ్మత సత్+భావుండు= అన్ని లోకాలకూ సమ్మతమైన సద్భావం కలవాడు; కావునన్= కాబట్టి, అతని తోడి చుట్టఱికంబు= అతడి తోడి బంధుత్వం; మేలు= మంచిది; అనినన్; ఒడంబడి= సమ్మతించి; అతండు; వారలకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగానే, వృత్రాసురుడు 'తేజోవిశేషంకొరకు ఆశించే మా ఇద్దరికి స్నేహం కుదరగలదా?' అంటే, ఆ మునులు 'సజ్జనమైత్రి లభించినప్పుడు చేయకపోవడం నీతి కాదు. మహేంద్రుడు లోకాలన్నీ సమ్మతించే సజ్జనత్వం కలవాడు. కాబట్టి అతడితో బంధుత్వం మంచిది,' అనగా, దానికి సమ్మతించి వృత్రుడు వారితో ఇట్లా అన్నాడు.

క. 'ఏ నొక్క తెఱఁగు సెప్పెద; । దానిం గాదనక చేసి తగ మీరలు సం
ధానము దృఢముగఁ జేయుం । డా నాకేశునకు నాకు నధికప్రీతిన్.' 136

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒక్క తెఱఁగు= ఒక్క విధం; చెప్పెదన్; మీరలు; దానిన్; కాదు+అనక; చేసి; ఆ నాక+ఈశునకున్= ఆ స్వర్గ ప్రభువుకూ (ఇంద్రుడికీ); నాకున్; అధిక ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; తగన్= ఒప్పేటట్టు; దృఢముగన్= గట్టిగా; సంధానము= సంధి; చేయుండు.

తాత్పర్యం: 'నేను ఒక పద్ధతి చెపుతాను. మీరు దానిని కాదనకుండా చేసి ఆ ఇంద్రుడికీ నాకూ మిక్కిలి సంతోషంతో ఒప్పుగా, దృఢంగా సంధి చేయండి.'

వ. 'అది యెయ్యది?' యనిన 'ఆర్ద్రం బగుదానను, శుష్కంబైన సాధనంబునను, దారువునం, బాషాణంబున, శస్త్రాస్త్రంబులం, దివంబున, రాత్రి యందును నేను వధ్యుండఁ గాకుండవలయు' ననిన, వారును దానికి నొడంబడి, యవ్వరంబు లొసంగి వృత్రవజ్రధరులకు మిత్రభావం బొనరించి, మగుడం జని, యత్తెఱంగు

వాసవున కెఱింగించి నిజనివాసంబుల కరిగిరి, సురనాథుండు సుఖంబుండి, పెద్దకాలంబునకుం దన మనంబునఁ బాయని వైరంబు సైరింపంజాలక, దామోదరుని పూనికయు, మునిజనంబు సేసిన సంధి విధంబును నిరూపించి, రిపుం బరిభవింప రంధ్రాన్వేషణంబు సేయుచుండి యొక్కనాఁడు. 137

ప్రతిపదార్థం: అది; ఎయ్యది= ఏది; అనినన్; ఆర్ద్రంబు+అగుదానను= తడిసిన దానిచేతను; శుష్కంబు+ఐన సాధనంబునను= ఎండిన పరికరం చేతను; తరువునన్= చెట్టుచేతను; పాషాణంబునన్= రాయిచేతను; శస్త్ర+అస్త్రంబులన్= శస్త్రాలచేతను; అస్త్రాలచేతను; దివంబునన్= పగటివేళా; రాత్రిఅందును; నేను; వధ్యుండన్+కాక+ఉండవలయును= చంపదగినవాడిని కాగూడదు; అనినన్; వారును; దానికిన్; ఒడంబడి= సమ్మతించి; ఆ+వరంబులు= ఆ వరాలు; ఒసంగి= ఇచ్చి; వృత్ర వజ్రధరులకున్= వృత్రుడికీ, ఇంద్రుడికీ; మిత్ర భావంబు= మైత్రి; ఒనరించి= చేసి; మగుడన్+చని= తిరిగిపోయి; ఆ+తెఱంగు= ఆ విధం; వాసవునకున్= ఇంద్రుడికి; ఎఱింగించి= చెప్పి; నిజనివాసంబులకున్= తమ తమ ఇండ్లకు; అరిగిరి= వెళ్లారు; సురనాథుండు= ఇంద్రుడు; సుఖంబు+ఉండి= సుఖంగా ఉండి; పెద్ద కాలంబునకున్= చిరకాలంగా; తన మనంబునన్= తన మనస్సులో; పాయని వైరంబు= తొలగని విరోధం; సైరింపన్+చాలక= సహించలేక; దామోదరుని పూనికయున్= విష్ణువు ప్రయత్నమూ; ముని జనంబు= మునుల సమూహం; చేసిన సంధి విధంబును; నిరూపించి= గ్రహించి; రిపున్= శత్రువును; పరిభవింపన్= అవమానించటానికి (ఓడించటానికి); రంధ్ర+అన్వేషణంబు+చేయుచున్+ఉండి= మార్గం వెదకుతూ; ఒక్కనాఁడు= ఒక రోజున.

తాత్పర్యం: 'అది ఏది?' అని అడిగితే, తడిసినదానిచేతగాని, ఎండినదానిచేతగాని, కర్రచేతగాని, రాయిచేతగాని, శస్త్రాలచేతగాని, అస్త్రాలచేతగాని, పగలుగాని, రాత్రిగాని నేను చావగూడదు' అనగా, వారును దాని కంగీకరించి, ఆ విధంగానే వరాలిచ్చి, వృత్రుడికీ, ఇంద్రుడికీ సంధి చేసి తిరిగి పోయి, ఆ ప్రకారం ఇంద్రుడికి చెప్పి తమ తమ యిండ్లకు వెళ్లిపోయారు. ఇంద్రుడు సుఖంగా ఉండి, చిరకాలంగా తన మనస్సులో తొలగని విరోధం సహించలేక, విష్ణుమూర్తి ప్రయత్నమూ, మునులు చేసిన సంధి విధానమూ గ్రహించి, శత్రువును ఓడించే మార్గాన్ని వెదకుతూ ఒక రోజున.

విశేషం: అమంత్రకములైన ఆయుధాలు శస్త్రాలు. సమంత్రకములైన ఆయుధాలు అస్త్రాలు. 'రంధ్రాన్వేషణ' జాతీయం. ఏదో దోషం కొరకు, సాకు కొరకు ప్రయత్నించటమని అర్థం.

చ. జలనిధి తీరభూమిఁ దన శత్రుఁ గనుంగొని, 'వీని నిప్డు దో
ర్బల మెసఁగంగ నాదు భిదురంబునఁ ద్రుంచెద; రాత్రిగాదు, తాఁ
దలఁప దివంబుగా; దిది యుదగ్రపరాక్రమ యోగ్య సంధ్య; నా
యలవుఁ జలంబుఁ జూప నెపమై తగు సాధన మెద్ది గల్గునో?' 138

ప్రతిపదార్థం: జలనిధి తీరభూమిన్= సముద్రపుటొడ్డున; తన శత్రున్= తన విరోధిఅయిన వృత్రుణ్ణి; కనుంగొని= చూసి; వీనిన్; ఇప్డు; దోర్బలము (దోస్)(ః)+బలము)= భుజబలం; ఎసఁగంగన్= అతిశయించగా; నాదు భిదురంబునన్= నా వజ్రాయుధంతో; త్రుంచెదన్= వధిస్తాను; రాత్రి+కాదు; తలఁపన్= ఆలోచించగా; తాన్; దివంబు= పగలు; కాదు; ఇది= ఈ సమయం; ఉదగ్ర పరాక్రమ యోగ్య సంధ్య= మహా పరాక్రమానికి తగిన సంజవేళ; నా+అలవున్= నా బలమూ; చలంబున్= పట్టుదలా; చూపన్; నెపము+ఐ= కారణమై; తగు సాధనము; ఎద్ది= ఏది; కల్గునో?= కలుగుతుందో?

తాత్పర్యం: సముద్రతీరంలో తన విరోధియైన వృత్రుడినిచూసి 'ఇప్పుడు వీడిని భుజబలం అతిశయించగా, నా వజ్రాయుధంతో వధిస్తాను. ఇది రాత్రి కాదు, పగలు కాదు. మహాపరాక్రమం ప్రదర్శించటానికి తగిన సంధ్యా సమయం. నా బలాన్నీ, పట్టుదలనూ చూపటానికి కారణమై ఒప్పే సాధనం ఏది దొరుకుతుందో కదా!'

క. అని తలఁచుచు నచ్చట నొక । వననిధి ఫేనంబుఁ జూచి వాసవుఁ 'డార్ద్రం
బును శుష్కంబును గాదిది' । యనుచుం గులిశమునఁ గూర్చి యధికరయమునన్. 139

ప్రతిపదార్థం: అని; తలఁచుచున్; అచ్చటన్; ఒక వననిధి ఫేనంబున్= ఒక సముద్రపు నురుగును; చూచి; వాసవుఁడు= ఇంద్రుడు; ఇది; ఆర్ద్రంబును= తడిదీ; శుష్కంబును= ఎండినదీ; కాదు; అనుచున్; కులిశమునన్= వజ్రాయుధంతో; కూర్చి= జతపరిచి; అధిక రయమునన్= మిక్కిలి వేగంతో.

తాత్పర్యం: అని అనుకొంటూ ఇంద్రుడు అక్కడ ఒక సముద్రపు నురుగును చూచి 'ఇది తడిదీ కాదు, పొడిదీ కాదు-' అంటూ వజ్రాయుధంతో కూర్చి మిక్కిలి వేగంతో.

తే. దాన వృత్రుని వ్రేయ నత్తఱి మురారి । యందుఁ దగ సంక్రమించి, యయ్యసురఁ జంపె;
జిష్ణుఁ డతిభక్తి విష్ణుఁ బూజించె నాత్మ । నఖిలలోకంబులకు మోద మావహిల్లె. 140

ప్రతిపదార్థం: దానన్= దానిచేత; వృత్రునిన్; వ్రేయన్= కొట్టగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; ముర+అరి= మురుడనే రాక్షసుడి శత్రువు - విష్ణువు; అందున్; తగన్= ఒప్పుగా; సంక్రమించి= ప్రవేశించి; ఆ+అసురన్= ఆ రాక్షసుడిని; చంపెన్; జిష్ణుఁడు= ఇంద్రుడు; అతి భక్తిన్= మిక్కిలి భక్తితో; విష్ణున్= విష్ణుమూర్తిని; ఆత్మన్= మనస్సులో; పూజించెన్= పూజించాడు; అఖిల లోకంబులకున్= ఎల్లలోకాలకూ; మోదము= సంతోషం; ఆవహిల్లెన్= కలిగింది.

తాత్పర్యం: దానితో వృత్రుడిని కొట్టటానికి పూనుకోగా, ఆ సమయంలో విష్ణువు అనువుగా ఆ సముద్రపు నురుగులో ప్రవేశించి ఆ రాక్షసుడిని సంహరించాడు. ఇంద్రుడు మిక్కిలి భక్తితో విష్ణుమూర్తిని మనస్సులో పూజించాడు. లోకాలన్నీ సంతోషించాయి.

వ. ఇవ్విధంబునం బగతుం బరిమార్చి పేర్చి యింద్రుండు నిజపురంబునకుం జనియె; మఱియును భూతసంఘం
'బిట్లు బ్రహ్మహత్య సేయందగునే?' యని యతని నిందించినం బ్రభుత్వ సంపద సెడుటయు. 141

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పగతున్= శత్రువును; పరిమార్చి= చంపి; పేర్చి= విజృంభించి; ఇంద్రుండు; నిజపురంబునకున్= తన నగరానికి; చనియెన్= వెళ్ళాడు; మఱియును; భూత సంఘంబు= పంచభూతాలసమూహం; ఇట్లు; బ్రహ్మహత్య; చేయన్+తగునే?; అని; అతనిన్; నిందించినన్= నిందించగా; ప్రభుత్వ సంపద= రాజ్యశ్రీ; చెడుటయున్= నశించగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రువును సంహరించి విజృంభించి ఇంద్రుడు తన నగరానికి వెళ్ళాడు. కాని, పంచభూతాల సమూహం 'ఇట్లా బ్రహ్మహత్య చేయవచ్చునా?' అని అతడిని నిందించగా రాజ్యశ్రీ నశించింది.

విశేషం: 'భూతసంఘంబు' - అంటే పంచభూతాలు మొదలైనవి. ఇవి ప్రతిప్రాణీ చేసే పనికి సాక్షీభూతాలుగా ఉంటాయి.

ఆ. నీచదశకు వచ్చి నిషధాచలంబున । కరిగి, సురవరేణ్యుఁ డడఁగియుండె;
నమరు లెల్లఁ గలఁగి, యన్యోన్యపీడన । భయముఁ బొంది కూడఁబాఱి, తమకు. 142

ప్రతిపదార్థం: సురవరేణ్యుఁడు= దేవశ్రేష్ఠుడు, ఇంద్రుడు; నీచ దశకున్, వచ్చి= నీచస్థితికి వచ్చి; నిషధ+అచలంబునకున్= నిషధ పర్వతానికి; అరిగి= వెళ్ళి; అడఁగి+ఉండెన్= దాక్కొన్నాడు; అమరులు+ఎల్లన్= దేవతలందరూ; కలఁగి= కలతచెంది; అన్యోన్య పీడన భయమున్= పరస్పరం బాధించుకొంటారనే భయం; పొంది; కూడన్+పాఱి= కూడుకొని; తమకున్.

తాత్పర్యం: ఇంద్రుడు నీచస్థితికి వచ్చి నిషధపర్వతానికి వెళ్ళి దాగుకొన్నాడు. దేవతలందరూ కలత చెంది తమను తాము బాధించుకొంటారనే భయం పొంది, కూడుకొని, తమకు.

క. కావలియై సురరాజ్య । శ్రీ వాలింపంగఁదగు విశేషంబున సం
భావితుఁడు నహుషుఁ డని చని, । యా విభుఁ గని తారు మునులు నతనికి నెమ్మిన్. 143

ప్రతిపదార్థం: కావలి+ఐ= రక్షకుడయి; సురరాజ్యశ్రీ= దేవ రాజ్య సంపద; పాలింపంగన్= కాపాడటానికి; తగు విశేషంబునన్= తగిన ఆధిక్యంతో; సంభావితుఁడు= కొనియాడబడేవాడు; నహుషుండు; అని; చని= వెళ్ళి; తారున్= తామూ (దేవతలూ); మునులున్= మునులూ; ఆ విభున్= ఆ ప్రభువును; కని= చూచి; అతనికిన్; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: రక్షకుడయి సురరాజ్యశ్రీని కాపాడడానికి తగిన గొప్పతనం కలవాడు నహుషుడని నిర్ణయించి, వెళ్ళి తామూ, మునులూ ఆ ప్రభువును చూచి అతడికి ప్రీతితో.

దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట (సం. 5-11-21)

వ. పాకశాసను తెఱం గెఱింగించి. 144

ప్రతిపదార్థం: పాకశాసను తెఱంగు= ఇంద్రుడి వృత్తాంతం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఇంద్రుడి వృత్తాంతం చెప్పి.

క. 'ర మ్మింద్రపదవి సేకొని । మ మ్మెల్లను నరయు' మనిన, మానవపతి, 'నా
కమ్మహిమకుఁ దగు మాహా । త్మ్యమ్ము గలదె? నన్ను నేల యలఁచెద?' రనినన్. 145

ప్రతిపదార్థం: రమ్ము; ఇంద్రపదవి; చేకొని= స్వీకరించి; మమ్ము+ఎల్లనున్= మమ్మల్ని అందరినీ; అరయుము= కాపాడుము; అనినన్; మానవపతి= రాజు-నహుషుడు; నాకున్; ఆ+మహిమకున్= ఆ గొప్పతనానికి; తగు; మాహాత్మ్యమ్ము= సామర్థ్యం; కలదె?= ఉన్నదా?; నన్నున్; ఏల; అలఁచెదరు= శ్రమపెట్టుతారు; అనినన్.

తాత్పర్యం: 'రమ్ము. ఇంద్రపదవిని స్వీకరించి మమ్మల్ని అందరినీ కాపాడుము' అనగా నహుషుడు 'నాకు అటువంటి మహాకార్యానికి తగిన సామర్థ్యం ఉన్నదా? నన్నెందుకు శ్రమపెట్టుతారు?' అనగా.

వ. అంత నిలువక యత్యంత ప్రార్థనంబు సేసి. 146

ప్రతిపదార్థం: అంతన్; నిలువక= ఆగక; అత్యంత ప్రార్థనంబు+చేసి= మిక్కిలి ప్రార్థించి.

తాత్పర్యం: అంతటితో ఆగక మరి మరి ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. యమ వరుణాది త్రిదశులు । దమ దమ శక్తి ప్రభావ దర్పంబులు భూ
రమణునకుఁ బంచి యిచ్చిరి । ప్రమోద మెసఁగంగ మునిసభామధ్యమునన్. 147

ప్రతిపదార్థం: యమ వరుణ+ఆది త్రిదశులు= యముడూ, వరుణుడూ మొదలైన దేవతలు; ప్రమోదము+ఎసఁగంగన్= సంతోషం అతిశయించగా; మునిసభామధ్యమునన్= మునుల సభలో; తమ తమ శక్తి ప్రభావ దర్పంబులు= తమ తమ శక్తి సామర్థ్య గర్వాలు; భూ రమణునకున్= రాజుకు- నహుషుడికి; పంచి+ఇచ్చిరి= పంచిపెట్టారు.

తాత్పర్యం: యముడూ, వరుణుడూ మొదలుగా గల దేవతలు సంతోషంతో అతిశయించగా మునుల సమూహంలో తమ తమ శక్తిసామర్థ్యాల గర్వాలను నహుషుడికి పంచిపెట్టారు.

వ. ఇవ్విధంబున నిచ్చి, యధికబలసమన్వితుం గావించి తోడ్కొనిపోయి, పూజ్యంబగు దివిజరాజ్యంబున కభిషిక్తుం జేసిన, నతండును బరమ ధర్మపరుండై, కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాది సమస్త దేవయోనులవలనను దేజోభాగంబులు పుచ్చికొని మహానుభావుండై, దివ్యముని సేవ్యంబైన యద్దేవేంద్ర పదంబు సేకొని తుంబురు నారదాది వినోద పాత్రంబులును, రంభాద్యప్సరోగణంబులుం గొలువ నభిమతభోగంబు లనుభవించుచు, మదంబు మిగిలి మన్మథాధీనుండై వర్తిల్లుసమయంబున నొక్కనాఁడు. 148

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; ఇచ్చి; అధిక బల సమన్వితున్= ఎక్కువ బలంతో కూడినవాడిని, కావించి= చేసి; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్ళి; పూజ్యంబు+అగు= పూజించదగినదైన; దివిజ రాజ్యంబునకున్= దేవతల రాజ్యానికి; అభిషిక్తున్+ చేసినన్= అభిషేకించబడిన వాడినిచేయగా; అతండును= ఆ నహుషుడును; పరమ ధర్మపరుండు+ఐ= మిక్కిలి ధర్మరతుడయి; కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధర+ఆది సమస్త దేవయోనుల వలనను= కిన్నరులూ, కింపురుషులూ, గరుడులూ, గంధర్వులూ, సిద్ధులూ, విద్యాధరులూ మొదలుగాగల ఎల్ల దేవతల జాతుల నుండీ; తేజస్(ః)+భాగంబులు; పుచ్చుకొని; మహానుభావుండు+ఐ= మహాత్ముడయి; దివ్య ముని సేవ్యంబు+ఐన= దేవతల చేతా, మునులచేతా సేవించదగిన; ఆ+దేవేంద్ర పదంబు+చేకొని= ఆ దేవేంద్ర పదవి స్వీకరించి; తుంబురు నారద+ఆది వినోద పాత్రంబులును= తుంబురుడూ, నారదుడూ మొదలైన వినోదం కలిగించేవారూ; రంభా+ఆది+అప్సరస్(ః)+గణంబులున్= రంభ మొదలైన అచ్చరల సమూహమూ; కొలువన్= సేవించగా; అభిమత భోగంబులు= ఇష్టసౌఖ్యాలు; అనుభవించుచున్; మదంబు మిగిలి= గర్వం అతిశయించి; మన్మథ+అధీనుండు+ఐ= మన్మథుడికి వశపడినవాడయి; వర్తిల్లు సమయంబునన్= ఉన్నసమయంలో; ఒక్కనాఁడు.

తాత్పర్యం: ఈ విధంగా ఇచ్చి, అమిత బలయుక్తుడిగా చేసి, తీసికొనివెళ్ళి పూజ్యమైన దేవరాజ్యాని కభిషిక్తుడిని చేయగా, ఆ నహుషుడు మిక్కిలి ధర్మరతుడై, కిన్నరులూ, కింపురుషులూ, గరుడులూ, గంధర్వులూ, సిద్ధులూ, విద్యాధరులూ మున్నగు ఎల్ల దేవతలనుండి తేజస్సుల అంశాలు పుచ్చుకొని మహాత్ముడై దేవతలూ, మునులూ సేవించే ఆ దేవేంద్ర పదవిని స్వీకరించి, తుంబురుడూ నారదుడూ మొదలయిన వినోదాన్ని కలిగించేవారూ, రంభ మొదలయిన అచ్చరల సమూహాలూ సేవిస్తూండగా, ఇష్టభోగా లనుభవిస్తూ, మదం అతిశయించి మన్మథవశుడయి ఉన్న సమయంలో ఒకనాడు.

తే. మహిత లావణ్యమున నసమాన యనఁగఁ । జనిన పౌలోమి యా నహుషునకు నయన
మార్గగోచర యగుటయు, మదన బాణ । భిన్న హృదయుఁడై, ధృతిఁబాయఁబెట్టి యతఁడు. 149

ప్రతిపదార్థం: మహిత లావణ్యమునన్= గొప్పదిఐన దేహకాంతియందు; అసమాన+అనఁగన్+చనిన= సాటిలేనిది అనదగిన; పౌలోమి= శచి; ఆ నహుషునకున్; నయన మార్గ గోచర+అగుటయున్= కన్నుల త్రోవలో కనబడినదికాగా(కంటికగపడగా); అతఁడు; మదన బాణ భిన్న హృదయుఁడు+ఐ= మన్మథ బాణాలచేత భేదింపబడిన హృదయం కలవాడయి; ధృతిన్= ధైర్యాన్ని; పాయన్+పెట్టి= కోలుపోయి.

తాత్పర్యం: గొప్పదిఅయిన మేనికాంతితో సాటిలేనిది అనదగిన శచీదేవి ఆ నహుషుడి కంటబడగా అతడు మదనపరవశుడయి, ధైర్యం కోలుపోయి.

విశేషం: పౌలోమి-పులోముడనే దానవుడి కూతురు. ఇంద్రుడు పులోముడిని సంహరించి, అతడి పుత్రిక అయిన శచిని పెండ్లాడాడు.

క. 'సురలోక రాజ్య పదవిన్ । గరిమంబున నున్న నన్నుఁ గవయం బరమా
దరలీలఁ జతురయగు నీ । సరసిజముఖి రామి యేమి చందమొ తలఁపన్?' 150

ప్రతిపదార్థం: సుర లోక రాజ్య పదవిన్= స్వర్గ రాజ్యాధిపత్యంలో; గరిమంబునన్= గొప్పతనంతో; ఉన్న; నన్నున్; కవయన్= కూడటానికి; చతుర+అగు= నేర్పరిఅయిన; సుందరిఅయిన; ఈ సరసిజముఖి= పద్మంవంటి ముఖంకల ఈమె; పరమ+ఆదర లీలన్= మిక్కిలి ఆదరంతో; రామి= రాకపోవటం; తలఁపన్= ఆలోచించగా; ఏమి చందమొ?= ఏమి కారణమో?

తాత్పర్యం: 'స్వర్గరాజ్యాధిపత్య పదవిలో మహావైభవంతో ఉన్న నన్ను కూడటానికి సుందరాంగిఅయిన ఈ పద్మవదన మిక్కిలి ఆదరంతో రాకపోవటానికి ఏమి కారణం అయి ఉంటుంది?'

క. అని యప్పొలఁతిం బిలిపిం । చిన, నదియును భయము నొంది, శీఘ్రము దేవే
జ్యుని సదనమునకు శరణం । బనుచుం జనుటయును వాసవాచార్యుండున్. 151

ప్రతిపదార్థం: అని; ఆ+పొలఁతిన్= ఆ కాంతను-శచిని; పిలిపించినన్= పిలిపించగా; అదియును= ఆమెయు; భయమున్+ ఒంది= భయపడి; శీఘ్రము+అ= వెంటనే; దేవ+ఇజ్యుని సదనంబునకున్= దేవగురువైన బృహస్పతి యింటికి; శరణంబు+ అనుచున్= శరణంటూ; చనుటయును= వెళ్ళగా; వాసవ+ఆచార్యుండున్= దేవగురుడునూ - బృహస్పతియూ.

తాత్పర్యం: అని ఆ శచీదేవిని పిలిపించగా, ఆమె భయపడి వెంటనే బృహస్పతి ఇంటికి శరణంటూ వెళ్ళగా ఆయన.

వ. పరమాదరంబున నద్దేవిని గారవించి 'నిన్ను నహుషు దుర్వినయంబుఁ బొరయకుండ నరయువాఁడ; నాఖండలుండు నా యత్నంబున నవశ్యంబును దడయక వచ్చు' నని యూఱడించిన. 152

ప్రతిపదార్థం: పరమ+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఆ+దేవిని= ఆ శచీదేవిని; గారవించి= గౌరవించి; నిన్నున్; నహుషు దుర్వినయంబున్= నహుషుడి దుష్ప్రవర్తనను; పొరయక+ఉండన్= పొందకుండా; అరయువాఁడన్= రక్షిస్తాను;

ఆఖండలుండు= ఇంద్రుడు; నా యత్నంబునన్= నా ప్రయత్నంచేత; అవశ్యంబును= తప్పకుండా; తడయక= వెంటనే; వచ్చున్; అని; ఊఱడించినన్= ఓదార్చగా.

తాత్పర్యం: మిక్కిలి ఆదరంతో ఆ శచీదేవిని గౌరవించి 'నిన్ను నహుషుడి దుష్ప్రవర్తన బారిన పడకుండా కాపాడుతాను. ఇంద్రుడు నా ప్రయత్నంచేత తప్పక వెంటనే వస్తాడు' అని ఓదార్చగా.

క. అది యెల్ల నెఱిఁగి కోపం । బొదవఁగ నహుషుండు 'గురున కుచితమె యే న
ముదితం బిలిపింపఁగఁ దన । సదనంబున నునుచు' టనియె సంక్షుభితుండై. 153

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= అదంతా; ఎఱిఁగి= తెలిసి; కోపంబు+ఒదవఁగన్= కోపం పుట్టగా; నహుషుండు; సంక్షుభితుండు+ఐ= కలతపడినవాడయి; ఏను= నేను; ఆ+ముదితన్= ఆ ఇంతిని- శచిని; పిలిపింపఁగన్= పిలిపించగా; తన సదనంబునన్= తన ఇంటిలో; ఉనుచుట= ఉంచటం; గురునకున్= బృహస్పతికి; ఉచితమె?= తగునా?; అనియెన్.

తాత్పర్యం: అదంతా తెలిసి, కోపంతో నహుషుడు కలత చెంది 'నేను ఆ శచిని పిలిపిస్తే, తన ఇంటిలో ఉంచటం బృహస్పతికి తగునా?' అన్నాడు.

చ. అనుడు మునీంద్రులున్ సురలు 'నక్కట నీ మహనీయ గౌరవం
బునకుఁ బరాంగనం గవయుబుద్ధి జనించుట యీడుగాదు' నా
విని, 'మును పూని యిమ్మెయి వివేకము గౌతముభార్యఁ బాకశా
సనుఁ డెడఁ గోరుచోఁ గఱపఁ జాలర మీ రది యెట్లు సెప్పుఁడా!' 154

ప్రతిపదార్థం: అనుడున్= అనినంతనే; ముని+ఇంద్రులున్= మునిశ్రేష్ఠులూ; సురలున్= దేవతలూ; అక్కట= అయ్యో; నీ మహనీయ గౌరవంబునకున్= నీ మహా మహత్త్వానికి; పర+అంగనన్= పరస్త్రీని; కవయు బుద్ధి= కూడాలనే తలపు; జనించుట= పుట్టటం; ఈడు+కాదు= సరి కాదు; నాన్= అనగా; విని; మును= పూర్వం; పాకశాసనుఁడు= పాకుడనే రాక్షసుడిని చంపినవాడు- ఇంద్రుడు; గౌతముభార్యన్= గౌతమ ముని భార్యను - అహల్యను; ఎడన్= హృదయంలో; కోరుచోన్= కామించినప్పుడు; మీరు; పూని= ప్రయత్నించి; ఈ+మెయి వివేకమున్= ఈ విధమైన జ్ఞానం; కఱపన్+చాలరు+అ= బోధించలేకపోయారా?; అది+ఎట్లు+చెప్పుఁడా!= అది ఎట్లాగో చెప్పండి. (ఏ విధంగా సమర్థించుకొనగలరో చెప్పండి అనిభావం.)

తాత్పర్యం: అనగానే మునివరులూ, దేవతలూ 'అయ్యో! నీ మహామహత్త్వానికి పరస్త్రీని కూడాలనే తలంపు పుట్టటం తగదు' అనగా నహుషుడు విని 'పూర్వం ఇంద్రుడు గౌతమమహర్షిభార్యఅయిన అహల్యను హృదయంలో కామించినప్పుడు మీరు ప్రయత్నించి అతనికి ఇటువంటి జ్ఞానం బోధించలేకపోయారా? అది ఎట్లాగో చెప్పండి.'

విశేషం: ఇంద్రుడు గౌతముడి భార్యయైన అహల్యను కామించి అర్ధరాత్రి కోడియై గౌతమాశ్రమ సమీపంలో కూయగా, గౌతముడు తెల్లవారిన దనుకొని స్నానార్థం వెళ్ళాడు. అప్పుడు ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశించి అహల్యను కూడాడు.

వ. అనుచు నతండు కోపించిన, భయంబుఁగొని వార లా పౌలోమి నతని పాలికిం దోడ్కొని వచ్చువారై పూని బృహస్పతికడకుం జని యద్దేవి వినుచుండ నిట్లనిరి. 155

ప్రతిపదార్థం: అనుచున్; అతండు= నహుషుడు; కోపించినన్; వారలు= ఆ మునులు, దేవతలు; భయంబున్+కొని= భయపడి; ఆ పౌలోమిన్= ఆ శచీదేవిని; అతని పాలికిన్= అతడి వద్దకు; తోడ్కొని వచ్చువారు+ఐ= తీసికొని రాగోరినవారయి; పూని= ప్రయత్నించి; బృహస్పతి కడకున్= బృహస్పతి దగ్గరకు; చని= వెళ్ళి; ఆ+దేవి= ఆ శచి; వినుచున్+ఉండన్= వింటూండగా; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: అంటూ నహుషుడు కోపపడగా, ఆ మునులు, దేవతలు భయపడి శచీదేవిని అతడి వద్దకు తీసికొని రావాలని పూని బృహస్పతి దగ్గరకు వెళ్ళి ఆ శచి వింటూండగా ఇట్లా అన్నారు.

క. 'నహుషుఁడు మహేంద్ర పదవీ । సహితుఁడు; శచికిన్ వరింపఁ జను నాతని; లో
కహితంబు గాఁగఁ బుచ్చుము । మహాత్మ! తచ్చిత్తమున యమర్షం బడఁగన్.' 156

ప్రతిపదార్థం: నహుషుఁడు; మహేంద్ర పదవీ సహితుఁడు= మహేంద్ర పదవితో కూడుకొన్నవాడు; ఆతనిన్; వరింపన్= కోరటానికి; శచికిన్; చనున్= తగును; మహాత్మ!= మహానుభావా; తద్+చిత్తమున+అమర్షంబు= అతడి మనస్సునందలి కోపం; అడఁగన్= పోయేటట్లు; లోకహితంబు+కాఁగన్= లోకశ్రేయస్సు అయ్యేటట్లు; పుచ్చుము= పంపుము.

తాత్పర్యం: 'నహుషు డిప్పుడు మహేంద్ర పదవీ సమన్వితుడు. అతడిని వరించటం శచికి సముచితం. మహానుభావా! అతడి మనస్సులోని కోపం పోయేటట్లు, లోకాలకు మేలుకలిగేటట్లు ఆమెను పంపుము.'

క. అనవుడు శోకం బడరఁగ । ననిమిషగురుఁ జూచి యిట్టులను శచి 'యటుపు
చ్చిన దూఱు రాదె? నను శుచి । యని మీ కొనియాడు టెల్ల నన్నతము గాదే?'. 157

ప్రతిపదార్థం: అనవుడున్= అని దేవతలు, మునులనగా; శచి= శచీదేవి; శోకంబు= దుఃఖం; అడరఁగన్= పొంగిరాగా; అనిమిషగురున్= దేవతల గురువైన బృహస్పతిని; చూచి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నది; ననున్= నన్ను; అటు పుచ్చినన్= ఆ నహుషుడున్న చోటికి పంపితే; దూఱు-రాదె= అపనింద కలుగదా! (పాపం కాదా? దోషం పుట్టదా?); ననున్= నన్ను; శుచి= పవిత్రురాలు; అని= అంటూ; మీ కొనియాడుట+ఎల్లన్= మీ పొగడటమంతా; అనృతము+కాదే!= కల్లబొల్లి (అబద్ధం)కాదా?

తాత్పర్యం: దేవతలు ఆ విధంగా అనగానే శచీదేవి దుఃఖంతో తల్లడిల్లుతూ బృహస్పతితో ఇట్లా పలికింది. 'నన్ను మీరు నహుషుడి వద్దకు పంపితే దోషం కాదా? నిందరాదా? పాపంకాదా? మీ రందరూ ఇన్నాళ్ళబట్టి పవిత్రురాల నని నన్ను పొగడటమంతా కల్లబొల్లి మాటలేనా?

వ. అనిన విని దరహసితవదనుం డగుచుఁ బురుహూత పురోహితుండు. 158

ప్రతిపదార్థం: అనినన్= అని శచీదేవి పలుకగా; పురుహూత పురోహితుండు= ఇంద్రుడి గురువు బృహస్పతి; విని; దరహసిత వదనుండు+అగుచున్= చిరునవ్వుతోడి ముఖం కలవాడవుతూ.

తాత్పర్యం: అని శచీదేవి పలుకగా బృహస్పతి విని చిరునవ్వు నవ్వుతూ.

క. 'నహుషుండు పనుచువాఁ డటె! । విహితానుష్ఠానపరులు వీ రటె! తా లో
కహితం బటె! యిది మనకున్ । మహనీయమ కాక యెట్లు మానఁగవచ్చున్?' 159

ప్రతిపదార్థం: నహుషుండు; పనుచువాఁడు+అటె!= ఆజ్ఞాపించే వాడట!; వీరు= ఈ మునులు, వేల్పులు; విహిత+ అనుష్ఠానపరులు+అటె!= విధిని ఆచరించడంలో ఆసక్తి కలవారట!; తాన్= అది; లోకహితంబు+అటె!= లోకానికి మేలట!; ఇది; మనకున్; మహనీయము+అ కాక= గొప్పపనేకాక; ఎట్లు మానఁగన్+వచ్చున్?= ఎట్లా మానగలం?

తాత్పర్యం: 'నహుషుడు ఆజ్ఞాపించేవాడట! ఈ మునులు, వేల్పులు విధిని ఆచరించటంలో ఆసక్తి కలవారట! అది లోకానికి మేలు కూర్చేదట! ఇంతటి గొప్ప పనిని మనం చేయకుండా ఎట్లా ఉండగలం!'

విశేషం: బృహస్పతి వారి మాటలను విపరీత లక్షణచేత అధిక్షేపించటం గమనించతగింది.

వ. అని యుల్లసం బాడి యనిమిషులను ఋషులను జూచి యిట్లనియె. 160

ప్రతిపదార్థం: అని; ఉల్లసంబు+ఆడి= ఎత్తిపొడిచి; అనిమిషులను= దేవతలను; ఋషులను= మునులనూ; చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఎత్తిపొడిచి బృహస్పతి దేవతలనూ, మునులనూ చూచి ఇట్లా అన్నాడు.

తే. 'శరణు సొచ్చిన రక్షింపఁ జాలియుండి । కడపి పుచ్చిన నూర్ధ్వలోకములు దప్పుఁ,
బుణ్యకర్మంబు లఫలతఁ బొందు ననఁడె । కమలగర్భుండు దొల్లి జగద్ధితముగ?' 161

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; కమలగర్భుండు= బ్రహ్మ; జగత్+హితముగన్= లోకశ్రేయస్సుగా; శరణు+చొచ్చినన్= శరణని వస్తే; రక్షింపన్+చాలి+ఉండి= కాపాడగలిగి ఉండీ; కడపి పుచ్చినన్= పొమ్మని పంపేస్తే; ఊర్ధ్వ లోకములు= పైలోకాలు - పుణ్యలోకాలు; తప్పున్= ఉండవు; పుణ్యకర్మంబులు= పుణ్యకార్యాలు; అఫలతన్+పొందున్= ఫలించవు; అనఁడె?= అనలేదా?

తాత్పర్యం: 'పూర్వం బ్రహ్మ లోకశ్రేయస్సు కాంక్షించి, శరణన్న వారిని కాపాడగలిగి ఉండీ పొమ్మని పంపేస్తే పుణ్యలోకాలు ఉండవనీ, పుణ్యకార్యాలు ఫలించవనీ అనలేదా?'

వ. అని యనురూపాలాపంబుల నిషేధింప, వార 'లట్లేనిఁ గర్తవ్యం బెయ్యది యూహింపు' మనిన, 'నద్దేవి నహుషుకడకుం జని సముచితంబుగాఁ దదీయ సాంగత్యంబున కెడవలికికొని వచ్చునది; యటమీఁద మన మందఱముం బురందరున కభ్యుదయం బగుతెఱంగాచరించువార' మనుటయు, వాచస్పతి వచనంబులకు సంతసించి సుర సంయమి సంఘంబు లరిగిన యనంతరంబ. 162

ప్రతిపదార్థం: అని; అనురూప+ఆలాపంబులన్= తగిన మాటలతో; నిషేధింపన్= త్రోసిపుచ్చగా; వారలు= ఆ మునులూ, దేవతలూ; అట్లు+ఏనిన్= అట్లా అయితే; కర్తవ్యంబు= చేయదగినది; ఎయ్యది= ఏదో; ఊహింపుము= ఆలోచించుము; అనినన్; ఆ+దేవి= ఆ శచి; నహుషు కడకున్= నహుషుడి వద్దకు; చని= వెళ్ళి; సముచితంబుగాన్= తగిన విధంగా; తదీయ సాంగత్యంబునకున్= అతనితో కలయికకు; ఎడ+పలికికొని వచ్చునది= వ్యవధి కావాలని చెప్పి రావాలి; అట మీఁదన్= ఆపై; మనము+అందఱమున్= మనమంతా; పురందరునకున్= ఇంద్రుడికి; అభ్యుదయంబు+అగు తెఱంగు= శుభం కలిగే విధం; ఆచరించువారము= చేద్దాము; అనుటయున్= అనగానే; సుర సంయమి సంఘంబులు= దేవతల, మునుల సమూహాలు; వాచస్పతి వచనంబులకున్= బృహస్పతి మాటలకు; సంతసించి= సంతోషించి; అరిగిన+అనంతరంబు+అ= వెళ్ళిన వెంటనే.

తాత్పర్యం: అని తగిన మాటలతో త్రోసిపుచ్చగా, వారు 'అట్లా అయితే కర్తవ్యమేదో ఆలోచించుము' అనగా, 'ఆదేవి నహుషుడి వద్దకు వెళ్ళి తగినట్లుగా అతడితోడి కలయికకు వ్యవధి కావాలని అడిగి రావాలి. తరువాత మనమందరం ఇంద్రుడికి అభ్యుదయం కలిగే విధం చేద్దాం' అనగా, దేవతల మునుల సమూహాలు బృహస్పతి మాటలకు సంతోషించి వెళ్ళారు. వెంటనే.

క. పౌలోమియు నా నహుషుని । పాలికిఁ జనుటయు, నతండు భావజ వికృతి
వ్యాలోల మానసుం డయి । లీలా సంభావనా లలిత ముఖుఁ డయ్యెన్. 163

ప్రతిపదార్థం: పౌలోమియున్= శచీదేవియూ; ఆ నహుషుని పాలికిన్= ఆ నహుషుడి వద్దకు; చనుటయున్= వెళ్ళగా; అతండూ= ఆ నహుషుడు; భావజ వికృతి వ్యాలోల మానసుండు+అయి= మన్మథ వికారంచేత సంచలించిన మనస్సు కలవాడయి; లీలా సంభావనా లలిత ముఖుఁడు= విలాస భావాలతో అందమైన ముఖం కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: శచీదేవియూ ఆ నహుషుడి వద్దకు వెళ్ళగా, అతడు మన్మథ వికారంచేత సంచలించిన మనస్సు కలవాడయి, విలాస భావ సుందరమైన ముఖం కలవాడు అయ్యాడు.

వ. అట్టియెడ. 164

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఉ. అల్లన యింతి యిట్లనియె 'నారసి వాసవు కల్మిలేమియుం
దెల్లముగా నెఱింగికొని తేఁకువలే కిట వచ్చు టొప్పు; నా
యుల్లము శంకితం బగుచు నుండఁగ వేగిరపాటు మేలె? నీ
వెల్ల నెఱుంగు; దిప్పు డెడ యిచ్చుట యుక్తము నాకుఁ జూడఁగన్. 165

ప్రతిపదార్థం: ఇంతి= స్త్రీ - శచి; అల్లన= మెల్లగా; ఇట్లు+అనియెన్; వాసవు కల్మి లేమియున్= ఇంద్రుడు ఉండటం; లేకపోవటం; ఆరసి= విచారించి; తెల్లముగాన్= స్పష్టంగా; ఎఱింగికొని= తెలిసికొని; తేఁకువ లేక= భయం లేకుండా; ఇట వచ్చుట+ఒప్పున్= ఇక్కడికి రావటం బాగుంటుంది; నా ఉల్లము= నా మనస్సు; శంకితంబు+అగుచున్+ఉండఁగన్= సందేహంతో భయపడుతూ ఉండగా; వేగిరపాటు= తొందరపడటం; మేలె?= మంచిదా?; నీవు; ఎల్లన్= అంతా; ఎఱుంగుదు(వు); నాకున్; చూడఁగన్; ఇప్పుడు; ఎడ= వ్యవధి; ఇచ్చుట; యుక్తము= మంచిది.

తాత్పర్యం: శచి అతనితో మెల్లగా ఇలా అన్నది. 'ఇంద్రుడు ఉన్నాడో లేడో బాగా విచారించి స్పష్టంగా తెలిసికొని నిర్భయంగా ఇక్కడికి రావటం బాగుంటుంది. నా మనస్సు శంకతో జంకుతూ ఉండగా తొందరపడటం మేలా? నీకంతా తెలుసు. ఇప్పుడు నాకు వ్యవధి ఇవ్వటం మంచిదని నా అభిప్రాయం'.

వ. అని యొడంబఱిచి కొండొకకాలం బెడ వలికికొని యింద్రాణియు మగుడం జనుదెంచె; నమరగణంబును మునిజన సహితంబుగ విష్ణుదేవు పాలికి రహస్యవృత్తిం బోయి, జిష్ణుని దురితంబు వాపుటఁ గోరిన, శౌరి కరుణాయత్తచిత్తుండై. 166

ప్రతిపదార్థం: అని; ఒడంబఱిచి= సమ్మతింపజేసి; కొండొక కాలంబు= కొంతకాలం; ఎడ+పలికికొని= వ్యవధి నడుగుకొని; ఇంద్రాణియున్= శచీదేవియు; మగుడన్+చనుదెంచెన్= మరలి వచ్చింది; అమర గణంబులును= దేవతా సమూహాలునూ; ముని జన సహితంబుగన్= మునిజనులతో కూడా; విష్ణుదేవు పాలికిన్= విష్ణుదేవుడి వద్దకు; రహస్య వృత్తిన్= రహస్య వ్యాపారంతో; పోయి; జిష్ణుని దురితంబు= ఇంద్రుడి బ్రహ్మహత్యాపాపం; పాపుటన్= పోగొట్టటం; కోరినన్= కోరగా; శౌరి= విష్ణుడు; కరుణా+ఆయత్తచిత్తుండు+ఐ= దయకు అధీనమైన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: అని ఒప్పించి కొంతకాలం వ్యవధి అడిగి శచి తిరిగి వచ్చింది. దేవతలు మునులతో కూడా రహస్యంగా విష్ణుమూర్తి వద్దకు వెళ్ళి ఇంద్రుడి పాపం పోగొట్టుమని కోరగా, విష్ణువు దయాధీన మనస్కుడయి.

క. 'హయమేధంబున నాకుం । బ్రియ మొనరింపంగ వృత్రభేదికిఁ బుణ్యో
దయ మగు' నావుడు వారలు । రయమునఁ జని రందఱుం బురందరు కడకున్. 167

ప్రతిపదార్థం: హయమేధంబునన్= అశ్వమేధయాగంచేత; నాకున్; ప్రియము+ఒనరింపంగన్= సంతోషం కలిగిస్తే; వృత్ర భేదికిన్= ఇంద్రుడికి; పుణ్య+ఉదయము+అగున్= పుణ్యం కలుగుతుంది; నావుడున్= అనగానే; వారలు; అందఱున్; పురందరు కడకున్= ఇంద్రుడి దగ్గరకు; రయంబునన్= వేగంగా; చనిరి= వెళ్లారు.

తాత్పర్యం: 'అశ్వమేధయాగం చేసి నాకు ప్రీతి కలిగిస్తే ఇంద్రుడికి పుణ్యం లభిస్తుంది' అనగానే వారందరూ ఇంద్రుడి దగ్గరకు వేగంగా వెళ్ళారు.

ఇంద్రుండు నహుషు తేజోవిశేషంబు సూచి మఱుఁగువడుట (సం. 5-13-16)

క. చని యతని నశ్వమేధం । బునఁ గల్మషరహితుఁ జేయఁ బురుహూతుండుం
దన పురికి నరిగి నహుషుం । గని తత్తేజోవిశేషకంపితుఁ డయ్యెన్. 168

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అతనిన్; అశ్వమేధంబునన్= అశ్వమేధ యాగంచేత; కల్మషరహితున్+చేయన్= నిష్పాపుడిని చేయగా; పురుహూతుండున్= ఇంద్రుడునూ; తన పురికిన్= తన పట్టణానికి; అరిగి= వెళ్ళి; నహుషున్+కని= నహుషుడిని చూచి; తద్+తేజస్(ః)+విశేష కంపితుఁడు= అతడి తేజస్సు యొక్క ఆధిక్యంచేత చలించినవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: వెళ్ళి, అతడిని అశ్వమేధయాగంచేత పాపరహితుడిని చేయగా, ఇంద్రుడు తన పట్టణానికి వెళ్ళి, నహుషుడిని చూచి అతని తేజోవిశేషానికి భయకంపితుడయ్యాడు.

వ. ఇట్లు వృత్రారి తన బ్రహ్మహత్య వాయుటయేకాని నహుషునంత బలంబు లేమింజేసి భయా కులితచిత్తుండై. 169

ప్రతిపదార్థం: ఇట్లు; వృత్ర+అరి= వృత్రుని శత్రువు - ఇంద్రుడు; తన బ్రహ్మహత్య= తన బ్రహ్మహత్యాపాపం; పాయుటయే కాని= పోగొట్టుకొనటమే కాని; నహుషు+అంత బలంబు= నహుషుడిబలం అంతబలం; లేమిన్+చేసి= లేకపోవటంచేత; భయ+ఆకులిత చిత్తుండు+ఐ= భయంచేత కలతచెందిన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: ఈ విధంగా ఇంద్రుడు తన బ్రహ్మహత్యాపాతకం పోగొట్టుకొనటమేకాని, నహుషుడి కున్నంత బలం తనకు లేకపోవటంచేత భయంతో కలతచెందిన మనస్సు కలవాడై.

క. ఎందేనిఁ జనియె నాతని । సుందరియును నెమ్మనమున శోకోద్రేకం
బొంది 'పురందరుఁ డరిగిన । కందువ యే నిప్పు డెట్లు గాంతునొ?' యనుచున్. 170

ప్రతిపదార్థం: ఎందున్+ఏనిన్= ఎక్కడికో; చనియెన్= వెళ్ళాడు; ఆతని సుందరియును= ఆతని భార్యయైన శచియు; నెఱ+మనమునన్= నెమ్మదిలో; శోక+ఉద్రేకంబు= దుఃఖాతిశయం; ఒంది= పొంది; పురందరుఁడు= ఇంద్రుడు; అరిగిన కందువ= వెళ్ళినచోటు; ఏను= నేను; ఇప్పుడు; ఎట్లు; కాంతునొ?= కనుగొంటానో?; అనుచున్.

తాత్పర్యం: ఎక్కడికో వెళ్ళాడు. అతడి భార్యఅయిన శచీదేవి తన మనస్సులో దుఃఖాతిశయం పొంది 'ఇంద్రుడు వెళ్ళిన చోటు నే నిప్పు డెట్లా తెలిసికొంటానో అని అనుకొంటూ.

వ. నిశాసమయంబున నుపశ్రుతి నారాధించినఁ దదీయాధి దేవత 'నీ సత్యంబువలన నీ మగనిం గను'దని చెప్పి, యనంతరంబ సాకారయై పొడసూపినఁ బౌలోమి 'నీవెవ్వ?'రవని యడిగిన, నదియును 'భవత్పాతివ్రత్య సత్య శౌచంబులకుఁ బ్రియంబంది వచ్చితి; నుపశ్రుతి' నని చెప్పి, 'నీకుం బాకశాసనుం జూపెదర'మ్మని తోడ్కొని హిమవంతంబు నుత్తరంబున మంజుమంతంబను మహాశైలంబున కరిగి, దానియందు శతయోజన విస్తీర్ణంబైన యొక్క సరోవరంబు సొచ్చి, యచ్చట నుల్లసిల్లు పంచవర్ణ కమనీయంబులగు కమలంబులలో నొక్క నాళంబు భేదించి, ముందటఁ బ్రవేశించె; నింద్రాణియుం దోడన చని తదీయ తంతుమధ్యంబున సూక్ష్మరూపంబున నున్న సురపతిం గన్నంత, నయ్యుపశ్రుతి యదృశ్యం బగుటయు. 171

ప్రతిపదార్థం: నిశా సమయంబునన్= రాత్రివేళ; ఉపశ్రుతిన్= పలుకుల ద్వారా శుభాశుభాలను సూచించే దేవతను; ఆరాధించినన్= పూజించగా; తదీయ+అధిదేవత= ఆ ఉపశ్రుతికి సంబంధించిన అధిష్ఠానదేవత; నీ సత్యంబు వలనన్; నీ మగనిన్ కనుదు(వు)+అని చెప్పి= చూస్తావని చెప్పి; అనంతరంబు+అ= వెంటనే; స+ఆకార+ఐ= రూపంతో కూడినదై; పొడసూపినన్= ప్రత్యక్షంకాగా; పౌలోమి= శచి; నీవు+ఎవ్వరవు+అని+అడిగినన్= అదియును; భవత్+పాతివ్రత్య, సత్య, శౌచంబులకున్= నీ పాతివ్రత్యానికీ, సత్యానికీ, శుచిత్వానికీ; ప్రియంబు+అంది= సంతోషించి; వచ్చితిన్; ఉపశ్రుతిన్; అని చెప్పి; నీకున్; పాకశాసనున్= ఇంద్రుడిని; చూపెదన్, రమ్ము+అని= చూపిస్తారు రా అని; తోడ్కొని= వెంటబెట్టుకొని; హిమవంతంబు+ఉత్తరంబునన్= హిమవత్పర్వతానికి ఉత్తరంగా; మంజుమంతంబు+అను; మహత్ (మహా) శైలంబునకున్= మంజుమంతమనే పెద్ద పర్వతం దగ్గరకు; అరిగి= వెళ్ళి; దానియందున్; శత యోజన విస్తీర్ణంబు+ఐన= నూ రామడల వైశాల్యం కల; ఒక్క సరోవరంబు+చొచ్చి= ఒక కొలనిలో ప్రవేశించి; అచ్చటన్; ఉల్లసిల్లు= వికసించే; పంచ వర్ణ కమనీయంబులు+ అగు= అయిదు రంగులచేత అందమైనవగు; కమలంబులలోన్= పద్మాలలో; ఒక్క నాళంబున్= ఒక కాడను; భేదించి= చీల్చి; ముందటన్= ముందుగా; ప్రవేశించెన్; ఇంద్రాణియున్= శచీదేవియు; తోడన్+అ= వెంటనే; చని; తదీయ తంతు మధ్యంబున= దాని సూత్రం నడుమ; సూక్ష్మ రూపంబునన్= సూక్ష్మాకారంతో; ఉన్న; సురపతిన్= ఇంద్రుడిని, కన్న+అంతన్= చూచిన తరువాత; ఆ+ఉపశ్రుతి; అదృశ్యంబు+అగుటయున్= మాయం కాగా.

తాత్పర్యం: రాత్రివేళ ఉపశ్రుతిని పూజించగా, దాని అధిష్ఠాన దేవత 'నీ సత్యం వల్ల నీవు నీ భర్తను చూస్తా' వని చెప్పి, వెంటనే నిజాకారంతో ప్రత్యక్షం కాగా, శచీదేవి 'నీవెవ్వరవు?' అని అడిగింది. అది 'నేను ఉపశ్రుతిని. నీ పాతివ్రత్యానికీ శుచిత్వానికీ సంతోషించి వచ్చాను' అని చెప్పి, 'నీకు ఇంద్రుడిని చూపిస్తాను, రా' అని వెంట బెట్టుకొని హిమవంతానికి ఉత్తరంగా ముంజుమంత మనే పెద్ద పర్వతం వద్దకు వెళ్ళి, దానియందు నూరామడల

వైశాల్యంకల ఒక కొలనిలో ప్రవేశించి, అక్కడ వికసించిన అయిదు రంగుల సుందర పద్మాలలో ఒకదాని కాడను చీల్చి తాను ముందు ప్రవేశించింది. శచీదేవి కూడా వెంటనే వెళ్ళి దాని దారాల నడుమ సూక్ష్మరూపంతో ఉన్న ఇంద్రుడిని చూచింది. వెంటనే ఆ ఉపశ్రుతి మాయమైపోయింది.

విశేషం: భవత్పాతివ్రత్య శౌచంబులకు - అని వావిళ్ళవారి ప్రతి. 'ముంజివంత'మని మున్నంగి శర్మ పరిష్కృతమైన ప్రతిలోను, తెలుగు విశ్వవిద్యాలయప్రతిలోను ఉండగా, మంజుమంతమని వావిళ్ళ ప్రతి. ఔత్తరాహ దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతులలో దేనిలోనూ ఆ పర్వతం పేరే లేదు. పైగా మూలంలో శచి హిమవంతం దాటి ఉత్తర పార్శ్వానికి వెళ్ళి, బహుయోజన విస్తృతమైన సముద్రాన్నీ, అందులో ఒక మహాద్వీపాన్నీ, అక్కడ నానా పక్షి సమన్వితమైన ఒక సరస్సునూ చూచినట్లు ఉన్నది.

'హిమవన్త మతిక్రమ్య ఉత్తరం పార్శ్వ మాగమత్,
సముద్రం చ సమాసాద్య బహు యోజన విస్తృతమ్.
ఆససాద మహాద్వీపం నానాద్రుమ లతా యుతమ్,
తత్రాపశ్యత్ సరో దివ్యం నానా శకునిభిర్యుతమ్. (ఉద్యోగ. 15-6,7.)

క. పతిసన్నిధి వడసి మహా । ద్భుత మందెడు శచి తదీయ పూర్వ సుకర్మ
స్తుతి సేయుచు నిలిచిన, నతఁ । డతివం గని సంభృతాదరాత్ముం డగుచున్. 172

ప్రతిపదార్థం: పతి సన్నిధి+పడసి= భర్త సన్నిధిని పొంది; మహత్(మహా)+అద్భుతము+అందెడు శచి= మిక్కిలి ఆశ్చర్యపడే శచి, తదీయ పూర్వ సుకర్మ స్తుతి+చేయుచున్= ఆతడి వెనుకటి మంచి పనుల పొగడ్త చేస్తూ; నిలిచినన్= ఉండగా; అతఁడు; అతివన్= స్త్రీని-భార్యను; కని, సంభృత+ఆదర+ఆత్ముండు+అగుచున్= సంపూర్ణమైన ఆదరంతో కూడిన మనస్సు కలవాడవుతూ.

తాత్పర్యం: భర్త సమీపానికి వెళ్ళిన శచీదేవి మిక్కిలి ఆశ్చర్యపడుతూ అతడి వెనుకటి సత్కర్మలను పొగడుతూ ఉండగా, అతడు భార్యను చూచి మిక్కిలి ఆదరంతో కూడిన మనస్సు కలవాడై.

ఉ. 'ఇచ్చట నేను నిల్చు టిది యెట్టు లెఱింగితి? నన్నుఁ గాన నీ
వచ్చిన కార్య మేమి? యనవద్యగుణోత్తర ! చెప్పు' నావుడుం
బొచ్చెము లేక యా నహుషు పోయిన పోకలు, వానికిం దగం
జెచ్చెరఁ గాలయాపనము సేసిన భంగియుఁ జెప్పె దేవియున్. 173

ప్రతిపదార్థం: అనవద్య గుణ+ఉత్తర!= అనింద్యాలైన గుణాల చేత శ్రేష్ఠురాలా! శచీ!; నేను; ఇచ్చటన్; నిల్చుట+ఇది; ఎట్టులు+ఎఱింగితి(వి); నన్నున్; కానన్= చూడడానికి; నీ వచ్చిన కార్యము+ఏమి= నీవు వచ్చిన పని యేమిటి? చెప్పు(ము); నావుడున్= అనగానే; దేవియున్= శచీదేవియూ; ఆ నహుషు పోయిన పోకలున్= ఆ నహుషుడు ప్రవర్తించిన విధమూ; వానికిన్; తగన్= ఒప్పుగా, చెచ్చెరన్= శీఘ్రంగా; కాలయాపనము+చేసిన భంగియున్= కాలక్షేపం చేసిన విధమూ; పొచ్చెము లేక= కొరత లేకుండా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: 'గుణవతులలో ఉత్తమురాలా! శచీ! నే నిక్కడ ఉన్నట్లు నీ కెలా తెలిసింది? నీవు నన్ను చూడవచ్చిన పనేమి? చెప్పుము' అనగానే శచీదేవి ఆ నహుషుడు పోయిన పోకడలూ, వాటికి ఒప్పుగా వెంటనే కాలక్షేపం చేసిన విధమూ పొల్లుపోకుండా చెప్పింది.

వ. చెప్పి, యుపశ్రుతి తెఱంగును నతని కెఱింగించి 'దేవా! నీ విత్తఱిం బ్రకాశుండవై, భవత్ప్రతాపంబున నహుషునకుఁ బరాభవం బొనరించి నన్ను రక్షింపక తక్కిన, నుక్కివుండగు నతని పాప నిశ్చయంబున నాపద వచ్చు' ననిన విని వల్లభకు దివిజవల్లభుం డిట్లనియె. 174

ప్రతిపదార్థం: చెప్పి; ఉపశ్రుతి తెఱంగును= ఉపశ్రుతి విధమూ; అతనికిన్; ఎఱింగించి= తెలిపి; దేవా!; నీవు; ఈ+తఱిన్= ఈ సమయంలో; ప్రకాశుండవు+ఐ= బయటపడి; భవత్+ప్రతాపంబునన్= నీ పరాక్రమం చేత; నహుషునకున్; పరాభవంబు= అవమానం; ఒనరించి= చేసి; నన్నున్; రక్షింపక తక్కినన్= కాపాడకపోతే; ఉక్కివుండు+అగు= కపటి అయిన; అతని పాప నిశ్చయంబునన్= అతని దుష్ట నిర్ణయం చేత; ఆపద వచ్చున్= కష్టం కలుగుతుంది; అనినన్; విని; దివిజ వల్లభుండు= దేవరాజు- ఇంద్రుడు; వల్లభకున్= భార్యకు - శచికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ రీతిగా చెప్పి, ఉపశ్రుతి వృత్తాంతం కూడా అతడికి తెలిపి, 'దేవా! నీ విప్పుడు వెలువడి నీ ప్రతాపంచేత నహుషుడిని అవమానించి నన్ను రక్షించకపోతే, వంచకుడైన అతడి దుష్ట నిర్ణయం చేత ఆపద సంభవిస్తుంది' అనగా విని ఇంద్రుడు భార్యతో ఇట్లా అన్నాడు.

క. 'ఆ నహుషు బాహుగర్వ మ । నూనంబై యున్నయది సముజ్జ్వల ముని స
మ్మాన ప్రవృద్ధ మగుటను; । దానం గాలంబు వేచెదను జయమునకున్. 175

ప్రతిపదార్థం: ఆ నహుషు బాహు గర్వము= ఆ నహుషుడి భుజబల గర్వం; సముజ్జ్వల ముని సమ్మాన ప్రవృద్ధము= మిక్కిలి ప్రకాశించే మునుల ఆదరంచేత ఎక్కువగా వృద్ధి పొందింది; అగుటన్= అవటం చేత; అనూనంబు+ఐ+ఉన్న+అది= అనల్పంగా ఉన్నది; దానన్= అందుచేత; జయమునకున్= విజయానికి; కాలంబు వేచెదను= సమయం కనిపెట్టుకొని ఉంటున్నాను.

తాత్పర్యం: 'ఆ నహుషుడి భుజబలగర్వం మునుల సముజ్జ్వలమైన ఆదరంచేత వృద్ధి పొంది ఉండటం చేత అనల్పంగా ఉన్నది. అందుచేత అతడిని జయించటానికి కొంతకాలం వేచి ఉన్నాను.'

చ. తఱి యగు నంతకున్ రిపునుదగ్రత సైఁచుట నీతి; నీవు నా
కఱపిన యట్ల చేయుము; తగం జని యాతనిఁ గాంచి 'నన్ను నె
త్తెఱఁగుననైనఁ బొందఁగ మదిం దలపోఁతయ కల్గెనేనిఁ గ్ర
చ్చఱ 'మునివర్గ వాహనుఁడవై చనుదె' మ్మను; మంతఁ దీఱెడున్. 176

ప్రతిపదార్థం: తఱి+అగు+అంతకున్= సమయం అయ్యేదాకా; రిపు+ఉదగ్రతన్= శత్రువుయొక్క ఉద్ధతిని; సైఁచుట= సహించటం; నీతి; నీవు; నా కఱపిన+అట్లు+అ= నేను చెప్పినట్లే; చేయుము; తగన్= ఒప్పుగా; చని; అతనిన్; కాంచి= చూచి; నన్నున్; ఏ+తెఱఁగునన్+ఐనన్= ఏ విధంగా నైనా; పొందఁగన్= కూడటానికి; మదిన్= మనస్సులో; తలపోఁత+అ= ఉద్దేశమే;

కల్గెన్+ఏనిన్= ఉంటే; క్రచ్చు+అఱన్= శీఘ్రంగా; మునివర్గ వాహనుఁడవు+ఐ= మునుల సమూహం వాహనంగా కలవాడవయి; చనుదెమ్ము= రమ్ము; అనుము; అంతన్+తీఱెడున్= దానితో సమసిపోతాడు, ఆపదతీరిపోతుంది.

తాత్పర్యం: 'సమయం వచ్చేదాకా శత్రుడి ఉద్ధతిని సహించి ఉండటం రాజనీతి; నీవు నేను చెప్పినట్లే చేయుము. నీవు ఒప్పుగా అతడిని చూచి 'నన్ను ఎట్లా అయినా పొందడానికే నీకు ఉద్దేశం ఉంటే, నీవు వెంటనే మునుల సమూహాన్ని వాహనం చేసికొని నా దగ్గరికి రమ్ము అనుము. దానితో వాడి పని అయిపోతుంది.

ఆ. **అనిన 'నట్ల కాక' యని పతి వీడ్కొని, । యింతి నహుషుపాలి కేఁగుదెంచె;**
నతఁడు దమక మడర నద్దేవిఁ బెద్దయు । నాదరించి యిష్ట మడుగుటయును. 177

ప్రతిపదార్థం: అనినన్; అట్లు+అ+కాక= అట్లాగే; అని; పతిన్= భర్తను; వీడ్కొని= విడిచి; ఇంతి= స్త్రీ - శచి; నహుషు పాలికిన్= నహుషుడి దగ్గరకు; ఏఁగుదెంచెన్= వచ్చింది; అతఁడు= నహుషుడు; తమకము= మోహం; అడరన్= అతిశయించగా; ఆ+దేవిన్= ఆ శచీదేవిని; పెద్దయున్= మిక్కిలి; ఆదరించి= సంభావించి; ఇష్టము+అడుగుటయును= కోరిక అడగ్గా.

తాత్పర్యం: అనగా 'అట్లాగే' అని భర్త దగ్గర సెలవుపుచ్చుకొని, శచీదేవి నహుషుడి దగ్గరకు వచ్చింది. నహుషుడు మోహం అతిశయించగా శచీదేవిని ఎంతో ఆదరించి తనపట్ల ఆమెకు గల కోరికను గురించి అడుగగా.

వ. **ఇంద్రాణియు నిట్లనియె: 'మన నిరూపించిన సమయంబునకుఁ గొండొక తడవు గలదు. కాలం బగుటయు నిన్ను వరియించెద; నీవు మహాముని వాహనుండవు గావలయు. అది నాకుఁ బ్రియంబు; నీకు ననన్య సామాన్యం బైన యానంబు తేజోవిశేషకరం బగు' ననిన, నప్పలుకులకు నహుషుండు ప్రహర్షచిత్తుండై. 178**

ప్రతిపదార్థం: ఇంద్రాణియున్= శచీదేవియూ; ఇట్లు+అనియెన్; మన నిరూపించిన సమయంబునకున్= మనం నిర్ణయించుకొన్న సమయానికి; కొండొక తడవు= కొంచెం వ్యవధి; కలదు; కాలంబు+అగుటయున్= సమయం కాగానే; నిన్నున్; వరియించెదన్= కోరతాను; నీవు; మహత్(మహా)+ముని వాహనుండవు కావలయున్= నీవు మహర్షులు వాహనంగా కలవాడవు కావాలి; అది; నాకున్; ప్రియంబు= ఇష్టం; నీకున్; అనన్య సామాన్యంబు+ఐన యానంబు= ఇతరులకు ఎవ్వరికీలేని వాహనం; తేజస్(ః)+విశేషకరంబు+అగున్= తేజస్సును అధికం చేసేది అవుతుంది. అనినన్; ఆ+పలుకులకున్= ఆ మాటలకు; నహుషుండు; ప్రహర్షచిత్తుండు+ఐ= మిక్కిలి సంతోషించిన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: శచీదేవి ఇట్లా అంది. 'మనం ఏర్పరుచుకొన్న సమయానికి ఇంకా కొంచెం వ్యవధి ఉన్నది. సమయం అయినప్పుడు నిన్ను వరిస్తాను. నీవు మహర్షులు వాహనంగా కలవాడవు కావాలి. అది నాకు ఇష్టం. ఎవరికీ లేని వాహనం నీకు తేజస్సును వృద్ధి పొందిస్తుంది.' అనగా, ఆ మాటలకు నహుషుడు మిక్కిలి సంతోషించిన మనస్సు కలవాడయి.

ఆ. **'ఏను దక్క నొరుల కెవ్వరికైన న । వ్వాహనంబు నెక్క వశమె? నీకు**
సమ్మతంబు గాఁగ సప్తర్షిగణము నా । యందలంబు మోవ నరుగుదెంతు.' 179

ప్రతిపదార్థం: ఏను+తక్కన్= నేను తప్ప; ఒరులకున్+ఎవ్వరికిన్+ఐనన్= ఇతరుల కెవరికైనా; ఆ+వాహనంబున్= ఆ వాహనాన్ని; ఎక్కన్+వశమె= ఎక్క తరమా? నీకున్; సమ్మతంబు+కాఁగన్= నీకు ఇష్టం అయ్యేటట్లు; సప్త+ఋషి గణము= ఏడుగురు మునుల సమూహం; నా+అందలంబున్= నా పల్లకీని; మోవన్= మోయగా; అరుగుదెంతున్= వస్తాను.

తాత్పర్యం: 'నేను తప్ప ఇతరుల కెవ్వరికైనా అటువంటి వాహనం ఎక్కటానికి సాధ్యమవుతుందా? నీకు ఇష్టం అయ్యేటట్లు సప్తర్షులు నా పల్లకీ మోస్తూండగా వస్తాను.'

క. **అని వనితఁ బంచి, యప్పుడ । మునులం బిలిపించి; మౌర్ఖ్యమునఁ దనకున్ వా**
హనముగఁ జేసి, యొకింతయు । ననుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలన్. **180**

ప్రతిపదార్థం: అని; వనితన్= స్త్రీని (శచిని); పంచి= పంపి; అప్పుడు+అ= వెంటనే; మునులన్; పిలిపించి; మౌర్ఖ్యమునన్= మూర్ఖత్వంతో; తనకున్; వాహనముగన్= వాహనంగా (పల్లకీ మోసేవారినిగా); చేసి; ఒక+ఇంతయున్= ఇంచుకైనా; అనుమానము లేక= సంకోచం లేకుండా; అతఁడు; ఎల్ల+ఎడలన్= అన్ని చోట్లా; తిరిగెన్.

తాత్పర్యం: అని శచిని పంపివేసి వెంటనే అతడు మునులను పిలిపించి, మూర్ఖత్వంతో వారిని తనకు వాహనంగా (వాహకులుగా) చేసికొని, కొంచెం కూడా సంకోచం లేకుండా అన్ని చోట్లా తిరిగాడు.

క. **చని పౌలోమియు సురగురుఁ । గని 'నహుషుడు వేచియున్నకాలం బెడ లే;**
దనిమిషనాథున కిత్తఱి । ననుగ్రహము సేయవలయు నవహితబుద్ధిన్. **181**

ప్రతిపదార్థం: పౌలోమియున్= శచీదేవియు; చని; సురగురున్= దేవగురుడిని-బృహస్పతిని; కని; నహుషుఁడు; వేచి+ఉన్న కాలంబు= ఎదురు చూచే సమయం; ఎడ లేదు= దూరం లేదు; అనిమిషనాథునకున్= దేవేంద్రుడికి; ఈ+తఱిన్= ఇప్పుడు; అవహిత బుద్ధిన్= ఏకాగ్రమైన మనస్సుతో; అనుగ్రహము+చేయవలయున్= అనుగ్రహం చూపాలి.

తాత్పర్యం: శచీదేవి వెళ్ళి బృహస్పతిని చూచి 'నహుషుడు ఎదురు చూచే సమయం ఇంకెంతో దూరంలో లేదు. ఈ సమయంలో ఏకాగ్రమైన మనస్సుతో ఇంద్రుడిని అనుగ్రహించాలి.

వ. **శరణాగతనైన నన్ను రక్షింపు, మనిన నతం డిట్లనియె.** **182**

ప్రతిపదార్థం: శరణ+ఆగతన్+ఐన నన్నున్= శరణు కొరకు వచ్చిన నన్ను రక్షింపుము; అనినన్; అతండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: శరణు కోరి వచ్చిన నన్ను రక్షించాలి' అనగా బృహస్పతి ఇట్లా అన్నాడు.

క. **'ఆ నహుషువలన నాపద । రా నీ; నాతనికి నాతురత గావింపం**
బూని యొనర్చెద వేలిమి । దానను మునివాహనత గతస్థైర్యుఁ డగున్. **183**

ప్రతిపదార్థం: ఆ నహుషు వలనన్= ఆ నహుషుడి నుండి; ఆపద; రానీను= రానివ్వను; ఆతనికిన్; ఆతురత= పీడ; కావింపన్= కలిగించటానికి; పూని= ప్రయత్నించి; వేలిమి= హోమం; ఒనర్చెదన్= చేస్తాను; దానను= ఆ హోమంచేతనూ; ముని వాహనతన్= మునులు వాహనంగా కలవాడవటం చేతా, గత స్థైర్యుఁడు+అగున్= పోయిన నిలకడ కలవాడవుతాడు.

తాత్పర్యం: 'ఆ నహుషుడి వలన నీకు ఆపద రానివ్వను; అతడికి ఆపద కలిగేటట్లు నేను ప్రయత్నించి హోమం చేస్తాను. దానివలనా, మునివాహనత్వం వలనా అతడు నిలకడ కోల్పోతాడు.'

క. వెరవున నీ పతి యునికియు । నరసెద'నని యూరడించి, యప్పుడ వైశ్వా
నరు నర్చితుఁ జేసి, పురం । దరు తెఱఁగుం జెప్పి యతనిఁ దడవం బనిచెన్. 184

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; నీ పతి+ఉనికియున్= నీ భర్త ఉనికినీ; అరసెదన్= చూస్తాను; అని; ఊరడించి= ఓదార్చి; అప్పుడు+అ= వెంటనే; వైశ్వానరున్= అగ్నిని; అర్చితున్+చేసి= పూజించి; పురందరు తెఱఁగున్= ఇంద్రుడి విధం; చెప్పి; అతనిన్= ఇంద్రుడిని; తడవన్= వెదకడానికి; పనిచెన్= పంపాడు.

తాత్పర్యం: 'ఉపాయంతో నీ భర్త ఉన్న చోటు చూస్తాను' అని ఊరడించి, వెంటనే అగ్నిదేవుడిని పూజించి, ఇంద్రుడి వృత్తాంతం చెప్పి, అతడిని వెదకడానికి పంపాడు.

అగ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట (సం. 5-15-27)

వ. పనిచిన వహ్నియు వనితా రూపంబునం జని మనోగతి యగుటంజేసి సర్వదిశలును, భూమ్యంతరిక్షంబులును, గిరివిపినంబులును గొండొక సేపునకుం గలయం జూచి, సంక్రందను నెందునుం గానక మగిడి వచ్చి, వాచస్పతికి నత్తెఱం గెఱింగించి, 'నాకు జలంబులు ప్రవేశింపరామి నంద పరికింపనేరనైతి; నప్పుల వలన నగ్నియు, బ్రాహ్మణుల వలన క్షత్రియ జాతియు, నశ్మంబుల వలన లోహంబును నుద్భవించె; వాని వాఁడిమి యెల్లయెడలనుంజెల్లుఁ; దమ తమ జన్మస్థానంబులయం దడంగుం, గావున నీళ్లు నాకు సంక్షయంబు సేయుట సుప్రసిద్ధం' బనిన విని యనిమిష గురుండు హవ్యవాహను నత్యంత గౌరవంబునం గనుంగొని. 185

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; వహ్నియున్= అగ్నియూ; వనితా రూపంబునన్= స్త్రీరూపంలో; చని= వెళ్ళి; మనస్(ః)గతి+అగుటన్+చేసి= మనోవేగం కలవాడవటం చేత, సర్వ దిశలును= అన్ని దిక్కులూ; భూమి+అంతరిక్షంబులును= భూమీ, ఆకాశమూ; గిరి విపినంబులును= కొండలూ, అడవులూ; కొండొక సేపునకున్= కొంచెం సేపటిలో; కలయన్+చూచి= అంతటా చూచి; సంక్రందనున్= ఇంద్రుడిని; ఎందునున్= ఎక్కడా; కానక= చూడక; మగిడి వచ్చి= తిరిగి వచ్చి; వాచస్పతికిన్= బృహస్పతికి; ఆ+తెఱంగు+ఎఱింగించి= ఆ విధం చెప్పి; నాకున్; జలంబులు= నీళ్ళు; ప్రవేశింపన్+రామిన్= ప్రవేశించలేకపోవటం చేత; అందున్+అ= అందులోమాత్రమే; పరికింపన్+నేరన్+ఐతిన్= చూడలేకపోయాను; అప్పుల వలనన్= నీళ్లనుంచి, అగ్నియున్; బ్రాహ్మణులవలనన్; క్షత్రియ జాతియున్; అశ్మంబుల వలనన్= రాళ్ల వలన; లోహంబును; ఉద్భవించెన్= పుట్టాయి; వాని వాఁడిమి= వాటి ప్రతాపం; ఎల్ల+ఎడలన్= అన్ని చోట్లా; చెల్లున్= చెల్లుతుంది; తమ తమ జన్మ స్థానంబులయందున్= తమ తమ పుట్టిన చోట్ల; అడంగున్= నశిస్తుంది; కావునన్; నీళ్ళు నాకున్; సంక్షయంబు+ చేయుట= నాశనం కలిగించటం; సుప్రసిద్ధంబు= బాగా తెలిసినదే; అనినన్; విని; అనిమిష గురుండు= దేవ గురువు - బృహస్పతి; హవ్యవాహనున్= అగ్నిని; అత్యంత గౌరవంబునన్= మిక్కిలి గౌరవంతో; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఆ విధంగా బృహస్పతి పంపగా, అగ్ని స్త్రీవేషం ధరించి వెళ్ళి, మనోవేగం కలవాడవటం చేత అన్ని దిక్కులూ, భూమ్యాకాశాలూ, కొండలూ, అడవులూ కొంచెం సేపటిలోనే కలయజూచి, ఇంద్రుడిని ఎక్కడా కానక

తిరిగి వచ్చి, బృహస్పతికి ఆ విధం చెప్పి, 'నాకు నీళ్ళల్లో ప్రవేశించటానికి అలవి కాకపోవటం చేత అందులో మాత్రం వెదకలేకపోయాను. నీళ్ళ వలన నిప్పూ, బ్రాహ్మణులవల్ల క్షత్రియులూ; రాళ్ళవలన లోహమూ పుట్టాయి. వాటి ప్రతాపం అన్ని చోట్లా చెల్లుతుంది కాని, తమ తమ పుట్టిన చోట్ల మాత్రం నశిస్తుంది. కాబట్టి నీళ్ళు నాకు నాశనం కలిగించటం మిక్కిలి ప్రసిద్ధమైనదే' అనగా విని బృహస్పతి అగ్నిదేవుడిని మిక్కిలి గౌరవంతో చూచి.

మ. 'సకల స్థావర జంగమంబులు భవత్సాన్నిధ్యమాత్రంబునన్
వికసిల్లుం; గ్రతు వైభవంబులుఁ, జతుర్వేదంబులున్ నీవ; పా
వక! నీయంద జలంబులుం గలిగె; విశ్వవ్యాప్తిమై నున్ననీ
కొకచో టెట్టు లగమ్య మయ్యెఁ? నిను నీ వూహింపు పెంపారఁగన్. 186

ప్రతిపదార్థం: పావక!= అగ్నిదేవా!; సకల స్థావర జంగమంబులు= ఎల్ల అచరాలూ; చరాలూ; భవత్+సాన్నిధ్య మాత్రంబునన్= నీ సన్నిధి మాత్రం చేతనే; వికసిల్లున్= వికసిస్తాయి; క్రతు వైభవంబులున్= యజ్ఞ విభవాలూ; చతుర్వేదంబులున్= నాలుగు వేదాలూ; నీవు+అ= నీవే; నీ+అందున్+అ= నీయందే; జలంబులున్= నీళ్ళు కూడా; కలిగెన్= పుట్టాయి; విశ్వవ్యాప్తిమైన్+ఉన్న నీకున్= సర్వ వ్యాపనంతో ఉన్న నీకు; ఒక చోటు; ఎట్టులు= ఎట్లా, అగమ్యము+అయ్యెన్= చొరరానిది అయింది; పెంపు+ ఆరఁగన్= బాగా; నినున్; నీవు; ఊహింపు(ము).

తాత్పర్యం: 'అగ్నిదేవా! ఎల్ల అచరాలూ, చరాలూ నీ సన్నిధి మత్రం చేతనే వికసిస్తాయి. యజ్ఞ వైభవాలూ, నాలుగు వేదాలూ నీవే. నీళ్ళుసైతం నీయందే పుట్టాయి. జగద్వ్యాపకుడవైన నీకు ఒక చోటు చొరరానిది ఎట్లా అయింది? నిన్ను నీవు బాగా ఊహించుకో.

ఉ. ఏనును బ్రహ్మమంత్రముల నెంతయు నీ కభివృద్ధిఁ జేసెదం
గాన విశంకతన్ సలిలగామివి గ' మ్మనినం, గృశానుఁడుం
బూనిక నేఁగి వారినిధి భూరి నదీ సరసీ తటాక సం
తానము రోయుచుం జని శతక్రతుఁ డున్న సరోవరంబునన్. 187

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; బ్రహ్మ మంత్రములన్= వేదమంత్రాలతో; నీకున్; ఎంతయున్= ఎంతో; అభివృద్ధిన్; చేసెదన్; కానన్; విశంకతన్= సంకోచం లేకుండా; సలిలగామివి+కమ్ము= నీళ్ళలో ప్రవేశించేవాడవు కమ్ము; అనినన్; కృశానుఁడున్= అగ్నియూ; పూనికన్= ప్రయత్నంతో; ఏఁగి= వెళ్ళి; వారినిధి భూరి నదీ సరసీ తటాకసంతానమున్= సముద్రాల, పెద్ద నదుల, సరస్సుల, కొలకుల సమూహాలను; రోయుచున్= వెదకుతూ; చని= వెళ్ళి; శతక్రతుఁడు= నూరుయజ్ఞాలు చేసినవాడు- ఇంద్రుడు; ఉన్న; సరోవరంబునన్= సరస్సులో.

తాత్పర్యం: నేను కూడా వేదమంత్రాలతో నీకు ఎంతో అభివృద్ధిని కలిగిస్తాను. కావున సంకోచం లేకుండా నీళ్ళలో ప్రవేశించుము'. అనగా అగ్ని కూడా ప్రయత్నంతో వెళ్ళి సముద్రాల, గొప్ప నదుల, సరస్సుల, కొలకుల సమూహాలు వెదకుతూ వెళ్ళి, ఇంద్రుడున్న సరస్సులో.

ఉ. అంబురుహంబులం గలయ నారసి చొచ్చి, యొకండు నాళసూ
త్రంబున నున్న యింద్రుఁ గని, రాగమునన్ గురునొద్ద కగ్ని శీ

ఘ్రంబున నేఁగుదెంచి, తన కన్నతెఱంగెఱిఁగింప, నాతఁ డు
ల్లంబున నుల్లసిల్లి, సురలన్ మునులం దగఁగూడి గ్రక్కునన్. 188

ప్రతిపదార్థం: అంబురుహంబులన్= తామరపువ్వులను; కలయన్= అంతటా; ఆరసి= వెదకి; ఒకండు చొచ్చి= ఒక పద్మంలో ప్రవేశించి; నాళ సూత్రంబునన్= దాని కాడయొక్క దారంలో; ఉన్న, ఇంద్రున్; కని; అగ్ని; గురు+ఒద్దకున్= బృహస్పతి వద్దకు, రాగమునన్= ప్రీతితో, శీఘ్రంబునన్= వేగంగా; ఏఁగుదెంచి= వచ్చి; తన కన్నతెఱంగు+ఎఱిఁగింపన్= తాను చూచిన విధం తెలుపగా; ఆతఁడు= బృహస్పతి; ఉల్లంబునన్= మనస్సులో; ఉల్లసిల్లి= సంతోషించి; సురలన్= దేవతలనూ; మునులన్= మునులనూ; తగన్= ఒప్పుగా; కూడి= కలిసి; గ్రక్కునన్= శీఘ్రంగా.

తాత్పర్యం: తామరపువ్వులను అంతటా వెదకి, ఒకదానిలో ప్రవేశించి, దాని కాడ దారంలో ఉన్న ఇంద్రుడిని చూసి, అగ్ని ప్రీతితో బృహస్పతి వద్దకు శీఘ్రంగా వచ్చి, తాను చూచిన విధం తెలుపగా, అతడు మనస్సులో సంతోషించి దేవతలనూ, మునులనూ కూడి వెంటనే.

మ. దివిజాధీశ్వరుపాలికిం జని, కృతార్థీభూతచేతస్కుఁడై,
వివిధ స్తోత్ర పరంపరా చతుర వాగ్విన్యాసతం బ్రీతుఁ జే
సి, 'వరిష్ఠంబగు నీదు కృత్యము ననుష్ఠింపంగ నీ వుత్సహిం
పవు; నీ కేమి కొఱంత? వృత్రవధ యే పాపంబు రూపింపుమా?' 189

ప్రతిపదార్థం: దివిజ+అధి+ఈశ్వరు పాలికిన్= దేవేంద్రుడి వద్దకు; చని= వెళ్ళి; కృతార్థీభూత చేతస్కుఁడు+ఐ= ధన్యమైన మనస్సుకల వాడయి; వివిధ స్తోత్ర పరంపరా చతుర వాక్+విన్యాసతన్= అనేకములైన స్తుతులయొక్క వరుసయందలి నేర్పుతో కూడిన మాటల రచనతో; ప్రీతున్+చేసి= సంతోషపెట్టి; నీవు; వరిష్ఠంబు+అగు= శ్రేష్ఠమైన; నీదు కృత్యమున్= నీ పనిని; అనుష్ఠింపంగన్= ఆచరించటానికి; ఉత్సహింపవు= యత్నించవు; నీకున్; ఏమి; కొఱంత= లోటు; వృత్ర వధ= వృత్రుణ్ణి చంపటం; ఏ పాపంబు?= ఏమి పాపకార్యం?; రూపింపుమా= నిరూపించుము.

తాత్పర్యం: ఇంద్రుడి వద్దకు వెళ్ళి, కృతార్థమైన మనస్సు కలవాడయి, వివిధ స్తుతులలోని చతుర వాక్కులతో సంతోషపెట్టి, 'నీవు శ్రేష్ఠమైన నీ పనిని ఆచరించటానికి ఉత్సాహపడవు. నీ కేమి లోటు? వృత్రవధ పాపకార్యం ఎట్లా అయిందో చెప్పు.

క. శరనిధి ఫేనంబున నా। హరి పొంది జగద్విరోధి యగు వృత్రునిఁ దాఁ
బరిమార్ప, నీకు విజయము। దొరకొనియెం గాక, దీన దోసము గలదే?' 190

ప్రతిపదార్థం: శరనిధి ఫేనంబునన్= సముద్రపు నురుగులో; ఆ హరి= ఆ విష్ణువు; పొంది= చేరి; జగత్+విరోధి+అగు= లోక కంటకుడైన; వృత్రునిన్; తాన్= తాను (విష్ణువు); పరిమార్పన్= చంపగా; నీకున్; విజయము= గెలుపు; దొరకొనియెన్+కాక= లభించింది కాని; దీనన్= దీనియందు, దోసము= దోషం - పాపం; కలదే?

తాత్పర్యం: సముద్రపు నురుగులో ఆ విష్ణువు చేరి లోక కంటకుడయిన వృత్రుడిని చంపగా నీకు విజయం లభించింది. ఇందులో నీ దోషం ఏమున్నది?'

విశేషం: వృత్రుడిని చంపినవాడు విష్ణువు కాని, నీవు కాదని ఇంద్రుడి నిర్దోషిత్వాన్ని సమర్థించిన తీరు బృహస్పతి మాటనేర్పును విశదీకరిస్తుంది. అతడు 'వాచస్పతి' కదా!

వ. అని సముచితంబుగా సంబోధించిన గురుని సంభాషితంబుల నిర్దోషితుండయి నిజరూపంబు వహించి, సకల సుమనోమునిసహితంబుగా నతని సంభావించి, జంభారి 'కర్తవ్యం బెయ్యది?' యని యడిగిన, నాచార్యం 'డితం డెఱింగినను విస్పష్టంబుగా నహుషు వృత్తాంతంబంతయు వివరించెదం గాక' యని తలంచి యిట్లనియె. 191

ప్రతిపదార్థం: అని, సముచితంబుగాన్= తగినట్లుగా; సంబోధించిన= తెలియబరిచిన; గురుని= బృహస్పతియొక్క; సంభాషితంబులన్= మాటలచేత; నిర్దోషితుండు+అయి= పాపరహితుడై; నిజ రూపంబు= స్వస్వరూపం; వహించి= తాల్చి; సకల సుమనస్(ః)+ముని సహితంబుగాన్= ఎల్లదేవతలతోనూ; మునులతోనూ; అతనిని= ఆ బృహస్పతిని; సంభావించి= ఆదరించి; జంభ+అరి= జంభుడనే రాక్షసుడి శత్రువు - ఇంద్రుడు; కర్తవ్యంబు= చేయదగింది; ఎయ్యది= ఏది; అని; అడిగినన్; ఆచార్యుండు= గురుడు - బృహస్పతి; ఇతండు; ఎఱింగినను; విస్పష్టంబుగాన్= తేటతెల్లంగా; నహుషు వృత్తాంతంబు+ అంతయున్= నహుషుడి వృత్తాంతమంతా; వివరించెదన్+కాక= వివరించి చెపుతాను; అని; తలంచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తగిన విధంగా తెలియజెప్పిన బృహస్పతి మాటల వలన పాపరహితుడై తన ఆకారం ధరించి, ఎల్ల దేవతలతో మునులతో కూడా అతడిని ఆదరించి, ఇంద్రుడు కర్తవ్యం చెప్పుమని అడుగగా, ఆచార్యుడు 'ఇతడికి తెలిసినా సుస్పష్టంగా నహుషుడి వృత్తాంతమంతా వివరిస్తా' నని యెంచి ఇట్లా అన్నాడు.

క. 'నాఁ డట్లు నీవు నీ దగు । పోఁడిమి సెడి యడఁగుటయును, భువనంబుల కె
వ్వాఁడును రక్షకుఁ డయ్యెడు । వాఁడిమగఁడు లేమిఁ ద్రిదశవర్గము మునులున్. 192

ప్రతిపదార్థం: నాఁడు= ఆరోజు; అట్లు= ఆ విధంగా; నీవు; నీది+అగు పోఁడిమి= నీ పరాక్రమం; చెడి= నశించి; అడఁగుటయును= క్రుంగగా; భువనంబులకున్= లోకాలకు; ఎవ్వాఁడును= ఎవడూ; రక్షకుఁడు+అయ్యెడు వాఁడిమగఁడు= రక్షకుడయ్యే గొప్పశూరుడు; లేమిన్= లేకపోవటంచేత; త్రిదశ వర్గమున్= దేవతల సమూహమూ; మునులున్= మునులూ.

తాత్పర్యం: అప్పుడు ఆ విధంగా నీవు నీ పరాక్రమం నశించి క్రుంగిపోతే, లోకాలకు ఎవడూ రక్షకుడైన గొప్ప శూరుడు లేకపోవడం చేత దేవతలూ, మునులూ.

ఉ. ఒండొరుచేతఁ బీడవడ నోపక రక్షకుఁ డైనవాని నా
ఖండలతుల్యు నేమిగతిఁ గాంతుమొకో?' యనుచున్న చోట, 'ను
ద్దండబలైక రక్ష్యము శతక్రతు రాజ్యము, దాని నేల న
న్యుండు సమర్థుఁడే?' యనుచు నొల్లరు దివ్యులలోన నెవ్వరున్. 193

ప్రతిపదార్థం: ఒండొరుచేతన్= ఒకరిచేత ఒకరు; పీడ+పడన్+ఓపక= బాధపడలేక; రక్షకుఁడు+ఐన వానిన్= కాపాడేవాడిని; ఆఖండలతుల్యున్= ఇంద్రుడితో సమానమైనవాడిని; ఏమి గతిన్= ఏ విధంగా; కాంతుము+ఒకో= పొందుతామో; అనుచున్+ఉన్న చోటన్; శతక్రతు రాజ్యము= ఇంద్రుడి రాజ్యం; ఉద్దండ బల+ఏక రక్ష్యము= మహాబలవంతుడిచేతనే రక్షించబడదగినది;

దానిన్; ఏలన్= పాలించటానికి; అన్యుండు= ఇతరుడు; సమర్థుఁడే= శక్తిమంతుడా; అనుచున్; దివ్యులలోన్= దేవతలలో; ఎవ్వరున్= ఎవరూ; ఒల్లరు= ఇష్టపడరు.

తాత్పర్యం: ఒకరిచేత ఒకరు బాధపడలేక ఇంద్రసమానుడైన రక్షకుడిని ఏ విధంగా పొందుతామో అంటూ ఉన్నచోట - 'ఇంద్రుడి రాజ్యం మహాబలవంతుడిచేతనే రక్షించబడదగినది. దానిని పాలించటానికి ఇతరుడు శక్తిమంతుడా?' అంటూ దేవతలలో ఎవ్వరూ ఇష్టపడలేదు.

వ. అట్టి సమయంబున మునిజనసహితంబుగ ననిమిషులు నహుషు కడకుం జని మనంబుల మనుజుం డను ననుమానంబు దక్కి యతని నింద్రపదవిఁ బరిపాలించుటకుం బ్రార్థించిన, నతండును దాను హీనబలుండనని శంకించినం, దమ తమ తేజంబుల యంశంబు లతని కొసంగి శక్తిమంతుం గావించి యభిషిక్తుం జేసిన. 194

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= అటువంటి సమయంలో; అనిమిషులు= దేవతలు; ముని జన సహితంబుగన్= మునులతో కూడుకొని; నహుషు కడకున్; చని; మనంబులన్= మనస్సులలో; మనుజుండు+అను+అనుమానంబు+తక్కి= మనుష్యుడు అనే సంకోచం విడిచి; అతనిన్; ఇంద్ర పదవిన్; పరిపాలించుటకున్; ప్రార్థించినన్= కోరగా; అతండును= నహుషుడునూ; తాను; హీన బలుండన్+అని= బలహీనుడిని అని; శంకించినన్= అనుమానించగా; తమ తమ తేజంబుల+ అంశంబులు= తమ తమ తేజస్సుల భాగాలు; అతనికిన్; ఒసంగి= ఇచ్చి; శక్తిమంతున్= శక్తికలవాడిని; కావించి= చేసి; అభిషిక్తున్+చేసినన్= అభిషేకించగా.

తాత్పర్యం: అటువంటి సమయంలో మునులతో కూడా దేవతలు నహుషుడి వద్దకు వెళ్ళి, తమ మనస్సులలో అతడు మనుష్యుడనే శంక విడిచి, అతడిని ఇంద్రపదవిని స్వీకరించ ప్రార్థించగా, అతడునూ తాను బలహీనుడనని అనుమానించగా, వారు తమ తమ తేజస్సుల భాగాలు అతడి కిచ్చి సమర్థుడిని చేసి అభిషేకించగా.

క. మహనీయ భవ త్పదవీ । మహితుండై నహుషుఁ డేచి, మదమున ధర్మ
స్పృహ దక్కి, తన్ను నిప్పుడు । వహియింపఁగ సన్మునీంద్రవర్గముఁ బనిచెన్. 195

ప్రతిపదార్థం: మహనీయ భవత్+పదవీ మహితుండు+ఐ= ఉన్నతమైన నీ పదవి చేత గొప్పవాడయి; నహుషుఁడు; ఏచి= విజృంభించి; మదమునన్= గర్వంతో; ధర్మ స్పృహ= ధర్మమునందు ఆసక్తి; తక్కి= విడిచి; ఇప్పుడు; తన్నున్; వహియింపఁగన్= మోయటానికి; సత్+ముని+ఇంద్ర+వర్గమున్= సన్మునిశ్రేష్ఠుల సమూహాన్ని - సప్తర్షులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: అత్యున్నతమైన నీ పదవిచేత గొప్పవాడై నహుషుడు విజృంభించి, గర్వంతో ధర్మంమీద ఆసక్తి విడిచి, ఇప్పుడు తనను మోయటానికి సప్తర్షులను నియోగించాడు.

ఆ. ఇదియకాదు; మఱియు నెన్నియు దుర్విన । యములు గలవు; వాని కలసి నిన్ను
వెదక వచ్చితిమి; వివేకహీనుండగు । నతనిఁ జెఱుప నిప్పు డవసరంబు. 196

ప్రతిపదార్థం: ఇది+అ= ఇదే; కాదు; మఱియున్= ఇంకా; ఎన్నియున్= ఎన్నో; దుస్(ః)+వినయములు= చెడు నడవడులు; కలవు; వానికిన్; అలసి= బడలి; నిన్నున్; వెదకన్; వచ్చితిమి; వివేకహీనుండు+అగు+అతనిన్= జ్ఞానశూన్యుడైన అతడిని; చెఱుపన్= నశింపచేయటానికి, భ్రష్టుడిని చేయటానికి; ఇప్పుడు; అవసరంబు= తగిన సమయం.

తాత్పర్యం: ఇది ఒక్కటే కాదు, ఇంకా ఎన్నో దుర్మార్గాలు ఉన్నాయి. అతడితో పడిపడి బడలిపోయి నిన్ను వెతుక్కుంటూ వచ్చాము. వివేకశూన్యుడైన అతడిని పదవీభ్రష్టుడిని చేయటానికి ఇది తగిన సమయం.

వ. అది యెట్లంటేని వినుము. నాఁడు హరి పంపునం జేసిన యశ్వమేధంబున నీ వపగతకల్మషుండ వైనను, నహుషునకుఁ దేజోహాని లేమిం జేసి యతని నాక్రమింపరాదయ్యెఁ; నిప్పుడు మహామునుల నధఃకరించి యతండు నిస్తేజుండై యున్నవాఁడు. కావున నీ చేతం జెడు, నట్లగుటయుం దురగమేధ ఫలపరిపాకంబ; యింక నుత్సాహంబు సేయు'మనుచున్న సమయంబున యమ వరుణ కుబేరులు సోమసహితంబుగా నరుగుదెంచి పురందరుం గాంచిన, నతండు ప్రియంబంది, యప్పటి కార్యంబు తెఱంగు వారల కెఱింగించి, తగిన సంభాషణంబుల వారలఁ బ్రీతచేతస్కులం జేసి, దృష్టి విషయ దుస్సహుండైన నహుషు గెలుచు నుపాయంబు విచారించు నవసరంబున. 197

ప్రతిపదార్థం: అది; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎట్లా అంటే; వినుము; నాఁడు= అప్పుడు; హరి పంపునన్+చేసిన= విష్ణుమూర్తి ఆజ్ఞచేత చేసిన; అశ్వమేధంబునన్; నీవు; అపగత కల్మషుండవు+ఐనను= పోయిన పాపం కలవాడవైనను - పాపరహితుడవైనా; నహుషునకున్; తేజస్(ః)+హాని= తేజోనష్టం; లేమిన్+చేసి= లేకపోవటం చేత; అతనిన్; ఆక్రమింపన్+రాదు+అయ్యెన్= జయించ శక్యం కాకపోయింది; ఇప్పుడు; మహామునులన్= మహర్షులను; అధఃకరించి= తక్కువ చేసి - అవమానించి; అతండు; నిస్తేజుండు+ఐ= తేజోహీనుడై; ఉన్నవాఁడు; కావునన్; నీ చేతన్= నీ చేతిలో; చెడున్= నశిస్తాడు; అట్లు+అగుటయున్= అట్లా జరగటం కూడా; తురగమేధ ఫల పరిపాకంబు+అ= అశ్వమేధయాగం యొక్క ఫలితమే; ఇంకన్; ఉత్సాహంబు+ చేయుము= ఉత్సహించుము; అనుచున్+ఉన్న సమయంబునన్= అంటూన్న సమయంలో; యమ వరుణ కుబేరులు= యముడూ, వరుణుడూ, కుబేరుడూ, సోమ సహితంబుగాన్= చంద్రుడితో కూడా; అరుగుదెంచి= వచ్చి; పురందరున్= ఇంద్రుడిని, కాంచినన్= చూడగా; అతండు; ప్రియంబు+అంది= సంతోషించి, అప్పటి కార్యంబు తెఱంగు= అప్పటి కర్తవ్య విధానం; వారలకున్; ఎఱింగించి= తెలిపి; తగిన సంభాషణంబులన్= తగిన మాటలతో; వారలన్; ప్రీతి చేతస్కులన్+చేసి= సంతోషించిన మనస్సులు కలవారినిగా చేసి - సంతోషింపజేసి; దృష్టి విషయ దుస్సహుండు+ఐన నహుషున్= దృష్టి విషయంలో సహింప రానివాడైన నహుషుని; గెలుచు+ఉపాయంబు= గెలిచే ఉపాయం; విచారించు+అవసరంబునన్= ఆలోచించే సమయంలో.

తాత్పర్యం: అది ఎట్లా అంటే వినుము. అప్పుడు విష్ణుమూర్తి ఆజ్ఞచేత చేసిన అశ్వమేధయాగం వలన నీవు పాపరహితుడవైనా, నహుషుడి తేజస్సు నశించకపోవటంచేత, అతడిని జయించటానికి శక్యం కాకపోయింది. ఇప్పుడు అతడు మహర్షులను అవమానించి తేజస్సును కోల్పోయాడు. కాబట్టి నీ చేతిలో నశిస్తాడు. అట్లా జరగటం కూడా అశ్వమేధయాగఫలమే. ఇంక ఉత్సాహం చూపు' అంటున్న సమయంలో యముడూ, వరుణుడూ, కుబేరుడూ చంద్రుడితో కూడా వచ్చి ఇంద్రుడిని చూడగా, అతడు సంతోషించి, అప్పుడు కర్తవ్యమైన విధం వారికి చెప్పి, తగిన మాటలతో వారిని సంతోషపెట్టి, దృష్టివిషయంలో సహింపరాని నహుషుడిని గెలిచే ఉపాయం ఆలోచించే సమయంలో.

విశేషం: దృష్టి విష దుస్సహుండైన - ఈ పాఠం మున్నంగి శర్మ పరిష్కృత భారత ప్రతి లోనిది. ఇదే సంస్కృత భారత ప్రతులలోని పాఠానికి అనుగుణంగా ఉన్నది. 'తేజోహరం, దృష్టి విషం సుఘోరం మా త్వం పశ్యే ర్నహుషమ్.' ఉద్యోగ. 16-29. వావిళ్లవారి ప్రతిలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిలోనూ 'దృష్టి విషయ దుస్సహుండైన' అనే పాఠం ఉన్నది. అది మూలానుగుణం కాకపోవటం చేత విడువబడింది.

క. 'కష్టం డగు నా నహుషుఁడు । నష్టాత్మకుఁ డయ్యెఁ; దివిజనాయక! నీ యు
త్కృష్ట చరితమున సురలకుఁ । దుష్టిగ నిజరాజ్య సంగతుఁడ వగు' మనుచున్. 198

ప్రతిపదార్థం: దివిజ నాయక!= దేవేంద్రా!; కష్టుండు+అగు+ఆ నహుషుఁడు= పాపాత్ముడైన ఆ నహుషుడు; నష్ట+ఆత్మకుఁడు+ అయ్యెన్= చెడిపోయినవాడు అయ్యాడు; నీ+ఉత్కృష్ట చరితమునన్= గొప్పదైన నీ నడవడి చేత; సురలకున్= దేవతలకు; తుష్టిగన్= సంతోషం కలిగేటట్లు; నిజ రాజ్య సంగతుఁడవు= నీ రాజ్యంతో కూడినవాడవు; అగుము; అనుచున్.

తాత్పర్యం: 'పాపాత్ముడైన ఆ నహుషుడు నష్టపోయాడు. దేవేంద్రా! గొప్పదైన నీ చరితంచేత దేవతలకు సంతోషం కలిగేటట్లు నీవు నీ రాజ్యం స్వీకరించవచ్చును' అంటూ.

క. మునివరుఁ డైన యగస్త్యుఁడు । ననుదెంచిన, శతమఖుండు సమ్మతి నుచితా
సన మిడి, యర్ఘ్యముఁ బాద్యము । నొనరిచి, యిట్లనియె సవినయోక్తి నతనితోన్. 199

ప్రతిపదార్థం: మునివరుఁడు+ఐన+అగస్త్యుఁడు= మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు; చనుదెంచినన్= రాగా; శతమఖుండు= నూరు యజ్ఞాలు కలవాడు - ఇంద్రుడు; సమ్మతిన్= ఇష్టంతో; ఉచిత+ఆసనము+ఇడి= తగిన పీఠం ఇచ్చి; అర్ఘ్యమున్= పూజాద్రవ్యాన్నీ; పాద్యమున్= కాళ్లు కడుగుకొనడానికి నీరూ; ఒనరిచి= చేసి(ఇచ్చి); అతనితోన్; సవినయ+ఉక్తిన్= అడకువతో కూడిన మాటతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు రాగా, ఇంద్రుడు అతడికి ఉచితమైన ఆసనమూ, అర్ఘ్యపాద్యాదులూ సగౌరవంగా ఇచ్చి, వినయపూర్వకంగా ఇట్లా అన్నాడు.

ఆ. 'అధిక విభవ మెసఁగ నసమాన శక్తి స । నాథుఁ డగుచునున్న నహుషుఁ డిప్డు
డేమికతన భాగ్యహీనుఁడై యుజ్జ్వల । శ్రీ దొఱంగె మునివరేణ్య! చెపుమ.' 200

ప్రతిపదార్థం: మునివరేణ్యా!= మునిశ్రేష్ఠుడా!; అధిక విభవము+ఎసఁగన్= మిక్కిలి వైభవం అతిశయించగా, అసమాన శక్తి సనాథుఁడు= సాటిలేని శక్తితో కూడినవాడు; అగుచున్+ఉన్న= అవుతూ ఉన్న, నహుషుఁడు, ఇప్డు; ఏమి కతనన్= ఏ కారణంచేత; భాగ్యహీనుఁడు+ఐ= నిర్భాగ్యుడై; ఉజ్జ్వలశ్రీ= ప్రకాశించే సంపద; తొఱంగెన్= కోలుపోయాడు; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'మునివరా! అగస్త్యా! ఎంతో వైభవం అతిశయించగా నిరుపమానమైన సామర్థ్యంతో కూడుకొని ఉండే నహుషుడు ఇప్పుడు ఏ కారణంచేత నిర్భాగ్యుడై ప్రకాశించే సంపదను కోలుపోయాడో చెప్పుము.'

అగస్త్యుఁ డింద్రునకు నహుషుభ్రష్టతఁ దెలుపుట (సం. 5-17-7)

వ. అనిన విని యమ్మునీంద్రుం డిట్లనియె; 'నన్నహుషుని మోచి వేసరుచున్న మును లతనికడ గోష్ఠీ వినోదంబుల నుండి 'బ్రాహ్మణంబు లయిన మంత్రంబులు గోసంప్రోక్షణంబునందుఁ జెప్పంబడియుండు; నవి నీకుఁ బ్రమాణ భూతంబు లగునే?' యని యడిగినం, బాపనిశ్చయుండై యతం' డమ్మంత్రంబులు ప్రమాణంబులు గా'వనిన నే నమ్మాట నిషేధించి, 'పూర్వాచార్యులచేత నభినందితంబులగు మంత్రంబులు నిందించుట యజ్ఞానం'బని

వివాదంబు సేసితి; నతండు కోపించి మదీయ మస్తకంబు దన్నె; నతనిం గనుంగొని, పుణ్యహీనుండును, దేజోహాని దీనుండును నగుట యుపలక్షించి, 'నీవు పూజనీయులయిన మహామునుల నిన్ను వహింపం బనిచితి; వారలు గొనియాడు మంత్రంబులు గర్హించి; తదియునుంగాక నన్ను నవమానించితి; గావున నింద్రపద భ్రష్టుండవై బహుసంవత్సరంబులు భూలోకంబున నురగరూపంబున నుండు' మని శాపం బిచ్చి, పదంపడి యనుగ్రహించి, 'భవదీయవంశజాతుండయి యజాతశత్రుం డను పెంపుగలిగి యుధిష్ఠిరనామధేయుండైన యొక్క సత్పురుషుని సందర్శనంబున దురితంబులఁ బాసి పుణ్యలోకంబు వడయువాఁడ' వనినఁ, దత్క్షణంబ. **201**

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+ముని+ఇంద్రుండు= ఆ ముని శ్రేష్ఠుడైన అగస్త్యుడు; ఇట్లు+అనియెన్; ఆ+నహుషునిన్; మోచి= మోసి; వేసరుచున్+ఉన్న= బాధపడుతున్న; అతని కడన్= అతడి వద్ద; గోష్ఠీ వినోదంబులన్+ఉండి= ప్రసంగపు వేడుకలతో ఉండి; బ్రాహ్మణంబులు+అయిన మంత్రంబులు= బ్రాహ్మణములందలి మంత్రాలు (వేదమంత్రాలకు వ్యాఖ్యాన రూపమయినవి బ్రాహ్మణములు); గోసంప్రోక్షణంబునందున్= మంత్రజలంతో ఆవులను పవిత్రీకరించే సందర్భంలో; చెప్పంబడి+ఉండున్; అవి; నీకున్; ప్రమాణ భూతంబులు+అగునే?= సమ్మదగినవి అగునా?; అని; అడిగినన్; పాప నిశ్చయుండు+ఐ= దుర్బుద్ధిఅయి; ఆ+మంత్రంబులు; ప్రమాణంబులు+కావు; అనినన్; నేను; ఆ+మాటన్; నిషేధించి= నిరాకరించి; పూర్వ+ఆచార్యులచేతన్= ప్రాచీన గురువులచేత; అభినందితంబులు+అగు మంత్రంబులు= పొగడబడే మంత్రాలను; నిందించుట; అజ్ఞానంబు= తెలివి లేమి; అని; వివాదంబు+చేసితిన్= వాదించాను; అతండు; కోపించి; మదీయ మస్తకంబు= నా తల; తన్నెన్; అతనిన్; కనుంగొని= చూచి; పుణ్య హీనుండును= పుణ్యం పోయినవాడూ; తేజస్(ః)+హాని దీనుండును= తేజస్సు నశించటంచేత దుఃఖితుడూ; అగుట; ఉపలక్షించి= చూచి; నీవు; పూజనీయులు+అయిన= పూజ్యులైన; మహామునులన్= మహర్షులను; నిన్నున్; వహింపన్+పనిచితి(వి)= మోయటానికి నియోగించావు; వారలు; కొనియాడు= అభినందించే; మంత్రంబులు; గర్హించితి= నిందించావు; అదియునున్+కాక; నన్నున్, అవమానించితి(వి); కావునన్; ఇంద్రపద భ్రష్టుండవు+ఐ= ఇంద్ర స్థానంనుండి జారినవాడవయి; బహు సంవత్సరంబులు= పెక్కేండ్లు; భూ లోకంబునన్; ఉరగ రూపంబునన్= పాము రూపుతో; ఉండుము; అని; శాపంబు+ఇచ్చి; పదంపడి= తరువాత; అనుగ్రహించి= కరుణించి; భవదీయ వంశ జాతుండు+అయి= నీ వంశంలో పుట్టినవాడయి; అజాత శత్రుండు+అను పెంపు+కలిగి= అజాతశత్రుడు (పుట్టని శత్రువులు గలవాడు - శత్రువులులేనివాడు) అనే గొప్పతనం కలిగి; యుధిష్ఠిర నామధేయుండు+ఐ= యుధిష్ఠిరుడు (యుద్ధంలో స్థిరంగా ఉండేవాడు) అనే పేరుగలవాడయిన; ఒక్క; సత్పురుషుని సందర్శనంబునన్= మంచివాడి దర్శనం చేత; దురితంబులన్= పాపాలను; పాసి= విడిచి, పుణ్యలోకంబు+పడయువాఁడవు= పుణ్యలోకం పొందుతావు; అనినన్; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే.

తాత్పర్యం: అనగా విని ఆ మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు ఇట్లా అన్నాడు. ఆ నహుషుడిని మోసి బాధపడుతున్న మునులు అతడి దగ్గర సల్లాపపు వేడుకలతో ఉండి 'బ్రాహ్మణములయిన మంత్రాలు గోసంప్రోక్షణంలో చెప్పబడి ఉన్నాయి. వాటిని నీవు నమ్ముతావా?' అని అడుగగా, దుర్బుద్ధిఅయిన అతడు 'ఆ మంత్రాలు నాకు ప్రమాణాలు కావు' అన్నాడు. నేను ఆ మాట నిరాకరించి 'పూర్వగురువులు అభినందించే మంత్రాలను నిందించడం అజ్ఞానం' అని వాదించాను. అతడు కోపించి నా తలను తన్నాడు. అతడిని చూచి, పుణ్యం పోయి, తేజస్సు నశించి దుఃఖితుడై ఉండటం గమనించి 'నీవు పూజ్యులైన మహర్షుల్ని నిన్ను మోయటానికి నియోగించావు, వారు కొనియాడే మంత్రాలను నిందించావు. అదీకాక నన్ను అవమానించావు. కాబట్టి ఇంద్రపదవినుండి భ్రష్టుడవై పెక్కేళ్ళు భూలోకంలో సర్పరూపంతో ఉండు.' అని శాపమిచ్చి, తరవాత అనుగ్రహించి 'నీ వంశంలో పుట్టి అజాతశత్రుడనే ప్రశస్తి కలిగి యుధిష్ఠిరుడనే పేరుగల ఒక సజ్జనుడి సందర్శనం చేత పాపాలు పోయి పుణ్యలోకం పొందుతావు' అనగా, ఆ క్షణమే.

క. స్వర్గ పరిభ్రష్టుండై । దుర్గతికిం బోయె నతఁడు; దుష్టాత్ములకున్
దౌర్గత్యము, సుజనులకు న । నర్గళ సద్గతియు నగుట యరుదే యెందున్?' 202

ప్రతిపదార్థం: అతఁడు= ఆ నహుషుడు; స్వర్గ పరిభ్రష్టుండు+ఐ= స్వర్గలోకం నుండి జారినవాడయి; దుర్గతికిన్= దుస్ స్థితికి; పోయెన్; ఎందున్= ఎక్కడైనా; దుష్ట+ఆత్ములకున్= దుర్మార్గులకు; దౌర్గత్యమున్= దుస్స్థితీ; సుజనులకున్= సజ్జనులకు; అనర్గళ సత్+గతియున్= అడ్డులేని సద్గతీ; అగుట; అరుదే?= ఆశ్చర్యమా?

తాత్పర్యం: ఆ నహుషుడు స్వర్గలోకం నుండి భ్రష్టుడై దుర్గతి చెందాడు. ఎక్కడైనా దుర్మార్గులకు దుర్గతీ, సన్మార్గులకు సద్గతీ కలగటం ఆశ్చర్యమా?'

విశేషం: ఇందులో విశేషం సామాన్యంచేత సమర్థింపబడుతోంది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

మ. అనినన్ దేవతలుం దపోధనులు నత్యానందముం బొంది; రా
మునిఁ బూజించె నమర్త్యనాథుఁడు మనోమోదంబు సంధిల్ల, న
య్యనురాగంబు చరాచరంబులకు హృద్యం బయ్యెఁ; సర్వాప్సరో
జనముం గౌశికుఁ గానవచ్చె సుభగైశ్వర్యంబు శోభిల్లఁగన్. 203

ప్రతిపదార్థం: అనినన్; దేవతలున్; తపోధనులు= తపస్సు ధనంగా కలవారు- మునులూ; అతి+ఆనందమున్+పొందిరి= మిక్కిలి ఆనందం పొందారు; అమర్త్య నాథుఁడు= సురరాజు- ఇంద్రుడు; మనస్(ః)+మోదంబు= మనస్సంతోషం; సంధిల్లన్= కలుగగా; ఆ మునిన్= ఆ మునిని- అగస్త్యుడిని; పూజించెన్; ఆ+అనురాగంబు= వారి ప్రేమభావం; చర+అచరంబులకున్= అజడాలకూ, జడములకూ; హృద్యంబు+అయ్యెన్= మదికింపు గొల్పింది. సర్వ+అప్సరస్(ః)+జనమున్= ఎల్ల అచ్చరల సమూహమూ; సుభగ+ఐశ్వర్యంబు= ఉదాత్తమైన ఐశ్వర్యం; శోభిల్లఁగన్= ప్రకాశించగా; కౌశికున్= ఇంద్రుడిని; కానన్+వచ్చెన్= చూడవచ్చింది.

తాత్పర్యం: అనగా, దేవతలూ మునులూ మిక్కిలి సంతోషించారు. ఇంద్రుడు ఆనందంతో ఆ అగస్త్యుణ్ణి పూజించాడు. వారిద్దరి ప్రేమ భావం స్వర్గంలోని చరాచరాలన్నింటికి సంతోషదాయకమయింది. ఉదాత్తమైన ఐశ్వర్యం ఒప్పగా అచ్చరలందరూ ఇంద్రుడిని చూడవచ్చారు.

క. తదనంతరంబ. 204

తాత్పర్యం: ఆ వెంటనే.

ఉ. పావకుఁ డాదిగా దిగధిపాలురుఁ, గిన్నర సిద్ధ సాధ్యులున్,
దేవగురుండుఁ దోన చనుదేరఁగ, వైభవ ముల్లసిల్ల, నై
రావణ దంతి నెక్కి యమరావతికిం జని, యింద్రుఁ డా శచీ
దేవియుఁ దాను మోదమునఁ దేలి రభీష్ట వినోద లీలలన్. 205

ప్రతిపదార్థం: పావకుఁడు+ఆదిగాన్= అగ్ని మొదలుగా; దిక్+అధిపాలురున్= దిక్పాలకులూ; కిన్నర సిద్ధ సాధ్యులున్= కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ; దేవగురుండున్= బృహస్పతీ; తోన్+అ= కూడానే; చనుదేరఁగన్= రాగా; వైభవము+ఉల్లసిల్లన్= వైభవం ప్రకాశించగా; ఐరావణ, దంతిన్+ఎక్కి= ఐరావతమనే ఏనుగు నెక్కి; అమరావతికిన్+చని; ఇంద్రుఁడు; ఆ శచీ

దేవియున్+తానున్= ఆ శచీదేవి; తనూ; అభీష్ట వినోద లీలలన్= కోరిన వేడుకల విలాసాలతో; మోదమునన్+తేలిరి= సంతోషంతో సుఖించారు.

తాత్పర్యం: అగ్నిదేవుడు మొదలుగాగల దిక్పాలకులూ, కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ బృహస్పతీ కూడా రాగా, వైభవం వెల్లివిరియగా, ఐరావతమనే ఏనుగు నెక్కి, అమరావతికి వెళ్ళి, ఇంద్రుడు ఆ శచీదేవితో ఇష్ట వినోద క్రీడలతో సంతోషంలో తేలియాడాడు.

విశేషం: అష్టదిక్పాలకులలో మొదటివాడు, తూర్పుదిక్కునకు అధిపతి ఇంద్రుడు. అతడిని చూడవచ్చినవారిలో ఇప్పుడు ఆగ్నేయదిక్కుకు అధిపతి అగ్ని. అతడు మొదలుగా మిగిలినవారు దక్షిణ దిగధిపతి- యముడు; నైఋతికి- నిరృతి; పశ్చిమానికి- వరుణుడు, వాయవ్యానికి- వాయువు, ఉత్తరానికి- కుబేరుడు; ఈశాన్యానికి- ఈశ్వరుడు అధిపతులు. (సంపా.)

వ. ఇవ్విధంబున మహానుభావుం డగు నమ్మహేంద్రుండు. 206

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; మహానుభావుండు+అగు= మహనీయుడైన; ఆ+మహేంద్రుండు= ఆ దేవేంద్రుడు.

తాత్పర్యం: ఈ రీతిగా మహానుభావుడైన ఆ దేవేంద్రుడు.

క. ఆజ్ఞాభంగం బయినం । బ్రాజ్ఞేతరునట్లు దుఃఖపడి యుండఁడె? తా
నజ్ఞాతవాసమును గా । లజ్ఞతఁ జలుపండె? యన్యులకు వగపేలా? 207

ప్రతిపదార్థం: ఆజ్ఞా భంగంబు+అయినన్= తన అధికారానికి భంగం కలుగగా; ప్రాజ్ఞ+ఇతరు+అట్లు= అప్రాజ్ఞుడివలె, అపండితుడివలె; దుఃఖము+పడి= దుఃఖించి; ఉండఁడె?= ఉండడా? తాను; అజ్ఞాత వాసమును= ఇతరులకు తెలియకుండా ఉండటం; కాలజ్ఞతన్= సమయజ్ఞతతో; చలుపండె?= చేయడా?; అన్యులకున్= ఇతరులకు; వగపు= దుఃఖం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: తన అధికారానికి భంగం వాటిల్లినప్పుడు పామరుడివలె దేవేంద్రుడివంటివాడు దుఃఖం అనుభవిస్తూ ఉండలేదా? తాను కాలప్రభావాన్ని గుర్తించి అజ్ఞాతవాసం చేయడా? ఇతరులకు దుఃఖ మెందుకు?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. ఇంద్రుడే ఆ విధంగా ప్రవర్తించినప్పుడు ఇతరుల సంగతి చెప్పాలా? అని కైముత్యంచేత అర్థసంసిద్ధి కలుగుతున్నది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

క. కావున మీ పడిన యర । ణ్యావాస క్లేశమునకు, నజ్ఞాత విధిన్
సేవకుల రైన దానికి । నోవకుఁడీ మీరు లఘుమనోవృత్తులరై.' 208

ప్రతిపదార్థం: కావునన్; మీరు; లఘు మనస్(ః)+వృత్తులరు+ఐ= అల్పబుద్ధి కలవారయి; మీ పడిన అరణ్య+ఆవాస క్లేశమునకున్= మీరు పడ్డ అరణ్యవాస కష్టానికీ; అజ్ఞాత విధిన్= ఇతరులచేత ఎరుగబడకుండా; సేవకులరు+ఐన దానికిన్= సేవకులయినందుకూ; నోవకుఁడీ= బాధపడకండి.

తాత్పర్యం: కాబట్టి మీరు అరణ్యావాస దుఃఖం అనుభవించినందుకూ, ఇతరులకు తెలియకుండా సేవకత్వం చేసినందుకూ మీరు అల్పబుద్ధితో నొచ్చుకొనకండి.'

వ. అని యిట్లు సెప్పి శల్యుండు సభాసదులం గలయం గనుంగొని. 209

ప్రతిపదార్థం: అని; ఇట్లు; చెప్పి; శల్యుండు; సభాసదులన్= సభ్యులను; కలయన్+కనుంగొని= బాగా చూచి.

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి శల్యుడు సభలోఉన్న వారి నందరినీ బాగా చూచి.

ఉ. కౌరవనాథుఁ డా నహుషుకైవడి నాశముఁ బొందు; వాసవ
శ్రీ రమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశి వే
లా రశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సార సమగ్ర భోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్. 210

ప్రతిపదార్థం: కౌరవ నాథుఁడు= కురుపతి-దుర్యోధనుడు; ఆ నహుషు కైవడిన్= ఆ నహుషుడివలె; నాశమున్+పొందున్= నశిస్తాడు; ధర్మజుఁడు= ధర్మరాజు; వాసవ శ్రీ రమణీయుఁడు+ఐ= ఇంద్ర సంపదవంటి సంపదతో మనోహరుడయి; జయము+చేకొని= గెలుపొంది; తానున్+తమ్ములున్= తాను తమ్ములతో; అంబురాశి= సముద్రముయొక్క; వేలా= తీరం అనే; రశనా= మొలనూలుతో; సముజ్జ్వల= ప్రకాశించే; విలాస= లీలచేత; మనోహర= అందమైన; మేదినీ వధూ= భూమి అనెడు స్త్రీ యొక్క; సార= సారవంతములూ; సమగ్ర= సంపూర్ణములూ అయిన; భోగములన్= సౌఖ్యాలతో; సన్నుతికిన్+ఎక్కెడున్= పొగడ్త కెక్కుతాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ నహుషుడివలె నశిస్తాడు. ధర్మరాజు ఇంద్రవైభవంతో విజయం సాధించి, తమ్ములతో సముద్ర తీరమనే మొలనూలి సముజ్జ్వల విలాసంచేత అందమైన భూమి అనే స్త్రీ యొక్క సారవంతాలైన సర్వభోగాలూ పొంది పొగడ్త కెక్కుతాడు.

విశేషం: అలం: ఉపమ. (కౌరవనాథుఁడా... నాశముఁబొందు); వేలా రశనా, మేదినీ వధూ అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

వ. అని పలికి వెండియు నతండు పాండవాగ్రజున కిట్లనియె. 211

ప్రతిపదార్థం: అని; పలికి; వెండియున్= ఇంకా; అతండు= శల్యుడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి శల్యుడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'సౌఖ్యంబులు వొందు, జగ । త్ప్రఖ్యాతులుఁ జెందుఁ, దగఁ బురందర విజయో
పాఖ్యానము విన్నను, ద । ద్వ్యాఖ్యానము సేసినన్ జనావలి కనఘా! 212

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! ధర్మరాజా!; తగన్= ఒప్పుగా; పురందర+విజయ+ఉపాఖ్యానము= ఇంద్ర విజయ వృత్తాంతం; విన్నను= విన్నా; తద్+వ్యాఖ్యానము+చేసినన్= దానిని వ్యాఖ్యానించినా; జన+ఆవలికిన్= జనసముదాయానికి; సౌఖ్యంబులు+పొందున్= సుఖాలు కలుగుతాయి.; జగత్+ప్రఖ్యాతులున్= ప్రపంచకీర్తులూ; చెందున్= లభిస్తాయి.

తాత్పర్యం: 'అనఘా! ధర్మరాజా! సముచితంగా ఇంద్రవిజయకథ విన్నా, దానిని వ్యాఖ్యానించినా జనులకు సౌఖ్యాలు కలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా కీర్తులు లభిస్తాయి.

క. మోహరము నడచుచుండఁగ । నీ హరి విజయంబు విను నరేంద్రుఁడు రిపు సం
దోహంబు గెల్చుటకు సం । దేహం బించుకయు లేదు ధీరవిచారా!' 213

ప్రతిపదార్థం: ధీర విచారా?= ధైర్యవంతమైన ఆలోచన కలవాడా! ధర్మరాజా!; మోహరము= యుద్ధం; నడుచుచున్+ ఉండఁగన్= జరుగుతుండగా; ఈ హరి విజయంబున్= ఈ ఇంద్ర విజయ వృత్తాంతాన్ని; విను నరేంద్రుఁడు= వినే రాజు; రిపు సందోహంబున్= శత్రువుల సమూహాన్ని; గెల్చుటకున్= గెలవటానికి; సందేహంబు= అనుమానం; ఇంచుకయున్+లేదు= కొంచెం కూడా లేదు.

తాత్పర్యం: ధర్మరాజా! యుద్ధం జరుగుతూ ఉండగా ఇంద్రవిజయమనే ఈ కథను విన్నరాజు శత్రుసమూహాన్ని గెలుస్తాడు. ఇందులో సందేహం ఏమాత్రమూ లేదు.'

విశేషం: ఇంద్రవిజయం విన్న ధర్మరాజు యుద్ధంలో శత్రువులను జయించటం తథ్యమని ధ్వని. ప్రాచీనకాలంలో ఇటువంటి విజయగాథలను యుద్ధశిబిరాల్లో వినిపించేసంప్రదాయం ఉన్నట్లు ఈ ఫలశ్రుతి వలన వెల్లడౌతున్నది. (సంపా.)

వ. అనిన విని ధర్మనందనుండు మద్రపతిం బ్రస్తుతించి 'మహానుభావా! భవదీయ భాషణ శ్రవణంబునఁ జిత్తంబు కలంక దేఱె' నని సంభావించి యతనికి సముచితంబులగు మజ్జన భోజనంబు లొనరించి, యనంతరంబ యతండు పయనంబునకు నుద్యోగించిన. 214

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మనందనుండు= ధర్మరాజు; మద్రపతిన్= మద్రదేశరాజును-శల్యుడిని; ప్రస్తుతించి= బాగా పొగడి; మహానుభావా!= మహాత్మా!; భవదీయ భాషణ శ్రవణంబునన్= మీ మాటల వినికి చేత; చిత్తంబు= మనస్సు; కలంకదేఱెన్= ప్రసన్నత నొందింది; అని; సంభావించి= ఆదరించి; అతనికిన్; సముచితంబులు+అగు= మిక్కిలి తగినవైన; మజ్జన భోజనంబులు= స్నానమూ, భోజనమూ; ఒనరించి= చేసి; అనంతరంబు+అ= వెంటనే; అతండు= శల్యుడు; పయనంబునకున్= ప్రయాణానికి; ఉద్యోగించినన్= పూనుకొనగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు శల్యుడిని సన్నుతించి 'మహాత్మా! మీ మాటలు వినటం చేత నా మనస్సు తేరుకొన్నది.' అని మన్నించి అతడికి తగిన విధంగా స్నాన భోజనాలు ఏర్పాటుచేసి, వెంటనే అతడు ప్రయాణానికి పూనుకోగా.

విశేషం: సత్కథాశ్రవణం సంకటహరణం అని నీతి.(సంపా.)

ఆ. అతని ననుప నేఁగి యధిక సంప్రీతి నే । తెంచునప్పు డయ్యుధిష్ఠిరుండు
'రణములోన మీరు రాధేయుఁ బలుకుట । మఱవకుండవలయు మమ్ముఁ దలఁచి.' 215

ప్రతిపదార్థం: అతనిన్= శల్యుడిని; అనుపన్+ఏఁగి= సాగనంపటానికి వెళ్ళి; అధిక సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఏతెంచు+అప్పుడు= వచ్చేటప్పుడు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; రణములోనన్= యుద్ధంలో; మీరు; మమ్మున్+

తలఁచి= మమ్మల్ని దృష్టిలో పెట్టుకుని; రాధేయున్+పలుకుట= కర్ణుడిని నిరుత్సాహపరుస్తూ మాటాడటం; మఱవక+ ఉండవలయున్= మరచిపోగూడదు.

తాత్పర్యం: శల్యుడిని మిక్కిలి సంతోషంతో సాగనంపటానికి వెళ్ళి వచ్చేటప్పుడు ఆ ధర్మరాజు 'యుద్ధంలో మీరు మమ్మల్ని దృష్టిలో పెట్టుకొని కర్ణుడిని నిరుత్సాహపరుస్తూ మాట్లాడటం మరచిపోగూడదు' అన్నాడు.

క. అనుటయు మద్రేశ్వరుఁ డా । తని నూఱడఁ బలికి గాఢతరముగ నాలిం
గన మొనరించి చనియె హ । స్తినాపురికి బలముతో నతిత్వరితగతిన్. 216

ప్రతిపదార్థం: అనుటయున్= అనినంతనే; మద్ర+ఈశ్వరుఁడు= మద్రదేశాధిపతి శల్యుడు; ఆతనిన్; ఊఱడన్+పలికి= ఓదార్పుగా పలికి; గాఢతరముగన్= మిక్కిలి గట్టిగా; ఆలింగనము+ఒనరించి= కౌగిలించుకొని; అతి త్వరిత గతిన్= మిక్కిలి శీఘ్రగమనంతో; బలముతోన్= సైన్యంతో; హస్తినాపురికిన్; చనియెన్.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగానే శల్యుడు అతడికి ఊరట కలిగేటట్లు మాటాడి గట్టిగా కౌగిలించుకొని, అతి శీఘ్ర గమనంతో హస్తినాపురానికి సైన్యంతో వెళ్ళిపోయాడు.

విశేషం: ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క ప్రత్యేకమైన అలవాటు ఉన్నట్లు చిత్రించటం తిక్కన నాటకీయరచనా శిల్పంలో భాగం. శల్యుడు మైత్రితో ఎదుటివారిని కౌగిలించుకొనటం అతడి అలవాటు. మొదట రాగానే ధర్మజుడిని కౌగిలించుకొన్నాడు (104వ పద్యం). పోతూ ఇప్పుడు గట్టిగా కౌగిలించుకొన్నాడు. ఆ గాఢమైన కౌగిలింత ధర్మరాజుకు తప్పక అనుకూలంగా వ్యవహరిస్తానని వ్యక్తం చేసిన ఆంగికాభినయం. మాటలకంటె చేతలే ఒక్కొక్కసారి ఎంతో మాట్లాడతాయి.(సంపా.)

వ. అట్టి యవసరంబున. 217

తాత్పర్యం: ఆ సమయంలో.

సాత్యక్యాదులు సేనాసమేతంబుగఁ బాండవులం జేరవచ్చుట (సం. 5-19-1)

మ. సకలారాతి భయంకరుం డగుచు నుత్సాహంబు వాటించి, నే
లకు వ్రేఁ గయ్యెడుభంగి వచ్చె రణలీలాకౌతుకం బొప్పఁ దా
నొక యక్షౌహిణి తోడఁ, బాండవబలం బుల్లాసముం బొంద సా
త్యకి బాహాబలగర్వ నిర్వహణ విద్యాప్రౌఢి సంరూఢుఁడై. 218

ప్రతిపదార్థం: సాత్యకి; సకల+అరాతి భయంకరుండు+అగుచున్= ఎల్లశత్రువులకు వెరపు కలిగించేవాడవుతూ; ఉత్సాహంబు+ పాటించి= అభిలాష పూని; బాహా బల గర్వ నిర్వహణ విద్యా ప్రౌఢి సంరూఢుఁడు+ఐ= భుజ పరాక్రమ గర్వాన్ని నిర్వహించే విద్యయందలి నేర్పుచేత మిక్కిలి ప్రసిద్ధుడై; రణ లీలా కౌతుకంబు+ఒప్పన్= యుద్ధక్రీడయందలి వేడుక ఒప్పగా; పాండవ బలంబు= పాండవుల సేన; ఉల్లాసమున్+పొందన్= సంతోషపడగా; తాను; ఒక+అక్షౌహిణి తోడన్= ఒక అక్షౌహిణీ సేనతో; నేలకున్= భూమికి; వ్రేఁగు= భారము; అయ్యెడు భంగిన్= అయ్యే విధంగా; వచ్చెన్.

తాత్పర్యం: సాత్యకి సర్వశత్రు భీకరుడవుతూ, ఉత్సాహంతో, యుద్ధక్రీడయందలి వేడుక ఒప్పగా, పాండవసేన సంతోషించగా, భుజ పరాక్రమ గర్వాన్ని చూపే విద్యయందలి నేర్పుచేత ప్రసిద్ధుడై, ఒక అక్షౌహిణీ సేనను తీసికొని, భూమికి భారం కలిగే విధంగా వచ్చాడు.

విశేషం: అక్షౌహిణి - 21870 రథాలు, అన్ని ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 కాల్బలం కలసేన.

వ. అంతం జేదిపతి యగు ధృష్టకేతుండును, జరాసంధనందనుండగు సహదేవుండును జెఱొక్క యక్షౌహిణి తోడం జనుదెంచిరి. సహోదరు లేవు రగు కేకయపతులు నేకాక్షౌహిణీ సమేతులై యేఁగుదెంచిరి; తదనంతరంబ. 219

ప్రతిపదార్థం: అంతన్; చేది పతి+అగు ధృష్టకేతుండును= చేది దేశరాజగు ధృష్టకేతుడూ; జరాసంధ నందనుండు+అగు సహదేవుండును= జరాసంధుడి కొడుకైన సహదేవుడూ; చెఱి+ఒక్క+అక్షౌహిణి తోడన్= ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో; చనుదెంచిరి= వచ్చారు; సహోదరులు+ఏవురు+అగు కేకయపతులున్= సోదరు లయిన అయిదుగురు కేకయ పతులూ; ఏక+ అక్షౌహిణీ సమేతులు+ఐ= ఒక్క అక్షౌహిణీ బలంతో; ఏఁగుదెంచిరి= వచ్చారు; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే.

తాత్పర్యం: అంతట చేది దేశపురాజైన ధృష్టకేతుడూ, జరాసంధుడి కుమారుడైన సహదేవుడూ ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో వచ్చారు. సోదరులైన అయిదుగురు కేకయపతులూ ఒక అక్షౌహిణీ బలంతో వచ్చారు. ఆ వెంటనే.

క. కొడుకులుఁ దానును గుఱ్ఱపు । దడములఁ, గరిఘటల; భట రథవ్రాతములం
బుడమి చలింపఁగ ద్రుపదుఁడు । గడు వేడుకఁ దోడు సూపెఁ గౌంతేయులకున్. 220

ప్రతిపదార్థం: ద్రుపదుఁడు; కొడుకులున్+తానును= కొడుకులూ; తానూ; గుఱ్ఱము+దడములన్= గుర్రపు సేనలతో; కరి ఘటలన్= ఏనుగుల గుంపులతో; భట రథ వ్రాతములన్= కాల్బంటుల, రథాల సమూహాలతో; పుడమి చలింపఁగన్= భూమి అదరేటట్లు; కడున్ వేడుకన్= మిక్కిలి సంతోషంతో; కౌంతేయులకున్= పాండవులకు; తోడు+చూపెన్= సహాయం కొరకు వచ్చాడు.

తాత్పర్యం: ద్రుపదుడు కొడుకులతో గుర్రపు దళాలతోనూ, ఏనుగుల గుంపులతోనూ, కాల్బంటుల రథాల సమూహాలతోనూ భూమి అదిరే విధంగా మిక్కిలి వేడుకతో పాండవులకు సహాయం చేయటానికి వచ్చాడు.

వ. అదియును నొక యక్షౌహిణికిం గలిగి యొప్పె; నయ్యవసరంబున ననుజ తనుజ సమేతుండును, బార్వతీయ మహీపాల సహితుండును నై యొక్క యక్షౌహిణి యొడ్డనంబు దీర్చి. 221

ప్రతిపదార్థం: అదియును= ఆ సేనయూ; ఒక+అక్షౌహిణికిన్+కలిగి+ఒప్పెన్= ఒక అక్షౌహిణి పరిమితి కలదై విలసిల్లింది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అనుజ తనుజ సమేతుండును= తమ్ములతోనూ, కొడుకులతోనూ కూడినవాడూ; పార్వతీయ మహీపాల సహితుండునున్+ఐ= పర్వతప్రాంత దేశాల రాజులతో కూడిన వాడూ అయి; ఒక్క+అక్షౌహిణి+ఒడ్డనంబు+తీర్చి= ఒక అక్షౌహిణీ వ్యూహం సవరించి.

తాత్పర్యం: అదియూ ఒక అక్షౌహిణి అయి ఒప్పింది. ఆ సమయంలో తమ్ములతోనూ, కొడుకులతోనూ కూడినవాడూ, పర్వతప్రాంతీయులైన రాజులతో కూడినవాడూ అయి ఒక అక్షౌహిణీ వ్యూహం సవరించి.

క. చిందముల మ్రోఁతఁ బగతుర । డెందంబులతోడ దిక్తటీసంధులు నం
దంద పగులంగఁ, గుంతీ । నందనులకుఁ దోడు మత్స్యనాథుఁడు సూపెన్. 222

ప్రతిపదార్థం: చిందముల మ్రోఁతన్= శంఖముల ధ్వనులతో; పగతుర డెందంబుల తోడన్= శత్రువుల మనస్సులతో; దిక్+తటీ సంధులున్= దిక్ప్రదేశముల కలయికలు కూడా; అందంద= క్రమక్రమంగా; పగులంగన్= బద్దలు కాగా; మత్స్య నాథుఁడు= మత్స్యదేశపు రాజయిన విరాటుడు; కుంతీ నందనులకున్= కుంతి కొడుకులకు-పాండవులకు; తోడు= సహాయం; చూపెన్.

తాత్పర్యం: శంఖధ్వనులచే శత్రుహృదయాలతోపాటు దిక్ప్రదేశాల సంధులు కూడా క్రమక్రమంగా పగులగా మత్స్య దేశాధీశుడైన విరాటుడు పాండవులకు సహాయుడై వచ్చాడు.

విశేషం: అలం: సహోక్తి. 'పగతురడెందంబులతోడ దిక్తటీసంధులు నందంద పగులంగ'. ఇక్కడ పగతురడెందములకూ, దిక్తటీ సంధులకూ సహభావం ఉన్నది కాబట్టి సహోక్తి.

వ. పాండ్యవిభుండు లోనుగాఁ బలుదెసలనుండి వచ్చిన బలం బొక్క యక్షౌహిణికిం గలిగి యొప్పె. 223

ప్రతిపదార్థం: పాండ్య విభుండు లోనుగాన్= పాండ్యదేశపు రాజు మొదలైన; పలు దెసలనుండి వచ్చిన బలంబు= అనేక దిక్కుల నుండి వచ్చిన సైన్యం; ఒక్క+అక్షౌహిణికిన్+కలిగి+ఒప్పెన్= ఒక అక్షౌహిణి అయి ఒప్పింది.

తాత్పర్యం: పాండ్యదేశాధిపతి మొదలుగా నానాదిశలనుండి వచ్చిన సైన్యం ఒక అక్షౌహిణి అయి ఒప్పింది.

క. ఏ డక్షౌహిణు లిమ్మెయిఁ । గూడెం బాండునృపసుతులఁ గ్రూరాహవసం
క్రీడా వినోదమునకుం । దోడుపడం బూని యతి కుతూహల వృత్తిన్. 224

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; ఏడు+అక్షౌహిణులు; క్రూర+ఆహవ సంక్రీడా వినోదమునకున్= ఘోరమైన యుద్ధం అనే క్రీడయందలి వేడుక కొరకు; అతి కుతూహల వృత్తిన్= మిక్కిలి సంతోషంతో; తోడుపడన్+పూని= సహాయపడటానికి పూని; పాండు నృప+సుతులన్= పాండురాజు కొడుకులైన పాండవులను; కూడెన్= కలిసాయి.

తాత్పర్యం: ఈ విధంగా ఏడు అక్షౌహిణులు ఘోరయుద్ధ క్రీడా వినోదం కొరకు మిక్కిలి కుతూహలంతో తోడ్పాటు చూపటానికి పూని పాండవులను కలిసాయి.

వ. ఇవ్విధంబునం గూడి పెరిఁగి యుధిష్ఠిరు సైన్యంబు గయ్యంబునకుం గాలు ద్రవ్వుచునుండె; నంత నక్కడం గిరాతకాంచన సైన్యనిచయంబులం గూర్చికొని, సమరంబునకు నమరి యొక్క యక్షౌహిణి గల భగదత్తుండు సుయోధనుం గలిసె; భూరిపరాక్రముండయిన భూరిశ్రవుండును, మహాబలుండయిన శల్యుండును నేకాక్షౌహిణీ సమేతంబుగా నేతెంచిరి; వారలయట్ల సన్నద్ధుఁడై కాంభోజనాథుండైన సుదక్షిణుండును యవనేశ్వరుండును వచ్చె; నత్తెఱంగున సమకట్టి జయద్రథ ప్రముఖులైన సింధు సౌవీర నరపతు లరుగుదెంచిరి; మాహిష్మతీ పతి యగు నీలుండు, యాదవవీరుం డగు కృతవర్మయు, నవంతీశ్వరులు సోదరులు నగు విందానువిందు లిరువురునుంగా నిన్నలువురు నొక్కొక్క యక్షౌహిణితోడఁ జనుదెంచిరి;

మఱియునుం బలుదెసల నుండి వచ్చి కూడిన వాహినులు మూఁ డక్షౌహిణులకుం గలిగె; ధార్తరాష్ట్రులకుఁ దోడు పడం బూనినయవి పదునొకం డక్షౌహిణు లయ్యెఁ; నట్టియెడ. 225

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కూడి; పెరిఁగి= వృద్ధిపొంది; యుధిష్ఠిరు సైన్యంబు= ధర్మరాజు సైన్యం; కయ్యంబునకున్+ కాలు+త్రవ్వుచున్+ఉండెన్= యుద్ధానికి సిద్ధపడుతూఉండింది; అంతన్; అక్కడన్= కౌరవపక్షంలో; కిరాత కాంచన సైన్య నిచయంబులన్= కిరాతులనూ, బంగారాన్నీ, సేనా సమూహాలనూ, కూర్చికొని; సమరంబునకున్= యుద్ధానికి; అమరి= ఒప్పి; ఒక్క+అక్షౌహిణి+కల భగదత్తుండు= ఒక అక్షౌహిణీబలం ఉన్న భగదత్తుడు; సుయోధనున్= దుర్యోధనుడిని కలిసెన్; భూరి పరాక్రముండు+అయిన భూరిశ్రవుండును= మిక్కిలి పరాక్రమవంతుడయిన భూరిశ్రవుడూ; మహాబలుండు+అయిన శల్యుండును; ఏక+అక్షౌహిణీ సమేతంబుగాన్= ఒక అక్షౌహిణీతో కూడి; ఏతెంచిరి= వచ్చారు; వారల+అట్లు+అ= వారి వలెనే- అనగా ఒక అక్షౌహిణితో; సన్నద్ధుఁడు+ఐ= సంసిద్ధుడయి; కాంభోజ నాథుండు+ఐన= కాంభోజదేశపురాజయిన; సుదక్షిణుండు+ అను యవన+ఈశ్వరుండును= సుదక్షిణుడనే యవనపతియూ; వచ్చెన్; ఆ+తెఱంగునన్= ఆ రీతిగా; సమకట్టి= పూని (అనగా ఒక అక్షౌహిణితో); జయద్రథ ప్రముఖులు+ఐన= జయద్రథుడూ మొదలైన; సింధు సౌవీర నరపతులు= సింధుదేశపురాజూ, సౌవీరదేశపురాజూ; అరుగుదెంచిరి= వచ్చారు; మాహిష్మతీ పతి+అగు నీలుండున్= మాహిష్మతీ దేశరాజయిన నీలుడూ; యాదవ వీరుండు+అగు కృతవర్మయున్; అవంతి+ఈశ్వరులు= అవంతి దేశరాజులూ; సోదరులున్= సహోదరులూ; అగు; వింద+అనువిందులు+ఇరువురునున్+కాన్= అవంతి దేశాధీశులూ సహోదరులూ అయిన విందుడూ, అనువిందుడూ; ఈ+నలువురున్= ఈ నలుగురూ; ఒక్కొక్క+అక్షౌహిణి తోడన్; చనుదెంచిరి; మఱియునున్; పలు దెసలనుండి= అనేక దిక్కుల నుండి; వచ్చి; కూడిన వాహినులు= చేరిన సేనలు; మూఁడు+అక్షౌహిణులకున్+కలిగెన్= మూడు అక్షౌహిణులు అయ్యాయి; ధార్తరాష్ట్రులకున్= కౌరవులకు; తోడుపడన్+పూనిన+అవి= సహాయపడటానికి వచ్చినవి; పదునొకండు+అక్షౌహిణులు; అయ్యెన్; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ రీతిగా కూడి పెరిగి ధర్మరాజుసైన్యం కయ్యానికి కాలుత్రవ్వుతూ ఉన్నది. అంత అక్కడ- కౌరవపక్షంలో- కిరాతకులనూ, ధనాన్నీ, సైన్య సమూహాలను కూర్చుకొని, యుద్ధానికి సిద్ధపడి ఒక అక్షౌహిణీసేనతో భగదత్తుడు దుర్యోధనుడిని చేరాడు. అధిక పరాక్రమవంతు డయిన భూరిశ్రవుడూ, మహాబలుడైన శల్యుడూ ఒక అక్షౌహిణితో వచ్చారు. వారివలెనే ఒక అక్షౌహిణితో కాంభోజరాజయిన సుదక్షిణుడనే యవనపతి వచ్చాడు. అదే విధంగా ఒక అక్షౌహిణితో సిద్ధపడి జయద్రథుడూ మొదలుగాగల సింధు సౌవీర దేశాల రాజులు వచ్చారు. మాహిష్మతీ ప్రభువైన నీలుడూ, యాదవవీరుడైన కృతవర్మా, అవంతీశ్వరులూ సోదరులూ అయిన విందుడూ అనువిందుడూ అనే ఇద్దరూ కలిసి ఈ నలుగురూ ఒక్కొక్క అక్షౌహిణితో వచ్చారు. ఇంకా అనేక దిక్కుల నుండి వచ్చి చేరిన సేనలు మూడు అక్షౌహిణులయ్యాయి. కౌరవులకు ఈ విధంగా సహాయపడవచ్చినవి పదకొండు అక్షౌహిణులయినాయి. ఆ సమయంలో.

క. సవరణల నొప్పి, యనిఁ బాం । డవ బలముల మార్కొనం గడంగుచు, నత్యు
త్సవమునఁ బేర్చిన సేనల । కవకాశము లేదు విడియ హస్తిపురమునన్. 226

ప్రతిపదార్థం: సవరణలన్= యుద్ధపరికరాలతో; ఒప్పి; అనిన్= యుద్ధంలో; పాండవ బలములన్= పాండవుల సేనలను; మార్కొనన్= ఎదుర్కొనటానికి; కడంగుచున్= ప్రయత్నిస్తూ; అతి+ఉత్సవమునన్= మిక్కిలి సంతోషంతో; పేర్చిన= విజృంభించిన; సేనలకున్; హస్తిపురమునన్; విడియన్= విడిది చేయటానికి; అవకాశము లేదు= స్థలం లేదు.

తాత్పర్యం: యుద్ధపరికరాలతో ఒప్పి, యుద్ధంలో పాండవుల సేనలను ఎదుర్కొనడానికి ప్రయత్నిస్తూ మిక్కిలి సంతోషంతో విజృంభించిన సేనలకు హస్తినాపురంలో విడిది చేయటానికి స్థలం చాలలేదు.

క. నానాముఖములు విడియం । గా నియమించెను బలంబుఁ గౌరవపతి యా
సేనల దొరలకు నిలువఁగ । నైనను నెడ లేమి, నధిక హర్షం బెసఁగన్. 227

ప్రతిపదార్థం: కౌరవ పతి= కురురాజు - దుర్యోధనుడు; ఆ సేనల దొరలకున్= ఆ సేనల నాయకులకు; నిలువఁగన్+ ఐననున్= నిలవటానికి కూడా; ఎడ లేమిన్= స్థలం లేకపోవటం చేత; బలంబును= సైన్యాన్ని; నానా ముఖములన్= పెక్కుచోట్ల; విడియంగాన్= విడిది చేసేటట్లు; అధిక హర్షంబు+ఎసఁగన్= మిక్కిలి సంతోషం అతిశయించగా; నియమించెను= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: ఆ సేనల నాయకులకు నిలవటానికి కూడా స్థలం లేకపోవటం వలన సంతోషం అతిశయించగా దుర్యోధనుడు సైన్యాన్ని పెక్కుచోట్ల విడిసేటట్లు ఏర్పాటు చేశాడు.

వ. ఇత్తెఱంగునం గురుజాంగలంబున, రౌహితకారణ్యంబున, మరుదేశంబున, నహిచ్ఛత్రంబునఁ, గాలకూటంబున, గంగాకూలంబున, వారణావతంబున, వటస్థానంబున విచ్చలవిడి విడిసి, ధనధాన్యాది సమస్త వస్తువుల కలిమింజేసి యెలమి మిగిలి యున్నంత. 228

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; కురుజాంగలంబునన్, రౌహితక+అరణ్యంబునన్, మరుదేశంబునన్, అహిచ్ఛత్రంబునన్, కాలకూటంబునన్, గంగాకూలంబునన్, వారణావతంబునన్; వటస్థానంబునన్; విచ్చలవిడి= స్వేచ్ఛగా; విడిసి; ధన ధాన్య+అది సమస్త వస్తువుల కలిమిన్+చేసి= ధనమూ, ధాన్యమూ మొదలయిన ఎల్ల వస్తువులూ ఉండటం చేత; ఎలమి మిగిలి= సంతోషం అతిశయించి; ఉన్న+అంతన్= ఉన్న తరువాత.

తాత్పర్యం: ఈ విధంగా కురుజాంగలంలోనూ, రౌహిత కారణ్యంలోనూ, మరుదేశంలోనూ, అహిచ్ఛత్రంలోనూ, కాలకూటంలోనూ, గంగాకూలంలోనూ (గంగాతీరంలోనూ), వారణావతంలోనూ, వటస్థానంలోనూ స్వేచ్ఛగా విడిసి, ధనమూ, ధాన్యమూ మొదలయిన వస్తువులన్నీ సమృద్ధిగా ఉండటంచేత సంతోషాతిశయంతో ఉండగా.

ద్రుపద పురోహితుని రాయబారము (సం. 5-29-1)

క. పాంచాల మహీవల్లభు । పంచిన భూదేవుఁ డుచితభంగి నగరి కే
తెంచి, ధృతరాష్ట్రుఁ బ్రీతిం । గాంచి, కృపద్రోణ విదుర గంగాసుతులన్. 229

ప్రతిపదార్థం: పాంచాల మహీవల్లభు పంచిన భూదేవుఁడు= పాంచాలదేశపురా జయిన ద్రుపదుడు పంపిన బ్రాహ్మణుడు; ఉచిత భంగిన్= తగిన విధంగా; నగరికిన్= పట్టణానికి- హస్తినాపురానికి; ఏతెంచి= వచ్చి; ధృతరాష్ట్రున్; ప్రీతిన్= ఇష్టంతో; కాంచి= చూచి(దర్శించి); కృప ద్రోణ విదుర గంగాసుతులన్= కృపుడినీ, ద్రోణుడినీ, విదురుడినీ, భీష్ముడినీ.

తాత్పర్యం: ద్రుపదుడు పంపిన పురోహితుడు తగిన విధంగా హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడిని ప్రీతితో చూసి, కృపద్రోణ విదుర భీష్ములను (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: ఈ పద్యం ఎత్తుగడ సాభిప్రాయం. వచ్చిన రాయబారి పాంచాల దేశాధీశుడు పంపిన దూత. ఆయన భూదేవుడైన పురోహితుడు. పంపినవాడు ద్రుపదుడు. కార్యం పాండవులది. స్వభావాన్ని బట్టి పురోహితుడు రాబోయే మేలు తెలిపేవాడు. ఆ తీరు చూస్తే ఈ రాయబారం మిత్రుడి హితబోధవలె ఉండే అవకాశం ఎక్కువగా ఉన్నదని సూచన. బ్రాహ్మణుడి మాటలలో ధర్మరాజు పంపిన సందేశం కంటె ద్రుపదుడు మొదలైన హితుల అభిప్రాయాలే ప్రతిఫలించే అవకాశం ఉన్నది. అందువలన ఈ రాయబారం చాలా సున్నితమైనది. (సంపా.)

వ. వారి వారి మందిరంబులకుం జని కని, సముచితాలాపంబులం బ్రసన్న చిత్తులం జేసి, దుర్యోధను సందర్శనం బును నిర్వర్తించి, నిత్య నిపుణారాధనంబున ధృతరాష్ట్రునభిముఖుం గావించి, యొక్క నాఁ డక్కౌరవేశ్వరు పేరోలగంబున సమస్త సేనాపతులం గలయం గనుంగొని యిట్లనియె. 230

ప్రతిపదార్థం: వారి వారి మందిరంబులకున్+చని= వారి వారి ఇళ్ళకు వెళ్ళి; కని= చూసి; సముచిత+ఆలాపంబులన్= తగిన మాటలచేత; ప్రసన్న చిత్తులన్+చేసి= సంతోషించిన మనస్సులు కలవారినిగా చేసి; దుర్యోధను సందర్శనంబును= దుర్యోధనుడి దర్శనం కూడా; నిర్వర్తించి= చేసి, నిత్య నిపుణ+ఆరాధనంబునన్= ఎడతెగని నేర్పుతోడి పూజనంచేత; ధృతరాష్ట్రున్; అభిముఖున్= అనుకూలుడిని; కావించి= చేసి; ఒక్క నాఁడు; ఆ+కౌరవ+ఈశ్వరు పేరు+ఓలగంబునన్= ఆ ధృతరాష్ట్రుడి నిండుకొలువులో; సమస్త సేనాపతులన్= ఎల్ల సేనానాయకులను; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వారి వారి ఇళ్ళకు వెళ్ళి చూచి, తగిన మాటలతో మనస్సులకు సంతోషం కలిగించి, దుర్యోధనుడి దర్శనం కూడా చేసికొని, నిరంతరం నేర్పుతో ఆరాధించి ధృతరాష్ట్రుడిని తనకు అనుకూలుడినిగా చేసికొని, ఒకనాడు ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో సేనానాయకుల నందరినీ బాగుగా చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: హస్తినాపురంలో ద్రుపద పురోహితుడు కొన్నాళ్ళు గడిపినట్లున్నాడు. అతడికి సరాసరి రాజసభలో ప్రవేశం దొరికినట్లు లేదు. అతడు అంతవేగంగా కోరినట్లూ లేదు. పట్టణంలోని పెద్దలనందరినీ దర్శించాడు. వారితో సమయోచితంగా మాట్లాడి వారి మనస్సులకు సంతోషం కలిగించాడు. దుర్యోధనుడిని కూడా దర్శించాడు. ధృతరాష్ట్రుడి హృదయానికెక్కాలంటే ఎన్నో నేర్పులు ప్రదర్శించవలసి వచ్చింది. రాజుమెచ్చి తనకనుకూలుడయిన తరువాత సభలో అసలు సంగతి ప్రస్తావించాడు. అనుకూల పరిస్థితుల కొరకు దూతపడే శ్రమ ఇందులో వ్యక్తమౌతున్నది. (సంపా.)

సీ. 'ధృతరాష్ట్ర పాండుభూపతులు సహోదరు । లగుటయు, వారల యాత్మజులకుఁ
దమ తమ తండ్రుల ధనములు గైకొనఁ । దగుటయు, మీకు నందఱకుఁ జూడ
నుచితంబ కాదె? యట్లుండెఁ, దొల్లింటి చం । దంబును మనకుఁ దెల్లంబ కాదె?
ప్రాణగొడ్డము లగు పనుల వారలఁ దీర్పఁ । దలఁచినఁ, బున్నెంబు కలిమిఁ జేసి

తే. బాహుబల మొప్ప నిజరాజ్యపదవిఁ బొంది । యున్న, వంచనమెయి మహిఁ గొన్న తెఱఁగు
నెఱుఁగుదుర కాదె? దీనికి నెల్ల నియ్య । కొనియె నీ పెద్దరాజు నేమనఁగ నేర్తు? 231

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర పాండు భూపతులు= ధృతరాష్ట్రుడూ, పాండురాజూ; సహోదరులు+అగుటయున్= సోదరులు కావటమూ; వారల+ఆత్మజులకున్= వారి కొడుకులకు; తమ తమ తండ్రుల ధనములు; కైకొనన్+తగుటయున్= స్వీకరించతగి

ఉండటమూ; మీకున్+అందఱకున్; చూడన్; ఉచితంబు+అ కాదె!= న్యాయమే కదా!; అట్లు+ఉండెన్= విషయం అట్లా ఉండగా; తొల్లింటి చందంబును= పూర్వపు విధమూ; మనకున్; తెల్లంబు+అ కాదె!= స్పష్టమే కదా!; ప్రాణగొడ్డములు+అగు పనులన్= ప్రాణాపాయకరా లైన పనులతో; వారలన్=ఆ పాండవుల్ని; తీర్పన్+తలఁచినన్= చంపనెంచితే; పున్నెంబు కలిమిన్+ చేసి= పుణ్యం ఉండడం చేత; బాహు బలము+ఒప్పన్= భుజబలం ఒప్పగా; నిజరాజ్య పదవిన్+పొంది+ఉన్నన్= తమ రాజ్యపదవిని పొంది ఉండగా; వంచనమెయిన్= మోసంతో; మహిన్= భూమిని; కొన్న తెఱఁగున్= కాజేసిన విధమూ; ఎఱుఁగుదురు+అ+కాదె= మీకు తెలిసిందేకదా!; దీనికిన్+ఎల్లన్= దీనికంతకూ; ఇయ్యకొనియెన్= అంగీకరించాడు; ఈ పెద్దరాజున్= ఈ ధృతరాష్ట్రుణ్ణి, ఏమి+అనఁగన్ నేర్తున్?= ఏమనగలను?

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడూ, పాండురాజూ అన్నదమ్ములన్న విషయమూ, వాళ్ల కొడుకులకు తమ తమ తండ్రుల ఆస్తులు స్వీకరించదగిన విషయమూ మీకందరికీ చూడగా న్యాయమే కదా! అది అలా ఉండగా, పూర్వం జరిగినదంతా మనకు స్పష్టమేకదా! ప్రాణాలు తీసే పనులతో వాళ్లని చంపనెంచితే, పుణ్యం ఉండబట్టి, భుజబలంతో తమ రాజ్యపదవిని పొంది ఉండగా, మోసంతో భూమిని హరించిన విషయమూ మీరు ఎరిగినదే కదా! దీనికంతటికీ సమ్మతించాడు ఈ పెద్దరాజు, ఆయనను నేను ఏమనగలను?

విశేషం: 1. ద్రుపదుడు తన పురోహితుడికి కురుసభలో రాయబారిగా నిర్వహించవలసిన అంశాలను నిర్దేశించి పంపాడు. అందులో మొదటిది- 57వ పద్య తాత్పర్యం. అందులోనూ మూడు సూక్ష్మాంశాలున్నాయి. 1.పాండవులకు రాదగిన రాజ్యభాగాన్ని ముందుగా ప్రస్తావించాలి. 2. ఆ మాటలు ధర్మనిష్ఠంగానూ, ఉచితంగానూ ఉండాలి. ధృతరాష్ట్రుడికి తెలిసివచ్చేటట్లుండాలి. 3. ఆ మాటలు సభలో ఉన్న యుద్ధ వీరులైన రాజుల, సేనానుల మనసులు 'తిరుగబడేటట్లు' ఉండాలి. (ధృతరాష్ట్రుడికి వ్యతిరేకంగా, పాండవులకు అనుకూలంగా మారటం తిరుగబడటం). ఈ మూడు ప్రయోజనాలు సాధించటానికే విప్రుడు మాట్లాడటం మొదలుపెట్టాడు. అందుకే మొదట అన్నదమ్ముల బిడ్డలు వారి వారి రాజ్యసంపదలను పంచుకొని సుఖించటం అందరికీ ఆమోదయోగ్యమేకదా! అని పేర్కొన్నాడు. ఆ మాట ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు సమ్మతం కాదు. అయినా, పాలుపంచుకొనటం 'మీకందరికీ ఆలోచిస్తే ఉచితంగా లేదా?' - అని సభ్యులైన వీరులను ప్రశ్నించాడు. వారు అంగీకరించినట్లు భావించాడు. ఆ అంశాన్ని స్థిరీకరించినట్లే మాటలు సాగించాడు. 'అట్లుండె' - అనే వాక్యం దాన్ని స్ఫురింపజేస్తుంది. ఇక రెండవ అంశం. న్యాయంగా పాండవులకు రావలసిన రాజ్యభాగాన్ని వారికి దక్కకుండా కౌరవులు చేసిన దుర్ణయాలను పేర్కొన్నాడు. పాండవుల ప్రాణాలు తీసే లాక్షా గృహదహనం వంటి యత్నాలు ఒకఎత్తు. వాటినుండి తమ పుణ్యబలం చేత పాండవులు తప్పించుకొని బయటపడి రాజ్య వైభవంతో విరాజిల్లుతూ ఉండగా మోసంతో ఆ సంపదను హరించటం మరొక ఎత్తు. ఈ రెండూ పాండవులకు జరిగిన అన్యాయాలే, అధర్మాలే. వాటిని నొక్కిచెప్పి రెండవ ప్రయోజనం సాధించాడు. కొస మెరుపుగా మరొకమాట అన్నాడు. అది మూడవ ప్రయోజనం. వీటి నన్నింటిని ధృతరాష్ట్రుడు అంగీకరించాడు. అది అన్నింటికంటె అధికమైన అధర్మం. దాన్నేమనేది? అని అన్నాడు. ఈ మాట బ్రాహ్మణు డంటున్నా ద్రుపదుడి మాటలుగానే వ్యవహారంలో గ్రహించాలి. అయినా ధృతరాష్ట్రుడి సభలో అతడి సహాయకుల ఎదుట, అతడినే దోషిగా చేసి మాట్లాడటం కార్యసాధన కుపయోగించదు. కాని, ధర్మనిష్ఠంగా మాట్లాడినట్లుంటుంది. ద్రుపదపురోహితుడు తన ఉపన్యాసాన్ని ధర్మనీతితో మొదలుపెట్టాడే కాని, రాజనీతితో కాదు. ధర్మ ప్రతిపాదనం వలన సభ్యుల మనస్సులు తిరుగబడుతాయని భావించాడు.(సంపా.)

2. బ్రాహ్మణుడి మాటలు పచ్చినిజాలే అయినా, వినటానికి కటువుగా ఉన్నాయి. మొదలు పెట్టుతూనే ఆయన మాటలు వాళ్ళకు కోపం తెప్పించేవిగా ఉన్నాయి. అవి చేదుమాత్రలవలె ఉన్నాయి. 'నీ వాక్యము విప్రస్వాభావికమై యిట్లు శ్రుతికిఁ బరుషంబైనన్' అని ఇదే మాట భీష్ము డనటం గమనించదగింది.

శా. నారీరత్నము నట్లు దెచ్చి సభలోన న్వారలుం జూడఁగాఁ
జీరల్ ప్రోవులు గాఁగ నొల్చుటయు, లచ్చిం బుచ్చికోలున్, మహో
గ్రారణ్యస్థలి నిల్వఁబంచుటయు, దైన్యవ్యక్తిమై పల్కులున్
సైరింపం జను పాండవేయులకు నీ సంధిక్రమం బొప్పదే? 232

ప్రతిపదార్థం: నారీ రత్నమున్= వనితామణిని-ద్రౌపదిని; అట్లు= ఆ రీతిగా; సభలోనన్+వారలున్= సభలో ఉన్నవాళ్ళు; చూడఁగాన్= చూస్తుండగా; చీరల్, ప్రోవులు+కాఁగన్= కట్టువస్త్రాలు రాసు లయ్యేటట్లు; ఒల్చుటయున్= ఊడదీయటమూ; లచ్చిన్+పుచ్చికోలున్= సంపదను హరించటమూ; మహా+ఉగ్ర+అరణ్య స్థలిన్= మిక్కిలి భయంకరమైన అటవీ ప్రదేశంలో; నిల్వన్+పంచుటయున్= ఉండేటట్టు పంపటమూ; దైన్య వ్యక్తిమై పల్కులున్= దీనదశయొక్క స్పష్టతకల మాటలూ- దీనదశను స్పష్టీకరించే రీతి మాటలూ; సైరింపన్+చను పాండవేయులకున్= సహించగలిగిన పాండవులకు; ఈ సంధి క్రమంబు= ఈ సంధి కార్యక్రమం; ఒప్పదే?= తగదా?- తగినదే అని భావం.

తాత్పర్యం: స్త్రీరత్నమైన ద్రౌపదినిట ఆ రీతిగా తెచ్చి సభాసదులు చూస్తూఉండగా ఆమె కట్టుకొన్న చీరలు పోగుపడేటట్లు విప్పటం, సంపదను హరించటం, మహాభీకరాటవిలో ఉండేటట్లు పంపటం, అజ్ఞాతవాస సమయంలో తమ దీనదశను స్పష్టపరిచే రీతి తమ మాటలూ సహించగలిగిన పాండవులకు ఈ సంధి కార్యక్రమం తగినదే!

విశేషం: 'పాండుతనూభవుల్ పడిన పాటులు బంధుల కెల్ల' తెల్పుతూ పండితులూ, వృద్ధులూ, సజ్జనులూ ఇతడిమాటలే మేలు, మరొక పద్ధతి మంచిదికాదు' అని మనస్సులలో తలపోసేటట్లు మాట్లాడాలని ద్రుపదుడు తన పురోహితుడితో చెప్పాడు (59వ పద్యం). దానిని పురస్కరించుకొని పురోహితు డీ పద్యం పలికాడు. మొదట ద్రౌపదీ వస్త్రాపహరణ వృత్తాంతాన్ని ప్రస్తావించాడు. ప్రతిపదాన్నీ సాభిప్రాయంగా ప్రయోగించాడు. ద్రౌపది నారీరత్నం. గౌరవింపదగిన ఆమెను 'అట్లా' తెచ్చారట. దుశ్శాసనుడు ఆమెను జుట్టుపట్టుకొని లాక్కొంటూ సభకు తెచ్చిన ఆ వైఖరి నలుగురిలో పేర్కొనరానిది అని గర్హణ వ్యక్తం చేశాడు. సభ్యులందరూ చూస్తూఉండగా 'చీరలు ప్రోవులుగా' ఒలిచారట! ఆ మాటలో కౌరవుల దుష్టసంకల్పం, అది విఫలమైన తీరూ, ద్రౌపది పాతివ్రత్య మాహాత్మ్యం ధ్వని. సంపదను అన్యాయంగా లాగుకొనటం, అడవులకు పంపటం, ఆ పంపేటప్పుడు పాండవులను దుశ్శాసనాదులు దుర్భాషలాడటం- పేర్కొన్నాడు. హస్తినాపురంలో ఉన్నవారికి తెలిసినవి ఆ దురంతాలే. అయితే, ఈ పాండవుల పాట్లన్నీ సభ్యులలో సానుభూతి కలిగించటానికి చెప్పి, వాటిని సహించిన పాండవులు ప్రతీకారానికి దిగకుండా సంధికి పూనుకొనటంలో ఉన్న సామంజస్యాన్ని పేర్కొన్నాడు. సంధి ప్రయత్నం పాండవుల ధర్మప్రవృత్తికీ, సహనశీలానికీ, ఉదాత్తతకూ పతాక గుణంగా అభివర్ణించాడు. ద్రుపదుడి సూచనను తు-చ తప్పక పాటించాడు. (సంపా.)

క. వీరల వృత్తముఁ, బాండుకు । మారుల వర్తనముతెఱఁగు మాత్సర్యములే
కారసి, ధృతరాష్ట్రునకున్ । గారవమున బుద్ధిసెప్పఁగాఁ దగు మీకున్. 233

ప్రతిపదార్థం: వీరల వృత్తమున్= ఈ కౌరవుల ప్రవర్తనా; పాండు కుమారుల వర్తనము తెఱఁగున్= పాండవుల నడత తీరూ; మాత్సర్యము లేక+ఆరసి= పక్షపాతం లేకుండా పరిశీలించి; ధృతరాష్ట్రునకున్; గారవమునన్= ఆదరంతో; బుద్ధి+చెప్పఁగాన్, మీకున్, తగున్= తగును.

తాత్పర్యం: ఈ కౌరవుల ప్రవర్తనా, ఆ పాండవుల నడతతీరూ పక్షపాతం లేకుండా పరిశీలించి ధృతరాష్ట్రుడికి మీరు బుద్ధి చెప్పటం మంచిది.

విశేషం: ఈ పద్యంలో సభ్యులముందు ఒక కర్తవ్యాన్ని ఉంచాడు పురోహితుడు. కౌరవ పాండవుల ప్రవర్తనలను నిష్పాక్షిక బుద్ధితో విచారించి, న్యాయాన్ని ధృతరాష్ట్రుడిని గౌరవంగా తెలియచెప్పండన్నాడు. అంటే తన వాదాన్ని ఏకగ్రీవంగా సమర్థించండని కోరాడు. తిక్కన వాడిన 'బుద్ధి సెప్పఁగాఁదగున్' అనే వాక్యం సాభిప్రాయం. బుద్ధి చెప్పటం - అనే జాతీయాన్ని తెలుగులో గౌరవ సూచకంగా కంటె నిందావాచకంగానే ఎక్కువగా వాడుతున్నా మిప్పుడు. కాని, తిక్కన ఇక్కడ వాడిన తీరు ఉభయార్థకంగా ఉండటం విశేషం. అయితే, గారవమున బుద్ధి చెప్పండి అనటం చేత సభాగౌరవం కాపాడబడింది. బుద్ధి అంటే హితవు అనే అర్థం ఇక్కడ గ్రాహ్యం. గుణపాఠం చెప్పండి అనే అర్థం ఇక్కడ ఉద్దిష్టం కాదు. కాని, ఆ ధ్వని స్ఫురించటం ఆ మాటలోని బలం. ద్రుపద పురోహితుడి కీ వాదంలో నేరాలుచేసిన దుర్యోధనాదులకంటె, వారిని వారించకుండా నిర్లిప్తంగా ఉన్న ధృతరాష్ట్రుడే మూల దోషిగా నిరూపించటం పరమతాత్పర్యం. ఆ ప్రయోజనాన్ని, పరుషంగానైనా, సాధించాడు పురోహితుడు. (సంపా.)

తే. పాండవులు కౌరవులతోడి పగకు నొల్ల । రఖిల భూప్రజ నాశన మగుటఁజేసి
వార లస దని తలఁపంగ వలవ; దధిక । ధర్మపరులైన కతమునఁ దగవు నడచె. 234

ప్రతిపదార్థం: అఖిల భూ ప్రజ= ఎల్ల భూమియందలి ప్రజలూ; నాశనము+అగుటన్+చేసి= నశిస్తారు కాబట్టి; పాండవులు; కౌరవులతోడి పగకున్= కౌరవులతో వైరానికి; ఒల్లరు= ఇష్టపడరు; వారలు= పాండవులు; అసదు+అని= తక్కువ అని; తలఁపంగన్+వలవదు= భావించవద్దు; అధిక ధర్మపరులు+ఐన కతమునన్= మిక్కిలి ధర్మాత్ములు కావటం చేత; తగవు నడచెన్= మేలు జరిగింది.

తాత్పర్యం: ఎల్లభూమిలో ఉన్న ప్రజలు నశిస్తారు కాబట్టి పాండవులు కౌరవులతో వైరానికి ఇష్టపడరు. అట్లా అని వాళ్ళు బలహీనులని ఎంచవద్దు. మిక్కిలి ధర్మాత్ములు కావటంవలన ఒడంబడిక కొనసాగి న్యాయం నెరవేరింది.

విశేషం: 1. కౌరవపాండవుల ప్రవర్తనలలోని తారతమ్యాన్ని పై పద్యంలో నిరూపించి, వారిరువురి ఆలోచనలలో గల అంతరాన్ని ఇక్కడ పేర్కొంటూ పాండవుల ధర్మబద్ధమైన చిత్తవృత్తిని ప్రశంసించాడు పురోహితుడు. పాండవులు పగకు పూనుకొనకపోవటానికి కారణం ప్రజా నాశనాన్ని కోరని దయాప్రవృత్తియే. అంటే-కౌరవులు స్వార్థపరులు, పాండవులు లోకహిత పరాయణులు. లోకహితం కొరకు వారు తమసుఖాన్ని కూడా త్యాగం చేయగలరు. అయితే, ఈ దయాపరత్వాన్ని తక్కువతనంగా, బలహీనతగా భావించవద్దన్నాడు. పాండవులు మిక్కిలి ధర్మాత్ములు కాబట్టి లోకానికి మేలు జరిగింది. యుద్ధంకంటె అన్నివిధాలా ప్రజాహితకరమైన సంధి మేలని భావించే పాండవ ప్రవృత్తియే లోక శ్రేయస్సును కలిగిస్తుందని నిరూపించి చెప్పాడు పురోహితుడు. పాండవ సంధియత్నంలో ప్రధానాంశం ప్రజలయోగక్షేమమని సభలో చాటిచెప్పాడు.

2. ఉపన్యాసకళలో ఇదొక మెలకువ. ఒక విషయాన్ని సభ్యులముందు ప్రతిపాదించి, మీరే ఆలోచించి చూడండి - అని ప్రబోధించి, ఆ తరువాత ఎట్లా ఆలోచించాలో తానే చెప్పి ఎదుటివారిని ఒప్పించటం. తాను చెప్పినమాటలను సభ్యులు అంగీకరించేటట్లు చేయాలని పురోహితుడికి ద్రుపదుడు హితవు చెప్పాడు. అందుకే ఈ సంభాషణ శిల్పం. ఇది తిక్కన నాటకీయ రచనలో భాగం కూడా. (సంపా.)

వ. అందుఁ గూడినవి యే డక్షౌహిణు, లిందుఁ గూడినవి పదు నొకం డక్షౌహిణులని తలంతురేని వినుండు. 235

ప్రతిపదార్థం: అందున్= పాండవ పక్షంలో; కూడినవి; ఏడు+అక్షౌహిణులు; ఇందున్= కౌరవుల పక్షంలో; కూడినవి; పదునొకండు+ అక్షౌహిణులు; అని, తలంతురు+ఏనిన్= అని సంఖ్యా ప్రాచుర్యంతోనే ఆలోచించేటట్లయితే; వినుండు.

తాత్పర్యం: పాండవుల పక్షంలో కూడినవి ఏ డక్షౌహిణులు మాత్రమే, కౌరవుల పక్షంలో కూడినవి పదకొండు అక్షౌహిణులు కదా! అని అనుకొంటారేమో! వినండి.

విశేషం: పాండవ కౌరవుల బలతారతమ్యాన్ని చెప్పాడిందులో పురోహితుడు. బలాన్ని సంఖ్యలతోగాని, సారవంతమైన బలంతోగాని లెక్కించవచ్చును. పాండవుల సేనకంటె కౌరవుల సేన నాలుగు అక్షౌహిణులు అధికం. సంఖ్యాప్రాచుర్యమే ప్రమాణమని భావించవద్దని పురోహితుడి హెచ్చరిక. కౌరవులది వాపు, పాండవులది బలుపు. వాపుకంటె బలుపే గొప్పది అని చెప్పబోతున్నాడు పురోహితుడు. ఇతడి మాటలలో ప్రతిపాద్యాంశాన్ని స్పష్టంగా చెప్పే ప్రజ్ఞ కనపడుతుంది. కాని, అందులో మర్మంలేని ధర్మావేశం ఎక్కువ. (సంపా.)

క. బాహుబల ఘనుఁడు భీముఁడు, । సాహస రసికాత్ముఁ డయిన సాత్యకియు మహో
గ్రాహవభూమి సహస్రా । క్షౌహిణు; లట్లగుట మీరు గానరె యెందున్? 236

ప్రతిపదార్థం: బాహు బల ఘనుఁడు= భుజబలంలో గొప్పవాడు; భీముడున్; సాహస రసిక+ఆత్ముఁడు+అయిన సాత్యకియున్= సాహసాలలో ఆనందించే స్వభావం కలవాడైన సాత్యకీ; మహా+ఉగ్ర ఆహవ భూమిన్= మిక్కిలి ఘోరమైన యుద్ధరంగంలో సహస్ర+అక్షౌహిణులు= వేయి అక్షౌహిణులు; అట్లు+అగుట= అట్లా అవటం; ఎందున్= ఎక్కడైనా; కానరె?= చూడలేదా?

తాత్పర్యం: భుజ పరాక్రమంలో ఘనుడైన భీముడూ, సాహస కార్యాలలో ఆనందపడే స్వభావం గల సాత్యకీ మహాభయంకర యుద్ధభూమిలో వేయి అక్షౌహిణులన్న సంగతి మీరు ఎక్కడైనా సరే చూడలేదా?

విశేషం: 1. గురు భీష్మాదులు యుద్ధానికి విముఖులై దుర్యోధనుడిని యుద్ధ విముఖుడిని చేసేటట్లు ప్రయత్నించాలనీ, దానికి తగిన మాటలు మాటాడాలనీ ద్రుపదుడు తన పురోహితుడికి చెప్పాడు. (పద్యం 58). దానికి తగినట్లుగా పురోహితుడు భీమ, సాత్యకి, విజయ కృష్ణుల ప్రతాపాలను వర్ణించటం ఆరంభించాడు. బాహుబలఘనుడైన భీముడూ, సాహస రసికాత్ముడైన సాత్యకీ కలిస్తే వేయి అక్షౌహిణులతో సమానమని లెక్కకట్టి చెప్పాడు. పాండవుల బాహుబలానికి ప్రతీకలు భీమసాత్యకులు. ఇక ధనుర్బల, నీతిబలాలకు అర్జునుడూ, కృష్ణుడూ ప్రతినిధులని వరుసగా చెప్పుతున్నాడు. (సంపా.)

2. వావిళ్ళ ప్రతిలోనూ, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిలోనూ ఈ పద్యం నాలుగోపాదం- 'సహస్రాక్షోహిణులట్లగుట మీరు సూడరె యెందున్' అనే పాఠం కనబడుతున్నది. మున్నంగి శర్మ ప్రతిలో 'సహస్రాక్షౌహిణు లట్లగుట మీరు గానరె యెందున్' అనే పాఠం మరికొన్ని ప్రతుల ననుసరించి స్వీకరింపబడింది. తిక్కన భారతంలో ఈ ఒక్క చోట తప్ప, ఎక్కడా 'అక్షోహిణి' అని ప్రయోగించలేదు. అక్షౌహిణి సాధువు. అక్షోహిణి అసాధువు. అందుచేత నేను మున్నంగివారి పాఠాన్నే స్వీకరించాను.

క. గాండీవధన్వు నాహవ । పాండిత్యముఁ దలఁప నతని భండనమున మా
ర్కొండు నని యొకఁడు గడఁగుట । కొండం గని తగరు దాఁకఁ గోరుట గాదే? 237

ప్రతిపదార్థం: గాండీవ ధన్వు+ఆహవ పాండిత్యమున్= గాండీవమనే ధనుస్సు కలవాడైన అర్జునుడి యొక్క యుద్ధ పాండిత్యం; తలఁపన్= ఆలోచిస్తే; అతనిన్; భండనమునన్= యుద్ధంలో; మార్కొండున్+అని= ఎదుర్కొంటానని; ఒకఁడు; కడఁగుట= పూనటం; కొండన్+కని= కొండను చూచి; తగరు= పొట్టేలు; తాఁకన్+కోరుట+కాదే?= ఎదురించటానికి కోరటమే కదా?

తాత్పర్యం: గాండీవి యుద్ధ నైపుణ్యాన్నిగూర్చి ఆలోచిస్తే ఆతడిని యుద్ధంలో ఎదుర్కొంటానని ఒకడు పూనుకొనడం, కొండను చూచి పొట్టేలు ఢీకొనటానికి సిద్ధపడటమే కాదా!

విశేషం: అలం: నిదర్శన. ఇందులో 'అతని భండనమున మార్కొండునని యొకఁడు గడఁగుట' అనే ఉపమేయ వాక్యానికీ, 'కొండం గని తగరు దాఁకఁగోరుట' అనే ఉపమాన వాక్యానికీ ఐక్యారోపణం (అభేదం) చెప్పబడింది కాబట్టి నిదర్శన. కొండను పొట్టేలు ఢీకొంటే ఏం జరుగుతుందో యుద్ధంలో గాండీవిని ఢీకొన్నవాడికీ అదే జరుగుతుందని భావం.

క. ఆ బీభత్సుని భూరి భు । జా బలమును, దుర్నివార శౌర్యము, శర వి
ద్యా బహుళతయును బందికి । నై బవరముఁ జేసినట్టి హరుఁడ యెఱుంగున్. 238

ప్రతిపదార్థం: ఆ బీభత్సుని భూరి భుజా బలమును= ఆ అర్జునుడి అధికమైన బాహుపరాక్రమమూ; దుర్నివార శౌర్యమున్= అడ్డగించటానికి శక్యంకాని శూరత్వమూ; శర విద్యా బహుళతయును= బాణవిద్యలో ఆధిక్యమూ; పందికిన్+ఐ= పందికొరకు; బవరమున్+చేసిన+అట్టి= యుద్ధం చేసినట్టి; హరుఁడు+అ= ఈశ్వరుడే; ఎఱుంగున్= తెలియును.

తాత్పర్యం: ఆ బీభత్సుడి గొప్పదైన బాహుపరాక్రమమూ, అవార్య శౌర్యమూ, అస్త్రవిద్యాధిక్యమూ పంది కొరకు అతడితో యుద్ధం చేసిన ఈశ్వరుడికే బాగుగా తెలుసు.

విశేషం: అలం: పరికరాంకురం. ఇందులో అర్జునుడికి 'బీభత్స' శబ్దప్రయోగమూ, ఈశ్వరుడికి 'హర' శబ్ద ప్రయోగమూ సాభిప్రాయాలు కాబట్టి పరికరాంకురం. విశేష్యం సాభిప్రాయమైతే పరికరాంకురాలంకారం అవుతుంది. బీభత్సుడంటే యుద్ధంలో శత్రువీరులకు బీభత్సం కలిగించేవాడు కాబట్టి అర్జునుడని అర్థం. హర శబ్దానికి ప్రళయసమయంలో సర్వమూ హరిస్తాడు కాబట్టి ఈశ్వరుడని అర్థం. అర్జునుడి తపస్సును పరీక్షించగోరి శివుడు కిరాత వేషం ధరించి మూకుడనే రాక్షసుడిని వరాహంగా చేసి అర్జునుడివద్దకు వచ్చాడు. అర్జునుడు ఆ పందిని కొట్టాడు. ఈశ్వరుడూ కొట్టాడు. ఇది నాదంటే నాదని యిద్దరికీ వివాదం ఏర్పడింది. యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో అర్జునుడు చూపిన పరాక్రమానికి శివుడు మెచ్చి అతడికి పాశుపతాస్త్రం ఇచ్చాడు.

వ. అదియునుం గాక. 239

తాత్పర్యం: అదీకాక.

మ. వివిధోపాయ పరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు, మంత్ర రక్షణ కళా ప్రావీణ్యగణ్యుండు, ధై
ర్య వివేకాది గుణోత్తరుం, డఖిల విద్యాజాల సంవేది మా
ధవుఁ డా దిక్కటె! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే? 240

ప్రతిపదార్థం: వివిధ+ఉపాయ పరాయణుండు= రకరకాల ఉపాయాలకు ఆశ్రయమైనవాడూ; రిపు దోస్(ః)+వీర్య+అపహార క్రియా ప్రవణ+ఉద్యోగుఁడు= శత్రువుల యొక్క బాహువుల పరాక్రమాన్ని తొలగించే కార్యంలో సమర్థమైన ప్రయత్నం కలవాడూ; మంత్ర రక్షణ కళా ప్రావీణ్య గణ్యుండు= ఆలోచనయొక్క రక్షణం అనే విద్య యందలి నేర్పుచేత గణించదగినవాడూ; ధైర్యవివేక ఆది గుణ+ఉత్తరుండు= ధైర్యమూ, వివేకమూ మొదలైన గుణాల చేత శ్రేష్ఠుడూ; అఖిల విద్యా జాల సంవేది= ఎల్ల విద్యల సమూహాన్ని బాగుగా తెలిసినవాడూ; అగు; మాధవుఁడు= కృష్ణుడు; ఆ దిక్కు+అటె!= ఆ పక్షమట! పాండవేయులకున్; అసాధ్యంబు= సాధించరానిది; ఎద్దియున్= ఏదయినా; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: అనేకములైన ఉపాయాలకు ఆశ్రయమైనవాడూ, శత్రువుల భుజబలం హరించే క్రియలో సమర్థమైన పూనిక కలవాడూ, మంత్ర రక్షణమనే విద్య యందలి నేర్పు చేత గణించదగిన వాడూ, ధైర్యమూ, వివేకమూ మొదలైన గుణాల చేత శ్రేష్ఠుడైన వాడూ, ఎల్ల విద్యల సమూహమూ తెలిసినవాడూ అయిన శ్రీకృష్ణుడు ఆ వైపున ఉన్నాడట! ఇంక పాండవేయులకు సాధ్యంకాని దేమయినా ఉంటుందా?

విశేషం: 1. అలం: కావ్యలింగం. 'పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే' అనే సమర్థనీయమైన అంశం సమర్థించబడింది కాబట్టి ఇక్కడ కావ్యలింగం.

2. ఈ పద్యంలో వర్ణించబడిన మాధవుడు మానవాకృతిలో ఉన్న రాజనీతి. విజయమార్గంలో నడిచే ప్రభువుకు మొదట ఉండవలసింది వివిధోపాయాలను ప్రయోగించటంలో నేర్పరితనం.

"లభేత సామదానాభ్యాం కృత్యాంశ్చ పరభూమిషు,
అకృత్యాన్ భేదదణ్డాభ్యాం పరదోషాంశ్చ దర్శయేత్" (అర్థశాస్త్రమ్. 14 అధ్యా. పు. 56)

శత్రు రాజ్యాలలో ఉన్న కృత్యులను సామదానభేద దండోపాయాలతో తనవైపు త్రిప్పుకొనటం, అకృత్యులను భేదదండోపాయాలతో తనవైపు త్రిప్పుకొనటం, శత్రువుల దోషాలు వాళ్ళకు చూపుతూ ఉండటం - అనే అంశాలలో ప్రజ్ఞాధురీణుడు శ్రీకృష్ణుడు. అంటే రాజనీతిలోని చతుర్విధోపాయాలలో నిష్ణాతుడు.

శత్రువుల (భుజ) బలాన్ని హరించే క్రియలలో సమర్థుడైన వాడు రాజనీతిలో షాడ్గుణ్యం తెలిసినవాడని భావం. **"సంధి విగ్రహాసన యాన సంశ్రయ ద్వైదీభావాః షాడ్గుణ్యమ్ ఇత్యాచార్యాః"** - అని కౌటిల్యుడి అర్థశాస్త్రం. "వాటిలో 'సంధి'- అనగా ఒప్పందం కుదుర్చుకొనటం, అపకారం చేయటం 'విగ్రహం', సంధి చేసికొనకుండా, అపకారం చేయకుండా ఉండటం 'ఆసనం'. శక్తినీ, దేశకాలాదులలో అభివృద్ధిని సంపాదించడం 'యానం'. ఈ విధమైన అభివృద్ధి ఉన్నప్పుడే శత్రువు మీదికి దండెత్తి వెళ్ళటం కుదురుతుంది గాన దీనికి 'యానం' అని పేరుపెట్టబడింది. యానం అనగా దండెత్తివెళ్ళటం. శత్రువు బలవంతుడైనప్పుడు తనను వానికి సమర్పించుకొనటం 'సంశ్రయం'. సంధి విగ్రహాలు రెండింటినీ నడిపించటం 'ద్వైధీభావం'. ఈ విధంగా గుణాలు ఆరు. (కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్ - ఆంధ్రవ్యాఖ్యాబాలానందినిలో - వ్యాఖ్యాత మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు- పు. 544 - 545). షాడ్గుణ్య ప్రయోగ విద్యానిపుణుడు శ్రీకృష్ణుడు.

రాజనీతిలో మంత్రం పంచాంగసహితం. **"కర్మణా మారంభోపాయాః పురుషద్రవ్యసంపత్, దేశకాల విభాగః వినిపాత ప్రతీకారః, కార్యసిద్ధి రితి పంచాఙ్గో మన్త్రః"** - అని అర్థశాస్త్రం. దీనిని బట్టి పనులు చేపట్టటంలో ఉపాయాలు ప్రయోగించటం, పురుషసంపదను ధన సంపదను పెంపొందించటం, దేశకాలాల విభాగాన్ని తెలియటం, విఘ్నాలకు ప్రతిక్రియలను ఆలోచించటం, కార్యసిద్ధి - అనే అయిదు అంగాలు గల మంత్రాన్ని రక్షించేకళలో ప్రావీణ్యం గలవారిలో శ్రీకృష్ణుడు ప్రథమగణ్యుడు.

ధైర్య వివేకాలు ధీరోదాత్తుల ఉత్తమగుణాలు. రాజనీతిలో ధైర్యంవలన సాహసం, దానివలన కార్యసాధనం ఏర్పడతాయి. వివేకంవలన ఎప్పుడెప్పుడేయే పనులు చేయవచ్చునో, చేయకూడదో నిర్దేశించటం కలుగుతుంది. దర్శకుడయ్యే నాయకుడికి ఉండవలసిన ఉత్తమగుణాలు కలవాడు శ్రీకృష్ణుడు.

'అఖిల విద్యాజాల సంవేది' - అనేది విశాలమైన అర్థాన్నిస్తుంది. ఇక్కడ రాజనీతికి సంబంధించిన విద్యలన్నీ నేర్చినవాడని చెప్పటం ప్రస్తుతం. **'ఆన్వీక్షికీ, త్రయీ, వార్తా, దణ్డనీతి శ్చేతి విద్యాః"** - అని అర్థశాస్త్రం. "పదార్థాల స్వరూపాన్ని యుక్తులచేత(హేతువుల చేత) పరీక్షించే విద్య ఆన్వీక్షికి(Philosophy), ఋగ్యజుస్సామవేదాలు 'త్రయి'. కృషి (వ్యవసాయం), పశుపాలన, వర్తకం వీటికి వార్త (Economics) అని పేరు. దండనీతి అంటే రాజనీతి (Political science), (అర్థశాస్త్రం. పు.13).

ఈ అయిదు విశేషణాలను కలిపి చదువుకొంటే శ్రీకృష్ణుడు జంగమ రాజనీతి శాస్త్రమనటం స్పష్టం. అతడి చెప్పుచేతలలో వర్తించే పాండవులకు అసాధ్యమనేది లేదని తాత్పర్యం. (సంపా.)

ఆ. అదను దప్పకుండ నమ్మహాత్ముల నెమ్మిఁ। బిలువఁ బంచి, హితముఁ బ్రియము రెండు
పక్షములకు నగుట పాటించి తగవుమైఁ। గొంతభూమి యిచ్చి కూడి మనుఁడు.' 241

ప్రతిపదార్థం: అదను+తప్పక+ఉండన్= సమయం మించిపోకుండా; ఆ+మహాత్ములన్= మహనీయులైన ఆ పాండవులను; నెమ్మిన్= ప్రీతితో; పిలువన్+పంచి= పిలిపించి; హితమున్+ప్రియమున్= మేలూ, ప్రీతీ; రెండు పక్షములకున్= ఇరు పక్షాల వారికీ; అగుట పాటించి= అవటం ఆలోచించి; తగవుమైన్= న్యాయంతో; కొంతభూమి, ఇచ్చి; కూడి= కలిసి; మనుఁడు= బ్రతకండి.

తాత్పర్యం: సమయం మించిపోకుండా మహనీయులైన ఆ పాండవులను ప్రీతితో పిలిపించి, హితమూ, ప్రియమూ రెండు పక్షాలకూ కలిగేటట్లు చూచి న్యాయంగా వాళ్ళకు కొంతభూమి ఇచ్చి కలిసి బ్రతకండి.'

విశేషం: ఈ వాక్యాలు ఒక మిత్రుడు హితవు చెప్పుతున్నట్లున్నాయి. నిజాని కవి ద్రుపదుడి హితోక్తులే. అయినా అవి పాండవానుమతితో పలికినవి. దూతద్వారా పలికించినవి. ఒక విధంగా ఇది పాండవ ప్రత్యక్ష ప్రార్థన కాదు. పాండవులూ, వారి హితులూ బంధువులూ కలిసి సామూహికంగా చేస్తున్న అభ్యర్థన. ఇందులో మూడంశాలు ముక్తసరిగా పేర్కొనబడ్డాయి. 1.మహనీయులైన ఆ పాండవులను ప్రీతితో వెంటనే పిలిపించాలి. 2.రెండు పక్షాలకూ హితమూ, ప్రియమూ కలిగేటట్లు న్యాయంగా కొంతభూమిని పంచి ఇవ్వాలి. 3. ఈ రెండూ చేసి కలిసి బ్రతకాలి. ఈ మూడూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. వీటిలో ఏ ఒకటి తప్పినా మూడూ ముడిపడవు. (సంపా.)

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె 'నక్కట! భాగ్యముగాదె పాండునం
దను లొకయాపదం బడక ధర్మగతిం దగ నందఱున్ సుహృ
జ్జనులను గృష్ణునిం గలిసి సమ్మద మొందుటయుం బ్రశాంతిమై
మనముల నీసు దక్కి మృదుమార్గము వట్టుటయుం దలంపఁగన్. 242

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; భీష్ముఁడు; ఇట్లు+అనియెన్; అక్కట!= ఆహా!; తలంపఁగన్= ఆలోచించగా; పాండు నందనులు+అందఱున్= పాండవులు అందరూ; ఒక+ఆపదన్+పడక= ఏమీ ఆపద పొందక; ధర్మగతిన్= ధర్మమార్గంలో; తగన్= ఒప్పుగా; సుహృజ్జనులను (సుహృద్+జనులను)= మిత్రులనూ; కృష్ణునిన్, కలిసి; సమ్మదము+ఒందుటయున్= సంతోషించటమూ; ప్రశాంతిమైన్= అధికశాంతితో; మనములన్= మనస్సులందు; ఈసు= ఈర్ష్య; తక్కి= విడిచి; మృదు మార్గము+పట్టుటయున్= శాంతి మార్గం అవలంబించటమూ; భాగ్యము+కాదె!= అదృష్టం కదా!

తాత్పర్యం: ద్రుపద పురోహితుడు అట్లా అనగానే భీష్ము డిట్లా అన్నాడు: 'ఆహా! పాండవులు అందరూ ఎటువంటి ఆపదా చెందకుండా మిత్రులతోనూ, కృష్ణుడితోనూ కూడి సంతోషంగా ఉండటమూ, ప్రశాంతితో మనస్సులలో ఈర్ష్య విడిచి శాంతిమార్గం అవలంబించటమూ ఆలోచించగా అదృష్టం కదా!

విశేషం: ద్రుపద పురోహితుడు తన ఉపన్యాసాన్ని సభలోని పెద్దల నుద్దేశించే ప్రధానంగా సాగించాడు. దోషం రాజుమీద ఉంచాడు. ఇప్పుడు ఆ సభలో మారు పల్కవలసింది సభాసదుల పక్షాన కురుపితామహుడైన భీష్ముడే. ఇది సహజ సన్నివేశం.

అయితే - ఇక్కడ ఒక ప్రశ్న. భీష్ముడి సమాధానం ధృతరాష్ట్రుడి సమాధానం కాదు. పాండవ మిత్రపక్షం పురోహితుడి ముఖాన పలికితే, హస్తినాపుర ప్రముఖుల పక్షాన, సభాపక్షాన భీష్ముడు పలుకుతున్నాడు. పాండవులు ఆపద పొందకుండా ఉన్నందుకూ, స్నేహితులతో శ్రీకృష్ణుడితో కలిసి ఉన్నందుకూ, ధర్మమార్గం తప్పకుండా ఉన్నందుకూ, శాంతచిత్తులై అసూయలు విడిచి సాధుమార్గంలో సాగుతున్నందుకూ తమ అందరి పక్షాన భీష్ముడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఇవి ఔపచారికమైన మాటలే. (సంపా.)

క. నీ వాక్యము విప్ర స్వా । భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్,
భావింపఁ గార్యమునయం । దే విధమున సభకు నింత యిష్టం బగునే ? 243

ప్రతిపదార్థం: నీ వాక్యము= నీ మాట; విప్ర స్వాభావికము+ఐ= బ్రాహ్మణ సహజమయి, ఇట్లు; శ్రుతికిన్= చెవికి - వినటానికి; పరుషంబు+ఐనన్= కష్టంగా ఉన్నా; భావింపన్= ఆలోచించగా; కార్యమున+అందున్= పని విషయంలో; ఏ విధమునన్= ఏ విధంగానైనా; సభకున్; ఇంత+ఇష్టంబు+అగునే?= ఇంత నచ్చుబాటు అవుతుందా!

తాత్పర్యం: నీ మాట బ్రాహ్మణ సహజమై, వినటానికి ఇట్లా కష్టమనిపించినా, ఆలోచిస్తే కార్యం విషయంలో మాత్రం ఏ విధంగా చూచినా సభకు ఎంతో నచ్చేదిగా ఉన్నది.

విశేషం: 1. నీ వాక్యము - అంటే నీవు చెప్పదలచుకొన్న దానిని చెప్పిన విధం. విప్రస్వాభావికం అంటే - బ్రాహ్మణ స్వభావోచితంగా అభివ్యక్తం అయిందని భావం. 'నిండుమనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము'- అని బ్రాహ్మణవాక్కుకు నన్నయ తెచ్చిన ఒక ప్రసిద్ధి ఉన్నది. అదీగాక ఇక్కడ బ్రాహ్మణుడు ధర్మనీతి చెప్పాడు. రాజనీతిని జోడించలేదు. అందువలన వినటానికి పరుషంగా ఉన్నది. మా కరకుదనం చేత కుండబ్రద్దలు వేసినట్లు చెప్పటం వలన మాటలు ఆస్వాదమధురంగా లేవు. సంధిమాటలు సౌమ్యసుందరంగా, సాదరంగా సాగాలి. అయితే చెప్పే పద్ధతి రుచించకపోయినా, ఆచరణలో అది ఎట్లా అయినా, చెప్పిన విషయం సభను ఆకట్టుకొన్న దని అభినందించాడు. భీష్ముడు సభలో ఉన్న విపరీత వాతావరణాన్ని సౌమ్యంగా సుముఖంగా మార్చాడు. సత్యాన్ని సమయోచితంగా చెప్పాడు. అది భీష్ముడి పరిణత ప్రజ్ఞను ధర్మాభిముఖ్యాన్ని తెలుపుతున్నది. (సంపా.)

2. రాజకీయపుటెత్తులు చేతగాని బ్రాహ్మణులు శ్రుతి మధురంగా మాటలాడలేరు. ఉన్నది ఉన్నట్లు సూటిగా మాటలాడటమే వాళ్ళకు సహజం.

చ. సమయము యూఁది, పాండవు లశక్తుల చాడ్పున నిందు నాఁడు బ
న్నము వడి చన్న దైన్యము, వనంబునఁ బడ్డ విషాదవేదనా
శ్రమము, విరాటు వీట లఘు సంచరణంబున దాఁగియున్న దుః
ఖమును జగం బెఱుంగదె? యకల్మషులం బఱుపంగఁ బాడియే? 244

ప్రతిపదార్థం: పాండవులు; సమయము+అ+ఊఁది= జూదానికి ముందు చేసికొన్న ఒప్పందాన్నే పట్టుకొని; అశక్తుల చాడ్పునన్= చేతకాని వాళ్ళవలె; ఇందున్= ఈ సభలో; నాఁడు= అప్పుడు; బన్నము+పడి= ఆపద పొంది; చన్న,దైన్యమున్= పొందిన దీనస్థితీ; వనంబునన్+పడ్డ= అడవిలో అనుభవించిన; విషాద, వేదనా, శ్రమమున్= విచారం వలన కలిగిన బాధ వలని బడలికా; విరాటు వీటన్= విరాటుడి నగరంలో; లఘు సంచరణంబునన్= తేలికైన (చులకనైన) ప్రవర్తనతో; దాఁగి+ఉన్న,

దుఃఖమును= అజ్ఞాతంగా ఉన్నప్పటి కష్టమూ; జగంబు= లోకం; ఎఱుంగదె; అకల్మషులన్= అపాపులను - మంచివారిని; పఱుపంగన్= బాధపెట్టటం; పాడియే?= ధర్మమా?

తాత్పర్యం: పాండవులు జూదానికి ముందు చేసికొన్న ఒప్పందాన్నే పట్టుకొని చేతకాని వాళ్ళవలె ఈ సభలో ఆనాడు భార్యా వస్త్రాపహరణ రూపమైన ఆపదవలన పొందిన దీనస్థితీ, అడవిలో పన్నెండేళ్ళపాటు అనుభవించిన కష్టాలూ, విరాటుడి నగరంలో అజ్ఞాతవాసం చేసినప్పటి దుఃఖమూ లోకానికి తెలియవా? అట్లాంటి సజ్జనులను బాధించటం న్యాయమా?

విశేషం: పురోహితుడు 232వ పద్యంలో పేర్కొన్న పాండవుల అవమానాలను, కష్టాలను భీష్ముడు కూడా స్మరించి వారిపట్ల సానుభూతిని వెల్లడించాడు, సభాసదులు ఆ అంశాలకు స్పందించేటట్లు ప్రకటించాడు. పాండవులను బాధించటం న్యాయమా? అని పురోహితుడి వలెనే భీష్ముడు సభనే ప్రశ్నించాడు. దీని కెవరు సమాధానం చెప్పాలి? (సంపా.)

క. పితృధన మగు పా లుచిత । స్థితి వారల కిచ్చి, నిర్విశేషుండై యీ
పతి లోకము మెచ్చఁగ నిజ । సుత నివహమునట్ల వారిఁ జూడఁగవలయున్. 245

ప్రతిపదార్థం: ఈ+పతి= ఈ రాజు - ధృతరాష్ట్రుడు; లోకము, మెచ్చఁగన్= ప్రపంచం ప్రశంసించేటట్లు; నిర్విశేషుండు+ఐ= భేదభావం లేనివాడై; పితృధనము+అగు, పాలు= తండ్రి ఆస్తి అయిన వాటా; ఉచిత - స్థితిన్= తగిన విధంగా; వారలకున్= ఆ పాండవులకు; ఇచ్చి; నిజసుత నివహము+అట్లు+అ= తన కుమారుల సమూహం వలెనే; వారిన్= ఆ పాండవులను; చూడఁగన్+వలయున్= ఆదరించాలి.

తాత్పర్యం: ఈ ధృతరాష్ట్ర మహారాజు లోకం మెచ్చుకొనేటట్లు, భేదభావం లేనివాడై, తమతండ్రి ఆస్తిలోని వాటా సముచితంగా వాళ్ళ కిచ్చి వాళ్ళను తన కొడుకులవలెనే ఆదరించాలి.

విశేషం: ద్రుపదపురోహితుడి హితవును భీష్ముడు సమర్థించి, సభానుకూల్యాన్ని ప్రకటించాడు. (సంపా.)

వ. అట్లుం గాక. 246

తాత్పర్యం: అంతేకాక.

చ. కడవఁగ జూదమాడి, యవుఁ గాడన నేరక, సత్యభాషణం
బెడలిన వచ్చు ధర్మగతిహీనత కోర్వక, రాజ్యహీనతం
బడుటకు నోర్చి, ధర్మజుఁడు పంచిన సైరణ సేసెఁ గాక క
వ్వడి నెఱ గిన్క కెట్టి మగవారును నోర్తురె యిజ్జగంబులన్?' 247

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; కడవఁగన్= కాలక్షేపం కొరకు; జూదము+ఆడి; అవున్+కాదు+అనన్, నేరక= అవునూ కాదూ అనలేక; సత్య భాషణంబు+ఎడలినన్= సత్యవాక్యం పోతే - నిజం చెప్పకపోతే; వచ్చు= కలిగే; ధర్మ గతి హీనతకున్= అధర్మానికి; ఓర్వక= సహించక; రాజ్య హీనతన్+పడుటకున్= రాజ్యనష్టం పొందటానికి; ఓర్చి= సహించి, పంచినన్= ఆజ్ఞాపించగా; సైరణ+చేసెన్+కాక= ఓర్పు వహించాడు కాని; కవ్వడి నెఱ+కిన్కకున్= అర్జునుడి పూర్ణాగ్రహానికి; ఇజ్జగంబులన్(ఈ+ జగంబులన్)= ఈ లోకాలలో; ఎట్టి మగవారునున్= ఎటువంటి శూరులైనా; ఓర్తురె?= ఓర్వగలరా?

తాత్పర్యం: ధర్మరాజు కాలక్షేపం కొరకు జూదమాడి అవుననీ, కాదనీ అనలేక, నిజం చెప్పకపోతే కలిగే అధర్మానికి సహించక, రాజ్య నష్టానికి సహించి, తనను ఆజ్ఞాపిస్తే సహించాడు కాని, సవ్యసాచి పూర్ణాగ్రహానికి ఈ లోకాలలో ఎంతటి శూరులైనా ఓర్వగలరా?'

విశేషం: భీష్ముడు ధర్మరాజు సహనాన్ని ప్రశంసించాడు. ఆ వెంటనే ఊరుకోక కౌరవపాండవ బలాబల నిరూపణంలో పురోహితుడి అభిప్రాయాన్ని సమర్థించాడు. ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడి పరాక్రమాన్ని ఉటంకించి, అతడితో ఎదురునిలిచి పోరాడగలిగిన శూరులు కౌరవులలో లేరన్నాడు. ఆ మాటకు కర్ణుడు అహంకరించి అడ్డుపడ్డాడు. రాయబారి మాటలు ప్రక్కకు పోయాయి. భీష్ముడి మాటలు రచ్చకెక్కాయి. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు కనలి యిట్లనియె. 248

ప్రతిపదార్థం: అనినన్, విని, కర్ణుండు; కనలి= కోపించి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు కోపించి ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడు కర్ణుడికి ప్రతిస్పర్ధి. అతడిని భీష్ముడు పొగడటం వలన కర్ణుడికి కోపం వచ్చింది. మానవంతుడైన శూరుడు పరప్రకర్షను సహించలేడుకదా!

క. 'జనులెల్ల నెఱింగిన యీ । పని యేటికి నుగ్గడింపఁ బలుమఱు ? దుర్యో
ధనునకయి శకుని జూదం । బున మేదిని గెలిచె; ధర్మపుత్త్రుం డోడెన్. 249

ప్రతిపదార్థం: జనులు+ఎల్లన్= జనులందరూ; ఎఱింగిన, ఈ+పని; పలుమఱున్= పలుమార్లు; ఉగ్గడింపన్+ఏటికి?= అనటం ఎందుకు?; దుర్యోధనుని కయి= దుర్యోధనుడి కొరకు; శకుని, జూదంబునన్; మేదిని= భూమి, గెలిచెన్; ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; ఓడెన్= ఓడాడు.

తాత్పర్యం: 'అందరికీ తెలిసిన ఈ విషయాన్ని మాటిమాటికీ అనటం ఎందుకు? దుర్యోధనుడి పక్షాన శకుని జూదం ఆడి రాజ్యం గెలిచాడు. ధర్మరాజు ఓడిపోయాడు.

ఆ. దీన నేమి తప్పు? కానకు నేఁగిన । యతఁడు సమయవృత్తి నాక్రమించి,
తండ్రిపాలు మాకుఁ దగునంచు, నడియరి । తనము సేసి రాక తప్పు గాక, 250

ప్రతిపదార్థం: కానకున్= అడవికి; ఏఁగిన+అతఁడు= వెళ్ళినవాడు; సమయవృత్తిన్+ఆక్రమించి= చేసికొన్న ఒప్పందం అతిక్రమించి; తండ్రి పాలు= తండ్రి భాగం; మాకున్; తగున్+అంచున్; అడియరితనము+చేసి,రాక= లోభ గుణంతో రావటం; తప్పు+కాక= తప్పుగాని; దీనన్= ఇందులో; ఏమి తప్పు?= తప్పేమిటి?

తాత్పర్యం: అడవికి వెళ్ళినవాడు చేసికొన్న ఒప్పందం అతిక్రమించి, మా తండ్రి ఆస్తిలో వాటా మాకు ఇవ్వాలంటూ లోభిత్వంతో రావటం తప్పుగాని, జూదం ఆడటంలో తప్పేమిటి?

విశేషం: కర్ణుడి వాదం ఎంత అధర్మంగా ఉన్నదో చూడవచ్చును. ధర్మరాజు ద్యూత సమయాన్ని ఏమి అతిక్రమించాడు? పన్నెండేళ్ళు అరణ్యావాసమూ, ఒక యేడాది అజ్ఞాత వాసమూ చేసి వచ్చాడు గదా? అదే కదా 'ద్యూత సమయం?' ద్యూత

సమయ నిర్వహణానంతరం తమవాటా తమ కివ్వాలనటం 'అడియరితన' మెట్లా అవుతుందో? 'అడియరితనం' అనే దానికి 'బానిసతనం' అనికాక, 'లోభిత్వం' అని అర్థం చెప్పబడింది. అది సూర్యరాయాంధ్ర నిఘంటువు ననుసరించినది.

క. విరటుఁడు ద్రుపదుఁడుఁ దోడుగ । బరవసమున నెత్తి విడిసి బలిమి నడిగినం
గురుపతియు వెఱచి యిచ్చునె । ధరలోఁ జక్క సగ? మిట్టి తగవులు గలవే?' 251

ప్రతిపదార్థం: విరటుఁడున్, ద్రుపదుఁడున్; తోడుగన్= సహాయంగా; బరవసమునన్= ధైర్యంతో; ఎత్తి= పూని; విడిసి= దండెత్తి; బలిమిన్= బలవంతంగా; అడిగినన్= అడిగితే; కురుపతియున్= దుర్యోధనుడును; వెఱచి= భయపడిపోయి; ధరలోన్= భూమిలో; చక్క సగము= సరిసమం; ఇచ్చునె; ఇట్టి తగవులు+కలవే?= ఇటువంటి న్యాయపద్ధతులు ఎక్కడనైనా ఉన్నాయా?

తాత్పర్యం: విరాటుడూ, ద్రుపదుడూ సహాయులుగా పట్టుదలతో పూని దండెత్తి బలవంతంగా అడిగితే భయపడిపోయి దుర్యోధనుడు భూమిలో సరిసగం ఇస్తాడా? ఇటువంటి న్యాయాలు ఎక్కడైనా ఉన్నాయా?'

వ. అనిన గాంగేయుండు గటకటంబడి కర్ణున కిట్లనియె. 252

ప్రతిపదార్థం: అనినన్; గాంగేయుండు= భీష్ముడు; కటకటన్+పడి= కోపంతో బాధపడి; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా భీష్ముడు కోపించి కర్ణుడితో ఇట్లా అన్నాడు.

చ. చిక్కని పోటుమానిసి విసీ ! వినువారలు నవ్వ నేమిగా
నెక్కుడు మాట లాడెద? వహీన పరాక్రమశాలి యర్జునుం
డొక్కఁడ యార్వురన్ మనల నుగ్రరణంబున గెల్చె నిన్న; నేఁ
డిక్కడఁ బల్కులన్ గెలిచె దీ వతనిన్ మనరాజు కొల్వునన్. 253

ప్రతిపదార్థం: చిక్కని, పోటుమానిసివి= గట్టి శూరుడవులే; ఇసీ= ఛీ; వినువారలు, నవ్వన్; ఏమిగాన్= ఎట్లుగా; ఎక్కుడు మాటలు+ఆడెదవు= అధికంగా మాటాడుతున్నావు?; అహీనపరాక్రమ శాలి+అర్జునుండు+ఒక్కఁడు+అ= తక్కువ కాని పరాక్రమంతో ఒప్పే అర్జునుడు ఒక్కడే; నిన్న; మనలన్, ఆర్వురన్= మనలను ఆరుగురిని; ఉగ్రరణంబునన్= భయంకరమైన యుద్ధంలో; గెల్చెన్; ఈవు= నీవు; నేఁడు; ఇక్కడన్; మన రాజు కొల్వునన్= మన రాజు సభలో; అతనిన్= అర్జునుడిని; పల్కులన్= మాటలలో; గెలిచెదు= గెలుస్తావు.

తాత్పర్యం: 'బలే మంచి శూరుడవులే, ఛీ ! వినేవాళ్ళు నవ్వేటట్లు ఇంత ఎక్కువగా ఎట్లా మాటలాడుతున్నావు? మహాపరాక్రమశాలి అయిన అర్జును డొక్కడే మనలను ఆరుగురినీ భయంకర యుద్ధంలో నిన్న గెలిచాడు, ఈ వేళ నీవు అతడిని ఇక్కడ మన రాజుసభలో మాటలలో గెలుస్తున్నావు.

విశేషం: చిక్కని పోటు మానిసివి - మంచి శూరుడవే-అని ఎగతాళి. నిన్న గో గ్రహణ సమయంలో అతడి చేతిలో అట్లా ఓడిపోయి ఈ వేళ ఇట్లా మాటాడుతున్నావంటే విన్నవాళ్ళు ఎవరైనా నవ్వుతారు. అతడు ఒక్కడే - మనలను ఆరుగురిని ఓడించాడు. అతడు గెలిచింది ఉగ్రరణంలో - నీవు గెలిచింది మనరాజు సభలో. అతడు గెలిచింది అస్త్ర శస్త్రాలతో; నీవు-

గెలిచింది మాటలతో-ఇదీ భీష్ముడు కర్ణుడిని పరిహసించిన విధం. ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడు గెలిచిన ఆరుగురు వీరులు - 1.భీష్ముడు, 2.ద్రోణుడు, 3.కృపుడు, 4.అశ్వత్థామ, 5.కర్ణుడు, 6.దుర్యోధనుడు.

క. నరుఁ డాల వెనుక వచ్చినఁ, । గురురా జడుగంగ, నీవు, గురుఁడును, గృపుఁడున్
గురుసుతుఁడు వినఁగ, వారల । చిరసమయము దెగుట యేను జెప్పనె తెలియన్? 254

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఆల, వెనుకన్= ఆవుల వెనుక; వచ్చినన్= రాగా; కురు రాజు= దుర్యోధనుడు; అడుగంగన్= అడుగగా; నీవున్; గురుఁడును= ద్రోణుడునూ; కృపుఁడున్= కృపాచార్యుడూ; గురుసుతుఁడున్= గురు పుత్త్రుడయిన అశ్వత్థామా; వినఁగన్= వింటూండగా; వారల చిర సమయము= ఆ పాండవుల బహుకాల దీక్ష - (శపథం); తెగుట= ముగియటం; ఏను= నేను; తెలియన్+చెప్పనె?= తెలిసేటట్లు చెప్పలేదా?

తాత్పర్యం: అర్జునుడు ఆవులను మరలించుకొని పోవటానికి వాటి వెనువెంట వచ్చినప్పుడు దుర్యోధనుడు పాండవుల అజ్ఞాతవాస కాలపు లెక్క అడిగాడు. అప్పుడు నీవూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా వింటూండగా లెక్కకట్టి, అది ముగిసిందని నేను స్పష్టంగా చెప్పలేదా?'

తే. అనిన, ధృతరాష్ట్రుఁ డాపగాతనయు భక్తి । ననునయించి, రాధేయునిఁ గినిసి, ప్రియము
దోఁపఁ దా నిట్టు లనియె నా ద్రుపద మనుజ । పతి పురోహితుతోడ సంభ్రమము లేక. 255

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుఁడు; ఆపగా తనయున్= నదీ పుత్త్రుడిని-భీష్ముడిని; భక్తిన్= భక్తితో; అనునయించి= బతిమాలి; రాధేయున్= కర్ణుడిని; కినిసి= కోపపడి; ఆ ద్రుపద మనుజపతి పురోహితుతోడన్= ఆ ద్రుపదరాజ పురోహితుడితో; సంభ్రమము లేక= వేగిరపాటు లేకుండా; ప్రియము+తోఁపన్= ప్రీతి కనబడేటట్లు; తాను; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: అని కర్ణుడనగా, ధృతరాష్ట్రుడు భీష్ముడిని భక్తితో బ్రతిమాలి ఓదార్చి, కర్ణుడిని కోపపడి, ఆ ద్రుపద పురోహితుడితో వేగిరపాటు లేకుండా, ప్రీతి కనబడేటట్లు ఇట్లా అన్నాడు.

ఉ. 'మంచిగ నేను బంధులును మంత్రిజనంబులుఁ బెద్దలున్ విచా
రించి, సమస్త భూ ప్రజకుఁ బ్రీతిగ, బిడ్డల పాలి కిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు' మదీయ మనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట దెల్లము కౌరవజాతి కెంతయున్. 256

ప్రతిపదార్థం: మంచిగన్= మేలయ్యేటట్లు; ఏనున్= నేనూ; బంధులును= చుట్టాలూ; మంత్రి జనంబులున్= మంత్రులూ; పెద్దలున్; విచారించి= ఆలోచించి; సమస్త భూ ప్రజకున్= ఎల్ల భూ ప్రజలకూ, ప్రీతిగన్= సంతోషం కలిగేటట్లు; ఇప్డు= ఇప్పుడు; సౌమ్యున్+ఒక్కరున్= మంచివాడిని ఒక్కడిని, బిడ్డల పాలికిన్= బిడ్డల దగ్గరకు- పాండవుల వద్దకు; పుత్తెంచెదన్= పంపుతాను; మదీయ మనస్(ః)+గతి= నా మనస్సుయొక్క రీతి; వారిన్= ఆ పాండవులను; కూడి= కలిసి; వర్తించు తెఱంగు+కైకొనుట= మెలగే పద్ధతిని అవలంబించటం; కౌరవ జాతికిన్= కురువంశీయుల కందరికీ; ఎంతయున్+తెల్లము= మిక్కిలి స్పష్టం.

తాత్పర్యం: 'మేలు కలిగేటట్లు నేనూ, బంధువులూ, మంత్రులూ, పెద్దలూ ఆలోచించి, భూజనుల కందరికీ సంతోషంగా, ఇప్పుడు మంచివాడిని ఒకడిని నా బిడ్డలైన పాండవుల వద్దకు పంపుతాను. నేను మనస్సులో ఆ పాండవులతో కూడి ఉండే మార్గాన్నే అవలంబిస్తా నన్న సంగతి కురువంశీయుల కందరికీ సుస్పష్టం.

విశేషం: 1. కర్ణభీష్ముల వాగ్యుద్ధంతో కౌరవసభలో పాండవ పక్షం బలపడసాగింది. కర్ణుడికండగా దుర్యోధనుడు రంగంలోకి దిగినా భీష్ముడు సహించాడు. పైపెచ్చు సభ రసాభాస మౌతుంది. అందువలన ధృతరాష్ట్రుడు కల్పించుకొనక తప్పలేదు. భీష్ముడిని బ్రతిమిలాడాడు. కర్ణుడిని కోపగించాడు. ఆపైన తాను ద్రుపదపురోహితుడితో మాట్లాడాడు. పాండవులకు భాగమిస్తానలేదు కాని, పాండవుల వద్దకు దూతను పంపుతానన్నాడు. 'మా దూత నీవలె కాక, సౌమ్యంగా ఉంటా'డని ఎత్తిపొడిచాడు. పాండవులతో కూడి ఉండే మార్గాన్ని ఆలోచించి వర్తమానం పంపుతానన్నాడు. సభలో తన మర్యాద నిలుపుకొన్నాడు. (సంపా.)

2. నిజానికి ధృతరాష్ట్రుడి మనస్సు దుర్యోధనుడిని అనువర్తిస్తుందే తప్ప, తద్విరుద్ధంగా ప్రవర్తించాలని అనుకొనదు. పాండవులను కూడి ఉంటాననటం పైకి అనేమాట.

తే. **నీవు మున్నేఁగు' మని యతనికి విభూష । ణాంబరమ్ములతోఁ దమ్ములంబుఁ బెట్టి**
వీడుకోలిచ్చి పుచ్చిన, విప్రవరుఁడు । పాండు జనపాల తనయుల పాలి కరిగె. **257**

ప్రతిపదార్థం: నీవు; మున్ను+ఏఁగుము+అని= ముందుగా వెళ్ళుము అని; అతనికిన్; విభూషణ+అంబరమ్ములతోన్= ఆభరణాలతోను, వస్త్రాలతోనూ; తమ్ములంబున్+పెట్టి= తాంబూలం ఇచ్చి; వీడుకోలు+ఇచ్చి= సెలవిచ్చి; పుచ్చినన్= పంపగా; విప్ర - వరుఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడు; పాండుజనపాల తనయుల పాలికిన్= పాండురాజు కొడుకుల వద్దకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నీవు ముందు పద' అని అతడికి ఆభరణాలతోను, వస్త్రాలతోను తాంబూలం ఇచ్చి, సెలవిచ్చి పంపగా, ద్రుపద పురోహితుడు పాండవుల వద్దకు వెళ్ళాడు.

వ. **ఇట్లు సని వారలఁ గని యతండు సముచిత సంభాషణంబులఁ దనపోయి వచ్చిన తెఱం గెఱింగించె; నిట ధృతరాష్ట్రుండును బుత్త్ర మిత్త్ర వృద్ధామాత్య సహితంబుగా నాస్థానాసీనుం డయి యుండి సంజయు రావించి యతని కిట్లనియె.** **258**

ప్రతిపదార్థం: ఇట్లు+చని= ఈ విధంగా వెళ్ళి; అతండు= ద్రుపద పురోహితుడు; వారలన్= ఆ పాండవులను; కని= చూచి; సముచిత సంభాషణంబులన్= తగిన మాటలతో; తన పోయి వచ్చిన తెఱంగు= తాను వెళ్ళి వచ్చిన విధం; ఎఱింగించెన్= తెలిపాడు; ఇటన్= ఇక్కడ; ధృతరాష్ట్రుండును; పుత్త్ర, మిత్త్ర, వృద్ధ+అమాత్య+సహితంబుగాన్= కొడుకులతోనూ, స్నేహితులతోనూ, పెద్దలతోనూ, మంత్రులతోనూ కలిసి; ఆస్థాన+ఆసీనుండు+అయి+ఉండి= సభాస్థానంలో కూర్చుండి; సంజయున్= సంజయుడిని; రావించి= రప్పించి; అతనికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపద పురోహితుడు వెళ్ళి పాండవులను చూచి తాను వెళ్ళి వచ్చిన విధం తగిన మాటలతో తెలిపాడు. ఇక్కడ ధృతరాష్ట్రుడు కూడా పుత్రులతోనూ, మిత్రులతోనూ, పెద్దలతోనూ, మంత్రులతోనూ కూడి సభాస్థానంలో కూర్చొనిఉండి సంజయుడిని పిలిపించి అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: సంజయుడు సూత కులజుడు, మంచివాడు. ఎప్పుడూ ధృతరాష్ట్రుడి వద్దనే ఉండి అతడికి ఉపచారాలు చేస్తూ ఉంటాడు. ముందు ముందు కురుక్షేత్ర సంగ్రామ వార్తలు ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి చెపుతూ ఉంటాడు. యుద్ధభూమిలో ఎవ్వరికీ కనపడకుండా నిరపాయంగా ఉండగలిగే శక్తి ఇతడికి వ్యాసుడు అనుగ్రహిస్తాడు.

తే. 'పాండు నరపాల సుతు లుపప్లావ్యమునకు । వచ్చియున్నారు; నీ వేఁగి వాసుదేవ
సహితముగ వారిఁ గని, తద్విషాద మేమి । భంగీ మాను నమ్మెయిఁ దగఁ బలుకవలయు.' 259

ప్రతిపదార్థం: పాండు నరపాల సుతులు= పాండురాజు కొడుకులు; ఉపప్లావ్యమునకున్= ఉపప్లావ్యమనే పురానికి; వచ్చి+ఉన్నారు; నీవు+ఏఁగి= నీవు వెళ్ళి; వారిన్; వాసుదేవ సహితముగన్= శ్రీ కృష్ణుడితో కూడా; కని, తద్+విషాదము= వారి దుఃఖం; ఏమి భంగిన్ మానున్= ఏ విధంగా పోతుందో; అమ్మెయిన్ (ఆ+మెయిన్)= ఆ రీతిగా; తగన్= ఒప్పుగా; పలుకవలయున్= మాట్లాడాలి.

తాత్పర్యం: 'పాండవులు ఉపప్లావ్య పురానికి వచ్చి ఉన్నారు. నీవు వెళ్ళి శ్రీకృష్ణుడితో కూడి ఉండగా వారిని చూచి, వారి దుఃఖం ఏ విధంగా తొలగి పోతుందో, ఆ విధంగా ఒప్పుగా పలకాలి.

ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బాండవుల యొద్దకుఁ బంపుట (సం. 5-22-1)

క. 'మీ యయ్య, మీరు వనవా । సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం । డై యిట పుత్తెంచె నన్ను' ననుమీ మొదలన్. 260

ప్రతిపదార్థం: మొదలన్= మొదట; మీరు; వన వాస+ఆ యాసమున్= అరణ్య వాస దుఃఖాన్ని; విస్తరించి= దాటి; అభ్యుదయమునన్= అభివృద్ధితో; డాయుట= చేరటం; విని; మీ+అయ్య= మీ తండ్రి; ముదిత+ఆత్ముండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై, నన్నున్; ఇట= ఇక్కడికి; పుత్తెంచెన్= పంపాడు; అనుమీ= అని చెప్పుము.

తాత్పర్యం: 'నీవు వెళ్ళగానే మొదట 'మీరు అరణ్యవాస దుఃఖాన్ని దాటి అభివృద్ధితో వచ్చారన్న సంగతి విని మీ తండ్రి సంతోషంతో నన్ను ఇక్కడికి పంపించా' డని పలుకుము.'

వ. అని చెప్పి, చుట్ల నున్న వారలతో నిట్లనియె. 261

ప్రతిపదార్థం: అని, చెప్పి; చుట్లన్+ఉన్న వారలతోన్= చుట్టూ ఉన్న వాళ్ళతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి, తన చుట్టూ ఉన్నవాళ్ళతో ఇట్లా అన్నాడు.

క. 'దుర్యోధనుండు కార్యా । కార్యజ్ఞుఁడు గామి నిట్టి కలఁక గలిగెఁ గా
కార్యులు దృఢధైర్యులు రణ । ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే? 262

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; కార్య+అకార్యజ్ఞుఁడు+కామిన్= చేయదగినదేదో, చేయదగని దేదో తెలిసిన వాడు కాకపోవటం చేత; ఇట్టి,కలఁక= ఇటువంటి సంక్షోభం; కలిగెన్+కాక= పుట్టింది కాని; ఆర్యులున్= మంచివాళ్ళూ; దృఢధైర్యులున్= మంచి ధైర్యం కల వాళ్ళూ; రణ ధర్యులున్= యుద్ధ కార్యభారం వహించేవాళ్ళూ, యుద్ధ నిపుణులూ; అగు; పాండు సుతులు= పాండవులు; దోష+అన్వితులే= దోష సహితులా?

తాత్పర్యం: 'మా దుర్యోధనుడు కార్యాకార్యాలు తెలియనివా డవటం చేత ఇటువంటి సంక్షోభం పుట్టింది కాని, మంచివాళ్ళూ, మంచి ధైర్యవంతులూ, యుద్ధ నిపుణులూ అయిన పాండవులు దోషులా?

విశేషం: తన కొడుకే మంచి చెడ్డలు తెలిసినవాడు కాడనీ, పాండవులు నిర్దోషులనీ అనటం ధృతరాష్ట్రుడు పైకి అనే మాటలు. అవి అతడి మాట నేర్పును సూచిస్తాయి.

క. క్షీరోదకవృత్తి మనము । వారలునుం గలిసి బ్రదుకవలదే నెమ్మిన్?
వా రిడుమలఁ బడఁ దగియెడు । వారే? పితృభాగ మేలువారలు గారే? 263

ప్రతిపదార్థం: మనమున్; వారలునున్; క్షీర+ఉదక వృత్తిన్= పాలూ నీళ్ళూ వలె; కలసి; నెమ్మిన్= ప్రీతితో; బ్రదుకవలదే= బ్రతుకవద్దా?; వారు, ఇడుమలన్+పడన్+తగియెడు వారే?= వాళ్ళు కష్టాలు పడదగిన వాళ్ళా?; పితృ భాగము+ఏలు వారలు+ కారే= తమ తండ్రి వాటా అనుభవించ దగిన వాళ్ళు కారా?

తాత్పర్యం: మనమూ, వాళ్ళూ పాలూ నీళ్ళూ వలె కలిసిపోయి హాయిగా బ్రతుకవద్దా? వాళ్ళు కష్టాలు పడదగ్గవాళ్ళా? తమ తండ్రి వాటా అనుభవించదగిన వాళ్ళు కారా?

విశేషం: అలం: యథాసంఖ్యం. 'క్షీరోదక వృత్తి మనము వారలునున్ గలిసి-' క్షీరం మనం, ఉదకం వారు- యథాసంఖ్యం. ఈ అలంకారంలో కౌరవపాండవులు విడదీయరానట్లుగా కలియటమే ముఖ్యం కాని, వారిలో పాలవంటివారు గొప్పవారనీ, నీళ్ళవంటివారు తక్కువవారనీ భావించరాదు. కాగా ఎప్పుడైనా పాలలో నీళ్ళు కలవటం లోక ప్రసిద్ధి. ధృతరాష్ట్రుడు 'క్షీరోదకవృత్తి మనము వారలనుం గలిసి బ్రతుకవలదే?' అంటే - 'క్షీరోదకగతిఁ బాండవ కౌరవు లొడఁగూడి మనకి కార్యం'బని శ్రీకృష్ణుడు అన్నాడు (చూడు. ఉద్యో.3.258). ఈ సారాసార విచారం ఆ అలంకారంలో లేదనలేము. కాని, ఎవరి కనుకూలంగా వారు యథాసంఖ్యాలంకారాన్ని ప్రయోగించా రన్నది వాస్తవం. (సంపా.)

ఆ. మనల నింక నమ్మ రనృతాత్ము లన్యాయ । పరులు గర్వు లనుచుఁ బాండుసుతులు;
గూడి మనుట కియ్యకొన నేర; రైనను । ధర్మజుండు గలఁడు దగవు నడప,' 264

ప్రతిపదార్థం: మనలన్= మనలను; అనృత+ఆత్ములు= అసత్య పరులు; అన్యాయపరులు= అధర్మపరులు; గర్వులు= గర్వం కలవారు; అనుచున్; పాండుసుతులు= పాండవులు; ఇంకన్= ఇకమీదట; నమ్మరు; కూడి మనుటకున్= కలిసి బ్రతకటానికి; ఇయ్యకొనన్+నేరరు= ఒప్పుకొనజాలరు; ఐనను; తగవు నడపన్= ధర్మం నడపటానికి; ధర్మజుండు, కలఁడు.

తాత్పర్యం: మనలను అసత్యవాదులనీ, అధర్మపరులనీ, గర్విష్ఠులనీ అంటూ పాండవులు ఇకమీద విశ్వసించరు. మనతో కలిసి బ్రతకటానికి అంగీకరించజాలరు. అయినా, ధర్మం నడపటానికి ధర్మరాజున్నాడు.

వ. అని పలికి వెండియు. 265

తాత్పర్యం: అని పలికి ఇంకా.

మ. 'మన కీ కుండఁగ వచ్చునే? మనము దుర్మానంబు వాటించి యొ
ప్పని కార్యంబులు వట్టి వారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన, నిక్కంబగు నల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టఁ గృ
ష్ణుని సారథ్యము నై జగత్త్రితయ సంక్షోభంబు గా కుండునే? 266

ప్రతిపదార్థం: మనకున్; ఈక+ఉండఁగన్, వచ్చునే?= ఇవ్వకుండా ఉండటానికి మనకు శక్యమా?; మనము; దుర్మానంబు= చెడుగర్వాన్ని; పాటించి= పూని; ఒప్పని కార్యంబులు+పట్టి= తగని పనులు చేసి; వారికిన్; తగన్= తగునట్లుగా; పాలు+ఈక= భాగం ఇవ్వక; గర్వంబులు+ఆడినన్= గర్వంగా మాటాడితే; నిక్కంబు+అగు+అల్కన్= నిజమైన కోపంతో; అర్జునుఁడు, గాండీవంబున్; మోపెట్టన్= ఎక్కుపెట్టితే; కృష్ణుని సారథ్యమున్+ఐ= దానికి తోడు శ్రీకృష్ణుడి సారథ్యం కూడా ఉండి; జగత్+త్రితయ సంక్షోభంబు+కాక+ఉండునే?= మూడులోకాలకు కలత సంభవించకుండా ఉంటుందా?

తాత్పర్యం: వారిభాగం వారికి ఇవ్వకుండా ఉందామన్నా మనకు శక్యం కాదు. మనం దురహంకారం పూని చేయగూడని పనులు చేసి వారికి సముచితంగా భాగం పంచిపెట్టక గర్వంగా మాటాడితే, నిజమైన కోపంతో అర్జునుడు గాండీవం ఎక్కుపెట్టగా, దానికి శ్రీకృష్ణుడి సారథ్యం కూడా తోడుకాగా ముల్లోకాలూ దద్దరిల్లకుండా ఉంటాయా?

తే. **అలఘు గదఁ బూంచికొని భీముఁ డతిరయమునఁ । గురుకుమారులపైఁ దీవ్రకోప మెసఁగఁ**
గవియు టాత్మ భావించినఁ గంప మడరు; । నిక్క మెవ్వరు మార్కొని నిలుచువారు? **267**

ప్రతిపదార్థం: భీముఁడు; అలఘు గదన్= పెద్ద గదను; పూంచి కొని= పట్టుకొని; అతి రయమునన్= మిక్కిలి వేగంతో; కురు కుమారులపైన్= కౌరవులమీద; తీవ్ర కోపము+ఎసఁగన్= తీవ్ర మైన కోపం అతిశయించగా; కవియుట= క్రమ్ముకొనటం; ఆత్మన్= మనస్సులో; భావించినన్= ఊహించుకుంటే; కంపము= వణకు; అడరున్= అధికమవుతుంది; నిక్కము= నిజంగా; ఎవ్వరు; మార్కొని= అతడిని ఎదుర్కొని; నిలుచువారు?= నిలువగలిగేవారు?

తాత్పర్యం: పెద్ద గద ధరించి భీముడు అమితవేగంతో తీవ్రమైన కోపం అతిశయించగా కౌరవులమీద పడటం మనస్సులో ఊహించుకొంటే వణకు పుట్టుకొస్తుంది. నిజంగా అతడిని ఎదిరించి నిలబడగలవారెవరు?

సీ. **కవ లగ్రజన్ముల కంటె నేమిటఁ గీడు? । ద్రుపదుఁ డల్పుండె? తత్సుతులు బాహు**
గర్వ సమగ్రులు గారె? విరాటుండు । నాతని తమ్ములు, నాత్మజులును
నసదులే? సాత్యకి యలఁతులఁ బోయెడు । వాఁడె? వృష్ణి కుమారవరు లనేకు
లట్టి యోధులు పోర నరవాయిఁ గొందురే? । పాండ్యుండుఁ, గేకయపతులు నాది

తే. **యైన బంధులు, మిత్త్రులు నగ్గలికలఁ । గొఱఁత వడియెడు వారె? యందఱను గెల్వ**
నోపినను రుద్రునకు నైన నోర్వరాని । ధర్మపుత్త్రు కోపమునకుఁ దలఁకవలదె?' **268**

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; అగ్ర జన్ములకంటెన్= అన్నగార్లకంటె; ఏమిటన్= ఎందులో; కీడు?= తక్కువ?; ద్రుపదుఁడు; అల్పుండె?= తక్కువ వాడా?; తద్+సుతులు= అతడి కొడుకులు; బాహు గర్వ సమగ్రులు+కారె?= భుజ బల గర్వంతో నిండినవారు కారా?; విరాటుండున్, ఆతని తమ్ములున్; ఆత్మజులునున్= కొడుకులూ; అసదులే?= తక్కువవారా? సాత్యకి; అలఁతులన్+పోయెడు వాఁడె?= తేలికగా పోయేవాడా?; వృష్ణి కుమార వరులు= వృష్ణివంశీయులైన కుమార శ్రేష్ఠులు; అనేకులు+అట్టి యోధులు= పెక్కుమంది అటువంటి యోధులు; పోరన్= యుద్ధంలో; అరవాయిన్+కొందురే?= జంకుతారా?; పాండ్యుండున్; కేకయ పతులున్= కేకయదేశపు రాజులూ; ఆది+ఐన బంధులున్= మొదలైన చుట్టాలూ; మిత్త్రులున్= స్నేహితులూ; అగ్గలికలన్= విజృంభించటంలో; కొఱఁత+పడియెడు వారె?= తక్కువ వాళ్ళా?; అందఱను గెల్వన్+ఓపినను=

వాళ్ళందరినీ గెలవగలిగినా; రుద్రునకున్+ఐనన్= రుద్రుడికి కూడా; ఓర్వరాని= ఓడించ తరం కాని; ధర్మపుత్త్రు కోపమునకున్= ధర్మరాజు కోపానికి; తలఁకవలదె?= వెరవవలదా?

తాత్పర్యం: నకుల సహదేవులు అన్నగార్లకంటె ఎందులో తక్కువ? ద్రుపదుడు తక్కువవాడా? అతడి కొడుకులు భుజబల గర్వం నిండినవాళ్ళు కారా? విరాటుడూ, అతడి తమ్ములూ, కొడుకులూ తక్కువ వాళ్ళా? సాత్యకి అంత తేలికగా పోయేవాడా? వృష్ణి వంశీయులైన కుమార శ్రేష్ఠులు, అటువంటి యోధులు అనేకులు యుద్ధంలో జంకుగొంటారా? పాండ్యరాజూ, కేకయదేశపు రాజులూ మొదలైన చుట్టాలూ, స్నేహితులూ విజృంభించటంలో తక్కువ తిన్నవాళ్ళా? అందరినీ ఓడించగలిగినా, రుద్రుడికి కూడా ఓడించటానికి శక్యం కాని ధర్మరాజు కోపానికి భయపడవలసిందే కదా!'

విశేషం: ధృతరాష్ట్రుడి మాటలను బట్టి అతడికి పాండవులమీద ప్రేమకంటె, వారంటే భయమే ఎక్కు వనిపిస్తుంది.

వ. అని పలికి సంజయుదిక్కు మొగంబై యెల్లవారును విన నిట్లనియె. 269

ప్రతిపదార్థం: అని, పలికి, సంజయు దిక్కు మొగంబు+ఐ= సంజయుడి కేసి చూచి; ఎల్లవారునున్= అందరూ; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి సంజయుడివైపు చూచి అందరూ వినేటట్లు ఇట్లా అన్నాడు.

తే. నీవు ధర్మజుపాలికి నెమ్మి నరుగు; । మతఁడు పేరోలగం బున్న యవసరమునఁ
గాన్పు; మతనికి ననుజవర్గంబునకును । బంధులకు నింపు పుట్టంగఁ బలుకు మచట. 270

ప్రతిపదార్థం: నీవు; ధర్మజు పాలికిన్= ధర్మరాజు దగ్గరకు; నెమ్మిన్= ప్రీతితో; అరుగుము= వెళ్ళుము; అతఁడు; పేరోలగంబు (పేరు+ఓలగంబు)+ఉన్న+అవసరమునన్= పెద్ద కొలువు తీర్చిఉన్న సమయంలో; కాన్పుము= కనిపించుము; అతనికిన్, అనుజ వర్గంబునకున్= తమ్ముల సమూహానికీ; బంధులకున్= చుట్టాలకూ; ఇంపు= సంతోషం; పుట్టంగన్= కలిగే విధంగా; అచటన్= అక్కడ; పలుకుము= మాటలాడుము.

తాత్పర్యం: నీవు ధర్మరాజు వద్దకు ప్రీతితో వెళ్ళుము. అతడు పెద్ద కొలువు తీర్చిన సమయంలో దర్శించుకొనుము. అతడికీ, ఆతడి తమ్ములకూ, బంధువులకూ సంతోషం కలిగే విధంగా అక్కడ మాటాడుము..

క. నెయ్యము వాటించి, కడుం । దియ్య మెసఁగ, నలుక లెల్లఁ దీఱునటులుగాఁ
గయ్య మను తలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్. 271

ప్రతిపదార్థం: నెయ్యము+పాటించి= స్నేహం చూపి; కడున్= మిక్కిలి; తియ్యము+ఎసఁగన్= ప్రీతి అతిశయించగా; అలుకలు+ ఎల్లన్= కోపాలన్నీ; తీఱు+అటులు+కాన్= తొలగిపోయే విధంగా; కయ్యము+అను తలఁపు+లోనుగన్= యుద్ధాలోచన మొదలుగా; ఆ+యమ నందనుఁడు= ఆ ధర్మరాజు; మాను+అట్టి తెఱఁగునన్= విడిచిపెట్టే విధంగా.

తాత్పర్యం: స్నేహం పాటించి, మిక్కిలి ప్రీతి అతిశయించగా, కోపాలన్నీ తీరిపోయేటట్లు ఆ ధర్మరాజు యుద్ధాలోచనాదికం మానే విధంగా.

విశేషం: ధృతరాష్ట్రు డీ పద్యంలో సంజయుడి రాయబారం సాధించవలసిన ప్రధాన ప్రయోజనాన్నీ, అందులో పాటించవలసిన విధానాన్ని నిర్దేశించాడు. 1.స్నేహం పాటించాలి. 2.వారిలో మిక్కిలి ప్రీతి అతిశయించేటట్లు చేయాలి. 3.ధర్మరాజు మనసులో ఉన్న కోపాలన్నీ తీరిపోవాలి. 4.ధర్మరాజు యుద్ధాలోచనం మానుకోవాలి. 5.శాంతిమార్గంలో కార్యం సాధించాలి. చివరి లక్ష్యం ధర్మరాజు యుద్ధాలోచన మానటం. ఇందులో రాజ్యభాగ ప్రసక్తి లేదు. ధర్మరాజు విరక్తికే ప్రాధాన్యం ఉన్నది. ఇది అపూర్వమైన రాయబారం. రాజనీతికి రత్నపరీక్ష వంటిది. (సంపా.)

సంజయుఁ డుపప్లావ్యంబున నున్న పాండవులయొద్దకు వచ్చుట (సం. 5-22-39)

వ. శాంతి ప్రకారంబునం గార్యంబు నడపి యొక్కటియై మనుట యొడఁగూర్చి రమ్ము; రథం బెక్కి పొ' మ్మని తగినతెఱంగున వీడ్కొలిపిన, సంజయుండునుం జని, యుపప్లావ్యంబు సొచ్చి, మాధవు మందిరంబున కరిగి, యభ్యంతర వినోదంబుల నరసహితుండై యున్న యన్నారాయణునకుం దనరాక యెఱింగించి పుచ్చి, తగఁ బ్రవేశించి, భయభక్తివినయ సంభ్రమంబులు మెఱయ వారలం గాంచి, యమ్మహాత్ము లిరువుర సంభావనంబులును, సంభాషణంబులునుం బడసి సంప్రీతచేతస్కుండై, మఱునాఁడు ధర్మతనయు నొడ్డోల గంబున్న సమయంబు వేచి, సముచితంబుగా నతనిం గని సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన, నతండుం బ్రియపూర్వకంబుగా నాదరించి తన సమీపంబున నునిచికొనినం గొలిచియుండి యతని కిట్లనియె. 272

ప్రతిపదార్థం: శాంతి ప్రకారంబునన్= శాంతి మార్గంలో; కార్యంబున్+నడపి= పనిని జరిపించి; ఒక్కటి+ఐ, మనుట= కలిసి బ్రతుకటం, ఒడన్‌కూర్చి రమ్ము= కలిగించి రావలసింది; రథంబు+ఎక్కి, పొమ్ము, అని; తగిన తెఱంగునన్= తగిన విధంగా; వీడ్కొలిపినన్= పంపగా; సంజయుండునున్, చని; ఉపప్లావ్యంబు+చొచ్చి= ఉపప్లావ్యపురం ప్రవేశించి; మాధవు మందిరంబునకున్ అరిగి= శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళి; అభ్యంతర వినోదంబులన్= అంతఃపురపు వేడుకలతో; నర సహితుండు+ఐ= అర్జునుడితో కూడినవాడై; ఉన్న+ఆ+నారాయణునకున్= ఉన్న ఆ శ్రీకృష్ణుడికి; తనరాక; ఎఱింగించి పుచ్చి= చెప్పి పంపి; తగన్+ప్రవేశించి= తగినట్లు ప్రవేశించి; భయ భక్తి వినయ సంభ్రమంబులు= భయమూ, భక్తీ, అడకువా, గౌరవమూ; మెఱయన్= ప్రకాశించగా; వారలన్, కాంచి; ఆ+మహాత్ముల+ఇరువుర= ఆ మహనీయు లిద్దరియొక్క; సంభావనంబులును= ఆదరములూ; సంభాషణంబులునున్= మాటలూ; పడసి= పొంది; సంప్రీత చేతస్కుండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై; మఱునాఁడు; ధర్మ తనయు+ఒడ్డోలగంబు (ఒడ్డు+ఓలగంబు)+ఉన్న, సమయంబు వేచి= ధర్మరాజు నిండుకొలువుండే సమయం కాచుకొని; సముచితంబుగాన్= తగినరీతిని; అతనిన్= ధర్మరాజును; కని; సాష్టాంగంబుగాన్+ప్రణమిల్లినన్= సాష్టాంగంగా (ప్రధానాలైన ఎనిమిది శరీరావయవాలు నేలకు తాకేటట్లు) నమస్కరించగా; అతండున్= ధర్మరాజుకూడా; ప్రియ పూర్వకంబుగాన్= సంతోషపురస్సరంగా; ఆదరించి= గౌరవించి; సమీపంబునన్= దగ్గరగా; ఉనిచికొనినన్= ఉంచగా (ఉండేటట్లు కూర్చుండబెట్టుకొనగా); కొలిచి+ఉండి= సేవించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శాంతిమార్గంలో కార్యం నడిపి కలిసి బ్రతకటాన్ని సాధించుకొని రమ్ము, రథమెక్కి వెళ్ళుము' అని తగిన విధంగా పంపగా, సంజయుడునూ వెళ్ళి, ఉపప్లావ్యపురం ప్రవేశించి, శ్రీకృష్ణుడి భవనానికి పోయి, అంతఃపురం ప్రవేశించి, అంతఃపురపు వేడుకలలో అర్జునుడితో కూడి ఉన్న ఆతడికి తన ఆగమనవార్త చెప్పి పంపి, ఒప్పుగా ప్రవేశించి, భయమూ, భక్తీ, వినయమూ ప్రకాశించగా వారిని చూచి, ఆ ఇద్దరి మహనీయుల మర్యాదలూ,

మన్ననలూ పొంది, సంతోషించిన మనస్సు కలవాడై మరునాడు ధర్మరాజు పెద్ద కొలువు తీర్చే సమయం కాచుకొని ఉండి, తగిన రీతిని ఆతడిని దర్శించి, సాష్టాంగ నమస్కారం చేశాడు. ధర్మరాజు ప్రీతి పురస్సరంగా ఆదరించి దగ్గర కూర్చుండ బెట్టుకొనగా సంజయుడు సేవించి అతడితో ఇట్లా అన్నాడు.

తే. **'భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁ బడసి నాదు । చూడ్కి చరితార్థ మయ్యెఁ; నస్తోక పుణ్య**
ధనుఁడు మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణినాథుఁ । డిందు మీ యున్కి విని, ప్రియ మెసకమెసఁగ. **273**

ప్రతిపదార్థం: భాగ్యమునన్= అదృష్టంచేత; నిన్నున్; కనుఁగొనన్+పడసి= చూడగలిగి; నాదు చూడ్కి= నా దృష్టి; చరితార్థము+ అయ్యెన్= సార్థక మయింది; అస్తోక పుణ్య ధనుఁడు= అనల్పమైన పుణ్యం ధనంగా గలవాడు(అగు); మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణి నాథుఁడు= మీ తండ్రి అయిన ధృతరాష్ట్ర మహారాజు; ఇందున్= ఇక్కడ; మీ+ఉన్కి= మీరు ఉండటం; విని; ప్రియము= ప్రీతి; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా.

తాత్పర్యం: 'అదృష్ట వశాన నిన్ను చూడగలగటం వలన నా దృష్టి సార్థకమయింది. అధిక పుణ్యాధనుడైన మీ తండ్రి ధృతరాష్ట్ర మహారాజు మీ రిక్కడ ఉండటం విని, ప్రీతి అతిశయించగా.

విశేషం: సంజయుడు మాటలాడే తీరు ధర్మజుడికి ఆశాజనకంగా లేదు. ఆప్యాయంగా రాజ్యభాగమిచ్చి హస్తినాపురానికి పిలవటానికి సంజయుడు వచ్చినట్లు లేదు. అందువలన అతడు మాట్లాడే మాటలన్నీ కంటితుడుపు మాటలని ధర్మజుడు అంచనా వేయసాగాడు. సంజయుడు పొందకుండ మాట్లాడాలని యత్నించటం, ధర్మజుడు అతడికి అందకుండా మాట్లాడటం మొదలౌతున్నది. పైకి లోకమర్యాదకై మాటలాడుతున్నా, లోన ఒక గూఢమైన విరుద్ధార్థం స్ఫురించటం సంజయుడి సంభాషణ శిల్పం. అదృష్టవశాన నిన్ను చూడగలిగాననటం ఇది ఔపచారికం. నిన్ను మరల చూస్తానని అనుకొనలేదు. అదృష్టవశాన చూడగలిగాను - అని గూఢార్థం. నా దృష్టి సార్థకమయింది - ఇది లౌకికం. నిన్ను దర్శించటం వలన నా దృక్పథం ప్రయోజనంతో కూడినదయింది - ఇది గూఢార్థం. మీ తండ్రి మీరిక్కడ ఉన్నారని తెలిసి ప్రీతి చెందాడన్నాడు. పాండవులు క్షేమంగా ఉన్నారని తెలిసి సంతోషించాడని ప్రకృతార్థం. అయితే ధృతరాష్ట్రుడికి వాడిన విశేషణాలు ధర్మరాజును అధిక్షేపిస్తున్న భావాన్ని ధ్వనింపజేస్తాయి. రాజు అస్తోకపుణ్యధనుడట! ధరణినాథుడట! ఈ రెండింటిని కలిపి చదువుకొంటే ధృతరాష్ట్రుడు అపారపుణ్యధనుడు కాబట్టి ప్రభువై రాజ్యాన్ని పాలిస్తున్నాడనీ, అత డొక్కడే రాజనీ అర్థమేర్పడుతుంది. పరిశేషన్యాయంతో పుణ్యహీనులైన పాండవులు ఈ విధంగా రాజ్యహీనులై ఉపప్లావ్య నగరంలో ఉన్నందుకు తండ్రి ప్రీతి చెందాడనే విపరీతార్థం స్ఫురించే అవకాశం ఉన్నది. గూఢవ్యంగ్యార్థ ధ్వని కాకువు నాశ్రయించి ఈ పద్యంలో రాణించింది. (సంపా.)

క. **అనుజులు నీవును ద్రోవది । యును బుత్త్రచయంబు నున్న యోగక్షేమం**
బున తెఱఁ గారయఁ బుత్తెం । చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్.' **274**

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములూ; నీవును; ద్రోవదియును= ద్రౌపదీ; పుత్త్ర చయంబున్= కుమారుల సమూహమూ; ఉన్న యోగక్షేమంబున తెఱఁగు= కుశలంగా ఉన్న విధం; ఆరయన్= తెలిసికొనటానికి; నితాంత స్నేహ పూర్ణ చేతస్(ః)+ వృత్తిన్= అధికమైన మైత్రితో నిండిన మనోవ్యాపారంతో; పుత్తెంచెన్= (నన్ను) పంపాడు.

తాత్పర్యం: తమ్ములూ, నీవూ, ద్రౌపదీ, నీ కొడుకులూ కులాసాగా ఉన్న విధం తెలిసికొనటానికి అధిక మైత్రితో నిండిన మనస్సుతో నన్ను పంపాడు.

విశేషం: 1. 'నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్' - అని ఎంతో గొప్పగా చెప్పి, పాండవులు యోగక్షేమాలతో ఉన్న విధం తెలిసికొని రమ్మని రాజు సంజయుడిని పంపినట్లు తెలిపాడు. అంత అనురాగం నిండిన వాడు శూన్యహస్తాలతో క్షేమాదులను తెలిసికొనటానికి పంపాడంటే- ఎంత మర్యాదగా ఉంటుందో, అంత ఎగతాళిగా ఉంటుంది. ధర్మజుడు మెత్తనిపులి. సంజయుడికి దీటుగా మాట్లాడి దెబ్బకు దెబ్బ తీయాలనుకొనటానికి ఈ మాటలే హేతువులయ్యాయి.

2. పాండవులకు 'ఇంపు పుట్టంగఁ బలుకు'మని (270 వ పద్యం) ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలకు అనువుగా నెయ్యం, తియ్యం, ప్రీతి అతిశయించేటట్లు పాండవుల వద్దకు ధృతరాష్ట్రుడు తనను పంపాడని చెప్పనారంభించాడు. (సంపా.)

వ. అనిన సూతనందనునకు ధర్మనందనుం డిట్లనియె. 275

ప్రతిపదార్థం: అనినన్; సూతనందనునకున్= సూతపుత్రుడైన సంజయుడికి; ధర్మ నందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనిపల్కిన సంజయుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. 'ఆ రాజు మా దెసం గల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్. 276

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; మాదెసన్+కల= మాయందు కలిగి ఉన్న; కారుణ్యము కతమునను= దయ కారణంగా; సుఖంబునన్= సుఖంగా; ఇట్లు+ఉన్నారము= ఇట్లా ఉన్నాం; నినున్, పుత్తెంచిన గారవమునన్= పంపిన వాత్సల్యం చేత; నాదు మది= నా మనస్సు; వికాసమున్+పొందెన్= సంతోషించింది.

తాత్పర్యం: 'ఆ ధృతరాష్ట్ర మహారాజుకు మా మీద ఉన్న దయచేత మేము ఇట్లా సుఖంగా ఉన్నాము. నిన్ను ఇక్కడకు పంపి చూపిన వాత్సల్యంచేత నా మనస్సు సంతోషించింది.

విశేషం: 1. ధర్మరాజు 'మెత్తని పులి' అనిపించే పద్యాలలో ఇది ఆణిముత్యం. ఈ పద్యంలో కాకువు నాశ్రయించి వ్యతిరేక వ్యంగ్యార్థం స్ఫురిస్తుంది. ఆ అర్థాన్ని ఇట్లా భావించవచ్చును. ఆ రాజుకు మా పట్ల ఉన్న దయ వలన ఇట్లా సుఖంగా ఉన్నాం - అన్నప్పుడు దయ-దయకాదు, కాపట్యం వలన అని అర్థం. ఇట్లు-అంటే ఈ విధంగా రాజ్యహీనులమై అని భావం; సుఖంగా - అంటే దుఃఖంగా అనీ, ఉన్నారమంటే-ఏదో ఇట్లా బ్రతుకు ఈడుస్తున్నాం అని భావం. తెలుగువారి వ్యవహారంలో దయ, ఇట్లు, సుఖంగా, ఉన్నాం - అనే మాటలు వ్యతిరేకార్థక ధ్వనికి వాడటం సర్వసామాన్యం. గౌరవవాక్యాలుగా పలికి, కాకువుతో అధిక్షేపంగా మార్చి, దెప్పిపొడుపు మాటలుగా వెలువరించిన ఈ పద్యం సంజయవాక్య రచనాశిల్పానికి ప్రతిస్పర్ధి శిల్పం. సంజయుడి వాక్యం ప్రౌఢం; ధర్మజుడి వాక్యం ప్రౌఢతరం. ఈ పద్యాన్ని తెలుగువారు లోకోక్తిగా వాడుకొంటారు.

2. 'నినుఁ బుత్తెంచిన గారవమున నాదుమది వికాసముఁ బొందెన్' - ఇది పైకి నిండుగా కనిపించే ప్రశంసావాక్యం. కాని దాని వెనుక ధర్మజుడి నిష్ఠురత్వం కూడా వ్యంగ్యంగా ధ్వనిస్తుంది. ద్రుపదపురోహిత రాయబారం విఫలమైన తరువాత, సంధి పొసగదని నిరాశ చెందుతున్న సమయంలో మాతండ్రి మిమ్ములను గౌరవంగా నా వద్దకు పంపటం వలన మనస్సు వికసించిందని ప్రకృతార్థం. ఎన్నో విషయాలు తెలిసి మనస్సు మరింత వివేకవంతమైనదని రెండో అర్థం. న్యాయమైన రాజ్యభాగాన్ని ఇవ్వకుండా, కర్ర విరుగకుండా, పాము చావకుండా ఎన్ని ఎత్తులు వేయవచ్చునో తెలిసికొని ధర్మజుడి బుద్ధి వికాసం పొందిందని గూఢార్థం. మూలంలోని ధర్మరాజువలె - 'చిర దిదం కుశలం భారతస్య । శ్రుత్వా రాజ్ఞః కురువృద్ధస్య సూత । మన్యే సాక్షా ద్దృష్ట మహం నరేంద్రం దృష్ట్వైత్వాం సంజయ ప్రీతి యోగాత్'' (సం. 5.23 .7) అనిఅనడు. సంజయుడు

రావటం సాక్షాత్తు ధృతరాష్ట్రుడు వచ్చినట్లే ఉన్నదనటం అతడి వినయసూచకం. తెలుగులో ధర్మరాజు అంత బయటపడేవాడు కాడు. (సంపా.)

3. ఆ రాజు - అని అనటం - సంజయుడు 273 పద్యంలో 'మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణి నాథుఁడు' అని అన్నందుకు తిరిగి వడ్డింపు. తండ్రిగా కాక రాజుగా నిన్ను రాయబారిగా పంపాడు. ధృతరాష్ట్రుడికి మా పట్ల రాజ్యతంత్రమే కాని స్నేహతంత్రం లేదని అధిక్షేపం. ఇట్లు - అనేది అభినయ స్ఫోరక వాచకం. (సంపా.)

4. ధృతరాష్ట్రుడికి ధర్మరాజాదులపై ఏ మాత్రం వాత్సల్యం ఉందో అందరికీ తెలుసు. కాని, ధర్మరాజు ఇట్లా మాటలాడడంలో వ్యతిరేక లక్షణం గోచరిస్తుంది. 'సుఖంబున నిట్లున్నారము' అనడం కూడా అట్లాంటిదే.

క. అమ్మనుజేశ్వరునకు సే । మమ్మే? పుత్త్రకులు సుఖులె? మనుమలు సమ్మో
దమ్మునఁ బెరిఁగెదరే? నగ । రమ్ముల భూములను శుభపరంపర గలదే ? 277

ప్రతిపదార్థం: ఆ+మనుజ+ఈశ్వరునకున్= ఆ రాజుకు - ధృతరాష్ట్రుడికి; సేమమ్మే?= కుశలమా?; పుత్త్రకులు= కొడుకులు; దుర్యోధనాదులు; సుఖులె?= సుఖంగా ఉన్నారా?; మనుమలు; సమ్మోదమ్మునన్= సంతోషంతో; పెరిఁగెదరే?= పెరుగుతున్నారా? నగరమ్ములన్= పట్టణాలలోనూ; భూములను= జనపదాలలోనూ, పంటనేలలోనూ; శుభ పరంపర= మేళ్ళ వరుస, కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: రాజైన ధృతరాష్ట్రుడికి క్షేమమా? అతడి కొడుకులు దుర్యోధనాదులు కుశలురా? మనుమలు సంతోషంతో పెరుగుతున్నారా? పట్టణాలలోనూ జనపదాలలోనూ శుభపరంపర ఉన్నదా?

విశేషం: ధర్మరాజు క్షేమసమాచారము లడిగేటప్పుడు కూడా క్రమంతప్పడు. రాజునూ, రాజుకుటుంబాన్నీ మొదట ప్రస్తావించాడు. ఆ తరువాత ప్రజా కుటుంబాన్ని గురించి ప్రశ్నించాడు. ప్రజలను నాగరకులూ, జానపదులూ అని వింగడించాడు. వారి వారి నివాసస్థలాలైన నగరాలనూ, పంటభూములుగల జనపదాలనూ పరామర్శించాడు. అడిగే ప్రశ్నలలో క్రియాపదాలు కూడా సార్థకాలే. రాజు క్షేమమా? పుత్రులు సుఖులా? మనుమలు సంతోషంతో ఉన్నారా? ఈ మూడు పలకరింపులలో వారి వారి మనస్తత్త్వాలు ధ్వనిస్తున్నాయి.(సంపా.)

సీ. ద్రోణుండుఁ, గృపుఁడును, ద్రోణసుతుండును । సుఖమున్నవారె? సుశ్లోకుఁడైన
భీష్ముడు కుశలియే? పెద్దతనం బిచ్చి । యాతనిఁ గౌరవు లనుసరించి
మెలఁగుదురే? బ్రాహ్మణులకు మన్నన గల్గి । యుండునే? యే మర్థి నొసఁగి నట్టి
వృత్తులు సెల్లునే? యొత్తొరు వొండుల । వలనఁ బుట్టదుగదా? కలఁకు లందుఁ

తే. బుట్టినప్పుడు గాండీవి భుజబలంబుఁ । దలఁతురే? భీమసేను గదా విహార
ముగ్గడింతురె? కవలు మహోగ్రరిపుల । భూము లంతంత కొత్తుట పొగడఁబడునె? 278

ప్రతిపదార్థం: ద్రోణుండున్; కృపుఁడును; ద్రోణ సుతుండును= అశ్వత్థామా; సుఖము+ఉన్నవారె?= సుఖంగా ఉన్నారా?; సుశ్లోకుఁడు+ఐన= కొనియాడబడే; భీష్ముండు; కుశలియే= క్షేమంగా ఉన్నాడా?; కౌరవులు; అతనిన్; పెద్ద తనంబు+ఇచ్చి= పెద్దరికం ఉంచి; అనుసరించి మెలఁగుదురే?= అనువర్తిస్తారా?; బ్రాహ్మణులకున్; మన్నన= ఆదరం; కల్గి+ఉండునే; మేము=

మేము; అర్థిన్= కోరికతో; ఒసఁగిన+అట్టి= ఇచ్చినటువంటి; వృత్తులు= జీవనోపాధులు; చెల్లునే?= కొనసాగుతున్నాయా? ఒత్తొరువు= సంపీడనము- బాధ; ఒండులవలనన్= ఇతరులనుండి; పుట్టదు+కదా?= కలుగదు కదా?; అందున్= అక్కడ; కలఁకులు= కలతలు; పుట్టిన+అప్పుడు= ఏర్పడినప్పుడు; గాండీవి భుజ బలంబు= అర్జునుడి బాహు పరాక్రమం; తలఁతురే?; భీమసేను గదా విహారము= భీముడి గదాయుధ క్రీడ; ఉగ్గడింతురె?= ప్రశంసిస్తారా?; కవలు= నకుల సహదేవులు; మహత్ (మహా)+ఉగ్ర రిపుల= మిక్కిలి భయంకరులైన శత్రువులను; భూముల+అంతంతకు= రాజ్యంలోని ప్రదేశాల చివరలకు; ఒత్తుట= తరిమివేయటం; పొగడన్+పడునె?= కీర్తించబడుతుందా?

తాత్పర్యం: ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా సుఖంగా ఉన్నారా? సుప్రసిద్ధుడైన భీష్ముడికి క్షేమమా? కౌరవులు అతడికి పెద్దరికం ఇచ్చి అనువర్తిస్తూఉంటారా? బ్రాహ్మణులకు ఆదరం ఉన్నదా? మేము కోరి వారి కిచ్చిన జీవనోపాధులు కొనసాగుతున్నాయా? ఇతరులనుండి ఏ బాధా పుట్టదు గదా? అక్కడ కలతలు పుట్టినప్పుడు వారు గాండీవి బాహుపరాక్రమం తలచుకొంటారా? భీముడి గదాయుధ క్రీడ ప్రశంసిస్తారా? నకుల సహదేవులు భయంకరులైన శత్రువుల భూములను క్రమక్రమంగా ఆక్రమించటం స్తుతించబడుతున్నదా?

విశేషం: కౌరవులు భీష్ముడి పెద్దరికం పరిగణించరనీ, తాము బ్రాహ్మణుల కిచ్చిన అగ్రహారాదికాలను వారు కొనసాగించరనీ, తన తమ్ముల పరాక్రమాన్ని వారు తలపెట్టుతూ ఉంటారనీ ధర్మరాజు విశ్వాసం. అందులోనుండి పుట్టిన ఈ ప్రశ్నలు వ్యంగ్యార్థ బంధురాలు.

మ. ఒకనాఁడా తమ ముందటం బలుమఱున్ హోరాటమై నేల యొ
త్తి కొనంగా బవరంబులన్ గెలువఁగాఁ దెల్లఁబుగాఁ జూచి పాం
డు కుమారాళి నుతింపకుండుదురె? యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే? 279

ప్రతిపదార్థం: ఒకనాఁడా?= ఒక్కనాడుకాదు; తమముందటన్= తమ ఎదుట; పలుమఱున్= ఎన్నోసార్లు; హోరాటమైన్= ఆటోపంతో; నేల+ఒత్తికొనంగాన్= నేల ఒత్తుకొనేటట్లు; బవరంబులన్= యుద్ధాలలో; గెలువఁగాన్; తెల్లంబుగాన్+చూచి= కళ్ళారా చూచి; పాండు కుమార+ఆళిన్= పాండవుల సమూహాన్ని; నుతింపక+ఉండుదురె?= పొగడకుండా ఉంటారా?; గంధర్వులు; ఆటోపంబునన్= గర్వంతో పెద్దపెట్టున; ఘోష యాత్రకున్; వచ్చిన+అప్పటి చరిత్రంబు= వచ్చిన నాటి వృత్తాంతం; ఆత్మలన్+పాయునే?= మనస్సుల నుండి పోతుందా? మరచిపోతారా?

తాత్పర్యం: ఒకనాడా! తమ ఎదుట ఎన్నోమార్లు ఆటోపంతో నేల క్రుంగిపోయే విధంగా యుద్ధాలు గెలవటం కళ్ళారా చూచి కౌరవులు పాండవులను ప్రశంసించకుండా ఉంటారా? గంధర్వులు పెద్దపెట్టున ఘోషయాత్రకు వచ్చిన ఆనాటి వృత్తాంతం మరచిపోతారా?

విశేషం: అరణ్య వాసకాలంలో పాండవులు ద్వైతవనంలో ఉండగా దుర్యోధనుడు వారిని చిన్నపుచ్చటానికి ఘోష యాత్ర నెపంతో సపరివారంతో వచ్చి చిత్రరథుడనే గంధర్వుడిచేత చావుదెబ్బలు తిని భీమార్జునులచేత రక్షించబడ్డ వృత్తాంతం ఇక్కడ స్మరించాలి. ఆ వృత్తాంతాన్నీ, పూర్వ విజయాలనూ హస్తినాపురంలో మరచిపోకుండా స్మరిస్తున్నారా?- అని ప్రశ్నించి ధర్మరాజు తాము కౌరవులకు చేసిన మేలును, తమ పరాక్రమ విశేషాలనూ గుర్తు చేసి గడుసుదనం ప్రకటించాడు.

క. వినుము మనము మధ్యస్థుల; । మని నర్జును నెదిరి, సంజయా! యిటము న్నె
వ్వనికిని మానముఁ బ్రాణం । బును దగఁ దక్కించుకొనఁగఁ బోలెనె చెపుమా! 280

ప్రతిపదార్థం: సంజయా!; వినుము, మనము; మధ్యస్థులము= మధ్యవర్తులం; అనిన్= యుద్ధంలో; అర్జునున్; ఎదిరి= ఎదుర్కొని; ఇటమున్ను= ఇంతకుముందు; ఎవ్వనికిని= ఎవడికైనా; మానమున్= గౌరవం; ప్రాణంబును= ప్రాణమూ; తగన్= చక్కఁగా; దక్కించు కొనఁగన్+పోలెనె= నిలుపుకొనటం సాధ్యపడిందా? చెపుమా.

తాత్పర్యం: సంజయా! వినుము. మనం మధ్యవర్తులం. యుద్ధంలో అర్జునుడిని మార్కొని ఇంతకుముందు ఎవరికైనా మానప్రాణాలు రక్షించుకొనగలగటం సాధ్యపడిందా? నీవే చెప్పుము.

విశేషం: మనము మధ్యస్థులం అనటంలో అర్జునుడు నా తమ్ముడు గదా అని పక్షపాతంతో మాటాడటం లేదని ధర్మరాజు సూచన. కౌరవులందరూ యుద్ధంలో అర్జునుడికి ఓడి మానప్రాణాలను దక్కించుకొన్నవారే. అందువలన పాండవులపట్ల కృతజ్ఞులై ఉండాలి. అట్లా ఉంటున్నారా? అని వ్యంగ్యంగా అడిగాడు ధర్మరాజు.

క. దుర్యోధను నింటం దగు । కార్యమునకు ఖడ్గమునకుఁ గలవాఁడై చా
తుర్యంబు మెఱయు కర్ణుని । యార్యత్వము సెల్లుచున్న యదియే నెమ్మిన్?' 281

ప్రతిపదార్థం: దుర్యోధను+ఇంటన్= దుర్యోధనుడి ఇంటియందు; తగు= ఒప్పే; కార్యమునకున్, ఖడ్గమునకున్= పేచీ పూచీలకు; కలవాఁడు+ఐ= ఉన్నవాడయి; చాతుర్యంబు మెఱయు= నేర్పు ప్రకటించే; కర్ణుని+ఆర్యత్వము= కర్ణుడి పెద్దరికం; నెమ్మిన్= బాగా; చెల్లుచున్+ఉన్న+అది+ఏ?= కొనసాగుతున్నదా?

తాత్పర్యం: దుర్యోధనుడి ఇంట్లో వచ్చే పేచీ పూచీలకు నే నున్నానంటూ నేర్పు ప్రకటించే కర్ణుడి పెత్తనం బాగా సాగుతున్నదా?

విశేషం: తెలుగుజాతీయం ఉట్టిపడే ఈ కర్ణుడినిగూర్చిన పలకరింపు ధర్మరాజు హృదయంలో ఉన్న గూఢామర్షాన్ని ధ్వనింపచేస్తున్నది. దుర్యోధనుడి ఇంట్లో - అన్నప్పుడు అది ఇల్లు మాత్రమే కాదు, దుర్యోధనుడి ఆంతరంగిక విషయాలలో కూడా అని భావం. కార్యానికీ ఖడ్గానికీ- తెలుగు జాతీయం. కార్యమంటే ఆలోచన; ఖడ్గమంటే యుద్ధం. దుర్యోధనుడి ఆలోచనలన్నీ కర్ణుడివే. కర్ణు డెప్పుడూ సమస్యలకన్నింటికీ యుద్ధమే పరిష్కారంగా భావిస్తాడు. దుర్యోధనుడు యుద్ధోన్ముఖుడు కావటానికి కర్ణుడి ప్రోత్సాహం ఒకవైపు. అతడి పరాక్రమం మీద దుర్యోధనుడికి ఉన్న విశ్వాసం మరొకవైపు కారణాలు కావటం కాదనలేని వాస్తవం. చాతుర్యం మెరసేటట్లు కర్ణుడి ఆర్యత్వం చెల్లుతున్నదా?- అన్నవాక్యం అధిక్షేపాత్మకం. కర్ణుడి చాతుర్యం దుర్యోధనుడిని మెప్పించటం కొరకు పడేపాట్లను సూచిస్తున్నది. ఆర్యత్వం వ్యతిరేకవ్యంగ్యం వలన అతడి దౌష్ట్యాన్ని ధ్వనింపచేస్తున్నది. ధర్మరాజు యోగక్షేమా లడిగిన వారందరూ హస్తినాపురంలో రాజనీతి నిర్ణయాలను తీసికొనటంలో ఏదో ఒక విధంగా పాలు పంచుకొనేవారే కావటం విశేషం. విదురాదుల ప్రసక్తి ధర్మరాజు తేలేదు. ఆయన మాట ఎవరూ పట్టించుకోరు కాబట్టి. కౌరవ నిర్ణయాలలో పాలు పంచుకొనే వారందరూ క్షేమమేకదా? వారి క్షేమానికి మూలకారణం అర్జునుడి వలన మానప్రాణాలు దక్కటమే కదా? ఈ సంగతి గుర్తుంచుకొనటమే క్షేమం-అని గడుసుగా హెచ్చరించటం ఈ మాటలోని ధ్వని. చిట్టచివరకు కర్ణుడిని గురించి అడగటంలో కూడా విశేషం ఉన్నది. అందరూ ఒక ఎత్తు. అత డొక్కడూ ఒక ఎత్తు. అందరూ క్షేమంగా ఉండటం అతడి ఆలోచన మీదా, అతడి యుద్ధప్రీతిమీదా, అతడి ఆర్యత్వం మీదా ఆధారపడి ఉన్నదని

హెచ్చరిక. 'కర్ణుడు లేనిది భారతం లే' దనే సామెత అందుకే పుట్టింది. ధర్మరాజు అడిగిన కుశల ప్రశ్నలు కౌరవులపై అతడి మనసులో ఉన్న రహస్యమైన క్రోధాగ్నిని ప్రకటించే వాఙ్మయ వ్యంగ్యాస్త్రాలు. (సంపా.)

వ. అనిన విని సంజయుండు సవినయంబుగా నిట్లనుఁ 'గురురాజునొద్ద నవినీతులు, నీతిమంతులు, సత్త్వసంపన్నులు, దురహంకారులు, మఱియు వివిధ ప్రకారులు నయి బెరసి యుండుదురు; వా రొకళ్ళొకళ్ళ మాటలం బోయెడువారు గారు; కావున వారి నంత యనం బనిలేదు; నా విన్నపంబు చిత్తగింపుము. 282

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; సవినయంబుగాన్= అడకువతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కురురాజు+ ఒద్దన్= దుర్యోధనుడి దగ్గర; అవినీతులున్= అవినయపరులూ; నీతిమంతులున్= నీతి యుక్తులూ; సత్త్వ సంపన్నులున్= సాత్త్వికులూ; దురహంకారులున్= దురభిమానులూ; మఱియున్= ఇంకా; వివిధ ప్రకారులున్= రకరకాల వాళ్ళు; అయి; బెరసి+ఉండుదురు= చేరి ఉంటారు; వారు; ఒకళ్ళు+ఒకళ్ళ మాటలన్+పోయెడువారు+కారు= ఒకరి మాట ఇంకొకరు వినిపించుకొనరు; కావునన్; వారిన్; అంత+అనన్+పని లేదు= అంతగా ప్రస్తావించ నక్కర లేదు; నా విన్నపంబు= నా మనవి; చిత్తగింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: అనగా విని సంజయుడు అణకువతో ఇట్లా అన్నాడు- 'దుర్యోధనుడి దగ్గర అవినయపరులూ, నీతిమంతులూ, సత్త్వగుణసంపన్నులూ, దురభిమానులూ - ఇంకా ఎన్నో రకాలవాళ్ళు చేరి ఉంటారు. వారు ఒకరిమాట ఇంకొకరు వినిపించుకొనరు. కాబట్టి వారిని గూర్చి ప్రస్తావించటం అనవసరం. నా మనవి శ్రద్ధగా ఆలకించుము.

విశేషం: 1. ధర్మరాజు కుశలప్రశ్నలు దాడి చేస్తున్నట్లున్నాయి. అందువలన సంజయుడు సవినయంగా సమాధానం చెప్పాడు. సముద్ర తరంగం పెల్లుబికి వస్తున్నప్పుడు తలవంచటమే నీతి. అందులోనూ రాయబారి వినయంగా వంగి ధర్మరాజు అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు పలికితే అతడిలోని ఉడుకు తగ్గుతుంది. అందుకే ధృతరాష్ట్రుడి కొలువులోని వారిలో అనేక విధాల వారున్నారనీ, వారందరూ ఒకరిమాట మరొకరు వినరనీ, వారిలో ఏకవాక్యత లేదనీ ఒప్పుకొన్నాడు. క్రమంగా ధృతరాష్ట్రుడి పుత్రాదులు అవినీతులనీ, ద్రోణభీష్మాదులు నీతిమంతులనీ, సత్త్వసంపన్నులనీ, కర్ణాదులు దురహంకారులనీ పేర్కొన్నట్లు స్పష్టం. అయితే వారిని గురించి పట్టించుకొనవలసిన అవసరం లేదనీ, ఈ ప్రస్తుతాంశం వారందరికీ సంబంధించినది కాదనీ సూచించాడు. తన విన్నపాన్ని వినుమని కోరాడు. (సంపా.)

2. సంజయుడు ఉన్న పరిస్థితి చెప్పి, తాను వచ్చిన అసలు విషయానికి వస్తున్నాడు.

క. పొందొందఁగఁ దలఁచితి నీ । విందు శిశిరమైన విమల హృదయంబున; వా
రందఱకును సేమం; బిట । ముందఱ లేకున్న, నేఁడు మొదలుగఁ గలుగున్. 283

ప్రతిపదార్థం: నీవు; ఇందు= ఇప్పుడు, ఇక్కడ; శిశిరము+ఐన విమల హృదయంబునన్= చంద్రుడివలె చల్లనైన నిర్మల హృదయంతో; పొందు+ఒందఁగన్+తలఁచితి(వి)= సంధి చేసికొనాలని అభిప్రాయ పడుతున్నావు; వారు+అందఱకును= వారి కందరికీ; సేమంబు= క్షేమమే (సేమంబు=క్షేమం); ఇట ముందఱన్= ఇంతకు ముందు; లేక+ఉన్నన్= లేకపోయినా; నేఁడు మొదలుగన్= ఈ వేళ మొదలుకొని; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: నీవు చంద్రుడి వలె చల్లనైన నిర్మల హృదయంతో సంధి చేసికొనదలచావు. వారి కందరికీ క్షేమం ఇంతకుముందు లేకపోయినా, ఈ వేళ మొదలుకొని కలుగుతుంది.

విశేషం: ధర్మరాజు సంధి కోరుతూండటం వలన దుర్యోధనాదులు ఇంకా క్షేమంగా ఉంటారు. యుద్ధమే వస్తే వాళ్ళకు నాశనం తప్పదు. ధర్మరాజును సుముఖుడిగా చేసికొనటానికి సంజయుడు ముందుగా అతడిని పొగడుతున్నాడు.

క. ధృతరాష్ట్ర భూపతికి వృ । ద్ధత కతమునఁ జిత్త మొక విధము గామి సుతో
ద్ధతి మాన్పఁడ నాఁడు; మనః । క్షతి పిదపం బుట్టి యిపుడు శాంతుం డయ్యెన్. 284

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర భూపతికిన్= ధృతరాష్ట్ర మహారాజుకు; వృద్ధతకతమునన్= ముసలితనం కారణంగా; చిత్తము= మనస్సు; ఒక విధము+కామిన్= ఒకే విధంగా లేకపోవటం చేత; నాఁడు= ఆ వేళ; సుత+ఉద్ధతి= కొడుకుల ఔద్ధత్యం; మాన్పఁడు+అ= మాన్పనే లేదు; పిదపన్= తరువాత; మనస్(ః)+క్షతి= మనస్తాపం; పుట్టి= కలిగి; ఇపుడు= ప్రస్తుతం; శాంతుండు+ అయ్యెన్= శాంతం కలవా డయ్యాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజుకు ముదిమివలన మనస్సు ఒకరీతిగా ఉండకపోవటం చేత అప్పుడు కొడుకుల ఔద్ధత్యం మాన్పనే లేకపోయాడు. తరువాత మనస్తాపం కలిగి ఇప్పుడు శాంతుడయినాడు.

విశేషం: దుర్యోధనుడు దుష్కార్యాలు చేయకుండా ధృతరాష్ట్రుడు వారించలేడా? అని ధర్మరాజు అడుగుతాడేమో అని, అతడి 'వృద్ధత' యే అందుకు కారణం అని సంజయుడు అన్నాడు. పశ్చాత్తాపం కలిగి ఇప్పుడు శాంతుడవటం వలననే, సంధికొరకు తనను రాయబారిగా పంపించాడని సంజయుడి మాట.

తే. ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య । చిత్తవృత్తిమై సైఁచినఁ జెల్లివచ్చు;
నీ యజాతశత్రుత్వంబు నిఖిల లోక । విశ్రుతము గాదె, ధర్మప్రవీణహృదయ! 285

ప్రతిపదార్థం: ధర్మ ప్రవీణ హృదయ!= ధర్మంలో నేర్పుగల హృదయం గలవాడా! ధర్మరాజా!; ఇట్టి చందంబులు+ఎల్లనున్= ఇటువంటి రీతులన్నీ; ఈవు= నీవు; పుణ్య చిత్తవృత్తిమైన్= ధర్మ సహితమైన మనోవ్యాపారంతో-దయా హృదయంతో; సైఁచినన్= సహించినట్లయితే; చెల్లివచ్చున్= సమసిపోతాయి; నీ+అజాత శత్రుత్వంబు= శత్రువులు పుట్టనివాడు అనబడే నీగుణం- నీ అజాత శత్రుబిరుదం; నిఖిల లోక విశ్రుతము+కాదె!= అన్ని లోకాలకూ తెలిసిందికాదా?

తాత్పర్యం: ధర్మబద్ధమైన హృదయం కల ధర్మరాజా! ఇటువంటి దుర్మార్గాలన్నీ నీవు కరుణా మనస్కుడవై సహిస్తే చెల్లుబాటు అవుతాయి. నీ అజాతశత్రుత్వం అన్ని లోకాలకు తెలిసిందే కదా!

విశేషం: ధర్మరాజు ధర్మప్రవీణహృదయుడట. అతడు కరుణాహృదయంతో కౌరవుల అన్యాయాలను సహించి తన అజాత శత్రు బిరుదం సార్థకం చేసికొనాలట. ఎంతసేపూ సంజయుడి నోట ఇదే మాట. అజాతశత్రువంటే - పుట్టని శత్రువులు కలవాడని అర్థం. ధర్మరాజుకు దుర్యోధనాదులు శత్రువులు. మరి ఆ బిరుదం ఎట్లా సార్థకమవుతుంది? శత్రువులందు కూడా శత్రుత్వం భావించకపోతే ధర్మరాజు అజాతశత్రుడౌతాడు. అటువంటి ధర్మజుడి ప్రవృత్తి పుణ్యచిత్తవృత్తివలన, ధర్మప్రవీణమైన హృదయం వలన కలిగినట్లు సంజయుడు కీర్తించాడు. ధృతరాష్ట్రుడు లక్షించిన ప్రయోజనాలలో ముఖ్యమైనది- 'కయ్యమను

తలఁపు లోనుగ నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగన్' చేయటం. దాని కనుగుణంగా సంజయుడు ఈ మాటలన్నాడు. (సంపా.)

చ. జగముల నెల్లెడన్ దురిత సంతమసంబు జయింపఁ గోరి పా
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు; లట్టి వారికిం
దగవు ఘటింప సత్పురుష దత్తములై చను జీవనంబు లెం
త గుమతులైన మార్తురె? పదంపడి యాయువు శ్రీయు నొల్లరే? 286

ప్రతిపదార్థం: మహీసురులు= బ్రాహ్మణులు; జగములన్+ఎల్ల+ఎడన్= లోకాలయందు అంతటా; దురిత సంతమసంబున్= పాప మనే అంధకారాన్ని; జయింపన్+కోరి= పారద్రోలగోరి; పరమేష్ఠి= బ్రహ్మ; పొల్పుగన్= ఒప్పుగా, నిల్పిన= నిలువబెట్టిన; వెలుంగు= ప్రకాశం; అట్టి వారికిన్= అటువంటి బ్రాహ్మణులకు; తగవు= న్యాయం; ఘటింపన్= కలగజేయడానికి; సత్+ పురుష దత్తములు+ఐ= సుజనులచేత ఈయబడిన వయి; చను= ఒప్పునట్టి; జీవనంబులు= బ్రతుకు తెరువులు-వృత్తులు; ఎంత+కుమతులు+ఐనన్= ఎంతటి దుర్బుద్ధులయినా; మార్తురె?= నశింప జేస్తారా?; పదంపడి= తరువాత; ఆయువున్, శ్రీయున్= ఆయుస్సునూ, సంపదనూ; ఒల్లరే?= కోరరా?

తాత్పర్యం: బ్రాహ్మణులంటే - లోకాలలో అంతటా పాపాంధకారాన్ని పారద్రోలటానికని బ్రహ్మ చక్కగా నిలిపిన వెలుగే. అటువంటి వారికి సత్పురుషులు కల్పించిన జీవనోపాధులను ఎంతటి దుర్బుద్ధులయినా నశింపజేస్తారా? తరువాత ఆయుర్భాగ్యాలను కోరరా? (అట్లా లాక్కుంటే, వారు బ్రతుకరనీ, బ్రతికినా నిర్భాగ్యులవుతారనీ భావం.)

విశేషం: అలం: రూపకం. ధర్మరాజు అడిగిన ప్రశ్నల కన్నింటికీ ఒక్కొక్క దానికే సమాధానం చెప్పుకొంటూ వస్తున్నాడు సంజయుడు. 'ఏ మర్థి నొసఁగినట్టి వృత్తులు సెల్లునే?' అన్న ధర్మరాజు ప్రశ్నకు సమాధాన మిది. కౌరవులు నీవన్నట్లు దుర్మతులే కావచ్చును. కాని, బ్రాహ్మణులకు సత్పురుషు లిచ్చిన వృత్తులను అపహరించేటంత దుర్మార్గులు కారని సంజయుడి సమాధానం. దురిత - సంతమసంబు, వెలుంగు మహీసురులు - అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం, ఈ పద్యంలోని అలంకారపు సొగసంతా అమూలకం.

ఉ. ఒక్కొకచోఁ గడంగి ప్రతియోధులు మార్కొనునప్పు డాత్మలన్
నెక్కొని మోములం బొడము నెవ్వగతోడ జనంబు లిట్టి యం
దక్కట! భీముఁ డైన, మన యర్జునుఁ డైనను, మాద్రి పుత్త్రులం
దొక్కరుఁడైన నీ పగఱ నుక్కడఁగింపరె యొక్క వ్రేల్మిడిన్? 287

ప్రతిపదార్థం: ఒక్కొక చోన్= ఒక్కొక్కప్పుడు; కడంగి= పూని; ప్రతియోధులు= శత్రువీరులు; మార్కొను+అప్పుడు= ఎదుర్కొన్నప్పుడు; జనంబులు= జనులు; ఆత్మలన్= మనస్సులందు; నెక్కొని= అతిశయించి; మోములన్= ముఖాలలో; పొడము= కనబడే; నెవ్వగ (నెఱ+వగ) తోడన్= అధిక దుఃఖంతో; అక్కట!= అయ్యో!; ఇట్టి+అందున్= ఇటు వంటి సందర్భాలలో; భీముఁడు+ఐనన్= భీముడయినా; మన+అర్జునుఁడు+ఐనను; మాద్రి పుత్త్రులందున్+ఒక్కరుఁడు+ఐనన్= మాద్రి కొడుకులైన నకుల సహదేవులలో ఏ ఒక్క డయినా; ఈ పగఱన్= ఈ శత్రువులను; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్క చిటికలో; ఉక్కు+అడఁగింపరె?= మట్టుపెట్టరా?

తాత్పర్యం: ఒక్కొక్కప్పుడు పూని శత్రువీరులు ఎదుర్కొనినప్పుడు జనులు మనస్సులలో నిండి ముఖాలలో కనవచ్చే అమిత దుఃఖంతో 'అయ్యో! ఇటువంటప్పుడు భీముడయినా, మన అర్జునుడయినా, మాద్రి కొడుకులైన నకుల సహదేవులలో ఏ ఒక్కడైనా ఉంటే ఈ శత్రువులను ఒక్క చిటికలో రూపుమాపరా?- (తరువాతి పద్యంలోని 'అంద్రు' అనే క్రియతో అన్వయం.)

విశేషం: ఇది 'కలఁకులందుఁ బుట్టినప్పుడు గాండీవి భుజబలంబుఁ దలఁతురా? భీమసేను గదా విహార ముగ్గడింతురె? కవలు మహోగ్రరిపుల భూము లంతంత కొత్తుట పొగడఁబడునె?' అన్న ధర్మరాజు ప్రశ్నకు సమాధానం.

క. వారొక యాగ్రహవృత్తిం । గూరి యధర్మంబు సేఁతకుం జాలరు; దు
ర్వారబలు లయ్యుఁ బాండుకు । మారులు శాంతాత్ము' లంద్రు మనుజాధీశా ! 288

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= రాజా!- ధర్మరాజా!; వారు= పాండవులు; ఒక ఆగ్రహ వృత్తిన్+కూరి= ఒక(తీవ్రమైన) కోప వ్యాపారాన్ని పొందినప్పటికీ; అధర్మంబు+చేఁతకున్+చాలరు= అధర్మం చేయటానికి ఓర్వరు; పాండు కుమారులు= పాండవులు; దుర్వార బలులు+అయ్యున్= వారించరాని పరాక్రమం కలవారయినా; శాంత+ఆత్ములు= శాంత స్వభావులు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! 'పాండవులకు మిక్కిలి కోపం వచ్చినా, అధర్మం చేయజాలరు. వారు అనివార్య పరాక్రమ వంతులయినా శాంతస్వభావు' లని ప్రజ లంటారు.

విశేషం: ప్రజలు మా పరాక్రమ విశేషాలను స్మరిస్తుంటారా? అని ధర్మరాజు అడిగాడు (పద్యం 278). దానికి సమాధానంగా పాండవుల శాంత స్వభావాన్ని ఈ విధంగా సంజయుడు మెచ్చుకొనటం వాళ్ళను తనకు ఉన్ముఖులనుగా చేసికొని తాను వచ్చిన పని సఫలం చేసికొనటానికే. సంజయుడి స్వకార్య నిర్వహణ సామర్థ్యం, ధర్మజుడి హృదయంలో కోపం కంటె శాంతం చోటు చేసికొనేటట్లు మాట్లాడే నేర్పు ప్రశంసనీయం.

క. నలువురు తమ్ములు, భవదా । ప్తులుఁ గృష్ణుఁడు వినుచునుండ భూవర! నీ కేఁ
గొలువునను విన్నవింపం । బలుకులు గల వవధరింపు పరిపాటి మెయిన్'. 289

ప్రతిపదార్థం: భూవర!= రాజా! ధర్మరాజా!; నలువురు తమ్ములన్, భవత్+ఆప్తులున్= నీ ఆత్మీయులూ; కృష్ణుఁడున్; వినుచున్+ఉండన్= వింటూండగా; నీకున్; ఏన్= నేను; కొలువునను= సభలో; విన్నవింపన్= మనవి చేయటానికి; పలుకులు= మాటలు; కలవు= ఉన్నాయి; పరిపాటి మెయిన్= క్రమంగా; అవధరింపు(ము)= చిత్తగించుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీ నలుగురు తమ్ములూ, నీ ఆత్మీయులూ, కృష్ణుడూ వింటూండగా నీకు నేను సభలో మనవి చేయవలసిన మాటలున్నాయి. వాటిని ఆనుపూర్విగా (మొదటనుండి చివరిదాకా) చిత్తగించుము.

విశేషం: ధృతరాష్ట్రుడు రాయబారపు మాటలను నిండుసభలో చెప్పుమన్నాడు. అందుకే సంజయుడు ధర్మరాజును అతడి నిండుసభలో మాట్లాడటానికి అనుమతి కోరాడు. సంజయుడికి సాధించే ప్రయోజనాన్ని చెప్పాడే కాని ధృతరాష్ట్రుడు మాట్లాడే మాటల తీరును చెప్పలేదు. సంజయుడు అందుకు సమర్థుడు. నిండుకొలువులో వినిపించే సంజయుడి సందేశంలోని మనసు ధృతరాష్ట్రుడిది, మాటలు సంజయుడివి. (సంపా.)

చ. అనవుడు 'వీరె తమ్ములును, నాప్తులుఁ, గృష్ణుఁడు; వీరె తక్కుకొ
ల్వునఁ గలయట్టి సర్వజనులున్ వినుచుండెద; రయ్య నిన్ను నే
మను మని పంచెఁ జెప్పు మది యంతయు నేర్పడ' నన్న, ధర్మనం
దను గరువంపుఁ బల్కుల విధంబునకున్ మదిలోన నుల్కుచున్. 290

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; తమ్ములునున్, ఆప్తులున్, కృష్ణుఁడున్; వీరె= ఇక్కడే ఉన్నారు; కొల్వునన్+కల+అట్టి తక్కు, సర్వ జనులున్= సభలో ఉన్న మిగిలిన ఎల్ల జనులూ, వీరే; వినుచున్+ఉండెదరు= వింటుంటారు; అయ్య= తండ్రి- ధృతరాష్ట్రుడు; నిన్నున్; ఏమి+అనుము+అని పంచెన్= ఏమి చెప్పుమని చెప్పిపంపాడో; అది+అంతయున్= దానినంతటినీ; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పుము; అన్నన్= అనగా; ధర్మ నందను గరువంపుఁ బల్కుల (గరువము+పల్కుల) విధంబునకున్= ధర్మరాజుయొక్క సగౌరవపు (గడుసరి) పలుకుల రీతికి; మదిలోనన్= మనస్సులో; ఉల్కుచున్= భయపడుతూ.

తాత్పర్యం: అనగానే 'తమ్ములూ, ఆత్మీయులూ, కృష్ణుడూ ఇరుగో ఇక్కడే ఉన్నారు. సభలోని మిగిలిన జనులందరూ ఇరుగో వింటూంటారు. తండ్రి ఏమి చెప్పుమని నిన్ను ఇక్కడికి పంపించాడో అదంతా స్పష్టంగా చెప్పుము'- అనగా ధర్మరాజు గడుసరి మాటల తీరుకు మనస్సులో భయపడుతూ.

విశేషం: ధర్మరాజుమాటలు 'గరువంపుఁబల్కు'లని సంజయుడు భావించాడు. గరువము - అంటే గౌరవమనీ, నైపుణ్యమని, గడుసరి తనమనీ అర్థాలున్నాయి. ఈ మూడూ ఇక్కడ సార్థకాలే. రాయబారం నడుపుతున్నది ధర్మరాజుతో. కానీ, ఆ రాయబారి మాటలు తమ్ములూ, ఆప్తులూ, కృష్ణుడూ మొదలైనవారు వినేటట్లు నిండుసభలో చెప్పుతాననటం ధర్మరాజుకు చిరాకు కలిగించేమాట. అందుకే వ్యంగ్యంగా సభలో ఉన్న తమ్ములనూ, ఆప్తులనూ, శ్రీకృష్ణుడిని చేతితో చూపిస్తూ, ప్రత్యక్షసాక్ష్యంగా మాట్లాడుతున్నట్లనిపిస్తూనే, మీ నియమాలన్నీ సమకూరాయికదా! ఇక ధృతరాష్ట్ర డేమి కబురంపాడో చెప్పుము' అని అన్నాడు. నీ మాటలు నేను వినటంకంటె, మావారందరూ వినటం ముఖ్యం కదా! అట్లాగే చెప్పుము. అని వ్యంగ్యావహేళన ధ్వనిస్తుంది - అది గడుసరితనం. (సంపా.)

ఆ. సంజయుండు కృష్ణు సద్భక్తి నీక్షించి, । పవనపుత్త్రుఁ బార్థుఁ గవల ద్రుపద
తనయు సవినయమునఁ గనుఁగొని, ప్రీతిఁ బాం । చాలు మత్స్యధరణిపాలుఁ జూచి. 291

ప్రతిపదార్థం: సంజయుండు; కృష్ణున్; సత్+భక్తిన్= మంచి భక్తితో; ఈక్షించి= చూచి; పవన పుత్త్రున్= వాయు కుమారుడైన భీముడినీ; పార్థున్= అర్జునుడినీ; కవలన్= నకుల సహదేవులనూ; ద్రుపద తనయున్= ద్రుపద పుత్త్రుడైన ధృష్టద్యుమ్నుడినీ; సవినయమునన్= అడకువతో; కనుఁగొని= చూచి; పాంచాలున్= ద్రుపదుడినీ; మత్స్య ధరణి పాలున్= మత్స్య దేశపు రాజయిన విరాటుడినీ; ప్రీతిన్= సంతోషంతో; చూచి.

తాత్పర్యం: సంజయుడు కృష్ణుడిని సద్భక్తితో చూచి, భీముడినీ, అర్జునుడినీ, నకుల సహదేవులనూ, ధృష్టద్యుమ్నుడినీ వినయపూర్వకంగా చూచి, ద్రుపదుడినీ, విరాటుడినీ ప్రీతితో చూచి, - (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: ధర్మరాజు ఎవరెవరిని ప్రత్యేకంగా పేర్కొని చూపాడో వారందరినీ విశేషంగా గౌరవించటం సంజయుడి గడుసరితనం.

వ. 'సావధానులరై వినుం' డని పలికి, యుధిష్ఠిరుదెసకు మోడ్పుఁగేలు నిగిడించి యిట్లనియె. 292

ప్రతిపదార్థం: సావధానులరు (స+అవధానులరు)+ఐ= ఏకాగ్రత కలవారయి; వినుండు= వినండి; అని, పలికి; యుధిష్ఠిరు దెసకున్= ధర్మరాజువైపు; మోడ్పుఁగేలు (మోడ్పు+కేలు); నిగిడించి= అంజలి ఘటించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'సావధానంగా వినండి' అని పలికి ధర్మరాజుకు అంజలి ఘటించి ఇట్లా అన్నాడు.

ఉ. 'శాంతతఁ బొంది కార్యముదెసన్ ధృతరాష్ట్ర మహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేటి, న న్నిటఁ బ్రియంబునఁ బంచెడునప్డు నాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్నఁ బంచె ని
ట్లింత ఘటించెఁ బొందు; మన మీ పదనం దెలివొందఁగాఁ దగున్. 293

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రమహీ+ఈశుఁడు= ధృత రాష్ట్ర మహా రాజు; శాంతతన్+పొంది; శాంతం వహించి; కార్యము దెసన్= పని విషయంలో; ఆత్మన్= మనస్సులో; అత్యంతమున్= మిక్కిలి; తేటి= ప్రసన్నుడయి; నన్నున్; ఇటన్= ఇక్కడికి; ప్రియంబునన్= ప్రీతితో; పంచెడు+అప్డు= పంపేటప్పుడు; ఎంతయున్, వేడ్కన్= ఎంతో వేడుకతో; తాన (తాను+అ)= తానే; వెరవు= నేర్పు; ఏర్పడన్+చెప్పుచున్= స్పష్టంగా చెపుతూ; నాకున్; తేరు= రథం; పన్నన్+పంచెన్= సిద్ధం చేయ నియోగించాడు; ఇట్లు= ఈ విధంగా; పొందు= పొత్తు; ఇంత, ఘటించెన్= ఇంతగా కూర్చాడు; ఈ+పదనన్= ఈ తరుణంలో; మనము; తెలివి+ఒందఁగాన్+తగున్= జ్ఞానం కలిగి ఉండటం మంచిది.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజు శాంతం వహించి, పని విషయంలో మనస్సులో మిక్కిలి ప్రసన్నత పొంది, నన్ను ఇక్కడికి ప్రీతితో పంపేటప్పుడు ఎంతో వేడుకతో తానే నేర్పు స్పష్టంగా బోధించి, నాకు రథం సిద్ధపరచ నాజ్ఞాపించాడు. అతడు ఈ విధంగా పొత్తు కొరకు ఇంత శ్రద్ధ వహించాడు. ఈ అదనులో మనం తెలివి కలిగి వ్యవహరించటం మంచిది.

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవుల దగ్గరకు తనను పంపించిన విధం సంజయుడు చాలా వివరంగా వర్ణించి చెప్పాడు. ఆ పంపిన విధానంలో ఆయన ఆప్యాయత వ్యక్తమౌతున్నది. దానికి కారణాలు వరుసగా చెప్పాడు కూడా. పాండవులు అరణ్యాజ్ఞాతవాసాలు ముగించుకొని అభ్యుదయపథంలో ఉన్నారని తెలిసికొనటం వలన ఇదివరలో ఆయన పొందిన వేదననంతా మరచి ప్రశాంత చిత్తుడైనాడు. ఆ తరువాత తన కర్తవ్యమేమిటి? అని వితర్కించుకొని కార్యశీలు డయ్యాడు. తన కర్తవ్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొన్నాడు. అందువలన తేరిన మనస్సుతో సంతోషంగా, ప్రీతితో నన్ను మీ వద్దకు పంపాడు. కాబట్టి ధృతరాష్ట్రుడు ఇంతగా మన పొత్తుకొరకు సన్నివేశాన్ని సంఘటించాడు. ఈ సందర్భాన్ని సద్వినియోగం చేసికొనటానికి మనం తెలివితో వ్యవహరించాలి - అని సూచించాడు. పొందుకావాలని కోరుకొంటున్న ధృతరాష్ట్రుడు దానికి ఏదైనా ఉపాయాన్ని చెప్పినట్లు సంజయుడు చెప్పడు. కాని, మనం, మనం అంటూ పూసుకొని మాట్లాడుతున్నాడు. (సంపా.)

క. చులుకని కార్యము సేయం । దలఁచుట మీ యట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు ననఁ బ్రసిద్ధులగు పె । ద్దలకుం దగ వగునె యెవ్విధంబునఁ జూడన్ ? 294

ప్రతిపదార్థం: మీ+అట్టి= మీవంటి; సర్వ ధర్మజ్ఞులున్; శాంతులున్= అన్నిధర్మాలూ తెలిసినవారూ; శాంత స్వభావులూ; అనన్; ప్రసిద్ధులు+అగు పెద్దలకున్= పేరుపడ్డ పెద్దలకు; చులుకనికార్యము= తేలికపని, అగౌరవపు పని; చేయన్+తలఁచుట= చేయాలనుకొనటం; ఏ+విధంబునన్+చూడన్= ఏ విధంగా చూచినా; తగవు+అగునె?= ధర్మం అవుతుందా?

తాత్పర్యం: అన్ని ధర్మాలూ తెలిసినవారూ, శాంతస్వభావులూ అని పేరుపడ్డ మీ వంటి వారికి ఏ విధంగా చూచినా లాఘవాన్ని కలిగించే పని చేయాలనుకొనటం, ధర్మమవుతుందా?

విశేషం: చులుకని కార్యము - నీచమైన పని - అంటే ఇక్కడ యుద్ధం.

ఆ. మడుఁగుఁ జీరయందు మసి దాఁకినట్లు మీ । సత్కులమునఁ గల్మషంబు కౌర
వేంద్రు కతనఁ బొందె; నింతయుఁ బాపంగ । నీవ నేర్తు, కార్యనిపుణహృదయ! 295

ప్రతిపదార్థం: కార్య నిపుణహృదయ!= కార్య నిర్వహణంలో నేర్పుగల హృదయం కలవాడా-ధర్మరాజా!; మడుఁగు+చీర+అందున్= పరిశుద్ధ వస్త్రంలో; మసి, తాఁకిన+అట్లు= నల్లనిమసి అంటుకొన్నట్లు; మీ సత్+కులమునన్= మీ మంచి వంశంలో; కౌరవ+ఇంద్రు కతనన్= దుర్యోధనుడి మూలంగా; కల్మషంబు= మచ్చ; పొందెన్= ఏర్పడింది; ఇంతయున్= ఇదంతా; పాపంగన్= పోగొట్టటానికి; నీవు+అ= నీవే; నేర్తు(వు)= చాలుదువు, సమర్థుడవు.

తాత్పర్యం: కార్య నిర్వహణంలో నేర్పు చూపే ధర్మరాజా! పరిశుద్ధమైన వస్త్రంలో మసి అంటుకొన్నట్లు మీ సద్వంశంలో దుర్యోధనుడి మూలాన మచ్చ ఏర్పడింది. దానిని పోగొట్టటానికి నీవే సమర్థుడవు.

విశేషం: అలం: ఉపమ. మడుఁగుఁజీరయందు మసి దాఁకినట్లు --- కల్మషంబు - అలంకారం ఉపమ. దాన్ని పోగొట్టే నైపుణ్యం, నీకే ఉన్నది. ఎందుచేతనంటే నీవు 'కార్య నిపుణ హృదయుడవు.' ఈ విశేషణం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరం. సంజయుడు ఇట్లా దుర్యోధనుడిని నిందించటం కూడా ధర్మరాజును తనకు ఉన్ముఖుడిని చేసికొనటానికే, ఇది సంజయుడి మాటనేర్పునూ, కార్య నిపుణ హృదయత్వాన్నీ కూడా తెలుపుతుంది.

చ. అఖిల జనక్షయంబయి, జయాపజయంబులు రెండునుం దుదిన్
సుఖములు గాని యీ పనికిఁ జొత్తురె యుత్తము? లట్లుఁగాక యా
నిఖిలసుఖంబు లేమిటికి నీవని వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురులఁ జంపితయేని దయాపయోనిధీ! 296

ప్రతిపదార్థం: దయా పయోనిధీ!= కరుణా సముద్రుడా! ధర్మరాజా!; అఖిల జన క్షయంబు+అయి= ఎల్ల జనుల నాశనమూ అయి; జయ+అపజయంబులు రెండునున్= గెలుపూ, ఓటమీ - ఈ రెండూ; తుదిన్= చివర - పర్యవసానంలో; సుఖములు+ కాని= లాభదాయకం కాని; ఈ పనికిన్= యుద్ధానికి; ఉత్తములు= సజ్జనులు; చొత్తురె?= పూనుకొంటారా?; అట్లున్+కాక= అదీకాక; నీవు; అనిన్= యుద్ధంలో; వృద్ధజనంబున్= ముసలివాళ్ళనూ; బాలురన్= పిల్లలనూ; సఖులను= మిత్రులనూ; బంధులన్= చుట్టాలనూ; గురులన్= గురువులనూ; చంపితయేనిన్ (చంపితివి+అ+ఏనిన్)= చంపినట్లయితే; ఆ నిఖిల సుఖంబులు+ఏమిటికిన్?= ఆ ఎల్ల సుఖాలూ ఎందుకు?

తాత్పర్యం: కరుణాసముద్రా! ధర్మరాజా! రాజులందరూ నశించి, పర్యవసానంలో జయాపజయాలు రెండూ లాభదాయకం కాని ఈ పనికి సజ్జనులు పూనుకొంటారా? అదీ కాక, నీవు యుద్ధంలో వృద్ధులనూ, పిల్లలనూ, మిత్రులనూ, బంధువులనూ, గురువులనూ చంపినట్లయితే ఆ సుఖాలన్నిటివలన ప్రయోజనం ఏముంటుంది?

విశేషం: అలం: పరికరం. సర్వజననాశనం కలిగించే యుద్ధానికి నీవు పూనుకోవు. ఎందుచేతనంటే నీవు 'దయాపయోనిధివి'. ధర్మరాజు విశేషణం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరం. 'జయాపజయంబులు రెండునుం దుదిన్ సుఖములుగాని'- యుద్ధంలో ఓడినవాడు పైకి ఏడుస్తాడు. గెలిచినవాడు లోపల ఏడుస్తాడు.

ఉ. పెట్టనికోట నీకు హరి; భీముఁడు నర్జునుఁడున్ రణంబునం
దొట్టిన మంట; లా కొలఁది యోధుల సాత్యకియున్, విరాటుఁడున్;
జుట్టపు మేరు, వుగ్రరణ శోభితుఁ డీ ద్రుపదుండు; నిన్ను ని
ట్టట్టనవచ్చునే సురలకైనను? నొల్లవు గాక చివ్వకున్. 297

ప్రతిపదార్థం: నీకున్= నీకు(ధర్మరాజుకు); హరి= కృష్ణుడు; పెట్టనికోట= సహజమైన రక్ష (చుట్టూ కట్టకపోయినా కోట కట్టినట్లు రక్ష కల్పించేవాడని భావం); భీముఁడున్; అర్జునుఁడున్; రణంబునందున్= యుద్ధంలో; ఒట్టిన మంటలు= ప్రజ్వలించే మంటలు; సాత్యకియున్; విరాటుఁడున్; ఆ కొలఁది, యోధులు+అ= ఆ పాటి వీరులే; చుట్టపు మేరువు (చుట్టము+మేరువు)= బంధువులలో మేరు సమానుడు; ఈ ద్రుపదుండున్; ఉగ్ర, రణ, శోభితుఁడు= భయంకర యుద్ధంలో ప్రకాశించేవాడు; చివ్వకున్= యుద్ధానికి; ఒల్లవు+కాక= ఇష్టపడవు కాని; నిన్నున్; సురలకున్+ఐననున్= దేవతలకయినా; ఇట్టట్టనవచ్చునే(ఇట్టు+అట్టు+అనన్+వచ్చునే)?= ఇట్లా అట్లా అనడానికి శక్యమా? (కదిలించటానికి వీలుందా?)

తాత్పర్యం: నీకు శ్రీకృష్ణుడు పెట్టనికోట, భీముడూ, అర్జునుడూ యుద్ధంలో ప్రజ్వలించే మంటలు, సాత్యకీ, విరాటుడూ ఆపాటి వీరులే. మేరు సమాన బంధువయిన ఈ ద్రుపదుడు కూడ భయంకర యుద్ధంలో ప్రకాశించేవాడు. యుద్ధానికి ఇష్టపడవు గాని దేవతలకయినా నిన్ను ఇట్లా అట్లా అనడానికి శక్యమా?

విశేషం: 1. అలం: రూపకం, కావ్యార్థాపత్తి, హరిపెట్టనికోట, భీముఁడు నర్జునుఁడున్ రణంబునం దొట్టినమంటలు-అలంకారం రూపకం. నిన్ను నిట్టట్టనవచ్చునే సురలకైనను-మానవులమాట చెప్పడం ఎందుకు? - అలంకారం కావ్యార్థాపత్తి. ఒల్లవుగాక చివ్వకున్- ధర్మరాజు యుద్ధం మానాలని సంజయుడు పదే పదే అనటం గమనార్హం. 'కయ్యమను తెఱఁగు లోనుగ నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్' - అనికదా ప్రభువు కోరిక.

2. తిక్కన రచనలో సంజయుడు సూక్తిసుధాకరు డయ్యాడు. పాత్రల స్వభావాలను సూత్రప్రాయంగా చెప్పటంలో సంజయుడు దిట్ట. ఈ పద్యం అందుకు ఉదాహరణం. 'హరి మీకు పెట్టని కోట' చుట్టూ రక్షకొరకు కోట కట్టకపోయినా కోటవలె యుద్ధంలో నిలబడి రక్షించే దైవశక్తి శ్రీకృష్ణుడు. భీమార్జునులు యుద్ధంలో ఒట్టిన మంటలు. శత్రువులు సమీపించటానికి శక్యంకాని దావానల సన్నిభులు; దరిచేరితే దహించే దమనమూర్తులు, తేజోధనులు అని భావం. విరాటుడు చుట్టపు మేరువు - 'మేరు పర్వతం సర్వదేవతలూ వసించే బంగారుకొండ', కోరికలు తీర్చేకొండ. విరాటు డటువంటి స్నేహమూర్తి. తెలుగు జాతీయాలతో పాత్రలకు వెలుగు, దివ్వెలవంటి సూక్తి నిర్వచనా లిచ్చిన తెలుగు వెలుగు తిక్కన. (సంపా.)

వ. మఱియు నక్కడ. 298

తాత్పర్యం: ఇంక కౌరవ పక్షంలో.

ఉ. ద్రోణుఁడు, భీష్ముఁడుం, గృపుఁడు, ద్రోణసుతుండును గర్ణశల్యులుం
బ్రాణము లా సుయోధనుని పాలివ యంద్రు; నిజానుజన్ము ల
క్షీణపరాక్రముల్, సుతు లజేయులు; బాహ్లిక సోమదత్తు లా
స్థాణునకైన నోడరు; వశంబె జయింపఁగ వారి నేరికిన్? 299

ప్రతిపదార్థం: ద్రోణుఁడున్, భీష్ముఁడున్, కృపుఁడున్; ద్రోణ సుతుండును= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామా; కర్ణ, శల్యులున్= కర్ణుడూ, శల్యుడూ; ప్రాణములు= తమ జీవితాలు; ఆ+సుయోధనుని పాలివి+అ+అంద్రు= ఆ దుర్యోధనుడివే అంటారు; నిజ+అనుజన్ములు= తన తమ్ములు; అక్షీణ పరాక్రముల్= తక్కువకాని (అధికమైన) పరాక్రమం కలవారు; సుతులు= కొడుకులు; అజేయులు= గెలువదగనివారు; బాహ్లిక, సోమదత్తులు= బాహ్లికుడూ, సోమదత్తుడూ; ఆ+స్థాణునకున్+ఐనన్= ఆ శివుడికి కూడా; ఓడరు= జంకరు; వారిన్, జయింపఁగన్= గెలవటానికి; ఏరికిన్= ఎవరికైనా, వశంబె?= తరమా?

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, శల్యుడూ తమ ప్రాణాలు ఆ దుర్యోధనుడివే అంటారు. తమ్ములు మిక్కిలి పరాక్రమవంతులు. కొడుకులు జయింపరాని వారు. బాహ్లికుడూ, సోమదత్తుడూ ఆ స్థాణుడికి కూడా జంకరు. వారిని జయించటం ఎవరికైనా శక్యమా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. 'సుతు లజేయులు' - అజేయులంటే జయింపదగని వారు, అజయ్యులు - జయింపరాని వారు, సుతులజయ్యులు అని ఉండవలసింది. కాని, అప్పుడు యతి మైత్రికి భంగం కలుగుతుంది. సోమదత్తుడు బాహ్లికుడి కొడుకు. 'స్థాణునకైన నోడరు' - కావ్యార్థాపత్తి.

ఆ. అధిప! యిట్టి మీకు నన్యోన్య కలహంబు । నాకుఁ జూడ మే లనంగ రాదు;
రెండు పక్షములకుఁ బ్రియము హితంబును । నాత్మఁ గోరువారి నడిగి చూడు.' 300

ప్రతిపదార్థం: అధిప!= రాజా! - ధర్మరాజా!; ఇట్టి మీకున్= ఇటువంటి మీకు (కౌరవపాండవులకు); అన్యోన్యకలహంబు= పరస్పర యుద్ధం; నాకున్+చూడన్= నాకు చూడగా; మేలు+అనంగన్, రాదు= మంచిది అనగూడదు; రెండు పక్షములకున్= ఇరువైపులవారికీ; ప్రియమున్= సంతోషాన్నీ; హితంబునున్= మేలునూ; ఆత్మన్= మనస్సునందు; కోరువారిన్= ఆశించేవారిని; అడిగి-చూడు(ము).

తాత్పర్యం: ధర్మరాజా! ఇటువంటి మీరు ఒకళ్ళతో ఒకళ్ళు పోరాడటం వలన మేలు కలుగుతుందని నాకు అనిపించదు. ఇంకా రెండు పక్షాల వారికీ సంతోషాన్నీ, శ్రేయస్సునూ ఆకాంక్షించే వాళ్ళను అడిగి చూడుము.'

వ. అని పలికి సూతనందనుండు గొలువు గలయం గనుంగొని. 301

ప్రతిపదార్థం: అని, పలికి; సూతనందనుండు= సూతపుత్రుడు - సంజయుడు; కొలువు= సభ; కలయన్+కనుంగొని= అంతటా చూచి.

తాత్పర్యం: అని పలికి సంజయుడు సభ అంతటా చూపు సారించి.

ఉ. 'మ్రొక్కెద వాసుదేవునకు, మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం,
దక్కటి మిత్త్ర బాంధవ హిత ప్రియమంత్రి వయస్య కోటికిన్
స్రుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్. 302

ప్రతిపదార్థం: వాసుదేవునకున్= కృష్ణుడికి; మ్రొక్కెదన్= నమస్కరిస్తాను; సవ్యసాచికిన్= కవ్వడికి - అర్జునుడికి; చేతులు మోడ్చెదన్= చేతులు జోడిస్తాను; తక్కటి, మిత్త్ర, బాంధవ, హిత, ప్రియ, మంత్రి, వయస్య, కోటికిన్= మిగిలిన మిత్త్రుల,

బంధువుల, హితుల, ప్రియుల, మంత్రుల, వయస్యుల సమూహానికి; స్రుక్కుచున్= అడగుతూ- సవినయంగా; విన్నవించెదన్= మనవి చేస్తాను; అసూయలు+తక్కి= కోపాలు విడిచి; అనుజ్ఞ+చేయుఁడీ= అనుమతించండి; ఈ+కరుణా+ఆకరున్= ఈ దయాళువును-ధర్మరాజును; క్రోధశాంతికిన్= కోపం ఉపశమించటానికి; ఏను= నేను; ఇదె= ఇప్పుడే; శరణము, వేఁడెదన్= శరణు వేడుతున్నాను.

తాత్పర్యం: 'కృష్ణుడికి మ్రొక్కుతాను, అర్జునుడికి చేతులు జోడిస్తాను, తక్కిన మిత్రుల, బంధువుల, హితుల, ప్రియుల, మంత్రుల, వయస్యుల సమూహానికి సవినయంగా మనవి చేస్తాను. కోపాలు మాని అనుమతించండి, ఈ దయాళుడైన ధర్మరాజును కోపోపశమనానికై నేను ఇదే శరణు వేడుతాను.'

విశేషం: 1. సంజయు రాయబారపు ఘట్టంలో పతాకస్థానమైన పద్యమిది. నాటకీయమైన సన్నివేశం. పరమేశ్వరుడి ముందు భక్తుడు ప్రణమిల్లి శరణు వేడుతున్నట్లు భక్తిభావ ప్రవృత్తితో సంజయుడు ధర్మరాజుకు ప్రణామం చేస్తూ పలికిన మాటలివి. ధర్మరాజును కరుణాకరుడని ప్రశంసించాడు. కాబట్టి శరణువేడినవారి కోర్కెను కాదనక తీర్చటం కరుణామయుడి కర్తవ్యం. సంజయుడు కోరింది క్రోధశాంతి. అంటే ధర్మరాజు క్రోధమూర్తి అయి ఉన్నాడనీ, ఆ క్రోధాన్ని ఆయన శాశ్వతంగా చంపుకొని శాంతమూర్తి కావాలనీ కోరుకొన్నాడు. ధర్మజు డా వరం ఇవ్వాలి.

2. అందుకు ఆ సభలోని ప్రముఖు లందరూ అసూయలు మాని ధర్మరాజుకు అనుజ్ఞ ఇవ్వాలట, అంటే ముక్తకంఠంతో, ఏకాభిప్రాయంతో ధర్మజ క్రోధశాంతిని సమర్థించాలని ప్రార్థన.

3. ధర్మరాజును అనుమతించవలసిన వారిలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుడు. అందుకే ఆయనకు ముందుగా మ్రొక్కులు చెల్లించటం, నారాయణుడి తరువాత నరుడు. అతడు పైపెచ్చు సవ్యసాచి, అతడికి చేతులు జోడించాడు. రెండు చేతుల వాడి కలవాడికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించటం న్యాయమే. (తలమీద చేతులెత్తి నమస్కరించటం మ్రొక్కటం. ఇది దేవ గురుమూర్తుల పట్ల సమంజసం. చేతులు జోడించటం వినయ గౌరవ ప్రదర్శకం). మిగిలిన వారందరికీ వినయంగా విన్నవించుకొన్నాడు. వారి వారి అధికారాలకు అనుగుణంగా అణకువను ప్రదర్శించి సంజయుడు సభా మర్యాదలను పాటించాడు. అందరినీ అర్థించి ధర్మరాజును ప్రార్థించాడు.

4. "శత్రు కృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః"- అని ప్రతాపరుద్రీయం. ధర్మరాజు క్రోధం కౌరవకృతాపచారాల వలన కలిగిన మనః ప్రజ్వలనరూపం. అది రౌద్రమై శత్రుప్రతీకార సంహారాలను చేపట్టి, శత్రుపక్షంలో శోకం కలిగించటానికి పూనుకొంటుంది. అట్టి రౌద్రకర్మను ఉపశమించుకొనుమని ధర్మరాజును సంజయుడు వేడుకొన్నాడు. రౌద్రం అర్థసాధన ప్రధానం. ధర్మజుడి క్రోధం రాజ్య సంపదను సాధించే ప్రయోజనంతో వర్తిస్తుంది. దానిని మానుకొనుమని సంజయుడి ప్రార్థన. క్రోధానికి అసూయ పోషకశక్తి. అందువలన అసూయను వదలి ధర్మరాజుకు క్రోధశాంతికై అనుజ్ఞ ఇవ్వండి- అని సభ్యులందరికీ సంజయుడి అభ్యర్థన.

5. సంజయుడి అభినయం, అభ్యర్థన ఎవరికైనా అనుమానం కలిగిస్తాయి. దూత శరణువేడుతున్నాడంటే ధృతరాష్ట్రుడి దూతగా సంజయుడు వ్యవహరిస్తున్నాడా? తన సొంత పూచీతో ఆ పని చేస్తున్నాడా? అన్నది మొదటి అనుమానం. దూత శరణు వేడడు. అది మర్యాద కాదు. కాబట్టి సంజయుడిది సొంత అభినయమే. అంటే ఆ మాటలన్నీ సంజయుడి వినయ విలాసాలే. ధృతరాష్ట్రుడి ఆదేశాలు కావు. కాబట్టి వాటిని అధికారికంగా అంగీకరించవలసిన అవసరం లేదు. భక్తిభావముద్రితమైన సంజయుడి పలుకులు ధర్మరాజు యుద్ధ విరమణ రూపమైన క్రియను చేపట్టటానికి ప్రేరణలుగా పనిచేస్తాయి. నిజంగా ఆ

మాటలకు ధర్మజుడు కరగిపోయి, కరుణాకరుడై యుద్ధం మానివేస్తే గొప్ప విపత్తు ఏర్పడుతుంది. క్రోధోపశాంతి వలన రాజ్యసుఖం వదలుకొనటమే ఫలమౌతుంది. ఇంత లోతుగా వ్యూహం పన్ని, పైకి అమాయకంగా మాట్లాడుతూ ముందరికాళ్ళకు బంధం వేయాలని శరణువేడినట్లు నటించాడు సంజయుడు. ధర్మరాజు శత్రు మర్మజ్ఞుడు. కౌరవ వ్యూహంలోని కౌటిల్యాన్ని పసికట్టాడు. కాని, బయటపడలేదు. (సంపా.)

వ. అనుచుం బ్రణామపూర్వకంబుగాఁ బాండవాగ్రజు వదనంబునం జూడ్కినిలిపి, 'దేవా! యుపశమించుట లెస్స, యిమ్మెయికిం గురు పితామహుండును సంతసిల్లు; నాతనికనుమతంబయిన తెఱంగు సర్వలోకసమ్మతం బగు' నన విని ధర్మనందనుం డిట్లనియె. 303

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; ప్రణామపూర్వకంబుగాన్= నమస్కార పూర్వకంగా; పాండవ+అగ్రజు వదనంబునన్= ధర్మరాజు ముఖంలో; చూడ్కి= చూపు; నిలిపి= ఉంచి; దేవా!; ఉపశమించుట= శాంతించటం; లెస్స= మంచిది; ఈ+మెయికిన్= ఈ రీతికి; కురు పితామహుండును= భీష్ముడుకూడా; సంతసిల్లున్= సంతోషిస్తాడు; ఆతనికిన్= భీష్ముడికికూడా; అనుమతంబు+ అయిన తెఱంగు= సమ్మతమైన విధం; సర్వలోక- సమ్మతంబు+అగున్= అన్ని లోకాలకూ అంగీకారం అవుతుంది; అనన్ విని= అనగా విని; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అంటూ నమస్కార పురస్సరంగా ధర్మరాజు ముఖంలో చూపు నిలిపి 'దేవా! శాంతించటం మంచిది. దీనికి భీష్ముడు కూడా సంతోషిస్తాడు. ఆతడికి సమ్మతమైన విధం అన్నిలోకాలకూ సమ్మతమవుతుంది' - అనగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్ముడు కూడా సంతోషిస్తా డనటం తాతగారిమీద ఉన్న భక్తి గౌరవాలకొద్దీ ధర్మరాజు తప్పకుండా ఉపశమిస్తాడనే ఆశతో.

ఉ. 'నెయ్యము దప్ప నొండొకటి నీ చెవి సోఁకెనె నాదు పల్కులం
దియ్యెడ? సంజయా! యనికి నెమ్మెయి నల్కెదు నీవు; మాకుఁ దాఁ
గయ్యము దక్కి మన్కి తగు కార్యము గా దొకొ? పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి వెడఁగైనను నొల్లక యొండు సేయునే? 304

ప్రతిపదార్థం: సంజయా!; అనికిన్= యుద్ధానికి; ఎమ్మెయిన్(ఏ+మెయిన్)= ఏదో ఒక విధంగా; నీవు; అల్కెదు(అల్కెదువు)= భయపడతావు; నాదు పల్కులందున్ (నా+పల్కుల+అందున్)= నా మాటలలో; నెయ్యము+తప్పన్= చెలిమికాక; ఒండొకటి (ఒండు+ఒకటి)= మరియొకటి; ఇయ్యెడన్ (ఈ+ఎడన్)= ఇప్పుడు; నీ చెవిన్+సోఁకెన్?= నీ చెవిని పడిందా?; మాకున్, తాన్; కయ్యము+తక్కి= యుద్ధం విడిచి; మన్కి= జీవించటం; తగు కార్యము+కాదు+ఒకొ!= తగిన పని కాదా?; పోరితంబు, లేక+అయ్యెడు+అర్థ సిద్ధి= యుద్ధం లేకుండా అయ్యే ప్రయోజన సిద్ధి (లేదా ధనప్రాప్తి); వెడఁగు+ఐనను= వెర్రివాడయినా; ఒల్లక= అంగీకరించక; ఒండు+చేయునే?= ఇంకొకటి చేస్తాడా?

తాత్పర్యం: 'సంజయా! యుద్ధానికి నీవు భయపడుతున్నావు, ఇప్పుడు నా మాటలలో చెలిమి కాక వేరొకటి నీ చెవిలో పడిందా? మాకు మాత్రం యుద్ధం లేకుండా జీవించటం తగిన పని కాదా? యుద్ధం లేకుండా ప్రయోజనం నెరవేరితే దానిని వెర్రివాడయినా కోరక ఇంకొకటి చేస్తాడా?

విశేషం: 1. సంజయుడి వాక్య నైపుణ్యం మీద ధర్మరాజు ఉక్తి చాతుర్యంతో ఎదురుదాడి మొదలుపెట్టాడు. అది అతడి గడుసరి తనం. అంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న ఆతడు ఒక్కసారి విజృంభించాడు. ఈ పద్యంలో చెప్పే తాత్పర్యానికి ఎంత విశేషముందో, చెప్పే తీరుకు కూడా అంత వైశిష్ట్యం ఉన్నది.

2. శరణు వేడిన సంజయుడికి ధర్మరాజు సుముఖుడైనట్లే వాక్యం మొదలుపెట్టాడు. చెలిమి తప్ప మరొకమాట నానోట నీకు వినబడిందా? అని అన్నాడు. ఇది గుట్టు తెలిసి పలికినమాట. ఆప్యాయత ఒలకబోసేమాట! కాగా, క్రోధమే లేని నాలో క్రోధం ఉన్నట్లు ఈ విధంగా పలికా వెందుకు? నా ప్రవృత్తిని మసిపూసి మారేడుకాయ చేస్తావెందుకు? అని సంజయుడిని దెప్పిపొడిచాడు. సంజయుడి నాటకం బట్టబయలైనది. కౌరవులకే కాదు పాండవులకూ కయ్యం లేకుండానే ఉండాలని ఉన్నది- అని తనమీద వేసిన నేరాన్ని దులుపుకొని మాట్లాడాడు. చివరకు పలికినమాట కీలెరిగి పెట్టినవాత. యుద్ధం లేకుండానే అర్థసిద్ధి అయితే ఎంతటి వెర్రివాడైనా మరొక రకంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? అని ఎదురు ప్రశ్న వేశాడు. ఇది చాలా లోతైన మాట. సంజయుడు కోరింది క్రోధోపశాంతి. శత్రువులు అర్థాన్ని హరించి అపకారం అవమానం చేయటం వలన దానిని మరల సంపాదించుకొనటానికి ప్రదర్శించే తీవ్రమనోభావం క్రోధం. యుద్ధం చేయకుండానే అర్థసిద్ధి కలిగితే క్రోధం ఉపశమిస్తుంది. లేదా అర్థంమీది తృష్ణే నశిస్తే శమిస్తుంది. ధర్మరాజు విరక్తుడై క్రోధాన్ని మానాలని సంజయుడి పన్నాగం. అర్థసిద్ధి కలిగితేనే క్రోధశాంతి కలుగుతుందని ధర్మరాజు ప్రతిసమాధానం. క్రోధశాంతికి అంగీకరించినా ధర్మరాజు సంజయుడి మార్గాన్ని అంగీకరించలేదు. శరణన్నవారిని కాదన్న దోషం ధర్మరాజుకు కలుగలేదు. అతడి యుక్తి చాతుర్యం అంత గొప్పది. (సంపా.)

3. 'యుద్ధం మాను, శాంతించు' అని మాటిమాటికీ సంజయుడు చెప్పిన దానికి ధర్మరాజు సూటిగా, స్పష్టంగా చెప్పిన సమాధానం ఇది. 'అర్థసిద్ధి' ముఖ్యమనీ, యుద్ధం చేయటం, మానటం దానిని బట్టి ఉంటుందనీ, అర్థసిద్ధి కాకపోతే యుద్ధం తప్పకపోవచ్చుననీ ధర్మరాజు మాటలలో ధ్వనిస్తున్నది.

క. జనులకు నెల్లను బథ్యము । లనఁగా, ధర్మానుగతములగు నన౯ బొగడం
జను పనులు సేయు భీమా । ర్జునులే దుష్కర్మములకు రోయని వారల్? 305

ప్రతిపదార్థం: జనులకున్+ఎల్లను= జనులకందరికీ; పథ్యములు+అనఁగాన్= మేలు చేసేవి అనిన్నీ; ధర్మ+అనుగతములు+అగున్+అనన్= ధర్మాన్ని అనుసరించేవి అనిన్నీ; పొగడన్+చను= ప్రశంసించదగిన; పనులు, చేయు, భీమ+అర్జునులే= భీమార్జునులా; దుష్కర్మములకున్= చెడుపనులకు; రోయనివారల్?= అసహ్యించుకొననివారు?

తాత్పర్యం: జనులకందరికీ మేలు చేసేవి అనిన్నీ, ధర్మాన్ని అనుసరించేవి అనిన్నీ ప్రశంసించదగిన పనులు చేసే భీమార్జునులా చెడుపనులకు అసహ్యించుకొననివారు?

విశేషం: 'నేనే కాదు మా తమ్ములు భీమార్జునులు కూడా జనహిత ధర్మకార్యాలే చేస్తారు కాని యుద్ధం జోలికి' అనవసరంగా పోరు. దానిని అసహ్యించుకొంటారు' అని ధర్మరాజు తమ్ముల సంగతి కూడా చెప్పాడు.

క. మది సుఖము గోరి, దుఃఖం । బొదవం గల కార్యములకు నుత్సాహము సే
యుదు రొప్పని తృష్ణం బడి । చదు రేమియు లేని యట్టి జను లాతురులై. 306

ప్రతిపదార్థం: చదురు+ఏమియున్, లేని+అట్టి; జనులు= నేర్పు ఏ మాత్రమూ లేని జనులు; ఒప్పని, తృష్ణన్+పడి= తగని దప్పికి - దురాశకు లోఁబడి; ఆతురులు+ఐ= తొందరపడినవారయి; మది,సుఖము+కోరి= మనస్సంతోషం కోరి; దుఃఖంబు+ఒదవన్+కల కార్యములకున్= దుఃఖం కలిగించే పనులకు; ఉత్సాహము+చేయుదురు= ఉత్సాహం చూపుతారు.

తాత్పర్యం: చతురత ఏ మాత్రమూ లేని జనులు తగని దురాశకు లోబడి తొందరపడినవారయి మనస్సంతోషం కోరి దుఃఖాన్ని కలిగించే పనులకు ఉత్సాహం చూపుతారు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. తాము చదురులేని జనులం కామనీ, తమకు ఒప్పని తృష్ణ లేదనీ, దుఃఖావహకార్యాలకు తాము చొరమనీ ధర్మరాజు అభిప్రాయం. పద్యంలో ఉన్నది సామాన్యాంశం. 'మేము అట్లాంటి వాళ్ళం కాము' అనేది విశేషాంశం. అది అధ్యాహార్యం. అది సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

ఆ. యోగ్యతృష్ణ దారు, లుచితంపుఁ గొలఁదిమై । నడచినట్టివారు బెడిదములకు
నంత సొత్తు రెట్లు? సంతాపకారుల । కాక పెనఁకువలు సుఖంబు లగునె? 307

ప్రతిపదార్థం: యోగ్యతృష్ణన్= సముచితమైన ఆశతో; ఉచితంపుఁగొలఁదిమైన్ (ఉచితము+కొలఁదిమైన్)= తగిన విధంగా; దారులు= మార్గాలు; నడచినట్టివారున్= అనుసరించేవారూ; బెడిదములకున్= హింసాకృత్యాలకు; అంత+చొత్తురు+ఎట్లు?= అంతగా ఎట్లా పూనుకొంటారు?; పెనఁకువలు= యుద్ధాలు; సంతాపకారులు+అ కాక= అధిక దుఃఖాన్ని కలిగించేవే కాని; సుఖంబులు+అగునె?= సుఖ ప్రదాలు అవుతాయా?

తాత్పర్యం: సముచితమైన ఆశతో, తగిన విధంగా మంచి త్రోవల ననుసరించేవారు క్రౌర్యాలకు అంతగా ఎట్లా పూనుకొంటారు? యుద్ధాలు దుఃఖావహాలే కాని సుఖావహా లవుతాయా?

వ. భోగంబులు వలదా యని తలంతు మేని. 308

ప్రతిపదార్థం: భోగంబులు= సుఖాలు; వలదా= వద్దా; అని; తలంతుము+ఏనిన్= అనుకొంటే.

తాత్పర్యం: సుఖాలు వద్దా అని అనుకొంటే.

తే. వస్త్ర మాల్యానులేపనావసరములును, । జతుర తూర్య త్రయంబుల సమయములును,
నేము వెలిగాఁగ మా తండ్రి కించు నెట్లు; । పుత్త్రులన పట్టి మమ్మేల పోవఁ ద్రోచు? 309

ప్రతిపదార్థం: వస్త్ర,మాల్య+అనులేపన+అవసరములును= వలువల, పూలమాలల, గంధపు పూతల వేళలూ; చతుర, తూర్య, త్రయంబుల; సమయములును= నేర్పరులయొక్క, నృత్త గీతవాద్యాల వేళలూ; ఏము వెలి+కాఁగన్= మేము దూరమైతే; మా తండ్రికిన్= మా తండ్రిఅయిన ధృతరాష్ట్రుడికి; ఇంచున్+ఎట్లు= ఎట్లా బాగుంటుంది?; పుత్త్రులన (పుత్త్రులన్+అ)= కొడుకులనే; పట్టి= పట్టుకొని; మమ్మున్+ఏల= మమ్ములను ఎందుకు; పోవన్+త్రోచున్?= పొమ్మంటాడు?

తాత్పర్యం: వస్త్రాలు కట్టుకొన్నప్పుడూ, పూలమాలలు ధరించినప్పుడూ, గంధపు పూతలు పూసికొన్నప్పుడూ, నేర్పరులు నృత్తగీత వాద్యాలు చేసేటప్పుడూ మేము దూరంగా ఉంటే మా తండ్రి ధృతరాష్ట్రుడికి ఏం బాగుంటుంది? అతడు కొడుకులనే పట్టుకొని మమ్మెందుకు పొమ్మంటాడు?

వ. అయినను నొకమాట సెప్పెద సమచిత్తుఁడవై విను' మని యిట్లనియె. 310

ప్రతిపదార్థం: అయిననున్= అయినప్పటికీ; ఒక - మాట, చెప్పెదన్; సమ చిత్తుఁడవు+ఐ= నిష్పక్షపాత బుద్ధి కలవాడవై; వినుము+అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అయినా ఒక మాట చెపుతా నిష్పక్షపాతబుద్ధితో వినుము' అని ఇట్లా అన్నాడు.

క. తానైన నపుడు వక్రుం । డై నీతిపథంబు విడిచె నక్కట! పతి; మ
మ్మైనను జక్కని తెరువునఁ । బూని నడవుఁ డనుచు నిపుడు బుద్ధులు సెప్పెన్. 311

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; పతి= రాజు - ధృతరాష్ట్రుడు; తాను+ఐనన్= తానైతే; అపుడు; వక్రుండు+ఐ= కుటిలుడై; నీతి పథంబున్= నీతిమార్గాన్ని; విడిచెన్= వదలిపెట్టాడు; ఇపుడు; మమ్మున్+ఐనను= మమ్ములనయితే; చక్కని తెరువునన్= సన్మార్గంలో; పూని= ప్రయత్నించి; నడవుఁడు+అనుచున్= నడవండి అంటూ; బుద్ధులు+చెప్పెన్= బుద్ధులు చెపుతున్నాడు.

తాత్పర్యం: 'అయ్యో! ధృతరాష్ట్రుడు తానేమో అప్పుడు కుటిలుడై నీతిమార్గం విడిచిపెట్టాడూ! మమ్మల్నేమో 'సన్మార్గంలో ప్రయత్నించి నడవండి' అంటూ ఇప్పుడు బుద్ధులు చెపుతున్నాడూ! (ఇదేం న్యాయం?)

క. ఎదిరిం దమయట్టుల కా । మదిఁ దలఁచినఁ బొసఁగుఁ గాక, మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁడని । చదు రడిచిన మనసు పొందు చక్కం బడునే?' 312

ప్రతిపదార్థం: ఎదిరిన్= ఎదుటివాడిని; తమ+అట్టులు+అ+కాన్= తమవలెనే; మదిన్= మనస్సులో; తలఁచినన్= భావిస్తే; పొసఁగున్+కాక= కుదురుతుంది కాని; మాకున్; కుడుము+ఇండు= కుడుము కుడుమంతా ఇవ్వండి; ఇదె= ఇదిగో; మీరు; వ్రక్కన్= ముక్కను; కొనుఁడు= తీసికొనండి; అని; చదురు+అడిచినన్= తెలివితో నటిస్తూ మాటాడితే; మనసుపొందు= మనస్సుల కలయిక; చక్కన్+పడునే?= తిన్న నవుతుందా?, అనుకూలంగా పొసగుతుందా?

తాత్పర్యం: ఎదుటివారిని తమవలెనే మనస్సులో భావిస్తే కుదురుతుంది కాని 'మాకు మొత్తం కుడుమంతా ఇవ్వండి, ఇదిగో మీరు ముక్క పుచ్చుకోండి' అని పరిహాస మాడితే మనస్సులు చక్కగా కలుస్తాయా?'

వ. అని చూపి చెప్పి, వెండియు. 313

తాత్పర్యం: అని నిరూపించి చెప్పి ఇంకా. - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'సంపద దక్కి యుండఁగ నశక్తు లనం జను మమ్ముఁ బిల్చి పూ
జింపఁగ నంత బేలె పతి? సెప్పెడు వారల బుద్ధి నాఁడ మ
న్నింపఁడు; యింక నేల యగు? నీ వడియాసల వచ్చి రిత్త గా
రింపక మాను; మాతని చరిత్రము నీకును మాకు వింతయే? 314

ప్రతిపదార్థం: సంపద+తక్కి+ఉండఁగన్= ఐశ్వర్యం పోయి ఉండగా; అశక్తులు+అనన్+చను మమ్మున్= బలహీనులుగా ఉన్న మమ్ములను; పిల్చి= ఆహ్వానించి; పూజింపఁగన్= పూజించటానికి; పతి= రాజు- ధృతరాష్ట్రుడు; అంత బేల+ఎ= అంత వెర్రివాడా?; చెప్పెడు వారల బుద్ధిన్= చెప్పేవాళ్ళ బుద్ధిని; నాఁడు+అ= అప్పుడే; మన్నింపఁడు+అ= ఆదరించనే లేదు; ఇంకన్+ఏల+అగున్?= ఇంక ఎందుకు కుదురుతుంది?; నీవు, అడియాసలన్= వట్టి ఆశలతో; వచ్చి; రిత్త= ఊరికే; కారింపక

మానుము= బాధపెట్టకుము; ఆతని చరిత్రము= ఆ ధృతరాష్ట్రుడి నడత; నీకును= నీకూ; మాకున్= మాకూ; వింతయే?= క్రొత్తా?

తాత్పర్యం: ఐశ్వర్యం కోల్పోయి బలహీనులమై ఉన్న మమ్ములను ఆహ్వానించి పూజించడానికి ధృతరాష్ట్రుడు అంత వెర్రివాడా? చెప్పేవాళ్ళ బుద్ధిని అప్పుడే ఆదరించలేదు. ఇంక ఎందుకు కుదురుతుంది? నీవు లేనిపోని ఆశలు పెట్టుకొని వచ్చి మమ్ములను ఊరికే బాధపెట్టకుము. ఆతడి ప్రవర్తన నీకూ మాకూ క్రొత్తా?

క. తగు మాట లాంబికేయుం । డగు నని కైకొనునె యెన్నఁడైనను? గొడుకున్
మగఁటిమి గలఁ డనియెడు న । మ్మిగఁ జూచుచు నుండు విషము మ్రింగిన యేనిన్. 315

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= అంబిక కుమారుడు - ధృతరాష్ట్రుడు; తగు మాటలు= మంచిమాటలు; అగును+అని= ఔనని; ఎన్నఁడు+ఐనను= ఎప్పుడయినా; కైకొనునె?= స్వీకరిస్తాడా? - వింటాడా?; కొడుకున్= కొడుకును- దుర్యోధనుడిని; మగఁటిమి= పరాక్రమం; కలఁడు+అనియెడు నమ్మిగన్= ఉన్నవాడు అనే నమ్మకంతో; విషమున్+మ్రింగిన+ఏనిన్= విషం మ్రింగినా; చూచుచున్+ఉండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మంచిమాటలకు ఔనని ఎప్పుడైనా ఊ కొడతాడా? కొడుకైన దుర్యోధనుడిని పరాక్రమవంతు డనే (గుడ్డి) నమ్మకంతో, విషం మ్రింగినా, చూస్తూ ఊరుకొంటాడు.

క. జూదపుసిరి యాసపడం । గా దని విదురుండు సెప్పఁగా నప్పుడు క
ర్ణాదుల పలుకులు విని పతి । యాదరణము సేయకున్న, నంతన తీరున్. 316

ప్రతిపదార్థం: జూదము+సిరి= జూదం వలని సంపద; ఆసపడన్+కాదు+అని= ఆశించకూడదని; విదురుండు, చెప్పఁగాన్, అప్పుడు; పతి= రాజు- ధృతరాష్ట్రుడు; విని; కర్ణ+ఆదుల పలుకులు= కర్ణుడూ మొదలయిన వాళ్ళమాటలు; ఆదరణము+ చేయక+ఉన్నన్= ఆదరించకుండా ఉంటే; అంతన్+అ= దానితోనే; తీరున్= తీరిపోయేది.

తాత్పర్యం: జూదంవలన వచ్చే సంపద కొరకు ఆశపడకూడదని విదురుడు చెప్పగా విని, అప్పుడు కర్ణాదుల మాటలు ధృతరాష్ట్రు డాదరించకుండా ఉంటే, దానితో తీరిపోయేది.

క. ధృతరాష్ట్రుం డిట మీఁదను । సుతులును, శకునియును, సూతసుతుఁడును దను నే
గతి నడపించిరి వారల । మతమ యనుష్ఠించుఁగాక మరలం బడునే? 317

ప్రతిపదార్థం: ఇటమీఁదను= ఇంకమీదట; ధృతరాష్ట్రుండు; సుతులును= కొడుకులూ (దుర్యోధన, దుశ్శాసనులు); శకునియును; సూత సుతుఁడును= కర్ణుడూ; తనున్= తనను; ఏ గతిన్+నడపించిరి= ఏ మార్గాన నడిపించారో; వారల మతము+అ= వాళ్ళ మతమే; అనుష్ఠించున్+కాక= ఆచరిస్తాడు కాని; మరలన్+పడునే?= దానికి విముఖు డవుతాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఇంకమీదట తనను కొడుకులు దుర్యోధన దుశ్శాసనులూ, శకునీ, కర్ణుడూ ఏ విధంగా నడిపిస్తే ఆ విధంగానే నడిచి వారి మతమే ఆచరిస్తాడు కాని తద్విముఖు డవుతాడా?

విశేషం: ఈ పద్యంలో యత్తత్ప్రయోగం చేయబడింది. కాని 'ఏగతి నడపించిరి' అని యచ్ఛబ్దం మాత్రం ఉన్నది కాని, 'ఆ గతి....' అని తచ్ఛబ్ద ప్రయోగం లోపించింది. అయితే, వారలమతమ అనే దానిలోనే తచ్ఛబ్ద భావం ఇమిడిఉంది. వారలమతమ=

ఆ మతమే - ఆగతే. అది విశేషం. ఇంతవరకూ ధర్మరాజు చేసిన ధృతరాష్ట్ర మనస్తత్త్వ విశ్లేషణ అతడి పర మనస్తత్త్వ పరిజ్ఞానానికి నిదర్శనం, ఇక దుర్యోధనుడి మనస్తత్త్వాన్ని విశ్లేషిస్తాడు.

క. కార్యము తెలుఁ గిట్టిది; నీ । వార్య చరితమునకుఁ జొచ్చి యాడెదు; నీ కా
దుర్యోధను నవినయ మని । వార్యం బని యెఱుఁగరామి; వలనో, వెడఁగో? 318

ప్రతిపదార్థం: కార్యము తెఱఁగు+ఇట్టిది= ఇదీ కార్యస్వరూపం; నీకున్; ఆ దుర్యోధను+అవినయము= ఆ దుర్యోధనుడి యొక్క చెడునడవడి; అనివార్యంబు+అని= మాన్ప శక్యం కానిది అని; ఎఱుఁగన్+రామిన్= తెలియకపోవటం చేత; నీవు; ఆర్యచరితమునకున్+చొచ్చి= 'పెద్దమనిషి తరహాగా'; ఆడెద+వు= మాటాడుతున్నావు; వలనో= వివేకమో; వెడఁగో= అవివేకమో!

తాత్పర్యం: ఇదీ కార్యస్వరూపం. నీకు ఆ దుర్యోధనుడి చెడునడత మాన్ప శక్యం కానిదని తెలియకపోవటం చేత నీవు అట్లా పెద్ద మనిషితరహాగా మాటాడుతున్నావు. నీది వివేకం అనుకొనాలా? అవివేకం అనుకొనాలా?

క. చక్రధరు లెక్క గొనఁడు; ప । రాక్రమనిధి యర్జునునకు రాధేయ భుజా
విక్రమ మెదురుగఁ గొని, ని । ర్వక్రముఁ జేసికొనువాఁడు రాజ్యం బెల్లన్.' 319

ప్రతిపదార్థం: వాఁడు= అతడు - దుర్యోధనుడు; చక్రధరున్= సుదర్శనమనే చక్రాన్ని ధరించినవాడిని- కృష్ణుడిని; లెక్క+కొనఁడు= లక్ష్యపెట్టడు; పరాక్రమ నిధి= పరాక్రమానికి నిధి అయిన; అర్జునునకున్; రాధేయ భుజా విక్రమము= కర్ణుడి బాహు పరాక్రమం; ఎదురుగన్+కొని= ప్రతిగా భావించి; రాజ్యంబు+ఎల్లన్= రాజ్యాన్ని అంతనూ; నిర్వక్రమున్+చేసికొనున్= చక్కబరుచుకొంటాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చక్రాయుధుడైన శ్రీకృష్ణుడిని లెక్కించడు; పరాక్రమానికి నిధి అయిన అర్జునుడికి కర్ణుడి బాహుపరాక్రమాన్ని ప్రతిగా భావించి రాజ్యన్నంతనూ నిష్కంటకం చేసికొని, చక్కబరుచుకొనా లనుకొంటున్నాడు.'

విశేషం: అలం: పరికరం. 'చక్రధరున్' అనే కృష్ణ విశేషణం సాభిప్రాయంగా ప్రయుక్త మయింది కాబట్టి పరికరం.

వ. అని పలికి వెడవెడ యలుక వొడమిన, మఱియు నిట్లనియె. 320

ప్రతిపదార్థం: అని, పలికి, వెడవెడ= కొద్దిగా; అలుక+పొడమినన్= కోపం రాగా; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి కొంచెం కోపం రాగా ఇంకా ఇట్లా అన్నాడు.

శా. 'చాపాచార్యుఁడు, భీష్ముఁడుం, గృపుఁడు, నశ్వత్థామయుం, గర్ణుఁడున్,
భూపశ్రేష్ఠుఁడుఁ దారు మున్నెఱుఁగరే పో? రెట్లుఁ గయ్యంబు లా
శాపాశంబులు చుట్ట; లా వెఱఁగియుం జావేఁడి మార్కొందు; రిం
తేపో! తమ్ముఁ గపిధ్వజప్రభల యంధీభూతులం జేయవే? 321

ప్రతిపదార్థం: చాప+ఆచార్యుఁడున్= ధనుర్గురువూ- ద్రోణుడూ; భీష్ముఁడున్, కృపుఁడున్; అశ్వత్థామయున్; కర్ణుఁడున్; భూప శ్రేష్ఠుఁడున్= రాజోత్తముడైన దుర్యోధనుడూ; తారు= తాము; మున్ను= పూర్వం; పోరు= యుద్ధం; ఎఱుఁగరే?= తెలియరా?; ఆశా పాశంబులు+చుట్టన్= ఆశలనెడి త్రాళ్ళు చుట్టుకోగా; ఎట్లున్= ఏ విధంగా నైనా; కయ్యంబులు= యుద్ధాలు - యుద్ధాలు

ఏ విధంగానైనా జరిగితీరతాయి; లావు= (మా) బలం; ఎఱిఁగియున్= తెలిసికూడా; చావ్+వేఁడి= చావగోరి; మార్కొందురు= ఎదుర్కొంటారు; ఇంతే పో= ఇదే నిశ్చయం; తమ్మున్= తమను; కపి ధ్వజ ప్రభలు+అ= (అర్జునుడి) కపిధ్వజం కాంతులే; అంధీభూతులన్= గ్రుడ్డివాళ్ళనుగా; చేయవు+ఏ?= చేయవా? చేస్తాయి అని భావం.

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, దుర్యోధనుడూ - వీరంతా మునుపు యుద్ధం ఎరుగరా? రాజ్యకాంక్ష మొదలైన ఆశలనే పాశాలు చుట్టుకుంటే, యుద్ధా లెట్లాగూ తప్పవు. వారు మా బలం ఎరిగికూడా చావగోరి ఎదుర్కొంటున్నారు. ఇదే నిశ్చయం! అర్జునుడి కపిధ్వజ కాంతులే తమను గ్రుడ్డివాళ్ళనుగా చేస్తాయి.

విశేషం: 1. అలం: రూపకం. ద్రోణాది వీరులంతా ఇదివరకు యుద్ధం ఎరుగరా? ఆ యుద్ధాలలో ఏం జరిగిందో వాళ్ళకు తెలియదా? ఆశలనే పాశాలు అనేచోట ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

2. కపిధ్వజప్రభలు అను సమాసమునకు అర్జునుడి పరాక్రమ ద్యుతులు అనికూడా అర్థం చెప్పవచ్చు.

క. మును మమ్ముఁ బొగడి, పదపడి । యని వారల గెలువ నరిది యని పొత్తుగఁ జె
ప్పిన మాటకు నే నొడఁబడ; । విను సంజయ! పక్షపాత వృత్తి విడువుమీ! 322

ప్రతిపదార్థం: సంజయా!; (విను)ము; మును= ముందు; మమ్మున్; పొగడి; పదపడి= తరువాత; అనిన్= యుద్ధంలో; వారలన్; గెలువన్= గెలవటానికి; అరిది= అశక్యం; అని; పొత్తుగన్= పొందికగా; చెప్పిన మాటకున్; ఏన్= నేను; ఒడఁబడన్= అంగీకరించను; పక్షపాత వృత్తిన్= ఒకేవైపు అభిమానం కలిగి ఉండటం; విడువుమీ= విడిచిపెట్టుము.

తాత్పర్యం: సంజయా! వినుము. ముందు మమ్ములను పొగడి, పిమ్మట వాళ్ళను యుద్ధంలో గెలవటం అసాధ్యం అని పొందికగా నీ వన్నమాట నేను అంగీకరించను. పక్షపాతబుద్ధి విడిచిపెట్టుము.

స్రగ్ధర.

గాండీవ జ్యారవం బుత్కట మయి పెలుచం గ్రమ్మినన్, భీము బాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁ దోఁచినన్, వే
దండ ద్వంద్వంబు మాడ్కిం దతిమి కవలు మాద్యద్గతిం దాఁకినం, జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్? 323

ప్రతిపదార్థం: గాండీవ జ్యా రవంబు= గాండీవం అనే అర్జునుడి వింటియొక్క అల్లెత్రాటియొక్క ధ్వని; ఉత్కటము+అయి= తీవ్రమై; పెలుచన్= అధికంగా; క్రమ్మినన్= వ్యాపించినా; భీము బాహా దండంబు= భీముడియొక్క దండంవంటి బాహువు; ఏపు+ఆరి= విజృంభించి; శుంభత్+గదన్= ప్రకాశిస్తున్న; గదను; జడియుచున్= త్రిప్పుతూ; రౌద్రంబుగాన్= భయంకరంగా; తోఁచినన్= కనబడినా; కవలు= నకులసహదేవులు; వేదండ ద్వంద్వంబు మాడ్కిన్= ఏనుగుల జంటవలె; తతిమి= విజృంభించి; మాద్యత్+గతిన్= మత్తెక్కుతూఉన్న విధంగా; తాఁకినన్= మార్కొన్నా; కౌరవ్యులకున్= కౌరవసంబంధులకు; చాక+ఉండన్= చావకుండా ఉండటానికీ; పోక+ఉండన్= పారిపోకుండా ఉండటానికీ; బిట్టు+ఉల్కి= మిక్కిలి భయపడి; మూర్ఛిల్లక+ఉండన్= మూర్ఛపోకుండా ఉండటానికీ; వశమె?= తరమా?

తాత్పర్యం: అర్జునుడి గాండీవపు అల్లెత్రాటి ధ్వని అధికమయి మిక్కిలి వ్యాపించినా, భీముడి బాహుదండం విజృంభించి ప్రకాశిస్తున్న గదను త్రిప్పుతూ భయంకరంగా కనబడినా, నకుల సహదేవుల ఏనుగుల జంటవలె కలిసి మదించిన విధంగా మార్కొన్నా కౌరవసంబంధులకు చావకుండా, పారిపోకుండా, మిక్కిలి భయపడి మూర్ఛపోకుండా ఉండటానికి శక్యమా?

విశేషం: దీనికి మూలమైన సంస్కృత శ్లోకం -

"గాణ్డీవ విస్ఫారిత శబ్ద మాజా వశృణ్వానా ధార్తరాష్ట్రా ధ్రియన్తే ।
క్రుద్ధస్య వ చే ద్భీమసేనస్య వేగాత్ సుయోధనో మన్యతే సిద్ధమర్థమ్ ॥
ఇన్ద్రోఽప్యేత న్నోత్సహేత్తాత హర్తు మైశ్వర్యం నో జీవతి భీమసేనే ।
ధనంజయే నకులే చైవ సూత, తథా వీరే సహదేవే మదీయే ॥ (సం. 5. 26. 14-15)

దీనితో పయి తెలుగుపద్యాన్ని పోలిస్తే తిక్కనమెలకువ విదితమవుతుంది.

'గాండీవజ్యా రావం కౌరవులు ఇప్పటిదాకా వినలేదు కాబట్టి బ్రదికిపోయారు. క్రుద్ధుడైన భీముడిని చూచేదాకా తనపూన్కి సాగిన దనే దుర్యోధనుడు నమ్మి ఉంటాడు. భీమార్జునులూ, వీరుడైన నకులుడూ, సహనశీలుడైన సహదేవుడూ సజీవులై ఉన్నంతవరకూ ఇంద్రుడు కూడా మా ఐశ్వర్యాన్ని హరించలేడు' - అని మూలశ్లోక భావం. ఇందులో పూర్వార్ధంలో భీమార్జునుల శౌర్యం గురించి చెప్పి, ఉత్తరార్ధంలో నకుల సహదేవులతోపాటు భీమార్జునులను మళ్ళీ పేర్కొన్నాడు వ్యాసుడు.

తిక్కన పద్యంలో ఈ పునరుక్తి లేదు. నలుగు రన్నదమ్ముల బలపరాక్రమాలనూ క్రమంగా ప్రకటించాడు తెలుగుకవి. అర్జును డని చెప్పకుండా 'గాండీవ జ్యారవ' మని మాత్రం చెప్పి అతడిని స్ఫురింపచేసిన తీరు బాగా ఉన్నది. అర్జునుడు శ్రవణ మాత్రభయంకరుడనీ, భీముడు దర్శనమాత్ర భయంకరుడనీ, నకుల సహదేవులు సంఘర్షణ మాత్ర భయంకరులనీ తారతమ్యాలను వ్యక్తీకరించిన విధం ప్రశంసనీయంగా ఉన్నది. కౌరవులు అర్జున, భీమ, నకుల, సహదేవుల పరాక్రమాలకు క్రమంగా చావకుండా, పారిపోకుండా, భయపడకుండా, మూర్ఛిల్లకుండా ఉండగలరా? అని క్రమాలంకారంలో చెప్పి వారి వారి బలాలను తిక్కన ధ్వనింపజేశాడు. 'స్రగ్ధరా' వృత్తం భావానుగుణంగానూ, సన్నివేశ సముచితంగానూ ఉన్నది. స్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి, ప్రతిపాదంలోనూ మ,ర,భ,న,య,య,య అనే గణాలుంటాయి. 1-8-15 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసనియమం ఉంటుంది.

వ. కావున. **324**

తాత్పర్యం: కాబట్టి.

చ. రణమున వారలన్ గెలువరా దను పల్కు లటుండనిమ్ము; స
ద్గుణుఁడవు నీవు వచ్చితి; ప్రకోపశమంబుగఁ బల్కి; తింకసై
రణ దగఁ జేయువారము; పరాభవ మొందియు మున్ను వారి దు
ర్గుణములు సైఁచు టీవు నొకకొంత యెఱుంగుదు వింతయేటికిన్? **325**

ప్రతిపదార్థం: రణమునన్= యుద్ధంలో; వారలన్= ఆ కౌరవులను; గెలువన్+రాదు+అను పల్కులు= గెలవటానికి శక్యం కాదు అనే మాటలు; అటు+ఉండన్+ఇమ్ము= అట్లా ఉండనిమ్ము; సత్+గుణుఁడవు, నీవు= మంచి గుణాలు కలవాడవైన

నీవు; వచ్చితి(వి); ప్రకోపశమంబుగన్+పల్కితి(వి)= అధికమైన కోపం శాంతించేటట్లు పలికావు; ఇంకన్; తగన్= ఒప్పేటట్లు; సైరణన్+చేయువారము= సహనం చూపిస్తాం; మున్ను= పూర్వం; పరాభవము+ఒందియున్= అవమానం పొందికూడా; వారి దుర్గుణములు= వారి అవగుణాలు; సైఁచుట= సహించటం; ఈవున్= నీవుకూడా; ఒక కొంత= ఒకించుక; ఎఱుంగుదు(వు)= ఎరిగి ఉన్నావు; ఇంత+ఏటికిన్= ఇంతెందుకు?

తాత్పర్యం: యుద్ధంలో ఆ కౌరవులను గెలవటం అశక్యం అనే మాటలు అట్లా ఉండనీ. మంచివాడవు నీవు వచ్చావు. అధిక కోపం ఉపశమించేటట్లు మాటాడావు. ఇక మేము సహనం ఒప్పుగా వహిస్తాం. అవమానం పొందీ మునుపు మేము వాళ్ళ అవగుణాలు సహించి ఉండటం నీకూ కొంచెం తెలుసు. ఇంతెందుకు?

ఉ. ఇంకను నట్లు కాఁ దలఁపు; మే మొక కీడునకుం దొడంగ; మా
శంకలు దక్కు; మయ్యకు విచారము గల్గెనయేని, బాంధవం
బంకుర మొత్త, మా వలన నక్కటికం బొలయంగ, మమ్ము నే
వంకకుఁ బోవనీక, గరువంబు జగంబు ప్రశంస సేయఁగన్. 326

ప్రతిపదార్థం: ఇంకనున్= ఇకమీదట కూడా; అట్లు+అ= అట్లాగే; కాన్+తలంపుము= అవునని తలంచే; ఏము= మేము; ఒక కీడునకున్= ఒక అపకారానికి కూడా; తొడంగము= పూనుకొనము; ఆ శంకలు+తక్కుము= ఆ అనుమానాలు విడిచిపెట్టుము; అయ్యకున్= తండ్రి అయిన ధృతరాష్ట్రుడికి; విచారము= వివేకం (సరి అయిన ఆలోచన); కల్గెన్+అ+ఏనిన్= ఉంటే; బాంధవంబు= చుట్టరికం; అంకురము+ఒత్తన్= మళ్ళీ మొలకెత్తగా; మా వలనన్= మామీద; అక్కటికంబు= కనికరం; ఒలయంగన్= కలుగగా; మమ్మున్; ఏ వంకకున్= ఎక్కడికీ; పోవన్+ఈక= వెళ్ళనీయక; గరువంబున్= గొప్పతనాన్ని; జగంబు= లోకం; ప్రశంస+చేయఁగన్= పొగడగా.

తాత్పర్యం: ఇక మీదట కూడా అట్లాగే సహించి ఉంటామని యెంచుము; మేము ఒకఅపకారానికి కూడా పూనుకొనము. ఆ అనుమానాలు విడిచిపెట్టుము. తండ్రిఅయిన ధృతరాష్ట్రుడికి వివేకం కనక ఉన్నట్లయితే, చుట్టరికం మళ్ళీ మొలకెత్తేటట్లు మాపై దయయుంచి మమ్మలను ఎక్కడికీ వెళ్ళనీయక తన గొప్పతనం లోకులు ప్రశంసించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. రండని పిలువఁ బనిచి, పా । లిండని కొడుకులకుఁ జెప్పి, యింద్ర ప్రస్థం
బొండెను, వేఱొక పట్టణ । మొండెను మా కిచ్చి యనుచు టుచితము కాదే?' 327

ప్రతిపదార్థం: రండు+అని; పిలువన్+పనిచి= పిలిపించి; పాలు+ఇండు+అని= భాగం ఇవ్వండి అని; కొడుకులకున్+చెప్పి; ఇంద్రప్రస్థంబు+ఒండెను= ఇంద్రప్రస్థమో; వేఱు+ఒక, పట్టణము+ఒండెను= ఇంకో పట్టణమో; మాకున్, ఇచ్చి; అనుచుట= పంపటం; ఉచితము+అ కాదే?= మంచిది కాదా?

తాత్పర్యం: రండి అని పిలిపించి, వాళ్ళకు భాగం ఇవ్వండి అని తన కొడుకులకు చెప్పి, ఇంద్రప్రస్థమో, లేదా ఇంకో పట్టణమో మా కిచ్చి పంపటం మంచిది కాదా?'

ఉ. నా విని సంజయుండు నరనాథున కిట్లను 'నెట్టి తప్పులుం
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు గావున నిన్నిమాట లి
ట్లీవు వినంగ నాడియును, నేఁ దనివోవక విన్నవించెదన్
నీ విభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే? 328

ప్రతిపదార్థం: నాన్+విని= అని ధర్మరాజు అనగా విని; సంజయుండు; నరనాథునకున్= రాజుకు; ధర్మరాజుతో; ఇట్లు+అనున్; ఎట్టితప్పులున్= ఎటువంటి తప్పులనైనా; పోవఁగన్+త్రోచి= పోనీలే అని త్రోసివైచి; తాలిమి+అ= సహనమే; పూనుదు(వు)+ కావునన్= వహిస్తావు కాబట్టి; ఈవు= నీవు; వినంగన్= వినేటట్లు; ఇట్లు= ఇట్లా; ఇన్ని మాటలు; ఆడియును= పలికీ; నేన్= నేను; తనివి+పోవక= తృప్తిపడక; విన్నవించెదన్= మనవి చేస్తాను; నీ విభవంబు= నీ ఐశ్వర్యం; అహింసయున్= అహింసా; అనింద్య చరిత్రము+అ+కాక= నిందించ దగని నడవడే కాక; అన్యము+ఏ?= ఇంకొకటి కాదు కదా!

తాత్పర్యం: అని ధర్మరాజు అనగా విని సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు- 'నీవు ఎట్లాంటి తప్పులనైనా పోనీలే అని ఉపేక్షించి సహనమే వహిస్తావు కాబట్టి నీవు వినేటట్లు ఈ విధంగా ఇన్నిమాటలు పలికి, నేను తృప్తి పడక ఇంకా మనవి చేస్తాను. నీ ఐశ్వర్యం, అహింసా, అనింద్యమైన నడవడీ తప్ప వేరొకటి కాదు కదా!

విశేషం: అహింసా సచ్చరితలే ఐశ్వర్యంగా గల నీవంటి వాడు రాజ్యభాగం కొరకు అంతగా పట్టించుకొనగూడదని సంజయుడి సూచన.

క. పా లీక కౌరవులు దు । శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ, జెప్పెద, రుధిరా
భీలాన్నంబునకంటెను । మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్. 329

ప్రతిపదార్థం: కౌరవులు, పాలు= భాగం; ఈక= ఇయ్యక; దుశ్శీలతన్= దుష్టస్వభావంతో; చెడన్+తలఁచిరి+ఏనిన్= చెడిపోవాలనుకొన్నా; చెప్పెదన్= చెపుతాను; మీ నడవడికిన్= మీ సత్ప్రవర్తనకు; రుధిర+ఆభీల+అన్నంబునకంటెను= నెత్తుటితో భయంకరమైన కూటికంటె; భిక్షా+అన్నము+ఐనన్= బిచ్చపు కూడైనా; మేలు+అగున్= మంచిది.

తాత్పర్యం: కౌరవులు దుష్టస్వభావులై మీకు రాజ్యభాగం ఇవ్వక చెడిపోవాలనుకొన్నా, చెపుతున్నాను వినుము మీ సత్ప్రవర్తనకు భయంకరమైన నెత్తుటికూటికంటె, బిచ్చపుకూడుతినటం మేలు.

విశేషం: 'రుధిరాభీలాన్నం' యుద్ధం చేయగా లభించే అన్నం. యుద్ధంలో శత్రువీరులను చంపగా లభించే అన్నం కాబట్టి అది 'ఆభీలం'= భయంకరంగా ఉంటుంది. కౌరవులు దుష్టులు. వాళ్ళు చచ్చినా మీకు భాగం ఇవ్వరు. అయినా సరే మీరు ఆ నెత్తుటి కూడుకొరకు ఆశించక, అడుక్కొని అయినా తిని బ్రతకటం నయం - అని ధర్మరాజుకు సంజయుడి సూచన.

వ. అది యెట్లంటేని. 330

తాత్పర్యం: నెత్తుటి కూటికంటె బిచ్చపుకూడు ఎట్లా నయం అంటావేమో.

సీ. రాజసూయ మహాధ్వరం బట్లు నడపి స । ద్విజులకు సురలకుఁ దృప్తిఁ జేసి,
శాంతియు దాంతియు సకలలోకంబులఁ । బొగడొంద బ్రదికిన పుణ్యమూర్తి
విట్టి నీ చరితంబు హింసాకళంకిత । మగు టెంత యొప్పదు? నదియుఁగాక
దుర్ణయవృత్తి దుర్ద్యూతంబు పుట్టించి । యంతలు సేసిన యట్టివారి

తే. నేల గర్వంబు సెల్లంగ నిచ్చి, జగము । చేతఁ దిట్టులు వడునట్లు సేసి పోయి
తేల? యడవుల నిమ్మెయి నిడుమ గుడిచి । తేల? తాల్మియ ధనముగా నింత వడితి. 331

ప్రతిపదార్థం: రాజసూయ మహత్(మహా)+అధ్వరంబు= రాజసూయ మహాయజ్ఞం; అట్లు= అంత గొప్పగా; నడపి= చేసి; సత్+ద్విజులకున్= ఉత్తమ బ్రాహ్మణులకూ; సురలకున్= దేవతలకూ; తృప్తిన్+చేసి= సంతుష్టి కలిగించి; శాంతియున్= అంతరింద్రియ నిగ్రహమూ; దాంతియున్= కర్మేంద్రియ నిగ్రహమూ; సకల లోకంబులన్= అన్ని లోకాలలోనూ; పొగడు+ ఒందన్= ప్రశంస పొందేటట్లే; బ్రదికిన పుణ్యమూర్తివి= బ్రదికిన పుణ్యాత్ముడవు; ఇట్టి నీ చరితంబు= ఇటువంటి నీ నడవడి; హింసా+అకళంకితము+అగుట= హింసచేత కలుషితం కాకపోవటం; ఎంత+ఒప్పదున్?= ఎంత బాగుండదు! ఎంతో బాగుంటుందని భావం; అదియున్+కాక= అదీకాక; దుర్ణయ వృత్తిన్= అవినీతి పద్ధతితో; దుర్ద్యూతంబు= దుష్టమైన జూదం; పుట్టించి= ఏర్పాటు చేసి; అంతలు+చేసిన+అట్టివారిన్= అంతటి ఘోరాలు చేసిన వాళ్ళను; ఏల= ఎందుకు; గర్వంబు+చెల్లంగన్+ ఇచ్చి= గర్వం చెల్లనిచ్చి; ఏల; జగముచేతన్= లోకంచేత; తిట్టులు+పడు+అట్లు+చేసి= తిట్లు పడేటట్లుచేసి; పోయితి(వి), ఏల; అడవులన్; ఇమ్మెయిన్(ఈ+మెయిన్)= ఈ విధంగా; ఇడుమ+కడిచితి(వి)?= కష్టా లనుభవించావు?; తాల్మి+అ= ఓరిమే; ధనము+కాన్= ధనంగా; ఇంత+పడితి(వి)= ఇంతపడ్డావు.

తాత్పర్యం: రాజసూయ మహాయజ్ఞం అంత వైభవోపేతంగా చేసి బ్రాహ్మణోత్తములకూ, దేవతలకూ సంతృప్తి కలిగించి, నీ శాంతీ, నీ కర్మేంద్రియ నిగ్రహమూ లోకాలలో ప్రశంస పొందేటట్లు బ్రదికిన పుణ్యాత్ముడవు. ఇటువంటి నీ నడవడి హింసతో కలుషితం కాకుండా ఉంటే ఎంత బాగుంటుంది! అదీకాక దుర్నీతితో కపటద్యూతం ఏర్పాటు చేసి అంతంత ఘోరాలు చేసిన వాళ్ళ గర్వం ఎందుకు చెల్లనిచ్చావు? లోకులచేత తిట్లు తినేటట్లు ఎందుకు చేశావు? అడవులలో ఈ విధంగా ఎందుకు కష్టపడ్డావు? ఓరిమే ధనంగా ఇన్నిపాట్లు పడ్డావు.

విశేషం: భిక్షాన్నానికి తగిన ప్రవర్తన శమదమాదిగుణాల వలన కలుగుతుంది. అట్టి శాంతిని, దాంతిని ధర్మజుడి ప్రవర్తనలో సంజయుడు నిరూపిస్తున్నాడు. రాజ్యాలను జయించి, రాజసూయం చేసి, అపారసంపదలను దానం చేసి దేవతలను, బ్రాహ్మణులను తృప్తిపరచటంలో శాంతిదాంతులు ప్రదర్శితమయ్యాయి. దుర్ద్యూతంలో వంచించి సంపదలు హరించి గర్వంతో పాండవులను అవమానించిన కౌరవులను ప్రజల నిందలకు వదిలివేసి, అరణ్యాజ్ఞాత వాసాలకు పోవటం కూడా శమదమాదుల వలననే. ఆ రెండు సందర్భాలలో కూడా పాండవులు భౌతిక రాజ్య సంపదల మీద తృష్ణను ప్రకటించలేదు. అది శమ దమ చిత్తవృత్తులు గల విరక్తుల స్వభావం. పాండవ ప్రవర్తన అట్లాగే ఉన్నదని సంజయుడు వ్యాఖ్యానించి వారికి సహనమే యోగ్యమైనదని సోదాహరణంగా వ్యాఖ్యానించాడు. (సంపా.)

క. తుదిఁ బోయి క్రూర కర్మా । స్పదమగు తెఱఁగునకుఁ జొచ్చి, బంధుల గురులన్
వెదకి వధియించు సౌఖ్యం । బది యేటికి, నార్యనింద్య మస్థిర మరయన్. 332

ప్రతిపదార్థం: తుదిన్+పోయి= చివరకు వెళ్ళి; క్రూర కర్మ+ఆస్పదము+అగు తెఱఁగునకున్+చొచ్చి= క్రూరపు పనికి చోటయిన పద్ధతికి పూని-యుద్ధానికి పూనుకొని; బంధులన్= చుట్టాలనూ; గురులన్= పెద్దలనూ; వెదకి; వధియించు+అట్టి సౌఖ్యంబు= చంపగా కలిగే సౌఖ్యం; అది+ఏటికిన్?= అది ఎందుకు?; అరయన్= పరిశీలించగా; ఆర్య నింద్యము= పెద్దలు నిందించేది; అస్థిరము= నిలకడలేనిదీ.

తాత్పర్యం: అట్లాంటి బ్రదుకు బ్రతికి, చివరకు క్రూరకర్మకు ఆస్పదమైన యుద్ధమార్గం అవలంబించి బంధువులను పెద్దలనూ వెదకి చంపటం వలన కలిగే సుఖం ఎందుకు? పరిశీలించగా ఆ సౌఖ్యం పెద్దలు నిరసించేదీ, నిలకడలేనిదీను.

విశేషం: శమంవలన శాంతం ఏర్పడుతుంది. శాంతం వలన అహింసా ప్రవృత్తి కలుగుతుంది. 'అహింసా పరమో ధర్మః' అని వేదోక్తి. ఇంతవరకు అహింసా వ్రతం నడిపి, ఇప్పుడు యుద్ధమనే క్రూరకర్మకు పూనుకొనటం నివృత్తి ధర్మ విరుద్ధం కాబట్టి, ధర్మరాజు శాంతుడై ఉండిపోతే. పెద్దలను చంపి సంపదను సాధించే పాపం లేకుండా పోతుంది. ఒకవేళ అట్లా వచ్చిన సంపదకూడా అనిత్యమని తెలిసి తరువాత నిర్వేదం పొందే అవసరం లేకుండా పోతుంది- అని సంజయుడు ధర్మరాజుకు బోధించాడు. సాత్త్వికుడైన యుధిష్ఠిరుడు దానికి సమ్మతించవచ్చునని భ్రమించాడు.(సంపా.)

తే. అల్పులకు మ్రింగఁ జేఁదైన హాలహలము । భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళు నెన్ని నిన్నెన్నఁబోలు; నట్టి । నీవు సాలినఁ గా కేల నెగడుఁ బేరు?' 333

ప్రతిపదార్థం: అల్పులకున్= తక్కువవారికి; మ్రింగన్= మ్రింగటానికి; చేఁదు+ఐన; హాలహలము భంగిన్= హాలాహలం వలె; పొంగెడు కోపంబున్= పొంగే కోపాన్ని; మ్రింగికొనఁగన్; నీలగళున్= నీలకంఠుడిని-ఈశ్వరుడిని, ఎన్ని= లెక్కించి; నిన్నున్; ఎన్నన్+పోలున్= లెక్కించదగును; అట్టి నీవు= అట్లాంటి నీవు; చాలినన్+కాక= సమర్థించకపోతే; పేరు= కీర్తి; ఏల= ఎట్లా; నెగడున్?= వస్తుంది?

తాత్పర్యం: క్షుద్రులకు మ్రింగటానికి చేదుగా ఉండే హాలాహలం వలె పొంగే కోపాన్ని దిగమ్రింగటంలో నీలకంఠుడి తరువాత నీవే అని చెప్పవచ్చును. అటువంటి నీవు కోపోపశమనానికి పూనుకోకపోతే నీకు పేరెట్లా వస్తుంది?'

విశేషం: అలం: ఉపమ, పరికరాంకురం. రాజ్యభాగం లేకున్నా ధర్మరాజు యుద్ధంవైపు మొగ్గకుండా ఉండటానికి సంజయుడు అతడిని ఆకాశం మీదకు ఎత్తేస్తున్నాడు. వట్టి పొగడ్తలకు ఉబ్బిపోయేవాడు కాడు ధర్మరాజు. హాలహలము భంగిఁ బొంగెడు కోపంబు - అలంకారం ఉపమ. ఈశ్వరుడికి నీలగళ శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

చ. అనవుడుఁ బాండురాజతనయాగ్రణి సంజయుమోముఁ జూచి యి
ట్లను; 'నది యెల్ల నీ పలికినట్టిద; ధర్మువులట్ల యుండి బో
ధను లరయంగ వచ్చిన నధర్మములై చెడుఁ గొన్ని; ధర్మ వ
ర్తనములు గాక తోఁచి తుది ధర్మములై చనుఁ గొన్ని కర్మముల్. 334

ప్రతిపదార్థం: అనవుడున్= అని సంజయుడు అనగానే; పాండురాజ తనయ+అగ్రణి= పాండురాజు యొక్క కొడుకులలో పెద్దవాడు ధర్మరాజు; సంజయు మోమున్= సంజయుడి ముఖం; చూచి; ఇట్లు+అనున్; అది ఎల్లన్= నీవు చెప్పినదంతా; నీ పలికిన+అట్టిది+అ= నీవు చెప్పినట్లే, నీ మాట యథార్థమే; కొన్ని(కర్మములు)= కొన్ని పనులు; ధర్మువులు+అట్లు+అ+ఉండి=

ధర్మాలవలెనే పైకి కనిపించి; బోధనులు= తెలిసినవాళ్ళు; అరయంగన్+వచ్చినన్= పరిశీలించవస్తే; అధర్మములు+ఐ; చెడున్= పోతాయి; కొన్ని కర్మముల్; ధర్మ వర్తనములు+కాక+తోఁచి= ధర్మాలవలె అనిపించక; తుదిన్= చివర; ధర్మములు+ఐ+చనున్= ధర్మాలయి ఒప్పుతాయి.

తాత్పర్యం: అని సంజయుడు అనగానే, ధర్మరాజు సంజయుడి ముఖంవైపు చూచి ఇట్లా అన్నాడు.' అదంతా నీవు చెప్పినట్లే, కొన్ని పనులు పైకి ధర్మాలవలె కనిపించి, తెలిసినవాళ్ళు పరిశీలిస్తే ధర్మాలు కాకుండా పోతాయి. మరికొన్ని పనులు ధర్మాలవలె మొదట అనిపించక చివరకు ధర్మాలయి ఒప్పుతాయి.

విశేషం: 'నేను యుద్ధం చేస్తా ననటం పైకి అధర్మం వలె తోచవచ్చును. కాని, తెలిసిన వాళ్ళెవరైనా రాజ్యభాగం లేకపోతే నేను యుద్ధానికి దిగటం ధర్మమే అని చెపుతారు-' అని ధర్మరాజు అభిప్రాయం. తరువాతి వచనంలో ఈ అభిప్రాయం స్పష్టపడుతుంది.

వ. కావున నన్ను దూఱఁదలంచితేని నా చేయునది ధర్మం బధర్మంబని నిరూపించి మఱి దూఱుము; కోపంబు నివారింపం దగు; నహింసయ యుత్తమధర్మం బగు; నట్లయినను వంశదూషకులును, లోకకంటకులును నగు పాపాత్ముల నిర్మూలంబుగాఁ జెఱుచుట ధర్మంబని పెద్దలచేత విందు; మది యట్లుండె; సంగ్రామంబు రాజులకు ధర్మం బవుంగాదని నీవచెప్పు; మట్లుంగాక యిది కర్తవ్యం బిది యకర్తవ్యం బని మనల శాసింప వాసుదేవుండు గలండు; మన కీ వితర్కం బేటికి? నితండు ధర్మాధర్మవిదులకు గురుండు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుం, డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం; డితని పంపునంగాదె యదు భోజాంధక వృష్ణి సృంజయ కేకయ ప్రభృతి భూపతి ప్రకరంబు ప్రశస్త పథంబునం బ్రవర్తిల్లుచున్నయది; విశేషించి మాకు నితని బుద్ధియ సమస్త పురుషార్థమ్ములకు మూలం బగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయం' బనిన విని జనార్దనుండు సంజయున కిట్లనియె. 335

ప్రతిపదార్థం: కావునన్, నన్నున్; దూఱన్+తలంచితి(వి)+ఏనిన్= నిందించాలనుకొంటే; నా చేయునది= నేను చేసేది; ధర్మంబు+అధర్మంబు+అని నిరూపించి= ధర్మమో అధర్మమో నిరూపించి; మఱి దూఱుము= మరీ నిందించుము; కోపంబు; నివారింపన్+తగున్= విడనాడటం ఉచితం; అహింస+అ= అహింసే; ఉత్తమ ధర్మంబు+అగున్= పరమ ధర్మం అవుతుంది; అట్లు+అయినను= అయినప్పటికీ; వంశ దూషకులును= వంశానికి చెడ్డపేరు తెచ్చేవాళ్ళూ; లోక కంటకులునున్= లోక బాధకులూ; అగు పాప+ఆత్ములన్= అయిన దుర్మార్గులను; నిర్మూలంబు+కాన్+చెఱుచుట= మొదలంటా చెరచటం; ధర్మంబు+అని; పెద్దలచేతన్; విందుము; అది+అట్లు+ఉండెన్; సంగ్రామంబు= యుద్ధం; రాజులకున్; ధర్మంబు; అవును+కాదు+అని, నీవు+అ, చెప్పుము, అట్లున్+కాక= అదీకాక; ఇది; కర్తవ్యంబు= చేయదగినది; ఇది; అకర్తవ్యంబు+అని= చేయదగనిది అని; మనలన్; శాసింపన్= ఆజ్ఞాపించటానికి; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; కలండు; మనకున్, ఈ వితర్కంబు+ ఏటికిన్= ఈ సంశయం ఎందుకు?; ఇతండు; ధర్మ+అధర్మ విదులకున్= ధర్మాధర్మాలు తెలిసినవాళ్ళకు; గురుండు= పెద్ద; కార్య+అకార్య నిరూపకులకున్= చేయదగిన, చేయదగని వాటిని నిర్ణయించేవారికి; శిక్షకుండు= గురువు; ఉచిత+అనుచితజ్ఞులకున్= మంచిఏదో చెడ్డఏదో తెలిసిన వారికి; ప్రదర్శకుండు= విశదీకరించేవాడు; ఇతని పంపునన్+కాదె= ఇతడి ఆజ్ఞచేతకదా; యదు భోజ+అంధక వృష్ణి, సృంజయ, కేకయ, ప్రభృతి, భూపతి, ప్రకరంబు= యదువులూ, భోజులూ, అంధకులూ, వృష్ణులూ, సృంజయులూ, కేకయులూ మొదలుగా గల రాజుల సమూహం; ప్రశస్త పథంబునన్= సన్మార్గంలో; ప్రవర్తిల్లుచున్+ ఉన్నఅది= నడుస్తున్నది; విశేషించి= ముఖ్యంగా; మాకున్= మాకు; ఇతని బుద్ధి+అ= ఇతడి తెలివే; సమస్త పురుషార్థమ్ములకున్= ధర్మార్థ

కామమోక్షాల కన్నింటికీ; మూలంబు+అగుటన్= పునాది అవటంచేత; ఇతని వచనంబు= ఇతడి మాట; అవశ్యంబున్= తప్పక; అలంఘనీయంబు= దాటరానిది; అనినన్; విని; జనార్దనుండు= కృష్ణుడు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి నన్ను నిందించాలనుకొంటే నేను చేసేది ధర్మమో, అధర్మమో నిర్ణయించి మరీ నిందించుము. కోపం విడనాడవలసిందే. అహింసే పరమధర్మం. అయినా వంశానికి చెడ్డపేరు తెచ్చేవాళ్ళూ, లోకానికి బాధకలిగించేవాళ్ళూ అయిన దుష్టులను మొదలంటా చెరచటం ధర్మమని పెద్దలవలన వింటాం. అది అట్లా ఉండనీ. యుద్ధం రాజులకు ధర్మం అవునో కాదో నీవే చెప్పుము. అదీకాక ఇది చేయదగింది, ఇది చేయదగనిది అని మనలను ఆజ్ఞాపించటానికి శ్రీకృష్ణు డున్నాడు, మన కీ సంశయం ఎందుకు? ఇతడు ధర్మాధర్మవేత్తలకు పెద్ద. కార్యాకార్య నిర్ణాయకులకు గురువు. ఉచితానుచితాలు తెలిసినవాళ్ళకు విశదీకరించేవాడు. ఇతడి ఆజ్ఞచేతనేకదా యదు భోజాంధక వృష్ణి సృంజయ కేకయాదులైన రాజుల సమూహం సన్మార్గంలో నడుస్తున్నది. ముఖ్యంగా మాకు ఇతడి తెలివే ధర్మార్థ కామమోక్షాల కన్నింటికీ మూలాధారం అవటంచేత ఇతడి మాట మాకు తప్పక అనతిక్రమణీయం-' అనగా విని శ్రీకృష్ణుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. ధర్మజుడు సంజయుడి వాదనను మెత్తగా కుశలంగా ఖండిస్తున్నాడు. మొదట ధర్మజుడు చేసే యుద్ధ ప్రయత్నం అతడి ప్రవర్తనకు తగినదా కాదా అన్నది ప్రస్తుత సమస్య కాదన్నాడు. అది ధర్మమా? అధర్మమా? అన్నది అసలు సమస్య అన్నాడు. దానిని ముందుగా నిర్ణయించి తనను సహేతుకంగా నిందించుమని హెచ్చరిక చేశాడు. అంటే సంజయుడి వాదానికి సరైన భూమిక లేదనీ, అప్రస్తుతమనీ, అనవసరమనీ తేల్చిచెప్పాడు.

2. సంజయుడు ధర్మాన్నే ప్రాతిపదికగా తీసికొంటే- వంశకంటకులనూ, లోక కంటకులనూ, పాపాత్ములనూ సమూలంగా సంహరించటం ధర్మం- అనే కొలమానంతో ధర్మజుడి యుద్ధం ధర్మమా? అధర్మమా? నిశ్చయించుమన్నాడు. యుద్ధం రాజులకు ధర్మమా? అధర్మమా? నిశ్చయించుమన్నాడు.

3. అయితే ధర్మరాజుకు సంజయుడు చెప్పిన ధర్మం ఉచితమా? క్షత్రియధర్మం ఉచితమా? అని తేల్చిచెప్పదగిన పరమ ధర్మవిదుడూ, ఉత్తమ న్యాయవిదుడూ శ్రీకృష్ణుడని నిర్దేశించాడు. ఇప్పుడు సంజయుడొకపక్షం. ధర్మజుడో పక్షం. న్యాయాధికారి శ్రీకృష్ణుడు. (సంపా)

4. సంజయ ధర్మరాజుల మాటలు వింటూ ఇప్పటివరకూ మౌనంగా ఉన్న శ్రీకృష్ణుడు ధర్మరాజు తన పేరెత్తగానే మాటాడటానికి ఉపక్రమిస్తున్నాడు.

ఉ. **'పాండుతనూజకోటికి శుభం బెడఁ గోరుదు నెప్డు; నాంబికే**
యుండును బుత్త్ర పౌత్త్ర మహిమోజ్జ్వలుఁ; డక్కట చేటు మేలె యం
చుండుదు; నట్లుగాక తెలివొంది యతం డిట వీరిఁ దేర్పఁగా
నిండుమనంబుతోఁ బనిచె ని న్నని దీనికిఁ బ్రీతిఁ బొందితిన్. **336**

ప్రతిపదార్థం: ఎప్డున్= ఎప్పుడూ; పాండు తనూజ కోటికిన్= పాండవుల సమూహానికి; శుభంబు= మేలు; ఎడన్= హృదయంలో; కోరుదున్= ఆకాంక్షిస్తాను; ఆంబికేయుండును= ధృతరాష్ట్రుడు కూడా; పుత్త్ర పౌత్త్ర మహిమ+ఉజ్జ్వలుఁడు= కొడుకుల, మనుమల గొప్పతనంతో ప్రకాశించేవాడు; అక్కట= అయ్యో; చేటు= అశుభం; మేలు+ఎ= మంచిదా; అంచున్+ఉండుదున్=

అంటూ ఉంటాను; అట్లు+కాక= ఎవరికీ అశుభం కాకుండా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; తెలివి+ఒంది= జ్ఞానం కలిగి; వీరిన్= పాండవులను; తేర్పఁగాన్= ఓదార్చటానికి; నిన్నున్; నిండు మనంబుతోన్= నిండు మనస్సుతో; ఇటన్= ఇక్కడికి; పనిచెన్+అని= పంపాడని; దీనికిన్; ప్రీతిన్+పొందితిన్= సంతోషించాను.

తాత్పర్యం: 'నేను ఎప్పుడూ పాండవులకు హృదయంలో మేలు ఆకాంక్షిస్తూ ఉంటాను. ధృతరాష్ట్రుడు కూడా కొడుకుల మనుమల కలిమి అనే గొప్పతనంతో ప్రకాశించేవాడు. పాపం, అతడికి అశుభం మంచిదా అంటూ ఉంటాను. అట్లా ఎవరికీ అశుభం కాకుండా ధృతరాష్ట్రుడు జ్ఞానం తెచ్చుకొని పాండవులను ఓదార్చటానికి నిన్ను నిండుమనస్సుతో ఇక్కడికి పంపాడని దీనికి సంతోషించాను.

ఆ. నీవు నుచితవృత్తి నెయ్యంబు, ధర్మంబు । వినయ మొప్పఁ దెలిపి, వీరు శాంతిఁ
బొందునట్టి భంగి పొసఁగఁ బల్కుటయును । నాకు సమ్మదం బొనర్చె నిపుడు. 337

ప్రతిపదార్థం: నీవున్= నీవు కూడా; ఉచిత వృత్తిన్= సముచితంగా; నెయ్యంబు= స్నేహమూ; ధర్మంబు= ధర్మమూ; వినయము= మర్యాదా; ఒప్పన్= ఒప్పేవిధంగా; తెలిపి= చెప్పి; వీరు= పాండవులు; శాంతిన్+పొందు+అట్టి భంగి= శాంతించే విధం; పొసఁగన్= కలిగేటట్లు; పల్కుటయును= మాటలాడటం కూడా; నాకున్; ఇపుడు; సమ్మదంబు= సంతోషం; ఒనర్చెన్= కలిగించింది.

తాత్పర్యం: నీవుకూడా సముచితంగా స్నేహమూ, ధర్మమూ, మర్యాదా ఒప్పేటట్లు చెప్పి వీరు శాంతించే మార్గం ఏర్పడే విధంగా మాటాడటం కూడా నాకు ఇప్పుడు సంతోషం కలిగించింది.

అ. అనఘ! యిట్టు లంతయును దలఁపం గడు । నెనసినట్టు లుండెనేని వింటె?
పాండవాగ్రజన్ము పలుకుల చందంబు । సూడ సంధి లేని చొప్పు దోఁచె. 338

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇట్టులు= ఈ విధంగా; అంతయును= అంతా; తలఁపన్= ఆలోచించగా; కడున్= మిక్కిలి; ఎనసిన+అట్టులు+ఉండెన్+ఏనిన్= పొందుపడినట్లు ఉన్నప్పటికీ; వింటివి+ఎ?= విన్నావా?; పాండవ+అగ్రజన్ము పలుకుల చందంబు= ధర్మరాజు మాటలతీరు; చూడన్= చూడగా; సంధి లేని చొప్పు= సంధి లేని విధం; తోఁచెన్= స్ఫురించింది.

తాత్పర్యం: పాపరహితుడా, సంజయా! ఈ విధంగా అంతా చూడగా ఎంతో పొందుపడినట్లు ఉన్నప్పటికీ విన్నావు కదా! ధర్మరాజు మాటలతీరు చూస్తే సంధి కుదరని వైనం స్ఫురిస్తున్నది.

క. అది యట్టిద; సంధానము । దుది నెమ్మెయిఁ గల్గు? నెట్లు దుర్యోధనుఁ డు
న్మదుఁడు; ధృతరాష్ట్రభూవిభు । హృదయంబు తెఱంగు గొంత యెఱుఁగుదుము కదా! 339

ప్రతిపదార్థం: అది+అట్టిది+అ= అది అంతే- ధర్మరాజు అభిప్రాయం సరిఅయినదే; సంధానము= సంధి; తుదిన్= చివర జరగవలసినవన్నీ జరిగాక; ఏ+మెయిన్= ఏ రీతిగా; కల్గున్?= సిద్ధిస్తుంది; దుర్యోధనుఁడు; ఎట్లున్= ఎటు చూసినా; ఉన్మదుఁడు= ఉన్మత్తుడు, మహాగర్వి; ధృతరాష్ట్ర భూవిభు, హృదయంబు= ధృతరాష్ట్ర మహారాజు మనోరీతి; కొంత= కొంచెం; ఎఱుఁగుదుము కదా!= మనకు తెలుసుకదా!

తాత్పర్యం: అది అంతే, ధర్మరాజు అభిప్రాయం సరియైనదే. జరుగవలసిన వన్నీ జరిగాక సంధి ఎట్లా పొసగుతుందయ్యా? ఎటు చూసినా దుర్యోధనుడు మహాగర్వి, ధృతరాష్ట్ర మహారాజు హృదయం మనకు కొంచెం తెలుసుకదా!

క. ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁ దీపులుగా
వీరు దమ పాలు వడయక । నేరిమి మాటలన తీర నేర్తురె చెపుమా! 340

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ ధృతరాష్ట్రుడు; చేయు= చూపే; నెయ్యమున్= స్నేహమూ; గారామును= ఆదరమూ; ఈవు= నీవు; కడున్+తీపులు+కాన్= ఎంతో మధురంగా; చెప్పెదు(చెప్పెదవు)= చెపుతావు; వీరు= పాండవులు; తమ పాలు= తమ భాగం; పడయక= పొందకుండా; నేరిమి మాటలన్+అ= చతురవచనాలతోటే; తీరన్+నేర్తురె= సంతృప్తిపడగలరా? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: ఆ రాజు ధృతరాష్ట్రుడు చూపే స్నేహమూ, ఆదరమూ నీవు ఎంతో మధురంగా చెపుతావు. వీరు తమరాజ్యభాగం పొందకుండా వట్టి చతుర వచనాలతోటే తృప్తి పొందుతారా? నీవే చెప్పుము.

ఉ. వీరలు పెద్ద ద్రవ్వ, కొకవెంట నొడంబడి, తేఱి శాంతులై
కౌరవకోటిఁ గూడి మనఁగా మదిఁ గోరుట పెంపుఁ దాల్మియుం,
గారుణికత్వముం దగవుఁ గాదె? జగంబున పాడిఁ దండ్రిపా
లీరని తెంపు సేసి పయినెత్తిన నెత్తిరిగాక ద్రోహమే? 341

ప్రతిపదార్థం: వీరలు= పాండవులు; పెద్ద త్రవ్వక= జరిగినవన్నీ ఎక్కువగా త్రవ్వుకోకుండ; ఒకవెంటన్+ఒడంబడి= ఏదో ఒక పద్ధతికి అంగీకరించి; తేఱి= ఊరట చెంది; శాంతులు+ఐ= ఉపశమించినవారయి; కౌరవ కోటిన్= కౌరవుల సమూహంతో; కూడి= కలిసి; మనఁగాన్= బ్రదకటానికి; మదిన్= మనస్సులో; కోరుట; పెంపున్= గొప్పతనమూ; తాల్మియున్= ఓరిమీ; కారుణికత్వమున్= కనికరమూ; తగవున్= న్యాయమూ; కాదె?= కాదా?; జగంబున పాడిన్= లోకధర్మం ప్రకారం; తండ్రి పాలు= తమ తండ్రి భాగం; ఈరు+అని= ఇవ్వరని; తెంపు+చేసి= తెగించి; పయిన్+ఎత్తినన్+ఎత్తిరి+కాక= మీదపడితే పడతారు (దండెత్తితే దండెత్తుతారు); ద్రోహమే?= అది ద్రోహ మవుతుందా?

తాత్పర్యం: పాండవులు పూర్వం జరిగినవన్నీ పెద్దగా త్రవ్వుకోకుండా ఏదో ఒక పద్ధతికి అంగీకరించి ఊరట చెంది శాంతం వహించి కౌరవులతో కలిసి బ్రదకటానికి అంగీకరించారంటే, అది గొప్పతనమూ, ఓరిమీ, కనికరమూ, ధర్మమూ కాదా? లోకాచారాన్ని బట్టి తమతండ్రి భాగం వారు ఇవ్వటం లేదని తెగించి దండెత్తితే దండెత్తుతారు, అది ద్రోహ మెట్లా అవుతుంది?

క. విను మవమానము పడి యి । ట్లునికిఁ బడయు పొగడు కంటె, నుజ్జ్వలులై మా
ర్కొనిన నది లెస్స; యెట్లయి । నను వీరికిఁ బోటు మేలు నాకుం జూడన్. 342

ప్రతిపదార్థం: వినుము; అవమానముపడి= పరాభవం పొంది; ఇట్లు+ఉనికిన్= ఇట్లా ఉండటం చేత; పడయు పొగడు కంటెన్= పొందే పొగడ్తకన్నా; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించే వారయి; మార్కొనినన్= ఎదుర్కొంటే; అది లెస్స= అది మంచిది; నాకున్+చూడన్= నా దృష్టిలో; ఎట్లు+అయినను= ఎట్లా అయినా; వీరికిన్= పాండవులకు; పోటు= యుద్ధం; మేలు= మంచిది.

తాత్పర్యం: సంజయా! వినుము. పరాభవం పొంది ఇట్లా దీనంగా ఉండటం వలన కలిగే పొగడ్తకన్నా, తేజస్వులై ఎదుర్కొంటే, అది మంచిది. నాకు చూడగా ఎట్లా అయినా వీరికి యుద్ధమే మంచిది.

వ. 'సంగ్రామంబు రాజులకు ధర్మం బవుంగాదని నీవ చెప్పు'మని యుధిష్ఠిరుండు నిన్నడిగెఁగదా! ద్విజాతులకు యజన యాజనాది కర్మ కరణ విభాగంబు ధర్మశాస్త్రాచార్యులు విధించునప్పుడు రాజు లిచ్చువారు గాని, వేఁడుకొనువారు గారని చెప్పుట సకలలోక ప్రసిద్ధంబు; సర్వ వర్ణాశ్రమ ధర్మ పరిపాలనంబు సేయునట్టి రాజులు దార నిజధర్మంబు వదలుదురా? యదియునుంగాక; పాడితోడి యార్జనంబునం దమకుఁ గల కలిమి యనుభవించుచు సత్పథంబున నడచుచుండఁ, ద మ్మొరు లన్యాయంబు సేసినయప్పటికిం గదా యీ శస్త్రాస్త్రధర్మంబు లింద్రాదులగు పెద్దలు గావించిరి; నీ చెప్పెడి ధర్మంబులు కౌరవులకుం జెప్పవలవదా? వారలు గదా మీఁ దెఱుంగక కొఱఁతనుఱుకులై చెడు తెరువునం బోయెడువా' రని పలికి మఱియు నిట్లనియె. 343

ప్రతిపదార్థం: సంగ్రామంబు= యుద్ధం; రాజులకున్; ధర్మంబు; అవును+కాదు+అని; నీవు+అ; చెప్పుము; అని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నిన్నున్+అడిగెన్+కదా!; ధర్మ శాస్త్ర+ఆచార్యులు= ధర్మశాస్త్ర గురువులు; ద్విజాతులకున్= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు; యజన యాజన+ఆది కర్మ కరణ విభాగంబున్= యజ్ఞం చేయటం, చేయించటం మొదలయిన పనుల చేతల విభజనను; విధించు+అప్పుడు= విధించేటప్పుడు; రాజులు; ఇచ్చువారు+కాని; వేఁడుకొనువారు కారు+అని= ఇచ్చేవాళ్ళేకాని పుచ్చుకొనేవాళ్ళు కారని; చెప్పుట; సకల లోక ప్రసిద్ధంబు= ఎల్ల లోకాలలోనూ ప్రసిద్ధమయినది; సర్వ వర్ణ+ఆశ్రమ ధర్మ పరిపాలనంబు= బ్రహ్మ క్షత్రియ వైశ్యులనే ఎల్ల వర్ణాశ్రమ ధర్మాలనూ కాపాడటం; చేయు+అట్టి రాజులు= చేసే క్షత్రియులు; తారు+అ= తామే; నిజ ధర్మంబున్= తమధర్మాన్ని; వదలుదురు+ఆ?= విడిచిపెడతారా?; అదియునున్+కాక; పాడితోడి+ ఆర్జవంబునన్= న్యాయయుక్తమైన సంపాదనతో, తమకున్+కల, కలిమి= తమ కున్న సంపద; అనుభవించుచున్; సత్+ పథంబునన్= సన్మార్గంలో; నడచుచున్+ఉండన్= నడుస్తూ ఉండగా; తమ్మున్; ఒరులు= ఇతరులు; అన్యాయంబు+చేసిన+ అప్పటికిన్+కదా= అన్యాయం చేసినప్పటికి కదా; ఈ శస్త్ర+అస్త్ర ధర్మంబులు= ఈ శస్త్రాల అస్త్రాల ధర్మాలు; ఇంద్ర+ఆదులు+అగు పెద్దలు= ఇంద్రుడూ మొదలైన పెద్దలు; కావించిరి= చేశారు; నీ చెప్పెడి ధర్మంబులు= నీవుచెప్పే ధర్మాలు; కౌరవులకున్; చెప్పన్+వలవదా?= చెప్పవద్దా?; వారలు+కదా; మీఁదు+ఎఱుంగక= రాగలదానిని ఎరుగక; కొఱఁతన్+ ఉఱుకులు+ఐ= ఉరికంబం మీదికి ఉరికే వారయి (అకార్యాలు చేసే వాళ్ళయి); చెడు+తెరువునన్+పోయెడు, వారు= అపమార్గంలో నడిచేవాళ్ళు; అని పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'యుద్ధం క్షత్రియులకు ధర్మం అవునా కాదా నీవే చెప్పుము' అని ధర్మరాజు నిన్ను అడిగాడు కదా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు యజ్ఞం చేయటం, చేయించటం మొదలయిన పనుల విభజన ధర్మశాస్త్ర గురువులు విధించేటప్పుడు రాజులు ఇచ్చేవాళ్ళు గాని పుచ్చుకొనేవాళ్ళు కారని చెప్పటం సర్వజగత్ప్రసిద్ధమైన విషయం కదా! ఎల్ల వర్ణాశ్రమ ధర్మాలనూ కాపాడవలసిన రాజులు తామే తమధర్మాన్ని విడిచిపెడతారా? అదీకాక న్యాయార్జనతో తమకు కల సంపద ననుభవిస్తూ సన్మార్గంలో నడుస్తూంటే, తమ కెవరైనా అపకారం చేసినప్పుడు ఉపయోగపడటానికి కదా ఈ శస్త్రాస్త్రాల ధర్మాలు ఇంద్రుడూ మొదలైన పెద్దలు నిర్ణయించారు? నీవు చెప్పే ధర్మాలు కౌరవులకు చెప్పవద్దా? వాళ్ళు కదా రాబోయేది తెలిసికొనక అకార్యాలు ఆచరిస్తూ అపమార్గంలో నడిచేవాళ్ళు' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నెట్టన సభలో వేవుర । కట్టెదుర నరాతితనము గా కెంతయు వా
రెట్టితులువలో! ద్రౌపది । నట్టులు పఱిచెడిదె! జూదమాడరె యెందున్?' 344

ప్రతిపదార్థం: నెట్టన= బరితెగించి; సభలోన్; వేవుర కడు+ఎదురన్= వేయిమంది ఎట్టఎదుట; ఎంతయున్+అరాతి తనము+కాక= మిక్కిలి శత్రుత్వం(పోకిరితనం) కాకపోతే; వారు; ఎట్టి తులువలో= ఎటువంటి దుర్మార్గులో; ద్రౌపదిన్; అట్టులు= ఆ విధంగా-పైకి చెప్పరాని రీతిగా; పఱిచెడిదె= అవమానించటమా; ఎందున్= ఎక్కడా; జూదము+ఆడరె?= జూదం ఆడరా?- ఇట్లా ఆడతారా? అని భావం.

తాత్పర్యం: 'సభలో వేయిమంది ఎట్టయెదుట తెగించి, మిక్కిలి పోకిరితనం కాకపోతే, వాళ్ళు ఎటువంటి దుర్మార్గులో ద్రౌపదిని ఆ విధంగా అవమానిస్తారా? ఎక్కడా జూదం ఆడరా? ఎవరైనా ఇట్లా చేశారా?'

విశేషం: ఈ పద్యంలో తిక్కన వాక్య విన్యాసం గమనించదగింది '. . . . వేవుర కట్టెదుర ద్రౌపది నట్టుల పఱిచెడిదె' అనే వాక్యం నడుమ'అరాతి తనముగా కెంతయు వారెట్టి తులువలో' అనే వాక్యం చొప్పించబడింది. ఇటువంటి రచన కోపావేశాన్ని సూచిస్తుంది. ద్విత్వప్రాసాక్షరం కోపోద్రేకాన్ని వ్యంజింపజేస్తున్నది.

వ. అనవుడు సంజయుండు 'దేవా! నీ చిత్తంబున నిడి దీని నింత కొనయాడినఁ గర్జం బొడఁగూడునే?' యనిన వాసుదేవుం డిట్లనియె. 345

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; సంజయుండు; దేవా! నీ చిత్తంబునన్= నీ మనస్సులో; ఇడి= పెట్టుకొని; దీనిన్= ఈ విషయాన్ని; ఇంత కొనియాడినన్= ఇంతగా పట్టించుకొంటే; కర్జంబు+ఒడన్+కూడునే= కార్యం సఫలం అవుతుందా?; అనినన్= అని అనగా; వాసుదేవుండు= కృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కృష్ణుడనగానే సంజయుడు 'దేవా! ఈ విషయాన్ని నీ మనస్సులో పెట్టుకొని ఇంతగా పట్టించుకొంటే కార్యం సఫల మవుతుందా?' అని అనగా, కృష్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: పూర్వం కౌరవులు చేసిన దుర్ణయాలన్నీ ఇప్పుడు తడవుతూ శ్రీకృష్ణుడు మాటాడటం వలన సంధికార్యం భగ్నమవుతుందని సంజయుడి భయం. కాని కృష్ణుడు ఆగక అవన్నీ ఏకరువు పెట్టుతున్నాడు. సంధి కాకూడదనే అతడి ఉద్దేశం.

ఉ. 'అత్తఱి భీష్మముఖ్యులగు నచ్చటి వృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి మహీశ్వరుచిత్త మెఱుంగకున్కిఁ; దా
నొత్తి కుమారులం గినియనోపఁడ; యక్కట! మాన్పఁ గన్న; నా
చిత్తమ కాదు; లోకముల చిత్తము లెల్లను సంతసింపవే? 346

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయంలో ద్రౌపదిని అవమానించేటప్పుడు; భీష్మ ముఖ్యులు+అగు= అచ్చటి వృద్ధజనంబులు+ఎల్లన్= భీష్ముడూ మొదలయిన అచటి పెద్దలందరూ; మహీ+ఈశ్వరు చిత్తము+ఎఱుంగక+ఉన్కిన్= రాజుయొక్క(ధృతరాష్ట్రుడి) అభిప్రాయం తెలియకపోవటం చేత; నోరు+ఎత్తక ఊరక+ఉండిరి= నోరు మెదపకుండా ఊరుకొన్నారు; తాను= ధృతరాష్ట్రుడు; కుమారులన్= కొడుకులను; ఒత్తి,కినియన్+ఓపఁడు+అ= గట్టిగా కోపపడలేడు; అక్కట!;=అయ్యో!; మాన్పన్+కన్నన్= ధృతరాష్ట్రుడు వారించగలిగితే; నా చిత్తము+అ కాదు= నామనస్సే కాదు; లోకముల చిత్తములు+ఎల్లనున్= లోకుల మనస్సులన్నీ; సంతసింపవే?= సంతోషించవా?

తాత్పర్యం: 'ద్రౌపదిని కౌరవు లవమానించేటప్పుడు భీష్ముడూ మొదలైన అక్కడి పెద్దలందరూ ధృతరాష్ట్ర మహారాజు అభిప్రాయం తెలియకపోవటం చేత నోరు మెదపకుండా ఊరుకొన్నారు. ఆ ధృతరాష్ట్రుడు కొడుకులను కోపపడలేడు. అయ్యో! అతడే కనక వాళ్ళను వారించగలిగితే, నా మనస్సే కాదు, లోకుల మనస్సులన్నీ సంతోషపడవా?

విశేషం: కౌరవ పాండవ విభేదమూలాన్ని శ్రీకృష్ణ డీపద్యంలో వివేచించాడు. తండ్రి మనసు తెలియక నోరు మెదపలేని పాండవులను, కౌరవులు అవినీతులై అవమానాల పాలు చేస్తుంటే వారిని వారించలేక అధర్మానికి ఆసట బాసటగా నిలిచిన ధృతరాష్ట్రుడే అన్ని పాపాలకు మూలహేతువనీ, బాధ్యుడనీ శ్రీకృష్ణుడు నిర్ణయించి చెప్పాడు. ఆ రాజు కొడుకులను వారించి ఉంటే భగవంతుడైన శ్రీకృష్ణుడూ, అన్ని లోకాలూ హర్షించి ఉండేవి అని చెప్పి, ఇప్పు డా ఇరువురూ ధృతరాష్ట్రుడిని గర్హిస్తున్నారని ధ్వనింపజేశాడు కృష్ణుడు! (సంపా.)

ఉ. **తిట్టులఁబోయి యక్కొలువు తేఁకువ వారలలోని కింతిఁ దా**
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందల వట్టి యీడ్వఁగా
నెట్టు సహించె మామ? సతి యేడ్పు టెలుంగున కెట్టు లోర్చె? నీ
పట్టున సేమ మారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మఱన్? **347**

ప్రతిపదార్థం: దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; తిట్టులన్+పోయి= తిట్లతో పోయి; ఆ+కొలువు తేఁకువ వారలలోనికిన్= ఆ సభలోని మిగుల ధైర్యపరులైన గౌరవార్హులమధ్యకు; ఇంతిన్= స్త్రీని- ద్రౌపదిని; తాను; అట్టులు= ఆ విధంగా; అదయ+ఆకృతిన్= నిర్దాక్షిణ్య రూపంతో; ముందు+తల+పట్టి+ఈడ్వఁగాన్= తలముందటి జుట్టు పట్టుకొని ఈడ్వగా; మామ= ధృతరాష్ట్రుడు; ఎట్టు సహించెన్= ఎట్లా ఓర్చుకొన్నాడు; సతి= పతివ్రతయొక్క; ఏడ్పు+ఎలుంగునకున్= రోదన స్వరానికి; ఎట్టులు+ఓర్చెన్= ఎట్లా సహించాడు; ఈ పట్టునన్= ఈ సమయంలో; క్రమ్మఱన్= మళ్ళీ; సేమము+ఆరయఁగన్= క్షేమం తెలిసికొనటానికి; పంచుటకున్= పంపటానికి; ఎట్టులు నేర్చెన్?= ఎట్లా నేర్చాడు?

తాత్పర్యం: దుశ్శాసనుడు తిట్లతోపోయి ఆ సభలో ఉన్న పెద్దల మధ్యకు ద్రౌపదిని ఆ విధంగా నిర్దాక్షిణ్యంతో ముందటి జుట్టుపట్టుకొని ఈడుస్తుంటే మామ ధృతరాష్ట్రుడు ఎట్లా సహించాడు? పతివ్రత రోదన ధ్వనికి ఎట్లా ఓర్చాడు? మళ్ళీ ఇప్పుడు క్షేమం తెలిసికొనటానికి దూతను పంపడానికి ఎట్లా నేర్చాడు?

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవులను మున్నీట ముంచగలడు, వారిపట్ల మొసలి కన్నీరు కార్చగలడు. అతడి ప్రవృత్తి పయోముఖ విషకుంభం.. (సంపా.)

చ. **ఇది తగదంచు నడ్డపడునింతకు నేరక సభ్యులందఱున్**
మది మఱగొన్న యట్టి యెడ మానినికిం దనుఁ దాన కాచికో
లొదవిన దానఁ జేసి సభ నొచ్చెము దక్కినఁ బాండునందనుల్
బ్రదికిరి గాక; యయ్యెడరు రాచకొమారుల కోర్చునట్టిదే? **348**

ప్రతిపదార్థం: ఇది= ఒకస్త్రీని సభలోనికి జుట్టుపట్టుకొని ఈడ్వటం; తగదు+అంచున్= మంచిది కాదంటూ; అడ్డపడు+ఇంతకున్= అడ్డపడే మాత్రానికి కూడా; నేరక= తెలియక; సభ్యులు+అందఱున్= సభలోని వాళ్ళందరూ; మదిన్ మఱగొన్న+అట్టి+ఎడన్=

మనస్సునందు మరబొమ్మవలె స్తబ్ధతతో దైన్యం పొంది ఉన్న సమయంలో; మానినికిన్= ఆ అభిమానవతికి; తనున్+తాను+అ= తనను తానే; కాచికోలు+ఒదవినదానన్+చేసి= రక్షించుకొన గలగడం చేత; సభన్= సభయందు; ఒచ్చెము+తక్కినన్= అవమానం జరగకపోవటం వలన; పాండు నందనుల్= పాండవులు; బ్రదికిరి+కాక= బ్రదికిపోయారు కాని; ఆ+ఎడరు= ఆ భంగపాటు; రాచ కొమారులకున్= రాచబిడ్డలకు; ఓర్చునట్టిదే?= సహించవలసిందా?

తాత్పర్యం: ఆడదానిని జుట్టుపట్టుకొని సభలోని కీడ్వటం మంచిది కాదని అడ్డుపడే మాత్రానికి చాలక సభలోని వాళ్ళందరూ మనస్సులలో దైన్యం పొంది ఉన్న సమయంలో పాపం ఆ మానవతి తనను తానే కాపాడుకొనగలగటం చేత సభలో అవమానం జరగక పాండవులు బ్రదికిపోయారు కాని, అటువంటి భంగపాటు రాచబిడ్డలు సహించవలసిందేనా?

విశేషం: కౌరవసభలో ద్రౌపదియొక్క గౌరవం రక్షించబడటానికి తాను కారణమైనా శ్రీకృష్ణుడా విషయాన్ని పేర్కొనకపోవటంలో ఆయన ఉదాత్తవ్యక్తిత్వం తేటతెల్లమౌతున్నది.

వ. సంజయా! వినవే యప్పుడు సభాసధులకుఁ గర్ణశూలంబు లగునట్లుగాఁ గర్ణుండు. 349

ప్రతిపదార్థం: సంజయా!; వినవే= నీవు వినలేదా?; అప్పుడు; సభాసదులకున్= సభ్యులకు; కర్ణ శూలంబులు+అగునట్లుగాన్= చెవులకు గ్రుచ్చుకొనేటట్లు; కర్ణుండు.

తాత్పర్యం: సంజయా! నీవు వినలేదా? అప్పుడు కర్ణుడు సభ్యుల చెవులకు గ్రుచ్చుకొనేటట్లు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'లే రిచట మగలు నీకును; । వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ । గూరిమి గల మగని వెదకికొను మొరు' ననఁడే? 350

ప్రతిపదార్థం: ఇచటన్= ఇక్కడ; నీకును; మగలు= భర్తలు; లేరు; వీరలు= నీ భర్తలనబడే ఈ ఐదుగురూ; నిన్నున్; జూదమునన్; ఓడి; విడిచిరి; వారిజలోచన!= ఓ పద్మాక్షీ! ద్రౌపదీ!; నీ పైన్= నీ మీద; కూరిమి+కల మగనిన్+ఒరున్= ప్రేమగల భర్తను ఇంకొకడిని; వెదకికొనుము; అనఁడే= అనడా?.

తాత్పర్యం: 'ఇక్కడ నీకు భర్తలు లేరు. నీ భర్త లని చెప్పబడే ఈ ఐదుగురూ నిన్ను జూదంలో ఓడిపోయి వదిలేశారు. అందుచేత ఓ పద్మాక్షీ! నీ మీద అనురాగం గలిగిన భర్త నింకొకడిని వెతుక్కో' అనలేదా?

క. నరునకు నదివాఙ్మయ మగు । శరమై హృదయంబు నాటి చలియింపక దు
ర్భర వేదనఁ జేయంగాఁ । జిరకాలము, దచ్చికిత్స చేసెనె చెపుమా? 351

ప్రతిపదార్థం: అది= కర్ణుడన్న ఆ మాట; నరునకున్= అర్జునుడికి; వాక్+మయము+అగు శరము+ఐ= వాగ్రూపమైన బాణమయి; హృదయంబు నాటి= మనస్సులో గ్రుచ్చుకొని; చలియింపక= ఊడిరాక; దుర్భర వేదనన్= సహించ శక్యం కాని బాధను; చేయంగాన్= కలిగించగా; చిరకాలమున్= చాలాకాలంగా; తద్+చికిత్స చేసెనె?= దానికి ప్రతిక్రియ చేశాడా?; చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: కర్ణు డాడిన ఆ మాట అర్జునుడికి వాగ్రూపమైన బాణమై హృదయంలో నాటుకొని ఊడిరాక దుస్సహమైన బాధ కలిగించగా చాలాకాలంగా దానికి ప్రతిక్రియ చేశాడా? నీవే చెప్పుము. (ఆ కర్ణుడిపై పగ దీర్చుకొనే ప్రతిక్రియ ఏమైనా ఇంతకాలంగా చేశాడా? అని భావం.)

వ. మఱియు దుశ్శాసనుండు 'వీర లందఱును గొడ్డువోయిన వారలు; పౌరుషంబు గల మానిసి యిం దెవ్వం?' డనియె; నతని చెప్పినట్ల పెద్దగాలంబేని వీరల గొడ్డువోయిరి గాక, వీరిదెస వారికి నేమిఫలించె? వెండియుఁ దత్సమయంబునఁ బుట్టిన మాట లుగ్గడించునట్టివిగా; వీ సంధికార్యం బత్యంత దుర్ఘటంబని తలంచెద; నయినను. 352

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; దుశ్శాసనుండు; వీరలు+అందఱును= వీళ్ళందరూ; గొడ్డు+పోయినవారలు= నిష్ఫలులు, పౌరుషహీనులు; పౌరుషంబు+కల మానిసి= పౌరుషవంతుడైన మనుష్యుడు; ఇందున్= వీరిలో - ఈ పాండవులలో; ఎవ్వండు; అనియెన్; అతని చెప్పిన+అట్లు+అ= అతడు చెప్పిన విధంగానే; పెద్ద+కాలంబు+ఏనిన్= ఎంతోకాలమైనా; వీరలు+అ= వీరే- ఈ పాండవులే; గొడ్డు+పోయిరి+కాక= నిష్ఫలు లయినారే కాని; వీరి దెసన్= వీరివలన; వారికిన్= కౌరవులకు; ఏమి ఫలించెన్?= ఏమి ఫలితం దక్కింది?; వెండియున్= ఇంకా; తద్+సమయంబునన్= ఆసమయంలో; పుట్టిన మాటలు; ఉగ్గడించు+అట్టివి+కావు= పైకి అనవలసినవి కావు; ఈ సంధి కార్యంబు; అత్యంత దుర్ఘటంబు= మిక్కిలి అసాధ్యం; దీనిన్; ఘటియింపన్+చేయుట= కుదర్చటం; అశక్యంబు+ అని= తరం కాదని; తలంచెదన్= అనుకొంటాను; అయినను= అయినప్పటికీ.

తాత్పర్యం: ఇంకా దుశ్శాసనుడు 'వీళ్ళందరూ - ఈ పాండవులంతా, నిష్ఫలులు, పౌరుషహీనులు. వీరిలో పౌరుషవంతుడైన మనుష్యు డెవడు? అన్నాడు. అతడు చెప్పిన రీతిగా ఎంతో కాలంగా వీళ్ళే నిష్ఫలులయినారే కాని వీరివలన వారి కేమి ఫలితం దక్కింది? ఇంకా ఆ సమయంలో పుట్టిన మాటలు పైకి అనవలసినవి కావు. ఈ సంధికార్యం జరగటం మిక్కిలి కష్టం. దీనిని కుదర్చటం అసాధ్యం అని భావిస్తున్నా. అయినా.

విశేషం: 'వీరల గొడ్డువోయిరి గాక, వీరి దెస వారికి నేమి ఫలించె?' కౌరవులు తమకి చేసిన అన్యాయాలకు పాండవులు ప్రతిస్పందించి వారికి ఏదయినా ప్రతీకారం చేసి పగదీర్చుకొని ఉంటే వారు సఫలులయినట్లు. ఇంతవరకూ అటువంటి దేమీ జరుగలేదు కాబట్టి పాండవులు 'గొడ్డువోయినవారే' అని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

సీ. పాండవేయులఁ దగం బ్రార్థించి, యందుల । కక్కట! యేనైన నరుగుదెంచి,
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి రాజ్యంబు । పాలుసేసిన, మృత్యుపాశములకుఁ
దప్పరే వారలు? దగవును నేర్పును । నా మీఁద నిలుచుట నాకుఁ గీడె?
నన్ను మన్నింతు; రన్యాయంబు సొరని నా । మాటకుఁ దా రొడఁబాటు లేక

తే. యుండుదురె? కేరడము లాడుచుండిరేనిఁ । గవియు పాండవ బాణాగ్ని గాదు సువ్వె,
తమ్ముఁ దమ లోభ మను చిచ్చు దరికొనంగఁ । దెగినవారయి పోదు; రింతియ తలంప. 353

ప్రతిపదార్థం: పాండవేయులన్= పాండవులను; తగన్= ఒప్పుగా; ప్రార్థించి= మిక్కిలి బతిమాలి; అక్కట!= అయ్యో!; అందులకున్= అక్కడికి; ఏను+ఐనన్= నేనయినా; అరుగుదెంచి= వచ్చి; కౌరవులకున్; బుద్ధి+కాన్= బుద్ధివచ్చేటట్లు; చెప్పి;

రాజ్యంబు; పాలు+చేసినన్= భాగం చేస్తే; వారలు= కౌరవులు; మృత్యు పాశములకున్= మరణం అనే త్రాళ్ళకు; తప్పరే?= తప్పిపోరా?- వారు చావు తప్పించుకోరా అని భావం; తగవును= న్యాయమూ; నేర్పును; నా మీఁదన్; నిలుచుట= ఉండటం; నాకున్; కీడు+ఎ?= అనుచితమా?; నన్నున్; మన్నింతురు= (కౌరవులు) ఆదరిస్తారు-నేను చెప్పినట్లు వింటారు; అన్యాయంబు+చొరని, నా మాటకున్= అధర్మయుక్తం కాని నా మాటకు; తారు= తాము, వారు-కౌరవులు; ఒడఁబాటు లేక+ ఉండుదురె?= అంగీకరించకుండా ఉంటారా?; కేరడములు+అడుచున్+ఉందురు+ఏనిన్= పరిహాసంతో కూడిన తిరస్కారపు వంకరమాటలు పలుకుతూ ఉంటే; కవియు పాండవ బాణ+అగ్ని+కాదు సువ్వె= క్రమ్ముకొనే పాండవుల బాణాలనే అగ్ని కాదు సుమీ; తమ లోభము+అను చిచ్చు= తమ దురాశ అనే అగ్ని; తమ్మున్= తమను; దరికొనంగన్= దహించగా; తెగినవారు+ అయిపోదురు= నాశనమయిపోతారు; తలంపన్= ఆలోచించగా; ఇంతియ= ఇంతే.

తాత్పర్యం: పాండవులను ఒప్పేటట్లు బతిమాలి, అయ్యో! అక్కడికి నేనయినా వచ్చి, కౌరవులకు బుద్ధికలిగి ఉండండని చెప్పి రాజ్యం భాగం చేస్తే, వాళ్ళు చావు తప్పించుకొనరా?, న్యాయమూ, నేర్పూ నాపై ఉండటం నాకు అనుచితమా? నేను కలగజేసికొని న్యాయమూ నేర్పూ చూపటం నాకు తగదా? వాళ్ళు నా మాట వింటారు. అన్యాయం కాని నా మాటకు వాళ్ళు అంగీకరించకుండా ఉంటారా? అట్లా కాక, వంకరమాట లేమైనా అంటే, క్రమ్ముకొనేది పాండవుల బాణాలనే అగ్ని కాదు సుమీ! తమని తమ దురాశ అనే చిచ్చే దహించివేయగా నాశనమయిపోతారు. ఆలోచించగా జరిగే దింతే'.

విశేషం: అలం: రూపకం. బాణాగ్ని= బాణములనే అగ్ని, తమలోభమను చిచ్చు= తమ లోభమనే చిచ్చు - ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం, కృష్ణుడి మాటలలో సంధియొక్క అసాధ్యత్వం సుస్పష్టమయింది. సంజయుడు యుద్ధాన్ని ఆపడానికి ఎంత తెలివిగా మాటాడినా కృష్ణుడు, జరిగిపోయిన అన్యాయాలన్నీ ఏకరువుపెట్టి ఇది కుదిరేది కాదని సూటిగా కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు.

వ. అని పలికి వెండియు నిట్లనియె. 354

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు:

ఆ. 'రోషమయ మహాతరువు సుయోధనుఁ డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ, డలరుఁ
గొమ్మ సౌబలుండు, గుసుమ ఫలములు దు । శ్శాసనుండు, మూలశక్తి తండ్రి. 355

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; రోషమయ మహాతరువు= క్రోధరూపమైన మహావృక్షం; కర్ణుఁడు; అందులోనన్= ఆ వృక్షంలో; ఉరు స్కంధము= పెద్ద బోదె; సౌబలుండు= శకుని; అలరు+కొమ్మ= పూలకొమ్మ; దుశ్శాసనుండు; కుసుమ ఫలములు= పూలు, పండ్లు; తండ్రి= ధృతరాష్ట్రుడు; మూల శక్తి= వేరుయొక్క బలం.

తాత్పర్యం: దుర్యోధనుడు క్రోధరూప మహావృక్షం. కర్ణుడు దాని పెద్ద బోదె. శకుని పూలకొమ్మ, దుశ్శాసనుడు పుష్ప ఫలములు. తండ్రి అయిన ధృతరాష్ట్రుడు దాని మూలబలం.

విశేషం: అలం: రూపకం. శ్రీకృష్ణుడు దుర్యోధనాది దుష్టచతుష్టయాన్ని రూపించిన తీరు బాగున్నది. ధృతరాష్ట్రుడు ఆ వృక్షమూల మనటం వలన దుర్యోధనుడి దుశ్చేష్టల కన్నింటికి మూల భూతుడైన వాడు అతడే అని శ్రీకృష్ణుడి అభిప్రాయం. చెట్టుబలం అంతా దాని వేరు లోనే ఉంటుంది కదా!

ఆ. ధర్మజుండు ధర్మతరు, వర్జునుఁడు ఘన । స్కంధ, మనిలసుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము; లేను, భూసురులును, వేద । ములుఁ దదీయమైన మూల చయము. 356

ప్రతిపదార్థం: ధర్మజుండు= ధర్మరాజు; ధర్మ తరువు= ధర్మరూపమనే చెట్టు; అర్జునుఁడు; ఘన స్కంధము= పెద్ద బోదె; అనిలసుతుఁడు= వాయుపుత్రుడు - భీముడు; శాఖ= కొమ్మ; కవలు= నకుల సహదేవులు; పుష్ప ఫలములు= పూలుపండ్లు; ఏనున్= నేనూ; భూసురులును= బ్రాహ్మణులూ; వేదములున్= వేదాలూ; తదీయము+ఐన మూల చయము= దానిదైన వేరుల సమూహం.

తాత్పర్యం: ధర్మరాజు ధర్మమనే చెట్టు. అర్జునుడు దాని పెద్ద బోదె. భీముడు దాని కొమ్మ. నకుల సహదేవులు పూలూ, పండ్లూ, నేనూ, బ్రాహ్మణులూ, వేదాలూ దాని వేళ్ళ సమూహం.

విశేషం: అలం: రూపకం. కౌరవులను గురించి చెప్పిన పద్యానికి ఇది దీటుగా ఉన్నది. అదీ ఆటవెలదే. ఇదీ ఆటవెలదే. దుర్యోధనుడి బలమంతా ధృతరాష్ట్రు డయితే, ధర్మరాజు బలం కృష్ణుడూ, బ్రాహ్మణులూ, వేదాలూను. ధర్మరాజు ప్రవర్తన కృష్ణప్రియంగానూ, బ్రాహ్మణసమ్మతంగానూ, వేదోక్తంగానూ ఉంటుందని భావం.

క. ఈ రెంటియందు నరసి య । సారం బిది, గాఢసార సహితం బిది నా
నేరవలయు; నదియును గా । కేరూపం బయ్యెనేని నీ సేమిటికిన్? 357

ప్రతిపదార్థం: ఈ రెంటియందున్= ఈ రెండింటిలోనూ; అరసి= పరిశీలించి; ఇది; అసారంబు= నిస్సారమయినదీ; ఇది; గాఢ సార సహితంబు= మిక్కిలి సారంతో కూడినదీ; నాన్+నేరవలయున్= అనేది తెలిసికొనాలి; అదియును+కాక; ఏ రూపంబు+అయ్యెన్+ఏనిన్= ఏ విధమయితేనేం; ఈసు= ఈర్ష్య, పగ; ఏమిటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: ఈ రెండింటిలోనూ పరిశీలించి ఇది నిస్సారమైనదీ, ఇది మంచి సారవంతమైనదీ అనేది తెలిసికొనాలి. అయినా ఏ విధమయితేనేం, ఈర్ష్య ఎందుకు?

విశేషం: పై పద్యాల క్రమాన్ని అనుసరించి రోషమయ మహాతరువు నిస్సారమైనదనీ, ధర్మతరువు సారవంతమైనదనీ గ్రహించాలి.

మ. ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; కుంతీనందనుల్ సింహముల్;
మతి నూహింప నసింహమైన వనమున్ మర్దింతు; రెందున్ వనా
వృత వృత్తంబులు గాని సింహములకున్ వేగంబ చేటొందుఁ; గా
న తగం బొందుట కార్య మీ యుభయమున్ సంతుష్టిమై నుక్కికిన్. 358

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును; పుత్త్రులున్= కొడుకులూ; వనము= అడవి; కుంతీ నందనుల్= కుంతి కొడుకులు పాండవులు; సింహముల్; మతిన్+ఊహింపన్= మనస్సులో ఆలోచించగా; అసింహము+ఐన వనమున్= సింహాలు లేని అడవిని; మర్దింతురు= కొట్టివేస్తారు; ఎందున్= ఎక్కడైనా; వన+ఆవృత వృత్తంబులు+కాని సింహములకున్= అడవిచేత ఆవరించబడని సింహాలకు; వేగంబు+అ= శీఘ్రమే; చేటు+ఒందున్= హాని కలుగుతుంది; కాన= కావున; ఈ ఉభయమున్=

ఈరెండూ - వనమూ, సింహాలూ; సంతుష్టిమైన్= సంతోషంతో సుఖంగా; ఉన్కికిన్= ఉండటానికి; తగన్= ఒప్పుగా; పొందుట= కూడిఉండటం; కార్యము= చేయదగింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులూ వనం. పాండవులు సింహాలు. ఆలోచించగా సింహాలు లేని అడవిని కొట్టివేస్తారు. ఎక్కడైనా అడవిలో లేని సింహాలకు వెంటనే హాని కలుగుతుంది. కాబట్టి ఈ రెండూ- వనమూ, సింహాలూ సుఖంగా ఉండాలంటే ఒప్పుగా కలిసి ఉండటం మంచిది.

విశేషం: అలం: రూపకం. ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; కుంతీనందనుల్ సింహముల్ రూపకాలంకారాలు. కాన= కానన్ ఇది ద్రుతప్రకృతికమైనా, ఇక్కడ మాత్రం కళగా ప్రయోగించబడింది. ద్రుతప్రకృతికమయితే కానఁ దగం బొందుట అని ఉండాలి. అప్పుడు ప్రాసమైత్రి దెబ్బతింటుంది. కౌరవులూ, పాండవులూ ఇద్దరూ సుఖంగా ఉండాలంటే- వాళ్ళిద్దరూ కలిసి ఉండటం మంచిదని భావం.

క. పరిచారకులై యుండుదు, । రరివర్గ వ్యతికరమున కగుదురు; వీరిన్
సరిఁ దన కొడుకుల మెలపిన । తెరువున మెలఁగింపవలదె ధృతరాష్ట్రునకున్. 359

ప్రతిపదార్థం: (పాండవులు); పరిచారకులు+ఐ= సేవకులయి; ఉండుదురు= ఉంటారు; అరి వర్గ వ్యతికరమునకున్= శత్రు సమూహం వలని కష్టదశకు; అగుదురు= అవుతారు; ధృతరాష్ట్రునకున్; వీరిన్= ఈ పాండవులను; సరిన్= సమానంగా; తన కొడుకుల మెలపిన తెరువునన్= తన కుమారులను నడిపించిన మార్గంలో; మెలఁగింపన్‌వలదె?= నడిపించవద్దా?

తాత్పర్యం: పాండవులు కౌరవులకు పరిచర్య చేస్తూ ఉంటారు. శత్రువుల వలన ఏదయినా కష్టదశ ప్రాప్తించినప్పుడు వారిని ఆదుకొంటారు. అందుచేత ధృతరాష్ట్రుడు వీళ్ళను సరిగా తన కొడుకులను నడిపించే మార్గంలోనే నడిపించవద్దా? వీళ్ళను తన కొడుకుల వలెనే చూడవద్దా? అని భావం.

విశేషం: అరివర్గ వ్యతికరమున కగుదురు-ఘోషయాత్రా సంఘటనను దృష్టిలో పెట్టుకొని శ్రీకృష్ణు డా రీతిగా అన్నాడు.

క. ఏ నీ పనికై వచ్చెదఁ; । దా నొప్పఁ దలంచె నొండెఁ దప్పం దలఁచెన్;
దానన నెగడెద మేః మ । మ్మానవ నాథునకుఁ జెప్పు మా మతమెల్లన్. 360

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ పనికై= కౌరవపాండవులను కలిపే పనికొరకు; వచ్చెదన్; తాను= అతడు- ధృతరాష్ట్రుడు; ఒప్పన్+తలంచెన్= అంగీకరిస్తాడో; ఒండెన్= లేదా; తప్పన్+తలఁచెన్= అంగీకరించడో; ఏము= మేము; దానన్+అ= దానినిబట్టే; నెగడెదము= ప్రవర్తిస్తాం; ఆ+మానవ నాథునకున్= ఆ రాజుకు- ధృతరాష్ట్రుడికి; మా మతము+ఎల్లన్= మా అభిప్రాయమంతా; చెప్పు(ము).

తాత్పర్యం: నేను ఈ కౌరవ పాండవ సంధి కార్యానికై వస్తాను. ధృతరాష్ట్రుడు ఒప్పుకొంటాడో ఒప్పుకోడో? మేము దానినిబట్టే ప్రవర్తిస్తాం. ఆ రాజుకు మా అభిప్రాయమంతా చెప్పుము'.

వ. అనిన విని సంజయుండు ధర్మతనయుం గనుంగొని 'యట్లయినను గడు లెస్సగదా! దేవా! నా వచ్చిన కార్యంబు సఫలం బయ్యెఁ; బనివినియెద' నని, వాసుదేవునకు నట్ల విన్నవించి, భీమార్జున నకుల సహదేవ

సాత్యకి ద్రుపద విరాటుల నీక్షించి, 'మీ యందఱచేత ననుజ్ఞాతుండన కదా? పోయి వచ్చెద. నా యాడిన మాటలయం దేమియుఁ దగని యట్టివి లేవు గదా?' యనుటయుఁ బాండవాగ్రజుం డతని కిట్లనియె. **361**

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; ధర్మతనయున్= ధర్మరాజును; కనుంగొని= చూచి; అట్లు+అయినను= అట్లా అయితే; కడున్= మిక్కిలి; లెస్స+కదా!= మంచిది కదా!; దేవా!; నా వచ్చిన కార్యంబు= నేను వచ్చిన పని; సఫలంబు+అయ్యెన్= నెరవేరింది; పనివినియెదన్= వెళ్ళివస్తాను; అని; వాసుదేవునకున్= కృష్ణుడికి; అట్లు+అ= అట్లాగే; విన్నవించి= మనవి చేసి; భీమ+అర్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటులన్+ఈక్షించి= భీముడినీ, అర్జునుడినీ, నకుల సహదేవులనూ, సాత్యకి, ద్రుపద, విరాటులనూ చూచి; మీ+అందఱచేతన్= మీ అందరిచేత; అనుజ్ఞాతుండన్+అ కదా?= అనుమతించబడినట్లే కదా?; పోయి వచ్చెదన్= వెళ్ళివస్తాను; నా+ఆడిన మాటలఅందున్= నే నన్న మాటలలో; ఏమియున్= ఏవీ; తగని+అట్టివి= అనుచిత మయినట్టివి; లేవు+కదా; అనుటయున్; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు- ధర్మరాజు; అతనికిన్= ఆ సంజయుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ధర్మరాజును చూచి 'అట్లా అయితే మరీ మంచిది కదా! నేను వచ్చినపని నెరవేరినట్లే. మీ అనుమతితో సెలవు పుచ్చుకొంటాను' అని చెప్పి, కృష్ణుడితో కూడా అట్లాగే మనవి చేసి, భీమార్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటులను చూసి మీ అనుమతితో 'నేనన్నమాటలలో ఏవీ అనుచితమైనవి లేవు కదా?' అనగా ధర్మరాజు సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'నా వచ్చిన కార్యంబు సఫలం బయ్యె' - అది నిజం కాకపోయినా సంజయుడు ఇట్లా ఎందుకంటున్నాడు? తాను వచ్చింది సంధి చేయటానికి. అందుకొరకు కురుసభకు శ్రీకృష్ణుడంతటివాడు రాబోవటమే తన కార్యం సఫలమయినట్లు స్పష్టం చేస్తున్నది. శ్రీకృష్ణుడు సంధి చేయటానికి వస్తున్నాడంటే అది తప్పక జరుగుతుంది.

ఆ. 'పోయి వత్తుగాక, యీ యున్న యందఱు । వినఁగ నాడి తీవు విశదభంగి;
నొక్కమాట యైన నుచితంబు గానిది । గలదె? యి ట్లనంగ వలయు నెట్లు? **362**

ప్రతిపదార్థం: పోయివత్తు(వు)+కాక= వెళ్ళిరమ్ము; ఈ+ఉన్న+అందఱున్= ఇక్కడ ఉన్న వీళ్ళందరూ; వినఁగన్= వింటూండగా; ఈవు= నీవు; విశద భంగిన్= స్పష్టమైన విధంగా; ఆడితి(వి)= మాటాడావు; ఒక్క మాట+ఐనన్; ఉచితంబు+కానిది= తగనిది; కలదె?; ఇట్లు+అనంగన్వలయున్+ఎట్లు?= ఇట్లా మాట్లాడాలి.

తాత్పర్యం: 'వెళ్ళిరమ్ము. ఇక్కడ ఉన్న అందరూ వినేటట్లు నీవు స్పష్టంగా మాటాడావు. నీ మాటలలో ఒక్కటికూడా అనుచితమైనది లేదు. మాట అంటే ఇట్లా ఉండాలి!'

క. ఎదురున్న రూపు వలుకఁగఁ । దుదిఁ కటకటఁ బడవు నీవు; దుర్ణయమును బె
ట్టిదమును బెండును నగు పలు । కొదవదు నీనాలుకకు నయోన్నత! యెపుడున్. **363**

ప్రతిపదార్థం: ఎదురు= ముందు; ఉన్నరూపు= ఉన్న విధం; పలుకఁగన్= మాటాడటానికి; నీవు; తుదిన్= చివరకు; కటకటన్+ పడవు= బాధపడవు; నయ+ఉన్నత!= నీతియందు గొప్పవాడా!; నీ నాలుకకున్; ఎపుడున్= ఎప్పుడూ; దుర్ణయమును= నీతి మాలినదీ; బెట్టిదమును= పరుషమయినదీ; బెండును= నిస్సారమైనదీ; అగు పలుకు= అయినమాట; ఒదవదు= కలుగదు.

తాత్పర్యం: ముందుగా ఎదుటివారు ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే నీవు చివరకు బాధపడవు. నీతికోవిదుడా! నీ నాలుకకు ఎప్పుడూ నీతి మాలినదీ, పరుషమైనదీ, నిస్సారమయినదీ అయిన మాట పుట్టదు.

క. నీ వొండె, విదురుఁ డొండెను । గా వలయుంగాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె తగువా । రీ వినయము నేర్పు గలదె యితరుల కెందున్? 364

ప్రతిపదార్థం: ఇట్టి కార్యంబులకున్= ఇటువంటి పనులకు; నీవు+ఒండెన్, విదురుఁడు+ఒండెను= నీవో, విదురుడో; కావలయున్+కాక= కావాలి కాని; రాన్= రావటానికి; తగువారు= అర్హులు; వేఱు+అ కలరె?= వేరే ఉన్నారా?; ఎందున్= ఎక్కడైనా; ఇతరులకున్; ఈ వినయము నేర్పు కలదె?= ఈ వినయనైపుణ్యం (ఔచిత్యపు నేర్పు) ఉంటుందా?

తాత్పర్యం: ఇటువంటి పనులకు నీవో విదురుడో పూనుకొనాలి కాని, రావటానికి అర్హు లింకెవ రయినా ఉన్నారా? ఎక్కడైనా ఇతరులకు ఈ వినయనైపుణ్యం (ఔచిత్యపు నేర్పు) ఉంటుందా?

చ. అరిగినయప్డు పెద్ద లగు నందలి విప్రుల నెల్లఁ గాంచి, యా
దరమున వారి సేమ ముచితంబుగ నారసి, వెండి కాన్పుమీ
గురునిఁ బితామహుం గృపునిఁ; గూర్తురు వారలు నాకు; నా నమ
స్కరణము గాఁగ వారి కధికప్రియభక్తి నమస్కరింపుమీ! 365

ప్రతిపదార్థం: అరిగిన+అప్డు= నీవు వెళ్ళినపుడు; పెద్దలు+అగు+అందలి విప్రులన్+ఎల్లన్= అక్కడి పెద్దలైన బ్రాహ్మణుల నందరినీ; కాంచి= చూచి; ఆదరమునన్= గౌరవంతో; వారి సేమము= వాళ్ళ క్షేమం; ఉచితంబుగన్= తగినట్లుగా; అరసి= తెలిసికొని; వెండి= తరువాత; గురునిన్= ద్రోణుడినీ; పితామహున్= తాత భీష్ముడినీ, కృపునిన్; కాన్పుమీ= దర్శించుము; వారలు; నాకున్+కూర్తురు= నేనంటే ఇష్టపడతారు; వారికిన్; నా నమస్కరణము+కాఁగన్= నా నమస్కారంగా; అధిక ప్రియ భక్తిన్= మిక్కిలి ప్రీతితోడి భక్తితో; నమస్కరింపుమీ= నమస్కరించుము.

తాత్పర్యం: నీవు వెళ్ళినపుడు అక్కడ ఉన్న పెద్దలైన బ్రాహ్మణుల నందరినీ చూచి ఆదరంతో వాళ్ళ క్షేమం ఒప్పుగా తెలిసికొని, తరువాత ద్రోణ భీష్మ కృపులను దర్శించుము. వాళ్ళకు నేనంటే ఎంతో ఇష్టం. వారికి మిక్కిలి ప్రీతితో భక్తితో నేను నమస్కరించినట్లు నమస్కరించుము.

సీ. మా తండ్రిఁ గని యేను బ్రీతి మ్రొక్కుట గాఁగ । దండప్రణామంబు దగ నొనర్పు;
దుర్వృత్తిఁ బొరయు నా దుర్యోధనుని సేమ । మడిగితి నని చెప్పు; మతని తమ్ముఁ
డగుటకుఁ దగియెడు నా దుస్ససేనుని । కుశల మారయుము; దక్కును గుమార
వర్గంబు నెల్లను, వనితాజనంబుల । నుచితంపుమై సుఖ మున్కి యడుగు;

ఆ. విదురు, శల్యుఁ గాంచి వినయంబు దోఁపంగ । నాడు; ద్రోణతనయు నక్కు సేర్చి
కొంటి నను ము; బాహ్లికుని సోమదత్తు, భూ । రిశ్రవసునిఁ దలఁచి ప్రియము నెఱపు. 366

ప్రతిపదార్థం: మా తండ్రిన్= మా తండ్రి అయిన ధృతరాష్ట్రుడిని; కని= చూచి; ఏను= నేను; ప్రీతిన్= సంతోషంతో; మ్రొక్కుట+కాఁగన్= నమస్కరించినట్లు; దండ ప్రణామంబు= సాష్టాంగ నమస్కారం; తగన్= ఒప్పుగా; ఒనర్పు(ము)=

చేయుము; దుర్వృత్తిన్+పొరయు= చెడు నడవడి కలుగు; ఆ దుర్యోధనుని సేమము= ఆ దుర్యోధనుడి క్షేమం; అడిగితిన్+అని చెప్పుము; అతడి తమ్ముఁడు; అగుటకున్+తగియెడు+ఆ దుస్సేనుని కుశలము= అతని తమ్ముడు అనటానికి అర్హుడైన ఆ దుశ్శాసనుడి క్షేమం; ఆరయుము= తెలిసికొనుము; తక్కును+కుమార వర్గంబున్+ఎల్లను= తక్కిన కుమారుల సమూహాన్ని అంతనూ; వనితాజనంబులన్= స్త్రీలనూ; ఉచితము+మై= తగిన విధంగా; సుఖము+ఉన్కి= సుఖంగా ఉన్న సంగతి; అడుగు(ము); విదురున్; శల్యున్, కాంచి= చూచి; వినయంబు+తోఁపంగన్= అణకువ కనబడేటట్లు; ఆడు(ము)= మాటాడుము; ద్రోణ తనయున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామను; అక్కు+చేర్చికొంటిన్+అనుము= కౌగిలించుకొన్నానని చెప్పుము; బాహ్లికునిన్; సోమదత్తున్; భూరిశ్రవసునిన్; తలఁచి; ప్రియము= ఇష్టం; నెఱపు= చేయుము.

తాత్పర్యం: మా తండ్రిఅయిన ధృతరాష్ట్రుడిని చూచి నేను సంతోషంతో నమస్కరించినట్లు సాష్టాంగ నమస్కారం చేయుము. చెడు నడవడి కలిగి ఉండే ఆ దుర్యోధనుడి క్షేమం అడిగానని చెప్పుము. అతడికి తమ్ముడు అనిపించుకొనటానికి తగిన ఆ దుశ్శాసనుడి క్షేమం తెలిసికొనుము. తక్కిన కుమారులనూ, అందరినీ, స్త్రీలనూ, తగిన విధంగా సుఖంగా ఉన్న సంగతి తెలిసికొమ్ము. విదురుడినీ, శల్యుడినీ చూచి వినయంతో మాటాడుము; అశ్వత్థామను ఆలింగనం చేసికొన్నానని చెప్పుము. బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులను తలచి సంతోషం ప్రకటించుము.

వ. మఱియు వంశవంతులు, వయోవృద్ధులు నగు భూపతులను, గృతవర్మను, గర్ణ శకుని సైంధవ ప్రభృతులను; దక్కటిరాజలోకంబును; గయ్యంబునకుఁ దోడు వచ్చిన సకల దేశాధీశులనుం గని, యెవ్వరితోడ నెవ్విధంబునం బలుకందగు ప్రణామ వినయ బాంధవ మైత్రీ వాత్సల్యంబులకు నయ్యై ప్రకారంబుల మద్వచనంబులుగాఁ బలికి; యుచితంబుమెయి నుపచరింపుము. 367

ప్రతిపదార్థం: మఱియున్; వంశవంతులున్= కులీనులూ; వయస్(ః)+వృద్ధులున్= వయస్సుచేత పెద్దవారూ; అగు; భూపతులను= రాజులనూ; కృతవర్మను; కర్ణ శకుని సైంధవ ప్రభృతులను= కర్ణుడూ, శకునీ, సైంధవుడూ మొదలైన వారినీ; కయ్యంబునకున్= యుద్ధానికి; తోడు వచ్చిన= సహాయంగా వచ్చిన; సకల దేశ+అధీశులనున్= ఎల్ల దేశాల రాజులనూ; కని; ఎవ్వరి తోడన్; ఏ+విధంబునన్= ఏ రీతిగా; పలుకన్+తగు= పలుకరించదగిన; ప్రణామ వినయ బాంధవ మైత్రీ వాత్సల్యంబులకున్= నమస్కారం, వినయం, చుట్టరికం, స్నేహం, వాత్సల్యం అనేవాటికి; ఆ+ఆ+ప్రకారంబులన్= ఆయా విధాలుగా; మత్+వచనంబులుగాన్= నా మాటలుగా; పలికి; ఉచితంబు మెయిన్= తగిన విధంగా; ఉపచరింపుము= సమ్మానించుము.

తాత్పర్యం: ఇంకా, కులీనులూ, వయస్సుచేత పెద్దవారూ అయిన రాజులనూ, కృతవర్మనూ, కర్ణుడూ, శకునీ, సైంధవుడూ మొదలయిన వాళ్ళనూ, తక్కిన రాజసమూహాన్నీ, యుద్ధంలో తోడు పడడానికి వచ్చిన ఎల్లదేశాల ప్రభువులనూ చూచి ఎవరితో ఏ విధంగా నమస్కారం, వినయం, బంధుత్వం, స్నేహం, వాత్సల్యం అనే వాటితో పలకాలో ఆయా విధాలుగా నా మాటలుగా పలికి సముచితంగా ప్రవర్తించుము.

క. దాసీ దాస జనముల కు । దాసీనము గాక యుండఁ, దడయక యే మి
త్రాసంగ మొంది, శత్రు ని । రాసం బొనరించి; తమ్ము నరసెద ననుమీ. 368

ప్రతిపదార్థం: దాసీ దాస జనములకున్= దాసీ జనానికీ, దాస జనానికీ; ఉదాసీనము+కాక+ఉండన్= మనకెందుకని ఊరుకొనకుండా; తడయక= ఆలస్యం చేయకుండా; ఏన్= నేను; మిత్ర+ఆసంగము+ఒంది= మిత్రుల తోడ్పాటు పొంది; శత్రు నిరాసంబు+ ఒనరించి= శత్రు నిరసనం చేసి; తమ్మున్= తమను; అరసెదన్+ అనుమీ!= రక్షిస్తానని చెప్పుము.

తాత్పర్యం: దాసీజనులనూ, దాసజనులనూ చూచి, మన కెందుకులే అని ఊరుకొనకుండా నేను, వెంటనే మిత్రులను కూర్చుకొని, శత్రువులను నిరసించి తమను కాపాడుతానని చెప్పుము.

క. పోయిన మొగమున నచ్చటఁ । జేయు తెఱంగెల్ల నీకుఁ జెప్పితిఁ; బిదపన్
మా యయ్య పెద్ద కొలువున । వా యొడక యిట్టనంగ వలయుం జుమ్మీ! 369

ప్రతిపదార్థం: పోయిన మొగమునన్= వెళ్ళీ వెళ్ళగానే; అచ్చటన్; చేయు తెఱంగు+ఎల్లన్= చేసే విధమంతా; నీకున్; చెప్పితిన్; పిదపన్= పిమ్మట; మా+అయ్య పెద్ద కొలువునన్= మా తండ్రిదైన నిండు సభలో; వాయి+ఒడక= పలుకటానికి వెనుకాడక; ఇట్టు+అనంగవలయున్+చుమ్మీ!= ఇట్లా పలకాలి సుమీ!

తాత్పర్యం: వెళ్ళీ వెళ్ళగానే అక్కడ నీవు చేయవలసిన దంతా నీకు చెప్పాను. తరువాత మా తండ్రి నిండోలగంలో మోమోటపడకుండా ఇట్లా అనాలి సుమీ!

చ. అనఘ! భవద్బలంబునన యాపద యించుక లేక పాండునం
దనులు నిజాప్తబంధుసహితంబు సుఖస్థితి నున్నవారు; త
జ్జనకుని రాజ్యపీఠమున సమ్మద మొందఁగ నిల్పి శైశవం
బునన ప్రభుత్వ మిచ్చి తగఁ బ్రోచితి వారల విశ్రుతంబుగన్. 370

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; భవత్+బలంబునన్+అ= నీ బలం వలననే; పాండునందనులు= పాండవులు; ఆపద+ఇంచుక లేక= కొంచెం కూడా కష్టం లేకుండా; నిజ+ఆప్త బంధు సహితంబు= తమమిత్రులతోనూ, బంధువులతోనూ; సుఖ స్థితిన్+ఉన్న వారు= సుఖంగా ఉన్నారు; వారలన్= వారిని; శైశవంబునన్+అ= బాల్యంలోనే; తద్+జనకుని రాజ్య పీఠమునన్= వారి తండ్రి రాజ్యసింహాసనం మీద; సమ్మదము+ఒందఁగన్= సంతోషపడేటట్లు; నిల్పి; ప్రభుత్వము+ఇచ్చి= రాచరికం ఇచ్చి; తగన్= తగిన విధంగా; విశ్రుతంబుగన్= ప్రసిద్ధంగా; ప్రోచితి(వి)= రక్షించావు.

తాత్పర్యం: పాపరహితుడా! నీ బలం వలననే పాండవులు కొంచెమైనా కష్టమనేది లేకుండా, తమ మిత్రులతోనూ, బంధువులతోనూ సుఖంగా ఉన్నారు. వారిని బాల్యంలోనే వారి తండ్రి రాజ్య సింహాసనం మీద సంతోషపడేటట్లు కూర్చుండబెట్టి రాచరిక మిచ్చి తగిన విధంగా ప్రసిద్ధంగా కాపాడావు.

విశేషం: 'భవద్బలంబునన సుఖస్థితి నున్నవారు' ధర్మరాజు ఇట్లా నిజంగా అనమంటున్నాడా? దెప్పి పొడుపా? నిజానికి పాండవులు సుఖంగా లేరు. ఎన్నో కష్టాలు పడ్డారు. వాటి కన్నింటికీ ధృతరాష్ట్రుడే మూల కారణం. మరి ఇట్లా అనడం ఏమనుకొనాలి? 'అనఘ' అనే సంబోధనం కూడా అనుమానించదగ్గదే!

ఉ. ఇప్పు డుపేక్ష సేసి, కృప యేమియు లేక, విహీనవృత్తి వా
రొప్పమిఁ బొందఁ జూచు టిది యొప్పునె? యింతట సంతసింప రా
దిప్పుడు; నంతకంత నట యెక్కుడు గోరినఁ జాలకుండదే?
యొప్పదె కూడి మన్కి మన కొప్పనివారల యుక్కు దక్కఁగన్?' 371

ప్రతిపదార్థం: ఇప్పుడు; ఉపేక్ష+చేసి= ఒప్పరికించి, అశ్రద్ధ వహించి; కృప+ఏమియున్ లేక= దయ ఏమాత్రమూ లేకుండా; వారు; విహీన వృత్తిన్= అధమస్థితితో; ఒప్పమిన్= ఆపదను; పొందన్+చూచుట= పొందేటట్లు చూడటం; ఇది; ఒప్పునె?= తగునా?; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; ఇంతటన్ సంతసింపరాదు= ఇంతటితో సంతోషించకూడదు; అంతకున్+అంతన్+అట+ ఎక్కుడు+కోరినన్= అంతకంటె అధికంగా కోరినప్పటికీ; చాలక+ఉండదే?= సరిపోకుండా ఉండదా?-ఎంత ఎక్కువ కోరినా చాలదని భావం; ఒప్పని వారల+ఉక్కు+తక్కఁగన్= పగవారి పొగరు అడగేటట్లు; మనకున్; కూడి మన్కి= కలిసి బ్రతకటం; ఒప్పదె?= తగదా?

తాత్పర్యం: బాల్యంలో అట్లా ఆదరించి, ఇప్పుడు ఒప్పరికించి, దయ ఎంత మాత్రమూ లేకుండా, వారు అధమ దశతో ఆపద పొందగా చూస్తూ ఊరుకొనటం తగునా? ఇప్పుడు అంతటితో సంతోషించకూడదు. అంతకంటె అధికంగా కోరినప్పటికీ సరిపోదు. పగవారి పొగరు అణగేటట్లు మనం కలిసి బ్రదకటం మంచిది కాదా?

విశేషం: నేనింకా తక్కువ కోరుతున్నాను గాని అంతకంటె ఎక్కువ కోరినప్పటికీ తక్కువే అవుతుందని భావం.

వ. అని తదవసరంబునం బితామహుతో నిట్లనుము. 372

తాత్పర్యం: అని ఆ సమయంలో భీష్మునితో ఇట్లా అనుము.

చ. 'అడఁగఁగనీక శంతనుని యన్వయముం గలిగించి; తీవ యి
ప్పుడుఁ దగ నీ మతంబునన పొందొడఁగూడఁగఁ జేర్చి పౌత్త్రులన్
సడికి నధర్మవృత్తికిని జావునకుం దొలఁగించి మన్చినం
బుడమిజనంబు రాజులును భూసురులున్ నినుఁ బ్రస్తుతింపరే?' 373

ప్రతిపదార్థం: ఈవు+అ= నీవే; శంతనుని+అన్వయమున్= శంతనుడి వంశాన్ని; అడఁగఁగ నీక= నశించిపోనివ్వకుండా; కలిగించితి(వి)= నిలబెట్టావు; ఇప్పుడు; తగన్= ఒప్పుగా; నీ మతంబునన్+అ= నీ ఇష్టప్రకారమే; పొందు+ఒడఁగూడఁగన్+ చేర్చి= సంధి కుదిరే విధంగా కలిపి; పౌత్త్రులన్= మనుమలను; సడికిన్= నిందకూ; అధర్మ వృత్తికినిన్= అన్యాయపు నడవడికీ; చావునకున్; తొలఁగించి= దూరంగా ఉంచి; మన్చినన్= బ్రదికిస్తే; పుడమి జనంబున్= భూజనులూ; రాజులునున్= రాజులూ; భూ సురులున్= బ్రాహ్మణులూ; నినున్= నిన్ను; ప్రస్తుతింపరే?= మెచ్చుకోరా?

తాత్పర్యం: ఇదివరకు నీవు శంతనుడి వంశం అంతరించి పోకుండా నిలబెట్టావు. ఇప్పుడు నీవే ఒప్పేటట్లు నీ ఇష్ట ప్రకారమే సంధి కుదిర్చి మనుమలను కలిపి, వారు నిందకూ, అన్యాయానికీ, చావుకూ దూరంగా ఉండేటట్లు చేసి బ్రదికిస్తే భూజనులూ, రాజులూ, బ్రాహ్మణులూ నిన్ను మెచ్చుకొనరా?

విశేషం: భీష్ముడు శంతనుడి కొడుకు. శంతనుడు సత్యవతిని పెళ్ళి చేసికొనటంలో భీష్ముడు సహాయపడ్డాడు. తాను పెళ్ళి చేసికొననని శపథం చేశాడు. సత్యవతీ శంతనులకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అని ఇద్దరు కొడుకులు పుట్టారు. వారి చిన్నతనంలోనే శంతనుడు మరణించాడు. చిత్రాంగదుడు అవివాహితుడుగా మరణించాడు. భీష్ముడు కాశీరాజు కూతుళ్ళయిన అంబ, అంబిక, అంబాలిక అనే వాళ్ళను స్వయంవరంలో గెల్చి తీసికొనిరాగా, అంబ సాళ్వుడిని ప్రేమించానంటే వెళ్ళిపొమ్మని, అంబికాంబాలికలను విచిత్రవీర్యుడి కిచ్చి పెళ్ళి చేశాడు. విచిత్ర వీర్యుడు సంతానం పొందకుండానే చచ్చిపోయాడు. శంతనుడి

వంశం అంతరించిపోతున్నదని సత్యవతి తన ప్రథమ పుత్రుడైన వ్యాసుడిని (పరాశరుడి వలన సత్యవతికి పుట్టినవాడు) అంబికాంబాలికలకు దేవరన్యాయం చొప్పున సంతానం పొందవలసిందిగా ఆదేశిస్తుంది. వ్యాసుడివలన అంబికకు ధృతరాష్ట్రుడూ, అంబాలికకు పాండురాజూ జన్మించారు. దాసిఅయిన శూద్రస్త్రీకి విదురుడు జన్మించాడు. ఈ విధంగా భీష్ముడు శంతనుడి వంశం అంతరించిపోకుండా నిలబెట్టాడు.

వ. అని పలికి వెండియు. 374

తాత్పర్యం: అని పలికి ఇంకా.

క. ఇంతలు వుట్టిన చోటను । శంతనునందన! యహీన శాంతిపరుండై
కౌంతేయాగ్రజుఁ డాలము । పొంతం బో నొల్లఁ' డనుము బుధు లియ్యకొనన్. 375

ప్రతిపదార్థం: బుధులు+ఇయ్యకొనన్= తెలిసినవారు సమ్మతించగా; శంతను నందన!= శంతనుని కుమారుడా! భీష్ముడా!; ఇంతలు+పుట్టిన చోటను= ఇంతలేసి ఘోరాలు జరిగినచోట కూడా; కౌంతేయ+అగ్రజుఁడు= పాండవులలో పెద్దవాడు; ధర్మరాజు; అహీన శాంతి పరుండు+ఐ= తక్కువకాని గొప్పశాంతియం దాసక్తికలవాడయి; ఆలము పొంతన్= యుద్ధం దరికి; పోన్+ఒల్లఁడు+ అనుము= పోవ నంగీకరించడు అనుము.

తాత్పర్యం: తెలిసిన వారు సమ్మతించగా 'భీష్ముడా! ఇంతలేసి ఘోరాలు జరిగిన సందర్భంలో కూడా ధర్మరాజు గొప్ప శాంతియందు ఆసక్తి గలవాడై యుద్ధపు చాయలకు పోవ నంగీకరించడు' అనుము.

సీ. ఆ సమయంబున నచ్చటి వారెల్ల । వినునట్లుగా సుయోధనుని తోడ
'బాహుబలాఢ్యుల బలవిహీనుల క్రియ । వెడలంగ నడిచిన వెట్టితనము,
నత్యంత చిరకాల మడవులఁ గొండల । బాధలఁ బెట్టిన పరుసఁదనము,
సభలోన నట్లు పాంచాల రాజాత్మజఁ । దలవట్టి యీడ్చిన తులువతనము

తే. ధర్మపుత్త్రుండు సైరించెఁ దథ్య; మీవు । కురుకుమారుల నని మ్రింగికొనకు; మొరుల
సొమ్మునకు నాసపడఁ దగ; దిమ్ము వారి । పాలు; వారలతోఁ గూడి బ్రదుకు' మనుము. 376

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; అచ్చటి వారు+ఎల్లన్= అక్కడ ఉన్నవాళ్ళు అందరూ; విను+అట్లుగాన్= వినేటట్లుగా; సుయోధనుని తోడన్= దుర్యోధనుడితో బాహు బల+ ఆఢ్యులన్= భుజ పరాక్రమ సంపన్నులైన పాండవులను; బల విహీనుల క్రియన్= పరాక్రమశూన్యులవలె; వెడలంగన్+అడిచిన వెట్టితనమున్= ఊళ్ళోనుండి వెళ్ళగొట్టిన వెర్రితనమూ; అత్యంత చిరకాలము= ఎంతోకాలం; అడవులన్= అడవులలోనూ; కొండలన్= కొండలలోనూ; బాధలన్+పెట్టిన పరుసఁదనమున్= బాధపెట్టిన క్రూరత్వమూ:సభలోనన్; అట్లు= ఆ రీతిగా పైకిచెప్పరాని విధంగా; పాంచాల రాజ+ఆత్మజన్= పాంచాల దేశపు రాజయిన ద్రుపదుడి కూతురిని-ద్రౌపదిని; తల+పట్టి+ఈడ్చిన తులువతనమున్= జుట్టుపట్టుకొని ఈడ్చిన తుంటరితనమూ, ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; సైరించెన్= సహించాడు; తథ్యము= నిజం; ఈవు= నీవు; కురు కుమారులన్= కౌరవులను; అనిన్= యుద్ధంలో; మ్రింగికొనకుము= నాశనం చేసికొనకుము; ఒరుల సొమ్మునకున్= ఇతరుల డబ్బుకు; ఆసపడన్+తగదు= ఆశించకూడదు; వారి పాలు= వారి భాగం; ఇమ్ము= ఇచ్చివేయుము; వారలతోన్= ఆ పాండవులతో; కూడి= కలిసి; బ్రదుకుము; అనుము.

తాత్పర్యం: నీవు ధృతరాష్ట్రుడి సభలో ఇక్కడి సంగతులన్నీ చెప్పేటప్పుడు అక్కడున్నవాళ్ళంతా వినేటట్లు దుర్యోధనుడితో 'భుజ పరాక్రమ సంపన్నులైన పాండవులను పరాక్రమ శూన్యులవలె ఊళ్ళోనుండి వెళ్ళగొట్టిన మీ వెర్రితనమూ, ఎంతోకాలం అడవులలోనూ, కొండలలోనూ బాధలు పెట్టిన మీ క్రూరత్వమూ, సభలో ద్రౌపదిని ఆ విధంగా జుట్టుపట్టుకొని ఈడ్చిన మీ తుంటరితనమూ ధర్మరాజు సహించాడు నిజం. నీవు కౌరవులను యుద్ధంలో నాశనం చేసికొనకుము. ఇతరుల డబ్బుకొరకు ఆశించకూడదు. వారి భాగం వారి కిచ్చివేయుము. వాళ్ళతో కలిసి బ్రదుకుము' అని చెప్పుము.

విశేషం: 'బాహు బలాఢ్యుల..........వెఱ్ఱితనము.' భుజపరాక్రమసంపన్నులైన పాండవులను స్వప్రయోజనం కొరకు ఉపయోగించుకొనకుండా దుర్యోధనుడు వాళ్ళను ఊళ్ళోనుండి వెళ్ళగొట్టటం వెర్రితనం కాక మరేమిటి?

వ. ఏము కలహం బొల్లక పొందుగోరుట తనకు మేలు; తన మనంబున దరికొను తృష్ణానలం బార్ప నొరు లడ్డంబు సొరమింజేసి, యేన బుద్ధి సెప్పవలసెఁ; దనయొద్దం గల యోధవీరులె య్యెడల లేమి దెల్లంబయినను, మాకుఁ జేదోడు ధర్మంబు గల; దదియునుంగాక యఖిలలోక సేవితుండైన కృష్ణుండు పెనుఁబ్రాపు గావునఁ దమకు మమ్ము గెలువం గొలఁదిగా; దదియట్లుండె; నేను భీమసేనాదులకుం దమకుం బెద్దవాఁడ నగుట వీరును వారును మదీయ ప్రార్థనా భంగంబు సేయక, నాదగు శాంతియు దాంతియుఁ జెల్లించి; న న్నలజడిఁ బెట్టక, పోరితం బుడిగి తమతమ ధనంబులు గుడిచి సుఖంబుండుట మన పెద్దలకుం దక్కటి బుద్ధిమంతులకును సంతోషంబగుఁ; బెద్దయీా నోపఁడయ్యేనేనిఁ గుశస్థలంబును; వృకస్థలంబును; వాసంతియు; వారణావతంబును జాలుఁ; గాదేని మఱియు నెందేనియు నొక్కటి యగునట్లుగాఁ దన తోడఁబుట్టువు లేవురకు నిలువతావు లయి దిచ్చిన సర్వశాంతి యగు; నట్లయిన నిందలి యందలి బంధు మిత్త్ర సహాయజనంబులు గలసి నవ్వుచుం దెగడుచు నునికి మన మనంబులకుఁ బ్రియంబుసేయుఁ; గురు పాంచాల యాదవ మాత్స్యులు పరస్పర ప్రీతి సంపాదకత్వ సంపన్నులై బ్రదుకుట నాకుం గోర్కి; యింతయు నమ్మహాపురుషునకుం దెలియం జెప్పు' మనిన విని 'దేవా! నీ యానతిచ్చిన మార్గంబంతయు నడపెద; మీ తండ్రి నీకును దమ్ములకును వాసుదేవునకు నెట్లు ప్రియం బట్లు సేయువాఁడ కాక' యనుచుం బ్రణామంబు సేసిన, సంజయునకు ధనంజయుం డిట్లనియె. 377

ప్రతిపదార్థం: ఏము= మేము; కలహంబు+ఒల్లక= యుద్ధం అంగీకరించక; పొందు+కోరుట= సఖ్యం కోరటం; తనకున్; మేలు= మంచిది; తన మనంబునన్= తన మనస్సులో; దరికొను= మండే, తృష్ణా+అనలంబు= పేరాస అనే అగ్ని; ఆర్పన్= చల్లార్చటానికి; ఒరులు= ఇతరులు; అడ్డంబు+చొరమిన్+చేసి= అడ్డం రాకపోవటం చేత; ఏను+అ= నేనే; బుద్ధి+చెప్పన్+వలసెన్= బుద్ధి చెప్పవలసి వచ్చింది; తన+ఒద్దన్+కల యోధ వీరులు= తన దగ్గరున్న యుద్ధవీరులు; ఏ+ఎడలన్= ఎక్కడా; లేమి= లేకపోవటం; తెల్లంబు+అయినను= స్పష్టం అయినప్పటికీ; మాకున్; చేదోడు= సహాయం; ధర్మంబు; కలదు; అదియునున్+ కాక; అఖిలలోక సేవితుండు+ఐన కృష్ణుండు= ఎల్ల లోకాల చేత సేవించబడే కృష్ణుడు; పెను+ప్రాపు+కావునన్= పెద్ద దిక్కు కాబట్టి; తమకున్; మమ్మున్; గెలువన్+కొలఁది+కాదు= గెలవటం శక్యం కాదు; అది+అట్లు+ఉండెన్; ఏను; భీమసేన+ఆదులకున్= భీముడూ మొదలయిన వారికీ; తమకున్; పెద్దవాఁడన్+అగుటన్= పెద్దవాడిని అవటం చేత; వీరును+తారును= వీళ్ళూ, వాళ్ళూ; మదీయ ప్రార్థనా భంగంబున్+చేయక= నాదయిన ప్రార్థనను అనాదరించక; నాది+అగు శాంతియున్ దాంతియున్=

నా శాంతినీ, కర్మేంద్రియాల నిగ్రహశక్తినీ; చెల్లించి= సాగనిచ్చి; నన్నున్; అలజడిన్+పెట్టక= బాధపెట్టక; పోరితంబు+ఉడిగి= యుద్ధం మాని; తమ తమ ధనంబులు+కుడిచి= తమ తమ సొమ్ము లనుభవించి; సుఖంబు+ఉండుట= సుఖంగా ఉండటం; మన పెద్దలకున్; తక్కటి బుద్ధిమంతులకును= తక్కిన బుద్ధిమంతులకూ; సంతోషంబు+అగున్; పెద్ద+ఈన్+ఓపఁడు+ ఏనిన్= అంత ఎక్కువ ఇవ్వలేకపోతే; కుశస్థలంబును; వృకస్థలంబును; వాసంతియున్; వారణావతంబును; చాలున్= సరిపోతాయి; కాదు+ఏనిన్= లేకపోతే; మఱియున్+ఎందున్+ఏనియున్= మరి ఎక్కడైనా; ఒక్కటి+అగునట్లుగాన్; తన తోడఁబుట్టువులు+ ఏవురకున్= తన సోదరులైదుగురికీ; నిలువన్= ఉండటానికి; తావులు= నివాసస్థానాలు; అయిదు= ఐదు; ఇచ్చినన్= ఇస్తే; సర్వశాంతి+అగున్= సంపూర్ణ శాంతి ఏర్పడుతుంది; అట్లు+అయినన్= అట్లా జరిగితే; ఇందలి, అందలి బంధు మిత్ర సహాయ జనంబులు= ఇక్కడి అక్కడి చుట్టాలూ, స్నేహితులూ, తోడ్పాటుకై వచ్చిన వాళ్ళూ, కలిసి= కూడి; నవ్వుచున్; తెగడుచున్= త్రుళ్ళుతూ; ఉనికి= ఉండటం; మన మనంబులకున్= మన మనస్సులకు; ప్రియంబు+చేయున్= సంతోషం కలిగిస్తుంది; కురు పాంచాల యాదవ మాత్స్యులు= కౌరవులూ, పాంచాలురూ, యాదవులూ, మాత్స్యులూ; పరస్పర ప్రీతి సంపాదకత్వ సంపన్నులు+ఐ= ఒండొరుల ప్రేమ సంపాదనతో కూడినవారై; బ్రదుకుట; నాకున్+కోర్కి= నా కోరిక; ఇంతయున్; ఆ+మహా పురుషునకున్= ఆ మహానుభావుడికి; తెలియన్+చెప్పుము= స్పష్టపరుచుము; అనినన్; విని; దేవా; నీ+ఆనతి+ఇచ్చిన మార్గంబు+అంతయున్= నీవు సెలవిచ్చిన విధం అంతా; నడపెదన్= జరుపుతాను; మీ తండ్రి; నీకును; తమ్ములకును; వాసుదేవునకున్= కృష్ణుడికీ; ఎట్లు ప్రియంబు+అట్లు+చేయువాఁడు+అ కాక= ఎట్లా ఇష్టమో అట్లా చేసేవాడే అవుతాడు; అనుచున్; ప్రణామంబు+చేసినన్= నమస్కరించగా; సంజయునకున్; ధనంజయుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మేము యుద్ధానికి అంగీకరించక సఖ్యం కోరటం తనకు మంచిది. తన మనస్సులో రగిలే తృష్ణ అనే అగ్నిని ఆర్పటానికి ఇతరులు పూనుకొనకపోవటం చేత నేనే బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన దగ్గర ఉన్న యోధులు ఎక్కడా లేకపోవడం స్పష్టమే అయినా, మాకు తోడ్పాటు ధర్మం ఉన్నది. అదీకాక ఎల్లలోకాలూ సేవించే కృష్ణుడు మాకు పెద్ద దిక్కు కాబట్టి తమకు మమ్ములను గెలవటం సాధ్యంకాదు. అది అట్లా ఉండనిమ్ము, నేను భీమాదులకూ, తమకూ పెద్దవాడిని అవటంచేత, వీళ్ళూ, వాళ్ళూ నా కోరికను అనాదరించక, నా శాంతినీ, దాంతినీ సాగనిచ్చి నన్ను బాధించక, యుద్ధం మాని, తమ తమ సొమ్ము లనుభవిస్తూ సుఖంగా ఉండటం మన పెద్దలకూ, తక్కిన బుద్ధిమంతులకూ సంతోషం. అంత ఎక్కువగా ఇవ్వలేకపోతే, కుశస్థలమూ, వృకస్థలమూ, వాసంతీ, వారణావతమూ సరిపోతాయి. లేకపోతే మరి ఎక్కడైనా ఏదో ఒకటి తన సోదరులకు అయిదుగురికీ నిలవడానికి చోట్లు అయిదిస్తే సంపూర్ణశాంతి అవుతుంది. అట్లా అయితే ఇక్కడి అక్కడి బంధువులూ, మిత్రులూ తోడ్పాటు కొరకు వచ్చినవాళ్ళూ కలిసి, నవ్వుతూ, త్రుళ్ళుతూ ఉండటం మన మనస్సులకు సంతోషం కలిగిస్తుంది. కురు పాంచాల యాదవ మాత్స్యులు ఒండొరుల ప్రేమను సంపాదించుకొని బ్రదకాలని నా కోరిక. ఇదంతా ఆ మహానుభావుడికి స్పష్టపరుచుము, అనగా విని 'దేవా! నీవు సెలవిచ్చిన విధానం అంతా నడుపుతాను. మీ తండ్రి నీకూ, తమ్ములకూ, కృష్ణుడికీ ఎట్లా ఇష్టమో అట్లా చేస్తాడు' అంటూ నమస్కరించగా, సంజయుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: తృష్ణానలంబు-తృష్ణ అనే అనలం రూపకాలంకారం. కుశస్థలంబును, వృకస్థలంబును, వాసంతియు, వారణావతంబును, ఇంకొకటి ఏదయినా ఇట్లా ఏవో అయిదూళ్ళు మాత్రమే ధర్మరాజు కోరినట్లు కనిపించినా, అవి కౌరవ సామ్రాజ్యానికి ఆయువుపట్టులైన ఊళ్ళు. ధర్మరాజు గడుసుదనం అక్కడే ఉన్నది. 'అమ్మహాపురుషునకున్' ఆ మహానుభావుడికి - ఇది స్తుతికాదు విసుగు చెంది అన్నమాట. మూలంలో 'వాసంతి' లేదు. దానికి బదులు 'అవంతి' ఉన్నది. 'కుశస్థల వృకస్థలం అవన్తీం వారణావతమ్.'

క. 'బాల సఖుండవు; నాకును । నీ లెస్సఁదనంబు; నేము నీతి విడిచి దు
శ్శీలుర మగుటయు; శైశవ । లీల మొదలు గాఁగ మును దెలియదే నీకున్? 378

ప్రతిపదార్థం: బాల సఖుండవు= బాల్య మిత్రుడివి; నాకును; నీ లెస్సఁదనంబు= నీ మంచితనమూ; నీకున్; ఏము= మేము; నీతిన్; విడిచి; దుశ్శీలురము+అగుటయున్= దుష్టస్వభావులం అవటమూ; శైశవ లీల మొదలు+కాఁగన్= బాల్యం నుండి; మును= ముందు; తెలియదే?= తెలియదా?

తాత్పర్యం: నీవు నాకు బాల్య స్నేహితుడివి. నీ మంచితనం నాకూ, మేము నీతి విడిచి దుస్స్వభావులం అవటం నీకూ చిన్ననాటి నుండీ ముందు తెలియదా?

విశేషం: 'నాకును నీ లెస్సఁదనంబు!' 'ఏము నీతి విడిచి దుశ్శీలురమగుటయు' - ఇవి నిజంగా అన్నమాటలు కావు. విపరీతార్థాన్ని ఇచ్చే మాటలు.

మ. బలమత్తాకృతి యైన భీముఁ డను శుంభత్కుంభి సంరంభమున్
నిలిపెన్ నాఁడును నంకుశంబయి; తుదిన్ నేఁడుం దదుద్రేకమున్
మలుఁగం జేయ నజాతశత్రుని కృపామౌగ్ధ్యంబ చాలంగ; వా
రల కేలా నయవిక్రమోచిత విచారక్లేశముల్ సంజయా!' 379

ప్రతిపదార్థం: సంజయా!; అజాతశత్రుని కృపా మౌగ్ధ్యంబు+అ= ధర్మరాజు యొక్క దయతో కూడిన తెలివితక్కువతనమే; నాఁడును= అప్పుడూ; అంకుశంబు+అయి= అంకుశమయి; బల మత్త+ఆకృతి+ఐన= బలంచేత మదించిన ఆకారం కలవాడయిన; భీముఁడు+అను= భీముడనే; శుంభత్+కుంభి సంరంభమున్= ప్రకాశించే ఏనుగుయొక్క విజృంభణాన్ని; నిలిపెన్= ఆపుచేసింది; తుదిన్= చివర; నేఁడున్= ఇప్పుడూ; తద్+ఉద్రేకమున్= ఆ భీమగజం ఆవేశాన్ని; మలుఁగన్+చేయన్= అణచటానికి;(అదే), చాలంగన్= సరిపడగా; వారలకున్= ఆ కౌరవులకు; నయ విక్రమ+ఉచిత విచార క్లేశముల్= నీతితో కూడిన పరాక్రమానికి తగిన ఆలోచనల కష్టాలు; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: సంజయా! అజాతశత్రువైన ధర్మరాజు దయతో కూడిన తెలివితక్కువతనమే అప్పుడు అంకుశమయి, పరాక్రమ మత్తాకారుడైన భీముడనే మత్తేభం విజృంభణాన్ని ఆపుచేసింది. చివరకు ఇప్పుడుకూడా ఆ భీమగజం ఆవేశాన్ని అణచటానికి అదే సరిపడగా, ఆ కౌరవులకు నీతి పరాక్రమానికి తగిన ఆలోచనలు చేసే కష్టం ఎందుకుంటుంది?

విశేషం: అలం: రూపకం, పరికరాంకురం. భీముఁడనే శుంభత్కుంభి అలంకారం రూపకం. అజాతశత్రుని కృపామౌగ్ధ్యంబ అంకుశం బయి - రూపకమే. అజాతశత్రుఁడు అనే ధర్మరాజునామం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. అని పలికి ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారంబుగా సముచిత ప్రకారంబున మజ్జన భోజనంబు లొనరించి, మాల్యానులేపనాద్యుపచారంబులు సేయించి, మణిభూషణ చిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన, నతండును బాండవులను వాసుదేవుని వీడ్కొని చనియె' నని చెప్పిన. 380

ప్రతిపదార్థం: అని పలికి; ధర్మతనయ+అనుమతంబునన్= ధర్మరాజుయొక్క అనుజ్ఞతో; సంజయునకున్; సపరివారంబుగాన్= పరిజనసమేతంగా; సముచిత ప్రకారంబునన్= తగిన విధంగా; మజ్జన భోజనంబులు= స్నానాహారాలు; ఒనరించి= చేసి; మాల్య+అనులేపన+ఆది+ఉపచారంబులు= దండలు, మైపూఁతలు మొదలయిన సమ్మానములు; చేయించి; మణి భూషణ చిత్ర+అంబరంబులు= రత్నాలంకారాలు, మనోజ్ఞములైన వస్త్రాలు; ఒసంగి= ఇచ్చి; వీడుకొల్పినన్= సెలవిచ్చి పంపగా; అతండును; పాండవులను; వాసుదేవునిన్= కృష్ణుడిని; వీడ్కొని చనియెన్= విడిచి వెళ్ళాడు; అని; చెప్పినన్= అని వైశంపాయనుడు చెప్పగా;

తాత్పర్యం: అని పలికి ధర్మరాజు అనుజ్ఞతో సంజయునకు పరిజనసమేతంగా తగిన విధాన స్నానాహారాలు చేయించి, పూలమాలలు, మైపూతలు మొదలయిన సమ్మానాలు జరిపించి, రత్నాలంకారాలు, మనోజ్ఞములయిన వస్త్రాలు సమర్పించి, సెలవిచ్చి పంపగా సంజయుడును పాండవులను, శ్రీకృష్ణుడిని విడిచి వెళ్ళాడు' అని వైశంపాయనుడు చెప్పగా.

క. విని, యత్యంత కుతూహల । మునఁ బొదలుచు, 'సంజయుండు మున్నెచ్చటికిం
జనియెను? నెవ్వరితో నే । మనియెను వినవలయు; మునిజనాధిప! చెపుమా.' 381

ప్రతిపదార్థం: విని= (జనమేజయుడు) విని; అత్యంత కుతూహలమునన్= మిక్కిలి ఆసక్తితో; పొదలుచున్= ఒప్పుతూ; ముని జన+అధిప!= మునీశ్వరా! వైశంపాయన మహర్షీ!; సంజయుండు; మున్ను= ముందు; ఎచ్చటికిన్= ఎక్కడకు; చనియెను= వెళ్ళాడు; ఎవ్వరితోన్; ఏమి+అనియెను; వినవలయున్; చెపుమా.

తాత్పర్యం: జనమేజయుడు విని మిక్కిలి ఆసక్తితో ఒప్పుతూ 'మునీశ్వరా! సంజయుడు ముందుగా ఎక్కడకు వెళ్ళాడు? ఎవరితో ఏ మన్నాడు? వినాలి చెప్పుము.'

వ. అని యడిగిన. 382

తాత్పర్యం: అని జనమేజయుడు అడుగగా. (తరువాతి ఆశ్వాసంలోని వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. భూరికృపానుషంగ! మునిపుంగవ చిత్త సరోజ భృంగ! సం
సార దవ ప్రవర్ష! సుర సంస్తుత దివ్య గుణ ప్రకర్ష! దో
స్సారనిరస్త దైత్య! శమశాలి మనస్స్థితి నిత్య! లోక ని
స్తారక శీల! నిర్వృతి విశాల! నిరంజన! పాపభంజనా! 383

ప్రతిపదార్థం: ఇది కృతిపతి అయిన హరిహరనాథుడికి కృతికర్త తిక్కన చేసిన స్తుతి. భూరి కృపా+అనుషంగ!= (ఆపన్నులైన వారి యందు) గొప్ప దయ కలవాడా!; (అనుషంగము= ఆసక్తి); ముని పుంగవ చిత్త సరోజ భృంగ!;= మునిశ్రేష్ఠుల మనఃపద్మములకు తుమ్మెద అయినవాడా!; సంసార దవ ప్రవర్ష!= సంసారమనే కార్చిచ్చునకు ధారాపాతమైన వాడా!; సుర సంస్తుత దివ్య గుణ ప్రకర్ష!= దేవతలచేత మిక్కిలి స్తుతించబడిన ఉత్తమ గుణాతిశయం కలవాడా!; దోస్+సార నిరస్త దైత్య!= భుజబలంచేత నిరసింపబడిన రాక్షసులు కలవాడా!; శమశాలి మనస్+స్థితి నిత్య!= ఇంద్రియనిగ్రహం కలవారి మనస్సులందలి ఉనికిచేత శాశ్వతుడా-వశులైన మహర్షులు తమ మనసులను పరమేశ్వరుడియందే లగ్నం చేస్తారని భావం; లోక విస్తారక

శీల!= భక్త లోకాన్ని తరింపజేసే స్వభావం కలవాడా!; నిర్వృతి విశాల!= ఆనందం చేత విశాలుడా! (అనంతానంద స్వరూపుడా అని భావం); నిరంజన!= దేనితోనూ తగులులేనివాడా!; పాప భంజనా= (భక్తుల) పాపాలను నశింపజేసేవాడా! హరిహరనాథా!

తాత్పర్యం: ఆపన్నులయందు గొప్పదయ గలవాడా! మహర్షుల మనఃపద్మాలకు తుమ్మెద అయినవాడా! సంసారం అనే కార్చిచ్చుకు ధారాపాతమైన వాడా! దేవతల చేత కూడా స్తుతించబడిన సుగుణాల అతిశయం కలవాడా! భుజబలం చేత నిరసించబడిన రాక్షసులు కలవాడా! ఇంద్రియనిగ్రహం కలవారి మనస్సులందు నిత్యం ఉండేవాడా! భక్త లోకాల్ని తరింపజేసే స్వభావం కలవాడా! అనంతానంద స్వరూపుడా! దేనితోనూ సక్తత లేనివాడా! భక్తుల పాపాలను నశింపజేసేవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం. అంత్యానుప్రాసం. ముని పుంగవ చిత్త సరోజ భృంగ- చిత్తములనే సరోజాలకు భృంగము- అలంకారం రూపకం. సంసారదవ ప్రవర్ష - సంసారమనే దవానికి ప్రవర్షమైనవాడు- అలంకారం రూపకం. రెండేసి విశేషణాలకు అంత్యానుప్రాసం.

క. శ్రుతి మౌళి రత్నమూర్తీ! । శతధృతి ముఖ పద్మ షండ సౌరభ కీర్తీ!
రతిపతి హితాహితాక్షా! । సతత సమాచరిత భక్త జన సంరక్షా! 384

ప్రతిపదార్థం: ఇది కూడా హరిహరనాథస్తుతే. శ్రుతి మౌళి రత్నమూర్తీ!= వేదం అనే స్త్రీయొక్క శిరస్సునకు రత్నమైన స్వరూపం కలవాడా! - వేదాంతాలచేత ప్రతిపాదించబడే వాడా అని భావం; శతధృతి ముఖ పద్మ షండ సౌరభ కీర్తీ!= బ్రహ్మయొక్క తామరల వంటి ముఖాల యొక్క సమూహం యొక్క పరిమళరూపకమైన యశస్సు కలవాడా!; రతి పతి హిత+అహిత+అక్షా!= మన్మథుడికి మేలూ, కీడూ కలుగజేసే కన్నులు కలవాడా!; సతత సమాచరిత భక్త జన సంరక్షా!= ఎల్లప్పుడూ చేయబడిన భక్త జనుల రక్షణం కలవాడా! నిత్యమూ భక్తులను రక్షించేవాడా అని భావం - హరిహరనాథా!

తాత్పర్యం: శ్రుతి కాంత శిరోరత్నమైనవాడా! వేదాంతాలచేత ప్రతిపాదించబడేవాడా! బ్రహ్మ ముఖ పద్మసమూహాల పరిమళంవంటి కీర్తి కలవాడా! (బ్రహ్మ ముఖ పద్మ నిర్గత చతుర్వేదాలూ పరమేశ్వరుడి యశస్సునే తెలుపుతున్నాయని భావం.) మన్మథుడికి మేలూ కీడూ కలుగజేసే కన్నులు కలవాడా! ఎల్లపుడూ భక్తజనులను రక్షించేవాడా! హరిహరనాథా!

విశేషం: శ్రుతిమౌళులు వేదాంతాలు. వాటికి రత్నమైన వాడు అనగా వాటిచేత ప్రతిపాదించబడేవాడు. వేదం పూర్వభాగం కర్మలకు సంబంధించేది. ఉత్తరభాగమైన ఉపనిషత్తులు పరమేశ్వరుడికి సంబంధించేవి. రతిపతి హితాహితాక్షా! హరి రూపంలో మన్మథుడు పుత్రుడవటం చేత అతడియందు ప్రసన్నమైన దృష్టీ, హరరూపంలో శత్రువవటం చేత మూడో కంటితో దహించి అతనియందు అహితమైన దృష్టీ హరిహరనాథుడి కున్నాయని భావం. శ్రుతిమౌళిరత్నమూర్తీ-రూపకాలంకారం. శతధృతి ముఖపద్మషండ సౌరభకీర్తీ రూపకాలంకారమే. రతిపతి హితాహితాక్షా - అలంకారం యథాసంఖ్యం. హితాక్షి హరిదీ, అహితాక్షి హరుడిదీ అని క్రమాన్వయం. రెండేసి పాదాలకు అంత్యానుప్రాసం పాటించబడింది.

మాలిని.

సదయ విమల దృష్టీ! సంశ్రితాశీః ప్రవృష్టీ!
హృదయ కమల వాసా! యిద్ధమాయా విలాసా!
విదిత నిఖిల భూతీ! విశ్వరక్షాత్తహేతీ!
సదసదుపచితాత్మా! సంభృతానందవర్మా! 385

ప్రతిపదార్థం: ఇది కూడా హరిహరనాథుడిని స్తుతించే పద్యమే. సదయ విమల దృష్టీ!= (భక్తులయందు) దయతో కూడిన స్వచ్ఛమైన కీర్తిగలవాడా; సంశ్రిత+ఆశీస్+ప్రవృష్టీ!= ఆశ్రితులకు ఆశీస్సులను మిక్కిలి వర్షించేవాడా!; హృదయ కమల వాసా!= పద్మంవంటి హృదయం నివాసస్థానంగా కలవాడా!; ఇద్ధ మాయా విలాసా!= అప్రతిహతమైన మాయయొక్క జగదుత్పత్తి స్థితి లయ రూపమైన లీలగలవాడా!; విదిత నిఖిల భూతీ!= తెలియబడిన సకలైశ్వరములూ కలవాడా!; విశ్వ రక్షా+ఆత్త హేతీ!= జగద్రక్షణ కొరకే పొందబడిన ఆయుధములు కలవాడా!; సత్+అసత్+ఉపచిత+ఆత్మా!= సద్రూపంతోనూ, అసద్రూపంతోనూ పెంపొందిన స్వరూపం కలవాడా!; సంభృత+ఆనంద వర్త్మా!= పొందబడిన ఆనందమార్గం కలవాడా! హరిహరనాథా!

తాత్పర్యం: భక్తులయందు సదయమూ నిర్మలమూ అయిన దృష్టికలవాడా! ఆశ్రితులకు ఆశీస్సులను వర్షించేవాడా! హృదయపద్మం వాసస్థానంగా కలవాడా! అడ్డులేని మాయయొక్క జగదుత్పత్తి స్థితి లయరూపమైన లీలగలవాడా! సకలైశ్వర్యాలూ తెలిసినవాడా! జగద్రక్షణ కొరకే ఆయుధాలు ధరించినవాడా! సద్రూపంతోనూ, అసద్రూపంతోనూ పెంపొందిన స్వరూపం కలవాడా! ఆనందమార్గం పొందినవాడా! హరిహరనాథా!

విశేషం: 'సదసదుపచితాత్మా' విశ్వమంతా సదసద్రూపాలతో కూడి ఉన్నది. సద్రూపం కారణరూపం వాస్తవం. అసద్రూపం కార్యరూపం అవాస్తవం. కార్యములైన ఘటాదులు వాస్తవములు కావు. కారణమైన మట్టియే వాస్తవం. కార్యకారణ రూపంతో ఒప్పు ఈ విశ్వమంతా పరమేశ్వర రూపమే కాబట్టి పరమేశ్వరుడు సదసదుపచితాత్ముడు. లేదా సత్తంటే మూర్తరూపాలైన పృథివి, జలం, అగ్ని మొదలయినవి. అసత్తంటే అమూర్తములైన వాయువు, ఆకాశం మొదలయినవి. తదుపచితాత్ముడు పరమేశ్వరుడు, 'సంభృతానంద వర్త్మా'-పరమేశ్వరుడిని పొందించే భక్తి జ్ఞాన కర్మ మార్గాలలో ఏదయినా ఆనందపరిపూర్ణమే అని భావం. ఆశీః ప్రవృష్టి రూపకం. హృదయ కమలం ఉపమిత సమాసం. రెండేసి విశేషణాలకు అంత్యప్రాసం పాటించబడింది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజ తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీ మహాభారతంబున యుద్యోగపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవి మిత్త్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదాంచితుడూ(సంస్కృతకవులూ, ఆంధ్ర కవులూ ఈ ఉభయులకూ మిత్త్రుడు ఇది తిక్కన బిరుదు.) కొమ్మన+అమాత్య పుత్త్ర= కొమ్మన మంత్రి కుమారుడూ; బుధ+ ఆరాధన విరాజి= పండితుల పూజచేత ప్రకాశించే వాడూ; (అగు), తిక్కన సోమయాజి ప్రణీతంబు+అయిన= తిక్కన సోమయాజిచేత రచించబడిన; శ్రీ మహాభారతంబున+ఉద్యోగపర్వంబునందున్= శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్త్ర బిరుదాంచితుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, బుధుల పూజచేత ప్రకాశించే వాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో మొదటి ఆశ్వాసం.

ఉద్యోగపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ విస్తారకరణ కరు। ణావేశోదార ! శశ్వదమలాకారా!
భావ వికార విదూర! శు। భావహ నామప్రకార! హరిహరనాథా! **1**

ప్రతిపదార్థం: ఇది తిక్కన కృతిపతిఐన హరిహరనాథుడిని స్తుతిస్తూ చెప్పిన ఆశ్వాసాది పద్యం.

శ్రీ విస్తార కరణ కరుణా+ఆవేశ+ఉదార!= ఐశ్వర్యాన్ని అధికం చేసే దయయొక్క ఆవేశం చేత గొప్పవాడా!; శశ్వత్+అమల+ ఆకారా!= ఎల్లప్పుడూ స్వచ్ఛమైన ఆకారం కలవాడా!; భావ వికార విదూర!= పదార్థాలకు లోకంలో గలిగే మార్పులకు మిక్కిలి దూరంగా ఉండేవాడా!; శుభ+ఆవహ నామ ప్రకార!= శుభాలను కలిగించే పేరు గలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: హరిహరనాథా! ఐశ్వర్యాన్ని పెంపొందించే దయావేశంచేత గొప్పవాడా! ఎప్పుడూ నిర్మలమైన ఆకారం కలవాడా! పదార్థాలకు కలిగే జనన మరణాది వికారాలకు మిక్కిలి దూరమైనవాడా! జనులకు శుభాలను కలిగించే పేరు కలవాడా!

విశేషం: పరమేశ్వరుడి దయావేశం ఐశ్వర్యహేతు వనటానికి కుచేలాదుల వృత్తాంతాలు దృష్టాంతాలు. భావ వికార విదూర- లోకంలో వస్తువులకుగల పుట్టటం, ఉండటం, వృద్ధిపొందటం, మారటం, క్షీణించటం, నశించటం అనే ఆరు విధాలయిన మార్పులు లేని నిర్వికారుడు పరమేశ్వరుడు. 'శుభావహనామ ప్రకార' - పరమేశ్వరుడి నామం మంత్రరూపమే కాబట్టి అట్టి మంత్రజపం తదుపాసకుడికి శుభం కలుగజేస్తుంది.

సంజయుఁడు ధర్మజుని సంధి పల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట (సం.5-32-1)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; 'నివ్విధంబున వీడ్కొని సూతనందనుండు పవనజవంబు లగు నరదంబు తురంగంబులం దఱిమి ప్రొద్దుగ్రుంకునంతకుం గరిపురి సొచ్చి నగరి కరిగి యంతః పురంబున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱింగించి పుచ్చి యతనిం గాంచి యడుగుల కెఱఁగిన, నమ్మహీవరుండును నత్యాదరంబున నెత్తి సమీపంబున నునిచినం గొలిచియుండి చేతులు మోడ్చి యిట్లనియె;** **2**

ప్రతిపదార్థం: దేవా!= స్వామీ, హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్; సూత నందనుండు= సంజయుడు; ఈ+విధంబునన్; వీడ్కొని= వీడి; పవన జవంబులు+అగు= వాయువువేగంవంటి వేగంగలవైన; అరదంబు తురంగంబులన్= రథాశ్వాలను; తఱిమి= పరుగెత్తించి; ప్రొద్దు+క్రుంకు+అంతకున్= సూర్యుడు అస్తమించే సమయానికి;

కరిపురి+చొచ్చి= హస్తినాపురం ప్రవేశించి; నగరికిన్+అరిగి= రాజభవనానికి వెళ్ళి; అంతఃపురంబునన్+ఉన్న ధృతరాష్ట్రునకున్= అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి; తన రాక; ఎఱింగించి పుచ్చి= తెలిపి; అతనిన్; కాంచి; అడుగులకున్+ఎఱఁగినన్= పాదాలకు మొక్కగా; ఆ+మహీవరుండును= ఆ రాజును; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఎత్తి= లేవనెత్తి; సమీపంబునన్= చేరువలో; ఉనిచినన్= కూర్చుండ బెట్టగా; కొలిచి+ఉండి= సేవించి; చేతులు మోడ్చి= చేతులు జోడించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ప్రభూ! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు. 'సంజయుడు ఈ విధంగా పాండవులను వీడి వాయువేగాలయిన రథాశ్వాలను పరువెత్తించి సూర్యాస్తమయ సమయానికి హస్తినాపురం ప్రవేశించి, రాజభవనానికి వెళ్ళి, అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి తన రాక తెలిపి, అతడిని చూచి, పాదాలకు మ్రొక్కగా, ఆ రాజు మిక్కిలి ఆదరంతో లేవనెత్తి దగ్గర కూర్చుండబెట్టుకొన్నాడు. సంజయుడు అతడిని సేవించి చేతులు జోడించి ఇట్లా అన్నాడు.

ఉ. 'దేవర పంపఁగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాఁడ; నా
భూవిభుఁ డప్రమేయ గుణపూజ్యుఁడు మీకు నమస్కరించె; సం
భావనసేసె నా; కిచటి బంధుల నెల్లఁ దలంచె; మీ సుఖ
శ్రీ విభవంబులున్, సుతుల సేమము నన్నడిగెం బ్రసన్నుఁడై.' 3

ప్రతిపదార్థం: దేవర= తమరు; పంపఁగాన్; చని= వెళ్ళి; యుధిష్ఠిరునిన్= ధర్మరాజును; కని= చూచి; వచ్చినాఁడన్; అప్రమేయ గుణ పూజ్యుఁడు= కొలది ఇడరాని సుగుణాలచే పూజించదగినవాడు; (అగు); ఆ భూవిభుఁడు= ఆ రాజు ధర్మరాజు; మీకున్; నమస్కరించెన్; నాకున్; సంభావన+చేసెన్= మర్యాద చేశాడు; ఇచటి బంధులన్+ఎల్లన్= ఇక్కడి చుట్టాలనందరినీ; తలంచెన్= స్మరించాడు; ప్రసన్నుఁడు+ఐ= సంతుష్టుడయి; మీ సుఖ శ్రీ విభవంబులున్= మీ సౌఖ్యమూ, సంపదా, వైభవమూ, సుతుల సేమమున్= కొడుకుల క్షేమమూ; నన్నున్+అడిగెన్.

తాత్పర్యం: 'తమరు పంపగా వెళ్ళి ధర్మరాజును చూచివచ్చాను. అమిత సుగుణాలు కలిగి పూజ్యుడైన ఆ రాజు మీకు నమస్కరించాడు. నాకు మర్యాద చేశాడు. ఇక్కడి చుట్టాలనందరినీ స్మరించాడు. సంతోషంతో మీ సౌఖ్యమూ, సంపదా, వైభవమూ, కొడుకుల క్షేమమూ నన్ను అడిగాడు.

విశేషం: రాయబారిగా సంజయుడు ఉపప్లావ్యంనుండి తిరిగి వచ్చి ధృతరాష్ట్ర మహారాజుకు అక్కడ జరిగిన విశేషాల తాత్పర్యాన్ని (సారాంశాన్ని) సంగ్రహంగా సారవంతంగా నివేదిస్తున్నాడు. ఇది ప్రాథమిక నివేదిక వంటిది. అందువలన ఇందులో ప్రతిపద సార్థక్యం పరిగణించదగింది. ప్రభువులైన మీరు నన్ను పంపారు. నేను 'యుధిష్ఠిరుడిని చూచి వచ్చాను' అని మొదటి వాక్యం. యుద్ధమందు స్థిరసంకల్పంతో ఉన్న ధర్మరాజును నేను అక్కడ చూచాను - అని అర్థం. 'చూచి వచ్చా'నంటే ఆశించిన ప్రయోజనం మరేమీ సిద్ధించ లేదని కూడా ధ్వని. ధర్మజుడు గుణపూజ్యుడు. ప్రసన్నుడు - అనిపించాడు; అందరినీ ఆదరంతో అభినందించాడని పేర్కొన్నాడు. ధృతరాష్ట్రుడి వ్యూహానికి విరుద్ధంగా యుద్ధ నిర్ణయంలో ధర్మజుడున్నా, శత్రువులు కూడా పూజ్యుడనీ, ప్రసన్నుడనీ భావించేటట్లు వ్యవహరించాడనీ తాత్పర్యం. యుధిష్ఠిరుడైనా ప్రసన్నుడై తండ్రియొక్క యోగక్షేమాలు తెలిసికొనటం, అతడి ప్రతినిధికి మర్యాద చేయటం, కౌరవుల క్షేమాన్ని అడగటం విశేషం. (సంపా.)

తే. అనుడు ధృతరాష్ట్రుఁ డిట్లను 'నయ్యజాత । శత్రునకు సేమమే? యనుజన్ము లెల్ల
సుఖులె? బంధులు, భృత్యులు, సఖులు, మంత్రి । వరులు సంప్రీతిమెయి నున్నవారె యచట?' 4

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; ధృతరాష్ట్రుఁడు+ఇట్లు+అనున్; ఆ+అజాతశత్రునకున్= ఆ ధర్మరాజుకు; సేమమే?; అనుజన్ములు+ఎల్లన్= తమ్ములందరూ; సుఖులె?= సుఖంగా ఉన్నారా?; బంధులున్= చుట్టాలూ; భృత్యులున్= సేవకులూ; సఖులున్= స్నేహితులూ; మంత్రివరులున్= మంత్రిశ్రేష్ఠులూ; అచటన్= అక్కడ; సంప్రీతి మెయిన్= సంతోషంతో; ఉన్నవారె?= ఉన్నారా?

తాత్పర్యం: అనగానే ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు; 'ఆ ధర్మరాజుకు క్షేమమా? అతడి తమ్ములందరూ సుఖంగా ఉన్నారా? అక్కడ చుట్టాలూ, సేవకులూ, స్నేహితులూ, మంత్రివర్యులూ సంతోషంతో ఉన్నారా?'

విశేషం: 'అజాతశత్రు'వనే పద ప్రయోగం సార్థకం. పేరుకు యుధిష్ఠిరుడైనా, స్వభావంచేత 'అజాత శత్రువు'. ధృతరాష్ట్రుడు ధర్మరాజులోని అజాతశత్రుత్వాన్ని మేలుకొల్పటానికే సంజయుడిని పంపాడు. అది సఫలమైనదా? అని ఆశతో ఆ పదాన్ని వాడాడు. ధర్మజుడి శాంతప్రవృత్తిని సహించి తమ్ములూ, బంధువులూ, భృత్యులూ సంతృప్తితో ఉన్నారా? అని అడిగాడు. లోగుట్టు లాగటానికి నగిషీగా మాట్లాడే తీరిది. (సంపా.)

వ. అనిన సంజయుం డిట్లనియె; 5

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

క. 'వారెల్లను భవదీయ । స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నారమని పలుకుదురు; నిజ । మారయఁగా నట్ల కాదె యది, జననాథా! 6

ప్రతిపదార్థం: జననాథా= రాజా!; వారు+ఎల్లను= వారందరూ; భవదీయ స్ఫార బలము+కారణముగన్= నీదైన అధిక బలం కారణంగా; సౌఖ్యంబునన్= సుఖంగా; ఉన్నారము+అని పలుకుదురు= ఉన్నామని అంటారు; నిజము+ఆరయఁగాన్= నిజం చెప్పాలంటే; అది; అట్లు+అ కాదె!= అంతేకదా!

తాత్పర్యం: 'రాజా! వారందరూ నీ గొప్పబలం కారణంగా సుఖంగా ఉన్నాం' అని అంటారు. నిజం చెప్పాలంటే అది అంతేకదా!

విశేషం: ఈ వాక్యాలు మెలిక మాటలు. వ్యంగ్యోక్తులు. కాకువు స్థగితం చేసిన పలుకులు. ధర్మరాజు 'ఆ రాజు మాదెసం గల కారుణ్యము కతముననుసుఖంబున నిట్లున్నారము'- అని కాకువుతో ఎత్తి పొడిచినట్లున్నాడు. దానిని సంజయుడు యథాతథంగా నివేదించకుండా సంస్కరించాడు. ధృతరాష్ట్రుడి ఉజ్జ్వలబలంవలన వారు క్షేమంగా ఉన్నారని అంటున్నారు - అన్నాడు. అంటే ఇప్పటికీ ధృతరాష్ట్రుడి రక్షలోనే మేమున్నామని భావిస్తున్నామని పాండవులు అంటున్నారని భావం. నిజానికి ఆ మాటలు సత్యం కావు. నిజం గాని మాటలను నిజంగా నమ్మించటమే కదా సంజయుడి రాయబారంలోని రాజనీతి. ఆ రాజనీతిని కన్నులతో వెక్కిరిస్తున్నట్లు సంజయుడు పలికాడు. 'నిజ మారయఁగా నట్లకాదె!' అని, ధర్మజుడి కాకువును స్థగితం చేసి తన వ్యంగ్యోక్తిని ప్రకటించటం సంజయుడి వాక్యనీతి. (సంపా.)

క. ధర్మజునకు భోగంబులు । ధర్మువున ట్లింపు గావు; ధర్మంబులలో
నిర్మల బుద్ధి నహింసకుఁ । గూర్మి గడుం గలఁ డతండు, కురువంశనిధీ! 7

ప్రతిపదార్థం: కురు వంశ నిధీ!= కురువంశానికి ఆశ్రయమైనవాడా - ధృతరాష్ట్రా!; ధర్మజునకున్= ధర్మరాజుకు; భోగంబులు= సౌఖ్యాలు; ధర్మువు+అట్లు= ధర్మం వలె; ఇంపు+కావు= ప్రియము కావు; అతండు; నిర్మల బుద్ధిన్= స్వచ్ఛమైన మనస్సుతో; ధర్మంబులలోన్= ధర్మాలలో; అహింసకున్= అహింస అనే ధర్మానికి; కూర్మి= ప్రీతి; కడున్= మిక్కిలి; కలఁడు= కలవాడు;

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! ధర్మరాజుకు సౌఖ్యాలు ధర్మం వలె ప్రియం కావు. అతడు నిర్మల మనస్సుతో ధర్మాలన్నిటిలోనూ అహింసాధర్మాన్ని బాగా ఇష్టపడతాడు.

విశేషం: సంజయుడి రాయబారపు ప్రయత్నమంతా ధర్మరాజులోని శాంత ప్రవృత్తిని ప్రబుద్ధం చేసి, అతడి యుద్ధ ప్రయత్నం మాన్పించి, రాజ్యకాంక్ష లేని ప్రసన్నభావంతో వైరాగ్యచిత్తంతో జీవించేటట్లు ప్రబోధించటం కదా! ఆ పరివర్తన ప్రయత్నంతో సంజయు డెంత వరకు కృతకృత్యుడైనాడో తెలిసికొనటం ధృతరాష్ట్రుడి ఆసక్తి. దాని కనుగుణంగా ధర్మజుడి చిత్తవృత్తిని సంజయుడు వివరించనారంభించాడు. ధర్మరాజుకు భోగాల కంటె ధర్మమంటే ప్రీతి. ధర్మాలలో అహింస అంటే అత్యంత ప్రీతి అని ఆరంభించాడు. ధృతరాష్ట్రుడికి ఈ ఎత్తుగడ ఆశాజనకంగా ఉన్నది. అయితే, ధర్మమంటే ఏమిటి? అన్నది ఈ పద్యంలో మిగిలే యక్షప్రశ్న. (సంపా.)

ఉ. మానుషశక్తి యొల్లఁడు; సమంచిత దైవమ యూఁదియుండు; నీ
పైన యతండు పుణ్యమును బాపముఁ బెట్టినవాఁడు; నీవు నీ
సూనువశంబ కాని యొకచొప్పుఁ దలంపవు; కర్ణ సౌబలా
ధీనము కార్యనిశ్చయము; తెల్లము నీ మత మొప్ప దేమియున్. 8

ప్రతిపదార్థం: (ధర్మరాజు కర్త); మానుష శక్తి= పౌరుషమైన శక్తి; ఒల్లఁడు= అంగీకరించడు; సమంచిత దైవము+అ= ఒప్పిదమైన దైవమే; ఊఁది+ఉండున్= అవలంబించి ఉంటాడు; అతండు= ధర్మరాజు; నీ పైన్+అ= నీ మీదనే; పుణ్యమును+ పాపమున్+పెట్టినవాఁడు= పుణ్యాపాపాలు పెట్టాడు; నీవు; నీ సూను వశంబు+అ కాని= నీ కొడుకు అధీనతే కాని; ఒక చొప్పున్= మరే విధమూ; తలంపవు= ఆలోచించవు; కార్య నిశ్చయము= కార్య నిర్ణయం; కర్ణ సౌబల+అధీనము= కర్ణ శకునుల వశం; నీ మతము= నీ విధం; ఏమియున్+ఒప్పదు= ఏమీ బాగుండదు; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: ధర్మరాజు పౌరుషాన్ని అంగీకరించడు; ఒప్పిదమైన దైవాన్నే నమ్ముకొని ఉంటాడు. అతడు పుణ్యాపాపాలను నీమీదే పెట్టాడు. నీవు నీ కొడుకు కోరినట్లేకాని ఇంకో విధం ఆలోచించవు. కార్య నిర్ణయం కర్ణ శకునుల వశం. నీ విధం ఏమీ బాగుండదు. అది స్పష్టం.

విశేషం: 'అహింసా పరమో ధర్మః' అని నమ్మిన ధర్మరాజు ఆ ధర్మసాధనలో పురుషయత్నాన్ని చేస్తాడు కాని, అది దైవ సమ్మతం కాకపోతే సఫలం కాదని నమ్ముతాడు. ఇది ధర్మజుడి వ్యక్తిత్వంలోని కీలకమైన అంశం. అందువలన దేవుడి మీద భారం వేసి ఈ కార్యంలోని పుణ్యాపాపాలు రెండూ ధృతరాష్ట్రుడి మీదనే ఉంచాడు ధర్మరాజు. అంటే, నిర్ణయం తీసికొనవలసింది ధృతరాష్ట్రుడే. అతడి నిర్ణయం దైవప్రేరితంగా ధర్మజుడు భావించి పురుషయత్నం చేయాలని భావించాడు. ధర్మజుడు స్వయంనిర్ణయం తీసికొని వైరాగ్య వృత్తిని వరిస్తాడేమో అనుకొని ధృతరాష్ట్రుడు పురుషయత్నం చేశాడు. ధర్మజుడు దానిని

నిపుణంగా త్రిప్పికొట్టి 'తండ్రి నిర్ణయమే దైవనిర్ణయంగా భావిస్తానన్నా'డని సంజయుడు తేల్చి చెప్పాడు. అంటే- పుణ్యపాపాలన్నీ ధృతరాష్ట్ర నిర్ణయం మీదే ఆధారపడి ఉన్నవనీ బాధ్యత గ్రుడ్డిరాజుదే అయిందనీ ధ్వని.

ఈ విధంగా ధర్మజ ప్రవృత్తిని తెలిపి అంతటితో ఆగక ధర్మజుడి ఎత్తుగడతో ధృతరాష్ట్రుడి అసలు బండారం ఎంత బైటపడుతుందో తెలిసేటట్లు వ్యంగ్యంగా రాజును అధిక్షేపగర్భితంగా ఆక్షేపించ నారంభించాడు. రాయబారి పాత్ర కంటె హితుడి పాత్రను గ్రహించి పలుక నారంభించాడు. అందులోని ముఖ్యాంశాలు ఇవి. అక్కడ నిర్ణయం ధర్మరాజుది. కాని, ఇక్కడ నిర్ణయం ధృతరాష్ట్రుడిది కాదు. అది దుర్యోధనాధీనం. ఆ దుర్యోధనుడి ఆలోచన కూడా అతడి స్వంతం కాదు. కార్యం నిశ్చయించేది కర్ణసౌబలులు. అందువలన కౌరవ నిర్ణయం పురుషయత్నమే కాదు. కాపురుషయత్నం, పరోక్ష యత్నం, పరాధీనమైన కార్యనిశ్చయం. అది అన్ని విధాలా అనర్థదాయకం. కాబట్టి ఈ పురుషయత్నం దైవబలం పొందలేక విఫలమౌతుందని ధ్వనిమయంగా పలికాడు. తన రాయబారి తనకే నీతి చెప్పితే వినే వింత పరిస్థితిలో పడ్డాడు ధృతరాష్ట్రుడు. ఇది శోచనీయావస్థ. (సంపా.)

ఆ. ఆలు బిడ్డ లేని యట్టి త్రిమ్మరి యగు । కొయ్య గాక, కుదుటఁ గూడు వెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబులు సేయఁ । జొచ్చు టిచ్చగించి చూతురయ్య? 9

ప్రతిపదార్థం: ఆలు బిడ్డ లేని అట్టి త్రిమ్మరి+అగు కొయ్య+కాక= పెళ్లాం బిడ్డా లేక ఇష్టం వచ్చినట్లు తిరిగే మొద్దుకాక; కుదుటన్+కూడు+పెట్టి కుడుచువారలు= ఒకచోట స్థిరంగా ఉండి అన్నం తినేవాళ్ళు; ఇట్టి క్రొవ్విదంబులు= ఇటువంటి పొగరుబోతు చేతలు; చేయన్+చొచ్చుట= చేయబూనటం; ఇచ్చగించి చూతురయ్య?= ఇష్టపడి చూస్తారా?

తాత్పర్యం: ఆలుబిడ్డలు లేక యథేచ్ఛగా తిరిగే మొద్దుగాక, ఒక చోట స్థిరంగా ఉండి అన్నం తినేవాళ్ళు ఇటువంటి పొగరుబోతు చేతలు ఇష్టపడి చూస్తూ ఊరుకొంటారా?

విశేషం: ఇది నిందోక్తి, అర్థవాదం. అలనాడు కురుసభలో దుర్యోధనాదులు చేసిన దుర్నయాన్ని నివారించకుండా ఉపేక్ష వహించిన ధృతరాష్ట్రుడి వర్తనం శత్రువుల చేత, మిత్రులచేత, ప్రజల చేత గర్హించబడుతున్నది. అది ఎంత నీచమైనదో సంజయు డీ పద్యంలో చెప్పాడు పరోక్షంగా. పెళ్ళాం బిడ్డలు లేనివాడు, దేశదిమ్మరి, మొద్దువంటివాడు అనే విశేషణాలు ధృతరాష్ట్రుడికి వర్తిస్తాయి. మర్యాదగా ఒక కుటుంబంలో ఉండి అన్నం తింటున్న పొగరుబోతులు కౌరవులు, వారివి అన్నం తినే వాళ్ళు చేసే పనులు కావు. పెళ్ళాలు బిడ్డలు లేనివాడు, తిరుగుబోతు, మొండిముండావాడు, బండ మొదలైనవి తెలుగుదనం ఉట్టిపడే తిట్లు. ఇవి సంజయుడు అంటున్నవిగా ఇందులో తోచినా తరువాతి పద్యంలో ఇవన్నీ ప్రజలంటూంటే చెవులు చీములు కట్టేట్లు వింటున్నవిగా చెప్పబడ్డాయి. ధృతరాష్ట్రుడికి ప్రజలలో ఉన్న అపకీర్తికి ఈ మాటలు అక్షర సాక్ష్యాలు. (సంపా.)

చ. కొడుకులఁ గానరే నృపు లకుంఠితతేజుల నెందు? నిమ్మెయిం
జెడు తెరు వైనచోఁ దగవు సెప్పక యొప్పరికించి చూతురే?
పుడమి జనంబులెల్ల నినుఁ బ్రువ్వఁగఁ దిట్టఁగ వించు నున్కి నొ
చ్చెడు మది యెప్పుడుం, జెవులు చీములు గట్టెడుఁ గౌరవేశ్వరా! 10

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా= కురురాజా! ధృతరాష్ట్రా!; ఎందున్= ఎక్కడా; నృపులు= రాజులు; అకుంఠిత తేజులన్ కొడుకులన్= మొక్కవోని తేజస్సుగల కొడుకులను; కానరే?= కనరా?; ఈ+మెయిన్= ఈ విధంగా; చెడు తెరువు+ఐనచోన్=

దుర్మార్గులయితే; తగవు+చెప్పక= బుద్ధి చెప్పక; ఒప్పరికించి చూతురే= గ్రుడ్లప్పగించి చూస్తారా?; పుడమి జనంబులు+ఎల్లన్= భూజనులందరూ; నినున్; ప్రువ్వఁగన్+తిట్టఁగన్= పుచ్చిపోయేటట్లు; తిడుతూంటే; వించున్+ఉన్కిన్= వింటూ ఉండటం చేత; మది= మనస్సు; ఎప్పుడున్; నొచ్చెడున్= బాధపడుతుంది; చెవులు చీములు+కట్టెడున్= చెవులు పుచ్చిపోతున్నాయి. (వినలేకపోతున్నానని భావం.)

తాత్పర్యం: కురురాజా! ధృతరాష్ట్రా! మరి ఎక్కడా రాజులు కుంటువడని తేజస్సుగల కొడుకులను కనరా? నీవొక్కడివే కన్నావా? ఈ తీరుగా వాళ్ళు అపమార్గంలో నడుస్తూంటే బుద్ధిచెప్పక గ్రుడ్లప్పగించి చూస్తూంటారా? ప్రజ లంతా నిన్ను పుచ్చిపోయేటట్లు తిట్టుతూండగా వింటూ ఉండటం నా మనస్సు కెప్పుడూ బాధాకరంగా ఉన్నది. నా చెవులు పుచ్చిపోతున్నాయి.

విశేషం: కానరే అనే క్రియ సార్థకం. జాగ్రత్తగా చూచుకోరా, సరిదిద్దుకోరా, రక్షించుకోరా అని అన్వయిస్తుంది. ప్రువ్వఁగఁ దిట్టఁగన్- తెలుగు నుడికారం. చెవులు చీములు గట్టెడు - తెలుగు జాతీయం. ఇవి తిక్కన రచనలోని తెలుగుదనానికి మచ్చుతునకలు. (సంపా.)

చ. చలమున దుస్ససేనుఁడును సౌబలుఁడున్ మిముఁ బట్టి యార్ప బొ
మ్మల క్రియ నాడుచుండుదురు మానక నీవు సుయోధనుండుఁ; దా
రలసి యొకప్డు పాండుసుతు లాగ్రహవృత్తికిఁ జొచ్చిరేని నీ
చలము బలంబునుం గులముఁ జక్కఁగఁ జేయరె యొక్క వ్రేల్మిడిన్? 11

ప్రతిపదార్థం: చలమునన్= మాత్సర్యంతో; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; సౌబలుఁడున్= శకునీ; మిమున్+పట్టి+ఆర్పన్= మిమ్మల్ని పట్టుకొని ఆడిస్తూంటే; నీవున్; సుయోధనుండున్= దుర్యోధనుడూ; మానక= విడువకుండా ఎప్పుడూ; బొమ్మల క్రియన్= బొమ్మలవలె; ఆడుచున్+ఉండుదురు= ఆడుతూ ఉంటారు; పాండు సుతులు= పాండవులు; ఒక+అప్డు= ఒకవేళ; తారు= తాము; అలసి= విసిగిపోయి; ఆగ్రహ వృత్తికిన్+చొచ్చిరి+ఏనిన్= కోపపడితే; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్కచిటిక సేపటిలో; నీ చలమున్ బలంబునున్ కులమున్= నీ మాత్సర్యాన్నీ, బలాన్నీ, కులాన్నీ, చక్కఁగన్+చేయరె?= నేలమట్టం చేసివేయరా?

తాత్పర్యం: దుశ్శాసనుడూ, శకునీ మాత్సర్యంతో మిమ్మల్ని పట్టుకొని ఎట్లా ఆడిస్తే అట్లా బొమ్మలవలె నీవూ, దుర్యోధనుడూ ఎప్పుడూ ఆడుతూ ఉంటారు. పాండవులే కనక ఒక వేళ విసిగిపోయి కినుక వహిస్తే, ఒక్క చిటిక కాలంలో నీ చలాన్నీ, బలాన్నీ, కులాన్నీ నేలమట్టం చేసివేయరా?

విశేషం: 'గులముఁ జక్కుగఁ జేయరె' - తెలుగు విశ్వవిద్యాలయప్రతి.

క. వినుము యుధిష్ఠిరు సైరణ । మనవారలు వెఱపుగా సమర్థింతురు; డీ
కొనఁగం దగరే కొండం । గని యోటమి వెట్టినట్లు, కౌరవనాథా! 12

ప్రతిపదార్థం: కౌరవ నాథా!= కురుప్రభూ, ధృతరాష్ట్రా!; వినుము; డీకొనఁగన్= ఎదుర్కొనగా; తగరే= పొట్టేలే; కొండన్+కని= కొండను చూచి; ఓటమి+పెట్టిన+అట్లు= ఓడిపోయిందని అన్నట్లు; మనవారు; యుధిష్ఠిరు సైరణన్= ధర్మరాజు శాంతాన్ని; వెఱపు+కాన్= పిరికితనంగా; సమర్థింతురు= భావిస్తారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. మనవాళ్ళు ధర్మరాజు శాంతాన్ని భయంగా భావిస్తున్నారు. ఇది ఎట్లా ఉన్నదంటే గొర్రెపొట్టేలు కొండను చూచి 'ఇది నాతో ఓడిపోతుంది' అన్నట్లున్నది.

విశేషం: అలం: ఉపమ. గొర్రెపొట్టేలు కొండను డీకొన్నట్లు అనే జాతీయం తెలుగులో ఉన్నది. పొట్టేలు మరొక పొట్టేలుతో తలతో డీకొట్టి పోరు చేయటం స్వభావం. పొగరు వలన, మదం వలన అది అట్లా చేస్తుంది. అది ఒక్కొకసారి అజ్ఞానంలో కొండను గూడా డీకొని తల పగిలి చనిపోతుంది. కాబట్టి ఎదుటివారి బలాన్ని అంచనా వేయకుండా పోరుకు దిగటాన్ని ఈ జాతీయంతో పోల్చి చెబుతారు. అయితే ఇక్కడ పొట్టేలు దుర్యోధనుడు. కదలకుండా ఉన్న కొండ సహనమూర్తి అయిన ధర్మరాజు. కొండ తనంత తాను ముందుకు వచ్చి డీకొనదు కాబట్టి అది ఓడిపోయినట్లే అని పొట్టేలు ప్రకటిస్తే ఎట్లా ఉంటుందో దుర్యోధనుడు ధర్మరాజు బలహీనుడు అని భావించి అతడు పోరులో ఓడిపోతాడని ఆశించటం అట్లా హాస్యాస్పదంగా ఉంటుందని సంజయుడు ఈ పోలిక చెప్పాడు. పొట్టేలుకూ దుర్యోధనుడికీ మదం, అవివేకం; ధర్మరాజుకూ కొండకూ సహనం. బలం సమాన లక్షణాలు. (సంపా.)

క. అనుజులకు నడ్డపడి యే । మిని జేయఁగ నీమిఁ జూచి మెచ్చితిగా కీ
వును; సాదు రేఁగె నేని । న్వినుు, తలపోలమునన కాని నిలువదు సుమ్మీ! 13

ప్రతిపదార్థం: (ధర్మరాజు); అనుజులకున్= తమ్ములకు; అడ్డము+పడి= అడ్డం వచ్చి; ఏమిని= ఏమీ; చేయఁగన్+ఈమిన్+ చూచి= చేయనీయకపోవటం చూచి; ఈవును= నీవు కూడా; మెచ్చితి(వి)+కాక= సంతోషించావు కాని; విను(ము); సాదు= సాధువైన జంతువు; రేఁగెన్+ఏనిన్= విజృంభించిందా; తలపోలమునన్+అ+కాని నిలువదు సుమ్మీ!= ఊరి చివరి భాగంలోనే కాని ఆగదు సుమా! తుదముట్టించక మానదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. ధర్మరాజు తమ్ములకు అడ్డం వచ్చి ఏమీ చేయనీయకుండా అదుపులో పెట్టటం చూచి నీవు కూడా సంతోషించావు కాని, సాధుజంతువు విజృంభించిందా, ఊరి చివరి భాగంలోనే కాని ఆగదు సుమా! తుదముట్టించి తీరుతుంది సుమా! (అట్లాగే పరమసాధువైన ధర్మరాజు కనుక కోపంతో విజృంభించాడా, నిన్ను సర్వనాశనం చేయకమానడని భావం.)

విశేషం: 'సాదురేఁగెనేనిన్.... సుమ్మీ. అలంకారం: అప్రస్తుత ప్రశంస. 'సాదురేఁగెనేనిన్':- సాధు అనుదాని పూర్వరూపము 'సాతు' సంస్కృతమున 'సార్థమ్'. అనగా వ్యాపారస్థుల సముదాయము. దీనిని పూర్వము 'బిడారు' వ్యాపార మనెడివారు. వర్తకులు తమ సరుకులను బండ్లు మొ॥ వానిపై వేసుకొనిపోయి ఒకచోట(అనువయినచోట) నిలిపి అమ్ముకొనెడివారు. ఒక మజిలీ విడిచిన తరువాత రెండవ మజిలీ చేరువరకు ఆగెడువారుకారు. ఇక్కడ ధర్మరాజు అడ్డుపడకపోతే అతని తమ్ములు వైరమునకు అంతమును చూసెడివారే. వారు తలచుకొంటే మధ్యలో ఆగరు. అంతుచూస్తారని భావం. (ఈ విషయం తెలుగుపరిశోధన 2వ సంచిక నుండి గ్రహింపబడినది - రచయితకు కృతజ్ఞతలు)' జనహితవ్యాఖ్య (పు.176-177).

చ. అనయము పుట్టె జూదమున యప్పుడ; యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం, బిదప నీకును నాకు మరల్పవచ్చునే? 14

ప్రతిపదార్థం: జూదమున+అప్పుడు+అ= జూదం ఆడినప్పుడే; అనయము+పుట్టెన్= అవినీతి ఏర్పడింది, కీడు మూడింది; నీ+ఉపేక్ష+అ= నీ ఊరుకోవడమే; ఎంతయున్= మిక్కిలి; చిచ్చు+పెట్టి కాల్చిన+అది= నిప్పుపెట్టి దహించివేసింది; వశీకృత చిత్తుఁడు ధర్మసూతి= స్వాధీన మనస్కుడైన ధర్మరాజు; మెత్తని పులి= పైకి మృదువుగా కనిపించే పులి; ఎల్లవారలున్= అందరూ; అధర్మము= అన్యాయం; నీ పయిన్= నీమీద; పెట్టు+అంతకున్= పెట్టేదాకా; వినఁడును+కానఁడున్= వినడు, కనడు;- ఏమీ ఎరుగనట్లు ఉంటాడు; పిదపన్= తరువాత- నీవు అన్యాయపరుడవని అందరూ నిన్ను నిందించిన తరువాత; నీకును, నాకును; మరల్పన్+వచ్చునే= వెనుకకు మరలించడం తరమా?

తాత్పర్యం: జూదం ఆడినప్పుడే అవినీతి ఏర్పడింది, కీడు మూడింది. అప్పుడు నీవు ఉపేక్షతో ఊరుకొనటమే (మనసులో) నిప్పు పెట్టి మిక్కిలి దహించివేసింది. (ఒడలు మండించింది.) ధర్మరాజు స్వాధీన మనస్కుడు. పైకి ఎంతో మృదువుగా కనిపించే పులి, లోకులంతా అన్యాయం నీమీద పెట్టే దాకా వినడు కనడు. ఏమీ ఎరుగనట్లు ఉంటాడు. అటువంటి నింద పడ్డ తరువాత అతడిని ఆపటం నీకూ నాకూ తరం కాదు.

విశేషం: 1. ఉద్యోగ పర్వంలో ప్రసిద్ధమైన పద్యాలలో ఇది ఒకటి. వక్త ఆలోచిస్తూ మాట్లాడటమే కాక వినేవారిచేత ఆలోచింప చేసే స్వభావం గల వాక్య విన్యాసం ఈ పద్య రచనాశిల్పం. ఈ పద్యంలో అయిదు వాక్యాలు ఉన్నాయి. వాక్యం వాక్యం మధ్య అభినయపరమైన విరామం పాటించబడటం గమనార్హం. రాజనీతిలో ఇటువంటి వాక్య శిల్పం తిక్కన రచనలో సర్వసామాన్యం.

2. సంజయుడు రాయబారిగా చేసిన ఈ దౌత్యకార్యంలో తాను చెప్పదలచుకొన్న పరమ తాత్పర్యాన్ని ఈ పద్యంలో చెప్పాడు. ఇది పాండవులు పంపిన సందేశం కాదు. సంజయుడి స్పందన; ధృతరాష్ట్రుడికి చెప్పదలచుకొన్న సత్య నివేదన రూపమైన హితవు.

3. జూదం ఆడినప్పుడే కీడు మూడింది. ఎవరికి? కౌరవులకని భావం. ఎటువంటి కీడు? పాండవులు ప్రతీకారం తీసికొనే పగ ఏర్పడటమనే కీడు. ఇది కూడా శ్రోతభావనకే వదలబడింది. ఆ తరువాత రెండో వాక్యం మొదలయ్యేలోగా వక్త హృదయంలో సాగిన భావన గమనించాలి. ఆ కీడు సమసిపోవటానికి వీలున్నదే. వెంటనే వారించినట్లయితే అది క్రోధ తీవ్రాగ్నిగా ప్రజ్వలించకుండా సమసి ఉండేది. అది జరగలేదు. అని చెప్పకుండా ధ్వనింపచేశాడు సంజయుడు.

4. ధృతరాష్ట్రుడు ఆ సభలో ఉపేక్ష వహించటమే చిచ్చు పెట్టి కాల్చినంత పని అయింది. "చిచ్చుపెట్టి కాల్చటం" తెలుగు జాతీయ ప్రయోగం. కళకళలాడుతున్న దానిని అగ్గిపెట్టి బుగ్గిచేయటమనీ, కలిసి ఉన్న వారి మధ్య కలహం పెట్టి వారిని కలతపెట్టటమనీ అర్థాలు చెప్పుకొనవచ్చును. చిచ్చుపెట్టి కాల్చటం వలన బాధ హృదయానికే కలుగుతుంది. ధృతరాష్ట్రుడు తండ్రిగా కౌరవ పాండవులు కలిసి ఉండటానికి యత్నించకుండా, ఊరకుండి కౌరవుల దుర్నయానికి తోడుపడ్డాడనే బాధ పాండవుల హృదయాలలో అగ్గిపెట్టినట్లు బాధ కలిగించి, వారిని నిలువునా దహించి వేసింది. ఇక ఆ బాధ నివారించడానికి వీలులేకపోయిందనీ, అది పగ సాధించటం వలననే చల్లారుతుందనీ భావం.

5. 'వశీకృతచిత్తుడు ధర్మసూతి మెత్తని పులి'- ఈ మూడు మాటలు ధర్మరాజు వ్యక్తిత్వాన్ని ధ్వనిమయంగా చిత్రించేవి. తమను అవమానించి వంచన చేసి, ఉపేక్షా భావాన్ని ప్రదర్శించినందుకు ధర్మరాజుకు తీవ్రమైన ఆగ్రహం కలిగింది కాని, అతడు వశీకృతచిత్తుడు కాబట్టి నిబ్బరంగా ఉన్నాడు. అతడి శాంతం అసమర్థత కాదు. అట్లా శాంతంగా ఉన్న ధర్మరాజు యమధర్మరాజు కొడుకు. అంటే సమయాన్ని చూచి కౌరవుల అంతం చూచేవాడు. ఎప్పుడు ఎట్లా మృత్యువు వస్తుందో తెలుపని విలయ శక్తి యమధర్మరాజు. అతడికి అన్ని విధాలా తగిన కొడుకు ధర్మరాజు. అందువలన అతడి వలన కౌరవులకు

మృత్యువెప్పుడు కలుగుతుందో జాగ్రత్తగా పరిశీలించ వలసి ఉంటుంది. మొత్తం మీద ధర్మరాజు మెత్తని పులి. పైకి మెత్తగా కనపడుతూ పులివలె శత్రువులపై లంఘించే క్రూరుడని భావం. తిక్కనగారు ధర్మరాజు కిచ్చిన తెలుగు బిరుద మిది. పండితుల ప్రశంసల నందుకొన్న ప్రయోగం అన్ని బాధలు పడి కూడా, పగ సాధించగలిగి కూడా శాంతికొరకు, సంధి కొరకు ప్రయత్నించటంలో మెత్తనిపులి స్వభావం గోచరిస్తుందని భావం.

6. మెత్తని పులి స్వభావం ఉద్యోగపర్వంలో ఎట్లా ప్రదర్శితమౌతుందో సంజయుడు వివేచించి చెప్పాడు. లోకులందరూ ధృతరాష్ట్రుడే పాండవులకు అన్యాయం చేశాడని అనుకొనేంత వరకూ ధర్మరాజు ఉలకడు, పలకడు. "వినఁడును కానఁడును" జాతీయం. మరే విషయాన్నీ విన్నట్లుగా గాని, చూచినట్లుగా గాని కనపడక ఏమీ ఎరుగనట్లు అమాయకంగా ఉంటాడని భావం. దానివలన ప్రజల సానుభూతి అతడి పట్ల ఏర్పడుతుంది అని ధ్వనిమయంగా ఊహించుకొనాలి.

7. ఆ తరువాత నాకూ నీకూ అతడిని మరల్చటం సాధ్యమౌతుందా? - ఈ వాక్యం కూడా జాతీయంతో కూడి ఉన్నది. మరల్చటం దేని నుండి? సాదురేగితే తలపాలానగాని ఆగడు కదా! అటువంటి యుద్ధం నుండి మరల్చటం. 'నీకూ నాకూ' అనే మాటల ప్రయోగం నుడికారం. ఇప్పుడు సంధి యత్నంలో ఉన్న నీకూ నాకూ అని ఒక అర్థం. ఎవరికైనా అని నుడికారపరమైన అర్థం.

8. ఈ పద్యం ప్రశ్నార్థకంతో ముగియటం కూడా సార్థకమే. ఆ ప్రశ్న ధృతరాష్ట్రుడి మనశ్శాంతిని, నిద్రను భగ్నం చేసింది. (సంపా.)

చ. అనయము నొచ్చుచున్నయవి యంగము లెల్లను వేగ వచ్చుట;
న్మనము వశంబు గాదు; జననాయక! ప్రొద్దును బోయె; నిప్పు డేఁ
బనివిని రేపు పుత్త్రులును, బంధులు, నాప్తులు, నీవు నేర్పడన్
విన మన కార్యమంతయు సవిస్తరతం దగ విన్నవించెదన్.' 15

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!, ధృతరాష్ట్రా!; వేగన్+వచ్చుటన్= వడిగా రావటం చేత; అంగములు+ఎల్లను= అవయవాలన్నీ; అనయమున్= మిక్కిలి; నొచ్చుచున్+ఉన్న+అవి= నొప్పిపెడుతున్నాయి; మనము= మనస్సు; వశంబు+కాదు= స్వాధీనంలో లేదు; ప్రొద్దునున్+పోయెన్= ప్రొద్దుకూడా పోయింది; ఇప్పుడు; ఏన్= నేను; పనివిని= వెళ్లి పోయి; రేపు= ప్రొద్దున; పుత్త్రులును= కొడుకులూ; బంధులున్= చుట్టాలూ; ఆప్తులున్= స్నేహితులూ; నీవున్= నీవూ; ఏర్పడన్+వినన్= స్పష్టంగా వినేటట్లు; మన కార్యము+అంతయున్= మన ప్రయత్నం అంతా; తగన్= ఒప్పుగా; సవిస్తరతన్= విపులంగా; విన్నవించెదన్= మనవి చేస్తాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! నేను వేగంగా రావటం వలన నా అవయవాలన్నీ నొప్పి పెడుతున్నాయి. నా మనస్సు స్వాధీనంలో లేదు. ప్రొద్దు కూడా పోయింది. ఇప్పుడు నేను వెళ్ళిపోయి ప్రొద్దున నీ కొడుకులూ, బంధువులూ, మిత్రులూ, నీవూ స్పష్టంగా వింటూండగా మన కార్యం అంతా ఒప్పుగా వివరంగా విన్నవిస్తాను.'

ఆ. అనిన, 'నట్ల కాక' యని సంజయుని వీడు । కొలిపి, కొంత ప్రొద్దు కురువిభుండు
కార్యచింత మునిఁగి, కంచుకి నొక్కరుఁ । బిలిచి, వేగ విదురుఁ బిలువు మనియె. 16

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కురు; విభుండు= కురురాజైన ధృతరాష్ట్రుడు; అట్లు+అ కాక= అలాగే; అని; సంజయునిన్; వీడు కొలిపి= పంపి; కొంత ప్రొద్దు= కొంతసేపు; కార్య చింతన్= కర్తవ్యాన్ని గురించిన ఆలోచనలో; మునిఁగి; కంచుకిన్+ ఒక్కరున్= కంచుకినొకడిని; పిలిచి; వేగన్= శీఘ్రంగా; విదురున్; పిలువుము+అనియెన్.

తాత్పర్యం: అని సంజయు డనగా ధృతరాష్ట్రుడు 'అట్లాగే' అని అతడిని పంపివేసి, కొంతసేపు కర్తవ్యం గురించిన ఆలోచనలో మునిగి, ఒక కంచుకిని పిలిచి, 'విదురుడిని వేగంగా పిలువుము' అన్నాడు.

వ. వాఁడును సత్వరంబుగాఁ జని యతనిం దోడ్తెచ్చి కాన్పించిన, నమ్మహీవరుం డత్యాదరంబున విదురుం దనయొద్ద నునిచికొని యతని కి ట్లనియె: 17

ప్రతిపదార్థం: వాఁడును= ఆ కంచుకియు; సత్వరంబుగాన్= వేగంగా; చని= వెళ్ళి; అతనిన్= విదురుడిని; తోడ్తెచ్చి= తీసికొనివచ్చి; కాన్పించినన్= చూపగా; ఆ+మహీవరుండు= ఆ రాజు ధృతరాష్ట్రుడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో; విదురున్; తన+ఒద్దన్= తన దగ్గర; ఉనిచికొని= ఉంచుకొని; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కంచుకి వేగంగా వెళ్ళి విదురుడిని తీసికొని వచ్చి చూపగా, ఆ రాజు మిక్కిలి ప్రీతితో విదురుడిని తన దగ్గర కూర్చుండబెట్టుకొని అతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'పాండురాజసుతుల పాలికిఁ జని యిప్డు । సంజయుండు వచ్చి, సమ్ముఖమున
నన్నుఁ జాల దూఱి, నాకు రే పచ్చటి । పనులు సెప్పువాఁడ ననుచుఁ జనియె. 18

ప్రతిపదార్థం: సంజయుండు; పాండురాజు సుతుల పాలికిన్+చని= పాండవుల దగ్గరకు వెళ్ళి; ఇప్డు= ఇప్పుడు; వచ్చి; సమ్ముఖమునన్= ముఖంమీద; సమక్షంలో, నన్నున్; చాలన్= మిక్కిలి; దూఱి= తిట్టి; రేపు= ప్రొద్దున; నాకున్; అచ్చటి పనులు= అక్కడ జరిగిన కార్యాలు; చెప్పువాఁడన్; అనుచున్; చనియెన్= వెళ్లాడు.

తాత్పర్యం: సంజయుడు పాండవుల దగ్గరకు వెళ్ళి ఇప్పుడు వచ్చి, నన్ను నా ముఖం మీదే మిక్కిలి తిట్టి, ప్రొద్దున నాకు అక్కడి కార్య విశేషాలు చెపుతానని వెళ్ళాడు.

క. అప్పటినుండియు నెవ్వగ । గప్పికొనినఁ జిత్తవృత్తి గలఁగెడు; మేనున్
నిప్పులఁ బొరలినయ ట్లయి । చొప్పడ దించుకయు నిద్ర శుద్ధవిచారా!' 19

ప్రతిపదార్థం: శుద్ధ విచారా!= నిర్మల భావా- విదురా!; అప్పటి నుండియున్; నెవ్వగ - నెఱ+వగ= మిక్కిలి దుఃఖం; కప్పికొనినన్= ఆక్రమించగా; చిత్తవృత్తి= మనస్థితి; కలఁగెడున్= కలత చెందింది; మేనున్= శరీరం కూడా; నిప్పులన్= నిప్పులలో; పొరలిన+అట్లు+అయి= దొరలినట్లుగా అయి; నిద్ర; ఇంచుకయున్= కొంచెం కూడా; చొప్పడదు= లభించదు.

తాత్పర్యం: నిర్మలభావా, విదురా! అప్పటి నుంచి అధికమైన దుఃఖం ఆక్రమించి మనస్థితి కలత చెందింది. శరీరం నిప్పులలో పొరలినట్లయి కొంచెం కూడా నిద్రపట్టదు.'

విశేషం: తన ఉపేక్షయే విపత్తుకు మూలమని తెలిసిన తరువాత ధృతరాష్ట్రుడి మనస్సు దుఃఖంతో నిండింది. "సర్వేంద్రియాణ్య ప్రకృతిం గతాని' (సం. 5-33-12) అని మూలం. నెవ్వగ, కలత మనస్సులో పొందే అవస్థలు. వాటి వలన కలిగే సాత్త్వికభావం శరీరం నిప్పులలో పొరలినట్లు తాపం పొందటం. ఈ ఉపమానం జాతీయం. (సంపా.)

వ. అనిన, విదురుం డిట్లనియె : 20

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విదురు డతడితో ఇట్లా అన్నాడు :

క. 'బలవంతుఁడు పై నెత్తిన । బలహీనుఁడు, ధనము గోలుపడిన యతఁడు, ము
చ్చిల వేచువాఁడుఁ, గామా । కుల చిత్తుఁడు నిద్రలేక కుందుదు రధిపా! 21

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా! బలవంతుడు; పైన్+ఎత్తిన= మీద పడిన; బలహీనుఁడున్= దుర్బలుడూ; ధనము+కోలుపడిన+అతఁడున్= డబ్బు పోగొట్టుకున్నవాడూ; ముచ్చిలన్ వేచువాఁడున్= దొంగిలించటానికి ఎదురుచూచేవాడూ; కామ+ఆకుల చిత్తుఁడున్= కామం (కోరిక) చేత కలతపడిన మనస్సు గలవాడూ; నిద్ర లేక కుందుదురు= నిద్రపట్టక బాధ పడతారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! బలవంతుడు మీదపడిన దుర్బలుడూ, డబ్బు పోగొట్టుకొన్నవాడూ, ఎప్పుడు దొంగిలిద్దామా అని కాచుకొని కూర్చున్నవాడూ, కామం చేత మనస్సు కలత చెందినవాడూ నిద్రపట్టక బాధపడతారు.

విశేషం: ఇది చక్కని సూక్తి. దీనికి మూలం-

"అభియుక్తం బలవతా, దుర్బలం హీన సాధనమ్
హృతస్వం కామినం చోర, మావిశన్తి ప్రజాగరాః" (సం. 5-33-13)

క. ఇక్కొఱగాముల లోపల । నొక్కటి నీ చిత్తవృత్తి నొందెనొ? యొరు సొ
మ్మెక్కటి గుడువఁ దలంచితొ? । నిక్కము గత మేమి సెపుమ నిద్ర సెడుటకున్?' 22

ప్రతిపదార్థం: ఈ+కొఱగాముల లోపలన్= ఈ దోషాలలో; ఒక్కటి; నీ చిత్త వృత్తిన్+ఒందెనొ= నీ మనస్సులో చోటుచేసికొన్నదా; ఒరు సొమ్ము= ఇతరుల ధనం; ఎక్కటి= ఒక్కడవే; కుడువన్+తలంచితొ= అనుభవించాలనుకొన్నావొ; నిద్ర+చెడుటకున్= నిద్రపట్టకపోవటానికి; నిక్కము కతము+ఏమి+చెపుమ= నిజమైన కారణం ఏమిటో చెప్పుము.

తాత్పర్యం: ఈ దోషాలలో ఏదయినా ఒక్కటి నీ మనస్సులో ప్రవేశించిందా?, ఇతరుడి ధనం ఒక్కడవే అనుభవించాలనుకొన్నావా? నిద్ర పట్టకపోవటానికి నిజమైన కారణం ఏమిటో చెప్పుము.'

విశేషం: పైన చెప్పిన కారణాలే కాక విదురుడు మరొక క్రొత్త కారణాన్ని కల్పించాడు. అది ఇతరుల ధనాన్ని మరొకడు ఒక్కడే అనుభవించటం. దానిని పేర్కొని ఎత్తిపొడిచాడు విదురుడు. (సంపా.)

తే. అనిన, ధృతరాష్ట్రుఁ డిట్లను నతనితోడ । 'ధర్మసుతుమాటచొ ప్పెవ్విధంబొ యెఱుఁగ
కునికిఁజేసి చింతిల్లితి; నోపు దీవు । దెలియఁ జెప్పి నా యలమట మలుగఁ జేయ.' 23

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుఁడు; అతని తోడన్; ఇట్లు+అనున్; ధర్మసుతు మాట చొప్పు= ధర్మరాజు మాట తీరు; ఏ+విధంబొ= ఎటువంటిదో; ఎఱుఁగక+ఉనికిన్+చేసి= తెలియకపోవటం చేత; చింతిల్లితిన్= దుఃఖించాను; ఈవు= నీవు; తెలియన్+చెప్పి; నా+అలమటన్= నా దుఃఖాన్ని, మలుగన్+చేయన్= పోగొట్టటానికి; ఓపుదు(వు)= చాలుదువు.

తాత్పర్యం: అని విదురు డనగా ధృతరాష్ట్రు డతడితో ఇట్లా అన్నాడు. 'ధర్మరాజు ఏమన్నాడో తెలియకపోవటం చేత దుఃఖించాను. నీవు స్పష్టపరిచి నా దుఃఖాన్ని పోగొట్టగలవు.'

చ. అనవుడు నిట్లనున్ విదురుఁ; 'డక్కట! ధర్మసుతుండు బాంధవుం
డును జెలికాఁడునుం దగు భటుండును బ్రెగ్గడయున్ గురుండుఁ గాఁ
డె, నృపవరేణ్య! నీకుఁ? బ్రకటీకృత సత్త్వుఁడు శాంతమూర్తి స
ద్వినయ వివేక శీలముల విశ్రుతుఁ; డాతఁడు గీడు వల్కునే? 24

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధృతరాష్ట్రుడు అనగానే; విదురుఁడు; ఇట్లు+అనున్; అక్కట!= అయ్యో!; నృపవరేణ్య!= రాజశ్రేష్ఠుడా!; నీకున్; ధర్మసుతుండు= ధర్మరాజు; బాంధవుండును= చుట్టమూ; చెలికాఁడునున్= స్నేహితుడూ; తగు భటుండును= తగిన బంటూ; ప్రెగ్గడయున్= మంత్రీ; గురుండున్= రక్షకుడూ; కాఁడె?= కాడా?; ప్రకటీకృత సత్త్వుఁడున్= బయల్పరుపబడిన సత్త్వగుణం కలవాడూ; శాంతమూర్తి; సత్+వినయ వివేక శీలములన్= మంచి వినయం; వివేకం; శీలమూ అనే వాటి యందు; విశ్రుతుఁడున్= ప్రసిద్ధుడూ; ఆతఁడు= ఆ ధర్మరాజు; కీడు+పల్కునే= తప్పు మాట్లాడుతాడా?'

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అనగానే విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'అయ్యో! రాజోత్తమా! నీకు ధర్మరాజు బంధువూ, స్నేహితుడూ, తగిన భటుడూ, మంత్రీ, రక్షకుడూ కాడా? తన సత్త్వగుణాన్ని స్పష్టపరిచినవాడూ; శాంతమూర్తీ, మంచి వినయం, వివేకం, శీలం అనే వాటిలో ప్రసిద్ధుడూ అయిన అతడు తప్పు మాట్లాడుతాడా?

ఆ. నీవుఁ గొడుకు వారి నెఱి లేక పఱిచితి; । రదియ చాలు; నుచితమైన పాలు
పంచి యిండు; పిల్లి వట్టిన యీరువు । సేసియున్న నేల చెల్ల నేర్చు? 25

ప్రతిపదార్థం: నీవున్+కొడుకున్= నీవూ, నీ కొడుకు దుర్యోధనుడూ; వారిన్= పాండవులను; నెఱి లేక= న్యాయం లేక-అన్యాయంగా; పఱిచితిరి= బాధించారు; అది+అ చాలున్= అదే చాలు; ఉచితము+ఐన పాలు= వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం; పంచి+ఇండు= పంచి ఇవ్వండి; పిల్లి+పట్టిన+ఈరువు+చేసి+ఉన్నన్= పిల్లి పట్టుకున్న మాంసంలా చేస్తే; ఏల చెల్లన్+నేర్చున్= ఎందుకు చెల్లుతుంది?

తాత్పర్యం: నీవూ, నీ కొడుకు దుర్యోధనుడూ వాళ్ళను అన్యాయంగా బాధించారు. అది చాలదా? వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం పంచిపెట్టండి. అంతేకాని, పిల్లి పట్టుకున్న మాంసం విధం చేస్తే ఎట్లా చెల్లుతుంది?

విశేషం: 'పిల్లి వట్టిన యీరువు' - దీనికి అనేకులు అనేక విధాలైన అర్థాలు చెప్పారు. శ్రీ ముప్పంగి లక్ష్మీనృసింహ శర్మగారు ఇట్లా చెప్పారు: 'ఈరువునకు చేఁదుగుండె' అని పడమటి సీమలోఁ గొంత భాగమున వాడుట కలదు. ప్రకృత సందర్భమున రాజ్యము సర్వము హరింపవలయునను దురాశకును, పాండవుల పరాక్రమమునకు జడుపునకును జిక్కువడిన ధృతరాష్ట్రునకు సరిపడ 'పిల్లి వట్టిన యీరువు' అని ఉపమింపఁబడినది. చేఁదుగుండెఁగఱచి తినుటకుఁజేఁదు, విడువ మనసొప్పదు-ఇట్లు మ్రింగలేక, క్రక్కలేక పెనఁగుచున్న పిల్లితో ధృతరాష్ట్రునకుఁ బోలిక చెప్పఁబడినది. ఈరువునకు మాంసమను నర్థము గ్రహించుచో నీ సందర్భమున కొప్పదు. మాంసమును బట్టిన పిల్లి దానిని గబళించి వేయును. అట్టిచో మ్రింగుడు వడక, క్రక్కనిష్టము లేక తల్లడపడు ధృతరాష్ట్రునకుఁ బోలిక యెట్లు? కావునఁ జేఁదుగుండె అను నర్థమే అన్నిట నొప్పియున్నది.'

వీరి అభిప్రాయం బాగానే ఉన్నది కాని, దీనికి ప్రధాన ప్రతిబంధకాలు రెండు ఉన్నాయి. ఒకటి- 'ఈరువు' అనే పదానికి ఏ నిఘంటువులోనూ 'మాంసము' అనే అర్థమేకాని, చేదుగుండె అనే అర్థం లేకపోవటం. రెండు- ఈరువునకు చేదుగుండె అనే వాడుక పడమటి సీమలో కొంతభాగంలో ఉన్నదట- కవి అంత అప్రసిద్ధమైన అర్థంలో ఈ శబ్దాన్ని ఎందుకు వాడతాడు? ఏమాత్రం వాడుకలో ఉన్నా అది నిఘంటువుల కెక్కి ఉండేదే.

'ఈరువు'నకు మాంసం అనే అర్థాన్ని చెప్పినా, ఈ సందర్భానికి అతుకుతుంది. ధృతరాష్ట్రుడు పాండవుల భాగాన్ని కూడా పట్టుకుని వదలిపెట్టటం లేదు. అది పిల్లి మాంసం పట్టుకుని విడిచిపెట్టకపోవటంవలె ఉన్నది. పిల్లి పట్టిన ఈరువువలె పాండవుల రాజ్యభాగాన్ని పట్టుకొని విడిచిపెట్టకపోతే ఎట్లా చెల్లుతుంది? అని సమన్వయం. ఇలా అర్థం చెపితే పైని చెప్పిన ప్రతిబంధకాలు ఉండవు. 'డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగమీక నీ వెక్కటి మ్రింగఁజూచెదు' (52) అనే పద్యం అభిప్రాయాన్నే చెపుతుంది.

ఈ 'ఈరువు'నకు 'ఈలువు' అనే పాఠం కొన్ని ప్రతులలో ఉన్నది. ఈలువు అనే మాటకు 'పాతివ్రత్యం' 'వ్రతం' అనే అర్థాలున్నాయి. 'పిల్లి పట్టిన వ్రతం' అంటే ఏమిటో- అది ఈ సందర్భానికి ఎట్లా కుదురుతుందో తెలియదు.

వ. మీరు శకుని కర్ణ దుశ్శాసనుల మీఁద రాజ్యభారంబు వెట్టికొనియుండుదు; రిది దుది ముట్టనేర దెట్లంటేని. 26

ప్రతిపదార్థం: మీరు, శకుని కర్ణ దుశ్శాసనుల మీఁదన్; రాజ్య భారంబు= ప్రభుత్వపు బాధ్యతను; పెట్టికొని+ఉండుదురు= ఉంచి వ్యవహరిస్తారు; ఇది; తుదిముట్టన్+నేరదు= కొనసాగలేదు; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎలా అంటావేమో!

తాత్పర్యం: మీరు- నీవూ నీ కొడుకూ- శకుని కర్ణ దుశ్శాసనులపై రాజ్యభారం మోపి ఉంటారు. ఇది చివరిదాకా కొనసాగబోదు. ఎలా అంటావేమో.

క. తముఁ దా రెఱుఁగుట, వేగ ప । డమి, దాలిమి, విడుపు గలుగుటయు లేని ప్రభు
త్వము గలదె? వారియం దీ । సుమానుషము లొకఁడుఁ బట్టి చూడం గలఁడే? 27

ప్రతిపదార్థం: తమున్= తమను; తారు= తాము; ఎఱుఁగుట= తెలిసికొనుట; వేగ పడమి= తొందరపడకపోవటం; తాలిమి= ఓర్పు; విడుపు+కలుగుటయున్= త్యాగం, ఈవి కలుగుటా; లేని ప్రభుత్వము+కలదె?= లేని ప్రభుత్వం ఉందా?; వారి యందున్= ఆ శకుని కర్ణ దుశ్శాసనులలో; పట్టిచూడన్= బాగా పరిశీలించి చూస్తే; ఈ సుమానుషములు+ఒకఁడున్= ఈ సుగుణాలలో ఒక్కటైనా; కలఁడే= కలవాడున్నాడా?

తాత్పర్యం: తమను తాము ఎరగటం, తొందరపడకపోవటం, ఓర్పు, ఈవీ లేని ప్రభుత్వం ఉంటుందా? ఆ శకుని కర్ణ దుశ్శాసనులలో బాగా పరిశీలించి చూస్తే పైసుగుణాలలో ఒక్కటైనా కలవాడున్నాడా?

వ. యుధిష్ఠిరుండు నీవు నిక్కమ తండ్రివని, తగవు నమ్మి, చాల సైరించియున్నవాఁ; డది నీవ యెఱుంగు' దనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె : 28

ప్రతిపదార్థం: యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నీవు; నిక్కము+అ= నిజంగానే; తండ్రివి+అని= తండ్రిగా తలంచి; తగవు నమ్మి= ధర్మాన్ని నమ్మి; చాలన్= మిక్కిలి; సైరించి ఉన్నవాఁడు= ఓపికపట్టి ఉన్నాడు; అది= ఆ సంగతి; నీవు+అ= నీవే; ఎఱుంగుదు(వు); అనినన్; విని; ధృతరాష్ట్రుండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు నీవు నిజంగానే తండ్రివని, ధర్మం నమ్మి, మిక్కిలి ఓపికపట్టి ఉన్నాడు. అది నీవే ఎరుగుదువు' అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు :

తే. **'సంజయునిచేతఁ గార్యంబు చంద మెల్లి । యెఱిఁగి, మన కెద్ది సేయంగఁ దెఱఁగు, దానిఁ**
బనిచి చేయింపు; మిపుడు నా మనము దల్ల । డిలుట హితభాషణంబుల డిందుపఱుపు. **29**

ప్రతిపదార్థం: సంజయుని చేతన్= సంజయుడివలన; కార్యంబు చందము= కార్యం రీతి; ఎల్లి= రేపు; ఎఱిఁగి= తెలిసికొని; మనకున్; ఎద్ది= ఏది; చేయంగన్+తెఱఁగు= చేస్తే క్షేమకరమో; దానిన్, పనిచి= నియోగించి; చేయింపుము; ఇపుడు; నా మనము= నా మనస్సు; తల్లిడిలుట= కలత చెందటాన్ని; హిత భాషణంబులన్= మేలు కూర్చే మాటలతో; డిందు పఱుపు(ము)= మాన్పుము.

తాత్పర్యం: 'సంజయుడు వెళ్ళిన పని ఏమయిందో రేపు అతడివలన తెలిసికొని మన కేది చేస్తే క్షేమకరమో దానిని నియోగించి చేయించుము. ఇప్పుడు నా మనస్సులోని కలతను హితభాషణాలతో మాన్పుము.

వ. **నీవు ధర్మాధర్మ విదుండవు; నయానయజ్ఞుండవు. నాకుం బ్రజాగరం బొనర్చుచున్న సంతాపం బుపశమిం చునట్లుగా భవద్వచనామృతంబు నా యుల్లంబున వెల్లిగొల్పు' మనిన విదురుం డిట్లనియె.** **30**

ప్రతిపదార్థం: నీవు, ధర్మ+అధర్మ విదుండవు= ధర్మాధర్మాలు తెలిసినవాడవు; నయ+అనయజ్ఞుండవు= నీతి, అవినీతి తెలిసినవాడవు; నాకున్; ప్రజాగరంబు+ఒనర్చుచున్+ఉన్న= నిద్రలేమి కలిగిస్తూన్న; సంతాపంబు= దుఃఖం; ఉపశమించు+ అట్లుకాన్= తగ్గేలాగ; భవత్+వచన+అమృతంబు= నీ మాటలనే అమృతం; నా+ఉల్లంబునన్= నా మనస్సులో; వెల్లి+కొల్పుము= ప్రవహించేటట్లు చేయుము; అనినన్; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవు ధర్మాధర్మాలూ, నీత్యవినీతులూ తెలిసినవాడవు. నాకు నిద్రాఖేదాన్ని కలిగిస్తూన్న దుఃఖం పోయేటట్లు నీ వచనం అనే అమృతాన్ని ప్రవహింపచేయి' అనగా విదురుడిట్లా అన్నాడు.

ధృతరాష్ట్రునకు విదురుఁడు హిత ముపదేశించుట (సం. 5-33-16)

క. **'జనులకు నొడఁ బా టగువిధ । మున నడచుచు, లోకనింద్యముల నుడుగుచు, మీఁ**
దని యొకని కలిమి కులుకక । మనుజులతోఁ బొంది పొసఁగి మను టొప్పు నృపా! **31**

ప్రతిపదార్థం: నృపా!= రాజా, ధృతరాష్ట్రా!; జనులకున్; ఒడఁబాటు+అగు విధమునన్= అంగీకారమైన రీతిలో; నడచుచున్= ప్రవర్తిస్తూ; లోక నింద్యములన్= లోకం చేత నిందించదగిన పనులను; ఉడుగుచున్= మానుతూ; మీఁదు+అని= గొప్ప అని- తన కలిమికంటె ఎక్కువని; ఒకని కలిమికిన్= ఇంకొకడి సంపదకు; ఉలుకక= ఈర్ష్య చెందక; మనుజులతోన్= మనుష్యులతో; పొంది పొసఁగి= కలిసియుండి; మనుట= బ్రతకడం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: 'రాజా, ధృతరాష్ట్రా! జనులకు అంగీకారమైన విధంగా ప్రవర్తిస్తూ, లోకం నిందించే పనులను చేయటం మాని, తన సంపద కంటె ఎక్కువని ఇంకొకడి సంపదకు ఈర్ష్య చెందక, మనుష్యులతో కలిసి మెలిసి బ్రతకటం మంచిది.

విశేషం: విదురుడు చేసే హితబోధ తత్కాలంలో ధృతరాష్ట్రుడి చిత్తవృత్తిని సంస్కరించి శాంతిని కూర్చేదీ, సర్వకాలాలలో లోకులకు హితం కలిగించేదీ కావటం విశేషం. అతడి బోధలో మూడంశాలు ముఖ్యంగా ఉన్నాయి. 1.లోకనీతి, 2.ధర్మప్రీతి 3.దైవభీతి. ఈ మూడూ త్రికరణ శుద్ధితో పాటిస్తే చిత్తశాంతి కలుగుతుందని హితబోధ తాత్పర్యం. ఈ పద్యంలో లోకనీతికి సంబంధించిన ముఖ్యాంశాలు నాలుగు పేర్కొనబడ్డాయి.

అవి- 1. జనులు మెచ్చుకొనేటట్లు ప్రవర్తించటం. 2.లోకులు నిందించే పనులను చేయకుండటం. 3. ఇతరులు తమకంటె బాగుపడుతున్నారే అని అసూయపడకుండా ఉండటం. 4.అందరితో కలిసి మెలిసి జీవించటం. 'యథారాజా తథా ప్రజా' అని న్యాయం. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్త దే వేతరో జనః । సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే" అని భగవద్గీత. అందువలన రాజు ప్రజలు మెచ్చుకొనేటట్లు ప్రవర్తించటం ప్రథమ నీతి. ధృతరాష్ట్రుడు లోభంతో పాండవులకు అన్యాయం చేసి అధర్మవర్తనుడని లోకంలో అపకీర్తి పొందాడు. ఆ అపకీర్తి అతడి అశాంతికి మూలం. రాజు ద్యూతం వంటి వ్యసనాలను అధికారికంగా గుర్తించి, వాటి వలన కలిగే ఫలితాలను ధర్మ పాలనలో భాగంగా పరిగణించటం వలన లోకనింద ఏర్పడుతుంది. నిందను లెక్కచేయకుండా వ్యవహరిస్తే మనస్తాపం తప్పదు. ధృతరాష్ట్రుడు అటువంటి లోకనిందాకరమైన ద్యూత చర్యకు ధర్మప్రతిపత్తి కలిగించి పరిపాలనను కలుషితం చేశాడు. దాని ఫలితం అనుభవిస్తున్నాడు. అసూయ మనస్సుకు చీడపురుగు వంటిది, ప్రవర్తనకు పాము కాటు వంటిది. పాండవ సంపదకు అసూయ పడి అన్యాయంగా దానిని దొంగిలించాలని కపట ద్యూతాన్ని జరిపి కలుషవర్తనులనిపించుకొన్నారు దుర్యోధనాదులు. ఆ పాపానికంతా అండదండలుగా నిలిచినవాడు ధృతరాష్ట్రుడు. అతడి మనస్సులోని అసూయయే అంతటి హాలాహలాన్ని పాండవ జీవితంలో నింపింది. పరుల సంపదను చూచి ఓర్వలేని ఆ చుప్పనాతి గుణం కట్టెలోని నిప్పువలె మనిషిని బూది చేస్తుంది. అందుకే ధృతరాష్ట్రుడికి అంతటి అశాంతి. కౌరవ, పాండవులు నీరక్షీరాల వలె కలిసి ఉంటే వంశానికి మేలు. కాని, ధృతరాష్ట్రుడికి స్వార్థబుద్ధి దుర్యోధనుడి దుష్ట ప్రయత్నాలను మాన్పలేక వంశనాశనానికి దోహదం చేసింది. ధృతరాష్ట్రుడు లోకనీతికి ఆదర్శం కావలసిన శ్రేష్ఠుడు, ప్రభువు. అతడే నీతి తప్పాడు. నిందించదగిన పనులు చేశాడు. అసూయకు గురిఅయ్యాడు. తమ్ముడి కొడుకులతో కలిసి ఉండలేకపోయాడు. ఈ నాలుగు దోషాలకూ గురి అయిన ధృతరాష్ట్రుడు పొందే మనస్తాపం స్వయంకృతాపరాధమే అని తాత్పర్యం. (సంపా.)

క. కోపము, నుబ్బును, గర్వము । నాపోవక యునికియును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి । కాపురుషగుణంబు లండ్రు కౌరవనాథా! 32

ప్రతిపదార్థం: కౌరవనాథా= కురురాజా, ధృతరాష్ట్రా!; కోపమున్, ఉబ్బును= పొంగిపోవటమూ; గర్వమున్; ఆపోవక+ఉనికియును= తృప్తిలేకపోవడమూ; దురభిమానమున్= తగని అభిమానమూ; నిర్వ్యాపారత్వమున్= ఏ పనీ చేయకపోవటమూ; అను+ఇవి; కాపురుష గుణంబులు+అండ్రు= దుర్జనుడి గుణాలు అంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కోపమూ, పొంగిపోవటమూ, గర్వమూ, తృప్తిలేకపోవటమూ, దురభిమానమూ, ఏ పనీ చేయకపోవటమూ అనే ఇవి దుర్జనుడి లక్షణాలు అంటారు.

విశేషం: అంతశ్శత్రువుల వంటి ఈ ఆరుగుణాలు కలవాడు అధముడు. దుర్యోధను డటువంటి వాడు, అతడిని సమర్థించే ధృతరాష్ట్రుడూ ఆ కోవకు చెందుతాడు. ఇటువంటి వారి ప్రవర్తనం సంఘనీతికి చేటు. (సంపా.)

క. ఏలిన వానిని, దైవము, । నాలిని, బంధులను సముచితారాధన సం
శీలతఁ బ్రీతులఁ జేయని । పాలసుఁడా ఫలము లాసపడు, మనుజేంద్రా! 33

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= రాజా! ధృతరాష్ట్రా!; ఏలినవానిని= రాజునూ; దైవమున్= భగవంతుడినీ; ఆలిని= భార్యనూ; బంధులను= చుట్టాలనూ; సముచిత+ఆరాధన సంశీలతన్= తగిన విధంగా పూజించే సత్స్వభావంతో; ప్రీతులన్+చేయని పాలసుఁడా= సంతోష పరచని యుక్తాయుక్త వివేకశూన్యుడా; ఫలములు+ఆసపడున్?= సత్ఫలితాలు ఆసపడేది?

తాత్పర్యం: ధృతరాష్ట్రా! రాజునూ, భగవంతుడినీ, భార్యనూ, చుట్టాలనూ, తగిన విధంగా పూజించే సత్స్వభావంతో సంతోషపెట్టని యుక్తాయుక్త వివేకశూన్యుడా సత్ఫలితాలు ఆశించేది?

విశేషం: లోకనీతి ననుసరించి వివేకవంతులు రాజునూ, దైవాన్నీ, భార్యనూ, బంధువులనూ గౌరవంగా చూస్తూ సత్ప్రవర్తనతో వారిని సంతోషపెట్టుతారు. ఆ లక్షణాలు పాండవులకు సహజంగా ఉన్నాయి. వారు ధృతరాష్ట్రుడి మాట పాటించారు. శ్రీకృష్ణుడిని దైవంగా భావించి ఆరాధించారు. భార్యను ప్రేమతో చూచుకొన్నారు. బంధువులను ఆదరంతో గౌరవించారు. వారు ఆయా ధర్మాలకు తగిన సత్ఫలితాలు అనుభవించగలరు. ఆ నీతులను పాటించని కౌరవులూ, ధృతరాష్ట్రుడూ వివేకవిహీనులై విషాదానికి గురి ఔతారు. ధృతరాష్ట్రుడి మనస్తాపానికి అతడి వివేక రాహిత్యమే కారణం. (సంపా.)

క. నెమ్మి గలవారి నొల్లరు । త మ్మొల్లనివారి వెనుకఁ దగులుదు; రధిక
త్వ మ్మెఱిఁగి యెఱిఁగి తొడరుదు । రి మ్మెఱుఁగని యట్టివార లిభపురనాథా! 34

ప్రతిపదార్థం: ఇభపుర నాథా!= హస్తినాపుర ప్రభూ, ధృతరాష్ట్రా!; ఇమ్ము+ఎఱుఁగని+అట్టివారలు= ఉపాయశాలులు కానివారు; నెమ్మి కలవారిన్+ఒల్లరు= తమపై ప్రేమ ఉన్నవాళ్ళను, ఇష్టపడరు; తమ్మున్+ఒల్లనివారి వెనుకన్= తమను ఇష్టపడనివారి వెనుక; తగులుదురు= ఆసక్తి చూపుతారు; అధికత్వమ్ము= ఆధిక్యం గొప్పతనం; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసి; తొడరుదురు= ఎదుర్కొంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఉపాయశాలులు కానివారు తమను ప్రేమించేవారంటే ఇష్టపడరు. తమను ప్రేమించనివారి వెనుక పడతారు. తమకంటె అధికులని తెలిసి తెలిసీ ఇతరులను ఎదుర్కొంటారు.

విశేషం: తనను నిజంగా గౌరవించే పాండవులను కాదని, తనను తమ వ్యూహంలో పావువలె భావించి తేలికగా చూచే దుష్టచతుష్టయాన్ని మన్నించి, అన్నిట్లోనూ అధికులైన పాండవులతో వైరం పెట్టుకొనటం ధృతరాష్ట్రుడి ఉపాయరాహిత్యమని తాత్పర్యం. అతడికి శాంతి లేకపోవటం సహజం. (సంపా.)

క. ధనమును, విద్యయు, వంశం । బును దుర్మతులకు మదంబుఁ బొనరించును; స
జ్జను లైనవారి కడఁకువ । యును, వినయము నివియతెచ్చు నుర్వీనాథా! 35

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా, ధృతరాష్ట్రా!, ధనమును= డబ్బూ, విద్యయున్; వంశంబును= ఉత్తమ వంశమూ; దుర్మతులకున్= దుర్బుద్ధులకు; మదంబున్= గర్వాన్నీ; పొనరించును= కలిగిస్తాయి; ఇవి+అ= ఇవే- ధనవిద్యావంశాలే; సత్+జనులు+ఐన వారికిన్= సద్బుద్ధులకు; అడఁకువయును= నమ్రతా; వినయమున్= గౌరవమూ; తెచ్చున్= తెస్తాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ధనమూ, విద్యా, ఉత్తమ వంశమూ దుర్బుద్ధులకు మదం కలిగిస్తాయి. ఇవే సద్బుద్ధులకు అడకువనూ, గౌరవాన్నీ తెచ్చిపెట్టుతాయి.

విశేషం: 1. దుర్బుద్ధులు కౌరవులు, సద్బుద్ధులు పాండవులు. వీరిరువురికీ ధనం, విద్య, ఉత్తమవంశం అనే మూడు అదృష్టాలున్నాయి. కాని, కౌరవులు వాటి వలన మదోన్మత్తులయ్యారు. కాని, పాండవులు వినయవంతు లయ్యారు. దానివలన వారు లోకనీతిలో గౌరవ పాత్రులయ్యారు. (సంపా.)

2. "దీనికి మూలంలో చక్కని చమత్కారం ఉంది.

'విద్యా మదో ధన మద స్తృతీయోభిజనో మదః

ఏతే మదావలిప్తానాం ఏత ఏవ సతాం దమాః' (సం.5.33-41)

ఈ మూడూ దుర్మార్గులకు మదమూ, సన్మార్గులకు దమమూ కలిగిస్తాయి. అక్షరాలు తిరగబడ్డాయి. (మద-దమ). కథా సంబంధిగా మదం దుర్యోధనుడికీ - దమం ధర్మరాజుకూ కలుగుతాయి. తెలుగులో అడకువ చేత దమమునూ, వినయం చేత శమమునూ గ్రహించాలి" జనహిత వ్యాఖ్య. (పు.185-186).

క. అరిది విలుకాని యుజ్జ్వల । శర మొక్కని నొంచుఁ; దప్పి చనినం జను; నే
ర్పరి యైనవాని నీతి । స్ఫురణము పగరాజు, నతని భూమిం జెఱుచున్. 36

ప్రతిపదార్థం: అరిది విలుకాని+ఉజ్జ్వల శరము= గొప్ప విలుకాడియొక్క ప్రకాశించే బాణం; ఒక్కనిన్= ఒకడిని; నొంచున్= బాధిస్తుంది; తప్పి చనినన్+చనున్= తప్పిపోతే తప్పిపోతుంది; నేర్పరి+ఐన వాని నీతి స్ఫురణము= నేర్పుగలవాడి నీతి ప్రకాశం; పగ రాజున్= శత్రురాజునీ; అతని భూమిన్= అతడి దేశాన్నీ; చెఱుచున్= నశింపజేస్తుంది.

తాత్పర్యం: గొప్ప విలుకాడి మంచి బాణం ఒకడిని బాధిస్తే బాధిస్తుంది లేదా తప్పిపోతే తప్పిపోతుంది కాని, నేర్పుగలవాడి నీతిస్ఫూర్తి శత్రురాజునూ, అతడి దేశాన్నీ నశింపజేస్తుంది.

విశేషం: దీనికి మూలం:

"ఏకం హన్యా న్నవా హన్యా దిషుర్ముక్తో ధనుష్మతః

బుద్ధిర్బుద్ధిమతో త్సృష్టా హన్యా ద్రాష్ట్రం సరాజకమ్" (సం.5-33-42)

బాణ(బల) ప్రయోగం ఎదుటివారి నొకరినే చంపుతుంది. బుద్ధి (నీతి) ప్రయోగం రాజునూ రాజ్యాన్నీ నశింపచేస్తుంది. దుర్యోధనుడు బలప్రయోగాన్ని నమ్ముకొన్నాడు. ధర్మరాజు ధర్మనీతిప్రయోగాన్ని నమ్ముకొన్నవాడు. దుర్యోధనుడు కొందరిని చంపగలడేమో కాని, ధర్మజుడి రాజనీతి కౌరవులనూ, వారి రాజ్యాన్నీ కూడా హరించగలదని ప్రకరణోచితమైన తాత్పర్యం. (సంపా.)

తే. ఒకటిఁ గొని, రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి, । మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,
యేనిటిని గెల్చి, యాఱింటి నెఱిఁగి, యేడు । విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు. 37

ప్రతిపదార్థం: ఒకటిన్= ప్రభుత్వమును; కొని= చేపట్టి-స్వీకరించి; రెంటిన్= మంత్రము, ఉత్సాహము అను రెండింటిని; నిశ్చల యుక్తిన్+చేర్చి= కదలనీయక జోడు చేసి; మూఁటిన్= మిత్రులు, అమిత్రులు, తటస్థులు అనే మూఁడు వర్గాలను; నాల్గింటన్= సామ, దాన, భేద, దండములనే నాలుగు ఉపాయాలచేత; కడున్= మిక్కిలి; వశ్యములుగన్+చేసి= వశపరచుకొని; ఏనిటిన్= త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము అనే అయిదింటినీ; గెల్చి= జయించి; ఆఱింటిన్= సంధి, విగ్రహము, యానము,

ఆసనము, ద్వైధీభావము అనే ఆరింటినీ; ఎఱింగి= తెలిసికొని; ఏడు= వ్యసనముల నేడింటినీ; విడిచి; వర్తించువాఁడు= ఉండేవాడు; వివేక ధనుఁడు= వివేకం ధనంగా కలవాడు.

తాత్పర్యం: ప్రభుత్వాన్ని చేపట్టి, మంత్రోత్సాహములనే రెండింటినీ కదలనీయక జోడు చేసి, మిత్రులు, అమిత్రులు, తటస్థులు అనే మూడు వర్గాలనూ సామ దాన భేద దండములనే నాలుగు ఉపాయాలచేతా పూర్తిగా వశపరచుకుని, త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము అనే అయిదు ఇంద్రియాలనూ జయించి, సంధి విగ్రహ యాన ఆసన ద్వైధీభావములు అనే ఆరింటినీ తెలిసికొని, వేట, జూదము, పానము, స్త్రీ, వాక్పారుష్యము, దండపారుష్యము, అర్థదూషణము అనే సప్త వ్యసనాలనూ విడిచి వర్తించేవాడు వివేకధనుడు.

దీనికి ఇంకో విధమైన అర్థం:

ఒకటి- బుద్ధి. దీనికి వాక్కు, క్రియ అనే రెండింటినీ నిశ్చలత్వంతో చేర్చి, ధర్మార్థకామాలనే మూడింటినీ బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములనే నాల్గింటితో మిక్కిలి వశపడేటట్లు చేసి, వాక్, పాణి, పాద, పా,యూపస్థ లనే కర్మేంద్రియాల నయిదింటినీ గెలిచి, యజన, యాజ, నాధ్యయన, దాన, ప్రతిగ్రహాలనే ఆరు స్మార్త కర్మలను తెలిసి, ఆవరణం (పంచభూతాలు), బుద్ధ్యహంకారాలూ అనే ఏడింటినీ విడిచి వర్తించే వాడు వివేకధనుడు.

మరోవిధమైన అర్థం: ఒకటి- సత్త్వం, రెండు- రజస్తమస్సులు, మూడు- ధన దార పుత్రేషణములు, నాలుగు- ధ్యాన, ధారణ, యోగ, సమాధులు, తక్కినవి పైని చెప్పబడినట్లే.

విశేషం: మూల భారతంలో దీనికి సరియైన శ్లోకం-

> **'ఏకయా ద్వౌ వినిశ్చిత్య త్రీం శ్చతుర్భి ర్వశే కురు,**
> **పఞ్చ జిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీభవ.' (సం. 5-33.43)**

క. విను, మధురాహారంబులు । గొనుటయుఁ, బెక్కండ్రు నిద్ర గూరినయెడ మే
ల్కని యునికియుఁ, గార్యాలో । చనముఁ, దెరువు నడచుటయును జన దొక్కనికిన్. 38

ప్రతిపదార్థం: విను(ము), ఒక్కనికిన్= ఒంటరిగా; మధుర+ఆహారంబులు+కొనుటయున్= మధురములైన ఆహారాలు స్వీకరించటమూ, పెక్కండ్రు= అనేకులు; నిద్ర+కూరిన+ఎడన్= నిద్రించేచోట; మేల్కని+ఉనికియున్= మేలుకొని ఉండటమూ; కార్య+ఆలోచనమున్= ఒక పనిని గూర్చి ఆలోచించటమూ; తెరువు నడచుటయును= మార్గంలో నడవటమూ; చనదు= తగదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! విను. మధురాహారాలు ఒక్కడూ తినటమూ, పలువురు నిద్రపోతుంటే ఒక్కడూ మేలుకొని ఉండటమూ, కార్యాలోచన ఒక్కడూ చేయటమూ, మార్గంలో ఒక్కడూ నడవటమూ తగదు.

విశేషం: దీనికి మూలం.

> **'ఏక స్స్వాదు న భుఞ్జీత ఏక శ్చార్థాన్ న చిన్తయేత్,**
> **ఏకో న గచ్ఛే దధ్వానం నైక స్సుప్తేషు జాగృయాత్,' (సం. 5.33.45)**

మధుర పదార్థం వంటి రాజ్యాన్ని న్యాయంగా పాండవులకు పంచి ఇచ్చి దానిని మరల హరించారు కౌరవులు. దానికి సాక్షీభూతుడు ధృతరాష్ట్రుడు. అందరూ నిద్రపోతూ ఉండగా మేల్కొని విదురుడి నీతి బోధ వింటున్నవాడు ధృతరాష్ట్రుడు. విదురుడు చెప్పే మాటలన్నీ వింటూ తనలో తాను ఏకాంతంగా తన వ్యూహాన్ని తీర్చిదిద్దికొనేవాడూ, ఎవరినీ నమ్మక తన దారిలో తాను ఒంటిగా సాగేవాడూ ధృతరాష్ట్రుడు. సంఘనీతికి సరిపడని వ్యక్తినీతి సన్మానయోగ్యం కాదనీ, పైపెచ్చు అది మనోవేదనను కలిగిస్తుందనీ తాత్పర్యం. (సంపా.)

క. నడవడి యను మున్నీటిం । గడవం బెట్టంగ నోడకరణిం దగి తా
నొడఁగూడు ననిన, సత్యము । గడచినగుణ మింక నొండు గలదే యరయన్? 39

ప్రతిపదార్థం: నడవడి+అను మున్నీటిన్= ప్రవర్తన అనే సముద్రాన్ని, కడవన్+పెట్టంగన్= దాటించటానికి; ఓడ కరణిన్= ఓడవలె; తగి= ఒప్పి; తాను; ఒడఁగూడన్+అనినన్= ఉంటుందంటే; అరయన్= పరిశీలించగా; సత్యము+కడచిన గుణము= సత్యాన్ని మించిన గుణం; ఇంకన్+ఒండు+కలదే?= ఇంకొకటి ఉన్నదా?

తాత్పర్యం: సత్ప్రవర్తన అనే సముద్రాన్ని దాటించటానికి ఓడవలె సత్యం ఒప్పి ఉంటుందంటే, సత్యాన్ని మించిన గుణం ఇంకోటి ఉంటుందా?

విశేషం: 1. ధర్మప్రీతి వ్యక్తిశీలాన్ని తీర్చిదిద్దుతుంది.

'ధృతిః క్షమా దయాఽ స్తేయం శౌచ మింద్రియనిగ్రహః

హ్రీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్'

అని భారతంలో చెప్పబడింది. ఈ దశధర్మలక్షణాలలో సత్యం మూలభూతమైనది, సారభూతమైనది. సత్ప్రవర్తన దాటరాని సముద్రం వంటిదైతే, దానిని దాటటానికి తోడ్పడే ఓడవంటిది సత్యం. ధర్మజుడి చరిత్రం సత్ప్రవర్తన సాగరం వంటిది. అతడికి సత్యమే తరణోపాయం. అతడికి సత్య ధర్మపాలనం వలన కష్టాలు వచ్చాయి. అయినా అతడు అంతశ్శాంతిని కోల్పోలేదు. ధృతరాష్ట్రుడి స్థితి తద్భిన్నం. (సంపా.)

2. దీనికి మూలం:

'ఏవమే వాద్వితీయం తద్యద్రాజన్నావ బుధ్యసే

సత్యం స్వర్గస్య సోపానం పారావారస్య నౌ రివ' (సం. 5-33-46)

ఇందులో 'సత్యం స్వర్గ సోపానం' అనే వాక్యాన్ని తిక్కన గ్రహించలేదు. ప్రవర్తనను గురించి చెప్పేటప్పుడు సముద్రాన్ని ఓడతో దాటటం అనే ఉపమానమే సరిపోతుంది. దాటటం వేరు, ఎక్కటం వేరు. అందువలన ఆ వాక్యాన్ని వదలి నట్లున్నారు. (సంపా.)

క. క్షమియించు వారిఁ గని చా । లమి వెట్టుదు; రైననుం దలంప, ననూన
క్షమయ కడు మెఱయు తొడ; వు । త్తమ రూపము గోరువారు దాల్తురు దానిన్. 40

ప్రతిపదార్థం: క్షమియించు వారిన్= క్షమించే గుణం కలవాళ్ళను; కని= చూచి; చాలమి+పెట్టుదురు= అసమర్థత ఆరోపిస్తారు; ఐననున్= అయినప్పటికీ; తలంపన్= ఆలోచించగా; అనూనక్షమ+అ= తక్కువ కాని (గొప్పదైన) ఓర్పే; కడున్= మిక్కిలి; మెఱయు తొడవు= ప్రకాశించే ఆభరణం; దానిన్= ఆ ఆభరణాన్ని; ఉత్తమ రూపము+కోరువారు= సుందరతమమైన ఆకారం కావాలనుకొనే వాళ్ళు; తాల్తురు= ధరిస్తారు.

తాత్పర్యం: క్షమించే స్వభావం కలవాళ్ళను చూచి జనులు అసమర్థతను ఆపాదిస్తారు. అయినా, ఆలోచిస్తే, గొప్పదైన క్షమాగుణమే మిక్కిలి మెరిసే ఆభరణం. మంచి సౌందర్యం కావాలనుకొనేవాళ్ళు దానిని ధరిస్తారు.

విశేషం: 1. దశ విధ ధర్మ లక్షణాలలో సత్యం తరువాత క్షమ గణనీయమైనది. సత్యం ధర్మహృదయం, క్షమ అలంకారం. పైపద్యానికి మూలం.

'ఏకః క్షమావతాం దోషో ద్వితీయో నోపలభ్యతే

యదేవం క్షమయా యుక్త మశక్తం మన్యతే జనః' (సం. 5-33-47)

క్షమ గలవారిమీద అసామర్థ్య దోషం ఒకటే తప్ప మరే దోషమూ జనులు ఆరోపించటానికి వీలుకాదు. అది అతడి దోషంగా భావించరాదు. ఓర్పే మానవుడికి శ్రేష్ఠమైన బలం. అసమర్థులకు ఓర్పు గుణమైతే, సమర్థులకు భూషణమౌతుంది. క్షమను వశీకరణ శక్తిగా భావించాలి. క్షమ చేత సాధించలేని దేదీ లేదు అని మూలం క్షమాగుణ ప్రాశస్త్యాన్ని పేర్కొన్నది.

2. క్షమాగుణ సంపన్నుడు ధర్మరాజు. పాండవులు ద్వైతవనంలో ఉన్న సమయంలో ధర్మజుడు ద్రౌపదికి క్షమావీరుడి మాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాడు.

క. 'క్షమగల వానికిఁ బృథ్వీ । సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్

క్షమయైనవాని భుజవి । క్రమము గడున్ వలయు సర్వకార్యక్షమమై'. (ఆరణ్య.1.223). అట్టి క్షమాగుణుడిని అసమర్థుడిగా భావించే దుర్యోధన ధృతరాష్ట్రుల భావాన్ని వ్యంగ్యంగా హెచ్చరించాడు; క్షమ లేని వాడు ఉత్తమవ్యక్తి కాజాలడని పేర్కొన్నాడు విదురుడు.

క. పురుషుండు రెండు దెఱఁగుల । ధర నుత్తముఁ డనఁగఁ బరఁగుఁ; దా నెయ్యెడలం
బరుసములు వలుక కునికిన్; । దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్. 41

ప్రతిపదార్థం: పురుషుండు= మనుష్యుడు; రెండు+తెఱఁగులన్= రెండు విధాల; ధరన్= భూమియందు; ఉత్తముఁడు+ అనఁగన్+పరఁగన్= శ్రేష్ఠుడు అనదగిఉంటాడు; తాను; ఏ+ఎడలన్= ఎక్కడా; పరుసములు+పలుకక+ఉనికిన్= పరుషవాక్కులు పలకకుండటం చేతా; దురితంబులు+పొరయు పనులు= పాపకార్యాలు; తొఱఁగుట కతనన్= విడిచిపెట్టటం చేతా.

తాత్పర్యం: ఎక్కడా పరుషవాక్కులు పలకకపోవటం, పాపపు పనులు చేయకపోవటం- ఈ రెండింటిచేతా లోకంలో పురుషుడు ఉత్తముడు అనిపించుకొంటాడు.

విశేషం: దీనికి మూలం.

'ద్వే కర్మణీ నరః కుర్వ న్నస్మిన్‌లోకే విరోచతే,

అబ్రువన్ పరుషం కిఞ్చి దసతో నార్థయం స్తథా.' (సం.5.33.50)

పరుషాలాడటం వాగ్దోషం. పాపపు పనులు చేయటం చేష్టా దోషం. ఆ రెండు దోషాలు చేయనివారు ఉత్తములు. కౌరవులు ఆ రెండు దోషాలు చేశారు. పాండవులు చేయలేదు. అందువలన పాండవులు ఉత్తములు. ధర్మాచరణ ప్రవృత్తిని బోధిస్తున్నట్లున్న ఈ నీతులలో పాండవ గుణస్తుతి వ్యంగ్యంగా వినపడుతున్నది. (సంపా.)

తే. చెల్లియుండియు సైరణ సేయువతఁడుఁ, । బేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ
దనకుఁ గల భంగి నిచ్చు నతండుఁ, బుణ్య । పురుషు లని చెప్పి రార్యులు కురువరేణ్య! 42

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; చెల్లి+ఉండియున్= సమర్థుడయి ఉండికూడా; సైరణ+చేయు+ అతఁడున్= శాంతం వహించేవాడూ; పేద+పడియును= బీదవాడయినప్పటికిని; అర్థికిన్= యాచకుడికి; ప్రియముతోడన్= ప్రీతితో; తనకున్+కలభంగిన్= తనకున్నంతలో; ఇచ్చు+అతండున్= ఇచ్చేవాడూ; పుణ్యపురుషులు+అని= పుణ్యాత్ములని; ఆర్యులు= పెద్దలు; చెప్పిరి= అన్నారు.

తాత్పర్యం: కురువంశోత్తమా, ధృతరాష్ట్రా! సమర్థుడయి ఉండికూడా శాంతం వహించేవాడూ, బీదవాడయినప్పటికీ తనకున్నంతలో ఇచ్చేవాడూ పుణ్యాత్ములని పెద్దలన్నారు.

విశేషం: దీని మూల శ్లోకం-

'ద్వా విమౌ పురుషౌరాజన్! స్వర్గస్యోపరి తిష్ఠతః।

ప్రభు శ్చ క్షమయా యుక్తో । దరిద్ర శ్చ ప్రదానవాన్'. (సం.5-33-53) అరణ్యాజ్ఞాత వాస నియమాలను పాటించిన పాండవులలో ఈ రెండు గుణాలూ ప్రకాశించాయి. (సంపా.)

ఆ. పాడి దప్పకుండఁ బడయు సొమ్ములకు న । పాత్రములకు నీఁగి, పాత్రములకుఁ
బెట్ట కునికి యనఁగ నెట్టన రెండు వి । ధములఁ గీడు దొడరు ధరణినాథ! 43

ప్రతిపదార్థం: ధరణినాథా!= రాజా, ధృతరాష్ట్రా!; పాడి+తప్పక+ఉండన్= న్యాయం అతిక్రమించకుండా; పడయు సొమ్ములకున్= గడించే ధనములకు; అపాత్రములకున్= అనర్హులకు; ఈగి= ఇవ్వటం; పాత్రములకున్= అర్హులకు; పెట్టక+ఉనికి= ఇవ్వకపోవటం; అనఁగన్; రెండు విధములన్; కీడు= హాని; నెట్టన= తప్పక; తొడరున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! న్యాయబద్ధంగా సంపాదించిన ధనాన్ని అనర్హులకు ఇవ్వటమూ, అర్హులకు ఇవ్వకపోవటమూ అనే వాటివలన రెండు విధాలా కీడు కలుగుతుంది.

విశేషం: దీనికి మూలం:

'న్యాయాగతస్య ద్రవ్యస్య బోద్ధవ్యౌ ద్వావతిక్రమౌ

అపాత్రే ప్రతిపత్తి శ్చ పాత్రే చాప్రతిపాదనమ్'. (సం. 5-33-54)

ఈ నీతి కథాసందర్భంలో సవ్యంగా, అపసవ్యంగా కూడా ధృతరాష్ట్రుడికి తగిలి వస్తుంది. ఎట్లాగంటే- న్యాయపరంగా వచ్చిన పైతృకమైన రాజ్యాన్ని పాత్రులైన పాండవులకు ఇవ్వకపోవటం, అపాత్రులైన కౌరవులకు దక్కేటట్లు ప్రయత్నించటం అనే రెండు దోషాలు ధృతరాష్ట్రుడికి తగిలాయి. ఇకపోతే అన్యాయార్జిత ద్రవ్యమైన పాండవ రాజ్యాన్ని కూడా పాత్రులైన పాండవులకు చెందకుండా చేయటం, అపాత్రులైన కౌరవులకే దక్కేటట్లు చూడటం అనే దోషద్వయం కూడా ధృతరాష్ట్రుడికి చెందింది. కాబట్టి రెండు విధాలా ద్విగుణీకృతమైన కీడు గలుగుతుందని ధృతరాష్ట్రుడిని విదురుడు వ్యంగ్యంగా హెచ్చరించాడు. (సంపా.)

తే. వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు । ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేఁత । యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల. 44

ప్రతిపదార్థం: వెలఁది= స్త్రీ; జూదంబు; పానంబు= మద్యసేవనం; వేఁట; పలుకు ప్రల్లదంబును= వాక్పారుష్యం; దండంబు పరుసఁదనమున్= దండపారుష్యం- అతిక్రూరంగా దండించటం; నిష్ప్రయోజనముగన్ సొమ్ము వమ్ము+చేఁత= నిరర్థకంగా డబ్బు పాడుచేయటం; అనెడు; సప్త వ్యసనములన్= ఏడు వ్యసనాలలోను; తగులన్+చనదు= ఆసక్తి చూపరాదు.

తాత్పర్యం: స్త్రీ, జూదం, త్రాగుడు, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, డబ్బు వృథా చేయటం అనే ఏడు వ్యసనాలయందు ఆసక్తి చూపరాదు.

విశేషం: అన్ని ప్రతులలోనూ 'దండంబుఁ, బరుసఁదనము' అని రెండుగా చూపబడ్డాయి. అది సరికాదు. అవి రెండయితే వ్యసనాలు ఎనిమిది అవుతాయి. అవి ఏడే కదా! దండంబు పరుసఁదనము అంతా ఒక్కటే. దానికి దండపారుష్యమని అర్థం. దండపారుష్యమంటే అతిక్రూరంగా దండించటం. మూలంలో 'మహచ్చదణ్డ పారుష్యం' అనే ఉన్నది. దండం వేరుగానూ, పారుష్యం వేరుగానూ లేదు.

మూలం: **'స్త్రి యోऽక్షా మృగయా పానం వాక్పారుష్యం చ పఞ్చమమ్,**
మహచ్చ దణ్డపారుష్య మర్థదూషణ మేవ చ.'

తే. తగిన వేషంబు, దనుఁ దాన పొగడుకొనమి । నొచ్చియును గీడు వలుకమి, యిచ్చి వగవ
కునికి, దన కెంత నడవకయున్నఁ బథము । దప్పకుండుట నడవడి కొప్పు సేయు. 45

ప్రతిపదార్థం: తగిన వేషంబు= తన హోదాకు ఉచితమైన వేషమూ; తనున్+తాను+అ= తన్ను తానే; పొగడుకొనమి= స్తుతించుకొనకపోవటం; నొచ్చియును+కీడు+పలుకమి= బాధపడికూడా కీడు పలకకపోవటం; ఇచ్చి వగవక+ఉనికి= దానం చేసి బాధపడకపోవటం; తనకున్+ఎంత నడవక+ఉన్నన్= తనకెంత గతి లేకున్నా; పథము+తప్పక+ఉండుట= మార్గం తప్పకుండడం; నడవడికిన్= ప్రవర్తనకు; ఒప్పు+చేయున్= మంచి కలిగిస్తాయి.

తాత్పర్యం: తన హోదాకు ఉచితమైన వేషధారణా, తనను తానే స్తుతించుకొనకపోవటమూ, బాధపడి కూడా కీడు పలుకక పోవడమూ, దానం చేసి- ఎందుకు చేశానా అని బాధపడకపోవటమూ, తన కెంత గతి లేకపోయినా ధర్మమార్గం అతిక్రమించకపోవటమూ ప్రవర్తనకు మేలు కలిగిస్తాయి. సత్ప్రవర్తన అనిపించుకొంటుంది.

క. చెలిమియు, సంభాషణమును । బలిమి, వివాదంబుఁ, ద్రోపుఁ బాడియుఁ దమయం
తలవారితోన తగు; నధి । కుల, హీనుల తోడనైనఁ గొఱ గా దధిపా! 46

ప్రతిపదార్థం: అధిపా= రాజా, ధృతరాష్ట్రా! చెలిమియున్= స్నేహమూ; సంభాషణమును= మాటా; బలిమి= బలమూ; వివాదంబున్= వాదించటమూ; (వివాహంబున్= పెండ్లీ - సూ.ని.); త్రోపుఁబాడియున్= యుద్ధమూ; తమ+అంతలవారితోన్+అ= తమతో సమానులైనవారితోనే; తగున్= ఒప్పుతుంది; అధికుల, హీనుల తోడన్+ఐనన్= తమకంటె గొప్పవారితోనూ, తక్కువవారితోనూ అయితే; కొఱ+కాదు= యుక్తంకాదు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! స్నేహమూ, మాటా, బలమూ, వివాదమూ (వివాహము), యుద్ధమూ తమతో సమానులైనవారితోనే ఒప్పుతుంది కాని, తమకంటె అధికులతోకాని, అల్పులతోకాని యుక్తం కాదు.

విశేషం: 'వివాదంబు' అనే దానికి బదులుగా 'వివాహంబు' అని సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఉదాహృతమైన చోట ఉన్నది. అది మూలానుగుణం కూడా. **"సమైః ర్వివాహం కురుతే న హీనైః"** అని మూలం.

తే. **కొంచె మైనను దగఁ బంచి కుడువ మేలు; । పనులయెడ దుఃఖ మోర్చి యల్పంబు సుఖము**
ననుభవించుట హితము; శత్రునకు నైన । నిచ్చుటయ లెస్స యడిగినయెడ నృపాల! **47**

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; ధృతరాష్ట్రా!; కొంచెము+ఐనను= తక్కువ ఉన్నప్పటికీ, తగన్= ఒప్పుగా; పంచి= విభజించి, కుడువన్= అనుభవించటం; మేలు= మంచిది; పనుల+ఎడన్= పనులు చేసేటప్పుడు; దుఃఖము+ఓర్చి= కష్టం సహించి; అల్పంబు సుఖమున్= ఇంచుక సుఖాన్ని; అనుభవించుట; హితము= మేలు; అడిగిన+ఎడన్= అడిగితే; శత్రునకున్+ఐనన్; ఇచ్చుట+అ= ఇవ్వటమే; లెస్స= మంచిది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఎంత తక్కువ ఉన్నప్పటికీ దానినే ఒప్పుగా ఇతరులకు పంచిపెట్టి అనుభవించటం మంచిది. పనులు చేసేటప్పుడు కష్టానికి సహించి, ఇంచుక సుఖాన్ని అనుభవించటం మేలు. అడిగితే శత్రువుకైనా ఇవ్వటమే మంచిది.

విశేషం: దీనికి మూలశ్లోకం-

> **'మితం భుంక్తే సంవిభజ్యాశ్రితేభ్యో । మితం స్వపి త్యమితం కర్మ కృత్వా**
>
> **దదా త్యమిత్రే ష్వపి యాచిత స్సన్ । తమాత్మవంతం ప్రజహత్యనర్థాః' (సం.5-33-55)**

అడిగితే శత్రువుకైనా ఇవ్వటం మంచిది- అనే నీతి ఇందులో ప్రత్యేకంగా పేర్కొనదగింది. పాండవులు తమ్ముడి బిడ్డలు. వారు తమకు న్యాయంగా రావలసిన రాజ్యభారం తిరిగి ఇమ్మని అడిగినప్పుడు ఇవ్వకపోవటం మహాదోషమని విదురుడి హితవు. (సంపా.)

క. **తను లోకము గొనియాడఁగ । విని యుబ్బఁడు సజ్జనుండు; వెండియుఁ గడు మే**
లొనరించుఁ; గీ డొకించుక । యును దసదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్. **48**

ప్రతిపదార్థం: సత్+జనుండు= మంచివాడు; తనున్= తనను; లోకము= లోకులు; కొనియాడఁగన్= పొగడితే; విని; ఉబ్బఁడు= పొంగిపోడు; వెండియున్= మళ్ళీ ఇంకా; కడున్= మిక్కిలి; మేలు+ఒనరించున్= మేలు చేస్తాడు; ఒక+ఇంచుకయును+ కీడు= అపకారం ఏకొంచెమూ; తన దెసన్= తనయందు; తోఁపన్+ఈక= కనబడనీయకుండా; ఉడుపుచున్+వచ్చున్= పోగొట్టుతూ ఉంటాడు.

తాత్పర్యం: లోకం తనను పొగడితే సజ్జనుడు విని పొంగిపోడు. ఇంకా ఎంతో మేలు చేస్తాడు. తానుమాత్రం ఏ కొంచెం కీడుకూడా చేయనివిధంగా ప్రవర్తిస్తాడు. ఇతరుల కీడును పోగొట్టుతూ ఉంటాడు.

విశేషం: దీనికి మూల శ్లోకం:

'న హృష్య త్యాత్మసమ్మానే నావమానేన తప్యతే,

గాంగోహ్రద ఇవాక్షోభ్యో య స్స పండిత ఉచ్యతే'. (సం.5-33-56)

ఇందులోని గంగాహ్రదం తోటి ఉపమానం తిక్కన గ్రహించలేదు. అక్షోభ్యంగా ఉంటాడు అన్నదాని కంటె ధర్మరాజులో కనపడే విశిష్ట లక్షణం- "గడు మేలొనరించుఁ, గీడొకించుకయును దనదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్' అనే దానిని పేర్కొనటం గమనార్హం. ఇది సజ్జనుడి గురించి చెప్పుకొనే చక్కని సూక్తి. ధర్మరాజు గుణాలకు అక్షర నీరాజనం. (సంపా.)

వ. ఇట్టి చందంబులు ధర్మనందనునకుం గల' వని పలికి, విదురుం డది ప్రసంగంబుగాఁ బాండవులఁ బ్రశంసించి, 'నీవు వారలం బెనిచి మానుసులం జేసి రక్షించి, యిప్పు డుపేక్షించి, వారలు వెలినుండ నూరకుండం దగునే? తగుపాలిచ్చి, వారి రావించి, నీ కొడుకుల తోడివారింగా నడపుట యుచితంబు, మీరును వారును నొక్కటియై యున్న మీదిక్కు దేవతలకుం దేఱి చూడరా' దనిన, నమ్మాటలు వెడవెడ యూఁకొని ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్టి చందంబులు= ఇట్టి విధాలు; ఈ లక్షణాలు; ధర్మనందనునకున్+కలవు= ధర్మరాజుకున్నాయి; అని; పలికి, విదురుండు; అది ప్రసంగంబుగాన్= ఆ సందర్భంగా; పాండవులన్; ప్రశంసించి= స్తుతించి; నీవు; వారలన్; పెనిచి= పెంచి; మానుసులన్+చేసి= మనుష్యులను చేసి- పెద్దవాళ్ళను చేసి; రక్షించి= కాపాడి; ఇప్పుడు; ఉపేక్షించి= ఊరకుండి; వారలు; వెలిన్+ఉండన్= వేరే ఉంటూంటే; ఊరక+ఉండన్+తగునే= మాటాడకపోవటం తగునా?; తగుపాలు+ఇచ్చి= న్యాయంగా ఇవ్వవలసిన భాగం ఇచ్చి; వారిన్; రావించి= రప్పించి; నీకొడుకుల తోడివారిన్+కాన్= నీ కొడుకులతో సమానంగా; నడపుట= నడపటం- చూడటం; ఉచితంబు= మంచిది; మీరును; వారునున్; ఒక్కటి+ఐ+ఉన్నన్= ఏకమయి ఉంటే; మీ దిక్కు= మీకేసి; దేవతలకున్= దేవతలకు కూడా; తేఱి చూడన్ రాదు= తేరిచూడటం కష్టం; అనినన్; ఆ+మాటలకున్; వెడవెడ= ఇంచు కించుక; ఊఁకొని= ఊకొట్టి; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లాంటి లక్షణాలు ధర్మరాజు కున్నాయి' అని పలికి విదురుడు ఆ సందర్భంలో పాండవులను పొగడి, 'నీవు వాళ్ళను పెంచి పెద్దవాళ్ళను చేసి రక్షించి, ఇప్పుడు మాని, వాళ్ళు వేరే ఉంటూంటే ఊరుకొనవచ్చునా? వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం వాళ్ళకిచ్చి, వాళ్ళను రప్పించి, నీ కొడుకులతో సమానంగా చూడటం మంచిది. మీరూ వాళ్ళూ ఒక్కటయి ఉంటే మీకేసి దేవతలు కూడా తేరి చూడలేరు' అనగా, ఆ మాటలకు కొంచెంగా ఊకొట్టి ధృతరాష్ట్రుడు విదురుడితో ఇట్లా అన్నాడు :

విశేషం: ధర్మరాజు సంజయుడితో ఏమన్నాడో తెలియక, సంజయుడు తనను ఎందుకు ముఖం మీద తిట్టినట్లు మాటలాడాడో తెలియక ధృతరాష్ట్రుడు వేదనపడి విదురుడిని దాని కారణం వివరించుమన్నాడు. విదురుడు లోకనీతిని, ధర్మప్రీతిని పాటించే సజ్జనుల లక్షణాలను వివరించి, అవి ధర్మరాజులో నిండుగా ఉన్నాయని పేర్కొన్నాడు. కౌరవులయం దా గుణాలు లేవని తేల్చిచెప్పాడు. తులనాత్మకంగా ఈ అంశాలను వితర్కించుకొని పాండవులకు రావలసిన భాగాన్ని ఇచ్చి, వారిని దగ్గరికి తీసికొని, కలసి మెలసి స్నేహంతో ఉండుమనీ, కౌరవ పాండవులు సమైక్యంగా ఉంటే వారిని దేవతలు కూడా తేరిపార చూడలేరనీ హితవు చెప్పాడు. అదే ధర్మరాజు హృదయమన్నాడు. అదే ధృతరాష్ట్రుడి కర్తవ్యమన్నాడు. అదే ధృతరాష్ట్రుడి మనశ్శాంతికి మందని చెప్పాడు. ఈ మాటలు ధృతరాష్ట్రుడికి మ్రింగుడు పడలేదు. ఔనని తల ఊపలేదు; కాదని త్రోసివేయలేడు. ఆ మానసిక స్థితినే 'వెడవెడ ఊకొట్టే' అభినయంతో ప్రదర్శించాడు. (సంపా.)

తే. **'హితముఁ గర్తవ్యమును నాకు నెఱుఁగు దీవ; । ధర్మసుతు చందమును విదితంబు నీకు;**
నట్లు గావున నెఱిఁగింపు మఖిలకార్య । జాతమును జిత్తతాపోపశమము గాఁగ.' **50**

ప్రతిపదార్థం: ఈవు+అ= నీవే; నాకున్; హితమున్= మేలయినదీ; కర్తవ్యమును= చేయదగినదీ, ఎఱుఁగుదు(వు); నీకున్, ధర్మసుతు చందమును= ధర్మరాజు పద్ధతీ; విదితంబు= తెలిసినది; అట్లు+కావునన్= అందుచేత; చిత్త తాప+ఉపశమము+ కాఁగన్= మనోవేదన పోయేటట్లు; అఖిల కార్య జాతమును= చేయదగినవాని సమూహమునంతనూ; ఎఱింగింపు(ము)= తెలుపుము.

తాత్పర్యం: 'నాకు మేలయినదీ, కర్తవ్యమయినదీ నీవే ఎరుగుదువు. ధర్మరాజు పద్ధతి కూడా నీకు తెలుసు. అందుచేత నా మనస్తాపం అడగేటట్టు నేను చేయవలసినదంతా చెప్పుము.'

విశేషం: ధృతరాష్ట్రుడు నివురు కప్పిన నిప్పు; విదురుడి మాటలు తనకు రుచించలేదని సూటిగా చెప్పడు. వక్రంగా వ్యక్తం చేస్తాడు. ఈ పద్యంలోని మూడు వాక్యాలలో మూడు మెలికలున్నాయి. 1.విదురుడు ధృతరాష్ట్రుడికి (పైపద్యంలో) చెప్పింది హితమూ, కర్తవ్యమే. కాని, ధృతరాష్ట్రుడు తనకు హితాన్నీ, కర్తవ్యాన్నీ చెప్పుమని మరల కోరుతున్నాడు. అంటే- ముందు చెప్పినవి తాను అంగీకరించటం లేదని సున్నితంగా సూచించి, విదురుడి హితవును వ్యంగ్యంగా త్రోసిపుచ్చుతున్నాడన్నమాట. ఇది మొదటి మెలిక. 2. ధర్మరాజు పద్ధతి కూడా విదురుడికి బాగా తెలుసు అని పేర్కొనటంలో గల అంతరార్థం - ధర్మరాజు మెత్తని పులి అనీ, సజ్జనుడుగా కనపడ్డా యుద్ధం చేయాలనీ, రాజ్యాన్ని పొందాలనీ స్థిరసంకల్పంతో ఉన్నాడనీ, సమయం కొరకు వేచి ఉన్నాడనీ తెలిసికొనటం ముఖ్యమని సూచన. ఇది రెండవ మెలిక. 3.ధృతరాష్ట్రుడికి చిత్తోపశాంతి ఎట్లా ఔతుందో కూడా విదురుడు తెలిసికొని హితవు చెప్పాలనే సున్నితమైన హెచ్చరిక మూడవ మెలిక. తన మన సెరిగి, తన కోర్కె తీరే విధానాన్ని వివరంగా తెలుపుమని విదురుడిని వేడుకొన్నాడు. ధృతరాష్ట్రుడి దృక్పథంతో ఆలోచించి అతడికి హితవు కలిగేటట్లు, మనస్తాపం తీరేటట్లు భావి కార్యక్రమం ఎట్లా చెయ్యాలో సూచించాలని అతడి ఆశయం. అంటే ప్రచ్ఛన్నంగా ధర్మరాజు వ్యూహానికి ప్రతివ్యూహ మేమిటో సూచించాలని తాత్పర్యం. (సంపా.)

క. **అనుడు విదురుఁ డాతని కి । ట్లనును; 'నిమ్మెయి నన్ను నొత్తి యడిగినఁ జెప్పం**
జను నున్న రూపు; సెప్పెద । విను మవధానంబు తోడ విమలవిచారా! **51**

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; విదురుఁడు; ఆతనికిన్; ఇట్లు+అనున్; విమల+విచారా!= నిర్మలమైన భావాలు కలవాడా! ధృతరాష్ట్రా!; ఈ+మెయిన్= ఈ విధంగా; నన్నున్; ఒత్తి+అడిగినన్= నొక్కి అడిగితే; ఉన్న రూపు= ఉన్న సంగతి; చెప్పన్+ చనున్= చెప్పాలి; అవధానంబు తోడన్= శ్రద్ధగా; వినుము; చెప్పెదన్.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడగగానే విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'ఈ విధంగా నన్ను మరీ మరీ అడిగితే ఉన్న సంగతి చెప్పాలి. నిర్మలభావుడవైన ధృతరాష్ట్రా! శ్రద్ధగా వినుము చెప్పుతాను'.

విశేషం: ఒత్తి అడిగితే ఉన్న సంగతి చెప్పవలసి వస్తుంది. ఈ వాక్యం తెలుగు జాతీయంగా అమరింది. ఒత్తి అడగటమంటే- గట్టిగా అడగటం, నొక్కి అడగటం, బలవంతపెట్టి అడగటం, మరీ మరీ అడగటం, కావాలని అడగటం- అనే అర్థాలున్నాయి. ఆ అర్థాలన్నీ ఈ సందర్భంలో సార్థక మౌతాయి. మూలంలో- "అపృష్ట స్తన్యతత్ బ్రూయాత్ యస్య నేచ్ఛేత్ పరాభవమ్''.

'రాజు యొక్క పరాజయాన్ని కోరని మిత్రుడు, భృత్యుడు, ఆ రాజు అడగకుండానే అతడికి మంచిదేదో, చెడ్డదేదో, శ్రేయస్కరమైనదేదో, ముప్పు తెచ్చేదేదో తప్పక చెప్పాలి. కాబట్టి కౌరవుల హితమేదో, శ్రేయస్కరమేదో, ధర్మయుక్తమైనదేదో చెప్పుతాను. సావధానంగా వినుము' అని విదురుడు పలికాడు. ఈ తాత్పర్యాన్నంతా 'ఉన్నమాట చెప్పవలసి వస్తుంది సుమా!' అనే తెలుగు జాతీయంతో ధ్వనిమయం చేయటమే కాకుండా - నీకు నిజం చెప్పటం ముఖ్యం కాని, కళ్ళనీళ్ళు తుడిచే కల్లబొల్లి మాటలను ముఖప్రీతి కలిగించే ముచ్చట్లు చెప్పటం నా అభిమతం కాదని సున్నితంగా పలికాడు. ధృతరాష్ట్రుడి వక్రపద్ధతికి దీటుగా విదురుడు వాచ్యమైన సూటి పద్ధతిని అనుసరించాడు. ఇందులో మరొక గడుసుదనం కూడా ప్రదర్శించాడు. అంతవరకూ దీటుగా విదురుడు వాచ్యమైన సూటి పద్ధతిని అనుసరించాడు. ఇందులో మరొక గడుసుదనం కూడా ప్రదర్శించాడు. అంతవరకూ నీతులు చెప్పినట్లు చెప్పి, అవన్నీ పాండవుల సుగుణాలుగా వ్యాఖ్యానించి, ఆ సుగుణాలు లేని కౌరవుల ప్రవృత్తులను వ్యంగ్యంగా నిరసించాడు. అదే సంగతిని మరల చెప్పవలసి వస్తే- ధృతరాష్ట్రుడి యొక్క కౌరవుల యొక్క దుర్గుణాలను, ప్రవర్తనలను ఉన్నవి ఉన్నట్లుగా కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పవలసి వస్తుంది అని అంటూ 'నామాటలు సావధానంగా వినుము' అని హెచ్చరించాడు. దోషాలను తెలిసికొని విమలవిచారుడవు కమ్మని సంబుద్ధితో సూచించాడు. (సంపా.)

ఉ. డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె; దది యె ట్లఱుగున్? విను, మీను లోలతన్
గ్రక్కున నామిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు సూవె యి;
ట్లుక్కివుఁడైన నీ కొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే?' 52

ప్రతిపదార్థం: అకటా!= అయ్యో!; రాజ్యము; డక్కెను= దక్కింది; అంచున్; ఇటు= ఇట్లా; తమ్ముని భాగము+ఈక= తమ్ముడి వాటా ఇవ్వక; నీవు; ఎక్కటిన్= ఒక్కడవే; మ్రింగన్+చూచెదు(దవు)= మ్రింగాలని చూస్తున్నావు - కాజెయ్యాలని చూస్తున్నావు, అది ఎట్లు+అఱుగున్= అది ఎట్లా జీర్ణమవుతుంది?; విను(ము); ఇట్లు= ఈ విధంగా తమ్ముడిభాగం కూడా మ్రింగాలని చూడటం; మీను= చేప; లోలతన్= పేరాసతో; గ్రక్కునన్= శీఘ్రంగా; ఆమిషంబు చవిన్= మాంసపురుచితో; గాలమున్; మ్రింగిన చాడ్పు+చూవె= మ్రింగిన విధం సుమీ; ఉక్కివుఁడు+ఐన= వంచకుడైన; నీ కొడుకు+ఉల్లము+ఉన్న+అటులు= నీ కుమారుడైన దుర్యోధనుడి మనసులో ఉన్నట్లు; ఆడన్+కూడునే?= చెప్పటం చెల్లుతుందా?

తాత్పర్యం: రాజ్యం చేతికి చిక్కింది గదా అని, అయ్యో! తమ్ముడి వాటా ఇవ్వక నీవు ఒక్కడవే మ్రింగివేయాలని చూస్తున్నావు. అది ఎట్లా అరుగుతుంది? విను. ఇది చేప పేరాసతో మాంసంతోపాటు శీఘ్రంగా గాలాన్ని కూడా మ్రింగటంవలె ఉంటుంది. కపటిఅయిన నీ కొడుకు మనస్సులో తలచినట్లంతా మాట్లాడితే అట్లా నెరవేరుతుందా?'

విశేషం: అలం: ఉపమ. నిజం చెప్పుతున్నాను వినుమని విదురుడు నిష్ఠురంగానూ, ముక్కుమీద గుద్దినట్లుగానూ ఉపమాలంకార సుందరంగానూ చెప్పాడు. అందులో తెలుగుదనం ఒలకపోశాడు. 'వెక్కటి మ్రింగఁజూచెదు' 'అది యెట్లరుగున్' గాలము మ్రింగిన చాడ్పు' ఈ పలుకుబడి తెలుగువారిది. ఈ భావాలు మూలంలోనూ ఉన్నాయి. (చూడు.5-34-13,14); కాని తెలుగులో పొందికగా కుదిరాయి. పేరాసను చేపగాలం మ్రింగటంతో పోల్చి చెప్పటం- జనంలో బాగా వ్యాప్తి చెంది ఉన్నది. ఒకరికి పెట్టకుండా ఒంటిగా తినే తిండి అరగదని తెలుగువారి జాతీయం. ఈ మాటలలో ఎంత చనువు ఉన్నదో అంత చురుకు కూడా ఉన్నది. (సంపా.)

క. అన విని నిరుత్తరుం డయి । మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి తలఁపుల్
పెనఁగొన, నిద్రాహానిం । దను వలయఁగ విదురుతోడఁ దా నిట్లనియెన్: 53

ప్రతిపదార్థం: అనన్= విదురు డట్లా అనగా; మనుజ+ఇంద్రుఁడు= రాజు-ధృతరాష్ట్రుడు; విని; నిరుత్తరుండు+అయి= సమాధానం లేనివాడయి; కొంతసేపు; మ్రాన్పడి= నిశ్చేష్టుడయి; తలఁపుల్= ఆలోచనలు; పెనఁగొనన్= పెనగులాడగా; నిద్రాహానిన్= నిద్ర లేకపోవటం చేత; తనువు= శరీరం; అలయఁగన్= బడలగా; తాను; విదురు తోడన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడి మాటలు విని ధృతరాష్ట్రుడు మాటలాడక, కొంతసేపు నిశ్చేష్టుడై, భావాలు ఒకదానితో ఒకటి పెనగులాడగా, నిద్ర లేకపోవటంచేత శరీరం బడలి, విదురుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: మ్రాన్పడటం సాత్త్విక భావం. కొయ్యబారిన ధృతరాష్ట్రుడు తేరుకొన్నాడు. దానికి రెండు దశలు పట్టింది. 1.ఏమి బదులు పలకాలో తెలియక భావాలు అతడిలో పెనగులాడాయి. 2. ఆ తరువాత సమాధానం చెప్పలేని అలసట నిద్రలేని అలసటను ముందుకు తెచ్చింది. దానితో మారుపలుకకుండా మంచి మాటలు వింటూ ఉండే స్థితిని ధృతరాష్ట్రుడు కోరుకొన్నాడు. ఇది మ్రానుపడ్డ శరీరావస్థ గల మానసికావస్థను వ్యక్తం చేస్తున్నది. ఇది తిక్కన నాటకీయతకు ఉదాహరణం. (సంపా.)

క. 'ఇందాఁక నీదు పలుకుల । డెందము తాపంబు గొంత డిందుపడియె; నా
కుం దగ నయానయంబుల । చందంబులు సెప్పుచుండు సౌజన్యనిధీ!' 54

ప్రతిపదార్థం: సౌజన్య నిధీ!= మంచితనానికి నిధానమైనవాడా! విదురా!; ఇందాఁకన్= ఇప్పటివరకూ; నీదు పలుకులన్= నీ మాటల చేత; డెందము తాపంబు= (నా) మనస్తాపం; కొంత= కొంచెం; డిందు పడియెన్= తగ్గింది; నాకున్; తగన్= ఒప్పుగా; నయ+అనయంబుల చందంబులు= నీత్యవినీతుల రీతులు; చెప్పుచున్+ఉందు(ము)= చెపుతూ ఉండుము.

తాత్పర్యం: 'సౌజన్యానికి నిధివైన విదురా! ఇప్పటి వరకూ నీ మాటల వలన నా మనస్తాపం కొంచెం ఉపశమించింది. నీవే నాకు నీత్యవినీతుల రీతులు ఒప్పుగా చెప్పుతూ ఉండుము.'

విశేషం: ధృతరాష్ట్రుడు వినగోరుతున్నవి నయ+అనయములు. నయమంటే పొందించేది, నీతి, అనయము- అంటే పొందించనిది అవినీతి. ఒక కార్యం పొందుపడే నీతిని, పొందుపడని అవినీతిని ప్రక్కప్రక్కన చెప్పుమని రాజు కోరిక. ఇకపై విదురనీతి బోధ ఈ రీతిలో సాగుతుందని సూచన. (సంపా.)

వ. అనిన విని విదురుం డిట్లనియె: 55

తాత్పర్యం: అని అడుగగా విని విదురుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'తనియఁ బండకుండ మును గోసికొనఁ జవి । చేటె కాదు; విత్తు చేటుఁ గలుగుఁ;
బక్వమైనఁ గొనిన ఫల మించుఁ, జెడదు బీ । జంబుఁ; గార్యసిద్ధిచంద మిట్లు. 56

ప్రతిపదార్థం: తనియన్= తృప్తిగా, బాగుగా; పండకుండన్= పక్వానికి రాకుండానే; మును= ముందుగా; కోసికొనన్; చవి చేటె+కాదు= రుచి లేకపోవటమే కాదు; విత్తు చేటున్+కలుగున్= విత్తనం కూడా నశిస్తుంది; పక్వము+ఐనన్= పండితే;

కొనినన్= స్వీకరిస్తే; ఫలము= పండు; ఇంచున్= బాగుంటుంది; బీజంబున్= విత్తనం కూడా; చెడదు= పోదు; కార్యసిద్ధి చందము+ఇట్లు= కార్యం సాఫల్యం పొందే రీతి ఇదీ.

తాత్పర్యం: బాగా ముగ్గకుండానే ముందే కోస్తే పండు రుచిగా లేకపోవటమే కాదు, విత్తనం కూడా పనికిరాదు. పక్వమైన తరువాత కోస్తే పండు బాగుంటుంది; విత్తనం కూడా చెడదు. కార్యం సఫలమయ్యే విధం కూడా ఇంతే.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశం సామాన్యాంశం చేత సమర్థింపబడింది. కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. ఫల విషయం విశేషం. కార్యసిద్ధి విషయం సామాన్యం. మూలంలోని రెండు శ్లోకాల తాత్పర్యాన్ని తిక్కన ఒక ఆటవెలదిలో సూక్తివలె స్ఫూర్తిమంతంగా రచించాడు. మూలం:

"వనస్పతే రపక్వాని ఫలాని ప్రచినోతి యః ।
స నాప్నోతి రసం తేభ్యో బీజం చాస్య వినశ్యతి ॥
యస్తు పక్వ ముపాదత్తే కాలే పరిణతం ఫలమ్ ।
ఫలాద్రసం స లభతే, బీజా చ్చైవ ఫలం పునః ॥ (సం. 5-34-15,16)

ఇది లోకనీతి, రాజనీతి కూడా. అపరిపక్వస్థితిలో ఫలాన్ని కోయరాదని నీతి. దాని వలన రససిద్ధి ఉండదు. బీజసిద్ధి కలుగదు. రససిద్ధి స్వీయప్రయోజన లబ్ది. బీజసిద్ధి లోకహితసిద్ధి. ఈ రెండూ ఒక కార్యం సహజంగా కాలం చేత పరిపక్వం చెందటంమీద ఆధారపడి ఉంటాయి. పరిణత ఫలం వలన రససిద్ధి, కార్యసిద్ధి కలుగుతుంది. ఈ నీతిలోని అపరిపక్వస్థితి దుర్యోధనుడి నీతిని సూచిస్తున్నది. పరిపక్వ స్థితి ధర్మజుడి నీతిని ధ్వనింపచేస్తున్నది. దుర్యోధనుడు అత్యాశతో పాండవ సంపదను మాయాద్యూత నెపంతో హరించి దాని ఫలాన్ని శాశ్వతంగా అనుభవించలేని స్థితిని కల్పించుకొనటమేకాక, దాని వలన సత్ఫలితా లివ్వ గలిగిన బీజాలను (హేతువులను) నైతికంగా ధ్వంసం చేసికొన్నాడు. దాని వలన దుర్యోధనుడు అపహరించిన పాండవ సంపద అపరిపక్వ ఫలం వంటిది. ధర్మరాజు రాజ్యాన్ని కోల్పోయినా అరణ్యాజ్ఞాతవాసాలు నిర్వహించి, తన యుద్ధోద్యోగానికి తగిన కాలపరిపక్వస్థితిని కల్పించుకొంటున్నాడు. సామదాన భేద దండోపాయాలనే బీజాలు నయనీతితో ఫలించేటట్లు కార్యాన్ని పరిపక్వ స్థితికి తెచ్చుకొంటున్నాడు. నయనీతి ధర్మజుడిది; అవినయనీతి దుర్యోధనుడిది. ఇవే ఈ పద్యంలోని నయానయాలు. (సంపా.)

తే. మాలకరి పుష్పములు గోయుమాడ్కిఁ, దేఁటి । పువ్వుఁ దేనియ గొనియెడు పోల్కి నెదురు
గందకుండఁగఁ గొనునది కార్యఫలము; । బొగ్గులకుఁ బోలె మొదలంటఁ బొడువఁ జనదు. 57

ప్రతిపదార్థం: మాలకరి= దండలు కట్టేవాడు; పుష్పములు= పువ్వులు, కోయు మాడ్కిన్= కోసే విధంగా; తేఁటి= తుమ్మెద; తేనియ= మకరందం; కొనియెడు పోల్కిన్= ఆస్వాదించే రీతిగా; ఎదురు= ఎదుటివాడు; కందక+ఉండంగన్= బాధపడకుండా; కార్యఫలమున్= ఒక పనియొక్క ఫలితాన్ని; కొనునది= పొందాలి; బొగ్గులకున్+పోలెన్= బొగ్గుల కొరకు వలె; మొదలు+అంటన్= పూర్తిగా; పొడువన్+చనదు= నరికివేయగూడదు.

తాత్పర్యం: దండలు కట్టేవాడు చెట్టునుండి పువ్వులు కోసే విధంగా, తుమ్మెద పువ్వులలోని మకరందం పీల్చుకొనే రీతిగా, ఎదుటివాడు బాధపడకుండా ఒక పని ఫలితాన్ని పొందాలి. అంతేకాని, బొగ్గుల కొరకు మొదలంటా నరికివేయగూడదు.

విశేషం: అలం: ఉపమ. ఉపమలు మూడు ఉన్నాయి కనుక, మాలోపమ. 1.'మాలకరి ...మాడ్కి', 2.'తేఁటి ...పోల్కి,' 3.'బొగ్గులకుఁ బోలె.' ఈ పద్యం కూడా మూలంలోని రెండు శ్లోకాల తాత్పర్యాన్ని కలిపి పునర్నిర్మించినది. మూల శ్లోకా లివి-

> **"యథా మధుసమాదత్తే రక్షన్ పుష్పాణి షట్పదః ।**
>
> **తద్య దర్థా న్మనుష్యేభ్య ఆదద్యా దవిహింసయా ॥**
>
> **పుష్పం పుష్పం విచిన్వీత మూలచ్ఛేదం నకారయేత్ ।**
>
> **మాలాకార ఇవారామే న యథాఽఙ్గారకారకః ॥ (సం. 5-34-17,18)**

-మూలంలోని 'అర్థం' తెలుగులో 'కార్యఫలం'గా పేర్కొనబడింది. వరుస మారినా ముచ్చటైన మూడు ఉపమానాలు ఒక పద్యంలో ఉక్తి విలాసాన్ని పొందాయి. మాలాకారుడి ఉపమానం ముందువచ్చింది. పూలు కోసినా మూలనాశం కాకూడదని నీతి అందులో ఉన్నది. ధర్మజుడి శాంతిసందేశం ఆ కార్యసిద్ధిని సూచిస్తుంది. అంతే కాదు. పూలను కోయటమంటే ఉపాయ సాధనం, లేదా ఉపకరణ సేకరణం. ధర్మజుడి సామదానాద్యుపాయాలు వంశనాశం కాకుండా ఉండటానికే ఉద్దేశించబడ్డాయి. పాండవులు కౌరవులకు పంపే సందేశాలన్నీ ఆ తాత్పర్యాన్నే సూచిస్తున్నాయి. ఆ తరువాత మధుకరోపమానం సార్థకం. ఇది శత్రుశిబిరంలోని వీరుల హృదయాలలో ధర్మజుడు తన ధర్మనీతి వర్తనం పట్ల సౌముఖ్యం ఏర్పడటానికి చేస్తున్న ప్రయత్నం. భీష్మాదుల వంటి వారు కౌరవ వంశ వృక్షానికి పూచిన పూలు. వారి సౌముఖ్యం పూదేనె. దానిని ధర్మరాజు వారి మనస్సులు కందకుండా దౌత్యం ద్వారా సంఘటిస్తున్నాడు. చివరకు యుద్ధం వలని కీడును అందరికీ తెలియజెప్పి వంశమూలాలు నాశనం కాకుండా, కౌరవులు నశించకుండా రక్షించ యత్నించాడు. స్వార్థం కొరకు కౌరవ వంశవృక్షాన్ని బొగ్గులు చేయతలచలేదు. ఇది ధర్మరాజు యొక్క నయనీతి. దుర్యోధనుడు ఈ మూడు రకాలైన యత్నాలనూ స్వీయకులనాశానికి అనుగుణంగా నడిపి అవినీతిని ప్రదర్శించాడు. పేర్లు ప్రత్యేకించి పేర్కొనకుండా ధర్మజ దుర్యోధను లనుసరిస్తున్న నీతి అవినీతులను అలంకార సుందరంగా ఆవిష్కరించిన సూక్తి ఇది. (సంపా.)

క. పరుల ధనమునకు, విద్యా । పరిణతికిం, దేజమునకు, బలమునకు మనం
బెరియఁగ నసహ్యపడు న । న్నరుఁడు దెవులు లేని వేదనం బడు నధిపా! 58

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; పరుల ధనమునకున్= ఇతరుల డబ్బుకూ; విద్యా పరిణతికిన్= విద్యాపరిపక్వతకూ; తేజమునకున్= తేజస్సుకూ; బలమునకున్= పరాక్రమానికీ; మనంబు= మనస్సు; ఎరియఁగన్= మండేటట్టు; అసహ్యము+పడు+ఆ+నరుఁడు= ఓర్వలేని ఆ మనుష్యుడు; తెవులు లేని వేదనన్+పడున్= రోగం ఏమీ లేకుండానే బాధపడతాడు.

తాత్పర్యం: రాజా ధృతరాష్ట్రా! ఇతరుల డబ్బుకూ, విద్యాపరిపక్వతకూ, తేజస్సుకూ, బలానికీ మనస్సు కాలిపోయేటట్లు ఓర్వలేని ఆ మనుష్యుడు రోగం ఏమీ లేకుండానే బాధపడతాడు.

విశేషం: ఇది చక్కని లోకనీతి. హితోక్తి. మూల శ్లోకభావాన్ని సందర్భశుద్ధితో నిగ్గుతేల్చి తెలుగులో వెలయించాడు తిక్కన. మూలం-

> **"య ఈర్ష్యః పరవిత్తేషు రూపే వీర్యే కులాన్వయే**
>
> **సుఖ సౌభాగ్య సత్కారే తస్య వ్యాధి రనన్తకః". (సం. 5-34-42)**

ఇతరుల ధనానికీ, రూపానికీ, బలానికీ, కులానికీ, సుఖసౌభాగ్యాలకూ, సత్కారానికీ ఈర్ష్య పొందేవాడి రోగానికి అంతం లేదని మూల శ్లోక తాత్పర్యం. ఇది సర్వసాధారణ లోకనీతి. తిక్కన పద్యంలో ఈర్ష్య పడదగిన అంశాలను, వాటి వరుసను మార్చి

పునర్నిర్మించాడు. ఈర్ష్యపడేవాడు ఏ రోగం లేకున్నా, దీర్ఘరోగంతో బాధపడేవాడివలె లోలోన వేదన పడతాడని తిక్కన తీర్చిన భావం. ఈ దీర్ఘరోగి ధృతరాష్ట్రుడని చెప్పకుండానే తెలుస్తున్నది. అతడి కా వేదన- పాండవ సంపదను చూచిన తరువాత మొదలయింది. సంపదనంతా కపట ద్యూతంలో హరించాడు, పాండవులను అరణ్యాజ్ఞాతవాసాలకు పంపారు. వారు నయనీతి విద్యాపారంగతులు కావటంతో ధర్మానికి కట్టుపడి ఆడిన మాటను పాటించారు. వారు విజయవంతంగా ప్రతిజ్ఞలను ముగించినందుకు ధృతరాష్ట్రుడు లోలోన బాధపడ్డాడు. పాండవులు పాశుపతాది మహాస్త్రాలను సంపాదించి శత్రువులకు అసాధ్యులై ఉత్తమ శీలంతో ప్రకాశిస్తున్నారు. ఆ అంశం ధృతరాష్ట్రుడి హృదయంలో శల్యం వలె బాధిస్తున్నది. చివరిది పాండవుల బలం. పాండవుల బలాన్ని గురించి, విశేషించి శ్రీకృష్ణుడి మహత్వాన్ని గురించి తలచినప్పుడెల్లా ధృతరాష్ట్రుడికి గుండెలో శతఘ్నులు మ్రోగుతూ ఉంటాయి. మాయాద్యూతం నుండి రాయబారాల వరకు సాగిన కథలో పాండవులలో వెలుగొందిన సద్గుణాలు వరుసగా పేర్కొనటం ఒక విశేషం. రోగం కాని రోగం అసూయ. ధనం కొరకైన అసూయ ఇంద్రియ సంక్షోభాన్ని కలిగిస్తుంది. విద్యను చూచి పడే అసహనం బుద్ధిని కలతపెట్టుతుంది. తేజస్సు వలన కలిగే అసూయ హృదయాన్ని క్షోభ పెట్టుతుంది. శత్రువుల బలాధిక్యాన్ని గమనించి పొందే అసూయ శరీరాన్నంతా దగ్ధం చేస్తూ ఉంటుంది. ఇంతటి దారుణ రోగావస్థను ధృతరాష్ట్రుడు అంతరంగంలో పొందుతూ ఉన్నాడని ప్రకరణోచిత ధ్వని. (సంపా.)

క. ఎదిరికి హితమును, బ్రియమును, । మది కింపును గాఁగఁ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స; యటు గా । కిది యది యన కూరకునికి యెంతయు నొప్పున్. 59

ప్రతిపదార్థం: ఎదిరికిన్= ఎదుటివాడికి; హితమును= మేలయినదీ; ప్రియమున్= ఇష్టమైనదీ; మదికిన్+ఇంపును+కాఁగన్= మనస్సునకు సంతోషకరమైనదీ అయ్యేటట్లు; పలుకు మాటలు= మాటాడే మాటలు; పెక్కు+ఐ= ఎక్కువయి; ఒదవినను= కలిగితే; లెస్స= మంచిది; అటు+కాక= అలా కాక; ఇది+అది+అనక= ఏమీ అనకుండా- నోరెత్తకుండా; ఊరక+ఉనికి= ఊరుకోవడం; ఎంతయున్+ఒప్పున్= మిక్కిలి బాగుంటుంది.

తాత్పర్యం: ఎదుటి వాడికి మేలయినవీ, ఇష్టమైనవీ, మనస్సంతోషకరమైనవీ అయిన మాటలు ఎక్కువగా మాటాడగలిగితే మంచిది. అట్లా కాకపోతే ఏమీ అనకుండా నోరు మూసికొని ఊరుకొనటం ఎంతో మంచిది.

విశేషం: మూలంలోని విదురనీతి వాక్యాలను సందర్భోచితంగా వినిర్మించటం తిక్కన శిల్పం. అందుకు ఇటువంటి పద్యాలు ఉదాహరణలు.

"వాక్ సంయమో హి నృపతే సుదుష్కరతమో మతః ।
అర్థ వచ్చ, విచిత్రం చ న శక్యం బహుభాషితుమ్" (సం. 5-34-76)

వాక్సంయమనం పాటించటం చాలా కష్టం! సార్థకంగా, చమత్కారంగా నిరంతరం మాట్లాడటం అసాధ్యం- అని మూల శ్లోకం. మితహిత భాషణం మంచిదనీ, అది ఎదుటి వారికి ఇంపును కలిగించాలనీ, అట్లా నిరంతరం మాట్లాడటం మంచిదనీ, అట్టి నేర్పు లేకపోతే నోరు మూసికొని ఉండటం భావ్యమనీ తిక్కన చెప్పించాడు. ఈ వాక్యనీతి కౌరవులను ఉద్దేశించి చెప్పిందే. దుష్ట చతుష్టయం మాటల తీరే వారికి దోషాన్నీ, పాపాన్నీ, హానినీ కలిగిస్తున్నదని హెచ్చరిక. వారు మాట్లాడకుండ మిన్నకుండి నయ వాక్యకోవిదులను గౌరవించటమే ఉత్తమమని విదురుడి సూచన! పైది నీతివాక్యం; లోకహిత వాక్యం ఈ పద్యం. (సంపా.)

క. చెలిమియుఁ బగయును, దెలివియుఁ, । గలఁకయు, ధర్మంబుఁ, బాపగతియును, బెంపుం,
దులువతనంబును వచ్చును । బలుకుబడిన; కానఁ బొసఁగఁ బలుకఁగ వలయున్. 60

ప్రతిపదార్థం: చెలిమియున్= స్నేహమూ; పగయును= విరోధమూ; తెలివియున్= తెలివీ; కలఁకయున్= కలతా; ధర్మంబున్; పాపగతియును= పాపమార్గమూ; అధర్మమూ; పెంపున్= ఆధిక్యమూ; తులువతనంబును= తుంటరితనమూ; పలుకుబడిన్+అ= మాట తీరుచేతనే; వచ్చును; కానన్= కాబట్టి; పొసఁగన్+పలుకఁగన్+వలయున్= ఒప్పేటట్లు మాటాడాలి.

తాత్పర్యం: స్నేహ విరోధాలూ, జ్ఞానాజ్ఞానాలూ, ధర్మాధర్మాలూ, ఆధిక్య నైచ్యాలూ తమ మాటలతీరును బట్టి వస్తాయి. కాబట్టి ఒప్పుగా మాటాడాలి.

విశేషం: మూల శ్లోకం కంటే ఈ పద్యం సానబెట్టిన వజ్రంవలె ఉన్నది.

"అభ్యావహతి కల్యాణం వివిధం వాక్ సుభాషితా ।

సైవ దుర్భాషితా రాజ న్ననర్థా యోపపద్యతే ॥' (సం. 5-34-77)

పొసగేటట్లు పలకటం ఎంత లోకనీతియో, అంత రాజనీతి. పాండవ పక్షంలోని వారు, రాయబారులూ, భీష్మాది కురువీరులూ పొసగేటట్లు మాట్లాడుతారు. దుష్టచతుష్టయం పొసగని మాటలు పలుకుతారు. పొసగే మాటల వలన కలిగేవి స్నేహం, జ్ఞానం, ధర్మం, అభ్యుదయం. పొసగనిమాటల వలన క్రమంగా కలిగేవి పగ, కలక, పాపగతి, తులువతనం. ఉద్యోగపర్వంలో పాండవ కౌరవ పక్షాలలోని పాత్రలు ఎట్లా పలికారన్నది వాక్యరీతి విన్యాస చర్చ. తిక్కన ఈ పద్యంలో రాజనీతి పండిన తన వాక్యరచనా వైదగ్ధ్యాన్ని ప్రదర్శించాడు. రాయబారాల ఘట్టాలు వాక్యరచనా శిల్పాలకు రాచబాటలు. ఈ సూక్తిలో తిక్కన కవితా శిల్ప ప్రసక్తి కూడా ధ్వని. (సంపా.)

క. బెడిదముగఁ గత్తి గొడ్డటఁ । బొడువఁ దెగినవ్రానఁ జిగురు వొడముఁ; బలుకులం
జెడఁ దునిసిన కార్యంబు ని । గుడనేరదు పిదపనెట్టుఁ గురువంశనిధీ! 61

ప్రతిపదార్థం: కురువంశ నిధీ!= కురువంశానికి ఆశ్రయమైనవాడా ధృతరాష్ట్రా!; కత్తిన్= కత్తిచేతా; గొడ్డటన్= గొడ్డలి చేతా; బెడిదముగన్= గట్టిగా; పొడువన్= పొడువగా; తెగిన వ్రానన్= తెగినచెట్టునందు; చిగురు; పొడమున్= పుట్టుతుంది; పలుకులన్= మాటలచేత; చెడన్= చెడిపోగా; తునిసిన కార్యంబు= భగ్నమైన పని; పిదపన్= తరువాత; ఎట్టున్= ఏవిధంగానూ; నిగుడన్+ నేరదు= చక్కబడదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కత్తితోగానీ, గొడ్డలితోగానీ గట్టిగా నరకగా తెగిపోయిన చెట్టుకు చిగురు పుడుతుంది. కాని, మాటలచే చెడి భగ్నమైన కార్యం తరువాత ఏవిధంగానూ చక్కబడలేదు.

విశేషం: అలం: వ్యతిరేకం. ఇందు ఉపమేయంకంటె ఉపమానానికి ఆధిక్యం చెప్పబడింది. కాబట్టి అలంకారం వ్యతిరేకం. ఈ సూక్తి దుష్టచతుష్టయం పలికే మాటలలోని వాక్పారుష్యాన్ని, దానివలన కలిగే ఫలితాలను ధ్వనింపజేస్తున్నది. (సంపా.)

క. తనువున విఱిగిన యలుఁగుల । ననువునఁ బుచ్చంగవచ్చు; నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు । విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా! 62

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా! వినుము, తనువునన్= శరీరంలో; విఱిగిన+అలుఁగులన్= విరిగిపోయిన బాణాలను; అనువునన్= ఉపాయంతో; పుచ్చంగన్+వచ్చున్= తొలగించవచ్చు; అతి నిష్ఠురతన్= మిక్కిలి పారుష్యంతో; మనమునన్=

మనస్సునందు; నాటిన మాటలు= గ్రుచ్చుకొన్న మాటలు; ఎన్ని ఉపాయములను= ఎన్ని ఉపాయాలచేతనైనా; వెడలునె?= పోతాయా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! విను. శరీరంలో నాటుకొన్న బాణాలను ఉపాయంతో తొలగించవచ్చును. కాని, మిక్కిలి గట్టిగా మనస్సులో నాటుకొన్న మాటలు ఎన్ని ఉపాయాలచేతనైనా వెలికి వస్తాయా?

విశేషం: అలం: వ్యతిరేకం. ఇందులో ఉపమేయం కంటె ఉపమానానికి ఆధిక్యం చెప్పబడింది. కాబట్టి అలంకారం వ్యతిరేకం. ఈ సూక్తి నిండుసభలో కర్ణుడు పలికిన మాటలను, దుర్యోధన దుశ్శాసనుల దుర్భాషలను సూచిస్తున్నది. (సంపా.)

ఉ. అక్కట! ధర్మనందనుని యాస్యమునం దొకనాఁడుఁ గీడుప
ల్కొక్కఁడు లేదు; నీ కొడుకు లొండొరు మీఱి నికృష్టవాక్యముల్
పెక్కులు పెక్కుభంగులను బ్రేలుచు నుండఁగ నీవు దానికిన్
స్రుక్కక వించు నుండె; దనురూపమె నీ కిది కౌరవేశ్వరా? 63

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా, ధృతరాష్ట్రా!; అక్కట= అయ్యో!; ధర్మ నందనుని+ఆస్యమునందున్= ధర్మరాజునోట; ఒక నాఁడున్= ఒకప్పుడునూ; కీడు పల్కు+ఒక్కఁడున్= దుర్భాష ఒక్కటి కూడా; లేదు; నీ కొడుకులు; ఒండొరున్= ఒకళ్ళ నొకళ్ళు; మీఱి= అతిక్రమించి; నికృష్ట వాక్యముల్= నీచములైన వాక్కులు; పెక్కులు= అనేకం; పెక్కు భంగులను= అనేక విధాల; ప్రేలుచున్+ఉండఁగన్= వాగుతూ ఉంటే; నీవు; దానికిన్; స్రుక్కక= జంకక; వించున్+ఉండెదు(దవు)= వింటూ ఉంటావు; నీకున్; ఇది; అనురూపమె?= తగినదేనా?

తాత్పర్యం: ధృతరాష్ట్రా! అయ్యో! ధర్మరాజు నోట ఒకప్పుడు దుర్భాష ఒక్కటి కూడా లేదు. నీ కొడుకులు ఒకళ్ళని మించి ఒకళ్ళు నీచవాక్యాలు అనేకం అనేక విధాలుగా ప్రేలుతూ ఉంటే నీవు దానికి జంకక వింటూ ఉంటావు. నీకిది తగినదేనా?

విశేషం: సద్భాషలు వినకపోవటం, దుర్భాషలు వింటూ వాటిని వారించక, మౌనంగా అంగీకరిస్తూ వాటికి బాసటగా నిలవటం మహాదోషం. ధృతరాష్ట్రుడు దుర్యోధనాదుల దుష్టభాషణ దుష్టఫలితాన్ని అనుభవించదగిన అర్హత పొందాడని ధ్వని. దాని ఫలమే అతడి అంతర్వేదన. (సంపా.)

ఆ. చేటుకాలమైనఁ జెట్టమాటలు నెఱి । గాని తెరువు వట్టు కర్జములును
దగవు లట్లు తోఁచుఁ; దగియెడునవి యవి । నీతు లని మనంబు నిశ్చయించు. 64

ప్రతిపదార్థం: చేటు కాలము+ఐనన్= చెడుకాలం దాపురించినప్పుడు; చెట్ట మాటలున్= చెడుమాటలును; నెఱి+కాని తెరువు+పట్టు కర్జములును= చెడుత్రోవపట్టిన పనులును; తగవులు+అట్లు తోఁచున్= ధర్మాలవలె తోస్తాయి; తగియెడు+అవి= తగిన మాటలూ; అవినీతులు+అని= నీతిమాలినవని; మనంబు= మనస్సు; నిశ్చయించున్= నిర్ణయిస్తుంది.

తాత్పర్యం: చెడుకాలం దాపురిస్తే చెడు మాటలూ, చెడుత్రోవ పట్టిన చేతులూ ధర్మబద్ధాలయినట్లు తోస్తాయి. తగిన మాటలూ, చేతలూ నీతిమాలినవని మనస్సు నిర్ణయిస్తుంది.

విశేషం: "వినాశకాలే విపరీత బుద్ధిః" అనే సూక్తికి ఈ పద్యం హృద్యమైన, అభినవాభివ్యక్తి. (సంపా.)

వ. నీ బుద్ధి పాండవులతోడి విరోధంబునెడ మరలంబడమి పాపం బింతియకాక యేమి సేయుదము? మన కులంబునం దేజో ధైర్య ధార్మికత్వాది గుణంబుల గరిష్ఠుండయిన యుధిష్ఠిరుండు నీ సిరికి వెలియై యట్లుండుట దగ వగునే? నీ పెద్దతనంబు సూచి సైరణ వాటించి యున్నవాఁ'డనిన, విదురు దిక్కు మొగంబై ధృతరాష్ట్రుండు 'నీ చెప్పిన నీతివాక్యంబుల నా మనంబు దనివోవ దింకను జెప్పు' మనవుడు నతండు వెండియు నిట్లనియె. 65

ప్రతిపదార్థం: నీ బుద్ధి, పాండవులతోడి విరోధంబు+ఎడ= పాండవులతోడి పగ నుంచి; మరలంబడమి= మరలకపోవటం; పాపంబు; ఇంతియ కాక= ఇంతేకాక; ఏమి+చేయుదము? మన కులంబునన్= మన వంశంలో; తేజస్(ః)+ధైర్య ధార్మికత్వ+ ఆది గుణంబులన్= తేజస్సూ, ధైర్యమూ, ధర్మపరాయణతా, మొదలైన గుణాల చేత; గరిష్ఠుండు+అయిన= గొప్పవాడైన; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నీ సిరికిన్= నీ సంపదకు; వెలి+ఐ= దవ్వయినవాడై; అట్లు+ఉండుట; తగవు+అగునే; నీ పెద్దతనంబు+చూచి; సైరణ+పాటించి= శాంతం వహించి; ఉన్నవాఁడు; అనినన్; విదురు దిక్కు మొగంబు+ఐ= విదురుడి కేసి తిరిగి; ధృతరాష్ట్రుండు; నీ చెప్పిన నీతివాక్యంబులన్; నా మనంబు; తనివోవదు= తృప్తిపడదు, ఇంకనున్+చెప్పుము; అనవుడున్; అతండు; వెండియున్= మళ్లీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీ మనస్సు పాండవులపై పగ నుండి మరలకపోవటం పాపం. ఇంతే. ఏం చేద్దాం? మన వంశంలో తేజస్సూ, ధైర్యమూ, ధర్మపరత్వమూ మొదలైన గుణాల చేత గొప్పవాడైన ధర్మరాజు నీ సంపదకు దూరమైనవాడై అట్లా ఉండటం న్యాయమా? నీ పెద్దరికం చూచి శాంతం వహించి ఉన్నాడు' అనగా ధృతరాష్ట్రుడు విదురుడివైపు మొగంపెట్టి 'నీవు చెప్పిన నీతివాక్యాలతో నా మనస్సు తృప్తిపడదు. ఇంకా చెప్పుము.' అనగా విదురుడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: ధృతరాష్ట్రుడు వస్తుతః గొప్ప శ్రోత. అతడి గ్రుడ్డితనం, స్థిరనిర్ణయం చేయలేని పిరికితనం అతడిని అట్లా మార్చింది. శత్రు మిత్ర పక్షాల వాదాలు చాలా ఓపికగా వింటాడు. దానికి అనువుగా విదురనీతి వాక్యబోధా శ్రవణం అమరింది. దీనివలన ధృతరాష్ట్రుడు కౌరవ పాండవ పక్షాల వర్తన విశేషాలను తులనాత్మకంగా తెలిసికొనే అవకాశం కలగటంతోపాటు, పాండవుల ప్రయత్నాలకు ప్రతిగా దుర్యోధను డనుసరించే పద్ధతిని మూల్యాంకనం చేసికొనటానికి అతడు ప్రయత్నించవచ్చును. రాత్రి తెల్లవారేదాకా, మనశ్శాంతి కలిగే దాకా విదురుడు నీతులు వల్లిస్తూనే ఉంటాడు. అక్కడక్కడ ధర్మరాజు యొక్క గొప్పతనాన్ని చెప్పి తన ఉపన్యాసాన్ని ఆపటానికి విదురుడు యత్నిస్తే, ధృతరాష్ట్రుడు కొనసాగించుమంటాడు. ఇది కూడా అతడి అనిశ్చిత మనఃస్థితిని వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

ఆ. 'సకల పుణ్యకర్మ చయమును నొకదెస, । వినుము పాడి దప్పకునికి యొక్క
దిక్కు; దీని శ్రుతులు తెలిపెడునెడఁ, బాడి । కలిమి యెందుఁ బెద్దగా నుతించె. 66

ప్రతిపదార్థం: వినుము; సకల పుణ్య కర్మ చయమునున్= ఎల్ల పుణ్యకార్యాల సమూహమూ; ఒక దెస= ఒకవైపు; పాడి+తప్పక+ ఉనికి= ధర్మం తప్పకుండటం; ఒక్క దిక్కు= ఒక వైపు; దీనిన్; శ్రుతులు= వేదాలు; తెలిపెడు+ఎడన్= తెలిపే టప్పుడు; పాడి కలిమి= ధార్మిక సంపదనే; ఎందున్= ఎక్కడైనా; పెద్దగాన్= అధికంగా; నుతించెన్= పొగిడాయి.

తాత్పర్యం: విను. ఎల్ల పుణ్యకార్యాల సమూహమూ ఒక దిక్కునా, ధర్మం తప్పకుండా ఉండడం ఒక దిక్కునా ఉంచగా- దీనిని గురించి చెప్పేటప్పుడు వేదాలు ధార్మిక సంపత్తినే ఎందయినా అధికతరంగా పొగిడాయి.

తే. పాడి గలిగిన నిహలోకఫలములెల్లఁ । జేరుటయ కాదు, కీర్తియుఁ జెందుఁ బురుషు;
ధరణిఁ బొగడిత యెందాఁకఁ బరఁగు, నంత । కాలమును బుణ్యలోకంబు గల్గు నండ్రు. 67

ప్రతిపదార్థం: పాడి+కలిగినన్= ధర్మం కనుక కలిగి ఉంటే; పురుషున్= మనుష్యుడిని; ఇహ లోక ఫలములు+ఎల్లన్= భూలోకఫలాలన్నీ; చేరుట+అ కాదు= చేరటమే కాదు; కీర్తియున్= కీర్తికూడా; చెందున్= కలుగుతుంది; ధరణిన్= భూమిలో; పొగడిత= పొగడ్త; ఎందాఁకన్= ఎంతకాలం; పరఁగున్= ఒప్పుతుందో; అంత కాలమును; పుణ్య లోకంబు, కల్గున్+అండ్రు= కలుగుతుంది అంటారు.

తాత్పర్యం: ధర్మం కనక కలిగి ఉంటే, పురుషుడిని భూలోకఫలాలన్నీ చేరడమే కాదు, అతడికి కీర్తి కూడా కలుగుతుంది. భూమిలో పొగడ్త (కీర్తి) ఎంతకాలం ఉంటుందో, అంతకాలమూ పుణ్యలోకం కలుగుతుందని అంటారు.

వ. తొల్లి ప్రహ్లాదుండు దైత్యజాతి సంభవుం డయ్యును, దనకొడుకు విరోచనుండును, నంగిరసుండను విప్రు కొడుకు సుధన్వుండును దమతమ ప్రాణంబు లొడ్డుగా నొడ్డి యొక్క ధర్మ సందేహంబునకుఁ బన్నిదంబు సఱచి వచ్చి త న్నడిగిన, నితండు గొడు, కితండు లాఁతి యని తలంపక మధ్యస్థుండై సుధన్వు గెలిపించి, యతని చేత నిజతనయుని జీవితంబు దానంబుగాఁ గొని వాని బ్రదికించెం గావున, నీవును ధర్మంబు విడువక, యధర్మోపేతులైన నీకొడుకులవలని పక్షపాతంబు విడిచి తెఱంగు సేయుము; వారును వీరును నాపదలేక బ్రదుకుదురు; నీవును శోకంబులేక తక్కుదు'వని చెప్పి మఱియును- 68

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; ప్రహ్లాదుండు; దైత్య జాతి సంభవుండు+అయ్యును= రాక్షసకులంలో పుట్టినవాడయినా; తన కొడుకు, విరోచనుండును; అంగిరసుండు+అను విప్రుకొడుకు సుధన్వుండును= అంగిరసుడనే బ్రాహ్మణుడి కుమారుడైన సుధన్వుడూ; తమ తమ ప్రాణంబులు; ఒడ్డుగాన్+ఒడ్డి= పణంగా పెట్టి; ఒక్క ధర్మ సందేహంబునకున్; పన్నిదంబు+చఱచి వచ్చి= పందెం వేసికొని వచ్చి; తన్నున్; అడిగినన్; ఇతండు; కొడుకు; ఇతండు; లాఁతి= ఇతరుడు; అని; తలంపక; మధ్యస్థుండు+ఐ= మధ్యవర్తియై; సుధన్వున్; గెలిపించి; అతని చేతన్; నిజ తనయుని జీవితంబున్= తన కొడుకు ప్రాణాన్ని; దానంబుగాన్; కొని; వానిన్; బ్రదికించెన్; కావునన్; నీవునున్; ధర్మంబు విడువక; అధర్మ+ఉపేతులు+ఐన= అధర్మంతో కూడుకొన్నవారైన; నీ కొడుకుల వలని పక్షపాతంబు విడిచి= నీ కొడుకుల మీది పక్షపాతం విడిచిపెట్టి; తెఱంగు+చేయుము= సంధిచేయుము; వారును; వీరునున్; ఆపద లేక; బ్రదుకుదురు; నీవును; శోకంబు లేక; తక్కుదువు= తొలగుదువు; అని, చెప్పి; మఱియును-

తాత్పర్యం: పూర్వం ప్రహ్లాదుడు రాక్షసకులంలో పుట్టినవాడయినా, తన కొడుకు విరోచనుడూ, అంగిరసుడనే బ్రాహ్మణుడి కొడుకు సుధన్వుడూ తమ తమ ప్రాణాలు పణంగా పెట్టి, ఒక ధర్మ సందేహానికి పందెం వేసికొని వచ్చి త న్నడిగితే, వీడు తన కొడుకూ, వీడు ఇతరుడూ అని భావించక మధ్యవర్తిత్వం వహించి, సుధన్వుడి పక్షాన తీర్పు చెప్పి, అతడి నుంచి తన కొడుకు జీవితాన్ని దానంగా పుచ్చుకొని అతడిని బ్రతికించాడు. కాబట్టి నీవు కూడా

ధర్మం విడువక, అధర్మపరులైన నీ కొడుకుల మీది పక్షపాతం విడిచిపెట్టి ఉభయులకూ సంధి చేయుము. వాళ్ళూ, వీళ్ళూ ఆపద లేక బ్రతుకుతారు. నీవూ దుఃఖం లేకుండా ఉంటావు.' అని చెప్పి, ఇంకా.

విశేషం: మూలంలో విపులంగా ఉన్న ప్రహ్లాదోదంతాన్ని సంగ్రహంగా రచించటం తిక్కన ప్రకరణౌచిత్యానికి నిదర్శనం. (సంపా.)

క. 'పాపంబులు గర్జము లని । యేపునఁ జేయంగ నవియు నింపగు; ధర్మ
వ్యాపారంబు లకార్యము । లై పరిణతిఁ బొందెనేని నట్టుల చెల్లున్. 69

ప్రతిపదార్థం: పాపంబులు; కర్జములు+అని= కార్యములని- చేయదగినవని; ఏపునన్= గర్వంతో; చేయంగన్= చేస్తే; అవియున్= ఆ పాపాలు కూడా; ఇంపు+అగున్= ఇష్టం అవుతాయి; ధర్మ వ్యాపారంబులు= ధర్మకార్యాలు; అకార్యములు+ఐ= చేయరానివయి; పరిణతిన్+పొందెన్+ఏనిన్= పరిణమిస్తే; అట్టులు+అ= అలాగే- అకార్యములుగానే; చెల్లున్= అయిపోతాయి.

తాత్పర్యం: పాపాలు చేయదగినపని గర్వంతో చేస్తే, అవే ఇష్టమవుతాయి. ధర్మకార్యాలు చేయరానివిగా పరిణమిస్తే అవి అట్లాగే అయిపోతాయి.

విశేషం: ఈ పద్య భావం మూలంలోని ముచ్చటైన రెండు సుభాషితాల సులభీకరణం: ఆ శ్లోకా లివి-

"పాపం ప్రజ్ఞాం నాశయతి క్రియమాణం పునః పునః
నష్ట ప్రజ్ఞః పాప మేవ నిత్య మారభతే నరః ॥
పుణ్యం ప్రజ్ఞాం వర్ధయతి క్రియమాణం పునః పునః
నష్ట ప్రజ్ఞః పాపమేవ నిత్య మారభతే నరః" (సం.5-35-52,53)

చ. అది సభయే ప్రియం బెసఁగ నార్యులు నిల్వరయేని? నార్యులే
మదిఁ దలఁపంగ వారలు సమంచిత ధర్మము వల్కరేని? న
ట్టిదియును ధర్మువే తగ ఘటించిన నిక్కము లేద యేనిఁ? దాఁ
బదిలపునిక్కమే యొక నెపంబిడు చొప్పగునేని భూవరా! 70

ప్రతిపదార్థం: భూవరా!= రాజా, ధృతరాష్ట్రా!; ప్రియంబు+ఎసఁగన్= ప్రీతి అతిశయించగా; ఆర్యులు= పూజ్యులు; నిల్వరు+అ+ఏనిన్= ఉండకపోతే; అది; సభయే= సభయా (కాదని భావం); వారలు= వాళ్ళు-ఆ ఆర్యులు; మదిన్+తలఁపంగన్= మనస్సులో ఆలోచింపగా; సమంచిత ధర్మము+పల్కరు+ఏనిన్= ఒప్పయిన న్యాయం చెప్పకపోతే; ఆర్యులు+ఏ?= ఆర్యులా? (పూజ్యులా); తగన్+ఘటించినన్= ఒప్పుగా చేస్తే; నిక్కము లేదు+అ+ఏనిన్= సత్యం లేకపోయినట్లయితే; అట్టిదియును+ధర్మువు+ఏ!= అటువంటిది కూడా ఒక ధర్మమేనా?; ఒక నెపంబు+ఇడు చొప్పు+అగున్+ఏనిన్= ఏదో ఒక నెపం పెట్టే విధం అయితే; తాన్= తాను- ఆ సత్యం; పదిలము+నిక్కము+ఏ?= సిసలైన సత్యమా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మిక్కిలి ప్రీతితో ఆర్యులు నిలవకపోతే అది కూడా ఒక సభయేనా? ఆ ఆర్యులు ఒప్పుగా న్యాయం మాటాడకపోతే, వాళ్ళూ ఓ ఆర్యులేనా? ఆ ధర్మాన్ని బాగా ఆచరిస్తే, అందులో సత్యం లేకపోతే, అదీ ఒక ధర్మమేనా? ఏదో ఒక నెపంతో కూడినదయితే, అదీ ఒక సిసలైన సత్యమా?

విశేషం: దీనికి మూలమైన శ్లోకం సంస్కృతభారతంలో ఇట్లా ఉంది.

'న సా సభా యత్ర న సన్తి వృద్ధా । న తే వృద్ధా యే న వదన్తి ధర్మమ్,

నా సౌ ధర్మో యత్ర న సత్యమస్తి । న తత్ సత్యం యచ్ఛలే నానువిద్ధమ్.' (సం. 5-35-58)

ఇదే శ్లోకం సంస్కృత భారతంలో సభాపర్వంలో కూడా ఉన్నది. (60-69) కాని దీనిని నన్నయ ఎందుచేతనో తెనిగించలేదు.

ఉ. నీతి పథంబునన్ బ్రదుక నేర్చుట యుత్తమ భంగి; శౌర్య సం
జాతములై కరం బలరు సంపద లొందుట మధ్యవృత్తి; య
స్ఫీతములైన భారవహజీవనముల్ దలఁపం గనిష్ఠముల్;
నీతికి బాహ్యులైన, ధరణీవర! మెత్తురె వారి నుత్తముల్? 71

ప్రతిపదార్థం: ధరణీవర!= రాజా, ధృతరాష్ట్రా!; నీతి పథంబునన్= నీతిమార్గంలో; బ్రదుకన్+నేర్చుట= బ్రతకగలగటం; ఉత్తమ భంగి= శ్రేష్ఠమయిన విధం; శౌర్య సంజాతములు+ఐ= పరాక్రమం చేత కలిగినవయి; కరంబు+అలరు= మిక్కిలి ఒప్పే; సంపదలు; ఒందుట; మధ్య వృత్తి= మధ్యమం; తలఁపన్= ఆలోచించగా; అస్ఫీతములు+ఐన= అరకొరలైన; భార వహ జీవనముల్= బరువుగా లాగే బ్రతుకులు; కనిష్ఠముల్= అధమాలు; నీతికిన్+బాహ్యులు+ఐనన్= నీతికి వెలి అయితే; వారిన్; ఉత్తముల్= సజ్జనులు; మెత్తురె?= మెచ్చుకొంటారా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీతిమార్గంలో బ్రతకగలగటం ఉత్తమం. శక్తియుక్తులతో సంపదలు పొందటం మధ్యమం. ఆలోచిస్తే బరువుగా లాగే అరకొరలైన బ్రతుకులు అధమం. నీతిమాలిన వాళ్ళను ఉత్తములు మెచ్చుకొంటారా?

ఆ. కయ్యమునక యెపుడుఁ గాలు ద్రవ్వుదురు నీ । పుత్త్రు లెల్ల; సూతపుత్త్రుఁ డాది
యగు తదీయ మంత్రు లంతకు ముందర । బిరుదు; లీవు నీతి తెరువు సొరవు. 72

ప్రతిపదార్థం: నీ పుత్త్రులు+ఎల్లన్= నీ కొడుకులందరూ; ఎపుడున్= ఎప్పుడూ; కయ్యమునకున్+అ= యుద్ధానికే; కాలు+త్రవ్వుదురు= కాలు తవ్వుతారు; సూత పుత్త్రుండు+ఆది+అగు తదీయ మంత్రులు= కర్ణుడూ మొదలుగాగల వారి మంత్రులు; అంతకు ముందరన్= అంతకు ముందే; బిరుదులు= క్రొవ్వెక్కినవాళ్ళు; నీవు; నీతి తెరువు= నీతిమార్గంలో; చొరవు= ప్రవేశించవు.

తాత్పర్యం: నీ కొడుకులందరూ ఎప్పుడూ కయ్యానికే కాలు దువ్వుతారు. కర్ణుడు మొదలుగాగల వారి సలహాదారులు అంతకుముందే క్రొవ్వెక్కి ఉన్నవాళ్ళు. నీవేమో నీతిమార్గం పట్టవు.

క. పాండవులు శౌర్య మొల్లరు । ఖండిత నీతి ప్రకార కార్యము మెచ్చై
యుండుదు; రెదు రేచినఁ దుది । మండుదు; రార్పంగ రాదు మఱి యెవ్వరికిన్. 73

ప్రతిపదార్థం: పాండవులు; శౌర్యము+ఒల్లరు= పరాక్రమం అంగీకరించరు; అఖండిత నీతి ప్రకార కార్యము= మొక్కవోని నీతిమార్గంతోడి కార్యం; మెచ్చు+ఐ+ఉండుదురు= మెచ్చుకొంటూ ఉంటారు; ఎదురు+ఏచినన్= ఎదుటివాడు చెలరేగాడా; తుదిన్= చివరకు; మండుదురు= మండిపడతారు; మఱి= తరువాత; ఎవ్వరికిన్= ఎవరికీ; ఆర్పంగన్+రాదు= ఆర్పటం తరం కాదు.

తాత్పర్యం: పాండవులు అనవసరంగా పరాక్రమించడానికి ఇష్టపడరు. మొక్కవోని నీతిసహమైన కార్యమే మెచ్చుకుంటూ ఉంటారు. ఎదుటివాడు చెలరేగేడా, చివరకు మండిపడతారు. తరువాత వారిని ఆర్పటం (శాంతింప జేయటం) ఎవరి తరమూ కాదు.

క. తమ తండ్రి భంగి నీకును । సముచిత మగు భక్తి సేసి సజ్జననుత మా
ర్గమున నడచువారల నీ । వమలమతిం గన్నకొడుకు ల ట్లరయఁదగున్.' 74

ప్రతిపదార్థం: తమ తండ్రి భంగిన్= తమ తండ్రి అయిన పాండురాజువలె; నీకును, సముచితము+అగు భక్తి+చేసి= తగిన భక్తి చూపి; సత్+జన నుత మార్గమునన్= మంచివాళ్ళచేత పొగడబడే దారిలో; నడచు వారలన్= నడుచుకొనే వాళ్ళను; నీవు, అమల మతిన్= నిర్మలమైన మనస్సుతో; కన్న కొడుకులు+అట్లు= కన్న కొడుకులవలె; అరయన్+తగున్= చూడదగును.

తాత్పర్యం: తమ తండ్రి అయిన పాండురాజువలెనే నీ యందు సముచితమైన భక్తి కలిగియుండి సత్పురుషులు మెచ్చుకొనే మార్గంలో నడిచే ఆ పాండవులను నీవు నిర్మలబుద్ధితో కన్నకొడుకులవలె చూడదగును.'.

వ. అని పలికి మఱియు నిట్లనియె: 75

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'కారణము లేకయును నుప । కార పరత్వమున నొరుల కార్యంబులకున్
వారని యలజడిఁ బడియెడు । వారల చూ యేడుగడయు వారికి నధిపా! 76

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; కారణము లేకయును= ఏ కారణం లేకుండానే; ఉపకార పరత్వమునన్= ఉపకారం చేయాలనే ఆసక్తితో; ఒరుల కార్యంబులకున్= ఇతరుల పనులను గురించి; వారని= ఉడుగని; అలజడిన్+పడియెడు వారలు+అ+చూ= బాధపడేవాళ్ళే సుమా; వారికిన్= ఆ పాండవులకు; ఏడుగడయున్= దిక్కు.

తాత్పర్యం: 'రాజా! ధృతరాష్ట్రా! పాండవులు దిక్కులేనివారు అనుకొనకు. ఏమీ కారణం లేకుండానే ఉపకారం చేసే బుద్ధితో ఇతరుల పనుల గురించి ఉడుగని బాధపడే వాళ్ళే సుమా ఆ పాండవులకు దిక్కు.

చ. ఒకరుని చేతిప్రోపును దదున్నతి ప్రాపును గాంచి, యెల్లవెం
టకును గొఱంతలేక పొగడందగు సంపద నొంది, యట్టి దా
తకుఁ దుదిఁ గీడు సేసిన కృతఘ్నుని పీనుఁగునైన రోఁత పు
ట్టక కబళింపఁ గుక్కలు నొడంబడునే కురువంశవర్ధనా! 77

ప్రతిపదార్థం: కురువంశ వర్ధనా!= కౌరవ వంశాన్ని వృద్ధిపొందించేవాడా!; ధృతరాష్ట్రా!; ఒకరుని చేతి ప్రోపును= ఒకడి చేతి పోషణమునూ; తద్+ఉన్నతి ప్రాపును= అతడి ఔన్నత్యం యొక్క అండనూ; కాంచి= పొంది; ఎల్ల వెంటకును= అన్ని విషయాలలోనూ; కొఱంత లేక= లోటు లేక; పొగడన్+తగు సంపదన్+ఒంది= పొగడదగిన సంపదను పొంది; అట్టి దాతకున్; తుదిన్= చివర; కీడు+చేసిన కృతఘ్నుని పీనుఁగున్+ఐనన్= హాని చేసిన కృతఘ్నుడి శవాన్ని కూడా; రోఁత+పుట్టక= అసహ్యించుకొనకుండా; కబళింపన్= తినటానికి; కుక్కలున్= కుక్కలు సైతం; ఒడంబడునే?= అంగీకరిస్తాయా?

తాత్పర్యం: ఓయి కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! ఒకడు ఒక మహానుభావుడి పోషణలో ఉండి, అతడి ఔన్నత్యాన్ని ఆసరాగా చేసికొని, ఏ విషయంలోనూ లోటులేక మంచి సంపద సంపాదించి చివరికి అటువంటి మహోదారునికే హాని చేస్తే, ఆ కృతఘ్నుడి శవాన్ని కూడా అసహ్యించుకొనకుండా తినటానికి కుక్కలు సైతం అంగీకరిస్తాయా?

విశేషం: ఈ పద్యం పరోక్షంగా ధృతరాష్ట్ర నింద. ఆ గ్రుడ్డిరాజు మొదట పాండురాజు పోషణలో ఉన్నాడు. అతడు తనను గద్దెమీద ఉంచి గౌరవిస్తే ఉన్నతిని పొందాడు. దిగ్విజయాలు చేసి ధనరాశులు తెచ్చి అందిస్తే అపారసంపదను అనుభవించాడు. అతడు చనిపోతే, అతడి కొడుకులకు అన్యాయం చేయతలపెట్టటం కృతఘ్నుడి లక్షణం. అటువంటి కృతఘ్నుడి శవాన్ని కుక్కలు కూడా ముట్టుకొనవు అన్నాడు విదురుడు. ఇంతకంటె హీనమైన తిట్టు మరొకటి ఉండబోదు. అయినా, నిబ్బరంగా ఉండటం ధృతరాష్ట్రుడి దుష్టనీతి. (సంపా.)

వ. కావునఁ గృతము దలంపమి గీడు; పాండురాజు నీకుం బరమ భక్తుండు; పాండవులునుం దేజో లాభంబులు గావించినవారలు; వారల నాదరింపు' మని చెప్పి వెండియు నిట్లనియె: 78

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కృతము= చేసిన మేలు; తలంపమి= గుర్తించుకొనకపోవటం; కీడు= తప్పు; పాండురాజు; నీకున్; పరమ భక్తుండు= మిక్కిలి భక్తుడు; పాండవులునున్= పాండవులు కూడా; తేజ(ః)+లాభంబులు= తేజస్సూ; లాభమూ; కావించిన వారలు= చేసినవాళ్ళు; వారలన్= వాళ్ళను; ఆదరింపుము+అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి చేసిన మేలు మరిచిపోవటం తప్పు. పాండురాజు నీకు మంచి భక్తుడు. పాండవులు కూడా తేజస్సూ, లాభమూ నీకు సంపాదించి పెట్టినవాళ్ళు. వాళ్ళను ఆదరించుము' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: 'కృతము తలంపమి కీడు' అని తిక్కన సూక్తి.

క. 'కృత మెఱుఁగుట పుణ్యము స । న్మతి దానికి సమము సేఁత మధ్యము, మఱి త
త్కృతమున కగ్గలముగ స । త్కృతి సేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్. (ఆది. 1.244)

'కృత మెఱిఁగెడు పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించును' (సభా. 1.46) అని నన్నయ. (సంపా.)

ఆ. 'బ్రదుకు, చేటు, పొగడువడుట, దూ ఱొందుట, । యీఁగి, వేఁడుకొనుట, యిట్లు మఱియుఁ
గలుగు సౌఖ్య దుఃఖములు వచ్చు నడవడి; । వాని కింత యేల వగవ నధిప! 79

ప్రతిపదార్థం: అధిప!= రాజా, ధృతరాష్ట్రా!; బ్రదుకు= మంచి బ్రదుకూ; చేటు= వినాశమూ; పొగడు+పడుట= ప్రశంసలు పొందటమూ; దూఱు+ఒందుట= నిందపడటమూ; ఈఁగి= త్యాగమూ; వేఁడుకొనుట= అడుగుకొనటమూ; ఇట్లు= ఈ విధంగా; మఱియున్+కలుగు సౌఖ్య దుఃఖములు= ఇంకా ఉన్న సుఖాలూ; దుఃఖాలూ; నడవడిన్= ప్రవర్తనలో- జీవితంలో; వచ్చున్= కలుగుతాయి; వానికిన్= ఆ సుఖాలకూ, దుఃఖాలకూ; ఇంత వగవన్+ఏల?= ఇంతగా చింతించటం ఎందుకు?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఒకప్పుడు మంచి బ్రదుకు బ్రదుకవచ్చును, లేదా ఆపదలకు గురికావచ్చును, ఒకప్పుడు ప్రశంసలు పొందవచ్చును. లేదా అడుగుకొనే దుఃస్థితి రావచ్చును. ఇట్లా ఇంకా ఉన్న సుఖాలూ దుఃఖాలూ జీవితంలో కలుగుతూ ఉంటాయి. వాటి కొరకు ఇంతగా చింతించటం ఎందుకు?

క. వగ బలము దఱుఁగు, రూపఱు; । వగచిన మతి దప్పుఁ, దెవులు వచ్చును; దూరన్
వగచి నలంగినఁ బ్రియ మగుఁ । బగతురకును; వగచు టుడుగు; పార్థివముఖ్యా!' 80

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజోత్తమా, ధృతరాష్ట్రా!; వగన్= దుఃఖం చేత; బలము+తఱుఁగున్= శక్తి నశిస్తుంది; రూపు+అఱున్= ఆకారం చెడుతుంది; వగచినన్= దుఃఖిస్తే; మతి+తప్పున్= మనసు పాడవుతుంది; తెవులు వచ్చున్= రోగం వస్తుంది; దూరన్+వగచి నలఁగినన్= మిక్కిలి దుఃఖించి కృశిస్తే; పగతురకును= శత్రువులకు; ప్రియము+అగున్= సంతోషం కలుగుతుంది; వగచుట+ఉడుగు(ము)= దుఃఖించటం మానుము.

తాత్పర్యం: రాజోత్తమా, ధృతరాష్ట్రా! దుఃఖంవలన బలం నశిస్తుంది. ఆకారం చెడుతుంది. దుఃఖిస్తే మనసు పాడవుతుంది. రోగం వస్తుంది. మిక్కిలి దుఃఖించి కృశిస్తే శత్రువులు సంతోషిస్తారు. కాబట్టి దుఃఖించటం మానుము.

విశేషం: తిక్కన భారతంలో పగమీద ధర్మరాజూ, వగమీద విదురుడూ పలికిన పద్యాలు ప్రసిద్ధాలు. అందులో వగమీది పద్యమిది. దీనికి మూలం కూడా ముచ్చటగా ఉంటుంది.

"సంతాపా ద్భ్రశ్యతే రూపం, సంతాపా ద్భ్రశ్యతే బలమ్
సంతాపా ద్భ్రశ్యతే జ్ఞానం, సంతాపా ద్వ్యాధి మృచ్ఛతి
అనవాప్యం చ శోకేన, శరీరం చోపతప్యతే
అమిత్రా శ్చ ప్రహృష్యన్తి మా స్మశోకే మనః కృథాః" (సం. 5-36-44,45)

వ. అనిన విని ధృతరాష్ట్రుండిట్లనియె : 81

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

క. 'రిత్త యుపచారముల నే । నుత్తముఁ డగు ధర్మతనయు నుడికించితి; దు
ర్వృత్తులగు మత్సుతులకును । మిత్తి యగుం బోర; వగలు మిగులక యున్నే? 82

ప్రతిపదార్థం: నేను, ఉత్తముఁడు+అగు ధర్మతనయున్= శ్రేష్ఠుడైన ధర్మరాజును; రిత్త ఉపచారములన్= వట్టి కల్లబొల్లి మాటలతో; ఉడికించితిన్= బాధించాను; దుర్వృత్తులు+అగు మత్+సుతులకును= దుష్టులైన నా కొడుకులకు; పోరన్= యుద్ధంలో; మిత్తి+అగున్= చావు కలుగుతుంది. వగలు= దుఃఖాలు; మిగులక+ఉన్నే?= కలగవా?

తాత్పర్యం: 'నేను ఉత్తముడైన ధర్మరాజును కల్లబొల్లిమాటలతో బాధించాను. దుష్టులైన నా కొడుకులకు యుద్ధంలో మరణం కలుగుతుంది. ఇంక నాకు దుఃఖం అతిశయించదా మరి?

వ. నెవ్వగలు నివ్వటిల్లనీక నిలుపునట్టిది యెయ్యది? దాని నెఱింగింపు' మనిన విదురుం డిట్లనియె. 83

ప్రతిపదార్థం: నెఱ+వగలు= పెను దుఃఖాలు; నివ్వటిల్లన్+ఈక= కలగనీయక; నిలుపు+అట్టిది= ఆపేది; ఎయ్యది?= ఏది?; దానిన్; ఎఱింగింపుము= తెలుపుము; అనినన్; విదురుండు; ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: పెనుదుఃఖం కలుగకుండా ఆపేది ఏది? దానిని చెప్పుము.' అనగా; విదురుడు ఇట్లా అన్నాడు:

**తే. 'నియత తపమును, నింద్రియ నిగ్రహంబు, । భూరి విద్యయు శాంతికిఁ గారణములు;
వాని యన్నిటికంటె మేలైన శాంతి । కారణము లోభ ముడుగుట కౌరవేంద్ర!' 84**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; నియత తపమునున్= నియమయుక్తమైన తపస్సూ; ఇంద్రియ నిగ్రహంబున్= ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనటమూ; భూరి విద్యయున్= అధికమైన విద్యా; శాంతికిన్+కారణములు= మనశ్శాంతికి కారణాలు; వాని+అన్నిటికంటెన్ మేలు+ఐన శాంతి కారణము= వాటన్నిటికన్నా గొప్ప శాంతి కారణం; లోభము+ఉడుగుట= పేరాస విడవటం.

తాత్పర్యం: 'కురువంశశ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా! నియమయుక్తమైన తపస్సూ, ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనటమూ, అధిక విద్యా మనశ్శాంతికి కారణాలు. వాటన్నిటికంటే అసలైన శాంతి కారణం లోభం విడిచిపెట్టటం.'

వ. అని వెండియు. 85

తాత్పర్యం: అని మళ్ళీ.

**క. 'జ్ఞాతుల పోరితమును; గో । వ్రాతము నాక్రమము, విప్ర వర్గము చనవున్,
నాతులఁ గారించుటయును । బ్రీతిం జన నిచ్చునతని పెం పొప్పు నృపా! 86**

ప్రతిపదార్థం: నృపా!= రాజా, ధృతరాష్ట్రా!; జ్ఞాతుల పోరితమును= జ్ఞాతి వైరాన్నీ; గో వ్రాతము+ఆక్రమమున్= గోవుల సమూహాన్ని ఆక్రమించటాన్నీ; విప్ర వర్గము చనవున్= బ్రాహ్మణుల సమూహం పట్ల చులకనగా వర్తించటాన్నీ; నాతులన్= స్త్రీలను; కారించుటయును= బాధించటాన్ని; ప్రీతిన్= ఆసక్తితో; చననిచ్చు+అతని పెంపు= పోగొట్టేవాడి గొప్పతనం; ఒప్పున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! జ్ఞాతి వైరాన్నీ, గోవులను ఆక్రమించటాన్నీ, విప్రులను లోకువ చేయటాన్నీ, స్త్రీలను బాధించటాన్నీ ఆసక్తితో నివారించేవాడి గొప్పతనం విలసిల్లుతూ ఉంటుంది.

**క. అలమికొని యొండొరుల ప్రో । పులఁ బ్రాపుల నెలమికలిమిఁ బొంది బహు జ్ఞా
తులు నెమ్మిఁ గూడి తామర । కొలని క్రియన్ సిరికిఁ బట్టగుదు రుజ్జ్వలులై. 87**

ప్రతిపదార్థం: బహు జ్ఞాతులు= దాయాదులనేకులు; అలమికొని= కలసి మెలసి; ఒండొరుల ప్రోపులన్= ఒకరొకరి రక్షణములనూ; ప్రాపులన్= అండలనూ; ఎలమి కలిమిన్= సంతోష సంపదనూ; పొంది; నెమ్మిన్= ప్రీతితో; కూడి= ఒక్కరయి; తామర కొలని క్రియన్= తామరల సరస్సువలె; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించేవాళ్ళయి; సిరికిన్+పట్టు+అగుదురు= శ్రీకి ఆకరమవుతారు.

తాత్పర్యం: దాయాదులు పెక్కండ్రు కలసి మెలసి ఒకరొకరి రక్షణలనూ, ఆశ్రయాలనూ, సంతోష సంపదనూ పొంది ప్రీతితో ఒక్కరయి తామరల సరస్సువలె ప్రకాశిస్తూ శ్రీకి స్థానమవుతారు.

విశేషం: తామరకొలని క్రియన్= అలంకారం : ఉపమ.

చ. కరి తురగాది ఘట్టనయు గాలియు నొంపదె యొంటి నున్న య
త్తరువు? ననేక భూరుహవితానము గుంపయిపేర్చి బాధలం
బొరయునె? యన్నదమ్ములును బొందిన నేరి కసాధ్యు; లట్లు గా
కెరవయి నిల్చినం గెలని కెల్లిదమై పటిపోదు రెంతయున్. 88

ప్రతిపదార్థం: ఒంటిన్+ఉన్న+ఆ+తరువున్= ఒంటరిగా ఉన్న ఆ చెట్టును; కరి తురగ+ఆది ఘట్టనయున్= ఏనుగులూ, గుర్రాలూ మొదలయిన వానియొక్క రాపిడీ; గాలియున్= గాలీ; నొంపదె= బాధింపదా (వా); అనేక భూరుహ వితానము= పెక్కు చెట్ల సమూహం; గుంపు+అయి పేర్చి= గుంపుగా ఉండి విజృంభిస్తే; బాధలన్+పొరయునె?= బాధలు పొందుతాయా?; అన్న+తమ్ములును; పొందినన్= కలిసి ఉంటే; ఏరికిన్+అసాధ్యులు= ఎవరికైనా అసాధ్యులవుతారు; అట్లు+కాక= అట్లాకాక; ఎరవు+అయి= వేరయి; నిల్చినన్= ఉన్నట్లయితే; కెలనికిన్= శత్రువుకు; ఎల్లిదము+ఐ= లోకువయి; ఎంతయున్= మిక్కిలి; పటి+పోదురు= నశిస్తారు.

తాత్పర్యం: చెట్టు ఒక్కటే ఉంటే, దానిని ఏనుగులూ, గుర్రాలూ త్రొక్కివేస్తాయి; గాలి కూల్చివేస్తుంది. పెక్కు చెట్లు ఒకచోట గుంపుగా ఉంటే అవి ఎటువంటి బాధా పొందవు. అట్లాగే అన్నదమ్ములు కూడా కలిసివుంటే ఎవరికైనా అసాధ్యులవుతారు. అట్లాకాక వేర్వేరుగా ఉంటె శత్రువుకు లోకువయి మిక్కిలి నశిస్తారు.

విశేషం: అలం: దృష్టాంతం.

వ. కావునఁ గౌరవులుం బాండవులు నొండొరులకుఁ బ్రాపై పొదలిన నెదిరికి నజయ్యు లగుదురు; పరుల యొత్తులేని రాజ్యంబు పూజ్యమహిమం బరఁగు. వనవాసంబునం గుందిన కౌంతేయులం దడయక తెచ్చి యుచితపదం బిచ్చి నిలుపుట నీ కొడుకులకు నిలుపు గావించుట యగు'నని చెప్పి మఱియు నిట్లనుఁ 'బ్రియవాదు లెందును గల రప్రియం బగుంగాకేమియని పథ్యంబు(తథ్యంబు) వలుకువారు లేరు. జూదంబునప్పు డే నడ్డపడి, యప్రియం బగుటకు శంకింపక తథ్యంబు వలికితి; నది నీకు రుచియింపక, రోగికిఁ బథ్యాహారంబు దలకంటగించునట్లయ్యె; నైన నిప్పుడుం జెప్పెద వినుము: కాకంబులం గైకొని మయూరంబులం బరిహరించు విధంబున, మార్జాలంబులం బాటించి సింహంబులయెడ ననాదరంబు సేయు చందంబున సుయోధనాదులం బట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితి; నేఁడు కార్యంబు ముట్టవచ్చినం దోఁపక మిడుంగుఱు సోఁకినట్లు దల్లడించెదవు. కులంబునకై యొకనిఁ దొఱంగుటయ నీతి యని పెద్దలు సెప్పుదురు; దుర్ణయపరుండై సద్బుద్ధి సెప్ప వినం డేని, మనము దుర్యోధనుం దొఱంగిన నేమి యగు? నది యట్లుండె, సంపద సహాయంబు నపేక్షించియుండు; సహాయంబు సంపద నుద్దేశించి వర్తిల్లు; నిట్లవి యొకటొకటి పొందునంగాని సిద్ధింపవు కావున నీ సంపద పాండవులకును, వారి సహాయత్వంబు నీకునుం బ్రియం బొనరింప, నొండొరుల కలయుట మేలుగాక, మనలావువెలిసేయుట లెస్స యగునే? కురువంశనిస్తారకులగు భీష్మ యుధిష్ఠిరులును, నవక్ర విక్రములగు కర్ణార్జునులును, బ్రతాపధాములగు భీమ దుర్యోధనులును, శస్త్రాస్త్రపారగులగు నభిమన్యు లక్ష్మణ ప్రభృతి కుమారులును, శాపాను గ్రహసమర్థులగు ద్రోణ ద్రుపదాది పరమాప్తులును, వారి వారి బంధు మిత్రజనంబులును, నొక్క మొగంబై నీ పనుపు సేయుచు,

నయ విక్రమంబు లప్రతిహతంబులై నడవం, బృథివి శాసింప భవదీయ విభవం బుజ్జ్వలంబై యొరులకెడలేక చెల్లుచున్న నెంత యొప్పగునో యటు విచారింపుము. పాండవులు ధీరమతులై వైర మెత్తక యూరక తొలంగియుండిరేనియుఁ, గతిపయ దినంబులలోఁ జీకాకుపడి చెడుంగాక, గాంధారీనందనుచేత వసుంధరా పరిపాలన భారంబు నిర్వహింపబడునే?' యనిన విని ధృతరాష్ట్రుండు విదురున కి ట్లనియె:

89

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కౌరవులున్, పాండవులున్, ఒండొరులకున్= ఒకరి కొకరు; ప్రాపు+ఐ= అండయై; పొదలినన్= ఒప్పితే; ఎదిరికిన్= శత్రువుకు; అజయ్యులు+అగుదురు= జయించరానివారు అవుతారు; పరుల+ఒత్తులేని రాజ్యంబు= శత్రువుల అదుముడు లేని రాజ్యం; పూజ్య మహిమన్+పరఁగున్= పూజించదగిన గొప్ప మహిమతో ఒప్పుతుంది; వన వాసంబునన్= అడవిలో నివసించటం చేత; కుందిన కౌంతేయులన్= దుఃఖించిన పాండవులను; తడయక= ఆలస్యం చేయక; తెచ్చి= తీసికొని వచ్చి; ఉచిత పదంబు+ఇచ్చి= తగిన స్థానం కల్పించి; నిలుపుట= నిలపటం; నీ కొడుకులకున్ నిలుపు+కావించుట+అగున్= నీ కొడుకులను నిలపటమే అవుతుంది, అని, చెప్పి, మఱియున్; ఇట్లు+అనున్; ప్రియవాదులు= ఇచ్చకాలు పలికేవాళ్ళు; ఎందున్+కలరు= ఎక్కడైనా ఉంటారు; అప్రియంబు+అగున్+కాకేమి+అని= అప్రియం అయితే అయిందని; పథ్యంబు+పలుకువారు లేరు= హితం పలికేవాళ్ళు లేరు; జూదంబు+అప్పుడు= జూదం ఆడే సమయంలో; ఏను= నేను; అడ్డము+పడి= అడ్డం వచ్చి; అప్రియంబు+అగుటకున్= రుచించేది కామికి; శంకింపక= సంకోచించక; తథ్యంబు+పలికితిన్= సత్యం చెప్పాను; అది; నీకున్; రుచియింపక= నచ్చక; రోగికిన్= జబ్బుచేసినవాడికి; పథ్య+ఆహారంబు= పథ్యమైన ఆహారం; తలకంటగించు+అట్లు+అయ్యెన్= సయించనట్లు అయింది; ఐనన్= అయినప్పటికీ; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; చెప్పెదన్+వినుము= చెపుతాను విను; కాకంబులన్= కాకులను; కైకొని= చేరదీసి; మయూరంబులన్= నెమళ్ళను; పరిహరించు విధంబునన్= విడిచి పెట్టినట్లుగా; మార్జాలంబులన్= పిల్లులను; పాటించి= ఆదరించి; సింహంబుల+ఎడన్= సింహాలపై; అనాదరంబు+చేయు చందంబునన్= విముఖత చూపే విధంగా; సుయోధన+ఆదులన్= దుర్యోధనుడు మొదలయినవాళ్ళని పట్టి= పట్టుకొని; యుధిష్ఠిర ప్రముఖులన్= ధర్మరాజాదులను విడిచితివి; నేఁడు= ఈవేళ; కార్యంబు; ముట్టన్+వచ్చినన్= విషమించగా; తోఁపక= ఏం చెయ్యాలో తెలియక; మిడుంగుఱులు సోఁకిన+అట్లు= నిప్పులుతాకినట్లు; తల్లడించెదవు= భయపడుతున్నావు; కులంబునకున్+ఐ= వంశంకొరకు; ఒకనిన్= ఒక్కడిని; తొఱంగుట+అ= విడిచిపెట్టటమే; నీతి; అని; పెద్దలు+చెప్పుదురు= పెద్దలంటారు; దుర్ణయపరుఁడు+ఐ= అవినీతిపరుడై; సత్+బుద్ధి+చెప్పన్ వినండు+ఏనిన్= మంచి మాటలు చెపితే వినకపోతే; మనము; దుర్యోధనున్= దుర్యోధనుడిని; తొఱంగినన్= విడిచిపెట్టితే; ఏమి+అగున్= ఏమవుతుంది; అది; అట్లు+ఉండెన్= అట్లా ఉండనీ; సంపద; సహాయంబున్= తోడును; అపేక్షించి+ఉండున్= కోరుతుంది; సహాయంబు= తోడు; సంపదన్+ ఉద్దేశించి వర్తిల్లున్= సంపదనుబట్టి ఉంటుంది; ఇట్లు= ఇట్లా; అవి= సహాయమూ, సంపదా; ఒకటి+ఒకటి పొందునన్+కాని సిద్ధింపవు= ఒక దానితో ఒకటి కలిసి ఉంటేనే కాని లభించవు; కావునన్; నీ సంపద; పాండవులకును; వారి సహాయత్వంబు= వారి తోడ్పాటు; నీకునున్= నీకూ; ప్రియంబు+ఒనరింపన్= ప్రీతి కలిగించాలంటే; ఒండొరుల కలయుట= ఒక్కళ్ళతో ఒకళ్ళు కలిసి ఉండడం; మేలు+కాక= మంచిదికాని; మన లావు= మన బలం; వెలి+చేయుట= బయటపెట్టటం; లెస్స+అగునే?= మంచిదా?; కురు వంశ నిస్తారకులు+అగు భీష్మ యుధిష్ఠిరులును= కురుకులాన్ని ఉద్ధరించే వాళ్ళయిన భీష్మ ధర్మరాజులూ; అవక్ర విక్రములు+అగు= మంచి పరాక్రమవంతులైన; కర్ణ+అర్జునులును= కర్ణార్జునులూ; ప్రతాపధాములు+అగు భీమ దుర్యోధనులును= పరాక్రమ నిలయులైన భీమ దుర్యోధనులూ; శస్త్ర+అస్త్ర పారగులు+అగు అభిమన్యు లక్ష్మణ ప్రభృతి కుమారులును= శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరిన అభిమన్యుడు లక్ష్మణుడు మొదలుగా గల యువకులూ; శాప+అనుగ్రహ సమర్థులు+అగు ద్రోణ ద్రుపద+ఆది పరమ+ఆప్తులును= శపించడానికీ అనుగ్రహించడానికీ సమర్థులైన ద్రోణుడూ, ద్రుపదుడూ మొదలైన గొప్ప ఆత్మీయులూ; వారి వారి బంధు మిత్ర జనంబులును= వారి వారి చుట్టాలూ, స్నేహితులూ; ఒక్క

మొగంబు+ఐ= ఏకమయి; నీ పనుపు+చేయుచున్= నీ ఆజ్ఞ పాటిస్తూ; నయ విక్రమంబులు= నీతి పరాక్రమాలు; అప్రతిహతంబులు+ఐ వడవన్= నిరాటంకంగా సాగుతూ ఉంటే; పృథివిన్+శాసింపన్= భూమిని పరిపాలిస్తే; భవదీయ విభవంబు= నీ వైభవం; ఉజ్జ్వలంబు+ఐ= ప్రకాశిస్తూన్నదయి; ఒరులకున్= ఇతరులకు; ఎడ లేక చెల్లుచున్+ఉన్నన్= ఆపులేక చెల్లుతూ ఉంటే; ఎంత+ఒప్పు+అగునో అటు విచారింపుము= ఎంత బాగుంటుందో ఆలోచించుము; పాండవులు; ధీరమతులు+ఐ= నిర్వికారచిత్తులయి; వైరము+ఎత్తక= పగమాట తలపెట్టక; ఊరక తొలంగి+ఉండిరి+ఏనియున్= మాటాడక ఊరుకున్నప్పటికీ; కతిపయ దినంబులలోన్= కొన్నాళ్ళలో; చీకాకుపడి= ఇబ్బందులుపాలయి; చెడున్+కాక= నశిస్తుంది కాని; గాంధారీ నందనుచేతన్= దుర్యోధనుడి చేత; వసుంధరా పరిపాలన భారంబు= భూపాలన భారం; నిర్వహింపంబడునే?= వహించబడుతుందా?; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: కాబట్టి కౌరవులూ, పాండవులూ ఒకళ్ళకొకళ్ళు అండగా ఉంటే శత్రువుకు జయించరానివాళ్ళవుతారు. శత్రువుల ఒత్తిడి లేని రాజ్యం అధికమహిమతో ఒప్పుతుంది. అడవిలో నివసించి దుఃఖితులైన పాండవులను వెంటనే రప్పించి వాళ్ళకు సముచితస్థానం ఇచ్చి నిలపటం, నీ కొడుకులను బ్రదికించుకొనటమే అవుతుంది-' అని చెప్పి విదురు డింకా ఇట్లా అన్నాడు: 'ఇచ్చకాలు మాట్లాడేవాళ్ళు ప్రతీచోటా ఉంటారు. అప్రియమయితే అయిందని హితం పలికేవాళ్ళు వేరు. రుచించేది కాదని సంకోచించక జూదం ఆడేటప్పుడు నేను అడ్డుపడి హితం చెప్పాను. అది నీకు రుచించక, రోగం వచ్చిన వాడికి పథ్యం సయించనట్లు అయింది. అయినా ఇప్పుడు కూడా చెపుతా వినుము. కాకులను చేరదీసి నెమళ్లను పారద్రోలినట్లూ, పిల్లులను ఆదరించి సింహాలను తోసిపుచ్చినట్లూ, దుర్యోధనాదులను పట్టుకుని ధర్మరాజాదులను వదిలేశావు. ఈవేళ పీకమీదకు వస్తే ఏం చేయాలో తోచక నిప్పులు తగిలినట్లు తల్లడిల్లిపోతున్నావు. కులం నిలపటానికి ఒక్కడిని వదలివేయటమే నీతి అని పెద్దలంటారు. అవినీతిపరుడై, మంచి చెపితే వినిపించుకొనకపోతే, మనం దుర్యోధనుడిని వదలుకుంటే నష్టం ఏమిటి? అది అట్లా ఉండనీ. సహాయం సంపదను బట్టీ, సంపద సహాయాన్ని బట్టీ ఉంటాయి. ఇట్లా అవి ఒకదానితో ఒకటి కూడి ఉంటేనే కాని సిద్ధించవు. కాబట్టి నీ సంపద పాండవులకూ, వాళ్ళ సహాయం నీకూ ప్రీతి కలిగిస్తూ ఉంటే పరస్పరం కలిసి ఉండటం మేలుకాని, మన బలం బయట పెట్టుకొనటం మంచిదా? కురు వంశోద్ధారకులైన భీష్మ ధర్మరాజులూ, మంచి పరాక్రమవంతులైన కర్ణార్జునులూ, పరాక్రమ నిలయులయిన భీమ దుర్యోధనులూ, శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరిన అభిమన్యు లక్ష్మణాది కుమారులూ, శపించటానికీ, అనుగ్రహించటానికి సమర్థులైన ద్రోణ ద్రుపదాదులైన ఆత్మీయులూ, వాళ్ళ వాళ్ళ చుట్టాలూ, మిత్రులూ ఏకమయి, నీ ఆజ్ఞ పాటిస్తూ, నీతి పరాక్రమాలు నిరాటంకంగా సాగుతూండగా, భూపరిపాలన కావిస్తూంటే, నీ వైభవం ప్రకాశవంతమై, శత్రువులకు స్థానం లేక, సాగితే అదెంత బాగుంటుందో ఒక్కసారి ఆలోచించుము. పాండవులు నిర్వికారచిత్తులై పగమాట తలపెట్టక మాటాడక ఊరుకొన్నా, కొన్ని నాళ్ళలో ఇబ్బందులు పాలయి చెడుతుందేకాని, దుర్యోధనుడిచేత రాజ్యం పాలించబడదు.' అని విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు :

విశేషం: 'అది నీకు రుచియింపక, రోగికిఁ బథ్యాహారంబు దల కంటగించునట్లయ్యె.' అలంకారం ఉపమ, 'కాకంబులంగైకొని, మయూరంబులం బరిహరించు విధంబున, మార్జాలంబులం బాటించి సింహంబులయెడ ననాదరంబు సేయు చందంబున, సుయోధనాదులంబట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితివి.' అలంకారం ఉపమ. 'మిడుంగురులు సోఁకినట్లు' - అలంకారం ఉపమ.

తే. 'నీవు సెప్పిన మాటలు నిర్మలములు, । నిపుణ సమ్మతములు, రాజనీతి మార్గ
బోధకంబులు; నైనను బుత్త్రువిడువ । నోప, 'ధర్మో జయతి'యని యుండువాఁడ.' 90

ప్రతిపదార్థం: నీవు+చెప్పిన మాటలు= నీవు చెప్పిన మాటలు; నిర్మలములు= కల్మషంలేనివి; నిపుణ సమ్మతములు= నేర్పరుల చేత అంగీకరించబడేవి, రాజనీతి మార్గ బోధకంబులున్= రాజనీతి మార్గాన్ని బోధించేవీ; ఐనను= అయినా; పుత్త్రున్= కొడుకును; విడువన్+ఓపన్= విడువలేను; ధర్మః+జయతి= ధర్మం జయిస్తుంది; అని; ఉండువాఁడన్= ఉంటాను.

తాత్పర్యం: 'నీవు చెప్పిన మాటలు కల్మషం లేనివి. నేర్పరులు సమ్మతించేవి, రాజనీతి మార్గాన్ని బోధించేవి. అయినా కొడుకును విడవలేను. 'ధర్మం జయిస్తుంది' అని చూస్తూ ఉంటాను.

వ. అనిన విని విదురుం డతని కిట్లనియె: 'దేవా! జ్ఞాతులు గుణహీనులైనను విడువందగ దనిన, సకల గుణసంపన్నులై భవత్ప్రసాదంబు గోరుచున్న కౌంతేయులన్ దిగవిడువం దగునే? యేను నీకు హితంబు గోరెడువాఁడనని నిశ్చయించి నా బుద్ధి వినుము; వారల జీవనంబునకుఁ గొన్ని యలంతిపల్లియలైనను దుర్యోధను నొడంబఱచి యేర్పఱచి, తెఱంగు పఱచిన లెస్స యని చూచెద; నతని విడువ వలయునని చెప్పితినేనిఁ బెనఁకువం బశ్చాత్తాపంబువుట్టు; దాని కప్పుడు ప్రతీకారంబు లేదు. కావున నెల్లభంగుల నియ్యకొని పాండవులతోడ సంధి సేయవలయు; నట్లుం గాక. 91

ప్రతిపదార్థం: అనినన్, విని, విదురుండు; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్; దేవా= ప్రభూ, ధృతరాష్ట్రా!; జ్ఞాతులన్= దాయాదులను, గుణ హీనులు+ఐనను= గుణం లేని వాళ్ళయినా; విడువన్+తగదు+అనినన్= విడవకూడదంటే; సకల గుణ సంపన్నులు+ఐ= ఎల్ల సుగుణ సంపదగలవారై; భవత్+ప్రసాదంబు= నీ అనుగ్రహం; కోరుచున్+ఉన్న కౌంతేయులన్= కోరుతూన్న పాండవులను; దిగన్+విడువన్+తగునే?= విడనాడ వచ్చునా?; ఏను= నేను; నీకున్; హితంబు+కోరెడువాఁడన్+అని నిశ్చయించి= మేలు కోరేవాడినని నిర్ణయించి; నా బుద్ధిన్+వినుము= నా తలపు వినుము; వారల జీవనంబునకున్= వాళ్ళ బ్రతుకుకు; కొన్ని+అలంతి పల్లియలు+ఐనను= కొన్ని చిన్న పల్లెలయినా; దుర్యోధనున్+ఒడంబఱచి= దుర్యోధనుణ్ణి సమ్మతింపజేసి; ఏర్పఱచి= నిర్ణయించి; తెఱంగు పఱచినన్+లెస్స+అని చూచెదను= సంధి చేస్తే మంచిదని భావిస్తాను; అతనిన్; విడువన్+వలయున్+అని చెప్పితిన్+ఏనిన్= విడిచిపెట్టాలంటున్నానంటే; పెనఁకువన్= యుద్ధం చేత; పశ్చాత్+తాపంబు+పుట్టున్= తరువాత విచారించవలసి ఉంటుంది. దానికిన్; అప్పుడు; ప్రతీకారంబు లేదు= మారుచేత లేదు- ఏమీ చేయలేము; కావునన్; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఇయ్యకొని= అంగీకరించి; పాండవులతోడన్; సంధి, చేయవలయున్; అట్లున్+కాక= అదికాక.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విని విదురుడు అతడితో ఇలా అన్నాడు. 'ప్రభూ! దాయాదులు గుణంలేని వాళ్ళయినా విడిచిపెట్టకూడదంటే, సకల సుగుణ సంపద గలవారై నీ అనుగ్రహం కోరుతున్న పాండవులను విడనాడవచ్చా? నేను నీకు మేలు కోరేవాణ్ణని నిర్ణయించి నా మాట వినుము. వాళ్ళు బ్రతకడానికి కొన్ని చిన్న పల్లెలయినా; దుర్యోధనుడిని సమ్మతింపజేసి, కేటాయించి, సంధి చేస్తే మంచిదని భావిస్తాను. అతడిని విడిచి పెట్టాలంటున్నానంటే, అట్లా చేయకపోతే, యుద్ధం వలన తరువాత విచారించవలసి వస్తుంది. ఇక దానికప్పుడు ఏమీ చేయలేము కాబట్టి అన్ని విధాలా అంగీకరించి పాండవులతో సంధి చెయ్యాలి. అట్లాకాక- (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 'జ్ఞాతులు గుణహీనులైనను... దిగవిడువందగునే?' - అలంకారం కావ్యార్థాపత్తి.

క. తమలోని పొళ్ళకుం గా । సమరము సేసినను గాని చాఁ జనదె? శరీ
రము లాధివ్యాధి జరా । సమన్వితము లగుటఁ జేటు సహజం బరయన్. 92

ప్రతిపదార్థం: తమలోని పొళ్లకున్+కాన్= తమ తమ పంపకాల విషయంగా; సమరము+చేసినను+కాని= యుద్ధం చేస్తే కాని; చాన్+చనదె?= చావరాదా?; అరయన్= పరిశీలించగా; శరీరములు= మేనులు; ఆధి వ్యాధి జరా సమన్వితములు+అగుటన్= మనోవ్యాధులతోనూ; రోగాలతోనూ; ముసలితనంతోనూ కూడుకొన్నవి కావటం చేత; చేటు= నాశనం, సహజం.

తాత్పర్యం: తమ తమ పంపకాల విషయంగా యుద్ధం చేస్తే కాని చావు రాదా ఏమి? చూడగా శరీరాలు మనోవ్యాధితోనూ, రోగంతోనూ, ముసలితనంతోనూ కూడుకొన్నవవటంచేత వాటికి నాశనం సహజం.

చ. గజ తురగాది సంపదలుఁ, గాంతలతోడి విహారలీలలుం,
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన సేయుక్రమంబుఁ, బోరులన్
విజయము లొంది పేర్చుటయు, విస్ఫురితాభరణానులేపవ
స్త్ర జనిత వైభవంబుఁ గల రాజులుఁ బోయిర కాక నిల్చిరే? 93

ప్రతిపదార్థం: గజ తురగ+ఆది సంపదలున్= ఏనుగులూ, గుఱ్ఱాలూ మొదలుగాగల సంపదలూ; కాంతలతోడి విహార లీలలున్= అందమైన స్త్రీలతోడి క్రీడా విలాసాలూ; ప్రజకున్= జనానికి; అనురాగము+ఒందన్= ప్రీతి కలిగేటట్లు; పరిపాలన+చేయు క్రమంబున్= ఏలే పద్ధతీ; పోరులన్= యుద్ధాలలో; విజయమున్+పొంది పేర్చుటయున్= గెలుపుగాంచి అతిశయించటమూ; విస్ఫురిత+ఆభరణ+అనులేప వస్త్ర జనిత వైభవంబున్= ప్రకాశించే భూషణాలూ, మైపూతలూ, వస్త్రాలూ అనే వాటి నుండి పుట్టిన విభవమూ; కల రాజులున్= ఉన్నరాజులు కూడా; పోయిరి కాక= మరణించారేకాని; నిల్చిరే?= జీవించి ఉన్నారా?

తాత్పర్యం: ఏనుగులు, గుఱ్ఱాలు మొదలుగాగల సంపదలూ, అందమైన స్త్రీలతోడి క్రీడా విలాసాలూ, ప్రజలకు ప్రీతికరంగా పరిపాలించే పద్ధతీ, యుద్ధాలలో గెలిచి అతిశయించటమూ, ప్రకాశించే ఆభరణాలూ, మైపూతలూ, వస్త్రాలూ అనే వాటివలన కలిగే వైభవమూ కల రాజులు సైతం మరణించారే తప్ప జీవించి ఉన్నారా?

క. కావునఁ జెవికిం జేఁ దగు । నీ వాక్యము వినఁగఁ జాలితేని, నిహపర
శ్రీ విభవములకుఁ గీర్తికిఁ । దావలమై వెలయు టింత తథ్యము సుమ్మీ! 94

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; చెవికిన్+చేఁదు+అగు+ఈవాక్యమున్= చెవికి చేదుగా ఉండే ఈ మాటను; వినఁగన్+చాలితి(వి)+ఏనిన్= వినగలిగావా; ఇహపర శ్రీ విభవములకున్= ఈ లోకపు, పరలోకపు సంపదలకూ వైభవాలకూ; కీర్తికిన్; తావలము+ఐ= స్థానమయి; వెలయుట= ఒప్పుట; ఇంత తథ్యము సుమ్మీ!= ఇంతా నిజం సుమా!

తాత్పర్యం: కాబట్టి చెవికి చేదుగా ఉండే ఈ మాట వినగలిగావా ఇహలోక, పరలోక సంపదలకూ, వైభవాలకూ, కీర్తికి నిలయమైన వాడవయి ఒప్పడం నిజం సుమా!

క. తగ నీలో నూహింపుము; । దిగ విడువకు ధర్మతనయు; దృఢమతివై పొం
దగు చందము గొడుకులకుం । బ్రెగడలకుం జెప్పి తీర్పు పెం పేర్పడఁగన్. 95

ప్రతిపదార్థం: తగన్= ఒప్పుగా; నీలోన్= నీ మనస్సులో; ఊహింపుము= ఆలోచించుము; ధర్మతనయున్= ధర్మరాజును; దిగన్+విడువకు(ము)= విడనాడకు; దృఢ మతివి+ఐ= గట్టి మనస్సుకలవాడవై; కొడుకులకున్; ప్రెగడలకున్= మంత్రులకూ; పొందు+అగు చందము= సంధి అయ్యే విధం; చెప్పి; పెంపు+ఏర్పడఁగన్= అభ్యుదయం కలిగేటట్లు; తీర్పు(ము)= కుదుర్చుము.

తాత్పర్యం: నీలో నీవే బాగా ఆలోచించుకొమ్ము. ధర్మరాజును విడనాడకుము. మనసు గట్టిపరచుకుని కొడుకులకూ, మంత్రులకూ సంధి అయ్యే విధం చెప్పి అభ్యుదయం కలిగేటట్లు కుదుర్చుము.'

ఆ. అనిన నాంబికేయుఁ డను: 'నీదు పలుకులఁ । గలఁక దేఱి బుద్ధి దెలివి నొందె;
నిట్ల చేయువాఁడ; నిదియ కర్జము, ధర్మ । మును, యశంబు, లాభమును దలంప.' 96

ప్రతిపదార్థం: అనినన్; ఆంబికేయుఁడు= అంబిక కొడుకు - ధృతరాష్ట్రుడు; అనున్; నీదు పలుకులన్= నీ మాటల చేత; బుద్ధి= మనస్సు; కలఁక+తేఱి= నిర్మలమయి; తెలివిన్+ఒందెన్= తేరుకుంది; ఇట్లు+అ చేయువాఁడన్= ఇట్లాగే చేస్తాను; తలంపన్= ఆలోచించగా; ఇది+అ= ఇదే; కర్జమున్= చేయదగిందీ; ధర్మమును= ధర్మమూ; యశంబున్= కీర్తీ; లాభమును= లాభమూ.

తాత్పర్యం: అని విదురు డనగా, అతడితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు: 'నీ మాటల వలన నా మనస్సు నిర్మలమై తేరుకుంది. నేను ఇట్లాగే చేస్తాను. ఆలోచించగా ఇదే చేయదగింది. ఇదే ధర్మమూ, కీర్తీ, లాభమూ.'

చ. అనుడు ముదంబు నమ్మమియు నాత్మఁ బెనంగొన నన్నతోడ ని
ట్లను విదురుండు: 'పెద్దవడి కక్కట! నీ మది కార్యవృత్తి నూ
ల్కొనియె; సుయోధనుం గని యకుంఠిత నిశ్చయమై యతండు వ్రా
లినదెస వ్రాలకుండిన బలే, మముబోఁటులకుం బ్రియం బగున్. 97

ప్రతిపదార్థం: అనుడున్= అని ధృతరాష్ట్రు డనగానే; విదురుండు; ముదంబున్= సంతోషమూ; నమ్మమియున్= అపనమ్మకమూ; ఆత్మన్= మనస్సులో; పెనంగొనన్= పెరిగొనగా; అన్నతోడన్= అన్న అయిన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్; అక్కట!= ఆహా!; ఇది సంతోషసూచకం; పెద్దవడికిన్= ఎంతో కాలానికి; నీ మది= నీ మనస్సు; కార్యవృత్తిన్= చేయదగిన నడవడియందు; నూల్కొనియెన్= స్థిరపడింది; సుయోధనున్+కని= దుర్యోధనుడిని చూచి; అకుంఠిత నిశ్చయము+ఐ= కుంటువడని నిర్ణయమై; అతండు; వ్రాలిన దెసన్= మొగ్గినవైపు; వ్రాలక+ఉండినన్= మొగ్గకపోతే; బలే; మము బోఁటులకున్= మా వంటివారికి; ప్రియంబు+అగున్= ఆనందం కలుగుతుంది.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగానే విదురుడు ఒకవైపు సంతోషమూ, ఇతడిలో నిజంగా మార్పు వచ్చిందా అనే అపనమ్మకమూ మనస్సులో పెరిగొనగా అన్నగారితో ఇట్లా అన్నాడు. 'ఆహా! ఎంతో కాలానికి నీ మనస్సు చేయదగిన దానియందు స్థిరపడింది. దుర్యోధనుడిని చూచి, నిర్ణయం మార్చుకోక, అతడు మొగ్గినవైపు నీవు కూడా మొగ్గకపోతే, బలే, మావంటివారికి ఎంతో ఆనందం కలుగుతుంది.'

వ. అని పలికి నిట్టూర్పు నిగిడించి. 98

తాత్పర్యం: అని పలికి విదురుడు నిట్టూర్పు పుచ్చి.

క. 'దైవంబు నేర్చుఁగా; కిటు । వోవఁగ నే నేర్తు, నేరఁ బొమ్మని పలుకం
గా వశమె నరున? కెక్కుడు । దైవము పౌరుషముకంటె ధరణీనాథా!' 99

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా! ధృతరాష్ట్రా!; దైవంబు+అ= దైవమే; నేర్చున్+కాక= సమర్థమైనదికాని; ఇటు+పోవఁగన్= ఇట్లా నడవటానికి; ఏన్= నేను; నేర్తున్= సమర్థుడిని; నేరన్+పొమ్ము+అని పలుకంగాన్= సమర్థుడను కానులే అనడానికి; నరునకున్= మనుష్యుడికి; వశమె?= తరమా?; దైవము; పౌరుషము కంటెన్= పురుష ప్రయత్నంకంటె; ఎక్కుడు= గొప్పది.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! దైవమే సమర్థమయినది. 'నే నిలా నడవగలను, నడవలేనులే' అనటానికి మానవుడి తరమా? పురుష ప్రయత్నం కంటె దైవం గొప్పది.'

విశేషం: ధృతరాష్ట్రుడిలో మార్పు వచ్చిందే అని సంతోషించిన విదురుడు మళ్ళీ ఇట్లా అనటానికి కారణం ధృతరాష్ట్రుడి మాటలలో అతడికి ఒకవైపున ఉన్న అపనమ్మకమే.

వ. అనిన, విదురునకు వైచిత్రవీర్యుం డిట్లనియె: 100

ప్రతిపదార్థం: అనినన్, విదురునకున్, వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకు ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: అని విదురుడనగా, అతడికి ధృతరాష్ట్ర డిట్లా అన్నాడు:

తే. 'ధర్మ పథమును, నీతి తత్త్వంబు తెరువు । నిర్మలము లగు పలుకుల నీవు నాకుఁ
దెలియఁ జెప్పితి; పరమార్థ దృష్టి యెట్టి । వాక్యములఁ గల్గుఁ? జెప్పుము వాని ననఘ! 101

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా, విదురా!; ధర్మ పథమును= ధర్మ మార్గాన్నీ; నీతి తత్త్వంబు తెరువున్= నీతితత్త్వపు మార్గాన్నీ; నీవు; నాకున్; నిర్మలములు+అగు పలుకులన్= స్వచ్ఛములైన మాటలలో; తెలియన్+చెప్పితి(వి)= స్పష్టపరచినావు; పరమార్థ దృష్టి= పారమార్థికమైన చూపు; ఎట్టి వాక్యములన్+కల్గున్?= ఎటువంటి వాక్కులవల్ల ఏర్పడుతుంది?; వానిన్, చెప్పుము.

తాత్పర్యం: 'పుణ్యాత్మా విదురా! నీవు నాకు ధర్మమార్గాన్నీ, నీతితత్త్వమార్గాన్నీ స్వచ్ఛములైన మాటలలో స్పష్టపరిచావు. ఆధ్యాత్మిక దృష్టి ఎటువంటి వాక్కులవలన ఏర్పడుతుందో వాటిని చెప్పుము.'

సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మతత్త్వంబుఁ జెప్పుట - (సం. 5-41-2)

వ. అని యడిగిన, విదురుం డతని కిట్లనియె; 'నాకుఁ దోఁచిన యన్నియు నా నేర్చినట్లు నీ కెఱింగించితి; నత్యంత గుహ్యంబులగు నర్థంబులు పురాణుం డయ్యును గుమారుం డగు సనత్సుజాతుండు దెలుపనోపుంగాని యిట మీఁద నాకుం దెలియ' దనిన ధృతరాష్ట్రుం 'డమ్మునీంద్రుండు నా కెంతదవ్వు! నీవ యవియునుం జెప్పు' మనిన, 'నేను శూద్రయోని జాతుండ, వేదాంత వేద్యంబు లగు నర్థంబులు నా కగోచరంబు; లమ్మహాత్ము బుద్ధి నే నెఱుంగుదు. దేవతలకుం దెలియనట్టివి యాతనికిం దెలియు; నతండు దెలుపంజాలు' ననిన, ధృతరాష్ట్రుం డతి కుతూహలుండై. 102

ప్రతిపదార్థం: అని; అడిగినన్; విదురుండు; అతనికిన్; ఇట్లు+అనియెన్; నాకున్; తోఁచిన+అన్నియున్= తెలిసినవన్నీ; నా నేర్చిన+అట్లు= నా శక్తి ననుసరించి; నీకున్; ఎఱింగించితిన్= తెలిపాను; అత్యంత గుహ్యంబులు+అగు+అర్థంబులు= మిక్కిలి రహస్యములైన విషయాలు; పురాణుండు+అయ్యునున్= చాలా కాలం నాటి వాడయినా; కుమారుండు+అగు సనత్సుజాతుండు= యువకుఁడే అయిన సనత్సుజాతుడు; తెలుపన్+ఓపున్+కాని= చెప్పగలడుకాని; ఇట మీఁదన్= ఈపైని; నాకున్; తెలియదు; అనినన్; ధృతరాష్ట్రుండు; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మునీశ్వరుడు; నాకున్; ఎంత దవ్వు= ఎంతో దూరం; నీవు+అ= నీవే; అవియునున్= అవి కూడా; చెప్పుము; అనినన్; నేను; శూద్రయోని జాతుండన్= శూద్ర స్త్రీ సంభవుడిని; వేదాంత వేద్యంబులు+అగు+అర్థంబులు= వేదాంతుల చేతనే తెలియదగిన విషయాలు; నాకున్+అగోచరంబులు= నాకు తెలియవు; ఆ+మహాత్ముబుద్ధి= ఆ మహనీయుడి హృదయం; నేను; ఎఱుంగుదున్; దేవతలకున్; తెలియని+అట్టివి; ఆతనికిన్; తెలియున్; అతండు; తెలుపన్+చాలున్= చెప్పగలడు; అనినన్; ధృతరాష్ట్రుండు; అతి కుతూహలుండు+ఐ= మిక్కిలి ఆసక్తిగలవాడయి-

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడుగగా విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'నాకు తెలిసినవన్నీ యథాశక్తి నీకు తెలిపాను. మిక్కిలి రహస్యాలయిన విషయాలు ఏకాలం నాటివాడో అయినా యువకుడే అగు సనత్సుజాతుడు చెప్పగలడు కాని ఈ పైని నాకు తెలియదు.' అంటే, ధృతరాష్ట్రుడు 'ఆ మునీశ్వరుడు నాకెంతో దవ్వు. సులభుడు కాడు. నీవే అవి కూడా చెప్పు.' అనగా 'నేను శూద్రుడిని. వేదాంతులకు మాత్రమే తెలియదగిన విషయాలు నాకు తెలియవు. ఆ మహాత్ముడి హృదయం నాకు తెలుసు. దేవతలకు కూడా తెలియని విషయాలు అతడికి తెలుసు. అతడు తెలుపగలడు' అనగా ధృతరాష్ట్రుండు మిక్కిలి ఆసక్తి గలవాడయి.

ఆ. 'మనకు నిప్పు డతనిఁ గను తెఱంగెయ్యది । యగుటయును నెఱుంగ' ననిన, విదురుఁ
డధిక భక్తిఁ దలఁచె నాత్మలో నాశ్రిత । వత్సలత్వ నిధి సనత్సుజాతు. 103

ప్రతిపదార్థం: మనకున్; ఇప్పుడు; అతనిన్; కను తెఱంగు+ఎయ్యది+అగుటయునున్= చూచే మార్గం ఏదో కూడా; ఎఱుంగన్+అనినన్= తెలియదనగా; విదురుఁడు; ఆత్మలోన్= మనస్సులో; ఆశ్రిత వత్సలత్వ నిధిన్= ఆశ్రయించిన వారిమీద వాత్సల్యానికి ఆశ్రయమైనవాడిని; సనత్సుజాతున్; అధిక భక్తిన్= మిక్కిలి భక్తితో; తలఁచెన్= స్మరించాడు.

తాత్పర్యం: 'మన కిప్పుడు అతడిని చూసే మార్గం ఏదో కూడా తెలియదే' అని ధృతరాష్ట్ర డనగా, విదురుడు తన మనస్సులో ఆశ్రితులపై వాత్సల్యానికి నిధియైన సనత్సుజాతుడిని అమితభక్తితో తలచుకొన్నాడు.

వ. ఇట్లు దలంచుటయును, దివ్యజ్ఞాన మాననీయుండగు నమ్మునివరేణ్యం డాక్షణంబ పొడసూపిన, విదురుం డతని వచ్చుట యుగ్గడించుచు, వినయంబున నతని నెదుర్కొని, దండ నమస్కారంబు లాచరించి, యున్నతాసనంబిడి, యర్ఘ్యపాద్యంబు లిచ్చి, ససంభ్రమంబుగాఁ బ్రత్యుత్థానంబును బ్రణామంబునుం జేసియున్న ధృతరాష్ట్రు నతనికిం జూపి విదురుం డి ట్లనియె: 104

ప్రతిపదార్థం: ఇట్లు; తలంచుటయును; దివ్యజ్ఞాన మాననీయుండు+అగు+ఆ+మునివరేణ్యుండు= ఆధ్యాత్మిక జ్ఞానం చేత మాన్యుడైన ఆ మునిశ్రేష్ఠుడు; ఆ క్షణంబు+అ= ఆ క్షణమే; పొడ+చూపినన్= ప్రత్యక్షంకాగా; విదురుండు; అతని వచ్చుట= అతని రాక; ఉగ్గడించుచున్= ప్రకటిస్తూ; వినయంబునన్= నమ్రతతో; అతనిన్; ఎదుర్కొని; దండ నమస్కారంబులు+ఆచరించి= సాష్టాంగవందనాలు చేసి; ఉన్నత+ఆసనంబు+ఇడి= ఉన్నతమైన పీఠం వేసి; అర్ఘ్య పాద్యంబులు+ఇచ్చి= పూజాద్రవ్యాలూ;

పాదప్రక్షాళన జలమూ ఇచ్చి; స సంభ్రమంబుగాన్= వేగిరపాటుతో; ప్రత్యుత్థానంబును= ఎదుర్కోలూ; ప్రణామంబునున్= నమస్కారమూ; చేసి+ఉన్న; ధృతరాష్ట్రున్; అతనికిన్+చూపి; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా స్మరించగానే, ఆధ్యాత్మిక జ్ఞానంచేత మాన్యుడైన ఆ మునిశ్రేష్ఠుడు ఆ క్షణమే ప్రత్యక్షం కాగా, విదురుడు అతడి రాక గ్రహించి, నమ్రతతో అతని కెదురేగి సాష్టాంగ నమస్కారాలు చేసి, ఉన్నత పీఠం వేసి, అర్ఘ్యపాద్యాదులిచ్చి, వేగిరపాటుతో ఎదుర్కోలూ, నమస్కారమూ చేసి ఉన్న ధృతరాష్ట్రుడిని అతడికి చూపి ఇట్లా అన్నాడు:

క. 'దేవా! దేవర కృప నీ । భూవల్లభుఁ డమల తత్త్వ బోధకమై సౌ
ఖ్యావహ మగు వాక్య చయముఁ । దా వినఁ గోరుటయు, మిమ్ముఁ దలఁచితి భక్తిన్. 105

ప్రతిపదార్థం: దేవా!= స్వామీ!; ఈ భూవల్లభుఁడు= ఈ రాజు-; ధృతరాష్ట్రుడు; దేవర కృపన్= తమ దయచేత; అమల తత్త్వ బోధకము+ఐ= నిర్మలమైన తత్త్వాన్ని ఉపదేశించేదయి; సౌఖ్య+ఆవహము+అగు వాక్య చయమున్= సుఖాన్ని కలిగించే వాక్కుల సమూహాన్ని; తాన్= తాను; వినన్+కోరుటయును= వినగోరగా; మిమ్మున్; భక్తిన్= భక్తితో; తలఁచితిన్= స్మరించాను.

తాత్పర్యం: 'స్వామీ! ఈ ధృతరాష్ట్ర మహారాజు తమ దయవలన నిర్మలమైన వేదాంత తత్త్వాన్ని ఉపదేశించేదీ, సుఖాన్ని కలిగించేదీ అయిన వాక్సమూహాన్ని వినగోరడం చేత మిమ్ములను భక్తితో స్మరించాను.

వ. మీరును గారుణ్యాతిశయంబున విజయం చేసితిరి. గురు సమాశ్రితులగు వార లెద్దాని వలన సుఖదుఃఖంబులు, లాభాలాభంబులుఁ, బ్రియద్వేషంబులు నాదిగాఁ గల ద్వంద్వంబులం బడక బ్రదుకుదు? రట్టి పరమార్థోపదేశంబున నితనిం గృతార్థునిం గావించి రక్షింపవలయు'నని ప్రార్థించినం, బార్థివుండునుం దదనురూపంబు లగు నాలాపంబుల నారాధించినం బ్రసన్నుండై, సనత్సుజాతుం డధ్యాత్మ విషయంబులగు వివిధ వాక్యంబుల సోపాన ప్రకారంబున నంతకంతకు సూక్ష్మంబులగు నర్థంబులు సమర్థించుచు, నందుఁ బ్రజ్ఞాచక్షుండెయ్యది యేర్పడ నడిగె నది యెల్ల వివరించుచు, హృదయ పుష్కర కలితంబగు పరతత్త్వంబు ప్రసాదించునట్టి గూఢోక్తు లనుగ్రహించుచుండ, నెట్టకేలకుఁ బ్రభాతం బగుటయు, ధృతరాష్ట్ర విదురుల నామంత్రణంబు సేసి యద్దేవముని యంతర్ధానంబు నొందె; నట్టి సమయంబున. 106

ప్రతిపదార్థం: మీరును, కారుణ్య+అతిశయంబునన్= దయాతిశయంతో; విజయం చేసితిరి= విచ్చేశారు; గురు సమాశ్రితులు+అగు వారలు= గురువు నాశ్రయించుకొన్నవారు; ఏ+దాని వలనన్= దేనివలన; సుఖదుఃఖంబులున్; ప్రియ ద్వేషంబులున్; ఆదిగాన్= మొదలుగా; కల; ద్వంద్వంబులన్+పడక= జంటలయందు తగుల్కొనక; బ్రదుకుదురు; అట్టి; పరమార్థ+ఉపదేశంబునన్= తత్త్వం ఉపదేశించడం చేత; ఇతనిన్; కృతార్థునిన్= ధన్యుడిని; కావించి= చేసి; రక్షింపన్+వలయున్= కాపాడాలి; అని; ప్రార్థించినన్= కోరగా; పార్థివుండునున్= రాజు- ధృతరాష్ట్రుడు కూడా; తద్+అనురూపంబులు+అగు+ఆలాపంబులన్= దానికి తగిన మాటల చేత; ఆరాధించినన్= పూజించగా; ప్రసన్నుండు+ఐ= సంతోషించినవాడయి; సనత్సుజాతుండు; అధ్యాత్మ విషయంబులు+అగు వివిధ వాక్యంబులన్= పరమార్థానికి సంబంధించిన వివిధ వాక్కులతో; సోపాన ప్రకారంబునన్= ఒకదాని తరువాత ఒకటిగా- మెట్ల వరసను; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; సూక్ష్మంబులు+అగు+అర్థంబులు= అగోచరములైన విషయాలు; సమర్థించుచున్= బోధిస్తూ; అందున్= వాటిలో; ప్రజ్ఞా చక్షుండు= గ్రుడ్డివాడు- ధృతరాష్ట్రుడు; ఎయ్యది= ఏది; ఏర్పడన్+అడిగెన్= స్పష్టపరచుమని అడిగాడో; అది+ఎల్లన్= అదంతా; వివరించుచున్=

స్పష్టపరుస్తూ; హృదయ పుష్కర కలితంబు+అగు పరతత్త్వంబు= హృదయ పద్మంలో ఉన్న పరతత్త్వం; ప్రసాదించు+అట్టి= అనుగ్రహించే; గూఢ+ఉక్తులు+అనుగ్రహించుచున్+ఉండన్= రహస్యోక్తులు అనుగ్రహిస్తూంటే; ఎట్టకేలకున్= చాలసేపటికి; ప్రభాతంబు= ఉదయం; అగుటయున్= కాగా; ధృతరాష్ట్ర విదురులన్; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; ఆ+దేవముని= ఆ దివ్యర్షి; అంతర్థానంబున్+ఒందెన్= అదృశ్యుడయ్యాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో-.

తాత్పర్యం: మీరు కూడా దయాతిశయంతో విచ్చేశారు. గురువు నాశ్రయించుకొన్నవారు దేనివలన సుఖదుఃఖాలూ లాభాలాభాలూ, ప్రియద్వేషాలూ మొదలుగాగల ద్వంద్వాలలో తగుల్కొనక బ్రదుకుతారో అటువంటి తత్త్వోపదేశంచేత ఇతడిని ధన్యుడిని చేసి కాపాడాలి' అని ప్రార్థించగా, ధృతరాష్ట్రుడు కూడా దానికి తగిన మాటలతో పూజించగా ప్రసన్నుడయి సనత్సుజాతుడు అధ్యాత్మ విషయాలైన వివిధ వాక్యాలతో ఒకదాని తరువాత ఒకటిగా- మెట్ల వరసను- క్రమక్రమంగా సూక్ష్మార్థాలు సమర్థిస్తూ, వాటిలో ధృతరాష్ట్రుడు స్పష్టపరచుమన్న వాటినన్నిటినీ వివరిస్తూ, హృదయపద్మంలో ఉన్న పరమాత్మ ప్రసాదించే రహస్య వాక్కులు అనుగ్రహిస్తూండగా, చాలాసేపటికి ప్రొద్దుపొడవగా, ధృతరాష్ట్ర విదురులను వీడుకొని ఆ దేవర్షి అదృశ్యుడయ్యాడు. ఆ సమయంలో.

ప్రాతఃకాల వర్ణనము (అమూలకము)

తే. **తన కులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు । లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట**
కుమ్మలించి వివర్ణత నొందినట్లు । గంది, యెంతయుఁ జెలు వేదెఁ జందురుండు. **107**

ప్రతిపదార్థం: తన కులంబునన్= తన వంశంలో; పుట్టిన; ధార్తరాష్ట్రులు= కౌరవులు; అన్నదమ్ములతోన్; విగ్రహంబు+ కొనుటకున్= విరోధించటానికి; చందురుండు= చంద్రుడు; ఉమ్మలించి= దుఃఖించి; వివర్ణతన్= కాంతిహీనతను; ఒందిన+ అట్లు= పొందిన విధంగా; కంది= తేజోవిహీనుడయి; ఎంతయున్= మిక్కిలి; చెలువు+ఏదెన్= అందం కోల్పోయాడు.

తాత్పర్యం: తన వంశంలో పుట్టిన కౌరవులు అన్నదమ్ములతో విరోధపడినందుకు చంద్రుడు దుఃఖించి కాంతిహీనతను పొందినవిధంగా తేజోవిహీనుడై మిక్కిలి అందం కోల్పోయాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. కౌరవులు చంద్రవంశోద్భవులు. ఉదయ సమయంలో చంద్రుడు పాలిపోవడం సహజం. దానికి ధార్తరాష్ట్రు లన్నదమ్ములతో విగ్రహము గొనుట హేతువు కాదు. హేతువుకాని దానిని హేతువుగా చెప్పటం చేత అలంకారం హేతూత్ప్రేక్ష.

మూలంలో ఈ సందర్భంలో ప్రాతఃకాలవర్ణన లేదు. 'తస్యాం రజన్యాం వ్యుష్టాయాం' అని మాత్రమే మూలభారతంలో ఉన్నది. ఆ మాత్రపు సూచననే పురస్కరించుకుని తిక్కన ఇక్కడ ప్రాతఃకాల వర్ణన విపులంగా చేశాడు. నీతులతోనూ, ధర్మాలతోనూ విసుగెత్తిన పఠితలకు ఈ ప్రకృతి వర్ణన ఇంచుక చిత్తాహ్లాదాన్ని కలిగిస్తుంది.

క. **కుముదములుఁ దారు నొక్కటఁ । బ్రమదంబున నుండి, వాని పదవి దొలఁగినం**
దమకున్ నిలువఁగఁ దగదను । క్రమమునఁ జనునట్లు తారకంబులు విరిసెన్. **108**

ప్రతిపదార్థం: తారకంబులు= నక్షత్రాలు; కుముదంబులున్= (తెల్ల) కలువలూ; తారున్= తామూ; ఒక్కటన్+ఒకచోట; ప్రమదంబునన్= సంతోషంతో; ఉండి; వాని పదవి తొలఁగినన్= ఆ కుముదముల సంపద నశించగా; తమకున్; నిలువఁగన్+ చనదు+అను క్రమమునన్= ఉండగూడదనే న్యాయం చొప్పున; చను+అట్లు= పోయే విధంగా; విరిసెన్= అదృశ్యమయ్యాయి.

తాత్పర్యం: కలువలూ తామూ ఒకేచోట సంతోషంతో ఉండి, ఆ కలువల సంపద నశించగానే - ఉన్నతస్థానం తొలగగానే - ఇంక తాము అక్కడ ఉండటం భావ్యం కాదని తొలగి పోయాయా అన్నట్లు నక్షత్రాలు అదృశ్యమయ్యాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రాత్రివేళ కలువలు వికసిస్తాయి. నక్షత్రాలు కూడా అప్పుడే మెరుస్తూంటాయి. రాత్రి నశించగానే, సూర్యోదయం కాగానే కలువల వికాసం నశిస్తుంది. నక్షత్రాలు కూడా సహజంగానే అదృశ్యమవుతాయి. నక్షత్రాలు అదృశ్యమవటానికి కలువల పదవి పోయినప్పుడు ఇంక మనం ఉండగూడదనుకొనటం హేతువు కాదు. హేతువుకాని దానిని హేతువుగా ఊహించటంచేత ఇక్కడ అలంకారం హేతూత్ప్రేక్ష.

ఉ. ఎత్తిన వేడ్కఁ గంధరము లెత్తి, మొగంబులు సాఁచి, చూడ్కులం
జిత్తములన్ నిగిడ్చి, తమ చెందెడు నిక్కలు రోసి, యింపు ద
ళ్కొత్తఁగ నొక్కచో నొకటి నొక్కటి గాంచి, యెలర్చు కాయ్కులం
జిత్తజుకేళిఁ దేలె విలసిల్లుచు జక్కవదోయి వేకువన్. 109

ప్రతిపదార్థం: వేకువన్= తెల్లవారుజామున; జక్కన దోయి= చక్రవాక పక్షుల జంట; ఎత్తిన వేడ్కన్= అతిశయించిన కోరికతో; కంధరములు+ఎత్తి= మెడలెత్తి; మొగంబులు= ముఖాలు; చాఁచి; చూడ్కులన్= చూపులతో; చిత్తములన్= మనస్సులను కూడా; నిగిడ్చి= ప్రసరింపజేసి; తమ చెందెడు+ఇక్కలు రోసి= తాము వెళ్ళవలసిన స్థానాలు వెదకి; ఒక్కచోన్= ఒకచోట; ఇంపు+తళ్కొత్తఁగన్= ఆనందం అతిశయించగా; ఒకటిన్+ఒక్కటి+కాంచి= ఒకదాని నొకటి చూచి; ఎలర్చు కాయ్కులన్= వికసిల్లే వలపులతో; విలసిల్లుచున్= ప్రకాశిస్తూ, ఆనందిస్తూ, చిత్తజుకేళిన్= మన్మథక్రీడయందు; తేలెన్= సుఖించాయి.

తాత్పర్యం: తెల్లవారుజామున చక్రవాక పక్షుల జంట అతిశయించిన కోరికతో మెడలెత్తి, ముట్టెలు చాచి, చూపులతోపాటు మనస్సులను కూడా ప్రసరింపజేసి, తాము చేరవలసిన స్థానాలు వెదకి, ఒకచోట ఆనందమతిశయించగా ఒకదానిని ఒకటి చూచి విలసిల్లుతూ ప్రకాశించే వలపులతో మన్మథక్రీడ చేసి ఆనందించాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. చక్రవాకపక్షుల జంట రాత్రి తెల్లవార్లూ ఒకదాని నొకటి వీడి విరహం అనుభవించి తెల్లవారుజామున కలిసికొంటాయని కవులు వర్ణిస్తారు. పక్షుల పనులను స్వభావరమణీయంగా ఇందులో కవి వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి.

మ. మును సౌరభ్యము నివ్వటిల్లఁగ, మనోమోదంబునం దేఁటు ల
ల్లన యోలిన్ వెడలంగ, రేకులు సముల్లాసంబునన్ బింక మె
క్క నయంబెక్కుచు, గద్దె పాం దెడలి వీఁకం గేసరంబుల్ గడ
ల్కొనఁ, దోడ్తో మధు వుచ్చి, పేరెలమిఁ బొల్పుం జెందె నంభోజముల్. 110

ప్రతిపదార్థం: అంభోజముల్= పద్మాలు; మును= ముందు; సౌరభ్యము= పరిమళం; నివ్వటిల్లఁగన్= వ్యాపించగా; తేఁటులు= తుమ్మెదలు; మనస్(ః)+మోదంబునన్= మనస్సంతోషంతో; అల్లన= మెల్లగా; ఓలిన్= క్రమంగా; వెడలంగన్= బయలుదేరగా; రేకులు= పూవురేకులు; సముల్లాసంబునన్= వికాసంతో; బింకము+ఎక్కన్= పైకి లేవగా- విచ్చుకోగా; నయంబు+ఎక్కుచున్= అంద మతిశయిస్తూ; కేసరంబుల్= అకరువులు; గద్దె పొందు+ఎడలి= దుద్దునుండి వీడి; వీఁకన్= విజృంభణంతో; కడల్కొనన్= వ్యాపించగా; తోడ్తోన్= వెనువెంటనే; మధువు+ఉచ్చి= తేనె పైకి వచ్చి; పేరు+ఎలమిన్= అధిక వికాసంతో- సంపూర్ణ వికాసంతో; పొల్పున్+చెందెన్= అందగించాయి.

తాత్పర్యం: పద్మాలు ముందుగా పరిమళం వ్యాపించగా, తుమ్మెదలు దానికి మనస్సంతోషంతో మెల్లగా క్రమంగా వాటి దగ్గరకు బయలుదేరగా, రేకులు మంచి వికాసంతో విచ్చుకోగా, అందమతిశయిస్తూ, అకరువులు దుద్దునుండి వీడి విజృంభణంతో వ్యాపించగా, వెనువెంటనే తేనె పైకి వచ్చి, సంపూర్ణ వికాసంతో అందగించాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. ఇందులో ఉదయ సమయంలో పద్మాల వికసన క్రమాన్ని స్వభావసుందరంగా కవి వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి. మనోమోదంబునన్.... వెడలంగ .... పద్మాలు వికసించకుండానే వాటి పరిమళం ముందు వ్యాపిస్తుంది. దానికి ఆకృష్టములై తుమ్మెదలు క్రమక్రమంగా వాటిదరికి వెడతాయి. గద్దె పొందెడలి - కేసరాలు మొగ్గగా ఉన్నప్పుడు దుద్దునంటిపెట్టుకుని ఉంటాయి. పువ్వు వికసించగానే అవి దాని నుంచి విడివడుతాయి. గ్రద్దె- అనే పాఠం అన్ని ప్రతులలోనూ ఉంది. కాని ఆ పదం సూర్యరాయాంధ్ర నిఘంటువులో లేదు. అందులో 'గద్దె' అని ఉన్నది. అందుచేత అదే గ్రహించబడింది. తోడ్తో మధువుచ్చి - పువ్వు వికసించిందే తడవుగా అందులో నుండి మకరందంపైకి పొరలుతుంది.

చ. వెడవెడ నిద్రవొంది కనువిచ్చిన పాంథులమీఁద దాడి వోఁ,
దడఁబడ నొండొరుం బిలుచు దర్పకు పంపు బలంబులోని య
ల్కుడు కరణిం జెలంగె శుక కోకిల భృంగతతుల్ వనంబులం
దెడనెడఁ బల్కఁ, గూయ, సొగియింపఁగ మ్రోయఁగఁ దద్విరావముల్. **111**

ప్రతిపదార్థం: వనంబులందున్= తోటలలో; శుక కోకిల భృంగ తతుల్= చిలుకల, కోకిలల, తుమ్మెదల సమూహాలు; ఎడనెడన్= అప్పుడప్పుడు; పల్కన్= పలుకగానూ; కూయన్= కూయగానూ; సొగియింపఁగన్ మ్రోయఁగన్= సుఖించేటట్లు రొదచేయగానూ; తద్ విరావముల్= వాటి వాటి ధ్వనులు; వెడవెడ= మిక్కిలి అల్పంగా; నిద్ర+పొంది= నిద్రపోయి; కనువిచ్చిన= కళ్ళు తెరిచిన; పాంథుల మీఁదన్= విరహుల పైకి; దాడి+పోన్= దండెత్తేటప్పుడు; తడఁబడన్= తొట్రుపడేటట్లు; ఒండొరున్= పరస్పరం; పిలుచు= పిలిచే; దర్పకు పంపు బలంబులోని+అల్కుడు కరణిన్= మన్మథుడు పంపే సైన్యంలోని ధ్వనివలె; చెలంగెన్= మ్రోగాయి- ఒప్పాయి.

తాత్పర్యం: తోటలలో చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ అప్పుడప్పుడు పలుకుతున్నాయి, కూస్తున్నాయి, సుఖం కలిగేటట్లు రొద చేస్తున్నాయి. ఆ ధ్వనులు ఎట్లా ఉన్నాయంటే- ఇంచుక నిద్రపోయి కళ్ళు తెరిచిన విరహుల మీదికి తన బలగాన్ని పంపితే, అందులోని పరివారం వాళ్లమీదకు పోయేటప్పుడు తొట్రుపాటుతో పరస్పరం పిలుచుకుంటూ చేసే చప్పుడువలె ఒప్పుతున్నాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. విరహులకు రాత్రి నిద్రపట్టలేదు. తెలతెలవారుతూందనగా కొంచెం కన్నుమూశారు. తెల్లవారగానే కళ్ళు తెరిచారు. అప్పుడు వాళ్లపైకి మన్మథుడు తన బలగాన్ని పంపాడు. అతడి బలగం చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ. అవి 'మన ప్రభువు ఆజ్ఞ అయింది. ఇంక ఏమాత్రమూ ఆలస్యం చేయగూడదు. విరహుల మీదకు పోదాం రండి అని తొట్రుపాటుతో ఒకళ్ళ నొకళ్ళు పిలుస్తున్నాయా అన్నట్లుగా పలుకుతున్నాయి, కూస్తున్నాయి, రొద చేస్తున్నాయి. అవి అప్పుడు చేసే చప్పుడులా అన్నట్లుగా ఉన్నాయి వనంలో చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ పలికే పలుకుల, కూసే కూతల, చేసే రొదల చప్పుడులు.

సీ. పద్మపరాగంబుఁ బరఁగించు నరుణోద । యంబు కాంతికిఁ జెలువంబు మిగులఁ,
బరువంబు దప్పిన విరుల రాలుచుఁ దరు । చయము చుక్కలు లేని చదలఁ జెనయ,
నరవిరి నెత్తావి నడరించు నున్నిద్ర । విట వీటి సౌరభవితతి వొదల,
నెలఁత చీరిన యెఱకల నెఱిఁ దీర్చు జ । క్క వలు చందోయి కేఁకట యొనర్ప,

ఆ. వెలరువాఱు దీవియల నల్లనల్లార్చు । సోర్ణగండ్లయందుఁ జొచ్చి సుడిసి,
తిరిగి వేగుఁబోక తెమ్మెర లెలదీఁగ । కొనల వంక లొత్తు, ననలఁ బ్రోచు. 112

ప్రతిపదార్థం: వేగుఁబోక తెమ్మెరలు= తెల్లవారుజామునందలి పిల్లగాలులు; తిరిగి= సంచరించి; అరుణ+ఉదయంబు కాంతికిన్= సూర్యోదయపు కాంతికి; చెలువంబు= అందం; మిగులన్= అతిశయించగా; పద్మ పరాగంబున్= తామర పుప్పొడిని; పరఁగించున్= వ్యాపింపజేస్తుంది; తరు చయము= చెట్ల సమూహం; చుక్కలు లేని చదలన్= నక్షత్రాలు లేని ఆకాశాన్ని; చెనయన్= పోలేటట్లు; పరువంబు+తప్పిన విరులన్= పక్వస్థితి నతిక్రమించిన పువ్వులను; రాలుచున్= రాలగొట్టుతుంది; ఉన్నిద్ర విట వీటిన్= నిద్రలేని విటుల వీటి యొక్క ప్రదేశంయొక్క; సౌరభ వితతి= పరిమళాల సమూహం; పొదలన్= అతిశయించేటట్లు; అర విరి నెఱ+తావి= సగం విచ్చిన పూల పరిమళాన్ని; అడరించున్= వ్యాపింపజేస్తుంది; జక్కవలు= చక్రవాకపక్షులు; చెన్ను+తొవలకున్= ఎర్ర కలువల కొరకు; ఏఁకట+ఒనర్పన్= అభిలాష చేయగా- అపేక్షించగా; నెలఁత= ఆడు జక్కవ- చక్రవాకి; చీరిన+ఎఱకల= చీలిన రెక్కల యొక్క; నెఱిన్= చిక్కును; తీర్చున్= సరిచేస్తుంది; సోర్ణ గండ్ల యందున్= కిటికీలలో; చొచ్చి= ప్రవేశించి; సుడిసి= చుట్టుకొని; వెలరు+పాఱు= వెలవెల పోయే; దీవియలన్= దీపాలను; అల్లన్= మెల్లగా; అల్లార్చున్= చలింపజేస్తుంది; ఎలదీఁగ కొనల వంకలు= లేదీగల చివరల వంకరలు; ఒత్తున్= సరిచేస్తుంది; ననలన్= పువ్వుల్ని; ప్రోచున్= పెంచుతుంది.

తాత్పర్యం: తెల్లవారుజామున వీచే గాలి సంచరిస్తూ సూర్యోదయపు కాంతికి అందం అతిశయించేటట్లు తామర పుప్పొడిని ఎగురగొట్టుతుంది. చెట్ల సమూహం నక్షత్ర రహితమైన ఆకాశాన్ని పోలేటట్లు వాడిపోయిన పువ్వులను రాలగొట్టుతుంది. నిద్రలేని విటుల ప్రదేశంలో పరిమళాలు అతిశయించేటట్లు సగం విచ్చిన పూల సువాసనను వ్యాపింపచేస్తుంది. చక్రవాక పక్షులు ఎర్ర కలువల కొరకు అభిలషించగా చక్రవాకి చీలిన రెక్కల చిక్కు సరిచేస్తుంది. కిటికీలను చుట్టి వచ్చి వెలవెలపోయే దీపాలను మెల్లగా చలింపచేస్తుంది. లేదీగ కొసల వంకరలను తీరుస్తుంది. పువ్వులను పెంచుతుంది.

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ. గాలి వీచే విధాన్ని కవి స్వభావరమణీయంగా వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి. అరుణోదయం కాంతి ఎరుపు. పద్మరాగం కూడా ఎరుపే. అందుచేతనే చెలువం మిగలటం. పూలు రాలిపోతే చెట్లు చుక్కలులేని ఆకాశంవలె ఉంటాయి. అలంకారం ఉపమ. విటులు పరిమళద్రవ్యాలు పూసికొని' (సెంట్లు మొదలైనవి) గుమగుమలాడుతుంటారు. వాళ్ళ వలన ఆ వీడంతా పరిమళిస్తుంది. పూల నెత్తావితో ఆ వీడు మరింత పరిమళిస్తుంది. తెల్లవారుజామున సూర్యుడి వెలుగువలన దీపాలు వెలవెలపోతాయి. కిటికీలలో వీచేగాలి వాటిని అల్లల్లాడిస్తుంది.

ఆ. అంత నుదయశైల మను నశోకద్రుమ । సమితియందుఁ గాంతి చారుభంగి
నెఱయ విరిసి తొలుత నెగసిన యుజ్జ్వల । స్తబక మనఁగఁ బద్మసఖుఁడు వొడిచె. 113

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట - తెల్లవారిన తరువాత; ఉదయ శైలము+అను+అశోక ద్రుమ సమితి+అందున్= తూర్పుకొండ అనే అశోక వృక్షాల సమూహంలో; కాంతి; చారు భంగిన్= మనోహరమైన విధంగా; నెఱయన్= నిండగా; విరిసి= పూసి; తొలుతన్= మొదటిసారి; నెగసిన+ఉజ్జ్వల స్తబకము+అనఁగన్= బయల్వెడలిన ప్రకాశించే పూలగుత్తియో అనేటట్లు; పద్మసఖుఁడు= పద్మబాంధవుడు-సూర్యుడు; పొడిచెన్= ఉదయించాడు.

తాత్పర్యం: అప్పుడు తూర్పుకొండ అనే అశోక వృక్ష సమూహంలో కాంతి మనోహరంగా వ్యాపించగా పూసి మొదటిసారిగా బయల్వెడలిన ప్రకాశించే పూలగుత్తియా అనేటట్లు సూర్యుడు ఉదయించాడు.

విశేషం: అలం: రూపకం. ఉదయశైలమే అశోకద్రుమ సమితి. పద్మసఖుడే ఉజ్జ్వలస్తబకం - రూపకం. తదనుప్రాణితమైన ఉత్ప్రేక్ష. సూర్యబింబం ఎరుపు. అశోకపుష్ప స్తబకం కూడా ఎరుపే. పుష్పస్తబకం గుండ్రన. సూర్యబింబం కూడా గుండ్రనిదే. అంచేత పోలిక సరిపోయింది. తొలుత- సూర్యు డొక్కడే అందుచేత పుష్పస్తబకం కూడా ఒక్కటే. మరి పూయవు. స్తబకమూ, సూర్యబింబమూ రెండూ ఉజ్జ్వలాలే. అశోకద్రుమ సమితి అనటం కొండతో పోలికకు.

సీ. **ఉర్వీధరంబుల నొప్పెడు జేవుఱుఁ । జఱుల కాంతికి నును మెఱుఁగు వెట్టి,**
ధరణీజ గుల్మ లతా వితానము పల్ల । వములకుఁ గట్టెఱ్ఱ వన్నె యొసఁగి,
యరుణాంబుజంబుల యంతర్దళంబుల । తళతళలకు జిగి దళము కొల్పి,
చక్రవాకద్వయ సంతతి యెఱకల । కొమరారు కెంజాయఁ గ్రొత్తసేసి,

ఆ. **తనదు బాలబింబ మనుపమేయప్రభా । పటల జటిల గగనభాగ మగుచు**
నుల్లసిల్లి, జగము లెల్లను విలసిల్లఁ । బూర్వశిఖరిమీఁదఁ బొడిచె నినుఁడు. **114**

ప్రతిపదార్థం: ఉర్వీధరంబులన్= కొండలందు; ఒప్పెడు= ఒప్పే; జేవుఱు+చఱుల కాంతికిన్= జేవురు రంగు చరియల కాంతికి; నును మెఱుఁగు+పెట్టి= ఇంచుక మెరుగుపెట్టి; ధరణీజ గుల్మ లతా వితానము పల్లవములకున్= చెట్లయొక్కయు, పొదలయొక్కయు, తీగల యొక్కయు సమూహం యొక్క చివురులకు; కడు+ఎఱ్ఱ వన్నె+ఒసఁగి= మిక్కిలి ఎరుపురంగు కలిగించి; అరుణ+అంబుజంబుల= ఎఱ్ఱతామరలయొక్క; అంతర్దళంబుల తళతళలకు= లోపలి రేకుల తళతళమనే కాంతులకు; జిగిన్= మెఱుగుదనాన్ని; దళము+కొల్పి= అధికం చేసి; చక్రవాక ద్వయ సంతతి ఎఱకల= చక్రవాక పక్షుల జంటల సమూహం యొక్క రెక్కల యొక్క; కొమరు+ఆరు= అందగించే; కెంపు+చాయన్= ఎఱ్ఱటి కాంతిని; క్రొత్త+చేసి= అపూర్వం చేసి; తనదు బాల బింబము= తన యొక్క లేతబింబం; అనుపమేయ ప్రభా పటల జటిల గగన భాగము+అగుచున్= సాటిలేని కాంతుల యొక్క సమూహంచేత క్రిక్కిరిసిన ఆకాశ ప్రదేశం కలది అవుతూ; ఉల్లసిల్లి= ప్రకాశించి; జగములు+ఎల్లను= లోకాలన్నీ; విలసిల్లన్= ప్రకాశించగా; ఇనుఁడు= సూర్యుడు; పూర్వ శిఖరి మీఁదన్= తూర్పు కొండపై; పొడిచెన్= ఉదయించాడు.

తాత్పర్యం: కొండలలో ఒప్పే జేవురురంగు చరియల ఎఱ్ఱటి కాంతికి ఇంచుక మెరుగు పెట్టి, చెట్ల, పొదల, తీగల సమూహాల చిగుళ్లకు మిక్కిలి ఎరుపు వన్నె కలిగించి, ఎఱ్ఱ తామరల లోపలి రేకుల తళతళలాడే కాంతిని అతిశయింపజేసి, చక్రవాక పక్షుల జంటల సమూహపు రెక్కల మనోహరమైన ఎఱ్ఱటి కాంతిని అపూర్వం చేసి, తన లేత బింబం ఆకాశ ప్రదేశాన్ని సాటిలేని కాంతి పుంజంతో క్రిక్కిరిసినదిగా చేస్తూ ఒప్పగా, లోకాలన్నీ ప్రకాశించేటట్లు సూర్యుడు ఉదయ పర్వతం మీద ఉదయించాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. కొండ చరియలు సహజంగానే జేవురురంగు కలిగి ఉంటాయి. ఉదయ సూర్యుడి కాంతి వాటి కింకా ఇంచుక మెరుగు పెడుతుంది. చివుళ్ళ కాంతి సహజంగానే ఎరుపు. సూర్యకాంతి దాని నింకా ఎర్రగా చేస్తున్నది. ఎర్ర తామరల లోపలి రేకులు తళతళలాడుతూంటాయి. ఆ తళతళలను మరింత సాంద్రం చేస్తున్నది సూర్యబింబం. చక్రవాక మిథునాల రెక్కలకు ఎర్రటి కాంతిని అపూర్వంగా కలిగిస్తున్నాడు సూర్యుడు.

వ. ఇట్లు సూర్యోదయం బగుటయు, ధృతరాష్ట్రుండు తత్కాలోచితాచారంబులు నిర్వర్తించి, తగు తెఱంగున నలంకృతుం డయి, యాస్థానమండపంబున కరిగి పేరోలగం బిచ్చినఁ, గుంభ సంభవ కృప కృతవర్మాశ్వత్థామ కర్ణాదు లగు దొరలును, భీష్మ విదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవః ప్రభృతులగు బంధుజనులును, దుర్యోధన దుశ్శాసన ప్రముఖులగు కుమారులును లోనుగాఁ గల సమస్త పరిజనంబులును వచ్చి బలసియుండి; రయ్యవసరంబున సంజయుండు వచ్చి వాకిట నిలిచి పణిహారుల వలనఁ దన్నెఱింగించి పుచ్చి చొచ్చి, సముచిత ప్రదేశంబునం గూర్చుండి, తన మాటలు వినుటకుఁ జిడిముడిపడుచున్న కొలువుఁ గలయం గనుంగొని యిట్లనియె. 115

ప్రతిపదార్థం: ఇట్లు; సూర్య+ఉదయంబు+అగుటయున్= సూర్యోదయం కాగా; ధృతరాష్ట్రుండు; తద్+కాల+ఉచిత+ఆచారంబులు= ఆ సమయానికి తగిన పనులు; నిర్వర్తించి= చేసి; తగు తెఱంగునన్= తగిన విధంగా; అలంకృతుండు+అయి= అలంకరించబడినవాడై; ఆస్థాన మండపంబునకున్+అరిగి= సభా మందిరానికి వెళ్ళి; పేరు+ఓలగంబు+ఇచ్చినన్= నిండు సభ తీర్చగా; కుంభసంభవ కృప కృతవర్మ+అశ్వత్థామ కర్ణ+ఆదులు+అగు దొరలును= ద్రోణుడూ, కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా, కర్ణుడూ మొదలైన నాయకులునూ; భీష్మ విదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవస్+ప్రభృతులు+అగు బంధు జనులును= భీష్ముడూ, విదురుడూ, బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ మొదలుగాగల చుట్టాలునూ; దుర్యోధన దుశ్శాసన ప్రముఖులు+అగు కుమారులును= దుర్యోధనుడూ, దుశ్శాసనుడు మొదలైన కుమారులునూ; లోనుగాన్+కల సమస్త పరిజనులును= మొదలుగాగల ఎల్ల పరివారమూ; వచ్చి; బలసి+ఉండిరి= కూడి ఉన్నారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సంజయుండు; వచ్చి; వాకిటన్= ద్వారం దగ్గర; నిలిచి; పణిహారుల వలనన్= ద్వారపాలకుల చేత; తన్నున్+ ఎఱింగించి పుచ్చి= తన రాక తెలియజేసి; చొచ్చి= ప్రవేశించి; సముచిత ప్రదేశంబునన్= తగిన స్థానంలో; కూర్చుండి; తన మాటలన్ వినుటకున్; చిడిముడి పడుచున్+ఉన్న= వేగిరపడుతున్న; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= అంతటా చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా సూర్యోదయం కాగా ధృతరాష్ట్రుడు ఆ సమయానికి తగిన పనులు చేసి, తగిన విధంగా అలంకరించుకొని, సభాస్థానానికి వెళ్ళి నిండుసభ తీర్చగా, ద్రోణుడూ, కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా మొదలగు నాయకులూ, భీష్ముడూ, విదురుడూ, బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ మొదలైన బంధువులూ, దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ మొదలగు కుమారులూ, ఇంకా ఉన్న ఎల్ల పరిజనులూ వచ్చి పరివేష్టించారు. ఆ సమయంలో సంజయుడు వచ్చి ద్వారం దగ్గర నిలిచి ద్వారపాలకుల చేత తన రాక తెలిపి ప్రవేశించి తగిన స్థానంలో కూర్చుండి, తన మాటలు వినటానికి తొందరపడుతున్న సభను అన్ని వైపులా చూచి ఇట్లా అన్నాడు.

సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవుల తెఱంగుసెప్పుట (సం. 5-46-15)

తే. 'పాండురాజ తనూజులపాలి కర్థి । నిమ్మహారాజు పనుపంగ నేఁగి ధర్మ
పుత్త్రుఁ గాంచితి; నాతండు మైత్త్రి మెఱయఁ । గౌరవుల సేమ మెల్లఁ బేర్వేర నడిగె. 116

ప్రతిపదార్థం: పాండురాజు తనూజుల పాలికిన్= పాండురాజు కొడుకుల వద్దకు; అర్థిన్= కోరికతో; ఈ+మహారాజు పనుపంగన్= ఈ ధృతరాష్ట్ర మహారాజు; పంపగా; ఏఁగి= వెళ్ళి; ధర్మపుత్త్రున్= ధర్మరాజును; కాంచితిన్= చూచాను; ఆతండు; మైత్రి మెఱయన్= స్నేహం ప్రకాశించగా- ఒప్పగా; కౌరవుల సేమము+ఎల్లన్= కౌరవుల క్షేమం అంతా; పేర్వేరన్= పేరుపేరునా; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: 'పాండవుల వద్దకు ఈ ధృతరాష్ట్ర మహారాజు పంపగా వెళ్ళి ధర్మరాజును చూచాను. అతడు చెలిమి ఒప్పగా కౌరవుల యోగక్షేమాలను గురించి పేరుపేరునా అడిగాడు.

వ. మఱియుఁ దగువారల నెల్ల నయ్యై యుచితవిధిం బ్రణామంబున, వినయంబున, బాంధవంబున, మిత్త్రభావంబున, వాత్సల్యంబునఁ, బ్రసాదంబున నాదరించె; నేనును భూనాథుండు గఱపిన తెఱంగునఁ గొఱంత లేకుండ బంధుత్వంబునకు వలయు మాటలాడితిఁ; బదంపడి కార్యంబు ప్రసంగించి నా యాడిన మాటలకు నయ్యుధిష్ఠిరుండు పలికిన వచనంబు లింత యొప్పునే?' యని యగ్గించిన, ధృతరాష్ట్రుం డవహితుండై యడుగఁ, దా నయ్యుధిష్ఠిరునకుం జెప్పిన భంగులు, నతండు వానికి నెల్ల నుత్తరం బిచ్చిన తెఱంగును నెఱింగించి, ధృతరాష్ట్రునకుం, బితామహునకు, దుర్యోధనునకుం గ్రమంబున వారివారితో నాడుమని నియమించిన చందంబులు ధర్మనందను పలుకుల పరిపాటిం దేటపడం జెప్పి సూతసూనుండు వెండియు నిట్లనియె. 117

ప్రతిపదార్థం: మఱియున్, తగు వారలన్+ఎల్లన్= తగువారినందరినీ, ఆ+ఆ=ఆయా; ఉచిత విధిన్= తగిన విధంగా; ప్రణామంబునన్= నమస్కారంతో; వినయంబునన్= నమ్రతతో; బాంధవంబునన్= చుట్టరికంతో; మిత్ర భావంబునన్= స్నేహభావంతో; వాత్సల్యంబునన్= ప్రేమతో; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; ఆదరించెన్= సంభావించాడు; ఏనును= నేనును; భూనాథుండు= రాజు ధృతరాష్ట్రుండు; కఱపిన తెఱంగునన్= బోధించిన విధంగా; కొఱంత లేక+ఉండన్= లోపం లేకుండా; బంధుత్వంబునకున్= చుట్టరికానికి; వలయు మాటలు+ఆడితిన్= అవసరమైన పలుకులు పలికాను; పదంపడి= పిమ్మట; కార్యంబు ప్రసంగించి= వచ్చిన పనిని ప్రస్తావించి; నా+ఆడిన మాటలకున్= నేను పలికిన పలుకులకు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; పలికిన వచనంబులు= పలికిన పలుకులు; ఇంత+ఒప్పునే!= ఎంత బాగున్నాయి!; అని; అగ్గించినన్= పొగడగా; ధృతరాష్ట్రుండు; అవహితుండు+ఐ+అడుగన్= సావధానుడై అడుగగా; తాను; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; చెప్పిన భంగులున్= చెప్పిన తెఱగులూ; అతండు; వానికిన్+ఎల్లన్= వాటి కన్నింటికీ; ఉత్తరంబు+ఇచ్చిన తెఱంగునున్= సమాధానం చెప్పిన విధమూ; ఎఱింగించి= తెలిపి; ధృతరాష్ట్రునకున్; పితామహునకున్= తాతకు- భీష్ముడికి; దుర్యోధనునకున్; క్రమంబునన్= వరుసగా; వారి వారితోన్; ఆడుము+అని= చెప్పుమని; నియమించిన చందంబులున్= విధించిన విధములూ; ధర్మనందను పలుకుల పరిపాటిన్= ధర్మరాజు మాటల క్రమమూ; తేటపడన్+చెప్పి= స్పష్టపడేటట్లు చెప్పి; సూతసూనుండు= సంజయుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇంకా తగువారినందరినీ ఆయా వారికి తగిన రీతిని నమస్కారమూ, వినయమూ, బంధుత్వమూ, స్నేహభావమూ, వాత్సల్యమూ, అనుగ్రహమూ నెరపి ఆదరించాడు. నేను కూడా రాజు బోధించిన విధంగా లోపం లేకుండా బంధుత్వానికి అవసరమైన రీతిగా పలికాను. పిమ్మట, వచ్చిన పనిని ప్రస్తావించి నేను పలికిన పలుకులకు ఆ ధర్మరాజు పలికిన పలుకులు ఎంత బాగున్నాయి!' అని పొగడగా, ధృతరాష్ట్రుడు సావధానుడై అడుగగా, తాను ఆ ధర్మరాజుతో అన్న మాటలూ, అతడు వాటి కన్నింటికీ సమాధానం చెప్పిన విధమూ తెలిపి, ధృతరాష్ట్రుడికీ,

భీష్ముడికీ, దుర్యోధనుడికీ క్రమంగా వారి వారితో చెప్పుమని చెప్పిన రీతులు ధర్మరాజు మాటల క్రమంలో స్పష్ట పడేటట్లు చెప్పి సంజయుడు ఇంకా ఇట్లా అన్నాడు:

తే. **'ఏ నుపప్లావ్య పురమున కేఁగి తొలుత । వాసుదేవార్జునులఁ గంటి; వారు నీతి**
పథము దప్పని మాటలు బలిమిఁ దోఁచు । నట్లుగా నాడి; రవి వినుం డాదరించి.' **118**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉపప్లావ్య పురమునకున్; ఏఁగి; తొలుతన్= మొదట; వాసుదేవ+అర్జునులన్= కృష్ణుడినీ, అర్జునుడినీ; కంటిన్= చూచాను; వారు; నీతి పథము+తప్పని మాటలు= నీతి మార్గం అతిక్రమించని మాటలు; బలిమిన్= విధిగా; తోఁచు+అట్లు+కాన్= స్ఫురించే విధంగా; ఆడిరి= పలికారు; అవి; ఆదరించి వినుండు= ఆదరంతో వినండి.

తాత్పర్యం: 'నేను ఉపప్లావ్యపురానికి వెళ్ళి మొదట కృష్ణార్జునులను చూచాను. వారు నీతిమార్గం తప్పని మాటలు విధిగా తోచేటట్లు పలికారు. వాటిని సాదరంగా వినండి.'

విశేషం: ఉపప్లావ్య నగరంలో సంజయుడు మొదట దర్శించింది వాసుదేవార్జునులను. వాసుదేవుడిని దర్శించబోగా అక్కడ అర్జునుడు అతడి వెంట అంటిపెట్టుకొని ఉన్నాడు. నరనారాయణ మైత్రిని ముమ్మూర్తుల ఈ పుట్టుకలో వారిద్దరు ప్రదర్శించారు. వారిద్దరూ నీతియుక్తంగా పలికారని చెప్పటంవలన వారు కుటిల నీతిని ప్రదర్శించలేదని భావం. (సంపా.)

వ. **అనిన విని ధృతరాష్ట్రుం 'డవ్వాసుదేవు చిత్తం బె? ట్లతం డేమనియె?' నని యడిగిన, నతనికి సంజయుం డిట్లనియె:** **119**

ప్రతిపదార్థం: అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఆ+వాసుదేవు చిత్తంబు+ఎట్లు= ఆ కృష్ణుడి మనస్సు ఎట్లా ఉన్నది?; అతండు; ఏమి+అనియెన్; అని+అడిగినన్; అతనికిన్; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు 'ఆ కృష్ణుడి మనస్సు ఎట్లా ఉన్నది? అత డే మన్నాడు?' అని అడుగగా, అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

విశేషం: కృష్ణార్జునులలో వాసుదేవుడి హృదయమేమిటి? అతడి మాటల తీరేమి?టని ధృతరాష్ట్రుడు గుచ్చి గుచ్చి అడిగాడు. పాండవుల బుద్ధిశక్తితోపాటు ఆత్మశక్తికూడ శ్రీకృష్ణుడే. అతడి మాటను వారందరు శిరసా వహిస్తారు. అర్జునుడు ధర్మజుడి తమ్ముడు. అన్న మాట దాటని వాడు. వాసుదేవుడిమాట దైవాజ్ఞగా భావించేవాడు. అందువలన శ్రీకృష్ణుడి అభిప్రాయాన్ని ధృతరాష్ట్రు డడిగాడు. అతడి మాటలలో అతడి హృదయం ప్రతిఫలిస్తుందా? అని ప్రత్యేకించి అడగటం ధృతరాష్ట్రుడి నైజం. తాను మనసుకూ, మాటకూ పొంతన లేనివాడు కావటంచేత లోకమంతా తన వలెనే ఉంటుందని భావిస్తాడు. ఏమైనా ధృతరాష్ట్రుడికి శ్రీకృష్ణుడి రాజనీతిజ్ఞతమీద గౌరవ ప్రపత్తులకన్నా భయసందేహాలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తుంది. (సంపా.)

ఉ. **'తానును సత్యభామయును ద్రౌపదియున్ నరుఁడున్ రహస్యగో**
ష్ఠీ నిరతాత్ముఁడై సుతులుఁ జేరని చెందని యట్టిచోటఁ గాం
తానివహంబు గొల్వఁ బ్రమదస్థితి నుండియుఁ, బిల్వఁబంచె న
న్నా నలినోదరుండు; హృదయంబున నీ దెస కూర్మియెట్టిదో? **120**

ప్రతిపదార్థం: ఆ నలిన+ఉదరుండు= ఆ పద్మనాభుడు- శ్రీకృష్ణుడు; తానును; సత్యభామయునున్; ద్రౌపదియున్; నరుఁడున్= అర్జునుడూ; రహస్య గోష్ఠీ నిరత+ఆత్ముఁడు+ఐ= రహస్య సంభాషణలో ఆసక్తిగల మనస్సు కలవాడయి; సుతులున్= కొడుకులు కూడా; చేరని చెందని+అట్టి చోటన్= దగ్గరకు రానటువంటి చోట; కాంతా నివహంబు= భార్యల సమూహం; కొల్వన్= సేవిస్తూండగా; ప్రమద స్థితిన్+ఉండియున్= ఆనందస్థితిలో ఉండి కూడా; నన్నున్; పిల్వన్+పంచెన్= పిలిపించాడు; హృదయంబునన్= అతడి హృదయంలో; నీ దెస కూర్మి= నీ మీది ప్రేమ; ఎట్టిదో= ఎటువంటిదో (ఎంత గొప్పదో).

తాత్పర్యం: 'ఆ శ్రీకృష్ణుడూ తనూ, సత్యభామా, ద్రౌపదీ, అర్జునుడూ రహస్య సంభాషణలు గావించే కోరిక కలవాడై కొడుకులు కూడా సమీపించని చోట, భార్యలు కొలుస్తూండగా, ఆనందంగా ఉండి కూడా నన్ను పిలిపించాడు. ఆతడి హృదయంలో నీమీద ఎంత ప్రేమో!

విశేషం: శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడిమీద గల అపారమైన ఆదరగౌరవాలను అతడి దూతను గౌరవించటం ద్వారా ప్రకటించాడు. అంతఃపురంలో కాంతలతో, అర్జునుడితో కలిసి ముచ్చటలాడుతున్న రహస్య సమావేశమది. కొడుకులకే అందులోనికి ప్రవేశం లేదు. కాని, సంజయుడికి దర్శన మిచ్చాడు. అది తన మీది అభిమానం కాదనీ, ధృతరాష్ట్రుడి మీది ప్రేమ అనీ సంజయుడు వ్యాఖ్యానించాడు. శ్రీకృష్ణుడి వర్తనం రెండంచులున్న కత్తి వంటిది. తేనె పూసిన కత్తివలె ధృతరాష్ట్రుడు రాయబారం పంపాడు. శ్రీకృష్ణుడు కూడా దానికి ప్రతిగా వ్యవహరించాడు. శ్రీకృష్ణుడు తనమీద ప్రేమాదరాలు ప్రదర్శించాడంటే నమ్మేంత అమాయకుడు కాడు ధృతరాష్ట్రుడు. అయినా లోకమర్యాద ననుసరించి శ్రీకృష్ణుడి నీతివర్తనం పరమోదారం. (సంపా.)

వ. ఏనును దత్ప్రకారంబు పణిహారుల వలన మున్న యెఱింగిన వాఁడ నగుటం జేసి కంచుకంబును, శిరోవేష్టనంబును ధరియించి వినీత వేషుండనై పోవునప్పుడు కృష్ణార్జును లనేక మణిమయ భూషణ ప్రభా భాసితులై యొక్కసెజ్జన యున్నవారు; కృష్ణుండు పవ్వళించి యుండి, చాఁచిన చరణంబులు దొడలపై నిడికొని యర్జునుండు గూర్చున్నవాఁడు; సత్యభామయుం బాంచాలియుం గద్దియలపై నున్నవారు; సవినయంబుగా నేనును దండప్రణామంబు సేసిన నన్నాదరించి, కృష్ణుని చేసన్న నర్జును పసుపునం గనక రత్నమయంబగు నతని పాదపీఠం బతండు ద్రేల్చిన కాళ్ళు దిగిచికొని; నిద్దఱు ముద్దియ లెత్తి తెచ్చి నాకుం బెట్టిన, నేనును దానిం గరతలంబున నంటుచు ధరణీతలంబునఁ గూర్చుండి, కేలు మొగిడ్చి ఫాలతలంబునం గదియించి, నీలవర్ణులు బాహుబల మద భరితులును నయి యేనుఁగు దోయియుంబోలె నున్న యమ్మాధవధనంజయులఁ జూచునప్పుడు నాకు హర్షాశ్రు పులకలును, దదనంతరంబ భయంబునుం బుట్టె; నట్టియెడ. 121

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; తద్+ప్రకారంబు= ఆవిధం; పణిహారుల వలనన్= ద్వారపాలకుల వలన; మున్ను+అ= ముందే; ఎఱింగిన వాఁడన్+అగుటన్+చేసి= ఎరిగినవాడనవటం చేత; కంచుకంబును= చొక్కానూ; శిరోవేష్టనంబును= తలపాగానూ; ధరియించి; వినీత వేషుండను+ఐ= పెద్ద మనిషి తరహా వేషం కలవాడినయి; పోవు+అప్పుడు= వెళ్ళేసరికి; కృష్ణ+ అర్జునులు; అనేక మణిమయ భూషణ ప్రభా భాసితులు+ఐ= పెక్కు మణులతో నిర్మించబడిన అలంకారాల కాంతులచేత ప్రకాశించిన వారై; ఒక్క సెజ్జన్+అ= ఏకశయ్యయందే; ఉన్నవారు; కృష్ణుండు; పవ్వళించి+ఉండి= పరుండి; చాఁచిన చరణంబులన్= చాచిన పాదాలను; తొడలపైన్+ఇడికొని= తొడలమీద పెట్టుకొని; అర్జునుండు, కూర్చున్నవాఁడు; సత్యభామయున్; పాంచాలియున్= ద్రౌపదీ; గద్దియలపైన్= పీఠాలమీద; ఉన్నవారు; ఏనును; సవినయంబుగాన్= అడకువతో; దండ ప్రణామంబు+చేసినన్=

సాష్టాంగ నమస్కారం చేయగా; నన్నున్+ఆదరించి= నన్ను సంభావించి; కృష్ణుని చేసన్నన్= కృష్ణుడి చేతి సంజ్ఞతో; అర్జును పనుపునన్= అర్జునుడి ఆజ్ఞచొప్పున; కనక రత్న మయంబు+అగు+అతని పాదపీఠంబు= బంగారుతోనూ; మణులతోనూ చేయబడినదైన అతడి పాదపీఠం; అతండు వ్రేల్చిన కాళ్ళు+తిగిచికొనన్= అతడు పెట్టుకున్న కాళ్ళు తీసికొనగా; ఇద్దఱు ముద్దియలు= ఇద్దరు స్త్రీలు; ఎత్తి; తెచ్చి; నాకున్; పెట్టినన్; నేనును; దానిన్; కరతలంబునన్= చేతితో; అంటుచున్= తాకుతూ; ధరణీ తలంబునన్= నేల మీద; కూర్చుండి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; ఫాల తలంబునన్= నుదుటిమీద; కదియించి= పెట్టి; నీల వర్ణులున్= నల్లని మేని చాయగలవారూ; బాహు బల మద భరితులును= భుజపరాక్రమమనే మదంతో కూడినవారూ; అయి, ఏనుఁగు దోయియున్+పోలెన్= ఏనుగుల జంటా అన్నట్లుగా; ఉన్న, ఆ+మాధవ ధనంజయులన్= ఆ కృష్ణార్జునులను; చూచు+అప్పుడు= చూసేటప్పుడు; నాకున్; హర్ష+అశ్రు పులకలును= సంతోష బాష్పాలూ, గగుర్పాటూ; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; భయంబునున్; పుట్టెన్= కలిగింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: నేనూ వాళ్ళున్న విధం ద్వారపాలకుల చేత ముందే తెలిసినవాడిని కావడం చేత, చొక్కా, తలపాగా ధరించి పెద్ద మనిషి తరహా వేషంతో వెళ్ళినపుడు కృష్ణార్జునులు పెక్కు మణులు పొదిగిన అలంకారాల కాంతులతో మెరిసిపోతూ ఒక్క శయ్యపైనే ఉన్నారు. కృష్ణుడు పరుండి చాచుకొన్న పాదాలను తన తొడలపై పెట్టుకొని అర్జునుడు కూర్చున్నాడు. సత్యభామా, ద్రౌపదీ పీఠాలపై ఆసీనలయ్యారు. నేను సవినయంగా సాష్టాంగ నమస్కారం చేయగా కృష్ణుడు నన్ను ఆదరించాడు. బంగారంతోనూ, మణులతోనూ, చేసిన పాదపీఠంపై తను పెట్టుకొన్న కాళ్ళు తీసివేయగా, కృష్ణుడి చేతి సంజ్ఞతోనూ, అర్జునుడి ఆజ్ఞ చొప్పునా, ఇద్దరు స్త్రీలు దానిని తెచ్చి నాకు వేయగా, నేను దానిని చేతితో తాకి, నేలపైన కూర్చుండి చేతులు జోడించి నుదుటిపై పెట్టి, నల్లని మేనిచాయ కలిగి, భుజ పరాక్రమ గర్వితులై ఏనుగుల జంటవలె ఉన్న ఆ కృష్ణార్జునులను చూస్తుంటే నాకు ఆనందంతో కళ్ళు చెమర్చాయి, ఒళ్ళు పులకించింది. ఆ తరువాత భయం కూడా వేసింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. శ్రీకృష్ణుడి మందిర సన్నివేశంలో ఒక దివ్య వాతావరణాన్ని సంజయుడు దర్శించాడు. వాసుదేవుడు నారాయణుడు. అర్జునుడు పాద సంవాహన రూపమైన సేవాభక్తిని ప్రదర్శిస్తున్న భాగవతోత్తముడు. వారిద్దరు ఒకే శయ్యమీద ఉన్నారు. అది వారి అభేద ప్రవృత్తికి నిదర్శనం. సత్యభామా ద్రౌపదులు వేరే గద్దెలపై కూర్చొని ఉన్నారు. వారు మధుర ముగ్ధ భక్తిభావాలకు ప్రతీకలు. పరమాత్మను సేవించే మూడు రకాల భక్తుల ముప్పేట దృశ్యమది. శ్రీకృష్ణుడికి సంజయుడు దండప్రణామం చేశాడు. అది ఎంతటి రాచరికపు మర్యాదో, అంతటి భక్తి మర్యాద. సంజయుడు దూతగానే కాక, భక్తుడుగా నమస్కరించాడు. అందుకే తనకు రత్న సింహాసనం చూపించినా వద్దని నేలమీద కూర్చున్నాడు. నెన్నుదురును నేలకు తాకించి నమస్కరించాడు. ఏన్గుల జంటవలె ఉన్న నరనారాయణులను చూచి పులకించాడు, ఆనందాశ్రువులను రాల్చాడు. అది భక్తి తన్మయభావానికి ప్రతీక. భక్తిభావం తరువాత భయభావం కలగటం విశేషం. ఇది రసధ్వని. భక్తుడుగా చూచినప్పుడు ఆనందం కలిగింది. ఆ స్థితి నుండి లౌకిక స్థాయికి వచ్చి దూతగా చూచినప్పుడు భయం కలిగింది. ధృతరాష్ట్రుడి సందేశం ఋజుమార్గాన సాగేది కాదు. వాసుదేవుడి ముందు తాను ప్రదర్శించబోయే వక్రనీతికి అతడి అంతరాత్మ భయభావాన్ని ప్రదర్శించింది. తన అనుభవాన్ని దాచుకొనకుండ చెప్పుతున్న సంజయుడి నిజాయితీ ఇందులో స్పష్టం. (సంపా.)

2. 'ఏనుఁగు దోయియిం బోలె నున్న యమ్మాధవధనంజయులన్' - అలంకారం ఉపమ. వాళ్లిద్దరూ ఏనుగులవలె తోచటం చేత 'భయం'.

క. 'ఈ యిరువురుఁ బంచిన పని। సేయుదురట! ధర్మజునకుఁ జేకుఱని తలం
పేయది? యతనిం దొడరుట। వేయేటికి జముని శిరము వ్రేయుట గాదే?' **122**

ప్రతిపదార్థం: ఈ+ఇరువురున్= ఈ ఇద్దరూ కృష్ణార్జునులు; పంచిన పని+చేయుదురు+అటె= ధర్మరాజు చెప్పినపని చేస్తారట!; ధర్మజునకున్= ధర్మరాజుకి; చేకుఱని తలంపు+ఏ+అది= నెరవేరని కోరిక ఇక ఏముంటుంది?; వేయి+ఏటికిన్= వేయి మాట లెందుకు?; అతనిన్+తొడరుట= ఆ ధర్మరాజును ఎదిరించటం; జముని శిరము వ్రేయుట+కాదే= యమధర్మరాజు శిరస్సును తెగవేయటమే కాదా?

తాత్పర్యం: 'ఈ కృష్ణార్జునులిద్దరూ తాను ఏ పనిచెప్పితే ఆ పని చేస్తారట! ఇంక ధర్మరాజుకు నెరవేరని కోరికంటూ ఏముంటుంది? వేయిమాట లెందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే, అతడిని యుద్ధంలో ఎదిరించడం అంటే, యమధర్మరాజు శిరస్సును తెగవేయటమే కాదా?

విశేషం: అలం: నిదర్శన. సాక్షాత్తూ యమధర్మరాజు తల తెగెయ్యటం ఎవరికైనా ఎంత అసాధ్యమో, ధర్మరాజును యుద్ధంలో ఎదిరించటం అంత అసాధ్యం అని భావం. 'అతనిం దొడరుట .... జముని శిరము వ్రేయుట గాదే' - ఉపమాన వాక్యార్థానికీ (జముని శిరము వ్రేయుట), ఉపమేయ వాక్యార్థానికీ (అతనిం దొడరుట) అభేదం చెప్పబడటం చేత అలంకారం నిదర్శన.

వ. అని తలంచుచుండ, నమ్మహానుభావులు నన్ను సంభావించి, తా రుపయోగించునట్టి యన్నపానంబులను, దమకుఁగట్టఁదగినట్టి వస్త్రంబులను, దాము దొడుగునట్టి భూషణంబులను నాకుఁ బ్రియంబొనర్చి గారవించిరి, నేనును నా పోయిన కార్యంబు విన్నవించిన; విజయుండు బలుమొగంబుతో దానికి నుత్తరంబు వలుకం దొడంగిన వారించి వారిజోదరుం డిట్లనియె: 123

ప్రతిపదార్థం: అని; తలంచుచున్+ఉండన్= అనుకుంటూంటే; ఆ+మహానుభావులు= ఆ మహాత్ములు; నన్నున్; సంభావించి= ఆదరించి; తారు= తాము; ఉపయోగించు+అట్టి+అన్నపానంబులను= ఉపయోగించే అన్నపానాలనూ; తమకున్+కట్టన్+తగిన+అట్టి వస్త్రంబులను= తాము కట్టదగిన వస్త్రాలనూ; తాము; తొడుగు+అట్టి భూషణంబులను= ధరించే అలంకారాలూ; నాకున్; ప్రియంబు+ఒనర్చి= ప్రీతితో ఇచ్చి; గారవించిరి= గౌరవించారు; నేనును; నా పోయిన కార్యంబు= నేను వెళ్ళిన పని; విన్నవించినన్= మనవి చేయగా; విజయుండు= అర్జునుడు; బలు మొగంబుతోన్= తీక్ష్ణమైన ముఖంతో; దానికిన్; ఉత్తరంబు= సమాధానం; పలుకన్+తొడంగినన్= చెప్పబూనగా; వారిజ+ఉదరుండు= పద్మనాభుడు- శ్రీకృష్ణుడు; వారించి= ఆపి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అనుకుంటూంటే, ఆ మహాత్ములు నన్ను ఆదరించి తాముపయోగించే అన్నపానాలు, తాము కట్టదగిన వస్త్రాలూ, తాము ధరించే ఆభరణాలూ నాకు ప్రీతితో సమర్పించి గౌరవించారు. నేను వెళ్ళిన పని మనవి చేశాను. అప్పుడు అర్జునుడు తీక్ష్ణమైన ముఖంతో దానికి సమాధానం చెప్పబోతూ ఉంటే కృష్ణుడు ఆపి ఇట్లా అన్నాడు:

సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుండు సెప్పినమాట లెఱింగించుట (సం. 5-58-18)

తే. 'వినుము సంజయ! ధృతరాష్ట్ర విభుని పెద్ద । కొలువునందుఁ దత్పుత్త్రులు, గురుఁడుఁ, గృపుఁడు,
నాపగానందనుఁడు మొదలైన సకల । జనులు వినుచుండఁగా నిట్టు లనుము నీవు. 124

ప్రతిపదార్థం: సంజయ!= సంజయా!; వినుము; ధృతరాష్ట్ర విభుని పెద్ద కొలువునందున్= ధృతరాష్ట్ర మహారాజు నిండుసభలో; తద్+పుత్రులున్= అతడి కొడుకులూ; గురుఁడున్= ద్రోణుడూ; కృపుఁడున్; ఆపగానందనుఁడున్= నదీసుతుడూ- భీష్ముడూ; మొదలు+ఐన= ఆదిగాగల; సకల జనులున్= ఎల్లరూ; వినుచున్+ఉండఁగాన్= వింటూండగా; నీవు; ఇట్టులు+అనుము.

తాత్పర్యం: సంజయా! వినుము. ధృతరాష్ట్ర మహారాజు నిండుసభలో అతడి కొడుకులూ, ద్రోణుడూ, కృపుడూ, భీష్ముడూ మొదలుగాగల వాళ్ళందరూ వింటూండగా నీవు ఇట్లా అనుము.

ఆ. అయ్యజాతశత్రుఁ డలుగుట నీళ్ళుల । నగ్ని పుట్టినట్టి దయ్యెః మీకు
నార్ప వెరవు లేదు; నేర్పుమై నింకఁ గా । వింపవలయు పనులు వినుఁడు మీరు. **125**

ప్రతిపదార్థం: ఆ+అజాతశత్రుఁడు= ఆ ధర్మరాజు; అలుగుట= కోపం వహించటం; నీళ్ళులన్= నీళ్ళల్లో; అగ్ని= నిప్పు; పుట్టిన+అట్టిది+అయ్యెన్= పుట్టటంవంటిది; మీకున్; ఆర్పన్= ఆర్పటానికి; వెరవు= ఉపాయం; లేదు; ఇంకన్= ఇకమీదట; నేర్పుమైన్= నేర్పుతో; కావింపవలయు పనులు= చేయవలసిన పనులు; మీరు; వినుఁడు= వినండి.

తాత్పర్యం: ఆ అజాతశత్రుడికి కోపం రావటం అంటే, నీళ్ళల్లో నిప్పు పుట్టటం వంటిది. దానిని ఆర్పటానికి మీకు ఉపాయం లేదు. ఇక మీదట నేర్పుతో మీరు చేయవలసిన పనులు వినండి.

విశేషం: అలం: నిదర్శన, పరికరాంకురం. 'అయ్యజాతశత్రుఁ డలుగుట నీళ్ళుల - నగ్ని పుట్టినట్టిది' - ఉపమాన వాక్యానికీ (నీళ్ళుల నగ్ని పుట్టుట); ఉపమేయ వాక్యానికీ (అయ్యజాతశత్రుఁ డలుగుట) ఐక్యారోపణం- అభేదం - చెప్పబడింది కాబట్టి అలంకారం నిదర్శన. నీళ్ళల్లో అగ్ని పుట్టడం ఎలాంటి వైపరీత్యమో, అజాతశత్రుడికి (శత్రువులే లేనివాడికి) కోపం రావటం అటువంటి వైపరీత్యమని భావం. 'ధర్మరాజు' శబ్దానికి 'అజాతశత్రు'డనే శబ్దం సాభిప్రాయంగా వాడబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. అవి యెవ్వి యంటేని. **126**

తాత్పర్యం: అంటే మీరు చేయవలసిన పనులు ఏవి అంటావేమో.

సీ. కలయట్టి వివిధార్థములు నశేషంబుగఁ । దగ నొసంగుండు సత్పాత్రములకుఁ,
జెలులఁ జుట్టముల నాశ్రితులను రావించి । సత్కరింపుఁడు సంతసం బెలర్ప,
నిచ్ఛానుగుణముల నింద్రియసుఖముల । ననుభవింపుఁడు హృదయంబు లలర,
నాండ్రను బిడ్డల నయ్యై విధంబుల । గారవింపుఁడు ప్రియపూరితముగ

తే. మఱియు నెవ్వరి చిత్త మెత్తెఱఁగునందు । వాటమైయుండు నది యెల్ల వలయునట్లు
సేసి విహరింపుఁ; డిం కెడ సేయ కనికి । నడవుఁ డఱచేతఁ బ్రాణంబు లిడి కడంగి. **127**

ప్రతిపదార్థం: కల+అట్టి= ఉన్నట్టి; వివిధ+అర్థములున్= రకరకాల వస్తువులూ; అశేషంబుగన్= నిశ్శేషంగా- సంపూర్ణంగా; సత్+పాత్రములకున్= మంచి యోగ్యులైనవారికి; తగన్= ఒప్పుగా; ఒసంగుండు= ఇచ్చివేయండి; చెలులన్= స్నేహితులను; చుట్టములన్= బంధువులను; ఆశ్రితులను= ఆశ్రయించుకొన్న వాళ్ళనూ; రావించి= రప్పించి; సంతసంబు+ఎలర్పన్= సంతోషం అతిశయించగా; సత్కరింపుఁడు= సమ్మానించండి; ఇచ్ఛా+అనుగుణములన్= కోరికకు అనుకూలమైన వాటిని;

ఇంద్రియ సుఖములన్= ఇంద్రియ సౌఖ్యాలను; హృదయంబులు+అలరన్= హృదయాలు ఆనందించగా; అనుభవింపుడు; ఆండ్రను= భార్యలనూ; బిడ్డలన్= బిడ్డలనూ; ఆ+ఆ విధంబులన్= ఆయా విధాలుగా; ప్రియ పూరితముగన్= ప్రీతి నిండేటట్లు; గారవింపుఁడు= ఆదరించండి; మఱియున్= ఇంకా; ఎవ్వరి చిత్తము= ఎవరి మనస్సు; ఏ+తెఱఁగు+అందున్= ఏ రీతిలో; వాటము+ఐ+ఉండున్= సక్తమై ఉంటుందో-తగిలి ఉంటుందో; అది+ఎల్లన్= అదంతా; వలయు+అట్లు+చేసి విహరింపుఁడు= కావలసిన విధంగా చేసి స్వేచ్ఛగా సంచరించండి; ఇంకన్; ఎడ+చేయక= ఆలస్యం చేయక; అఱచేతన్= అరచేతిలో; ప్రాణంబులు+ఇడి= ప్రాణాలు పెట్టుకొని; కడంగి= పూని; అనికిన్= యుద్ధానికి; నడవుఁడు= నడవండి.

తాత్పర్యం: ఉన్న వస్తువులన్నీ యోగ్యులైనవాళ్ళకు ఒప్పుగా పంచిపెట్టండి. స్నేహితులనూ, చుట్టాలనూ, ఆశ్రితులనూ రప్పించి సంతోషం అతిశయించగా సమ్మానించండి. మీ కోరికలకు అనుకూలంగా హృదయాలు ఆనందించేటట్లు ఇంద్రియసుఖాలు అనుభవించండి. మీ భార్యల్నీ, బిడ్డల్నీ ఎవరికి ఏ విధం తగుతుందో ఆ విధంగా ప్రీతి నిండేటట్టు ఆదరించండి. ఇంకా- ఎవరి మనస్సు ఏ రీతియందు తగిలి ఉంటుందో అదంతా కావలసినవిధంగా స్వేచ్ఛగా చేసి సంచరించండి. ఇంక ఆలస్యం చేయకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని యుద్ధానికి బయల్దేరండి.

విశేషం: కృష్ణు డిట్లా చెప్పడం యుద్ధంలో కౌరవులకు చావు తప్పదనే ఉద్దేశంతో చేయవలసినవీ, అనుభవించవలసినవీ ఇప్పుడే-బ్రతికుండగానే చేసికొనండి అని హెచ్చరిస్తున్నారు.

వ. అని చెప్పు; మింత యేమిటి కంటేని. 128

తాత్పర్యం: ఇదంతా ఎందుకు చెపుతున్నావంటావేమో.

ఉ. ఎందును నెవ్వరుం బడని యెంతయుఁ గష్టముపాటు వచ్చినం
గొందల మంది పాండువిభుకోడలు దవ్వుల నున్న నన్ను 'గో
విందుఁడ ! కావు' మంచుఁ బలవించుట యీఁగఁగరాని యప్పుఁ బో
లెం దలపోయ వ్రేగయి చలింపకయున్నది యెప్పుడున్ మదిన్. 129

ప్రతిపదార్థం: పాండువిభు కోడలు= పాండురాజు కోడలు- ద్రౌపది; ఎందునున్= ఎక్కడా; ఎవ్వరున్= ఎవ్వరూ; పడని= అనుభవించని; ఎంతయున్+కష్టము, పాటు, వచ్చినన్= ఎంతో కష్టం వస్తే; కొందలము+అంది= దుఃఖించి; దవ్వులన్+ఉన్న నన్నున్= దూరంగా ఉన్న నన్ను; గోవిందుఁడ!= కృష్ణా!; కావుము= రక్షించుము; అంచున్= అంటూ; పలవించుట= ఏడవటం; ఈఁగఁగన్+రాని+అప్పున్+పోలెన్= తీర్చరాని అప్పువలె; తలపోయన్= చింతించగా; వ్రేఁగు+అయి= బరువై; మదిన్= మనస్సులో; ఎప్పుడున్= నిరంతరమూ; చలింపక+ఉన్నది= నిలిచి ఉన్నది.

తాత్పర్యం: పాండురాజు కోడలు - ద్రౌపది ఎప్పుడూ ఎవరూ పడని ఎంతో కష్టం వస్తే, దుఃఖించి, ఎక్కడో దూరంగా ఉన్న నన్ను 'గోవిందా! రక్షించుము' అంటూ ఏడవటం తీర్చలేని అప్పువలె - ఆలోచించగా బరువై నా మనస్సులో ఎప్పుడూ నిలిచి ఉన్నది.

విశేషం: యుద్ధంలో కౌరవులు నశించినప్పుడే ఆ అప్పు తీరుతుంది అని కృష్ణుడి అభిప్రాయం.

తే. **ఇట్టి యేఁ దేరు గడపంగ, నెందు నుతికి । నెక్కు గాండీవ మేడ్తెఱ నెక్కు వెట్టి**
రెండు దొనలను బూని కిరీటి యనికి । వచ్చు నేఁ డెల్లి; యెందుఁ బోవచ్చు మీకు?' **130**

ప్రతిపదార్థం: ఇట్టి+ఏన్= ద్రౌపదికి ఋణగ్రస్తుడనై ఉన్న నేను; తేరు+కడపంగన్= రథం తోలగా; ఎందున్= ఎక్కడా; నుతికిన్ ఎక్కు గాండీవము= పొగడ్తకెక్కు గాండీవం; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఎక్కు+పెట్టి= సజ్యం చేసి- నారి తొడిగి; రెండు దొనలను= రెండు అమ్ముల పొదులను; పూని= ధరించి; కిరీటి= అర్జునుడు; నేఁడు+ఎల్లి= ఈవేళ రేపట్లో; అనికిన్= యుద్ధానికి; వచ్చున్; మీకున్; ఎందున్+పోన్+వచ్చున్?= ఎక్కడకు తప్పించుకొని పోవీలౌతుంది? (కాదని భావం).

తాత్పర్యం: ద్రౌపదికి అప్పుపడి ఉన్న నేను రథం తోలగా, పొగడ్త కెక్కిన గాండీవాన్ని పరాక్రమంతో ఎక్కుపెట్టి రెండు అంపపొదులను ధరించి అర్జునుడు ఈవేళ రేపట్లో యుద్ధానికి వస్తాడు. ఇక మీరు ఎక్కడికి పోతారు?'

విశేషం: శ్రీకృష్ణుడి మనోగతమైన భావం ఈ తేటగీతిలో తేటతెల్లమవుతున్నది. ద్రౌపదికి శ్రీకృష్ణుడు పడిన అప్పును తీర్చికొనటానికే శ్రీకృష్ణుడు పార్థసారథిగా పూనుకొంటాడు. రథస్థుడైన అర్జునుడు గాండీవ పరాక్రమాన్ని ప్రదర్శిస్తాడు. ఇక కౌరవులు తప్పించుకొనే అవకాశం లేదు అని హెచ్చరించాడు. (సంపా.)

వ. **అని పలుకునప్పటి వారి యెత్తికోలును, నీ కొడుకు నిలుపోపమియునుం దలంచి భయం బందితి; నితండు వారల నెఱుంగండు; భీష్మద్రోణుల ప్రాపును, గర్ణు గర్వంబును దన్ను గెలిపించునని నచ్చి తొడరెడు' ననిన విని ధృతరాష్ట్రుం 'డర్జునుం డేమనియె?' నని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె:** **131**

ప్రతిపదార్థం: అని పలుకు+అప్పటి వారి+ఎత్తికోలును= అని పలికేటప్పటి వారి పూనికా (కోరికా); నీ కొడుకు నిలుపు+ ఓపమియునున్= నీ కొడుకు దుర్యోధనుడు (వాళ్ళకు ఇవ్వవలసిందేదో) విడవలేకపోవటమూ; తలంచి; భయంబు+అందితిన్= భయపడ్డాను; ఇతండు= దుర్యోధనుడు; వారలన్= పాండవులను; ఎఱుంగండు; భీష్మ ద్రోణుల ప్రాపును= భీష్మద్రోణుల అండా; కర్ణు గర్వంబును= కర్ణుడి గర్వమూ; తన్నున్+గెలిపించున్+అని నచ్చి తొడరెడున్= తనను గెలిపిస్తాయని నమ్మి ఎదిరిస్తాడు; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; అర్జునుండు; ఏమి+అనియెన్; అని; అడిగినన్; అతనికిన్; సంజయుండు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: అని పలికేటప్పటి వారి పూనికా, నీ కొడుకు వాళ్ళకివ్వవలసింది ఇవ్వలేకపోవటమూ తలచుకొని నేను భయపడ్డాను. ఇతడికి వాళ్ళ సంగతి తెలియదు. భీష్మద్రోణుల అండా, కర్ణుడి గర్వమూ తనను గెలిపిస్తాయనే ధీమాతో ఎదిరిస్తాడు' అనగా, ధృతరాష్ట్రుడు విని 'అర్జును డేమన్నాడు?' అని అడుగగా అతడికి సంజయుడు ఇట్లా అన్నాడు:

విశేషం: శ్రీకృష్ణుడు పార్థసారథిగా యుద్ధంలో పాల్గొంటానని చెప్పి శత్రు సంహారం చేసేది అర్జునుడే అని ధ్వనింపజేశాడు. అందువలన అర్జునుడి అభిప్రాయాన్ని ధృతరాష్ట్రుడు తెలిసికొనగోరాడు. అర్జునుడు శ్రీకృష్ణుడికి అంగమా? ధర్మరాజుకు అంగమా? అనే అనుమానం కలిగి ఉండవచ్చును. ఏమైనా పాండవ పక్షంలో పార్థుడి అభిప్రాయానికి బలమున్నదని భావించి ధృతరాష్ట్రుడు అడిగాడు. (సంపా.)

సంజయుఁడు ధృతరాష్ట్రున కర్జునుఁడు చెప్పిన మాట లెఱింగించుట (సం. 5-47-6)

క. 'నరుఁ డలుక వొడమియును సు । స్థిరుఁడై, తన యెఱ్ఱ సెరల చెలువునఁ గెందా
మరలం దెగడెడు కన్నుల । నరుణచ్ఛవి నెఱయ నిట్టు లనియె నరేంద్రా! 132

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా, ధృతరాష్ట్రా!; నరుఁడు= అర్జునుడు+పొడమియును= కోపం వచ్చినా; సుస్థిరుఁడు+ఐ= చలించని వాడయి; తన+ఎఱ్ఱ సెరల చెలువునన్= తన కళ్ళల్లోని జీరల కాంతితో; కెంపు+తామరలన్= ఎఱ్ఱ తామరలను; తెగడెడు కన్నులన్= తిరస్కరించే కన్నులలో; అరుణ+ఛవి= ఎఱ్ఱని కాంతి; నెఱయన్= నిండగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! కోపం వచ్చినా అర్జునుడు చలించక, తన కళ్ళల్లోని ఎఱ్ఱటి జీరల కాంతి చేత ఎఱ్ఱ తామరలను తిరస్కరించే కళ్ళల్లో ఎఱ్ఱటి కాంతి నిండగా ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడి కళ్ళల్లో ఎఱ్ఱటి జీరలుండటం చేత వాటి కాంతిచే అవి ఎఱ్ఱ తామరలవలె ఉన్నాయి. వాటిలో ఎఱ్ఱటి కాంతి నిండటం కోపాతిశయంచేత.

ఆ. 'ఆ సుయోధనుండు, నతనికిఁ దోడ్పడ । నరుగుదెంచినట్టి ధరణినాథ
చయము వినుచునుండ సంజయ ! నా వచ । నములు గాఁగ ని ట్లనంగవలయు. 133

ప్రతిపదార్థం: సంజయ!= సంజయుడా!; ఆ సుయోధనుండున్= ఆ దుర్యోధనుడూ; అతనికిన్; తోడ్పడన్+అరుగుదెంచిన+అట్టి= సాయపడటానికి వచ్చినట్టి; ధరణినాథ చయమున్= రాజుల సమూహమూ; వినుచున్+ఉండన్= వింటూండగా; నా వచనములు+కాఁగన్= నా మాటలుగా; ఇట్లు+అనంగన్ వలయున్= ఇట్లా చెప్పాలి.

తాత్పర్యం: 'సంజయా! ఆ దుర్యోధనుడూ, అతడికి సాయపడటానికి వచ్చిన రాజుల సమూహమూ వింటూండగా నా మాటలుగా నీవు ఇట్లా అనాలి.

ఉ. పాండుని యగ్రనందనుఁడు పా లడుగం దగ నీఁడయేని, మా
కొం డన నేల? మే లది; సుయోధనుఁ డింతకుమున్ను పెక్కు లు
ద్దండతఁ దాను జేసిన విధంబుల కెల్ల మెఱుంగు వెట్టిన
ట్లుండెడుఁ గాక, యేనును వృకోదరుఁడుం బ్రియమందునట్లుగన్. 134

ప్రతిపదార్థం: పాండుని+అగ్ర నందనుఁడు= పాండురాజు పెద్ద కొడుకు ధర్మరాజు; పాలు+అడుగన్= భాగం ఇమ్మంటే; తగన్= ఒప్పుగా; ఈఁడు+అ+ఏనిన్= ఇవ్వకపోతే; మాకున్; ఒండు+అనన్+ఏల= ఇంకో మాట అనటం ఎందుకు?; అది; మేలు= మంచిది; ఇంతకున్+మున్ను= ఇదివరకు; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఉద్దండతన్= తెగువతో; తాను; చేసిన పెక్కులు విధంబులకున్+ఎల్లన్= చేసిన ఎన్నో వాటికన్నిటికీ; ఏనును= నేనూ; వృక+ఉదరుఁడున్= భీముడూ (తోడేలు పొట్టవంటి పొట్టగలవాడు); ప్రియము+అందు+అట్లుగన్= సంతోషిస్తూండగా; మెఱుంగు+పెట్టిన+అట్లు+ఉండెడున్+కాక= మెరుగుపెట్టినట్లుగా ఉంటుందిలే.

తాత్పర్యం: ధర్మరాజు భాగం ఇమ్మని అడిగితే ఒప్పుగా ఇవ్వకపోతే, మేము ఇంకో మాట అనటం ఎందుకు? అది మంచిది. ఇంతకు ముందు దుర్యోధనుడు మహాగర్వంతో చేసిన ఎన్నో పనుల కన్నింటికీ - నేనూ భీముడూ సంతోషించేటట్టుగా మెరుగుపెట్టినట్లు ఉంటుందిలే.

విశేషం: 'ఇంతకు మున్ను .... మెఱుంగు వెట్టి నట్లుండెడుఁగాక' - ఇంతకు ముందు దుర్యోధనుడు మాకెన్నో అపకారాలు చేశాడు. అవి మా ప్రతీకారానికి చాలనివైతే; ఇప్పుడు ధర్మరాజు కోరినట్లుగా భాగం ఇవ్వకపోవడం వాటికి తోడై, మా ప్రతీకారానికి తగినవౌతాయని భావం.

క. మా యిరువురతోఁ గయ్యము । సేయ నతం డియ్యకొనిన, సిద్ధించెన కా
దే యుచితచరితుఁ డగు కౌం । తేయాగ్రజు కార్య; మట్టి తెఱఁగొప్పుఁ గదా! 135

ప్రతిపదార్థం: మా+ఇరువురతోన్= మా ఇద్దరితో-నాతోనూ; భీముడితోనూ; కయ్యము+చేయన్= యుద్ధం చేయడానికి; అతండు= దుర్యోధనుడు; ఇయ్యకొనినన్= అంగీకరిస్తే; ఉచిత చరితుఁడు+అగు కౌంతేయ+అగ్రజు కార్యము= మంచినడవడి కల ధర్మరాజు పని; సిద్ధించెన్+అ+కాదే= ఫలించినట్లే కాదా?; అట్టి తెఱఁగు= అటువంటి విధం; ఒప్పున్+కదా!= మంచిది కదా!

తాత్పర్యం: దుర్యోధనుడు నాతోనూ, భీముడితోనూ యుద్ధం చేయటానికి అంగీకరిస్తే, ఇంక మాకు కావలసిందేమిటి? ధర్మరాజు అనుకున్నపని నెరవేరినట్లే! అట్లా అయితే మంచిదే కదా!

విశేషం: దుర్యోధనాదులను ప్రతిఘటించటంలో భీమార్జునుల సంఘటిత శక్తిని ప్రస్తావించటం ప్రకరణౌచిత్యం. వ్యంగ్యంగా ధర్మజ నాయకత్వాన్ని అర్జునుడు సమర్థించటం సూక్ష్మాంశం. (సంపా.)

క. వనవాసంబున భూశ । య్యను ధర్మజుఁ డున్నయట్టి యాయాసము వో
వునె, యంపశయ్య దుర్యో । ధనుఁడు రణక్షోణిఁ బడక తక్కిన యేనిన్? 136

ప్రతిపదార్థం: దుర్యోధనుఁడు; రణ క్షోణిన్= యుద్ధభూమిలో; అమ్ము+శయ్య= అమ్ముల సెజ్జ మీద; పడక తక్కిన+ఏనిన్= పడకుండా ఉన్నట్లయితే; ధర్మజుఁడు= ధర్మరాజు; వన వాసంబునన్= అరణ్యవాసంలో; భూశయ్యను= నేలే పాన్పుగా; ఉన్న+అట్టి+ఆయాసము= ఉన్న కష్టం; పోవునె?= పోతుందా?

తాత్పర్యం: దుర్యోధనుడు యుద్ధభూమిలో అమ్ముల పాన్పు మీద పడకుండా ఉంటే, ధర్మరాజు వనవాస సమయంలో నేలమీదే పరుండి పడ్డ ఆయాసం పోతుందా?

విశేషం: దుర్యోధనుడు రణరంగంలో అంపశయ్యమీద పడటం అనేది ధ్వనిమయమైన ఆలంకారికోక్తి. ధర్మరాజు వనవాసంలో నేలమీద పడుకొని ఎంత బాధపడ్డాడో ఆ ఆయాసం దుర్యోధనుడికి అంపశయ్యపై శయనించినప్పుడు తెలియాలి. నేలమీద పడుకొన్న ధర్మజుడి దుఃఖం తాత్కాలికం. కాని, దుర్యోధనుడి అంపశయ్య మరణశయ్యయే ఔతుందని ధ్వని. (సంపా.)

ఉ. సూనృత మూఁది బన్నములు సూడక లోన నడంచినట్టి కో
పానల మెండియున్న నిబిడాటవిపైఁ బచరించు తీవ్ర దా

వానలుఁ బోలి శాత్రవచయంబుపయిం గవియించి నిల్చినం
గాని యుధిష్ఠిరున్ సరకుగాఁ గొన రా ధృతరాష్ట్రనందనుల్. 137

ప్రతిపదార్థం: సూనృతము+ఊఁది= సత్యాన్ని పట్టుకొని; బన్నములు+చూడక= కష్టాలు లెక్కచేయక; లోనన్= లోపల; అడంచిన+అట్టి= అణచిపెట్టినట్టి; కోప+అనలము= కోపం అనే అగ్ని; ఎండి+ఉన్న నిబిడ+అటవిపైన్= ఎండిపోయి ఉన్న దట్టమైన అడవి మీద; పచరించు= వ్యాపించే; తీవ్ర దావ+అనలున్+పోలి= దారుణమైన కార్చిచ్చువలె; శాత్రవ చయంబుపయిన్= విరోధి వర్గం మీద; కవియించి= వ్యాపింపజేసి; నిల్చినన్+కాని= నిలిస్తేనేకాని; ఆ ధృతరాష్ట్ర నందనుల్= ఆ ధృతరాష్ట్రుడి కొడుకులు- కౌరవులు; యుధిష్ఠిరున్= ధర్మరాజును; సరకుగాన్+కొనరు= లక్ష్యపెట్టరు.

తాత్పర్యం: సత్యాన్నే పట్టుకొని, కష్టాలను పరిగణించక, లోపలే అణచుకొన్న కోపాగ్నిని ఎండిపోయి ఉన్న దట్టమైన అడవిమీదకు ప్రసరించే దారుణమైన కార్చిచ్చువలె - శత్రు సమూహంపైకి వ్యాపింప జేస్తేనే కాని ధృతరాష్ట్రుడి కొడుకులు యుధిష్ఠిరుడిని లెక్కచేయరు.

విశేషం: 'లోన నడంచినట్టి కోపాగ్ని... గవియించి' .....అలంకారం ఉపమ. కోపాగ్ని....కోపమనే అగ్ని....రూపకం. రూపకానుప్రాణితమైన ఉపమ. 'యుధిష్ఠిరున్' ఇక్కడ ధర్మరాజుకు యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది. కాబట్టి అలంకారం పరికరాంకురం.

మ. గద సారించుచు నంత్యకాల విచలత్కాలాకృతిన్ భీముఁ డు
న్మద మాతంగచయంబు నుగ్గుగ, లసన్నానా రథవ్రాతముల్
చదియన్, భూరి హయవ్రజంబు పొడిగా సంరంభతుంగాంగుఁడై
కదియం జూచి బలే! సుయోధనుఁడు భాగం బిచ్చు రాజ్యంబునన్. 138

ప్రతిపదార్థం: భీముఁడు; అంత్య కాల విచలత్ కాల+ఆకృతిన్= ప్రళయ సమయంలో విశేషంగా చలించే యముడివలె; గదసారించుచున్= గద త్రిప్పుతూ; ఉన్మద మాతంగ చయంబు= మిక్కిలి మదించిన ఏనుగుల గుంపు; నుగ్గుగన్= ముక్కలు కాగా; లసత్+నానా రథ వ్రాతముల్= ఒప్పుతూన్న అనేక రథాల సమూహాలు; చదియన్= నలిగిపోగా; భూరి హయ వ్రజంబు= అధికమైన గుర్రాల సమూహం; పొడి+కాన్= పొడికాగా; సంరంభ తుంగ+అంగుఁడు+ఐ= ఉద్రేకం చేత ఎత్తయిన శరీరం కలవాడై; కదియన్= సమీపించగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; చూచి; రాజ్యంబునన్= రాజ్యంలో; భాగంబు+ ఇచ్చున్ బలే!= భాగం ఇస్తాడు సుమీ!

తాత్పర్యం: భీముడు ప్రళయకాలంలో విశేషంగా చలించే యముడివలె గద త్రిప్పుతూ, మదించిన ఏనుగుల సమూహం ముక్కలు ముక్కలు కాగా, ఒప్పే పెక్కు రథాల సమూహాలు నలిగిపోగా, అధికమైన గుర్రాల సమూహం పొడియైపోగా; ఉద్రేకంతో పెరిగిన శరీరం కలవాడై సమీపించటం చూచి దుర్యోధనుడు రాజ్యంలో భాగం ఇస్తాడు సుమీ!

విశేషం: 'అంత్యకాల విచలత్కాలాకృతిన్' - అలంకారం ఉపమ. 'ఆకృతి' శబ్దం ఇక్కడ ఇవార్థకం - ఉపమా వాచకం.

సీ. **కోల్పులి వీఁకమై గొదగొని లేళ్లకు । నుఱుకు తెఱంగునఁ దటియఁ జొచ్చి,**
పెనుగాలి జీమూత బృందంబుపైఁ బెట్టి । దంబుగ వీఁచుచందమున నడరి,
కసి మసంగిన మారి గడఁగి జీవులమీఁద । నుగ్రతఁ గవియున ట్లురవడించి,
యాఁకొన్న లయరుద్రుఁ డాగ్రహంబున జగ । త్ప్రచయంబు ముట్టెడు భంగిఁ బొదివి.

తే. **నకులుఁడును, దదనుజుఁడు, సాత్యకియు, నా సు । భద్ర కొడుకును నెదిరిన బలము నెల్ల**
బెదరఁ, జెదర, బడల్పడఁ, బెల్లు సావఁ । జేయఁగని కౌరవులు సంధి సేయువారు. **139**

ప్రతిపదార్థం: కోల్పులి= పెద్దపులి; వీఁకమైన్= పరాక్రమంతో; గొదగొని= ఆకలిగొని; లేళ్లకున్= లేళ్లకై; ఉఱుకు తెఱంగునన్= ఉరికే విధంగా; తటియన్+చొచ్చి= తాకి; పెనుగాలి= పెద్దగాలి; జీమూత బృందంబుపైన్= మేఘాల సమూహం మీద; బెట్టిదంబుగన్= భయంకరంగా; వీచు చందమునన్= వీచే విధంగా; అడరి= విజృంభించి; కవిసి- కసి మసంగిన మారి= రెచ్చిపోయిన మృత్యుదేవత; కడఁగి= పూని; జీవుల మీఁదన్= ప్రాణులపై; ఉగ్రతన్= భయంకరత్వంతో; కవియు+అట్లు= పడే విధంగా; ఉరవడించి= విజృంభించి; ఆఁకొన్న= ఆకలిగొన్న; లయ రుద్రుఁడు= ప్రళయకాల రుద్రుడు; ఆగ్రహంబునన్= కోపంతో; జగత్+ప్రచయంబున్= లోకాల సమూహాన్ని; ముట్టెడు భంగిన్= ఆక్రమించే విధంగా; పొదివి= మార్కొని; నకులుఁడును+తద్+అనుజుఁడున్= నకులుడూ, అతడి తమ్ముడు సహదేవుడూ; సాత్యకియున్; ఆ సుభద్ర కొడుకును= ఆ సుభద్ర కొడుకైన అభిమన్యుడూ; ఎదిరిన బలమున్+ఎల్లన్= ఎదుర్కొనిన సైన్యాన్ని అంతనూ; బెదరన్= భయపడేటట్లుగాను; చెదరన్= చెల్లాచెదరయి పోయేటట్లుగాను; బడల్పడన్= చీకాకుపడేటట్లుగాను; పెల్లు+చావన్= ఎక్కువగా చచ్చేటట్లుగాను; చేయన్= చేయగా; కని= చూచి; కౌరవులు; సంధి+చేయువారు= సంధి చేస్తారు.

తాత్పర్యం: బెబ్బులి ఆకలిగొని పరాక్రమంతో క్రౌర్యంతో లేళ్ళమీదికి ఉరికే విధంగా తాకీ, పెద్ద గాలి మేఘసమూహంపై భయంకరంగా వీచే విధంగా కవిసీ, రెచ్చిపోయిన మృత్యుదేవత పూని ప్రాణులపై క్రూరంగా పడే విధంగా విజృంభించీ, ఆకలిగొన్న ప్రళయ సమయ రుద్రుడు ఆగ్రహంతో లోకాల సమూహాన్ని ఆక్రమించే విధంగా మార్కొనీ, నకులుడూ, సహదేవుడూ, సాత్యకీ, అభిమన్యుడూ తమ్మెదుర్కొన్న శత్రుబలమంతా బెదిరిపోయేటట్లూ, చెల్లాచెదరయిపోయేటట్లూ; చీకాకు పడేటట్లూ, పెక్కుమంది చచ్చేటట్లు చేస్తే చూచి కౌరవులు సంధి చేస్తారు.

విశేషం: అలం: ఉపమ. సీసపద్యంలోని ఒక్కొక్క పాదాన్ని తేటగీతిలోని ఒక్కొక్క వీరుడితో సమన్వయిస్తే బాగుంటుంది. కోల్పులి లేళ్ల మీదకు ఉరికేటట్లు నకులుడు శత్రుసైన్యాన్ని బెదరగొట్టితేనూ, పెనుగాలి మేఘాల్ని తరిమేటట్లు సహదేవుడు శత్రు బలాన్ని బెదరగొట్టితేనూ, రెచ్చిపోయిన మృత్యువు జీవులపై పడే విధంగా సాత్యకి వైరి సేనను చీకాకు పరిస్తేనూ, ఆకొన్న ప్రళయకాల రుద్రుడు లోకాలను ఆక్రమించే విధంగా అభిమన్యుడు విరోధి సైన్యాన్ని చంపితేనూ- ఇట్లా సమన్వయించడానికి అవకాశం ఉన్నది. అప్పుడు అలంకారం యథాసంఖ్యం- తదనుప్రాణితమైన ఉపమ. పద్యంలో ఒక్కొక్క ఉపమానాన్నీ, ఒక్కొక్కవీరుడినీ, అతడు చేసే పనినీ విడివిడిగా చెప్పటంచేత ఈ రీతి సమన్వయం సముచితమేమో అనే ఊహ వచ్చింది.

ఉ. **చిత్తము లుల్లసిల్ల, నల సింహకిశోరము లొక్కమై మదో**
న్మత్త గజావళిం బొదువుమాడ్కి నరాతి బలంబు ముట్టి, యు
ద్వృత్తిఁ గడంగి యప్రతిమవీరులు ద్రౌపదిపుత్త్రులేవురున్
నెత్తురు నీరఁ దేల్చిన ననిం గని మీ నృపుఁ డల్క దీఱెడిన్. **140**

ప్రతిపదార్థం: అప్రతిమ వీరులు ద్రౌపది పుత్రులు+ఏవురున్= సాటిలేని పరాక్రమవంతులైన ద్రౌపది కొడుకులు (ఉపపాండవులు) అయిదుగురూ; చిత్తములు= మనస్సులు; ఉల్లసిల్లన్= సంతోషించగా; అల= ఆ; సింహ కిశోరములు= సింగపు కొదమలు; ఒక్కమైన్= ఒక్క పెట్టున; మద+ఉన్మత్త గజ+ఆవళిన్= మదంచేత మిక్కిలి పొగరెక్కిన ఏనుగుల వరసను; పొదువు మాడ్కిన్= ఆక్రమించే విధంగా; అరాతి బలంబున్= శత్రుసైన్యాన్ని; ముట్టి= తాకి; ఉద్వృత్తిన్= గర్వంతో; కడంగి= పూని; నెత్తురు నీరన్= రక్తం అనే జలంలో; తేల్చినన్= తేలిస్తే; అనిన్= యుద్ధాన్ని; కని= చూసి; మీ నృపుఁడు= మీ రాజు - దుర్యోధనుడు; అల్క+తీఱెడిన్= కోపం వీడుతాడు.

తాత్పర్యం: సాటిలేని పరాక్రమవంతులైన ఉపపాండవు లైదుగురూ మనస్సులు సంతోషించగా సింగపు కొదమలు ఒక్క పెట్టున మదించిన ఏనుగుల గుంపులను ఆక్రమించే విధంగా శత్రుసైన్యాన్ని ఆక్రమించి నెత్తురు అనే నీటిలో తేలిస్తే, ఆ యుద్ధాన్ని చూసి మీ రాజు - దుర్యోధనుడు శాంతిస్తాడు.

విశేషం: అలం: ఉపమ. నెత్తురు నీరన్ అనే చోట రూపకం. 'చిత్తము లుల్లసిల్లన్' అనేదానిని ఉపమేయోపమానాలు రెండింటితోనూ ద్రౌపది పుత్త్రులు చిత్తము లుల్లసిల్లన్ సింహ కిశోరములు చిత్తము లుల్లసిల్లన్ అనే రీతిగా అన్వయించవచ్చును.

మ. చెలులుం జుట్టలు నిష్టభృత్యులు మహాజిం బ్రాణముల్ డాఁప కు
జ్జ్వలులై తో నడవన్, విరాటుఁడును బాంచాలుండు నేపారి సే
నల యుద్రేకము రౌద్రముం బెనుప, నానా హేతి ఘోరంబుగాఁ
దలపడ్డం గని గాక; స్రుక్కుదురె గాంధారీసుతుల్ మాటలన్? 141

ప్రతిపదార్థం: చెలులున్= స్నేహితులూ; చుట్టలున్= చుట్టాలూ; ఇష్టభృత్యులున్= ఇష్టులైన సేవకులూ; మహా+ఆజిన్= గొప్ప యుద్ధంలో; ప్రాణముల్; డాఁపక= దాచుకోకుండా; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించేవారై; తోన్= కూడా; నడవన్= నడవగారాగా; విరాటుఁడును; పాంచాలుండున్= ద్రుపదుడూ; ఏపు+ఆరి= విజృంభించి; సేనల= సేనల యొక్క; ఉద్రేకమున్= విజృంభణమూ; రౌద్రమున్= కోపమూ; పెనుపన్= వృద్ధి పొందించగా; నానా హేతి ఘోరంబు+కాన్= పెక్కు ఆయుధాల చేత భయంకరమైనదికాగా; కని కాక= చూసికాని; గాంధారీ సుతుల్= గాంధారి కొడుకులు - కౌరవులు; మాటలన్= మాటలచేత; స్రుక్కుదురె= వెనుకకు తగ్గుతారా?

తాత్పర్యం: స్నేహితులూ, చుట్టాలూ, ఇష్టసేవకులూ మహాయుద్ధంలో ప్రాణాలు దాచుకోకుండా ప్రకాశిస్తూ వెంట రాగా విరాటుడూ, ద్రుపదుడూ విజృంభించి సేనల విజృంభణమూ, రౌద్రమూ వృద్ధిపొందిస్తూ, అనేకాయుధాలతో భయంకరంగా మార్కొనడం చూచికాని కౌరవులు మాటలచేత వెనుకకు తగ్గుతారా?

చ. తఱిమి శిఖండి తన్నొరులు దాఁకఁగ నెవ్వరి దిక్కుఁజూడ కే
డ్తెఱఁ దనపూన్కిపై మనము ధీరత నిల్పి, రథంబు బల్విడిం
బఱపి, కురుక్షితీశుఁడను బ్రహ్మకు వేయును నిండ భీష్ముపై
కుఱికినఁ గాక, మాకు సగ మూరక యిత్తురె మీరు మేదినిన్? 142

ప్రతిపదార్థం: శిఖండి; తన్నున్; ఒరులు= శత్రువులు; తాఁకఁగన్= ముట్టగా; ఎవ్వరి దిక్కున్+చూడక= ఎవరివైపూ చూడక; తఱిమి= కవిసి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; తన పూన్కి పైన్= తన పనిమీద; మనము= మనస్సు; ధీరతన్= ధైర్యంతో; నిల్పి;

రథంబున్; బల్విడిన్= వేగంగా; పఱపి= పోనిచ్చి; కురుక్షితి+ఈశుఁడు+అను బ్రహ్మకున్= కురురాజు - దుర్యోధనుడు అనే బ్రహ్మకు; వేయును నిండన్= వేయేళ్ళు నిండగా- మరణించగా; భీష్మపైన్= భీష్ముడి మీదకు; ఉఱికినన్+కాక= ఉరికితేనే కాని; మాకున్; మీరు; మేదినిన్= భూమిలో- రాజ్యంలో; సగము; ఊరక+ఇత్తురె?= ఊరికే ఇస్తారా?

తాత్పర్యం: తనను శత్రువులు ముట్టగా శిఖండి ఎవరివైపూ చూడక కవిసి పరాక్రమంతో తన పనిమీదే మనస్సు ధైర్యంతో నిలిపి, రథం వేగంగా పోనిచ్చి, కురురాజు (దుర్యోధనుడు) అనే బ్రహ్మకు వెయ్యేళ్ళూ నిండగా- మరణించగా- భీష్ముడి మీదకు ఉరికితేనే కాని మాకు మీరు రాజ్యంలో సగం ఊరికే ఇస్తారా?

విశేషం: కురుక్షితీశుఁ డను బ్రహ్మకు- అలంకారం రూపకం, శిఖండి - పూర్వజన్మలో అంబ. భీష్ముడు తనను నిరాకరించాడనే కోపంతో అతడిని సాధించాలని తపస్సు చేసింది. తరువాత జన్మలో ఆమె ద్రుపదుడికి కూతురై పుడుతుంది. కాని, తల్లిదండ్రు లామెను పురుషుడుగానే పెంచి, హేమవర్మ కూతురుతో వివాహం చేస్తారు. తన అల్లుడు పురుషుడు కాడని తెలిసి హేమవర్మ ద్రుపదుడిపై దండెత్తుతాడు. శిఖండి స్థూలకర్ణుడనే యక్షుడి అరణ్యంలో ప్రాయోపవేశం చేస్తూండగా, స్థూలకర్ణుడామె వృత్తాంతం విని తన పురుషత్వం ఆమెకిచ్చి, ఆమె స్త్రీత్వం తాను గ్రహిస్తాడు. శిఖండి భారత యుద్ధంలో పాండవుల పక్షంలో ఉంటాడు. షండులతోనూ, స్త్రీలతోనూ యుద్ధం చేయనని భీష్ముడి ప్రతిజ్ఞ. ఆ విషయం తెలిసికొని పాండవులు భీష్ముడితో యుద్ధం చేయుమని శిఖండిని నియోగిస్తారు. భీష్ముడు శిఖండిని చూడగానే అస్త్రసన్న్యాసం చేస్తాడు.

శా. విద్యుద్దండము నిల్చిపొల్చినగతిన్ విల్లందమైయుండ న
స్మ ద్యోధావలి మానసంబున రణోత్సాహంబు రెట్టింప ధృ
ష్టద్యుమ్నుండు గడంగి ద్రోణుఁ గడిమిన్ డాయంగ, వీక్షించి కా
కుద్యోగించుట కేల తక్కుదురు మీ రుగ్రాహవక్రీడకున్? 143

ప్రతిపదార్థం: విద్యుత్+దండము= మెఱపు దండం; నిల్చి; పొల్చిన గతిన్= ఒప్పిన విధంగా; విల్లు, అందము+ఐ+ఉండన్= అందంగా ఉండగా; అస్మద్+యోధ+ఆవలీ మానసంబునన్= మా వీరుల వరుస యొక్క మనస్సులో; రణ+ఉత్సాహంబు= యుద్ధోత్సాహం; రెట్టింపన్= ఇనుమడించగా; ధృష్టద్యుమ్నుండు= ద్రుపద పుత్రుడు; కడంగి= పూని; ద్రోణున్= ద్రోణుడిని; కడిమిన్= పరాక్రమంతో; డాయంగన్= సమీపించగా; వీక్షించికాక= చూచికాని; మీరు; ఉగ్ర+ఆహవ క్రీడకున్= భయంకరమైన యుద్ధం అనే ఆటకు; ఉద్యోగించుటకున్= పూనుటకు; ఏల తక్కుదురు?= ఎందుకు విరమిస్తారు?

తాత్పర్యం: విద్యుద్దండంవలె విల్లు అందగించగా, మా యోధుల మనస్సులలో యుద్ధోత్సాహం ఇనుమడించగా, ధృష్టద్యుమ్నుడు పూని ద్రోణుడిని పరాక్రమంతో సమీపించగా చూచికాని మీరు భయంకర యుద్ధక్రీడకు పూనుకొనటం ఎందుకు విరమిస్తారు?

విశేషం: విద్యుద్దండము నిల్చిపొల్చినగతిన్ విల్లందమైయుండ - అలంకారం ఉపమ. విద్యుద్దండం మెరిసి ఇట్టే అదృశ్యమవుతుంది. అది క్షణప్రభ. అందుచేతనే 'నిల్చి' అనటం. ధృష్టద్యుమ్నుడు ద్రుపదుడి కొడుకు. ద్రోణుడు తనను అవమానించటం చేత, అతడిని చంపగల కొడుకు కొరకు ద్రుపదుడు పుత్రేష్టి చేస్తాడు. ధృష్టద్యుమ్నుడూ, ద్రౌపదీ యజ్ఞకుండంలోంచి పుట్టుతారు. ధృష్టద్యుమ్నుడు పాండవుల పక్షంలో ఉండి కౌరవులతో పోరాడతాడు. అతడు ద్రోణుడిని చంపలేదు కాని, చనిపోయిన ద్రోణుడి శిరస్సు ఖండిస్తాడు. ఆ కోపంతో ద్రోణ పుత్రుడైన అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడిని రాత్రి శిబిరంలో నిద్రపోతూండగా ఆకస్మికంగా మీదబడి వధిస్తాడు.

సీ. గాండీవ గుణ రవం బొండొండ చెలఁగంగ, । శరపరంపర లాకసంబు గప్పఁ,
బ్రతి విశిఖములు ఖండితములై రాలంగ, । నెదిరి సైన్యంబుల మదగజాది
చతురంగములును జర్జరితంబులై యవ । యవ భేద మెఱుఁగని యట్లు గాఁగఁ
దునిసిన, నెత్తురు నెనడును నెమ్ములు । నెఱచియుఁ గండలు నెనసి సమర

తే. తలము ఘోరంబుగాఁ, గపిధ్వజము, ధవళ । హరులు శోభిల్ల, నొగలపై హరి యెలర్ప,
దేవదత్తంబు మ్రోయఁ దోఁతెంచునట్టి । రథముఁ గని కాని కానఁడు రాజరాజు. 144

ప్రతిపదార్థం: గాండీవ గుణ రవంబు= గాండీవమనే వింటి యొక్క అల్లెత్రాటి ధ్వని; ఒండు+ఒండు+అ= క్రమక్రమంగా; చెలఁగంగన్= మ్రోయగా; శరపరంపరలు= బాణాల వరుసలు; ఆకసంబు+కప్పన్= ఆకాశాన్ని కప్పివేయగా; ప్రతి విశిఖంబులు= ఎదిరి బాణాలు- శత్రువుల బాణాలు; ఖండితములు+ఐ= ముక్కలయి; రాలంగన్= రాలిపోగా; ఎదిరి సైన్యంబులన్= శత్రుసేనల యందలి; మద గజ+ఆది చతురంగములును= మదించిన ఏనుగులు మున్నగు నాలుగు యుద్ధాంగాలూ- రథ, గజ, తురగ, పదాతులు; జర్జరితంబులు+ఐ= తూంట్లు పడినవయి; అవయవ భేదము+ఎఱుఁగని+అట్లు+కాఁగన్= అవయవాల తేడా ఎరగని విధంగా; తునిసినన్= ముక్కలయిపోగా; నెత్తురున్+నెనడునున్= రక్తమూ, ఎముకలలోని క్రొవ్వూ(మూలుగ); ఎమ్ములున్= ఎముకలూ; ఎఱచియున్= మాంసమూ; కండలున్; ఎనసి= కలిసి; సమరతలము= యుద్ధభూమి; ఘోరంబు+కాన్= భయంకరం కాగా; కపి ధ్వజమున్; ధవళ హరులున్= శ్వేతాశ్వాలూ; శోభిల్లన్= ప్రకాశించగా; నొగలపైన్= బండికాడికట్టుకఱ్ఱలపై- తొట్టెలో; హరి= కృష్ణుడు; ఎలర్పన్= ఒప్పగా; దేవదత్తంబు మ్రోయన్= దేవదత్తమనే శంఖం మ్రోయగా; తోఁతెంచు+అట్టి= కనబడే; రథమున్+కని కాని= రథాన్ని చూచికాని; రాజరాజు= దుర్యోధనుడు; కానఁడు= చూడడు- తెలిసికొనడు.

తాత్పర్యం: గాండీవమనే వింటి అల్లెత్రాటి ధ్వని క్రమక్రమంగా మ్రోయటమూ, బాణాల సమూహాలు ఆకాశాన్ని కప్పివేయటమూ, శత్రువుల బాణాలు ముక్కలై రాలటమూ, శత్రు సేనలలోని మత్తేభాలు మొదలుగాగల చతురంగ బలాలూ తూంట్లు పడినవై, ఇది ఈ అవయవం అనే వైనం తెలియకుండేటట్లు ముక్కలైపోగా, రక్తంతోనూ, మజ్జతోనూ, ఎముకలతోనూ, మాంసంతోనూ, కండలతోనూ కూడి యుద్ధభూమి భయంకరం కావటమూ, కపిధ్వజమూ, తెల్లగుర్రాలూ ఒప్పగా, తొట్టెలో హరి ఒప్పగా, దేవదత్తమనే శంఖం మ్రోయగా కనబడే రథం చూచికాని రాజరాజు- దుర్యోధనుడు కానలేడు.

విశేషం: అలం: పర్యాయోక్తం. ఈ విషయం మాటాడుతూన్నవాడు అర్జునుడు. అతడు తన పేరు చెప్పకుండా, విన్నవాళ్లకు అర్జునుడని స్ఫురించే విధంగా మాటాడింపజేశాడు కవి. కపిధ్వజమూ, ధవళ హరులూ, తొట్టెలో హరీ, దేవదత్తము - ఇవి ఆ రథం అర్జునుడిదని స్ఫురింపజేస్తున్నాయి. ఇది పర్యాయోక్తమనే అలంకారం. భంగ్యంతరం చేత గమ్యార్థసిద్ధి జరగటం పర్యాయోక్తం.

శా. బాలక్రీడ మహాసురప్రకరమున్ భంజింపఁడే? యెప్పుడుం
ద్రైలోక్యంబును భక్తియుక్తిఁ దగ నారాధింపదే? యట్టి శౌ
ర్యాలంకారు మహాత్ముఁ దా సరకుసేయం డచ్యుతున్! మ మ్మతం
డేలా కైకొను? నా సుయోధనునియం దెగ్గేది యూహింపఁగన్? 145

ప్రతిపదార్థం: బాలక్రీడన్= పిల్లాటయందు; మహా+అసుర ప్రకరమున్= గొప్ప రాక్షసుల సమూహాన్ని; భంజింపఁడే?= చంపడా? ఎప్పుడున్= నిత్యమూ; త్రైలోక్యంబును= మూడు లోకాల సమూహమూ; భక్తి యుక్తిన్= భక్తితో; తగన్= ఒప్పుగా; ఆరాధింపదే?= పూజింపదా?; అట్టి శౌర్య+అలంకారున్= అటువంటి పరాక్రమం అలంకారంగా కలవాడిని, మహాత్మున్= మహానుభావుడిని, అచ్యుతున్= కృష్ణుడిని; తాన్= తాను - దుర్యోధనుడు; సరకు+చేయండు= లక్ష్యపెట్టడు; అతండు= దుర్యోధనుడు; మమ్మున్; ఏలా= ఎందుకు; కైకొనున్?= లక్ష్యపెడతాడు?; ఊహింపఁగన్= ఆలోచింపగా, ఆ సుయోధనునియందున్= ఆ దుర్యోధనుడిలో; ఎగ్గు+ఏది?= దోషమేది- అపరాధ మేముంది?

తాత్పర్యం: పిల్లాటయందు ఘోర రాక్షసుల సమూహాన్ని చంపడా? నిత్యమూ మూడులోకాలూ భక్తితో ఒప్పుగా పూజింపవా? అటువంటి పరాక్రమం అలంకారంగా కలవాడూ, మహాత్ముడూ అయిన కృష్ణుడిని తను లెక్కచేయడు! ఇంక అతడు మమ్మల్ని ఎందుకు లెక్కచేస్తాడు? ఆలోచిస్తే ఆ దుర్యోధనుడిలో తప్పేముంది?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. శౌర్యాలంకారుడూ, మహాత్ముడూ అయిన కృష్ణుడినే లెక్కచేయని దుర్యోధనుడు మమ్మల్ని లెక్క చేయకపోవటం దోషం కాదు- సహజమే అని భావం. 'తా సరకు సేయం డచ్యుతున్ మమ్మతండేలా కైకొను?' అచ్యుతుడినే సరకుసేయనివాడు మమ్మల్ని సరకు సేయడని వేరే చెప్పాలా? అని కైముత్యం చేత అర్థ సంసిద్ధి జరుగుతోంది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

వ. ఏము పితామహ గురు కృపాచార్యులకు నమస్కరించి, యస్మదీయ రాజ్యభాగంబునకై తొడరి కయ్యంబు సేయువారము; కౌరవులకుంబూని యెవ్వరేమాతోఁబెనంగినను వారి శస్త్రాస్త్రంబులు ధర్మప్రతిహతంబులగునని తలంచెదము; పండ్రెండు వత్సరంబులు వనంబున నమ్మెయి నిడుమలం బడి, జనపదంబునం బదుమూఁడగునేఁ డజ్ఞాతవాసాయాసం బట్లనుభవించి వచ్చి, మా తండ్రి పాలికినై పెనం గు మమ్ము నింద్రాది సుర సహాయులయ్యును ధార్తరాష్ట్రులు గెల్చువారైరేని ధర్మంబుకంటె నధర్మము బలవంతం బైనయదియగు; నింతియకాని మా చేయునట్టిది గీ డైనదిగా; దేము వాసుదేవుని మున్నిడుకొని నడతుము గావున, నీ యుద్ధంబునం జయంబు మాకు సిద్ధంబ; యెల్ల భంగులం గర్ణ సహితంబుగా గాంధారీనందనులం దునిమి యేము భూమి గొనుట దప్పదు; 'గాండీవంబు దివియకయును గుడుసువడియెడు; బాణంబులు దమయంతన తూణీరంబుల వెడలెడుఁ; దోలూడ్చు మహానాగంబునుంబోలెఁ గరవాలంబు దాన యొఱవెలికి నిగుడుచున్నయది గావున, మా కవశ్యంబును సంగరంబు సంభవించుఁ; బాశుపతాది దివ్యశరంబులం గురుపక్ష ప్రజాక్షయంబు సేసి శాంతిం బొందెదము; సూతనందనా! నీవు సుస్థిరుండవై యింతయుం దెలియం బలుకవలయు; నిమ్మాటలు విని కురువృద్ధుండగు బాహ్లికుండును, బితామహుండగు భీష్ముండును, గురుం డగు కుంభసంభవుండును, శిక్షకుండగు కృపాచార్యుండును, గురుపుత్రుండగు నశ్వత్థామయు, సద్బుద్ధి యగు విదురుండును, ధర్మాచరణకల్యుండగు శల్యుండును నెయ్యది నిశ్చయించి పలికి రది యయ్యెడు; సుయోధనాదు లాయుష్మంతు లగువారకాక! యని పలికె.' నని చెప్పిన విని మందాకినీనందనుం డందఱు విన దుర్యోధనున కి ట్లనియె: **146**

ప్రతిపదార్థం: ఏము= మేము; పితామహ గురు కృపాచార్యులకున్= భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపాచార్యుడికీ; నమస్కరించి; అస్మదీయ రాజ్య భాగంబునకై= మా రాజ్యభాగం కొరకు; తొడరి= పూని; కయ్యంబు+చేయువారము= యుద్ధం చేస్తాం;

కౌరవులకున్+పూని= కౌరవులకొరకై యత్నించి; ఎవ్వరేన్= ఎవరైనా; మాతోన్; పెనంగినను= యుద్ధం చేస్తే; వారి శస్త్ర+అస్త్రంబులు; ధర్మ ప్రతిహతంబులు+అగున్+అని తలంచెదము= ధర్మం చేత దెబ్బ కొట్టబడినవి అవుతాయని భావిస్తాం; పంౘ్రెండు వత్సరంబులు= పన్నెండేళ్ళు; వనంబునన్= అడవిలో; ఆ+మెయిన్= ఆ విధంగా; ఇడుమలన్+పడి= కష్టా లనుభవించి; జనపదంబునన్= దేశంలో; పదుమూఁడగు+ఏఁడు= పదమూడోయేడు; అజ్ఞాతవాస+ఆయాసంబు+అట్లు+అనుభవించి వచ్చి= అజ్ఞాతవాస కష్టం ఆ విధంగా అనుభవించి వచ్చి; మా తండ్రి పాలికినై= మా తండ్రి వాటా కొరకు; పెనంగు మమ్మున్= పోరాడే మమ్మల్ని; ఇంద్ర+ఆది సుర సహాయులు+అయ్యును= ఇంద్రుడు మొదలగు దేవతలు తోడుగా గలవారయినా; ధార్తరాష్ట్రులు= కౌరవులు; గెల్చువారు+ఐరి+ఏనిన్= గెలిస్తే; ధర్మంబు కంటెన్; అధర్మంబు; బలవంతంబు ఐన+అది+అగున్= బలవత్తరం అవుతుంది; ఇంతియకాని= ఇంతేకాని; మా చేయు+అట్టిది= మేము చేసేది; కీడు+ఐనది+కాదు= తప్పుకాదు; ఏము; వాసుదేవునిన్= కృష్ణుడిని; మున్ను+ఇడికొని= ముందు పెట్టుకొని; నడతుము; కావునన్; ఈ యుద్ధంబునన్, జయంబు; మాకున్; సిద్ధంబు+అ= సిద్ధమే; ఎల్లభంగులన్= అన్ని విధాలా; కర్ణ సహితంబుగాన్= కర్ణుడితో కూడా; గాంధారీ నందనులన్= గాంధారి కొడుకులను-కౌరవులను; తునిమి= వధించి; ఏము= మేము; భూమి+కొనుట; తప్పదు; గాండీవంబు; తివియకయును= లాగకుండానే; గుడుసు+పడియెడున్= గుండ్రంగా చుట్టుకుంటున్నది; బాణంబులు; తమ+అంతన్+అ= తమకు తామే; తూణీరంబులన్+వెడలెడున్= అమ్ముల పొదులలోనుండి వెలువడుతున్నాయి; తోలు+ఊడ్చు మహత్ నాగంబునున్+పోలెన్= కుబుసం విడిచిపెట్టే పెద్ద పాములె; కరవాలంబు= కత్తి; ఒఱ వెలికిన్= ఒరబయటికి; నిగుడుచున్+ఉన్న+అది= వస్తున్నది; కావునన్; మాకున్; అవశ్యంబును= తప్పక; సంగరంబు= యుద్ధం; సంభవించున్= కలుగుతుంది; పాశుపత+ఆది దివ్య శరంబులన్= పాశుపతం మొదలైన దేవతా సంబంధ్యస్త్రాలతో; కురు పక్ష ప్రజా క్షయంబు+చేసి= కౌరవుల పక్షంలో ఉన్న జనుల నాశనం చేసి; శాంతిన్+పొందెదము= శాంతిస్తాం; సూత నందనా!= సంజయా!; నీవు; సుస్థిరుండవు+ఐ= నిలకడగలవాడవై-జంకులేనివాడవయి; ఇంతయున్= ఇదంతా; తెలియన్+పలుకవలయున్= తెలపాలి; ఈ+మాటలు; విని; కురు వృద్ధుండు+అగు బాహ్లికుండును= కురు వంశంలో పెద్దవాడైన బాహ్లికుడూ; పితామహుండు+అగు భీష్ముండును= తాత అయిన భీష్ముడూ; గురుండు+అగు కుంభసంభవుండును= ద్రోణుడూ; శిక్షకుండు+అగు కృపాచార్యుండును= ఆచార్యుడైన కృపుడూ; గురు పుత్త్రుండు+అగు+అశ్వత్థామయున్= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామా; సత్+బుద్ధి+అగు విదురుండును= బుద్ధిమంతుడైన విదురుడూ; ధర్మ+ఆచరణ కల్యుండు+అగు శల్యుండును= ధర్మం ఆచరించటంలో సమర్థుడైన శల్యుడూ; ఎయ్యది= ఏది; నిశ్చయించి= నిర్ణయించి; పలికిరి; అది; అయ్యెడున్; సుయోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలగువారు; ఆయుష్మంతులు+ అగు వారు+అ కాక= ఆయువు కలవాళ్ళు అవుతారు కాక; అని; పలికెన్; అని; చెప్పినన్; విని; మందాకినీ నందనుండు= గంగాసుతుడు- భీష్ముడు; అందఱున్; వినన్; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మేము భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ నమస్కరించి, మా రాజ్యభాగానికై పూని యుద్ధం చేస్తాం. కౌరవుల కొరకు ఎవరైనా మాతో యుద్ధం చేసినా, వారి శస్త్రాలూ, అస్త్రాలూ ధర్మంచేత నిరోధించబడతాయని భావిస్తాం. పన్నెండేళ్ళు అడవిలో అలా కష్టా లనుభవించి, గ్రామంలో పదమూడోయేడు అజ్ఞాతవాస కష్టం అట్లా అనుభవించి వచ్చి, మా తండ్రి వాటా కొరకు పోరే మమ్ములను, ఇంద్రాది దేవతలు తోడు వచ్చినా కౌరవులు గెలిస్తే, ధర్మం కంటె అధర్మం బలవత్తరం అన్నమాట. ఇంతేకాని మేము చేసేది తప్పు కాదు. మేము కృష్ణుడిని ముందు పెట్టుకొని నడుస్తాం కాబట్టి ఈ యుద్ధంలో గెలుపు మాదే, అన్ని విధాల కర్ణుడితో కూడా కౌరవులను వధించి మేము భూమిని పుచ్చుకొనటం తప్పదు, గాండీవం లాగకుండానే వంగుతున్నది. బాణాలు తమకు తామే అంప పొదులలోనుండి వెలువడుతున్నాయి. కుబుసం విడిచే మహాసర్పంవలె ఖడ్గం తనంతట తానే ఒరలో నుండి బయటికి వస్తున్నది. కాబట్టి మాకు తప్పకుండా యుద్ధం జరిగితీరుతుంది. పాశుపతాది దివ్యాస్త్రాల చేత కురుపక్షంలో

ఉన్న వాళ్ళను నశింపజేసి శాంతిస్తాం. సంజయా! నీవు ఏమీ జంకకుండా ఇదంతా స్పష్టపరచాలి. ఈ మాటలు విని కురువృద్ధుడైన బాహ్లికుడూ, తాత అయిన భీష్ముడూ, గురుడైన ద్రోణుడూ, ఆచార్యుడైన కృపుడూ, గురుపుత్రుడైన అశ్వత్థామా, బుద్ధిమంతుడైన విదురుడూ, ధర్మనిర్వహణ దక్షుడైన శల్యుడూ ఏది నిర్ణయించి పలుకుతారో అది జరుగుతుంది. దుర్యోధనాదులు దీర్ఘాయువు లవుతారు కాక' అన్నాడు. ఆ మాటలు విని భీష్ముడు అందరూ వినేటట్లు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'గాండీవంబు దివియకయును గుడుసువడియెడు - బాణంబులు దమయంతన తూణీరంబుల వెడలెడు; కరవాలంబు దాన యొఱ వెలికి నిగుడుచున్నయది.' అలంకారం విభావన. కారణం లేకుండానే కార్యం జరిగినట్లు చెప్పటం విభావనాలంకారం. 'తోలూడ్చు మహానాగంబునుం బోలెఁ గరవాలంబు దాన యొఱ వెలికి నిగుడుచున్నయది'- అలంకారం ఉపమానుప్రాణిత విభావన.

సీ. **నలినగర్భుఁడు పెద్ద కొలువున నున్నెడ । సురపతి ప్రముఖుల చూడ్కులెల్ల**
మెఱయు తేజంబున మిఱుమిట్లు గొన నిద్ద । ఱచ్చట నొరసికొంచరుగఁ జూచి,
'వీ రెవ్వ, రిమ్మెయి మీ రుండ సరుకుసే । యని యట్లు వోయెడు నట్టివార?'
లని బృహస్పతి బ్రహ్మ నడిగిన నతని కి । ట్లనియె నా చతురాస్యుఁ డాదరమునఁ

తే. **దపము పెంపును బలశౌర్యదర్పములును । గలిగి లోకహితార్థంబుగాఁ జరింతు**
రే యుగంబున నరుఁడు నారాయణుండు । ననఁ బ్రసిద్ధికి నెక్కిన మునులు సుమ్ము!' **147**

ప్రతిపదార్థం: నలిన గర్భుఁడు= తమ్మిచూలి-బ్రహ్మ; పెద్ద కొలువునన్= నిండు సభలో; ఉన్న+ఎడన్= ఉండగా; సురపతి ప్రముఖుల చూడ్కులు+ఎల్లన్= ఇంద్రాదుల చూపులన్నీ; మెఱయు తేజంబునన్= ప్రకాశించే తేజస్సుతో; మిట్లు+మిట్లు+కొనన్= కళ్ళు చెదిరిపోయేటట్లు; ఇద్దఱు= ఇరువురు; అచ్చటన్; ఒరసికొంచున్= రాసుకొంటూ; అరుగన్+చూచి= వెళ్ళటం చూచి; వీరు= ఈ ఇరువురూ; ఎవ్వరు?; ఈ+మెయిన్= ఈ విధంగా; మీరు+ఉండన్= మీరు ఉంటూండగా; సరకు+చేయని+అట్లు= లెక్కచేయనట్లు; పోయెడు+అట్టివారలు= ప్రవర్తిస్తున్నారు; అని; బృహస్పతి; బ్రహ్మన్; అడిగినన్= అడుగగా; ఆ చతురాస్యుఁడు= ఆ బ్రహ్మ; ఆదరమునన్= ప్రీతితో; అతనికిన్; ఇట్లు+అనియెన్; తపము పెంపును= తపోమహిమా; బల శౌర్య దర్పములను= బలం, శౌర్యం, గర్వం కలిగి; లోక హిత+అర్థంబుగాన్= లోకం మేలుకోసం; ఏ యుగంబునన్= ఏ యుగంలో అయినా; నరుఁడున్ నారాయణుండున్+అనన్+ప్రసిద్ధికిన్+ఎక్కిన మునులు= నరుడూ నారాయణుడూ అని ప్రసిద్ధి వహించిన మునులు; చరింతురు సుమ్ము!= సంచరిస్తారు సుమా!

తాత్పర్యం: బ్రహ్మ నిండుసభ తీర్చి ఉండగా, ఇంద్రాదుల చూపులన్నీ- మెరిసిపోయే తేజస్సుతో కళ్ళుమిరుమిట్లు కొలిపేటట్లు ఇద్దరు ఒకరినొకరు రాసుకుంటూ వెళ్ళటం చూచి, 'ఈ ఇరువురూ ఎవ్వరు? మీ రుంటూండగా మిమ్ములను లక్ష్యపెట్టనట్లు సంచరిస్తున్నారు?' అని బృహస్పతి బ్రహ్మనడుగగా, ఆ బ్రహ్మ ప్రీతితో ఇట్లా అన్నాడు: 'తపశ్శక్తీ, బలమూ, పరాక్రమమూ, గర్వమూ కలిగి లోకహితం కొరకు ప్రతియుగంలోనూ నరుడూ, నారాయణుడూ అని ప్రసిద్ధికెక్కిన మునులు సంచరిస్తారు సుమా!'

వ. **అని పలికి వెండియు** **148**

తాత్పర్యం: అని పలికి, ఇంకా.

క. 'అనిమిషహితము దనుజ నా । శనమును జేయుదు; రధర్మ సంగ్రామము గ
ల్గిన చోట ధర్మపరు లగు । జనముల గెలిపింతు రధిక సంరంభమునన్. 149

ప్రతిపదార్థం: అనిమిష హితమున్= దేవతలకు మేలూ; దనుజ నాశనమును= రాక్షస వినాశాన్నీ; చేయుదురు; అధర్మ సంగ్రామము= అధర్మ యుద్ధం; కల్గిన చోటన్; ధర్మపరులు+అగు జనములను= ధర్మాత్ములైన జనుల్ని; అధిక సంరంభమునన్= మిక్కిలి ఆటోపంతో; గెలిపింతురు.

తాత్పర్యం: 'దేవతలకు హితమూ, రాక్షసులకు వినాశమూ చేస్తారు. అధర్మయుద్ధం జరిగేచోట ధర్మపరులైన జనులను మిక్కిలి ఆటోపంతో గెలిపిస్తారు.

వ. దేవాసుర యుద్ధంబు నప్పు డింద్రుండు వోయి వీరి నారాధించి తో డడిగినం, జనుదెంచి పౌలోమ కాలకేయాదులగు ననేక దైత్య దానవులం జంపి యింద్రునకు విజయంబు గావించి; రది మొదలుగా వీరల నెల్లవారలు నెఱింగియుండుదు; రిది యొక్క తేజంబ రెండు దెఱంగులై వెలుంగుచుండు' నని చెప్పి, వినోదార్థంబు జన్మాంతరంబు నొందిన యమ్మహాత్ములు గదా యీ యర్జునుండును వాసుదేవుండును! నర్జునుండు సముద్రతీరంబున హిరణ్యపురంబు వొడిచి నివాతకవచుల నఱువది వేవుర నిర్జించి పర్జన్యునకుఁ బ్రియంబుసేసె; వాసుదేవు పరాక్రమంబు గంస నరకాసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునం బ్రసిద్ధంబు గాదె? తెలియ విను మున్నరూపు సెప్పెద. 150

ప్రతిపదార్థం: దేవ+అసుర యుద్ధంబు+అప్పుడు= దేవదానవ యుద్ధ సమయంలో; ఇంద్రుండు+పోయి; వీరిన్; ఆరాధించి= పూజించి; తోడు= సహాయం; అడిగినన్= అడుగగా; చనుదెంచి= వచ్చి; పౌలోమ కాలకేయ+ఆదులు+అగు= పౌలోములు; కాలకేయులు మొదలగు; అనేక దైత్య దానవులన్= పెక్కురు దైత్యులనూ, దానవులనూ; చంపి; ఇంద్రునకున్; విజయంబు= గెలుపు; కావించిరి; అది మొదలుగాన్; వీరలన్; ఎల్లవారలున్= అందరూ; ఎఱింగి+ఉండుదురు; ఇది; ఒక్క తేజంబు+అ= ఒక తేజస్సే; రెండు+తెఱంగులు+ఐ= రెండు విధాలయి; వెలుంగుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అని; చెప్పెన్; ఈ+అర్జునుండును; వాసుదేవుండును= కృష్ణుడూ; వినోద+అర్థంబు= వేడుకకొరకు; జన్మ+అంతరంబున్+ఒందిన= మరో జన్మనందిన; ఆ+మహాత్ములు+కదా!= ఆ మహానుభావులే కదా!; అర్జునుండు; సముద్ర తీరంబునన్= సముద్రపుటొడ్డున; హిరణ్యపురంబు+పొడిచి; నివాతకవచులన్; అఱువది వేవురన్= అరవై వేల మందిని; నిర్జించి= జయించి; పర్జన్యునకున్= ఇంద్రుడికి; ప్రియంబు+చేసెన్= ప్రీతి కలిగించాడు; వాసుదేవు పరాక్రమంబు= కృష్ణుడి శౌర్యం; కంస నరక+అసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునన్= కంసుడూ; నరకాసురుడూ మొదలయిన ఎల్ల దుర్మార్గుల వధచేత; ప్రసిద్ధంబు+కాదె= తెలిసిందేకదా; ఉన్న రూపు= ఉన్న విధం; చెప్పెదన్; తెలియన్+వినుము.

తాత్పర్యం: దేవ దానవ యుద్ధ సమయంలో ఇంద్రుడు వెళ్ళి ఈ నరనారాయణులను పూజించి సహాయం చేయండని అడిగితే, వచ్చి పౌలోములూ, కాలకేయులూ మొదలైన పెక్కుమంది దైత్యులనూ, దానవులనూ చంపి ఇంద్రుడికి విజయం సంపాదించిపెట్టారు. అది మొదలుకొని వీరిని అందరూ ఎరుగుదురు. ఇది ఒక్క తేజస్సే. రెండు విధాలుగా అయి ప్రకాశిస్తూ ఉంటుంది' అని చెప్పాడు. వేడుక కొరకు మరో జన్మనెత్తిన ఆ మహాత్ములే

కదా ఈ అర్జునుడూ, కృష్ణుడూ. అర్జునుడు సముద్రతీరస్థమైన హిరణ్యాపురం పొడిచి అరవైవేలమంది నివాతకవచులను జయించి ఇంద్రుడికి ప్రీతి కలిగించాడు. కృష్ణుడి పరాక్రమం కంస నరకాసురాది సకల దుర్మార్గులను చంపడం వలన తెలిసిందేకదా! ఉన్న విధం చెపుతాను తెలిసేటట్లు వినుము.

క. ఆ యిరువురు నొకతలయై । యాయోధనమునకు నడచునట్టిద యేనిన్
వే యేల మనక కా దెదు । రై యేడ్తెఱఁ దాఁక హరునకైనను వశమే? 151

ప్రతిపదార్థం: ఆ+ఇరువురున్= ఆ కృష్ణార్జును లిద్దరూ; ఒక తల+ఐ= ఏకమయి; అయోధనమునకున్= యుద్ధానికి; నడచు+అట్టిది+అ+ఏనిన్= నడవటమే జరిగితే; వేయి+ఏల= వేయి మాట లెందుకు? మనకున్+అ కాదు= మనకే కాదు; ఎదురు+ఐ= ఎదురుగా ఉండి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; తాఁకన్= ఎదిరించటానికి; హరునకున్+ఐనను వశమే= ఆ ఈశ్వరుడికైనా సాధ్యమే?

తాత్పర్యం: ఆ కృష్ణార్జును లిద్దరూ ఏకమయి యుద్ధానికి నడవడమే జరిగితే, వేయి మాటలెందుకు? మనకే కాదు, ఎదురుగా నిలబడి పరాక్రమంతో ముట్టటానికి ఆ హరుడికి కూడా సాధ్యం కాదు.

విశేషం: హరుడికే సాధ్యం కాదన్నప్పుడు మనకు సాధ్యం కాదని వేరే చెప్పాలా? అని కైముత్యంచేత అర్థ సంసిద్ధి కలుగుతున్నది. కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి. ఇక్కడ ఈశ్వరుడికి హరశబ్దం సాభిప్రాయంగా ప్రయుక్తమైంది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. సారథియు రథియు నై యొక । తేరం గృష్ణు లతిఘోరతేజస్సార
స్ఫారతఁ దోఁచిన నైనను । ధీరత వాటించి చూచి తెలిసెదవు బలే!' 152

ప్రతిపదార్థం: కృష్ణులు= కృష్ణార్జునులు; సారథియున్; రథియున్+ఐ= రథికుడూ అయి; ఒక తేరన్= ఒక రథం మీద; అతి ఘోర తేజస్+సార స్ఫారతన్= మిక్కిలి భయంకరమైన తేజస్సారం యొక్క ఆధిక్యంతో; తోఁచినన్+ఐననున్= కనబడినప్పుడైనా; ధీరత+పాటించి= ధైర్యం కలిగి; చూచి; తెలిసెదవు బలే!= తెలిసికొంటావు సుమీ!

తాత్పర్యం: ఒక కృష్ణుడు సారథీ, ఇంకో కృష్ణుడు (అర్జునుడు) రథికుడూ అయి ఒక రథంపై మిక్కిలి భయం కరమైన తేజస్సారపుటాధిక్యంతో కనబడినప్పుడైనా నీవు ధైర్యం వహించి చూచి తెలిసికొంటావులే.'

విశేషం: కృష్ణుడంటే శ్రీకృష్ణుడే కాక, అర్జునుడు కూడా. కృష్ణుడు= నల్లనివాడు. అర్జునుడు నల్లని వాడవటం చేత అతడు కూడా కృష్ణు డనబడతాడు. ఇక్కడ 'కృష్ణులు' అని ఇద్దరికీ ఒకే శబ్దం వాడటం వలన వారి ఐక్యాన్ని ఒక తేజస్సే రెండయిన దనటాన్ని సూచిస్తున్నాడు కవి.

వ. అనుచు నా సుయోధను నుపలక్షించి శాంతనవుండు మఱియు నిట్లనియె: 153

ప్రతిపదార్థం: అనుచున్; ఆ సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; ఉపలక్షించి= చూచి; శాంతనవుండు= శంతనుపుత్రుడు-భీష్ముడు; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంటూ ఆ దుర్యోధనుడిని చూచి భీష్ముడు ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'మది నా మాట కొకింతయు । బెదర వకార్యంబునందుఁ బ్రియము గలిగి యుం
డుదు; కౌరవులకుఁ గాలము । తుదియో కా కిట్టి గర్వితుని నే మందున్? 154

ప్రతిపదార్థం: నా మాటకున్; ఒక+ఇంతయున్= కొంచెం కూడా; మదిన్= మనస్సులో; బెదరవు= భయపడవు; అకార్యంబునందున్= చెడుపనియందు- చేయదగని పనియందు; ప్రియము+కలిగి+ఉండుదు(వు)= ప్రీతి కలిగి ఉంటావు; కౌరవులకున్; కాలము+తుది+ఓ= అంత్యకాలమో; కాక= లేకపోతే; ఇట్టి గర్వితునిన్= ఇట్లాంటి పొగరుబోతును; ఏమి+అందున్?= ఏమంటాను?

తాత్పర్యం: 'నా మాటకు కొంచెం కూడా మదిలో భయపడవు. చేయదగని పనియందు ప్రీతి కలిగి ఉంటావు. కౌరవులకు పోగాలం దాపురించిందేమో లేకపోతే ఇట్లాంటి పొగరుబోతును నిన్ను ఏమంటాను?

తే. హితములగు నాదు వచనంబు లిపుడు వినని । వాఁడవైతేని నప్పుడు 'వారు పడిరి,
వీరు పడి' రను పలుకులు విందుగాక । శకుని కర్ణ దుశ్శాసనుల్ సమ్మతింప. 155

ప్రతిపదార్థం: హితములు+అగు నాదు వచనంబులు= మేలును గూర్చే నా మాటలు; ఇపుడు; వినని వాఁడవు! ఐతి(వి)+ఏనిన్= వినకపోతే; అప్పుడు= యుద్ధ సమయంలో; శకుని కర్ణ దుశ్శాసనుల్; సమ్మతింపన్= ఇష్టపడగా; వారు+పడిరి= వారు చచ్చారు; వీరు+పడిరి= వీరు చచ్చారు; అను పలుకులు= అనే మాటలు; విందు(వు)+కాక= వింటావులే.

తాత్పర్యం: నీ హితం కోరే నా మాటలు ఇప్పుడు నీవు వినకపోతే, అప్పుడు కురుక్షేత్ర యుద్ధ సమయంలో 'వారు చచ్చారు, వీరు చచ్చారు' అనే మాటలు - శకునీ, కర్ణుడూ, దుశ్శాసనుడూ ఇష్టపడగా - వింటావులే.

వ. దుష్ట కష్ట నికృష్టాత్ము లగు నిమ్ముువ్వురుఁ జెప్పెడు బుద్ధులుగాని యొండు విననొల్ల; వేమి సేయవచ్చు?' నని పలికినం గానీనుండు గనలి గాంగేయున కిట్లనియె; 156

ప్రతిపదార్థం: దుష్ట కష్ట నికృష్ట+ఆత్ములు+అగు+ఈ+ముువ్వురున్= దుర్మార్గులూ, పాపులూ, నీచ బుద్ధులూ అయిన ఈ ముగ్గురూ (కర్ణ శకుని దుశ్శాసనులు); చెప్పెడు బుద్ధులు+కాని= చేసే బోధలు కాని; ఒండు= ఇంకొకటి; వినన్+ ఒల్లవు= వినటానికి ఇష్టపడవు; ఏమి చేయన్+వచ్చున్?= ఏమిటి చేయటం?; అని; పలికినన్; కానీనుండు= కర్ణుడు (కన్యాపుత్రుడు); కనలి= కోపం వహించి; గాంగేయునకున్= భీష్మునికి (గంగా పుత్రుడు); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్మార్గులూ, పాపులూ, నీచస్వభావులూ అయిన ఈ కర్ణ శకుని దుశ్శాసనులు ముగ్గురూ చేసే బోధలే కాని ఇంకొకటి వినడానికి ఇష్టపడవు. ఏం చెయ్యటం?' అని అంటే, కర్ణుడు కోపించి భీష్మునితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఇట్టు లాడఁ దగునె? యే నేమి సేసితిఁ? । గొలిచి కుడుచు పాడి నలవుఁ జలముఁ
బలుకు టెందు నెగ్గె? పతికిఁ బుత్త్రులకును । మనుమలకు హితంబ యొనర నడతు. 157

ప్రతిపదార్థం: ఇట్టులు= ఇలా; ఆడన్+తగునె= మాటాడవచ్చా?; ఏను+ఏమి+చేసితిన్= నేనేం చేశాను?; కొలిచి కడుచు పాడిన్= సేవించి, తినే ధర్మంచేత; అలవున్= ఉపాయమూ; చలమున్= పంతమూ; పలుకుట; ఎందున్= ఎక్కడా; ఎగ్గె= తప్పా?; పతికిన్= రాజుకూ - ధృతరాష్ట్రుడికీ; పుత్త్రులకును= కొడుకులకూ; మనుమలకున్; హితంబు+అ= మేలే; ఒనరన్= కలిగేటట్లు; నడతున్= ప్రవర్తిస్తాను.

తాత్పర్యం: 'నీవు ఇట్లా మాటాడవచ్చా? నేనేం చేశానని? వాళ్ళను సేవిస్తూ, వాళ్ళ ఉప్పు తింటూన్న న్యాయం చేత, ఏదో నాకు తోచిన ఉపాయం చెప్పటమూ, వాళ్ళకై పంతం పూనటమూ ఎక్కడైనా తప్పా? నే నెప్పుడూ ధృతరాష్ట్ర మహారాజుకూ, అతడి కొడుకులకూ, మనుమలకూ మేలే కలిగేవిధంగా ప్రవర్తిస్తాను.

క. కాని తెఱఁగైన నింతటి । మానిసిఁ గా నేల చేయు మనుజేంద్రుఁడు న
న్నీ నెఱి దప్పిన మాటలు । నీ నోరన్ వెడలఁ దగునె నిండిన సభలోన్?' 158

ప్రతిపదార్థం: కాని తెఱఁగు+ఐనన్= దుర్మార్గం అయితే; మనుజ+ఇంద్రుఁడు= రాజు-దుర్యోధనుడు; నన్నున్; ఇంతటి మానిసిన్+కాన్= ఇంతటి గొప్పవాడినిగా; ఏల చేయున్= ఎందుకు చేస్తాడు?; నిండిన సభలోన్= నిండు సభలో; ఈ నెఱి+ తప్పిన మాటలు= ఈ అన్యాయపు మాటలు; నీ నోరన్= నీ నోటి నుండి; వెడలన్+తగునె?= రావచ్చా?

తాత్పర్యం: నాది దుర్మార్గం అయితే, రాజు దుర్యోధనుడు నన్ను ఇంతటి గొప్పవాడుగా ఎందుకు చేస్తాడు? నిండుసభలో ఈ అన్యాయపు మాటలు నీ నోటి నుండి వెలువడవచ్చా?'

విశేషం: 'ఇంతటి మానిసిఁగా నేల చేయు' - కర్ణుడు సూతకులజుడని కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో పెద్దలు పాల్గొననీయకపోతే, దుర్యోధనుడు అప్పటికప్పుడు అంగరాజ్యానికి అభిషిక్తుడిని చేసి కర్ణుడిని రాజుగా చేస్తాడు. ఇదీ కర్ణుడి అభిప్రాయం.

వ. అనిన విని భీష్ముఁడు ధృతరాష్ట్రున కిట్లనియె: 159

తాత్పర్యం: అనగా విని భీష్ముడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు :

భీష్ముఁడు కర్ణుని దుర్ణయంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 5-48-33)

తే. 'ఒకట నైనను వారియం దొకరిలోని । చిదుర పాలును బోలండు; సిగ్గులేక
'పాండవుల గెల్తు నే' నని పలుకుచుండు; । వీని రజ్జులు దులువలు విండ్రు తగిలి! 160

ప్రతిపదార్థం: ఒకటన్+ఐనను= ఒక్క విషయంలో అయినా; వారి యందున్= ఆ పాండవులలో; ఒకరిలోని చిదురపాలును= ఒక్కరిలోని చిన్న తునుకంత కూడా; పోలఁడు= సరిపోడు; సిగ్గులేక; పాండవులన్; నేను; గెల్తున్; అని; పలుకుచున్+ఉండున్= అంటూఉంటాడు; వీని రజ్జులు= వీని పొల్లుకూతలు; తులువలు= దుర్మార్గులు; తగిలి= ఆసక్తి వహించి; విండ్రు= వింటారు.

తాత్పర్యం: ఒక్క విషయంలోనైనా పాండవులలో ఒకడిలోని చిన్ని తునుకంత కూడా పోలడు. సిగ్గులేక పాండవులను నేను గెలుస్తానంటూ ఉంటాడు ఈ కర్ణుడు. వీడి పొల్లుకూతలను దుర్మార్గులు ఆసక్తితో వింటారు.

క. మగఁటిమి వారికి వీఁ డెదు । రుగ నమ్మి, సుయోధనుఁడు విరోధము గొని, స
ర్వ గుణాఢ్యులు బలవంతులు । నగు పాండునృపాలసుతుల నవమానించెన్. 161

ప్రతిపదార్థం: మగఁటిమిన్= పరాక్రమంలో; వారికిన్= ఆ పాండవులకు; వీఁడు= ఈ కర్ణుడు; ఎదురుగన్= ప్రతిగా; నమ్మి; సుయోధనుఁడు= దుర్యోధనుడు; విరోధము+కొని= శత్రుత్వం తాల్చి; సర్వ గుణ+ఆఢ్యులున్= సకల సుగుణ సంపన్నులూ; బలవంతులున్= పరాక్రమవంతులూ; అగు; పాండు నృపాల సుతులన్= పాండురాజు కొడుకులను-పాండవులను; అవమానించెన్= పరాభవించాడు.

తాత్పర్యం: పరాక్రమంలో పాండవులకు కర్ణుడు ప్రతి అని నమ్మి దుర్యోధనుడు పాండవులతో శత్రుత్వం వహించి సకల సుగుణ సంపన్నులూ, పరాక్రమవంతులూ అయిన వాళ్ళని అవమానించాడు.

ఉ. ఒక్కఁ డొకం డనేక విధ యుద్ధ జయంబులు గొన్నవారు వా;
రెక్కడ నేమి సేసె నితఁ? డీతని తమ్ముని గూలనేసి యు
క్కెక్కిన పార్థుపైఁ గవిసెనే? పసు లాతఁడు గ్రమ్మఱింపఁగా
నక్కడ లేఁడె వీఁడు? భవదాత్మజుఁ గోల్పడె ఘోషయాత్రలోన్. 162

ప్రతిపదార్థం: వారు= పాండవులు; ఒక్కఁడు+ఒకండు= ఒక్కొక్కడు; అనేక విధ యుద్ధ జయంబులు= పెక్కురీతులైన యుద్ధ విజయాలు; కొన్నవారు= పొందినవారు; ఇతఁడు= ఈ కర్ణుడు; ఎక్కడన్; ఏమి+చేసెన్?= ఏం చేశాడు?; ఈతని తమ్మునిన్; కూలన్+ఏసి= కూల్చి చంపి; ఉక్కు+ఎక్కిన పార్థుపైన్= అతిశయించిన అర్జునుడి మీద; కవిసెనే?= పడ్డాడా?; అతఁడు= అర్జునుడు; పసులు= గోవులు; క్రమ్మఱింపఁగాన్= మరలించగా; వీఁడు= ఈ కర్ణుడు; అక్కడ లేఁడె?; ఘోషయాత్రలోన్; భవత్+ఆత్మజున్= నీ కొడుకును- దుర్యోధనుడినీ; కోల్పడెన్= పోగొట్టుకొన్నాడు (ఓడగొట్టుకొన్నాడు).

తాత్పర్యం: పాండవులు ఒక్కొక్కడు అనేక విధాలయిన యుద్ధ విజయాలు పొందినవారు. వీడు ఎక్కడ ఏం చేశాడు? ఇతడి తమ్ముడిని కూల్చి విజృంభించిన అర్జునుడిమీదికి ఉరికాడా? అతడు గోవులను మరలించుకొనిపోతే, వీడు అక్కడ లేడా? ఘోషయాత్రలో నీ కొడుకును ఓడింపజేసికొన్నాడు.

విశేషం: 'ఈతని తమ్మునిఁ గూలనేసి యుక్కెక్కిన పార్థుపైఁ గవిసెనే?' - ఈతడి తమ్ముడు 'సంగ్రామజిత్తు' అని తెలుస్తున్నది. ఉత్తరగోగ్రహణ సందర్భంగా అర్జునుడితో సంగ్రామజిత్తు అనేవాడు తలపడగా, అర్జును డతడి 'తల దునిమివైచె' అని ఉన్నది. వెంటనే 'అపుడు రాధేయుఁ డిమ్మెయి ననుజుపాటుఁ జూచి' అని ఉన్నది. (విరాట. 5-80, 81). అందుచేత కర్ణుడి తమ్ముడు సంగ్రామజిత్తు అని చెప్పాలి.

వ. ఈ దురాత్ముండు కర్జం బెఱుంగక నీతిబాహ్యుండై వలసినట్లు ప్రేలరిమాట లాడుచుండు; నీవునుం గైకొని వినుచుండుదువు; మేల కాక!' యనిన భీష్ము పలుకులు విని ద్రోణుం డమ్మహారాజుతో నిట్లనియె; 163

ప్రతిపదార్థం: ఈ దురాత్ముండు= దుష్టబుద్ధి గల ఈ కర్ణుడు- ఈ దుష్టుడు; కర్జంబు+ఎఱుంగక= చేయవలసిన పని తెలియక; నీతి బాహ్యుండు+ఐ= నీతికి వెలియైన వాడయి - అవినీతిపరుడయి; వలసిన+అట్లు= ఇష్టం వచ్చినట్లు; ప్రేలరి మాటలు+అడుచున్+ఉండున్= వదరుబోతు మాటలాడుతూ ఉంటాడు; నీవునున్= నీవు కూడా; కైకొని= సమ్మతించి; వినుచున్+ఉండుదువు= వింటూంటావు; మేలు+అ కాక= మంచిదే; అనినన్; భీష్మ పలుకులు; విని; ద్రోణుండు; ఆ+ మహారాజుతోన్= ధృతరాష్ట్ర మహారాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ దుష్టుడు చేయవలసిన పని ఏమిటో తెలియక అవినీతిపరుడయి ఇష్టం వచ్చినట్లు ప్రేలుతూ ఉంటాడు. నీవూ సమ్మతించి ఊఁ కొట్టుతుంటావు. మంచిదే' అనగా, భీష్ముడి మాటలు విని ద్రోణుడు ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. 'శాంతనవుండు సర్వకురుసంతతికిం గలవాఁడు గాఁడె? య
త్యంత హితంబు లీ పలుకు; లాహవ మొప్పదు; ధర్మసూతితోఁ
బొంతము మేలు; దేవపతిపుత్త్రుఁడు సంజయుతోడ నాడిన
ట్లంతకు నోపు; మీకుఁ దెలియం దగు ఖాండవదాహ మాదిగాన్. 164

ప్రతిపదార్థం: శాంతనవుండు= శంతను పుత్త్రుడు- భీష్ముడు; సర్వకురు సంతతికిన్+కలవాఁడు+కాఁడె= కురు సంతానానికంతకూ పాండవులకూ, కౌరవులకూ కావలసినవాడు కాడా?; ఈ పలుకులు= ఇతడి మాటలు; అత్యంత హితంబు= మిక్కిలి మేలు కూర్చేవి; ఆహవము+ఒప్పదు= యుద్ధం తగదు; ధర్మసూతితోన్= ధర్మపుత్త్రుడితో; పొంతము= పొందు; మేలు= మంచిది; దేవ పతి పుత్త్రుఁడు= సురరాజు కొడుకు అర్జునుడు; సంజయుతోడన్+ఆడిన+అంతకున్+ఓపున్= సంజయుడితో అన్నంతా చేయటానికి సమర్థుడు; ఖాండవ దాహము+ఆదిగాన్= ఖాండవ వన దహనం మొదలుగా; మీకున్; తెలియన్+తగున్= తెలిసికొనటం మంచిది.

తాత్పర్యం: "భీష్ముడు అటు పాండవులకూ, ఇటు కౌరవులకూ మొత్తం కురు సంతతికంతకూ కావలసినవాడు కాడా? అతని మాటలు మిక్కిలి మేలు కూర్చేవి. యుద్ధం తగదు. ధర్మరాజుతో సంధి చేసుకోవడం మంచిది. అర్జునుడు సంజయుడితో అన్నంతా చేయగలవాడు. ఖాండవ వనదహనం మొదలుగా అతడు చేసిన వీరకృత్యాలు తెలిసికొనటం మంచిది.

ఆ. శర శరాసనములు ధరియింప రెట్టు లె । వ్వరును? మగతనంబు వలనుఁ గలిగి
కయ్యమున జయంబు గైకొనరే యొరు? । లర్జునుండ విజయుఁ డనఁగ నెగడె! 165

ప్రతిపదార్థం: ఎవ్వరును= మరెవ్వరూ; శర శరాసనములు= బాణాలూ; ధనుస్సులూ; ధరియింపరు+ఎట్టులు= ధరించరా ఏమి?; ఒరులు= ఇతరులు; మగతనంబు= పౌరుషం; వలనున్+కలిగి= నేర్పూ కలిగి; కయ్యమునన్= యుద్ధంలో; జయంబు+కైకొనరే= గెలుపొందరా?; అర్జునుండు+అ= అర్జును డొక్కడే; విజయుఁడు+అనఁగన్+నెగడెన్= విజయ డనగా పేరుపొందాడు.

తాత్పర్యం: మరెవ్వరూ విల్లమ్ములు ధరించరా ఏమి? ఇతరులు పౌరుషమూ, శక్తీ (నేర్పూ) కలిగి యుద్ధంలో గెలుపొందరా? అర్జునుడి కొక్కడికే విజయు డనే పేరు వచ్చింది!

క. మన వీటనకా, దయ్యు । ర్జునునకు సరివింటివానిఁ జూడఁగ లోకం
బున నెందు లేమి దెల్లం । బనుమానములేదు; తొడరనగునే వానిన్?' 166

ప్రతిపదార్థం: మన వీటన్+అ కాదు= మన దేశంలోనే కాదు; ఆ+అర్జుననకున్; సరి వింటి వానిన్= సమానుడైన విలుకాడిని; చూడఁగన్; లోకంబునన్; ఎందున్; లేమి; తెల్లంబు= స్పష్టం; అనుమానము లేదు= సందేహం లేదు; వానిన్; తొడరన్+అగునే?= ఎదిరించటం సాధ్యమా?

తాత్పర్యం: మన దేశంలోనే కాదు, ఆ అర్జునుడితో సమానుడైన విలుకాడు చూడగా లోకంలో ఎక్కడా లేకపోవటం స్పష్టం. సందేహం లేదు. అతడిని ఎదిరించటం అసాధ్యం.'

వ. అని చెప్పి, యప్పాటం బరమహితోపదేశంబు సేసిన భీష్మ ద్రోణుల పలుకు లాదరింపక, వారికి సదుత్తరంబు లీక, వారలతోడం దదనురూపంబుగా సంభాషింపక, ధృతరాష్ట్రుండు వెండియుఁ బాండవులవలని వార్త లడుగుటకు సంజయుదిక్కు మొగంబైనం జూచి, కురుపక్షవీరు లందఱుఁ బ్రాణంబుల దెస నిరాశులై యుండి; రమ్మహీపతి సంజయునితో నిట్లనియె; 167

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆ+పాటన్= ఆ విధంగానే; పరమహిత+ఉపదేశంబు+చేసిన భీష్మ ద్రోణుల పలుకులు= మంచి హితం ఉపదేశించిన భీష్మ ద్రోణుల మాటలు; ఆదరింపక= స్వీకరించక; వారికిన్= ఆ భీష్మద్రోణులకు; సత్+ఉత్తరంబులు+ ఈక= తగిన సమాధానాలు చెప్పక; వారలతోడన్; తద్+అనురూపంబుగాన్= వాటికి తగినట్లుగా; సంభాషింపక= మాటాడక; ధృతరాష్ట్రుండు; వెండియున్= మళ్ళీ; పాండవుల వలని వార్తలు= పాండవులను గూర్చిన విషయాలు; అడుగుటకున్; సంజయు దిక్కు మొగంబు+ఐనన్= సంజయుడివైపు చూడగా; చూచి, కురుపక్ష వీరులు+అందఱున్= కౌరవపక్షంలో ఉన్న వీరులంతా; ప్రాణంబుల దెసన్= ప్రాణాల మీద; నిరాశులు+ఐ= ఆశలేనివారై; ఉండిరి; ఆ+మహీపతి= ఆ రాజు-ధృతరాష్ట్రుడు; సంజయునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి ఆ విధంగా మంచి హితవు ఉపదేశించిన భీష్మద్రోణుల మాటలు మన్నించక, వారికి తగిన సమాధానాలు చెప్పక, వాళ్ళతో వాటికి తగ్గట్టుగా మాటాడక ధృతరాష్ట్రుడు మళ్ళీ పాండవులను గూర్చిన విషయా లడగడానికి సంజయుడికేసి చూచాడు. అది చూచి కౌరవుల పక్షంలో ఉన్న వీరులంతా తమ ప్రాణాల మీద ఆశలు వదులుకొన్నారు. ఆ ధృతరాష్ట్ర మహారాజు సంజయుడితో ఇట్లా అన్నాడు :

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవుల గొప్పతనం విని సహించలేడు. అందుచేతనే భీష్మ ద్రోణుల మాటలు అతడికి రుచించలేదు. వాళ్ళమాటలకు సమాధానాలు చెప్పలేదు.

తే. 'ధర్మ పుత్త్రున కిక్కడి తలఁపు భంగి । యెట్టు లుండు? నీ సైన్యంబులెల్లఁ గూడి
యునికి వినియెనే? యెవ్వరిఁ గొని యతండు । కౌరవులమీఁది కెత్తి రాఁగలుగువాఁడు?' 168

ప్రతిపదార్థం: ధర్మ పుత్త్రునకున్= ధర్మరాజునకు; ఇక్కడి తలఁపు భంగి= ఈ పక్షాన్ని గూర్చిన ఆలోచనా క్రమం; ఎట్టులు+ ఉండున్?= ఎట్లా ఉంటుంది?; ఈ సైన్యంబులు+ఎల్లన్= ఇక్కడి సేనలన్నీ; కూడి+ఉనికి= కూడి ఉండటం; వినియెనే?= విన్నాడా?; అతండు; ఎవ్వరిన్+కొని= ఎవరిని తోడు చేసికొని; కౌరవుల మీఁదికిన్; ఎత్తి రాన్+కలుగువాఁడు?= దండెత్తి రాగలుగుతాడు?

తాత్పర్యం: 'ధర్మరాజు ఈ పక్షం గూర్చి ఏమనుకొంటున్నాడు? ఇక్కడ సైన్యాలన్నీ మోహరించి ఉండటం అతడికి తెలుసా? అతడు ఎవరిని తోడు చేసికొని కౌరవులపైకి దండెత్తి రాగలవాడు.

వ. అనిన విని సంజయుండు వెచ్చనూర్చి, తీచ్చవడి, మూర్ఛవోయిన చందంబున డెందంబు మొగుడం జేష్టలు దక్కియుండి, కొండొక సేపునకుఁ జిత్తం బొక్కింత సేసికొని, 'యక్కటా! యీ భూపాలుం డింత బేల యగునే? యుధిష్ఠిరుం డెవ్వరిఁ గొని యెత్తి వచ్చు వాఁడని యడుగుచున్నవాఁ! డింత యెఱుంగని వాఁ డెంతసెప్పినను తెలియనేర్చునే? యితని భంగి యిట్టిదనినఁ, గొడుకుల తెఱంగు వేఱ యెన్న నేల? యే నింక

నేమనువాఁడ? నైనను నన్నడిగిన మాటకుం దగిన మాఱుమాట పలుకవలయునకాదె' యని తలంచి ధృతరాష్ట్రున కిట్లనియె;' 169

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; వెచ్చన్+ఊర్చి= వేడి నిట్టూర్పు విడిచి; ఱిచ్చ+పడి= నిశ్చేష్టుడయి; మూర్ఛ+పోయిన చందంబునన్= మూర్ఛిల్లిన రీతిగా; డెందంబు= హృదయం; మొగుడన్= ముడుచుకొనగా; చేష్టలు+తక్కి+ఉండి= కొయ్యబారిపోయి; కొండొక సేపునకున్= కొంతసేపటికి; చిత్తంబు+ఒక్క+ఇంత చేసికొని= మనస్సు కొంచెం పదిలపరుచుకొని; అక్కటా= అయ్యో; ఈ భూపాలుండు= ఈ రాజు- ధృతరాష్ట్రుడు; ఇంత బేల+అగునే?= ఇంత వెర్రివాడా? యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఎవ్వరిన్= ఎవరిని; కొని= తీసికొని ఎత్తి వచ్చువాఁడు+అని= దండెత్తి రానున్నాడని; అడుగుచున్+ఉన్నవాఁడు; ఇంత; ఎఱుంగనివాఁడు; ఎంత+చెప్పినను; తెలియన్+నేర్చునే= తెలిసికొనగలడా; ఇతని భంగి= ఇతడి విధం; ఇట్టిది+అనినన్= ఇటువంటిదంటే; కొడుకుల తెఱంగు; వేఱు+అ= వేరే; ఎన్నన్+ఏల?= ఎంచటం ఎందుకు?; ఏను; ఇంకన్; ఏమి; అనువాఁడన్; ఐనను; నన్నున్+అడిగిన మాటకున్; తగిన; మాఱుమాట= ప్రతివచనం, సమాధానం; పలుకవలయున్+అ కాదె!= చెప్పవలసిందే కదా!; అని; తలంచి; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని సంజయుడు వేడి నిట్టూర్పు పుచ్చి, నిశ్చేష్టుడయి, మూర్ఛిల్లిన విధంగా మనస్సు ముకుళించగా కొయ్యబారిపోయి, కొంతసేపటికి మనస్సు గట్టిపరచుకొని, 'అయ్యో! ఈ రాజు ఇంత వెర్రివాడా? యుధిష్ఠిరుడు ఎవరిని తీసికొని దండెత్తి రానున్నాడని అడుగుతున్నాడు! ఇంత తెలియనివాడు ఎంత చెప్పితే మాత్రం తెలిసికొంటాడా? ఇతడి విధం ఇట్టిదంటే కొడుకుల విధం వేరే చెప్పటం ఎందుకు? నే నింక ఏమంటాను? అయినా, నన్నడిగిన మాటకు తగిన సమాధానం చెప్పాలి కదా!' అని తలచి ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'ఇతని భంగి యిట్టిదనినఁ గొడుకుల తెఱంగు వేఱ యెన్ననేల?' అలంకారం కావ్యార్థాపత్తి. 'యుధిష్ఠిరుండు' అతడే యుద్ధంలో స్థిరంగా ఉండేవాడయితే ....' అని యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

చ. 'వినుము నరేంద్ర! పాండుపృథివీపతి యగ్రసుతుండు సంధిసే
యన మదిఁ గోరు; మీరు దమ యయ్యసగంబును భూమియీక త
క్కిన మఱికాని ముంద రొకకీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొనం దలంచినన్.' 170

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా, ధృతరాష్ట్రా!; వినుము; పాండు పృథివీ పతి అగ్ర సుతుండు= పాండురాజు పెద్ద కొడుకు ధర్మరాజు; సంధి+చేయన్+అ మదిన్+కోరున్= సంధి చేసికొనటానికే మనస్సులో కోరుతున్నాడు; మీరు; తమ+అయ్య సగంబును భూమి+ఈక తక్కిన మఱికాని= తమ తండ్రి సగం భూమిని ఇవ్వకపోతే తప్ప; ముందర= ముందు; ఒక కీడున్= ఒక హానిని కూడా; తలంపఁడు; లావునన్= పరాక్రమంతో; నేలన్= భూమిని; కొనన్+తలంచినన్= పుచ్చుకొనాలనుకొంటే- పుచ్చుకోవలసివస్తే, మీ బలంబున్+ఎల్లను= మీ సైన్యాన్నంతనూ; మదిన్= మనస్సులో; చీరికిన్+కొనఁడు= కొంచెం కూడా లక్ష్యపెట్టడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! వినుము. ధర్మరాజు సంధి చేసికొనటానికే మనస్సులో కోరుతున్నాడు. మీరు తమ తండ్రి సగం భూమినీ ఇవ్వకపోతే తప్ప, ముందే ఏ కీడూ తలపెట్టడు. బలంతోనే భూమిని పుచ్చుకొనవలసి వస్తే, మీ బలాన్ని కొంచెం కూడా లక్ష్యపెట్టడు.

విశేషం: ఒక రాయబారి తన ప్రయత్నాన్నీ ఫలితాంశాలనూ ప్రభువుముందు లేదా సభముందు ఉంచేటప్పుడు నాలుగంశాలు తన నివేదనంలో ప్రదర్శిస్తాడు. 1.సారాంశాన్ని అసందిగ్ధంగా చెప్పటం. 2.సమస్యలను స్పష్టంగా వివరించటం. 3.శత్రుపక్షంవారి ప్రవృత్తులను ప్రస్ఫుటంగా వివేచించి చెప్పటం. 4.తాను గమనించిన అంశాలను నిర్మొగమాటంగా తేటతెల్లంగా చెప్పటం. ధర్మజాదులను గురించి తన తుది అంచనాలను ఫలితాంశాలుగా ప్రకటిస్తున్న ఈ ఘట్టంలో ధర్మజుడిని గూర్చి చెప్పిన పద్యమిది. ఈ పద్యంలోని మూడు వాక్యాలలో పై మూడంశాలు ప్రదర్శితమయ్యాయి. వాటిని చెప్పిన తీరులో సంజయుడి మొగమోటం లేనితనం స్పష్టమవుతున్నది. సంజయుడు సమర్థుడైనా వాగ్మి. (సంపా.)

వ. అతం డెవ్వరిం గొని యెత్తివచ్చువాఁ డని యడిగితివి; నీ యెఱుంగని వార లం దెవ్వరు గల? రవధరింపుము. 171

ప్రతిపదార్థం: అతండు= ధర్మరాజు; ఎవ్వరిన్+కొని= ఎవరిని వెంటబెట్టుకొని; ఎత్తి వచ్చువాఁడు+అని+అడిగితివి= దండెత్తి వస్తాడని అడిగావు; నీ+ఎఱుంగని వారలు+అందున్+ఎవ్వరు+కలరు?= నీకు తెలియనివాళ్ళు అక్కడ ఎవరున్నారు? అవధరింపుము= చిత్తగించుము.

తాత్పర్యం: ధర్మరాజు ఎవరిని తోడు తెచ్చుకొని దండెత్తి రానున్నాడని అడిగావు. నీకు తెలియనివాళ్ళు అక్కడ ఎవరున్నారు? చిత్తగించుము:

మ. బకవిధ్వంసి జటాసురాంతకు హిడింబప్రాణపారీణుఁ గీ
చక నిర్మూలన కేళి లోలు సమరోత్సాహైక శీల ప్రవ
ర్తకు నాగాయుత సామ్యకీర్తిత బలోదగ్రుం బ్రతివ్యూహ దా
హకు భీముం గొని వచ్చు ధర్మజుఁడు బాహాటోపముం జూపఁగన్. 172

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; బక విధ్వంసిన్= బకాసుర నాశకుడూ; జటా+అసుర+అంతకున్= జటాసురుడిని అంత మొందించినవాడూ; హిడింబ+ప్రాణ పారీణున్= హిడింబుడనే రాక్షసుడి ప్రాణాల పారం ముట్టినవాడూ- ప్రాణాల అంతు చూచిన వాడూ; కీచక నిర్మూలన కేళి లోలున్= కీచకుడిని తుదముట్టించటం అనే ఆటయందు ఆసక్తి గలవాడూ; సమర+ఉత్సాహ+ఏక శీల ప్రవర్తకున్= యుద్ధోత్సాహమనే ప్రధానమైన స్వభావంతో ప్రవర్తించేవాడూ; నాగ+అయుత సామ్య కీర్తిత బల+ఉదగ్రున్= పదివేల ఏనుగుల సాదృశ్యంతో పొగడబడే పరాక్రమంచేత భయంకరుడూ- పదివేల ఏనుగుల బలంతో సమానమైన పొగడబడే బలంచేత భయంకరమైనవాడూ; ప్రతివ్యూహ దాహకున్= శత్రువుల మారు వ్యూహాలను తగల బెట్టేవాడూ అయిన; భీమున్= భీముడిని; బాహా+ఆటోపమున్= భుజాల విజృంభణాన్ని - భుజబల విజృంభణాన్ని; చూపఁగన్= చూపించటానికి; కొని వచ్చున్= తీసికొని వస్తాడు.

తాత్పర్యం: బకాసురుడిని చంపినవాడూ, జటాసురుడిని అంతమొందించినవాడూ, హిడింబుడనే రాక్షసుడి ప్రాణాల అంతు చూచినవాడూ, కీచకుడిని తుదముట్టించటమనే ఆటయందు ఆసక్తి కలవాడూ, యుద్ధోత్సాహం ఒక్కటే స్వభావంగా ప్రవర్తించేవాడూ, పదివేల ఏనుగుల బలమంత బలం గలవాడని పొగడబడే భయంకరుడూ, శత్రువుల వ్యూహాలను తగలబెట్టేవాడూ అయిన భీముడిని భుజపరాక్రమ విజృంభణం చూపించటానికి వెంటబెట్టుకొని ధర్మరాజు వస్తాడు.

విశేషం: పద్యంలోని భీమ విశేషణాలన్నీ సంస్కృత సమాస భీమము లయి అతడి భీమ పరాక్రమాన్ని సూచిస్తున్నాయి. ప్రకరణాను గుణమైన శయ్యను ప్రదర్శించటం మహాకవుల ప్రత్యేకత.

వ. మఱియును. **173**

తాత్పర్యం: ఇంకా.

మ. అట మిన్నందిన యట్టివాని పాడ వెం తన్నట్లు ఫాలాక్షు నె
క్కటి కయ్యంబునఁ గన్న ఫల్గును భుజాగర్వంబు లెక్కించు; టం
తటి వానింగొని ధర్మసూతి సమరోత్సాహంబుమై నెత్తి వ
చ్చుటకుం గొంకునె? వీఁపు సక్కనయి నిల్చుంగాక మీ సైన్యముల్. **174**

ప్రతిపదార్థం: ఫాల+అక్షున్= నుదుట కన్నుగలవాడిని- ఈశ్వరుడిని; ఎక్కటి కయ్యంబునన్= ద్వంద్వయుద్ధంలో; కన్న= పొందిన- చూచిన; ఫల్గును భుజా గర్వంబున్= అర్జునుడి బాహు పరాక్రమ గర్వాన్ని; లెక్కించుట= లెక్కపెట్టటం; అట మిన్ను+అందిన+అట్టి వాని పాడవు= ఆకాశాన్ని తాకిన ఆ మనుష్యుడి పొడవు; ఎంత+అన్న+అట్లు= ఎంత అని అడగటం వంటిది; అంతటి వానిన్+కొని= అంతటి గొప్పవాడిని మహోన్నతుడిని తీసికొని; ధర్మసూతి= ధర్మరాజు; సమర+ఉత్సాహంబు మైన్= యుద్ధోత్సాహంతో; ఎత్తి వచ్చుటకున్= దండెత్తి రావటానికి; కొంకునె?= సందేహిస్తాడా?; మీ సైన్యముల్= మీ సేనలు; వీఁపు+చక్కన+అయి= వీపు తిన్ననై; నిల్చున్+కాక= ఉంటాయిలే - వెనుదిరుగుతాయిలే.

తాత్పర్యం: నిటలాక్షుడిని ద్వంద్వయుద్ధంలో కన్న అర్జునుడి భుజబలం పరిమితి ఎంత అని లెక్కించటం, ఆకాశాన్ని తాకే ఆ మనుష్యుడి పొడవెంత అని అడగటం లాంటిది. అంతటివాడిని వెంటబెట్టుకొని ధర్మరాజు యుద్ధోత్సాహంతో దండెత్తి రావటానికి సందేహిస్తాడా? మీ సైన్యాలు వెనుదిరిగి పోవాలిసిందే.

విశేషం: ఈశ్వరు డనక ఫాలాక్షు డనటం తన్మహిమను చెప్పటం కొరకు ఫాలాక్ష శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం. 'అట మిన్నందిన యట్టివాని ..... లెక్కించుట' - ఉపమేయోపమాన వాక్యాలకు ఐక్యారోపణం చెప్పబడింది కాబట్టి అలంకారం నిదర్శన. వెనుదిరుగుతాయి అనే' దానిని 'వీఁపు సక్కనయి నిల్చు'నని భంగ్యంతరంచేత చెప్పడంచేత అలంకారం పర్యాయోక్తం.

తే. నకులు సహదేవుఁ గొని ధర్మనందనుండు । మొనసి కౌరవ బలముల ముట్టికొనఁగఁ
దలఁచి తఱి వేచి వచ్చుట ధరణినాథ! । సింగములఁ బట్టి వేఁటాడు భంగి గాదె? **175**

ప్రతిపదార్థం: ధరణినాథ= ధృతరాష్ట్ర మహారాజా!; ధర్మనందనుండు= ధర్మరాజు; నకులున్; సహదేవున్; కొని= వెంటబెట్టుకొని; మొనసి= పూని; కౌరవ బలములన్= కౌరవుల సేనలను; ముట్టికొనఁగన్+తలఁచి తఱి వేచి వచ్చుట= ఎదుర్కొన దలచి సమయం చూచి రావటం; సింగములన్+పట్టి= సింహాలను అవలంబించి వెంటతీసికొని; వేఁట+ఆడు భంగి+కాదె= వేటాడటానికి రావటం వంటిది కాదా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నకులుడినీ, సహదేవుడినీ తీసికొని ధర్మరాజు పూని కౌరవులపై దండెత్తాలని తలచి సమయం చూచి రావటం, సింహాలను తీసికొని వేటాడటానికి రావటం వంటిది కాదా?

విశేషం: వేటకాడు వేటాడటానికి వెళ్ళేటప్పుడు సాధారణంగా తనతో వేటకుక్కలను తీసికొనివెళ్ళుతాడు. అట్లాకాక సింహాలనే తీసికొని వెళ్ళటం వంటిది- ధర్మరాజు నకుల సహదేవులను తీసికొని కౌరవుల మీదకు వెళ్ళటం. వేటపని అంతా సింహాలే చేసేస్తాయి. వేటగాడిపని సులభతరం అవుతుంది. అట్లాగే యుద్ధకార్యం అంతా నకుల సహదేవులే చేసి, ధర్మరాజు పని సులభతరం చేస్తారని స్వారస్యం. ఉపమేయోపమాన వాక్యాలకు ఐక్యారోపణం చేయటం వలన అలంకారం నిదర్శన.

తే. **ద్రౌపదేయులు, నా సుభద్రా సుతుండు । నుక్కు తునియలు గారె? మి మ్మక్కుమార**
వరులఁగొని యోర్చువాఁడయి వచ్చు ధర్మ । పుత్త్రుఁ; డిది నీకుఁ జూడంగఁ బోల దెట్లు?' **176**

ప్రతిపదార్థం: ద్రౌపదేయులున్= ద్రౌపది కొడుకులూ-ఉపపాండవులూ; ఆ సుభద్రా సుతుండున్= ఆ సుభద్ర కొడుకు అభిమన్యుడూ; ఉక్కు తునియలు+కారె= ఉక్కు ముక్కలు కారా? - మహాబలవంతులు కారా; ధర్మపుత్త్రుఁడు= ధర్మరాజు; ఆ+కుమార వరులన్+కొని= ఆ కుమార శ్రేష్ఠులను తీసికొని; మిమ్మున్= మిమ్ములను; ఓర్చువాఁడు+అయి= ఓడించటానికని; వచ్చున్; చూడంగన్= ఆలోచించగా; ఇది; నీకున్; ఎట్లు+పోలదు?= ఎట్లా సంగతం కాదు?

తాత్పర్యం: ద్రౌపది కొడుకులూ, ఆ సుభద్ర కొడుకు అభిమన్యుడూ ఉక్కు ముక్కలు కారా? ధర్మరాజు ఆ కుమారశ్రేష్ఠులను వెంట బెట్టుకుని మిమ్ములను ఓడించటానికి వస్తాడు. ఆలోచించగా ఇది నీకు ఎట్లా సంగతం కాదు? - ఔననిపించటం లేదు?'

విశేషం: ద్రౌపదేయులు, ఆ సుభద్రాసుతుడు ఉక్కుతునియలు - అలంకారం రూపకం.

వ. **అని చెప్పి వెండియు నిట్లనియె :** **177**

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు :

క. **'వృష్ణి కుమారోత్తముఁ డా । కృష్ణుని తమ్ముండు సాత్యకియు, దవదహనా**
త్యుష్ణ ప్రతాపదీప్తులు । కృష్ణా సోదరులుఁ దలఁపఁ గేవలులె నృపా! **178**

ప్రతిపదార్థం: నృపా!= ధృతరాష్ట్ర మహారాజా!; వృష్ణికుమార+ఉత్తముఁడు= వృష్ణివంశకుమారులలో శ్రేష్ఠుడు; ఆ కృష్ణుడి తమ్ముండు సాత్యకియున్; దవ దహన+అతి+ఉగ్ర ప్రతాపదీప్తులు= కార్చిచ్చు యొక్క మిక్కిలి వేడియైన ప్రతాపము అనెడి ప్రతాపము (పరాక్రమము) యొక్క కాంతులైనవారు; అగు; కృష్ణా సోదరులు= ద్రౌపది సోదరులు; తలఁపన్= ఆలోచించగా; కేవలులె?= సామాన్యులా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! వృష్ణి వంశ కుమారులలో శ్రేష్ఠుడూ, ఆ కృష్ణుడి తమ్ముడూ అయిన సాత్యకీ, కార్చిచ్చు యొక్క అత్యుష్ణమైన ప్రతాపం అనే పరాక్రమం యొక్క కాంతులైనవారగు ద్రౌపదీ సోదరులు ఆలోచించగా సామాన్యులా?

విశేషం: దవదహనాత్యుష్ణ ప్రతాపదీప్తులు- ప్రతాపము (మిక్కిలి తాపము) అనెడి ప్రతాపము (పరాక్రమము)-శ్లిష్ట రూపకం. దీప్తులే అయిన కృష్ణా సోదరులు-రూపకం.

సీ. శౌర్యోజ్జ్వలుండు పాంచాల భూనాథుండు, । మహితవిక్రముఁ డగు మత్స్యవిభుఁడు
నధిక ధైర్యాన్వితు లతని తమ్ము, లుదగ్ర । తేజస్కులైన తదీయసుతులు,
నన్నదమ్ములు ప్రతాపోన్నతు లేవురు । కేకయపతులు, నక్షీణ బాహు
శక్తియుక్తులు జరాసంధ సూనుఁడు సహ । దేవుండు, నా జయత్సేన విభుఁడు

తే. వినుము శిశుపాల తనయులు వీరధనులు । ధృష్టకేతుండు వృషభుండుఁ, దీవ్రరణ వి
నోది యదుభర్త చేకితానుండు, దర్ప । ఘనుఁడు శైబ్య నృపాలుండుఁ గలరుగాదె! 179

ప్రతిపదార్థం: వినుము= ధృతరాష్ట్రా! వినుము; శౌర్య+ఉజ్జ్వలుండు= పరాక్రమంచేత ప్రకాశించేవాడు; అగు; పాంచాల భూనాథుండున్= పాంచాల దేశపురాజూ- ద్రుపదుడూ; మహిత విక్రముఁడు+అగు మత్స్య విభుఁడున్= గొప్ప పరాక్రమం కలవాడైన మత్స్యరాజు విరాటుడూ; అధిక ధైర్య+అన్వితులు+అతని తమ్ములు= ఎక్కువ ధైర్యంతో కూడినవారైన తమ్ములూ; ఉదగ్ర తేజస్కులు+ఐన తదీయ సుతులున్ అన్నదమ్ములన్= భయంకరమైన తేజస్సు గల వారగు అతడి కొడుకులూ, అన్నలూ, తమ్ములూ; ప్రతాప+ఉన్నతులు+ఏవురు కేకయ పతులున్= పరాక్రమం చేత గొప్పవారైన అయిదుగురు కేకయ వంశరాజులూ; అక్షీణ బాహు శక్తియుక్తులు= తరుగని భుజం యొక్క పరాక్రమంతో కూడినవారు; అగు; జరాసంధ సూనుఁడు సహదేవుఁడున్+ఆ జయత్సేన విభుఁడున్= జరాసంధుడి కొడుకు సహదేవుడూ, ఆ జయత్సేన రాజూ; శిశుపాల తనయులున్= శిశుపాలుడి కొడుకులూ; వీర ధనులున్= పరాక్రమమే ధనంగా కలవారు; అగు; ధృష్టకేతుండున్; వృషభుండున్; తీవ్ర రణ వినోది యదుభర్త చేకితానుండున్= తీవ్రమైన యుద్ధం చేత వినోదించే వాడైన యాదవరాజు చేకితానుడూ; దర్పఘనుఁడు= (పరాక్రమ) గర్వంచేత గొప్పవాడు అగు శైబ్యరాజూ; కలరు+కాదె!= ఉన్నారు గదా!

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. శౌర్యంచేత ప్రకాశించే ద్రుపదుడూ, గొప్ప పరాక్రమం కలవాడైన విరాటుడూ, మిక్కిలి ధైర్యంతో కూడినవారైన అతడి తమ్ములూ, గొప్ప తేజస్సు కలవారగు అతడి కుమారులూ, అన్నదమ్ములూ, పరాక్రమంచేత ఉన్నతులైన అయిదుగురు కేకయరాజులూ, తరుగని భుజ పరాక్రమంతో కూడిన జరాసంధ తనయుడు- సహదేవుడూ, ఆ జయత్సేనరాజూ, శిశుపాలుడి కుమారులూ, పరాక్రమధనులూ అయిన ధృష్టకేతు వృషభులూ, తీవ్ర యుద్ధంలో వినోదించే యాదవరాజు చేకితానుడూ, పరాక్రమగర్వంచేత ఘనుడైన శైబ్యనృపాలుడూ ఉన్నారు గదా!

క. వీరెల్లఁ బాండురాజ కు । మారుల పాటునకుఁ గుందు మనములతోడన్
వారి పగ దీర్పఁ గడఁగెడు । వారల కా, కందు లాఁతివారుం గలరే? 180

ప్రతిపదార్థం: వీరు+ఎల్లన్= వీళ్ళందరూ; పాండు రాజ కుమారుల పాటునకున్= పాండవుల కష్టానికి; కుందు మనములతోడన్= దుఃఖించే మనస్సులతో; వారి పగ+తీర్పన్= వారి పగదీర్చటానికి; కడఁగెడు వారలు+అ కాక= ప్రయత్నించేవాళ్ళేకాని; అందున్= అక్కడ; లాఁతివారున్+కలరే?= వేరేవాళ్ళు కూడా ఉన్నారా?

తాత్పర్యం: ఈ వీరులందరూ పాండవుల ఆపదకు దుఃఖించే మనస్సులతో ప్రతీకారం చేసి వాళ్ళ పగదీర్చటానికి ప్రయత్నించేవాళ్ళే కాని వేరేవాళ్ళు ఎవరూ లేరు.

వ. భీమసేనసూనుండు ఘటోత్కచుండు తండ్రికంటెను లావును బీరంబునుం గలవాఁడు, మాయాబలంబున మనబలంబు నెల్లం గలంచు; మఱియును దూర్పున నుత్తరంబునం గలుగు నరనాయకులు నానా సేనా సమన్వితులయి వచ్చి చిచ్చయిననుం బిడికిలింత మనుచున్నవా; రదియునుంగాక. 181

ప్రతిపదార్థం: భీమసేన సూనుండు= భీముడి కొడుకు; ఘటోత్కచుండు; తండ్రికంటెను; లావును= బలమూ; బీరంబునున్= పరాక్రమమూ; కలవాఁడు; మాయా బలంబునన్= మాయా శక్తితో; మన బలంబున్+ఎల్లన్= మన సేననంతనూ; కలంచున్= చీకాకుపరుస్తాడు; మఱియును; తూర్పునన్; ఉత్తరంబునన్; కలుగు నర నాయకులు= ఉన్న రాజులు; నానా సేనా సమన్వితులు+ అయి వచ్చి= అనేక సేనలతో కూడినవారయి వచ్చి; చిచ్చు+అయిననున్+పిడికిలింతము+అనుచున్+ఉన్నవారు= నిప్పయినా పిడికిట్లో పట్టుకుందాం అంటున్నారు; అదియునున్+కాక-

తాత్పర్యం: భీముడి కొడుకు ఘటోత్కచుడు తండ్రికన్నా బలపరాక్రమాలు కలవాడు. మాయాబలంచేత మన సైన్యాన్నంతనూ చీకాకు పరుస్తాడు. ఇంకా తూర్పునా, ఉత్తరానా ఉన్న రాజులు అనేక సేనలతో వచ్చి అగ్గి నయినా సరే పిడికిట పట్టుకుందాం అంటున్నారు. అదీకాక.

విశేషం: చిచ్చయిననుం బిడికిలింతము- ఎంత కష్టం వచ్చినా సహిద్దాం - అలంకారం అతిశయోక్తి.

క. సకల భువనములు నఱ చే । తికిఁ దేరంజాలు నట్టి ధీమంతుఁడు దే
వకి కొడుకు గలఁడు ధర్మజు । నికి; నాతం డెత్తి రాక నిలుచునె యధిపా?' 182

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; సకల భువనములున్= ఎల్ల లోకాలూ; అఱ చేతికిన్; తేరన్+చాలు+అట్టి= తేగలిగే; ధీమంతుఁడు= బుద్ధిమంతుడు - శక్తి మంతుడు; దేవకి కొడుకు= దేవకి కొడుకు- శ్రీకృష్ణుడు; ధర్మజునికిన్= ధర్మరాజుకు; కలఁడు= ఉన్నాడు; ఆతండు= ఆ ధర్మరాజు; ఎత్తి రాక నిలుచునె?= దండెత్తకుండా ఉంటాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! లోకాల నన్నిటినీ అరచేతిలోకి తీసికొని రాగలిగే శక్తి సంపన్నుడు దేవకి కొడుకు శ్రీకృష్ణుడు ధర్మరాజుకున్నాడు. ఇంక ఆ ధర్మరాజు దండెత్తి రాకుండా ఉంటాడా?'

విశేషం: 'సకల భువనములు నఱచేతికిఁ దేరం జాలునట్టి' - లోకాల నన్నిటినీ తన చెప్పుచేతులలో పెట్టుకొనగల.

వ. అని చెప్పిన సూతపుత్త్రునకు నంబికాపుత్త్రుం డిట్లనియె: 183

ప్రతిపదార్థం: అని; చెప్పిన; సూత పుత్త్రునకున్= సంజయుడికి; అంబికా పుత్త్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికిన సంజయుడితో ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు.

ధృతరాష్ట్రుండు భీమసేనాదుల పరాక్రమంబు దలంచి దుఃఖించుట (సం. 5-50-1)

క. 'వారి దెస నీదు సెప్పిన । యా రథికులు ప్రబలు లగుదు రందఱు; నైనన్
వా రెల్లను నొకతల, య । మ్మారుతి యొకతల బలప్రమాణము సూడన్. 184

ప్రతిపదార్థం: వారి దెసన్= వారి పక్షంలో; నీదు+చెప్పిన ఆ రథికులు= నీవు పేర్కొన్న ఆ రథికులు; అందఱున్, ప్రబలులు+అగుదురు= మిక్కిలి బలవంతులవుతారు; ఐనన్= అయినా; బల ప్రమాణము+చూడన్= బలపరిమితి చూస్తే; వారు+ఎల్లరున్= వాళ్ళందరూ; ఒక తల= ఒక ఎత్తు; ఆ+మారుతి+ఒక తల= ఆ భీముడు ఒక ఎత్తు.

తాత్పర్యం: పాండవపక్షంలో నీవు చెప్పిన ఆ రథికులందరూ మిక్కిలి బలవంతులే. అయినా బలపరిమితి చూస్తే వాళ్ళంతా ఒక ఎత్తు, ఆ భీము డొక్కడూ ఒక యెత్తు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుడి అంచనా. పాండవవీరులందరూ ఒక ఎత్తు. భీముడొక్కడూ ఒక్క ఎత్తు. ఇది అతడి దృక్కోణం. భీముడే కౌరవులను సంహరిస్తానని ప్రతినబూనాడు. చేసిన ప్రతిజ్ఞను నిర్వహించి తీరుతాడు. అంతే కాదు. తనమీదకు వచ్చిన శత్రువులను మట్టుపెట్టటం, వ్యూహాలను భగ్నం చేయటం అతడి సాహసవృత్తి. భీముడు ధృతరాష్ట్రుడికి సింహస్వప్నం వంటివాడు. (సంపా.)

ఉ. భీముఁ దలంచినన్ మనము భీతిఁ గలంగుచునుండు నాకు, రే
లేమియు నిద్ర రా; దతని నేడ్తెఱ మార్కొనఁ జాలునట్టి వాఁ
డీ మొన లేఁ; డతం డలుక నెత్తిన యా గద కాలదండ; ము
ద్దామ విలాసుఁడై కురు కదంబములో విహరింపకుండునే? 185

ప్రతిపదార్థం: భీమున్= భీముడిని; తలంచినన్= తలచుకొంటే; నాకున్; మనంబు= మనస్సు; భీతిన్= భయంతో; కలంగుచున్+ ఉండున్= కలత చెందుతూ ఉంటుంది; రేలు= రాత్రులు; ఏమియున్ నిద్ర రాదు= కొంచెం కూడా నిద్ర పట్టదు; అతనిన్= ఆ భీముడిని; ఏడ్తెఱన్= పరాక్రమంతో; మార్కొనన్+చాలు+అట్టివాఁడు= ఎదురుకొనగలిగేవాడు; ఈ మొనన్= ఈ సేనలో; లేఁడు; అతండు+ఆ భీముడు; అలుకన్= కోపంతో; ఎత్తిన ఆ గద= ఎత్తి పట్టుకొన్న ఆ గదాయుధం; కాల దండము= యమ దండం; ఉద్దామ విలాసుఁడు+ఐ= విశృంఖలమైన లీల గలవాడయి; కురు కదంబములోన్= కౌరవుల సమూహంలో; విహరింపక+ ఉండునే?= విహరించకుండా ఉంటాడా?

తాత్పర్యం: భీముడిని తలచుకొంటే నాకు గుండె బేజారెత్తిపోతూ ఉంటుంది. రాత్రులు కొంచెమయినా నిద్రపట్టదు. అతడిని పరాక్రమంతో ఎదురుకొనగలవాడు ఈ సైన్యంలో లేడు. అతడు కోపంతో ఎత్తిన గదాదండం యమదండమే. అతడు అడ్డులేకుండా కౌరవ సమూహంలో విహరించకుండా ఉంటాడా?

విశేషం: 'ఆ గద కాలదండము' - అలంకారం రూపకం. భీముడి వలన గ్రుడ్డిరాజు పొందే భయభావాన్ని రమణీయంగా తిక్కన చిత్రించాడు. భీముడి వలని భయం వలన మనస్సు కలతచెందటం అనుభావం. రాత్రిళ్ళు నిద్రపట్టకపోవటం సాత్త్వికభావం. నిరంతరం మేల్కొని భీముడిని గురించే ఆలోచిస్తూ ఉంటే అతడిని ఎదుర్కొనే వీరుడు కౌరవపక్షంలో లేడని స్పష్టమవుతుంది. దాని వలన మరణభీతి కలుగుతుంది. ఆ భావమే భీముడి గదను యమదండంగా భావింపజేస్తుంది. దానితో గుండె పగిలినంత పని ఔతుంది. కౌరవ సమూహంలో అతడు దండధారి అయిన యముడివలె విహరిస్తున్నట్లుగా మనోరంగంలో గోచరిస్తుంది. స్మరణ రూపమైన ఈ ఊహాచిత్రం భావరమణీయం. (సంపా.)

తే. చిఱుతనాఁడును వాఁడు నాశిక్షఁ బోఁడు; । వీరు చివ్వకుఁ జొత్తురు వైర మెత్తి;
వానిచేఁ బీడ వడియును మాన; రిదియ । కాదె యీ భేదమున కెల్లఁ గారణంబు. 186

ప్రతిపదార్థం: వాఁడు= ఆ భీముడు; చిఱుత నాఁడును= చిన్నప్పుడు కూడా; నా శిక్షన్+పోఁడు= నేను చెప్పినట్లు వినడు; వీరు= ఈ కౌరవులు; వైరము+ఎత్తి= పగపెట్టుకొని; చివ్వకున్+చొత్తురు= కయ్యానికి పూనుకొంటారు; వానిచేన్= ఆ భీముడి చేత; పీడ+పడియును= బాధ పొందికూడా; మానరు= పగ విడువరు; ఈ భేదమునకున్+ఎల్లన్= ఈ కురుపాండవ వైరాని కంతకూ; కారణంబు; ఇది+అ+కాదె!= ఇదే కదా!

తాత్పర్యం: ఆ భీముడు చిన్నప్పుడు కూడా నా మాట వినేవాడు కాడు. వీళ్ళు పగబూని కయ్యానికి కాలు ద్రవ్వుతారు. వాడిచేత బాధ పొందికూడా పగ విడవరు. ఈ కౌరవ పాండవ వైరానికంతకూ మూలకారణం ఇదే కదా!

క. సమరమున దైత్య దానవ । సమితియు నాతని నెదుర్పఁ జాలదు; భుజయు
ద్ధమున జరాసంధుని నొక । నిమిషంబునఁ జంపె; నొరులు నిలుతురె యెదురన్? 187

ప్రతిపదార్థం: సమరమునన్= యుద్ధంలో; దైత్య దానవ సమితియున్= రాక్షస జాతుల సమూహం కూడా; ఆతనిన్= ఆ భీముడిని; ఎదుర్పన్+చాలదు= ఎదిరించ లేదు; భుజ యుద్ధమునన్= బాహుయుద్ధంలో; జరాసంధునిన్; ఒక నిమిషంబునన్+ చంపెన్= ఒక్క రెప్పపాటుకాలంలో చంపాడు; ఒరులు= ఇతరులు; ఎదురన్= ఎదురుగా; నిలుతురె?= నిలబడగలరా?

తాత్పర్యం: యుద్ధంలో రాక్షస జాతుల సమూహం కూడా ఆ భీముడిని ఎదిరించలేదు. బాహుయుద్ధంలో అతడు జరాసంధుడిని ఒక్క రెప్పపాటు కాలంలో చంపాడు. ఇంక ఇతరులు ఎదుట నిలబడతారా?

విశేషం: 'భుజ యుద్ధమున .... యెదురన్' కైముత్యం చేత అర్థ సంసిద్ధి జరుగుతున్నది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

మ. బొమ లల్కన్ ముడివడ్డ, రౌద్రరస ముప్పొంగం, దనర్పన్ భుజా
గ్రము, 'లిందెవ్వఁడు నాకు మా' ఱనుచు శౌర్యస్ఫూర్తి శోభిల్ల దు
ర్దమ లీలం గదియంగ, భీముఁ గని ధైర్యం బేది కౌరవ్యసై
న్యము లంతంతఁ గలంగఁ బాఱినటులై నా మోమునన్ వ్రేలెడిన్. 188

ప్రతిపదార్థం: బొమలు= కనుబొమలు; అల్కన్= కోపంతో; ముడి+పడ్డన్= ముడిపడగా; రౌద్ర రసము+ఉప్పొంగన్= రౌద్ర రసం పొంగి పొరలగా; భుజ+అగ్రములు= భుజాల కొనలు; తనర్పన్= పొంగగా; ఇందున్= ఈ కురుసేనలో; ఎవ్వఁడు; నాకున్; మాఱు+అనుచున్= ఎదురంటూ; శౌర్యస్ఫూర్తి= పరాక్రమ ప్రకాశం; శోభిల్లన్= ప్రకాశించగా, ఒప్పగా; దుర్దమ లీలన్= అణచరాని విధంగా; కదియంగన్= సమీపించగా; భీమున్; కని; కౌరవ్య సైన్యములు= కురుసేనలు; ధైర్యంబు+ఏది= ధైర్యం నశించి; అంతంతన్= క్రమక్రమంగా; కలంగన్+పాఱిన+అటులు+ఐ= కలత చెందిన విధమై; నా మోమునన్, వ్రేలెడిన్= నా కళ్ళకు కట్టినట్లున్నాయి.

తాత్పర్యం: కోపంతో కనుబొమలు ముడిపడగా, రౌద్రరసం పొంగి పొరలగా, భుజాల కొనలు పొంగగా, ఈ కురుసేనలో నాకు ఎదురెవ్వడు అంటూ పరాక్రమం ఒప్పగా, అణచరాని విధంగా సమీపించే భీముడిని చూచి ధైర్యం నశించి కౌరవసైన్యాలు కలత చెందినట్లై, నా కళ్లకు కట్టినట్లున్నాయి.

విశేషం: రౌద్రరసమూర్తి అయిన భీముడి ఆంగికాభినయం శత్రువుల హృదయాలపై అంతటి భయముద్రను వేసిందన్నమాట! కళ్ళున్నవాళ్ళు కళ్ళు మూసికొని చూచినా భయపడతారు. ఇక గ్రుడ్డిరాజు మనోనేత్రంతో దర్శించి లోలోననే హడలిపోతున్నాడు. (సంపా.)

క. కరవాలము గద మొదలగు । పరికర మేమియును లేక బాహుబలమునం
గరి గతి నడరినను వృకో । దరునకు నొకఁ డెదుర నిలిచి తలపడువాఁడే? 189

ప్రతిపదార్థం: కరవాలము= కత్తి; గద, మొదలు+అగు; పరికరము= సాధనం; ఏమియును-లేక; బాహు బలమునన్= భుజబలంతో; కరి గతిన్= ఏనుగువలె; అడరినను= విజృంభిస్తే; వృకోదరునకున్= భీముడికి; ఒకఁడు; ఎదురన్; నిలిచి; తలపడువాఁడే;= ప్రతిఘటించగలడా?

తాత్పర్యం: కత్తి, గద మున్నగు సాధన సామగ్రి ఏమీ లేకుండానే కేవలం భుజబలంతో ఏనుగువలె విజృంభించినా భీముడి ఎదుట నిలబడి ఎవడైనా ప్రతిఘటించగలడా?

విశేషం: భీముడికి ఇక్కడ వృకోదరుడు (వృకము= తోడేలు ఉదరం వంటి ఉదరం గలవాడు) అనే శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

తే. ప్రళయకాల సముద్రము భంగిఁ బొంగి । కడు భయంకరుఁడగు భీముఁ గడవ నీఁద
వశమె నా పుత్త్రులకు? విధివశము వొంది । యెదిరిఁ దమ్మును నెఱుఁగరు మదము కతన. 190

ప్రతిపదార్థం: ప్రళయ కాల సముద్రము భంగిన్= ప్రళయ సమయంలోని సముద్రంవలె; పొంగి, కడున్= మిక్కిలి; భయంకరుఁడు+ అగు భీముని= వెరపు గొలిపే భీముడిని; కడవన్+ఈఁదన్= దాటేటట్లు ఈదటానికి; నా పుత్త్రులకున్= నా కుమారులకు; వశమె?= తరమా?; విధి వశము+పొంది= విధి వశం చేత; మదము కతనన్= గర్వం క్రొవ్వు కారణంగా; ఎదిరిన్+తమ్మునున్= ఎదుటివాళ్ళనూ; తమనూ; ఎఱుఁగరు.

తాత్పర్యం: ప్రళయ సమయంలో సముద్రంవలె పొంగి మిక్కిలి వెరపు గొలిపే భీముడిని తరించేటట్లు ఈదటానికి నా కుమారులకు శక్యమా? విధి వశంచేత, మదం కొద్దీ, ఎదుటివాళ్ళనూ తమనూ ఎరగరు.

విశేషం: 'ప్రళయ కాల సముద్రము భంగిన్' - అలంకారం ఉపమ.

క. చిచ్చునకుఁ దోడు కరువలి । వచ్చు గతిన్ భీము దుర్నివార విహారం
బచ్చు పడఁగఁ బ్రాపై వి । వ్వచ్చుఁడు వెస వచ్చు గాండివంబును దానున్. 191

ప్రతిపదార్థం: చిచ్చునకున్= అగ్నికి; తోడు= సహాయం(గా); కరువలి= గాలి; వచ్చు గతిన్= వచ్చే విధంగా; భీము దుర్నివార విహారంబు= భీముడియొక్క అడ్డగించ శక్యం కాని విహారం; అచ్చు పడఁగన్= తెల్లమయ్యేటట్లు; ప్రాపు+ఐ= అండయై-తోడయి; వివ్వచ్చుఁడు= బీభత్సుడు- అర్జునుడు; గాండివంబును+తానున్= గాండీవమూ; తానూ- గాండీవ సహితుడై; వెసన్= శీఘ్రంగా; వచ్చున్.

తాత్పర్యం: అగ్నికి వాయువు తోడయినట్లు, భీముడి అనివార్యమైన యుద్ధ విహారం బాగా తెలిసేటట్లు, అతడికి అండగా అర్జునుడు గాండీవంతో శీఘ్రంగా వస్తాడు.

విశేషం: 'చిచ్చునకుఁ దోడు కరువలి వచ్చుగతిన్... విన్వచ్చుఁడు వెసవచ్చు.' అలంకారం ఉపమ. ధృతరాష్ట్రుడికి కూడా అభిమానంలో దుర్యోధను డొక్కడూ ఒక ఎత్తు; మిగిలిన వారందరూ మరొక ఎత్తు. అందుకే దుర్యోధనుడిని, అతడి సోదరులనూ చంపే భీముడు మొదటి స్థానంలో జ్ఞాపకం వస్తాడు. ఆ తరువాత భీష్మ, ద్రోణ, కర్ణాది వీరులనందరినీ చంపగలిగిన అర్జునుడు మేటివీరుడైనా తరువాత లెక్కకు వస్తాడు. ఇది సహజం. (సంపా.)

వ. సంజయా! వినుము; నీ కున్న రూపు సెప్పెద. 192

తాత్పర్యం: సంజయా! నీకు ఉన్న సంగతి చెపుతాను. వినుము.

క. ఆ యర్జును మగఁటిమి కెన । యే యుగములఁ జూడ వినఁగ నెందును గలదే?
నీ యెదుర నాడి నంతయుఁ । జేయుట కతఁ డోపు; రిత్త సెప్పెడువాఁడే? 193

ప్రతిపదార్థం: ఆ+అర్జును మగఁటిమికిన్= ఆ అర్జునుడి పరాక్రమానికి; ఎన= సాటియైనవాడు; ఏ యుగములన్= ఏయుగాలలోనైనా- ఏ కాలంలోనైనా; ఎందును= ఎక్కడైనా; చూడన్ వినఁగన్= చూడడానికీ, వినడానికీ; కలఁడే?= ఉన్నాడా? అతఁడు; నీ+ఎదురన్= నీ ఎదురుగా; ఆడిన+అంతయున్= చెప్పినదంతా; చేయన్+ఓపున్= చేయటానికి సమర్థుడు; రిత్త+చెప్పెడు వాఁడే?= ఊరికే చెప్పేవాడా?

తాత్పర్యం: ఆ అర్జునుడికి పరాక్రమంలో సాటియైనవాడు ఏ యుగాలలోనైనా, ఎక్కడైనా ఉన్నాడని చూచామా, విన్నామా? అతడు నీ యెదుట అన్నదంతా చేయగల సమర్థుడు. ఊరికే అనేవాడా?

విశేషం: అర్జునుడు కూడా అన్నంత పనిచేస్తాడని భయం. (సంపా.)

ఉ. ఎక్కటి గాండివంబు నుతికెక్కి వెలుంగుట! మీఁదఁ గేశవుం
డక్కజమైన తేజ! మది యాసపడండు, దనంత నర్జునుం
డొక్కఁడ వైరిసేనలకు నొట్టిన మంట! ప్రతాపమూర్తు లి
ట్లొక్కెడఁ గూడె, నిన్నిటి మహోగ్రపు వేఁడిమి కోర్వవచ్చునే? 194

ప్రతిపదార్థం: ఎక్కటి గాండివంబు= సాటిలేని గాండీవం; నుతికిన్+ఎక్కి వెలుంగుట= పొగడ్తకెక్కి ప్రకాశించటం; మీఁదన్= ఆపైన; కేశవుండు= కృష్ణుడు; అక్కజము+ఐన తేజము= ఆశ్చర్యకరమైన తేజస్సు; అది, ఆసపడండు= దానికొరకు ఆశపడడు; తన+అంతన్= స్వయంగా; అర్జునుండు+ఒక్కఁడు+అ= అర్జునుడొక్కడే; వైరి సేనలకున్= శత్రుసేనలకు; ఒట్టిన మంట= మండే మంట; ఇట్లు= ఈవిధంగా; ప్రతాపమూర్తులు= తేజోమూర్తులు మూడు- గాండీవం, కృష్ణుడు, అర్జునుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; కూడెన్= కలిశాయి; ఇన్నిటి మహా+ఉగ్రపు(ము)+వేఁడిమికిన్= ఈ మూడిటి మిక్కిలి భయంకరమైన వేడిమికి; ఓర్వన్+వచ్చునే?= సహించ శక్యమా?

తాత్పర్యం: సాటిలేని గాండీవం పొగడ్తకెక్కేటట్లు వెలుగుతూంటుంది. ఆపైన కృష్ణుడు ఇంకో ఆశ్చర్యకరమైన తేజస్సు. ఆ తేజస్సును అర్జునుడు ఆశించడు. తనకు తాను అర్జును డొక్కడే శత్రుసైన్యాలకు మండుతున్న మంట.

ఈ విధంగా ప్రతాపమూర్తులు మూడూ ఒక్కచోట కూడాయి. ఇన్ని ప్రతాపాల భయంకరమైన వేడిని తట్టుకో తరమా?

విశేషం: అలం: రూపకం, శ్లేష, సార్థక శబ్ద ప్రయోగం వలన ఈ పద్యంలో 'ప్రతాపమూర్తు లిట్లొక్కెడఁ గూడెన్' అనే వాక్యం ప్రాణం. ప్రతాపమూర్తులంటే పరాక్రమమూర్తులనీ, ప్రకాశమానులనీ, అధికంగా తాపం కలిగించే వారనీ రెండర్థాలు స్ఫురిస్తాయి. వీరులనీ అగ్నులనీ తాత్పర్యం. ఇక్కడ యుద్ధ యజ్ఞ త్రేతాగ్నులని కూడా ధ్వని. గాండీవం ఒక తేజస్సు. కృష్ణు డొక తేజస్సు, అర్జును డొక తేజస్సు. అర్జునుడు గాండీవ తేజస్సునే గ్రహిస్తాడు. కాని, కేశవ తేజాన్ని గ్రహించడు. అందువలన కేశవార్జునులు స్వతంత్ర తేజస్సులు. అవి మహోగ్ర భావాన్ని చెందినప్పుడు కలిగే 'వేడిమి'కి ఇతరులు తట్టుకొనటం కష్టం. వేడిమి అంటే కోపం, పౌరుషం అనీ, వెచ్చదనమనీ అర్థాలున్నాయి. అందువలన ఇందులో ధ్వనిమయంగా త్రేతాగ్ని రూపకం సార్థకంగా రాణించింది. ఆ ముచ్చిచ్చు మృత్యువు వంటిదని గ్రుడ్డిరాజు భయం. (సంపా.)

క. దివిజ దనుజ సహితము లగు । భువనము లన్నిట మహేంద్ర పుత్త్రుఁడు విజయో
త్సవ లీలఁ గ్రీడ సల్పుం; । దవులం బడఁడెందు నత్యుదగ్ర బలమునన్.' 195

ప్రతిపదార్థం: మహేంద్ర పుత్త్రుండు= మహేంద్రుడి కొడుకు- అర్జునుడు; దివిజ దనుజ సహితములు+అగు భువనములు+అన్నిటన్= దేవతలతోనూ; రాక్షసులతోనూ కూడినవైన లోకాలన్నిటా; విజయ+ఉత్సవ లీలన్= గెలుపు వేడుకల విలాసంతో; క్రీడ+చల్పున్= విహరిస్తాడు; అతి+ఉదగ్ర బలమునన్= మిక్కిలి భయంకరమైన బలం వలన; ఎందున్= ఏ భువనంలోనూ; తవులంబడఁడు= అరికట్టబడడు.

తాత్పర్యం: అర్జునుడు సురాసుర సహిత లోకాలన్నిటిలోనూ విజయోత్సవలీలలతో విహరిస్తాడు. మిక్కిలి భయంకరమైన బలం ఉండటం వలన అతడు ఏ లోకంలోనూ అరికట్టబడడు.'.

వ. అని పలికి వెండియు. 196

తాత్పర్యం: అని పలికి, మళ్ళీ.

క. 'కురుసేనఁ గదా! గెలుచుట । కరము భరం బర్జునునకు! గాండీవమునం
బెరిఁగిన యమ్ముల మంటలు! దరికొని తెగఁ గాల్చునట్టిద యగుం జుమ్మీ! 197

ప్రతిపదార్థం: కురు సేనన్+కదా!= కౌరవ సైన్యాన్ని కదా!; అర్జుననకున్; గెలుచుట; కరము భరంబు= మిక్కిలి కష్టం!; (ఇది విపరీతార్థ ద్యోతకం); గాండీవమునన్= గాండీవంలో; పెరిఁగిన= వృద్ధి పొందిన; అమ్ముల మంటలు+అ= బాణాల మంటలే; దరికొని= విజృంభించి; తెగన్+కాల్చు+అట్టిది+అ= నిశ్శేషంగా కాల్చేదే; అగున్+చుమ్మీ!= అవుతుంది సుమీ!

తాత్పర్యం: కౌరవ సైన్యాన్నా! గెలవటం అర్జునుడికి చాలా(వింత) కష్టం! గాండీవంలో వృద్ధిపొందిన బాణాల మంటలే విజృంభించి, దానిని నిశ్శేషంగా దహించేవి అవుతాయి సుమీ!

విశేషం: 'గెలుచుట కరము భరం బర్జునునకు' ఏమీ భరం కాదనే విపరీతార్థమే ఇక్కడ గ్రాహ్యం.

వ. భీమార్జునుల కొలందులు భీష్మద్రోణు లెఱుంగునంతకంటె నెవ్వ రెఱుంగుదు? రెఱింగియు మానుషంబు వాటించి సేన మొగంబున నిలుతురు; కీర్తి వట్టి ప్రాణంబులు విడుతు; రంతియకాని చేయునది లే; దదియునుం గాక పౌత్రులగుటయు శిష్యు లగుటయు, గాంగేయునకు గురునకు సామాన్యం బగుటం జేసి, రెండు దెఱంగుల వారికి వీ రొక్కరూప; మన కడనున్న తప్పునకు మనముందట నిలువవలయునను నింత మాత్రకుంగా వీరల కింత వలసె; నేను దైవాధీనత కతంబున బిడ్డల నొత్తి చెప్పను, నియమింపనుం జాల; మొదల విదురుం డేమని చాటి చెప్పి నదియంతయుం బాటిలె; జూదంబు నాఁటనుండియుఁ గురుజాతికిం జేటు మూఁడుట దోఁచుచుండు; మంద బుద్ధియు, లోభోపహతుండును నయి దురభిలాషంబున దుర్యోధనుఁ డింతసేసెఁ; గాలపర్యాయంబునఁ గౌరవులకుఁ గడవరాని యవస్థ వచ్చె; సంజయా! నే నేమి సేయుదు? నెందుఁ జొత్తు? నెద్ది దెరు? వెవ్వరు శరణంబు? వా రిరువురుఁ గల యంతటన పోయెనే? విను' మని మఱియు నిట్లనియె:' 198

ప్రతిపదార్థం: భీమ+అర్జునుల కొలందులు= భీమార్జునుల శక్తులు; భీష్మ ద్రోణులు ఎఱుంగు+అంతకంటెన్= భీష్మ ద్రోణులకు తెలిసినదానికంటె; ఎవ్వరు+ఎఱుంగుదురు?= ఎవరికి తెలుసు?; ఎఱింగియున్= తెలిసికూడా; మానుషంబు+ పాటించి= అభిమానం వహించి; సేన మొగంబునన్= సేన అగ్రభాగాన; నిలుతురు= ఉంటారు; కీర్తి+పట్టి= కీర్తి నవలంబించి- కీర్తే ముఖ్యమని; ప్రాణంబులు; విడుతురు; అంతియకాని; చేయు+అది లేదు; అదియునున్+కాక; పౌత్రులు+అగుటయున్= మనుమలు కావటం; శిష్యులు+అగుటయున్= శిష్యులు కావటం; గాంగేయునకున్= భీష్ముడికీ; గురునకున్= ద్రోణుడికీ; సామాన్యంబు+అగుటన్+చేసి= సమానమవటం చేత; రెండు+తెఱంగులవారికిన్= ఇరు పక్షాలవారికీ; వీరు; ఒక్క రూపు+అ= ఒక్కటే; మన కడన్+ఉన్న తప్పునకున్= మన దగ్గరనున్న దోషానికి; మన ముందటన్ నిలువ వలయున్+అను+ఇంత మాత్రకున్+కాన్= మన ముందు నిలిచి తీరాలనే ఈ మాత్రానికే కదా; వీరలకున్+ఇంత వలసెన్= వీళ్ళకింత కావలసి వచ్చింది; నేను; దైవ అధీనత కతంబునన్= విధివశం చేత; బిడ్డలన్+ఒత్తి చెప్పనున్, నియమింపనున్+చాలన్= పిల్లలకు గట్టిగా చెప్పడానికీ, వాళ్ళను ఆజ్ఞాపించటానికీ సమర్థుడినీ కాను; మొదలన్= ఆదిలో; విదురుండు; ఏమి+అని చాటి చెప్పెన్= ఏమని విశదంగా చెప్పాడో; అది+అంతయున్+పాటిలెన్= అదంతా జరిగింది; జూదంబు నాఁటన్+ఉండియున్= జూద మప్పటినుండీ; కురుజాతికిన్= కౌరవులకు; చేటు మూఁడుట తోఁచుచున్+ఉండున్= కీడు వాటిల్లుతున్నదని అనిపిస్తూంటుంది; మందబుద్ధియున్= తెలివిమాలినవాడూ; లోభ+ఉపహతుండునున్= దురాశా దూషితుడూ; అయి, దురభిలాషంబునన్= దుష్టవాంఛతో; దుర్యోధనుఁడు; ఇంత+చేసెన్; కాల పర్యాయంబునన్= కాల భ్రమణంలో; కౌరవులకున్; కడవన్+రాని అవస్థ= దాటరాని దుస్థితి; వచ్చెన్; సంజయా!; నేను+ఏమి చేయుదున్; ఎందున్+చొత్తున్= ఎక్కడికి వెళ్ళుతాను?; ఎద్ది తెరువు?= ఏది మార్గం?; ఎవ్వరు - శరణంబు?= ఎవరు దిక్కు?; వారు+ఇరువురున్= ఆ భీమార్జును లిద్దరూ; కల+అంతటన్+అ+ పోయెనే?= ఉండటంతోనే అయిపోయిందా; వినుము+అని; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీమార్జునుల శక్తులు భీష్మ ద్రోణులకు తెలిసినదానికంటె ఎవరికీ తెలియదు. తెలిసి కూడా, అభిమానం వహించి వాళ్ళు మన సేనా ముఖంలో నిలుస్తారు. కీర్తే ముఖ్యమనుకొని ప్రాణాలు విడుస్తారు. ఇంతేకాని చేసేది లేదు. అదీగాక మనుమలు కావడమూ, శిష్యులు కావటమూ భీష్మద్రోణులకు సమానమవటం చేత, వీళ్ళు ఇరు పక్షాలవారికీ ఒక్కటే. మన దగ్గర ఉన్న దోషానికి మనముందు నిలిచితీరాలనే ఈ మాత్రానికే కదా వీళ్ళ కింత కావలసి వచ్చింది! నేను విధివశంచేత బిడ్డలకు నొక్కి చెప్పటంగాని, ఇట్లా నడవండి ఇట్లా నడవకండి అని అజ్ఞాపించటంగాని చేయలేకపోతున్నాను. ఆదిలో విదురు డెట్లా జరుగుతుందని విశదంగా చెప్పాడో, అట్లాగే జరిగింది. జూద

మప్పటినుండి కౌరవులకు కీడు జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. తెలివిమాలినవాడూ, దురాశా దూషితుడూ అయి దుష్టవాంఛతో దుర్యోధనుడు ఇంత పని చేశాడు. కాలభ్రమణంలో కౌరవులకు దుస్తరమైన దురవస్థ తటస్థించింది. సంజయా! నే నేమి చేస్తాను? ఎక్కడికి పోతాను? ఏది దారి? ఎవరు దిక్కు? ఆ భీమార్జునులు ఇద్దరూ ఉండటంతోనే అయిపోయిందా? వినుము.' అని ఇంకా ఇట్లా అన్నాడు:

చ. 'అనుజులు నట్టి వార; ద్రుపదాది సుహృజ్జను లెల్ల నంతకం
టెను బలవంతు; లాహవ పటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు; స
ద్వినయ వివేక శీలముల విశ్రుతుఁ డాతఁడు బంధు భృత్యులం
దనకు వశంబు సేసికొనుదానికి నేర్చుఁ బ్రభుత్వ సంపదన్. 199

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములు కూడా; అట్టివారు+అ= అంతటివాళ్ళే; ద్రుపద+ఆది సుహృద్+జనులు+ఎల్లన్= ద్రుపదుడు మొదలైన మిత్రులందరూ; అంతకంటెను బలవంతులు; రాజు యుధిష్ఠిరుండు= రాజయిన ధర్మరాజు; ఆహవ పటిష్ఠుఁడు= యుద్ధంలో మిక్కిలి గట్టివాడు; సత్+వినయ వివేక శీలములన్= మంచి వినయం, వివేకం, స్వభావమూ అనే వాటిచేత; విశ్రుతుఁడు= ప్రసిద్ధుడు; ఆతఁడు= ఆ ధర్మరాజు; ప్రభుత్వ సంపదన్= ప్రభుత్వపు కలిమి చేత- ప్రభువు అవటం చేత; బంధు భృత్యులన్= చుట్టాలనూ, సేవకులనూ; తనకున్ వశంబు+చేసికొనుదానికిన్+నేర్చున్= తనకు అధీనులను చేసుకొనటం తెలిసినవాడు.

తాత్పర్యం: ఆ భీమార్జునుల తమ్ములు - నకుల సహదేవులు కూడా అంతటివాళ్ళే. ద్రుపదుడు మొదలుగా గల స్నేహితులందరూ అంతకంటె బలవంతులు. రాజైన యుధిష్ఠిరుడు యుద్ధంలో చాలా గట్టివాడు. మంచి వినయమూ, వివేకమూ, శీలమూ అనే వాటిచేత ప్రసిద్ధుడు. అతడు ప్రభువవటంచేత బంధువులనూ, సేవకులనూ తనకు స్వాధీనులను చేసికొనటం తెలిసినవాడు.

విశేషం: 'ఆహవ పటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు'- ఇక్కడ యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

ఆ. సత్య శౌచ ధర్మశాలి దయాపరుం। డట్టి ధర్మపుత్త్రు నాక్రమింప
మనము దలఁచు టెల్ల మంటలో మిడుత లు। దగ్రవృత్తి నుఱుకఁ దలఁచునట్ల. 200

ప్రతిపదార్థం: సత్య శౌచ ధర్మశాలి= సత్యమూ, శుచిత్వమూ, ధర్మమూ అనే వాటిచేత ఒప్పేవాడు; దయాపరుండు= దయా స్వభావుడు; అట్టి ధర్మపుత్త్రున్= అటువంటి ధర్మరాజును; మనము= మనం; ఆక్రమింపన్+తలఁచుట+ఎల్లన్= ఆక్రమించాలనుకొనటం అంతా; మిడుతలు; మంటలోన్; ఉదగ్రవృత్తిన్= గర్వంతో; ఉఱుకన్+తలఁచు+అట్లు+అ= ఉరకాలనుకొనటం వంటిదే.

తాత్పర్యం: సత్యమూ, శుచిత్వమూ, ధర్మమూ అనేవాటితో ఒప్పేవాడు. అటువంటి ధర్మరాజును మనం ఆక్రమించా లనుకొనటం అంతా - మిడుతలు గర్వంతో మంటలో ఉరకా లనుకొనటమే.

విశేషం: ఇందులో ఉపమేయ వాక్యానికీ (ధర్మపుత్త్రు నాక్రమింప మనము దలఁచు టెల్ల); ఉపమాన వాక్యానికీ (మంటలో మిడుత లుదగ్రవృత్తి నుఱుకఁ దలఁచునట్ల) ఐక్యారోపణం చేయబడింది కాబట్టి అలంకారం నిదర్శన.

వ. కావునఁ బాండవులతోడి భండనంబునఁ గులక్షయం బగుట దప్పదు; శాంతిఁ బొందుటయ మేలు; మనవారల కది ప్రియంబగునేని దానికిఁ దగిన యత్నంబు సేసెద' ననిన విని ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె: 201

ప్రతిపదార్థం: కావునన్; పాండవులతోడి భండనంబునన్= పాండవులతో యుద్ధంలో; కుల క్షయంబు+అగుట= వంశ నాశన మవటం; తప్పదు; శాంతిన్+పొందుట+అ= శాంతి వహించటమే; మేలు= మంచిది; మన వారలకున్; అది= శాంతి; ప్రియంబు+అగున్+ఏనిన్= ఇష్టమైనది అయితే; దానికిన్; తగిన యత్నంబు+చేసెదన్; అనినన్; విని; ధృతరాష్ట్రునకున్; సంజయుండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: కాబట్టి పాండవులతో జరిగే యుద్ధంలో వంశనాశన మవటం తప్పదు. శాంతి వహించటమే మేలు. మనవాళ్ళకు అది (శాంతి) ఇష్టమయితే దానికొరకు తగిన ప్రయత్నం చేస్తాను.' అనగా విని ధృతరాష్ట్రుడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

క. 'దేవర యానతి యిచ్చిన । యీ వాక్యము లెస్స! నాఁడు నీవ యుపేక్షం
బో విడిచితి; వింకను నీ । చే వత్తురు వారు; వీరి చే టొప్పుదురే? 202

ప్రతిపదార్థం: దేవర= ప్రభువు; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; ఈ వాక్యము; లెస్స= మంచిది; నాఁడున్= అప్పుడు; ఈవు+అ= నీవే; ఉపేక్షన్= అలక్ష్యంతో; పోన్; విడిచితివి= ఆ పాండవులను వదిలేశావు; వారు= పాండవులు; ఇంకను; నీచేన్+వత్తురు= నీ వశంలోకి వస్తారు; వీరి చేటు+ఒప్పుదురే?= కౌరవుల హానికి సమ్మతిస్తారా?- కౌరవులకు కీడు కలుగుతుందంటే సహిస్తారా?

తాత్పర్యం: 'ప్రభువు సెలవిచ్చిన ఈ మాట మంచిది. అప్పుడు నీవే అలక్ష్యం చేసి పాండవులను వదిలేశావు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఇంక వాళ్ళు నీ అధీనంలోకి వస్తారు. కౌరవుల హానికి వాళ్ళు అంగీకరిస్తారా?'

వ. అది యెట్లంటేని. 203

తాత్పర్యం: పాండవులు కౌరవులకు కీడు జరుగుతుందంటే ఒప్పుకోరనేది ఎట్లా అంటావేమో.

క. వారు దెస లొత్తికొనియు ధ । రా రాజ్యం బిచ్చి పోయిరా పోరా? తా
రారణ్యపీడఁ బడియును । రారాజుం జెఱకుఁ బాపరా మన మెఱుఁగన్? 204

ప్రతిపదార్థం: వారు= పాండవులు; దెసలు+ఒత్తికొనియున్= దిక్కులను రాచికొని - దిక్కుల్ని అంటిపెట్టుకొని; ధరా రాజ్యంబు+ఇచ్చి పోయిరా పోరా?= భూరాజ్యం మీ కిచ్చి వెళ్ళిపోయారా లేదా?; తారు= తాము; ఆరణ్య పీడన్+పడియును= అరణ్యవాస బాధ పడి కూడా; మనము+ఎఱుఁగన్= మనం ఎరుగగా; రారాజున్= దుర్యోధనుడిని; చెఱకున్+పాపరా= గంధర్వుల బంధనం నుండి విడిపించరా?

తాత్పర్యం: పాండవులు భూరాజ్యం మీ కిచ్చి దిక్కులను పట్టుకొని వెళ్ళిపోయారా లేదా? తాము అరణ్యంలో బాధలు పడుతూ కూడా దుర్యోధనుడిని ఘోషయాత్రా సందర్భంలో గంధర్వుల చెరనుండి విడిపించటం మనకు తెలుసు గదా!

వ. అట్టి యెడ నైనను. **205**

తాత్పర్యం: ఆ సమయంలో అయినా.

క. రావించి తగవుమై సం । భావింపవ కాక, నాఁడ పాండవు లలుకం
బో విడువరె? మిగులుదురే । నీ వచనంబులకుఁ? బిలిచి నిలుపుము వారిన్.' **206**

ప్రతిపదార్థం: రావించి= (పాండవులను) రప్పించి; తగవు మైన్= న్యాయంతో; సంభావింపవు+అ+కాక= ఆదరించవుకాని; నాఁడు+అ= అప్పుడే - నీవు ఆదరించిననాడే; పాండవులు; అలుకన్= కోపాన్ని; పోన్+విడువరె?= విడిచిపెట్టరా?; నీ వచనంబులకున్= నీ మాటలకు(ను); మిగులుదురే?= అతిక్రమిస్తారా?; వారిన్; పిలిచి; నిలుపుము= అధికారంలో ఉంచుము.

తాత్పర్యం: పాండవులను రప్పించి న్యాయం చేసి ఆదరించవుగాని, ఆనాడే వారు కోపం విడిచిపెట్టరా? నీ మాటలు అతిక్రమిస్తారా? వారిని (ఇప్పుడైనా) పిలిచి నిలుపుము.

దుర్యోధనుఁడు తండ్రితో స్వపక్షవీరుల సామర్థ్యంబు సెప్పుట (సం. 5-54-1).

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కి ట్లనియె: **207**

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు తండ్రితో ఇట్లా అన్నాడు.

చ. 'అడవులఁ గొండలం బడి మహాపద రూపఱి చన్నవారి ని
ప్పుడు కొనివచ్చి కృష్ణుఁ డొక ప్రోవుగఁ గూటువమూఁకఁ గూర్చినం,
బొడుతురె పాండునందనులు? భూవర! యేటికి నింతభీతి? మా
కడిమియు లావు నీ వసదుగా గణుతింపకు; గెల్తు మెమ్మెయిన్. **208**

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; అడవులన్= అడవులలోనూ; కొండలన్+పడి= కొండలలోనూ పడి; మహత్(మహా)+ఆపదన్= పెద్ద ఆపద చేత; రూపు+అఱి చన్నవారిన్= రూపు చెడిపోయినవాళ్ళను; ఇప్పుడు; కొని; వచ్చి; కృష్ణుఁడు; ఒక ప్రోవుగన్= ఒక గుంపుగా; కూటువ మూఁకన్= ప్రోత్సాహపరిచి అక్కడక్కడ వెదకి తెచ్చిన పిరికిబలాన్ని; కూర్చినన్= కూరిస్తే; పాండునందనులు= పాండవులు; పొడుతురె?= యుద్ధం చేస్తారా?; ఇంత భీతి= ఇంత అధికమైన భయం; ఏటికిన్?= ఎందుకు?; నీవు; మా కడిమియున్= పరాక్రమమూ; లావున్= బలమూ; అసదుగాన్= తక్కువగా; గణింపకు(ము)= లెక్కించకుము; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; గెల్తుము= జయిస్తాం.

తాత్పర్యం: 'అడవులలోనూ, కొండలలోనూ పడి పెద్ద ఆపదచేత రూపుచెడిపోయిన వాళ్ళను ఇప్పుడు తీసికొని వచ్చి కృష్ణుడు శిక్షణంలేని పిరికివాళ్ళ గుంపును ఒక ప్రోవుగా కూరిస్తే పాండవులు యుద్ధం చేస్తారా? రాజా! ఎందుకయ్యా నీకు ఇంతటి భయం? మా బలపరాక్రమాన్ని నీవు తక్కువ అంచనా వేయకుము. ఎట్లా అయినా మేమే గెలుస్తాం.

విశేషం: 'పొడుతురె పాండునందనులు' -ఇది తిక్కన రచనలోని తెలుగు పలుకుబడికి చక్కని ఉదాహరణం. ఈపద్యం దుర్యోధనుడి స్వభావాన్ని స్పష్టంగా చాటుతున్నది.

తే. పరశురాముని గెలిచిన బల్లిదుండు । భీష్ముఁ డవనీశు లీతని పేరు వినినఁ
బాఱుచుండుట యెఱుఁగవే? పాండుపుత్త్రు । లనఁగ నెంతటివా రితం డలిగెనేని? 209

ప్రతిపదార్థం: భీష్ముఁడు; పరశురామునిన్; గెలిచిన; బల్లిదుండు= శూరుడు; అవని+ఈశులు= రాజులు; ఈతని పేరు వినినన్= ఇతడి పేరు వింటేనే; పాఱుచున్+ ఉండుట= పరిగెత్తుకొని పోతూండటం; ఎఱుఁగవే?= తెలియవా?; ఇతండు; అలిగెన్+ఏనిన్= కోపం వహిస్తే; పాండుపుత్త్రులు+అనఁగన్+ఎంతటివారు= పాండవులంటే ఎంతటివారు?

తాత్పర్యం: భీష్ముడు పరశురాముడిని గెలిచిన శూరుడు. రాజు లితని పేరు వినగానే పారిపోవటం నీకు తెలియదా? ఇతడికి కోపం వస్తే పాండవులంటే ఎంత?

విశేషం: 'పరశురాముని గెలిచిన బల్లిదుండు భీష్ముఁడు' - అంబ కోరికపై భీష్ముడిని లొంగదీసుకోవడానికి పరశురాము డతడితో యుద్ధం చేశాడు. కాని భీష్ము డతడికి లొంగకపోవడంతో పరశురాముడు ఆ యత్నం విరమించాడు.

క. కృపుఁడును గురుఁడు నయోనిజు । లపరిమిత భుజాబలాఢ్యు, లాహవకేళీ
నిపుణు, లజేయులు; వీరలు । కుపితాత్మకులైన మాఱుకొనునే హరుఁడున్? 210

ప్రతిపదార్థం: కృపుఁడును; గురుఁడున్= ద్రోణుడూ; అయోనిజులు= యోనినుంచి పుట్టనివారు- పవిత్రులు; అపరిమిత భుజా బల+ఆఢ్యులు= మితిలేని బాహుబలంతో కూడినవారు; ఆహవ కేళీ నిపుణులు= యుద్ధ క్రీడయందు నేర్పరులు; అజేయులు= జయించరానివారు; వీరలు; కుపిత+ఆత్మకులు+ఐనన్= కోపించిన వారయితే; హరుఁడున్= ఈశ్వరుడయినా; మాఱుకొనునే?= ఎదుర్కొంటాడా?

తాత్పర్యం: కృపుడూ, ద్రోణుడూ అయోనిసంభవులు, అమిత బాహు బల సంపన్నులు. యుద్ధ క్రీడలో ఆరితేరిన వారు. వీళ్ళకు కోపం వస్తే హరుడు కూడా ఎదుర్కొనలేడు.

విశేషం: కృపుడు - శరద్వంతుడనే ముని తపస్సు చేస్తూండగా ఇంద్రుడతడి తపస్సును భగ్నం చేయటానికి ఒక అప్సరసను పంపాడు. ఆమెను చూడగానే మునికి కామం కలిగి రేతఃపతనమయింది. అతడి వీర్యం ఒక రెల్లుకాడమీద ద్వివిధంగా పడింది. అందులోంచి ఒక కొడుకూ, కూతురు పుట్టారు. వేట కొరకు వచ్చిన శంతనుడు వీళ్ళను చూచి కృపతో పెంచాడు. అందుచేతనే కొడుకు కృపుడూ, కూతురు కృపీ అయ్యారు. ఈ విధంగా కృపుడు అయోనిజుడు. ద్రోణుడు- భరద్వాజుడు ఘృతాచిని చూచి కామపరవశుడవుతాడు. అతడికి రేతః పతనమయింది. దానిని తెచ్చి భరద్వాజు డొక ద్రోణం (కుండ)లో పెట్టి కాపాడాడు. అందులోనుండి ద్రోణుడు పుట్టుతాడు. ఈ విధంగా ద్రోణుడు అయోనిజుడు. 'హరుఁడున్' ఈశ్వరుడికి బదులుగా హరశబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. ఈశ్వర వరజనితుఁడు, హరి । దశ్వ ప్రతిమాన తేజుఁ, డస్త్రకళా ని
త్యై శ్వర్య ధురంధరుఁ డీ । యశ్వత్థామ గలుగ మన కని వెఱపేలా? 211

ప్రతిపదార్థం: ఈశ్వర వర జనితుఁడు= ఈశ్వరుడి వరం వలన పుట్టినవాడూ; హరిదశ్వ ప్రతిమాన తేజుఁడు= సూర్యుడితో (పచ్చని గుఱ్ఱాలు గలవాడు) సమానమైన తేజస్సు కలవాడూ; అస్త్ర కళా నిత్య+ఐశ్వర్య ధురంధరుఁడు= అస్త్ర విద్య అనే

శాశ్వతైశ్వర్యం యొక్క భారాన్ని ధరించినవాడూ- అస్త్ర విద్యా సంపద అధికంగా కలవాడూ (అగు); ఈ+అశ్వత్థామ+కలుగన్= ఈ అశ్వత్థామ ఉండగా; మనకున్; అని వెఱపు= యుద్ధ భయం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: ఈశ్వరుడి వరం వలన పుట్టినవాడూ, సూర్యుడి తేజస్సు వంటి తేజస్సు గలవాడూ, అస్త్ర విద్యా సంపన్నుడూ అయిన ఈ అశ్వత్థామ ఉండగా మనకు యుద్ధ భయం ఎందుకు?

ఆ. సహజ కుండలుండు, శౌర్యధుర్యుఁడు, సము । దీర్ణ బాహుబలుఁడు కర్ణుఁ డిందుఁ
గలఁడు; వీని కెదురు గలఁడని యెన్నుమా । ధర్మపుత్త్రుపాల, ధరణినాథ! 212

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; సహజ కుండలుండు= సహజములైన (పుట్టుకతోఉన్న) కుండలాలు గలవాడు; శౌర్య ధుర్యుఁడు= పరాక్రమ భారం వహించినవాడు; సముదీర్ణ బాహు బలుఁడు= మిక్కిలి గొప్ప భుజ బలంగలవాడు; (అగు); కర్ణుఁడు; ఇందున్= ఇక్కడ; కలఁడు; ధర్మపుత్త్రు పాలన్= ధర్మరాజు దగ్గర; వీనికిన్; ఎదురు; కలఁడు+అని; ఎన్నుమా= ఎంచుమా?

తాత్పర్యం: రాజా! సహజములైన కుండలాలు కలవాడూ, పరాక్రమభారం వహించినవాడూ, మిక్కిలి గొప్ప భుజబలం గలవాడూ అయిన కర్ణుడు ఇక్కడ ఉన్నాడు. ధర్మరాజు దగ్గర ఇతడికి ప్రతి అనదగినవాడు ఉన్నాడేమో ఎంచుము.

క. వినుము నరేశ్వర! కర్ణుని । పెనుపు; మహేంద్రుండు వచ్చి ప్రియమున శచికై
తను నర్థింపఁగ నిచ్చెను । గొను మని లోకంబు లెఱుఁగఁ గుండల యుగమున్. 213

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా!; కర్ణుని పెనుపు= కర్ణుడి గొప్పతనం; వినుము; మహేంద్రుండు; వచ్చి; ప్రియమునన్= ప్రీతితో; శచికై= శచి కొరకు; తనున్; అర్థింపఁగన్= కోరగా; కొనుము+అని= తీసుకో అని; లోకంబులు+ఎఱుఁగన్= లోకాలు ఎరిగేటట్లు - జగద్విదితంగా; కుండల యుగమున్= కుండలాల జతను; ఇచ్చెను= ఇచ్చాడు- (దానం చేశాడు.)

తాత్పర్యం: రాజా! కర్ణుడి గొప్పతనం చెపుతా వినుము. ఇంద్రుడు వచ్చి ప్రీతితో శచి కొరకని తనను కోరితే, తీసికొమ్మని కుండలాల జత ఇవ్వటం జగద్విదితం.

విశేషం: సహజ కవచ కుండలాలతో కూడిన కర్ణుడు తన కొడుకైన అర్జునుడికి అజేయు డవుతాడని భయపడి ఇంద్రుడు బ్రాహ్మణ వేషధారియై వచ్చి వాటినిమ్మని కర్ణుడిని అడగ్గా, అతడు మహోదారు డవటం వలన అంతకుముందే తన తండ్రియైన సూర్యుడు వారించినా, ఇచ్చి వేశాడు. అదీ అతని 'పెనుపు.'

వ. వీర లా ధర్మపుత్త్రాదుల చేతన కా దెవ్వరి చేతనుం జెడమి దెల్లంబు. బాహ్లిక సోమదత్త భూరిశ్రవ శ్శల్య సింధురాజ గాంధారరాజ ప్రభృతి మహావీరులు వీరలకంటెను శక్తి సమగ్రులు. తక్కటి రాజలోకంబును, సహాయులై వచ్చిన వివిధ దేశాధీశులును నాతోడి సుఖదుఃఖంబుల కియ్యకొని, యగ్గలికమై నగ్గినైన నుఱుకను, సముద్రంబైన నీఁదను దెంపుసేసి పాంపిరివోవుచున్నవారు. కావునఁ బాండవులకు మా దిక్కుదేఁటి చూడనుం గొలంది గా, దనుమానింపకు; మిట్లునుంగాక మాకు నెవ్వరును లేక చుట్టంబులును జెలులును

విడిచి, తోడు వచ్చినవారును విచ్చిపోయి, భృత్యులును విరక్తులై, వారిక పోటుమానుసులును, బంధుమిత్ర సహాయులును, బ్రజానురాగంబునుం గలిగినట్టిదైన నది ప్రాప్తకాలం; బింతియకాని, యేమింక వారి యడుగు లొత్తను, బాఱిపోవనుం జాల; మెల్ల భంగుల సమరంబు సేయుదుము; మా తలంపిట్టిది; నా తలంచినట్లొండె, వాసుదేవుండు దలంచిన ట్లొండె నయ్యెడు నట్లైన మే; లింత వట్టును నిర్ణయం' బని పలికి, మఱియు నిట్లనియె: 214

ప్రతిపదార్థం: వీరలు= వీరు - ఈ వీరులు; ఆ ధర్మపుత్ర+ఆదులచేతన్+అ కాదు= ఆ ధర్మరాజు మున్నగువారిచేతనే కాదు; ఎవ్వరి చేతనున్; చెడమి= చెడకపోవటం; తెల్లంబు= స్పష్టం; బాహ్లిక సోమదత్త భూరిశ్రవస్+శల్య సింధురాజ గాంధారరాజ ప్రభృతి మహావీరులు= బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, సైంధవుడూ, శకునీ మొదలైన మహావీరులు; వీరల కంటెను; శక్తి సమగ్రులు= బలంచేత సంపూర్ణులు; తక్కటి రాజ లోకంబును= తక్కిన రాజుల సమూహమూ; సహాయులు+ఐ వచ్చిన వివిధ దేశ అధీశులును= వివిధ దేశాల రాజులూ; నాతోడి సుఖ దుఃఖంబులకున్= నాతోపాటు సుఖాలకూ దుఃఖాలకూ; ఇయ్యకొని= సమ్మతించి; అగ్గలికమైన్= ఉత్సాహంతో; అగ్గిన్+ఐనన్+ఉఱుకను= నిప్పులోనైన ఉరకడానికీ; సముద్రంబు+ఐనన్+ఈఁదను= సముద్రమైనా ఈదటానికీ; తెంపు+చేసి= సాహసించి; పొంపిరి+పోవుచున్+ఉన్నవారు= విజృంభిస్తున్నారు; కావునన్; పాండవులకున్; మా దిక్కు+తేఱి చూడనున్+కొలంది+కాదు= మావైపు తేరి చూడటానికి కూడా తరం కాదు; అనుమానింపకుము= సందేహించకుము; ఇట్టునున్+కాక= ఇట్లా కాక; మాకున్; ఎవ్వరును; లేక; చుట్టంబులును; చెలులును= స్నేహితులూ; విడిచి; తోడు వచ్చినవారును; విచ్చిపోయి= విడిచిపోయి; భృత్యులును= సేవకులు కూడా; విరక్తులు+ఐ= అసంతుష్టులయి; వారికిన్+అ= వారికే- ఆ పాండవులకే; పోటు మానుసులును= వీరులూ; బంధు మిత్ర సహాయులును= చుట్టాలూ, స్నేహితులూ, తోడ్పడ వచ్చినవాళ్ళూ; ప్రజా+అనురాగంబునున్= ప్రజల అనురాగమూ; కలిగిన+ అట్టిది+ఐనన్= కలిగేటట్లయితే; అది; ప్రాప్త కాలంబు= ప్రారబ్ధం; ఇంతియ+కాని; ఏము= మేము; ఇంకన్; వారి అడుగులు+ఒత్తను= వారి పాదాలు పట్టటానికిగాని; పాఱిపోవనున్= పారిపోవటానికిగాని; చాలము= ఓపము; ఎల్ల భంగులన్= అన్ని విధాల; సమరంబు+చేయుదుము= యుద్ధం చేస్తాము; మా తలంపు+ఇట్టిది+అ= మా అభిప్రాయం ఇదే; నా తలంచిన+ అట్లు+ఒండెన్= నేను అనుకొన్నట్లయినా; వాసుదేవుండు= కృష్ణుడు; తలంచిన+అట్లు+ఒండెన్= అనుకున్నట్లయినా; అయ్యెడున్= అవుతుంది; ఎట్లు+ఐనన్= ఎట్లా అయినా; మేలు= మంచిది; ఇంత వట్టును= ఇంతవరకూ; నిర్ణయంబు= నిశ్చయం; అని; పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇప్పుడు నేను చెప్పిన వీరులు ఆ ధర్మరాజాదులచేతనే కాదు, మరెవ్వరిచేతా చెడిపోరు అనేది స్పష్టం. బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, సైంధవుడూ, శకునీ మొదలైన మహావీరులు వాళ్ళకంటెను బలవంతులు. తక్కిన రాజ సమూహమూ, తోడ్పడ వచ్చిన వివిధ దేశాల రాజులూ నాతోపాటు సుఖ దుఃఖాలకు సమ్మతించి, ఉత్సాహంతో నిప్పులలోనైనా ఉరకటానికీ, సముద్రమైనా ఈదటానికీ తెగించి విజృంభిస్తున్నారు. కాబట్టి పాండవులు మావైపు తేరి చూడటానికి కూడా సమర్థులు కారు. సందేహించకుము. ఇట్లాకాక, మాకు ఎవరూ లేక, చుట్టాలూ, స్నేహితులూ విడిచిపెట్టి, తోడువచ్చినవాళ్ళూ వెళ్ళిపోయి, సేవకులూ అసంతుష్టులయి, ఆ పాండవులకే వీరులూ, బంధువులు, మిత్రులు, సహాయులు, ప్రజానురాగమూ లభించేటట్లయితే, అది మా ప్రారబ్ధం. ఇంతేకాని, మేము ఇంక వారి పాదాలు పట్టటంగాని, పారిపోవటంగాని చేయలేము. అన్నివిధాలా యుద్ధం చేస్తాము. ఇదే మా అభిప్రాయం. నేననుకొన్నట్లయినా కావాలి, కృష్ణు డనుకొన్నట్లయినా జరగాలి. ఎట్లా అయినా మేలే. ఇంతవరకూ నిశ్చయం' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు:

తే. 'కులములోఁ దలవంపగు కూడు గుడువఁ । బంపఁ జూచెద, నొకళులఁ బఱతు రట్టె!
వారు పై నెత్తి వచ్చినఁ 'బోరి కోప' । మనిన, ధృతి చేట కాక, పొం దగునె చెపుమ? 215

ప్రతిపదార్థం: కులములోన్= వంశంలో; తలవంపు+అగు కూడు= అవమానకరమైన కూడు; కుడువన్+పంపన్+చూచెదవు= తినుమని పంపటానికి చూస్తావు; ఒకళులన్= ఒకళ్ళను; పఱతురు+అట్టె!= బాధిస్తారట!; వారు= ఆ బాధితులు; పైన్+ఎత్తి వచ్చినన్= మీదికి దండెత్తి వస్తే; పోరికిన్+ఓపము= యుద్ధానికి చాలం- యుద్ధం చేయలేము; అనినన్= అంటే; ధృతి+చేటు+అ కాక= ధైర్యం చెడటమేకాని; పొందు+అగునె చెపుమ?= సంధి- సఖ్యం కుదురుతుందా? చెప్పుము.

తాత్పర్యం: 'కులంలో అవమానకరమైన, సిగ్గు చేటయిన కూడు తినుమని పంపాలని చూస్తున్నావు. ఒకళ్ళను బాధించిన వాళ్ళ మీదకు ఆ బాధితులు దండెత్తి వస్తే 'మేము యుద్ధం చేయలేము' అంటే, ధైర్యానికి చేటే (కీడే) కాని సఖ్యం కుదురుతుందా?

విశేషం: ఇంతవరకూ మేము పాండవులను బాధించాం. ఇప్పుడు వాళ్ళు మామీద తిరగబడితే 'మేము పోరాడలే'మంటే, 'వీళ్ళకు ధైర్యం లేదంటారే' తప్ప సఖ్యం కుదురుతుందా? అని భావం.

క. నీవు బతిమాలి కొడుకుల । చావునకును జేటునకును జాలక, యిమ్మై
వా విడిచి యఱచినం గడు । నేవ పడరె జనులు? నిన్ను నే మననేర్తున్? 216

ప్రతిపదార్థం: నీవు; బతిమాలి= దీనంగా వేడుకొని; కొడుకుల చావునకును+చేటునకును= కొడుకుల చావుకీ, హానికీ; చాలక= సైపక; ఈ+మైన్= ఈ విధంగా; వా విడిచి= నోరు విడిచి; అఱచినన్= ఏడిస్తే; జనులు= లోకులు; కడున్+ఏవ పడరె?= మిక్కిలి అసహ్యించుకోరా?; నిన్నున్; ఏమి+అనన్+నేర్తున్?= నేను ఏమనగలను?

తాత్పర్యం: నీవు వాళ్ళను దీనంగా వేడుకొని, నీ కొడుకుల చావుకూ, హానికీ ఓర్వక, ఇట్లా నోరు విడిచి విలపిస్తే లోకులు మిక్కిలి అసహ్యించుకొనరా? నిన్ను నేనేమనగలను?

తే. భీమసేనుని నీ వింత పెద్ద చేసి । పెక్కు భంగులఁ జెప్పితి 'యుక్కు గలఁడు,
గదకు నేర్చు నం' చెంతయు బెదరె; దతఁడు । నన్నుఁ బోలమి యెఱుఁగవే నరవరేణ్య? 217

ప్రతిపదార్థం: నరవరేణ్య!= రాజా!; నీవు; భీమసేనునిన్= భీముడిని ఇంత పెద్ద చేసి= ఇంత పెద్దవాడిని చేసి; పెక్కు భంగులన్= అనేక విధాల; చెప్పితి(వి)= చెప్పావు; ఉక్కు+కలఁడు= శౌర్యం కలవాడూ; గదకున్+నేర్చున్= గదయందు నేర్పరి; అంచున్; ఎంతయున్= మిక్కిలి; బెదరెదు (దవు)= భయపడతావు; అతఁడు; నన్నున్; పోలమి= సరిపోలకపోవటం; ఎఱుఁగవే?= తెలియవా?

తాత్పర్యం: రాజా! నీవు భీముడిని ఇంత గొప్ప చేసి అనేక విధాల చెప్పావు. అతడు బలం గలవాడు, గదయందు నేర్పరి అంటూ ఎంతో భయపడుతున్నావు. అతడు నన్ను పోలడని నీవు ఎరుగవా?

విశేషం: పెక్కు భంగులఁ జెప్పితి యుక్కు గలఁడు- ఇందులో 'చెప్పితి' అనేది మధ్యమపురుషక్రియ- చెప్పితివి. దీని వకారానికి లోపం వచ్చి, చెప్పితి+ఇ అయి, సంధి జరిగి, చెప్పితి అయింది. దీనిలోని ఇకారానికి ఉక్కులోని ఉకారం పరమయి-

'మధ్యమ పురుష క్రియలయం దిత్తునకు సంధి యగును' - బాల. సం.7 సూత్రం చేత 'చెప్పి తుక్కు ....' అని కావాలి. కాని అన్ని ప్రతులలోనూ 'చెప్పితి యుక్కు' అని యడాగమం వచ్చిన రూపమే ఉన్నది. కొన్ని వావిళ్ళవారి ప్రతులలో మాత్రం 'చెప్పి తట్లుక్కు గలఁడు' అనే పాఠం అధస్సూచికలో ఇవ్వబడింది.

మ. గద నాతో 'సరి మూఁడు లోకముల నేఁ గానం; జలం బెత్తి యు
న్మదుఁ డా భీముఁడు న న్ననిం దొడరిన న్వజ్రప్రహారంబు బె
ట్టిదమై తాఁకినఁ గూలు పర్వతము మాడ్కిం గుంభినిం గూలవ్రే
సెద! నా కోర్కి గదా గదారణము వచ్చెం బెద్దకాలంబునన్! 218

ప్రతిపదార్థం: గదన్= గదయందు- గదా యుద్ధంలో; నాతోన్, సరి= సమానుడిని; మూఁడు లోకములన్; ఏన్= నేను; కానన్= చూడను; ఉన్మదుఁడు= మిక్కిలి పొగరెక్కినవాడు; ఆ భీముఁడు; చలంబు+ఎత్తి= పంతం అతిశయించి; నన్నున్; అనిన్= యుద్ధంలో; తొడరినన్= మార్కొంటే; వజ్ర ప్రహారంబు= వజ్రపు దెబ్బ; బెట్టిదము+ఐ= గట్టిదయి; తాఁకినన్= తగిలితే; కూలు పర్వతము మాడ్కిన్= కూలిపోయే కొండలాగా; కుంభినిన్= నేల మీద; కూలన్+వ్రేసెదన్= పడిపోయేటట్లు కొడతాను; నా కోర్కిగదా= ఇది నా కోరిక కదా; పెద్ద కాలంబునన్= చిరకాలానికి; గదా రణము= గదాయుద్ధం; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: గదా యుద్ధంలో నాతో సమానుడు మూడులోకాలలోనూ నాకు కనిపించడు. పొగరెక్కిన ఆ భీముడు పంతం అతిశయించి నన్ను యుద్ధంలో మార్కొంటే, వజ్రం దెబ్బ గట్టిగా తగిలితే కూలిపోయే కొండలాగా, వాడిని నేలమీద పడేటట్లు కొట్టుతాను. ఇది నా కోరిక గదా! చిరకాలానికి గదాయుద్ధం వచ్చింది.

విశేషం: 'వజ్ర ప్రహారంబు బెట్టిదమై తాఁకినఁ గూలు పర్వతము మాడ్కిన్'- అలంకారం ఉపమ. నా కోర్కి గదా గదారణము ... గదా శబ్ద పునరక్తి అతని గదా యుద్ధ ప్రీతిని తెలియజేస్తున్నది. అలంకారం : యమకం.

ఆ. అతఁడు పడిన వెండి యా సేనఁ గోల్తల । సేయ నొకఁడు లేమి సిద్ధ; మింత
యెఱిఁగి వెఱచి కాదె 'యే నూళ్ళు లైనను । దమకుఁ జాలు' ననియె ధర్మసుతుఁడు. 219

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీముడు; పడినన్= పడిపోతే; వెండి= మళ్ళీ; ఆ సేనన్= ఆ సైన్యాన్ని; కోల్తల+చేయన్= ఎదుట నిలబడి యుద్ధసన్నాహం చేయటానికి; ఒకఁడు= ఎవడూ; లేమి= లేకపోవటం; సిద్ధము= స్పష్టం; ఇంత+ఎఱిఁగి వెఱచి కాదె= ఇదంతా ఎరిగి భయపడే కదా; ధర్మ సుతుఁడు= ధర్మరాజు; తమకున్; ఏను+ఊళ్ళులు+ఐనను= అయి దూళ్ళయినా; చాలున్= సరిపోతాయి; అనియెన్.

తాత్పర్యం: భీముడు నేలగూలితే ఇంక ఆ సేనలో ఎదుట నిలబడి యుద్ధం చేయటానికి మరెవ్వడూ లేడనటం స్పష్టం. ఇదంతా తెలిసి భయపడే కదా ధర్మరాజు 'మాకు అయిదూళ్ళయినా చాలు' అనటం!

వ. అర్జునుండు గలం డని తలంచితివేని. 220

తాత్పర్యం: భీముడు పోతే అర్జును డున్నాడు గదా అని అనుకొంటున్నావేమో.

తే. కర్ణు పడసిన యా శక్తి గలుగఁ, బోర । బ్రదుక వచ్చునె నరునకు? నదియుఁ గాక,
యతని భీష్మాది రథికుల యతులితాస్త్ర । మేయ దివ్యబాణంబులు మ్రింగికొనవె? 221

ప్రతిపదార్థం: కర్ణు పడసిన+ఆ శక్తి కలుగన్= కర్ణుడు పొందిన ఆ శక్త్యాయుధం ఉండగా; నరునకున్= అర్జునుడికి; పోరన్= యుద్ధంలో; బ్రదుకన్+వచ్చునె= బ్రతుక తరమా?; అదియున్+కాక= అదీకాక, అతనిన్= అర్జునుడిని; భీష్మ+ఆది రథికుల= భీష్ముడు మున్నగు రథికుల యొక్క; అతులిత= సాటిలేని; అప్రమేయ= ఇంత అని మితి ఏర్పరచడానికి శక్యంకాని; దివ్య బాణంబులు= దేవతా సంబంధి బాణాలు; మ్రింగికొనవె?= మ్రింగెయ్యవా?

తాత్పర్యం: కర్ణుడు పొందిన ఆ శక్త్యాయుధం ఉన్నంతకాలం, అర్జునుడికి యుద్ధంలో బ్రతుక తరమా? అదీకాక అతడిని భీష్మాది వీరుల సాటిలేనివీ, అమిత శక్తిమంతాలూ అయిన దివ్యబాణాలూ మ్రింగేయవా?

వ. దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ వివింశతి వికర్ణ చిత్రసేనాదులగు నీ కొడుకు లొకం డొకండ జగంబులెల్ల జయింపఁజాలుదు; రందఱు నొక్క మొగంబై త్రోచి నడచిన సవ్యసాచి నొక్కరుండ కాదు; పాండవులనెల్ల నొక్కెత్తున వైచికొన నోపుదు; రట్లునుంగాక, మాకు నక్షౌహిణులు పదునొకండు, వారికి నే డక్షౌహిణులు, మా సైన్యంబు సారవంతంబు; వారిబలంబు నిస్సారంబు; వారు మమ్మెవ్విధంబున జయింపనోపుదు? రీ యెక్కువ తక్కువలు విచారింపక వలవని వెఱపు గట్టికొని ముక్కూరి వగచుచున్నవాఁడవు; నిన్ను వగవకుండ నుడుపం జాల మంతియ కాని, తక్కెల్ల పనులకుం జాలుదు' మని పలికి, సంజయు దెసఁ గనుంగొని సుయోధనుం డిట్లనియె: 222

ప్రతిపదార్థం: దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ వివింశతి వికర్ణ చిత్రసేన+ఆదులు+అగు నీ కొడుకులు= దుశ్శాసనుడూ, దుష్ప్రహుడూ, దుర్ముఖుడూ, వివింశతీ, వికర్ణుడూ, చిత్రసేనుడూ మొదలగు నీ కొడుకులు; ఒకండు+ఒకండు+అ= ఒక్కొక్కడే; జగంబులు+ఎల్లన్= లోకాలన్నీ; జయింపన్+చాలుదురు= జయించగలరు; అందఱున్= అంతా; ఒక్క మొగంబు+ఐ= ఒక్కసారిగా; త్రోచి నడచినన్= కలిసి నడిస్తే; సవ్యసాచిన్+ఒక్కరుండు+అ కాదు+ అర్జునుడిని ఒక్కడినే కాదు; పాండవులన్+ఎల్లన్= పాండవులనందరినీ; ఒక్క+ఎత్తునన్= ఒక్కపెట్టున; వైచికొనన్+ఓపుదురు= ఎగురగొట్టగలరు; అట్లునున్+కాక= అదీకాక; మాకున్; అక్షౌహిణులు; పదునొకండు= పదకొండు; వారికిన్; ఏడు అక్షౌహిణులు; మా సైన్యంబు; సారవంతంబు; వారి బలంబు; నిస్సారంబు= సారం లేని; వారు; మమ్మున్; ఏ+విధంబునన్; జయింపన్+ఓపుదురు?= జయించగలరు?; ఈ ఎక్కువ తక్కువలు; విచారింపక= ఆలోచించక; వలవని వెఱపు= కూడని భయం; కట్టికొని= పొంది; ముక్కూరి వగచుచున్+ఉన్నవాఁడవు= తెలివి తక్కువగా దుఃఖిస్తున్నావు; నిన్నున్; వగవక+ఉండన్= దుఃఖించకుండా; ఉడుపన్+చాలము= మాన్పలేము; అంతియ కాని; తక్కు+ఎల్ల పనులకున్+చాలుదుము= తక్కిన పనుల కన్నిటికీ సమర్థులం; అని పలికి; సంజయు దెసన్+కనుంగొని= సంజయుడికేసి చూచి; సుయోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుశ్శాసనుడూ, దుష్ప్రహుడూ, దుర్ముఖుడూ, వివింశతీ, వికర్ణుడూ, చిత్రసేనుడూ మొదలుగాగల నీ కొడుకులు ఒక్కొక్కడే లోకాల నన్నిటినీ జయించగలరు. ఇక అందరూ ఒకటై కలిసి నడిస్తే అర్జునుడిని ఒక్కడినే కాదు- పాండవుల నందరినీ ఒక్క పెట్టున ఎగుర గొట్టగలరు. అదీకాక, మాకు పదకొండు అక్షౌహిణు లున్నాయి. వాళ్ళకి ఏడే ఉన్నాయి. మా సైన్యం సారవంతమైంది. వాళ్ళది నిస్సారం. వాళ్ళు మిమ్మల్ని ఎలా జయించగలరు? ఈ ఎక్కువ తక్కువలను చూడక తగని భయం పెట్టుకొని తెలివితక్కువగా దుఃఖిస్తున్నావు. మేము తక్కిన పనులన్నీ చేయగలం కాని నిన్ను ఏడువకుండా మాత్రం చేయలేము.' అని పలికి సంజయుడి వైపు చూచి దుర్యోధను డిట్లా అన్నాడు:

క. 'నానాదేశంబుల బలు । మానుసులం గూర్చికొని సమత్సరబుద్ధిం
దా నే మనియెడు నయ్యమ । సూనుం డాతని తెఱంగు సూతము చెపుమా!' 223

ప్రతిపదార్థం: నానా దేశంబుల బలు మానుసులన్= అనేక దేశాలలో ఉన్న గొప్ప మనుష్యులను- వీరులను; సమత్సర బుద్ధిన్= క్రోధ బుద్ధితో; కూర్చికొని= కలిపికొని; ఆ+యమ సూనుండు= ఆ ధర్మరాజు; తాను; ఏమి+అనియెడున్= ఏమంటాడు?; ఆతని తెఱంగు+చూతము చెపుమా!= అతడి సంగతి చూద్దాం చెప్పుము.

తాత్పర్యం: 'అనేక దేశాలలో ఉన్న గొప్ప వీరులను క్రోధ బుద్ధితో కూర్చుకొని ఆ ధర్మరాజు ఏమంటాడో- అతడి సంగతి చెప్పుము చూద్దాం.'

వ. అనిన విని సంజయుం డిట్లనియె : 224

తాత్పర్యం: అనగా విని సంజయుడిట్లా అన్నాడు :

సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజు నిశ్చయం బెఱింగించుట (సం. 5-55-2)

ఉ. 'ఆతఁడు భండనం బనిన నార్చిన మూరెఁడు వేర్చు; నెంతయుం
బ్రీతి వహించి తమ్ము లొక పెండ్లికిఁ బోయెడు నట్ల యున్నవా;
రా తెలి వెందునుం గలదె? యందలి నాయకు 'లెప్పుడొక్కొ మా
చేతుల తీఁట పుత్తు?' మను చిత్తమ కాని చలింప రేమియున్. 225

ప్రతిపదార్థం: ఆతఁడు= ధర్మరాజు; భండనంబు+అనినన్= యుద్ధమంటే; ఆర్చినన్ మూర+ఎఁడు+పేర్చున్= అరిస్తే మూరెడు పైకి విజృంభిస్తాడు; తమ్ములు; ఎంతయున్; ప్రీతి వహించి= సంతోషం పూని; ఒక పెండ్లికిన్+పోయెడు+అట్ల+అ+ఉన్నవారు= ఒక పెళ్ళికి వెళ్ళే విధంగానే ఉన్నారు; ఆ తెలివి= ఆ ఉల్లాసం; ఎందునున్+కలదె?= ఎక్కడైనా ఉన్నదా?; అందలి నాయకులు= ఆ పక్షంలోని నాయకులు; ఎప్పుడు+ఒక్కొ!= ఎప్పుడోకదా!; మా చేతుల తీఁట+పుత్తుము= మా చేతుల దురద తీర్చుకొంటాం; అను చిత్తము కాని= అనే మనస్సే- కోరికే కాని; ఏమియున్+చలింపరు= కొంచెం కూడా చలించరు.

తాత్పర్యం: 'ధర్మరాజు యుద్ధం అనగానే మూరెడు లేస్తాడు. అతడి తమ్ములు ఎంతో సంతోషంతో ఒక పెళ్ళికి వెళ్ళుతున్న విధంగానే ఉన్నారు. వాళ్ళ ఉల్లాసం ఎక్కడైనా ఉన్నదా? ఆ పక్షంలోని నాయకులు 'మా చేతుల దురద తీర్చుకొనటం ఎప్పుడా?' అని ఉవ్విళ్ళూరుతూంటారు కాని కొంచెం కూడా చలించరు.

తే. నరుని పాశుపతాది బాణముల పెంపు, । భీము గద సొంపు నమ్మి యుద్దామ లీలఁ
జెలఁగి వెఱపేది యక్కడి బలము ముసురు । గవిసి యెపుడుఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వు.' 226

ప్రతిపదార్థం: అక్కడి బలము= ఆ పక్షంలోని సైన్యం; నరుని పాశుపత+ఆది బాణముల పెంపున్= అర్జునుడి పాశుపతం మొదలైన అస్త్రాల గొప్పతనమూ; భీము గద సొంపున్= భీముడి గద అందమూ- శక్తీ; నమ్మి, ఉద్దామ లీలన్= విశృంఖలంగా; చెలఁగి= విజృంభించి; వెఱపు+ఏది= భయం లేక; ముసురు కవిసి= గుమికూడి; ఎపుడున్= ఎప్పుడూ; కయ్యమునకున్; కాలు+త్రవ్వున్= పై కొడుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఆ పక్షంలోని సైన్యం అర్జునుడి పాశుపతాది బాణాల గొప్పతనమూ, భీముడి గద గొప్పతనమూ నమ్మి విశృంఖలంగా గుమికూడి ఎప్పుడూ కయ్యానికి కాలుద్రవ్వుతూ ఉంటుంది.'

క. నావుడు 'నిది యౌ, సంజయ! । కైవారము సేసె దీవు కౌంతేయుల; వా
రేవి రణ సాధనమ్ములు । గా వెఱవక నడచువారు కౌరవుల పయిన్?' 227

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; సంజయ!; ఇది+ఔన్= ఇది సరే; ఈవు= నీవు; కౌంతేయులన్= పాండవులను; కైవారము+చేసెదు (దవు)= స్తుతి చేస్తావు; వారు= ఆ పాండవులు; ఏవి; రణ సాధనమ్ములు+కాన్= యుద్ధ పరికరాలుగా; కౌరవుల పయిన్= కౌరవుల మీదకు; వెఱవక= నిర్భయంగా; నడచువారు?= నడుస్తారు- దండెత్తుతారు?

తాత్పర్యం: అనగానే, 'సంజయా! అది సరే. నీవు పాండవులను పొగుడుతావు. ఆ పాండవులు వేటిని యుద్ధసాధనాలుగా చేసికొని కౌరవుల మీదకు నిర్భయంగా దండెత్తుతారు?'

వ. అనిన సుయోధనునకు సూతనందనుం డర్జును దివ్యరథ శ్వేతాశ్వ కపిధ్వజ దేవదత్తంబుల మహానుభావంబులు వేఱువేఱ వర్ణించి చెప్పి, యుధిష్ఠిర భీమ నకుల సహదేవుల యరదంబులు, తురంగాది పరికరంబు లిట్టిట్టి వని యేర్పడం బలికి, విరాట ద్రుపదాదులకు వలయు నుపకరణంబులు గొఱంత లేమియు నెఱింగించిన, ధృతరాష్ట్రుం 'డిందుఁ గల బలు మానుసు లెవ్వరికి నసాధ్యులు. వీరి సాధించుతెఱం గూహించిరే?' యని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె: 228

ప్రతిపదార్థం: అనిన సుయోధనునకున్= అట్లా అడిగిన దుర్యోధనుడికి; సూత నందనుండు= సంజయుడు; అర్జును= అర్జునుడి యొక్క; దివ్య రథ శ్వేత+అశ్వ కపిధ్వజ దేవదత్తంబుల= దేవతా సంబంధాలయిన రథమూ; తెల్లని గుర్రాలూ, కపిధ్వజమూ; దేవదత్తమూ అనేవాటి; మహా+అనుభావంబులు= గొప్పతనాలు; వేఱు వేఱు+అ= ప్రత్యేకంగా; వర్ణించి చెప్పి= వివరించి చెప్పి; యుధిష్ఠిర, భీమ, నకుల, సహదేవుల, రథాలు= ధర్మజ, భీమ, నకుల, సహదేవుల రథాలు; ఇట్టి+ఇట్టివి+అని= ఇట్లాంటివి ఇట్లాంటివి అని; ఏర్పడన్+పలికి= స్పష్టంగా చెప్పి; విరాట ద్రుపద+ఆదులకున్ వలయు+ఉపకరణంబులు= విరాటుడూ, ద్రుపదుడూ మొదలైనవాళ్ళకు కావలసిన సాధనాలు; కొఱంత లేమియున్= లోటు లేకపోవటం; ఎఱింగించినన్= చెప్పగా; ధృతరాష్ట్రుండు; ఇందున్= కౌరవ పక్షంలో; కల= ఉన్న; బలు మానుసులు= మహావీరులు; ఎవ్వరికిన్= ఎవరికీ; అసాధ్యులు= సాధించరానివారు - జయించరానివారు; వీరిన్= కౌరవ వీరులను; సాధించు తెఱంగు= జయించే విధం; ఊహించిరే; అని అడిగినన్; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అడిగిన దుర్యోధనుడితో సంజయుడు అర్జునుడి దివ్యరథమూ, తెల్లగుర్రాలూ, కపిధ్వజమూ, దేవదత్తమనే శంఖమూ అనే వాటి మహత్త్వాలు ప్రత్యేకంగా వివరించి చెప్పి, ధర్మజ భీమ నకుల సహదేవుల రథాలూ, మొదలగు ఉపకరణాలూ ఇట్లాంటి విట్లాంటివని స్పష్టంగా చెప్పి, విరాటుడూ, ద్రుపదుడూ మొదలైనవారికి కావలసిన సాధనాల లోటు లేకపోవటం చెప్పగా, ధృతరాష్ట్రుడు 'కౌరవ పక్షంలోని మహావీరులు ఎవరికీ అసాధ్యులు. వీళ్ళను సాధించే విధం వాళ్ళు ఊహించారా?' అని అడిగితే, అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు:

సీ. 'గంగాసుతుండు శిఖండిపా, లతనికిఁ। బ్రాపు మత్స్యేశ్వరు బలము; కుంభ
భవుఁడు ధృష్టద్యుమ్ను పా, లతనికిఁ దోడు। పడు ద్రౌపదీ పుత్త్ర పంచకంబు;
రారాజుఁ, దమ్ములు మారుతి పాలు; కు। మారు లందఱు నభిమన్యు పాలు;
శకుని సైంధవులు, నశ్వత్థామ కర్ణులుఁ,। దక్కొరుచేఁ బోని దండిమగలు

ఆ. సవ్యసాచి పాలు; సాత్యకి పాల్ కృత। వర్మ; చేకితాన వసుమతీశు
పాలు సోమదత్తుఁ; డాలంబునకు నిట్లు। నిశ్చయించి రచట నృపవరేణ్య! 229

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజోత్తమా! ధృతరాష్ట్రా!; భీష్ముడు శిఖండి పాలు= వంతు; అతనికిన్= ఆ శిఖండికి; మత్స్య+ఈశ్వరు బలము= మత్స్య దేశరాజు - విరాటుడి సేన; ప్రాపు= అండ; కుంభభవుఁడు= ద్రోణుడు; ధృష్టద్యుమ్ను పాలు; అతనికిన్; ద్రౌపదీ పుత్త్ర పంచకంబు తోడుపడున్= ద్రౌపది కొడుకులు - ఉపపాండవులు అయిదుగురూ సహాయపడతారు; రారాజున్+తమ్ములున్= దుర్యోధనుడూ, అతడి తమ్ములూ; మారుతి పాలు= భీముడి పాలు; కుమారులు+అందఱున్= యువకులంతా; అభిమన్యు పాలు; శకుని సైంధవులున్; అశ్వత్థామ కర్ణులున్; తక్క+ఒరుచేన్+పోని దండి మగలు= ఇంకొకడి చేత పడని మహాశూరులు; సవ్యసాచి పాలు= అర్జునుడి వంతు; కృతవర్మ; సాత్యకి పాల్; సోమదత్తుఁడు; చేకితాన వసుమతీ+ఈశు పాలు= చేకితానుడనే యాదవరాజు పాలు; అచటన్; ఆలంబునకున్= యుద్ధానికి; ఇట్లు= ఇట్లా; నిశ్చయించిరి= నిర్ణయించుకొన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు శిఖండి వంతు. ఆ శిఖండికి విరాటుడి సైన్యం అండ. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి వంతు. అతడికి ఉపపాండవు లైదుగురూ తోడ్పడుతారు. దుర్యోధనుడూ, అతడి తమ్ములూ భీముడి వంతు. యువ వీరులంతా అభిమన్యుడి వంతు. శకుని సైంధవులూ, అశ్వత్థామ కర్ణులూ- ఇతరుడికి లొంగని మహాశూరులైన వారూ అర్జునుడి వంతు. కృతవర్మ సాత్యకి వంతు. సోమదత్తుడు చేకితానుడనే యాదవరాజు వంతు. యుద్ధానికి ఇట్లా అక్కడ నిర్ణయించుకొన్నారు.

క. నకులుఁడు, సహదేవుండును,। శకుని నులూకాది సుతుల సారస్వతులం
బ్రకటబలులైన కాళిం। గకులను సమయించువారు కౌరవనాథా! 230

ప్రతిపదార్థం: కౌరవ నాథా!= కురురాజా, ధృతరాష్ట్రా!; నకులుఁడున్, సహదేవుండునున్; శకునిన్; ఉలూక+ఆది సుతులన్= ఉలూకుడూ మున్నగు కొడుకులనూ; సారస్వతులన్; ప్రకట బలులు+ఐన కాళింగకులను= ప్రసిద్ధమైన బలంగల కాళింగకులను, సమయించువారు= చంపుతారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నకులుడూ, సహదేవుడూ శకునినీ, ఉలూకుడూ మొదలైన కొడుకులనూ, సారస్వతులనూ, ప్రసిద్ధమైన బలం కల కాళింగకులనూ చంపుతారు.

క. కేకయులు మనలఁ గలిసిన। కేకయుల జయించువారు; కృతపుణ్యుఁడు సు
శ్లోకుఁడు ధర్మతనూజుఁడు। లోకోత్తరు శల్యుఁ దా గెలుచువాఁ డధిపా ! 231

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; కేకయులు; మనలన్; కలిసిన కేకయులన్; జయించువారు; కృతపుణ్యుఁడు= చేయ బడిన పుణ్యం కలవాడు - పుణ్యాత్ముడు; సుశ్లోకుఁడు= మంచి కీర్తి గలవాడు అగు; ధర్మ తనూజుఁడు= ధర్మరాజు; తాన్= తాను; లోకోత్తరున్= అసాధారణుడు అయిన శల్యున్= శల్యుడిని; గెలుచువాఁడు= గెలుస్తాడు.

తాత్పర్యం: రాజా! కేకయులు మనలను కూడిన కేకయులను జయిస్తారు. పుణ్యాత్ముడూ, సుశ్లోకుడూ అయిన ధర్మరాజు లోకోత్తరుడైన శల్యుడిని గెలుస్తాడు.

వ. అట్టి పలుకుల సమయంబున నచ్చోటఁ గొందఱు జనంబులు ధర్మనందను నుద్దేశించి. 232

ప్రతిపదార్థం: అట్టి పలుకుల సమయంబునన్= ఆ మాటల సందర్భంలో; ఆ+చోటన్= అక్కడ; కొందఱు జనంబులు= కొంతమంది జనులు; ధర్మనందనున్+ఉద్దేశించి= ధర్మరాజుతో.

తాత్పర్యం: ఆ మాటల సందర్భంలో అక్కడ కొందరు జనులు ధర్మరాజుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'ఇతఁ డెక్కడ? మద్ర మహీ । పతి యెక్కడ? నితని కతఁడు సాటియె?' యనుడుం,
బ్రతివచనంబుల శల్యుని । యతి బల శౌర్యములు వారి కాతఁడ చెప్పెన్. 233

ప్రతిపదార్థం: ఇతఁడు= ధర్మరాజు; ఎక్కడన్; మద్ర మహీపతి= మద్రదేశాధిపతి శల్యుడు; ఎక్కడన్; ఇతనికిన్; అతఁడు; సాటియె?= సమానుడా?; అనుడున్= అనగానే; ఆతఁడు+అ= అతడే- ధర్మరాజే; ప్రతి వచనంబులన్= బదులు పలుకులతో; వారికిన్; శల్యుని+అతి బల శౌర్యములు= శల్యుడి అమిత బలపరాక్రమాలు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ధర్మరా జెక్కడ? శల్యు డెక్కడ? ఇతడికి అతడు సమానుడా?' అనగానే వారికి అతడే శల్యుడి అమిత బలపరాక్రమాలను గూర్చి చెప్పాడు.

విశేషం: ఇతఁ డెక్కడ మద్రమహీపతి యెక్కడ- అననురూపములైన వాటికి ఘటన వర్ణించబడింది కనుక విషమాలంకారం.

వ. ఇట్లు గాకయు నెవ్వరి మొగంబున నెవ్వరు వడిరి, వారికి వార చాలియుండు వా రని; రివ్విధంబునఁ గ్రొవ్వు మిగిలి కొఱంతలేని తెగువం దేజరిల్లుచున్నవారు. నీకు నీ కొడుకునకు నెయ్యది గర్జంబై తోఁచె నదియ చేయుం' డనిన విని విచిత్రవీర్యతనయుం డిట్లనియె. 234

ప్రతిపదార్థం: ఇట్లు+కాకయున్= ఇట్లా కాక; ఎవ్వరి మొగంబునన్+ఎవ్వరు పడిరి= ఎవరిని ఎవరు ఎదుర్కొంటే; వారికిన్, వారు+అ= వారే; చాలి+ఉండువారు+అనిరి= గెలువగలుగుతారు అన్నారు; ఈ+విధంబునన్; క్రొవ్వు మిగిలి= గర్వం అతిశయించి; కొఱంత లేని తెగువన్= తక్కువకాని సాహసంతో; తేజరిల్లుచున్+ఉన్నవారు= ప్రకాశిస్తున్నారు; నీకున్; నీ కొడుకునకున్; ఎయ్యది+కర్జంబు+ఐ+తోఁచెన్= ఏది చేయదగిందని అనిపిస్తుందో; అది+అ= అదే; చేయుండు; అనినన్; విని; విచిత్రవీర్య తనయుండు= విచిత్రవీర్యుడి కొడుకు- ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఇట్లాగే కాక, ఎవరిని ఎవరు మార్కొంటారో, వారిని వారే గెలువగలుగుతారు' అన్నారు. ఈ రీతిగా గర్వం అతిశయించి కొదవ లేని సాహసంతో వారు ప్రకాశిస్తున్నారు. ఇక- నీకూ నీ కొడుకుకూ ఏది చేయదగిందని అనిపిస్తే అదే చేయండి' అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. 'నా కొడుకుల కెక్కడి బ్రదు? । కే కొలఁది దలంపు నిప్పు డెన్నిన వీరా
నీకంబు నోర్వవచ్చునె । యీ కూడిన సైనికులకు? నే మనువాఁడన్? 235

ప్రతిపదార్థం: నా కొడుకులకున్; ఎక్కడి బ్రదుకు?= ఇక బ్రతికి ఉండటం ఎక్కడిది?- చావు తప్పదు; ఏ కొలఁది+తలంపన్= ఎంత ఆలోచించినా; ఈ కూడిన సైనికులకున్= ఈ కూడుకొన్న సైనికులకు; ఇప్పుడు+ఎన్నిన వీర+అనీకంబున్= ఇప్పుడు నీవు చెప్పిన వీరుల సమూహాన్ని (వీరుల సేనను); ఓర్వన్+వచ్చునె?= ఓడించవీలవుతుందా?; ఏమి+అనువాఁడన్!= ఇంక ఏమంటాను!

తాత్పర్యం: 'ఇంక నా కొడుకులకు ఎక్కడి బ్రదుకు? ఎంత ఆలోచించినా, ఇక్కడ కూడుకొన్న సైనికులకు ఇప్పుడు నీవు చెప్పిన వీరుల సమూహాన్ని- వీరుల సేనను గెలవటం సాధ్యపడుతుందా? ఇక నేనేమి అనేది?

క. రాజు యుధిష్ఠిరుఁడై, హరి । దా జయ మొడఁగూర్ప నున్నఁ, దత్సైన్యము రా
రా జిట్లు సరకు సేయమి । నా జన్మము దుఃఖభాజనం బగుటఁ జుమీ! 236

ప్రతిపదార్థం: రాజు; యుధిష్ఠిరుఁడు+ఐ= ధర్మరాజయి; హరి= కృష్ణుడు; తాన్= తాను; జయము+ఒడఁగూర్పన్+ఉన్నన్= గెలుపు కలిగించబోతూండగా; తద్+సైన్యమున్= ఆ సేనను; రారాజు= దుర్యోధనుడు; ఇట్లు; సరకు+చేయమి= లక్ష్యపెట్టకపోవటం; నా జన్మము= నా పుట్టుక; దుఃఖభాజనంబు+అగుటన్+చుమీ!= దుఃఖానికి పాత్రమైనది అవటం చేత సుమా!

తాత్పర్యం: రాజు ధర్మరాజుయి, కృష్ణుడు జయం కలిగించబోయే ఆ సైన్యాన్ని దుర్యోధనుడు ఇట్లా లక్ష్య పెట్టకపోవటం నా పుట్టుక దుఃఖశీలం అవటంచేతనే.

విశేషం: ధర్మరాజుకు యుధిష్ఠిరు డనే శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. నా కుడుప నేల వశమగు? । నీ కూడిన భూపతులకు నింతియ కాలం
బై కడచన్నది సంజయ! । నీ కీ వగపేల? యింక నిలుపుము పలుకుల్.' 237

ప్రతిపదార్థం: నాకున్+ఉడుపన్+ఏల వశము+అగున్= మాన్పటానికి నాకెట్లా సాధ్యమవుతుంది?; ఈ కూడిన భూపతులకున్= ఈ చేరిన రాజులకు; ఇంతియ కాలంబు+ఐ కడచన్నది= ఇంతే బ్రదుకయిపోయింది - ఆయువు ఇంతటితో మూడింది; సంజయ; నీకున్; ఈ వగపు+ఏల?= ఈ శ్రమ-దుఃఖం ఎందుకు?; ఇంకన్, పలుకుల్, నిలుపుము= ఇక నీ మాటలు చాలించుము.

తాత్పర్యం: నే నెట్లా మాన్పగలను? ఈ చేరిన రాజులకు ఆయువు మూడింది. సంజయా! నీ కీ శ్రమ ఎందుకు? ఇంక చెప్పకుము.'

వ. అనిన విని దుర్యోధనుండు నిజ జనకునితో నిట్లనియె : 238

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు తన తండ్రితో ఇట్లా అన్నాడు :

ఉ. 'ఏమును బాండునందనులు నేక కులంబునఁ బుట్టి యొక్కచో
నే మొకఁడైనఁ జేసి గెడ నెప్డుఁ జరించినయట్టివార; ము
ద్దామబలంబు శౌర్యమును దర్పము వారిక కల్గి, వార సం
గ్రామమునన్ జయింతు రనఁగా నొక నిశ్చయ మెట్లు గల్గెడున్? 239

ప్రతిపదార్థం: ఏమును= మేమూ; పాండు నందనులున్= పాండవులూ; ఏక కులంబునన్= ఒకే కులంలో; పుట్టి; ఒక్కచోన్= ఒక చోట; ఏము; ఒకఁడు+ఐనన్+చేసి= ఒకటి (ఏకం) అవటం చేత; ఎప్డున్= ఎప్పుడూ; గెడన్= జతగా; చరించిన+అట్టి సంచరించినవాళ్ళం; ఉద్దామ బలంబున్= అధిక బలమూ; శౌర్యమును= పరాక్రమమూ; గర్వమున్; వారికిన్+అ= వారికి-వారికే; కల్గి; వారు+అ= వారే; సంగ్రామమునన్= యుద్ధంలో; జయింతురు+అనఁగాన్= జయిస్తారంటే; ఒక నిశ్చయము= ఒక నిర్ణయం; ఎట్లు+కల్గెడున్= ఎట్లా కలిగింది?

తాత్పర్యం: 'మేమూ పాండవులూ ఒకే కులంలో పుట్టి, ఒక్కచోట ఏకమవటం చేత ఎప్పుడూ జతగా సంచరించిన వాళ్ళం. అట్లాంటప్పుడు అధికమైన బలపరాక్రమాలూ గర్వమూ వారికే కలిగి, వారే యుద్ధంలో జయిస్తారనే నిర్ణయం నీకు ఎట్లా ఏర్పడింది?

ఉ. వారిని, వారివారి నిటు వర్ణన సేసెదు గాని, మమ్ము మా
వారిఁ దలంప; వి ప్పుడమి వారికిఁ బాయను, మాకు నంతయున్
జేరను మున్ సృజించె విధి సిద్ధము, దీని నొకండు మాన్పఁగా
నేరఁ; డకారణంబ మది నెవ్వగ లేటికిఁ బట్టుకొల్పఁగన్?' 240

ప్రతిపదార్థం: వారిని= పాండవులనూ; వారి వారిన్= వాళ్ళ వాళ్ళనూ; ఇటు= ఇట్లా; వర్ణన+చేసెదు(దవు)+కాని= వర్ణిస్తావు కాని; మమ్మున్; మా వారిన్; తలంపవు; ఈ+పుడమి= ఈ భూమి; వారికిన్+పాయను= వాళ్ళకు లేకుండానూ; మాకున్; అంతయున్= అంతా; చేరను= చెందేటట్లూ; విధి= బ్రహ్మ - దైవం; మున్= ముందు, మొదటే; సృజించెన్= పుట్టించాడు-నిర్ణయించాడు; సిద్ధము= తప్పదు; దీనిన్= ఈ విధి నిర్ణయాన్ని; ఒకండు= ఎవడూ; మాన్పఁగాన్+నేరఁడు= తప్పించలేడు; ఆకారణంబు+అ= నిష్కారణంగానే; మదిన్= మనస్సులో; నెఱ+వగలు= అధిక దుఃఖాలు - ఎక్కువ ఆలోచనలు; పట్టుకొల్పఁగన్+ఏటికి?= కలిగించడం దేనికి?

తాత్పర్యం: పాండవులనూ, వాళ్ళ వాళ్ళనూ ఇట్లా తెగ పొగుడుతావు కాని, మమ్ములను, మా వాళ్ళనూ తలపెట్టవు. ఈ భూమి వాళ్ళకు కాదనీ, మాకే అంతా చెందాలనీ మొదటే విధి నిర్ణయించాడు. ఇది తప్పదు. ఈ విధి నిర్ణయాన్ని ఎవడూ తప్పించలేడు. నిష్కారణంగా మనస్సులో ఇంత బాధ పడటం దేనికి?'

వ. అనిన విని సూతనందనునకు నంబికానందనుం డిట్లను- 'నా కొడు కున్మత్త ప్రలాపంబులు సేయుచున్నవాఁ; డింతియకాని సత్యధర్మ నయ పరాక్రమ సహాయ సంపన్నులైన పాండవులఁ దనకు గెలువ వచ్చునే? తాను బ్రబలుం డయినను బెనఁకువ గీడ కాక మేలగునే? యది యట్లుండె; నొక్కటి యడిగెద సంజయా! చెప్పుము. 241

ప్రతిపదార్థం: అనినన్; విని; సూతనందనునకున్= సంజయుడికి; అంబికానందనుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనున్; నా కొడుకు; ఉన్మత్త ప్రలాపంబులు+చేయుచున్+ఉన్నవాఁడు= పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు; ఇంతియకాని= ఇంతే కాని; సత్య ధర్మ నయ పరాక్రమ సహాయ సంపన్నులు+ఐన పాండవులన్= సత్యమూ, ధర్మమూ, నీతీ, పరాక్రమం, సహాయమూ తోడుగా గలిగిన పాండవులను, తనకున్+గెలువన్+వచ్చునే?= తనకు గెలవటం సాధ్యమా?; తాను; ప్రబలుండు+అయినను= మిక్కిలి బలం కలవాడే అయినప్పటికీ; పెనఁకువ= కలహం; కీడు+అ+కాక= హానే కాని; మేలు+అగునే= మంచిదవుతుందా?; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ; సంజయా!; ఒక్కటి+అడిగెదన్; చెప్పుము.

తాత్పర్యం: అనగా విని సంజయుడితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు. 'నా కొడుకు పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు. ఇంతేకాని సత్యమూ, ధర్మమూ, నీతీ, పరాక్రమం, సహాయమూ గలిగిన పాండవులను తను గెలవగలడా? తాను అధిక బలవంతుడయినప్పటికీ కలహం కీడే కాని మేలు కలిగిస్తుందా? అది అట్లా ఉంచి, సంజయా! నిన్నొక్కటి అడుగుతాను చెప్పుము.

క. సమరమునకుఁ బురికొల్పుచు, । మముఁ దలఁచిన నుల్లి కుట్టు మాటలఁ దచ్చి
త్తము లుడికించుచుఁ బాండవ । సమితిం గడఁగించువా రచట నెవ్వరొకో?' 242

ప్రతిపదార్థం: సమరమునకున్= యుద్ధానికి; పురికొల్పుచున్= ప్రేరేపిస్తూ; మమున్= మమ్మల్ని; తలఁచినన్= తలచుకోగానే; ఉల్లి కుట్టు మాటలన్= సూటీ పోటీ మాటలతో- ఎత్తి పొడుపు మాటలతో; తద్+చిత్తములు= వాళ్ళ మనస్సులు; ఉడికించుచున్= వేడెక్కిస్తూ; పాండవ సమితిన్= పాండవుల సమూహాన్ని; కడఁగించువారు= ప్రోత్సహించేవాళ్ళు; అచటన్= అక్కడ; ఎవ్వరు+ ఒకో?= ఎవరో?

తాత్పర్యం: యుద్ధానికి పురికొల్పుతూ మా మాట స్మరించగానే సూటిపోటి మాటలతో వాళ్ళ మనస్సులను వేడెక్కిస్తూ పాండవులను ప్రోత్సహించే వాళ్ళు అక్కడ ఎవరో?'

క. నావుడు సంజయుఁ డిట్లను; । 'దేవా! పాండవుల యలుక ధృష్టద్యుమ్నుం
డే వెరవుమాటనైనను । నే వోసిన యగ్ని భంగి నిగుడం జేయున్. 243

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; సంజయుఁడు; ఇట్లు+అనున్; దేవా!; ధృష్టద్యుమ్నుండు; ఏ వెరవు మాటన్+ఐనను= ఏ రకం మాటతో అయినా; పాండవుల అలుకన్= పాండవుల కోపాన్ని; నే+పోసిన+అగ్ని భంగిన్= నేయి పోసిన నిప్పువలె; నిగుడన్+చేయున్= రగుల్కొలుపుతాడు.

తాత్పర్యం: అట్లా ధృతరాష్ట్రుడు అడగగానే సంజయుడు ఇట్లా అన్నాడు: 'ప్రభూ! ధృష్టద్యుమ్నుడు ఏదో మాటతో పాండవుల కోపాన్ని నెయ్యి పోసిన నిప్పువలె రగుల్కొలుపుతాడు.

విశేషం: నే వోసిన యగ్ని భంగి- అలంకారం ఉపమ.

వ. అతండు ధర్మతనయుతో నిట్లను: 'గాంగేయ కుంభసంభవాది మహావీర క్రూరసత్త్వ బహుళంబును, గరిఘటా గిరి కదంబ కలితంబును, దురంగ నికర తరంగ పరంపరా ఘోరంబు నగు కౌరవసేనా సముద్రంబునకు నేనొక్క చెలియలికట్టనై నిలిచెద' నవుడు నయ్యుధిష్ఠిరుండు 'నీ వింతకుఁ జాలుట యెవ్వరు నెఱుంగరే? యెట్లును సంగరంబున మమ్ముద్ధరింపు' మనియె; నిట్లు గొనియాడిన, నాతండు నా దెసం గనుంగొని, 'సంజయా! మీ వారల కెల్లనుం దెలియం జెప్పు; మీశ్వరాది దేవతలు సమకట్టిన సవరణగల యర్జునుచేత నిర్జింపంబడిన యుత్కృష్టజాతు లనేకు లగుట యెఱుంగుదుర కాదె? మనుష్యు లతనికెంత పెద్ద? యిట్టి జెట్టి వెన్నుదన్ని చూడఁగలవాఁడు గావున, మముబోంట్లెల్లఁబోక పెనంగినం, బోరు భరంబైనం, బ్రాణంబులపై వచ్చు; నంతకంటెను బరమ దయాపరుండైన పాండవాగ్రజు మఱువు సొచ్చి బ్రదుకుం డను; మంతలంతలు

దప్పులు సేసితి మని తలంక వలవ; దెంత సేసినను, గౌంతేయ పూర్వజుండు శాంతి సుధానిధి యగుటంజేసి శరణు సొచ్చినం గాచు' నని పలికె' ననిన విని ధృతరాష్ట్రుండు దుర్యోధనున కిట్లనియె: 244

ప్రతిపదార్థం: అతఁడు= ధృష్టద్యుమ్నుడు; ధర్మతనయుతోన్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్; గాంగేయ కుంభసంభవ+ఆది మహావీర క్రూర సత్త్వ బహుళంబును= భీష్ముడూ, ద్రోణుడూ మున్నగు గొప్ప వీరులనే క్రూరమృగాలతో సాంద్రమైనదీ; కరి ఘటా గిరి కదంబ కలితంబును= ఏనుగుల గుంపు అనే కొండల సమూహంతో కూడుకొన్నదీ; తురంగ నికర తరంగ పరంపరా ఘోరంబును= గుర్రాల సమూహం అనే అలల వరసచేత భయంకరమైనదీ; అగు; కౌరవ సేనా సముద్రంబునకున్= కురుసైన్యం అనే సముద్రానికి; ఏను= నేను; ఒక్క చెలియలికట్టను+ఐ= ఒక గట్టు నయి; నిలిచెదన్= నిలుస్తాను; అనవుడున్= అనగానే; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; నీవు; ఇంతకున్+చాలుట= ఈ చెప్పినదానికి సమర్థుడవటం; ఎవ్వరున్= ఎవరూ; ఎఱుంగరే?= ఎరగరా?; ఎట్లునున్= ఎట్లా అయినా; సంగరంబునన్= యుద్ధంలో; మమ్మున్; ఉద్ధరింపుము= లేవనెత్తుము, ఆదుకో; అనియెన్; ఇట్లు; కొనియాడినన్= పొగడగా; అతండు+ ధృష్టద్యుమ్నుడు; నా దెసన్= నా వైపు; కనుంగొని= చూచి; సంజయా!; మీ వారలకున్+ఎల్లనున్= మీవాళ్ళకందరికీ; తెలియన్+చెప్పుము= తెలిసేటట్లు చెప్పుము; ఈశ్వర+ఆది దేవతలు= ఈశ్వరుడూ మొదలైన దేవతలు; సమకట్టిన సవరణ+కల= సమకూర్చిన యుద్ధపరికరాలు ఉన్న; అర్జును చేతన్; నిర్జింపంబడిన= జయించబడిన; ఉత్కృష్ట జాతులు= గొప్పవాళ్ళు; అనేకులు+అగుట= పెక్కుమంది అవటం; ఎఱుంగుదురు+అ కాదె= ఎరుగుదురు కదా; అతనికిన్; మనుష్యులు= మానవ మాత్రులు; ఎంత పెద్ద?= ఏమి ఎక్కువ?; ఇట్టి జెట్టి= ఇటువంటి వీరుడు; వెన్ను దన్ని చూడన్+కలవాఁడు+కావునన్= వెనకాల ఉండి చూడగలవాడు కాబట్టి; మము బోంట్లు+ఎల్లన్= మావంటివాళ్ళు అందరూ; పోక పెనంగినన్= పారిపోకుండా యుద్ధం చేయగా; పోరు= యుద్ధం; భరంబు+ఐనన్= అతిశయం అయితే; ప్రాణంబులపైన్+వచ్చున్= ప్రాణాంతకమవుతుంది; అంతకంటెను= దానికంటె; పరమ దయాపరుండు+ఐన= మిక్కిలి దయగల వాడయిన; పాండవ+అగ్రజు= ధర్మరాజుయొక్క; మఱువు+చొచ్చి= శరణుపొంది; బ్రదుకుండు+అనుము= బ్రతకండి అని చెప్పుము; అంతలు+అంతలు+తప్పులు+చేసితిమి+అని= అంతంత అపరాధాలు చేశామని; తలంకవలవదు= భయపడవద్దు; ఎంతలు+చేసినను= ఎంతటి ఘోరాలు చేసినా; కౌంతేయ పూర్వజుండు= పాండవులలో పెద్దవాడు- ధర్మరాజు; శాంతి సుధానిధి+అగుటన్+చేసి= శాంతికి చంద్రుడు అవటం చేత- శాంతి అనే అమృతానికి నిధానం కావటం చేత; శరణు+చొచ్చినన్= శరణంటే; కాచున్= రక్షిస్తాడు; అని; పలికెన్; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అతడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'భీష్మద్రోణాది మహావీరులనే క్రూరమృగాలతో తరచైనదీ, ఏనుగుల గుంపు అనే కొండల సమూహంతో కూడుకొన్నదీ, గుర్రాల సమూహం అనే అలల వరసచేత భయంకరమయినదీ అయిన కురుసేన అనే సముద్రానికి నేను ఒక గట్టునయి నిలుస్తాను' అనగానే ఆ ధర్మరాజు 'నీవు అన్నంత దానికీ సరిపోతావని ఎవరికి తెలియదు? ఎట్లా అయినా యుద్ధంలో మమ్మల్ని ఆదుకో' అన్నాడు. ఇట్లా పొగిడితే, ధృష్టద్యుమ్నుడు నావైపు చూచి 'సంజయా! మీ వాళ్ళ కందరికీ తెలిసేటట్లు చెప్పుము. ఈశ్వరుడు మొదలైన దేవతలు సమకూర్చిన యుద్ధ పరికరాలు గల అర్జునుడిచేత జయించబడిన గొప్పవాళ్ళు ఎంతో మంది ఉండటం మీకు తెలిసిందే కదా! మనుష్యులు అతడికి ఏమి ఎక్కువ? ఇటువంటి శూరుడు వెనకాల ఉండి చూడగలవాడు కాబట్టి, మావంటివాళ్ళం పారిపోకుండా నిలబడి యుద్ధం చేస్తాం. అప్పుడు యుద్ధం తలకు మించిన బరువై ప్రాణాంతక మవుతుంది. దానికంటె మిక్కిలి దయగలవాడైన ధర్మరాజును శరణనివేడి బ్రతకండి అని చెప్పుము. అంతలేసి తప్పులు చేశాం అని భయపడవద్దు. ఎంతటి తప్పులు చేసినా ధర్మరాజు శాంతికి చంద్రుడు (శాంతి అనే అమృతానికి నిధానం) కాబట్టి, శరణంటే రక్షిస్తాడు' అని పలికాడు:' అనగా విని ధృతరాష్ట్రుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 'గాంగేయ ... బహుళంబును',- 'కరిఘటా .... కలితంబును', 'తురంగ నికర తరంగ ఘోరంబును'; 'కౌరవ సేనా సముద్రంబునకు నేను చెలియలికట్టను' - అన్నీ రూపకాలంకారాలు. 'ఒక్క చెలియలికట్టనై నిలిచెద' - చెలియలి కట్ట సముద్రం పొంగి పొరలకుండా ఆపినట్లు, 'నేను కౌరవసేన మీదికి రాకుండా అడ్డుపడతాను' అని భావం. 'శాంతి సుధా నిధి' శాంతి అనే సుధకు నిధి- అలంకారం రూపకం. 'అర్జును చేత నిర్జింపబడిన ఉత్కృష్ట జాతులనేకులగుట యెఱుంగుదుర కాదె? మనుష్యు లతని కెంత పెద్ద?' - అలంకారం కావ్యార్థాపత్తి.

క. 'పరిజనులకు నీకును ని । ద్ధరలోన సగంబు సాలుఁ; దక్కటి సగముం
గర ముచితంబుగఁ బాండవ । వరుఁ డగు ధర్మజున కిచ్చి బ్రదుకుము నెమ్మిన్. 245

ప్రతిపదార్థం: పరిజనులకున్ నీకునున్= నీ పరివారానికీ, నీకూ; ఈ+ధరలోనన్= ఈ భూమిలో; సగంబు+చాలున్= సగం సరిపోతుంది; తక్కటి సగమున్= మిగిలిన సగాన్ని; కరము+ఉచితంబుగన్= సముచితంగా; పాండవ వరుఁడు+అగు ధర్మజునకున్+ఇచ్చి= పాండవ శ్రేష్ఠుడైన ధర్మరాజు కిచ్చి; నెమ్మిన్= హాయిగా; బ్రదుకుము= జీవించుము.

తాత్పర్యం: 'నీకూ నీ పరివారానికే ఈ భూమిలో సగం చాలు, తక్కిన సగం సముచితంగా ధర్మరాజుకిచ్చి హాయిగా బ్రతుకుము.

ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో సంధి సేయుమని చెప్పుట (సం. 5-57-4)

చ. పెనఁకువ నాక యేల మన పెద్దల కెవ్వరి కియ్యకోలు గా;
దనుచిత వృత్తి గాన గురుఁడాదిగ నాప్తులు బంధుమిత్రులున్
గొనకొని పోరికిం జొర; రకుంఠిత తేజుఁడు ధర్మపుత్త్రుఁ; డా
తనిఁ దగఁ గూడి మన్కి ప్రమదం బగుఁ గౌరవజాతి కెంతయున్.' 246

ప్రతిపదార్థం: పెనఁకువ= యుద్ధం; నాకున్+అ= నాక= నాకే; ఏల; మన పెద్దలకున్; ఎవ్వరికిన్; ఇయ్యకోలు+కాదు= సమ్మతం కాదు; అనుచిత వృత్తి+కానన్= తగని వ్యాపారం కాబట్టి; గురుఁడు+ఆదిగన్= ద్రోణుడు మొదలుకొని; ఆప్తులున్; బంధు మిత్రులున్= చుట్టాలూ; స్నేహితులూ; గొనకొని= పూని; పోరికిన్= యుద్ధానికి; చొరరు= ప్రవేశించరు - ముందుకు రారు; ధర్మపుత్రుఁడు= ధర్మరాజు; అకుంఠిత తేజుఁడు= కుంటువడని తేజస్సు కలవాడు; ఆతనిన్; తగన్= ఒప్పుగా; కూడి మన్కి= కలిసి బ్రతకటం; కౌరవజాతికిన్= కురు కులానికి; ఎంతయున్= మిక్కిలి; ప్రమదంబు+అగున్= ఆనందమవుతుంది.

తాత్పర్యం: యుద్ధం నాకే కాదు, మన పెద్దల కెవ్వరికీ సమ్మతం కాదు. అది తగని పని కాబట్టి ద్రోణుడు మొదలుకొని ఆప్తులుగాని, బంధువులుగాని, మిత్రులుగాని యుద్ధానికి పూని ముందుకు రారు. ధర్మరాజు కుంటువడని తేజస్సు కలవాడు. ఆతడితో ఒప్పుగా కలిసి బ్రతకటం కౌరవజాతికి ఎంతో సంతోషం కలిగిస్తుంది.'

వ. అని వెండియు. 247

తాత్పర్యం: అని మళ్ళీ.

క. 'కర్ణుండు రేఁచి పెట్టఁగ, । దుర్ణయపరులైన శకుని దుశ్శాసను లీ
నిర్ణయమె మేలనఁగ, నీ । కర్ణములకు నించు నెట్లు కార్యవచనముల్?' 248

ప్రతిపదార్థం: కర్ణుండు; రేఁచి పెట్టఁగన్= ప్రేరేపించగా; దుర్ణయపరులు+ఐన= అవినీతిపరులైన; శకుని దుశ్శాసనులు; ఈ నిర్ణయమె; మేలు+అనఁగన్; కార్యవచనముల్= చేయాల్సినదానికి సంబంధించిన మాటలు; ఎట్లు ఇంచున్= ఎట్లా ఇష్టమవుతాయి?

తాత్పర్యం: 'కర్ణుడు ప్రేరేపించగా, అవినీతిపరులైన శకుని దుశ్శాసనులు ఈ నిర్ణయం బాగుందని మెచ్చుకోగా, చేయవలసిన దానికి సంబంధించిన మాటలు నీకెట్లా చెవికెక్కుతాయి?'

వ. అనినఁ గటకటంబడి సుయోధనుం డిట్లనియె : 249

తాత్పర్యం: అనగా, బాధపడి దుర్యోధనుడు ఇట్లా అన్నాడు :

క. 'నీ చెప్పెడి పెద్దలు ద్రో । ణా చార్యులు మొదలుగాఁగ నని కొల్లని వా
రై చేరని వారిం గొని । యే చక్కం బెట్టువాఁడ నేఁ బాండవులన్? 250

ప్రతిపదార్థం: నీ చెప్పెడి= నీవు చెప్పే; పెద్దలు ద్రోణాచార్యులు మొదలు+కాఁగన్= పెద్దలైన ద్రోణాచార్యులు మున్నుగా; అనికిన్= యుద్ధానికి; ఒల్లనివారు+ఐ= ఇష్టపడనివారయి; చేరనివారిన్= కలిసిరానివారిని; కొనియే= కొనియా; ఏన్= నేను; పాండవులన్; చక్కంబెట్టువాఁడన్= జయిస్తాను.

తాత్పర్యం: 'నీవు చెప్పే పెద్దలు ద్రోణాచార్యులు మొదలగు యుద్ధాని కంగీకరించక కలిసిరానివాళ్ళను వెంటబెట్టుకొనియా నేను పాండవులను జయిస్తానని అనుకొంటున్నావు?

శా. రాధేయుండును దుస్ససేనుఁడును బోరం బ్రాపుగాఁ బాండవ
క్రోధజ్వాలల నార్తు; నొండొకఁడు నాకుం దోడె? నీ వింక నన్
బాధం బెట్టకు; వాఁడి సూది మొనమోవంజాలు నంతైన నే
నీ ధాత్రీతల మీను వారలకు; నాకే లింత సేగిం బడన్?' 251

ప్రతిపదార్థం: రాధేయుండును= కర్ణుడూ; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; పోరన్= యుద్ధంలో; ప్రాపు+కాన్= అండగా; పాండవ క్రోధ+జ్వాలలన్= పాండవుల కోపాగ్ని జ్వాలలను; ఆర్తున్= ఆర్పుతాను; ఒండు+ఒకఁడు= ఇంకొకడు; నాకున్; తోడె?= తోడా? ఇంకొక డెవడూ నాకు తోడు అక్కర్లేదు అని భావం; నీవు; ఇంకన్; నన్; బాధన్+పెట్టకు; నేను; వారలకున్= పాండవులకు; ధాత్రీతలము= భూభాగం; వాఁడి సూది మొన మోవన్+చాలు+అంత+ఐనన్= వాడిఅయిన సూది మొన ఆక్రమించేటంత కూడా; ఈను= ఇవ్వను; నాకున్; ఇంత సేగిన్+పడన్+ఏల?= ఇంత చేటు పొందటం ఎందుకు?

తాత్పర్యం: యుద్ధంలో నాకు కర్ణుడూ, దుశ్శాసనుడూ అండగా ఉండగా నేను పాండవుల కోపాగ్ని జ్వాలలను ఆర్పుతాను. ఇంకొకడి సాయం నా కెందుకు? నీవు ఇంక నన్ను బాధించకుము. నేను వాడి సూది మొన పట్టేటంత భూమిని కూడా పాండవులకు ఇవ్వను. ఇంత చేటు పొందే అవసరం ఏముంది నాకు?'

విశేషం: క్రోధ జ్వాలలన్ - క్రోధమనే (అగ్ని) జ్వాలల్ని - అలంకారం రూపకం. సూదే సన్నం. వాడి సూది మరీ సన్నం. దాని మొన చెప్పలేనంత సన్నం. అది పట్టేటంత నేలను గూడా ఇవ్వను- అణువంత భూమిని కూడా ఇవ్వనని భావం.

వ. అనిన గాంధారీవల్లభుం డతని కిట్లనియె: 252

ప్రతిపదార్థం: అనినన్; గాంధారీ వల్లభుండు= గాంధారి భర్త- ధృతరాష్ట్రుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా, ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'నీకు నంత వగవ; నీపోవు తెరువునఁ । బోవు వారు గాఁగఁ బూనియున్న
వారికెల్ల నేను వగచెదఁ; గయ్యంబు । వలవ దుడుగు మయ్య చలము గొనక. 253

ప్రతిపదార్థం: నీకున్+అంత వగవన్= నీ కొరకు అంతగా దుఃఖించను; నీ పోవు తెరువునన్= నీవు వెళ్ళే మార్గంలో; పోవు వారు+కాఁగన్+పూని+ఉన్న వారికిన్+ఎల్లన్= వెళ్ళటానికి యత్నించే వాళ్ళందరి కొరకు; ఏను= నేను; వగచెదన్= దుఃఖిస్తాను; కయ్యంబు వలవదు= యుద్ధం వద్దు; చలము కొనక= పంతం పూనక; ఉడుగుము+అయ్య= మానవయ్య.

తాత్పర్యం: 'నీ కొరకు అంతగా విచారించను. నీవు పయనించే దారిలో పయనించడానికి యత్నించే వాళ్ళందరికొరకు నేను విచారిస్తాను. యుద్ధం వద్దు. పంతానికి పోక మానవయ్యా!

చ. ఉభయ బలంబులుం బొగడ నుగ్రత భీముఁడు విస్ఫురద్గదన్
రభస మెలర్పఁ గుంభములు వ్రయ్యఁగ వ్రేసిన, నెత్తు రొల్కఁగా
నిభముల పిండు గావి సెలయేఱుల తోడి నగంబులట్లు సం
క్షుభితములై పయిం బఱవఁ జూచి తలంచెదు నాదు వాక్యముల్! 254

ప్రతిపదార్థం: భీముఁడు; ఉభయ బలంబులున్= రెండు పక్షాల సేనలూ; పొగడన్= పొగడగా; ఉగ్రతన్= కోపంతో; విస్ఫురత్+గదన్= ప్రకాశించే గదతో; రభసము+ఎలర్పన్= సంతోష మతిశయించగా; కుంభములు= కుంభస్థలాలు; వ్రయ్యఁగన్+ వ్రేసినన్= బ్రద్దలయ్యేటట్లు కొట్టగా; నెత్తురు+ఒల్కఁగాన్= రక్తం ఓడగా; ఇభముల పిండు= ఏనుగుల గుంపు; కావి సెలయేఱుల తోడి నగంబుల+అట్లు= ఎర్రటి సెలయేళ్ళతోడి కొండల వలె; సంక్షుభితములు+ఐ= మిక్కిలి వ్యాకులత నొందినవయి; పయిన్+పఱవన్= పైని వ్యాపించగా; చూచి; నాదు వాక్యముల్= నా మాటలు; తలంచెదు (దవు)= స్మరిస్తావు.

తాత్పర్యం: ఇరుపక్షాల సేనలూ ప్రశంసిస్తూండగా భీముడు మహాకోపంతో ప్రకాశించే గదతో, హర్షం అతిశయించగా కుంభస్థలాలు బ్రద్దలు కొడితే, నెత్తురోడుతూ ఏనుగుల గుంపు ఎర్రటి సెలయేళ్ళతో కూడిన కొండల వలె మిక్కిలి వ్యాకులత చెంది పైని వ్యాపించగా చూచి నా మాటలు స్మరిస్తావు.

విశేషం: 'నెత్తు రొల్కఁగా నిభముల పిండు గావి సెలయేఱులతోడి నగంబు లట్లు సంక్షుభితములై పయిం బఱవ'- అలంకారం ఉపమ.

చ. ఉఱక ధనంజయుండు వివిధోగ్ర శరంబుల నొక్క మాత్ర నే
డ్తెఱ నుఱుమాడినం బుడమిఁ ద్రెళ్ళిన నీదగుసైన్యమంతయున్
నఱికినఁ బడ్డ ఘోర విపినంబు విధంబున నున్నఁ జూచి, య
త్తఱి నయినం దలంపు ముచితంబగు నా వచనంబుఁ బుత్త్రకా!' 255

ప్రతిపదార్థం: పుత్త్రకా!= కుమారా!; ధనంజయుండు= అర్జునుడు; ఉఱక= ఎవర్నీ సరకు గొనక; వివిధ+ఉగ్ర శరంబులన్= పెక్కు రీతులైన భయంకర బాణాలతో; ఒక్క మాత్రన్= ఒక రెప్పపాటు కాలంలో; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నుఱుమాడినన్= వధించగా; పుడమిన్= నేలమీద; త్రెళ్ళిన= పడిన; నీ+అది+అగు సైన్యము+అంతయున్= నీదైన సేన అంతా; నఱికినన్= నరకగా; పడ్డ= పడిపోయిన; ఘోర విపినంబు విధంబునన్= భయంకరమైన అడవి వలె; ఉన్నన్+చూచి= ఉండటం చూచి; ఆ+తఱిన్+అయినన్= ఆ సమయంలోనైనా; ఉచితంబు+అగు నా వచనంబున్= తగిన నా మాటను; తలంపుము= స్మరించుము.

తాత్పర్యం: కుమారా! అర్జునుడు ఎవర్నీ సరకుగొనకుండా పెక్కు రీతులైన భయంకర బాణాలతో ఒక్క రెప్పపాటు కాలంలో పరాక్రమంతో నరకగా నేలమీద పడిన నీ సేన అంతా నరికితే పడిపోయిన భయంకరాటవి వలె ఉండటం చూచి, అప్పుడైనా సముచితమైన నా మాటను స్మరించుము.

విశేషం: 'నుఱుమాడినం బుడమిఁ ద్రెళ్ళిన నీదగు సైన్యమంతయున్ - నఱికినఁ బడ్డ ఘోర విపినంబు విధంబున నున్నన్'- అలంకారం ఉపమ.

వ. అని పలికి, యతని వలనం బలుకుగానక మనంబు మరలంబెట్టు కొని కొడుకులు జయింప నోపుదురొకో యను నాస సంజయు దిక్కు మొగంబుసేసి పాండవ కౌరవ పక్షంబులం గలవారి నడుగుచుం, గొలందులు దలపోయుచు, నాతని వచనంబులం దన విచారంబులను బలాబలంబులు నిశ్చయించి, పాండవేయు లెక్కు డవుట యెఱుంగుచుఁ, గ్రమ్మఱ నా సూతపుత్రుతో లెక్కలు వెట్టుచుం, బోలించుచుఁ, బెద్దప్రొద్దు వితర్కించి, కౌంతేయుల శక్తి దేవశక్తియు, గాంధారేయుల శక్తి మనుష్యశక్తియుంగాఁ దెలిసినవాఁడై, యంబికానందనుండు నిజనందనునితో నిట్లనియె: 256

ప్రతిపదార్థం: అని; పలికి; అతని వలనన్= అతడిలో - దుర్యోధనుడిలో; పలుకు+కానక= ఎటువంటి సమాధానమూ పొందక; మనంబు= మనస్సు; మరలన్+పెట్టుకొని= మరల్చుకొని; కొడుకులు; జయింపన్+ఓపుదురు+ఒకో+అను+ఆసన్= గెలవగలరా అనే ఆశతో; సంజయు దిక్కు మొగంబు+చేసి= సంజయుడికేసి చూచి; పాండవ కౌరవ పక్షంబులన్+కలవారిన్= పాండవుల పక్షంలోనూ, కౌరవుల పక్షంలోనూ ఉన్నవాళ్ళని గూర్చి; అడుగుచున్= అడుగుతూ; కొలందులు+తలపోయుచున్= సామర్థ్యాలు తలచుకొంటూ; ఆతని వచనంబులన్= ఆ సంజయుడి మాటలతోనూ; తన విచారంబులను= తన ఆలోచనలతోనూ; బల+అబలంబులు= బలాబలాలు; నిశ్చయించి= నిర్ణయించి; పాండవేయులు; ఎక్కుడు+అవుట= ఎక్కువవటం; ఎఱుంగుచున్= తెలిసికొంటూ; క్రమ్మఱన్= మళ్ళీ; ఆ సూతపుత్త్రుతోన్= ఆ సంజయుడితో; లెక్కలు+పెట్టుచున్= లెక్కలు కట్టుతూ; పోలించుచున్= పరస్పరం పోలుస్తూ; పెద్ద ప్రొద్దు= చాలసేపు; వితర్కించి= యుక్తులతో ఆలోచించి; కౌంతేయుల శక్తి= పాండవుల శక్తి; దేవశక్తియున్= దివ్యశక్తీ; గాంధారేయుల శక్తి= కౌరవుల శక్తి; మనుష్య శక్తియున్+కాన్= మానవశక్తీ అని; తెలిసినవాఁడు+ఐ= గుర్తించినవాడై; అంబికా నందనుండు= ధృతరాష్ట్రుడు; నిజ నందనునితోన్= తన కొడుకుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి, అతడినుండి మారుపలుకు పొందక మనస్సు మరలించుకొని, కొడుకులు గెలవగలరా అనే ఆశతో సంజయుడివైపు చూచి, పాండవ కౌరవ పక్షాలలో ఉన్నవారిని గూర్చి ప్రశ్నిస్తూ, వాళ్ళ వాళ్ళ శక్తులు తలచుకొంటూ, పాండవులు అధికులు కావడం తెలిసి, మళ్ళీ ఆ సంజయుడితో లెక్కలు కట్టుతూ, ఒకళ్ళతో

ఒకళ్ళని పోలుస్తూ, చాలాసేపు యుక్తులతో ఆలోచించి, పాండవుల శక్తి దివ్యశక్తి అనీ; కౌరవుల శక్తి మానవశక్తి అనీ తెలిసి ధృతరాష్ట్రుడు తన కొడుకు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

క. 'నరుఁ డగ్నిదేవుఁ దనకును । వరదునిఁగాఁ గొలిచినాఁడు; వానికిఁ గేతు
స్ఫురణం బాదిగఁ గల సం । గర పరికర మెల్ల నతఁడు గావించె దయన్. 257

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అగ్నిదేవున్= అగ్నిదేవుడిని; తనకును; వరదునిన్+కాన్= వరాలిచ్చేవాడినిగా; కొలిచినాఁడు= సేవించినాడు; వానికిన్= అర్జునుడికి; కేతు స్ఫురణంబు+ఆదిగన్+కల= జెండా ప్రకాశం మొదలుకొని ఉన్న; సంగర పరికరము+ఎల్లన్= యుద్ధసాధనం అంతా; అగ్నిదేవుడు; దయన్= దయతో; కావించెన్= చేశాడు- ఇచ్చాడు.

తాత్పర్యం: అర్జునుడు అగ్నిదేవుడిని తనకు వరదాత అయ్యేటట్లు సేవించాడు. అర్జునుడికి జెండా మొదలైన యుద్ధోపకరణాలనన్నిటినీ అగ్నిదేవుడు దయతో అనుగ్రహించాడు.

వ. అదియునుం గాక ధర్మదేవతయు, వాయుదేవుండును, వాసవుండును, నాశ్వినులును వారలకుఁ బాండురాజు తోడి వారలు; వారి నొక కీడునుం బొరయకుండ రక్షింతురు గావున, భీష్మ ద్రోణ ప్రముఖులకుఁ బాండవులం బరిభవింపరామి దెల్లంబు. 258

ప్రతిపదార్థం: అదియున్+కాక= అదీకాక; ధర్మదేవతయున్= ధర్ముడూ - యమూడూ; వాయుదేవుండును; వాసవుండునున్= ఇంద్రుడూ; ఆశ్వినులును= అశ్వినీ దేవతలూ; వారలకున్= పాండవులకు; పాండురాజు తోడివారలు= పాండురాజుతో సమానులు; వారిన్= పాండవులను; ఒక కీడునున్= ఒక హాని కూడా; పొరయక+ఉండన్= కలగకుండా; రక్షింతురు= కాపాడతారు; కావునన్; భీష్మ ద్రోణ ప్రముఖులకున్= భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారికి; పాండవులన్; పరిభవింపన్+రామి= ఓడించలేకపోవటం; తెల్లంబు= స్పష్టం.

తాత్పర్యం: అదీకాక, ధర్ముడూ, వాయువూ, ఇంద్రుడూ, అశ్వినీదేవతలూ వాళ్ళకు పాండురాజెంతో అంత. వాళ్లకు ఎటువంటి హానీ కలగకుండా వారు కాపాడుతారు. కాబట్టి భీష్ముడూ, ద్రోణుడూ మొదలైనవాళ్ళు పాండవులను జయించలేరనడం స్పష్టం.

విశేషం: పాండవుల కందరికీ పాండురాజు తండ్రి అయినప్పటికీ ధర్మరాజు యముడి అంశవలనా, భీముడు వాయుదేవుడి అంశవలనా, అర్జునుడు ఇంద్రుడి అంశవలనా, నకుల సహదేవులు అశ్వినీ దేవతల అంశవలనా పుట్టినవాళ్ళు కాబట్టి, యమాదులైన ఆ అయిదుగురూ పాండవులకు పాండురాజుతో సమానులు. అందుచేతనే పాండవులను ఆదుకొనటం.

క. దేవత లేటికిఁ? బార్థుఁడు । దేవ సముఁడు గాఁడె? వాఁడు దివిజులచేతం
బోవని దైత్యులఁ జంపఁడె? । యీవును నీవారు నతని నెఱుఁగరె చెపుమా? 259

ప్రతిపదార్థం: దేవతలు+ఏటికిన్= దేవతల దాకా ఎందుకు?; పార్థుఁడు= అర్జునుడు; దేవ సముఁడు+కాఁడె?= దేవతలతో సమానుడు కాడా?; వాఁడు= అర్జునుడు; దివిజుల చేతన్+పోవని దైత్యులన్= దేవతలకు సాధ్యంకాని రాక్షసులను; చంపఁడె?= చంపలేదా?; ఈవును= నీవూ; నీ వారున్= నీ వాళ్ళూ; అతనిన్; ఎఱుఁగరె?= తెలియరా; చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: దేవతల దాకా ఎందుకు? అర్జునుడు దేవతలతో సమానుడు కాడా? అతడు దేవతలకు సాధ్యంకాని రాక్షసులను చంపలేదా? నీవూ, నీవాళ్ళూ అతడిని ఎరగరా చెప్పుము.

వ. కౌరవులకు వచ్చిన యిమ్మహాభయంబునకుఁ బ్రతీకారంబు శాంతిం గడచినయది లే; దెన్ని భంగులం జూచినఁ గయ్యం బుడుగుటయ మనకుం గర్తవ్యంబై యున్నయది; యుపశమింపవయ్య! దీర్ఘ వైరంబు వలవదనినఁ దండ్రికిఁ గొడు కిట్లనియె: 260

ప్రతిపదార్థం: కౌరవులకున్; వచ్చిన= కలిగిన; ఈ+మహా భయంబునకున్= ఈ గొప్ప ఆపదకు; ప్రతీకారంబు= చికిత్స; శాంతిన్= శాంతిని; కడచిన+అది లేదు= మించింది లేదు; ఎన్ని భంగులన్+చూచినన్= ఎన్ని విధాల చూసినా; కయ్యంబు= యుద్ధం; ఉడుగుట+అ= విరమించటమే; మనకున్; కర్తవ్యంబు+ఐ= చేయదగినదయి; ఉన్న+అది= ఉన్నది; ఉపశమింపవయ్యా= శాంతించవయ్యా; దీర్ఘ వైరంబు= చిరకాలపు పగ; వలవదు= వద్దు; అనినన్; తండ్రికిన్; కొడుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కౌరవులకు వచ్చిపడ్డ ఈ మహాపదకు చికిత్స శాంతిని మించింది లేదు. ఎన్ని విధాల చూచినా యుద్ధం విరమించటమే మనం చేయవలసింది. శాంతించవయ్యా. దీర్ఘవైరం పనికి రాదు.' అనగా తండ్రికి కొడుకిట్లా అన్నాడు:

క. 'దేవత లర్జునునకుఁ దో । డై వత్తు రనంగ వలవ; దది యెట్లనినన్
దేవత్వము రాగద్వే । షావేశము లేమిఁ గాదె యైనది మొదలన్? 261

ప్రతిపదార్థం: దేవతలు; అర్జుననకున్; తోడు+ఐ= సహాయంగా; వత్తురు+అనంగన్ వలవదు= వస్తారనవద్దు; అది+ఎట్లు+అనినన్+అది ఎట్లా అంటే; మొదలన్= మొట్టమొదట; దేవత్వము; రాగ ద్వేష+ఆవేశము లేమిన్+కాదె+ఐనది?= రాగద్వేషాల ఆవేశం లేకపోవటం చేతనే కదా ఏర్పడింది?

తాత్పర్యం: 'దేవతలు అర్జునుడికి సహాయులై వస్తారనవద్దు. అది ఎట్లా అంటే- మొట్టమొదట- అసలు, దేవత్వం అంటే రాగద్వేషరాహిత్యమే కదా!

విశేషం: 'అర్జునుడి మీద రాగమూ, మామీద ద్వేషమూ పూని దేవతలు అతడికి సహాయపడితే వాళ్ళు దేవత లెట్లా అవుతా'రని దుర్యోధనుడి ప్రశ్న. అసలు దేవత్వం అంటే రాగద్వేషరాహిత్యమే. వాళ్ళు నిజంగా దేవతలే అయితే అర్జునుడికి సాయపడరని దుర్యోధనుడి అభిప్రాయం.

వ. కావున వా రొకళ్ళవారుం గా; రట్లుంగాక పక్షపాతులై పూని వత్తురయేని నది దేవత్వంబు గా; దట్టి దేవత్వంబున నర్జునుండును సురక్షితుండు గానేరఁడు; నీకు నా పనికిఁ జింత వలవ' దని పలికి, వెండియు నిట్లనుఁ; 'బెఱిగి వచ్చు కార్చిచ్చు నుడుపను, బాషాణ వర్షంబు వారింపను, మహావాయువు నిలుపను, నీళ్ళు గట్టిగా నభిమంత్రించి వానిపైఁ గరి తురగాదుల నడపింపను, నా సేన నడచునప్పుడు వలసినచోట జలంబు లుత్పాదింపను జాలుదు; సింహ శరభ శార్దూల భూత బేతాళాది క్రూరసత్త్వ సంరంభ స్తంభన ప్రకారం బెఱుంగుదు, మిత్త్రశత్త్రు విషయంబులైన శుభాశుభంబులు వలయుభంగి నావహింపనేర్తు; మఱియు నానావిధ సిద్ధి ప్రదంబులగు మంత్ర ధ్యానాద్యనుష్ఠానంబుల నాకుం గొఱంత లేదు; నీ చెప్పిన యగ్నిప్రముఖ

దేవతలం బ్రసన్ను లగునట్లుగా నారాధించినవాఁడ; వారికి నాకుం బోలె మహానుభావంబు గలిగినఁ బదుమూఁడు వత్సరంబు లబ్బంగి నిడుమలం బడుదురె? వినుము చెప్పెద. 262

ప్రతిపదార్థం: కావునన్; వారు= ఆ దేవతలు; ఒకళ్ళవారున్+కారు= ఏ ఒక్కరి వాళ్ళూ కారు; అట్లున్+కాక= అట్లాకాక; పక్షపాతులు+ఐ= ఏ ఒక్కరి పక్షమో వహించి; పూని వత్తురు+అ+ఏనిన్= ప్రయత్నించి వచ్చే మాటయితే; అది; దేవత్వంబు+కాదు; అట్టి దేవత్వంబునన్; అర్జునుండును; సురక్షితుండు= లెస్సగా కాపాడబడినవాడు; కాన్+నేరఁడు= కాలేడు; నీకున్; నా పనికిన్= నేను చేసే పనిని గూర్చి; చింత= విచారం; వలవదు= వద్దు; అని; పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనున్; పెఱిగి వచ్చు కార్చిచ్చున్+ఉడుపను= పెద్దదయి వచ్చే అడవి నిప్పును మాన్పటానికీ- ఆర్పటానికీ; పాషాణ వర్షంబున్= రాళ్ళ వానను; వారింపను= ఆపటానికీ; మహా వాయువున్= పెనుగాలిని; నిలుపను= నిలపటానికీ; నీళ్ళు; గట్టిగాన్; అభిమంత్రించి= మంత్రంచే సంస్కరించి; వానిపైన్; కరి తురగ+ఆదులన్= ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటిని; నడిపింపను= నడపటానికీ; నా సేన= నా సైన్యం; నడచు+అప్పుడు= నడిచేటప్పుడు; వలసిన చోటన్= కావలసినచోట; జలంబులు= నీళ్ళు; ఉత్పాదింపను= పుట్టించటానికీ; చాలుదున్= సమర్థుడిని; సింహ శరభ శార్దూల భూత బేతాళ+ఆది క్రూర సత్త్వ సంరంభ స్తంభన ప్రకారంబు= సింహాలూ, శరభమృగాలూ (సింహం కంటె బలవత్తరమై ఎనిమిది పాదాలుగల జంతువు), పెద్దపులులూ, భూతాలు, బేతాళురూ మొదలయిన క్రూరమృగాల అలజడి యొక్క నిలుపుదల విధం; ఎఱుంగుదున్; మిత్త్ర శత్రు విషయంబులు+ఐన= మిత్రులకూ, శత్రువులకూ సంబంధించిన; శుభ+అశుభంబులు= శుభాలూ, అశుభాలూ; వలయు భంగిన్= కావలసిన రీతిగా; ఆవహింపన్+నేర్తున్= కలిగించగలను; మఱియున్; నానా విధ సిద్ధి ప్రదంబులు+అగు= అనేక రీతులైన సిద్ధులు కలిగించే; మంత్ర ధ్యాన+ఆది+అనుష్ఠానంబులన్= మంత్రాల ధ్యానమూ మొదలైన వాటి చేతలలో; నాకున్; కొఱంత లేదు= లోటు లేదు; నీ చెప్పిన= నీవు చెప్పిన; అగ్ని ప్రముఖ దేవతలన్= అగ్ని మొదలగు దేవతలను; ప్రసన్నులు+అగు+అట్లు+కాన్= సంతుష్టులుఅయ్యే విధంగా; ఆరాధించినవాఁడన్= పూజించాను; వారికిన్= పాండవులకు; నాకున్+పోలెన్= నావలె; మహత్(మహా)+అనుభావంబులు+కలిగినన్= గొప్ప ప్రభావాలు ఉన్నట్లయితే; పదుమూఁడు సంవత్సరంబులు= పదమూడేళ్ళు; ఆ+భంగిన్= ఆ విధంగా; ఇడుమలన్+పడుదురు+ఏ?= కష్టాలు పడతారా?; చెప్పెదన్, వినుము= చెపుతాను వినుము.

తాత్పర్యం: కాబట్టి ఆ దేవతలు ఏ ఒక్కరి వాళ్ళూ కారు. అట్లాకాక ఏదో ఒక పక్షం వహించే మాటయితే వారిది దివ్యత్వం కాదు. అటువంటి దేవత్వంచేత అర్జునుడూ లెస్సగా కాపాడబడలేడు. నా గురించి నీవు బాధపడవద్దు' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు: పెచ్చురేగి వచ్చే కార్చిచ్చును ఆర్పటానికీ, రాళ్ళ వర్షం ఆపటానికీ, పెనుగాలిని స్తంభింపచేయటానికీ, నీళ్ళు గట్టిగా మంత్రించి, వాటిపై ఏనుగులు గుర్రాలు మొదలైనవాటిని నడిపించటానికీ, నా సైన్యం నడిచేటప్పుడు కావలసినచోట నీళ్ళు పుట్టించటానికీ సమర్థుడిని. సింహాలూ, శరభాలూ, పెద్ద పులులూ, భూతాలూ, బేతాళురూ మొదలయిన క్రూర మృగాల అలజడిని స్తంభింపజేసే విధం నాకు తెలుసు. మిత్రులకు శుభాలూ, శత్రువులకు అశుభాలూ కలిగించే విధం నేనెరుగుదును. ఇంకా ఎన్నో విధాల సిద్ధులను కలిగించే మంత్ర ధ్యానాదుల విషయంలో నాకు లోటు లేదు. నీవు చెప్పిన అగ్ని మొదలగు దేవతలను ప్రసన్నులయ్యేట్లు పూజించాను. పాండవులకు నాకువలె మహాప్రభావమే ఉంటే పదమూడేళ్ళు ఆ విధంగా కష్టా లనుభవిస్తారా? చెపుతా వినుము.

విశేషం: మిత్ర శత్రు విషయంబులైన శుభా శుభంబులు- మిత్ర విషయములైన శుభాలు, శత్రు విషయములైన అశుభాలు అని క్రమం. అటువంటి అమానుషాలైన శక్తులు గల తనకు మనుష్యమాత్రులైన పాండవు లొక లెక్కా అని దుర్యోధనుడి ధీమా.

దుర్యోధనుఁడు తండ్రితోఁ దన బలపరాక్రమంబులు సెప్పుట (సం. 5-60-20)

క. ఏ నలిగిన వారిని సుర । లైనను రక్షింపనోప; రమరు లలిగినం
బూని చెడకుండఁ గాతును; । మానవు లొక సరకె నాకు మనుజాధీశా? 263

ప్రతిపదార్థం: ఏను= నేను; అలిగినన్= కోపిస్తే; వారిని= ఎదుటివారిని; సురలు+ఐనను= దేవతలయినా; రక్షింపన్+ఓపరు= కాపాడలేరు; అమరులు= దేవతలు; అలిగినన్= కోపిస్తే కూడా; పూని= యత్నించి; చెడక+ఉండన్= చెడిపోనివిధంగా; కాతును= రక్షిస్తాను; మనుజ+అధి+ఈశా= రాజా; నాకున్; మానవులు= మనుష్యమాత్రులు; ఒక సరకు+ఎ?= ఒక లెక్కా?

తాత్పర్యం: రాజా! నాకు కోపం వస్తే వాళ్ళను దేవతలు కూడా రక్షించలేరు. దేవతలకు కోపం వస్తే కూడా, ప్రయత్నించి హానికలుగకుండా ఉండేటట్లు రక్షిస్తాను. అటువంటి నాకు మనుష్య లోక లెక్కా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

తే. గర్వమున నాడు మాటలుగాఁ దలంప । వలవ; దిది యెల్ల నిక్కంబు; వసుమతీశ!
నన్ను నేఁ జెప్పికొందునే యెన్నఁడైన? । నాత్మసంస్తుతి పౌరుషం బగునె చెపుమ? 264

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= రాజా!; గర్వమునన్= గర్వంతో; ఆడు మాటలు+కాన్= చెప్పే మాటలుగా; తలంపన్+వలవదు= భావించవద్దు; ఇది+ఎల్లన్= ఇప్పుడు నేను చెప్పినదంతా; నిక్కంబు= నిజం; ఎన్నఁడు+ఐనన్= ఎప్పుడైనా; నన్నున్; నేన్= నేను; చెప్పికొందునే= పొగుడుకొంటానా?; ఆత్మ సంస్తుతి= తనని తాను పొగడుకొనటం; పౌరుషంబు+అగునె చెపుమ?= పురుష లక్షణం ఔతుందా చెప్పుము?

తాత్పర్యం: రాజా! నా మాటలను గర్వంతో అన్నవిగా భావించి తీసిపారెయ్యకుము. ఇప్పుడు నేను చెప్పినదంతా నిజం. ఎప్పుడైనా నన్ను నేను పొగడుకొంటానా? ఆత్మస్తుతి పురుషలక్షణమా? చెప్పుము.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'నన్ను నేఁ ... యెన్నఁడైన' అనే విశేషాంశం. 'ఆత్మ సంస్తుతి పౌరుషం బగునె' అనే సామాన్యాంశంచేత సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. ధర్మతనయాది పాండవేయులును, ద్రుపదాది పాంచాలురును, విరాటాది మాత్స్యులును, వాసుదేవాది యాదవులును, మఱియునుం గేకయ పాండ్య మాగధ చైద్య ప్రముఖ నిఖిల దండనాయకులును నాబారింబడి మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున నడంగిపోవుట యవధరించెదుగాక! వారెల్లఁ దేజోధైర్య పరాక్రమోపాయ విచార వివేకంబుల నాయెత్తు వత్తురె? పితామహ ద్రోణ కృపాశ్వత్థామలు శస్త్రాస్త్ర విషయంబులుగా నేమేమి యెఱుంగుదు రెంతెంత నేర్తు రది యెల్ల నెఱుంగుదు; నంతయు నేర్తు' నని పలికి, యందఱు వెఱఁగుపడియుండం, దాను సంజయుతో సంగరంబు తెఱంగు నాలోచనంబుగాఁ బాండవుల దెస మాటలాడుచుండఁ గర్ణుండు ధృతరాష్ట్రుం గైకొనక, ధార్తరాష్ట్రునకుం బ్రియంబుగా నిట్లనియె: 265

ప్రతిపదార్థం: ధర్మ తనయ+ఆది పాండవేయులును= ధర్మరాజు మొదలుగాగల పాండవులూ; ద్రుపద+ఆది పాంచాలురును= ద్రుపదుడు మొదలైన పాంచాలదేశీయులూ; విరాట+ఆది మాత్స్యులును= విరాటుడు మొదలగు మత్స్యదేశీయులూ; వాసుదేవ+ఆది యాదవులును= కృష్ణుడు మున్నగు యాదవులూ; మఱియునున్= ఇంకా; కేకయ పాండ్య మాగధ చైద్య ప్రముఖ నిఖిల దండ నాయకులును= కేకయులు, పాండ్యులు, మాగధులు, చైద్యులు మొదలైన ఎల్ల సేనాధిపతులూ; నా బారిన్+పడి= నా హింసకు లోనయి; మును+నీరు+చొచ్చిన= సముద్రంలో ప్రవేశించిన; ఏఱుల చందంబునన్= నదుల విధంగా; అడంగిపోవుట= రూపుమాసిపోవటం; అవధరించెదవు+కాక= చిత్తగిస్తావు; వారు+ఎల్లన్= వాళ్ళందరూ; తేజస్+ధైర్య పరాక్రమ+ఉపాయ విచార వివేకంబులన్= ధైర్యంలోనూ, పరాక్రమంలోనూ, ఉపాయంలోనూ, ఆలోచనలోనూ, వివేకంలోనూ; నా+ఎత్తు వత్తురె?= నాతో సాటి అవుతారా?; పితామహ ద్రోణ కృప+అశ్వత్థామలు= భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా; శస్త్ర+అస్త్ర విషయంబులుగాన్= శస్త్రాల విషయంలోనూ, అస్త్రాల విషయంలోనూ; ఏమి+ఏమి+ఎఱుంగుదురు; ఎంత+ఎంత; నేర్తురు; అది+ఎల్లన్; ఎఱుంగుదున్; అంతయున్+నేర్తున్; అని పలికి; అందఱున్; వెఱఁగుపడి+ఉండన్= ఆశ్చర్యపడుతూండగా; తాను; సంజయుతోన్; సంగరంబు తెఱంగున్= యుద్ధ పద్ధతిని; ఆలోచనంబు+కాన్= ఆలోచనగా; పాండవుల దెసన్= పాండవులను గూర్చి; మాటలు+ఆడుచున్+ఉండన్= మాటలాడుతూండగా; కర్ణుండు; ధృతరాష్ట్రున్; కైకొనక= పట్టించుకొనక; ధార్తరాష్ట్రునకున్= దుర్యోధనుడికి; ప్రియంబు+కాన్= ఇష్టమయ్యేటట్లు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు మొదలైన పాండవులూ, ద్రుపదుడు మున్నగు పాంచాలురూ, విరాటుడు మొదలగు మాత్స్యులూ, కృష్ణుడు మొదలుగా గల యాదవులూ, ఇంకా కేకయులు, పాండ్యులు, మాగధులు, చైద్యులు మొదలైన ఎల్ల సేనాధిపతులూ, నా హింసకు లోనయి, సముద్రంలో కలిసిన నదుల విధాన రూపుమాసిపోవటం చిత్తగిస్తావులే. వాళ్ళందరూ తేజస్సులోను, ధైర్యంలోను, పరాక్రమంలోను, ఉపాయంలోను, ఆలోచనలోను, వివేకంలోను నాతో సాటి ఔతారా? భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ, అశ్వత్థామకూ శస్త్రాలను గురించీ, అస్త్రాలను గురించీ ఏమేమి, ఎంతెంత తెలుసో అది అంతా, అంత బాగానూ నాకూ తెలుసు' అని పలికి, అందరూ ఆశ్చర్యంతో చూస్తూండగా, తాను సంజయుడితో యుద్ధవిషయమై పాండవులను గురించి మాటలాడుతూంటే, కర్ణుడు ధృతరాష్ట్రుడిని పట్టించుకొనక దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున' - అలంకారం ఉపమ.

క. 'గురు నలుక నాకు నస్త్ర । స్ఫురణ మెడలె నండ్రు జనులు; బొం కది; పూజా
పరతమెయి నమ్మునీశ్వరు । కరుణ గొఱలి మగుడఁ బడయఁ గాంచితిఁ బ్రీతిన్. 266

ప్రతిపదార్థం: జనులు= లోకులు; నాకున్; గురు+అలుకన్= గురుడి కోపం చేత; అస్త్ర స్ఫురణము= అస్త్రాల స్ఫురణ; ఎడలెన్= పోయింది; అండ్రు= అంటారు; అది; బొంకు= అసత్యం; పూజాపరత మెయిన్= పూజాపరత్వంచేత; ఆ+ముని+ఈశ్వరు కరుణ= ఆ మునిశ్రేష్ఠుడి దయ; కొఱలి= అతిశయించి; ప్రీతిన్= సంతోషంతో; మగుడన్= మళ్ళీ; పడయన్+కాంచితిన్= పొందగలిగాను.

తాత్పర్యం: 'నాకు గురువుగారి కోపం కారణంగా అస్త్రాలు స్ఫురించ కుండా పోయాయని లోకులంటారు. కాని, అది అసత్యం. నా ఆరాధనాపరత్వంచేత ఆ మునిశ్రేష్ఠుడి దయ అతిశయించి సంతోషంతో మళ్ళీ పొందగలిగాను.

విశేషం: 'గురు నలుక' బ్రాహ్మణుడిని అని చెప్పి తన దగ్గర అస్త్రవిద్య నేర్చుకొనే కాలంలో పరశురాముడు కర్ణుడి ఒడిలో పరున్నాడు. అప్పు డొక కీటకం కర్ణుడితొడ కరిచింది. రక్తం కారుతున్నా, కర్ణుడు గురువుగారికి నిద్రాభంగం అవుతుందని ఓర్చుకొని కదలలేదు. కొంతసేపటికి పరశురాముడు లేచి, రక్తం చూచి, బ్రాహ్మణుడయితే ఇంత సహనం ఉండదని ఎంచి 'నీ కులం ఏమిటో చెప్పుము' అన్నాడు. కర్ణుడు తాను సూతకులజుడిని అని చెప్పాడు. అసత్య మాడినందుకు పరశురాముడు కోపించి, ఆపద వచ్చినప్పుడు బ్రహ్మాస్త్రం అతడికి తోచదనీ, మృత్యువు ఆసన్నమైనపుడు తోస్తుందనీ కర్ణుడిని శపించాడు.

ఉ. కావున నస్త్రశస్త్రము లఖండిత సంపద నొంది యుండు; దే
వావలికైన నన్నుఁ జెనయన్ భర; మేఁ గలుగంగ నర్జునుం
డే విడిపించు మేదినిఁ? గడింది మగంటిమి యుల్లసిల్లఁగా,
నీవు బలంబు మెచ్చ నని నిల్చెద గెల్చెదఁ బాండవేయులన్. 267

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అస్త్ర శస్త్రములు; అఖండిత సంపదన్= సంపూర్ణ సంపదతో; ఒంది+ఉండున్= ఒప్పి ఉంటాయి; దేవ+ఆవలికిన్+ఐనన్= దేవతల సమూహానికైనా; నన్నున్; చెనయన్= ఎదిరించడం; భరము= కష్టం; ఏన్+కలుగంగన్= నేనుండగా; మేదినిన్= భూమిని; అర్జునుండే= అర్జునుడా; విడిపించున్?= విడిపిస్తాడు?; కడింది మగంటిమి= అధికమైన పరాక్రమం; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశించగా; నీవున్= నీవూ; బలంబున్= నీ సైన్యమూ; మెచ్చన్= పొగడగా; అనిన్= యుద్ధంలో; నిల్చెదన్= నిలబడతాను; పాండవేయులన్= పాండవులను; గెల్చెదన్= జయిస్తాను.

తాత్పర్యం: కాబట్టి నాకు అస్త్రశస్త్ర సంపద సంపూర్ణంగా ఉన్నది. దేవతలకయినా నన్ను తాకడం కష్టం. నే నుండగా అర్జునుడా భూమిని పట్టుకొని పోవటం? అధికమైన పరాక్రమం ప్రకాశించగా, నీవూ నీ సైన్యమూ ప్రశంసించగా, యుద్ధంలో నిలుస్తాను, పాండవులను గెలుస్తాను.

శా. గాంగేయాదులు నీకడన్ నిలిచి వేడ్కం జూడఁగా సర్వ సే
నాంగాంగంబులమీఁద గాలియును జిట్టాడంగ నీ కేను వీఁ
కం గౌంతేయులఁ దాఁకి, తత్తనువు లుగ్రస్ఫారబాణాలిఁ గూ
లం గోదండ విలాసముల్ మెఱయ లీలం బోరఁ గ్రీడించెదన్,' 268

ప్రతిపదార్థం: గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలగువారు; నీ కడన్= నీ చెంత; నిలిచి; వేడ్కన్= వేడుకతో; చూడఁగాన్; సర్వ సేనాంగ+అంగంబుల మీఁదన్= రథ గజ తురగ పదాతులనే అన్ని సేనావిభాగాల యొక్క శరీరాల మీదా; గాలియును= గాలి కూడా; చిట్టాడంగన్+ఈక= సోకనియ్యకుండా; ఏను= నేను; వీఁకన్= పరాక్రమంతో; కౌంతేయులన్= పాండవులను; తాఁకి= ఎదిర్చి; తద్+తనువులు= వాళ్ళ మేనులు; ఉగ్ర స్ఫార బాణ+ఆలిన్= భయంకరములూ, అధికములూ అయిన బాణాల వరుస చేత; కూలన్= నేలపై పడేటట్లు; కోదండ విలాసముల్= వింటి లీలలు; మెఱయన్= ప్రకాశించగా; పోరన్= యుద్ధంలో; క్రీడించెదన్= విహరిస్తాను.

తాత్పర్యం: భీష్మాదులు నీ దగ్గర ఉండి వేడుక చూస్తుండగా, రథ గజ తురగ పదాతులైన సర్వసేనాంగాల మేనులపై గాలి కూడా సోకనీయక, నేను పరాక్రమంతో పాండవులను ఎదుర్కొని, వాళ్ళ శరీరాలు భయంకర బాణాలచే కూలిపోయేటట్లు వింటి లీలలు ప్రకాశించగా యుద్ధభూమిలో విహరిస్తాను.'

వ. అనిన విని యినసందనునకు మందాకినీనందనుం డిట్లనియె: 269

ప్రతిపదార్థం: అనినన్; విని; ఇన నందనునకున్= సూర్యపుత్రుడికి; (కర్ణుడికి); మందాకినీ నందనుండు= గంగాసుతుడు-(భీష్ముడు); ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: అనగా విని భీష్ముడు కర్ణుడితో ఇట్లా అన్నాడు :

క. 'కాలుఁడు ప్రేరేపఁగ నిటు । ప్రేలినయంతటన నిన్నుఁ బెద్దగఁ దలఁపం
బోలునె మాకును? నుడుగుము; । చాలుదు నీ వెల్ల పనులు సాధింపంగన్! 270

ప్రతిపదార్థం: కాలుఁడు= యముడు; ప్రేరేపఁగన్= పురికొల్పగా; ఇటు ప్రేలిన+అంతటన్+అ= ఇట్లా వాగగానే; మాకును; నిన్నున్; పెద్దగన్+తలఁపన్+పోలునె?= గొప్పగా భావించడం మంచిదా?; ఉడుగుము= చాలులే; నీవు; ఎల్ల పనులు, సాధింపగన్= అన్ని పనులూ సాధించటానికి; చాలుదు(వు)= సమర్థుడివి!

తాత్పర్యం: 'యముడు పురికొల్పగా ఇట్లా నీవు వాగుతూంటే నిన్ను గొప్పగా భావించటం మాకు తగునా? చాలులే ఊరుకో. నీవు అన్ని పనులూ సాధించడానికి సమర్థుడివి!

విశేషం: 'చాలుదు నీవెల్ల పనులు సాధింపంగన్' - విపరీత లక్షణచే వ్యతిరేకార్థాన్నే గ్రహించాలి.

ఉ. కూలెడువారె పాండవులు? ఘోరపుఁబోర నొకం డొకండ యీ
చాలెడువార లెల్ల మును చావఁ, గ్రమంబున సేన లన్నియుం
గూలఁగఁ గౌరవుల్ పిదపఁ గూలుదు; రింతియకాక, నోరి చే
టేల? వృథాభిమానమున నిన్నియుఁ బ్రేలెదు సూతనందనా! 271

ప్రతిపదార్థం: సూత నందనా!= కర్ణా!; పాండవులు; కూలెడువారె?= కూలిపోయేవాళ్ళా?; ఘోరము+పోరన్= భయంకరమైన యుద్ధంలో; ఈ చాలెడు వారలు+ఎల్లన్= ఈ సమర్థులైన వాళ్ళందరూ; ఒకండు+ఒకండు+అ= ఒక్కొక్కడే; మును= ముందు; చావన్= చావగా; క్రమంబునన్; సేనలు+అన్నియున్; కూలఁగన్= కూలిపోగా; పిదపన్= తరువాత, కౌరవుల్; కూలుదురు; ఇంతియ కాక= జరిగేది ఇంతేలే; నోరిచేటు+ఏల?= వాగటం ఎందుకు?; వృథా+అభిమానమునన్= పనికిమాలిన గర్వంతో; ఇన్నియున్+ప్రేలెదు?= ఇన్ని వాగుతావు?

తాత్పర్యం: కర్ణా! పాండవులు కూలిపోయేవాళ్ళా? భయంకర యుద్ధంలో ఈ సమర్థులందరూ, ఒక్కొక్కడే ముందు చావగా, క్రమంగా సేనలన్నీ కూలిపోగా, అప్పుడు కౌరవులు చస్తారు. జరిగేది ఇంతేలే. ఊరికే వాగటం ఎందుకు? పనికిమాలిన గర్వంతో ఇన్ని మాటలూ వాగుతావు.

తే. దివిజపతి నీకు నిచ్చిన తీవ్రశక్తి । చేతఁ గవ్వడి వడునని చూతువేని
వాసుదేవునిచే నది వ్యయ్యలయ్యుఁ, । దునియ లయ్యును, బొడియయ్యుఁ దొరఁగు ధరణి. 272

ప్రతిపదార్థం: దివిజ పతి= దేవేంద్రుడు; నీకున్; ఇచ్చిన= ఇచ్చినట్టి; తీవ్ర శక్తిచేతన్= తీవ్రమైన శక్త్యాయుధంచేత; కవ్వడి= అర్జునుడు; పడును+అని= కూలుతాడని; చూతువు+ఏనిన్= చూస్తావేమో, అనుకొంటున్నావేమో; అది= ఆ శక్తి; వాసుదేవునిచేన్=

కృష్ణుడిచేత; వ్రయ్యలు+అయ్యున్= ముక్కలయీ; తునియలు+అయ్యును= చిద్రుపలయీ; పొడి+అయ్యున్= చూర్ణం అయీ; నులి అయీ; ధరణిన్= నేలమీద; తొరఁగున్= రాలుతుంది.

తాత్పర్యం: దేవేంద్రుడు నీ కిచ్చిన తీవ్ర శక్త్యాయుధంచేత అర్జునుడు కూలిపోతాడని అనుకొంటున్నావేమో, ఆ శక్తి కృష్ణుడిచేత ముక్కలయి, చిద్రుపలయి, చూర్ణమయి నేల రాలుతుంది.

విశేషం: తాను అడగగానే అతని సహజ కవచకుండలాలను ఇచ్చిన కర్ణుడి ఔదార్యానికి మెచ్చుకొని ఇంద్రుడు అతడికి, అతడి కోరికపై, ఒక దివ్యశక్తి నిచ్చాడు. దానిని ఒక్కడి మీదనే ఒక్కసారి ప్రయోగించాలని ఇంద్రుడు ఆనతిచ్చాడు. దానిని అర్జునుడిపై ప్రయోగిద్దాం అని కర్ణుడు అనుకొంటాడు. కాని, దానిని ఘటోత్కచుడిపై ప్రయోగించవలసివస్తుంది.

క. సర్పముఖ శరము గల దను । దర్పంబునఁ గ్రీడిఁ దొడరఁ దలఁపకు; హరి పెం
పేర్పడఁగ నదియ కా, దట । తీర్పవలయువాని నెల్లఁ దీర్చు నరునకై.' 273

ప్రతిపదార్థం: సర్ప ముఖ శరము కలదు+అను దర్పంబునన్= సర్పముఖంకల అస్త్రం ఉన్నదనే గర్వంతో; క్రీడిన్= అర్జునుడిని; తొడరన్= ఎదుర్కొనటానికి; తలఁపకు= అనుకొనకు; హరి= కృష్ణుడు; పెంపు+ఏర్పడఁగన్= గొప్పతనం స్పష్టపడేటట్లు; అది+అ= అదే; కాదు; నరునకై= అర్జునుడి కొరకు; అట తీర్పవలయు వానిన్+ఎల్లన్= ఆ నశింపజేయవలసిన వాటినన్నిటినీ; తీర్చున్= నాశనం చేస్తాడు.

తాత్పర్యం: నా దగ్గర సర్పముఖం గల అస్త్రం ఉన్నది గదా అనే గర్వంతో అర్జునుడిని ఎదుర్కొందా మనుకొనకు. కృష్ణుడు దానినే కాదు, అర్జునుడి కొరకు నాశనం చేయవలసిన వాటినన్నిటినీ నాశనం చేస్తాడు.'

వ. అని పలికి, ధృతరాష్ట్రునితో నిట్లనియె: 274

తాత్పర్యం: అని పలికి, ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు :

క. 'జ్ఞాతులు దమలోఁ బొందినఁ । జేతో మోదమున వెలిఁగి చెలు వొందుదు; ర
న్నీతిం బాసిన విగత వి । భూతిం గడకొఱవులట్ల పొగయుదు రధిపా! 275

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా!; జ్ఞాతులు= దాయాదులు; తమలోన్= ఒకరితో ఒకళ్ళు; పొందినన్= కలిసి ఉంటే; చేతస్+మోదమునన్= మనస్సంతోషంతో; వెలిఁగి= ప్రకాశించి; చెలువు+ఒందుదురు= ఒప్పుతారు; ఆ+నీతిన్+కలిసి ఉండాలనే ఆ నీతిని; పాసినన్= విడిచిపెడితే; విగత విభూతిన్= పోయిన సంపదతో - సంపద పోయి; కడ కొఱవుల+అట్లు+అ= కాలగా మిగిలి పొగవచ్చే కట్టెలవలె; పొగయుదురు= పొగచిమ్ముతారు- లో లోపల తపిస్తారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! జ్ఞాతులు ఒకళ్ళతో ఒకళ్ళు కలిసి ఉంటే మనస్సంతోషంతో వెలిగి ఒప్పుతారు. ఆ నీతిని విడనాడినట్లయితే, ఐశ్వర్యం కోల్పోయి, కాలగా మిగిలి పొగలు చిమ్మే కట్టెలవలె లో లోపల తపిస్తారు.

విశేషం: కడకొఱవు లట్ల- అలంకారం ఉపమ, 'జ్ఞాతులు దమలో.... పొగయుదురు' - ఇదంతా సామాన్యాంశం. దీనిచే 'పాండవులూ కౌరవులూ కలిసి ఉంటే బాగుంటుంది' అనే విశేషాంశం సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. కావునఁ దమలో విరోధం బొప్పదు; సంభాషణ సహభోజనాది సత్కారంబులను, సవినయ వర్తనంబులను బ్రీతులైన జ్ఞాతు లిహ పరార్థ సాధకు లగుదు' రని చెప్పి వెండియు. 276

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; తమలోన్ విరోధంబు+ఒప్పదు= తమలో తాము కలహించగూడదు; సంభాషణ సహభోజన+ఆది సత్కారంబులను= మాట్లాడుకొనటం; కలిసి భోజనం చేయటంవంటి సత్కార్యాలచేతా; సవినయ వర్తనంబులను= వినయంతో కూడిన నడవడులచేతా; ప్రీతులు+ఐ= సంతోషించినవారయి; జ్ఞాతులు; ఇహ పర+అర్థ సాధకులు= ఈ లోకపు, పరలోకపు ప్రయోజనాలను సాధించేవారు; అగుదురు; అని; చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: కాబట్టి తమలో తాము కలహించటం తగదు. మాటలాడుకొనటం, కలిసి భోజనం చేయటం మొదలైన సత్కారాలచేతా, వినయంతో కూడిన నడవడులచేతా ప్రీతులై జ్ఞాతులు ఈ లోకపు, పరలోకపు ప్రయోజనాలను సాధించగలుగుతారు' అని చెప్పి ఇంకా.

క. 'విను మే నొక శైలమునకు । మును భూసురవర్గ సహితముగ నొకపనికిం
జను నెడఁ జనరాని తటం । బున నొక జున్నుండె; దానిఁ బొగడిరి తద్జ్ఞుల్. 277

ప్రతిపదార్థం: వినుము; మును= పూర్వం; ఏను= నేను; ఒక శైలమునకున్= ఒక కొండకు; భూసురవర్గ సహితముగన్= బ్రాహ్మణుల సమూహంతో కూడా; ఒక పనికిన్= ఒక పనిమీద; చను+ఎడన్= వెళ్ళే సమయంలో; చనన్+రాని తటంబునన్= దుర్గమమైన చరియఅందు; ఒక; జున్ను= తేనెపట్టు; ఉండెన్; దానిన్; తద్జ్ఞుల్= తెలిసినవారు; పొగడిరి.

తాత్పర్యం: 'వినుము. పూర్వం నేను ఒక కొండమీదికి బ్రాహ్మణ సమూహంతో కూడా ఒక పని మీద వెళ్ళేటప్పుడు దుర్గమమైన చరియయందు ఒక తేనెపట్టు ఉన్నది. తెలిసినవారు దానిని పొగిడారు.

తే. 'దీని తేనియఁ ద్రావిన మానవులకు । జరయు రుజయును డప్పియుఁ జావుఁ గలుగ'
వనఁగఁ, గొందఱు బోయలు విని, కడంగి । యుఱక మొఱకలై చఱిఁబడ నుఱికి రపుడు. 278

ప్రతిపదార్థం: దీని తేనియన్; త్రావిన మానవులకున్= త్రాగిన మనుష్యులకు; జరయున్= ముసలితనమూ; రుజయును= రోగమూ; డప్పియున్= ఆయాసమూ, దాహమూ; చావున్; కలుగవు+అనఁగన్; కొందఱు బోయలు; విని; కడంగి= పూని; అపుడు; ఉఱక= లక్ష్యపెట్టక; మొఱకులు+ఐ= మూర్ఖులయి; చఱిన్= చరియలో; పడన్; ఉఱికిరి.

తాత్పర్యం: దీని తేనె త్రాగిన మనుష్యులకు ముసలితనమూ, రోగమూ, శ్రమా, (దాహమూ), చావూ ఉండవని అనగా, కొందరు బోయలు విని, పూని, మూర్ఖులై లక్ష్యపెట్టక అప్పుడు చరియలో పడేటట్లు ఉరికారు.

వ. ఇట్లుఱికి మృతిఁ బొంది; రట్లపోలె నవినీతు లైన నీ కొడుకులు పుడమి యెల్లను దార యేలుతీపుఁ జూచెదరుగాని తమ పాలిసి పోవుటం గానరు; వీర లర్జునుతోడం బెనంగి మానప్రాణంబులు దక్కించుకొనువారె? యట్లుంగాక సమబలులైననుం గయ్యంబునఁ గదా వీరౌదురు వారౌదు రనవచ్చు; నదియేల నీలోనికి ధర్మనందనుం దెచ్చికొనుటయ నీకుఁ గర్తవ్యం' బనిన బాహ్లికుండు ధార్తరాష్ట్రున కిట్లనియె: 279

ప్రతిపదార్థం: ఇట్లు; ఉఱికి; మృతిన్+పొందిరి= మరణించారు; అట్లు+అ పోలెన్= ఆ రీతిగానే; అవినీతులు+ఐన నీ కొడుకులు= అవినయపరులైన నీ కొడుకులు; పుడమి+ఎల్లను= భూమినంతనూ; తారు+అ= తామే; ఏలు తీపున్+చూచెదరు+

కాని= పరిపాలించాలనే తీపి కొరకు చూస్తారు కాని, తమ పొలిసిపోవుటన్+కానరు= తాము చచ్చిపోతామని చూడరు; వీరలు; అర్జును తోడన్; పెనంగి= పోరి; మాన ప్రాణంబులు= మానాన్నీ, ప్రాణాన్నీ; దక్కించుకొనువారె?= నిలుపుకొంటారా?; అట్లున్+కాక= అట్లాకాక; సమ బలులు+ఐననున్= సమానమైన బలం కలవాళ్ళయినా; కయ్యంబునన్+కదా= యుద్ధంలో కదా; వీరు+ఔదురు, వారు+ఔదురు+అనన్+వచ్చున్= వీళ్ళు సమర్థులు, వాళ్ళు సమర్థులు అనవచ్చును; అది+ఏల= అదంతా ఎందుకు?; నీ లోనికిన్; ధర్మనందనున్= ధర్మరాజును; తెచ్చికొనుట+అ= తెచ్చుకొనటమే; నీకున్; కర్తవ్యంబు= చేయదగింది; అనినన్; బాహ్లికుండు; ధార్తరాష్ట్రునకున్= దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా ఉరికి మరణించారు. అట్లాగే అవినయపరులైన నీ కొడుకులు భూమినంతనూ తామే ఏలాలనే తీపి కోసం చూస్తారుగాని తాము చచ్చిపోతామేమో అని చూడరు. వీళ్ళు అర్జునుడిని ఎదుర్కొని మానప్రాణాలు దక్కించుకొంటారా? అట్లాకాక, సమానమైన బలం కలవాళ్ళయినా, యుద్ధంలోగదా వీరి సామర్థ్యాలూ, వారి సామర్థ్యాలూ తేలేది? అదంతా ఎందుకు? ధర్మరాజును నీలోకి తెచ్చుకొనటం నీకు కర్తవ్యం' అనగా; బాహ్లికుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: భీష్ముడు ధృతరాష్ట్రుడితో చెప్పిన జ్ఞాతులు ప్రవర్తించవలసిన విధంగానీ, జున్ను కొరకు ఆశపడి మరణించిన బోయల వృత్తాంతంగానీ, సంస్కృత భారత ప్రతులలో కానరావు.

క. 'కను బ్రమసిన తెరువరి తన । కనపాయం బైన మార్గ మరసి తగ నెఱిం
గినవారు సెప్పఁగాఁ గై । కొనని కరణిఁ దగిన వెంటకుం జొర వకటా!' 280

ప్రతిపదార్థం: ఎఱింగినవారు= తెలిసినవాళ్ళు; తనకున్; అనపాయంబు+ఐన మార్గము= అపాయంలేని దారి; అరసి= చూచి; తగన్= ఒప్పుగా; చెప్పఁగాన్= కనుబ్రమసిన తెరువరి= కళ్ళు మిరుమిట్లుగొన్న బాటసారి; కైకొనని కరణిన్= అవలంబించని విధంగా; అకటా!= అయ్యో!; తగిన వెంటకున్+చొరవు= తగిన దారికి నీవు రావు.

తాత్పర్యం: 'దుర్యోధనా! తెలిసినవాళ్ళు తనకు అపాయం లేని దారి చూపి ఒప్పుగా చెప్పగా కళ్ళు మిరుమిట్లుగొన్న పాంథుడు అవలంబించని విధంగా, అయ్యో! నీవు తగిన దారికి రావుగదా!'

విశేషం: అలం: ఉపమ. బాహ్లికుడనిన ఈ మాటలు సంస్కృత భారత ప్రతులలో గానరావు.

వ. అనిన వైచిత్రవీర్యుండు దుర్యోధనున కిట్లనియె: 281

తాత్పర్యం: అనగా, ధృతరాష్ట్రుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

మ. 'కొడుకా! యే నెటు లట్ల బాహ్లికుఁడు నీకుం గూర్చు, భీష్ముండు నీ
యెడ సస్నేహుఁడు, వీరి మాట విను; మే మీ ముప్వురున్ మన్ననల్
వడయంగాఁ దగునట్టివారము; నినుం బ్రార్థించెదన్ ధర్మజున్
విడువంగాఁ దగ, దిమ్ము వారలకు నుర్విం బాలు నెమ్మిం దగన్.' 282

ప్రతిపదార్థం: కొడుకా!= బిడ్డా!; ఏను+ఎటులు+అట్లు+అ= నే నెట్లాగో అలాగే; బాహ్లికుఁడు; నీకున్+కూర్చున్= నీవంటే ఇష్టపడతాడు; భీష్ముండున్= భీష్ముడుకూడా; నీ+ఎడన్= నీ విషయంలో; సస్నేహుఁడు= స్నేహభావంతో కూడినవాడు; వీరి

మాట వినుము; ఏము+ఈ ముచ్చురున్= ఈ మేము ముగ్గురమూ; మన్ననల్+పడయంగాన్+తగు+అట్టి వారము= మన్ననలు పొందదగిన వాళ్ళం; నినున్; ప్రార్థించెదన్= బతిమాలుతాను; ధర్మజున్; విడువంగాన్+తగదు= విడిచిపెట్టదగదు; వారలకున్= పాండవులకు; ఉర్విన్= భూమిలో; పాలు= భాగం; నెమ్మిన్= సంతోషంతో; తగన్= ఒప్పుగా; ఇమ్ము.

తాత్పర్యం: 'నాయనా! దుర్యోధనా! నా వలెనే బాహ్లికుడు కూడా నీవంటే ఇష్టపడతాడు. భీష్ముడు కూడా నీయందు స్నేహభావం కలిగి ఉంటాడు. వీళ్ళ మాట విను. ఈ మేము ముగ్గురమూ నీ మన్ననలు పొందదగినవాళ్ళం. నిన్ను బతిమాలుకుంటానురా. ధర్మరాజును విడిచిపెట్టదగదురా. వాళ్ళకు భూమిలో వాటా ప్రీతితో ఒప్పుగా ఇయ్యరా!'

క. అనినను వెండియు నొడఁబా । టునకుఁ జొరని దానికిం గొడుకుతోడఁ గడుం
గినిసి ధరణీశ్వరుం డి । ట్లనుఁ గొలువున నున్న వార లందఱు వినఁగన్. 283

ప్రతిపదార్థం: అనినన్= అనగా; వెండియున్= ఇంకా; ఒడఁబాటునకున్+చొరనిదానికిన్= సమ్మతించకపోవటానికి; కడున్= మిక్కిలి; కినిసి= కోపించి; ధరణీ+ఈశ్వరుఁడు= రాజు-ధృతరాష్ట్రుడు; కొలువునన్+ఉన్నవారలు+అందఱున్= సభలో ఉన్నవాళ్ళందరూ; వినఁగన్= వినేటట్లు; కొడుకుతోడన్; ఇట్లు+అనున్.

తాత్పర్యం: అని తాను చెప్పగా, ఇంకా సమ్మతించకపోవటానికి మిక్కిలి కోపించి ధృతరాష్ట్రుడు సభలో ఉన్నవాళ్ళందరూ వింటూండగా కొడుకుతో ఇట్లా అన్నాడు:

తే. 'బవరములు గావె! విఱిగిన బార సాఁప । వచ్చునే? యొక్కరుండ వివ్వచ్చుఁ డదరి
పసులఁ బెట్టించునపుడు నీ బలము విఱుగ । దయ్యెనే? నీవుఁ గర్ణుండు నచట లేరె?' 284

ప్రతిపదార్థం: బవరములు+కావె?= యుద్ధాలు జరగలేదా?; విఱిగిన బార+చాఁపవచ్చునే?= విరిగిపోయిన చేయి చాపవచ్చా? (ఓడిపోయి మళ్ళీ యుద్ధానికి పూనుకొనవచ్చా?); వివ్వచ్చుఁడు+ఒక్కరుండు+అ= బీభత్సుడు (అర్జునుడు) ఒక్కడే; అదరి= విజృంభించి; పసులన్= పశువులను; పెట్టించు+అపుడు= విడిపించే సమయంలో; నీ బలము= నీ సైన్యం; విఱుగదయ్యెనే?= పారిపోలేదా?; అచటన్= అక్కడ; నీవున్+కర్ణుండున్= నీవూ; కర్ణుడూ; లేరె?= లేరా?

తాత్పర్యం: 'ఇదివరలో యుద్ధాలు జరగలేదా? విరిగిపోయిన చేయి చాచవచ్చా?- ఓడిపోయి మళ్ళీ యుద్ధానికి పూనుకొనవచ్చా? అర్జును డొక్కడూ విజృంభించి పశువులను విడిపించేటప్పుడు నీ సైన్యం పారిపోలేదా? నీవూ, కర్ణుడూ అక్కడ లేరా?'

వ. అని రాధేయు దిక్కు మొగంబై మఱియు నిట్లనియె: 285

తాత్పర్యం: అని కర్ణుడికేసి చూసి ధృతరాష్ట్రుడు ఇంకా ఇట్లా అన్నాడు:

ఆ. 'నాఁటి కొలఁది గాదు; నారాయణుఁడు నొగ । లెక్కఁ, గెలన భీముఁ డేచి నడవ,
ననుజ తనుజ సహితుఁడై వచ్చు వివ్వచ్చు । మార్కొనంగ వశమె మనకుఁ గర్ణ! 286

ప్రతిపదార్థం: కర్ణ!; నాఁటి కొలఁది+కాదు= అప్పటివలె అనుకొన్నావేమో! (గోగ్రహణ సమయంలో ఉన్నంతే అనుకొన్నావేమో); కాదు= అంత మాత్రమే కాదు; నారాయణుఁడు= కృష్ణుడు; నొగలు+ఎక్కన్= రథం తొట్టెలో కూర్చుండగా; కెలనన్= ప్రక్కన;

భీముఁడు; ఏచి= విజృంభించి; నడవన్= నడవగా; అనుజ తనుజ సహితుఁడు+ఐ= తమ్ములతో; కొడుకులతో కూడినవాడయి; వచ్చు వివ్వచ్చున్= వచ్చే బీభత్సుడిని- అర్జునుడిని; మనకున్; మార్కొనంగన్+వశమె?= ఎదుర్కొనతరమా?

తాత్పర్యం: 'కర్ణా! అప్పటివలె- గోగ్రహణ సమయంలో వలె- అంతమాత్రమే అనుకొన్నావేమో! కాదు. కృష్ణుడు సారథి అయి రథం తొట్టెలో కూర్చుండగా, ప్రక్కన భీముడు విజృంభించి నడవగా, తమ్ములతోనూ, కొడుకులతోనూ వచ్చే బీభత్సుడిని ఎదుర్కొనటం మన తరమా?

విశేషం: 'ఉత్తర గోగ్రహణ సమయంలో అర్జును డొక్కడే దండెత్తి వచ్చాడు. ఇప్పు డట్లా కాదే! ఒక్కడూ వచ్చినప్పుడే మనం ఓడిపోయాము. ఇప్పుడు వాళ్ళందరితోనూ వస్తే అర్జునుడిని మనం ఎదుర్కొనగలమా?' అని భావం. ఇక్కడ బీభత్సుడు అనే పదానికి వికృతియైన 'వివ్వచ్చుడు' అనే శబ్దాన్ని సాభిప్రాయంగా ప్రయోగించటం వలన అలంకారం పరికరాంకురం. యుద్ధంలో అర్జునుడు బీభత్సం చేస్తాడు కాబట్టి అతనికి బీభత్సుడనే పేరు వచ్చింది.

చ. బలమును దర్పమున్ మెఱయ బంటుతనంబున నీవు పాండవే
యుల నని మార్కొనం గడఁగు టొప్పెడు తెంపగుఁ; జచ్చి శుద్ధుఁడై
పలుకులు మాన్పు భృత్యుఁ డను పాటి దలంచెద; విట్లు మేలె? య
చ్ఛలమున నీ సుయోధనుని చావున కోర్చుట గాదె యంతయున్? 287

ప్రతిపదార్థం: నీవు; బలమును= పరాక్రమమూ; దర్పమున్= గర్వమూ; మెఱయన్= ప్రకాశించగా; బంటుతనంబునన్= శూరత్వంతో; పాండవేయులన్= పాండవులను; అనిన్= యుద్ధంలో; మార్కొనన్+కడఁగుట= ఎదుర్కొన పూనటం; ఒప్పెడు తెంపు+అగున్= మంచి సాహసమే అవుతుంది; చచ్చి; శుద్ధుఁడు+ఐ= పవిత్రుడయి; పలుకులు= నిందలు; మాన్పు= పరిహరించే (పోగొట్టే); భృత్యుఁడు= సేవకుడు; అను పాటి= అనే మాత్రం (అంత మాత్రమే); తలంచెదవు= అనుకొంటున్నావు; ఇట్లు మేలె?= ఈ రీతి మంచిదా?; ఇంతయున్= ఇదంతా; (నీవు పాండవులను ఎదుర్కొనటం); అచ్చలమునన్= పట్టుదలతో;- పూనికతో; ఈ సుయోధనుని చావునకున్= ఈ దుర్యోధనుడి చావుకు; ఓర్చుట+కాదె!= సహించటమే కదా!

తాత్పర్యం: 'నీవు పరాక్రమమూ, గర్వమూ ప్రకాశించగా శూరత్వంతో పాండవులను ఎదురుకొనపూనటం మంచి సాహసమే అవుతుంది. 'కర్ణుడు చచ్చి పవిత్రుడై నిందలు పోగొట్టుకొన్న భృత్యుడు' అనే పేరు సంపాదిస్తావు. నీవు అంతమాత్రమే కోరుకొంటున్నావు. ఇది మంచిది కాదు. ఎందుచేతనంటే- ఇదంతా ఈ దుర్యోధనుడికి చావు మూడటమే అవుతుంది. దానిని సహించటమే అవుతుంది.'

విశేషం: 'చచ్చి శుద్ధుఁడై' - పాండవులను ఎదిరించటం మంచి సాహసమే అయినా ఆ యుద్ధంలో నీవు తప్పక చస్తావని సూచన. చచ్చి పవిత్రుడై నిందలు పాపిన భృత్యుడు కర్ణుడు అనే పేరు నీకు వస్తుంది. నీవు అదొక్కటే చూచుకొంటున్నావు. ఇది న్యాయం కాదు. ఎందుచేతనంటే ఇదంతా దుర్యోధనుడి చావుకే కారణం కనక.

వ. అనిన విని కానీనుండు సంక్షుభితమానసుండై 'యిది యెల్ల నిట్లయ్యెఁ; నిట్లుం గాక, తక్కినయది యట్లుండె; నదీ సూనుండు నన్ను నిరాకరించి పలికిన పలుకుల ఫలం బనుభవించుం గాక!' యని యతని నుద్దేశించి యిట్లనియె: 288

ప్రతిపదార్థం: అనినన్; విని; కానీనుండు= కన్యాపుత్రుడు - కర్ణుడు; సంక్షుభిత మానసుండు+ఐ= మిక్కిలి కలగిన మనస్సు కలవాడయి; ఇది+ఎల్లన్= ఇదంతా; ఇట్లు+అయ్యెన్= ఇట్లా అయింది; ఇట్లున్+కాక= ఇట్లా కాక; తక్కిన+అది= తక్కినది; అట్లు+ఉండెన్= అట్లా ఉండగా; నదీ సూనుండు= గంగానది కొడుకు- భీష్ముఁడు; నన్నున్; నిరాకరించి= తిరస్కరించి; పలికిన పలుకులు ఫలంబు; అనుభవించున్+కాక= తప్పక అనుభవిస్తాడు; అని; అతనిన్+ఉద్దేశించి= అతడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విని కర్ణుడు కలగిన మనస్సు కలవాడయి 'ఇదంతా ఇట్లా అయింది. తక్కినది అట్లా ఉండగా భీష్ముడు నన్ను తిరస్కరించి పలికిన పలుకుల ఫలితం తప్పకుండా అనుభవిస్తాడు' అని అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: ధృతరాష్ట్రుడు కూడా తనను నిరాకరించి పలికినా, ఆ మాటలకంటె భీష్ముడి తిరస్కారవాక్యాలే కర్ణుడికి ఎక్కువ బాధ కలిగించాయి.

కర్ణుఁడు భీష్మునిపై రోషముచేత నస్త్రసన్న్యాసంబు సేయుట (సం. 5-61-13)

తే. 'నీకు నా లావు తోడ్పాటు లేకయుండ। వలయు; నీ తెగునంతకుఁ గలన నిలువ;
నాయుధంబులు విడిచితి; నంత మీఁద। మెఱసి బలవిక్రమంబులు నెఱపువాఁడ.' 289

ప్రతిపదార్థం: నీకున్; నా లావు తోడ్పాటు= నా బలం తోడు; లేక+ఉండవలయున్= లేకపోవాలి; నీ తెగు+అంతకున్= నీవు చచ్చేదాకా; కలనన్= యుద్ధంలో; నిలువన్= ఉండును; ఆయుధంబులు; విడిచితిన్; అంతమీఁదన్= ఆపైని (నీవు చచ్చినమీదట); మెఱసి= విజృంభించి; బల విక్రమంబులు= బలపరాక్రమాలు; నెఱపువాఁడన్= చూపిస్తాను.

తాత్పర్యం: 'నీకు నా బలం తోడు లేకుండా ఉండాలి. నీవు చచ్చేవరకూ నేను యుద్ధభూమిలో అడుగుపెట్టను. అస్త్రాలు విడిచాను. ఆ తరువాత - నీవు చనిపోయిన తరువాత - విజృంభించి నా బలపరాక్రమాలు చూపిస్తాను.'

విశేషం: కర్ణుడు పంతానికి పోయి, భీష్ముడి మీది ద్వేషం కొద్దీ, రాజభక్తినీ, తన కర్తవ్యాన్నీ విస్మరించి అవివేకంతో ఇట్లాంటి శపథం చేశాడు.

వ. అని శస్త్రసన్న్యాసంబుసేసి కొలువున నిలువనొల్లక దిగ్గన లేచిపోయె; నట్టియెడ శాంతనవుండు నవ్వుచు దుర్యోధనునితో నిట్లనియె: 290

ప్రతిపదార్థం: అని; శస్త్రసన్న్యాసంబు+చేసి= శస్త్రాలు విడిచిపెట్టి; కొలువునన్= సభలో; నిలువన్+ఒల్లక= ఉండటానికి ఇష్టపడక; దిగ్గనన్= వెంటనే; లేచిపోయెన్; అట్టి+ఎడన్= ఆ సమయంలో; శాంతనవుండు= భీష్ముడు; నవ్వుచున్; దుర్యోధనునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శస్త్రసన్న్యాసం చేసి కర్ణుడు సభలో ఉండటానికి ఇష్టపడక వెంటనే లేచి వెళ్ళిపోయాడు. అప్పుడు భీష్ముడు నవ్వుతూ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

క. 'అంతకుఁ జాలఁడె కర్ణుం? । డింతకు మును బాస యిచ్చి యెన్నఁడు బొంకం!
డింతటి మానిసి యలిగినఁ । గౌంతేయుల కెట్లు బ్రదుకఁగా వచ్చు ననిన్?' 291

ప్రతిపదార్థం: కర్ణుండు; అంతకున్+చాలఁడె?= అందుకు తగ్గవాడు కాడా?; ఇంతకున్+మును= ఇంతకు పూర్వం; బాస+ ఇచ్చి= శపథం చేసి; ఎన్నఁడున్= ఎప్పుడూ; బొంకండు= అసత్యమాడడు; (మాట తప్పేవాడే ఎప్పుడూ అని భావం); ఇంతటి మానిసి= ఇంత సమర్థుడైనవాడు; అలిగినన్= కోపిస్తే; అనిన్= యుద్ధంలో; కౌంతేయులకున్= పాండవులకు; ఎట్లు బ్రదుకఁగాన్ వచ్చున్= బ్రదకటానికి ఎలా సాధ్యమవుతుంది?

తాత్పర్యం: 'కర్ణుడు అందుకు తగ్గవాడు కాడా? ఇంతకుముందు ప్రతిజ్ఞ చేసి ఎప్పుడూ బొంకడు! ఇంతటి మహావీరుడు అలిగితే యుద్ధంలో పాండవులెట్లా బ్రదకగలరు?'

విశేషం: విపరీత లక్షణచే భీష్ముడి మాటలకు వ్యతిరేకభావాన్నే గ్రహించాలి. కర్ణుడు అస్త్రసన్న్యాసం చేయటానికి తగినవాడే అనీ, మాట తప్పటం ఎప్పుడూ అతడికి అలవాటే అనీ, ఇంతటి మహావీరుడు అలిగితే యుద్ధంలో పాండవులకు ఏమీ కాదనీ భావం.

క. అని వెండియు నిట్లను: 'నా । తని మాటల కెట్లుఁ గడఁగి ధర్మతనయుతో
నని సేయక తక్కవు నీ । వనుమానము వాయఁ జూడు మతనిని, నన్నున్. 292

ప్రతిపదార్థం: అని, వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్; నీవు; ఆతని మాటలకున్; ఎట్లున్= ఎట్లా అయినా; కడఁగి= పూని; ధర్మ తనయుతోన్= ధర్మరాజుతో; అని+చేయక తక్కవు= యుద్ధం చేయకుండా ఉండవు- యుద్ధం చేసి తీరుతావు; అనుమానము= సందేహం; పాయన్= పోయేటట్లు; అతనిని= ఆ కర్ణుడినీ; నన్నున్; చూడుము.

తాత్పర్యం: అని భీష్ము డింకా ఇట్లా అన్నాడు: 'నీవు అతడి మాటలను పట్టుకుని' అతడి 'భరోసా' చూచుకొని ధర్మరాజుతో ఎట్లాగూ యుద్ధం చేసితీరుతావు. నీ అనుమానం తీరేటట్లు అప్పుడు అతడినీ నన్నూ చూద్దువుగాని- (మా ఇద్దరి పరాక్రమాల తారతమ్యం నీకప్పుడు నిస్సందేహంగా బోధపడుతుందని భావం.)

వ. ఏను బాహ్లిక ద్రోణ ప్రముఖులు గనుంగొనుచుండఁ బ్రతివీరుల ననేక సహస్రంబుల సమయించెదఁ; బిదప రాధేయు రణంబునుం జూచెదవుగాక!' యనిన విని దుర్యోధనుండు కర్ణ పక్షపాతియు, నవినీతుండు నగుటం జేసి సహింపక పితామహుతో నిట్లనియె: 293

ప్రతిపదార్థం: ఏను= నేను; బాహ్లిక ద్రోణ ప్రముఖులు= బాహ్లికుడూ, ద్రోణుడూ మొదలగువారు; కనుంగొనుచున్+ఉండన్= చూస్తూండగా; ప్రతివీరులన్+అనేక సహస్రంబులన్= పెక్కువేలమంది శత్రువీరులను; సమయించెదన్= చంపుతాను; పిదపన్= తరువాత; రాధేయు రణంబునున్= కర్ణుడి యుద్ధం కూడా; చూచెదవు+కాక= చూద్దువులే; అనినన్; విని; దుర్యోధనుండు; కర్ణ పక్షపాతియున్= కర్ణుడి మీద పక్షపాతం కలవాడూ; అవినీతుండున్= అవినయపరుడూ; అగుటన్+చేసి= కావడంచేత; సహింపక= ఓర్వక; పితామహుతోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నేను బాహ్లికుడూ, ద్రోణుడూ మొదలైనవారు చూస్తుండగా పెక్కువేల మంది శత్రువీరులను చంపుతాను. తరువాత కర్ణుడి యుద్ధనైపుణ్యం కూడా చూద్దువుగాని' అనగా విని దుర్యోధనుడు కర్ణుడి మీద పక్షపాతం కలవాడూ, అవినయపరుడూ కావటంచేత ఓర్వక భీష్ముడితో ఇట్లా అన్నాడు:

చ. 'ఎఱిఁగి యెఱింగి యొండె, మది నేది యెఱుంగక యొండె నెప్డు నం
దఱు వినఁ 'బాండునందనులు దర్పితులై యని గెల్తు' రండ్రు; ముం
దఱ నిను బాహ్లికున్ గురునిఁ దక్కటివారిని నమ్మి యేను నే
డ్తెఱ నని సేయఁబూనితిఁ; గడింది మగంటిమి తోడు సాలదే? 294

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఎఱింగి+ఒండెన్= తెలిసి తెలిసో; మదిన్= మనస్సులో; ఏది+ఎఱుంగక+ఒండెన్= ఏమీ తెలియకో; ఎప్డున్= ఎప్పుడూ; అందఱున్= అందరూ; వినన్= వినేటట్లు; పాండునందనులు= పాండవులు; దర్పితులు+ఐ= గర్వించినవారయి; అనిన్= యుద్ధంలో; గెల్తురు= గెలుస్తారు; అండ్రు= అంటారు; ముందఱన్= మొదట; నినున్= నిన్నూ; బాహ్లికున్; గురునిన్= ద్రోణుణ్ణి; తక్కటివారిని= తక్కినవాళ్ళనూ; నమ్మి; ఏను; ఏడ్తెఱన్= విజృంభణంతో; అని+చేయన్+పూనితిన్= యుద్ధం చేయటానికి సిద్ధపడ్డాను; కడింది మగంటిమి తోడు= అధికమైన పరాక్రమం యొక్క సాయం; చాలదే?= సరిపోదా?

తాత్పర్యం: తెలిసో తెలియకో అందరూ 'పాండవులు పరాక్రమ గర్వంతో యుద్ధంలో గెలుస్తా'రని అంటారు. మొదట నిన్నూ, బాహ్లికుడినీ, ద్రోణుడినీ, తక్కినవాళ్ళనీ నమ్ముకొని విజృంభించి యుద్ధం చేయడానికి సిద్ధపడ్డాను. నా అధికమైన పరాక్రమం తోడ్పాటు సరిపోదా?

ఉ. కర్ణుఁడు దుస్ససేనుఁడును గల్గఁగ నా కొరులేల? సద్భటా
కీర్ణ విరోధి సైన్యముల గెల్వఁగఁ జాలుదు మేమ; మాకు నీ
యర్ణవ వేష్టిత క్షితి యనర్గళ విక్రమ మొప్పదక్కు; మా
నిర్ణయ మెల్ల నిట్టి; దవినీతియొ నీతియొ చూడుమీ తుదిన్.' 295

ప్రతిపదార్థం: కర్ణుఁడును; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; కల్గఁగన్= ఉండగా; నాకున్; ఒరులు+ఏల= ఇతరు లెందుకు; ఏము+అ= మేమే; సత్+భట+విరోధి సైన్యములన్= గొప్ప వీరులతో గూడిన శత్రు సేనలను; గెల్వఁగన్+చాలుదుము; గెలవగలం; మాకున్; అనర్గళ విక్రమము+ఒప్పన్= అడ్డులేని పరాక్రమం ఒప్పగా; ఈ అర్ణవ వేష్టిత క్షితి= ఈ సముద్ర పరివృతమైన భూమి; దక్కున్= లభిస్తుంది; మా నిర్ణయము+ఎల్లన్= మా నిశ్చయమంతా; ఇట్టిది; అవినీతియొ; నీతియొ; తుదిన్= చివర; చూడుమీ.

తాత్పర్యం: కర్ణుడూ, దుశ్శాసనుడూ ఉండగా నాకు ఇతరులెందుకు? మంచి వీరులతో వ్యాపించిన శత్రుసేనలను మేమే గెలవగలం. ఈ సముద్ర పరీత భూమి అడ్డులేని పరాక్రమం ఒప్పగా మాకు దక్కుతుంది. ఇదీ మా నిశ్చయం. అవినీతో, నీతో చివరకు చూడుము'.

క. అను పలుకులకు విషాదము । దనుకఁగ ధృతరాష్ట్రవిభుఁడు దననందను నే
మనియుం బలుకఁగఁజాలక । వెనుఁబాటున నిట్టులనియె విదురునితోడన్. 296

ప్రతిపదార్థం: అను పలుకులకున్= దుర్యోధను డన్న ఆ మాటలకు; విషాదము= విచారం; తనుకఁగన్= కలుగగా; ధృతరాష్ట్ర విభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; తన నందనున్= తన కొడుకును; ఏమి+అనియున్+పలుకఁగన్+చాలక= ఏమీ అనలేక; వెనుఁబాటునన్= విచారంతో; విదురునితోడన్; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు దుఃఖం కలుగగా, ధృతరాష్ట్ర మహారాజు తన కొడుకును ఏమీ అనలేక విచారంతో విదురుడితో ఇట్లా అన్నాడు:

తే. 'మృత్యుపాశోపహతుఁడయ్యె మీఁదు లేక । సూతనందనుతోఁగూడి నా తనూజుఁ
డకట! నాశంబుఁ బొందువాఁడయ్యెఁ; మనకు । నింకఁ జేయంగ నగుపని యెద్ది చెపుమ?' 297

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; నా తనూజుఁడు= నా కొడుకు; మీఁదు లేక= పైని లేక - తనకంటె అధికుడు లేక; సూత నందనుతోన్= కర్ణుడితో; కూడి= కలిసి; మృత్యుపాశ+ఉపహతుఁడు+అయ్యెన్= మృత్యుపాశాలచేత కొట్టబడినవాడు అయ్యాడు; నాశంబున్+పొందువాఁడు+అయ్యెన్= నశిస్తున్నాడు; మనకున్; ఇంకన్; చేయంగన్+అగు పని= చేయదగినపని; ఎద్ది= ఏది; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'అయ్యో! నా కొడుకు పైనెవడూ లేక కర్ణుడితో కలిసి మృత్యుపాశాలలో చిక్కుకున్నాడు. నశిస్తున్నాడు. ఇంక మనకు చేయదగిం దేదో చెప్పుము.'

వ. అనిన విని విదురుం డతని కిట్లను: 'మనవారలు మున్న దుర్బలులు. తమలోనం బెనంకువలయి విరస వచనంబు లాడుచు నింతలు పుట్టించుట యది యర్జునునకుఁ గార్యసాధనం బింతియకాక యే మనువారము? వారలు బంధుమిత్త్ర సహాయులుం దారును నొక్క తలంపువారలయి యున్నవారు. వలవని యీ వెంగలి మాటలు విడిచి పాండవులం బిలువం బనిచి తగవు నడపుటదక్క మనకుఁ జేయందగుపని వేఱొండు గలుగునే?' యని చెప్పిన, ధృతరాష్ట్రుండు సంజయు చెప్పిన కార్యవచనంబులు కొఱంత వినంగలవాఁడై యతని దిక్కు మొగంబు సేసి. 298

ప్రతిపదార్థం: అనినన్; విని; విదురుండు; అతనికిన్; ఇట్లు+అనున్; మనవారలు; మున్ను+అ= ముందే; దుర్బలులు= బలహీనులు; తమలోనన్; పెనంకువలు+అయి= కలహాలయి; విరస వచనంబులు+ఆడుచున్= దుర్భాషలాడుతూ; ఇంతలు పుట్టించుట= ఇంతా కలిగించడం; అది అర్జునునకున్; కార్యసాధనంబు= ప్రయోజనాన్ని సాధించిపెట్టేది; ఇంతియకాక ఏమి+అనువారము?= ఇంతేతప్ప ఏమంటాం?; వారలు= పాండవులు; బంధు మిత్ర సహాయులున్+తారునున్= చుట్టాలూ, స్నేహితులూ, తోడువచ్చినవాళ్ళూ; ఒక్క తలంపు వారలు+అయి+ఉన్నవారు= ఏకాభిప్రాయులై ఉన్నారు; వలవని+ఈ వెంగలి మాటలు= పనికిరాని ఈ పిచ్చిమాటలు; విడిచి; పాండవులన్; పిలువన్+పనిచి= పిలిపించి; తగవు నడపుట+తక్కన్= న్యాయం చేయటం తప్ప; మనకున్+చేయన్+తగు పని= మనం చేయదగినపని; వేఱు+ఒండు+కలుగునే?= ఇంకోటి ఉంటుందా?; అని, చెప్పినన్; ధృతరాష్ట్రుండు; సంజయు చెప్పిన= సంజయుడు చెప్పిన; కార్య వచనంబుల కొఱంత= రాయబారపు మాటల శేషం; వినంగలవాఁడు+ఐ= వినగోరినవాడై; అతని దిక్కు= అతడి వైపు; మొగంబు+చేసి= తిరిగి.

తాత్పర్యం: అనగా విని విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'మనవాళ్ళు అసలే బలహీనులు. తమలో తాము పోట్లాడుకొంటూ దుర్భాషలాడుకుంటూ ఇట్లా ఉండటం అది అర్జునుడికి లాభం. ఇంతేతప్ప ఏమంటాం? పాండవులు ఏకాభిప్రాయులై ఉన్నారు. పనికిమాలిన ఈ పిచ్చిమాటలు కట్టిపెట్టి పాండవులను పిలిపించి న్యాయం చేయటం తప్ప మనం చేయవలసింది ఇంకోటి లేదు' అని చెప్పగా, ధృతరాష్ట్రుడు సంజయుడు చెప్పిన రాయబారపు మాటల శేషం వినగోరి అతడివైపు చూచి.

క. 'మును వరుసతోడఁ దన తలఁ । చిన యన్నియు నీవు వినఁగఁ జెప్పి తగవుమై
నిను వీడుకొల్పునెడ, న । ర్జునుఁ డేమని నిశ్చయించెఁ జూతము చెపుమా!' 299

ప్రతిపదార్థం: మును= ముందు; వరుసతోడన్= క్రమంతో; తన తలఁచిన+అన్నియున్= తన మనస్సులో ఉన్నవన్నీ; నీవు; వినఁగన్+చెప్పి; తగవుమైన్= సముచితంగా; నినున్; వీడుకొల్పు+ఎడన్= పంపించేటప్పుడు; అర్జునుఁడు; ఏమి+అని; నిశ్చయించెన్= నిర్ణయించాడో; చెపుమా= చెప్పుమా; చూతము= చూద్దాం.

తాత్పర్యం: 'ముందు తన మనస్సులో ఉన్నవన్నీ క్రమంగా నీవు వినేటట్లు చెప్పి, సముచితంగా నిన్ను పంపించేటప్పుడు అర్జునుడు తుదినిర్ణయంగా ఏమన్నాడో చెప్పుము చూద్దాము.'

క. అని యడిగిన సంజయుఁ డి । ట్లనుఁ: 'దుదిఁ బార్థుండు నిశ్చయము సేసి సుయో
ధనుతో నిందలి పెద్దలు । వినఁగా ననుమన్నపలుకు వినుము నరేంద్రా!' 300

ప్రతిపదార్థం: అని; అడిగినన్; సంజయుఁడు; ఇట్లు+అనున్; నర+ఇంద్రా!= రాజా!; పార్థుండు= అర్జునుడు; తుదిన్= చివరగా; నిశ్చయము+చేసి= నిర్ణయించి; సుయోధనుతోన్; ఇందలి పెద్దలు; వినఁగాన్; అనుము+అన్న పలుకు= చెప్పుమన్న మాట; వినుము.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు డడుగగా సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు: 'మహారాజా! అర్జునుడు చివరగా నిర్ణయించి దుర్యోధనుడితో ఇందలి పెద్దలు వింటూండగా చెప్పుమన్న పలుకులు చెపుతా వినుము.'

మ. 'కురువంశోత్తముఁడైన ధర్మజుఁడు 'నాకుం దండ్రిపా లీఁదగున్
ధరలో సా' మని తాన పల్క, వినియున్ దర్పంబుమై నీక త
క్కిరయేనిం, జటు లాస్మదీయ విశిఖాగ్నిజ్వాలలం దాహుతుల్
వరుసం బెట్టుదు ధార్తరాష్ట్రతతి నైశ్వర్యం బవార్యంబుగన్.' 301

ప్రతిపదార్థం: కురు వంశ+ఉత్తముఁడు+ఐన ధర్మజుఁడు= కురు వంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; నాకున్; తండ్రిపాలు= తండ్రివాటా; ధరలోన్ సాము= భూమిలో సగం; ఈన్+తగున్= ఈయదగును; అని; తాను+అ= తానే స్వయంగా; పల్కన్= చెప్పగా; వినియున్; దర్పంబు+మైన్= గర్వంతో; ఈక తక్కిరి+అ+ఏనిన్= ఇయ్యకపోయారో, ధార్తరాష్ట్ర తతిన్= ధృతరాష్ట్ర పుత్రుల సమూహాన్ని; వరుసన్= వరసగా ఒక్కొక్కడినే; ఐశ్వర్యంబు= సంపద, రాజ్యభాగం; అవార్యంబుగన్= తప్పనిసరి అయ్యేటట్లు; చటుల+అస్మదీయ విశిఖ+అగ్ని జ్వాలల+అందున్= చలించే నా బాణాలనే అగ్నిజ్వాలలలో; ఆహుతుల్ పెట్టుదున్= వేలుస్తాను-హోమం చేస్తాను.

తాత్పర్యం: 'కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు స్వయంగా- 'మా తండ్రి వాటా భూమిలో సగం నాకివ్వదగు'నని అంటే, వినీ, గర్వంతో ఇయ్యకపోయారో, ధృతరాష్ట్ర పుత్రుల సమూహాన్ని వరసగా, మాకు రాజ్యభాగం తప్పనిసరి అయ్యేటట్లు, నా చంచలమైన బాణాలనే అగ్ని జ్వాలలో వేలుస్తాను.'

విశేషం: విశిఖాగ్నిజ్వాలలు - విశిఖాలనే అగ్నిజ్వాలలు - రూపకాలంకారం.

వ. అని పలికి, కౌఁగిలించుకొని భూషణాంబరాది కమనీయ వస్తువు లొసంగిన, నేనునుం బాండవులను వాసుదేవుని సవినయంబున వీడ్కొని యింతవట్టును దేవరకు నెఱింగింప వేగంబ వచ్చితి' ననిన నమ్మాటలు దుర్యోధనుం డాదరింపక పెడచెవులంబెట్టె; ధృతరాష్ట్రుండును ఱిచ్చవడి యూరకుండె; నప్పు డయ్యిరువురపాలను సంజయుం డొక్కరుండుదక్క నయ్యాస్థానంబున నున్న సమస్త జనంబులును దిగ్గన లేచి తమతమ నివాసంబులకుం బోయిరి; తదనంతరంబ. 302

ప్రతిపదార్థం: అని; పలికి; కౌఁగిలించుకొని; భూషణ+అంబర+ఆది కమనీయ వస్తువులు= అలంకారాలూ, వస్త్రాలూ మొదలగు కోరదగిన వస్తువులు; ఒసంగినన్= ఇయ్యగా; ఏనునున్= నేనుకూడా; పాండవులను; వాసుదేవునిన్= కృష్ణుడినీ; సవినయంబునన్= అడకువతో; వీడ్కొని= విడిచి; ఇంతవట్టును= ఇంతవరకూ; దేవరకున్= తమకు; ఎఱింగింపన్= తెలపటానికి; వేగంబు+అ= వేగమే; వచ్చితిన్; అనినన్; ఆ+మాటలు; దుర్యోధనుండు; ఆదరింపక= మన్నించక; పెడచెవులన్+పెట్టెన్= వినిపించుకొనలేదు; ధృతరాష్ట్రుండును; ఱిచ్చవడి= నిశ్చేష్టుడై; ఊరక+ఉండెన్; అప్పుడు; ఆ+ఇరువుర పాలను= ఆ ఇద్దరి దగ్గరా; సంజయుండు; ఒక్కరుండు+తక్కన్= ఒక్కడు తప్ప; ఆ+ఆస్థానంబునన్; ఉన్న; సమస్త జనంబులను= ఎల్లజనులూ; దిగ్గనన్+లేచి= వెంటనే లేచి; తమ తమ నివాసంబులకున్= తమ తమ ఇండ్లకు; పోయిరి; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని పలికి కౌగిలించుకొని అలంకారాలూ, వస్త్రాలూ మొదలైన వస్తువు లియ్యగా నేనూ పాండవులనూ కృష్ణుడినీ వీడి ఇంతవరకూ తమకు తెలపటానికి వేగమే వచ్చాను' అనగా ఆ మాటలు దుర్యోధనుడు మన్నించక వినిపించుకొనలేదు. ధృతరాష్ట్రుడునూ నిశ్చేష్టుడై ఊరుకున్నాడు. అప్పుడు ఆ ఇద్దరి దగ్గరా సంజయుడు ఒక్కడు తప్ప ఆ ఆస్థానంలో ఉన్నవాళ్ళందరూ వెంటనే లేచి తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఆ తరువాత (తరువాతి పద్యంతో అన్వయం).

క. తనుజవశవర్తి యగు న । మ్మనుజేంద్రుఁడు దన సుతుండు మర్దింపఁగ నో
పునొ యనిఁ బాండుతనూజుల? । నను మతి సంజయునితోడ నాడె దురాశన్. 303

ప్రతిపదార్థం: తనుజ వశవర్తి+అగు+ఆ+మనుజ+ఇంద్రుఁడు= కొడుకునకు అధీనుడై మెలగే ఆ రాజు - ధృతరాష్ట్రుడు; తన సుతుండు= తన కొడుకు; అనిన్= యుద్ధంలో; పాండు తనూజులన్= పాండవులను; మర్దింపఁగన్+ఓపునొ= చంపగలడా; అను మతిన్= అనే తలపుతో; సంజయునితోడన్; దురాశన్= దురాశతో; ఆడెన్= పలికాడు.

తాత్పర్యం: కొడుకునకు అధీనుడై మెలగే ఆ ధృతరాష్ట్ర మహారాజు, తన కొడుకు పాండవులను యుద్ధంలో చంపగలడా? అనే తలపుతో సంజయుడితో దురాశతో ఇట్లా అన్నాడు:

సీ. 'ఈ రెండు వీకుల తారతమ్యంబులు । నెఱుఁగుదు; పోరైన నెవ్వ రోర్తు
రిది నిశ్చయింతమే? యెందు నుపాయంబుఁ । బౌరుషంబును గలవారు గలరు?
సూతము చెపు' మన్న సూతనందనుఁడు 'న । న్నడిగెద వే నొంటి యడుగవలదు;
మీ యయ్య సాత్యవతేయుఁ డీయెడకు వేం । చేయునట్లుగ భక్తిఁ జేసి తలఁపు;

తే. పిలువఁబంపు గాంధారి; వారలు వినీతి । రతులు, నిశ్చయవిదులు, ధర్మజ్ఞ చిత్తు;
లుల్లమున నీ కసూయాదు లొదవవేని । పూని మాన్పంగ నేర్తురు మానవేంద్ర!' 304

ప్రతిపదార్థం: ఈ రెండు వీఁకుల తారతమ్యంబులున్= ఈ రెండు సేనల తరతమ భావాలూ; ఎఱుఁగుదువు; పోరు+ఐనన్= యుద్ధం వస్తే; ఎవ్వరు+ఓర్తురు?= ఎవరు గెలుస్తారు?; ఇది నిశ్చయింతమే?= ఇది నిర్ణయిద్దామా?; ఎందున్= ఏ సేనలో; ఉపాయంబున్; పౌరుషంబును; కలవారు= కలరు?; చూతము; చెపుము; అన్నన్; సూతనందనుఁడు= సంజయుడు; మానవ+ ఇంద్ర!= రాజా!; నన్నున్ అడిగెదవు+ఏన్= అడిగితే; ఒంటి+అడుగన్ వలదు= ఒంటరిపాటున అడగవద్దు; మీ+అయ్య= మీ తండ్రి; సాత్యవతేయుఁడు= వ్యాసుడు; ఈ+ఎడకున్= ఇక్కడికి; వేంచేయునట్లుగన్= విచ్చేసేటట్లు; భక్తిన్+చేసి తలఁపుము= భక్తితో ధ్యానించుము; గాంధారిన్; పిలువన్+పంపుము= పిలిపించుము; వారలు; వినీతిపరులు= మర్యాదస్థులు; నిశ్చయవిదులు= నిర్ణయం తెలిసినవారు; ధర్మజ్ఞచిత్తులు= ధర్మం తెలిసిన మనస్సు కలవారు; నీకున్; ఉల్లమునన్= మనస్సులో; అసూయా+ ఆదులు= ఈర్ష్య మొదలైనవి; ఒదవెన్+ఏనిన్= కలిగినట్లయితే; పూని= పూనిక వహించి; మాన్పంగన్+నేర్తురు= పోగొట్టగలరు.

తాత్పర్యం: 'ఈ రెండు సైన్యాలలోనూ గల తరతమ భావాలను నీ వెరుగుదువు. యుద్ధం వస్తే ఎవరు గెలుస్తారో నిశ్చయిద్దామా? ఏ సైన్యంలో ఉపాయమూ, పౌరుషమూ కలవాళ్ళు ఉన్నారు? చూద్దాం చెప్పుము" అనగా, సంజయుడు 'రాజా! నన్నడిగే మాటుంటే ఒంటరిగా అడగవద్దు. మీ తండ్రి వ్యాసుడు ఇక్కడికి విచ్చేసేటట్లు ఆయనను భక్తితో ధ్యానించుము. గాంధారిని పిలిపించుము. వాళ్ళు మర్యాదస్థులు, నిర్ణయం తెలిసినవాళ్ళు. ధర్మం తెలిసిన మనస్సు కలవాళ్ళు. నీకు మనస్సులో అసూయ మొదలైనవి కలిగితే వాటిని పోగొట్టగలవాళ్ళు.'

కృష్ణద్వైపాయనుఁడు ధృతరాష్ట్రుని యొద్దకు వచ్చుట (సం. 5-65-8)

వ. **అనిన విని యంబికానందనుం 'డట్లకాక'యని యొక కంచుకిం బిలిచి వానిం బుచ్చి గాంధారి రావించి, సద్భక్తి తాత్పర్యంబునఁ గృష్ణద్వైపాయన మహామునిం దలంచిన, దివ్యబోధ మహనీయుండైన యమ్మహాత్ముండు విజయం చేయుటకు, నందఱు దండ ప్రణామంబులు సేసి సమున్నతాసనంబున నునిచి, యర్ఘ్యపాద్యాది విధులం బూజించియున్న సమయంబున ధృతరాష్ట్రుండు విన్నపంబు సేయక మున్న యమ్మహాపురుషుండు ధృతరాష్ట్ర సంజయుల చిత్తవృత్తులు దాన యెఱింగినవాఁడగుటం జేసి, సంజయువలనఁ బ్రసన్న దృష్టి నవలోకించి యతని కిట్లనియె:** **305**

ప్రతిపదార్థం: అనినన్; విని; అంబికా నందనుండు= ధృతరాష్ట్రుడు; అట్లు+అ కాక= అట్లాగే; అని; ఒక కంచుకిన్+పిలిచి= ఒక రాజాంతఃపురాధికారిని పిలిచి; వానిన్; పుచ్చి= పంపి; గాంధారిన్; రావించి= రప్పించి; సత్+భక్తి తాత్పర్యంబునన్= సద్భక్తి తత్పరత్వంతో; కృష్ణద్వైపాయన మహామునిన్= వ్యాసమహర్షిని; తలంచినన్= ధ్యానించగా; దివ్య బోధ మహనీయుండు+ఐన+ ఆ+మహాత్ముండు= దివ్యజ్ఞానం చేత పూజనీయుడైన ఆ మహానుభావుడు; విజయం చేయుటయున్= విచ్చేయగా; అందఱున్; దండ ప్రణామంబులు+చేసి= సాష్టాంగ నమస్కారాలు చేసి; సమున్నత+ఆసనంబునన్= ఎత్తయిన పీఠంపై; ఉనిచి= కూర్చుండబెట్టి; అర్ఘ్య పాద్య+ఆది విధులన్= పూజాద్రవ్యాలూ, పాదజలమూ మొదలైన సత్కారాలతో; పూజించి+ఉన్న సమయంబునన్= పూజించి ఉన్నప్పుడు; ధృతరాష్ట్రుండు; విన్నపంబు+చేయక మున్ను+అ= మనవి చేయకముందే; ఆ+మహాపురుషుండు= ఆ మహాత్ముడు; ధృతరాష్ట్ర సంజయుల చిత్తవృత్తులు= ధృతరాష్ట్ర సంజయుల మనోగతాలు; తాను+అ= తానే; ఎఱింగిన వాఁడు+అగుటన్+చేసి= తెలిసినవాడవటంచేత; సంజయువలనన్= సంజయుడికేసి; ప్రసన్నదృష్టిన్= అనుగ్రహంకల చూపుతో; అవలోకించి= చూచి; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అట్లా సంజయుడనగా విని ధృతరాష్ట్రుడు 'అలాగే' అని ఒక కంచుకిని పిలిచి అతడిని పంపి గాంధారిని రప్పించి, భక్తిపారవశ్యంతో వ్యాస మహర్షిని ధ్యానించగా, దివ్యజ్ఞాన మహనీయుడైన ఆ మహానుభావుడు

విచ్చేశాడు. అందరూ సాష్టాంగ నమస్కారాలు చేసి ఉన్నతమైన పీఠంపై ఆసీనుడిని చేసి అర్ఘ్యం పాద్యం మొదలైన సత్కారాలతో పూజించి ఉన్నప్పుడు, ధృతరాష్ట్రుడు మనవి చేయకుండానే, ఆ మహాత్ముడు ధృతరాష్ట్ర సంజయుల మనోగతాలు తెలిసినవాడవటం చేత, సంజయుడికేసి అనుగ్రహంతో కూడిన దృష్టితో చూచి, అతడితో ఇట్లా అన్నాడు:

క. 'నీవు సమస్తము నెఱుఁగుదు । గావున నీ కూరకుండఁగాఁ దగదు; ధరి
త్రీ వల్లభుఁ డడిగిన పని । యీ విధమని తెలియఁబలుకు మేను వినంగన్.' 306

ప్రతిపదార్థం: నీవు; సమస్తమున్+ఎఱుఁగుదువు+కావునన్= అంతా ఎరుగుదువు కాబట్టి; నీకున్+ఊరక+ఉండఁగాన్+తగదు= నీవు ఊరుకొనగూడదు, ధరిత్రీ వల్లభుఁడు= రాజు- ధృతరాష్ట్రుడు; అడిగిన పని; ఈ విధము+అని= ఇదీ అని; ఏను వినంగన్= నేను వినేటట్టు; తెలియన్+పలుకుము= స్పష్టంగా చెప్పుము.

తాత్పర్యం: 'నీకు అన్నీ తెలుసు కాబట్టి నీవు ఊరుకొనగూడదు. ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సమాధానం నేను వినేటట్లు స్పష్టంగా చెప్పుము.'

వ. అనినఁ బ్రసాదం బని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె: 307

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రసాదంబు+అని= సంతోషం అని; సంజయుండు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వ్యాసుడు అనగానే 'సంతోషం' అని సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

క. 'ఆ సేనకు నీ సేనకు । వాసి యడిగె దీవు నన్నుఁ, వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు; తత్సము । నీ సేనం జూపుమా నరేశ్వర! నాకున్. 308

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా, ధృతరాష్ట్రా!; ఈవు= నీవు; నన్నున్; ఆ సేనకున్= ఆ (పాండవుల) సేనకూ; ఈ సేనకున్= ఈ (కౌరవుల) సేనకూ; వాసి= తారతమ్యం; అడిగెదవు; ఆ సేనన్= పాండవుల సేనలో; వసుదేవ సుతుండు= కృష్ణుడు; కలఁడు= ఉన్నాడు; ఈ సేనన్= కౌరవుల సేనలో; తద్+సమున్= అతడితో సమానుడిని; నాకున్; చూపుమా= చూపించుము.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రా! నీవు నన్ను పాండవుల సేనకూ, కౌరవుల సేనకూ తారతమ్యం అడిగావు. పాండవుల సేనలో కృష్ణు డున్నాడు. ఈ కౌరవసేనలో అతడితో సమానుడిని నాకు చూపించుము.

వ. వాసుదేవుం డెట్టివాఁ డని యడిగెదేనిం జెప్పెద. 309

ప్రతిపదార్థం: వాసుదేవుండు= కృష్ణుడు; ఎట్టివాఁడు+అని= ఎటువంటివాడు అని; అడిగెదు (దవు)+ఏనిన్= అడిగితే; చెప్పెదన్.

తాత్పర్యం: కృష్ణుడు ఎట్లాంటివాడని అడిగితే, చెప్పుతాను వినుము.

చ. జగముల నన్నిటిం దనవశంబుగఁ జేసినవీరు, భంగమున్,
బగయు లలాట లోచనుఁడు వాపఁగఁ బేర్చినయట్టి బాణు, నొ
క్క గడియలోన గర్వ మడఁగం బరిమార్చె; సురేంద్ర కల్పకం
బు గరములీలఁ దెచ్చె; హరి భూరి పరాక్రమ మప్రసిద్ధమే! 310

ప్రతిపదార్థం: జగములన్+అన్నిటిన్= లోకాల నన్నింటినీ; తన వశంబుగన్+చేసిన వీరున్= తనకు లోబడేటట్లు చేసికొన్న వీరుడిని; భంగమున్= అవమానమూ; పగయున్= శత్రుత్వమూ; లలాట లోచనుఁడు= నుదుట కన్నుకలవాడు- శివుడు; వాపఁగన్= లేకుండా చేయగా; పేర్చిన+అట్టి= విజృంభించినట్టి; బాణున్= బాణుడిని; ఒక్క గడియలోన్+అ= ఒక గడియ కాలంలోనే; గర్వము+అడఁగన్= గర్వం నశించిపోయేటట్లు; పరిమార్చెన్= సంహరించాడు; సుర+ఇంద్ర కల్పకంబు= దేవేంద్రుడి కల్పవృక్షం- పారిజాతం; కరము లీలన్= మిక్కిలి విలాసంతో- అనాయాసంగా; తెచ్చెన్; హరి భూరి పరాక్రమము= కృష్ణుడి మహాపరాక్రమం; అప్రసిద్ధమే?= ప్రసిద్ధమైనది కాదా? (అందరికీ తెలిసిందే కదా!)

తాత్పర్యం: లోకాల నన్నింటినీ తనకు అధీనాలుగా చేసికొన్న వీరుడూ, అవమానమూ, శత్రుత్వమూ ముక్కంటి పోగొట్టగా విజృంభించినవాడూ అయిన బాణుడిని ఒక గడియ కాలంలోనే గర్వం నశించేటట్లు వధించాడు. దేవేంద్రుడి పారిజాత వృక్షాన్ని అవలీలగా తీసికొనివచ్చాడు. కృష్ణుడి మహాపరాక్రమం సుప్రసిద్ధమే కదా!

విశేషం: బాణుడు - బాణాసురుడు బలి కొడుకు. ఇతడు ఈశ్వరుడిని గురించి తపస్సు చేసి మూడు లోకాలలోనూ తన కెదురు లేకుండా వరం పొందుతాడు. ఇతని కూతురు ఉష. ఈమె కలలో చూచిన అనిరుద్ధుడిని ప్రేమించి తన చెలికత్తె సాయంతో అతణ్ణి తన అంతఃపురానికి రప్పించుకొంటుంది. అతనితో సంగమించటం వలన ఆమె గర్భవతి అవుతుంది. ఈ సంగతి బాణుడు తెలిసికొని అనిరుద్ధుడి తాతయైన కృష్ణుడితో యుద్ధం చేస్తాడు. కృష్ణుడు బాణుడి వేయి బాహువులను నరుకుతాడు. బాణుడు ఓడిపోయి ఉషానిరుద్ధులకు వివాహం జరిపిస్తాడు. 'సురేంద్ర కల్పకంబు గరము లీలఁ దెచ్చె' - కృష్ణుడు సత్యభామ కోరికపై ఇంద్రుడి మీదికి దండెత్తిపోయి అతడి నందనవనంలోని పారిజాత వృక్షాన్ని భూమికి తెచ్చి సత్యభామ పెరట్లో నాటుతాడు.

ఆ. అధిక దుష్కరంబులైన కార్యంబులు । క్రీడవోలెఁజేయుఁ గేశవుండు;
విను మతండు పార్థు నెనసి యేకార్థుఁడై । యుండుఁ బూర్వ భవ సఖుండు గాన. 311

ప్రతిపదార్థం: కేశవుండు= కృష్ణుడు; అధిక దుష్కరంబులు+ఐన కార్యంబులు= మిక్కిలి కష్టములైన పనులు; క్రీడ+పోలెన్+ చేయున్= ఆటవలె చేస్తాడు; వినుము; అతండు; పూర్వభవ సఖుండు+కానన్= పూర్వజన్మలో మిత్రుడు కాబట్టి, పార్థున్= అర్జునుడిని; ఎనసి= కూడి; ఏక+అర్థుఁడు+ఐ+ఉండున్= ఒకే ప్రయోజనం కలవాడై ఉంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! విను. కృష్ణుడు మిక్కిలి కష్టములైన పనులు ఒక ఆటవలె అవలీలగా చేస్తాడు. అంతేకాక అతడు పూర్వజన్మలో అర్జునుడికి స్నేహితుడు కాబట్టి, అర్జునుడితోకూడి ఒకే ప్రయోజనం కలిగి ఉంటాడు.

ఆ. అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయాబలంబునఁ బాండవుల సర్వ సమర సాధనంబుల యందును సూక్ష్మరూపవ్యాపియై నిలిచి వారికి విజయం బొసంగుచుండు' నని చెప్పి, మఱియు నిట్లనియె: 312

ప్రతిపదార్థం: అట్టి వాసుదేవుని చక్రంబు= అటువంటి కృష్ణుని చక్రాయుధం (సుదర్శనం); నిజ మాయా బలంబునన్= తనదైన మాయయొక్క శక్తిచేత; పాండవుల సర్వ సమర సాధనంబుల అందును= పాండవుల యుద్ధ పరికరాలన్నిటిలోనూ; సూక్ష్మ రూప వ్యాపి+ఐ= సూక్ష్మరూపంతో వ్యాపించినదై; నిలిచి; వారికిన్; విజయంబు; ఒసంగుచున్+ఉండున్= కూరుస్తూంటుంది; అని; చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి కృష్ణుని సుదర్శనం తన మాయా బలంతో పాండవుల యుద్ధోపకరణాలన్నిటియందూ సూక్ష్మరూపంతో వ్యాపించి, వారికి విజయం చేకూరుస్తుంది' అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు:

క. 'పలుమఱుఁ బాండు తనూజుల । కొలఁది వితర్కించెదవు; నిగూఢం బదియుం
దెలియం బలికెద; వారికి । బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా! 313

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజోత్తమా, ధృతరాష్ట్రా!; పాండు తనూజుల కొలఁది= పాండవుల సామర్థ్యం; పలుమఱున్= పలుసార్లు; వితర్కించెదవు= సంశయిస్తావు; నిగూఢంబు+అదియున్+తెలియన్+పలికెదన్= రహస్యమైన దానినికూడా తెలిసేటట్లు చెపుతాను; వారికిన్= పాండవులకు; బలమును= పరాక్రమమూ; సత్త్వంబున్= ప్రాణమూ; హరి+అ= కృష్ణుడే.

తాత్పర్యం: 'రాజోత్తమా, ధృతరాష్ట్రా! నీవు మాటిమాటికీ పాండవుల సామర్థ్యాన్ని సంశయిస్తావు. అది రహస్యమైనా, స్పష్టపరుస్తాను. వారికి కృష్ణుడే పరాక్రమమూ, ప్రాణమూ.

వ. హరి మహత్త్వంబు విన్నవించెద నవధరింపుము. 314

తాత్పర్యం: కృష్ణుడి మాహాత్మ్యం మనవి చేస్తాను, శ్రద్ధగా వినుము.

క. ఒక తల సమస్త జగములు, । నొకఁడ జనార్దనుఁడు నిలిచి యొక తలయైనన్,
సకలము నసార; మాతం । డొకరుని సారంబ చాల నుత్కృష్టమగున్. 315

ప్రతిపదార్థం: సమస్త జగములున్= లోకాలన్నీ; ఒక తల= ఒక వైపూ; జనార్దనుఁడు+ఒక్కఁడు+అ= కృష్ణు డొక్కడూ; నిలిచి; ఒక తల+ఐనన్= ఒక వైపూ అయితే; సకలమున్= అంతా; అసారము= నిస్సారం; ఆతండు+ఒకరుని సారంబు+అ= అతడొక్కడి సారమూ; చాలన్+ఉత్కృష్టము+అగున్= మిక్కిలి గొప్పది అవుతుంది.

తాత్పర్యం: లోకాలన్నీ ఒక పక్షాన, కృష్ణు డొక్కడూ ఒక పక్షాన నిలిస్తే, అంతా నిస్సారమూ అతడి ఒక్కని సారమూ మహోత్కృష్టమూ అవుతుంది.

క. తలఁపునన వాసుదేవుఁడు । గలిగింపను, నిలుప, నడఁపఁగా నోపు జగం
బుల; మఱియును గ్రీడార్థము । పలుపోకలఁ బుచ్చుచుండుఁ బౌరవనాథా! 316

ప్రతిపదార్థం: పౌరవ నాథా!= పూరు వంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; వాసుదేవుఁడు= కృష్ణుడు; తలఁపునన్+అ= సంకల్పంచేతనే; జగంబులన్= లోకాలను; కలిగింపను= పుట్టించడానికీ; నిలుపన్= నిలపటానికీ; అడఁపఁగాన్= నశింపచేయటానికీ; ఓపున్= చాలును; మఱియును= ఇంకా; క్రీడా+అర్థము= ఆటకొరకు; వినోదంకొరకు; పలు+పోకలన్+పుచ్చుచున్+ఉండున్= అనేక రీతులను ప్రయోగిస్తూంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కృష్ణుడు సంకల్పమాత్రంచేతనే లోకాల సృష్టి స్థితి లయాలను చేయగల సమర్థుడు. ఇంకా ఎన్నో రీతులను ప్రయోగిస్తూంటాడు.

విశేషం: కృష్ణుడు త్రిమూర్త్యాత్మకుడని భావం.

క. **ఎక్కడ నడచును సత్యం, । బెక్కడ ధర్మంబు వరఁగు, నెక్కడఁ గలుగుం**
జక్కటి నిలుచుం గృష్ణుం । డక్కడ; నతఁ డున్నకడన యగు జయ మధిపా! **317**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; సత్యంబు; ఎక్కడన్; నడచున్= ప్రవర్తిస్తుందో; ధర్మంబు; ఎక్కడ; పరఁగున్= ఒప్పుతుందో; చక్కటి= న్యాయంగా; ఎక్కడన్; కలుగున్; కృష్ణుండు; అక్కడన్; నిలుచున్= ఉంటాడు; అతఁడు; ఉన్న కడన్+అ= ఉన్నచోటనే; జయము; అగున్.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! సత్యం ఎక్కడ ప్రవర్తిల్లుతుందో, ధర్మం ఎక్కడ ఒప్పుతుందో, న్యాయం ఎక్కడ ఉంటుందో కృష్ణుడు అక్కడ నిలుస్తాడు. అతడున్న చోటనే జయం కలుగుతుంది.

సీ. **పురుషోత్తముం డెల్ల భువనంబులును దాన । యఖిల భూతాత్మకుండై విహార**
లీల విచేష్టించు; నీ లోకముల మాయ । దొట్టి యొక్కొకమరి పుట్టి, పెరిఁగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు; । శిష్టరక్షణమును, దుష్ట నిగ్ర
హంబును దన పను లగుటఁ; బాండవుల నె । పం బిడుకొని ధర్మబాహ్యు లైన

తే. **నీ తనూజుల నిక్కమ నిగ్రహింపఁ । దలఁచినాఁ డమ్మహాత్ముండు; తథ్య మతని**
నిట్టి చందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ । రాశ్రయింతురు, బ్రదుకుదు రట్టివారు.' **318**

ప్రతిపదార్థం: పురుష+ఉత్తముండు= కృష్ణుడు; ఎల్లభువనంబులును= అన్నిలోకాలు; తాను+అ= తానే; అఖిల భూత+ ఆత్మకుండు+ఐ= ఎల్లప్రాణులలో అంతర్యామిగా- నున్నవాడై; విహార లీలన్= ఒక ఆటగా; విచేష్టించున్= క్రియా కలాపములు సాగిస్తుంటాడు; ఈ లోకములన్= ఈ లోకాలలో; మాయ+తొట్టి= మాయను అవలంబించి; ఒక్కొకమరి= ఒక్కొక్కసారి; పుట్టి; పెరిఁగి; కర్మ+అనుచరణముల్+కైకొని= కర్మలను అనుసరించటం స్వీకరించి; వర్తించున్= మెలగుతాడు; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు- కృష్ణుడు; శిష్ట రక్షణమును= మంచివాళ్ళను కాపాడడమూ; దుష్ట నిగ్రహంబును= చెడ్డవాళ్ళను శిక్షించటమూ; తన పనులు+అగుటన్= తన విధులు అవటం చేత; పాండవుల నెపంబు+ ఇడుకొని= పాండవులను నిమిత్తంగా చేసికొని; ధర్మ బాహ్యులు+ఐన నీ తనూజులన్= ధర్మానికి వెలిఅయిన- అధర్మపరులైన నీ కొడుకులను; నిక్కము+అ= నిజంగానే; నిగ్రహింపన్+తలఁచినాఁడు= శిక్షించనెంచాడు; తథ్యము= ఇది నిశ్చయం; అతనిన్; ఇట్టి చందంబువాఁడు+అని+ఎఱిఁగి= ఇటువంటివాడని తెలిసి; ఎవ్వరు; ఆశ్రయింతురు= ఆశ్రయిస్తారో, శరణు కోరతారో; అట్టివారు; బ్రదుకుదురు= ప్రాణాలతో ఉంటారు.

తాత్పర్యం: కృష్ణుడు సకలలోక స్వరూపుడు. సర్వ జీవాంతరాత్ముడై ఒక క్రీడగా క్రియాకలాపములు సాగిస్తుంటాడు. మాయనవలంబించి ఈ లోకాలలో ఒక్కొక్కసారి పుట్టి, పెరిగి తన జన్మలకు అనుగుణమైన కర్మలను స్వీకరించి ప్రవర్తిస్తాడు. శిష్టులను రక్షించటమూ, దుష్టులను శిక్షించటమూ తన పనులు కావటం చేత పాండవుల నెపంతో

అధర్మపరులైన నీ కొడుకులను ఆ మహాత్ముడు నిజంగా శిక్షించదలచుకొన్నాడు. ఇది తథ్యం. ఇటువంటి మహనీయుడని తెలిసి అతడిని ఎవరు ఆశ్రయిస్తారో, వాళ్ళు బ్రదుకుతారు.'

విశేషం: అతడిని ఆశ్రయించనివాళ్ళు చస్తారని అర్థం.

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు 'వి। ష్ణుని నే నెఱుఁగని విధంబునుం, దెలియఁగ నీ
కని యున్న తెఱఁగుఁ జెప్పుమ'। యనుటయు సూతసుతుఁ డిట్టులను నాతనితోన్. 319

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ధృతరాష్ట్రుఁడు; విష్ణునిన్= విష్ణువును; ఏను= నేను; ఎఱుఁగని విధంబునున్= ఎరగని విధమూ; నీ కని+ఉన్న తెఱఁగున్= నీవు చూచి ఉన్న- తెలిసిఉన్న విధమూ; తెలియఁగన్= స్పష్టపడేటట్లు; చెప్పుమ; అనుటయున్= అనగా; సూతసుతుఁడు= సంజయుడు; అతనితోన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సంజయుడు అట్లా అన్నంతనే ధృతరాష్ట్రుడు 'విష్ణువును నేను ఎరుగకపోవటానికీ, నీవు ఎరగటానికీ కారణం ఏమిటో స్పష్టంగా చెప్పుము' అని అడగగా, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

వ. 'విద్యయు నవిద్యయు ననఁగా రెండు గల; వవిద్యాదూషితుండై తమోగ్రస్తుండైనవాఁడు విష్ణు నెఱుంగఁడు. విద్యాసంపన్నుం డెఱుంగు' ననిన, 'విద్య యనునది యెట్టి? దెద్దాన నీవా సర్వేశ్వరు నెఱింగితి? దాని, నవిద్య యెట్టిది? దానిని జెప్పు' మనుటయు, నాంబికేయునకు సంజయుం డిట్లనియె: 'సాత్త్విక రాజస తామస వికారంబుల త్రిప్పులంబడక ధర్మం బాచరించుచు భావశుద్ధి గలిగి యుండుదు; దీన నే నచ్యుతు నెఱుంగుదు; విద్య యిట్టిది. నీకునుం, దక్కెవరికైనను నతని నెఱుంగుటకు నిదియ తెరు; విట్టిదిగాని విధం బవిద్య' యని చెప్పిన, నతండు నిజనందనున కిట్లనియె: 320

ప్రతిపదార్థం: విద్యయున్; అవిద్యయున్; అనఁగాన్; రెండు; కలవు; అవిద్యా దూషితుండు+ఐ= అవిద్యచేత నిందితుడయి; తమస్(ః)+గ్రస్తుండు+ఐనవాఁడు= తమోగుణం చేత ఆక్రమించబడినవాడు; విష్ణున్; ఎఱుంగఁడు; విద్యాసంపన్నుండు= విద్యతో కూడినవాడు; ఎఱుంగున్; అనినన్; విద్య+అను+అది+ఎట్టిది?= విద్య అనేది ఎటువంటిది?; ఏ+దానన్= దేనిచేత; నీవు; ఆ సర్వేశ్వరున్= ఆ కృష్ణుడిని; ఎఱింగితివి; దానిన్= దానినీ; అవిద్య; ఎట్టిది; దానిని; చెప్పుము; అనుటయున్; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; సంజయుండు; ఇట్లు+అనియెన్; సాత్త్విక రాజస తామస వికారంబుల త్రిప్పులన్+పడక= సత్త్వ రజస్తమో గుణ వికారాల చిక్కులలో పడక; ధర్మంబు+ఆచరించుచున్= ధర్మ ఆచరిస్తూ; భావశుద్ధి+కలిగి= అంతశ్శుద్ధి కలిగి; ఉండుదున్= ఉంటాను; దీనన్= దీనిచేత; నేను; అచ్యుతున్= కృష్ణుడిని; ఎఱుంగుదున్; నీకునున్; తక్కు+ఎవరికిన్+ ఐననున్= తక్కిన ఎవరికైనా; అతనిన్; ఎఱుంగుటకున్; ఇది+అ= ఇదే; తెరువు= మార్గం; ఇట్టిది కానివిధంబు= ఇటువంటిది కానిది; అవిద్య; అని; చెప్పినన్; అతండు; నిజనందనునకున్= తన కుమారుడికి- దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విద్య అనీ, అవిద్య అని రెండున్నాయి. అవిద్య చేత పాడయి, తమోగుణం చేత ఆక్రమించబడినవాడు విష్ణువును ఎరగడు. విద్యతో కూడుకొన్నవాడు ఎరుగుతాడు, అనగా, 'విద్య అనేది ఎటువంటిది? నీవు ఆ సర్వేశ్వరుడిని ఎలా తెలిసికొనగలిగావో దానినీ, అవిద్య ఎటువంటిదో దానినీ చెప్పుము అని అడగగా, ధృతరాష్ట్రుడితో సంజయుడు ఇట్లా' అన్నాడు: 'సత్త్వ రజస్తమోగుణాల వికారాలకు లోనుగాక, ధర్మం ఆచరిస్తూ, అంతశ్శుద్ధి కలిగి ఉంటాను.

దీనివలన నేను ఆ విష్ణువును ఎరుగుదును. ఇదీ విద్య. నీకుగానీ, ఇంకెవరికిగానీ విష్ణువును తెలిసికొనే మార్గం ఇదే. ఇటువంటిది కానిది అవిద్య' అని చెప్పగా, ధృతరాష్ట్రుడు తన కొడుకుతో ఇట్లా అన్నాడు:

క. 'మన కాప్తుఁడు సంజయుఁ; డీ । తని యుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింపవయ్య! య । తనిఁ జొచ్చిన బ్రదుకుదీవుఁ దమ్ములు సుతులున్.' 321

ప్రతిపదార్థం: సంజయుఁడు; మనకున్; ఆప్తుండు= కావలసినవాడు; ఈతని+ఉపదేశంబు+పట్టి= ఇతడి బోధను అనుసరించి; ధర్మమునన్= ధర్మంతో; ముకుందునిన్= కృష్ణుడిని; ఆశ్రయింపవయ్య!= ఆశ్రయించు నాయనా!; అతనిన్+చొచ్చినన్= అతడిని శరణంటే; తమ్ములున్; సుతులున్= కొడుకులూ; ఈవున్= నీవూ; బ్రదుకుదువు= ప్రాణాలతో ఉంటావు.

తాత్పర్యం: 'సంజయుడు మన మేలు కోరేవాడురా, ఇతని ఉపదేశం పాటించి ధర్మంతో కృష్ణుడిని ఆశ్రయించు నాయనా. అతడిని శరణంటే నీవు నీ తమ్ములతోనూ, కొడుకులతోనూ బ్రదుకుతావు.'

చ. అనిన సుయోధనుండు దమ యయ్యకు నిట్లను: 'నిజ్జగంబు ల
న్నిని నొకపెట్ట మ్రింగినను, నెట్టన సర్వము గాచెనేనియు
న్వినుము - ముకుందుఁ డర్జునుని నెచ్చెలి నాఁ జెవులార వించు, నిం
క నతని నొక్క బామునకుఁగా ధృతిపెంపఱ నాశ్రయింతునే?' 322

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రు డనగానే; సుయోధనుండు= దుర్యోధనుడు; తమ+అయ్యకున్= తమ తండ్రికి; ఇట్లు+అనున్; వినుము; ఈ+జగంబులు+అన్నినిన్= ఈ లోకాల నన్నింటినీ; ఒకపెట్టన్= ఒక్కసారిగా; మ్రింగినను; నెట్టన= నిజంగా; సర్వము= అన్నింటినీ; కాచెన్+ఏనియున్= రక్షించినా; ముకుందుఁడు= కృష్ణుడు; అర్జునుని నెచ్చెలి నాన్= అర్జునుడి చెలికాడు అనగా; చెవులు+ఆరన్; వించున్= వింటూ; ఇంకన్; అతనిన్; ఒక్క బామునకున్+కాన్= ఒక కష్టానికిగాను; ధృతిపెంపు= ధైర్యాతిశయం; అఱన్= నశించగా; ఆశ్రయింతునే?= ఆశ్రయిస్తానా?

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగానే, దుర్యోధనుడు తన తండ్రితో ఇట్లా అన్నాడు: 'విను. ఈ లోకాల నన్నింటినీ ఒక్కసారిగా మ్రింగినా, అన్నింటినీ నిజంగా రక్షించినా, కృష్ణుడు అర్జునుడి చెలికాడని చెవులారా వింటూ, ఇంక అతడిని ఒక కష్టం వచ్చింది గదా అని, ధైర్యాతిశయం నశించగా ఆశ్రయిస్తానా?'

విశేషం: ఇందులో ఔపవిభక్తికమైన ఎన్ని శబ్దం అనౌపవిభక్తికంగా ప్రయుక్తమవటం విశేషం.

తే. అనిన గాంధారి కిట్లను జనవిభుండు: । 'నీ తనూజుండు దుర్మాని నీతిబాహ్యుఁ
డుద్ధతుం డీసుమాని నా బుద్ధి వినఁడు; । వీఁడు సెడుఁగాని బ్రదుకంగ లేఁడు సుమ్ము!' 323

ప్రతిపదార్థం: అనినన్= అని దుర్యోధను డనగానే; జనవిభుండు= రాజు - ధృతరాష్ట్రుడు; గాంధారికిన్; ఇట్లు+అనున్; నీ తనూజుండు= నీ కొడుకు - దుర్యోధనుడు; దుర్మాని= దురభిమానం కలవాడు; నీతిబాహ్యుఁడు= నీతికి వెలిఅయినవాడు; ఉద్ధతుండు= గర్వితుడు; ఈసు మాని= ఈర్ష్య విడిచి; నా బుద్ధిన్; వినఁడు; వీఁడు; చెడున్+కాని= చెడిపోతాడే తప్ప; బ్రదుకంగన్+లేఁడు సుమ్ము!= బ్రతకలేడు సుమా!

తాత్పర్యం: అని దుర్యోధను డనగానే ధృతరాష్ట్రుడు గాంధారితో ఇట్లా అన్నాడు: 'నీ కొడుకు దురభిమాని, నీతిమాలిన వాడు. గర్వితుడు. ఈర్ష్య విడిచి నా బుద్ధి వినడు. వీడు చెడిపోతాడే తప్ప బ్రదకలేడు.'

ఉ. నావుడుఁ దల్లి యిట్టులను నందనుతోఁ: 'నిది యేల యాయువున్
శ్రీ విభవంబులన్ మము నశేషసుహృజ్జనులం దొఱంగఁగా
నీవు గడంగె? దిట్టి యవినీతులునుం గలరే? వృకోదరుం
డై విధి సంపఁగా నొరుల కాఁగఁగ వచ్చునె యింకఁ బుత్త్రకా?' 324

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; తల్లి; నందనుతోన్= కొడుకుతో; ఇట్టులు+అనున్; పుత్త్రకా!= కొడుకా!; నీవు; ఆయువున్; శ్రీ విభవంబులన్= సంపదనూ, వైభవాలనూ; మమున్; అశేష సుహృద్+జనులన్= సకల మిత్రులనూ; తొఱంగఁగాన్+కడంగె దవు= విడిచిపెట్టాలని చూస్తావు; ఇది+ఏల?= ఎందుకురా ఇది?; ఇట్టి+అవినీతులునున్+కలరే!= ఇటువంటి అవినయపరులు కూడా ఉన్నారా?; విధి= దైవం; వృకోదరుండు+ఐ= భీముడై - భీముడి రూపంలో; చంపఁగాన్= చంపుతూ ఉంటే; ఇంకన్; ఒరులకున్= ఇతరులకు; ఆఁగఁగన్ వచ్చునె?= ఆప తరమా?

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగానే తల్లి గాంధారి తన కొడుకుతో ఇట్లా అన్నది: 'నాయనా, దుర్యోధనా! నీవు ఆయువునూ, సంపద్వైభవాలనూ, మమ్మల్నీ, సర్వమిత్రుల్నీ వదులుకొన యత్నిస్తావు ఎందుకురా? ఇటువంటి అవినీతులు కూడా ఉన్నారా? దైవం భీముడి రూపంలో నిన్ను చంపబోతూంటే ఇంక ఎవరాపగలరు?'

విశేషం: భీముడికి 'వృకోదర' శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. అనియె; నట్టి యెడం గృష్ణద్వైపాయనుండు ధృతరాష్ట్రునకిట్లను 'కృష్ణుండు నీకుం గూర్చు; నీవుం బరమాప్తుండైన సంజయు నతనిపాలికిం బుచ్చి; తది లెస్స కార్యం బయ్యె, వీఁడును నమ్మహానుభావు మహనీయ ప్రభావం బున్నరూ పెఱుంగు. వీని బుద్ధి విని యద్దేవు నాశ్రయింపు; మతం డేకాగ్రచిత్తులై యారాధించినవారికిఁ జేరువ యగుఁ; గామక్రోధోపహతులై తమ తమ ధనంబులం దృప్తులు గాక యన్యాయంబున వర్తించువారలకు దూరంబై యుండు; నెల్లభంగుల నాతనిం జొచ్చి బ్రదుకు;' మనినం, 'బ్రసాదం బట్ల చేయుదు' నని, విచిత్రవీర్యనందనుండు సూతనందనునితో 'నవ్వాసుదేవ నామ నిర్వచనంబు నాకుఁ దేటపడం దెలిపి యతనిం బొందు నుపాయం బుపదేశింపవే' యని యడిగిన. 325

ప్రతిపదార్థం: అనియెన్= అన్నది; అట్టి+ఎడన్= అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనున్; కృష్ణుండు; నీకున్; కూర్చున్= ఇష్టపడతాడు; నీవున్= నీవూ; పరమ+ఆప్తుండు+ఐన సంజయున్= మిక్కిలి కావలసినవాడైన సంజయుడిని, అతని పాలికిన్= ఆ కృష్ణుడి దగ్గరకు; పుచ్చితివి= పంపావు; అది; లెస్స కార్యంబు+అయ్యెన్= మంచి పని అయింది; వీఁడునున్= ఈ సంజయుడు కూడా; ఆ+మహానుభావు మహనీయ ప్రభావంబు= ఆ మహాత్ముడి మహామహిమ యొక్క; ఉన్న రూపు= ఉన్న విధం; ఎఱుంగన్; వీని బుద్ధి విని; ఆ+దేవున్= ఆ కృష్ణుడిని; ఆశ్రయింపుము; అతండు= కృష్ణుడు; ఏకాగ్రచిత్తులు+ఐ= అతడియందే లగ్నమైన మనస్సు కలవారయి; ఆరాధించినవారికిన్= పూజించినవారికి; చేరువ+ అగున్= చేరువవుతాడు; కామ క్రోధ+ఉపహతులు+ఐ= కామమూ, క్రోధమూ మొదలైవాటిచే కొట్టబడినవారయి; తమ తమ

ధనంబులన్= తమ తమ సంపదలతో; తృప్తులు+కాక= తనివి చెందక; అన్యాయంబునన్= సబబుగాని పద్ధతిలో; వర్తించువారలకున్= నడిచేవారికి; దూరంబు+ఐ+ఉండున్= దూరంగా ఉంటాడు; ఎల్ల భంగులన్= అన్నివిధాలా; ఆతనిన్= ఆ కృష్ణుడిని, చొచ్చి= చేరి; బ్రదుకుము= జీవించుము; అనినన్= అనగా; ప్రసాదంబు= చిత్తం; అట్లు+అ= అట్లాగే; చేయుదున్+అని= చేస్తానని; విచిత్రవీర్య నందనుండు= ధృతరాష్ట్రుడు; సూతనందనునితోన్= సంజయుడితో; ఆ+వాసుదేవ నామ నిర్వచనంబు= ఆ 'వాసుదేవు'డనే పేరున కర్థం; నాకున్; తేటపడన్+తెలిపి= స్పష్టపరిచి; అతనిన్= ఆ వాసుదేవుడిని; పొందు+ఉపాయంబు పొందేకిటుకు; ఉపదేశింపవే= బోధించవా; అని అడిగినన్= అని అడుగగా.

తాత్పర్యం: అని గాంధారి అన్నది. అప్పుడు వ్యాసుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'కృష్ణుడంటే నీ కిష్టం. నీవు మిక్కిలి కావలసినవాడైన సంజయుడిని అతడి దగ్గరకు పంపావు. అది మంచి పని అయింది. సంజయుడూ ఆ మహాత్ముడి మహా మహిమ యాథార్థ్యం తెలిసినవాడు. ఈ సంజయుడి మాట విని ఆ కృష్ణుడిని ఆశ్రయించుము. అతడు ఏకాగ్రచిత్తతతో ఆరాధించేవాళ్ళకు చేరువవుతాడు. కామ క్రోధాదులచేత దూషితులై తమకున్నదానితో తృప్తిపడక అన్యాయమార్గంలో ప్రవర్తించేవాళ్ళకు దూరమవుతాడు. అన్నివిధాలా అతడిని చేరి బ్రదుకుము. 'అనగా- 'చిత్తం అలాగే చేస్తా' అని ధృతరాష్ట్రుడు సంజయుడితో 'ఆ వాసుదేవుడనే పేరుకు అర్థం ఏమిటో నాకు స్పష్టపరిచి, అతడిని పొందే ఉపాయం ఉపదేశించవా' అని అడుగగా.

తే. **'ఎల్లయందును దా వసియించు, టెల్ల । యదియుఁ దనయందు వసియించు టండ్రు వాసు**
దేవుఁ డనుపేరి కర్థంబు; దెల్ల మింత । యెఱుఁగు జనులందుఁ దగ వసియించు శుభము. **326**

ప్రతిపదార్థం: వాసుదేవుఁడు+ అను పేరికిన్= వాసుదేవుడు అనే పేరుకు; అర్థంబు; ఎల్లఅందును= అన్నింటను; తాన్; వసియించుట= ఉండటమూ; ఎల్ల+అదియున్= ప్రతీదీ; తన+అందున్; వసియించుట; అండ్రు= అంటారు; తెల్లము= స్పష్టం; ఇంత+ఎఱుఁగు జనులందున్= ఈ విషయం తెలిసినవాళ్ళయందు; శుభము= మేలు; తగన్= ఒప్పుగా; వసియించున్= ఉంటుంది.

తాత్పర్యం: 'వాసుదేవుడు' అనే పేరుకు అర్థం అన్నిటా తాను ఉండటమూ, ప్రతీదీ తనయందు ఉండటమూ అంటారు పెద్దలు. ఇది స్పష్టం. ఈ విషయం తెలిసినవాళ్ళకు ఒప్పుగా శుభం కలుగుతుంది.

తే. **అతనిఁ బొందు నుపాయంబు నంతరంగ । నిగ్రహమ కాఁగ నార్యు లనుగ్రహింతు;**
రోపి చిత్తవికారంబు లుడిపి, యేక । బుద్ధిఁ గొలువఁ బ్రసన్నతఁ బొందు నతఁడు. **327**

ప్రతిపదార్థం: అతనిన్= ఆ వాసుదేవుడిని; పొందు+ఉపాయంబున్= పొందే ఉపాయాన్ని; అంతరంగ నిగ్రహము+అ కాఁగన్= మనోనిగ్రహమే అని; ఆర్యులు+అనుగ్రహింతురు= పెద్దలు సెలవిస్తారు; ఓపి= ఓర్చి; చిత్తవికారంబులు+ఉడిపి= మనోవికారాలను విడిచి; ఏకబుద్ధిన్= ఏకాగ్రచిత్తంతో; కొలువన్= సేవిస్తే; అతఁడు= వాసుదేవుడు; ప్రసన్నతన్+పొందున్= ప్రసన్నుడవుతాడు.

తాత్పర్యం: మనోనిగ్రహమే ఆ వాసుదేవుడిని పొందడానికి ఉపాయం అని ఆర్యులు సెలవిస్తారు. ఓర్పు వహించి, మనోవికారాలను పోగొట్టి, ఏకాగ్రతతో సేవిస్తే వాసుదేవుడు ప్రసన్నుడవుతాడు.

వ. **నీవును బలుబుద్ధులుడిగి గోవిందు నాశ్రయింపు' మనినం బ్రజ్ఞాచక్షుం డిట్లనియె:** **328**

ప్రతిపదార్థం: నీవును; పలు బుద్దులు= పెక్కు చింతలు; ఉడిగి= మాని; గోవిందున్= కృష్ణుడిని; ఆశ్రయింపుము= శరణువేడుము; అనినన్; ప్రజ్ఞా చక్షుండు= బుద్ధియే నేత్రాలుగా కలవాడు - చర్మచక్షువులు లేనివాడు - గ్రుడ్డివాడు- ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవుకూడా పెక్కు అన్యచింతలను విడిచి కృష్ణుడిని ఆశ్రయించు' అనగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. 'నాకు నయనేంద్రియము గతి। లేకుండుట కంత వగపులే; దఖిల మనో
జ్ఞాకారుఁడైన హరి నా। లోకింపం గానమికిఁ గలుగు వగ పెపుడున్. 329

ప్రతిపదార్థం: నాకున్; నయన+ఇంద్రియము గతి= నేత్రేంద్రియ సౌకర్యం; లేక+ఉండుటకున్= లేకపోవటానికి; అంత వగపు లేదు= అంత విచారం లేదు; అఖిల మనోజ్ఞ+ఆకారుఁడు+ఐన హరిన్= అందరికంటె మనోహరమైన ఆకారంగల కృష్ణుడిని; ఆలోకింపన్+కానమికిన్= చూడలేకపోవటానికి; ఎపుడున్= ఎల్లప్పుడూ; వగపు= దుఃఖం, విచారం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'నాకు నేత్రేంద్రియ సౌకర్యం లేనందున అంత విచారం లేదు. అందరికంటె మనోహరమైన ఆకారం కల కృష్ణుడిని చూడలేకపోతున్నానే అని ఎప్పుడూ విచారిస్తాను.

ఉ. ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండువా
రే తప మాచరించిరో? యుపేంద్రుని, నాశ్రితవత్సలున్, విని
ర్ధూతకలంకు, ధర్మనిరతుం, గరుణాకరు, సర్వలోక వి
ఖ్యాతుఁ, బవిత్రమూర్తి, శరణాగతరక్షకు నాశ్రయించెదన్'. 330

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ కృష్ణుడిని; కన్నులారఁగన్= కళ్ళారా; అహర్నిశమున్= పగలూ, రాత్రీ; కనుఁగొంచున్+ఉండువారు= చూస్తూ ఉండేవాళ్ళు; ఏ తపము+ఆచరించిరొ?= ఎటువంటి తపం చేశారో?; ఆశ్రిత వత్సలున్= ఆశ్రయించినవాళ్ళపై వాత్సల్యం కలవాడూ; వినిర్ధూత కలంకున్= ఎగురగొట్టబడిన పాపాలు కలవాడూ; ధర్మనిరతున్= ధర్మంపై ఆసక్తి కలవాడూ; కరుణాకరున్= దయగలవాడూ; సర్వలోక విఖ్యాతున్= అన్ని లోకాలలోనూ ప్రసిద్ధుడూ; పవిత్రమూర్తిన్= పావనాకారుడూ; శరణ+ఆగత రక్షకున్= శరణన్నవారిని కాపాడేవాడూ; అయిన; ఉపేంద్రునిన్= కృష్ణుడిని; ఆశ్రయించెదన్= శరణు వేడుతాను.

తాత్పర్యం: ఆ కృష్ణుడిని కళ్ళారా రేయింబవళ్ళు చూస్తూ ఉండేవాళ్ళు ఎటువంటి తపం చేశారో? ఆశ్రిత వత్సలుడూ, పాపాలను ఎగురగొట్టేవాడూ, ధర్మపరుడూ, సదయుడూ, సర్వలోక ప్రసిద్ధుడూ, పావనాకారుడూ, శరణాగతరక్షకుడూ అయిన కృష్ణుడిని ఆశ్రయిస్తాను.'

వ. అని పలికి పరమశాంతుండై పారాశర్యు నుద్దేశించి 'దేవా! యేను వాసుదేవుని శరణు సొచ్చి బ్రదుకువాఁడ' ననుచుఁ గృతాంజలి యగుటయు వ్యాసమహామునియు నాశీర్వాదంబు సేసి యంతర్హితుం డయ్యెఁ; గౌరవేశ్వరుండును దుర్యోధన సంజయుల నిజ నివాసంబులకుం బోవం బనిచి, తానును గాంధారియు నభ్యంతర మందిరంబున కరిగి, యుచిత వ్యాపారంబులం బ్రవర్తిల్లుచునుండె' నని చెప్పిన విని 'పదంపడి పుట్టిన విశేషంబు లెట్టి' వని యడిగిన. 331

ప్రతిపదార్థం: అని; పలికి; పరమ శాంతుండు+ఐ= మిక్కిలి శాంతుడయి; పారాశర్యున్= వ్యాసుడిని; ఉద్దేశించి; దేవా; ఏను; వాసుదేవునిన్; శరణు+చొచ్చి; బ్రదుకువాఁడన్; అనుచున్; కృత+అంజలి= నమస్కరించినవాడు; అగుటయున్= కాగా; వ్యాస మహామునియున్; ఆశీర్వాదంబు+చేసి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; కౌరవ+ఈశ్వరుండును= కురుప్రభువునూ - ధృతరాష్ట్రుడునూ; దుర్యోధన సంజయులన్; నిజ నివాసంబులకున్= తమ ఇండ్లకు; పోవన్+పనిచి= పంపివైచి; తానును; గాంధారియున్; అభ్యంతర మందిరంబునకున్= అంతఃపురగృహానికి; అరిగి= వెళ్ళి; ఉచిత వ్యాపారంబులన్= తగిన పనులలో; ప్రవర్తించుచున్= మెలగుతూ; ఉండెన్; అని; చెప్పినన్; విని; పదంపడి= తరువాత; పుట్టిన విశేషంబులు; ఎట్టివి; అని; అడిగినన్.

తాత్పర్యం: అని పలికి మిక్కిలి శాంతం వహించి వ్యాసుడిని చూచి, 'దేవా! నేను వాసుదేవుడిని శరణుచొచ్చి బ్రదుకుతాను' అంటూ నమస్కరించగా వ్యాసమహర్షియు దీవించి అదృశ్యుడయ్యాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడినీ సంజయుడినీ వారి నివాసాలకు పంపివైచి, తాను గాంధారితో అంతఃపురగృహానికి వెళ్ళి తగిన పనులలో మెలగుతూ ఉన్నాడు' అని వైశంపాయనుడు చెప్పగా విని, జనమేజయుడు 'తరువాత పుట్టిన విశేషాలు ఏమిటి?' అని అడగగా. (తరువాత మూడో ఆశ్వాసంలోని రెండో వచనంలోని 'అనియె' అనే క్రియతో అన్వయం.)

ఆశ్వాసాంతము

శా. నిత్యానిత్యవివేక వైభవ సమున్నిద్రాంతరంగస్ఫుట
ప్రత్యక్షా! పరమేశ! విశ్వ జగదారాధ్యా! మహానంత చి
త్సత్యానంద విభు స్వభావ మహితా! సంవిత్సమాధాన దౌ
ర్గత్య వ్యాహృతి సంప్రవర్తన విదగ్ధ శ్రీ పదాంభోరుహా! 332

ప్రతిపదార్థం: నిత్య+అనిత్య= ఇది నిత్యమూ, అది అనిత్యమూ అనే; వివేక= జ్ఞానం యొక్క; వైభవ= సంపద చేత; సమున్నిద్ర= మేల్కొన్న; అంతరంగ= మనస్సులో; స్ఫుట= స్పష్టమైన; ప్రత్యక్షా!= దర్శనం కలవాడా!; పరమేశ!= ఉత్కృష్టుడవైన ఈశ్వరా!; విశ్వ జగత్+ఆరాధ్యా!= సర్వజగత్తులచేతను పూజించదగినవాడా! మహా= గొప్పదీ; అనంత= అంతం లేనిదీ అయిన; చిత్= జ్ఞానమూ; సత్య= సత్యమూ; ఆనంద= ఆనందమూ; విభు= సర్వ వ్యాపకుడై ఉండటం; అనే; స్వభావ= స్వభావం చేత; మహితా!= పూజించబడినవాడా!; సంవిత్= జ్ఞానాన్ని; సమాధాన= కలిగించటంచేత; దౌర్గత్య వ్యాహతి= పాపవినాశాన్ని; సంప్రవర్తన= కలిగించటంలో; విదగ్ధ= నేర్పుగల; శ్రీ పద+ అంభోరుహా!= పద్మాలవంటి శ్రీపాదాలు కలవాడా!

తాత్పర్యం: ఇది నిత్యమూ, అది అనిత్యమూ అనే వివేక సంపద చేత ప్రబుద్ధమైన మనస్సులో స్పష్టంగా సాక్షాత్కరించేవాడా! పరమేశ్వరా! సకల జగత్తుల చేత ఆరాధించ దగినవాడా! గొప్పదీ, అంతం లేనిదీ అయిన సచ్చిదానంద సర్వవ్యాపకత్వ స్వభావం చేత పూజించబడేవాడా! ఉత్తమ జ్ఞానాన్ని కలిగించి, పాపాన్ని పోగొట్టటంలో నేర్పుగల శ్రీపాదపద్మాలు కలవాడా! హరిహరనాథా!

విశేషం: నిత్యానిత్య ...... ప్రత్యక్షా - భగవంతుడగు హరిహరనాథుడు ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలిసిన మనస్సులు గలవారికి తప్పక ప్రత్యక్షమవుతాడు. సంవిత్సమాధాన ... శ్రీ పదాం భోరుహా-పరమేశ్వరుడి శ్రీపాదపద్మాల ధ్యానం చేత జ్ఞానం కలిగి పాపాల నుండి విముక్తులవుతారు.

క. వ్యాసాది మునిప్రోక్త మ । హా సందర్భాప్రమేయతా రూఢ గుణో
ల్లాసా! నైర్గుణ్యసము । ద్భాసి రహస్యానుభావ! భక్తాధీనా! 333

ప్రతిపదార్థం: వ్యాస+ఆది= వ్యాసుడూ మొదలైన; ముని= మహర్షులచేత; ప్ర+ఉక్త= చెప్పబడిన; మహా సందర్భ= వాఙ్మయంలోని గొప్ప ప్రకరణాలచేత కూడా; అప్రమేయతా= నిర్ణయించశక్యం కాని; ఆరూఢ= ప్రసిద్ధాలైన; గుణ= గుణముల యొక్క; ఉల్లాసా!= ప్రకాశం కలవాడా! నైర్గుణ్య= గుణరాహిత్యం చేతనే; సముద్భాసి= మిక్కిలి ప్రకాశించే; రహస్య= గూఢమైన; అనుభావ!= ప్రభావం కలవాడా! భక్త+అధీనా= భక్తులకు వశమైనవాడా!

తాత్పర్యం: శ్రీకృష్ణద్వైపాయనాది మహర్షులచేత రచించబడిన గ్రంథాల ప్రకరణాలలో కూడా నిర్ణయించ శక్యంకాని గుణముల ప్రకాశం కలవాడా! గుణరాహిత్యమునందే ప్రకాశించే గూఢమైన మహాశక్తి కలవాడా! భక్తవశంవదుడా హరిహరనాథుడా!

విశేషం: 'వ్యాసాది...గుణోల్లాసా!' వ్యాసాది మహర్షులు పరమేశ్వర ప్రతిపాదకములైన బ్రహ్మసూత్ర భగవద్గీతాది మహాగ్రంథాలను పరమేశ్వర నిరూపణకై రచించినా, ఆ గ్రంథాలు కూడా పరమేశ్వరుడి గుణప్రకాశాన్ని ప్రతిపాదించలేకపోతున్నాయి. 'నైర్గుణ్య ---- భావ' ఎటువంటి గుణాలూ లేకున్నా, జగత్సృష్టి స్థితి లయ రూపమైన మహాశక్తి అతడియందు అంతర్గతంగా ఉంటుందని భావం. 'భక్తాధీనా' పరమేశ్వరుడు వాస్తవంగా స్వతంత్రుడే అయినా, భక్తజనులకు మాత్రం అధీనుడు.

మాలిని.

నమ దనిమిషచూడా నవ్యరత్న ప్రభా సం
గమ రుచిర పదాబ్జా! గర్వ దుర్వార దైత్యో
ద్యమ బహుల తమో మార్తాండ! దోః క్రీడన ప్ర
క్రమ లలిత వికాసా! గాఢ భక్తి ప్రకాశా! 334

ప్రతిపదార్థం: నమత్= నమస్కరిస్తున్న; అనిమిష= దేవతలయొక్క; చూడా= సిగయందలి; నవ్య= క్రొత్తవియగు; రత్న= మణుల యొక్క; ప్రభా= కాంతుల యొక్క; సంగమ= కలయికచేత; రుచిర= మనోహరమైన; పద+అబ్జా!= తామరలవంటి పాదములు కలవాడా! గర్వ= అహంకారం చేత; దుర్వార= వారించశక్యంకాని; దైత్య= రాక్షసుల యొక్క; ఉద్యమ= లోకాలను బాధించే ప్రయత్నం అనే; బహుల తమస్= గాఢాంధకారానికి; మార్తాండ!= సూర్యుడైనవాడా!; దోస్+క్రీడన= దుష్ట శిక్షణం కోసమైన భుజ పరాక్రమంయొక్క; ప్రక్రమ= ప్రారంభమనే; లలిత వికాసా!= మనోహరమైన వికాసం కలవాడా!; గాఢ భక్తి ప్రకాశా!= దృఢమైన భక్తి చేతనే ప్రకాశించేవాడా! - హరిహరనాథా!

తాత్పర్యం: హరిహరనాథా! తలలొగ్గి నీకు నమస్కరించే దేవతల సిగల లోని నూత్నమణుల కాంతుల కలయికచేత మనోహరమైన అడుగుదామరలు కలవాడా!, అహంకారం చేత వారించ శక్యం కాని రాక్షసుల జగద్బాధక ప్రయత్నం అనే గాఢాంధకారానికి సూర్యుడైనవాడా; దుష్టులను శిక్షించటం కొరకు చూపే భుజపరాక్రమం అనే లీల కలవాడా! దృఢమైన భక్తి చేతనే తెలియబడేవాడా!

విశేషం: 'దైత్యోద్యమ బహుల తమో మార్తాండ' - దైత్యోద్యమమే బహుల తమస్సు. దానికి హరిహరుడే మార్తాండుడు - రూపకాలంకారం. బహుల తమస్సును మార్తాండుడు పారద్రోలే విధంగా, దైత్యోద్యమాన్ని హరిహరనాథుడు వమ్ము చేస్తాడని

భావం. మాలినీ వృత్తంలోని ప్రతి పాదంలో వరుసగా న-న-మ-య-య- అనే గణాలు వరుసగా ఉంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాస నియతం.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున నుద్యోగపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్త్ర బిరుదాంచితుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, బుధుల పూజచేత ప్రకాశించేవాడూ అగు తిక్కన సోమయాజిచే రచించబడిన శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో రెండో ఆశ్వాసం.

ఉద్యోగపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము

శ్రీవాగ్విభవారోగ్య । ప్రావీణ్యప్రాభవానుభావమహిత సౌ
ఖ్యావహ పదస్మరణ! కరు । ణావాస కటాక్షకిరణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీవాక్+విభవ= లక్ష్మీసరస్వతుల యొక్క సమృద్ధి; ఆరోగ్య= రోగం లేకుండటం; ప్రావీణ్య= నేర్పు; ప్రాభవ= ప్రభుత్వం అనే వాటియొక్క; అనుభావ= ప్రభావంచేత; మహిత= గొప్పదైన; సౌఖ్య= ఆనందాన్ని; ఆవహ= కలిగించే; పదస్మరణ= పాదములయొక్క స్మరణం కలవాడా!; కరుణా= దయకు; ఆవాస= నిలయమైన; కటాక్ష కిరణ!= కడగంటి చూపులయొక్క వెలుగు కలవాడా!; హరిహరనాథా= హరిహరనాథుడనే పేరుగల దైవమా!

తాత్పర్యం: హరిహరనాథుడనే పేరు గల పరమేశ్వరా! నీ చరణాలను స్మరించేవారికి నీవు ఐశ్వర్యం. విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ప్రభుత్వం అనే వాటిని లభింపజేసి, వాటి మహిమ చేత గొప్పదైన ఆనందాన్ని సమకూరుస్తావు. నీ పదధ్యానం అటువంటి మహిమ గలది. స్వామీ! వెలుగులు వెదచల్లే నీ క్రీగంటి చూపులు దయకు నిలయాలు.

శ్రీకృష్ణుని రాయబారము (సం. 5-70-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: 2

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! అవధరించుము. కథకుడైన వైశంపాయన మహర్షి శ్రోత అయిన జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు:

తే. సంజయుఁడు దన్ను వీడ్కొని చనిన ధర్మ । సుతుఁడు మఱునాఁడు దమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులఁ గొలువునకుఁ బిలువఁ బనిచి । యెల్లవారలు వినుచుండ నిట్టు లనియె. 3

ప్రతిపదార్థం: సంజయుఁడు= ధృతరాష్ట్రుడి దగ్గర నుండి దూతగా వచ్చిన సూతపుత్రుడైన సంజయుడు; తన్నున్= తనను (ధర్మపుత్రుడిని); వీడ్కొని= వదలి; చనినన్= (హస్తినాపురికి) వెళ్ళగా; ధర్మసుతుఁడు= యముని కుమారుడైన ధర్మరాజు; మఱునాఁడు= మరుసటిదినం; తమ్ములన్= తమ్ములను; సుతులన్= కొడుకులను; ఇష్టభృత్యవరులన్= తనకు ప్రీతిపాత్రులైన సేవకులను; కొలువునకున్= ఆస్థానానికి; పిలువన్+పనిచి= పిలుచుకొనిరండని పరిచారకులను పంపి; ఎల్లవారలు= అందరును; వినుచున్+ఉండన్= ఆలకిస్తూ ఉండగా; ఇట్టులు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: ఉపప్లావ్య పట్టణంలో ఉన్న తనను వదలి సంజయుడు హస్తినాపురికి వెళ్ళిన తరువాత ధర్మనందనుడు ఆ మరుసటిరోజు తన తమ్ముళ్ళనూ, కొడుకులనూ, సామంతరాజులనూ చెంతకు పిలిపించుకొని, వారంతా వింటుండగా ఇట్లా అన్నాడు :

విశేషం: సంజయుడి రాయబారం వలన పాండవులకు ఒరిగినదేమీ లేదు. అందువలన శ్రీకృష్ణుడి రాయబారం అవసరమైనది. దానికి శ్రీకారం చుట్టుతూ పాండవ నాయకుడైన ధర్మరాజు కాలయాపనం జరుగకుండా మరునాడే యత్నం ప్రారంభించాడు. తన స్వంత కొలువులో ఆత్మీయులనూ, సన్నిహితులనూ సమావేశపరిచాడు. అది ఒక విధంగా ఆత్మీయసభ, ఆంతరంగిక సభ, అత్యవసర సమావేశం. రాజు తనంతట తాను పిలిచిన సభ. నాటకీయంగా ఇదొక చిన్నరంగం వంటిది. సభలో సభ్యులు కూర్చున్నట్లు, వారందరూ వినేటట్లుగా ధర్మరాజు సమావేశ ప్రయోజనాన్ని వినిపించనున్నట్లు ఒక నిండైన దృశ్యం ఈ తేటగీతిలో ప్రత్యక్షమయింది. (సంపా.)

క. 'మనము జనార్దను పాలికిఁ। జని కౌరవసభకు నతనిఁ జనుమని ప్రార్థిం
చిన మేలు బంధు హిత గురు। జనములతో రణము గాక సంప్రీతి యగున్.' 4

ప్రతిపదార్థం: మనము= మన మందరమూ; జనార్దను పాలికిన్= శ్రీకృష్ణుడి వద్దకు; చని= వెళ్ళి; కౌరవ సభకున్= ధృతరాష్ట్రుడి కొలువుకూటానికి; చనుము+అని= పొమ్మని; అతనిన్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రార్థించినన్= వేడుకొన్నచో; మేలు= మంచిది; బంధు హిత గురుజనములతోన్= చుట్టాలు, మేలుకోరేవారు, గురువులు అయినట్టివారితో; రణము కాక= యుద్ధం జరగకుండ; సంప్రీతి+అగున్= సంతోషం కలుగుతుంది.

తాత్పర్యం: 'మన మంతా కలిసి మాధవుడి దగ్గరకు వెళ్ళి కౌరవసభలో మన విషయాలన్నీ చర్చించవలసినదిగా ఆయనను వేడుకొందాము. అట్లా చెయ్యటంవలన మనకెంతో మేలు కలుగుతుంది. ఎందుకంటే చుట్టాలతో, హితులతో, గురువులతో మనకు పోరు తప్పుతుంది. ఆనందం కలుగుతుంది.'

విశేషం: సభలో ముక్తసరిగా మూడు ముక్కలతో తాత్పర్యం తేటపడేటట్లు మాటలాడే ధర్మజుడి నేర్పు ఈ పద్యంలో స్పష్టం. ఇందులో రెండు వాక్యాలున్నాయి. రెండూ మిశ్ర సమ్మితంగా ఉన్నాయి. వాటిలో వాడిన పదాల వరుస కూడా కార్యక్రమ సూచకంగా ఉండటం విశేషం. 'అందరూ కలిసి జనార్దనుడి దగ్గరకు పోవాలి. ఆ తరువాత కౌరవ సభకు ఆయనను పొమ్మని ప్రార్థించాలి. అట్లా చేయటం శుభం. మనకు మేలు జరుగుతుంది. ఆ మేలు ఎటువంటిదంటే బంధువులతో, స్నేహితులతో చివరకు పెద్దలతో యుద్ధం తప్పుతుంది. సంతోషం కలుగుతుంది' అని అన్నాడు. కార్యాన్నీ, ఫలాన్నీ ఒక్కసారి దర్శించగల వాక్యం. చమత్కార మేమంటే - ఈ వాక్యాలు సున్నితమైన ఆదేశాలు, నిపుణమైన నిర్ణయాలు, తీర్చిదిద్దిన తీర్మానాలు. రాజు ఒక సంగ్రహ ప్రకటన చేయటం, దాని నందరూ ఏకగ్రీవంగా అంగీకరించటం ఈ సన్నివేశ చాతుర్యం. ధర్మజుడి సర్వామోద నాయకత్వం ఈ సన్నివేశం ధ్వనింపజేస్తున్నది.

2. శ్రీకృష్ణుడే స్వయంగా 'కురుసభకు వచ్చి శాంతివచనాలు ధృతరాష్ట్రుడితో పలుకుతా'నని సంజయుడి రాయబారపు సందర్భంగా చెప్పాడు (ఉద్యో-1-360). ధర్మరాజు దానిని వ్యవస్థీకరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ రచనలో శబ్దార్థగుణమైన ప్రసాదం పోషించబడింది. (సంపా.)

వ. అని పలికి వార లందఱు బలసి చనుదేర మాధవు మందిరంబున కరిగి యతని చేత సత్కృతుండయి సమస్త పరిజనంబులుం బరివేష్టింప నొక్క పార్శ్వంబునం బాంచాలియు సముచిత పరివార పరివృతయై యుండ నతండునుం దానును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె: 5

ప్రతిపదార్థం: అని పలికి= అలా ధర్మరాజు వచించి; వారలు+అందఱున్= సోదరులు, కుమారులు, సామంతులు, ఇష్టభృత్యులు; బలసి= చుట్టుకొని; చనుదేరన్= తన వెంట రాగా; మాధవు మందిరంబునకున్= శ్రీకృష్ణుడి భవనానికి; అరిగి= పోయి;

అతనిచేతన్= వాసుదేవుడి చేత; సత్కృతుండు+అయి= సమ్మానించబడి; సమస్త పరిజనంబులున్= పరివారమంతా; పరివేష్టింపన్= తన చుట్టూ చేరగా; ఒక్క పార్శ్వంబునన్= ఒకవైపు; పాంచాలియున్= పాంచాల దేశాధిపతి పుత్రికఅయిన ద్రౌపది; సముచిత పరివార పరివృత ఐ= తగిన పరిజనంతో చుట్టబడినదై; ఉండన్= ఉండగా; అతండునున్= ఆ శ్రీకృష్ణుడునూ; తానును= ధర్మరాజున్నూ; సుఖ+ఆసీనులు+ఐ+ఉండి= హాయిగా కూర్చుండినవారై; అతనితోన్= హరితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అట్లా పలికి ధర్మజుడు తనవారంతా వెనువెంట రాగా శ్రీకృష్ణుడున్న చోటికి వెళ్ళాడు. అక్కడ ఆయన ఆదరణలు అందుకొన్నాడు. పరివారమంతా తనను సేవిస్తుండగా, తగిన పరిజనంతో ద్రౌపది ఒక ప్రక్క నుండగా ధర్మరాజు కృష్ణుడితోపాటు హాయిగా కూర్చున్నాడు. ఆ తరువాత ఇట్లా అన్నాడు :

విశేషం: ఇందులోనిది మాధవుడి మందిరంలోని రంగం, ఆ రంగంలో పాత్రలు కూర్చున్న రంగపరికల్పనం ప్రత్యక్షం. సామూహికంగా అందరూ కలిసి మాధవుడి మందిరానికి పోయారు. క్రమశిక్షణతో మెలగారు. విశేష మేమంటే పరివారంతో పాంచాలి కూడా అక్కడికి వచ్చింది. ఆమె పరిజనంతో కూడి ఒక ప్రక్కన కూర్చున్నది. మిగిలిన వారందరూ మరొక ప్రక్కన కూర్చున్నారు. ఉభయ పార్శ్వాలకు నడుమ ఉన్నతాసనాలమీద శ్రీకృష్ణుడు, ధర్మరాజు అభ్యర్థి కాబట్టి అత డీ సంభాషణ మొదలు పెట్టాడు. అంటే మరొక రంగం ప్రారంభమైనదన్నమాట. రంగ పరికల్పన శిల్పంలో తిక్కన అందెవేసిన చేయి. (సంపా.)

క. 'ఆపదఁ గడవం బెట్టఁగ । నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు । క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా! 6

ప్రతిపదార్థం: మహాత్మా!= మహానుభావా!; ఆపదన్= కష్టాన్ని; కడవన్+పెట్టఁగన్= దాటించుటకు; ఓపి= సమర్థుడై; శుభంబు+ ఐనదానిన్= మేలు గూర్చునట్టిదానిని; ఒడఁగూర్పను= కలిగించుటకు; మాకున్= తన కుమారులమైన మాకు; ఈ పుట్టువునకున్= ఈ జన్మకు; పాండుక్ష్మాపాలుఁడు= పాండు మహారాజు; నిన్నున్+చూపి= నిన్ను దిక్కుగా మాకు కనబరచి; చనియెన్= స్వర్గం చేరాడు.

తాత్పర్యం: 'మహానుభావా! కష్టాలను తొలగించటానికీ, శుభాలను సమకూర్చటానికీ సమర్థుడవైన నిన్ను ఈ జన్మకు మాకు దిక్కుగా చూపి, మా తండ్రి పాండుమహారాజు వెళ్ళిపోయాడు.

విశేషం: అలం: హేతువు. 1.ధర్మజుడి ధర్మనీతికి కీర్తిధ్వజం వంటి ఉపన్యాసానికి ఈ పద్యం నాందీ వాక్యం వంటిది. 2. 'మహాత్మా!' అనే సంబుద్ధి ధర్మరాజు శ్రీకృష్ణుడిలో దేవుడినీ, పూజ్యుడినీ, స్నేహితుడినీ, మార్గదర్శకుడినీ దర్శిస్తున్నాడని ధ్వని. 3. 'తండ్రి తరువాత తండ్రి వంటివాడవు నీవే' అని చెప్పే భావాన్ని 'మా తండ్రి పోతూ నిన్ను చూపించి వెళ్ళాడు' అనటం తెలుగు జాతీయం. అంటే- పాండవులు తండ్రి లేని బిడ్డలనీ, వారిని తండ్రిగా రక్షించి, పోషించి దీవించవలసిన బాధ్యత ఆయనదే అనీ పలికాడు ధర్మజుడు. ఈ జన్మకు నీవే మా తండ్రివి - అనటం శరణాగత భావానికి ప్రతీక. 4. కష్టాలనుండి గట్టెక్కించేవాడూ, శుభాలు కలిగించేవాడూ భగవంతుడు. లేదా మహాత్ముడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ విధుల వంటివవి. వాటిని పాండవులకు సదా సమకూర్చే పరమాత్మ శ్రీకృష్ణుడని ధర్మజుడు భగవద్భక్తి విశేష చిత్తవృత్తిని ప్రదర్శించాడు. 5. శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుడు స్నేహభక్తి భావవశుడై పాండవుల యోగక్షేమాలు చూడటం ప్రసిద్ధం. 6. ఉద్యోగపర్వంలో పాండవులను యుద్ధమనే ఆపద నుండి గట్టెక్కించటం, రాజ్యలాభమనే శుభాన్ని కలిగించటం శ్రీకృష్ణుడి కర్తవ్యాలని ధ్వని.

తనంతట తానే హస్తినాపురానికి వెళ్ళి శాంతియత్నం చేయబూనటం - ఆపద గడవం బెట్టటం. ఫలిత మేమైనా పాండవులకు విజయాన్ని చేకూర్చి కౌరవనాశనం చేయటం శుభఫలం. ఈ రెండూ శ్రీకృష్ణుడి అంటే భగవంతుడి అధీనంలో ఉన్నాయనటం, ఆ భగవద్రూపుడైన శ్రీకృష్ణుడే తల్లి, తండ్రి, దైవం, రక్ష అని నివేదించుకొనటం ధర్మజుడి భక్తియుక్తమైన ధర్మనీతి వర్తనకు నిదర్శనం. ప్రార్థనకు శుభారంభం. ఇందులోని గుణం ప్రసాదం. (సంపా.)

తే. **సమయ మిది మిత్త్రకార్యంబు చక్కఁ జేయ। నీ కతంబున నే మవినీతుఁ డైన**
యా సుయోధను తోడి పోరాట దక్కి। యనుభవింతుము మా యంశమగు ధరిత్రి. 7

ప్రతిపదార్థం: మిత్ర కార్యంబున్= స్నేహితుల యొక్క పనిని; చక్కన్+చేయన్= సరిచేయటానికి; సమయము+ఇది= ఇది తగిన వేళ; నీ కతంబునన్= నీ మూలాన; ఏము= మేము; అవినీతుఁడు+ఐన= అవిధేయుడైనట్టి; ఆ సుయోధనుతోడి పోరాట= ఆ దుర్యోధనుడి తోడి కలహం; తక్కి= మాని; మా+అంశము+అగు ధరిత్రిన్= మా వంతు భూమిని; అనుభవింతుము= మేము అనుభవించగలం.

తాత్పర్యం: కృష్ణా! మిత్రులమైన మా పనిని చక్కబెట్టడానికి నీ కిది తగిన తరుణం. నీవు రాయబారానికి వెళ్ళితే అయోగ్యుడైన ఆ దుర్యోధనుడితో మేము యుద్ధం చేయవలసిన అవసరం రాదు. మా పాలికి వచ్చే రాజ్యాన్ని మేము అనుభవించగలం.

విశేషం: దివ్యాదివ్యుడైన శ్రీకృష్ణుడికి సూటిగా చేసిన ప్రార్థన ఇది. ఇందులో రెండంశాలు స్పష్టమవుతున్నాయి.

1. కురుపాండవుల వివాదం మిత్రకార్యంగా భావించుమని వేడికోలు. మిత్రకార్యమైతేనే మిత్రసమ్మితమైన ప్రబోధం నిర్వహించటానికి వీలవుతుంది. హితబోధకు అవకాశ మేర్పడుతుంది. ఇరువైపులా సమయ మెరిగి మందలించటానికి అనువుగా ఉంటుంది.

2. కౌరవపక్షంలో ప్రధానుడు దుర్యోధనుడు. అతడు నీతియుతుడు కాకపోగా అవినీతిపరుడు. అతడిని మిత్రవాక్యాలతో ఒక త్రోవకు తేవటం తేలికైన పనికాదు. అతడు రాజ్యపిపాసి. అందువలన యుద్ధం కాకుండా అతడు రాజ్యభాగమీయటం అసంభవం.

3. అటువంటి దుర్యోధనుడితో, అతడి తండ్రితో మంతనాలు సలిపి, హితవు చెప్పి పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగాన్ని తిరిగి ఇప్పించటానికి శ్రీకృష్ణుడు కృషి చేయాలి.

4. ఈ పద్యం 6వ పద్యానికి అనుబంధం. అది సూత్రం. ఇది ఉదాహరణం. అది శ్రీ కృష్ణుడి దక్షతను తెలిపేది. ఇది ఆ దక్షత వలన సాధించదగిన అసాధ్యకార్యాన్ని నిర్దేశించేది.

5. ఇందులో ధర్మరాజు శాంతియుతంగా తనకు రావలసిన నేల వాటాను మాత్రమే కోరుతున్నాడు. దానికి దుర్యోధను డంగీకరించడు. సగమిస్తే పూర్తిగా జయించగల పరాక్రమం పాండవులకున్నదని అతడికి తెలుసు. ధర్మజుడు భాగం అడుగుతున్నాడు. కాదంటే మొత్తం రాజ్యాన్నే ఆక్రమిస్తాడు. భావి వ్యూహమంతా 'పోరాట దక్కి యనుభవింతుము మా యంశమగు ధరిత్రి' అనే వాక్యంలో బీజప్రాయంగా నిక్షిప్తం చేయబడి ఉన్నది.

6. కాబట్టి ఈ పద్యం భావి యుద్ధోద్యోగ బీజతుల్యం. గుణం ప్రసాదం (సంపా.)

వ. **నీకు మేము ప్రద్యుమ్నాది కుమారుల తోడివారము, మమ్ము దురితంబులు వొరయకుండ నరసి రక్షింపు' మనవుడు వాసుదేవుండు 'నీ పంచిన యట్ల చేయంగలవాఁడ; నెయ్యది తలంపు? సెప్పు' మనిన**

నజాతశత్రుండు 'నీవు కరినగరంబున కరిగి కౌరవులతోడం దగిన మాటలాడి తెఱంగు సేయవలయు' నని ప్రార్థించి, యతని నియ్యకొలిపి యిట్లనియె: 8

ప్రతిపదార్థం: నీకున్= నీకు; మేము= పాండవులం; ప్రద్యుమ్న+ఆది కుమారులతోడివారము= ప్రద్యుమ్నుడు మొదలైన నీ పుత్రులతో సమానులం; మమ్మున్= మమ్ములను; దురితంబులు= పాపములు; పొరయక+ఉండన్= చెందకుండేటట్లుగా; అరసి= విచారించి; రక్షింపుము= కాపాడుము; అనవుడున్= అని ధర్మరాజు వేడిన మీదట; వాసుదేవుండు= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు; నీ పంచిన+అట్లు+అ= నీవెట్లా చేయుమని చెపుతావో ఆ విధంగా; చేయన్+కలవాఁడన్= చేయగలను; ఏ+అది+తలంపు+చెప్పుము= నీ ఉద్దేశ మేమిటో నాకు తెల్పుము; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; అజాతశత్రుండు= విరోధులే లేని ధర్మరాజు; నీవు కరినగరంబునకున్+అరిగి= నీవు హస్తినాపురికి వెళ్ళి; కౌరవులతోడన్= ధృతరాష్ట్రుడు మొదలైనవారితో; తగిన మాటలు+ఆడి= ఉచితములైన పలుకులు పల్కి; తెఱంగు+చేయవలయున్= ఒక దారి నేర్పరచాలి; అని ప్రార్థించి= అని వేడుకొని; అతనిన్= శ్రీకృష్ణుడిని; ఇయ్యకొలిపి= సమ్మతింపజేసి; ఇట్లు+అనియెన్= మళ్ళీ ఈ ప్రకారం పలికాడు.

తాత్పర్యం: కృష్ణా! ప్రద్యుమ్నుడు మొదలైన నీ కుమారులు నీకు ఎట్లాంటివాళ్ళో మేము కూడా అట్లాంటి వాళ్ళమే. మాకు పాపాలు సోకకుండేటట్లు ఆలోచించి మమ్మల్ని కాపాడుము' అంటూ ధర్మనందనుడు ప్రార్థించాడు. అంతట శ్రీకృష్ణుడు 'నీవు ఏమి చేయుమని ఆదేశిస్తావో అట్లా చేస్తాను. నీ అభిప్రాయ మేమిటో చెప్పు' మన్నాడు. అప్పుడు ధర్మజుడు కృష్ణుడితో 'నీవు హస్తినాపురికి పోయి కౌరవులతో తగుమాటలాడి ఒకదారి నేర్పరచాలి' అని అర్థించి, అందు కాయనను అంగీకరింపజేసి మళ్ళీ ఇట్లా పలికాడు :

విశేషం: 1. రక్షించుమని ధర్మరాజు శ్రీకృష్ణుడిని - దేవుడిని ప్రార్థించినట్లు ప్రార్థిస్తున్నాడు. ఆ రక్షా విధానం పితాసుత సంబంధ బంధురమై ఉండాలని తమను ప్రద్యుమ్నాదులతో పోల్చుకొన్నాడు. అంటే శ్రీకృష్ణుడిని పాండవుల కపికిశోర న్యాయంతో రక్షించుమని వేడుతున్నారని భావం. పాండవ యత్నం లేకుండా భగవంతుడైన శ్రీకృష్ణుడి యత్నమే కార్యంగా సాగాలని వేడుకొన్నాడు. అంటే, పాండవుల భారమంతా శ్రీకృష్ణుడిపై ఉంచారన్నమాట.

2. పాండవులకు పాపాలు సోకకుండా కార్యం నిర్వహించుమని మరొక వేడికోలు. ఇది ధర్మజుడి ధర్మనీతి వర్తనాన్నీ, భగవంతుడికి ప్రీతిపాత్రమైన ప్రవృత్తినీ వ్యంజింపజేస్తున్నది. ఉద్యోగంలో రాజనీతి ప్రవర్తిల్లినా, అది ధర్మహాని కలిగించి పాండవులకు అపకీర్తిని, పాపఫలితాన్ని కలిగించకూడదు. అర్థం కంటె ధర్మమే ధర్మరాజుకు ప్రీతి. అది దేవుడు మెచ్చే గుణం.

3. ధర్మరాజు ప్రార్థిస్తున్నాడు. శ్రీకృష్ణుడు 'నీ ఆదేశాన్ని అక్షరాలా పాటిస్తా'నని అంటున్నాడు. ఇక్కడ ఒక రాజనీతి ధర్మసూత్రం ఉన్నది. శ్రీకృష్ణుడు తానే హస్తినాపురానికి పోవాలని నిశ్చయించాడు. దానికి ధర్మజుడి అనుమతిని కోరలేదు. అయితే ధర్మజుడు ఆ ప్రతిపాదనను నిండుసభలోనే సమ్మతించాడు. కాగా, శ్రీకృష్ణుడు కురుసభలో స్వతంత్ర ప్రతిపత్తితో మాట్లాడతాడు. అందువలన ఆ మాటలాడేటప్పుడు ఏ పక్షానికీ అతడు ప్రాతినిధ్యం వహించక ధర్మదేవతలవలె పలుకవచ్చును. కాబట్టి, ముందుగానే తన వాదాన్ని శ్రీకృష్ణుడి ముందు నివేదించుకొనటానికి ధర్మరాజు పూనుకొన్నాడు. శ్రీకృష్ణుడు మనసు విప్పి, ధర్మరాజు ఏది ఆజ్ఞాపిస్తే దానినే చేస్తానని చెప్పి, తాను పాండవపక్షానే హస్తినకు వెళ్ళుతున్నట్లు ప్రకటించాడు. దానితో ప్రభువు ధర్మరాజనీ అతడి పంపున వెళ్ళుతున్న రాయబారి శ్రీకృష్ణుడనీ భావించే అవకాశం కలిగింది. దానిని ధర్మరాజు చక్కగా వినియోగించుకొని 'నీవు హస్తినాపురానికి పోయి కౌరవులతో తగు మాటలాడి న్యాయం చేయు'మని కోరాడు. అంటే-

మొదట శ్రీకృష్ణుడు స్వీయ సంకల్పంతో పోదలచాడు. ఇప్పుడు పాండవ ప్రార్థనకు అనువుగా పోవనిశ్చయించాడు. శ్రీకృష్ణుడు ఎంత స్వతంత్రుడో, అంతటి భక్తపరతంత్రుడని రాజనీతిపరంగా కూడా ప్రదర్శించటం ఈ సన్నివేశ విశేషం. (సంపా.)

సీ. 'మా తండ్రి తలఁపును నాతని నందను । చందంబు నిన్న నా సంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁగదా నీకు; । వారి చిత్తము భంగి వాఁ డెఱుంగుఁ;
బాలు పంపనియీక మేలిమాటలన మ । మ్మలుక దీర్చెదరు తా; రధిక దుష్క
రంబైన యాసమయం బేము పదుమూఁడు । వత్సరంబులు సల్పి వచ్చియుండఁ

ఆ. గులము పాడి నడపఁ దలఁపడ; పతి సెడఁ । దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్పలేఁ; । డింతకంటెఁ గలదె యెడరు మాకు? 9

ప్రతిపదార్థం: మా తండ్రి తలఁపును= మా నాయనగారైన ధృతరాష్ట్రుడి ఉద్దేశం; ఆతని నందను చందంబున్= ఆయన కొడుకైన దుర్యోధనుడి తీరూ; నిన్న= నిన్నటి దినం; ఆ సంజయుండు పలికిన పలుకులన్= దూతగా వచ్చిన సంజయుడు మాటలాడిన మాటల వలన; నీకున్= నీకు; తెలిసెన్+కదా!= తెలిసింది కదా!; వారి చిత్తము భంగిన్= ఆ కౌరవుల మనోవైఖరి; వాఁడు+ఎఱుంగున్= ఆ సంజయుడికి తెలుసు; పాలుపంపు+అని+ఈక= మీ భాగమునకు వచ్చిన భూమి ఇంతని ఇయ్యక; మేలి మాటలన్+అ= తియ్యని పలుకులతోనే; తారు= ఆ కౌరవులు; మమ్ము+అలుక+తీర్చెదరు= మేము అలుగకుండ బుజ్జగిస్తారు; అధిక దుష్కరంబు+ఐన= చేయుట కేమాత్రం శక్యం కాని; ఆ సమయంబున్= ఆ ప్రతిజ్ఞను; ఏము= మేము; పదుమూఁడు వత్సరంబులు సల్పి= పన్నెండేళ్ళరణ్యావాసం; ఒకయే డజ్ఞాతవాసం చేసి; వచ్చియుండన్= రాగా; పతి= ధృతరాష్ట్రుడు; కులము పాడి నడపన్= వంశధర్మం సాగించుటకు; తలపఁడు+అ= అనుకొనకున్నాడు; చెడన్+తలఁచెనేనిన్= చెడిపోదలచుకుంటే; కొడుకున్ వలచినట్టివాఁడు= దుర్యోధనుడిమీద దురభిమానం చూపువాడవుతున్నాడు; కానన్= కాబట్టి; అతని వక్రతన్+మాన్పన్+ లేఁడు= కొడుకు కుటిలబుద్ధిని తొలగించలేకున్నాడు; ఇంతకంటెన్= ఈ విషమ స్థితికంటె; మాకున్= అన్నదమ్ములమైన మాకు; ఎడరు= ఆపద; కలదె?= మరొకటున్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: 'నిన్న సంజయుడు మాట్లాడిన మాటల వలన మా తండ్రి ధృతరాష్ట్రుడి ఉద్దేశ మేమిటో, అతడి కుమారుడైన దుర్యోధనుడి తీరు ఎటువంటిదో నీకు తెలిసింది కదా! ఆ తండ్రి కొడుకుల చిత్తవృత్తులు ఎట్లాంటివో సంజయుడికి తెలుసు. మా రాజ్యభాగం మాకియ్యకుండా, మాకు కోపం రాకుండా, కల్లబొల్లి మాటలతో బుజ్జగిస్తున్నారు. చెప్పిన ప్రకారం మేము ఏమాత్రం చేయశక్యంకాని అరణ్యాజ్ఞాతవాసాలు పదమూడేళ్ళు చేసి వచ్చిఉండగా ధృతరాష్ట్రుడు వంశధర్మం పాటించకున్నాడు. చెడదలచియే అతడు కొడుకు దారి ననుసరిస్తున్నాడు. అతడికి కొడుకుపట్ల వల్లమాలిన దురభిమానం కాబట్టి, సుయోధనుడి కుటిలత్వం మాన్పలేకున్నాడు. ఇంతకంటె మాకు విపత్తు మరేముంటుంది?

విశేషం: 1. ధర్మజుడు మహావక్త. విషయ స్వభావాన్ని బట్టి దానిని ఆతడు ప్రపంచించే తీరు మారుతూ ఉంటుంది. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి పరిష్కరించవలసిన సమస్యలోని ప్రధానాంశాన్ని మొదట సవిస్తరంగా, సమర్థవంతంగా ప్రతిపాదించా డీ పద్యంలో. 'ఇంతకంటెఁ గలదె యెడరు మాకు?' అన్నది ప్రధానాంశంలోని ప్రాణం. 'ఆపదఁ గడవం బెట్టగ నోపెడి' శ్రీకృష్ణుడికి తన కేర్పడిన ఆపద (ఎడరు)ను పేర్కొన్నాడు.

2. సంజయుడి రాయబారం వలన దుర్యోధన ధృతరాష్ట్రుల మనోగతం తెల్లమైపోయింది. రాజ్యభాగమీయకుండా మాయమాటలతో పాండవుల కోపం చల్లార్చే సాంత్వన వచనాలు పలుకుతున్నారు. పాండవులు దుష్కరమైన అరణ్యాజ్ఞాతవాసాలు నియమంతో

గడపినా వంశ మర్యాదను పాటించి కౌరవులు రాజ్యభాగమిచ్చే ఆలోచన చేయరు. దుర్యోధనుడు దుర్మార్గుడై నాశనం కావటానికి సిద్ధమైనా, అది తెలిసిన ధృతరాష్ట్రుడు తన కొడుకు వక్రబుద్ధిని మాన్పలేదు. కొడుకును కాదనలేని ధృతరాష్ట్రుడి చిత్తవృత్తియే పాండవులకు అడ్డువచ్చిన పెద్ద సమస్య. దీనిని తీర్చి కార్యాన్ని శాంతంగా సాధించుకొనటమే శ్రీకృష్ణుడి ముందున్న సమస్య - అని ధర్మరాజు పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు చెప్పాడు.

3. 'పాలుపంపని యీక.....తారు' - అనేది సంజయుడి రాయబారపు సారాంశం. దీనికి మూలం. "అప్రదానేన రాజ్యస్య శాంతి మస్మాసు మారతి'' (సం. 5-70-80) యుద్ధోన్ముఖులు కాకుండా శాంతి పరచటానికే. (సంపా.)

క. జననియు సమస్త బాంధవ । జనములుఁ బ్రియమంద, వారి శాంతులఁగాఁ జే
యను, నెమ్మిగ నొక్కటియై । మననుం దెఱఁగేది యునికి మా పౌరుషమే? 10

ప్రతిపదార్థం: జననియున్= మా తల్లిఅయిన కుంతీదేవి; సమస్త బాంధవ జనములున్= చుట్టాలందరున్నూ; ప్రియము+అందన్= సంతోషం చెందగా; వారిన్= దుర్యోధనాదులను; శాంతులన్+కాన్+చేయను; నెమ్మిగన్= కూర్మితో; ఒక్కటి+ఐ+మననున్= కౌరవులున్నూ మేమూ కలసి మెలసి జీవించటానికీ; తెఱఁగు+ఏది+ఉనికి= దారి దోచక ఇట్లా పడిఉండటం; మా పౌరుషమే?= మాకు మగతనం అవుతుందా?

తాత్పర్యం: మా తల్లీ, చుట్టపక్కాలూ హర్షించేటట్లూ, దుర్యోధనాదులందరూ యుద్ధంమాట ఎత్తకుండా శాంతించేటట్లూ, కౌరవులూ మేమూ కలసి మెలసి ఒద్దికగా జీవించేటట్లూ మార్గం తెలియక ఇట్లా బ్రతకటం మాకు మగతనం కాదు.

విశేషం: ఎడరు తీరటంవలన రెండు ఫలితాంశాలు కలగాలని ధర్మరాజు స్పష్టం చేస్తున్నాడు.

1. ప్రస్తుతం ఉన్న స్థితి ఇట్లాగే కొనసాగటానికి వీలులేదు. అట్లా కొనసాగటం పాండవ పౌరుషానికే తలవంపులు. కాబట్టి పరిష్కారం త్వరగా జరగాలి.

2. అయితే ఆ పరిష్కారం తల్లికీ బంధువులకూ సంతోషంతోపాటు ఊరట కలిగించేదిగా ఉండాలి. కౌరవ పాండవులు కలిసి కలకాలం జీవించేటట్లుండాలి. (సంపా.)

క. ఇచ్చటి బంధులు నీవును । నచ్చెరువడి వినుచునుండ నయిదూళ్ళును మా
కిచ్చినను జాలు నంటిని । బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ! 11

ప్రతిపదార్థం: ఇచ్చటి బంధులు= ఇక్కడనున్న చుట్టాలూ; నీవును= నీవూ; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; వినుచున్+ఉండన్= వింటూండగా; మాకున్= అన్నదమ్ములమైన మాకు; అయిదు+ఊళ్ళును= ఐదు గ్రామాలను; ఇచ్చినను= ఇచ్చినప్పటికీ; చాలున్+అంటిని= సరిపోతుందని సంజయుడితో అన్నాను; పొచ్చెము+కాదు= తక్కువ కాదు; ఇంతవట్టు= నేనాడిన ఈమాత్రపు మాట; పూర్ణము సుమ్మీ!= చాలు సుమా!

తాత్పర్యం: కృష్ణా! ఇక్కడున్న చుట్టాలూ, నీవు విస్మయంతో వింటుండగా- 'సక్రమంగా మాకు అర్ధరాజ్యం పంచియివ్వటానికి మా తండ్రికి మనసొప్పకపోతే ఇంద్రప్రస్థం, కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం చాలు. అందుకూ అతడిష్టపడకపోతే ఎక్కడైనా మేము తలదాచుకొనటానికి ఐదూళ్ళిచ్చినా చాలు' నని సంజయుడితో ఇంతవరకూ నే చెప్పిన మాటలలో కపటం లేదు. అంతా యథార్థం సుమా!

విశేషం: 1. ఆ ఫలితాంశాల సాధనలో ధర్మజుడు ఇంతకు పూర్వమే ఒకదారి చూపించాడు. అర్ధరాజ్యం బదులు అయిదూళ్ళు ఇస్తే చాలునని నిండుమనసుతో ఉన్నాడు. నిజానికి అది దానోపాయ ప్రయోగ నైపుణ్యం. దానివలన బంధువులతో పాటు కృష్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు. అంతటి ఔదార్యం కూడా దుర్యోధన ధృతరాష్ట్రుల ప్రవర్తన వలన బూడిదలో పోసిన పన్నీరై పోయింది - అని ధర్మరాజు మనవి చేశాడు. అంతకంటె మంచి ఉపాయం మరేదైనా ఉంటుందా? అని ఆలోచించాలని సమస్యలోని మరొక ముడి విప్పి చెప్పాడు. 2. ధర్మరాజడిగిన అయిదూళ్ళ పేర్లు మూలంలో ఇట్లా ఉన్నాయి. అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం మరింకేదైనా ఒక ఊరు. తెలుగులో అవిస్థలం, మాకంది పట్టణాలకు బదులు కుశస్థలం, వాసంతి పేర్కొనబడ్డాయి. (చూడు. ఉద్యో. 1.377). (సంపా.)

శా. **ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయంజాలఁడో కాని, పెం**
పేదం గ్రూరత కోర్వరాదు; సిరి నా కేలందునే, గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకుం; గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీ నొందినన్. **12**

ప్రతిపదార్థం: ఆ దుర్యోధనుఁడు= ఆ సుయోధనుడు; అంతమాత్రయును+చేయన్+చాలఁడో కాని= కడకు నేను కోరిన ఐదూళ్ళైనా ఇస్తాడో ఇవ్వడో తెలియదు గాని; పెంపు+ఏదన్= గౌరవం నశించేటట్లు; క్రూరతకున్+ఓర్వన్ రాదు= క్రూరకర్మలు కావించటానికి సహించలేను; సిరి= రాజ్యసంపద; నాకున్+ఏల+అందునేన్= నా కెందు కని తలంచితినేని; నా+అరయు= నేను చూచే; ఈ చుట్టాలకున్= ఈ బంధు జనాలకు; గ్రాసవాసస్(ః)+దైన్యంబులు వచ్చున్= తిండికీ, బట్టకూ కరువేర్పడుతుంది; కావునన్= అందుచేత; కౌరవులున్= ధార్తరాష్ట్రులూ; ఏమున్= మేమూ; పొంది= కూడి; శ్రీన్+ఒందినన్= సంపద పొందితే; మోదంబు+అందుట+కల్గున్= సంతోషం పొందటం జరుగుతుంది.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు కడకు నే నడిగిన ఐదూళ్ళయినా ఇస్తాడో ఇవ్వడో తెలియదు. కాని, గౌరవం చెడేటట్లు క్రూర కార్యాచరణానికి నా మనసు ఒప్పుకోదు. పోనీ, రాజ్యసంపద నా కెందు కని వారిని అడగటం మానితే, నన్నాశ్రయించుకొనిఉన్న నా బంధుజనులకు కూటికీ, గుడ్డకూ దైన్యం ఏర్పడుతుంది. కనుక కౌరవులూ, మేమూ ఒద్దికగా ఉండి రాజ్యసంపద పంచుకొంటే ఉభయులకూ సంతోషం సమకూరుతుంది.

విశేషం: 1. ధర్మజుడు ఈ పద్యంలోని వాక్యాలను భావోద్వేగంతో పలికినట్లు తిక్కన రచించాడు. ఇందులో నాలుగు వాక్యాలున్నాయి. అవి భిన్న భావావస్థలను వ్యక్తం చేసేవి. 'దుర్యోధను డీమాత్రం కూడా చేయలేడా?' అన్నది ఆవేశంతో, ఆవేదనతో గొంతెత్తి పలికే రోషవాక్యం. ఆ వాక్యం తరువాత కొంత విరామం అభినయంగా స్ఫురిస్తుంది. ఉదాత్త స్థాయిలో పలికిన ఆ వాక్యం నుండి తన గొంతును మంద్రస్థితికి తెచ్చుకొనటానికి 'కాని' అనే పదం తోడ్పడింది. ఈ వాక్యానికీ తరువాతి వాక్యానికీ ఉన్న అంతరం తెలియచెప్పింది. 'పెంపేదం గ్రూరత కోర్వరాదు' అనే వాక్యంలో ధర్మజుడి అభిమానం ద్యోతకమైనది. అప్పటి తన దీనస్థితిని స్ఫురింపచేసింది. దీనికి రెండు మూడు రకాల అర్థాలు చెప్పవచ్చును. (1) దుర్యోధనుడి పరంగా-అయినా, ఆ విధంగా ఔన్నత్యాన్ని వీడి క్రూరత్వాన్ని చేపట్టటం సహించరాదు- అని చెప్పవచ్చును. (2) ధర్మరాజుపరంగా- అతడు ఐదూళ్ళు కూడా ఇవ్వలేదని నా గౌరవాన్ని దిగజార్చుకొని నన్ను నేను క్రూరంగా కించపరచుకొనటం సహించరాని స్థితి. (3) దుర్యోధనుడు అయిదూళ్ళు ఇవ్వలేదనే నెపంతో గౌరవం చెడేటట్లు క్రూరకార్యానికి పూనుకొనటానికి నా మనసు ఒప్పుకోదు. సందర్భశుద్ధి గలిగిన మూడంచుల అర్థాలతో ముచ్చట కొలిపే ఈ వాక్యం ఒక్కటే మంద్రస్థాయిలో అనే వాక్యం. ఆ తరువాత కొంత విరామం ఉంటుంది. 'సిరి నాకేలందునే?' - ఈ వాక్యం సంజయుడి రాయబారంలోని తాత్పర్యాన్ని

మనసులో తలచుకొని గూఢమైన బాధతో, దెబ్బతిన్న ఆత్మాభిమానంతో, ఆలోచిస్తూ, గంభీరంగా అనే వాక్యం. ధృతరాష్ట్రుడు 'పాండవులకు రాజ్యం వద్దు, యుద్ధం కూడదు, ప్రశాంతంగా బ్రాహ్మణుల వలె జీవించటం ఉచిత'మని సంజయుడి ద్వారా సూచించాడు. ఆ ఆదేశాన్ని అనుసరించి ధర్మరాజు తనకు సంపద ఎందుకులే? అని అనుకొన్నా- అది పొసగని పని అని భావం. దీనిని మరొక విధంగా అన్వయించవచ్చును. 'ఒకవేళ దుర్యోధనుడు ఐదూళ్ళు కూడా ఇవ్వకపోతే ధర్మరాజుకు సిరి సంపదలకు ఆలవాలమైన రాజ్యం అసలు ఉండదు. అయినా, ధర్మరాజు సిరిని కోరకుండా వైరాగ్య జీవితం గడపటానికి అతడు విపుల సంసారి. అందువలన అది సాధ్యం కాదు. మరి సిరి ఎందుకు? అంటే.. 'నా అరయు చుట్టాలకు - గ్రాసవాసోదైన్యం వస్తుం'దని ధర్మజుడి సమాధానం. ఇది తన స్థితిని చెప్పుకొనటమే కాక కౌరవులను వ్యంగ్యంగా ఎత్తిపొడవటం కూడా, నూరుగురు కొడుకులు, బంధువులు ఉన్న పెద్ద సంసారం ధృతరాష్ట్రుడిది. వారి కొరకే అత డీ రాజ్యాన్ని హరించింది. వారి పోషణ వారి కెంత ముఖ్యమో తనవారి పోషణ తనకంత ముఖ్యమని ధర్మజుడి ఎత్తిపొడుపు. అంతేకాదు. తనది కూడా క్షత్ర గార్హస్థ్య జీవితమనీ, బ్రాహ్మణ సన్న్యాస జీవితం కాదనీ హెచ్చరిక! ఈ వాక్యం ధర్మరాజు నిక్కచ్చిగా, నిష్ఠురంగా, నిండుగా, గండుగా అన్నాడు. ఈ మూడు వాక్యాలే ధర్మజుడి వాదనలో మూడు బలమైన అంశాలు. వాటి ఫలితాలు శ్రోత ఊహించాలని గ్రహించాలి. అంటే, అయిదూళ్ళయినా ఇవ్వని క్రూరత్వం ఏర్పడితే, మా అయిదుగురి బంధువులనూ పోషింప దగినంత రాజ్యాన్ని మేము గ్రహించక తప్పదు. అప్పుడు యుద్ధం తప్పదు. 'కౌరవ నాశనం తప్పదు. ఇవన్నీ ఊహించగలిగితే ధర్మరాజు 'కావునన్' అనటంలో ఉన్న గడుసుదనం గోచరిస్తుంది. 'కౌరవ పాండవులు కలిసి రాజ్యసంపదను పంచుకొంటే ఉభయులూ సంతోషాన్ని పొందే స్థితి ఏర్పడుతుంది' అని ధర్మజుడు తేల్చి చెప్పాడు.

2. తిక్కన ధర్మరాజు యొక్క ఉపన్యాస శిల్పంలో కొన్ని శైలీ స్వభావాలను రచనలో ప్రవేశపెట్టాడు. అవి (1) ఒక పద్యాన్ని ఒక విధమైన భావావస్థకు ఆలోచనాత్మకమైన అభివ్యక్తిగా మలచటం. ఈ వాక్యంలో ధర్మరాజు ఉభయులూ సంపద పంచుకొనటం ఉచితం అనే తాత్పర్యాన్ని చెప్పటానికి కావలసిన మానసికావస్థను ప్రకటించాడు. (2) పద్యాన్ని వాక్యమండలిగా రూపొందించటం. (3) వాక్యానికీ వాక్యానికీ మధ్య కొంత విరామం ఉన్నట్లు, అభినయం సాగుతున్నట్లు, ఒక భావం నుండి మరొక భావానికి మరలుతున్నట్లు స్ఫూర్తిని కలిగించటం. వాక్యాలను పలకటంలో ఉండే ఉదాత్తానుదాత్తస్థితులను ధ్వనింప జేయటం. (4) వాచికాభినయ ద్యోతకమైన నాటకీయ పద్య రచనను సంతరించటం. (5) వాదాంశాలను క్రమంగా ఆవిష్కరించి పద్యం చివర ప్రతిపాద్యాంశ ఫలితాంశాన్ని ప్రకటించటం. ఈ లక్షణాలన్నీ ఒక మహావక్త, రాజనీతివేత్త మాట్లాడే ఉపన్యాసంలో గోచరించే అంశాలు.

3. తిక్కన రచించిన మంచి పద్యాలలో ఇది ఒకటి. ధర్మజోపన్యాసంలో తిక్కన వివిధ అర్థగుణాలను సార్థకంగా వాడాడు. ఇందులో అజరరత్వం, అపారుష్యం అనే లక్షణాలు గల సౌకుమార్యం సంతరించబడింది. (సంపా.)

ఉ. అక్కట! లాఁతులైనఁ బగతైనను జంపన కోర నేల? యొం
డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు; గణుతింపక సంపదకై వధించి దూ
ఱెక్కుట దోషమందు టను నీ దురవస్థల కోర్వవచ్చునే?' 13

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లాఁతులు+ఐనన్= పరాయివారైనా; పగఱు+ఐనను= శత్రువులే అయినా; చంపన్+అ+కోరన్+ఏల= చంపాలనే ఎందుకు కోరాలి?; ఒండు+ఒక్క+తెఱంగు లేదె?= యుద్ధం కంటె మరొకమార్గం లేదా?; అది+ఒప్పదె?= ఆ మార్గం తగింది కాదా?; ఆ దిక్కునన్= ఆ కౌరవుల పక్షంలో; బంధు సుహృద్ జనంబులు= చుట్టాలు, మిత్రులు; ఉన్నవారు= ఉన్నారు; గణుతింపక= ఆ వైపున ఉన్న మా బంధుమిత్ర వర్గాన్ని లెక్కించక; సంపదకై= సిరికై; వధించి= (వారిని) చంపి; దూఱు+ఎక్కుట= నిందలపాలవటం; దోషము+అందుట= పాపం మూటగట్టుకొనటం; అను= అనునట్టి; ఈ దుర్+అవస్థలకున్= ఈ దుర్దశలకు; ఓర్వన్+వచ్చునే?= సహింప శక్యమగునా? (కాదని భావం.)

తాత్పర్యం: అయ్యో! వారు ఇతరులే అగుదురుగాక! విరోధులే అగుదురుగాక! వారిని చంపవలెననే ఎందుకు కోరాలి? పోరాటంకంటే మరో మంచిదారి లేదా? ఆ మార్గం మంచిది కాదా? కౌరవుల పక్షంలో మా చుట్టాలు, మిత్రులు ఉన్నారు. వారిని లెక్కించక రాజ్యసంపదకై సంహరిస్తే నిందలపాలుగాక తప్పదు. పాపాలు మూటగట్టుకొనక తప్పదు. ఇట్లా ఇహపరాలు రెంటికీ దూరం చేసే దుర్దశను నేను భరించలేను.

విశేషం: 1. రారాజు రాజ్యభాగ మీయడు కాబట్టి యుద్ధం చేసి రాజ్యాభాగం పొందటమే కర్తవ్యం- అని భావించే వారి తలపులను మనస్సులో ఉంచుకొని ధర్మరాజు యుద్ధం కంటే వేరే మరొక మార్గాన్ని అన్వేషించవలసిన అవసరాన్ని ఈ పద్యంలో నొక్కి చెపుతున్నాడు. పైపద్యంలో రాజ్యభాగం యొక్క అవసరాన్ని చెప్పి, దానిని సాధించే మార్గాన్ని గురించి తన ఆలోచనా విధానాన్ని ఈ పద్యంలో ఆవిష్కరించాడు.

2. ఈ పద్యం 'అక్కట!' అనే మాటతో మొదలవుతున్నది. అది విచారాన్నీ, ఆశ్చర్యాన్నీ తెలిపే వాచికాభినయ వాచకం! ఆమాట అనే ముందు ధర్మజుడి భావనలో యుద్ధమే కర్తవ్యమనే యోచన మెదలిన సంగతి ధ్వని. ఇట్లా అభినయాంశాలతో, అభినయ వాచకాలతో మనోగత భావాలను ధ్వనింప చేయటం నాటకీయ శిల్పంలో రసధ్వని.

3. చంపవలసి వస్తే లోకంలో పరాయివారినీ, శత్రువులనూ ఎన్నుకొనటం సహజం. వారితో స్నేహ సంబంధాలుగాని, రక్త సంబంధాలుగాని, భావజాల సంబంధాలు కాని ఉండవు కాబట్టి. అయినా వారిని కూడా రాజ్యం కొరకు చంపాలనుకొనటం అహింసాధర్మం కాదు. మానవ మూల్యమైన దయాధర్మం కూడా కాదు. అది యుద్ధనీతి ఔతుందేమో కాని, ధర్మనీతి కాదు. ఆ అంశాన్ని ఈ వాక్యంలో ధర్మజుడు చెప్పాడు. ఇది సాధారణ శాంతిసూక్తం.

4. 'ఒండొక్క తెఱంగు లేదె?' ఇది ఆలోచనాముద్రతో వేస్తున్న ప్రశ్న. ఎదుటివారిని 'ఆలోచించండి' అని అడుగుతున్న నాట్యముద్ర. దీని వెనుక రాజనీతి కూడా ఉన్నది. చతుర్విధోపాయాలలో చివరిది. సామ, దాన, భేదోపాయాలు విఫలమైపోయిన తరువాత దండోపాయాన్ని తప్పనిసరి పరిస్థితులలో ప్రయోగించాలి కాని, ముందుగానే తొందరపడి యుద్ధం చేయరాదు. అయితే, యుద్ధానికి ప్రత్యామ్నాయమైన ఉపాయం ప్రప్రథమ కర్తవ్యం. దానిని ధర్మజుడు సూచిస్తున్నాడు.

5. 'అది యొప్పదె?' - అట్లా చెయ్యటం న్యాయం కాదా? అని ప్రశ్నిస్తున్నాడు. ధర్మజుడి దృక్పథంలో అదే న్యాయం. సభ్యులు కూడా తన అభిప్రాయంతో అంగీకరించేటట్లు చేసే నేర్పుతో కూడిన ప్రశ్న. ఈ ప్రశ్న వేసి ధర్మరాజు కొంత విరామం పాటించి ఉంటాడు. ఆయన నిజానికి ఏ పరాయివారినో, శత్రువులనో ఉద్దేశించి మాట్లాడటం లేదు. హస్తినాపురంలో ఉన్న బంధు మిత్రులను గురించే భావిస్తున్నాడు. ఆ ఆలోచన నుండి తరువాతి వాక్యం వెలువడింది.

6. 'బంధు సుహృజ్జనంబు లా దిక్కున నున్నవారు'. ఇది పాండవు లను కొనవలసిన మాట. కౌరవు లెట్లాగూ పాండవులు బంధువులని భావించటం లేదు. ధర్మరాజు దయామూర్తి కాబట్టి ఈ ధర్మనీతి పద్ధతిలో ఆలోచిస్తున్నాడు. పగవారినే చంపగూడదని లోకనీతి చెప్పుతుండగా బంధు మిత్రులను చంపటం న్యాయమా? అని యుద్ధోద్యోగానికి విరుగుడుగా ఈ అంశాన్ని పేర్కొన్నాడు.

7. ఈ ధర్మనీతిని లెక్కచేయకుండా సంపద కొరకు బంధుమిత్రులను యుద్ధంలో చంపితే రెండు దుర్దశలు కలుగుతాయట! అవి- అపకీర్తి, పాపం. ఈ రెండూ ధర్మవీరుడి జీవితానికి ఇహపరాలు లేకుండా చేసే దుర్దశలు. అపకీర్తి వలన ఈ జన్మలో మృత్యువు పాలైనట్లే, పాపంవలన జన్మ జన్మలలో సద్గతి కోల్పోయినట్లే. కాబట్టి కౌరవులను యుద్ధంలో చంపితే పాండవు లిహపరాలకు చెడుతారని ధర్మరాజు నిశ్చయం.

8. 'ఈ దురవస్థల కోర్వవచ్చునే?' సంపద లేకపోయినా బ్రతుక వచ్చునుగాని, అపకీర్తితో పాపంతో బ్రతకటం అసాధ్యమని ధర్మజుడి నీతిసూక్తం.

9. ఈ పద్యం ముగిసేసరికి రెండు విరుద్ధాంశాలు ధర్మజుడు ప్రతిపాదించాడు. (1) రాజ్యభాగం కావాలి. అందరూ కలిసి ఉండాలి. (2) యుద్ధం జరుగకూడదు. ఈ రెండూ జరిగేవి కావని స్పష్టం. కాని, ఆ దిశలో యత్నం జరగాలని ధర్మజుడి ఆశయం.

10. ఈ విషయాన్ని సభ మననం చేసికొనటానికి ధర్మరాజు కొన్ని క్షణాల విరామం ఇచ్చాడు. అది నాటకీయంగా అవసరం.

11. ఈ పద్యంలో శ్లేషమనే శబ్దార్థోభయ గుణాలు సంతరించబడ్డాయి. రచనలో మసృణత్వం, పదవాక్య సంవిధానంలో ఘటన ఈ పద్య రచనకు ప్రాణం.

12. తిక్కన తీర్చిదిద్దిన ఉపన్యాస శిల్ప పద్యాలలో ఇది కూడా ప్రశస్తి చెందింది. నేటికీ తెలుగువారి మాటలలో సంధి యత్నాల పట్ల ఈ పద్యం పల్లవిగా వినిపిస్తుంది. (సంపా.)

వ. అని పలికి పాండవాగ్రజుండు వెండియు. 14

తాత్పర్యం: అట్లా ధర్మజుడు పలికి మరల ఇట్లా అన్నాడు :

విశేషం: ఉపన్యాసఘట్టంలో తిక్కన నడుమ నడుమ రచించే చిన్న చిన్న వచనాలను అభినయ వ్యంజకాలుగా రూపొందించటం నాటక శిల్పం. పాండవాగ్రజుడు అనే విశేషణం సార్థకం. అతడి మాట పాండవ స్కంధావారంలో ముక్తకంఠంతో వినపడుతుం దని ధ్వని. 'వెండియు' - అనేది కొన్ని క్షణాల విరామానంతరం అనే కాలసూచిక. (సంపా.)

ఆ. క్షత్త్రధర్మ మింత కష్టమగునె? పెఱ। ధర్మ మాచరింపఁ దగ దటండ్రు
గాన శస్త్రజీవికయ తగియున్నది;। యైన వంశనాశ మనభిమతము. 15

ప్రతిపదార్థం: క్షత్త్రధర్మము= రాజధర్మము; ఇంత కష్టము+అగునె?= ఇంతటి కష్టంతో కూడుకొన్నది గదా!; పెఱ+ధర్మము= (క్షత్రియులు) అన్యధర్మము; ఆచరింపన్+తగదు+అటండ్రు= అనుష్ఠించరాదని పెద్దలు చెప్పుతారు; కానన్= కాబట్టి; శస్త్రజీవిక+అ+తగి+ఉన్నది= మాకు ఆయుధోపజీవనమే యుక్తమై ఉన్నది; ఐనన్= అయినప్పటికీ; వంశనాశము= కులనిర్మూలనం; అనభిమతము= నాకు ఇష్టం కాదు.

తాత్పర్యం: ఔరా! క్షత్రియ ధర్మపాలనం ఎంతో కష్టంతో కూడుకొన్నది. అన్య ధర్మాచరణం రాజులకు తగదని పెద్దలంటారు. కనుక ఆయుధాలను చేతబట్టి బ్రదకటమే వారికి యోగ్యమైన పని. కాని, రాజ్యానికై కులనిర్మూలనం చేయటం నాకు సమ్మతం కాదు.

విశేషం: 1. అజాతశత్రువు యొక్క అంతర్మథనానికి ఈ ఆటవెలది అచ్చమైన అభినయ వాచికం. ఈ పద్యానికి మూలం గమనిస్తే దీని ముచ్చట మరీ బాగుంటుంది.

"పాపః క్షత్రియ ధర్మోఽయం నయంచ క్షత్రబాంధవాః,
స నః స్వధర్మోఽధర్మో వా వృత్తి రన్యా విగర్హితా". (సం. 5-70-46)

"క్షత్రియ ధర్మం ఎంత పాపం!' అని మూలంలో అంటే. 'ఎంత కష్టం?' అని తెలుగులో అన్నాడు. 'మనమేమో క్షత్రియ బంధువుల' మని మూలంలో ఉంటే. తిక్కన దానిని వదలివేశాడు. ఈ విషయం వాచ్యం చేయవలసిన అవసరం లేదు. 'అది

మనకు స్వధర్మం. ధర్మమైనా పరధర్మం నిందకు పాత్రమౌతుంది' - అని మూలం. దీని వరుస మార్చి - 'పెఱ ధర్మమాచరింపఁ దగ దటంద్రు' అని మొదట పలికాడు తెలుగులో. ఆటవెలది ఉత్తరార్థం అన్వయ సుందరంగా తెలుగులో అమరింది. క్షత్రియులైన పాండవులకు 'శస్త్రజీవికయే' స్వధర్మమై తగి ఉన్నది. అట్లని యుద్ధం చేసి కార్యం సాధించటమే కర్తవ్యం కాదు. వంశనాశనం జరుగకుండా కార్యసాధనం చేయటం కర్తవ్యం. క్షత్రధర్మానికీ, అహింసకూ సంఘర్షణ వచ్చినపుడు యుద్ధేతర మార్గంలో కార్యాన్ని లోకహితంగా సాధించటం కూడా ధర్మమే. దానినే ధర్మనీతివర్తనం అంటారు. ధర్మరాజు ఆ మార్గాన్ని సూచించాడు.

2. ఆటవెలది పాదాలు నాలుగూ నాలుగు వాక్యాలు. విరుద్ధ ధర్మ సూచికలు. అయినా అన్వయసుందరాలు.

3. ఇందులో అర్థవ్యక్తి అనే శబ్దార్థ గుణాలు పోషించబడ్డాయి. (సంపా.)

వ. అదియునుంగాక. 16

తాత్పర్యం: ఇంతేకాక.

ఆ. కలహ మగుట లక్ష్మిఁ గావించుఁ, బ్రాణహా । నియును జేయు; నింత నిక్కువంబు;
పలువు రొకని కోడి పాఱుట, బల్లిదు । లనదచేతఁ జెడుటయును ఘటించు. 17

ప్రతిపదార్థం: కలహము+అగుట= యుద్ధం రావటం (సంభవించటం); లక్ష్మిన్= సంపదను; కావించున్= లభింపజేస్తుంది; ప్రాణహానియును+చేయున్= ప్రాణనష్టం గూడ కలిగిస్తుంది; ఇంత నిక్కువంబు= (ధనసంప్రాప్తి, ప్రాణనష్టం, యుద్ధం వలన జరగటం) యథార్థం; పలువురు= అనేకులు; ఒకనికిన్+ఓడి= ఒక్కడి చేతిలో అపజయం పొంది; పాఱుట= పరుగిడిపోవటం; బల్లిదులు= బలవంతులు; అనదచేతన్= దుర్బలుడిచేత; చెడుటయును= నశించుటయున్నూ; ఘటించున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: యుద్ధం జరిగితే సంపదలు సంప్రాప్తిస్తాయి. ప్రాణహాని కూడా సంభవిస్తుంది. ఇందులో సందేహం లేదు. పెక్కుమంది ఒక్కడి చేతిలో ఓడిపోయి పరుగెత్తిపోవటం, బలవంతులు బలహీనుడి చేజిక్కి సమసిపోవటం కూడ జరుగుతుంది.

విశేషం: యుద్ధం వలన లాభనష్టాలు మొదట చెప్పాడు ధర్మజుడు. సంపద కలగటం లాభం. ప్రాణహాని నష్టం. యుద్ధంలో జరిగే అబ్బురాలను రెండింటిని తరువాత పేర్కొన్నాడు. ఒకే మహావీరుడి చేతులలో పలువురు పారిపోవచ్చును. ఒక్కొక్కసారి అసమర్థులైన వారు గుంపు కట్టి బలవంతులను చంపవచ్చును. మొదటి దానికి అర్జునుడు, భీష్ముడు ఉదాహరణలు కావచ్చును. కౌరవులు చంపిన అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైనవారు రెండవ పద్ధతికి ఉదాహరణలు. ఇవి అసహజమైనవి. అదృష్టంమీద, అవకాశం మీద ఆధారపడిన ఇటువంటి సంఘటనలను ఆధారంగా చేసికొని జయాపజయాలను ముందే నిశ్చయించటం కష్టం. జయాపజయాలు దైవాధీనాలు. ఈ వాస్తవం - యుద్ధోపాయం విశ్వసనీయం కాదని సూచిస్తున్నది. (సంపా.)

క. జయమగు నోడుదు మను ని । శ్చయ మొక్కఁడు లేదు; వినుము! సమరమునఁ బరా
జయము మరణంబు కంటె హ్యా । దయపుట భేదనము సేయుఁ దథ్యం బనఘా! 18

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్య పురుషా!; వినుము= నా మాట లాలకించుము; సమరమునన్= యుద్ధంలో; జయము+అగున్= మనకే విజయం లభిస్తుంది. ఓడుదుము= మనమే అపజయం పొందుతాము; అను నిశ్చయము= అనే నిర్ణయం;

ఒక్కఁడు లేదు= ఒకటీ లేదు; పరాజయము= అపజయం; మరణంబుకంటెన్= మృతికంటె కూడా; హృదయపుట భేదనము+చేయున్= దొప్పవంటి గుండెను పగులగొట్టుతుంది; తథ్యంబు= ఇది నిజం

తాత్పర్యం: కృష్ణా! యుద్ధంలో మనమే గెలుస్తాం, లేదా ఓడిపోతాం అని నిశ్చయంగా చెప్పటానికి వీలులేదు. సంగ్రామంలో అపజయమే సంప్రాప్తమైతే అది మరణంకంటె గుండెను బ్రద్దలు చేసి, దుస్సహమైన వేదనను కలిగిస్తుంది. ఇది నిజం.

విశేషం: 'విజయం తథ్యం కాని యుద్ధం కంటె మరణం మే' అని ధర్మరాజు పేర్కొని సభ్యులు, యుద్ధేతర మార్గాలలో కార్యసాధన మేలని తలంచేటట్లు చేస్తున్నాడు. యుద్ధం చేయాలనే భీమాదుల వాదాలను తర్కబద్ధమైన ప్రతివాద చాతుర్యంతో నియమిస్తున్నాడు. (సంపా.)

క. కాన నవశ్యముఁ బెనఁకువ । గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చు ధృతిం
బూని నడచు నెవ్వఁడు డెం । దానం జెయివెట్టికొని యతఁడు నిద్రించున్. 19

ప్రతిపదార్థం: కానన్= కాబట్టి; అవశ్యమున్= తప్పక; పెనఁకువ కాని= కయ్యం జరగని; ఉపాయమునన్= వెరవు చేత; పగఱన్= శత్రువులను; కడతేర్చు ధృతిన్+పూని= అణచునట్టి ధైర్యం వహించి; ఎవ్వఁడు నడచున్= ఎవడు మెలగునో; అతఁడు= అట్టివాడు; డెందానన్= గుండెమీద; చెయి+పెట్టికొని= చేతిని ఉంచుకొని; నిద్రించున్= హాయిగా నిద్రపోతాడు.

తాత్పర్యం: యుద్ధం అన్ని అనర్థాలకు మూలమవటంచేత కయ్యం చేయకుండానే ఉపాయంతో విరోధులను అణచివేయగలననే ధైర్యం వహించి ఎవడు ప్రవర్తిస్తాడో వాడు గుండెమీద చేయి వేసుకొని నిశ్చింతగా నిదురిస్తాడు.

విశేషం: యుద్ధోపాయాన్ని ప్రయోగించే అవసరం రాకుండానే సామదాన భేదోపాయాలతోనే కార్యఫలాన్ని సాధించటం ఉత్తమమని ధర్మజుడు తేల్చిన ఫలితాంశం. ఇది శాస్త్ర సమ్మతమైన ధర్మనీతి. ఈ పద్యంతో ఒక ప్రతిపాదన ముగిసింది. అందుకే 'కాన' అని పద్యం మొదలైంది. ధర్మరాజు తన ఉపన్యాసంలో ప్రతిపాద్యాంశ పరిసమాప్తిని సూచించే వాక్యాన్ని 'కావున' అని మొదలు పెడుతూ ఉంటాడు. అది ఆయన వాక్యశిల్పం. (సంపా.)

ఆ. పగయ కలిగె నేనిఁ బాముున్న యింటిలో । నున్న యట్లకాక యూఱడిల్లి
యుండు నెట్లు చిత్త మొకమాటుఁ గావున । వలవ దధిక దీర్ఘ వైరవృత్తి. 20

ప్రతిపదార్థం: పగ+అ+కలిగెనేనిన్= విరోధమే ఏర్పడితే; పాము+ఉన్న+ఇంటిలోన్= సర్పమున్న గృహంలో; ఉన్న+అట్ల కాక= ఉన్నట్లే ఉంటుందిగాని; ఒకమాటున్= ఒకసారిఅయినా; చిత్తము= హృదయం; ఊఱడిల్లి= ఊరటపొంది; ఎట్లు+ఉండున్?= ఎట్లా ఉండగలదు?; కావునన్= కాబట్టి; అధికదీర్ఘవైరవృత్తి= చిరకాలం విరోధంతో మెలగటం; వలవదు= కూడదు.

తాత్పర్యం: శత్రుత్వమే ఏర్పడితే పామున్న యింటిలో కాపురమున్నట్లే ఉంటుందిగాని ఒక తడవైనా మనస్సు నిమ్మళంగా ఉండదు. కనుక ఎవరితోనూ దీర్ఘకాలం విరోధంతో ప్రవర్తించటం తగదు.

విశేషం: అలం: ఉపమ. ఇది గొప్ప నైతిక సూక్తి, సుభాషితం. మూలం:

"సుఖం ప్రశాన్తః స్వపితి హిత్వా జయపరాజయౌ ॥
జాత వైర శ్చ పురుషో దుఃఖం స్వపితి నిత్యదా ।
అనివృత్తేన మనసా స సర్ప ఇవ వేశ్మని ॥
ఉత్సాదయతి యః సర్వం యశసా స విముచ్యతే ।" (సం. 5-70-59,60,61)

జయాపజయాలను పట్టించుకొనని ప్రశాంతచిత్తులు సుఖంగా నిద్రిస్తారు. పగపట్టిన పురుషుడు ప్రతిదినం దుఃఖంతో పడుకొంటాడు. పగ వలన సుఖం లేని వాడు పామున్న ఇంటిలో ఉన్నవాడి వలె సర్వాన్నీ పాడుచేసికొంటాడు. వాడికి పూర్వమున్న కీర్తి కూడా తరిగిపోతుంది- అని మూల తాత్పర్యం. తిక్కన మూలాన్ని సందర్భోచితంగా చికిలిపెట్టి నాడుకొన్నాడు.

సంస్కృతంలో వైరం అనే పదానికి తెలుగు-పగ. ఈ పదం తెలుగులో బాగా ప్రచారంలో ఉన్నది. పాముకూ పగకూ కవి సమయం వంటి అనుబంధం ఉన్నది. అందువలన తిక్కన పగ కలిగిన చిత్తం పాము పుట్ట వంటిదనీ, అటువంటి చిత్తవృత్తిగల వ్యక్తి పాముపుట్ట ఉన్న ఇల్లనీ ఉపమించాడు. వ్యాస హృదయానికి వన్నెపెట్టాడు.

పగ ఒకసారి ప్రవేశిస్తే శాంతి ఉండదు కాబట్టి దానిని తగ్గించటం, తొలగించటం తప్ప మార్గాంతరం లేదు. అంటే ఎక్కువ కాలం పగను మనసులో ఉంచుకొనకుండా నిర్మూలించుకొనటమే యుద్ధనివారణకు తరణోపాయమని ధర్మజుడి భావన.

యుద్ధానికి మూలం పగ. ఎడతెగని పగయే యుద్ధోన్మాదంగా మారుతుంది. మాయాద్యూతంలో వంచించి రాజ్యాన్ని కాజేశారనే పగతో పాండవులలో యుద్ధజ్వాల రగులుతున్నది. బలవంతులైన పాండవులు బ్రతికి ఉంటే ప్రభుత్వం దక్కదని అసూయాపరులైన కౌరవులు వారి మీద పగతో యుద్ధానికి కూడా సిద్ధమవుతున్నారు. ఇది ఉభయులకు వర్తించే నీతి. పగ తగ్గితే యుద్ధ ప్రవృత్తి సహజంగానే సమసిపోతుంది. యుద్ధేతరోపాయాలలో ఇది ఉత్తమం, నైతికం, ఆధ్యాత్మికం. కాని, అది సాధ్యమా? అన్నది హిమాలయమంత ప్రశ్న. (సంపా.)

చ. పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ? వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా! 21

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; పగ+అడఁగించుట= విరోధాన్ని రూపుమాపటం; ఎంతయున్+శుభంబు= మిక్కిలి శ్రేయస్కరం; అది లెస్స= అది మంచిపని; పగన్= విరోధంచేత; పగ+అడంగునే= విరోధం శమిస్తుందా? (అంటే శమించదు); వగ+కొన్నన్= (ఒకరి) పగవలన (మరొకరు)బాధపడితే; మార్కొనక= అతడిని ఎదిరించక; పల్కక+ఉండఁగన్+వచ్చునే= ఊరకుండటం శక్యమా? కాదు; కడున్+తెగన్= పరమ సాహసంతో; మొదలు+ఎత్తిపోవన్= తుదముట్టేటట్లు; పగన్+తీర్పఁగన్+వచ్చినన్= వైరాన్ని నిర్మూలించటానికి సిద్ధపడితే; క్రౌర్యము+ఒందున్= క్రూరకృత్యములకు తాను ఒడిగట్టవలసి వస్తుంది; ఏమిగతి+ తలంచినన్= ఏ విధంగా ఆలోచించినా; పగకున్= విరోధానికి; మేలిమి లేమి= ఆధిక్యం లేకుండుట; ధ్రువంబు= నిజం.

తాత్పర్యం: విరోధాన్ని అణచివేయడం ఎంతో శ్రేయస్కరం. అది మంచి పని. విరోధం వలన విరోధం సమసిపోదు. ఒకడు వైరం వహించి మరొకరికి బాధ కలిగిస్తే, బాధపెట్టిన వాడితో తలపడక ఊరకుండటం శక్యం గాదు. పరమ సాహసంతో తుదముట్ట పగను నిర్మూలించటానికి పూనుకొంటే దారుణ కృత్యాలకు ఒడిగట్టవలసివస్తుంది. కనుక, ఎన్ని విధాల ఆలోచించినా పగవలన కీడేగాని ప్రయోజనం శూన్యం. కృష్ణా! ఇది నిజం.

విశేషం: 1. పగ వలన కలిగే అనర్థాన్ని చెప్పే గొప్ప సూక్తి ఇది. తెలుగువారి నిత్య వ్యవహారంలో నిత్యంగా నిలిచే సత్యం వంటి పద్యం. తిక్కన రచించిన మేటి పద్యాలలో ఒకటి.

2. ధర్మరాజు తర్కబద్ధంగా ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ మాట్లాడుతాడు. ఆ పాత్ర స్వభావానికి అనుగుణంగా ఈ పద్యాన్ని చిన్న చిన్న వాక్యాల పొందికైన రచనతో చేశాడు తిక్కన. చిన్న వాక్యం ఆలోచనాతరంగం. శాంతి పొందటం కర్తవ్యం. 'దానికి భంజకం పగ' అని చెప్పాలి. దానినే పగను గురించి వివరించి, 'అది లేకపోతేనే శాంతి, అది కర్తవ్యం' అని ధర్మరాజు చెప్పాడు. కూడనిది ముందు చెప్పితే కూడేదాని ప్రతిపాదనకు బలం వస్తుంది. దీన్నే తర్కంలో నేతి నేతి వాదం అంటారు. ధర్మరాజు దానిని పాటించాడు.

3. ధర్మరాజు మౌలికంగా శాంతి కాముకుడు. ధర్మనీతి వర్తనుడు. కౌరవులు రాజ్యభాగ మీయరని సంజయుడి రాయబారం వలన తేలిపోయింది. అది కౌరవుల పగ సాధింపు చర్య. అయితే, ఆ పగల వలన కలిగే ఫలమేమిటి? అని జిజ్ఞాసువైన ధర్మరాజు ఆలోచించాడు. శ్రీకృష్ణుడి రాయబారానికి మూలకారణం పగలేకుండా చేయటమే అని బలంగా ఈ పద్యంలో ప్రతిపాదిస్తున్నాడు.

4. పగ ఉన్న మనసు పాము పుట్ట ఉన్న ఇల్లు వంటిది. అందులో శాంతి ఉండదు- అని చక్కని దృష్టాంతాన్ని నిత్య జీవితంలో నుండి తీసికొని పూర్వపద్యంలో చెప్పి, ఈ పద్యాన్ని ఎన్నుకొనటంలో మంచి పూర్వరంగం తయారు చేసి, ప్రతిపాద్యాంశాన్ని చెపుతున్న వాద కౌశలం ప్రకటిత మౌతున్నది.

5. పగను అణచటం ఎంతైనా శుభం. శుభం అనే మాటకు బదులు మేలు, మంచిది, హితవు వంటి అర్థాలు వచ్చే పదాలు వాడవచ్చును. తెలుగు పలుకుబడిలో 'శుభం' పదాని కున్న వాడుక శక్తి మరో పదానికి లేదు. 'అది లెస్స' అనే చిన్నవాక్యం- తెలుగువారు తాను చెప్పిన దాన్ని స్థిరంగా నమ్ముతున్నారని ధ్రువీకరించే పద్ధతికి ప్రతినిధి. 'నిజం. నా మాట నమ్ము- సత్యం' మొదలైన పలుకుబడులకు అది సమానం. ధర్మరాజు చెప్పింది తాను గట్టిగా నమ్మి చెప్పిందే అని అర్థం. తెలుగు పలుకుబడి గల వాక్యాలకు ఈ తిక్కన పద్యం రత్నాల పేటి.

6. పగను గురించి చెప్పే ఈ పద్యంలో ధర్మరాజు- (పాండవులు) - భవిష్యత్తులో అనుసరించబోయే కార్యాచరణ పద్ధతి ఈ పగమీదే ఆధారపడి ఉంటుందని హెచ్చరిక చేశాడు. పగ వలన వగగొన్నవారు తిరగబడకుండా ఊరుకొనబోరట! సంజయుడు- పాండవులు శాంతించాలని చెప్పాడు. దానికి తిరుగు సమాధాన మిది. కౌరవుల పగకు తగిన సమాధానం చెప్పటమే వగగొన్న పాండవుల సహజ కార్యాచరణం. అయితే, ఒకసారి పగసాధింపుకు దిగితే ఇక దయాదాక్షిణ్యాలకు తావుండదు. సంధి వచనాలకు అవకాశముండదు. దారుణమైన క్రూరవృత్తితో శత్రు సంహారమే సాగుతుంది. కౌరవనాశనం తప్పదు. కాబట్టి ఎన్ని రకాలుగా ఆలోచించినా పగను తొలగించక పోతే ఎటువంటి మంచీ ఏర్పడదు. చివర 'ధ్రువంబు కేశవా!' అనే వాక్యం కూడా - ఇది నిశ్చయం, ఇది జరిగి తీరుతుంది. నా మాట అయి తీరుతుంది. ఇది నిజం- ఇన్ని అర్థాలనిస్తుంది. వాద ప్రతిపాద్యాంశంలోని నిత్యత్వాన్ని స్థాపించే తర్కరహస్యం ఈ పద్య నిర్మాణ మర్మం.

7. పూర్వరంగాన్ని ముందు పద్యంలోనూ, తాత్పర్యాన్ని తరువాతి పద్యంలోనూ చెప్పిన తిక్కన ఛందస్సుల మధ్య తర్కంతో వంతెన కట్టాడు. 'కావున శాంతి పొందుటయ కర్జము' అనే నిశ్చితాంశం తరువాతి పద్యం ఎత్తుగడలోని వాక్యం.

8. తిక్కన నాటకీయ సంభాషణ శిల్పంలో ఉపన్యాస రచన- లేదా - దీర్ఘ సంభాషణ ఒక విశిష్టాంశం. సందేశమిచ్చే ముఖ్యపాత్రలూ, దూతలూ మాత్రమే ఈ దీర్ఘసంభాషణలు చేస్తారు. భారతంలో ధర్మజుడి ఉపన్యాస ఖండికలలో ఉద్యోగపర్వంలోని ఈ భాగం ప్రసిద్ధమైనది. అందులో ఈ పద్యం శిరోమణి వంటిది.

9. ఈ పద్యంలో వాడిన తెలుగు పదాల పొందిక గమనిస్తే సంస్కృత భారతంలోని భావాలను తెలుగులో ఎంత ఆత్మీయం చేసికొని, జాతీయంగా తెలుగు పలుకుబడికి ప్రాణంగా తిక్కన రచించాడో స్పష్టమవుతుంది. విశేషించి - పగ, శుభంబు,

లెస్స, పగ, మార్కొనక, కడుందెగ మొదలెత్తిపోవ, మేలిమి, ధ్రువంబు మొదలైన పదాలు సార్థకాలు, శబ్ద ప్రయోగౌచిత్యానికి పద్యమంతా ఉదాహరణమే.

10. 'పగ గొన్న మార్కొనక' - అనే పాఠానికి 'పగగొన్న మార్కొనక', 'తెగగొన్న మార్కొనక' అనే పాఠాంతరాలు కనపడుతున్నాయి.

11. ఈ పద్య రచనకు సహకరించిన మూలశ్లోక మిది-

"న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి,
హవిషాగ్నిర్యథా కృష్ణ, భూయ ఏవాభివర్ధతే". (సం. 5-70-63)

కేశవా! పగతో పగ ఎప్పటికీ చల్లారదు. హోమ పదార్థా లుంచిన కొద్దీ హోమాగ్ని ఎట్లా ప్రజ్వరిల్లుతుందో పగవలన పగ మరల మరల రగిలి పెచ్చుపెరుగుతుంది. తిక్కన ఈ ఉపమానాన్ని గ్రహించలేదు. యజ్ఞోపకరణాన్ని పగకు ఉపమానంగా వాడక పోవటం వలన ఔచిత్యం పోషించబడింది. మూలంలో కంటె తిక్కన పద్యం వస్తువులో, రచనలో, జిగి బిగి ప్రదర్శిస్తున్నది.

12. తిక్కన ధ్వనిమార్గంలో కవిత రచించాడు. అందులోనూ రసధ్వని ఆయన ప్రత్యేక రంగం. వాచికాభినయ ప్రధానమైన ఈ ఘట్టంలో మాటలు పాత్రల స్వభావాలనూ, స్వభావాలు ప్రకరణ భావాలనూ, ధ్వనింపజేసి, నాయకుడైన ధర్మజుడి ధర్మనీతి వర్తనంలోని ఉత్సాహదీప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ధర్మజుడి ధర్మవీరం తిక్కన కవితలో రసోల్లాసం.

13. తిక్కన శబ్దగుణానికి అర్థగుణాన్ని వన్నెగా నిలుపుతాడు. ఈపద్యం అటువంటి శిల్పానికి ఉదాహరణం. పదబంధంలోని మసృణత్వమే శబ్దగుణమైన శ్లేష లక్షణం. బహుపదా లున్నప్పటికీ ఏకపదం వలెనే భాసించటం దాని స్వభావం. అర్థగుణమైన శ్లేష అర్థఘటనకు సంబంధించింది. అనేకభావా లున్నప్పటికీ వాటికి ఐక్యఘటనాన్ని మార్చేదిగా అర్థగుణశ్లేష రాణిస్తుంది. శ్లేషలో క్రమం, కౌటిల్యం, అనుల్బణత్వం ఉపపన్నమై ఉండాలని వామనుడు పేర్కొన్నాడు. ఈ మూడు లక్షణాలూ ధర్మజుడి వాక్యఘటనలో అర్థగుణ సిద్ధిని పొందాయి. ధర్మరాజు మాటల పొందికలో ఎంత మన్నిక ఉంటుందో, వాక్యాల కూర్పులో అంత అర్థ సంఘటన ఉంటుంది. మాటలను అతకటం శబ్దగుణం, ఊటగా ఊరే భావాలను బహు వాక్యాలలో ప్రయాణింపజేసినా ఏకధారను అర్థస్ఫూర్తియందు సంఘటింపజేయటం అర్థగుణం. తిక్కన రచనలో శబ్దగుణమైన శ్లేష అర్థగుణమైన శ్లేషకు ఊడిగం చేస్తుంది. వాక్యవిన్యాసంలో ఏకసూత్రంగా ఉండే ఆలోచనాక్రమం ఒక్కొక్కప్పుడు వక్రతతో కూడి ఉన్నా, అనుల్బణత్వాన్ని ఆద్యంతమూ ఆదరిస్తుంది. ఇది తిక్కన సంభాషణ శిల్పంలోని ఆయుస్సూత్రం. ఈ పద్యంలోని ధర్మజుడి వాక్యరచన అర్థగుణమైన శ్లేషకు శీర్షప్రాయమైన ఉదాహరణం.

14. ఈ పద్యంలో అలంకారం లేదు. కాని, నాటకీయత ఉన్నది. సమాసాలు లేవు కాని, వాక్య విన్యాసం ఉన్నది. ఆడంబరం లేదు. కాని, ఆలోచన ఉన్నది. తిక్కన పద్యరచన ఆలోచనామృతం. (సంపా.)

ఉ. **కావున శాంతిఁ బొందుటయ కర్జము; దా నది యట్టులుండెఁ; శ్రీ**
గావలె నంచుఁ, బోరితము గామియుఁ గోరెద; మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నే విధినైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా! **22**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శాంతిన్+పొందుట+అ= శాంతి వహించటమే; కర్జము= చేయవలసిన పని; తాన్+అది+అట్టులు+ ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; శ్రీ+కావలెన్+అంచున్= సంపద కావలెననీ; పోరితము+కామియున్= యుద్ధం జరగకుండ ఉండవలెననీ; కోరెదము= మేము వాంఛిస్తాము; ఎల్ల సొమ్ములున్= ఉన్న సమస్త ధనాలూ; పోవుటయున్=

నశించటమూ; కులక్షయము పుట్టుటయున్= వంశనాశం కలగటమూ; వెలి కాఁగన్= ఈ రెండునూ జరగకుండా; ఒండుమైన్= వేరొక్క విధంగా; ఏ విధిన్+ఐనన్= ఏ ప్రకారంగా నైనా; చక్కన్+పడుట= బాగుపడటం; ఎంతయున్+ఒప్పున్+చుమీ!= మిక్కిలి తగును గదా! (ఎంతో బాగుంటుంది కదూ!); జనార్దనా!= శ్రీకృష్ణా!.

తాత్పర్యం: వైరం వలన ప్రయోజనం శూన్యం. కలత లేక నిమ్మళంగా ఉండటమే తగిన పని. కృష్ణా! ఆ విషయమట్లా ఉండనీ. నేను సంపద కావాలనీ, యుద్ధం జరగకుండ ఉండాలనీ కోరుకొంటున్నాను. యుద్ధం వలన ధననష్టం, వంశనాశనం జరుగుతుంది. ఈ రెండూ జరగని ఉపాయంతో ఎట్లాగయినా బాగు పడటం మిక్కిలి సముచితం కదా!

విశేషం: 1. పాండవోద్యోగ సారసర్వస్వ మనదగిన పద్యం ఇది. ఉద్యోగపర్వానికి గుండెకాయవంటిది.

2. కావున- అనే నిశ్చితార్థంతో మొదలు కావటం రచనాశిల్పం.

3. యుద్ధం లేకుండా శాంతి పొందటం ప్రస్తుత కర్తవ్యం - అని ఫలితాంశ ప్రతిపాదనం.

4. దూతకార్యంలో లక్ష్యం శాంతి. ఆ శాంతిని సాధించే మార్గంలో రక్షించబడవలసిన మూల్యాలు మూడు. అవి:

(1) రాజ్య సంపద కావాలి. (2) కాని, యుద్ధం జరగకూడదు. (3) సంపద నష్టం కాకుండా, కులక్షయం కాకుండా మరే మార్గంలోనైనా, ఏ పద్ధతిలో నయినా కార్యం చక్కబడాలి.

ఈ ప్రణాళిక ధర్మజుడి ఉద్యోగంలోని ధర్మనీతి. ఇంతటితో ధర్మజుడి ప్రధాన ప్రతిపాదనం ముగిసింది. (సంపా.)

చ. **మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ**
ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడుమీ! **23**

ప్రతిపదార్థం: మనమునన్= నీ హృదయంలో; మా దెసన్= మా విషయమై; పక్షపాతగతిన్= అభిమానం చూపటం; మానుము= వదలి పెట్టుము; ధర్మనీతివర్తనములన్= ధర్మంతో నీతితోకూడిన నడవడికలతో; రెండు దిక్కులన్= ఇరుపక్షాలకూ; హితంబును= మేలును; పెంపును= అభివృద్ధియు; కల్గునట్టి చొప్పునన్= సమకూడే రీతిలో; విదుర+అది= విదురుడు మొదలైన; సజ్జనుల బుద్ధికిన్+రాన్= సత్పురుషుల మనసునకు సమ్మతమయ్యేటట్లుగా; ఉచితంబుతోడి మెల్పునన్= అనువైన మెత్తబాటుతోనూ; పరుసందనంబునను= కరకుదనంతోనూ; భూపతులు+ఎల్లన్= కురుసభలోని రాజులందరూ; ఎఱుంగన్= తెలిసికొనేటట్లు; ఆడుమీ= పలుకుము.

తాత్పర్యం: కృష్ణా! మా విషయంలో పక్షపాతం చూపవద్దు. ధర్మం, నీతి- వీటి ననుసరించి ఇరుపక్షాలకున్నూ మేలు, అభివృద్ధి సమకూరే రీతిలో, విదురుడు మొదలైన సత్పురుషుల మనసులకు సమ్మతమయ్యేటట్లుగా తగినంత మెత్తదనంతోనూ, కఠినమైన మందలింపులతోనూ కురుసభలో రాజు లందరూ గ్రహించేటట్లు మాట్లాడుము.

విశేషం: ఇంతవరకూ దౌత్య కార్య లక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ నిర్దేశించిన ధర్మరాజు ఈ పద్యం మొదలుకొని 26వ పద్యం వరకు దూత వర్తనాన్ని గురించి తన అభిప్రాయాలను తెలుపుతున్నాడు. ఇవి పరోక్షంగా ఉత్తమదూత సాధారణ లక్షణాలుగా

కూడా అన్వయిస్తాయి. అవి 1. మనస్సులో పక్షపాతగతి మానాలి. 2. ధర్మనీతి పథంలో తప్పకుండా నడవాలి. 3. ఉభయ పక్షాలకూ మేలూ, అభ్యుదయం కలిగేటట్లు మాట్లాడాలి. 4. సభ్యులలో విదురాది సత్పురుషులకు సమ్మతమయ్యేటట్లు మాట్లాడాలి. 5. అవసరాన్ని బట్టి మెత్తగానూ, కఠినంగానూ, మందలిస్తున్నట్లుగా సంభాషణ నిపుణంగా సాగించాలి. 6. సభలోనున్న రాజులందరూ పాండవుల ఉద్యోగాన్ని సక్రమంగా, సమగ్రంగా తెలిసికొన గలిగేటట్లు మాట్లాడాలి. మహాభారతంలో- దూతలకు ఉండదగిన ఈ లక్షణాలన్నీ చెప్పింది ధర్మజుడు. ఆచరించి చూపింది శ్రీకృష్ణుడు. (సంపా.)

చ. **తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కినయేని సైఁచి యొ**
ప్పుగ నిలుమీ; గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యా సుయోధను కడన్ నిలువన్ మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధు పల్కుఁ దలఁపుం జన నిచ్చిన మెచ్చరే జనుల్? **24**

ప్రతిపదార్థం: రాజు= దుర్యోధనుడు; తగవునన్+పోక= న్యాయమార్గాన నడువక; బెడిదంబులు= కఠినవాక్యాలు; పల్కిన+ ఏనిన్= మాట్లాడినట్లయితే; సైఁచి= సహించి; ఒప్పుగన్+నిలుమీ= చక్కగా నిలబడుము; గురుత్వమున్= పెద్దరికం; ప్రభుత్వమునున్= రాచరికమున్నూ; కల= కలిగిన; పెద్దవారిమాట= వృద్ధుల వచనం; కొనమి= ఆదరించకుండటం; ఆ సుయోధను కడన్+నిలువన్= ఆ దుర్యోధనుడి దెసనుండగా; మనము+ఎల్లన్= మనమందరమూ; గారవంబుగన్= మర్యాదతో; కురువృద్ధు పల్కున్= కౌరవులలో పెద్దవారైన భీష్మాదుల మాటను; తలఁపున్= ఉద్దేశమును; చనన్+ఇచ్చినన్= సాగనిస్తే; జనుల్= లోకులు; మెచ్చరే?= మనలను పొగడకుందురా?

తాత్పర్యం: న్యాయ మెంచక దుర్యోధనుడు పరుష వాక్యాలు పల్కితే సహించవలసింది. తొందరపాటున సభ విడిచి రావద్దు. పెద్దరికం, రాచరికంగల పెద్దలమాట సుయోధనుడు వినలేదనే నింద వాడి తలపై వేయవలసింది. మనం గౌరవంగా కురువృద్ధులైన భీష్మాదుల మాటనూ, ఉద్దేశాన్నీ సాగనిస్తే లోకులు మనలను మెచ్చుకొంటారు.

విశేషం: ఈ పద్యంలో ధర్మరాజు కురుసభలో ఏర్పడే సంఘటనలను బుద్ధిబలంతో ఊహించి ఆయా సందర్భాలలో శ్రీకృష్ణుడు వ్యవహరించవలసిన తీరులను నిర్దేశించాడు. అవి-

(1) దుర్యోధనుడు అన్యాయంగా, అసభ్యంగా, పరుషంగా పలికినా, వ్యవహరించినా వాటిని సహించి సభలో నిగ్రహంతో ఉండాలి. తొందరపడి సభ వెలువడి రావద్దు. ఇది కీలకాంశం.

(2) సభలోని పెద్దలు దుర్యోధనుడి దుష్ప్రవర్తనాన్ని వారిస్తారు. నిందిస్తారు, అతడికి హితవులు బోధిస్తారు. అతడు వారి మాటలు వినడు. ఆ నింద అతడికి నిండు కొలువులో ఏర్పడేటట్లు నిబ్బరంగా నిలిచి నిర్వహించాలి.

(3) ధృతరాష్ట్రుడు పెద్దలు చెప్పిన మాటలు విని, వారికి అనుకూలంగా మాట్లాడి, కొడుకును వారించవచ్చును. ఆ పరిస్థితిని గమనించి, ధృతరాష్ట్రుడి ఆనతిని మనం గౌరవిస్తున్నట్లు వ్యవహరించి, అతడి మాట సాగేటట్లు చేయాలి. అంటే దుర్యోధనుడి మాట కాదని పాండవులకు ధృతరాష్ట్రుడు రాజ్యభాగం ఇచ్చే పరిస్థితులను కలిగించి ఫలప్రాప్తిని సాధించాలి.

(4) దీనినే సామభేదోపాయాల నిపుణ ప్రయోగమంటారు రాజనీతిలో. దీనివలన యుద్ధం లేకుండానే పాండవులకు రాజ్యభాగం దక్కే అవకాశా లేర్పడతాయి. (సంపా.)

మ. **సుతువాఁడై వినయంబు సేకొనక యేచొప్పున్ దగం జెప్ప కా**
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే

గ తెగంబాఱకు తెంపుసేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ! 25

ప్రతిపదార్థం: ఆ ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; సుతువాఁడు+ఐ= కుమారుడి పక్షం వహించినవాఁడై; వినయంబు చేకొనక= విధేయత చూపక; ఏ చొప్పున్= ఏ మార్గమునూ; తగన్+చెప్పక= యుక్తంగా తేల్చక; అవినీతిన్ చేసినను= అవినీతితో వర్తించినట్లయితే; సంధింపంగన్+రాదు+అంచున్= సంధి చేయటం పొసగదని; వేగ= వెంటనే; తెగన్+పాఱకు= సాహస కార్యానికి పూనవద్దు; తెంపు+చేయు+ఎడన్= సాహసానికి పూనుకొనవలసినప్పుడు; లోకంబు+ఎల్లన్+మెచ్చన్= జనులందరూ కొనియాడునట్లుగా; ప్రకాశిత ధర్మస్థితిన్+ఒంది= ప్రకటితమైన ధర్మంలో నెలకొన్నవాడవై; మా మనమున్= మా హృదయాన్ని; నిశ్చింతంబుగాన్+చేయుమీ= నిర్విచారంగా ఉండేటట్లు కావించవలసింది.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్ర మహారాజు కుమారుడి పక్షం వహించి వినయం వీడి ఏ అభిప్రాయం వెల్లడించక అవినీతితో మెలగినప్పుడు ఇక నేమాత్రం సంధి పొసగదని వెంటనే సాహసించవద్దు. సాహసం చేయవలసివస్తే జనులంతా కొనియాడేటట్లు ప్రకటిత ధర్మమందు నిలిచిన వాడవై మా మనసు విచారరహితంగా ఉండేటట్లు చేయవలసింది.

విశేషం: 1. ఒకవేళ- అనుకొన్నట్లు ధృతరాష్ట్రుడు వ్యవహరించక దుర్యోధనుడి దుర్నీతిని సమర్థించి అవినీతితో ప్రవర్తించి, రాజ్యభాగాన్ని ఇవ్వదలచకపోతే సంధికార్యం చెడిపోయిందని వెంటనే సభను వదలిపెట్టి రావద్దు.

2. సాహసించి నిండు కొలువులో నిలబడి ప్రజలందరూ గ్రహించేటట్లు పాండవుల ధర్మస్థితి ప్రకటితమయ్యేటట్లు గంభీరంగా ఉపన్యసించుము. ప్రజలు పాండవ ప్రయత్నాలు తెలిసికొని సత్యధర్మస్థితిని సమర్థిస్తే చాలు. రాయబారం సఫలమైనట్లే. అంటే సామదాన భేదాల ప్రయోగాన్ని కౌరవులు తిరస్కరించి యుద్ధోపాయానికి దారిచూపినట్లే ఔతుంది. (సంపా.)

ఆ. ఇన్ని సంకటముల నిబ్భంగి నెంతయు । నొగులు చిత్తవృత్తి నొవ్వు దీర్ప
వెజ్జ వీవకావె! వేయేల? యేగతి । నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము.' 26

ప్రతిపదార్థం: ఇన్ని సంకటములన్= ఇన్ని చిక్కులతో; ఈ+భంగిన్= ఈ విధంగా; ఎంతయున్= మిక్కిలి; నొగులు= వికలమౌతున్న; చిత్తవృత్తి నొవ్వు= మనో వ్యాపారము యొక్క వేదనను; తీర్పన్= తొలగించటానికి; వెజ్జవు= వైద్యుడవు; ఈవు+అ+కావె!= నీవే కదా!; వేయు+ఏల= పలుమాట లెందుకు?; ఏ గతిన్= ఏ రీతిగా; నడపన్+తలఁచితి(వి)= మమ్ములను ముందుకు నడిపించ దలచుకొన్నావో; అది+అ= అదే; నాకున్+ప్రియము= నాకిష్టం.

తాత్పర్యం: కృష్ణా! ఇన్ని చిక్కులతో ఈ ప్రకారంగా నా మనస్సు వికలమై వేదన చెందుతున్నది. నా మనో బాధను తొలగించుటకు తగిన వైద్యుడవు నీవుకాక మరెవ్వరు? ఇన్ని మాటలెందుకు? నీవు మమ్ము ఏ మార్గాన నడిపించ నెంచావో ఆ మార్గంలో నడవటమే నాకు సమ్మతం.'

విశేషం: 1. ధర్మరాజు తన చిత్తం చిక్కులతో ఈ విధంగా వేదనపడుతున్నదని చెప్పాడు. అంటే ఆయన తన మనసులోని బాధనే వెళ్ళగ్రక్కాడన్న మాట. అంటే శ్రీకృష్ణుడికి తన బాధను నివేదించుకొన్నాడన్నమాట! ఆయనది ఆదేశం కాదనీ, నివేదనమనీ నిపుణంగా చెప్పాడు. ఇది వాస్తవంగా గోచరించే రాజనీతి. ఆ సంగతి శ్రీకృష్ణుడికి తెలుసు.

2. ధర్మరాజు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించవలసిన విధానాలు, ఫలితాంశాల అంచనాలు సంక్లిష్టంగా ఉన్నాయి. అఘటనా ఘటన సామర్థ్యం ఉంటేనే అవి సాధ్యాలవుతాయి.

3. నొవ్వు తీర్చే వైద్యుడు శ్రీకృష్ణుడని ధర్మరాజు సాభిప్రాయంగా అన్నాడు. ఆ నొవ్వేమిటి? ఆ మందేమిటి?

(1) కౌరవులమీద నిందపడకుండా తాను యుద్ధం ప్రకటించవలసి వస్తుందేమోనని ధర్మజుడి బాధ. ఆ బాధను తొలగించే మందు రాయబారం.

(2) దుర్యోధనుడి దుర్నయాన్ని ధృతరాష్ట్రుడు పుత్రవ్యామోహంతో సమర్థిస్తూ సంధి కార్యాన్ని భగ్నం చేస్తే తప్ప యుద్ధం ధర్మనీతియుక్తం కాదు. కౌరవసభలో దాని కనుగుణంగా కథ నడిపే కథానాయకుడుగా ఒక మహావ్యక్తి కావాలి. అది నెరవేరాలని ధర్మజుడి బెంగ. దానిని తీర్చగలిగిన మానసిక వైద్యుడు శ్రీకృష్ణుడు.

(3) దుర్యోధన ధృతరాష్ట్రులు దుర్నీతి ప్రదర్శించినా, భీష్మాదులు, రాజులు, మిత్రులు, ప్రజలు, పాండవ యత్నాన్ని విని హర్షించి కౌరవులను నిందించి, పాండవోద్యోగాన్ని సమర్థించాలి. ఆ విధంగా శత్రు శిబిరంలో భేదోపాయాన్ని ప్రయోగించాలని ధర్మజుడి చింత. ఆ చింతను, వంతను తీర్చగలవాడు శ్రీకృష్ణుడు.

(4) రోగి తన రోగ లక్షణాలను తన బాధను వైద్యుడికి చెప్పుతాడు. బాధానివారణ వైద్యుడి కర్తవ్యం. కాని, చికిత్స విధానం ఆయనదే ఔతుంది. శ్రీకృష్ణుడు మహాత్ముడైన దివ్య పురుషుడు. సాక్షాత్ నారాయణుడు. అతడి సంకల్పం ప్రకారమే కార్యం నడుస్తుంది, నడుస్తున్నది. అయితే, నారాయణుడు భక్తవత్సలుడు. మొరపెట్టుకొన్న వారిని రక్షిస్తాడు. వారికి ప్రియం చేకూరుస్తాడు. 'మ్రొక్కిన వరమిచ్చు వేల్పు' శ్రీకృష్ణుడు. అందుకే వేయేల? ఏగతి నడపఁ దలఁచితి, అదియ నాకుఁ బ్రియము' అని 'అన్యథా శరణం నాస్తి' అని వేడుకొంటూ దైవసంకల్పమే తన సంతోషంగా పేర్కొని ముగించాడు.

(5) 'ఆపదఁ గడవం బెట్టఁగ' (6వ పద్యం) అని మొదలు పెట్టి 'ఇన్ని సంకటముల నిబ్బంగి' అని ముగించే ఈ పద్యాల ఎత్తుగడలలో ఒకే విధమైన మనఃస్థితి ఉండటం, శ్రీకృష్ణుడిని దివ్యాత్ముడిగా భావించే భక్తిభావం ప్రకటితం కావటం గమనిస్తే తిక్కన పూర్వాపరకావ్య కథార్థ సమన్వయ శిల్పం స్పష్టమవుతుంది. (సంపా.)

వ. అని చెప్పి తలంచికొని వెండియు నిట్లనియె : 27

తాత్పర్యం: అని పలికి, ఏదో భావం మనసుకు రాగా, మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: 'తలంచికొని' - అభినయ విశేష వ్యంజకం. పాదరసం వంటి బుద్ధిగల ధర్మరాజు - శ్రీకృష్ణుడు కురుసభకు పోతే ఏయే సన్నివేశాలు జరుగవచ్చునో, ఏయే విపరీత పరిస్థితులు శ్రీకృష్ణుడు ఎదుర్కొనవలసి వస్తుందో ఊహించాడు. బహుశః దుర్యోధనాదులు శ్రీకృష్ణుడిని ఒంటరివాడిని చేసి బంధించవచ్చును, సంహరించవచ్చును. ఒకవేళ అటువంటి గడ్డు పరిస్థితినే ఎదుర్కొనవలసి వస్తే యుద్ధ ప్రయోజనాల కొరకు శ్రీకృష్ణుడిని నిష్ప్రయోజనంగా బలిపెట్టుకొనవలసి వస్తుందేమో-అనే భావం ధర్మజుడి మనసులో మెరసినట్లుంది. మరల మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆలోచనాముద్రలో ఉన్న ధర్మజుడిని గమనించి, అత డింకా మాట్లాడే అవకాశమున్నదని ఎవరూ పలకటానికి ముందుకు రాలేదు. ఇవన్నీ నిశ్శబ్దంగా ధ్వనింపబడే తిక్కన నాటకరంగ సూచనలు. (సంపా.)

క. 'నీవు సుయోధను పాలికిఁ । బోవఁగ వలదనియు నొక్క బుద్ధి వొడమెడున్;
గోవింద! యతఁడు మంత్రులుఁ । గావరమునఁ జక్క వినరు కార్యవచనముల్. 28

ప్రతిపదార్థం: గోవింద= కృష్ణా!; నీవు= నీవు; సుయోధనుపాలికిన్= దుర్యోధనుడి దగ్గరకు; పోవఁగన్+వలదు= వెళ్ళవద్దు; అనియున్= అనికూడ; ఒక బుద్ధి పొడమెడున్= ఒక తలంపు కలుగుతున్నది; అతఁడు= ఆ సుయోధనుడు; మంత్రులున్= ఆతడి సచివులు; కావరమునన్= పొగరుబోతుతనంతో; కార్యవచనముల్= సంధి మాటలు; చక్కన్+వినరు= శ్రద్ధగా ఆలకించరు.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళటం సముచితం కాదని కూడా నాకొక తలంపు కలుగుతున్నది. అతడూ, ఆతడి మంత్రులూ పొగరుబోతులు. వారు నీ సంధివచనాలు శ్రద్ధగా చెవులబెట్టరు.

తే. **కుటిలమతు లవినీతులు క్రూరకర్ము; । లట్టి నీచుల కడకు ని న్ననుపఁజాల;**
నీవు సంకటపడియెడు దేవపదవి । యైన నే నొల్ల; నొంటి యం దరుగు టుడుగు.' **29**

ప్రతిపదార్థం: కుటిలమతులు= కుచ్చితపు బుద్ధిగలవారు; అవినీతులు= అడకువ లేనివారు; క్రూరకర్ములు= ఘోరకృత్యాలు చేసేవారూ అయిన; అట్టి నీచుల కడకున్= అటువంటి తుచ్ఛులైన కౌరవుల వద్దకు; నిన్నున్= నిన్ను; అనుపన్+చాలన్= పంపలేను; నీవు సంకటపడియెడు= నీవు శ్రమల పాలు కావలసిన; దేవపదవి+ఐనన్= స్వర్గరాజ్యమైనా; నేను+ఒల్లన్= నేనిష్టపడను; ఒంటిన్= ఒంటరిగా; అందున్+అరుగుట+ఉడుగు(ము)= అక్కడికి వెళ్ళటం మానవలసింది.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనాదులు వక్రబుద్ధి గలవారు, వినయరహితులు, దారుణకృత్యాలకు పాల్పడేవారు. అట్లాంటి తుచ్ఛుల దగ్గరికి నిన్ను పంపలేను. నిన్ను చిక్కులపాలు చేసే ఇంద్రపదవిని సైతం నేను వాంఛించను. కనుక కౌరవుల కడకు నీవు ఒంటరిగా వెళ్ళటం మానుకో.'

విశేషం: 1.28, 29 పద్యాలలో ధర్మజుడు శంకించినవన్నీ ఊహలుగా అనిపించినా, అతడు శంకించినట్లుగానే అవి జరుగబోతున్నాయి. అంటే ధర్మరాజు ఆగామిని అంత నిర్దిష్టంగా దర్శించగల ప్రజ్ఞావంతు డన్నమాట!

2. త్రిలోకపదవికంటె శ్రీకృష్ణుడి క్షేమం ధర్మజుడికి ప్రియం- అనే వాక్యం పాండవుల అనన్యభక్తికి ప్రత్యక్షర సాక్ష్యం.

3. దీనికి మూలం : "నహినః ప్రణయే ద్రవ్యం, నదేవత్వం కుతః సుఖమ్ । న చ సర్వామరైశ్వర్యం తవరోధిన మాధవ!" (5.70.84). 'ఒంటి యం దరుగుటుడుగు' అనే మాట అమూలకం. అయినా ప్రకరణోచితం" (సంపా.)

చ. **అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె 'నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ త**
త్తనయుఁడ యేల; నీ పలుకు తథ్యము; నీ తలఁ పే నెఱింగితి;
న్మనమున శంక దక్కుము; వినన్ వలతే విను; మేను నిక్క మ
ల్గిన నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్? **30**

ప్రతిపదార్థం: అనవుడున్= ధర్మజుడు అట్లా పలుకగా; కృష్ణుఁడు= వాసుదేవుఁడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; తత్+తనయుఁడ+ఏల?= అతని కుమారుడైన సుయోధను డొక్కడే యేమి?; ఆ ధృతరాష్ట్రుఁడున్+అట్టివాఁడు+అ= ఆంబికేయుడును అట్లాంటివాడే; నీ పలుకు తథ్యము+అ= నీమాట నిజమే; నీ తలఁపు= నీ భావం; ఏను+ఎఱింగితిన్= నేను తెలిసికొన్నాను; మనమునన్= నీ హృదయంలో; శంక+తక్కుము= అనుమానం మాను; వినన్ వలతేన్= నా మాటలు వినగోరితే; వినుము= వినుము; ఏను= నేను; నిక్కము= నిజంగా; అల్గినన్= నిజంగా ఆగ్రహిస్తే; అచటన్= ఆ కురుసభలో; రణకేళికిన్= యుద్ధ క్రీడకు; మార్కొనన్= ఎదిరించటానికి; ఒక్కఁడు+ఏనియున్= లెక్కకు ఒక్కడైనా; కలండె?= ఉన్నాడా?

తాత్పర్యం: ధర్మజుడి మాటలకు శ్రీకృష్ణుడు ఇట్లా బదులు పలికాడు. 'సుయోధను డొక్కడేయేమి, ఆతడి తండ్రి ధృతరాష్ట్రుడుగూడ నీవు పల్కిన తీరువాడే. నీ మాట సత్యం. నీ భావ మేమిటో నేను గ్రహించాను. నీవు మనసులో సందేహించ వద్దు. నా మాటలు వినదలిస్తే వినుము. నేను నిజంగా ఆగ్రహిస్తే అక్కడ యుద్ధంలో న న్నెదిరించగలవాడు ఒక్కడైనా ఉన్నాడా?

విశేషం: 1. ఒంటరిగా కురుసభకు వెళ్ళటం మానుమని స్నేహ పురస్సరంగా ధర్మరాజు అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు ఆర్ద్రుడయ్యాడు. ధర్మజుడి మనసులో ఉన్న శంక తొలగించాలని ఈ పద్యంలోని మాటలన్నాడు. ధర్మజుడివలెనే శ్రీకృష్ణుడు చిన్న చిన్న వాక్యాలతో తన మనోభావాన్ని తెలిపాడు. దుర్యోధన ధృతరాష్ట్రుల స్వభావా లటువంటివే అని ఒప్పుకొన్నాడు. ధర్మజు డనిన మాటలన్నీ నిజాలనీ (నిజాలౌతాయనీ) చెప్పాడు. 'నీతలఁ పే నెఱింగితి'- అనే వాక్యం బహుళార్థకం. ధర్మజుడు తన ఉపన్యాసంలో కోరుతున్న తాత్పర్యాన్ని, అంతరార్థాన్ని అవగాహనం చేసికొన్నానని ఒక అర్థం. కురుసభకు పోతే ఏర్పడే అపాయాన్ని గురించి శంకిస్తున్న ధర్మజుడి ఆత్మీయతను గ్రహించానని మరొక అర్థం. మనస్సులో శంకను మానేయమన్న వాక్యం - రెండర్థాలకూ వర్తిస్తుంది. 'వినవలతేన్ వినుము'- అనే వాక్యం శ్రీకృష్ణుడి అభిమానోక్తి, వీరోక్తి, ఒంటరిగా వెళ్ళినా, ఎంద రెదిరించినా, నిజంగా కోపించి యుద్ధానికి దిగితే శ్రీకృష్ణుడికి ఎదురైన వాడు కురుసభలో లేడని చెప్పి, 'నే నొక్కడినే, నావలె మరొక్కడున్నాడా?' అని వీరోక్తి పలికాడు. ఒక్కడు - అంటే ఒంటరివాడు అని ఒక అర్థం. ఏకైక వీరుడు అని మరొక అర్థం. శ్రీకృష్ణు డొక్కడైనా ఏకైక వీరుడని ధ్వని. ఇవి సంభాషణ చమత్కారాలని భావించినా, శ్రీకృష్ణుడి మాటలు కూడా కురుసభలో సత్యాలు కాబోతున్న భావికథార్థ ధ్వనులవలె వెలుగొందుతున్నాయి. ఈ పద్యంలో శ్రీకృష్ణుడి దివ్యాదివ్య స్వభావం ధ్వని.

2. ఇందులో అర్థవ్యక్తి అనే గుణం భాసిస్తున్నది. శ్రీకృష్ణ స్వభావ స్ఫుటత్వం ఇందులోని అర్థగుణదీప్తి. (సంపా.)

క. పనుపుము కౌరవసభ; కేఁ । జను టెట్లును మేల; యర్థ సంసిద్ధియగున్;
మన కొకటం బాపము రా । కునికికిఁ గతమైన పలుకు లొండెను గలుగున్.' **31**

ప్రతిపదార్థం: కౌరవసభకున్= కౌరవుల కొలువు కూటానికి; పనుపుము= నన్ను పంపుము; ఏన్= నేను; చనుట= అచటికి వెళ్ళటం; ఎట్లును+మేలు+అ= ఏ విధంగా ఆలోచించినా అది మంచిదే; అర్థ సంసిద్ధి+అగున్= మన ప్రయోజనం నెరవేరుతుంది; మనకున్= మనకు; ఒకటన్= ఏ రకంగానూ; పాపము రాక+ఉనికికిన్= దురితం రాకుండటానికి; కతము+ఐన= కారణమైన; పలుకులు+ఒండెను= మాటలైననూ; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: నన్ను కౌరవ సభకు పంపుము. నేనచటికి వెళ్ళటం ఎంతైనా మంచిది. మన కార్యం నెరవేరుతుంది. లేదా మనకు పాపం సంభవించని పలుకులైనా పలకడానికి వీలవుతుంది.'

విశేషం: ఈ పద్యం ధర్మరాజు హృదయాన్ని పూర్తిగా తెలిసికొన్న దూత పలికినట్లుండటం విశేషం. ప్రతి వాక్యం ప్రయోజనాత్మకం.

(1) 'నన్ను కౌరవసభకు పంపుము'- శ్రీకృష్ణుడు స్వతంత్రుడుగా కౌరవసభకు పోయినట్లు కాకుండా ధర్మజుడి రాయబారిగానే వెళ్ళుతున్నట్లు సూచించి, ధర్మరాజ ప్రభుత్వాన్ని గౌరవించాడు, మన్నించాడు.

(2) 'నేను వెళ్ళటం అన్ని విధాలా మంచిది'- ఈ మాట నిజం. ధర్మజుడు సామదాన భేదోపాయాలను ప్రయోగించి, అవన్నీ కౌరవులవలననే భంగమయ్యాయని నిరూపించగల వ్యక్తిని కోరుతున్నాడు. అతడి ఆశయాల నన్నింటిని నెరవేర్చటమే కాక,

చూచి రమ్మంటే కాల్చి వచ్చే సమర్థుడు శ్రీకృష్ణుడు. కర్ణుడితో సాగించిన మంతనాలవంటివి శ్రీకృష్ణుడే చేయగలడు. అవెంతో మేలు చేశాయి. అందువలన సర్వసమర్థుడైన రాయబారి శ్రీకృష్ణుడని స్పష్టం.

(3) ధర్మరాజు కోరినట్లు అర్థసిద్ధి అయ్యేటట్లు, పాపం రానట్లు, కీర్తి కలిగేటట్లు మాట్లాడతానని శ్రీకృష్ణుడు పలకటం ధర్మరాజుకు పరిపూర్ణ సంతృప్తి నిచ్చింది. అర్థమంటే సంపద, ప్రయోజనం అని రెండర్థాలు. ఇక్కడ మొదట సంధి ప్రయోజనసిద్ధి, ఆ తరువాత యుద్ధ విజయసిద్ధి అని గ్రహించవచ్చును. ధర్మజుడి విస్తృతోపన్యాస సారాంశం ఒక కంద పద్యంలో అందంగా చెప్పాడు కృష్ణుడు. ధర్మజుడు గడుసుగా మాట్లాడగలడు. ఒడుపుగా మాట్లాడగలడు. (సంపా.)

వ. అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె: 32

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలకు ధర్మనందనుడు ఇట్లా అన్నాడు:

ఆ. 'మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం। దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లుగాఁగ నొడఁబాటు గావింపు। మెల్లభంగి మనకు నిదియ లెస్స. 33

ప్రతిపదార్థం: మేలుగాక!= శుభమగుగాక;! నీకున్= నీకు; పోలిన+అట్లు+అయినన్= యుక్తమని తోస్తే; అందున్+అరిగి= కౌరవసభకు వెళ్ళి; ఏము= మేము; వారు= కౌరవులు; అర్థిన్= ప్రీతితో; పొంది+ఉండునట్లు కాఁగన్= కూడిఉండేటట్లు; ఒడఁబాటు కావింపుము= అంగీకారం కుదుర్చుము; ఎల్లభంగిన్= అన్ని విధాల; మనకున్= మనకు; ఇది+అ లెస్స= సంధియే మేలు.

తాత్పర్యం: 'కృష్ణా! మంచిది. కురుసభకు వెళ్ళటం నీకు యుక్తమని తోస్తే వెళ్ళి మేమూ, వారూ కలసి మెలసి ఉండేటట్లుగా సంధి కుదుర్చుము. అన్ని విధాలా వారితో సంధి కుదుర్చుకొనటమే మనకు మంచిది.

క. మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు। నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు। పా మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్. 34

ప్రతిపదార్థం: మమ్మున్+ఎఱుఁగుదు(వు)= మేమెట్లాంటి వాళ్ళమో ఎరుగుదువు; ఎదిరిన్+ఎఱుఁగుదు(వు)= కౌరవు లెట్టివారో ఎరుగుదువు; నెమ్మిన్+ఎఱుఁగుదు= కూర్మిఅనగా ఎటువంటిదో ఎరుగుదువు; అర్థసిద్ధినెఱి+ఎఱుఁగుదు(వు)= కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు; వాక్యమ్ముల పద్ధతిన్+ఎఱుఁగుదు(వు)= మాటలాడే తీరు ఎట్టిదో ఎరుగుదువు; నీకున్+బుద్ధులు+చెప్పన్= నీకు ఉపాయాలు బోధించటానికి; నేను+ఎవ్వఁడన్= నేనేపాటివాడిని; పొమ్ము= హస్తినాపురికి వెళ్ళిరమ్ము.

తాత్పర్యం: కృష్ణా! పాండవులూ, కౌరవులూ ఎట్లాంటివారో ఎరుగుదువు. కూర్మి అంటే ఎట్టిదో ఎరుగుదువు. కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు. మాటలాడు తెరగెట్టిదో ఎరుగుదువు. నీకు ఉపాయాలు చెప్ప నేనే పాటివాడిని?, హస్తినకు వెళ్ళి రమ్ము.'

విశేషం: 1. ఈ పద్యం పైకి ప్రశంసావాక్యం, లోన దూతలక్షణవివేకం.

2. ధర్మరాజు చేసిన ఉపన్యాసంలోని లోగుట్టులు తెలిసిన వ్యక్తి శ్రీకృష్ణుడే. మిగిలిన వారికి చూచాయగా మాత్రం గోచరమై ఉండవచ్చును. శ్రీకృష్ణుడు ఆవులిస్తే ప్రేవులు లెక్క పెట్టగలవాడని అతడి సమాధానం బైటపెట్టింది. దానికి లోలోన సంతోషించి ముసి ముసి నవ్వులతో ప్రశంసల జల్లులు కురిపించాడు ధర్మరాజు. 'ఎఱుగుదు(వు)' అనే క్రియను అయిదుసార్లు వాడాడు. ఆరవసారి వాచ్యం చేయకుండా ధ్వనిమయం చేసి సర్వజ్ఞత్వాన్ని సూచించాడు.

3. శ్రీకృష్ణుడిని 'దివ్యుడిగా సర్వజ్ఞుడిగా ప్రశంసించిన తాత్పర్యం ఇది. మమ్ములను గురించి తెలుసు. ఆపైన ఎదుటి వారిని గురించి తెలుసు అనటంలో పాండవాధిక్యాన్ని తెలిసినవాడివని భావం. శ్రీకృష్ణుడిని రాయబారిగా ప్రశంసించిన తాత్పర్యంలో 'నీకు ఉభయ పక్షాలూ తెలు'సని భావం. 'ఇరువురికి ఉన్న అనుబంధ మెటువంటిదో తెలుసు. వాక్య రచనా పద్ధతులు తెలుసు. ఇన్ని తెలిసిన సర్వజ్ఞుడైన నీకు ధర్మనీతులు చెప్పటానికి నేనెంత వాడను?' అని ఒక అర్థం. 'నీకు ఉపాయాలు చెప్పేటంత వాడినా నేను?'- అని మరొక అర్థం. అన్ని వాక్యాలూ ఒక ఎత్తు; చివరివాక్యం ఒక్కటీ ఒక ఎత్తు. ముగింపు వాక్యాన్ని మెరిపించిన వాడే మహావక్త. ఈ పద్యంలో చివరి వాక్యం- తెలుగుదనం పుక్కిట పట్టిన వాక్యం. అప్యాయతకు అచ్చమైన నిదర్శనం. ముచ్చటైన ముగింపు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు సెప్పుట (సం. 5-71-1)

సీ. అనిన ముకుందుఁ డిట్లనియె; 'సంజయుని మా । టలును నీవన్న పల్కులును వింటి;
నీమది ధర్మైకనిష్ఠమై యున్నది; । వైరంబు విడువరు వారు; ద్రోణ
భీష్ములు గలరని బిరుదులై యున్న వా; । రగునె రాజన్యుల కడఁగి కుడువ?
నక్లేశవృత్తి రాజ్యము చవి గొన్న వా । రేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ!
తే. ధార్తరాష్ట్రులు సడికి నధర్మమునకు । నలుక రెన్నఁడు; విడువు దైన్యంబు; పొడువు
కయ్య మరివర్గ జయమునఁ గలుగు నిహ ప । రములుఁ జిరకీర్తియును బాండురాజతనయ! 35

ప్రతిపదార్థం: అనినన్= ధర్మజుడు అట్లా పలుకగా; ముకుందుఁడు= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణమూర్తి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా మాట్లాడాడు; పాండురాజ తనయ!= పాండురాజు పుత్రుడవైన ధర్మజా!; సంజయుని మాటలును= సంజయు డాడిన వాక్యాలూ; నీవు+అన్న పల్కులును= నీవు మాట్లాడిన మాటలూ; వింటిన్= ఆకర్ణించితిని; నీ మది= నీ హృదయం; ధర్మ+ఏకనిష్ఠమైన్+ఉన్నది= ధర్మమునందే ముఖ్యంగా నెలకొని ఉన్నది; వారు= కౌరవులు; వైరంబున్+విడువరు= విరోధాన్ని మానరు; ద్రోణభీష్ములు= గురుడూ, పితామహుడూ; కలరు+అని= తమ పక్షంలో ఉన్నారని; బిరుదులు+ఐ= శూరులై; ఉన్నవారు= ఉన్నారు; రాజన్యులకున్= క్షత్రవంశజులకు; అడఁగి= విధేయులై; కుడువన్= భుజించటం; అగునె?= తగునా?; అక్లేశవృత్తిన్= ఎట్టి కష్టం లేకుండా; రాజ్యము చవికొన్నవారు= రాజ్యం యొక్క రుచి చూచినవారు; నీకున్= నీకు; పాలు= రాజ్యభాగం; ఏల+ఇత్తురు చెపుమ!= ఎందుకిస్తారో చెప్పుము; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కొడుకులు; సడికిన్= నిందకు; అధర్మమునకున్= అన్యాయానికి; ఎన్నఁడున్= ఎప్పుడూ; అలుకరు= భయపడరు; దైన్యంబు= దీనతను; విడువు(ము)= వదలిపెట్టుము; కయ్యము పొడువు(ము)= పోరు సల్పుము; అరివర్గజయమునన్= శత్రు సమూహాన్ని జయించటంవలన; ఇహపరములున్= ఇహపరసుఖాలునూ; చిరకీర్తియున్= శాశ్వత యశమున్నూ; కలుగున్= నీకు లభించగలవు.

తాత్పర్యం: ధర్మనందనుడి మాటలు విని శ్రీకృష్ణు డిట్లా అన్నాడు. 'పాండురాజపుత్రా! సంజయు డాడిన మాటలూ, నీవు పల్కిన పల్కులూ విన్నాను. నీ మనస్సు ధర్మంలో పూర్తిగా నెలకొని ఉన్నది. కౌరవులు పగ మానరు. భీష్మ ద్రోణులు తమ పక్షంలో ఉన్నారని శూరులై నిక్కుతున్నారు. రాజులకు అణగిమణగి యాచించి భుజించటం తగదు. అనాయాసంగా లభించిన రాజ్యం రుచి మరిగిన కౌరవులు పుడమిలో పాలు పంచి నీ కెందు కిస్తారో నీవే చెప్పుము. దుర్యోధనాదులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు. నీవు దైన్యం వదలిపెట్టుము. యుద్ధం సలుపుము. శత్రు సమూహాన్ని జయించటం వలన ఇహపరసుఖాలు సమకూరుతాయి. శాశ్వత కీర్తి లభిస్తుంది.

విశేషం: 1. ఇంతవరకు శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళే రాయబారిగా మాట్లాడాడు. ప్రభువైన ధర్మరాజు నిర్దేశించిన ప్రయోజనాలను సాధిస్తానని నిస్సంశయంగా పలికాడు. ఇక ఇప్పుడు శ్రీకృష్ణుడు మిత్రుడుగా, హితవరిగా, సచివుడుగా పాండవులు నమ్మిన భగవంతుడుగా మాట్లాడుతున్నాడు. ధర్మరాజు ఉపప్లావ్యనగరంలో ఎట్లా వ్యవహరించుకొనాలో చెప్పుతున్నాడు. ఇది పాండవులకు వాసుదేవుడు చెప్పే హితవు.

2.'మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు' అని ధర్మరాజు చేసిన ప్రశంసకు అనుగుణంగా శ్రీకృష్ణుడు తా నెఱిగిన అంశాలను ఈ పద్యంలో నివేదించాడు. 'ధర్మజుడి మనస్సు ధర్మైక నిష్ఠం. ధార్తరాష్ట్రులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు' అని తేల్చి చెప్పాడు. "తన ధర్మాశ్రితా బుద్ధిః । తేషాం వైరాశ్రితా మతిః" (5-71-2) అని మూలం. ధర్మాధర్మాలకు సంధి కుదురుతుందా? అన్న ప్రశ్న లేవనెత్తాడు మాధవుడు. సంధి సందిగ్ధం కాబట్టి పాండవులు సమర సన్నాహం మానకూడదని హితవు చెప్పాడు. ధర్మజుడు చేస్తున్న శాంతి యత్నానికి, పాండవ యుద్ధ సన్నాహం విరుద్ధం కాదని ప్రకటించాడు. శ్రీకృష్ణుడి హితవు అనుష్ఠాన రాజనీతి.

3. తిక్కన మూలంలోని భావాలను సందర్భోచితంగా మార్చి రచించటం సర్వసామాన్యం. దానికి ఉదాహరణగా ఇక్కడ ఒక విషయం చెప్పుకొనవచ్చును. కౌరవులను గురించి చెప్తూ శ్రీకృష్ణుడు -

"అతి గృద్ధాః కృతస్నేహా దీర్ఘకాలం సహోషితాః
కృత మిత్రాః కృతబలా ధార్తరాష్ట్రాః పరంతప". (సం. 5-71-6)

అని అన్నాడని మూలం. 'ధార్తరాష్ట్రులు మిక్కిలి పిసినిగొట్టువారు. అయినా మీరు చాలాకాలం వారితో స్నేహం చేశారు, కలిసి మెలసి ఉన్నారు. మైత్రి పెంపొందించుకొన్నారు. బలాన్ని కూడా పెంపొందించుకొని ఉన్నారు' అనే ఈ మాటలను తిక్కన స్వీకరించక. 'అక్లేశవృత్తి రాజ్యము చవిగొన్న వారేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ?' అని అనిపించాడు. ఈ వాక్యం సన్నివేశౌచిత్యాన్ని పెంచింది.

4. ఎత్తుగీతి తిక్కన పాత్రోచిత సంభాషణ కెత్తిన పతాక! ధర్మజుడి శాంతిప్రయత్నంతో పాండవ స్కంధావారంలో ఉత్సాహం కొంత మందగించినట్లు కనపడింది. అది భావి కార్యసాధనకు పోషకం కాదు. శ్రీకృష్ణు డా సమయంలో పగనూ, సమరోత్సాహాన్నీ, వీరరౌద్రరసస్ఫూర్తినీ పాండవవర్గంలో జాగృతం చేసి రసోల్లాసాన్ని కలిగించదలచాడు. అందువలననే ఎత్తుగీతిలో నినాద కవిత్వం చెప్పాడు. అందులో అంతర్గత తర్కం కూడా ఇమిడ్చాడు. 'కౌరవులు నిందకు భయపడరు కాబట్టి నీవు దైన్యాన్ని వదలిపెట్టుము: వాళ్ళు అధర్మానికి జంకరు కాబట్టి నీవు యుద్ధానికి జంకక వారిమీద దాడి చేయుము' అని రెచ్చగొట్టాడు. శత్రువులను జయించటం వలన ఇహపర సుఖాలూ, చిరకీర్తీ వస్తాయని ధర్మజుడి చిత్తవృత్తికి హత్తుకొనేటట్లు పలికాడు.

5. దూతగా శ్రీకృష్ణుడు శాంతినీ, హితుడుగా యుద్ధాన్నీ అనుసరిస్తూ ద్విముఖ పాత్ర నిర్వహిస్తున్నట్లు కనపడుతున్నా, ధర్మజుడు సాధించ దలచుకొన్న ధర్మనీతికి అది విరుద్ధం కాదని తెలిపే సంభాషణ ఇక ముందు శ్రీకృష్ణుడు సాగించటం గమనార్హం.

6. 'పాండురాజతనయ!' అనే సంబుద్ధి సార్థకం. చిరకీర్తీ, ఇహపరాలూ పాండురాజు పుత్రుడైతేనే కోరుకొంటాడని భావం.

7. ధర్మైకనిష్ఠమై ఉన్న ధర్మరాజు చిత్తవృత్తిని యుద్ధైక నిష్ఠం చేయటానికి శ్రీకృష్ణుడు ప్రయోగించిన ప్రథమ వాఙ్మయోపాయం ఈ పద్యం. (సంపా.)

మ. గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరులై చేసిరి; యంతసేసియును బశ్చాత్తాపముం బొంద నో
పర వా రెన్నఁడు; నట్టిచోటఁ గృపయున్ బంధుత్వముం దక్కు; మె
వ్వరుఁ గోపింపరె యా దురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్. 36

ప్రతిపదార్థం: గురు భీష్మ+ఆదులు= ఆచార్యుడైన ద్రోణుడు; పితామహుడైన భీష్ముడు మున్నగువారు; చూచుచున్+ఉండన్= వీక్షిస్తూఉండగా; సభన్= కొలువులో; మీకున్= మీకు; కీడు= అపకారం; నాఁడు= అప్పుడు; అట్లు= ఆ విధంగా; ముష్కరులు+ఐ= నీచులై; చేసిరి= చేశారు; అంత చేసియును= అంతటి కీడు చేసికూడా; వారు= కౌరవులు; ఎన్నఁడున్= ఒకనాడైనా; పశ్చాత్తాపమున్+పొందన్+ఓపరు+అ= చేసిన తప్పును గూర్చి తరువాత చింతించినవారు కారు; అట్టిచోటన్= అట్టివారి విషయంలో; కృపయున్= కారుణ్యమునూ; బంధుత్వమున్= చుట్టరికాన్నీ; తక్కుము= మానుము; ఆ దురాత్మకుల గర్వ క్రౌర్యముల్= ఆ దుష్టచిత్తుల యొక్క పొగరుబోతుతనం, క్రూరత్వం; చూచినన్= పరికిస్తే; ఎవ్వరున్+కోపింపరె?= ఎంతటి సాధువులైనా కోపగించక మానుతారా?

తాత్పర్యం: గురుడు, భీష్ముడు మొదలైన పెద్దలు చూస్తుండగా, సభలో తుచ్ఛులైన కౌరవులు మీకు ఆనాడు అపకారం చేశారు. అంతటి అపకారం చేసికూడా ఆ తరువాతనైనా, వారు చేసిన తమ తప్పుకు ఎన్నడూ పశ్చాత్తాపం ప్రకటించనేలేదు. అట్టి వారి విషయంలో కారుణ్యం, బంధుభావం విడిచిపెట్టుము. ఆ దుష్టచిత్తులయొక్క పొగరు, క్రౌర్యం చూస్తే ఎవరైనా వారిపై కోపపడకుంటారా?

విశేషం: 1. 'పగ యడగించుటెంతయు శుభంబు'- అన ధర్మరాజుఅభిమతం. అది రాజకీయానికి పనికి వచ్చే శాంతి సూక్తం. కాని, పాండవ స్కంధావారానికి అప్పు డది పనికిరాదు. కురుసభలో పగ సెగలు క్రక్కుతున్న వాస్తవం గమనించి కూడా పాండవులు పగను చల్లార్చుకొనటం సబబుకాదు. అందువలన పగకు మూలమైన కౌరవ దుష్కృత్యాన్ని శ్రీకృష్ణు డిందులో పేర్కొన్నాడు. అందులోనూ ఆ చెప్పే తీరులో ఒక క్రమోన్మీలనం గోచరిస్తుంది. శ్రోతను భావోద్వేగస్థితికి చేర్చే మాటల పొందిక కనబడుతుంది. అది శ్రీకృష్ణుడి ప్రబోధ వాక్యరచనా శిల్పం.

2. కౌరవులు వస్తుతః దురాత్ములు, పైపెచ్చు గర్విష్ఠులు, క్రూరులు. ఈ మూడు గుణా లున్నవారిని లోకంలో ఎవరైనా కోపిస్తారు! గర్హిస్తారు. దురాత్ములు అనటానికి - ద్రోణ భీష్మాదులు చూస్తూ ఉండగా నిండుసభలో పాండవులకు నీచంగా కీడు చేయటమే సాక్ష్యం. ఒకవేళ ఆవేశంలో ఆ తప్పు చేసినా, వారు గర్వాంధులు కాబట్టే చేసిన తప్పుకు పశ్చాత్తాపం కూడా ప్రకటించలేదు. ఇప్పటికీ క్రూరులై మీకు కీడే తలపెట్టుతున్నారు. అటువంటి వారిమీద దయాదాక్షిణ్యాలు కాని, బంధుత్వ మిత్రత్వాలు కాని తగవు. కాబట్టి యుద్ధం వలన బంధునాశన మవుతుందని నిర్వేదం చెందవలసిన అవసరం లేదని హితవు చెప్పాడు. కోపంతో పగసాధించటమే కర్తవ్యమని బోధించాడు.

3. 'ఎవ్వరు కోపింపరె?' అనే ప్రశ్నార్థకం వ్యంగ్యగర్భితం. 'ఎవరు కోపించరు? నీ వొక్కడివి తప్ప' అని భావం. లోకమంతటిదీ ఒకదారి, నీవొక్కడిదీ ఒకదారి - అని సున్నితమైన అధిక్షేపం. కరుడుకట్టుకొన్న భావాలను కరిగించటానికి ప్రశ్నార్థక వాక్యాలు వేడి తూటాల వంటివి. శ్రీకృష్ణుడికి వాటిప్రయోగం బాగా తెలుసు. (సంపా.)

వ. కపటపు నెత్తంబు నెపంబుగా మిమ్ము వెడలనడుచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింపవచ్చునే? వాని విని సమస్త జనంబులు ధృతరాష్ట్రు నిందించుచు మీరు బలవంతులరయి యుండియు సత్యంబు వాటించి యూరకపోక సూచి యచ్చెరు వాటుతో నుమ్మలించుచుండిరి; తిట్టువాట్లం బోయెడువారు దైవోపహతులై మున్న చెడియుండుదురు గావున వారలం జంపనుం జెఱుపనుం జులుకన క్రూరాత్ములగు కౌరవులెల్లవారికి వధ్యులుగాఁ దగుదురు; నీకేల యవధ్యులైరి? పాపాత్మకులగు హింసకులం బాముల నెట్లట్ల నిర్విచారంబుగా వధియించుట కర్తవ్యంబు. 37

ప్రతిపదార్థం: కపటము నెత్తంబు= మోసపు జూదం; నెపంబుగాన్= మిషగా; మిమ్ముృన్= మిమ్ములను; వెడలనడుచు+అప్పుడు= అడవులకు పంపేటప్పుడు; దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు= దుర్యోధనుడు, దుస్ససేనుడు, శకుని, సూతపుత్రుడైన కర్ణుడు; పుయిలోట+తక్కి= సంకోచం వీడి; కలకల నవ్వుచున్= పకపక నవ్వుతూ; పలికిన పలుకులు= మాట్లాడిన మాటలు; ఉగ్గడింపన్+వచ్చునే?= పలుక దగినవా?; వానిన్+విని= ఆ మాటలు విని; సమస్త జనంబులు= ప్రజలందరు; ధృతరాష్ట్రున్+ నిందించుచున్= ధృతరాష్ట్రుడిని దూషిస్తూ; మీరు బలవంతులరు+అయి+ఉండియున్= మీరు బలశాలురై ఉండికూడా; సత్యంబు+పాటించి= సత్యము నవలంబించి; ఊరకపోక+చూచి= తలవంచుకొని అడవులకు వెళ్ళటం చూచి; అచ్చెరు+ పాటుతోన్= ఆశ్చర్యం పొందుటతో; ఉమ్మలించుచున్+ఉండిరి= దుఃఖపడుచుండిరి; తిట్టువాట్లన్+పోయెడువారు= నిందల పాలైనవారు; దైవ+ఉపహతులై= దైవముచే చెరుపబడినవారై; మున్ను+అ= ముందుగానే; చెడి+ఉండుదురు= చెరుపబడినవారౌదురు; కావునన్= కనుక; వారలన్= కౌరవులను; చంపనున్= సంహరించటానికీ; చెఱుపనున్= చెరచటానికీ; చులుకన= తేలిక; క్రూర+ఆత్ములు+అగు= కఠినచిత్తులైన; కౌరవులు= దుర్యోధనాదులు; ఎల్లవారికిన్= అందరికిని; వధ్యులు కాన్+తగుదురు= చంప దగినవారౌతారు; నీకున్= నీకు మాత్రం; ఏల+అవధ్యులు+ఐరి?= ఎందుకు చంపకూడనివారైనారు? పాప+ఆత్మకులు+అగు= పాపంతో కూడిన చిత్తంగల; హింసకులన్= ఘాతుకులను; పాములన్+ఎట్లు= సర్పాలను ఎట్లా వధిస్తారో; అట్లు= ఆ ప్రకారం; నిర్విచారంబుగాన్= ఆలోచించకుండా; వధియించుట కర్తవ్యంబు= చంపటమే చేయదగినపని.

తాత్పర్యం: ధర్మజా! కపట ద్యూతంలో మిమ్ము ఓడించి అడవులకు పంపేటప్పుడు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు సంకోచం లేకుండా పకపక నవ్వుతూ ఆడిన మాటలు నోటితో వెల్లడించరానివి. ఆ మాటలన్నీ విని ప్రజలంతా ధృతరాష్ట్రుడిని దూషిస్తూ, మీరు బలవంతులై ఉండికూడా సత్యమునకు తల ఒగ్గి తలవంచుకొని ఊరక అడవులకు వెళ్ళటం చూచి ఆశ్చర్యపడుతూ దుఃఖించారు. నిందాపాత్రులైనవారు దైవంచేత ముందుగానే చెరుపబడి ఉంటారు. కనుక అటువంటివారిని చంపటం, చెరచటం చాల తేలిక. దుష్టచిత్తులైన కౌరవులు అందరికీ చంపదగిన వారైనప్పుడు నీకు మాత్రం చంపదగనివారైనారా? పాపహృదయులైన హింసాస్వభావులను పాముల నెట్లా ఆలోచించక వధిస్తారో అట్లా వధించడం తగిన పని.

విశేషం: అలం: ఉపమ: అర్థాంతరన్యాసం. పాపాత్ములను, హింసాత్మకులను పాములను నిర్దాక్షిణ్యంగా చంపినట్లు చంపాలి- అనేది ప్రతిపాద్యాంశం. పాముల కున్న విషలక్షణాలు కౌరవులయందు నిరూపించటం ఇందులోని అలంకార శిల్పం.

1. కపట ద్యూత సభలోనూ, అడవులకు పంపేటప్పుడూ పాండవులను దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణ లాడిన పరిహాసోక్తులు పాములు వేసే కాట్లవంటివి. పాముల కాట్లతో చంపబూనినా భీముడు వాటిని నిగ్రహించి బ్రతికిన ఘట్టాలు జ్ఞాపకం వస్తాయి. దుర్యోధనాదుల పరిహాస వాక్యాలు పాండవులకు విషబాధను కలిగించిన మాట వాస్తవం. బాధ కోర్చి సత్యవ్రతాన్ని సహనంతో పాటించిన పాండవుల ఉత్తమప్రవృత్తి ప్రజాదరణం పొందింది. కౌరవులను జనులు నిందించారు. వారి క్రౌర్యానికి కన్నీరు పెట్టారు. శ్రీకృష్ణుడు వాటిని మృత్యుదంష్ట్రల కాట్లగా అభివర్ణించాడు. పాము కాటుకు విరుగుడున్నది కాని, చావు కాటుకు తిరుగు లేదు. ఈ నీతితో కౌరవులు దైవోపహతులు. వారు తమ పాపకార్యాలతో ధార్మికంగా, నైతికంగా హతులైనారు. చనిపోయినవారిని భౌతికంగా చంపటమే మిగిలి ఉన్నదన్నాడు. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడిలో భగవద్గీతాచార్యుడు ప్రత్యక్షమవుతున్నాడు. అందుకే పాండవులను కౌరవుల వధకు ప్రేరేపించాడు.

2. పగ కలిగి ఉన్న మనసు పాముల పుట్టలున్న ఇల్లు వంటిదని ధర్మరాజన్నాడు. (3.20) దానికి శ్రీకృష్ణు డిస్తున్న ప్రచ్ఛన్న ప్రత్యాఖ్యానం.

ధర్మరాజు మనసులో పుట్టపెట్టుకొని ఉన్న పాము లెవరో కాదు- కౌరవులే. ఆ పాములను చంపకపోతే శాంతి ఎట్లా కలుగుతుంది? అని ఎదురు ప్రశ్న వేస్తున్నాడు. కాబట్టి 'వధించుట కర్తవ్యంబు' అని తర్కబద్ధంగా తేల్చి ఫలితాంశాన్ని నిర్దేశించాడు. శ్రీకృష్ణుడి తర్కానికి తట్టుకొనటం సామాన్యులకు సాధ్యం కాదు. (సంపా.)

క. మీ తండ్రికి భీష్మునకుం । జేతోముద మొదవ భక్తి సేయన తగు నీ;
కా తలకు నేనుఁ జని వి । ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్. 38

ప్రతిపదార్థం: మీ తండ్రికిన్= మీ జనకుడైన ధృతరాష్ట్రుడికీ; భీష్మునకున్= తాతయగు భీష్ముడికీ; చేతస్(ః)+ముదము= హృదయానికి సంతోషం; ఒదవన్= కలుగునట్లు; నీకున్= నీకు; భక్తి చేయన్+అ తగున్= భక్తి చూపటమే యుక్తం; నేనున్= నేను; ఆ తలకున్= అక్కడికి; చని= వెళ్ళి; విఖ్యాతంబుగన్= వెల్లడిఅయ్యేటట్లు; నీదు వినయము= నీ అడకువను; అభివర్ణింతున్= పొగడుతాను.

తాత్పర్యం: ధర్మజా! మీ తండ్రి ధృతరాష్ట్రుడికీ, తాత భీష్ముడికీ, హృదయానందం కలిగేటట్లు భక్తి చూపటమే నీకు ఉచితం. నేనా కురుసభకు వెళ్ళి నీ వినయగుణాన్ని అందరికీ తేటపడేటట్లు లెస్సగా వర్ణిస్తాను.

విశేషం: కురుసభలో ధృతరాష్ట్రుడు మెచ్చుకొంటే సాహసించి రాజ్యంలో సగభాగం ఇవ్వవచ్చును. భీష్ముడు సంతోషిస్తే ధృతరాష్ట్రాదులకు హితవు చెప్పి పాండవులకు న్యాయం జరిగేటట్లు చూడవచ్చును. లేదా యుద్ధమే జరిగితే స్వేచ్ఛామరణశక్తి ఉన్న ఆ పితామహుడు స్వీయ వధోపాయాన్ని పాండవులకు చెప్పవచ్చును. వారి మనసులలో అట్టి సౌముఖ్యాన్ని కలిగించాలంటే కురుసభలో శ్రీకృష్ణుడు ధర్మజుడి వినయాది గుణాలను ప్రస్తుతించటం రాజనీతి. ఇది భేదోపాయంలో ఒక భాగం. (సంపా.)

క. చెలులుం జుట్టలు దేశం । బులరాజులు వినఁగ నీదు పుణ్యచరిత్రం
బులు నీవు ధర్మమార్గము । దలఁచుటయుం దెలియఁబలికెదం గురుసభలోన్. 39

ప్రతిపదార్థం: చెలులున్= మిత్రులూ; చుట్టలున్= బంధువులూ; దేశంబుల రాజులున్= నానా దేశాధిపతులూ; వినఁగన్= వింటూ ఉండగా; నీదు పుణ్య చరిత్రంబులు= నీ పవిత్రమైన నడవడులు; నీవు ధర్మమార్గము తలఁచుటయున్= నీవు న్యాయ మార్గాన్ని ఎంచుకొన్న తీరూ; కురు సభలోన్= కౌరవుల కొలువులో; తెలియన్+పలికెదన్= స్పష్టంగా వక్కాణిస్తాను.

తాత్పర్యం: మిత్రులూ, బంధువులూ, నానా దేశాల రాజులూ ఆలకించగా నీ పావనమైన ప్రవర్తనమూ, నీవు ధర్మమార్గం అవలంబించే తీరూ కౌరవుల సభలో అందరికీ తెలిసేటట్లుగా మాట్లాడుతాను.

విశేషం: కురుసభలో సంధికార్యం ఫలించినా ఫలించకపోయినా సభ్యులైన బంధుమిత్రులైన రాజులందరూ పాండవుల ధర్మనీతి వర్తనాన్ని మెచ్చుకొని, కౌరవులను నిందించి నిరసించేటట్లుచేయటమే ధర్మజ వ్యూహం. దానిని సఫలంగా నిర్వహిస్తానని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. (సంపా.)

వ. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగుమాలిన మాట లాడుటయుఁ దండ్రి యతని వారింప నేరమికిఁదో డుపేక్షకుం డగుటయుఁ జూచి, మీ తొల్లింటిపాట్లునుం దలంచి యెల్లవారును వారిన గర్హింతు; రింతియ కాక మనకు నొండేమి వలయు? నా యోపినంతయుఁ బెక్కు భంగుల సంధియ కావింపఁజూచెద; నవ్విధంబు

సిద్ధించిన మేలుగాదె! యట్లుగాకతక్కిన నచ్చోటి యుత్సాహంబు చందంబును, నందుఁ జేయంగలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద. 40

ప్రతిపదార్థం: దానికిన్= నా పలుకులకు; దుర్యోధనుండు+ఇయ్యకొనక= సుయోధను డంగీకరించక; తెఱంగు మాలిన మాటలు+ఆడుటయున్= న్యాయం తప్పిన పలుకులు పలకటమున్నూ; తండ్రి= జనకుడైన ధృతరాష్ట్రుడు; అతనిన్= దుర్యోధనుడిని; వారింపన్ నేరమికిన్+తోడు= అడ్డగించలేనందుకు తోడుగా; ఉపేక్షకుండు+అగుటయున్= ఉదాసీనుడు కావటమున్నూ; చూచి= కనుగొని; మీ తొల్లింటి పాట్లునున్+తలంచి= మీరు మునుపు పడిన కష్టాలను స్మరించి; ఎల్లవారును= సభలోని వారందరూ; వారిన్+అ= ఆ కౌరవులనే; గర్హింతురు= నిందిస్తారు; ఇంతియకాక= ఇంతకంటెను; మనకున్+ఒండు+ ఏమివలయున్?= మనకు మరేమి కావలెను?; నా+ఓపినంతయున్= నా శక్తి కొలది; పెక్కు భంగులన్= అనేక రీతుల; సంధి+అ కావింపన్+చూచెదన్= సంధి చేయటానికే యత్నిస్తాను; ఆ విధంబు సిద్ధించినన్ మేలు+కాదె!= అట్లా సంధికార్యం నెరవేరితే మంచిదే కదా! అట్లు కాక తక్కినన్= అట్లా సంధి కార్యం నెరవేరకపోతే; అచ్చోటి+ఉత్సాహంబు చందంబును= ఆ కౌరవుల యొక్క ప్రయత్నాల తీరునూ; అందున్+చేయన్+కలవారి వర్తనంబులున్= అక్కడ యుద్ధం చేయగలవారియొక్క ప్రవర్తనలనూ; కొలందులున్= వారి వారి శక్తియుక్తుల పరిమాణములనూ; ఎఱింగి= గ్రహించి; నీకున్= నీకు; విజయంబు+అగు విధంబునన్= గెలుపు చేకూరే పద్ధతిలో; చనుదెంచెదన్= మరలివస్తాను.

తాత్పర్యం: నేను సభలో పలికిన పలుకులకు దుర్యోధనుడు సమ్మతించక న్యాయం విడిచి ప్రసంగించటం, ధృతరాష్ట్రుడు అతడి మాటలు తిరస్కరించకపోవటమే కాక తాను ఉదాసీన వైఖరి వహించటం కనులారా చూస్తూ, మీరింతకుముందు అనుభవించిన కష్టాలన్నిటినీ స్మరించి సభలోనివారంతా ఆ కౌరవులనే చీకొడతారు. ఇంతకు మించి మనకు కావలసింది ఏముంది? నా శక్తి కొలది బహు విధాల సంధికే ప్రయత్నిస్తాను. సంధి కుదిరితే మంచిదే. ఒకవేళ కుదరకపోతే ఆ సభలోని వారి ప్రయత్నాలు ఎట్లా ఉన్నవో, యుద్ధం చేయగల అచటివారి ప్రవర్తనలూ, వారి సామర్థ్యాలూ ఏపాటివో గ్రహించి, నీకు విజయం సమకూడేవిధంగా మరలివస్తాను.

విశేషం: ఒక రాయబారివలన సాధించబడే ఉపాయాలన్నీ సాధించగలనని శ్రీకృష్ణుడు మాట ఇచ్చాడు. ధర్మరాజు చెప్పని మరొక విశేషం కూడా పలికాడు. శత్రు బలాబల రహస్యాలు తెలిసి కొనిరావటం రాయబారంలో ఔపచారికాంశం. ధర్మరాజుకు విజయం కలిగేటట్లు తిరిగి రావటం రాజనీతి పరాకాష్ఠ. దానిని కూడా శ్రీకృష్ణుడు సాధిస్తే 'చూచి రమ్మంటే కాల్చిరాగల' ప్రతిభను ప్రదర్శించినట్లవుతుంది. (సంపా.)

తే. ఆ సుయోధను ముక్కున నావి గలుగఁ । బుడమి నీ కీఁడు గావునఁ బోర కలుగు,
నేను గయ్యపు శకునంబు లెన్నియేనిఁ । గంటి; నీ వనుత్సాహివి గాఁగ వలదు. 41

ప్రతిపదార్థం: ఆ సుయోధను ముక్కునన్= ఆ దుర్యోధనుడి ముక్కులో; అవి కలుగన్= ఊపిరి ఉండగా; పుడమిన్= భూమిని; నీకున్+ఈఁడు= నీకు పంచి ఇవ్వడు; కావునన్= కనుక; పోరు+అ కలుగున్= యుద్ధమే సంభవిస్తుంది. నేను కయ్యపు శకునంబులు= నేను యుద్ధ నిమిత్తాలు; ఎన్నియేనిన్+కంటిన్= ఎన్నో చూచాను; నీవు+అనుత్సాహివి+కాఁగన్+వలదు= నీవు యుద్ధ ప్రయత్నాలు విరమించవద్దు. (నీవు యుద్ధోత్సాహం లేనివాడవు కావద్దు.)

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి ముక్కులో శ్వాస ఉన్నంతకాలం అతడు నీకు రాజ్యభాగం ఇవ్వడు. యుద్ధం తప్పదు. పోరు జరిగే శకునాలు నేనెన్నో చూచాను. కాబట్టి (ఈ తరుణంలో శాంతి, సంధి - అంటూ) యుద్ధోత్సాహాన్ని మాని(శాంతమూర్తివై) ఉండవద్దు.

విశేషం: 'ముక్కున నావి గలుగ' - చక్కని తెలుగు నుడికారం, 'నీ వనుత్సాహివి గాఁగవలదు' అన్నది శ్రీకృష్ణుడి ఉపన్యాస పరమ తాత్పర్యం. (సంపా.)

వ. చతురంగ బలంబుల నాయితంబు గావించుచు దొరలం బురికొల్పికొనుచు నాలస్యంబులేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండవలయునని పలికిన విని వృకోదరుండు దామోదరున కిట్లనియె: 42

ప్రతిపదార్థం: చతురంగబలంబులన్= రథ గజ తురగ పదాతులను; ఆయితంబు+కావించుచున్= సంసిద్ధం చేస్తూ; దొరలన్= రాజులను; పురి కొల్పికొనుచున్= యుద్ధానికి ప్రేరేపిస్తూ; ఆలస్యంబు లేక= జాగుచేయక; సమరంబునకున్= యుద్ధానికి; సన్నాహంబు+చేయుచున్+ఉండన్+వలయున్= ప్రయత్నాలు చేస్తూ ఉండాలి; అని పల్కినన్= అని శ్రీకృష్ణు డనగా; విని; వృకోదరుండు= భీముడు; దామోదరునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజా! రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, కాలిబంటులు అనే నాలుగు రకాల సేనా విశేషాన్ని సంసిద్ధం చేసికొని, దొరలను యుద్ధానికి ప్రేరేపిస్తూ ఆలస్యం జరగకుండా కదనానికి సన్నాహాలు సాగించు అని శ్రీకృష్ణు డన్నాడు. ఆ మాటలు విని భీమసేనుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. చతురంగ బలాలు= రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, పదాతులు అనే సైన్యంలోని నాలుగు అంగాలు.

2. **"సాంగ్రామికం తే యదుపార్జనీయం । సర్వం సమగ్రం కురు తన్నరేంద్ర!' (సం.5-71-36)** అనే మూలశ్లోకానికి ఈ వచనం వివరణం. ఇది భావికథార్థ సూచన. శ్రీకృష్ణుడు కర్ణుడితో - యుద్ధం రాబోయే అమావాస్య నాడు ప్రారంభమవుతుందని ప్రకటించి రాబోతున్నాడు. అందువలన ఏ క్షణంలోనైనా యుద్ధయాత్ర సాగించే యత్నంలో ఉండాలని శ్రీకృష్ణుడు ధర్మరాజును హెచ్చరించాడు. (సంపా.)

క. 'సమరంబు గలుగు ననుచును । మము వెఱపింపంగ వలదు మాధవ! నీ వా
కుమతి యగు ధార్తరాష్ట్రుఁడు । శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్.' 43

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; నీవు= నీవు; సమరంబు కలుగున్+అనుచును= యుద్ధం సంభవిస్తుందని పలుకుతూ; మమున్= మమ్మల్ని; వెఱపింపంగన్+వలదు= భయపెట్టవద్దు; ఆ కుమతి+అగు= ఆ చెడుబుద్ధి కల్గిన; ధార్తరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; శమించు కార్యంబు= అణగి మణగి ఉండే పనిని; సౌజన్యమునన్= మంచితనంతో; నడపు(ము)= ప్రవర్తింపజేయుము.

తాత్పర్యం: 'లక్ష్మీవల్లభా! యుద్ధం జరుగుతుందని చెప్పుతూ మమ్ము భయపెట్టవద్దు. దుష్టచిత్తుడైన ఆ దుర్యోధనుడు అణగి మణగిఉండే పనిని సద్భావంతో సాధించుము.'

విశేషం: 1. ఈ పద్యం నాటకీయతకు చక్కని ఉదాహరణం.

2. 'సమరానికి సన్నాహం చేయు'మన్న శ్రీకృష్ణుడి వాక్యానికి భీముడు స్పందించి, 'సమరంబు గలుగు ననుచు మము వెఱపింపవలదు' అని పలకటం నాటకీయం. ఒక రకమైన ప్రయోగాతిశయం.

3. తన అభిప్రాయం ఎవ్వరూ అడుగకుండానే భీముడు సంభాషణ మొదలుపెట్టి తన ఆవేశ స్వభావాన్నీ, అన్నగారి మాటను శ్రీకృష్ణుడు కాదంటున్నాడని భ్రమించి తొందరపడటంలో ధీరోద్ధతనూ ప్రదర్శించాడు. అయితే అతడు నిష్కల్మషుడు కావటం చేత ఎవరూ అపార్థం చేసికొనరు.

4. భీముడి మాటల వలన అతడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా కంటే, అదివ్యుడైన దూతగానే భావిస్తున్నట్లుగా స్పష్టం. (సంపా.)

వ. అని వెండియు. 44

తాత్పర్యం: అని మళ్ళీ భీమసేనుడు (ఇట్లా అన్నాడు).

శా. 'పాపాత్ముండు మదాంధుఁ డా తులువ నీపంపెట్లునుం జేయఁగా
నోపం; డడ్డము సెప్ప రెవ్వరును; మానోద్రేకమున్ గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పోనిత్తురు; గాన ని న్నతఁడు జాలింబెట్టెడుం జూడుమీ! 45

ప్రతిపదార్థం: ఆ తులువ= ఆ కుత్సితుడైన దుర్యోధనుడు; పాప+ఆత్ముండు= దురితచిత్తుడు; మద+అంధుఁడు= మదముచేత కన్నుగాననివాడు; నీ పంపు= నీ ఆజ్ఞ; ఎట్లునున్= ఏ విధంగానూ; చేయఁగాన్+ఓపండు= చేయలేడు; ఎవ్వరును= ఏ ఒక్కరైనను; అడ్డము చెప్పరు= అతడిని ఎదిరించి మాట్లాడరు; మాన+ఉద్రేకమున్= అహంకారము యొక్క ఆటోపమునూ; గర్వమున్= పొగరుబోతుతనమునూ; కోపంబున్= క్రోధమునూ; తనున్+త్రిప్పన్= తనను ఆడిస్తుండగా; ఆప్తజనులన్= ఆత్మీయులైనవారిని; కుందించుటన్= దుఃఖపెట్టటం చేత; పోయినట్లే పోనిత్తురు= అతడు వెళ్ళే దారినే చూస్తూ ఊరకుంటారు; కాన= కాబట్టి; నిన్నున్= నిన్ను; అతఁడు= ఆ దుర్యోధనుడు; జాలిన్+పెట్టెడున్= చింతల పాలు చేయగలడు; చూడుమీ= గ్రహింపుమా! (చూస్తూ ఉండుము)

తాత్పర్యం: 'మాధవా! ఆ దుర్యోధనుడు కలుషాత్ముడు. మదంచేత కన్ను మిన్ను కాననివాడు. కుత్సితుడు. నీ ఆదేశం మన్నించడు. ఒక్కరైనను అతడి మాటకు అడ్డు చెప్పలేరు. అహంకారం, గర్వం, కోపం తనను పట్టి ఆడిస్తుండగా ఆప్తులను సైతం అతడు దుఃఖపెట్టుతున్నాడు. అత డేమైపోయినా తమకేమి లెమ్మని అందరూ మిన్నకుండటం చేత ని న్నతడు సంకటపరుస్తాడు సుమా!

విశేషం: హస్తినాపురాన్ని తలచుకొంటే భీముడికి పాపాత్ముడైన దుర్యోధనుడే జ్ఞాపకం వస్తాడు. అతడు చేసిన అపకారాలు గుర్తుకు వస్తాయి. కోపోద్రేకం కలుగుతుంది. ఆవేశంలో అతడిని నిందిస్తాడు. ఇది భీమ స్వభావం. ఆ సహజ స్వభావానికి ఈ పద్యం అద్దం పట్టుతున్నది. దుర్యోధనుడు పాపాత్ముడనీ, మదాంధుడనీ, తులువ అనీ, నోరారా తిట్టితేతప్ప అతడికి తృప్తి ఉండదు. అతడిలో దురహంకారం, గర్వం, కోపం అనే దుష్ట గుణాలు ఉంటాయనీ, వాటి వలన పరులను, ఆత్మీయులను బాధపెట్టుతాడనీ, పెద్దల మాటలు వినడనీ, భీముడిని తిప్పలు పెట్టుతాడనీ పేర్కొంటాడు. శత్రువైన దుర్యోధనుడిని గురించి భీముడికి ఎంత స్పష్టమైన అవగాహన ఉన్నదో ఈ పద్యం స్పష్టం చేస్తున్నది. (సంపా.)

ఉ. చొచ్చిన చోన చొచ్చి తెగఁ జూచెద నంచుఁ గడంగుచుండు; న
న్మెచ్చఁడు బాహుగర్వమున; నీచు సుయోధనుఁ; డట్టివానితోఁ
బొచ్చెములేక కూడి మనఁ బోవక పోవఁగరాదు నాకు వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశము చేటున కోపకుండుటన్. 46

ప్రతిపదార్థం: నీచు సుయోధనుఁడు= తుచ్ఛుడైన దుర్యోధనుడు; చొచ్చిన చోన్+అ= నేను ప్రవేశించినచోటనే; చొచ్చి= తానూ ప్రవేశించి; తెగన్+చూచెదన్+అంచున్= నన్ను చంపుతా నంటూ; కడంగుచున్+ఉండున్= పూనిక వహిస్తూ ఉంటాడు;

బాహుగర్వమునన్= భుజవిక్రమంలో; నన్+మెచ్చఁడు= నన్ను లెక్కించడు; విప్పచ్చుఁడు= బీభత్సుడు (అర్జునుడు); రాచవారున్= ప్రభువైన ధర్మరాజు; కురువంశము చేటునకున్= కురువంశముయొక్క వినాశానికి; ఓపక+ఉండుటన్= సహింపకుండటంచేత; అట్టివానితోన్= అటువంటి (అల్లుడైన) దుర్యోధనుడితో; నాకున్= నాకు; పొచ్చెములేక= కపటంలేక; కూడి= కలసి; మనన్+ పోవక= జీవించనెంచక; పోవఁగన్+రాదు= తప్పుకొనటానికి వీలులేకుండా ఉన్నది.

తాత్పర్యం: నేను ప్రవేశించిన చోట తానూ ప్రవేశిస్తూ నన్ను చంపటానికి యత్నిస్తుంటాడు. భుజ విక్రమంలో నన్ను లెక్కించడు. ఆతడు వట్టి తుచ్ఛుడు. ఫల్గునుడూ, ప్రభువైన ధర్మజుడూ కురువంశ వినాశానికి సమ్మతించ కుండటం వలన ఆ దుర్యోధనుడితో నిష్కపటంగా కలసి మెలసి జీవించడం నాకు తప్పేటట్లు లేదు.

విశేషం: భీముడి ఆత్మాభిమానమే కాక, అమాయకత్వం కూడా బైటపడుతున్నది. (సంపా.)

ఉ. పాండవ కౌరవుల్ గలసి పాలును నీరును బోలె నెమ్మిమై
నుండఁగ దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె; నాతఁ డొ
క్కండ కులక్షయంబునకుఁ గారణమం; డ్రది దప్పు; దైన నీ
వొం డన నేల యా బిరుదు నోపిన యంతయుఁ దీర్పు నేర్పునన్. 47

ప్రతిపదార్థం: పాండవ కౌరవుల్= పాండవులూ, కౌరవులూ; పాలును నీరును+పోలెన్= పాలూ నీరూ వలె; కలసి= (విడదీయటానికి వీలు లేనట్లుగా) కలిసిపోయి; నెమ్మిమైన్= ప్రేమతో; ఉండఁగన్= జీవిస్తూ ఉండగా; దుష్టచేష్టలన్= దుండగపు పనులతో; సుయోధనుఁడు; ఇంతలు+చేసెన్= ఇట్టి దుర్ణయాలు కావించాడు; ఆతఁడు+ఒక్కఁడు+అ= అతడొక్కడే; కులక్షయంబునకున్= వంశ వినాశనానికి; కారణము+అండ్రు= హేతువని పెద్దలు చెప్పుతారు; అది+తప్పదు= ఆ మాట వృథా కాదు; అయినన్= అయినప్పటికినీ; నీవు; ఒండు+అనన్+ఏల?= నీవు వేరొక మాట పలుకుటెందుకు?; ఆ బిరుదున్= ఆ శూరుని; ఓపిన+అంతయున్= శక్తిఉన్నంత వరకూ; నేర్పునన్= చాతుర్యంతో; తీర్పు(ము)= చక్కబఱచుము.

తాత్పర్యం: పాండవులూ, కౌరవులూ పాలూ నీరూవలె కలసి మెలసి ప్రేమతో జీవిస్తుండగా దుర్యోధనుడు తన దుండగపు పనులతో ఒద్దిక చెరచివేశాడు. అతడే ఈ కురువంశ వినాశానికి కారణమని పెద్దల మాట ఆ మాట ఎన్నటికినీ తప్పదు. ఐనప్పటికీ నీవు నేర్పుతో శక్తి కలిగినమేరకు ఆ జగజెట్టిని దారిలో పెట్టజూడుము.

విశేషం: 1. అలం: ఉపమ, క్రమం. పాండవులూ కౌరవులూ పాలూ, నీరూ వంటివారు. ఉపమాన ఉపమేయాలను ఆ వరుసలోనే గ్రహించాలి. కాబట్టి క్రమాలంకారం. పాండవులు పాలవంటివారు. కౌరవులు నీళ్ళవంటివారు. అంటే నీళ్ళకంటె పాలు చిక్కన. కౌరవులకంటె పాండవులు బలవంతులు అని ధ్వని. ఇందులో మరొక విశేషం కూడా ఆలోచిస్తే స్ఫురిస్తుంది. పాలతో కలిసి ఉంటేనే నీటికి గౌరవం. నీళ్ళతో పాలు కలిపిస్తే పాలకు విలువ లేదు. పాలూ నీరూ కలిసి ఉన్నప్పుడు వాటిని వేరు చేసేది హంస. కాని, దుర్యోధనుడు హంస కాదు. కాకి. అతడు చేసింది నీరక్షీర వివేకం కాదు. కలిసి వున్న పాలనూ నీళ్ళనూ కలుషితం చేశాడు. కలిసి ఉన్న గుణం కలిగించేది కులవృద్ధి. దానిని పాడు చేయటం కులక్షయం. పాడైపోయిన పాలు ఏ ప్రయోజనాన్నీ పొందలేవు. ఈ తాత్పర్యం మరొక వ్యంగ్యార్థం.

2. ఈ మాటలంటున్న భీముడు ధర్మరాజుతమ్ము డనిపించుకొన్నాడు. అయితే ధర్మజుడు తన భావాన్ని గూఢంగా నిపుణంగా చెప్పగలడు. భీముడు బయటపడి ఘాటుగా చెప్పగలడు. ధర్మరాజుకూ సంధిమీద నమ్మకం లేదు. అయినా

అంతకంటె మించిన రాజనీతి ప్రయోజనాల కొరకు, భేదోపాయాన్ని ప్రయోగించటం కొరకు శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపుతున్నాడు. ఆ సంగతి అందరికీ తెలిసేటట్లు చెప్పాడు. కాని, భీముడికి ఆ వ్యూహరహస్యాలు తెలియవు. దుర్యోధనుడిని కులక్షయ కారకుడిగా నిరూపించటానికే శ్రీకృష్ణుడి రాయబారం పనికి వస్తుందని భావించాడు. భావాభివ్యక్తితో ఈ రెండు పాత్రల తారతమ్యం పరమ రమణీయం.

3. భీముడికి దుర్యోధనుడు ఆగర్భశత్రువు. ఆ దుర్మార్గుడు భీముడిని చంపటానికి చేసిన కుతంత్రాలు ఇన్నీ అన్నీ కావు. భీముడు లేకపోతే పాండవులు లేనట్లే అని సుయోధనుడి అంచనా. అతడంటే భీముడికి అమితకోపం. దుర్యోధనుడు పుట్టినప్పుడే అతడు కులక్షయకారకుడని ఆకాశవాణి పలికింది. ఆ తరువాత వ్యాసమహర్షి చెప్పాడు. అయినా, ధృతరాష్ట్రుడు వాటిని పట్టించుకొనలేదు. దుర్యోధనుడి దుష్టచేష్టలన్నీ క్రమంగా కులక్షయానికే దారితీస్తున్నాయి. సంధి యత్నం సాగుతుందనే నమ్మకం భీముడికీ లేదు. అయినా, శ్రీకృష్ణుడు రాయబారం చేయవలసిందే, ధర్మజుడి ఆనతి పాటించవలసిందే- అని భీముడి అభిప్రాయం.

4. ఈ పద్యంలో 'దుష్టచేష్టలు', 'ఇంతలు సేసె' 'అది తప్పదు', 'నీవు ఒండన నేల?', 'ఆ బిరుదు' అనే పదాలు తెలుగు పలుకుబడిని పుక్కిటబట్టాయి. అంత, ఇంత, ఎంత అనే అవ్యయాలకు తెలుగులో ఎంతటి శక్తి ఉన్నదో అంతటిశక్తి 'ఇంతలు సేసె' అనే వాక్యంలో ఉన్నది. జరిగిన కథంతా అందులో ధ్వనిస్తుంది. శబ్దప్రయోగౌచిత్యానికి ఇవి ప్రమాణాలు.

5. తిక్కన నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ఒక ప్రత్యేకత. భీముడు లౌకిక వాది. అతడికి భుక్తియందున్న ఆసక్తి భక్తియందు లేదు. అందుకే 'పాలు నీరు' ఉపమానం తీసికొన్నాడు. పరమాత్ముడైన హరిని రాయబారిగానే మన్నిస్తాడు. అతడిలోని దివ్యత్వం ఇతడికి కనపడదు. భీమపాత్రోచితమైన సంభాషణ ఇది. ఇట్లాగే ఈ సన్నివేశంలో ధర్మజ, అర్జున, నకుల, సహదేవులూ, ద్రౌపదీ, శ్రీకృష్ణుడూ, చేసే సంభాషణలలో వారి వారి సంస్కారాలు గుబాళిస్తుంటాయి. ఇటువంటి రచన రసధ్వనిలోని ఒక మెళకువ; నాటకీయ రచనాశిల్పంలోని ఒక రహస్యం. (సంపా.)

6. ఈ సందర్భంలో భీముడు కులక్షయ కారకులైన అసురవంశ రాజులను పదునెనిమిది మందిని పేర్కొన్నట్లు మూలంలో ఉన్నది. వారు- 1. హైహయవంశజుడైన ముదావర్తుడు 2. నీప కులానికి చెందిన జనమేజయుడు 3. తాలజంఘ వంశజుడైన బహుళుడు 4. క్రిమి కులోద్భవుడు వసువు 5. సువీరవంశజుడు అజబిందువు 6. సురాష్ట్ర కులజుడు రుషర్ధికుడు 7. బలీహ వంశజుడు అర్కజుడు 8. చీనీయ వంశం వాడైన ధౌతమూలకుడు 9. విదేహ వంశీయుడైన హయగ్రీవుడు 10. మహౌజ క్షత్రియ వంశజుడు పరాయువు 11. సుందరవంశీయుడు బాహువు 12. దీప్తాక్షకులజుడైన పురూరవుడు 13. చేది మత్స్య వంశీయులలోని సహజుడు 14. ప్రవీర వంశంలోని వృషధ్వజుడు 15. చంద్రవత్స కులజుడు ధారణుడు 16. ముకుట వంశీయుడు విగాహనుడు 17. నందివేగ కులోద్భవుడు శముడు 18. చంద్ర వంశజుడైన దుర్యోధనుడు. (వివరాలకు చూడు: సం. 5-72-11 నుండి 18).

చ. తన పొరిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాన నే
ర్చునె ధృతరాష్ట్ర సూనుఁడు? యశోభరితంబగు భారతాన్వయం
బున కొక నిందవచ్చు ననుబుద్ధి దురాత్మున కేలకల్గు? నా
యనమెయిఁబోయి హీనగతినైన ఘటించిన నెంత యొప్పునో! 48

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రసూనుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; తన పొరిపోవునంతకున్= తాను చచ్చేవరకూ; ఉదగ్రతయున్= క్రౌర్యమునూ; కపటమున్= మోసమునూ; మానన్+నేర్చునె?= విడువగలడా?; యశోభరితంబు+అగు= కీర్తితో నిండిన; భారత+అన్వయంబునకున్= భరతుడు జన్మించిన వంశానికి; ఒక నింద వచ్చున్= అపకీర్తి కల్గుతుంది; అను బుద్ధి= అనే తలంపు; దుర్+ఆత్మునకున్= దుష్టహృదయుడైన ఆ దుర్యోధనుడికి; ఏల+కల్గున్?= ఎందుకు జనిస్తుంది?;

ఆయన మెయిన్+పోయి= అతడి తలంపు ననుసరించి; హీనగతిన్+ఐనన్= నీచస్థితితో నైనను; ఘటించినన్= సంధి కుదుర్చుకొంటే; ఎంత+ఒప్పునో!= ఎంత బాగుంటుందో కదా!

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు తాను చచ్చేవరకూ తన క్రౌర్యాన్నీ, మోసమునూ విడిచిపెట్టడు. కీర్తిమంతమైన భరతవంశం అపకీర్తి పాలవుతుందే అనేతలంపు ఆ దుష్టచిత్తుడికి కలుగనే కలుగదు. ఆ సుయోధనుడి మనోవైఖరి ననుసరించి నీచత్వానికి దిగజారిఅయినా మనం సంధి కావించుకొంటే అదెంతో మేలుగా ఉంటుంది.

విశేషం: 1. 'ఆయన మెయిన్+పోయి'= మా అన్న ధర్మజుడి తలంపు ననుసరించి - అనిన్నీ, నాయన మెయిన్+పోయి= తండ్రి అయిన ధృతరాష్ట్రుడి తలంపు ననుసరించి - అనిన్నీ అన్వయం చెప్పటానికి వీలుంది.

2. విరాటోద్యోగ పర్వాలలో భీముడు తన సహజమైన ఔద్ధత్యాన్ని తగ్గించుకొని ఉదాత్తుడి వలె వ్యవహరించాడు. ఈ పద్యం అట్టి ప్రవృత్తికి చక్కని ఉదాహరణం. ఇది భీముడికి అలంకారం కాదనీ, కార్యసాధకం కాదనీ శ్రీకృష్ణుడు భావించి అతడిని యుద్ధోత్సాహపూరితుడినీ, ఉద్ధతుడినీ చేయాలని యత్నిస్తాడు. (సంపా.)

వ. అని పలికి, మాకును వారికిఁ బితామహుండగు భీష్ముండు వినుచుండ సుయోధనుతోడం గురుకులేశ్వరు నాస్థానంబున నా వచనంబులుగా నిట్లనుము. 49

ప్రతిపదార్థం: అని, పలికి; మాకును, వారికిన్= (పాండవులకూ, కౌరవులకూ); పితామహుండు+అగు= తండ్రియొక్క తండ్రి (తాత); అయిన; భీష్ముండు; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; కురుకుల+ఈశ్వరు+ఆస్థానంబునన్= ధృతరాష్ట్రుడి నిండు కొలువులో; సుయోధను తోడన్= దుర్యోధనుడితో; నా వచనంబులుగాన్; నా మాటలుగా; ఇట్లు+అనుము= ఇట్లా చెప్పుము.

తాత్పర్యం: కృష్ణా! మాకూ, కౌరవులకూ తాతఅయిన భీష్ముడు వింటుండగా ధృతరాష్ట్ర మహారాజు కొలువులో నా మాటలుగా సుయోధనుడితో ఇట్లా చెప్పుము.

తే. అన్నదమ్ములమై యుండి యకట! మనల । నొరులు దలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి । బుద్ధి విని పంచి కుడుచుట పోల దొక్కొ? 50

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; అన్నదమ్ములము+ఐ+ఉండి= సోదరులమై జన్మించికూడా; మనలన్= మనలను; ఒరులు= ఇతరులు; తల+ఎత్తి+చూడన్= ఆశ్చర్యంతో కనుగొనగా; ఒండొరుల తోడన్= ఒకరితో మరొక్కరు; పెనఁగన్+ఏటికిన్?= పోట్లాడుకొనటమెందుకు?; ఈ నేలన్= ఈ భూమిని; పెద్దవారి బుద్ధి విని= పెద్దలు చెప్పిన నీతులు ఆలకించి; పంచికుడుచుట= పంచుకొని అనుభవించటం; పోలదు+ఒక్కొ!= యుక్తము కాదా!

తాత్పర్యం: మనం అన్నదమ్ములమై ఉండి కూడ లోకులు తలయెత్తి చూచి పరిహసించగా మనలో మనం ఒకరితో నొకరు పోట్లాడుకొనటం మంచిది కాదు. హస్తినాపుర సామ్రాజ్యాన్ని పెద్దల మాట ప్రకారం పంచుకొని హాయిగా అనుభవించటం ఎంతో మేలుగదా!

క. అని యెవ్విధమున నైనను । వనజోదర! సంధి సేయవలయుం దగ నే
మును వారును గలయుట భూ । జనులకునెల్లను హితంబు సౌఖ్యకరంబున్.' 51

ప్రతిపదార్థం: అని= అనుచు; వనజ+ఉదర!= పద్మనాభా!; ఏ విధమునన్+ఐనను= ఏ రీతిగానైనా; సంధిచేయన్+వలయున్= సంధి సమకూరేటట్లు చేయవలసింది; తగన్= చక్కగా; ఏమును వారును కలయుట= మేమూ, కౌరవులూ ఒకటిగా చేరటం; భూజనులకున్+ఎల్లన్= పుడమిలోని ప్రజలందరికీ; హితంబు= మేలు; సౌఖ్యకరంబున్= సుఖాన్ని కలుగజేస్తుంది.

తాత్పర్యం: పద్మనాభా! నా మాటలుగా కురుసభలో అట్లా చెప్పి, ఎట్లాగైనా సంధి పొసగేటట్లు ప్రయత్నించుము. వారూ మేము కలసిమెలసి వర్తించటం పుడమిజనులకు ఎంతో మేలు. సుఖకరంగానూ ఉంటుంది.'

చ. **అనుటయుఁ బిన్ననవ్వు నగి యంబుజనాభుఁడు వల్కు 'నెన్నఁడున్**
విననివి భీముపాలఁ గడు వింతలు వింటిమి మాట; లగ్గి చ
ల్లనగుట భూరిభూధరము లాఘవ మొందుటఁ గాదె యివ్విధం
బున నితఁ డిప్డు మార్దవముఁ బొందుట; యింకిటఁ జెప్ప నేటికిన్? 52

ప్రతిపదార్థం: అనుటయున్= భీమసేను డట్లా వచించగా; అంబుజనాభుఁడు= కమలం నాభియందుగలవాడు- శ్రీకృష్ణుడు; పిన్న నవ్వు నగి= చిన్నగానవ్వి; పల్కున్= ఇట్లా మాట్లాడాడు. ఎన్నడున్= ఎప్పుడునూ; విననివి= మేము ఆలకించనట్టివి; భీము పాలన్= భీమసేనుడి దగ్గర; కడున్ వింతలు మాటలు వింటిమి= మిక్కిలి వింత (విస్మయం) కలిగించే పలుకులు విన్నాము; ఈ+విధంబునన్= ఇట్లా; ఇతఁడు= భీముడు; ఇప్డు= ఈ సమయంలో; మార్దవము పొందుట= మృదుత్వం వహించటం అన్నది; అగ్గి చల్లన+అగుట= నిప్పు చల్లబడటం; భూరిభూధరము= గొప్ప పర్వతం; లాఘవము+ఒందుట కాదె= తక్కువతనం పొందటమే అవుతుంది; ఇంకన్+ఇటన్+చెప్పన్+ఏటికిన్?= మరిఇక్కడ పలుకవలసిన దేమున్నది?

తాత్పర్యం: భీమసేనుడి మాటలకు పద్మనాభుడు చిరునవ్వు నవ్వి ఇట్లా అన్నాడు: మునుపెన్నడు విననట్టి మాటలు ఇపుడు భీముడి నోటినుండి విన్నాను. మఱి చెప్పవలసిన దేముంది? ఈ విధంగా వృకోదరుడు ఇపుడు మెత్తబడటం చూడగా అగ్ని చల్లదనం పొందినట్లుగా, గొప్ప పర్వతం తేలిక అయిన చందంగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

1. శ్రీకృష్ణుడు భీముడి మాటలను విని చిరునవ్వు నవ్వాడు. వికృతి వలన హాసం పుట్టుతుంది. భీముడు సహజంగా ఉద్ధతుడు, కాని, ఉదాత్తుడివలె మాట్లాడుతున్నాడు. దుర్యోధన స్మరణ మాత్రం చేతనే కోపోద్రేకంతో ఉగ్రరూపం తాల్చి, అతడిని అంతం చేయటమే తనకు సంతోషదాయకమని భావించే భీముడు అతడిపై అన్నదమ్ముల ప్రేమను, ఐక్యభావాన్ని ఒలకబోస్తూ అతడితో కలిసి జీవించటం కర్తవ్యమంటున్నాడు. శ్రీకృష్ణుడిని ఏ విధంగానైనా సరే అతడిని ఒప్పించి సంధి చేయుమని అడుగుతున్నాడు. ఇది భీముడిలోని స్వభావ విశ్రుతి. దీనిని అలంకారంతో ధ్వనింపచేయటం రచనా శిల్పం.

2. వికృతి వలన ఆశ్చర్యం కలిగిందని వాచికాభినయంతో శ్రీకృష్ణుడి పాత్ర మాటల వలన ధ్వనింపజేసింది. 'ఎన్నడున్ విననివి', 'కడువింతలు' అనే మాటలు తెలుగుదనం మూటకట్టినట్లున్నాయి. మూలంలో- "ఏత చ్ఛ్రుత్వా మహాబాహుః కేశవః ప్రహసన్నివ- అభూతపూర్వం భీమస్య మార్దవోపహితం వచః" (సం. 5-73-1) అని ఉన్నది. శ్రీకృష్ణుడు మూలంలో పెద్దగా నవ్వాడు. తెలుగులో చిరునవ్వు నవ్వాడు. ప్రహసనం చేస్తే భీముడు నొచ్చుకొంటాడనీ, కోపిస్తాడనీ తెలుగులో తిక్కన భావించి ఈ మార్పు చేసి ఉండవచ్చును. 'అభూతపూర్వం' అనే మాటకు తెలుగులో చక్కని వ్యాఖ్యానమిచ్చాడు తిక్కన.

3. భీముడు మెత్తబడటం అగ్గి చల్లబడినట్లూ, మహాపర్వతం తేలిక పడ్డట్లూ ఉన్నదట! భీముడు శాంతి సూక్తం పలకటం శత్రువులను దహించే అతడి క్రోధభావం శాంతించినట్లున్నదని భావం. శత్రువులకు తలవంచని సమున్నత ఆత్మాభిమానం

వదలి బంధుత్వాన్ని భావించి కలసి ఉండాలని తలంచటం పర్వతం తేలికపడటం వంటిది. ఈ రెండంశాలూ భీముడి స్వభావానికి విరుద్ధమైనవి. అయినా, ధర్మరాజుమీది భక్తిగౌరవాలచేత భీముడు మెత్తపడ్డాడు. ఇది వింతగా ఉన్నదని శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

4. 'ఇం కిటఁ జెప్ప నేటికిన్?' అనే వాక్యం ఆశ్చర్య భావముద్రను వ్యక్తం చేస్తున్నది. భీముడిని ఆ విధంగా నేను చూడలేను. అతడు సహజస్వభావంతో ఉంటేనే బాగుంటుందని సూచన అందులో వినబడుతుంది. పఠితలు ఆ వాక్యంతో తాదాత్మ్యం పొందుతారు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట (సం. 5-73-1)

తే. అని సహోదరు లాజి నాయాసపడుట । కోర్వమియుఁ గౌరవులఁ జంప నొల్లమియును,
గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁ । డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి. 53

ప్రతిపదార్థం: అని= అలా వచించి; ఆజిన్= యుద్ధంలో; సహోదరులు= తోబుట్టువులు; ఆయాసపడుటకున్= శ్రమ చెందటానికి; ఓర్వమియున్= సహించలేకుండుటయున్నూ; కౌరవులన్= దుర్యోధనాదులను; చంపన్+ఒల్లమియున్= చంపుటకు ఇష్టపడ కుండటమున్నూ; కలుగు నెయ్యంబు పెంపునన్= మనసులో కలిగే ప్రేమాధిక్యం చేతనున్నూ; కరుణన్= దయారసముచేత; ఆర్ద్రుఁడు+ఐన= కరగిపోయిన; పవనజున్= వాయుపుత్రుడైన భీముడిని; పురికొల్పన్= రెచ్చగొట్టటానికై; ఆత్మన్+తలఁచి= మనసులో సంకల్పించి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: తన తోబుట్టువులు యుద్ధంలో కష్టపడటానికి సహించలేనందుననూ, కౌరవులను సంహరించటానికి ఇష్టపడనందుననూ, కలిగిన స్నేహాధిక్యం చేతనున్నూ పొంగిన కరుణచేత వాయునందనుడు కరగిపోయాడు. అతడిని యుద్ధానికి రెచ్చగొట్టవలెనని మనసులో సంకల్పించి.

విశేషం: భీముడు ఎందుకు, ఎట్లా మెత్తబడ్డాడో చెప్పి, అతడి మానసిక స్థితిని వ్యాఖ్యానించే చక్కని పద్యం ఇది. సహోదరులు యుద్ధం చేయటం వలన పొందే శ్రమను భావించి, వారి కా శ్రమ లేకుండా చేద్దామనే స్నేహాతిశయం మొదటి కారణమట! కౌరవులను చంపటం వలన వంశనాశన మవుతుందనే కరుణాభావం రెండవ కారణమట! క్రోధభావం స్నేహభావం వలన మెత్తబడుతుంది. కరుణ వలన ఆర్ద్రమవుతుంది. ఈ క్రమాన్ని భావించిన శ్రీకృష్ణుడు ఇంగితజ్ఞుడు, రసజ్ఞుడు. ఇప్పుడు స్నేహ, కరుణ భావాలకు విరుగుడు పెట్టి ఆర్ద్రత నుండి ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేసి, యుద్ధానికి భీముడిని పురికొల్పటం శ్రీకృష్ణుడి సంకల్పం. రాబోయే పద్యంలో ఈ పరిణామ క్రమం గోచరిస్తుంది. (సంపా.)

వ. మురమర్దనుం డతనితో నిట్లనియె : 54

ప్రతిపదార్థం: మురమర్దనుండు= మురాసురుని సంహరించినవాడు, శ్రీకృష్ణుడు; అతనితోన్= భీమునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీముడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'యుద్ధము మీఁది వేడ్కయు మహోగ్ర విరోధుల నల్కఁజేయు ద
ర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి సైఁపని యేపు రాజ్యసం
సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం
బద్ధములైన వాక్యములు వల్కుట యొప్పునె కీచకాంతకా!' 55

ప్రతిపదార్థం: కీచక+అంతకా!= కీచకుడినీ, ఉపకీచకులనూ మట్టుపెట్టిన వాయుపుత్రా!; యుద్ధము మీఁది వేడ్కయున్= సంగ్రామం సల్పుటలోని అభిలాష; మహా+ఉగ్రవిరోధులన్= మిక్కిలి భయంకరులైన శాత్రవులను; అల్కన్+చేయు= భయపెట్టే; దర్ప+ఉద్ధతియున్= గర్వాటోపమునూ; సుయోధనుని+ఉన్నతిన్= దుర్యోధనుడి గొప్పతనమును; సైఁపని+ఏపున్= సహించనట్టి విజృంభణమునూ; రాజ్యసంసిద్ధిన్= రాజ్యలాభమును; నిజ+అగ్రజన్మునకున్= నీ అన్నఅయిన ధర్మపుత్రుడికి; చేయుతలంపును= కలిగించే ఉద్దేశమునూ; కల్గు నీవు= ఉన్నట్టి నీవు; అసంబద్ధములు+ఐన= పొందికలేని వైన; వాక్యములు= పలుకులు; పల్కుట+ఒప్పునె?= చెప్పుట తగునా? (తగదని భావం.)

తాత్పర్యం: కీచకుడి రూపుమాపిన భీమసేనా! సంగ్రామం సల్పటంలో కుతూహలమూ, పరమ దారుణ శాత్రవులను గడగడ వణకించే శౌర్యాటోపమూ, దుర్యోధనుడి గొప్పతనము సహించని ఔద్ధత్యమూ, అన్నఅయిన ధర్మజుడికి రాజ్యప్రాప్తి కలిగించే సంకల్పమూ కలిగిన నీవు ఇపుడు పొంతన లేని మాటలు మాట్లాడటం తగదుసుమా!'

విశేషం: 1. ఈ పద్య ప్రాణం 'నీ వసంబద్ధములైన వాక్యములు పల్కుట యొప్పునె?' అనే వాక్యం. అసంబద్ధాలు అంటే పొందిక లేనివనీ, సందర్భానికి తగినవి కానివనీ, అనరాని మాటలనీ, వ్యర్థపదాలనీ అర్థాలున్నాయి. ఆ నాలుగర్థాలూ సార్థకమయ్యేటట్లు శ్రీ కృష్ణుడు వ్యాఖ్యానించటం విశేషం.

2. ఇందులో భీముడి సహజ లక్షణాలు నాలుగు చెప్పబడ్డాయి. 1.యుద్ధం మీద ఎప్పుడూ ఉండే ప్రీతి. 2.భయంకర శత్రువులను సైతం లెక్క చేయని గర్వోన్నతి. 3.దుర్యోధనుడి ఆధిక్యాన్ని సహించని ఉద్ధతి. 4.ధర్మరాజుకు రాజ్యం కట్టబెట్టాలన్న సంకల్పం. యుద్ధప్రీతి కలవాడు 43, 50, 51 పద్యాలు మాట్లాడడు. శత్రుభావం కౌరవులపట్ల ఉన్న భీముడు 45, 46, 47 పద్యాలు పలకడు. దుర్యోధనుడి మీది పగగల భీముడు 48 పద్యం చెప్పడు. కాని, ఇప్పుడు అన్నాడంటే భీమ స్వభావం తెలిసినవారికి అవి పొందిక లేని మాటలుగా తోస్తాయి.

3. యుద్ధం చేసి శత్రువర్గాన్ని చంపి విజయాన్ని సాధించవలసిన ఆ తరుణంలో భీముడు అనదగిన మాటలు కావు ఇవి. నిజానికి భీముడి మాటలు కార్యరూపం తాల్చేవి కావు కాబట్టి వ్యర్థమైనవని కూడా తోచవచ్చును. అందువలన అసంబద్ధ శబ్దం సార్థకం.

4. ఆర్ద్ర హృదయం యుద్ధోత్సాహంతో కరడు కట్టుతుంది. శత్రువుల ధిక్కార స్మరణం వలన ఆగ్రహంగా మారుతుంది. సోదరుడైనా తనను చంపజూచిన దుర్యోధనుడి స్మరణ చేత స్నేహం పగగా మారుతుంది. చివరకు 'కీచకాంతకా!' అనే పిలుపుతో ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం జ్ఞాపకం వచ్చి అతడిని చంపినట్లే చంపాలనే క్రోధోద్రేకం పొంగులువారుతుంది. అంటే ఈ పద్యం భీముడిని అతడి సహజ స్వభావంతో వెలుగొందటానికి చేసిన వాఙ్మయ ప్రేరణ మన్నమాట. ఇది రసధ్వని. (సంపా.)

వ. అని యంత నిలువక. 56

తాత్పర్యం: అని అంతటితో ఆగక.

క. 'వెఱ పెట్టిదియో యెన్నఁడు । నెఱుఁగని నీ యట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడ । గఱపినవా' రనుచు శౌరి గలకల నవ్వెన్. 57

ప్రతిపదార్థం: వెఱపు+ఎట్టిదియో= భయమంటే ఎటువంటిదో; ఎన్నఁడున్= ఏనాడును; ఎఱుఁగని= తెలియని; నీ+అట్టివానికిన్= నీవంటి బలశాలికి; ఈ పిఱికితనము; ఇంత+అలవడన్= ఇంతగా అభ్యాసమయేట్లు; కఱపినవారు= బోధించినవారు; ఎవ్వరు+ఒకో= ఎవరో కదా!; అనుచున్= అంటూ; శౌరి= శ్రీకృష్ణుడు; కలకల నవ్వెన్= పకపకమని నవ్వాడు.

తాత్పర్యం: 'భయమంటే ఏమిటో ఎప్పుడూ తెలియని నీవంటి ధీరుడికి ఈ పిరికితనం ఇంతగా అలవాటయ్యేటట్లు చేసినవారు ఎవరో?' అని హరి పకపక నవ్వాడు.

విశేషం: భయ మెరుగని భీముడికి పిరికితనం నూరిపోసిం దెవ్వరు? -అని ప్రశ్న వేయటం ఒక ఎత్తు, కలకలనవ్వటం మరొకయెత్తు. భీముడి వాక్యాలు అనునయవాక్యాలే కాని భయపడినవాడి మాటలు కావు. కాని, శ్రీకృష్ణుడు వాటికి భయం రంగు పులుముతున్నాడు. అతడిది వక్రోక్తి, జల్పోక్తి. అయినా లోకం భీముడు పిరికివాడని అనుకొనే ప్రమాదముందని హెచ్చరించాడు. అతడిని సంకటస్థితిలో పెట్టాడు. 'దీని కేమి సమాధానం చెప్పుతావు?' అన్నట్లు హాస్యంగా నవ్వాడు. ఈ నవ్వు కవ్వింపు నవ్వు, చనువుతో చుర్రెక్కించే నవ్వు, పిరికివాళ్ళను చూస్తే లోకం ఇట్లాగే నవ్వుతుంది అని ఎగతాళి చేసే నవ్వు. అందుకే శ్రీకృష్ణుడు కలకలనవ్వినా భీముడికి పెళపెళ కోపం రాలేదు. పైపెచ్చు ఆప్యాయంగా ఆ పరిహాసానికి ప్రతిస్పందనగా భీముడు ఒక చిరునవ్వును చిందించాడు. (సంపా.)

వ. దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున కిట్లనియె: 58

ప్రతిపదార్థం: దానికిన్= శౌరి వచనాలకు; దరహసిత వదనుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన ముఖం కలవాడై; భీమసేనుండు= భీముడు; వసుదేవసూనునకున్= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా సమాధాన మిచ్చాడు.

తాత్పర్యం: శౌరి మాటలకు భీముడు చిరునవ్వు తన మోమున నిండగా వాసుదేవుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'బంటుతనంబు మాటలకుఁ బాఱకు; పాండునృపాలుపాలు గై
కొంటయ చాలునన్న నృపకుంజరు పల్కుల కడ్డమాడ రా
కుంట యెఱుంగవే; మును సుయోధను చందముఁ జూపి యప్పు డే
మంటి యుపేంద్ర! న న్నని రణాగ్రమునన్ నిను మూదలించెదన్. 59

ప్రతిపదార్థం: ఉపేంద్ర!= మాధవా!; బంటుతనంబు మాటలకున్+పాఱకు= పౌరుష వచనాలు పలకటానికి పూనవద్దు; పాండు నృపాలు పాలు= పాండు మహారాజుయొక్క రాజ్యభాగం; కైకొంటయ చాలున్= గ్రహించుటయే మనకు చాలు; అన్న నృపకుంజరు పల్కులకున్= అని పలికిన రాజోత్తముడైన ధర్మజుడి మాటలకు; అడ్డము+ఆడన్+రాకుంట= వ్యతిరేకంగా పలుక లేకుండటం; ఎఱుంగవే= నీకు తెలుసు గదా; మును= మున్ముందు; సుయోధను చందమున్+చూపి= దుర్యోధనుడు పడే పాట్లు కనబరచి; అప్పుడు= దౌత్యం కావింప కురుసభకు వెళ్ళే సమయంలో; నన్నున్= నన్ను; ఏమంటి= ఏమని పల్కితివి; అని= అంటూ; రణ+అగ్రమునన్= అని మొనలో; నినున్= నిన్ను; మూదలించెదన్= హెచ్చరించుకొంటాను.

తాత్పర్యం: 'కృష్ణా! మగసిరి మాటలు నా దగ్గర మాట్లాడవద్దు. మన తండ్రి రాజ్యభాగమే మనకు చాలునని ప్రభువగు ధర్మరాజు పలికిన మాటలకు మేము బదులు చెప్పలేకుండటం నీకు తెలుసు. జరుగబోయే సంగ్రామంలో దుర్యోధనుడు పడే పాట్లు చూపి ఆనాడు కురుసభకు వెళ్ళేటప్పుడు ఉపప్లావ్యపురిలో నన్నేమంటివో జ్ఞప్తికి తెచ్చుకొమ్మని యుద్ధముఖంలో నిన్ను హెచ్చరించకపోనులే.

విశేషం: 1. భీము డీ పద్యంలో శ్రీకృష్ణుడితో రసికవీరుడుగా పరిహాసోక్తులు మాట్లాడాడు. 'కృష్ణా! నీ వేమీ నాకు పౌరుషం నూరిపోసేపని లేదులే. ధర్మరాజు రాజ్యభాగం తీసికొంటే చాలులే అన్నందువలననే నే నిట్లా మాట్లాడాను. కాని, ఆనాడు

కురుసభలో దుర్యోధనుడి తీరు చూచి నేను ప్రతిజ్ఞ చేసిన మాటలు నీకు తెలియవా? వాటిని రణరంగంలో చేసి చూపిస్తాను. అంటే దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి నేను పిరికివాడిని కానని నీ ఎదుట నిరూపించుకొంటాను' అని భీముడు సరసంగానే పౌరుషంగా మాట్లాడాడు. నవ్వుతూ మాట్లాడితే కలిగే ఫల మది. భీముడు సంధి జరిగితే సౌమ్యుడు; యుద్ధం జరిగితే యముడు.

2. ఏమంటి యుపేంద్ర - 'అంటివి' అనునది మధ్యమపురుషక్రియ. 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు.' అనే సూత్రంచేత, వకారానికి లోపం వచ్చి 'అంటి' అయినది. 'మధ్యమపురుషక్రియలయం' 'దిత్తునకు సంధి యగు' అనే సూత్రంచేత, సంధి నిత్యంగా రావలసి యుండగా, ఏమంటి యుపేంద్ర - అని యడాగమము వచ్చుట విశేషం. ఏమంటి వుపేంద్ర- అన్నచో సరిపోయెడిది. (సంపా.)

క. నా కొలఁది విచారింపక । నీ కిట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మైఁ
గాక తిరుగంగఁ బడినం । బో కే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్. 60

ప్రతిపదార్థం: నా కొలఁది= నా శక్తి ఏపాటిదో; విచారింపక= ఆలోచించకుండ; నీకున్+ఇట్లు+అనన్+తగునె?= నీకు ఇట్లా పలకటం న్యాయమా?; మిన్నున్= ఆకాశమూ; నేలయున్= భూమియు; ఇమ్మైన్+కాక= ఇప్పుడున్నట్లుండక; తిరుగంగన్+ పడినన్= తార్మారైనప్పటికీ; పోక= వెనుకాడక; ఏన్= నేను; ముంజేతులు+ఒడ్డి= ముంజేతులు అడ్డముపెట్టి; పోవఁగన్+త్రోతున్= వాటి వాటి స్థానాలకు నెట్టివేస్తాను.

తాత్పర్యం: బావా! నా శక్తిసామర్థ్యాలు ఏపాటివో ఆలోచించక ఇట్లా నీవు మాట్లాడటం న్యాయం కాదు. నేలా, నింగీ ఇప్పుడున్నట్లు కాక తలక్రిందులైనప్పటికీ వెనుదీయక నేను ముంజేతులు ఒడ్డి వాటిని పాటుకు తోస్తాను సుమా!'

విశేషం: 1.అలం: అత్యుక్తి. "అత్యుక్తి రద్భుతా తథ్య శ్చార్యౌదార్యాది వర్ణనమ్". శ్రీకృష్ణుడి పరిహాసానికి భీముడి అత్యుక్తి సమతౌల్యాన్ని తెచ్చింది. మూలశ్లోకం ఇట్లా ఉన్నది.

"యది మే సహసా క్రుద్దే సమేయాతాం శిలే ఇవ,
అహ మేతే నిగృహ్ణీయాం బాహుభ్యాం సచరాచరే". (సం. 5-74-8)

భూమ్యాకాశాలు పరస్పరం రాపిడి పడితే విడదీస్తానని అనటం సంస్కృతంలో జాతీయం కావచ్చును. కాని, నేలా నింగీ తిరగబడితే సరిగా త్రోయటం తెలుగువారికి దగ్గరగా ఉండే జాతీయం. 2.శ్రీకృష్ణుడి మాటలకు భీముడికి అభిమానం పొడుచుకొని వచ్చింది కాని, ఆగ్రహం ప్రజ్వరిల్లలేదు. ఈ సందర్భంలో కొందరు కవులు భీముడికి నిజంగా పట్టరానంత కోపం వచ్చినట్లు, అతడు శ్రీకృష్ణుడిని తూలనాడినట్లూ చిత్రిస్తారు. వారు వ్యాసుడి వద్దా, తిక్కన వద్దా ఔచిత్యపాఠాలు నేర్చుకొనాలి. ఇక్కడ భీముడు ఉచితజ్ఞుడు. (సంపా..)

ఉ. నావుడు 'నవ్వుటాల కనినం బవనాత్మజ! యింత యేటికిం?
గేవల యోధవే? పరుల కిల్బిషముల్ దలపోయ కిమ్మెయిన్
జావడమైనఁ జూచి యిది చందము గాదని యంటిఁగాక, నీ
చేవయు లావు నీవు మును చేసిన భంగులు నే నెఱుంగనే? 61

ప్రతిపదార్థం: నావుడున్= భీమసేను డట్లా పలుకగా; పవన+ఆత్మజ!= వాయునందనా!; నవ్వుటాలకున్= ఎగతాళికి; అనినన్= నేనట్లా అంటే; ఇంత+ఏటికిన్?= ఇంత ఎందుకు?; కేవల యోధవే?= నీవు సామాన్య వీరుడవా?; పరుల కిల్బిషముల్=

శత్రువు లొనర్చిన పాతకములు; తలపోయక= మదినెంచక; ఈ+మెయిన్= ఈ విధంగా; జావడము+ఐనన్= అపౌరుషవృత్తి నవలంబించగా; చూచి= గమనించి; ఇది చందము+కాదు= ఇది సుక్షత్రియుడి పద్ధతి కాదు; అని+అంటిన్+కాక= అని పల్కితినే తప్ప; నీ చేవయున్= నీ సారమూ; లావు= బలమూ; నీవు+మును+చేసిన భంగులు= నీవు పూర్వం చేసిన వీరవిహారాలూ; ఏన్= నేను; ఎఱుంగనే!= తెలియనటయ్యా!

తాత్పర్యం: భీముడి మాటలు విని వాసుదేవుడు 'పవనపుత్రా! నే నేదో పరిహాసానికై పలికిన మాటలకు ఇంత రాద్ధాంతమా? నీవు అసామాన్య వీరుడివి. ఇట్లాంటివాడివి దుర్యోధనాదులు మునుపు మీకు చేసిన అపకారాలను స్మరించక పౌరుష హీన వాక్యాలు పల్కటం చూచి, ఇది నీవంటి రాచబిడ్డకు యుక్తం కాదన్నానేగాని మరేమీ కాదు. నీ భుజసారం, శక్తీ, నీవు పూర్వం చేసిన సాహసకృత్యాలు- హిడింబాసుర, బకాసుర, కీచక, జరాసంధాది వధలు నాకు తెలియనివి కావు గదా!'

విశేషం: భీముడిలో క్రోధాగ్ని చల్లారలేదని తెలిసికొన్న శ్రీకృష్ణుడు తనవి పరిహాస వచనాలని ఊరటపలికి, భీముడి బలపరాక్రమాలను ప్రశంసించి, అతడిలో యుద్ధోత్సాహాన్ని స్థాయిగా నిలిపాడు. (సంపా.)

వ. అని చెప్పి మాధవుండు మఱియును. 62

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు మళ్ళీ భీముడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁ గోరి యెంతయుం
బ్రార్థన సేసె; దాని కనురాగము నొందితి నేను గాన యు
ద్ధార్థులమైన మాకు నిను నాసపడం దగదే? యశంబు నా
నార్థములున్ విరోధి విజయంబునఁ దక్కఁగ నొంటఁ గల్గునే?' 63

ప్రతిపదార్థం: పార్థుఁడు= కుంతీపుత్రుడైన అర్జునుడు; పోరన్= యుద్ధంలో; తనకున్= తనకు; తేరు+కడపన్= రథం తోలటానికి; ననున్+కోరి= నన్ను అభిలషించి; ఎంతయున్+ప్రార్థన చేసెన్= మిక్కిలి వేడుకొన్నాడు; దానికిన్= అర్జునుడి వేడికోలుకు; నేను+అనురాగము+ఒందితిన్= నేను ఆసక్తి వహించాను; కానన్= కనుక; యుద్ధ+అర్థులము+ఐన మాకున్= యుద్ధం చేయవలెనని కాంక్షిస్తున్న మా ఇద్దరికీ; నినున్= నిన్ను; ఆస+పడన్+తగదే?= కోరుకొనటం యుక్తమే గదా!; యశంబున్= కీర్తీ; నానా+అర్థములున్= బహుళ ప్రయోజనాలూ; విరోధి జయంబునన్+తక్కఁగన్= శత్రువులను గెల్చుటచేగాక; ఒంటన్= మరొక్క విధాన; కల్గునే?= లభింపగలవా? (లభించవని అర్థం.)

తాత్పర్యం: 'ఫల్గునుడు యుద్ధంలో తనకు రథసారథ్యం చేయవలసిందిగా నన్ను మిక్కిలి కోరుకొన్నాడు. అందుకు నేను సమ్మతించాను. కనుక యుద్ధం అభిలషిస్తున్న మాకు కదనంలో నీ తోడ్పాటు ఎంతో అవసరం. కీర్తి, సకల ప్రయోజనాలూ శాత్రవులను గెలవటంవలన కాక మరో విధంగా సమకూడవు గదా!'

విశేషం: ఈ పద్యంలోని వాక్యప్రవృత్తిని గురించి తిక్కన 66వ వచనంలో- పరిహాసంతో పని సాధించే సరస వాక్యాలని సూచించాడు. ఇంతవరకూ పరిహాసంతో పని సాధించే మాటలయ్యాయి. ఇప్పుడు సరస వాక్యాలు ఇక్కడ మొదలయ్యాయి. సరస వాక్యం వినోద పర్యవసాయిగా ఉంటుంది. నవ్వుతో చిగురిస్తుంది. ఉద్ధతుడైన భీముడికి ఇతరులు తనకంటె గొప్పవారంటే

మండిపడతాడు. ప్రత్యేకించి కౌరవవీరులంటే అసలు సహించలేడు. శ్రీకృష్ణుడు పాండవులలోనే సారథిగా తన సహాయం పొందిన అర్జునుడి ప్రస్తావన చేసి, వారిద్దరూ కలసి భీముడి సహాయాన్ని కోరతామని వ్యంగ్యంగా అన్నాడు. ఇందులో కాకువులో రెండర్థాలు స్ఫురించవచ్చును.

1. మేమిద్దరం కలిసి యుద్ధం చేసినా విజయం సాధ్యం కాకపోవచ్చును. కాబట్టి నీసహాయం మాకు అవసరం అని. అంటే భీముడి సహాయమే విజయమూలమని ప్రశంస. కృష్ణార్జునుల కంటె భీముడే అధికుడని తాత్పర్యం. 2.అసలు యుద్ధం చేసేది కృష్ణార్జునులే. వారి బలపరాక్రమాలే విజయ హేతువులు. అయినా, భీముడి సహాయం కూడా విజయానికి తోడ్పడుతుందని మరొక అర్థం. ఈ భావంలో భీముడు కృష్ణార్జునులకు సహాయకుడు, ఉపాంగతుల్యుడు. భీముడు రెండో అర్థాన్ని గ్రహిస్తే ఉద్రిక్తుడు కావచ్చును. కాని, ఆ వాక్యం శ్రీకృష్ణు డాడుతున్న సరస వాక్యంగా గ్రహించటం చేత కోపం తెచ్చుకొనకుండా సరితూకంగా తానూ పరిహాసోచిత వీరసరసం మాట్లాడగలిగాడు. భీముడిని సరైన బాటలో పెట్టిన శ్రీకృష్ణుడి సరసవాక్య మిది. (సంపా.)

వ. అనవుడు. 64

తాత్పర్యం: అని అనగా.

శా. 'ఏమీ! పార్థుఁడు నీవు దండిమగలై యీవచ్చు కౌరవ్య సం
గ్రామక్షోభము బాహుదర్పమునఁ దీర్పం బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్లన్ వెఱఁగంది చూచెదముగా; కీసారెకుం బోయి రా
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండుసూ పెంపఱన్.' 65

ప్రతిపదార్థం: ఏమీ!= ఎట్టెట్టూ!; పార్థుఁడున్= అర్జునుడూ; నీవున్= నీవూ; దండిమగలు+ఐ= మేటి శూరులై; ఈ వచ్చు= ఇప్పుడు రానున్న; కౌరవ్య సంగ్రామ క్షోభమున్= కురు సంతతి యొక్క యుద్ధంవలని కలతను; బాహుదర్పమునన్= భుజగర్వంతో; తీర్పన్= తొలగిస్తుండగా; ఏము+ఎల్లన్= తక్కిన మేమందరమూ; పెద్ద+మిట్టు+ఎక్కి= ఎత్తైన మిట్టమీద నిలిచి; వెఱఁగు+అంది= ఆశ్చర్యంపొంది; చూచెదముగాక= తిలకిస్తాము లెమ్ము; ఈ సారెకున్= ఈ తడవకు; పోయిరా= సంధికి వెళ్ళిరమ్ము; భీముండు= ఈ భీమసేనుడు; ఈ+తఱిన్= ఈ సమయంలో; రిత్త మాటలకున్= వ్యర్థ వచనాలకు; పెంపు+అఱన్= గౌరవం చెడేటట్లు; కోపింపండు సూ!= కోపము వహించడు సుమా!

తాత్పర్యం: ఎట్టెట్టూ? అర్జునుడూ నీవూ మేటిశూరులై రానున్న కురు సంగ్రామ క్షోభను మీ భుజశక్తితో నివారిస్తుంటే మేమందరమూ చేతులు ముడుచుకొని పెద్ద మిట్ట నెక్కి ఆశ్చర్యంతో మిమ్ము చూస్తుంటాంలే. నీవు ఈ సారికి కురుసభకు వెళ్ళి రావయ్యా! ఇట్లాంటి సమయంలో భీముడు గౌరవం చెడేటట్లు వ్యర్థ వచనాలకు కోపం చెందడు.'

విశేషం: ఇది వ్యంగ్య సరసోక్తి. భీముడు గూఢాభిమానం తొంగి చూచేటట్లు మాట్లాడాడు. 'ఏమీ!' - ఆశ్చర్యార్థకం. కాకువులో పరిహాసార్థకం 'దండి మగలై' - తెలుగుదనం గుబాళించే సమాసం. మేటి వీరులై అని అర్థం. భీముడికంటె గొప్పవారుగా రణరంగంలో రాణించే వారై అని భావం. భీము డీ మాటలు ఎగతాళిగా కూడా అనే అవకాశం ఉన్నది; గౌరవంగా కూడా చెప్పే అవకాశం ఉన్నది; అందువలన ఎదుటివా రేమీ అనలేరు. శ్రీకృష్ణుడు రెండు రకాల అర్థాలు వచ్చే సరసవాక్యాలు ఎట్లా మాట్లాడాడో భీముడూ వాటికి దీటుగా మాట్లాడాడు. 'మిట్టలెక్కి మీ పరాక్రమాన్ని మేము భయపడుతూ చూస్తాంలే' అనే మాట మనసులో దెబ్బతిన్న అభిమాని ఎదుటివారి మనసు దెబ్బతినకుండా నవ్వి ఊరుకొనేటట్లు మాట్లాడిన సరసవ్యంగ్యోక్తి. ఇవన్నీ

ఒక ఎత్తు. 'ఈ సారెకుం బోయిరా!' అనే వాక్యం మరొక ఎత్తు. 'ఎప్పుడో జరుగబోయే యుద్ధంలో సారథ్యాన్ని నిర్వహిస్తానని బడాయిలు కొట్టటం ఎందుకు? యుద్ధం చేయటం కంటె సంధి చేయటం తక్కువైనదేమీ కాదు. నీనేర్పు ఈ సంధి సారథ్యంలో మొదట బైటపడుతుంది. ఇక్కడ నీవు నెగ్గితే యుద్ధం సంగతి ఆ తరువాత గమనిద్దాం' అని ఆ వాక్యంలో స్ఫురించే వ్యంగ్యార్థం. 'భీముఁ డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెంపఱన్' - ఈ వాక్యం వినయ వివేకంతో పలికిన వీరవాక్యం. తనపేరు తానే చెప్పుకొనటం, అహంకార సూచకమైన ప్రథమ పురుష ప్రయోగం కాక, వినయసూచకమైన ప్రథమపురుష కావటం విశేషం. శ్రీకృష్ణుడు 'అసంబద్ధ వాక్యా'లని భీముడిని ఎత్తిపొడిచిన దానికి, భీముడు 'రిత్తమాటల'ని శ్రీకృష్ణుడి పట్ల ప్రయోగించాడు. కోపం రేకెత్తించాలని శ్రీకృష్ణుడు మేలమాడిన సంగతి గుర్తించి 'నీ యత్నాలు ఫలించవు' నేను గంభీరుడను, ధీరుడను, వివేకుడను, ఉదాత్తుడను అని కన్నులెగరేస్తూ పరిహాసంగా భీముడు పలికాడు. (సంపా.)

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్యవచనంబులకుం దగం దానును దోడ్తో
సరసం బాడుటయకా మఱుమాటలాడి యంతటఁ దనివోవక బకమర్దనుం డతనితో నిట్లనియె: 66

ప్రతిపదార్థం: అని పలికి= అంటూ మాట్లాడి; ఈ+విధంబునన్= ఈ రకంగా; గోపాలదేవు= శ్రీకృష్ణస్వామియొక్క; మేలంపు మెయివడి కార్యవచనంబులకున్= పరిహాసంతో కూడిన కార్యానుకూలాలైన మాటలకు; తగన్= ఒప్పిదంగా; తానును= తాను గూడ; తోడ్తోన్= వెంటనే; సరసంబు+ఆడుట+అ కాన్= సరసమాడటమేకాగా; మఱుమాటలు+ఆడి= ప్రతివచనాలు పలికి; అంతటన్+తని+పోవక= ఆ మాటలతోనే తనివి తీరక; బకమర్దనుండు= బకాసురుడిని చంపినవాడు- భీముడు; అతనితోన్+ఇట్లు+అనియెన్= కృష్ణుడితో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీము డీవిధంగా గోపాలకృష్ణుడి పరిహాస చతురాలైన పని సాధించే మాటలకు యుక్తంగా వెంటనే తానుగూడ సరసపు మాటలతోనే సమాధానం చెప్పి, అంతటితో తృప్తిపడక మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఉ. 'కయ్యము గల్గినట్లయిన గంధ గజ ప్రకరంబు కుంభముల్
వ్రయ్యఁ దురంగ పంక్తులు ధరం బడఁ దేరిగముల్ బడల్పడన్
డయ్యమి కీవు వెక్కసపడన్ గదపండువు సేయఁగోరు నా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుటగాదె భుజంగభంజనా! 67

ప్రతిపదార్థం: భుజంగభంజనా!= కాళీయుడిని మర్దించిన కృష్ణా!; కయ్యము+కల్గినట్లు+అయినన్= పోరాటం జరిగితే; గంధగజ ప్రకరంబు కుంభముల్= మదించిన ఏనుగుల గుంపుల యొక్క తలలు; వ్రయ్యన్= బ్రద్దలు కాగా; తురంగ పంక్తులు= గుఱ్ఱాల బారులు; ధరన్+పడన్= భూమిపై కూలగా; తేరిగముల్= రథాల మొత్తాలు; బడల్ పడన్= శిథిలాలుకాగా; డయ్యమికిన్= నేను అలసట చెందకున్నందుకు; ఈవు= నీవు; వెక్కసపడన్= దుస్సహత్వము చెందగా; గద పండువు+చేయన్+కోరు= నా హస్త మందలి గదకు ఉత్సవం చేయనెంచుతున్న; ఆ దయ్యము+ఎత్తికోలు= ఆ దైవం యొక్క ఉద్యమం, ఆ విధియొక్క విజృంభణం; తుది+తాఁకుట గాదె!= కడముట్టుటయే(నెరవేరటమే) అగును సుమా!

తాత్పర్యం: యుద్ధం జరిగితే మదించిన యేనుగుల తలలు బ్రద్దలు చేస్తాను. గుఱ్ఱాల బారులను భూమిపై కూలుస్తాను. రథ సమూహాలను నుగ్గు నుగ్గు చేస్తాను. ఇంత చేసికూడా బడలిక చెందని నన్ను చూచి నీవు ఆశ్చర్యపడక మానవు. నా గదతో పండుగ చేయగోరుతున్న దైవసంకల్పం అప్పుడే కదా సఫలమయ్యేది!

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. లోకోక్తి. అర్జునుడికి గాండీవ పాండిత్యం ఎంత పేరు తెచ్చిందో భీముడికి గదాయుధం అంత కీర్తి తెచ్చింది. గదాయుద్ధంలో భారత వీరులలో అతడు మేటి. 'దయ్యము నెత్తికోలు దుది దాకుట కాదె'. ఇది లోకోక్తి. (సంపా.)

చ. **అన విని దేవకీతనయుఁ డాతని కిట్లనుఁ 'జెప్పినంత కం**
టెను మిగులంగఁ జేయుదు గడింది మగండవు నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపదలకున్ భయమొందక దుఃఖవార్ధు లీఁ
దిన మము నెల్ల నిక్కొఱఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావనీ! **68**

ప్రతిపదార్థం: అనన్+విని= భీముడట్లా పలుకగా విని; దేవకీతనయుండు= దేవకీదేవి కుమారుడైన కృష్ణుడు; ఆతనికిన్= భీముడికి; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; పావనీ!= వాయుకుమారా!; చెప్పిన+అంతకంటెను= చెప్పినదానికన్న, మిగులంగన్+చేయుదు(వు)= ఎక్కువగా చేస్తావు; కడింది మగండవు= నీవు మేటి వీరుడివి; నిన్నున్= నిన్ను; తెప్పగాన్+కొని= నౌకగా చేసికొని; పలుమాఱున్= పెక్కుసారులు; ఆపదలకున్= కష్టాలకు; భయము+ఒందక= వెరపు చెందక; దుఃఖవార్ధులు+ ఈదిన= దుఃఖాలనే సాగరాలను దాటిన; మమున్+ఎల్లన్= మమ్ములనందరినీ; ఈ కొఱఁతన్+తీర్చి= ఇప్పు డేర్పడిన ఆపదను బాపి; సుఖ+ఆత్ములన్+చేయు!= సుఖంతో గూడిన హృదయం కలవారినిగా చేయవయ్యా!

తాత్పర్యం: భీముడు పలికిన పలుకులు విని శ్రీకృష్ణుడు 'వాయునందనా! నీవు చెప్పినదానికంటె ఎక్కువగానే చేస్తావు. నీవు గొప్ప వీరుడివి. నిన్ను తెప్పగా చేసికొని కడగండ్లకు భయపడకుండా మేము దుఃఖమనే సముద్రాలీది గట్టెక్కినాము. ఇప్పు డేర్పడిన సంకటం తొలగించి మమ్ము సుఖపెట్టవలసింది.

విశేషం: అలం: రూపకం. సంధియత్న సమయంలో ధర్మరాజు యుద్ధోత్సాహాన్ని మానకుండా ఉండటానికి భీమాదులలో పౌరుషాన్ని ప్రజ్వలింపజేస్తున్న శ్రీకృష్ణుడి వ్యూహశక్తికి ఈ పద్యం ఒక తార్కాణం. భీముడు పైకి చల్లారినట్లున్నా, లోన మండుతూనే ఉన్నాడని పాండవ పక్షానికి ప్రదర్శింపజేసి చూపించాడు. 'పావనీ!' - సార్థక సంబోధనం. దుఃఖవార్ధులు దాటేవారికి భీముడు తెప్పయేకాదు, తెప్పను ముందుకు త్రోసి ఒడ్డుకు చేర్చే పవనకుమారుడు (పిల్లగాలి) కూడా అని చమత్కారం. (సంపా.)

క. **ఇదె పోయెదఁ గౌరవ్యులఁ । బదనికి రాఁ బలికి సంధి వాటించెద; నా**
కది యొప్పదె! కాని తుదిం । గుదురింతకు నీవ కావె గుణరత్ననిధీ!' **69**

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ! -సద్గుణాలనెడు రత్నాలకు నిలయమైనవాడా!; ఇదె= ఇప్పుడే; పోయెదన్= కురుసభకు వెళ్తాను; కౌరవ్యులన్= కురువంశసంభవులను; పదనికి రాన్+పలికి= పాకానికి వచ్చేటట్లు మాట్లాడి; సంధి పాటించెదన్= సంధి సమకూరుస్తాను; నాకున్= నాకు; అది+ఒప్పదె?= అట్లా సంధి కుదుర్చుట సమ్మతమే; కాని; తుదిన్= చివరకు సంధి కుదురని పక్షంలో; ఇంతకున్+కుదురు= అన్నింటికినీ; ఆధారము; నీవు+అ, కావె!= నీవే సుమా!

తాత్పర్యం: గుణరత్న నిధివైన భీమా! నే నిపుడే కురుసభకు వెళ్ళుతాను. పాకానికి వచ్చేటట్లు వారితో మాట్లాడి సంధి పొసగే టట్లు చూస్తాను. అట్లా యత్నించటం నాకు సమ్మతమే. ఒకవేళ సంధి కుదరని పక్షంలో మాకు అన్నింటికీ ఆధారం నీవే సుమా!'

విశేషం: 1. 'ఈ సారెకుం బోయిరా' అని 65వ పద్యంలో భీముడన్న మాటలకు ప్రతిధ్వని ఈ పద్యం.

2. ఒక దీర్ఘసంభాషణను ముగించే తరుణంలో పాటించే నిర్వహణ శిల్పం తిక్కన రచనలో గమనించదగింది. ఈ పద్యం శ్రీకృష్ణుడు భీముడితో చేసిన సంభాషణకు సముచితమైన ముగింపు.

3. 'తుదిన్ కుదు రింతకు నీవకావె గుణరత్ననిధీ' - కుదుటపరిచే వాడు, ఆధారమైన వాడు భీముడు అనే మాట సాధారణార్థంలో సరసంగా ఉన్నది. భావికథార్థ వ్యంజకంగా కూడా ఉన్నది. మహాభారత యుద్ధంలో చిట్టచివర దుర్యోధన సంహారమే విజయనిర్ధారకంగా నిలిచే అంశం. దానిని విజయవంతంగా ముగించి భారత యుద్ధంలో విజయానికి ఒక కుదురుగా నిలిచేవాడు భీముడే కదా! శ్రీకృష్ణుడు సత్యవాక్కు. 'గుణరత్ననిధీ' ప్రశంసకు పరాకాష్ఠ. (సంపా.)

అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట (సం. 5-76-1)

వ. అనిన వాసుదేవున కర్జునుం డిట్లనియె : 70

తాత్పర్యం: అని పలికిన కృష్ణుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు :

తే. 'చెప్పఁ గల యంతవట్టును జెప్పె నీ క । జాత శత్రుండు; వింటి వీ వా తెఱంగు;
మాకు నెల్లను బలుకంగ మాట లొండు । గలవె? యైనను జెప్పెదఁ గన్నయంత. 71

ప్రతిపదార్థం: అజాతశత్రుండు= ధర్మరాజు; నీకున్= నీకు; చెప్పన్+కల+అంతవట్టును+చెప్పెన్= చెప్పగలిగినంతవరకు చెప్పాడు; ఈవు= నీవు; ఆ తెఱంగు వింటివి= ఆయన పలుకుల చందం విన్నావు; మాకున్+ఎల్లను= మాకందరికీ; పలుకంగన్= చెప్పటానికి; మాటలు= పలుకులు; ఒండు+కలవె?= వేరే ఉన్నవా?; ఐనను= లేనప్పటికీ; కన్న+అంత= ఎరిగినంతవరకూ; చెప్పెదన్= పలుకుతాను.

తాత్పర్యం: 'ధర్మనందనుడు నీకు చెప్పవలసినదంతా చెప్పాడు. ఆయన మాటలన్నిటినీ నీవు విన్నావు. ప్రత్యేకంగా మేము చెప్పవలసిన మాటలు లేవు. అయినా నాకు తోచిన మాటలు నేనూ చెపుతాను.

విశేషం: భీముడు సూటిగా మాట్లాడితే అర్జునుడు సున్నితంగా మాట్లాడతాడు. చెప్పవలసినదంతా 'అజాతశత్రుడు' చెప్పాడట. ఆ విశేషణం సార్థకం. ధర్మజుడి మాటలు శత్రువులు కూడా కాదన లేని రీతిలో ఉన్నాయి. అతడు మాట్లాడిన తరువాత ఎవరికైనా మాటలు మిగులుతాయా? అనటం ఔపచారికార్థం. అతడి అభిప్రాయం కంటె వేరైన నిశ్చయం మాకు ఉంటుందా? అని మరొక అర్థం. అయినా చెప్పుతున్నాను వినుమని అంటున్న అర్జునుడు పెద్దలను కాదనని స్వీయ అస్తిత్వం కల అభిమానధనుడని స్పష్టమవుతున్నది. (సంపా.)

మ. ధృతరాష్ట్రుం డతిలోభదూషితుఁడు ధాత్రీభాగ మీ నేర్చునే
సుతుఁడుం గష్టుఁడు సంధి యేల యగునంచున్ మున్న కైపెక్కిన
ట్టితలం పచ్యుత! నీకుఁ గల్గినది; గాండీవంబు దివ్యాస్త్ర సం
తతియుం బెట్టినయట్లయుండ మముఁ జింతం బాపరాదో కదే! 72

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అతి లోభదూషితుఁడు= మిక్కిలి దురాశచేత నిందింపదగినవాడు; ధాత్రీ భాగము= పుడమిలో పాలు; ఈన్+నేర్చునే= ఇచ్చుటకు సమ్మతిస్తాడా?; సుతుఁడున్= అతని కుమారుడైన సుయోధనుడు; కష్టుఁడు= కర్కశుడు; సంధి+ఏల+అగున్+అంచున్= సంధి ఎట్లా కుదురుతుందని; మున్న+అ= ముందుగానే; కైపు+ఎక్కినట్టి తలంపు= సందేహంతో కూడిన ఆలోచన; నీకున్+కల్గినది= నీకు పుట్టింది; గాండీవంబున్= నా ధనుస్సును; దివ్య+అస్త్ర సంతతియున్= దివ్యములైన బాణ సమూహమును; పెట్టిన+అట్ల+ఉండన్= వానికేమాత్రం

పనితగులకుండ ఉన్నచోటనే అవి ఉండగా; మమున్= మమ్ము; చింతన్+పాపరాదో+కదే?= విచారం పాలుగాకుండా చేయగూడదా యేమి?

తాత్పర్యం: కృష్ణా! ధృతరాష్ట్రుడు పరమ దురాశాపరుడు. అతడు మాకు రాజ్యభాగ మివ్వటానికి అంగీకరించడు. అతడి కొడుకు గూడా మిక్కిలి కర్కశుడు. మరి సంధి కుదరటం అసంభవమని ముందుగానే నీకు సందేహం కలిగింది. నా గాండీవం, దివ్యబాణ పరంపర పనిమాని ఊరక ఉన్నచోటనే ఉండగా మేము ఏ విచారం లేకుండా ఉండే మార్గం చూపించలేవా?

విశేషం: అర్జునుడు గూఢాభిమాని. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడు సంధి పడనీయరని అతడి దృఢ విశ్వాసం. శ్రీకృష్ణుడు కూడా అటువంటి అభిప్రాయాన్ని ఆవేశంతో అనటం కూడా జరిగింది. (చూడు పద్యాలు 1.352; 3.41). అంటే అర్జునుడికున్న అభిప్రాయమే కృష్ణుడి కున్నదన్నమాట! శ్రీకృష్ణుడు అచ్యుతుడు, అన్న మాట నుండి జారి పోయేవాడు కాదు. అయినా సంధి యత్నం చేస్తున్నాడు. ఇందులో సహజ విరోధాభాసం ఉన్నది. జగన్నాటక సూత్రధారి సాగించే రాజనీతి ఉన్నది. దానిని మనసులో పెట్టుకొని ఎత్తిపొడుపుగా 'నా గాండీవం, దివ్యాస్త్రాలూ ఉన్నవి ఉన్నట్లుగానే ఉండగా మా దిగులు తీరేటట్లు చేయు'మని అనటం వ్యంగ్యోక్తి. అర్జునుడి రథసారథిగా కృష్ణుడు కుదిరింది గాండీవి పరాక్రమాన్ని ప్రపంచానికి చాటటానికే. అదీ శ్రీకృష్ణు డన్నమాటే. ఇపుడు సంధి చేస్తే ఆమాట నిలువదు. అచ్యుత బిరుదం పొసగదు. కాబట్టి ఘటనాఘటన సమర్థుడైన శ్రీకృష్ణుడిలోని దివ్యత్వాన్ని భావిస్తూ 'అన్న మాటలన్నీ నిలబెట్టుకొని అచ్యుతత్వాన్ని కాపాడుకో'మ్మని పార్థుడు సున్నితమైన వ్యంగ్యోక్తిని పలికాడు. (సంపా.)

ఉ. నీ వొనరింపఁ బూనిన పనిం గమలోదర! కీడు వుట్టునే?
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావనసేఁత పౌరుషము పద్ధతి తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్. 73

ప్రతిపదార్థం: కమల+ఉదర!= ఓ పద్మనాభా!; నీవు+ఒనరింపన్+పూనిన పనిన్= నీవు చేయనెంచిన పనికి; కీడు+పుట్టునే?= హాని కలుగుతుందా? (కలుగదనిభావం); కార్యములు= నీవు సంకల్పించిన పనులు; కావు+అనినట్లు+అ+ఉండి= నెరవేరనట్లే కనిపించినప్పటికీ; అవున్= నెరవేరుతాయి; అట్లు+అగుటన్= అందువలన; ప్రయత్న సంభావన+చేఁత= కార్యమొనర్చుటకు పూనుకొనటం; పౌరుషము పద్ధతి= పురుష లక్షణం; తద్+ఫలసిద్ధి+పొందుచోన్= ఆ కార్యం యొక్క ఫలమును పొందే విషయంలో; దైవము తోడ్పడన్ వలయున్= దైవము సాయపడాలి; రెండును= కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం, అనేవి, పౌరుషమూ దైవమూ అనేవి; నీ వినోదముల్= నీ ఇచ్ఛకు లోబడి ఉంటాయి; తథ్యము= ఇది నిజం.

తాత్పర్యం: స్వామీ! నీవు చేయ నెంచిన పనికి హాని ఎప్పుడూ కలుగదు. కొన్ని పనులు ఫలించనట్లే ముందు కనిపించినా చివరకు ఫలిస్తాయి. కాబట్టి కార్యానికి పూనుకొనటం పురుష లక్షణం. కార్యఫలం తనకు సమకూరటంలో దైవ సహాయం అవసరం. కనుక పురుషయత్నం, దైవానుకూల్యం. కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం అనేవి రెండున్నూ నీ సంకల్పానికి లోబడి ఉంటాయి. ఈ మాట వాస్తవం.

విశేషం: 1. నరనారాయణ మహర్షులే భూతలం మీద అర్జునుడుగా, శ్రీకృష్ణుడుగా జన్మించారు. అర్జునుడు శ్రీకృష్ణుడి పట్ల స్నేహభక్తిని ప్రసరిస్తూ ఉంటాడు. నరుడు భక్తుడు, నారాయణుడు భగవంతుడు. అందువలన శ్రీకృష్ణుడిని దైవస్వరూపుడుగా,

పురుషకారదైవానుకూల్య శక్తిస్వరూపుడుగా భావించి పలుకుతున్నాడు. అతడి దృష్టిలో కృష్ణుడు దూత కాడు; ఘటనాఘటన సమర్థుడైన పరమాత్ముడు. ఆ భావానికి ఈ పద్యం అద్దం.

2. దైవ సంకల్పానికి వికల్పం లేదు. అయితే, కృష్ణుడు సంధిని కోరుతున్నాడా? యుద్ధాన్ని కోరుతున్నాడా? అన్నది అసలు ప్రశ్న. అది ఫలాన్ని చూచి తెలిసికొనవలసిన సత్యం. ఆ కార్యం ఏదైనా జయం మాత్రం తథ్యం - అని అర్జునుడి విశ్వాసం.

3. ఈ పద్యం భక్తిభావ వ్యంజకంగా ఉన్నది. ఎత్తుగడలో, ముగింపులో, నిర్వహణలో సమత అనే గుణం కనపడుతున్నది. వాక్య నిర్మాణంలో ఆ గుణం ప్రతిఫలిస్తున్నది. అది భక్తుడైన అర్జునుడి మనస్సులోని నిర్మలత్వాన్ని సమత్వాన్ని సూచిస్తున్నది.

4. తిక్కన రచనలోని నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ప్రవృత్తికి ఈ పద్యం ఉదాహరణం.

5. వాక్య విన్యాసంలో భక్తిభావాన్ని ధ్వనింపచేయటం తిక్కన రసధ్వనిశిల్పం.

6. 'కమలోదర!' సార్థక శబ్ద ప్రయోగం. శ్రీకృష్ణుడిలో విష్ణువును దర్శించే భావన ధ్వని. 'తథ్యము' 'నీ వినోదముల్' అనే పదాలు సమానమైన దైవలీలా విలాసాన్ని ధ్వనింపజేస్తున్నాయి. తేటతెనుగుకు తిక్కన శైలి ప్రసిద్ధి. దాని కిది ఉదాహరణం. (సంపా.)

ఉ. వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యులన్న నె
వ్వారికిఁ బోలదే సుజనవత్సల! నీ విటులంట వారు మ
మ్మీరసమెత్తి కీడ్పఱిచి యింతలుసేసినదాన నీ మదిం
గూరిన నొవ్వుసొంపునను గోపము పెంపునఁ గాదె యారయన్. 74

ప్రతిపదార్థం: సుజన వత్సల!= సత్పురుషులందు ప్రేమగల కృష్ణా!; వేరిమిన్= శత్రుభావంతో; ధర్మజున్= ధర్మపుత్రుడిని; పరిభవించిన ద్రోహులు= అవమానపరచిన ఘాతుకులు; వధ్యులు= చంపదగినవారు; అన్నన్= అనగా; ఎవ్వారికిన్+పోలదే= ఎవరికైనను యుక్తమే; నీవు+ఇటులు+అంట= యుద్ధంలో కౌరవులను జయించి రాజ్యభాగం గైకొనుట సమంజసమని నీవు పల్కటం; ఆరయన్= నిజం పరికిస్తే; వారు= ఆ కౌరవులు; ఈరసము+ఎత్తి= ద్వేషం వహించి; మమ్మున్= మమ్ములను; కీడ్పఱిచి= కష్టపెట్టి; ఇంతలు చేసిన దానన్= ఇంతటి దురవస్థల పాలు కావించిన కారణాన; నీ మదిన్= నీ హృదయంలో; కూరిన= నిండిన; నొవ్వుసొంపునను= బాధాతిశయం వలననూ; కోపము పెంపునన్+కాదె!= క్రోధవిజృంభణం వలననేకదా!

తాత్పర్యం: శత్రుభావంతో జూదంలో ధర్మజు నోడించి అవమానించిన ఆ ఘాతుకులు వధార్హులని ఎవరైనా చెప్పగలరు. నీవు సత్పురుషుల యందు వాత్సల్యం కలవాడవు కనుక ఆ కౌరవులు మా యెడ ద్వేషం పూని, మమ్ములను బాధించి, ఇంతటి దుఃస్థితి పాలుగావించిన కారణాన నీ హృదయంలో నెలకొన్న మిక్కుటమైన బాధ చేతనున్నూ, అగ్గలమైన కోపం చేతనున్నూ వారిని సంగ్రామంలో నిర్జించి, రాజ్యభాగం గైకొనటం యోగ్యమని చెప్పావుగాని మరేమీ కాదు.

విశేషం: అలం: కావ్యలింగం. 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్'. 'అజాతశత్రువైన ధర్మరాజుపై శత్రుభావం పూని అవమానించిన ద్రోహులైన కౌరవులు వధ్యులు అని ఎవరికైనా అనిపిస్తుంది. సుజనవత్సలా! నీకు కూడా అనిపించింది. అది సహజమే' అని తన ఊహను ఉపపత్తితో సమర్థించుకొంటున్నాడు అర్జునుడు. పగబూని పాండవులను పరిపరివిధాల బాధించినందుకు శ్రీకృష్ణుడి మనసు నొచ్చి కోపం వచ్చి ఉంటుందని సమర్థించాడు. అట్లా కోపం రావటానికి కారణం పాండవులు సుజనులు కావటం. శ్రీకృష్ణుడు సుజన వత్సలుడు కావటం. ఈ మాటలో తన మనోభావాలనే శ్రీకృష్ణుడిపై ఆరోపించి చెప్పే వైఖరి కూడా తోస్తుంది. నరనారాయణుల అభేద ప్రవృత్తి ఇందులో వ్యంగ్యంగా స్ఫురిస్తుంది. (సంపా.)

ఉ. ఐనను జిత్తగింపు; ద్రుపదాత్మజ నాసభ నట్లు సేసినన్
దానికి సైఁప లెస్సయని దైన్యముఁ బొందుట కోర్చి యమ్మెయిం
గాననభూమికిం జనుట కారుణికోత్తమ! నీ వెఱుంగవే?
కాన సహించి పాండవులఁ గౌరవులం దగఁ గూర్పు నేర్పునన్. 75

ప్రతిపదార్థం: కారుణిక+ఉత్తమ!= దయావంతులలో శ్రేష్ఠుడా!; ఐనను= ఇనప్పటికినీ; చిత్తగింపు= మా మాటలు అవధరించవలసింది; ద్రుపద+ఆత్మజన్= పాంచాలిని; ఆ సభన్= ఆనాటి ఒడ్డోలగంలో; అట్లు+చేసినన్= తలవెంట్రుకలు పట్టి ఈడ్చి వలువలు ఒలిచినమా; దానికిన్= ఆ దుండగాలకు; సైఁపన్+లెస్స+అని= సహించియుండటం మంచిదని; దైన్యమున్+పొందుటకున్+ఓర్చి= దీనదశ పాలవటానికి సహించి; ఆ+మెయిన్= ఆ విధంగా; కానన భూమికిన్+చనుట= అరణ్య ప్రదేశాలకు వెళ్ళుట; నీవు+ఎఱుంగవే?= నీకు తెలియదా?; కానన్= ఇన్నిటినీ నీ వెఱిగి ఉన్నందువలన; సహించి= ఓర్చుకొని; పాండవులన్ కౌరవులన్= కౌరవ పాండవులను; నేర్పునన్= సామర్థ్యంతో; తగన్+కూర్పు(ము)= ఒకటిగా చేయవలసింది.

తాత్పర్యం: పరమ కృపాశాలివగు కృష్ణా! కౌరవులను ఏమి చేసినా దోషం లేనప్పటికీ నా మాటలు ఆలకించవలసింది. ఆనాడు నిండు సభలో పాంచాలిని కొప్పుపట్టి ఈడ్చి, వలువ లొలిచిననూ మంచిదని మిన్నకున్నాం. దైన్యస్థితి పొందుటకున్నూ ఓర్చి, తలవంచుకొని అడవులకు పోయాం. ఇదంతా నీవెఱుగుదువు. కావున వారి దుండగాలన్నింటినీ మన్నించి, నేర్పుతో కౌరవ పాండవుల నొకటిగా ఉండేటట్లు కావించుము.

విశేషం: 1. అర్జునుడి మాటల కన్నిటికీ కీలకం వలె ఉండేది సంబుద్ధి. 'కారుణికోత్తమా!' అని శ్రీకృష్ణుడిని సంబోధించాడు. ఇతరుల కష్టసుఖాలను తనవిగా భావించి ఆర్ద్రుడయ్యే వారిలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుడట! అందువలన అలనాడు కౌరవసభలో ద్రౌపదికి చేసిన అవమానాలకు సైతం ఓర్చి అరణ్యాజ్ఞాతవాసాలు చేసి కష్టాలు పడిన పాండవుల దీనస్థితిని శ్రీకృష్ణుడు తానే అనుభవించినట్లు భావించి క్రోధోద్రిక్తుడు కావటం అతడి నైజగుణం. అటువంటి వాడు కౌరవ సభలో ఆ దైన్యాన్ని స్మరించి కోపానికి వశుడై సంధి యత్నాన్ని విఫలం చేస్తాడేమో! అని అర్జునుడు సహనాన్ని ప్రబోధిస్తున్నాడు. ఇది తన మానసిక స్థితిని శ్రీకృష్ణుడియందు ఆరోపించటమే, పైపెచ్చు సంధి ప్రయత్నాల సమయంలో పాండవులు పడిన బాధలు మరచిపోవద్దనటం వ్యతిరేక వ్యంగ్యధ్వని. పార్థుడిక్రోధం హృదయంలో గూఢంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

2.'ద్రుపదాత్మజ నా సభనట్లు సేసినన్' - ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం పైకి చెప్పరాని దనుట.

తే. అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి । మమ్ముఁ బఱచిన పాటులు మానసమునఁ
జవుటఁబెట్టిన విత్తుల చందమొంది । యంకురింపక చెడిపోయె నంబుజాక్ష! 76

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలాల వంటి కన్నులు గల శ్రీకృష్ణా!; అలవి+ఎఱుఁగక= తమశక్తి ఏపాటిదో తెలిసికొనక; ధార్తరాష్ట్రులు= కౌరవులు; కడంగి= పూనుకొని; మమ్మున్= మమ్ములను; పఱచిన పాటులు= పెట్టిన బాధలు; మానసమునన్= మా హృదయంలో; చవుటన్+పెట్టిన= చవిటి నేలలో విత్తిన; విత్తుల చందము+ఒంది= గింజల తీరై; అంకురింపక= మొలకెత్తక; చెడిపోయెన్= నశించాయి.

తాత్పర్యం: పుండరీకాక్షా! తమ శక్తి ఏపాటిదో తెలిసి కొనక దుర్యోధనాదులు పూనుకొని మమ్మ నానావిధ బాధలకు గురి చేశారు. చవిటి నేలలో విత్తిన విత్తులు మొలకెత్తక నశించిన విధంగా ఆ తలంపులన్నీ మా హృదయంలోనే అణగారిపోయాయి.

విశేషం: అలం: ఉపమ. 1.అర్జునుడి మనస్సులో ఉన్న గూఢామర్షకు ఈ పద్యం అద్దం పట్టుతున్నది. బాధ పొందిన హృదయక్షేత్రాలు పగ సాధింపు చర్యతో సారవంతమౌతాయి. కాని, పాండవ హృదయాలు ధర్మజశాంతి ప్రబోధం చేత శమభావాన్ని పొంది యుద్ధబీజాలు మొలకెత్తని చవిటి నేలలుగా తయ్యారయ్యాయి. దానితో వారి ఆశలు, ఆకాంక్షలు మొలకెత్తని విపరీతస్థితికి గురి అయ్యాయి. ఇది ఆత్మనిర్వేదాన్ని భగవంతుడితో చెప్పుకొంటున్న తీరు. యుద్ధ వాంఛను గూఢంగా వ్యక్తం చేస్తున్న వైఖరి. వ్యతిరేక వ్యంగ్య స్ఫూర్తి ధ్వనించే విధంగా మాట్లాడే ఈ తీరు సుకుమార వైఖరి అంటారు. (సంపా.)

2. దుర్యోధనాదులు మాకు కలిగించిన కష్టాలు నా మనస్సులో చవిటినేలలో చల్లిన విత్తులవలె మొలకెత్తకుండా చెడిపోయాయి - అని తెలుగులో ఉండగా, మూలంలో - 'సనామ సమ్య గ్వర్తేత పాండవేష్విత మాధవ, నమే సంజాయతే బుద్ధిః బీజ ముప్తమి వోష'(సం. 5-76-19) - చవిటి నేలలో చల్లిన విత్తనంవలె, దుర్యోధనుడు పాండవుల విషయంలో సరిగా ప్రవర్తిస్తాడని నాకు అనిపించటంలేదు. అని మూలంలో ఉంది. (సంపా.)

వ. అమ్మొఱకుల నెమ్మెయి నయినను. 77

తాత్పర్యం: ఆ మూర్ఖులను ఏ విధంగానైనా

క. ఒడఁబఱిచి మాకు వారికిఁ। బుడమి సగము గాఁగఁ జేసి పొంది పొసఁగియుం
డెడు నట్టి తెఱఁగు సేయుట। కడు మేఁ; లది గౌరవము సుఖంబును జేయున్. 78

ప్రతిపదార్థం: ఒడన్+పఱిచి= సమ్మతింపజేసి; మాకున్ వారికిన్= మాకున్నూ, కౌరవులకున్నూ; పుడమి సగము గాఁగన్+చేసి= భూమిలో చెరిసగము వచ్చునట్లొనరించి; పొంది పొసఁగి+ఉండెడు+అట్టి= కలిసి మెలసి జీవించే; తెఱఁగుచేయుట= విధానం రూపొందించటం; కడున్+మేలు= మిక్కిలి మంచిది; అది= ఆ ఏర్పాటు; గౌరవమున్= గౌరవాన్ని; సుఖంబును= సౌఖ్యాన్ని; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కృష్ణా! ఆ మూర్ఖుల నెట్లాగయినా సంధి కొప్పించి మాకూ, వారికీ రాజ్యంలో చెరిసగం వచ్చేటట్లుగా చేసి, ఉభయులం కలిసి మెలసి ఒద్దికగా జీవించే ఏర్పాటు కావించటం చాలా మంచిది. ఆ ఏర్పాటు వలన మాకు గౌరవమూ, సౌఖ్యమూ లభిస్తాయి.

క. నీ కిట్టిది చిత్తమునకు। రాకున్నది యేని వలదు రం డిమ్మెయి మీ
రీకార్యము సేయుం డని। మా కానతి యిమ్ము కంసమర్దన! తెలియన్. 79

ప్రతిపదార్థం: కంసమర్దన!= కంసుడిని నిర్మూలించినవాడా!; నీకున్= నీకు; ఇట్టిది= ఇటువంటి సంధి విధానం; చిత్తమునకున్+ రాక+ఉన్నది+ఏనిన్= మనసునకెక్కని పక్షాన; వలదు= అక్కరలేదు; మీరు రండు= మీరు రండి; ఈ+మెయిన్= ఈ విధంగా; ఈ కార్యము చేయుండు+అని= మీరీపని చేయండని; తెలియన్= మేము గ్రహించి అనుసరించేటట్లుగా; మాకున్+ఆనతి+ ఇమ్ము= మాకు ఆజ్ఞ దయచేయుము.

తాత్పర్యం: కృష్ణా! కౌరవులతో మేము సంధి చేసికొనుట మీ దివ్యచిత్తానికి సరిపడకపోతే - ఆ పద్ధతి మీకు తగదు, మీరు ఈ రకంగా ఈ పని చెయ్యండి అని స్పష్టంగా మాకు ఆజ్ఞ నివ్వండి.

మ. హిత మిబ్భంగిది మాకు ధర్మము తెఱం గిట్లుండునం చేను నీ
మతి బోధింప వలంతినే? హితము ధర్మంబున్ విచారించి చూ
చి తగున్‌బొమ్మని యేది పంచి తది నిశ్చింతంబునంజేసి యు
న్నతిం బొందంగలవారమై యునికి కృష్ణా! నేఁడుగా వచ్చెనే! 80

ప్రతిపదార్థం: కృష్ణా!= శ్రీకృష్ణా!; మాకున్= మాకు; హితము+ఈ భంగిది= మేలుగల్గించు పద్ధతి ఇటువంటిది; ధర్మము తెఱంగు= న్యాయసరణి; ఇట్లు+ఉండున్+అంచున్= ఈరీతిగా ఉండునని; ఏను= నేను; నీ మతి బోధింపన్= నీ మదికి గోచరింపచేయటానికి; వలంతినే= సమర్థుడనా? (కానని అర్థం); హితమున్, ధర్మంబున్= హితమునూ, ధర్మమునూ; విచారించి చూచి= ఆలోచించి నిర్ణయము ఒనర్చి; తగున్+పొమ్ము+అని= ఈ దారిలో చక్కగా సాగుమని; ఏది+పంచితి(వి)= ఏమి సల్పుటకు ఆజ్ఞాపింతువో; అది= దానిని; నిశ్చింతంబునన్+చేసి= నిర్విచారంగా కావించి; ఉన్నతిన్+పొందన్+కలవారము+ఐ+ ఉనికి= ఔన్నత్యం వహించి జీవించే స్థితి; నేఁడుగా+వచ్చెనే?= ఈ నాడు వచ్చిందా? కాదని భావం.

తాత్పర్యం: కృష్ణా! మా కిది మేలు కలిగిస్తుంది; ధర్మస్వరూప మిటువంటిది- అని నీకు తెలియజెప్పుటకు నేను ఏపాటివాడిని? ఏది హితమో, ఏది న్యాయమో నీవే ఆలోచించి నిర్ణయించి ఈ దారిని పొమ్మని నిర్దేశిస్తే ఆ మార్గాన్ని అవలంబించి నిర్విచారంగా నీవు చెప్పినట్లు చేసి ఉన్నతస్థితికి రాగలం. అట్టి స్థితి నేడు క్రొత్తగా ఏర్పడింది కాదుకదా!

విశేషం: 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అన్న గీతాకారుడి వాక్యానికి అనుగుణంగా అర్జునుడు పాండవుల అనన్య భక్తి విశేషాన్ని పేర్కొని, శ్రీకృష్ణు డేది చెప్పితే అదే హితవు. అదే ధర్మం అని భావించే శరణాగత ప్రవృత్తిని, నిరహంకార చిత్తవృత్తినీ ఈ పద్యంలో ప్రదర్శించి భక్తు డనిపించుకొన్నాడు. 78, 79, 80 పద్యాలు అర్జునుడి త్రికరణశుద్ధిని ప్రదర్శిస్తున్నాయి. (సంపా.)

వ. అనిన విని కృష్ణుండు విజయున కిట్లనియె : 81

తాత్పర్యం: అనగా విని కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు :

ఉ. వెరవున లావునం గృషికి వేయు విధంబుల మేలొనర్చినం
దొరకొనునే ఫలంబు? తఱితోఁ దగు వర్షము లేకయున్నఁ; నె
ప్పరుసున లెస్స సేసినను బౌరుషముల్ ఫలియించు టెల్ల నా
దరణమునం బ్రసన్నమగు దైవముచేఁతన చూవె ఫల్గునా! 82

ప్రతిపదార్థం: ఫల్గునా!= (ఉత్తర ఫల్గునీ నక్షత్రాన జన్మించిన) అర్జునా!; వెరవునన్= ఉపాయంతో; లావునన్= శక్తితో; కృషికిన్= సేద్యానికి; వేయు విధంబులన్= బహు ప్రకారాల; మేలు+ఒనర్చినన్= దోహదం చేసినప్పటికినీ; తఱితోన్= అదనులో; తగు వర్షము లేక+ఉన్నన్= తగినంత వాన కురియకపోతే; ఫలంబు దొరకొనునే?= పంట లభించగలదా?; ఏ+పరుసునన్= ఏ విధంగా నైనను; లెస్స+చేసినను= చక్కగా పనులు గావించిననూ; పౌరుషముల్ ఫలియించుట+ఎల్లన్= పురుష యత్నాలు సఫలం కావటం అన్నది; ఆదరణమునన్= ప్రేమతో; ప్రసన్నము+అగు= అనుగ్రహం చూపు; దైవము చేఁతన్+అ చూవె= దైవం యొక్క తోడ్పాటు వల్లనే సుమా!

తాత్పర్యం: ఉపాయంతో శక్తితో శ్రమించి సేద్యానికి పలు రకాల దోహదం చేసినప్పటికీ సమయానికి తగినంత వర్షం లేకుంటే పంట చేతికందదు. అట్లాగే ఎన్నో విధాల పరిశ్రమ చేసినప్పటికినీ ప్రేమతో దైవం ప్రసన్నమైనప్పుడే పురుషయత్నాలు సఫలమౌతాయి.

విశేషం: 1. అలం: దృష్టాంతం, అప్రస్తుత ప్రశంస, అర్థాంతరన్యాసం. "చేద్ బింబప్రతిబింబత్వం దృష్టాంత స్తదలంకృతిః". రెండు వాక్యాలకు బింబప్రతిబింబ భావం వర్తించబడితే దృష్టాంతం. ఈ పద్యంలో పద్యపూర్వార్ధంలోని వాక్యానికి ఉత్తరార్ధంలోని వాక్యం దృష్టాంతం. "అప్రస్తుత ప్రశంసా స్యాత్ సా యత్ర ప్రస్తుతాశ్రయా". అప్రస్తుత కథనం వలన ప్రస్తుతం స్ఫురిస్తే అప్రస్తుత ప్రశంస. ఇక్కడే సేద్యం, సకాలవర్షం లేక ఫలం చేతికందకపోవటం అనే అప్రస్తుత కథనం వలన ప్రస్తుత కథాంశం స్ఫురించబడుతున్నది కాబట్టి అప్రస్తుత ప్రశంస.

2. 'పురుషకారం, దైవానుకూల్యం అనేవి రెండూ నీ లీలలే కృష్ణా!' అని అర్జునుడు శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని కీర్తించగా, శ్రీకృష్ణుడు తాను దివ్యుడు కానట్లు, లౌకిక వ్యక్తి అయినట్లు, దైవం ప్రత్యేకంగా ఉన్నట్లూ మాట్లాడిన మాటలివి. 'దైవం మానుష రూపేణ.'

3. ఎన్ని పాట్లు పడి వ్యవసాయం చేసినా తగిన సమయంలో పడిన వర్షం వలననే పంట పండుతుంది. అట్లాగే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆ సమయానికి దేవుడు ప్రసన్నుడైతేనే అవి ఫలిస్తాయి- అనే ఈ తాత్పర్యంలో అర్థాంతర న్యాసాలంకారం కూడా సార్థకంగా ఔచిత్యవంతంగా ప్రయోగించబడింది. అర్థాంతరన్యాసంలో సామాన్యం విశేషం చేత కాని, విశేషం సామాన్యం చేతకాని సమర్థించబడాలి. ఇందులో సామాన్యం విశేషం చేత సమర్థించబడింది. ఇటువంటి అర్థాంతరన్యాసం తక్కువగా కవులు వాడుతుంటారు. విశేషాన్ని సామాన్యంతో సమర్థించే పద్ధతిని మార్చి చెప్పిన ఈ వాక్యం శ్రీకృష్ణుడి స్వభావాన్ని ధ్వనింపజేస్తున్నది. అతడు నిజంగా దివ్యుడే. కాని, అదివ్యుడనని సమర్థించుకొనబోతున్నాడు. ఇది నిజానికి వ్యత్యస్తమే. దానిని అలంకార ధ్వనితో తిక్కన ప్రదీప్తం చేశాడు.

4. శ్రీకృష్ణు డీ సందర్భంలో చెప్పిన ఈ పద్యం, రాబోయే పద్యం, ఈ రెండూ - ధర్మరాజు పలికిన రెండు పద్యాలకు ప్రతి రూపాలుగా కనపడతాయి. ఉదా.

ధర్మ: పగయడగించు టెంతయు శుభంబు... (3.21)

శ్రీకృష్ణ: వెరవున లావునం గృషికి వేయువిధంబుల ... (3.82)

ధర్మ : కావున శాంతి బొందుటయ కర్జము ... (3.22)

శ్రీకృష్ణ: కావున సంధికిం బురుషకార మొనర్చెద ... (3.83)

తిక్కన పద్యరచనలో సందర్భోచితంగా, పాత్రోచితంగా ఇటువంటి సంవాద శిల్పాలను ప్రదర్శిస్తాడు. శ్రీకృష్ణ పాత్రోచిత పద్య మిది. పద్యం సంబుద్ధితో అంతమైనప్పుడు ప్రతిపాద్యాంశంమీద శ్రోత సమాహితాన్ని నిలిపే సూచన గోచరిస్తుంది.

6. తెలుగు - పదాల పొందికకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. (సంపా.)

ఉ. కావున సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయున్
దైవముచేఁత యెట్లగునొ దాని నెఱుంగ సుయోధనుండు సం
భావనసేసి పా లొసఁగు పాడియ కల్గిన బాల్యమాదిగా
నేవిధి నైననుం జెఱుప నింతలు పాపము లాచరించునే? 83

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సంధికిన్= సంధికి; ఓపిన+అంతయున్= శక్తి ఉన్నంతవరకూ; పురుషకారము+ఒనర్చెదన్= పురుష ప్రయత్నం చేస్తాను; దైవము చేఁత+ఎట్లు+అగునొ?= దైవ మేమి చేయదలం చాడో; దానిన్+ఎఱుంగన్= ఆ విషయం

తెలియలేను; సుయోధనుండు= దుర్యోధనుడు; సంభావన+చేసి= మనమాట నాదరించి; పాలు+ఒసఁగు= భాగమిచ్చునట్టి; పాడియ కల్గినన్= న్యాయబుద్ధి గలవాడైతే; బాల్యము+ఆదిగాన్= చిన్నతనం నుండి; ఏ+విధిన్+ఐనను= ఏ రకంగానైనను; చెఱుపన్= మిమ్ము నాశనం చేయటానికి; ఇంతలు పాపములు= ఇంతటి పాపపుపనులు; ఆచరించునే?= చేస్తాడా? (చేయడని అర్థం-)

తాత్పర్యం: నేను మాత్రం నా శక్తికొద్దీ సంధి సమకూర్చటానికే ప్రయత్నిస్తాను. దైవం ఏమి చేయదలచాడో చెప్పలేను. దుర్యోధనుడు ఆదరంతో రాజ్యభాగమిచ్చే న్యాయబుద్ధికలవాడైతే చిన్నతనంనుండి ఎన్నో విధాల మిమ్మల్ని పాడు చెయ్యటానికి ఇన్ని దుష్కృత్యాలు కావిస్తాడా? (కావించడని తాత్పర్యం.)

విశేషం: మూలాన్ని సందర్భోచితంగా మలచే నేర్పరితనానికి ఈ పద్యం చక్కని ఉదాహరణం. మూల శ్లోకా లివి-

> **"అహం హి త త్కరిష్యామి పరం పురుషకారతః ।**
> **దైవంతు న మయా శక్యం కర్మ కర్తుం కథంచన ॥ (సం. 5-77-5)**
> **యత్తు వాచా మయా శక్యం కర్మణా చాపి పాండవ ।**
> **కరిష్యే తదహం పార్థ న త్వాశంసే శమం పరైః ॥ (సం. 5-77-18)**

మూలంలో కృష్ణుడు విధి ప్రస్తావన చేశాడు. తెలుగులో అది లేదు. సంధి జరిగే నమ్మకం, ఆశా తనకు లేదని మూలంలో శ్రీకృష్ణుడు అన్నాడు. తెలుగులో పురుషయత్నం చేస్తాను కాని దైవానుకూల్యం ఎట్లా ఉంటుందో తెలియదన్నాడు. అంటే ఉండదనే ధ్వని. ఇది అర్జునుడి అంతరంగాన్ని ఊరట పరిచే వాక్యం. చిన్ననాటినుండి దుర్యోధనుడు ప్రదర్శించే ప్రవర్తనను పేర్కొని, అందులో మార్పు లేదు కాబట్టి సంధి జరగటం అసంభవమని ప్రత్యక్ష ప్రమాణాల నాధారంగా ప్రతిపాదించటం విశేషం. పద్య ఉత్తరార్థం తరువాతి కథార్థాల కనుగుణంగా మలచబడటం విశేషం. (సంపా.)

వ. అది యెల్ల నట్లుండె; నిచ్చట విరాటు పసులన్ బెట్టింప నీవు వోయిన యప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు. 84

ప్రతిపదార్థం: అది+ఎల్లన్+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉండగా; ఇచ్చటన్= మత్స్యనగరంలో; విరాటు పసులన్+పెట్టింపన్= విరటుడి గోవులను మరలించటానికి; నీవు పోయిన+అప్పుడు= నీవు వెళ్ళిన సమయంలో; భీష్ముండు= పితామహుడు; దుర్యోధను తోన్+చెప్పిన తెఱంగు= దుర్యోధనుడితో వచించిన విధ మిది:

తాత్పర్యం: ఆ విషయం అట్లా ఉంచుము. మత్స్యనగరంలో విరటుడి గోవులను కౌరవులు తోలుకొనిపోతుండగా, వాటిని మళ్ళించుకొనిరావటానికి నీవు వెళ్ళినప్పుడు భీష్ముడు దుర్యోధనుడితో పలికిన పలుకులివి:

ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే?
హెచ్చగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్క మెయి నిత్తఱిఁ బొందగుచేఁతయుం దగున్. 85

ప్రతిపదార్థం: వచ్చినవాఁడు= గోవులను మరలించటానికై అరుదెంచినట్టివాడు; ఫల్గునుఁడు= అర్జునుడు; అవశ్యమున్= తప్పక; గెల్తుము+అనంగన్ రాదు= మనమే జయించగలమని చెప్ప వీలుగాదు; రాలచ్చికిన్+ఐ= రాజ్యలక్ష్మికొరకు; పెనంగినన్=

పోరాడితే; బలంబులు రెండును= ఇరుసైన్యాలూ; గెల్వన్+నేర్చునే?= జయించగలవా? (జయించలేవని అర్థం); హెచ్చుగున్= ఒకటి మించుతుంది; కుందు+అగున్= మరొక్కటి తగ్గుతుంది; తొడరుట= ఎదిరించటం; ఎల్లవిధంబులకున్+ఓర్చుట= జయాపజయాలను భరించుటే ఔతుంది; అట్లు+కాక= జయాపజయాలను కలిగించే పోరాటానికి దిగకుండా; ఇచ్చన్+తలంచి= మనసులో యోచించి; ఒక్క మెయిన్= ఒక రీతిని; ఈ+తఱిన్= ఈ సమయంలో; పొందు+అగు+చేఁతయున్+తగున్= పొత్తు సమకూడే పనికి పూనుకోవటమే యుక్తం.

తాత్పర్యం: ఆవులను మరలించుకొని పోవుటకై వచ్చినవాడు అర్జునుడు! తప్పక యుద్ధంలో మనమే గెలుస్తా మనటానికి వీలుగాదు. రాజ్యలక్ష్మి కొరకు సైన్యాలు తలపడితే ఇరుపక్షాలు జయం పొందగలవా? ఒకరిది పైచేయి, మరొకరిది క్రిందిచేయి అవుతుంది. జయాపజయాలను భరించటానికి సమ్మతమైతేనే సంగ్రామానికి దిగవలె. అట్లాకాకుండా ఆలోచించి ఏదో ఒక విధంగా సంధి కావించుకొనటం మంచిది.

విశేషం: 1. కృష్ణుడు మహావక్త. ప్రతిపాద్యాంశాలకు దృష్టాంతాలను పేర్కొంటూ మాట్లాడటం తర్కబద్ధ వాక్యవాదికి సహజగుణం. శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పదలచుకొన్న అంశం- దుర్యోధనుడు సంధికి అంగీకరించడని. దానికి తార్కాణంగా ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడు పలికిన ఈ పద్యాన్ని (విరా. 4.234) పేర్కొని, దానికి దుర్యోధనుడిచ్చిన సమాధానాన్ని చెప్పాడు. అది - 'మనకూ పాండవులకూ ఎట్లా పొత్తు కలుగుతుంది? నేను వారి రాజ్యభాగం తిరిగి ఇవ్వను. యుద్ధం చేసి పరాక్రమంతో వారిని జయించటమే మార్గం. ఇది నా నిశ్చయం.' (విరా. 4.235)

2. యుద్ధంలో జయాపజయాలు అనిశ్చితాలని చెప్పే భీష్ముడి అభిప్రాయం లోకనీతి వాక్యమే. యుద్ధం వద్దనే వారూ, శాంతిని కోరేవారూ ఈ అంశాన్ని పేర్కొని, సంధి అనుసరణీయమని చెప్తుతారు. ఉద్యోగపర్వంలో ధర్మరాజు కూడా ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తం చేశాడు. (3.18). యుద్ధంలో జయమో, ఓటమో నిశ్చయంగా చెప్పలేం. యుద్ధంలో ఓడితే మరణం కంటె దుర్భరమైన మనోవేదన పడాలి. కాబట్టి, సంధి మేలంటాడు ధర్మరాజు. ధర్మరాజూ, భీష్ముడూ ఒకే రకంగా, శాస్త్రీయంగా, లోకహితంగా, అచరణయోగ్యంగా ఆలోచిస్తున్నారని ఇక్కడ స్పష్టం. ఒకసారి ఇట్లాంటి యత్నం చేసి భీష్ముడు విఫలుడు కాగా, ఇప్పుడు ధర్మరాజు సఫలుడౌతాడా? అనే ప్రశ్న శ్రీకృష్ణుడు రేకెత్తించాడు.

3. 'వచ్చిన వాడు ఫల్గునుఁడు'- తిక్కనగారి ఈ వాక్యం తెలుగువారి జాతీయమైపోయింది. ఫల్గునుడు అంటే ఫల్గుని నక్షత్రంలో పుట్టినవాడు. పిడుగులు పడేటప్పుడు 'అర్జునః ఫల్గునః'' అని తలచుకొంటాం. పిడుగు పడి చనిపోతామన్న భయం కలిగే సమయంలో తలచుకొనే ఈ పేరు పిడుగుపాటు వంటి వాడు అనే అర్థంలో తెలుగువారి నోట రూఢికెక్కింది. ఎవడో అసాధ్యుడు వస్తున్నాడనే అర్థంలో తెలుగు వ్యవహారంలో రూఢి కెక్కింది. ఆ పలుకుబడికి ఈ పద్యం మూలం.

4. అచ్చమైన తెలుగు పదాలను దేశీయంగా వాడటం, ద్విత్వచకారప్రాస పద్యం ఎత్తుగడలో ఆశ్చర్యం, ముగింపులో హితబోధ అచ్చు గుద్దినట్లు కనపడుతున్నాయి.

5. పాత్రోచిత, సందర్భోచిత సంభాషణలకు తిక్కన పెట్టింది పేరు. భీష్ముడు శాంతి కాముకుడు. కాని, మహావీరుడు. అతడి దృష్టిలో అర్జునుడు అతిలోకవీరుడు. దానికి కారణం అతడు సాధించిన పాశుపతాస్త్రం, ఇంద్రాది దేవతలిచ్చిన అస్త్ర సంపద. 'విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్' అని లోకోక్తి. పండితుడే పండితుడిని అంచనా వేయగలడు. ఈ మాట ఈ పద్యంలో అక్షర సత్యం.

6. ఈ పద్యంలో అర్జునుడి పరాక్రమం ధ్వని. దానిని ధ్వనింపజేసి కౌరవ పాండవుల మధ్య సంధి కుదిరించాలన్న భీష్ముడి శాంతి సంకల్పం ధ్వని. కవిత్రయం ధ్వని ప్రస్థానానికి సంబంధించిన వారు. తిక్కన రసధ్వని మార్గంలో సాగాడు. శబ్దవాక్య

ప్రయోగంలో తిక్కన ఔచిత్య పాలనం చేస్తాడు. శబ్దగుణాల కంటె అర్థ గుణాలను ఎక్కువగా పోషిస్తాడు. ఈ పద్య రచనలో ప్రసాద గుణం ఉన్నది. బంధ శైథిల్యం అర్థ వైమల్య పోషకంగా నిలవటం ఇందులో విశేషం.

7. తిక్కన తన రచనలో కొన్ని పద్యాలను సందర్భోచితంగా పునరుక్తం చేశాడు. అట్లా చేసిన వాటిల్లో ఈ పద్యం, తరువాతి పద్యం కూడా ఉన్నాయి. కథలో కీలకపాత్ర నిర్వహించే ఈ రెండు పద్యాలూ వస్తుగత ప్రాధాన్యం కలవి. (సంపా.)

వ. అనియె దానికతం డుత్తరం బిచ్చిన తెఱంగు. 86

ప్రతిపదార్థం: అనియెన్= అని భీష్ముడు చెప్పాడు; దానికిన్= అందుకు; అతండు= దుర్యోధనుడు; ఉత్తరంబు+ఇచ్చిన తెఱంగు= సమాధానం చెప్పిన విధం ఇది:

తాత్పర్యం: భీష్ముడి పలుకులకు దుర్యోధనుడు ఇట్లా సమాధాన మిచ్చాడు:

ఆ. మనకుఁ బాండురాజతనయవర్గమునకు । నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ । నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు. 87

ప్రతిపదార్థం: మనకున్= మనకూ; పాండురాజు తనయ వర్గమునకున్= పాండురాజు యొక్క కుమార సమూహానికీ; ఎట్లు+పొందు+కలుగున్?= ఎట్లా పొత్తు కుదురుతుంది?; నేను రాజ్యభాగము+ఈను= నేను రాజ్యంలో భాగం పంచి వారి కివ్వను; సమర భంగికిన్+అ= యుద్ధపద్ధతికే; విక్రమ నిరతిన్+పూనుట= యుద్ధమునందు ఆసక్తి వహించటం; ఇది+అ= ఇదియే; నిశ్చయంబు= నా నిర్ణయం.

తాత్పర్యం: మనకూ పాండవులకూ పొత్తెలా పొసగుతుంది? నేను రాజ్యంలో వారికి భాగం పంచి ఇవ్వను. పరాక్రమంతో సమరం సాగించి రాజ్యమంతా ఏలుకొనటానికే నిర్ణయించుకున్నాను.

వ. అని పలికె; నది యంతయుఁ బదంపడి మనమెల్ల వింటిమ కాదె! యా మాటల ఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు వెండియుఁ దెలియండు. 88

ప్రతిపదార్థం: అని పలికెన్= అని చెప్పాడు; అది+అంతయున్= ఆ సంగతంతా; పదంపడి= తరువాత; మనము+ఎల్లన్= మనమందరమూ; వింటిమి+అ కాదె!= విన్నాంగదా!; ఆ మాటల ఫలంబు= ఆ మాటల వలన కలిగిన లాభమేమిటో; అప్పుడు= ఆ ఉత్తర గోగ్రహణ యుద్ధంలో; ఆ కష్ట+ఆత్ముండు= ఆ కఠినచిత్తుడైన దుర్యోధనుడు; కనియున్= చూచి కూడా; వెండియున్= ఆ తరువాతనైనా; తెలియండు= గ్రహించలేకున్నాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు భీష్ముడితో చెప్పిన మాటలు ఆ తర్వాత మనమంతా విన్నాం. ఆ మాటల ఫలమేమిటో ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అతడు చవి చూచాడు. రణంలో నీచేత పరాజితుడైన తర్వాతకూడా ఆ దుష్టచిత్తుడు తన మూర్ఖపు పట్టు విడువలేకున్నాడు.

తే. అతని గుణదోషముల చంద మట్లయుండె; । నాకు ధర్మజు బుద్ధిన నడపవలయు
నిత్తెఱం గాచరింపంగ నేఁగి యచట । నెల్ల తెఱఁగును నేర్పడ నెఱిఁగివత్తు.' 89

ప్రతిపదార్థం: అతని గుణదోషముల చందము= ఆ దుర్యోధనుడి గుణావగుణముల తీరు; అట్లు+అ+ఉండెన్= ఆవిధంగా ఉండనీ; నాకున్= నాకు; ధర్మజుబుద్ధిన్+అ= ధర్మరాజు తలపుజాడలోనే; నడవన్+వలయున్= మెలగవలసి ఉన్నది; ఈ+తెఱంగు+

ఆచరింపఁగన్+ఏఁగి= సంధి సమకూర్చటానికి కురుసభకు వెళ్ళి; అచటన్= అక్కడ; ఎల్ల+తెఱఁగును= ఉన్న విధమంతా; ఏర్పడన్= విశదంగా; ఎఱిఁగి వత్తున్= తెలిసికొని వస్తాను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి గుణదోషాలు అట్లా ఉండనీ. నేను ధర్మరాజు కోరిన చందంగా రాయబారం నడపటానికి కురుసభకు వెళ్ళవలసి ఉన్నది. పొత్తు కుదర్చటానికి వెళ్ళి, అక్కడ వారి వర్తనాలెలా ఉన్నాయో తేటతెల్లంగా తెలిసి కొని తిరిగి వస్తాను.'

విశేషం: అర్జునుడితో పలికిన ఈ చివరి పద్యం రాయబారపు రహస్యం చెప్పే రాజనీతి మంత్రం. దుర్యోధనాదులు ఎట్లా వర్తించినా శత్రు రహస్యాలను తెలిసికొనటం, భేదోపాయాన్ని నిపుణంగా ప్రయోగించటం, విజయావకాశాలను మెరుగు చేసికొనటం - అనేవి శ్రీకృష్ణుడి హస్తినాపుర ప్రయాణ ప్రయోజనాలలోని రహస్యం. ధర్మజుడు కోరేదీ అదే. దానిని మనసు విప్పి అర్జునుడితో చెప్పిన ముగింపు పద్యం. (సంపా.)

చ. అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను 'నీకు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుఁడుం దగఁ జెప్పుట రిత్తగాదు; మా
మనము లరణ్యవాసమున మత్స్యమహీపతిపాల నున్నయ
ద్దినముల భంగి గావు; కృపఁ దీవ్రతఁ గుందిన చంద మయ్యెడున్. 90

ప్రతిపదార్థం: అనిన ముకుందుతోన్= అని పల్కిన కృష్ణుడితో; నకులుఁడు; అల్లన= తిన్నగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీకున్= నీకు; ధర్మజుండును= ధర్మరాజూ; పవన+ఆత్మజుండున్= భీమసేనుడూ; నరుఁడున్= అర్జునుడూ; తగన్+చెప్పుట= ఒప్పిదంగా తెలపటం; రిత్తకాదు= వట్టిమాటలు కావు; మా మనములు= మా మనసులు; అరణ్యావాసమునన్= అడవులలో నివసించేకాలంలో; మత్స్యమహీపతి పాలన్+ఉన్న= విరాట మహారాజు దగ్గర నివసిస్తున్న; ఆ దినముల భంగిన్+కావు= ఆ రోజులలో ఉన్నవిధంగా లేవు; కృపన్= దయ చేత; తీవ్రతన్= తీవ్రతచేత; కుందిన చందము+అయ్యెడున్= కొరతపడినట్లు ఉన్నవి.

తాత్పర్యం: సంధికార్యం సాధించటానికై కురుసభకు వెళ్ళి వస్తానన్న శ్రీకృష్ణుడితో నకులు డిట్లా అన్నాడు: నీకు ధర్మనందనుడూ, భీమసేనుడూ, అర్జునుడూ చెప్పినవి వట్టి మాటలు కావు. మా మనస్సులు అప్పు డరణ్యావాసకాలంలో, విరాట మహారాజు దగ్గర గడపిన అజ్ఞాత వాసకాలంలోని రోజులలో వలె ప్రతీకారేచ్ఛతో ఇప్పుడు లేవు. కౌరవులపట్ల కారుణ్యాతిశయంతో తీవ్రత తగ్గినట్లు ఉన్నాయి.

విశేషం: నకులుడు ధర్మజుడివలె వక్రోక్తులు కాక, భీముడివలె సూటిమాటలు కాక, అర్జునుడి వలె సున్నితంగా కాక, ఋజువాదిగా మాట్లాడతాడు. అందరికంటె ఆశావాదిగా కనపడతాడు. భీమాదులందరిలో కంటె సంధికి సుముఖంగా పలికిన అమాయకుడు నకులుడు. తాము ప్రతీకారేచ్ఛతో కాక కారుణ్యాతిశయంతో ఉన్నామని చెప్పటం అట్లా ఉండగా, ధర్మరాజాదులందరూ అటువంటి చిత్తవృత్తితోనే ఉన్నారని అంటున్నాడు. భీముడికంటె అమాయకుడివలె మాట్లాడాడు. అతడు అందగాడు. అతడి చిత్తం ఆర్ద్రం. అది ఈ పద్యంలో ప్రతిఫలించింది. (సంపా.)

క. కడవఁగ నొకళ్ళు పసరము। నడిచిన నొక్కకులుఁ బెయ్య నడువ వలయునే?
చెడుతెరు వా కౌరవ్యుల। కడ నిలుచుంగాక మనకుఁ గ్రౌర్యం బేలా? 91

ప్రతిపదార్థం: కడవఁగన్= ముందు మిగిలి; ఒకళ్ళు= ఒకరు; పసరమున్= ఆవును; అడిచినన్= కొట్టగా; ఒక్కళులు= మరొక్కరు; పెయ్యన్= దూడను; అడువన్+వలయునే?= కొట్టవలెనా?; చెడు తెరువు= చెడ్డదారి; ఆ కౌరవ్యుల కడన్= ఆ ధార్తరాష్ట్రులవద్దనే; నిలుచున్+కాక= ఉండుగాక; మనకున్= మనకు; క్రౌర్యంబు+ఏలా?= ఆ క్రూరత్వం ఎందుకు?

తాత్పర్యం: కృష్ణా! ముందుగా తొందరపడి ఒకడు గోవును కొట్టితే మరొకడు దాని దూడను కొట్టాలా? ఆ పని మంచిది కాదు. ఆ దుర్యోధనాదులు చెడుమార్గం అనుసరిస్తే అనుసరించనీ. మనం మాత్రం క్రూరులమై ఎందుకు మెలగాలి?

విశేషం: అలం: ప్రతివస్తూపమ. "వాక్యయో రేక సామాన్యే ప్రతివస్తూపమా మతా." రెండు వాక్యాలకూ ఒకే సమానధర్మముండి అది భిన్న శబ్దాల చేత చెప్పబడితే ప్రతివస్తూపమాలంకారం. 'ఒకడు ఆవును కొడితే మరొకడు దాని దూడను కొట్టాలా'- అనేది తెలుగు సామెత. కౌరవులు పాండవులను కష్టాల పాలు చేస్తే, తిరిగి పాండవులు కౌరవులను హింసించాలా? అని సాధువర్తనుడివలె మాట్లాడాడు నకులుడు. పై పద్యంలో మెత్తబడిన హృదయం ఈ పద్యంలో కరుణతో జాలువారింది. (సంపా.)

సీ. **గోగ్రహణంబునఁ గోలె నెంతయు మెత్తఁ । బడకుండుదురె వారు పద్మనాభ!**
నీ యనుగ్రహమున నెమ్మిమైఁ గూడిన । బలము లేడక్షౌహిణులును, దొరలుఁ,
బాంచాల యాదవ పాండ్య కేకయ మాత్స్యు । లొకతెంపు నెఱుఁగకయున్నవారె
భీమార్జునుల లావు పెంపును నీ సహా । యంబును గలుగుట కలుక రెట్లు?

ఆ. **గురుఁడుఁ గృపుఁడు బాహ్లికుఁడు భీష్ముఁడును బుద్ధి । సెప్పి వారిఁ జక్కఁ జేయరెట్లు?**
కార్య మీవు చెప్పఁగా విదురుండు వి । నంగ నెట్లు గాదనంగ వచ్చు? **92**

ప్రతిపదార్థం: పద్మనాభ!= కృష్ణా!; గోగ్రహణంబునన్+కోలెన్= తమ్ము ఓడించి విరటుడి పశువులను ఏకాంగవీరుడై అర్జునుడు మరలించుకొని వచ్చినప్పటినుండి; వారు= కౌరవులు; ఎంతయున్= మిక్కిలి; మెత్తన్+పడక+ఉండుదురె= మునుపటి కాఠిన్యము తగ్గి మెత్తబడకుంటారా? (మెత్తబడి ఉంటారని భావం); నీ అనుగ్రహమునన్= నీ దయచేత; నెమ్మిమైన్= ప్రేమచేత; కూడిన= మన పక్షంలో చేరిన; బలములు+ఏడు+అక్షౌహిణులును= ఏడక్షౌహిణుల సైన్యాలునూ; దొరలున్= ప్రభువులూ; పాంచాల, యాదవ, పాండ్య, కేకయ, మాత్స్యులు= ద్రుపద సాత్యకుల యొక్కయూ; పాండ్య కేకయ భూవల్లభుల యొక్కయూ; విరాట మహారాజు యొక్కయూ; ఒక తెంపున్+ఎఱుఁగక+ఉన్నవారె?= విశిష్టమైన సాహస ప్రవృత్తిని తెలియజాలకున్నారా?; (తెలియుదురని భావం); భీమ+అర్జునుల లావు= భీమార్జునుల యొక్క శక్తి; వెరవు= ఉపాయం; నీ సహాయంబును= నీ యొక్క తోడ్పాటున్నూ; కలుగుటకున్= ధర్మరాజునకు లభించటానికి; ఎట్లు+అలుకరు?= ఎందుకు జంకరు?; (జంకుదురని భావం); గురుఁడున్= ద్రోణాచార్యులూ; కృపుఁడున్= కృపాచార్యులూ; బాహ్లికుఁడున్= బాహ్లికుడూ; భీష్ముఁడును= పితామహుడూ; బుద్ధి చెప్పి= నీతి బోధించి; వారిన్= కౌరవులను; ఎట్లు+చక్కన్+చేయరు= ఎందులకు చక్కబరచకుంటారు?; (చక్కబరుస్తారని భావం); ఈవు= నీవు; కార్యము చెప్పఁగాన్= కర్తవ్యం ఉపదేశించగా; విదురుండు వినంగన్= విదురుడు వినగా; ఎట్లు= ఏవిధంగా; కాదు+అనంగన్ వచ్చున్?= కాదనటానికి వీలౌతుందా? (శక్యం కాదని భావం).

తాత్పర్యం: వీరాధి వీరులైన తమ్మందరినీ నిర్జించి అర్జును డొక్కడే విరటుడి పశువులను మళ్ళించుకొని వచ్చిననాటి నుండి కౌరవులు మునుపటి కరకుదనం వదలి మెత్తబడి ఉంటారు. నీ కృపవలన కూర్మితో ఏడక్షౌహిణుల సైన్యం

వాటి అధిపతులూ, ధర్మరాజు పక్షాన చేరటం వారెరుగరా? పాంచాల యాదవ పాండ్య మత్స్య దేశాల రాజుల సాహస ప్రవృత్తు లెట్టివో వారికి తెలియదా? భీమార్జునుల బల విక్రమాలు, గొప్పతనం, నీ తోడ్పాటు ధర్మపుత్రుడికి ఉన్నాయని వారు భయపడకుండా ఉంటారా? ద్రోణ కృపాచార్యులు, బాహ్లికుడు, భీష్ముడు, నీతి బోధించి ఎట్లాగైనా వారిని చక్కబరచకుండా ఉంటారా? విదురుడు వింటుండగా, నీవు చేసే కర్తవ్య బోధను తిరస్కరించటం వారికి ఎట్లా సాధ్యమౌతుంది?

విశేషం: ఈ పద్యం పాత్ర స్వభావోచిత సంభాషణకు అచ్చమైన ఉదాహరణం. నకులుడు తన వలెనే పరులు కూడా ఉంటారని భావించే ఋజుభావుకుడు. అందువలననే పరిస్థితులనుండి గుణపాఠాలు నేర్చికొని దుర్యోధనుడు మారి, సంధి కంగీకరిస్తాడని భావించాడు. శ్రీకృష్ణు డంతటివాడు పోయి మాట్లాడితే కౌరవులు భయభక్తులతో ఆయన మాట నంగీకరిస్తారని అంచనా వేశాడు. నకులుడి మాటలకు శ్రీకృష్ణు డేమీ మాట్లాడడు. బహుశః అతడి అమాయకత్వానికి పైకి కనపడని కడుపులోనే నవ్వుకొని ఉంటాడు - పరితపలె. (సంపా.)

వ. అట్లుంగాక నీవు దమపాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱవరే? నీ పోయినప్పుడ యీ కార్యంబు చక్కనగు' ననిన విని సహదేవుండు వాసుదేవున కిట్లనియె: 93

ప్రతిపదార్థం: అట్లున్+కాక= అంతేకాక; నీవు తమ పాలికిన్+పోవుట= నీవు తమ దగ్గరకు విచ్చేయటం; ధార్తరాష్ట్రులు+ ఆదరింపక+ఉండన్+వెఱవరే= దుర్యోధనాదులు గౌరవించకుండ ఉండటానికి జంకరా?; నీ పోయినప్పుడు+అ= నీవు వెళ్ళినవెంటనే; ఈ కార్యంబు చక్కన్+అగున్= ఈ సంధికార్యం నెరవేరుతుంది; అనినన్ విని= నకులు డట్లా పలుకగా విని; సహదేవుండు వాసుదేవునకున్+ఇట్లు+అనియెన్= సహదేవుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! నీవు తమ దగ్గరకు వస్తే దుర్యోధనాదులు నిన్ను అనాదరించటానికి భయపడతారు. నీవు వెళ్ళిన వెంటనే కార్యం సఫలమవుతుంది' అని నకులు డన్నాడు. ఆ పిదప సహదేవుడు శ్రీకృష్ణుడితో ఇట్లా చెప్పాడు:

ఉ. 'రక్కెస మాట లాడెదరు రాజును దమ్ములు; వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూఁ కొనుచుండుట యంతకంటె మేఁ;
లక్కట! యిట్లు వేఁడికొననైనను బోయెదువో; సుయోధనుం
డెక్కడ? భూమిలోన సగమిచ్చుట యెక్కడ? దానవాంతకా! 94

ప్రతిపదార్థం: దానవ+అంతకా!= రాక్షసులను అంతమొందించినవాడా!; కృష్ణా!; రాజును= ప్రభువగు ధర్మజుడునూ; తమ్ములున్= ఆయన తమ్ములునూ; రక్కెస మాటలు+ఆడెదరు= అయుక్తములైన పల్కులు పల్కుతున్నారు; వానిలోనన్= వారు చెప్పిన మాటలలో; నీవు= నీవు; ఒక్కటి+ఐనన్= ఒకమాటనైనను; కాదు+అనక= కాదనకుండ; ఊఁకొనుచున్+ఉండుట= ఊఁకొట్టుతూ ఉండటం, అంగీకరించటం; అంతకంటెన్ మేలు= వారు పల్కిన దానికంటె బాగున్నది; అక్కట!= అయ్యో!; ఇట్లు వేఁడికొనన్+ఐనను+పోయెదువో= ఈ రీతిగా వారిని బిచ్చమడగటానికి సైతం వెళ్ళుతావా?; సుయోధనుండు+ఎక్కడ?= దురాత్ముడైన ఆ దుర్యోధను డెక్కడ?; భూమిలోనన్= పుడమిలో; సగము+ఇచ్చుట+ఎక్కడ?= అర్ధ భాగ మివ్వటం ఎక్కడ?

తాత్పర్యం: 'ఔరా! ధర్మపుత్రుడూ, ఆతడి సోదరులూ తగని పల్కులు పల్కుతున్నారు. వాటిలో ఒక మాటనైనా తిరస్కరించక అన్నిటికీ నీవు ఊకొట్టటం అంతకన్న బాగుంది. రాక్షసులను విధ్వంసం చేసిన నీవు కురుసభకు

బిచ్చమడగటానికి సైతం పోతావన్నమాట? దుష్టచిత్తుడైన దుర్యోధను డెక్కడ? రాజ్యంలో మనకు సగం పంచి ఇవ్వటం ఎక్కడ? అది కల్ల.

విశేషం: 1. పాండవులలో చిన్నవాడైన సహదేవుడు చిచ్చంద్రీ వంటివాడు. అభిమానధనుడు. పౌరుషోపేతుడు. సంధి మాటలు అతడికి సరిపడవు. అందువలన ధర్మరాజాదుల అభిప్రాయాన్ని కాదంటున్నాడు. ఇతడివి వీరోక్తులు, పౌరుషోక్తులు.

2. అభిప్రాయం నచ్చకపోతే ఎంతటి దగ్గరి వారైనా ఇతడికి పరాయివారుగా కనపడతారు. అందుకే ఇతడి దృష్టిలో ధర్మరాజూ, అతడి తమ్ములూ అయోగ్యమైన మాటలు మాట్లాడేవారట! సహదేవుడు ధర్మజుడి తమ్ముడు కాడా? నకులుడు తమ్ముడైనప్పుడు అతడు కాడా? ప్రశ్న అది కాదు. ధర్మజుడి మాటకు 'తందానతాన' పలికి తమ్ములనిపించుకొంటున్న నీడలు భీమాదులు. సహదేవు డా స్థితిని కోరటం లేదు. అందువలన వారికంటె తనను వేరు చేసి చెప్పుకొన్నాడు. ఇది కోపపరుల స్వభావం.

3. చేటతోపాటు పరుగు కూడా ఎండుతుందట. అట్లాగే ధర్మరాజాదులతోపాటు శ్రీకృష్ణుడు కూడా దైన్యస్థితికి రావలసి వచ్చిందట! ఎందుకంటే- తనవలె కాక ఆయన ధర్మజుడి తమ్ములతో చేరిపోయాడట! అందుకే దానవాంతకుడు ఇప్పుడు బిచ్చగాడివలె కౌరవసభకు పోతున్నాడట! వ్రతం చెడినా ఫలం దక్కదని అధిక్షేపించాడు యువకిశోరమైన సహదేవుడు.

4. ఇది సహదేవ పాత్రోచిత పద్యం. రంగస్థల ప్రదర్శనకు పనికివచ్చే నాటకీయ రచన.

5. 'రక్కసమాట లాడెదరు' వంటి మాటలు అతడి కసిని బైట పెట్టుతున్నాయి. ప్రకరణౌచిత్యంతో ప్రకాశిస్తున్నాయి.

6. పౌరుషోపేతుడైన సహదేవుడి మాటలు సాత్యకి వంటి ఆవేశపరులను ఆకర్షిస్తాయి. ధర్మరాజు మాటలలోని లోతులు తెలియని వెలితి పఠితకు తెలుస్తుంది. విశేషమేమంటే- ధర్మరాజు కాని, భీమార్జునులు కాని, శ్రీకృష్ణుడు కాని అతడిమీద ఏ విమర్శా చేయరు. సంధిప్రయత్నం జరుగుతున్నా, ధర్మజుడి స్కంధావారంలో యుద్ధాగ్ని చల్లారకూడదు. సవన యజ్ఞానికి ధర్మజుడింట నున్న త్రేతాగ్నులు-భీముడు, అర్జునుడు, సహదేవుడు. ఈ అగ్నులు చల్లారకుండటమే ఔచిత్యం. ధర్మజ వాసుదేవాదులు కోరేది కూడా అదే. (సంపా.)

మ. తలఁపం గూడునె యింత లేసి దొర లీ దైన్యంబు? చుట్టంబులుం
జెలులుం దిట్టరె? లాఁతిరాజులకు మెచ్చే యి వ్విధం' బిట్టిదిం
గలదే? వేఁడఁగ ధర్మజుం డడుగఁ బోఁగాఁ గృష్ణుఁ డా ధార్తరా
ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ నిట్లుం గూడు దీపయ్యెనే? **95**

ప్రతిపదార్థం: ఇంతలు+ఏసి దొరలు= ఇంతటి శక్తిమంతులైన ప్రభువులు- ధర్మజ భీమార్జున నకులులు; ఈ దైన్యంబు= ఒకరిని యాచించే దీనత్వం; తలఁపన్+కూడునె?= తలచనైనా తలచవచ్చునా?; చుట్టంబులున్= బంధువులూ; చెలులున్= మిత్రులూ; తిట్టరె?= మనలను నిందించరా?; లాఁతి రాజులకున్= ఇతర రాజులకును; ఈ+విధంబు= ఇట్టి చందం; మెచ్చే?= మెప్పు గలిగిస్తుందా?; ఇట్టిదిన్+కలదే= లోకంలో ఇంత విడ్డూరం ఉంటుందా?; ధర్మజుండు+వేఁడఁగన్= పాలివ్వండని ధర్మరాజు యాచించగా; కృష్ణుఁడు+అడుగన్+పోఁగాన్= శ్రీకృష్ణుడు రాజ్యభాగం అడగటానికివారి వద్దకు వెళ్ళగా; ఆ ధార్తరాష్ట్రులు= ఆ కౌరవులు; పాలు+ఈక= భాగమీయకుండా; చలంబునన్= ఈర్ష్యతో; పెనఁగన్= పోరాటం సాగించగా; ఇట్లున్= ఇన్నివిధాల బాధపడి సంపాదించే; కూడు= తిండి; తీపు+అయ్యెనే?= అంత రుచికరం అయిందా?

తాత్పర్యం: ధర్మజాదుల వంటి దొడ్డదొరలు ఇంతటి దైన్యానికి దిగజారటం ఊహించని విషయం. ఇందుకు బంధువులూ స్నేహితులూ నిందించక మానరు. యుద్ధ సన్నద్ధులై వచ్చిన పాంచాలాది మహీపతులకు ఈ తీరు

మెప్పు కలిగించదు. లోకంలో ఇట్టి విడ్డూరం మరొకటి ఉంటుందా? ధర్మరాజు రాజ్యభాగం యాచించటం, దానిని పరమ పురుషుడైన శ్రీకృష్ణుడు అడగబోవటం, లోభదూషితులైన కౌరవులు భాగమివ్వక ఈర్ష్యతో పోరాడటం గమనిస్తే-ఇంతటి హీనమైన తిండి కూడా ఇంత ఇంపయిందా?

విశేషం: సహదేవుడు పాండవుల ఆత్మాభిమానం ఉట్టిపడేటట్లు మాట్లాడిన ఈ పద్యంలో అన్నీ ప్రశ్నార్థకాలే. పద్యం చివర 'ఇట్లుం గూడు దీపయ్యెనే?' అనే ప్రశ్న ఈ భావావస్థకు పరాకాష్ఠ. ఇట్లున్- అని చెప్పబడే దీనావస్థను నిరూపించేవి మిగిలిన ప్రశ్నలన్నీ. ధర్మరాజు చక్రవర్తి అయి కూడా యాచించటం మొదటి దైన్యం. దానివలన బంధుమిత్రులు తమను తేలికగా చూడటం రెండవ దైన్యం. లోకంలో మిగిలిన రాజులు కూడా దీనిని గర్హించటం మూడవ దైన్యం. ఈ విధంగా తనకు తాను తేలిక కావటం, బంధుమిత్ర రాజసంస్థానాలలో తేలిక పడటం కంటె అభిమానధనుడైన ప్రభువుకు హీనమైన స్థితి మరొకటి ఉండదని సహదేవుడి అభియోగం. పోగా, ఇంతటి దైన్యంతో ధర్మరాజు శ్రీకృష్ణుడిని హస్తినాపురికి పంపినా పని చక్కపడుతుందా అంటే- ఆ ఆశ కూడా లేదు. పైపెచ్చు ధర్మజ శ్రీకృష్ణుల ప్రతిపాదనలను కౌరవులు లోభంతో ఈర్ష్యతో త్రోసిరాజని పోరుకు దిగితే ఎంత పరువు పోయినట్లు? పరులచేత ఛీ అనిపించుకొంటూ పొందే తిండి రుచిగా అనిపించిందా? అని నిష్ఠురంగా మాట్లాడాడు. 'కూడు రుచిస్తుందా' అనేది తెలుగు జాతీయం. ఇక్కడ జీవన భృతికై రాజ్యాన్ని యాచించటం అనుసరణీయమైన విధానం కాదని భావం. సహదేవుడి మాటలు రోషావేశంతో కూడి అభిమాన స్ఫోరకాలుగా ఉన్నా, రాజనీతిలోని లోతులు తెలిసికొన్నవిగా కనపడవు. అందుకే శ్రీకృష్ణుడు అతడి మాటల నంత పట్టించుకొన్నట్లు లేదు. (సంపా.)

ఉ. వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగనాడి రేనియు
న్వారలు దాని కియ్యకొనినన్ విను మచ్యుత! యట్టిసంధి పెం
పారఁగ నేర్చునే? యుచితమైనది కయ్యము; వంకమాట లే
నేరఁ గురుప్రవీరుసభ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ! 96

ప్రతిపదార్థం: వీరలు= ధర్మజాదులు; ధర్మమార్గమునన్= న్యాయసరణిలో; సవిస్తరతన్= విపులంగా; తగన్+ఆడిరి+ఏనియున్= ఒప్పిదంగా చెప్పినప్పటికిన్నీ; వారలు= కౌరవులు; దానికిన్+ఇయ్యకొనినన్= అందులకు సమ్మతించి ఏదో కొంత ఇచ్చినను; అచ్యుత= శ్రీకృష్ణా!; వినుము= నా మాటలు వినుము; అట్టి సంధి= ఆ విధంగా కుదుర్చుకొన్న సంధి; పెంపు+ఆరఁగన్+నేర్చునే?= గౌరవాన్ని కలిగించగలుగుతుందా?; కయ్యము+అ= యుద్ధమే; ఉచితము+ఐనది= యోగ్యమైనది; వంక మాటలు= కృత్రిమ వచనాలు; ఏన్+నేరన్= చెప్పటం నాకు తెలియదు; కురుప్రవీరుసభన్= ధృతరాష్ట్రుడి ఓలగంలో; నిశ్చయము= మా నిర్ణయము; ఇట్టిది కాఁగన్= ఇదేఅని; చెప్పుమీ!= పలుకుము.

తాత్పర్యం: అచ్యుతా! మావారు న్యాయమార్గ మెట్టిదో విపులంగా చర్చించినప్పటికీ, అందుకు కౌరవు లంగీకరించి ఏదో కొంత మా కిచ్చినప్పటికీ, ఈ పొత్తు పెంపు వహించదు. మాకు యుద్ధమే తగినది. వంకర మాటలు నాకు తెలియవు. కాబట్టి ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో నా నిశ్చయం ఇటువంటిదిగా చెప్పుము.

విశేషం: సంధికుదిరి కౌరవపాండవులు గతాన్ని మరచి కలసి స్నేహంతో జీవించటం అసంభవం. ఈ నిజం తెలిసి కూడా ఈ సంధి ప్రయత్నాలు దేనికి? అని ప్రశ్నించి ధర్మరాజాదుల పలుకులన్నీ 'వంక మాటలు'- వక్రోక్తులు అని అధిక్షేపించాడు సహదేవుడు. తనకు వంకమాటలాడటం చేతగాదన్నాడు. కాబట్టి తన అభిప్రాయం భిన్నమైనదని చెప్పడం అతడి ప్రత్యేకత. తెగించి మాట్లాడే స్వభావం ఈ పద్యంలో స్పష్టం. (సంపా.)

మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొ; మ్మడవియందుం, బేరు వంచించియుం,
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగిరాఁ బాలీకపోవచ్చునే?
యది గాదేఁ దెగి బంటవై యఱుము మాయల్‌పన్ను నేర్పింకఁ జె
ల్లదుసూ నీ కని యా సుయోధనుని యుల్లం బుచ్చిపోనాడుమీ!' 97

ప్రతిపదార్థం: తుదిన్= చివరకు; రాజ్యమ్ము సగమ్ము+కొమ్ము= పాండు మహారాజు గడించిన రాజ్యంలో సగం తీసికొమ్ము; అడవియందున్= అరణ్యాలలో పన్నెండేళ్ళూ; పేరు వంచించియున్= పేర్లు మాటుపరచుకొని ఒక యేడూ; పదుమూఁడు+ ఏఁడులు= ఇట్లా పదమూడేళ్ళు; తిరిగి రాన్= మేము సంచరించి మరలిరాగా; నీవునున్= నీవునూ; పాలు+ఈక= భాగమొసగక; పోన్+ వచ్చునే?= తప్పించుకొనటానికి వీలవుతుందా?; అది+కాదు+ఏన్= అట్లా రాజ్యమొసగ నైతివేని; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= యుద్ధంలో మమ్ము ఎదుర్కొని నశించుము; మాయల్+పన్ను నేర్పు= కపటం పన్నటంలోని చాతుర్యం; ఇంకన్= ఇకమీదట; నీకున్ చెల్లదుసూ+అని= నీకు సాగదుసుమా అని; ఆ సుయోధనుని+ఉల్లంబు+ఉచ్చిపోన్= ఆ దుర్యోధనుడి మనసుకు గ్రుచ్చుకొనేటట్లు; ఆడుమీ!= పలుకుము.

తాత్పర్యం: మా తండ్రి పాండురాజు గడించిన రాజ్యంలో ఎట్టకేలకు నీవు కూడ సగం తీసికో. పన్నెండేళ్ళు అరణ్యవాసం, మారుపేర్లతో ఒరులెరుగకుండ ఒక యేడు అజ్ఞాతవాసం ఇట్లా పదమూడేళ్ళు గడపి మేము ప్రాణాలతో మరలిరాగా రాజ్యంలో పాలుపంచి మాకివ్వక నీకు తప్పుతుందా? నీ వట్లా రాజ్యభాగం ఇవ్వటానికి ఇష్టపడకపోతే శూరుడవై సాహసంతో మమ్మెదుర్కొనుము. ఇకమీదట నీ టక్కుటమారాలు సాగవు - అని దుర్యోధనుడి హృదయానికి సూటిగా గ్రుచ్చుకొనేటట్లు నీవు మాట్లాడుము.'

విశేషం: 1. మూలభారతంలో సహదేవుడి ఈ మాటలు లేవు. అందులో ఎంతసేపూ సంధివద్దు, యుద్ధం వచ్చేటట్లే వ్యవహరించుమని చెప్పినట్లే ఉన్నది.

2. ఇది వీరోచిత భాషణం. అతడి వాదంలో అసలు రాజ్యాధికారం పాండురాజుదే. అతడు దయతో ఇస్తే - సగం పొందతగినవారు కౌరవులు. కాగా, 'అరణ్యాజ్ఞాతవాసాలు మాట ప్రకారం పూర్తి చేసి వచ్చిన తరువాత కూడా మా సహజ రాజ్యాన్ని మాకివ్వటానికి దుర్యోధనుడు కాదనటమేమిటి? అతడి కేమి హక్కున్నది? రాజ్యభాగం ఇవ్వకపోతే దుర్యోధనుడు దురాక్రమణం చేసిన వాడౌతాడు. దండార్హుడౌతాడు. మా దాడికి యోగ్యుడౌతాడు. ఇదీ అసలు వ్యవహారం. దీనిని కాదని మాయలూ మర్మాలూ చేస్తే చెల్లేది లే దని నిష్ఠురసత్యం. గుండె బ్రద్దలయ్యేటట్లు చెప్పు'మన్నాడు. 'పాండురాజు దయాభిక్షగా ఇచ్చిన రాజ్యం తింటున్నది దుర్యోధనుడు. దానిని గుర్తించకపోవటం అన్యాయం, అహంకారం, అక్రమంగా ఆక్రమించిన పాండవ భాగాన్ని ఇవ్వకపోవటం లోభగుణం, క్రౌర్యం, రెండు విధాలా తప్పు చేసింది కౌరవులే. వారు వధ్యులుకాని, యాచించదగినవారు కా'దని సహదేవుడి అభిప్రాయం. ఇట్లా విశిష్టంగా మాట్లాడటం పాండవులలో సహదేవుడికే చెల్లింది. అందుకే సజాతీయ ప్రవృత్తిగల సాత్యక్యాదుల మెచ్చుకోలు వెంటనే అతడికి లభించింది. (సంపా.)

3. ఈ పద్యాన్ని విమర్శకులు మరికొన్ని విధాలుగా వ్యాఖ్యానించారు. వాటిని 'జనహిత' వ్యాఖ్య ఇట్లా సమీకరించింది.

"సంస్కృత మహాభారతంలో వ్యాసఘట్టాలు ప్రసిద్ధాలు. తిక్కన కూడా కొన్ని పద్యాలు అలా వ్రాశాడు. వాటిల్లో ఇది ఒకటి. దీనికి కొంత మంది విజ్ఞులు ఎలా అర్థాలు చెప్పారో పరిశీలిద్దాం.

(i) "తిక్కన రచనలో రెండు మూడు ప్రౌఢ రచనావిన్యాసములు గూడ గనఁబడును'' అని చెప్పి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఉద్యోగపర్వం పీఠికలో ఈ పద్యం ఉదాహరించారు.

అర్థం: "అడవి యందున్= అరణ్యములోను; పేరు వంచించియున్= మారుపేరులు పెట్టుకొనియు; పదుమూఁడేఁడులు= పదమూడు సంవత్సరములు; ఉండి యను క్త్వార్థక మధ్యాహారము; తుదిన్= చివరను; రాజ్యమ్ము సగమ్ము గొమ్ము= అర్థరాజ్యమును స్వీకరించుము (అని); నీవు= నీవు (దుర్యోధనుడని యర్థము); అనన్= (ధర్మరాజుతో) అనగా; (అట్లుచేసి); తిరిగి రాన్= తిరిగి రాగా; పాలీక పోవచ్చునే?= భాగమీయకుండుట న్యాయమా?; అది కాదేన్= అది నీయిష్టము కాకున్న; తెగి= సాహసించి; బంటవై= వీరుడవై; అఱుము= ఆక్రమించుము (గెలువుము); మాయల్ పన్ను నేర్పు= మాయలను గల్పించు తెలివి; ఇంకన్= ఇకమీద; చెల్లదుసూ= పనికి రాదు సుమా; నీకని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= డెందంబు; ఉచ్చిపోన్= డస్సిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుమా.

తాత్పర్యం: వనవాసాజ్ఞాతవాసములు రెండును బదుమూడేడులు సలిపి, తుది రాజ్యమ్ము సగమ్ముగొమ్మని నీవనగా, ధర్మరాజు తిరిగిరా పాలీయకుండుట న్యాయమా? అట్లిష్టపడవేని సాహసించి వీరుడవై యుద్ధమున గెలువుము. మోసగించి సంపాదించు నేర్పింక నీకు సాగదు సుమా! యని యాసుయోధనుని యుల్లంబుచ్చిపోవునట్లు వచింపుమా! యని సహదేవుడు శ్రీకృష్ణునితో జెప్పెనని తాత్పర్యము. (చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక; సంపుటి 17, సంచిక-5, పుట= 253).

(ii) "శ్రీ చంద్రాభట్ట రామమూర్తిగారు 'నీవనన్' అని సవరించి చెప్పిన యర్థము సముచితముగా కనిపించుచున్నది" అని తిక్కన కావ్య శిల్పము అనే సిద్ధాంత గ్రంథంలో డా॥ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రిగారు భావించారు.

అర్థం: "నీవునున్= నీవు కూడ; తుదిన్= మాకు బంచియిచ్చిన పిమ్మట; రాజ్యమ్ము సగమ్ము= అర్ధరాజ్యమును; కొమ్ము= పుచ్చుకొనుము; అడవియందున్= అరణ్యమునందును; పేరు వంచించియున్= అజ్ఞాతమునందును; పదమూడు వత్సరములు; తిరిగిరాన్= తిరిగిరాగా; పాలు+ఈకన్= భాగం ఇవ్వకుండా; పోవచ్చునే?= ఉండవచ్చునా?; అదికాదు+ఏన్= అది పొసఁగనిచో; తెగి= తెగించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= ఎదుర్కొని నశింపుము; మాయల్+పన్ను= మోసములను పన్నునట్టి; నేన్పు= కౌశలము; నీకున్= నీకు; చెల్లదు+సూ(సుమీ); అని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూరిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుము.

తాత్పర్యం: 'తొలుత మాకు సగము రాజ్యము పంచి యిచ్చి మిగిలిన దానిని నీవు పుచ్చుకొమ్ము. పదమూడు వత్సరము లరణ్యముల నజ్ఞాతమున గడపి వచ్చిన తరువాత రాజ్యభాగ మీయకపోవచ్చునా? అది పొసఁగనిచోఁ దెగించి వీరుడవై యుద్ధమునకు వచ్చి మమ్మెదుర్కొనుము. మాయలు పన్ను నీనేర్పు ఇక చెల్లదు సుమీ! యని యా దుర్యోధనుని హృదయమున గాటముగా గుచ్చుకొని పోవునట్లు పలుకుము.' (శ్రీ వావిలాల సోమయాజులు).

భీమార్జున నకులులు ధర్మరాజు అభిప్రాయాన్ని కాదనలేకా, ఔను అనటం ఇష్టం లేకా, ఎటూగాని మాటలు మాట్లాడారు కాని సహదేవుడు జంకు లేకుండా తన పైవాళ్ళు చెప్పలేని దానిని సూటిగా చెప్పాడు. పాండవులలో ముగ్గురు ఒకే మాట మీద ఉన్నట్లు, ఒక్కరు అందుకు భిన్నంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని, తరువాత ద్రౌపది చెప్పబోయే మాటలకు సహదేవుని ఈ మాటలు ఉపోద్ఘాతంలాగా ఉన్నాయి. పాండవ పక్షంలో సంధికి అనుకూలత కంటే వ్యతిరేకతే ఉందని ఇక్కడి నుండి స్పష్టమవుతుంది' (ఉద్యోగపర్వము జనహిత వ్యాఖ్య. పు. 373-375).

(iii) శ్రీ పార్థసారథి రచించిన ఉద్యోగపర్వము - ఆమ్నాయకళానిధి వ్యాఖ్యలో ఇట్లా ఉన్నది.

అర్థం: "తుదిన్= కడపటి పక్షమగు; రాజ్యమ్ము సగమ్ము కొమ్ము; అడవియందున్= వనవాసమునను; పేరు వంచించియున్= మారు పేరులతోడ నజ్ఞాతవాసమునను; పదుమూఁడేఁడులు, తిరిగి రాన్; నీవు; పాలు= భాగమైనను; ఈక= ఇయ్యక; పోవచ్చునే; అది; కాదేని= ఇచ్చుట కాకపోయినన్; బంటవై= శూరుడవై; అఱుము= యుద్ధమునఁ జచ్చిపొమ్ము; మాయల్ పన్ను నేర్పు= మోసములు చేయు గట్టితనము; ఇంకన్= ఇట మీఁద; చెల్లదు సూ= జరుగదు సుమా; నీకున్; అని; సుయోధనుని యుల్లంబు= వాని మనసు; ఉచ్చిపోన్= నాటునట్లుగా; ఆడుమీ= భాషింపుమా!

తాత్పర్యం: న్యాయముగా రాజ్యమంతయు మాదైనను, గడపటి పక్షమున సగము రాజ్యమునైనను నీవు తీసికొని సగము మాకిమ్ము. మేమడవులందు బండ్రెండేళ్ళు తిరిగి మాఱుపేరులు పెట్టుకొని యజ్ఞాతవాసమున నొక్కయేఁడు వసించి తిరిగి వచ్చినపుడు మారాజ్యమంతయు నిచ్చుట యటుండ నీవు సగభాగమైన నియ్యకపోవచ్చునా? అట్లు నీ మనసు రాని యెడల శూరుడవై యుద్ధమునకుం దిగుము. లోఁగడవలె టక్కు చేసి రాజ్యముం గొనుట యింక ననుకూలింపదు సుమా!'' అని దుర్యోధనుడి మనంబున నాటునట్లు పలుకుము.' (పు.279) (సంపా.).

(iv) కొందరీ క్రింది విధంగా అర్థం చెప్పుతారు.

అర్థం: అడవియందున్= పన్నెండేళ్ళు అడవిలోనూ; పేరు వంచించియున్= మారుపేర్లు పెట్టుకొని; ఒక యేడు అజ్ఞాతంగానూ; (ఈ విధంగా) పదుమూఁడు+ఏఁడులు= పదమూడు సంవత్సరాలు; నీవునున్= (మావలెనే) నీవుకూడా; తిరిగి రా= తిరిగి రమ్ము; తుదిన్= చివర; రాజ్యమ్ము సగమ్ము= సగం రాజ్యభాగం; కొమ్ము= తీసికొమ్ము; పాలు+ఈక పోవచ్చునే?= (నీకు) భాగం ఇవ్వకుండా ఉండటానికి (మాకు) వీలవుతుందా?; అట్లాగే- అనుకొన్న విధంగా పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు నీవు కూడా భాగం ఇవ్వకుండా ఉండటానికి వీలులేదు; అది కాదు+ఏన్= ఆ రీతిగా ఇవ్వటానికి ఇష్టం లేకపోతే; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవయి; అఱుము= నశించుము; (ఒప్పందం ప్రకారం మా భాగం మాకు ఇవ్వాలి లేకపోతే వీరోచితంగా యుద్ధంలో చావాలి అనటం); (అంతేకాని) - మాయల్- పన్ను నేర్పు= వంచనా శిల్పం; ఇంకన్= ఇకమీద; నీకున్; చెల్లదు, సూ= సాగదు సుమా; అని, ఆ - సుయోధనుని; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూసుకొని పోయేటట్లు; ఆడుమీ= మాటాడుము.

తాత్పర్యం: నీవు కూడా మా వలెనే పదమూడేళ్ళు తిరిగిరా, చివర సగం రాజ్యం తీసుకో. మేము వాటా పెట్టకుంటే నీవు ఒప్పుకుంటావా? అట్లాగే ఒప్పందం ప్రకారం పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు రాజ్యభాగం ఇవ్వకుండా ఉండటానికి నీకు వీలులేదు. అట్లా కాకపోతే యుద్ధంలో చావుము. (మా వాటా మాకు ఇచ్చి తీరాలి లేదా చచ్చి తీరాలి.) ఇంక నీకు మాయలు పన్నే నేర్పు సాగదు - అని ఆ దుర్యోధనుడి మనస్సు దూసుకొనిపోయే విధంగా మాటాడుము.

మ. అనినన్ సాత్యకి ప్రీతుఁడై 'యితఁడు లెస్సై యుండఁబల్కెం; బ్రయో
జనముం గల్గదు గౌరవంబుఁ జెడు దుశ్చారిత్రకుం డా సుయో
ధను బోధింపఁగఁ బోయినన్; సరభసోత్సాహంబుమై నున్న వీ
రనికాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మే లెమ్మెయిన్.' 98

ప్రతిపదార్థం: అనినన్= అని సహదేవుడు పలుకగా; సాత్యకి= కృష్ణుడి తమ్ముడు; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; ఇతఁడు= సహదేవుడు; లెస్స+ఐ+ఉండన్+పల్కెన్= చక్కగా మాట్లాడాడు; దుస్+చారిత్రకుండు= చెడువర్తనములు గల; ఆ సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; బోధింపఁగన్+పోయినన్= మంచి తెలియ జెప్పుటకు యత్నించిననూ; ప్రయోజనమున్+ కల్గదు= లాభం కూడా ఉండదు; గౌరవంబున్+చెడున్= మన పరువుకూడా పోతుంది; సరభస+ఉత్సాహంబుమైన్+ఉన్న= సంతోషంతో కూడిన యుద్ధ యత్నంతో ఉన్న; వీర నికాయంబునకున్+ఎల్లనున్= వీరుల సమూహాని కంతటికినీ; ఏ+మెయిన్= ఏ విధంగా యోచించిననూ; సంగ్రామంబు ప్రియము= యుద్ధమే ఇష్టమైనది; మేలు= శ్రేయస్కరం కూడ.

తాత్పర్యం: సహదేవుడి మాటలకు సాత్యకి సంతోషించి ఇట్లా అన్నాడు: 'ఈతడు యుక్తంగా మాట్లాడాడు. దుర్యోధనుడు దుష్టవర్తనుడు. అతడికి నీతులు చెప్పబోతే ప్రయోజనముండదు. అంతే కాదు. మన గౌరవం కూడ ఊడిపోతుంది. సంతోషోత్సాహాలతో ఉన్న ఈ వీరులందరికీ యుద్ధమే ఇష్టం. ఏ విధంగా ఆలోచించినా మనకు సంగ్రామమే మంచిది.'

వ. అనిన విని రథికవరు లందఱు 'సహదేవుం డింత యొప్పనాడునే? సాత్యకి పలుకు లిట్లుండునే? తక్కటివి యెక్కడి మాటలు? పగవారి నడిగికొనంబోవుట యుచితంబఁట! కయ్యంబు కర్జంబుగాదఁట! భంగంబు నీఁగికొనం దగదఁట! యనునివి మొదలుగా ననేకు లనేక ప్రకారంబుల వీరాలాపంబులం గొలువెల్ల నొక్క మ్రోఁతగాఁ జెలంగిన యెలుంగులు నింగి ముట్టెఁ దదనంతరంబ. 99

ప్రతిపదార్థం: అనినన్ విని= సహదేవ సాత్యకుల మాటలు విని; రథికవరులు+అందఱున్= రథమెక్కి యుద్ధం చేసే వీరాగ్రేసరులంతా; సహదేవుండు+ఇంత+ఒప్పన్+ఆడునే!= సహదేవు డింత ఒప్పిదంగా పల్కునా!; సాత్యకి పలుకులు+ఇట్లు+ ఉండునే!= సాత్యకి మాటలింత బాగుంటాయా?; తక్కటివి= మిగిలినవారు చెప్పినవి; ఎక్కడి మాటలు?= ఏమి పలుకులు?; పగవారిన్+అడిగి కొనన్+పోవుట= శత్రువులను యాచించటానికి వెళ్లటం; ఉచితంబు+అఁట!= యోగ్యమట!; కయ్యంబు కర్జంబు+కాదు+అఁట!= యుద్ధం చేయటం తగదట!; భంగంబున్+ఈఁగి కొనన్+తగదు+అట!= అవమానం బాపుకొనుట తగదట!; అనునివి మొదలుగాన్= అనునిటువంటి మాటలతో; అనేకులు= పలువురు; అనేక ప్రకారంబులన్= పలు రకాల; వీర+ఆలాపంబులన్= వీరోక్తులతో; కొలువు+ఎల్లన్= సభఅంతా; ఒక్క మ్రోఁతగాన్= ఒకే ధ్వనితో నిండినదికాగా; చెలంగిన+ఎలుంగులు= చెలరేగిన కంఠధ్వనులు; నింగిన్+ముట్టెన్= అంబరం అంటాయి; తత్+అనంతరంబు+అ= ఆ పిదప.

తాత్పర్యం: సహదేవుడూ, సాత్యకీ చెప్పిన మాటలు విని రథికశ్రేష్ఠులందరూ 'ఆహా! సహదేవు డెంత చక్కగా పలికాడు. సాత్యకి మాటలు ఎంత బాగా ఉన్నాయి! తక్కినవారి మాటలు ఏమి మాటలులే. విరోధులను యాచించటానికి వెళ్లటం మంచిదట! యుద్ధం చేయడం తగదట! వారు చేసిన అవమానానికి ప్రతీకారం కూడదట!' అంటూ అక్కడ అనేకులు అనేక విధాల వీరోక్తు లాడుతుండగా కొలువుకూటంలో ఒకే రొద చెలరేగింది. వారి కంఠధ్వనులు ఆకాశాన్ని తాకాయి. ఆ తరువాత.

విశేషం: ధర్మజుడు పలికిన రాజనీతి వాక్యాలకు సభ నిశ్శబ్దంగా ఉండి పోయింది. భీమార్జున నకులులు పల్కిన మాటలకు మారుపల్కకుండా ఊరుకొన్నది. సహదేవుడి మాటలకు ఉబ్బితబ్బిబ్బయిపోయింది. మనసులలో ఉన్న యుద్ధోత్సాహాన్ని మాటలలో బైటపెట్టింది. సభ్యుల వీరాలాపాలు గమనిస్తే పాండవ స్కంధావారమంతా యుద్ధాన్నే కోరుతున్నదని ప్రకటితమైనది. దీనిని పోషించటమే శ్రీకృష్ణుడి సంకల్పం. అందుకే వారిని వారించని వైనం. (సంపా.)

ద్రౌపది కృష్ణునితోఁ దన మున్ను పడిన భంగపాట్లు సెప్పుట (సం. 5-80-1)

తే. ధర్మనందను పలుకులు దనకు హృదయ । తాప మొనరింప మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ । గనలి శౌరితో గద్గదకంఠి యగుచు. 100

ప్రతిపదార్థం: ధర్మనందను పలుకులు= ధర్మజుడాడిన మాటలు; తనకున్= తనకు; హృదయతాపము+ఒనరింపన్= మనస్సునకు వ్యథ కలిగించగా; మోమునన్= ముఖంలో; దైన్యము+ఒందన్= దీనత తోపగా; ఉన్నపాంచాలి= అక్కడఉన్న ద్రౌపది; కనలి= కోపించి; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; గద్గద కంఠి+అగుచున్= డగ్గుత్తిక పడిన గొంతుగలదై; ఇట్లు+అని= ఈ రీతిగా; ఒయ్యన్+ పలికెన్= తిన్నగా మాట్లాడింది.

తాత్పర్యం: ధర్మపుత్రుడి వాక్కులు తన హృదయానికి వేదన కలిగించగా, తన ముఖంలో దైన్యం నెలకొనగా; అందరి మాటలు వింటూ అక్కడున్న ద్రౌపది కోపించి, శ్రీకృష్ణుడిని చూచి డగ్గుత్తికతో మెల్లగా ఇట్లా అన్నది.

విశేషం: 1. తిక్కన ద్రౌపది పాత్రను ఈ ఘట్టంలో సమున్నతంగా సహజంగా చిత్రించాడు. పాండవులు యుద్ధనీతిని అనుసరించి మాట్లాడుతారు. ఆమె హృదయ నీతిని పాటించి మాట్లాడుతుంది. ఆమెలో ఆవిర్భవించే భావకదంబాన్ని ఆమె చేష్టలు అభినయ దర్పణాలుగా వ్యాఖ్యానిస్తాయి. తిక్కన నాటకీయ రచనా శిల్పం ఈమె హావభావాలలో ఆయువు పోసికొన్నది.

ఆమెకు ధర్మరాజు మాటలు మనస్తాపాన్ని కలిగించాయి. దాని వలన ఆమె ముఖం చిన్నబుచ్చుకొన్నది. ఇది మనస్తాపానికి అనుభావం. ఆమెకు కోపం వచ్చింది. 'కనలు' అనే పదం సార్థకం. ఆపాదమస్తకం కోపంతో ఎర్రబడింది. ఇది సాత్త్విక భావం. గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం మొదలుపెట్టింది. గాద్గద్యం తన పరితాపానికి అనువైన వాచికాభినయంతో కూడిన సాత్త్వికభావం. మెల్లగా మాట్లాడటం మనస్తాప వ్యంజకం.

2. మూలంలో ద్రౌపది ధర్మజాదుల పలుకులకు ప్రతిస్పందించిన వివరాలు కూడా ఇవ్వబడ్డాయి.

> **"రాజ్ఞస్తు వచనం శ్రుత్వా ధర్మార్థ సహితం హితమ్**
> **కృష్ణా దాశార్హ మాసీన మబ్రవీచ్ఛోకకర్శితా॥**
> **మతా ద్రుపదరాజస్య స్వసితాయత మూర్ధజా**
> **సంపూజ్య సహదేవం చ సాత్యకిం చ మహారథమ్॥**
> **భీమసేనం చ సంశాన్తం దృష్ట్వా పరమదుర్మనాః**
> **అశ్రుపూర్ణేక్షణా వాక్య మువాచేదం మనస్వినీ॥" (సం. 5-80-1,2,3)**

ధర్మార్థ సహితంగా మాట్లాడిన ధర్మరాజు మాటలు విని ద్రౌపది శోకంతో కుమిలిపోయి శ్రీకృష్ణుడితో పలికింది. సహదేవుడిని, సాత్యకిని ప్రశంసించింది. చల్లబడిన భీముడిని చూచి గుండెలో కుమిలిపోతూ కళ్ళల్లో నీళ్ళు నిండగా ఆ అభిమానవతి ఇట్లా అన్నది. తిక్కన ధర్మరాజు ప్రసక్తిని చెప్పి మిగిలిన విశేషాలు వదలాడు. భీమాదులేమన్నా, ఎన్ని అన్నా ధర్మజుడి మాటను కాదనలేరు. శ్రీకృష్ణుడూ అంతే. అయినా ఆతడు స్వతంత్రుడు కాబట్టి తాను నమ్మింది చెప్పగలడు. చెప్పింది చేసి చూపించగలడు. అందువలన తిక్కన ద్రౌపది ధర్మజుడి మాటనే లెక్కలోకి తీసికొంటుంది. మిగతావారిని గురించి మాట్లాడకుండా ఉండటం ఇక్కడ ప్రకరణౌచిత్యం. తిక్కన ఔచిత్య పోషణ కిది తార్కాణం.

3. వ్యాసుడు మహర్షి. ధర్మరాజు పలికిన మాటలు ధర్మార్థ సహితాలైనా అవి ఆమెకు శోకం కలిగించాయని వ్యాఖ్యానం చేశాడు. అది సత్యమే అయినా ఆమె అవివేకాన్ని బైటపెట్టినట్లుంటుందని తిక్కన ధర్మార్థ ప్రసక్తి తీసికొని రాలేదు. ఆమెకు అంతస్తాపం కలిగిందని చెప్పాడు. వ్యాసుడు చిత్రించిన ద్రౌపది శోకమూర్తి. అశ్రుపూర్ణ నయన. మూలంలో అనుభావ సంచారిభావాలు వర్ణించబడ్డాయి. తిక్కన ద్రౌపది కన్నీటి వరకు రాలేదు. మొగం చిన్నబుచ్చుకొన్నది. మనసులో బాధపడుతున్నది. ఆ తాపానికి శరీరమంతా (మొగమంతా) నల్లబడిపోయింది. గొంతు బొంగురుపోయింది. అంటే కన్నీళ్ళు గొంతుకలోనే ఉన్నాయి కాని, ఇంకా కళ్ళల్లోకి పొంగలేదు. తిక్కనది క్రమదశావికాసస్ఫూర్తిగల అభినయ శిల్పం. రసాభ్యుదయ శిల్పంలో అది భాగం. (సంపా.)

ఉ. **అంతలు సేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు**
త్తెంతురె? యిట్టి యూఱట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళు లేవురకు నైదు సుయోధనుఁ డిచ్చు నొక్కొ? యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్? **101**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; అంతలు+చేసి= అన్ని దుండగా లొనర్చి; పోన్+అడిచి= అడవులకు తరుమగొట్టి; సంజయు చేతన్= సంజయుడితో; చెప్పి పుత్తెంతురె?= ఉపచార వాక్యాలు చెప్పి పంపుతారా?; ఇట్టి+ఊఱటన్= ఇటువంటి ఓదార్పు మాటలచేత; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; మదిన్+ప్రియము+అందెన్= మనసులో సంతోషించాడు; సుయోధనుఁడు= ఆ దుర్యోధనుడు; తాను; అంతన్+అ= అంత తేలికగా; ఏవురకున్= అన్నదమ్ము లైదుగురకూ; ఊళులు+ఐదు= ఐదు గ్రామాలను; ఇచ్చును+ఒక్కొ?= ఇస్తాడా?; ఈక= ఇవ్వక; అంత కృపావిహీనమతిన్= అంత నిర్దయమైన చిత్తంతో; అతఁడు= సుయోధనుడు; అన్నదమ్ములన్= సహోదరులను; నొంచునె?= బాధిస్తాడా?

తాత్పర్యం: కౌరవులు అంతటి అకృత్యాలు చేసి, అడవులకు తరిమివేసి, నేడు సంజయుడిచేత ఊరడింపు మాటలు చెప్పిపంపుతారా? ధర్మనందనుడు ఆ మాటలకు మనసులో ఎంతో ఉబ్బిపోగా, సుయోధనుడు తనకై తాను మనసొప్పి ఐదుమంది అన్నదమ్ములకు ఐదూళ్ళు ఇస్తాడా? ఇవ్వక దయారహిత బుద్ధితో అత డింకా ఇట్లా అన్నదమ్ములను బాధిస్తాడు కాబోలు!

విశేషం: 1. ద్రౌపది తనకు కలిగిన మనస్తాపానికి గల హేతువులను ఒక్కొక్క దానిని పేర్కొంటూ తన అభిప్రాయాన్ని శ్రీకృష్ణుడికి నివేదించుకొనటం ద్రౌపది ఉపన్యాసశిల్పంలోని మొదటి ముఖ్యాంశం. అందులో ఈ పద్యం మొదటిది.

2. ఇందులో అయిదూళ్ళడిగిన ధర్మరాజు దైన్యాన్నీ, అవి కూడా ఇవ్వని దుర్యోధనుని దౌష్ట్యాన్నీ పేర్కొంటూ 'కౌరవుల వలన పాండవులకు ఇంకా బాధలు తప్పవు కాబోలు' అని తన మనోవేదనను ప్రదర్శించింది. ఇందులో వ్యంగ్యంగా ధర్మజుడి అయిదూళ్ళ ప్రతిపాదనను ద్రౌపది గర్హిస్తున్నది. కౌరవులకు కాళ్ళిస్తున్నట్లు బాధపడుతున్నది. ఇది మనస్తాపానికి మొదటి కారణం.

3. ఈ పద్యం ప్రతిపద సార్థకం. 'అంతలు చేసి' అంటే- చెప్పలేనన్ని బాధలు పెట్టి అని భావం. 'పోనడచి' అన్నప్పుడు అన్యాయంగా రాజ్యం నుండి వెళ్ళగొట్టిన ఆ కాఠిన్యం వ్యంగ్యం. 'అక్కట!' ఇది జాలిని తెలిపేది కాదు. కౌరవుల నీతిలేని తనానికి అబ్బురపాటు వ్యక్తం చేసిన మాట. అంత చేసి, మరల సిగ్గు లేకుండా రాయబారం పంపుతారా? అని భావం. 'చెప్పి పుత్తెంతురె?' రాయబారం పంపుతారా? అని సామాన్యార్థం. కాని, కౌరవులే స్వయంగా వచ్చి క్షమాభిక్ష కోరి రాజ్యభాగం ఇవ్వవలసింది ఇవ్వకపోగా, సంజయుడితో కబురంపుతారా? అది ఆహ్వానం కాదు ప్రచ్ఛన్నమైన అపకారం. సంజయుడి రాయబారం వట్టి కన్నీటి తుడుపు. అతడి మాటలు శుష్కప్రియాలూ, శూన్య హస్తాలు, వాటికి ధర్మరాజు అమాయకుడై ఉబ్బితబ్బిబ్బయిపోయి, అయిదూళ్ళ బేరానికి దిగాడు. ఈ వరుసను ఇట్లా చెప్పటం వలన పై సన్నివేశాల కన్నిటినీ ధర్మజుడి వర్తనమే కారణమని ధ్వని. దానివలన ముఖ్యంగా ద్రౌపది హృదయతాపాన్ని పొందిందని భావం. (సంపా.)

4. ఇందు 'ఇట్టి యూఱట మదిం బ్రియమంది యుధిష్ఠిరుండు ---' అనేది అసమాపకం. తరువాతి తలంపు పైకొనటంచేత ఆ వాక్య మంతటితో ఆగింది. సహజమైన మాట వరస పాటించి చూపినాడు తిక్కన. 'సంజయుచేతఁ జెప్పి పుత్తెంతురె?' అనేచోట 'సంజయుచేత' అనే మాటలో ఊతమున్నది. ధర్మరాజును మోమాటపెట్ట గల నేర్పరిని -సంజయుడిని పంపినారే అని వారి సమయాభిజ్ఞతకూ, స్వభావగ్రహణ కౌశలానికీ, కుటిల ప్రయోగానికీ వింతపాటు. 'ఇట్టియూఱట----యుధిష్ఠిరుండు' అనే వాక్యంలో వెక్కసపాటు. అంతలో 'తానంతనె---సుయోధనుఁ డిచ్చునొక్కొ?' అనిన సందియపాటు. 'అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు. సహజసిద్ధమైన వాక్యరచన!' ఈ కంత కృపావిహీనమతి --- అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు! తిక్కన రచనలో ఇటువంటి అసమాపక వాక్యాలు గల పద్యాలు ఉంటాయని, వాటిలో ఇది ఒకటనీ విమర్శకులంటారు. 'ప్రియమందె' అని ఉంటే అన్వయం సుకరం.

చ. తన మును బడ్డ బన్నములుఁ దమ్ములపైఁ గల కూర్మి పేర్మి నీ
జనపతి సైఁపకున్నె? యది సక్కన; రాజ్యము పాలులేక తీ
ఱున కొడఁబాటు గల్గిన నెఱుంగమి వెట్టరె? 'చాలరైరి వీ'
రన రొకొ? నానలేమి యని యాడరె లోకమువారు కేశవా? 102

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; ఈ జనపతి= ఈ ప్రభువైన ధర్మజుడు; తన మునుపడ్డ బన్నములున్= తా నింతవరకు పొందిన పరాభవాలు; తమ్ములపైన్+కల= తమ్ముళ్ళైన కౌరవుల మీద ఉన్న; కూర్మిపేర్మిన్= అనురాగాతిశయంచేత; సైఁపక+ ఉన్నె?= సహించకుండా ఉంటాడా? (సహిస్తాడని భావం); అది+చక్కన= అట్లా సహించటం మంచిదే; రాజ్యము పాలులేక= రాజ్యంలో భాగం లేకుండా; తీఱునకున్= సంధికి; ఒడఁబాటు+కల్గినన్= అంగీకారం కుదిరితే; లోకమువారు= ప్రజలు; ఎఱుంగమి పెట్టరె?= పాండవులు తెలివిమాలినవారని పల్కరా?; వీరు చాలరు+ఐరి+అనరు+ఒకొ?= వీరు యుద్ధం చేయటానికి సమర్థులు కారని అనరా?; నానలేమి+అని+ఆడరె?= సిగ్గులేనివారని నిందించకుండ ఉంటారా?

తాత్పర్యం: కృష్ణా! ప్రభువగు ధర్మజుడు తమ్ములైన దుర్యోధనాదులైన కౌరవులమీద తనకున్న ప్రేమాతిశయంవలన తా నింతవరకు పొందిన అవమాన పరంపరలు సహించిన సహించుగాక! మంచిదే. కాని రాజ్యంలో భాగం తీసికొనకుండా వారితో పొత్తుకు అంగీకరిస్తే మాత్రంలోకులు పాండవు లెంత అవివేకులు! ఎంత అసమర్థులు! ఎంత సిగ్గులేనివారు! అని నిందించరా?

విశేషం: 1. ద్రౌపది తన మనోవేదనకు రెండవ కారణం గురించి ఇందులో వ్యంగ్యంగా చెప్పుతున్నది. ఈ పద్యంలో ఒక క్రమాన్వయం ఉన్నది. ధర్మరాజు తాను పడ్డ కష్టాలన్నీ మరచిపోయి తమ్ముళ్ళయిన కౌరవులను ప్రేమాతిశయంతో మన్నిస్తే ఆయనకు బాగానే ఉండవచ్చునుగాని లోకులు మాత్రం పాండవు లెంత అవివేకులు అని నవ్విపోతారు. రాజ్యభాగం ప్రసక్తి లేకుండా సంధి చేసికొంటే ధర్మరాజుకు తృప్తిగానే ఉండవచ్చును కాని లోకులు మాత్రం పాండవుల వంటి అసమర్థులు మరెవ్వరూ లేరని ఎగతాళి చేస్తారు. ఈ రెండూ బాంధవ్యానికీ ఔదార్యానికీ ప్రతీకలుగా భావించి ధర్మరాజు మురిసిపోవచ్చును కాని లోకులు పాండవులకు సిగ్గులేదని ఏవగించుకొంటారు. కాబట్టి కౌరవులతో సంధి కొరకు చేసే ఎటువంటి ప్రయత్నమైనా పాండవులకు నగుబాట్లు కలిగిస్తుందనీ, అటువంటి పనిని చేసి తమ నిందను తామే కొనితెచ్చుకొంటున్నారనీ వారి భార్య అయిన ద్రౌపది మనోవేదన పడుతున్నట్లు చెప్పింది. పగవారితో పొత్తు బంధుత్వం కాదనీ, పరిహాస జనకమనీ ద్రౌపది అభిప్రాయం. (సంపా.)

2. 'ఈ జనపతి సైఁపకున్నె?' --- ఈ మాటలో ధర్మరాజు దయాగుణాన్ని అసమయ, అస్థానపతితంగా ఎగతాళి చేస్తున్నది ద్రౌపది. 'తమ్ములపైన్ - ఇక్కడ తమ్ములంటే పాండవులనే అర్థం అంత సమంజసంగా ఉండదు. పాండవులపై గల ప్రేమాతిశయం చేత ధర్మరాజు సహించకపోతాడా? అనటంకంటె, 'తమ్ములపై' అనేదానికి దుర్యోధనాదులని చెప్పితే ద్రౌపది వ్యంగ్య సహితమైన వాగ్విన్యాసానికి సూచకమవుతుంది. (సంపా.)

శా. పెంపేదన్ దమకిట్టి తక్కువలు రూపింపంగ నేలా? విచా
రింపన్ వారిక మేలు సంధి; దము వారిం జూచినం దారు సా
ధింపం జాలరొ? కాక పోరఁ దగ మర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ? వారు బ్రాహ్మణులె యే కీడైన సైరింపఁగన్? 103

ప్రతిపదార్థం: పెంపు+ఏదన్= గౌరవం చెడేటట్లు; తమకున్= తమకు; ఇట్టి తక్కువలు= ఇంతటి హీనత్వములు; రూపింపంగన్+ ఏలా?= తామే నిరూపించుకొనటం ఎందుకు?; విచారింపన్= తర్కించగా; సంధి= పొత్తు; వారికిన్+అ మేలు= కౌరవులకే లాభం; తమున్ వారిన్ చూచినన్= తమనూ కౌరవులనూ పోల్చుకొన్నప్పుడు; తారు= కౌంతేయులు; సాధింపన్+చాలరొ?= కార్యం నెరవేర్చుకొనలేరా?; కాక= అట్లా పని సాధించుకొనలేకపోతే; పోరన్= రణంలో; తగన్= చక్కగా; మర్దింపన్+తలంపు+ఏనిన్= దండించే ఉద్దేశం ఉంటే; శంకింపన్+పట్టు+ఒకో!= సందేహానికి తావున్నదా? ఏ కీడు+ఐనన్+సైరింపఁగన్= ఎట్టి దోషమైనా సహించి విడిచిపెట్టటానికి; వారు= ఆ దుర్యోధనాదులు; బ్రాహ్మణులె?= భూసురులా?

తాత్పర్యం: గౌరవం చెడిపోయేటట్లు తాము తక్కువవార మని ఏల నిరూపించుకొనవలె? బాగా ఆలోచిస్తే సంధి కౌరవులకే లాభం. తా మెంత మాత్రమో, కౌరవు లెంతమాత్రమో పోల్చి చూచుకొంటే కౌంతేయులు కార్యం సాధించలేరా? సంధి పొసగనప్పుడు పోరిలో వారిని దండించే తలపు వీరికి ఉంటే గెలవటంలో అనుమానానికి అవకాశమే లేదు. ఏ తప్పు చేసినా మన్నించి విడిచిపెట్టటానికి దుర్యోధనాదులు బ్రాహ్మణులా ఏమి?

విశేషం: 1. ద్రౌపది తన మనోవేదనకు గల మూడవ కారణం చెప్పుతున్నది. ఈ మనోవేదన ధర్మజుడి మాటల వలన ఏర్పడింది. ధర్మరాజు రాజ్యభాగం అర్థించటంలో తనను తాను తక్కువ పరచుకొన్నాడు. అందుకే ఆమె బాధ. కులక్షయం కాకుండా సంధి చేసికొనదలిస్తే అది పాండవులకంటె కౌరవులకే ఎక్కువ లాభం. వారందరూ ఎన్ని దుర్మార్గాలు చేసినా ప్రాణాలతో బ్రతుకుతారు. బలాబలాలతో పోల్చి చూచుకొంటే వారందరికంటె పాండవులే శ్రేష్ఠులు కదా! యుద్ధంలో ఎవరికి అపజయం కలుగుతుందో చెప్పలేమని భయపడి ఎందుకు సంధి చేయాలి?- అని ఆమె మనోవేదన. అసలు ధర్మరాజుకు యుద్ధం చేసి వారిని శిక్షించాలన్న తలపే మనస్సులో లేదు. ఉంటే ఇన్ని అనుమానాలూ, ఆలోచనలూ ఉంటాయా? అసలు సమస్య ధర్మజుడి శాంతికాముకత్వమే. అయితే, ధర్మజుడి శాంతి గుణాన్ని చూచి దుర్యోధనాదులు హర్షిస్తారా? గౌరవిస్తారా? అట్లా చేయటానికి వారు బ్రాహ్మణులు కారు కదా! - అని ద్రౌపది అధిక్షేపించింది. పాండవులు క్షత్రియుల వలె కాక బ్రాహ్మణులవలె వర్తించి తమ గౌరవాన్ని తామే జారవిడుచుకొంటున్నారని ద్రౌపది మనస్సులో వేదన పడుతున్నది. తమ ఉపాయంతో పాండవులు తమకే అపాయం తెచ్చుకొంటున్నారని ఆమె వేదన.

2. ఆత్మన్యూనతా భావం గల పాండవులకు వారి అతి సమర్థత గుర్తు చేస్తున్నది ద్రౌపది. 'విచారింపన్ వారికమేలు సంధి.' అనటంలో పాండవుల తెలివి మాలినతనాన్నీ, దూరదృష్టి రాహిత్యాన్నీ ఒక పనివల్ల కలిగే లాభాలాభాలను బేరీజు వేసికొనలేని అసమర్థతనూ వెక్కిరిస్తున్నది ద్రౌపది. తము వారిం జూచినం దారు సాధింపం జాలరొ?' -- పాండవుల ఆత్మ సామర్థ్యజ్ఞతా రాహిత్యాన్ని ఈసడిస్తున్నది. 'శంకింపం బట్టొకొ?' -- కౌరవ మర్దనమెంత ధర్మబద్ధమో నిరూపిస్తున్నది. 'వారు బ్రాహ్మణులె- సైరింపఁగన్' బ్రాహ్మణుడెంతటి పాపి అయినా 'బ్రాహ్మణో నహంతవ్యః', అనే ధర్మసూక్ష్మాన్ని చెప్పి క్షమించటానికి వారు బ్రాహ్మణులు కారు గదా అని అడుగుతున్నది. ద్రౌపది పాండవులను కౌరవ నాశనానికి పురికొల్పేవిధం ఆమె వాక్చాతుర్యాన్ని, హేతుబద్ధతనూ నిరూపిస్తున్నది. (సంపా.)

ఉ. ఓట యొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదు; నీ
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడు పూనుఁగాక; య
చ్చోటన సంగరంబు లగు చొప్పులు వుట్టిననైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ! పోదురొ కానల నుండ నచ్యుతా! 104

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీకృష్ణా!; ఓట= భయం; ఒకింత+ఏనియున్= రవ్వంతైనా; సుయోధను చిత్తమునందున్= దుర్యోధనుడి మనస్సులో; లేదు= లేదు; నీ మాటలన్= నీ హితవచనాలను; పోవునే= అనుసరిస్తాడా?; దురభిమానము+అ=

చెడ్డ అహంకారమునే; ఎక్కుడు పూనున్+కాక= మిక్కిలి వహిస్తాడు; ఆ+చోటన్+అ= ఆ కురుసభలోనే; సంగరంబులు+అగు చొప్పులు= యుద్ధం జరిగే సూచనలు; పుట్టినన్+ఐనన్= సంభవించినప్పటికిన్నీ; పాండవుల్= కౌంతేయులు; పోటునకున్= పోరాటానికి; ఇచ్చగింతురు+ఒకొ!= ఇష్టపడతారంటావా?; కానలన్+ఉండన్= అడవులలో నివసించటానికి; పోదురొ!= వెళ్ళుదురో ఏమో తెలియదు.

తాత్పర్యం: కృష్ణా! సుయోధనుడి మనసులో భయం ఒకింతైనా లేదు. నీ హితవచనాలను అనుసరిస్తాడా? అంతకంతకూ దురహంకారమే ప్రదర్శిస్తాడు. ఆ కురుసభలో యుద్ధం జరిగే సూచన లేర్పడితే అప్పటికైనా పాండవులు కదనానికి సిద్ధపడతారో? వనాలలోనే వసించటానికి వెళ్ళుతారో ఏమో?

విశేషం: సుయోధనుడు రాజ్యభాగ మీయనని పరుషంగా మాట్లాడి శ్రీకృష్ణుడికి కీడు తలపెట్టినా సభను వీడిరాకుండా ఓర్పుతో నిలబడి పాండవుల సత్ప్రవర్తన సభలోనివారికి తెలిపేటట్లు మాట్లాడి రమ్మని ధర్మజు డంటున్నాడు. ఆమాటలు ఆమెకు బాధ కలిగించాయి. దుర్యోధనుడికి 'ఓట' లేదట! లజ్జ, సిగ్గు, భయం, మొగమోటం, జంకు, గొంకు, భయం, భక్తి అనే భావాలు ఈ మాటలో స్ఫురిస్తాయి. వాటికి సంబంధించిన కొద్దిపాటి సంస్కారం కూడా లేని కరడు కట్టిన దురహంకారి దుర్యోధనుడు. అతడు మంచి మాటలతో వింటాడా? మరీ కొండెక్కి కూర్చుంటాడు. అతడు పాండవులు పనికిరానివారని భావించి యుద్ధానికి కాలుదువ్వుతాడు. అప్పుడైనా పాండవులు పౌరుషంతో యుద్ధానికి సిద్ధమవుతారా? లేదా, వంశనాశనమవుతుంది యుద్ధం వద్దని మేము ముందే అన్నాము కదా అని మాట నిలబెట్టుకొనటానికి అడవులకు పోతారా? - అని ద్రౌపది మనోవేదనతో ప్రశ్నించింది. అలనాటి కురుసభలో ప్రదర్శించిన మనః ప్రవృత్తినే ఇప్పుడు కూడా ప్రదర్శించి ధర్మరాజు రాజ్యావకాశాన్ని చేజేతులా జారవిడచుకొని మరల శాంతికై అడవులకు పోతాడేమోనని ఆమె వేదన! దీనితో ధర్మరాజు ప్రవర్తనయే ఆమె వేదనకు హేతువని తేలింది. (సంపా.)

ఉ. ఏ నిటులంటి నా వలవ; దింకను నీవును రాజుఁ దమ్ములుం
గా నుచితంబు చూచి మన కార్యము మీసుజనత్వముం జెడం
గా నొకభంగి సేయక తగం గురువర్గము తోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్. 105

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇటులు+అంటిన్+నాన్+వలవదు= నేనిట్లా మాట్లాడానని అనుకొనవద్దు; ఇంకను= మరియు; నీవును; రాజున్= ధర్మజుడూ; తమ్ములున్+కాన్= తమ్ములునూ కూడి; ఉచితంబు చూచి= తగిన పద్ధతిని పరికించి; మన కార్యమున్= మన పనియు; మీ సుజనత్వమున్= మీ మంచితనమును; చెడంగాన్= చెడిపోయేటట్లు; ఒక భంగి+చేయక= ఏదో విధంగా సరిపెట్టుకొనక; తగన్= యుక్తంగా; కురువర్గముతోడి సంధి= కౌరవులతో పొత్తు; మీకున్+ఐన తెఱంగునన్= మీకు శక్యమైన రీతిలో; వలచినట్టులు+అ= మీకిష్టమైన పద్ధతిలో; నేర్పులు+ఏర్పడన్= మీ చాతుర్యాలు వెల్లడి అయ్యేటట్లు; చేయుఁడు= చేయవలసింది.

తాత్పర్యం: అన్నా! నే నిట్లన్నానని వేరుగా తలంచవద్దు. ఇంకా నీవూ, ధర్మజుడూ, అతని తమ్ముళ్ళూ కలసి, ఏది యుక్తమో పరికించి, మన పనీ, మీ మంచితనమూ చెడేటట్లు, ఏదో ఒక విధంగా కాకుండా ఒప్పిదంగా ఉండేటట్లు, శక్యమైనంతలో మీకిష్టమైనట్లు, మీ నేర్పు తేటపడేటట్లుగా కౌరవులతో పొత్తు కుదుర్చుకొనండి.

విశేషం: ఇవి ద్రౌపది యొక్క గూఢామర్షోక్తులు. విపరీతవ్యంగ్యోక్తులు. మగవారు తన గోడు పట్టించుకొనకుండా తమకు తోచిన పనులు నిరంకుశంగా చేసికొంటూ పోతూంటే, తన మాట సాగదని తెలిసి కూడా, వ్యంగ్యోక్తులతో మెత్తని నిష్ఠురాలాడే

అభిమానవతి పలికే కాకూక్తు లివి. ద్రౌపది అనే మాటలకు అర్థాలు విపరీతంగా ఉంటాయి. అట్లా ఉండేటట్లు మాట్లాడటమే కాకువు.

1. నేనిట్లా అంటున్నానని మీరేమీ అనుకొనవద్దు- అంటే ధర్మరాజు చేస్తున్న సంధి యత్నాన్ని కాదన్న దానికి తప్పుపట్టబోకండి, నిరసించబోకండి. కాని, మాటలలోని వాస్తవాన్ని, నా మనసులోని బాధను గమనించండి. నా మాటలు నా మనసుకు తేటలు. వాటిని పట్టించుకొనటం కనీస కర్తవ్యం - అని భావం.

2. ఇంకను- మరింకొకమాట. ఇది నా సొంత గోడని అనుకొంటారేమో. అయినా నేను అనుకొంటున్న విషయాన్ని మీకు తెలుపుతున్నాను వినండి.

3. కృష్ణా! ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నం నీవూ, పాండవులూ కలిసి రాజనీతికి ఉచితంగా చేస్తున్న కార్యం. కాదనటానికి నేనెవరిని? ఏమైనా, మీరు చేసే కార్యంలో మీ మంచితనంతో అందరూ మెచ్చుకొనే పద్ధతినే అవలంబిస్తారు కాని, నేను పడ్డపాట్లు మీకు జ్ఞాపకముండవు. అయినా, మీమీ ప్రయోజనాలు చెడకుండా కౌరవులతో సంధిని మీ నేర్పరితనం వాసికెక్కేటట్లు, మీకు కావలసినట్లు చేసి కొనటమేగా నేను కోరేది? - అని ద్రౌపది నిష్ఠురంగా మాట్లాడింది. ఈ సంధి ప్రయత్నం వలన పాండవులు మంచివారనిపించుకొంటారేమో కాని, నేను మాత్రం వారు మంచిపని చేస్తున్నారని అనలేను. నే ననకపోయినంత మాత్రాన ఎవరికి కావాలి? - అని ఎత్తిపొడుపు మాటలంటూ తన అభిప్రాయానికి కూడా తగినంత విలువ ఇవ్వటం కనీస కర్తవ్యమనీ, అది ఇంతవరకు పాండవుల మనసులలోకే రాలేదనీ, ఆత్మీయుడైన శ్రీకృష్ణుడితో మనవి చేసికొంటున్నది ద్రౌపది. గూఢాధిక్షేపోక్తులతో గూఢాభిమానాన్ని ప్రదర్శించిన గొప్ప పద్యం ఇది. ఇంతవరకు ధర్మజుడి సంధి యత్నాన్ని నిరసించింది. ఇకపై తన మనస్తాపాన్ని పరిగణనంలోకి తీసికొనని పరిస్థితికి పరితాపాన్ని వ్యక్తం చేస్తున్నది.

4. ద్రౌపది తన ఒక్కతెపైనా పూర్తి బాధ్యతను పెట్టుకొనటంలేదు. ఏదయినా జరగకూడనిది జరిగితే, నింద తన ఒక్కతె మీదనే పడుతుంది. ద్రౌపది గడుసరి మాటనేర్పూ, వ్యవహారజ్ఞానమూ అద్భుతాలు. తమ కార్యమూ చెడకూడదు. వారి మంచితనమూ, పౌరుషమూ చెడకుండా సంధికార్యాన్ని నిర్వహించాలట! తాను కర్తవ్యబోధ చేస్తూనే, మీకు నచ్చినట్లు, నేర్పుతో చక్కబెట్టండి అంటోంది. ఆమె వాక్నైపుణ్యం ప్రశంసనీయం.

వ. అని మఱియు నిట్లనియె. 106

తాత్పర్యం: అని ఇంకా ద్రౌపది ఇట్లా మాట్లాడింది :

ఉ. ఆఱడిఁ బోకయున్ ఫలము నందుటయుం గని పల్కనేరమిన్
మాఱట నోరి దాననయి మాటలు చిత్తమునందు నిల్ప కేఁ
గాఱులు ప్రేలెదన్; వినుఁడు; కర్జము నెగ్గును గాన నల్కమై,
వీఱిఁడి యైన మానిసికి వెండి వివేకము గల్గనేర్చునే? 107

ప్రతిపదార్థం: ఆఱడిన్+పోకయున్= నిందలపాలగుటయు; ఫలమున్+అందుటయున్= ప్రయోజనం సిద్ధించటమూ; కని= చూచికూడా; పల్కన్+నేరమిన్= (భర్తలు) మాటాడకపోవటం చేత; మాఱటనోరిదానన్+అయి= ఆడినమాటనే ఆడెడి దానననయి; చిత్తము నందున్= మనస్సులో; మాటలు నిల్పక= మాటలు దాచుకొనక; ఏన్= నేను; కాఱులు ప్రేలెదన్= ఏమిటో వదరుతున్నాను; వినుఁడు= నా మాట లాలకించండి; అల్కమైన్= కోపంచేత; కర్జమున్+ఎగ్గున్, కానన్= చేయవలసిన దానిని, హానిని తెలియలేను; వీఱిఁడి+ఐన+మానిసికిన్= వెఱ్ఱిపట్టిన మనిషికి; వెండి= మరల; వివేకము= యుక్తా యుక్తపరిజ్ఞానం; కల్గన్+నేర్చునే?= సమకూడగలదా?

తాత్పర్యం: నేను అల్లరి పాలవటమూ, తత్ఫల మనుభవించటమూ చూచి కూడా 'పల్కనేరమి'కి కర్త నేను అనటం కంటె, పాండవులనటమే మేలు. నా భర్తలు మాటాడక పోవటంచేత, ఆడినమాటనే మళ్ళీ మళ్ళీ ఆడే దాననయి, మాటలను మనస్సులోనే నిల్పలేక, నేను ఏదో నోటికి వచ్చినట్లు మాటాడుతున్నాను. వినండి. కోపోద్రేకం చేత ఏది కార్యమో, ఏది అకార్యమో తెలియకున్నాను. అవివేకి అయిన మానిసికి మళ్ళీ వివేకం కలుగుతుందా? (ఈ మాటలు మూలంలో లేవు.)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 1. తన బాధను గాని, మాటనుగాని పట్టించుకొనని ధర్మజుడి వైఖరిమీద ద్రౌపది వ్యంగ్యమైన వాఙ్మయాస్త్రాలు ప్రయోగిస్తున్నది. అన్నీ విపరీత వ్యంగ్యార్థక కాకువులు.

2. కార్యాకార్య వివేకుడై ధర్మరాజు ఆచితూచి మాట్లాడుతాడు. ఆమాట బైటికి అనకుండా 'నాకు మంచీ చెడులూ తెలిసికొని మాట్లాడటం చేతకా'దని ద్రౌపది అంటుంది. అంటే. ఆమెకు చేతకాదని కాదు, చేతకాదని ధర్మరాజాదులు అనుకొంటారు కాబట్టి, తన మాటలు పట్టించుకొనరు కాబట్టి ఆ మాట అన్నది. పైకి వినయంగానూ లోన వేదనగానూ వినపడుతుం దీ వాక్యం.

3. మాట దాచుకోలేక పైకి బడబడ మాట్లాడే మనిషట ద్రౌపది! ఇది ధర్మరాజు ప్రవృత్తికి సాక్షాత్ విరుద్ధం. అదే అందులోని అధిక్షేపం. ధర్మజుడు బైటపడడు, ద్రౌపది బైటపడుతుంది. ఆమె చెడ్డదనిపించుకొంటుంది. అసలు మౌనంగా చేసేది ధర్మరాజే అని ఆమె ఆక్షేపం.

4. ఇటువంటి దాననైనా నామాట కాస్త వినండి-అని నిష్ఠురమాడింది. నామాట త్రోసివేయదగింది కాదని మందలింపు అందులో ధ్వని.

5. నాకు మంచి చెడ్డలు తెలియవు అనటం కూడా గడుసరిదనమే. మంచిచెడ్డలనేవి పురుష ప్రమాణంతో నిర్ణయించేవి కావనీ, అవమానాల పాలైన తనను దృష్టిలో ఉంచుకొని నిశ్చయించండనీ ద్రౌపది మనవి చేసింది.

6. 'కోపంతో వెర్రిదాన్ని అయిపోయిన నావంటి మనసున్న దానికి వివేకం ఉంటుందా?' అని అర్థాంతరన్యాసాలంకారం వలె మాట్లాడింది. ఆమె మాటలు అరణ్య రోదనలుగా మారటానికి గల కారణం ఆమె మనసులోని మాటను మన్నించకపోవటమే అని తన మనోవేదనను వ్యక్తం చేసింది.

7. 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ' అని కదా న్యాయం. సంధి విషయంలో పాండవ పత్ని అయిన ద్రౌపది యొక్క సలహా అడగలేదని అభిమానంతో అన్నమాట ఇది! ధర్మజుడి నిర్ణయమే అందరి నిర్ణయమన్న నిరంకుశ వైఖరిని ఆమె ఆత్మన్యూనతాభావ ద్యోతకమైన వ్యంగ్యాధిక్షేపోక్తులతో నిందించటం ఇందులోని సంభాషణ శిల్పం. (సంపా.)

8. మూలం: పునరుక్తంచ వక్ష్యామి విశ్రమ్భేణ జనార్దన- కాతు సీమన్తినీ మాదృక్ వృథివ్యా మస్తి కేశవ- "మాఱట నోరి దాననయి -----

చ. **వరమునఁ బుట్టితిన్, భరత వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ**
వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతి విక్రమ
స్థిరులగు పుత్త్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్. **108**

ప్రతిపదార్థం: వరమునన్+పుట్టితిన్= దేవతా వరప్రసాదాన జన్మించాను; భరత వంశమున్+చొచ్చితిన్= భరతుడు మూల పురుషుడుగా గల కురు వంశమునందు మెట్టాను; అందున్= ప్రసిద్ధమైన ఆ కురువంశంలో కూడ; పాండు భూవరునకున్=

పాండు మహారాజునకు; కోడలు+ఐతిన్= కోడలనైనాను; జనవంద్యులన్= ప్రజలచేత నమస్కరించదగినవారిని; పొందితిన్= పతులుగా పడశాను. నీతి విక్రమస్థిరులు+అగు= రాజనీతిలో, పరాక్రమంలోనూ చలించనివారైన; పుత్త్రులన్+పడసితిన్= కొడుకులను కన్నాను; సహజన్మల ప్రాపు+కాంచితిన్= సోదరుల యొక్క అండగలదాననైనాను; సరసిజనాభ!= (కమలము నాభియందుగల) శ్రీకృష్ణా!; ఇన్నిటన్= ఇన్ని విధాల; ఎంతయున్= మిక్కిలి; ప్రశస్తికిన్+ఎక్కినదానన్= ప్రఖ్యాతి పొందాను.

తాత్పర్యం: కృష్ణా! నేను దేవతావర ప్రసాదం వలన జన్మించాను. భరతవంశం మెట్టాను. భరతకుల ప్రసిద్ధుడైన పాండు మహారాజుకు కోడలినైనాను. జనులచేత నమస్కరించదగిన భర్తలను పొందాను. రాజనీతి లోనూ, శౌర్యంలోనూ చలించని ఉత్తమ పుత్రులను కన్నాను. తోబుట్టువుల తోడు నాకున్నది. ఇన్ని విధాల నేను ప్రఖ్యాతి గడించాను.

విశేషం: 1. ధర్మరాజు ద్రౌపది చింతను పరిగణనంలోనికి తీసికొనటం లేదని ద్రౌపది మనోవేదన. దానిని మరింత మండించే లక్షణం ఆమె అస్తిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ లెక్కించక పోవటం. అందుకని ఇంత అవజ్ఞకు గురి అయిన తనను గురించి తానే చెప్పుకొంటున్నది. ఇది అహంకారంతో చెప్పుకొనేది కాదు. తనంతట తానే చెప్పుకొని ఎదుటివారి మన్ననల కొరకై పాటుపడవలసిన దైన్యాన్ని ఎత్తిచూపి, ఎదుటివారిని ఎత్తిపొడవటానికి వాఙ్మయాస్త్రంగా ప్రయోగించటానికి అన్నది. అప్పటి రాజనీతిలో తన మనోభావానికి కూడా తగినంత గౌరవస్థానం ఇవ్వాలని ఒత్తిడి తేవటానికి ఈ పద్యం అన్నది. ఇది మానోక్తికి మధురోదాహరణం.

2. ఉత్తమ ఇల్లాలికి గౌరవ ప్రమాణాలు ఆరు. (1) పుట్టుక (పుట్టింటి) గౌరవం, (2) మెట్టినింటి గౌరవం. (3) అత్తామామల గౌరవం (4) భర్త గౌరవం, (5) సంతాన గౌరవం, (6) పుట్టింటి సహకార గౌరవం. ఈ షడ్గౌరవాలు పరిపూర్ణంగా గలది ద్రౌపది అని వరుసగా పేర్కొన్నది.

3. ద్రౌపది వాక్కులలో అహంకారం కంటె అభిమానం అధికంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

4. పైపెచ్చు ఆమె అయోనిజ. ద్రుపద మహారాజు తపఃఫలం. వరమున పుట్టిన పుణ్యవతి. అట్టి సహధర్మచారిణి అభిప్రాయాన్ని, సలహాలను అవజ్ఞ చేయటం అసమంజసం. పాండవులు ఆ పొరపాటు చేశారని ఈ పద్యంలో చెప్పింది. శ్రీకృష్ణుణ్ణికూడా అటువంటి పొరపాటు చేయవద్దని తరువాత పద్యంలో హెచ్చరించబోతున్నది.

5. దీనికి మూలము.

> **సుతా ద్రుపదరాజస్య వేదిమధ్యాత్ సముత్థితా,**
> **ధృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణ ప్రియా సఖీ ॥**
> **ఆజలాఢ కులం ప్రాప్తా స్నుషా పాణ్డోర్మహాత్మనః,**
> **మహిషీ పాణ్డు పుత్రాణాం పఞ్చేంద్ర సమవర్చసామ్ ॥**
> **సుతా మే పఞ్చభి ర్వీరైః పఞ్చ జాతా మహారథాః**
> **అభిమన్యు ర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః, ॥ (సం. 3-80- 21, 22, 23)**

వ. అట్లుంగాక. 109

తాత్పర్యం: అంతమాత్రమే కాకుండా.

ఉ. నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టి ననుఁ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబు నందు శుచియై పెనుపొందిన వేణి పట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ; గులాంగన ని ట్లొనర్తురే? 110

ప్రతిపదార్థం: పంకజనాభ!= పద్మము నాభియందు కలవాడా, శ్రీకృష్ణా! నీవు సుభద్రకంటెన్= నీ చెల్లెలైన సుభద్ర కంటెను; కడున్= మిక్కిలి; నెయ్యమున్= స్నేహమూ; గారవమున్= గౌరవమూ; తలిర్పన్= అతిశయించగా; సంభావన చేయుదు(వు)= నన్ను ఆదరిస్తావు; ఇట్టి ననున్= నీ మన్ననకు పాత్రురాలనైన నన్ను; ఒకండు= నోటితో ఉచ్చరించరానివాడైన దుశ్శాసనుడు; రాజసూయ+అవభృథంబునందున్= రాజసూయ యాగదీక్షానంతరం చేసే మంగళ స్నానంచే; శుచి+ఐ= పవిత్రమై; పెనుపు+ ఒందిన= మహిమ గాంచిన; వేణిన్+పట్టి= నా జడను పట్టుకొని; ఈ ఏవురు+చూడఁగాన్= ఈ భర్త లైదుగురూ చూస్తూ ఉండగా; సభకున్+ఈడ్చెన్= సభలోని కీడ్చి తెచ్చాడు; కుల+అంగనన్= ఇల్లాలిని; ఇట్లు+ఒనర్తురే?= ఇంతటి అవమానానికి గురిచేస్తారా?

తాత్పర్యం: పద్మనాభా! నీవు నన్ను నీ చెల్లెలు సుభద్రకంటె మిక్కిలి స్నేహ గౌరవాలతో ఆదరిస్తావు. ఇట్లాంటి నన్ను రాజసూయ యజ్ఞదీక్షానంతరం కావించిన మంగళ స్నానంతో పావనమై, మహిమ గాంచిన నా జడ పట్టుకొని ఒకానొకడు నా పతులైదుగురూ చూస్తుండగా కొలువులోనికి ఈడ్చి తెచ్చాడు. ఇల్లాలిని ఇట్లా పరాభవిస్తారా? నీవే చెప్పుము.

విశేషం: 1. శ్రీకృష్ణుడితో ఆత్మీయత ఉట్టిపడేటట్లు ద్రౌపది పలికిన గొప్పపద్య మిది. రసధ్వని రమణీయం. ప్రతిపదసార్థక రచన.

2. శ్రీకృష్ణుడు సుభద్రకంటె ప్రేమగా, ఆదరంగా ద్రౌపదిని చూచేవాడట. అది నిజం. సుభద్ర స్వంత చెల్లెలు. ఆమె యోగక్షేమాలన్నీ శ్రీకృష్ణుడే చూచాడు. రహస్యంగా అర్జునుడికిచ్చి వివాహం కూడా చేశాడు. అయినా, ఆయనకు ద్రౌపదంటే అంతకంటె ప్రేమ. కురుసభలో ఆమెను అవమానం నుండి రక్షించాడు. ఆమెను కనురెప్పవలె కాపాడుతూ ఆమెను గౌరవంగా మర్యాదలిచ్చి మన్నిస్తాడు. పాండవులకంటె శ్రీకృష్ణుడికి ఆమెయందు ఆదరణం అధికం. పాండవు లామె కష్టనిష్ఠురాలను పట్టించుకొనరు కాని, శ్రీకృష్ణుడు వాళ్ళవలె ఉండడు, ఉండకూడదు అని ఆమె అభిమతం. శ్రీకృష్ణుడికి అభిమాన పాత్రురాలు కావటం ఆ తరంలో గొప్ప అదృష్టం. గొప్ప యోగ్యత. అందుకే 'పంజకనాభ! అట్టి నన్ను' అని అనగలిగింది సార్థకంగా, సాభిమానంగా, చనువుగా.

3. అట్టి ఆమెను ఒకడు జుట్టుపట్టి సభకు లాగికొని తెచ్చాడని అన్నది. ఒకడు అనే మాటకు అల్పుడు, ఏకాకి, పేరుచ్చరించరాని పాపి - అనే అర్థాలు ఈ ప్రకరణంలో సరిపోతాయి. శ్రేష్ఠుడనే అర్థం ఉన్నా ఇక్కడ అది పొసగదు. ఆ ఒకడు దుశ్శాసనుడు.

4. ఒక అల్పుడు - మహాపరాక్రమవంతులైన 'ఈ యేవురు' (అని పాండవులవైపు చూపించి అనే అభినయాత్మక వాచకం) ఏమీ చేయలేక కళ్ళప్పగించి చూస్తూ ఉండగా, ఆమె కేశపాశాన్ని పట్టి లాగాడట! ఆ కేశపాశం సామాన్యమైనదా! రాజసూయయాగం చేసి, పరిసమాప్తిలో పవిత్రమైన అవభృథ స్నానం చేయడం చేత పవిత్రమైనది. సమ్రాజ్ఞి అర్హత పొందిన ఆ కేశం ఆమె సుమంగళీత్వానికి చిహ్నం. దాన్ని కించపరిచేటట్లు దుశ్శాసనుడు లాగాడని జ్ఞాపకం చేసింది. ఆ చేష్ట వెనుక ఉన్న కౌరవుల క్రౌర్యం తలపోసింది. పాండవుల నిస్సహాయ స్థితికి నిట్టూర్చింది. కృష్ణుడి దయకు ధ్వనిమయంగా కృతజ్ఞత చెప్పింది. 'ఇల్లాలిని ఇట్లా చేస్తారా?' అని ప్రశ్నించింది. 'ఇట్లు' అనే మాట చాలా విలువైనది. కౌరవులు పరుల ఇల్లాలిని ఇట్లా అవమానిస్తారా? అని, పాండవులు తమ ఇల్లాలిని అట్లా అగచాట్ల పాలుపడనిస్తారా? అని ఉభయులను మందలించింది. అసలు ఇల్లాళ్ళను ఇటువంటి అవమానాల పాలు చేసే వారితో పాలు పంచుకోబోతారా? అని అందరినీ ప్రశ్నించింది. దాని సమాధానం కొరకు శ్రీకృష్ణుడివైపే చూచింది. ఇది మానసిక వేదనను పతాక స్థానాన్ని చేర్చే ప్రశ్న.

5. సంధి వద్దని నేరుగా చెప్పక, ద్రౌపది ఈ విధంగా మాటాడటం వలన సంధిగాక యుద్ధమే అవశ్యం జరగాలని ఆమె అభిప్రాయంగా శ్రీకృష్ణుడు గ్రహించగలడు. 'నీ చెల్లెలు సుభద్రకే ఇటువంటి అవమానం జరిగితే నీవు ఊరుకొంటావా? మరి నీవు నన్ను అంతకంటె మిన్నగా ఆదరిస్తావు కదా! నా విషయంలో ఉపేక్షించవచ్చా?' అని ఆమె హృదయం. (సంపా.)

ఉ. ఆ సభ కేకవస్త్ర యగు నట్టి ననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతు లసంభ్రములై తగుచేష్ట లేక నా
యాసలు మాని చిత్రముల యాకృతి నున్న యెడన్ ముకుందా! వి
శ్వాసముతోడ నిన్ గొలువ వచ్చె మనం; బదియుం దలంపవే. 111

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; ఆ సభకున్= ఆ కురుసభలోనికి; ఏకవస్త్ర+అగునట్టి ననున్= రజస్వలనైన నన్ను; కొని వచ్చి= ఈడ్చి తెచ్చి; నొంచు= బాధిస్తున్న; దుశ్శాసనున్+చూచుచున్= దుస్ససేనుడి దుండగం చూస్తూ; పతులు= నా భర్తలు; అసంభ్రములు+ఐ= తొట్రుపాటు చెందనివారై; తగుచేష్ట లేక= తగిన చర్య గైకొనక; నా+ఆసలు మాని= నాపై తమ ఆశలు వదలుకొని; చిత్రముల+ఆకృతిన్= బొమ్మల ఆకారంతో - నిశ్చేష్టులై; ఉన్న+ఎడన్= ఉన్నట్టి సమయంలో; విశ్వాసము తోడన్= నమ్మికతో; మనంబు= నా హృదయం; నిన్+కొలువన్+వచ్చెన్= నిన్ను సేవించటానికి వచ్చింది; అదియున్+తలంపవే= ఆ విషయాన్ని కూడా స్మరించుము.

తాత్పర్యం: ముకుందా! ఆ నాడు కురుసభకు ఒంటి చీరతో ఉన్న (బైటచేరి ఉన్న) నన్ను బలాత్కారంగా లాగితెచ్చి దుశ్శాసనుడు బాధిస్తుంటే నా భర్తలు దిగ్భ్రాంతి పొంది ఏమీ చెయ్యలేక నా మీది ఆశలు వదలుకొని చిత్రాలవలె కదలక మెదలక ఉండగా నమ్మికతో నా మనస్సు నిన్ను భజించటానికి పూనుకొన్నది. ఆ విషయాన్ని నీవు సంధి కుదిర్చేవేళ జ్ఞప్తికి తెచ్చుకొ!

విశేషం: 1. సభానీతి లేక రాజనీతిని గురించి పై పద్యంలో మాట్లాడి, కుటుంబ నీతికి వెలియైన రాజనీతిని గురించి ఇక్కడ పేర్కొంటున్నది ద్రౌపది. ఏకవస్త్ర (ముట్టయిన) అయిన స్త్రీని పురుషుడు తాకరాదు. ఆమెను బాధపెట్టరాదు. ఇది కుటుంబ నీతి, గృహనీతి. దీనిని రాజనీతితో ధ్వంసం చేయటం అవినీతి. దుశ్శాసనాదులు చేసిన అవినీతి దండార్హం. అయినా, దానిని పాండవులు చూస్తూ, ఎటువంటి ప్రతిస్పందన లేకుండా, ఆశలు వదలుకొని, బొమ్మలవలె కూర్చున్నారు. చక్కని నాటకీయ సన్నివేశ స్మృతి. అట్టి దయనీయ సమయంలో విశ్వాసంతో తలచినంతమాత్రంలోనే శ్రీకృష్ణుడు ఆమెను కాపాడాడు. దానిని గుర్తుంచుకొనమంటున్నది ద్రౌపది.

2. 110వ పద్యంలో శ్రీకృష్ణుడికి తనపై నిజసోదర నిర్విశేషమైన ఆదరం ఉందని చెప్పి, యిప్పుడు ఈ పద్యంలో తనకు శ్రీకృష్ణుడిపై ఎంత విశ్వాసమో చెప్తుతోంది ద్రౌపది. ఆ సమయంలో నిజ భర్తలకు తన యెడగల ఉపేక్షాభావం చేత, ఆమె నిస్సహాయత ఎవరికైనా జాలి కలిగిస్తుంది. 'అదియుం దలంపవే' - సంధి కుదిర్చేటప్పుడు అవన్నీ మనసులో పెట్టుకొని ప్రయత్నిస్తే, అది ఎట్లాగూ కుదిరేది కాదు. శ్రీకృష్ణుడికే సంధి కుదర్చటం ఇష్టంకాదు. అది అతని పూర్వపు మాటలలో తెల్లమైంది. ఇప్పుడు ద్రౌపదికి కూడా సంధి ఇష్టం కాదని స్పష్టమౌతున్నది.

3. ఇందులో చక్కని ధ్వని ఉన్నది. 'ప్రస్తుత సంధి ప్రయత్నంలో కూడా- కౌరవుల చేత అవమానించబడిన నేను పరోక్షంగా- అదే స్థితిలో నేటికీ ఉన్నాను. సంధి చేయటం నన్ను నిండుకొలువులో అవమానించడం వంటిదే' అని ధ్వని. ఆనాడు మిన్నక కూర్చున్నారు పాండవులు. ఈ రోజు కూడా తనను పట్టించుకొనక, తనను అవమానం నుండి రక్షించక, తమ మంచితనం కొరకు దుర్మార్గులతో స్నేహం చేయబోతున్నారు. వారితో కలిసి బ్రతకాలని భావిస్తున్నారు. ఈ పరిస్థితులలో ద్రౌపది ఆనాటి వలెనే శ్రీకృష్ణుడితో తన మొర చెప్పుకొంటున్నది. ఆనాడు శ్రీకృష్ణుడు ఆమెను ఎట్లా ఆదుకొన్నాడో, అట్లాగే ఇప్పుడూ అట్టి ప్రేమతో ఆదుకొనవలెనని ప్రార్థిస్తున్నది. ఆనాటి సభకూ ఈనాటి సభకూ చక్కని సామ్యాన్ని ధ్వనింపచేసిన ద్రౌపది వాక్కులు ఆలోచనామృతాలు.

4. అర్థవ్యక్తి అనే శబ్దార్థగుణ స్వభావాలు ఈ పద్యంలో హృద్యంగా రాణిస్తున్నాయి. (సంపా.)

చ. అరయమిఁ జేసి కోడ లన కప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? యటుఁగాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!' 112

ప్రతిపదార్థం: మాధవ!= లక్ష్మీవల్లభా!; అరయమిన్+చేసి= ముందు వెనకలు విచారించక; కోడలు+అనక= కోడలు అని కూడా భావించక; దాసిగన్+చేసెన్= నన్ను ఊడిగపుదానిగ చేశాడు; ఆ+మహాపురుషుని పాలికిన్= ఆ దొడ్డ మనిషి ధృతరాష్ట్ర మహారాజు కడకు; పతులు పోవఁగన్= నా భర్తలు వెళ్ళగా; వీరలతోన్+అ= వీరి వెంటనే; ఏను= నేను; చెచ్చెరన్+చని= శీఘ్రముగా పోయి; వారికిన్= ఆ పెద్దలకు; కోటరంబు= కోడరికము; తగన్+చేయుదునో= చక్కగా చేయవలెనో; అటుఁగాక= అలా కాకుండా; పాడిమైన్= న్యాయముతో; వరవుడము= దాస్యము; ఓపి= సహించి; చేయుదునొ= చేయవలెనో; నిశ్చయింపుమా= నీవే నిర్ణయించవలసినది.

తాత్పర్యం: అన్నా! ముందు వెనుకలు ఆలోచించక కోడలని కూడా భావించక అప్పుడు నన్ను దాసిని గావించిన ఆ పెద్దమనిషి ధృతరాష్ట్ర మహారాజు దగ్గరకు నా భర్తలు వెళ్ళగా, వారి వెంట నేను కూడా వెళ్ళి ఆ పెద్దలకు కోడరికము చేయాలో లేక న్యాయప్రకారం వారికి దాస్యమే చేయాలో నీవే నిర్ణయించి చెప్పుము.'

విశేషం: 1. ఈ పద్యం ఒక కీలకాంశం. ద్రౌపది సమయోచిత ప్రతిభకు మచ్చుతునక. సభాపర్వంలో 'మున్ను తన్నోడి ఆపైన నన్నోడెనా? నన్ను మున్నోడి విభుఁడు ఆమీద తన్నోడెనా?' అని అడిగిన చిక్కుముడి ప్రశ్నవంటిది.

2. హస్తినాపురంలో జరిగిన మాయా ద్యూతంలో ధర్మజాదులు ఓడి దాసులయ్యారు. ద్రౌపదిని దాసిగా భావించి కౌరవులు అవమానించారు. దానిని ధృతరాష్ట్రుడు గమనిస్తూనే కిమ్మనకున్నాడు. ఆపైన రాజ్యాన్నిచ్చాడు. పాండవులు ప్రభువులైనారు. ద్రౌపది రాణి అయింది. ఆపైన పునర్ద్యూతంలో ఓడి అరణ్యాజ్ఞాతవాసాల పాలయ్యారు. ఆ పరిస్థితులకూ ధృతరాష్ట్రుడు సాక్షిగా నిలిచాడు. 'ఒకవేళ ఇప్పుడు హస్తినాపురికి పోతే పాండవుల స్థితి ఏమిటి? రాజ్యాన్ని వదలిపోయిన పాండవులకు రాజ్యమున్నట్లా? లేనట్లా? దుర్యోధన ధృతరాష్ట్రులు ఇస్తేనే ఉన్నట్లా? ఇవ్వకపోతే లేనట్లా? ఒకవేళ రాజ్యభాగం ఇవ్వకపోయినా, వారితో కలిసి ఉండే సంధి కుదిరితే ధృతరాష్ట్రుడి సమ్ముఖంలో పాండవుల అధికారమేమిటి? రాజ్యంలేని రాజులా? ఇచ్చిన రాజ్యాన్ని కోల్పోవటం ద్వారా వారు దాసులుగానే పరిగణించబడతారా? రాజ్యం స్వీయాధికారం వలన ఏర్పడేదా? కౌరవుల దయాభిక్షవలన కలిగేదా? ఇంతటి సందిగ్ధావస్థలో పాండవులు ధృతరాష్ట్రుడి మందిరానికి పోతే వారెట్లా మెలగుతారో, మెలగరాదో వారికే ఏమైనా నిశ్చితాభిప్రాయం ఉన్నదో లేదో నాకు తెలియదు. కాని, నేను ధృతరాష్ట్రుడికి కోడరికం చేయాలా? దాస్యం చేయాలా? అన్నది నీవే నిశ్చయించి చెప్పు'మని శ్రీకృష్ణుడిని వేడింది. స్వాభిమానాన్ని సర్వనాశనం చేసే సంధిని ఆమె అంగీకరించదు. ఆమె మనోవేదన పాండవులకు పట్టదనీ, దానిని శ్రీకృష్ణుడే పట్టించుకొని తగిన పరిష్కారం చూపించాలనీ ఆమె పరితాపం. (సంపా.)

వ. అని యట్లుగ్గడించి. 113

తాత్పర్యం: అట్లా పలికి.

ఉ. ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెంద్రుకల్
దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో

నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై. 114

ప్రతిపదార్థం: ద్రోవది= ద్రౌపది; బంధురంబు+అయిన= ఒప్పిదమైన; క్రొమ్ముడిన్= క్రొత్త సిగముడిని; గ్రమ్మన= శీఘ్రంగా; విడ్చి= విప్పి; వెండ్రుకల్= శిరోజాలు; తాన్= తాను; వలచేతన్+పూని= కుడిచేతపట్టుకొని; అసిత+ఛవిన్= నల్లని కాంతితో; పొల్చు= ఒప్పు; మహాభుజంగమో= గొప్ప సర్పమేమో; నాన్= అన్నట్లు; విలసిల్లి= ప్రకాశించి; వ్రేలఁగన్= వ్రేలాడుతుండగా; మనంబునన్= తన హృదయంలో; పొంగు= అతిశయిస్తున్న; విషాదరోషముల్= దుఃఖమూ కోపమూ; కావఁగన్+లేక= అణచుకొనలేక; బాష్పములు= కన్నీరు; క్రమ్మఁగన్= కన్నులలో ఆవరించగా; ఆర్త+ఐ= దుఃఖితురాలై; దిగ్గనన్+లేచి= తటాలున లేచి.

తాత్పర్యం: ద్రౌపది తన ఒప్పిదమైన అప్పుడే వేసుకున్న కొప్పును గ్రక్కున విప్పి, శిరోజాలను కుడిచేతదాల్చి నల్లని రంగుతో నిగనిగలాడే పెద్ద పామువలె ప్రకాశిస్తూ వ్రేలాడుతుండగా తన హృదయంలో చెలరేగు దుఃఖాన్నీ, క్రోధాన్నీ ఆపుకొనలేక కనులలో అశ్రువులు నిండగా విలపిస్తూ తటాలున లేచి దుఃఖితురాలై. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. శ్రీకృష్ణుడి ఎదుట ద్రౌపది తన మనోగత వేదనను ప్రదర్శించిన మాటలతో పాటు ఆమె చేష్టలను కూడా వర్ణించిన పద్యాలలో ఇది ఆణిముత్యం.

2. ద్రౌపది ఉపన్యాసంలో తిక్కన చేసిన వర్ణనగా నిలిచిన పద్యం ఇది ఒక్కటే. మిగిలినవన్నీ ద్రౌపదీ సంభాషణలే. ఈ పద్యం నాటకీయతలోని ఆంగిక, ఆహార్య, సాత్త్వికాభినయాల సంపుటి. అందువలన అభినయం రీత్యా ఒక ప్రత్యేక స్థానం దీనికి ఉన్నది. తెలుగు సాహిత్యంలోని మంచి పద్యాలలో ఇది ఒకటిగా ఆంధ్రులు భావిస్తారు.

3. ద్రౌపది కురుసభలో పొందిన అవమానానికి ప్రత్యక్ష ఉద్దీపన విభావం ఆమె దీర్ఘ శిరోజవేణి. ఆమె శిరోజాలు అవభృథస్నానపూతమైనవి. అవి దుశ్శాసనుడి కరస్పర్శతో అపవిత్రమయ్యాయి. ఆ అవమానానికి తగిన ప్రతీకారంకొరకు ఆమెహృదయంలో పగ అనే చిచ్చు మండుతున్నది. ఆ అగ్నినుండి రేగిన పొగలా అన్నట్లున్నాయి ఆమె శిరోజాలు. అంతేకాదు. అవి కౌరవులను కాటందాలని బుసలు కొట్టుతున్న కాలమహాభుజంగమా అన్నట్లున్నాయి. కౌరవ నాశాన్ని కోరే ప్రతీకార వాంఛకు ప్రతీక ఆమె శిరోజ మంజరి.

4. ఇందులోని ఉత్ప్రేక్షాలంకారం సార్థకం. ఉపమాన ధర్మసంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా భావించటం (లేదా ఊహించటం) ఉత్ప్రేక్ష. ఇందులో ద్రౌపది శిరోజవేణి ఉపమేయం. అది 'అసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో' అన్నట్లు ఇందులో భావింపబడుతున్నది. అలంకారం సార్థకం కావటంతో అలంకారౌచిత్యం ఏర్పడింది. అలంకార స్వభావంతో భావికథార్థ ధ్వని ప్రతీయమానం ఔతున్నది.

5. పాండవ యుద్ధనీతిలో కీలకస్థానం వహించవలసిన అంశం ద్రౌపది జడ. అది అపవిత్రమైనది. పవిత్రం కావాలంటే మార్గమేమిటి? ఆలోచించండని సూచిస్తున్నది. అక్కడ ఆమె ప్రదర్శించిన అభినయం ఆమె భావాలకు ఆంగిక వ్యాఖ్యానం. ఆమె శిరోజాలను తన కుడిచేతిమీద ఉంచింది. శ్రీకృష్ణుడు తోబుట్టువు కాబట్టి కుడిచేతిమీద ఉంచి భారమంతా ఆయనమీద ఉండునట్లు చేసింది. ముడి విప్పటంలో ఆత్రుత ప్రకటించింది. మాటలు వెలువడటానికి ముందే మనోవేదన వెలికి తీసికొని వస్తున్నది. తన శిరోజాల విషయంలో తనకు ఊరట కలిగించే ఉపాయం ఎవ్వరూ ఊహించక పోవటంతో విషాదం మొదట తలయెత్తింది. తనంతట తాను ఆ విషయం శ్రీకృష్ణాదులకు జ్ఞాపకం చేయవలసి వచ్చినందుకు రోషం పొంగివచ్చింది. ఆ అవమాన వేదన స్మరణ చేత దుఃఖం పెల్లుబికి కన్నీళ్ళు క్రమ్మాయి. ఇక ఆలస్యం పనికి రాదని పగ వగను వెనకకు త్రోసి

తానే ముందుకు వచ్చింది. దానితో ఆమె దిగ్గున లేచింది. అదుపులో పెట్టుకొనలేని దుఃఖం ఆర్తిగా మారింది. గుండెలో కరడు గట్టిన వేదన మాటలతో బైటపడాలంటే అంతవరకూ అడ్డుగా నిలిచిన దుఃఖం ఆర్తిగా మారి త్రోవ ఇవ్వాలి. లోతైన అభినయ రహస్యాలను ద్రౌపది పాత్రయందు సంగ్రహ సుందరంగా వర్ణించి తిక్కన రసాభ్యుదయ శిల్పాన్ని ప్రదర్శించాడు.

6. ఏడుస్తూ ద్రౌపది శిరోజాలను శ్రీకృష్ణుడి ముందు ఉంచటం ఈ నాటకీయతలోని పరాకాష్ఠ. తీరని సమస్యను దేవుడి ముందుంచి వేడుకొన్న స్ఫూర్తి ఇందులో ఉన్నది. ఎదుట లేని శ్రీకృష్ణుడిని అప్పుడు తలచింది. ఎదుట నున్న మాధవుడి ముందు ఇప్పుడు తన గోడు వినిపించింది. అప్పు డాదుకొన్నాడు కృష్ణుడు. ఇప్పుడూ ఆదుకోక తప్పదు.

7. ఈ పద్యానికి మూల మిట్లున్నది -

"ఇత్యుక్త్వా మృదుసంహారం వృజినాగ్రం సుదర్శనమ్,
సునీల మసితాపాఙ్గీ సర్వగంధాధివాసితమ్ ॥
సర్వలక్షణసంపన్నం మహాభుజగవర్చసమ్,
కేశపక్షం వరారోహా గృహ్య వామేన పాణినా ॥
పద్మాక్షీ పుణ్డరీకాక్ష ముపేత్య గజగామినీ,
అశ్రుపూర్ణేక్షణా కృష్ణా కృష్ణం వచనమబ్రవీత్ ॥ (సం. 5.80.33-35)

మూలంలో ద్రౌపది 'వామేన పాణినా' అని జడను ఎడమచేత పట్టినట్లున్నది. తిక్కన 'వలచేత' అని కుడిచేతికి మార్చాడు. మూలంలో 'అశ్రుపూర్ణేక్షణా' అని ఉండగా తెలుగు 'విషాదరోషముల్ గావఁగలేక' అని ఉన్నది. విషాదరోషాలను ఆపుకొనలేకపోతే బాష్పాలు క్రమ్మటం తప్పదు. (సంపా.)

వ. గోవిందు ముందటంబెట్టి యిట్లనియె : 115

తాత్పర్యం: కృష్ణుడి ఎదుట తలవెండ్రుకలను పారబట్టి ఇట్లా అన్నది :

క. 'ఇవి దుస్ససేను వ్రేళ్ళం। దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి; కౌ
రవుల కడఁ దీఱుమాటల। యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్. 116

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ఇవి= ఈ వెండ్రుకలు, దుస్ససేను వ్రేళ్ళన్+తవిలి= దుశ్శాసనుడి వ్రేళ్ళలో చిక్కుకొని; సగము= అర్ధభాగం; త్రెవ్విపోయి= తెగిపోయి; తక్కిన+అవి= మిగిలినట్టివి; కౌరవులకడన్= దుర్యోధనాదుల దగ్గర; తీఱుమాటల+ అవసరమునన్= సంధి వచనములాడే సందర్భంలో; వీనిన్= ఈ శిరోజాలను; తలఁపన్+వలయున్= నీవు యోచించవలెను.

తాత్పర్యం: 'కృష్ణా! ఈ శిరోజాలు దుశ్శాసనుడు నన్ను బలాత్కారంగా సభకీడ్చి తెచ్చేవేళ అతడి చేతివ్రేళ్ళలో చిక్కుకొని సగం తెగిపోగా మిగిలినవి. నీవు కౌరవుల దగ్గర సంధి వచనములాడే సందర్భంలో వీటిని జ్ఞప్తిలో ఉంచుకొనాలి.

విశేషం: 1. 114వ పద్యంలో ద్రౌపది మనస్సులో పొంగిన భావాలలో విషాదం మొదటిది. దానికి సంబంధించిన వాచికాభినయం ఇది. ఇందులో వాడిన పదాలు దీప్తరసత్వాన్ని వ్యంజింపజేస్తూ కాంతిగుణంతో రాజిల్లుతున్నాయి.

2. దీనికిమూలం :

'అయం తే పుణ్డరీకాక్ష దుశ్శాసనకరోద్ధృతః
స్మర్తవ్యః సర్వకార్యేషు పరేషాం సంధిమిచ్ఛతా॥" (సం. 5.80.36) అని మాత్రమే ఉండగా, తెలుగున తిక్కన -

'ఇవి దుస్ససేను వేళ్ళం, దవిలి సగము త్రెవ్విపోయి దక్కినయవి'' - అనటం వినటానికీ చూడటానికీ మరింత బాధాకరం. (సంపా.)

సీ. **ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యాచేయి । దొలుతగాఁ బోరిలో దుస్ససేను**
తను వింత లింతలు దునియలై చెదరి రూ । పఱియున్నఁ గని యుడుకాఱుఁగాక!
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది; । పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ । మను నొక విల్లెప్పుడును వహించు

ఆ. **కట్టి విక్రమంబు గాల్పనే? యిట్లు బ । న్నములు వడిన ధర్మనందనుండు**
నేను రాజరాజు పీనుంగుఁ గన్నారఁ । గానఁ బడయమైతిమేనిఁ గృష్ణ! **117**

ప్రతిపదార్థం: కృష్ణ!= శ్రీకృష్ణా!; పోరిలోన్= యుద్ధములో; తొలుతగాన్= ప్రప్రథమంగా; ఈ వెండ్రుకలు+పట్టి= ఈ శిరోజాలను ఒడిసిపట్టి; ఈడ్చిన= లాగిన; ఆ చేయి= ఆ దుశ్శాసనుడి హస్తము; దుస్ససేను తనువు= దుశ్శాసనుడి శరీరం; ఇంతలు+ఇంతలు+తునియలు+ఐ= ఇంతింత ముక్కలై; చెదరి= చెల్లా చెదరై; రూపు+అఱి+ఉన్నన్= రూపు చెడియుండగా; కని= చూచి; ఉడుకు+ఆఱున్+కాక= నామనస్తాపం చల్లారునుగాని; అలుపాలన్= స్వల్పకార్యాలతో; ఇది; పొనుపడునట్టి చిచ్చే?= అణగారే అగ్నియా?; ఇట్లు= ఈ విధంగా; బన్నములు+పడిన= భంగపాటులొందిన; ధర్మనందనుండున్= ధర్మజుడూ; నేనున్= నేనున్నూ; రాజరాజు పీనుంగున్= దుర్యోధనుడి శవమును; కన్నారన్+కానన్+పడయము+ఐతిమి+ఏనిన్= కనులార చూచే భాగ్యానికి నోచనిచో; పెనుగద+పట్టిన= పెద్ద గదను ధరించిన; భీమసేను బాహుబలంబును= వాయునందనుని భుజశక్తీ; పాటించి= ఆదరించి; గాండీవము+అను+ఒక విల్లు= గాండీవం అనెడు ఒక చాపమును; ఎప్పుడున్= ఎల్లవేళల; వహించు= తాల్చు; కట్టివిక్రమంబు= అర్జునుడి పరాక్రమమూ; కాల్పనే?= తగుల బెట్టటానికా?

తాత్పర్యం: యుద్ధంలో ప్రప్రథమంగా నా తలవెంట్రుకలను పట్టి సభలోని కీడ్చి తెచ్చిన ఆ దుశ్శాసనుడి హస్తం, అతని దేహం ఇంతింత ముక్కలై చెల్లాచెదరుగా నేలబడి రూపు మాసిఉండగా చూచినప్పుడే నా మనస్తాపం చల్లారగలదు. అల్పకార్యాలతో చల్లారే అగ్ని కాదిది. ఆ విధంగా పరిభవముల పాలైన ధర్మనందనుడూ, నేనూ దుర్యోధనుడి శవాన్ని కనులార చూడటానికి నోచుకొనకపోతే, కొండంత గదను మూపున వేసికొని తిరిగే భీమసేనుడి భుజబలమూ, ఆదరంతో గాండీవమనే పేరుగల దొడ్డ వింటిని ధరించే పాండవమధ్యముడి శౌర్యమూ తగులబెట్టనా?

విశేషం: 1. ఈ పద్యంలో ఉన్న సొగసు మూలంలో లేదు. దుశ్శాసనుడి శరీరమంతటిలోను, ప్రప్రథమంగా తన వెండ్రుకలు పట్టి యీడ్చిన ఆ చేయి రూపఱవలెనట. ద్రౌపదికాతని చేయి యన్న అంతటి ప్రత్యేకమైన కోపము! 'తొలుతగా' అను పదం చాల ముఖ్యమైనది. ఇది మూలంలో లేదు. 'దుశ్శాసన భుజం శ్యామం సంభిన్నం పాంసుగుణ్ఠితమ్' అని మాత్రమే ఉన్నది. ఆతని తను వింత వింతలు దునియలై చెదరవలయు ననుట మూలంలో లేనే లేదు. పెచ్చరిల్లిన అచ్చమైన ఆమె కోపం అచ్చ తెనుగు పదములలో ప్రదర్శింపబడటం మెచ్చదగినది. ఏడ్చుచున్న ద్రౌపదిని పఠితల కన్నుల యెదుట సాక్షాత్కరింప జేసినాడు తిక్కన. ఆతడి నాటకీయ రచనలో, పాత్రల ప్రత్యక్షీకరణ మొక అంశం. 'పెనుగద పట్టిన భీమసేను ----- కట్టి విక్రమంబు గాల్పనే' --- అనే మాటలు మూలంలో లేవు. "ఇత్యుక్త్వా బాష్పరుద్ధేన కణ్ఠే నాయతలోచనా, రురోద కృష్ణా సోత్కమ్పం సస్వరం బాష్పగద్గదమ్, స్తనౌ పీనాయతశ్రోణీ, సహితా వధివర్షతీ'' - అనేది తెలుగులో లేదు.

2. 114వ పద్యంలోని ద్రౌపది రోషభావానికి అనుగుణమైన వాక్యాలివి. దుశ్శాసన దుర్యోధనులపై ఆమె కెంత కసి కడుపులో మండుతున్నదో ఈ దీర్ఘమైన సీసపద్యం సాక్ష్యంగా తిక్కన చిత్రించాడు. శత్రుసంహారమే ఆమె కడుపు మంటకు చల్లార్పు.

ఆ ఉపశమనం చేయలేనప్పుడు 'భరించేవాళ్ళు భర్తలం' అని చెప్పుకొనే వారిలో బలవంతులమనుకొనే భీముడిగదా, అర్జునుడి గాండీవం తగుల బెట్టనా? అని నిష్ఠురమాడింది. ధర్మజుడి మాటలకు తల ఊపుతున్న వారిద్దరిమీద నిప్పులు కురిపించింది. ఈ పద్యం ఆమెలోని ప్రతీకారాగ్ని జ్వాలల భుగభుగలను మూర్తికట్టించింది. (సంపా.)

ఉ. నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కెస తాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము దీనికి నాఱు టెన్నఁడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తోఁ
బుట్టువు తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!' 118

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీహరీ!; దుష్ట నిగ్రహము పూని= దుర్మార్గులను శిక్షించటానికి పూనిక వహించి; జగంబులు= లోకాలు; కాచునట్టి= కాపాడే; తోఁబుట్టువు= అన్నవైన నీవూ; తీవ్ర తేజమునన్= మిక్కిలి ప్రతాపంతో; పొల్చిన భర్తలున్= ఒప్పుతున్న పతులూ; కల్గన్= నాకుండగా; నెట్టన= అనివార్యంగా; ఇట్టి+అల్కన్= ఇటువంటి క్రోధాన్ని; చిచ్చు+ఒడిన్+కట్టిన+ అట్లు= నిప్పును ఒడిలో ఉంచుకొన్నట్లు; పెద్దయును+కాలము= బహుకాలం; రక్కెస తాల్మిన్= దుస్సహమైన ఓర్పుతో; మదిన్+నిల్పితిన్= మనసులో భరించాను; దీనికిన్= ఈ అవమానాగ్నికి; ఆఱుట= శమించటం; ఎన్నఁడున్ పుట్టదు= ఏనాడూ కలుగదు.

తాత్పర్యం: దుష్టులను శిక్షించటానికి లోకాలను రక్షించటానికి పూనుకొనిఉన్న నీవంటి తోడబుట్టువూ, మిక్కుటమైన పరాక్రమంతో దీపించే భర్తలు కలిగి కూడా నేను ఇంతటి పరాభవ జనిత క్రోధాగ్నిని, నిప్పును ఒడిలో నుంచుకొన్న చందాన రాక్షస సహనంతో భరిస్తున్నాను. ఈ పరిభవానలం శమించటం ఏనాడూ కలుగదు.

విశేషం: అలం: ఉపమ, హేతువు.

1. కోపాన్ని చిచ్చుతో పోల్చటం విశిష్టం. పదమూడేళ్ళుగా కోపాన్ని గుండెల్లో దాచింది ద్రౌపది. అది చిచ్చును ఒడిలో మూటకట్టి పెట్టుకొన్నట్లున్నదట! ఒడిలోని చిచ్చు ఒడలెల్ల కాలుస్తుంది. గుండెలోని చిచ్చు అంతరంగాన్నే దహిస్తుంది. అయినా 'రక్కెసతాల్మి'తో ఆమె సహించింది. 'రాక్షసమైన ఓర్పు' అనే అర్థాన్నిచ్చే తెలుగు పలుకుబడి రక్కెసతాల్మి. అల్క, చిచ్చు ఒడి, రక్కెస తాల్మి అనే తెలుగు మాటలు ఇక్కడ సార్థకాలు. గుండెలు కాల్చే భావచిత్రం చిచ్చు అనే పదంతోనే ఏర్పడుతుంది. అట్లాగే మిగతావి కూడా. ఉపమానం ఉజ్జ్వలం.

2. ఆమె గుండెలోని చిచ్చు - తోబుట్టువు. భర్తలూ అండగా ఉన్నా, ఆరేటట్లు కనపడటం లేదని ఆమె వేదన. అన్న దుష్టశిక్షణ, శిష్టరక్షణ వ్రతంతో అవతరించిన మహాత్ముడు. ఎదురు లేని పరాక్రమం కలవారు పాండవులు. అయినా ఆమె వేదన ఆరదు - అని హేత్వలంకారంలో పలికింది. హేతువునూ హేతుమంతాన్నీ ఒకే వాక్యంలో వర్ణించటం హేత్వలంకారం. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట (సం. 5-80-43)

వ. అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్తచిత్తుండయి నారాయణుం డూరార్చి కూర్చుండ నియమించి కన్నీరు దుడువను బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి య మ్మానినితో నిట్లనియె: 119

ప్రతిపదార్థం: అనుచున్= అని; ఎలుంగు రాలుపడన్= కంఠధ్వని కంపించగా; ఏడ్చిన= విలపించిన; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; కృపా+ఆయత్తచిత్తుండు+అయి= దయకు అధీనమైన మనస్సుకలవాడై; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఊరార్చి= ఓదార్చి;

కూర్చుండన్+నియమించి= కూర్చుండుమని తెలిపి; కన్నీరు తుడువను= కన్నీరు తుడవటానికీ; పెన్నెఱి వేణి ముడువను= అందమైన పెద్ద కొప్పును ముడివేయటానికీ; తగువారిన్= తగిన స్త్రీలను; నియోగించి= నియమించి; ఆ+మానినితోన్= ఆత్మాభిమానం కల్గిన ఆ ద్రౌపదితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా కంఠస్వరం కంపిస్తుండగా పాంచాలి విలపించింది. శ్రీకృష్ణుడు ఆమెను ఊరడించి కూర్చుండుమని చెప్పి ఆమె కన్నీటి నొత్తడానికి, చెదరిన చక్కని పెద్ద కొప్పును ముడవటానికి తగినవారిని నియమించి, ఆ మానవతితో ఇట్లా అన్నాడు:

విశేషం: తిక్కన అభినయ క్రమాన్ని శిల్పమయం చేశాడు. ద్రౌపది 100వ పద్యంలో గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం ప్రారంభించింది. 114వ పద్యంలో మనస్సులో విషాదరోషాలు పొంగగా కళ్ళలో నీళ్ళు నిండగా దిగ్గన లేచి దుఃఖించింది. ఈ పద్యంలో కంఠస్వరం కంపించగా ఏడ్చింది (బావురుమన్నది). అది పరాకాష్ఠ బావురుమని విలపించటంతో ఆమె మాట లయిపోయినవని సూచన. అంతవరకు మధ్యలో ఆమెతో మాట్లాడకుండా ఉండటం మాధవుడి మనోవిజ్ఞానశాస్త్రపాండిత్యం. (సంపా.)

ఉ. 'మ్రుచ్చిర నేల యేఁ గలుగ? ముద్దియ! నాకు వృకోదరుండు వి
వ్వచ్చుఁడుఁ దోడుగాఁగ జనవంద్యుఁడు ధర్మసుతుండు పంప నీ
మెచ్చుగ శత్రు సంక్షయము మేకొని చేసెదఁగాక! వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు కౌరవు లుర్వి యిత్తురే? 120

ప్రతిపదార్థం: ముద్దియ!= ఓ ముద్దరాలా! ద్రౌపదీ; ఏన్+కలుగన్= నేనుండగా; మ్రుచ్చిరన్+ఏల= శోకించుటెందుకు?; నాకున్= నాకు; వృకోదరుండున్= భీముడూ; వివ్వచ్చుఁడున్= సవ్యసాచి; తోడు కాఁగన్= సహాయులు కాగా; జనవంద్యుఁడు= జనులచేత నమస్కరించదగిన; ధర్మసుతుండు= ధర్మరాజు; పంపన్= ఆజ్ఞాపించగా, నీ మెచ్చుగన్= నీకు ప్రీతి కలిగేటట్లు; మేకొని= సమ్మతించి; శత్రు సంక్షయమున్= శాత్రవ నిర్మూలనం; చేసెదన్+కాక!= చేస్తాను సుమా!; వేఱు+ఒకండు= మరొకదారి; అచ్చుపడంగన్+నేర్చునె?= అలవడటానికి వీలుందా? (వీలులేదు); దురాత్ములు= దుష్టచిత్తులైన; కౌరవులు= ధార్తరాష్ట్రులు; ఉర్విన్+ఇత్తురే?= భూమిని పంచి మనకిస్తారా?

తాత్పర్యం: పాంచాలీ! నేనుండగా ఎందుకు శోకిస్తావు? నాకు భీమార్జునులు సాయపడగా, జనవినుతుడైన ధర్మజుడు ఆజ్ఞాపించగా, నీవు సంతోషించేటట్లు శాత్రవులను నిర్మూలిస్తాను. మరొక మార్గం లేదు. దుష్టచిత్తులైన కౌరవులు భూమిని పంచి మన కిస్తారా? (ఇవ్వరని భావం).

విశేషం: 1. ద్రౌపది 'అచ్యుతా' అని (పద్యం 118) ఎలుగెత్తి పిలిచింది. ఆ పిలుస్తున్నప్పుడు ఆమె కంఠధ్వని కంపించింది (ప.119). ఆ పిలుపు 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ!' అన్న భక్తుడి పిలుపువలె ఉన్నది. గజేంద్రుడి కేకవలె తోచింది. 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్'- అని ప్రతిజ్ఞచేసిన శ్రీకృష్ణుడిలోని భగవదంశ ప్రబుద్ధమయింది. దివ్యాదివ్యుడివలె వెలుగొందే ఆ వాసుదేవుడు కృపాయత్తచిత్తుడయ్యాడు. ఆ స్థితిలో ఆయన సాక్షాత్ 'నారాయణుడు'గా వెలుగొందాడు. అతడి మాటలు భక్తరక్షణ కళాప్రావీణ్యంతో ప్రతిధ్వనించాయి. ఈ పద్యం ఆ ప్రతిధ్వనులలో మొదటిది.

2. ఇందులోని ప్రతి వాక్యం సార్థకం. పదాల పొందిక కూడా సాభిప్రాయం. అనునయించటం కూడా ఒక కళగా తెలిసిన మహానుభావుడు శ్రీకృష్ణుడు. 'ఏడుస్తావెందుకమ్మా నేనుండగా పిచ్చితల్లీ?' అన్న వ్యవహార వాక్యానికి మొదటి వాక్యం పద్యాకృతి. ముందు దుఃఖాన్ని విడువుమన్నాడు. నే నున్నానని నమ్ముమన్నాడు. ఆ నమ్మిక దుఃఖాన్ని తొలగిస్తుందన్నాడు. నన్ను నమ్మికూడా, నన్నడిగి కూడా ఇంకా ఎందుకు దుఃఖిస్తావు? నీ భక్తి నా మనస్సు కెక్కింది. నే నెప్పుడూ నీకు ప్రసన్నుడనే. ఈ సంగతి తెలిసి కూడా దుఃఖించే నీవు ఎంత అమాయకురాలవు! - అనే భావం ఏర్పడే ఆ మాటలు తీవ్ర దుఃఖాన్ని తగ్గిస్తాయి. తన మాట విని ఆదుకొనే దేవుడివంటి అన్న ఉన్నాడన్న ధైర్యం ఏర్పడుతుంది. మొదటి వాక్యమే కాదు అందులోని పదాల వరస కూడా మార్చటానికి వీలు పడనివి కావటం విశేషం.

3. యుద్ధంలో శ్రీకృష్ణుడు ద్రౌపది మెచ్చేటట్లు శత్రువులను సంహరిస్తాడట! పాండవులు తన దుఃఖాన్ని తీర్చలేదని శ్రీకృష్ణుడిని వేడుకొంటున్న ద్రౌపదిని ఊరట పరచే వాక్యమిది. యుద్ధం చేస్తాననీ, ఆ చేయటం నీకు పూర్తిగా సంతోషం, తృప్తీ కలిగించటానికే అనీ అనటంతో ద్రౌపదికి హామీ దొరికింది. ఆమె నిశ్చింతురాలు కాగలిగింది ఆ వాక్యంతో. అయితే ఆ వాక్యంలో అనుబంధాలు రెండున్నాయి. 1. భీమార్జునులు తోడుపడతారట. 117వ పద్యంలో 'భీమసేను బాహుబలంబును, నొక విల్లెప్పుడును వహించు కవ్వడి విక్రమంబు కాల్పనే?' అని అధిక్షేపించిన దానికి ఇది పరోక్ష సమాధానం. యుద్ధంలో శ్రీకృష్ణుడికి భీమార్జునులు అండగా నిలిచి ద్రౌపది ఆశలను చిగురింప చేస్తారని ధ్వని. ఆ తరువాత 'జనవంద్యుడు ధర్మసుతుడు ఆజ్ఞాపించగా' అనటం సాభిప్రాయం. ద్రౌపది కోపమంతా ధర్మజుడి మాటల మీదనే. అతడు సంధి మాటలు మాట్లాడినందుకే. సంధి కోరే ధర్మరాజే సమరాన్ని చేయండని ఆజ్ఞాపిస్తాడనీ, అతడి ఆజ్ఞతోనే యుద్ధం సాగుతుందనీ చెప్పి ద్రౌపది మనోవేదనకు మూలమైన అనుమానాన్ని తొలగించాడు. పరిస్థితులను అట్లా మార్చే బాధ్యత శ్రీకృష్ణుడు స్వీకరించాడు.

4. 'మరొకం డచ్చు వడంగ నేర్చునె?' అనే వాక్యం జరుగబోయే శత్రుసంహారాన్ని ధ్రువీకరించే వాక్యం. దానివలన విశ్వాసం గట్టిపడుతుంది. దుఃఖం ఉపశమిస్తుంది.

5. రాయబారం జరిగినా దురాత్ములు రాజ్యభాగ మివ్వరని - చివర చెప్పిన వాక్యం కొసమెరుపు. 112వ పద్యంలో ద్రౌపది లేవనెత్తిన కీలకమైన ప్రశ్నకు కీలెరిగి చెప్పిన సమాధానం, సంధి ఫలవంతం కాదని సూచన. ద్రౌపది దిగులుపడవలసిన దేమీ లేదని భావం. భావి కథంతా ద్రౌపదిని సంతోషపెట్టటానికే సాగుతుందనీ, దానినంతా శ్రీకృష్ణుడే సూత్రధారుడై నడుపుతాడనీ, నమ్మకం కలిగి ఉండుమనీ శ్రీకృష్ణుడు ద్రౌపదికి అభయహస్తం ఇచ్చాడు.

6. పాండవుల వలెనే పాండవపత్ని కూడా శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించే సంస్కృతినీ, భక్తజనావన బిరుదాంకితుడైన నారాయణుడి స్వభావాన్ని ప్రకటిస్తున్న అవతార పురుషుడని భావించే సంస్కృతీ ఈ పద్యంలో బింబ ప్రతిబింబభావంతో ప్రకటితం కావటం వస్తుధ్వని. (సంపా.)

క. లలనా! యుడుగుము నీ యే । డ్పుల కొలఁదియె కురునృపాల పుత్త్ర కళత్రం
బుల యేడ్పు; లింక వానిం । గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్. 121

ప్రతిపదార్థం: లలనా!= ఓ వనితా, ద్రౌపదీ; ఉడుగుము= దుఃఖించటం మానుము; కురునృపాల పుత్త్ర కళత్రంబుల+ఏడ్పులు= కురురాజయిన ధృతరాష్ట్రుని కొడుకుల భార్యల యొక్క రోదనములు; నీ+ఏడ్పుల కొలఁదియె= నీ యేడ్పుల పరిమాణం కలవే; ఇంకన్= ఇక; వానిన్= వారి శోకాలను; కలకలనవ్వుచున్= నీవు పకపక నవ్వుతూ; వినంగన్= వినటానికి; కాలంబు+అయ్యెన్= సమయం వచ్చింది.

తాత్పర్యం: అమ్మా! దుఃఖం మాను. నీ వెంత విలపించావో దుర్యోధనాదుల భార్యలుగూడ అంత విలపిస్తారు. వారి యేడ్పులు నీవు పకపక నవ్వుతూ వినే సమయం సమీపించింది.

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనా ననురూపయోః". అననురూపాలైన వాటికి సంబంధాన్ని వర్ణించటం విషమాలంకారం. కౌరవుల భార్యల విలాపాలకూ ద్రౌపది కలకలనవ్వటానికీ ఇందులో సంబంధం చెప్పబడింది కావున విషమం.

2. అనునయంలో పాటించే మెలకువలకు శ్రీకృష్ణుడు పెట్టింది పేరు. ద్రౌపదికి దుఃఖాన్ని కలిగించింది కౌరవులు. వారి భార్యాపుత్రులు ఆమెవలె దుఃఖిస్తే ఆమెకు ఉపశాంతి. పరదుఃఖం ఉపశమనమే కాదు ఉల్లాసం కూడా కలిగిస్తుందన్న మానసిక సూత్రం తెలిసిన విజ్ఞుడు శ్రీకృష్ణుడు. అందుకు విషమాలంకారం అర్థవంతంగా ఉంటుందని తిక్కన తీర్పు. (సంపా.)

క. యమ మహిష ఘంటికా నా । దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములు గల కౌరవుల కి । ష్టము లగునే సంధికార్య శాంతవచనముల్? 122

ప్రతిపదార్థం: యమ మహిష ఘంటికా నాదమున్= యముడి వాహనమైన దున్నపోతు యొక్క మెడగంటల చప్పుడును; వినన్= వినటానికి; కౌతూహలంబు= ఉబలాటము; తళుకొత్తెడు= అతిశయిస్తున్న; చిత్తములుకల= మనస్సులు కల్గిన; కౌరవులకున్= ధార్తరాష్ట్రులకు; సంధికార్య శాంతవచనముల్= సంధికి సంబంధించిన శాంతంతోడి మాటలు; ఇష్టములు+అగునే?= సమ్మతాలౌతాయా? (కానేరవు.)

తాత్పర్యం: అమ్మా! యముని దున్నపోతు మెడలోని గంటల సవ్వడి వినటానికి మిక్కిలి ఉబలాటపడుతున్న కౌరవులకు సంధికి సంబంధించిన సౌమ్య వాక్యాలు సమ్మతాలు కావు.

విశేషం: అలం: అప్రస్తుతప్రశంస. మహిషం యముడి వాహనం. యము డా వాహనాన్ని ఎక్కి వడివడిగా వస్తున్నప్పుడు దాని మెడలోని లోహఘంటలు మ్రోగుతాయి. అవి వినబడితే మరణం ఆసన్నమైనదని ధ్వని. మరణాన్ని మనసారా కోరుకొంటున్న కౌరవులకు బ్రతకటానికి వీలున్న సంధి వాక్యాలు రుచించవనటం- వారికి త్వరలో మరణం తథ్యమని ధ్వని. నిజానికి శ్రీకృష్ణుడు హస్తినకు పోవటానికీ, యమ మహిష ఘంటానాదం వినబడటానికీ ఉన్న సాజాత్యాన్ని ఊహిస్తే ఆలోచనామృతం. (సంపా.)

క. మొదల విధినియతియును న । ట్టిద యందురు పెద్ద; లది ఘటింపకపో దే
మదిఁ జూచి చెప్పినను ద । ప్పదు మేరువు దిరిగెనేనిఁ బాంచాలసుతా! 123

ప్రతిపదార్థం: పాంచాల సుతా!= పాంచాల రాజపుత్రీ!; పెద్దలు= తెలిసినవారు; మొదలన్= తొలుతనే; విధి నియతియును= విధి నిర్ణయం కూడా; అట్టిది+అ+అందురు= కురుపాండవులకు పొత్తు కుదరదనీ కౌరవులకు చావు మూడిందనే చెపుతారు; అది ఘటింపక పోదు= అలా జరగకుండాపోదు; ఏన్= నేను; మదిన్+చూచి= బుద్ధిలో ఊహించి; చెప్పినను= వాకొన్నచో; మేరువు తిరిగెను+ఏనిన్= మేరు పర్వతం తల్లక్రిందైనను; తప్పదు= నా వచనం వ్యర్థంగాదు.

తాత్పర్యం: అసలు దైవ నిర్ణయ మిదే అని పెద్దలు చెపుతున్నారు. ఇంతకు అదే జరుగుతుంది. నేను బుద్ధిలో ఊహించి చెప్పిన మాట మేరు పర్వతం తలక్రిందైనను తప్పదు సుమా!

విశేషం: అలం: అతిశయోక్తి. శ్రీకృష్ణుడే కాలపురుషుడని ధ్వనింపజేసే పద్యం ఇది. ఆతడి దివ్యాదివ్య స్వభావం మాటలలో వ్యంగ్యం. పెద్దలంటున్నారన్నప్పుడు అదివ్యుడు. నేను మదిఁ జూచి చెప్పెదను అన్నప్పుడు దివ్యుడు. మేరుపర్వతం తలక్రిందైనా

నామాట తప్పదంటున్న శ్రీకృష్ణుడు విధిస్వరూపుడు. భక్తప్రసన్నుడైన భగవంతుడు దివ్యరూపంతో మాట్లాడుతున్న అనుభూతి నందించే పద్య మిది. (సంపా.)

తే. పూని పలికెద వినుము రిపు క్షయంబుఁ । జేసి యుజ్జ్వల పుణ్యలక్ష్మీ సమేతు
లైన పాండు కుమారుల యధిక విభవ । మీవు సూచెదు; తడవులేదు; దిది నిజంబు! 124

ప్రతిపదార్థం: పూని పలికెదన్= నొక్కి చెపుతున్నాను; వినుము= నా మాటలు వినుము; రిపుక్షయంబున్+చేసి= విరోధులను నాశముచేసి; ఉజ్జ్వల పుణ్యలక్ష్మీసమేతులు= ప్రకాశించే పుణ్యమనెడు సంపదతో కూడినట్టి; పాండు కుమారుల= పాండవుల యొక్క; అధిక విభవము= గొప్ప ప్రాభవము; ఈవు= నీవు; చూచెదు(వు)= చూడగలవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; ఇది నిజంబు= నా మాట సత్యం.

తాత్పర్యం: ద్రుపదపుత్రీ! శపథం చేసి చెపుతున్నాను. నా పలుకు లాలకించుము. విరోధులను విధ్వంసం చేసి, ప్రకాశమానమైన పుణ్యసమృద్ధితో కూడిన పాండురాజ తనయుల యొక్క మిక్కుటమైన వైభవాన్ని నీవు దర్శించగలవు. ఇందుకు అట్టే ఆలస్యం లేదు. నా మాట నిజం.'

విశేషం: ఈ మాటలు విశ్వరూప ప్రదర్శనం చేస్తూ పరమాత్ముడు పలుకుతున్న అద్భుత వాతావరణం స్ఫురింపజేస్తున్నవి. శ్రీకృష్ణుడి వాక్కు భగవన్నిర్ణయమని స్పష్టమవుతుంది. ఊరడింపు కిది పరాకాష్ఠ. ద్రౌపది హృదయతాపం చల్లారింది అని ధ్వని. (సంపా.)

క. అని యూఱడిలఁగఁ బలికిన । విని యంకిలి దేఱు చిత్తవృత్తిగలుగు నం
గన యే డ్పుడిగెం; దగ ఫ । ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్. 125

ప్రతిపదార్థం: అని+ఊఱడిలఁగన్= అంటూ ఊఱడిల్లేటట్లు; పలికినన్= శ్రీకృష్ణుడు చెప్పగా; విని; అంకిలి తేఱు+చిత్తవృత్తి కలుగు= కలతనుండి ప్రసన్నత కాంచిన మనోవ్యాపారంగల; అంగన= ద్రౌపది; ఏడ్పు+ఉడిగెన్= విలపించటం మానింది; తగన్= ఒప్పుగా; ఫల్గునుఁడు= అర్జునుడు; అపుడు= ఆ సమయాన; గోవిందునితోన్= గోపాలదేవుడితో; ఇట్లు+అని పలికెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: జనార్దను డిట్లా ద్రౌపదిని సాంత్వనవచనాలతో ఊరడించాడు. ఆమె కలత వీడి ప్రసన్నత నొందిన మనసుగలదై యేడ్పు మానింది. పిదప పార్థుడు గోపాలకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. 'పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక । నేత్ర ! చుట్టరికంబున నీకు నొక్క
రూప; కావునఁ గోరి యేరూపునందు । నుభయపక్షంబులకుఁ జేయు ముచితహితము. 126

ప్రతిపదార్థం: పుండరీక నేత్ర!= తెల్ల దామరల వంటి కన్నులు గల కృష్ణా!; నీకున్= నీకు; చుట్టరికంబునన్= బంధుత్వం చేత; పాండవులున్= పాండుపుత్రులమైన మేము; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుడి కుమారులగు దుర్యోధనాదులు; ఒక్క రూప= ఒకే విధమైనవారం; కావునన్= కనుక; కోరి= వాంఛించి; ఏ రూపు+అందున్= ఎట్లాగయినా; ఉభయ పక్షంబులకున్= రెండు వర్గాలకు ఉచిత హితము+చేయుము= తగిన మేలు చేయుము.

తాత్పర్యం: 'కమల పత్రాక్షా! బంధుత్వమును బట్టి కురుపాండవులు నీకు సమానులే. కనుక ఏ విధంగానైనా ఆసక్తితో ఇరువర్గాలకూ తగిన మేలు గావించు.

విశేషం: 124లో విరోధుల విధ్వంసాన్ని గురించి మాట్లాడిన శ్రీకృష్ణుడు దివ్యత్వస్థాయిలోకి వెళ్ళి మాట్లాడినట్లుండగా, అర్జునుడు అతడిని వాస్తవ స్థితిలోనికి తెచ్చాడు. బంధుత్వం అనే సమాన గుణంతో ఉభయులకూ మేలు చేయుమన్నాడు. (సంపా.)

క. ధర్మార్థ సంగతంబుగ । ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ నా
దుర్మతులు కౌరవులు స । త్కర్మమునకుఁ జొరకయున్న దైవమ యెఱుఁగున్. 127

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ సంగతంబుగన్= ధర్మార్థాలతో కూడేటట్లుగా; ధర్మతనయు చెప్పినట్లు+అ= ధర్మనందనుడు తెల్పినట్లుగా; తగన్= ఒప్పిదముగా; పల్కఁగన్= నీవు కురుసభలో మాట్లాడితే; ఆ దుర్మతులు= ఆ చెడుబుద్ధి కలిగిన; కౌరవులు= దుర్యోధనాదులు; సత్కర్మమునకున్= మంచి పనికి; చొరక+ఉన్నన్= నడుము కట్టనిచో; దైవము+అ+ఎఱుఁగున్= ఆవల దేవుడే పని చక్కబెట్టగలడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మార్థయుక్తంగా ధర్మపుత్రుడు చెప్పినట్లు కౌరవ సభలో చక్కగా హితోక్తులు పలుకవలసింది. దుర్బుద్ధిగల కౌరవులు మంచి చేయటానికీ పూనుకొనకపోతే దైవమున్నాడు. ఆ దేవుడే అన్నీ చక్కబెట్టగలడు.'

విశేషం: శ్రీకృష్ణుడు ధర్మజుడికి ఇచ్చిన మాటను జ్ఞాపకం చేసి, కౌరవసభలో సముచిత విధానంలో వ్యవహరించుమన్నాడు. దైవం మీద భారముంచి ప్రయత్నించటం పురుషకారం. తగిన ఫలాన్ని అందించేది దైవానుకూల్యం. దూతగా శ్రీకృష్ణుడు పురుషకారం చేస్తాడు. దైవంగా ఆయనే ఫలాన్ని అందిస్తాడు - అని అర్జునుడు ధర్మ కర్మ యోగాన్ని ప్రదర్శిస్తూ పలికాడు. నరుడు నారాయణుడికి సన్నిహితుడు కావటంతో ఆ చనువు తీసికొనగలిగాడు. (సంపా.)

క. అన విని 'కౌరవులకు మీ । కును హితముఁ బ్రియంబుఁ జేయఁ గోరియ కుంతీ
తనయాగ్రజుపని ధృతరా । ష్ట్రుని కడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్. 128

ప్రతిపదార్థం: అనన్ విని= అర్జునుడిట్లా పలుకగా ఆలించి; కౌరవులకున్= దుర్యోధనాదులకూ; మీకును= మీకున్నూ; హితమున్= మేలు; ప్రియమున్= స్నేహమునూ; చేయన్+కోరి+అ= చేయటానికి కోరికొనియే; కుంతీ తనయ+అగ్రజుపనిన్= ధర్మనందనుడి పనిమీద; కడున్+ప్రీతిమెయిన్= మిక్కిలి సంతోషంతో; ధృతరాష్ట్రుని కడకున్= ఆంబికేయుని దగ్గరకు; పోయెదన్= వెళ్ళుతాను.

తాత్పర్యం: పార్థుడి పలుకులు విని శ్రీకృష్ణుడు - 'అర్జునా! కౌరవులకూ మీకూ ఇష్టమైనదానిని, మేలుగూర్చే దానినీ చేయవలెనని తలంచి కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మజుడి పనిమీద ధృతరాష్ట్రుడి దగ్గరకు మిక్కిలి సంతోషంతో వెళ్ళుతున్నాను.'

విశేషం: పైకి చూస్తే ద్రౌపదికి తగిన మాటలు ఆమె వద్దా, అర్జునుడికి తగిన మాటలు అతడి వద్దా శ్రీకృష్ణుడు పలికినట్లుంటుంది కాని, శ్రీకృష్ణుడి మాటలలో వైరుధ్యం లేదు. ఎట్లాగంటే - ధర్మజుడి వాక్యాలు యుద్ధానికి పూర్వార్థం; ద్రౌపదికి ఇచ్చిన మాటలు యుద్ధానికి ఉత్తరార్థం. ఆ వరుసలో నిర్వహించే శ్రీకృష్ణుడు కార్యపరమార్థం. (సంపా.)

క. అని పలికిన హరి ధర్మ వ । చనముల తెఱఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి 'యట్ల చేయుము । మన నిశ్చయ మిదియ దీని మఱవకు మనఘా!' 129

ప్రతిపదార్థం: అని పలికిన= ఈ విధంగా వచించిన; హరి= శ్రీకృష్ణుడి యొక్క; ధర్మవచనముల తెఱఁగునకున్= న్యాయంతో కూడిన వాక్యాల పద్ధతికి; అజాతశత్రుఁడు= ధర్మజుడు; చిత్తంబునన్+పొంగి= మనస్సులో ఉబ్బి; అనఘా!= పుణ్యపురుషా!; అట్లు+అ చేయుము= అట్లే కావించుము; ఇది+అ మన నిశ్చయము= ఇదే మనయొక్క నిర్ణయం; దీనిన్= ఈ మాటను; మఱవకుము= మరిచిపోవద్దు.

తాత్పర్యం: త్రివిక్రముడి ధర్మయుక్తమైన మాటల తీరునకు ధర్మరాజు మనసులో పొంగిపోయాడు. 'మహానుభావా! నీ వన్నట్లే చేయవలసింది. మా తలపు కూడ అదే. ఈ విషయం మరచిపోవద్దు.'

విశేషం: ద్రౌపదితో శ్రీకృష్ణుడు మాట్లాడిన తరువాత ధర్మజుడు అడుగవలసిన మాటలు అర్జునుడే అడిగాడు. శ్రీకృష్ణుడు ధర్మజుడి వ్యూహానికి అనుగుణంగా మాట్లాడాడు. దానికి ధర్మజుడు పొంగిపోయాడు. శ్రీకృష్ణుడితో మూడు మాటలన్నాడు. 'అట్లాగే చేయుము; మన నిశ్చయం ఇదే. ఓ పుణ్యాత్మా! దీనిని మరచిపోకుము'. ఈ మూడూ కార్యనిర్ణాయక మంత్రాలు. మొదటివాక్యం అధికారికం. రెండవ వాక్యం నిశ్చయాత్మకం. మూడవ వాక్యం ఔపచారికం. (సంపా.)

వ. అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి 'నీ నక్షత్రంబు రోహిణిగదా యెల్లి రేవతి నీకుఁ జంద్ర తారాబలంబులు గలవు; గమనంబునకు రేపకడయ మేలు; పయనం బగుట లెస్స'యని చెప్పిన నప్పలుకుల కతండు సగౌరవంబుగా నియ్యకొనినం బాండవాగ్రజుండు కొలువుం గలయం గనుంగొని యెల్లవారును విన నది యట్లకాక యని పలికి తదనంతరంబ తానునుం దమ్ములుఁ బాంచాలియుఁ బరివారంబును నుచిత ప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి; మఱునాఁ డరుణోదయంబునఁ గృష్ణుండు గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి సూర్యోపాస్తి సేసి యగ్ని సమారాధనం బాచరించి ధరణిసురులం బ్రణామపూర్వకంబుగాఁ బ్రయాణ దాన ప్రముఖ పూజావిశేషంబులం బ్రీతులం గావించి వారల యిచ్చు నాశీర్వాదంబులును సమంత్రాక్షత దూర్వాంకురాదులునుం గైకొని యుచిత ప్రదేశంబున నుండి సాత్యకి రావించి. 130

ప్రతిపదార్థం: అని= అని ధర్మరాజు పలికి; కార్యంబు నిశ్చయించి= చేయవలసిన పనిని తీర్మానించి; దినశుద్ధి నిరూపించి= మంచి రోజు నిర్ణయించి; నారాయణున్+చూచి= కృష్ణుడిని చూచి; నీ నక్షత్రంబు రోహిణి కదా= నీ జన్మనక్షత్రం రోహిణి కదా; ఎల్లి= రేపు; రేవతి= రేవతీ నక్షత్రము; నీకున్ చంద్ర తారాబలంబులు+కలవు= నీకు చంద్రబలమున్నది. తారా బలమున్నది; గమనంబునకున్= ప్రయాణానికి; రేపకడయ= ఉదయమే; మేలు= మంచిది; పయనంబు+అగుట లెస్స= ప్రయాణమై వెళ్ళటం బాగు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పలుకులకున్= ధర్మజుడి మాటలకు; అతండు= శ్రీకృష్ణుడు; సగౌరవంబుగాన్= ఆదరంతో; ఇయ్యకొనినన్= అంగీకరించగా, పాండవ+అగ్రజుండు= ధర్మనందనుడు; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= తేరిపారచూచి; ఎల్లవారును వినన్= అందరూ వినేటట్లుగా; అది+అట్లు+అ+కాక= అది అట్లే అగుగాక!; అని పలికి; తద్+అనంతరంబు+అ= అటు తరువాత; తానున్= తానూ; తమ్ములున్= అనుజులూ; పాంచాలియున్= ద్రౌపదియూ; పరివారంబును= భృత్యవర్గమునూ; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; నిజనివాసంబులకున్+చనిరి= తమ తమ నివాస ప్రదేశాలకు వెళ్ళారు; మఱునాఁడు= ఆ మరుసటి దినం; అరుణ+ఉదయంబునన్= సూర్యోదయవేళ; కృష్ణుండు; కాల+ఉచిత కృత్యంబులు= ప్రాతఃకాలానికి తగిన పనులు; నిర్వర్తించి= చేసి; సూర్య+ఉపాస్తి+చేసి= సూర్యోపాసన కావించి; అగ్ని సమారాధనంబు+ఆచరించి= అగ్నికార్యం నెరవేర్చి; ధరణిసురులన్= బ్రాహ్మణులను; ప్రణామ పూర్వకంబుగాన్= నమస్కార పురస్సరంగా; ప్రయాణ దాన ప్రముఖ పూజా విశేషంబులన్= ప్రయాణకాలంలో చేసే దానాలు అర్చనలు మొదలైన

వాటిచే; ప్రీతులన్+కావించి= సంతోషింపజేసి; వారల+ఇచ్చు= ఆ బ్రాహ్మణు లిచ్చే; ఆశీర్వాదంబులును= దీవనలును; సమంత్ర+అక్షత దూర్వా+అంకుర+ఆదులున్= మంత్రపూర్వకాక్షతలు, గరికపోచలు మున్నగువాటిని; కైకొని= గ్రహించి; ఉచిత ప్రదేశంబునన్+ఉండి= తగిన తావులో నిల్చినవాడై; సాత్యకిన్ రావించి= సాత్యకిని రప్పించి.

తాత్పర్యం: ధర్మజుడు కృష్ణుడిని కౌరవసభకు పంపటానికి తీర్మానించి రేపు మంచి రోజని తెల్పి, 'నారాయణా! నీ జన్మనక్షత్రం రోహిణి; వృషభరాశి. రేపు రేవతీ నక్షత్రం గనుక చంద్రుడు మీనరాశిలో ఏకాదశ స్థానంలో శుభుడై ఉన్నాడు. కావున చంద్ర బలమునూ, రేవతి నీకు సాధన తార అగుటచే తారాబలమున్నూ చక్కగా కుదిరి ఉన్నవి. ప్రయాణానికి రేపు ఉదయమే అనుకూలం' అని చెప్పాడు. మాధవుడు ధర్మజుడి పలుకులను సగౌరవంగా అంగీకరించాడు. పిదప ధర్మపుత్రుడు కొలువు నలువంకలా కలయచూచి అందరూ వింటుండగా 'ఇదే మన నిర్ణయం' అని చెప్పాడు. తరువాత ధర్మరాజు, అతడి తమ్ములు, ద్రౌపది, పరివారం తగిన విధాల తమ తమ నివాస స్థానాలకు తరలి వెళ్ళిపోయారు. మరుసటి దినం శ్రీకృష్ణుడు సూర్యోదయం కాగానే కాలోచిత కృత్యాలు సలిపి, సూర్యోపాసన చేశాడు. అగ్నిని ఆరాధించాడు. బ్రాహ్మణులకు నమస్కారాలు చేసి, ప్రయాణ కాలంలో చేయవలసిన దానాలు, పూజలు సల్పి, వారిని సంతోషపరిచాడు. బ్రాహ్మణుల దీవనలను, వారు మంత్ర పురస్సరంగా ఇచ్చిన అక్షతలను, దూర్వాంకురాలను స్వీకరించాడు. ఉచిత ప్రదేశంలో ఉండి, దామోదరుడు సాత్యకిని పిలిపించాడు.

విశేషం: 1. ప్రయాణాలకు తారాబలం చంద్రబలం చూడటం పరిపాటి. 'శుక్లే పక్షే శీతరశ్మి ర్బలీయాన్' అని జ్యోతిశ్శాస్త్రం (రత్నమాల). కాబట్టి చంద్ర బలం ఉన్నది. శ్రీకృష్ణుడి జన్మనక్షత్రం రోహిణి. ప్రయాణ నక్షత్రం రేవతి. రోహిణికి రేవతి సాధన తార ఔతుంది. రేవతి ప్రయాణానికి శుభ నక్షత్రం. ధర్మజుడు భావించినట్లు శ్రీకృష్ణ దౌత్యం సాధించబడుతుంది- అని ధ్వని.

2. వేదోచితమైన సంస్కారం కలవాడు ప్రయాణారంభంలో నిర్వహించే పుణ్య విధులు ఇందులో చెప్పబడ్డాయి. ఇవి తిక్కననాటి ఆచారాలు కూడా కావచ్చును. ఆతడు కూడా వైదిక మార్గ నిష్ఠమగు వర్తనం కలవాడు కదా! (సంపా.)

క. 'మన ప్రజలోఁ గరిపురికిం । జనుదేరఁగ వలయువారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు ప । యనమై యేతెమ్ము నీవు' నని తగ మఱియున్. 131

ప్రతిపదార్థం: మన ప్రజలోన్= మన యాదవులలో; కరిపురికిన్= హస్తినానగరానికి; చనుదేరఁగన్ వలయువారిన్= రావలసిన వారిని; సవరణతోన్= సన్నాహంతో; రండు+అని= రావలసిందని; ఏర్పడన్= స్పష్టముగా; నియమింపు= నిర్ణయించుము; నీవున్= నీవుకూడా; పయనము+ఐ+ఏతెమ్ము= ప్రయాణమై నా వెంట రావలసింది; అని= అని చెప్పి; తగన్= ఒప్పిదంగా; మఱియున్= ఇంకను ఇట్లాఅన్నాడు;

తాత్పర్యం: 'మన యాదవులలో హస్తినాపురానికి రావలసిన వారినందరినీ, సన్నాహాలతో రావలసిందిగా స్పష్టంగా చెప్పుము. నీవు కూడా నా వెంట ప్రయాణమై రమ్ము' అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు:

వ. 'దుర్యోధనుండు దుష్టాత్మకుం; డతని మన్నించు మానుసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదా ద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు' నని చెప్పి పనిచి సమయజ్ఞతం బొడసూపి నిలుచున్న దారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన, నతండును మణిగణ ప్రభాపటల జటిలంబగు నరదంబు వన్ని

శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబు లనంబరఁగు తురంగంబులం బూన్చి గరుడధ్వజం బెత్తి తెచ్చినం దానునుం బయనంపుఁ జందంబునఁ గట్టాయితంబై జనంబుల చూడ్కులకుం బండు వగుచుఁ బుండరీకాక్షుండు మంగళ తూర్యంబులు సెలంగఁ జామరంబు లుల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున యాదవ పరివారంబుతో నరుగుదెంచిన సాత్యకిం దన రథం బెక్కించుకొని యాంగికంబులైన శుభ సూచకంబులు గైకొనుచుఁ బూర్ణ కలశ వృషభాది భద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు సేసలొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలునప్పుడు. **132**

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; దుష్ట+ఆత్మకుండు= చెడు మనస్సు కలవాడు; అతని మన్నించు= అతడు ఆదరించు; మానుసులునున్= మనుష్యులు కూడ; కుటిలబుద్ధులు= వక్రబుద్ధికలవారు; కావునన్= కనుక; చక్ర గదా+ఆది+ఆయుధంబులు= సుదర్శన మనే చక్రం, కౌమోదకి అనే గద మొదలైన యుద్ధోపకరణాలను; రథంబునన్+పెట్టింపన్+వలయున్= రథములో నుంచవలసినది; అని చెప్పి; పనిచి= పంపి; సమయజ్ఞతన్+పొడచూపి= సమయము నెఱిగినవాడై కన్పించి; నిలుచున్న దారుకున్+చూచి= నిలబడియున్న దారుకుడనే తన సారథినిగాంచి; తేరు పూన్పన్+నియోగించినన్= రథమును ఆయత్తం కావించుమని ఆజ్ఞాపించగా; అతండును= సారథియైన దారుకుడు కూడా; మణిగణ ప్రభా పటలజటిలంబు= మణుల సమూహము యొక్క కాంతిపుంజముచే సాంద్రమైనది, అగు+అరదంబు+పన్ని= అయినట్టి రథమును సిద్ధపరిచి; శైబ్యసుగ్రీవ మేఘపుష్ప వలాహకంబులు= శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము; అనన్+పరఁగు= అను పేర్లతో ఒప్పుతున్న; తురంగంబులన్+పూన్చి= గుర్రాలను కట్టి; గరుడ ధ్వజంబు+ఎత్తి= రథముపై గరుడుని జెండా నిలిపి; తెచ్చినన్= తన సన్నిధికి కొనిరాగా; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల శ్రీకృష్ణమూర్తి; పయనంపుఁ జందంబునన్= ప్రయాణ విధానంతో; కడు+ఆయితంబు+ఐ= మిక్కిలి సంసిద్ధుడై; జనంబుల చూడ్కులకున్= ప్రజల యొక్క నేత్రాలకు; పండువు+ అగుచున్= ఉత్సవం చేస్తూ; మంగళ తూర్యంబులు= మంగళ వాద్యాలు; చెలంగన్= మ్రోయగా; చామరంబులు+ఉల్లసిల్లన్= వింజామరలు విలసిల్లగా; రథంబు+ఎక్కిన+అవసరంబునన్= రథారోహణం కావించిన సమయంలో; యాదవ పరివారంబుతోన్= యదువంశమునకు చెందిన బలగంతో; అరుగుదెంచిన= వచ్చినట్టి; సాత్యకిన్; తన రథంబు; ఎక్కించుకొని; ఆంగికంబులు+ఐన= అంగములందు ఏర్పడిన; శుభసూచనంబులు+కైకొనుచున్= శుభ శకునాలను స్వీకరిస్తూ; పూర్ణకలశ వృషభ+ఆది= జలముతో నిండిన కలశము, ఎద్దు మొదలైన; భద్ర పదార్థంబులన్= శుభ ప్రదాలైన వస్తువులను; అవలోకించుచున్= చూస్తూ; పుణ్య+ అంగనలు= ముత్తైదువలు; సేసలు+ఒలుకన్= అక్షతలు చల్లగా; చిత్తంబు= తన మనస్సు; ప్రసన్నతన్+పొందన్= శాంతమై ఉండగా; వెడలు+అప్పుడు= బయలుదేరే వేళలో.

తాత్పర్యం: 'దుర్యోధనుడు దుష్టచిత్తుడు. అతడు ఆదరించే మనుషులంతా వంకరబుద్ధి గలవారు. కాబట్టి నీవు చక్రం, గద మొదలైన ఆయుధాలను రథంలో పెట్టించు' అని శ్రీకృష్ణుడు సాత్యకితో చెప్పి పంపాడు. సమయం గుర్తించి దారుకుడు అనే సారథి ఎదుటికి వచ్చి నిలబడగా అతడిని కనుగొని శ్రీకృష్ణుఁడు 'నీవు రథాన్ని ఆయత్తం కావించుము' అని ఆజ్ఞాపించాడు. మణి సమూహాల కాంతిపుంజంతో నిండిన రథానికి శైబ్యం, సుగ్రీవం, మేఘ పుష్పం, వలాహకం అనే గుర్రాలను కట్టి, రథంమీద గరుడకేతనం నిలిపి దారుకుడు అరదం తీసికొనివచ్చాడు. అంతట కృష్ణుడు ప్రయాణ సన్నాహంతో ప్రజలకు కన్నుల పండువు కావిస్తూ, మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, వింజామరలు వీస్తుండగా రథారోహణం చేశాడు. సాత్యకి యాదవ పరిజనంతో ఎదుటికి రాగా అతడిని తన రథ మెక్కించుకొని కుడి కన్ను అదరటం మొదలైన ఆంగికాలైన శుభ నిమిత్తాలకు ప్రీతి చెందుతూ, పూర్ణ కుంభం,

వృషభం మొదలైన క్షేమకర పదార్థాలను చూస్తూ, ముత్తయిదువలు అక్షతలు చల్లుతుండగా ప్రసన్నమైన మనస్సుతో కృష్ణుడు బయలుదేరాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. రాజపురుషులు యాత్రకు బయలుదేరేటప్పుడు భద్రతకు తీసికొనే రక్షణ చర్యలను శ్రీకృష్ణుడు నిశితంగా పాటించటం ఆతడి కార్యదక్షతకు నిదర్శనం. చిన్న విషయంలో కూడా పెద్ద జాగ్రత్త అవసరమని తాత్పర్యం.

2. ప్రయాణం సాగించేటప్పుడు మంగళవాద్యాలు మ్రోయించటం, శుభశకునాలు దర్శించటం, శుభ చిహ్నాలను తమ శరీరాల మీద తోచటాన్ని గమనించటం, పూర్ణకుంభ వృషభ దర్శనాలను చేయటం, వనితలు అక్షతలూ పూలూ చల్లటం మొదలైన దేశీయాచారాలను వర్ణించటం జాతి వార్తా విశేషకథనం. (సంపా.)

సీ. **పాండవ యాదవ పాంచాల కేకయ । పాండ్య మాత్స్యాదులు భద్రదంతి**
హయరథంబులతోడ నతికుతూహలమున । వచ్చినఁ గనుఁగొని వారినెల్ల
సంభావనంబుల సంభాషణంబుల । నాదరించుచుఁ దగ నల్ల నల్ల
విభవంబు మెఱయంగ విడిదల పఱపెల్లఁ । గడచిన యత్తఱిఁ గరము శుభము

ఆ. **లైన శకునములకు నందఱుఁ బ్రియమంద । నరుగుచున్నయట్టి యవసరమున**
రథము రథముఁ గదియ రా నిచ్చి ధర్మనం । దనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి. **133**

ప్రతిపదార్థం: పాండవ, యాదవ, పాంచాల, కేకయ, పాండ్య, మాత్స్య+ఆదులు= పాండవులు, యాదవులు, పాంచాల విభుడు - ద్రుపదుడు, కేకయ రాజు, పాండ్య భూపతి, మత్స్య దేశాధీశుడు విరాటరాజు మొదలైనవారు; భద్ర దంతి హయరథంబుల తోడన్= భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో; అతి కుతూహలమునన్= మిక్కిలి అభిలాషతో; వచ్చినన్= రాగా; కనుఁగొని= శ్రీకృష్ణుడు చూచి; వారిన్+ఎల్లన్= వారినందరినీ; సంభావనంబులన్= మన్ననలతో; సంభాషణంబులన్= చక్కని మాటలతో; ఆదరించుచున్= గౌరవిస్తూ; తగన్= ఒప్పిదంగా; అల్లన్+అల్లన్= మెల్ల మెల్లగా; విభవంబు+మెఱయంగన్= వైభవం ప్రకాశించగా; విడిదల పఱపు+ఎల్లన్= సేనలు విడిసిన ప్రదేశమంతా; కడచిన+ఆ+తఱిన్= దాటిన తరుణంలో; కరము= మిక్కిలి; శుభములు+ఐన+శకునములకున్= మంగళకరాలైన శకునాలకు; అందఱున్= అచటి వారెల్లరూ; ప్రియము+ అందన్= సంతోషపడగా; అరుగుచున్న+అట్టి అవసరమునన్= వెళ్ళుతున్న వేళలో; రథమున్= తన రథాన్ని; రథమున్+కదియన్+ రాన్+ఇచ్చి= శ్రీకృష్ణుడి రథాన్ని వెంబడించేటట్లు కావించి; ధర్మనందనుఁడు; హరికిన్= గోవిందుడికి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: పాండవులు, యాదవులు, పాంచాల విభుడైన ద్రుపదుడు, కేకయరాజు, పాండ్య వల్లభుడు, విరాట మహారాజు మొదలైనవారు భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో మిక్కిలి ఆసక్తితో వచ్చారు. వారిని వీక్షించి శ్రీకృష్ణుడు ఆదరణలతో సంభాషణలతో గౌరవించాడు. వైభవంతో మెల్ల మెల్లగా సేనలు నిలిచి ఉన్న తావు లన్నిటినీ దాటగానే శుభ శకునాలు గోచరించాయి. అందరూ ఎంతో హర్షించారు. అలా శ్రీకృష్ణుడు వెళ్ళుతున్న సమయంలో తన రథం అతడి రథం దగ్గరకు పోనిచ్చి ధర్మపుత్రుడు శ్రీహరితో ఇట్లా అన్నాడు.

ఉ. **'వచ్చె జనార్దనుం డనిన వార్తకుఁ బ్రాణము మేనికంతకున్**
వచ్చిన సేఁదఁ దేఱుఁ గురువంశ పవిత్రచరిత్ర గొంతి నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మాఱనిచెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ! **134**

ప్రతిపదార్థం: కురువంశ పవిత్ర చరిత్ర= కురువంశమును పావనము చేయు నడవడిగల; గొంతి= కుంతీదేవి; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; వచ్చెన్= వచ్చాడు; అనిన వార్తకున్= అనినట్టి వృత్తాంతానికి; ప్రాణము= ఊపిరి; మేనికిన్+అంతకున్= శరీరాని కంతటికినీ; వచ్చినన్= రాగా; సేద తేఱున్= బడలిక నుండి తేరుకొంటుంది; నీవు+అచ్చటికిన్+ఏఁగి= నీవు ఆమె ఉన్న తావునకు పోయి; పాండవుల+అందఱ మాఱు+అని చెప్పి= పాండవులందరికీ బదులు అని పలికి; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; గ్రుచ్చి+అ కౌఁగిలించుకొని= గట్టిగా కౌగిలించుకొని; కుందిన చిత్తము నొప్పిన్= క్రుంగిపోయిన మనసులోని బాధను; తీర్పుమీ!= పోగొట్టుము.

తాత్పర్యం: 'మా తల్లి కుంతీదేవి కురువంశాన్ని పవిత్రం చేసే ప్రవర్తన కలది. మధుసూదనుడు వచ్చాడన్న సంగతి చెవి సోకగానే ఆమె శరీరమంతటికినీ చైతన్యం వచ్చినట్లుంటుంది. (ప్రాణం లేచి వచ్చినట్లుంటుంది.) ఆమె శ్రమ తొలగిపోతుంది. నీవు మా తల్లి కడకేగి మా అందరికి మారుగా నమస్కరించి, గట్టిగా కౌగిలించుకొని, కుప్పకూలిన ఆమె మనసులోని బాధను నివారించుము.

చ. **అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన**
ప్పుడు దనమోము దైన్యమునఁ బొందెడు నశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁబడి డించిపోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడుగయి పాలలోఁ బడిన బల్లి విధంబున నుండకుండునే? **135**

ప్రతిపదార్థం: అడవికిన్+ఏఁగునాఁడు= అరణ్యావాసానికి వెళ్ళే వేళలో; మమున్+అంపఁగన్= మమ్ము పంపటానికి; ఎంతయున్ దవ్వు= మిక్కిలిదూరం; వచ్చిన+అప్పుడు= వచ్చిన సమయాన; తన మోము= తన ముఖం; దైన్యమునన్= దీనత్వంచేత; పొందెడు+అశ్రులు= పొందుతున్న దుఃఖబాష్పాలు; చూచి చూచి= ఆ విధంగా కనులతో చూస్తూ కూడ; అట్లు ఒడఁబడి= ఆ రీతిగా సమ్మతించి; డించిపోన్+వలసెన్= వదలిపెట్టి వెళ్ళవలసి వచ్చింది; ఉమ్మలికమ్మునన్= శోకంతో; గొంతి= (మా జనని) కుంతీదేవి; ఇంతకున్= ఇప్పటికి; బడుగు+అయి= శుష్కించినదై; పాలలోన్ పడిన= పాలలో పడిన; బల్లి విధంబునన్= బల్లివలె; ఉండక+ఉండునే?= ఉండక ఉంటుందా? (ఉండి ఉంటుంది.)

తాత్పర్యం: అడవులకు పోయేటప్పుడు మమ్ములను పంపటానికి చాలా దూరం నడచి వచ్చింది. ముఖంలో దైన్యం నెలకొన్నది. కన్నులలో దుఃఖబాష్పాలు నిండాయి. అట్టి మా తల్లిని చూస్తూ చూస్తూ సమ్మతించి హస్తినలో విడిచిపెట్టి వెళ్ళవలసి వచ్చింది. పాలలో పడిన బల్లివలె ఆమె దుఃఖంతో ఈపాటి కెంతో శుష్కించిపోయి ఉంటుంది.

విశేషం: 1. అలం: ఉపమ, లోకోక్తి.

2. ధర్మజుడు కుంతీదేవిని గురించి చెప్పిన మాటలు వత్సల, ప్రేయోరసముద్రితాలు. తల్లిని కలిసికొని తమ పక్షాన ఆమెను ప్రేమతో కౌగిలించుకొని మనోవేదన తొలగేటట్లుగా శ్రీకృష్ణుడిని మాట్లాడుమన్నాడు. అడవికి పంపేనాడు ఆమె దైన్యంతో కన్నీరు మున్నీరయిన ఆనాటి దృశ్యం ఇంకా కళ్ళల్లో మెదలుతున్నదని ధర్మజుడు జ్ఞాపకం చేసికొన్నాడు. విధిలేక ఆమెను హస్తినలో వదలవలసి వచ్చింది. ఇన్నేళ్ళుగా ఆమె దిగులుతో వరుగై పోయి ఉంటుందని అంటూ 'పాలలో బడ్డ బల్లి' వలె అనే ఉపమానం వాడాడు. పాలు రుచిగా ఉండేవయినా, దానిలో పడి బల్లి ప్రాణాంతకంగా భావిస్తుంది. హస్తినలో విదురుడింట ఆమె సుఖంగా ఉన్నా పుత్ర వియోగతాపంతో వేడిపాలలోని బల్లివలె మగ్గిపోతూ ఉంటుందని సార్థకంగా చెప్పాడు. లోకోక్తిని ఉపమానంగా తీసికొని చెప్పటం దేశీయం. (సంపా.)

క. లక్కయిలు కాలినది మొద । లక్కట! మా తల్లి మాకునై నెవ్వగతోఁ
బెక్కిడుమలఁ బడుచున్నది । దిక్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్. 136

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లక్క ఇలు కాలినది మొదలు= లాక్షాగృహదహనం జరిగినప్పటి నుండి; మా తల్లి= మా జనని; మాకున్+ఐ= మా కొఱకు; నెఱ+వగతోన్= నిండు దుఃఖంతో; ఎవ్వరు దిక్కులేని అట్లు= ఎవరూ తనకు ఆధారం లేనివిధంగా; దీనత్వమునన్= దైన్యంతో; పెక్కు+ఇడుమలన్+పడుచున్+ఉన్నది= పలు కష్టాలు అనుభవిస్తున్నది.

తాత్పర్యం: అయ్యో! లాక్షాగృహదహనం జరిగినది మొదలు దిక్కుమాలినదానివలె మా తల్లి దైన్యంతో మా కొరకు పలు కష్టాలు అనుభవిస్తూ ఉన్నది.

క. ఏ ననుట గాఁగ దుఃఖము । లైనవి దెగు సమయ మయ్యె నని చెప్పుము; మీ
మేనత్త నూఱడింపుము; । దా నెప్పుడు నీవు గలవు తన కనుచుండున్.' 137

ప్రతిపదార్థం: ఏన్+అనుట+కాఁగన్= నేను చెప్పినట్లుగా; దుఃఖములు+ఐనవి= దుఃఖాలనునట్టివి; తెగు సమయము+అయ్యెన్= తొలగేవేళ సమీపించింది; అని చెప్పుము= అని చెప్పవలసింది; మీ మేనత్తన్+ఊరడింపుము= మీ మేనత్త అగు కుంతీదేవిని ఓదార్చ వలసింది; తాన్= మా అమ్మ; ఎప్పుడున్= ఎల్లవేళలందు; తనకున్= తనకు; నీవు కలవు+అని= నీవు(ఆధారమని) ఉన్నావని; అనుచున్+ఉండున్= పలుకుతుంటుంది.

తాత్పర్యం: దుఃఖాలు అనుభవించటం ఐనది, కష్టాలు తొలగే సమయం వచ్చింది - అని మా అమ్మతో నేను చెప్పినట్లుగా చెప్పవలసింది. కృష్ణా! మీ మేనత్తను ఊరడించవలసింది. నీవు తన కెప్పుడూ ఆధారమని ఆమె పలుకుతుంటుంది.'

వ. అని చెప్పి వెండియు. 138

తాత్పర్యం: ధర్మజుడిట్లా చెప్పి, మరల ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'గురుఁడు బాహ్లికాది కురువృద్ధులును సుహృ । ద్బాంధవులు నశేష ధరణిపతులుఁ
బ్రీతిఁ బొంద నెవ్వరికి నేది దగుఁ బ్రణా । మాది విధుల నడపు నాదుపలుకు. 139

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; బాహ్లిక+ఆది= శంతన మహారాజు తమ్ముడైన బాహ్లికుడు మున్నగు; కురువృద్ధులును= కురు వంశములోని పెద్దలును; సుహృత్+బాంధవులును= చెలికాండ్రు, చుట్టాలును; అశేష ధరణి పతులున్= సకల రాజులున్నూ; ప్రీతిన్+పొందన్= సంతోషం చెందేటట్లు; ఎవ్వరికిన్+ఏది, తగున్= ఎవరి యెడల ఏది ఉచితమో; ప్రణామ+ఆది విధులన్= నమస్కారాలు మొదలైన ఉపచారాల చేత; నాదు పలుకున్= నా మాటను; నడపు(ము)= వారికి అందజేయవలసింది.

తాత్పర్యం: 'గురువగు ద్రోణాచార్యులు, బాహ్లికుడు మొదలైన కురువంశంలోని పెద్దలు, చెలికాండ్రు, చుట్టాలు, సకల భూపతులు సంతసించేటట్లు ఎవరి పట్ల ఏది ఉచితమో, ఆ విధంగా నమస్కారాది విధు లొనర్చినానని నా మాటగా వారికి చెప్పుము.

క. పరమ ప్రియమున నాకై । పరిరంభణ సేసి గాఢ బాంధవ సాంద్రా
దరమున సంభాషింపు వి । దురుతోఁ; మధ్యస్థుఁడగు హితుం డతఁ డనఘా!' 140

ప్రతిపదార్థం: అనఘా!= దోషరహితుడా!; నాకై= నాకు మారుగా; పరమ ప్రియమునన్= మిక్కిలి ప్రేమతో; పరిరంభణ చేసి= కౌగిలించుకొని, గాఢ బాంధవ= దృఢమైన చుట్టరికంచేత కలిగిన; సాంద్ర= నిబిడమైన; ఆదరమునన్= గౌరవంచేత; విదురుతోన్; సంభాషింపు(ము)= మాట్లాడుము; అతఁడు= ఆ మహనీయుడు; మధ్యస్థుఁడు+అగు హితుఁడు= పక్షపాతం లేక ఉభయ వర్గాల మేలు కోరేవాడు.

తాత్పర్యం: మిక్కిలి ప్రేమతో నాకు బదులుగా విదురుడిని కౌగిలించుకొని గాఢమైన బాంధవాదరంతో ఆయనను గౌరవించి మాటాడుము. అతడు పక్షపాతం లేకుండా కురు పాండవుల మేలుకోరే మహనీయుడు.'

వ. అనియెఁ దదనంతరంబ యర్జునుండు. 141

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తర్వాతనే.

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పినాడు. అటు తర్వాత అర్జునుడిలా అన్నాడు.

చ. 'జనులు వినంగ రాజ్యమున సాము గొనంగలవారమన్న యీ
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమును నియ్యకొందు మొం
డనిన సపుత్త్రమిత్త్రముగ నద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్.' 142

ప్రతిపదార్థం: జనులు వినంగన్= ప్రజలందరూ వింటుండగా; రాజ్యమునన్= హస్తినాపుర సామ్రాజ్యంలో; సాము= సగపాలు; కొనన్+కలవారము= తీసికొనగలం; అన్న= అని నుడివిన; ఈ జనపతి కార్య నిశ్చయమున్= విభుడగు ధర్మజుడి కార్య నిర్ణయాన్ని; సుయోధనుఁడును= దుర్యోధనుడూ; తమ్ములున్= అతడి సహోదరులూ; సఖులున్= అతని చెలికాండ్రూ; సమ్మతిన్= అంగీకారంతో; కైకొని= అతని మాట స్వీకరించి; చేసినన్= ఆచరిస్తే; దానికిన్= అర్ధ రాజ్యం తీసుకొనటానికి; ఏమును= మేమున్నూ; ఇయ్యకొందుము= ఒప్పుకొంటాం; ఒండు+అనినన్= వేరు విధంగా పలికితే; సపుత్త్ర మిత్త్రముగన్= సుతులతో, హితులతో కూడా; ఆ+దెసన్+అందఱన్= ఆ పక్షంలోఉన్న వారినందరినీ, గ్రొచ్చి పాఁతుదున్= గోయి త్రవ్వి పూడ్చిపెడతాను.

తాత్పర్యం: 'జనులంతా వింటుండగా రాజ్యంలో సగభాగం మేము తీసికొంటాం'. అని ధర్మజుడు తీర్మానించాడు. ఆ తీర్మానానికి సమ్మతించి దుర్యోధనుడూ, అతడి తమ్ములూ, అతడి స్నేహితులూ అర్ధరాజ్యమిస్తే మేము అందుకు అంగీకరిస్తాము. ఇందుకు మరో విధంగా చెపితే కౌరవపక్షంలో ఉన్నవారినందరినీ సుతులతో హితులతో కూడ గోతులు త్రవ్వి పూడ్చిపెడతాను.'

విశేషం: 'అందఱ గ్రొచ్చి పాఁతుదున్' - అన్నది తెలుగు జాతీయం. కోపం వచ్చినప్పుడు ఎదుటివారిని (గొయ్యితీసి) పాతిపెడతాననటం తెలుగువారికి అలవాటు. కాగా, యుద్ధ రంగాలలో కుప్పలు కుప్పలుగా పడి ఉన్న శవాలను పెద్ద పెద్ద గోతులు తవ్వి మూక ఉమ్మడిగా పూడ్చటం కూడా సహజం. ఏమైనా ఈ వాక్యం అర్జునుడికి కౌరవులమీదగల తీవ్రకోపాన్ని వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

మ. అనినన్ మెచ్చి వృకోదరుం డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ
బొనరం బల్కునె?' యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద వక్త్రంబు పొ
ల్పున దర్పం బొలయంగ నంగములునుం బొంగార నుద్బృంహిత
ధ్వనియై పొల్చు మహోగ్ర సింధురము చందం బొంది యొప్పెం గడున్. 143

ప్రతిపదార్థం: అనినన్= అని పార్థుడు పలుకగా; మెచ్చి= మెచ్చుకొని; వృకోదరుండు= భీమసేనుడు; ఇతఁడు= అర్జునుడు; కార్యంబున్= చేయదగిన పనిని; ఇంత తెల్లంబుగాన్= ఇంత విస్పష్టంగా; పొనరన్+పల్కునె?= ఒప్పుగ చెప్పుతాడా?; అంచున్= అంటూ; పేరు+ఎలుఁగు= గొప్ప కంఠధ్వని; సొంపున్+పొందన్= అందగించగా; వక్త్రంబు పొల్పునన్= ముఖ సౌందర్యం చేత; దర్పంబు= గర్వం; ఒలయంగన్= వ్యాపించగా; అంగములునున్= అవయవాలు కూడా; పొంగు+ఆరన్= పొంగగా, ఉబ్బగా; ఉత్+బృంహితధ్వని+ఐ= గొప్ప ఘీంకార శబ్దంకలదై; పొల్చు= శోభిల్లు; మహా+ఉగ్రసింధురము చందంబున్+ఒంది= మహా భయంకరమైన ఏనుగు తీరై; కడున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడి పలుకులు శ్లాఘిస్తూ 'ఇతడు చేయవలసిన పనిని గూర్చి ఎంతో విస్పష్టంగా చెప్పాడు అంటూ తన గంభీర కంఠస్వరం అందం చిందగా, ముఖ సౌందర్యంచేత గరువం వ్యాపించగా, అవయవాలు పొంగగా, గొప్ప ఘీంకార ధ్వనితో చెలువారు మత్తగజంవలె భీముడు ప్రకాశించాడు.

విశేషం: భీముడు గొప్ప సహృదయుడు. అర్జునుడు వీరవాక్యం మాట్లాడగా విని తానే ఆ మాటలన్నంత ఉప్పొంగిపోయాడు. ఆ అన్నదమ్ముల ఆత్మీయత కూడా అటువంటిదే. వీరోల్లాసంతో సంతోషించే భీముడు ప్రదర్శించే ఆంగికాభినయం ఇందులో సుందర గంభీరం. మాటలు శ్రావ్య గంభీరంగా వెలువడ్డాయి. ముఖం గర్వంతో అందంగా వెలిగిపోయింది. ఒడలు ఉప్పొంగింది. పెద్ద పెట్టున ఘీంకారం చేసే మత్తేభంవలె మనోహరంగా ఉన్నాడు. మదేభం వలె ఉన్న భీముడిని మత్తేభవిక్రీడితంలో వర్ణించటం ఛందశ్శిల్పం. (సంపా.)

క. నకుల సహదేవులును దా । నికి సంతసమంది 'యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడ । యక ర మ్మని పలికి రప్పు డచ్యుతుతోడన్. 144

ప్రతిపదార్థం: నకుల సహదేవులును= నకులుడూ; సహదేవుడూ; దానికిన్= అర్జునుడి పలుకులకు; సంతసము+అంది= సంతోషపడి; ఇట్లు= ఈ ప్రకారంగా; నెయ్యము= స్నేహమో; కయ్యము= యుద్ధమో; ఒక తెఱఁగు+చేసికొని= రెంటిలో ఒక దానిని నిశ్చయించి; తడయక రమ్ము+అని= ఆలసింపక రమ్మని; అచ్యుతు తోడన్= శ్రీకృష్ణుడితో; అప్పుడు= ఆ సమయాన; పలికిరి= చెప్పారు.

తాత్పర్యం: నకుల సహదేవులు అందుకు సంతసించి పొత్తో లేక పోరో ఏదో ఒకటి తీర్మానించుకొని వెంటనే రావలసినదని శ్రీకృష్ణుడితో చెప్పారు.

శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట (సం. 5-81-58)

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయు మాటలు సెప్పి 'యతనిఁ గౌఁగిలించికొని యథోచిత ప్రకారంబుల వీడుకొని వలగొని మగిడిరి; తక్కినవారలు నర్వంబులగు తెఱంగుల నామంత్రితులై మరలిరి; మాధవుండును బ్రయాణ సర్వ సంభార నిర్వాహకులం గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి, కరినగరంబు పెం దెరువుఁ గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనంబైన యానంబున మనం బలరం జనిచని, యొక్కయెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి, మీ

రిక్కడకు, విజయంచేయుటకుఁ గతం బేమి? సేయంగల పని యెయ్యది? నా కానతిం' డనిన నారాయణునకు
నారదుం డిట్లనియె. **145**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈతీరున; పాండునందనులు; అందఱును; గోవిందునకున్= కృష్ణుడికి; వలయు మాటలు+ చెప్పి= చెప్పవలసిన మాటలు చెప్పి; అతనిన్; కౌఁగిలించికొని; యథా+ఉచిత ప్రకారంబులన్= అర్హమైన విధానాలతో; వీడుకొని= వెళ్ళి వస్తామని చెప్పి; వలగొని= ప్రదక్షిణంచేసి; మగిడిరి= మరలారు; తక్కినవారలు; అర్హంబులు+అగు తెఱంగులన్= తగిన విధాల; ఆమంత్రితులు+ఐ= ఆ కృష్ణుడిచేత అనుమతి కొన్నవారై; మరలిరి= తిరిగి వెళ్ళారు; మాధవుండును; ప్రయాణ సర్వ సంభార నిర్వాహకులన్= పయనానికి కావలసిన సమస్త వస్తువులు సమకూర్చేవారిని; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; తగిన సల్లాపంబులు+చేసి= తగు ముచ్చటలు ఆడి; కరినగరంబు పెను+తెరువు+కైకొని= హస్తినాపురికి పోయే పెద్దబాట ననుసరించి; దారుకుని చతురత్వంబునన్= దారుకుని నేర్పు చేతను; తురంగంబుల-పటుత్వంబునన్= గుర్రాలయొక్క దృఢత్వం చేతను; అత్యంత సమీచీనంబు+ఐన= మిక్కిలి యుక్తమైన; యానంబునన్= గమనంచేత; మనంబు+అలరన్= హృదయ మానందించగా; చని చని= వెళ్లి వెళ్లి; ఒక్క+ఎడన్= ఆ వెళుతున్న దారిలో; నారద, జమదగ్ని; కణ్వ+ఆదులు+అగు= నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన; మహామునులన్= మహర్షులను; కొందఱన్; కని= చూచి; రథంబు; డిగ్గి= దిగి; నమస్కరించి; సభక్తి తాత్పర్యంబునన్= భక్తితోడి తత్పరత్వంతో; కుశలంబు+అడిగి= క్షేమం విచారించి; మీరు; ఇక్కడకున్; విజయం చేయుటకున్= రావటానికి; కతంబు+ఏమి?= కారణమేమిటి?; చేయన్+కలపని+ఎయ్యది?= తమకు నేనేకార్యం చేయాలి?; నాకున్; ఆనతి+ఇండు= సెలవియ్యండి; అనినన్; నారాయణునకున్; నారదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా పాండవు లందరూ శ్రీకృష్ణుడికి చెప్పవలసిన మాటలన్నీ చెప్పి, ఆలింగనం చేసికొని అర్హ ప్రకారంగా సెలవు పుచ్చుకొని ప్రదక్షిణం చేసి వెనుకకు మరలారు. యాదవులు, పాంచాలురు మొదలైన వారంతా తగు విధాల కృష్ణుడి అనుమతి పొంది అక్కడ నిల్చిపోయారు. తరువాత శౌరి ప్రయాణానికి కావలసిన పదార్థాలు సమకూర్చినవా రందరినీ కనుగొని వారితో ముచ్చటించాడు. హస్తినానగరికి వెళ్ళే విశాల మార్గంలో దారుకుని నైపుణ్యం, గుర్రాల పటుత్వం కారణంగా సాగిన చక్కని రథగమనం ఆయన మనస్సును ఆహ్లాదపరిచింది. కృష్ణుడు వెళ్ళుతుండగా దారిలో ఒకచోట నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన మహర్షులు కొందరు కనిపించారు. వెంటనే గోవిందుడు రథం దిగి వారికి నమస్కరించాడు. మాధవుడు భక్తితత్పరుడై వారి క్షేమం విచారించి, 'మీరిక్కడికి విచ్చేయటానికి హేతువేమిటి? నేను తమకు చేయవలసిన పనులేమి?' సెలవియ్యం'డని అడిగాడు. అప్పుడు నారదుడు నారాయణుడితో ఇట్లా అన్నాడు:

సీ. **'అనఘ! పుణ్యాత్ముఁడ వగు నిన్నుఁ గనుఁగొనఁ, । గౌరవసభ నీవు గారవమునఁ**
బలికెడి పలుకుల భంగు లాకర్ణింప, । విదుర భీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ । వేడుక వచ్చిరి వీరలెల్ల'
నని చెప్ప విని 'లెస్స, యట్ల చేయుదురుగా' । కని హరి వల్కిన నమ్మునీంద్రు

తే. **లతని దీవించి 'నీవు పొ; మ్మచటి కేము । నరుగుదెంచెద'మని ప్రీతి ననుప నరిగి**
యొక్క పుణ్యాశ్రమంబున యొద్ది యేట । విడిసి దివస ప్రవర్తన విధులు నడిపి. **146**

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడా!; పుణ్య+ఆత్ముఁడవు+అగు నిన్నున్= సుకృతాత్ముడవైన నిన్ను; కనుఁగొనన్= చూడటానికి; కౌరవ సభన్= ధృతరాష్ట్రుని కొలువులో; నీవు; గారవమునన్= ఆదరంతో; పలికెడి పలుకుల భంగులు= మాటాడే

మాటల తీరులు; ఆకర్ణింపన్= వినటానికీ; విదుర భీష్మ+ఆదులు= విదురుడు, భీష్ముడు మొదలైనవారు; విను తెఱంగు= వినే విధం; ఉత్తరంబు+ఇచ్చు కార్య+ఉక్తులు= కార్యానికి సంబంధించి వారు సమాధాన మిచ్చే మాటలు; ఎఱుఁగంగన్= తెలియటానికి; వీరలు+ఎల్లన్= ఈ మునీశ్వరులందరు; వేడుకన్= కుతూహలంతో; వచ్చిరి= వచ్చారు; అని; చెప్పన్; విని; లెస్స= మంచిది; అట్ల చేయుదురు గాక= అట్లే వచ్చి విందురుగాక; అని; హరి; పల్కినన్; ఆ+ముని+ఇంద్రులు= ఆ మౌనిశ్రేష్ఠులు; అతనిన్ దీవించి= కృష్ణుడిని ఆశీర్వదించి; నీవు; అచటికిన్= కురుసభకు పొమ్ము; ఏము= మేము; అరుగుదెంచెదము= వస్తాం; అని; ప్రీతిన్= సంతోషంతో; అనుపన్+అరిగి= వారు సాగనంపగా వెళ్ళి; ఒక్క+పుణ్య+ఆశ్రమంబున+ఒద్ది+ఏటన్= ఒక పావనాశ్రమం చెంతగల నది ఒడ్డున; విడిసి= దిగి; దివసప్రవర్తన విధులు+నడిపి= ఆహ్నికాలైన వేదవిహిత కార్యాలు ఆచరించి.

తాత్పర్యం: 'వాసుదేవా! పుణ్యచిత్తుడవైన నిన్ను చూడటానికి కౌరవ సభలో నీవు ఆదరంతో చెప్పే మాటలు వినటానికీ, విదురుడు భీష్ముడు మొదలైనవారు వినే విధమూ, విని వారిచ్చే సమాధానాలూ తెలిసికొనటానికీ కుతూహలపడి ఈ మునీశ్వరులంతా వచ్చారు' అని చెప్పగా శ్రీకృష్ణుడు ఆలకించి 'మంచిది అలాగే చేయండి' అని అనుమతించాడు. మహర్షులు ఆయనను ఆశీర్వదించి 'నారాయణా! నీవు హస్తినాపురికి వెళ్ళుము. మే మక్కడికి వస్తాము' అని సంతోషంతో పంపగా, కృష్ణుడు బయలుదేరి ఒక పావనాశ్రమం చెంత గల ఏటి ఒడ్డున విడిది చేశాడు. అక్కడ శాస్త్ర విహితాలైన ఆహ్నికాలు నిర్వర్తించాడు.

వ. కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయ సమయంబునఁ గుశస్థలంబు సేరం జనునప్పు డందలి విప్రు లెదురు వచ్చి కాంచి నిజనివాసంబులకుం బిలిచినం బ్రసన్నవదనుండగుచు సమ్మర్దంబు వలవదని పలికి విశాల రమణీయంబైన బహిరంగణంబునం బటకుటీర ప్రకరం బెత్తించి విడిసి, తగువారును దానును వారల గృహంబుల కరిగి యభ్యాగత పూజలు గైకొని వారిని సంభావించి విడిదలకుం జని సమయ సముచిత వృత్తిం బ్రవర్తిల్లుచుండె; నంత నక్కడ; 147

ప్రతిపదార్థం: కమలనాభుండు= కమలం నాభియందు కల శ్రీకృష్ణుడు; కదలిపోయి= పయనం సమకట్టి; సూర్య+అస్తమయ సమయంబునన్= ప్రొద్దు గ్రుంకువేళకు; కుశస్థలంబు చేరన్+చను+అప్పుడు= కుశస్థలమనే ప్రదేశాన్ని సమీపించే సమయంలో; అందలి విప్రులు= కుశస్థల వాసులైన బ్రాహ్మణులు; ఎదురు వచ్చి= కృష్ణుడికి ఎదురుగా వెళ్ళి; కాంచి= చూచి; నిజనివాసంబులకున్= తమ ఇండ్లకు; పిలిచినన్= రండని ఆహ్వానింపగా; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన మోముకలవాడై; సమ్మర్దంబు వలవదు= సందడి పనికిరాదు; అని పలికి; విశాల రమణీయంబు+ఐన= విరివి ఐనది సుందరమైనది అగు; బహిః+అంగణంబునన్= మైదానంలో; పట కుటీర ప్రకరంబు+ఎత్తించి= పెక్కు గుడారాలు వేయించి; విడిసి= వాటిలో దిగి; తగువారును= తగిన మనుష్యులును; తానును; వారల గృహంబులకున్; అరిగి; అభ్యాగత పూజలు+కైకొని= భోజనమప్పుడు వచ్చిన వారికి చేసే సత్కారాలు స్వీకరించి; వారిని సంభావించి= ఆ బ్రాహ్మణులను ఆదరించి; విడిదలకున్+చని= తాము విడిసిన పట కుటీరాలకు వెళ్ళి; సమయ సముచిత వృత్తిన్= ఆ వేళకు దగిన పనిపాటులలో; ప్రవర్తిల్లుచున్+ఉండెన్= మెలగుతూ ఉన్నాడు; అంతన్= అటు పిమ్మట; అక్కడ= హస్తినాపురంలో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు బయలుదేరి ప్రొద్దుగ్రుంకే వేళకు కుశస్థలం సమీపించాడు. అక్కడి బ్రాహ్మణులు నారాయణునకు ఎదురువచ్చి తమ గృహాలకు రమ్మని ఆహ్వానించారు. శౌరి ప్రశాంత ముఖంతో వారిని చూచి, ఇంత మంది పరిజనంతో రావటం లేదు, అని చెప్పి అక్కడొక విశాలమైన సుందరమైన మైదానంలో గుడారాలు

వేయించాడు. పరిజనమంతా ఆ శిబిరాలలో ఉండగా తాను, అర్హులైన కొద్దిమందితో మాత్రం ముకుందుడు ఆ విప్రుల నిలయాలకు వెళ్ళాడు. అక్కడ వారిచ్చే అతిథి సపర్యలు స్వీకరించాడు. భూసురులను ఆదరించి తిరిగి తమ విడిది పట్టులకు చేరి, ఆ సమయానికి తగిన పనులలో నిమగ్నుడైనాడు. ఇక హస్తినాపురంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వార్త విని యాక్షణమ కౌరవక్షితీశ్వ । రుండు గాంగేయ గురు విదురులను బుత్త్రు
సంజయునిఁ గర్ణు సైంధవు శకునిఁ బిలువఁ । బనిచి తా నిట్టు లనియె నందనునితోడ. 148

ప్రతిపదార్థం: కౌరవక్షితి+ఈశ్వరుండు= ధృతరాష్ట్ర మహారాజు; వార్తన్ విని= కృష్ణుడు వస్తున్న సమాచారం తెలిసి; ఆ క్షణమ= అప్పుడే; గాంగేయ గురు విదురులను= గంగా పుత్రుడైన భీష్ముడిని, ఆచార్యుడైన ద్రోణుడిని, సచివుడైన విదురుడిని; పుత్త్రున్= కుమారుడైన దుర్యోధనుడిని; సంజయునిన్= చెలికాడగు సంజయుడిని; కర్ణున్= రాధేయుడిని; సైంధవున్= అల్లుడైన సైంధవుడిని; శకునిన్= మరిదిఅయిన శకునినీ; పిలువన్+పనిచి= దగ్గరకు రప్పించుకొని; నందనునితోడన్= కుమారుడితో; తాన్= తాను (ఆ ధృతరాష్ట్రుడు); ఇట్టులు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: కురువంశ విభుడగు ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడు తమకడకు వస్తున్నాడనే సమాచారం విని, వెంటనే తన దగ్గరికి భీష్ముడిని, ద్రోణుడిని, విదురుడిని, దుర్యోధనుడిని, కర్ణుడిని, సైంధవుడిని, శకునినీ పిలిపించాడు. దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

వ. 'కృష్ణుఁడు పాండవ కార్యార్థంబుగా మనయొద్దకు వచ్చుచున్నవాఁడు; నేఁడు కుశస్థలంబున విడిసె రేపిందులకు వచ్చునని వింటి; మిట్టి యాశ్చర్యంబునుం గలదే! సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి; మన కింతకంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుండయ్యె వారికి శుభంబును, నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుటదప్పు; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము; గృహాలంకరణాది మంగళప్రకారంబు లనుష్ఠింప నియమింపు; మతని చిత్తంబునకు నీ విభవంబును దనమీఁది ప్రియంబునుం దోఁచునట్టి తెఱంగున సమస్తంబును సమకట్టుము. 149

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; పాండవ కార్య+అర్థంబుగాన్= పాండవుల పని కొరకై; మన+ఒద్దకున్; వచ్చుచున్+ఉన్నవాఁడు; నేఁడు; కుశస్థలంబునన్; విడిసెన్; రేపు; ఇందులకున్; వచ్చున్; అని; వింటిమి; ఇట్టి ఆశ్చర్యంబునున్+కలదే?= ఇంతటి వింత ఉన్నదా?; సర్వలోక+అభిగమ్యుండు= సమస్త లోకములకు పొందదగినవాడు; అగు+అ+మహానుభావునకున్; మనము; అభిగమ్యులము+ఐతిమి= పొందదగినవారమైనాము; మనకున్; ఇంతకంటెను; పెంపు+ఎయ్యది?= భాగ్యమేముంది?; అతండు; ఎవ్వరివలనన్; సంతుష్టుండు+అయ్యెన్= మిక్కిలి సంతోషం పొందిన వాడాయెనో; వారికిన్; శుభంబును; ఎవ్వరి దెసన్= ఎవరి విషయమున; అనాదరంబు+చేసెన్= మన్నన చూపడో; వారికిన్; అశుభంబున్= అమంగళమూ; అగుట; తప్పదు; వలయు= కావలసిన; పూజలు= సపర్యలు; ఆచరించుటకున్= కావించటానికి; సంవిధానంబు+చేయుము= ఏర్పాటు చేయుము; గృహ+ అలంకరణ+ఆది= ఇండ్లు అలంకరించటం మున్నగు; మంగళ ప్రకారంబులు= శోభన కార్యాలు; అనుష్ఠింపన్= ఆచరించటానికి; నియమింపుము= ఆజ్ఞాపించుము; అతని చిత్తంబునకున్= శౌరి మనస్సునకు; నీ విభవంబును= నీ ప్రాభవం; తన మీఁది ప్రియంబునున్= తన యెడ నీకు గల ఇష్టం; తోఁచునట్టి తెఱంగునన్= గోచరించే విధంగా; సమస్తంబును సమకట్టుము= అన్ని ఏర్పాట్లు చేయుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు పాండవుల పనిమీద మన దగ్గరకు వస్తున్నాడు. ఈ రోజు కుశస్థలంలో నిలిచాడు. ఇక్కడకు రేపు వస్తాడని విన్నాను. ఇంతటి అద్భుత విషయం ఉన్నదా? లోకులందరు ఎవడి చెంతకు చేరవలెనని ఉవ్విళ్ళూరుతారో అట్టి మహానుభావుడు మనకడకు వస్తున్నాడు. మన కింతకంటే అదృష్టముందా? ఎవ్వరు అతడిని సంతోషపెట్టుతారో వారికి శుభాలూ, ఎవరు అతడిని ఆదరించరో వారికి అశుభాలూ జరగటం తథ్యం. కావున ఆయనకు సర్వ సపర్యలు చేయటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చక్కగా కావించుము. భవనాలు అలంకరించటం మొదలైన మంగళ కార్యాలకు వెంటనే ఆదేశాలివ్వవలసింది. అతడి హృదయం సంతోషించేటట్లు, నీ ప్రాభవానికి తగ్గట్లు, తనమీద నీకున్న ప్రేమ వెల్లడి అయ్యేటట్లు సర్వమూ సంసిద్ధ మొనర్చుము.'

విశేషం: 1. అలం: ప్రహర్షణం. "ఉత్కంఠితార్థ సంసిద్ధి ర్వినా యత్నం ప్రహర్షణమ్'. ప్రయత్నం లేకుండానే అభిమతార్థం సిద్ధించినట్లు చెప్పితే ప్రహర్షణాలంకారం. ధృతరాష్ట్రుడి వాక్యాలు ఈ అలంకారానికే అలంకారం.

2. ధృతరాష్ట్రుడు గుడ్డివాడు. కాని, లోవెలుగుతో శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి 'సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యులమైతిమి. మన కింతకన్నకు 'బెం పెయ్యది?' అని ఉప్పొంగిపోయాడు. ఇది సహజమైన ఆత్మానందోల్లాసం. ఇక్కడ ఈ వాక్యం కీలకం. పాండవుల కొరకైనా పరమాత్ముడు కౌరవసభకు వస్తున్నాడని గుర్తించి ధృతరాష్ట్రుడు నిండుసభలో విశ్వరూపదర్శనం చేయదగిన అంతస్సంస్కారం, లోచూపు కలవాడని వస్తుధ్వని.

3. కన్నులు లేకపోయినా కమలనాభుడిని అంతర్నేత్రంతో చూడగల ధృతరాష్ట్రుడు కన్నులున్నా పద్మాక్షుడిని కనుగొనలేని గర్వాంధుడైన దుర్యోధనుడికి ఆ మహాత్ముడిని ఆరాధించుమని చెప్పటం విశేషం. గర్భశిలవంటి వాడు ధృతరాష్ట్రుడు.

4. శ్రీకృష్ణుడు సాక్షాత్ నారాయణుడని భావించిన ధృతరాష్ట్రుడు ఆయన ఆదరణం పొందగలగటం శుభప్రదం. అనాదరణం పొందటం అశుభం- అని నిర్దేశించాడు. ఇది భావికథార్థ సూచిక అయిన పతాక.

5. అపూర్వాహ్వాన సంభారాలు చేయండని ఉప్పొంగుతూ ధృతరాష్ట్రుడు ఆదేశాలిచ్చాడు. ఆ మాటలన్నీ దుర్యోధనుడు వింటాడని అతడూ భ్రమించలేదు. అందుకే మెళకువగా అన్నాడు - దుర్యోధనుడి వైభవ మొకవైపూ, ప్రీతి మరొక వైపూ ప్రదర్శితమయ్యేటట్లుగా స్వాగత సన్నాహాలు చేయుమన్నాడు.

6. పరమాత్మయొక్క భావనం, దర్శన స్పర్శన సంభాషణ సౌముఖ్యాల సమ్మోదం, అనుగ్రహాశీర్వాద ప్రసాద లాభం మొదలైన వాటి వలన కలిగే ప్రహర్షణం తెచ్చిపెట్టుకొనేది కాదు. అంతఃప్రబోధంతో ఆవిర్భవించే ప్రహర్షణం. (సంపా.)

క. అనిన ధృతరాష్ట్రు పలుకులు । గొనియాడిరి సంతసిల్లి గురుఁడును భీష్ముం
డును నౌఁగాకని దుర్యో । ధనుడుం బరిచారక ప్రతతిఁ బిలిపించెన్. 150

ప్రతిపదార్థం: అనిన ధృతరాష్ట్రు పలుకులు= అని చెప్పిన ధృతరాష్ట్రుడి మాటలు; గురుఁడును= ద్రోణుడును; భీష్ముండును= భీష్ముడూ; సంతసిల్లి= ఆనందించి; ఔన్+కాక+అని= మంచిదే అని; కొనియాడిరి= మెచ్చారు; దుర్యోధనుఁడున్= సుయోధనుడూ; పరిచారక ప్రతతిన్= సేవకుల సమూహాన్ని; పిలిపించెన్= రావించాడు.

తాత్పర్యం: ద్రోణుడు, భీష్ముడు ధృతరాష్ట్రుడి మాటలకు సంతోషించి ఇది యుక్తమే అని మెచ్చారు. అంతట దుర్యోధనుడు సేవకులను పిలిపించాడు.

వ. ఇట్లుచిత పరివారంబు రావించి యతండు. 151

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు తగిన పరిచారకులను పిలిపించి ఇట్లన్నాడు:

క. 'అలుకుఁడు మృగమదమున, మ్రు । గ్గులు వెట్టుఁడు గప్పురమునఁ, గుంకుమమున గో
డలు పూయుఁడు' మణిదామక । ములు గట్టుఁడు పెద్ద కూటమున సొంపారన్. 152

ప్రతిపదార్థం: పెద్ద కూటమునన్= సభాసదనంలో; సొంపు+ఆరన్= కనుల కింపుగా; మృగమదమునన్= కస్తూరితో; అలుకుఁడు= నేల నలకండి; కప్పురమునన్= కర్పూరంతో; మ్రుగ్గులు+పెట్టుఁడు= రంగవల్లికలు తీర్చండి; గోడలు= గోడలు; కుంకుమమునన్= కుంకుమ ద్రవ్యంతో; పూయుఁడు= మెత్తండి; మణిదామకములు+కట్టుఁడు= మణుల దండలు ద్వారాలకు కట్టండి.

తాత్పర్యం: సభా సదనంలో నేలను కస్తూరితో అలకండి. కర్పూరంతో రంగవల్లికలు తీర్చండి. గోడలు కుంకుమ పంకంతో మెత్తండి. ద్వారదేశాలకు మణుల దండలు వ్రేలాడదీయండి.

విశేషం: విశేషం: అలం: ఉదాత్తం.

వ. మఱియు నగరెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు. 153

తాత్పర్యం: ఒక్క కొలువు కూటమునేకాక నగరమంతా అలంకరించండి.

క. పెనుపుం జతురత మెఱయఁగ । మన యింటను దుస్ససేను మందిరమున శో
భనశిల్పము లొనరింపుఁడు । చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్. 154

ప్రతిపదార్థం: పెనుపున్= పెంపును; చతురత= నేర్పు; మెఱయఁగన్= వెల్లడి అయ్యేటట్లు; మన+ఇంటను= మన భవనంలో; దుస్ససేను మందిరమునన్= దుశ్శాసనుడి సౌధంలో; శోభన శిల్పములు+ఒనరింపుఁడు= మంగళకరమైన చిత్తరువులు వ్రాయించండి; వృకస్థలమునందున్= వృకస్థలం అనేచోట; చప్పరములు+ఇడన్+చనుఁడు= పందిళ్ళు వేయటానికి పొండి.

తాత్పర్యం: మీ కళాచాతుర్యము వెల్లడి యగునట్లు మన భవనంలో, దుశ్శాసనుడి భవనంలో మనోహరాలైన చిత్తరువులు చిత్రించండి. వృకస్థలంలో చలువ పందిళ్ళు వేయించండి.

వ. అది విడి పట్టు గాఁదగియెడు ప' ట్టని పలికి 'వాసుదేవుండు రేపకడయ వచ్చునంతకుమున్న యింతయుం గావింపవలయు' నని పనిచి పురంబున నుత్సవంబు సాటుండని నియోగించి వివిధ గంధ మహిత మాల్యంబులు సంపాదింపను మణిభూషణ చిత్రాంబరంబులు సమకట్టను సరసాన్నస్వాదు పాన ద్రవ్యంబు లొడఁగూర్పను నేర్పరులగు తద్‌జ్ఞుల నియమించె; నట్టి యెడ నాంబికేయుండు విదురున కిట్లనియె: 155

ప్రతిపదార్థం: అది= వృకస్థలము; విడిపట్టు= విడిది; కాన్+తగియెడు పట్టు= కాదగిన చోటు; అని పలికి; వాసుదేవుండు; రేపకడయ వచ్చున్= ఉదయమే రాగలడు; అంతకున్ మున్ను+అ= అతడి రాకకు మునుపే; ఇంతయున్ కావింపన్ వలయున్= ఈ పనులన్నీ చేయవలె; అని పనిచి= అని సేవకులను నియమించి; పురంబునన్= పట్టణంలో; ఉత్సవంబు+ చాటుండు= సంబరాన్ని చాటండి; అని నియోగించి= అని భృత్యుల నాజ్ఞాపించి; వివిధ గంధ మహిత మాల్యంబులు= పలు విధాలైన సువాసనలతో గొప్పవైన పూలదండలు; సంపాదింపను= కొనివచ్చుటకు; మణి భూషణ చిత్ర+అంబరంబులు=

మణుల నగలు, వింత గొలుపు వస్త్రాలు; సమకట్టను= సమకూర్చటానికి; సరస+అన్న= రససంపన్నాలైన అన్నాలు; స్వాదు పానద్రవ్యంబులు= రుచికరమైన పానీయాలు; ఒడఁగూర్పను= లభింపజేయుటకు; నేర్పరులు+అగు= సమర్థులైన; తద్‌జ్ఞులన్= తెలిసినవారిని; నియమించెన్= నియోగించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆంబికేయుండు= అంబిక కొడుకు- ధృతరాష్ట్రుడు; విదురునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వృక్షస్స్థలం లం విడిది చేయటానికి తగిన చోటు 'అని పరిచారకులతో పలికి దుర్యోధనుడు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు ఉదయమే ఇచటికి రాగలడు. రావటానికి మునుపే అన్ని పనులు చేయాలి సుమా' అని వారిని పంపివేశాడు. 'హస్తినాపురంలో ఉత్సవం చాటండి' అని మరి కొందరిని ఆజ్ఞాపించాడు. 'రకరకాల సుగంధ ద్రవ్యాలు, పూలదండలు, రత్నాల నగలు, చిత్ర, విచిత్రాలైన వస్త్రాలు సమకూర్చండి. రుచికరాలైన వంటకాలు, కమ్మని పానీయాలు సిద్ధం చేయండి' అంటూ ఆయా పనులలో ప్రవీణులైనవారిని నియమించాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు విదురుడితో ఇట్లా అన్నాడు:

ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణు రాక సెప్పి సంతోషించుట (సం. 5-84-20)

క. 'వివిధ మణిమయ రథంబులు । జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్న విభూషణములు దాసీ । నివహంబులుఁ జాలఁ గృష్ణునికి నే నిత్తున్. 156

ప్రతిపదార్థం: వివిధ మణిమయ రథంబులున్= రకరకాల రతనాల రథాలను; జవన+అశ్వంబులును= వడిగల గుఱ్ఱలను; భద్ర సామజములున్= భద్రజాతికి చెందిన ఏనుగులను; రత్న విభూషణములున్= రతనాల ఆభరణాలను; దాసీ నివహంబులున్= పనికత్తెల గుంపును; చాలన్= ఎక్కువగా; నేను; కృష్ణునకున్; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'నేను శ్రీకృష్ణుడికి మణులు పొదిగిన రకరకాల రథాలను, వేగంగా పరుగెత్తగల గుర్రాలను, భద్రజాతికి చెందిన గజాలనూ, రతనాల సొమ్ములనూ, పెక్కుమంది పరిచారికలను ఇస్తాను.

క. మన యింట సుయోధను గృహ । మున దుశ్శాసను నికేతమున నెయ్యది యా
తని చూడ్కి కించు నదియె । ల్లను గౌరవమొప్ప నీవలయు మన మనఘా!' 157

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; మన+ఇంటన్= మన గృహంలో; సుయోధను గృహమునన్= దుర్యోధనుడి మందిరంలో; దుశ్శాసను నికేతమునన్= దుశ్శాసనుడి సౌధంలో; ఎయ్యది= ఏ వస్తువు; ఆతని చూడ్కికిన్+ఇంచున్= ఆయన చూపునకు ఇంపు గొలుపుతుందో; అది+ఎల్లను= దాని నంతయు; గౌరవము+ఒప్పన్= ఆదర మతిశయించునట్లు; మనము= మనం; ఈన్+వలయున్= (కృష్ణుడికి) ఇవ్వాలి.

తాత్పర్యం: విదురా! మన గృహంలో కాని, సుయోధనుడి మందిరంలోగాని; దుశ్శాసనుడి భవనంలోగాని గోవిందుడి చూపులకు ఏ వస్తువు ఇంపు కలిగిస్తుందో ఆ వస్తువును మన మెంతో ఆదరంతో ఆయనకు సమర్పించాలి.'

విశేషం: శ్రీకృష్ణు డేది కోరితే అది కానుకగా ఇచ్చి, అతడిని తన వాడిగా చేసికొని, పాండవులలో భేదాన్ని తీసికొనిరావాలని ధృతరాష్ట్రుడి రాజకీయ వ్యూహం. ఇది శత్రువుల పట్ల ప్రచ్ఛన్న భేదోపాయం. (సంపా.)

చ. అన విని యాతఁ డిట్లనియె 'నంబుజనాభునిఁ బ్రీతుఁ జేయు కం
టెను హితమైన కృత్య మొకటిం గలదే? యది మేలు; పాండునం
దనులకు నైదయూళ్ళు లుచితస్థితి నిచ్చుట కోపమన్న యు
న్కిన యిటు లోపు కల్మి ధరణీవర! యేమిట వచ్చెఁ జెప్పుమా! 158

ప్రతిపదార్థం: అనన్ విని= ధృతరాష్ట్రుడు అట్లు పల్కగా విని; ఆతఁడు+ఇట్లు+అనియెన్= విదురుడిట్లా చెప్పాడు; అంబుజ నాభునిన్= కమలము నాభియందుగల నారాయణుడిని; ప్రీతున్ చేయు కంటెను= సంతుష్టుడిని చేయటంకంటే; హితము+ఐన; కృత్యము= శ్రేయస్కరమైనపని; ఒకటిన్+కలదే!= మరొక టున్నదా?; అది మేలు= అట్లా చేయటం మంచిది; పాండునందనులకున్= నీ తమ్ముని కొడుకులకు; ఐదు+అ+ఊళ్ళు= కేవలం ఐదు గ్రామాలు; ఉచితస్థితిన్= న్యాయమైన రీతిలో; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; ఓపము= సహించలేము; అన్న+ఉన్కిన్+అ= అనెడు స్థితిలో; ఇటులు+ఓపు+కల్మి= వాసుదేవునకు నచ్చినవెల్లా ఇచ్చుటకు చాలిన సిరి; ధరణీవర!= ఓరాజా!; ఏమిటన్ వచ్చెన్= ఏవిధంగా లభించింది; చెప్పుమా!= తెలుపుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిట్లా పలికిన పలుకులు విని విదురుడు ఇట్లా బదులు పలికాడు: 'మహారాజా! పరమాత్ముడైన శ్రీకృష్ణుడిని సంతుష్టుని చేయటంకన్న మంచిపని మరొక్కటి ఉంటుందా? అది మన కెంతో శ్రేయస్కరం. కాని, పాండు కుమారులకు న్యాయపద్ధతిలో కేవలం ఐదు గ్రామాలు ఇవ్వటానికి తగినశక్తిలేని మనకు శ్రీహరి కిష్టమైనవాటిని సమర్పించటానికి చాలినంత సంపద ఉన్నట్లుండి ఎట్లా లభించిందో చెప్పు.

విశేషం: ధృతరాష్ట్రుడి లోభగుణాన్ని వ్యంగ్యంగా అధిక్షేపించటం ఇందులో ధ్వని. అయినవాళ్ళకు అయిదూళ్ళివ్వలేని పీనాసి ఆ భగవంతుడికి సమర్పించగల సంపదను ఇవ్వగలడా? అని ప్రశ్న. 'భక్తి కలుగుకూడు పట్టెడైనను చాలు' అనే వేమన సూక్తి జ్ఞాపకం వచ్చేటట్లు మాటలాడాడు విదురుడు. (సంపా.)

ఉ. నీ తలఁ పేను గంటి నొకనేర్పున శౌరికి లంచమిచ్చి సం
ప్రీతునిఁ జేసి, కార్యగతి భేదము సేయఁగఁ జూచె; దింత బే
లైతిగదే! సుమేరు సదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయునే?
యాతఁడు? క్రీడి భక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే? 159

ప్రతిపదార్థం: నీ తలఁపు= నీ ఉద్దేశం; ఏను= నేను; కంటిన్= తెలిసికొన్నాను; ఒక నేర్పునన్= ఒక చాతుర్యంతో; శౌరికిన్= శ్రీకృష్ణుడికి; లంచము+ఇచ్చి= లంచమిచ్చి; సంప్రీతునిన్+చేసి= సంతుష్టుడిని చేసి; కార్యగతిన్= రాయబారం విషయంలో; భేదము+చేయఁగన్+చూచెదు= భేదబుద్ధి పుట్టించాలని ఆలోచిస్తున్నావు; ఇంత బేల+ఐతి+కదే!= ఇంత మూఢుడవైనావు గదా! ఆతఁడు= కృష్ణుడు; సుమేరుసదృశ+అర్థమున్= మేరుపర్వతమంత ధనాన్ని; చూచియున్= చూచికూడా; పార్థున్= అర్జునుడిని; పాయునే?= విడుస్తాడా?; క్రీడిభక్తియును= అర్జునుడి పరమప్రేమనూ; అచ్యుతు పెంపును= గోవిందుడి గొప్పతనమునూ; నీవు; ఎఱుంగవే?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! నీ ఉద్దేశం నేను గ్రహించాను. ఏవో కానుకలు సమర్పించే మిషతో శ్రీకృష్ణుడికి లంచమిచ్చి, తృప్తిపరిచి పాండవుల విషయమై కార్యవిధానంలో భేదబుద్ధి కల్పించవలెనని యత్నిస్తున్నావు. నీ వెంత తెలివిమాలినవాడవో చెప్పలేను. నీవు మేరుపర్వతంతో సమానమైన ధనం సమర్పించినప్పటికీ, ఆయన

అర్జునుడిని విడువడు. వాసుదేవుడిపై, పార్థుడికున్న భక్తి ప్రపత్తు లెటువంటివో, గోపాలదేవుడి గొప్పతన మెటువంటిదో తెలియనివాడవా నీవు?

విశేషం: ధృతరాష్ట్రుడు లోభి. శ్రీకృష్ణుడిని లోభపెట్టి వశం చేసికొనవలెనని యత్నించటం ఎంత అవివేకమో విదురుడు హెచ్చరించాడు. నరనారాయణుల సంబంధం విభజించలేని భక్తి ప్రేమ సూత్రాలతో కట్టబడి ఉన్నది. దానిని మేరు పర్వతమంత ధనాన్నిచ్చినా భేదించ లేవని హెచ్చరించాడు. వారిది అర్థార్థ సంబంధం కాదని తెల్పాడు. శ్రీకృష్ణుడు భక్తికి వశమవుతాడు కాని, లంచాలతో కాదని తేల్చి చెప్పాడు. ధృతరాష్ట్రుడి నైచ్యం ఈ భేదోపాయంలో తేటపడుతుంది. (సంపా.)

తే. **అర్జునుఁడు ప్రాణతుల్యుండు హరికి నట్లు । గాన జలపూర్ణ మంగళ కలశమునకుఁ**
బాద్యమునకును గుశలసంప్రశ్నమునకు । మిగుల నొండు జనార్దను మెచ్చుగాదు. **160**

ప్రతిపదార్థం: హరికిన్= శ్రీకృష్ణునికి; అర్జునుఁడు; ప్రాణతుల్యుండు= ప్రాణంతో సమానమైనవాడు; అట్లు+కానన్= అందువలన; జలపూర్ణ మంగళ కలశమునకున్= మంగళార్థమై నీటితో నిండిన కుంభమునకును; పాద్యమునకును= కాళ్ళు కడుగుకొనే నీళ్ళకును; కుశల సంప్రశ్నమునకున్= యోగక్షేమాలు అడుగుటకంటెను; మిగులన్= మించి; ఒండు= మరొక్కటి; జనార్దను మెచ్చు+కాదు= శౌరికి ప్రీతిని కలిగించదు.

తాత్పర్యం: అర్జునుడు శ్రీకృష్ణుడికి ప్రాణసమానుడు కనుక మంగళాచారానికైన జలపూర్ణ కుంభానికి మించి, కాళ్ళు కడుగుకొనే నీళ్ళకు మించి, యోగక్షేమాలు పరామర్శించటానికి మించి మరేదీ అతడికి ప్రీతికరంకాదు.

క. **మన కడకు నేమి కార్యం । బునకై యాతండు వచ్చెఁ బూనికిమెయి నా**
పని వంచింపక చేయుట । విను మతనికిఁ బ్రియము; తక్కువేయును నేలా?' **161**

ప్రతిపదార్థం: వినుము; ఆతండు= శ్రీకృష్ణుడు; మన కడకున్= మన దగ్గరకు; ఏమి కార్యంబునకై= ఏ పని మీద; వచ్చెన్= వచ్చాడో; పూనికి మెయిన్= శ్రద్ధతో; ఆ పనిన్= ఆ కార్యాన్ని; వంచింపక= మోసగించక; చేయుట= చేయటం; అతనికిన్= హరికి; ప్రియము= ఇష్టం; తక్కు= ఇతరములు; వేయునున్+ఏలా?= వేయి చేయట మెందుకు?

తాత్పర్యం: మహారాజా! నా మాటలు వినుము. శ్రీకృష్ణుడు మన దగ్గరకు ఏ పని మీద వస్తున్నాడో ఆ పనిని మోసగించక నెరవేర్చటం అతడికి ఇష్టం. ఆ పనిని కాదని మనం ఎన్ని చేసినా ఏమి లాభం?' (ఏమీ లాభం లేదని భావం).

వ. **అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె:** **162**

తాత్పర్యం: విదురుడి మాటలు విని సుయోధనుడు జనకుడితో ఇట్లా అన్నాడు:

క. **'అది విదురు చెప్పినట్టిద । తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వేఱగునే?**
పదనెఱుఁగ కీఁగియిచ్చిన । బెదరి రనరె యొచ్చెమైనఁ బిమ్మట నగరే! **163**

ప్రతిపదార్థం: అది విదురు చెప్పిన+అట్టిది+అ= విదురుడు చెప్పిన ఆ మాట వాస్తవం; తుదిన్= కడకు; కృష్ణుఁడు; పాండుసుతులతోన్= పాండవుల నుండి; వేఱు+అగునే?= విడివడునా?; పదను+ఎఱుఁగక= మనసు యొక్క పాకం

తెలియక; ఈఁగి+ఇచ్చినన్= కానుకలు(దానాలు) ఇస్తే; బెదరిరి+అనరె?= కౌరవులు భయపడినా రనరా?; ఒచ్చెము+ఐనన్= న్యూనత కలిగితే; పిమ్మటన్= పిదప; నగరె?= పరిహసింపరా?

తాత్పర్యం: 'కృష్ణుడి తత్త్వ మెట్టిదో విదురుడు చెప్పాడు. అతడు పాండవులను ఎన్నటికీ విడువడు. అతడి మనః పరిపాకం తెలియక కానుకలిస్తే మనం భయపడ్డామని అంటారు. కార్యంలో న్యూనత కలిగితే పిదప మనలను అందరూ పరిహసిస్తారు.

ఆ. **అతఁడు పూజనీయుఁ డగు; నే నెఱుంగుదు; । నైన ధనము లీఁగి యనదతనము**
వచ్చుఁ; బెచ్చు పెరిఁగి వైరులు గర్వింతు; । రేల పగ యడంగు నిట్టులైన?' 164

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; పూజనీయుఁడు+అగున్= పూజించదగిన వాడే ఔతాడు; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; ఐనన్= కాని; ధనములు+ఈఁగిన్= ధనావళి ఇవ్వటంచేత; అనదతనము+వచ్చున్= మనకు అల్పత్వం కలుగుతుంది; పెచ్చుపెరిఁగి= అంతకంతకు విజృంభించి; వైరులు= మన విరోధులు; గర్వింతురు= అహంకరిస్తారు; ఇట్టులు+ఐనన్= ఇట్లు కావిస్తే; పగ+ఏల+అడంగున్?= శత్రుత్వం ఎట్లా అణగిపోతుంది?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పూజించటానికి తగినవాడని నాకు తెలుసు. కాని, అతడికి మనం ధనాలిస్తే మన అల్పత్వం బయటపడుతుంది. వైరులు అంతకంతకూ అహంకరిస్తారు. ఇందువలన విరోధం శమించదు.'

క. **అనవుడు భీష్ముఁడు ధృతరా । ష్ట్రున కిట్లను 'నీవునుం గొడుకు నేమే ని**
చ్చిన నొకటి యీఁగి లేకు । న్నను వేఱొక్కటి దలంచునా కేశవుఁడున్. 165

ప్రతిపదార్థం: అనవుడున్= దుర్యోధనుడు అట్లా పలుకగనే; భీష్ముఁడు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నీవునున్; కొడుకున్; ఏమేన్= ఏమైనను; ఇచ్చినన్+ఒకటి= ఇస్తే ఒకవిధంగా; ఈఁగి లేకున్నను= ఇవ్వక పోయిననూ; వేఱు+ ఒక్కటి= మరొక్కటి; కేశవుఁడున్= శ్రీకృష్ణుడు కూడా; తలంచునా?= భావిస్తాడా?

తాత్పర్యం: సుయోధనుడు పలికిన తర్వాత భీష్ముడు ధృతరాష్ట్రుడిని జూచి 'నీవూ, నీ కొడుకూ ఏమైనా ఇస్తే ఒక విధంగానూ, ఇవ్వకపోతే మరొక విధంగానూ ఆ శ్రీకృష్ణుడుకూడా భావిస్తాడా?

క. **విను, మతఁడు సేయఁబూనిన । పని దప్పింపంగరాదు పాండవులం దే**
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ జొ । చ్చిన మే లాపురుషు పనుపు సేయుము పుత్త్రా! 166

ప్రతిపదార్థం: పుత్త్రా!= వత్సా!; వినుము= నా మాటలు వినుము; అతఁడు= కృష్ణుఁడు; చేయన్+పూనిన పనిన్= చేయటానికి నిర్ణయించిన కార్యాన్ని; తప్పింపంగన్ రాదు= తొలగద్రోయటానికి శక్యం కాదు; పాండవులన్= పాండవులను; తేర్పను= ప్రసన్నులను కావించటానికి; కృష్ణుఁడు= పురుషోత్తముడు; వెరవుగన్+చొచ్చినన్= యుక్తంగా ఇందు ప్రవేశించిన; మేలు= మంచిది; ఆ పురుషు పనుపు చేయుము= ఆ మహానుభావుడి ఆజ్ఞ నిర్వర్తించుము.

తాత్పర్యం: కుమారా! నారాయణుడు చేయదలచిన పనిని తప్పించటానికి మన తరం కాదు. ఆయన పాండవుల నుద్ధరించటానికి ఇక్కడికి రావటం సమంజసమే. ఆ మహాత్ముడి ఆజ్ఞ శిరసావహించుము.

క. నారాయణుండు ధర్మా। ర్థారూఢము గాఁగఁ బలుకు నది నీవును నీ
వారును గైకొని యెంతయు। గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్.' 167

ప్రతిపదార్థం: నారాయణుండు= శ్రీకృష్ణుడు; ధర్మ+అర్థ+అరూఢము కాఁగన్= ధర్మార్థాలతో ప్రసిద్ధమయ్యేటట్లుగా; పలుకునది= చెప్పునట్టిదానిని; నీవును; నీ వారును= నీ మిత్రులును; కైకొని= స్వీకరించి; ఎంతయున్= మిక్కిలి; గారవమునన్+చేయన్= ఆదరంతో చేస్తే; ఎల్లకార్యంబున్+అగున్= పనులన్నీ చక్కబడతాయి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మార్థయుక్తంగా చెప్పే మాటలు నీవూ, నీవారూ గ్రహించి మిక్కిలి ఆదరంతో ఆ ప్రకారంగా చేస్తే పనులన్నీ సఫలమౌతాయి.'

క. అనుటయు సుయోధనుఁడు భీ। ష్మున కిట్లనుఁ 'బాండురాజు సుతులకు నిమ్మే
దిని హరి సగపా లీఁ దగు। ననుఁ బో, యే నీను, గాని యది యట్లుండెన్. 168

ప్రతిపదార్థం: అనుటయున్= అని పితామహుడు చెప్పగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; భీష్మునకున్= భీష్ముడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరి= శ్రీకృష్ణుడు; పాండురాజ సుతులకున్= పాండురాజు కుమారులకు; ఈ+మేదినిన్= ఈ భూమిలో; సగపాలు= అర్ధ భాగం; ఈన్+తగున్+అనున్+పో= ఇవ్వటం యోగ్యం అని అంటాడు; ఏన్= నేను; ఈను= ఇవ్వను; కాని; అది+అట్లు+ఉండెన్= ఆ విషయమంతే.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విని దుర్యోధనుడు ఆయనతో ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు పాండవులకు అర్ధరాజ్య మిమ్మని చెపుతాడు; నేను ఇవ్వను. ఆ విషయం వదలిపెట్టండి.

విశేషం: పాండవులకు రాజ్యభాగం ఇవ్వనని దుర్యోధనుడు ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడికి చెప్పాడు. (విరా. 4-236) అతడా మాట మీదనే ఉన్నాడు. (సంపా.)

వ. వేఱొక కార్యంబు సేయం దలంచితి; నది వినుము! పాండవులకు నేడుగడయు జనార్దనుం; డతనింబట్టి బంధించిన ఱెక్కలు విఱిగిన పులుఁగులుం బోలె వారు నాకు విధేయు లగుదురు; పాంచాల యాదవాదులైన తదీయ బంధు మిత్రులు నా వశంబున వర్తిల్లుదురు; సమస్త దేశంబులు నేన యేలుదు; దీనికిం దగిన యుపాయ సహాయంబు లనువు సేసెద; నీవింక నేమి సెప్పెదవు చెప్పుమనిన విని యతిఘోరంబగు నవ్విచారంబునకు నమాత్యసహితంబుగా సంతప్తచిత్తుండై వైచిత్రవీర్యుండు కొడుకున కిట్లనియె: 169

ప్రతిపదార్థం: వేఱు+ఒక కార్యంబు= మరొక పని; చేయన్+తలంచితిన్= చేయటానికి సంకల్పించాను; అది వినుము= ఆ పని ఏమిటో వినుము; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; పాండవులకున్; ఏడు+కడయున్= గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత అని సప్త ప్రకారాలుగా రక్షకమైఉన్నవాడు; అతనిన్ పట్టి బంధించినన్= అతడిని పట్టుకొని కట్టిపడవేస్తే; వారు= పాండవులు; ఱెక్కలు విఱిగిన= రెక్కలు తెగిన; పులుఁగులున్+పోలెన్= పక్షుల మాదిరిగా; నాకున్; విధేయులు+అగుదురు= అణగి మణగి ఉంటారు; పాంచాల యాదవ+ఆదులు+ఐన= ద్రుపదుడు, యాదవులు మొదలైన; తదీయ బంధు మిత్రులు= పాండవులయొక్క చుట్టాలు, హితులు; నా వశంబునన్+వర్తిల్లుదురు= నా అధీనంలో మెలగుతారు; సమస్త దేశంబులు; నేను+అ= నేనే; ఏలుదున్= పాలిస్తాను; దీనికిన్ తగిన; ఉపాయ సహాయంబులు= ఉపాయం, తోడ్పాటు; అనువు+చేసెదన్=

సిద్ధపరుచుకొంటాను; నీవు; ఇంకన్; ఏమి చెప్పెదవు చెప్పుము; అనినన్+విని= దుర్యోధనుడనగా విని; అతి ఘోరంబు+అగు= మిక్కిలి దారుణమైన; ఆ+విచారంబునకున్= అతడి ఆలోచనకు; అమాత్య సహితంబుగాన్= మంత్రులతో కూడ; సంతప్త చిత్తుండు+ఐ= ఉడుకుతున్న మనస్సు కలవాడై; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకైన ధృతరాష్ట్రుడు; కొడుకునకున్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: మరొక పని చేయదలచాను. అదేమిటో వినుము. పాండవులకు గురువు, తల్లీ, తండ్రీ, పురుషుడూ, విద్యా, దైవం, దాత అయి సర్వ విధాల రక్షిస్తున్న ఆ శ్రీకృష్ణుడిని పట్టి బంధిస్తే వారు రెక్కలు విరిగిన పక్షులై నాకు అణగి మణగి ఉంటారు. పాంచాలపతి, యాదవులు మొదలైన వారి చుట్టపక్కాలు, మిత్రులు నేను చెప్పినట్లు మెలగుతారు. దేశాలన్నీ నేనే ఏలుతాను. ఇందుకు తగిన ఉపాయం, తోడ్పాటు సిద్ధం చేసికొంటాను. ఇక నీవేమి చెప్పదలచావో చెప్పుము' అన్నాడు. మిక్కిలి దారుణమైన అతడి ఆలోచనకు మంత్రులతో కూడిన ధృతరాష్ట్రుడు తన హృదయం ఉడికిపోగా సుయోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడు దూరమైతే పాండవులు రెక్కలు తెగిన పక్షులవలె విలవిలలాడి తనకు వశమవుతారని దుర్యోధనుడి వ్యూహం. ఇది భేదం కాదు ద్రోహం. ఇది కుటిలోపాయం. దుష్టనీతి. ధర్మనీతి ఈ ఉపాయాన్ని అంగీకరించదు. పైపెచ్చు గర్హిస్తుంది.

2. దుర్యోధనుడు బరి తెగించి తన దుర్నీతిని అందరి ముందూ ప్రకటించి, ఎవరేమన్నా తన యత్నం కొనసాగుతుందని ప్రకటించి ఉద్ధతుడివలె వ్యవహరించాడు. (సంపా.)

క. 'ఓహో! యిట్లనుట జగ । ద్ద్రోహం; బిమ్మాట మఱవు; దూతత్వంబున్
మాహాత్మ్యంబును ధర్మో । త్సాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్. 170

ప్రతిపదార్థం: ఓహో!= ఔరా!; ఇట్లు+అనుట= శ్రీకృష్ణుడిని బంధిస్తానని పలకటం; జగత్+ద్రోహంబు= లోకానికి కీడు చేయటం; ఈ+మాట= ఇపుడు నీవన్నమాట; మఱవు= మరచిపొమ్ము; వినుము= నా మాట వినుము; దూతత్వంబున్= రాయబారితనం; మాహాత్మ్యంబున్= మహానుభావత్వం; ధర్మ+ఉత్సాహంబును= ధర్మానికై పాటుపడటం; అబాధ్యతకున్= బాధించబడ కుండుటకు; కారణముల్= హేతువులై ఉన్నవి.

తాత్పర్యం: 'ఔరా! శ్రీకృష్ణుడిని బంధిస్తాననటం లోకానికంతటికీ కీడు చేసినట్లేకదా! ఈ దురాలోచన మానుము. రాయబారిగా వచ్చినవాడిని, మహాత్ముడిని, న్యాయంకొరకు పాటుపడేవాడిని బాధించకూడదు.

విశేషం: ఊహించని విషయాన్ని ఒక్కసారిగా విన్నప్పుడు కలిగే ఆశ్చర్యభావం, వినకూడని విషయం విన్నప్పుడు కలిగే ఉద్వేగం ఈ పద్యంలోని చిత్తవృత్తి. దుర్యోధనుడి వ్యూహం బాధ్యతారహితమైనదని ధృతరాష్ట్రుడు ఉద్వేగంతో పేర్కొన్నాడు. దానికి కారణాలు మూడింటిని చెప్పాడు. 1. శ్రీకృష్ణుడు దూత. అతడిని బంధించరాదు. 2. అతడు మహాత్ముడు. మహాత్ములకు కీడు చేస్తే హాని కలుగుతుంది. 3. అతడు ధర్మసాధనోత్సాహంతో వస్తున్న పుణ్యాత్ముడు. అతడికి కీడు చేయటం అధర్మం. అందువలన శ్రీకృష్ణ నిర్బంధం సర్వత్రా నిరసించతగిందని తెలిపాడు. (సంపా.)

క. ఈ కారణములు గలవను । నా కొలఁదియె వాసుదేవుఁ? డదిగాకయుఁ గీ
డే కురువంశమున కతని । రాక? యతం డేమి సేసెరా పాపాత్మా!' 171

ప్రతిపదార్థం: ఈ కారణములు గలవు= ఈ హేతువులన్నీ శ్రీకృష్ణుడి విషయంలో ఉన్నవి; అను+ఆ కొలఁదియె?= అన్నంత మాత్రమేనా?; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు (అతడు జగద్వ్యాపకుడైన భగవంతుడు); అదికాకయున్= అంతేకాక; అతనిరాక= ఆ మహనీయుడి ఆగమనం; కురువంశమునకున్= కురుకులానికి; కీడే?= హానికరమా?; అతండు= కృష్ణుడు; ఏమి చేసెరా?= ఏమి తప్పు చేశాడురా?; పాప+ఆత్మా?= పాపచిత్తుడా!

తాత్పర్యం: దౌత్యం నెరపుటకు వస్తున్నవాడు, గొప్పవాడు, ధర్మం నిలపటానికి పాటుపడేవాడు అయిన గోపాలదేవుడిని నొప్పించరాదు. అతడు సామాన్యు డనుకొన్నావా? సకల జగద్వ్యాపకుడైన శ్రీమన్నారాయణుడు. ఇంతేకాదు. అతడిరాకవలన మన కురువంశానికి ఏమి హాని? పాపీ! పట్టి బంధించటానికి అతడు చేసిన తప్పేమిటి?'

విశేషం: 1. శ్రీకృష్ణుడిని బంధించటం ఎంత అధర్మమో, అంత అసంబద్ధం. సామాన్యుడైతే బంధించవచ్చు ననుకొంటే శ్రీకృష్ణుడు అసామాన్యుడు. కీడు చేసిన వాడైతే అతడికి కీడు తలపెట్టటం లోకన్యాయం. కాని, కురువంశానికి హితం కోరి వచ్చేవాడిని బంధించటం దరిచేరిన అదృష్టాన్ని దూరం చేసికొనటమే. ఈ మాటలన్న తరువాత ధృతరాష్ట్రుడు నిగ్రహించుకొనలేక బావురుమన్నట్లు 'పాపాత్మా! శ్రీకృష్ణుడు నీకేం అపకారం చేశాడురా?' అని ఎలుగెత్తి ఆక్రోశించాడు.

2. ఇది చిత్తశుద్ధితో అన్న మాటలుగానూ ఉన్నాయి, అందరి ముందు కొడుకును మందలిస్తున్నట్లూ ఉన్నాయి. తండ్రిమాట కొడుకు లెక్కచేయడని చెప్పుకొంటాడు. ఎవరైనా చెప్పగలిగితే చెప్పి దుర్యోధనుడిని మార్చండని పిలుపునిస్తాడు. పైకి ఎన్ని పలికినా లోన పుత్రుడి పక్షంవాడే ధృతరాష్ట్రుడు. అతడి నీతివాక్యాలు నీటి బుడగలు. (సంపా.)

వ. **అని యదల్చె నప్పుడు గాంగేయుం డాంబికేయున కిట్లను 'నీ కొడుకు ప్రాణగొడ్డంబైన కార్యంబు సేయందలంచె దామోదరు నిట్లు సేయం జూచెనేని దానును దనవారును వినాశంబుఁ బొందుదు; రింతియ; యిది సేసిరి సేయరైరి యమ్మహాత్మునెడ నీయపరాధంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ముల కాక, యని పలికి యేనిట్టిదాని వినంజాల' ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె, ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో 'నిటువంటి కొఱగాములు మనంబునం దలంచినప్పుడు సేయంగలవాఁడవు గావున దీనం జేటువచ్చు నుడుగుమయ్య' యనిచెప్పి యతనిం దక్కినవారినిం బోవంబనిచి తగిన వర్తనంబున నుండె; మఱునాఁడు.** **172**

ప్రతిపదార్థం: అని+అదల్చెన్= అని కోపంతో ధృతరాష్ట్రుడు గద్దించాడు; అప్పుడు; గాంగేయుండు= గంగాపుత్రుడగు భీష్ముడు; ఆంబికేయునకున్= అంబ కొడుకైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; నీ కొడుకు; ప్రాణగొడ్డంబు+ఐన= ప్రాణసంకటం కలిగించే; కార్యంబు చేయన్+తలంచెన్; పని చేయటానికి తలపెట్టాడు; దామోదరున్= వనమాలా విరాజితుడైన శ్రీకృష్ణుడిని; ఇట్లు; చేయన్+చూచెన్+ఏనిన్= చేయటానికి యత్నిస్తే; తానును= అతడూ; తనవారును= అతడికి సంబంధించిన వాళ్ళూ; వినాశంబున్ పొందుదురు= నాశనాన్ని పొందుతారు; ఇంతి+అ= ఇది నిశ్చయం; ఇది చేసిరి+చేయరు+ఐరి= ఈ పని చేసినా; చేయకమానినా; ఆ+మహాత్ము+ఎడన్= ఆ మహానుభావుడి విషయమై; ఈ+అపరాధంబు= ఈ దోషం; విచారించిన= సంకల్పించిన; దుష్ట+ఆత్ములు= పాపహృదయులు; నష్ట+ఆత్ములు+అ కాక= నాశనమై పోతారు పో; అని పలికి= అంటూ భీష్ముడు వచించి; ఏను= నేను; ఇట్టిదానిన్= ఇటువంటి పాపపు మాటను; వినన్+చాలన్= విని భరించలేను; అనుచున్; మొగంబు= ముఖం; గంటు+పెట్టుకొని= ముడుచుకొని; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= ఆ చోటు విడిచి వెళ్ళిపోయాడు; ధృతరాష్ట్రుండును; దుర్యోధనుడితో; ఇటువంటి, కొఱగాములు= అకార్యములు; మనంబునన్= మనస్సులో; తలంచిన+అప్పుడు= అనుకొన్న వెంటనే; చేయన్+కలవాఁడవు= చేసే స్వభావం కలవాడివి; కావునన్= కాబట్టి; దీనన్= ఈ

పాపకార్యాచరణంవలన; చేటువచ్చున్= కీడు మూడుతుంది; ఉడుగుము+అయ్య!= నాయనా, ఈ చెడుపని చేయవద్దు; అని చెప్పి; అతనిన్; తక్కినవారినిన్= మిగిలిన వారిని; పోవన్+పనిచి= వెళ్ళిపొండని చెప్పి; తగిన వర్తనంబునన్+ఉండెన్= ధృతరాష్ట్రుడు తన పనిలో తాను ఉన్నాడు; మఱునాఁడు= ఆ మరుసటి రోజు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు తన కుమారుడిని కసరినాడు. అప్పుడు భీష్ముడు ధృతరాష్ట్రుడితో 'నీ కుమారుడు ప్రాణసంకటమైన పనికి పూనుకొన్నాడు. గోవిందుడికి ఇట్లా కీడు చేయటానికి యత్నిస్తే తానూ తనవారూ నాశనమైపోతారు. ఈ పని చేసినా చేయకున్నా ఆ మహాపురుషుడి యెడ ఇట్టి అపకారం తలపెట్టిన దుష్టులు నష్టమై పోతారు. నేనిటువంటి మాటలు వినలేను' అని పలికి ముఖం ముడుచుకొని అక్కడనుండి వెంటనే లేచివెళ్ళాడు. ధృతరాష్ట్రుడు కొడుకుతో 'ఇటువంటి అకార్యాలను ఎప్పుడు మనసులో అనుకుంటావో అప్పుడే వాటిని చేసి తీరుతావు. నాయనా! ఇట్లాంటి పాడుపని చేస్తే కీడుమూడుతుంది. కనుక ఈ పని విరమించుకొనుము' అని చెప్పి అతడినీ, తక్కినవారినీ వెళ్ళండని చెప్పి, తన పాటికి తాను ఉండిపోయాడు. ఆ మరునాడు.

విశేషం: 1. దుర్యోధనుడి దుష్టవ్యూహానికి భీష్ముడు అసమ్మతి తెలియజేయటమే కాక, దానివలన కలిగే దుష్పరిణామాలను కూడా తెలియజెప్పాడు. 'వినాశకాలే విపరీత బుద్ధిః' అని భావించి సభనుండి తొలగిపోయాడు. పాండవులలో భేదాన్ని కలిగించాలని తలంచిన ధృతరాష్ట్ర దుర్యోధనుల పన్నాగాలు విఫలమై, వారి పక్షంలోనే భేదోపాయం ప్రవర్తిల్లింది. మహాత్ముడైన శ్రీకృష్ణుడి రాకయే ఇన్ని కలతలకు కారణమైతే, ఆయన దౌత్యం ఎంతటి విపరీత పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేమన్న భావం ధ్వని.

2. 'అకార్యాలను అనుకొన్నప్పుడే ఆచరణలో పెట్టటం దుర్యోధనుడి స్వభావం'- అని ధృతరాష్ట్రుడి వ్యాఖ్య. దానిని వారించాడు. కాని, దుర్యోధనుడు వినడని తెలుసు. ధృతరాష్ట్రుడు తన అధికారాన్ని వినియోగించి కొడుకును దండించడు. అదుపులేని అవినీతికి ప్రభువుగా ఉన్న ధృతరాష్ట్రుడి ద్వంద్వనీతికి ఈ సన్నివేశం ఉదాహరణం. (సంపా.)

సీ. కాలోచితములగు కరణీయములు దీర్చి । కమలనాభుఁడు రేపకడయ కదలి
తనుఁ గుశస్థలవాసు లనుప రా నందఱ । నాదరంబున నిల్పి యరుగునపుడు
గజ్జంబులును బండ్లు గంధమాల్యంబులు । ధృతరాష్ట్ర సుతుఁడు పుత్తేరఁ బ్రీతి
నెడ నెడఁ గొనివచ్చి యిచ్చిన వాని నె । ల్లను వేడ్క ననుభవించిన విధంబు

తే. సలిపి, యనుభవ మొల్లక చనఁగ, నెదుర । బాహ్లిక ద్రోణ భీష్మాది బంధుమిత్ర
గణము సర్వభూపాల లోకంబుఁ గురుకు । మార వర్గంబుఁ బుత్తెంచె మనుజవిభుఁడు. 173

ప్రతిపదార్థం: కమలనాభుఁడు= పద్మము బొడ్డునగల శ్రీహరి; కాల+ఉచితములు+ఐన= వేళకు తగినట్టి; కరణీయములు తీర్చి= చేయదగిన పనులు చేసి; రేపకడ+అ= ప్రాతఃకాలంలోనే; కదలి= బయలుదేరి; తనున్= తనను; కుశస్థలవాసులు= కుశస్థలంలో ఉన్నవారు; అనుపన్+రాన్= సాగనంపటానికిరాగా; అందఱన్= వారినందరినీ; ఆదరంబునన్= మన్ననతో; నిల్పి= ఆగండని చెప్పి; అరుగు+అపుడున్= వెళ్ళేసమయంలో; కజ్జంబులును= భక్ష్యాలను; పండ్లున్= ఫలాలను; గంధమాల్యంబులున్= చందనం; పూలదండలు; ధృతరాష్ట్ర సుతుఁడు= దుర్యోధనుడు; పుత్తేరన్= పంపగా; ప్రీతిన్= సంతోషంతో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చినవానిన్+ఎల్లను= తన కిచ్చిన వాటినన్నిటినీ; వేడ్కన్= అభిలాషతో; అనుభవించిన విధంబు సలిపి= అనుభవించినట్లుగా నటించి; అనుభవము+ఒల్లక= నిజంగా ఆయా

పదార్థాలను అనుభవించక; చనఁగన్= వెళ్ళుతుండగా; మనుజవిభుఁడు= నరపతి అయిన ధృతరాష్ట్రుడు; బాహ్లిక ద్రోణ భీష్మ+ఆది= బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు మొదలైన; బంధు మిత్ర గణమున్= చుట్టాలయొక్క హితుల యొక్క సముదాయాన్ని; సర్వభూపాల లోకంబున్= సమస్త రాజసమూహాన్ని; కురుకుమార వర్గంబున్= తన కొడుకుల యొక్క మొత్తమును; ఎదురన్ పుత్తెంచెన్= శ్రీకృష్ణుడికి ఎదురుకోలు జరపటానికి పంపాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రాతఃకాల విధు లన్నిటినీ నెరవేర్చి ఉదయమే హస్తినాపురికి బయలుదేరనుండగా కుశస్థల నివాసులు తనను సాగనంపటానికై దగ్గరకు వచ్చారు. వారినందరినీ ఆగండని నిల్పి శౌరి బయలుదేరాడు. అతడు వెళ్ళుతున్నప్పుడు దుర్యోధనుడు పంపగా పిండివంటలు, పండ్లు, చందనము, పూలదండలు దారిలో అక్కడక్కడా ప్రీతితో ఆయనకు తెచ్చి ఇచ్చారు. ఇచ్చినవాటినెల్ల నారాయణుడు అభిలాషతో అనుభవించినవానివలె నటించాడు. నిజానికి వాటి నతడు అనుభవించలేదు. ఇట్లా శ్రీహరి హస్తినాపురికి వస్తుండగా ధృతరాష్ట్ర మహారాజు- బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణుడు మొదలైన బంధు మిత్ర కోటిని, సకల రాజ సమూహాన్ని, తన పుత్రులను ఆయనకు ఎదురుకోలు సల్పటానికి పంపాడు.

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట (సం. 5-87-1)

వ. ఇట్లు దుర్యోధనుం డొక్కరుండు దక్కనెల్లవారిం దూర్యాది శోభన పదార్థంబులు సమకట్టి ధృతరాష్ట్రుండు వనుప నెదుర్కొనిన వాసుదేవుండు వారల నందఱ నయ్యైతెఱంగుల సంభావించి, కృతవర్మ దమవాఁడు గావున నతనికి సవిశేష స్నేహంబు సేసి, యతండు సేరువరా సమస్త జనంబులుం బరివేష్టింపం జని తన రాకకు నలంకృతంబును బ్రమోద చాపల సుభగ జనంబును నైన పురంబు సొచ్చి, రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తిక మిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షత ప్రకరంబులును బుష్ప నికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు మ్రొక్కుచుఁ జొక్కుచు నిరుగెలంకుల రమ్యహర్మ్యంబులపై నిలిచి పొలిచి కనుంగొను నంగనాజనంబులు తమలోన. 174

ప్రతిపదార్థం: ఇట్లు; దుర్యోధనుండు; ఒక్కరుండు తక్కన్= ఒకడు తప్ప; ఎల్లవారిన్= అందరినీ; తూర్య+ఆది శోభన పదార్థంబులు= వాద్యాలు మొదలైన మంగళ వస్తువులు; సమకట్టి= సిద్ధపరిచి; ధృతరాష్ట్రుండు; పనుపన్= పంపగా; ఎదుర్కొనినన్= ఎదురురాగా; వాసుదేవుండు; వారలన్+అందఱన్= వారినందరినీ; అయ్యై తెఱంగులన్ సంభావించి= ఆయా విధాల ఆదరించి; కృతవర్మ; తమవాఁడు కావునన్= తమ భోజ వంశస్థుడగుటచేత; అతనికిన్+సవిశేష స్నేహంబు+చేసి= ఆతనిపై మిక్కుటమైన స్నేహం కనబరిచి; అతండు= ఆ కృతవర్మ; చేరువన్ రాన్= వెంట వస్తుండగా; సమస్త జనంబులున్+పరివేష్టింపన్= జనులందరూ తన చుట్టూ బలసిఉండగా; చని= వెడలి; తన రాకకున్; అలంకృతంబును= అలంకరించబడినదిన్నీ; ప్రమోదచాపల సుభగ జనంబును= సంతోషంచేత సంచలిస్తున్న సుందర జనములు కలది; ఐన= ఐనట్టి; పురంబు చొచ్చి= హస్తినాపురం ప్రవేశించి; రాజమార్గంబునన్; అరుగు+అవసరంబున్= వెళుతున్న సమయంలో; మౌక్తిక మిళితంబులు= ముత్యాలతో చేరినవియు; బహుగంధ లుళితంబులు= పెక్కు సువాసనలతో కూడినవి; అగు= ఐనట్టి; అక్షత ప్రకరంబులును= అక్షతల సమూహాలును; పుష్పనికరంబులును= పువ్వుల యొక్క మొత్తములును; చల్లుచున్; సంతసిల్లుచున్= సంతోషిస్తూ; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; చొక్కుచున్= ఒడలు మరుస్తూ; ఇరు+కెలంకున్= రాజమార్గానికి రెండు వైపుల; రమ్యహర్మ్యంబులపైన్= అందమైన మేడల మీద; నిలిచి= నిలువబడి; పొలిచి= ప్రకాశించి; కనుంగొని= చూస్తున్న; అంగనాజనంబులు= ఆడువారు; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజు ఒక్క దుర్యోధనుడిని తప్ప తక్కిన వారినెల్ల వాసుదేవుని మంగళ వాద్యాలతో ఎదుర్కొనడానికి పంపించాడు. శ్రీకృష్ణుడు తనను ఆహ్వానించటానికి ఎదురుగా వచ్చిన వారినందరినీ ఆయా రీతుల గౌరవించాడు. కృతవర్మ తమవాడు గనుక అతడిని ప్రత్యేకంగా ఆదరించాడు. కృతవర్మ తన వెంబడి వస్తుండగా, జనులందరూ తన చుట్టూ బలసిరాగా, తనరాక సందర్భంగా చక్కగా అలంకరించబడినట్టిదీ, సంతోషంచేత కళకళలాడుతున్న ప్రజలు గలదీ అయిన హస్తినాపురంలో ప్రవేశించాడు. అతడు రాజమార్గంలో వెళుతుండగా రకరకాల సువాసనలు విరజిమ్ముతున్న ముత్యాలు కలిపిన తలంబ్రాలు, పూల మొత్తాలు శౌరిమీద చల్లుతూ, సంతసిస్తూ, నమస్కరిస్తూ, పరవశిస్తూ మార్గానికి ఇరువైపుల నున్న అందమైన మేడలపై నిలిచి కనుగొంటున్న వనితలు తమలో తాము ఇట్లా అనుకొన్నారు:

విశేషం: 1. మూర్ధాభిషిక్తులైన ధృతరాష్ట్ర దుర్యోధనులు తప్ప మిగిలిన పెద్దలూ, పిన్నలూ అందరూ శ్రీకృష్ణుడిని ఆహ్వానించటానికి వెళ్ళారు. అది రాచమర్యాదలలో శ్రేష్ఠమైన పద్ధతి. శ్రీకృష్ణుడిని దూతగానే కాక మహాత్ముడుగా భావించిన వైఖరి ధ్వని.

2. ఆ వేడుకలో దుర్యోధనుడు పాల్గొంటే జరుగరానిది జరుగవచ్చునని కూడ ధృతరాష్ట్రుడు భావించి, అతడిని పంపకపోయి ఉండవచ్చును.

3. శ్రీకృష్ణుడి దివ్యతేజం జీవులనందరినీ ఆకర్షించింది. ప్రజలందరూ ఆ పరమాత్ముడిని దర్శించుకొనటానికి ఉత్సాహ పడ్డారు. సముచితంగా ఆరాధిస్తూ ఆహ్వానించారు. (సంపా.)

సీ. **'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల । పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!**
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె । చ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ । బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల । కోర్కిఁ దీర్చిన రసికుం డితండె!

తే. **వెన్నలును గోపికాచిత్త వృత్తములును । నరసి మ్రుచ్చిల నేర్చిన హరి యితండె!**
శ్రుతిశిరోభాగములఁ దన సుభగచరణ । సరసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె! **175**

ప్రతిపదార్థం: ప్రాణంబుతోన్+కూడన్= అసువులతో కూడ; రక్కసి చన్నుల పాలు= రాక్షసిఅయిన పూతన చనుబాలు; త్రావిన= క్రోలిన; ప్రౌఢబాలుఁడు= గడుసరి పిల్లవాడు; ఇతఁడె!= ఈతఁడే సుమా!; వ్రేల్మిడిన్= చిటిక వేసినంతలో; చాణూరున్= కంసుడి మల్లవీరుడైన చాణూరుడిని; విఱిచి= భంజించి; లోకములన్= జగాలను; మెచ్చించిన= మెప్పించినట్టి; ఆ జగజెట్టి+ ఇతఁడె!= ఆ మేటివీరు డితడే సుమా!; దుర్వృత్తుఁడు+అగు= చెడు నడవడి గల్గినట్టి; కంసున్+తునిమి= కంసుడిని సంహరించి; ఆతని తండ్రిన్= అతని తండ్రియగు ఉగ్రసేనుడిని; పట్టంబు+కట్టిన= పట్టాభిషిక్తుడిని చేసిన; ప్రభువు+ఇతండె!= దొర యితడే సుమా!; సత్యభామకున్= సత్యాదేవికి; పారిజాతంబుపైన్+కల= ఇంద్రుడి నందనోద్యానంలోని పారిజాత వృక్షం మీద నున్న; కోర్కిన్= కాంక్షను; తీర్చిన రసికుండు+ఇతండె!= నెరవేర్చిన సరసు డితడేసుమా!; వెన్నలును= నవనీతపు ముద్దలు; గోపికా చిత్త వృత్తములును= గోపికల యొక్క మనోవ్యాపారాలనూ; అరసి= తెలిసికొని; మ్రుచ్చిలన్+నేర్చిన= దొంగిలించనేర్చిన; హరి= దోషాలను హరించే నారాయణుడు; ఇతండె!= ఇతడే సుమా!; శ్రుతి శిరస్+భాగములన్= వేద శీర్ష ప్రదేశాలందు - ఉపనిషత్తులందు; తన సుభగ చరణ సరసిజ+ఆమోదమును= తన యొక్క మనోహరమైన పాదపద్మాలయొక్క పరిమళాన్ని, కూర్చు= సంధించు; చతురుఁడు= నేర్పరి; ఇతఁడె!= ఇతడే సుమా!

తాత్పర్యం: ప్రాణాలతోపాటు రాక్షస కాంత అయిన పూతన చనుబాలు పానం చేసిన గడుసరి పిల్లడు ఇతడే. చిటికెలో మల్లవీరుడైన చాణూరుడిని విరిచి ప్రోగులుపెట్టి లోకాలను మెప్పించిన మేటి శూరు డితడే సుమా! దుష్టవర్తనుడైన కంసుడిని నిర్మూలించి, అతడి జనకుడైన ఉగ్రసేనుడికి మధురా రాజ్యపట్టం కట్టబెట్టిన ప్రభు వితడే సుమా! పారిజాతవృక్షంపై సత్యభామకు గల కోర్కి తీర్చిన రసికవల్లభు డితడే సుమా! వెన్నలతోపాటు గొల్ల చేడెల చిత్తాలను అపహరించ నేర్చిన శ్రీహరి ఇతడే సుమా! ఉపనిషత్తులకు తన పాదపద్మ పరిమళాన్ని సంధింప జాలు జాణ ఇతడే సుమా!

విశేషం: 1. అలం: ఉల్లేఖం, ఉదాత్తం. 'బహుభి ర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే''. ఒకే వస్తువు అనేకుల చేత అనేకవిధాలుగా వర్ణించబడితే ఉల్లేఖాలంకారం. "ఉదాత్త మృద్ధిశ్చరితం శ్లాఘ్యం వాన్యోపలక్షణమ్'' శ్లాఘనీయమైన సమృద్ధిని వర్ణించినా, మహాపురుషుల చరిత్రాన్ని ఉపలక్షణంగా వర్ణించినా ఉదాత్తం. హస్తినాపురంలో పిల్లల నుండి వృద్ధుల వరకు శ్రీకృష్ణుడిని పరిపరివిధాల ప్రశంసించిన ఘట్టమిది. ప్రశంసలకు సీసం కుదురైన ఛందం. ఒక్కొక్క చరణం ఒక్కొక్క ప్రశంసకు అనువై ఆరు ప్రశంసలకు ఆలవాలమై అందగిస్తుంది. శ్రీకృష్ణుడు ఉదాత్తుడు కావటంతో ఉదాత్తాలంకారం సార్థకం.

2. ఉల్లేఖంలో ఆరు ప్రశంసలున్నాయి. అవి- 1. ప్రౌఢ బాలుడు 2. జగజెట్టి 3. ప్రభువు 4. రసికుడు 5. హరి 6. చతురుడు. ఆ ఆరు ప్రశంసలూ క్రమంగా శైశవంలో, బాల్యంలో, యౌవనంలో, ప్రౌఢ దశలో, వార్ధక్య దశలో, ముముక్షు దశలో ఉన్నవారు ప్రశంసించే వాక్యాలు. వారి వారి మనస్తత్త్వాలకు అనుగుణమైన ప్రశంసలివి. సహృదయులు గమనించటం సులభం. పసిబాలుడి నుండి పరమాత్మ వరకు సాగిన ఈ దశలు భాగవత కృష్ణుడి దివ్యమహిమలుగా విజ్ఞులు భావిస్తున్నారు. శ్రీకృష్ణుడు పరమాత్మ అని నిర్ధారించటానికి తోడ్పడే షడ్లింగాలు ఇవి. ఉపనిషత్తులపై నిలచిన ఉజ్జ్వలతత్త్వం శ్రీకృష్ణతత్త్వం. (సంపా.)

వ. **అనుచు నతి కుతూహలంబున నవలోకింప నాబాలవృద్ధంబగు పౌరలోకం బాలోకన కౌతుకంబునఁ దన రథంబు గదిసిన సందడి జడియు వేత్రహస్తుల వారించుచు నారాయణుండు సమ్మర్ద మందగమనంబునం జని మణితోరణ సుందరం బగు రాజమందిర ద్వారంబు ప్రవేశించి కక్ష్యాంతరంబులు గడచి యేనుంగు మొగసాలఁ జొచ్చి యరదంబు డిగ్గి యల్లన నడచునప్పు డంతకు మున్నయరిగి భీష్మద్రోణ ప్రముఖులగు తగు వారలు ధృతరాష్ట్రునిం బొదువ నతండుఁ బ్రత్యుత్థానంబు సేసి విదుర సంజయ సహితంబుగా నెదుర్కొనం జేరి.** **176**

ప్రతిపదార్థం: అనుచున్; అతి కుతూహలంబునన్= మిక్కిలి వేడ్కతో; అవలోకింపన్= కనుగొనటానికి; ఆబాలవృద్ధంబు+అగు= పిల్లలు మొదలు ముదుసళ్ళ వరకుగల; పౌరలోకంబు= పురప్రజలు; ఆలోకన కౌతుకంబునన్= తనను చూచుటయందలి అభిలాషతో; తన రథంబున్= తన తేరిని; కదిసిన సందడిన్= సమీపించటం వలన ఏర్పడిన రద్దిని; జడియు= నివారించే; వేత్రహస్తులన్= బెత్తాలవారిని; వారించుచున్= వలదని పలుకుతూ; నారాయణుండు; సమ్మర్ద మందగమనంబునన్+చని= జనుల రాయిడివలన మెల్లని గమనంతో వెళ్ళి; మణితోరణ సుందరంబు+అగు= రత్నాలతోరణముచే అందమైన; రాజమందిర ద్వారంబు= రాజభవనం యొక్క వాకిలి; ప్రవేశించి= చొచ్చి; కక్ష్యా+అంతరంబులు+కడచి= లోగిళ్ళు దాటి; ఏనుంగు మొగసాలన్+చొచ్చి= ఏనుగులను కట్టివేసే చావడిలో ప్రవేశించి; అరదంబు+డిగ్గి= రథంనుండి దిగి; అల్లన= తిన్నగా; నడచునప్పుడు= నడిచేవేళ; అంతకున్+మున్ను+అ= అంతకు మునుపే; అరిగి= వెళ్ళి; భీష్మ ద్రోణ ప్రముఖులు+అగువారలు= భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు; ధృతరాష్ట్రునిన్+పొదువన్= ధృతరాష్ట్రుడిని పట్టుకొనగా; అతండున్= ఆంబికేయుడు; ప్రత్యుత్థానంబు+చేసి= ఎదుర్కొనుటకు లేచినవాడై; విదుర సంజయ సహితంబుగాన్= విదురుడితో సంజయుడితో; ఎదుర్కొనన్+ చేరి= నారాయణుడిని ఎదుర్కొనటానికి సమీపించి. (క్రింది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అంటూ మిక్కిలి అభిలాషతో శౌరిని దర్శించటానికి పిల్లలు మొదలు ముసలివారివరకు హస్తినాపురిలోని ప్రజలంతా వేడ్కపడి ఆయన రథం చుట్టూ గుమిగూడారు. ఆ జనుల రాయిడిని తొలగించటానికై వేత్రహస్తులు బెత్తాలు ఝళిపించగా, వలదని వారిని వారిస్తూ నారాయణుడు ఆ సందడిలో మెల్లని గమనంతో మణితోరణంతో విరాజిల్లే రాజమందిర ద్వార ప్రవేశం చేశాడు. తొట్టికట్లు దాటుతూ పోయి ఏనుగుల చావడిలో ప్రవేశించి అక్కడ రథం దిగాడు. అక్కడ నుండి గోవిందుడు తిన్నగా నడిచివస్తుండగా అంతకుమునుపే వెళ్ళినవారై భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు ధృతరాష్ట్రుడిని పొదివి పట్టుకొన్నారు. ధృతరాష్ట్రుడు విదుర సంజయులతో నడచి వచ్చి ముకుందుడిని ఎదుర్కొన్నాడు.

ఆ. అతనిఁ గౌఁగిలించి యచ్చటఁ గల విదు । రాది శిష్టజనుల నాదరార్ద్ర
బంధు దృష్టిఁ జూచి పరిరంభ సంభావ । నము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ. 177

ప్రతిపదార్థం: శౌరి= శ్రీకృష్ణుడు; అతనిన్+కౌఁగిలించి= ధృతరాష్ట్ర మహారాజును ఆలింగనం చేసికొని; అచ్చటన్+కల= అక్కడున్న; విదుర+ఆది+శిష్టజనులన్= విదురుడు మొదలైన పెద్దలను; ఆదర+ఆర్ద్ర+బంధుదృష్టిన్= ఆదరంచేత మృదువైన చుట్టపు చూపుతో; చూచి= కనుగొని; పరిరంభ సంభావనములు= ఆలింగనాదికమైన మన్ననలు; ఒనర్చి= చేసి; ప్రమదము+ ఎసఁగన్= సంతోష మొప్పగా. (మీది వచనంతో అన్వయం)

తాత్పర్యం: మాధవుడు ధృతరాష్ట్ర మహారాజును కౌఁగిలించుకొని, విదురుడు మొదలైన పెద్దలను ఆదరమేదురమైన చుట్టపు చూపులతో చూచి, మన్ననతో వారిని ఆలింగన మొనర్చుకొన్నాడు.

వ. వార లందఱకును సాత్యకిని దగిన సమాచారంబులు నడపం బనిచె; నటమున్న ధృతరాష్ట్రు పనుపునం దెచ్చి పెట్టిన నచ్చోటన యున్న యున్నత కనకాసనంబున నతం డునుప నాసీనుం డయ్యెఁ; నవ్వాసుదేవునకు విహితానుష్ఠాన పరాయణు లగు నగరి పురోహితులు రాజానుమతంబున నర్ఘ్యపాద్య మధుపర్కాద్యుపచారంబు లాచరించి యతని తమ్ముని నర్హపీఠంబున నునిచి యర్చించిరి; నరనాథుండును దొరలును నిజోచితాసనంబుల నుండిరి; కొలువెల్లను సూర్యోదయ సమయంబునఁ గమలాకరంబు విధంబున వికసించి యుండె నయ్యవసరంబునఁ గృష్ణుండు ధర్మనందను వచనంబులుగా నాంబికేయునకుం దగువారలకుం బ్రణామ పరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు వలికి సంభాషణంబులకుం జొచ్చి. 178

ప్రతిపదార్థం: వారలందఱకును; సాత్యకిని తగిన సమాచారంబులు+నడపన్= తగిన వార్తలు అందించటానికి; పనిచెన్= నియమించాడు; అటమున్న+అ= అంతకు మునుపే; ధృతరాష్ట్రు పనుపునన్+తెచ్చిపెట్టిన= ధృతరాష్ట్రుడి ఆదేశంవలన తెచ్చిఉంచిన; ఆ+చోటన్+అ+ఉన్న= అక్కడేఉన్న; ఉన్నత+కనక+ఆసనంబునన్= ఎత్తయిన బంగారు పీఠమునందు; అతండు= ధృతరాష్ట్రుడు; ఉనుపన్= కూర్చుండ బెట్టగా; ఆసీనుండు+అయ్యెన్= కూర్చున్నాడు; ఆ వాసుదేవునకున్= గోపాలదేవుడికి; విహిత+అనుష్ఠాన+పరాయణులు+అగు= శాస్త్రోక్తమైన ఆచారమునందు శ్రద్ధగలవారైన; నగరి పురోహితులు= రాజపురోహితులు; రాజ+అనుమతంబునన్= ధృతరాష్ట్రుడి సమ్మతితో; అర్ఘ్యపాద్యమధుపర్క+ఆది+ఉపచారంబులు= చేతులకు కాళ్ళకు నీళ్ళు ఇచ్చుట, పాలలో కలిపిన తేనె ఇవ్వటం మొదలైన సమ్మానాలు; ఆచరించి= చేసి; అతని తమ్మునిన్= శ్రీకృష్ణుడి అనుజుడైన సాత్యకిని; అర్హపీఠంబునన్+ఉనిచి= తగిన పీఠముపై కూర్చుండ బెట్టి; అర్చించిరి= పూజించారు; నరనాథుండును= ధృతరాష్ట్రుడును; దొరలును= ఇతర రాజులును; నిజ+ఉచిత+ఆసనంబులన్+ఉండిరి= తమకు తగిన పీఠాలపై తాము

కూర్చున్నారు; కొలువు+ఎల్లను= సభ అంతా; సూర్య+ఉదయసమయంబునన్= భానుడుదయించిన వేళలో; కమల+ఆకరంబు విధంబునన్= తామర కొలనువలె; వికసించి+ఉండెన్= ప్రకాశిస్తున్నది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కృష్ణుండు; ధర్మనందను వచనంబులుగాన్= ధర్మరాజు చెప్పిన మాటలుగా; ఆంబికేయునకున్= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడికీ; తగువారలకున్= తగినట్టివారికినీ; ప్రణామ= నమస్కారాలు; పరిరంభణ= ఆలింగనాలు; ప్రముఖ= మొదలైన; సముచిత సంభావనంబులు= తగిన మన్ననలు; పలికి= తెలిపి; సంభాషణంబులకున్= మాటలకు; చొచ్చి= ఉపక్రమించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అందరి యోగక్షేమాలు విచారించటానికై సాత్యకిని నియమించాడు. అంతకుమునుపే అచ్చటికి ధృతరాష్ట్ర మహారాజు ఆజ్ఞ చేత ఎత్తయిన బంగారు పీఠాన్ని తెచ్చి ఉంచారు. ఆ పీఠంపై ధృతరాష్ట్రుడు కూర్చుండ బెట్టగా శౌరి కూర్చున్నాడు. అప్పుడు శాస్త్ర విహితమైన ఆచారమునందు శ్రద్ధ గల రాజపురోహితులు రాజుగారి అనుమతితో వాసుదేవుడికి అర్ఘ్యం పాద్యం మధుపర్కం మొదలైన మర్యాదలు జరిపారు. గోవిందుడి తమ్ముడగు సాత్యకిని కూడా తగిన పీఠంమీద కూర్చుండ బెట్టి పూజించారు. ఆ తరువాత ధృతరాష్ట్రుడూ, తక్కిన రాజులూ తమ తమ గద్దెలపై ఉన్నారు. సూర్యోదయ కాలంలో పద్మసరస్సువలె సభ అంతా కళకళలాడుతూ ఉండింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఆంబికేయునకూ, అర్హులైనవారికీ ధర్మరాజు మాటలుగా ఆతడి నమస్కారాలు, ఆలింగనాలు మొదలైన మన్ననలు అందజేసి సంభాషించటానికి ఉపక్రమించాడు.

విశేషం: 1. అలం: ఉపమ. సూర్యోదయ సమయంలో వికసించిన కమలాలతో ఒప్పారే సరోవరం వలె కౌరవసభ కృష్ణ దర్శనంతో కళకళలాడిందని భావం. చక్కని ఉపమానం. శ్రీకృష్ణ దివ్యత్వదీపకం.

2. ఈ సన్నివేశంలో అతిథులు వచ్చినప్పుడు ఆయా సందర్భాలలో సాగే రాజమర్యాదలను సవిస్తరంగా, సముచితంగా వర్ణించి తిక్కన రంగ మర్యాదలను నాటకీయంగా చిత్రించాడు. (సంపా.)

క. రాజునకుఁ దియ్య మెసఁగెడు । పూజా వచనముల నెయ్యపుంబలుకులఁబే
రోజ మెయి బంధుమిత్ర స । మాజములకు మేలములఁ గుమారులకుఁ దగన్. 179

ప్రతిపదార్థం: రాజునకున్= ధృతరాష్ట్రునకు; తియ్యము+ఎసఁగెడు= ప్రియమొప్పు; పూజావచనములన్= గౌరవ వాక్యాలతోను; పేరు+ఓజమెయిన్= మహోత్సాహంతో; బంధుమిత్ర సమాజములకున్= చుట్టముల యొక్క హితుల యొక్క సమూహమునకు; నెయ్యపున్+పలుకులన్= స్నేహ వచనాలతోడనూ; తగన్= ఒప్పిదముగా; కుమారులకున్= ధృతరాష్ట్రుడి కొడుకులకు, మేలములన్= పరిహాసాలతోడను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి ప్రీతి కలిగించే గౌరవ వచనాలతో; బంధు మిత్ర సమూహానికి మహోత్సాహమొప్పే ప్రేమవచనాలతో, కురుకుమారవర్గానికి పరియాచకపు మాటలతో. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: శ్రీకృష్ణుడు సభలో సంభాషణ ప్రారంభించాడు. సంభాషణం రాయబారపు ఉపన్యాసం కాదు. పలు హోదాలలో ఉన్నవారిని ఆయా పద్ధతులలో పలుకరించే మర్యాద. శ్రీకృష్ణుడి ప్రవర్తనలోని ప్రతి చిన్న అంశాన్ని కూడా వదలకుండా తిక్కన జాతి వార్తా చమత్కారయుతంగా వర్ణించాడు. ఈ పద్యంలో మొదట రాజును పలుకరించాడు. ఆ మాటలతో రాజుకు సంతోషం కలిగించాడు. ఆయనకు సాక్షాత్తు (వాక్పుష్పాలతో) పూజిస్తున్నట్లు, గౌరవిస్తున్నట్లు మర్యాదను నడిపాడు. రాజును ఒక్కడినీ పలకరించే తీరొకటి. ఆ తరువాత బంధువులు, మిత్రులు మొదలైన వారు సభలో ఆయాచోట్ల కలిసి కూర్చుండి

ఉంటారు. వారిని సామూహికంగా పలకరించాడు. స్నేహంగా ఉత్సాహంగా మాట్లాడాడు. తరువాత కురుకుమార వర్గాన్ని గుంపుగా పలకరించాడు. వారితో పరిహాసాలాడుతూ చనువును స్నేహాన్నీ ప్రకటించాడు. సంభాషణ వైవిధ్యం వర్ణన శిల్పం. (సంపా.)

వ. ఇంపు వుట్టించుచుఁ గొండొకసేపు నిలిచి పుండరీకాక్షుండు విదురు సదనంబునకుం జనియెద మఱియుఁ బోవలయు నెడలకుం బోయి వచ్చెద' నని పలికి యాంబికేయుననుమతి వడసి యరుగ, విదురుండు ససంభ్రమంబునం గడచిచని మంగళోపచార సహితంబుగా నెదుర్కొని భయ భక్తి వినయ స్నేహానందంబులఁ గందళితుం డగుచు గోవిందునకు దేవోపచారంబుల ననేక ప్రకారంబుల నర్చన లిచ్చి, కౌంతేయుల కుశలం బడిగిన నతనికి వారలవృత్తాంతంబు సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిన యనంతరంబ. 180

ప్రతిపదార్థం: ఇంపు పుట్టించుచున్= ఆనందం కలిగిస్తూ; కొండొకసేపు= కొంత తడవు; నిలిచి= ఆగి; పుండరీక+అక్షుండు= తెల్లదామరల వంటి కన్నులు గల గోవిందుడు; విదురు సదనంబునకున్= విదురుడి గృహానికి; చనియెదన్= వెళ్ళుతాను; మఱియున్= ఇంకను; పోవలయు+ఎడలకున్= పోవలసిన చోట్లకు; పోయివచ్చెదన్; అని పలికి; ఆంబికేయు+అనుమతి+పడసి= ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది; అరుగన్= వెళ్ళగా; విదురుండు; ససంభ్రమంబునన్= వేగిరపాటుతో; కడచిచని= దాటుకొని వెళ్ళి; మంగళ+ఉపచార+సహితంబుగాన్= శుభకరాలైన సేవలతో కూడునట్లుగా; ఎదుర్కొని= స్వాగతం చెప్పి; భయభక్తి వినయ స్నేహ+ఆనందంబులన్= భయం, భక్తి, అణకువ, ప్రేమ, సంతోషం అనే గుణాలతో; కందళితుండు+అగుచున్= వికాసం పొందినవాడై; గోవిందునకున్= శ్రీ కృష్ణుడిని; దేవ+ఉపచారంబులన్= దేవతలకు కావించే మన్ననలతో; అనేక ప్రకారంబులన్= పలు విధముల; అర్చనలు+ఇచ్చి= పూజ లొసగి; కౌంతేయుల కుశలంబు= పాండవుల క్షేమం; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= విదురుడికి; వారల వృత్తాంతంబు= పాండవుల యొక్క సమాచారం; సమస్తంబును= అంతయూ; సవిస్తరంబుగన్= విపులంగా; చెప్పిన+అనంతరంబు+అ= చెప్పిన తరువాత.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కొంతసేపు అక్కడ ఆగి, విదురుడి గృహానికీ, ఇంకా వెళ్ళవలసిన చోట్లకూ వెళ్ళి వస్తాను' అని ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది బయలుదేరాడు. విదురుడు గబగబ ముందువెళ్ళి తన యింటి దగ్గర ఎదుర్కొని శ్రీహరికి స్వాగతం పలికాడు. భయం, భక్తి, వినయం, స్నేహం, సంతోషం పెల్లుబుకగా గోవిందుడికి దేవతోపచారాలతో, బహువిధాల పూజలు చేశాడు. కుంతీపుత్రుల యోగక్షేమాలు అడిగాడు. అతడికి కమలాక్షుడు పాండవుల సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఆ తరువాత.

విశేషం: 1. సభలో సంభాషించే వారితో మాట్లాడి, సభాసదులైన వారందరికీ సంతోషం కలిగేటట్లుగా తన దివ్య మంగళ విగ్రహ దర్శనాన్ని ప్రసాదిస్తూ కొంతసేపు నిలవటం రాజసభలో పెద్దల మర్యాద. శ్రీకృష్ణుడు దివ్యుడు కావటం చేత అతడి దర్శనానికి ప్రత్యేకత ఉన్నది. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా!' అన్న వేమన సూక్తి ఇక్కడ నిజమనిపిస్తుంది.

2. ఒకసారి రాజసభలో ప్రవేశించిన దూత రాజానుమతితోనే బయటకు వెళ్ళాలి. దౌత్యం మొదలు కాకపోయినా కృష్ణుడు సభామర్యాదను పాటించాడు. ధృతరాష్ట్రుడికి తన కార్యక్రమం చెప్పి అనుమతి వేడాడు.

3. విదురుడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావించి షోడశోపచార విధులతో దేవతార్చన విధితో పూజించాడు. భయభక్తి, వినయ వందనా లాచరిస్తూ పులకించాడు. విదురుడు భక్తుడు. శ్రీకృష్ణుడు భగవంతుడు. అందుకే భక్తుడి ఇంటికి వెళ్ళాడు భగవంతుడు. లౌకిక ఆధ్యాత్మిక భావాల తారతమ్య మిక్కడ స్పష్టం. (సంపా.)

క. ముదమునఁ గృష్ణుఁడు కుంతీ । సదనమునకుఁ జనియె; నపుడు సమ్మదమున న
వ్విదురుం 'డోగిర మొనరిం । చెద' నని తన్నడుగ 'నట్ల చేయుం' డనుచున్. 181

ప్రతిపదార్థం: కృష్ణుఁడు, ముదమునన్= సంతోషంతో; కుంతీ-సదనమునకున్= కుంతి యింటికి; చనియెన్= వెళ్ళాడు; అపుడు; ఆ+విదురుండు= ఆ విదురుడు; సమ్మదమునన్= హర్షంతో; ఓగిరము+ఒనరించెదన్= వంట చేయిస్తాను; అని; తన్నున్+అడుగన్= తనతో చెప్పగా; అట్ల చేయుండు+అనుచున్= అట్లాగే చేయించం డని చెప్పి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంతోషంతో కుంతీ గృహానికి వెళ్ళాడు. అప్పుడు విదురుడు హర్షించి 'వంట చేయిస్తాను' అని శ్రీహరితో అన్నాడు. అట్లాగే చేయించండి' అని చెప్పి కృష్ణుడు.

వ. చని కాంచిన నద్దేవియు నతని తోడు నీడయుంబోని తన కొడుకులం దలంచి యడలు వుట్టిన నమ్మాధవు మెడ వట్టికొని యెలుంగెత్తి యేడ్చిన, నతండు సంబోధించి యూరార్ప నెట్టకేలకు నుడిగి యాతనికి నాసన విన్యాసనాద్యుపచారంబులు చేయించి తత్సమీపంబున నుచిత పీఠంబునం గూర్చుండి గద్గద కంఠంబుతో నిట్లనియె. 182

ప్రతిపదార్థం: చని= కుంతీదేవి నివాసానికి ఏగి; కాంచినన్= ఆమెను చూడగా; ఆ+దేవియున్= ఆ కుంతీదేవికూడ; అతని తోడు నీడయున్+పోని= అతని వెన్నంటి వచ్చు నీడల వంటివారైన; తన కొడుకులన్+తలంచి= తన కుమారులను జ్ఞప్తికి తెచ్చుకొని; అడలు+పుట్టినన్= దుఃఖం జనించగా; ఆ+మాధవు మెడ పట్టుకొని= కృష్ణుడి కంఠం పట్టుకొని; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ఏడ్చినన్= విలపించగా; అతండు= హరి; సంబోధించి= అత్తా అని హెచ్చరించుకొని; ఊరార్పన్= ఓదార్చగా; ఎట్టకేలకున్= తుదకు; ఉడిగి= ఏడ్పుమాని; అతనికిన్= మేనల్లుడికి; ఆసన+విన్యాసన+ఆది+ఉపచారములు చేయించి= పీఠముంచటం మొదలైన మన్ననలు కావించి; తద్+సమీపంబునన్= అతడి చెంగట; ఉచిత పీఠంబునన్+కూర్చుండి= తగిన పీఠం మీద కూర్చొని; గద్గద కంఠంబుతోన్= డగ్గుత్తికతో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికింది:

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కుంతీదేవి గృహానికి వెళ్ళి ఆమెను దర్శించాడు. ఆమె అతడి వెన్నంటే నీడల వంటి తన కొడుకులు జ్ఞప్తికి రాగా దుఃఖంతో మేనల్లుడి మెడపట్టుకొని గొంతెత్తి విలపించింది. ముకుందుడు అత్తా అని సంబోధించి ఊరడించాడు. హరి ఊరడింపుతో ఆమె ఏడ్పుమాని అతడికి కూర్చుండ పీఠం వేయించటం మొదలైన ఉపచారాలు చేయించింది. తాను ఆయన చెంత అర్హపీఠంమీద ఆసీనురాలై ఎలుగురాలుపడ ఇట్లా అన్నది.

విశేషం: కుంతీదేవికి ఎదుట శ్రీకృష్ణుడు కనపడగానే అతడికి తోడునీడలవలె ఉండే పాండవులు జ్ఞాపకం రావటం వలన ఆమెకు దుఃఖం పొంగివచ్చింది. శ్రీకృష్ణుడు పాండవుల కెంత ఆత్మీయుడో కుంతీదేవి కంత ఆత్మీయుడు. వత్సల భావద్యోతకమైన చేష్ట - అప్యాయంగా మెడను కౌగిలించుకొనటం. మనసులో బాధను కొన్నేళ్ళుగా అణచుకొని ఉండటంచేత దానిని ఒక్కసారిగా వెలువరించే సాత్త్విక భావం వంటి అభినయ విశేషం ఎలుగెత్తి ఏడ్వటం. కుంతికి శ్రీకృష్ణుడన్నా, తన బిడ్డలన్నా ఉన్న అభేద వాత్సల్య భావం ఇందులో వ్యంగ్యం. స్వయంగానూ, ధర్మజుడి ప్రార్థన వలననూ ఆమెను దర్శింప వచ్చాడు శ్రీకృష్ణుడు. సాక్షాత్తు తన పుత్రులను చూచిన సంతృప్తి ఆమెకు కలిగించాలని వచ్చాడు. అందువలననే ఈ సన్నివేశంలో ఆ ఆర్ద్రత. (సంపా.)

సీ. **'నీ శిక్షఁ బెరుఁగుట నీతిమంతులుఁ బుణ్య । పరులు శూరులు గదా పాండుసుతులు**
సుఖవృత్తిఁ బెక్కండ్రు సూరెలఁ గొలువ నుం । డెడువార లిడుమలఁ బడుచు నిర్జ
నంబైన కానలోనన యెట్లు నిలిచిరి? । ననుఁ బెట్టి నాయెదఁ గొనుచుఁ జనిరి
యేను వడ్డింపంగ నింపారఁ గుడిచి మె । త్తని సెజ్జ నిద్రించి వినుతభద్ర

తే. **గాన కరి బృంహితముల మేల్కాంచునట్టి । వారు కందమూలంబు లాహారములుగఁ**
బొదలఁ బుట్టలఁబడి యుండి పులుఁగు మెకము । లఱవ మేల్కనుచుండిరే యక్కటకట! **183**

ప్రతిపదార్థం: నీ శిక్షన్= నీ అభ్యాసంలో; పెరుఁగుటన్= పెరిగినవారగుటచేత; పాండుసుతులు= పాండుపుత్రులు; నీతిమంతులున్= న్యాయంతో కూడినవారు; పుణ్యపరులు= సుకృతమునందు ఆసక్తికలవారు; శూరులుగదా= వీరులు గదా!; పెక్కండ్రు= పలువురు; సూరెలన్= కుడి యెడమ పార్శ్వములందు; కొలువన్= సేవిస్తుండగా; సుఖవృత్తిన్= సుఖ జీవనోపాయంతో; ఉండెడివారలు= ఉన్నట్టివారు; ఇడుమలన్+పడుచున్= కష్టాలనుభవిస్తూ; నిర్జనంబు+ఐన= మనుష్యులులేని; కానలోనన్+అ= అడవులలోనే; ఎట్లు నిలిచిరి?= ఎట్లున్నారు?; ననున్+పెట్టి= నన్నిక్కడ వదలిపెట్టి; నా+ఎదన్+కొనుచున్+చనిరి= నా హృదయాన్ని తమ వెంట తీసికొని వెళ్ళారు; ఏను వడ్డింపంగన్= నేను వడ్డన చేయగా; ఇంపు+ఆరన్+కుడిచి= కమ్మగా కడుపార భుజించి; మెత్తని సెజ్జన్= మృదువైన పాన్పుల మీద; నిద్రించి= నిదురపోయి; వినుత= కొనియాడదగిన; భద్రగాన= మంగళ గానాల చేతను; కరిబృంహితములన్= ఏనుగుల ఘీంకార ధ్వనుల చేతను; మేల్కాంచునట్టివారు= కనులు తెరచునట్టివారు; కందమూలంబులు= గడ్డలు; వేళ్ళు; ఆహారములుగన్= భోజనంకాగా; పొదలన్= పొదలలో; పుట్టలన్= పుట్టలమీద; పడియుండి= నివసిస్తూ; పులుఁగు మెకములు= పక్షులు, జంతువులు; అఱవన్= అరవగా; మేల్కనుచున్+ఉండిరే?= మేల్కొనుచున్నారా?; అక్కట+అకట!= అయ్యయ్యో! (వారికెన్ని కష్టాలు వచ్చాయి.)

తాత్పర్యం: 'కృష్ణా! నీ కట్టుబాటులో పెరిగిన వారగుటచే పాండవులు నీతిమంతులు, పుణ్యపరులు, వీరులు అయినారు. వారు ఇరుగెలంకులజేరి పెక్కుమంది సేవిస్తుండగా సుఖంగా నుండవలసినవారు కష్టాలనుభవిస్తూ నిర్మానుష్యాలైన అరణ్యాలలో ఎట్లా నివసించారో! నన్నిక్కడ విడిచిపెట్టి నా హృదయాన్ని తమవెంట కొనిపోయారు. నేను వడ్డిస్తుంటే కడుపారా కమ్మగా తిని మెత్తని పాన్పుల మీద నిదురించి మాగధుల మంగళ గానాలతో, భద్రగజాల ఘీంకార ధ్వనులతో మేల్కొనునట్టి నా బిడ్డలు పొదలలో గుట్టలలో పడియుండి పక్షుల కూతలకు, జంతువుల అరపులకు మేల్కొంటున్నారు గదా! అయ్యో, వారి కెన్ని కష్టాలువచ్చాయి?

విశేషం: అలం: విషమం. కుంతీదేవి వేసిన కుశల ప్రశ్నలలో ఒక మర్యాద. సంస్కృతి, మాతృప్రేమావిష్కార క్రమం గోచరిస్తుంది. కొడుకుల శీలం వీరమాతకు ప్రథమ గణ్యమైన కుశలాంశం. ఆ తరువాత వారి సుఖజీవన విధానాన్ని గురించిన విశేషం తెలిసికొనగోరుతుంది. ఆ తరువాత తన పెంపకంలో తాను చూపిన వాత్సల్యం. వారు పొందిన సుఖాలను గురించి సంస్మరణం తల్లి అడుగుతుంది. తల్లి లాలించటం, అన్నం పెట్టటం, నిద్రపుచ్చటం, నిద్రలేపటం మొదలైన సేవలు చేసి పిల్లలను పెంచుతుంది. వాత్సల్యపూర్ణంగా అవన్నీ పిల్లలు కలకాలం అనుభవించాలని ఆశిస్తుంది. కుంతి ఈ పద్యంలో వీటిని ప్రస్తావించటం సహజం. కుశల ప్రశ్నలలో తొలుత నిలిచే చల్లని మాటలివి. (సంపా.)

ఆ. **తండ్రిలేని ప్రజలు తల్లిని బాసి పె । ద్దయునుగాల మివ్విధమునఁ బడిరి**
భంగపాటు దుఃఖపాటును సంకట । పాటు గలిగె విరటు పాలఁ బిదప.' **184**

ప్రతిపదార్థం: తండ్రి లేని ప్రజలు= తండ్రిని కోల్పోయిన బిడ్డలు; తల్లినిన్+పాసి= తల్లిని గూడా విడిచి; పెద్దయును+కాలము= చాలా కాలము; ఈ+విధమునన్= ఈ రీతిగా; పడిరి= కష్టాలనుభవించారు; పిదపన్= అరణ్యవాసమైన తరువాత; విరటుపాలన్= విరటుడి దగ్గర; భంగపాటు= అవమానం; దుఃఖపాటు= దుఃఖాలనుభవించటం; సంకటపాటు= చిక్కులలో పడటం; కలిగెన్= సంభవించాయి.

తాత్పర్యం: తండ్రి లేని పాండవులు తల్లినైన నన్ను కూడా విడిచి చాలా కాలం ఈ విధంగా అడవులలో కష్టాలు అనుభవించారు. ఆ పిదప విరటుడికడ వారికి భంగపాటు, దుఃఖపాటు, సంకటపాటు కలిగాయి.'

విశేషం: పాండవులు పొందిన కష్టాలను మూడంచెలుగా భావించిందా తల్లి. 1. తండ్రి పోయిన తరువాత పాండవులు భంగపాటు పొందారు. రాజ్యభాగ ప్రసక్తిగాని, రాజ్యాన్ని కోల్పోయే ప్రసక్తిగాని, దుర్యోధనాదుల వలన కలిగే అవమానాలుగాని పాండురాజు బ్రతికి ఉంటే జరిగేవి కావు. కాబట్టి, తండ్రిలేని పిల్లలు కాబట్టే రాజ్యాన్ని కోల్పోయి అరణ్యాజ్ఞాతవాసాలు చేసే అవమానం కలిగింది.

2. పాండవులు తల్లిని వదలి ఎన్నడూ లేరు. కాని, అరణ్యవాసానికి వెళ్లుతూ ఆమెను వదలి వెళ్ళవలసి వచ్చింది. ఆ వియోగం తల్లికీ, బిడ్డలకూ దుఃఖతీవ్రతను కలిగించింది.

3. ఇక అజ్ఞాతవాసకాలంలో విరాటనగరంలో పాండవులు ఎన్నో చిక్కులు పడవలసి వచ్చింది. తండ్రి లేని పిల్లలు అందరికీ లోకువ. తల్లికి దూరమైన పిల్లలు ఆదరానికి దూరమైనవారు. అజ్ఞాతవాసంలో దినదినగండంగా బ్రదుకవలసి వస్తుంది. ఆ అవస్థలను తలచుకొన్న తల్లి- కుంతి తల్లడిల్లిపోయింది. (సంపా.)

వ. అని వెండియు. **185**

తాత్పర్యం: అని, మరల.

ఉ. 'దానదయాపరుం డయిన ధర్మతనూభవు సేమ మెట్లు? పం
చాననవిక్రముం డగు బకారికి భద్రమె? యస్త్ర శస్త్ర వి
ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ గవల్ సమా
ధాన సమేతులే? యకట! ద్రౌపది సాధ్వి; సుఖంబె దానికిన్? **186**

ప్రతిపదార్థం: దానదయాపరుండు+అయిన= దానదయా గుణాలలో శ్రద్ధ గల్గిన; ధర్మ తనూభవు= ధర్మజుడియొక్క; సేమము+ఎట్లు?= క్షేమమెట్లా ఉన్నది?; పంచ+ఆనన విక్రముండు+అగు= సింహపరాక్రమంతో సమానమైన పరాక్రమం కల్గిన; బక+అరికిన్= బకాసురుడిని సంహరించిన భీమసేనుడికి; భద్రమె?= కుశలమా?; అస్త్ర శస్త్ర విద్యానిపుణుండు= బాణవిద్యలలో ఆయుధ విద్యలలో నేర్పరి అయిన; క్రీడి= అర్జునుడు; సుఖియా?= హాయిగానున్నాడా?; వినయ+ఆభరణుల్= అడకువయే సొమ్ములుగా గల్గిన; కవల్= అమడలు - నకుల సహదేవులు; సమాధాన సమేతులు+ఏ= శాంతితో కూడిఉన్నారా?; అకట!= అయ్యో! ద్రౌపది= ద్రుపద పుత్రి; సాధ్వి= పతివ్రత; దానికిన్+సుఖంబె?= ఆమెకు సౌఖ్యమేనా?

తాత్పర్యం: దానదయాగుణాలుగల ధర్మజునకు క్షేమమా? సింహపరాక్రముడైన భీమసేనుడికి కుశలమా? అస్త్రశస్త్ర విద్యలందు ఆరితేరిన అర్జునుడు హాయిగా ఉన్నాడా? వినయాలంకృతులైన నకుల సహదేవులు నెమ్మదిగా ఉన్నారా? అయ్యో! పాంచాలి పరమ సాధ్వి- ఆమె సుఖంగా ఉన్నదా?

విశేషం: పిల్లల క్షేమం గురించి అడిగేటప్పుడు తల్లి వారి అసలు పేర్లు పేర్కొనకుండా, ముద్దుపేర్లుకాని, బిరుదనామాలుకానీ, ఆత్మీయముద్రతో పిలిచే పిలుపులు గాని పలకటం లోకసహజం. దాని కనుగుణంగా ధర్మతనూభవుడు, బకారి, క్రీడి, కవలు - అనటం గమనించదగింది. వారిని ఆమెకు నచ్చిన, ఆమె మెచ్చిన గుణాలతో విశేషించి పేర్కొనటం ఆమె అభిమానానికి నిదర్శనం. వీరమాతలు పిల్లల యోగక్షేమాల నడిగే నమూనా పద్యమిది. కోడలిని పేరు పెట్టి పిలిచి, సాధ్విగా గౌరవించటం ఆదరాభిమానాలకు సాక్ష్యం. దాదాపు 25 శ్లోకాలలో కొడుకులను గురించి అడిగిన మూలంలోని కుంతి బావురుమన్నట్లుంటుంది. తిక్కన తీర్చిదిద్దిన కుంతి నిర్వేదాన్ని కూడా నిబ్బరంగా ప్రదర్శించగలిగింది. (సంపా.)

చ. కొడుకుల కంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ గోడలుం
గొడుకులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁ జేయుచుండు నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్. 187

ప్రతిపదార్థం: కొడుకుల కంటెన్= కుమారుల కంటెను; ఆ+అనుఁగు కోడలికిన్= ఆ కూర్మి కోడలికి; ఎక్కుడు కూర్తున్= నేను మిక్కిలి ప్రియపడుదును; కొడుకులు చేయు భక్తికిన్= కుమారులు కనబరచే పరమప్రేమకు; అట కోటి మడుంగులు భక్తిన్= అంతకు కోటి రెట్లు భక్తిని; నాకున్= నాకు; ఎప్పుడున్= ఎల్లవేళలందును; తగన్= చక్కగా; చేయుచున్+ఉండున్= ఆమె సలుపుతుంటుంది; అది పుణ్యచరిత్ర= ఆమె పవిత్రమైన నడవడి గలది; కుల+అగ్రగణ్యా= వంశములో తొలుత లెక్కించ దగినది; క్రొత్తడి= మగనాలు; సకలంబున్+చూడన్= అందరూ చూస్తూఉండగా; సభన్= కురుసభలో; దైన్యమున్+ పొందుట చూచి= దీన దశ పొలవటం చూచి; పొక్కితిన్= దుఃఖించాను.

తాత్పర్యం: కొడుకుల కంటె కోడలు అంటే నాకు చాలా ఇష్టం. కుమారులు చూపు ప్రేమ కంటె కోటి రెట్లు భక్తితో ఆమె నాకు సేవలు చేస్తుంది. పాంచాలి పవిత్రమైన నడవడి కలది. కులంలో వన్నె కెక్కింది. ఆ మగనాలు అందరు చూస్తుండగా కురుసభలో అంతటి దైన్యం పొందటం చూచి దుఃఖపడ్డాను.

విశేషం: కోడలిని మెచ్చుకొనే అత్త గుణవంతురాలు. కుంతి కోడలిని ఉత్తమురాలని ప్రశంసించింది. ఆమెను మనసారా ప్రేమించింది. కొడుకులకంటె ఆమెకు కోడలే ప్రీతిపాత్రురాలట! ద్రౌపది కుంతిని భక్తితో సేవించేదట! ఆమె పుణ్యచరిత్రట! కులాగ్రగణ్యట! మగనాలట! అంతటి అనురాగవతికి అంతటి అవమానం జరిగినందుకు ఆవేదన పడింది. ఈ పద్యం ఒక సత్యాన్ని బైటపెట్టింది. పాండవపక్షం వారందరిలో అగ్నివలె గుండెలను మండిస్తున్నది- కురుసభలో ద్రౌపది పొందిన అవమాన దుఃఖం. ద్రౌపది ఒకవైపు గర్వకారణం. మరొకవైపు జాలికి తావలం. (సంపా.)

తే. నాఁడు ద్రౌపది వడిన బన్నములు సూడ । నోర్చినప్పుడ యెంతకు నోర్వఁ జెపుమ
యంత గడచిన దుఃఖంబు లనుభవింపఁ । గలవె లోకంబువారికిఁ గమలనాభ! 188

ప్రతిపదార్థం: కమలనాభ!= పద్మం నాభియందుగలవాడా!; కృష్ణా; నాఁడు= ఆనాడు; ద్రౌపది+పడిన బన్నములు= ద్రౌపది పొందిన అవమానాలను; చూడన్+ఓర్చిన+అప్పుడు+అ= చూచి సహించ జాలినప్పుడే; ఎంతకున్+ఓర్వన్?= ఎంతకైనా భరించలేనో; చెపుము= పల్కుమా!; (ఎన్నిటినైన భరింపగలనని అర్థం); లోకంబు వారికిన్= లోకులకు; అంత+కడచిన దుఃఖంబులు= ఆమె అనుభవించిన దుఃఖాల కంటె మించిన దుఃఖాలు; కలవె!= ఉన్నవా? (లేవని భావం.)

తాత్పర్యం: ఆనాడు పాంచాలి పొందిన అవమానాలు చూచి సహింపజాలిన నేను ఎంతకైనా ఓర్చుకోగలను. ఆమె అనుభవించిన కష్టాలను మించిన కష్టాలు లోకంలోని వారెవ్వరూ అనుభవించి ఉండరు.

విశేషం: ద్రౌపది పొందిన కష్టాలు మరెవ్వరూ లోకంలో అనుభవించి ఉండరని చెపుతూనే ఆ కష్టాలను చూచి సహించి ఇంకా బ్రతికి ఉన్న తాను మరెన్ని కష్టాలనైనా ఓర్చుకొనగలనని తన దుర్భర మనోవేదనను ధ్వనిమయంగా వ్యక్తం చేసింది కుంతి. సంధి మాటలలో శాంతి ప్రసంగాలలో కూడా మరువ లేని బడబాగ్ని వంటి బాధ ద్రౌపది మీది సానుభూతి. (సంపా.)

వ. అట్టి యెడ. 189

తాత్పర్యం: ఆ సమయాన.

క. విదురుం డొక్కఁడు దక్కఁగ । సదస్యు లెవ్వరును ధర్మసంక్షయ మిది కూ
డదు నార; యతని శీలమ । కుదు రీ లోకమున కింతకుం దలఁపంగన్." 190

ప్రతిపదార్థం: విదురుండు+ఒక్కఁడు+తక్కఁగన్= విదురు డొక్కడు తప్ప; సదస్యులు= సభలో ఉన్నవారు; ఎవ్వరును= ఒక్కరైనను కూడ; ఇది ధర్మ సంక్షయము= ద్రౌపదీ వస్త్రాపహరణం ధర్మమును నశింపజేస్తుంది; కూడదు= ఇట్టి నీచపు పని తగదు; నారు+అ= అనరు; తలఁపంగన్= ఆలోచించగా; ఈ లోకమునకున్+ఇంతకున్= ఈ జగమున కంతటికినీ; అతని శీలము+అ= ఆతడి వర్తనమే; కుదురు= ఆధారం.

తాత్పర్యం: విదురు డొక్కడు దప్ప నాటి సభలోని వారిలో ఒక్కరైనా పాంచాలిని పరాభవించటం ధర్మ వినాశక కృత్యం; ఇది తగదు అని పల్కినవారు కారు. ఆలోచించగా విదురుడి సత్స్వభావమే ఈ జగత్తుకంతా ఆదర్శప్రాయం.

వ. అని యివ్విధంబునఁ గృష్ణుతోడఁ దన యుమ్మలికంబు లన్నియుఁ ద్రవ్వికొని శోకంబు వెల్లిగొనఁ గొండొక దిగం బాఱెడు చిత్తంబుతో మఱియు నిట్లనియె; 191

ప్రతిపదార్థం: అని; ఈ+విధంబునన్; కృష్ణుతోడన్; తన+ఉమ్మలికంబులు= తన దుఃఖాలు; అన్నియున్+త్రవ్వికొని= అన్నింటినీ స్మృతికి తెచ్చుకొని; శోకంబు= దుఃఖం; వెల్లిగొనన్= పొంగిప్రవహించగా; కొండొక దిగన్+పాఱెడు చిత్తంబుతోన్= కొంచెం క్రుంగిపోతున్న మనస్సుతో; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఈ విధంగా మేనల్లుడైన శ్రీకృష్ణుడితో తన దుఃఖాలన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకొని శోకం వెల్లివిరియగా కొంచెం క్రుంగిన మనస్సుతో మళ్ళీ ఇట్లా అన్నది:

క. 'ఇది యెల్లను నొకతల; యీ । పదు మూఁ డేఁడులును నాకు బావకొడుకుచే
నదయమగు కూడుగుడుచుట । యది యొక తలయయ్యె; నేమి యనఁగల దనఘా! 192

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యపురుషా!; ఇది+ఎల్లను+ఒకతల= ఈ కష్టాలన్నీ ఒక ఎత్తు; ఈ పదుమూఁడు+ఏఁడులును= ఈ పదమూడు సంవత్సరాలూ; నాకున్= నాకు; బావకొడుకుచేన్= బావ కుమారుడైన దుర్యోధనుడిచేత; అదయము+అగుకూడు= దయలేని అన్నం; కుడుచుట+అది= తినటంఅన్నది; ఒక తల+అయ్యెను= ఒక యెత్తైనది; ఏమి+అనన్+కలదు?= చెప్పటాని కింకే మున్నది?

తాత్పర్యం: కృష్ణా! ఈ పడిన కష్టాలు, అనుభవించిన దుఃఖాలు అన్నీ ఒక యెత్తు. ఈ పదమూడేళ్ళూ నాకు బావ కొడుకు పెట్టే దయమాలిన తిండి తినటం ఒక యెత్తుగా ఉన్నది. నే నేమి చెప్పగలనయ్యా?

విశేషం: కుంతి అభిమానవతి. అందుకే పదమూడేళ్ళు పరాయి పంచలో ఉండటంతోపాటు బావ కొడుకైన దుర్యోధనుడు నిర్దయగా, పరుషంగా వ్యవహరిస్తూ పెట్టుతున్న తిండి తినటం ఆమె భరించలేకపోయింది. 'ఏమి యనగలదు అనఘా!' అనే వాక్యం ఆమె దైన్యావస్థ యొక్క పరాకాష్ఠ! 'బావకొడుకు' అనే మాట సార్థకం. సొంత కొడుకులుండి కూడా బావగారి కొడుకు పెట్టే తిండి తినవలసి వచ్చిందని ఒక దైన్య భావం. 'దుర్యోధనుడి' పేరుచ్చరించని అనిష్టం అందులో వ్యంగ్యం. (సంపా.)

క. తన్నుఁ దన తమ్ములను నా । కన్న కొడుకు లట్ల తలఁతుఁ గాని విభేదం
బెన్నఁడు నా మది లేమికి । వెన్నుఁడ దైవంబు సాక్షి వినుము పలికెదన్. 193

ప్రతిపదార్థం: తన్నున్= ఆ దుర్యోధనుడినీ; తన తమ్ములను= అతడి సహోదరులనూ; నా కన్నకొడుకులు+అట్ల+ తలఁతున్+కాని= నా కడుపున గన్నబిడ్డలైన పాండవులవలెనే భావిస్తానుగాని; విభేదంబు= వ్యత్యాసం; ఎన్నఁడున్= ఎప్పుడూ; నా మదిన్+లేమికిన్= నా మనసులో లేనందుకు; వెన్నుఁడ= ఓ విష్ణుమూర్తీ!- కృష్ణుడా!; (దైవంబు సాక్షి= ఇందుకు దేవుడే సాక్షి.) పలికెదన్ వినుము= చెప్పుతున్నాను వినుము.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనుడినీ, అతని తోబుట్టువులనూ నా కడుపున గన్న కొడుకులవలెనే చూస్తాను గాని భిన్నంగా చూడను. నాకు భేదబుద్ధి లేనందుకు ఆ దేవుడే సాక్షి అని చెపుతున్నాను వినుము.

విశేషం: కుంతీదేవి పాండవ కౌరవులను సమదృష్టితో చూచేది. కాని, కౌరవులు మాత్రం తననూ, తన బిడ్డలనూ వేరుగా చూచారని మనోవేదన. ఆమె చిత్తశుద్ధికి దైవం సాక్ష్యం- అనటం జాతీయం. (సంపా.)

క. ఇది నిక్కం బగునేనియుఁ । దుది నీవుం బాండవులను దురితరహితులై
ముదమందఁ జూడఁగనియెద; । నది దీనికి మందు సువ్వె యంబుజనాభా! 194

ప్రతిపదార్థం: అంబుజనాభా!= పద్మము నాభియందు గలవాడా!; ఇది నిక్కంబు+అగున్+ఏనియున్= ఈ మాటలే నిజమైతే; తుదిన్= చివరకు; నీవున్= నీవున్నూ; పాండవులును= పాండవులున్నూ; దురితరహితులు+ఐ= పాపంలేనివారై; ముదము+అందన్= సంతోషం పొందగా; చూడన్+కనియెదన్= చూడటానికి నోచుకొంటాను; అది= అట్లా మీరు ఆనందంతో ఉండటం; దీనికిన్+ మందు+చువ్వె!= నా ఇప్పటి మనోవ్యథకు ఔషధం ఔతుంది సుమా!

తాత్పర్యం: కృష్ణా! నా మాట సత్యమైతే కడపటికి నీవూ పాండవులూ దోషాలంటనివారై ఆనందించగా చూడనోచెదను. ఇప్పటి నా హృదయ వ్యథకు మీరు పరమానందంతో ఉండగా చూడటమే ఔషధం సుమా!

విశేషం: 1. పాండవులను కౌరవులను సమంగా చూడటం అనేది నిజమే అయితే పాండవులు నిందలపాల్గాక, విజయులై తిరిగి వస్తారని ప్రమాణం చేసింది. ఇదీ దేశీయాచారమే.

2. అన్ని బాధలకూ నివారణశక్తి శ్రీకృష్ణుడే అని నమ్మి భక్తి విశ్వాసాలను ప్రదర్శించే కుంతీస్వభావం ఇందులో విశదం. (సంపా.)

సీ. బావ యొప్పం డనుపలుకుల నేమగు? । నాతని కొడుకుఁ గీడాడనేల?
కురువృద్ధుఁడగు బాహ్లికుని దూఱ నేటికి? । భీష్మునిపైఁబ్రయి వెట్టనగునె?
యిట్టి క్రూరుల యింటి కిచ్చిన మనవారి । నందుఁగా కట్లు దాననుటమేలె?
యర్జును పుట్టిన యప్పుడు 'వీఁడు లో । కము లెల్ల గెల్చు పొగడ్త మొగులు

తే. ముట్టు నట్టిద యగు, రణమున జయించు । గౌరవుల; సోదరులుఁ, దాను భూరి రాజ్య
గౌరవముఁ బొందు' నని యశరీరవాణి । పలికె; నది తిట్టుపడుఁగాక పలయునేని. 195

ప్రతిపదార్థం: బావ+ఒప్పండు+అనుపలుకులన్= ధృతరాష్ట్రుడు మా మేలు సహించలేడు అనే మాటల వలన; ఏమి+అగున్?= ఏమి ప్రయోజనం?; ఆతని కొడుకున్= అతడి పుత్రుడైన దుర్యోధనుడిని; కీడు+ఆడన్+ఏల?= నిందించటమెందుకు?; కురువృద్ధుఁడు+అగు= కౌరవులలో పెద్దవాడైన; బాహ్లికునిన్= బాహ్లికుడిని; దూఱన్+ఏటికిన్?= తిట్టటం ఎందులకు?; భీష్మునిపైన్= పితామహుడిమీద; ప్రయి+పెట్టన్+అగునె?= నింద మోపవచ్చునా?; ఇట్టి క్రూరులు+ఇంటికిన్= ఇట్టి కఠినాత్ముల యొక్క గృహానికి; ఇచ్చిన= నన్ను కోడలిగా చేసిన; మనవారిన్= పుట్టింటివారిని; అందున్+కాక= అంటానే అనుకో; అట్లు= ఆ విధంగా; తాన్= నేను; అనుట మేలె?= నిందించటం న్యాయమా? (కాదని భావం); అర్జును పుట్టిన+అప్పుడు= అర్జునుడు జన్మించిన సమయంలో; వీఁడు= పార్థుడు; లోకములు+ఎల్లన్= జగములన్నిటిని; గెల్చు= జయిస్తాడనే; పొగడ్త= ప్రశంస; మొగులు ముట్టినట్టిది+అ+అగున్= మేఘమండలం తాకునటువంటి దౌతుంది; రణమునన్= కదనంలో; కౌరవులన్+జయించున్= దుర్యోధనాదులను గెలుస్తాడు; సోదరులున్= తోబుట్టువులూ; తానున్= తానూ; భూరి రాజ్యగౌరవమున్+పొందున్= గొప్ప రాజ్యం ఏలుట వలని గొప్పతనమును పొందుతాడు; అని= అంటూ; అశరీరవాణి= అశరీరవాక్కు; పలికెన్= పల్కింది; పలయున్+ఏనిన్= కావలసివస్తే; అది= అశరీరవాణి; తిట్టుపడున్+కాక!= నిందించబడుగాక!

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పాండవుల మేలోర్చువాడు కాడని అనటంవలన ఏమి లాభం? అతని కొడుకు దుర్యోధనుడిని తిట్టటం వలన ప్రయోజనమేముంది? కౌరవులలో పెద్దవాడగు బాహ్లికుడిని నిందించడం దేనికి? భీష్ముడి మీద తప్పు మోపటం న్యాయమా? ఇట్లాంటి కఠినచిత్తుల ఇంటికి నన్ను కోడలిని చేసిన నా పుట్టింటివారినే దూషించాలి. అట్లా దూషించటం కూడా సమంజసం ఔతుందా? పార్థుడు జన్మించినవేళ 'ఇతడు లోకాలన్నీ జయిస్తాడనే కీర్తి మేఘమండల మంటుతుంది. ఇతడు కౌరవులను యుద్ధంలో గెలుస్తాడు. తానూ, తన తోబుట్టువులూ భూరి సామ్రాజ్యాధిపత్య గౌరవం పొందుతారు' అని అశరీరవాణి పలికింది. అవసరమైతే ఇట్లా నుడివిన ఆ అశరీరవాణినే నిందించాలి. మరెవ్వరినీ కాదు.

విశేషం: కుంతీదేవి మెత్తని హృదయం గల తల్లియే కాదు, కడుపులోని బాధను గడుసుదనంతో చెప్పగల గడుసరి కూడా. శ్రీకృష్ణుడి బహిఃప్రాణమైన అర్జునుడు పుట్టినప్పుడు ఆకాశవాణి పలికిన పలుకుల వైపు శ్రోత మనస్సును మళ్ళించి గ్రుచ్చుకొనేటట్లు చెప్పటానికి. 'నేతినేతివాదం' వలె- ధృతరాష్ట్రుడిని అనటం ఎందుకు? దుర్యోధనుడిని అనటం ఎందుకు? అని వరుస మొదలు పెట్టింది. ఆ మాట నిజానికి శ్రీకృష్ణుడి మనస్సుకు గ్రుచ్చుకొనాలని అన్నదే. (సంపా.)

వ. ధర్మంబు గలుగునే నది నిక్కంబయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె! నీ మన్నించు
నెచ్చెలులకుం జెప్పెడు మాటలు గలవు విను; మయ్యుధిష్ఠిరునితో నిట్లనుము; 196

ప్రతిపదార్థం: ధర్మంబు కలుగునేన్= లోకంలో ధర్మమున్నట్లయితే; అది నిక్కంబు+అయ్యెడున్= అశరీరవాణి మాటలు యథార్థాలవుతాయి; దానికిన్+ఎల్లను= ఆ ధర్మానికంతటికినీ; నిర్వాహకుండవు= ప్రవర్తిల్ల చేసేవాడవు; నీవు+కలవు+కాదె!= నీవున్నావు గదా!; నీ మన్నించు నెచ్చెలులకున్= నీ వాదరించే నీ ప్రియమిత్రులైన పాండునందనులకు; చెప్పెడు మాటలు+కలవు= చెప్పవలసిన మాట లున్నాయి; వినుము= ఆలింపుము; ఆ+యుధిష్ఠిరునితోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనుము= ఈ విధంగా చెప్పు.

తాత్పర్యం: లోకంలో ధర్మ మున్నట్లయితే అశరీరవాణి చెప్పినదే సత్యమవుతుంది. కృష్ణా! ధర్మోద్ధారకుడవు నీవున్నావు. నీవు మన్నించే నీ అనుగు నెచ్చెలికాంద్రకు చెప్పవలసిన మాట లున్నాయి. వినవలసింది. ముందుగా ధర్మతనయుడితో ఇట్లా చెప్పుము:

విశేషం: 1. ధర్మముంటే దేవతల మాటలు నిజమౌతాయట! అన్నిటికీ నిర్వాహకుడైన శ్రీకృష్ణుడే ఉన్నాడట! ఈ దృఢ నిశ్చయమే ఆమెను ధర్మశీలనుగా నిలిపింది. ఆమె కొడుకులను ధర్మమార్గంలో నడిపింది.

2. కొడుకుల స్వభావాలను బట్టి ఎవరెవరికి ఎటువంటి సందేశమివ్వాలో తెలిసిన వివేకవతి అయిన వీరమాత కుంతి.

3. ఉపప్లావ్యంనుండి వచ్చిన కృష్ణుడు పాండవ దూత. హస్తినాపురంనుండి తిరిగి వెళ్ళే శ్రీకృష్ణుడు కుంతీదూత. (సంపా.)

క. వేఁడికొని కృపణులై కను । పోఁడిమి యది యేల రాజపుత్రులు దమ మై
వాఁడిమి దప్పిన నిప్పులు । వేఁడిమి సెడినట్లు జనులు విని యులుకుదురే? 197

ప్రతిపదార్థం: కృపణులు+ఐ= దీనులై; వేఁడికొని= ప్రార్థించి; కనుపోఁడిమి= పొందునట్టి సంపద; అది+ఏల?= అదెందుకు?; రాజపుత్రులు= క్షత్రియకుమారులు; తమ= తమయొక్క; మైవాఁడిమి= శరీరమందలి ప్రతాపం; తప్పినన్= విడిచినయెడల; నిప్పులు= అగ్నులు; వేఁడిమి చెడిన+అట్లు= వేడిమిని గోల్పోయినట్లే అగును; జనులు విని= ప్రజలు అట్టి ప్రతాపహీనుల ఆజ్ఞ లాలించి; ఉలుకుదురే?= జంకుదురా? (జంకరని అర్థము.)

తాత్పర్యం: దీనులై యాచించి గడించిన సంపద లెందుకు? క్షత్రియ కుమారులు ఒడలిలో తేజం కోల్పడితే నిప్పులు వేడిమిని విడిచినట్లే అవుతుంది. మగటిమి లేనివారి మాటలకు జనులు జంకుతారా?

విశేషం: అలం: ఉపమ. ఇది ధర్మరాజున కిచ్చిన సందేశం. అతడిని మూడు విధాల మందలించింది కుంతి. 1. నీకు రావలసిన రాజ్యభాగాన్ని దీనుడివలె యాచించటం తప్పు. అట్లా భిక్షాదానంగా వచ్చే రాజ్యాన్ని స్వీకరించటం తప్పు- అని మొదటి హెచ్చరిక. కపట ద్యూతంలో రాజ్యసంపద కోల్పోయినప్పుడు ద్రౌపదికి వరంగా ధృతరాష్ట్రుడు దానిని తిరిగి ఇచ్చాడు. అరణ్యాజ్ఞాతవాసాలు ముగిసిన తరువాత కూడ మరల ధృతరాష్ట్రుడి దయ కొరకు, దుర్యోధనుడి సుముఖత కొరకు ఇంత దీనంగా అడగటం అవమానం. అడగటంలో కూడా ఆత్మగౌరవం ఉండాలి. రాజ్యభాగం ఇవ్వకపోయినా అయిదూళ్ళు ఇస్తే చాలని కోరటం మరీ అవమానం- అని హెచ్చరించింది.

2. క్షత్రియులు ప్రతాపాన్ని విడిచిపెడితే వేడిలేని అగ్నులవలె మారి శత్రువులను తపింపచేసే శక్తిని కోల్పోతారు. కాబట్టి యుద్ధంలో పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని పొందండి. క్షత్రియ ధర్మాన్ని రక్షించండి. యుద్ధం కంటె శాంతి మేలు అని భావిస్తున్న ధర్మజుడిని యుద్ధోన్ముఖుడిగా చేయాలన్న వీరమాత ప్రబోధ మిది.

3. ఒకవేళ ప్రతాపరహితులై యాచించి, రాజ్యాన్ని పొందినా జనులు ఆ రాజులను గౌరవించరు. కాబట్టి అటువంటి రాజ్యసంపదను పొందినా ప్రభుత్వాన్ని నిలుపుకొనటం కష్టం.

4. తాత్పర్య మేమంటే- 'దైన్యాన్ని వదులు. క్షత్రియోచిత పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని సాధించు. ప్రజల ఆదరాభిమానాలను పొందు.' ఈ మూడూ పరస్పరాశ్రితాలైన గుణాలు. ఏ ఒకటి లేకపోయినా మిగిలినవి దక్కవు అని శాంతికాముకుడైన ధర్మజుడు పౌరుషాగ్నితో ప్రజ్వలించేటట్లు పలికింది. అయితే, ధర్మజుడు సూక్ష్మగ్రాహి కాబట్టి సందేశాన్ని మృదువుగా, వ్యంగ్యంగా, మనసు నొవ్వకుండా చెప్పింది.

5. కుంతి మనసులో పడుతున్న వేదనకు ఈ మాటలు అక్షరదీపికలు. వీరులను కన్న రాజమాత తన కొడుకులు వీరులుగానే బ్రతికి తనకు గౌరవం తేవాలని అనుకొనటం సహజం. కాని, ధర్మజుడు ధర్మనీతిలో భాగంగా చతుర్విధోపాయాలను ప్రదర్శిస్తూ సంధియత్నం చేస్తున్నాడే కాని, పౌరుషహీనుడై కాదన్న సత్యం గమనార్హం. (సంపా.)

వ. భీమార్జునుల కిట్లని చెప్పుము: 198

తాత్పర్యం: భీముడికి, అర్జునుడికి ఇట్లా చెప్పుము:

ఆ. కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి? । నట్టిపనికి నుచితమైన సమయ
మొదవెఁ; దడయుటింక నొప్పదు; జనములు । నట్లుగాని పురుషు లనరు మిమ్ము. 199

ప్రతిపదార్థం: రాచకూఁతురు= క్షత్రియపుత్రి; ఏ+దానికిన్= దేనికొరకు; కొడుకున్+కాంచున్= కుమారుడిని కంటుందో; అట్టిపనికిన్= అట్లాంటి యుద్ధ కార్యానికి; ఉచితము+ఐన+సమయము+ఒదవెన్= తగిన వేళ వచ్చింది; ఇంకన్= ఇటమీదట; తడయుట= ఆలసించటం; ఒప్పదు= తగదు; అట్లు+కాని= అప్పుడు తప్ప; జనములు= ప్రజలు; మిమ్మున్= మిమ్మలను; పురుషులు+అనరు= మగవారని చెప్పరు.

తాత్పర్యం: క్షత్రియకన్య పెండ్లాడి కొడుకును ఏ కార్యానికై కంటుందో, అట్టి ప్రతాపప్రదర్శనకు తగిన అదను సంప్రాప్తించింది. ఇక ఆలసించటం తగదు. అప్పుడుగాని మిమ్మల్ని ప్రజలు మగవారని అనరు సుమా!

విశేషం: 1. కుంతీదేవి తన కొడుకులలో ధర్మజుడిని ప్రత్యేకంగా, ప్రజ్ఞావంతుడైన మనీషిగా భావించి గౌరవిస్తుంది. ఆ తరువాత భీమార్జునులను ఒక జంటగా, నకుల సహదేవులను ఒక జంటగా భావిస్తుంది. ద్రౌపదిని ప్రత్యేకంగా సంభావిస్తుంది. ఈ స్వభావం ఈ సందర్భంలో స్పష్టమౌతున్నది.

2. ధర్మజుడు నీతిజ్ఞుడు కాగా, భీమార్జునులు గదాగాండీవాలతో ప్రసిద్ధి కెక్కిన శస్త్రజీవులు. నిజానికి క్షత్రియ వనిత యుద్ధంలో సాటిలేని మేటి వీరులను కనాలనీ, వారు రణరంగంలో తమ మగతనం ప్రదర్శించి తమకు, తనకు పేరు తేవాలనీ అనుకొంటుంది. తల్లి కలలు కని కన్న వీరసంతానం భీమార్జునులు. ఆ కలలు నిజం చేయటం వారి ధర్మమని హెచ్చరిక. ఆమె కోర్కెను తీర్చకపోతే వారు వీరులు కాదు, ఆమె వీరమాత కాజాలదు- అని నిష్ఠురం.

3. యుద్ధం చేసి పౌరుషాన్ని ప్రదర్శించకపోతే వారిని పురుషులని లోకం గుర్తించదట! ఇది చాలా నిష్ఠురమైన మాట. మరీ, బృహన్నలగా అజ్ఞాతవాసం చేసిన అర్జునుడికి గుచ్చుకొనే మాట! తెలుగులో 'మిమ్మలిని మగవా రనరు' అనే తిట్టు జాతీయం. బలపరాక్రమమే తమ అస్తిత్వంగా బ్రతికే కొడుకులను ఉత్తేజపరిచే వాఙ్మయ శిల్పం తెలిసిన వీరమాత కుంతి.

4. భీమార్జునులు కీచకవధలోనూ, దక్షిణ ఉత్తర గోగ్రహణ ఘట్టంలోనూ తమ పౌరుషాన్ని ప్రదర్శించే ఉన్నారు. కాని, ఆమె వాటిని గుర్తించినట్లు చెప్పకపోవటం గడుసుదనం. ఆ యుద్ధాలు పాండవులు ఆత్మరక్షణ కొరకు చేసినవి. కాని, మాతృమూర్తిని వీరమాతగా చేయాలంటే కౌరవులపై యుద్ధం చేసి తమ శస్త్రాస్త్రబల సంపదను ప్రదర్శించి పురుషులనిపించుకొన్నప్పుడే సాధ్యమౌతుందని హెచ్చరిక చేసింది. ఆలసించవద్దని ప్రేరేపించింది.

5. భీమార్జునులకు ధర్మరాజుకు వలె సున్నితంగా చెప్పలేదు. బాణంతో గుచ్చినట్లు మాట్లాడింది. మగతనం- అనే మాట వారి మనసులపై దెబ్బకొట్టుతుంది. ఆకలి తెలిసి అన్నం పెట్టేదీ, అదనెరిగి ఆగ్రహించేదీ, అనువుగా మందలించేదీ, ఆదర్శంతో తీర్చిదిద్దేదీ తల్లి, కుంతి వీరమాత. (సంపా.)

క. భుజ బలమున జీవించుట । నిజధర్మము మెత్తఁబడుట నింద్యము; మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము ద్రుపదా । త్మజఁ గార్యం బడుగుమనుము తగనందఱతోన్. 200

ప్రతిపదార్థం: భుజబలమునన్= బాహు విక్రమంతో; జీవించుట= బ్రతకటం; నిజధర్మము= క్షత్రియ ధర్మం; మెత్తఁబడుట= అణగిపోవటం; నింద్యము= దూషింపదగింది అని; మాద్రీప్రజలకున్= మాద్రి కుమారులకు; చెప్పుము= తెలుపుము; ద్రుపద+ ఆత్మజన్= ద్రౌపదిని; తగన్= ఒప్పిదంగా; అందఱతోన్= పాండవులందరితో; కార్యంబు+అడుగుము+అనుము= కర్తవ్యం గురించి అడుగుమని చెప్పుము.

తాత్పర్యం: మాద్రీనందనులైన నకుల సహదేవులతో- బాహుబలంతో బ్రదకటం క్షత్రియధర్మమనీ, అణగిమణగి ఉండటం దూషింపదగిన విషయమనీ చెప్పుము. తన కర్తవ్యమేమిటో ద్రౌపది నడిగి తెలిసికొనండని పాండవులందరితో చెప్పుము.

విశేషం: 1. కవలలు నకుల సహదేవులు. వారిద్దరికీ కలిపి సందేశం ఇవ్వటం ఔచిత్యం. అందులోనూ క్రమాన్ని పాటించి అన్వయించుకొంటే నకులుడికి భుజబలంతో జీవించుమని హెచ్చరిక. సహదేవుడికి క్షత్రియ ధర్మంలో మెత్తబడటం నింద్యమని గట్టిగా చెప్పింది. శ్రీకృష్ణుడితో వారిరువురు మాట్లాడిన తీరులు గమనిస్తే ఈ సందేశాలు వారి మనఃప్రవృత్తులకు అచ్చంగా అతికినట్లున్నాయని స్పష్టమవుతుంది.

2. పాండవులలో పరాక్రమాన్ని ప్రేరేపించే ప్రధానశక్తిగా ద్రౌపదిని కుంతి గుర్తించి, సమయోచితంగా వారిలో యుద్ధోత్సాహాన్ని ప్రజ్వలింపజేస్తూ ఉండుమని కోరింది. ద్రౌపది కాంతాసమ్మితంగా కార్యాన్ని చక్కదిద్దగలదని ఆమె విశ్వాసం. అది సహజం కూడా. (సంపా.)

చ. అలిగిన భీమ ఫల్గునుల కడ్డము లేమి యెఱుంగు; దంతలం
తలు వడి వాని నీఁగవలదా? విను మాపని కెల్లఁ బాండుపు
త్రులె కలవారు; నీ కెటుల దోఁచిన నట్టులు సేయువారు గా;
కలఘువిచార! నా యలఁత యార్పుము; నన్ గడతేర్పు మెమ్మెయిన్.' 201

ప్రతిపదార్థం: అలిగినన్= కోపగిస్తే; భీమఫల్గునులకున్= భీమార్జునులకు; అడ్డము లేమిన్= అవరోధం లేకుండటం; ఎఱుంగుదున్= తెలియుదును; అంతలు+అంతలు+పడి= అంతలేసి అవమానాల పాలై; వానిన్= ఆ పరాభవాలను; ఈఁగన్ వలదా= తీర్చుకొనవద్దా; వినుము= ఆలింపుము; ఆ పనికిన్+ఎల్లన్= పరాభవ దుఃఖాలను బాపుకొనే పనికంతా; పాండుపుత్రులె కలవారు= పాండు నందనులే సంసిద్ధంగా ఉన్నారు; నీకున్= నీకు; ఎటులు తోఁచినన్= ఏ విధమైన అభిప్రాయం కల్గుతుందో; అట్టులు+చేయువారు+కాక= ఆ విధంగా సల్పగలరు; అలఘువిచార!= గొప్ప ఆలోచనగలవాఁడా! కృష్ణా!; నా+అలఁత= నా శోకం; ఆర్పుము= తొలగించుము; నన్= నన్ను; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కడతేర్పుము= ఉద్ధరించుము.

తాత్పర్యం: అలుక వహిస్తే భీమార్జునులకు అడ్డం లేదని నాకు తెలుసు. అంతంత అవమానాలు పొంది ఆ కసి తీర్చుకొనవద్దా? ఆ పని పాండునందనులు చేయగలరు. నీవెట్లా చెపితే వారట్లా చేస్తారు. గొప్ప ఆలోచనగల నీవు నా బాధ తీర్చవలసినది. నన్ను ఎట్లయినా దుఃఖాల నుండి కడతేర్చవలె.'

విశేషం: 1. ఈ మాటలు కుంతీదేవి శ్రీకృష్ణుడితో అంటున్నవి. ఆమె ఆయనను కోరింది రెండంశాలు: 1. నా దుఃఖం (అనే అగ్నిని) ఆర్పుము. 2. నన్ను ఉద్ధరించుము. ఈ రెండూ పరమాత్మరూపుడైన శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి అన్నవే. 'కడతేర్పుము' అనే క్రియ తెలుగు జాతీయం. దానికి అనేకార్థాలున్నా ఇక్కడ కష్టాలనుండి గట్టెక్కించుమని భావం.

2. కుంతి విజ్ఞురాలు. ఒక కార్యం సాధించబడాలంటే ఇచ్ఛాక్రియా జ్ఞానశక్తుల సమన్వయ వినియోగాలు అవసరం. ఇక్కడ ఇచ్ఛాశక్తులు భీమార్జునులు. వారు కోపిస్తే చాలు ఆ కార్యానికి అడ్డం ఉండదు. ఆ సంగతి శ్రీకృష్ణుడికి కూడా తెలుసుననటం కుంతీదేవి గడుసుదనం. అవమానాల పాలైన పాండవులు వాటికి ప్రతీకారం తీర్చికొనే ప్రయత్నం చేయాలి. ఇది కార్యశక్తి. పాండవులు సంఘటితంగా కూడి యుద్ధకార్యాన్ని స్వయంగా నిర్వహించగలరని కుంతీదేవి కొడుకుల పౌరుషంమీద ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది.

3. ఇక పాండవ పక్షంలో ఇచ్ఛాక్రియాశక్తులకు మూలమైనదీ, చోదకమైనదీ, వాటిని నియంత్రించగలిగినదీ. ఫలాగమందాకా ముందుకు నడిపించేదీ జ్ఞానశక్తి. అదే శ్రీకృష్ణుడు. ఆ అర్థం వ్యంగ్యంగా స్ఫురించేటట్లు 'అలఘువిచార!' అని సంబోధించింది. నీ కెట్లా తోస్తే అట్లా పాండవులను నియోగించు మని కోరింది. కార్యచక్రం తిప్పుమని వేడింది. ఫలితం మాత్రం- కుంతి వంత తీరాలి. ఆమె ఉద్ధరించబడాలి.

4. కుంతి మనోదుఃఖం అగ్నివంటిదని 'ఆర్పు' అనే క్రియతో ధ్వనింపజేశాడు తిక్కన. అది శత్రుసంహారంవలన సాధ్యం. ఇక ఉద్ధరించమంటే- పరుల పంచలో ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి దైన్యంతో బ్రతికే అప్పటి దురవస్థ నుండి ఉద్ధరించటమే, పాండవులు పరాక్రమంతో రాజ్యాన్ని జయించి, తనను రాజమాతగా గౌరవపదంలో నిలపటమే. ఈ పని చేసే వారు పాండవులైనా చేయించే దైవీసంకల్పశక్తి శ్రీకృష్ణు డని ఆమె తాత్పర్యం. కార్యసాధకమైన మాటల పొందికలో అర్థవ్యక్తి అనే గుణం రాణించి వస్తు స్వభావ స్ఫుటత్వాన్ని కలిగిస్తున్నది. (సంపా.)

వ. అనినఁ గృష్ణుండు గొంతి ననునయించి యిట్లనియె: 202

తాత్పర్యం: కుంతి అట్లా తన మనోబాధను వెల్లడించగా కృష్ణుడు ఆమె నోదార్చి ఇట్లా చెప్పాడు:

శ్రీకృష్ణుఁడు కుంతీదేవి నూఱడించుట (సం. 5-88-89)

చ. 'సుగుణవు, పుట్టినింటికిని జొచ్చినయింటికిఁ దేజ మెక్కఁగాఁ
దగుచరితంబునన్ నడచు ధన్యవు, ధీరవు, దేవి! నీ వెడ
న్వగ లడఁగింపకున్న భువనంబుల నింకిట నెవ్వ రోర్చువా
రు గలఁక దక్కుమీ హృదయ రోగము లన్నియుఁ బుచ్చివైచెదన్. 203

ప్రతిపదార్థం: దేవి!= కుంతీమహాదేవీ!; సుగుణవు= మంచి గుణములు కలదానివి; పుట్టిన+ఇంటికిని= పుట్టింటికినీ; చొచ్చిన+ఇంటికిన్= అత్త యింటికినీ; తేజము+ఎక్కఁగాన్= వన్నె మీరగా; తగుచరితంబునన్= యోగ్యమైన నడవడితో; నడచుధన్యవు= ప్రవర్తించే పుణ్యాత్మురాలవు; ధీరవు= ధైర్యముగలదానవు; నీవు= అట్టి నీవు; ఎడన్= హృదయంలో; వగల్= చింతలు; అడగింపక+ఉన్నన్= అణచకపోయినచో; ఇంకన్= మరి; ఇటన్= ఇక్కడ; భువనంబులన్= లోకాలలో; ఓర్చువారు= దుఃఖాలను సహించేవారు; ఎవ్వరు?= ఎవరు గలరు?; కలఁక+తక్కుమీ= సంక్షోభం మానుము; హృదయ రోగములు+అన్నియున్= నీ మనోవ్యాధు లన్నింటినీ; పుచ్చివైచెదన్= తొలగించివేస్తాను.

తాత్పర్యం: 'అత్తా! నీవు గుణవంతురాలివి. పుట్టినింటికీ, మెట్టినింటికీ వన్నె వాసి ఏర్పడగా ఒప్పిదమైన నడవడితో ప్రవర్తించే పుణ్యాత్మురాలివి. ధైర్యంగలదానివి. ఇట్టి నీవు మనస్సులోని చింతలను అణచుకొనకుంటే మరి ఈ లోకంలో దుఃఖాలను సహించేవారు ఎవరుంటారు? అమ్మా! కలత మానుము. నీ మనోవ్యాధులన్నిటినీ తొలగిస్తాను.

విశేషం: 1. యోగ్యుడైన భక్తుడు ఆర్తితో అడుగుతుంటే కరుణారసం పొంగగా అభయహస్తం ఇస్తున్న భగవంతుడివలె శ్రీకృష్ణుడు పలుకుతూ ఉండటం పరిపాటి. 2. ద్రౌపది కెట్లా అభయహస్త మిచ్చాడో, కుంతికీ అట్లాగే అభయహస్త మిచ్చాడు. సంధి కాదు, యుద్ధం ఆగదు. విజయం సిద్ధించక మానదు, మనశ్శాంతి కుదరక తీరదు- అన్నట్లు ధైర్యం చెప్పాడు.

3. కుంతీ మనోవేదనను రోగంగా చెప్పి రూపకాలంకార శోభను కలిగించాడు తిక్కన. ఇక్కడ బహువచనం చెప్పటం మరొక విశేషం. కుంతి మనసులో పాండవుల బెంగ ఒక ప్రక్క. తనకు కన్యాత్వంలో సూర్యుడి వరం వలన కలిగిన కర్ణుడి బెంగ మరొక ప్రక్క బాధిస్తున్నాయి. ఒక దానిని చెప్పగలిగింది. మరొకటి చెప్పలేనిదిగా దాచుకొన్నది. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు. ఆ దుఃఖాన్ని కూడా మానుస్తానన్నాడు. ఎట్లా? అది భావికథలోగాని ప్రసన్నం కాదు. శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావిస్తే అతడు దివ్యమహిమలనే ప్రసాదించగలడు. (సంపా.)

క. **తనయులుఁ గోడలు సేమం । బున నున్నా; రధిక భక్తిపూర్వముగా దం**
డనమస్కారంబులు నీ । కొనరించిరి, కౌఁగిలించి రుల్లములఁ దగన్. **204**

ప్రతిపదార్థం: తనయులున్= నీ కుమారులును; కోడలున్= నీ కోడలుకూడా; సేమంబునన్+ఉన్నారు= సుఖంగా ఉన్నారు; అధిక భక్తిపూర్వముగాన్= మిక్కుటమైన భక్తి పురస్సరంగా; నీకున్= నీకు; దండ నమస్కారంబులు+ఒనరించిరి= నీకు సాగిలపడి మ్రొక్కారు; తగన్= చక్కగా; ఉల్లములన్= తమ మనసులందు; కౌఁగిలించిరి= నిన్ను కౌగిలించుకొన్నారు.

తాత్పర్యం: అత్తా! నీ కొడుకులు కోడలు క్షేమంగా ఉన్నారు. మిక్కిలి భక్తితో నీకు సాగిలపడి మ్రొక్కులు సమర్పించారు. మనసులందే నిన్ను కౌగిలించుకొన్నారు.

క. **నీ కొడుకు లొండు సుఖములు । చేకొన; రవ్వీరసుఖమ చిత్తములఁ గరం**
బాకాంక్షింతు; రలంతులఁ । బోక గలుగు నెట్టు? లల్పబుద్ధులె వారల్? **205**

ప్రతిపదార్థం: నీ కొడుకులు= నీ కుమారులు; ఒండు సుఖములు= ఇతర సౌఖ్యాలు; చేకొనరు= గ్రహించరు; ఆ+వీరసుఖము+అ= శౌర్యవృత్తి వలన చేకూరు సౌఖ్యమే; చిత్తములన్= హృదయములందు; కరంబు= మిక్కిలి; ఆకాంక్షింతురు= కోరుకొంటారు; అలంతులన్+పోక= అల్పమార్గాలలో వెళ్ళటం; ఎట్టులు+కలుగున్?= వారికెట్లా అలవడుతుంది?; వారల్= నీ కుమారులు; అల్పబుద్ధులె?= నీచస్వభావులా?- కారు సుమా!

తాత్పర్యం: అత్తా! నీ కుమారులు లోక సాధారణమైన సౌఖ్యాలు అనుభవించటానికి అంగీకరించరు. వీర ధర్మాన లభించే సౌఖ్యమే తమ మనస్సులో కోరుకొంటారు. వారు తుచ్ఛమార్గాలు అనుసరించేటంత నీచబుద్ధులు కారు సుమా!

క. **ఉత్సాహంబున శత్రు కు । లోత్సాదన విధి యొనర్చి యున్నత సామ్రా**
జ్యోత్సవము నొందు పుత్త్రుల । నుత్సుకతం జూతుగాక; యూఱడు మింకన్.' **206**

ప్రతిపదార్థం: ఉత్సాహంబునన్= పూనికతో; శత్రుకుల+ఉత్పాదన విధి+ఒనర్చి= విరోధి వంశాన్ని పెల్లగించి వేయటం అనే కార్యం నిర్వహించి; ఉన్నత సామ్రాజ్య+ఉత్సవము= దొడ్డ ప్రభుత్వం అనే పండుగను; ఒందు= పొందే; పుత్త్రులన్= కొడుకులను; ఉత్సుకతన్= ఉబలాటంతో; చూతు+కాక= చూచెదవు లెమ్ము; ఇంకన్= ఇక; ఊఱడుము= ఊరడిల్లుము.

తాత్పర్యం: పాండవులు విరోధివంశాన్ని కూకటివేళ్ళతో పెల్లగించి వేసి,; ఉన్నత సామ్రాజ్యాధిపత్యమనే పండుగను జరుపుకుంటుంటే నీవు ఉత్సాహంతో కనుగొనగలవు. ఇంక ఊరట వహించుము.'

చ. **అన విని మోము విచ్చుచు మురారికి నిట్లనుఁ గుంతి 'పాండు నం**
దనులకుఁ దండ్రియున్ గురువు దైవము నారయ నీవ కావె! నీ
మనమున ధర్మమున్ హితము మంచిగఁ జూచి విధించినట్ల చే
సి నెగడువారు గాక నినుఁ జేరిన నాపద లొంద నేర్చునే? 207

ప్రతిపదార్థం: అనన్+విని= శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు విని; కుంతి= కుంతీదేవి; మోము విచ్చుచున్= మొగం వికసింప చేస్తూ; ముర+అరికిన్= ఆ మురవైరికి; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పింది; పాండునందనులకున్= పాండుకుమారులకు; తండ్రియున్= జనకుడును; గురువు= ఒజ్జయును; దైవమున్= దైవతమును; ఆరయన్= పరికించగా; నీవు+అ+కావె!= నీవేగదా!; నీ మనమునన్= నీ చిత్తంలో; ధర్మమున్= న్యాయాన్ని; హితమున్= మేలును; మంచిగన్+చూచి= చక్కగ తలపోసి; విధించిన+అట్లు+అ= నీవు నిర్ణయించిన విధాన; చేసి= ఆచరించి; నెగడువారు+కాక= వృద్ధి పొందుతారు లెమ్ము; నినున్+చేరినన్= నిన్నాశ్రయించుకొన్నచో; ఆపదలు= కష్టాలు; ఒందన్+నేర్చునే= కలుగ గలవా? (కలుగవని అర్థం.)

తాత్పర్యం: కృష్ణుడి మాటలు వినేసరికి కుంతీదేవి ముఖం వికసించింది. ఆమె మురవిధ్వంసకుడైన మేనల్లుడితో ఇట్లా అన్నది. 'పాండుకుమారులకు తండ్రి, గురువు, దైవం నీవేకదా! నీ మనస్సులో ఏది న్యాయమో, ఏది హితమో మంచిగా నీవే చూచి ఇట్లా చేయండి అని నిర్దేశిస్తే వారు అట్లా చేసి బాగుపడగలరు. నిన్ను ఆశ్రయించుకొన్నవారికి ఎట్టి ఆపదలు రావుగదా!

విశేషం: 1. అలం: మాలారూపకం. 2.పాండవులకు శ్రీకృష్ణుడు వరుసగా తండ్రి, గురువు, దైవం అని నివేదించుకొన్నది. ముగ్గురూ ఒకరిలోనే ఉన్నారు. తండ్రిగా ధర్మాన్ని నిర్దేశిస్తాడు. గురువుగా హితాన్ని బోధిస్తాడు, దైవంగా 'మంచిగ చూస్తాడు' అంటే యోగక్షేమం వహిస్తాడు అని క్రమాన్వయం. 'నిను చేరిన నాపద లొంద నేర్చునే!' అన్నది విశ్వాసంతో కూడుకొన్న శరణాగత భక్తి భావ ప్రకటనం. భగవంతుడి రక్షణలో ఉన్నవారి దరికి ఆపదలు చేరవు అన్నది విశ్వాసం. పాండవులు శ్రీకృష్ణుడిని శరణు వేడి అటువంటి భద్రస్థితిలో ఉన్నారని ధ్వని. (సంపా.)

క. **వారలక యేల మాధవ! । కౌరవులకు మఱియు నీజగంబులకెల్లం**
జేరుగడ నీవ; నీ పలు । కారయ వేదంబ కాదె యఖిలంబునకున్.' 208

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; వారలకున్+అ+ఏల?= పాండవులకు మాత్రమే అననేల?; కౌరవులకున్= కౌరవులకుకూడా; మఱియున్= ఇంకను; ఈ జగంబులకున్+ఎల్లన్= ఈ లోకాలన్నింటికినీ; చేరుగడ= శరణం; నీవు+అ= నీవే సుమా!; అఖిలంబునకున్= సమస్తమునకునూ; ఆరయన్= విచారించగా; నీ పలుకు= నీ వచనం; వేదంబు+అ కాదె!= వేదమే గదా!

తాత్పర్యం: మాధవా! ఒక్క పాండుకుమారులకే అననేల? కౌరవులకునూ; ఈ లోకము లన్నింటికినీ నీవేదిక్కు సమస్త జగాలకూ పరికించగా నీ పలుకే వేదం కదా!'

విశేషం: 1. అలం: రూపకం. శ్రీకృష్ణుడి మాట వేదం.

2. భగవంతుడు జగద్రక్షకుడనీ, పాండవ కౌరవులందరికీ ఆయన సముడనీ భావించే కుంతీభావంలో సమత్వం స్ఫురిస్తున్నది.

3. అఖిలలోకాలకూ శ్రీకృష్ణుడి వాక్కులు వేదంకాగా ఆ మాటలు విన్నవారు ధర్మమూర్తు లౌతారు. విననివారు పతితులౌతారని ధ్వని. (సంపా.)

వ. అనినం బ్రసన్నవదనుం డగుచు నద్దేవి గారవించి యామన్త్రణంబు సేసి తదావాసంబు వెలువడి తనరాకకు నలంకృతంబైన దుర్యోధను మందిరంబునకుఁ గృతవర్మ సాత్యకి సమేతుండయి పోవు గోవిందునిం గని తదీయ ద్వారపాలకులు సంభ్రమంబునం బఱచి యతని కెఱిఁగించి తదనుమతంబునం బఱతెంచి యెదుర్కొని కక్ష్యాంతరంబుల సందడి నెడగలుగ జడియుచు వినయంబునం దోడ్కొనిచన నమ్మనుజవిభుండు కైలాసశిఖరాకారంబగు సౌధంబున బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును, గర్ణశకుని సైంధవాదులును, దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును మఱియు ననేక దేశాధీశులునుం బరివేష్టింపఁ బేరోలగంబున సింహాసనాసీనుండై యున్న యెడకుం జను నప్పు డాసుయోధనుండు సపరివారంబుగాఁ బ్రత్యుత్థానంబు సేయం జేర నరిగి యతనికిం దగువారలకు నాలింగనాద్యుపచారంబులు తానుం దమ్ముండును నాచరించి. **209**

ప్రతిపదార్థం: అనినన్; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన ముఖం కలవాడై; ఆ+దేవిన్= ఆ కుంతిని; గారవించి= గౌరవించి; ఆమంత్రణంబు+చేసి= ఆమె నుండి వీడ్కోలు పడసి; తద్+ఆవాసంబు+వెలువడి= ఆమె గృహం నుంచి బయటకువచ్చి; తన రాకకున్= తన ఆగమనమునకై; అలంకృతంబు+ఐన= అలంకరించబడిన; దుర్యోధను మందిరంబునకున్= సుయోధనుడి సౌధానికి; కృతవర్మసాత్యకి సమేతుండు+అయి= కృతవర్మ, సాత్యకి అనే వారితో కూడినవాడై; పోవు గోవిందునిన్; కని= చూచి; తదీయ ద్వారపాలకులు= ఆ దుర్యోధనుడి వాకిలిగాచువారు; సంభ్రమంబునన్+పఱచి= తొట్రుపాటుతో పరుగెత్తిపోయి; అతనికిన్+ఎఱిఁగించి= సుయోధనుడికి కృష్ణుడి రాక తెలిపి; తద్+అనుమతంబునన్= సుయోధనుడి అంగీకారంతో; పఱతెంచి= మరలివచ్చి; ఎదుర్కొని= శ్రీకృష్ణుడికి ఎదురుగా వచ్చి; కక్ష్యా+అంతరంబుల సందడిన్= లోగిళ్ళ లోపల కలిగిన సమ్మర్దమును; ఎడ కలుగన్= దారి ఏర్పడేటట్లు; జడియుచున్= తొలగిస్తూ; వినయమునన్= అణకువతో; తోడ్కొని చనన్= వెంట బెట్టుకొని వెళ్ళగా; ఆ+మనుజ విభుండు= ఆ నరనాథుడైన సుయోధనుడు; కైలాస శిఖర+ఆకారంబు+అగు= కైలాస పర్వత శిఖరం మాదిరి ఉన్న; సౌధంబునన్= భవనంలో; బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును= బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణాచార్యులు మొదలైనవారున్నూ; కర్ణ శకుని సైంధవ+ఆదులును= కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారున్నూ; దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును= దుశ్శాసనుడు, వికర్ణుడు, దుర్ముఖుడు మొదలైనవారున్నూ; మఱియున్= ఇంకను; అనేక దేశ+అధీశులునున్= పెక్కు దేశాల రాజులున్నూ; పరివేష్టింపన్= చుట్టుచేరిఉండగా; పేరు+ఓలగంబునన్= గొప్ప కొలువు కూటంలో; సింహ+ఆసన+ఆసీనుండు+ఐ= సింగపు గద్దె మీద కూర్చుండినవాడై; ఉన్న+ఎడకున్= ఉన్న తావుకు; చను+అప్పుడు= వెళ్ళుతున్న సమయంలో; ఆ సుయోధనుండు= ఆ దుర్యోధనుడు; సపరివారంబుగన్= పరిజనులతో కూడ; ప్రత్యుత్థానంబు+చేయన్= ఎదుర్కోలు జరుపుటకై; చేరన్+అరిగి= శ్రీకృష్ణుడి సమీపానికి వెళ్ళి; అతనికిన్= శ్రీకృష్ణుడికి; తగువారలకున్= అతని వెంట వచ్చిన అర్హులైన వారందరికీ; ఆలింగన+ఆది+ఉపచారంబులు= కౌగిలించుకొనటం మున్నగు మన్ననలు; తానున్= తానును; తమ్ముండును= తన అనుజుడైన దుశ్శాసనుడును; ఆచరించి= కావించి.

తాత్పర్యం: కుంతీదేవి మాటలు విని శ్రీకృష్ణుడు ప్రశాంత ముఖపద్మంతో ఆ దేవిని మన్నించి, సెలవు పుచ్చుకొని, ఆమె నివాసం నుండి వెలుపలికి వచ్చాడు, తన ఆగమనానికై అలంకరించబడిన దుర్యోధనుడి భవనానికి హరి

కృతవర్మతో సాత్యకితో కలిసి బయలుదేరాడు. కృష్ణస్వామి రాకనుగాంచి వాకిటి కావలివాండ్రు సత్వరంగా వెళ్ళి దుర్యోధనుడికి ఆ వార్త తెలిపారు. ఆయన ఆదేశంతో వారు వచ్చి శౌరి నెదుర్కొని లోగిళ్ళలోని సమ్మర్దం తొలగిస్తూ దారి నేర్పరచి వినయంతో తోడ్కొనిపోయారు. సుయోధనుడు కైలాస శిఖరంవలె ఉన్న ఉన్నత సౌధంలో బాహ్లికుడు భీష్ముడు ద్రోణుడు మున్నగువారూ, కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారూ, దుశ్శాసనుడు వికర్ణుడు దుర్ముఖుడు ఆదిగాగలవారూ, ఇంకా పలు దేశముల ప్రభువులూ తన చుట్టూ చేరి ఉండగా, సింహాసనాసీనుడై కొలువుదీరి ఉన్నాడు. అక్కడికి శ్రీకృష్ణుడు వస్తుండగా దుర్యోధనుడు పరిజనులతో కూడ ఎదుర్కోలు జరపటానికై మురారిని చేరవచ్చి ఆయనకూ, తగినవారలకూ తానూ తన తమ్ముడు దుశ్శాసనుడూ ఆలింగనాదులైన మన్ననలు చేశారు.

విశేషం: అలం: ఉపమ. 1. దుర్యోధనుడి భవనం శిఖరాకారంవలె ఉన్నదనటంలో ఉపమ.

2. శ్రీకృష్ణుడు ప్రసన్నవదనుడై కుంతిని గారవించాడంటే దైవానుగ్రహం ఆమె పట్ల ఉంటుందని ధ్వనింపజేశాడు.

3. దుర్యోధనుడి మందిరంలో ప్రవేశించేటప్పుడు శ్రీకృష్ణుడికి భద్రతా సేనానులవలె కృతవర్మ, సాత్యకి ఇరువైపుల నడవటం గమనార్హం. అది మిత్రమందిరంగా కంటె శత్రుమందిరంగానే శ్రీకృష్ణుడు భావిస్తున్నాడని ధ్వని.

4. మందిరంలో కక్ష్యలన్నీ దాటి సభాభవన కక్ష్యలో ప్రవేశించిన తరువాత దుర్యోధనుడు పరివారంతో ఎదుర్కోలివ్వటం రాజమందిర మర్యాద. తనను ఆహ్వానించటానికి వస్తున్న దుర్యోధన దుశ్శాసనాదులను స్నేహపూర్వకమైన ఆలింగనాదులతో సమ్మానించటం స్నేహ మర్యాద. ఆసనాదు లిచ్చి అతిథిని గౌరవించటం అతిథి మర్యాద. దూతకిచ్చే మర్యాదలకంటె ఉన్నతమైన వాటిని కౌరవులు శ్రీకృష్ణుడికి అందచేస్తున్నారు. అది వారి వ్యూహంలో ఒక భాగం, గౌరవించి, కానుకలిచ్చి శ్రీకృష్ణుడిని పాండవులనుండి వేరు చేయాలన్న భేదోపాయం. (సంపా.)

క. అతఁ డునుపఁగఁ గనక మయో । న్నత పర్యంకంబునందు నారాయణుఁ డూ
ర్జిత మహిమ నుండి యభ్య । ర్చితుఁ డయ్యెఁ దగంగ నతనిచే సత్కృతులన్. 210

ప్రతిపదార్థం: అతఁడు+ఉనుపఁగన్= సుయోధనుడు కూర్చుండ బెట్టగా; కనకమయ= సువర్ణమయమైన; ఉన్నత పర్యంకంబు+అందున్= ఎత్తయిన మంచం మీద; నారాయణుఁడు= వాసుదేవుడు; ఊర్జిత మహిమన్+ఉండి= గొప్ప ప్రభావంతో అధివసించి, తగంగన్= ఒప్పుగా; అతనిచేన్= దుర్యోధనుడి చేత; సత్కృతులన్= సత్కారాలతో; అభ్యర్చితుఁడు+అయ్యెన్= లెస్సగా పూజించబడ్డాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కూర్చుండ బెట్టగా సమున్నతమైన బంగరు మంచం మీద గొప్ప విభూతితో వాసుదేవుడు కూర్చుండి అత డొనర్చే సత్కారాలతో మిక్కిలి పూజించబడ్డాడు.

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట (సం. 5-89-1)

వ. సాత్యకియును సముచిత ప్రకారంబునం బూజితుండయ్యెఁ; దదనంతరంబు నిజాసనాసీనులయి తన మొగంబునం జూడ్కి నిలిపియున్న దుర్యోధనాదులతో మాధవుండు మధురసంభాషణంబులు సేయుచుండె; నట్టియెడ. 211

ప్రతిపదార్థం: సాత్యకియును, సముచిత ప్రకారంబునన్= తగు విధంగా, పూజితుండు+అయ్యెన్= పూజించబడ్డాడు, తద్+అనంతరంబు= అటుపిమ్మట, నిజ+ఆసన+ఆసీనులు+అయి= తమ పీఠాలమీద కూర్చుండినవారై, తన మొగంబునన్=

తన ముఖంమీద, చూడ్కిన్= దృష్టిని, నిలిపి+ఉన్న= ప్రసరింపజేస్తున్న, దుర్యోధన+ఆదులతోన్= సుయోధనుడు మొదలైనవారితో, మాధవుండు= లక్ష్మీవల్లభుడు, శ్రీకృష్ణుడు; మధుర సంభాషణంబులు+చేయుచున్+ఉండెన్= ఇంపైన మాటలాడుతూ ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: సాత్యకికూడ తగు విధంగా పూజించబడ్డాడు. పిదప తమ తమ పీఠాలమీద కూర్చుండి తన వదనం మీద చూపులు సారించిఉన్న దుర్యోధనుడు మొదలైనవారితో గోవిందుడు ఇంపైన మాటలు మాట్లాడుతుండినాడు. ఆ సమయంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. సముచితంబుగఁ గూరలచంద మగ్గ । డించి కుడుపు తెఱంగు పుట్టించి పలుకు
నా సుయోధనుతోఁ గృష్ణుఁ డచటఁ దాను । గుడువ నొల్లక యునికి యేర్పడఁగఁ జెప్పె. 212

ప్రతిపదార్థం: సముచితంబుగన్= మిక్కిలి యుక్తంగా; కూరలచందము= కూరల విధం- శాకపాకాల రీతి; ఉగ్గడించి= పలికి; కుడుపు తెఱంగు పుట్టించి= భోజన విషయం ప్రస్తావనకు దెచ్చి; పలుకు= మాట్లాడుతున్న; ఆ సుయోధనుతోన్= ఆ దుర్యోధనుడితో; కృష్ణుఁడు= శ్రీ కృష్ణుడు; అచటన్= దుర్యోధనుడి గృహంలో; తాను= తాను; కుడువన్+ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడని స్థితి; ఏర్పడఁగన్+చెప్పెన్= స్పష్టంగా తెలిపాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తగు విధాన తన ఇంటిలో వండిన శాకపాకాల వివరాలు తెలిపి, భోజన విషయం ప్రస్తావనకు తేగా, శ్రీకృష్ణుడు అక్కడ తాను భుజించటానికి ఇష్టపడకుండటం స్పష్టంగా చెప్పివేశాడు.

విశేషం: ఇంటికి వచ్చిన అతిథిని భోజనానికి ఆహ్వానించటం గృహస్థుడి మర్యాద. దానిని దుర్యోధనుడు నిర్వహించినట్లుగా పైకి కనపడుతున్నాడు. అప్యాయతతో, భక్తితో, వినయంతో పిలిచేవారు కూరల రుచిని గురించి అంతగా గొప్పలు చెప్పుకోరు. భోజనంమీద మోహం కలిగేటట్లు మాట్లాడరు. ఆ వైఖరిలో సహజత్వం కొరవడినట్లు ఎదుటివారికి స్పష్టం ఔతున్నది. అన్నంలో విషం పెట్టటానికి పన్నాగం వేశాడా? అన్నంత అనుమానం కలుగుతుంది. అందువలననే శ్రీకృష్ణుడు 'అన్నం తినజాలను' అన్నాడు. 'తినను' అనలేదు. తినను అంటే తిరస్కారమౌతుంది. 'తినజాలను' అంటే పరిస్థితుల ప్రభావమౌతుంది. అడుగడుగున సమస్యలు సృష్టించి శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతిగా, కౌరవ విరోధిగా, కపట వర్తనుడుగా నిరూపించాలని దుర్యోధనుడు ప్రయత్నించటం ఇక్కడే ప్రారంభమయింది. విందు నొక సమస్య చేశాడు దుర్యోధనుడు. (సంపా.)

వ. చెప్పిన విని దుర్యోధనుండు సూర్యసూను వదనం బవలోకించి యల్లన యిట్లనియె: 213

ప్రతిపదార్థం: చెప్పినన్+విని; దుర్యోధనుండు; సూర్యసూనువదనంబు= సూర్యుని పుత్రుడైన కర్ణుడి ముఖం; అవలోకించి= చూచి; అల్లన= నెమ్మదిగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని సుయోధనుడు రవితనయుడైన కర్ణుడి ముఖం వైపు చూచి నెమ్మదిగా ఇట్లా అన్నాడు:

క. 'హరి పలికిన విధ మెంతయు । నెరవై యున్నయది వింటె యిమ్మాట తెఱం
గరయుదము తొలుత; నీ పెను । పరిచందం బెల్ల నెఱుకపడియెడుఁ బిదపన్.' 214

ప్రతిపదార్థం: హరిపలికిన విధము= కృష్ణుడు మాటాడిన తీరు; ఎంతయున్= మిక్కిలి; ఎరవై+ఉన్న+అది= భేదబుద్ధితో కూడిఉన్నది; వింటె!= వింటివిగదా!; ఈ+మాట తెఱంగు= ఈ పలుకుల విధ మెట్టిదో; తొలుతన్= మొదట; అరయుదము= పరిశీలిద్దాం; పిదపన్= తరువాత; ఈ పెనుపరిచందంబు+ఎల్లన్= ఈ పెద్దమనిషి వైనమంతా; ఎఱుకపడియెడున్= బయటపడుతుంది.

తాత్పర్యం: 'కర్ణ! శ్రీకృష్ణు డాడినమాట మిక్కిలి భేదబుద్ధితో కూడి ఉంది. నీవు విన్నావుకదా! మొదట అతడిమాటతీరు పరిశీలిద్దాం. అవతల ఆ పెద్దమనిషి పద్ధతి అంతా తేటతెల్లమవుతుంది.'

విశేషం: దుర్యోధనుడి నీతిని తీర్చిదిద్దే ఆప్తమిత్రుడు కర్ణుడని మొదట్లోనే బైటపెట్టుకొన్నాడు దుర్యోధనుడు. భోజనానికి రాని కారణం అడిగితే పాండవ పక్షపాతం బయటపడుతుంది. ఆ తరువాత శ్రీకృష్ణుడి చర్యలన్నీ పక్షపాతంతో, శత్రుత్వంతో కూడినవే అని నిరూపించవచ్చునని దుర్యోధనుడి వ్యూహం. (సంపా.)

వ. అని పలికి యచ్యుతున కిట్లనియె: 215

తాత్పర్యం: అని చెప్పి దుర్యోధనుడు శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

తే. 'వలయు నన్నపానంబులు పలు దెఱఁగుల । నేర్చు విధముల నే మొడఁ గూర్చి వేడ్క
నున్న నీ వుపయోగింప నొల్లకునికి । బాంధవమునకు నీతికి బాహిరంబు. 216

ప్రతిపదార్థం: వలయు+అన్నపానంబులు= కావలసిన అన్నం, పానీయాలు; పలు+తెఱఁగులన్= అనేకరీతుల; నేర్చు విధములన్= మాకు తెలిసినంతలో; ఏము= మేము; ఒడఁగూర్చి= సిద్ధపరిచి; వేడ్కన్+ఉన్నన్= అభిలాషతో ఉండగా; నీవు= నీవు; ఉపయోగింపన్+ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడకుండటం; బాంధవమునకున్= చుట్టరికానికి; నీతికిన్= న్యాయానికి; బాహిరంబు= వెలియైన విషయం.

తాత్పర్యం: 'కృష్ణా! కావలసిన అన్నపానీయాలు పలురీతుల మాకు తెలిసినంతలో సిద్ధపరిచి మేము ఆశతో ఉండగా, నీవు వాటిని భుజించటానికి ఇష్టపడకపోవటం మన చుట్టరికానికి, న్యాయానికి విరుద్ధమైన విషయం.

క. కౌరవులకుఁ బాండవులకు । నారయ నీ వొక్క రూప; యసదృశ ధర్మా
చారుండవు రాజునకుం । గూరుతు? కతమేమి యిట్లగుటకుం జెపుమా'. 217

ప్రతిపదార్థం: కౌరవులకున్= ధృతరాష్ట్రుడి కుమారులమైన మాకూ; పాండవులకున్= పాండురాజు కొడుకులకున్నూ; ఆరయన్= పరికింపగా; నీవు; ఒక్కరూపు+అ= సమానమైనవాడివే; అసదృశ+ధర్మ+ఆచారుండవు= సాటిలేని న్యాయాచరణం గలవాడివి; రాజునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; కూరుతు(వు)= ప్రియమైనవాడివి; ఇట్లు+అగుటకున్= నీ విట్లా మారిపోవటానికి; కతము+ఏమి?= కారణ మేమి? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: ఆలోచించగా కురుపాండవులకు నీవు ఒకే విధమైనవాడవు. అంతేకాదు. సాటిలేని ధర్మశీలుడవు. ధృతరాష్ట్ర మహారాజుకు ఇష్టుడవు. ఇట్లాంటివాడివి మా యింట భుజించను అనటానికి హేతువేమో చెప్పుము.'

క. అనుడు నుపేంద్రుఁడు మనుజేం । ద్రుని కిట్లను 'దూత లెందుఁ దొలిదొలి గుడువం
గొనఁ గట్టఁ దొడఁగుదురె? వ । చ్చిన కార్యము దీర్చి పిదపఁ జేయుదు రెల్లన్.' 218

ప్రతిపదార్థం: అనుడున్= అని దుర్యోధనుడు ప్రశ్నించగా; ఉపేంద్రుఁడు= దేవేంద్రుడికి అనుజన్ముడైన శ్రీకృష్ణుడు; మనుజ+ఇంద్రునికిన్= నరేశ్వరుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; దూతలు= రాయబారులు; ఎందున్= ఎక్కడైనా; తొలి+తొలిన్= దౌత్యానికి మునుముందే; కుడువన్= భుజించటానికి; కొనన్= సత్కారములందుకొనటానికి; కట్టన్= నూతన వస్త్రాలు స్వీకరించి ధరించటానికి; తొడఁగుదురె= పూనుకొందురా? (పూనుకొనరని అర్థము;) వచ్చిన కార్యమున్= ఏ పనిమీద వచ్చిరో ఆ పనిని; తీర్చి= నెరవేర్చి; పిదపన్= తరువాత; ఎల్లన్+చేయుదురు= అన్ని మన్ననలను స్వీకరిస్తారు.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడు దుర్యోధనుడికి ఇట్లా ప్రత్యుత్తరమిచ్చాడు: 'రాయబారులు వచ్చినపని చూడకుండ మున్ముందుగా భుజించటం, వస్తువులను గైకొనటం, ఉడుపులు చేకొని ధరించటం కూడదు. వచ్చిన పని నెరవేర్చిన తరువాత అన్ని మర్యాదలు అంగీకరిస్తారు.'

విశేషం: దుర్యోధనుడు శ్రీకృష్ణుడిని అందరికీ కావలసిన బంధువుగా ఆహ్వానించి చెప్పాడు. అందువలన విందుకు అంగీకరించకపోవటం శ్రీకృష్ణుడి దోషంగా పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడు తాను విందుకు రాకపోవటానికి రాయబారి ధర్మాన్ని కారణంగా పేర్కొన్నాడు. రాయబారి వచ్చినపని ముగించకుండా భుజించటం, కానుకలు తీసికొనటం, నూతన వస్త్రాలు తీసికొని ధరించటం నిషేధమనే రాజనీతిని పేర్కొని తాను వచ్చినపని ముగించిన తరువాత మర్యాదలన్నీ స్వీకరిస్తానని చెప్పాడు. బంధుత్వంకంటె బాధ్యత ప్రథమగణ్యం. (సంపా.)

వ. అనిన గాంధారీనందనుండు దేవకీనందనున కిట్లనియె: 219

ప్రతిపదార్థం: అనినన్= అని కృష్ణుడు పలుకగా; గాంధారీనందనుండు= గాంధారి కుమారుడైన సుయోధనుడు; దేవకీనందనునకున్= దేవకీదేవి తనయుడైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా బదులు పలికాడు.

తాత్పర్యం: మాధవుని మాటలకు సుయోధను డిలా బదులు చెప్పాడు:

ఆ. 'వేగపడుట మేలె? వినుము; కార్యము దీఱుఁ। దీఱకుండు దాని తెఱఁగు దగిన
యప్పు డాడరాదె? యిప్పుడు ముకుఁ ద్రాటఁ। గాలు గ్రువ్వనేల కమలనాభ! 220

ప్రతిపదార్థం: కమలనాభ!= కమలము నాభియందు గల వాడా కృష్ణా!; వేగపడుట మేలె?= త్వరపడటం మంచిదా?; వినుము= నా మాటలు వినుము; కార్యము తీఱున్= పని నెరవేరవచ్చును; తీఱక+ఉండున్= నెరవేరకపోవచ్చును; దాని తెఱఁగు= ఆ విషయం; అప్పుడు+ఆడన్+రాదె= అప్పుడు పలుకవచ్చును కదా!; ఇప్పుడు= ఈ సమయంలో; ముకుఁద్రాటన్= ముక్కునకు గ్రుచ్చిన త్రాటియందు; కాలు+క్రువ్వన్+ఏల?= కాలిని దూర్చుటెందుకు?

తాత్పర్యం: పద్మనాభా! తొందరపడటం అంత మంచిదికాదు. నా మాట వినుము. పని అవుతుంది, కాకపోతుంది. అవసరం వచ్చినపుడు ఆ సంగతి మాటాడవచ్చును గదా! ముక్కుకు గ్రుచ్చిన త్రాటిలో కాలు దూర్చటమెందుకు?

విశేషం: 1. అలం: లోకోక్తి. లోకోక్తితో కలిపి చెప్పటం లోకోక్తి అలంకారం. 2.శ్రీకృష్ణుఁడు విందుకూ రాయబారం పూర్తికావటానికీ లంకె పెట్టాడు. దానిని దుర్యోధనుడు నిపుణంగా పరిహసిస్తున్నాడు. శ్రీకృష్ణుడు తొందరపడుతున్నాడని ఒక అభియోగం చేశాడు. రాయబారానికీ విందుకూ సంబంధం లేదని చెప్పాడు. ఒకవేళ రాయబారం సఫలం కావచ్చును, కాకపోవచ్చును.

దానికీ విందుకూ ముడిపెట్టటం తొందరపాటు అని హెచ్చరించాడు. చివరకు 'ముక్కుత్రాటిలో కాలుదూర్చటం ఎందుకు?' అనే లోకోక్తితో ఎత్తిపొడిచాడు. పని మొదలు కాకపోగా ముగింపు సంగతి ఎందుకు అప్పుడే తెస్తావు? అని భావం. మరొక మాటలో చెప్పాలంటే- సంధి కుదురుతుందంటేనే నేను విందు చేస్తా'నన్నట్లున్నదని భావం. ముక్కుత్రాడు - మొదటి మర్యాదలకూ, కాలు - చివరి ముగింపుకూ ఆ సూక్తిలో స్ఫూర్తినిస్తాయి. శ్రీకృష్ణుడి వక్రనీతిని బయటపెట్టాలని పలికిన మాట లివి. (సంపా.)

వ. నీవు వచ్చినవాఁడవు మా యింటఁ గుడిచి కూర్చుండి యెల్లపనులుం జెప్పుట యొప్పుఁగాక; కుడువనొల్ల ననం దగునె? దీనికిం గారణంబు నా యెఱింగిన యది లేదు; విచారింపక పలికి' తనిన మందరధరుండు మందస్మితంబుతో నందఱం గలయం గనుంగొని ధార్తరాష్ట్రుకరంబు గజంబు పల్లవం బల్లన తెమల్చు లీలం గేల నమర్చి 'యిట్టి మాటలు తేటపఱుపవలయునేని విను'మని యతని కిట్లనియె: 221

ప్రతిపదార్థం: వచ్చినవాడవు నీవు; మా యింటన్= మా గృహంలో; కుడిచి= భుజించి; కూర్చుండి; ఎల్లపనులన్= అన్ని కార్యాలూ; చెప్పుట; ఒప్పున్+కాక= తగునుగాని; కుడువన్+ఒల్లన్+అనన్+తగునె?= భుజించటాని కిష్టపడను అని చెప్పటం యుక్తమా?; దీనికిన్= ఇట్లు తిననని చెప్పటానికి; కారణంబు; నా+ఎఱిఁగిన+అది= నాకు తెలిసినట్టిది; లేదు; విచారింపక పలికితి(వి)= ఆలోచించక మాట్లాడావు; అనినన్; మందరధరుండు= క్షీరసాగర మథన కాలంలో మందరగిరిని మూపున దాల్చిన మహాకూర్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు; మందస్మితంబుతోన్= చిరునవ్వుతో; అందఱన్+కలయన్+కనుంగొని= అక్కడున్నవారినెల్ల తేరిపారజూచి; ధార్త రాష్ట్రుకరంబు= దుర్యోధనుడి చేతిని; గజంబు= ఏనుగు; పల్లవంబున్= చిగురుటాకును; అల్లన= మెల్లగా; తెమల్చులీలన్= చలింప జేయు విధాన; కేలన్+అమర్చి= తన చేతిలో ఇమిడ్చి; ఇట్టిమాటలు= ఇటువంటి పలుకులు; తేటపఱుపన్+వలయున్+ఏనిన్= విశదం చేయవలసి వస్తే; వినుము= చెప్పుచున్నాను ఆలకించు; అని; ఆతనికిన్; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! వచ్చినవాడివి వచ్చినట్లు మా ఇంటిలో కమ్మగా భుజించి, హాయిగా కూర్చుండి, అన్ని పనులు చెప్పటం తగును గాని భుజించటానికి సమ్మతించనని చెప్పవచ్చునా? ఇందుకు కారణం నా యెరిగినంతలో ఏదీలేదు. ఆలోచించక ఇట్లా పలికావు' అని దుర్యోధను డన్నాడు. అప్పుడు వెన్నుడు చిరునవ్వు నవ్వుతూ అక్కడున్నవారినంతా కలయజూచి ఏనుగు చిగురుటాకును తొండంతో పట్టుకొని కదల్చేరీతిగా దుర్యోధనుడి చేతిని తన హస్తంతో పట్టుకొని కదల్చుతూ ఇట్లాంటి విషయాలు వివరించవలసిన అవసరముంటే వెల్లడిస్తాను. విను'మంటూ అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. తన ఇంట విందు చేయనన్న శ్రీకృష్ణుడి వర్తనానికి కారణ మేమిటో రారాజుకు బోధపడలేదు. సూటిగా అతడినే అడిగాడు. అట్లా అడిగితే శ్రీకృష్ణుడి బండారం బైటపడుతుందని దుర్యోధనుడి తలపు. అడిగితే దుర్యోధనుడి బండారం బైట పెడదామని గోవిందుడి మనసు. ఇద్దరికీ అవకాశం దొరికింది.

2. ఇక్కడ శ్రీకృష్ణుడి అభినయం అమోఘం. క్షీరసాగర మథనంలో మందరపర్వతాన్ని మోసిన ఆదికూర్మ రూపుడు శ్రీకృష్ణుడు. ఈ సమస్య ఒక లెక్కా? మందహాసం చేస్తూ అందరినీ చూచాడు. తాను చెప్పబోయే అంశం దుర్యోధనుడే కాదు అందరూ వినదగింది అని హెచ్చరిక. దుర్యోధనుడి దుర్వివేకంపై ఒక పరిహాస హేల. అంతటితో ఆగక ఏనుగు తన తొండంతో ఒక చిగురాకును అవలీలగా పైకి లేపినట్లు దుర్యోధనుడి చేతితో కరచాలనం చేస్తూ పలికాడు. (చక్కని ఉపమాలంకారం.) దీనిభావ మేమి? 'దుర్యోధనా! నీ సంగతి నీవే త్రవ్వుకొని అడుగుతున్నావు. నేను చెప్పే మాటల కన్నిటికీ

నీవే బాధ్యుడవు. ఇందులో నా తప్పేమీ ఉండదు. తరువాత నన్నని లాభం లేదు' - అని ఆ అభినయానికి అర్థం. 'వివరించమంటే వివరిస్తాను వినండి' అని హుందాగా హుంకరించాడు. దుర్యోధనుడు కదిలించాడు. శ్రీహరి విజృంభించాడు. (సంపా.)

చ. ప్రియమెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
క్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టునట్టు నే
మియు ననలేని కూ డదియు మేవడియై చను; నీవు మా దెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతి పెంపఱ నాపదలే దొకింతయున్. 222

ప్రతిపదార్థం: ప్రియము+ఎసఁగన్= ప్రేమ అతిశయించగా; తగన్+పిలిచి= హృదయపూర్వకంగా ఆహ్వానించి; పెట్టెడుకూడు= పెట్టే అన్నం; అది లెస్సకూడు+తక్క= అది మంచి అన్నం దప్ప; అయనయహీనతన్= శుభం, న్యాయం లేకుండా; తమకున్= తమకు; ఆపద+ఐన+ఎడన్= విపత్తు సంభవించిన చోట; ఇట్టున్+అట్టున్= ఇట్టిట్టని; ఏమియున్+అనలేని= సంకటస్థితిలో ఇంచుకకూడా బదులాడటానికి వీలుగాని; కూడు+అదియున్= భోజనం కూడా; మేవడి+ఐ+చనున్= ఉచితమైనదే ఔతుంది.; నీవు; మా దెసన్= మా యెడ; ప్రియుఁడవు కావు= ప్రేమకలవాడవు కావు; మాకున్= మాకు; ధృతిపెంపు+అఱన్= ధైర్యసమృద్ధి చెడేటట్లుగా; ఒకింతయున్= రవంతైనా; ఆపద లేదు= కీడు వాటిల్లలేదు.

తాత్పర్యం: ప్రేమతో తన ఇంటికి పిలిచి పెట్టే భోజనం మంచి భోజనం. విపత్తు కలిగినచోట ఔను కాదని బదులేమీ పలకటానికి వీలుగాని సంకట స్థితిలో అయనయములు లేక తినే కూడు కూడా ఉచితమైన కూడే అవుతుంది. దుర్యోధనా! నీవు మా ఎడ ప్రేమకలవాడవు కావు. మాకు ధైర్యం నశించగా ఇప్పుడు ముంచుకొని వచ్చిన ఆపద కొంచెం కూడా లేదు. అందువలన నీ ఇంటిలో భుజించటానికి ఇష్టపడను.

విశేషం: 1.ప్రీతితో పిలిచి పెట్టే విందు ప్రియమైనది. లేదా 'భక్తి గలుగుకూడు పట్టెడైనను చాలు'. అంటే దుర్యోధనుడు ఇంటికి వచ్చిన తరువాత శ్రీకృష్ణుడిని విందుకు పిలిచాడు. అయినా అచ్చమైనా స్వచ్ఛమైన ప్రీతితో పిలువలేదు. మరొకమాటలో చెప్పాలంటే రాజకీయమైన దురుద్దేశంతో పిలిచాడని భావం.

2. ఏదైనా తీరని ఆపద కలిగితే, కాదనలేక కటకటపడుతూ తప్పనిసరిగా తినే మిగిలిన కూడు కూడా తినదగిందే. ప్రీతితో పెట్టే భోజనం ఒకటి, ఆపదలో చేసే భోజనం ఒకటి- ఈ రెండే సబబైన విందులు.

3. ఈ రెండు ప్రమాణాలూ దుర్యోధనుడి పట్ల వర్తించవు. అతడు పాండవులకు హితుడు కాడు; పాండవుల కిప్పు డంతటి ఆపద ఏమీ రాలేదు అన్నాడు కృష్ణుడు. ఇది ముక్కుపై గుద్దినట్లు చెప్పిన సమాధానం. మూర్ఖంగా వేసిన ప్రశ్నకు ఇటువంటి జవాబే తగింది.

4. ఈ పద్యానికి మూలం:

'సంప్రీతి భోజ్యా న్యన్నాని ఆపద్భోజ్యాని వా పునః

నచ సంప్రీయసే రాజన్ నచైవా సద్గతా వయమ్' (సం. 5-89-25)

తిక్కన దీనిని చక్కని తెలుగు పద్యంగా మార్చాడు. (సంపా.)

వ. అట్లుంగాక. 223

తాత్పర్యం: అంతేకాదు.

క. పగవారి యింటఁ గుడిచిన । నగుఁ దమ కనుమాన; మమృత మైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ । దగ; దొడలకుల కెప్పు డెవ్విధము వాటిలునో? 224

ప్రతిపదార్థం: పగవారి+ఇంటన్= శత్రు గృహంలో; కుడిచినన్= భుజిస్తే; తమకున్= తమకు; అనుమానము+అగున్= సందేహం కలుగుతుంది; అమృతము+ఐనను= సుధారసమైనప్పటికిన్నీ; తారున్= గృహస్థులు; పగతురకున్= తమ విరోధులకు; కుడువన్+పెట్టఁగన్+తగదు= తినబెట్టరాదు; ఒడళులకున్= దేహాలకు; ఎప్పుడు= ఏ సమయంలో; ఏ+విధము+పాటిలునో!= ఏమి జరుగుతుందో తెలియదుకదా!

తాత్పర్యం: శత్రుగృహాలలో భుజించేటప్పుడు వారు తన కేమి పెడతారో అని సందేహం కలుగుతుంది. అమృతమైనప్పటికినీ యజమానులు తమ శత్రువులకు తినబెట్టటం కూడదు. క్షణభంగురాలైన ఈ శరీరాలకు ఎప్పుడు ఏ విధంగా చేటు మూడుతుందో చెప్పలేము కదా!

విశేషం: ఇది చక్కని సూక్తి. ఈ పద్యం లోకధర్మనీతిగా కనపడుతున్నా దుర్యోధనుడి దురాలోచనను ధ్వనింపచేసే నిపుణోక్తి. శత్రువు విషాహారం పెట్టకపోయినా, తినినవాడికి సహజంగా ఏదయినా హాని జరిగితే, అతడు శత్రువు పెట్టినకూడు తినటంవలన అనే అనుమానం కలుగుతుంది. (సంపా.)

వ. నేను పగతుండనె యంటేని. 225

ప్రతిపదార్థం: నేను; పగతుండనె?= శత్రువునా?; అంటి(వి)+ఏని= అంటావేమో!

తాత్పర్యం: నేను నీకు విరోధినా? అని ప్రశ్నిస్తావేమో - వినుము.

క. అలుగుదు పాండవులకు వా । రలు నాకుం బ్రాణములు ధరావల్లభ! యి
ట్టలముగఁ దమ ప్రాణములకు । నలుగు జనులు పగతు రగుట యనుమానంబే? 226

ప్రతిపదార్థం: ధరావల్లభ!= రాజా!; పాండవులకున్= పాండవులపై; అలుగుదు(వు)= నీవు కోపం వహిస్తావు; వారలు= కౌంతేయులు; నాకున్ ప్రాణములు= నాకు అసువుల వంటివారు; ఇట్టలముగన్= అధికంగా; తమ ప్రాణములకున్= తమ ప్రాణాలపై; అలుగు జనులు= కినుక వహించినవారు; పగతురు+అగుట= విరోధులు కావటం; అనుమానంబే?= సందేహమా?

తాత్పర్యం: దుర్యోధనా! పాండవులంటే నీకు కోపం. వారు నాకు పంచప్రాణాలు. తమ ప్రాణాలకు ఎసరుపెట్టేవారు తమకు విరోధులు కావటంలో సంశయ మేముంది?

విశేషం: 1. పాండవులనుండి కృష్ణుడిని వేరు చేయాలనీ, లేదా బంధించాలనీ, లేదా చంపాలనీ దుర్యోధనుడు ప్రకటించిన పన్నాగం. విందు ప్రాణాలు తీసే ప్రయోగం. ఆ సంగతిని శ్రీకృష్ణుడు ధ్వనిమయంగా చెప్పాడు.

2. పాండవులు తన పంచప్రాణాలని ప్రకటించిన శ్రీకృష్ణుడు వారు ఆయనకంటె అభిన్నులని స్పష్టం చేశాడు. కృష్ణుడికి దుర్యోధనుడు నేరుగా శత్రువు కాకపోయినా, అతడికి ప్రాణసములైన పాండవులకు శత్రువు కాబట్టి, అతడు తనకూ శత్రువే. శ్రీకృష్ణుడి హేతుబద్ధ వాక్నైపుణ్యం ప్రశంసనీయం. (సంపా.)

ఆ. కారణంబు లేక కౌంతేయులకు బాల్య । మాదిగాఁగఁ గీడె యాచరింతు;
పుణ్యపరులు తోడఁబుట్టువు లార్యులు । వైర మెత్తఁదగునె వారితోడ? 227

ప్రతిపదార్థం: కారణంబులేక= నిమిత్తంలేక; కౌంతేయులకున్= కుంతీపుత్రులకు; బాల్యము+ఆది కాఁగన్= చిన్నతనంనుండి; కీడె= అపకారమే; ఆచరింతు(వు)= చేస్తుంటావు; పుణ్యపరులు= పుణ్యకార్యాలు సల్పటంలో శ్రద్ధకలవారు; తోడఁబుట్టువులు= సహోదరులు; ఆర్యులు= పూజ్యులు ఐన; వారితోడన్= పాండవులతో; వైరము+ఎత్తన్+తగునె?= కలహించవచ్చునా?

తాత్పర్యం: వైర కారణమేమీ లేకుండా చిన్నతనం నుండీ నీవు పాండవులకు అపకారమే చేస్తున్నావు. వారు నీకు సహోదరులు, పుణ్య కార్యాలందు ఆసక్తి గలవారు, పూజ్యులు. అట్టివారితో నీవు విరోధం కలిగి ఉండవచ్చునా?

వ. ఇట్లున్న మీ యందఱ యన్నంబులు దుష్టాన్నంబులు; విదురుం డొక్కని యన్నంబు భోక్తవ్యంబని నిశ్చయించితిఁ గావున నందుఁ బోయెద'నని చెప్పి యజ్ఞనపతి యనుమతి సేయఁ జనునప్పుడు తోడన బాహ్లిక భీష్మాది కౌరవులును గుంభసంభవ ప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ 'మా యిండ్ల నెల్లను గానిక లాయితంబులు చేసికొని నీవు విజయం చేయుటకు నెదురు చూచుచున్న వార'మని పల్కి ప్రార్థించిన 'నే నన్ని చోట్లకు వచ్చిన వాఁడన; యందఱ యర్చనలుం గైకొంటిన; మీరు నిలువుం'డని వారల నిలిపి విదురు గృహంబునకుం బోయిన. 228

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్న= పుణ్యపురుషులను; పూజ్యులను బాధిస్తున్న; మీ+అందఱ+అన్నంబులు= మీ అందరియొక్క భోజనాలు; దుష్ట+అన్నంబులు= పాపపు కూళ్ళు; విదురుండు+ఒక్కని+అన్నంబు= ఒక్క విదురుడి అన్నం మాత్రం; భోక్తవ్యంబు= భుజించదగింది; అని నిశ్చయించితిన్= అని నిర్ణయించుకొన్నాను; కావునన్= కనుక; అందున్+పోయెదన్= అతడి ఇంటికి వెళ్ళుతాను; అని చెప్పి; ఆ+జనపతి+అనుమతి+చేయన్= రాజగు దుర్యోధనుడు సమ్మతించగా; చను+అప్పుడు= వెళ్ళేటప్పుడు; తోడన్+అ= అతడివెంటనే; బాహ్లిక భీష్మ+ఆది కౌరవులును= బాహ్లికుడు భీష్ముడు మున్నగు కురువంశస్థులును; కుంభసంభవ ప్రముఖులు+ఐన మాన్యులును= కలశంనుండి ఉద్భవించిన ద్రోణుడు మున్నుగా గల పెద్దలూ; చని= వెళ్ళి; మాధవుతోడన్= కృష్ణుడితో; మా+ఇండ్లన్+ఎల్లను= మా అందరి ఇళ్ళలో; కానికలు= బహుమతులు; ఆయితంబులు చేసికొని= సిద్ధపరచుకొని; నీవు విజయం చేయుటకున్= నీవు విచ్చేయటానికి; ఎదురుచూచుచున్+ఉన్నవారము= ప్రతీక్షిస్తున్నాం; అని పల్కి= అని నుడివి; ప్రార్థించినన్= వేడుకోగా; నేను; అన్నిచోట్లకున్+వచ్చినవాఁడను+అ= వచ్చినట్లే; అందఱ+అర్చనలున్= మీ అందరి పూజలు; కైకొంటిన్+అ= స్వీకరించినట్లే; మీరు నిలువుండు= మీరు ఆగండి; అని; వారలన్ నిలిపి= వారిని తన వెంట రాకుండ అక్కడే ఆగేటట్లు చేసి; విదురు గృహంబునకున్; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: పుణ్యాత్ములను బాధిస్తున్న మీ అందరి అన్నాలు చెడుతిండ్లు. ఒక్క విదురుడి అన్నమే భుజించదగినది అని నిర్ణయించుకొన్నాను. కావున అక్కడికి వెళ్ళుతాను' అని చెప్పి దుర్యోధనుడు పంపగా వెళ్ళుతున్న సమయంలో శ్రీకృష్ణుడిని బాహ్లికుడు భీష్ముడు మొదలైన కురువృద్ధులున్నూ, ద్రోణాచార్యులు మొదలైన పూజ్యులున్నూ, వెంబడించి 'మా ఇళ్ళలో నీ కోసం కానుకలు సిద్ధపరచుకొని ఉన్నాము. నీ రాకకు ఎదురు చూస్తున్నాము. మా ఇళ్ళకు దయచేయండని వేడుకొన్నారు. 'నేను మీ అందరి ఇళ్ళకు వచ్చినట్లే, మీ పూజలన్నీ అందుకొన్నట్లే అని భావించండి. ఇక ఆగండి' అని వాళ్ళను నిలిపి, విదురుడి మందిరానికి వెళ్ళాడు.

విశేషం: 1. కౌరవుల ఇండ్లలోని విందులు పాపపుకూళ్ళు అని నిందించాడు. 2. విదురు డొక్కడే హితుడనీ, అతడి విందే హితమైన భోజనమనీ ప్రకటించాడు. 3. భీష్మాదు లెందరో తమ ఇండ్లకు పిలిచారు. 'అందరూ పిలిచినట్లే, నేను వచ్చినట్లే, మీ పూజలందుకొన్నట్లే' అని అనునయించాడు. నిజానికి భీష్మాదులతో పలికిన మాటలు సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుడు అనదగిన మాటలు. ఆధ్యాత్మికమైన అర్థంలో మీ అందరి ఇండ్లకూ భౌతికంగా రాకపోయినా మీ అందరి పూజలూ మానసికంగా అందుకొన్నానని అర్థం. లౌకికంగా- మీరందరూ కౌరవుల నాశ్రయించి ఉన్నారు కాబట్టి మీకూళ్ళు నాకు పాసగవు అని చెప్పినట్లు తాత్పర్యం. (సంపా.)

సీ. **సంభ్రమ స్నేహ నిశ్చల భక్తియుక్తిఁ బ ၊ విత్ర మజ్జనము గావించి విదురుఁ**
డెల్లవంటకమును నేర్పడ బోనాలు ၊ వేర్పింప, నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి ၊ సపరివారముగ విశాల రమ్య
పూత స్థలంబునఁ బుండరీకాక్షుండు ၊ దమ్ముండు దాను నుత్సవ మెలర్ప

తే. **సరస రంజక మహనీయ సంప్రయోగ ၊ మగు చతుర్విధ హృద్యాన్న మారగించె**
లలిత సంభావనా మంజులంబు లైన ၊ పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. **229**

ప్రతిపదార్థం: విదురుఁడు; సంభ్రమస్నేహ నిశ్చలభక్తియుక్తిన్= ఆదరం, స్నేహం, నిలుకడఐన భక్తి అనేవాటితో కూడినవాడై; పవిత్ర మజ్జనము+కావించి= శౌరికి పావనమైన స్నానం చేయించి; ఎల్లవంటకమును= పలు తెరగులైన వంటకములు అన్నీ; ఏర్పడన్= విశదంకాగా; బోనాలు+పేర్పింపన్= భోజనపదార్థములు పేర్పించగా; ఎంతయున్+ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ముందర= తాను భుజించటానికి మునుపే; ఓజమైన్= క్రమ ప్రకారం; బ్రాహ్మణభోజనంబు+ఒనరించి= బ్రాహ్మణులకు భోజనం పెట్టి; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల నారాయణుడు-శ్రీకృష్ణుడు; విశాల రమ్య పూత స్థలంబునన్= విశాలమైన, సుందరమైన, పవిత్రమైన ప్రదేశంలో; సపరివారముగన్= సహచరులతోకూడ; తానున్= తానున్నూ; తమ్ముండున్= అనుజుడైన సాత్యకియున్నూ; ఉత్సవము+ఎలర్పన్= వేడుకమీరగా; సరస= రసవంతమూ; రంజక= మదికింపు గొల్పేది; మహనీయ సంప్రయోగము+అగు= గొప్పగా చేయించబడింది ఐన; చతుర్విధ= భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు అనే నాల్గు విధాలైన; హృద్య+అన్నము= ఆత్మకింపైన భోజనం; ఎడన్+ఎడన్= మధ్య మధ్య; లలిత సంభావనా మంజులంబులు+ఐన= మృదులములైన ప్రశంసలచేత ఒప్పుతున్నట్టి; పలుకులు= మాటలు; విదురునకున్= విదురుడికి; ఎలమి+ఒసఁగన్= సంతోషం కలిగించగా; ఆరగించెన్= భుజించాడు.

తాత్పర్యం: విదురుడు ఆదరం, స్నేహం, నిలుకడ గల భక్తి అనే గుణాలతో కూడినవాడై శౌరికి మంగళస్నానం చేయించాడు. ఆ తరువాత వండిన వంటకాలన్నింటినీ వరుసగా వడ్డన చేయించాడు. శ్రీకృష్ణుడు ఆచారక్రమాన్ని అనుసరించి బ్రాహ్మణులు ముందు భుజించిన తరువాత తానూ, తన తమ్ముడూ, సహచరులూ పవిత్రమైన విశాల సుందర ప్రదేశంలో సంతోషంగా భోజనాలకు కూర్చున్నారు. నడుమ నడుమ మృదుల సమ్మాన వాక్యాలతో విదురుడికి ఆనందం కలిగిస్తూ, మహనీయంగా, కమనీయంగా తయారు చేసిన రసవంతాలు, ఆత్మ కింపైనవీ అయిన భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనే నాలుగు విధాలైన భోజన పదార్థాలను శ్రీకృష్ణుడు ఆరగించాడు.

వ. **ఆతండును.** **230**

తాత్పర్యం: ఆ విదురుడు కూడ.

క. 'గోవింద! సంభ్రమము సం । భావింపుము మాకు నిదియ పరమధనం; బొం
డే విధమున నీ కర్చన । గావింపం జాలువాఁడు కలఁడే యెందున్?' 231

ప్రతిపదార్థం: గోవింద!= శ్రీకృష్ణా!; సంభ్రమము సంభావింపుము= మా ఆదరపూర్వకమైన ఆతిథ్యం మన్నించవలసింది. మాకున్+ఇదియ= మా ఆతిథ్యం నీవు స్వీకరించటమే; పరమధనంబు= గొప్పధనం; ఒండు+ ఏ విధమునన్= మరే విధంగానూ; నీకున్+అర్చన+కావింపన్+చాలువాఁడు= నీకు పూజలు చేయగలిగినవాడు; ఎందున్+కలఁడే?= ఎక్కడైనను ఉన్నాడా? (లేడని అర్థం.)

తాత్పర్యం: 'పురుషోత్తమా! నా ఆతిథ్యం మన్నించుము. నీకు ఆతిథ్యమివ్వటమే మాకు పరమ సంపద. వేరొక విధంగా నిన్ను అర్చించగలవాడు ఎక్కడా లేడు.'

విశేషం: మానవాకారంలో వచ్చిన మాధవుడికి భక్తి కలుగుకూడు పెట్టి భజించటానికి విదురుడి విందు ఉదాహరణం. (సంపా.)

వ. అని మఱియు నత్యంత వినయ వాక్యమ్ముల నారాధించుచుండె; నిట్లు కృతాహారుండైన హరికి చందన చర్చా ద్యుపచారంబు లాచరించి యవ్విదురుండు కృతార్థుండై యుండఁ; గవి గాయక ప్రముఖ నిఖిల విద్వజ్జనంబులు పాఠక వాంశిక వైణికాది వినోద పాత్రంబులు నప్పరమేశ్వరుం గానవచ్చి ప్రొద్దుపుచ్చి యభిమతార్థంబులు వడసి చనిరి; రాత్రియగుటయుం దగిన యభ్యంతర మందిరంబున హంసతూలికా తల్పంబున భుజంగ తల్పు నునిచి యతనికడ నుచితాసనంబున నుండి. 232

ప్రతిపదార్థం: అని, మఱియున్= ఇంకను; అత్యంత వినయ వాక్యమ్ములన్= మిక్కిలి అణకువతో కూడిన మాటలచేత; ఆరాధించుచున్+ఉండెన్= శ్రీకృష్ణుడిని పూజిస్తూ ఉన్నాడు. ఇట్లు= ఈ రీతిగా; కృత+ఆహారుండు+ఐన= స్వీకరించిన భోజనంకలవాడైన; హరికిన్= కృష్ణుడికి; చందనచర్చా+ఆది= గంధం పూయటం మున్నగు; ఉపచారంబులు+ఆచరించి= సేవలుచేసి; ఆ+ విదురుండు; కృతార్థుండు+ఐ+ఉండన్= మనోరథం ఫలించినవాడై-ధన్యుడై ఉండగా; కవిగాయక ప్రముఖ= కవులు, గానం చేసేవారు మొదలుగా గల; నిఖిల విద్వత్+జనంబులు= సమస్త పండితులు; పాఠక= స్తుతిపాఠకులూ; వాంశిక= పిల్లన గ్రోవులూదేవారూ (మురళివాయించేవారూ); వైణిక= వీణ వాయించేవారూ; ఆది= మున్నుగా గల; వినోద పాత్రంబులు= వేడుక కలిగించే కళాకారులు; ఆ+పరమ+ ఈశ్వరున్= భగవంతుడైన శ్రీకృష్ణుడిని; కానన్+వచ్చి= దర్శించి; ప్రొద్దు+పుచ్చి= కాలక్షేపం చేసి; అభిమత+అర్థంబులు+ పడసి= ఇష్టప్రయోజనాలను పొంది; చనిరి= తమ నివాసాలకు వెళ్ళారు; రాత్రి; అగుటయున్= కాగా; తగిన; అభ్యంతర మందిరంబునన్= లోపలి సౌధంలో; హంసతూలికా తల్పంబునన్= అంచ రెక్కలతో తయారుచేసిన మెత్తని పరుపుమీద; భుజంగ తల్పున్= శేషశాయియైన శ్రీమహావిష్ణువును; ఉనిచి= అధివసింపజేసి; అతని కడన్= ఆ పరమపురుషుడి చెంత; ఉచిత+ఆసనంబునన్= తగిన పీఠంమీద; ఉండి= కూర్చున్నవాడై.

తాత్పర్యం: విదురుడు మిక్కిలి వినయ వచనాలతో స్వామిని ఆదరించాడు. భోజనమైన తరువాత శ్రీహరికి గంధం పూయటం మొదలైన సపర్యలన్నీ చేసి విదురుడు ధన్యుడైనాడు. ఆ తరువాత కవులు గాయకులు మొదలైన సకల విద్వాంసులు, స్తుతిపాఠకులు, వేణువు లూదేవారు, వీణ వాయించేవారు- ఇట్లా వివిధ విద్యలలో ప్రవీణులై వినోదాన్ని కలిగించే కళాకారులందరూ ఆ జగన్నాయకుని దర్శించి కాలక్షేపం కావించి ఇష్టార్థాలు పడసి తమ తమ నివాసాలకు వెళ్ళారు. రాత్రికాగానే విదురుడు లోపలి సౌధంలో హంసతూలికా తల్పంమీద గోవిందుడిని శయింపజేసి ఆయన దగ్గర తగిన పీఠంమీద తాను కూర్చుండి.

ఆ. 'విదురుఁ డిట్టు లనియె నిది యొక కార్యంబు । గాఁగఁ బూని యిందు రాఁగఁ దగునె?
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ । మాట వినునె? దురభిమాన ఘనుఁడు. 233

ప్రతిపదార్థం: విదురుఁడు, ఇట్టులు+అనియెన్; ఇది+ఒక కార్యంబు కాఁగన్+పూని= ఇది ఒక చేయవలసిన పనిగా భావించి పనిగట్టుకొని; ఇందున్= ఇక్కడికి; రాఁగన్+తగునె?= మీరు రావచ్చునా?; దుర్యోధనుండు; దుష్టబుద్ధి= చెడు తలంపుకలవాడు; నీచు= అల్పుడు; దుర్+అభిమాన ఘనుఁడు= దురహంకారంలో దొడ్డవాడు; నీ మాట వినునె?= నీ హితవు వింటాడా?

తాత్పర్యం: పడుకపైనున్న పరమేశ్వరుడితో విదురు డిట్లా పలికాడు: 'స్వామీ! ఇదొక పనిగా పనిగట్టుకొని ఇక్కడికి నీవు రావచ్చునా? దుర్యోధనుడు దురాత్ముడు. నీచుడు. దురహంకార పూరితుడు. అతడు నీ మాటలను వింటాడా?

క. వచ్చిన సైన్యంబులఁ గని । పెచ్చు పెరిఁగినాఁడు; ద్రోణ భీష్ముల లావుల్
నచ్చియుఁ గర్ణుం డొక్కఁడ । యిచ్చుఁ దనకు విజయ మనియు నెంతయుఁ బొంగున్. 234

ప్రతిపదార్థం: వచ్చిన సైన్యంబులన్+కని= తన చెంతకు జేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచి; పెచ్చు+పెరిఁగినాఁడు= విర్రవీగుతున్నాడు; ద్రోణ భీష్ముల లావుల్= ద్రోణ భీష్ముల యొక్క శక్తులు; నచ్చియున్= నమ్మికూడ; కర్ణుండు+ ఒక్కఁడు+అ= రాధేయు డొకడే; తనకున్= తనకు; విజయము+ఇచ్చున్+అనియున్= గెలుపు నొసగ గలడనియు; ఎంతయున్= మిక్కిలి; పొంగున్= మిడిసిపడుతుంటాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన పక్షాన చేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచుకొని విర్రవీగుతున్నాడు. ద్రోణభీష్ముల శక్తిపై విశ్వాసమున్నప్పటికీ ఒక్క కర్ణుడే తనకు జయం కలిగిస్తాడని మిడిసిపడుతుంటాడు.

వ. నీ విట వచ్చుట వినిన యప్పుడు ధార్త రాష్ట్రులందఱుం గూడంబాఱి తమలో నిశ్చయించిన తెఱంగు నీ శాసనం బుల్లంఘింపం గలవారు 'పాండునందనులకు నేమియు నీకుండువారు' తార యీ ధాత్రియంతయు బీఱువోవ కుండ నేలువారు; వారింగూడిన రాజులెల్లను దిగ్విజయంబునాఁడు పాండవులచేత భంగపడినవారు గావునఁ గర్ణుతో నేకార్థులమై చత్తుము గెలుతు; మింతియ కాని యొండు లేదని నిశ్చయించికొని యున్నవా; ర ట్లగుటంజేసి దుర్యోధనుండు గండు మిగిలి యున్నవాఁడు; సంధి గానేరదు; వారల కందఱకు నిది ప్రాప్తకాలంబై యున్నయది; యెట్లును నుడుగ నేర్చినవారు గా;రిట్లు తమ్మెఱుంగని దుష్టాత్ముల నడుమం గూర్చుండుటయు నవ్వెంగలివిత్తు లఱచు వీఱిఁడి యఱపులకు వంకలొత్తి మాఱుసెప్పుటయు నొప్పకయుండు వెడంగు లగుటం గార్యవచనంబు లెఱుంగరు; మొఱకులగుటం బ్రతాపభాషణంబులకు వెఱవరు; వారల తలంపులు కీడు; నీ మహనీయ ప్రభావబుద్ధి పౌరుషంబు లే నెఱుంగుదు; నయినను బాండవేయులపై స్నేహంబునను నీమీఁది భక్తినిం జెప్పెద; నందుఁ బో వలవ' దనిన వాసుదేవుం డతని కిట్లనియె: 235

ప్రతిపదార్థం: నీవు, ఇటవచ్చుట= ఇక్కడికి రావటం; వినిన+అప్పుడు= విన్నవెంటనే; ధార్తరాష్ట్రులు+అందఱున్= కౌరవులందరూ; కూడన్+పాఱి= గుంపుగా చేరి; తమలోన్= తమలో తాము; నిశ్చయించిన తెఱంగు= నిర్ణయించుకొన్న విధం ఏమిటంటే; నీ శాసనంబు= నీ ఆజ్ఞ; ఉల్లంఘింపన్+కలవారు= అతిక్రమిస్తారు; పాండునందనులకున్; ఏమియున్+ఈక+ఉండువారు= ఏమి కూడ ఇవ్వరు; తారు+అ= తామే; ఈ ధాత్రి+అంతయున్= ఈ పుడమి నంతటినీ; బీఱుపోవక+ఉండన్= బెత్తెడు చోటుకూడ వదలకుండా; ఏలువారు= పాలించదలచారు; వారిన్ కూడిన రాజులు+ ఎల్లను= వారి పక్షం అవలంబించిన

రాజులంతా; దిక్+విజయంబునాఁడు= (కౌంతేయులు) దిగ్విజయం చేసేటప్పుడు; పాండవుల చేతన్; భంగపడినవారు= ఓడించబడినవారు; కావునన్= అట్లగుటచేత; కర్ణుతోన్= రాధేయుడితోపాటు; ఏక+అర్థులము+ఐ= ఒకే ప్రయోజనం ఆశించినవారమై; చత్తుము= యుద్ధంలో చావనైనా చస్తాము; గెలుతుము= గెలువనైనా గెలుస్తాము; ఇంతి+అకాని= ఇంతే తప్ప; ఒండు లేదు= మరో మార్గం మాకు లేదు; అని నిశ్చయించుకొని ఉన్నవారు= అని తీర్మానించుకొని ఉన్నారు; అట్లు+అగుటన్+చేసి= వారల నిర్ణయం ఇట్లా ఉండటం వలన- అనగా కదనానికి వారు కాలు ద్రవ్వటం వలన; దుర్యోధనుండు; గండు మిగిలి+ఉన్నవాఁడు= పౌరుషం వహించి(పొగరుబట్టి) ఉన్నాడు; సంధి, కానేరదు= జరుగబోదు; వారలకున్, అందఱకున్, ఇది ప్రాప్తకాలంబు+ఐ+ఉన్నఅది= వినాశకాలం దాపురించి ఉన్నది; ఎట్లును= ఏ విధంగానైనా; ఉడుగన్ నేర్చినవారు కారు= యుద్ధం చేయవలెననే సంకల్పం మానుకొనేవారు కారు; ఇట్లు= ఈ ప్రకారంగా; తమ్ము+ఎఱుంగని= తమ హాని వృద్ధులే తమకు తెలియనట్టి; దుష్ట+ఆత్ముల+నడుమన్= చెడు మనసులుకలవారి మధ్య; కూర్చుండుటయున్= మీరు కూర్చొనటం; ఆ+వెంగలి విత్తులు= ఆ మూర్ఖ శిరోమణులు; అఱచు; వీఱిడి+అఱపులకున్= అవివేకపు కూతలకు; వంకలు+ఒత్తి= వంకరలు సరిదిద్ది; మాఱు చెప్పుటయున్= బదులాడుటయు; ఒప్పక+ఉండున్= యుక్తంగా నుండదు; వెడంగులు+అగుటన్= అవివేకులు కావడంవలన; కార్యవచనంబులు+ఎఱుంగరు= ప్రయోజనకరమైన మాటలు వినరు; మొఱకులు+అగుటన్= మూర్ఖులు కావటంవలన; ప్రతాప భాషణంబులకున్= వేడిమాటలకు; వెఱవరు= భయపడరు; వారల తలంపులు కీడు= వారి ఆలోచనలు చెడ్డవి; నీ మహనీయ ప్రభావ బుద్ధి పౌరుషంబులు= నీ గొప్ప మహిమ, బుద్ధి, మగటిమి; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; అయినను, పాండవేయులపైన్+స్నేహంబునను= పాండవులమీద గల ప్రేమచేతను; నీమీఁది భక్తినిన్= నీయందుగల భక్తిచేతను; చెప్పెదన్; అందున్+పోవలదు= కురుసభకు వెళ్ళవద్దు; అనినన్; వాసుదేవుండు; అతనికిన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: నారాయణా! నీ విక్కడికి వస్తున్నావని వినినప్పుడు కౌరవులందరూ చేరి తమలో నిర్ణయించుకొన్న సంగతులు మనవి చేస్తాను. వారు నీ ఆజ్ఞ నతిక్రమిస్తారు. పాండవులకు ఏమీ పంచి ఇవ్వరు. తామే ఈ భూమినంతటినీ ఏలుకో దలచారు. వారితో చేరిన రాజులంతా పాండవులు దిగ్విజయం చేసినప్పుడు వారిచేతిలో అవమానం పొందినవారు గనుక తామూ పాండవులతో యుద్ధం చేసి (కర్ణుడితో పాటు) చస్తాం లేదా గెలుస్తాం తప్ప మరో మార్గం అనుసరించమని నిర్ణయించుకొని ఉన్నారు. కాబట్టి దుర్యోధనుడు అహంకరించి ఉన్నాడు. కనుక సంధి జరగదు. కౌరవులకు వినాశకాలం దాపురించింది. అందువలన వారు కదనానికి కాలు ద్రవ్వుతున్నారు. ఇట్లా ఒళ్ళెరుగక త్రుళ్ళిపడుతున్న ఆ దుష్టచిత్తుల మధ్య నీవు కూర్చొని, ఆ మూఢాగ్రేసరులు కూసే అవివేకపు కూతలకు సర్ది సర్ది బదులుమాటలు పల్కటం బాగుండదు. వారందరూ తెలివిమాలినవారు. కనుక ప్రయోజనకరమైన పలుకుల విలువ వారికి తెలియదు. పరమ మూర్ఖులు గనుక చురుకుపుట్టించు మాటలకు చలించరు. వారివి చెడు తలంపులు, స్వామీ! నీ మహామహిమ, నీ ప్రజ్ఞాపాటవం, నీ పౌరుషం నేనెఱుగుదు. అయిననూ పాండుపుత్రులపై గల ప్రేమచేతనూ, నీ యెడగల భక్తిచేతనూ చెపుతున్నాను. నీవు వారున్న సభకు వెళ్ళవద్దు' అని పల్కగా విని పురుషోత్తముడు విదురుడితో ఇట్లా అన్నాడు:

తే. **'నీ వివేకంబు నాప్తియు నెఱపితీవు । తల్లిదండ్రుల మాడ్కి హితంబు సెప్పి**
తేను నా రాక తెఱఁగెల్ల నేర్పరించి । చెప్ప విని యేమి సెప్పినఁ జేయువాఁడ. **236**

ప్రతిపదార్థం: నీ వివేకంబు= నీ జ్ఞానము; ఆప్తియున్= ఆప్తత్వము; ఈవు= నీవు; నెఱపితి(వి)= ఉపయోగపరచావు; తల్లిదండ్రులమాడ్కిన్= జననీజనకులవలె; హితంబు+చెప్పితి(వి)= ఏదిమేలు కలిగిస్తుందో తెలిపినావు; ఏను= నేను; నా రాక

తెలఁగు+ఎల్లన్= నేను ఎందుకు వచ్చానో అదంతయు; ఏర్పరించి+చెప్పన్= తేటతెల్లమొనర్చగా; విని= ఆలకించి; ఏమి చెప్పినన్ చేయువాఁడన్= ఏమి చెపుతావో ఆ ప్రకారమే చేస్తాను.

తాత్పర్యం: 'నీ వివేకం, ఆత్మీయత నాయెడ కనబరచి, తల్లిదండ్రులకైవడి హితం చెప్పావు. నేనిచటికి వచ్చిన దెందుకో వారికి తెలియజెప్పి, అందుకు వారేమంటారో తెలిసికొని అందుకు అనుగుణంగా చేయవలసింది చేస్తాను.

శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట (సం. 5-91-3)

క. ఎఱుఁగుదు నేను సుయోధను । కొఱగామియు నతనితోడఁ గూడిన నృపు లం
దఱుఁ బగ మనమున నిడికొని । యఱుముటయును సంధి పొసఁగదనియు మహాత్మా! 237

ప్రతిపదార్థం: మహాత్మా!= దొడ్డబుద్ధిగలవాడా!; నేను; సుయోధను కొఱగామియున్= దుర్యోధనుడి చెడ్డతనాన్ని; అతని తోడన్+కూడిన= అతడితో జేరిన; నృపులు+అందఱున్= రాజులంతా; పగ= వైరం; మనమునన్+ఇడికొని= మనసులో ఉంచుకొని; అఱుముటయును= ప్రతిఘటించటమూ; సంధి పొసఁగదు+అనియున్= సొత్తుకుదరదనీ; ఎఱుఁగుదున్= తెలియుదును.

తాత్పర్యం: 'నాకు దుర్యోధనుడి దౌష్ట్యమంతా తెలుసు. అతడితో చేరిన రాజులందరూ పాండవుల మీద పగగొని ఎదిరించటానికి సిద్ధంగా ఉన్నారనీ తెలుసు. సంధి సమకూడదనీ తెలుసు.

ఆ. పుడమియెల్ల నొడ్డగెడవయి గజవాజి । యుతముగాఁ గడంగి యుగ్ర మృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్చుట । యధికమైన పుణ్య మనఘచరిత! 238

ప్రతిపదార్థం: అనఘచరిత!= దోషరహితమైన నడవడి గలవాడా!; పుడమి+ఎల్లన్= భూమండలమంతా; ఒడ్డగెడవు+అయి= భారంతో ఒక ప్రక్క కొరగి; గజ వాజియుతముగాన్= ఏనుగులు గుర్రాలు అనువాటితో కూడ; కడంగి= పూనుకొని; ఉగ్రమృత్యు ముఖము+చొరఁగన్= దారుణమైన మిత్తియొక్క నోటిలో ప్రవేశించటానికి; తివురు= త్వరపడుతున్న; మూర్ఖతన్= మొండితనాన్ని; మాన్చుట= తొలగించటం; అధికము+ఐన పుణ్యము= మిక్కిలి పుణ్యకార్యం.

తాత్పర్యం: భూ మండలమంతా భారముతో ఒక ప్రక్కకొరగి ఏనుగులతో, గుర్రాలతో కూడ భీకరమైన మృత్యువు నోటిలో ప్రవేశించటానికి వేగిరపడుతున్నది. ఇట్టి మూర్ఖత్వాన్ని తొలగించుట మిక్కిలి పుణ్య కార్యం.

వ. మానుప వచ్చునే యంటేని. 239

తాత్పర్యం: భూమండలం మృత్యువు నోటిలో ప్రవేశించకుండ ఆపటం శక్యమా అంటే.

క. దొరకొని పుణ్యముఁ బాపము । నరుఁ డర్థిం జేయుచుండ నడుమ నొకట న
వ్వెర వెడలి తప్పినను ద । త్పరిణతి ఫలమొందునండ్రు ధర్మవిధిజ్ఞుల్. 240

ప్రతిపదార్థం: దొరకొని= పూనిక వహించి; పుణ్యమున్= సుకృత కర్మలనూ, పాపమున్= దురిత కర్మలనూ; నరుఁడు= మానవుడు; అర్థిన్= ఆసక్తితో; చేయుచున్+ఉండన్= కావిస్తున్నప్పుడు; నడుమన్= మధ్యలో; ఒకటన్= ఒకానొక కారణంచేత; ఆ+వెరవు+ఎడలి= ఉపాయము చెడి; తప్పినను= ఆ కార్యము నెరవేరకపోయిననూ; ధర్మవిధిజ్ఞుల్= ధర్మస్వరూపమెరిగిన పెద్దలు; తద్+పరిణతి= ఆ పనులయొక్క పరిణామం; ఫలము+ఒందున్+అండ్రు= ఫలం చెందుతుందని చెప్పుతారు.

తాత్పర్యం: ఒకడు పూనికతో పుణ్యమో, పాపమో చేస్తూ ఉండగా నడుమ ఏదో ఒక కారణంచేత ఆ పని వెరవు తప్పి నెరవేరకపోయినా చేసిన ప్రయత్నం మాత్రం ఫలాన్ని పొందియే తీరుతుంది - అని ధర్మస్వరూపం తెలిసిన పెద్దలు చెపుతారు. విదురా! ఇక్కడ నా మాట ఫలించినా ఫలించకపోయినా చేసిన పుణ్యాయత్నఫలం మాత్రం నాకు దక్కుతుంది.

విశేషం: దీనికి మూలం:

"ధర్మకార్యం యతన్ శక్త్యా నచేచ్ఛక్నోతి మానవః

ప్రాప్తో భవతి తత్పుణ్య మత్ర మే నాస్తి సంశయః." (సం. 5-91-6)

మానవుడు తన శక్తిలోపం లేకుండా ధర్మకార్యాన్ని చేయటానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ అతడు దానిని పూర్తి చేయలేక, ఫలం పొందకపోయినా, దాని పుణ్యాన్ని తప్పక పొందుతాడు. అందులో నాకు సంశయం లేదు. ఈ శ్లోకం భారత కథాసందేశంగా వినిపిస్తున్నది. (సంపా.)

వ. అట్లుంగాక. 241

తాత్పర్యం: అంతే కాకుండా.

తే. చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు । డడ్డపడి వారితోడఁ గొట్లాడియైన
దాని నుడుపంగఁ జొరకున్నవానిఁ గ్రూర । కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు. 242

ప్రతిపదార్థం: చుట్టములలోనన్= బంధువులలోపల; ఒప్పమి పుట్టినపుడు= ద్వేషం కలిగినప్పుడు; అడ్డపడి= అడ్డం వచ్చి; వారితోడన్= ఆ చుట్టాలతో; కొట్లాడి+ఐనన్= తగవులాడి అయినా; దానిన్= ఏర్పడిన విరోధాన్ని; ఉడుపంగన్= మాన్పటానికి చొరక+ఉన్నన్= పూనుకోకపోతే; వానిన్= అట్టివాడిని; కర్మకాండ విదులు= కార్యస్వరూపం తెలిసిన పెద్దలు; క్రూరకర్ముఁడు+అని= ఘాతుకుడని; చెప్పుదురు= చెప్తారు.

తాత్పర్యం: బంధువులలో పరస్పరం వైరమేర్పడితే అడ్డం వచ్చి వారితో తగవులాడి అయినా ఆ పగను మాన్పకుంటే అలాంటివాడిని క్రూరకర్ముడని కర్మకాండయొక్క తత్త్వం తెలిసిన పెద్దలు చెపుతారు.

వ. కావున నీ రెండు దెఱంగులవారికి శాంతిగావింపం బ్రయత్నంబు సేసెద; ధర్మార్థ సహితంబైన తెఱంగు మాటలు మంత్రి జన సహితుండైన సుయోధనునకుం జెప్పెదఁ దనకుం బాండునందనులకు లోకంబులకు హితంబయిన విధంబు వంచన లేక చెప్పెడు నన్ను పాండవులవాఁడని శంకించి యతండు నామాట వినండయ్యె నేనియు మేలకాక యిట్లు సొచ్చి చెప్పకున్న నన్నదమ్ములు దమలోనం బోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించెఁ దనచేతఁ జక్కంబడదా? యని యజ్ఞులైన జను లాడుదు; రెల్లభంగులం గార్యం బార్యు లియ్యకొనం జెప్పుదు; ధార్తరాష్ట్రులుం దమకు బ్రదుకు తెరువైన నా పలుకులు వట్టుదురు; పట్టక నీ తలంచిన చందమునం దులువలై కలఁగం బాటినవారు నా ముందర నిలువం జాలుదురే' యని పలికిన విదురుం డట్లకాక యని సమ్మతించి యామంత్రణంబు సేసి నిజ శయన స్థానంబునకుం జనియె; ననంతరంబ. 243

ప్రతిపదార్థం: కావునన్; ఈ రెండు తెఱంగుల వారికిన్= ఈ కురు పాండవులకు; శాంతి కావింపన్= సంధి చేయటానికి; ప్రయత్నంబు చేసెదన్= ప్రయత్నం చేస్తాను; ధర్మ+అర్థ సహితంబు= ధర్మార్థాలతో కూడిన; తెఱంగు మాటలు= సంధి వచనాలు; మంత్రిజన సహితుండు+ఐన= మంత్రులతో కూడిన; సుయోధనునకున్; చెప్పెదన్; తనకున్, పాండునందనులకున్= పాండురాజు కుమారులకు; లోకంబునకున్; హితంబు+అయిన విధంబు= మేలు కలిగించే మార్గం; వంచనలేక= కపటం లేక; చెప్పెడు నన్నున్; పాండవులవాఁడు+అని= పాండవ పక్షపాతి అని; శంకించి= అనుమానించి; అతఁడు; నా మాట; వినండు+ అయ్యెన్+ఏనియున్= పెడచెవిని బెట్టినచో; మేలకాక= మంచిదే పొమ్ము; ఇట్లు చొచ్చి చెప్పక+ఉన్నన్= ఇట్లు కార్యరంగంలో ప్రవేశించి చెప్పదగిన మాటలు నేను చెప్పకపోతే; అన్నదమ్ములు; తమలోనన్; పోరన్= కలహించుకొంటుండగా; కృష్ణుండు; వారింపక= అడ్డుపడక; ఉపేక్షించెన్= అశ్రద్ధ చేశాడు; తన చేతన్= తన వల్ల; చక్కంబడదా= కార్యము నెరవేరదా; అని, అజ్ఞులు+ఐన జనులు= ఏమీ తెలియని మనుష్యులు; ఆడుదురు= పలుకుతారు; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; కార్యంబు; ఆర్యులు= పెద్దలు; ఇయ్యకొనన్= సమ్మతించగా; చెప్పుదున్; ధార్తరాష్ట్రులున్= దుర్యోధనాదులుకూడ; తమకున్= తమకు; బ్రదుకు, తెరువు+ఐన= జీవనాధారమైన; నా పలుకులు= నా మాటలు; పట్టుదురు= చేకొందురు గాక; పట్టక= నా మాటలు ఆదరింపక; నీ తలంచిన చందంబునన్= నీవు భావించిన విధాన; తులువలు+ఐ= కుత్సితులై; కలఁగన్+పాటినన్= చిత్తసంక్షోభము పొందినయెడల; వారు; నా ముందరన్= నా యెదుట; నిలువన్+చాలుదురే?= ధైర్యంతో నిలబడగలరా?; అని పల్కినన్; విదురుండు; అట్లు+అ కాక= నీవు సంకల్పించినట్లే; అని సమ్మతించి; ఆమంత్రణంబు+చేసి= హరి దగ్గర పోయి రమ్మనిపించుకొని; నిజశయన స్థానంబునకున్= తాను పరుండే ప్రదేశానికి; చనియెన్= వెళ్ళాడు; అనంతరంబు+అ= అటుతరువాత.

తాత్పర్యం: కురుపాండవుల పొత్తుకొరకు ప్రయత్నం చేస్తాను. ధర్మార్థయుక్తంగా ఒద్దిక మాటలు మంత్రి సహితుడైన దుర్యోధనుడికి చెపుతాను. అతడికీ, పాండుకుమారులకూ, సర్వజనులకూ మేలు కలిగించే మార్గమేదో మోసం లేకుండా తెలుపుతాను. ఇట్లా చెపుతున్న నన్ను పాండవ పక్షపాతి అని, దుర్యోధనుడు సందేహపడి నా మాటలు వినకపోతే పోనీ. అదీ ఒకందుకు మంచిదే. ఇట్లా నేను ఈ రెండు కుటుంబాలవిషయంలో జోక్యం కలిగించుకొనకుంటే అన్నదమ్ములు తమలో తాము పోట్లాడుకొంటుంటే కృష్ణుఁడు వారించక తన కేమీ పట్టనట్లు ఊరక ఉండిపోయాడు; తాను అనుకుంటే కార్యం చక్కదిద్దలేడా? అని అవివేకులు నన్ను ఆడిపోసుకొంటారు. అందుచేత పెద్దలు సమ్మతించేటట్లు అన్ని విధాలా కార్యం చక్కబెట్టటానికి అనుకూలమైన మాటలు వారికి చెపుతాను. దుర్యోధనాదులు తాము బ్రదకటానికి దారి కల్పించే నా మాటలు మన్నిస్తే బాగుపడతారు. అట్లా నా పలుకులు ఆదరించక నీవు భావించినట్లు కుత్సితులై మనసులు చెరుచుకొని తిరగబడితే వారు నాముందు నిలువ గల్గుతారా?' అని వాసుదేవుడు విదురుడితో పలికాడు. విదురుడు 'అట్లాగే స్వామీ అని ఆయన మాటలకు సమ్మతి తెల్పి' శౌరికడ సెలవు తీసికొని తాను పరుండేచోటికి వెళ్ళిపోయాడు.

ఆ. ఆతని వచన రచన యాత్మలోఁదలపోసి । యిట్టివాఁడు గలఁడె యెందు?' ననుచుఁ
బాలకడలి కడల పాటియై యొప్పు న । ప్పాన్పునందు శౌరి పవ్వడించె. 244

ప్రతిపదార్థం: శౌరి= శూరుడి మనుమడైన శ్రీకృష్ణుడు; అతని వచన రచన= ఆ విదురుడి మాటలయొక్క పొంకమును; ఆత్మలోన్= తన మదిలో; తలపోసి= స్మరించి; ఇట్టివాఁడు= ఇంతటి మహనీయుడు; ఎందున్= ఎచ్చటైనా; కలఁడు+ఎ?= ఉన్నాడా?; అనుచున్= అనుకొంటూ; పాలకడలి కడలపాటి+ఐ= క్షీర సాగర తరంగాలకు సమానమై; ఒప్పు= ప్రకాశించే; ఆ+ పాన్పునందున్= ఆ పరుపుమీద; పవ్వడించెన్= పండుకొన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి మాటల పొందికను తన మదిలో స్మరించి, ఇంతటి మహనీయు డెక్కడైనా ఉన్నాడా అని అనుకొంటూ క్షీరసముద్ర తరంగాలవలె విశాలమైన ఆ తెల్లని పరుపుమీద పవ్వళించాడు.

విశేషం: అలం: ఉపమ. శ్రీకృష్ణుడియందు విష్ణుత్వం అలంకార ధ్వని. (సంపా.)

వ. ఇట్లు సుఖనిద్రసేసి వేగుంబోకట మాగధమంగళగానంబుల మేలుకాంచి సమయ కర్తవ్యంబులు సలిపె; నట్టియెడఁ గృతవర్మయు సాత్యకియు వచ్చి పొడసూపినం బురుషోత్తముండ వారలు మొదలుగాఁగల యిష్ట జనంబులు పరివేష్టింప నుచిత ప్రదేశంబున నున్నంత. 245

ప్రతిపదార్థం: ఇట్లు సుఖనిద్ర+చేసి= ఇట్లా విదురుడి గృహంలో హాయిగా నిదురించి; వేగుంబోకటన్= తెల్లవారే సమయంలో; మాగధ మంగళగానంబులన్= మేలుకొలుపువారియొక్క శుభకరాలైన గానములచేత; మేలుకాంచి= నిదుర లేచి; సమయ కర్తవ్యంబులు= ప్రాతఃకాలకృత్యాలు; సలిపెన్; అట్టియెడన్= అట్టివేళలో; కృతవర్మయున్; సాత్యకియున్; వచ్చి; పొడచూపినన్= కనబడగా; పురుషోత్తముండు= శ్రీకృష్ణుడు; వారలు మొదలుగాన్ కల= కృతవర్మ సాత్యకి ప్రభృతులైన; ఇష్టజనంబులు= ప్రియమైన వారు; పరివేష్టింపన్= తన చుట్టు చేరగా; ఉచిత ప్రదేశంబునన్= తగిన చోట; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి గృహంలో సుఖంగా నిద్రించి వేగుజాముున వైతాళికులు వచ్చి మేలు కొలుపు పాటలు పాడగా మేల్కొని, ప్రాతఃకాల కృత్యములన్నీ నెరవేర్చాడు. ఇంతలో కృతవర్మ, సాత్యకి వచ్చి కనిపించుకొన్నారు. నారాయణుడు వారితోపాటు, మరికొంతమంది ఇష్టులు తన చుట్టూ చేరి కొల్చుచుండగా తగిన చోట ఆసీనుడై ఉన్నాడు. అప్పుడు.

క. ఇనతనయ శకుని దుశ్శాసన సహితము। గాఁగ నెలమిఁ జనుదెంచి సుయో
ధనుఁడు ప్రియోక్తులఁ దగు వా। రును దానును వారిజోదరుం గొనియాడెన్. 246

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఇన తనయ= సూర్య పుత్రుడైన కర్ణుడు; శకుని= శకుని; దుశ్శాసన సహితము కాఁగన్= దుశ్శాసనునితో కూడ; ఎలమిన్= సంతోషంతో; చనుదెంచి= వచ్చి; ప్రియ+ఉక్తులన్= ఇంపైన మాటలతో; తగువారును= అర్హులైనవారున్నూ; తానును= తానున్నూ; వారిజ+ఉదరున్= కమలనాభుడిని; కొనియాడెన్= శ్లాఘించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రాధేయుడితో శకునితో దుశ్శాసనుడితో కలసి సంతోషంతో వచ్చి, మది కింపైన మాటలతో తగినవారూ, తానూ మధుసూదనుడిని వినుతించాడు.

వ. అతండును మధుర సంభాషణంబులు చేయ వార లతనికి ధృతరాష్ట్రుండు బంధుమిత్త్రాది సమస్త పరిజన సమన్వితుండయి పేరోలగంబున నునికి యెఱిఁగించినఁ బ్రియంబునఁ గట్టాయితంబైన తేరెక్కి భేరీశంఖచామర ప్రముఖ భద్ర చిహ్నంబులతో వెడలి గరుడధ్వజంబు గ్రాలఁ గృతవర్మ సాత్యకు లొక్కరథంబునను, దుర్యోధనాది దుష్టచతుష్టయం బొక్క రథంబునను బార్శ్వంబుల రాఁ బౌరులకుఁ గన్నుల పండువగుచు రాజమందిర ద్వారంబు సేర నరుగునప్పటి యులివునకుఁ గొలువువారెల్ల నత్యుత్సుకులై యెదురుచూడ రథోత్తమంబు నవతరించి యరవిందనాభుండు. 247

ప్రతిపదార్థం: అతండును= శ్రీకృష్ణుడున్నూ; మధుర సంభాషణంబులు చేయన్= ప్రియమైన పలుకులు పలుకగా; వారలు= ఆ వచ్చిన దుర్యోధనాదులు; అతనికిన్= శ్రీకృష్ణుడికి; ధృతరాష్ట్రుండు; బంధుమిత్త్ర+ఆది+సమస్త పరిజన సమన్వితుండు+అయి= చుట్టాలు, స్నేహితులు మున్నగు పరివారంతో కూడివున్నవాడై; పేరు+ఓలగంబునన్+ఉనికి= నిండుకొలువున ఉండటం; ఎఱిఁగించినన్= తెలుపగా; ప్రియంబునన్= ఇష్టంతో; కడు+ఆయితంబు+ఐన= సర్వ సంసిద్ధమై ఉన్న; తేరు+ఎక్కి= రథమెక్కి; భేరీ శంఖ చామర ప్రముఖ భద్ర చిహ్నంబులతోన్= భేరులు, శంఖములు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో; వెడలి= బయలుదేరి; గరుడధ్వజంబు+క్రాలన్= రథంపై గరుత్మంతుడి టెక్కెం ప్రకాశించగా; కృతవర్మసాత్యకులు; ఒక్క రథంబునను; దుర్యోధన+ఆది+దుష్ట చతుష్టయంబు= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని అనే దుర్మార్గులు నలుగురు; ఒక్క రథంబుననూ; పార్శ్వంబులన్+రాన్= తన రథానికి కుడియెడమ ప్రక్కల వస్తూ ఉండగా; పౌరులకున్= పురజనులకు; కన్నుల పండువు+అగుచున్= కన్నుల విందుచేస్తూ; రాజమందిర ద్వారంబు= ధృతరాష్ట్రుడి సభాభవనం యొక్క వాకిలి; చేరన్+అరుగు+అప్పటి+ఉలివునకున్= సమీపించే వేళలో ఏర్పడిన సద్దునకు; కొలువువారు+ఎల్లన్= సభలో ఉన్నవారందరూ; అతి+ఉత్సుకులు+ఐ= మిక్కిలి ఉత్సాహం కలవారై; ఎదురుచూడన్= ప్రతీక్షిస్తుండగా; రథ+ఉత్తమంబున్= శ్రేష్ఠమైన తేరును; అవతరించి= దిగి; అరవిందనాభుండు= పద్మం నాభియందుగల శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: దుర్యోధనాదులతో శౌరికూడా ప్రియమైన మాటలు మాట్లాడాడు. అప్పుడు సుయోధనాదులు శ్రీకృష్ణుడితో 'ధృతరాష్ట్రమహారాజు బంధుమిత్రులతో పరిజనులతో కొలువుదీరి ఉన్నారు' అని చెప్పారు. ఆ మాటలతో సంతోషించి శ్రీహరి సంసిద్ధంగా ఉన్న రథమెక్కాడు. భేరులు, శంఖాలు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో, గరుడకేతనం ప్రకాశిస్తుండగా రథంపై బయలుదేరాడు. తన అరదానికి ఒకవైపు సాత్యకి కృతవర్మలు ఎక్కిన రథం, మరోవైపు దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులనే నలుగురు దుర్మార్గులెక్కిన రథం వస్తుండగా స్వామి పురజనుల కన్నులకు విందు గావిస్తూ రాజభవనద్వారం సమీపించాడు. స్వామి తేరు మందిర ద్వారం సమీపిస్తుండగా కలిగిన సందడికి కొలువు కూటంలోని వారంతా రాజీవలోచనుడి రాకకు పరమోత్సాహంతో ఎదురుచూడసాగారు. శ్రీమన్నారాయణుడు శ్రేష్ఠమైన రథం నుండి క్రిందికి దిగాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఎదురు వచ్చిన విదురుని యిచ్చు కరముఁ । దమ్ము చేయును రెండు హస్తములఁ బట్టి
నడచె ముందటఁ గదియు సందడిఁ గడంగి । కర్ణ దుర్యోధనులు దొలఁగంగ జడియ. 248

ప్రతిపదార్థం: ఎదురువచ్చిన= తన కెదురుగా వచ్చిన; విదురుని+ఇచ్చుకరమున్= విదురుడందిచ్చిన హస్తాన్నీ; తమ్ము చేయును= తమ్ముడైన సాత్యకి హస్తాన్నీ; రెండు చేతులన్+పట్టి= తన రెండు బాహువులతో ఊతగా గ్రహించి; ముందటన్= ఎదుట; కదియు సందడిన్= ఏర్పడిన సమ్మర్దాన్ని; కడంగి= పూని; కర్ణ దుర్యోధనులు= కర్ణుడూ, దుర్యోధనుడునూ; తొలఁగంగన్= దూరమయ్యేటట్లు; జడియన్= తోలగా; నడచెన్= నారాయణుడు సాగాడు.

తాత్పర్యం: తన కెదురుగా వచ్చి విదురు డందించిన హస్తాన్నీ; తమ్ముడైన సాత్యకి చేతినీ తన రెండు చేతులతో ఊతగా గ్రహించి శ్రీకృష్ణుడు నడుస్తూండగా ఎదుట ఏర్పడిన జన సమ్మర్దాన్ని కర్ణ దుర్యోధనులు దవ్వులకు తొలగద్రోశారు.

వ. కృత వర్మాది యాదవులు లోనుగాఁగల యభ్యంతరులైన బలు మానుసులు పొదివి కొని పోవఁదన సమీపంబునఁ గౌరవులు రవి సన్నిధి తారాగ్రహంబుల చందం బగుచుండం దేజోరాజియగు రాజీవాక్షుండు చని తనకుఁ బ్రత్యుత్థానంబు సేసిన కురురాజును దొరలను నభినందించుచు. 249

ప్రతిపదార్థం: కృతవర్మ+ఆది యాదవులు= కృతవర్మ మొదలైన యదువంశస్థులు; లోనుగాన్+కల= మొదలుగా కలిగిన; అభ్యంతరులు+ఐన= సన్నిహితులైన; బలు+మానుసులు= దొడ్డమనుష్యులు; పొదివి కొనిపోవన్= కూడికొనిపోగా; తన సమీపంబునన్= తన దగ్గర; కౌరవులు; రవి సన్నిధిన్= సూర్యుడి ముందు; తారాగ్రహంబుల చందంబు+అగుచుండన్= నక్షత్రాల గ్రహాల వలె వెలవెల పోతూ ఉండగా; తేజోరాశి+అగు= వెలుగుల ప్రోగైన; రాజీవ+అక్షుండు= కమల నేత్రుడు; చని= సభలో ప్రవేశించి; తనకున్= తనకు; ప్రత్యుత్థానంబు+చేసిన= ఎదురుగా వచ్చిన; కురురాజును= ధృతరాష్ట్రుడినీ; దొరలను= ఇతర రాజులను; అభినందించుచున్= మెచ్చుకొంటూ.

తాత్పర్యం: బలసంపన్నులు, సన్నిహితులు అయిన కృతవర్మ మొదలైన యాదవులు తనను అలముకొని వెంటరాగా, తన సన్నిధిలో కౌరవులందరూ భాస్కరుడి మ్రోల తారలవలె, గ్రహములవలె వెలవెల పోతుండగా, వెలుగుల ముద్దఅయిన పుండరీకాక్షుడు కొలువుకూటం లోనికి వచ్చాడు. ధృతరాష్ట్రుడూ, ఇతర ధరాపతులూ శౌరికి ఎదురు వచ్చి ఆహ్వానించారు. శ్రీకృష్ణుడు వారిని అభినందిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉపమ. ధృతరాష్ట్రుడి సభలో ప్రవేశించిన కృష్ణుడు సూర్యుడివలె వెలుగు ముద్దగా వెలిగిపోయాడట. కౌరవులు తారకలవలె, గ్రహాల వలె వెలవెల పోయారట! త్వరలో శ్రీకృష్ణుడు చూపబోయే విశ్వరూపానికి ఈ అలంకారం ధ్వనిసంకేతం. (సంపా.)

క. తన కని పెట్టిన మణిమయ । కనకోన్నత పీఠమునఁ బ్రకాశంబున ని
ల్చిన యెడఁ దోఁచిరి నారద । ముని ప్రముఖు లంతరిక్షమున నుజ్జ్వలులై. 250

ప్రతిపదార్థం: తనకున్+అని= తనకొరకని; పెట్టిన= ఉంచిన; మణిమయ+కనక+ఉన్నతపీఠమునన్= రతనాలు చెక్కిన, ఎత్తయిన బంగరు గద్దెపై; ప్రకాశంబునన్= కాంతితో; నిల్చిన+ఎడన్= నిలిచినవేళలో; అంతరిక్షమునన్= ఆకాశమునందు; ఉజ్జ్వలులు+ఐ= దీప్తిమంతులై; నారదముని ప్రముఖులు= నారదుడు మున్నగు మునిపుంగవులు; తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తన కొరకై అక్కడనుంచిన రత్నఖచితమగు ఎత్తయిన బంగారు గద్దెమీద వెలుగులు వెదచల్లుతూ నిలిచి ఉండగా ప్రకాశమానులై నారదుడు మొదలగు మునీశ్వరులు గగనతలంలో కాన్పించారు.

విశేషం: కౌరవ సభలో శ్రీకృష్ణుడిని నిలిపి అతడి చుట్టూ ఒక దివ్య వాతావరణాన్ని ధ్వనింపజేయటం ఈ వర్ణన పరమార్థం. ఎత్తైన చోట మణుల కాంతులతో మెరుస్తున్న బంగారు గద్దె. ఆ గద్దెకే ప్రకాశాన్ని కలిగించే దివ్యతేజోమూర్తి శ్రీకృష్ణుడు. దానికితోడు ఆయన దర్శనం కొరకు వచ్చిన నారదాది దివ్యమునీంద్రులు. నేల శ్రీకృష్ణుడితో ఆకాశానికి అంటింది. నారదాదుల ఆగమనంతో నింగి నేలకు దిగింది. ఇహపరాల అద్భుత సమ్మేళనం శ్రీకృష్ణ సందర్శనం. (సంపా.)

వ. ఇవ్విధంబున సన్నిహితులయిన యమ్మహామునులం గురుపితామహునకుం జూపి నారాయణుం డిట్లనియె. 251

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; సన్నిహితులు+అయిన= అచటికి చనుదెంచిన; ఆ+మహామునులన్= ఆ మహర్షులను; కురుపితామహునకున్= కౌరవులకు తాత అయిన భీష్ముడికి; చూపి= కనబరిచి; నారాయణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అచటికి వచ్చిన మహామునులను కౌరవులకు తాతఅయిన భీష్ముడికి చూపి ఇట్లా అన్నాడు:

ఆ. మనలఁ జూచువేడ్కఁ జనుదెంచినారు మ । హాత్ములైన నారదాది మునులు;
వీరి కర్ఘ్యపాద్య విధు లొనరించి యా । సనము లిడఁగఁ బనుపు సత్వరముగ. 252

ప్రతిపదార్థం: మనలన్= మనలను; చూచువేడ్కన్= చూడవలెననే అభిలాషతో; మహా+ఆత్ములు+ఐన= మహానుభావులైన; నారద+ఆది మునులు= నారదుడు మొదలైన మునీశ్వరులు; చనుదెంచినారు= విచ్చేశారు; వీరికిన్= ఈ మహాపురుషులకు; అర్ఘ్య+పాద్య విధులు= అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం అనే ఉపచారాలు; ఒనరించి= చేసి; సత్వరముగన్= తొందరగా; ఆసనములు+ఇడఁగన్= పీఠాలు వేయటానికి; పనుపుము= పంపుము.

తాత్పర్యం: మనలను చూడవలెననే కుతూహలంతో మహనీయులైన నారదాది మహర్షులు విచ్చేశారు. వీరికి అర్ఘ్య పాద్యాదులైన ఉపచారాలు చేయించు, వారు కూర్చుండటానికి వెంటనే పీఠాలు వేయించు.

వ. వీరలు సముచితాసనంబుల నుండక మనకుఁ గూర్చుండుట తగవుగా'దనినం గొలువువారెల్ల సంభ్రమాశ్చర్యంబులతో మునుల వలను జూచుచుండ భీష్ముండు పరిచారకులం బనిచి కనక మణిమయాసనంబు లనేకంబులు దెప్పింప వార లరుగుదెంచిన వారలకు నమస్కరించి యాసనార్ఘ్య పాద్యాది విధులం బూజలు సేయించి కృష్ణుండు గూర్చున్న యనంతరంబ ధృతరాష్ట్రుండునుం దక్కటివారును నుచిత ప్రకారంబుల నమ్మునీంద్రులకు నభివందనంబులు సేసి నిజాసనా సీనులైరి; దుశ్శాసనుండును వివింశతియును గద్దియ లిడ సాత్యకియుఁ గృతవర్మయుఁ గృష్ణుం గదిసి యిరువంకలం గూర్చుండిరి. కర్ణ దుర్యోధనులుం జేరువ నొక్క గద్దియ నుండిరి. విదురుండును మణిపీఠంబునఁ గృష్ణుని వెనుక దెసఁ దదీయోన్నత పీఠంబునఁ గరంబత్తమిల్లి యుండె; గాంధార రాజు నిజపుత్త్ర పరివృతుండై యొక్క దిక్కున నుచిత పీఠాసీనుండయ్యె; నట్టి సమయంబున. 253

ప్రతిపదార్థం: వీరలు= నారదాది మునులు; సముచిత+ఆసనంబులన్+ఉండక= తగిన పీఠాలపై కూర్చుండక; మనకున్; కూర్చుండుట; తగవు+కాదు= ధర్మంకాదు; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; కొలువువారు+ఎల్లన్= సదస్యులందరూ; సంభ్రమ+ఆశ్చర్యములతోన్= సంతోషాద్భుతములతో; మునుల వలను= ఆ మునీశ్వరులవైపు; చూచుచున్+ఉండన్; భీష్ముండు; పరిచారకులన్+పనిచి= సేవకులను పంపి; కనకమణిమయ+అసనంబులు= బంగారు రత్నాలు తాపిన పీఠాలు; అనేకంబులు= పెక్కు; తెప్పింపన్; వారలు= ఆ నారదాదులు; అరుగుదెంచినన్= (సభకు)రాగా; వారలకున్; నమస్కరించి; ఆసన+అర్ఘ్య పాద్య+ఆదివిధులన్= ఆసనాలివ్వటం; అర్ఘ్యమివ్వటం; పాద్యమొసగటం మొదలైన ఉపచారాల చేత; పూజలు= అర్చనలు; చేయించి; కృష్ణుఁడు; కూర్చున్న+అనంతరంబు+అ= కూర్చున్న తరువాతనే; ధృతరాష్ట్రుండునున్; తక్కటివారును= మిగిలినవారున్నూ; ఉచిత ప్రకారంబులన్= తగురీతుల; ఆ+ముని+ఇంద్రులకున్= ఆ నారదాది ముని పుంగవులకు; అభివందనంబులు చేసి= ప్రణామాలు సలిపి; నిజ+ఆసన+ఆసీనులు+ఐరి= తమ తమ పీఠాలందు కూర్చున్నారు; దుశ్శాసనుండును, వివింశతియును; గద్దియలు+ఇడన్= పీఠాలుంచగా; సాత్యకియున్; కృతవర్మయున్; కృష్ణున్, కదిసి= ఆనుకొని; ఇరువంకలన్= రెండువైపుల; కూర్చుండిరి; కర్ణ దుర్యోధనులున్; చేరువన్= చెంతనే; ఒక్క గద్దియన్; ఉండిరి; విదురుండును; మణిపీఠంబునన్; కృష్ణుని; వెనుకదెసన్= వెనుకవైపున; తదీయ+ఉన్నత పీఠంబునన్= ఎత్తైన గద్దియమీద; కరంబు= మిక్కిలి; అత్తమిల్లి= ఒరిగి; ఉండెన్= ఉన్నాడు; గాంధారరాజు= శకుని; నిజపుత్త్ర పరివృతుండు+ఐ= శకుని తన కుమారులతో చుట్టబడినవాడై; ఒక్కదిక్కునన్= ఒక దెస; ఉచితపీఠ+ఆసీనుండు+అయ్యెన్= తగిన గద్దెపై ఉన్నాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నారదాది మహామునులు తగిన పీఠాలపై కూర్చుండకుండా మనం కూర్చుండటం న్యాయం కాదు' అని శ్రీకృష్ణుడు భీష్ముడితో చెప్పాడు. సదస్యులంతా తొట్రుపాటుతో ఆశ్చర్యపడి ఆ మునులవైపే చూస్తుండిపోయారు. భీష్ముడు సేవకులను పంపి మణులు తాపిన బంగారు గద్దెలు పెక్కింటిని తెప్పించాడు. ఇంతలో మునీశ్వరు లచటికి విచ్చేయగా పరమాత్ముడు వారికి నమస్కరించి, ఆసనమివ్వటం, అర్ఘ్య పాద్యాదు లొసంగటం మొదలైన దివ్యోపచారాలతో పూజలు చేయించాడు. వాసుదేవుడు కూర్చున్న పిదప ధృతరాష్ట్రుడున్నూ, మిగిలిన వారున్నూ తగిన రీతుల ఆ మునిపుంగవులకు నమస్కారాలు చేసి తమ తమ పీఠాలపై ఆసీనులయ్యారు. దుశ్శాసనుడు, ధార్తరాష్ట్రులలో పదిహేడవవాడగు వివింశతి అనే అతడు గద్దె లిడగా సాత్యకి, కృతవర్మ శ్రీకృష్ణుడికి రెండువైపులా ఆనుకొని కూర్చున్నారు. కర్ణుడు, దుర్యోధనుడు ఆ సమీపంలో ఒకే పీఠాన ఉండినారు. విదురుడు వెనుక తట్టుగా మురారి యొక్క ఎత్తైన గద్దెమీదికి వ్రాలి మణిపీఠంమీద కూర్చున్నాడు. గాంధార రాజైన శకుని తన కొడుకులతో ఒక తట్టు తగిన గద్దెమీద తానుండినాడు. ఇట్టిసమయంలో.

విశేషం: 1. శ్రీకృష్ణుడు నిలిచిన సభ లౌకికత్వం మీద దివ్యత్వం ఆవేశించిన ట్లుంటుంది. కురువీరులందరూ లేచి దివ్యమునులకు ఆసనాలిచ్చి కూర్చొనబెట్టారు. శ్రీకృష్ణుడి దివ్య సందేశం వినటానికై వచ్చిన మహర్షులు వారు. శ్రీకృష్ణుడి సందేశం యొక్క గొప్పదనాన్ని మునిగణం మౌనంగా వ్యాఖ్యానించి చెపుతున్నట్లున్నది.

2. దేవర్షులు కూర్చున్న తరువాత శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు, ఆ తరువాత సభ్యులు కూర్చున్నారు. సభ నంతా శ్రీకృష్ణాధీనమైన ఒక దివ్యానుభూతి వాతావరణం అలముకొన్నది.

3. సభలో భద్రతా విశేషాలు ప్రత్యేకంగా గమనించదగినవి. అవి ఆసనాలు అమర్చటంలో స్పష్టమౌతున్నది. శ్రీకృష్ణుడి భద్రత అత్యంత ముఖ్యం. అందుకే ఆయన కిరుప్రక్కల సాత్యకీ, కృతవర్మా కూర్చున్నారు - అంగరక్షకులవలె. విదురుడు వెనుకభాగంలో ఒదిగి కూర్చున్నాడు. అంటే మూడు దిక్కులా నమ్మిన బంటులవంటి వారు శ్రీకృష్ణుడికి రక్షా కవచంవలె వ్యాపించి కూర్చున్నారు. శ్రీకృష్ణుడికి ఎదురు బడి ఎవరూ నిలవలేరని ధ్వని.

4. శ్రీకృష్ణుడికి కొద్ది దూరంలో ఒక ప్రక్కన కర్ణదుర్యోధనులు ఒకే సింహాసనం మీద కూర్చున్నారు. తనువులు వేరైనా మనసులు ఒకటే సుమా! అని వారి నేస్తం ఆ కూర్చోటంలో ధ్వనించబడుతున్నది. వారిద్దరూ శ్రీకృష్ణుడిని బంధించటానికి అనువైన దూరంలో కూర్చున్నారు. శకుని సకుటుంబంగా ఆ సమీపంలో ఉన్నాడు. దుశ్శాసనుడు అన్నకు నీడగా ఉంటాడు. దుష్టచతుష్టయం దాడికి అనువుగా సభలో కూర్చున్నది. ఈ విధంగా సభాసదులు కూర్చొనటంలో కూడా వ్యూహరచన మున్నట్లు చిత్రించటం రాజకీయ సభా ప్రాశస్త్యాన్ని తెలుపుతున్నది. ఉద్యోగపర్వ సభలో ఇది అన్ని విధాలా ఉన్నతమైన రాజ్య (రాజకీయ) సభ. (సంపా.)

క. అంబుద శుభగాత్రుం బీ । తాంబరధరుఁ గమలదళ నిభాక్షున్ హరిఁ జూ
డం బడసి లోచనము లమృ । తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్. 254

ప్రతిపదార్థం: అంబుద శుభగాత్రున్= మేఘం వంటి మంగళకరమైన శరీరం కలవాడును; పీత+అంబరధరున్= పచ్చని పట్టు పుట్టం కట్టినవాడును; కమలదళ నిభ+అక్షున్= తామర రేకులతో సమానమైన కన్నులు కలవాడును; అగు; హరిన్= శ్రీకృష్ణుడిని; చూడన్+పడసి= చూచే భాగ్యంపొంది; లోచనములు= నేత్రాలు; అమృతంబు+ఆనినమాడ్కిన్= సుధారసమును గ్రోలిన విధాన; సమ్మదంబునన్= ఆనందమునందు; తేలన్= తేలగా.

తాత్పర్యం: మేఘవర్ణంవలె సుందరమైన దేహవర్ణం కలవాడూ, పచ్చని పట్టుపుట్టం ధరించినవాడూ, తామర రేకులతో సమానమైన నయనాలు కలవాడూ, అయిన శ్రీహరిని చూడనోచినందులకు సభలోనివారి కన్నులు అమృతరసాన్ని గ్రోలినట్లు ఆనందంలో ఓలలాడాయి.

విశేషం: అలం: ఉపమ. 1. రాజనీతికి ఈ రాయబారపు ఘట్టం శిఖరాయమాణం. అందులో శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం మకుటాయమానం. ఈ ఘట్టాన్ని అటు వ్యాసమహర్షి, ఇటు తిక్కన సోమయాజీ అద్భుతంగా చిత్రించారు.

2. సభలో అందరినీ ఆకర్షించేది వక్త యొక్క రూపవైభవం. అంటే ఆంగిక, ఆహార్య అభినయ సంపద. శ్రీకృష్ణుడు కన్నుల పండుగ కలిగించే మధురాకృతి కలవాడు. వ్యాసమహర్షి మాటలలో.

'అతసీ పుష్ప సంకాశః పీతవాసా జనార్దనః

వ్యభ్రాజత సభామధ్యే హేమ్నీవోపహితో మణిః' (సం. 5-92-52)

నల్లని అవిసెపూవు వంటి మేనికాంతి కలవాడూ, పచ్చని పట్టువస్త్రం ధరించినవాడూ అయిన శ్రీకృష్ణుడు సభామధ్యంలో బంగారంలో పొదిగిన ఇంద్రనీలమణివలె ప్రకాశించాడు- అని వ్యాసుడు వర్ణించాడు. తిక్కన శ్రీకృష్ణుడిని అంబుదశుభగాత్రుడుగా మొదట పేర్కొన్నాడు. సర్వజనుల కన్నులనూ, హృదయాలనూ ఆకర్షించేది శ్రావణమేఘం. పచ్చని పట్టువస్త్రం కట్టటం శ్రీకృష్ణుడి నైజం. ఆ రంగు చూచేవారికి శాంతిని ప్రసాదిస్తుంది. ఆ తరువాత తిక్కన- మూలంలో ప్రస్తావించబడని కమలదళనిభాక్షులను వర్ణించాడు. విశాలాక్షుడని విష్ణువుకు పెట్టింది పేరు. ప్రకృతి నుండి పురుషోత్తముడి వరకు, భౌతికం నుండి ఆధ్యాత్మికం వరకు, సౌందర్యం నుండి కారుణ్యం వరకు వ్యాపించి ఉన్న ఒక దివ్యచైతన్యం రూపుతాల్చిన అనుభవం. గాత్రం ఇంద్రియాలను, అంబరం మనస్సును, కమలాక్ష దృష్టి ఆత్మను ఆకట్టుకొనే స్వభావం కలవి. వీటన్నిటినీ తిక్కన ఒకచోట కూర్చాడు.

3. శ్రీకృష్ణుడు ఒక దివ్యాదివ్యవిభావం. ఆయనను చూచిన సభాసదులు మూడంచెల అనుభూతిని పొందారు. క్రమంగా అన్వయించుకొంటే 'అంబుదనిభ గాత్రుడి'ని చూచి కన్నులు ఆనందించాయి. పీతాంబరధరుడిని చూచి మనస్సులు అమృతం త్రాగిన అనుభూతిని పొందాయి. కమలదళాక్షుని కరుణామయ విశాలదృక్కులను చూచి ఆత్మలు ఆనందాంబుధిలో తేలినట్లున్నవి. తిక్కన అలంకారధ్వని ఇక్కడ గమ్యమానం. మూడు రకాల అనుభవాన్ని ఒక ఉపమాలంకారంలో సూచించాడు. కన్నులు అమృతరసాన్ని గ్రోలి ఆనందంలో తేలాయట! ఇది అలంకారాన్ని మించిన ధ్వనిమయ భావచిత్రం.

4. సభలో అందరినీ ఆకర్షించే రూపం, వేషం, అభినయం (దృష్టి) అనే మూడంశాలు ముప్పిరిగొని ముచ్చట కొలపటం నాటకీయత. (సంపా.)

క. ఆ కొలువువారు కర మచ । లాకృతి నొక పలుకులేక యందఱు వింజం
బాఁకిడిన కరణి నవశ ము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్. 255

ప్రతిపదార్థం: ఆ కొలువువారు= ధృతరాష్ట్రుడి కొలువుకూటంలో ఉన్నవారు; కరము= మిక్కిలి; అచల+ఆకృతిన్= కదలని రూపాలతో; ఒక పలుకులేక= ఏమియు మాటాడక; అందఱున్= ఎల్లరు; వింజంబు= వింధ్య పర్వతం; ఆఁక+ఇడిన కరణిన్= అడ్డపడిన తీరున; అవశ+ముద్+ఆకారిత+చిత్తవృత్తులు+ఐ= పారవశ్యం, సంతోషం రూపుగొన్న మనోవ్యాపారం కలవారై; ఉండంగన్= ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మేరుగిరి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న సూర్యుడి భ్రమణాన్ని వింధ్యపర్వతం నిరోధించిన వేళ సృష్టి నిశ్చలమైనట్లు ధృతరాష్ట్రుడి కొలువు కూటంలోని వారందరూ శ్రీకృష్ణ సందర్శనంతో తమ మనస్సులు సంతోష పరవశాలు కాగా ఇట్టట్టు చలింపక నోట మాటలేక అట్లే స్తంభించిపోయారు.

విశేషం: అలం: ఉపమ. 1. శ్రీకృష్ణుడి దివ్య దర్శనం చేసికొంటున్న సభాసదుల స్థితిని తిక్కన ఉపమాలంకార సుందరంగా వర్ణించాడు. తెలుగుదనం ఒలకపోశాడు.

2. సభాసదుల అవస్థలన్నీ సాత్త్వికాభినయ విశేషాలు కావటం చేత అవి తెచ్చిపెట్టుకొన్నవి కాక శ్రీకృష్ణ దర్శనం వలన పొంగిన సాత్త్వికచిత్తవృత్తి జన్యమైన సహజాభినయ విశేషాలని స్పష్టం.

3. ఇందులో మూడు రకాలైన అవస్థలు వర్ణించబడ్డాయి. 1. 'కరమచలాకృతి' అవస్థ. మిక్కిలి కదలని ఆకృతితో ఉన్నారట! లేదా, శ్రేష్ఠమైన పర్వతంవలె స్థిరమైన ఆకృతితో సభ్యులున్నారట. అంటే ఆశ్చర్యజన్యమైన స్తంభావస్థలో ఆంగికాభినయాన్ని ప్రదర్శిస్తున్నారన్నమాట. స్తంభావస్థలో వాచికాభినయం ఉండకపోవటం సహజం. అందుకే 'ఒక పలుకు లేక' ఉండిపోయారు. ఇవి అభినయావస్థలు.

4. ఇక వారి చిత్తవృత్తులు 'వింజం బాకిడిన కరణి' నవశముదాకారిత చిత్తవృత్తులై ఉన్నట్లు తిక్కన విశేషంగా వర్ణించాడు. వింధ్యపర్వతం అడ్డుపడితే జనులు సూర్యచంద్రుల గతిని గమనించలేక కాలజ్ఞానాన్ని కోల్పోయారట. ఆ అనుభవాన్ని తెలుగులో జాతీయంగా భద్రపరచుకొన్నారు తెలుగువారు. అంటే, శ్రీకృష్ణుడి దివ్యాకారాన్ని చూస్తూ కాలాన్ని మరచిపోయారు. దానికి కారణం- వారందరూ పారవశ్యంతో కూడుకొన్న ఆనందమే ఆకారంగా రూపుదాల్చిన చిత్తవృత్తులు కలవారయ్యారు. ఇది తన్మయావస్థ. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట (సం. 5-93-1)

క. జలదస్వన గంభీరత । నెలుఁగొప్పఁగ దంత దీప్తు లెసఁగ ముకుందుం
డలరుచు సభ నఖిల జనం । బులు విన ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్. 256

ప్రతిపదార్థం: ముకుందుఁడు= శ్రీకృష్ణుడు; జలదస్వన గంభీరతన్= మేఘధ్వనియొక్క గాంభీర్యంతో; ఎలుఁగు+ఒప్పఁగన్= తన కంఠధ్వని సొంపారగా; దంత దీప్తులు+ఎసఁగన్= దంతాల యొక్క కాంతులు అతిశయించగా; సభన్= సభలో; అలరుచున్= ప్రకాశిస్తూ; అఖిలజనంబులు= ధృతరాష్ట్రుడి కొలువులోనున్న సమస్త ప్రజలు; వినన్= ఆలకించగా; ధృతరాష్ట్ర భూవిభునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మేఘధ్వనివలె గంభీరమైన తన కంఠధ్వనితో, దంతాల కాంతులు ప్రసరిస్తూ ఉండగా సభలో వెలుగొందుతూ సదస్యులందరూ చెవులు నిక్కించుకొని ఆలకిస్తుండగా ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడి కంఠస్వరం మేఘ గర్జనవలె గంభీరంగానూ, హృదయంగమంగానూ ఉన్నది. దానికి తోడు ఆయన దంతకాంతులు మెరుపుల వలె మెరిసిపోతున్నాయి. వర్షాకాల ప్రకృతి రామణీయకం కాల్పనిక సౌందర్యంతో శ్రీకృష్ణుడియందు దర్శనమిస్తున్నట్లు తిక్కన చిత్రించి, సందేశ ఘట్టానికి పూర్వరంగ ప్రక్రియను నిర్వహించాడు. చెప్పేవాడు గొప్పవాడైతే చెప్పేది గొప్పగా రాణిస్తుంది. (సంపా.)

క. 'జననాథ! నీ యెఱుంగని । పనులు గలవె? యైనఁ దగవుఁ బరమహితంబుం
దనవారికిఁ జెప్పన తగు । నని వచ్చితి భారతాన్వయము ప్రియమొందన్. 257

ప్రతిపదార్థం: జననాథ!= రాజా ధృతరాష్ట్రా!; నీ+ఎఱుంగని+పనులుకలవె?= నీకు తెలియని కార్యాలున్నాయా?; ఐనన్= అయినప్పటికీ; తగవున్= న్యాయాన్ని; పరమ హితంబున్= మిక్కిలి శ్రేయస్కరమైనదానిని; భారత+అన్వయము= భరతుడు

జన్మించిన కురువంశము; ప్రియము+ఒందన్= సంతోషపడగా; తనవారికిన్= నా వారికి; చెప్పన్+అ+తగున్+అని= చెప్పటమే ఉచితమని; వచ్చితిన్= ఇక్కడికి వచ్చాను.

తాత్పర్యం: 'మహారాజా! నీ వెరుగని కార్యా లేమున్నాయి? ఐనప్పటికీ, భరతవంశం సంతోషించేటట్లు నా ఇరుకుటుంబాలవారికీ న్యాయమూ, పరమహితమూ చెప్పటం ఉచితమని నేనిక్కడికి వచ్చాను.

విశేషం: 1. శ్రీకృష్ణుడి గంభీరోపన్యాసం ఇక్కడి నుండి ప్రారంభమౌతున్నది. ఉపన్యాసానికి ఉపక్రమణిక ఊపిరి. ఎత్తుగడలోనే వక్త శ్రోతల చిత్తాలను ఆకర్షించాలి. అందుకై శ్రీకృష్ణుడు నాలుగంశాలను తొలి పలుకులలో తోచేటట్లు చెప్పాడు. అవి- (1) సంబుద్ధి (2) వినయవచనం (3) వక్త లక్ష్యం (4) ప్రయోజనం.

2. 'జననాథ!' అన్న సంబుద్ధి సార్థకం. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి మాటలను కౌరవులకు తండ్రిగా కాక, ప్రజలకు ప్రభువుగా వినాలని ధ్వని. ఇందులో వంశం కంటె ప్రజల యోగక్షేమం ముఖ్యమని సూచన. లోకక్షేమం కొరకే శ్రీకృష్ణుడి బోధ అని ధ్వని.

3. పెద్దల ముందు ఉపన్యసించేటప్పుడు వివేకవంతుడు వినయోక్తులతో మొదలు పెట్టాలి. దాని వలన వక్త యొక్క నిరహంకార ప్రవృత్తి వ్యక్తమై శ్రోతల ఆభిముఖ్యం ఏర్పడుతుంది. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి ఆభిముఖ్యాన్ని సాధించ యత్నించాడు రెండవ అంశంలో.

4. శ్రీకృష్ణుడు తన ఉపన్యాసానికి లక్ష్యాన్ని వివరించాడు మూడవ అంశంగా. కౌరవులందరూ తనవారని అనుకొని వారితో తన అభిప్రాయం చెప్పటం న్యాయమని భావించి శ్రీకృష్ణుడు హస్తినకు వచ్చాడట! ఆ మాటలలో రెండు లక్ష్యాలున్నాయి. 1. న్యాయం 2. పరమహితం ఏర్పడేటట్లు చెప్పటం.

5. ఆ చెప్పటం వలన భారతాన్వయమంతా సంతోషించే ప్రయోజనం సాధించబడుతుందని సూచించాడు. లక్ష్య ప్రయోజనాల నిర్దేశం వలన వక్తవ్యాంశం మీద ఆసక్తి అంకురిస్తుంది.

6. అవధాన సాధనమే ఈ పద్య ప్రయోజనం. ప్రసాద గుణభూయిష్ఠమైన రచన దీనికి ప్రాణం. (సంపా.)

క. క్షీరోదక గతిఁ బాండవ । కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము వా రన । వీ రనఁ గురుముఖ్య! నీకు వేఱుంగలదే? 258

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కురువంశంలో ప్రధానమైనవాడా!; క్షీర+ఉదకగతిన్= పాలూ, నీరూవలె; పాండవ కౌరవులు= పాండవులున్నూ కౌరవులున్నూ; ఒడన్+కూడి= ఒద్దిక కలిగి; మనికి= జీవించటం; కార్యంబు= చేయదగినపని; అది= దానిని; నీవు= నీవు; ఆరసి= పరికించి; నడపుము= సాగించుము; నీకున్= నీకు; వారు+అనన్= పాండవులనగా; వీరు+అనన్= కౌరవులనగా; వేఱున్+కలదే= భేదమున్నదా? (లేదని అర్థం.)

తాత్పర్యం: కురునాథా! పాండవ కౌరవులు పాలూ నీరూ వలె కలసి మెలసి జీవించటం మంచిపని. వారు అట్లా ఒద్దికతో ఉండేటట్లు నీవు వారిని నడపించవలసింది. పాండవులు వేరు, కౌరవులు వేరు అనే భేదబుద్ధి నీకు లేదు కదా!

విశేషం: అలం: ఉపమ, యథాసంఖ్యం. కురుముఖ్యుడుగా ధృతరాష్ట్రుడు చేయవలసిన బాధ్యతను ఇక్కడ శ్రీకృష్ణుడు చెప్పుతున్నాడు. 1. పాండవ కౌరవులు పాలూనీరువలె కలిసి ఉండటం కాదగిన కార్యం. 2. అట్లా జరగాలంటే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులను సమంగా చూడాలి. ఇందులో మొదటిది న్యాయం. రెండవది హితం.

2. కౌరవ పాండవులు కలిసి ఉండాలి అన్నప్పుడు చాలవరకు ఈ ఘట్టంలో అందరూ క్షీరోదక సామ్యాన్నే స్వీకరించారు. అయితే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులు క్షీరోదకాలవంటివారన్నాడు. (1.263), భీముడు పాండవ కౌరవులను క్షీరోదకాలన్నాడు. (3.47). శ్రీకృష్ణుడు పాండవ పక్షం వాడే కాబట్టే వారు పాలవలె బలవంతులనీ, కౌరవులు నీరువలె బలహీనులనీ, పాండవుల నాశ్రయించి బ్రతకటమే ధార్తరాష్ట్రులకు క్షేమమనీ భావించాడు. (సంపా.)

చ. భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీ యనుఁగుఁ దమ్ముఁడు; నీ తనయుల్ యశోధురం
ధర శుభ శీలు; రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్పనేటికిన్? 259

ప్రతిపదార్థం: భరతకులంబు= భరతుడు జన్మించిన కురువంశం; ధర్మమును= ధర్మమూ; పాడియున్= న్యాయమూ; సత్యమున్= సూనృతమూ; పొత్తున్= ఐకమత్యమూ; పెంపునున్= గొప్పతనమూ; కరుణయున్= కృపయూ; కల్గి+ఉండున్+ అనఁగాన్= కల్గియుంటుందని; నుతిన్+కన్నది= ప్రఖ్యాతి వహించింది; అందున్= అట్టి వంశంలో; నీవున్= నీవూ; నీ+ అనుఁగుఁ దమ్ముఁడున్= నీ ప్రియమైన తమ్ముడు పాండురాజూ; సద్గుణ+ఉత్తరులరు= మంచి గుణాలచేత శ్రేష్ఠులు; నీ తనయుల్= నీ కొడుకులున్నూ నీ తమ్ముడి కొడుకులున్నూ; యశోధురంధర శుభశీలురు= కీర్తి భారాన్ని వహిస్తున్న మంచి స్వభావం కలవారు; ఈ సుచరితక్రమము= పరంపరగా వస్తున్న ఈ మంచి నడవళ్ళతీరును; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; తప్పన్+ ఏటికిన్?= విడుచుట ఎందులకు?

తాత్పర్యం: మహారాజా! మీ భరతవంశం ధర్మం న్యాయం సత్యం ఐకమత్యం గౌరవం కారుణ్యం మొదలైన సద్గుణాలు గలిగి పొగడ్త కెక్కింది. అట్టి వంశంలో నీవూ, నీ ప్రియ సహోదరుడు పాండురాజూ, సద్గుణాలయందు శ్రేష్ఠులు, మరి నీ కుమారులో కీర్తి భారం వహించజాలినవారు, కళ్యాణ స్వభావులు. ఇంత మంచి నడవడిగల వంశసంప్రదాయం ఇపుడు కూడా తప్పించటమెందుకు?

విశేషం: 1. వెనుకటి పద్యంలో ధృతరాష్ట్రుడు నిర్వహించవలసిన బాధ్యతలు అవశ్య కర్తవ్యాలని చెప్పటానికి శ్రీకృష్ణుడు ఉపపత్తులను ఏకరువు పెట్టుతున్నాడు. వాటిల్లో మొదటిది వంశగౌరవ సంప్రదాయ పరిరక్షణ. దానిని వివరించా డీ పద్యంలో.

2. భరతవంశం ఆరు గుణాలకు ప్రసిద్ధి. వాటిని ఈ క్రమంలో చెప్పుకొనాలి. (1) ధర్మం - వేదశాస్త్రాదులలో ప్రతిపాదించిన విధి. (2) న్యాయం - లోకహితాన్ని కలిగించే సాంఘిక మర్యాద. (3) సత్యం - నిజం మాట్లాడటం, నిజం భావించటం, నిజం పాటించటం (4) పొత్తు - అరమరికలు లేక ఒకరి మేలు ఒకరు కోరుతూ కలసి మెలసి ఉండటం. (5) గౌరవం - వ్యక్తిసుఖం కంటె వంశానికి కళంకం రాకుండా గౌరవం కలిగేటట్లు వర్తించటం (6) కరుణ - సర్వజీవ హితభావం.

3. భరతవంశంలో కొందరు కొన్ని కొన్ని గుణాలు ఆచరించి ఉండవచ్చును. కాని, పాండురాజూ, ధృతరాష్ట్రుడూ అన్ని గుణాలను ఆచరించేవారిలో అగ్రగణ్యులుగా పరిగణించబడతారు. ఈ మాట ధృతరాష్ట్రుడి యందు సత్యం కాకపోయినా ముందుకాళ్ళకు బంధంగా శ్రీకృష్ణుడు అట్లా పొగిడాడు. 'నీతనయుల్' అనే మాట పాండవ కౌరవుల కిద్దరికీ వర్తిస్తుంది. తండ్రి లేని పాండవులను ధృతరాష్ట్రుడే తండ్రిగా పెంచి పెద్దవాళ్ళను చేశాడని తాత్పర్యం. కౌరవ పాండవులు యశోధురంధర శుభశీలురట! యశస్సు, వంశ గౌరవ పరిరక్షణ వలననే కలుగుతుందని ధ్వని. ఆ మంచి వంశ సంప్రదాయాన్ని మానవద్దని హితవు చెప్పాడు. ఈ పద్యం హితోక్తి. (సంపా.)

శా. **ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె**
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ! **260**

ప్రతిపదార్థం: కౌరవ్యవంశ+అగ్రణీ!= కురువంశంవారిలో శ్రేష్ఠుడా!; ఈ వంశంబునకున్+ఎల్లన్= ఈ కురుకులాని కంతటికీ; నీవు+అ= నీవే; కుదురు= ఆశ్రయం; ఇందున్= ఈ కురువంశస్థులలో; ఎవ్వారి చందంబులు= ఎవ్వరి నడవడులు; ఎట్లు+ఐ వర్తిల్లినన్= ఏ విధంగా ఉండునో వాటిననుసరించి, కీడు= హాని, మేలు= వృద్ధి; తుదిన్= కడపటికి; నీఅందున్+ఒందెడున్= నీకే చెందగలవు; కానన్= కనుక; సద్భావంబు+ఆరసి= మంచి తలంపునకు వచ్చి; లోనిపొత్తు= అంతరంగంలో ఒద్దిక; వెలివృత్తంబున్= బహిరంగ ప్రవర్తన; జనస్తుత్యముల్= ప్రజలచేత మెచ్చదగినవిగా; కావింపన్= చేయటానికి; నీకున్+అ= నీకే; ఏ విధమునన్= ఏ విధంగానైనా; తగున్= యోగ్యం.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీవు కురువంశస్థులలో అగ్రేసరుడివి. ఈ వంశాని కంతటికీ నీవే ఆధారం. నీ కుటుంబంలో ఎవ్వరెవ్వరి నడవడికలు ఎట్టెట్లుగా ఉంటాయో వాటినిబట్టి కలిగే మేలు కీళ్ళు నీకే చెందుతాయి. కాబట్టి నీవు ఇరు కుటుంబాల వారి శ్రేయస్సు నూహించి అంతరంగ స్నేహం, బహిరంగ ప్రవర్తన జనులు మెచ్చేటట్లుగా ఏవిధంగానైనా వారిని చక్కదిద్దవలసి ఉంటుంది.

విశేషం: కౌరవ్య వంశాగ్రణీ! అనే పిలుపు సాభిప్రాయం. ధృతరాష్ట్రుడు కౌరవవంశరాజులలో అగ్రగణ్యుడు కావాలంటే ఈ తగవు (న్యాయం) పాటించాలని శ్రీకృష్ణుడు నిర్దేశించాడు. 1. ఇప్పుడు ఈ వంశానికంతా నీవే ఆధారం. అతడు న్యాయంగా వ్యవహరిస్తే వంశం నిలుస్తుంది. లేదా వంశం అతడితోనే అంతమౌతుంది. అంతటి కీలకమైనది ఆయన వర్తనం.

2. వంశంలో ఇతరులు అతడిని కాదని ఏమి చేసినా, దానివలన కలిగే కీడుగాని, మేలుగాని ధృతరాష్ట్రుడే అనుభవించవలసి వస్తుంది.

3. కాబట్టి కుటుంబ శ్రేయస్సును భావించి, మనసూ మాటా ఒకటిగా తలంచి, జనులు మెచ్చేటట్లు వ్యవహరించాలి.

4. ఏ విధంగా చూచినా ఈ బాధ్యత మరెవ్వరిదీ కాదు. ధృతరాష్ట్రుడిదే. కాదని తప్పించుకొనటం న్యాయం కాదు- అని శ్రీకృష్ణుడు స్పష్టపరిచాడు. తరతరాల వంశ సంప్రదాయ గౌరవం ఒక్క ధృతరాష్ట్రుడి వర్తనం మీదనే ఆధారపడి ఉన్నదనీ, వంశ చరిత్రలో ధృతరాష్ట్రుడు కీలకమైన పాత్ర నిర్వహించవలసి వచ్చిందనీ, న్యాయంగా వ్యవహరించి కౌరవ్యవంశాగ్రణి కావాలనీ శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. (సంపా.)

చ. **వినుము! సుయోధనాదులగు వీరు సధర్ములు గాక కార్యము**
ల్గొనక మహార్థసిద్ధి యెడలుం దమ కిట్లున కన్వయంబు వ
ర్తనమిది గాదు నాక బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్. **261**

ప్రతిపదార్థం: వినుము= మహారాజా, నామాటలాలకించవలసింది; సుయోధన+ఆదులు+అగు+వీరు= దుర్యోధనుడు మొదలుగా గల్గిన నీ కుమారులు; సధర్ములు కాక= ధర్మము ననుసరించే వారుకాక; కార్యముల్+కొనక= చేయదగిన మంచి పనులు

చేయక; ఇట్లు= ఈ రీతిగా మెలగితే; తమకున్= తమకు; మహా+అర్థసిద్ధి= గొప్ప ప్రయోజనాలు చేకూరుట; ఎడలున్+అనక= తొలగిపోవునని తలంచక; అన్వయంబు వర్తనము= వంశపు నడవడి; ఇది కాదు= ఇటువంటిది కాదు; నాక= అనక; బెడిదంపుఁ దనంబునన్= దారుణ స్వభావంతో; బంధుకోటికిన్= బంధువర్గానికి; మనసులు నొవ్వఁగాన్:= హృదయాలు వ్యథ చెందేటట్లు; అవగుణంబులకున్= దుర్గుణాలకు; ఏమియున్= ఇంచుకయు; ప్రుయిలోడరు= వెనుదీయరు.

తాత్పర్యం: రాజా! వినుము. దుర్యోధనాదులైన వీరు ధర్మపరులుగాక, సత్కార్యాలాచరించక, ఇట్లా ఉంటే మహార్థసిద్ధికి దూరమవుతామని తలంచక, వంశపునడవడి ఇట్టిది కాదనక, దారుణ బుద్ధితో బంధువుల మనస్సులు బాధచెందేటట్లుగా దుష్టచేష్టలు చేయటానికి ఏమాత్రం వెనుదీయకున్నారు.

విశేషం: భరతవంశం సద్గుణాలకు నిలయం. మరి ధృతరాష్ట్రుడి కొడుకులు అవగుణాలకు ఆశ్రయాలు. కాబట్టి దుశ్చేష్టలు చేయటానికి వెనుకాడరు. వంశపురుషులకు కౌరవులకూ ఉన్న భేదాన్ని శ్రీకృష్ణుడు చక్కగా విశ్లేషించాడు. వారు సధర్ములు- వీరు అధర్ములు. వారు న్యాయవర్తనులు - వీరు మంచి పనులు చేపట్టరు. వారు సత్యనిష్ఠులు - వీరు మహార్థసిద్ధిని లెక్కచేయని అసత్యనిష్ఠులు. వారు వంశజులందరూ కలసి మెలసి ఉండాలనేవారు. వీరు అన్వయ వర్తనాన్ని గౌరవించనివారు; వారు వంశౌన్నత్యానికి కృషి చేశారు. వీరు బంధుకోటి మనసులను బాధపెట్టి వంశగౌరవాన్ని మట్టి కలిపారు. వారు కరుణామూర్తులు - వీరు పాపకర్మలకు వెనుకాడని కఠినాత్ములు. ఈ విధంగా కౌరవులు భరత వంశ సంప్రదాయాన్ని చట్టుబండలు చేశారని స్పష్టంగా చెప్పాడు. వీరివలననే వంశ క్షయం కలుగుతుందని ధ్వనింపచేశాడు. (సంపా.)

ఉ. కౌరవ పాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీ నృపకోటి కుర్వికిం
బోరితమైన నింతకును బుట్టు మహాపద గావునన్ ధరి
త్రీ రమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే! 262

ప్రతిపదార్థం: ధరిత్రీ రమణ+అగ్రగణ్య!= రాజులలో ఉత్తముడా!; కౌరవపాండవుల్= కౌరవులూ, పాండవులూ; తెఱఁగు+ కైకొని= సంధి నిర్ణయానికి వచ్చి; శాంతతన్+పొంది= ప్రసన్నత్వం వహించి; ఉన్కి= ఉండటం; ఆరయన్= పరికించగా; నాకున్= నాకును; నీకున్= నీకును; కులము+అంతకున్= కురువంశాని కంతటికీ; ఈ నృపకోటికిన్= ఈ రాజ సమూహానికి; ఉర్వికిన్= ఈ జగత్తునకూ; మేలు= శ్రేయం; పోరితము+ఐనన్= యుద్ధం జరిగితే; ఇంతకును= ఈ సమస్తమునకునూ; మహా+ఆపద+పుట్టున్= గొప్ప విపత్తు సంభవిస్తుంది; కావునన్= అట్లగుటచేత; గణుతించి= నా మాటలు లెక్కించి; అవశ్యమున్= తప్పక; పొందు+ఒనర్పవే= సంధి కావించవలసింది.

తాత్పర్యం: కౌరవులు పాండవులు ఒక మంచి నిర్ణయానికి వచ్చి, శాంతం వహించి, జీవించటం మంచిది. ఇట్లు వారు ప్రసన్నచిత్తులై ఉండటం నాకూ, నీకూ, కురువంశానికీ, ఈ రాజ సమూహానికీ, ఈ భూ మండలానికి శ్రేయం. అట్లాకాక యుద్ధమే సంభవిస్తే మనందరికీ మహా విపత్తు కలుగుతుంది. కనుక రాజోత్తమా! నా మాటలపై విశ్వాసముంచి తప్పక సంధి జరిపించవలసింది.

విశేషం: 1. శ్రీకృష్ణుడు తనవారని భావించేవారికి తెలిపే పరమహితం ఈ పద్యతాత్పర్యం.

2. కౌరవ పాండవు లేదో ఒక పద్ధతితో శాంతి కుదుర్చుకొంటే మేలయ్యేది శ్రీకృష్ణుడికి, ధృతరాష్ట్రుడికి, వంశంలో ఉన్నవారి కందరికీ, ఆ సభలో ఉన్న రాజులందరికీ, చివరకు సమస్త భూమికీ అని పేర్కొనటం సఖ్యత వలన ఎంతటి సౌఖ్యమేర్పడుతుందో భావనా రమణీయంగా ప్రసన్నమౌతున్నది.

3. యుద్ధమైతే అందరికీ మహాపద కలుగుతుంది - దాన్ని లెక్కలోనికి తీసికొనుమన్నాడు. పాండవ యాదవ కుటుంబ సభ్యులు కొందరైనా పోవటం శ్రీకృష్ణుడి కేర్పడే ఆపద. కొడుకులందరూ మరణించి తర్పణాలు ఇవ్వటానికి కూడా ఎవ్వరూ మిగలని మహాపద ధృతరాష్ట్రుడిది. కౌరవులందరూ నశించటం వంశజుల కేర్పడే మహాపద. యుద్ధంలో సహాయపడే రాజులు ప్రాణాలు కోల్పోతారు. దానివలన భూమి వీరులను కోల్పోతుంది. రక్తంతో తడుస్తుంది. జననాశం ఏర్పడుతుంది. వితంతువుల విషాదం పెల్లుబుకుతుంది. ఇవన్నీ లోకాని కేర్పడే ఆపదలు. వీటిని పరిగణించి తప్పక సంధి చేయుమని హితవు చెప్పి హెచ్చరించాడు శ్రీకృష్ణుడు. (సంపా.)

తే. **నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు । నధిప! తెఱఁగు నీ వశమున యదియ కాన**
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె । సిద్ధ మెవ్వారిఁ దెలివొందఁ జేయనేర్తు. **263**

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; తెఱఁగు= సంధి; నీ వశమున+అదియ+కానన్= నీ అధీనంలో ఉన్నట్టిదే కావటం చేత; నీకున్+వలసినన్= నీకు అవసరమని తోస్తే; తీర్పంగన్+నేరన్+వచ్చున్= కార్యం సరిదిద్దవచ్చు; నీకున్= నీకు; వీరలన్+తేర్చుట= కురుపాండవుల కలతలు మాన్పి ప్రసన్నులను చేయటం; నెఱియకాదె?= న్యాయంగదా!; సిద్ధము= ఇది నీ వశము లోనిది; ఏ+వారిన్= ఎవ్వరినైనను; తెలివి+ఒందన్= వివేకం పొందేటట్లు; చేయన్+నేర్తు(వు)= చేయటానికి నీవు సమర్థుడివి.

తాత్పర్యం: రాజా! సంధికార్యం నీ చేతిలో ఉన్నది. అవసరమైతే పని చక్కబెట్టగలవు. కురుపాండవులను ప్రసన్నులను చేయుట న్యాయం. ఎవ్వరికైనా వివేకం కల్గించటానికి నీవు సమర్థుడవు. ఇది నిజం.

విశేషం: 1. సంధి అవశ్యం జరగవలసిన కార్యం. అది ధృతరాష్ట్రుడిపై ఆధారపడి ఉన్నది. ఆ సంధి జరిపే పద్ధతి కూడ ధృతరాష్ట్రుడి అధీనంలోనే ఉన్నది. కాబట్టి కౌరవ పాండవులను సంధి కంగీకరించేటట్లు ప్రసన్న మనస్కులను చేయటం కర్తవ్యం. అది చేయగలవాడు ధృతరాష్ట్రు డొక్కడే - ఇది శ్రీకృష్ణుడి మాటల ఫలితాంశం. ప్రతిపాద్యాంశ తాత్పర్యాన్ని స్పష్టంగా చెప్పటం ఉపన్యాస ఉపసంహారాంశం ఔతుంది.

2. ఇంతవరకు వంశగౌరవానికి తగ్గట్లుగా ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులూ నడచుకొనవలసిన అంశాన్నీ, సంధి అవసరాన్నీ విడమరచి చెప్పాడు. సంధి చేయటం న్యాయమన్నాడు. ధృతరాష్ట్రుడే ఆ నిర్ణయం తీసికొనటం పరమహితమన్నాడు శ్రీకృష్ణుడు. 257వ పద్యంలో ఆరంభించిన విశ్లేషణను ఇక్కడివరకు హేతుబద్ధంగా కొనసాగించటం తిక్కన సంభాషణ శిల్పం. (సంపా.)

ఉ. **అందు వృకోదరార్జునుల నాహవ రంగమునందు మీఱువా**
రెందఱొ యెన్నుమా యిచట; నీ గురుభీష్ములఁ గ్రేణిసేయువా
రెందఱొ; వారు వీరు నని నీల్గుటకంటె భవద్బలంబులై
యందఱుఁగూడు టొప్పదె జనాధిప! శాంతి యొనర్పు మెమ్మెయిన్. **264**

ప్రతిపదార్థం: అందున్= అక్కడఉన్న; వృకోదర+అర్జునులన్= భీమార్జునులను; ఆహవరంగమునందున్= యుద్ధరంగంలో; మీఱువారు= మించగలవారు; ఎందఱొ+ఎన్నుమా= ఇక్కడ ఎందరున్నారో నీవే లెక్కించు; ఇచటన్= ఇక్కడఉన్న; ఈ

గురుభీష్ములన్= ఈ ద్రోణుడిని; భీష్ముడిని; క్రేణి+చేయువారు= పరిహసించగలవారు; ఎందఱొ?= అక్కడెందరున్నారు?; వారున్, వీరున్= అక్కడివారూ, ఇక్కడివారూ; అనిన్= యుద్ధంలో; ఈల్గుట కంటెన్= చావటంకంటె; భవత్+బలంబులు+ఐ= నీ బలగాలై; అందఱున్= వీరందరూ; కూడుట+ఒప్పదె?= కలసిమెలసి వర్తించటం తగదా?; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; శాంతి+ఒనర్పుము= సంధిచేయుము.

తాత్పర్యం: అక్కడున్న భీమార్జునులను యుద్ధరంగంలో మించేవారు ఇక్క డెంద రున్నారో చెపుము? ఇక్కడున్న ద్రోణభీష్ముల పరాక్రమాన్ని లక్ష్యపెట్టక పరిహసించ గలవారు అక్కడ కూడా లేరు. ఇట్లా ఉభయ పక్షాలలోని వీరులు యుద్ధంలో చావటం కన్న నీ బలగాలై కలసి మెలసి వర్తించటం మంచిది. మహారాజా! ఏవిధంగానైనా వీరిని శాంతింపజేయుము.

విశేషం: 1. భరతవంశ సంప్రదాయం నిలపగలిగిన కీలకస్థానంలో ధృతరాష్ట్రుడున్నాడని చెప్పి కౌరవ పాండవులు కలసి ఉంటే కలిగే లాభాలను వివరిస్తున్నాడు శ్రీకృష్ణుడు. వాటిలో మొదట సంఘటిత బలశక్తిని ప్రస్తావిస్తున్నా డీ పద్యంలో. పాండవ పక్షంలో భీమార్జునులూ, కౌరవ పక్షంలో గురు భీష్ములూ కలిసి ఉంటే ధృతరాష్ట్రుడి రాజ్యం శత్రుదుర్భేద్యంగా ఉంటుందని చెప్పాడు. రాజ్యానికీ, రాజుకూ మొదట కావలసింది రక్ష. ఆ అంశాన్ని ఇందులో ఒత్తి చెప్పాడు.

2. మూలంలో ఇరుపక్షాలలో ఉన్న పెక్కు వీరుల పేర్లు చెప్పబడ్డాయి. కాని, పై నలుగురూ సంగ్రామంలో ఓడడం దుర్లభం. మిగిలినవారి కా ప్రతిపత్తి లేదు. అందువలన తిక్కన ఈ మార్పు చేశాడు. దుర్యోధనుడు ఇటువంటి మహావీరులలో ఒకడని శ్రీకృష్ణుడు చెప్పకుండా ఉండటం గమనింపదగిన అంశం. ఆ సత్యాన్ని గుర్తించుమని ధృతరాష్ట్రుడికి వ్యంగ్యంగా హితవు పలికాడు శ్రీకృష్ణుడు.

3. ఏ విధంగానైనా శాంతిని స్థాపించుము- అన్నది పద్యంలోని వాద తాత్పర్యం. తిక్కన ఒక్కొక్క పద్యాన్ని ఒక వాదాంశానికి ప్రతినిధిగా నిలపటం వాదన కళ. కార్యకారణ సంబద్ధమైన తాత్పర్య ప్రతిపాదనం అందులోని వాక్యకళ. వస్తువు కనుగుణమైన పద్య రచనా శైలిని సంఘటించటం కావ్యకళ. బంధ శైథిల్యం, అర్థవైమల్యం గల ప్రసాదగుణం ఈ రచనలోని జీవకళ. (సంపా.)

తే. జగతిఁగల జనపతులు నీ చరణపీఠ । మర్థిఁ గొలువ సముద్ర వేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే? । తల్లి ప్రజల । యెడ విరోధంబు వాటించు టెంత మేలు? 265

ప్రతిపదార్థం: జగతిన్+కల= లోకంలో ఉన్న; జనపతులు= రాజులు; నీ చరణ పీఠము= నీ పాద పీఠం; అర్థిన్= ప్రీతితో; కొలువన్= సేవిస్తుండగా; సముద్ర వేలా+ఆవృత= సాగరం యొక్క చెలియలికట్టచేత చుట్టబడిన; ఉర్వి+ఎల్లన్= పుడమి నంతయు; ఏలుట= నీవు పాలించటం; ఒప్పదే?= తగదా?; తల్లి= జనని; ప్రజల+ఎడన్= తన బిడ్డల విషయంలో; విరోధంబు పాటించుట= వైరం వహించటం; ఎంత మేలు?= ఏపాటి శ్రేయం?

తాత్పర్యం: లోకంలోని రాజులందరూ నీ పాదపీఠాన్ని ప్రీతితో సేవిస్తుండగా సముద్రపు చెలియలికట్టచేత చుట్టబడిన పుడమినంతటినీ నీవే ఏకచ్ఛత్రంగా పరిపాలించటం తగును. తల్లి తన బిడ్డలపట్ల శత్రుత్వం వహించటం ఎంత సమంజసమో నీవే యోచించుము.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం, నిదర్శన. 1.ఇందులో సర్వసామ్రాజ్యాధిపత్యం ధృతారాష్ట్రుడిదే అని హెచ్చరించటం ముఖ్యాంశం. కాని, ధృతరాష్ట్రుడు ఆ అధికారం తన కుమారుడిదిగా ప్రజలు భావించేటట్లు వ్యవహరిస్తాడు. దానిని మానుకొమ్మని శ్రీకృష్ణుడి హితవు. పాండవులను కూడ ఉత్తరాధికారులుగా గుర్తించుమని హెచ్చరిక.

2. ఆ అంశాన్ని (విశేషాన్ని) లోకన్యాయంతో (సామాన్యంతో) సమర్థించాడు ఈ పద్యంలో. తల్లికి బిడ్డలుంటారు. వారినందరినీ సమభావంతో ప్రేమతో చూడటమే వాత్సల్యం. అట్లాకాక పక్షపాత వైఖరి ప్రకటించటం అన్యాయం- అని చెప్పి పాండవుల పట్ల విరోధం ప్రదర్శించటం అన్యాయమని శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. 'ప్రజలు' అనే శబ్దం సార్థకం. పిల్లలనీ, ప్రజలనీ రెండర్థాలు. ధృతరాష్ట్రుడు రాజకుమారులకూ ప్రజలకూ తల్లివంటివాడనీ ధ్వని. ఏలుట - అనే క్రియ సాభిప్రాయం. కొడుకులను అదుపులో ఉంచటం, ప్రజలను పాలించటం అనే అర్థాలేర్పడతాయి. 'విరోధంబు పాటించు టెంత మేలు?' అని ప్రశ్నార్థక వాక్యాన్ని చివర ఉంచటం సాభిప్రాయం. ఒక హితాన్ని చెప్పి దాని బాగోగులను గురించి ఎదుటివారి చేతనే ఆలోచింపచేయటానికి తోడ్పడే శక్తిమంతమైన పద్ధతి ప్రశ్నార్థక వాక్య ప్రయోగం. సంభాషణ శిల్పి తిక్కన తెలిసివాడిన సంభాషణ శిల్పమిది.

3. రచనలో అర్థవ్యక్తి అనేగుణం సార్థకంగా పోషించబడింది. (సంపా.)

క. నరనాథ! నీవుపేక్షా । పరుఁడ వయినఁ గౌరవులక పాండవులక కా
దరయఁగ భూ ప్రజకెల్లను । దురితం బొనరించి నట్ల తుదిఁ గీడు సుమీ! 266

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా!; నీవు; ఉపేక్షాపరుఁడవు+అయినన్= ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే; కౌరవులకున్+అ పాండవులకున్+అ+కాదు= కురుపాండవులకే కాదు; అరయఁగన్= ఆలోచిస్తే; భూప్రజకున్+ఎల్లను= పుడమి యందలి జనుల కందరికినీ; దురితంబు+ఒనరించిన+అట్లు+అ= పాపం చేసినట్లే ఔతుంది; తుదిన్= చివరకు; కీడు+చుమీ!= నీకే అపకారం సుమా!

తాత్పర్యం: రాజా! నీవు కురుపాండవుల విషయంలో శ్రద్ధ వహించకుంటే ఈ ఉభయ వర్గాలకే కాదు, పుడమిలోని జనులందరికీ పాపం చేసినట్లే ఔతుంది. చివరకు నీకే హాని కలుగుతుంది.

విశేషం: ధృతరాష్ట్రుడు తల్లివలె తన ధర్మాన్ని నిర్వహించకుండా ఉపేక్ష వహిస్తే కలిగే నష్టాన్ని ఈ పద్యంలో పేర్కొన్నాడు శ్రీకృష్ణుడు. ఉపేక్ష వలన మొదట కౌరవులకే హాని జరుగుతుంది. పాండవులకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు అపద కలుగుతుంది. 'దురిత' శబ్దం నానార్థ వ్యంజకం. చివరికి ధృతరాష్ట్రుడికే కీడు మూడుతుంది. ఉపేక్ష వలన కులనాశనం, ప్రజాక్షయం, చివరకు ఆత్మహాని చేసికొన్న వాడవుతాడని ధృతరాష్ట్రుడిని శ్రీకృష్ణుడు హెచ్చరించి, పరమ హితాన్ని బోధించాడు. లోకంలో ఆత్మనాశన కారకమైన చర్యను చేపట్టటానికి ఎవరైనా జంకుతారు. ధృతరాష్ట్రుడు ఆ విషయంలో కూడా గ్రుడ్డిరాజే. (సంపా.)

క. కౌరవ పాండవులం దె । వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మే లు
ర్వీరమణ! చిత్తమున నె । ట్లారయుమా నీకు దుఃఖమగు నెట్లయినన్. 267

ప్రతిపదార్థం: ఉర్వీరమణ!= భూనాథా!; కౌరవ పాండవులందున్= కౌరవులలో పాండవులలో; ఏ+వారలకున్= ఎవరికైనా; చావు= మరణం; నొవ్వు= బాధ; వచ్చినన్= కలిగినా; చిత్తమునన్= మనస్సులో; ఎట్లు మేలు= ఏ విధంగా మేలవుతుందో; ఆరయుమా= పరిశీలించుము; ఎట్లు+అయినన్= వారికి ఏలాగైనా; నీకున్= నీకు; దుఃఖము+అగున్= విషాదం కలుగుతుంది.

తాత్పర్యం: రాజా! కురు పాండవులలో ఎవరికి మరణం సంప్రాప్తించినా, బాధలు కలిగినా నీకు ఎట్లా మేలవుతుందో మనస్సులో ఆలోచించుము. వారికి చావు నోవులు వస్తే నీకే ఏ విధంగానైనా దుఃఖం కలుగుతుంది.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. గుణం: అర్థవ్యక్తి.

2. ఉపేక్ష వలన యుద్ధం వస్తుంది. కౌరవ పాండవులకు రణంలో చావు కలుగవచ్చును, లేదా బాధ కలుగవచ్చును. ఈ వాక్యంలో యథాసంఖ్యాలంకారం వాక్యశిల్పంలో భాగం. అంటే కౌరవులకు చావు, పాండవులకు బాధ కలుగుతాయని ధ్వని.

3. ఇది ఫలితాంశమని గట్టిగా చెప్పాడు శ్రీకృష్ణుడు. అదే నిజమైతే ధృతరాష్ట్రుడి స్థితి ఏ విధంగా ఉంటుంది? ఆలోచించు కొనుమంటున్నాడు శ్రీకృష్ణుడు. ప్రస్తుతం ధృతరాష్ట్రుడు ఉర్వీరమణుడు (రాజు). కౌరవులు చనిపోతే అతడి రాచరికం చిక్కులలో పడుతుంది. ఉపేక్ష వలన ధృతరాష్ట్రుడి రాచరికం మరుక్షణమే అపాయస్థితిలో పడుతుంది. నైతికంగా అతడు భూరమణుడుగా ఉండలేడు. పదవీభ్రష్టుడు కావటం ఒక విధమైన దుఃఖం. ఒకవేళ పాండవులు ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని గౌరవించినా వారు ఎత్తిపొడుపు మాటలలో వేధించక మానరు. అప్పుడూ అతడికి దుఃఖమే మిగులుతుంది. యుద్ధంలో పాండవపక్షంలో కూడా కొందరు చనిపోవచ్చును. వారు అందుకు మనసు నొచ్చుకొనవచ్చును. ఆ విపత్తుకు కారణం ధృతరాష్ట్రుడి ఉపేక్షయే అని భావించి గ్రుడ్డిరాజును వేధించవచ్చును. అదీ అతడికి దుఃఖహేతువే. అందువలననే శ్రీకృష్ణుడు 'ధృతరాష్ట్రా! నీ మనసులో ఎన్నిరకాలుగా ఆలోచించినా ఉపేక్ష వలన చివరకు నీకు మిగిలేది దుఃఖమే సుమా!' అని విషయాన్ని విశ్లేషించి చెప్పాడు. (సంపా.)

ఉ. వీరును వారుఁ బండితులు, విక్రమవంతులు, బాహుగర్వదు
ర్వారులు; పూని రిత్త బవరంబున నాఱడిఁ జావఁబోవ నె
ట్లూరక యుండవచ్చుఁ? గడు నొప్పెడు మేనులు వాఁడి కైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట! యోర్వవచ్చునే? 268

ప్రతిపదార్థం: వీరును= ఈ కౌరవులున్నూ; వారున్= ఆ పాండవులున్నూ; పండితులు= చదువు సాములు నేర్చినవారు; విక్రమవంతులు= పరాక్రమం కలవారు; బాహుగర్వ దుర్వారులు= భుజబలంచేత అడ్డగించరానివారు; పూని= ఉద్యమించి; రిత్తబవరంబునన్= తమలో తమకు ఏర్పడిన వ్యర్థమైన కలహంవల్ల; ఆఱడిన్= వ్యర్థంగా; చావన్+పోవన్= మరణించటానికి సిద్ధపడగా; ఎట్లు+ఊరక+ఉండన్+వచ్చున్?= నివారించక మౌనంగా ఎట్లుండదగును?; వాఁడి కైదువుల్= పదునైన ఆయుధాలు-బాణాలు; కూరఁగన్ నాటినన్= దూసుకొనిపోయేటట్లు గ్రుచ్చుకొనగా; కడున్= మిక్కిలి; ఒప్పెడు మేనులు= సుకుమారమైన శరీరాలు; పుడమిన్+కూలుటకున్= నేలపై త్రెళ్ళుటకు; అక్కట!= అయ్యో!; ఓర్వన్+వచ్చునే?= సహింపశక్యమగునా? (శక్యం కాదని భావం.)

తాత్పర్యం: కౌరవులూ పాండవులూ మంచి చదువరులు, పరాక్రమవంతులు. భుజదర్పం గలవారు గనుక ఎవ్వరూ వీరి నడ్డగించలేరు. ఇట్లాంటివారు తమలో తమ కేర్పడిన కొరమాలిన యుద్ధంలో ఊరక మరణించటానికి సిద్ధపడుతుండగా అడ్డపడక చూస్తూ ఊరకుండటం యుక్తం కాదు. ఇంత కోమలమైన శరీరాలు వాడి బాణాలు ఆవలికి దూసుకొని వెళ్ళేటట్లు గ్రుచ్చుకోగా నేలమీద కూలటం చూచి సహించటానికి శక్యం కాదు.

విశేషం: 1. యుద్ధంలో నిరర్థకంగా వీరులు చనిపోయే పరిస్థితి వస్తే ఉపేక్షతో ఊరుకొనటం ఏమి న్యాయం? అని ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తాను ఉపేక్ష విడనాడి శాంతి కొరకు యత్నించటానికి కారణ మదే అని సూచిస్తున్నాడు. తన ప్రబోధంతో ధృతరాష్ట్రుడిని కూడా తనవలె స్పందించుమని హితవు చెప్పుతున్నాడు.

2. చనిపోయేవారు వ్యర్థులు కారు. చదువుకొన్నవారు, పరాక్రమవంతులు. పైపెచ్చు తమ భుజబలాలమీద ఉన్న నమ్మకంతో యుద్ధానికి వెనుకాడనివారు, వారిని నిష్కారణంగా కొల్పోతే దేశంలో జ్ఞానేచ్ఛాక్రియా వృత్తులలో సుశిక్షితులైన వీరులు తరుగౌతారు. దేశం అన్ని విధాలా దివాలా తీస్తుంది అని హెచ్చరించాడు.

3. దేశానికి మానవ సంపదగా పేరొందే వీరులు యుద్ధంలో ఆయుధాల బారిపడి చనిపోతే ఆ దృశ్యం చూడటానికీ, భావించటానికీ దుర్భరం. నిష్కారణ హింసను సహించవచ్చునా? అని ప్రశ్నించి ధృతరాష్ట్రుడిని ఆలోచించుమని హెచ్చరించాడు శ్రీకృష్ణుడు.

4. తిని కూర్చుండి సంపదను నిష్కారణంగా నాశనం చేసికొనే వాడు జాతికి ద్రోహి. ధృతరాష్ట్రుడు ఉపేక్ష వహిస్తే అటువంటి నిందపడతాడు. అర్థవ్యక్తి గుణ ప్రధాన రచనలో తిక్కన వస్తుస్వభావాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించా డీపద్యంలో. (సంపా.)

ఆ. ఇట్లు గాక యుండ నీ రెండు దెఱఁగుల । వారి గాచికొనుము వసుమతీశ !
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు । నఖిల జనులుఁ బొగడునట్లుగాఁగ.' 269

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూవల్లభా! ధృతరాష్ట్రా! నీదు ప్రాభవంబు= నీ యొక్క దొరతనం; నీతియున్= రాజనీతి; శాంతియున్= కామక్రోధాది రాహిత్యమూ; అఖిల జనులు= సమస్త ప్రజలు; పొగడునట్లు కాఁగన్= ప్రశంసించునట్టి తీరులో; ఇట్లు+కాక+ఉండన్= ఇట్లా చావు నొవ్వుల పాలుగాకుండా; ఈ రెండు తెఱఁగులవారిన్= ఈ ఉభయ పక్షాల వారిని; కాచికొనుము= రక్షించుకొమ్ము.

తాత్పర్యం: రాజా! నీ విభుత్వమునూ, రాజనీతినీ, శాంతినీ సమస్త ప్రజలు మెచ్చుకొనేటట్లు కురుపాండవులు సంగ్రామంలో నశించకుండా సంరక్షించుకొనుము'.

విశేషం: యుద్ధం రాకుండా చేసి, రెండు వైపులవారినీ చావు నొవ్వుల నుండి రక్షించుకొంటే ధృతరాష్ట్రుడికి నాలుగు ప్రయోజనాలు కలుగుతాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. 1. ప్రభుత్వం నిలుస్తుంది. 2. లోకనీతి, రాజనీతి, ధర్మనీతి ఫలించి ప్రభునీతి ప్రకాశిస్తుంది. 3. శాంతి ఏర్పడి రక్తపాతం లేని స్నేహభావం చిగురిస్తుంది. 4. ప్రజలందరూ ధృతరాష్ట్రుడి వర్తనాన్ని నోరారా కీర్తిస్తారు. ఉపేక్షాభావంతో పక్షపాత వైఖరి అనుసరిస్తే రాజ్యం పోతుంది. అవినీతిపరుడనే అపకీర్తి వస్తుంది. బ్రతుకంతా అశాంతితో గడపవలసి వస్తుంది. ప్రజలు చీకొట్టి నిందిస్తారు. తులనాత్మకంగా ఆలోచించి హితమైన పద్ధతి నాశ్రయించుమని పేర్కొన్నాడు. 5. వంశగౌరవం కొరకు కౌరవ పాండవుల నడుమ సంధి కుదిరించటంలో ఉపేక్ష వహిస్తే కలిగే విషపరిణామాల గురించి ఇంతవరకు శ్రీకృష్ణుడు వివరించాడు. ఈ అంశం తరువాత మరొక అంశాన్ని ఎత్తుకొంటున్న దానికి సూచనగా 'అని చెప్పి వెండియు' అని తరువాతి వచనం వాడటం తిక్కన ఉపన్యాస శిల్పంలో భాగం. (సంపా.)

వ. అని చెప్పి వెండియు. 270

తాత్పర్యం: అనిచెప్పి శ్రీకృష్ణుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పిన మాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 5-93-36)

తే. పాండవులు తండ్రి సచ్చిన ప్రజలు వారి । నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె? । పారమొందంగ రక్షింపు గారవమున. 271

ప్రతిపదార్థం: పాండవులు= ధర్మజాదులు; తండ్రి చచ్చిన ప్రజలు= తండ్రిలేని బిడ్డలు; వారిన్= వారలను; శైశవము+ ఆదిగాఁగన్= చిన్నప్పటినుంచి; అరసి ప్రోచితి(వి)= చక్కగ విచారించి కాపాడావు; నడుమన్= మధ్యలో; నిష్కారణము+అ=

హేతువులేకుండా; దిగన్+విడువన్+తగునె?= వదలి వేయవచ్చునా?; పారము+ఒందంగన్= ఆవలిగట్టు చేరువరకూ; గారవమునన్= ఆదరంతో; రక్షింపు(ము)= కాపాడుము.

తాత్పర్యం: 'పాండవులు తండ్రిలేని పిల్లలు. వారిని పసితనంనుంచి చల్లగా కాపాడావు. ఇప్పుడు వారిని కారణం లేకుండా మధ్యలోనే విడిచిపెట్టటం న్యాయం కాదు. కడపటివరకు నీవు ప్రేమతో వారిని కాపాడవలసిందే.

విశేషం: 1. 'పాండవులు తండ్రి లేనివారు' అనే మాట ఉద్యోగపర్వంలో బాగా వినబడుతుంది. ధర్మరాజే పాండురాజు పోతూ శ్రీకృష్ణుడిని చూపి వెళ్ళాడని పేర్కొన్నాడు. (ఉద్యో. 3.6) కొడుకులను ఆపదనుండి రక్షించటం, వారికి శుభాలు కలిగించటం తండ్రి బాధ్యత. వంశపారంపర్యంగా వచ్చిన బాధ్యత ధృతరాష్ట్రుడి మీద ఉన్నది. కన్నతండ్రి పోతే వంశంలో పెంపుడు తండ్రిగా వ్యవహరించే పెద్దవాడు ఆ బాధ్యతలు నిర్వహించాలి. ఇది ఉమ్మడి కుటుంబ ధర్మం. దానిని ధృతరాష్ట్రుడికి జ్ఞాపకం చేశాడు శ్రీకృష్ణుడు. కొందరు భావించినట్లు ఈ వాక్యం పాండవుల పట్ల సానుభూతి కలిగించటానికి అన్నది కాదు.

2. ఆ బాధ్యతను ధృతరాష్ట్రుడు ఇదివరలో నిర్వహించాడు. పాండవులను పెంచి పెద్దవారిగా చేశాడు. అయితే ఆరంభించి మధ్యలో కార్యాన్ని దిగవిడవటం ఉత్తముల స్వభావం కాదు. అందువలన ఆ బాధ్యతను అతడి జీవితం ఉండేంత వరకూ కొనసాగించటం న్యాయమని శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. (సంపా.)

వ. పాండుకుమారులు నీకుం బరమభక్తిం బ్రణమిల్లి యందఱు నొక్కమాటగా నీతోఁ జెప్పుమని నాకుం జెప్పిన విధంబు వినుము: తన పంపునం బన్రెండు వత్సరంబులు వనంబున వసియించితిమి. పదుమూఁడగునేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబునుం జలిపితిమి; మా తండ్రి సమయంబు పరిపాలించి యే మర్ధరాజ్యం బెట్లునుం బడయుదు మని కృతనిశ్చయులమై పడితిమి; తల్లియుఁ దండ్రియు నెల్ల చుట్టంబులు నేడుగడయును మాకుఁ దాన; మావలన నేరమి గల్గినం గినిసి యిట్లుగా దట్లని చక్కం బెట్టునది; తనగల పది వేలేండ్లకుం దన్నకాని మఱియెఱుంగ మెట్టివారమైనను మమ్మును దుర్యోధనాదులనుం దలంపరు తనయందుఁదెఱంగు గలిగిన నెవ్వరు గొఱగాకున్నను గులంబుపాడి సెడక చెల్లునని' రని పలికి మఱియు నిట్లనియె: 272

ప్రతిపదార్థం: పాండు కుమారులు; నీకున్; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; అందఱున్; ఒక్కమాటగా= ఏకవాక్యంగా; నీతోన్; చెప్పుము+అని; నాకున్; చెప్పిన విధంబు; వినుము; తన పంపునన్= తన ఆజ్ఞచేత; పన్రెండు వత్సరంబులు= పన్నెండేళ్ళు; వనంబునన్; వసియించితిమి; పదుమూఁడగు+ఏఁడు; జనపదంబునన్= జనులుండే తావున; అజ్ఞాతవాసంబునున్+చలిపితిమి= ఇతరులు మమ్మెరుగకుండేటట్లుగా నివాసం చేశాము; మా తండ్రి సమయంబు పరిపాలించి= మా తండ్రి ఏర్పరచిన ఒడంబడికను నెరవేర్చి; ఏము= మేము; అర్ధరాజ్యంబు; ఎట్టును= ఏ విధంగానైనా; పడయుదుము= పొందగలం; అని, కృతనిశ్చయులము+ఐ= తీర్మానించుకొన్నవారమై; పడితిమి= కష్టాలు అనుభవించాం; తల్లియున్; తండ్రియున్; ఎల్లచుట్టంబులున్, ఏడుగడయును= సర్వవిధాల రక్షించేవాడు; మాకున్, తాన్+అ= అతఁడే; మా వలనన్; నేరమి+కల్గినన్= దోషముంటే; కినిసి= కోపించి; ఇట్లుకాదు; అట్లు+అని; చక్కన్+పెట్టునది= సరిదిద్దవలెను; తన కల పదివేల+ఏండ్లకున్= తాను జీవించిన పదివేల సంవత్సరాలకైనా; తన్నున్+అకాని= తన్నేతప్ప; మఱి+ఎఱుంగము= ఇతరుల నాశ్రయించం; ఎట్టివారము+ఐనను= మే మెటువంటివాళ్ళమైనా; మమ్మును; దుర్యోధన+ఆదులను; తలంపరు= లోకులు భావింపరు; తనయందున్+తెఱంగు+కల్గినన్= తనకు కార్యం సరిదిద్దవలెనన్న తలంపుఉంటే; ఎవ్వరు కొఱ+కాకున్నను= ఎవరు పనికిమాలిన వారైనా; కులంబుపాడి= వంశధర్మం; చెడక; చెల్లును= సాగును; అనిరి; అని పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! పాండునందనులు నీకు పరమభక్తితో నమస్కరించి ఒకే గొంతుతో చెప్పుమని నాతో చెప్పి పంపిన మాటలు చెపుతాను, వినుము. 'తండ్రీ! నీ ఇష్టప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యాలలో నివసించాము. పదమూడవ సంవత్సరం విరటుడి పట్టణంలో అజ్ఞాతవాసం కావించాము. ఈ విధంగా ఒడంబడికను నెరవేర్చి మేము రాజ్యంలో సగపాలు పొందగలమని దృఢనిశ్చయంతో ఉన్నాము. మాకు తల్లి, తండ్రి, చుట్టములు-వెయ్యేల సర్వవిధ రక్షకులు మీరే. మా వలన ఏమైనా అపరాధముంటే కోపించి ఇట్లా కాదు అట్లా నడచుకొనండని చెప్పి చక్కబెట్టండి. నీవు పదివేలేండ్లు జీవించినప్పటికినీ నిన్ను దప్ప మరెవ్వరినీ ఎరుగము. ఎట్టివాళ్ళమైననూ, మమ్మూ, దుర్యోధనాదులనూ లోకులు అనుకోరు. నీకు సదభిప్రాయముంటే మాలో ఎవరు కొరగాకపోయినా వంశ ధర్మం చెడక నిలుస్తుంది అని నీతో చెప్పుమన్నారు' అంటూ శ్రీకృష్ణుడు ఆయనతో ఇంకా ఇట్లా అన్నాడు:

విశేషం: 1. తండ్రిలేని పాండవులు ధృతరాష్ట్రుడే తమ తండ్రిగా భావించి, భక్తి ప్రపత్తులతో పలికిన మాటల పద్ధతిని గమనించుమని శ్రీకృష్ణుడు వివరించటం ఇందులో ప్రధానాంశం. 'మాటల పద్ధతి' రచనలోని విశేషాంశం.

2. అరణ్యాజ్ఞాత వాసాలు నిర్వహించండని ఆజ్ఞ ఇచ్చింది ధృతరాష్ట్రుడే నట. ఇది ఎట్లా? దుర్యోధనుడి ప్రవర్తనను అడ్డుకొనకుండా ఉపేక్షతో అతడి చర్యలకు రాజముద్ర గౌరవాన్ని కలిగించినవాడు ధృతరాష్ట్రుడు. ప్రవర్తన దుర్యోధనుడిదైనా బాధ్యత ధృతరాష్ట్రుడిదే. అందువలన అతడికి నివేదించుకొనటం.

3. ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యం అధికారికంగా ఇచ్చి ఉన్నాడు. అనుద్యూతంలో రాజ్యాన్ని వారు కోల్పోలేదు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరంగా ఇచ్చిన రాజ్యభాగం న్యాయంగా పాండవులదే ఔతుందికదా! ఈ విధంగా రెండుసార్లు ధృతరాష్ట్రుడే అర్ధరాజ్యాన్ని పాండవులకు దత్తం చేసి ఉండగా, అరణ్యాజ్ఞాత వాసాల తరువాత వారి కా భాగం సహజంగా చెందుతుంది అని నిర్ధారించి చెప్పి, ఆ భాగాన్ని ఒప్పచెప్పవలసింది ధృతరాష్ట్రుడు. కాని, విచిత్రమేమంటే అతడు తన బాధ్యతను దుర్యోధనుడికి బదిలీ చేశాడు. అట్లని తన ప్రభుత్వాన్ని వదలు కొన్నాడా? లేదు. ప్రభువు తానై ఉండి ప్రభుత్వం కొడుకు దనే ద్వంద్వ వైఖరిని పాండవులు గుర్తించటం లేదు. సమస్య అంతా అక్కడే ఉన్నది. శ్రీకృష్ణుడు కూడా ధృతరాష్ట్రుడి ద్వంద్వ వైఖరిని వ్యంగ్యంగా నిరసిస్తున్నాడు.

4. పాండవులు అన్నివిధాలుగా రక్షకుడు ధృతరాష్ట్రుడని నమ్మి ఉన్నారు కాబట్టి అర్ధరాజ్యం ఎట్లాగూ వస్తుందనే విశ్వాసంతో ఉన్నారు.

5. ఒకవేళ పాండవులవలన ఏవైనా లోపాలుకాని, పొరపాట్లుకానీ ఉంటే వాటిని సరిజేసి కార్యం చక్కబెట్టవలసిన కర్తవ్యం కూడా ధృతరాష్ట్రుడిదే అని ధ్రువపరుస్తున్నారు.

6. పాండవులు ధృతరాష్ట్రుడికి జీవితాంతం కృతజ్ఞులమై ఉంటామంటున్నారు. తమను దుర్యోధనాదులతో సమంగా చూడమంటున్నారు.

7. వంశధర్మం పాటించే న్యాయాన్ని ధృతరాష్ట్రుడు మన్నిస్తే ఎవరు పనికి వచ్చినా, పనికి రాకపోయినా పుత్రులందరూ బాగుపడతారు. కులం వర్ధిల్లుతుంది.

8. తండ్రి చచ్చిన పాండవులు ధృతరాష్ట్రుడిని తండ్రిగా భావించి పలకటంలో విశేషం గమనార్హం. పాండురాజే బ్రతికి ఉంటే కురుపాండవ భేదం ఉండేది కాదు. కలసి ఉండే కుటుంబం కొరకు ఆయన తన సర్వస్వాన్ని ధారపోశాడు. ఆయన గతించటం వలన ధృతరాష్ట్రుడిని తండ్రిగా గౌరవించవలసి వచ్చింది. అయితే పాండవులు త్రికరణశుద్ధిగా పితృభక్తిని పచరిస్తున్నారు. ఇక దాని కనుగుణంగా వ్యవహరించవలసిన న్యాయం ధృతరాష్ట్రుడి మీదే ఉన్నదని శ్రీకృష్ణుడు నిర్దేశిస్తున్నాడు.

9. సంజయుడు 'ధర్మసూతి మెత్తని పులి', 'ఎల్లవారలు నధర్మము నీపయి బెట్టునంతకు న్వినడును, గానడుం; బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?' (2.14) అన్న మాటలు ఇక్కడ స్మరణీయాలు.

10. ధర్మజుడి ధర్మనీతి పద్మవ్యూహం వంటిది. మాటలు తేటలుగా ఉన్నా, అందులో నీతి సుడిగుండాలుగా మెలికలు తిరుగుతూ ఉంటుంది. సామోపాయంతో సానబెట్టిన చతురవచనా లివి. (సంపా.)

ఉ. 'సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁ బాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభ దాయక మయ్యును దైవ ముండెడున్.' 273

ప్రతిపదార్థం: సారపుధర్మమున్= శ్రేష్ఠమైన ధర్మమును; విమల సత్యమున్= నిర్మలమైన సత్యమును; పాపముచేతన్= దురితం చేతనూ; బొంకుచేన్= అబద్ధం చేతనూ; పారమున్+పొందన్+లేక= గట్టు చేరలేక; చెడన్ పాఱినది+ఐన+అవస్థన్= చెడటానికి సిద్ధంగా ఉన్న దుర్దశలో; దక్షులు= చక్కదిద్దటానికి సమర్థులు; ఏ+వారలు= ఎవరు; ఉపేక్ష+చేసిరి= అశ్రద్ధ వహిస్తారో; అది= అట్లా ఒప్పరికించటం; వారలచేటు+అగున్= వారికే హాని కలిగిస్తుంది; కాని= కాని; ధర్మనిస్తారకము+అయ్యున్= ధర్మమునుద్ధరించేదిగానూ; సత్యశుభదాయకము+అయ్యును= సత్యానికి మేలు కల్గించేదిగాను; దైవము+ఉండెడున్= దైవం ఆధారంగా ఉంటుంది.

తాత్పర్యం: 'ఉత్తమమైన ధర్మం, నిర్మలమైన సత్యం పాపంచేతను, అబద్ధం చేతనూ దరి చేరలేక చెడటానికి సంసిద్ధంగా ఉన్న స్థితిలో వాటిని రక్షించే శక్తి ఉన్నా ఎవరు అడ్డుపడక అశ్రద్ధ వహిస్తారో అది వారలకే హానికరమవుతుంది. ఆ స్థితిలో భగవంతుడు ధర్మమును ఉద్ధరించటానికీ, సత్యమునకు శుభం కలిగించటానికీ ముందుకు వస్తాడు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

1. పాండవులు సభాసదుల నుద్దేశించి చెప్పుమన్న సందేశ మిది. ఉద్యోగపర్వ తాత్పర్యానికీ, మహాభారత కథాతత్త్వానికీ ఈ పద్యం ఆత్మవంటిది. తెలుగువారు క్లిష్టపరిస్థితులలో భగవంతుడు ధర్మాన్నీ ధర్మాత్ములనూ రక్షిస్తాడనీ, అధర్మాన్నీ, అధర్మాత్ములనూ శిక్షిస్తాడనీ తమ విశ్వాసాన్ని ఈ పద్యం చదివి వ్యక్తం చేస్తూ ఉంటారు. అందువలన తెలుగు సాహిత్యంలో ఈ పద్యం ఒక ధర్మదీపం.

2. మూల తాత్పర్యాన్ని తిక్కన చికిలిపెట్టి తెలుగులో నిర్మించాడు. మూలం-

"యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ॥
విద్ధో ధర్మో హ్యధర్మేణ సభాం యత్ర ప్రపద్యతే
న చాస్య శల్యం కృన్తన్తి విద్ధా స్తత్ర సభాసదః
ధర్మ ఏతా నారుజతి యథా నద్యనుకూలజాన్ ॥
యే ధర్మ మనుపశ్యన్త స్తూష్ణీం ధ్యాయన్త ఆసతే
తే సత్య మాహుర్ధర్మం చ న్యాయ్యం చ భరతర్షభ!" (సం. 5.93.48-50)

ధర్మం అధర్మం చేతా, సత్యం అసత్యం చేతా నశిస్తున్నప్పుడు చూస్తూ ఊరకుంటే సభాసదులకే చేటు మూడుతుంది. ధర్మం అధర్మం చేతిలో దెబ్బతిని సభలోకి ప్రవేశిస్తే దాని బాధను (ముల్లును) తొలగించకపోతే ఆ సభాసదులే దెబ్బతింటారు. అటువంటి వారిని నది తన ఒడ్డున పుట్టిన చెట్లను ప్రవాహంతో పెకలించి వేసినట్లుగా, ధర్మం వారిని ఉన్మూలించివేస్తుంది. కాబట్టి, ధర్మాన్ని సదా పరిశీలిస్తూ, పరిరక్షిస్తూ దానినే ధ్యానిస్తూ కాలం గడిపేవారు సత్యాన్నీ, ధర్మాన్నీ, న్యాయాన్నీ మాత్రమే పలుకుతారు - అని పై శ్లోకాల తాత్పర్యం. వ్యాసుడు మహర్షి, తిక్కన మహాకవి. ఋషివాక్కు ఇతిహాసంలో అర్థప్రధానం, కవి వాక్కు కావ్యేతిహాసంలో శబ్దార్థోభయప్రధానం. మూలానికీ తెలుగుకూ ఈ తారతమ్యం గమ్యం.

3. సారవంతమైన ధర్మం, నిర్మలమైన సత్యం - అంటున్న తిక్కన మాటలలో ఆ విశేషణాలు ఆ విశేష్యాలకు నిత్యధర్మాలుగా పేర్కొనటం గమనార్హం. ధర్మం ఎప్పుడూ సారవంతమైనదే. శక్తిమంతమైనదే, సత్యం ఎల్లప్పుడూ కల్మషం లేనిదే, నిర్మలమైనదే, స్వచ్ఛమైనదే. అవి రెండు స్వయం సమర్థములైనవే. అయితే వాటిని వ్యతిరేకించేవీ, కలతపెట్టేవీ, నశింపజేయ యత్నించేవి పాపం, బొంకు కాని, అవి (వరుసగా) సారవంతం, నిర్మలం కాకపోవటం చేత ధర్మసత్యాలను నశింపచేయలేవు. అయితే, సత్యధర్మాలు ఫలవంతమయ్యే తరుణంలో అవి ఫలించకుండా అడ్డుపడి చెరిచే యత్నాలు చేస్తాయి. అప్పుడు ధర్మసత్యాలు చెడబారే పరిస్థితులు ఏర్పడతాయి. కాని, అవి చెడిపోవు. 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయాన్ని అనుసరించి ధర్మాత్ములు, సత్యశీలురు వాటిని తమ శక్తియుక్తులతో రక్షించే యత్నం చేస్తారు. పాపం చేసేవారూ, అబద్ధా లాడేవారూ మానవులే; ధర్మాన్ని రక్షించేవారూ సత్యాన్ని కాపాడేవారూ మానవులే. అయితే ధర్మాన్ని రక్షించేవారు దానికొరకు తమ శక్తిని ధారపోయాలి. సత్యాన్ని రక్షించేవారు సత్యాచరణంలోని అసంబద్ధతను తొలగించి త్రికరణశుద్ధిని ప్రదర్శించాలి. అప్పుడు ధర్మసత్యాలు తమ సార నిర్మలత్వాలను రక్షించుకొనగలుగుతాయి. ఎందుకంటే - ధర్మం సత్యం ఎంతటి గుణాలో అంతటి ఆచరణాలు. ఆచరణలోపం వలననే ధర్మం బలాన్ని కోల్పోయినట్లు, సత్యం మలినమైనట్లు కనపడతాయి. దీనిని తెలిసిన విజ్ఞులు తమ బాధ్యతను తెలిసికొని వాటిని రక్షించి తమను తాము రక్షించుకొనాలి. ఆ విషయంలో ఉపేక్ష చేస్తే వారి చరిత్రలకు ధర్మసత్య కవచాలు తొలగిపోయి బలహీనులై పాపాలకూ, అసత్యాలకూ బలి అయిపోతారు. దక్షులై కూడా తమ ధర్మాన్ని నిజాయితీతో నిర్వహించని వారికి చేటు రాకతప్పదని ఈ సందేశం.

4. మానవులు తమ ధర్మాన్ని నిర్వర్తించకపోతే ధర్మ, సత్యాలు నశించిపోవు. ఎట్లాగంటే వేదాన్ని రక్షించవలసింది బ్రాహ్మణుడు. కాని, అతడు వేద ధర్మాన్ని ఆచరించకపోతే వేదం వెనకబడినట్లుంటుందేమో కాని నశించిపోదు. వేదాన్ని రక్షించిన వాడే బ్రాహ్మణుడనబడతాడు. వేదాన్ని పరమాత్ముడు రక్షించగలడు, ఉద్ధరించగలడు. అట్లాగే ధర్మాన్ని సత్యాన్ని కూడా, అందుకే భగవంతుడు ధర్మోద్ధారకుడు, సత్యశుభదాయకుడు అని ప్రశంసించబడతాడు. ధర్మంలోని సారం, సత్యంలోని విమలత్వం దైవం.

5. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడే పాండవుల దృక్పథంలో దైవం. ధర్మరాజు సత్యశీలుడు. అతడు వంచితుడూ, రాజ్యాన్ని కోల్పోయి బలహీనుడై ధర్మసత్య ఫలాన్ని పూర్తిగా పొందలేని దురవస్థలో ఉన్నట్లు ఇప్పుడు కనపడుతున్నాడు. పాపానికీ, అబద్ధానికీ ప్రతినిధులైన కౌరవుల వలన పాండవులు తమ ప్రయత్నంలో పారం ముట్టలేక నశించిపోతారని తెలుస్తున్నప్పుడు దక్షులైన సభాసదులు ఆ పరిస్థితిని చక్కబెట్టాలి. అది వారి విధ్యుక్తధర్మం. అక్కడ విఫలులైతే వారి ముప్పు వారే కొని తెచ్చుకొంటారని ధ్వని.

6. ఉదాత్తమైన ఈ పద్యాన్ని పెక్కురు పండితులు వ్యాఖ్యానించారు. వారి వాక్యాలలో కొన్ని - శ్రీ భూపతి లక్ష్మీనారాయణ రావుగారి వ్యాఖ్య.

"ఈ పలుకులు గంభీరభావ ప్రధానములైనవి. సత్యధర్మములను భావించుచున్న పాండవు లెట్లును దైవముచే రక్షితు లగుదు రనియుఁ, గౌరవుల వలనఁ గలిగిన యాపదనుండి సత్యధర్మముల నుద్ధరింప సమర్థులయ్యు, నుపేక్ష వహించిన భీష్మాదులు చెడుదురనియు, నీవాక్యములు తెలుపుచున్నవి. భీష్మద్రోణాదులకుఁ గూడ స్వధర్మస్మృతిఁ గలుగఁ జేయుట కృష్ణుని యుద్దేశము.

'ద్రోణ భీష్మ లీ దిక్కు సుమ్మ' అని దుర్యోధనుడు పల్కినట్లు కౌరవుల యుద్ధోత్సాహమంతయు నీయిరువురపైఁ బడియున్నదని కృష్ణుఁ డెఱుఁగును. వారిని యధర్మ ప్రయత్నమునకు విముఖులఁ గావించి, యుద్ధమునఁ బాల్గొనకుండునట్లు చేసినచో కోరలూడ్చిన త్రాచులై, కౌరవులు సంధి కొప్పుకొందురని కృష్ణుని యాశయము. కనుక, ధర్మనాశము నెడ నౌదాసీన్యము కూడ నధర్మమే యగునని భీష్మాదులు కీవాక్యములు సూచించుచున్నవి.'' (భారతము: తిక్కన రచన. పు. 57-58).

7. డా. పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య:- "ఈ సందేశమున కురుక్షేత్ర సంగ్రామ పర్యవసానము వ్యంగ్యముగా సూచింపబడినది. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమున ధర్మసత్యములకు అధర్మ+అసత్యములతో సంఘర్షణ తటస్థించినది. అధర్మాసత్యములే బలవత్తరములై ధర్మసత్యములు గట్టెక్కజాలని యవస్థ వచ్చినది. ధర్మము గమ్యము చేరలేక చెడబారుట లోకవినాశమునకు హేతువగును. లోకకల్యాణము నభిలషించువారెల్లరును ధర్మవిజయమునకు తోడ్పడవలయును. అధర్మ విజృంభణమును నిరోధింపవలయును. అట్లు చేయుటకు దక్షత కలిగియుండియు ఉదాసీన భావముచేత గాని, పక్షపాతముచేత గాని సత్యధర్మ నాశనమును కనులారా చూచుచు ఎవ్వ రుపేక్షింతురో వారి వినాశనమునకే ఆ యుపేక్ష కారణ మగును. ఉపేక్షాభావమున వారు తమ కర్తవ్యము నిర్వర్తింపనంత మాత్రమున సత్యధర్మముల కెట్టి క్షతియు కలుగదు. ధర్మమునకు, సత్యమునకు దైవము ఎప్పుడును అండగా నుండును. ధర్మమును ఒడ్డెక్కించును. సత్యమునకు శుభము కూర్చును. అట్టి దైవమైన శ్రీకృష్ణుడు తమకు రక్షగా నున్నాడనియు, సమర్థులైన భీష్మద్రోణాదులు ఉదాసీనత వహించినను, కౌరవపక్షమున నిల్చినను వారు నశించుట తప్పదనియు పాండవుల సందేశమందలి వ్యంగ్యార్థము.'' (తిక్కన కవితా వైభవము: యువభారతి ప్రచురణ. పు. 27-28)

8. ప్రసాదగుణంలో పర్యవసించే గుణం అర్థవ్యక్తి ఇందులో పోషించబడింది. ఝటిత్యర్థ ప్రతిపత్తి హేతుత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తి లక్షణం. వస్తు స్వభావ స్ఫుటత్వం అర్థగుణమైన అర్థవ్యక్తి. నన్నయ తిక్కనలకు అర్థవ్యక్తి అంటే అలవిమాలిన అభిమానం. నన్నయలో శబ్దగుణమైన అభివ్యక్తి. తిక్కన రచనలో అర్థగుణమైన అర్థవ్యక్తి బలంగా ఉన్న అనర్ఘరత్నాలవంటి పద్యాలు వెలువడ్డాయి. తిక్కన రచనలో ఈ పద్యం ఉజ్జ్వ లోదాహరణం. ధర్మరక్షాదక్షమైన దైవం యొక్క స్వభావాన్ని వ్యాఖ్యానించే వాక్యసముదాయం ఇందులో ప్రసన్నంగా ప్రకాశిస్తున్నది కాబట్టి అర్థవ్యక్తి అర్థవంతంగా అవతరించింది. (సంపా.)

వ. అని యీ సభ్యులకుం జెప్పుమనిరి; నీవును సభాసదులైన రాజులు నేమనియెద రనుం; దేను ధర్మంబును నీతియుఁ జుట్టతికంబును మున్నిడుకొని మనోవాక్ప్రకారంబు లేక రూపంబైన సత్యంబకాఁ జెప్పితి; నిత్తెఱంగు మీకు మేలు; క్రోధమాన మత్సరంబులు విడిచి యిట్లు సేయుండు. 274

ప్రతిపదార్థం: అని; ఈ సభ్యులకున్= సభలోని పెద్దలకు; చెప్పుము+అనిరి= చెప్పవలసినదిగా పాండవులు నన్ను కోరారు. నీవును; సభాసదులు+ఐన రాజులు= సభలో ఉన్న దొరలు; ఏమి+అనియెదరు+అనుండు= ఏమిచెపుతారో చెప్పండి; ఏను= నేను; ధర్మంబును= న్యాయమును; నీతియును= రాజనీతిని; చుట్టఱికంబును= బాంధవమును; మున్ను+ఇడుకొని= ముందుంచుకొని; మనః వాక్+ప్రకారంబులు= మనసు యొక్క వాక్కు యొక్క వైఖరులు; ఏకరూపంబు+ఐన= ఒకే విధమైన; సత్యంబకాన్= సత్యమునే;చెప్పితిన్; ఈ+తెఱంగు= ఈ విధం; మీకున్; మేలు= మంచిని కలిగిస్తుంది; క్రోధ మానమత్సరంబులు= కోపం, గర్వం, ద్వేషం; విడిచి; ఇట్లు+చేయుండు= నేను చెప్పిన రీతిని ఆచరించండి.

తాత్పర్యం: పాండవులు సభలోని పెద్దలకు నన్ను చెప్పుమని కోరినమాటలు చెప్పాను. మహారాజా! నీవూ, సభలోని రాజులూ ఇందుకు బదు లేమి చెపుతారో చెప్పండి. నేను నీతి ధర్మాలనూ, బాంధవాన్నీ ముందుంచుకొని మనో వాక్కులు ఏకరూపంగాఉన్న సత్యమునే చెప్పాను. నే చెప్పిన పద్ధతి మీకు మేలు గలిగిస్తుంది. కోపం గర్వం ద్వేషం వదలి, నేను చెప్పినట్లు చేయండి.

విశేషం: 1. శ్రీకృష్ణుడి సందేశంలో ధర్మం, నీతి చుట్టరికం అనే అంశాల మేళవింపు కనబడుతుంది. ధర్మం విశ్వవ్యాప్తం, నీతి కార్యవ్యాప్తం, చుట్టరికం వ్యక్తి సంబంధి - ఈ మూడూ పరస్పరం విరుద్ధం కాకుండా ఉండటం ధర్మనీతివర్తనం. శ్రీకృష్ణుడి సందేశం దానికుదాహరణం.

2.మనోవాక్కాయ కర్మలు ఏకమై వ్యక్తమైన వాక్కు సత్యం. శ్రీకృష్ణుడు త్రికరణశుద్ధిగా పలికిన ఈ సందేశం సత్యం. అంటే నిజాయితీతో కూడుకొన్న నిజం.

3. శ్రీకృష్ణుడి సత్యవాక్కును గుర్తించాలంటే క్రోధం, అభిమానం, మాత్సర్యం అనే గుణాలు మాని ఆలోచించాలి. క్రోధం వలన ధర్మం దర్శనమివ్వదు. అభిమానం వలన నీతి యొక్క నిజస్థితి స్ఫురించదు. మాత్సర్యం వలన చుట్టరికపు ప్రేమ మనసులో మోసులెత్తదు. ఆ మూడు అవగుణాలను వదలితే శ్రీకృష్ణుడి సందేశంలోని నిజస్థితి గోచరిస్తుంది. క్రోధ మాన మత్సరాలకు పుట్టినిల్లు దుర్యోధనుడు. అతడి అంశలుగా క్రోధంతో దుశ్శాసనుడు, మానంతో కర్ణుడు, మత్సరంతో శకుని ఎప్పుడూ మసలుతుంటారు. వారికి శ్రీకృష్ణుడి సందేశ తాత్పర్యం సవ్యంగా స్ఫురించదని ధ్వని. (సంపా.)

ఆ. పాండవులకుఁ దగిన పాలు మేదిని బంచి । యిచ్చుకంటెఁ గార్య మెద్ది గలదు?
ధర్మమెద్ది? సముచితంబగు విధమెద్ది? । శక్యమెద్ది? చెపుఁడ వాక్యవిదులు! 275

ప్రతిపదార్థం: పాండవులకున్= పాండుపుత్రులకు; మేదినిన్= పుడమిలో; తగినపాలు= రా దగిన భాగం; పంచి+ఇచ్చుకంటెన్= పంచి ఇవ్వటం కంటె; కార్యము+ఎద్ది+కలదు?= చేయదగిన పని మరేముంది?; ధర్మము+ఎద్ది?= ఇంతకంటె న్యాయమేముంది?; సముచితంబు+అగు విధము+ఎద్ది?= మిక్కిలి తగిన తెఱంగు వేరొక టేముంది?; శక్యము+ఎద్ది?= మీకు వీలైన పని ఇంకొకటి ఏమున్నది?; వాక్య విదులు= మాటలతీరెరింగిన పెద్దలారా!; చెపుఁడ= చెప్పండి.

తాత్పర్యం: కౌంతేయులకు పుడమిలో తగిన భాగం పంచి ఇవ్వటంకంటె మంచి పని మరొక టేముంది? ధర్మం వేరేముంది? ఇంతకంటె తగిన తెరగు అన్యమేముంది? మీకు శక్యమైనది ఇంతకన్న ఏముంది? వాక్య పద్ధతి నెరింగిన పెద్దలు మీరే చెప్పండి.'

విశేషం: ఇంతవరకు నాలుగంచెలుగా సాగిన శ్రీకృష్ణ సందేశంలో ధర్మశాస్త్ర తర్కశాస్త్ర పండితులు పరిశీలిస్తే నాలుగు నిర్ణయాలకు రాకతప్పదనే హెచ్చరిక ఇందులో ఉన్నది. 1. పాండవులకు రాజ్యభాగ మీయటమే కార్యం. 2. అదే ధర్మం. 3. అదే సముచితమైన నీతి. 4. అదే ప్రస్తుతం సాధ్యమైన పని. శ్రీకృష్ణుడే సభాభిప్రాయాన్ని ఏకోన్ముఖం చేసి వారిచేత ఒప్పించేటట్లు ధ్రువీకరిస్తూ మాట్లాడాడు. సమర్థుడైన వక్త సాధించే ప్రబోధఫల మిది. (సంపా.)

క. అని పలికి మహారాజా । వినుమని ధృత రాష్ట్రు తోడ వెండియుఁ దా ని
ట్లని చెప్పె వాసుదేవుఁడు । తనమది నఱలేక కార్యదశ దెలియంగన్. 276

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; మహారాజా!= భూవల్లభా ధృతరాష్ట్రా!; వినుము+అని; ధృతరాష్ట్రుతోడన్; వెండియున్= మరల; కార్యదశ తెలియంగన్= కార్యపద్ధతి విశదమయ్యేటట్లు; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; తన మదిన్= తన హృదయంలో; అఱలేక= మర్మంలేక; తాన్+ఇట్లు+అని చెప్పెన్= తా నీ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో రాజా! నా మాటలు విను' మంటూ మనసులో మర్మం ఉంచుకోక కార్యపద్ధతి తేటతెల్లమయ్యేటట్లు మళ్ళీ ఈ విధంగా పలికాడు:

**ఆ. 'వారి తండ్రిపాలు వారికి నిచ్చి నీ। పాలు నీవుఁ బుత్ర పౌత్ర చయము
నను భవించి సుఖులరై యుండుఁ డిది బంధు। మిత్ర సుజనకోటి మెచ్చు తెఱఁగు. 277**

ప్రతిపదార్థం: వారి తండ్రిపాలు= పాండవుల తండ్రి భాగం; వారికిన్+ఇచ్చి= పాండవులకు ఇచ్చి; నీ పాలు= నీ రాజ్యభాగం; నీవున్= నీవూ; పుత్రపౌత్ర చయమున్= నీ కొడుకులయొక్క మనుమలయొక్క సమూహం; అనుభవించి= కుడిచి; సుఖులరు+ఐ+ ఉండుఁడు= హాయిగా జీవించండి; ఇది= ఇట్లా ఉండటం; బంధుమిత్ర సుజనకోటి= చుట్టముల స్నేహితుల సత్పురుషులయొక్క సముదాయం; మెచ్చుతెఱఁగు= కొనియాడువిధమై ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! పాండవుల తండ్రి భాగం పాండవుల కిచ్చి; నీ రాజ్యభాగం నీ కుమారులు, నీ మనుమళ్ళూ హాయిగా అనుభవిస్తూ ఉంటే చుట్టాలూ, స్నేహితులూ, సత్పురుషులూ మిమ్ము కొనియాడుతారు.

విశేషం: ఈ పద్యంలో శ్రీకృష్ణుడు పాండవ పక్షంగానే కాక బంధుమిత్ర సుజనకోటిపక్షాన, వారందరి ఏకగ్రీవాంగీకారంగా, ఫలితాంశాన్ని ప్రకటించటం గమనిస్తే, ధృతరాష్ట్రుడిని ఏకాకి చేసి, అంగీకరించక తప్పనిదైన ఒత్తిడి స్థితిని కల్పించే నీతి వలె కనపడుతుంది. అయినా, అది న్యాయమని అందరికీ అనిపిస్తుంది. ధర్మజుడు ఆశించిన ఫలితాన్ని శ్రీకృష్ణు డింతవరకు విజయవంతంగా సాగించాడు. (సంపా.)

**క. ఎఱుఁగవె యజాతశత్రుని। నెఱియును ధర్మంబు సత్యనిష్ఠయు మిము నె
త్తెఱఁగున ననువర్తించెనొ। యెఱుఁగవె? తగు చేవ గలుగు టెఱుఁగవె? యధిపా! 278**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అజాతశత్రుని= ధర్మజుడియొక్క; నెఱియును= న్యాయమును; ధర్మంబున్= ధర్మమును; సత్యనిష్ఠయున్= సత్యమునందలి ఉనికియు; ఎఱుఁగవె?= తెలియవా? మిమున్= మిమ్ము; ఏ+తెఱఁగునన్= ఏ విధంగా; అనువర్తించెనొ= అనుసరించిమెలగెనో; ఎఱుఁగవె= తెలియవా?; తగుచేవ= తగిన శక్తి; కలుగుట= ఆతడు కల్గియుండటం; ఎఱుఁగవె?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! ధర్మజుడి న్యాయమూ, ధర్మమూ, సత్యప్రవృత్తీ నీకు తెలుసు. అతడు మిమ్మాశ్రయించుకొని ఎట్లా ఉండినదీ నీకు తెలుసు. తగినశక్తి కలిగి ఉండటం కూడ నీకు తెలుసు.

విశేషం: ఇది ధర్మరాజ ప్రశంస. ఆరుగుణాల చేత అతడు అగ్రగణ్యుడు.

1. అజాతశత్రుత్వం-ఎదుటివారు అతడిని శత్రువనుకొనవచ్చునేమో కాని అతడు ఎదుటివారిని ఎప్పుడూ శత్రువని భావించడు. ఇది అపూర్వగుణం. మహాభారత చక్రవర్తులలో ధర్మరాజుకే చెల్లింది. 2. న్యాయం తప్పని లోకనీతి. 3. ధర్మం తప్పని వేదనీతి. 4. సత్యం తప్పని వ్యక్తి నీతి. 5. పెద్దల మాట తప్పని వంశనీతి. 6. రాజ్యం పాలించగలిగిన శక్తి - ప్రభునీతి. ఈ ఆరుగుణాలు ఉత్తమ వంశకర్తకుండే లక్షణాలు. సారపు ధర్మం, విమలసత్యం ధర్మజుడి జీవిత రథచక్రాలు. (సంపా.)

వ. అది యెల్ల నీ వెఱుంగు; దైనను దెలియఁ జెప్పెద విను; మింద్రప్రస్థపురంబున నుండి పాండవాగ్రజుండు నీకుం బెంపునుం బేరునుం జేయం గోరి. 279

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= అది అంతయూ; నీవు+ఎఱుంగుదు= నీకు తెలియును; ఐనను; తెలియన్+చెప్పెదన్+వినుము= తేటతెల్లంగా తెలుపుతాను వినుము; ఇంద్రప్రస్థపురంబునన్+ఉండి; పాండవ+అగ్రజుండు= పాండవులలో తొలుత జన్మించిన ధర్మజుడు; నీకున్; పెంపునన్= గౌరవమును; పేరునున్= ప్రఖ్యాతిని; చేయన్+కోరి= కలిగింపనెంచి.

తాత్పర్యం: ధర్మజు డెటువంటివాడో నీ వెరుగుదువు. అయినప్పటికీ స్పష్టంగా చెపుతాను, విను. అతడు ఇంద్రప్రస్థపురంలో ఉంటూ నీకు గౌరవఖ్యాతులు కలిగింప నెంచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. మద మడఁగించి భూపతిసమాజము నెల్లను నిన్నుఁ గొల్వఁజే
యుదునని పూని దిగ్విజయ మున్నతిఁజేసి మహావిభూతితో
మదిమదినుండ నీ సుతుఁడు మంత్రులు సౌబలు జూదమార్చి సం
పద గొని యంతఁ బోవక సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే. 280

ప్రతిపదార్థం: మదము+అడఁగించి= గర్వాన్ని తొలఁగించి; భూపతి సమాజమున్+ఎల్లను= రాజలోకమంతటినీ; నిన్నున్= నిన్ను; కొల్వన్+చేయుదున్+అని= సేవించేటట్లు చేయుదునుగాక అని; పూని= పూనుకొని; దిగ్విజయము= దిగ్జయమును; ఉన్నతిన్+చేసి= గొప్పగా కావించి; మహావిభూతితోన్= గొప్ప ఐశ్వర్యంతో; మది మదిన్+ఉండన్= నెమ్మదిగా ఉండగా; నీ సుతుఁడు= నీ కుమారుడైన దుర్యోధనుడు; మంత్రులు= అతడికి ఆలోచనచెప్పే కర్ణదుశ్శాసనులు; సౌబలున్= సుబలుని పుత్రుడైన శకునిని; జూదము+ఆర్చి= జూదమాడించి; సంపదన్+కొని= సిరిని హరించి; అంతన్+పోవక= అంతటితో విడువక; ద్రుపద+ఆత్మజన్= ద్రౌపదిని; సభన్= కొలువులో; భంగపెట్టరే= అవమానించినారు గదా!

తాత్పర్యం: రాజుల దర్పమడచి వారందరు నిన్ను కొలిచేటట్లు చేయటానికై ధర్మనందనుడు గొప్పగా దిగ్విజయం చేసి మిక్కుటమైన సిరిసంపదలతో తులతూగుతూ నిమ్మళంగా ఉన్నాడు. అప్పుడు నీ తనయుడూ, అతని మంత్రులూ చేరి శకునిచే జూదమాడించి ధర్మజుడి సంపదనెల్ల హరించారు. అంతటితో తృప్తిపడక నిండుసభలో ద్రౌపదిని పరాభవించారు.

విశేషం: 1. ధర్మరాజు దిగ్విజయం చేయటం ధృతరాష్ట్రుడి ఔన్నత్యాన్ని పెంచటానికే అన్నాడు కృష్ణుడు.

2. దిగ్విజయంలో ఓడిన రాజులు దుర్యోధనుడికి సాయం చేస్తున్నారు. వారి నుద్దేశించి చెప్పిన మాట ఇది. దిగ్విజయం చేసింది ధర్మరాజు; దాని ఫలితాన్ని అనుభవిస్తున్నది ధృతరాష్ట్రుడు. ఆ యుద్ధాలన్నీ ధృతరాష్ట్రుడి సంపదను పెంచటానికే అని వారు గ్రహించి పాండవులయందు సౌముఖ్యాన్ని వహించాలని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

3. ధర్మజుడు తండ్రిపెంపుగోరి సంపద గడిస్తే, దుర్యోధనుడు తండ్రికి కళంకం తెచ్చేటట్లు సంపద హరించాడు. అంతేకాదు ద్రౌపదిని నిండుసభలో భంగపరచి తండ్రికి తలవంపులు తెచ్చాడు. తులనాత్మక విచారంతో ఎవరు యోగ్యులో తేల్చుకొనుమని సూచన. తండ్రి పెంపుకు కృషి చేసిన కొడుకుకు కీడు తలపెట్టటం తగదని హితవు. (సంపా.)

ఉ. దానికి నీ వొడంబడితి; ధర్మజుఁ డంతయుఁ జూచి సత్యముం
బూని వృకోదరార్జునులు భుగ్నులుగాఁ బెడచేతఁ గన్ను నీ
రూనఁగ నొత్తుకొంచుఁ జని యుగ్ర వనంబున దుఃఖమగ్నుఁడై
దీనత నుండి పూన్కి దగఁ దీర్చియుఁ గూడి మనంగఁ గోరెడిన్. 281

ప్రతిపదార్థం: దానికిన్= దుర్యోధనుడి దుష్టచేష్టకు; నీవు+ఒడంబడితి(వి)= నీవు సమ్మతించావు; ధర్మజుఁడు= ధర్మరాజు; అంతయున్+చూచి= పరిస్థితి నాకళించుకొని; సత్యమున్+పూని= సత్యం అవలంబించి; వృకోదర+అర్జునులు= భీమార్జునులు; భుగ్నులుగాన్= విఱిగినవారు కాగా, క్రుంగినవారుకాగా; కన్ను= నేత్రములు; నీరు+ఊనఁగన్= కన్నీరు వహించగా; పెడచేతన్=

వెనుక చెయ్యితో; ఒత్తుకొంచున్= తుడుచుకొంటూ; చని= వెళ్ళి; ఉగ్రవనంబునన్= ఘోరారణ్యంలో; దుఃఖమగ్నుఁడు+ఐ= శోకమునందు మునిగినవాడై; దీనతన్+ఉండి= దైన్యంతో పడియుండి; పూన్కిన్= ప్రతిజ్ఞను; తగన్+తీర్చియున్= సక్రమంగా నిర్వహించికూడా; కూడి= మీతో కలసిమెలసి; మనంగన్= జీవించాలని; కోరెడిన్= కోరుకొంటున్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి దుష్కృత్యాలకు నీవు సమ్మతించావు. ధర్మరాజు తనకేర్పడిన సంకటాన్ని గమనించి సత్యం తప్పక తన ఆజ్ఞచేత భీమార్జునులు బలముడిగి క్రుంగిపోగా కంటినుండి కారుకన్నీటిని పెడచేతితో తుడిచికొంటూ ఘోరారణ్యాలకు వెళ్ళాడు. అక్కడ దుఃఖాలలో మునిగి దైన్యం అనుభవిస్తూ ప్రతిజ్ఞను సక్రమంగా నెరవేర్చికూడా నేడు మీతో ఒద్దికగా జీవించవలెనని కోరుకుంటున్నాడు.

విశేషం: 1. దుర్యోధనుడు చేసిన దుర్నయం క్షమార్హం కానిది. అయినా, దానికి ధృతరాష్ట్రుడు అంగీకరించి ఆ పాపభారాన్నంతా తన తలమీద వేసికొన్నాడు. అందుచేత పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు ఆయాసపడుతూనే సత్యవ్రతంగా నిర్వహించారు. అడవులలో అన్ని యాతనలు పడికూడా పగ సాధించే క్రౌర్యానికి పోకుండా, అన్ని అపకారాలు చేసినా కౌరవులతో కలిసి జీవించాలని కోరుతున్నారు. అజాతశత్రువు శీలానికి ఇంతకంటె నిదర్శన మే ముంటుంది? - అని ధర్మజుడి ధీరోదాత్తతను, శాంతికాముకత్వాన్నీ బంధుప్రీతిని సమర్థవంతంగా సభలో తెలియచెప్పాడు.

2. భీమార్జునులు కన్నీరొత్తుకొంటూ వెళ్ళినట్లు చెప్పిన అంశం సాభిప్రాయం. వారు క్రోధమూర్తులు. యుద్ధాన్నే కోరుతున్నారు. అయినా, వారిని తగిన విధంగా నియంత్రించి సత్యధర్మాలను పాటిస్తున్నాడు ధర్మరాజు. అతడివలె ధృతరాష్ట్రుడు కూడ తన పుత్రులను అదుపులో పెట్టి పాండవులకు న్యాయం చేయాలని హెచ్చరిక. (సంపా.)

క. తనుఁ దాన పోలుఁగా కే । మనవచ్చు? నజాతశత్రు నతిశాంతతయున్
వినయము సత్యము ము న్నే । జనపతులకుఁ గలవు సెపుమ? సౌజన్యనిధీ! 282

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనానికి స్థానమైనవాఁడా!; తనున్+తాను+అ+పోలున్+కాక= ఆతడికి అతడే సాటిఅగును; ఏమి+అనన్+వచ్చున్?= అతడిని ఎంతని కొనియాడగలము?; అజాతశత్రు= ధర్మజుడియొక్క; అతి= మిక్కుటమైన; శాంతతయున్= శాంతస్వభావమూ; వినయమున్= అణకువా; సత్యమున్= సత్యమూ; మున్ను= పూర్వం; ఏ జనపతులకున్+ కలవు= ఏ రాజులకున్నాయో; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: ధర్మపుత్రుడికి సాటి ధర్మపుత్రుడే. అతడిని ఎంతని కొనయాడగలం? ఆయన శాంతస్వభావం, అణకువ, సత్యనిష్ఠ ఇంతకుమునుపు ఏ రాజులకున్నవో చెప్పు.

విశేషం: 1. అలం: అనన్వయం, కావ్యలింగం. "ఉపమానోపమేయత్వం యదేక స్యైవ వస్తుతః". ఒకే వస్తువుకు ఉపమానత్వం, ఉపమేయత్వం కూడా చెప్పితే అనన్వయం. ధర్మజుడు తనకు తానే పోలినవాడు అనటం అనన్వయం. సాటి లేని మేటి వ్యక్తిత్వం ధ్వని. మహాభారత పురుషులలో శ్రీకృష్ణుడిని మించిన మహాపురుషుడు లేడని ప్రసిద్ధి. అతడి ప్రశంస పొందిన ధర్మరాజు ధన్యజీవి.

2. "సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్" అని కావ్యలింగాలంకార లక్షణం. అతడి కతడే సాటి అయిన ధర్మరాజును ప్రశంసించటానికి మాటలు లేవట! శాంతవినయ సత్యగుణాలలో అతడివంటివారు అంతవరకు లేరట! ఇది అతిశయోక్తిగా ఉన్నా ధర్మజుడి అనన్యత్వాన్ని సమర్థించే వాక్యమే- అందుకు కావ్యలింగం.

3. ధర్మజుడి వంటి రాజులు అంత వరకు పుట్టలేదన్న ప్రశంస సమకాలీనులైన ప్రభువులలో గల అతడి నిరుపమాన వ్యక్తిత్వాన్ని ధ్వనిస్తున్నది. (సంపా.)

క. ఏ నిం తాడితి నీ సం । తానం బిరుదెఱఁగునకు హితము గోరి భవ
త్సూనుని మతి యతిలోభము । మానిచి పాండవులఁ దెమ్ము మనుజాధీశా! 283

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= నరనాథా!; నీ సంతానంబు= నీ బిడ్డలైన; ఇరు+తెఱఁగునకున్= రెండు పక్షాల వారికి; హితమున్+కోరి= మేలు దలచి; ఏను= నేను; ఇంత+ఆడితిన్= ఇన్నిమాటలు చెప్పాను; భవత్+సూనుని= నీ కొడుకైన దుర్యోధనుడియొక్క; మతి+అతిలోభమున్= మనస్సునందలి మిక్కిలి దురాశను; మానిచి= తొలగించి; పాండవులన్+తెమ్ము= పాండవులను నీ కడకు రప్పించుకొనుము.

తాత్పర్యం: మంచితనంగల ధృతరాష్ట్ర మహారాజా! నీ బిడ్డలైన కురుపాండవుల మేలు గోరి నే నిన్నిమాటలు చెప్పవలసి వచ్చింది. నీ పుత్రుడైన దుర్యోధనుడి మనసులో ఉన్న పరమ దురాశను తొలగించి, పాండవులను నీ చెంతకు పిలిపించుకొనుము.

విశేషం: ధర్మరాజ ప్రశంస ప్రయోజనం అతడిని పిలిపించటం కొరకే. దానికి ప్రతిబంధకంగా నిలిచే దుర్యోధనుడి లోభాన్ని నియమించటం కొరకే. (సంపా.)

ఉ. వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నారటుఁగాక మీ కది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు; భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁ బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!' 284

ప్రతిపదార్థం: వారలు= కౌంతేయులు; శాంతశూరులు= శాంతస్వభావులున్నూ, పరాక్రమవంతులున్నూ; భవత్+చరణంబులు= నీ పాదాలు; కొల్వన్= సేవించటానికి; పూని+ఉన్నారు= సంసిద్ధంగా ఉన్నారు; అటున్+కాక= అట్లాకాక; మీకున్= మీకు; అది= పాండవుల పొత్తు; మనంబునకున్= మీ మనస్సులకు; అప్రియము+ఏనిన్= ఇష్టంకానిచో; ఇంతకున్= ఈపాటికి; పోరికిన్= యుద్ధానికి; వచ్చుచున్+ఉండుదురు= వస్తూ ఉంటారు; భూవర!= రాజా!; రెండు తెఱంగులందున్= సంధి సంగ్రామాలలో; నీకున్= నీకు; ఆరయన్= ఆలోచించగా; ఏది పథ్యము+అగున్= ఏది హితమౌతుందో; ఆ+విధము= ఆ తెఱగు; ఏర్పడన్+ నిశ్చయింపుమా!= తేటపడేటట్లు తీర్మానించుము.

తాత్పర్యం: మహారాజా! పాండవులు ఎంతటి శాంత స్వభావులో అంతటి వీరాగ్రేసరులు. వారు నీ పాదసేవ చేయటానికి సంసిద్ధంగా ఉన్నారు. వా రట్లా మీతో కలసి మెలసి వర్తించటం మీకు ఇష్టంకాకపోతే ఈ పాటికి కదనం కావించటానికి బయలుదేరి వస్తుంటారు. సంధి, సంగ్రామం - ఈ రెండింటిలో మీ కేది హితమని తోస్తుందో దానిని నిర్ణయించి వెల్లడించండి.'

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనాననురూపయోః" అననురూపాలైన వాటికి సంబంధం వర్ణిస్తే విషమాలంకారం. పాండవులు శాంతశూరులు - అనే వాక్యం చక్కని ఉదాహరణం. శాంత శూరత్వాలు అననురూపాలైన

గుణాలు. పాండవులు అట్టి గుణాలు కలవారని భావం. తిక్కన ధర్మరాజును - 'మెత్తనిపులి' అని అన్నాడు. పాండవులను 'శాంతశూరులు' అని పేర్కొన్నాడు. తెలుగు సాహిత్యంలో ఈ బిరుద విశేషణాలు తిక్కన ప్రతిభావైభవానికి కీర్తి పతాకలు.

2. శాంతులు కాబట్టి ధృతరాష్ట్రుడిని సేవించాలని భావిస్తున్నారు. ధృతరాష్ట్రుడు వారికి రాజ్యభాగమిచ్చి మన్నించకపోతే శూరులవలె యుద్ధానికి సిద్ధమౌతారు. సహజంగా వారు శాంతులు, అవసరం వస్తే వారు శూరులు. ధృతరాష్ట్రుడు పాండవుల నెట్లా ప్రవర్తించవలెనని కోరుకొంటున్నాడో తేల్చిచెప్పాలని సభలో నిలదీసి అడిగాడు కృష్ణుడు. ఇది సందేశంలోని తారాస్థాయి (క్లైమాక్స్). (సంపా.)

చ. అనవుడు రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లను బ్రియమంది నెమ్మనములం 'బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కునె? మఱుమాటలాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁడెవ్వఁ? డిం
దనువరి యెవ్వఁ' డంచు నచలాకృతులై నెఱి నూరకుండఁగన్. 285

ప్రతిపదార్థం: అనవుడున్= శ్రీకృష్ణుడు అట్లా పలుకగా; అంగములన్= శరీరములందు; రోమహర్షణములు= గగుర్పాటు; పొడమన్= కలుగగా; సదస్యులు+ఎల్లను= కొలువులోని వారంతా; ప్రియము+అంది= హర్షించి; నెమ్మనములన్= తమ నిండు మనసులలో; పురుషోత్తముఁడు= శ్రీ కృష్ణుడు; ఇంత+ఒప్పన్+పల్కునె= ఇంత బాగా మాట్లాడుతాడా? (ఎంతబాగా మాట్లాడాడు? అని భావం); మఱుమాటలు+ఆడన్= ఆ మాటలకు బదులు పలకటానికి; ఇందున్= ఈ సభలో; నయకోవిదుఁడు+ ఎవ్వఁడు?= నీతిశాస్త్ర నిపుణుడు ఎవడున్నాడు?; ధీరుఁడు+ఎవ్వఁడు?= ధైర్యశాలి ఎవడున్నాడు?; అనువరి+ఎవ్వఁడు?= ఉపాయశాలి ఎవడున్నాడు?; అంచున్= అని పలుకుతూ; అచల+ఆకృతులు+ఐ= చలించని ఆకారాలు గలవారై; నెఱిన్= ఒప్పుగా; ఊరక+ఉండఁగన్= మిన్నకుండగా.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడి మాటలు వినగానే సభ్యులందరి శరీరాలు గగుర్పాటు వహించాయి. వారు మనస్సులలో ఎంతో సంతోషించి, 'నారాయణు డెంత ఒప్పిదంగా మాటాడాడు! శౌరి మాటలకు ప్రతివచనాలు పల్కగల నీతి నిపుణుడు, ధీరుడు, ఉపాయశాలి ఈ కొలువులో ఎవడున్నాడు' అని కదలక మెదలక నోరు విప్పక అట్లాగే ఉండిపోగా, (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: ఒక మహావక్త ఉపన్యసించినప్పుడు సభాసదులు ఎట్లా సమ్మోహితు లౌతారో వర్ణించిన పద్యమిది.

1. అందరి శరీరాల మీద పులకలు నిలిచాయి. ఇది సాత్త్వికభావం. అప్రయత్నకృతమైన సాత్త్విక చేష్ట అవ్యక్తమైన ఆనందానికి గుర్తు.

2. మనస్సులు సంతోషించాయి- ఇది పద్యఃపరనిర్వృతి వంటిది.

3.'ఇంత ఒప్పఁ బల్కునె?' - అనే మాట ఆశ్చర్య ప్రకటనం. శ్రీకృష్ణ సందేశంలోని వస్తువుకు శ్రోతలు అబ్బురపాటు పడిన వైఖరి.

4. 'మారుమాటాడే నీతికోవిదు డెవ్వడున్నాడు?' అన్నది ఆశ్చర్యజనకమైన ప్రతిస్పందన. శ్రీకృష్ణుడి సందేశోపన్యాసంలో చెప్పిన దెంత బాగుందో, చెప్పినతీరు అంతకంటె బాగుంది. దానికి తిరుగుచెప్పే పండితులు లేరని భావం. ఇది బుద్ధిమంతుల ప్రశంస.

5. 'ధీరు డెవ్వడు' - అట్లా చెప్పగలిగిన ధైర్యం ఉన్న వాడెవడు? ధృతరాష్ట్రుడి నిండు కొలువులో అతడి ఉపేక్షయే ప్రళయ హేతువని ప్రకటించి, రాజ్యభాగమివ్వటం కంటె గత్యంతరం మరొకటి లేదని సూటిగా, ఘాటుగా చెప్పగల మొనగాడు శ్రీకృష్ణు డొక్కడే అని తెగువరుల ప్రశంస.

6. 'అనువరి ఎవ్వడు?' అన్న ప్రశ్న రాజనీతిజ్ఞులు వేసేది. శ్రీకృష్ణుడి మాటలు పైకి నీతులు. లోన సామదానభేదోపాయ బృంహితాలు. ధర్మనీతి మార్గంలో ఉపాయాలు ప్రయోగించ బడతాయి. కౌరవులు దుర్నీతి మార్గగాములు కాబట్టి ఉపాయ నైపుణ్యం ఉండదు. యుద్ధ పిపాస మాత్రమే కనపడుతుంది.

7. 'అచలాకృతులై ఊరకుండటం' సాత్త్వికాభినయం. కదలకుండా కొండవలె (ఉపమాలంకారం) కొయ్యబారి కూర్చుండిపోయారు. అందుకే కాబోలు జమదగ్న్యాది మహర్షులు తేరుకొని మాట్లాడటం మొదలు పెట్టారు.

8. శ్రీకృష్ణుడు కౌరవసభలో గాలినంతా తనవైపు మళ్ళించుకొన్నాడు. ధర్మజుడి ఉపాయంలోని తొలిఘట్టం విజయవంతంగా ముగించాడు. (సంపా.)

వ. జామదగ్న్య మహాముని సుయోధనునితో నిట్లనియె : 286

ప్రతిపదార్థం: జామదగ్న్య మహాముని= జామదగ్న్యుడనే మహర్షి; సుయోధనునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జామదగ్న్యుడు అనే మహర్షి దుర్యోధనుడితో ఇట్లా చెప్పాడు :

సీ. వినుము దంభోద్భవుం డనురాజు దన కెదు । రెవ్వరు లేరంచు గ్రొవ్వి నరుఁడు
నారాయణుం డనువారలు గంధమా । దనమను నగమునఁ దపము సేయ
వారిపైఁ జని యాహవమునకుఁ బిలిచిన । నమ్మునీంద్రులు వలదని యనేక
విధములఁ జెప్పంగ వెండియుఁ బోకున్నఁ । గుశముష్టి నుజ్జ్వల విశిఖ వృష్టిఁ

ఆ. గురిసి నరుఁడు సేనఁ గూల్చి యాతని భంగ । పెట్టి పట్టి విడిచె నట్టి యమ్మ
హాత్ము లిపుడు పార్థుఁడనఁ గృష్ణుఁడనఁగ లీ । లార్థ కలిత జన్ములైరి సూవె! 287

ప్రతిపదార్థం: వినుము= సుయోధనా! నా మాటలు వినుము; దంభోద్భవుండు+అను రాజు= దంభోద్భవుఁడనే ప్రభువు; తనకున్+ఎదురు+ఎవ్వరున్+లేరు+అంచున్= తనకు అడ్డమెవ్వరూ లేరని; క్రొవ్వి= గర్వించి; నరుఁడు; నారాయణుండు; అనువారలు= అనునట్టివారు; గంధమాదనము+అను నగమునన్= గంధమాదనము అనే పేరుగల పర్వతంమీద; తపము+చేయన్= తపసు చేస్తుండగా; వారిపైన్+చని= వారిమీదికి వెళ్ళి; ఆహవమునకున్+పిలిచినన్= యుద్ధానికి ఆహ్వానించగా; ఆ+ముని+ ఇంద్రులు= ఆ మునీశ్వరులు; వలదు+అని= వద్దని; అనేక విధములన్= పలు రీతుల; చెప్పంగన్= పలుకగా; వెండియున్= మరల; పోక+ఉన్నన్= అతడు తొలగకున్నప్పుడు; నరుఁడు= నరుడనే ఋషి; కుశముష్టిన్= దర్భలు ధరించిన పిడికిటితో; ఉజ్జ్వల విశిఖ వృష్టిన్= వాడియైన బాణాలు అనే వర్షమును; కురిసి= వర్షించి; సేనన్+కూల్చి= దంభోద్భవుడి సైన్యాన్ని హతంచేసి; ఆతనిన్= అతడిని; భంగపెట్టి= పరాభవించి; పట్టి= బంధించి; విడిచెన్= ఆ తరువాత కరుణతో వదలివేశాడు; అట్టి= అటువంటి; ఆ+మహా+ఆత్ములు= ఆ మహనీయులు; ఇప్పుడు= ఈవేళ; పార్థుఁడు+అనన్= అర్జునుడనగా; కృష్ణుఁడు+అనఁగన్= శ్రీకృష్ణుడనగా; లీలా+అర్థ+కలిత జన్ములు+ఐరి+చూవె!= విలాసం కొరకు పుట్టుకలను స్వీకరించారు సుమా!

తాత్పర్యం: దుర్యోధనా! వినుము. దంభోద్భవుడనే రాజు తనకు ఎదురెవ్వరూ లేరని గర్వంతో విర్రవీగుతూ, నరనారాయణులనే దేవర్షులు గంధమాదన పర్వతంమీద తపస్సు చేసికొంటుంటే వారిపైకి వెళ్ళి యుద్ధానికి ఆహ్వానించాడు. ఆ మహామునులు యుద్ధం వద్దని ఎన్నో విధాల చెప్పిచూచారు. అతడు మొండికి పడి అక్కడి నుండి కదలకుంటే నరుడు దర్భలు ధరించిన పిడికిటితో వాడియైన బాణాల వాన కురిపించి దంభోద్భవుడి సేనలను హతం చేశాడు. అతడిని పట్టి పరాభవించి చివరికి దయదలచి వదలివేశాడు. ఆ మహానుభావు లిద్దరూ ఇప్పుడు పార్థుడనే పేరుతో శ్రీకృష్ణుడనే పేరుతో క్రీడార్థమై ఈ భువిలో అవతరించారు సుమా!

వ. కావున నీవా దంభోద్భవు చందంబున నుద్ధతి వాటించుటయు, నరనారాయణులతోడఁ దొడరుటయు మీఁద మేలయి యుండదు; పాండవులతోడి పొందు మేలనిన యనంతరంబ కణ్వుండు దుర్యోధనున కిట్లనియె: 288

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు; ఆ దంభోద్భవు చందంబునన్= ఆ దంభోద్భవుడి మాదిరి; ఉద్ధతి+పాటించుటయున్= గర్వం వహించటమూ; నరనారాయణులతోడన్; తొడరుటయున్= ఎదిరించటమూ; మీఁదన్= ముందు; మేలు+అయి+ఉండదు= శ్రేయం కలిగించదు; పాండవులతోడి పొందు= పాండవులతో కలిసి ఉండటం; మేలు= మంచిది; అనిన+అనంతరంబు+అ= అని జామదగ్న్యుడు చెప్పిన పిదప; కణ్వుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి ఆ దంభోద్భవుడి విధంగా గర్వం వహించటం, నరనారాయణులను ఎదిరించటం మేలుకాదు. పాండవులతోడి పొందు మేలు' అని జామదగ్న్యుడు చెప్పిన పిదప కణ్వుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతంబు సెప్పుట (సం. 5-95-1)

ఆ. అదిపోలుఁ; దన్ను నెదిరిని । మది నెఱుఁగక నిగ్రహించి మదమెత్తుట యొ
ప్ప; దహంకారం బొనరిం । పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్. 289

ప్రతిపదార్థం: అది+పోలున్= జామదగ్న్యుడు చెప్పినమాటలు తగిఉన్నవి; తన్నున్= తనను; ఎదిరినిన్= ఎదుటివానిని; మదిన్= మనస్సులో; ఎఱుఁగక= తెలియలేక; నిగ్రహించి= త్రోసివేసి; మదము+ఎత్తుట= గర్వపడటం; ఒప్పదు= తగదు; తొల్లి= మునుపు; పక్షి+ఇంద్రునకున్= పక్షులకు రాజైన గరుత్మంతుడికి; అహంకారంబు= గర్వం; పౌరుషహానిన్= పరాక్రమానికి చేటు; ఒనరింపదె?= కలిగింపలేదా? (కలిగించినదని అర్థం.)

తాత్పర్యం: 'జామదగ్న్య మహాముని చెప్పిన మాటలు సమంజసాలు. తన శక్తినీ, ఎదిరి శక్తినీ గమనించక గర్వంతో ధిక్కరించటం యుక్తం కాదు. పూర్వం అహంకారం గరుత్మంతుడికి శౌర్యహానిని కలిగించింది సుమా!

వ. అది యెట్లనిన. 290

తాత్పర్యం: ఆ కథ యేమిటంటే.

సీ. అమరేంద్రరథసూతుఁడైన మాతలి దన । సుత గుణకేశికిఁ బతిఁ దగంగ
నారసి యార్యకుండను భుజంగాధిపు । మనుమనిఁ జికురుని తనయు సుముఖు
నర్థిమైఁ గోరిన నార్యకుం డుమ్మలి । కంబుతో నిట్లను "గరుడుఁ డితని
తండ్రి వధించి యెంతయు నల్కమై వీని । నింకిట నెల సమయించువాఁడు

ఆ. గాఁగఁ బూనిపోయెఁ గావున నే మియ్య । కొనఁగనేర" మనిన విని 'బలారి
నడిగి పడసి యిత్తు నాయువు రం' డని । వారిఁగొనుచు నరిగె సారథియును. 291

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర= దేవేంద్రుడియొక్క; రథసూతుఁడు+ఐన= రథసారథి ఐన; మాతలి= మాతలి అనేవాడు; తనసుత= తన కొమార్తెఅయిన; గుణకేశికిన్= గుణకేశి అనేదానికి; పతిన్= భర్తను; తగంగన్= చక్కగా; ఆరసి= విచారించి; ఆర్యకుండు+అను= ఆర్యకుడనే పేరుగల; భుజంగ+అధిపు మనుమనిన్= సర్పరాజు యొక్క మనుమడూ; చికురుని తనయున్= చికురుడనే వాడి కుమారుడూ అయిన; సుముఖున్= సుముఖుడనే పేరుగలవాడిని; అర్థిమైన్= ఆసక్తితో; కోరినన్= వేడగా; ఆర్యకుండు= ఆర్యకుడు; ఉమ్మలికంబుతోన్= దుఃఖంతో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; గరుడుఁడు= గరుత్మంతుడు; ఇతని తండ్రిన్= ఈతడి జనకుడిని; వధించి= చంపి; ఎంతయున్= మిక్కిలి; అల్కమైన్= కోపంతో; వీనిన్= సుముఖుడిని; ఇంకన్+ఇటన్= ఇంకనిక్కడ; నెలన్= నెలరోజులలో; సమయించువాఁడు+కాఁగన్= చంపేటట్లుగా; పూని= నిశ్చయించి; పోయెన్= వెళ్ళాడు; కావునన్= కనుక; ఏము= మేము; ఇయ్యకొనఁగన్+నేరము= పెండ్లికి అంగీకరించలేము; అనినన్+విని= అని ఆర్యకుడు చెప్పగా ఆలించి; సారథియును= ఇంద్ర రథ సారథి అయిన మాతలియు; బల+అరిన్= బలుడనే రాక్షసుడికి విరోధి అయిన దేవేంద్రుడిని; అడిగి= అర్థించి; ఆయువున్= ఆయుర్దాయాన్ని; పడసి+ఇత్తున్= పొంది సుముఖుడికిస్తాను; రండు= మీరు నావెంట రండి; అని= అనుచు; వారిన్+కొనుచున్+అరిగెన్= వారిని తన వెంట తీసికొనివెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడి రథసారథి అయిన మాతలి గుణకేశి అనే తన కొమార్తెకు విచారించుకొని, ఆర్యకుడు అనే సర్పనాయకుడి మనుమడున్నూ, చికురుడనే వాడి తనయుడున్నూ అయిన సుముఖుడిని భర్తగా నిర్ణయించాడు. అట్లా నిర్ణయించుకొని ఆర్యకుడి దగ్గరకు వెళ్ళి ప్రీతితో సుముఖుడిని కోరాడు. అప్పుడు ఆర్యకుడు దుఃఖంతో 'గరుత్మంతుడు వీని తండ్రియైన చికురుడిని చంపివేసి, నెలరోజులలో సుముఖుడిని కూడ సంహరిస్తానని కోపంతో పంతగించి పలికి వెళ్ళాడు. ఇట్టి దశలో మేము సుముఖుడి వివాహానికి సమ్మతించలేము' అని చెప్పాడు. ఆ మాటలు విని మాతలి 'దేవేంద్రుడి నడిగి సుముఖుడికి ఆయుస్సు తీసి యిస్తాను రం'డని వారిని తన వెంటబెట్టుకొని ఇంద్రుడి కడకు వెళ్ళాడు.

వ. వారల భాగ్యంబున నప్పు డింద్రుండును, నుపేంద్రుండును, నొక్కచో నుండం గని మాతలి యక్కార్యంబు విన్నవించినం గరుణించి జిష్ణుండు విష్ణునకుం జెప్పి చేయించువాఁడై వైనతేయు దెసకుం దాన చాలి సుముఖుం జిరాయు రుపేతుం జేసిన 292

ప్రతిపదార్థం: వారల భాగ్యంబునన్= వారి అదృష్టంచేత; అప్పుడు; ఇంద్రుండును; ఉపేంద్రుండును= విష్ణువు; ఒక్కచోన్= ఒక్కచోట; ఉండన్+కని= ఉండటం చూచి; మాతలి; ఆ కార్యంబు విన్నవించినన్= తాను వచ్చినపని మనవి చేయగా; కరుణించి; జిష్ణుండు= దేవేంద్రుడు; విష్ణునకున్+చెప్పి చేయించువాఁడు+ఐ= మహావిష్ణువునకు దెలిపి చేయించేవాడై; వైనతేయు

దెసకున్= వినతా పుత్రుడైన గరుత్మంతుడి దిక్కునకు; తాను+అ= తానే; చాలి= శక్తి గల్గినవాఁడై; సుముఖున్= సుముఖుడిని; చిర+ఆయుః+ఉపేతున్+చేసినన్= దీర్ఘాయుష్యంతో కూడినవాడిని చేయగా.

తాత్పర్యం: వారి అదృష్టంవలన అప్పుడు ఇంద్రుడూ ఉపేంద్రుడూ ఒకే చోట ఉన్నారు. మాతలి వారిని చూచి వచ్చిన కార్యం నివేదించాడు. అందుకు సురపతి కరుణించి విష్ణుదేవుడికి చెప్పి చేయించదలచి, గరుత్మంతుడి విషయంలో తాను చాలుదునని ఎంచి సుముఖుడిని దీర్ఘాయుష్మంతుణ్ణి చేశాడు.

క. మాతలి పాణిగ్రహణం । బాతనిఁ జేయించియున్న నంతయు విని తా
నేతెంచి గరుడుఁ డతి కో । పాతురుఁడై రేఁగి పెలుచ నమరాధిపుతోన్. 293

వ. వాసుదేవ సన్నిధి నిట్లనియె. 294

ప్రతిపదార్థం: మాతలి= ఇంద్ర సారథి; ఆతనిన్= సుముఖుడిని; పాణిగ్రహణంబు చేయించి= పెండ్లి చేయించి; ఉన్నన్= సుఖంగా ఉండగా; అంతయున్+విని= ఆ విషయమంతా తెలిసి; గరుడుఁడు= గరుత్మంతుఁడు; తాన్+ఏతెంచి= తా నచ్చటికి వచ్చి; అతికోప+ఆతురుఁడు+ఐ= మిక్కిలి కోపంతో ఒడలు తెలియనివాడై; పెలుచన్+రేఁగి= మిక్కిలి చెలరేగి; అమర+అధిపుతోన్= దేవతలకు రాజైన ఇంద్రుడితో; వాసుదేవ సన్నిధిన్= నారాయణుడి సముఖంలో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మాతలి తన పుత్రికను సుముఖుడి కిచ్చి వివాహం జరిపించి ఉండగా ఆ సంగతి విని గరుత్మంతుడు అక్కడికి వచ్చి క్రోధపరవశుడై ఇంద్రుడితో నారాయణుడి సమక్షంలో ఇట్లా అన్నాడు:

క. 'విను నీ వదితిసుతుండవు । వినత కొడుక నేను; విఱ్ఱవీఁగెడు మనకున్
జనకుఁడు గ శ్యపుఁ డొక్కఁడ; । దనుజుల శోధించి చంపుదమ యిరువురమున్. 295

ప్రతిపదార్థం: విను= వినుము; నీవు; అదితిసుతుండవు= అదితియొక్క కొడుకవు; నేను; వినత కొడుకన్= వినతయొక్క కొడుకును; విఱ్ఱవీఁగెడు మనకున్= మిక్కిలిఒప్పుతున్న మనకు; జనకుఁడు= తండ్రి; కశ్యపుఁడు+ఒక్కఁడు+అ= కశ్యపుడొకడే; ఇరువురమున్= మనమిద్దరమునూ; దనుజులన్= రక్కసులను; శోధించి= వెదకి; చంపుదము+అ= చంపుదామా?

తాత్పర్యం: 'అదితిపుత్రుడవు నీవు. వినతా పుత్రుడను నేను. వైభవాతిశయంగల మన కిద్దరికీ కశ్యపు డొక్కడే తండ్రి. ఇద్దరం కలిసి రాక్షసులను వెదకి వెదకి చంపుదామా?

క. ఏమిట నీకేఁ దక్కువ । నా మేరకు నడ్డపడితి 'నావుడు నింద్రుం
డీ మహనీయ మహిమకును । ధామము విష్ణుండుగాక తక్కొరుఁ డగునే?' 296

ప్రతిపదార్థం: నీకున్= నీకు; ఏన్= నేను; ఏమిటన్= ఏ విషయంలో; తక్కువ?= లొచ్చు?; నా మేరకున్= నా నిర్ణయానికి; అడ్డపడితి(వి)= అడ్డం వచ్చావు; నావుడున్= అని గరుత్మంతుడనగా; ఇంద్రుండు= ఇంద్రుడు; ఈ మహనీయ మహిమకును= ఈ నీ గొప్ప ప్రభావానికి; ధామము= ఆశ్రయం; విష్ణుండు+కాక= విష్ణుదేవుడే తప్ప; తక్కు+ఒరుఁడు+అగునే?= మరొక్కడు కాడు.

తాత్పర్యం: ఇంద్రా! ఏ విషయంలో నేను నీ కంటె తక్కువ? నా నిర్ణయానికి నీవెందుకు అడ్డుపడ్డావు? అని గరుత్మంతుడు ప్రశ్నించగా సురనాథుడు ఈ నీ గొప్ప ప్రభావానికి అంతటికీ విష్ణుదేవుడు తప్ప మరొక్కడు కారణం కాదు.'

వ. అనిన విని గటకటం బడి గరుత్మంతుం డిట్లనియె: 297

ప్రతిపదార్థం: అనినన్; విని; కటకటంబడి= విచారపడి; గరుత్మంతుండు= గరుత్మంతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడి మాటలకు విచారపడి గరుత్మంతు డిట్లా అన్నాడు :

ఉ. 'తమ్ముఁడ! నీవు నా కొలఁది తథ్యమెఱుంగక నాకు నీచభా
వమ్మగు భంగిఁ జేసితివి; వాసవ! యి య్యదితి ప్రసూత వం
శ మ్మఖిలమ్ముఁ దాల్తు నొక సన్నపు టీఁకన; యిట్టి నన్ను నీ
విమ్మెయి దూలపుత్తె! యని యీక్షణరోచులఁ గెం పెలర్పఁగన్. 298

ప్రతిపదార్థం: తమ్ముఁడ!= తమ్ముడవైన ఇంద్రుడా!; నీవు= నీవు; నా కొలఁది= నా శక్తి యొక్క పరిమాణం; తథ్యము= వాస్తవంగా; ఎఱుంగక= తెలియజాలక; నాకున్= నాకు; నీచభావమ్ము+అగుభంగిన్+చేసితివి= అల్పస్థితి కలిగేటట్లు వ్యవహరించావు; వాసవ!= ఇంద్రా! ఈ+అదితి ప్రసూత వంశమ్ము+అఖిలమ్మున్= ఈ అదితికి జన్మించిన దేవతాకులం అంతటినీ; ఒక సన్నము+ ఈఁకన్+అ= ఒక సన్నపాటి ఈకమీదే; తాల్తున్= ధరించగలను; ఇట్టి నన్నున్= ఇట్లాంటి బలాఢ్యుడనైన నన్ను; నీవు= నీవు; ఈ+మెయిన్= ఈ విధంగా; తూల+పుత్తె?= చిన్నబుచ్చుతావా?; అని= అంటూ; ఈక్షణరోచులన్= కన్నుల కాంతులందు; కెంపు+ఎలర్పఁగన్= ఎర్రదనం అతిశయించగా.

తాత్పర్యం: 'తమ్ముడా! నీవు నా శక్తి సామర్థ్యాలు ఎట్లాంటివో వాస్తవంగా గ్రహించలేక నాకు హీనత్వమేర్పడేటట్లుగా ప్రవర్తించావు. అదితిగన్న సమస్త దేవతాకులాన్ని ఒక సన్నని ఈకపై ధరించగలను సుమా! ఇంతటి బలాఢ్యుడిని నన్ను నీవీరకంగా చిన్నబుచ్చుతావా?' అని నేత్రకాంతులలో ఎర్రదనం నిండగా.

వ. ఉన్నం గనుంగొని కోపించి వాసుదేవుండు వెడనవ్వు నవ్వుచు. 299

ప్రతిపదార్థం: ఉన్నన్= అక్కడుండగా; కనుంగొని= చూచి; కోపించి= అలుకపూని; వాసుదేవుండు= నారాయణుడు; వెడనవ్వు+ నవ్వుచున్= వెటకారంగా నవ్వుతూ.

తాత్పర్యం: ఇంద్రుడిపై గ్రుడ్లురుముతూ అక్కడున్న గరుత్మంతుడిని చూచి నారాయణుడు వెటకారంగా నవ్వుతూ.

క. 'నీవేటి మోపుకాఁడవు? । నా వెరవున నిన్ను నడపినను గర్వం బే
లా వెడఁగ' యంచుఁ దనముం । జే వీఁపున నిడ సురేంద్రజిత్తు వికలుఁడై. 300

ప్రతిపదార్థం: వెడఁగ!= వివేకహీనుడా!; నీవు+ఏటి మోపుకాఁడవు?= నీవేపాటి బరువు మోయగలవాడవు?; నా వెరవునన్= నా చాతుర్యంచేత; నిన్నున్+నడపినను= నిన్ను ప్రవర్తింపజేస్తుంటే; గర్వంబు+ఏలా?= నీ కింతటి పొగరెందుకు?; అంచున్= అని;

తనముంజే= తనయొక్క ముంజేతిని; వీఁపునన్+ఇడన్= అతడి వీపుమీద ఉంచగా; సురేంద్రజిత్తు= ఇంద్రుడిని జయించిన గరుత్మంతుడు; వికలుఁడు+ఐ= బెదరినవాఁ డై.

తాత్పర్యం: 'అవివేకీ! నీవు ఏపాటి భారం మోయగలవురా? నా సామర్థ్యంతో నిన్ను నడుపుకొనివస్తుంటే నీకు పొగరెందుకు?' అంటూ పరమపురుషుడు తన ముంజేతిని అతడి వీపుమీద మోపాడు. ఆ భారానికి గరుత్మంతుడు బెదరిపోయాడు.

క. **ఎఱకలు విచ్చుచుఁ దుండము । దెఱచుచు వ్రేఁగడరి సొగసి త్రెళ్ళి వివశుఁడై**
యఱచిన నోడకుమని హరి । నెఱి సక్కఁగఁ ద్రోచి యెత్తె నెగయంగఁ గృపన్. **301**

ప్రతిపదార్థం: ఎఱకలు= రెక్కలు; విచ్చుచున్= చాస్తూ; తుండము+తెఱచుచున్= నోరు (ముక్కు పుటాలు) తెరుస్తూ; వ్రేఁగు+అడరి= బరువు అతిశయించటం చేత; సొగసి= మూర్ఛిల్లి; త్రెళ్ళి= క్రిందపడి; వివశుఁడు+ఐ= ఒడ లెరుగనివాడై; అఱచినన్= ఆక్రోశించగా; హరి= విష్ణుమూర్తి; ఓడకుము+అని= భయపడవద్దని; నెగయంగన్= ఎగురుటకు; నెఱిన్= ఈకలచిక్కును; చక్కఁగన్+త్రోచి= బాగుగా సవరించి; కృపన్= దయతో; ఎత్తెన్= పైకెత్తాడు.

తాత్పర్యం: పుండరీకాక్షుడు తన వీపుమీద చేయి మోపగానే ఆ బరువునకు గరుత్మంతుడు రెక్కలు చాస్తూ, నోరు తెరుస్తూ నొచ్చి నేలమీద కూలి ఒడలు తెలియక ఆక్రందనం చేశాడు. అంతట శ్రీహరి 'గరుడా! భయపడవ' ద్దని ఆతడి ఈకల చిక్కు చక్కగా సవరించి ఎగరటానికి కరుణతో అతడిని పైకెత్తాడు.

వ. **ఇవ్విధంబునం గేశవుండు గరుణించి గరుడని ననునయించి 'యింక నవుదానికి నుద్ధతి మాని బుద్ధిగలిగి యుండు' మని వీడ్కొలిపి పుచ్చినం బోయెం; గావున గర్వంబు గొఱగా'; దింతయు నీ మహానుభావుం డెఱుంగునని నారదుం జూపియితండు మాతలి కన్యా కార్యంబునకుఁ దోడైనడచె; నడుగు; మదియకాదు సర్వేశ్వరుం డగు మాధవు మాహాత్మ్యం బితనికిం గరతలా మలకం బయి యుండు; బ్రభవిష్ణుండగు నాదివిష్ణుండు గదా యీ కృష్ణుం డీతని సహాయత్వంబు గల కౌంతేయులతోడం గూడి మనికి కార్యం' బనిన నారదుండు ధార్తరాష్ట్రు నాలోకించి.'** **302**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కేశవుండు= శ్రీహరి; కరుణించి= దయచూపి; గరుడనిన్= గరుత్మంతుడిని; అనునయించి= ఓదార్చి; ఇంకన్= ఇటుపై; అవుదానికిన్= జరుగనున్న దానికి; ఉద్ధతిన్మాని= గర్వం వదలి; బుద్ధి+కలిగి+ఉండుము; అని; వీడ్కొలిపి= సెలవొసగి; పుచ్చినన్= పంపగా; పోయెన్= వెళ్ళాడు; కావునన్; గర్వంబు; కొఱగాదు= పనికిరాదు; ఇంతయున్= ఈ సంగతిఅంతా; ఈ+మహా+అనుభావుండు= ఈ మహాత్ముడు; ఎఱుంగన్+అని; నారదున్+చూపి; ఇతండు= ఈ నారదమహర్షి; మాతలి కన్యా కార్యంబునకున్= మాతలి కొమార్తె పనికై; తోడు+ఐ నడచెన్= సాయంగా వెంట వెళ్ళాడు; అడుగుము= నారదుడిని ప్రశ్నించుము; అది+అ కాదు= అంతమాత్రమే కాదు; సర్వ+ఈశ్వరుండు+అగు= విశ్వానికి ప్రభువైన; మాధవు మాహాత్మ్యంబు= లక్ష్మీవల్లభుడి ప్రభావం; ఇతనికిన్= నారదుడికి; కరతల+ఆమలకంబు+అయి+ఉండున్= చేతిలోని ఉసిరిక కాయవలె స్పష్టంగా తోస్తూ ఉంటుంది; ఈ కృష్ణుండు= ఈ కృష్ణమూర్తి; ప్రభవిష్ణుండు+అగు= ప్రభావశీలుడైన; ఆదివిష్ణుండు+కదా!= ఆదినారాయణమూర్తికదా!; ఈతని సహాయత్వంబు+కల= ఈతని తోడ్పాటు కలిగిఉన్న; కౌంతేయుల తోడన్= కుంతీ కుమారులతో; కూడి మనికి= కలసి జీవించటం; కార్యంబు= చేయదగిన పని; అనినన్= అని కణ్వమహాముని పలుకగా; నారదుండు; ధార్తరాష్ట్రున్= ధృతరాష్ట్రుడి కుమారుడైన దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా విష్ణుదేవుడు దయచూపి గరుత్మంతుడిని ఊరడించి, 'ఇక మీదట నీవు గర్వం విడిచి బుద్ధిగలిగి ఉండు'మని సెలవిచ్చి పంపగా, అతడు వెళ్ళిపోయాడు. కావున గర్వం పనికి రాదు. ఇదంతయు మహాత్ముడైన ఈ నారద మహర్షికి తెలుసు' అని దుర్యోధనుడికి నారదుడిని చూపి 'ఈయన మాతలి కొమార్తె పనికై వారి వెంట వెళ్ళాడు. ఈయనను అడిగిచూడుము. ఇంతేకాదు, సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుడి మహిమ ఇతడికి అరచేతిలోని ఉసిరిక కాయ సుమా! ప్రభావశీలుడైన ఆదినారాయణమూర్తియే ఈ దేవకీనందనుడని గ్రహించుము. ఈయన తోడ్పాటు గల కుంతీపుత్రులతో నీవు పొత్తుగలిగి ఉండటం చేయదగిన పని' అని కణ్వమహర్షి పలికాడు. అప్పుడు నారద మునీంద్రుడు సుయోధనుడిని చూచి.

క. 'బలవంతుల బలములు న । నగ్గలమగు బల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు నే
కొలఁదుల వారికి గర్వము । నిలుచునె నయమార్గ వృత్తి నిలిచిన భంగిన్.' 303

ప్రతిపదార్థం: బలవంతుల బలములు= బలశాలులయొక్క శక్తులు; ఎదురన్= తమముందు; అగ్గలము+అగు+బలము= అధికమైన బలం; కలుగఁగాన్= ఏర్పడగా; కీడ్పడున్= తక్కువయిపోతుంది; ఏ కొలఁదుల వారికిన్= ఎంతటి శక్తి సంపన్నులకైనా; నయమార్గవృత్తి= న్యాయమార్గ ప్రవర్తనం; నిలిచిన భంగిన్= నిలబడినట్లుగా; గర్వము= పొగరు; నిలుచునె?= నిలబడగలదా?;

తాత్పర్యం: 'బలవంతుల బలాలు అంతకంటె మిక్కుటమైన బలం ఎదురైనపుడు అవి క్రిందైపోతాయి. ఎంతటి శక్తిసంపన్నులకయినా ధర్మమార్గ ప్రవర్తనం తలయెత్తి నిలబడినట్లుగా అహంకారం నిలబడలేదు.'

వ. అని పలికి వెండియు నిట్లనియె: 304

తాత్పర్యం: అని పలికి మరల నారదు డిట్లా వచించాడు :

ఆ. 'ఇదియకాని చేయ నెద్ది యే ననుచు । నిర్బంధవృత్తిఁ దలఁపు వట్టికొనిన
నట్టి వాని కెందు నలజడి వాటిల్లు । గాలవుండు గుఱియ కాఁడె మనకు? 305

ప్రతిపదార్థం: ఇదియకాని= ఈ పని దప్ప; ఎద్దియేన్= మరేపనిని; చేయన్+అనుచున్= నేను చేయనని; నిర్బంధవృత్తిన్= కదలమెదలగూడని పట్టుదలయందు; తలఁపు పట్టుకొనినన్= తన అభిప్రాయం నిల్పితే; అట్టివానికిన్= అట్లాంటి మొండి పట్టుపట్టినవాడికి; ఎందున్= ఎచ్చటకూడ; అలజడి= క్లేశం; పాటిల్లున్= కల్గుతుంది; గాలవుండు= గాలవుడనే ముని కుమారుడు; మనకున్= మనకు; గుఱి+అ కాఁడె= ఇందుకు సాక్షి కాడా?

తాత్పర్యం: 'నేనీ పనిదప్ప మరే పనీ చేయను - అని మొండిపట్టుపట్టినవాడికి ఎక్కడ కూడా ఆపదలే కల్గుతాయి. గాలవుడనే ముని కుమారుడు ఇందుకు ఉదాహరణం.

వ. వినుము విశ్వామిత్రు పాల విద్యాభ్యాసంబు సేసి గాలవుండను మునికుమారుండు 'గురుదక్షిణ యేమి సమర్పింతు' నని యడిగిన, నతం'డేమియు నేల?'యని యుడిపిన, నుడుగక యెన్ని సెప్పిన నన్నింటికి నన్నిసెప్పి నిర్బంధించినఁ, గటకటంబడి యత్తపోధనవర్యుం 'డట్లేని శుద్ధ ధవళవర్ణంబులై యొక్క కర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు లెనమన్నూఱు దెచ్చి యి'మ్మని పలికినం బోయి. 306

ప్రతిపదార్థం: వినుము; విశ్వామిత్రుపాలన్= విశ్వామిత్రుడి దగ్గర; విద్యా+అభ్యాసంబు చేసి= విద్యను నేర్చి; గాలవుండు అను ముని కుమారుండు; గురుదక్షిణ; ఏమి; సమర్పింతున్?= ఇచ్చికొనేది?; అని+అడిగినన్; అతండు= విశ్వామిత్రుడు; ఏమియున్; ఏల; అని; ఉడిపినన్= మాన్పగా; ఉడుగక= మానక; ఎన్ని చెప్పినన్; అన్నింటికిన్; అన్నిచెప్పి; నిర్బంధించినన్= బలాత్కారం చేయగా; కటకటంబడి= కోపించి; ఆ+తపోధన+వర్యుండు= తపమే ధనంగా గల మునులలో శ్రేష్ఠుడు విశ్వామిత్రుడు; అట్లు+ఏనిన్= అట్లా అయితే; శుద్ధ ధవళ వర్ణంబులై= కేవలం తెల్లని రంగు కలిగినవై; ఒక్క కర్ణంబు= ఒక చెవి; నీలంబు+ ఐన= నల్లనిరంగు కలిగిన; ఉత్తమ+అశ్వంబులు= మేలుజాతి గుఱ్ఱాలు; ఎనమన్నూఱు= ఎనిమిది వందలు; తెచ్చి+ఇమ్ము; అని; పలికినన్; పోయెన్= తేవటానికి గాలవుడు వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్యోధనా! ఆ గాలవుడి వృత్తాంతం వినుము. గాలవుడనే ముని కుమారుడు విశ్వామిత్రుడి దగ్గర విద్యలు అభ్యసించి 'తమకు గురుదక్షిణ నేనేమి సమర్పించుకొనవలెనో సెలవివ్వండి' అని గాధేయుడిని అడిగాడు. అందుకు విశ్వామిత్రుడు 'ఏమీ వద్దు' అన్నాడు. అన్నప్పటికీ గాలవుడు మానక గురువు చెప్పిన ప్రతిమాటకూ బదులు చెపుతూ గురుదక్షిణ చెప్పితీరవలెనని బాధించాడు. విశ్వామిత్రుడికి కోపం వచ్చింది. అట్లాగయితే శరీరమంతా తెల్లగా ఉండి, ఒక చెవిమాత్రం నల్లగా ఉండే మేలుజాతి గుఱ్ఱాలు ఎనిమిదివందలు తెచ్చి ఇవ్వవలసిందని అడిగాడు. అట్లాగే అని గాలవుడు అశ్వాలకోసం అక్కడినుంచి బయలుదేరివెళ్ళాడు.

తే. గాలవుం డవ్విధము ఘోటకముల నెందుఁ । బడయలేక చింతాభరభ్రాంతుఁ డగుచు
వెడలి యాహార నిద్రలు విడిచి తా మ । హాపథముఁ బోదుఁగాకని యరిగి యరిగి. 307

ప్రతిపదార్థం: గాలవుండు= గాలవుడు; ఆ+విధము ఘోటకములన్= ఆ రకమైన గుఱ్ఱాలను; ఎందున్= ఎక్కడా; పడయన్‌లేక= సంపాదించలేక; చింతాభర+భ్రాంతుఁడు+అగుచున్= విచారభారంచేత మనసు చలించినవాడు ఔతూ; వెడలి= పయనమై; ఆహారనిద్రలు విడిచి; తాన్= తాను; మహాపథమునన్+పోదున్+కాక= ప్రాణాంతం కావించుకుంటాను గాక; అని; నిశ్చయించుకొని; అరిగి అరిగి= వెళ్ళి వెళ్ళి.

తాత్పర్యం: దేహమంతా తెలుపు, ఒక చెవి మాత్రం నలుపు కలిగిన గుఱ్ఱాలను గాలవుడు ఎక్కడా సంపాదించలేక పోయాడు. విచారభారం చేత భ్రమచెంది ఆహారనిద్రలు కూడ మాని వేశాడు. ప్రాణాంతం చేసుకుంటానని నిర్ణయించుకొని గాలవుడు అట్లా వెళ్ళి వెళ్ళి.

వ. ఒక్కచో గరుడునిం గని బాలసఖుండు గావున నతనికిం దనవృత్తాంతంబు సెప్పిన నతండు కరుణా భరితుండై 308

ప్రతిపదార్థం: ఒక్కచోన్= ఒకచోట; గరుడునిన్+కని; బాలసఖుండుకావునన్= చిననాటి చెలికాడు గనుక; అతనికిన్; తన వృత్తాంతంబు= తన సమాచారం; చెప్పినన్; కరుణా భరితుండు+ఐ= గరుత్మంతుడు దయతో నిండినవాడై

తాత్పర్యం: దైవికంగా ఒకచోట గరుత్మంతుడిని చూశాడు. గరుత్మంతుడు తనకు చిననాటి చెలికాడుగనుక అతనికి సంగతి అంతా చెప్పాడు. గరుడుడు దయతో నిండిన మనసు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'దేవతలు గాని యిట్టివి । గావింపం జాల రీ సకల దిక్కులలో
దేవేంద్రు దిక్కు బహు దివి । జావాసం బందుఁ బోద మని మునిపుత్త్రున్.' 309

ప్రతిపదార్థం: దేవతలు+కాని= వేల్పులు తప్ప; ఇట్టివి= ఇటువంటి పనులు; కావింపన్+చాలరు= చేయలేరు; ఈ సకల దిక్కులలోన్= ఈ దిక్కులన్నింటిలో; దేవేంద్రు దిక్కు= తూర్పు; బహు దివిజ+ఆవాసంబు= పలు దేవతలకు నిలయం; అందున్+పోదము+అని= అక్కడికి వెళ్ళుదామని; మునిపుత్రున్= గాలవుడిని.

తాత్పర్యం: దేవతలు తప్ప ఇలాంటి కార్యాలు ఇతరులు సాధించలేరు. అన్ని దిక్కులలో తూర్పు దిక్కు వేల్పులకు నిలయం కనుక అక్కడకి వెళదామని గరుత్మంతుడు గాలవుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అఱకడ నిడి ప్రాఙ్ముఖుఁడై । పఱచి జలధిలోనఁ జదలఁ బాఱెడునెడఁ జె
య్వఱి దప్పి నిలువఁ జాలక । యొఱగిన గాలవుని డించె నొక గిరి మీఁదన్. 310

ప్రతిపదార్థం: అఱకడన్+ఇడి= భుజస్కంధంపై పెట్టుకొని; ప్రాక్+ముఖుఁడు+ఐ= తూరుపు మొగమైనవాడై; పఱచి= పరువెత్తి; జలధిలోనన్= సముద్రంమీద; చదలన్= ఆకాశంలో; పాఱెడు+ఎడన్= ఎగిరిపోయేటప్పుడు; చెయ్వు+అఱి= చేష్టలుడిగి; దప్పిన్= శ్రమచేత; నిలువన్+చాలక= స్కంధ ప్రదేశంమీద ఉండలేక; ఒఱగిన గాలవునిన్= ప్రక్కకు వ్రాలిన గాలవుడిని; ఒక గిరిమీఁదన్= ఒక కొండమీద; డించెన్= గరుత్మంతుడు దించాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని తన భుజస్కంధంమీద కూర్చుండ బెట్టుకొని, తూర్పు ముఖంగా బయలుదేరి సముద్రంమీద ఆకాశవీథిలో ఎగిరిపోతూ ఉండగా గాలవుడు చేష్టలుడిగి, శ్రమచేత నిలువలేక ప్రక్కకొరుగుతుండగా అతడిని ఒక కొండ మీద దించాడు.

వ. ఇట్లు డించి దప్పిదేర్చి యందుఁ గశ్యప నందనుండు శాండిలి యను నొక్క తపస్విశాపంబునఁ బక్షంబులు డుల్లి యనుగ్రహంబునం గ్రమ్మఱ వచ్చిన విషాదమోదంబు లనుభవించి యట ననుట సాలించి మగుడ మహీతలంబునకు మునికుమారుం దెచ్చి యయాతి తన నెచ్చెలియని ప్రతిష్ఠానపురనాథుండగు నతని కడకు నాతనిం దోడ్కొని చని, యగ్గాలవు తెఱం గెఱింగించిన నతండు. 311

ప్రతిపదార్థం: ఇట్లు; డించి= దించి; డప్పి+తేర్చి= శ్రమను పోగొట్టి; అందున్= ఆ గిరిమీద; కశ్యపనందనుండు= కశ్యపప్రజాపతి కుమారుడైన గరుత్మంతుడు; శాండిలి+అను+ ఒక్క తపస్వి శాపంబునన్= శాండిలి అనే పేరుగల ఒకానొక ముని శాపం వలన; పక్షంబులు= రెక్కలు; డుల్లి= రాలి; అనుగ్రహంబునన్= ఆ ముని కృపవలన; క్రమ్మఱన్= మరల; వచ్చినన్= మొలవగా; విషాద+మోదంబులు= రెక్కలు రాలినందుకు దుఃఖమును, మరల మొలచినందుకు సంతోషమును; అనుభవించి; అటచనుట= అలా తూర్పు దెసకు వెళ్ళటం; చాలించి= మాని; మగుడన్= మరల; మహీతలంబునకున్= భూస్థలికి; మునికుమారున్+తెచ్చి; యయాతి= యయాతి అనే పేరుగల రాజు; తన నెచ్చెలి+అని= తన ప్రియమిత్రుడని; ప్రతిష్ఠాన పురనాథుండు+అగు= ప్రతిష్ఠాన పట్టణానికి అధిపతిఅయిన; అతని కడకున్= యయాతిదగ్గరకు; అతనిన్= గాలవుడిని; తోడ్కొని చని= తీసికొని వెళ్ళి; ఆ+గాలవు తెఱంగు= ఆ గాలవుని వృత్తాంతం. ఎఱింగించినన్= చెప్పగా; అతండు= ఆ యయాతి మహారాజు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని కొండమీద దించి బడలిక పోగొట్టాడు. అక్కడ శాండిలి అనే పేరుగల ఒక మునీశ్వరుడి శాపంవలన తన రెక్కలు రాలి పడగా దుఃఖించి ఆ ముని అనుగ్రహంతో మరల మొలవగా సంతోషించి తూర్పు దెసగా ప్రయాణం సమకట్టటం మానివేశాడు. గరుడుడు మరల గాలవుని భూమండలానికి

కొనివచ్చాడు. ప్రతిష్ఠానపురాధీశ్వరుడు యయాతి తనకు అనుగు చెలికాడగుటవల్ల అతడి చెంతకు గాలవుడిని తోడ్కొని వెళ్ళి ఆతడి వృత్తాంతమంతా చెప్పాడు.

క. తన కట్టి గుఱ్ఱములు లే । కునికిని మాధవి యనంగ నొప్పెడు పుత్త్రిన్
ముని కొసఁగె దీనికై యే । మనుజేశుఁడు నీఁడె హయసమాజము ననుచున్. 312

ప్రతిపదార్థం: తనకున్= తనకు; అట్టి గుఱ్ఱములు= అట్లాంటి గుఱ్ఱాలు; లేక+ఉనికిని= లేకుండుటవలన; మాధవి+అనంగన్+ఒప్పెడు= మాధవి అనే పేరుతో ప్రకాశించే; పుత్త్రిన్= కొమార్తెను; దీనికై= ఈ కన్యకకై; ఏ మనుజ+ఈశుఁడు= ఏ రాజైనను; హయసమాజమున్= అశ్వాల సమూహాన్ని; ఈఁడె?= ఇవ్వకుంటాడా?; అనుచున్= అని భావించి; మునికిన్+ఒసఁగెన్= గాలవుడికి సమర్పించాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకు అట్లాంటి గుఱ్ఱాలు లేనందున మాధవి అనే తన పుత్రికను - ఈ కన్యక కొరకై ఏ రాజైనను గుఱ్ఱాల నివ్వకపోతాడా అని భావించి గాలవుడికి ఆమెను సమర్పించాడు.

వ. ఇ ట్లొసంగినం దోడుకొని. 313

తాత్పర్యం: ఇట్లా ఇవ్వగా ఆమెను (మాధవిని) వెంటబెట్టుకొని.

తే. ఇట్టి హయములుగల రాజు లెవ్వరొక్కొ! । యనుచుఁ దిరిగి యయోధ్యకుఁ జని తదీయ
నాథు నిక్ష్వాకుఁ గనిన నన్నరవరుండు । దనకు నిన్నూఱ కాని లేవనియె హరులు. 314

ప్రతిపదార్థం: ఇట్టి హయములు= ఇట్లాంటి గుఱ్ఱాలు; కలరాజులు= కలిగిన భూపతులు; ఎవ్వరు+ఒక్కొ!= ఎవరున్నారో!; అనుచున్= అని తలస్తూ; తిరిగి= సంచరించి; అయోధ్యకున్+చని= అయోధ్యానగరానికి వెళ్ళి; తదీయనాథున్= ఆ పట్టణ ప్రభువైన; ఇక్ష్వాకున్+కనినన్= ఇక్ష్వాకు భూపాలుడిని దర్శించగా; ఆ+నరవరుండు= ఆ మనుజేశ్వరుడు; తనకున్= తనకు; ఇన్నూఱు+అ+కాని= రెండువందలే తప్ప(అంతకుమించి); హరులు= గుఱ్ఱాలు; లేవు+ అనియెన్= లేవని చెప్పాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకిచ్చిన మాధవిని వెంటబెట్టుకొని, గాలవుడు విశ్వామిత్రుడు చెప్పిన లక్షణాలు కల గుఱ్ఱాలు కలిగిన రాజు లెవరా అంటూ సంచారం చేసి, ఇక్ష్వాకు మహారాజు ఏలుతున్న అయోధ్యానగరానికి వచ్చాడు. ఆయనను సందర్శించాడు. ఆయన తనకు అట్లాంటి గుఱ్ఱాలు రెండువందలు తప్ప అంతకుమించి లేవని చెప్పాడు.

క. అన విని మాధవి ఋషికి । ట్లను నొక్క మహానుభావు నతుల వరమునం
దనయవతి నయ్యు నేఁ గ । న్యన యగుదుంగాన నిమ్ము నన్నీతనికిన్. 315

ప్రతిపదార్థం: అనన్+విని= ఇక్ష్వాకు మహారాజు అట్లా చెప్పగా విని; మాధవి= యయాతి పుత్రి; ఋషికిన్= మునిఅయిన గాలవుడికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; ఒక్క మహానుభావు+ అతులవరమునన్= ఒకానొక మహనీయుడి సాటిలేని వరంచేత; తనయవతిన్+అయ్యున్= బిడ్డలు కన్నదాననైనప్పటికిన్నీ, నేన్= నేను; కన్యన్+అ+అగుదున్= పెండ్లికాని కన్యకగానే ఉంటాను; కానన్= కాబట్టి; నన్నున్= నన్ను; ఈతనికిన్= ఈ ఇక్ష్వాకు మహారాజునకు; ఇమ్ము= అర్పించుము.

తాత్పర్యం: ఇక్ష్వాకు విభుడి మాట లాలకించి మాధవి గాలవుడితో ఇట్లా చెప్పింది. 'ఒకానొక మహాత్ముడి వరప్రభావం వలన నేను బిడ్డలను కన్నప్పటికీ, కన్యకగానే ఉంటాను. కనుక నన్ను ఈతడికి భార్యగా సమర్పించండి.

వ. ఒక్క సమయంబు సేసికొని యిచ్చి గుఱ్ఱంబులు వచ్చినవి యెల్లరాఁబుచ్చి కొమ్మనిన గాలవుండు నవ్విధంబునకు సమ్మతించె; నపత్యార్థియై యిక్ష్వాకుండును నయ్యుంకువునకు భార్య యగుట పుత్త్రజన్మావధిగా నొడివి యశ్వంబుల నొసంగి కన్యకం బరిగ్రహించి దానియందు వసుమనస్సుండను కొడుకుం బడసి గాలవునకు నమ్మగువను మగుడ సమర్పించినఁ జూచి యబ్భంగిం గలచోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించికొమ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె; మఱియు మహీతలంబునం గ్రుమ్మరి యమ్ముని కుమారుండు గందువ లెఱింగి పోవంబోవ. 316

ప్రతిపదార్థం: ఒక్క సమయంబు+చేసికొని= ఒక ఒడంబడిక కావించుకొని; ఇచ్చి= పత్నిగా నన్నొసగి; గుఱ్ఱంబులు వచ్చినవి+ ఎల్లన్= వచ్చిన గుర్రాల నన్నింటిని; రాన్+పుచ్చికొమ్ము= వచ్చినట్లుగా తీసికొమ్ము; అనినన్= అని మాధవి చెప్పగా; గాలవుండు; ఆ విధంబునకున్; సమ్మతించెన్= అంగీకరించాడు; ఇక్ష్వాకుండును; అపత్య+అర్థిఐ= సంతానాన్ని అభిలషిస్తున్నవాడై; ఆ+ఉంకువునకున్= ఆ శుల్కానికి (అల్లుడు కన్యకార్థం మామకిచ్చే ద్రవ్యం); భార్య+అగుట= మాధవి తనకు పెండ్లమగుట; పుత్త్రజన్మ+అవధిగాన్+నొడివి= కుమారుడు కలుగునంతవరకే గడువుగా చెప్పి; అశ్వంబులన్; ఒసంగి= గాలవున కిచ్చి; కన్యకన్; పరిగ్రహించి= స్వీకరించి; దానియందున్= మాధవియందు; వసుమనస్సుండు, అను కొడుకున్; పడసి= పొంది; గాలవునకున్; ఆ+మగువను= ఆ కాంతను; మగుడన్ సమర్పించినన్= తిరిగి ఇచ్చివేయగా; సుపర్ణుండు= గరుత్మంతుడు; చూచి= ఆ విధమంతా చూచి; ఆ+భంగిన్= ఆరీతిగా; కలచోట్లన్+ఎల్లన్+అరసి= గుర్రాలున్న తావులన్నిటిని చూచి; తురంగంబులన్= అశ్వములను; కావించికొమ్ము= సంపాదించుకొమ్ము; అని; అతనికిన్= గాలవునకు; చెప్పి; చనియెన్= తన దారిని తానే వెళ్ళాడు; మఱియున్; మహీతలంబునన్= భూ ప్రదేశంలో; క్రుమ్మరి= సంచరించి; ఆ+ముని కుమారుండు; కందువలు+ఎఱింగి= గుర్రాలున్న జాడలు దెలిసి; పోవన్+పోవన్= పోతూ పోతూ ఉండగా.

తాత్పర్యం: ఒక ఒడంబడిక చేసుకొని నన్ను ఇక్ష్వాకుడికి పత్నిగా నిచ్చి వచ్చిన గుర్రాలను వచ్చినట్లుగా పుచ్చుకొమ్మని మాధవి చెప్పింది. అందుకు గాలవుడు సమ్మతించాడు. సంతానం అభిలషిస్తున్న ఇక్ష్వాకు చక్రవర్తి, ఒక కుమారుడు కలుగునంత వరకే మాధవి తనకు భార్యగా ఉంటుందని పల్కి, కన్యాశుల్కంగా ఇన్నూరు గుర్రాలను గాలవుడికి సమర్పించాడు. ఇక్ష్వాకువు మాధవి యందు వసుమనస్సుడు అనే కొడుకును పొంది తిరిగి ఆమె నతని కిచ్చివేశాడు. ఇదంతయు గమనించిన గరుత్మంతుడు ఈ పద్ధతిలోనే గుర్రాలను సంపాదించుకొమ్మని మునిపుత్త్రుడికి చెప్పి వెళ్ళిపోయాడు. గాలవుడు గుర్రాల కొరకు అవనీతలంలో తిరుగుతున్నాడు.

క. ఆ సమయంబునను దివో । దాసుఁడు నౌశీనరుండుఁ దరుణికి నిన్నూ
ఱేసి హయంబుల నిచ్చి మ । హాసత్త్వుల సుతులఁ బడసి రధికప్రీతిన్. 317

ప్రతిపదార్థం: ఆ సమయంబునను= అట్టితరి; దివోదాసుఁడున్= కాశీనగరాధిపతి అయిన దివోదాసుఁడు; ఔశీనరుండున్= భోజపుర ప్రభువైన ఔశీనరుడును; తరుణికిన్= చెలువమైన మాధవికి; ఇన్నూఱు+ఏసి= రెండేసి వందలు; హయంబులన్+ఇచ్చి= గుర్రాల నొసగి; అధికప్రీతిన్= మిక్కుటమైన సంతోషంతో; మహాసత్త్వులన్= మిక్కిలి బలశాలులైన; సుతులన్+పడసిరి= కొడుకులను కన్నారు.

తాత్పర్యం: అట్టి సమయంలో కాశీశ్వరుడైన దివోదాసుడు, భోజపురాధీశ్వరుడైన ఔశీనరుడు మాధవికి రెండేసి వందల గుర్రాల నిచ్చి అధిక బలవంతులైన కుమారులను పరమసంతోషంతో పొందారు.

వ. ఇట్లు క్రమంబునఁ గాశీశ్వరునకుఁ బ్రతర్దనుని భోజపురనాథునకు శిబిం గనిన యక్కన్యకఁ గొని వెండియు వసుంధరం దిరుగుచుండ గరుత్మంతుండు గ్రమ్మఱి వచ్చి యమ్మునితో నీ వింక జాలింబడ వలవ; దొక్క కారణంబున నీ రాజులు మువ్వురకు నివ్వాజులు గలిగె; నింతియకాని యొండెడ నీచందంబున మొత్తంబులై దొరకనేర; వియ్యాఱునూఱు గుఱ్ఱంబులను గురువునకు సమర్పింపు; మొక్కటి సెప్పెద విను'మని యిట్లనియె. 318

ప్రతిపదార్థం: ఇట్లు; క్రమంబునన్= వరుసగా; కాశీశ్వరునకున్= కాశీపట్టణప్రభువైన దివోదాసునకు; ప్రతర్దనునిన్= ప్రతర్దనుడనే కుమారుడినీ; భోజపురనాథునకున్= భోజపట్టణానికి భర్తఅయిన ఔశీనరునకు; శిబిన్= శిబిఅనే పుత్రుడినీ; కనిన= కనినట్టి; ఆ+కన్యకన్= బిడ్డలను కనికూడ కన్యాత్వం పాయని మాధవిని; కొని= గాలవుడు వెంటబెట్టుకొని; వెండియున్= మరల; వసుంధరన్= భూమిలో; తిరుగుచున్; ఉండన్; గరుత్మంతుండు; క్రమ్మఱివచ్చి= మరలివచ్చి; ఆ+మునితోన్= గాలవుడితో; నీవు; ఇంకన్; జాలిన్+పడన్+వలవదు= శ్రమపడవద్దు; ఒక్క కారణంబునన్= ఒక హేతువు చేత; ఈ రాజులు మువ్వురకున్= ఇక్ష్వాకువు, దివోదాసుడు, ఔశీనరుడు అనే ఈ ముగ్గురు ప్రభువులకు; ఈ+వాజులు+కలిగెన్= ఈ గుర్రాలు లభించాయి; ఇంతియకాని= ఇంతేతప్ప; ఒండు+ఎడన్= మరొక్కచోట; ఈ చందంబునన్= ఈ మాదిరి; మొత్తంబులు+ఐ= గుంపులుగా; దొరకన్+నేరవు= లభించజాలవు; ఈ+ఆఱునూఱు గుఱ్ఱంబులను= నీవు సంపాదించిన ఈ ఆరువందల గుర్రాలను; గురువునకున్= గురువైన విశ్వామిత్రుడికి; సమర్పింపుము; ఒక్కటి చెప్పెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా కాశీశ్వరుడైన దివోదాసుడికి ప్రతర్దనుడు అనే కుమారుడిని, భోజ పట్టణాధీశ్వరుడైన ఔశీనరునకు శిబి అనే తనయుడిని క్రమంగా మాధవి కన్నది. కనికూడా కన్యాత్వం కోల్పోని ఆమెను వెంటబెట్టుకొని మళ్ళీ గుర్రాలకై గాలవుడు భూ సంచారం చేస్తుండగా గరుత్మంతుడు మరల వచ్చి అతడితో- 'నీవిక శ్రమపడవద్దు. ఒకానొక కారణం చేత ఈ ముగ్గురు రాజులకు ఇట్లాంటి గుర్రాలు లభించాయి. అంతేకాని లోకంలో మరెక్కడా ఈ విధంగా ఇన్ని గుర్రాలు దొరకవు. ఈ ఆరువందల అశ్వాలను నీ గురుడైన విశ్వామిత్రుడికి సమర్పించుము. ఒక మాట చెపుతాను, వినుము.

క. ఈ మువ్వర తెఱఁగునఁ దగ । నా మునియుం గొడుకుఁ బడయునట్లుగ ని మ్మీ
కోమలిని గొఱంతకు వి । శ్వామిత్రున కెట్టులైన సంప్రార్థనతోన్. 319

ప్రతిపదార్థం: ఈ మువ్వర తెఱఁగునన్= ఈ ముగ్గురు రాజులవలెనే; తగన్= యుక్తంగా; ఆ+మునియున్= మౌనిఐన ఆ విశ్వామిత్రుడున్నూ; కొడుకున్= కుమారుడిని; పడయునట్లుగన్= పొందేటట్లుగా; కొఱంతకున్= తక్కువపడిన ఇన్నూరు గుర్రాల కొరకు; ఎట్టులు+ఐనన్= ఏవిధంగా నైనా; సంప్రార్థనతోన్= వేడికోలుతో; ఈ కోమలినిన్= సుకుమారిఅయిన ఈ మాధవిని; ఇమ్ము= గురుదక్షిణగా సమర్పించుము.

తాత్పర్యం: ఈ ముగ్గురు రాజుల వలెనే మౌనిఅయిన విశ్వామిత్రుడు కూడ కుమారుడిని కనే విధంగా తక్కువ పడిన ఆ రెండువందల గుఱ్ఱాలకొరకై ఎట్లాగైనా వేడుకొని విశ్వామిత్రుడికి తరుణిఅయిన మాధవిని సమర్పించవలసింది.'

వ. అని తానునుఁ దోడుసని యత్తపస్విపాలికింబోయి యత్తెఱం గెఱింగించి, గాలవుం గానిపించి, 'యీతండు బాలుండు, నీవు దయాళుండ' వితనిం గృతార్థుం జేయవలయు నని ప్రార్థించి పక్షిరా జక్కార్యంబు చక్కంజేసి పోయిన. 320

ప్రతిపదార్థం: అని; తానును; తోడు+చని= సహాయంగా బయలుదేరి; ఆ+తపస్విపాలికిన్+పోయి= ఆ మునీంద్రుడి చెంతకుపోయి; ఆ+తెఱంగు+ఎఱింగించి= గాలవుడు ఆరువందల గుర్రాలను సంపాదించినవైనమూ, మరెక్కడా అలాంటి గుర్రాలు దొరకని స్థితీ తెలిపి; గాలవున్; కానిపించి= చూపి; ఈతండు; బాలుండు= పసివాడు; నీవు; దయాళుండవు= కరుణాస్వభావుడవు; ఇతనిన్; కృతార్థున్+చేయన్+వలయున్= కోరిక నెరవేరినవాడినిగా కావించవలెను; అని ప్రార్థించి= అని వేడుకొని; పక్షిరాజు= ఖగనాథుడైన గరుత్మంతుడు; ఆ+కార్యంబు; చక్కన్+చేసి= సరిపరచి; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: గరుత్మంతుడు తాను కూడ గాలవుడికి తోడుగా విశ్వామిత్ర మునీంద్రుడి పాలికి వెళ్ళి గాలవుడిని చూపి, అతడు ఆరువందల అశ్వాలను సంపాదించిన వైన మెరింగించి 'ఇతడు పసివాడు; నీవు కృపాస్వభావుడివి. ఇతడిని గురు ఋణంనుండి విముక్తుణ్ణి కావించు'మని వేడుకొని, పని చక్కబెట్టి వెళ్ళిపోగా.

క. మునివరుఁ డష్టకుఁ డనియెడు । తనయుఁ బడసి శిష్యునకు సుదతి నొప్పించెన్;
వనితయుఁ దపంబు సేయం । జనియెను; గాలవున కిట్టి చరితము గలిగెన్. 321

ప్రతిపదార్థం: మునివరుఁడు= మునులలో శ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు, అష్టకుఁడు+అనియెడు= అష్టకుడనే పేరుగల; తనయున్+పడసి= కుమారుడిని పొంది; శిష్యునకున్= ఛాత్రుడైన గాలవుడికి; సుదతిన్= చక్కని దంతాలుగల మాధవిని; ఒప్పించెన్= అతడికి అప్పజెప్పాడు; వనితయున్= మాధవియు; తపంబుచేయన్+చనియెన్= తపస్సు చేయటానికి వెళ్ళింది; గాలవునకున్= గాలవుడికి; ఇట్టి చరితము= ఇట్టి వర్తనం; కలిగెన్= సంప్రాప్తమైనది.

తాత్పర్యం: మునిపుంగవుడైన విశ్వామిత్రుడు అష్టకుడనే కుమారుడిని కని శిష్యుడికి మాధవిని అప్పగించాడు. మాధవి కూడ తపస్సు చేసికొనటానికి వెళ్ళిపోయింది. గాలవుడి కథ ఇట్లా జరిగింది.

వ. కావున నెట్టివారికి నిర్బంధము దగదు; దుర్మానంబు దుర్దశ నాపాదించు; నయ్యయాతి దుర్మానంబునంగాదె పుణ్యలోక పరిభ్రష్టుండై మాధవీ పుత్త్రులగు నన్నలువురు దౌహిత్రులకతంబున నూర్ధ్వగతిం గనియె; నట్లగుటం జేసి. 322

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఎట్టివారికిన్= ఎటువంటివారికైనను; నిర్బంధము తగదు= బలాత్కారం కూడదు; దుర్మానంబు= దురహంకారం; దుర్దశన్= దుఃస్థితిని; ఆపాదించున్= కలిగిస్తుంది; ఆ యయాతి; దుర్మానంబునన్+కాదె= దుర్గర్వం వల్లనే కదా; పుణ్యలోక పరిభ్రష్టుండు+ఐ= ఉత్తమలోకాలనుండి జారినవాడై; మాధవీపుత్త్రులు+అగు= మాధవి అనే తన కొమార్తె కొడుకులైన; ఆ+నలువురు దౌహిత్రుల కతంబునన్= ఆ నలుగురు మనుమళ్ళ మూలాన (దుహిత= కూతురు; దౌహిత్రుడు= దుహితయొక్క పుత్త్రుడు- మనుమడు); ఊర్ధ్వగతిన్+కనియెన్= ఉత్తమలోక ప్రాప్తినందాడు; అట్లు+ అగుటన్+చేసి= అందువలన.

తాత్పర్యం: దుర్యోధనా! ఎట్టివారికైనా నిర్బంధం పనికిరాదు. దురహంకారం దుఃస్థితి కలిగిస్తుంది. యయాతి మహారాజు దురహంకారం చేతనే పుణ్యలోకాలనుండి దిగజారి కొమార్తె మాధవియొక్క నలుగురు తనయుల మూలాన ఊర్ధ్వలోక ప్రాప్తి నందాడు. కాబట్టి- (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **నిర్బంధము దుర్మానము । దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ**
మార్బలమె పాండవులకున్ । దౌర్బల్యము వాయు శుభము దలఁకొను సంధిన్. **323**

ప్రతిపదార్థం: దుర్యోధన!= సుయోధనా!; నిర్బంధము= కదలమెదలగూడని కట్టుబాటూ; దుర్మానము= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టచిత్తుడికి తప్ప; తగునె?= నీకు తగునా? (తగవని అర్థం); నీ మార్బలమె?= పాండవులు నీకు శత్రుబలమా? (కారనుట); పాండవులకున్= కౌంతేయులకు; సంధిన్= పొత్తువలన; దౌర్బల్యము+పాయున్= దుర్బలత్వం తొలగుతుంది; శుభము= మేలు; తలఁకొనున్= కలుగుతుంది.

తాత్పర్యం: సుయోధనా! పరులను నిర్బంధించటం, దురహంకారం పూనటం దుష్టాత్ముడికి తప్ప నీకు తగవు. నీవు ప్రతిఘటించడం పాండవుల దౌర్బల్యాన్ని తొలగిస్తుంది. సంధివల్ల నీకు మేలు కల్గుతుంది.

విశేషం: సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఈ పద్యమిట్లు పేర్కొనబడింది: **"క. నిర్బంధము దుర్మానము । దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ । మార్బలమె పాండవేయులు? దౌర్బల్యము వాయు, శుభముదలఁకొను సంధిన్."** ప్రతిపదార్థం: నిర్బంధమున్= బలాత్కారమూ; దుర్మానమున్= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టబుద్ధికి కాక; తగునె= తగునా?; దుర్యోధన!; పాండవేయులు= పాండవులు; నీ-మార్బలమె?= నీ శత్రుబలమా?; సంధిన్= సంధిచేత; దౌర్బల్యము+పాయున్= దుర్బలత్వము పోతుంది; శుభము= మంచి; తలఁకొనున్= కలుగుతుంది. (సంపా.)

వ. **కృష్ణుని మాట విని నీ విక్కౌరవాన్వయంబు రక్షింపు' మనియె; నివ్విధంబున నమ్మువ్వురు మునీంద్రులు సెప్పిన హితోపదేశంబుల దెస ననాదరంబు సేసి గాంధారేయుండు రాధేయుం గనుంగొని చేయప్పళించి నవ్వి 'వీర లింత వెఱ్ఱు లగుదురే?' యని పలికి వారల నవలోకించి.** **324**

ప్రతిపదార్థం: కృష్ణునిమాటన్; విని; నీవు; ఈ+కౌరవ+అన్వయంబున్= ఈ కురువంశమును; రక్షింపుము= కాపాడుము; అనియెన్; ఈ+విధంబునన్; ఆ+మువ్వురు; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు, చెప్పిన; హిత+ఉపదేశంబుల దెసన్= హితబోధలపట్ల; అనాదరంబు+చేసి= అసమ్మతి చూపి; గాంధారేయుండు= గాంధారి కుమారుడైన దుర్యోధనుడు; రాధేయున్= కర్ణుడిని; కనుంగొని= చూచి; చే+అప్పళించి= చప్పట్లు చరచి; నవ్వి= పరిహసించి; వీరలు= ఈ మునులు; ఇంత వెఱ్ఱులు+అగుదురే?= ఇంత పిచ్చివారా? అని పలికి; వారలన్= ఆ మునీశ్వరులను; అవలోకించి= కనుగొని.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని నీవు ఈ కురువంశాన్ని కాపాడుము'. అని నారదుడు పలికాడు. ఆ విధంగా ఆ ముగ్గురు మునిపుంగవులు చెప్పిన హితవాక్యాలను మన్నించక దుర్యోధనుడు కర్ణుడిని చూచి, చేయి చరుస్తూ, నవ్వి 'ఈ మునీశ్వరు లెంత పిచ్చివారు? అని పలికి, వారిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

దుర్యోధనుఁడు నారదాది మునుల మాటలు వినక నిరాకరించుట (సం. 5-122-1)

క. **'మునులార! నన్ను విధి యే । మని మును పుట్టించె నట్టులయ్యెడుఁ గా కీ**
వినఁ జవి గాని పలుకులకుఁ । బని గలదే యుడుగుఁ డింక బహుభాషణముల్. **325**

ప్రతిపదార్థం: మునులార!= ఓ మునీశ్వరులారా!; నన్నున్= నన్ను; విధి= బ్రహ్మదేవుఁడు; ఏమి+అని= ఎట్లు కమ్మని; మును= తొలుత; పుట్టించెన్= జన్మింపజేశాడో; అట్టులు+అయ్యెడున్+కాక= అట్లాగే జరుగుతుంది పొండు; ఈ+వినన్+చవికాని+

పలుకులకున్= వినుటకు రుచించని మీ మాటలవలన; పనికలదే?= ప్రయోజనముందా?; ఇంకన్= ఇక; బహుభాషణముల్= పలుమాటలు; ఉడుగుఁడు= మానండి.

తాత్పర్యం: 'ఓ మునీశ్వరులారా! బ్రహ్మదేవుఁడు నన్ను ఏమి కమ్మని పుట్టించాడో అట్లానే జరుగుతుంది. వినటానికి రుచించని మీ మాటలవలన ఏమి ప్రయోజనం? ఇక పలుమాటలాడటం చాలించండి.'

వ. అనిన విని ధృతరాష్ట్రుం డమ్మహామునులతో నిట్లనియె. 326

ప్రతిపదార్థం: అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఆ+ మహామునులతోన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కుమారుని పలుకులు విని ధృతరాష్ట్రుడు ఆ మహర్షులతో ఇట్లా అన్నాడు:

తే. 'మీరు చెప్పిన బుద్ధులు గారవమునఁ । జేయఁ గాంచినఁ బుణ్యంబు సేయ నెట్లు
నా ముఖంబునఁ గార్యంబు నడవ దేమి । సేయువాఁడ నొం డెద్దియుఁ జెప్పలేదు. 327

ప్రతిపదార్థం: మీరు చెప్పిన బుద్దులు= మీరు చేసిన హితోపదేశాలు; గారవమునన్= ఆదరంతో; చేయన్+కాంచినన్= చేయుటకు నోచియున్నచో; పుణ్యంబున్+ఎట్లు+చేయన్= సుకృతం చేసినవాడనే అగుదును గదా!; నా ముఖంబునన్= నా చేతిమీదుగా; కార్యంబు నడవదు= పని జరుగదు; ఏమి చేయువాఁడన్?= నేనేమి చేయగలను?; చెప్పన్= ఇంతకుమించి నుడువుటకు; ఒండు+ఎద్దియున్+లేదు= మరేమియూ లేదు.

తాత్పర్యం: 'మునిపుంగవులారా! మీరు చేసిన హితోపదేశాన్ని ఆదరంతో అనుసరించగలిగితే నేను పుణ్యం చేసినవాడనే ఔతాను గదా! కాని నావల్ల ఏ పనీ కాదు. నే నేమి చేయగలను? ఇంతకుమించి చెప్పవలసినదేమీ లేదు.'

క. అని యతఁడు శౌరితో ని । ట్లను 'నిహముం బరముఁ గలుగునట్టి విధము నీ
వనఘా! చెప్పితి; నాకుం । జన వేదియు లేదు దీన సమ్మతి నడపన్. 328

ప్రతిపదార్థం: అని= అనుచు; అతఁడు= ధృతరాష్ట్రుడు; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనున్= ఈ లాగున అన్నాడు; అనఘా= పుణ్యాత్ముడా!; నీవు ఇహమున్= ఈ లోకమందు సుఖము; పరమున్= ఆలోకమందు సుఖము; కలుగు+అట్టివిధమున్= లభించే మార్గాన్ని; చెప్పితి(వి)= వచించావు; దీనిన్= నీవు చెప్పిన హితమును; సమ్మతిన్= అంగీకారముతో; నడపన్= ఆచరణలోనుంచుటకు; నాకున్= నాకు; చనవు= చొరవ, ఏదియున్+లేదు= ఏ మాత్రం లేదు.

తాత్పర్యం: మునులతో అట్లా పల్కి ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడితో ఇట్లాఅన్నాడు. 'పుణ్యపురుషా! ఇహపరాలు రెండూ సమకూడే విధమేదో నీవు చెప్పావు. కాని, నీవు చెప్పినట్లుగా కార్యం నిర్వర్తించటానికి నాకు ఏ మాత్రం చొరవ లేదు.

ఆ. మందబుద్ధి నాదు నందనుఁ డీవు పో । రాని చుట్టమవు మహానుభావుఁ
డవు దయార్ద్రచిత్తుఁడవు; వీనిఁ దేర్పవే । యనునయించి యెట్టులైనఁ గృష్ణ!' 329

ప్రతిపదార్థం: కృష్ణ!= గోవిందా!; నాదు నందనుఁడు= నా కుమారుఁడు; మందబుద్ధి= మూఢచిత్తుడు; ఈవు= నీవు; పోరానిచుట్టమవు= త్రోసివేయరాని బాంధవుడవు; మహానుభావుఁడవు= మహాత్ముడివి; దయా+ఆర్ద్ర చిత్తుఁడవు= కృపచేత

తడిసిన మనస్సుకలవాడవు; వీనిన్= దుర్యోధనుడిని; అనునయించి= బుజ్జగించి; ఎట్టులు+ఐనన్= ఏ విధంగానైనను; తేర్పవే!= ప్రసన్నుడిని కావించుమయ్యా!

తాత్పర్యం: కృష్ణా! నా కుమారుడు మూఢచిత్తుడు. నీవో త్రోసిరాజనని బాంధవుడవు. మహాత్ముడవు. కారుణ్య కలిత హృదయుడివి. వీని నెట్లాగయినా శాంతింపజేయు మని వేడుకొంటున్నాను.'

క. అనిన ముకుందుఁడు దుర్యో । ధనుతో నిట్లనియె 'విమల తర వంశమునన్
జనియించి తెల్లగుణముల । ననూనుఁడవు నీకు నా దురాగ్రహ మేలా? 330

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు కోరగా; ముకుందుఁడు= కృష్ణుడు; దుర్యోధనుతోన్= సుయోధనుడితో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు; విమలతర వంశమునన్= పరమ స్వచ్ఛమైన కురుకులంలో; జనియించితి(వి)= పుట్టావు; ఎల్లగుణములన్= అన్నిగుణాలచేత; అనూనుఁడవు= అధికుడవు; నీకున్= ఇట్టి నీకు; ఈ+దుర్+ఆగ్రహము+ఏలా?= ఈ మొండిపట్టుదల ఎందుకు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు తనను ఆ రీతిని కోరగా కృష్ణు డిట్లా పలికాడు: 'సుయోధనా! నీవు మిక్కిలి నిర్మలమైన వంశంలో జన్మించావు. అన్ని సద్గుణాలచే గొప్పవాడివి. ఇట్లాంటి నీకు ఈ మొండిపట్టుదల తగునటయ్యా!'

చ. తులువలు గాక యిట్టిదొర దుర్ణయవృత్తికిఁ జొచ్చునయ్య? పు
త్త్రులు ననుజన్ములుం జెలులు దుష్టపథంబునఁ బోవకుండఁ జు
ట్టలుఁ దగువారుఁ దండ్రియు నొడంబడఁ జేయుము కార్య; మల్పబు
ద్ధుల వెడమాట లూఁకొనకు; దోసము సేగియు వచ్చు నమ్మెయిన్. 331

ప్రతిపదార్థం: తులువలు+కాక= కుచ్చితులు తప్ప; ఇట్టిదొర= నీవంటి ప్రభువు; దుర్ణయవృత్తికిన్= అన్యాయకార్యాలకు; చొచ్చును+అయ్య?= పాల్పడునా; పుత్త్రులున్= నీ కుమారులును; అనుజన్ములున్= తమ్ముళ్ళు; చెలులున్= మిత్రులు; దుష్టపథంబునన్= చెడుదారిలో; పోవక+ఉండన్= నడవకుండునట్లు; చుట్టలున్= బంధువులును; తగువారున్= పెద్దలు; తండ్రియున్= నీ జనకుడును; ఒడంబడన్= సమ్మతించగా; కార్యమున్+చేయుము= పని నిర్వహించుము; అల్పబుద్ధుల= నీచమనస్కులయొక్క; వెడమాటలు= తుచ్ఛవాక్యాలు; ఊఁకొనకు(ము)= అంగీకరించకుము; ఆ+మెయిన్= అట్లు అంగీకరించినయెడల; దోసమున్= పాపం; సేగియున్= కీడును; వచ్చున్= వస్తాయి.

తాత్పర్యం: సుయోధనా! ఎవరో కుచ్చితులు తప్ప నీవంటి ఉత్తమ ప్రభువు ఇట్లాంటి అన్యాయ కార్యాలకు పాల్పడవచ్చునా? నీ కుమారులు, తమ్ములు, స్నేహితులు చెడుదారిలో నడవకుండా చూచుకో. నీ బంధువులు, పెద్దలు, జనకుడు సమ్మతించేటట్లుగా పాండవులతో పొత్తు కావించుకొనుము. అల్పబుద్ధిగలవారి చెడుమాటలు వినవద్దు. వారి మాటలకు తల ఒగ్గితే నీకు పాపం సంభవిస్తుంది. ఆపద మూడుతుంది.

క. పాండిత్య శౌర్య నిత్యులు । పాండుసుతులు వారిఁగూడి బ్రదుకుట ధృతరా
ష్ట్రుండును బాహ్లికుఁడును భీ । ష్ముండు గురుఁడు కోరు తెఱఁగు సూవె నరేంద్రా! 332

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మనుజేశ్వరా!; పాండుసుతులు= పాండురాజు కుమారులు; పాండిత్య శౌర్య నిత్యులు= వివేకం పరాక్రమం అనేవాటిచే స్థిరులు; వారిన్+కూడి= వారితో చేరి; బ్రదుకుట= మనటం; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడూ; బాహ్లికుడూ, భీష్మండున్= భీష్ముడూ; గురుఁడున్= ద్రోణుఁడూ; కోరు తెఱఁగు+చూవె= కోరుకొనే తీరు సుమా!

తాత్పర్యం: పాండవులు పాండిత్య పరాక్రమ సమగ్రులు. వీరితో కలసి మెలసి మీరు జీవించవలెనని ధృతరాష్ట్ర బాహ్లిక భీష్మ ద్రోణులు కోరుకొంటున్నారు సుమా!

ఆ. **విను మసత్య లోభమున సిరియగునె యాఁ। కొని ముసిండి దినినఁ గ్రొవ్వు లావుఁ**
గలుగునయ్య? శకుని కర్ణ దుశ్శాసన। మంత్రితంబు కార్య తంత్ర మగునె? **333**

ప్రతిపదార్థం: వినుము= ఆలింపుము; అసత్యలోభమునన్= అసత్యమందలి దురాశచేత; సిరి+అగునె?= సంపద సమకూడగలదా? ఆఁకొని= ఆకలిగొని; ముసిండి+తినినన్= ముసిడి పండ్లను భుజిస్తే; క్రొవ్వులావు+కలుగును+అయ్య?= కండ బలిమి లభిస్తుందా?; శకుని కర్ణ దుశ్శాసన మంత్రితంబు= శకుని కర్ణ దుశ్శాసనులచే చెప్పబడిన సలహా; కార్య తంత్రము+అగునె?= పనిని సాధించటానికి సాధనం కాగలదా? (కాదని భావం).

తాత్పర్యం: దుర్యోధనా! విను. అసత్యలోభం వల్ల సంపద సమకూడదు. ఆకలి వేసినపుడు మిసమిసలాడుతూ భ్రాంతి గొలిపే ముష్టిచెట్టుపండ్లను తింటే శరీరానికి పుష్టి తుష్టి ఏర్పడుతుందా? అందుకు మారుగా ఆ పండ్లు ప్రాణాంతక మవుతాయి. అట్లాగే శకుని కర్ణ దుశ్శాసనుల చెడు సలహాలు కార్యకారులు ఔతాయా?

విశేషం: అలం: నిదర్శన.

శా. **తోడంబుట్టిన భీమపార్థుల మహా దోర్దర్పముల్ లాఁతులై**
తో డంచుం బెఱవారి దుర్బలుల నెందుం జొచ్చి దైన్యంబునం
గూడం బెట్టెదు; నీవ పాండుసుతులం గుందింపఁగా సత్యముం
బాడిం దప్ప రొకప్పుడుం గినియ రా బంధుత్వ మే లొల్లవో? **334**

ప్రతిపదార్థం: తోడన్+పుట్టిన= సోదరులుగా జన్మించిన; భీమపార్థుల= భీమార్జునుల యొక్క; మహా+దోః +దర్పముల్= గొప్ప భుజశౌర్యాలు; లాఁతులు+ఐ= అన్యములై; పాండుసుతులన్= పాండవులను; కుందింపఁగాన్= బాధించటానికి; నీవు+అ= నీవే; పెఱవారిన్= పరాయివారైన; దుర్బలులన్= శక్తిహీనులను; తోడు+అంచున్= సహాయులని; ఎందున్+చొచ్చి= ఎక్కడెక్కడికో వెళ్ళి; దైన్యంబునన్= కృపణత్వంతో; కూడన్+పెట్టెదు= గుంపుగా చేర్చుకొంటున్నావు; సత్యమున్= నిజమును; పాడిన్= న్యాయమును; తప్పరు= కౌంతేయులు విడిచినవారుకారు; ఒకప్పుడున్= ఏనాడుకూడా; కినియరు= నీపై క్రోధం వహించరు; ఆ బంధుత్వమున్= ఆ చుట్టరికమును; ఏల+ ఒల్లవో?= ఎందుకు ఇష్టపడవో తెలియదు.

తాత్పర్యం: సహోదరులైన భీమార్జునులు గొప్ప భుజపరాక్రమాలు కలవారు. వారు నీకు పరాయివారైనారు. వారిని నొప్పించటానికి సాయపడగలరని శక్తిహీనులను పరాయివారిని ఎక్కడెక్కడికో వెళ్ళి కృపణత్వంతో వేడుకొని అందరినీ గుంపుగా చెంతకు చేర్చుకొంటున్నావు. పాండవులు సత్యాన్నీ, న్యాయాన్నీ వీడనివారు. ఎన్నడూ నీమీద క్రోధం వహించినవారు కాదు. అట్లాంటివారి చుట్టరికం నీ కెందుకు గిట్టదో తెలియదు.

ఉ. వారును మీరుఁ బొంది జనవల్లభు లెల్లను భృత్యభావనం
జేర సమస్త వస్తువులుఁ జేకుఱఁగా బ్రదుకొప్పుఁగాక నీ;
కీరస మెత్తికోల్ గఱపి యిప్పుడు కార్యము దప్పఁజూచు నీ
వారలు ముట్టవచ్చిన నవశ్యము నంతకుఁ జాలరుం జుమీ! 335

ప్రతిపదార్థం: వారును= ఆ పాండవులూ; మీరున్= కౌరవులైన మీరూ; పొంది= ఒద్దికగా ఉండి; జనవల్లభులు+ఎల్లను= రాజులందరూ; భృత్యభావనన్= సేవాబుద్ధితో; చేరన్= మిమ్మాశ్రయించగా; సమస్త వస్తువులున్= ఎల్లపదార్థాలును; చేకుఱఁగాన్= మీకు లభించగా; బ్రదుకు= జీవించటం; ఒప్పున్+కాక= తగి ఉండగలదుగాని; నీకున్= నీకు; ఈరసము+ఎత్తికోల్+ కఱపి= ద్వేషం వహించేట్లు బోధించి; ఇప్పుడు= ఈ సమయాన; కార్యమున్+తప్పన్+చూచి= పని చెడిపోయేటట్లు చేసే; నీ వారలు= నీ పక్షంలో ఉన్నవారు; ముట్టన్+వచ్చినన్= పాండవులు మీపై దండెత్తి వచ్చినపుడు; అవశ్యము= నిశ్చయంగా; అంతకున్+చాలరున్+చుమీ!= వారి నెదిరించటానికి సమర్థులు కాలేరు సుమా!

తాత్పర్యం: పాండవులూ మీరూ పొత్తుకూడి ఉండగా, రాజులందరూ తాము సేవకుల మనే తలంపుతో మిమ్ముచేరి కొలుస్తుండగా, అన్ని పదార్థాలు మీకు సమకూడగా హాయిగా జీవించటం మంచిది. అంతేకాని, నీకు కౌంతేయులపై ద్వేషం కల్పించి ఇప్పుడు పనిచెరచటానికి కంకణం కట్టుకొన్న నీ మనుషులు, పాండవులు మీపై యుద్ధానికి తరలివచ్చిన సమయంలో వారి నెదిరించటానికి ఏమాత్రం కొరగారు సుమా!

ఆ. వీరు కారు పాండవేయులఁబోర మా । ర్కొన సురాసురులకుఁ గొలఁది గాదు
కాన వారితోడి కయ్యంబునకు నిర్ణ । యింపవలదు । సంధి పెంపుఁ జేయు. 336

ప్రతిపదార్థం: వీరు+అ+కాదు= నీవు విశ్వసించిన కర్ణాదులే కాదు; పాండవేయులన్= పాండుపుత్రులను; పోరన్= యుద్ధంలో; మార్కొనన్= ఎదిరించటానికి; సుర+అసురులకున్= దేవదానవులకు కూడ; కొలఁది+కాదు= శక్యం కాదు; కానన్= కాబట్టి; వారి తోడి కయ్యంబునకున్= కౌంతేయుల తోడి కలహానికి; నిర్ణయింపన్+వలదు= నిశ్చయించవద్దు; సంధి= పొత్తు; పెంపున్+చేయున్= వృద్ధిని కల్గిస్తుంది.

తాత్పర్యం: కర్ణాదులకే కాదు, దేవదానవులకు కూడ కౌంతేయులను ఎదుర్కొనటం శక్యంకాదు. కనుక పాండవులతో పోరాటానికి నిర్ణయం చేయవద్దు. సంధియే అభివృద్ధి కలిగిస్తుంది.

విశేషం: అలం: అనన్వయం.

క. ఈయున్న రాజులందఱు । వాయుసుతున కొక్క యెత్తు; వాఁ డలిగిన శూ
లాయుధుఁడు వడఁకు; నా కౌం । తేయులతోఁ బెనఁగు టుడుగు ధీరవిచారా! 337

ప్రతిపదార్థం: ధీర విచారా!= ధైర్యాలోచన కలవాడా!; ఈ+ఉన్న రాజులు+అందఱున్= నీ పక్షంలో చేరి ఉన్న ఈ దొరలంతా; వాయుసుతునకున్= గాడ్పుపట్టి ఐన భీమసేనుడికి; ఒక్క+ఎత్తు= సమానం; వాఁడు+అలిగినన్= అతడు కోపిస్తే; శూల+ ఆయుధుఁడున్= శూలం ఆయుధంగా గలిగిన పరమేశ్వరుడుకూడా; వడఁకున్= గడగడలాడుతాడు; ఆ కౌంతేయులతోన్= ఆ కుంతీదేవి కుమారులతో; పెనఁగుట+ఉడుగు(ము)= పోరు సల్పటం మానుము.

తాత్పర్యం: ఇక్కడున్న ఈ దొరలంతా చేరి భీమసేనుడికి ఒక యెత్తు. భీముడు గనుక కినుకవహిస్తే త్రిశూలపాణి అయిన ఈశ్వరుడే భయంతో కంపించిపోతాడు. కాబట్టి కౌంతేయులతో కలహించటం మానుకో!

క. ఒక కార్యము సెప్పెద మీ । సకల బలమునందు సవ్యసాచి కెదురుగా
నొకరుఁడు గలిగినఁ గయ్యము । నకుఁ బూనుఁడు; రిత్త బహుజనక్షయ మేలా? 338

ప్రతిపదార్థం: ఒక కార్యము+చెప్పెదన్= ఒక కర్తవ్యం నీకు చెపుతాను; మీ సకలబలమునందున్= మీకున్న సమస్త సైన్యంలో; సవ్యసాచికిన్= అర్జునుడికి; ఎదురుగాన్= ఎదిరించటానికి సమర్థుడుగా; ఒకరుఁడు= ఒక్కడు; కలిగినన్= ఉంటే; కయ్యమునకున్= యుద్ధానికి; పూనుఁడు= సిద్ధపడండి; రిత్త= వ్యర్థంగా; బహుజనక్షయము+ఏలా?= అనేక ప్రజా వినాశం ఎందుకు?

తాత్పర్యం: సుయోధనా! ఒక సంగతి చెపుతాను విను. మీ సమస్త సైన్యంలో అర్జునుడిని ఎదిరించగల వీరుడొక్కడుంటే యుద్ధానికి నడుంకట్టుము. నిరుపయోగంగా బహుజన వినాశం ఎందుకు చేస్తావు?

క. పెక్కండ్రు గోవులంగొని । యుక్కు మిగిలి నడవ వెనుక నుద్దవిడిం దా
నొక్కఁడ నరుఁ డేతెంచినఁ । జిక్కె సమస్తంబు నది ప్రసిద్ధమ కాదే? 339

ప్రతిపదార్థం: పెక్కండ్రు= పలువురు వీరులు; గోవులన్+కొని= ఆవులను తోలుకొని; ఉక్కుమిగిలి నడవన్= శౌర్యంతో చెలరేగి ముందుకు సాగుతుండగా; వెనుకన్= వారి వెనుక; ఉద్దవిడిన్= పూనికతో; తాన్+ఒక్కఁడు+అ= తానొక్కడే; నరుఁడు= అర్జునుడు; ఏతెంచినన్= రాగా; సమస్తంబు చిక్కెన్= ఆవులన్నీ దొరకిపోయాయి; అది= ఆ గోవులను మరలించుకొనివచ్చిన విషయం; ప్రసిద్ధమ కాదే!= అందరికీ తెలిసినదేగదా!

తాత్పర్యం: పెక్కుమంది వీరులు విరటుడి గోవులను తోలుకొని శౌర్యంతో హస్తినాపురికి వెళ్ళుతుండగా వెనకనే వేగంగా వచ్చి, అర్జునుడు తా నొక్కడే ఆవులన్నింటినీ మత్స్యపురికి మరలించుకు వచ్చిన సంగతి ప్రఖ్యాతమే కదా!

క. తోడు దొనలేనియప్పటి । క్రీడి కొలఁది యట్టి దధిప! కినియక విను మేఁ
దోడై రా నెదురుట గడుఁ । గీడు; వలవ దుడుగవయ్య గెలు పరిది సుమీ! 340

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తోడుదొన= తనకు ఎట్టి సహాయం, అమ్ములపొదులు; లేని= లేనటువంటి; అప్పటి క్రీడి కొలఁది+అట్టిది= అజ్ఞాతవాస దీక్షలో ఉన్న ఫల్గునుడి పరాక్రమం అటువంటిది; కినియక వినుము= కోపపడక నా మాటలు వినుము; ఏన్= నేను; తోడు+ఐ రాన్= సహాయంగా రాగా; ఎదురుట= అర్జునుడిని మార్కొనటం; కడున్+కీడు= మిక్కిలి హానికరం; వలవదు= తగదు; ఉడుగవు+అయ్య!= వారితో పోరు సల్పటం మానవయ్యా; గెలుపు= విజయం; అరిదిసుమీ!= దుర్లభం సుమా!

తాత్పర్యం: తనకు ఎటువంటి సహాయమూ, అమ్ముల పొదులూ లేని అజ్ఞాతవాసకాలంనాటి అర్జునుడి విక్రమం అటువంటిది. రాజా! నే చెప్పేది కోపగించక విను. నేనే తనకు సహాయుడనై రాగా పార్థుడితో ప్రతిఘటించటం చేటునకు మూలం. ఆ ఆలోచన మానుకో. యుద్ధంలో నీకు విజయం అశక్యం సుమా!

తే. అనుజ తనుజులుఁ జెలులు వియ్యములు నడుగు । మాలి పోదురు నీకుఁగా మనుజనాథ!
దొరకుఁ గులనాశనుండను దూఱు మేలె? । పాండవుతోడ నొడఁగూడి బ్రదుకవయ్య! 341

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; అనుజతనుజులున్= తమ్ములూ, కుమారులూ; చెలులున్= మిత్రులూ; వియ్యములున్= వివాహ సంబంధులున్నూ; నీకున్+కాన్= నీ కొరకై; అడుగుమాలిపోదురు= అణగారిపోతారు; దొరకున్= ప్రభువునకు; కులనాశనుండు= వంశవిధ్వంసకుడు; అను+దూఱు= అనునట్టి నింద; మేలె?= మంచిదా? పాండవులతోడన్= పాండుకుమారులతో; ఒడన్+కూడి= పొత్తుకూడి; బ్రదుకవు+అయ్య!= జీవించవయ్యా!

తాత్పర్యం: సుయోధనా! నీ తమ్ములూ, కుమారులూ, స్నేహితులూ, పిల్లనిచ్చినవారూ, పిల్లను చేసికొన్నవారూ నీమూలంగా నాశనమవుతారు. నీవంటి ప్రభువుకు కులవినాశకుడు అనే నింద పొందటం మంచిదికాదు. పాండవులతో కలిసి మెలసి జీవించు.

ఉ. రాజ్యముభారమెల్ల ధృతరాష్ట్రునియంద వెలుంగుచుండఁ, ద
త్పూజ్య కుమార పట్టమునఁ బొల్చి చరింపఁగ నీవు, పాండవుల్
సజ్యతఁ దండ్రి చిత్తము ప్రసన్నతఁ బొందఁగఁ గొల్చి యున్కి సా
మ్రాజ్యముగాఁ దలంతు రనురక్తమతిం దమకున్ ధరాధిపా! 342

ప్రతిపదార్థం: ధరా+అధిపా!= రాజా!; రాజ్యము భారము+ఎల్లన్= రాజ్యమేలే బరువంతా; ధృతరాష్ట్రుని యందున్+అ= ధృతరాష్ట్రుడియందే; వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; నీవు; తద్+పూజ్యకుమార పట్టమునన్= మాననీయమైన యౌవరాజ్య పదవిలో; పొల్చి= ఒప్పుచు; చరింపఁగన్= మెలగుతుండగా; పాండవుల్= పాండుకుమారులు; సజ్యతన్= విండ్లనెక్కువెట్టి; తండ్రి చిత్తము= జనకుడైన ధృతరాష్ట్రుడి మనస్సు; ప్రసన్నతన్+పొందఁగన్= శాంతితో కూడి ఉండగా కొల్చి+ఉన్కి= సేవిస్తూ ఉండటం; తమకున్= తమకు; అనురక్తమతిన్= అనురాగముతో నిండిన హృదయంతో; సామ్రాజ్యముగాన్+తలంతురు= చక్రవర్తిత్వం వచ్చినట్లుగా భావిస్తారు.

తాత్పర్యం: రాజా! రాజ్య భారమంతా ధృతరాష్ట్రుడే వహించి ప్రకాశిస్తుంటే, నీవు యౌవరాజ్య పట్టాభిషిక్తుడవై రాచకార్యాలు చూచుకొంటుంటే, పాండవులు విండ్లెక్కు పెట్టుకొని రాజ్యరక్షణ గావిస్తూ జనకుడైన ఆంబికేయుడి మనస్సు ఎట్టి కలతలు లేక ప్రశాంతంగా ఉండగా, ఆయనకు సేవలు చెయ్యటమే తమకు చక్రవర్తిత్వమని అనురాగం గల హృదయాలతో భావిస్తారు.

క. కౌరవనాయక! పాండుకు । మారులు నీ తోడి పొత్తు మనియెద మనఁగా
శ్రీ రా మోఁకా లొడ్డిన । వారి విధమ కాదె నీవు వలదను టెల్లన్.' 343

ప్రతిపదార్థం: కౌరవనాయక!= కురురాజా!; పాండుకుమారులు= పాండునందనులు; నీతోడి పొత్తు మనియెదము= నీతో ఒద్దికగా ఉండి జీవిస్తామని; అనఁగాన్= అంటుంటే; నీవు; వలదు+అనుట+ఎల్లన్= వద్దని చెప్పడం; శ్రీరాన్= సిరివస్తుంటే; మోకాలు+ ఒడ్డినవారి విధమకాదె!= మోకాలు అడ్డంపెట్టే వారి చందంగా ఉండదా?

తాత్పర్యం: కురునాథా! పాండునందనులు నీతో సంధి చేసికొని జీవిస్తామని ఆశతో ఉంటే, నీవు వారి పొత్తు నాకు వద్దని నిరాకరించటం- లక్ష్మి తానై నడచి ఇంటికి వస్తుంటే రావద్దని మోకాలు అడ్డంపెట్టేవారి చందంగా ఉన్నది.

విశేషం: అలం: లోకోక్తి.

భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట (సం. 5-123-1)

చ. అన విని భీష్ముఁ డిట్లనియె నాధృతరాష్ట్ర తనూజుతోడ 'నీ
జనకుని మాట వట్టుము ప్రసన్నమతిన్। మనవంశ మెల్లఁ బా
వనముగ నిందు వచ్చి బుధవత్సలుఁ డీ హరి యిట్లు సెప్పఁగా
వినమిఁ గడుం జెడుం దెరువు;। వీరల పం పొనరింపు పెంపుగన్. 344

ప్రతిపదార్థం: అనన్ విని= అని శ్రీకృష్ణుడు పలుకగా విని; భీష్ముఁడు; ఆ ధృతరాష్ట్ర తనూజు తోడన్= ఆ ధృతరాష్ట్రుడి కుమారుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ప్రసన్నమతిన్= ప్రశాంతమైన మనస్సుతో; నీ జనకునిమాట+పట్టుము= నీ తండ్రిమాట గ్రహించుము; మన వంశము+ఎల్లన్= మన కురు కుల మంతయూ; పావనముగన్= పవిత్రముకాగా; ఇందున్+వచ్చి= ఇక్కడికి విచ్చేసి; బుధవత్సలుఁడు= విద్వాంసుల యందు ప్రేమ కలిగిన వాడైన; ఈ హరి= ఈ శ్రీకృష్ణుడు; ఇట్లు చెప్పఁగాన్= ఇంత హితం బోధించగా; వినమిన్= వినకుండుట; కడున్= మిక్కిలి; చెడున్+తెరువు= పెడత్రోవ; వీరల పంపు= నీ తండ్రి యొక్క, నారాయణుడికి యొక్క ఆనతి; పెంపుగన్= వృద్ధికరంగా; ఒనరింపు(ము)= ఆచరించుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి పలుకులు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: నీ తండ్రిమాట ప్రశాంత హృదయంతో స్వీకరించు. మన కురుకులం పవిత్రమయేటట్లు పండితుల యందు ప్రేమగల నారాయణుడు ఇక్కడికి విచ్చేసి నీకు హితం తెలిపాడు. ఆయన వచనాలు వినకపోవటం వినాశనానికి మార్గం. వీరందరూ ఆజ్ఞాపించిన పని అభ్యుదయకరంగా ఆచరించు.

క. మానక ధృతరాష్ట్రుఁడు ప్రా। ణానం గలుగంగ బంధునాశము రాజ్య
శ్రీనాశము నుద్దామయ। శోనాశముఁ జేయనేల చూచెద చెపుమా! 345

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ప్రాణానన్+కలుగంగన్= ప్రాణాలతో ఉండగా; మానక= వదలక; బంధునాశమున్= చుట్టాల యొక్క వినాశనాన్నీ; రాజ్యశ్రీ నాశమున్= రాజ్యలక్ష్మియొక్క వినాశనాన్నీ; ఉద్దామ యశోనాశమున్= గొప్పదైన కీర్తియొక్క వినాశనాన్ని; ఏల= ఎందుకు; చేయన్+చూచెదు+చెపుమా!= చేయడానికి సంకల్పించావో చెప్పుము.

తాత్పర్యం: 'సుయోధనా! నీ తండ్రి ధృతరాష్ట్రుడు ప్రాణాలతో ఉండగానే' విడువకుండా చుట్టాలనూ, రాజ్యాన్నీ, హద్దులేని కీర్తినీ ఎందుకు నాశనం చేయాలని యత్నిస్తావో చెప్పు.

విశేషం: అలం: సముచ్చయం.

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీ బంధులోకంబునక కాదు లోకంబున నెవ్వరికినిం జూడం బోలదు లోకంబులు రెంటికిని హానిం జేయక కూడి బ్రదుకుట మే'లనినఁ దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున కిట్లనియె: 346

ప్రతిపదార్థం: కృష్ణ+అర్జునుల తోడి విరోధంబు= శ్రీ కృష్ణార్జునులతోడి వైరం; ఈ బంధులోకంబునకున్+అ+కాదు= ఈ చుట్టాల సమూహానికే కాదు; లోకంబునన్= జగత్తులో; ఎవ్వరికినిన్= ఎట్టివారికిన్నీ; చూడన్+పోలదు= చూచి సహించటానికి శక్యం కాదు; లోకంబులు రెంటికిని= ఇహపరాలు రెంటికిన్నీ; హానిన్+చేయక= చేటు కలిగించక; కూడి= పాండవులతో చేరి;

బ్రదుకుట మేలు= జీవించటం మంచిది; అనినన్= అని భీష్ముడు పలుకగా; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ద్రోణ+ఆచార్యుండు= గురువైన ద్రోణుడు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కృష్ణార్జునులతో పెట్టుకొనే శత్రుత్వం ఈ సమస్త బంధువులకే కాదు, పుడమిలో ఎవ్వరికినీ చూచి సహించరానిదే అవుతుంది. నీవు ఇహపరాలకు కీడు కలిగించక పాండవులతో కలసిమెలసి జీవించటం మంచిది' అని చెప్పాడు. తరువాత గురువైన ద్రోణుడు సుయోధనుడితో ఇట్లా అన్నాడు :

తే. **'పితృ పితామహ గురులమై ప్రీతిఁగోరు । చున్న యట్టి మా పరమ హితోపదేశ**
వాక్యములు విని దుర్జన వచన రచనఁ । గొనక బంధులతో నొడఁగూడి మనుము. **347**

ప్రతిపదార్థం: పితృపితామహ గురులము+ఐ= తండ్రి, తాత గురువులము అయి; ప్రీతిన్= మీకు సంతోషం; కోరుచున్+ఉన్న+అట్టి= వాంఛిస్తున్నట్టి; మా పరమ హిత+ఉపదేశ వాక్యములు= మిక్కిలిమేలు సమకూర్చే మా హిత వచనాలు; విని= ఆలించి; దుర్జన వచన రచనన్= దుర్మార్గుల పలుకులయొక్క కల్పనను; కొనక= ఆదరించక; బంధులతోన్= చుట్టాలతో; ఒడఁగూడి= చేరి; మనుము= జీవించుము.

తాత్పర్యం: 'సుయోధనా! మీ తండ్రియైన ధృతరాష్ట్రుడు, తాత భీష్ముడూ, గురుడనైన నేనూ మీకు సుఖం కోరుతున్న వాళ్ళం. మేలు కలిగించే మా మంచి మాటలు విను. దుర్మార్గుల పల్కులు ఆదరించక బంధువులైన పాండుపుత్రులతో కలసిమెలసి జీవించు.

ఉ. **వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తర వాక్ప్రచయంబు త్రోవఁ బో**
వన్న కుమార! యట్లయిన వాయువు శ్రీయును నీకుఁ గల్గు మా
కన్నులు సల్లఁగా నకట గన్గొనుచుండుదు మేము; నట్లుగా
కున్నను నీవ నేర్తు నొండన నేరము నిండు కొల్వునన్. **348**

ప్రతిపదార్థం: కుమార!= వత్సా!; సుయోధనా!; వెన్నుఁడు= విష్ణుమూర్తి - కృష్ణుడు; ప్రీతిన్= ప్రేమతో; చెప్పిన= వచించిన; సవిస్తర వాక్+ప్రచయంబు త్రోవన్= విపులమైన మాటల సమూహం చొప్పున; పోవు+అన్న!= పోగదవయ్యా!; అట్లు+అయినన్= శ్రీకృష్ణుడు బోధించిన మార్గాన్ని అనుసరిస్తే; ఆయువున్= ఆయుష్యం; శ్రీయును= సంపదా; నీకున్+కల్గున్= నీకు లభించగలవు; మా కన్నులు చల్లఁగాన్= మా కన్నులు చల్లబడగా; అకట!= ఆహా! మేము= మేమందరం; కన్గొనుచున్+ఉండుదుము= చూస్తూ ఉండగలం; అట్లు+కాక+ఉన్నను= నీవు శౌరియొక్క వాక్య పద్ధతి ననుసరించకుంటే; నీవు+అ నేర్తు(వు)= నీవే తత్ఫల మనుభవించగలవు; నిండు కొల్వునన్= అందరున్న సభలో; నినున్= నిన్ను; ఒండు+అనన్+నేరము= ఇంతకు మించి ఏమీ పల్కలేము.

తాత్పర్యం: వత్సా! గోవిందుడు ప్రేమతో నుడివిన విపులమైన హితవాక్యాలు విన్నావు. ఆ దారిలో మెలగవలసింది. అట్లయితే నీకు ఆయుష్యం, సిరి సంపదలు సమకూడుతాయి. మా కన్నులతో చల్లగా మిమ్ము చూస్తూ హాయిగా ఉంటాము. అట్లా నీవు శౌరి వాక్యపద్ధతి ననుసరించకుంటే తత్ఫలం నీవే అనుభవిస్తావు. ఇంతకుమించి నిండుసభలో నిన్ను ఏమీ అనలేము.'

చ. అనవుడు నాంబికేయుఁడు నిజాత్మజుదిక్కు మొగంబుచేసి యి
ట్లను 'హరి నాశ్రయించి భవదగ్రజుఁ బుణ్యు నజాతశత్రునిం
గను మటవోయి దీన మన కార్యము లన్నియు సిద్ధిఁబొందు; నీ
తనిపలు కాదరింపమిఁ బదంపడి పాటిలు నెల్ల చేటులున్. 349

ప్రతిపదార్థం: అనవుడున్= అట్లా ద్రోణాచార్యుడు పల్కినమీదట; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజు దిక్కు= తన కుమారుడి వైపు; మొగంబుచేసి= ముఖం త్రిప్పి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరిన్+ఆశ్రయించి= శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని; భవత్+అగ్రజున్= నీ అన్నగారిని; పుణ్యున్= సుకృతశాలి అయిన; అజాతశత్రునిన్= ధర్మజుడిని; అటవోయి= ఉపప్లావ్య పురికలిగి; కనుము= దర్శించుము; దీనన్= ఆయనను కలిసికొనటంచేత; మన కార్యములు+అన్నియున్= మన పనులన్నీ; సిద్ధిన్+పొందున్= నెరవేరుతాయి; ఈతని పలుకున్+ఆదరింపమిన్= మాధవుడి మాటలు మన్నించకుంటే; పదంపడి= తరువాత; ఎల్లచేటులున్= అన్ని ఆపదలు; పాటిలున్= కలుగుతాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యులు అట్లా హితం ఉపదేశించిన తరువాత ధృతరాష్ట్రుడు తన కుమారుడి వైపు ముఖం త్రిప్పి ఇట్లా అన్నాడు: నీవు శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని అక్కడికి వెళ్ళి నీకు అన్నగారున్నూ, పుణ్యాత్ముడున్నూ అయిన ధర్మపుత్రుడిని చూడు. అందువల్ల మన పనులన్నీ సఫలమవుతాయి. నారాయణుడి మాటలు ఆదరించకుంటే ఆ తరువాత ఎన్నో కష్టాలు కలుగుతాయి.'

వ. అనియె; నట్టియెడ గురుభీష్ము లొత్తి చెప్పం దలంచి గాంధారేయున కిట్లనిరి: 350

ప్రతిపదార్థం: అనియెన్= అని ధృతరాష్ట్ర డన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; గురుభీష్ములు; ఒత్తిచెప్పన్+తలంచి= నొక్కిచెప్పతలచినవారై; గాంధారేయునకున్= గాంధారి కుమారుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కుమారుడికి చెప్పిన తరువాత ఇంకా నొక్కి చెప్పదలచి ద్రోణభీష్ములు సుయోధనుడితో ఇట్లా అన్నారు:

క. 'ఈ కృష్ణుని సారథ్యము । నా కృష్ణుని గాండివంబునై తోఁపక ము
న్నీ కొలఁదిఁ జక్కఁబడి నీ । వీ కురువంశంబు గావు మిభపురనాథా!' 351

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తిపురాధీశ్వరా!; ఈ కృష్ణుని సారథ్యమున్= ఈ గోపాలకృష్ణుడి రథచోదకత్వమూ; ఆ కృష్ణుని= పాండవమధ్యముడైన అర్జునుడి; గాండివంబున్+ఐ= గాండివమనే ధనుస్సు కలదై; తోఁపకమున్ను= యుద్ధం ఏర్పడకమునుపే; ఈ కొలఁదిన్+చక్కఁబడి= ఈ పాటి ఉపదేశాలతో మనసు సవరించుకొని; నీవు; ఈ+కురువంశంబున్= ఈ కౌరవ వంశాన్ని; కావుము= రక్షించుము.

తాత్పర్యం: 'రాజా! ఈ శ్రీకృష్ణుడు రథసారథ్యం సల్పుతుండగా, గాండివం చేత ధరించి అర్జునుడు యుద్ధ రంగంలో ప్రత్యక్షం కాకమునుపే నీవు ధర్మజుడిని సందర్శించి కార్యం చక్కదిద్దుకొని కౌరవవంశమంతటినీ కాపాడు.'

వ. అని పలికి మఱియు. 352

తాత్పర్యం: అంటూ భీష్మ ద్రోణులు మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ధర్మపుత్త్రుని పద ద్వయమున కతిభక్తి । నెఱఁగిన నతఁడు ని న్నెత్తి గ్రుచ్చి
నిడుఁ గేలఁ బెద్దయుఁ దడవుగాఁ గౌఁగిలింపఁగ భీముఁడును నీవుఁ బరమహర్ష
మునఁ జారుతర వక్షములు సంగతములుగాఁ । బరిరంభణం బొనర్పంగ నరుఁడుఁ
గవలును మ్రొక్కినఁ గరమర్థిఁ దిగిచి నీ । వాలింగనంబు సేయంగ, నిట్లు

తే. వారు మీరును దగ బాంధవమునఁ బొదలి । యింపు దళుకొత్తఁ దామరతంపరైనఁ
జెలులుఁ జుట్టలుఁ గలసి పేరెలమిఁ బొంది । యుల్లసిల్లంగఁ గులమెంత యొప్పునొక్కొ! 353

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుని పదద్వయమునకున్= ధర్మజుడి యొక్క పాదాల జంటకు; అతిభక్తిన్= మిక్కుటమైన భక్తితో; ఎఱఁగినన్= నీవు సాగిలపడి నమస్కరించగా; అతఁడు= ధర్మజుడు; నిన్నున్ గ్రుచ్చి+ఎత్తి= నిన్ను పట్టి లేవనెత్తి; నిడుఁగేలన్= దీర్ఘబాహువులతో; పెద్దయున్+తడవుగాన్= చాలసేపు; కౌఁగిలింపఁగన్= ఆలింగనం చేసికొనగా; భీముఁడును నీవున్= భీమసేనుడూ, నీవూ; పరమహర్షమునన్= మిక్కిలి సంతోషంతో; చారుతరవక్షములు= మిక్కిలి అందమైన రొమ్ములు; సంగతములు కాన్= హత్తుకొనేటట్లు; పరిరంభణంబు+ఒనర్పంగన్= కౌగిలించుకొనగా; నరుఁడున్= అర్జునుడూ; కవలును= నకులసహదేవులూ; మ్రొక్కినన్= నీకు వందనం చేయగా; కరము+అర్థిన్= మిక్కిలి ప్రీతితో; తిగిచి= వారిని చెంతకు లాగికొని; నీవు; ఆలింగనంబు+ చేయంగన్= వారిని కవుగిలించుకొనగా; ఇట్లు= ఈ ప్రకారం; వారున్ మీరును= పాండవులున్నూ, మీరున్నూ; తగన్= ఒప్పుగా; బాంధవమునన్+పొదలి= చుట్టరికంతో ఏపారి; ఇంపు తళుకొత్తన్= ప్రియ మతిశయించగా; తామరతంపర+ఐనన్= మిక్కిలి అభివృద్ధి గాంచగా; చెలులున్= స్నేహితులు; చుట్టలున్= బంధువులు; కలసి= కూడి; పేరు+ఎలమిన్+పొంది= పరమానందం చెంది; ఉల్లసిల్లంగన్= ప్రకాశించగా; కులము= కురువంశం; ఎంత+ఒప్పున్+ఒక్కొ= ఎంతగా సొంపారునోగదా!

తాత్పర్యం: సుయోధనా! నీవు ధర్మజుడి అడుగుల జంటకు అత్యంత భక్తితో ప్రణమిల్లినప్పుడు అతడు నిన్ను పట్టి లేవనెత్తి దీర్ఘ బాహువులతో చాలసేపు కౌగిలించు కొనగా, భీముడూ నీవూ మీ సుందర వక్షఃస్థలాలు హత్తుకొనేటట్లు మిక్కిలి సంతోషంతో ఆలింగనం చేయగా, అర్జునుడూ నకుల సహదేవులూ నీకు ప్రణామం కావించినపుడు నీవు వారిని దగ్గరకు చేరదీసి కవుగిలించుకోగా- ఇట్లా వారూ మీరూ పరస్పరం వందనాలింగనాలతో, చుట్టరికంతో పెంపారుతూ ప్రియమతిశయిల్ల అభివృద్ధి చెందుతుండగా, స్నేహితులు బంధువులు ఇట్లా ఉన్న మిమ్ము చూచి మిక్కిలి హర్షించగా మీ కురువంశం ఎంత చక్కగా ఉంటుందో ఊహించు.

క. సమరమునకు వచ్చిన భూ । రమణు లుభయకటకములను బ్రమదం బెసఁ గం
దమతమ పురములకుం బో । వ మహీ జను లెట్టి యుత్సవముఁ బొందుదురో!' 354

ప్రతిపదార్థం: సమరమునకున్ వచ్చిన= యుద్ధం చేయటానికి వచ్చిన; భూరమణులు= రాజులు; ఉభయ కటకములను= రెండు సేనాశిబిరాలలో; ప్రమదంబు+ఎసఁగన్= హర్షం అతిశయించగా; తమ తమ పురములకున్+పోవన్= తమ తమ నగరాలకు తరలివెళ్ళగా; మహీజనులు= పుడమిలోని ప్రజలు; ఎట్టి+ఉత్సవమున్= ఎంతటి సంతోషాన్ని; పొందుదురో!= పొందుతారో కదా!

తాత్పర్యం: యుద్ధం చేయటానికి వచ్చిన రాజులు రెండు సేనా శిబిరాలలో ఆనందం విస్తరిల్లగా తాము తమ తమ పట్టణాలకు తరలివెళ్ళుతుంటే పుడమిలోని ప్రజలు ఎంత ఆనందిస్తారో చెప్పటానికి శక్యం కాదు.'

వ. అని వెండియు ననేక విధంబులం జెప్పి యీ రెండు దెఱంగుల వారును బంచి కుడిచి సుఖంబున్న నఖిల భూ ప్రజకును బ్రమోదం బగుం గావున నట్లుసేసి యందఱచేత దీవనలు వడయవయ్య నీ'వనిన విని దుర్యోధనుం డప్పుండరీకాక్షు వీక్షించి యిట్లనియె: 355

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకను; అనేకవిధంబులన్= పలురీతులు; చెప్పి; ఈ రెండు తెఱంగులవారును= ఈ ఉభయ కుటుంబాలవారున్నూ; పంచి= రాజ్యం పంచుకొని; కుడిచి= అనుభవిస్తూ; సుఖంబు+ఉన్నన్= హాయిగా ఉంటే; అఖిల భూ ప్రజలకును= పుడమిలోని జనులందరికినీ; ప్రమోదంబు= సంతోషం; అగున్= కలుగుతుంది; కావునన్; అట్లుచేసి; అందఱచేతన్; నీవు; దీవనలు పడయవయ్యా= ఆశీర్వాదములు పొందవలసింది; అనినన్= అని ద్రోణ భీష్ములు చెప్పగా; విని; దుర్యోధనుండు; ఆ+పుండరీక+అక్షున్= ఆ కమల నేత్రుడిని శ్రీకృష్ణుడిని; వీక్షించి= చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా ఇంకా ద్రోణభీష్ములు పలు విధాలుగా చెప్పి 'మీరెండు కుటుంబాలవారూ రాజ్యం పంచుకొని అనుభవిస్తూ, హాయిగా ఉండటం పుడమిలోని జనులందరికీ సంతోషం కలిగిస్తుంది కనుక మేము చెప్పినట్లు చేసి నీవు అందరివల్ల ఆశీస్సులు పొందు'మని చెప్పారు. వారి మాటలన్నిటినీ విని దుర్యోధనుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'గురుఁడును బితామహుఁడు నీ । నరనాథుఁడు నెల్ల ప్రొద్దు నను దూఱుదు; రి
ప్పరుసున నీవును దామో । దర! దూఱెదుగాని తగవుఁ దలఁపవు కంటే! 356

ప్రతిపదార్థం: దామోదర!= శ్రీకృష్ణా!; గురుఁడును= ద్రోణాచార్యులూ; పితామహుఁడున్= తాతయైన భీష్ముడూ; ఈ నరనాథుఁడున్= ఈ ధృతరాష్ట్ర మహారాజూ; ఎల్లప్రొద్దున్= ఎల్లప్పుడూ; ననున్= నన్ను; దూఱుదురు= నిందిస్తారు; ఈ పరుసునన్= ఈ విధంగా; నీవును; దూఱెదు(వు)కాని= నన్ను నిందిస్తావే తప్ప; తగవున్+తలఁపవు+కంటే!= న్యాయమాలోచించవుగదా!

తాత్పర్యం: 'గురువైన ద్రోణుడూ, తాతగారు భీష్ముడూ, తండ్రి ధృతరాష్ట్ర మహారాజూ ఎప్పుడూ నన్ను తిడుతుంటారు. నీవున్నూ అదే విధంగా నన్ను నిందిస్తావేగాని న్యాయం ఆలోచించవుగదా!

క. వనితం బఱిచి రరణ్యం । బున నిడుమలఁ బడితి మనుచుఁ బోటరులై చం
పను జెఱుపఁదలఁచి మా దెసఁ । గనలుదు రప్పాండుసుతు లకారణమ కడున్. 357

ప్రతిపదార్థం: వనితన్= ద్రౌపదిని; పఱిచిరి= అవమానించారు; అరణ్యంబునన్= అడవిలో; ఇడుమలన్+పడితిమి= కష్టాలు అనుభవించాము; అనుచున్= అని పల్కుతూ; పోటరులు+ఐ= శూరులై; ఆ+పాండుసుతులు= ఆ పాండు రాజు కొడుకులు; అకారణమ= నిష్కారణంగా; కడున్= మిక్కిలి; చంపను= చంపటానికీ; చెఱుపన్= నాశనం చేయటానికీ; తలఁచి= భావించి; మా దెసన్= మా యెడ; కనలుదురు= కోపం వహిస్తారు.

తాత్పర్యం: 'ద్రౌపదిని భంగపరిచారు. అడవులలో మేము నానా కష్టాలు అనుభవించాము' అంటూ పాండవులు నిష్కారణంగా మాపై క్రోధం వహించి వీరులై మమ్మల్ని చంపటానికీ, నాశం చేయటానికీ ఆలోచిస్తారు.

మ. **అరయం దప్పొకయింత నా వలన లే దా ధర్మపుత్త్రుండు జూ**
దరి వెంటం దమకించి సౌబలునిచేతన్ భూమిఁ గోల్పోయి ము
ష్కరుఁడై వెండియు నొడ్డఁగా నతఁడు నక్షప్రౌఢిమై గెల్చె; నే
తెరువైనం దనయిచ్చతోఁ బడియె; నింతేకాక యేఁ బూఁటయే? **358**

ప్రతిపదార్థం: అరయన్= పరికించగా; నావలనన్= నావలన; తప్పు= దోషం; ఒక+ఇంతలేదు= రవ్వంతయినా లేదు; ఆ ధర్మపుత్త్రుండు= ఆ ధర్మరాజు; జూదరి వెంటన్+తమకించి= జూదరితనంతో వేగిరపడి; సౌబలుని చేతన్= శకునిచేత; భూమిన్= పుడమిని; కోల్పోయి= పోగొట్టుకొని; ముష్కరుఁడు+ఐ= మూర్ఖుడై; వెండియున్= మరల; ఒడ్డఁగాన్= పందెం చరచగా; అతఁడు= ఆ శకుని; అక్షప్రౌఢిమైన్= పాచికల ఆటలోని నేర్పుతో; గెల్చెన్= జయించాడు; ఏ తెరువు+ఐనన్= ఏ దారి అయినా; తన+ఇచ్చతోన్+పడియెన్= తన ఇష్టప్రకారమే అనుసరించాడు; ఇంతేకాక= ఇంతదప్ప; ఏన్+పూఁటయే?= అందుకు నేను బాధ్యుడనా?

తాత్పర్యం: కృష్ణా! న్యాయంగా ఆలోచిస్తే నా వలన తప్పేముంది? ధర్మరాజు జూదరి అయి, తానే శకునిని వెంబడించి వేగిరపడి అతడి చేతిలో పుడమినంతా కోలుపోయాడు. అంతటితో ఆట మానక మూర్ఖుడై మరల పందెం చరచగా సౌబలుడు తనకు పాచికల ఆటలో ఉన్న ప్రావీణ్యంతో గెలిచాడు. ఏ తెరువైనా ధర్మజుడు తన ఇష్టప్రకారమే త్రొక్కినాడు. అంతేతప్ప అతని కష్టనష్టాలకు నేను బాధ్యుడనా?

తే. **మాత్స్య పాంచాల పాండ్యాది మనుజపతులఁ । గూర్చికొని తార కయ్యంబు గోరి యెత్తి**
విడిసి; రింతియ కాక యివ్విధము నుగ్ర । కర్మమున కేము దొడఁగుట గలదె చెపుమ? **359**

ప్రతిపదార్థం: మాత్స్య+పాంచాల+పాండ్య+ఆది మనుజపతులన్= మత్స్య దేశం; 'పాంచాల దేశం'; పాండ్య దేశం మున్నగు దేశాలరాజులను; కూర్చికొని= చేర్చుకొని; తారు+అ= తామే; కయ్యంబు+కోరి= యుద్ధం అభిలషించి; ఎత్తి విడిసిరి= మాపై దండెత్తటానికి దిగి ఉన్నారు; ఇంతియకాక= ఇంతేతప్ప; ఈ+విధము+ఉగ్రకర్మమునకున్= ఇట్లాంటి క్రూరకృత్యానికి; ఏము= మేము; తొడఁగుట+కలదె?= పూనుకొనటం జరిగిందా; చెపుమ!= కృష్ణా!; నీవే వచించు.

తాత్పర్యం: కృష్ణా! మత్స్య పాంచాల పాండ్యాది దేశాల రాజులందరినీ కూర్చుకొని యుద్ధం చేయవలెననే కోరికతో తామే మాపై దండెత్తటానికి సిద్ధంగా ఉన్నారు. ఇట్లాంటి క్రూర కృత్యానికి మేమెప్పుడు పాల్పడినామో నీవే చెప్పు.

క. **ఉక్కఱి సురపతి కైనను । మ్రొక్కము నృపధర్మమూఁది మొనతలఁబడినన్**
మిక్కిలి పేరును నిట దివి । నక్కజముగఁ బెంపుఁ బడయ నగుట నుపేంద్రా! **360**

ప్రతిపదార్థం: ఉప+ఇంద్రా!= కృష్ణా!; నృపధర్మము+ఊఁది= క్షత్రియ ధర్మం అవలంబించి; మొనతలన్= రణాగ్రమునందు; పడినన్= కూలినా; ఇటన్= ఈ లోకంలో; మిక్కిలి పేరును= గొప్ప కీర్తినీ; దివిన్= స్వర్గంలో; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; పెంపున్= వృద్ధినీ; పడయన్+అగుటన్= పొందగలగటంచేత; ఉక్కు+అఱి= పౌరుషాన్ని వీడి; సురపతికిన్+ఐనన్= దేవేంద్రుడికైననూ; మ్రొక్కము= నమస్కరించం.

తాత్పర్యం: కృష్ణా! క్షత్రియధర్మం వహించి యుద్ధం చేస్తూ నేలగూలితే ఇక్కడ వీరుడన్న విఖ్యాతి లభిస్తుంది. అక్కడ వీర స్వర్గ సుఖాలు చేకూరుతాయి. అందువల్ల మేము పౌరుషముడిగి దేవేంద్రుడికైనా నమస్కరించం.

చ. చిఱుతఁదనంబునం దగవు చిత్తమునం దలపోయలేక ముం
దఱ యటు వోవనిచ్చితిఁ । బితామహుఁడున్ జనకుండు నింకఁ గ్ర
చ్ఛఱ నిలఁ బంచి చక్క సగ మక్కడ నెవ్వరికేని మద్బలం
బెఱుఁగక యీఁదలంచినను నే నది యేటికి సమ్మతించెదన్? 361

ప్రతిపదార్థం: చిఱుతఁదనంబునన్= నేను పసివాడుగా నున్నప్పుడు; తగవు= న్యాయం; చిత్తమునన్= మనసులో; తలపోయన్+ లేక= భావించజాలక; ముందఱ= జరిగిన రోజులలో; అటుపోవన్+ఇచ్చితిన్= అట్లా జరుగనిచ్చాను; పితామహుఁడున్= భీష్ముడూ, జనకుండున్= ధృతరాష్ట్రుడూ; ఇంకన్= ఇకమీదట; క్రచ్చఱన్= అనాలోచితంగా; ఇలన్+పంచి= భూమిని విభజించి; చక్కసగము= సరిగా సగపాలు; అక్కడన్+ఎవ్వరికిన్+ఏనిన్= అక్కడ పాండవులలో ఎవరికైనా; మత్+బలంబు+ఎఱుఁగక= నా శక్తి తెలియక; ఈన్+తలంచినను= ఇవ్వటానికి సంకల్పిస్తే; ఏన్= నేను; అది+ఏటికిన్+సమ్మతించెదన్?= అట్లా సగపాలు పంచి ఇవ్వటానికి ఎందుకు అంగీకరిస్తాను.

తాత్పర్యం: చిన్నతనంలో న్యాయమేదో తెలియనప్పుడు అట్లా సాగనిచ్చాను. ఇపుడు మా తండ్రి, తాత అనాలోచితంగా నా శక్తి సామర్థ్యాలు గుర్తించక రాజ్యంలో సగపాలు పాండవులలో ఎవ్వరికైనా పంచి ఇవ్వవలెనని సంకల్పిస్తే అందుకు నేను ఎందుకు అంగీకరిస్తాను?

తే. తొంటి చవిగని యిప్పుడుఁ దోఁచి పాండు । సుతులు రాజ్యంబు చేయంగఁ జూచినారు;
నాకు నీఁ దీఱునే యింక నాఁటి చూఱ । లెక్కడివి ద్రోణ భీష్ము లీ దిక్కుసుమ్ము! 362

ప్రతిపదార్థం: తొంటిచవి+కని= మునుపటి రుచి మరగి; ఇప్పుడున్+తోఁచి= ఈ వేళ కూడా ప్రత్యక్షమై; పాండుసుతులు= పాండుకుమారులు; రాజ్యంబు చేయంగన్= రాజ్యమేలటానికి; చూచినారు= వాంఛిస్తున్నారు; నాకున్= నాకు; ఈన్+తీఱునే= ఇవ్వటానికి వీలగునా?; ఇంకన్= ఇక; నాటి చూఱలు= ఆనాటి కొల్లలు; ఎక్కడివి?= ఎక్కడున్నవి?; ద్రోణ భీష్ములు= గురు పితామహులు; ఈ దిక్కు+చుమ్ము!= మా పక్షంలో ఉన్నారు సుమా!

తాత్పర్యం: మునుపటి రుచిమరగి మళ్ళీ ఇప్పుడు ప్రత్యక్షమై కౌంతేయులు రాజ్యమేలుటకు కోరుతున్నారు. కాని, నే నిస్తానా? ఆనాటి దోపిళ్ళు ఇకమీదట సాగవు. ద్రోణభీష్ములు మా పక్షంలో ఉన్నారు.

ఉ. ఏమును వారుఁ బంచికొని యేలుట గల్గదు; పల్కకుండు మిం
కేమియు; వాఁడి సూదిమొన యించుక మోపిన యంతమాత్రయున్
భూమి యొనర్చి పాండునృపపుత్త్రుల కిత్తునె । యెవ్వరైన సం
గ్రామమునన్ జయంబుఁ గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్. 363

ప్రతిపదార్థం: ఏమును= మేమూ; వారున్= పాండవులూ; పంచికొని= రాజ్యాన్ని పంచుకొని; ఏలుట+కల్గదు= పరిపాలించటం జరగదు; ఇంకన్+ఏమియున్= మరేమిన్నీ; పల్కక+ఉండుము= బదులాడవద్దు; వాఁడిసూదిమొన= సన్నని సూదియొక్క కొన; ఇంచుక= కొంచెం; మోపిన+అంతమాత్రయున్= ఆక్రమించినంత మేర కూడా; భూమి+ఒనర్చి= పుడమిని చీల్చి; పాండునృప పుత్త్రులకున్= పాండురాజు కుమారులకు; ఇత్తునె?= ఇస్తానా? నేనివ్వను; ఎవ్వరు+ఐనన్= అటు వారో; ఇటు మేమో;

సంగ్రామమునన్= రణంలో; జయంబు కొని= విజయం పొంది; రాజ్యము చేయుట= రాజ్యము నేలటానికి; నిశ్చయించితిన్= నిర్ణయించుకొన్నాను.

తాత్పర్యం: మేమూ, వారూ పుడమిని పంచుకొని పరిపాలించటం జరగదు. ఇందుకు నీ వేమీ బదులు చెప్పవద్దు. వాడి సూదిమొన మోపినంతమాత్రమైనా భూమిని పంచి పాండునందనులకు నేనివ్వను. మాలో ఎవరో ఒకరు యుద్ధంలో విజయం పొంది రాజ్యం చేయటానికి నిర్ణయించాను.'

విశేషం: అసలే అది సూది. అదీ వాడియైనది. దాని మొనమాత్రమే, అదికూడా ఎక్కువ మోపక 'ఇంచుక' - పాండవులకు కొంచెం కూడా ఇవ్వననటానికి ఈ కూర్పు. (సంపా.)

తే. అనిన విని కిన్కఁ బూనిన యలఁతి నగవు । చెలువు మొగమున కొక క్రొత్త పొలు పొనర్పఁ
బుండరీకాక్షుఁడగు టెల్లఁ బోయి యప్పు । డరుణ కమలాక్షుఁ డగుచు మురాంతకుండు. 364

ప్రతిపదార్థం: అనినన్+విని= దుర్యోధనుడి మాటలు ఆలకించి; కిన్కన్+పూనిన= కోపం వహించిన; అలఁతినగవు చెలువు= చిరునవ్వుయొక్క సొగసు; మొగమునకున్= తన ముఖానికి; ఒక క్రొత్త పొలుపు+ఒనర్పన్= ఒక నూతన సౌందర్యాన్ని ఆపాదించగా; పుండరీక+అక్షుఁడు+అగుట+ఎల్లన్= తెల్లదామరలవంటి కన్నులుగలవాడగుట అంతా; పోయి= తొలగి; ముర+ అంతకుండు= మురాసురుడిని హరించిన శ్రీకృష్ణుడు; అప్పుడు= ఆ సమయంలో; అరుణ+కమల+అక్షుఁడు+అగుచున్= ఎఱ్ఱదామరల వంటి కన్నులు గలవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు కోపం వహించిన చిరునవ్వుసొగసు తన ముఖమునకు ఒక క్రొత్త అందం సంతరించగా; తెల్లదామరలవంటి కన్నులుగలవాడవటం అంతాపోయి మురవిధ్వంసకుడైన వాసుదేవుడు ఎఱ్ఱదామరలవంటి కన్నులు గలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: పర్యాయం, ఉపమ. కృష్ణుఁడు సహజంగా పుండరీకాక్షుడు - తెల్ల దామరలవంటి కన్నులు గలవాడు. ఇప్పుడు కోపంవచ్చి కన్నులు ఎఱ్ఱబడ్డాయి. అందుచేత అరుణ కమలాక్షుడయ్యాడు. ఆరుణ్యం కోపానికి చిహ్నం. శ్రీకృష్ణుడు కుపితుడయ్యాడన్న విషయాన్ని తిక్కన ధ్వనిపూర్వకంగా చెప్పటం ప్రశంసనీయం. పాత్రల మనోభావాలను ఇట్లా బాహ్య వర్ణనలద్వారా చెప్పటం తిక్కన నేర్పు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు చేసిన దుర్ణయంబు సెప్పుట (సం. 5-126-1)

క. 'మొనతలఁబడియెదు నీచె । ప్పిన యట్టుల తడవులేదు బిరుదలరై నీ
వును వీరు నిలువుఁ డిదె భం । డన మెల్లియ వచ్చె నూఱటలు గనుఁడింకన్. 365

ప్రతిపదార్థం: నీ చెప్పిన+అట్టులు+అ= నీవు వచించిన విధంగానే; మొనతలన్+పడియెదు(వు)= రణాగ్రంలో కూలెదవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; బిరుదులరు+ఐ= వీరులై; నీవును= నీవూ; వీరున్= నీకు సాయపడవచ్చిన ఈ రాజులూ; నిలువుఁడు= నిలబడండి; భండనము= యుద్ధం; ఎల్లి+అ+వచ్చెన్= రేపే వస్తున్నది; ఇంకన్= ఇక; ఊఱటలు+ కనుఁడు= తృప్తి వహించండి; ఉపశమనం పొందండి.

తాత్పర్యం: 'దుర్యోధనా! నీవు చెప్పినట్లే రణాగ్రంలో కూలగలవు. ఇందుకు ఆలస్యం లేదు. శూరులై నీవూ, నీకు సాయపడవచ్చిన ఈ రాజులందరూ నిలబడండి. రేపే యుద్ధం వస్తున్నది. ఇక ఊరడిల్లండి.

సీ. **అరయంగఁ దప్పు లేదంటి నీవలనఁ గీ । డొకనాఁడు సేసియు నొక్కనాఁడు**
సేయవె? నీ జనించిన యది యాదిగా । నుడుగక పాండవేయులకుఁ జాల
నెగ్గు సేసితి విషమిడి, పెనుఁబాములఁ । గఱపించి, నీరిలోఁ గట్టి త్రోచి,
లక్కయిల్ గాలిచి, పెక్కు భంగులఁ జంపఁ । దలఁచినఁ జావక ధర్మరక్షఁ

ఆ. **జేసి నెగడి రాచసిరి నొందియున్నఁ జూ । పోప కీవు తీవ్ర పాపబుద్ధిఁ**
గసలి జూద మొకటి కల్పించి కపటంబు । సేయ దాన నెల్ల చేటుఁబుట్టె. **366**

ప్రతిపదార్థం: అరయంగన్= విచారించగా; నీ వలనన్= నీయెడ; తప్పులేదు+ అంటి(వి)= దోషం లేదని చెప్పావు; ఒకనాఁడు కీడు చేసియున్= ఒకనాడు పాండవులకు హాని చేసి; ఒక్కనాఁడు చేయవె= ఒకరోజు చేయకున్నావా? (ఎప్పుడూ చేస్తున్నావని అభిప్రాయం), నీ జనించిన అది+ఆదిగాన్= నీవు పుట్టింది మొదలుకొని; ఉడుగక= మానక; పాండవేయులకున్= పాండుపుత్రులకు; చాలన్= మిక్కిలి; ఎగ్గుచేసితి(వి)= కీడు చేశావు; విషము+ఇడి= అన్నంలో విషంపెట్టి; పెనుఁబాములన్+ కఱపించి= నిదురిస్తున్నప్పుడు పెద్ద పెద్ద సర్పాలచేత కరపించి; లక్క+ఇల్+కాలిచి= లాక్షాగృహదహనం చేయించి; పెక్కుభంగులన్= అనేక రీతుల; చంపన్+తలఁచినన్= చంపటానికి యత్నించగా; చావక= చనిపోక; ధర్మరక్షన్+చేసి= ధర్మం తమను కాపాడటం వలన; ధర్మాన్ని తాము కాపాడటం వలన; నెగడి= వృద్ధికి వచ్చి; రాచసిరిన్= రాజ్యలక్ష్మిని; ఒంది+ఉన్నన్= పాండవులు పొంది సుఖులై ఉండగా; చూపు+ఓపక= చూచి సహించలేక; ఈవు= నీవు; తీవ్ర పాపబుద్ధిన్= దారుణమైన పాపచింతతో; కసలి= కోపించి; జూదము+ఒకటి కల్పించి= ద్యూతక్రీడ ఒకటి ఏర్పాటు చేసి; కపటంబు చేయన్= పాండవులను మోసగించగా; దానన్= అందువలన; ఎల్లచేటున్= ఇంత అనర్థమూ; పుట్టెన్= కల్గింది.

తాత్పర్యం: విచారిస్తే నీవల్ల దోషం లేదని చెప్పావు. సుయోధనా! ఒకనాడు పాండవులకు కీడుచేసి మరొకనాడు చేయకున్నావా? నీవు పుట్టింది మొదలు మానకుండ వారికి అపకారాలు చేస్తూనే ఉన్నావు. తినే అన్నంలో విషం పెట్టించావు. పెద్ద పెద్ద విషసర్పాల చేత కరిపించావు. కాళ్లూ చేతులు కట్టించి గంగ మడుగులోనికి నెట్టించావు. లక్కయింటిలో నివసిస్తుండగా కాల్పించావు. ఇట్లా అనేక విధాల పాండవులను నీవు చంపటానికి యత్నించావు. కాని, వారి ధర్మం వారి ప్రాణాలను కాపాడింది. వా రెట్లాగో పైకివచ్చి రాజ్యసంపదను పొంది హాయిగా జీవిస్తుంటే నీకు కన్నుకుట్టింది. దారుణమైన పాపహృదయంతో వారిమీద కినుక పూని, జూదమొకటి ఏర్పాటు చేశావు. ధర్మజుని ఆ కపటద్యూతంలో ఓడించగా ఇంత అనర్థం కల్గింది.

విశేషం: ధర్మరక్షఁజేసి - వారు ధర్మాన్ని రక్షించటం చేతా, వాళ్ళని ధర్మం రక్షించటంచేత - అని రెండు విధాల అర్థం చెప్పవచ్చు. 'ధర్మో రక్షతి రక్షితః' అని కదా సూక్తి (సంపా.)

తే. **అన్నదమ్ముల నెత్తంబు లాడి సతుల । తలలువట్టి సభాస్థలంబులకు నీడ్చి**
చీర లొలిపింతురే? యిట్టి వారి నెందుఁ । దడవుమా నీ వొకండవు దక్క నధిప! **367**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అన్నదమ్ములన్= తోడబుట్టువులతో; నెత్తంబులు+ఆడి= పాచికలాడి; సతుల తలలు+పట్టి= ఇల్లాండ్ర తలవెండ్రుకలు పట్టి; సభాస్థలంబులకున్+ఈడ్చి= కొలువుకూటాలలోనికి ఈడ్చుకొనివచ్చి; చీరలు+ఒలిపింతురే=

వలువలు ఊడదీయిస్తారా; నీవు+ఒకండవు+తక్కన్= నీ వొక్కడివేగాని; ఎందున్= ఎక్కడైనా; ఇట్టివారిన్+తడవుమా!= ఇటువంటి వారున్నారేమో చెప్పుము.

తాత్పర్యం: నీ వొకడివి తప్ప లోకంలో ఎక్కడైనా తోడబుట్టువులతో జూదమాడి, మగనాంధ్ర శిరోజాలు పట్టుకొని కొలువు కూటాలలోనికి ఈడ్చుకొని వచ్చి, కట్టిన పుట్టాలు తొలగించే వారున్నారేమో నీవే చెప్పు.

ఉ. అప్పుడు నీవు గర్ణుఁడును నాడిన మాటలు కొల్వులోపలం
జెప్పెడునట్టివే? కులము శీలముఁ గల్గిన పుణ్యకాంత క
ట్లొప్పమి చేయుటెల్లఁ గనియున్న జనంబులు వించునుండఁగాఁ
దప్పొక యింత లేదను విధం బది నీక చనున్ సుయోధనా! 368

ప్రతిపదార్థం: సుయోధనా!= దుర్యోధనా!; అప్పుడు= ద్రౌపదీ మానభంగసమయంలో; నీవున్= నీవూ; కర్ణుడును= కర్ణుడూ; ఆడినమాటలు= పల్కిన పలుకులు; కొల్వులోపలన్= ఈ సభలో; చెప్పెడు+అట్టివే?= వాకొన దగినవా (కావని భావం); కులము= ఉత్తమ వంశాభిజాత్యమూ; శీలము= మంచి నడవడీ; కల్గిన పుణ్యకాంతకున్= కలిగి ఉన్న పవిత్రురాలైన వనితకు; అట్లు+ఒప్పమిచేయుట+ఎల్లన్= ఆ విధంగా పరాభవించటమంతా; కని+ఉన్న= చూచి ఉన్నట్టి; జనంబులు= ఈ సభలో ఉన్న జనులు; వించున్+ఉండఁగాన్= ఆలకిస్తూండగా; తప్పు+ఒక+ఇంత+లేదు= నావలన ఎట్టి నేరమూ లేదు; అనువిధంబు+ అది= అని చెప్పుచున్నట్టి తీరు, నీకున్+అ+చనున్= నీకే చెల్లింది.

తాత్పర్యం: సుయోధనా! పాంచాలికి నిండుసభలో పరాభవం జరుగుతున్నప్పుడు నీవూ, కర్ణుడూ మాట్లాడిన మాటలు ఇపు డీ సభలో చెప్పదగినట్టివి కావు. ఉత్తమ వంశాభిజాత్యం, సత్ప్రవర్తన కల్గిన పరమ పతివ్రతను ఆ విధంగా మీరు పరాభవించటం కనులార చూచిన ఈ జనులందరూ వింటుండగా నా వల్ల ఏ నేరమూ లేదని పల్కటం నీ కొకడికే చెల్లింది.

విశేషం: అట్లొప్పమి చేయుటెల్ల - అట్లు - అనిర్వాచ్యమైన విధంగా, - అట్టి ఘోరమైన అనిభావం. 'అరయం దప్పొకయింత నావలనలే' దన్న దుర్యోధనుడి మాటకిది యెత్తిపొడుపు. (సంపా.)

తే. ఎత్తి విడిసిన వారని యెల్ల తప్పుఁ। బాండవుల మీఁదఁ బెట్టిన బ్రదుకుగలదె?
ద్రోణ భీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ। జెప్ప తగుమాట లేమియుఁ జెవులు సొరవు. 369

ప్రతిపదార్థం: ఎత్తి విడిసినవారు+అని= దండెత్తటానికి చేరి ఉన్నారని; ఎల్లతప్పున్= దోషమంతటినీ; పాండవుల మీఁదన్; పెట్టినన్= మోపినచో; బ్రదుకు+కలదె?= మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణ భీష్ములు, తండ్రియున్= జనకుడును; తోడుతోడన్= ఒకరి తరువాత మరొక్కరు; చెప్పు= బోధించే; తగుమాటలు= హితవాక్యాలు; ఏమియున్= ఒక్కటి కూడా; చెవులు+చొరవు= నీ చెవులలో దూరవు గదా!

తాత్పర్యం: మాపైకి దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నారని నేరమంతటినీ పాండవులమీద మోపితే మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణుడు, భీష్ముడు, నీ తండ్రి ధృతరాష్ట్రుడు ఒకరి తరువాత మరొకరు చెప్పే హితవచనాలు నీవు వినటమే లేదు.

క. శాంతిం బొందుట నీకుం । గుంతీ పుత్త్రులకు మేలగున్; దానిక యే
నింతయు నాడెద; నది నీ । కెంతయు రుచియింపకునికి యెఱిఁగి యెఱిఁగియున్. 370

ప్రతిపదార్థం: శాంతిన్+పొందుట= క్రోధాదులు విడిచి ఒద్దికగా మెలగటం; నీకున్= నీకూ; కుంతీపుత్రులకున్= పాండవులకూ; మేలు+అగున్= శ్రేయోదాయకం; నీకున్= నీకు; అది+ఎంతయున్= అదేమాత్రం; రుచియింపక+ఉనికి= ఇష్టం కాకుండటం; ఎఱిఁగి+ఎఱిఁగియున్= బాగా తెలిసికూడా; దానికిన్+అ= మీరు శాంతితో జీవించటం కొరకే; ఏను= నేను; ఇంతయున్+ ఆడెదన్= ఇంతగా చెపుతున్నాను.

తాత్పర్యం: శాంతి వహించటం నీకూ, పాండవులకూ మిక్కిలి మంచిది. పాండవులతో పొత్తు నీకు బొత్తిగా గిట్టదని తెలిసికూడా శాంతికోసం నేనింతగా నీకు నొక్కి చెపుతున్నాను.

వ. అని యిట్లు నారాయణుండు నానా ప్రకారంబులం జెప్పుటకుఁ గటకటం బడియెడు దుర్యోధనునకు దుశ్శాసనుం డిట్లనియె: 371

ప్రతిపదార్థం: అని+ఇట్లు; నారాయణుండు; నానా ప్రకారంబులన్= పలురకాలుగా; చెప్పుటకు; కటకటంబడియెడు= బాధపడుతున్న; దుర్యోధనునకున్; దుశ్శాసనుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ రకంగా నారాయణుడు బహు విధాల హితవాక్యాలు పలుకుతుంటే వినటానికి బాధపడుతున్న దుర్యోధనుడితో దుశ్శాసనుడు ఇట్లా అన్నాడు:

మ. 'జనకుండున్ గురుభీష్ములుం దగిన కర్జం బాప్తులై నీకుఁ బ్రీ
తి నెఱింగించు తెఱంగు గాదు తమబుద్ధిం బోయి సంధాన మి
ట్లొనరం జేయకయున్నఁ గృష్ణుకు నిన్నొప్పించు వా; రింతవ
ట్టు నిజం; బిచ్చట నింక నీయునికి నెట్లుం గీడు వుట్టుం జుమీ! 372

ప్రతిపదార్థం: జనకుండున్= మన తండ్రీ; గురుభీష్ములున్= ద్రోణుడూ; భీష్ముడూ; తగిన కర్జంబు= యోగ్యమైన పని; ఆప్తులు+ఐ= ఇష్టులై; నీకున్= నీకు; ప్రీతిన్= ప్రేమతో; ఎఱింగించు తెఱంగు కాదు= తెలిపే తీరు కానేకాదు; తమ బుద్ధిన్+ పోయి= తాము చెప్పిన త్రోవ ననుసరించి; సంధానము= సంధి; ఇట్లు= వారు చెప్పినట్లు; ఒనరన్= సముచితంగా; చేయక+ ఉన్నన్= నీవు చేయకపోతే; కృష్ణునకున్= వాసుదేవుడికి; నిన్నున్= నిన్ను; ఒప్పించువారు= అప్పగిస్తారు; ఇంతవట్టు నిజంబు= నేను చెప్పుచున్నది వాస్తవం; ఇచ్చటన్= ఇక్కడ; ఇంకన్= ఇటుమీద; నీ+ఉనికిన్= నీవుండుటవలన; ఎట్లున్= ఏవిధంగానైనా; కీడు+పుట్టున్+చుమీ!= హాని కల్గుతుంది సుమా!

తాత్పర్యం: మన తండ్రీ, ద్రోణాచార్యులూ, పితామహుడూ నీ మేలు కోరి కర్తవ్యం ప్రేమతో నీకు చెప్పేవిధం ఇది కానేకాదు. తాము చెప్పినట్లుగా విని నీవు పాండవులతో పొత్తు కుదుర్చుకొనకుంటే నిన్ను వీరు శ్రీకృష్ణుడికి వశం చేస్తారు. ఈ మాట నిజం. ఇక ఇక్కడ నీ వుండటం చేత ఏ విధంగానైనా హాని కలుగుతుంది సుమా!

ఆ. అనిన బాహ్లికాదులగు కురువృద్ధుల । నాత్మజనకుఁ గృష్ణు నాదరింప
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన । లేచిపోయె సంచలించెఁ గొలువు. 373

ప్రతిపదార్థం: అనినన్= అని దుస్ససేనుడు చెప్పగా; బాహ్లిక+ఆదులు+అగు= శంతనుడి తమ్ముడైన బాహ్లికుడు మొదలైన; కురువృద్ధులన్= కౌరవులలో వయసు మళ్ళినవారినీ; ఆత్మజనకున్= తన తండ్రినీ; కృష్ణున్= నారాయణుడినీ; ఆదరింపక= గౌరవించక; అతఁడు= దుర్యోధనుడు; రాజసమునన్= దురహంకారంతో; అప్పుడు= ఆ సమయాన; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= సభనుంచి నిష్క్రమించాడు; కొలువు= సభ; సంచలించెన్= కలవరపడింది.

తాత్పర్యం: దుశ్శాసనుడు అట్లా చెప్పగానే బాహ్లికుడు మొదలైన కురువంశ వృద్ధులనూ, తమ తండ్రినీ, వాసుదేవుడినీ లెక్కించకుండ దుర్గర్వంతో దుర్యోధనుడు సభనుంచి వెంటనే లేచి వెళ్ళాడు. కొలువంతా కలవరపాటు చెందింది.

తే. **అతని వెనుకన కర్ణుండు ననుజగణము । శకునియును వారి పొందైన జనపతులును**
బోయి రమ్మెయిఁ జని యొక్క ప్రోవుగట్టి । వేఱ యంతంత నుండిరి కోఁతడమున. **374**

ప్రతిపదార్థం: అతని వెనుకన్+అ= దుర్యోధనుడి వెంబడే; కర్ణుండున్= రాధేయుడూ; అనుజగణమున్= తమ్ముళ్ళ గుంపూ; శకునియును= సౌబలుడూ; వారిపొందు+ఐన= వారికి అనుకూలురైన; జనపతులును= రాజులున్నూ; పోయిరి= వెళ్ళారు; ఆ+మెయిన్+చని= ఆ విధంగా వారు వెళ్ళి; ఒక్క ప్రోవు+కట్టి= ఒక గుంపుగా చేరి; కోఁతడమునన్= క్రోధంతో; వేఱ= ప్రత్యేకంగా; అంతంతన్+ఉండిరి= కొంతదూరంలో ఉన్నారు.

తాత్పర్యం: దుర్యోధనుడి వెంట కర్ణుడు, సహోదరుల సమూహం, శకుని, మిత్రులైన రాజులు సభనుండి ఆ విధంగా లేచిపోయి గుంపుగట్టి క్రోధంతో వేఱుగా కొంచెం దూరంలో ఉండిపోయారు.

వ. **ఇ ట్లున్నం గనుంగొని గాంగేయుండు.** **375**

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్నన్= వారిట్లుండగా; కనుంగొని= చూచి; గాంగేయుండు= గంగకొడుకైన భీష్ముడు.

తాత్పర్యం: దుర్యోధనాదులు సభనుంచి అట్లా లేచిపోయి ఒకచోట గుంపుగా చేరి ఉండగా చూచి గంగా పుత్రుడిట్లా అన్నాడు:

చ. **'ఇతఁ డిదియేల క్రొవ్వి ధరణీశుఁడ నంచు వృథాభిమానియై**
మతిచెడి లోభమోహ మదమత్సరముల్ దనుఁ ద్రిప్ప ని ట్లసం
గతమునఁ బోయె; వీని వెనుకం జని రేమి దలంచియో మహీ
పతులును; వీరు గొంద అతి పౌరుష మానసు లేమిచేయుదున్?' **376**

ప్రతిపదార్థం: ఇతఁడు= దుర్యోధనుఁడు; ఇది+ఏల= ఇట్లెందుకు; క్రొవ్వి= మదించి; ధరణీ+ఈశుఁడన్+అంచున్= భూపతిననుచు; వృథా+అభిమాని+ఐ= వ్యర్థమైన అహంకారం కలవాడై; మతిచెడి= బుద్ధిలేక; లోభమోహమదమత్సరముల్= దురాశ, అజ్ఞానం, పొగరు, ద్వేషం అనే దుర్గుణాలు; తనున్= తనను; త్రిప్పన్= పట్టి ఆడించగా; ఇట్లు= ఈ ప్రకారంగా; అసంగతమునన్+పోయెన్= అమర్యాదగా వెళ్ళాడు; వీని వెనుకన్= ఈ దుర్యోధనుని వెనుకనే; ఏమి తలంచియో= ఏమి భావించిరోగాని; మహీపతులును= రాజులును; చనిరి= వెళ్ళారు; వీరు కొందఱు= వీరిలో కొంతమంది; అతి పౌరుషమానసులు= మిక్కిలి పౌరుషంతో కూడిన మనస్సులు కలవారు; ఏమి చేయుదున్?= ఏమి చేసేది? (ఏమి చేయటానికీ తోచటం లేదని భావం).

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు తానూ ఒక రాజునని కొరమాలిన అహంకారంతో పొగరెక్కి, బుద్ధిలేక, అత్యాశ, అజ్ఞానం, మదం, ఈర్ష్య అనే దుర్గుణాలకులోనై, అమర్యాదగా సభనుండి లేచివెళ్ళాడు. ఏ ఉద్దేశంతోనో వీని వెంబడి మరికొందరు రాజులు కూడా వెళ్ళిపోయారు. వీరు కొంతమంది మిక్కిలి పౌరుషంతో కూడిన మనసులు కలవారు. ఇప్పుడేమి చేయవలెనో తోచటం లేదు.'

విశేషం: అలం: సముచ్చయం.

తే. **అని జనార్దనుఁ గనుఁగొని 'యకట' కాల । పక్వమయ్యె నీ నరపతి ప్రతతి కెల్ల !**
ననుడుఁ దగువారి దెసఁ గలయంగఁ జూచి । తగవు మెయి నిట్టులనియె నన్నగధరుండు. **377**

ప్రతిపదార్థం: అని; జనార్దనున్+కనుఁగొని= అంటూ శ్రీకృష్ణుడిని చూచి; అకట!= అయ్యో!; ఈ నరపతి ప్రతతికిన్+ఎల్లన్= ఈ రాజసమూహాని కంతకూ; కాలపక్వము+అయ్యెన్= కాలం పండింది సుమా; అనుడున్= అని పల్కగా; ఆ+నగధరుండు= ఆ గోవర్ధనగిరినెత్తిన గోవిందుడు; తగు వారిదెసన్= యోగ్యులైన వారివైపు; కలయంగన్+చూచి= తేరిపార చూచి; తగవు మెయిన్= ధర్మయుక్తంగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుడి వంక చూచి ఈ రాజులందరికీ వినాశకాలం దాపురించినట్లుంది అని అనగానే శ్రీకృష్ణుడు సభలో యోగ్యులైనవారి వైపు చూచి న్యాయసమ్మతంగా ఇట్లా ప్రసంగించాడు.

శా. **'ఈ దుర్యోధనుఁ డింత గర్వియగునే । యీ యున్నవారెల్ల నా**
చే దైన్యంబునఁ బొందు టొప్పదని చర్చింపండ; యీ భంగికిన్
లేదే యొండు దెఱంగు? సత్కులముఁ బాలింపంగ వర్జింపరా
దే? దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ? బోదే భేద మీ జాతికిన్? **378**

ప్రతిపదార్థం: ఈ దుర్యోధనుఁడు= ఈ సుయోధనుడు; ఇంత గర్వి+అగునే= ఇంతటి పొగరుబోతు అవుతాడా? ఈ+ఉన్నవారు+ఎల్లన్= ఇక్కడున్న రాజులంతా; నాచేన్= నావలన; దైన్యంబునన్+పొందుట= దీనత్వం పాలుకావడం; ఒప్పదు+అని= తగదని; చర్చింపండ?= ఎందుకు ఆలోచించడు?; ఈ భంగికిన్= దుర్యోధనుడి ఈ రీతి వ్యవహారానికి; ఒండు తెఱంగు లేదే?= మరొక మార్గం ఏదీ లేదా?; సత్కులమున్= సద్వంశమును; పాలింపఁగన్= కాపాడటానికి; దుష్టాత్మకున్= చెడుబుద్ధిగలవాడిని; నీచున్= అల్పుడిని; ఒక్కరునిన్= ఒక్కడిని; వర్జింపన్‌రాదే?= పరిత్యజించ తగదా? ఈ జాతికిన్= ఈ కౌరవజాతికి; భేదము పోదే!= ఈ చీలిక తొలగదా?

తాత్పర్యం: 'ఈ సుయోధనుడి కింత పొగరా? ఈ సభలో ఉన్న రాజులందరూ 'నా చేత దైన్యం అనుభవించటం తగ'దని ఆలోచించకున్నారు. ఈతడి అనుచిత ప్రవృత్తి మాన్పటానికి మరో మార్గ మేదీ లేదా? సద్వంశాన్ని సంరక్షించటానికి ఆ కుటుంబంలో పుట్టిన దుష్టచిత్తుడు, అల్పుడు అయిన ఒకే ఒకడిని పరిత్యజించటం తగదా? ఈ కౌరవ జాతి కేర్పడిన పీడ తొలగదా?

ఉ. **కంసుఁడు నిట్ల తండ్రి మది గందెడు చంద మొనర్చి ధర్మ వి**
ధ్వంసము సేసినం గులమువారలు నా కెఱిఁగింప నేను దు

ర్మాంసము గోయు వైద్యుని క్రమంబున నాతనిఁ ద్రుంచి యన్వయో
త్తంసముఁ జేయనే జనకుఁ; దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్? **379**

ప్రతిపదార్థం: కంసుఁడున్= కంసుడుకూడ; ఇట్లు+అ= ఈ దుర్యోధనుడివలెనే; తండ్రి మది= జనకుడైన ఉగ్రసేన మహారాజు చిత్తం; కందెడు చందము+ఒనర్చి= కుమిలిపోయేటట్లు చేసి; ధర్మ విధ్వంసమున్+చేసినన్= ధర్మాన్ని నిర్మూలించగా; కులమువారలు= భోజవంశంలో పుట్టినవారు; నాకున్= నాకు; ఎఱిఁగింపన్= తెలుపగా; నేను= నేను; దుర్మాంసమున్= చెడుమాంసాన్ని; కోయు= ఖండించే; వైద్యుని క్రమంబునన్= చికిత్సకుడి విధాన; ఆతనిన్= కంసుడిని; త్రుంచి= సంహరించి; జనకున్= అతని తండ్రి అయిన ఉగ్రసేనుడిని; అన్వయ+ఉత్తంసమున్+చేయనే?= కులమునకు పెద్దగా చేయలేదా?; తద్+విధము= ఆ రీతి; మీరున్ చేసినన్= మీరు కూడా సల్పినచో; ఒప్పదె?= బాగుండదా?

తాత్పర్యం: కంసుడు ఈ విధంగానే తండ్రి మనసు నొప్పించి ధర్మాన్ని నశింపజేస్తుంటే కులబంధువులు వచ్చి నాకు చెప్పుకొన్నారు. చెడుమాంసాన్ని కోసివైచే వైద్యుడివలె నేను ఆ దుష్టుడిని సంహరించి అతడి జనకుడైన ఉగ్రసేనుడికి రాజ్యపట్టం కట్టి కులానికి మేటిగా చేశాను. మీరున్నూ అట్లా చేయటం సముచితంగా ఉండదా?

విశేషం: అలం: ఉపమ.

ఆ. **అంతతోడ నెల్ల యాపదలును దీఱు । వంశ మధిక గౌరవంబు నొందుఁ**
గూడి మనుట గలుగుఁ గురు పాండవులకు ని । త్తెఱఁగు సూడ మీకు నుఱవకాదె? **380**

ప్రతిపదార్థం: అంతతోడన్= అంతటితో; ఎల్ల+ఆపదలును= అన్నికష్టాలూ; తీఱున్= తొలగిపోతాయి; వంశము= కౌరవ వంశం; అధికగౌరవంబున్+ఒందున్= మిక్కిలి ఆదరణ పొందుతుంది; కురుపాండవులకున్= కౌరవులకూ, పాండవులకూ; కూడిమనుట+కలుగున్= కలసి జీవించటం సమకూడుతుంది; ఈ తెఱఁగు చూడన్= ఆలోచిస్తే ఈ ప్రక్రియ; మీకున్= మీకు; ఉఱవు+అ కాదె!= ఉచితమే కదా!

తాత్పర్యం: దుర్యోధనుడి పీడ విరగడ కావటంతో అన్ని కష్టాలు తీరుతాయి. కురువంశం మిక్కిలి గౌరవం పొందుతుంది. కురుపాండవులకు కలసి జీవించే భాగ్యం లభిస్తుంది. కనుక నే చెప్పిన మార్గం మీకు సముచితమైనది కదా!'

వ. **అనిన విని ధృతరాష్ట్రుం డదరిపడి విదురున కిట్లనియె:** **381**

ప్రతిపదార్థం: అనినన్+విని= శ్రీకృష్ణుడట్లా చెప్పగా ఆలించి; అదరిపడి= భయపడి; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సదస్యులతో శ్రీకృష్ణు డన్న మాటలు విని ధృతరాష్ట్రుడు బెదరిపోయి విదురుడితో ఇట్లా అన్నాడు:

ఆ. **'బుద్ధిమంతురాలు పొందుగఁ బలుకంగ । నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చిపోవుఁ**
గాన వేగ నీవు గాంధారిఁ దోడితె' । మ్మనుడు నరిగి యతఁడు నట్లచేసె. **382**

ప్రతిపదార్థం: బుద్ధిమంతురాలు= తెలివిగలది; పొందుగన్= తగినట్లు; పలుకంగన్+నేర్చున్= మాటలాడటం తెలిసినట్టిది; వచ్చి= ఇక్కడికి వచ్చి; కొడుకున్= కుమారుడిని; తేర్చిపోవున్= ప్రసన్నుడిని చేసి వెళ్ళుతుంది; కానన్= కాబట్టి; వేగ= శీఘ్రమే; నీవు= నీవు; గాంధారిన్= గాంధారీదేవిని; తోడితెమ్ము= పిలుచుకొనిరమ్ము; అనుడున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; అరిగి= వెళ్ళి; అతఁడు= విదురుడు; అట్ల చేసెన్= ఆమెను సభకు వెంటబెట్టుకొని వచ్చాడు.

తాత్పర్యం: 'గాంధారి తెలివిగలది. తగినట్లు మాట్లాడే నేర్పున్నది. ఇక్కడికి వచ్చి తన కుమారుడిని శాంతింపజేస్తుంది. నీవు త్వరగా వెళ్ళి ఆమెను సభకు తోడ్కొనిరమ్ము' అని ధృతరాష్ట్రుడు చెప్పగా విదురుడు వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొని వచ్చాడు.

వ. అద్దేవియు. 383

తాత్పర్యం: ఆ గాంధారీ దేవియును.

క. చనుదెంచి యుచిత పీఠం । బున నున్నం గురువిభుండు పొలఁతుకతో ని
ట్లను; నీ తనూభవుఁడు దు । ర్వినయంబునఁ జనియె; నిట్టి వెంగలి గలఁడే? 384

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ఉచిత పీఠంబునన్+ఉన్నన్= తగిన ఆసనంపై ఉండగా; కురువిభుండు= కురు రాజైన ధృతరాష్ట్రుడు; పొలఁతుక తోన్= పత్ని అయిన గాంధారితో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; నీ తనూభవుఁడు= నీ కుమారుడు; దుర్వినయంబునన్= అవిధేయతతో; చనియెన్= సభనుంచి లేచి వెళ్ళాడు; ఇట్టి వెంగలి+కలఁడే?= ఇటువంటి మూర్ఖుడున్నాడా?

తాత్పర్యం: గాంధారి విదురుడి వెంట వచ్చి తగిన పీఠంమీద కూర్చున్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు. ఆమెతో ఇట్లా అన్నాడు. 'నీ కుమారుడు అవిధేయుడై సభనుంచి వెళ్ళిపోయాడు. ఇట్లాంటి మూర్ఖుడు ఎక్కడైనా ఉన్నాడా?'

విశేషం: దుర్యోధనుడు తనకూ కొడుకైనప్పటికీ, భార్యయైన గాంధారితో మన తనూభవుడనక 'నీ తనూభవుఁ' డనటం లోక సహజం. (సంపా.)

క. నీవైనఁ జెప్పి శాంతుం । గావింపఁగ నోపుదేనిఁ గౌరవకుల మీ
గోవిందు శాసనము సం । భావింపం గాంచి చెడక బ్రదుకుంజుమ్మీ! 385

ప్రతిపదార్థం: నీవు+ఐనన్+చెప్పి= నీవైనా తెలిపి; శాంతున్+కావింపఁగన్= ప్రసన్నుడిని కావించటానికి; ఓపుదు(వు)+ఏనిన్= చాలి ఉంటే; కౌరవకులము= కురువంశం; ఈ గోవిందుశాసనమున్= ఈ ముకుందుడి యొక్క ఆజ్ఞను; సంభావింపన్+కాంచి= ఆదరించగల్గినదై; చెడక= నశించక; బ్రదుకున్+చుమ్మీ!= జీవించును సుమా!

తాత్పర్యం: 'నీవైననూ చెప్పి దుర్యోధనుడిని శాంతింపజేయగలిగితే శ్రీకృష్ణుడి ఆజ్ఞ ఆదరించబడినదై, ఈ కురువంశం నశించక బ్రతికి ఉంటుంది.'

తే. అనుడు 'నీ పుత్త్రుఁ డవినీతుఁ డగుట యెఱిఁగి । యెఱిఁగి వాని వశంబున నేలపోయె
దీవు పాండవులకు నేమియిచ్చితేని । నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప! చెపుమ.' 386

ప్రతిపదార్థం: అనుడున్= అని ధృతరాష్ట్రుడు పలుకగా; నీ పుత్త్రుఁడు= నీ కుమారుడు; అవినీతుఁడు= అణకువ లేనివాడు; అగుట= అయి యుండుట; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసికూడ; వాని వశంబునన్+ఏల పోయెదు(వు)?= వాడికి లోబడి ఎందుకు మెలగుతావు?; ఈవు= నీవు; పాండవులకున్= పాండు కుమారులకు; ఏమి+ఇచ్చితి+ఏనిన్= ఏమిచ్చినప్పటికిన్నీ; అధిప!= రాజా!; ఎవ్వరికిన్+అడ్డపడన్ వచ్చున్?= కాదని చెప్పటానికి ఎవరితరం?; చెపుమ= నీవే చెప్పుము.

తాత్పర్యం: 'రాజా! నీ కొడుకు అవిధేయుడని తెలిసి తెలిసి వాని ఇష్ట ప్రకారం ఎందుకు వ్యవహరిస్తావు? నీవు పాండుకుమారులకు ఏమిచ్చినా వద్దని నీకు అడ్డుపడే వారెవరో నీవే చెప్పు.'

విశేషం: ధృతరాష్ట్రుడు గాంధారితో 'నీ తనూభవు' డంటే, ఆమెకూడా తదనుగుణంగానే 'నీ పుత్త్రు' డనటం గమనించదగింది. లోకంలో కొడుకు చెడ్డవాడైతే తల్లి దండ్రులిట్లా ఎవరిమట్టుకు వారు అతడిని తన కొడుకు కాడనటం పరిపాటి. 'నీ కొడుకని అంటావేమి? నీకు మాత్రం కొడుకు కాడా? అని యెత్తిపొడుపు. 'అధిప' అనే సంబోధనం కూడా సాభిప్రాయం. నీవు అధిపుడవు. ఏమయినా చేయగల సమర్థుడివి. పాండవులకు ఏమి ఇస్తే నిన్ను వారించగలిగే వారెవరున్నారు? నీవు రాజువు కదా! అందుచే తప్పంతా నీదే అంటోంది గాంధారి. (సంపా.)

క. అని గాంధారి పతియుఁ దా । నును విదురుం బనిచె నందనుం బిలువ; నతం
డును మొగము జేవుఱింపఁగఁ । జనుదెంచెను సభకు విదుర సంప్రార్థితుఁడై. 387

ప్రతిపదార్థం: అని గాంధారి= అని గాంధారి పలికి; పతియున్= తనభర్త అగు ధృతరాష్ట్రుడూ; తానును= తానూ; నందనున్= కుమారుడైన దుర్యోధనుడిని; పిలువన్= పిలుచుకొని రావటానికి; విదురున్= విదురుడిని; పనిచెన్= పంపారు; విదుర సంప్రార్థితుఁడు+ఐ= విదురుడిచే వేయబడినవాడై; అతండును= ఆ దుర్యోధనుడూ; మొగము జేవుఱింపఁగన్= ముఖం క్రోధంతో ఎర్రబడగా; సభకున్= కొలువులోనికి; చనుదెంచెను= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా గాంధారి వచించి తానూ ధృతరాష్ట్రుడూ దుర్యోధనుడిని సభకు పిలుచుకొనిరమ్మని విదురుడిని పంపారు. విదురుడు వెళ్ళి రమ్మని చెప్పగా సుయోధనుడు కోపంతో ముఖం ఎర్రపడగా సభకు వచ్చాడు.

వ. మున్ను దనతోడం జనిన వార లందఱు నచ్చోటన నిలువ నిట్లువచ్చి సుయోధనుండు నిజాసనాసీనుండై యున్నఁజూచి తల్లి చిత్తంబున గర్హించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁదెరువును నిజశక్తియు సహాయంబు గొలందియుఁ గులజన చిత్త ప్రకారంబున బాండుపుత్త్రుల బలపరాక్రమంబులుఁ దెలియునట్లుగాఁ దెఱంగుపడం జెప్పి, బుజ్జగించియుం గినిసియు ననేక విధంబుల నాడిన నమ్మాటల దెస ననాదరంబు సేసి యుద్ధతిం గ్రమ్మఱం జని యతండు కర్ణాదులం గలిసి వారునుం దానును దుర్మం త్రంబునకుం జొచ్చి. 388

ప్రతిపదార్థం: మున్ను= మునుపు; తనతోడన్చనినవారలు= తనతో వెళ్ళినవారు; అందఱున్; ఆ+చోటన్+అ= అక్కడే; నిలువన్; ఇట్లు వచ్చి= ఈ విధంగా వచ్చి సుయోధనుండు; నిజ+ఆసన+ఆసీనుండు+ఐ= తన పీఠంమీద కూర్చున్నవాడై; ఉన్నన్; చూచి; తల్లి; చిత్తంబునన్= మనసులోపల; గర్హించుచున్= నిందిస్తూ; అతనికిన్; ధర్మంబును; నీతియును; చుట్టఱికంబును; బ్రదుకు+తెరువును= జీవనోపాయం; నిజశక్తియున్= అతనిశక్తిని; సహాయంబు కొలఁదియున్= ఆతడికి జరిగేసాయం యొక్క మోతాదు; కులజన చిత్తప్రకారంబును= కుల బంధువుల యొక్క మనోవైఖరి; పాండు పుత్త్రుల బల పరాక్రమంబులున్;

తెలియునట్లుగాన్; తెఱంగుపడన్+చెప్పి= తేటతెల్లంగా తెలిపి; బుజ్జగించియున్= బతిమాలుకొనియూ; కినిసియున్= కోపించియూ; అనేకవిధంబులన్= పలు రకాల; ఆడిన= పల్కినట్టి; ఆ+మాటల దెసన్= ఆ పలుకులయెడ; అనాదరంబు+చేసి= ఆదరం చూపక; ఉద్ధతిన్= గర్వంతో; క్రమ్మఱన్+చని= మరల వెళ్ళి; అతండు= దుర్యోధనుడు; కర్ణ+ఆదులన్+కలిసి= కర్ణుడు మొదలైనవారితో చేరి; వారునున్= ఆ కర్ణాదులు; తానును; దుర్మంత్రంబునకున్+చొచ్చి= దురాలోచనకు పూనుకొని.

తాత్పర్యం: మునుపు తనతోపాటు సభనుండి లేచి వచ్చిన వారంతా అక్కడే నిలువగా దుర్యోధనుడు తానొక్కడే వచ్చి తన పీఠంమీద కూర్చున్నాడు. గాంధారి అతడిని గమనించి మనసులో తిట్టుకొంటూ అతనికి ధర్మం, రాజనీతి, బాంధవ్యం, బ్రతికే మార్గం, అతనికున్న శక్తి, సహాయము యొక్క మితి, కురువంశంలోని పెద్దల మనోవైఖరి, పాండవుల శక్తిసామర్థ్యాలు స్పష్టంగా అతడి బుద్ధి కెక్కేటట్లు చెప్పింది. అతడిని బతిమాలి, కోపించి బహువిధాలుగా హితవాక్యాలు పలికింది. కాని, అతడు తల్లిమాటలు నిరాదరించి గర్వంతో మళ్ళీ లేచి వెళ్ళి కర్ణాదులతో చేరి తానూ వారూ దురాలోచనకు పూనుకొన్నారు.

దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱంబెట్టఁ దలంచుట (సం. 5-128-1)

క. **హరి తలఁ పొప్పదు భీష్ముని । గురునిం గూర్చికొని మనలఁ గ్రొవ్వఱఁ బట్టం**
గర ముత్సహించుచున్నాఁ । డరయ నతని వచన రచన నంతయుఁ దెలిసెన్. 389

ప్రతిపదార్థం: హరి తలఁపు+ఒప్పదు= శ్రీకృష్ణుడి సంకల్పం మంచిది కాదు; భీష్మునిన్= గాంగేయుడిని; గురునిన్= ద్రోణుడిని; కూర్చికొని= తనవైపు చేర్చుకొని; మనలన్= మనందరినీ; క్రొవ్వు+అఱన్= పౌరుషం చెడేటట్లు; పట్టన్= బంధించటానికి; కరము= మిక్కిలి; ఉత్సహించుచున్+ఉన్నాఁడు= యత్నిస్తున్నాడు; అరయన్= పరికించగా; అతని వచనరచనన్= శౌరిమాటల తీరును బట్టి; అంతయున్+తెలిసెన్= సమస్తం వెల్లడి ఐనది.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి ఉద్దేశం మంచిది కాదు. అతడు గురుభీష్ములను తనవైపు కూడ గట్టుకొని, మనందరినీ గర్వమణగేటట్లు పట్టటానికి మిక్కిలి యత్నిస్తున్నాడు. ఇదంతా అతడి మాటల తీరును బట్టి వెల్లడి ఔతున్నది.

విశేషం: నిజానికి కృష్ణుడిని బంధింప జూచేది తానూ తన మిత్రులూ, కృష్ణుడే తనను బంధింపజూస్తున్నాడనటం విడ్డూరం. దుష్టుడైన దుర్యోధనుడు తాను చేయబోయే దౌష్ట్యానికి హేతువును కల్పిస్తున్నాడు. (సంపా.)

క. **మునుఁ దాఁ గంసునిఁబరి మా । ర్చిన చందము వారికెల్లఁ జెప్పెడుఁ; దనకున్**
మును మనము గడఁగి వెసఁబ । ట్టినఁ గార్యం బగుఁ; జలంబు డింపకుఁ డింకన్. 390

ప్రతిపదార్థం: మును= పూర్వం; తాన్= తాను; కంసునిన్ పరిమార్చిన చందమున్= కంసుడిని చంపిన వైనం; వారికిన్+ఎల్లన్= సభలోని భీష్మ ద్రోణాదులందరికీ; చెప్పెడున్= చెపుతున్నాడు; తనకున్ మును= తాను మనలను బంధించటానికి పూర్వమే; మనము= మనమందరమూ; కడఁగి= పూనుకొని; వెసన్= శీఘ్రంగా; పట్టినన్= శౌరిని బంధిస్తే; కార్యంబు+అగున్= మనపని నెరవేరుతుంది; ఇంకన్= ఇంక; చలంబు; డింపకుఁడు= పట్టుదల వదలకండి.

తాత్పర్యం: పూర్వం తాను కంసుడిని సంహరించిన విధమెట్టిదో గురుభీష్మాదులైన మనవారి కందరికీ చెప్పుతున్నాడు. తనకంటె మనమే ముందు మిగిలి అతడిని వెంటనే బంధిస్తే మనపని నెరవేరుతుంది. పట్టుదల మానకండి.

తే. పట్టి యీతనిఁ జెఱఁబెట్టి పాండవులకు । దిగులు పుట్టింత మంతటఁ దెగక యెత్తి
వచ్చిరేనియు నిర్జింప వచ్చుఁ గోఱ । లెల్లఁ బుచ్చిన నురగంబు లేమిసేయు? 391

ప్రతిపదార్థం: ఈతనిన్+పట్టి= శౌరిని పట్టుకొని; చెఱన్+పెట్టి= చెరసాలలో ఉంచి; పాండవులకున్= పాండునందనులకు; దిగులు పుట్టింతము= జాలికలిగేటట్లు చేద్దాము; అంతటన్= అంతటితో; తెగక= వెనుదీయక; ఎత్తివచ్చిరి+ఏనియున్= మనపై దాడి సలిపితే; నిర్జింపన్+వచ్చున్= వారి నోడించవచ్చు; కోఱలు+ఎల్లన్= కోరలన్నీ; పుచ్చినన్= తీసివేస్తే; ఉరగంబులు= పాములు; ఏమి చేయున్?= ఏమి చెయ్యగలవు?

తాత్పర్యం: కృష్ణుడిని పట్టి చెరలో పెట్టి పాండవులకు దిగులు పుట్టిద్దాము. అంతటితో వారు దారికి వస్తారు. ఒకవేళ దారికి రాక మనపైకి దండెత్తి వస్తే వారిని సులువుగా మనం ఓడించవచ్చు. కోరలు తీసిన పాము లేమి చేస్తాయి?

విశేషం: అలం: నిదర్శన.

వ. అని విచారించె నట్లు దుష్కార్యాలోచనంబు సేసి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులగు దుష్టచతుష్టయంబు మొదలుగాఁ గల యవినీతులు దైతేయమర్దను మర్దింప నిశ్చయించి; రయ్యవసరంబున. 392

ప్రతిపదార్థం: అని విచారించెన్= అని దుర్యోధనుడు ఆలోచించాడు. అట్లు= ఆ విధంగా; దుష్కార్య+ఆలోచనంబు చేసి= చెడుపని చేయటానికి ఆలోచించి; దుర్యోధన దుశ్శాసన; శకుని కర్ణులు; అగు= అనునట్టి; దుష్టచతుష్టయంబు= నలుగురు దుర్మార్గులు; మొదలుగాన్+కల= మున్నుగా ఉన్నట్టి; అవినీతులు= చెడు నడవడికలవారు; దైతేయ మర్దనున్= రాక్షసులను నలగగొట్టిన నారాయణుడిని; మర్దింపన్ నిశ్చయించిరి= పీడించటానికి నిర్ణయించుకొన్నారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కృష్ణుడిని పట్టవలెనని దుష్కార్యాలోచన చేసి, దుష్టచతుష్టయం అని పిలువబడే దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు, ఇంకా వారి పక్షంలో ఉన్న చెడు నడత గలిగిన మరికొందరూ రాక్షసాంతకుడైన శౌరిని బంధించాలని నిశ్చయించుకొన్నారు.

చ. అడఁకువ లేమి నల్కి యురియాడుట నొండొరుఁగూడకుండుటన్
బుడిబుడి మాటలాడుటను బోవుచు వచ్చుచుఁ గ్రందు గ్రమ్మఱం
బడుటను దెల్లమైన మును పన్నుగఁ దాఁ బరికించి యున్కి న
ప్పుడు హరిఁ బట్టు సంకులము పుట్టుట సాత్యకి నిశ్చయించుచున్. 393

ప్రతిపదార్థం: అడఁకువలేమిన్= వినయం లేకుండటంచేత; అల్కి= శంకించి; ఉరియాడుటన్= కళవళపడటం చేతను; ఒండొరున్+కూడక+ఉండుటన్= ఒకరితో మరొకరు చేరకుండటం చేతను; బుడిబుడి మాటలు+ఆడుటను= గుసగుసలాడు కొనటంచేతను; పోవుచున్ వచ్చుచున్= రాకపోకలు సల్పుతూ; క్రందు= సందడి; క్రమ్మఱన్+పడుటను= మరల నేర్పడుట చేతను; తెల్లము+ఐనన్= స్పష్టంకాగా; మును= ముందే; పన్నుగన్= చక్కగా; తాన్= తాను; పరికించి+ఉన్కిన్= గమనిస్తూ ఉండుటచేత; అప్పుడు= ఆ వేళ; హరిన్= శ్రీకృష్ణుడిని; పట్టు సంకులము= బంధించే సంరంభం; పుట్టుట= జనించటం; సాత్యకి= (కృష్ణుడి సోదరుడు); నిశ్చయించుచున్= నిర్ణయిస్తూ

తాత్పర్యం: దుర్యోధనాదులు వినయరహితులై భయంతో కళవళించటం, ఒకరి నొకరు చేరకుండటం, ఒకరితో ఒకరు గుసగుసలాడుకొనటం, అటునిటు తిరుగులాడుతుండటంవల్ల సందడి హెచ్చటం - ఈ లక్షణాలవల్ల

విషయం విశదమై ముందుగానే అంతా చక్కగా గమనించటం వల్ల శౌరిని బంధించే సంరంభం ఏర్పడిందని అప్పుడు సాత్యకి నిర్ణయిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: సముచ్చయం.

తే. బఱటి కొనిపోయి కృతవర్మఁ బన్నఁ బనిచె। నీవు బలమును వాఁకిట నిలువు; మేను
లోపలికి నెల్లఁ జాలుదుఁ; బాపబుద్ధు। లన్నదెసఁ దప్పిరని నిర్భయమునఁ జెప్పె. 394

ప్రతిపదార్థం: బఱటి= సైగగా గోకి; కొనిపోయి= తనవెంట తీసికొనివెళ్ళి; కృతవర్మన్= కృతవర్మను; పన్నన్+పనిచెన్= యుద్ధానికి తలపడుమని చెప్పాడు; నీవును= నీవూ; బలమును= సేనలూ; వాఁకిటన్= సభాద్వారమునందు; నిలువుము= నిలబడండి; ఏను= నేను; లోపలికిన్+ఎల్లన్= సభలోపలి పని కంతటికీ; చాలుదున్= సరిపోతాను; పాపబుద్ధులు= దురిత చిత్తులైన దుర్యోధనాదులు; అన్నదెసన్+తప్పిరి= అన్నపట్ల దౌష్ట్యానికి దిగారు; అని, నిర్భయమునన్+చెప్పెన్= నిర్భీతితో పలికాడు.

తాత్పర్యం: సాత్యకి సైగచేసి కృతవర్మను తనవెంట కొనిపోయి 'నీవు యుద్ధానికి సంసిద్ధంగా ఉండు. నీవూ, సేనలూ వాకిట నిలబడండి. సభలోని సంగతి నంతా నేను చూచుకొంటాను. దురితచిత్తులై దుర్యోధనాదులు అన్నపట్ల అక్రమ మార్గానికి దిగారు' అంటూ నిర్భయంగా పలికాడు.

వ. ఇట్లు పరమాప్తుండగు హార్దిక్యు నటపుచ్చి సాత్యకి సత్వరంగాఁ జనుదెంచి జనార్దనునకు నత్తెఱంగెల్ల
నెఱింగించి, తదనుమతిం గౌరవేశ్వర బాహ్లిక గురు భీష్మ విదురులతో నిట్లనియె. 395

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పరమ+ఆప్తుండు+అగు= మిక్కిలి హితుడైన; హార్దిక్యున్= కృతవర్మను (హృదికుని కొడుకు); అట+పుచ్చి= సభ వెలుపల ఉండుమని పంపి; సాత్యకి; సత్వరంబుగాన్= వేగంగా; చనుదెంచి= వచ్చి; జనార్దనునకున్= శ్రీకృష్ణుడికి; ఆ+తెఱంగు= ఆ విధమంతయు; ఎఱింగించి; తత్+అనుమతిన్= అచ్యుతుడి అంగీకారంతో; కౌరవేశ్వర; బాహ్లిక గురు; భీష్మ; విదురుల తోన్= ధృతరాష్ట్రుడు, బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు, విదురుడు అనువారితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ఈ విధంగా పరమహితుడూ యాదవుడూ అయిన కృతవర్మను సభ వాకిట పోరాటానికి సంసిద్ధంగా ఉండుమని పంపి, తాను శీఘ్రంగా కొలువు లోనికి వచ్చాడు. శ్రీకృష్ణుడికి విషయమంతా చెప్పి, ఆయన అంగీకారంతో ధృతరాష్ట్ర బాహ్లిక గురు భీష్మ విదురులతో ఇట్లా అన్నాడు:

మ. 'అదె కౌరవ్యు లశక్తదుర్జనత సేయంబూని పైఁ బాఱఁజూ
చెద రమ్మైఁ దమచేతఁ దీఱునె జయశ్రీకాంతు దైత్యాంతకుం
బొదువం దారు దలంచు టెల్ల ననలంబుం జీర బంధింపఁగా
మది నూహించిన యట్లకాక తమ దుర్మంత్రంబులం బోవునే?' 396

ప్రతిపదార్థం: అదె= అదిగో; కౌరవ్యులు= కురుకుమారులు; అశక్త దుర్జనతన్+చేయన్+పూని= శక్తి లేనందున దౌర్జన్యం జరుపనెంచి; పైన్+పాఱన్+చూచెదరు= శ్రీకృష్ణుడి మీదికి ఉరుక యత్నిస్తున్నారు; అమ్మైన్= (ఆ+మైన్) ఆ విధంగా

గమకించటం; తమచేతన్+తీఱునె?= తమవలన సాధ్యపడుతుందా?; జయశ్రీకాంతున్= జయలక్ష్మీ వల్లభుడూ; దైత్య+అంతకున్= దానవ వినాశకుడూ అయిన శౌరిని; పొదువన్= పట్టటానికి; తారు= తాము; తలంచుట+ఎల్లన్= సంకల్పించటమన్నది; అనలంబున్= అగ్నిని; చీరన్= వస్త్రంలో; బంధింపఁగాన్= మూట గట్టటానికి; మదిన్= మనస్సులో; ఊహించిన+అట్లకాక= తలంచినట్లే అవుతుందిగాని; తమ దుర్మంత్రంబులన్= తమయొక్క దుష్టాలోచనలతో; పోవునే?= పని నెరవేరుతుందా?

తాత్పర్యం: 'అదుగో! కౌరవులు శక్తిహీనులై దౌర్జన్యం జరుపదలచి శ్రీకృష్ణుడి మీదికి దుముక యత్నిస్తున్నారు. అది తమవల్ల శక్యమవుతుందా? శౌరిని ఏమిగా భావించారో! ఆయన జయలక్ష్మీవల్లభుడు. దైత్య సంహారకుడు, అట్లాంటి పురుషోత్తముడిని పట్టనెంచటం వస్త్రంలో అగ్నిని మూట గట్టటమే అవుతుంది. తమ దురాలోచనల వల్ల పని నెరవేరుతుందా?'

విశేషం: అలం: రూపకం.

వ. అనిన విదురుం డదరిపడి వైచిత్త్రవీర్యున కిట్లనియె: 397

ప్రతిపదార్థం: అనినన్; విదురుండు; అదరిపడి= బెదరిపోయి; వైచిత్త్రవీర్యునకున్= విచిత్రవీర్యుడి కుమారుడైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి మాటలు విని విదురు డదిరిపడి ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'భూవర! నీ తనూభవులు పుణ్యు నగణ్యపరాక్రమున్ హరిం
గేవల మర్త్యుఁగాఁ దలఁచి కిట్టినఁ బట్టినఁ దారు మంటపై
వావిరిఁ గ్రమ్ము నా శలభ వర్గము చాడ్పున మ్రందిపోరె? కా
లావధి యయ్యెఁ గావలయు నక్కట! వారికి వారివారికిన్. 398

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నీ తనూభవులు= నీ కుమారులు; పుణ్యున్= కలుష రహితుడూ; అగణ్య పరాక్రమున్= గణింప శక్యంగాని శౌర్యము కలవాడునూ అయిన; హరిన్= శ్రీమన్నారాయణుడిని; కేవల మర్త్యుగాన్+తలఁచి= సామాన్యుడైన మానవమాత్రుడిగా నెంచి; కిట్టినన్= సమీపించినా; పట్టినన్= బంధించినా; తారు= తాము; మంటపైన్= అగ్నిజ్వాలపై; వావిరిన్= వరుసగా; క్రమ్ము= మూగు; ఆ శలభ వర్గము చాడ్పునన్= ఆ మిడుతలదండువలె; మ్రందిపోరె?= మాడిపోవరా?; అక్కట!= అయ్యో; వారికిన్= కౌరవులకు; వారివారికిన్= వారితో చేరిన వారికందరికినీ; కాల+అవధి+అయ్యెన్+కావలయున్= ఆయుష్యం యొక్క గడువు తీరింది కాబోలు!

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులు సుకృతాత్ముడూ, లెక్కింప శక్యంగాని పరాక్రమం కలవాడూ అయిన శ్రీహరిని సాధారణ నరుడిగా భావించి ఎదుర్కొని బంధించనెంచితే అగ్నిజ్వాలలపై మూగిన మిడుతల దండువలె మాడి మసియైపోతారు. కౌరవులకూ, కౌరవులతో చేరినవారికీ మరణ సమయం ఆసన్నమయిందేమో!'

విశేషం: అలం: ఉపమ.

వ. అనుటయు గోవిందుం డందఱు విన నంబికానందనున కిట్లనియె: 399

ప్రతిపదార్థం: అనుటయున్= అని విదురుడనగా; గోవిందుండు= గోపాలదేవుడు; అందఱువినన్= సభ్యులంతా ఆలకించగా; అంబికానందనునకున్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడట్లా పలికిన మీదట అందరు వింటుండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింతసేఁత సం
తోషమ! నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞయిమ్ము; ని
ర్దోషత నేను నోపుగతి దోర్బల దుర్జయులైన వారి వి
ద్వేషముఁ జక్కఁ బెట్టి జగతీవర! యింతకుఁ బోయివచ్చెదన్.' 400

ప్రతిపదార్థం: జగతీవర!= రాజా!; రోషము= కోపం; నాపయిన్+కలిగి= నామీద జనించి; క్రూరతన్= కర్కశత్వంతో; కౌరవులు= నీ కుమారులు; ఇంతచేఁత= ఇంతపనికి పూనుకొనటం; సంతోషము+అ= నాకు ఆనందమే; నీవు; ప్రాభవముతోన్= రాచరికంతో; తగన్= యుక్తంగా; నాకున్= నాకు; అనుజ్ఞ+ఇమ్ము= ఉత్తరువు నొసగుము; నిర్దోషతన్= దోషం కలుగకుండా; నేనున్= నేనునూ; ఓపుగతిన్= చాలినంతవరకు; దోర్బలదుర్జయులు+ఐన= భుజ విక్రమంతో సులభంగా జయించ రానట్టి; వారి= దుర్యోధనాదుల యొక్క; విద్వేషమున్= వైరమును; చక్కన్+పెట్టి= సరిదిద్ది; ఇంతకున్= ఇటుపై; పోయివచ్చెదన్= పయనమై వెళ్ళుతాను.

తాత్పర్యం: 'మహారాజా! నామీద కినుక వహించి ద్రోహబుద్ధితో కౌరవులింతపనికి పూనుకొన్నారు. చాలా సంతోషం. నీవు నీ రాజాధికారంతో నాకు ఉత్తరువిస్తే నేను దోషమొదవకుండ నా శక్తికొలది బాహుశక్తితో సులభంగా జయించరాని ఈ కురుకుమారుల విరోధాన్ని చక్కబెట్టి, ఆ తర్వాతనే ఇక్కడనుండి పయనమై వెళ్ళుతాను.'

క. అనుడు ససంభ్రమముగ న । జ్జనపతి దుశ్శాసనాది సకల పరిజనం
బును నాదుర్జనునిం దో । డ్కొని రమ్మని విదురుఁ బనుచుడుం జని యతఁడున్. 401

ప్రతిపదార్థం: అనుచున్= అని వాసుదేవుడు పలుకగానే; ససంభ్రమముగన్= తొట్రుపాటుతో; ఆ+జనపతి= ఆ నరేశ్వరుడు అయిన ధృతరాష్ట్రుడు; దుశ్శాసన+ఆది+సకల పరిజనంబును= దుశ్శాసనుడు మొదలైన అనుచరవర్గమునూ; ఆ దుర్జనునిన్= ఆ దుర్మార్గుడైన దుర్యోధనుడినీ; తోడ్కొని రమ్ము+అని= ఇచటికి తీసికొని రమ్ము అని; విదురున్ పనుచుడున్= విదురుడిని పంపగా; అతఁడున్= విదురుడునూ; చని= వెళ్ళి

తాత్పర్యం: వాసుదేవుడి మాటలు విని తొట్రుపాటుతో ధృతరాష్ట్రుడు దుశ్శాసనుడు మొదలైన పరిజనంతోపాటు దుర్మార్గుడైన దుర్యోధనుడిని ఇక్కడికి పిలుచుకొని రమ్మని పంపగా విదురుడు వెళ్ళి.

వ. సపరివారంబుగా దుర్యోధనుం దోడ్తెచ్చినం జూచి యతనికి ధృతరాష్ట్రుం డిట్లనియె: 402

ప్రతిపదార్థం: సపరివారంబుగాన్= పరిజనులతో కూడ; దుర్యోధనున్; తోడ్తెచ్చినన్+చూచి= విదురుడు వెంట బెట్టుక రాగా వీక్షించి; అతనికిన్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడు వెళ్ళి పరిజనులతో కూడ దుర్యోధనుడిని సభకు తోడుకొని వచ్చాడు. అపుడు ధృతరాష్ట్రుడు అతడిని చూచి ఇట్లా అన్నాడు :

చ. 'అలవి యెఱుంగ కిట్లు దనుజారికిఁ గీడొనరింప నీవు నీ
తులువలు నుత్సహించితిరి దుర్మతులార! సమీరు మీకుఁ జే
నలవడఁ బట్టవచ్చునె? మహాద్రిఁ గదల్పఁగఁ బోలునే? దవా
నలుఁ జమరంగ శక్యమె? వినాశముఁ బొందెద రేమి సేయుదున్?' 403

ప్రతిపదార్థం: దుర్మతులార!= దుష్టాత్ములారా!; అలవి+ఎఱుంగక= మీ శక్తి ఏపాటిదో గుర్తించక; ఇట్లు= ఈ ప్రకారంగా; దనుజ+అరికిన్= రాక్షస విరోధి అయిన రాజీవాక్షునకు; కీడు+ఒనరింపన్= హాని కల్గించటానికి; నీవున్= నీవూ; ఈ తులువలున్= ఈ తుంటరులూ; ఉత్సహించితిరి= పూనుకొన్నారు; మీకున్= మీకు; సమీరున్= వాయువును; చేన్+అలవడన్+పట్టన్+వచ్చునే= చేతిలోనికి ఇమిడేటట్లు బంధించటం శక్యమా? మహా+అద్రిన్= గొప్ప పర్వతాన్ని; కదల్పఁగన్+పోలునే?= పెల్లగించతరమా? దవ+అనలున్= కార్చిచ్చును; చమరంగన్+శక్యమె= చేతితో నలపటానికి వీలౌతుందా? వినాశము పొందెదరు= మీరు నశించిపోతారు; ఏమిచేయుదున్?= ఏమనగలను? ఏం చేయగలను?

తాత్పర్యం: 'దుర్బుద్ధి పుట్టి మీ శక్తి ఏపాటిదో తెలిసికొనక దైత్య మర్దనుడైన నారాయణుడికే హాని కల్గించటానికి నీవూ, ఈ తుంటరులూ పూనిక వహించారు. వాయువును చేతిలో ఇముడ్చటానికి వీలవుతుందా? మహా పర్వతాన్ని పెకలించటం సాధ్యమా? కార్చిచ్చును నలచివేయటానికి శక్యమవుతుందా? ఊరక నాశనమై పోతారు సుమా! మిమ్ము నే నేమి చేయగలను?

విశేషం: అలం: నిదర్శన.

ఆ. అనిన విదురుఁ డిట్టులను సుయోధనుతోడ । 'బాలకేళిఁ దొడఁగి లీలఁ గృష్ణుఁ
డెచట నెచట నెవ్వరెవ్వరి నేమేమి । సేసె వినవె? యేల చెడియె దిట్లు?' 404

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడట్లా చెప్పగా; సుయోధనుతోడన్= దుర్యోధనునితో; విదురుఁడు+ఇట్టులు+అనున్= విదురు డిట్లా అన్నాడు; కృష్ణుఁడు= భగవంతుడైన శ్రీకృష్ణుడు; బాలకేళిన్+తొడఁగి= బాలక్రీడలు చేయటానికి ఆరంభించినది మొదలు; లీలన్= వినోదంగా; ఎచటన్+ఎచటన్= ఎక్కడెక్కడ; ఎవ్వరిన్+ఎవ్వరిన్= ఎవరెవరిని; ఏమి+ఏమి+చేసెన్= ఏమేమి చేశాడో; వినవె?= నీవు వినలేదా?; ఇట్లు= ఈ విధంగా; ఏల చెడియెదు(వు)?= ఎందుకు చెడిపోతావు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని చీకొట్టిన తర్వాత విదురు డతనితో ఇట్లా అన్నాడు: శ్రీకృష్ణుడు శైశవక్రీడ లారంభించినప్పటి నుండి ఎక్కడెక్కడ, ఎవ్వరెవ్వరిని, ఏమేమి చేసిందీ నీకు తెలియదా? వృథాగా ఎందుకు నాశనమై పోతావు?

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

వ. అనియె నట్టియెడఁ గట్టెదురనున్న యక్కురుపతికుమారుం జక్కం జూచి యేనొక్కరుండన యని తలంచియె దుర్మదంబునం బొదివి పట్ట నుత్సాహంబు సేసితనుచు దరహాసంబు సేయు వాసుదేవుని ఫాలప్రదేశంబున బ్రహ్మయు, వక్షంబున విరూపాక్షుండును, వదనంబున వహ్నియుఁ, బార్శ్వంబుల నింద్ర యమ వరుణ కుబేరులు నాదిత్యమరుద్విశ్వేదేవాశ్వినులు నుద్భవించిరి హలగాండీవ మండిత బాహులగు బలదేవార్జునులు

సవ్య దక్షిణ భుజంబులను, నిజాయుధ హస్తులగు యుధిష్ఠిర భీమ నకుల సహదేవులు వీఁపునను. వివిధ ప్రహరణ పాణులగు యదువృష్ణి భోజాంధక వీరు లూరులను బ్రభవించిరి; జనిత నానాహస్త విన్యస్తంబులయి శంఖచక్ర గదా ఖడ్గ శక్తి శార్ఙ్గ ప్రముఖ నిఖిల సాధనంబులు వెలింగె; నేత్ర శ్రోత్ర నాసా వివరంబుల సధూమ ధూమకేతు జ్వాలా జాలంబులు నిగిడె; రోమకూప కలాపంబులం దరణి కిరణ నిభ ప్రభలు వెడలె; నిట్లు దుర్నిరీక్షంబగు నత్తేజోరూపంబుఁ గనుంగొనం గొలఁదిగాక సకల జనంబుల నయనంబులు మొగిడ్చి యద్భుత భయానక రసంబుల జొత్తిల్లు చిత్తంబుల తోడం గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాది మహా మునుల వలనను భీష్మవిదుర ద్రోణ సంజయుల యందును గరుణా తరంగితంబగు కటాక్ష వీక్షణం బొలయ వారలకు దివ్య దృష్టి యొసంగిన నా పుణ్యపురుషులు సాంద్రానందంబునం దేలుచుండి; రయ్యవసరంబున.

405

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికినాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కడు+ఎదురన్+ఉన్న= ఎట్ట ఎదుట ఉండిన; ఆ కురుపతికుమారున్+చక్కన్+చూచి= ఆ ధృతరాష్ట్ర పుత్రుని తేరిచూచి; ఏను= నేను; ఒక్కరుండన్+అ+అని= ఒంటరివాడనని; తలంచియె= భావించియేగదా; దుర్మదంబునన్= దురహంకారంతో; పొదివి+పట్టన్= ఆక్రమించి బంధించటానికి; ఉత్సాహంబుచేసితి(వి)= పూనిక వహించావు; అనుచున్= అని పల్కుతూ; దరహాసంబు చేయు= చిరునవ్వు నవ్వుతున్న; వాసుదేవుని ఫాలప్రదేశంబునన్= శ్రీకృష్ణుని యొక్క నొసటిభాగంలో; బ్రహ్మయున్= బ్రహ్మదేవుడూ; వక్షంబునన్= గుండెమీద; విరూప+అక్షుండును= శంకరుడును; వదనంబునన్= ముఖమునందు; వహ్నియున్= అగ్ని; పార్శ్వంబులన్= కుడి యెడమ ప్రక్కలందు; ఇంద్ర= ఇంద్రుడూ, యమ= యముడూ; వరుణ= వరుణుడును; కుబేరులున్= కుబేరుడు అనే దిక్పాలకులున్నూ; ఆదిత్య= ఆదిత్యులు; మరుత్= మరుత్తులు; విశ్వేదేవ= విశ్వేదేవులు; ఆశ్వినులున్= ఆశ్వినులనేవారు; ఉద్భవించిరి= పుట్టారు. హల గాండీవమండిత బాహులు+అగు= నాగలి, గాండీవం అనే ఆయుధాలతో ప్రకాశించే హస్తాలుగల; బలదేవ+అర్జునులు= బలరాముడు, అర్జునుడు; సవ్యదక్షిణ భుజంబుల= ఎడమకుడిచేతులందు; నిజ+ఆయుధ హస్తులు+అగు= తమ తమ ఆయుధాలు చేతులందు కల్గిన; యుధిష్ఠిర= ధర్మజుడు; భీమనకులసహదేవులు; వీఁపునను= వీపునందును; వివిధ ప్రహరణపాణులు+అగు= రకరకాలైన ఆయుధాలు చేతులయందు ధరించిన వారైన; యదువృష్ణి భోజ+అంధక వీరులు= యదువృష్ణి భోజ అంధక వంశాలకు చెందిన శూరులు; ఊరులను= తొడలయందును; ప్రభవించిరి= పుట్టారు; జనిత నానాహస్త విన్యస్తంబులు+అయి= కలిగిన పెక్కుచేతులందు ఉంచబడినవై; శంఖచక్రగదా ఖడ్గ శక్తి శార్ఙ్గ ప్రముఖ= శంఖం చక్రం గద ఖడ్గం శక్తి శార్ఙ్గం మొదలైన; నిఖిల సాధనంబులు= సమస్తములైన ఉపకరణములు; వెలింగెన్= ప్రకాశించాయి; నారాయణుడి శంఖం పేరు పాంచజన్యం; సుదర్శనం ఆయన చక్రం; కౌమోదకి గద; ఖడ్గ నామం నందకం; చాపం పేరు శార్ఙ్గం.

నేత్ర శ్రోత్ర నాసా వివరంబులన్= కన్నులు, చెవులు, ముక్కు అనే అవయవాల యొక్క రంధ్రాల నుంచి; సధూమ= పొగతో కూడిన; ధూమకేతు= అగ్నియొక్క; జ్వాలాజాలంబులు= మంటలయొక్క గుంపులు; నిగిడెన్= వ్యాపించాయి; రోమకూప కలాపంబులన్= రోమకూపాల సమూహమునుండి; తరణి కిరణ= సూర్యకిరణాలతో; నిభ= సమానాలైన; ప్రభలు= కాంతులు; వెడలెన్= బయలుదేరాయి; ఇట్లు= ఈ మాదిరి; దుర్నిరీక్షంబు= చూడటానికి శక్యం కానిది; అగు= అయినట్టి; ఆ తేజోరూపంబున్= ఆ తేజోమయమైన స్వరూపాన్ని; కనుంగొనన్= చూడటానికి; కొలఁది+కాక= తరంకాక; సకల జనంబులు; నయనంబులు= కన్నులు; మొగిడ్చి= మూసికొని; అద్భుత భయానక రసంబులన్= ఆశ్చర్యము; భయానకం అనే రసాలతో; జొత్తిల్లు= తడిసిన; చిత్తంబుల తోడన్= మనసులచే; కదలక+ఉండన్= చలించకుండగా; ఆ+పుండరీక+అక్షుండు= ఆ కమల నయనుడు; నారద+ఆది మహామునులవలనను= నారదుడు మొదలైన మహర్షుల వైపునను; భీష్మ విదుర ద్రోణ

సంజయులందును; కరుణా తరంగితంబు+అగు= కృపారసమున పొంగి పొరలుతున్న; కటాక్ష వీక్షణంబు+ఒలయన్= కడకంటి చూపు ప్రసరించగా; వారలకున్= ఆ మహనీయులకు; దివ్యదృష్టి; ఒసంగినన్= ప్రసాదించగా; ఆ పుణ్యపురుషులు= ఆ సుకృతాత్ములు; సాంద్ర+ఆనందంబునన్= అధికమైన సంతోషము నందు; తేలుచున్+ఉండిరి= ఓలలాడుతూ ఉండిపోయారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఎట్టయెదుటనున్న దుర్యోధనుడిని తేరిపారజూచి 'నేను ఒంటరివాడననే కదా నీవు దుర్గర్వంతో నన్ను పైనబడి బంధించాలని ఉత్సాహపడుతున్నావు అంటూ ఒక చిరునవ్వు నవ్వాడు. అప్పుడు ఆ వాసుదేవుడి నుదుట బ్రహ్మదేవుడు, వక్షఃస్థలంలో రుద్రుడు, ముఖంలో అగ్ని, పార్శ్వ ప్రదేశాలలో ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ద్వాదశాదిత్యులు, మరుత్తులు, విశ్వేదేవతలు, అశ్వినులు జనించారు. నాగలి, గాండీవం చేతులందు ధరించిన బలరాముడు పార్థుడు ఎడమ కుడిచేతుల నుంచి ఉద్భవించారు. వీపునుండి తమ తమ ఆయుధాలు చేతులందు గలిగి ధర్మరాజు, భీమసేనుడు, నకులుడు, సహదేవుడు ఆవిర్భవించారు. అనేకములైన ఆయుధాలు హస్తాలలో ధరించిన యదు, వృష్ణి, భోజక, అంధక వంశాలకు చెందిన తన బంధువులైన వీరు లెందరో శౌరి తొడలనుండి ప్రభవించారు. భగవంతుడైన ఆ పరమ పురుషుడి నానాహస్తాలలో శంఖం, చక్రం, గద, ఖడ్గం, శక్తి, శార్ఙ్గం మొదలైన పలు దివ్యాయుధాలు ప్రకాశించాయి. పురుషోత్తముడి నేత్ర కర్ణ నాసికా రంధ్రాల నుండి పొగతో కూడి అగ్నిజ్వాలల సముదాయం వెలువడి వ్యాపించింది. త్రివిక్రముడి రోమ కూపాలనుండి రవికిరణాలతో సమానమైన కాంతులు వెలువడ్డాయి. ఇట్లా నేత్రాలు మిరుమిట్లు గొలిపే ఆ ముకుందుడి దివ్యతేజ స్స్వరూపం చూడటానికి శక్యం కాక సమస్త జనులు కన్నులు మూసుకొని ఆశ్చర్య భయానక రసాలలో తమ మనస్సులు మునిగి తేలుతుండగా నిశ్చేష్టులయ్యారు. అప్పుడు తెల్ల దామరలవంటి కన్నులు గల ఆ దేవదేవుడు నారదుడు మొదలైన మహర్షుల వైపూ, భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, సంజయుడు అనే వారివైపూ దయతో నిండిన తన కడగంటి చూపులు ప్రసరింపజేసి వారికి తన విశ్వరూపం సందర్శించటానికి దివ్యదృష్టి ప్రసాదించాడు. ఆ పుణ్యపురుషులు నారాయణమూర్తియొక్క విశ్వరూపాన్ని తిలకిస్తూ పరిపూర్ణమైన ఆనందానుభవంలో ఓలలాడుతూ ఉన్నారు. ఆ సమయంలో.

విశేషం: కశ్యప ప్రజాపతికి అదితివలన కల్గినవారు ఆదిత్యులు. వీరు పన్నెండుమంది. ఇంద్రుడు, ధాత, సవిత్రుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

మరుత్తులు ఏభైనాల్గుమంది.

ఇంద్రుడు దితిగర్భంలో ప్రవేశించి వజ్రాయుధంతో భ్రూణమును నలభై తొమ్మిది శకలాలు కావించాడు. పంచ ప్రాణాలు తోడుకాగా వీరు యాభై నలుగురయ్యారు.

విశ్వేదేవులు పదిమంది. ధర్మునకు దక్షపుత్రి విశ్వయందు జన్మించినవారు; క్రతువు, దక్షుడు, వసువు, సత్యుడు, కాలరాముడు, ముని, కురజుడు, మనుజుడు, వీజుడు, రోచమానుడు. హవ్య కవ్యాలలో వీరు అర్చితులు.

అశ్వినీ దేవులు ఇద్దరు.

తనరూపం చూడగోరిన అర్జునిడికి శ్రీకృష్ణ పరమాత్మ దివ్య చక్షువు లిచ్చి చూడుమంటూ చూపిన రూపంలో వీరంతా గోచరించారు.

పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రా నశ్వినౌ మరుతస్తథా,
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. (గీత 11-6)

తే. దేవదుందుభి వ్రాతంబు దివిరెఁ గల్ప । వృక్ష పుష్ప ధారామయ వృష్టి గురిసె
సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి భక్తి । నిచ్చు జయజయ శబ్దంబు లెసఁగెఁ జదల. 406

ప్రతిపదార్థం: దేవదుందుభి వ్రాతంబు= వేల్పుల భేరులయొక్క సమూహం; తివిరెన్= మ్రోగింది; కల్పవృక్ష పుష్ప ధారామయవృష్టి= కల్పతరు కుసుమాలు అనే జల్లులతో నిండిన వాన; కురిసెన్= వర్షించింది; సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి= సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు అనే దేవతాగణం; భక్తిన్= భక్తితో; ఇచ్చు= సలుపునట్టి; జయజయ శబ్దంబులు= జేజే అనే ధ్వనులు; చదలన్= ఆకాశంలో; ఎసఁగెన్= అతిశయించాయి.

తాత్పర్యం: దేవతలయొక్క భేరీ సమూహం మ్రోగింది. కల్పతరు కుసుమాల వానజల్లు కురిసింది. సిద్ధులు సాధ్యులు విద్యాధరులు అనే దేవతా సముదాయం భక్తితో చేసిన జయజయధ్వానాలు అంతరిక్షంలో నిండాయి.

వ. అప్పుడు ధృతరాష్ట్రుం డమ్మహాసంకులంబు విష్ణుని దివ్యవిజృంభణంబు గావలయు నని యూహించి. 407

ప్రతిపదార్థం: అప్పుడు; ధృతరాష్ట్రుండు; ఆ+మహాసంకులంబు= సభయందు ఏర్పడిన కలకల ధ్వని; విష్ణుని దివ్య విజృంభణంబు కావలయున్+అని= వాసుదేవుడి యొక్క విశ్వవ్యాపకత్వ మగునేమో అని; ఊహించి= వితర్కించి.

తాత్పర్యం: అప్పుడు ఆంబికేయుడు కొలువులో ఏర్పడ్డ కలకలధ్వని విని, అది గోపాలదేవుడి యొక్క విశ్వరూప ప్రదర్శనమై ఉంటుందని భావించి.

క. 'కరుణింపుము సంశ్రితభయ । హరణ ధురీణా! సహింపు మజ్ఞానంబున్
శరణంబు వేఁడెద భవ । చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁగదే! 408

ప్రతిపదార్థం: సంశ్రిత భయహరణధురీణా!= ఆశ్రితులయొక్క భీతిని తొలగించే కార్యభారం వహించేవాడా!; కరుణింపుము= దయచూడుము; అజ్ఞానంబున్= అవివేకాన్ని; సహింపుము= మన్నించు; శరణంబు వేఁడెదన్= నిన్నే రక్షకుడిగా ప్రార్థిస్తున్నాను; భవత్+చరణంబులు= నీ పాదాలు; కనుఁగొనన్= దర్శించటానికి; ప్రసాదింపన్+కదే!= అనుగ్రహించుము.

తాత్పర్యం: 'వాసుదేవా! ఆశ్రితుల భయాన్ని తొలగించేవారిలో అగ్రేసరుడవు. నన్ను దయతో చూడు. నా అజ్ఞానాన్ని మన్నించు. నిన్నే శరణు వేడుతున్నాను. నీ పాదములు దర్శించే భాగ్యం అనుగ్రహించు'.

చ. అనుడు దయార్ద్రచిత్తుఁడగు నప్పరమేశ్వరుఁ డిచ్చె దృష్టి య
జ్జనపతి కద్భుతం బడర సమ్మదపూరము గ్రమ్మ నాతఁడుం
గనుఁగొని భక్తి మ్రొక్కి 'నినుఁగంటిఁ గృతార్థుఁడనైతి; నింక నో
ల్ల నొరులఁ జూడ లోచనములం బురుషోత్తమ! సంహరింపవే' 409

ప్రతిపదార్థం: అనుచున్= అని ఆంబికేయుడు వేడగా; దయా+ఆర్ద్ర చిత్తుఁడు+అగు= దయతో తడిసిన మనస్సుగల ఆ+పరమ+ఈశ్వరుఁడు= ఆ దేవ దేవుఁడు; ఆ+జనపతికిన్= ఆ నరేశ్వరుడైన ధృతరాష్ట్రుడికి; అద్భుతంబు+అడరన్=

ఆశ్చర్య మతిశయిల్లగా; దృష్టిన్+ఇచ్చెన్= చూపు ననుగ్రహించాడు; ఆతఁడున్= అంధరాజైన ధృతరాష్ట్రుడు; సమ్మదపూరము+ క్రమ్మన్= ఆనందాశ్రువులు కన్నులలో నిండగా; కనుఁగొని= స్వామి యొక్క విశ్వరూపం సందర్శించి; భక్తిన్= భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; పురుషోత్తమ!= గోవిందుడా!; నినున్‌కంటిన్= నిన్ను దర్శించాను; కృతార్థుఁడన్+ఐతిన్= ధన్యుడనయ్యాను; ఇంకన్= ఇటుపై; ఒరులన్+చూడన్+ఒల్లన్= ఇతరులను చూడటానికి ఇష్టపడను; లోచనములన్= నీ విచ్చిన నేత్రాలను; సంహరింపవే= నిరోధించు!

తాత్పర్యం: ధృతరాష్ట్రు డట్లా వేడగా దయారసంతో తడిసిన మనస్సుగల ఆ దేవదేవుడు అంధనృపతికి ఆశ్చర్యం కలిగేటట్లు దివ్యదృష్టి ప్రసాదించాడు. దేవుడిచ్చిన చూపుతో కనులలో ఆనందబాష్పాలు క్రమ్మగా అతడు శ్రీకృష్ణుడి విశ్వరూపం వీక్షించి భక్తితో నమస్కరించి 'పురుషోత్తమా! నిన్ను చూచాను. ధన్యుడనయ్యాను. నిన్ను జూచిన కన్నులతో ఇతరులను చూడటాని కిష్టపడను. నీవిచ్చిన చూపు నీవే వెనుకకు తీసికొమ్ము!'

క. అనిన పలుకులకు నచ్చటి । జనులెల్ల నృపాలు సితవిశాలాక్షుఁ గనుం
గొనుచుండి రపుడు తమనె । మ్మనమ్ము లాశ్చర్యరస నిమగ్నంబులుగాన్. 410

ప్రతిపదార్థం: అనిన పలుకులకున్= అనిన ధృతరాష్ట్రుడి మాటలకు; అపుడు= ఆ సమయాన; అచ్చటి జనులు+ఎల్లన్= అక్కడున్న జనులంతా; తమ నెమ్మనమ్ములు= తమ నిండు హృదయాలు; ఆశ్చర్య రస నిమగ్నంబులు కాన్= అద్భుత రసంలో మునిగినవి కాగా; సితవిశాల+అక్షున్= తెల్లని వెడదలైన కన్నులు గల; నృపాలున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; కనుంగొనుచున్+ఉండిరి= చూస్తూ ఉన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని మాటలకు ఆ సభలో ఉన్న జనులందరూ తమ హృదయాలు అద్భుతరసంలో మునిగిపోగా విశాలమైన తెల్లని కన్నులు గల ఆ రాజును చూస్తూ ఉండిపోయారు.

వ. తదనంతరంబ దామోదరుండు ధృతరాష్ట్రు నభిమతం బొడఁగూడ నతని కన్ను లెప్పటియట్ల కావించి, నిజ విశ్వరూప ప్రపంచంబు నుపసంహరించి, మునీంద్రుల నామంత్రణంబు సేయ నమ్మహాత్ము లంతర్ధానంబు సేసిరి; దానును సముత్థానంబు సేసి యంతకుమున్న సన్నిహితులైయున్న కృతవర్మ కరంబును, సాత్యకి హస్తంబును నవలంబించి యూరక వెడలెనని చెప్పిన. 411

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; దామోదరుండు= శ్రీకృష్ణుడు; ధృతరాష్ట్రు+అభిమతంబు= ధృతరాష్ట్రుడి యొక్క కోరిక; ఒడఁగూడన్= నెరవేరగా; అతని కన్నులు; ఎప్పటి+అట్ల+కావించి= మునుపటి వలె అంధములుగా ఉండేటట్లు చేసి; నిజ విశ్వరూప ప్రపంచంబున్= తన విశ్వవ్యాపకమైన దివ్యరూపాన్ని; ఉపసంహరించి= వెనుకకు తీసికొని; ముని+ఇంద్రులన్= నారదాది మహర్షులను; ఆమంత్రణంబు+చేయన్= పోయిరండని సెలవీయగా; ఆ+మహాత్ములు= ఆ మహానుభావులు; అంతర్ధానంబు చేసిరి= మాయమైనారు; తానును= శ్రీకృష్ణుడుకూడా; సముత్థానంబు+చేసి= పీఠంనుండి దిగి; అంతకున్+ మున్న= తాను పీఠం నుండి లేవడానికి మునుపే; సన్నిహితులు+ఐ= సముఖాన నిలిచినవారై; ఉన్న= ఉన్నట్టి; కృతవర్మ కరంబును= కృతవర్మయొక్క చేతిని; సాత్యకి హస్తంబును= సాత్యకియొక్క చేతిని; అవలంబించి= పట్టుకొని; ఊరక వెడలెన్= మౌనంగా బయలుదేరాడు; అని చెప్పినన్= అని వైశంపాయన మహర్షి చెప్పగా.

తాత్పర్యం: ఆ తరువాత శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి కోరిక తీరేటట్లు ఎప్పటివలెనే అతడి కన్నులు గ్రుడ్డివిగా చేసి తన జగద్వ్యాపకమైన మహామూర్తిని ఉపసంహరించాడు. నారదాది మహర్షులకు వెళ్ళిరండని సెలవిచ్చాడు. అంతట ఆ మహనీయులు అదృశ్యమయ్యారు. అప్పుడు వాసుదేవుడు తన పీఠం నుండి దిగాడు. అప్పటికే సముఖంలో నిలిచి ఉన్న సాత్యకి కృతవర్మల హస్తము లూది నారాయణుడు మౌనంగా అక్కడినుండి బయలుదేరాడు అని వైశంపాయన మహర్షి జనమేజయుడికి చెప్పగా.

ఆ. **'ఇవ్విధమునఁ గృష్ణుఁ డేఁగిన పిదపటి । కథ వినంగ నాకుఁ గౌతుకంబు**
మనము నిండి గడలు కొనుచున్నయది విన । రించి చెప్పు మునివరేణ్య' యనుడు. **412**

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఏగిన పిదపటి కథన్= వెళ్ళిన తరువాత జరిగిన కథను; వినంగన్= వినటానికి; నాకున్= నాకు; కౌతుకంబు= కుతూహలం; మనమునిండి= మనస్సునందు నిండి; కడలు కొనుచున్+ఉన్న అది= పొంగి పొరలుతూ ఉన్నది; మునివరేణ్య!= మునులలో శ్రేష్ఠుడా!; వివరించి చెప్పు= విపులంగా తెలుపుము; అనుడున్= అని జనమేజయుడు అడుగగా.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు సభనుండి వెళ్ళిన తరువాత జరిగిన కథ వినవలెననే కుతూహలం నా ఎదలో నిండి పొంగి పొరలుతున్నది. ఆ విషయం మునివర్యా! నాకు సవిస్తరంగా తెల్పు'మని జనమేజయ మహారాజు వైశంపాయన మహర్షిని అడిగాడు.

ఆశ్వాసాంతము

ఉ. **భక్త మనస్ ప్రమోదకర పాదసరోజ వికాస! చేతనా**
శక్తిమయ ప్రభావ! ముని సంస్తుత! సాత్యవతేయభారతీ
ప్రోక్త! నిగూఢ సంప్రకట భూమ సమాశ్రయ! వత్సలత్వ సు
వ్యక్త కృపాభిరామ! గుణ వర్జన! నిష్కల! నిత్యపుష్కలా! **413**

ప్రతిపదార్థం: భక్త మనస్ ప్రమోదకర= భక్తులయొక్క చిత్తమునకు ఆనందాన్ని కలిగించే; పాదసరోజ వికాస!= పద్మాలవంటి పాదాలయొక్క వికాసం కలవాడా!; (హరిహరనాథుని చరణ కమలధ్యానం వలన భక్తుల హృదయాలకు సంతోషం సమకూడుతుందని భావం); చేతనాశక్తిమయ ప్రభావ!= చైతన్య విశిష్టమైనశక్తి యొక్క మహిమగలవాడా! (చైతన్య విశిష్టమైన ఆయన బలం యొక్క మహిమవలననే సకలమూ ప్రవర్తిల్లుతుందనుట); ముని సంస్తుత= జ్ఞానులచేత కొనియాడబడేవాడా; సాత్యవతేయ భారతీ ప్రోక్త!= సత్యవతీ పుత్రుడైన వేదవ్యాస మునీంద్రుడియొక్క వాఙ్మయంచేత చక్కగా చెప్పబడినవాడా! (వ్యాసమహర్షి రచించిన సారస్వతమంతా భగవత్ప్రశస్తిని తెలియజెప్పుతుందనుట); నిగూఢసంప్రకట భూమసమాశ్రయ!= అవ్యక్తం. వ్యక్తం అయినట్టి కారణ కార్యమైన బృహద్రూపాన్ని ఆశ్రయించినవాడా!; వత్సలత్వ+సువ్యక్త+కృపా+అభిరామ!= వాత్సల్య గుణముచేత చక్కగా తెలియబడునట్టి కృపచేత ఇంపైనవాడా!; గుణవర్జన!= ప్రాకృతికములైన హేయగుణాలు లేనివాడా! (హేయ ప్రత్యనీకములైన కారుణ్య వాత్సల్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్య కామ సత్య సంకల్ప కృతిత్వ కృతజ్ఞతాదులైన అసంఖ్యేయ కళ్యాణ గుణాలకు ఆటపట్టుగా భగవంతుడిని పెద్దలు వినుతించారు); నిష్కల!= అంశం లేనివాడా! (ప్రాణము,

శ్రద్ధ ఈ మొదలైనవి షోడశకళలు, సాధారణ పురుషుడు ఈ పదారు కళలు కలవాడు; భగవంతుడట్టివాడు కాడు; ఆయన నిష్కళుడు); నిత్యపుష్కలా!= ఎల్లప్పుడు పూర్ణుడవై ఉండేవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీ చరణకమల వికాసం భక్తుల మనస్సులకు సంతోషం చేకూరుస్తుంది. చైతన్య విశిష్టమైన శక్తి సామర్థ్యా లున్నవాడవు నీవు. నిన్ను యోగీశ్వరులు వినుతిస్తారు. వ్యాస రచితమైన వాఙ్మయం నిన్ను గూర్చి తెలుపుతుంది. కారణ కార్యరూపంలో వ్యక్తావ్యక్తంగా ఉన్న పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. శరణాగతులందు ప్రకటితమైన వాత్సల్యాన్ని బట్టి నీ కారుణ్య మెంతటిదో బాగా స్పష్టమవుతున్నది. నీవు హేయగుణ రహితుడవు. కళ్యాణ గుణ పరిపూర్ణుడవు. షోడశకళలు గల సాధారణ పురుషుడి వలెగాక నిష్కలుడవై, పురుషోత్తముడవై ఉన్నావు. వృద్ధి క్షయాలు లేక నీవు నిత్యపూర్ణుడవై విలసిల్లుతున్నావు.

విశేషం: అలం: ఉపమ.

క. అవ్యయ నిర్మల విభవా! । దివ్య ప్రభవా! సుఖైక దీప్తానుభవా!
నవ్యత్వనిత్య! యతిసం । సేవ్యసుసాంగత్య! లోక జీవన కృత్యా! **414**

ప్రతిపదార్థం: అవ్యయ= నాశరహితమైన? నిర్మల= మాలిన్యంలేని; విభవా!= వైభవం కలవాడా! (విభవ శబ్దానికి నిర్వృతి అనే అర్థం ఉండుటచే (భగవంతుడు శాశ్వతనిర్మల మోక్ష స్వరూపుడు) దివ్య ప్రభవా!= అప్రాకృతమగు పుట్టుక గలవాడా! (భగవంతుడి జన్మకర్మలు దివ్యములు; ప్రాకృతములు కావు); సుఖ+ఏకదీప్త+అనుభవా!= ఆనందంచేతనే ముఖ్యంగా ప్రకాశించే అనుభవం కలవాడా! (భగవంతుడి అనుభవం కేవలానందమే); నవ్యత్వ నిత్య!= నూతనత్వం చేత ఎడతెగని వాడా! (దేవుడు శాశ్వతమైన నవ్యత్వం గలవాడు); యతి సంసేవ్య సుసాంగత్య!= యోగులచేత మిక్కిలి అనుభవించదగిన భేదరహిత భావం కలవాడా!; లోక జీవన కృత్యా!= జగములను పోషించడమే కార్యంగా కలవాడా! (నిఖిల భువన జన్మస్థేమ భంగములు ఆయన కృత్యములే అయిననూ జీవులకు బ్రతుకుతెరువు కల్పించటమే ఆయన ముఖ్యమైన కృత్యం.)

తాత్పర్యం: హరిహరనాథా! నాశరహితమూ, దోషరహితమూ అయిన మోక్షస్వరూపం కలవాడివి నీవు. నీ పుట్టుక సాధారణ జీవుల పుట్టుక వంటిదిగాదు. అది దివ్యమైనది. కేవల సుఖరూపమైన ఆనందంతో నీవు ప్రకాశిస్తుంటావు. నీవు నిత్యనూతనుడివి. అభేద భావంతో పరమయోగులచేత అనుభవించబడుతుంటావు. లోకాలను పరిపోషించటమే నీ ప్రధాన కృత్యం.

విశేషం: అంత్యానుప్రాసం.

మాలిని.

రవిశశి మయనేత్రా! ప్రస్ఫురత్కాంతి హృద్యా!
నవ జరఠ వికార న్యాస లీలానవద్యా!
వివృత నిగమ శాఖా విశ్రుతాగ్రైక వేద్యా!
వివిధ నియత చర్యా విత్త చిత్త ప్రసాద్యా! **415**

ప్రతిపదార్థం: రవిశశిమయ నేత్రా!= సూర్య చంద్ర రూపాలైన కన్నులు కలవాడా!; (విరాట్ విగ్రహుడైన పరమేశ్వరుడికి 'చక్షుషీ చంద్ర సూర్యౌ' నేత్రాలు చంద్ర సూర్యులు అని శ్రుతులు చెపుతున్నాయి.) ప్రస్ఫురత్ కాంతి హృద్యా!= మిక్కిలి ప్రకాశించే తేజస్సుచేత మనోహరమైనవాడా! (గగనతలంలో ఒకేసారి వేయి మంది సూర్యు లుదయిస్తే ఆ కాంతి ఆ మహాత్ముడి కాంతికి సమానం కావచ్చు అని గీత చెపుతుంది.)

దివి సూర్యసహస్రస్య భవే ద్యుగపదుత్థితా,
యది భాస్సదృశీ సా స్యా ద్భాసస్తస్య మహాత్మనః

నవజరఠ వికార న్యాస లీలా+అనవద్యా= బాల్యం వార్ధకం అనే భావవికారాలు ఉంచటం అనే విలాసంచే దోషరహితమైనవాడా! (పుట్టుట, ఉండుట, మారుట, పెరుగుట, కృశించుట, నశించుట అనేవి ఆరువిధాలైన భావవికారాలు. అవి లేనివాడు భగవంతుడు. కాని తనయందునూ, జగమునందునూ వాటిని ఆరోపించటం ఆయనకు లీల); వివృత నిగమశాఖా= వివరించబడిన వేదశాఖలయందలి; విశ్రుత+అగ్ర+ఏక+వేద్యా!= ప్రసిద్ధమైన కొనలచే ముఖ్యంగా తెలియబడేవాడా(వ్యాఖ్యానించబడ్డ వేదశాఖల యొక్క అగ్రభాగములు ఉపనిషత్తులు, వాటిచేతనే భగవంతుడిని తెలుసుకోవచ్చు. ఋగ్యజుస్సామాథర్వణములని వేదాలు నాలుగు. ఆ చతుర్వేదములు 1131 శాఖలుగా విభజించబడినాయి. వాటి అగ్రభాగాలే ఉపనిషత్తులు. బ్రహ్మసూత్రములకు, గీతకు, ఉపనిషత్తులకు పెద్దలు వ్యాఖ్యానాలు రచించారు. వాటివలన భగవత్తత్త్వం తెలియవీలవుతుంది.) వివిధ నియతచర్యా= పలు తెరగులైన యమనియమాది చర్యల వలన; విత్త= పొందబడిన; చిత్తప్రసాద్యా!= మనస్సుచేత ప్రసన్నుడిగా చేయదగినవాడా! (యమనియమాదులైన చర్యలచేత మనస్సు స్వాధీనం కాగా అట్టి మనస్సునందే భగవంతుడు గోచరిస్తాడు.)

తాత్పర్యం: హరిహరనాథా! నీ కన్నులు సూర్యచంద్రరూపాలు. దీపిస్తున్న నీ తేజస్సు మనసులకు ఇంపుగొలుపుతుంది. బాల్య యౌవన కౌమార వార్ధక్యాదులు లేనివాడవైనా వాటిని నీ యందూ, జగమునందూ ఆరోపించటం నీ కొకలీల. వివిధాలైన వేదశిరస్సులచేతనే తెలియదగినవాడవు నీవు. యమనియమాదులచేత స్వస్థమైన మనస్సునకే నీవు గోచరిస్తావు.

విశేషం: అలం: అంత్యానుప్రాసం.

మాలినీ వృత్తంలోని ప్రతిచరణంలోనూ న-న-మ-య-య- అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమ దుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున నుద్యోగ పర్వంబునందుఁ దృతీయాశ్వాసము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవీశ్వరులకు హితుడును, కొమ్మన మంత్రికి కుమారుడును, పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడును అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని ఉద్యోగపర్వంలో మూడవ ఆశ్వాసం ముగిసింది.

ఉద్యోగపర్వంలో తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ మత్తులసీ పల్లవ । దామచ్ఛవిలబ్ధ మరకత ప్రతిమత్వో
ద్దామ ప్రభాస్థిమాలా । శ్యామాయిత విపులవక్ష హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= శోభాయుక్తమైన; తులసీపల్లవదామ= తులసి చిగుళ్లమాలిక యొక్క; ఛవి= కాంతిచేత; లబ్ధ= పొందబడిన; మరకత ప్రతిమత్వ= గరుడపచ్చల మణులతోడి పోలికతో; ఉద్దామ ప్రభా= అధికమైన కాంతిగల్గిన; అస్థిమాలా= పునుకలదండచేత; శ్యామాయిత= నీలంగా చేయబడిన; విపులవక్ష!= విశాలమైన రొమ్ము కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడనే పేరుగల దేవా!

తాత్పర్యం: హరిహరనాథా! శోభావంతమైన తులసి చిగుళ్ల మాలికయొక్క నల్లని కాంతిపొత్తుచేత తెల్లని పునుకదండ గరుడపచ్చల సామ్యం పొందినదై తన విశేషమైన దీప్తిచేత నీ వెడల్పయిన ఎడమరొమ్మును నీలంగా చేస్తున్నది స్వామీ!

విశేషం: నారాయణుడు నల్లని రంగు కలవాడు. అతడు తులసీదళదాముడు, శంభుడు తెల్లటి మేనివాడు. పునుకదండను తాల్చేవాడు. తులసి నల్లటిది. పునుక తెల్లటిది. హరిహరనాథుడి దక్షిణార్ధ శరీరం వైష్ణవం. వామార్ధభాగం శైవం. ఒకే మూర్తి కనుక ఒకే వక్షఃస్థలం. ఆ వక్షఃస్థలం యొక్క కుడిభాగంలో నల్లని తులసీమాల, ఎడమ భాగమందు తెల్లని అస్థిమాల ప్రకాశిస్తున్నాయి. కాని, స్ఫటికంవలె తెల్లని పునుకదండ తులసిమాలయొక్క సంసర్గంతో గరుడపచ్చల కాంతి సామ్యం పొంది తెల్లని ఆయన రొమ్మును నల్లగ మారుస్తున్నది.

శ్రీకృష్ణుండు కుంతియింటికిం జని యాయమతో మాటలాడుట (సం. 5-129-20)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియెఁ గృష్ణుం డత్తెఱంగున వెడలిన విస్మితయై గాంధారి యభ్యంతర మందిరంబున కరుగం గౌరవులెల్లను బంధుమిత్ర సహాయ సహితంబుగాఁ దనతోడన వెడల, మొగంబు గంటు వెట్టికొని కక్ష్యాంతరంబులు గడచినప్పుడు దారుకుండు తేరినొగలపై నుండి పాడసూపి కేలు మొగిడ్చి ఫాలభాగంబునం గదియించినం, దత్ప్రదేశంబున నిలిచి, వారలదెస మరలిచూచి 'మీ రింక నిలువుం' డని పలికిన నాంబికేయుండు పుండరీకాక్షుం జేరి నిజతనూజుల నుపలక్షించి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా! అవధరించు; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; కృష్ణుండు, ఆ+తెఱంగునన్= ఆ విధంగా; వెడలినన్= సభనుండి మౌనంగా లేచి వెళ్ళగానే; విస్మిత+ఐ= ఆశ్చర్యం పొందినదై; గాంధారి; అభ్యంతరమందిరంబునకున్+అరుగన్= లోపలి నగరుకు వెళ్ళగా; కౌరవులు+ఎల్లను; బంధుమిత్ర

సహాయ సహితంబుగాన్= బంధువులతో, మిత్రులతో, తోడ్పడేవారితో కూడ; తనతోడన్+అ= తన వెంబడినే; వెడలన్= బయలుదేరగా; మొగంబు గంటుపెట్టికొని= ముఖం చిన్నపుచ్చుకొని; కక్ష్యా+అంతరంబులు= తొట్టికట్లు; కడచిన+అప్పుడు= దాటినప్పుడు; దారుకుండు= కృష్ణసారథి; తేరి నొగలపైన్+ఉండి= రథంయొక్క నొగలమీదినుంచి; పొడచూపి= కన్పించి; కేలుమొగిడ్చి= చేతులు జోడించి; ఫాలభాగంబునన్= నెన్నుదురు ప్రాంతంలో; కదియించినన్= చేర్చగా; తద్+ప్రదేశంబునన్+ నిలిచి= శ్రీకృష్ణుడు ఆ తావులో ఆగి; వారలదెసన్ మరలిచూచి= తన వెంటవస్తున్న వారివైపునకు తిరిగి చూచి; మీరు+ఇంకన్, నిలువుండు+అని; పల్కినన్= గోవిందుడు చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; పుండరీక+అక్షున్+చేరి= శ్రీకృష్ణుడిని సమీపించి; నిజతనూజులన్= తన కుమారులను; ఉపలక్షించి= ఉద్దేశించి.

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! అవధరించుము: వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు: వాసుదేవుడు ఆ విధంగా సభనుంచి నిష్క్రమించగానే ఆశ్చర్యపడి గాంధారీదేవి లోపలినగరుకు వెళ్లిపోయింది. కౌరవులందరూ బంధుమిత్ర సహాయులతో కూడి తనను వెంబడించగా శ్రీ కృష్ణుడు ముఖం చిన్నపుచ్చుకొని కక్ష్యాంతరాలు దాటాడు. అక్కడ రథసారథి అయిన దారుకుడు తేరినొగలపైనుండి మోడ్చినచేతులు నిటల ప్రదేశంలో చేర్చి తనను కనిపించుకొన్నాడు. దేవకీనందనుడు అక్కడ ఆగాడు. వెంటవస్తున్న వారివైపు తిరిగి 'మీ రిక నిలవండి' అని పలికాడు. పిదప ధృతరాష్ట్రుడు శ్రీహరి చెంతకు చేరి తన కొడుకులను ఉద్దేశించి (ఇట్లా అన్నాడు).

ఉ. **'వీరును బాండుపుత్త్రులును వేరము దక్కి పొసంగి మన్కికై**
పోరితమాడి యే నటులు బుద్ధులు సెప్పిన భంగియుం, గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కౌరవజాతికిం దెలిసెఁ గాదె గదాధర! నీదు సన్నిధిన్.' **3**

ప్రతిపదార్థం: గదాధర!= కౌమోదకి అనే గదను ధరించే శ్రీకృష్ణా!; వీరును= నా కుమారులున్నూ; పాండు పుత్త్రులును= పాండవులున్నూ; వేరము+తక్కి= విరోధం విడిచి; పొసంగి మన్కికై= అనుకూలంగా ఉండటానికై; ఏన్= నేను; పోరితము+ఆడి= జగడమాడి; అటులు= ఆ ప్రకారంగా; బుద్ధులు+చెప్పిన భంగియున్= నీతులు బోధించిన తీరున్నూ; కుల+ఆచారమున్+ నిర్వహింపన్= వంశధర్మం నిలపటానికి; పలుచందములన్= పెక్కువిధాల; తగన్= మిక్కిలి; దుఃఖపాటున్= దుఃఖంపొందటమున్నూ; నీదు సన్నిధిన్= నీ సమక్షంలో; ఈ కౌరవజాతికిన్= ఈ కౌరవులకు; తెలిసెన్+కాదె!= విదితమైనది కదా!

తాత్పర్యం: 'కృష్ణా! కౌరవులున్నూ పాండవులున్నూ విరోధం వీడి ఒద్దికగా జీవించటానికై జగడమాడి నే నెన్ని రీతుల బుద్ధులు చెప్పానో, వంశ ధర్మం నిలుపుటకై ఎన్నివిధాల శ్రమపడ్డానో నేడు నీ సముఖంలో కౌరవజాతికి వెల్లడి అయింది గదా!'

వ. **అని వెండియు.** **4**

తాత్పర్యం: అని, మళ్ళీ ఇట్లా అన్నాడు:

తే. **'నీకు శుద్ధుండ నగుటయ నిఖిలబంధు । మిత్ర గురుజన కోటికి ధాత్రి కెల్ల**
నంబుజాక్ష! నిర్దోషుండ నగుట; గాన । నా తెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు. **5**

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలనేత్రుడా!; నీకున్= నీకు; శుద్ధుండన్+అగుట+అ= కల్మషం లేనివాడనగుటయే; నిఖిలబంధుమిత్ర గురుజనకోటికిన్= ఎల్ల చుట్టాలు, స్నేహితులు, గురుజన సమూహానికీ; ధాత్రికిన్+ఎల్లన్= లోకమున కంతటికిన్నీ; నిర్దోషుండన్+అగుట= దోషరహితుడనగుట; కానన్= కనుక; నా తెఱంగు= నాతత్త్వం; నీవు+ఎఱుఁగుట= నీకు తెలియటం; నాకున్+చాలు= నాకు చాలు.

తాత్పర్యం: 'కృష్ణా! నేను పరిశుద్ధుడనని నీవు గుర్తిస్తే సమస్తబంధువులు, మిత్రులు, గురుజనాలు, లోకమూ నన్ను నిర్దోషినని గుర్తించినట్లే. కాబట్టి నా చంద మెట్లాంటిదో నీవు తెలిసికొనుటయే నాకు ముఖ్యం.'

వ. అనిన విని యచ్యుతుండు బాహ్లిక భీష్మ ద్రోణ కృప ప్రముఖ నిఖిల విశిష్టజనంబుల నాలోకించి. 6

ప్రతిపదార్థం: అనినన్; విని; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; బాహ్లిక భీష్మ ద్రోణ కృప ప్రముఖ= శంతనుమహారాజు తమ్ముడైన బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణాచార్యులు, కృపాచార్యులు మొదలైన; నిఖిల విశిష్టజనంబులన్= సకల సదాచారసంపన్నులైన (ముఖ్యులైన)వారిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలు విని గోవిందుడు బాహ్లిక భీష్మ ద్రోణ కృపాదులైన సదాచార సంపన్నులను (ప్రముఖులను) చూచి.

తే. 'ఇప్పు డీ సభఁ బుట్టిన యింతవట్టు । మీకుఁ దెల్లంబు గాదె! యీ మేదినీ వి
భుండు దా నేమిటికిని ముఖ్యుఁడఁ గాను । దప్పు దనదెస లేదని చెప్పి విడిచె. 7

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ వేళ; ఈ సభన్= ఈ కొలువులో; పుట్టిన+ఇంతవట్టు= జరిగిన సంగతి అంతా; మీకున్= మీకు; తెల్లంబు+కాదె!= స్పష్టమైనదికదా!; ఈ మేదినీ విభుండు= ఈ ధృతరాష్ట్ర మహారాజు; తాను= తాను; ఏమిటికిని= ఏ విషయానికీ; ముఖ్యుండన్ కాను= ప్రధానుడినికాను; తప్పు= దోషం; తనదెసన్= తనయెడ; లేదు+అని= లేదని; చెప్పివిడిచెన్= చెప్పివేశాడు.

తాత్పర్యం: 'ఇప్పు డీ సభలో జరిగిన సంగతి అంతా మీకు స్పష్టమే కదా! ఈ ధృతరాష్ట్ర మహారాజు తాను దేనికిన్నీ ప్రధానుడనుకాననీ, తనయెడ తప్పులు లేవనీ చెప్పివేశాడు.

వ. కావున నాకు నియ్యెడం దడయం బనిలేదు; పోయివచ్చెద; ధర్మపుత్త్రునకు నింత వృత్తాంత బెఱింగింపవలయు' నని పలికి వారల నామంత్రణంబు సేసినవాఁడై రథారోహణంబు సేసి ధృతరాష్ట్రుండును నచటి జనంబులును వెనుకం జనఁ జని కుంతీగృహద్వారంబున నరదంబు డిగ్గె. 8

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నాకున్, ఈ+ఎడన్= ఇచ్చట; తడయన్+పనిలేదు= ఆలసించవలసిన అక్కరలేదు; పోయివచ్చెదన్; ధర్మపుత్త్రునకున్, ఇంతవృత్తాంతంబు= ఈ జరిగిన సంగతి అంతా; ఎఱింగింపన్+వలయున్; అని, పలికి; వారలన్= ఆ బాహ్లికాదులను; ఆమంత్రణంబు+చేసినవాఁడు+ఐ= అక్కడ ఆగుటకు సెలవిచ్చినవాడై; రథ+ఆరోహణంబు చేసి= రథమెక్కి; ధృతరాష్ట్రుండును; అచటిజనంబులును; వెనుకన్+చనన్= తన రథం వెనుక వస్తుండగా; చని= వెళ్ళి; కుంతీగృహద్వారంబునన్= కుంతీదేవి యింటివాకిలి దగ్గర; అరదంబు= రథం; డిగ్గి= దిగి.

తాత్పర్యం: కనుక నా కిచ్చట ఆగవలసిన అవసరం లేదు, వెళ్ళివస్తాను. ఇక్కడ జరిగిన సంగతి అంతా ధర్మరాజునకు చెప్పాలి' అంటూ నారాయణమూర్తి అక్కడున్నవారిని నిలవం డని సెలవిచ్చి రథమెక్కాడు. ధృతరాష్ట్రుడు, మిగిలినవారు సగౌరవంగా సాగనంపటానికి వెనుక వస్తుండగా శౌరి కుంతీదేవి వాకిట రథం దిగాడు.

క. వారందఱుఁ దనతోడన । గారవమున నరుగుదేరఁగాఁ జొచ్చి మహో
దారుఁడు కుంతీ చరణాం । భోరుహముల కెఱఁగి వినయభూషణుఁ డగుచున్. 9

ప్రతిపదార్థం: వారు+అందఱున్= ధృతరాష్ట్రుడు మొదలైనవారెల్లరూ; తనతోడన్+అ= తన వెంబడినే; గారవమునన్= ఆదరంతో; అరుగుదేరగాన్= రాగా; చొచ్చి= కుంతీదేవి ఇంటిలో ప్రవేశించి; మహా+ఉదారుఁడు= మిక్కిలి దొడ్డవాడైన శ్రీకృష్ణుడు; వినయభూషణుఁడు+అగుచున్= వినయగుణమే ఆభరణంగా కలిగినవాడై; కుంతీచరణము+అంభోరుహములకున్+ ఎఱఁగి= పద్మాలవంటి కుంతీదేవి పాదాలకు సమస్కరించి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మొదలైనవారందరూ గౌరవంతో తన వెంబడి రాగా, మిక్కిలి దొడ్డవాడైన కేశవుడు వినయగుణాన్వితుడై కుంతి గృహంలోనికి ప్రవేశించి ఆమె పాదపద్మాలకు నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కౌరవసభఁ దా నాడిన । గౌరవవాక్యములుఁ గార్యఖడ్గక్రమ వా
క్పూరములు సుయోధను దు । ష్ప్రారంభము నల్పవచన పద్ధతిఁ జెప్పెన్. 10

ప్రతిపదార్థం: కౌరవసభన్= ధృతరాష్ట్రుడి కొలువులో; తాన్= తాను; ఆడిన= పల్కిన; గౌరవ వాక్యములున్= ఆదరంతో కూడిన పలుకులున్నూ; కార్యఖడ్గ క్రమ వాక్పూరములున్= కార్యవాదిగా, ఖడ్గవాదిగా పలికిన పలుకుల సమూహాలునూ; సుయోధను= దుర్యోధనుడియొక్క; దుష్ప్రారంభమున్= తనను బంధించే దుష్ట ప్రయత్నమున్నూ; అల్పవచన పద్ధతిన్+ చెప్పెన్= తక్కువ మాటలతోనే తెలిపాడు.

తాత్పర్యం: కురుసభలో ఆదరంతో తాను పల్కిన పల్కులున్నూ, కార్యవాదిగా, ఖడ్గవాదిగా చెప్పిన మాటలున్నూ, దుర్యోధనుడి దుష్టప్రయత్నమున్నూ సంక్షిప్తంగా ఆమెకు తెలిపాడు.

వ. ఇట్లు ధృతరాష్ట్ర కొలువునం బుట్టిన విశేషంబుల పాండురాజమహిషి కెఱింగించి మాధవుండు మఱియును. 11

ప్రతిపదార్థం: ఇట్లు; ధృతరాష్ట్ర కొలువునన్; పుట్టిన విశేషంబులు= జనించిన వింతలు; పాండురాజు మహిషికిన్= పాండురాజు యొక్క పట్టపురాణి అయిన కుంతికి; ఎఱింగించి; మాధవుండు= లక్ష్మీకాంతుడైన శ్రీకృష్ణుడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఇట్లా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి కొలువుకూటంలో కలిగిన వింతలు పాండురాజు పట్టపురాణి కుంతీదేవికి తెలిపి మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

తే. 'కురుకుమారులు తమయంతఁ గుడిచి క్రొవ్వి । మీఁ దెఱుంగరు; మాకేమి? మేల కాక;
నాలుకలు గ్రోయు నర్జునానలము దగిన । యెర గొనం గని సంతృప్తి యెసక మెసఁగు. 12

ప్రతిపదార్థం: కురుకుమారులు= కౌరవులు; తమ అంతన్= తమకు తామే; కుడిచి= రాజభోగాలు అనుభవించి; క్రొవ్వి= పొగరెక్కి; మీఁదు+ఎఱుంగరు= రానున్నదేమిటో తెలియకున్నారు; మేలు+అ కాక= మంచిదే అవుతుంది. మాకున్+ఏమి= మాకు మరేమి నష్టంలేదు; నాలుకలు క్రోయు= జిహ్వలు చాస్తున్న; అర్జున+అనలము= అర్జునుడనే అగ్ని; తగిన ఎర+కొనన్= తగిన ఆహారం గైకొనగా; కని= చూచి; సంతృప్తి= సంతోషం; ఎసకము+ఎసఁగున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: 'కౌరవులు తమపాటికి తాము హాయిగా రాజ్యభోగా లనుభవిస్తూ పొగరుపట్టి రానున్నది తెలియకున్నారు. మాకది మంచిదే. మంటలు వెలిగ్రక్కుతున్న అర్జునుడనే అగ్ని తనకు తగిన ఆహారం లభించినందుకు ఎంతో సంతృప్తి వహిస్తుంది.

విశేషం: అలం: రూపకం.

వ. **పాండుకుమారులపాలికిం బోయి వచ్చెద; వారికిం దగిన బుద్ధు లానతి'మ్మనిన నద్దేవి విక్రమోపజీవులయిన ముచుకుందుండును సృంజయుండును నను తొంటినరపతుల చరిత్రంబులు సెప్పి, 'యుధిష్ఠిరుండు వీరిని వినండొ కాక'యని పలికి యెల్లవారును వినుచుండ వెండియు నిట్లనియె.** **13**

ప్రతిపదార్థం: పాండుకుమారుల పాలికిన్= పాండవుల దగ్గరకు; పోయి వచ్చెదన్; వారికిన్; తగిన బుద్ధులు; ఆనతి+ఇమ్ము= సెలవిమ్ము; అనినన్, ఆ+దేవి; విక్రమ+ఉపజీవులు= పరాక్రమాన్ని అనుసరించి బ్రతికినవారు అయిన ముచుకుందుండును, సృంజయుండునున్; అను= అనునట్టి; తొంటినరపతుల చరిత్రంబులు= పూర్వపురాజుల కథలు; చెప్పి, యుధిష్ఠిరుండు; వీరిని వినండొ కాక= వీరిని గూర్చి వినలేదా ఏమి?; అని పలికి; ఎల్లవారును; వినుచుండన్; వెండియున్= మరల; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: నేను పాండునందనుల దగ్గరకు వెళ్ళివస్తాను. వారికి చెప్పవలసిన మాటలు సెలవిమ్ము!' అని శ్రీకృష్ణు డడిగినాడు. అపుడు కుంతీదేవి పరాక్రమం నమ్ముకొని జీవించిన ముచుకుందుడు, సృంజయుడు అనే పూర్వపు రాజుల కథలు చెప్పి, 'ధర్మజుడు వీరిని గురించి విని ఉన్నాడో, లేదో' అని పలికి, అక్కడి వారంతా ఆలకిస్తుండగా మళ్ళీ ఇట్లా అన్నది:

విశేషం: ముచుకుందుడు - భారత ప్రతులన్నిటిలోను ఈ పదం ఇట్లే ఉన్నది. పూర్వగాథాలహరిలో మాత్రం ముచికుందుడని కలదు. ఇరువురు నొక్కరే అయియుంటారు.

ఇతడొకసారి అలకాపట్టణముపై దండెత్తెను. త్రోవలోనే కుబేరుని భటులు ఈతని సైన్యముపైబడి కొట్టారు. అప్పుడితడు తన పురోహితుని ప్రార్థించాడు. పురోహితుడు తాను చేసిన తపస్సు, మంత్రములు, పూజలు మొదలగువాని వలన వాని సైన్యానికి తిరిగి బలం కలిగించాడు. పిమ్మట ఈతడు కుబేరుడి మీదికి యుద్ధమునకు పోగా, బ్రాహ్మణ క్షాత్ర బలములేకమై ఉండటం వలన నీతో నేను పోరలేనని చెప్పి తప్పుకొన్నాడు. (భార.)

ముచికుందుడు ఒక రాజు. మాంధాత కుమారుడు. ఇతడు దేవాసురులకు యుద్ధమైనప్పుడు దేవతలకు సహాయం చేశాడు. దేవతలు వరం కోరుకో అన్నారు. ఇతడు మిక్కిలి డస్సి ఉండటం చేత, నిద్రపోతూ, ఎవరైనా తనకు నిద్రాభంగం చేస్తే, వారిని ఇతడు చూడగానే, వారు భస్మం కావాలని వరం కోరుకొంటాడు. ఇతడు ఒక గుహలో నిద్రపోతుండగా, కాల

యవనుడు ఆ గుహలోనికే వచ్చి, ఇతనిని చూచి కృష్ణుడని భ్రమించి తన్నాడు. ముచికుందుడు లేచి వానిని చూడగానే వాడు భస్మమయ్యాడు.

సృంజయుడు : ఒక రాజు. ఇతని కడకు పర్వతనారదులు రాఁగా, వారి పరిచర్యకు ఇతడు తన కూతురైన మదయంతిని నియోగించాడు. నారదుడామెను వలచుటచే, రాజామెను నారదుని కిచ్చి పెండ్లి చేశాడు.

సృంజయుడు మూత్ర పురీషములు కూడా బంగారమగునట్టి కుమారుడిని పొందగోరి బ్రాహ్మణులను పూజించి, తన కోరికను నారదుడితో చెప్పాడు. నారదుడి అనుగ్రహం వలన అతని కట్టి కొడుకు పుట్టాడు. అతనిపేరు సువర్ణష్ఠీవి. క్రూరులు కొందరు అతని లోపల బంగారం ఉంటుందని భ్రమించి వానిని చంపి చీల్చారు. సృంజయుఁడు మిక్కిలి దుఃఖించి నారదుడిని తలచుకోగా, నారదుడు వచ్చి, అతని పుత్త్రుణ్ణి బ్రతికించాడు. సృంజయుడు భార్యాపుత్త్రులతో భాగీరథీతీరంలో వనవిహారం చేస్తుండగా, ఇంద్రుడు సువర్ణష్ఠీవి బలానికి భయపడి శార్దూల రూపంలో చంపవలసిందిగా తన వజ్రాన్ని ఆదేశించాడు. వజ్రం వాడిని చంపింది. రాజు కోరికపై నారదుడు మళ్ళీ వానిని బ్రతికించాడు. (సంపా.)

ఉ. 'రాజుల కెందు నారయఁ బరాక్రమజీవన వృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మండ్రు మును; లుత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజిత భంగిఁ జేయుదురు; బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁ గూటి కియ్యకొని దీనతఁ బొందుదు రంబుజోదరా! 14

ప్రతిపదార్థం: అంబుజ+ఉదరా!= పద్మనాభా!; ఆరయన్= పరికించగా; రాజులకున్= నరపతులకు; ఎందున్= ఎచ్చటకూడ; పరాక్రమ జీవనవృత్తి+తక్కన్= శౌర్యంతో జీవించే నడవడిక తప్ప; ఒండు+ఓజ= మరోపద్ధతి; నిషిద్ధము= కూడదని; మునులు+అండ్రు= జ్ఞానులు చెపుతారు; ఉత్తమసత్త్వులు= శ్రేష్ఠ బలసంపన్నులు; వంశధర్మముల్= కులాచారాలు; పూజిత భంగిన్= గౌరవపద్ధతిలో; చేయుదురు= ఆచరిస్తారు; బుద్ధివిహీనులు= తెలివిమాలినవారు; వానిన్+తక్కి= తమ కులధర్మాలను అనుసరించక; నిస్తేజము+కూటికిన్= పౌరుషహీనమైన తిండికి; ఇయ్యకొని= సమ్మతించి; దీనతన్+పొందుదురు= దైన్యాన్ని పొందుతారు.

తాత్పర్యం: 'గోవిందా! రాజులు పరాక్రమంతో జీవించవలెనేకాని, మరో మార్గం వారికి తగదని జ్ఞానులు చెపుతారు. బలసంపన్నులు తమ కులధర్మాలను గౌరవబుద్ధితో అనుష్ఠిస్తారు. తెలివిమాలినవారు వంశాచారం వదలిపెట్టి పౌరుషహీనమైన తిండికి సమ్మతించి దేబెలై మనుగడ సాగిస్తారు.

క. నీ వియ్యంబులు సంధియ । కావింపంబడిరి; వీరిఁ గలయుట కష్టం;
బా వెరవు దప్పటయ మే । లై వచ్చెం బొమ్ము; విడువు మనుమానంబున్. 15

ప్రతిపదార్థం: నీ వియ్యంబులు= నీ మరదులైన నా కొమారులు; సంధి+అ= సంధినే; కావింపన్= చేయుటకు; పడిరి= శ్రమ చెందారు; వీరిన్= ఈ కౌరవులను, కలయుట= చేరుట; కష్టంబు= నా బిడ్డలకు కష్టం; ఆ వెరవు= ఆ సంధిమార్గం; తప్పుట+అ= తొలగిపోవటమే; మేలు+ఐ; వచ్చెన్ పొమ్ము= మంచికే వచ్చింది సుమా!; అనుమానంబున్= ఈ విషయంలో సందేహం; విడువుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: కృష్ణా! నీ మరదులు సంధికొరకు సకలవిధాల శ్రమపడ్డారు. కాని, కౌరవులతో కలసిమెలసి మనుగడసాగించటం కష్టం. ఇపుడు సంధి తప్పిపోవడం కూడ మంచికే జరిగింది. నీవు ఈ విషయంలో శంకించవద్దు.

మ. నిజవంశోచిత వీరవృత్తమున కున్మేషంబుగా నా కపి
ధ్వజుఁ డుత్సాహము సేయకున్న నకటా! దైన్యంబు వాటిల్లదే?
భుజదర్పోద్ధతుఁడైన భీమునకు నీ పొం దొప్పునే? నీవు స
ర్వజగన్మాన్యుఁడ విందు రాఁదగునె? దైవం బిట్లు దప్పించునే!' 16

ప్రతిపదార్థం: నిజవంశ+ఉచిత= తమ క్షత్రియ కులానికి (కురువంశానికి) తగిన; వీరవృత్తమునకున్= పరాక్రమపు నడవడికి; ఉన్మేషంబుగాన్= వికాసంగా; ఆ కపిధ్వజుఁడు= హనుమంతుడు టెక్కెమందు కలిగిన ఫల్గునుడు; ఉత్సాహము+చేయక+ఉన్నన్= ఉద్యమించకుంటే; అకటా!= అయ్యో!; దైన్యంబు+పాటిల్లదే?= చులుకదన మేర్పడదా?; భుజదర్ప+ఉద్ధతుఁడు+ఐన= బాహుబలంచే గర్వితుడైన; భీమునకున్= భీమసేనుడికి; ఈ పొందు= ఈ సంధి; ఒప్పునే?= తగి ఉంటుందా?; నీవు= నీవు; సర్వజగత్+మాన్యుఁడవు= సకల లోకాలచేత - గౌరవించదగినవాడవు; ఇందున్= ఈ కురుసభకు; రాన్+తగునె?= రావచ్చునా?; దైవంబు= భగవంతుడు; ఇట్లు తప్పించునే!= ఈ విధంగా పొత్తు కుదరకుండ చేశాడు గదా!

తాత్పర్యం: మధుసూదనా! క్షత్రియ జాతికి (కురువంశానికి) తగినది వీరవృత్తి. దానికి వన్నెగా కపికేతనుడైన పార్థుడు రణోత్సాహం చూపకుంటే నలుగురిలో పలుచనైపోడా? భుజబల గర్వితుడైన భీమసేనుడికి ఈ సంధి తగినదేనా? సకల లోకపూజ్యుడవైన నీవు ఈ పనికై ఇక్కడికి రావచ్చునా? దేవుడు మేలు చేయగా సంధి భగ్నమైనది.

వ. అని యంత నిలువక గొంతి యిట్లనియె: 17

ప్రతిపదార్థం: అని; అంతన్ నిలువక= అంతటితో ఆగక; గొంతి= కుంతీదేవి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఈ మాటలతో ఆగక కుంతీదేవి మరల ఇట్లా అన్నది:

క. 'మఱచిరె కొలువున ద్రౌపదిఁ । బఱచిన బన్నంబు? ధర్మపథము దొఱంగన్
వెఱచుట కప్పటి కది దగుఁ; । జెఱచినచో వెదక వలదె చిరతర కీర్తిన్?' 18

ప్రతిపదార్థం: కొలువునన్= సభలో; ద్రౌపదిన్= పాంచాలిని; పఱచిన బన్నంబున్= అవమానపరచటాన్ని; మఱచిరె?= (నా కుమారులు) మరచిపోయారా?; ధర్మపథంబున్= న్యాయ మార్గాన్ని; తొఱంగన్= విడవటానికి; వెఱచుట= భయపడటం; అప్పటికిన్+అది+తగున్= ఆ సమయానికి అది యుక్తంగానే ఉండింది; చెఱచినచోన్= ధర్మాన్ని నాశనం చేస్తే; చిరతరకీర్తిన్= శాశ్వతమైన యశస్సును; వెదకన్+వలదె?= అన్వేషించవద్దా?

తాత్పర్యం: 'కౌరవులు నిండుసభలో పాంచాలిని అవమానించటం నా కుమారులు మరచిపోయారా? న్యాయమార్గాన్ని వీడటానికి జంకి వా రప్పుడు అట్లా అడవులకు వెళ్ళటం యుక్తమేకాని, న్యాయంగా తమకు రావలసిన అర్ధరాజ్యం ఇవ్వక తామే హరింపదలచి కౌరవులు ధర్మవినాశనానికి పూనుకొన్నప్పుడు తాము శాశ్వతకీర్తిని సంపాదించటానికి యత్నంచేయవద్దా?'

శ్రీకృష్ణుఁడు కర్ణునిఁ దన రథం బెక్కించుకొని కొన్ని రహస్యోక్తులు పలుకుట (సం. 5-138-1)

వ. అని పలికి పుండరీకాక్షుం గౌఁగిలించుకొని, యచ్యుతుండు మ్రొక్కిన దీవించి, 'యేను సుఖంబున్న దాన'నని పాండవులకుం జెప్పుము; చేతుల లావునం గనిన జీవనంబున బ్రదుకుం డనుము; పోయిర'మ్మని వీడుకొల్పిన సింహగమనసుందరంబుగా వెడలి, తన తోడన కదలివచ్చిన ధృతరాష్ట్రాదుల నిలువంబనిచి, రథారోహణంబు సేసి గోవిందుండు కర్ణుదెసం గనుంగొని, 'న న్ననిచి వత్తుగానిర'మ్మని కరంబు సాఁచి చెయివట్టి తన యరదం బెక్కించికొని, సాత్యకి వేసరి నెక్కి కెలనం జనుదేరం గదలిచని, యనుపవచ్చిన కృతవర్మ నుచిత ప్రకారంబున సస్నేహంబుగా నిలిపి యరుగు నవసరంబునఁ బౌరలోకంబు. 19

ప్రతిపదార్థం: అని పలికి= అని కుంతీదేవి వచించి; పుండరీక+అక్షున్= శ్రీకృష్ణుడిని; కౌఁగిలించుకొని; అచ్యుతుండు- శ్రీకృష్ణుడు; మ్రొక్కినన్= తనకు నమస్కరించగా; దీవించి; ఏను= నేను; సుఖంబు+ఉన్నదానన్= సుఖంగా ఉన్నాను; అని, పాండవులకున్; చెప్పుము; చేతులలావునన్= భుజబలంతో; కనిన= పడసిన; జీవనంబునన్= బ్రదుకుతో; బ్రదుకుండు+అనుము= జీవించండి అని చెప్పుము; పోయిరమ్ము= వెళ్లిరమ్ము; అని; వీడుకొల్పినన్= సెలవిచ్చి పంపగా; సింహగమన సుందరంబుగాన్= సింహంయొక్క నడకవలె అందమైన నడకతో; వెడలి= బయలుదేరి; తన తోడన్+అ= తన వెంబడినే; కదలివచ్చిన; ధృతరాష్ట్ర+ఆదులన్= ధృతరాష్ట్రుడు మొదలైనవారిని; నిలువన్+పనిచి= ఆగండి అని చెప్పి; రథ+ఆరోహణంబు చేసి= రథము నెక్కి; గోవిందుండు; కర్ణుదెసన్= రాధేయుడివైపు; కనుంగొని; నన్నున్+అనిచివత్తు+కాని= నన్ను సాగనంపి వత్తువులే; రమ్ము+అని; కరంబు+చాఁచి; చెయి+పట్టి= అతడి హస్తం పట్టుకొని; తన+అరదంబు; ఎక్కించికొని; సాత్యకి; వేసరిన్+ఎక్కి= కంచరగాడిద (అశ్వతరము) నెక్కి; కెలనన్= ప్రక్కను; చనుదేరన్= రాగా; కదలిచని= బయలుదేరివెళ్ళి; అనుపన్ వచ్చిన= తనను సాగనంపటానికి వచ్చిన; కృతవర్మన్; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; సస్నేహంబుగాన్= ప్రేమయుక్తంగా; నిలిపి= ఆపి; అరుగు+అవసరంబునన్= వెళ్ళే సమయంలో; పౌరలోకంబు= పురజనులు.

తాత్పర్యం: కుంతీదేవి అట్లా పలికి శ్రీకృష్ణుడిని కౌగిలించుకొన్నది. గోవిందుడు తనకు మ్రొక్కగా దీవించి, 'నేను సుఖంగా ఉన్నానని నా కుమారులకు చెప్పుము. భుజ విక్రమంతో సంపాదించిన బ్రదుకు తెరువుతో బ్రదకండని చెప్పుము. పుండరీకాక్ష! పోయిరమ్ము' అని వీడ్కొల్పింది.

శౌరి సింహగమనంవలె సుందరమైన నడకతో కదలి తనతో కదలివస్తున్న ధృతరాష్ట్రుడు మొదలైనవారిని నిలవండని పలికి, తాను రథమెక్కాడు. కర్ణుడివైపు చూచి 'నన్ను సాగనంపివద్దువుగాని రావయ్యా!' అని చెయిసాచి అతడి చేయిపట్టి రథంమీద ఎక్కించుకొన్నాడు.

సాత్యకి ప్రక్కన అశ్వతరము నెక్కి వస్తుండగా శ్రీకృష్ణుడు ముందుకు సాగాడు. తనను సాగనంపటానికి వచ్చిన కృతవర్మను తగిన విధంగా స్నేహయుక్తంగా నిలిపి నారాయణుడు వెళ్ళుతున్నప్పుడు పట్టణ ప్రజలు. (ఇట్లా అన్నారు:)

ఉ. 'అక్కట! వాసుదేవు పను పాదరణంబునఁ జేయరైరి; వీ
రెక్కడి బుద్ధిమంతు? లని నిందును నందును లోకమెల్లఁ బే
రుక్కున ప్రగ్గుటం దలఁప నొల్ల కపాయము సేసి రట్టె! యీ
యుక్కివు లెందునుం గలరె? యొప్పరు వో ధృతరాష్ట్ర నందనుల్.' 20

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; వాసుదేవు పనుపు= కృష్ణుడి ఆజ్ఞ; ఆదరణంబునన్= గౌరవంతో; చేయరు+ఐరి= చేసినవారు కారు; వీరు= ఈ కౌరవులు; ఎక్కడి బుద్ధిమంతులు?= ఏమి బుద్ధిమంతులండీ?; అనిన్= యుద్ధంలో; ఇందునున్= ఈ కౌరవుల పక్షంలోనూ; అందును= ఆ పాండవుల పక్షంలోనూ; లోకము+ఎల్లన్= జనులందరూ; పేరు+ ఉక్కునన్= మిక్కిలి శౌర్యంతో పోరి; మ్రగ్గుటన్= నశించిపోవటం; తలఁపన్+ఒల్లక= ఆలోచించటానికి ఇష్టపడక; అపాయము చేసిరి+అట్టె!= హాని చేశారు గదా!; ఈ+ఉక్కివులు= ఇంత కఠినులు; ఎందునున్+కలరె?= ఎక్కడైనా ఉన్నారా?; ధృతరాష్ట్రనందనుల్= ధృతరాష్ట్రుడి కుమారులు; ఒప్పరు+పో!= ఓర్వలేరు.

తాత్పర్యం: 'అయ్యో! వాసుదేవుడి ఆదేశం ఆదరంతో స్వీకరించని వీరు ఏపాటి బుద్ధిమంతులు? సంగ్రామంలో ఇరుపక్షాలలోని జనులంతా శౌర్యంతో పోరి కూలుతారని భావించక ఇంతటి జనహానికి పూనుకొన్నారు. ఇట్లాంటి కపటులు ఎక్కడైనా ఉన్నారా? ధృతరాష్ట్రుడి కుమారులు ఓర్వలేని వారు సుమా!

వ. అని మఱియు ననేకు లనేక ప్రకారంబులం బలుకుచు నిరుగెలంకులం జూచుచుండఁ బుండరీకాక్షుండు పురంబు నిర్గమించె; నట ధృతరాష్ట్రుండును మగిడి కొలువు కూటంబునకు వచ్చి యెప్పటివారలు పరివేష్టింప నుండి కృష్ణుని వలని మాటలాడుచున్న సమయంబున సుయోధనునితో భీష్మద్రోణు లిట్లనిరి. 21

ప్రతిపదార్థం: అని, మఱియున్; అనేకులు= పలువురు; అనేక ప్రకారంబులన్= పెక్కురీతుల; పలుకుచున్; ఇరు+కెలంకులన్= రెండుప్రక్కల; చూచుచున్+ఉండన్; పుండరీక+అక్షుండు= శ్రీకృష్ణుడు; పురంబు నిర్గమించెన్= హస్తినాపురినుండి వెలువడ్డాడు; అట; ధృతరాష్ట్రుండును; మగిడి= మరలి; కొలువు కూటంబునకున్+వచ్చి; ఎప్పటివారలు= మునుపటివారు; పరివేష్టింపన్= చుట్టుకొని ఉండగా; ఉండి; కృష్ణుని వలని మాటలు= కృష్ణుని గురించిన మాటలు; ఆడుచున్+ఉన్న= పలుకుతున్న; సమయంబునన్; సుయోధనుతోన్; భీష్మద్రోణులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఇట్లా పలువిధాల పలుకుతూ మార్గానికి రెండు వైపులా నిలిచి జనులు చూస్తుండగా నారాయణుడు పట్టణం నుండి వెలువడ్డాడు. తరువాత ధృతరాష్ట్రుడు తిరిగి కొలువు కూటానికి వచ్చి ఎప్పటివారలు చుట్టూచేరి ఉండగా కృష్ణుడిని గురించి మాటాడుతున్న సమయంలో దుర్యోధనుడితో ద్రోణభీష్ము లిట్లా అన్నారు:

చ. 'పలుకునె యిట్లు గొంతి? విని బమ్మెరపోయితి; మింత బెట్టిదం
బు లగునె మాట? లయ్యమయుఁ బుణ్యుఁడుఁ గృష్ణుఁడు గార్యవాదముల్
వలికెడు వార లిట్లు దెగఁబాఱిరి; ధర్మజవారిరాశికిం
జెలియలికట్ట వాసె; మనచే నగు కర్జముచంద మెట్టిదో?' 22

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; ఇట్లు పలుకునె?= ఇట్లా మాట్లాడుతుందా?; విని= ఆమె మాటలు విని; బమ్మెరపోయితిమి= దిగ్భ్రాంతిచెందాము; మాటలు= ఆమె పలుకులు; ఇంత బెట్టిదంబులు+అగునె?= ఇంత కఠినంగా ఉంటాయా?; ఆ+అమయున్= ఆ తల్లియును; పుణ్యుఁడున్= ధర్మాత్ముడైన; కృష్ణుఁడున్= వాసుదేవుడును; కార్యవాదముల్ పలికెడువారలు= పనికి అనుకూలించే మాటలు చెప్పునట్టివారు; ఇట్లు= నేఁడీ విధంగా; తెగన్+పాఱిరి= సాహసించారు; ధర్మజ వారిరాశికిన్= ధర్మరాజు అనే సాగరానికి; చెలియలికట్ట+పాసెన్= గట్టులేకుండా పోయింది; మనచేన్+అగు= మన వలన అయ్యే; కర్జము చందము= కార్య విధం; ఎట్టిదో!= ఎటువంటిదో!

తాత్పర్యం: 'కుంతీదేవి ఇట్లా మాట్లాడుతుందని ఊహించలేదు. ఆమె పలుకులకు దిగ్భ్రమ కలిగింది. ఆమె వాక్కులు ఎంతో కఠోరంగా ఉన్నాయి. ఆమెయూ, ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణుడున్నూ పని అనుకూలపడేటట్లు పలుక నేర్చినవారు. ఈనా డిట్లా వారు సాహసోక్తు లాడారు. ధర్మజుడనే సముద్రానికి చెలియలికట్ట లేకుండా పోయింది. ఈ విషయంలో మనం చేయగలిందేమిటో తోచటంలేదు.'

విశేషం: అలం: రూపకం.

వ. **అని పలికి వెండియు.** **23**

తాత్పర్యం: భీష్ముడు ద్రోణుడు మళ్ళీ దుర్యోధనుడితో (ఇట్లా అన్నారు:)

శా. **'మాకుం జూడఁగఁబోలు కార్య మిది: ధర్మప్రీతి నీ వేఁగి సు**
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యులనెల్లఁ గాచికొనవే యే పొప్ప దెందుం; దుదిన్
శోకం బొందక వేగమైఁ గదలి కృష్ణుంగూడఁబోవే నృపా!' **24**

ప్రతిపదార్థం: నృపా!= దుర్యోధనా!; మాకున్= మాకు; చూడఁగన్= ఆలోచించగా; పోలు= తగిన; కార్యము+ఇది= పని యిది; ధర్మప్రీతిన్= ధర్మమందలి ఆసక్తితో; నీవు+ఏఁగి= నీవువెళ్ళి; సుశ్లోకుండు+ఐన= ఉత్తమకీర్తిశాలి అయిన; యుధిష్ఠిరున్+కని= ధర్మరాజును దర్శించి; జనస్తుత్యంబుగాన్= జనులు మెచ్చుకొనేటట్లు; శాంతిమైన్= శాంతితో; ఈ కౌరవ్యులన్+ఎల్లన్= ఈ కురువంశంలో పుట్టిన వారినందరినీ; కాచికొనవే= రక్షించుకొనుము; ఎందున్= ఎక్కడను; ఏపు+ఒప్పదు= గర్వం చెల్లదు; తుదిన్= కడపటికి; శోకంబు+ఒందక= దుఃఖం పాలుగాక; వేగమైన్= శీఘ్రంగా; కదలి= బయలుదేరి; కృష్ణున్+కూడన్+పోవే= శ్రీకృష్ణుడిని చేరబొమ్ము.

తాత్పర్యం: 'దుర్యోధనా! ఆలోచింపగా మాకు తోచిన కర్తవ్యం ఇది. నీవు ధర్మాసక్తితో వెళ్ళి సత్కీర్తిశాలి అయిన ధర్మజుడిని దర్శించి, జనులు మెచ్చేటట్లు శాంతితో ఈ కురుకులమంతటినీ సంరక్షించుకొమ్ము. ఇక ఔద్ధత్యం ఏ మాత్రం కూడదు. కడకు దుఃఖం పాలు కాకుండ వేగిరమే కదలిపోయి శ్రీకృష్ణుడిని కలిసికొమ్ము!'

వ. **అనిన విని దుర్యోధనుండు మొగంబు రాఁజుచుండ నూరకుండె; గాంగేయుండును గురుండును దిగ్గనలేచి యతని నవలోకించి.** **25**

ప్రతిపదార్థం: అనినన్; విని; దుర్యోధనుండు; మొగంబు= ముఖం; రాఁజుచున్+ఉండన్= మండుతూ ఉండగా; ఊరక+ఉండెన్; గాంగేయుండును= భీష్ముడూ; గురుండును= ద్రోణుడూ; దిగ్గన లేచి= తటాలున లేచి; అతనిన్; అవలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్మద్రోణులమాటలకు దుర్యోధనుడు మొగం కోపంతో మండుతూ ఉండగా సమాధానం చెప్పకుండా ఉన్నాడు. అప్పుడు వారిద్దరూ తమ పీఠాలనుంచి తటాలున లేచి సుయోధనుడివైపు చూచి.

క. **'కురునృప! విను సంసారము । దరిద్రొక్కినవార; మింకఁ దలఁకెదమే? సం**
గరమునకు నేము నీకై । పొరలితి; మెట్లైన నగును బోయెద' మనుచున్. **26**

ప్రతిపదార్థం: కురునృప!= సుయోధనా!; విను= మేము చెప్పేది వినుము; సంసారముదరి+త్రొక్కినవారము= జీవితం యొక్క చివరి ఒడ్డు చేరినవాళ్ళం; ఏము= మేము; ఇంకన్= మరి; సంగరమునకున్= యుద్ధానికి; తలఁకెదమే?= జంకుతామా?; నీకై పొరలితిమి= నీ మేలుగోరి ఎన్నో విధాల చెప్పిచూచాం; ఎట్లు+ఐనన్+అగును= విధి నిర్ణయమెట్లాఉందో అట్లే జరుగుతుంది; పోయెదము= మేము వెళ్ళి వస్తాం; అనుచున్= అని పలుకుతూ.

తాత్పర్యం: 'దుర్యోధనా! మా మాటలు వినుము. మేము సంసారపు ఆవలి తీరం చేరినవాళ్ళం. ఇట్లాంటి మేము పోరాటానికి భయపడతామా? నీ మేలు గోరి ఎన్నో రీతుల చెప్పిచూచాం. విధి నిర్ణయమెట్లా ఉంటే అట్లాగే ఔతుంది. ఇక మేము వెళ్ళి వస్తాం' అని పలుకుతూ.

క. అరిగిరి, రాజును నభ్యం । తరమునకుం జనియె, రాజతనయుండు బహిః
పరివారముఁ బొమ్మని మిత । పరిజనుఁడై యేఁగె నాత్మభవనంబునకున్. 27

ప్రతిపదార్థం: అరిగిరి= భీష్మద్రోణులు వెళ్ళారు; రాజును= ధృతరాష్ట్రుడున్నూ; అభ్యంతరమునకున్+చనియెన్= లోపలి గృహంలోనికి వెళ్ళిపోయాడు. రాజతనయుండు= సుయోధనుడు; బహిఃపరివారమున్= వెలుపల ఉన్న బలగాన్ని; పొమ్ము+అని= వెళ్ళుమని చెప్పి; మితపరిజనుఁడు+ఐ= కొద్ది పరివారం కలవాడై; ఆత్మభవనంబునకున్= తన మందిరానికి; ఏఁగెన్= పోయాడు.

తాత్పర్యం: భీష్మద్రోణులు వెళ్ళగానే ధృతరాష్ట్రుడు అభ్యంతర గృహానికి వెళ్ళిపోయాడు. రాజకుమారుడైన సుయోధనుడు వెలుపలనున్న సేవకులను వెళ్ళండని చెప్పి మితమైన పరివారంతో తానూ తన భవనానికి వెళ్ళిపోయాడు.

తే. అంత నక్కడ నచ్యుతుఁ డరిగి యరిగి । యధిక సంప్రీతి దలకొన నర్కతనయు
నాననంబు వీక్షించి యిట్లనియె నెమ్మి । నన్యు లెవ్వరు వినకుండ నతనితోడ. 28

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అక్కడన్= అచ్చట; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; అరిగి అరిగి= వెళ్ళి వెళ్ళి; అధిక సంప్రీతి= మిక్కుటమైన ప్రేమ; తలకొనన్= కలుగగా; అర్కతనయు+ఆననంబు= కర్ణుడి యొక్క ముఖం; వీక్షించి= చూచి; నెమ్మిన్= కూర్మితో; అన్యులు+ఎవ్వరున్= ఇతరులెవ్వరున్నూ; వినకుండన్= వినకుండా; అతనితోడన్= కర్ణుడితో; ఇట్లు+ అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అట్లా వెళ్ళివెళ్ళి మిక్కిలి ప్రేమతో సూర్యుడి కుమారుడైన కర్ణుడి వదనం తిలకించి, ఇతరులెవ్వరున్నూ వినకుండ అతడితో ఇట్లా అన్నాడు:

సీ. 'నీవు వృద్ధజనోపసేవివి, ధర్మసం । వేదివి, తెలియంగ వినుము; సిద్ధ
మంత్రబలంబున మార్తాండు వరమునఁ । గన్నియ తఱి గొంతి గన్నవాఁడ
వగుటఁ బాండునృపాలు నగ్రసుతుండవు; । ధర్మమార్గం బిది; ధర్మతనయుఁ
డాదిగాఁ గల తమ్ములందఱు నా చేత । నెఱిఁగి నీ యడుగుల కెఱఁగి సకల

ఆ. పుత్త్ర మిత్త్ర బంధు భూరిసేనా సమ । న్వితముగాఁగఁ గొలిచి నిన్ను రాజ్య
భారవహనమునకుఁ బట్టంబుగట్ట ను । జ్జ్వలుఁడ వగుదు; రమ్ము వారికడకు. 29

ప్రతిపదార్థం: నీవు; వృద్ధజన+ఉపసేవివి= పెద్దలను సేవించినవాడివి; ధర్మసంవేదివి= ధర్మమును చక్కగా ఎరిగినవాడివి; తెలియంగన్+వినుము= స్పష్టమయ్యేటట్లు వినుము; సిద్ధమంత్రబలంబునన్= సిద్ధించిన(దివ్యమైన) ఒక మంత్రశక్తిచేత; మార్తాండువరమునన్= సూర్యుడి వరముచేత; కన్నియతఱిన్= తాను కన్యగా ఉన్నప్పుడే; గొంతి= కుంతీదేవి; కన్నవాఁడవు= కనినట్టివాడివి; అగుటన్= అయినందువలన; పాండునృపాలు= పాండు రాజుయొక్క; అగ్రసుతుండవు= పెద్దకుమారుడవు; ఇది ధర్మమార్గంబు= ఇది ధర్మసమ్మతం; ధర్మతనయుఁడు+ఆదిగాన్+కల= ధర్మజుడు మొదలుగా కలిగిన; తమ్ములు+ అందఱున్; నాచేతన్+ఎఱిఁగి= నీవు తమకు అన్నవన్న వార్త నేను తెల్పగా విని; నీ+అడుగులకున్+ఎఱఁగి= నీ పాదాలకు నమస్కరించి; సకల= సమస్తమైన; పుత్త్రమిత్త్ర బంధు భూరిసేనా సమన్వితము+కాఁగన్= కుమారులు, స్నేహితులు, చుట్టాలు, గొప్పసేనలు అన్నింటితోకూడా; కొలిచి= భజించి; నిన్నున్= నిన్ను; రాజ్యభారవహనమునకున్= రాజ్యభారం వహించటానికి; పట్టంబు+కట్టన్= అభిషేకించగా; ఉజ్జ్వలుఁడవు+అగుదు(వు)= మిక్కిలి ప్రకాశించగలవు; వారి కడకున్= పాండవుల దగ్గరకు; రమ్ము= అరుగుదెంచుము.

తాత్పర్యం: 'కర్ణా! నీవు పెద్దలను సేవించినవాడివి. ధర్మం బాగుగా తెలిసినవాడివి. నే చెప్పేది చక్కగా వినుము, కన్యకగా ఉన్నప్పుడు కుంతీదేవి దివ్యమైన మంత్రమహిమచేత మార్తాండుడి వరంవలన నిన్ను కన్నది. అందుచేత నీవు పాండురాజుకు పెద్దకుమారుడవు. ఇది ధర్మసమ్మతం. ధర్మజుడు, ఆతడి తమ్ములు నీవు తమకు అన్నవని నాచేత తెలిసికొని నీ పాదాలకు నమస్కరించి, పుత్రమిత్ర బంధుసేనాసహితంగా కొలిచి రాజ్యభారం వహించటానికి నీకు పట్టం కట్టుతారు. ఆ రీతిగా నీవు రాజ్యపదవిలో ప్రకాశించగలవు. కనుక నాతో కలసి వారి దగ్గరకు రమ్ము.

వ. ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుంజేయుదు; నీవు దొలుత వెడలునప్పటి మహోత్సవంబునకు యువరాజైయుధిష్ఠిరుండు నీ రథంబున నుండి నీకు ధవళచామరంబులు వైచు; వాయుపుత్త్రుండు సితచ్ఛత్రంబు వట్టు; సవ్యసాచి సారథ్యంబుచేయు; మఱియుఁ బాంచాల యాదవ పాండ్యమాత్స్యులు లోనుగాఁగల రాజలోకంబుతోడఁ గవలు నభిమన్యు ప్రభృతి కుమారులు బెరయ నే మెల్లం బలసి పరివేష్టించి వత్తు; మిట్టి మహేంద్ర విభవంబున మహనీయుండ వగుచు మహీచక్రం బేలు' మని మఱియును. 30

ప్రతిపదార్థం: ఏను= నేను; నిన్నున్; సామ్రాజ్యంబునకున్+అభిషిక్తున్+చేయుదున్= పాండవరాజ్యపదానికి అభిషిక్తుడిని చేస్తాను; నీవు; తొలుతన్= మొదట; వెడలునప్పటి మహోత్సవంబునకున్= ఊరేగటానికి బయలుదేరునట్టి గొప్పసంబరంలో; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; యువరాజై; నీ రథంబునన్+ఉండి= నీ తేరిలో నిలిచి; నీకున్; ధవళచామరంబులు వైచున్= వింజామరలతో విసరగలడు; వాయుపుత్రుండు= భీమసేనుడు; సిత+ఛత్రంబు= తెల్లని గొడుగు; పట్టున్= పట్టుకొనగలడు; సవ్యసాచి= అర్జునుడు; సారథ్యంబు చేయున్= నీ రథం నడుపగలడు; మఱియున్= ఇంకను; పాంచాల, యాదవ, పాండ్య, మాత్స్యులు= ద్రుపదుడు, యాదవప్రభువులు, పాండ్యరాజు, విరాటుడు; లోనుగాన్+కల= మున్నుగా కలిగిన; రాజలోకంబుతోడన్= రాజుల సమూహంతో; కవలు= అమడలైన నకులసహదేవులు; అభిమన్యు ప్రభృతికుమారులు= అభిమన్యుడు మొదలైన కుమార వర్గం; బెరయన్= కూడగా, నిండగా; ఏము+ఎల్లన్= మేమందరమూ; బలసి పరివేష్టించి వత్తుము= గుమిగా నిన్ను చుట్టుకొని వస్తాము; ఇట్టి మహా+ఇంద్రవిభవంబునన్= ఈ విధమైన దేవేంద్రవైభవంతో; మహనీయుండవు+అగుచున్= గొప్పవాడ వవుతూ; మహీచక్రంబు+ఏలుము= భూమండలం పరిపాలించుము; అని; మఱియును.

తాత్పర్యం: కర్ణా! నిన్ను పాండవసామ్రాజ్యానికి అభిషిక్తుడిని చేస్తాను. నీవు అభిషిక్తుడవై రథమెక్కి నగరంలో ఊరేగునప్పటి మహోత్సవంలో యువరాజై ధర్మజుడు నీకు వింజామరలు వీస్తాడు. భీమసేనుడు తెల్లగొడుగు

పట్టుతాడు. అర్జునుడు రథసారథ్యం వహిస్తాడు. పాంచాల యాదవ పాండ్య మాత్స్య మహీపతులు మొదలైన రాజులందరితో నకుల సహదేవులు, అభిమన్యుడు మొదలైన కుమార వర్గం చేరగా మేమందరమూ గుంపుగా నిన్ను పరివేష్టించి వస్తాము. ఇట్లా, దేవేంద్ర వైభవంతో మహనీయుడవై మహీమండలాన్ని పరిపాలించుము' అని పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. 'పాంచాల రాజపుత్రియు । నంచితముగ నిన్నుఁ బొందు నాఱవ వరుసన్;
సంచితపుణ్యుఁడ వీ వొక । యించుకయును వేఱుసేయ కేతె మ్మెలమిన్. 31

ప్రతిపదార్థం: పాంచాల రాజపుత్రియున్= పాంచాలరాజు కూతురైన ద్రౌపదియు; అంచితముగన్= ఒప్పిదంగా; నిన్నున్= నిన్ను; ఆఱవ వరుసన్= ఐదుమందితోపాటు ఆరవవాడిగా; పొందున్= పతిగా పడయగలదు; సంచితపుణ్యుఁడవు= సముపార్జించిన సుకృతము గల; ఈవు= నీవు; ఒక+ఇంచుకయును= కొంచెంకూడా; వేఱుచేయక= భేదభావంలేక; ఎలమిన్= సంతోషంతో; ఏతెమ్ము= పాండవులను చేరుము.

తాత్పర్యం: 'కర్ణా! ద్రౌపది ఐదుమందితోపాటు నిన్ను ఆరవభర్తగా ఆప్యాయంతో స్వీకరిస్తుంది. సుకృతాత్ముడవైన నీవు రవంతేని భేదభావంలేక సంతోషంతో పాండవులను కలిసికొనటానికి రమ్ము.

విశేషం: 'అంచితముగ నిన్నుఁబొందు నాఱవ వరుసన్' - అనే వాక్యానికి మూలం: షష్ఠే చ త్వాం తథాకాలే ద్రౌపద్యుపగమిష్యతి' ఆరవస్థానమందు నిన్ను ఆవిధంగా ద్రౌపది పొందగలదు.

వ. ఇట్లైనఁ గుంతికి సమస్త బంధుమిత్రులకుఁ బ్రియంబగు' ననిన విని రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె: 32

ప్రతిపదార్థం: ఇట్లు+ఐనన్= ఇట్లా నీవు పాండవులతో చేరితే; కుంతికిన్= కుంతీదేవికీ; సమస్త బంధుమిత్రులకున్= బంధువులూ మిత్రులూ అందరికీ; ప్రియంబు+అగును= సంతోషం కలుగుతుంది; అనినన్; విని; రహస్యంబుగాన్= గుట్టుగా; రాధేయుండు= రాధాపుత్రుడైన కర్ణుడు; మాధవునకున్= లక్ష్మీవల్లభుడైన కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కర్ణా! నీవు పాండవులతో చేరితే, కుంతికిన్నీ, తక్కిన సకల బంధువులకూ, స్నేహితులకూ సంతోషం కలుగుతుంది' అని శ్రీకృష్ణు డనగా విని రాధేయుడు నారాయణుడితో ఇట్లా అన్నాడు:

కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట (సం. 5-139-1)

చ. 'వెడవెడ యేనుఁ దొల్లి యిది వింటి' ననుం గని కుంతి నిర్దయన్
జెడ నదివైచిపోయెఁ; గృపఁజేకొని సూతుఁడు దెచ్చి తాను మున్
కొడుకులుఁ గానకున్కిఁ బ్రియకుం దగనిచ్చినఁ జేపెఁ జన్నుఁ; ల
ప్పడఁతియు నప్పుడాదిగ శుభస్థితిఁ బెంచెఁ బ్రయత్నశీలయై. 33

ప్రతిపదార్థం: వెడవెడ= కొంచెం కొంచెం; ఏనున్= నేను కూడ; ఇది= నీవు చెప్పిన విషయమునే; తొల్లి= మునుపు; వింటిన్= విన్నాను; కుంతి= కుంతీదేవి; ననున్+కని= నన్ను ప్రసవించి; నిర్దయన్= దయమాలినదై; చెడన్= నాశమయ్యేటట్లు; నదిన్=

నదిలో; వైచి= పారవేసి; పోయెన్= ఇంటికి వెళ్ళింది; సూతుఁడు= అధిరథుడు; కృపన్+చేకొని= దయతో నన్ను గ్రహించి; తెచ్చి= తన ఇంటికి తీసికొనివచ్చి; తాను= తాను; మున్= నన్ను కొనిరావటానికి మునుపు; కొడుకులన్+కానక+ఉన్కిన్= కుమారులను పడయకుండటంచేత; ప్రియకున్= తన భార్య అయిన రాధకు; తగన్= ఒప్పుగా; ఇచ్చినన్= ఇవ్వగా; చన్నులు చేఁపెన్= ఆమె స్తనాలకు పాలువచ్చాయి; ఆ+పడఁతియున్= ఆ వనితయు; అప్పుడు+ఆదిగన్= అదిమొదలుకొని; ప్రయత్నశీల+ఐ= విడువని పూనిక(జాగరూకత)కలదై; శుభస్థితిన్+పెంచెన్= మంచి స్థితిలో నన్ను సాకింది.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు చెప్పిన విషయం కొంచెం కొంచెం నేనూ విని ఉన్నాను. కుంతీదేవి నన్ను కని కనికరంలేనిదై గంగలోత్రోసి యింటి కేగింది. అప్పుడు సూతుడు దయతో నన్ను ఎత్తుకొని వచ్చి, తనకు అంతకుముందు బిడ్డలులేనందున తన ప్రియురాలైన రాధ కందించాడు. ఆమెకు పుత్త్రప్రేమ పొడమగా చన్నులు చేపాయి. అది మొదలు ఆమె పాలిచ్చి మిక్కిలి పూనికతో ఉన్నతస్థితిలో నన్ను పెంచింది.

క. మూత్ర పురీషాదులు దమ । గాత్రములం దింక వారు గారవ మెసఁగం
బుత్త్రుండని సంవర్ధిత । గాత్రునిగాఁ జేసి రింతకాలముఁ గూర్మిన్. 34

ప్రతిపదార్థం: మూత్రపురీష+ఆదులు= నా యొక్క మలమూత్రాదులు; తమగాత్రములందున్= తమ శరీరములందు; ఇంకన్= ఆరిపోగా; వారు= ఆ సూతదంపతులు; గారవము+ఎసఁగన్= ఆదరం అతిశయించగా; పుత్త్రుండు+అని= తమ కొడుకని; ఇంతకాలమున్= ఇన్నాళ్ళూ; కూర్మిన్= వాత్సల్యంతో; సంవర్ధితగాత్రునిగాన్+చేసిరి= పోషించబడిన దేహం కలవాడినిగా చేశారు.

తాత్పర్యం: తమ శరీరములందు నా మలమూత్రాదులు ఇంకిపోగా పరమాదరంతో నన్ను కన్నకుమారుడిగా ఆ సూత దంపతులు ఇంతకాలం ఈ శరీరాన్ని పరిపోషించారు.

క. నేఁ డింక నెఱిఁగి యొరువుల । వాఁడఁ గదా యనుచు నేను వారిఁ దొఱఁగినం
బోఁడిమి సెడదే? మదిఁ గడు । వాఁడి గలదె నాకు నకట వారిజనాభా! 35

ప్రతిపదార్థం: వారిజనాభా!= పద్మం నాభియందుగల శ్రీకృష్ణా! నేఁడు= ఈనాడు; ఎఱిఁగి= నా జన్మవృత్తాంతం తెలిసి; ఇంకన్= ఇటుపై; ఒరువులవాఁడన్ కదా= ఇతరుల బిడ్డను గదా; అనుచున్= అని తలుస్తూ; నేను= నేను; వారిన్= సూత దంపతులను; తొఱఁగినన్= విడిచిపెట్టితే; పోఁడిమి+చెడదే?= ధర్మం నశింపదా?; అకట!= అయ్యో!; నాకున్= నాకు; మదిన్= మనసులో; కడున్= మిక్కిలి; వాడి కలదె?= క్రూరత్వ మున్నదా?

తాత్పర్యం: నేడు నాజన్మవృత్తాంతం తెలిసి నేను ఇతరుల బిడ్డను గదా అని పెంచి పెద్దనుచేసిన ఆ సూతదంపతులను వదలివస్తే ధర్మం తప్పినవాడినికాగలను. కృష్ణా! నామనసులో అంతటి క్రౌర్యమున్నదా? (లేదని భావం.)

వ. వృద్ధోప సేవనంబును ధర్మ సంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవ చెప్పితివి; రాధయు నధిరథుండును నాకు జాతకర్మాది సమస్త సంస్కారంబులు నిజకులోచితంబుగా నాచరించి; రట్టి తల్లిదండ్రులకుఁ బుత్త్రకృత్యంబులు నిర్వర్తింపక వారలంబాసి యేను వచ్చుట ధర్మంబగునే?' యని పలికి వెండియు. 36

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; వృద్ధ+ఉపసేవనంబును= పెద్దలను సేవించటం; ధర్మసంవేదనంబును= ధర్మం తెలియటం; కలవాఁడవు+అని= కలిగిఉన్నవాడవని; నీవు+అ= నీవే; చెప్పితివి= అన్నావు; రాధయున్; అధిరథుండును; నాకున్; జాతకర్మ+ఆది,

సమస్తసంస్కారంబులు= పుట్టినప్పటినుండి చేయవలసిన వైదిక సంస్కారాలు; నిజకుల+ఉచితంబుగాన్= తమ కులానికి దగినట్లుగా; ఆచరించిరి= చేశారు; అట్టి; తల్లిదండ్రులకున్; పుత్త్రకృత్యంబులు= కుమారుడు చేయవలసిన కార్యములు; నిర్వర్తింపక= చేయకుండా; వారలన్; పాసి= విడిచి; ఏను= నేను; వచ్చుట; ధర్మంబు+అగునే?= ధర్మం ఔతుందా?; అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నేను పెద్దలను భక్తితో సేవించేవాడననీ, ధర్మం తెలిసినవాడననీ నీవే పలికావు. రాధ, అధిరథుడు నాకు పుట్టినప్పటినుండి చేయవలసిన వైదిక సంస్కారాలన్నీ తమ కులాచారానికి తగినట్లు చేసిఉన్నారు. అట్టి తల్లిదండ్రులకు తనయుడుగా నేను చేయవలసిన పనులను చేయకుండా వారిని వదలి పాండవుల దగ్గరకు రావటం ధర్మమా? చెప్పు'మని పలికి మరల కర్ణు డిట్లా అన్నాడు:

క. 'సోదరులుఁ బ్రియులు ననుజులు । నా దెసఁ బెక్కండ్రు; వారినందఱ విడువం
గాదని యూహింపక దా । మోదర! నన్నిట్లు పిలుచు టుచితమె? చెపుమా! 37

ప్రతిపదార్థం: దామోదర!= శ్రీకృష్ణా!; సోదరులున్= తోడబుట్టినవారు; ప్రియులున్= ఇష్టులు; అనుజులున్= తమ్ములూ; నా దెసన్= నా వైపు; పెక్కండ్రు= పలువురున్నారు; వారిన్+అందఱన్= వారినందరినీ; విడువన్+కాదు+అని= వదలటానికి వీలుగాదని; ఊహింపక= ఆలోచించక; నన్నున్= నన్ను; ఇట్లు= ఈవిధంగా; పిలుచుట= పాండవులను చేరరమ్మని ఆహ్వానించటం; ఉచితమె?; చెపుమా!= నీకు తగునా? తెలుపుము.

తాత్పర్యం: కృష్ణా! సోదరులు, ఇష్టులు, తమ్ముళ్ళు నా వైపు పలువురున్నారు. వారినందరినీ వదలిపెట్టడానికి వీలుకాదని భావించక నన్ను కౌంతేయులను కలియరమ్మని ఆహ్వానించటం నీకు తగునా? చెప్పుము.

వ. అదియునుం గాక. 38

తాత్పర్యం: ఇంతే కాక.

ఉ. సూతసుతుండు వీఁ డనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతియొనర్చి తేజమును బెంపును నాఁటికినాఁటి కగ్గలం
బై తనరార నన్నుఁ దనయంతటి మానిసిఁ జేసియుండ నే
నేతగవూఁది యా కురుకులేశ్వరుఁ బాయుదు? ముట్టవచ్చినన్. 39

ప్రతిపదార్థం: వీఁడు= ఈ కర్ణుఁడు; సూతసుతుండు= సూతజాతివాడి కొడుకు; అనక= అని తలంచక; సూనుల తమ్ములకంటెన్= తన కొడుకులకంటెను, అనుజులకంటెను; నాకున్= నాకు; సంప్రీతి+ఒనర్చి= సంతోషం కలుగజేసి; తేజమును= ప్రతాపాన్ని; పెంపును= వృద్ధినీ; నాఁటికిన్ నాఁటికిన్= దినదినానికి; అగ్గలంబు+ఐ= మిక్కుటమై; తనరారన్= అతిశయించగా; నన్నున్= నన్ను; తన+అంతటి మానిసిన్+చేసి= తనంత వాడినిగా చేసి; ఉండన్= నా యెడ స్నేహభావంతో ఉండగా; నేను; ఏ తగవు+ఊఁది= ఏ ధర్మాన్ని ఆశ్రయించి; ఆ+కురుకుల+ఈశ్వరున్= కురువంశ నాయకుడైన దుర్యోధనుడిని; ముట్టన్ వచ్చినన్= శత్రువులు దాడి సల్పనుండగా; పాయుదున్?= వీడుతాను?

తాత్పర్యం: ఈ కర్ణుడు సూతజాతివాడి కొడుకని భావించక తన కుమారులకంటె, తమ్ముళ్ళకంటె నాకు సంతోషం కలిగిస్తూ నా ప్రతాపం, ఔన్నత్యం దినదినానికీ అతిశయిస్తుండగా సుయోధనుడు నన్ను తనంతవాడినిగా చేశాడు.

అట్లాంటి కురుకులాధినాథుడైన దుర్యోధనుడిని యుద్ధం ముంచుకొని వస్తున్న వేళలో ఏ ధర్మాన్ని అనుసరించి విడువగలనో నీవే చెప్పుము.

క. నను నయ్యర్జునునకు నెదు । రని పెద్దయు నమ్మియుండు నక్కట! దుర్యో
ధనుఁ; డా నమ్మిగ వమ్ముగఁ । జనునే పాండవులఁ గలయఁ జన నా కనఘా! 40

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; దుర్యోధనుఁడు= రాజరాజు; ననున్= నన్ను; ఆ+అర్జునునకున్= ఆ పార్థుడికి; ఎదురు+అని= యుద్ధంలో దీటని; పెద్దయున్= మిక్కిలి; నమ్మి+ఉండున్= విశ్వసించి ఉంటాడు; అక్కట!= అయ్యో!; ఆ నమ్మిగ= ఆతడి విశ్వాసం; వమ్మగన్= రిత్తకాగా; నాకున్= నాకు; పాండవులన్ కలయన్+చనన్= పాండవులను చేరబోవటం; చనునే?= తగునా?

తాత్పర్యం: కృష్ణా! సుయోధనుడు సంగ్రామంలో నన్ను అర్జునుడికి దీటని మిక్కిలి నమ్మకంతో ఉన్నాడు. ఆతడి నమ్మకం వమ్ముచేసి నేను కౌంతేయులను చేరబోవటం తగునా?

ఆ. ఏను నర్జునుండు నెక్కటెక్కటి దల । పడకయున్న నగరె పుడమి జనము?
లందు నాదు వచ్చు టతనికి నపకీర్తి । యనిన నాకు వేఱె యడుగనేల? 41

ప్రతిపదార్థం: ఏనున్= నేనూ; అర్జునుండున్= అర్జునుడూ; ఎక్కటిన్+ఎక్కటిన్= ఒకడితో నొక్కడు; తలపడక+ఉన్నన్= యుద్ధంలో ఢీకొనకుంటే; పుడమిజనములు= భూమియందలి జనులు; నగరె?= పరిహసించరా?; అందున్= పాండవుల చెంతకు; నాదు వచ్చుట= నేను రావటం; అతనికిన్= ఆ పార్థునకు; అపకీర్తి= దుర్యశం; అనినన్= అని చెప్పినప్పుడు; నాకున్= నా విషయమై; వేఱె= ప్రత్యేకంగా; అడుగన్+ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: నేనూ, అర్జునుడూ రణంలో ఒకరినొక్కరు ఎదుర్కొనకుంటే లోకులు నవ్వరా? నేను పాండవులను చేరరావటం అర్జునుడికి అపకీర్తి హేతువయినప్పుడు, మరి అది నాకెంత అవమానకరమో వేరే చెప్పాలా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

క. హిత ముపదేశించితి నీ । వతి నిర్మలబుద్ధి వగుట; నైనను నిది నా
మతి సొరదు; రహస్యము ర । క్షితముగఁ బాటింపుమయ్య! చిత్తములోనన్. 42

ప్రతిపదార్థం: నీవు= నీవు; అతినిర్మలబుద్ధివి+అగుటన్= మిక్కిలి స్వచ్ఛమైన మనస్సుకలవాడవు గనుక; హితము+ఉపదేశించితి(వి)= శ్రేయమైనదానిని బోధించావు; ఐననున్= కాని; ఇది= నీవు సల్పిన ఈబోధ; నా మతిన్= నా హృదయంలో; చొరదు= ప్రవేశించదు; రహస్యము= ఈ గుట్టు; రక్షితముగన్= సంరక్షింపబడేటట్లు; చిత్తములోనన్= నీ మనస్సులో; పాటింపుము+అయ్య!= ఉంచుకొనవయ్యా!

తాత్పర్యం: శ్రీ కృష్ణా! నీవు మిక్కిలి నిర్మలమైన మనస్సుకలవాడవు కనుక నాకు మేలు కలిగే విధమేదో బోధించావు. కాని, నీ హితోపదేశం నా మనస్సుకు ఎక్కదు. నేను కుంతీపుత్రుడనన్న ఈ రహస్యం వెలికి పొక్కనీయకుండా భద్రంగా నీ హృదయంలోనే ఉంచుకొమ్ము.

వ. అది యేమిటి కంటేని. 43

తాత్పర్యం: అదెందుకని అడుగుతావేమో.

తే. ధర్మతనయుండు తాను నా తమ్ము డగుట । యెఱిఁగెనేనియు సామ్రాజ్య మేల పూను?
నట్టి ధార్మికుఁ డాధిపత్యంబుఁ జేయ । వలవదే శాశ్వతంబుగ వసుధకెల్ల? 44

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= ధర్మరాజు; తాను; నా తమ్ముఁడు+అగుట= నాకు తమ్ముడు అనే విషయం; ఎఱిఁగెన్+ ఏనియున్= తెలిసికొన్నయెడల; సామ్రాజ్యమున్= దొరతనాన్ని; ఏల పూనున్?= ఎందుకు వహిస్తాడు; అట్టి ధార్మికుఁడు= అటువంటి పుణ్యాత్ముడు; శాశ్వతంబుగన్= స్థిరంగా; వసుధకున్+ఎల్లన్= పుడమికంతటికిని; ఆధిపత్యంబున్+చేయన్+వలవదే?= అధిపతిగా ఉండి పాలించవద్దా?

తాత్పర్యం: ధర్మపుత్రుడు నాకు తమ్ముడని తాను తెలిసికొంటే భూమండలాధిపత్యం వహించడు. కాని, అట్లాంటి ధర్మాత్ముడు శాశ్వతంగా ఈ పుడమి కంతటికి రాజై పరిపాలించటం న్యాయంకదా!

క. అనుజులు ఋత్విజులుగ, నీ । పని యిటు సేయుమను నీ వుపద్రష్టవుగా
విను! కురుకుమార పశువిశ । సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్. 45

ప్రతిపదార్థం: విను!= కృష్ణా! నా పలుకులాలకించు; అతఁడు= ధర్మజుడు; అనుజులు= తన తమ్ములు; ఋత్విజులుగన్= యజ్ఞం చేయించే ఋత్విక్కులు కాగా; ఈ పని= ఈ కార్యం; ఇటు చేయుము= ఈ విధంగా నిర్వహించుము; అను= అని పలికే; నీవు= నీవు; ఉపద్రష్టవు కాన్= యజ్ఞకర్మలోని గుణదోషాలను కనిపెట్టేవాడవు కాగా; కురుకుమారపశువిశసనమునన్= కౌరవులనే యజ్ఞపశువులను చంపుటద్వారా; రణయజ్ఞము= యుద్ధమనే యాగాన్ని; సమ్మతిన్= ఇష్టంతో; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మజుడు తన తమ్ములు నలుగురూ, హోత, ఉద్గాత, అధ్వర్యువు, బ్రహ్మ అని యజ్ఞం చేయించే యాజకులు కాగా, ఈ పని ఇట్లా చేయండి అని యజ్ఞకర్మలోని గుణదోషాలను కనిపెట్టి చెప్పే ఉపద్రష్టవు నీవు కాగా, కౌరవులనే పశువులను విశసించి సంప్రీతితో రణయజ్ఞం చేస్తాడు.

విశేషం: అలం: రూపకం.

వ. దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మముబోం ట్లెల్లను సద్గతి వడయుదురు గాక!' యనిన విని వసుదేవనందనుండు సూతనందనున కిట్లనియె. 46

ప్రతిపదార్థం: దానన్= దానివలన; పుణ్యభూమి+అగు= ధర్మక్షేత్రమైన; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; మముబోంట్లు+ఎల్లను= మా వంటివారందరూ; సత్+గతి= ఉత్తమలోకాలను; పడయుదురుగాక!= పొందుతారుగాక!; అనినన్= అని కర్ణుడు పలుకగా; విని; వసుదేవనందనుండు= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడు; సూతనందననుకున్= అధిరథుడి ఆత్మజుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మజుడు యుద్ధ యజ్ఞంచేసే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో మా వంటివారంతా ఉత్తమగతులు పొందుతారు' అని కర్ణుడు పలుకగా విని శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు:

మ. 'దయ నా యాడినమాటఁ గైకొనవు సంతాపంబుఁ దెచ్చుం జుమీ!
స్మయ మెట్లుం దుది నీకు నర్జుననితో మాత్సర్యమైనం బరా
జయ మొండెన్ మృతి యొండెఁ గాక గెలువన్ శక్యంబె? పెక్కంద్ర కిం
తియ కాలం బగునట్టె నీ మనము శాంతింబొందఁగా నేర్చునే? 47

ప్రతిపదార్థం: దయన్= కృపతో; నా+ఆడినమాటన్= నేను పలికిన పలుకును; కైకొనవు= ఆదరించకున్నావు; స్మయము= గర్వం; సంతాపంబున్= దుఃఖమును; తెచ్చున్+చుమీ!= కలిగించగలదు సుమా!; ఎట్లున్= ఎట్లాగయినా; తుదిన్= చివరకు; నీకున్= నీకు; అర్జుననితోన్= పార్థుడితో; మాత్సర్యము+ఐనన్= ద్వేషమొదవినచో; పరాజయము+ఒండెన్= అపజయమో లేదా; మృతి+ఒండెన్= మరణమో; కాక= ఈ రెంటిలో ఒకటితప్ప; గెలువన్ శక్యంబె?= అతనిని జయించుట నీ తరమా? (కాదని అర్థం); పెక్కం(డ్రకున్= అనేకులకు; ఇంతియకాలంబు+అగునట్టె= బ్రతుకు ఇంతవరకే ఉన్నది కాబోలు (ఆ కారణముచే); నీ మనము= నీ హృదయం; శాంతిన్+పొందగాన్+నేర్చునే?= శాంతిని పొందజాలునా? (చాలదని అర్థం.)

తాత్పర్యం: 'కనికరంతో నేను పలికిన పల్కులు గైకొనకున్నావు. అహంకారం దుఃఖాన్ని కలిగిస్తుంది సుమా! అర్జునుడిపై ద్వేషం వహించిన నీకు అతడితోటి పోరాటంలో పరాజయమో ప్రాణహానియో - ఈ రెంటిలో ఒకటితప్ప విజయం సంప్రాప్తించదు. పలువురకు చేటుకాలం దాపురించి ఉండగా నీ మనసు శాంతి వహించగలదా?

క. గాండీవముఁ గవదొనలు న । ఖండిత దివ్యాస్త్రములు నొగలపై నేనుం
జండ భుజబలమునై యు । ద్దండత నరుఁ డడర నెదురఁ దరమే నీకున్? 48

ప్రతిపదార్థం: గాండీవమున్= గాండీవమనే ధనుస్సు; కవదొనలున్= అక్షయబాణతూణీరాల జంట; అఖండిత దివ్య+అస్త్రములు= అమోఘాలైన దివ్యబాణాలు; నొగలపైన్= తన తేరి నొగల మీద; నేనున్= నేనూ; చండభుజబలమున్+ఐ= తీవ్రమైన బాహుశక్తిగలిగి; ఉద్దండతన్= ఉగ్రంగా; నరుఁడు+అడరన్= అర్జునుడు విజృంభించగా; నీకున్= నీకు; ఎదురన్+తరమే?= యుద్ధంలో ఎదిరించ శక్యమా? (కాదని భావం.)

తాత్పర్యం: గాండీవం, అక్షయ తూణీరాల జంట, అమోఘమైన దివ్యశరాలు, అపార భుజ విక్రమం తనకు తోడై ఉండగా, తన రథం తోలుతూ నొగలపై నేనుండగా, భయంకరంగా చెలరేగిన అర్జునుడిని కయ్యంలో ఎదుర్కొనటానికి నీకు శక్యం కాదు.

విశేషం: తిరుపతికవుల ఉద్యోగ విజయాల నాటకంలోని సుప్రసిద్ధమైన 'జెండాపై కపిరాజు, ముందు సితవాజి శ్రేణి.....' అనే పద్యానికి ఇది స్ఫూర్తియేమో!

వ. ఎల్లభంగులం బాండవుల గెల్తు; రది యట్లుండె; నీవు పొః; మ్మిప్పుడ పోయి సుయోధనునకును గురుభీష్ములకును మీకుం దోడువచ్చిన రాజుల కందఱకుం జెప్పు : మిమ్మాసంబు సౌమ్యంబై సమశీతోష్ణంబై పుష్పఫలోపేతంబును, సమగ్ర ధాన్యంబును, సులభయవ సేంధనంబును నగుచు నొప్పియున్నయది; యేడెనిమిది దివసంబులకు నమావాస్య వచ్చు; నది పుణ్యదినంబు; నాఁడు భండనంబు గావలయు' ననినఁ గానీనుండు కమలనాభున కిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాల; పాండవులు+అ= పాండవేయులే; గెల్తురు= జయిస్తారు; అది+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉండనీ; నీవు పొమ్ము= నీవు కరినగరికి వెళ్ళుము; ఇప్పుడు+అ పోయి= ఇపుడే వెళ్ళి; సుయోధనునకును; గురుభీష్ములకును; మీకున్= మీకు; తోడువచ్చిన= సాయపడటానికి వచ్చిన; రాజులకున్; అందఱకున్; చెప్పుము; ఈ+మాసంబు= ఈ నెల; సౌమ్యంబు+ఐ= శాంతమై; సమ శీత+ఉష్ణంబు+ఐ= సమానమైన చలీ, వేడీ కలదై; పుష్పఫల+ఉపేతంబును= పూలతో పండ్లతో కూడినదై; సమగ్ర ధాన్యంబును= అధికమైన ధాన్యం కలదై; సులభ యవస+ఇంధనంబును= తేలికగా లభించే పచ్చిక, వంటచెరకులు కలది; అగుచున్; ఒప్పి+ఉన్నయది= సొంపారుతున్నది; ఏడు+ఎనిమిది దివసంబులకున్= ఏడెనిమిది రోజులకు; అమావాస్య; వచ్చున్; అది= ఆ అమావాస్య; పుణ్యదినంబు= పవిత్రమైన రోజు; నాఁడు= ఆ అమావాస్యరోజు; భండనంబు= యుద్ధం; కావలయున్= జరుగవలెను; అనినన్; కానీనుండు= కుంతి కన్యగా నున్నపుడు సూర్యవర ప్రసాదంతో జనించిన కర్ణుడు; కమలనాభునకున్= బొడ్డున తామరగల శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: సర్వవిధాల పాండవేయులే జయిస్తారు. ఆ విషయం అట్లా ఉండనీ. నీవు హస్తినాపురికి వెళ్ళి ఇపుడే దుర్యోధనుడికీ, భీష్మ ద్రోణులకూ, మీకు సాయపడవచ్చిన రాజులందరికీ చెప్పుము. ఈ నెల అంత చలి, వేడిమి లేక పూలతో పండ్లతో కూడి, ధాన్యంతో నిండి, తేలికగా పచ్చిక, వంట చెరకు దొరుకుతుండగా పెంపారుతున్నది. ఏడెనిమిది రోజులలో అమావాస్య వస్తుంది. అది పుణ్య తిథి. ఆనాడు యుద్ధం ప్రారంభం కావాలి' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకు కర్ణుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: నేడు అమావాస్య. ఏ పనినీ ఆరంభింపగూడని అపవిత్రదినంగా భావింపబడుతుండగా, నాడు యుద్ధంవంటి అతిముఖ్యమైన కార్యాన్ని ఆరంభించదగిన పుణ్యదినంగా భావించబడటం విశేషం.

క. 'కలవు నిమిత్త స్వప్నం । బులు కౌరవ పాండవులకుఁ బోటగు; దానన్
గెలు పయ్యుధిష్ఠిరునకును । గల; దెఱుఁగుదు నీవు సెప్పఁగా నేమిటికిన్? 50

ప్రతిపదార్థం: నిమిత్త స్వప్నంబులు= శకునాలు, కలలు; కలవు= భావియుద్ధాన్నే సూచిస్తున్నాయి; దానన్= ఆ కారణముచే; కౌరవ పాండవులకున్= కౌరవులకు, పాండవేయులకు; పోటు+అగున్= పోరాటం జరుగుతుంది; ఆ యుధిష్ఠిరునకున్= ఆ ధర్మజునకు; గెలుపు+కలదు= విజయం కలుగుతుంది; ఎఱుఁగుదున్= నాకు తెలుసు; నీవు చెప్పఁగాన్+ఏమిటికిన్?= నీవు తెలుపవలసిన అవసరం ఏముంది? (లేదని భావం).

తాత్పర్యం: శకునాలూ, కలలూ భావియుద్ధ సూచకాలై ఉన్నాయి. అందుచేత కురుపాండవులకు పోరు జరుగుతుంది. ఆ పోరాటంలో ధర్మజుడికి గెలుపు కలుగుతుంది. ఆ విషయం నాకు తెలుసు. నీవు వేరే చెప్పటమెందుకు?

వ. అట్లుగాన కదా యే నందు రా' నని పలికి మఱియును. 51

ప్రతిపదార్థం: అట్లు+కాన్+అ+కదా= అందువలననేగదా!; ఏను= నేను; అందున్+రాను= అక్కడికి రావటానికి సమ్మతించను; అని పలికి; మఱియును.

తాత్పర్యం: కృష్ణా! అందువలననే కదా నేను పాండవుల వద్దకు రానని చెప్పుతున్నాను' అని పలికి కర్ణుడు ఇంకా. (ఇట్లా అన్నాడు:)

క. 'దీనికి మూలము శకునియు। నేనును, దుశ్శాసనుండు, నింతియ; కుంతీ
సూనుల వారలు గలసిన। రానేరఁగ వచ్చు నాకు రాజీవాక్షా! 52

ప్రతిపదార్థం: రాజీవ+అక్షా!= కమలాల వంటి కన్నులుగల కృష్ణా!; దీనికిన్= ఈ సంగ్రామానికి; శకునియున్= సౌబలుడూ; నేనును= నేనున్నూ; దుశ్శాసనుండు= దుస్ససేనుడూ; మూలము= హేతువై ఉన్నాము; ఇంతియ= ఇది నిజం; వారలు= ఆ శకుని దుశ్శాసనులు; కుంతీసూనులన్= కుంతి కొడుకులను; కలసినన్= కూడినప్పుడే; నాకున్= నాకు; రానేరఁగన్ వచ్చున్= రాదగి ఉంటుంది.

తాత్పర్యం: ఈ సంగ్రామానికి శకుని, నేను, దుశ్శాసనుడు కారణభూతులం. ఇది నిజం. వారిద్దరు పాండవేయులను కలసినప్పుడు గదా నేను వారిని కలవవలసి ఉంటుంది? వారూ, నేనూ కౌంతేయులను కలవటం అసంభవం.

వ. ఈ సమర సముద్రంబు గడవ నీఁది నిన్నుం గనియెదఁ; గాదేని నూర్ధ్వలోకంబునం గాంచెద; నీ వింక నేమియుం బలుకకుము; పని వినియెద'నని కౌఁగిలించుకొనిన 'నట్ల కాక పొ'మ్మని విష్ణుండు వీడుకొలువ రాధేయుండు రథావతరణంబు సేసి, కనక రత్నమయంబగు తన యరదం బెక్కి కరిపురంబున కరిగె; నచ్యుతుండును సాత్యకిం దన రథం బెక్కించుకొని దారుకుం జూచి 'పద పద పోనిమ్ము పోని'మ్మని పలికి లలితాటోపకలితుండగుచుఁ జనియె; నట్టియెడ విదురుండు విషాదంబుతోఁ బాండురాజమహిషి పాలికిం జని యిట్లనియె. 53

ప్రతిపదార్థం: ఈ సమర సముద్రంబున్= ఈ యుద్ధమనెడు సాగరాన్ని; కడవన్+ఈఁది= కడముట్ట దాటి; నిన్నున్+ కనియెదన్= నిన్ను సందర్శిస్తాను; కాదు+ఏనిన్= అట్లా రణ విజయం పొందలేక వీరమరణం చెందితే; ఊర్ధ్వలోకంబునన్= పరలోకంలో; కాంచెదన్= చూస్తాను; నీవు; ఇంకన్; ఏమియున్; పలుకకుము; పని వినియెదన్= వెళ్ళివస్తాను; అని; కౌఁగిలించుకొనినన్; అట్లకాక= అట్లాగే; పొమ్ము+అని; విష్ణుండు= వెన్నుడు; వీడు కొల్పన్= అంపగా; రాధేయుండు; రథ+ అవతరణంబు చేసి= రథం నుండి క్రిందికి దిగి; కనక రత్నమయంబు+అగు= బంగారంతో రతనాలతో నిర్మించిన; తన+అరదంబు+ఎక్కి= తన రథాన్ని అధిరోహించి; కరిపురంబునకున్= హస్తినాపురానికి; అరిగెన్; అచ్యుతుండును= శ్రీకృష్ణుడు కూడా; సాత్యకిన్; తన రథంబు; ఎక్కించుకొని; దారుకున్+చూచి= దారుకుడనే తన రథసారథిని చూచి; పద పద; పోనిమ్ము పోనిమ్ము; అని పలికి; లలిత+ఆటోప కలితుండు+అగుచున్= ఉల్లాసకరమైన గర్వంతో కూడినవాడవుతూ; చనియెన్= పాండవుల దగ్గరకు వెళ్ళాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో, విదురుండు; విషాదంబుతోన్= దుఃఖంతో; పాండురాజమహిషి పాలికిన్+చని= పాండురాజు పట్టపు దేవేరి అయిన కుంతి చెంతకు వెళ్ళి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణా! కురుపాండవులకు ఏర్పడనున్న ఈ సంగ్రామ మనే సముద్రాన్ని తుదముట్టనీది విజయినై ఇక్కడ నిన్ను దర్శిస్తాను. లేదా కూలి వీరస్వర్గంచేరి పరమేశ్వరుడవైన నిన్ను చూస్తాను. నా కిక సెలవిప్పించు'మంటూ స్వామిని కర్ణుడు కౌగిలించుకొన్నాడు. వెన్నుడు 'అట్లాగే వెళ్ళు'మని అనుమతి నీయగా రాధేయుడు రాజీవాక్షుడి రథంనుండి దిగి కనకరత్నమయమైన తన తేరెక్కి హస్తినాపురికి తిరిగివెళ్ళాడు. అచ్యుతుడు అంతవరకు దవ్వుల నున్న సాత్యకిని తన రథ మెక్కించుకొని సారథి అయిన దారుకుడితో 'పదపద, రథాన్ని పోని'మ్మని చెప్పి సొబగైన దర్పంతో వెళ్ళాడు. అట్టి సమయంలో విదురుడు దుఃఖంతో పాండునృపాలుడి పట్టపురాణి కుంతీదేవి గృహానికి వెళ్ళి ఆమెతో ఇట్లా అన్నాడు:

విశేషం: సమరసముద్రంబు - అలంకారం రూపకం.

ఉ. 'అక్కట! కౌరవాన్వయ మహార్ణవ మింకెడునట్లు పుట్టె; నిం
దొక్కరుఁడైనఁ గేశవు హితోక్తికి మేకొనఁ డయ్యె; నర్జునుం
డెక్కటి దాన చాలుఁ దము నిందఱఁ దీవ్రశరాగ్నిఁ గాల్చఁ; బెం
పెక్కిన పాండునందనుల యేడ్తెఱఁ దొల్లియుఁ దా రెఱుంగరే? 54

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; కౌరవ+అన్వయ+మహా+అర్ణవము= కౌరవ వంశమనే గొప్ప సముద్రం; ఇంకెడు+అట్లు+పుట్టెన్= ఎండిపోయేటట్లు యుద్ధం తటస్థించింది; ఇందున్= ఈ కురువంశంలో; ఒక్కరుఁడు+ఐనన్= ఒక్కడు కూడ; కేశవుహిత+ఉక్తికిన్= శ్రీకృష్ణుడి శ్రేయస్కరమైన వచనానికి; మేకొనఁడు+అయ్యెన్= సమ్మతించలేదు; అర్జునుండు= పార్థుడు; ఎక్కటి= అసహాయశూరుడు; తమున్+ఇందఱన్= కౌరవులనందరినీ; తీవ్రశర+అగ్నిని= తీక్ష్ణములైన బాణాలనే నిప్పుతో; కాల్చన్= దహించటానికి; తాను+అ చాలున్= తానొక్కడే సరిపోతాడు; పెంపు+ఎక్కిన= ఘనతగాంచిన; పాండునందనుల= పాండుకుమారుల యొక్క; ఏడ్తెఱన్= శక్తిని (సామర్థ్యాన్ని, పరాక్రమాన్ని); తొల్లియున్= ఇదివరలోకూడా; తారు= తాము; ఎఱుంగరే?= తెలియకున్నారా?

తాత్పర్యం: 'అయ్యో! కౌరవవంశమనే సాగరం ఇంకిపోయేటట్లుగా యుద్ధం తటస్థించింది. కౌరవులలో ఒక్కడైనా శ్రీకృష్ణుడి హితబోధ మన్నించలేదు. అర్జునుడు అసహాయశూరుడు. అత డొక్కడే తామందరినీ వాడిబాణాలనే అగ్ని చేత దహించి వేయగలడు. ప్రసిద్ధికెక్కిన పాండవుల శక్తిసామర్థ్యాలు ఎట్లాంటివో వీరికి ఇంతకు మునుపు తెలియనివి కావు గదా!

విశేషం: అలం: రూపకం. కౌరవాన్వయ మహార్ణవము, తీవ్ర శరాగ్ని.

తే. అన్ని వడియును బంధుక్షయంబు సేయ । నొల్ల కెల్ల విధంబుల నుపశమంబ
కోరి రప్పాండవేయులు; వారి కిట్టి । దొసఁగు వచ్చునె తులువల తోడఁబుట్టి.' 55

ప్రతిపదార్థం: ఆ+పాండవేయులు= ఆ పాండునందనులు; అన్ని పడియును= అన్ని కష్టాలు అనుభవించినప్పటికినీ; బంధుక్షయంబు+చేయన్+ఒల్లక= చుట్టాలను నాశనం చెయ్యటాని కిష్టపడక; ఉపశమంబు+అ కోరిరి= శాంతినే వాంఛించారు; తులువల తోడన్+పుట్టి= తుచ్ఛులైన దుర్యోధనాదులకు సోదరులై పుట్టి; వారికిన్= పుణ్యాత్ములైన పాండుపుత్త్రులకు; ఇట్టి దొసఁగు వచ్చునె?= ఇట్టి విపత్తు కలిగిందే?

తాత్పర్యం: పాండుకుమారులు అన్ని కష్టాలు అనుభవించినప్పటికీ చుట్టాలను నాశనం చేయటానికి ఇష్టపడక సకల విధాల శాంతినే అభిలషించారు. అట్టి మహనీయులకు దుర్మార్గులైన కౌరవులు తోడబుట్టువులైనందుకు ఇట్లాంటి బాధలు కలిగాయి'.

వ. అని వెండియు నివ్విధంబు మాటలఁ బాండవులకుఁ గయ్యంపు టలజడియైన వగపు దోఁప నాడుచుం గొండొక ప్రొద్దు నిలిచి నిజనివాసంబునకుం బోయిన యనంతరంబ కుంతి యిట్లని వితర్కించె. 56

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల; ఈ+విధంబు మాటలన్= ఇట్లాంటి మాటలతో; పాండవులకున్= ధర్మజాదులకు; కయ్యము+అలజడి+ఐనన్= యుద్ధ సంక్షోభ మేర్పడగా; వగపు+తోఁపన్= చింత వ్యక్తమయ్యేటట్లు; ఆడుచున్= పలుకుతూ; కొండొక ప్రొద్దు= కొంత తడవు; నిలిచి= కుంతీగృహంలో ఆగి; నిజ నివాసంబునకున్= తన నివాస ప్రదేశానికి; పోయిన+ అనంతరంబు+అ= వెళ్లిన తరువాత; కుంతి; ఇట్లని; వితర్కించెన్= ఆలోచించింది.

తాత్పర్యం: విదురుడు పాండవుల కేర్పడిన యుద్ధాందోళనగురించి ఇట్లాంటి మాటలతో తన దుఃఖం వ్యక్తమయ్యేటట్లు పలుకుతూ, కొంచెం సేపు కుంతీగృహంలో నిలిచి, పిదప తన నివాసప్రదేశానికి వెళ్ళాడు. అట్లా విదురుడు వెళ్ళిన తరువాత కుంతి తన మనసులో ఇట్లా ఆలోచించింది:

మ. 'తమ వారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశ కృ
త్యమె తాఁ గయ్యము? ద్రోణ భీష్మ కృప కర్ణాటోపముల్ మాన్చు ట
ల్పములం దీఱునె? యందు నర్కజుని యుల్లం బెప్పుడుం గ్రోధ దీ
ప్తము భీమాదుల మీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్.' 57

ప్రతిపదార్థం: తమవారిన్= తమ చుట్టాలను; సిరికై= రాజ్యలక్ష్మికై; వధించుట= చంపటం; ఇది సత్+ధర్మంబె?= ఇది శ్రేష్ఠమైన ధర్మమా?; కయ్యము తాన్= సంగ్రామమన్నది; అక్లేశ కృత్యమె?= దుఃఖ మొదవని కార్యమా?; ద్రోణ భీష్మ కృప కర్ణ+ఆటోపముల్= ద్రోణ భీష్ముల యొక్క, కృప కర్ణులయొక్క యుద్ధ విజృంభణాలు; మాన్చుట= లేకుండా చేయటం; అల్పములన్+తీఱునె?= తక్కువ యత్నాలతో జరిగేదా?; అందున్= ఆ ద్రోణభీష్మ కృపకర్ణులలో; అర్కజుని+ఉల్లంబు= కర్ణుడి మనస్సు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; భీమ+ఆదుల మీఁదన్= భీముడు మొదలైన వారిమీద; క్రోధ దీప్తము= కోపంతో మండుతుంటుంది; తక్కొరులకున్= మిగిలిన కౌరవ సేనలోని వీరులకు; ఆజికిన్= యుద్ధం సల్పడానికి; ఉత్సాహంబు లేదు= అభిలాష లేదు.

తాత్పర్యం: 'తమ చుట్టాలను రాజ్యసంపదకై చంపటం ఉత్తమ ధర్మమౌతుందా? యుద్ధం చేయటం దుఃఖరహిత కార్యం కాదుగదా! ద్రోణభీష్మకృపకర్ణుల వీరావేశాలు మాన్పటం తక్కువ యత్నంతో జరిగేవి కావు. ఆ ద్రోణ భీష్మ కృప కర్ణులలో ఆ సూర్యపుత్రుడి మన సెప్పుడూ భీమాదుల మీద కోపంతో మండిపోతుంటుంది. కురుసేనలోని తదితర యోధులకు యుద్ధం చేయాలనే అభిలాష లేదు.'

వ. అని యిత్తెఱంగునఁ బెక్కులు చింతించి తలంచుకొని 'కర్ణునకుం బుట్టువు తెలిపి సహోదర స్నేహం బావహించెద; నట్లయిన నాహవంబువలని కడంక యుడుగకుండునె?' యని విచారించి యతని పాలికిం బోన నిశ్చయించి, యుచిత ప్రకారంబున వెడలి యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని తత్ప్రదేశంబున కరిగి యతనికి జపకాలంబయి యునికిం జూచి వెనుక వలనఁ గూర్చుండఁ, గొండొక సేపునకు జపంబుదీఱ కలయం గనుంగొని యమ్మహాదేవిఁగాంచి కానీనుండు సంభ్రమ వినయంబులతోడం జేరి సూత గోత్రంబును రాధేయనామంబునుం జెప్పి యభివాదనంబు చేసి 'నీవు విజయంచేసిన కార్యం బేమి? నాకుం జేయంగల పని యెయ్యది? యానతి'మ్మనినఁ గుంతి యేకాంతంబుగా నిట్లనియె. 58

ప్రతిపదార్థం: అని; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పెక్కులు చింతించి= అనేక విధాలుగా ఆలోచించి; తలంచుకొని= భావించి; కర్ణునకున్; పుట్టువు తెలిపి= జన్మ ప్రకారం తెలిపి; సహోదర స్నేహంబు+ఆవహించెదన్= తోడబుట్టువుల మీద

ప్రేమను కలిగిస్తాను; అట్లు+అయినన్= అట్లాచేస్తే; ఆహవంబు వలని కడంక= యుద్ధమునందలి పూనిక; ఉడుగక+ఉండునె?= మానకుంటాడా?; అని విచారించి= అని తలపోసి; అతని పాలికిన్+పోవన్+నిశ్చయించి= అతడి దగ్గరకు వెళ్ళటానికి నిర్ణయించి; ఉచిత ప్రకారంబునన్= తగిన విధంగా; వెడలి= బయలుదేరి; అతండు= కర్ణుడు; అనుష్ఠాన+అర్థంబు= విధులాచరించుట కొరకు; భాగీరథికిన్= గంగానదికి; చనుట విని= వెళ్ళాడని తెలిసికొని; అతనికిన్= ఆ కర్ణుడికి; జపకాలంబు= మంత్రజపం చేసే సమయం; అయి+ఉనికిన్= అయి ఉండటం; చూచి; వెనుక వలనన్= అతడికి వెనుక తట్టు; కూర్చుండన్= ఆసీనురాలు కాగా; కొండొక సేపునకున్= కొంత తడవునకు; జపంబు తీఱి= జపం ముగించి; కలయన్+కనుంగొని= నలువైపుల చూచి; ఆ+మహాదేవిన్+కాంచి= పాండురాజు పట్టపు దేవేరిని కనుగొని; కానీనుండు= కన్యాపుత్రుడైన కర్ణుడు; సంభ్రమ వినయంబుల తోడన్= తొట్రుపాటుతో, అణకువతో; చేరి= ఆమెను సమీపించి; సూతగోత్రంబును= తనకు సంబంధించిన సూతగోత్రాన్ని; రాధేయ నామంబునున్= రాధేయుడనే తన పేరునూ చెప్పి; అభివాదనంబు చేసి= పాదనమస్కారంచేసి; నీవు; విజయంచేసిన కార్యంబు+ఏమి?= వచ్చిన పని ఏమిటి?; నాకున్+చేయన్+కల+పని+ఏ+అది?= నేను నీ కొరకై చేయవలసిన పనిఏమిటి?; ఆనతిమ్ము= సెలవిమ్ము; అనినన్; కుంతి; ఏకాంతంబుగాన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఇట్లా పలురకాల ఆలోచించింది. 'కర్ణుడికి ఆతడి జన్మ వృత్తాంతం చెప్పి తన తోబుట్టువుల మీద ప్రేమ కలిగిస్తాను. అట్లా సోదరుల మీద ప్రేమ జనింపజేస్తే యుద్ధం చేయవలెననే పట్టుదల మానుకొంటాడు కదా! అని భావించి అతడి దగ్గరకు వెళ్ళాలని నిశ్చయించుకొన్నది. కర్ణుడు అనుష్ఠానార్థం గంగానదికి వెళ్ళాడని విని తా నక్కడికి వెళ్ళింది. ఆ సమయంలో కర్ణుడు జపం చేస్తున్నాడు. మెల్లగా వెళ్ళి అతని వెనుక కుంతి కూర్చున్నది. కొంచెంసేపటికి తన జపం పూర్తి కాగానే కర్ణుడు కనులు దెరచి నాల్గువైపుల కలయజూచాడు. కుంతి కనిపించింది. అతడు పాండు రాజమహిషిని చూడగానే సంభ్రమ వినయాలతో దగ్గరకు వచ్చాడు. తన సూత గోత్రం, రాధేయ నామధేయం చెప్పి ఆమెకు ప్రణమిల్లాడు. 'నీ విక్కడికి ఏమి పనిమీద వచ్చావో, నేను చేయవలసిన పని ఏమిటో సెల'విమ్మని అడిగాడు. ఆమె రహస్యంగా కర్ణుడితో ఇట్లా అన్నది:

కుంతీదేవి కర్ణునకు నతండు తన పుత్త్రుం డగుట దెలుపుట (సం. 5-143-1)

సీ. 'వినుము! సూతాన్వయంబున నీవు పుట్టుట । బొం; కేను మా కుంతిభోజునింటఁ
గన్నియనాఁడు భాస్కరుని రావించితి । వరమంత్రబలమున; వచ్చి యతఁడు
సంప్రీతి నొసఁగంగ జన్మించినాఁడవు । నాకుఁ; గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టి నీ వితరులఁ । గొలువ నేటికిఁ గురుకులవరేణ్య?

తే. ధర్మతనయాదులైన నీ తమ్ములకును । ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ;
వేలు మీ లోకమెల్ల; నీ కేల రాధ । కొడు కితం డను తక్కువ? కొడుకుఁగుఱ్ఱ!' 59

ప్రతిపదార్థం: కొడుకుఁ గుఱ్ఱ!= ముద్దుకుమారా!; వినుము= ఆలకించుము; సూత+అన్వయంబునన్= సూతకులంలో; నీవు పుట్టుట= నీవు జన్మించటం; బొంకు= అబద్ధం; ఏను= నేను; మా కుంతి భోజు+ఇంటన్= మా తండ్రిఐన కుంతిభోజుడి గృహంలో; కన్నియనాఁడు= కన్యగా ఉన్నప్పుడు; భాస్కరునిన్= సూర్యభగవానుడిని; వరమంత్రబలమునన్= శ్రేష్ఠమైన మంత్రశక్తిచేత; రావించితిన్= చెంతకు రప్పించాను; అతఁడు వచ్చి= ఆ సూర్యుడు వచ్చి; నాకున్= నాకు; సంప్రీతిన్= సంతోషంతో; ఒసఁగంగన్= నిన్ను అనుగ్రహించగా; జన్మించినాఁడవు= పుట్టావు; కావునన్= కాబట్టి; ధర్మస్థితిన్= న్యాయపద్ధతితో; పాండు నందనుండవు= పాండురాజు కుమారుడవే; అగుదు(వు)= ఔతావు; అట్టి నీవు= అటువంటి నీవు; ఇతరులన్= అన్యులను;

కొలువన్+ఏటికిన్?= సేవించుటెందులకు?; కురుకులవరేణ్యా!= కురువంశంలో ఉత్తముడవైనపుత్రా!; ధర్మతనయ+ఆదులు+ అయిన= ధర్మజుడు మున్నుగా గల; నీ తమ్ములకును= నీ తమ్ములందరికీ; ధార్తరాష్ట్రులకును= దుర్యోధనాదులైన కౌరవులందరికీ; నీవు+అ= నీవే; తగు విభుండవు= తగిన రాజువు; ఈ లోకము+ఎల్లన్= ఈ జగమంతా; ఏలుము= పాలించుము; నీకున్= నీకు; ఇతండు రాధకొడుకు= ఈ కర్ణుడు రాధయొక్క కుమారుడు; అను తక్కువ= అనునట్టి హీనస్థితి; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'వత్సా! నా మాట వినుము. నీవు సూతకులంలో జన్మించినావనటం అబద్ధం. నేను మా తండ్రి కుంతి భోజుడి గృహంలో కన్యగా ఉన్నప్పుడు గొప్ప మంత్ర బలంతో భాస్కరుడిని నా చెంతకు రప్పించాను. ఆతడు వచ్చి సంతోషంతో అనుగ్రహించగా నీవు నాకు జన్మించావు. కావున ధర్మ ప్రకారం నీవు పాండురాజు కుమారుడివే. అట్లాంటి నీవు పరులసేవలో పడిఉండటం తగదు. నీవు కురువంశశ్రేష్ఠుడవు. ధర్మజాదులైన నీ తమ్ముళ్ళకూ, సుయోధనాదులైన కౌరవులకూ నీవు తగిన దొరవు గనుక, ఈ పుడమినంతా నీవే పాలించుము. కర్ణుడు రాధా తనయుడన్న హీనస్థితి నీ కెందుకు?'

క. అని పలికిన యవసరమున । నినబింబములోన నుండి 'యిది నిజ మిభ్భం
గిన నెగడవన్న మేలగు' । నను వాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్. 60

ప్రతిపదార్థం: అని పలికిన+అవసరమునన్= కుంతీదేవి అట్లా చెపుతున్న సమయంలో; కర్ణుఁడు+ఆకర్ణింపన్= కర్ణుడు వినేటట్లుగా; ఇన బింబములోనన్+ఉండి= సూర్యమండలంలో నుండి; ఇది నిజము= కుంతి చెప్పినది సత్యం; ఈ+భంగిన్+అ= ఆమె చెప్పిన రీతిలో మెలగి; నెగడవు+అన్న= వర్ధిలుమయ్యా; మేలు+అగున్= నీకు శ్రేయం కలుగుతుంది; అను వాక్యము వెడలెన్= అనే వచనం వినవచ్చింది.

తాత్పర్యం: కుంతీదేవి అట్లా అనగానే 'ఆమె చెప్పింది నిజం. నీవు ఆమె చెప్పినట్లు నడచుకొని వర్ధిల్లుము. ఇది నీకు మేలు' అనే వాక్యం కర్ణుడు వింటుండగా సూర్యబింబంలో నుండి వెలువడింది.

తే. దాని వినియును నపుడు రాధాసుతుండు । దిరుగఁబడని మనంబుతో ధీరవృత్తిఁ
దల్లి కిట్లను 'నీమాట తథ్యమగున । యైన నొక్కటి సెప్పెద నవధరింపు. 61

ప్రతిపదార్థం: దానిన్= ఆ మాటను; వినియునున్= వినికూడ; అపుడు; రాధాసుతుండు= రాధ కొడుకు-కర్ణుడు; తిరుగన్+పడని+మనంబుతోన్= మరలని చిత్తంతో; ధీరవృత్తిన్= ధైర్యమునందు నిలుకడ కలిగినవాడై; తల్లికిన్= జననికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నీ మాట తథ్యము= నీ వాడింది సత్యం; అగును+అ= అయినదే; ఐనన్= అయినప్పటికినీ; ఒక్కటి చెప్పెదన్= నేనొకమాట చెపుతాను; అవధరింపు= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: సూర్యుడు చెప్పిన మాట విని కూడ కర్ణుడు మారని మనస్సుతో ధైర్యం అవలంబించి తల్లితో ఇట్లా అన్నాడు: 'నీవు చెప్పింది సత్యమే అయినప్పటికీ నే నొకటి చెపుతాను. చిత్తగించుము.

క. క్షత్రియ సంస్కారమునకుఁ । బాత్రముగా నీవు నన్నుఁ బాటింప విహా
ముత్రఫలములకు నీ కేఁ । బుత్రుఁడ నని వచ్చుటింకఁ బోలునె చెపుమా? 62

ప్రతిపదార్థం: క్షత్రియ సంస్కారమునకున్= క్షత్రియ కులోచితమైన జాతకర్మాది షోడశ కర్మలకు; పాత్రముగాన్= అర్హుడయ్యేటట్లు; నీవు= నీవు; నన్నున్= నన్ను; పాటింపవు= ఆదరించినదానవు కావు; నీకున్= అట్టి నీకు; ఇహ+అముత్ర ఫలములకున్= ఇహపరలోక కర్మఫలాలను కలిగించటానికి; ఏన్= నేను; పుత్త్రుఁడన్+అని+వచ్చుట= కుమారుడనని పేర్కొంటూ రావటం; ఇంకన్= ఇక; పోలునె చెపుమా!= తగునా? నీవే చెప్పుము.

తాత్పర్యం: క్షత్రియులకు తగిన సంస్కారాలకు నేను నోచుకొనేటట్లు నీవు చేయలేదు. ఇప్పుడు ఇహపరసుఖాలు కల్గించుట కొరకై నేను పుత్రుడనని నీ వెంట రావటం తగునా? నీవే చెప్పుము.

వ. సూర్యానుగ్రహంబునఁ జేసి నింద్యంబుగాక తక్కెనేనియు నా జన్మంబు పరమ రహస్యంబునై యున్నయది; దీనిఁ బ్రకాశంబు చేయుట మనకెంత మే? లట్లుంగాక. 63

ప్రతిపదార్థం: సూర్య+అనుగ్రహంబునన్+చేసి= సూర్యుడి ప్రసాదంవలన; నింద్యంబు+కాక+తక్కెన్+ఏనియున్= దూషించదగినది కాకపోయినప్పటికిన్నీ; నా జన్మంబు= నా పుట్టుక; పరమ రహస్యంబున్+ఐ+ఉన్న+అది= మిక్కిలి గూఢంగా ఉన్నది; దీనిన్= నా జన్మాన్ని; ప్రకాశంబు చేయుట= వెల్లడి చేయటం; మనకున్+ఎంత మేలు?= మనకు ఏమాత్రం మేలు?; అట్లున్+కాక= అంతేకాక.

తాత్పర్యం: సూర్యభగవానుని ప్రసాదంచేత నా జన్మ దూషించదగినది కానప్పటికీ పరమ రహస్యంగా ఉన్నది. దీనిని ఈనాడు వెల్లడి చేయటం మనకేమంత మంచిది? (మంచిది కాదని భావం). అదీకాక.

ఆ. విజయు విక్రమంబు విఖ్యాతమై యుండ । 'నేను గుంతికొడుక భానుజుండ'
ననుచు నతనిఁ గూడ నరిగిన నతనికి । వెఱచి పోయె ననరె? వేయు నేల? 64

ప్రతిపదార్థం: విజయు విక్రమంబు= అర్జునుడి పరాక్రమం; విఖ్యాతము+ఐ+ఉండన్= ప్రసిద్ధమైఉండగా; నేను; కుంతి కొడుకన్= కుంతీదేవి పుత్రుడను; భానుజుండన్= సూర్యుడి అనుగ్రహంతో జన్మించినవాడిని; అనుచున్= అని చెప్పికొంటూ; అతనిన్= అర్జునుడిని; కూడన్+అరిగినన్= కలియటానికి వెళ్ళితే; అతనికిన్= ఆ పార్థుడికి; వెఱచి పోయెన్= కర్ణుడు భయపడి అతడిని చేరబోయాడు; అనరె?= అని లోకులు పలుకరా?; వేయున్+ఏల?= ఇక పలుమాట లెందుకు?

తాత్పర్యం: పలుమాటలెందుకు? పార్థుడి పరాక్రమం ప్రసిద్ధమైఉండగా 'నేను కుంతీతనయుడిని, భానుడి వరప్రసాదం వల్ల జనించిన వాడిని' అని చెప్పుకొంటూ అతడిని చేరబోతే, లోకులు నన్ను భయపడి పాండవులను చేరబోయాడని అనక మానరు.

క. కడిఁది పగఱ నేఁ దెప్పగఁ । గడవంగా నీఁదఁదలఁచు కౌరవనాథుం
జెడుఁ గాక యంచు నిత్తఱి । విడువఁదగునె? యతని వలన వెలసిన వాఁడన్. 65

ప్రతిపదార్థం: కడిఁది పగఱన్= సాధించరాని శత్రువులను (దుస్తర శత్రువులనే సముద్రాన్ని); నేన్= నేను; తెప్పగన్= నౌకగా; కడవంగాన్+ఈఁదన్+తలఁచు= ఈది గట్టుచేరనెంచే; కౌరవనాథున్= దుర్యోధనుడిని; చెడున్+కాక+అంచున్= నాశనం కానిమ్మని; ఈ+తఱిన్= అక్కర గలిగిన ఈ సమయంలో; అతని వలనన్= కురుపతి వలన; వెలసినవాఁడన్= ప్రసిద్ధిగాంచిన వాడనైన నేను; విడువన్+తగునె?= వదలిపెట్టటం భావ్యమా?

తాత్పర్యం: దుస్తర విరోధులనే సముద్రాన్ని నన్ను తెప్పగా చేసికొని ఈది గట్టు చేరవలెననే విశ్వాసంతో ఉన్న ఆ కురుపతిని అవసర సమయంలో వదలివేయటం నాకు ధర్మం కాదు. ఆయన వల్లనే నేను ప్రసిద్ధి కెక్కాను.

క. కౌరవులచేతఁ గుడిచిన । వారికి నిది సమయ; మెట్టివారును సంగ్రా
మారంభంబునఁ బాయుదు । రే? రాజులు మనలఁ దిట్టరే యట్లయినన్. 66

ప్రతిపదార్థం: కౌరవులచేతన్= కౌరవులవలన; కుడిచిన వారికిన్= మనుగడ సాగిస్తున్నవారికి; ఇది సమయము= సాయపడటానికి ఇది తగిన వేళ; ఎట్టివారును= ఎంత కృతఘ్నులైనా; సంగ్రామ+ఆరంభంబునన్= యుద్ధ ప్రారంభంలో; పాయుదురే?= వీడుదురా?; అట్లు+అయినన్= అట్లా చేస్తే; మనలన్= మనలను; రాజులు= ప్రభువులు; తిట్టరే?= దూషించరా?

తాత్పర్యం: కౌరవుల తిండి తిని జీవిస్తున్నవారు వారికి సాయపడటానికి ఇది తగిన సమయం. ఎంత విశ్వాసం లేనివారైనా యుద్ధం మొదలయ్యేటప్పుడు తమ పక్షాన్ని వదలి వస్తారా? ఇట్లా చేస్తే తోడ్పాటు చూపవచ్చిన రాజులు మనలను నిందించరా?

వ. ఏ నవశ్యంబును దుర్యోధనునకై నీకొడుకులతోడం బెనంగుదు. 67

ప్రతిపదార్థం: ఏను= నేను; అవశ్యంబును= తప్పక; దుర్యోధనునకై= సుయోధనుడి కొరకు; నీ కొడుకుల తోడన్; పెనంగుదున్= పోరాడతాను.

తాత్పర్యం: నేను దుర్యోధనుడి కొరకు తప్పక నీ కుమారులతో పోరాడుతాను.

ఉ. నీ పలు కెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండు లే;
దీపని మీఁది భారమున నీ విట వచ్చితిగాన పాండవుల్
సేపడిరేనిఁ జంప; నఱసేయక చెప్పెద సవ్యసాచిపైఁ
గోపము పెద్ద; వాఁడు సమకూరిన బిట్టఱఁ జంపుదుం జుమీ! 68

ప్రతిపదార్థం: నీ పలుకు+ నీ వచనము; ఎంత పోలినను= ఎంత తగియున్నను; నిర్ణయము= నా నిశ్చయము; ఇట్టిది+అ కాని+ఒండులేదు= ఇదేగాని మరియొకటికాదు; ఈ పనిమీఁది భారమునన్= ఈ కార్యభారం వహించి; ఈవు= నీవు; ఇటవచ్చితి(వి)= ఇక్కడికి వచ్చావు; కాన= కనుక; పాండవుల్= ధర్మజాదులు; చేపడిరేనిన్= నా చేతికి దొరకినా; చంపన్= సంహరించను; అఱ చేయక చెప్పెదన్= కపటం లేకుండా పలుకుతున్నాను; సవ్యసాచిపైన్= అర్జునుడి మీఁద; కోపము పెద్ద= నాకు మిక్కిలి కోపం; వాఁడు= అతడు-అర్జునుడు; సమకూరినన్= లభిస్తే; బిట్టఱన్= శీఘ్రంగా; చంపుదున్+చుమీ!= సంహరిస్తాను సుమా!

తాత్పర్యం: నీ మాట ఎంత ధర్మయుక్తంగా ఉన్నప్పటికీ నా నిశ్చయమింతే. ఇక మారదు. నీవు ఈ కార్యభారం మీద నా దగ్గరకు వచ్చావు. కపటం లేక చెపుతున్నాను. ధర్మజాదులు నా చేతికి దొరకితే నేను వారిని చంపను. అర్జునుడి మీద నాకు క్రోధం మెండు. వాడు తటస్థపడితే మాత్రం చంపి తీరుతాను.

ఆ. సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి । కరమ యతఁడు లోనుగాఁగ నేవు
రేను లోనుగాఁగ నేవురుగాని నీ । కొడుకు లార్వురనుట విడువు'మింక. 69

ప్రతిపదార్థం: సవ్యసాచి చేతన్= అర్జునుడిచేత; చచ్చుటయును= మరణించటం కూడ; కీర్తికరము+అ= నాకు యశస్సునే కలిగిస్తుంది; అతఁడు లోను+కాఁగన్= అతనితో కూడ; ఏవురు= నీకు ఐదుమందే; ఏను లోనుగాఁగన్= అతడు పోతే నాతో కూడ; ఏవురు+కాని= ఐదుమందే తప్ప; నీ కొడుకులు= నీ తనయులు; ఆర్వురు+అనుట= ఆరుమంది అనటం; ఇంకన్+ విడువుము= ఇక మానుము.

తాత్పర్యం: అర్జునుడి చేతిలో నేను చావటం కూడ కీర్తికరమే. నేను పోయినప్పుడు అతడితో కూడ నీకు ఐదుమందే కొడుకులు. అతడు పోతే నాతో కూడ నీకు ఐదుమందే అవుతారు గాని, ఆరుమంది కొడుకు లనటం ఇక మానుకొమ్ము!'

చ. అనుటయు నప్డు గొంతి హృదయంబున శోకము నివ్వటిల్ల ని
ట్లను 'నిది దైవసంఘటన మక్కట! యెట్లును దప్ప నేర్చునే?
యనుపమ సత్యవిస్ఫురణ నాడినమాట మఱకుమన్న! నీ
యనుజుల నల్వురం గడపు; మర్జును జేఁతకు సమ్మతించితిన్. 70

ప్రతిపదార్థం: అనుటయున్= అని కర్ణుడు పలుకగా; అప్డు= ఆ వేళ; గొంతి= కుంతీదేవి; హృదయంబునన్= మదిలో; శోకము నివ్వటిల్లన్= దుఃఖం నిండగా; ఇట్లు+అనున్= ఈ తీరున పల్కింది; ఇది దైవ సంఘటనము= ఇది భగవన్నిర్ణయం; ఎట్లును= ఏ రీతిగానైనా; తప్పన్+నేర్చునే?= తప్పిపోదుగదా!; అనుపమ సత్య విస్ఫురణన్= సాటిలేని సత్యం తోచేటట్లు; ఆడిన మాట= పలికిన పలుకు; మఱకుము+అన్న!= వత్సా! మరచిపోవద్దు; నీ+అనుజులన్+నల్వురన్= నీ తమ్ములు నలుగురినీ; కడపుము= వదలిపెట్టుము; అర్జునున్+చేఁతకున్= పార్థుడి విషయంలో నీవు చేసే చేతకు; సమ్మతించితిన్= ఒప్పుకొన్నాను.

తాత్పర్యం: కర్ణు డట్లా పలుకగా కుంతి హృదయంలో దుఃఖమతిశయించగా ఇట్లా అన్నది: 'ఇది భగవత్సంకల్పం. ఎట్లాగూ దీనిని తప్పించ శక్యం కాదు. నీవు సాటిలేని సత్యం ప్రకాశించేటట్లు పలికిన పలుకులు మరచిపోవద్దు. నీ నలుగురు తమ్ములను చంపక వదలి పెట్టుము. యుద్ధం చేసి అర్జునుడిని సంహరించటానికి నేను అంగీకరించాను.'

ఆ. అనుచుఁ గౌఁగిలింప నర్కజుం 'డట్ల కా' । కని ప్రియంబు మెఱయ వినతుఁ డైన
నరిగె సదనమునకు నద్దేవి; యతఁడును । జనియె నిజనివాసమునకుఁ బ్రీతి. 71

ప్రతిపదార్థం: అనుచున్= అని; కౌఁగిలింపన్= ఆలింగనం చేసికోగా; అర్కజుండు= సూర్యసూతి; అట్లకాక+అని= అట్లేఅని; ప్రియంబు మెఱయన్= ప్రేమ ప్రకాశించేటట్లు; వినతుఁడు+ఐనన్= నమస్కరించగా; ఆ దేవి= కుంతీదేవి; సదనమునకున్= తన నివాసానికి; అరిగెన్= వెళ్ళింది; అతఁడును= ఆ రాధేయుడు కూడ; నిజనివాసమునకున్= తన మందిరానికి; ప్రీతిన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: కుంతీదేవి ఆవిధంగా పలికి కర్ణుడిని కౌగిలించుకొన్నది. అతడు 'అలాగే' అని పలికి, ప్రేమతో ఆమెకు నమస్కరించాడు. తరువాత వారిద్దరూ తమ తమ నివాసాలకు సంతోషంతో వెళ్ళిపోయారు.

వ. అక్కడ వాసుదేవుం డుచిత ప్రయాణంబుల నుపప్లావ్యంబునకుం జని ధర్మతనయుచేతం బూజితుండయి, భీమసేనాదులు విరాట ద్రుపదముఖ్యులగు తగువారలుఁ దన్నుం గాంచిన వారినెల్ల నభినందించి, కొలువున నుండి యుధిష్ఠిరుతో నిట్లనియె. 72

ప్రతిపదార్థం: అక్కడ; వాసుదేవుండు; ఉచిత ప్రయాణంబులన్= తగిన పయనములతో; ఉపప్లావ్యంబునకున్+చని= పాండవులున్న ఉపప్లావ్యపురికి వెళ్ళి; ధర్మతనయుచేతన్; పూజితుండు+అయి= పూజింపబడినవాడై; భీమసేన+ఆదులు= భీముడు మొదలైనవారు; విరాట ద్రుపద ముఖ్యులు+అగు= విరాట మహారాజు, ద్రుపద మహారాజు మొదలైన; తగువారలున్= అర్హులైనవారునూ; తన్నున్+కాంచినన్= తనను దర్శించగా; వారిన్+ఎల్లన్= వారినందరినీ; అభినందించి= ప్రశంసించి; కొలువునన్+ఉండి= సభలో నుండి; యుధిష్ఠిరుతోన్= ధర్మజుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తగిన ప్రయాణాలతో హస్తినాపురి నుండి కదలి ఉపప్లావ్యానికి వచ్చి అక్కడ ధర్మజుడి పూజలందుకొన్నాడు. భీముడు మొదలైనవారు, విరాటుడు ద్రుపదుడు మున్నగు అర్హులైనవారు తనను దర్శించగా, వారినందరినీ మెచ్చుకొన్నాడు. సభలో ఆసీనుడై ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

తే. 'ధార్తరాష్ట్ర లున్మత్తులు; తగిన పలుకు । లేల విని సంధి సేయుట కిచ్చగింతు?
రెదిరిఁ దమ్మును నెఱిఁగిర యేని వార । లంత లంతలు చేయుదు రయ్య నాఁడు?' 73

ప్రతిపదార్థం: ధార్తరాష్ట్రులు= దుర్యోధనాదులు; ఉన్మత్తులు= మదం చేత కన్ను మిన్ను కాననివారు; తగిన పలుకులు= అనుకూలాలైన మాటలు; ఏల విని= ఎందులకు ఆలకించి; సంధి చేయుటకున్= సంధి చేయటానికి; ఇచ్చగింతురు?= అంగీకరిస్తారు?; ఎదిరిన్= ఎదుటివారి శక్తినీ; తమ్మును= తమ శక్తినీ; ఎఱిఁగిరి+అ+ఏనిన్= తెలిసినవారే అయితే; నాఁడు= జూదమాడేవేళ; అంతలు+అంతలు= అంతంత నీచకృత్యాలు; చేయుదురు+అయ్య!= చేసేవారా?

తాత్పర్యం: దుర్యోధనాదులు పొగరుతో కన్నుమిన్ను కానకున్నారు. న్యాయంగా మాటాడే మాటలు విని సంధి చేయటానికి వారెందు కంగీకరిస్తారు? తమ బలం, ఎదిరి బలం ఎరిగినవారైతే వారు ఆనాడు సభలో అంతంత నీచకృత్యాలకు పాల్పడుతారా?'

వ. అని యెల్లవారును వినఁ దనపోయివచ్చిన కార్యంబు తెఱంగెఱింగించి, పథిశ్రమంబు పుచ్చువాఁడయి పుండరీకాక్షుండు నిజమందిరంబున కరిగె; నాఁటి రాత్రి ధర్మనందనుం డనుజ సహితంబుగా నుచిత ప్రదేశంబున నుండి గోవిందుని రావించి 'నీవు సుయోధనునితోఁ బలికిన చందం బెయ్యది? యతండేమి విధంబున నుత్తరంబిచ్చె?' నని యడిగిన నచ్యుతుఁ డిట్లనియె. 74

ప్రతిపదార్థం: అని; ఎల్లవారును= సభలో ఉన్నవారంతా; వినన్= ఆలింపగా; తన పోయి వచ్చిన కార్యంబు తెఱంగు= తాను హస్తినాపురికి వెళ్ళివచ్చిన విషయమంతా; ఎఱింగించి= తెలిపి; పథిశ్రమంబు పుచ్చువాఁడు+అయి= దారి బడలిక తొలగించుకొనటానికి; పుండరీక+అక్షుండు; నిజమందిరంబునకున్= తన నివాసానికి; అరిగెన్= వెళ్ళాడు; నాఁటి రాత్రి= ఆ రేయి; ధర్మనందనుండు; అనుజసహితంబుగాన్= తమ్ముళ్ళతో కూడి; ఉచిత ప్రదేశంబునన్+ఉండి= తగిన ప్రదేశంలో చేరి; గోవిందునిన్ రావించి= ముకుందుడిని రప్పించుకొని; నీవు సుయోధనునితోన్ పలికిన; చందంబు= విధం; ఏ+అది?= ఎట్టిది?; అతండు+ఏమి, విధంబునన్; ఉత్తరంబు+ఇచ్చెన్= బదులు చెప్పాడు?; అని; అడిగినన్; అచ్యుతుఁడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అక్కడున్న వారంతా వింటుండగా తాను హస్తినాపురికి వెళ్ళి వచ్చిన పని తీరంతా తెలిపి, దారి బడలిక తొలగించు కొనేందుకు, కమలాక్షుడు తన నివాసానికి వెళ్ళాడు. ఆనాటి రాత్రి ధర్మరాజు తమ్ముళ్ళతో తగిన ప్రదేశంలో ఉండి ముకుందుని అక్కడికి రప్పించి 'నీవు దుర్యోధనుడితో అక్కడ ఏమి మాట్లాడావో, అందుకు అతడు ఏమి సమాధానం చెప్పాడో తెల్పవలసిం'దని కోరాడు. అందుకు శౌరి ఇట్లు అన్నాడు:

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టిన విశేషంబు దెలుపుట (సం. 5-145-1)

క. 'కయ్యము గాని తెఱంగున । నెయ్యంబగు నట్లుగాఁగ నెఱిఁ బలికితి నే
నెయ్యది సుఖంబు పథ్యం । బెయ్యది యరయంగఁ దథ్య మెయ్యది దానిన్. 75

ప్రతిపదార్థం: కయ్యము కాని తెఱంగునన్= యుద్ధం జరుగని విధంగా; నెయ్యంబు+అగునట్లు కాఁగన్= స్నేహం కలిగేటట్లుగా; ఎయ్యది సుఖంబు= ఏది సుఖం చేకూరుస్తుందో; పథ్యంబు+ఎయ్యది= ఏది హితకరమో; తథ్యము+ఎయ్యది?= సత్యమైనదేదో; దానిన్= దానిని; అరయంగన్= వారు తెలిసికొనేటట్లుగా; నేను= నేను; నెఱిన్+పలికితిన్= న్యాయంగా వచించాను.

తాత్పర్యం: 'ధర్మజా! వారికీ మీకూ యుద్ధం జరుగకుండేటట్లు, స్నేహం కలిగేటట్లు, ఏది ఉభయులకు సుఖం కలిగిస్తుందో, ఏది మేలు చేస్తుందో, ఏది సత్యమైనదో దానిని వారికి విస్పష్టంగా తెలిసేటట్లు న్యాయం తప్పక వచించాను.

తే. బహు విధంబులఁ బలుకు నా పలుకు లెల్లఁ । జీఁదక న్నిడి తన పెడచెవులఁ బెట్టి
యీఱతాఱలు మఱుమాట లిచ్చి యపహ । సించె; దుర్యోధనుఁడు వేయుఁ జెప్పనేల?' 76

ప్రతిపదార్థం: బహు విధంబులన్= అనేక రీతుల; పలుకు నా పలుకులు+ఎల్లన్= చెప్పిన నా మాట లన్నింటినీ; చీఁదకన్ను+ఇడి= (చిందపక్షివలె) ఆవేశపూరితమైన చూపులతో చూస్తూ; తన పెడచెవులన్+పెట్టి= తన చెవి వెనుక భాగాన ఇడి - (అనగా తన చెవులలో చొరనీయక); ఈఱతాఱలు= వక్రములైనట్టి; మఱుమాటలు+ఇచ్చి= బదులుపలుకులు పలికి; దుర్యోధనుఁడు= కురురాజు; అపహసించెన్= పరిహాసం చేశాడు; వేయున్+చెప్పన్+ఏల?= ఇక పలుమాటలతో ప్రయోజన మేముంది?

తాత్పర్యం: అనేక విధాల పలుకుతున్న నా పలుకులన్నీ చీదకన్నువేసి చూస్తూ తన చెవులలో చొరనీయక వంకర జవాబులు చెపుతూ దుర్యోధనుడు నన్ను గేలి చేశాడు. అత డాడిన మాటలు మీకు చెప్పి లాభ మేముంది?'

విశేషం: చీఁదకన్నిడి - చీఁద కనువడి (మున్నంగి శర్మపాఠం) - శ్రద్ధలేని దృష్టి పెట్టి - సరిగా చూడక. దీనికి మూలం. "మయా నాగపురం గత్వా సభాయాం ధృతరాష్ట్రజః తథ్యం పథ్యం హితం చోక్తో న చ గృహ్ణాతి దుర్మతిః" నచ గృహ్ణాతి - అనేదానికి తిక్కన తెలుగు 'చీఁద కన్నిడి.'

క. అనిన విని ధర్మజుం డి । ట్లను 'నప్పుడు తండ్రి యుచిత మాడఁడె? భీష్ముం
డును గురుఁడు విదురుఁడుం ద । క్కిన పెద్దలుఁ బలుకరే తగిన చందమునన్? 77

ప్రతిపదార్థం: అనినన్ విని= శ్రీకృష్ణుడు అట్లా పలుకగా; ఆలించి= విని; ధర్మజుండు= ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అప్పుడు= దుర్యోధనుడు అట్లా మాటాడుతున్న సమయంలో; తండ్రి= ధృతరాష్ట్రుడు; ఉచితము+ఆడఁడు+ఎ= యుక్తముగా చెప్పలేదా? భీష్ముండును, గురుఁడున్, విదురుఁడున్= ఈ ముప్పురున్నూ; తక్కిన పెద్దలున్= సభలో పెద్దలైన ఇతరులును; తగిన చందమునన్= తగిన రీతిని; పలుకరే?= మాటాడలేదా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడి పలుకులు విని ధర్మజు డిట్లా అన్నాడు: 'గోవిందా! దుర్యోధనుడు అట్లా వంకర మాట లాడుతున్నవేళ ధృతరాష్ట్రుడు సముచితంగా పలుకలేదా? భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సభలోనున్న ఇతరులైన పెద్దలు తగిన విధంగా మాటాడలేదా?

క. నావుడు హరి యిట్లను 'స । ద్భావమున విచిత్రవీర్యతనయుఁడుఁ దగ నా
నా విధములఁ జెప్పిన సం । భావన వినఁ డతఁడు, పలుకుఁ బ్రతికూలంబుల్. 78

ప్రతిపదార్థం: నావుడున్= ధర్మజుడట్లా అడుగగా; హరి= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; సత్+భావమునన్= మంచి తలంపుతో; విచిత్రవీర్య తనయుఁడున్= విచిత్రవీర్యుడి కుమారుడైన ధృతరాష్ట్రుడు; తగన్= ఒప్పుగా; నానా విధములన్= పలురీతుల; చెప్పినన్= చెప్పినప్పటికిన్నీ; సంభావనన్= ఆదరంతో; అతఁడు= సుయోధనుడు; వినఁడు= ఆలకించలేదు; ప్రతికూలంబుల్= అనుకూలాలు కాని మాటలు; పలుకున్= పలికాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా ప్రశ్నించగా శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. 'మంచి మనసుతో ధృతరాష్ట్రుడు చక్కగా, పలు విధాల చెప్పినప్పటికీ ఆ మాటలను ఆదరంతో దుర్యోధనుడు విన్నవాడు కాడు. అందుకు విరుద్ధంగానే పలికాడు.

సీ. శంతను పుణ్యవంశం బంకురించిన । చందంబు, నంబికానందనుండు
జాత్యంధుఁడై యుండ సామ్రాజ్యమంతయుఁ । బాలించి పాండునృపాలుఁ డతనిఁ
గొలిచి యుండుటయును, గురుకులంబున కెల్ల । దేజంబుగా మీరు దిగ్విజయము
సేసి కావించిన సిరి వారు వంచనఁ । గొనుటయు, సత్య మకుంఠితముగ

తే. నీవు సమయంబు నడపిన నెఱియుఁ దండ్రి । పాలు మీకు నీఁదగుటయుఁ, బాడిలేమి
నరయఁ జెడుదురు కౌరవు లనియుఁ, బెద్ద । లెల్లఁ జెప్పిరి మొగమోట యింతలేక. 79

ప్రతిపదార్థం: శంతను పుణ్యవంశంబు= శంతను మహారాజుయొక్క పవిత్రమైన వంశం; అంకురించిన చందంబు= మొలకెత్తిన విధం; అంబికా నందనుండు= అంబిక యొక్క కుమారుడైన ధృతరాష్ట్రుడు; జాత్యంధుఁడై+ఉండెన్= పుట్టుగ్రుడ్డియై ఉండగా; పాండు నృపాలుఁడు= తమ్ముడైన పాండురాజు; సామ్రాజ్యము+అంతయున్+పాలించి= సామ్రాజ్యము నెల్ల ఏలుతూ; అతనిన్= పుట్టుగ్రుడ్డియైన అన్నను; కొలిచి+ఉండుటయున్= సేవిస్తూ ఉండటం; కురు కులంబునకున్+ఎల్లన్= కౌరవ వంశమున కంతటికినీ; తేజంబుగాన్= వన్నె కలుగునట్లుగా, మీరు= మీరలు; దిక్+విజయము చేసి= దిక్కులను జయించి; కావించిన సిరిన్= గడించిన సంపదను; వారు= దుర్యోధనాదులు; వంచనన్+కొనుటయున్= మోసముతో హరించుటయునూ; సత్యము+అకుంఠితముగన్= సత్యము మొక్క పోకుండ; నీవు= నీవు; సమయంబు నడపిన నెఱియున్= ప్రతిజ్ఞాకాలం పదమూడేండ్లు చెల్లించిన క్రమమునూ; తండ్రి పాలు= మీ జనకుని రాజ్యభాగం; మీకున్= మీకు; ఈన్+తగుటయున్= ఇచ్చుట ధర్మమనియూ; పాడిలేమిన్= న్యాయము తమ పట్ల లేనందున; అరయన్= ఆలోచించి చూచినట్లయితే; కౌరవులు+చెడుదురు+అనియున్= దుర్యోధనాదులు పాడైపోతారనియూ; మొగమోట= దాక్షిణ్యము; ఇంతలేక= రవంతయు లేకుండ; పెద్దలు+ఎల్లన్= సభలోని పెద్దవారంతా; చెప్పిరి= దుర్యోధనునకు తెల్పినారు.

తాత్పర్యం: శంతను మహారాజు పవిత్ర వంశం అంతరించకుండ చిగిరించిన క్రమం, ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డియై ఉండగా పాండురాజు సామ్రాజ్యమంతటినీ తానే పరిపాలిస్తూ అంధుడైన అన్నను భక్తితో కొలిచి ఉండటం, కురువంశానికెల్ల వన్నె కలిగేటట్లు మీరు దిక్కులన్నీ జయించి గడించిన సంపదనంతా కపటద్యూతంలో వారు అపహరించటం, సత్యం తప్పక నీవు ప్రతిజ్ఞాకాలం పదమూడేండ్లు ధర్మయుక్తంగా గడపడం, మీ తండ్రి పుడమి

పాలు మీకు ఇవ్వదగిఉండటం, న్యాయం వదలి మీ రాజ్యభాగం కూడ హరించదలిస్తే, కౌరవులందరూ నాశనమవుతారని సభలోని పూజ్యులంతా మోమోటపడకుండా చెప్పారు.

క. అలయక యందఱుఁ జెప్పం । గల యంతయుఁ జెప్పి; రతఁడు కటకటఁబడి య
క్కొలువు వెడలి పోయెం ద । మ్ములుఁ గర్ణుఁడు రాజలోకముం దో నరుగన్. 80

ప్రతిపదార్థం: అలయక= విసుగు చెందక; అందఱున్= సభలోని పూజ్యులందరూ; చెప్పన్+కల+అంతయున్= తాము చెప్పగలిగినదంతా; చెప్పిరి= చెప్పారు; అతఁడు= సుయోధనుడు; కటకటన్+పడి= వారి హితబోధకు కలతచెందుతూ; తమ్ములన్= దుశ్శాసనాదులూ; కర్ణుఁడున్= రాధేయుడూ; రాజలోకమున్= యుద్ధానికి సాయపడవచ్చిన రాజుల సమూహం; తోన్+అరుగన్= వెంటరాగా; ఆ+కొలువు వెడలిపోయెన్= ఆ సభనుండి నిష్క్రమించాడు.

తాత్పర్యం: సభలోని పెద్దలంతా ఏమాత్రం విసుగుకొనకుండ చెప్పవలసినదంతా చెప్పనే చెప్పారు. కాని, దుర్యోధనుడు వారి మాటలకు సంకటపడుతూ, తమ్ముళ్ళూ, కర్ణుడూ, యుద్ధంలో తనకు సాయపడటానికి వచ్చిన రాజులూ తన్ను అనుసరించగా సభనుండి లేచి వెళ్ళాడు.

వ. ఇట్లు కొడుకు ముష్కరుండై యరిగిన ధృతరాష్ట్రుండు గాంధారి రావించి. 81

ప్రతిపదార్థం: ఇట్లు; కొడుకు; ముష్కరుండు+ఐ= కుటిలుడై; అరిగినన్= వెళ్ళగా; ధృతరాష్ట్రుండు; గాంధారినిన్; రావించి-

తాత్పర్యం: ఇట్లా కుటిలబుద్ధితో కొడుకు సభలోనుండి లేచి వెళ్ళగా, ధృతరాష్ట్రుడు గాంధారిని కొలువుకూటానికి పిలిపించి.

క. తగ విదురుఁ బంచి యాతని । మగుడఁగఁ బిలిపించె; నా యమయుఁ దనయునకున్
వగయును గూర్మియు వెరవును । మిగిలిన వచనముల సంధి మెయికొనఁ జెప్పెన్. 82

ప్రతిపదార్థం: తగన్= ఒప్పుగా; విదురున్+పంచి= విదురుడిని పంపి; ఆతనిన్= సుయోధనుడిని; మగుడఁగన్= మరల; పిలిపించెన్= సభకు రప్పించాడు; ఆ+అమయున్= ఆ గాంధారీదేవి కూడ; తనయునకున్= తన కుమారుడికి; వగయును= దుఃఖాన్నీ; కూర్మియున్= ప్రేమనూ; వెరవును= జీవనోపాయాన్నీ; మిగిలిన= అతిశయించిన; వచనములన్= వాక్కులచేత; సంధి మెయికొనన్+చెప్పెన్= సంధికి అంగీకరించేటట్లు చెప్పింది.

తాత్పర్యం: అటు పిమ్మట ధృతరాష్ట్రుడు విదురుడిని పంపి దుర్యోధనుడిని మరల సభకు పిలిపించాడు. గాంధారి తన కుమారుడు సంధికి సమ్మతించేటట్లు తన మాటలలో శోకం, ప్రేమ, ఉపాయం నెలకొనగా చెప్పింది.

వ. ఎవ్వ రెంత సెప్పినను గైకొనక కడంగి దుర్యోధనుండు దనకుం గలవారల నెల్లను గురుక్షేత్రంబునకు నడవుండని చెప్పంబనిచె; భీష్ముని సేనా ముఖంబు సేసికొని యెత్తి విడియం గలవాఁ; డిది ధార్తరాష్ట్రుల నిశ్చయం; బేనును నా యోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధులు సెప్పునట్లు సేసితి; నేమి చెప్పినను నెంతటం బోకున్నం గినుక దెచ్చికొని జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ గార్యంబు భగ్నంబగుట కొల్లక వెండియు శాంత వచనంబులు

వలికితి; నతం డశక్త దుర్జనత సేయం జూచిన నమానుషంబు లగువానిం గొన్ని వెడమాయలం బన్ని పెక్కుపోకలం బోయితి నెన్ని భంగుల సంధియ కావలయునని పొరలంగలయంతయుంబొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక తన చలంబుతోన పొట్టుపొరలయ్యుఁ గయ్యంబు వొడుచుంగాని, యవశ్యంబును రాజ్యంబు పాలిచ్చు వాఁడు గాఁడు; కౌరవుల యెడ దండంబు దక్క నొం డుపాయంబు లేదు; మీకుం బోలిన తెఱంగు సేయుం' డనిన ధర్మతనయుండు తమ్ములం గనుంగొని యిట్లనియె: 83

ప్రతిపదార్థం: ఎవ్వరు ఎంత చెప్పినను; కైకొనక= ఆదరించక; కడంగి= పూనుకొని; దుర్యోధనుండు; తనకున్+కలవారలన్+ఎల్లను= తనకున్నవారి నందరినీ; కురుక్షేత్రంబునకున్; నడవుండు+అని= తరలి వెళ్ళండని; చెప్పన్+పనిచెన్= చెప్పి పంపాడు; భీష్ముని; సేనాముఖంబు చేసికొని= సేనల యొక్క అగ్రభాగమునం దుంచుకొని; ఎత్తి విడియన్+కలవాఁడు= యుద్ధానికి సైన్యంతో దిగుతాడు; ఇది ధార్తరాష్ట్రుల నిశ్చయంబు= ఇది కౌరవుల నిర్ణయం; ఏనును= నేను కూడ; నా+ఓపిన+అంత= నాకు శక్తిగల్గిన మేరకు; సామవాదంబులు+ఆడితిన్= హితవచనాలు పలికాను; నారద+ఆది మహామునులను= నారదుడు మున్నగు మహర్షులను కూడ; సుయోధనునకున్; బుద్ధులు చెప్పునట్లు చేసితిన్= నీతులు చెప్పేటట్లు చేశాను; ఏమి చెప్పినను; ఎంతటన్+పోక+ఉన్నన్= ఏ దారికీ రాకుండగా; కినుక తెచ్చికొని= కోపం వహించి; జంకించియున్= బెదిరించియు; భంగించియున్= అవమానించియు; ధిక్కరించియున్= తిరస్కరించియు; తృణీకరించియున్= అలక్ష్యం చేసియు; చూచితిన్= పనిని సాధించ యత్నించాను; కార్యంబు భగ్నంబు+అగుటకున్= పని చెడటానికి; ఒల్లక= ఇష్టపడక; వెండియున్= మరల; శాంత వచనంబులు పలికితిన్= ప్రసన్న వాక్యాలాడాను; అతండు= సుయోధనుడు; అశక్త దుర్జనత+చేయన్+చూచినన్= తనకు శక్తి లేనందున దౌర్జన్యానికి పూనుకోగా; అమానుషంబులు+అగువానిన్= మానవాతీతాలైనట్టి; కొన్ని వెడమాయలన్+పన్ని= కొన్ని వింత మాయలు కల్పించి; పెక్కుపోకలన్+పోయితిన్= పలుభంగుల ప్రవర్తించాను; ఎన్ని భంగులన్= సర్వవిధాలా; సంధి+అ కావలయున్+అని= సంధి యే పొసగవలెనని; పొరలన్+కలయంతయున్+పొరలితిన్= ఎంతవరకు పాటుపడాలో అంతవరకూ పాటుపడ్డాను; ఆ+పాప+ఆత్ముండు= ఆ దురితచిత్తుడు; ఎట్లునున్= ఏ విధంగానూ; చక్కంబడక= దారికి రాక; తన చలంబుతోన్+అ= తన మాత్సర్యంతోనే; పొట్టుపొరలు+అయ్యున్= పీడితుడైనప్పటికిన్నీ; కయ్యంబు పొడుచున్+కాని= యుద్ధం సల్పునేగాని; అవశ్యంబును= తప్పకుండా; రాజ్యంబు+పాలు+ఇచ్చువాఁడు కాఁడు= రాజ్యంలో భాగమివ్వడు; కౌరవుల ఎడన్= కౌరవుల పట్ల; దండంబు తక్కన్= దండోపాయము తప్ప; ఒండు= మరొక; ఉపాయంబు లేదు; మీకున్+పోలిన తెఱంగు చేయుండు= మీకు అనుకూలమైన మార్గాన్ని అనుసరించండి; అనినన్; ధర్మతనయుండు; తమ్ములన్; కనుంగొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎవరు ఎన్ని విధాల చెప్పినప్పటికీ వారి మాటలు మన్నించక దుర్యోధనుడు తన పక్షంలోనివారినంతా కురుక్షేత్రానికి తరలిపొండని ఆజ్ఞాపించాడు. భీష్ముడిని సర్వసైన్యాధ్యక్షుడిని చేసి మనపై దాడి సల్పడానికి దిగగలడు. ఇది కౌరవుల నిర్ణయం. నేను నా శక్తి మేరకు మంచి చెప్పాను. అంతేకాదు. నారదాది మహర్షులు సుయోధనుడికి నీతులు గరపేటట్లు చేశాను. ఎవ రేమి చెప్పినప్పటికీ అతడు దారికి రానందున నేను కోపం తెచ్చుకొని బెదరించి, అవమానించి, తిరస్కరించి, చులుకన చేసి కార్యసాఫల్యం కోసం ఎంతో ప్రయత్నించాను. కార్యం చెడిపోతుందేమోనని మళ్ళీ శాంతవచనాలు పలికాను. ఇంత చేసినా దుర్యోధనుడు అశక్త దుర్జనత్వానికి పాల్పడగా అపుడు అమానుషాలైన కొన్ని అద్భుత మాయలు అక్కడ ప్రదర్శించాను. అన్ని విధాల పొత్తుకొరకు పొరలగలంత మేర పొరలాడాను. కాని, ఆ దుష్టచిత్తుడు దుర్యోధనుడు ఏ విధంగానూ చక్కబడక మాత్సర్యంతో, తనకు ఎన్ని బాధలు వచ్చినప్పటికిన్నీ యుద్ధం చేస్తాడేగాని మీకు రాజ్యభాగం మాత్రమివ్వడు. కౌరవుల పట్ల దండోపాయం తప్ప మరేదీ కొరగాదు. మీకు ఎట్లా సమ్మతమో అట్లా చేయండి' అని శ్రీకృష్ణుడు పల్కగా విని ధర్మరాజు తన తమ్ముళ్ళను చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: రాజు శత్రువులను జయించటానికి ప్రయోగించే సామాదులను ఉపాయాలంటారు. వీటిని- సామం, దానం, భేదం, దండం అంటారు. వీటితో 'ఉపేక్ష' చేర్చి శుక్రుడు ఉపాయాలు ఐదన్నాడు. మాయ, ఉపేక్ష, ఇంద్రజాలం అనే మూటిని సామాదులతో చేరిస్తే సప్తోపాయాలని మరికొందరు పెద్దలంటారు.

1. సామం: ఇది చతురుపాయాలలో మొదటిది. మంచిమాట, శాంతపరచుట, ఓదార్చుట, అనునయించుట. అనుకూల ప్రవర్తన రూపమైన ఈ ఉపాయం ఐదు విధాలు. పరస్పరోపకారం కనిపింప జేయటం, మంచితనం చేయటం, గుణాలను కొనియాడటం, చుట్టరికాన్ని తెలపటం, నేను నీ వాడనని మంచిమాటలాడటం.

2. దానం: ఇది రాజ్యాంగ చతురుపాయాలలో రెండోది. ఇది పంచ విధం. తనకున్న ధనమివ్వటం, ఎక్కడనైనా ధనం తీసికొంటే దానికి తాను అనుకూలుడై ఉండటం, అపూర్వ వస్తువుల నివ్వటం, అన్యుల ధనం పుచ్చుకొనేటట్లు చేయటం, అప్పుతీర్చటం.

3. భేదం: చతురుపాయాలలో మూడోది. శత్రుపక్షంలో పరస్పర విరోధం పెట్టటం.

4. దండం: శత్రువుల పట్ల ప్రయోగించే చతురుపాయాలలో నాల్గవది. ఇది వధించటం, ధనం అపహరించటం, పీడించటం అనే మూడు విధాలుగా ఉంటుంది.

క. 'కురుసభఁ బుట్టిన చందము । హరి యంతయుఁ జెప్పెఁ; నింక ననుమానము లేఁ;
దరి మర్దనమున కయ్యెడు । వెరవుం జేవయును మెఱయ వెడలుఁడు గడఁకన్.' 84

ప్రతిపదార్థం: కురు సభన్= కౌరవుల కొలువు కూటంలో; పుట్టిన చందము= జరిగిన విధం; హరి= నారాయణుడు; అంతయున్+చెప్పెన్= సమస్తం తెల్పినాడు; ఇంకన్= ఇక; అనుమానము లేదు= సందేహం లేదు; అరిమర్దనమునకున్= శాత్రవులను దండించటానికి; అయ్యెడు= వలసినట్టి; వెరవున్= ఉపాయమూ; చేవయున్= శక్తీ; మెఱయన్= ప్రకటమయ్యేటట్లు; కడఁకన్= పూనికతో; వెడలుఁడు= బయలుదేరండి.

తాత్పర్యం: 'కౌరవుల కొలువు కూటంలో జరిగిన సంగతినంతా నారాయణుడు సవిస్తరంగా చెప్పాడు గదా! ఇక మనం శంకించ నవసరం లేదు. విరోధులను మట్టుపెట్టటానికి మన శక్తియుక్తులు ప్రస్ఫుటమయేటట్లు పూనిక వహించండి. రణరంగానికి కదలండి.'

వ. అని పలికి, యజాతశత్రుండు కరుణాయత్తచిత్తుండై యచ్యుతు నాలోకించి. 85

ప్రతిపదార్థం: అని పలికి; అజాతశత్రుండు= ధర్మరాజు; కరుణా+ఆయత్తచిత్తుండు+ఐ= దయకు అధీనమైన మనస్సుకలవాడై; అచ్యుతున్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా ధర్మజుడు తమ్ముళ్ళను ఆదేశించి దయాపరవశ హృదయుడై శ్రీ కృష్ణుడిని చూచి.

క. 'కురువంశముఁ ద్రుంచుటకుం । జొరఁజాలక నా మనంబు సుడివడియెడు; నే
వెరవును దొరకొనదు గదే । సరసీరుహనాభ! పొందు సంపాదింపన్. 86

ప్రతిపదార్థం: సరసీరుహనాభ!= కమలనాభా!; కురువంశమున్= కౌరవజాతిని; త్రుంచుటకున్= నాశనం చేయటానికి; చొరన్+చాలక= యుద్ధంలో ప్రవేశించ నొల్లక; నా మనంబు= నా చిత్తం; సుడి పడియెడున్= పరిభ్రమిస్తున్నది; పొందు= వారితోడి కలయిక; సంపాదింపన్= పొందటానికి; ఏ+వెరవును= ఏ ఉపాయం కూడా; దొరకొనదు+కదే!= లభించక పోయిందిగదా!

తాత్పర్యం: 'కృష్ణా! కురువంశం నిర్మూలించటానికి సమ్మతించక నా మనస్సు పరిభ్రమిస్తున్నది. వారితో పొత్తు సాధించడానికి మన కెట్టి మార్గం లభించ లేదుగదా!

వ. **నా మనంబును దమ్ములతలంపును నీ వెఱుంగుదు; ధార్తరాష్ట్రుల చందంబును భీష్మ ద్రోణ విదురాదుల చిత్తంబులును నెఱింగి వచ్చితి; మాకు ధర్మచ్యుతి లేకుండునట్టి కార్యంబు నిశ్చయింపు' మనిన నారాయణుం డిట్లనియె.** **87**

ప్రతిపదార్థం: నా మనంబును= నా హృదయం; తమ్ముల తలంపును= నా అనుజుల ఉద్దేశం; నీవు+ఎఱుంగుదు(వు)= నీవు తెలియుదువు; ధార్తరాష్ట్రుల చందంబును= దుర్యోధనాదుల తీరును; భీష్మ ద్రోణ విదుర+ఆదుల చిత్తంబులును= భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మున్నగువారి మనస్సులను; ఎఱింగివచ్చితి(వి)= తెలిసికొని వచ్చావు; మాకున్= మాకు; ధర్మచ్యుతి లేకుండునట్టి కార్యంబు= ధర్మము నుండి జారుపాటు జరుగనట్టి పనిని; నిశ్చయింపుము= నీవే నిర్ణయించుము; అనినన్; నారాయణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నారాయణా! నా మనస్సెట్టిదో, నా తమ్ముల ఉద్దేశమేమిటో నీకు తెలుసు. అక్కడ దుర్యోధనాదుల తీరు, భీష్మ ద్రోణ విదురాదుల తలపులు తెలిసికొనివచ్చావు. మాకు ధర్మహాని కలుగ కుండునట్టి కార్యమేదో నీవే నిర్ణయించు'మని ధర్మజుడు వేడగా గోవిందు డిట్లాఅన్నాడు:

ఉ. **'యుద్ధమ కాక కార్యమును నొండొకఁ డెద్దియుఁ గల్గనేర్చునే?**
బుద్ధులు చెప్ప వాక్యములఁ బోల వినం డననేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁబట్టి సుయోధనుఁ, డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నా మతిఁ దోఁప దెమ్మెయిన్.' **88**

ప్రతిపదార్థం: యుద్ధము+అ,కాక= సంగ్రామమే తప్ప; కార్యమునున్= చేయవలసినపని కూడ; ఒండొకఁడు= ఇంకొక్కటి; ఎద్దియున్= ఏదియు; కల్గన్+నేర్చునే?= ఉండగలదా?; బుద్ధులు చెప్పు వాక్యములన్= నీతులు నేర్పే మాటలను; పోలన్= చక్కఁగా; వినండు+అనన్+ఏల?= అతడు ఆలకించలేదని చెప్పటమెందుకు?; అట్టిచోన్= నేను హితం చెప్పుతూఉండగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ననున్+పట్టి= నన్ను పట్టుకొని; బద్ధునిన్+చేయన్+చూచెన్= బంధించటానికి యత్నించాడు; ఇంకన్= ఇక; ఆ+అసంబద్ధునితోడి సంధికిన్= ఆ అయోగ్యుడి తోటి పొత్తుకు; ఉపాయము= వెరవు; నా మతిన్= నా మనసులో; ఏ+మెయిన్= ఏ విధంగానూ; తోఁపదు= గోచరించదు.

తాత్పర్యం: 'యుద్ధము తప్ప చేయవలసినపని మరొక టేదీ లేదు. నేను చెప్పే నీతివాక్యాలు అతడు వినలేదని అనటం మాత్రమే కాదు. అట్లా నేను హితం చెపుతున్నప్పుడు సుయోధనుడు నన్ను పట్టుకొని బంధింప జూచాడు. ఇక అట్లాంటి అయోగ్యుడితోడి పొత్తుకు ఉపాయమేదో నా మనసుకు స్ఫురించటం లేదు.'

వ. **అని చెప్పి విదురుం డేకాంతంబున నాడినమాటలును, భీష్మద్రోణ బాహ్లికాదులగు పెద్దలకు ధార్తరాష్ట్రుల దెసం బుట్టిన మనఃక్షోభంబును, గుంతి కౌరవులు వినం బలికిన పలుకులుం బ్రకటించి ధర్మపుత్త్రుపైఁ బాపంబు లేకునికిఁ దెలిపి సమరం బవశ్య కర్తవ్యంబుగా నిశ్చయించె; నట్టియెడఁ దమ్ము లన్న మొగంబునం జూడ్కి నిలిపి యూరకుండి; రతండు వారలం గలయం గనుంగొని యిట్లనియె:** **89**

ప్రతిపదార్థం: అని చెప్పి; విదురుండు; ఏకాంతంబునన్= రహస్య ప్రదేశంలో; ఆడిన మాటలును= పలికిన పలుకులును; భీష్మద్రోణ బాహ్లిక+ఆదులు+అగు= భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు మున్నగు; పెద్దలకున్= పూజ్యులకు; ధార్తరాష్ట్రుల దెసన్= దుర్యోధనాదులయెడ; పుట్టిన= కలిగిన; మనఃక్షోభంబును= మనస్సులందలి కలతను; కుంతి; కౌరవులు; వినన్= వినేటట్లు; పలికిన పలుకులున్= చెప్పిన మాటలున్నూ; ప్రకటించి= వెల్లడించి; ధర్మపుత్రుపైన్= ధర్మరాజు మీద; పాపంబులేక+ఉనికిన్= పాపం లేకుండుటను; తెలిపి= చెప్పి; సమరంబు= యుద్ధం; అవశ్యకర్తవ్యంబుగాన్+నిశ్చయించెన్= తత్‌క్షణం చేయదగిన పనిగా నిర్ణయించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తమ్ములు; అన్న మొగంబునన్; చూడ్కి నిలిపి= దృష్టి సారించి; ఊరక+ఉండిరి; అతండు= ధర్మజుడు; వారలన్= తమ్ములను; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి శ్రీకృష్ణుడు రహస్య ప్రదేశంలో విదురుడు పల్కిన మాటలూ, భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు మొదలైన పెద్దలకు దుర్యోధనాదుల విషయంలో ఏర్పడిన హృదయ సంక్షోభమూ, కుంతీదేవి కౌరవులు వింటుండగా పలికిన పలుకులూ వెల్లడించి, ధర్మజుపట్ల ఏ పాపం లేదని చెప్పాడు. యుద్ధమే తత్‌క్షణ కర్తవ్యంగా నిర్ణయించాడు. అప్పుడు తమ్ము లందరూ అన్నగారి ముఖం చూస్తూ మౌనంగా ఉండిపోయారు. అంతట ధర్మపుత్రుడు తమ్ముళ్ళను కలయజూచి ఇట్లా అన్నాడు:

ఉ. 'కౌరవకోటిచేత మన కష్టపుఁబాటు తలంపు వచ్చినం
గ్రూరవిచేష్టితంబునకు గొంతి యొడంబడె; బంధువర్గమున్
ఘోరముగా వధించుటకుఁ గోల్కొన కున్నది బుద్ధి; మీరు ని
ర్ధారణ చేయుఁడా హితము ధర్మము నయ్యెడు వృత్తమెట్టిదో.' 90

ప్రతిపదార్థం: కౌరవ కోటి చేతన్= కౌరవవర్గంవలన; మన కష్టపుఁబాటు= మనం పడిన బాధలు; తలంపు వచ్చినన్= జ్ఞప్తికి రాగా; క్రూర విచేష్టితంబునకున్= కౌరవులను నిర్మూలించే ఘాతుకపు పనికి; గొంతి= కుంతీదేవి; ఒడంబడెన్= సమ్మతించింది; బంధువర్గమున్= చుట్టాల సమూహాన్ని; ఘోరముగాన్= దారుణంగా; వధించుటకున్= చంపటానికి; బుద్ధి= నా మనస్సు; కోల్కొనక+ఉన్నది= ఉత్సహించటం లేదు; మీరు= తమ్ములైన మీరు; హితము= మేలు; ధర్మము= న్యాయం; అయ్యెడు= కలుగునట్టి; వృత్తము= చర్య (నడవడి); ఎట్టిదో= ఎటువంటిదో; నిర్ధారణ చేయుఁడా= నిర్ణయించండి.

తాత్పర్యం: 'కౌరవుల వలన మనం పడిన కష్టాలు స్మృతికి రాగానే మన తల్లి కుంతీదేవి మారణకర్మకు సమ్మతించింది. చుట్టాలను దారుణంగా చంపటానికి మాత్రం నా మనసు ఉత్సహించటం లేదు. మనకు మేలు గూర్చేదీ, ధర్మయుక్తమైనదీ అయిన నడవడి ఎటువంటిదో మీరే నిర్ధారణ చేయండి.'

వ. అనిన విని అర్జునుం డతని కిట్లనియె : 91

తాత్పర్యం: అనగా విని అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

చ. 'హితమును ధర్మముం దగవు నిట్టిది నా మన మేమి నేర్తు? మ
చ్యుతుఁడు సమస్త ధర్మ పరిశోధకుఁ; డా విదురుండుఁ; బాండు భూ
పతి సతియుం దగం బలుకు పల్కుల సందియమెల్లఁ బాసె; ని
ట్లితఁడు రణంబు చేయుఁ డన నింక విచారము లెల్ల నేటికిన్?' 92

ప్రతిపదార్థం: హితమున్= మేలూ; ధర్మమున్= పుణ్యమూ; తగవున్= న్యాయమూ; ఇట్టిది నాన్= ఇటువంటిదని చెప్పటానికి; మనము+ఏమి నేర్తుము?= మనకేమి తెలియును?; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; సమస్త ధర్మ పరిశోధకుఁడు= ఎల్ల ధర్మాలను పరిశీలించిన మహానుభావుడు; ఆ+విదురుండున్= విదురుడును; పాండు భూపతి సతియున్= పాండు మహారాజు దేవేరిఅయిన కుంతియు; తగన్= ఒప్పిదంగా; పలుకు పల్కులన్= నుడివిన మాటలవలన; సందియము+ఎల్లన్+పాసెన్= అనుమానమంతా తొలగిపోయింది; ఇట్లు= ఈ ప్రకారంగా; ఇతఁడు= శ్రీకృష్ణ భగవానుడు; రణంబు చేయుఁడు+అనన్= యుద్ధం చేయండని చెప్పగా; ఇంకన్= మరి; విచారములు+ఎల్లన్= ఆలోచనలన్నీ; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: 'ఏది హితమో, ఏది ధర్మమో, ఏది న్యాయమో మన కేమి తెలుసు? నారాయణుడు, ఎల్ల ధర్మాలను పరిశీలించినవాడు. ఆ విదురుడు, పాండు మహారాజు పత్ని కుంతీదేవి చక్కగా పలికిన పలుకుల వలన సందేహమంతా తీరిపోయింది. శ్రీకృష్ణ భగవానుడు యుద్ధం చేయండని పల్కగా మనకు వేరే ఆలోచన లెందుకు?'

ఆ. అనిన 'నట్లుకాక యఖిల ధర్మజ్ఞాన । ఘనుఁడు మనకు నేడుగడయుఁ దాన
శౌరి నిశ్చయింప సంశయం బేటికి? । సంఘటింపుఁ డుగ్ర సమర విధము.' 93

ప్రతిపదార్థం: అనినన్= అని ఫల్గునుడు పలుకగా; అట్లకాక= సరిసరి; అఖిల ధర్మజ్ఞాన ఘనుఁడు= సమస్త ధర్మముల యొక్క జ్ఞానంచేత గొప్పవాడు; మనకున్= మనందరికీ; ఏడుగడయున్= రక్షకుడును; తాన్+అ= తానే; శౌరి= అట్టి నారాయణుడు; నిశ్చయింపన్= కర్తవ్యం నిర్దేశించగా; ఏటికిన్ సంశయంబు?= అనుమాన మింకెందుకు?; ఉగ్రసమర విధము= దారుణమైన యుద్ధ విధానం; సంఘటింపుఁడు= రూపొందించండి.

తాత్పర్యం: పార్థు డట్లా పలుకగానే ధర్మజుడు 'అట్లే కానివ్వండి. సకల ధర్మ స్వరూపం ఎరింగిన మహానుభావుడూ, మనకు రక్షకుడూ వాసుదేవుడే. ఆయన కర్తవ్యం నిర్దేశించిన తరువాత మనకు సందేహం తగదు. దారుణ యుద్ధ సన్నాహాలు సాగించండి.'

వ. అని యుధిష్ఠిరుండు తమ్ములతో నెట్టకేలకుం దెగువ సెప్పి. 94

ప్రతిపదార్థం: అని; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; తమ్ములతోన్; ఎట్టకేలకున్= తుదకు; తెగువ చెప్పి= నిర్ణయం తెలిపి.

తాత్పర్యం: అంటూ ధర్మరాజు తుదకు యుద్ధం చేయటమే కర్తవ్యమని నిర్ణయించి.

క. 'బాహాగర్వము వివిధ । వ్యూహ విధిజ్ఞతయుఁ గలిగి యొకరుం డే డ
క్షోహిణులు నడపి భీష్మో । త్సాహంబున కోర్చు చాపధరుఁ డెవ్వఁ డొకో! 95

ప్రతిపదార్థం: బాహాగర్వమున్= భుజ దర్పమూ; వివిధ వ్యూహ విధిజ్ఞతయున్+కలిగి= పలురకాలైన వ్యూహాలు పన్నటం తెలిసి ఉండి; ఒకరుండు= తా నొక్కడే; ఏడు+అక్షోహిణులు నడపి= ఏడక్షౌహిణుల సేనను ముందుకు సాగించి; భీష్మ+ఉత్సాహంబునకున్= పితామహుడి యొక్క సమర విజృంభణానికి; ఓర్చు= తాళగలిగిన; చాపధరుఁడు= విలుకాడు; ఎవ్వఁడు+ఒకో!= మనలో ఎవడున్నాడు?;

తాత్పర్యం: 'బాహు బలము, బహువిధాలైన వ్యూహాలను పన్నే విధానంలో తెలివితేటలు గలిగి, ఏడక్షౌహిణుల సైన్యాన్ని నడిపి భీష్ముడి రణోత్సాహాన్ని అరికట్టగలిగిన మేటి విలుకాడు మనలో ఎవ్వడు?

వ. అట్టివానికి వాహినీ నాయకత్వం బిచ్చి యభిషేకంబు సేయవలయు.' 96

ప్రతిపదార్థం: అట్టివానికిన్= అట్టి వీరాగ్రేసరుడికి; వాహినీ నాయకత్వంబు+ఇచ్చి= సేనాధిపత్యం ఇచ్చి; అభిషేకంబు చేయన్ వలయున్= అభిషేకం జరపాలి.

తాత్పర్యం: మనం అటువంటి వీరాగ్రణికి సర్వసేనాధిపత్యం ఇచ్చి అభిషేకించాలి.'

తే. అనిన సహదేవుఁ డిట్లను 'నధిప! పుత్త్ర । పౌత్ర సోదరవంతుండు బాహువీర్య
ఘనుఁడు మన కాశ్రయంబయి మనిచె మత్స్య । దేశపతి గాఁడె సేనాపతిత్వమునకు?' 97

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మజుడు చెప్పగా; సహదేవుఁడు+ఇట్లు+అనున్= సహదేవుడు ఈ విధంగా చెప్పాడు; అధిప!= రాజా! పుత్త్రపౌత్ర సోదరవంతుండు= కొడుకులు, మనుమలు, తోడబుట్టినవారు కలవాడు; బాహువీర్యఘనుఁడు= భుజపరాక్రమంచేత దొడ్డవాడు; మనకున్= మనందరికీ; ఆశ్రయంబు+అయి= ఆధారమై; మనిచెన్= కాపాడాడు; మత్స్యదేశపతి= మత్స్యదేశానికి పాలకుడైన విరాట మహారాజు; సేనాపతిత్వమునకున్= సేనలయొక్క ఆధిపత్యానికి; కాఁడె?= చాలడా?

తాత్పర్యం: ధర్మజుడి పలుకులు విని సహదేవుడు ఇట్లా అన్నాడు: 'రాజా! విరాటుడు కొడుకులూ మనుమళ్ళూ సోదరులూ మొదలైన బలగం కలవాడు. బాహుబలంలో గొప్పవాడు. మనకు ఆధారమై ఉండినవాడు. అట్టి మత్స్యమహీపతి సేనాధిపత్యానికి తగడా?'

వ. అనవుడు నకులుండు. 98

తాత్పర్యం: తరువాత నకులుడు (ఇట్లా అన్నాడు:)

చ. 'బలఁగముఁ బెంపుఁ, దేజమును, బాహుబలంబును, నగ్గలంబు పె
క్కు లెఱుఁగుఁ గార్య ఖడ్గములకుం దగు త్రోవలు; ద్రోణులందు భీ
ష్ములదెసఁ గోపముం గలఁ, డమోఘ పరాక్రమశాలి, నీ బలం
బుల కధినాథుఁగా ద్రుపదభూపతిఁ బట్టముఁ గట్టు టెట్లొకో!' 99

ప్రతిపదార్థం: బలఁగమున్= పరివారం; పెంపున్= గొప్పతనం; తేజమును= ప్రతాపం; బాహుబలంబునన్= భుజశక్తి; అగ్గలంబు= అధికంగా ఉన్నవాడు; కార్యఖడ్గములకున్; కార్యవాదానికీ, ఖడ్గవాదానికీ; తగు= తగినట్లు; త్రోవలు= మార్గాలు; పెక్కులు+ఎఱుఁగున్= అనేకాలు తెలిసినవాడు; ద్రోణులందున్= ద్రోణాచార్యుల వారియందును; భీష్ములదెసన్= పితామహులయందును; కోపమున్+కలఁడు= క్రోధం కలవాడు; అమోఘ పరాక్రమశాలి= మొక్కవోని శౌర్యం కల్గినవాడు; అయిన; ద్రుపద భూపతిన్= ద్రుపద మహారాజును; నీ బలంబులకున్= నీ సేనలకు; అధినాథున్+కాన్= అధిపతిగా; పట్టమున్+కట్టుట= అభిషేకించటం; ఎట్లు+ఒకో?= ఎట్లుండునో యోచించండి.

తాత్పర్యం: 'పరివారం, గొప్పతనం, ప్రతాపం, భుజవీర్యం అధికంగా కలవాడూ, కార్యఖడ్గ వాదాలకు తగిన అనేక మార్గాలు ఎరిగినవాడూ, ద్రోణ భీష్ములయందు కోపం కలవాడూ, మొక్కవోని కడిమిగలవాడూ అయిన ద్రుపద మహారాజును నీ సేనలకు అధిపతినిచేస్తే ఎట్లా ఉంటుందో ఆలోచించు.'

వ. అనుటయుం దదనంతరంబ ధనంజయుఁడు. 100

తాత్పర్యం: నకులుడు ద్రుపదుడికి సేనాధిపత్యం అప్పగించటం తగునని పలికిన పిమ్మట అర్జునుడు (ఇట్లా అన్నాడు:)

ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట (సం. 5-149-18)

సీ. 'అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశ । మొనరించుదానికై యుద్భవించె;
రథరథ్యములు ధనుర్బాణంబులును దను । త్రాణఖడ్గములు నుద్దామ లీలఁ
దనతోన జన్మించె; దహన శిఖామూర్తి । భుజవీర్య విక్రమ స్ఫూర్తిశాలి
సైన్యనాథుండు ధృష్టద్యుమ్నుఁ డగునని । తలఁచెద; నాతఁడు దక్క నొరులు

తే. భీష్ము తాఁ కోర్వ; రుగ్రంపు బిరుదు ధైర్య । ధన ఘనుండు శిఖండి భీష్మునకు మృత్యు
వై జనించినవాఁడు మహాబలుండు । దండనాయకుఁ జేయ నతండు దగును.' 101

ప్రతిపదార్థం: అగ్నికుండమునన్= హోమకుండంలో; ద్రోణ+ఆచార్యునకున్= గురుడైన ద్రోణుడికి; నాశము+ఒనరించు దానికై= నిర్మూలించేసే పనికై; ఉద్భవించెన్= జన్మించాడు; రథ రథ్యములు= రథమూ, అశ్వాలూ; ధనుః+బాణంబులును= విల్లూ, అమ్ములును; తను త్రాణ ఖడ్గములు= కవచమూ, కత్తీ; ఉద్దామలీలన్= భయంకర విలాసంతో; తనతోన్+అ= తనతోడనే; జన్మించెన్= పుట్టాయి; దహనశిఖామూర్తి= అగ్నిజ్వాలవంటి ఆకృతి కలవాడు; భుజవీర్య విక్రమస్ఫూర్తిశాలి= బాహుబలం, ప్రతాప ప్రకాశం కలవాడు; అయిన; ధృష్టద్యుమ్నుఁడు= ద్రుపదపుత్రుడు; సైన్యనాథుండు+అగున్+అని= సేనాధిపతి కాగలడని; తలఁచెదన్= భావిస్తాను; ఆతఁడు+తక్కన్= ధృష్టద్యుమ్నుడు దప్ప; ఒరులు= ఇతరులు; భీష్ముతాఁకున్+ఓర్వరు= భీష్ముడి ధాటికి ఆగలేరు; ఉగ్రంపు బిరుదు= అతడు ప్రచండ శూరుడు; ధైర్యధన ఘనుండు= ధైర్యమనే ధనం కలవారిలో గొప్పవాడు; శిఖండి= అంగనాపూర్వుడైన ద్రుపద పుత్రుడు శిఖండి; భీష్మునకున్= గాంగేయునకు; మృత్యువు+ఐ= మిత్తిఅయి; జనించినవాఁడు= పుట్టినవాడు; మహాబలుండు= గొప్ప శక్తి కలవాడు; దండనాయకున్+చేయన్= దళవాయిని చేయటానికి; అతండు తగును= అతడు అర్హుడవుతాడు.

తాత్పర్యం: 'ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని నిర్మూలించుటకై అగ్నికుండం నుండి పుట్టాడు. అతడితోపాటు రథం, గుర్రాలు, విల్లమ్ములు, కవచఖడ్గాలు అగ్నికుండం నుంచి పుట్టాయి. ధృష్టద్యుమ్నుడు అగ్నిజ్వాలతో సమానమైన ఆకారం కలవాడు. బాహుబలం కలవాడు, ప్రతాపవంతుడు. సర్వసైన్యాధిపతిగా ఉండటానికి తగినవాడని భావిస్తున్నాను. అతడు తప్ప మరొక్కడు భీష్ముడి ధాటికి తట్టుకోలేడు. మరి శిఖండి అంటేనో- భయంకరమైన వీరుడు. ధైర్యశాలి. మిక్కిలి బలం కలవాడు. భీష్ముడి పాలిటికి మిత్తియై పుట్టినట్టివాడు. అతడిని దళవాయిగా చేయవచ్చును.

విశేషం: ధృష్టద్యుమ్నుని జన్మవృత్తాంతము: భరద్వాజుడనే మునియొక్క కలశంలో ఉద్భవించిన ద్రోణుడు, పృషతుని పుత్రుడైన ద్రుపదుడు ఆబాల్య మిత్రులు. వారిద్దరు వేదాలు చదివి, ధనుర్వేదం అగ్నివేశుని దగ్గర అభ్యసించారు. ద్రుపదుడు తండ్రి తరువాత పాంచాల దేశానికి ప్రభువైనాడు. ద్రోణుడు తన పుత్రుడైన అశ్వత్థామ పాలకొరకు ధేనువును వేడబోయి, ప్రియసఖుడైన ద్రుపదునిచే పరాభవం పొందినాడు. అతడు హస్తినాపురికి వచ్చి కురుకుమారులకు గురువై, తన వద్ద విలువిద్య నేర్చిన పాండవ కౌరవులతో తన్ను అవమానించిన ద్రుపదుడి నోడించి పట్టుకొని తెండని పలుకగా అర్జునుడు మహాయుద్ధంలో

ద్రుపదుడిని ఓడించి పట్టుకొని వచ్చి గురున కొప్పగించాడు. ద్రోణుడు ఎత్తిపొడుపు మాటలతో అతడిని గేలి చేసి విడిచిపుచ్చాడు. అవమానతప్తుడైన ద్రుపదుడు రణరంగంలో ద్రోణుడిని వధించునట్టి కొడుకును, అర్జునునకు దేవి అగునట్టి కొమార్తెను పడయనెంచి గంగాతీరంలో వానప్రస్థులుగా నున్న యాజోపయాజులనే అన్నదమ్ములలో పిన్నవాడైననూ తపోమహిమాఢ్యుడైన ఉపయాజుని ఆశ్రయించాడు. 'నీకు లక్షధేనువు లిస్తాను. నాకు సత్సంతాన మొదవించే క్రతువు చేయించు'మని అర్థించాడు. తనకు ఫలాశ లేదని చెపుతూ 'మా అన్న యాజుడు నీ అభిమతం నెరవేరుస్తాడు వెళ్ళు'మని ఉపయాజుడు చెప్పాడు. పాంచాలుడు యాజుని దర్శించి - 'మునీంద్రా! భారద్వాజుడు నాకు అపాయ మొనరించాడు. ఘోరయుద్ధంలో అతడి నోర్చే అపార పరాక్రముడైన సుతుడినీ, పార్థుని పతిగా బడయునట్టి సుతనూ వాంఛిస్తున్నాను నా కోరిక తీర్చు'మని ప్రార్థించాడు. యాజుడు యాజకత్వానికి అంగీకరించి ద్రుపదుడిచేత పుత్రకామేష్టి చేయించాడు. మంత్రాహుతులతో సంతృప్తుడైన అగ్నిదేవునివలన ద్రుపద మహారాజుకు అగ్నికుండంలోనుండి ఖడ్గచాపాలు ధరించినవాడు; కవచ కిరీటాలంకారుడు, రథారూఢుడు, అగ్నిజ్వాలవంటి శరీరం కలవాడు - ఒక కుమారుడు జనించాడు. అట్లాగే అగ్నికుండం నుండి దివ్యతేజంతో దీపిస్తూ ఒక కుమారి జనించింది. ఇట్లా జన్మించిన ద్రుపద కుమారునకు ధృష్టద్యుమ్నుడనీ, కొమార్తెకు కృష్ణ అనీ ఆకాశవాణి నామకరణం చేసింది. తరువాత ద్రుపదుడు ధృష్టద్యుమ్నుడిని ధనుర్వేద పారంగతుడిని కావించాడు.

వ. అనవుడు ధర్మనందనుండు గోవిందుం జూపి 'యితండు సకల చరాచర తారతమ్య సంవేది; విశేషించి మనకు నితని మాటలు విజయ మూలంబు; గావున నిమ్మహాత్ముండు నిరూపించినవాడు వరూధినీ ముఖ్యుండు.' 102

ప్రతిపదార్థం: అనవుడున్= అని పార్థుడు పలుకగా; ధర్మనందనుండు= ధర్మరాజు; గోవిందున్+చూపి= తమ్ములకు శ్రీకృష్ణుడిని చూపి; ఇతండు= ఈ మహనీయుడు; సకల చర+అచర తారతమ్యసంవేది= సమస్తమైన జంగమ స్థావరాల యొక్క ఎక్కువ తక్కువలు చక్కగ తెలిసినవాడు; విశేషించి= ప్రత్యేకించి; మనకున్; ఇతని మాటలు; విజయమూలంబు= జయానికి ఆధారం; కావునన్; ఈ మహాత్ముండు= ఈ మహానుభావుడు; నిరూపించినవాఁడు వరూధినీ ముఖ్యుండు= నిర్ణయించినవాడే సేనలకు అధిపతి. (వరూధిని= వాహిని, సేన.)

తాత్పర్యం: అర్జునుడి పలుకు లాలకించి ధర్మరాజు తన తమ్ములకు భగవంతుడైన శ్రీకృష్ణుడిని చూపుతూ 'ఈ మహనీయుడు సమస్తమైన జంగమ స్థావరాల యొక్క ఎక్కువ తక్కువలు చక్కగా ఎరిగినవాడు. ముఖ్యంగా ఈయన వచనాలు మన గెలుపునకు కారణాలు. కనుక ఈ మహానుభావుడు నిర్ణయించిన పురుషుడే మన ఏడక్షౌహిణుల సేనలకు అధిపతి అవుతాడు.'

క. అనుటయు దామోదరుఁ డి । ట్లను 'ధృష్టద్యుమ్నుఁ డర్హుఁ డగు నభిషేకం
బొనరింపుము పేరోలగ । మున నక్షోహిణుల కెల్ల ముఖ్యుఁడు గాఁగన్. 103

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మనందనుడు పలుకగా; దామ+ఉదరుఁడు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు; ధృష్టద్యుమ్నుఁడు; అర్హుఁడు+అగున్= సైన్యాధిపత్యానికి తగును; అక్ష+ఊహినులకున్+ఎల్లన్= అక్షౌహిణు లన్నింటికి; ముఖ్యుఁడు కాఁగన్= ప్రధానాధికారి అయ్యేటట్లు; పేరోలగమునన్= నిండుసభలో; అభిషేకంబు+ఒనరింపుము= సర్వసేనాధిపత్యానికి అభిషిక్తుడిని చేయుము.

తాత్పర్యం: ధర్మజుని మాటలు విని శ్రీ కృష్ణుడు ఇట్లా అన్నాడు. 'ధృష్టద్యుమ్నుడు సేనాధ్యక్షుడుగా ఉండదగినవాడు. ఇతనిని ఏడక్షౌహిణులకు నాయకుడిగా నిండు కొలువులో అభిషేకించుము.

విశేషం: అక్షోహిణి, అక్షౌహిణి= 21870 రథాలు, అన్ని ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 పదాతులు కలిగిన సేన - దీనినే చతురంగ బలం అంటారు.

క. సురగంధర్వ ఖచర కిం । పురుషాది సమస్త దివ్యభూతంబుల బం
ధుర భూరి వ్యూహంబుల । విరచనముల నెఱుఁగు నతఁడు వీరోత్తముఁడున్. 104

ప్రతిపదార్థం: సుర గంధర్వ ఖచర కింపురుష+ఆది= దేవతలు, గంధర్వులు, ఖేచరులు, కింపురుషులు మున్నుగాగల; సమస్త దివ్యభూతంబుల= సకల దేవతా వర్గాల యొక్క; బంధుర= సాంద్రమైన; భూరివ్యూహంబుల విరచనములన్= గొప్ప మొగ్గరాల యొక్క పన్నుగడలు; ఎఱుఁగున్= ఇతనికి తెలుసు; అతఁడు= ధృష్టద్యుమ్నుడు; వీర+ఉత్తముఁడున్= శూరులలో శ్రేష్ఠుడౌతాడు.

తాత్పర్యం: సురలు, గంధర్వులు, ఖేచరులు, కింపురుషులు మొదలైన దేవయోనులు పన్నే సేనావ్యూహాల కల్పన లన్నింటినీ తెలిసినవాడు ధృష్టద్యుమ్నుడు. వ్యూహరచనలో నేర్పు కలవాడే కాదు; వీరులలో కూడ శ్రేష్ఠుడు.

క. నీ యొద్దిరాజు లందఱు । ధీయుక్తులు విక్రమ ప్రదీప్తుల యైనన్
వేయేటికి ధృష్టద్యు । మ్నా యత్తము చేయు సైన్యమంతయు నధిపా!' 105

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నీయొద్దిరాజులు+అందఱున్= నీ దగ్గరనున్న భూపతులందరున్నూ; ధీయుక్తులు= బుద్ధిమంతులు; విక్రమ ప్రదీప్తులు+అ+ఐనన్= శౌర్యంతో దీపించేవారే అయినప్పటికీ; వేయు+ఏటికిన్?= పలుమాట లెందుకు?; సైన్యము+అంతయున్= నీ సేనలన్నిటినీ; ధృష్టద్యుమ్న+ఆయత్తము+చేయు(ము)= ధృష్టద్యుమ్నుడి అధీనం కావించుము.

తాత్పర్యం: నీ చెంతనున్న భూపతులంతా బుద్ధిమంతులు, ప్రతాపంతో ప్రజ్వలించువారే. సందేహం లేదు. అయినప్పటికినీ నీ సేనలన్నింటినీ ధృష్టద్యుమ్నుడి వశంలో ఉంచుము.'

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డక్షోహిణులకుం బ్రత్యేక నాయకులను నీవ నిర్దేశింపు' మనుటయు నతండు. 106

ప్రతిపదార్థం: అనినన్; విని; యుధిష్ఠిరుండు; అక్షోహిణులకున్; ప్రత్యేక నాయకులను= విడివిడిగా అధిపతులను; నీవు+అ= నీవే; నిర్దేశింపుము= నిర్ణయించుము; అనుటయున్; అతండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి వాక్యాలు విని ధర్మజుడు 'ఏడక్షోహిణులకున్నూ విడివిడిగా అధిపతులను నీవే నిర్ణయించు' మని కోరగా వాసుదేవుడు.

తే. 'సేన దమకును గలవారు లేనివారు । ననక తగువారిఁ జెప్పెద నఖిల సమర
పండితుల నేరి, వారి నీ బలము లేడు । నడపఁ జాలించి యభిషేచనం బొనర్పు.' 107

ప్రతిపదార్థం: సేన= సైన్యం; తమకును= తమకు; కలవారు= ఉన్నవారు; లేనివారు= లేనట్టివారు; అనక= అనే భేదం పాటించక; తగువారిన్= అర్హులను; అఖిల సమర పండితులన్= సమస్త యుద్ధాలలో విశారదులైనవారిని; ఏరి= ఎన్ని; చెప్పెదన్= నీకు తెలుపుతాను; వారిన్= అట్టివారలను; నీ బలములు+ఏడున్= నీ ఏడక్షౌహిణులను; నడపన్= నడపటానికి; చాలించి= సమర్థులను చేసి; అభిషేచనంబు+ఒనర్పు= అభిషేకం చేయుము.

తాత్పర్యం: 'తమకు సైన్యం కలవారు లేనివారు అనే భేదం లేక సకల యుద్ధాలలో కోవిదులైనవారును, అర్హులును అయినవారిని పేర్కొంటాను. నీ బలము లేడింటిని నడపటానికి సమర్థులైన వారికి ప్రత్యేక నాయకులుగా నీవు అభిషేకించుము.'

వ. అనిన 'నట్ల చేయుదు; వారెవ్వ రెవ్వరు? నిరూపింపు'మని యడిగినఁ గుంతీనందనునకు దేవకీనందనుం డిట్లనియె. 108

ప్రతిపదార్థం: అనినన్; అట్లు+అ= అట్లే; చేయుదున్; వారు; ఎవ్వరు+ఎవ్వరు= ఎవరెవరు; నిరూపింపుము= నిశ్చయించుము; అని అడిగినన్; కుంతీనందనునకున్= ధర్మజునకు; దేవకీనందనుండు= దేవకీతనయుడైన శ్రీకృష్ణమూర్తి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని ధర్మజుడు 'నీవు చెప్పినట్లే చేస్తాను. వా రెవరో నిశ్చయింపు'మని అడుగగా దేవకీపుత్రుడు ఇట్లా అన్నాడు:

సీ. 'పటుపరాక్రమనిధి పాంచాలపతియు, న । మానుష తేజుండు మత్స్యవిభుఁడు,
శత్రుభీకరమూర్తి సాత్యకియును, జరా । సంధాగ్ర తనయుండు శౌర్యఘనుఁడు
సహదేవుఁడును, ధైర్యశాలి యాదవశిరో । మణి చేకితానుండు, మహితవిభవ
ఖని యగు శిశుపాల తనయుండు దోర్దర్ప । ధుర్యుండు ధృష్టకేతుండు, సమర

తే. లంపటుండు శిఖండియు లావు వెరవు । గలరు, నీయెడ ననురక్తిఁగలరు, సాలఁ
బెంపుగల, రుక్కు ముట్టిన తెంపుగలరు । కోరి పతులుగఁ జేయు మక్షోహిణులకు. 109

ప్రతిపదార్థం: పటు పరాక్రమనిధి= దృఢమైన శౌర్యానికి ఆశ్రయమైనవాడు; పాంచాల పతియున్= పాంచాలదేశాధీశుడు ద్రుపదుడు; అమానుష తేజుండు= మానవశక్తికి మీరిన ప్రతాపంకలవాడు; మత్స్యవిభుఁడు= మత్స్యదేశ ప్రభువు విరాటుడును; శత్రుభీకరమూర్తి, సాత్యకియును= విరోధులకు వెరపు గలిగించే స్వరూపం గల సాత్యకియున్నూ; శౌర్యఘనుఁడు= పరాక్రమంచేత గొప్పవాడు; జరాసంధ+అగ్రతనయుఁడు= జరాసంధుడి పెద్దకొడుకు; సహదేవుఁడును= సహదేవుడనేవాడున్నూ; ధైర్యశాలి= ధైర్యంకలవాడు; యాదవ శిరోమణి= యాదవులలో శ్రేష్ఠుడు; చేకితానుండున్= చేకితానుడనేవాడును; మహిత విభవఖని= గొప్ప వైభవాలకు గనివంటివాడును; దోః+దర్పధుర్యుండు= భుజబలమునందు మిన్న అయిన; శిశుపాల తనయుండున్= శిశుపాలుడి పుత్రుడు; అగు= అయినట్టి; ధృష్టకేతుండున్= ధృష్టకేతువనేవాడును; సమరలంపటుండు= యుద్ధాలందు అత్యాసక్తికలవాడు; శిఖండియున్= భీష్ముడిని వధించటానికి ఈశ్వరుడి వరం వలన ద్రుపదుడికి ముందు కూతురై పుట్టి పిదప కొడుకుతనమును పొందిన శిఖండి అనేవాడును; లావున్= బలం; వెరవున్= ఉపాయాన్ని; కలరు= కలిగి ఉన్నారు; నీ యెడన్= నీపట్ల; అనురక్తిన్= అనురాగాన్ని; కలరు= కల్గినవారు; చాలన్= మిక్కిలి; పెంపు+కలరు= గొప్పతనం కలవారు; ముట్టినన్= తాకితే; తెంపు+కలరు= సాహసం చూపగలవారు; అక్షోహిణులకున్= నీ సేనలకు; కోరి= ఇష్టపడి; పతులుగన్+చేయుము= నాయకులుగా నియమించుము.

తాత్పర్యం: గొప్ప పరాక్రమరాశిఅయిన ద్రుపదుడు, మానవాతీత ప్రతాపంగల విరాటుడు, శత్రువులకు భయం కలిగించే స్వరూపంగల సాత్యకి, మిక్కిలి శౌర్యవంతుడైన జరాసంధుడి పెద్ద కుమారుడగు సహదేవుడు, యాదవులలో ఉత్తముడును, ధైర్యవంతుడును అయిన చేకితానుడు, గొప్ప వైభవాలకు నెలవైనవాడు, భుజబలం కలిగినవాడు, శిశుపాలుడి నందనుడు అయిన ధృష్టకేతువు, యుద్ధములందు మిక్కిలి ఆసక్తిగల శిఖండి బలసంపన్నులు,

ఉపాయశాలులు. నీయెడ ప్రేమగలవారు, చాల గొప్పతనంగలవారు, సాహసోపేతులు. అట్టి వీరిని ఏడ్గురినీ నీ అక్షౌహిణులకు అధిపతులను గావించుము.

విశేషం: ధృష్టకేతుడి వృత్తాంతము:

శిశుపాలుడు చేదివంశంలో దమఘోషుడనే రాజుకూ, సాత్వతికీ నాల్గు చేతులతో, ఫాలనేత్రంతో పుట్టి గార్దభ స్వరంతో ఏడుస్తుండగా తలిదండ్రులు భయాశ్చర్య నిమగ్నులైనారు. అప్పుడు అశరీరవాణి 'ఇతడిని ఇతరులు చంపలేరు. ఎవడు వీడిని ఎత్తుకొన్నప్పుడు ఎక్కువగానున్న రెండు చేతులూ, నొసటి కన్నూ అణగిపోతాయో అతడే వీడి పాలిటికి అంతకుడు' అని చెప్పింది. జననీజనకులు చూడవచ్చినవారికెల్ల తమ కుమారుడిని ఎత్తుకొనటానికి ఇస్తూ వచ్చారు. ఒకసారి బలరామకృష్ణులు తమ మేనత్త సాత్వతిని చూడదలచి ఆమె ఇంటికి వచ్చారు. సాత్వతి తన కొడుకును ముందు బలరాముడికీ, తరువాత శ్రీకృష్ణుడికీ ఎత్తుకొనటానికి ఇచ్చింది. అచ్యుతుడు బాలునెత్తుకొనగానే వాని మిక్కిలి చేతులు, మిక్కిలి కన్ను మాయమయ్యాయి. సాత్వతి భయపడింది. మురవైరి వలన తన సుతునకు ముప్పు తప్పదని గ్రహించి' 'నారాయణా! వీడు మున్ముందు దుర్మార్గుడయి నీకు అప్రియాలు ఆచరించినప్పటికీ, నన్ను జూచి వీని శతాపరాధములు మన్నించవలసినదిగా' వేడింది. కృష్ణు డంగీకరించాడు. శిశుపాలుడు కృష్ణుడి పట్ల అకారణ ద్వేషం వహించి అతడు లేని సమయంలో ద్వారకాపురిని దహించాడు. భోజవంశ ప్రభువులు తమ భార్యలతో రైవతకాద్రిలో విహరిస్తూ ప్రమత్తులై ఉండగా వారిని నిర్దయుడై వధించాడు. వసుదేవుడి యాగహయాన్ని అపహరించి అతడి అశ్వమేధమునకు విఘ్నం కల్గించాడు. ఇంతేకాక వాగ్విషయాలైన అపచారాలెన్నో చేశాడు. ధర్మజుడు రాజసూయ యాగ సమయంలో భీష్మాది వృద్ధుల అనుమతితో శ్రీకృష్ణుడిని పూజిస్తూ ఉండగా అతడు అగ్రపూజకు అనర్హుడని నిండుసభలో నానా దుర్భాషలాడాడు. అత్తకిచ్చిన మాటప్రకారం నూరు తప్పులు సహించి మరి భరించలేక శౌరి చక్రంతో అతడి తల ఖండించాడు. శిశుపాలు నట్లా సంహరించి మాధవుడు వాడి కొడుకును చేది రాజ్యానికి అభిషిక్తుడిని చేశాడు. అతడే ధృష్టకేతుడు. పాండవులకు హితుడై, కురుక్షేత్ర సంగ్రామ రంగంలో పాండవ పక్షం వహించాడు.

వ. అని దండనాథుల నిశ్చయించి వెండియు. 110

ప్రతిపదార్థం: అంటూ ఏడక్షౌహిణులకు దండనాయకులను నిర్ధారించాడు కృష్ణుడు. మరల. (ఇట్లా అన్నాడు:)

క. 'కురుసైన్యము నిస్సారం । బరయఁగ మన బలము లెల్ల నతిదృఢములు; నీ
వరవాయి గొనక నడపుము । ధరణీశ్వర! సేన మొగము దైవమ నీకున్. 111

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూవల్లభా!; కురుసైన్యము= కౌరవసేన; నిస్సారంబు= శక్తిహీనమైనది; అరయఁగన్= ఆలోచించగా; మన బలములు+ఎల్లన్= మన సైన్యాలన్నియు; అతి ధృఢములు= మిక్కిలి గట్టివి; నీవు= నీవు; అరవాయి+కొనక= వెనుదీయక; నడపుము= సైన్యమును కదలించుము; నీకున్= నీకు; సేనమొగము= సేనాగ్రభాగమునందు; దైవము+అ= దేవుడే నిలిచి ఉంటాడు.

తాత్పర్యం: 'ధర్మజా! కౌరవసేన శక్తిహీనం. ఆలోచించగా మనబలాలు మిక్కిలి చేవగలవి. నీవు సంకోచించక సేనలను నడుపుము. నీ సేనకు అగ్రభాగాన దేవుడే నిలిచి ఉంటాడు.

క. నీ యనుజులు దివిజులకు న । జేయులు ధృతరాష్ట్రసుతులఁ జెఱుచుట వ్రేఁగే?
తోయజనాశము గజలీ । లాయత్తము గాదె! యెత్తు మాహవమునకున్.' 112

ప్రతిపదార్థం: నీ+అనుజులు= నీ తమ్ములు; దివిజులకున్= దేవతలకు కూడ; అజేయులు= జయింపరానివారు; ధృతరాష్ట్ర సుతులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; చెఱుచుట= నాశం చేయటం; వ్రేగే?= భారమా?; (కాదనిభావం) తోయజనాశము= పద్మాలను పాడుచేయటం; గజలీలా+ఆయత్తము+కాదె!= ఏనుగు యొక్క క్రీడలకు అధీనమైనదే కదా! ఆహవమునకున్= యుద్ధానికి; ఎత్తుము= బయలుదేరుము.

తాత్పర్యం: నీ తమ్ములు వేల్పులకు సైతం గెలువరానివారు. కౌరవులను నాశనం చేయటం వారికి భారం కాదు. తామరల గుంపులను ధ్వంసం చేయటం గజక్రీడలకు లోబడినదే కదా! నీవు యుద్ధానికి బయలుదేరుము.'

విశేషం: అలం: నిదర్శన.

వ. అని నిర్ణయించి నారాయణుఁడు నిజనివాసంబునకుం జనియె; ధర్మతనయుండు దమ్ములుం దానును బ్రియంబంది యారాత్రి సుఖనిద్ర సేసిరి; రేపకడయ పాండవాగ్రజుం డనుజతనుజ దనుజాంతక సామంత మంత్రి పురోహిత సహితంబుగాఁ బేరోలగంబున నుండి సమస్త పరివారంబును వినఁ గార్యంబు నిశ్చయంబుఁ దెలియంబలికి, తగువారలతో సముచిత సంభాషణంబులు సేసి, మహనీయ మహిమ వెలయం బుండరీకాక్షుండు పనిచినట్ల పాంచాలనాథ ప్రముఖుల నక్షౌహిణులకు నధిపతులుగా వేఱువేఱ యభిషేకించి, శ్వేతవంశజాతుం డగుటంజేసి శ్వేతుండనం బ్రఖ్యాతుం డగు ధృష్టద్యుమ్నునకు నుత్కృష్ట ప్రకారంబున నభిషేకం బొనర్చి సర్వసేనాధిపత్యంబునకుం బట్టంబుగట్టి, యయ్యేనమండ్రను దక్కటి దొరలను గనుంగొని మధురవాక్యంబుల నగ్గించి కౌరవులతోడి కయ్యంబునకుం గురుక్షేత్రంబునకు విడియం బోద'మని చెప్పి వారినెల్ల ధనంజయునకుం జూపి. 113

ప్రతిపదార్థం: అని, నిర్ణయించి= కార్యం నిశ్చయించి; నారాయణుండు; నిజ నివాసంబునకున్= తనదైన యింటికి; చనియెన్= వెళ్ళాడు; ధర్మతనయుండున్; తమ్ములున్; తానును; ప్రియంబు+అంది= సంతోషం పొంది; ఆ రాత్రి; సుఖనిద్ర చేసిరి= హాయిగా నిదురపోయారు; రేపకడ+అ= ఉదయముననే; పాండవ+అగ్రజుండు= పాండవులలో తొలుత జన్మించిన ధర్మజుడు; అనుజ= తమ్ములు; తనుజ= కుమారులు; దనుజ+అంతక= రాక్షసులను అంతమొందించిన శ్రీకృష్ణుడు; సామంత= సామంత రాజులు; మంత్రి= సచివులు; పురోహిత సహితంబుగాన్= పురోహితులతో కూడ; పేరు+ఓలగంబునన్+ ఉండి= నిండు సభలో ఉన్నవాడై; సమస్త పరివారంబును వినన్= సకల పరిజనం వింటూ ఉండగా; కార్యంబు నిశ్చయంబు= యుద్ధ కార్య నిర్ణయాన్ని; తెలియన్+పలికి= వారందరికీ తెలిసేటట్లు చెప్పి; తగువారలతోన్= తగినవారితో; సముచిత సంభాషణంబులు చేసి= మిక్కిలి తగిన మాటలు మాటాడి; మహనీయ మహిమ= గొప్ప సంపదలు; వెలయన్= మెరయగా; పుండరీక+అక్షుండు= శ్రీకృష్ణుడు; పనిచిన+అట్ల= ఆజ్ఞాపించినట్లే; పాంచాల నాథ ప్రముఖులన్= ద్రుపదుడు మున్నగువారిని; అక్షౌహిణులకున్= సేనా విభాగాలకు; అధిపతులుగాన్= నాయకులుగా; వేఱువేఱ= ప్రత్యేకంగా; అభిషేకించి; శ్వేత వంశజాతుండు+అగుటన్+చేసి= శ్వేతుడి వంశంలో జన్మించినవాడు కావటంవలన; శ్వేతుండు+అనన్= శ్వేతుడనే నామంతో; ప్రఖ్యాతుండు+అగు= ప్రసిద్ధిగాంచిన; ధృష్టద్యుమ్నునకున్= ద్రుపద మహీపతి కుమారునకు; ఉత్కృష్ట ప్రకారంబునన్= శ్రేష్ఠమైన పద్ధతితో; అభిషేకంబు+ఒనర్చి; సర్వసేనా+ఆధిపత్యంబునకున్= సకల సైన్యాల దొరతనానికి; పట్టంబు+కట్టి= పట్టాన్నిచ్చి; ఆ+ఏనమండ్రను= ఆ ఎనిమిదిమందిని అనగా సర్వ సైన్యాధ్యక్షుడైన ధృష్టద్యుమ్నుడినీ; అక్షౌహిణీ నాయకులగు ద్రుపద, విరాట, సాత్యకి, సహదేవ, చేకితాన, ధృష్టకేతు, శిఖండులనూ; తక్కటి దొరలను= మిగిలిన రాజులనూ; కనుంగొని; మధుర వాక్యంబులన్= ప్రియమైన వచనాలతో; అగ్గించి= కొనియాడి; కౌరవులతోడి కయ్యంబునకున్; కురుక్షేత్రంబునకున్;

విడియన్+ పోదము= దిగుటకు వెళ్ళుదాము; అని చెప్పి; వారిన్+ఎల్లన్= వారందరినీ; ధనంజయునకున్+చూపి= అర్జునుడికి చూపి.

తాత్పర్యం: ఇట్లా నిర్ణయం చేసి కృష్ణుడు తన నివాసానికి వెళ్ళాడు. ధర్మరాజు, అతడి తమ్ములు సంతోషం పొంది ఆ రాత్రి సుఖంగా నిద్రపోయారు. తెల్లవారగనే యుధిష్ఠిరుడు తమ్ములతో, కుమారులతో, శ్రీకృష్ణుడితో, సామంత రాజులతో, మంత్రులతో, పురోహితులతో కూడి నిండు కొలువుండి పరిజనులందరూ వినేటట్లు యుద్ధం నిర్ణయమైనట్లు తెలియబలికాడు. తన వారలతో తగు మాటలాడి, సమున్నత వైభవంతో శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించిన విధంగా ద్రుపదుడు మొదలైనవారిని వేర్వేరుగా అక్షౌహిణులకు నాయకులను కావించాడు. విశేషించి ధృష్టద్యుమ్నుడికి ఉత్తమ పద్ధతిలో అభిషేకం చేసి, సర్వసేనాధిపత్యానికి పట్టం కట్టాడు. పిదప ఆ ఎనిమిది మందిని, మిగిలిన రాజులనూ చూచి, ప్రియవచనాలతో వారిని శ్లాఘించి, కౌరవులతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రానికి మనం తరలి వెళ్ళుదా' మని చెప్పి వారినందరినీ అర్జునుడికి చూపి (ఇట్లా అన్నాడు:)

ఉ. 'ఎప్పుడు నెయ్యెడం బొదివి యిందఱకుం దగ నీవు కంటికిన్
ఱెప్పయుఁ బోలె మాటయి నెఱిం బను లారసి యొజ్జచాడ్పునం
జెప్పుచు వీరిబుద్ధిఁగొని చేయుము కార్యము; నీకు రక్షగా
నిప్పరమేశ్వరుండు గలఁ; డిచ్చు శుభం' బని చూపెఁ గృష్ణునిన్. 114

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లవేళల; ఏ+యెడన్= ఎల్లచోటుల; పొదివి= క్రమ్ముకొని; ఇందఱకున్= ఇచ్చటివారందరికీ; తగన్= ఒప్పిదంగా; నీవు= నీవు; కంటికిన్= కంటికి; ఱెప్పయున్+పోలెన్= రెప్పవలె; మాటు+అయి= అడ్డమై; నెఱిన్= చక్కగా; పనులు+ఆరసి= కార్యాలు విచారిస్తూ; ఒజ్జ చాడ్పునన్= గురుడి చందంగా; చెప్పుచున్= హితవు గరపుతూ; వీరిబుద్ధిన్+కొని= వీరి అభిప్రాయం మన్నించి; కార్యము చేయుము= కర్తవ్యం నిర్వహించుము; నీకున్= నీకు; రక్షగాన్= రక్షకుడుగా; ఈ+పరమ+ ఈశ్వరుండు కలఁడు= ఈ దేవాధిదేవుడే ఉన్నాడు; శుభంబు+ఇచ్చున్= శుభం కలిగిస్తాడు; అని+కృష్ణునిన్+చూపెన్= అంటూ శ్రీకృష్ణుడిని చూపాడు.

తాత్పర్యం: 'అర్జునా! ఎల్లవేళలందునూ ఎల్లతావులందునూ క్రమ్ముకొని వీరందరినీ కంటిని రెప్పవలె కాపాడుతూ, పనులన్నింటినీ పరిశీలిస్తూ గురునివలె హితం గరపుతూ, వీరి తాత్పర్యం మన్నిస్తూ కర్తవ్యం సల్పుము. ఈ పరమ పురుషుడే నీకు రక్షకుడు. శుభాలు అనుగ్రహించగలడు' అని శ్రీకృష్ణుడిని చూపాడు.

వ. ఇట్లు గాంభీర్య మాధుర్య ధుర్యుండైన యుధిష్ఠిరుండు వరిష్ఠ ప్రభువుల చిత్తంబు లారాధించి సర్వజన సమ్మతంబుగా సమరోత్సాహంబు చేసి మహోల్లాసంబునం బ్రస్థాన భేరి సఱవం బంచిన. 115

ప్రతిపదార్థం: ఇట్లు; గాంభీర్య మాధుర్య ధుర్యుండు= గాంభీర్య మాధుర్య గుణములు వహించేవాడు; (గాంభీర్యమనగా కోపం దుఃఖం మొదలైన వాటిచేత వికారం పొందకుండటం; మాధుర్యమంటే దయ, సౌశీల్యం, సౌజన్యం); ఐన= అయినట్టి; యుధిష్ఠిరుండు; వరిష్ఠ ప్రభువుల చిత్తంబులు= శ్రేష్ఠులైన రాజుల మనస్సులు; ఆరాధించి= పూజించి; సర్వజన సమ్మతంబుగాన్= సకల జనులకు ఇష్టమయ్యేటట్లు; సమర+ఉత్సాహంబు చేసి= యుద్ధం చేసే పూనిక వహించి; (రాజునకు ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి ఉండవలెను. ఈ మూడు శక్తులు ధర్మజుడిలో ముప్పిరిగొన్నవి); అతడు మహా+ఉల్లాసంబునన్= మిక్కిలి సంతోషంతో; ప్రస్థాన భేరి= ప్రయాణ (యుద్ధ) వేళ మ్రోగించే ఢంకా; చఱవన్+పంచినన్= మ్రోగించటాని కాజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా గాంభీర్య మాధుర్య గుణ ధురీణుడైన ధర్మజుడు ఉత్తమ ప్రభువుల మనస్సులు ఆరాధించి సకల జనులకు అంగీకారమయ్యేటట్లు యుద్ధంచేయటానికి పూనిక వహించినవాడై, పరమ సంతోషంతో ప్రస్థాన భేరి మ్రోగించండని ఆజ్ఞాపించాడు.

సీ. బీఁటెండ తాఁకున బీఁటలు వాఱిన । పచ్చిగోడల మాడ్కిఁ బగిలె దిశలు,
కాఁగిన యెసరుల కరణిఁ బొరిం బొరి । శరనిధు లుప్పొంగి పొరలఁబడియెఁ,
గలముపైఁ గీలించి గాలి కెత్తిన చాఁప । వోలె మిన్నంతయు బూరటిల్లెఁ,
గులపర్వతావళి కులిశభయంబున । బెదరి వాపోవున ట్లెదురుసెలఁగె,

తే. ధాత్రి కుమ్మరి సారె విధమునఁ దిరిగెఁ । జిత్రరూపులభంగి నిశ్చేష్టితంబు
లయ్యె సర్వభూతములుఁ బ్రయాణభేరి । భూరి నిష్ఠుర ఘోరభాంకార మడర. 116

ప్రతిపదార్థం: ప్రయాణ భేరి= యుద్ధ ప్రయాణ సమయంలో మ్రోగించబడిన భేరి యొక్క; భూరి= గొప్పదైన; నిష్ఠుర= కఠినమైన; ఘోర= భయంకరమైన; భాంకారము+అడరన్= భాంకారం వ్యాపించగా; బీఁటు+ఎండ తాఁకునన్= మిక్కుటమైన ఎండ తగులగా; బీఁటలు+పాఱిన= పగుళ్ళు విడిచిన; పచ్చి గోడల మాడ్కిన్= మట్టి ముద్దలతో పెట్టిన పచ్చి గోడలవలె; దిశలు= దిక్కులు; పగిలెన్= బ్రద్దలయ్యాయి; కాఁగిన్+ఎసరులకరణిన్= తెర్లిన ఎసళ్ళవలె; శరనిధులు= సముద్రములు; పొరిన్+పొరిన్= అత్యంతం; ఉప్పొంగి= పైకి ఉబికి; పొరలన్+పడియెన్= క్రిందికి పొరలినవి; కలముపైన్= పడవమీద; కీలించి= అమర్చి; గాలికిన్+ఎత్తిన చాప+పోలెన్= గాలి కొరకు పైకెత్తిన తెరచాపవలె; మిన్ను+అంతయున్= ఆకాశమంతా; బూరటిల్లెన్= నిండుగా ఉబ్బింది; కులపర్వత+ఆవళి= ఏడు కులగిరులు; కులిశభయంబునన్= ఇంద్రుడి వజ్రాయుధం వలని భీతిచేత; బెదరి= జంకి; వాపోవునట్లు= ఆక్రోశిస్తూ ఉన్న విధంగా; ఎదురు+చెలఁగెన్= ప్రతిధ్వని ఒప్పింది; కుమ్మరి సారె విధమునన్= కుమ్మరిచక్రం వలె; ధాత్రి= పుడమి; తిరిగెన్= భ్రమించింది; సర్వభూతములు= సకల ప్రాణులు; చిత్రరూపుల భంగిన్= పటంలో లిఖించబడిన బొమ్మలవలె; నిశ్చేష్టితంబులు+అయ్యెన్= కదలిక లేకుండినవి.

తాత్పర్యం: ధర్మజుడి యుద్ధ ప్రయాణభేరియొక్క దారుణమైన కఠిన భాంకారం వ్యాపించగా మిక్కిలి ఎండకాసినపుడు మట్టి ముద్దలతో పెట్టిన పచ్చి గోడలమాదిరి దిక్కులు బ్రద్దలయ్యాయి. తెర్లిన ఎసరు నీళ్ళవలె సముద్రాలు అంతకంతకూ ఉప్పొంగి గట్లమీదికి పొర్లిపొరాయి; పడవపై అమర్చి గాలికెత్తిన తెరచాపవలె ఆకసమంతా నిండిపోయింది; ఇంద్రుడి వజ్రాయుధపు వ్రేటుకు భయపడి సప్తకుల పర్వతాలు ఆక్రోశిస్తున్నవో అన్నట్లు ప్రతిధ్వని చెలరేగింది. కుమ్మరివాడి చక్రం మాదిరి భూమి గిరగిరా తిరిగింది. పటంలో లిఖించబడిన బొమ్మలవలె సకల ప్రాణులు నిశ్చలంగా నిలిచిపోయాయి.

విశేషం: కుల పర్వతాల సంఖ్య ఏడు-మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం.

పాండవులు కౌరవులతోడి యుద్ధంబునకు వెడలుట (సం. 5-149-49)

వ. ఇట్లు ప్రస్థాన భేరి చెలంగిన సకల సైన్యంబులు దండనాథ సహితంబుగా సన్నద్ధంబులయ్యెః మఱునాఁడు. 117

ప్రతిపదార్థం: ఇట్లు; ప్రస్థాన భేరి= ప్రయాణభేరి; చెలంగినన్= మ్రోగగా; సకల సైన్యంబులు= సమస్త సేనలు; దండనాథ సహితంబుగాన్= సేనానాయకులతో కూడ; సన్నద్ధంబులు+అయ్యెన్= యుద్ధానికి సంసిద్ధమయ్యాయి; మఱునాఁడు= మరుసటి దినం.

తాత్పర్యం: ప్రయాణభేరి మ్రోగగానే యుద్ధ యాత్రకు సమస్త సైన్యాలు, దండనాయకులతో సంసిద్ధమయ్యాయి. ఆ మరుసటి రోజు.

ఉ. భూరి విభూతిఁ బెండ్లికిని బోవు తెఱంగునఁ బాండునందనుల్
దారును బుత్త్రులున్ హరియుఁ దమ్ముఁడు నుజ్జ్వల చారులీల శృం
గారము చేసి, సమ్మద వికాస మెలర్పఁగ వీర సంభ్రమో
దార సముద్ధతిం జనిరి ద్రౌపది యున్నెడ కందఱుం దగన్. 118

ప్రతిపదార్థం: భూరి విభూతిన్= అధిక వైభవంతో; పెండ్లికిని+పోవు తెఱంగునన్= పెండ్లికి వెళ్ళే విధంగా; పాండు నందనుల్= పాండవులు; తారును= తామున్నూ; పుత్త్రులున్= తమ కుమారులున్నూ; హరియున్= గోవిందుడూ; తమ్ముఁడున్= అతడి అనుజుడైన సాత్యకీ; ఉజ్జ్వలచారులీలన్= సొంపారు సుందర విలాసంతో; శృంగారము+చేసి= అలంకరించుకొని; సమ్మద వికాసము+ఎలర్పఁగన్= సంతోషకళ అతిశయించగా; వీర సంభ్రమ+ఉదార సముద్ధతిన్= వీరులయొక్క త్వరతో కూడిన గొప్పదైన దర్పంతో; ద్రౌపది+ఉన్న+ఎడకున్= పాంచాలిఉన్న ప్రదేశానికి; తగన్= ఒప్పుగా; అందఱున్= ఎల్లరు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: మహా వైభవంతో పెళ్ళికి వెళ్ళే విధంగా పాండుకుమారులు తామూ తమ పుత్రులూ, శ్రీకృష్ణుడూ అతడి తమ్ముడైన సాత్యకీ సుందర విలాసాలు సొంపారే తీరున అలంకారాలు కావించుకొని సంతోష కళలు మొగ్గలు తొడుగగా, వీరుల యొక్క త్వరతో గూడిన గొప్ప దర్పంతో పాంచాలిఉన్న ప్రదేశానికి అందరూ వెళ్ళారు.

వ. ఇట్లుచని యమ్మహాదేవి నామంత్రణంబు సేసి తత్ప్రభృతి పుణ్యస్త్రీ కరకలితలలితాక్షతంబులు గైకొని, విప్రాశీర్వాదంబులాదరించుచు, భద్రపాఠక శ్లోకంబు లాకర్ణించుచు, శోభన పదార్థంబులు గనుంగొనుచు, నాంగిక మాంగల్య సూచకంబులు సేకొనుచు వెడలునప్పుడు. 119

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; చని= వెళ్ళి; ఆ+మహాదేవిన్= ఆ ద్రౌపదిని; ఆమంత్రణంబు చేసి= వెళ్ళివస్తామని చెప్పి వీడ్కొని; తద్ ప్రభృతి పుణ్యస్త్రీ కరకలిత లలిత+అక్షతంబులు= పాంచాలి మున్నుగాగల సువాసినుల యొక్క చేతుల యందలి ఇంపైన అక్షతలు; కైకొని= స్వీకరించి; విప్ర+ఆశీర్వాదంబులు= బ్రాహ్మణుల యొక్క దీవనలు; ఆదరించుచున్= గౌరవ పూర్వకంగా గ్రహిస్తూ; భద్ర పాఠక శ్లోకంబులు= మంగళ పాఠకుల యొక్క పద్యాలు; ఆకర్ణించుచున్= వింటూ; శోభన పదార్థంబులు కనుంగొనుచున్= ఎదురుగా వచ్చే చందనాది మంగళ ద్రవ్యాలను దర్శిస్తూ; ఆంగిక మాంగల్య సూచకంబులు= తమ శరీరంలో పొడముచున్న శుభ నిమిత్తాలు; చేకొనుచున్; వెడలునప్పుడు= కదలే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పాండుకుమారులు పట్టపురాణిఅయిన ద్రౌపదితో వెళ్ళి వస్తామని చెప్పి, ఆమె దగ్గర వీడ్కోలు పొందారు. పాంచాలి మున్నగు ముత్తైదువల చేతులలోని మంగళాక్షతలు స్వీకరించి, భూసురులిచ్చే దీవనలు గ్రహిస్తూ, మంగళ పాఠకుల యొక్క పద్యాలు ఆలకిస్తూ, శుభసూచకాలై ఎదురుగా వస్తున్న మంగళ

వస్తువులను వీక్షిస్తూ, తమ దేహములందు కలుగుతున్న శుభ నిమిత్తాలను కనుగొని మెచ్చుతూ తరలి వెళ్ళే సమయంలో

క. తగ శంఖ కాహళాదిక । మగు మంగళ తూర్యసంచయము గంభీరం
బుగ మ్రోసె జయముఁ దెలుపుచు । జగతీశ్వరు మ్రోల నాకసము దీటుకొనన్. 120

ప్రతిపదార్థం: తగన్= ఒప్పిదమైనట్లు; శంఖ కాహళ+ఆదికము+అగు= శంఖములు, బాకాలు మొదలుగా గల్గిన; మంగళ తూర్య సంచయము= ఢక్క మొదలైన మంగళ వాద్యాల యొక్క సమూహం; ఆకసము దీటుకొనన్= ఆకాశం నిండగా; జయమున్+తెలుపుచున్= గెలుపున్ సూచిస్తూ; జగతీ+ఈశ్వరు మ్రోలన్= భూవల్లభుడి యెదుట; మ్రోసెన్= మ్రోగింది.

తాత్పర్యం: శంఖాలు బాకాలు మొదలైన మంగళవాద్యాల సమూహం గగనతలం నిండగా విజయసూచకమై ప్రభువైన ధర్మజుడి మ్రోల మ్రోగింది.

క. మనుమని జయప్రయాణం । బనుమోదింపంగ నా సుధాంశుఁడు సనుదెం
చినకరణి గొడుగు కుంతీ । తనయాగ్రజుమ్రోల నతిసితప్రభ నొప్పెన్. 121

ప్రతిపదార్థం: మనుమని జయప్రయాణంబు= తన మనుమడి యొక్క యుద్ధ ప్రయాణాన్ని; అనుమోదింపంగన్= అంగీకరించటానికి; ఆ సుధా+అంశుఁడు= అమృతకిరణుడైన ఆ చంద్రుడు; చనుదెంచిన కరణిన్= వచ్చినాడేమో అన్న విధంగా; గొడుగు= ఛత్రం; కుంతీ తనయ+అగ్రజుమ్రోలన్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మజుడి ఎదుట; అతిసితప్రభన్= మిక్కిలి తెల్లని కాంతితో; ఒప్పెన్= శోభిల్లింది; (అమృతము తెల్లనిది; అమృత కిరణుఁడు గనుక చంద్రుడు తెల్లనివాడు; ధవళచ్ఛత్రానికి పోలికగా చంద్రుడిని చెప్పటం రుచిరం; ధర్మజుడు చంద్రవంశంలో జన్మించాడు కనుక చంద్రునికి మనుమడు; మనుమడు ప్రయాణమవుతుండగా తాతగారు వచ్చి చూచి సంతోషించటం సహజం, సమంజసం.)

తాత్పర్యం: తన మనుమడు కురుక్షేత్రానికి పయనం కాగా, అతడి యుద్ధయాత్రను అంగీకరించటానికి అమృత కిరణుడైన చంద్రుడు వచ్చాడేమో అన్నట్లుగా కుంతీ తనయులలో తొలుతటి వాడైన ధర్మపుత్రుడి యెదుట మిక్కిలి ధవళకాంతితో గొడుగు ప్రకాశించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అట్టి యెడ నమ్మహీవల్లభుండు. 122

తాత్పర్యం: ఆ సమయంలో ఆ ధర్మరాజు.

క. ఉచితగతిఁ జేరి వంది । ప్రచయముఁ గీర్తింప నెక్కె రథమం దొనరన్
ఖచియించిన వజ్రంబుల । రుచులను బొలుపారు సీవిరులు బెరయంగన్. 123

ప్రతిపదార్థం: ఉచితగతిన్+చేరి= యుక్తమగు విధాన తన దగ్గరకు వచ్చి; వంది ప్రచయము= స్తోత్ర పాఠకుల యొక్క సమూహం- బట్టువారు; కీర్తింపన్= పొగడగా; ఒనరన్= చక్కగా; ఖచియించిన= పొదిగినట్టి; వజ్రంబుల రుచులను= వజ్రాల

కాంతులతో; పొలుపారు= ప్రకాశించు; సీవిరులు= వింజామరలు; బెరయంగన్= పార్శ్వములందు ఆవరించగా; రథమందున్+ ఎక్కెన్= ధర్మజుడు తేరిలో ఎక్కాడు.

తాత్పర్యం: బట్టువారు గారవంగా తన చెంతకు జేరి స్తుతించగా, వజ్రాలు పొదుగుటచేత కాంతులీనే వింజామరలు ఇరుపార్శ్వములందు ఆవరించగా ధర్మరాజు రథాన్ని అధిరోహించాడు.

వ. తదనంతరంబ. 124

తాత్పర్యం: అటు తరువాత.

సీ. వక్ష స్థలంబున వనమాల క్రాలంగ । వెలిమావు గెడల వాగెలు ధరించి
నొగలపై హరియొప్ప నగచరకేతువు । మెఱయంగ నరదంబు మెఱుఁగు లడర
దివ్యకిరీటంబు దీప్తులు భూనభోం । తరమెల్లఁ గలయంగఁ బరఁగుచుండ
గాండీవతూణ యుగ్మములు పూర్వాపర । భాగంబులకు నవాభరణములుగఁ

తే. దెలి మొగంబుతో నల్ల నేతెంచి యొక్క । పార్శ్వమునఁ బొడసూపి భూపతికి మ్రొక్కి
దేవదత్తంబు పూరించె దేవదేవు । పాంచజన్యంబునకు మున్న ఫల్గునుండు. 125

ప్రతిపదార్థం: వక్షః+స్థలంబునన్= గుండెమీద; వనమాల= మోకాళ్ళ వరకు వ్రేలాడే పూలదండ; క్రాలంగన్= ఒప్పుతుండగా; వెలిమావు= తెల్లగుఱ్ఱాల యొక్క; గెడల వాగెలు= నోటి కళ్ళాలకు తగిలించి జతకూర్చబడిన పగ్గాలు; ధరించి= చేతబట్టి; నొగలపైన్= రథము యొక్క నొగల మీద; హరి+ఒప్పన్= శ్రీకృష్ణుడు విరాజిల్లుతుండగా; నగచర కేతువు= కపిధ్వజం; మెఱయంగన్= ప్రకాశించగా; అరదంబు మెఱుఁగులు+అడరన్= స్యందనం యొక్క కాంతులు వ్యాపించగా; దివ్య కిరీటంబు దీప్తులు= వేల్పులచేత ఒసగబడిన మకుటము యొక్క వెలుగులు; భూనభః+అంతరము+ఎల్లన్= భూమ్యాకాశాల మధ్యప్రదేశమంతటను; కలయంగన్+పరఁగుచున్+ఉండన్= ఎడము లేక నిండగా; గాండీవ= గాండీవమనే విల్లు; తూణయుగ్మములు= అమ్ముల పొదులయొక్క జత; పూర్వ+అపరభాగంబులకున్= తన కుడి యెడమ భుజాలకు; నవ+ఆభరణములుగన్= క్రొత్త సొమ్ములు కాగా; తెలి మొగంబుతోన్= వికాసంతో కూడిన ముఖంతో; అల్లన్= మెల్లగా; ఏతెంచి= వచ్చి; ఒక పార్శ్వంబునన్= ఒక ప్రక్కగా నిలిచి; పొడసూపి= కనబడి; భూపతికిన్= విభుడైన ధర్మజుడికి; మ్రొక్కి= నమస్కరించి; ఫల్గునుండు= అర్జునుడు; దేవదేవు పాంచజన్యంబునకున్= దేవాధిదేవుడైన శ్రీకృష్ణుడి పాంచజన్యమనే పేరుగల శంఖమునకు; మున్న= ముందుగానే; దేవదత్తంబు పూరించెన్= దేవదత్తమనే పేరుగల తన శంఖాన్ని ఒత్తాడు.

తాత్పర్యం: వాసుదేవుడు తన వక్షఃస్థలంలో వనమాల విరాజిల్లుతుండగా తెల్లని గుఱ్ఱాల నోటి కళ్లెములకు తగిలించిన పగ్గాలను చేత ధరించి రథం నొగల మీద కూర్చొని ఉన్నాడు. రథంమీద హనుమద్ధ్వజం రెపరెపలాడుతోంది. రథ కాంతులు దిక్కుల వ్యాపిస్తున్నాయి. ఇంద్రదత్తమైన తన మకుట దీప్తులు రోదసీ కుహరమందు సందులేక నిండిపోయాయి. గాండీవం, అక్షయ తూణీర ద్వయం తన కుడి యెడమ భుజాలకు క్రొత్త సొమ్ములుకాగా. వికసించిన ముఖంతో ఫల్గునుడు మెల్లగా వచ్చి ఒక ప్రక్కగా నిలిచి, తనను కనబరచుకొని, నరేంద్రుడైన ధర్మజుడికి నమస్కరించాడు. దేవదేవుడైన శ్రీకృష్ణుడి పాంచజన్య శంఖంకంటె ముందుగానే పార్థుడు దేవదత్తమనే తన శంఖాన్ని ఒత్తాడు.

శా. భీముండుం గవలుం గుమారులును సంప్రీతిన్ గదాద్యాయుధో
ద్దామ స్ఫీత రుచుల్ వెలుంగ, రథ సంతానంబు రమ్యోజ్జ్వల
శ్రీ మీఱన్ దగ వచ్చి శంఖములు గర్జిల్లంగఁ బూరించుచున్
భూమీశుం గని యగ్రభాగమున కొప్పుం బెంపునుం జేయుచున్. 126

ప్రతిపదార్థం: భీముండున్= వృకోదరుడూ; కవలున్= అమడలైన నకుల సహదేవులు; కుమారులును= అభిమన్యుడు, ఉపపాండవులు మున్నగు పుత్రులును; సంప్రీతిన్= మిక్కిలి హర్షంతో; గదా+ఆది= గద మొదలైన; ఆయుధ= ఆయుధాలయొక్క; ఉద్దామ= అధికమైన; స్ఫీతరుచుల్= స్వచ్ఛమైన కాంతులు; వెలుంగన్= ప్రకాశించగా; రథసంతానంబు= రథాలగుంపు; రమ్య= మనోహరమైన; ఉజ్జ్వల శ్రీమీఱన్= ప్రకాశవంతమైన శోభతో అతిశయిల్లగా; తగన్= ఒప్పిదంగా; వచ్చి; శంఖములు; గర్జిల్లంగన్= రొదచేయగా; పూరించుచున్= ఊదుతూ; భూమీ+ఈశున్+కని= ధర్మరాజును చూచి; అగ్రభాగమునకున్= సేనలయొక్క ముందుభాగానికి; ఒప్పున్= అందమున్నూ; పెంపున్= గౌరవమున్నూ; చేయుచున్= కలిగిస్తూ. (నిలబడిరి - అని తరువాతి పద్యంలోని క్రియతో అన్వయం).

తాత్పర్యం: భీమసేనుడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ఉపపాండవులు, హర్షంతో గద మొదలైన ఆయుధాల యొక్క మిక్కుటమైన స్వచ్ఛ కాంతులు వెలుగుతుండగా, రథాల యొక్క మనోహర శోభలు అతిశయిల్లగా శంఖాలు పూరిస్తూ చనుదెంచి ధరణీవల్లభుడైన ధర్మజుడిని దర్శించారు. సైన్యాగ్ర భాగానికి అందం, గౌరవం సమకూరుస్తూ (నిలబడ్డారు.)

క. నిలిచిరి, తక్కటి దొరలును । బలుమానుసులును మహోగ్రభంగి సవరణల్
సెలువొంద నధిపు చుట్టుల । నలంకరించిరి విభూషణాంశుచ్ఛటలన్. 127

ప్రతిపదార్థం: నిలిచిరి= అభిమన్యుడు మొదలైన కుమారులు నిలబడ్డారు; తక్కటి దొరలును= మిగిలిన ప్రభువులును; బలుమానుసులును= యుద్ధం సల్పగల దొడ్డ మనుష్యులును; మహా+ఉగ్రభంగిన్= మిక్కిలి భయంకరమైన రీతులలో; సవరణల్= యుద్ధ సన్నాహాలు; చెలువు+ఒందన్= వన్నెమీరగా; విభూషణ+అంశు+ఛటలన్= తాము ధరించిన విశిష్టఆభరణాల యొక్క దీప్తి సమూహం చేత; అధిపుచుట్టులన్= ధర్మజుడి నలువైపులను; అలంకరించిరి= సింగారించారు.

తాత్పర్యం: తక్కిన రాజులును, వీరగ్రామణులును మిక్కిలి భయంకరంగా రణసన్నాహకలితులై తాము ధరించిన ఆభరణ కాంతిపుంజంతో ధర్మజుడిని నలువైపుల సింగారిస్తూ నిలిచారు.

వ. అప్పుడు పాండవాగ్రజున కభిముఖంగాఁ జనుదెంచి. 128

ప్రతిపదార్థం: అప్పుడు; పాండవ+అగ్రజునకున్= పాండవులలో పెద్దవాడైన ధర్మనందనునకు; అభిముఖంబుగాన్= ఎదురుగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అపుడు ధృష్టద్యుమ్నుడు ధర్మనందనుడికి అభిముఖంగా వచ్చి.

క. సాష్టాంగ మెఱఁగి సమరా । వష్టంభం బొప్ప దివ్యవాహన లీలో
త్కృష్టగతిన్ ముంగలియై । ధృష్టద్యుమ్నుండు వొలిచెఁ దేజో మహిమన్. 129

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు= (ద్రుపద తనయుడు); స+అష్ట+అంగము+ఎఱఁగి= దండాకారంగా ఎనిమిది అవయవాలు నేలకు తగిలేటట్లు నమస్కరించి; సమర+అవష్టంభంబు= యుద్ధగర్వం; ఒప్పన్= అతిశయించగా; దివ్యవాహన లీలా+ఉత్కృష్టగతిన్= దివ్యమైన అశ్వము యొక్క విలాసముచేత ప్రశస్తమైన గమనంతో; ముంగలి ఐ= ముందున్నవాడై; తేజో మహిమన్= ప్రతాప వైభవంతో; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుకు సాగిలపడి నమస్కరించి, రణదర్పం మేరమీరగా, అశ్వము నధిరోహించి విలాసగమనంతో సేనలకు ముందున్నవాడై ప్రతాపదీప్తితో ప్రజ్వలించాడు.

వ. ఇవ్విధంబునం జారుభీషణంబుగా సన్నద్ధుండై యుధిష్ఠిరుండు గదలి శుభసూచకంబులు గైకొనుచు నడచె; నట్టిసమయంబున నెల్లవారి పరిచారకులును శకటాది సకల సాధనంబులును బటగృహంబులును మొదలుగా వలయు సమస్త వస్తువు లొడఁగూర్చి వెడలిన దండు పఱపై సముద్రంబు గాఁపుపోవు చందంబయ్యె; నిట్లరిగి ధర్మపుత్త్రుండు కురుక్షేత్రంబు దఱియంజొచ్చి ఋష్యాశ్రమంబులకు దేవతాయతనంబులకు నలజడి గాకుండం బరిహారంబు సేయుచుం జని తృణకాష్ఠ జలసమృద్ధంబై తగియెడు సమస్థలంబున హిరణ్వతి యను పుణ్యనది పొంత విడిదలగా నిరూపించి యచ్చో నిలిచెఁ; దదనంతరంబ. 130

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; యుధిష్ఠిరుండు; చారుభీషణంబుగాన్= రమ్యంగానూ, భయానకంగానూ; సన్నద్ధుండై= యుద్ధమునకు సంసిద్ధుడై; కదలి; శుభసూచకంబులు గైకొనుచున్= శుభ శకునములు స్వీకరిస్తూ; నడచెన్= గమనం సాగించాడు; అట్టి సమయంబునన్; ఎల్లవారి పరిచారకులును= రాజులందరి సేవకులును; శకట+ఆది= బండ్లు మొదలైన; సకల సాధనంబులును= సమస్త పరికరాలున్నూ; పటగృహంబులు= గుడారాలు-డేరాలు; మొదలుగాన్= మున్నగు; వలయు= కావలసిన; సమస్త వస్తువులు; ఒడగూర్చి= ప్రోగుచేసి; వెడలిన దండు= బయలుదేరిన సైన్యం; పఱపు+ఐ= విశాలమై - దట్టమై; సముద్రంబు; కాఁపు+పోవు చందంబు+అయ్యెన్= నివసించడానికి వెళుతున్నట్లయింది; ఇట్లు+అరిగి; ధర్మపుత్త్రుండు; కురుక్షేత్రంబు; తఱియన్+చొచ్చి= సమీపించి; ఋషి+ఆశ్రమంబులకున్= మునుల ఆశ్రమాలకూ; దేవతా+ ఆయతనంబులకున్= దేవాలయాలకూ; అలజడి+కాకుండన్= బాధ కలుగకుండా; పరిహారంబు చేయుచున్= విడిచిపెట్టి; చని= వెళ్ళి; తృణ కాష్ఠ జలసమృద్ధంబు+ఐ= పశువులకు గడ్డి, వంటచేసికొనటానికి కట్టెలు, త్రాగటానికి నీరు అనునవి కలిగినదై; తగియుండు= తగినట్టి; సమస్థలంబునన్= గుంటమిట్టలు లేక చదునైన ప్రదేశంలో; హిరణ్వతి+అను; పుణ్యనది పొంతన్= పావనమైన నదీతీరంలో; విడిదలకాన్= దండు విడిసే చోటుగా; నిరూపించి= నిర్ణయించి; అచ్చోన్+నిలిచెన్= అక్కడ ఆగాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిదప.

తాత్పర్యం: ధర్మరాజు రమణీయ భయానకంగా యుద్ధ సన్నద్ధుడైనాడు. శుభ శకునాలను గైకొంటూ నడచాడు. ఆ సమయంలో ఆయా రాజుల సేవకులు బండ్లు మొదలైన ప్రయాణ సాధనాలు, డేరాలు మొదలైన కావలసిన సకల వస్తువులూ సమకూర్చుకొని బయలుదేరారు. అట్లా కదలిపోతున్న విశాలమైన ఆ దండు సముద్రమే కాపురం పెట్టటానికి కురుక్షేత్రానికి తరలిపోతున్నదా అన్నట్లుంది. ఇట్లా వెళ్ళి ధర్మపుత్త్రుడు కురుక్షేత్రాన్ని సమీపించాడు. మునీశ్వరుల ఆశ్రమాలకూ, దేవాలయాలకూ ఎట్టి అలజడి కలుగకుండా వాటికి దూరంగా దండు నడిచింది. అట్లా యుధిష్ఠిరు డరిగి గడ్డి వంటచెరకు జలం సమృద్ధిగా లభించే చదునైన ఒక ప్రదేశంలో హిరణ్వతి అనే పేరుగల ఒక పవిత్ర నది ఒడ్డున ఆగాడు. అది దండు విడియడానికి తగిన చోటుగా నిర్ధారణ చేశాడు.

తే. విడియుటకు సూచకంబుగ విష్ణుఁ డొత్తెఁ । బాంచజన్యంబు; ధర్మజపార్థులాది
గాఁగఁ దమతమ వీరశంఖంబు లెల్ల । దొరలు నొత్తిరి దివి మ్రోఁతఁ దూఁటుగట్ట. 131

ప్రతిపదార్థం: విడియుటకున్= దండు దిగుటకు; సూచకంబుగన్= గుర్తుగా; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబున్+ఒత్తెన్; ధర్మజ పార్థులు+ఆది గాఁగన్= ధర్మపుత్రుడు అర్జునుడు మున్నుగా; ఎల్ల దొరలున్= రాజులందరూ; దివి= ఆకాశం; మ్రోఁతన్= ధ్వనిచేత; తూఁటు+కట్టన్= చిల్లిపడగా; తమ తమ వీరశంఖంబులు+ఒత్తిరి= పౌరుషం ప్రకటించే తమ తమ శంఖాలను ఊదారు.

తాత్పర్యం: హిరణ్వతీ నదీతీరాన దండు దిగుటకు గుర్తుగా శ్రీ మహావిష్ణువు పాంచజన్యమనే తన శంఖాన్ని పూరించాడు. ధర్మజుడు అనంతవిజయమనే శంఖాన్నీ, అర్జునుడు దేవదత్తాన్నీ, భీముడు పౌండ్రమనే శంఖాన్నీ, నకులుడు సుఘోషాన్నీ, సహదేవుడు మణిపుష్పకాన్నీ పూరించగా యుద్ధం చేయవచ్చిన ప్రభువులందరూ మగటిమి చాటే తమ తమ వీరశంఖాలను ఊదారు.

విశేషం: ఇక్కడ ఇంచుక వివరణ:

"తత శ్శ్వేతై ర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ,
మాధవః పాండవ శ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః,
పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః,
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః.
అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః,
నకుల స్సహదేవ శ్చ సుఘోష మణిపుష్పకౌ॥,
కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః,
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః.
ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే,
సౌభద్రశ్చ మహా బాహుః శంఖాన్ దధ్ముః పృథక్పృథక్."

అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అంటాడు.

'అప్పుడు కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తంబులును, భీమసేనుండు పౌండ్రంబును, యుధిష్ఠిరుం డనంతవిజయంబును, నకుల సహదేవులు సుఘోష మణిపుష్పకంబులును, పాంచాల విరాట సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ దండనాయకులు దమతమ శంఖంబులుఁ బూరించి''రని తిక్కనగారి అనువాదం. భీష్మపర్వం - ప్రథమాశ్వాసం 176. శ్రీకృష్ణార్జునుల శంఖనామములు ప్రసిద్ధాలు. ధర్మజ భీమ నకుల సహదేవుల శంఖముల పేర్లు వరుసగా అనంత, విజయ, పౌండ్ర, సుఘోష, మణిపుష్పకములని వ్యాసులవారు పేర్కొన్నారు.

వ. తదనంతరంబ యొక్క రమ్యప్రదేశంబున రాజమందిరంబును నుచిత స్థానంబుల సమస్తజన నివాసంబులునై రమణీయబంధురంబును సింధురాశ్వశాలా మాలికా మనోహరంబునుంగా వీడెల్ల విడిసె; వీటి చుట్టునుం దిరిగి ధృష్టద్యుమ్నుండు సురక్షితంబు చేసివచ్చె; రాజును దొరలును దమ్ములును సకల పరివారంబును దగిన తెఱంగున నుండిరి. నానావస్తు బహుళ సంభారంబుల మహోదారం బగుచుఁ బాండవ స్కంధావారంబు మహనీయాకారంబున నొప్పె; నంత నక్కడ. 132

ప్రతిపదార్థం: తద్+అనంతరంబ= ఆ పిదప; ఒక రమ్య ప్రదేశంబునన్= ఒక మనోహరమైన చోట; రాజమందిరంబును= రాజభవనమును; ఉచిత స్థానంబులన్= తగిన తావులలో; సమస్త జన నివాసంబులును+ఐ= జనులందరికీ నివాస గృహాలు కలిగి; రమణీయ బంధురంబును= మనోహరము, ఒప్పినవియునై; సింధుర+అశ్వశాలా మాలికా మనోహరంబునున్+కాన్= ఏనుగుల, గుఱ్ఱాల సాలల యొక్క వరుసలచే ఇంపు గొల్పునది కాగా; వీడు+ఎల్లన్+విడిసెన్= సైన్యమంతయూ బస చేసింది; ధృష్టద్యుమ్నుండు; వీటి చుట్టునున్= సైన్యం విడిసిన చోటు చుట్టూ; తిరిగి= ప్రదక్షిణించి; సురక్షితంబు చేసివచ్చెన్= మిక్కిలి రక్షింపబడినట్టిదిగా చేసి వచ్చాడు; రాజును= ధర్మజుడును; దొరలును= ప్రభువులును; తమ్ములును= భీమాదులు; సకల పరివారంబును= సమస్త పరిజనమున్నూ; తగిన తెఱంగునన్+ఉండిరి= ఉచిత విధంగా ఉన్నారు; నానావస్తు బహుళ సంభారంబులన్= పలు తెఱగులైన వస్తువులు, అధికమైన పదార్థ సంచయం అనే వాటిచే; మహా+ఉదారంబు+అగుచున్= మిక్కిలి దొడ్డదై; పాండవస్కంధావారంబు= పాండవుల యొక్క దండు విడిసిన చోటు; మహనీయ+ఆకారంబునన్= గొప్ప స్వరూపంతో; ఒప్పెన్; అంతన్; అక్కడన్.

తాత్పర్యం: ఒక అందమైన ప్రదేశంలో రాజగృహం, తగిన తావులందు సకల జన నివాసాలూ, గజశాలలూ, అశ్వశాలలూ చూడటానికి సొగసుగా ఉండగా దండు దిగింది. ధృష్టద్యుమ్నుడు పాండవ స్కంధావారం చుట్టూ తిరిగి దానిని సురక్షితం కావించి వచ్చాడు. ధర్మజుడు, అతని తమ్ములు, ప్రభువులు, సమస్త పరిజనులు అర్హ విధాల ఆయా తావులలో ఉన్నారు. నానావస్తుసామగ్రులతో మిక్కిలి దొడ్డదైన ఆ పాండవ స్కంధావారం సమున్నతాకారంతో భాసిల్లింది. ఇక హస్తినాపురంలో.

క. **చారులచే నంతయు విని । కౌరవపతి విననియట్ల కర్ణాదులతోఁ**
బేరోలగమున విగత వి । కారుండై యిట్టు లనియె గర్వ మెలర్పన్. **133**

ప్రతిపదార్థం: కౌరవపతి= కౌరవులకు నాయకుడైన దుర్యోధనుడు; చారులచేన్= వేగులవారిచేత; అంతయున్ విని= పాండవులు దండు విడిసినారని తెలిసి; వినని+అట్ల= తనకేమీ ఆ విషయం తెలియని చందంగా; కర్ణ+ఆదులతోన్= రాధేయుడు మున్నగు వారితో; పేరు+ఓలగమునన్= పెద్దసభలో; విగత వికారుండు+ఐ= మారుపాటు లేనివాడై; గర్వము+ఎలర్పన్= అహంకారం అతిశయించగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: వేగులవారి వలన పాండవులు దండు విడిసినారని విని, తానేమీ విననివాడి మాదిరి దుర్యోధనుడు తన ఆకార స్వభావాలందు ఏమార్పు లేనివాడై పెద్ద సభలో రాధేయుడు మొదలైనవారితో అహంకార మతిశయించగా ఇట్లా అన్నాడు:

క. **'తన వచ్చిన కార్యము మన । మనుకూలతఁ జేయకున్న హరి యలుకమెయిన్**
జని యప్పాండు తనూజులు । మనములఁ గినుకూనునట్టి మాటలు సెప్పున్. **134**

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; తన వచ్చిన కార్యమున్= తాను చనుదెంచిన పనిని; మనము; అనుకూలతన్= తన సంకల్పానికి అనుగుణంగా; చేయక+ఉన్నన్= చేసినవాళ్ళం కానందున; అలుక మెయిన్= కోపంతో; చని= వెళ్ళి; ఆ+పాండుతనూజులు= ఆ పాండు కుమారులు; మనములన్= తమ చిత్తములందు; కినుక= కోపం; ఊను+అట్టి మాటలు= పొందునట్టి పలుకులు; చెప్పున్= వారికి చెపుతాడు.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు తాను వచ్చిన పనిని మనం అనుకూలంగా నెరవేర్చనందువలన మన మీద కోపంతో వెళ్ళి, పాండవులకు క్రోధం కలిగించే మాటలు చెప్పుతాడు.

చ. **మును మనచేత భంగపడి ముచ్చిరి యుండుటఁ జేసి పాండునం**
దనులును నెత్తివత్తు రుచితంబుగ; సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చిన బహుసైన్యముల్ బయలఁ జేరఁ దగన్ విడియింత; మెల్లి దం
డని పురిఁ జాటఁ బంచి దొరలందఱకున్ బడిసేయుఁ డేడ్తెఱన్. **135**

ప్రతిపదార్థం: మును= పూర్వం; మనచేతన్= మనవలన; భంగపడి= అవమానించబడి; ముచ్చిరి+ఉండుటన్+చేసి= పరితపిస్తున్నందువలన; పాండునందనులును= పాండుపుత్రులు కూడ; ఉచితంబుగన్= తగిన విధంగా; ఎత్తివత్తురు= యుద్ధం చెయ్యటానికి వస్తారు; సంగరము= యుద్ధం; ఎట్లున్+కల్గున్= ఏ విధంగానైనా జరిగి తీరుతుంది; పేర్చిన= అతిశయించిన; బహుసైన్యముల్= పెక్కు సేనలు; బయలన్+చేరన్= బయలునకు చేరగా; తగన్= చక్కగా; విడియింతము= దిగేటట్లు చేద్దాము; ఎల్లి= రేపు; దండు+అని= దండయాత్ర అని; పురిన్= పట్టణంలో; చాటన్+పంచి= చాటించి; దొరలు+అందఱకున్= రాజులందరికీ; ఏడ్తెఱన్= శీఘ్రంగా; పడి చేయుఁడు= ఆజ్ఞలివ్వండి.

తాత్పర్యం: పూర్వం మనచేత అవమానించబడి పరితపిస్తున్న వారు కనుక పాండవులు తగిన విధంగా యుద్ధం చెయ్యటానికి తరలివస్తారు. సమరం జరగక మానదు. ఏపుమీరిన మన సేనలు విశాలమైన బయలుకు చేరుకొనగానే అక్కడ దిగేటట్లు చేద్దాము. రేపే దండయాత్ర అని నగరంలో చాటించండి. రాజు లందరికీ శీఘ్రమే ఆజ్ఞలివ్వండి.

వ. **మనకు విడిదల కురుక్షేత్రం'బని పలికి దుశ్శాసనుం జూచి, నీవును గర్ణుండును గాంధారపతియును సమస్తంబును సమకట్టుం' డనుటయు వారలు ప్రియంబునం బనిపూని వెడలి దండు సాటించి, తగు వారలకెల్ల నెఱింగించి పుచ్చిన, సకల పరివారంబును బ్రమోదంబు నొందె; భూవల్లభుండును గొలిచియున్నవారలం బోవంబంచి, వలయు నెడకుం జని తగిన వర్తనంబున నుండె; నట్టి సమయంబునఁ బ్రయాణోచితంబులగు బహుప్రకార వ్యాపారంబులయందుఁ దత్పరులయిన దొరల నానాచేష్టితంబులను, గరితురగ రథంబులకు సవరణలు సమకూర్చు చతుర పరిచారకుల సంభ్రమంబునను, వివిధాయుధంబులు రవణంబులుగా నాయితంబులు సేయఁ బ్రవర్తించు పదాతి వర్గంబుల సంరంభంబునను నయ్యైసరకులు పయనంబున కనువు సేయ బలుమానుసుల తిరుగుడు వడుటనుం బురంబు సమరోత్సాహ చంద్రోదయంబునకు మహార్ణవంబై ఘూర్ణిల్లుచుండె; నపరదిన ముఖంబున.** **136**

ప్రతిపదార్థం: మనకున్; విడిదల= విడియు చోటు; కురుక్షేత్రంబు; అని; పలికి దుశ్శాసనున్ చూచి నీవును; కర్ణుండును; గాంధార పతియున్= శకునియు; సమస్తంబును సమకట్టుండు= అన్ని ఏర్పాట్లు చెయ్యండి; అనుటయున్= అని చెప్పగా; వారలు; ప్రియంబునన్= సంతోషంతో; పనిపూని; వెడలి; దండు చాటించి= యుద్ధయాత్రను పట్టణంలో చాటించి; తగువారలకున్+ఎల్లన్= తగిన వారికందరికీ; ఎఱింగించి= తెలిపి; పుచ్చినన్= పంపగా; సకల పరివారంబును= బలగ మంతయున్నూ; ప్రమోదంబున్+ఒందెన్= సంతోషించింది; భూవల్లభుండును= దుర్యోధనుడు; కొలిచి+ఉన్న వారలన్= తనను సేవిస్తున్నవారిని; పోవన్+పనిచి= వెళ్ళండని చెప్పి; వలయు+ఎడకున్+చని= ఇష్టప్రదేశానికి వెళ్ళి; తగిన వర్తనంబునన్+ ఉండెన్= తన పనిలో తానున్నాడు; అట్టి సమయంబునన్; ప్రయాణ+ఉచితంబులగు= పయనమునకు తగినట్టి; బహుప్రకార

వ్యాపారంబులయందున్= అనేక విధాలైన పనిపాటులలో; తత్పరులు+ఐన= శ్రద్ధగలవారైన; దొరల= రాజుల యొక్క; నానా చేష్టితంబులను= పలు తెరగులైన పనులచేతను; కరి తురగ రథంబులకున్= ఏనుగులకు, గుర్రాలకు, రథాలకు; సవరణలు సమకూర్చు= అలంకారాలు సల్పు; చతుర పరిచారకుల= నేర్పుగల భృత్యులయొక్క; సంభ్రమంబునను= వేగిరపాటు చేతను; వివిధ+ఆయుధంబులు= రకరకాలైన ఆయుధాలు; రవణంబులుగాన్= ఆభరణాలుగా; ఆయితంబులు+చేయన్= సిద్ధపరచుటకు; ప్రవర్తించు= తిరుగుతున్న; పదాతివర్గంబుల= కాలిబంటుల యొక్క (నడజోదులయొక్క); సంరంభంబునను= సన్నాహం చేతనూ; అయ్యై సరకులు= ఆయాపదార్థాలు; పయనంబునకున్= యుద్ధయాత్రకు; అనువు చేయు= సిద్ధం గావించే; బలుమానుసుల= బలిష్ఠులైనవారి యొక్క; తిరుగుడు+పడుటనున్= తిరుగుచుండటం చేతను; పురంబు= హస్తినాపురి; సమర+ఉత్సాహ చంద్ర+ఉదయంబునకున్= యుద్ధ ప్రయత్నమనెడు చంద్రోదయానికి; మహా+అర్ణవంబు+ఐ= గొప్ప సముద్రమై; ఘూర్ణిల్లుచున్+ఉండెన్= మ్రోగుతుండింది; అపరదిన ముఖంబునన్= మరునాటి ప్రభాత సమయంలో-

తాత్పర్యం: మనము విడియవలసిన చోటు కురుక్షేత్ర'మని పలికి దుర్యోధనుడు దుశ్శాసనుడిని చూచి, 'నీవూ కర్ణుడూ, శకునీ అన్ని పనులు చూడండి' అని చెప్పగా వారు మహాసంతోషంతో కార్యోన్ముఖులై వెళ్ళారు. నగరంలో దండయాత్ర చాటించారు. తగిన వారందరికీ యుద్ధయాత్రను గురించి తెల్పటానికి సేవకులను నియోగించారు. దుర్యోధనుని పరివారమంతా సంతోషం పొందింది. రాజరాజు తనను కొలిచిఉన్న వారిని వెళ్ళండని పలికి వారికి సెలవొసంగి తనపాటికి తాను తగిన వర్తనంతో ఉండిపోయాడు. ఆ సమయాన ప్రయాణానికి అనుకూలమైన పలు విధాలైన పనులలో మునిగిన రాజుల చేష్టితాలూ, ఏనుగులను, గుర్రాలను, రథాలను అలంకరించే నేర్పుగల పరిచారకుల సందడీ, పలురకాలైన ఆయుధాలు అనే సొమ్ములను సంసిద్ధపరచడానికి తిరుగుతున్న కాలిబంటుల యొక్క సంరంభం, ప్రయాణానికి తగిన వస్తుసామగ్రిని సమకూరుస్తున్న బలిష్ఠులైన మనుషుల తిరుగుళ్ళూ కలిగి హస్తినాపురం యుద్ధోత్సాహమనే చంద్రోదయ వేళ ఆటుపోటుల్లో ఉన్న మహాసముద్రంవలె ఉన్నది. అంత మరునాటి ప్రభాతసమయంలో-

విశేషం: సమరోత్సాహ చంద్రోదయంబునకుఁబురంబు మహార్ణవంబై - అలంకారం రూపకం.

క. త్వరితగతి సమయ సముచిత । కరణీయము లాచరించి కమనీయాలం
కరణోజ్జ్వలుఁడై యెలమిం । గురురా జేతెంచెఁ గొలువు కూటంబునకున్. 137

ప్రతిపదార్థం: త్వరితగతిన్= శీఘ్రంగా; సమయ సముచిత= ఆ వేళకు తగిన; కరణీయములు= చేయవలసిన పనులు; ఆచరించి= చేసి; కమనీయ+అలంకరణ+ఉజ్జ్వలుఁడు+ఐ= మనోహరమైన అలంకారాల చేత మిక్కిలి ప్రకాశిస్తున్నవాడై; ఎలమిన్= సంతోషంతో; కురురాజు= కౌరవపతి సుయోధనుడు; కొలువుకూటంబునకున్= సభామందిరానికి; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మరునాటి ప్రభాత సమయంలో తొందరగా తత్కాలోచితాలైన కృత్యాలు నిర్వర్తించి మనోజ్ఞాలైన అలంకారాలతో ప్రకాశిస్తూ కొలువుకూటానికి కురురాజైన సుయోధనుడు సంతోషంతో వచ్చాడు.

వ. వచ్చి దుశ్శాసన ప్రముఖ నిఖిలసహోదర పరివృతుండై యుండి. 138

ప్రతిపదార్థం: వచ్చి; దుశ్శాసన ప్రముఖ= దుశ్శాసనుడు మొదలైన; నిఖిల సహోదర= సమస్త సోదరులతో; పరివృతుండు+ ఐ+ఉండి= చుట్టబడినవాడై ఆసనమునందు అధివసించి.

తాత్పర్యం: వచ్చి, దుశ్శాసనుడు మొదలైన అనుజవర్గంచేత చుట్టబడినవాడై ఉండి రాజరాజు.

దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట (సం. 5-152-27)

సీ. అరిభయంకరుఁడు ద్రోణాచార్యుఁడును, రణో । త్సాహ లంపటుఁడు రాధాసుతుండు,
శరతత్త్వవేది యశ్వత్థామయును, భూరి । బాహా విలాసుండు బాహ్లికుండు,
శౌర్య వైభవశాలి శల్యుండు, ధైర్యసం । పన్నిధి కృపుఁడును, బ్రకటశక్తి
సార దుర్జయమూర్తి భూరిశ్రవుండును, । దర్పోజ్జ్వలుండు గాంధారపతియు,

తే. నుగ్రతేజుండు గృతవర్మయును, బ్రతాప । ఘనుఁడు కాంభోజుఁడును, బరాక్రమధనుండు
సింధురాజును బతులుగాఁ జేయఁగోరి । కొనఁగఁ దగువార లగుదు రక్షోహిణులకు.' 139

ప్రతిపదార్థం: అరిభయంకరుఁడు= శత్రువులకు భయం గలిగించునట్టి; ద్రోణ+ఆచార్యుఁడును= గురువైన ద్రోణుఁడును; రణ+ఉత్సాహలంపటుఁడు= యుద్ధంచేయటంలో మిక్కిలి ఆశ గల్గిన; రాధాసుతుండు= రాధ కొడుకు కర్ణుడును; శరతత్త్వవేది= బాణాల యొక్క స్వరూప స్వభావాలెరిగిన; అశ్వత్థామయును= గురుపుత్త్రు డశ్వత్థామయూ; భూరిబాహావిలాసుండు= గొప్ప భుజసౌందర్యంగల (అనగా అధిక భుజశక్తి గలిగిన); బాహ్లికుండు= శంతను మహారాజు తమ్ముడైన బాహ్లికుడును; శౌర్యవైభవశాలి= పరాక్రమ విభవము గల్గినట్టి; శల్యుండున్= మద్రరాజు శల్యుడును; ధైర్యసంపద్+నిధి= ధైర్యసంపదకు నిలయమైన; కృపుఁడును= కృపాచార్యులున్నూ; ప్రకట శక్తిసార దుర్జయమూర్తి= ప్రఖ్యాతమైన బలవిక్రమముల చేత జయించరాని స్వరూపంగల; భూరిశ్రవుండును= భూరిశ్రవుడనేవాడును; దర్ప+ఉజ్జ్వలుండు= గర్వరేఖచేత వెలుగునట్టి; గాంధార పతియున్= శకునియూ; ఉగ్రతేజుండు= భయంకర ప్రతాపంగల (రుద్రుని ప్రతాపం వంటి ప్రతాపం గలిగినవాడని భావం); కృతవర్మయును= (భోజకులాగ్రణి) కృతవర్మయున్నూ; ప్రతాపఘనుఁడు= విక్రమంచేత గొప్పవాడైన; కాంభోజుఁడును= కాంభోజ దేశరాజున్నూ; పరాక్రమధనుఁడు= శౌర్యమే ధనంగా కలిగిన; సింధురాజును= సింధుదేశాధిపతి సైంధవుడున్నూ; అక్షోహిణులకున్= పదకొండు అక్షౌహిణుల సేనలకు; పతులుగాన్+చేయన్= నాయకులుగా చేయటానికి; కోరికొనఁగన్+తగువారలు+అగుదురు= వరించటానికి అర్హులైనవారవుతారు.

తాత్పర్యం: శత్రుభయంకరుడైన ద్రోణాచార్యులు, యుద్ధోత్సాహశీలిఅయిన రాధేయుడు, బాణ స్వరూప స్వభావాలెరిగిన అశ్వత్థామ; అధిక భుజశక్తి గలిగిన బాహ్లికుడు, పరాక్రమ వైభవోపేతుడు శల్యుడు, ధైర్య సంపదకు నిలయమైన కృపాచార్యుడు, విఖ్యాత వీర్యంచేత జయించరానట్టి భూరిశ్రవుడు, దర్పంచేత దీపించే శకుని, దారుణ ప్రతాపశాలి కృతవర్మ, విక్రమాఢ్యుడు కాంభోజరాజు, శౌర్యధన సంపన్నుడు సైంధవుడు మన పదకొండక్షోహిణులకు నాయకులుగా కోరదగినవారు.

చ. అని మది నిశ్చయించి తగ నందఱఁ బిల్వఁగఁ బంచి వారితో
నని పని మాటలాడి వినయంబునఁ బ్రార్థన చేసి 'మీర లీ
యొనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొ
చ్చిన సకలంబు నొప్పు నభిషేకముఁ గైకొనుఁ డుత్సవంబునన్. 140

ప్రతిపదార్థం: అని; మదిన్= తన మనస్సులో; నిశ్చయించి= నిర్ధారించుకొని; తగన్= ఒప్పుగా; అందఱన్= వీరినందరినీ; పిల్వఁగన్+పంచి= పిలువనంపి; వారితోన్= ఆ వచ్చిన ద్రోణ ప్రముఖులతో; అని పని మాటలు+ఆడి= యుద్ధ సంబంధి

విషయాలను చర్చించి; వినయంబునన్= అడకువతో; ప్రార్థన చేసి= వేడికొని; మీరలు= మీరు; ఈ+ఒనరిన సైన్యముల్= కూడిన ఈ సేనలు; పదునొకొంటికిన్= పదకొండక్షౌహిణులకు; ప్రాభవము+ఆచరింపన్+చొచ్చినన్= ఆధిపత్యం చేయటానికి పూనుకొంటే; సకలంబున్+ఒప్పున్= అంతా సవ్యంగా జరుగుతుంది; ఉత్సవంబునన్= వైభవంగా; అభిషేకము+కైకొనుఁడు= అభిషిక్తులు కండి.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ ప్రకారంగా తన మనసులో నిర్ణయం చేసికొని చక్కగా వారి నందరినీ సభకు రప్పించి వారితో యుద్ధ విషయాలు ముచ్చటించి, అణకువతో వారినందరినీ స్తుతి చేసి, 'కూడిన ఈ పదకొండక్షోహిణుల సేనలకు మీరు ఆధిపత్యం వహించటానికి పూనుకొంటే అంతా సవ్యంగా జరిగి పోతుంది. వైభవంగా సేనాపతిత్వానికి అభిషిక్తులు కండి.'

క. అనవుడు నందఱు నౌఁగా । కని సంతసమంద నధిపుఁ డభిషేకించెన్
జనులెల్ల సంప్రమోదం । బునఁ బొందఁగ నప్పు డతివిభూతి దలిర్పన్. 141

ప్రతిపదార్థం: అనవుడున్= అని సుయోధనుడు వేడగా; అందఱున్= వారంతా; ఔన్+కాక+అని= అట్లేఅని; సంతసము+ అందన్= హర్షించగా; అధిపుఁడు= ప్రభువైన దుర్యోధనుడు; జనులు+ఎల్లన్= జనులందరూ; సంప్రమోదంబునన్+పొందగన్= మిక్కిలి సంతోషం చెందగా; అప్పుడు= ఆ సమయాన; అతి విభూతి= మిక్కిలి వైభవం; తలిర్పన్= ఒప్పగా; అభిషేకించెన్= అభిషిక్తులను చేశాడు.

తాత్పర్యం: సుయోధనుడి మాటలకు వారందరూ సంతోషంగా అంగీకరించారు. జనులంతా పరమానందభరితులుకాగా అపుడు దుర్యోధనుడు ఆ రాజులను మిక్కిలి వైభవంతో అక్షౌహిణీపతులుగా అభిషిక్తులను చేశాడు.

వ. ఇట్లు మహామహిమ వెలయ నక్షోహిణీ నాయకుల సమకట్టి రారాజు పితామహుపాలికి వారిం దోడ్కొని చని సవినయంబుగా నతనికిఁ బ్రణామంబుసేసి, వారలం జూపి 'వీరల మన యక్షోహిణులు పదునొకొంటికిం బతులఁ గావించితి; నిన్నిసైన్యంబులు నొక్కలావున వర్తించు చందంబు సూచికొనవలయు' నని చెప్పుచుఁ జేతులు మొగిచి యిట్లనియె. 142

ప్రతిపదార్థం: ఇట్లు, మహామహిమ వెలయన్= మిక్కిలి ప్రాభవమొప్పగా; అక్షోహిణీ నాయకులన్; సమకట్టి= కూర్చుకొని; రారాజు= రాజులకు రాజైన సుయోధనుడు; పితామహుపాలికిన్= భీష్ముడి చెంతకు; వారిన్= వారలను; తోడ్కొనిచని= వెంటబెట్టుకొని వెళ్ళి; సవినయంబుగాన్= విధేయతతో; అతనికిన్; ప్రణామంబు చేసి= వందన మాచరించి; వారలన్ చూపి= ద్రోణాదులను కనబరిచి; వీరలన్= వీరిని; మన అక్షోహిణులు పదునొకొంటికిన్ పతులన్ కావించితిన్; ఇన్ని సైన్యంబులు; ఒక్క లావునన్= ఒక్క శక్తితో; వర్తించు చందంబు= మెలగు విధానం; చూచికొనవలయున్; అని చెప్పుచున్; చేతులు మొగిచి= హస్తాలు జోడించి; ఇట్లు+అనియెన్-

తాత్పర్యం: ఈ రీతిగా మహావైభవం మెరయగా అక్షౌహిణీ నాయకులను కూర్చుకొని రాజరాజు భీష్ముడి చెంతకు వారిని వెంటబెట్టుకొనివెళ్ళాడు. అణకువతో నమస్కరించాడు. వారినందరినీ కనబరిచి- 'వీరిని మన పదకొండు అక్షోహిణులకు అధిపతులను చేశాను. ఇన్ని సేనలు ఏకముఖంగా మెలగే మార్గం చూడవలసి ఉన్నది' అని చెప్తుతూ హస్తాలు ముకుళించి ఇట్లా అన్నాడు:

చ. ‘నెఱిఁబడి యాజి నీ మొనలు నేరవు కూడి తగం జరింప నిం
దఱి మన సొక్కఁడై చనక తప్పుఁగదా బహుదేశవాసు లం
దఱొకటి సేయుచో వెరవు దప్పక చెల్లుట యెట్లు గల్గు? ని
త్తెఱఁగొక చాలు వాని బలుతీర్పునఁ గాక పొసంగ నేర్చునే? 143

ప్రతిపదార్థం: ఈ+మొనలు= ఈ సేనలు; నెఱిన్+పడి= కుదురుపడి; కూడి= కలసి; తగన్= ఒప్పుగా; ఆజిన్= యుద్ధమందు; చరింపన్+నేరవు= మెలగజాలవు; ఇందఱ మనసు= ఈ జోదులందరి చిత్తం; ఒక్కఁడు+ఐ చనక= ఒకటిఅయి వర్తింపకుంటే; తప్పున్+కదా!= కార్యం చెడును గదా!; అందఱున్= వీరెల్లరు; బహుదేశవాసులు= అనేక దేశాలలో నివసిస్తున్నవారు; ఒకటి చేయుచోన్= ఒక పనిని చేస్తున్నప్పుడు; వెరవు= నేర్పు; తప్పక= చెడకుండ; చెల్లుట= సాగటం; ఎట్లు+కల్గున్= ఏరీతిగా సమకూడగలదు?; ఈ తెఱఁగు= ఈ సంవిధానం; ఒక చాలువాని= ఒకానొక సమర్థుడియొక్క; బలుతీర్పునన్+కాక= గొప్ప సవరింతవలనగాని; పొసంగన్+నేర్చున్= కలుగగలదా?; (కలుగదని భావం.)

తాత్పర్యం: ‘పితామహా! మన ఈసేనలన్నీ యుద్ధంలో కుదిరికగా కలసి మెలసి చరించగలవా? ఇందరి మనస్సు ఏకముఖంగా వర్తించకుంటే కార్యం తప్పిపోతుంది గదా! చేరిన యోధులందరూ బహుదేశస్థులు. ఒక పని చేసేటప్పుడు అందరి నేర్పు ఏకోన్ముఖం కావలె. అప్పుడే కార్యం సఫలం కాగలదు. లోటుపాటులు సరిదిద్దగల ఒక సమర్థుడి ఆధిపత్యం సేనలకు లభించినపుడే సంకల్పించిన పని సానుకూల మవుతుంది.

ఆ. అమరసేనలును దమంతన వర్తింప। నేర కునికి నా కుమారు మొగము
గానొనర్ప వలసెఁగాదె! సమస్తసే। నలను నీవ యరసి నడపవలయు. 144

ప్రతిపదార్థం: అమర సేనలును= దేవతల సైన్యాలు కూడ; తమంతన= తమకు తామే; వర్తింపన్+నేరక+ఉనికిన్= ప్రవర్తింప జాలకుండటంచేత; ఆ కుమారున్= ఆ కుమారస్వామిని; మొగముగాన్+ఒనర్పన్+వలసెన్+కాదె!= సేనాగ్రమున నిలుపవలసి వచ్చింది కదా!; (కనుక;) సమస్త సేనలను= మన సైన్యాలన్నింటినీ; నీవు+అ= నీవే; అరసి= పరామర్శిస్తూ; నడపన్+వలయున్= నడిపించాలి.

తాత్పర్యం: దేవతాసేనలు కూడ తమకు తామే వ్యవహరించ లేవు కనుక కుమారస్వామిని సైన్యాధిపతిని చేయవలసి వచ్చింది. కావున నా సైన్యాలన్నింటికీ నీవే నాథుడవై నడిపించాలి.

క. తారలకుం జంద్రునిగతిఁ। గౌరవులకు మేటి వీవ; కావున నీవీ
భారంబు పూని మముఁ గడ। చేరుపఁదగు నెమ్మెయిం బ్రసిద్ధచరిత్రా! 145

ప్రతిపదార్థం: ప్రసిద్ధచరిత్రా!= ప్రఖ్యాతమైన నడవడిగల పితామహా!; తారలకున్= చుక్కలకు; చంద్రునిగతిన్= సోముడివలె; కౌరవులకున్= కురుకుమారులకు; ఈవు+అ= నీవే; మేటివి= అధికుడవు; కావునన్= కాబట్టి; నీవు; ఈ భారంబు పూని= ఈ యుద్ధభారాన్ని వహించి; మమున్= మమ్ము; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; కడచేరుపన్= ఒడ్డుకు చేర్చటానికి; తగున్= యుక్తం.

తాత్పర్యం: పితామహా! నీవు సుప్రసిద్ధ చరిత్రుడవు. చుక్కలకు జాబిల్లివలె కౌరవులందరికీ నీవే శరణ్యుడివి. కనుక ఈ రణభారం వహించి ఎట్లాగైనా మమ్ము ఒడ్డుకు చేర్చు.

విశేషం: అలం: ఉపమ.

తే. **సర్వసేనాధిపత్యంబు నిర్వహింప । నీవు దక్క నిం దొక్కరు నీవ యరసి**
చెప్పుమా కలఁడేని; రక్షింపు మమ్ముఁ, । బూని పట్టంబుఁ దాల్పుము, పొడిచి గెలుము.' **146**

ప్రతిపదార్థం: సర్వసేనా+ఆధిపత్యంబు= సమస్త సేనలయొక్క నాయకత్వాన్ని; నిర్వహింపన్= నెరవేర్చటానికి; నీవు తక్కన్= నీవు కాక; ఇందున్= మన పక్షంలో; ఒక్కరున్= ఒకడిని; నీవు+అ= నీవే; అరసి= పరికించి; కలఁడు+ఏనిన్= ఉంటే; చెప్పుమా?= వచింపుము; మమ్మున్= మమ్ము; పూని= పూనిక వహించి; రక్షింపు(ము)= కాపాడుము; పట్టంబు+తాల్పుము= సర్వసైన్యాధ్యక్ష పదవి పరిగ్రహించుము; పొడిచి గెలుము= రణమొనర్చి విజయం సాధించు.

తాత్పర్యం: పితామహా! సర్వసైన్యాధిపత్యం నిర్వహించుటకు నీవు దప్ప ఇక్కడ మరెవ్వరూ లేరు. ఉంటే నీవే చెప్పు. పూనికతో మమ్ము కాపాడు. యుద్ధంచేసి విజయం సాధించుము.'

వ. **అనిన విని గాంగేయుండు గాంధారేయున కిట్లనియె :** **147**

ప్రతిపదార్థం: అనినన్ విని; గాంగేయుండు= భీష్ముడు; గాంధారేయునకున్= గాంధారి కొడుకు దుర్యోధనుడితో; ఇట్లు+ అనియెన్-

తాత్పర్యం: ఆ మాటలు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

ఆ. **'మీరుఁ బాండుసుతులు నారయ నా కొక్క । రూప; కార్య మున్నరూపు వలుక**
వలయుఁ; గయ్యమైన వత్తు మీలోన నా । యునికి చందమునకు నుచిత మిదియ. **148**

ప్రతిపదార్థం: ఆరయన్= తలపోయగా; మీరున్= మీరును; పాండుసుతులున్= పాండవులూ; నాకున్= నాకు; ఒక్క రూప= సమానులే; కార్యము= పనియొక్క; ఉన్నరూపు= ఉన్నట్టి చందము; పలుకన్ వలయున్= చెప్పవలసి ఉంటుంది; మీలోనన్= మీలోపలనే; నా+ఉనికి+చందమునకున్= నేనున్నందులకు; కయ్యము+ఐనన్= యుద్ధం సంభవిస్తే; వత్తున్= మీ పక్షం వహిస్తాను; ఇది+అ ఉచితము= ఇదే తగింది.

తాత్పర్యం: 'మీరున్నూ పాండుకుమారులున్నూ నాకు సమానులే. కాని ఉన్న విషయం చెప్పవలె. వారితో మీకు యుద్ధమేర్పడినపుడు నేను మీ పక్షం వాడనే. ఏలన, నేను మీ వద్దనే ఉన్నాను. కనుక నా కిదే సముచితం.

క. **సేనాధిపత్యమును దగఁ । బూనెద; నను మార్కొనంగఁ బురుషుల నుర్విం**
గానఁ; గిరీటికి నొక్కని । కే నోర్వ; నతండు శరము లెక్కు డెఱుంగున్. **149**

ప్రతిపదార్థం: సేనా+ఆధిపత్యమును= సేనా నాయకత్వాన్ని; తగన్= ఒప్పిదంగా; పూనెదన్= వహిస్తాను; ననున్= నన్ను; మార్కొనంగన్= ఎదిరించటానికి; పురుషులన్= వీరులను; ఉర్విన్= పుడమిలో; కానన్= చూడను; కిరీటికిన్+ఒక్కనికిన్= ఒక్క అర్జునుడికి; ఏను= నేను; ఓర్వన్= ఎదురు నిలువలేను; అతండు= అర్జునుడు; ఎక్కుడు= నాకంటె అధికంగా; శరములు= బాణాలు; ఎఱుంగున్= తెలిసినవాడు.

తాత్పర్యం: నేను సర్వసేనాధిపత్యం వహిస్తాను. నన్ను ఎదుర్కొనగల పురుషులెవ్వరూ ఈ పుడమిలో లేరు. కాని నేను కిరీటిని మాత్రం ఎదుర్కొనలేను. ఏలన, అతడికి నాకంటె ఎక్కువ బాణాలు తెలుసు.

క. **పెఱవారినెల్లఁ దరమిడి । నఱకుదుఁ; బాండుక్షితీశ నందనులను రూ**
పఱసేయం జేయాడదు; । తఱుమరు నామీఁద నత్యుదగ్రత వారున్. 150

ప్రతిపదార్థం: పెఱవారిన్+ఎల్లన్= ఇతరుల నందరినీ; తరము+ఇడి= వరుసపెట్టి (మునుము బట్టి); నఱకుదున్= ఖండిస్తాను; పాండుక్షితి+ఈశ నందనులను= పాండురాజు కుమారులను; రూపు+అఱచేయన్= నిర్మూలించటానికి; చే+ఆడదు= చేయిరాదు; వారున్= కౌంతేయులుకూడ; అతి+ఉదగ్రతన్= మిక్కిలి భయంకరంగా; నా మీఁదన్= నాపైకి; తఱుమరు= కవియరు.

తాత్పర్యం: ఇతరులందరినీ వరుసపెట్టి నఱికివేస్తానుగాని పాండుకుమారులను సంహరించటానికి నాకు చేతులాడవు. వారు కూడా ఉద్ధతులై నా మీదికి దూకరు.

వ. **అప్పటికిఁ దగిన భంగి యయ్యెడు; నది యట్లుండె' నని పలికి మఱియు నిట్లనియె.** 151

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; తగిన భంగి+అయ్యెడున్= తగినట్లు జరుగుతుంది; అది+అట్లుండెన్= ఆ విషయం అట్లా ఉంచుము; అని పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్-

తాత్పర్యం: ఆ సమయానికి జరుగవలసిందేదో జరుగుతుంది. ఆ సంగతి అట్లా ఉండనీ' అంటూ భీష్ముడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఆ. **'మున్ను కర్ణునొండె నన్నొండెఁ గయ్యంబు । చేయఁ బనుపు; మిట్లు సేయువాఁడ**
వైనఁ గాని సకల సేనాధిపత్యంబుఁ । బూన నేరఁ జుమ్ము భూపవర్య!' 152

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజవరేణ్యా!; మున్ను= ముందుగా; కర్ణున్+ఒండెన్= కర్ణుడినిగాని; నన్నున్+ఒండెన్= నన్నుగాని; కయ్యంబు చేయన్= యుద్ధం చేయటానికి; పనుపుము= పంపుము; ఇట్లు చేయువాఁడవు+ఐనన్+కాని= ఇట్లా నీవు చేయగల్గినపుడే; సకల సేనా+ఆధిపత్యంబు= సర్వసేనలకు నాయకత్వం; పూనన్ నేరన్ చుమ్ము!= వహించుటకు అంగీకరించను సుమా!

తాత్పర్యం: 'రాజవర్యా! ముందు నన్నుగాని, లేదా కర్ణుడినిగాని యుద్ధం చేయటానికి నియోగించుము. ఇట్లా నీవు చేయగలిగితే తప్ప నేను సర్వసేనాధిపత్యం వహించటానికి సమ్మతించను సుమా!'

వ. **అనినం గర్ణుండు కౌరవపతితో నిట్లనియె :** 153

తాత్పర్యం: భీష్ము డట్లనగా కర్ణుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

క. **'ఇప్పుడు క్రొత్తగ దీనిం । జెప్పంగా నేల? మున్న చెప్పితిఁగాదే!**
యెప్పుడు భీష్ముండు పడు నే । నప్పు డనికి వచ్చువాఁడ నని సభలోనన్.' 154

ప్రతిపదార్థం: ఇప్పుడు; క్రొత్తగన్; దీనిన్= ఈ విషయాన్ని; చెప్పంగాన్+ఏల?= చెప్పటెందుకు?; ఎప్పుడు= ఏ వేళ; భీష్ముఁడు పడున్= భీష్ముడు నేలగూలునో; అప్పుడు= ఆ వేళ; నేను; అనికిన్= యుద్ధానికి; వచ్చువాఁడన్+అని= రాగలనని; సభలోనన్= సభలో; మున్ను+అ= మునుపే; చెప్పితిన్+కాదే!= చెప్పానుగదా!

తాత్పర్యం: ఇపు డీవిషయం క్రొత్తగా చెప్పటమెందుకు? ఎపుడు రణరంగంలో భీష్ముడు నేలగూలుతాడో అపుడు నేను యుద్ధం చేయవస్తానని మునుపే సభలో చెప్పాను కదా!

ఆ. అనిన 'నట్ల కాక' యని సర్వసేనాధి । పత్యభార పట్టబంధమునకు
నియ్యకొనియె భీష్ముఁ; డయ్యగ్గలికఁ గొని । యాడె విభుఁడు ప్రముదితాత్ముఁ డగుచు. 155

ప్రతిపదార్థం: అనినన్= అని కర్ణుడు పలుకగా; అట్లకాక+అని= సరేనని; భీష్ముఁడు= గాంగేయుడు; సర్వసేనా+ఆధిపత్యభార= సకలసేనా విభుత్వభారం వహించటం అనెడు; పట్టబంధమునకున్= పట్టం గట్టుకొనుటకు; ఇయ్యకొనియన్= అంగీకరించాడు; విభుఁడు= రాజగు దుర్యోధనుడు; ప్రముదిత+ఆత్ముఁడు+అగుచున్= సంతుష్టచిత్తుడై; ఆ+అగ్గలికన్= భీష్ముడి సమరోత్సాహాన్ని; కొనియాడెన్= మెచ్చాడు.

తాత్పర్యం: అని కర్ణుడు పలుకగా 'అట్లే అగుగాక' అని భీష్ముడు సర్వసేనాధిపతిగా పట్టం కట్టుకొనటానికి అంగీకరించాడు. దుర్యోధనుడు సంతోషించిన మనస్సుకలవాడై ఆతడి యుద్ధోత్సాహాన్ని ప్రస్తుతించాడు.

క. 'భేరీ మృదంగ శంఖ మ । హారవములు సెలఁగఁ జేయుఁ'డని పనిచి, మహో
దార పతాకా ద్యుత్సవ । గౌరవములు నడపె నెల్లకడలం బురిలోన్. 156

ప్రతిపదార్థం: భేరీ మృదంగ శంఖ= ఢంకాలు, మద్దెలలు, శంఖములు అనువాటియొక్క; మహా+ఆరవములు= గొప్పధ్వనులు; చెలఁగన్+చేయుఁడు+అని= వ్యాపించేటట్లు చేయండని; పనిచి= ఆజ్ఞాపించి; మహా+ఉదార పతాకా+ఆది= మిక్కిలి గొప్పటెక్కెములు మున్నగువాటియొక్క; ఉత్సవ గౌరవములు= ఊరేగింపులు; పురిలోన్= నగరంలో; ఎల్లకడలన్= అన్నివైపుల; నడపెన్= జరిపించాడు.

తాత్పర్యం: ఢంకాలు, మద్దెలలు, శంఖాలు మ్రోగుతుండగా, మిక్కిలి ఎత్తయిన జెండాల ఊరేగింపులు నగరంలో అన్నిచోట్ల దుర్యోధనుడు జరిపించాడు.

వ. అట్లు పట్టణాలంకారంబు సంఘటించి, రత్నకాంచన కలధౌతమయంబులగు కలశంబులఁ దీర్థజలంబులు దెప్పించి, మణిప్రకరంబునఁ గుసుమ నికరంబున మంగళ తరు త్వక్పల్లవ ప్రచయంబున మహౌషధి నిచయంబున విహిత మంత్రంబుల నుచిత తంత్రంబుల ఋత్విక్పురోహిత సహితుండై త త్సంస్కార ప్రకారం బాచరించి. 157

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పట్టణ+అలంకారంబు సంఘటించి= పట్టణమును శృంగారింపజేసి; రత్న కాంచన కలధౌతమయంబులు+అగు= రత్నములు, బంగారం, వెండి అనువాటితో చేయబడిన; కలశంబులన్= పాత్రలలో; తీర్థ జలంబులు తెప్పించి= పవిత్రములైన నదులయందలి ఉదకములు తెప్పించి; మణిప్రకరంబునన్= రత్నాల సమూహం చేతను; కుసుమ నికరంబునన్= పూలమొత్తం తోడను; మంగళతరు త్వక్+పల్లవ= శోభనకరాలైన చెట్లపట్టలయొక్క, చిగురుటాకులయొక్క; ప్రచయంబునన్= సముదాయంతో; మహా+ఓషధి నిచయంబునన్= మందుల కుపయోగించే గొప్ప మూలికలయొక్క రాశితో; విహిత మంత్రంబులన్= ఈ సన్నివేశమునకు శాస్త్రములందు చెప్పబడిన మంత్రాలతో; ఉచిత తంత్రంబులన్= కార్యసాధకాలైన క్రియలతో; ఋత్విక్+ పురోహిత+సహితుండు+ఐ= ఋత్విజులతో పురోహితులతో కూడినవాడై; తద్‌సంస్కార ప్రకారంబు+ఆచరించి= కలశాలలోని పుణ్యనదీ జలాలను పరిశుద్ధపరిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: దుర్యోధనుడు పట్టణాన్ని అలంకరింపజేశాడు. రత్న కలశాలతో, బంగారు కలశాలతో, వెండి కలశాలతో పవిత్ర నదీ జలాలను తెప్పించాడు. వాటికి మణులతో, పూలతో, పవిత్రములైన వృక్షముల యొక్క బెరడులతో,

చిగుళ్ళతో, గొప్ప ఓషధులతో, వేదవిహితాలైన మంత్రాలతో, తంత్రాలతో ఋత్విక్పురోహితులతో కూడినవాడై సుయోధనుడు సంస్కారం కలుగజేశాడు.

క. గురుఁడును గృపుఁడును లోనగు । గురు లనుమోదింప, బాహ్లికుండు మొదలుగాఁ
గురుజాతి యెలర్పఁగ న । న్నరపతి భీష్మాభిషేచనం బొనరించెన్. 158

ప్రతిపదార్థం: గురుఁడును= ద్రోణాచార్యులు; కృపుఁడున్= కృపాచార్యులు; లోనగు= మున్నుగాగల; గురులు= పెద్దలు; అనుమోదింపన్= అంగీకరించగా; బాహ్లికుండు మొదలుగాన్= బాహ్లికుడు మున్నుగాగల; కురుజాతి= కురువంశస్థులు - కౌరవులు; ఎలర్పఁగన్= సంతోషించగా; ఆ+నరపతి= ప్రభువైన సుయోధనుఁడు; భీష్మ+అభిషేచనంబు+ఒనరించెన్= భీష్ముడికి సర్వసేనా విభుత్వమునకై మంగళస్నానం చేయించాడు.

తాత్పర్యం: ద్రోణుడు కృపుడు మొదలైన గురువులు అంగీకరించగా, బాహ్లికుడు మొదలైన కురువంశ సంజాతులు సంతోషించగా సుయోధనుడు పుణ్యనదీజలాలతో సర్వసేనాధిపత్యానికి భీష్ముడిని అభిషేకించాడు.

తే. ఇవ్విధంబున నభిషేక మెలమిఁ జేసి । పరమభక్తి నక్షోహిణీపతులఁ జూపి
'వీరికిని సైన్యములకును మీర యొడయ' । లనుచుఁ బట్టంబుఁ గట్టె శంతనుతనూజు. 159

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈవిధంగా; ఎలమిన్= సంతోషంతో; అభిషేకము చేసి; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; అక్షోహిణీపతులన్+చూపి= అక్షౌహిణీ నాయకులను కనబరిచి; వీరికిని= ఈ సేనాధిపతులకు; సైన్యములకును= సేన లన్నింటికిని; మీరు+అ= మీరే; ఒడయలు= అధికారులు; అనుచున్= అని నుడువుచు; శంతను తనూజున్= శంతను మహారాజ పుత్రుడైన భీష్ముడిని; పట్టంబు+కట్టెన్= సర్వసేనాధ్యక్షుడిని కావించాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీష్మునకు అభిషేకం చేసి మిక్కుటమైన భక్తితో అక్షోహిణీ నాయకులను ఆయనకు కనబరచి 'వీరికినీ, సేనలన్నింటికినీ మీరే అధికారు'లని భీష్ముడికి సర్వ సైన్యాధ్యక్ష పదవి అప్పగించాడు.

క. అత్తఱిఁ బాషాణంబులు । నెత్తురు నెమ్ములను గురిసె, నిష్ఠుర నినదా
యత్తమయి నభము పిడుగుల । మొత్తంబులు వడియె నగరమున నెల్లెడలన్. 160

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయాన; నభము= ఆకాశం; పాషాణంబులు= రాళ్ళు; నెత్తురున్= రక్తం; ఎమ్ములను= ఎముకలను; నిష్ఠుర= కర్కశమైన; నినద= ధ్వనులకు; ఆయత్తము+అయి= అధీనమై; కురిసెన్= వర్షించింది; నగరమునన్= హస్తినాపురిలో; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్ల; పిడుగుల మొత్తంబులు= పిడుగులయొక్క గుంపు; పడియెన్= రాలాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడిని సర్వసేనాధిపతిగా చేసే సమయంలో ఆకాశం భయంకరంగా గర్జిస్తూ రాళ్ళు నెత్తురు ఎముకలు వర్షించింది. నగరంలో అన్నిచోట్ల పిడుగులు రాలాయి.

క. దానికి జను లుత్సాహ వి । హీనతఁ బొందంగఁ, గౌరవేంద్రుఁడు నానా
దానాదు లయిన శాంతి వి । ధానము లొనరించి యానతత్పరమతియై. 161

ప్రతిపదార్థం: దానికిన్= అట్టి దుర్నిమిత్తాలకు; జనులు= ప్రజలు; ఉత్సాహ విహీనతన్+పొందంగన్= ఉత్సాహం లేనివారు కాగా; కౌరవ+ఇంద్రుఁడు= కురురాజైన సుయోధనుడు; నానా దాన+ఆదులు+అయిన= అనేక దానాలు చేయటం మొదలైన;

శాంతి విధానములు= దోష పరిహారానికైన శాంతి క్రియలను; ఒనరించి= సలిపి; యాన తత్పర మతియై= యుద్ధానికి వెడలుటయందు లగ్నమైన మనస్సుకలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అటువంటి దుర్నిమిత్తాలు చూచి ప్రజలు ఉత్సాహహీను లయ్యారు. కురురాజు తద్దోష పరిహారార్థం దానాలివ్వటం మొదలైన శాంతిక్రియలు సల్పి, యుద్ధప్రయాణంలో మనస్సును లగ్నంచేశాడు.

క. తల్లియుఁ దండ్రియు వెఱఁగునఁ । బుల్లవడన్ వారికడకుఁ బోయి తడయఁగా
నొల్లక పయనపు వీడ్కో । లెల్లను దనయిచ్చ నడపి యేడ్తెఱ వెడలెన్. 162

ప్రతిపదార్థం: తల్లియున్= గాంధారియు; తండ్రియున్= ధృతరాష్ట్రుడును; వెఱఁగునన్= ఆశ్చర్యంచేత; పుల్లవడన్= స్తంభించిపోగా; వారికడకున్= వారి దగ్గరకు; పోయి= వెళ్ళి; తడయఁగాన్= ఆలసించటానికి; ఒల్లక= ఇష్టపడక; పయనపు వీడ్కోలు= యుద్ధ ప్రయాణానికి అనుమతి; ఎల్లను= అంతయు; తన+ఇచ్చన్+నడపి= తన కోరిక ప్రకారం తెల్పి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తల్లిదండ్రులైన గాంధారీ ధృతరాష్ట్రులు ఆ దుర్నిమిత్తాలుగని భీతితో నిశ్చేష్టులై ఉండగా, వారి దగ్గరకు వెళ్ళి అక్కడ ఆలసించటానికి ఇష్టపడక, యుద్ధానికి వెళ్ళుతున్నాను అంగీకరించండని తానేపలికి సాతిశయంగా అక్కడనుండి బయలుదేరాడు.

తే. వెడలి తమ్ములుఁ దగువారు వివిధభృత్య । గణముఁ దానును నేల గ్రక్కదలఁ గదలి
రాజరాజు గాంగేయుఁ బురస్కరించి । కొని సముద్ధతి నడచె దిక్కులు వడంక. 163

ప్రతిపదార్థం: వెడలి= తల్లిదండ్రుల చెంతనుండి బయలుదేరి; తమ్ములున్; తగువారున్= తగినవారలు; వివిధ భృత్యగణమున్= నానాసేవక సమూహం; తానును= తానున్నూ; నేల= పుడమి; గ్రక్కదలన్= మిక్కిలి కంపించగా; కదలి= బయలువెడలి; రాజరాజు= దుర్యోధనుడు; గాంగేయున్= భీష్ముడిని; పురస్కరించికొని= ముందుంచుకొని; దిక్కులు వడంకన్= దిశలు చలించగా; సముద్ధతిన్= మిక్కిలి గర్వంతో; నడచెన్= ముందుకుసాగాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తలిదండ్రుల దగ్గర నుండి కదలి, తమ్ములూ, తగినవారూ, నానాసేవక సమూహమూ తనను అనుసరించగా పుడమి వణకగా కదలాడు. అతడు భీష్ముడిని ముందిడుకొని దిక్కులు కంపించేటట్లు మిక్కిలి గర్వంతో కురుక్షేత్రానికి నడిచాడు.

వ. నడచి కురుక్షేత్రంబు దఱియం జొచ్చి యం దొక్క రమణీయ ప్రదేశంబు విడిదలగా నిరూపించి నిలిచి, భానుసూనుండునుం దానును మెలంగి యెల్లవారిని విడియించి, నడుమ నిజనివాసంబు గావించినఁ, గౌరవేశ్వరు స్కంధావారంబు వారణపురంబున నెవ్వ రెయ్యెడ వసియింతు రాచందంబున నందంబై యొప్పె; నిట్లు రెండు వీళ్ళును సన్నద్ధంబులైన సమయంబున. 164

ప్రతిపదార్థం: నడచి; కురుక్షేత్రంబున్; తఱియన్+చొచ్చి= ప్రవేశించి; అందున్; ఒక్క రమణీయ ప్రదేశంబున్= ఒక ఇంపైన తావును; విడిదలగాన్+నిరూపించి= విడిదిచోటుగా నిర్ణయించి; భానుసూనుండునున్= సూర్యపుత్రుడైన కర్ణుడునూ; తానును; మెలంగి= సంచరించి; ఎల్లవారినిన్= అందఱను; విడియించి= అక్కడ బసచేయించి; నడుమ= ఆ ప్రదేశంయొక్క మధ్యలో;

నిజనివాసంబున్= తానుండు చోటును; కావించినన్= ఏర్పరచగా; కౌరవ+ఈశ్వరు స్కంధావారంబు= దుర్యోధనుడి దండు విడిసిన చోటు; వారణ పురంబునన్= హస్తినాపురిలో; ఎవ్వరు; ఏ+ఎడన్= ఎక్కడ; వసియింతురు= నివాసముంటారో; ఆ చందంబునన్= ఆ విధంగా; అందంబు+ఐ= సుందరమై; ఒప్పెన్; ఇట్లు= ఈ విధంగా; రెండు వీళ్ళును= కురు పాండవ స్కంధావారములు; సన్నద్ధంబులు+ఐన సమయంబునన్= యుద్ధానికి సంసిద్ధాలై ఉన్నవేళ.

తాత్పర్యం: సుయోధనుడు కురుక్షేత్రంలో ప్రవేశించి అక్కడ ఒక మనోహరమైన ప్రదేశాన్ని చూచి, తన సేనలు నిలువదగిన చోటు అదిగా నిర్ణయించాడు. తానూ, కర్ణుడూ ఆ ప్రదేశమంతా కలయదిరిగి అందరూ ఉండవలసిన తావులకు నడుమ తన నివాసం ఏర్పాటు చేసికొన్నాడు. హస్తినాపురంలో ఎవ్వరు ఎక్కడ నివసించారో ఆ విధంగానే దుర్యోధనుడి స్కంధావారం అమరి అందంగా రూపుదిద్దుకొన్నది. ఈ రీతిగా కురుక్షేత్రంలో కౌరవ పాండవ స్కంధావారాలు ఏర్పడి, యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. సంధికి నేఁగి కార్యము పొసంగక కృష్ణుఁడు రాకయున్, సుహృ
ద్బాంధవ సంఘయుక్తముగఁ బాండవ కౌరవ వీరు లష్ట ది
క్సింధుర కంధరంబు లడఁగించు బలంబుల పెల్లుతోడ గ
ర్వాంధత నాజికెత్తుటయు నా బలభద్రుఁ డెఱింగి యార్తుఁడై. 165

ప్రతిపదార్థం: సంధికిన్+ఏఁగి= సంధిచేయటానికై పోయి; కార్యము పొసంగక= వెళ్ళిన పని నెరవేరక; కృష్ణుఁడు రాకయున్= శ్రీకృష్ణుడు తిరిగిరావటమూ; పాండవ కౌరవ వీరులు= శూరులైన పాండవులూ, కౌరవులూ; సుహృద్+బాంధవ సంఘయుక్తముగన్= స్నేహితులయొక్క, చుట్టాలయొక్క సమూహాలతో కూడ; అష్టదిక్+సింధుర= ఎనిమిది దిక్కులందున్న ఏనుగులయొక్క; కంధరంబులు= మెడలు; అడఁగించు= వంచునట్టి; బలంబుల పెల్లుతోడన్= సేనలయొక్క ఆధిక్యంతో; గర్వ+అంధతన్= మదంచేత కన్నుగాననివారై; ఆజికిన్= యుద్ధానికి; ఎత్తుటయున్= పూనిక వహించటమూ; ఆ బలభద్రుఁడు= ఆ బలరాముడు; ఎఱింగి= విన్నవాడై; ఆర్తుఁడు+ఐ= దుఃఖితుడై.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంధికార్యం విఫలమై తిరిగిరాగా పాండవ కౌరవ వీరులు తమ తమ మిత్ర బంధు సమూహాలతో అష్టదిగ్గజాల మెడలు క్రుంగజేసే మిక్కుటమైన సేనల భారంతో, గర్వంవలన కన్నుగానక యుద్ధానికి సంసిద్ధులై ఉన్నట్లు బలరాముడు విని దుఃఖం పొంది.

విశేషం: అలం: అతిశయోక్తి. దిగ్గజములు: దిక్కులందలి ఏనుగులు ఐరావతం, పుండరీకం, వామనం, కుముదం, అంజనం, పుష్పదంతం, సార్వభౌమం, సుప్రతీకం ఇవీ అష్టదిగ్గజాలు.

బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర వోవుట. (సం. 5-154-15)

వ. కతిపయ పరివారంబు పరివేష్టింప రయంబునం జనుదెంచి సముచిత ప్రకారంబున ధర్మనందనుం బేరోలగంబునం గని సంభ్రమాలింగనాసనార్ఘ్య పాద్యంబుల నతనిచేత సంభావితుండయి, దామోదర భీమార్జున నకుల సహదేవుల యభివాదనంబు లాదరించి, పాంచాల విరాట ప్రముఖులగు తగువారల వినయంబుల నభినందించి, యా దొరలతోఁ దత్కాలయోగ్య మితసంభాషణంబులు సేసి, యనంతరంబ వారల కిట్లనియె: 166

ప్రతిపదార్థం: కతిపయ పరివారంబు= కొద్ది మంది పరిజనం; పరివేష్టింపన్= చుట్టిరాగా; రయంబునన్= శీఘ్రంగా; చనుదెంచి= వచ్చి; సముచిత ప్రకారంబునన్= తగినవిధంగా; ధర్మనందనున్= ధర్మజుడిని; పేరు+ఓలగంబునన్= నిండుకొలువులో; కని= చూచి; సంభ్రమ+ఆలింగన+ఆసన+అర్ఘ్య పాద్యంబులన్= హర్షంతో కౌగిలించుకొనటం; కూర్చుండుటకు పీఠం వేయటం, అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం అనే పనులతో; అతనిచేతన్= ధర్మజుడిచేత; సంభావితుండు+అయి= గౌరవించబడినవాడై; దామోదర+భీమ+అర్జున నకుల సహదేవుల= శ్రీకృష్ణుడి యొక్క; భీమార్జున నకుల సహదేవులయొక్క; అభివాదనంబులు= వందనములు; ఆదరించి= ప్రేమతో స్వీకరించి; పాంచాల విరాట ప్రముఖులు+అగు= ద్రుపదుడు; విరాటుడు మున్నగు; తగువారల= గౌరవపాత్రులయొక్క; వినయంబులన్= అణకువలను; అభినందించి= ప్రశంసించి; ఆ దొరలతోన్= ఆ ప్రభువులతో; తద్+కాలయోగ్య= ఆ సమయానికి తగిన; మిత సంభాషణంబులు చేసి= పరిమితమైన పలుకులు పలికి; అనంతరంబు+అ; వారలకున్; ఇట్లనియెన్.

తాత్పర్యం: బలరాముడు కొంతమంది పరిజనం తనను కొలిచిరాగా శీఘ్రమే వచ్చి తగినవిధంగా ధర్మపుత్త్రుడిని ఒడ్డోలగంలో చూచాడు. యుధిష్ఠిరుడు బలరాముడిని సంతోషంతో కౌగిలించుకొని, ఆసనమొసగి, అర్ఘ్యపాద్యాదులిచ్చి గౌరవించాడు. శ్రీకృష్ణ భీమార్జున నకుల సహదేవులు తనకు నమస్కరించగా బలదేవుడు ఆదరంతో స్వీకరించాడు. ద్రుపదుడు, విరాటుడు మొదలైనవారు అణకువతో వర్తించగా మెచ్చుకొని, ఆ ప్రభువులతో ఆ సమయానికి తగినట్లు పరిమిత సంభాషణం చేసి, పిదప వారితో ఇట్లా అన్నాడు:

క. 'కౌరవ పాండవు లెంతయుఁ। గ్రూరత వాటించి బంధుకోటికి నిఖిలో
ర్వీ రమణులకుం జేటుగఁ। బోరికిఁ దెగి; రిట్టి ఘోరపుంబని యగునే? 167

ప్రతిపదార్థం: కౌరవపాండవులు= కౌరవులు, పాండవులు; ఎంతయున్= మిక్కిలి; క్రూరత+పాటించి= కరకుతనం వహించి; బంధుకోటికిన్= చుట్టాల సమూహానికి; నిఖిల+ఉర్వీరమణులకున్= సకల రాజులకు; చేటుగన్=కీడు మూడేటట్లు; పోరికిన్+ తెగిరి= యుద్ధానికి సాహసించారు; ఇట్టి ఘోరపున్+పని+అగునే?= ఇంతటి దారుణకృత్యం తగునా?

తాత్పర్యం: 'కౌరవులూ, పాండవులూ మిక్కిలి క్రూరులై బంధుజనములకూ, పుడమి దొరలకూ కీడు వాటిల్లేటట్లు యుద్ధానికి పూనారు. ఇట్టి దారుణ కృత్యం వారికి తగునా?

తే. ఇట్టిదానికి నోర్వక యెన్నఁడేనిఁ। గృష్ణుతోడ నేఁ జెప్పితిఁ, గినిసి యిరు దె
అంగువారికిఁ దగఁ జెప్పి సంగతంబు। సేయు మని యెంత సెప్పినఁ జేయఁడయ్యె. 168

ప్రతిపదార్థం: ఇట్టిదానికిన్= ఇట్లు జరగటానికి; ఎన్నఁడు+ఏనిన్= ఎప్పుడైనను; ఓర్వక= సహించలేక; కినిసి= కోపించి; ఇరు తెఱంగువారికిన్= ఉభయపక్షాలవారికి; తగన్+చెప్పి= అనుకూలంగా బోధించి; సంగతంబు= సంధిని; చేయుము+అని= కుదుర్చుమని; కృష్ణుతోడన్= మాధవుడితో; నేన్= నేను; చెప్పితిన్= చెప్పాను; ఎంతచెప్పినన్= నే నెంత చెప్పినప్పటికీ; చేయఁడు+అయ్యెన్= అతడు చేసినవాడు కాడు.

తాత్పర్యం: దారుణమైన యుద్ధం కురుపాండవుల మధ్య సంభవించటానికి నే నెన్నడూ సహించలేను. అందుచేత కోపించి అయినా రెండు పక్షాలవారికి తగిన విధంగా నచ్చజెప్పి సంధి సమకూరేటట్లు చూడుమని నేను శ్రీకృష్ణుడితో చెప్పాను. నే నెంత చెప్పినప్పటికిన్నీ అతడు సంధి పొసగేటట్లు చూడలేదు.

క. పలుకుల పొం దెఱుఁగని వా । రలఁ బూజావాక్యములఁ దిరంబై తనకుం
దెలుపం దగదే? యే మని । యలుకమెయిన్ సంధి సెఱిచి హరి యేతెంచెన్? 169

ప్రతిపదార్థం: పలుకుల పొందు= మాటలపొందిక; ఎఱుఁగని వారలన్= తెలియని మూఢులను; పూజా వాక్యములన్= బుజ్జగింపు పలుకులతో; తిరంబు+ఐ= గట్టిగా నిలబడి; తనకున్= గోవిందుడికి; తెలుపన్+తగదే= చెప్పటం యుక్తంకదా!; అలుకమెయిన్= కోపంతో; సంధిచెఱిచి= సంధికార్యం చెడగొట్టి; హరి= శ్రీకృష్ణుడు; ఏమి+అని+ఏతెంచెన్?= ఏమి సంకల్పించి వచ్చాడు?

తాత్పర్యం: మాటాడేతీరు తెలియని పరమ మూర్ఖులకు మంచిమాటలతో హితవు గరపవలసిన శ్రీహరి అలా చేయక వారిపై క్రోధం వహించి సంధికార్యం చెడగొట్టి ఏమి చేయటానికి వచ్చినట్లు?

తే. వీరు వారును సంబంధ విషయబంధు । లగుట సరిగాదె హరికిఁ; దా నర్జుననకుఁ
బక్షపాతంబు చేయుటఁ బాండవులను । బెట్టుచోటులు గానక పట్టి క్రాలు. 170

ప్రతిపదార్థం: వీరున్= పాండవులూ; వారును= కౌరవులూ; సంబంధవిషయబంధులు+అగుటన్= సంబంధవిషయమై చుట్టాలగుటవలన; హరికిన్= శ్రీకృష్ణుడికి; సరి+కాదె= సమానులే కదా!; తాన్= తాను; అర్జుననకున్; పక్షపాతంబుచేయుటన్= మిక్కిలి అభిమానం చూపటంచేత; పాండవులను= పాండుకుమారులను; పెట్టుచోటులుకానక= కుదురుగా ఒక్కచోట నుంచక; పట్టిక్రాలున్= పట్టుకొని ఊరేగుతుంటాడు.

తాత్పర్యం: పాండవులు కౌరవులు సంబంధ విషయమై చుట్టాలు కావటంచేత తనకు ఉభయులూ సమానులే కదా! కాని, అతడికి అర్జునుడిపట్ల అభిమానం మెండు. అందువలన కౌంతేయులను కుదురుగా ఒకచోట నుంచక, తన ఇచ్చకొలదీ వెంట బెట్టుకొని త్రిప్పుతుంటాడు.

ఉ. కావున వీరికిన్ జయము గల్గుట నిశ్చయ; మెల్ల భంగులం
జావు నిజంబు వారికి; నసంశయమై యిటులుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తుఁ? దగ నింత ప్రవీణుల నేన చేసితిం
జూవె! సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే? 171

ప్రతిపదార్థం: కావునన్= అట్లగుటచే; వీరికిన్= పాండుకుమారులకు; జయము కల్గుట= గెలుపు సమకూడడం; నిశ్చయము= తప్పదు; వారికిన్= కౌరవులకు; ఎల్లభంగులన్= అన్నివిధాల; చావు నిజంబు= మరణం తథ్యం; అసంశయము+ఐ= సందేహము లేనిదై; ఇటులు+ఉండన్= విషయమిట్లా ఉండగా; దీనిన్= ఈ పరిణామాన్ని; ఎట్లు= ఎట్లా; ఏన్= నేను; వినన్‌చూడన్+నేర్తున్?= వినగలను, చూడగలను?; తగన్= ఒప్పుగా; సుయోధనున్= దుర్యోధనుడిని; పవనసూనునిన్= వాయుపుత్రుడిని; ఇంతప్రవీణులన్= ఇంతటి నేర్పరులుగా; నేను+అ= నేనే; చేసితిన్+చూవె!= చేశాను సుమా! ఒండు+ఒరున్= ఒకడిని మరొకడు; చంపన్+చూతునే?= చంపుతుండగా కనుగొనగలనా?

తాత్పర్యం: పాండవులకు విజయం తథ్యం. అన్ని విధాల కౌరవులకు చావు తప్పదు. ఇందులో సందేహం లేదు. కనుక దీనిని నే నెట్లా చెవులతో వింటూ, కనులతోచూస్తూ భరించగలను? దుర్యోధనుడిని, వృకోదరుడిని గదాయుద్ధంలో ఇంత నేర్పరులను నేనే చేశాను. భీమ సుయోధనులు పరస్పరం చంపుకొంటుండగా ఎట్లా చూడగలను?

క. హరి యెఱుఁగని చక్కటియుం । బురుషార్థము నా కెఱుంగఁ బోలునె? యీ ని
ష్ఠురత వినఁ జూడఁ జాలక । సరస్వతీ తీర్థమునకుఁ జనియెడు బుద్ధిన్. 172

ప్రతిపదార్థం: హరి= శౌరి; ఎఱుఁగని= తెలియని; చక్కటియున్= న్యాయం, ధర్మం; పురుష+అర్థము= పురుష ప్రయోజనం; నాకున్= నాకు; ఎఱుంగన్+పోలునె?= తెలియ శక్యమౌతుందా? (కాదని భావం); ఈ నిష్ఠురతన్= ఈ కర్కశత్వమును; వినన్= వినటానికి; చూడన్= చూడటానికీ; చాలక= సహించలేక; సరస్వతీ తీర్థమునకున్= సరస్వతీ నదికి; చనియెడు బుద్ధిన్= వెళ్ళేతలంపుతో.

తాత్పర్యం: గోవిందుడికి తెలియని న్యాయం, పురుషార్థం నాకు తెలియశక్యంగాదు. ఈ కర్కశత్వాన్ని వినలేక చూడలేక సరస్వతీ తీర్థానికి వెళ్ళే తలంపుతో.

వ. మీకుం జెప్పిపో వచ్చితిఁ; బోయి వచ్చెద' నని పలికి బలదేవుండు వాసుదేవ ధర్మపుత్త్రు లొడంబడి యనుపఁ దీర్థయాత్ర వోయెఁ; దదనంతరంబ. 173

ప్రతిపదార్థం: మీకున్= మీకు; చెప్పిపోన్+వచ్చితిన్= చెప్పివెళ్ళుదామని వచ్చాను; పోయివచ్చెదన్= వెళ్ళివస్తాను; అని పలికి; బలదేవుండు= బలరాముడు; వాసుదేవ ధర్మపుత్త్రులు= శ్రీకృష్ణుడు, ధర్మరాజు; ఒడంబడి= సమ్మతించి; అనుపన్= తనను సాగనంపగా; తీర్థయాత్ర+పోయెన్; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట.

తాత్పర్యం: మీకు చెప్పి వెళ్ళుదామని వచ్చాను. పోయివస్తాను' అని బలదేవు డన్నాడు. అందుకు అంగీకరించి శ్రీకృష్ణుడు ధర్మనందనుడు సాగనంపగా ఆయన తీర్థయాత్రకు వెళ్ళాడు. అటు పిమ్మట.

రుక్మి వృత్తాంతము (సం. 5-155-1)

సీ. కృష్ణుని దేవి రుక్మిణి సోదరుఁడు రుక్మి । యను రాజు బలవిక్రమాన్వితుండు
శార్ఙ్గగాండీవ విజయములు నాఁగల । దివ్య చాపములఁ దృతీయమైన
చాపంబు గలవాఁడు సైన్య సమేతుఁడై । చనుదెంచి ధర్మజుఁ గని తదీయ
సత్కారములు గాంచి సముచితాసనమున । నుండి యక్కొలువున నున్న వీరు

ఆ. లెల్ల వినఁ గిరీటి కిట్లను 'సమరంబు । సేయ వెఱచితేనిఁ జెప్పు; నాకు
నెదురు లేరు జగతి నెవ్వరు; నీకుఁ దో । డ్పడి జయింతు నెట్టి పగఱనైన.' 174

ప్రతిపదార్థం: కృష్ణుని దేవి= శ్రీకృష్ణుడి పత్నిఅయిన; రుక్మిణి= రుక్మిణీదేవికి; సోదరుఁడు= తోడబుట్టినవాడు; రుక్మి అనురాజు= రుక్మి అనే పేరుగల దొర; బలవిక్రమ+అన్వితుండు= బలం పరాక్రమం అనువాటితో కూడినవాడు; శార్ఙ్గ గాండీవ విజయములు నాన్+కల= శార్ఙ్గం, గాండీవం, విజయం అనే పేర్లుగలిగిన; దివ్యచాపములన్= శ్రేష్ఠములైన ధనుస్సులలో; తృతీయము+అయిన= మూడవదైన; చాపంబు+కలవాఁడు= విల్లు కలిగినవాడు; సైన్య సమేతుఁడు+ఐ= సేనలతో కూడినవాడై; చనుదెంచి= వచ్చి; ధర్మజున్+కని= ధర్మనందనుడిని దర్శించి; తదీయ సత్కారంబులు+కాంచి= అతనివలన గౌరవాలు పడసి; సముచిత+ఆసనంబునన్+ఉండి= అర్హపీఠంమీద అధివసించి; ఆ+కొలువునన్+ఉన్నవీరులు+ఎల్లన్= ఆ సభలో నుండిన శూరులందరూ; వినన్= వినుచుండగా; కిరీటికిన్= అర్జునుడికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; సమరంబు చేయన్= యుద్ధం

చేయటానికి; వెఱచితి(వి)+ఏనిన్= భయపడితే; చెప్పుము= తెలుపుము; నాకున్= నాకు; జగతిన్= పుడమిలో; ఎవ్వరున్= ఎట్టివారున్నూ; ఎదురులేరు= అడ్డంలేరు; నీకున్ తోడ్పడి= నీకు సాయం చేసి; ఎట్టి పగఱన్+ఐనన్= ఎంతటి విరోధులనయినా; జయింతున్= గెలుస్తాను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి దేవేరి రుక్మిణి. ఆమె అన్నపేరు రుక్మి. అతడు బలం పరాక్రమం కలవాడు. శ్రీకృష్ణుడికి శార్ఙ్గం, అర్జునుడికి గాండీవం అనే ధనుస్సులున్నట్లుగా తనకూ విజయం అనే పేరుగల దొడ్డవిల్లు ఉన్నది. అతడు సేనాపరివృతుడై ధర్మజుడి దగ్గరకు వచ్చి దర్శించాడు. యుధిష్ఠిరుడు అతడికి సముచిత సత్కారాలు జరిపించాడు. అట్లా సమ్మానితుడై రుక్మి అర్ఘ్యపీఠం మీద అధివసించి, ఆ సభలోని వీరులంతా వింటుండగా అర్జునుడితో ఇట్లా పలికాడు: 'అర్జునా! యుద్ధం చెయ్యటానికి నీకు భయంగా ఉంటే చెప్పు. నీకు సాయంగా నిల్చి ఎంతటి శత్రువులనైనా గెలుస్తాను. నాకీ ఇలలో ఎవ్వరూ ఎదురులేరు.'

వ. అని తన్ను నాక్రమించి తన తోఁబుట్టువు రుక్మిణిం గొనివచ్చిన యా కృష్ణు సన్నిధిని సిగ్గులేక యాడిన మాటలు విని, చిఱునవ్వు నవ్వుచుం గవ్వడి యతని యాననం బాలోకించి. 175

ప్రతిపదార్థం: అని; తన్నున్= తనను; ఆక్రమించి= అలమి; తన తోఁబుట్టువు= తన చెల్లెలు; రుక్మిణిన్; కొనివచ్చిన= తీసికొని వెళ్ళిన; ఆ కృష్ణు సన్నిధిన్+అ= ఆ శ్రీకృష్ణుడి సమక్షంలోనే; సిగ్గులేక= లజ్జవీడి; ఆడినమాటలు= పలికిన పలుకులు; విని; చిఱునవ్వు నవ్వుచున్; కవ్వడి= రెండు చేతుల వడిగల అర్జునుడు; అతని; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి

తాత్పర్యం: తనను అతిక్రమించి తన చెల్లెలైన రుక్మిణిని వెంటగొనిపోయిన ఆ శ్రీకృష్ణుడి ఎదుట రుక్మి సిగ్గులేక మాటాడిన మాటలు విని చిరునవ్వు నవ్వుతూ అర్జునుడు అతడి ముఖం చూచి ఇట్లా అన్నాడు:

తే. 'చెనసి గంధర్వసేన నిర్జించునపుడు । మత్స్యనాథు గోవర్గంబు మరలఁ దెచ్చు
నెడను దప్పెఁ; నీకందువ యెఱుఁగనైతి । నింక నౌఁగాని తోడుగ మ్మెచటి కైన.' 176

ప్రతిపదార్థం: చెనసి= ఎదిరించి; గంధర్వసేనన్= చిత్రసేనుడి సైన్యాన్ని; నిర్జించునపుడున్= జయించేవేళలో; మత్స్యనాథు గోవర్గంబున్= మత్స్యదేశాధీశుడైన విరాటుడి యొక్క ఆలమందలను; మరలన్+తెచ్చు+ఎడను= కౌరవుల బారినుండి మరలించుకొని వచ్చునపుడును; తప్పెన్= అవకాశం జారిపోయింది; నీకందువ+ఎఱుఁగన్+ఐతిన్= నీ ఉనికి ఎక్కడో తెలియనైతిని; ఇంకన్= ఇక; ఔన్+కాని= చాలు గాని; ఎచటికిన్+ఐనన్= నీ సాయం అవసరమైనచోటికి; తోడు+కమ్ము= సాయపడుము.

తాత్పర్యం: 'గంధర్వ సైన్యాన్ని ఎదిరించి చిత్రసేనుడి చెరజిక్కిన సుయోధనుడిని భార్యాపుత్రమిత్ర బంధుసహితంగా బంధవిముక్తుని కావించే టప్పుడూ; కురువీరులందరూ మొత్తమై విరాటుడి గోవులను తోలుకొని కరిపురికి అరుగునప్పుడు, వారిబారినుండి ఆలమందలను మరలించుకొని వచ్చునప్పుడు నీ జాడ నాకు తెలియలేదు. అపుడు నీవెక్కడ ఉన్నావో నాకు తెలియదు. ఇక నీమాటలు కట్టిపెట్టి, అక్కర గల్గినచోటికి సాయపడటానికి వెళ్ళు.'

విశేషం: అర్జునుడు గంధర్వ సేనను నిర్జించుట: పాండవులు ద్వైతవనంలో నివసిస్తున్నారు. తన డాబు దర్పం వారిముందు ప్రదర్శించి మరీ ఏడ్పించవలెనని దుర్యోధనుడికి దుర్బుద్ధి పుట్టింది. కర్ణ శకునులతో మంతనం జరిపాడు. ఘోషయాత్ర

నెపంతో అక్కడికి వెళ్ళదలచాడు. అందుకు ఎట్లాగో ధృతరాష్ట్రుడి అనుమతి సంపాదించాడు. సుయోధనుడు చతురంగబలంతో, అంగనాజనంతో అనుజ బంధు మంత్రి గాయక నర్తక సమూహంతో వందిమాగధ బృందంతో కర్ణ శకునులను వెంటబెట్టుకొని వైభవోపేతంగా తమ గోగణమున్న ద్వైతవనానికి తరలివెళ్ళాడు.

సుయోధనుడు ఆ వనంలో విహరించి అక్కడి మృగాలను వేటాడుతూ ఒక సరస్సు చెంతకు వచ్చాడు. ఆ సమీపంలోనే మునిజన సహాయంతో సద్యస్కందమనే యాగం సల్పుతున్నాడు ధర్మజుడు. ఆ కొలని గట్టున క్రీడా గృహాలను నిర్మించటానికి దుర్యోధనుడు భృత్యవర్గాన్ని నియమించాడు. చిత్రసేనుడనే గంధర్వరాజుకు క్రీడార్థం కల్పితమైన సరస్సు గనుక ఇక్కడనుండి తొలగిపొండని గంధర్వులు కౌరవసేవకులను హెచ్చరించారు. దుర్యోధనుడు దుర్మదాంధులైన సైనికులను గంధర్వుల నెదిరించటానికి పంపాడు. తానూ తన తమ్ములూ కర్ణశకునులూ పోరాటంలో పాల్గొన్నారు. పోరు ఘోరమైంది. కర్ణుడు విరథుడై వికర్ణుడి రథమెక్కి రణరంగంనుండి తప్పుకొన్నాడు. దుర్యోధనుడు గంధర్వులతో తలపడ్డాడు. చిత్రసేనుడు అతడి రథాన్ని భగ్నం చేయించి జుట్టుపట్టి నేలకీడ్చి పెడరెక్కలు గట్టి సింహనాదం చేశాడు. అప్పుడే గంధర్వులు దుర్యోధనుడి వనితలనూ, అతడి సోదరులనూ, తనయులనూ, వాని మంత్రులనూ పట్టి బంధించి చిత్రసేనుడి కొప్పగించారు.

అంతట సుయోధనుడి పరిజనం పరుగెత్తి పోయి ధర్మజుడి పాదాల వ్రాలి, నీ తమ్ముళ్ళనూ, నెలతలనూ రక్షించుమని వేడుకొన్నారు. 'కాగల కార్యం గంధర్వులే తీర్చారు. క్రూరాత్ముని దెస కృప చూపవ'ద్దని అన్నతో అన్నాడు అనిలజుడు హర్షంతో **'శరణం బని వచ్చిన భీకర శత్రువునైన ప్రీతిగావగవలయున్ కరుణాపరుల తెఱంగిది యిరవుగ సరిగావు దీని కేధర్మంబుల్'** అని ధర్మజుడు పలు విధాల భీమసేనుడిని అనునయించాడు. "నేను యజ్ఞదీక్షితుడిని గనుక వెళ్ళరాదు. మీరు వెళ్ళి సామవాక్యాలకు సాధ్యపడకుంటే ఎదిరించిఅయినా గంధర్వుల చెరనుంచి సుయోధనుడిని విడిపించండి" అని ధర్మపుత్రుడు తమ్ముళ్ళ నడిగాడు. అగ్రజుడి ఆజ్ఞ ననుసరించి భీమార్జున నకుల సహదేవులు కదలిపోయి గంధర్వుల నెదుర్కొన్నారు.

దారుణ సంగ్రామం జరిగింది. పాండవుల చిత్తవృత్తి చిత్రసేనుడికి విస్మయం కలిగించింది. అతడు వెంటనే యుద్ధం విరమించి అర్జునుడిని చేరబోయాడు. ఆ వచ్చినవాడిని ఆత్మసఖుడిగా గుర్తించి సవ్యసాచి సంగ్రామం చాలించాడు.

"పరమ ధార్మికులైన మిమ్ము పరాభవింప దలచి, పరిహసించి ఇక్కడికి వచ్చిన సుయోధనుడిని భార్యా భ్రాతృ పుత్ర బంధుయుతంగా పట్టి తెమ్మని దేవేంద్రునాజ్ఞ. అందుకే వచ్చా'నని చిత్రసేనుడు అర్జునుడితో అన్నాడు. 'తానెంత దుర్మార్గుడయినా మాకు సహోదరుడు గనుక దుర్యోధనుడిని విడిచిపెట్టవలసినది. ధర్మజుడిని దర్శించి అతడు చెప్పినట్లు చేయవలసినది" అని పాండవ మధ్యముడు పలికాడు. చిత్రసేనుడు అజాతశత్రుడి దగ్గరకు వచ్చాడు. అతడు ధర్మజుడి ప్రార్థనతో దుర్యోధనాదు లందరినీ విడిచిపెట్టి ఇంద్రుని కడకు వెళ్ళాడు. 'ఇకమీదట ఇట్లాంటి సాహసాలు చేయవద్దు. గుట్టుగ పట్టణానికి వెళ్ళుము" అని బుద్ధులు చెప్పి ధర్మజుడు దుర్యోధనుడికి వీడ్కోలిచ్చాడు. ఈ విషయం అరణ్యపర్వ పంచమాశ్వాసంలో ఉన్నది.

వ. అని యతని యుత్తరమునకుఁ దగిన యట్ల పలికి, మఱియును. 177

తాత్పర్యం: అంటూ రుక్మి మాటలకు సరియైన సమాధానమిచ్చి అర్జునుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

క. 'ము న్నే నసహాయుఁడనై । చన్న గతిం జనఁగ నైన చందం బయ్యెన్;
వెన్నుఁడు తోడుగలఁడు; వెఱ । పెన్నండును వలవ దింక నేమిటికైనన్. 178

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; ఏను= నేను; అసహాయుఁడను+ఐ= తోడ్పాటు లేనివాడనై; చన్నగతిన్+చనఁగన్= అరిగిన మార్గంలో అరుగగా; ఐన చందంబు+అయ్యెన్= జరుగవలసిన దేదో జరిగిపోయింది; వెన్నుఁడు= విష్ణుమూర్తి; తోడు+

కలఁడు= నాకిప్పుడు సాయంగా ఉన్నాడు; ఇంకన్= ఇటుపై; ఏమిటికిన్+ఐనన్= ఏ విషయానికైననూ; వెఱపు= భీతి; ఎన్నండును వలవదు= ఎప్పుడూ నాకు కలుగదు.

తాత్పర్యం: 'పూర్వం నేను ఎవ్వరి తోడ్పాటూ లేనివాడనై అనుకొన్న దారిలో నరుగగా జరుగవలసిన దేదో జరిగింది. నేడు నాకు విష్ణుదేవుడి సాయమున్నది. మున్ముందు ఏమి జరిగిననూ నాకు ఎవ్వరి వల్లా భయంలేదు.

చ. **వెఱచితి రాఁగదే యనిన వెండికదా పగఁదీర్తు వీవు; నా**
వెఱపెటులున్న నీ రథిక వీరులు వాపెద; రొల్ల నిన్ను; నీ
యుఱుకడ కేఁగి తోడుపడు మొడ్లకు నెవ్వరికేని' నన్న నే
డ్తెఱ నతఁ డేఁగి కౌరవపతిం గని యట్టుల బెట్టుపల్కినన్. **179**

ప్రతిపదార్థం: వెఱచితిన్= యుద్ధానికి భయపడ్డాను; రాన్+కదే= తోడుపడటానికి రావయ్యా; అనినన్= అని నేను వేడుకొంటే; వెండికదా= అప్పుడుగదా; ఈవు= నీవు; పగన్+తీర్తువు= వైరం బాపగలవు; నా వెఱపు= నా భీతి; ఎటులు+ఉన్నన్= ఎట్లున్నప్పటికినీ; ఈ రథిక వీరులు= వీరులైన ఈ రథికులు; పాపెదరు= తొలగించగలరు; నిన్నున్+ఒల్లన్= నీ సాయం అంగీకరించను; నీ+ఉఱుకడకున్+ఏఁగి= నీకు ఉచితమైన చోటికి వెళ్ళి; ఒడ్లకున్+ఎవ్వరికిన్+ఏనిన్= ఇతరులెవ్వరికైననూ; తోడుపడుము= సాయపడుము; అన్నన్= అని అర్జునుడు పలుకగా; ఏడ్తెఱన్= వెంటనే; ఆతఁడు+ఏఁగి= రుక్మి వెళ్ళి; కౌరవపతిన్+కని= కురువిభుడైన సుయోధనుడిని వీక్షించి; అట్టుల= ధర్మజుడి ఎదుట పలికినట్లుగానే; బెట్టుపల్కినన్= బిగువుగా మాట్లాడగా.

తాత్పర్యం: 'నాకు యుద్ధమంటే భయంగా ఉన్నది, రావయ్యా' అని నేను అడిగినప్పుడు గదా నీవు వచ్చి పగ తొలగిస్తావు. నాకంతగా భయమేర్పడితే దానిని తొలగించటానికి ఈ రథిక శ్రేష్ఠులున్నారు. నీతోడ్పాటు నాకు అక్కరలేదు. నీకిష్టమైన చోటికి వెళ్ళి ఇతరులెవ్వరికైనా సాయపడుమని అర్జునుడు పల్కగా రుక్మి శీఘ్రమే కదలి వెళ్ళి దుర్యోధనుడిని చూచి ఉద్ధతుడై ఈ విధంగానే మాట్లాడగా.

క. **ఆతఁడివి యేటిమాటలు । నీ తోడగు టొల్లఁ బొ'మ్మనిన రుక్మి వృథా**
యాతాయాస విషణ్ణుం । డై తన పురమునకు మగుడ నరిగెం బెలుచన్. **180**

ప్రతిపదార్థం: ఆతఁడు= దుర్యోధనుడు; ఇవి+ఏటిమాటలు= ఏమి టీ పలుకులు?; నీతోడు+అగుట= నీ యొక్క సహాయం; ఒల్లన్= ఇష్టపడను; పొమ్ము= వెళ్ళుము; అనినన్= అని పలుకగా; రుక్మి= రుక్మిణియొక్క అన్న; వృథా+ఆయాత+ఆయాస+విషణ్ణుండు+ఐ= వ్యర్థంగా తన పట్టణం నుండి వచ్చుటచే కలిగిన శ్రమవలన దుఃఖితుడై; తన పురమునకున్= తన నగరానికి; పెలుచన్= వడిగా; మగుడన్= మరల; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రుక్మియొక్క తలబిరుసు మాటలు విని 'ఇవేటి మాటలు? నీ సాయం నాకు అక్కరలేదు; పొ'మ్మన్నాడు. కుండినపురినుండి తనరాక వృథా ప్రయాస అయిందిగదా అని బాధపడుతూ రుక్మి తన నగరానికి అక్కడనుంచి వెంటనే తిరిగి వెళ్ళాడు.

తే. **ఇట్లు బలదేవ రుక్ముల కిద్దఱకును । గయ్యమునకు సన్నాహంబు గలుగదయ్యెఁ**
గాని తక్కులోకమ్మునఁ గలుగు నృపతి । కోటి యిరువాఁగు నందును గూడె ననికి. **181**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; బలదేవ రుక్ములకున్+ఇద్దఱకును= బలరాముడు, రుక్మి అనే ఇరువురకునూ; కయ్యమునకున్= యుద్ధానికి; సన్నాహంబు= అవసరం; కలుగదు+అయ్యెన్= లభించలేదు; కాని= కాని; తక్కులోకమ్మునన్+ కలుగు= మిగిలిన జగతియందున్నట్టి; నృపతి కోటి= రాజసమూహం; అనికిన్= యుద్ధానికి; ఇరువాఁగునందును+కూడెన్= రెండు పక్షాలందు చేరింది.

తాత్పర్యం: ఈ రీతిగా బలరాముడు, రుక్మి అనే ఈ ఇద్దరికీ కురుపాండవ యుద్ధంలో పాల్గొనే అవకాశం చిక్కలేదు. కాని, జగతిలోని మిగిలిన రాజులందరూ పోరాటానికై రెండు పక్షాలలో చేరిపోయారు.

వ. అట్టియెడ నిశాసమయంబున ధృతరాష్ట్రుండు సంజయు రావించి యిట్లనియె. 182

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అటువంటి తరుణంలో; నిశా సమయంబునన్= రాత్రి వేళ; ధృతరాష్ట్రుండు; సంజయున్; రావించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు రాత్రివేళ ధృతరాష్ట్ర మహారాజు సంజయుడిని తన చెంతకు రప్పించుకొని ఇట్లా అన్నాడు:

క. 'బవరము గీడని యెఱుఁగుదు । నవినీతుండైన కొడుకు నదలిచి యుడుపం
బివిరియు నోరాడమి దై । వ వశం; బప్పనికి మనకు వగ పింకేలా? 183

ప్రతిపదార్థం: బవరము= పోరు; కీడు+అని+ఎఱుఁగుదున్= చేటు కలిగిస్తుందని తెలుసు; అవినీతుండు+ఐన= అడకువలేనట్టి; కొడుకున్= నా కుమారుడిని; అదలిచి= బెదిరించి; ఉడుపన్+తివిరియున్= సంక్షోభం నివారించటానికి పూనియు; నోరు+ఆడమి= నాకు నోరాడకుండటం; దైవ వశంబు= దైవాధీనమే; ఆ+పనికిన్= అలా జరిగినందుకు; మనకున్= మనకు; వగపు= విచారం; ఇంకన్+ఏలా?= మరెందుకు?

తాత్పర్యం: 'యుద్ధం అనర్థాలకు మూలమని నాకు తెలుసు. అవిధేయుడైన నా కుమారుడిని తర్జించి భర్జించి కుటుంబ సంక్షోభం మాన్పడానికి యత్నించి కూడ నాకు నోరు రాకుండటం విధి వైపరీత్యం. అట్లా జరిగినందుకు ఇప్పుడు విచారించి లాభం లేదు.

క. ఎయ్యది గానున్నది యది । యయ్యెడుఁ; జేయునది గలదె? యవనీశులకుం
గయ్యానఁ జచ్చుటయు మే; । లయ్యొప్పుట లెస్సగాక! యది యట్లుండెన్. 184

ప్రతిపదార్థం: ఎయ్యది= ఏది; కానున్నది= జరుగనున్నదో; అది+అయ్యెడున్= అది జరుగగలదు; చేయునది+కలదె?= ఇప్పుడు మనం చేయగల్గింది ఏమీలేదు; అవనీ+ఈశులకున్= రాజులకు; కయ్యానన్= రణంలో; చచ్చుటయున్+మేలు= మరణించటమే శ్రేయస్కరం; ఆ+ఒప్పుట= అందు కంగీకరించటం; లెస్సగాక!= మంచిదే సుమా!; అది+అట్లు+ఉండెన్= ఆ విషయమట్లా ఉండనిమ్ము.

తాత్పర్యం: ఏది జరుగవలసి ఉన్నదో అది జరుగక మానదు. మనం చేయగల్గింది ఏమీ లేదు. రాజులు రణరంగంలో చావడమే మంచిది. అందుకు అంగీకరించటమే యుక్తం. ఆ విషయ మట్లా ఉండనీ.

వ. రెండు వీఁకును గురుక్షేత్రంబున విడిసిన పిదపం బుట్టిన విశేషంబులు గలవేని నెఱింగింపుము.' 185

ప్రతిపదార్థం: రెండు వీడు+లును= ఉభయ సేనలును; కురుక్షేత్రంబునన్; విడిసిన పిదపన్= దిగిన తర్వాత; పుట్టిన విశేషంబులు= కలిగిన వింతలు; కలవు+ ఏనిన్= ఉంటే; ఎఱింగింపుము= తెలుపుము.

తాత్పర్యం: ఉభయ సైన్యాలూ కురుక్షేత్రంలో దిగిన తరువాత జరిగిన విశేషము లేమైనా ఉంటే నాకు చెప్పు.'

సంజయుండు ధృతరాష్ట్రుని కులూకుఁడు పాండవుల నాడిన మాటలు చెప్పుట (సం. 5-157-1)

తే. **అనిన సంజయుఁ డిట్లను 'నకట! కొడుకు । మీఁదఁ దప్పు పెట్టెదవు నీ మీఁది కొఱఁత**
నీకుఁ గానంగ వచ్చునె? నీ వెఱుంగ । కుండఁ బఱచెనె యాతండు పాండుసుతుల? **186**

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు అడుగగా; సంజయుఁడు= సంజయుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అకట!= ఔరా!; కొడుకుమీఁదన్= కుమారుడిపై; తప్పు+పెట్టెదవు= నిందమోపెదవు; నీమీఁది కొఱఁత= నీయందున్నలోటు; నీకున్= నీకు; కానంగన్+వచ్చునె?= కనబడునా?; నీవు+ఎఱుంగకుండన్= నీకు తెలియకుండ; ఆతండు= సుయోధనుడు; పాండుసుతులన్= పాండవులను; పఱచెనె?= బాధించాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు సంజయు డిట్లా బదులు పలికాడు: 'ఔరా! నీ కొడుకు మీద దోషం ఆరోపిస్తావు గాని, నీలోని లోపం నీవు గుర్తించకున్నావు. నీకు తెలియకుండ సుయోధనుడు పాండునందనులను కష్టపెట్టాడా?

వ. **ఆ పని గడవంబడియె; వార్తలు వినియెదవేని వినుము; దుర్యోధనుండు దుశ్శాసన శకుని కర్ణులతో విచారించి యులూకుం బిలిపించి నీవు వోయి పాండవులంగని వాసుదేవు సన్నిధిని బాంచాల విరాట ప్రముఖులు వినఁ బలుకు'మని పరుసని మాటలు గఱపి పుచ్చిన నతండును.** **187**

ప్రతిపదార్థం: ఆ పని= ఆ కార్యం; కడవన్+పడియెన్= జరిగిపోయింది; వార్తలు వినియెదవు+ఏనిన్= సంగతులు వినదలచుకొంటే; వినుము= ఆలకించుము; దుర్యోధనుండు దుశ్శాసన శకుని కర్ణులతోన్; విచారించి= ఆలోచించి; ఉలూకున్; పిలిపించి= ఉలూకుడనెడి శకుని కుమారుడిని రప్పించి; నీవు పోయి, పాండవులన్‌కని; వాసుదేవు సన్నిధిని= శ్రీకృష్ణుడి సమక్షంలో; పాంచాల విరాట ప్రముఖులు= ద్రుపదుడు, విరాటుడు మున్నగువారు; వినన్; పలుకుము; అని; పరుసని మాటలు= కఠినవాక్యాలు; కఱపి= చెప్పి; పుచ్చినన్= పంపగా; అతండును= ఆ ఉలూకుడుకూడ.

తాత్పర్యం: ఆ కార్యం గడచిపోయింది. సంగతులు వినదలిస్తే వినుము. దుర్యోధనుడు దుశ్శాసన శకుని కర్ణులతో మంతనమాడి ఉలూకుడనే శకుని పుత్రుడిని పిలిపించి, నీవు వెళ్ళి పాండవులను చూచి, అక్కడ శ్రీకృష్ణుడి సమ్ముఖంలో ద్రుపదుడు విరాటుడు మొదలైనవారు వింటుండగా ఈ పలుకులు పలుకుము అని కొన్ని కఠిన వాక్యాలు అతడికి చెప్పి పంపగా వాడు (వెళ్ళాడు.)

క. **చని కొలువున ధర్మసుతుం । గని 'దుర్యోధనుఁడు చెప్పఁగా నను నియమిం**
చిన మాటలు గొన్ని గలవు । విను మలుగక' యనిన నతఁడు విని యిట్లనియెన్. **188**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; కొలువునన్= సభలో; ధర్మసుతున్+కని= ధర్మజుడిని చూచి; దుర్యోధనుఁడు= సుయోధనుడు; చెప్పఁగాన్= మీకు తెలుపుటకై; ననున్= నన్ను; నియమించిన మాటలు= ఆజ్ఞాపించిన పలుకులు; కొన్ని కలవు= కొన్ని

ఉన్నాయి; అలుగక= నాపై కోపించక; వినుము= ఆలకించుము; అనినన్= అని ఉలూకుడు పలుకగా; అతఁడు విని= ధర్మపుత్రుడు ఆకర్ణించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఉలూకుడు వెళ్ళి సభలో ధర్మపుత్రుడిని చూచి 'దుర్యోధనుడు మీకు చెప్పుమని నన్ను ఆజ్ఞాపించిన మాటలు కొన్ని ఉన్నాయి. నాపై కోపగించక వాటిని వినుము' అని పలుకగా ధర్మజుడు విని ఇట్లా అన్నాడు:

ఆ. 'నీకు వెఱవనేల? నిన్ను నా బుద్ధిమం । తుండు చెప్పు మనిన తులువమాట
లెన్ని గలవు వాని నన్నింటి ననుమాన । మింత లేక యాడు మెల్ల వినఁగ. 189

ప్రతిపదార్థం: నీకున్= నీకు; వెఱవన్+ఏల?= భయపడటమెందుకు?; నిన్నున్= నిన్ను; ఆ బుద్ధిమంతుండు= ఆ ప్రజ్ఞావంతుడు; చెప్పుము+అనిన= పలుకుమనిన; తులువమాటలు= తుంటరికూతలు; ఎన్ని కలవు= ఎన్ని ఉన్నాయో; వానిన్+అన్నింటిన్= ఆ మాటలన్నీ; అనుమానము= సందేహం; ఇంత లేక= రవంతయు లేకుండా; ఎల్లన్+వినఁగన్= అందరూ ఆలకిస్తుండగా; ఆడుము= పలుకుము.

తాత్పర్యం: 'ఉలూకా! నీవు భయపడనక్కరలేదు. నిన్ను ఆ బుద్ధిమంతుడు పలుకుమన్న తుంటరి మాటలు ఎన్ని ఉన్నాయో వాటి నన్నింటిని సందేహం కొంచెం కూడా లేకుండ ఈ కొలువులోని వారెల్లరు ఆలకించగా పలుకుము.'

వ. అనిన నులూకుం డిట్లనియె : 190

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మజు డనగా; ఉలూకుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజు డట్లా పలుకగా ఉలూకు డిట్లా అన్నాడు:

సీ. 'కయ్యంబునకుఁ బెద్ద కాలమేనియుఁ బూఁచి । పట్టి వచ్చితి కడు బరవసమున;
సంజయుతో మీరు శంకలే కాడిన । యెక్కుడు మాటలు పెక్కు గలవు;
భూమి భాగము గోలుపోయిన యలుకకు । ద్రౌపదిఁ బఱచిన దైన్యమునకుఁ
దగ మంచిబంటవై తఱి యిది బాహుబ । లాస్త్ర విద్యలు చూపనని తలంచి

ఆ. నిలువ వలయు నీకుఁగలవారి నెల్లను । గూర్చి మోహరించికొని కడంగి
నడవు సమరమునకు; వెడజంకఁబోదింకఁ । దప్పఁ గ్రుంకలేదు తఱికిఁ జొరుము. 191

ప్రతిపదార్థం: కయ్యంబునకున్= యుద్ధానికి; పెద్దకాలము+ఏనియున్= దీర్ఘకాలమైనను; పూఁచి పట్టి= పూనిక వహించి; కడున్ బరవసమునన్= మిక్కిలి ధైర్యంతో; వచ్చితి(వి)= వచ్చావు; సంజయుతోన్= సంజయుడితో; మీరు; శంకలేక= జంకు వహించక; ఆడిన= పలికిన; ఎక్కుడు మాటలు= మీ యోగ్యతను మించిన పలుకులు; పెక్కు కలవు= అనేకములున్నవి; భూమిభాగమున్= రాజ్యభాగాన్ని; కోలుపోయిన+అలుకకున్= పోగొట్టుకొన్న కోపానికి; ద్రౌపదిన్= పాంచాలిని; పఱచిన దైన్యమునకున్= అవమానించిన చిన్నతనానికి; తగన్= చక్కగా; మంచి బంటవు+ఐ= గొప్ప వీరుడవై; బాహుబల+అస్త్రవిద్యలు చూపన్= భుజబలమును, బాణ విద్యా నైపుణ్యమును చూపటానికి; తఱి+ఇది= ఇది తగిన సమయం; అని తలంచి= అని భావించి; నిలువన్ వలయున్= నిలబడవలెను; నీకున్+కలవారిన్+ఎల్లను= నీకున్న వారినందరినీ; కూర్చి= చేర్చుకొని; మోహరించికొని= వ్యూహము లేర్పరచుకొని; కడంగి= పూని; సమరమునకున్= కయ్యానికి; నడవు(ము)= కదలుము; వెడ

జంకన్+బోదు= ఇంచుక జంకితే పోవదు, ఏ మాత్రం జంకినా లాభం లేదు; ఇంకన్= మరి; తప్పన్+క్రుంకన్లేదు= తప్పించుకోవడానికి వీలుకాదు; తఱికిన్= సమయానికి; చొరుము= ప్రవేశించుము, పూనుకొమ్ము.

తాత్పర్యం: 'యుద్ధం చేయటానికి బహుకాలం వేచియుండి మిక్కిలి ధైర్యంతో వచ్చావు. సంజయుడితో మీ యోగ్యతకు మించి పల్కిన మాట లెన్నో ఉన్నవి. రాజ్యభాగం పోగొట్టుకొన్నందుకు, ద్రౌపదిని భంగపెట్టినందుకు పగదీర్చుకొనే సమయ మాసన్నమైనదని తలంచి మీ బాహుబలం, మీ బాణ విద్యా కౌశలం చూపటానికి కదనరంగంలో మేటి వీరుడవై నిలబడుము. నీకున్న వారి నందరినీ కూర్చుకొని, వ్యూహా లమర్చుకొని కదనానికి కదలిరమ్ము. ఇక జంకి లాభంలేదు. తప్పించుకొనటానికి వీలుగాదు. సమయానికి రమ్ము.

క. ఆతతబలుఁ డగు భీష్ముని చేతి । బలువు ద్రోణు నంపసెల లవియుటయుం
జూతు రటురండు కృష్ణుని । చేతన సకలంబుఁ జక్కఁ జేసికొనుండీ! 192

ప్రతిపదార్థం: ఆతత బలుఁడు+అగు= అధికబలంగల వాడయిన; భీష్ముని= పితామహుడి యొక్క; చేతి బలువు= బాహుశక్తి; ద్రోణు+అంపసెలలు= ద్రోణాచార్యుల బాణపు ములుకులు; అవియుటయున్= గ్రుచ్చుకొనటమున్నూ; చూతురు= చూస్తారు; అటురండు= యుద్ధానికి రండి; కృష్ణునిచేతన= కృష్ణుడి వలననే; సకలంబున్= అంతయు; చక్కఁజేసికొనుండీ= చక్కబరచుకొనండి.

తాత్పర్యం: పోరాటానికి రండి. అధిక బలసంపన్నుడైన భీష్ముడి భుజశక్తినీ, ద్రోణాచార్యుల బాణాగ్రాల పోటులనూ కనుగొనగలరు. మీరు శ్రీకృష్ణుడిచేతనే అంతా చక్కబెట్టుకొనండి.

క. వారిద్దఱ వాలమ్ముల । బారింబడి యర్జునునకు బ్రదుక వశమె? మీ
వారెల్ల నెఱుంగరె య । వ్వీరుల దివ్యాస్త్రశస్త్ర విభవ సమృద్ధుల్?' 193

ప్రతిపదార్థం: వారి+ఇద్దఱవాలు+అమ్ముల= ఆ భీష్మ ద్రోణుల నిడుదలైన శరాలయొక్క; బారిన్+పడి= పాలై (హింసకులోనై;) అర్జుననకున్= పార్థుడికి; బ్రదుకన్ వశమె?= జీవించటానికి శక్యమౌతుందా? మీవారు+ఎల్లన్= మీ వారందరూ; ఆ+వీరుల= ఆ శూరులిద్దరియొక్క; దివ్య+అస్త్రశస్త్ర విభవ సమృద్ధుల్= శ్రేష్ఠములైన శరములయొక్కయు, ఆయుధముల యొక్కయు శక్తి సంపన్నతలు; ఎఱుంగరె?= తెలియరా?

తాత్పర్యం: భీష్మ ద్రోణు లిద్దరి దీర్ఘములైన బాణాల బారిన పడి అర్జునుడు బ్రతకటం సాధ్యమా? మీ వారందరు ఆ మేటి శూరులయొక్క దివ్యాస్త్రాల ఆయుధాల శక్తి సంపన్నతను తెలియరా ఏమి?'

వ. అని భీమసేనుం జూచి. 194

తాత్పర్యం: అని ఉలూకుడు పలికి భీమసేనుడిని చూచి.

క. 'ఈ వాయుపుత్త్రుఁ డాజిం । ద్రావుదు నే దుస్ససేను రక్తం బనియెం;
ద్రావఁగ శక్యం బేనిం । ద్రావు మనన్ రాదె? యింకఁ దడ వేమిటికిన్? 195

ప్రతిపదార్థం: ఈ వాయు పుత్త్రుఁడు= ఈ భీముడు; దుస్ససేను రక్తంబు= దుశ్శాసనుడి నెత్తురు; ఆజిన్= యుద్ధంలో; నేన్= నేను; త్రావుదున్+అనియెన్= నేను త్రాగుతానని అన్నాడు; త్రావఁగన్= త్రాగటానికి; శక్యంబు+ఏనిన్= వీలయితే; త్రావుము+అనన్ రాదె?= త్రాగుమని చెప్పరాదా?; ఇంకన్= మరి; తడవు+ఏమిటికిన్?= ఆలస్య మెందుకు?

తాత్పర్యం: 'ఈ భీముడు దుశ్శాసనుడి నెత్తురు యుద్ధంలో నేను త్రాగుతానని ప్రతిజ్ఞ చేశాడు. త్రాగటానికి తనకు శక్యమైతే త్రాగుమని చెప్పుము. మరి జాగు చేయటమెందుకు?

క. విను నూతి కప్ప విధమున । నిను నీవ యెఱుంగు; దెఱుఁగ నేరవు గర్వం
బున నావలి కొలఁది రణం । బున నొకమరి పెట్టువడక పోనేర్చెదవే?' 196

ప్రతిపదార్థం: విను= భీమసేనా, వినుము; నూతికప్పవిధమునన్= బావిలోని మండూకం వలె; నినున్= నిన్ను మాత్రమే; నీవ+ ఎఱుంగుదు(వు)= నీవు తెలియుదువు; గర్వంబునన్= పొగరుచేత; ఆవలి కొలఁదిన్= ఇతరుల బల పరిమాణాన్ని; ఎఱుఁగన్ నేరవు= తెలియజాలవు; రణంబునన్= సంగ్రామంలో; ఒకమరి= ఒకసారి; పెట్టువడక= దెబ్బతినక; పోన్+నేర్చెదవే?= తప్పించుకొని పోగలవా?

తాత్పర్యం: భీమసేనా! వినుము. బావిలోని కప్పవలె నిన్ను మాత్రమే నీ వెఱుగుదువు. మదంవలన ఎదుటివారి బల పరిమాణ మేమిటో తెలియకున్నావు. సంగ్రామంలో ఒకసారి మా చేత జిక్కి పెట్టులు (దెబ్బలు) తినకుండ తప్పించుకొని పోలేవు సుమా!'

వ. అని పలికి సవ్యసాచిం జూచి. 197

తాత్పర్యం: అని పలికి అర్జునుడిని చూచి.

తే. 'వినుము గాండీవ మనునొక విల్లు తాటి । పొడవు గలిమియుఁ, గృష్ణుండు పూని తోడు
గూడుకొని వచ్చుటయు నెఱుంగుదుము; వీని । కెల్ల శంకించి భూమి పా లీము గాని. 198

ప్రతిపదార్థం: వినుము= అర్జునా, ఆలకించుము; గాండీవము+అను= గాండీవమనే పేరుగల; ఒక విల్లు= ఒక చాపం; తాటిపొడవు+కలిమియున్= తాటిచెట్టంత పొడవు గలిగి ఉండుటయు; కృష్ణుండు= శౌరి; పూని= పూనిక వహించి; తోడు కూడుకొని వచ్చుటయున్= నీకు సాయంగా వెంబడిరావటం; ఎఱుంగుదుము= మాకు తెలుసు; వీనికిన్+ఎల్లన్= వీటినన్నిటిని చూచి; శంకించి= జంకి; భూమిపాలు+ఈము+కాని= మేము పుడమిలో భాగం మీ కీయము సుమా!

తాత్పర్యం: 'అర్జునా! తాటిచెట్టంత పొడవు గలిగిన గాండీవ మనే విల్లు నీకున్నదనీ, కృష్ణుడు నీకు సాయంగా నీవెంట ఉన్నాడనీ మాకు బాగా తెలుసు. ఈ ఆర్భాటాలకు బెదరిపోయి మీకు పుడమిలో పాలుపంచి మే మొసగం సుమా!

క. పవనజు గదయును నీ గాం । డివమును నెట వోయె నంగడికిఁ బాంచాలిం
దివిచికొని వచ్చునెడఁ బలి । భవ మెఱుఁగవె బీర మేల పలుకుదు తోడ్తోన్? 199

ప్రతిపదార్థం: పాంచాలిన్= ద్రౌపదిని; అంగడికిన్= సభలోనికి; తివిచికొనివచ్చు+ఎడన్= ఈడ్చుకొని వచ్చేటప్పుడు; పవనజు గదయున్= భీముడి గదయు; నీ గాండివమును= నీ గాండీవమును; ఎట+పోయెన్?= ఎక్కడికి పోయాయి?; పరిభవము= జరిగిన అవమానం; ఎఱుఁగవె?= తెలియవా?; తోడ్తోన్= వెంటవెంటనే; బీరము+ఏల+పలుకుదు(వు)?= పౌరుష వచనాలు ఎందుకు పలుకుతావు?

తాత్పర్యం: ద్రౌపదిని ఒడ్డోలగం లోనికి ఈడ్చి తెచ్చేటప్పుడు భీముడి గద, నీ గాండీవం ఎక్కడికి వెళ్ళాయి? జరిగిన అవమానం మరచావా? మాటి మాటికి బింకపు మాటలు ఎందుకు పలుకుతావు?

చ. వలలుఁ డనన్ విరాటుకడ వంటలవాఁడయి భీముఁడున్, బృహ
న్నల యన నాఁడు పేడివయి నాన యొకింతయు లేక నీవు న
గ్గలమగు దైన్యమొంది కడుఁ గాఱియ వొందితి రుర్వియేలునా
సలఁబడి; సవ్యసాచి! యిది శౌర్యమొ? బాహుబలంబొ? చెప్పుమా! 200

ప్రతిపదార్థం: వలలుఁడు+అనన్= వలలుడనే మారుపేరుతో; వంటలవాఁడు+అయి= బానసీడై; భీముఁడున్= భీముడున్నూ; బృహన్నల+అనన్= బృహన్నల అనగా; నాఁడు= అజ్ఞాతవాస సమయంలో; పేడివి+అయి= నపుంసకుడవై; నాన= సిగ్గు; ఒక+ ఇంతయున్ లేక= ఇంచుకంతైనలేక; నీవున్= నీవునూ; ఉర్వి+ఏలు+ఆసలన్+పడి= పుడమిని పాలించవలెననే ఆశకు వశులై; అగ్గలము+అగు= అధికమైన; దైన్యము+ఒంది= దీనదశ జిక్కి; కడున్= మిక్కిలి; కాఱియ పొందితిరి= కష్టాలు అనుభవించారు; సవ్యసాచి!= ఓ అర్జునా!; ఇది శౌర్యమొ= ఇది శూరత్వమో; బాహు బలంబొ= భుజబలమో; చెప్పుమా= వచింపుము.

తాత్పర్యం: అర్జునా! వలలుడనే పేరుతో వంటలవాడై భీముడూ, బృహన్నల నామంతో షండుడవై నీవూ సిగ్గు రవంతైనా లేక, రాజ్యం పాలించవలెననే ఆశకు వశులై, విరాటుడి కొలువులో దీనులై నానాకష్టాల పాలైనారు కదా! ఇది శూర లక్షణమో, బాహు విక్రమమో నీవే చెప్పవలె.

ఉ. మాయలు నింద్రజాలములు మాధవుఁ డిందును గొన్ని వన్నినన్
బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడితేనియున్
వేయును నేల? పార్థులును విష్ణులు నేఁబదివేలు వచ్చినం
జేయుదు మేము గయ్య మొకచీరియు సంపదఁ బంచియిత్తుమే?' 201

ప్రతిపదార్థం: మాధవుఁడు= శ్రీకృష్ణుడు; మాయలున్= టక్కులు; ఇంద్రజాలములు= కనుకట్టు విద్యలు; ఇందును= ఇక్కడ; కొన్ని పన్నినన్= కొన్ని చేసిననూ; పాయవు= తీరవు; రజ్జులు= ఆత్మస్తుతులతో కూడిన వ్యర్థ సంభాషణలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అవారణన్= అడ్డం లేకుండా; నీవు+ఎట్టులు+ఆడితి+ఏనియున్= నీవెట్లా పల్కినప్పటికినీ; వేయును+ఏల?= పలుమాటలెందుకు? పార్థులును= అర్జునులు(కౌంతేయులు); విష్ణులు= శ్రీకృష్ణులు; ఏబదివేలు వచ్చినన్= ఏబదివేల మంది వచ్చినప్పటికిన్నీ; ఏము= మేము; కయ్యము చేయుదుము= యుద్ధం చేస్తాము; సంపదన్= రాజ్యసంపత్తిలో; ఒక చీరియున్= ఒకింత చీల్చి; పంచి+ ఇత్తుమే= మీకు పంచి ఇస్తామా? (ఇవ్వమని అభిప్రాయం.)

తాత్పర్యం: మాధవుడు టక్కుటమారాలు, ఇంద్రజాలాలు కొన్ని పన్నినప్పటికీ, గాలిలో కలిసిపోయే ప్రగల్భవచనాలు నోటికడ్డం లేకుండ నీ వెలా ప్రేలినప్పటికీ, ఏబది వేలమంది అర్జునులు శ్రీకృష్ణులు వచ్చినప్పటికీ మేము యుద్ధం చెయ్యకమానము. పలుమాట లెందుకు? పుడమిలో రవంతకూడా చీల్చి మీకు పంచి ఇవ్వం.'

వ. అనిన భీమార్జున నకుల సహదేవు లొండొరుల మొగంబులు సూచుచు నాసనంబులు చలింప, మొగంబులు జేవుఱింపఁ గ్రోధాయత్తచిత్తులై యున్నం గనుంగొని నవ్వుచు నారాయణుం డులూకున కిట్లనియె 'నీవు వోయి సుయోధనుతో నెల్లవారును విన నిట్లనుము: 202

ప్రతిపదార్థం: అనినన్; భీమ+అర్జున నకుల సహదేవులు; ఒండు+ ఒరుల మొగంబులు చూచుచున్= ఒకరి ముఖం మరొక్కరు చూచుకొంటూ; ఆసనంబులు చలింపన్= పీఠాలు కదలగా; మొగంబులు జేవుఱింపన్= ముఖాలు ఎర్రపడగా; క్రోధ+ఆయత్త చిత్తులు+ఐ= కోపానికి వశమైన మనస్సులు కలవారై; ఉన్నన్= ఉండగా; కనుంగొని= చూచి; నవ్వుచున్; నారాయణుండు; ఉలూకునకున్; ఇట్లనియెన్; నీవుపోయి; సుయోధనుతోన్; ఎల్లవారును వినన్; ఇట్లు+ అనుము= ఈ రీతి పలుకుము.

తాత్పర్యం: ఉలూకుడి పలుకులు విని భీమార్జున నకుల సహదేవులు ఒకరిముఖం మరొకరు చూస్తూ, కూర్చున్న తమ ఆసనాలు కదలగా, ముఖాలు ఎర్రదనం పొందగా కోపానికి అధీనమైన మనస్సులు కలవారై ఉండగా శ్రీకృష్ణుడు చూచాడు. చూచి నవ్వుతూ ఉలూకుడితో 'నీవు వెళ్ళి అక్కడ అందరూ వింటుండగా దుర్యోధనుడితో ఇట్లా చెప్పు.

తే. బవర మెల్లియ బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగ రాదు
కృష్ణ సారథికంబగు జిష్ణురథము । తొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు. 203

ప్రతిపదార్థం: బవరము= యుద్ధం; ఎల్లి+అ= రేపే; బిరుదవు+ఐ= శూరుడవై; బరవసంబు+కలిగి= ధైర్యం వహించి; చావుము= మరణించుము; చావక= మరణం పాలుగాక; తొలఁగన్+రాదు= యుద్ధరంగం నుండి తప్పించుకొనలేవు; కృష్ణ సారథికంబు+అగు= శ్రీకృష్ణుడు సారథిగా కలిగిన; జిష్ణు రథము= జయశీలుడైన పార్థుడి అరదం; తొడరి= ఎదిరించి; నీవు+ ఎందున్+చొచ్చినన్= నీవెక్కడ ప్రవేశించినప్పటికీ; తోన్+అ చొచ్చున్= వెంబడే ప్రవేశిస్తుంది.

తాత్పర్యం: యుద్ధం రేపే. వీరుడవై ధైర్యమూని మరణించుము. మరణించక తప్పించుకొనిపోలేవు. శ్రీకృష్ణుడు సారథ్యం వహించగా వెడలిన విజయుడి తేరు ని న్నెదిరించి నీ వెక్కడ దూరితే వెంటనే తానూ అక్కడ దూరుతుంది.

క. రిత్తలు రజ్జెడువాఁడే । మత్తగజాయుతబలుండు మారుతి యని మ
ద్వృత్తుఁడగు దుస్ససేనుని । నెత్తు రురము వ్రచ్చి త్రావు నీవుం జూడన్. 204

ప్రతిపదార్థం: మత్తగజ+అయుతబలుండు= మదించిన పదివేల యేనుగుల బలం గలిగిన; మారుతి= వాయుపుత్రుడు భీముడు; రిత్తలు= వట్టిమాటలు; రజ్జెడువాఁడే= వాగునట్టివాడా? అనిన్= కదనంలో; ఉద్వృత్తుఁడు+అగు= గర్వి అయిన; దుస్ససేనుని= దుశ్శాసనుడి యొక్క; నెత్తురు= నెత్తురును; ఉరము వ్రచ్చి= గుండె చీల్చి; నీవున్= నీవు; చూడన్= చూస్తూ ఉండగా; త్రావున్= త్రాగగలడు.

తాత్పర్యం: భీముడు పదివేల యేనుగుల సత్తువగలవాడు. అత డెప్పుడూ వట్టిమాటలు వదరెడువాడు కాడు. కదనంలో దుశ్శాసనుడి వక్షం చీల్చి నీవు చూస్తుండగనే రక్తం త్రాగగలడు.'

వ. అని యిట్లు హరి పలికిన యనంతరంబ యర్జునుం డులూకున కిట్లనియె: **205**

తాత్పర్యం: ఇట్లా కృష్ణుడు పలికిన తరువాత అర్జునుడు ఉలూకుడితో ఇట్లా అన్నాడు:

క. 'వారు గలరు వీరు గలరు । పోరికి నని చెప్పె దీవు పొంగారుచు మీ
వారిని మిమ్మును రేపు గ । దా రూ పేర్పడఁగఁ జూచెదం గితవసుతా! **206**

ప్రతిపదార్థం: కితవసుతా!= ఓ జూదరికొడుకా!; పోరికిన్= యుద్ధానికి; వారు కలరు= వారున్నారు; వీరు కలరు= వీరున్నారు; అని= అంటూ; పొంగారుచున్= నిక్కుతూ; ఈవు= నీవు; చెప్పెదవు= చెపుతున్నావు; మీవారినిన్= మీకు సాయంగా ఉన్నవారినీ; మిమ్మును= బింకాలాడుతున్న మిమ్మునూ; రేపు+కదా= రేపటి దినంగదా; రూపు+ఏర్పడఁగన్+చూచెదను= మీ విధమెట్టిదో తేటతెల్లంగా కనుగొంటాను.

తాత్పర్యం: 'మాకు యుద్ధంలో సాయపడటానికి వారున్నారు. వీరున్నారు' అని నీవు నిక్కుతూ చెప్తున్నావు. మీకు సాయంగా ఉన్నవారినీ, బింకాలాడుతున్న మిమ్ములనూ రేపుగదా స్పష్టంగా చూస్తాను.

చ. తన భుజశక్తి లేక యొరుదర్పమ యూఁది పరాక్రమింప వ
చ్చిన నది సెల్లునే? కులవిశిష్టుని సువ్రతు వృద్ధు నార్యు భీ
ష్మని నెసకొల్పి సేనలకు ముఖ్యుఁడ వీవని యుబ్బఁజేసి యీ
సునఁ దలపెట్టి చంపికొనఁజూచె సుయోధనుఁ డింత నేమగున్? **207**

ప్రతిపదార్థం: తన భుజశక్తి లేక= తనకు బాహుబలం లేకుండా; ఒరుదర్పము+అ= పరులశక్తినే; ఊఁది= ఆధారం చేసికొని; పరాక్రమింపన్+వచ్చినన్= శౌర్యం చూపవస్తే; అది చెల్లునే= అది సాగుతుందా?; కుల విశిష్టునిన్= కురువంశంలో సదాచార సంపన్నుడునూ; సువ్రతున్= మంచి నియమాలు కలవాడునూ; వృద్ధున్= ముసలివాడునూ; ఆర్యున్= పూజ్యుడునూ అయిన; భీష్మునిన్= పితామహుడిని; ఎసకొల్పి= పురికొలిపి; సేనలకున్+ముఖ్యుఁడవు+ఈవు+అని= సైన్యాలన్నింటికీ ప్రధానాధికారివి నీవేఅని; ఉబ్బన్+చేసి= ఉప్పొంగించి; ఈసునన్+తలపెట్టి= ద్వేషంతో సంకల్పించి; సుయోధనుఁడు= దుర్యోధనుడు; చంపికొనన్+చూచెన్= చంపుకొనటానికి యత్నించాడు; ఇంతన్+ఏమి+అగున్?= భీష్ముడు సర్వసైన్యాధిపతి అయినంత మాత్రాన తాను గట్టెక్కినట్లా?

తాత్పర్యం: తనకు బాహుబలం లేకుండా పరులశక్తి నాశ్రయించి పరాక్రమం ప్రకటింపజూస్తే సాగదు. కురుకులంలో విశిష్టుడూ, మంచి నియమ నిష్ఠలు కలవాడూ, ముసలివాడూ, పూజ్యుడూ అయిన భీష్ముడిని పురికొల్పి సేనలన్నింటికి నీవే అధిపతివని ఉబ్బించి ఈర్ష్యతో అతడిని చంప దలపెట్టాడు సుయోధనుడు. భీష్ముడిని నమ్ముకొన్న మాత్రాన తాను ఒడ్డుకు చేరినట్లా?

చ. తన తలఁ పిట్లు భీష్మభుజదర్పము లోకముకంటె నెక్కు డీ
తని నొకభంగి నండగొని తప్పుదుఁ జావున కంచునున్నవాఁ;
డనిఁ దొలుముద్ద గొందుము రయంబున నాతని, వెండి ద్రోణులం
దునుముదు, మప్డు సూతసుతుఁ దోలుదు, మంతట నాస మాలెడున్. **208**

ప్రతిపదార్థం: తన తలఁపు+ఇట్లు= తన ఉద్దేశ మిది; భీష్మభుజ దర్పము= గాంగేయుడి బాహు పరాక్రమం; లోకముకంటెన్= లోకంలోనివారి శౌర్యంకంటె; ఎక్కుడు= అధికం; ఈతనిన్= భీష్ముడిని; ఒక భంగిన్= ఒక విధంగా; అండ+కొని= ఆధారంగా చేసికొని; చావునకున్+తప్పుదున్= మరణం గడచెదను; అంచున్= అని; ఉన్నవాఁడు= దుర్యోధను డాశతో ఉన్నాడు; అనిన్= పోరాటంలో; రయంబునన్= శీఘ్రంగా; ఆతనిన్= ఆ భీష్ముడిని; తొలుముద్ద కొందుము= మొదటి ముద్దగా ఆరగిస్తాం; వెండిన్= ఆతడి తర్వాత; ద్రోణులన్= గురువైన ద్రోణాచార్యుని; తునుముదుము= నరకివేస్తాము; అప్డు= ఆ వెంటనే; సూతసుతున్= కర్ణుడిని; తోలుదుము= రణరంగమునుంచి తరిమి వేస్తాము; అంతటన్= అప్పుడు; ఆసమాలెడున్= దుర్యోధనుడు ఆశ వదలుకొంటాడు.

తాత్పర్యం: సుయోధనుడి ఉద్దేశమిది- లోకంలోని వారందరికంటె భీష్ముడి భుజబలం ఎక్కువని. అది వట్టి భ్రమ. గాంగేయుడిని ఆధారంగా చేసికొని మరణం పాలుగాకుండ మనవలెనని దుర్యోధనుడు భావిస్తున్నాడు. కాని, అతడు విశ్వసించిన గాంగేయుడినే తొలిముద్దగా దిగమ్రింగుతాము. ఆ పిదప గురువైన ద్రోణాచార్యులను మట్టుపెడతాం. అవతల సూతపుత్రుడైన కర్ణుడిని తరుమగొడతాం. అప్పటికికాని సుయోధనుడు ఆశ వదలుకోడు.

క. **అనుజుల తనుజుల చావులు । కనుఁగొని మఱి తాను భీము గదచే నిలఁ గూ**
లిన యప్పుడైన దుర్యో । ధనుఁడు మదిం దలఁచుఁగాక తన దుష్కృతముల్. **209**

ప్రతిపదార్థం: అనుజుల= తమ్ముల యొక్కయు; తనుజుల= పుత్రుల యొక్కయు; చావులు= మరణాలు; కనుఁగొని= చూచి; మఱి= తరువాత; తాను= తాను; భీము గదచేన్= భీమసేనుడి గదాఘాతంతో; ఇలన్+కూలిన+ అప్పుడు+ఐనన్= నేలపై కూలినప్పుడైనా; దుర్యోధనుఁడు= సుయోధనుడు; తన దుష్కృతముల్= తన పాపములు; మదిన్= మనసులో; తలఁచున్+కాక!= భావించుకొనగలడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తమ్ముల, కుమారుల మరణాలు చూచి, భీముడి గదాఘాతంతో ధరణిపై కూలినప్పుడైనా తన పాపకార్యాలను స్మరించగలడు.

వ. **అది యట్లుండె; నీవు వేగపోయి రేపకడయ మీ రాజుం గలనికి నడపింపు'మనియె; నప్పుడు ధర్మనందనుం డులూకునకుం దాంబూలాభరణంబు లిచ్చి వీడుకొలిపి, ధృష్టద్యుమ్ను నవలోకించి 'యెల్లి కయ్యంబని మన సైన్యంబులకెఱింగించి సర్వసమరసన్నాహంబులు సమకట్టు'మని పనిచి కొలువు విరిసి చనియె; ధృష్టద్యుమ్నుండును ద్రోణులం దొడరం బడసితినని యుబ్బుచు వెడలి, భీష్మం దలపడఁగంటి నని పొంగు శిఖండి తోడుగా రాజు శాసనంబు నిర్వర్తించె; నిట యులూకుండు వచ్చి దుర్యోధనుం బేరోలగంబునం గని యతనికిఁ గృష్ణార్జునుల పలుకు లున్న రూపు విన్నవించిన, నతండు కర్ణుదెసఁ గనుంగొని 'సమస్త సేనలకు రేపు బవరం బని చెప్పి పుచ్చుము; సకల సాధనంబులు నాయితంబులు సేయు' మని పనిచిన నతండు నట్లచేసె; నిట్లు భయకటకంబులు రణంబునకు నుత్సహించి విజృంభించి యుల్లసిల్లె' ననిన ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె:** **210**

ప్రతిపదార్థం: అది+అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉంచుము; నీవు; వేగన్= శీఘ్రంగా పోయి; రేపకడయ= ఉదయమే; మీ రాజున్; కలనికిన్= యుద్ధానికి; నడపింపుము; అనియెన్; అప్పుడు ధర్మనందనుండు; ఉలూకునకున్; తాంబూల+

ఆభరణంబులు+ఇచ్చి; వీడుకొలిపి= వెళ్ళుటకు అనుమతినిచ్చి; ధృష్టద్యుమ్నున్; అవలోకించి= చూచి; ఎల్లి= రేపు; కయ్యంబు+అని; మన సైన్యంబులకున్; ఎఱింగించి; సర్వ సమర సన్నాహంబులు= అన్ని రకాలైన యుద్ధ ప్రయత్నాలు; సమకట్టుము+అని= చేయుమని; పనిచి= ఆజ్ఞాపించి; కొలువు విరిసి= సభ చాలించి; చనియెన్; ధృష్టద్యుమ్నుండును; ద్రోణులన్; తొడరన్+పడసితిన్= ఎదిరింపగంటినని; ఉబ్బుచున్= సంతోషిస్తూ; వెడలి; భీష్మన్+తలపడన్+కంటిని= భీష్మతో పోరాడనోచితిని; అని; పొంగు= సంతసిల్లే; శిఖండి; తోడుగాన్= సహాయుడు కాగా; రాజు శాసనంబు= రాజాజ్ఞను; నిర్వర్తించెన్= నెరవేర్చాడు; ఇటన్; ఉలూకుండున్ వచ్చి దుర్యోధనున్; పేరు+ఓలగంబునన్= పెద్ద సభలో; కని; అతనికిన్; కృష్ణ+అర్జునుల పలుకులు; ఉన్నరూపు= ఉన్నవి ఉన్నట్లుగా; విన్నవించినన్= మనవి చేయగా; అతండు= సుయోధనుడు; కర్ణుదెసన్; కనుంగొని; సమస్త సేనలకున్; రేపు; బవరంబు= యుద్ధం; అని చెప్పి; పుచ్చుము= పంపుము; సకల సాధనంబులు= అన్ని యుద్ధోపకరణాలు; ఆయితంబులు= సంసిద్ధాలు; చేయుము; అని; పనిచినన్= పంపగా; అతండు= రాధేయుడు; అట్ల చేసెన్; ఇట్లు; ఉభయకటకంబులు= రెండు సైన్య పక్షాలు; రణంబునకున్; ఉత్సహించి= ఉద్యోగించి; విజృంభించి= చెలరేగి; ఉల్లసిల్లెన్= ప్రకాశించాయి; అనినన్; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విషయ మట్లుంచు. నీవు తొందరగా వెళ్ళి ఉదయమే మీ రాజును యుద్ధానికి పంపుమని అర్జునుడు పలికాడు. ధర్మరాజు ఉలూకుడికి తాంబూలాభరణాలు ఇచ్చి వెళ్ళుమని చెప్పాడు. అవతల ధృష్టద్యుమ్నుడిని చూచి 'రేపే యుద్ధమని మన సైన్యాలకు తెలిపి యుద్ధ సన్నాహాలన్నీ చేయుమని ఆజ్ఞాపించి కొలువు చాలించి వెళ్ళాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఎదిరించే అవకాశం తనకు లభించినందుకు సంతోషించాడు. భీష్ముడిని ఎదుర్కొనే భాగ్యం తనకు కల్గినందుకు శిఖండి పొంగిపోయాడు. ధృష్టద్యుమ్నుడు శిఖండిని తోడుగా చేసికొని రాజాజ్ఞను నిర్వర్తించాడు. పాండవులకడనుండి తిరిగివచ్చిన ఉలూకుడు దుర్యోధనుడిని ఒడ్డోలగంలో చూచి, కృష్ణార్జునులు పలికిన పలుకులు ఉన్నవి ఉన్నట్లుగా మనవి చేశాడు. దుర్యోధనుడు కర్ణుడి వైపు చూచి, 'మన సేనలన్నింటికి రేపే సంగ్రామమని చెప్పి పంపుము; సకలసాధనాలను సమాయత్తం చేయవలసిం'దని పంపగా అతడు అట్లా చేశాడు. ఈ రీతిగా రెండు పక్షాలు చెలరేగి యుద్ధోత్సాహంతో ఉల్లసిల్లాయి' అని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు విని మళ్ళీ అతడితో ఇట్లా అన్నాడు:

క. 'వినుము హరి తోడుగల య । ర్జును గెలువ నదీసుతునకుఁ జొప్పడునే? యా
పని నిలుపు; ములూకుని చె । ప్పిన మాటల కేమి యనిరి పిదపఁ గొలువునన్?' 211

ప్రతిపదార్థం: వినుము= సంజయా! నా మాటలు వినుము; హరితోడు+కల= శ్రీకృష్ణుడి సహాయం కలిగిన; అర్జునున్= అర్జునుడిని; గెలువన్= జయించటానికి; నదీసుతునకున్= భీష్ముడికి; చొప్పు+పడునే?= శక్యమౌతుందా?; ఆ పని నిలుపుము= ఆ విషయం అలాఉంచు; ఉలూకుని చెప్పిన మాటలకున్= ఉలూకుడు పలికిన పలుకులకు; పిదపన్= తరువాత; కొలువునన్= సభలో; ఏమి+అనిరి?= ఎవ్వరేమన్నారు?

తాత్పర్యం: 'సంజయా! శ్రీహరి సహాయం కలిగిన అర్జునుడిని జయించటానికి భీష్ముడికి సాధ్యమౌతుందా? ఆ విషయం అట్లా ఉంచు. ఉలూకుడు చెప్పిన మాటలు విన్న తరువాత సభలో ఎవ రేమి పలికారో? నాకు తెలుపుము.'

వ. అనిన విని యంబికానందనునకు సూతనందనుం డిట్లనియె : 212

ప్రతిపదార్థం: అనినన్; విని; అంబికానందనునకున్= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడితో; సూతనందనుండు= సూతజాతివాని కొడుకైన సంజయుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు సంజయు డిట్లా బదులు చెప్పాడు:

ఆ. 'అయ్యులూకు పలుకు లన్నియు విని భవ । త్తనయుతోడ నిట్టులనియె భీష్ముఁ
'డేనుగలుగ వెఱవ నేటికి? సేనలఁ । గాతు నీవు మెచ్చఁ గౌరవేంద్ర! 213

ప్రతిపదార్థం: ఆ+ఉలూకుపలుకులు= ఆ ఉలూకుడి మాటలు; అన్నియున్ విని= అన్నిటినీ ఆలకించి; భవత్+తనయుతోడన్= నీ కుమారునితో; భీష్ముఁడు= గాంగేయుడు; ఇట్టులు+ అనియెన్= ఈ ప్రకారం చెప్పాడు; కౌరవ+ఇంద్ర= కురునాథా!; ఏను= నేను; కలుగన్= ఉండగా; వెఱవన్+ఏటికిన్?= భయపడటం ఎందుకు?; నీవు మెచ్చన్= నీవు శ్లాఘించగా; సేనలన్+కాతున్= సైన్యాలను రక్షిస్తాను.

తాత్పర్యం: ఉలూకుడు చెప్పినమాట లన్నీ విని భీష్ముడు నీ కుమారుడితో ఇట్లా వచించాడు: 'కురురాజా! నేనుండగా నీకు భయమెందుకు? నీవు మెచ్చేటట్లు సేనలన్నింటినీ సంరక్షిస్తాను.

క. నడిపింపఁగఁ బొడిపింపఁగ । నెడమడువై కలఁగినప్పు డేర్పఱుపఁగ నేఁ
గడునేర్తుఁ బేర్చు నాదగు । కడిమియ నీ సైన్యమునకు గౌసెన కాదే?' 214

ప్రతిపదార్థం: నడిపింపఁగన్= సేనలను నడిపించటానికి; పొడిపింపఁగన్= యుద్ధం చేయించటానికి; ఎడమడువు+ఐ= తారుమారై; కలఁగిన+అప్పుడు= చెదరిపోయినప్పుడు; ఏర్పఱుపఁగన్= చక్కబరచటానికి; ఏన్= నేను; కడున్= మిక్కిలి; నేర్తున్= తెలియుదును; పేర్చు= అతిశయించే; నాదగు= నాయొక్క; కడిమి+అ= పరాక్రమమే; నీ సైన్యమునకున్= నీ సేనకు; గౌసెన+కాదే!= గలీబు(కవచం) సుమా!

తాత్పర్యం: దుర్యోధనా! సేనలను నడిపించటానికి, యుద్ధం చేయించటానికి, సైన్యం తారుమారై చెదరిపోయినప్పుడు కలతమాన్పి చక్కబరచటానికి నేను మిక్కిలి సమర్థుణ్ణి. అతిశయించే నా పరాక్రమమే సైన్యానికి రక్షాకవచమని గ్రహించుము.'

క. అనినన్ గురురా జిట్లను । 'వినుము పితామహా! మహాస్త్రవిత్తము లనఁగాఁ
జను నీవును నాచార్యుం । డును గలుగఁగ నాకు నెన్నఁడును వెఱపేలా? 215

ప్రతిపదార్థం: అనినన్= అని భీష్ముడు చెప్పగా; కురురాజు= దుర్యోధనుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; పితామహా!= తాతా!; వినుము= ఆలకించుము; మహా+అస్త్ర విత్తములు+అనఁగాన్+చను= మహాస్త్రా లెఱింగిన వారిలో శ్రేష్ఠులు అనగా ఒప్పునట్టి; నీవును= నీవూ; ఆచార్యుండును= గురువగు ద్రోణుడును; కలుగఁగన్= లభించగా; నాకున్= నాకు; ఎన్నఁడును= ఎప్పటికినీ; వెఱపు+ఏలా?= భయమెందుకు?

తాత్పర్యం: భీష్ము డారీతి ధైర్య వచనాలు పల్కగా విని సుయోధనుడు, 'తాతా! నీవూ, గురుడైన ద్రోణాచార్యులూ మహాస్త్రా లెరిగిన వారిలో పరమశ్రేష్ఠులు. మరి మీరుండగా నాకు భయమెందుకు?

తే. ఏను గంధర్వ కిన్నర దానవాది । దివ్య భూతంబులకును భీతిల్ల ననినఁ
బాండుపుత్త్రుల మాత్రకు భయము నాకు । నెక్కడిది? వ్రేల్మిడిన వారి యుక్కు మడఁతు.' 216

ప్రతిపదార్థం: ఏను= నేను; గంధర్వ= గంధర్వులు; కిన్నర= కిన్నరులు; దానవ= రాక్షసులు; ఆది= మొదలైన; దివ్య భూతంబులకును= దేవతా జాతులకూ; భీతిల్లన్+అనినన్= భయపడ నన్నప్పుడు; పాండుపుత్త్రుల మాత్రకున్= కేవలం అల్పులైన పాండవుల గురించి; నాకున్= నాకు; భయము+ఎక్కడిది?= భీతి లేనేలేదు; వ్రేల్మిడిన్+అ= చిటిక వేసినంతలో; వారి+ఉక్కు మడఁతున్= వారల పొగరు అణుస్తాను.

తాత్పర్యం: నేను గంధర్వ కిన్నర దానవాది దేవతా వర్గానికే భయపడనప్పుడు అల్పులైన పాండవుల విషయమై నాకు భయమెక్కడిది? చిటికవేసినంతలో వారి మద మణగిస్తాను.'

భీష్ముఁడు గౌరవసేనలో నతిరథ మహారథాదుల నిరూపణంబు సేయుట (సం. 5-162-15)

వ. అని పలికి మఱియు నిట్లనియె : 217

తాత్పర్యం: అని పలికి దుర్యోధనుడు అంతటితో ఆగక మరల ఇట్లా పలికాడు :

క. 'నీ యందు వారి యందుం । జేయంగల మానుసుల విశేషంబులఁ జి
త్తాయత్తంబుగఁ జెప్పుము । నీ యెఱుఁగని యవియు లేవు నిక్కపుఁ దరముల్.' 218

ప్రతిపదార్థం: నీ యందున్= నీ ఆధిపత్యంలో ఉన్న సేనలందును; వారియందున్= పాండవ పక్షంలో ఉన్న సేనలలో; చేయన్+కల= యుద్ధం సల్పగల; మానుసుల విశేషంబులన్= వీరుల ప్రత్యేకతను; చిత్త+ఆయత్తంబుగన్+చెప్పుము= నా మనసున కెక్కునట్లు తెలుపవలసినది; నిక్కము+తరముల్= వాస్తవమైన హెచ్చు తక్కువలు; నీ+ఎఱుఁగని+అవియున్+లేవు= నీకు తెలియనట్టివి లేవు.

తాత్పర్యం: 'పితామహా! నీ పక్షంలో, పాండవుల పక్షంలో యుద్ధంచేయగల వీరుల ప్రత్యేకతలు నా మదికెక్కేటట్లు చెప్పుము. ఆ వ్యక్తుల తారతమ్యాలు నీకు తెలియనివి కావు.'

క. అనవుడు 'నీ విట్లడిగిన । విని యూరక యుండఁ దగదు విను మేర్పడ నె
ల్లను నున్న రూపు సెప్పెద । మన వారల వారి వారి మానము లధిపా!' 219

ప్రతిపదార్థం: అనవుడున్= సుయోధనుడట్లా పలుకగా; నీవు= నీవు; ఇట్లు+అడిగినన్= వీరులలో గల హెచ్చు తక్కువలు తెలుపుమని నన్ను కోరినప్పుడు; విని= ఆలకించి; ఊరక+ఉండన్+తగదు= మిన్నకుండటం న్యాయంగాదు; అధిపా!= రాజా!; ఏర్పడన్= విశదమయ్యేటట్లు; మనవారల= మన పక్షంలోని వారియొక్కయు; వారి వారి= పాండవ పక్షానికి చెందిన వారియొక్కయు; మానములు= బలపరిమాణాలు; ఉన్నరూపు+ఎల్లను= ఉన్న విధమంతయు; చెప్పెదన్= తెలుపుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'సుయోధనా! వీరులలోని తారతమ్యాలు తెలుపుమని నన్ను కోరినప్పుడు తెలుపక ఊరకుండటం న్యాయం కాదు. మనవారియొక్క పాండవ పక్షంలోని వారియొక్క శక్తులలోని హెచ్చుతక్కువలు ఉన్నవి ఉన్నట్లుగా చెపుతాను విను.'

వ. అని గాంగేయుం డిట్లనియె : 220

తాత్పర్యం: అని భీష్ముడిట్లా అన్నాడు:

సీ. 'నీ వతిరథుఁడవు, నీ తమ్ములందఱు । సమరథశ్రేష్ఠులు సమరమునకుఁ
బరుసని వీరులు పాంచాలసేన ని । ర్జింతురు; నను నేన చెప్పికొనఁగ
నేర; నా యేడ్తెఱ మీరెఱుంగుదురు; భో । జాగ్రణి కృతవర్మ యతిరథుండు
దృఢవేధి యీతండు దీర్చునెంతటి పని । యైనఁ గైకొని; శల్యుఁ డతిరథుండు;

ఆ. వాసుదేవుతోడి యీసువాఁ, డల్లుర । విడిచె నిన్నుఁ గూడి; విక్రమమునఁ
బేరుకొనఁగఁ జాలు భూరిశ్రవుం డతి । రథుల మొదలి; యనికి రక్కసుండు. 221

ప్రతిపదార్థం: నీవు= నీవు; అతిరథుఁడవు= అనేక రథికులతో ఒంటరిగా పోరాడగల ఉత్తమ రథికుడవు; నీ తమ్ములు+ అందఱున్= నీ అనుజులెల్లరు; సమరథశ్రేష్ఠులు= సమరథులయందు శ్రేష్ఠులు; సమరమునకున్= యుద్ధానికి; పరుసని వీరులు= కరకుతనం కలిగిన శూరులు; పాంచాలసేనన్= ద్రుపదుడి సైన్యమును; నిర్జింతురు= గెలువగలరు; ననున్ నేన చెప్పికొనఁగన్ నేరన్= నన్ను గూర్చి నేనే వెల్లడించుకొనలేను; నా+ఏడ్తెఱ= నా పరాక్రమం; మీరు+ఎఱుంగుదురు= మీకు తెలుసు; భోజ+అగ్రణి= భోజవంశస్థులలో మేటి; కృతవర్మ= కృతవర్మ అనువాడు; అతిరథుండు= అతిరథుడు; ఈతండు= ఈ కృతవర్మ; దృఢవేధి= గట్టిగా లక్ష్యాన్ని భేదించగలవాఁడు; ఎంతటి పని+ఐనన్+కైకొని= ఎట్టి సంకట కార్యాన్నైనా గ్రహించి; తీర్చున్= చక్కబెట్టగలడు; శల్యుఁడు= మద్రపతి; అతిరథుండు= అతిరథుడు; వాసుదేవుతోడి+ఈసువాఁడు= శ్రీకృష్ణుడిపై అసూయ కల్గినవాడు; నిన్నున్+కూడి= నీతోచేరి; అల్లురన్+విడిచెన్= తన మేనల్లుళ్ళైన పాండవులను వదలివేశాడు; విక్రమమునన్= శూరత్వంచేత; పేరుకొనఁగన్+చాలు= పొగడదగినవాడైన; భూరిశ్రవసుడు; అతిరథుల మొదలి= అతిరథులలో అగ్రేసరుడు; అనికిన్= యుద్ధానికి; రక్కసుండు= రాక్షసుడు సుమా!

తాత్పర్యం: 'సుయోధనా! నీ వతిరథుడవు. నీ తమ్ములందరు సమరథులలో ఉత్తములు. యుద్ధం చేయటంలో గడుసుతనం గలవారు. ద్రుపదుడి సేనలను జయించగలరు. ఇక నన్ను గూర్చి నేను చెప్పికొనటం బాగుండదు. నా చేవ ఎలాంటిదో మీకు తెలుసు. భోజులలో మేటి అయిన కృతవర్మ అతిరథుడు. అతడు లక్ష్యాన్ని భేదించగలవాడు. ఎట్టి దుర్ఘటకార్యాన్నైనా చక్కబెట్టగలడు. శల్యుడు అతిరథుడు. అతడికి శ్రీకృష్ణుడిపై ఈర్ష్య. తన మేనల్లుళ్ళైన పాండవులను విడిచి నీతో చేరాడు. పరాక్రమంలో ప్రఖ్యాతి వహించిన భూరిశ్రవుడు అతిరథోత్తముడని గ్రహించుము. ఆతడు రణరంగంలో నిజంగా రాక్షసుడే సుమా!

విశేషం: ఆ కాలంలో రథ సారథ్యంలో నిపుణులు శ్రీకృష్ణుడు, శల్యుడు. ఉత్తరుడు కూడ తేరు నడపటంలో ప్రగల్భుడంటారు. రథచోదకత్వంలో మాధవుడి విఖ్యాతికి శల్యుడు మాత్సర్యగ్రస్తుడయి ఉండవచ్చును. అంతకంటె అతడికి వాసుదేవుడిపై గల ఈసుకు మరొక్క కారణం కనిపించదు. అసలు మేనల్లుళ్ళ పక్షం వహించవలసిన శల్యుడు దుర్యోధనుడి కుతంత్రంవలన కౌరవులతో కలియవలసి వచ్చింది. ఆ కథ యిది.

పాండవులు సమరసహాయం కోరి శల్యుడి పాలికి దూతలను పంపగా అతడు పుత్ర మిత్ర సమేతంగా నానా సేనలతో కదలి పాండవులున్నచోటికి నిత్య ప్రయాణాలతో నడచివస్తున్నాడు. ఈ విషయం తెలిసి దుర్యోధనుడు మద్రపతి

వచ్చే మార్గంలో వారికి అన్ని సౌకర్యాలూ కలిగించాడు. అందుకు సంతుష్టుడై శల్యుడు 'ఇంత చతురంగా ఇన్ని ఏర్పాట్లు చేసిన ధర్మజుడి అమాత్యులెవరో తోడ్కొని రండి. అభినందించాలి' అన్నాడు. పలుతెరగుల పనులు చేస్తున్న తన ఆప్తులలో మరుగున నున్న దుర్యోధనుడు తన కిది తగిన సమయమని వచ్చి వినయంతో శల్యుడిని సందర్శించాడు. ఇదంతా దుర్యోధనుడి యత్నఫలమని 'శల్యుడు గ్రహించి ఉబ్బి తబ్బిబ్బై' నీకేది యిష్టమో కోరుకో, ఇస్తా నన్నాడు. 'నీవు యుద్ధంలో నా పక్షం వహించి నన్ను ఉద్ధరించు' మని సుయోధనుడు అర్థించాడు. మానధనుడైన శల్యుడు మాట తిరుగలేక, 'నేను ఉపప్లావ్యపురికి వెళ్ళి, పాండవులను చూచి, తప్పక హస్తినాపురికి వస్తాను', వెళ్ళుమన్నాడు.

శల్యుడు కౌంతేయులను కలుసుకొన్నాడు. దుర్యోధనుడు తనను దర్శించి సాయమర్థించటం, అందుకు తాను సమ్మతించటం చెప్పి వేశాడు. ధర్మజుడు ఆశ్రితుల అభీష్టం నెరవేర్చటం పెద్దల గుణమని శల్యుడిని ప్రశంసించి 'మామా! పంకజాక్షుడు పార్థుడికి భండనంలో సారథ్యం వహిస్తాడు. కర్ణుడు అర్జునుడితో మచ్చరిస్తుంటాడు గదా! వీరిద్దరికీ పోరు జరిగేటప్పుడు కౌరవ పక్షంలో శ్రీకృష్ణుడికి ప్రతిసారథ్యం చేయగల నేర్పు మరొక్కరికి లేనందున నీకు కర్ణ సారథ్యం తప్పదు. సమరసమయంలో తృణీకరించి పలికి రాధేయుడి మనసుకు కలక పుట్టించి క్రీడిని సంరక్షింపవలసిన'దని వేడుకొన్నాడు. అందుకు శల్యు డంగీకరించాడు.

ధర్మజుడి వేడికోలునుబట్టి చూస్తే, శల్యుడికి సారథి కృత్యంలో గల కౌశలం ఏపాటిదో విశదమవుతుంది.

క. విను సైంధవుఁడు మహారథుఁ । డనిఁ బోక పెనంగు; నతని నా ద్రౌపదికై
పెనుపఱఁ బఱిచిరి కుంతీ । తనయులు వారల కెదుర్పఁ దపముం జేసెన్. 222

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; సైంధవుఁడు= సింధుదేశపతి, నీ చెల్లెలు దుస్సలకు పెనిమిటి; మహారథుఁడు= మహారథుడు; అనిన్= యుద్ధంలో; పోక= వెనుదీయక; పెనంగున్= పోరాడుతాడు; అతనిన్= ఆ సైంధవుడిని; ఆ ద్రౌపదికై= పాంచాలిపట్ల చేసిన తప్పునకై; పెనుపు+అఱన్= మదమణగేటట్లు; కుంతీతనయులు= పాండవులు; పఱిచిరి= అవమానపరచారు; వారలకున్= వారికి; ఎదుర్పన్= ఎదురుతిరగటానికి; తపమున్+చేసెన్= (ఈశ్వరుడి గురించి) తపస్సు చేశాడు.

తాత్పర్యం: సుయోధనా! సింధుదేశాధీశుడూ, నీ చెల్లెలు దుస్సల మగడూ అయిన జయద్రథుడిని గురించి వినుము. అతడు మహారథుడు. యుద్ధంలో వెనుకంజవేయక పోరాడుతాడు. ద్రౌపది విషయంలో చేసిన తప్పిదానికి కౌంతేయులు వాడిని మదమణగేటట్లు మర్దించారు. ఆ కోపంతో వారి నెదుర్కొనటానికి అతడు ఈశ్వరుడిని గురించి తపస్సు కూడా చేశాడు.

విశేషం: పాండవులు కామ్యకవనంలో తృణబిందుమహాముని ఆశ్రమంలో కాలం గడుపుతున్నారు. ఒకనాడు వారైదుగురూ పాంచాలి నక్కడ ఉంచి మృగయార్థం వనంలోకి వెళ్ళారు. సాల్వకన్యను పెండ్లాడటానికి సైంధవుడు చతురంగ బలాలతో ఆ దారిని వెళ్ళుతూ ఆశ్రమద్వారంలో ద్రౌపదిని చూచి మోహించి రథమెక్కి తనతో రమ్మని నిర్బంధించాడు. ఆమె భీతిల్లి పురోహితుడైన ధౌమ్యుడిని కేకవేసింది. జయద్రథుడు ఆమెను బలాత్కారంగా రథంలో ఉంచుకొని వెళ్ళుతుంటే పురోహితుడు ఆక్రోశిస్తూ వారి వెంబడి పరుగెత్తసాగాడు.

పాండవులు మృగాలను వేటాడి ఆశ్రమాభిముఖులై వస్తూ పరిచారిక ధాత్రేయివల్ల సంగతి తెలిసి తత్క్షణమే జయద్రథుడిని వెంటనంటారు. ఆక్రోశిస్తూ అరుగుతున్న ధౌమ్యుడిని ఓదార్చి త్రిగర్త శిబిసింధు సౌవీర సైన్యంపై కవిశారు. తుముల యుద్ధం జరిగింది. జయద్రథుడు ద్రౌపదిని దిగవిడిచి పారిపోయి ఒక పొదలోకి దూరాడు. భీముడు సైంధవుడిని వెలికిలాగి పిండిపిండిగా పొడుస్తుంటే, మన అన్న చెప్పినట్లు దుస్సలను తలంచిఅయినా వీనిని చంపవద్దన్నాడు పార్థుడు.

భీమసేనుడు అతడి తల చెక్క లెగసేటట్లు గొరిగి, పెడకేలు గట్టి తెచ్చి ధర్మజుడి ముందు పడవేశాడు. వీడే పాండవదాసు డన్నాడు. అట్లా అయితే ప్రాణాలతో విడిచిపెట్టండని పాంచాలి పలికింది. మున్ముందు ఇట్లాంటి పాపపు పనులు చేయక బుద్ధిగలిగి బ్రతుకుమని నిరసించి ధర్మజుడు వదలిపెడితే వాడు గంగాద్వారంలో శివుడిని గురించి కఠోరతపం చేశాడు.

శంభుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే, 'పంచపాండవులను సైన్యయుతంగా జయించేటట్లు అనుగ్రహించు'మని వేడుకొన్నాడు. 'ఒక్క విజయుడిని తప్ప నలుగురు కౌంతేయులను ఒకనాటి యుద్ధంలో జయిస్తావు పొ'మ్మని రుద్రు డంతర్ధానమయ్యాడు. అర్జునుడు లేని సమయంలో ద్రోణుడు ధర్మజుడిని బంధించటానికి పన్నిన పద్మవ్యూహాన్ని భేదించటానికి ధర్మరాజు అభిమన్యుడిని నియోగిస్తాడు. అతడు వ్యూహాన్ని భేదించి కౌరవ సేనతో ఒంటరిగా పోరాడుతున్నప్పుడు ధర్మపుత్రుడు వాడికి తోడ్పడటానికి తమ్ములతో సకల సైన్యంతో ఉరవడిస్తాడు. కాని, ఈశ్వరదత్త వర ప్రభావం వలన సైంధవుడు వారిని అడుగు ముందుకు వేయకుండా అడ్డుకొన్నాడు. అక్కడ అభిమన్యుడు యుద్ధంలో ఒంటరిగా పోరి పోరి పెక్కంద్ర చేత హతుడయ్యాడు. ఆ తరువాత అర్జునుడు పాశుపతాస్త్ర మహిమచేత సైంధవుడిని సంహరిస్తాడు.

వ. కాంభోజరాజగు సుదక్షిణుండు సమరథుం; డితనిపాల రథబృందంబులు మేలు గలుగుఁ, బాండవ బలంబులం గలంచు; మాహిష్మతీపతి యగు నీలుం డర్ధరథుం డితనికి సహదేవునకుఁ దెగని పగయై యుండు; దానం జేసి యాలంబున నోలమాసగొనం; డవంతిదేశాధీశులగు విందానువిందు లర్ధరథులు; పరస్పర స్నేహంబున సాహసికులై యొకళ్ళొకళ్ళం బెట్టి పోవక పోరుదురు; త్రిగర్త పతులు తోడంబుట్టువులేవురును మహారథులు; గోగ్రహణంబునం బడిన బన్నంబుఁ బాపికొనం గడంగుదురు; వీరికి భుజబలం బగ్గలంబై యుండు. 223

ప్రతిపదార్థం: కాంభోజరాజు+అగు, సుదక్షిణుండు; సమరథుండు= ఒక విలుకాడితో సరిగా నిలచి యుద్ధం చేసే యోధుడు; ఇతనిపాలన్= ఇతడి దగ్గర; రథబృందంబులు= రథ సమూహాలు; మేలు+కలుగున్= మంచివి కలవు; పాండవబలంబులన్= పాండవుల సేనలను; కలంచున్= కలతనొందించగలవు; మాహిష్మతీపతి+అగు నీలుండు; అర్ధరథుండు; ఇతనికిన్ సహదేవునకున్; తెగని పగ+ఐ= మానని విరోధమై; ఉండున్; దానన్+చేసి= ఆ కారణంచేత; ఆలంబునన్= యుద్ధంలో; ఓలము+ఆస+కొనండు= వెనుదీయడు(మరుగుచోటున ప్రవేశించడు); అవంతి దేశ+అధీశులు+అగు= అవంతిదేశానికి అధిపతులైన; వింద+ అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవారు; అర్ధరథులు; పరస్పర స్నేహంబునన్= ఒకరిపై మరొక్కరికి గల చెలిమి చేత; సాహసికులు+ఐ= తెంపరులై; ఒకళ్ళు+ ఒకళ్ళన్+ పెట్టిపోవక= ఒకరిని మరొక్కరు దిగవిడిచి వెళ్ళక; పోరుదురు= పోరాటం సల్పుతారు; త్రిగర్త పతులు= త్రిగర్త దేశాధీశులు; తోడంబుట్టులు+ఏవురును= ఐదుగురు సహోదరులు; మహారథులు; గోగ్రహణంబునన్= దక్షిణ గోగ్రహణకాలమందు; పడిన బన్నంబు= చెందిన భంగపాటు; పాపికొనన్= తొలగించు కొనటానికి; కడంగుదురు= పూనుకొంటారు; వీరికిన్; భుజబలంబు= బాహువిక్రమం; అగ్గలంబు+ఐ+ఉండున్= అధికంగా ఉన్నది.

తాత్పర్యం: కాంభోజ దేశానికి రాజైన సుదక్షిణుడు సమరథుడు. ఇతడి దగ్గర మంచి రథాలున్నాయి. అవి పాండవసేనలను సంక్షోభమొందిస్తాయి. మాహిష్మతీ నాయకుడైన నీలుడు అర్ధరథుడు. ఇతడికీ సహదేవుడికీ మానని విరోధం. అందువలన నీలుడు రణరంగంలో వెనుదీయక పోరాడుతాడు. అవంతిదేశపతులైన విందానువిందులిద్దరూ అర్ధరథులు. అన్యోన్య స్నేహం కలవారు. కనుక ఒకరినొకరు వదలిపెట్టక సాహసంతో పోరు సల్పుతారు. త్రిగర్త దేశపురాజులు అన్నదమ్ములైదుమంది కూడా మహారథులు. దక్షిణ గోగ్రహణకాలంలో పాండవుల వలన పొందిన భంగపాటు తొలగించుకొనటానికి ఉద్యమిస్తారు. వీరు అధిక బాహుపరాక్రమం కలవారు.

క. **సమరథుఁడు బిరుదు లక్ష్మణ । కుమారకుం డేచి మొనలఁ గోల్తల సేయున్**
మిమునెల్ల మిగులు భుజగ । ర్వము మదముం గలఁడు కొనఁ డరాతుల నధిపా! 224

ప్రతిపదార్థం: అధిపా= రాజా!; లక్ష్మణ కుమారకుండు= నీ తనయుడైన లక్ష్మణకుమారుడు; సమరథుఁడు= సమరథుడై ఉన్నాడు; బిరుదు= శూరుడు; ఏచి= చెలరేగి; మొనలన్= సేనలను; కోల్తలచేయున్= యుద్ధానికి ప్రోత్సహిస్తాడు; మిమ్మున్+ఎల్లన్= మిమ్మందరినీ; మిగులున్= మించుతాడు; భుజగర్వము= బాహుదర్పం; మదమున్+కలఁడు= పొగరు కలవాడు; అరాతులన్= శత్రువులను; కొనఁడు= లెక్కచేయడు.

తాత్పర్యం: దుర్యోధనా! నీ తనయుడైన లక్ష్మణకుమారుడు సమరథుడు. మంచివీరుడు. విజృంభించి సేనలను యుద్ధానికి ప్రోత్సహించి నడుపగలవాడు. మిమ్మందరినీ మించినవాడు. బాహుబలం, దర్పం కలవాడు. విరోధులను లక్ష్యపెట్టడు.

వ. **బృహద్బలుండు సమరథుండు కోసల బలంబుతోడం గడంగి చిచ్చునుం గరువలియునుంగొని తాఁకు; దండధారుం డర్ధరథుండు సేన పఱపు గలండు, బెట్టిదంబుగాఁ గయ్యంబు సేయు. 225**

ప్రతిపదార్థం: బృహద్బలుండు; సమరథుండు; కోసలబలంబుల తోడన్= కోసలదేశపుసైన్యాలతో; కడంగి= పూనుకొని; చిచ్చునున్= అగ్నిని; కరువలియునున్= గాలిని; కొని తాఁకున్= ఎదిరిస్తాడు; దండధారుండు; అర్ధరథుండు; సేనపఱపు+కలండు= విస్తారమైన సైన్యంకలవాడు; బెట్టిదంబుగాన్= కఠోరంగా; కయ్యంబు+చేయున్= యుద్ధం చేయగలడు.

తాత్పర్యం: బృహద్బలుడు సమరథుడు. అతడు కోసల దేశ సైన్యాలతో కూడి, అగ్ని వాయువులు జతపడినట్లు శాత్రవ సేనలను ఎదిరిస్తాడు. దండధారుడు అర్ధరథుడు, ఎక్కువ సైన్యం కలవాడు. దారుణంగా పోరాడుతాడు.

తే. **అతిరథోత్తముఁ డివ్వీటియందు మేటి । కృపుడు; తన పెంపు వాటించి గెలుచుఁ జచ్చుఁ**
గాని నాలుగు దెఱఁగుల సేనలకును । దివియఁ డించుకయును నరదేవముఖ్య! 226

ప్రతిపదార్థం: నరదేవముఖ్య!= రాజోత్తమా!; కృపుఁడు= కృపాచార్యుడు; అతిరథ+ఉత్తముడు= అతిరథులలో మిన్న; ~~ఈ~~+ వీటియందున్= ఈ మన దండులో; మేటి= గొప్పవాడు; తన పెంపు+పాటించి= తన గొప్పతనం ప్రకటించి; గెలుచున్= విజయము గైకొంటాడు; చచ్చున్+కాని= (లేదా) మరణిస్తాడు కాని; నాలుగు తెఱఁగుల సేనలకును= చతుర్విధములైన సైన్యాలకు - అనగా రథగజతురగ పదాతులకు; ఇంచుకయును= కొంచెమైనా; తివియఁడు= వెనుదీయడు.

తాత్పర్యం: కృపాచార్యుడు అతిరథులలో శ్రేష్ఠుడు. మనదండులో మిన్న. తన ప్రశస్తి చాటుతూ గెలవనైనా గెలుస్తాడు, చావనైనా చస్తాడు గాని చతుర్విధ సైన్యాలకు పోరాటంలో రవంతైనా వెనుదీయడు.

క. **శకుని విను సమరథుఁడు పాం । డు కుమారులతోడ నెప్పుడుం బగఁగొని వా**
రికిఁ గీడురోయు; భృత్యులు । ప్రకట బలులు గలరు; నేర్చు బవరంబునకున్. 227

ప్రతిపదార్థం: విను(ము)= ఆలకించు; శకుని= నీ మేనమామ; సమరథుఁడు= సమరథుడు; పాండుకుమారులతోడన్= పాండవులతో; ఎప్పుడున్= ఎల్లవేళల; పగన్+కొని= శత్రుత్వం వహించి; వారికిన్= కౌంతేయులకు; కీడు= హానిని; రోయున్=

వెదకుతాడు; ప్రకటబలులు= గొప్ప బలం కలిగిన; భృత్యులు= సేవకులు; కలరు= అతడి కున్నారు; బవరంబునకున్+నేర్చున్= యుద్ధంచేయటం శకుని ఎరుగును.

తాత్పర్యం: శకుని సమరథుడు. పాండునందనులతో ఎల్లప్పుడు విరోధం వహించి వారి చేటునకు దారులు వెదకుతుంటాడు. అతడికి బలాఢ్యులైన సేవకులున్నారు. శకుని చక్కగా యుద్ధం చేయగలడు.

మ. **వరదివ్యాస్త్రవిదుండు బాహుఘనుఁ డశ్వత్థామ గాండీవితోఁ**
బురుడింపందగువాఁడు; వీని కెన యీ భూలోక సంచారు లె
వ్వరులే; రీతఁడు బ్రాహ్మణుం డనని భావం బూనఁగా నోర్వమిం
దర మూహింపఁగ లేదకాని జముచందం బయ్యెడుం బోరులన్. **228**

ప్రతిపదార్థం: వరదివ్య+అస్త్రవిదుండు= శ్రేష్ఠాలైన దివ్యాస్త్రాలెరింగినవాడూ; బాహు ఘనుఁడు= భుజశక్తిచేత గొప్పవాడూ అగు; అశ్వత్థామ= ద్రోణుని పుత్రుడు; గాండీవితోన్= అర్జునుడితో; పురుడింపన్+తగువాఁడు= పోల్చదగినవాడు; వీనికిన్= ఇతడికి; ఎన= సాటి; ఈ భూలోక సంచారులు+ఎవ్వరున్+లేరు= ఈ పుడమియందు తిరిగే వారిలో ఎవ్వరూ లేరు; ఈతఁడు= అశ్వత్థామ; బ్రాహ్మణుండు+అనని భావంబు= బ్రాహ్మణుడు కాడు అనే తలంపు; ఊనఁగాన్= వహించుటకు; ఓర్వమిన్= సహించలేనందున; తరము= కొలది, స్థాయి; ఊహింపఁగన్+లేద= అతడి తరమిట్టిదని నిర్ణయించటానికి వీలుకాదు; కాని= ఐననూ; పోరులన్= పోరాటాలలో; జముచందంబు+అయ్యెడున్= యముడి విధంగా ఉంటాడు.

తాత్పర్యం: శ్రేష్ఠాలూ, దివ్యాలూ అయిన అస్త్రాలు తెలిసినవాడూ, భుజ బలాధికుడూ అయిన అశ్వత్థామ అర్జునుడితో సాటి అనదగినవాడు. ఈతడితో సమానులు ఈ భూలోక వాసులలో ఒక్కడు కూడా లేడు. ఇతడు బ్రాహ్మణుడుకాడనే భావం తలపున బారుట సహించరాని విషయమే. అందువలన ఈతడి కొలది నూహించటానికి వీలులేదు. కాని, యుద్ధాలలో ఇతడు యముడిలా విజృంభిస్తాడు.

విశేషం: కొంచెం ఇబ్బంది పెట్టే తిక్కన పద్యాలలో ఇదికూడా ఒకటి. 'ఈతఁడు బ్రాహ్మణుండనిన భావం బూనఁగా నోర్వమిం - దరమూహింపఁగ లేద - ఈ పాఠం సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'తరము' శబ్దమునకు అర్థము చెప్పునప్పుడు ఉన్నది. ఇదే గ్రహించబడింది. 'బ్రాహ్మణుం డనని భావం బూనఁగా నోర్వమిం - దరమూహింపఁ లేద - బ్రాహ్మణుండు+అననిభావం బూనఁగా ....ఈ విభాగం అర్థం కావటంలేదు. 'బ్రాహ్మణుండన్+అని భావం బూనగా నోర్వమిన్+తర......... ఇదికూడా అంత సుకరంగా లేదు. 'బ్రాహ్మణుండనని భావం బూనఁగా నోర్వము - ఇందర మూహింపఁగ లేద అని విడదీద్దామంటే - 'ఇందఱము' లోనిది శకట రేఫము. యతిప్రాసల విషయంలో కవిత్రయం వారు రేఫ శకట రేఫలకు మైత్రి పాటించలేదు. అందుచేత ఆ విభాగం త్యాజ్యం.

సీ. **అతిరథోత్తముఁడు ద్రోణాచార్యుఁ; డందలి । యిందలి విలుకాండ్ర కెల్ల గురుఁడు,**
హితుఁడు నీ కెంతయు, నేర్చిన మొన లితం। డడరినఁ జమరినయట్ల ప్రుందు;
వృద్ధని యితని భావింపరా; దనిలోన । నంగ విస్ఫురణంబు భంగి చూడ
నర్జునుపైఁ గూర్మి నతని నో నేయఁడు । సచరాచరంబైన జగము లెల్ల

తే. **నొక్క మొగమై కడంగినఁ జిక్కువఱుచు । దివ్యబాణ జాలంబుల దీటు కొలిపి**
ప్రాణములు డాఁపఁ; డీతని పాటి దొరలఁ । గాన మే రాజ్యములయందుఁ గౌరవేంద్ర! **229**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= సుయోధనా!; ద్రోణ+ఆచార్యుఁడు= గురుడగు ద్రోణుడు; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో వరిష్ఠుడు; అందలి+ఇందలి విలుకాండ్రకున్+ఎల్లన్= పాండవ కౌరవులనెడి ఉభయ పక్షాలలో ఉన్న ధానుష్కులందరికీ; గురుఁడు= ఒజ్జ; నీకున్= నీకు; ఎంతయున్+హితుఁడు= మిక్కిలి మేలు కోరేవాడు; ఏర్చిన మొనలు= పన్నిన వ్యూహాలు; ఇతండు= ఈయన; అడరినన్= విజృంభిస్తే; చమరిన+అట్లు+అ= నేలబెట్టి రాచిన విధంగానే; మ్రందున్= నశించిపోతాయి; అనిలోనన్= కయ్యమునందు; అంగ విస్ఫురణంబు+భంగిన్= శరీర విజృంభణం యొక్క విధమును; చూడన్= కనుగొన్నప్పుడు వృద్ధు+అని= ముసలివాడని; ఇతనిన్ భావింపన్‌రాదు= ఇతడిని తలంచటానికి వీలుగాదు; అర్జునుపైన్+కూర్మిన్= అర్జునుడి మీది వాత్సల్యంతో; అతనిన్= పార్థుడిని; నొనేయఁడు= నొచ్చేటట్లు బాణాలు ప్రయోగించడు; సచర+అచరంబు+ఐన= జంగమ స్థావరాలతో కూడిన; జగములు+ఎల్లన్= లోకాలన్నీ; ఒక మొగము+ఐ= ఏకమై; కడంగినన్= తన మీదికి కవిసిననూ; దివ్యబాణజాలంబులన్= దివ్యములైన శరసమూహాలను, దీటుకొల్పి= పరగించి; చిక్కు పఱుచున్= కష్టాలపాలు కావిస్తాడు; ప్రాణములు డాఁపఁడు= ప్రాణాలమీద తీపిలేనివాడు ప్రాణాలు దాచుకోడు; ఈతనిపాటి దొరలన్= ఇతడితో సమానులైన శూర ప్రభువులను; ఏ రాజ్యములఅందున్= ఏ దేశాలలోనూ; కానము= చూడబోము.

తాత్పర్యం: కురుపతీ! ద్రోణాచార్యులు అతిరథులలో శ్రేష్ఠుడు. ఉభయ పక్షాలలోని ధానుష్కులందరికినీ గురువు. నీకు మిక్కిలి మేలు కోరేవాడు. ఏర్చి కూర్చిన వ్యూహాల మీదకు ఇతడు విజృంభించినపుడు అవి చేత నలిపినట్లు నిర్మూలమవుతాయి. యుద్ధంలో ఈయన దేహకాంతి కనుగొంటే ముసలివాడని భావించటానికి శక్యం కాదు. అర్జునుడిపై ప్రేముడి కలవాడు గనుక అతడిని శరాలతో నొప్పించడు. స్థావర జంగమాత్మకమైన జగమంతా ఏకంగా తనమీదికి ఉరికినా దివ్యశర సమూహం ప్రయోగించి చీకాకు పరుస్తాడు. కయ్యంలో ప్రాణాలు పోతాయన్న జంకు ఇతడికి లేదు. ఇతడితో సమానులైన శూర ప్రభువులను ఏ రాజ్యంలోనూ చూడలేము.

క. అతిరథుఁడు బాహ్లికుఁడు విను । మతులిత బలుఁ; డితని యట్ల యాత్మజుఁడును వి
శ్రుతశక్తి సోమదత్తుఁ; । డితనికి, నీతనికి సమర మెన పెండిలికిన్. 230

ప్రతిపదార్థం: వినుము= ఆలింపుము; బాహ్లికుఁడు= కురువంశస్థులలో పెద్దవాడు; అతిరథుఁడు; అతులిత బలుఁడు= సాటిలేని శక్తికలవాడు; ఇతనిఅట్లు+అ= ఈతడివలెనే; ఆత్మజుఁడును= కుమారుడగు; సోమదత్తుండు= సోమదత్తుడు; విశ్రుతశక్తి= ప్రఖ్యాతమైన బలం కలవాడు; ఇతనికిన్= బాహ్లికుడికి; ఈతనికిన్= సోమదత్తుడికి; సమరము= సంగ్రామం; పెండిలికిన్= వివాహంతో; ఎన= సాటి;

తాత్పర్యం: బాహ్లికుడు అతిరథుడు. సాటిలేని బలం కలవాడు. అతడి వలెనే ఆతడి కుమారుడు సోమదత్తుడు కూడా ప్రసిద్ధమైన బలం కలిగినవాడు. తండ్రికీ, కుమారుడికీ యుద్ధమంటే పెళ్ళితో సమానం.

క. అసురవరుఁ డీ యలంబుషుఁ । డసమాన బలుండు సమరథాగ్రణి; విను పాం
డు సుతులయెడ రోషము గలఁ । డసంఖ్య మాయా బలమున నరులఁ గలంచున్. 231

ప్రతిపదార్థం: అసురవరుఁడు= రాక్షసశ్రేష్ఠుడైన; ఈ+అలంబుషుఁడు= అలంబుషుడు అను పేరుగల ఇతడు; అసమానబలుండు= సాటిలేని శక్తికలవాడు; సమరథ+అగ్రణి= సమరథులలో ఉత్తముడు; విను= సుయోధనా, ఆలకించు; పాండుసుతులయెడన్= పాండుకుమారుల యందు, రోషము కలఁడు= కోపం కలవాడు; అసంఖ్య మాయాబలమునన్= గణింపరాని మాయలయొక్క మహిమచేత; అరులన్= శాత్రవులను; కలంచున్= బాధిస్తాడు.

తాత్పర్యం: రాక్షసులలో శ్రేష్ఠుడైన ఈ అలంబుషుడు సాటిలేని బలం కలిగినవాడు. సమరథుడు. ఇతడికి పాండవులంటే కోపం. అగణితమైన తన మాయా బలంతో విరోధులను బాధిస్తాడు.

విశేషం: అలంబుషుని వృత్తాంతము: అలంబుషుడు అనే పదానికి అలంబుషుడు అనే పాఠాంతరం ఉన్నది. గంధమాదన పర్వతంలో పాండవులుంటున్నారు. జటాసురుడు అనే రాక్షసుడు బ్రాహ్మణరూపం ధరించి తాను పరశురామ శిష్యుడిని అని చెప్పి పాండవులను సేవిస్తుంటాడు. భీము డొకనాడు మృగయా వినోదార్థం అడవికి వెళ్ళిన సమయంలో అతడు రాక్షసరూపం ధరించి ద్రౌపదిని ధర్మజుడిని నకులునీ ఎత్తుకొని శీఘ్రంగా ఆకాశ మార్గంలో వెళుతున్నాడు. సహదేవుడు భీముడిని గొంతెత్తి పిలుస్తూ వనంలోకి పరుగెత్తాడు. 'విశ్వసించినవారికీ, కుడువబెట్టినవారికీ ఎగ్గుచేయటం మహాపాపం. ఆయుధాలతో మమ్ము వదలిపెట్టి మాతో యుద్ధం చెయ్యి. ఇట్లా వెళ్ళటం నీకు తగదు' అంటూ ధర్మజుడు తన చేతులతో వాడిని గట్టిగా అదుముతూ అతడి గమనవేగం తగ్గించాడు. సహదేవుడు అడ్డంవచ్చి నిలునిలుమని అతడిని అదలించాడు. భీముడు అతివేగంగా వచ్చి గగన మార్గంలో వెళుతున్న జటాసురుడిని వారించి 'నీకు బుద్ధి ఉంటే వీరిని వదలిపెట్టి నీ ప్రాణాలు రక్షించుకో, లేదా బక హిడింబ కిమ్మీరులకు పట్టిన దుర్గతి నీకూ పడుతుంది' అన్నాడు. ఆ మాటతో జటాసురుడు భూమికి దిగి భీముడితో తలపడ్డాడు. ఇద్దరికీ పోరు ఘోరమయింది. వృక్షాలతో శిలలతో వారు పోరాడారు. ముష్టాముష్టియుద్ధం చేశారు. జటాసురుడు హీనసత్త్వు డయ్యాడు. భీముడు వాని మెడమీద పొడిచి పుడమిపై పడగొట్టాడు. వాడి కాయమెత్తి ఒక విశాల పాషాణం మీద బాది, యమసదనానికి పంపించాడు. ఆతడి కుమారుడే అలంబుషుడు. బక కిమ్మీరులకు అనుజుడు. పాండవులతో తమకున్న పూర్వ వైరాన్ని పురస్కరించుకొని దుర్యోధనుడి పక్షంలో చేరి పోరాడుతాడు. ఇతడిని ఘటోత్కచుడు సంహరిస్తాడు. భుజంగకన్య ఉలూచికి అర్జునునకు జన్మించిన ఇరావంతుడిని కురుక్షేత్ర సంగ్రామంలో అలంబుషుడు వధిస్తాడు.

విశేషం: మూలంలో అలంబుషుడని ఉన్నది. "అలమ్బుషో రాక్షసేన్ద్రః క్రూరకర్మా మహారథః, హనిష్యతి పరాన్ రాజన్ పూర్వ వై ర మనుస్మరన్" - మున్నంగిశర్మ పరిష్కృత ప్రతిలో - 'అసురవరుఁడీ హలాయుధుఁ డసమాన బలుండు ---' అని ఉన్నది.

తే. **వినుము ప్రాగ్జ్యోతిషాధీశుఁ డనుపమాన । శక్తి యీ భగదత్తుండు సమరథుండు;**
గజము నెక్కి తా నేనిక కయ్యమైన । నేర్చు నైరావణము మీఁది యింద్రుఁ బోలి. **232**

ప్రతిపదార్థం: వినుము; ప్రాగ్జ్యోతిష+అధీశుఁడు= ప్రాగ్జ్యోతిష పురాధీశ్వరుడైన; ఈ భగదత్తుండు= ఈ భగదత్తుడనేవాడు; సమరథుండు= సమరథుడు; అనుపమానశక్తి= సాటిలేని బలంకలవాడు; ఏనిక కయ్యము+ఐనన్= ఏనుగులతో పోరాటం జరుగుతున్నప్పుడు; తాన్= తాను; గజమున్+ఎక్కి= ఏనుగును ఎక్కి; ఐరావణముమీఁది= ఐరావతం అనే దిగ్గజం పైనున్న; ఇంద్రున్+పోలి= దేవేంద్రుడికి సాటి అవుతూ; ఏర్చున్= విజృంభిస్తాడు.

తాత్పర్యం: సుయోధనా! వినుము. ప్రాగ్జ్యోతిష నగరాధిపతిఅయిన ఈ భగదత్తుడు సమరథుడు. సాటిలేని బలం కలవాడు. ఏనుగులతో పోరాటం జరిగేటప్పుడు ఐరావత గజము నధిష్ఠించిన ఇంద్రుడికి సరిపోలుతూ ఇతడు ఏనుగునెక్కి చెలరేగుతాడు.

విశేషం: భగదత్తుని వృత్తాంతం: భగదత్తుడు నరకాసురుడి పుత్రుడు. ఇతడు ప్రాగ్జ్యోతిష పురాధీశ్వరుడు. అర్జునుడు దిగ్విజయానికి వెళ్ళినపుడు ఇతడు ఎనిమిది రోజులు పోరి గెలువలేక 'నేనింద్రసఖుడను; నీవింద్ర పుత్రుడవు. మనలో మనకు పోరాటమెందు' కని పల్కి అర్జునుడితో సంధి చేసికొని కానుకలిచ్చి పంపాడు. భారత సంగ్రామంలో ఇతడు దుర్యోధనుడి

పక్షం వహించి పోరాడాడు. నరకుడు తాను గడించిన వైష్ణవాస్త్రాన్ని ఈతనికిచ్చాడు. దానిని భగదత్తుడు అర్జునుడిమీద ప్రయోగించాడు. వైష్ణవాస్త్రమును ఎవ్వరూ సహించలేరు గనుక ఆ సమయంలో శ్రీకృష్ణుడు తన వక్షఃస్థలాన్ని అడ్డుపెట్టి ధరించాడు. అస్త్రం విఫలం కాగానే భగదత్తుడు సుప్రతీకమనే ఏనుగునెక్కి అర్జునుడితో తలపడ్డాడు. విజయుడు ఏనుగుతో కూడా భగదత్తుడిని సంహరించాడు.

భీష్ముఁడు కర్ణుని నర్ధరథుండని చెప్పుట (సం. 5-165-3)

వ. గాంధార రాజులగు వృక్షుండును, నచలుండును సమరథులు; మానిసితనంబును మానుసులుం గలవారు; వీరి సమరోత్సాహం బజేయంబైయుండు. 233

ప్రతిపదార్థం: గాంధారరాజులు+అగు= గాంధార దేశ ప్రభువులైన; వృక్షుండును అచలుండును సమరథులు; మానిసితనంబును= పౌరుషమును; మానుసులును= మనుష్యులను కలవారు; వీరి; సమర+ఉత్సాహంబు= యుద్ధోత్సాహం; అజేయంబు+ఐ+ఉండున్= జయించరానిదై ఉంటుంది.

తాత్పర్యం: గాంధార రాజులైన వృక్షుడు, అచలుడు అనువారు సమరథులు. మగటిమి, మంది కలిగినవారు. వీరి యుద్ధపు పన్నుగడ జయించటానికి శక్యం కాదు.

సీ. నీకుఁ బ్రెగ్గడయును నెయ్యంపుఁ జెలియునై । కయ్యంబునకు నెప్డుఁ గాలు ద్రవ్వుఁ
బాండుపుత్త్రుల తోడి పగకు ని న్నెసకొల్పుఁ । గొలువున రజ్జులు పలుకునట్టి
రాధాసుతుం డర్ధరథుఁడు; కుండలములుఁ । గవచంబుఁ బోవుట కారణముగ
బీఱువాఱినవాఁడు, వీఱిఁడి, కృపఁ బెద్ద । పరశురాముండు శాపమున వీని

తే. యస్త్రవీర్యంబుఁ జెఱిచె; నట్లగుట వీఁడు । పార్థు మార్కొని మానంబుఁ బ్రాణములును
దనకు సొమ్ముగఁ దక్కించుకొనఁగ లేమి । యెల్లవారికి నెంతయుఁ దెల్ల మధిప!" 234

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీకున్= నీకు; ప్రెగ్గడయును= మంత్రియు; నెయ్యంపుఁ జెలియున్+ఐ= అనురాగపు మిత్రుడై; కయ్యంబునకున్= కలహానికి; ఎప్డున్= నిరంతరం; కాలుద్రవ్వున్= సిద్ధపడతాడో; పాండుపుత్త్రుల తోడి పగకున్= పాండునందనులతో విరోధానికి; నిన్నున్= నిన్ను; ఎసకొల్పున్= పురికొల్పుతుంటాడో; కొలువునన్= సభలో; రజ్జులు పలుకున్= వ్యర్థపు పలుకులు (దుర్భాషలు, డంబాలు) పల్కుతుంటాడో; అట్టి= అటువంటి; రాధాసుతుండు= కర్ణుడు; అర్ధరథుడు= అర్ధరథుఁడు సుమా!; కుండలములు= సహజకుండలాలు; కవచంబున్= కవచం; పోవుట కారణముగన్= కోల్పడిన హేతువుచేత; బీఱువాఱినవాఁడు= నిస్సారమైపోయినవాడు; వీఱిఁడి= బుద్ధిలేనివాడు; కృపన్= కరుణయందు; పెద్ద= దొడ్డవాడు(అధికుడు); పరశురాముండు= భృగురాముడు; శాపమునన్= శాపంతో; వీని అస్త్రవీర్యంబు చెఱిచెన్= ఇతడియొక్క అస్త్రబలాన్ని పోగొట్టాడు; అట్లు+అగుటన్= అందువలన; వీఁడు= ఈ కర్ణుడు; పార్థున్+ మార్కొని= అర్జునుడిని ఎదిరించి; మానంబున్= గౌరవాన్ని; ప్రాణములును= అసువులును; తనకున్+సొమ్ముగన్= తన హక్కుగా; దక్కించుకొనఁగన్+లేమి= నిలుపుకొనలేకపోవటం; ఎల్లవారికిన్= అందరికినీ; ఎంతయున్= మిక్కిలి; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: రాజా! నీకు మంత్రీ, గారాబు నెచ్చెలికాడూ అయిన కర్ణుడు ఎల్లప్పుడూ కలహానికి కాలుద్రవ్వుతుంటాడు. పాండవులమీద నీ కున్న విరోధాన్ని చల్లారనీయక రగులుకొలుపుతుంటాడు. సభలో కొరమాలిన మాటలు

మాటాడుతుంటాడు. ఇట్లాంటి రాధేయుడు అర్ధరథుడని గ్రహించుము. జన్మసిద్ధాలైన కవచకుండలాలు కోల్పోయిన హేతువుచేత ఇతడు శక్తిహీను డయ్యాడు. పైపెచ్చు ఇతడు అవివేకి. కాని, అధికమైన కరుణగలవాడు. పరశురాముడు శాపంపెట్టి ఈతని అస్త్రశక్తిని నాశనం చేశాడు. అందువలన వీడు ఫల్గునుడిని భండనంలో ఎదుర్కొని తన మాన ప్రాణాలు తన సొమ్ముగా దక్కించుకొనలేడన్నది లోకులందరికీ తేటతెల్లం.'

క. అనవుడు గురుఁ డిట్లనుఁ 'గ । ర్ణునిచందము మున్ను కడఁగు రోయఁడు పాఱన్
విను మేమఱి యుండుంగా । వున నీతం డర్ధరథుఁ డవుం దలపోయన్.' 235

ప్రతిపదార్థం: అనవుడున్= భీష్ముడట్లా పల్కిన తర్వాత; గురుఁడు= ద్రోణుడు; కర్ణునిచందమున్= రాధేయుడి తీరు; ఇట్లు+అనున్= ఈ విధంగా తెల్పాడు; మున్ను కడఁగున్= కర్ణుడు అందరికంటే ముందుగా తలపడుతాడు; పాఱన్= పరుగెత్తి పోవటానికి; రోయఁడు= సంకోచించడు; వినుము= సుయోధనా, వినుము; ఏమఱి+ఉండున్= పరాకుగా ఉంటాడు; కావునన్= కనుక; తలపోయన్= ఆలోచించగా; ఈతండు+అర్ధరథుఁడు+అవున్= కర్ణుడు అర్ధరథు డవుతాడు.

తాత్పర్యం: భీష్ముడు మాటలాడిన తరువాత కర్ణుడి స్వభావాన్ని ద్రోణు డీరీతిగా చెప్పాడు. 'ఇతడు అందరికంటె ముందుగా ఉద్యమిస్తాడు. పిరికితనంతో రణరంగమునుండి పారిపోవటానికి సంకోచించడు. పరాకుగా ఉంటాడు. కాబట్టి ఆలోచించి చూస్తే రాధేయుడు అర్ధరథుడే.'

వ. అనిన విని రాధేయుండు క్రోధతామ్రాక్షుం డగుచు గాంగేయున కిట్లనియె: 236

ప్రతిపదార్థం: అనినన్; విని; రాధేయుండు; క్రోధతామ్ర+అక్షుండు+అగుచున్= కోపంచేత ఎర్రబడిన కన్నులుకలవాడై; గాంగేయునకున్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్మద్రోణుల మాటలు విని కర్ణుడు కోపంతో కన్నులు జేవురించగా భీష్ముడితో ఇట్లా అన్నాడు:

క. 'ఒంటమిని లేని యొంటర । మింటరములు పల్కు టుచితమే? యర్ధరథుం
డంటి నను; నేమి తక్కువ । గంటి చెపుమ; దీన నీవు గన్నది కలదే? 237

ప్రతిపదార్థం: ఒంటమిని= నామీది పగతో(ద్వేషంతో); లేని= లేనిపోని; ఒంటరమింటరములు= పరుష వచనాలు; పల్కుట= మాటాడటం; ఉచితమే?= నీకు తగునా?; ననున్= నన్ను; అర్ధరథుండు+అంటి(వి)= అర్ధరథుడని చెప్పితివి; ఏమితక్కువ+కంటి(వి)= నాలో ఏ లోపం కనుగొన్నావు?; చెపుము!= పల్కుమా! దీనన్= ఇట్లా నన్ను తక్కువ చేసి మాటాడినందువలన; నీవు+కన్నది+కలదే?= నీవు పొందిన ప్రయోజన మున్నదా?

తాత్పర్యం: 'నామీది ద్వేషంతో పరుషవచనాలు పల్కటం నీకు తగునా? నన్ను అర్ధరథుడని చెప్పావు. నాలో ఏ లోపం కనుగొన్నావో చెప్పు. ఇట్లా నన్ను తక్కువచేసి మాటలాడినందువల్ల నీకు కల్గిన లాభ మేమిటి?

తే. నొవ్వఁ బలుకుదు సభలోనఁ జివ్వకొల్ల । కేను గురుపతిఁ జూచి సహించి పోదు;
సురనదీపుత్ర! విను నాకుఁ జూడ నర్ధ । రథుఁడ వగుదీవు లావు బీరంబు నరయ" 238

ప్రతిపదార్థం: సురనదీపుత్ర!= గంగాసుతా భీష్మా!; సభలోనన్= కొలువులోపల; నొవ్వన్= నేను బాధపడేటట్లు; పలుకుదు(వు)= మాటాడుతుంటావు; ఏను= నేను; చివ్వకున్+ఒల్లక= నీతో పోట్లాటకు ఇష్టపడక; కురుపతిన్+చూచి= కౌరవేశ్వరుడిని గాంచి; సహించిపోదున్= ఓర్చుకొని వెళుతుంటాను; విను(ము)= నేను చెప్పేది ఆలకించుము; ఈవు= నీవు; లావు= శక్తి; బీరంబు= పరాక్రమం; అరయన్= పరికించగా; నాకున్+చూడన్= నాకు చూడగా; అర్ధరథుఁడవు+అగుదు(వు)= అర్ధరథుడవే అవుతావు.

తాత్పర్యం: గంగాపుత్రా! బాధపడేటట్లు నన్ను గురించి కొలువులో మాట్లాడుతావు. దుర్యోధనుడిని చూచి నీతో పోట్లాటకు దిగక ఓర్చుకొని వెళుతుంటాను. నీ శక్తినీ, పరాక్రమాన్నీబట్టి నీవు నా దృష్టిలో అర్ధరథుడవే.'

వ. అని పలికి కొలువుఁ గలయం గనుంగొని. 239

ప్రతిపదార్థం: అని పలికి; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= నలుమూలల జూచి-

తాత్పర్యం: రాధేయుడు అట్లా పలికి సభను నలువంకల కలయజూచి.

చ. 'హితుఁడని నమ్మఁగాఁ దగునె యీతనిఁ? గార్యపు మాట లిట్టివే?
పతిదెసకూర్మి వాపుటకుఁ బట్టుగ నెక్కువ తక్కువంచు ను
న్నతులగు మేదినీశులకు నానగఁ బల్కుట గాక, యిట్టివా
రితవులు తండ్రికిన్ సుతుల; కేమన నేర్తుము పెద్ద రాజులన్?' 240

ప్రతిపదార్థం: ఈతనిన్= ఈ భీష్ముడిని; హితుఁడు+అని= మేలు చేసేవాడని; నమ్మగాన్+తగునె?= విశ్వసించవచ్చునా?; కార్యపుమాటలు+ఇట్టివే?= పని సాధించుకొనే మాటలు ఇట్లాగే ఉంటాయా?; పతిదెసన్= ప్రభువైన సుయోధనుడి ఎడ; కూర్మి= అనురాగం; పాపుటకున్+పట్టుగన్= తొలగించటానికి వీలుగా; ఎక్కువ తక్కువ+అంచున్= ఇత డెక్కువ, అతడు తక్కువంటూ; ఉన్నతులు+అగు= దొడ్డవారైన; మేదినీ+ఈశులకున్= భూవల్లభులకు; నానగన్= లజ్జకలుగునట్లు; పల్కుటగాక= మాటలాడటంకాక మరేమున్నది?; తండ్రికిన్= ధృతరాష్ట్రుడికి; సుతులకున్= కుమారులైన సుయోధనాదులకు; ఇట్టివారు= ఇటువంటివారు; ఇతవులు= హితులైయున్నారు; పెద్దరాజులన్= దొడ్డ ప్రభువులను; ఏమి+అనన్+నేర్తుము?= మనము ఏమనగలం?'

తాత్పర్యం: ఈ భీష్ముడిని మేలు గూర్చేవాడని విశ్వసించవచ్చునా? పనులు సాధించుకొనే మాటలతీరులు ఇట్లా ఉంటాయా? రాజైన దుర్యోధనుడి పట్ల ఉన్న ప్రేమ పోవటానికి వీలుగా, ఇత డెక్కువ, అతడు తక్కువ అంటూ అధికులైన అవనీపతులకు సిగ్గు కలిగేటట్లు ఇతడు పలుకుతున్నాడు. ఇట్లాంటివారు తండ్రికీ కుమారులకూ హితులై ఉన్నారు. పెద్దలగు దొరలను మన మేమనగలం?'

వ. అని దుర్యోధనుం జూచి యిట్లనియె : 241

తాత్పర్యం: రాధేయుడు దుర్యోధనుడి వైపు చూచి ఇట్లా అన్నాడు :

ఉ. 'కర్జము దప్పె నీ యెదురఁ గష్టపు మాటల కేల యోర్తు రీ
దుర్జనుఁడైన శాంతనవు దోర్బల మేటిది? యీతఁ డొక్కఁడున్
వర్జితుఁడైన నేమి? నృపవర్గము కుందుట యొంటఁ బాయునే?
యర్జున పక్షపాతి యితఁ డాలము మేకొని చేయఁడుంజుమీ! 242

ప్రతిపదార్థం: కర్జము తప్పెన్= పని చెడిపోయింది; నీ+ఎదురన్= నీ సమక్షంలో; కష్టపుమాటలకున్= బాధ కలిగించే పలుకులకు; ఏల+ఓర్తురు?= ఏ విధంగా సహించగలరు?; ఈ దుర్జనుఁడు+ఐన= ఈ దుష్టుడైన; శాంతనవు దోః బలము+ ఏటిది?= భీష్మడి భుజశక్తి ఏపాటిది?; ఈతఁడు+ఒక్కఁడున్= ఇతఁడొక్కడు; వర్జితుఁడు+ఐనన్+ఏమి?= విడువబడితే కలిగే నష్టమేమి?; నృపవర్గము కుందుట= రాజసమూహం బాధచెందటం; ఒంటన్+పాయునే?= భీష్మడిని త్యజించకుండా మరొక్క విధంగా తొలగిపోగలదా?; ఇతఁడు= ఈ గాంగేయుడు; అర్జునపక్షపాతి= అర్జునుడి మీద అభిమానం కలవాడు; మేకొని= పూనుకొని; ఆలము= కయ్యం; చేయఁడున్+చుమీ!= సలుపడు సుమా!

తాత్పర్యం: వ్యవహారం చెడిపోయింది. నీ సముఖంలో భీష్మ డాడిన మనసు నొప్పించే మాటలు విని సహించటం ఎట్లా? దుష్టుడైన ఈ గాంగేయుడి భుజశక్తి ఏపాటిది? ఇతడిని మనపక్షం నుండి తొలగిస్తే కలిగే నష్టమేమి? ఈ విధంగాకాక మరోవిధంగా ఈ రాజసమూహం మనోబాధ తీరదు. ఇతడు అర్జునుడి పట్ల పక్షపాతం కలవాడు. పూనికతో యుద్ధం చేయడు సుమా!

తే. చాలఁ గాలంబు పోవక చతురులైన । వృద్ధ జనముల బుద్ధులు విం(డుగాక!
ముదియ మతిదప్పి నోరికి నొదవినట్లు । పలుకు వెడఁగుల మాటలు పాడి యగునె? 243

ప్రతిపదార్థం: చాలన్+కాలంబు పోవక= బహుకాలం గడవక; చతురులు+ ఐన= నేర్పరులైన; వృద్ధజనముల బుద్ధులు= పెద్దలైన వారి మాటలు; విం(డుగాక= ఆలకిస్తారుగాని; ముదియన్= ముసలితనం రాగా; మతి+తప్పి= బుద్ధిచెడి; నోరికిన్+ ఒదవినట్లు= నోటికి వచ్చినట్లు; పలుకు= మాటాడునట్టి; వెడఁగుల మాటలు= వివేకం లేనివారి పల్కులు; పాడి+అగునె?= ధర్మమౌతుందా?; (ఆదరింపదగినవి కావని భావం.)

తాత్పర్యం: పండు ముసలివాళ్ళుగాక నేర్పరులైన వృద్ధులయొక్క బుద్ధులు ఆదరించదగినవేకాని ముదిమివలన మదిదప్పి నోటికి వచ్చినట్లు వదరే అవివేకుల వాక్యాలు ప్రమాణంగా స్వీకరించదగినవి కావు.

క. సేనమొగ మీతఁ డైనం । బూని మహీశ్వరులు నీకుఁ బొడిచెదరే? దు
ర్మాని యనిగాదె యీతని । తో నడచుట కొల్లనైతి దురమున కధిపా!' 244

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; సేనమొగము+ఈతఁడు+ఐనన్= సేనలకు అగ్రభాగంలో (సేనాధిపతిగా) ఇతడుంటే; పూని= శ్రద్ధవహించి; మహీ+ఈశ్వరులు= ధరణిపతులు; నీకున్= నీకుగా; పొడిచెదరే?= పోరాడెదరా?; దుర్మాని+అని+కాదె= దురహంకారుడని తలంచికదా; ఈతనితోన్= ఈ భీష్మడితో; దురమునకున్= యుద్ధానికి; నడచుటకున్= కదలటానికి; ఒల్లన్+ఐతిన్= అంగీకరించలేకపోయాను.

తాత్పర్యం: ఈ భీష్మడు గనుక సేనాగ్రభాగంలో ఉంటే రాజులు శ్రద్ధతో నీకై పోరాడుతారా? ఇతడు దురహంకారి కావటం వలన ఇతడితో చేరి యుద్ధం చేయటానికి నేను అంగీకరించలేదు.'

వ. అనిన భీష్ముండు సూతసూనున కిట్లనియె: **245**

ప్రతిపదార్థం: అనినన్; భీష్ముండు; సూతసూనునకున్= సూతపుత్రుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అందులకు భీష్ముడు కర్ణుడితో ఇట్లా అన్నాడు:

చ. 'ముదుకఁడనైన నాదు బలమున్ జలమున్ వివిధాస్త్రశస్త్ర సం
పదయును బోయి నీ గురుఁడు భార్గవుచే విను, మాజిభూమి నా
కెదిరినవారు పెక్కెడల నేమయిరో యెఱుఁగున్ జగంబు; నా
ముదిమియు నీ కుమారుతనమున్ వరుసన్ విజయుం డెఱింగెడున్. **246**

ప్రతిపదార్థం: ముదుకఁడను+ఐన= ముసలివాడనైన; నాదు బలమున్= నా శక్తిని; చలమున్= పట్టుదలను; వివిధ+అస్త్రశస్త్ర సంపదయును= పలురకాలైన అస్త్రశస్త్ర విద్యలలోని ప్రావీణ్యాన్నీ; పోయి= వెళ్ళి; నీ గురుఁడు= నీకు గురువైన; భార్గవుచేన్= పరశురాముడి వలన; వినుము= తెలిసికొనుము; ఆజిభూమిన్= యుద్ధప్రదేశంలో; నాకున్+ఎదిరినవారు= నాతో మార్కొన్నవారు; పెక్కు+ఎడలన్= పలుచోట్ల; ఏమి+అయిరో= ఏమై పోయారో; జగంబు+ఎఱుఁగున్= లోకానికి తెలుసు; నా ముదిమియున్= నా వార్ధక్యం; నీ కుమారుతనమున్= నీయొక్క కౌమారం; వరుసన్= క్రమంగా; విజయుండు= అర్జునుడు; ఎఱింగెడున్= తెలియగలడు.

తాత్పర్యం: 'కర్ణా! నన్ను ముసలివాడని తూలనాడావు. వృద్ధుడనైన నా శక్తి ఎటువంటిదో, పంతం ఏపాటిదో, సకల శస్త్రాస్త్ర సంపన్నత ఎట్టిదో వెళ్ళి నీ గురువైన భార్గవరాముడిని అడిగి తెలిసికొనుము. పలుచోట్ల యుద్ధ రంగాలలో నన్నెదుర్కొన్నవారు ఏమై పోయినారో లోకానికి తెలుసు. నా వార్ధక్యం, నీ కౌమారం క్రమంగా పాండవమధ్యముడు ఎరుగగలడు.

క. అనుమానింపక సభలో । నను నేఁ జెప్పికొనవలసె నా కిమ్మెయి దు
ర్జనితుఁడ వగు నీ యెడ నీ । సున నా కిటు వలుక వలసె సూతతనూజా! **247**

ప్రతిపదార్థం: సూత తనూజా!= సూతపుత్రా కర్ణా!; అనుమానింపక= సంకోచించక; సభలోన్= కొలువులో; నాకున్= నాకు; ననున్ నేన్= నన్నుగురించి నేనే; చెప్పికొనన్ వలసెన్= తెల్పుకొనవలసి వచ్చినది; దుర్జనితుఁడవు+ అగు= తల్లికడుపు చెడబుట్టినవాడవైన; నీ ఎడన్= నీయందుగల; ఈసునన్= ద్వేషంచేత; నాకున్+ఇటు+పలుకన్ వలసెన్= నాకిట్లా పలుకవలసి వచ్చింది.

తాత్పర్యం: సూతపుత్రా! సందేహించక సభలో నన్నుగురించి నేనే ఈ విధంగా చాటుకొనవలసి వచ్చింది. తల్లి కడుపు చెడబుట్టిన నీ యెడ గల ద్వేషంచేత నా కిట్లా ఆత్మశ్లాఘ చేసుకొనవలసి వచ్చింది.

తే. కార్యమును ఖడ్గమును నింత గలుగు నీవు । గలుగఁ జేటువాటిల్లె నిక్కౌరవులకు;
దీని మముబోఁటు లెల్లను దీర్పనెట్లు । చాలెదము? మంచిబంటవు చక్కనగుము. **248**

ప్రతిపదార్థం: కార్యమును ఖడ్గమును= కార్యాలోచనకూ, ఖడ్గాలోచనకూ; ఇంత+కలుగు= ఇంత దుర్గుణములు గల; నీవు కలుగన్= నీవు మంత్రిగా లభించగా; ఈ+కౌరవులకున్= ఈ దుర్యోధనాదులకు; చేటు+పాటిల్లెన్= ముప్పు మూడింది;

దీనిన్= వీరి కేర్పడిన విపత్తును; మముబోఁటులు+ఎల్లను= మావంటి వాళ్ళమందరం; తీర్పన్= తొలగించటానికి; ఎట్లు చాలెదము?= ఏరీతి శక్తులమవుతాము?; మంచిబంటవు= నీవు మేటి వీరుడవుగాని; చక్కనగుము= యుద్ధానికి సంసిద్ధం కమ్ము.

తాత్పర్యం: కార్యఖడ్గాలోచనలకు మంత్రిగా నీవు కౌరవులకు లభించావు. కనుక వారికి కీడు సంప్రాప్తమయింది. వారి కేర్పడిన ఈ విపత్తు తొలగించటానికి మావంటివారందరికీ శక్తి చాలదు. నీవు మహావీరుడవే గాని, ముందు యుద్ధంలో చక్కగా నిలిచి నీ ప్రతాపం చూపించు.

చ. నెపమిడి యోహటించి యిటు నీవు తొలంగినఁ బోవ వచ్చునే?
కుపితమనస్కుఁడై నరుఁడు కూల్పఁ గ్రమంబున దొడ్డలెల్లఁ జ
న్న పిదప, నెట్లుఁ జొచ్చెదు రణంబున, నప్పుడు చావకున్న దై
న్యపుఁ బరివారముం బతియునైన నెఱింగెద రెల్ల చందముల్.' 249

ప్రతిపదార్థం: నెపము+ఇడి= నామీద సాకుపెట్టి; ఓహటించి= యుద్ధం చేయుటకు జంకి; ఇటు నీవు తొలంగినన్= ఈ రీతిగా నీ విప్పటికి తప్పించుకొన్నను; పోవన్+వచ్చునే?= మున్ముందు తప్పించుకొనిపోగలవా?; కుపిత మనస్కుఁడు+ఐ= కోపించిన మనస్సుకలవాడై; నరుఁడు= అర్జునుడు; కూల్పన్= పడగొట్టగా; క్రమంబునన్= వరుసగా; దొడ్డలు+ఎల్లన్= పెద్దలంతా; చన్నపిదపన్= చచ్చిన తరువాత; ఎట్లున్= ఏ విధంగానైనా; రణంబునన్+చొచ్చెదు(వు)= యుద్ధంలో ప్రవేశించకమానవు; అప్పుడు= అట్టి తరుణంలో; చావక+ఉన్న= మరణించక మిగిలిన; దైన్యపుఁ బరివారమున్= దీన దశలో నున్న బలగమూ; పతియున్+ఐనన్= రాజగు దుర్యోధనుడయిననూ; ఎల్లచందముల్= అన్నివిధాలు; ఎఱింగెదరు= తెలియగలరు.

తాత్పర్యం: యుద్ధానికి జంకి నాపై నెపం మోపి నీ విపుడు తప్పించుకొన్నప్పటికీ మున్ముందు తప్పించుక తిరుగలేవు. క్రోధపరీత చిత్తుడైన అర్జునుడు కూలుస్తూ ఉండగా వరుసగా మహావీరులంతా వెళ్ళిపోయిన తరువాత నీకు కదనరంగ ప్రవేశం తప్పదు. అపుడు చావక మిగిలి దీనదశలో నున్న పరివారమూ, సుయోధనుడూ నీ చందమెటువంటిదో తెలిసికొనగలరు.'

విశేషం: ఎట్లుఁ జొచ్చెదు రణంబున - అనుదానికి 'ఎట్లుఁ జచ్చెదు రణంబున' అను పాఠాంతరము గలదు. నరుఁడు-కూల్పన్= అర్జునుడు చంపఁగా, అప్పుడు, చావక+ఉన్నన్= చావకపోతే, దొడ్డలు+ఎల్లన్, చన్న-పిదపన్, రణంబునన్= యుద్ధంలో, చచ్చెదు(వు)= చస్తావు - నరుడు కూల్చినప్పుడు చావకపోతే యుద్ధంలో ఎట్లాగూ చస్తావు. - అని భావం.

వ. అని పలికి దుర్యోధను నుపలక్షించి కర్ణుతో వెండియు. 250

ప్రతిపదార్థం: అని పలికి; దుర్యోధనున్; ఉపలక్షించి= చూచి; కర్ణుతోన్; వెండియున్= మరల.

తాత్పర్యం: అని పలికి దుర్యోధనుడిని కనుగొని భీష్ముడు కర్ణుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఆ. 'సూతపుత్త్ర! యితఁడు నా తలఁ బెద్ద మో । పెత్తి నమ్మియున్న యట్టి చోటఁ
గ్రందుసేయ నాకుఁ గాదని సైరించి । యున్న బ్రదికి; తింక నూరకుండు.' 251

ప్రతిపదార్థం: సూతపుత్ర!= కర్ణా!; ఇతఁడు= ఈ సుయోధనుడు; నా తలన్= నా శిరస్సు మీద; పెద్ద మోపు+ఎత్తి= పెనుభారం మోపి; నమ్మి+ఉన్న+అట్టి చోటన్= విశ్వసించిఉన్న తావులో; క్రందు+చేయన్= కలహమొనర్చుట; నాకున్= నాకు; కాదు+అని= తగదని; సైరించి+ఉన్నన్= క్షమించి ఉన్నందున; బ్రదికితి(వి)= ప్రాణాలతో ఉన్నావు; ఇంకన్+ఊరకుండు(ము)= ఇక నోరుమూసుకొనుము.

తాత్పర్యం: 'సూతనందనా! ఈ దుర్యోధనుడు నా తలపై పెనుభారం మోపాడు. ఇతడు నన్ను గట్టిగా నమ్ముకొని ఉన్నాడు. ఇట్టిచోట వివాదం తగదని సహించాను. అందుచేత నీవు బ్రతికిపోయావు. ఇక నోరెత్తవద్దు.'

వ. అనియాడి మొగంబు గంటు వెట్టుకొనియున్న సురనదీసూను దిక్కు మొగంబై సుయోధనుండు 'నీకుం గోపింప నగునె; నన్నును గార్యభారంబునుం జూచి నా బ్రదుకునకై సర్వంబును సహింపలయు'నని తేర్చి యంగ రాజుం గనుంగొని 'మీ రిద్దఱు నొక్కటియై భరంపడి యిప్పని సక్కంజేసి కాక మీలోన నిట్టి యెరవు మాటలేల?' యని పాదివి పలికి, తదనంతరంబ పాండవ పక్షంబు వారల తారతమ్యంబులు వినువాఁడై యమ్మాట పుట్టించిన నతనికి భీష్ముం డిట్లనియె: 252

ప్రతిపదార్థం: అని+ఆడి= అనిపలికి; మొగంబు; గంటుపెట్టుకొని+ఉన్న= ముడుచుకొని ఉన్న; సురనదీసూనుదిక్కుమొగంబు+ఐ= గంగానదీపుత్రుడి వైపు ముఖం త్రిప్పి; సుయోధనుండు; నీకున్; కోపింపన్+అగునె?= కినుక వహించటం న్యాయమా?; నన్నును; కార్యభారంబునున్‌చూచి; నా బ్రదుకునకున్+ఐ= నా జీవితంకొరకు; సర్వంబును= అన్నిటినీ; సహింపన్ వలయున్; ఓర్చుకొనాలి; అని; తేర్చి= భీష్ముడిని ప్రసన్నుడిని గావించి; అంగరాజున్= కర్ణుడిని; కనుంగొని= చూచి; మీరు+ఇద్దఱున్+ ఒక్కటి ఐ; భరంపడి= భారం వహించి; ఈ+పనిన్= ఈ యుద్ధకార్యాన్ని; చక్కన్+చేసి= చక్కబరిచి; కాక; మీలోనన్; ఇట్టి; ఎరవుమాటలు= పొరపొచ్చెపు పలుకులు; ఏల?= ఎందుకు?; అని; పొదివిపలికి= క్రమ్ముకొని మాటాడి; తద్+అనంతరంబ= అటు తరువాత; పాండవ పక్షంబువారల= పాండవుల వైపున్నవారియొక్క; తారతమ్యంబులు= ఎచ్చుతగ్గులు; వినువాఁడు+ఐ= వినదలంచినవాడై; ఆ+మాట+పుట్టించినన్= ఆ ప్రస్తావన తీసికొనిరాగా; ఆతనికిన్; భీష్ముండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా పలికి ముఖం ముకుళించుకొని ఉండగా సుయోధనుడు గాంగేయుడి వైపు చూచి 'పితామహా! నీకు కోపించదగునా? నన్నూ, కార్యభారాన్నీ గమనించి నా జీవితానికై నీ వన్నిటినీ సహించవలె' అని పలికి అతడిని ప్రసన్నుడిని కావించాడు. అంగరాజును అవలోకించి 'రాధేయా! మీ రిద్దరూ ఒకటై యుద్ధభారం వహించి కార్యమును గట్టెక్కించక మీలో మీకు ఈ పొరపు మాటలెందుకు?' అని పొందికగా పలికి, అవతల పాండవ పక్షమందున్న వీరుల తారతమ్యములు తెలిసికొనటానికై ఆ మాట ప్రస్తావించగా భీష్ముడిట్లా అన్నాడు:

తే. 'పాండుపుత్త్రుల నద్దెస దండిమగలఁ । గలనిజంబేను జెప్పినఁ గర్ణు మనసు
నొచ్చు; నీ చిత్త మెట్లగునో యెఱుంగ; । నాకు నిదియేమి పని రిత్త నడుమనుండి?' 253

ప్రతిపదార్థం: పాండుపుత్త్రులన్= పాండు నందనులను గురించి; ఆ+దెస+దండిమగలన్= ఆ పక్షమందున్న బిరుదుశూరులను గురించి; కలనిజంబు= ఉన్నసత్యం; ఏను చెప్పినన్= నేను పలికితే; కర్ణుమనసు నొచ్చున్= కర్ణుడి హృదయం బాధపడుతుంది; నీ చిత్తము= నీ మనస్సు; ఎట్లు+అగునో+ఎఱుంగన్= ఏ విధంగా ఉంటుందో తెలియదు; రిత్తన్= వ్యర్థంగా; నడుమనుండి= మధ్యలో; నాకున్+ఇది+ఏమిపని?= నాకు ఎందుకు వచ్చిన అక్కర?'

తాత్పర్యం: 'పాండుకుమారుల పక్షంలో ఉన్న మేటి వీరుల వాస్తవమైన శక్తి సామర్థ్యాలను గురించి నేను వివరిస్తే కర్ణుడి మనస్సునకు కష్టం కలుగుతుంది. నీ మనస్సు ఎట్లా ఉంటుందో తెలియదు. మధ్యలో అనవసరంగా నాకీ పని ఎందుకు?'

వ. అనిన, మఱియు దుర్యోధనుండు తఱిమి యడుగుటయు నిట్లనియె: 254

ప్రతిపదార్థం: అనినన్= అని భీష్ముడు పలుకగా; మఱియున్; దుర్యోధనుండు; తఱిమి అడుగుటయున్= బలాత్కరించి చెప్పుమని అడుగగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు నిర్బంధించి అడుగగా భీష్మ డిట్లా అన్నాడు:

భీష్ముండు పాండవవీరులం దతిరథ మహారథాదుల నిరూపించి చెప్పుట (సం. 5-166-14)

తే. 'అతిరథుండు యుధిష్ఠిరుం డగ్నికల్పుఁ । డాహవంబున నప్రతిహతుఁడు; భీముఁ
డతిరథ శ్రేష్ఠుఁ; డతని మహాబలం బ । మానుషము, విక్రమం బసమాన మధిప! 255

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; అతిరథుండు= అతిరథుడు; అగ్నికల్పుఁడు= అగ్నితో సమానుడు; ఆహవంబునన్= యుద్ధంలో; అప్రతిహతుఁడు= అడ్డం లేనివాడు; భీముఁడు= భీమసేనుడు; అతిరథ శ్రేష్ఠుఁడు= అతిరథులలో ఉత్తముడు; ఆతని మహాబలంబు= ఆతడి పెనుశక్తి; అమానుషంబు= మానవాతీతం; విక్రమంబు= పరాక్రమం; అసమానము= పోలికలేనిది.

తాత్పర్యం: 'రాజా! అగ్నితో సమానుడైన ధర్మజుడు అతిరథుడు. యుద్ధరంగంలో అతడికి ఎదురులేదు. భీముడు అతిరథులలో మేటి. అతడు మానవాతీత దేహబలసంపన్నుడు. అతడి పరాక్రమానికి పోలిక చెప్ప వీలుగాదు.

క. సమరథులు కవలు భుజగ । ర్వము పటు విక్రమము దుర్నివారంబులు; వా
రి మనంబులు నిర్భయములు; । తమ మొనలకు మించి బెట్టు దాఁకుదు రధిపా! 256

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; కవలు= అమడలైన నకుల సహదేవులు; సమరథులు= సమరథులైఉన్నారు; భుజగర్వము= వారల బాహు దర్పం; పటువిక్రమము= దృఢ శౌర్యం; దుర్నివారంబులు= అడ్డగించరానివి; వారి మనంబులు= వారి హృదయాలు; నిర్భయములు= భీతిలేనివి; తమ మొనలకున్ మించి= తమ సేనలకు ముందు మిగిలి; బెట్టుతాఁకుదురు= శత్రువులతో గట్టిగా పోరాటం సాగిస్తారు.

తాత్పర్యం: నకుల సహదేవులు సమరథులు. వారి బాహుబలం, దృఢమైన శౌర్యం అడ్డగించరానివి. వారి హృదయాలు భయరహితాలు. వారు తమ సేనలకు ముందు మిగిలి విరోధులతో గట్టిగా పోరాడగలరు.

సీ. వారందఱును ధర్మవైభవంబునఁ, దప । స్సంపద నెక్కుడు జనులకెల్ల
ధనువు నాఱంగంబులను బరిణతులు దాఁ । కోర్తురు; పరులకు నోర్వరాని
కోల్తల గలరు; పెక్కులు పరాక్రమములు । వేర్వేఱ చేసిన వీరు లొక్క
మొగ మయి తాఁకిన వెగడంద కుండునే? । మనసేన ము న్నవమాన పాటు

ఆ. దుఃఖపాటు గలిగి తొడరంగ వచ్చిన । వారుగాన నలఁతిఁ బోరు; ప్రాణ
మాసపడక యోపినంతయుఁ బెనఁగుదు । రది సహించి నిలుచు టరిది మనకు. 257

ప్రతిపదార్థం: వారు+అందఱును= వారెల్లరును; ధర్మవైభవంబునన్= సుకృతాతిశయం వలనను; తపస్+సంపదన్= తపస్సమృద్ధిచేతను; జనులకున్+ఎల్లన్= జనులందరికంటె; ఎక్కుడు= అధికులు; ధనువు+ఆఱు+అంగంబులను= షడంగాలతో కూడిన ధనుర్వేదమునందు; పరిణతులు= పరిపక్వమైనవారు; తాఁకు+ఓర్తురు= శాత్రవుల తాకిడికి తట్టుకొనగలరు; పరులకున్= విరోధులకు; ఓర్వన్+రాని= సహించరానంతటి; కోల్తల కలరు= యుద్ధసన్నాహం కలవారు; పరాక్రమములు పెక్కులు= అనేక విక్రమములు; వేర్వేఱన్+చేసిన వీరులు= వేఱువేఱుగా ప్రదర్శించిన శూరులు; ఒక్కమొగము+అయి= ఏకముఖమయి; తాఁకినన్= వారు ఎదిరిస్తే; మన సేన= మన సైన్యం; వెగడు+అందక+ఉండునే?= తడబాటు చెందక మానదు; మున్ను= పూర్వం; అవమానపాటు= భంగపాటు; దుఃఖపాటు= దుఃఖానుభవం; కలిగి= పొంది; తొడరంగన్ వచ్చినవారుకానన్= ఎదిరించటానికి వచ్చినవారు కనుక; అలఁతిన్ పోరు= అంత తేలికగా మరలరు; ప్రాణము+ఆసపడక= ప్రాణముల కాశింపక; ఓపినంతయున్+పెనఁగుదురు= శక్తిఉన్నంతమేరకు పోరాడుతారు; మనకున్= మనకు; అది సహించి= వారి విజృంభణాన్ని ఓర్చి; నిలుచుట= యుద్ధంలో చెదరక నిలబడటం; అరిది= అశక్యం.

తాత్పర్యం: పాండవులు పుణ్యాతిశయంవల్ల, తపోబలంవల్ల జనులందరికంటె గొప్పవారు. ధనుర్వేదాన్ని ఆరు అంగాలతో అభ్యసించారు. ధనుర్విద్యలో ప్రవీణులు. శత్రుధాటికి తాళగలరు. వైరులు వారి యుద్ధసన్నాహాలకు తట్టుకొనలేరు. వేరువేరుగా తమ తమ ప్రతాపాలెట్టివో ప్రదర్శించిన వీరులు. వీరందరు ఏకంగా తాకినట్లయితే మన సైన్యం తల్లడిల్లిపోతుంది. పూర్వం పొందిన పరాభవంతో, అనుభవించిన దుఃఖాలతో మనల్ని నెదిరింపవచ్చినవారు గనుక అంత తేలికగా వెళ్ళరు. ప్రాణాలను లెక్కించక శక్తి ఉన్నంతవరకూ పెనగులాడుతారు. వారి దాడికి తట్టుకొని రణరంగంలో కాలూని నిలబడటం మనకు అశక్యం.

మ. నరుఁ డీ మానమువాఁ డనంగ వశమే? నా కంతవా రెందు నె
వ్వరులే; రింకను బుట్ట; రాపులికి దుర్వారోద్యముండైన యా
హరియుం దోడటె! యేమి చెప్పుదు? నతం డా సేనలం గాచు నొ
క్కరుఁడుం, గీటడఁగించు నీ బలములన్ గాండీవదుర్దాంతుఁడై. 258

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఈ మానమువాఁడు= ఈ కొలదివాడు; అనంగన్= అని చెప్పటానికి; నాకున్= నాకు; వశమే?= తరమా?; అంతవారు= అర్జునుపాటివారు; ఎందున్+ఎవ్వరున్ లేరు= ఎక్కడా ఎవ్వరూలేరు; ఇంకను పుట్టరు= మున్ముందు కలుగబోరు; ఆ పులికిన్= ఆ బెబ్బులికి; దుర్వార+ఉద్యముండ+ఐన= అడ్డగించరాని యత్నములుగల; హరియున్= ఆ నారాయణుడును; తోడు+అటె!= సహాయుడై ఉన్నాడట!; ఏమిచెప్పుదున్= ఏమనగలం? ఇక వేరే చెప్పాలా?; అతండు= అర్జునుడు; ఆ సేనలన్+కాచున్= పాండవసైన్యాన్ని రక్షిస్తాడు; ఒక్కరుఁడున్= తానొక్కడే; నీ బలములన్= నీ సేనలన్నింటినీ; గాండీవ దుర్దాంతుఁడు+ఐ= గాండీవముచేత అణచరానివాడై; గీటడఁగించున్= సంహరిస్తాడు.

తాత్పర్యం: సుయోధనా! ఫల్గును డీపాటి వాడని నాకు చెప్పశక్యం కాదు. అంతటివాడు ఎప్పుడూ ఎక్కడా కనిపించటం లేదు. మున్ముందు అట్టివారు కలుగరుకూడా. ఆ బెబ్బులికి అడ్డగించరాని యత్నపరుడైన శ్రీహరి తోడ్పాటున్నదట. ఇక చెప్పవలసినదేముంది? గాండీవం అనే వింటిచేత అణచరానివాడై అత డొక్కడే తన సేనలన్నింటినీ కాపాడుకొంటాడు; నీ సేనలన్నింటినీ నిర్మూలిస్తాడు.'

విశేషం: ఆ హరియున్ దోడఁటె-ఇచ్చట 'హరి' శబ్దమునకు సింహమని కూడా అర్థం. హరి= కృష్ణుడనెడి సింహము-శ్లిష్టరూపకం. అలం: రూపకం. పులికి సింహం తోడయితే ఇక చెప్పేదేమున్నది? - అనే విశేషార్థం ఇందులో సూచితం.

వ. అనిన విని యక్కొలువున నున్న రాజుల మనంబు లెల్లను జేవ సెడియె; భీష్ముండు వెండియు నిట్లనియె : 259

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+కొలువునన్+ఉన్న; రాజుల మనంబులు; ఎల్లను; చేవ చెడియెన్= సత్తువ కోల్పోయాయి; భీష్ముండు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని ఆ సభలో ఉన్నవారి మనస్సులు దిగాలుపడిపోయాయి. మరల భీష్ముడిట్లా చెప్పసాగాడు.

సీ. 'ద్రౌపదేయులు మహారథు లేవురును; వారి । తరమ యుత్తరుఁడును ధరణినాథ!
యతిరథవర్యుఁ డయ్యభిమన్యుఁ; డర్జున । వాసుదేవుల కెనవచ్చువాఁడు;
లఘుచిత్రములు నేర్చు లావును దాల్మియుఁ । గలఁడు తండ్రులపాటు తలఁచుచుండుఁ
గావున బెడిదంబుగాఁ బోరు; సాత్యకి । యతిరథోత్తముఁడు శౌర్యాన్వితుండు;

తే. పాండవ స్నేహసక్తుఁడై యుండుఁ గాన । నలుక మనమీఁదఁ బెద్దయుఁ గలిగి పెనఁగు;
వీర లిరువురుఁ బరుసనివారు సమర । పరుల నొప్పింతు రీ యోధవరులనెల్ల. 260

ప్రతిపదార్థం: ధరణినాథ!= దుర్యోధన మహారాజా!; ద్రౌపదేయులు= ద్రౌపదికుమారులైన ఉపపాండవులు; ఏవురును= ఐదుమందికూడ; మహారథులు= మహారథులని చెప్పదగినవారు; ఉత్తరుఁడును= విరటుడి కొడుకైన ఉత్తరుడుకూడా; వారి తరమ= ఉపపాండవులవలె మహారథుడు; ఆ+అభిమన్యుఁడు= ఆ యభిమన్యుడు; అతిరథవర్యుఁడు= అతిరథోత్తముడు; అర్జున వాసుదేవులకున్= పార్థునకు, శ్రీకృష్ణునకు; ఎనవచ్చువాఁడు= సాటివచ్చేవాడు; లఘుచిత్రములు నేర్చున్= వింతవింతలాఘవములు అతడెరుంగును; లావును= బలం; తాల్మియున్= సహనం; కలఁడు= కల్గిఉన్నాడు; తండ్రులపాటు= తనతండ్రు లనుభవించిన కష్టాలను; తలఁచుచున్+ఉండున్= స్మరిస్తూ ఉంటాడు; కావునన్= కాబట్టి; బెడిదంబుగాన్= దారుణంగా; పోరున్= యుద్ధం చేస్తాడు; సాత్యకి= వృష్ణి వంశస్థుడైన సాత్యకి; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో శ్రేష్ఠుడు; శౌర్య+అన్వితుండు= పరాక్రమంతో కూడినవాడు; పాండవ స్నేహసక్తుఁడు+ఐ= పాండవుల చెలిమియందు కోరిక గలవాడై; ఉండున్+కానన్= ఉంటాడు కనుక; మనమీఁదన్= మనయెడ; అలుక= కోపం; పెద్దయున్+కలిగి= మిక్కిలి కలిగి; పెనఁగున్= మనతో పోరాడుతాడు; వీరలు+ఇరువురున్= అభిమన్యు సాత్యకులిద్దరు; పరుసనివారు= పారుష్యం కలవారు; సమరపరులన్= యుద్ధమునందు ఆసక్తిగల; ఈ యోధవరులన్+ఎల్లన్= మన వీర యోధులందరినీ; నొప్పింతురు= బాధిస్తారు.

తాత్పర్యం: ఉప పాండవులు ఐదుమందీ మహారథులు. వారితో సమానుడు ఉత్తరుడు. అభిమన్యుడు అతిరథులలో అగ్రేసరుడు. శ్రీకృష్ణార్జునులకు సాటియైనవాడు. యుద్ధపు మెలకువ లెన్నింటినో నేర్చినవాడు. శక్తిమంతుడు. సహనయుక్తుడు. అతడు తన తండ్రులు పడిన కష్టపరంపరలను తలపోసుకొంటూ ఉంటాడు. కనుక ఘోరంగా పోరాటం సాగిస్తాడు. సాత్యకి అతిరథులలో సిగబంతి. శౌర్యంతో కూడినవాడు. పాండవస్నేహమునందు సక్తమనస్కుడుగాన మన మీద అతడికి కోపం మెండు. ఆ కారణంతో మనతో లెస్సగా పోరాడుతాడు. అభిమన్యు సాత్యకు లిద్దరూ గండరగండలు. సంగ్రామలంపటులైన మన మేటి జోదులందరినీ వేధించక విడువరు.

విశేషం: ద్రౌపదేయులు: పాంచాలి కుమారులు ఐదుగురు. వీరు ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు అనేవారు. వీరినే ఉపపాండవు లంటారు.

మ. అలఁతింబోరు మహారథుల్ ద్రుపద మత్స్యాధీశు లుద్యద్భుజా
బలశౌర్యాఢ్యులు పాండురాజసుత సంబంధ ప్రియస్నేహముల్
కలిమింజేసి తదీయ దైన్యమునకుంగా నొచ్చియుం జచ్చియున్
గెలిపింపం దమకించి చొత్తు రని కేకీభూతచేతస్కులై. 261

ప్రతిపదార్థం: ద్రుపద మత్స్య+అధీశులు= ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి విరాటుడు అనువారు; ఉద్యత్= పెంపారుతున్న; భుజాబల= బాహుబలం చేతను; శౌర్య= విక్రమంచేతను; ఆఢ్యులు= సంపన్నులు; అలఁతిన్+పోరు= తేలికగా పోరాటంలో మనలను వదలరు; పాండురాజసుత= పాండవులతోడి; సంబంధ= చుట్టరికం; ప్రియస్నేహముల్= ప్రేమము, చెలిమి అనునవి; కలిమిన్+చేసి= కలిగినవారవటంచేత; తదీయదైన్యమునకున్+కాన్= పాండవుల దీనస్థితికై; నొచ్చియున్= బాధపడియూ; చచ్చియున్= మరణించటానికి సిద్ధపడియూ; ఏకీభూత చేతస్కులు+ఐ= ఒకటిగాఉన్న మనస్సుకలవారై; గెలిపింపన్+తమకించి= విజయం సమకూర్చటానికి త్వరపడుతూ; అనికిన్+చొత్తురు= యుద్ధరంగంలో ప్రవేశిస్తారు.

తాత్పర్యం: పాంచాల దేశపు ప్రభువైన ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి విరటుడు పెంపారు భుజశక్తితో, విక్రమంతో ఉద్దీపించే మహారథులు. పాండవులతో సఖ్యసంబంధాలు కలవారవటం వల్ల కౌంతేయుల కష్టపాటు తలంచుకొని వారికొరకు తాము నొచ్చిఅయినా, చచ్చిఅయినా వారిని గెలిపించటానికి ఏకమనస్సుతో యుద్ధరంగంలోనికి ఉరుకుతారు.

ఆ. వీరగుణము బలము వీఁకయుఁగలఁడు మ । హారథుఁడు శిఖండి; యతని తమ్ముఁ
డతిరథుండు దర్పయుతుఁడు ధృష్టద్యుమ్నుఁ । డుగ్రతేజుఁ డనికి నుగ్రునట్ల. 262

ప్రతిపదార్థం: శిఖండి= ద్రుపదుడి తనయుడైన శిఖండి అనేవాడు; మహారథుఁడు= మహారథుడు; వీరగుణము= శూరత్వం; బలము= శక్తి; వీఁకయున్= పట్టుదల; కలఁడు= కలవాడు; అతని తమ్ముఁడు= శిఖండి అనుజుడైన; ధృష్టద్యుమ్నుఁడు; అతిరథుండు= అతిరథుడు; దర్పయుతుఁడు= గర్వంతో కూడినవాడు; అనికిన్= యుద్ధానికి; ఉగ్రు+అట్ల= రుద్రుడివలె; ఉగ్రతేజుఁడు= భయంకరమైన ప్రతాపం కలవాడు.

తాత్పర్యం: శిఖండి మహారథుడు. శౌర్యం, శక్తి, పట్టుదల కలవాడు. అతడి తమ్ముడు ధృష్టద్యుమ్నుడు అతిరథుడు. బాహుదర్పం కలవాడు. యుద్ధంలో రుద్రుడివలె అతడు దారుణమైన ప్రతాపం చూపగలడు.

క. అతని సుతుఁ డర్ధరథుఁ డా । ధృతవర్మఁడు పిన్నవాఁడు త్రిమ్మటకాఁడై
మతిహీనత శస్త్రా స్త్ర । ప్రతతి పరిశ్రమములేక పాలసుఁ డగుటన్. 263

ప్రతిపదార్థం: అతని సుతుఁడు= ఆ ధృష్టద్యుమ్నుని కుమారుడు; ఆ ధృతవర్మఁడు= ధృతవర్మడనేవాడు; పిన్నవాఁడు= పసివాడు; త్రిమ్మటకాఁడై= ఇచ్చవచ్చినట్లు తిరుగుచూ; మతిహీనతన్= తెలివితక్కువచేత; శస్త్ర+అస్త్రప్రతతి పరిశ్రమములేక= శస్త్రాస్త్ర విద్యాభ్యాసం లేక; పాలసుఁడు+అగుటన్= మూర్ఖుడయినందున; అర్ధరథుఁడు= అర్ధరథుడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి కుమారుడు ధృతవర్మడు చిన్నతనంనుండి దేశముల వెంట ఇచ్చవచ్చినట్లు తిరుగుతూ తెలివిలేక శస్త్రాస్త్ర విద్యాపరిశ్రమంలేక పాలసుడైనందున అర్ధరథుడయ్యాడు.

ఆ. చేది భూవిభుండు శిశుపాల తనయుండు । ధృష్టకేతుఁ డధిక ధీరమతి మ
హారథుండు; భోజుఁ డజుఁ డనురాజులు । నట్టివార తెంపు నలవుఁ గలరు. 264

ప్రతిపదార్థం: చేది భూ విభుండు= చేదిదేశాధిపతిఅయిన; శిశుపాలతనయుండు= శిశుపాలుడి యొక్క కుమారుడు; ధృష్టకేతుఁడు= ధృష్టకేతుడనేవాడు; అధిక ధీరమతి= మిక్కిలి ధైర్యంతో కూడిన మనస్సుకలవాడు; మహారథుండు= మహారథుడై ఉన్నాడు; భోజుఁడు అజుఁడు+అను రాజులు= భోజుడు, అజుడు అను పేర్లుకల నరపతులు; అట్టివారు+అ= మహారథులే; తెంపున్= సాహసమూ; అలవున్= బలమూ; కలరు= కలిగి ఉన్నారు.

తాత్పర్యం: చేది దేశపురాజు శిశుపాలుడి యొక్క కుమారుడు ధృష్టకేతుడు. అతడు మిక్కిలి ధైర్యంతో గూడిన మనస్సుకలవాడు. అతడు మహారథుడు. భోజుడు అజుడు అనే పేర్లుగల నరపతులు కూడ మహారథులే. వారు బలసాహసాలు కలవారు.

వ. ఉత్తమౌజుండును యుధామన్యుండును క్షత్త్ర దేవుండును జయంతుండును నమితౌజుండును విరాటుండును సత్యజితుండును ననం బరఁగు పాంచాల కుల ప్రదీపకులు మహారథులు; మత్తమాతంగ బృందంబు చందంబునం బ్రతిబలంబు పయిం గవిసి కోలాహల బహుళంబుగాఁ గలంపం జాలుదురు; కేకయపతు లేవురు సహోదరులు మహారథులు, కడింది మగలు, కెంపు రథంబుల మొత్తంబులతోఁ గార్చిచ్చు పగిదిం బొదువుదురు; కాశీశుండు నీలుండు సూర్యదత్తుండు మదిరాక్షుండు శంఖుండు విరాటజ్ఞాతులు మహారథులు వివిధాయుధ విద్యా విశారదులు; వారి పోరు భరంబై యుండు. 265

ప్రతిపదార్థం: ఉత్తమౌజుండును; యుధామన్యుండును; క్షత్త్రదేవుండును; జయంతుండును; అమితౌజుండును; విరాటుండును; సత్యజితుండును; అనన్+పరఁగు= అనే పేర్లతో ఒప్పారుతున్న; పాంచాలకుల ప్రదీపకులు= పాంచాల వంశమును వెలిగించేవారు; మహారథులు= మహారథులై ఉన్నారు; మత్తమాతంగ బృందంబు+చందంబునన్= మదించిన గజసమూహంవలె; ప్రతిబలంబుపయిన్= శత్రుసేనమీదికి; కవిసి= దుమికి; కోలాహలబహుళంబుగాన్= కలకలధ్వని చెలరేగేటట్లుగా; కలపన్+చాలుదురు= కలతనొందింప సమర్థులు; కేకయపతులు= కేకయ రాజ్యాధీశులు; ఏవురు సహోదరులు= ఐదుమంది అన్నదమ్ములు; మహారథులు= మహారథులై ఉన్నారు; కడిందిమగలు= వారు శూరులు; కెంపురథంబుల మొత్తంబులతోన్= కెంపులతో నిర్మించిన రథసమూహాలతో; కార్చిచ్చుపగిదిన్= దావానలంవలె; పొదువుదురు= క్రమ్ముకొంటారు; విరాటజ్ఞాతులు= విరాటమహారాజు దాయాదులైన; కాశీశుండు; నీలుండు; సూర్యదత్తుండు; మదిరాక్షుండు; శంఖుండు - ఈ ఏవురూ; మహారథులు= మహారథులై ఉన్నారు; వివిధ+ఆయుధ విద్యా విశారదులు= పలు తెరగులైన శస్త్రవిద్యలలో ప్రవీణులు; వారి పోరు భరంబు+ఐ+ఉండున్= వీరు సల్పు పోరాటం భరింపశక్యంకానిదై ఉంటుంది.

తాత్పర్యం: తమ పుట్టుకచేత పాంచాల వంశాన్ని ప్రకాశింపజేస్తున్న ఉత్తమౌజుడు యుధామన్యుడు క్షత్త్రదేవుడు జయంతుడు అమితౌజుడు విరాటుడు సత్యజితుడు అనే ఏడుగురున్నూ మహారథులు. వారు మదించిన ఏనుగుల గుంపువలె విరోధిసేనలపై దూకి కలకలధ్వని చెలరేగేటట్లు చీకాకు పరుస్తారు. కేకయ దేశాధిపతులు అయిదుమంది అన్నదమ్ములు మహారథులు. వారు మేటి వీరులు. కెంపురథాలతో దావానలం మాదిరి శత్రుసైన్యాలను చుట్టుముట్టుతారు. విరాటుడి దాయాదులైన కాశీశుడు నీలుడు సూర్యదత్తుడు మదిరాక్షుడు శంఖుడు అనేవారు మహారథులు. అనేక విధాలైన ఆయుధ విద్యలలో వారు నేర్పరులు. వారు సాగించే పోరాటం సహింపశక్యంకాదు.

సీ. చిత్రాయుధుండును జేకితానుండు మ । హారథు లిద్దఱు నర్జునునకుఁ
గూర్తురు, కయ్యాన కోర్తురు, నేర్తు, రా । యుధముల కెల్ల నత్యుగ్రు; లవ్వి
ధము వార; చంద్రదత్త వ్యాఘ్రదత్తులు । వినుము సేనాబిందుఁడను నృపాలుఁ
డతిరథోత్తముఁడు మారుత పుత్త్రు నెన యతం । డొక్కరుండును వారి యుఱిది లావు

ఆ. పాండ్యుఁ డతిరథుండు బలఁగంబుఁ గలవాఁడు । సమరథుండు కాశ్యుఁ డమితబలుఁడు
కుంతిభోజుఁ డాజికోవిదుఁ డతిరథుం । డతని యొద్దిజోదు లధికబలులు. **266**

ప్రతిపదార్థం: చిత్రాయుధుండును= చిత్రాయుధుడనేవాడును; చేకితానుండున్= యాదవరాజైన చేకితానుడును; మహారథులు= మహారథులై ఉన్నారు; ఇద్దఱున్= వీరిరువురును; అర్జుననకున్; కూర్తురు= ఇష్టులై ఉన్నారు; కయ్యానకున్+ఓర్తురు= యుద్ధం చేయటానికి సమర్థులు; ఆయుధములకున్+ఎల్లన్+నేర్తురు= సకలాయుధాలతో పోరుసల్పడం తెలియుదురు; అతి+ఉగ్రులు= మిక్కిలి భయంకరులు; చంద్రదత్త వ్యాఘ్రదత్తులు= చంద్రదత్తుడు, వ్యాఘ్రదత్తుడు; ఆ+విధమువారు+అ= చిత్రాయుధ చేకితానులవంటివారే; వినుము!; సేనాబిందుఁడు+అను నృపాలుఁడు= సేనాబిందుడనేరాజు; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో శ్రేష్ఠుడు; మారుతపుత్త్రు+ఎన= భీమసేనుడికి సమానుడు; అతండు+ఒక్కరుండును= ఆ సేనాబిందు డొక్కడే; వారి+ఉఱిదిలావు= వారి గొప్పబలం; పాండ్యుఁడు= పాండ్యభూపతి; అతిరథుండు= అతిరథుడు; బలఁగంబున్+కలవాఁడు= పరివారమున్నవాడు; కాశ్యుఁడు; సమరథుండు= సమరథుడై ఉన్నాడు; అమితబలుఁడు= అతడు మిక్కిలి శక్తి కలవాడు; కుంతి భోజుఁడు= కాశ్యుడి మేనత్త కుమారుడున్నూ, యాదవరాజున్నూ అయిన కుంతిభోజుడనేవాడు; అతిరథుడు; ఆజికోవిదుఁడు= యుద్ధ ప్రావీణ్యం కల్గినవాడు; అతని+ఒద్ది+జోదులు= అతడి వద్ద ఉండే శూరులు; అధికబలులు= మిక్కుటమైన శక్తికలవారు.

తాత్పర్యం: చిత్రాయుధుడు చేకితానుడు మహారథులు. వీరిద్దరూ అర్జునుడిపై ప్రేమగలవారు. యుద్ధ క్రీడయందు సమర్థులు. సకల శస్త్రాస్త్రాలెరింగినవారు. మిక్కిలి భయంకరులు. అట్లాంటి మహారథులే చంద్రదత్తుడు, వ్యాఘ్ర దత్తుడు. సేనాబిందుడనేరాజు అతిరథుడు. అతఁ డొక్కడే వీరందరి శక్తి సామర్థ్యాలు కల్గినవాడు. పాండ్యరాజు అతిరథుడు. సేన కలవాడు. కాశ్యుడు సమరథుడు. మిక్కిలి బలశాలి. కుంతిభోజుడు అతిరథుడు. యుద్ధం చేయటంలో నేర్పుగలవాడు. అతడి కడనున్న యోధులందరూ మిక్కిలి శక్తి సంపన్నులు.

వ. రోచమానుండు మహారథుండు దేవసమానుండు. **267**

ప్రతిపదార్థం: రోచమానుండు= రోచమానుడనేవాడు; మహారథుండు; దేవసమానుండు= దేవతాతుల్యుడు.

తాత్పర్యం: రోచమానుడనేవాడు మహారథుడు. అతడు వేల్పులతో సమానుడు.

తే. అతిరథుల కెల్లఁ దల, తండ్రియట్టివాఁడ । యసురవిభుఁడు ఘటోత్కచుం; డా హిడింబ
కొడుకు మాయాబలంబున నొడుచుఁ బగఱ । నతనికడ దానవానీక మగ్గలంబు. **268**

ప్రతిపదార్థం: ఆ హిడింబకొడుకు= హిడింబయనే దానవకాంతకు పుట్టిన; ఘటోత్కచుండు; అతిరథులకున్+ఎల్లన్+తల= అతిరథులందరికంటె మిన్న; తండ్రిఅట్టివాఁడు+అ= తన జనకుడైన భీమసేనుడి వంటివాడే; అసురవిభుఁడు= రాక్షసులకు నాయకుడు; మాయాబలంబునన్= తనకున్న మాయాశక్తిచేత; పగఱన్= శత్రువులను; ఒడుచున్= జయిస్తాడు; అతనికడన్= వాడిదగ్గర; దానవ+అనీకంబు= రాక్షస సమూహం; అగ్గలంబు= మిక్కుటం.

తాత్పర్యం: హిడింబ అనే దైత్యకాంతకు జనించిన ఘటోత్కచుడు అతిరథుడు. అతడు తన జనకుడైన భీముడితో సమానుడు. రాక్షసులకు నాయకుడు. తన మాయామహిమచేత శత్రువులను ఓడించగలడు. వాడికడ రాక్షస సైన్యం మెండు.

విశేషం: ఘటోత్కచుడి జన్మవృత్తాంతం: లాక్షాగృహదహనానంతరం భీమసేనుడు అర్ధరాత్రంలో తల్లితో సహోదరులతో బిలద్వారంనుండి వెలువడి గంగానదిని దాటి సాయం సమయానికి హిడింబాసురుడు నివసించే వనం చేరాడు. అక్కడొక మర్రిచెట్టు క్రింద గమనాయాసంతో అందరూ నేలపరుండి నిద్రపోయారు. భీముడు వారిని కనిపెట్టుకొని మేల్కొని ఉన్నాడు. ఆ సమీపంలో మామిడి గున్నల మధ్యనున్న మండపంలో నుండి హిడింబాసురుడు వారినందరినీ చూచాడు. ఇన్నాళ్ళకు మానవమాంసం లభించిందని సంతోషపడి వారిని చంపి తెచ్చుటకై తన చెల్లెలు హిడింబను పంపాడు. ఆమె మనుజస్త్రీ స్వరూపంతో వచ్చింది. భీమసేనుడిని చూచి మోహించింది. విషయమంతా అతడికి తెలిపింది. హిడింబాసురుడు తడవోర్వక వచ్చి భీముడితో మాటాడుతున్న చెల్లెలిమీద నిప్పులు గ్రక్కాడు. ఆమె భయంతో భీముడి మరుగు జొచ్చింది. తల్లికి సోదరులకు నిద్రాభంగమవుతుందని వృకోదరుడు హిడింబుడిని దూరంగా ఈడ్చుకొని పోయాడు. హోరాహోరీగా వారు పోరాడుతుండగా ధర్మజాదులు మేల్కొన్నారు. హిడింబ వారికి నమస్కరించి తాను రాక్షసకాంతననీ, తనకు త్రైకాలికజ్ఞానం కలదనీ, భీముడిని వలచాననీ, తన్ను రక్షింపుడనీ వారిని వేడుకొన్నది. ఇంతలో హిడింబుడిని సంహరించి వచ్చిన భీముడితో కుంతీదేవి, 'ఈమె పరమసాధ్వి, వేరుగా తలంపక పరిగ్రహించు'మని పల్కి అతడిని ఒడబరిచింది. పగళ్ళు యథేచ్ఛగా విహరిస్తూ రాత్రులు మా యొద్ద ఉండండని వారిని కోరింది. 'పుత్రుడు కలిగేవరకూ ఈమెను పరిగ్రహిస్తా'నని భీముడు తల్లికి మాట ఇచ్చాడు. అక్కడికి వ్యాసభగవానుడు వచ్చి 'దీని పేరు కమలపాలిక. మహాసత్త్వుడైన కొడుకును కంటుంది. ఆపద్విషయంలో అతడు మిమ్ము కాపాడుతాడు' అని చెప్పి వెళ్ళిపోతాడు. పాండవులు వ్యాసమునీంద్రుడి వచనానుసారంగా అచటినుండి శాలిహోత్రుడి ఆశ్రమానికి తరలివెళ్ళుతారు. వారక్కడ వసిస్తున్న కాలంలో భీముడివలన హిడింబకు సద్యోగర్భంలో కామరూపధరుడైన ఘటోత్కచుడు ఉద్భవిస్తాడు. పుట్టగనే అతడు నవయౌవనశాలి, సకలాస్త్రశస్త్ర కుశలుడు, అపరిమిత రాక్షస పిశాచ బలసమేతుడు అయి, తలిదండ్రులకు కుంతీదేవికి నమస్కరిస్తాడు. తమకు పెద్దకొడుకని వారందరూ ముచ్చట పడుతుండగా కొన్నాళ్ళు వారితోఉండి తండ్రులతో అతడు 'నేను నా బలగంతో వెళ్ళి ఇష్టమైన చోట నివసిస్తాను. పనిగల్గినప్పుడు నన్ను స్మరించండి. వెంటనే వస్తా'నని పల్కి తల్లిని తోడ్కొని ఉత్తరదిశాభిముఖుడై వెళ్ళుతాడు. కురుక్షేత్ర యుద్ధం మొదలయింది. ఘటోత్కచుడు సంగ్రామంలో కురుసైన్యాన్ని నిర్మూలించసాగాడు. అప్పుడు కౌరవవీరులు కర్ణుడితో- 'ఇంద్రదత్తమైన శక్తిని ఇతని మీద ప్రయోగించు. భీమార్జునులు నిన్నేమిచేస్తారు?' అని ప్రోత్సహించారు. ఆ తరుణంలో ఘటోత్కచుడు విజృంభించి కర్ణుడి రథరథ్యాలను గదాఘాతంతో కూల్చివేశాడు. అతడిని నొప్పించాడు. వీడి చేతిలో తనకు చావు తప్పదని రాధేయుడు నిర్ణయించుకొన్నాడు. వాసవు డిచ్చిన ఆ ఘోర శక్తిని భీమనందనుడిపై వేశాడు. ఘటోత్కచుడు భయంకర మరణం పాలయ్యాడు. పాండవులు దుఃఖితులయ్యారు. శ్రీకృష్ణుడు సింహనాదం చేసి శంఖాన్ని పూరించి ఆనందంతో నాట్యంచేస్తూ, రథస్థుడైన అర్జునుడిని కౌగిలించుకొని వెన్ను చరిచాడు. 'మేమంతా విలపిస్తుంటే బావా! ఏమిటీ విచిత్ర వర్తనం?' అని అర్జునుడు ప్రశ్నించాడు. శౌరి ఇట్లా అన్నాడు: 'ఇంద్రు డిచ్చిన శక్తి కర్ణుడి దగ్గరుండగా నిన్ను బ్రతికించుకొనటం దుష్కరమని భావిస్తూ వచ్చాను. ఆ చింత తీరింది, కర్ణుడికి కవచకుండలాలు మునుపే పోయాయి. ఇపుడు ఇంద్రదత్త సాధనమూ పోయింది. ఇక రాధేయుడిని నీవు సుకరంగా గెలుస్తావు. ఈ ఘటోత్కచుడు కిమ్మీర బక హిడింబాసురుల కోవలోనివాడు. ధర్మద్వేషం, రోషం కల్గి ఉండటంవలన ఒకప్పుడు ఒప్పమి రావచ్చు. ఆ దానవుల మాదిరి వీడూ నశించటం నాకు అభిమతం. వీడు రావణుడి వంటివాడు. ఇపుడు చావకపోతే తరువాతనైనా నేను చంపవలసివచ్చేది. అందుచేత అర్జునా! నాకిది సంతోషకాలంగాని శోకసమయం కా'దన్నాడు. ఆ మాటలు వింటున్న సాత్యకి అన్నగారి నడిగాడు- ఇన్నాళ్ళు ఈ శక్తిని కర్ణుడు విజయుడి మీద ఎందుకు ప్రయోగించలేదని.

'అతనివారంతా ఈ పని చేయుమని కర్ణుడికి బోధిస్తూనే ఉంటారు. తాను అట్లా తప్పక చేస్తానని అతడు చెపుతూనే ఉంటాడు. తీరా పోరాడే సమయంలో వారంతా ఆ విషయం మరచిపోయేటట్లు నేను చేస్తుంటాను' అంటూ శ్రీకృష్ణుడు ధృష్టద్యుమ్నుడిని పేర్కొని సాత్యకిని చూచి 'మీరూ, నా ప్రాణాలూ, ఈ త్రిలోకీరాజ్యమూ పార్థుడివలె నా కూర్మికి పాత్రాలు కావు. ఆ శక్తి ఘటోత్కచుడి ప్రాణాలు హరించి వమ్మయిపోయింది. ఈ రాత్రి నేను హాయిగా నిద్రపోతాను' అన్నాడు.

వ. నాకుం దోఁచినవారిం బేరుకొంటి; నింతియకాని, రెండు వీళ్లను మంచి మగలు పెక్కండ్రు గల'రని చెప్పి గాంగేయుండు. 269

ప్రతిపదార్థం: నాకున్; తోఁచినవారిన్= జ్ఞప్తికివచ్చినవారిని; పేరుకొంటిన్= చెప్పాను; ఇంతియకాని= ఇంతేతప్ప; రెండువీళ్లను= ఉభయ సైన్యాలందును; మంచిమగలు= మేటి వీరులు; పెక్కండ్రు కలరు= పలువురున్నారు; అనిచెప్పి; గాంగేయుండు= భీష్ముడు.

తాత్పర్యం: నాకు జ్ఞప్తికి వచ్చినవారిని గురించి చెప్పాను. ఇంతేకాని, ఉభయ పక్షాలందు మేటి వీరులెంతోమంది ఉన్నా'రని భీష్ము డింకా ఇట్లా పలికాడు:

క. 'పాండవుల దిక్కు రథికు ల । ఖండిత బలులైన నా మొగంబునఁబడి యు
ద్దండత చూపఁగ లేరు శి । ఖండిని నొక్కరునిఁ జంపఁగాని కుమారా!' 270

ప్రతిపదార్థం: కుమారా!= వత్సా, సుయోధనా!; పాండవులదిక్కు రథికులు= పాండవ పక్షమందున్న రథికులు; అఖండితబలులు+ ఐనన్= సంపూర్ణమైన శక్తిగలవారైనప్పటికినీ; నా మొగంబునన్+పడి= నా బారినబడి; ఉద్దండతన్+చూపఁగన్+లేరు= విజృంభించలేరు; కాని= ఐననూ; శిఖండిని+ఒక్కరునిన్= ఒక్క శిఖండిని మాత్రం; చంపన్= సంహరించలేను.

తాత్పర్యం: 'పాండవ పక్షమందలి రథికులు అకుంఠిత బలవంతులైనప్పటికీ నా ముందు విజృంభించలేరు కాని, నేను శిఖండిని మాత్రం చంపలేను.'

క. అనవుడు దుర్యోధనుఁ 'డా । తని మీరు వధింపమికిఁ గతం బేమియొకో!
విన దగనేనిం జెపుఁడా' । యనుటయు నిట్లనియె భీష్ముఁ డతనికి నెమ్మిన్. 271

ప్రతిపదార్థం: అనవుడున్= అని భీష్ముడు పలుకగా; దుర్యోధనుఁడు= సుయోధనుడు; మీరు= మీరు; ఆతనిన్= శిఖండిని; వధింపమికిన్= చంపకుండుటకు; కతంబు= కారణం; ఏమి+ఒకో!= ఏమో!; వినన్+తగున్+ఏనిన్= నేను వినటానికి తగినవిషయమైతే; చెపుఁడా= చెప్పండి; అనుటయున్= అని అడుగగా; అతనికిన్= దుర్యోధనుడికి; నెమ్మిన్= ప్రీతితో; భీష్ముఁడు= దేవవ్రతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విని దుర్యోధనుడు 'మీ రా శిఖండిని చంపకుండటానికి హేతువేమో తెలియదు. నేను వినదగినదయితే చెప్పండి' అని అడుగగా పితామహు డిట్లా అన్నాడు:

వ. 'ఏ నా శిఖండినిఁ జంపమికి మూలంబు సాలం గలదు; తత్ప్రపంచం బంతయు వివరించెద నాకర్ణింపుము: 272

ప్రతిపదార్థం: ఏను= నేను; ఆ శిఖండిని; చంపమికిన్= సంహరించకుండటానికి; మూలంబు చాలన్+కలదు= కారణ మెంతో ఉన్నది; తద్+ప్రపంచంబు+అంతయున్= ఆ వివరాలన్నీ; వివరించెదన్= విశదపరుస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: నేను శిఖండిని చంపకుండటానికి కారణం చాలా ఉన్నది. ఆ విషయమంతా వివరిస్తాను వినుము:

భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానంబు సెప్పుట (సం. 5-170-1)

సీ. శంతను పిమ్మట సత్యవతీ దేవి । యనుమతితోడఁ జిత్రాంగదునకు
సామ్రాజ్యపట్టంబు సమ్మతిఁ గట్టితిఁ । నల్పకాలంబున నతఁడు దీఱెఁ;
దత్పరోక్షావస్థఁ దదనుసంభవుని వి । చిత్రవీర్యుని రాజుఁ జేసి, పెండ్లి
సేయంగఁ దివిరి, కాశీపతి కూఁతులు । కన్యలు ముప్వురు గలుగుటయును

తే. నాత దర్థిఁ దదీయ స్వయంవరమున । నఖిల నృపతులఁ బిలిపించె ననియు నెఱిఁగి
తల్లి కెఱిఁగించి యొంటిమైఁ దత్పురమున । కాయితం బయిపోయితి నరద మెక్కి. 273

ప్రతిపదార్థం: శంతనుపిమ్మటన్= శంతనుమహారాజు తరువాత; సత్యవతీదేవి+అనుమతితోడన్= సత్యవతీ దేవియొక్క అంగీకారంతో; చిత్రాంగదునకున్= ఆమె పుత్రుడైన చిత్రాంగదుడికి; సమ్మతిన్= ఇచ్ఛతో; సామ్రాజ్యపట్టంబు+కట్టితిన్= హస్తినాపుర సామ్రాజ్యానికి అభిషిక్తుడిని చేశాను; అల్పకాలంబునన్= పట్టాభిషిక్తుడైన కొద్దికాలానికే; అతఁడు+తీఱెన్= అతడు మరణించాడు; తద్+పరోక్ష+అవస్థన్= చిత్రాంగదుడి పరోక్షంలో; తద్+అనుసంభవునిన్= ఆతడి తమ్ముడైన; విచిత్రవీర్యునిన్= విచిత్రవీర్యుడిని; రాజున్+చేసి= ప్రభువుగాచేసి; పెండ్లి+చేయంగన్= పెండ్లిచేయటానికి; తివిరి= పూనుకొని; కాశీపతికూఁతులు= కాశీరాజుయొక్క పుత్రికలు; ముప్వురు కలుగుటయును= ముగ్గురుండుటయు; ఆతఁడు= ఆ+కాశీరాజు; అర్థిన్= ప్రీతితో; తదీయస్వయంవరమునకున్= తన కొమార్తెల స్వయంవరానికి; అఖిల నృపతులన్= రాజులందరినీ; పిలిపించెన్= ఆహ్వానించాడు; అనియున్+ఎఱిఁగి= అనికూడా తెలిసికొని; తల్లికిన్+ఎఱిఁగించి= నా జననికి తెల్పి; ఒంటిమైన్= ఒంటరిగా; అరదము+ఎక్కి= రథ మారోహించి; ఆయితంబు+అయి+పోయితిన్= సన్నాహంతో వెళ్ళాను.

తాత్పర్యం: శంతను మహారాజు తరువాత సత్యవతీ దేవి అంగీకారంతో ఆమె పుత్రుడైన చిత్రాంగదుడికి సామ్రాజ్యపట్టం కట్టబెట్టాను. రాజయిన కొద్దికాలానికే అతడు అంతరించాడు. ఆతడి పరోక్షంలో అతడి తమ్ముడైన విచిత్రవీర్యుడిని రాజును చేసి, వివాహం జరిపించటానికి పూనుకొన్నాను. కాశీరాజుకు ముగ్గురు కొమార్తెలు కలరనీ, అతడు తన పుత్రికల స్వయంవరానికి రాజులందరినీ ఆహ్వానించాడనీ తెలిసి, ఆ విషయం మా తల్లికి తెలిపి నేనొక్కడనే రథమెక్కి కాశీనగరానికి సన్నాహంతో వెళ్ళాను.

విశేషం: హస్తినాపురాధీశ్వరుడైన శంతను మహారాజు పరమానురాగంతో దాశరాజుకూతురు సత్యవతిని వివాహమై, ఆమెయందు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే ఇద్దరు కుమారులను కన్నాడు. వాళ్ళు సంప్రాప్త యౌవనులు కాకమునుపే శంతనుడు పరలోక గతుడైనాడు. భీష్ముడు తండ్రికి పరలోక క్రియలు నిర్వర్తించి చిత్రాంగదుణ్ణి రాజ్యాభిషిక్తుడిని కావించాడు. అతడు గర్వంతో ఊరక సుర దనుజ మనుజ గంధర్వులను ఆక్షేపిస్తూ వచ్చాడు. అందుకు కోపించి చిత్రాంగదుడు అనే గంధర్వుడు అతడిపై యుద్ధానికి వచ్చాడు. కురుక్షేత్రంలో నరాధిపతి చిత్రాంగదుడు గంధర్వపతి చిత్రాంగదుడితో తలపడ్డాడు. హోరాహోరీగా పోరాటం సాగింది. మాయాయుద్ధంలో అతిదక్షుడైన గంధర్వుడు రవితేజుడైన చిత్రాంగదుడిని సంహరించాడు. ఇలా చిత్రాంగదుడు గంధర్వ నిహతుడు కాగా, అతడి పరోక్షంలో భీష్ముడు విచిత్రవీర్యుడిని కౌరవరాజ్యానికి అభిషిక్తుడిని చేశాడు.

విచిత్రవీర్యుడి వృత్తాంతం:

విచిత్రవీర్యుడు ఆరూఢయౌవనుడు కాగానే భీష్ముడు అతడికి వివాహం చేయసంకల్పించాడు. కాశీరాజు తన పుత్రికలకు స్వయంవరం చాటించడం విని గాంగేయుడు అక్కడికి వెళ్ళి స్వయంవరానికి మూగిన రాజులంతా వెరచి వెరగుపడి చూస్తుండగా కాశీరాజు దుహితలను ముగ్గురినీ రథమెక్కించుకొని, 'నా తమ్మునికి వివాహం చేయటానికి వీరిని గొంపోతున్నాను. బ్రాహ్మము మొదలైన అష్ట వివాహాలలో క్షత్రియులకు గాంధర్వ, రాక్షసాలు ఉత్తమాలు. స్వయంవరంలో జయించి వివాహం కావటం అంతకంటే ఉత్తమం. ఇక్కడ చేరిన రాజలోకాన్ని జయించి ఈ కన్యలను తోడ్కొని చనడం ధర్మం. అడ్డుపడేవారుంటే అడ్డగించండి చూస్తాను' అని కాశీరాజుతో పలికి, వస్తూ ఉండగా అతడిని రాజులెదిరించి పరాజితులయ్యారు. భీష్ముడు ఏకవీరుడై కన్యలతో ఏగుతుంటే సాళ్వుడు వెంటనంటాడు. భీష్ముడు మార్కొని అతడి రథాన్ని రథ్యాలను సారథిని కూల్చివేశాడు. భగ్నరథుడు, భగ్నమనోరథుడు అయి సాళ్వుడు తన పట్టణానికి వెళ్ళిపోయాడు.

అంబ, అంబిక, అంబాలిక అనే ఆ ముప్వురు కన్యలతో భీష్ముడు పురం చేరగానే, వారిలో అంబ తనను సాల్వపతి ప్రేమించగా తండ్రిచే అతడికి పూర్వదత్తనైనాను అన్నది. భీష్ము డామెను విడిచి, మిగిలిన ఇద్దరినీ తమ్ముడికిచ్చి పెళ్ళిచేశాడు. విచిత్రవీర్యుడు సకలవ్యాపారాలు వదలి కాశీరాజు యొక్క దుహితలతో విహరిస్తూ అధిక కామాసక్తివలన శోషించి మరణించాడు. అతడికి పరలోక విధులు జరిపి గాంగేయుడు తల్లిని, మరదళ్ళను ఓదార్చి అరాజకమయిన రాజ్యాన్ని అకలంకంగా ప్రతిపాలిస్తూ వచ్చాడు. ఆ తర్వాత శంతనువంశం నిల్పటానికి సత్యవతీదేవి నియోగం వలన అంబిక, అంబాలికలు వ్యాస ప్రసాదం వలన ధృతరాష్ట్రునీ పాండురాజునూ కన్నారు. వీరిద్దరూ విచిత్రవీర్యుడికి క్షేత్రజులైన కొడుకులు.

వ. ఇవ్విధమునం జని యమ్మహోత్సవంబున నలంకృతలై యున్న యంబయు నంబికయు నంబాలికయు ననుముద్దియల ముప్వురంబట్టి రథంబుపయిఁబెట్టి కొనిరా నచ్చటి రాజులెల్లను జతురంగ బలంబులతో వచ్చి నన్నుం బొదివినఁ, బటువిశిఖానల శిఖా కలాపంబున వేఁడిమి చూపి వారి నిలువరించి, యరుగుదెంచి సత్యవతికి నప్పొలంతుల నొప్పించిన నద్దేవి విచిత్రవీర్యునకు వారల వివాహంబు సేయ నుద్యోగించె; నట్టియెడ నమ్ముప్వురయందుం బెద్దయదియైన యంబయను కన్యక నాతో నిట్లనియె: 274

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; చని; ఆ+మహా+ఉత్సవంబునన్; అలంకృతలు+ఐ= అలంకరించబడినవారై; ఉన్న; అంబయున్; అంబికయున్; అంబాలికయున్ అను; ముద్దియలన్= కాంతలను; ముప్వురన్; పట్టి; రథంబుపయిన్+పెట్టికొని; రాన్= రాగా; అచ్చటి రాజులు+ఎల్లను; చతురంగబలంబులతోన్; వచ్చి; నన్నున్; పొదివినన్= క్రమ్ముకొనగా, ఆవరించగా; పటువిశిఖ+ అనలశిఖా కలాపంబునన్= తీవ్రములైన బాణాలనెడి అగ్నిజ్వాలల యొక్క సముదాయంతో; వేఁడిమి చూపి= ప్రతాపం నెరపి; వారిన్; నిలువరించి= అడ్డగించి; అరుగుదెంచి= వచ్చి; సత్యవతికిన్; ఆ+పొలంతులన్= ఆపడతులను; ఒప్పించినన్= అప్పగించగా; ఆ+దేవి= ఆ సత్యవతి; విచిత్రవీర్యునకున్; వారలన్, వివాహంబు చేయన్; ఉద్యోగించెన్= యత్నించింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ముప్వుర అందున్; పెద్ద+అది= పెద్దది; ఐన; అంబ; అను కన్యక; నాతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లు అన్నది.

తాత్పర్యం: నేను కాశీనగరానికి వెళ్ళి స్వయంవరోత్సవంలో అలంకరించబడి ఉన్న అంబ, అంబిక, అంబాలిక అనే ముగ్గురు కన్యలను పట్టుకొని రథంలో పెట్టుకొని వస్తుండగా అక్కడ జేరిన రాజులంతా చతురంగ బలాలతో వచ్చి నన్ను చుట్టుముట్టారు. నేను తీవ్ర శరాలనెడి అగ్నిజ్వాలల తాపం చూపి వారిని ముందడుగు వేయకుండా నిలిపివేసి హస్తినకు వచ్చి ఆ అతివలను మా అమ్మకు అప్పగించాను. ఆమె వారి నిచ్చి విచిత్రవీర్యుడికి పెళ్ళి చేయాలని యత్నిస్తుండగా ఆ ముగ్గురిలో పెద్దది అయిన అంబ అనే కన్య నాతో ఇట్లా అన్నది:

తే. 'సౌంభపురవల్లభుండైన సాళ్వుమీఁదఁ। దలఁపు గలదు నా; కతఁడును దగులు గలిగి
యుండు నాదెస; నీవు ధర్మోత్తరుండ;। వతని పాలికిఁ దగ నన్ను ననుపవయ్య!' 275

ప్రతిపదార్థం: సౌంభపురవల్లభుండు+ఐన= సౌంభపట్టణప్రభువైన; సాళ్వుమీఁదన్= సాళ్వుడిపై; నాకున్= నాకు; తలఁపు కలదు= ఉద్దేశమున్నది; అతఁడును= సాళ్వుడుకూడ; నాదెసన్= నాపట్ల; తగులు కలిగి+ఉండున్= మమకారం కలిగి ఉన్నాడు; నీవు= నీవు; ధర్మ+ఉత్తరుండవు= ధర్మమెఱింగినవారిలో శ్రేష్ఠుడవు; అతనిపాలికిన్= ఆతడి చెంతకు; తగన్= ఒప్పుగా; నన్నున్= నన్ను; అనుపవు+అయ్య!= పంపుమయ్యా!

తాత్పర్యం: 'సౌంభపట్టణాధీశ్వరుడైన సాళ్వుడిమీద నాకు అనురాగమున్నది. అతడుకూడ నాయెడ మమత కలవాడు. నీవు ధార్మికులలో అగ్రగణ్యుడవు కనుక, అతడి చెంతకు నన్ను సాదరంగా పంప వేడుకొంటున్నాను.'

క. అనవిని సత్యవతికిఁ జె। ప్పిన నాయమ వనుప నంబఁ బెంపుగ వృద్ధాం
గనలం దోడుగ నప్పుడ। పనిచి యనిచితిని జనంబు ప్రస్తుతిసేయన్. 276

ప్రతిపదార్థం: అనన్+విని= అని అంబ చెప్పగా ఆలకించి; సత్యవతికిన్+చెప్పినన్= నేను ఆ విషయాన్ని సత్యవతీదేవి కెరిగించగా; ఆయమ= ఆమె; పనుపన్= పంపగా; అంబన్= అంబను; పెంపుగన్= వైభవంగా; వృద్ధ+అంగనలన్= ముదుసలి స్త్రీలను; తోడుగన్= తోడిచ్చి; అప్పుడ= వెంటనే; పనిచి= నియమించి; జనంబు ప్రస్తుతి చేయన్= జనులు మిక్కిలికొనియాడుతుండగా; అనిచితిని= పంపాను.

తాత్పర్యం: అంబ పలుకులు విని నేను ఆ విషయం సత్యవతికి తెలిపాను. ఆమె అంబను సాళ్వుడిపాలికి పంపటానికి సమ్మతించింది. ప్రజలు నన్ను ప్రస్తుతిస్తూ ఉండగా, వెంటనే నేను వృద్ధాంగనలను తోడిచ్చి ఆమెను వైభవంగా సాళ్వుని కడకు పంపాను.

వ. ఇట్లు పనిచి తక్కిన కన్నెల నిరువురం బాణిగ్రహణంబు చేయించితి. 277

ప్రతిపదార్థం: ఇట్లు; పనిచి= పంపి; తక్కిన కన్నెలన్= మిగిలిన కన్యలైన అంబికను, అంబాలికను; ఇరువురన్= ఇద్దరినీ; పాణిగ్రహణంబు చేయించితిన్= నా తమ్ముడి కిచ్చి వివాహం చేయించాను.

తాత్పర్యం: ఇట్లా అంబను సాళ్వుడికడకు పంపివేసి, అంబిక అంబాలిక అనే ఇరువురు కన్యలను విచిత్రవీర్యుడికిచ్చి పరిణయం జరిపించాను.

క. అంబయు నట సాళ్వుని కడ। కుం బోయిన నతఁడు 'భీష్ము కొనిపోయిన దా
నిం బరచుం గైకొన ధ। ర్మంబే? కన్యాత్వ మెడలె మగువా నీకున్. 278

ప్రతిపదార్థం: అంబయున్= అంబయూ; అట= అక్కడ; సాళ్వుని కడకున్= సాళ్వుడి దగ్గరకు; పోయినన్= వెళ్ళగా; అతఁడు= ఆ సాళ్వుడు; భీష్ముకొనిపోయినదానిన్= భీష్ముడు బలాత్కారంగా తీసికొని వెళ్ళినట్టి; పరచున్= దుష్టురాలిని; కైకొనన్= పత్నిగా గ్రహించటం; ధర్మంబే?= న్యాయమా?; మగువా!= ఓ కాంతా!; నీకున్= నీకు; కన్యాత్వము+ఎడలెన్= కన్యాత్వం తొలగిపోయింది.

తాత్పర్యం: అంబ సాళ్వుడి దగ్గరకు పోగా అతడు 'నీవు భీష్ముడిచేత అపహరించబడిన కులటవు. నిన్ను పత్నిగా స్వీకరించటం న్యాయంకాదు. నీకు కన్యాత్వం పోయింది.

వ. ఇంక నిన్ను భార్యగా వరియింపం దగునే?' యనినఁ గామశరపీడిత యగుచు నక్కామిని యతని కిట్లనియె: 279

ప్రతిపదార్థం: ఇంకన్; నిన్నున్; భార్యగాన్; వరియింపన్; తగునే?= యుక్తమా?; అనినన్; కామశరపీడిత+అగుచున్= మన్మథబాణాలతో బాధింపబడినదై; ఆ+కామిని= ఆకాంత; ఆతనికిన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఇక నిన్ను భార్యగా వరించటం తగదు' అని సాళ్వుడు పలుకగా మన్మథబాణ బాధితఅయి అంబ అతడితో ఇట్లా అన్నది:

తే. 'తమ్మునికిఁ గాఁగ భీష్ముఁ డుదగ్రవృత్తిఁ । గన్నియలఁ గొనిపోయెడుఁ గాన బలిమి
నన్నుఁ గొనిపోయె; నాచేత నిన్ను వినిన । యపుడె పుత్తెంచె దూషింప ననఘ! తగునె? 280

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తమ్మునికిన్+కాఁగన్= తన తమ్ముడైన విచిత్రవీర్యుడికొరకై; భీష్ముఁడు= గాంగేయుడు; ఉదగ్రవృత్తిన్= గర్వప్రవృత్తితో; కన్నియలన్= కన్యలను; బలిమిన్= బలాత్కారంగా; కొనిపోయెడున్+కానన్= తీసికొనివెళుతున్నాడు గనుక; నన్నున్+కొనిపోయెన్= నా చెల్లెళ్ళతో నన్నుగూడ తోడ్కొని వెళ్ళాడు; నాచేతన్= నావలన; నిన్నున్+వినిన+అపుడె= నినుగూర్చి నేను చెప్పిన వెంటనే; పుత్తెంచెన్= నన్ను నీ చెంతకు పంపాడు; దూషింపన్+తగునె?= నిందించటం న్యాయమా?

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! భీష్ముడు తన తమ్ముడి కొరకై బలాత్కారంగా కన్యలను గొనిపోతుండటం వలన నన్నుగూడ వారితోపాటు తీసికొనివెళ్ళాడు. నావలన నిన్ను నే వలచిన సంగతి వినిన వెంటనే, నన్ను నీకడకు పంపి వేశాడు. మరి దూషింపదగిన విషయం ఇందులో ఏముంది?

వ. మా తండ్రి యెఱుంగక స్వయంవరాలంకారంబు నాకుం జేయించిన కతంబున నింత వుట్టె; భీష్ముండు నా చెలియండ్రం దన తమ్మున కిచ్చి నన్ను నీకడకుం దగ ననిచె; దీన నేమి త?'ప్పని మఱియు ననేకప్రకారంబులం బలికిన వినక తన్నుం జేకొనక సాళ్వుండు. 281

ప్రతిపదార్థం: మా తండ్రి; ఎఱుంగక; స్వయంవర+అలంకారంబు= స్వయంవరానికైన శృంగారం; నాకున్; చేయించిన; కతంబునన్= కారణంచేత; ఇంత పుట్టెన్= ఇంత జరిగింది; భీష్ముండు; నా చెలియండ్రన్= అంబికను, అంబాలికను; తన తమ్మునకున్; ఇచ్చి; నన్నున్; నీకడకున్; తగన్+అనిచెన్= మర్యాదగా పంపించాడు; దీనన్= ఇందులో; తప్పు+ఏమి?; అని; మఱియున్; అనేక ప్రకారంబులన్= పలువిధాల; పలికినన్; వినక; సాళ్వుండు; తన్నున్= తనను; చేకొనక= గ్రహించక.

తాత్పర్యం: నేను నిన్ను వలచుట మా తండ్రి ఎరుగడు. అందుచేత నాకు స్వయంవరాలంకారం చేయించాడు. ఆ కారణంచేత ఇంతపని జరిగింది. భీష్ముడు నా చెల్లెళ్ళిద్దరినీ తన తమ్మున కిచ్చి, నన్ను నీ దగ్గరకు మర్యాదగా పంపాడు. ఇందులో తప్పేముంది?' అని బహువిధాల అంబ చెప్పినప్పటికీ సాళ్వుడు ఆమెను స్వీకరించలేదు.

క. కరుణంబుగ నేడ్చు తలోదరిఁ । 'బోపొ మ్మిచట నింకఁ దడయకు' మని మం
దిరము వెడలంగ నడిచిన । నరిగె నదియు నార్తచిత్తయై వికలగతిన్. 282

ప్రతిపదార్థం: కరుణంబుగన్= జాలికలిగేటట్లు; ఏడ్చు= విలపించు; తలోదరిన్= అంబను; పోపొమ్ము= వెంటనే వెళ్ళిపొమ్ము; ఇచటన్= ఇక్కడ; ఇంకన్= మరి; తడయకుము+అని= ఆలసించవద్దని; మందిరమున్ వెడలంగన్+అడిచినన్= తన భవనం విడిచిపోయేటట్లు తరుమగా; అదియున్= అంబయు; ఆర్తచిత్త+ఐ= దుఃఖిత మనస్కురాలై; వికలగతిన్= తడబడే నడకతో; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: అంబ జాలి కలిగేటట్లు విలపించింది. 'ఇక నిక్కడ నిలువ వద్దు పోపో'మ్మని ఆమెను సాళ్వుడు గద్దించి తన భవనంనుంచి తరిమివేశాడు. ఆమె తడవాటుతో దుఃఖపూరిత హృదయంతో వెళ్ళిపోయింది.

వ. చనిచని యవ్వెలంది యిట్లని వితర్కించు. 283

ప్రతిపదార్థం: చని చని= వెళ్ళి వెళ్ళి; ఆ+వెలంది= ఆ మగువ; ఇట్లు+అని; వితర్కించున్= ఆలోచించింది.

తాత్పర్యం: అంబ సాళ్వపురినుండి కదలి వెళ్ళి వెళ్ళి తనలో తాను ఇట్లా వితర్కించుకొన్నది.

తే. 'సాళ్వునకుఁ గాని యపుడ సంసారమునకుఁ । బాసితిన; యింక భీష్ముని పాలి కేల
యరుగ? నాతండు మూల మీ హానికెల్లఁ । గాన నాతని సాధింతుఁగాక యేను. 284

ప్రతిపదార్థం: సాళ్వునకున్= సాళ్వభూపతికి; కాని+అపుడు+అ= పనికిరానప్పుడే; సంసారమునకున్= సంసారసౌఖ్యాలకు; పాసితిన్+అ= దూరమయ్యాను; ఇంకన్= ఇక; భీష్ముడి పాలికిన్= భీష్ముని దగ్గరకు, అరుగన్+ఏల?= వెళ్ళటెందుకు?; ఈ హానికిన్+ఎల్లన్= ఈ కీడునకంతకు; మూలము= కారణం; ఆతండు+ ఆ భీష్ముడే; కానన్= కాబట్టి; ఏను= నేను; ఆతనిన్= గాంగేయుడిని; సాధింతున్+కాక= సాధించి తీరుతాను.

తాత్పర్యం: 'సాళ్వుడికి నేను ఇల్లాలుగా పనికిరానప్పుడు మరెవ్వరికినీ కొరగాను. నా బ్రదుకు చట్టు బండలయింది. ఇప్పుడు నేను భీష్ముడి దగ్గరకు వెళ్ళి మాత్రం ఏమి ప్రయోజనం? ఈ చేటున కంతకు మూలం భీష్ముడే కనుక, అతడిని సాధించి తీరుతాను.

క. గాంగేయు గెల్వ నెవ్వరి । కిం గొలఁదియె? తపముపేర్మి గెలిచెదఁగా' కం
చుం గాంత చనియె సంయమి । పుంగవు లొక కొందఱున్న పుణ్యస్థలికిన్. 285

ప్రతిపదార్థం: గాంగేయు గెల్వన్= భీష్ముడిని జయించటం; ఎవ్వరికిన్= ఎట్టివారికిన్నీ; కొలఁదియె?= శక్యమా; తపముపేర్మిన్= తపస్సుయొక్క ఆధిక్యంచేత; గెలిచెదన్+కాక= జయిస్తాను సుమా!; అంచున్= అని; కాంత= అంబ; సంయమి పుంగవులు= మునిశ్రేష్ఠులు; ఒక కొందఱు= కొంతమంది; ఉన్న పుణ్యస్థలికిన్= ఉన్నట్టి పవిత్ర ప్రదేశానికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: గంగాపుత్రుడిని గెలవటం ఎవరికినీ తరంకాదు; కనుక అతణ్ణి తపస్సుచేత గెలుస్తా'నని నిశ్చయించుకొని అంబ మునీశ్వరులు కొందరున్నట్టి ఒక పావన ప్రదేశానికి వెళ్ళిపోయింది.

వ. చని వారలకుం దనవృత్తాంతం బెఱింగించిన వా 'రిది రాజులు చేసిన పని సాధులచేతఁ జక్కంబడునే' యనిన నవ్వనిత 'తపశ్చరణంబునకు వచ్చితి' ననుటయు, 'నీవు సుకుమారవు; నీకిది సొప్పడునే? తండ్రి పాలికిం బొ; మ్మదియ పరమ ధర్మం'బని పలికిన వారి కన్నారీరత్నం బిట్లనియె; 286

ప్రతిపదార్థం: చని; వారలకున్+తన వృత్తాంతంబు= తన సమాచారం; ఎఱింగించినన్; వారు; ఇది రాజులు చేసిన పని; సాధులచేతన్; చక్కన్+పడునే?= అనుకూలించ గలదా? అనినన్; ఆ+వనిత= ఆమె; తపస్+చరణంబునకున్= తపస్సు సలుపుటకు; వచ్చితిన్; అనుటయున్= అని పలుకగా; నీవు సుకుమారవు= మృదువైన దానవు; నీకున్ ఇది; చొప్పడునే?= సాధ్యమగునా?; తండ్రిపాలికిన్+పొమ్ము; ఇదియ పరమధర్మంబు= ఉత్తమ ధర్మం; అని పలికినన్; వారికిన్; ఆ+నారీరత్నంబు= ఆ తరుణీమణి; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అంబ వెళ్ళి ఆ మునీశ్వరులకు తన కథ సమస్తం చెప్పింది. వారు విని, 'ఇది రాజులు చేసినపని; సాధువుల చేత చక్కబడగలదా?' అని సమాధాన మిచ్చారు. అప్పుడు అంబ తాను తపస్సు చేయటానికి ఇక్కడికి వచ్చానని చెప్పింది. 'నీవు పరమ సుకుమారవు. తపస్సు చేయటం నీకు శక్యం కాదు. నీ తండ్రి దగ్గరకు వెళ్ళుము. ఇదే పరమ ధర్మం' అని మునులు చెప్పారు. వారికి ఆ వనితామణి ఇట్లా అన్నది:

క. 'ఎవ్వరు నెఱుఁగక యుండఁగ । నివ్వనమునఁ దపముసేఁత యిది నిర్ణయ మే
నెవ్వారి కడకు నేమని । యెవ్విధిఁ బోనేర్తుదాన? నేటికి బంధుల్? 287

ప్రతిపదార్థం: ఎవ్వరున్+ఎఱుఁగక+ఉండఁగన్= ఎవ్వరికీ తెలియకుండా; ఈ వనమునన్= ఈ అరణ్యంలో; తపముచేఁత= తపస్సు చేయటం; ఇది= ఇదే; నిర్ణయము= నా నిశ్చయం; ఏను= నేను; ఎవ్వారికడకున్= ఎవ్వరి దగ్గరకు; ఏమి+అని= ఏ మొగం పెట్టుకొని; ఏ+విధిన్= ఏ రీతిగా? పోన్+నేర్తుదానన్?= పోగలను? బంధుల్+ఏటికిన్?= చుట్టాలతో నాకు ఇక పనేముంది?

తాత్పర్యం: 'ఎవ్వరికీ తెలియకుండ ఈ అరణ్యంలో తపస్సుచేయటమే నా నిశ్చయం. నేను ఎవ్వరిదగ్గరకు ఏ మొగం పెట్టుకొని ఎట్లా వెళ్ళగలను? ఇక చుట్టాలతో నా కేమిపని?

వ. అని చెప్పు నవసరంబున నయ్యాశ్రమంబునకు హోత్రవాహనుండను రాజర్షి వచ్చిన నమ్మును లభ్యాగత పూజలు చేసిన యనంతరంబ యంబం గనుంగొని 'యిక్కన్నియ యెక్కడిది? దీని విషాదంబునకుం గారణం బే?'మని యడిగి, వారివలన దాని జన్మప్రకారంబును దద్వృత్తాంతంబును విని, తన కూఁతుకూఁతు రగుట యెఱింగి యయ్యంగన వినం దపస్విజనంబులకుఁ జెప్పి, యప్పాలంతిం దన యంకతలంబున నునిచికొని వెండియు నడుగ సవిస్తరంబుగా నచ్చేడియ చెప్పిన విని, శోకించి యవ్విషమ ప్రకారంబునకు నిస్తారంబుఁ జింతించి. 288

ప్రతిపదార్థం: అని చెప్పు+ అవసరంబునన్= అని చెప్పే సమయంలో; ఆ+ఆశ్రమంబునకున్= ఆ తపోవనమునకు; హోత్రవాహనుండు; అను; రాజ+ఋషి వచ్చినన్= రాజర్షి రాగా; ఆ+మునులు; అభ్యాగత పూజలు= అతిథి పూజలు; చేసిన; అనంతరంబ= పిమ్మట; అంబన్; కనుంగొని; ఈ+కన్నియ= ఈ బాల; ఎక్కడిది?= ఎక్కడనుంచి వచ్చింది?; దీని; విషాదంబునకున్= దుఃఖమునకు; కారణంబు; ఏమి+అని; అడిగి= హోత్రవాహనుడు ప్రశ్నించి; వారివలనన్= ఆ మునులవలన; దాని జన్మ ప్రకారంబును= ఆమె కాశీరాజ పుత్రిక అంబ అన్న విషయం; తద్+వృత్తాంతంబునున్= ఆమె భీష్ముడిచేత హస్తినకు కొనిరాబడి; సాళ్వునిచేత తిరస్కృతఅయి తపస్సు చేసికొనటానికి ఆ వనానికి వచ్చిన సంగతి; విని; తన కూఁతు కూఁతురు+అగుట= తన కొమార్తె బిడ్డ కావటం; ఎఱింగి; ఆ+అంగన వినన్= అంబ వినేటట్లు; తపస్వి జనంబులకున్+చెప్పి= మునుల కెఱింగించి; ఆ+పొలంతిన్= ఆ పడతిని; తన+అంకతలంబునన్+ఉనిచికొని= తన ఒడిలో కూర్చుండబెట్టుకొని;

వెండియున్ అడుగన్= మరల ఆమెనే అడుగగా; ఆ+చేడియ= ఆ చెలువ; సవిస్తరంబుగాన్= విపులంగా; చెప్పినన్= తన వృత్తాంతము తెల్పగా; విని; శోకించి= దుఃఖించి; ఆ+విషమ ప్రకారంబునకున్= ఆ విపరీత విధానానికి; నిస్తారంబున్+చింతించి= తరణోపాయం ఆలోచించి.

తాత్పర్యం: అని అంబ చెపుతున్న సమయంలో ఆ మునుల ఆశ్రమానికి హోత్రవాహనుడనే రాజర్షి వచ్చాడు. వారు ఆ మహాభాగునకు అతిథిపూజలు చేశారు. పిమ్మట హోత్రవాహనుడు అంబను చూచి 'ఈ కన్య ఎవరు? ఈమె దుఃఖానికి కారణమేమి?' అని మునులను ప్రశ్నించాడు. వారు ఆమె కాశీరాజ పుత్రికఅనీ, సాళ్వుడిని వరించినదనీ, భీష్ముడిచే బలాత్కారంగా హస్తినాపురికి కొనిరాబడిన కారణంవలన సాళ్వుడిచేత తిరస్కృతయై తపస్సు చేయటానికి ఇక్కడికి వచ్చినదనీ తెలిపారు. ఆ సంగతి విని అంబ తన దౌహిత్రి అని ఆమెతోపాటు మౌనులు ఆలకించగా హోత్రవాహనుడు చెప్పి, ఆ బాలామణిని తన ఒడిలో నిడుకొని మరల ఆమె వృత్తాంత మడిగాడు. ఆమె విపులంగా తన విషయం తెల్పగా విని అతడు దుఃఖించాడు. ఆమెను ఆ విషమ పరిస్థితినుండి తప్పించుటకు ఉపాయం ఆలోచించి.

ఉ. **'నీ కిది యేటికిం దప? మనింద్యచరిత్రవు నీవు; నిన్ను నేఁ**
జేకొని కాతు; నొక్క గతిఁ జెప్పెద, భార్గవరాము నాశ్రిత
శ్రీకరుఁ గాన్పు; మాపదలు చెందఁగనీఁ డతఁ డాశ్రయించినన్;
శోకము దక్కు' మన్న విని సుందరి యల్లన యత్తపస్వితోన్. **289**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; తపము+ఇది+ఏటికిన్?= ఇట్లా తపం చేయటమెందుకు?; నీవు అనింద్య చరిత్రవు= నీవు దూషింపదగని నడవడి కలదానవు; నిన్నున్= నిన్ను; నేన్= నేను; చేకొని= స్వీకరించి; కాతున్= రక్షిస్తాను; ఒక్కగతిన్= ఒక మార్గమును; చెప్పెదన్= నీకు తెలుపుతాను; ఆశ్రిత శ్రీకరున్= ఆశ్రయించినవారికి శుభములు కలిగించునట్టి; భార్గవరామున్= భృగువంశాన జనించిన పరశురాముడిని; కాన్పుము= దర్శించుము; అతఁడు= ఆ మహాత్ముడు; ఆశ్రయించినన్= తనను శరణు జొచ్చినచో; ఆపదలు చెందఁగన్+ఈఁడు= కష్టాలు పొందనియ్యడు; శోకము+తక్కుము= దుఃఖం వదలుము; అన్నన్= అని హోత్రవాహనుడు చెప్పగా; విని= ఆలకించి; సుందరి= అందగత్తెయగు అంబ; అల్లన= తిన్నగా; ఆ+తపస్వితోన్= ఆ మునీంద్రుడితో

తాత్పర్యం: 'నీవు తపస్సు చేయటమెందుకు? దోషంలేని నడవడి గలదానవు. నిన్ను నేను రక్షిస్తా. ఇందు కొకమార్గం చెపుతా. ఆశ్రయించినవారికి శుభాలిచ్చే భృగుకుల సంజాతుడైన పరశురాముడిని దర్శించు. తనను ఆశ్రయించిన వారికి కష్టాలు కలుగనివ్వక కాపాడుతాడు. అమ్మా! చింత మానుము' అని హోత్రవాహనుడు పలుకగా విని ఆ రాజర్షితో అంబ ఇట్లా అన్నది.

ఆ. **'పరశురాముఁ గానఁబడయుట యెక్కడఁ । గలుగు? నాతఁ డెట్లు కరుణసేయు?'**
ననఁ దపస్వి యిట్టు లను 'మహేంద్రంబను । పర్వతమునఁ జేయు పరమతపము. **290**

ప్రతిపదార్థం: పరశురామున్= పరశురాముడిని; కానన్+పడయుట= దర్శించ గలగటం; ఎక్కడన్= ఎచ్చోట; కలుగున్= సంప్రాప్తిస్తుంది? ఆతఁడు+ఎట్లు+కరుణ చేయున్?= భార్గవరాముడెట్లా కరుణిస్తాడు?; అనన్= అని అంబ అడుగగా; తపస్వి=

ఆ మౌని; ఇట్టులు+అనున్= ఈ విధంగా చెప్పాడు; మహేంద్రంబు+అను పర్వతమునన్= మహేంద్రగిరిలో; పరమ తపమున్+చేయున్= ఆయన గొప్ప తపస్సు చేస్తుంటాడు.

తాత్పర్యం: 'పరశురాముడిని ఎక్కడ దర్శించటానికి వీలవుతుంది? అతడు న న్నెలా కరుణించగలడు?' అని హోత్రవాహనుడిని అంబ అడుగగా, 'అతడు మహేంద్రశైలంలో ఘనతపశ్చర్యలో ఉంటాడు' అని ఆ రాజర్షి సమాధాన మిచ్చాడు.

వ. నన్ను మన్నించుం గావున మదీయ దౌహిత్రి వగుట యెఱింగిన నిన్ను రక్షించు; నందుఁ బొ'మ్మను సమయంబునం బరశురామశిష్యుం డగు నకృతవ్రణుండను ముని వచ్చి, యతిథి సత్కారంబులం బూజితుండై యున్నఁ, బ్రియపూర్వకంబుగా నా హోత్రవాహనుండు 'భార్గవుం డెయ్యెడ నున్నవాఁ?'డని యడిగిన. నతం డిట్లనియె: 291

ప్రతిపదార్థం: నన్నున్; మన్నించున్= ఆదరిస్తాడు; కావునన్= కనుక; మదీయ దౌహిత్రివి+ అగుటన్= నీవు నా కొమార్తె బిడ్డవని; ఎఱింగినన్= తెలిసికొంటే; నిన్నున్; రక్షించున్; అందున్+పొమ్ము= అక్కడికి వెళ్ళుము; అనుసమయంబునన్= అని హోత్ర వాహనుడు చెప్పేవేళకు; పరశురామ శిష్యుండు+అగు అకృతవ్రణుండు; అను ముని వచ్చి; అతిథి సత్కారంబులన్; పూజితుండు+ఐ= గౌరవింపబడి; ఉన్నన్; ప్రియపూర్వకంబుగాన్= ప్రేమపురస్సరంగా; ఆ హోత్రవాహనుండు; భార్గవుండు= పరశురాముడు; ఏ+ఎడన్= ఎచ్చోట; ఉన్నవాఁడు?= ఉన్నాడు; అని; అడిగినన్; అతండు= అకృతవ్రణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అమ్మా! పరశురాముడు నన్ను ఆదరిస్తాడు. నీవు నా కొమార్తె బిడ్డవు అని అతడు తెలిసికొంటే చాలు, తప్పక నిన్ను కాపాడుతాడు; కనుక అచటికి వెళ్ళుము' అని హోత్రవాహనుడు చెపుతున్న సమయంలో పరశురాముడి శిష్యుడైన అకృతవ్రణుడు అనే ముని అక్కడికి వచ్చాడు. అతిథి సత్కారాలు అందుకొన్న తరువాత స్నేహపూర్వకంగా హోత్రవాహనుడు 'భార్గవరాముడు ఇప్పు డెక్కడున్నాడు?' అని ప్రశ్నించగా అకృతవ్రణుడు ఇట్లా అన్నాడు:

క. 'తన ప్రియసఖుఁడవు నీవని । మునిజనులకుఁ జెప్పచుండు ముదమున నిన్నుం
గనుఁగొనఁగ నెల్లి యిచటికిఁ । జనుదెంచు ననేక శిష్య సంఘము తోడన్.' 292

ప్రతిపదార్థం: నీవు; తన ప్రియసఖుఁడవు+అని= తనకు అనుంగు నెచ్చెలికాడవని; ముదమునన్= సంతోషంతో; మునిజనులకున్= మునీశ్వరులకు; చెప్పుచున్+ఉండున్= నిను గూర్చి చెపుతూ ఉంటాడు; నిన్నున్= నిన్ను; కనుఁగొనఁగన్= చూడటానికి; ఎల్లి= రేపు; అనేక శిష్య సంఘముతోడన్= పెక్కుమంది శిష్యులయొక్క సమూహంతో; ఇచటికిన్= ఇక్కడికి; చనుదెంచున్= వస్తాడు.

తాత్పర్యం: 'నీవు తనకు గారాబు మిత్రుడవని ఆయన మునీశ్వరులందరికీ సంతోషంతో చెపుతుంటాడు. నిన్ను చూడటానికి రేపు పలువురు శిష్యులతో బయలుదేరి వా రిక్కడికి వస్తారు.'

తే. అనిన విని యెల్లవారును నధిక హర్ష । మెసఁగ నున్నంత మఱునాఁడ యేగుదెంచె
భార్గవుం; డమ్మునీంద్రులు పరమభక్తి । నర్చ లిచ్చిరి హోత్ర వాహనుఁడు గనియె. 293

ప్రతిపదార్థం: అనినన్ విని= అకృతవ్రణుడు చెప్పగా ఆలకించి; ఎల్లవారును= అందరు; అధికహర్షము+ఎసఁగన్= మిక్కిలి సంతోషం అతిశయించగా; ఉన్న+అంతన్= ఉంటుండగా; మఱునాఁడు+అ= ఆ మరుసటిదినమే; భార్గవుండు= పరశురాముడు; ఏగుదెంచెన్= విచ్చేశాడు; ఆ ముని+ఇంద్రులు= అచ్చట ఉన్న మునీశ్వరులు; పరమభక్తిన్= మిక్కుటమైన భక్తితో; అర్చలు+ ఇచ్చిరి= పూజలు చేశారు; హోత్రవాహనుడు; కనియెన్= భృగురాముడిని చూచాడు.

తాత్పర్యం: అకృతవ్రణుడు పల్కినమాటలు విని అందరూ మిక్కిలి సంతోషించారు. వారట్లా ఆనందంతో ఉండగా మరునాడు పరశురాము డక్కడికి వచ్చాడు. వారు మిక్కిలి భక్తితో ఆయనకు అతిథి పూజలు సలిపారు. ఆ పిదప హోత్రవాహనుడు ఆయనను దర్శించాడు.

వ. కని పరశురాముని సంభావనంబును సంభాషణంబును బడసి కాశిరాజు కన్యకం జూపి, 'యిది నా దౌహిత్రి; దీని వృత్తాంతం బంతయు విను' మని య మ్మానినిం గానిపించిన నదియును. 294

ప్రతిపదార్థం: కని= చూచి; పరశురాముని సంభావనంబును= పరశురాముడి యొక్క ఆదరాన్ని; సంభాషణంబును= ప్రియపూర్వకమైన సల్లాపాన్ని; పడసి= పొంది; కాశిరాజు కన్యకన్+చూపి= భృగురాముడికి కాశీరాజుయొక్క పుత్రికను చూపి; ఇది= ఈమె; నా దౌహిత్రి= నా కొమార్తె బిడ్డ; దీని వృత్తాంతంబు= దీని సమాచారం; అంతయున్= సమస్తం; వినుము+ అని= ఆలకించుమని; ఆ+మానినిన్= ఆ నారీమణిని; కానిపించినన్= చూపగా; అదియును= అంబయు.

తాత్పర్యం: హోత్రవాహనుడు పరశురాముడిని సందర్శించి ఆతడి మన్ననలు పొందాడు. ప్రియపూర్వక సంభాషణ అయిన తరువాత కాశీరాజపుత్రికను చూపి, 'ఇది నా మనుమరాలు; కొమార్తెబిడ్డ. ఈమె కథనంతా ఆలకించు' మని అంబను చూపగా.

చ. కనుఁగవ నశ్రుధార లొలుకం జరణానతయైన, రాముఁ డి
ట్లను 'విను హోత్రవాహనుని యట్టుల యేనును నీకు; నీ మనం
బునఁ గల చింతయంతయును బుచ్చెద; నాకడఁ జేరి తింక నీ
వనటఁ దొలంగఁబెట్టి గరువంబుగఁ జెప్పుము దీని మూలమున్. 295

ప్రతిపదార్థం: కనుఁగవన్= రెండు కనులనుండి; అశ్రుధారలు+ఒలుకన్= కన్నీటి ధారలు కారగా; చరణ+ఆనత+ఐనన్= తన పాదాలపై వ్రాలగా; రాముఁడు= పరశురాముడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా పలికాడు; విను(ము)= అమ్మా! ఆలకించు; నీకున్= నీకు; ఏనును= నేనుకూడ; హోత్రవాహనుని+అట్టుల= హోత్రవాహను డెట్లో అట్లే తాతనని తలంచుము; నీ మనంబునన్+కల= నీ హృదయంలో ఉన్న; చింత+అంతయును= విచారాన్నంతా; పుచ్చెదన్= తొలగిస్తాను; నా కడన్+ చేరితి(వి)= నా దగ్గరకు వచ్చావు; ఇంకన్= ఇక; నీ వనటన్+తొలంగన్+పెట్టి= నీ దుఃఖాన్ని దూరంగా ఉంచి; గరువంబునన్= ధైర్యంగా; దీనిమూలమున్= నీ విషాదానికి గల కారణాన్ని; చెప్పుము= నా కెరిగింపుము.

తాత్పర్యం: రెండు కనులనుండి కన్నీటిధారలు కారుతుండగా తన పాదాలపై వ్రాలిన అంబను జూచి పరశురాము డిట్లా అన్నాడు: 'తల్లీ! నీకు హోత్రవాహను డెట్లో నేనూ అట్లే. నీవు నన్నాశ్రయించావు. నీ మదిలో నెలకొన్న దుఃఖమంతా తొలగిస్తాను. ఇక విచారం వీడి ధైర్యంతో నీ మనస్తాపానికి హేతువైన వృత్తాంతం నాకు చెప్పు.'

వ. అనిన విని యమ్మహాత్మునకు నంబ దనవృత్తాంతం బంతయు సవిస్తరంబుగాఁ జెప్పి 'నీ వార్తశరణ్యుండవు; నా పరిభవంబు దీర్చి నన్ను రక్షింపు'మనవుడు నతం డిట్లనియె: 296

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+మహా+ఆత్మునకున్; అంబ; తన వృత్తాంతంబు+అంతయున్= తనచరిత్రనంతా; సవిస్తరంబుగాన్+చెప్పి= విపులంగా నుడివి; నీవు; ఆర్త శరణ్యుండవు= ఆర్తులకు రక్షకుడవు; నా పరిభవంబు+తీర్చి= నా అవమానమును తొలగించి; నన్నున్; రక్షింపుము; అనవుడున్= అని అంబ చెప్పగా; అతండు= పరశురాముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరశురాముడి పల్కులు విని అంబ ఆ మహానుభావుడికి తన సంగతి అంతా విపులంగా వెల్లడించి, 'దేవా! నీవు దీనరక్షకుడవు. నా అవమానం బాపి నన్ను కాపాడు'మని పల్కింది. అపుడు పరశురాము డిట్లాఅన్నాడు.

క. 'పరిభవము రెండు దెఱఁగులఁ । దరుణీ తోఁచినది; సాళ్వుఁ దగఁ దేర్తునొ? యు
ద్ధురుఁ డగు భీష్మునిఁ దీర్తునొ; । కరము ప్రియంబెద్ది హృదయగతముం జెపుమా!' 297

ప్రతిపదార్థం: తరుణీ!= అంబా!; పరిభవము= నీకు కల్గిన అవమానం; రెండు తెఱఁగులన్= రెండు విధాలుగా; తోఁచినది= నాకు గోచరించింది; సాళ్వున్= సాళ్వుడిని; తగన్= తగినట్లు; తేర్తునొ?= శిక్షింతునో?; ఉద్ధురుఁడు+అగు= గర్వితుడైన; భీష్మునిన్= గాంగేయుడిని; తీర్తునొ?= దండింతునో?; కరము ప్రియంబు+ఎద్ది= నీ కీ రెండు విధాలైన చర్యలలో మిక్కిలి ఇష్టమైన దేదో; హృదయగతమున్+చెపుమా!= నీ మనసులోని విషయం నాకు తెలుపుము.

తాత్పర్యం: 'అంబా! నీకు గల్గిన అవమానమునకు రెండు కారణాలు నాకు తోచాయి. సాళ్వుని శిక్షించుమంటావా? భీష్ముని దండించుమంటావా? ఈ రెంటిలో ఏది నీ మనసుకు మిక్కిలి ఇష్టమో దానిని చెప్పు'.

చ. అనవుడు నింతి యిట్లను 'మహాపురుషా! నను సాళ్వుఁ డింకఁ గై
కొనఁ; డది సాలు; భీష్ముదెసఁ గోపము నా మది గల్గియుండు; నా
తని వధియింపఁ బూని యిటు తాపసవృత్తికి వచ్చి యిచ్చటన్
నినుఁ గని యీ పరాభవము నీఁగఁగ నీ శరణంబుఁ జొచ్చితిన్. 298

ప్రతిపదార్థం: అనవుడున్= అని పరశురాముడు పలుకగా; ఇంతి= అంబ; ఇట్లు+అనున్= ఈరీతిగా చెప్పింది; మహాపురుషా!= ఓ మహానుభావా!; ననున్= నన్ను; సాళ్వుఁడు= సాళ్వభూపతి; ఇంకన్+కైకొనఁడు= ఇక నన్ను భార్యగా స్వీకరించడు; అది చాలు= కనుక అతడిని దండించనక్కరలేదు; భీష్మదెసన్= భీష్ముడి విషయంలో; కోపము= క్రోధం; నా మదిన్= నా హృదయంలో; కల్గి+ఉండున్= కలిగిఉన్నది; ఆతనిన్= గాంగేయుడిని; వధియింపన్+పూని= చంపటానికి నిశ్చయించి; ఇటు తాపసవృత్తికిన్ వచ్చి= ఈ రీతిగా తపస్సు చేయాలని వచ్చి; ఇచ్చటన్= ఈ ఆశ్రమంలో; నినున్+కని= నిన్ను దర్శించి; ఈ పరాభవమున్+నీఁగఁగన్= ఈ అవమానం తొలగించుకొనుటకై; నీ శరణంబున్+చొచ్చితిన్= నిన్ను రక్షకుడిగా ఆశ్రయించాను.

తాత్పర్యం: పరశురాముడి పలుకులు విని అంబ ఇట్లన్నది: 'మహాత్మా! నన్ను సాళ్వు డిక పత్నిగా స్వీకరించడు. అతడిని దండించి ఫలం లేదు. నన్ను బలాత్కారంగా హస్తినకు తెచ్చిన భీష్ముడిపై నాకు మనసులో కోపముంది. అతడిని చంపటానికై తపస్సు చేయవలెనని ఇక్కడికి వచ్చాను. నిన్ను దర్శించి ఈ అవమానం తొలగించు కొనటానికి నీ శరణు జొచ్చాను.'

తే. అనిన 'నా చెప్పినట్ల గంగాత్మజుండు । సేయుఁ; జేయక తక్కిన శితశరముల
నతనిఁ బడవైతు; నూఱడు మబల! నీకుఁ । దపము సేయంగ నేటికిఁ దనువు డయ్య?' 299

ప్రతిపదార్థం: అనినన్= అని అంబ పలుకగా; నా చెప్పిన+అట్లు+అ= నేను వచించినవిధంగా; గంగా+ఆత్మజుండు= గంగకొడుకు భీష్ముడు; చేయున్= ఆచరిస్తాడు; చేయక తక్కినన్= ఆచరించకుంటే; శితశరములన్= వాడి బాణాలతో; అతనిన్+పడన్+వైతున్= వాడిని నేలగూలుస్తాను; ఊఱడుము= ఓర్చుకో! అబల!= అంబా!; తనువు డయ్యన్= శరీరం బడలిపోగా; నీకున్= నీకు; తపము చేయంగన్+ఏటికిన్= తపస్సు చేయటం ఎందుకు?

తాత్పర్యం: 'నేను చెప్పినట్లు గాంగేయుడు చేస్తాడు. చేయకపోతే వాడిబాణాలతో వాడిని కూల్చివేస్తాను. ఓర్చుకో. శరీరం శుష్కించగా నీవు తపస్సు చేయవలసిన అక్కర లేదు.'

పరశురాముఁ డంబం దోడుకొని భీష్ముని యొద్దకు వచ్చుట (సం. 5-178-23)

క. అని పలికి పరశురాముఁడు । సనుదెంచెను మునిజనంబు సమ్మదమునఁ దోఁ
జనుదేరఁ గురుక్షేత్రం । బున కుద్ధతిఁ గాశిరాజపుత్రిం గొనుచున్. 300

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించినవాడై; పరశురాముఁడు= భార్గవరాముడు; మునిజనంబు= మునీశ్వరులు; సమ్మదమునన్= సంతోషంతో; తోన్+చనుదేరన్= తన వెంబడి రాగా; కాశిరాజపుత్రిన్+కొనుచున్= కాశీరాజు కొమార్తెను తీసికొని; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రమనే ప్రదేశానికి; ఉద్ధతిన్= దర్పంతో; చనుదెంచెను= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా అంబతో పలికి పరశురాముడు మునీశ్వరులు హర్షంతో తనవెంట రాగా, కాశీరాజకుమారిని తోడ్కొని దర్పంతో కురుక్షేత్రానికి వచ్చాడు.

వ. వచ్చి సరస్వతీతీరంబున విడిసి, తనరాక నా కెఱింగించిన, నేను ఋత్విక్పురోహిత ప్రభృతి విశిష్ట బ్రాహ్మణ సమేతంబుగాఁ బూజాద్రవ్యంబులు గొని తత్ప్రదేశంబున కరిగిన, నమ్మహాత్ముండును మదీయ భక్తి వినయ సంభ్రమంబులు సంప్రీతి నభినందించి యర్చనలు గైకొని కాశిరాజకన్యకం జూపి నాతో విట్లనియె: 301

ప్రతిపదార్థం: వచ్చి; సరస్వతీ తీరంబునన్= సరస్వతీ నది ఒడ్డున; విడిసి= నిలిచి; తనరాక; నాకున్; ఎఱింగించినన్; నేను; ఋత్విక్+పురోహిత ప్రభృతి= ఋత్విజులు పురోహితులు మున్నగు; విశిష్ట= ఆచార సంపన్నులైన; బ్రాహ్మణసమేతంబుగాన్= బ్రాహ్మణులతోకూడ; పూజాద్రవ్యంబులు కొని= పూజకొరకై వస్తువులు తీసికొని; తద్+ప్రదేశంబునకున్= పరశురాము డున్న చోటికి; అరిగినన్; ఆ+మహా+ఆత్ముఁడు= ఆ మహానుభావుడు; మదీయభక్తి వినయ సంభ్రమంబులు= నా యొక్క భక్తి, అణకువ, హర్షము; సంప్రీతిన్= మిక్కిలి తృప్తితో; అభినందించి= కొనియాడి; అర్చనలు కైకొని= నా చేయు పూజలు స్వీకరించి; కాశిరాజ కన్యకన్+చూపి; నాతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరశురాముడు అట్లా బయలుదేరి వచ్చి సరస్వతీ నదీతటంలో దిగి తాను వచ్చినట్లు నాకు చెప్పి పంపాడు. నేను ఋత్విజులు, పురోహితులు మొదలైన సదాచార సంపన్నులైన బ్రాహ్మణులతో పూజాద్రవ్యాలు తీసుకొని అక్కడికి వెళ్ళాను. ఆ మహానుభావుడు నా భక్తిని, వినయమును, సంతోషమును మిక్కిలి ప్రీతితో మెచ్చి నేను చేసే పూజలు స్వీకరించాడు. ఆ తరువాత కాశీరాజ కన్యఅయిన అంబను చూపి ఇట్లా అన్నాడు:

తే. 'బలిమి మున్నేల తెచ్చి తిప్పడఁతి? మగుడఁ । ద్రోచిపుచ్చంగఁదగునయ్య నీచవృత్తి?
వచ్చె దీనిఁ దమ్మునికి వివాహమింక । నైనఁ జేయుము; చేయమి యనుచితంబు.' 302

ప్రతిపదార్థం: బలిమిన్= బలవంతంగా; మున్ను= పూర్వం; ఈ+పడఁతిన్= ఈ కోమలిని; ఏల తెచ్చితి(వి)= ఎందుకు తీసుకువచ్చావు? నీచవృత్తిన్= అల్పుని చందంగా; మగుడన్= మరల; త్రోచిపుచ్చంగన్+తగును+అయ్య!= తిరస్కరించటం ఉచితమా?; వచ్చెన్= ఈ కన్య వచ్చినది; దీనిన్= ఈమెను; తమ్మునికిన్= విచిత్రవీర్యుడికి; వివాహము= పెండ్లి; ఇంకన్+ఐనన్+ చేయుము= ఇకనైనా చేయవలసింది; చేయమి= పెండ్లి చేయకుండటం; అనుచితంబు= తగనిపని.

తాత్పర్యం: 'బలాత్కారంగా ఈ కన్యను మొదట ఏల తెచ్చావు? తెచ్చితివిపో అల్పుడివలె మరల నీమెను తిరస్కరించటం న్యాయమా? ఈమె తిరిగి వచ్చింది. నీ తమ్ముడికి ఈమె నిచ్చి ఇకనైనా పెండ్లి కావించు. ఇట్లా పెళ్ళి చేయకుండటం సముచితం కాదు.'

క. అనుటయు 'ననఘా! తెలియన్ । విను మిది నాతోడ 'సాళ్వవిభునకు నేఁ గూ
ర్చినదాన నతనిపాలికి । ననుపుము న' న్ననినఁ గాదె యనిచితి మగుడన్. 303

ప్రతిపదార్థం: అనుటయున్= అని పరశురాముడు పలుకగా; అనఘా!= పుణ్యాత్ముడా!; తెలియన్ వినుము= నా మాటలు స్పష్టంగా ఆలకించుము; ఇది= ఈమె; నాతోడన్= నాతో; సాళ్వవిభునకున్= సాళ్వపతికి; నేన్+కూర్చినదానన్= నేను ఇష్టురాలను; అతని పాలికిన్= అతడి దగ్గరకు; నన్నున్= నన్ను; అనుపుము= పంపుము; అనినన్+కాదె= అని చెప్పటం వలన కదా; మగుడన్= తిరిగి; అనిచితిన్= పంపాను?

తాత్పర్యం: పరశురాముడి పలుకులు విని నేను, 'మహాత్మా! నా మాటలు చక్కగా విను. ఈమె నాతో 'సాళ్వవిభుడికి నేను ఇష్టురాలను, అతడి దగ్గరకు నన్ను పంపుము' అని అడిగినందువల్ల గదా నే నీమెను తిరిగి అతడి కడకు పంపాను.

తే. ఇంక నా తమ్మునికి దీని నెట్లు పెండ్లి । సేయ నేరుతు?' ననుడు 'నా చెప్పినట్లు
సేయ వైతేని నిన్ను నీ చెలులఁ జుట్ట । ములను జంపుదు' ననియె నమ్మునివరుండు. 304

ప్రతిపదార్థం: ఇంకన్= మఱి; నా తమ్మునికిన్= నా అనుజుడైన విచిత్రవీర్యుడికి; దీనిన్= ఈమెను; ఎట్లు పెండ్లి చేయన్ నేరుతున్?= ఎట్లా వివాహం చేయగలను?; అనుడున్= అని నేననగా; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడు; నా చెప్పినట్లు= నేను చెప్పిన విధంగా; చేయవైతి(వి)+ఏని= నీవు చేయకపోతే; నిన్నున్= నిన్నును; నీ చెలులన్= నీ మిత్రులను; చుట్టములను= బంధువులను; చంపుదున్+అనియెన్= సంహరిస్తా నన్నాడు.

తాత్పర్యం: మరి నా తమ్ముడికి ఈమె నిచ్చి ఎట్లా పెళ్ళి చేయగలను?' అని నేనన్నాను. అందుకు ఆ మునీంద్రుడు 'నేను చెప్పినట్లు నీవు చెయ్యకపోతే నిన్నూ, నీ స్నేహితులనూ, నీ చుట్టాలనూ చంపుతా'నన్నాడు.

వ. ఏను వినయంబు వదలక వినతుండ నగుచు వివిధ వాక్యంబులం దెలుప, నంతకంతకు నతనికిఁ గోపం బగ్గలంబైన వెండియు. 305

ప్రతిపదార్థం: ఏను= నేను; వినయంబున్ వదలక= అణకువను వీడక; వినతుండన్+అగుచున్= నమస్కారాలు చేస్తూ; వివిధ వాక్యంబులన్= అనేక వచనాలతో; తెలుపన్= నా అభిప్రాయం చెప్పగా; అంతకున్+అంతకున్= క్షణ క్షణానికి; కోపంబు; అగ్గలంబు+ఐనన్= మిక్కుటం కాగా; వెండియున్= మరల.

తాత్పర్యం: నేను వినయం వీడక అణకువతో నమస్కరిస్తూ పలు రకాలైన మాటలతో మనవి చేసుకొన్నాను. కాని, ఆయనకు అంతకంతకూ ఆగ్రహం హెచ్చింది.

ఆ. 'గురుఁడవై సమగ్ర కోదండ విద్యా మ । హత్త్వ మిచ్చినాఁడ వలుగఁ దగునె
కారణంబు లేక యీరసమెత్తి యి?' । ట్లనినఁ బరశురాముఁ డాగ్రహమున. 306

ప్రతిపదార్థం: గురుఁడవు+ఐ= నాకు ఆచార్యుడవై; సమగ్ర= పరిపూర్ణమైన; కోదండ విద్యా మహత్త్వము= ధనుర్విద్యయందలి గొప్పతనం; ఇచ్చినాఁడవు= అనుగ్రహించావు; కారణంబు లేక= హేతువు లేకుండ; ఈరసము+ఎత్తి= ఈర్ష్య వహించి; అలుగన్+తగునె?= నాపై కోపమూనటం యుక్తమా?; అనినన్= అని నేననగా; పరశురాముఁడు= భార్గవరాముడు; ఆగ్రహమునన్= కినుకతో.

తాత్పర్యం: 'నీవు నాకు గురుదేవుడవు. పరిపూర్ణమైన ధనుర్విద్యాపాండిత్యం ప్రసాదించావు. అట్టి నీవు నిష్కారణంగా ద్వేషం పూని నాపై కోపం వహించటం తగునా?' అని నే నన్నాను. అపుడు పరశురాము డాగ్రహిస్తూ.

చ. 'గురుఁడని నన్నెఱుంగు దనఘుండవు నా వచనంబునం దనా
దరణము సేసి తెన్నియొ విధంబులఁ బల్కెదు భక్తితోడ, నీ
వెరవులు దక్కు మీ! యబల వేగమ పెండిలిసేయు మంతతో
మరలు మదీయ కోప శిఖి; మానదు వేఱొక వేయుఁ జేసినన్? 307

ప్రతిపదార్థం: గురుఁడు+అని= ఆచార్యుడనని; నన్నున్+ఎఱుంగుదు= నన్ను తెలుసు; అనఘుండవు= పాపమెరుగనివాడవు; నా వచనంబునందున్= నా మాటయెడ; అనాదరణము చేసితి(వి)= అగౌరవం చూపితివి; భక్తితోడన్= భక్తితో; ఎన్నియొ విధంబులన్+పల్కెదు(వు)= ఎన్నో రకాలుగా మాట్లాడుతున్నావు; నీ వెరవులు తక్కుము= నీ యుక్తులు మానుకొమ్ము. ఈ+అబలన్= ఈ మగువను; వేగమ= శీఘ్రమే; పెండిలి చేయుము= నీ తమ్మునకిచ్చి వివాహం చేయుము; అంతతోన్= అంతటితో; మదీయ కోపశిఖి= నా క్రోధాగ్ని; మరలున్= చల్లారుతుంది; వేఱు+ఒకవేయున్+చేసినన్= ఇందుకు భిన్నంగా వేయి పనులు చేసినప్పటికినీ; మానదు= శమించదు.

తాత్పర్యం: 'నేను నీకు గురువునని తెలుసు. ఏ దోషమెరుగని వాడవైననూ నా మాటను అలక్ష్యం చేశావు. భక్తితో ఎన్నో రీతుల మాటాడుతున్నావు. ఈ ఉపాయాలన్నీ కట్టిపెట్టు. ఈమెను వెంటనే నీ తమ్ముడి కిచ్చి పెండ్లి చేయుము. అంతటితో నా కోపాగ్ని చల్లారుతుంది. నీ వీ పనిచేయక మరి వేయిపనులు చేసినా నా క్రోధానలం శమించదు.'

వ. అనిన విని 'యధర్మాచరణంబున కింతవట్టి పెనంగనగునె? పరానురక్తచిత్తయగు మగువ నిల్లాలిం జేయువారుం గలరె? యిట్టి యకృత్యం బాచరించుకంటె నీచేత నెట్లయినను లెస్స; తొల్లి పెద్దలు సెప్పిన చొప్పవధరింపు' మని యిట్లంటి. 308

ప్రతిపదార్థం: అనినన్ విని; అధర్మ+ఆచరణంబునకున్= అధర్మం ఆచరించటానికి; ఇంత+పట్టి పెనంగన్+అగునె?= ఇంతగా పట్టుకొని పెనగులాడవలెనా?; పర+అనురక్త చిత్త+అగు= ఇతరుడి యందు మమత నిండిన మనస్సుగల; మగువన్= పడతిని; ఇల్లాలిన్ చేయువారున్ కలరె= గృహిణిని కావించువారున్నారా?; ఇట్టి; అకృత్యంబు= చేయరానిపని; ఆచరించుకంటెన్= చేయటంకంటె; నీచేతన్= నీవలన; ఎట్లు+అయినన్ లెస్స= ఎట్లా జరిగినా మంచిదే; తొల్లి= పూర్వం; పెద్దలు చెప్పినచొప్పు= పెద్దలు నుడివిన మార్గం; అవధరింపుము= చిత్తగించుము; అని ఇట్లు+ అంటిన్= పరశురాముడితో ఇట్లా పలికాను.

తాత్పర్యం: పరశురాముడు పలికిన పలుకులు విని నేను 'అధర్మాచరణనిమిత్తమై ఇంత గట్టిగా పట్టుకొని పెనగులాడటం మీ కేమి న్యాయం? పరపురుషుడి యందు మనసు తగిలిన మగువను మరొకడి కిచ్చి పెండ్లి చేసేవారు ఎక్కడైనా ఉన్నారా? ఇట్లాంటి చేయరాని పని చేసేదానికన్నా, మీ వల్ల ఏమి జరిగినా మంచిదే. వెనుకటికి పెద్దలు చెప్పిన విధ మొకటున్నది. చెపుతాను వినండి' అని నే నిలా అన్నాను.

తే. 'గర్వియై కార్య మిట్టి దకార్యమిట్టి । దని యెఱుంగక లోకంబు చనుపథమునఁ
దిరుగ కున్మదవృత్తి వర్తించునట్టి । వాని గురునైన దండింప వలయు నండ్రు.' 309

ప్రతిపదార్థం: గర్వి ఐ= అహంకారం కలవాడై; కార్యము+ఇట్టిది= చేయదగిన పని ఇట్లాంటిది; అకార్యము+ఇట్టిది= చేయదగనిపని ఇటువంటిది; అని+ఎఱుంగక= అని తెలియక; లోకంబు చను పథమునన్= లోకులు నడచే మార్గంలో; తిరుగక= మెలగక; ఉన్మదవృత్తిన్= వెర్రితనంతో; వర్తించునట్టి వానిన్= మెలగునట్టివాడిని; గురున్+ఐనన్= గురువువైనను; దండింపన్+వలయున్+ అండ్రు= శిక్షించవలెనని పెద్దలు చెపుతారు.

తాత్పర్యం: 'అహంకారంతో ఇది చేయదగినపని, ఇది చేయరానిపని అని తెలిసికొనకుండా ప్రజలు నడిచే మార్గంలో నడవక, వెర్రియై ఎవడు ప్రవర్తిస్తాడో అతడు గురువైనా దండనార్హుడని పెద్దలు చెపుతారు.'

క. అను మాటకుఁ గాలానల । మును బోలెను మండి 'కయ్యమున కాయితమై
మొనలేర్చి వేగ యిచటికిఁ । జనుదె'మ్మని భార్గవుండు సంరంభమునన్. 310

ప్రతిపదార్థం: అనుమాటకున్= అని నేనన్న మాటకు; భార్గవుండు= పరశురాముడు; కాల+అనలమును+పోలెను= ప్రళయకాలములోని అగ్నివలె; మండి= ప్రజ్వలించి; సంరంభమునన్= ఆటోపంతో; కయ్యమునకున్= యుద్ధానికి; ఆయితము+ఐ= సిద్ధమై; మొనలు+ఏర్చి= వ్యూహాలను సిద్ధపరిచి; ఇచటికిన్= ఇక్కడికి (యుద్ధానికి వ్యూహం సిద్ధంచేసిన చోటుకు); వేగ= త్వరగా; చనుదెమ్ము+అని= రమ్మని.

తాత్పర్యం: నేనాడిన మాటకు పరశురాముడు ప్రళయాగ్ని వలె మండిపడ్డాడు. యుద్ధానికి సిద్ధమై సేనా వ్యూహాలు పన్నుకొని ఆటోపం ప్రదర్శించి, 'శీఘ్రమే ఇక్కడికి రా' అంటూ.

వ. పలికిన నేనును. 311

ప్రతిపదార్థం: అట్లా పరశురాముడు పలుకగా నేనున్నూ.

క. 'చులుకఁదనంబున విప్రున । కలుగంగాఁ దగదు; గురుఁడునై యున్నాఁ డం
చలయక తలఁచితిఁ గా కిటు । నిలుమీ! నీ రణము సేఁత నిజమగునేనిన్. 312

ప్రతిపదార్థం: చులుక+తనంబునన్= గౌరవహీనంగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; అలుగంగాన్+తగదు= కోపించరాదు; గురుఁడును+ఐ+ఉన్నాఁడు= గురువుగా కూడ ఉన్నాడు; అంచున్= అని; అలయక= కోపింపక; తలఁచితిన్+కాక= భావించితినేగాని; నీ రణముచేఁత= నీవు నాతో యుద్ధం చేయటం; నిజము+అగునేనిన్= సత్యమైతే; ఇటు నిలుమీ!= నా మ్రోల ధైర్యంగా నిలబడుమా?

తాత్పర్యం: 'గౌరవహీనంగా బ్రాహ్మణులయెడ కోపించటం పనికిరాదు. అందునా గురుడవై ఉన్నావని విసువక భావించాను. అంతేకాని భయంవల్ల కాదు. నీవు యుద్ధంచేయటం నిజమైతే ఇక నిలబడు.

క. క్షత్రియులఁ దొల్లి యలుకకుఁ । బాత్రము సేసితటె? నాఁడు బలియుఁడు గంగా
పుత్త్రుఁడు పుట్టమిఁగా కిది । యీ త్రయి నింకేల చెల్లు? నెఱుఁగవె నన్నున్! 313

ప్రతిపదార్థం: క్షత్రియులన్= రాచవారిని; తొల్లి= మునుపు; అలుకకున్= నీ ఆగ్రహానికి; పాత్రము చేసితి(వి)+అటె!= గురి కావించావని చెపుతారు; నాఁడు= అప్పుడు; బలియుఁడు= బలవంతుడైన; గంగా పుత్త్రుఁడు పుట్టమిన్+కాక= గాంగేయుడు జన్మించని కారణాన చెల్లింది; ఇది= ఈ క్షత్రియవంశ విధ్వంసనం; ఈ త్రయిన్= ఈ ముల్లోకాలలో; ఇంకన్= ఇకమీదట; ఏల చెల్లున్?= ఎట్లు సాగుతుంది?; నన్నున్= నన్ను; ఎఱుఁగవె?= తెలియవా?

తాత్పర్యం: పూర్వం నీవు రాచవారిని నీ క్రోధానికి గురి కావించావని చెపుతారు. ఆనాడు గాంగేయుడు జన్మించని కారణంతో అట్లా జరిగిఉంటుంది. ఇపుడు భీష్ము డున్నాడు. ఇక ముల్లోకాలలో నీ ఆగడం సాగదు. నా బలవిక్రమా లెలాంటివో నీ వెరుగవా?

క. ఏ నొకరుండన వచ్చెదఁ । గాని బలము దేను; నీవు గఱపిన శస్త్రా
స్త్రానేక విధవిలాసము । దాన వలయు సేన గాదె! తథ్యం బరయన్'. 314

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒకరుండన్+అ= ఒక్కడనే; వచ్చెదన్+కాని= వస్తానేతప్ప; బలము+తేను= సైన్యాన్ని వెంటబెట్టుకొనిరాను; తథ్యంబు+అరయన్= వాస్తవం పరికిస్తే; నీవు కఱపిన= నీవు నేర్పిన; శస్త్ర+అస్త్ర= శస్త్రాస్త్రములయొక్క; అనేకవిధవిలాసము= పెక్కు తెఱగులైన క్రీడ; తాన్+అ= తానే; వలయుసేన కాదె!= కావలసిన సైన్యమౌతుంది కదా!

తాత్పర్యం: నిజము గమనిస్తే నీవు నేర్పిన శస్త్రాస్త్రవిద్యా విశేషమే నాకు కావలసినంత సైన్యమై ఉండగా, నేను బలగాన్ని వెంటబెట్టుకొనిరాను. యుద్ధానికి ఒక్కడనే వస్తాను.'

వ. అని పలికి యతనికిం బ్రణమిల్లి చనుదెంచి, సత్యవతి కింతయు విన్నవించి, యద్దేవి యనుమతి వడసి, సర్వసన్నాహ సమేతంబగు రథం బెక్కి విప్రాశీర్వాదంబులు చెలంగ వెడలి వచ్చి కురుక్షేత్రంబు దఱియం జనునెడ, భాగీరథి భామినీ రూపంబున నరుగుదెంచి 'తన్నెఱింగించి, మదీయభక్తి నభినందించి యే నాయితంబై పోవుటకుఁ గారణం బడిగి, నా చేత నత్తెఱం గెఱింగినదియై నన్నుం గినిసి, భార్గవుపాలికిం జని 'నీ శిష్యుండు నిరపరాధుండు నా కొడుకున కలుగం దగునే?' యని చెప్పి, యతని యందుఁ బిక్కు గానక మగుడ నేతెంచి, నావలనను మెత్తంబాటులేకున్నం జనియె; నప్పుడు సిద్ధ విద్యాధర ముని గణంబులు గౌతుకంబునం గనుంగొనుచుండ నేను జమదగ్ని తనయున కనతిదూరంబునం దేరుడిగి వినతుండనై

నిలిచి 'నీవు భూచారివై యున్నవాఁడవు; రథికుండనైన నాకు నీతోడ సమరంబు చేయనగునే?' యనిన యనంతరంబ యతండు దివ్యంబులగు రథ రథ్యంబులు శస్త్రాస్త్రంబులునుం గలిగి యకృతవ్రణుండు సారథిగా సమర సన్నద్ధుండై తోఁచినం జూచి రథారోహణంబు చేసి శంఖంబు పూరించి గుణంబు సారించి సూతు నగ్గించి తనకు నమస్కరించి కడంగిన నప్పరశురామదేవుండు. 315

ప్రతిపదార్థం: అని పలికి; అతనికిన్= పరశురాముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; చనుదెంచి= వచ్చి; సత్యవతికిన్; ఇంతయున్= ఈ విషయమంతా; విన్నవించి; ఆ+దేవి+అనుమతి; పడసి= పొంది; సర్వసన్నాహసమేతంబు+అగు= సర్వసన్నాహాలతో కూడిన; రథంబు+ఎక్కి; విప్ర+ఆశీర్వాదంబులు; చెలంగన్= అతిశయించగా; వెడలివచ్చి; కురుక్షేత్రంబు; తఱియన్+చను+ఎడన్= సమీపించే సమయంలో; భాగీరథి= గంగానది; భామినీ రూపంబునన్= స్త్రీ రూపంతో; అరుగుదెంచి; తన్నున్+ఎఱింగించి= తాను గంగనని చెప్పి; మదీయభక్తిన్= నా భక్తిని; అభినందించి= మెచ్చి; ఏను= నేను; ఆయితంబు+ఐ= సిద్ధమై; పోవుటకున్+ కారణంబు+అడిగి; నాచేతన్; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎఱింగినది+ఐ; నన్నున్; కినిసి= కోపించి; భార్గవుపాలికిన్+చని; నీ శిష్యుండు; నిరపరాధుండు= తప్పులేనివాడు; నా కొడుకునకున్; అలుగన్+తగునే; అని చెప్పి; అతని యందున్= ఆ భార్గవరాముడిలో కూడ; పిక్కు+కానక= వెనుదీయటం చూడక; మగుడన్= మరల; ఏతెంచి; నా వలనను= నా వైపు కూడ; మెత్తంబాటు లేకున్నన్= మృదుత్వము లేనందున; చనియెన్= ఆమె వెళ్ళింది; అప్పుడు; సిద్ధ విద్యాధర ముని గణంబులు= సిద్ధులు విద్యాధరులు మౌనులు అనువారియొక్క సమూహాలు; కౌతుకంబునన్= కుతూహలంతో; కనుంగొనుచున్+ఉండన్; నేను; జమదగ్ని తనయునకున్= జమదగ్ని కుమారుడైన పరశురామునికి; అనతి దూరంబునన్= సమీపమందు(చేరువలో); తేరుదిగి; వినతుండను+ఐ= నమస్కరించినవాడనై; నిలిచి= ఆగి; నీవు భూచారివి+ఐ+ఉన్నవాఁడవు= నీవు నేలమీద సంచరిస్తున్నావు; రథికుండన్+ఐన+నాకున్= రథమెక్కిఉన్న నాకు; నీతోడన్= నీతో; సమరంబు+చేయన్+అగునే?= యుద్ధం చేయదగునా? అనినన్+అనంతరంబ= అని నేను పల్కిన పిమ్మట; అతండు; దివ్యంబులు+అగు= దేవ సంబంధములైన; రథ రథ్యంబులు= రథం, గుఱ్ఱాలు; శస్త్ర+అస్త్రంబులున్+కలిగి; అకృతవ్రణుండు= పరశురాముడి శిష్యుడు; సారథి కాన్= రథం నడపేవాడు కాగా; సమరసన్నద్ధుండు+ఐ తోఁచినన్= యుద్ధానికి సంసిద్ధుడై కనబడగా; రథ+ఆరోహణంబు చేసి= నేను రథమెక్కి; శంఖంబు; పూరించి= ఊది; గుణంబు సారించి= నారి మొరయించి; సూతున్= నా రథసారథిని; అగ్గించి= కొనియాడి; తనకున్= పరశురామునికి; నమస్కరించి; కడంగినన్= యుద్ధానికి పూనుకోగా; ఆ+పరశురామదేవుండు= భగవంతుడైన భార్గవరాముడు.

తాత్పర్యం: అని పరశురాముడితో పలికి ఆయనకు నమస్కరించి కదలివచ్చి మా తల్లి సత్యవతీదేవికి జరిగిన విషయం విజ్ఞప్తి చేశాను. ఆ దేవి అనుమతి పొంది సర్వసన్నాహాలతో రథమెక్కి బ్రాహ్మణాశీస్సులు గైకొని కురుక్షేత్రం సమీపిస్తుండగా గంగాదేవి స్త్రీరూపంతో వచ్చి, తానెవరో చెప్పింది. నా భక్తిని మెచ్చి నేను యుద్ధాయత్తుడనై బయలుదేరటానికి కారణమడిగింది. నేను చెప్పగా విని నాపై కోపించి, పరశురాముడి వద్దకు వెళ్ళింది. 'నీ శిష్యుడు ఏతప్పూ చేయనివాడు. అట్టి నా కుమారుడిపై నీవు కినుకవహించ దగునా? అని అన్నది. అతని వల్ల ప్రయోజనం సిద్ధించక మళ్ళీ నా దగ్గరకు వచ్చింది. నా విషయంలోనూ పట్టుదల సడలని కారణంవల్ల తిరిగి వెళ్ళిపోయింది. అప్పుడు సిద్ధ విద్యాధర మునిసమూహాలు కుతూహలంతో చూస్తూ ఉండగా జమదగ్ని మహర్షి తనయుడైన మా గురువుగారికి చేరువలో రథం దిగి వినయంతో నిలిచి 'నీవు నేలపై నుండగా నేను రథస్థుడనై నీతో సంగ్రామం సల్పటం న్యాయం కా'దన్నాను. అనంతర మతడు దివ్యమైన రథం, అశ్వములు, శస్త్రాస్త్రాలు కలిగి, తన శిష్యుడైన

అకృతవ్రణుడు సారథిగా యుద్ధానికి ఆయత్తమై గోచరించాడు. నేను రథ మెక్కి, శంఖం పూరించి, వింటినారిని మొరయించి సూతుడిని శ్లాఘించి రణ సంసిద్ధుడనై పరశురాముడికి నమస్కరించగా, అతడు.

భీష్ముఁడు పరశురామునితో యుద్ధము సేయుట (సం. 5-180-18)

క. శరవర్షము నామీఁదం । గురిసిన నే నాకసమునఁ గుదియించితి నా
యరదంబు పొంతకును న । చ్చెరువుగ నొక బాణమైనఁ జేరకయుండన్. 316

ప్రతిపదార్థం: శరవర్షమున్= బాణాలనెడి వానను; నామీఁదన్= నాపై; కురిసినన్= పరశురాముడు వర్షించగా; నా+అరదంబు పొంతకును= నా రథముయొక్క చేరువకు; అచ్చెరువుగన్= వింతగా, ఒక బాణము+ ఐనన్= ఒక శరమైనను; చేరక+ఉండన్= రాకుండునట్లు; నేను= నేను; ఆకసమునన్= అంతరిక్షములోనే; కుదియించితిన్= ఆ బాణములను అణచివేశాను.

తాత్పర్యం: పరశురాముడు నామీద శరవర్షం కురిశాడు. ఆ బాణాలను నా రథం చెంతకు కూడా చేరకుండా ఆశ్చర్యం కలిగేటట్లు అంబరతలంలోనే అన్నింటినీ అణచివేశాను.

క. ఒక మొగి నఱువది యమ్ములఁ । బ్రకటబలుండైన పరశురాముఁడు నా యం
గకములు దాఁకఁగ నశ్వ । ప్రకరము నోనాఁట సూతుపైఁ బడ నేసెన్. 317

ప్రతిపదార్థం: ప్రకటబలుండు+ఐన= ప్రసిద్ధబలవంతుడైన; పరశురాముడు= భార్గవరాముడు; ఒకమొగిన్= ఒక్కసారిగా; అఱువది+అమ్ములన్= అరవై బాణాలను; నా+అంగకములు= నా అవయవాలకు; తాఁకఁగన్= తగిలేటట్లును; అశ్వప్రకరము నోనాటన్= గుర్రాల గుంపునకు నొవ్వు కలుగ గ్రుచ్చుకొనేటట్లును; సూతుపైన్+పడన్= రథసారథిపై పడేటట్లునూ; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ప్రఖ్యాత బలశాలి అయిన పరశురాముడు నా అవయవాలకు తగిలేటట్లు, నా గుర్రాలగుంపునకు గ్రుచ్చుకొని నొప్పు కలిగేటట్లు, నా సారథిపై పడేటట్లు ఒక్కసారి అరవై బాణాలు ప్రయోగించాడు.

క. దానికి నవ్వుచు వేగం । బే నొక భల్లంబు దొడిగి యేసితి సాంద్ర
జ్యానాద భరిత రోదసి । యైన తదీయోగ్ర చాప మఱిముఱిఁ దునియన్. 318

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; నవ్వుచున్= నవ్వుతూ; వేగంబు= శీఘ్రమే; ఏను= నేను; ఒక భల్లంబున్= ఒక బాణాన్ని; తొడిగి= వింట సంధించి; సాంద్ర జ్యానాద= నిబిడమైన నారి మ్రోతచేత; భరిత= నిండిన; రోదసి+ఐన= భూమ్యాకాశాల మధ్య ప్రదేశం కలదైన; తదీయ+ఉగ్రచాపమున్= ఆతడి భయంకరమైన ధనుస్సును; అఱిముఱిన్= వెంటనే; తునియన్= విరిగేటట్లు; ఏసితిన్= విడిచాను.

తాత్పర్యం: అందుకు నేను నవ్వుతూ శీఘ్రమే ఒక బాణాన్ని వింటదొడిగి భూమ్యాకాశాల నడిమి ప్రదేశాన్నంతటినీ తన అల్లెత్రాటి మ్రోతచే నిండిస్తున్న పరశురాముడి భయంకరమైన విల్లు విరిగేటట్లు ప్రయోగించాను.

ఉ. ఒండొక విల్లు పుచ్చికొని యుజ్జ్వల రోష మహానలార్చు లొం
డొండ మొగంబుపై నెగయ నుర్వి చలింప గుణధ్వనిన్ సము
ద్దండతఁ దీవ్ర మార్గణ శతంబున నా యరదంబు ముంచె రా
ముండు వియచ్చరప్రకరముల్ వెఱఁగందుచుఁ బ్రస్తుతింపఁగన్. 319

ప్రతిపదార్థం: రాముండు= పరశురాముడు; ఒండొకవిల్లు= మరొక చాపం; పుచ్చికొని= చేతబట్టి; ఉజ్జ్వల= మిక్కిలి మండుతున్న; రోష= రోషమనెడు; మహా+అనల+అర్చులు= గొప్ప నిప్పుమంటలు; ఒండొండన్= ఒక్కటొక్కటిగా; మొగంబుపైన్+ఎగయన్= ముఖంమీద వ్యాపించగా; గుణధ్వనిన్= అల్లెత్రాటిమ్రోతచేత; ఉర్వి చలింపన్= భూమి కంపించగా; వియత్+చర ప్రకరముల్= గగన చారులైన వేల్పుల గుంపులు; వెఱఁగు+అందుచున్= విస్మయం చెందుతూ; ప్రస్తుతింపఁగన్= తనను కొనియాడగా; సముద్దండతన్= మిక్కిలి భయంకరంగా; తీవ్ర మార్గణ శతంబునన్= వాడియైన నూరు బాణాలతో; నా+అరదంబున్+ముంచెన్= నా రథాన్ని మునిగేటట్లు చేశాడు.

తాత్పర్యం: పరశురాముడు వేరొక విల్లు గ్రహించి, చెలరేగుతున్న క్రోధమనే గొప్ప నిప్పుమంటలు అంతకంతకూ తన మొగంమీద వ్యాపించగా, వింటినారి మ్రోతచేత పుడమి వణకగా, మిక్కిలి ఘోరంగా నూరు వాడి బాణాలతో నా రథాన్ని ముంచివేశాడు. ఆ మహాటోపాన్ని చూచి గగనంలో నిలిచిఉన్న దేవతాగణం విస్మయం చెందుతూ అతడిని శ్లాఘించారు.

క. ఉఱక మదీయాంగంబులు । గిటికొన నట్లేయుటయును గినుక గదిరినన్
మెఱుఁగారు నారసమ్ములు । దఱచుగ నించితిఁ గడంగి తద్గాత్రమునన్. 320

ప్రతిపదార్థం: ఉఱక= లక్ష్యపెట్టక; మదీయ+అంగంబులు= నా అవయవాలు; గిటికొనన్= చుట్టుకొనేటట్లు; అట్లు+ ఏయుటయును= ఆ విధంగా శరాలు ప్రయోగించగా; కినుక గదిరినన్= నాకు కోపంకలుగగా; మెఱుఁగారు నారసమ్ములు= వాడిదేరిన బాణాలు; తఱచుగన్= దట్టంగా; కడంగి= పూని; తద్+గాత్రంబునన్= ఆతడి శరీరమునందు; నించితిన్= నాటాను.

తాత్పర్యం: లక్ష్యపెట్టకుండా, నా అవయవాలను క్రమ్ముకొనేటట్లు పరశురాముడు తూపులు వేయగా నాకు కోపం కలిగింది. నేను వాడిదేరిన శరాలను ఆయన దేహంనిండా దట్టంగా నాటాను.

తే. ఉచ్చిపోయిన యేటుల నొలుకు శోణి । తమున సర్వాంగకంబులుఁ దడిసి యొప్పెఁ
జిగురుఁదఱుచునఁ గెంజాయ మిగిలి చెలువు । వడయు క్రొమ్మావిచాడ్పున భార్గవుండు. 321

ప్రతిపదార్థం: ఉచ్చిపోయిన= గ్రుచ్చుకొని ఆవలికి వెడలిన; ఏటులన్= బాణఘాతాలచేత; ఒలుకు= కారుతున్న; శోణితమునన్= రక్తంతో; సర్వ+అంగకంబులు= ఎల్ల అవయవాలు; తడిసి= తడిసినవై; చిగురు+తఱచునన్= దట్టమైన చిగుళ్ళవలన; కెంజాయ (కెంపు+చాయ)మిగిలి= ఎర్రని వన్నెతో అతిశయించి; చెలువు+పడయు= అందగించిన; క్రొమ్మావి (క్రొత్త+మావి) చాడ్పునన్= వసంత ఋతువునందలి క్రొత్తమామిడి చెట్టువలె; భార్గవుండు= పరశురాముడు; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: నేను ప్రయోగించిన బాణాలు పరశురాముడి అవయవాలలోదిగి అవతలకు వెళ్ళబారాయి. ఆ గాయాలనుండి కారే రక్తంతో అతడి అంగాలు తడిసి ముద్దఅయ్యాయి. దట్టమైన చిగుళ్ళవల్ల అరుణకాంతులు విరజిమ్ముతూ సౌందర్య మెగబోసే క్రొత్త మామిడి చెట్టువలె అప్పుడు పరశురాముడు ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. నెత్తురు వడిసిన మూర్ఛా । యత్తుండై సొగయుటయును నాతనిఁగని యు
ద్వృత్త క్షత్రియ ధర్మో । పాత్తంబగు తేజ మొల్లఁబాటై తోఁచెన్. 322

ప్రతిపదార్థం: నెత్తురు వడిసినన్= రక్తం కారగా; మూర్ఛా+ఆయత్తుండు+ఐ= మూర్ఛకు అధీనుడై; సొగయుటయును= సొమ్మసిల్లగా; ఆతనిన్+కని= పరశురాముడిని చూచి; ఉద్వృత్త= గర్వముతో కూడిన; క్షత్రియధర్మ= రాజధర్మంచేత; ఉపాత్తంబు+అగు= పొందబడిన; తేజము= ప్రతాపం; ఒల్లఁబాటై= అపేక్షించరానిదై; తోఁచెన్= నాకు గోచరించింది.

తాత్పర్యం: రక్తం కారడం వలన మూర్ఛ పొంది ఒడలెఱుగకున్న నా గురువు పరశురాముడిని చూడగానే గర్వంగల క్షత్రియవృత్తిచేత లభించిన ప్రతాపం నాకు అనపేక్షితంగా కనబడింది.

వ. అప్పుడు మనంబున నన్ను నేన గర్హించుకొనుచుండితి. 323

ప్రతిపదార్థం: అప్పుడు; మనంబునన్= మనసులో; నన్నున్; నేను+అ= నేనే; గర్హించుకొనుచున్= నిందించుకొంటూ; ఉండితిన్= ఉండిపోయాను.

తాత్పర్యం: పరశురాముడు మూర్ఛలో మునిగిఉండగా చూచి నన్ను నేనే ఎంతపని చేశానని నిందించుకొంటూ ఉండిపోయాను.

ఆ. అంతఁ దెలిసి రాముఁ డతికుపితాత్ముఁడై । యేఱువాఱుతెంచు నెసకమెసఁగ
నప్రమేయశరము లడరించె; నవి సత్వ । రముగ నేను బ్రతిహతములు సేసి. 324

ప్రతిపదార్థం: అంతన్= అటు తరువాత; తెలిసి= ఒడలెరిగి; రాముఁడు= పరశురాముడు; అతికుపిత+ఆత్ముఁడు+ఐ= మిక్కిలి కోపంతో కూడిన మనసుకలవాడై; ఏఱు= నది; పాఱుతెంచు+ఎసకము= ప్రవహించే విజృంభణం; ఎసఁగన్= ఒప్పగా; అప్రమేయశరములు= తెలిసికొనటానికి అశక్యములైన బాణాలు; అడరించెన్= నాపై ప్రయోగించాడు; అవి= వాటిని; సత్వరముగన్= వెనువెంటనే; నేను= నేను; ప్రతిహతములు చేసి= త్రిప్పికొట్టి.

తాత్పర్యం: ఆ తరువాత పరశురాముడు మూర్ఛనుండి తేరుకొని, మిక్కిలి కోపంతో నది ప్రవహిస్తున్నదో అనునట్లు అవిచ్ఛిన్నంగా ఇవి ఇట్లాంటివని ఊహించనలవిగాని శరాలు నామీద ప్రయోగించాడు. వాటిని నేను వెంటనే త్రిప్పికొట్టి.

విశేషం: అలం: ఉపమ.

క. మరుదస్త్ర మేయ గుహ్యక । శరమున వారించె నతఁడు; సరభసముగ ను
ద్ధుర శిఖి బాణం బేసిన । గురుఁడు వరుణ విశిఖ నిహతిఁ గుదియం జేసెన్. 325

ప్రతిపదార్థం: మరుత్+అస్త్రము+ఏయన్= వాయవ్యాస్త్రం నేను ప్రయోగించగా; అతఁడు= పరశురాముడు; గుహ్యక శరమునన్= గుహ్యకాస్త్రంతో; సరభసముగన్= సత్వరంగా; వారించెన్= అడ్డగించాడు; ఉద్ధురశిఖిబాణంబు= దృఢమైన ఆగ్నేయాస్త్రం;

ఏసినన్= నేను వేయగా; గురుఁడు= పరశురాముడు; వరుణ విశిఖ నిహతిన్= వారుణాస్త్రంయొక్క పెట్టుచేత; కుదియన్+ చేసెన్= ఆగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: నేను మారుతాస్త్రం ప్రయోగించగా గురుడు గుహ్యకాస్త్రంతో దానిని నివారించాడు. దృఢమైన ఆగ్నేయాస్త్రం నేను వేయగా ఆయన వారుణాస్త్రంయొక్క దెబ్బతో దానిని ఆగిపోయేటట్లు చేశాడు.

క. ఇమ్మెయి నతఁడును దివ్యా । స్త్రమ్ములు నామీఁద నేయ రయమునఁ బ్రతి ఘా
త మ్మొనరించితి దివిజగ । ణ మ్మంబర వీథిఁ గీర్తన మ్మొనరింపన్. 326

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; అతఁడును= పరశురామ దేవుడు కూడ; దివ్య+అస్త్రమ్ములు= దేవతాకములైన బాణాలు; నామీఁదన్= నాపై; ఏయన్= ప్రయోగించగా; రయమునన్= శీఘ్రంగా; దివిజగణమ్ము= దేవతావర్గం; అంబరవీథిన్= ఆకాశమార్గంలో నుండి; కీర్తనమ్ము+ ఒనరింపన్= నన్ను పొగడగా; ప్రతిఘాతమ్ము+ఒనరించితిన్= నివారించాను.

తాత్పర్యం: ఈ రీతిగా పరశురాముడు దివ్యాస్త్రాలు నామీద ప్రయోగించగా నేను కూడ శీఘ్రంగా వాటిని వారించాను. ఆకాశపథంలో నిలిచి దేవతాసమూహం నన్ను ప్రశంసించింది.

తే. రాముఁ డంత్యకాలానలో ద్దామ లీల । మండి నా యురస్థ్సలి యొక్క మార్గణమున
నేసె నంతంత నున్న మునీశ్వరులును । గాశిరాజ కన్యకయును గడఁగి యార్వ. 327

ప్రతిపదార్థం: అంతన్+అంతన్+ఉన్న= అక్కడక్కడ నున్న; ముని+ఈశ్వరులును= మునీంద్రులున్నూ; కాశిరాజ కన్యకయును= కాశీరాజపుత్రి అంబయున్నూ; కడఁగి= పూని; ఆర్వన్= అరవగా; రాముఁడు= భార్గవరాముడు; అంత్యకాల= ప్రళయకాలమందలి; అనల= అగ్నివలె; ఉద్దామలీలన్+మండి= అడ్డులేని విధంగా జ్వలిస్తూ; నా= నాయొక్క; ఉరస్+స్థలిన్= వక్షఃస్థలంమీద; ఒక్కమార్గణమునన్= ఒక బాణంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అక్కడక్కడ నిలిచి చూస్తున్న మునీంద్రులు, కాశీరాజు కుమారి అంబ ఉత్సహించి అరవగా పరశురాముడు ప్రళయకాలానలజ్వాలవలె మండుతూ నా గుండెపై ఒక బాణం వేశాడు.

క. ఆ నిశితాస్త్రం బెయ్యది । యో నాకుం దెలియ; దది మహోగ్రత నాఁటం
గా నొచ్చి పడితి నరదము । పై; నప్పుడు సూతుఁ డచటు వాపె రథంబున్. 328

ప్రతిపదార్థం: ఆ నిశిత+అస్త్రంబు= ఆ వాడి బాణం; ఏ+అదియో= ఏదో; నాకున్+తెలియదు= నాకు తెలియదు; అది మహా+ఉగ్రతన్= అది మిక్కిలి దారుణంగా; నాటంగాన్= నా గుండెలో దిగబడగా; నొచ్చి= బాధనొంది; అరదముపైన్+పడితిన్= రథంలో కూలిపోయాను; అప్పుడు= ఆ సమయాన; సూతుఁడు= నా రథసారథి; రథంబున్= రథాన్ని; అచటు పాపెన్= అక్కడ నుండి మరలించాడు.

తాత్పర్యం: పరశురాముడు ప్రయోగించిన ఆ వాడి బాణమేదో నాకు తెలియదు. అది మిక్కిలి భయంకరంగా నా గుండెలో దిగబడగా బాధతో రథంలో కూలిపోయాను. అప్పుడు సూతుడు నా తేరును అక్కడినుండి తొలగించాడు.

తే. చేతనుఁడ నయి యేను మత్సూతుఁ గినిసి । రాముఁ డున్నెడ కప్పుడు గ్రమ్మఱంగ
రథముఁ దోలించి బాణపరంపరా ని । మగ్నుఁ జేసితి నంబ నెమ్మనము దలఁక. 329

ప్రతిపదార్థం: చేతనుఁడన్+అయి= తెలివివచ్చిన వాడనయి; ఏను= నేను; మత్+సూతున్= నా సారథిని; కినిసి= కోపించి; రాముఁడు+ఉన్న+ఎడకున్= పరశురాముడున్న చోటికి; అప్పుడు= ఆ సమయంలో; క్రమ్మఱంగన్= మరల; రథమున్+తోలించి= రథాన్ని నడిపించి; అంబ నెమ్మనము= అంబయొక్క హృదయం; తలఁకన్= భీతి నొందగా; బాణ పరంపరా నిమగ్నున్+ చేసితిన్= పరశురాముడిని శరసమూహమందు ముంచివేశాను.

తాత్పర్యం: నేను మూర్ఛనుండి తేరుకొన్నపిదప రథం మరలించుక వచ్చినందుకు నా సారథిని కోపించి రాముడున్న చోటికి మరల ఆ రథాన్ని నడిపించాను. అంబ గుండె భయంతో వణకగా పరశురాముడిని బాణసమూహంలో ముంచివేశాను.

వ. ఇట్లు బహు ప్రకారంబులం బోరుచుఁ బ్రొద్దు గ్రుంకినప్పుడు రణం బుపసంహరించుచు, రేపకడ దొడంగుచుం బెనంగ నిరువది దినంబులు చెల్లిన, మఱునాఁటి కయ్యంబున నేనునుం గడంగి. 330

ప్రతిపదార్థం: ఇట్లు; బహు ప్రకారంబులన్= అనేకవిధాల; పోరుచున్= పోరాడుతూ; ప్రొద్దు+క్రుంకిన+అప్పుడు= సూర్యుడస్తమించినపుడు; రణంబు+ఉపసంహరించుచున్= పోరాటం చాలిస్తూ; రేపకడ= ఉదయమే; తొడంగుచున్= ప్రారంభిస్తూ; పెనంగన్= మేము పోరాడుతుండగా; ఇరువది రెండు దినంబులు; చెల్లినన్= కడవగా; మఱునాఁటి కయ్యంబునన్; నేనునున్; కడంగి= పూని.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాల పోరాడుతూ ప్రొద్దు గ్రుంకినప్పుడు రణం చాలిస్తూ, తెల్లవారగానే ఆరంభిస్తూ గురుశిష్యుల మిద్దరమూ పెనగులాడుతుండగా ఇరవైరెండు రోజులు గడిచిపోయాయి. మరునాడు మళ్ళీ యుద్ధానికి పూనుకొన్నాను.

క. కడు బెట్టిదముగఁ గదియం । బడి హయములు నొవ్వ ధనువు భగ్నంబుగఁ జే
డ్పడి సారథి దెరలఁగఁ దన । యొడలు సిరుఁగ నేసినను మహోద్ధతి గురుఁడున్. 331

ప్రతిపదార్థం: కడున్ బెట్టిదముగన్= మిక్కిలి భయంకరంగా; కదియన్+పడి= కలియబడి; హయములు నొవ్వన్= గుర్రాలు బాధ చెందగా, ధనువు భగ్నంబుగన్= విల్లు విరుగగా; చేడ్పడి= వ్యాకులతచెంది; సారథి= రథ చోదకుడు; తెరలఁగన్= చలించగా; తన+ఒడలు= తన దేహం; చిరుఁగన్= చీలేటట్లు; ఏసినను= నేను శరములు వేయగా; మహా+ఉద్ధతిన్= మిక్కిలి విజృంభణంతో; గురుఁడున్= గురువైన పరశురాముడును.

తాత్పర్యం: మిక్కిలి భయంకరంగా నేను కలియబడి శరాలు ప్రయోగించి రథాశ్వాలను నొప్పించాను. వింటిని విరిచివేశాను. సారథిని వ్యాకులపాటుతో చలించేటట్లు చేశాను. గురుడి శరీరాన్ని చీల్చాను. అప్పుడు నా ధనురాచార్యుడు చెలరేగి.

క. ఒక శక్తి వైవ నఱకితి, । నకుటిలముగ శక్తి దశక మడరించిన స్రు
క్కక త్రుంచితి, బహుశక్తుల । నికరము పరఁగించినం దునిమితిం బెలుచన్. 332

ప్రతిపదార్థం: ఒక శక్తి వైవన్= పరశురాముడు నాపై ఒక శక్తిని ప్రయోగించగా; నఱకితిన్= దానిని ఖండించాను; అకుటిలముగన్= నిర్వక్రంగా; శక్తి దశకమున్= పది శక్తులు; అడరించినన్= వేయగా; స్రుక్కక= గాసిచెందక; త్రుంచితిన్= నరకివేశాను; బహుశక్తుల నికరము= అనేక శక్త్యాయుధాల సమూహాన్ని; పరఁగించినన్= ప్రయోగించగా; పెలుచన్= వెంటనే; తునిమితిన్= ఖండించివేశాను.

తాత్పర్యం: పరశురాముడు ఒక శక్త్యాయుధాన్ని నామీద వేయగా, దానిని నరకివేశాను. పిదప ఆతడు పదింటిని ప్రయోగించగా ఏమాత్రం గాసిచెందక వాటిని తునిమివైచాను. అనేక శక్త్యాయుధాల సముదాయాన్ని ఆతడు ప్రయోగించగా వెంటనే వాటినికూడా ఖండించివేశాను.

క. **విస్మయము నొందు భార్గవు । నస్మత్కర మపుడు లాఘవారూఢముగా**
సస్మితుఁడ నగుచుఁ బటు దీ । ప్తి స్మేరాస్త్రముల నేసితిం బరవశుఁగాన్. 333

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; అస్మత్+కరము= నా హస్తము; లాఘవ+ఆరూఢముకాన్= నేర్పుగలది కాగా; సస్మితుఁడన్+అగుచున్= నేను చిరునవ్వుతో కూడిన వాడనవుతూ; విస్మయమున్+ఒందు= ఆశ్చర్యపడుతున్న; భార్గవున్= భృగురాముడిని; పటుదీప్తి స్మేర+అస్త్రములన్= మిక్కిలి తేజోవికాసం గల అస్త్రాలచేత; పరవశున్+కాన్+ఏసితిన్= సొమ్మసిల్లేటట్లు కొట్టాను.

తాత్పర్యం: ఆ సమయంలో నా హస్తం అమితలాఘవాన్ని పుంజుకొన్నది. పరశురాముడు ఆశ్చర్యపడుతుండగా నేను చిరునవ్వుతో మిక్కిలి దీప్తి వికాసం కలిగిన అస్త్రాలు ప్రయోగించి ఆయనను మూర్ఛితుణ్ణి చేశాను.

వ. **ఇట్లతండు మూర్ఛిల్లిన మునిజనంబులును నంబయు నధిక శోకసమాకులత్వంబు నొంది హాహా కారంబులు సెలంగఁ బొదివి రంత. 334**

ప్రతిపదార్థం: ఇట్లు; అతండు; మూర్ఛిల్లినన్; ముని జనంబులును; అంబయున్; అధికశోక సమాకులత్వంబున్+ఒంది= మిక్కుటమైన దుఃఖంచేత కలతనొంది; హాహాకారంబులు చెలంగన్= అయ్యో అయ్యో అనే అరపులు సందడించగా; పొదివిరి= అతడి చుట్టూ మూగారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పరశురాముడు మూర్ఛిల్లాడు. మునీశ్వరులు, అంబ దుఃఖవ్యాకుల మనస్కులయినారు. వారు హాహాకారాలుచేస్తూ అతడి చుట్టూ క్రమ్ముకొన్నారు. తరువాత

ఆ. **తెలిసి భార్గవుండు దృఢ తీవ్ర నారాచ । పంక్తి గురిసి నన్నుఁ బారవశ్య**
మంది నేల కొఱగునట్లుగాఁ జేసి మ । త్సూతు మస్తకంబుఁ దునియ నేసె. 335

ప్రతిపదార్థం: తెలిసి= ఒడలెరిగి; భార్గవుండు= పరశురాముడు; దృఢతీవ్ర నారాచ పంక్తిన్= గట్టివి, వాడివి అయిన బాణాలయొక్క శ్రేణిని; కురిసి= నాపై వర్షించి; నన్నున్= నన్ను; పారవశ్యము+అంది= స్మృతికోల్పోయి; నేలకున్+ఒఱగునట్లుగాన్+చేసి= నేలమీదికి వ్రాలేటట్లు కావించి; మత్సూతుమస్తకంబున్= నా రథసారథి శిరస్సును; తునియన్+ఏసెన్= తెగేటట్లు బాణం వేశాడు.

తాత్పర్యం: ఒడలు తెలిసి పరశురాముడు పటిష్ఠములైన వాడి బాణాలు గుప్పించి, నేను స్మృతి దప్పి నేలకు వ్రాలేటట్లు చేశాడు. శరంతో నా రథసారథి తలను ఖండించాడు.

వ. అట్టియెడ నెనమండ్రు విప్రులు సమానవయోరూపంబుల నొప్పు వారలు నన్నెత్తి, సేదదీర్చి రథంబు పయింబెట్టి, గగన గమనంబునం బోయి; రంతకు మున్న మందాకిని మున్ను నాకన్న చందంబున నొగలపయినుండి మదీయ రథ్యంబుల పగ్గంబులు ధరియించి యున్న నేనునుం గనుంగొని నమస్కరించిన దీవించి చనియె; వెండియు. 336

ప్రతిపదార్థం: అట్టియెడన్= అటువంటి సమయంలో; ఎనమండ్రు విప్రుల= ఎనిమిదిమంది బ్రాహ్మణులు; సమానవయః+ రూపంబులన్= నాతో సమానమైన ప్రాయం, ఆకారాలతో; ఒప్పువారలు= ప్రకాశించేవారు; నన్నున్+ఎత్తి= నన్ను నేలనుండి పైకి లేవదీసి; సేద+తీర్చి= బడలిక వాపి; రథంబు పయిన్+పెట్టి= రథంమీదకూర్చుండబెట్టి; గగనగమనంబునన్+పోయిరి= ఆకాశ మార్గాన వెళ్ళిపోయారు; అంతకున్+మున్న= వారు నన్ను రథంలో కూర్చోబెట్టటానికి పూర్వమే; మందాకిని= గంగాదేవి; నా+కన్న+చందంబునన్= నేను చూచిన రూపంతోనే; నొగలపయిన్+ఉండి; మదీయ రథ్యంబుల= నా రథాశ్వములయొక్క; పగ్గంబులు= పగ్గాలు; ధరియించి+ఉన్నన్= చేతదాల్చి ఉండగా; ఏనునున్= నేనును; కనుంగొని; నమస్కరించినన్; దీవించి; చనియెన్= వెళ్ళింది; వెండియున్= మరియు.

తాత్పర్యం: నేను మూర్ఛలో మునిగి ఉన్న సమయంలో ఎనిమిది మంది బ్రాహ్మణులు నాతో సమానమైన వయస్సు, రూపం కలవారు నన్ను నేలనుండి లేవదీసి, శ్రమ తొలగించి రథంలో కూర్చోబెట్టి ఆకాశగమనంలో వెళ్ళారు. అంతకుమునుపే గంగాదేవి పూర్వం నేను చూచిన రూపంతో రథం నొగల మీద కూర్చుండి గుర్రాల పగ్గాలు చేత ధరించి ఉండింది. నేను నమస్కరించగా నన్ను దీవించి తన దారిని తాను వెళ్ళింది. ఆ తరువాత.

క. సారథ్యంబును జేయుచు । ధీరత వాటించి రామదేవుని తోడం
గ్రూరాస్త్రంబుల సమర వి । హారం బొనరించితిని సురావలి వొగడన్. 337

ప్రతిపదార్థం: సారథ్యంబును+జేయుచున్= రథం నడుపుతూ; ధీరత+పాటించి= ధైర్య మవలంబించి; సుర+ఆవలి= దేవతాసమూహం; పొగడన్= శ్లాఘించగా; రామదేవునితోడన్= భృగురాముడితో; క్రూర+అస్త్రంబులన్= దారుణమైన అస్త్రాలతో; సమరవిహారంబు+ఒనరించితిని= యుద్ధక్రీడ చేశాను.

తాత్పర్యం: నేనే రథం నడుపుకొంటూ; ధైర్యం వహించి అంబరతలంలో నిలిచి దేవగణం మెచ్చగా భార్గవరాముడితో ఘోరములైన అస్త్రాలతో రణక్రీడ సలిపాను.

భీష్మునకు వసువులు స్వప్నసాక్షాత్కారంబున మోహనాస్త్రం బిచ్చుట (సం.5-184-1)

వ. ఇవ్విధంబునం బోరి సూర్యాస్తమయం బగుటయు నెప్పటియట్ల చని యే నా రాత్రి యేకాంతంబున దర్భశయనంబున నుండి సురభూసుర వర్గంబులం దలంచి భక్తిం బ్రణామంబులు సేసి 'పరశురాముని జయింపరా దయ్యెడు, దినంబులు పెక్కులు సనియె, నతని నాజి జయించుటఁ గలుగునేని మీరు నాకుం

దో(చి యూఱడింపవలయు' నని ప్రార్థించి నిద్రించుచుండం బవలు నన్నెత్తి రథంబుపయిం బెట్టిన యెనమండ్రునుం బ్రభాత సమయంబునం గలలోన వచ్చి. 338

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; పోరి= పోరాడి; సూర్య+అస్తమయంబు+అగుటయున్= ప్రొద్దుగ్రుంకగా; ఎప్పటి+అట్ల చని= మునుపటి వలె యుద్ధం చాలించి వెళ్ళి; ఏను= నేను; ఆ రాత్రి; ఏకాంతంబునన్= ఒంటరిగా; దర్భశయనంబునన్+ఉండి= దర్భమీద పరుండి ఉండి; సురభూసుర వర్గంబులన్+తలంచి= దేవతలను బ్రాహ్మణులను ధ్యానించి; భక్తిన్; ప్రణామంబులు చేసి= నమస్కరించి; పరశురామునిన్; జయింపన్‌రాదు+అయ్యెడున్= గెలుచుటకు వీలుకావటంలేదు; దినంబులు; పెక్కులు= చాల, చనియెన్= కడచినవి; అతనిన్; ఆజిన్= యుద్ధంలో; జయించుట కలుగున్+ఏనిన్= గెలుచుటకు శక్యమైతే; మీరు; నాకున్; తో(చి= గోచరించి; ఊఱడింపన్+వలయున్= ఓదార్చవలెను; అని, ప్రార్థించి= వేడుకొని; నిద్రించుచున్+ ఉండన్; పవలు= పగటి పూట; నన్నున్+ఎత్తి; రథంబుపయిన్+పెట్టిన; ఎనమండ్రునున్= ఎనిమిదిమంది; ప్రభాతసమయంబునన్= ఉదయవేళ; కలలోనన్+వచ్చి= స్వప్నంలో కనబడి.

తాత్పర్యం: ఈ రీతి పగలంతా పరశురాముడితో పోరాడి ప్రొద్దు గ్రుంకగనే ఎప్పటివలె నా నివాసానికి వెళ్ళాను. ఆ రాత్రి నేను ఏకాంతంగా దర్భలపై పరుండి దేవతలను బ్రాహ్మణులను ధ్యానించి భక్తితో వారికి నమస్కారాలు చేసి 'పరశురాముడిని జయించటం శక్యంగాకున్నది. ఎన్నో రోజులు గడిచాయి. అతడిని రణంలో నేను జయించగలిగితే మీరు నాకు కనిపించి నన్నూరడించాలి' అని వేడుకొని నిదురించాను. భృగురాముడి శరాహతితో మూర్ఛపొందిన నన్ను ఎత్తి రథంలో కూర్చుండపెట్టి వెళ్ళిన ఆ ఎనమండుగురు ఉదయవేళ నాకు కలలో కన్పించి.

తే. నీవు నేమును నొక్కటి; నీకు వెఱవ । నేల గాంగేయ! రాము జయించునట్టి
శరము సుమ్మని మోహనాస్త్రంబు నాకు । నిచ్చిపోయిరి క్రమ్మఱ నెక్కడేని. 339

ప్రతిపదార్థం: గాంగేయ!= భీష్మా!; నీవున్= నీవును; ఏమును= మేమును; ఒక్కటి= ఒక్కటేసుమా; నీకున్= నీకు; వెఱవన్+ఏల= భయపడటమెందుకు? రామున్= పరశురాముడిని; జయించునట్టి= గెలువగలిగిన; శరముసుమ్ము+అని= బాణం సుమా అని; మోహన+అస్త్రంబున్= మోహనాస్త్రాన్ని; నాకున్= నాకు; ఇచ్చి= ఒసగి; క్రమ్మఱన్= తిరిగి; ఎక్కడ+ఏనిన్+పోయిరి= ఎక్కడికో వెళ్ళిపోయారు.

తాత్పర్యం: 'భీష్మా! నీవూ మేమూ ఒక్కటే. నీవు భయపడనక్కరలేదు. పరశురాముడిని జయించగల బాణమిది సుమా!' అని మోహనాస్త్రం నాకు ప్రసాదించి, తిరిగి ఎక్కడికో వారు వెళ్ళిపోయారు.

విశేషం: అష్టవసువులు: ఇక్ష్వాకు వంశస్థుడైన మహాభిషుడు ఎన్నో యజ్ఞాలు చేసి దేవలోకం చేరి బ్రహ్మదేవుడిని కొలుస్తుండినాడు. గంగాదేవి స్త్రీ రూప ధారిణిఅయి బ్రహ్మసభకు వచ్చింది. వాయు వశాన ఊరుమూలం కనిపించేటట్లు ఆమె చీర తొలగింది. దానిని మహాభిషుడు సాభిలాషంగా చూశాడు. అందుకు విరించి కోపించి 'నీవు మనుష్యయోనిలో జన్మించు'మని శాపం పెట్టాడు. అతడు రాజర్షిఅయిన ప్రతీపుడి కొడుకుగా పుట్టాడు. అతడే శంతనుడు. అష్టవసువులు ఒకనాడు వసిష్ఠుని తపోవనానికి వచ్చారు. అక్కడ నందిని అనే హోమధేనువును చూచారు. కోరిన వస్తువులు కురిసే ఆ గోవును అష్టమ వసువైన ప్రభాసుని పత్ని ఉశీనరపతి కూతురూ తన స్నేహితురాలూ అయిన జితవతికి బహూకరించదలచింది. అందుకు ప్రభాసుడి సోదరులు కూడా సుముఖత చూపారు. వసిష్ఠుడు యోగదృష్టితో వసువులు హోమధేనువును కొనిపోయారని తెలిసి, మనుజయోనిలో

పుట్టండని వారికి శాపమిచ్చాడు. చిరకాలం మానవలోకంలో ఉండకుండేటట్లు అనుగ్రహించుమని వారు వేడుకున్నారు. ప్రభాసుడే పెద్ద అపరాధం చేశాడు గనుక అతడు మాత్రమే బహుకాలం మర్త్యలోకంలో ఉంటాడని వసిష్ఠు డనుగ్రహించాడు.

శంతనుడై జన్మించిన మహాభిషుడి సమాగమం కోసం గంగాదేవి వస్తుండగా వసువులు చూచారు. ఆమెకు వసిష్ఠుడి శాపం తెలిపి - నీ గర్భంలో జన్మిస్తాము. పుట్టినప్పుడే మమ్మల్ని నీళ్ళలో వేసి ఎక్కువకాలం పుడమిలో ఉండకుండేటట్లు చేయవలసిందని కోరుతూ, మాలో అష్టమ వసువు మాత్రం దీర్ఘాయుష్మంతుడై నీకు సంతోషం కలిగిస్తాడని చెప్పుకొన్నారు. సంప్రాప్త యౌవనుడైన కుమారుడికి రాజ్యమప్పగించి, గంగాతటంలో నీకు కన్పించిన కన్య కులగోత్రనామాలు అడగకుండ ఆమె అభీష్టం సల్పుమని తెల్పి ప్రతీపుడు తపోవనానికి వెళ్ళాడు. తండ్రి చెప్పినట్లుగా శంతనుడు స్త్రీ రూపంలో ఉన్న గంగను ప్రేమించాడు. 'నే నేది చేసినా నీవు సమ్మతించాలి. వారించరాదు. అప్రియం పల్కరాదు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే నిన్ను విడిచి వెళ్ళుతాను' అన్నది గంగ. శంతనుడు సమ్మతించి ఆమెతో కలిసి కాపురం చేస్తున్నాడు. ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అనే అష్టవసువులు ఒకరివెంట ఒకరుగా గంగ కడుపున పుడుతూ వచ్చారు. పుట్టినవారిని పుట్టినట్లుగా తీసికొనివెళ్ళి భాగీరథి గంగనీళ్ళలో వేస్తూ వచ్చింది. అష్టమపుత్రుడినికూడా గంగలో కలపటానికి ఆమె పూనుకోగా శంతనుడు వారించి నిందించాడు. అపుడు గంగ తన కథ చెప్పి ఇతడు ధర్మమూర్తిఅయి మనుజలోకంలో పెద్దకాల ముంటాడు. 'పెరిగేవరకు నావద్ద ఉంటాడు' అని చెప్పి కొడుకును తోడ్కొని వెళ్ళింది. భీష్ముడు సాంగములైన వేదాలు వసిష్ఠుడి దగ్గర, ధనుర్విద్య పరశురాముడి వద్ద అభ్యసించాడు. గంగాదేవి తేజస్వియైన కుమారుడిని శంతనున కొప్పగించింది. సత్యవతిని వివాహమాడదలచిన జనకుడి కోరిక తీర్చుటకై భీష్ముడు పెళ్ళి మానుకొన్నాడు. రాజ్యం వదలుకొన్నాడు. బ్రహ్మచర్యం స్వీకరించాడు. అతిమానుషమైన ఆ మహనీయుడి సత్యవ్రతానికి సంతసిల్లిన శంతనుడు అతడికి స్వచ్ఛందమరణం వరంగా ఇచ్చాడు. ఆ వసువులే విప్రరూపాలలో భీష్ముడికి కలలో కనిపించారు.

వ. ఏను మేలుకాంచి సంతోషించి తన్మంత్ర స్వరూపంబును బ్రయోగోపసంహార ప్రకారంబులును జిత్తంబున నిలిపికొనుచుఁ గాలోచితకృత్యంబు లాచరించి యొక్క సారథి నంగీకరించి, యరదంబు పూన్పించి, సన్నద్ధుండనై సత్వరంబుగా సమరంబున కరిగినం బరశురామదేవుండు. 340

ప్రతిపదార్థం: ఏను= నేను; మేలుకాంచి= మేలుకొని; సంతోషించి; తద్+మంత్రస్వరూపంబును= ఆ మోహనాస్త్రంయొక్క మంత్ర విధానాన్ని; ప్రయోగ+ఉపసంహార ప్రకారంబులును= ప్రయోగించే తీరు, వెనుకకు మరలించే రీతి; చిత్తంబునన్= మనస్సులో; నిలిపికొనుచున్; కాల+ఉచిత కృత్యంబులు= ఉదయవేళలో ఆచరించవలసిన పనులు; ఆచరించి= నిర్వర్తించి; అరదంబు; పూన్పించి= సిద్ధపరిచేటట్లుచేసి; సన్నద్ధుండను+ఐ= సిద్ధపడినవాడనై; సత్వరంబుగాన్= శీఘ్రంగా; సమరంబునకున్= కయ్యానికి; అరిగినన్; పరశురామదేవుండు.

తాత్పర్యం: నేను నిద్రనుండి లేచి సంతోషించి మోహనాస్త్రపు మంత్రవిధానాన్ని, ప్రయోగోపసంహార రీతులను జ్ఞప్తిలో ఉంచుకొని ప్రాతఃకాల కృత్యాలు నిర్వర్తించి ఒక్క సారథిని ఏర్పాటు చేసికొని రథాన్ని ఆయత్తపరచుకొని సంసిద్ధుడనై శీఘ్రమే కదనరంగానికి వెళ్ళాను. అప్పుడు పరశురాముడు.

క. నిన్న యఱచచ్చి పోయితి । వున్న యఱయు నేఁడు దీర్చి యుడిపెద నీ గ
ర్వోన్నతి; యిం కెట వోయెదు । నన్ను నెఱుఁగ వెట్టు?'లనుచు నాపైఁ గవిసెన్. 341

ప్రతిపదార్థం: నిన్న= నిన్నటిరోజు; అఱ+చచ్చిపోయితి(వి)= సగం చచ్చి వెళ్ళావు; ఉన్న+అఱయున్= మిగిలిన సగం ప్రాణం; నేఁడు= ఈ రోజు; తీర్చి= తొలగించి; నీ గర్వ+ఉన్నతిన్= నీ మదాతిశయాన్ని; ఉడిపెదన్= మాపెదను; ఇంకన్= మరి;

ఎట+పోయెదు(వు)?= ఎక్కడికి తప్పించుకొని వెళ్ళుతావు? నన్నున్= నన్ను; ఎఱుఁగవు+ఎట్టులు?= ఎట్లు తెలియకున్నావు?; అనుచున్= అని పలుకుతూ; నాపైన్+కవిసెన్= నామీదికి దూకాడు.

తాత్పర్యం: 'నిన్న సగం చచ్చి వెళ్ళావు. ఈ దినం ఆ ఉన్న సగం కూడ హరించి నీ మద మణచి వేస్తాను. ఇంకెక్కడికి తప్పించుకు పోగలవు? నన్నెరుగవా?' అంటూ (పరశురామదేవుడు) నా మీదికి విజృంభించాడు.

క. కవిసినఁ గడంగి పెల్లుగఁ । గవియించితి నంపవెల్లిఁ గడుఁ గ్రూరత భా
ర్గవుఁడును మద్గాత్రంబున । వివిధాస్త్ర ప్రతతి నించి వెగ డొందించెన్. 342

ప్రతిపదార్థం: కవిసినన్= నాపైకి దుముకగా; కడంగి= పూని; పెల్లుగన్= అధికంగా; అంపవెల్లిన్= బాణప్రవాహాన్ని; కవియించితిన్= పరపాను; కడున్= మిక్కిలి, క్రూరతన్= కనికరం లేకుండా; భార్గవుఁడును= పరశురాముడు; మత్+గాత్రంబునన్= నా శరీరమునందు; వివిధ+అస్త్రప్రతతిన్+నించి= పలు తెరగులైన అస్త్ర సమూహాలను నిండించి; వెగడు+ఒందించెన్= తల్లడపరిచాడు.

తాత్పర్యం: పరశురాముడు నామీదికి కవియగా నేను పూనికతో బాణ ప్రవాహాన్ని అతడిపై ప్రసరింపజేశాను. ఆయన రవంతకూడా కనికరం లేకుండా నా శరీరమునందు పలువిధాలైన అస్త్రాలను నాటి భీతి కలిగించాడు.

వ. ఏనుం గోపించి. 343

ప్రతిపదార్థం: ఏనున్= నేనుకూడ; కోపించి= రోషించి-

తాత్పర్యం: నేను కూడా రోషపడి.

తే. రయము మెఱయంగ నొక్క నారసము ఫాల । దేశమునయందు నాఁ టించి తీవ్ర శక్తి
నురము వైచినఁ దూఁగాడి యొఱగ నూఁది । పట్టి యకృతవ్రణుఁడు తేర్చెఁ బరశురాము. 344

ప్రతిపదార్థం: రయము+మెఱయంగన్= వేగం మించగా; ఒక్క నారసమున్= ఒక తూపును; ఫాలదేశమున అందున్= నిటలభాగంలో; నాటించి= దిగేటట్లు చేసి; తీవ్రశక్తిన్= దారుణమైన శక్తిని; ఉరమున్ వైచినన్= రొమ్ముపై వేయగా; తూఁగాడి= చలించి; ఒఱగన్= ప్రక్కకు వ్రాలగా; అకృతవ్రణుఁడు= సారథ్యం సల్పుతున్న అకృతవ్రణుడు; ఊదిపట్టి= వ్రాలకుండా గట్టిగా పట్టుకొని; పరశురామున్+తేర్చెన్= పరశురాముడిని స్మృతికి వచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: వేగం మీరేటట్లు నేనొక్క తూపును ఆయన నిటలభాగంలో దిగబడే విధంగా నాటాను. తరువాత తీవ్రమైన శక్త్యాయుధాన్ని ఆయన గుండెపై వేశాను. అంతట పరశురాముడు చలించి ప్రక్కకు వ్రాలగా, పడకుండా గట్టిగా పట్టుకొని అకృతవ్రణుడనే ఆయన సారథి అతడిని స్మృతికి వచ్చేటట్లు చేశాడు.

క. అప్పుడు దెప్పిఱి కన్నుల । నిప్పులు రాలంగ నన్ను నిశ్చల దృష్టిం
దప్పక చూచి యలఁతి న । వొప్పఁగ బ్రహ్మాస్త్ర మాతఁ డుగ్రత నేసెన్. 345

ప్రతిపదార్థం: అప్పుడు= అంతట; ఆతఁడు= పరశురాముడు; తెప్పిఱి= తేరుకొని; కన్నులన్= నేత్రములనుండి; నిప్పులు రాలంగన్= అగ్నికణాలు రాలుతుండగా; నన్నున్= నన్ను; నిశ్చలదృష్టిన్= చలించని చూపులతో; తప్పక చూచి= మానకుండా

కనుగొని; అలఁతి నవ్వు= చిరునవ్వు; ఒప్పఁగన్= మెరయగా; ఉగ్రతన్= భయంకరంగా; బ్రహ్మ+అస్త్రమున్+ఏసెన్= బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

తాత్పర్యం: అంతట పరశురాముడు తేరుకొని తన కనులనుండి అగ్ని కణాలు రాలుతుండగా నన్ను కన్నార్పకుండా క్రూరంగా చూచి చిరునవ్వు దీపించగా బ్రహ్మాస్త్రాన్ని దారుణంగా నాపై ప్రయోగించాడు.

క. తెగఁగొని బ్రహ్మాస్త్రమ యేఁ । దగ నేసిన నొకటి నొకటి దార్కొని రెండున్
గగనంబంతయుఁ దేజ । స్థగితముగాఁ జేసె సురలు దైత్యులుఁ దలఁకన్. 346

ప్రతిపదార్థం: ఏన్= నేను; తెగన్+కొని= నారిసారించి; బ్రహ్మ+అస్త్రము+అ= బ్రహ్మాస్త్రమునే; తగన్= చక్కగా; ఏసినన్= ప్రయోగించగా; ఒకటిన్+ఒకటి= ఒకదాని నొకటి; తార్కొని= మార్కొని; సురలు= దేవతలు; దైత్యులు= రక్కసులు; తలఁకన్= భీతిల్లగా; రెండున్= ఆ రెండు బ్రహ్మాస్త్రాలు; గగనంబు+అంతయున్= ఆకాశము నంతటినీ; తేజస్+స్థగితముగాన్+ చేసెన్= కాంతితో ఆచ్ఛాదించబడినదానినిగా చేశాయి.

తాత్పర్యం: నేను కూడా నారి సారించి బ్రహ్మాస్త్రమునే ప్రయోగించాను. ఈ రెండు బ్రహ్మాస్త్రాలు ఒకదాని నొకటి ఎదుర్కొని దేవదానవులు భీతిల్లగా ఆకాశాన్నంతటినీ కాంతితో ఆచ్ఛాదింపజేశాయి.

తే. సకల భూత సంక్షోభ సంజనకమైన । యట్టియెడఁ గని యిది తఱి యని తలంచి
మోహనాస్త్రంబు నంచితావాహనంబు । సేయుటయును జరాచర శ్రేణి మ్రోసె. 347

ప్రతిపదార్థం: సకలభూత సంక్షోభ సంజనకము+ఐన= సర్వప్రాణులకు కలతను గలిగించుచున్నదైన; అట్టియెడన్= ఆ సమయంలో; కని= గమనించి; ఇది తఱి+అని= ఇది అదనని; తలంచి= భావించి; మోహన+అస్త్రంబు= మోహనాస్త్రముయొక్క; అంచిత+ఆవాహనంబు= ఒప్పిదమైన ఆహ్వానాన్ని; చేయుటయును= చేయగా; చర+అచరశ్రేణి= జంగమస్థావరాలయొక్క సమూహం; మ్రోసెన్= ఆక్రోశించింది.

తాత్పర్యం: సకలజీవులకు సంక్షోభం కలిగించే ఆ సమయం చూచి ఇది శర ప్రయోగానికి తగిన వేళ అని తలంచి, నేను మోహనాస్త్రాన్ని ఆవాహనం చెయ్యగా చేతనములు, అచేతనములు ఆక్రందించాయి.

వ. తదవసరంబున. 348

తాత్పర్యం: ఆ సమయంలో.

క. ఉడుగుడుగు మోహనాస్త్రము । విడువకు మను నెలుఁగుతోడ వేగంబున న
య్యెడ కేఁగుదెంచి నారదుఁ । డెడమడు గించుకయు లేక యిట్లను నాతోన్. 349

ప్రతిపదార్థం: ఉడుగు+ఉడుగు(ము)= మానుము మానుము; మోహన+అస్త్రమున్= మోహనాస్త్రాన్ని; విడువకుము= ప్రయోగించవద్దు; అను+ఎలుఁగు తోడన్= అను కంఠధ్వనితో; వేగంబునన్= త్వరితంగా; అయ్యెడకున్= మేము పోరాడుతున్న ప్రదేశానికి; ఏఁగుదెంచి= వచ్చి; నారదుఁడు= నారద మహర్షి; ఎడమడుగు+ఇంచుకయున్ లేక= అరమరిక రవంతకూడా లేకుండ; నాతోన్+ఇట్లు+అనున్= నాతో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: 'వద్దు వద్దు. మోహనాస్త్రాన్ని ప్రయోగించవద్దు' అని కేకలిడుతూ నారదమహర్షి సత్వరంగా అక్కడికి వచ్చాడు. అరమరిక లేకుండా నాతో ఇట్లా అన్నాడు:

క. 'గురునకు నవమానము ని । ష్ఠుర వృత్తిం జేసెదీవు సూచితిమే యి
ప్పరుసునఁ బరుసపు నడవడిఁ । గురువంశప్రవర యిట్లుఁ గూడునె చేయన్?' 350

ప్రతిపదార్థం: కురువంశప్రవర!= కురువంశస్థులలో శ్రేష్ఠుడా!; గురునకున్= విద్య గరపిన ఆచార్యునకు; అవమానమున్= పరాభవాన్ని; నిష్ఠుర వృత్తిన్= క్రూరవర్తనంతో; ఈవు చేసెదు(వు)= నీవు చేస్తున్నావు; ఈ+పరుసునన్= ఈరకంగా; పరుసపు నడవడి= క్రూరమైన ప్రవర్తన; చూచితిమే= లోకంలో కనుగొన్నది లేదు; ఇట్లు చేయన్= ఈ విధంగా సల్పడం; కూడునె?= నీవంటివాడికి తగునా?

తాత్పర్యం: 'కురువంశ శ్రేష్ఠుడా! కర్కశ బుద్ధితో గురునకు పరాభవం చేస్తున్నావు. ఇట్టి కఠినమైన నడవడి లోకంలో చూచిందిలేదు. ఇట్లా చేయటం నీవంటి వానికి ఉచితం కాదు.'

వ. అని సువ్యక్తంబుగాఁ జెప్పి. 351

ప్రతిపదార్థం: అని; సువ్యక్తంబుగాన్= స్పష్టంగా; చెప్పి= తెలిపి.

తాత్పర్యం: అని సుస్పష్టంగా నారదుడు పలికి.

క. 'వీరె సుర లాకసంబున । గారవమున బుద్ధి సెప్పఁగా నీకడకుం
దా రేగు దెంచి'రని క । న్నారంగాఁ జూపె నాకు నయ్యేనమంద్రన్. 352

ప్రతిపదార్థం: ఆకసంబునన్= గగనంలో; వీరె సురలు= అరుగో దేవతలు; గారవమునన్= గౌరవంతో; బుద్ధి చెప్పఁగాన్= నీకు నీతులు గఱపుటకై; నీ కడకున్= నీ దగ్గరకు; తారు= తాము; ఏగుదెంచిరి= వచ్చిఉన్నారు; అని= అనుచు; కన్ను+ ఆరంగాన్= కనులార; నాకున్= నాకు; ఆ+ఎనమంద్రన్= ఆ యెనిమిదిమందిని; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: 'అరుగో! ఆకాశంలో దేవతలు. వీరు గౌరవంగా నీకు బుద్ధులు గరపవలెనని నీ దగ్గరకు వచ్చి ఉన్నారు' అంటూ నారదుడు కనులారా నాకు ఆ యెనిమిదిమందిని చూపించాడు.

వ. ఇవ్విధంబున నెప్పటి విప్రవరులు సన్నిధిసేసి నన్నుం జూచి నగుమొగంబులతో నెఱుఁగని వారపోలె నిట్లనిరి; 353

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఎప్పటి విప్రవరులు= నిన్న రణంలో మూర్ఛితుడనై నేలబడిఉండగా రథంమీద కూర్చుండబెట్టి చనినవారూ, రాత్రి స్వప్నంలో తోచి మోహనాస్త్రం ఇచ్చినవారూ అయిన ఆ యెనిమిదిమంది బ్రాహ్మణులు; సన్నిధిచేసి= నా సమ్ముఖమున నిల్చి; నన్నున్+చూచి= నను గాంచి; నగు మొగంబులతోన్= నవ్వుతో నిండిన వదనాలతో; ఎఱుఁగని వార పోలెన్= ఏమియు తెలియనివారివలె; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: పరశురామ శరాహతుడనై నేలబడియుండగా నన్నెత్తి రథంలో కూర్చోబెట్టి వెళ్ళినవారూ, వేకువజామున నాకు కలలో కనిపించి మోహనాస్త్రము నిచ్చినవారూ అయిన ఆ యెనమండుగురు బ్రాహ్మణోత్తములు నాచెంత జేరి నవ్వుతున్న ముఖాలతో ఏమీ తెలియనివారివలె నాతో ఇట్లా అన్నారు:

క. 'నారదముని త్రైలోక్య స । మారాధ్యుం డితని పలుకు లాగమ వాక్యో
దారములు వినుము వీనిం । గ్రూరత వాటింపఁ దగదుగురు విషయమునన్.' 354

ప్రతిపదార్థం: నారదముని= నారద మహర్షి; త్రైలోక్య సమారాధ్యుఁడు= ముల్లోకాలవారిచేత పూజించదగినవాడు; ఇతని పలుకులు= ఈ మహనీయుడి మాటలు; ఆగమవాక్య+ఉదారములు= వేదవాక్కులవలె గొప్పవి; వీనిన్+వినుము= ఈ మహాత్ముడి మాటలు ఆలకించు; గురువిషయమునన్= ఆచార్యుడి విషయములో; క్రూరత= కాఠిన్యం; పాటింపన్+తగదు= వహించరాదు.

తాత్పర్యం: 'నారద మహర్షి ముల్లోకాలవారిచే పూజింపదగినవాడు. ఈ మహానుభావుడి మాటలు వేదవచనాలవలె దొడ్డవి. ఈ మునీంద్రుడి పలుకులు వినుము. గురునకు సంబంధించిన విషయంలో కర్కశత్వం కూడదు.'

వ. అనిన విని యేను సమ్మోహనాస్త్రం బేయుట యుడిగి బ్రహ్మాస్త్రంబు దీపింపఁజేసితి; నప్పుడు జామదగ్న్యుం డది యెల్ల నెఱింగి, యోటమి యెక్కించుకొని చలంబు మిగిలియున్నం దజ్జనకుండు జమదగ్నియుఁ దదీయ పితృవర్గంబును నతనికి సన్నిధి సేసి వేఁడికొని శాంతవచనంబులం దేర్చి యిట్లనిరి: 355

ప్రతిపదార్థం: అనినన్; విని; ఏను= నేను; సమ్మోహన+అస్త్రంబు; ఏయుట= ప్రయోగించటం; ఉడిగి= మాని; బ్రహ్మ+అస్త్రంబున్; దీపింపన్+చేసితిన్= ప్రజ్వలింపజేశాను; అప్పుడు; జామదగ్న్యుండు= జమదగ్ని తనయుడైన పరశురామదేవుడు; అది+ఎల్లన్+ఎఱింగి= నారదాదులు వచ్చి నాకు హితం చెప్పటం; నేను మోహనాస్త్రమును విడువకుండటం; తెలిసి; ఓటమి+ఎక్కించుకొని= తాను అపజయం పాలైనట్లుగానే భావించి; చలంబు+మిగిలి+ఉన్నన్= ద్వేషాతిశయంతో ఉండగా; తద్+జనకుండు= నా గురువు తండ్రి; జమదగ్నియున్; తదీయ పితృవర్గంబును= ఆయన పితరుల సమూహమునూ; అతనికిన్; సన్నిధిచేసి= ప్రత్యక్షమై; వేఁడికొని= అర్థించి; శాంతవచనంబులన్= చల్లటి మాటలతో; తేర్చి= కలతబాపి(ప్రసన్నుడిని కావించి); ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ఎనమండుగురు భూసుర పుంగవుల మాటలు విని, నేను సమ్మోహనాస్త్రం విడవటం మానుకొన్నాను. బ్రహ్మాస్త్రమునే ప్రకాశింపజేశాను. అపుడు జమదగ్నిసుతుడు నారదాదులు వచ్చి నాకు హితోపదేశం చేయటం; నేను సమ్మోహనాస్త్ర ప్రయోగం విరమించటం తెలిసికొని, తాను అపజయం పొందినట్లు భావించి, నాపై ద్వేషం పెంచుకొన్నాడు. అంతట అతడి తండ్రి జమదగ్ని మహర్షి, ఆయన పితరులు పరశురాముడికి ప్రత్యక్షమై వేడుకొని చల్లటి మాటలతో అతడిని ప్రసన్నుడిని కావించి ఇట్లా పలికారు:

క. 'వినుము వసుమూర్తి యీతం । డనన్య సామాన్య తేజుఁ డాహవభూమిన్
మనకు జయింప వశమె భీ । ష్మని? విపున కగునె రోషమును మత్సరమున్?' 356

ప్రతిపదార్థం: వినుము= పరశురామా! మా మాటలు ఆలకించుము; ఈతఁడు= ఈ భీష్ముడు; వసుమూర్తి= వసు స్వరూపుడు; అనన్య సామాన్య తేజుఁడు= పరుల కెవ్వరికి లేని ప్రతాపం కలవాడు; ఆహవ భూమిన్= యుద్ధరంగంలో;

మనకున్= మనకు; భీష్ముని జయింపన్ వశమె?= భీష్ముడిని గెలువ శక్యమా?; (కాదనుట); విప్రునకున్= బ్రాహ్మణుడికి; రోషమును= కోపమూ; మత్సరమున్= ద్వేషమూ; అగునె?= తగునా?

తాత్పర్యం: 'పరశురామా! మా పలుకు లాలకించుము. ఈతడు వసువు. ఇతరుల కెవ్వరికినీ లేనట్టి ప్రతాపం కలవాడు. యుద్ధంలో ఇతడిని గెలువ మనతరమా? బ్రాహ్మణుడికి క్రోధం, ఈర్ష్య తగవు సుమా!

తే. సమర ముడుగు నారాయణసఖుఁడు నరుఁడు । సవ్యసాచి నా నింకొక జన్మమొంది
యితని వధియించుఁగాని తక్కితర జనము । లకు నసాధ్యుండు భీష్ముఁ డాలంబులోన. 357

ప్రతిపదార్థం: సమరము+ఉడుగు(ము)= యుద్ధం మానుము; నారాయణసఖుఁడు= నారాయణుడికి చెలికాడైన; నరుఁడు= నరుడు; సవ్యసాచి నాన్= అర్జునుడనే పేరుతో; ఇంకొక జన్మము+ఒంది= మరొక్క పుట్టువునుపొంది; ఇతనిన్= ఈ భీష్ముడిని; వధియించున్ కాని= చంపునే తప్ప; తక్కు+ఇతరజనములకున్= మిగిలిన వేరే మనుష్యులకు; ఆలంబులోనన్= కదనంలో; భీష్ముఁడు= దేవవ్రతుడు; అసాధ్యుండు= సాధింపరానివాడు.

తాత్పర్యం: రామా! యుద్ధం విరమించుము. నారాయణుడి చెలికాడైన నరుడు అర్జునుడనే పేరుతో వేరొక జన్మమెత్తి వీనిని సంహరించగలడు. అంతే కాని ఇతరులు భీష్ముడిని కదనంలో జయించలేరు సుమా!

వ. అనిన నతండు పోక పెనంగిన వెండియు ననేక ప్రకారంబులం జెప్పి యమ్మునులు నాకడకుం జనుదెంచి యుపశమన వాక్యంబులు పలికి జామదగ్న్యుతోడం దమయాడిన మాటలు తేటపఱిచి యప్పుడు పొడసూపిన జాహ్నవియుం దారు బహు విధంబుల నన్ను ననునయించి భార్గవుపాలికి నమ్మహాదేవిం దోడ్కొని యరిగియుం గ్రమ్మఱ మత్సమీపంబునకు వచ్చియు నెట్టకేలకుం జలం బుడిపిన నే మిరువురమును దివ్యాస్త్రంబులుప సంహరించి సమరం బుడిగితి; మట్టియెడ నయ్యెనమండ్రు విప్రులుం జేరి నాతో నిట్లనిరి: 358

ప్రతిపదార్థం: అనినన్= అని వారు చెప్పినప్పటికినీ; అతండు; పోక= వెనుదీయక; పెనంగినన్= పోరాడగా; వెండియున్= మరల; అనేక ప్రకారంబులన్= పలువిధాల; చెప్పి; ఆ+మునులు; నా కడకున్; చనుదెంచి; ఉపశమనవాక్యంబులు= శాంతివచనాలు; పలికి; జామదగ్న్యుతోడన్= జమదగ్ని తనయుడైన పరశురాముడితో; తమ+ఆడిన మాటలు; తేటపఱిచి= వెల్లడించి; అప్పుడు= ఆ సమయమందే; పొడచూపిన= సాక్షాత్కరించిన; జాహ్నవియున్= గంగాదేవియు; తారున్= తామును; బహువిధంబులన్= పెక్కురీతుల; నన్నున్; అనునయించి= బుజ్జగించి; భార్గవుపాలికిన్= పరశురాముడికడకు; ఆ+మహాదేవిని= ఆ భాగీరథిని; తోడ్కొని+అరిగియున్= వెంటబెట్టుకొని వెళ్ళియు; క్రమ్మఱన్= మరల; మత్+సమీపంబునకున్= నా దగ్గరకు; వచ్చియున్; ఎట్టకేలకున్= చివరకు; చలంబు= పంతం; ఉడిపినన్= మాన్పగా; ఏము+ఇరువురము= గురుశిష్యులమైన మే మిద్దరమూ; దివ్య+అస్త్రంబులు= బ్రహ్మాస్త్రములు రెంటినీ; ఉపసంహరించి= ఉపశమిల్లజేసి; సమరంబు; ఉడిగితిమి= మానినాము; అట్టి+ఎడన్= ఆ తరుణంలో; ఆ+ఎనమండ్రు విప్రులున్; చేరి= నా కడకు వచ్చి; నాతోన్; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: తన జనకుడూ, పితృదేవతలూ చెప్పినప్పటికిన్నీ పరశురాముడు వెనుదీయక పెనగుతుండగా వారింకనూ అనేక విధాల చెప్పి చెప్పి నాకడకు వచ్చారు. నాతో శాంతి వచనాలు పలికి పరశురాముడితో తామన్న మాటలు వెల్లడించారు. ఆ సమయంలో అక్కడ ప్రత్యక్షమైన గంగతో తామూ చేరి నన్ను పలువిధాల బుజ్జగించారు. తరువాత

వారు గంగాదేవిని వెంటబెట్టుకొని పరశురాముడి చెంతకు వెళ్ళారు. మళ్ళీ నా దగ్గరకు వచ్చారు. ఇట్లా వారు మా ఉభయుల చుట్టూ పెక్కు సారులు తిరిగి తిరిగి తుట్టతుదకు మా పంతాలు మాన్పించారు. మేమిద్దరమూ బ్రహ్మాస్త్రాలను ఉపసంహరించి యుద్ధం చాలించాము. అట్టి సమయంలో ముందు కన్పడిన ఆ యెనిమిది మంది భూసురులు నన్ను జేరి నాతో ఇట్లా అన్నారు:

ఆ. 'గురుఁడు బ్రహ్మవిదుఁ డకుంఠిత తేజుండు । పరశురాముఁ డతని పాలి కీవు
భక్తి మెఱయ నేఁగి ప్రణమిల్లి తదనుగ్ర । హంబు వడయవలయు ననఘ! యిపుడు.' 359

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; పరశురాముడు= భార్గవరాముడు; గురుఁడు= నీకు ఆచార్యుడు; బ్రహ్మవిదుఁడు= బ్రహ్మతత్త్వమెరిగినవాడు; అకుంఠిత తేజుండు= మొక్కవోని ప్రతాపం కలవాడు; అతని పాలికిన్= ఆ భృగురాముడి చెంతకు; ఈవు= నీవు; భక్తి మెఱయన్= భక్తి వెల్లడియగునట్లు; ఏఁగి= వెళ్ళి; ప్రణమిల్లి= నమస్కరించి; తద్+అనుగ్రహంబున్= ఆయన కారుణ్యమును; ఇపుడు= ఇప్పుడు; పడయన్ వలయున్= పొందవలెను.

తాత్పర్యం: 'భీష్మా! పరశురాముడు నీకు గురువు. తత్త్వవేత్త. అమోఘమైన ప్రతాపం కలవాడు. ఆ మహామహుడి చెంతకు నీ విప్పుడే వెళ్ళి, నీ భక్తి ప్రకటమయ్యేటట్లు ప్రణామం సలిపి, వారి అనుగ్రహం ఇపుడే పొందవలెను సుమా!'

వ. అని చెప్పి యతని కడకుం దారును నారదమునీశ్వరుండును జమదగ్ని ప్రముఖులును భాగీరథియును జని 'నీ శిష్యుండు దేవవ్రతుండు; వాని యెడ నలుగం దగునె? వాఁడు తగవు మాలిన పనిఁ జేయంజాలక పెనంగె; నింతియకాని విరోధి గాఁడు; వానిం గరుణింపు' మని తెలిపి, నన్నుం బిలిచినం బోయి యే నమ్మహాత్మునకు సాష్టాంగదండ ప్రణామంబు సేసిన నతండు దీవనతో గ్రుచ్చి యెత్తి కౌఁగిలించికొని 'గాంగేయా! నీశక్తికి భక్తికిం బ్రీతుండనైతి' నని సస్నేహంబుగా సంభావించి, యంబ నవలోకించి; నన్ను భీష్ముండు గెలిచె 'నా వలన నయ్యెడుపని యింతియ; నీవింక నీకుం జూడం బోలిన గతిం బొమ్మ'నిన నమ్మానిని 'దేవా యిది యిట్టిద; నీ యోపినంతయుం జేసితి; నీ చేతం బోకున్న నేమి సేయుదు? నేను దపంబు పెంపున భీష్ముని వధించెద జన్మాంతరంబున నైననుం జలంబు సాధ్యంబు చేయుదు; నటు సూడు' మని పలికిపోయెఁ; దదనంతరంబ యమ్మునిజన పితృదేవతా సమూహంబును భృగు నందను నన్ను నామంత్రణంబు చేసి యంతర్ధానంబు సేసె; భార్గవుండును నన్నువీడ్కొలిపి మున్ను దనతో వచ్చిన తపోధనవర్గముం దానును మహేంద్ర శైలంబునకుం జనియె; నేను మగిడి యెడనెడ నుర్వీసురుల యాశీర్వాదంబులు సంభావన వచనంబులుఁ బ్రస్తుతి వాక్యంబులుఁ గర్ణంబుల కింపుసేయ నిటవచ్చి సత్యవతికి నమస్కారపూర్వకంబుగా నంతయు నెఱింగించిన నద్దేవి యభినందించె. 360

ప్రతిపదార్థం: అని చెప్పి; అతనికడకున్= పరశురాముడి చెంతకు; తారును= ఆ యెనమండుగురు భూసురులను; నారద ముని+ఈశ్వరుండును; జమదగ్ని ప్రముఖులను= జమదగ్ని మున్నగువారును; భాగీరథియును= నా జననిఅయిన గంగాదేవియు; చని; నీ శిష్యుండు; దేవవ్రతుండు= భీష్ముడు; వానియెడన్= అతనిపట్ల; అలుగన్+తగునె?= కోపగించుకొనవచ్చునా?; వాఁడు= భీష్ముడు; తగవు మాలిన పని= న్యాయం తప్పిన పని; చేయన్+చాలక= చేయటానికి ఇష్టపడక; పెనంగెన్= నీతో కలహించాడు;

ఇంతియకాని= ఇంతేతప్ప; విరోధికాఁడు= నీకు శత్రువు కాడు; వానిన్; కరుణింపుము; అని తెలిపి; నన్నున్ పిలిచినన్= నన్ను రమ్మనగా; పోయి; ఏను= నేను; ఆ మహాత్మునకున్; స+అష్ట+అంగ+దండ ప్రణామంబు= ఎనిమిది అవయవాలు నేలకు సోకేటట్లు కర్రవలె పడి చేసే నమస్కారం; చేసినన్= చేయగా; అతండు= పరశురాముడు; దీవనతోన్= ఆశీస్సుతో; గ్రుచ్చి ఎత్తి= దృఢంగా నేలనుండి మీదికెత్తి; కౌఁగిలించికొని; గాంగేయా; నీ శక్తికిన్= నీ బలానికి; భక్తికిన్; ప్రీతుండన్+ఐతిన్= హర్షించాను; అని; సస్నేహంబుగాన్= ప్రేమయుక్తంగా; సంభావించి= ఆదరించి; అంబన్; అవలోకించి= చూచి; నన్నున్; భీష్ముండు; గెలిచెన్; నావలనన్; అయ్యెడు పని= జరుగు పని; ఇంతియ= ఇంతే; నీవు+ఇంకన్; నీకున్+ చూడన్+పోలినగతిన్+పొమ్ము= ఆలోచించుకొని నీకు తగిన దారి నీ వనుసరించుము; అనినన్; ఆ+మానిని= అంబ; దేవా!= ప్రభూ!; ఇది+ఇట్టిద= నా ప్రాప్తమింతే; నీ+ఓపినంతయున్+చేసితి(వి)= నీకు శక్తి ఉన్నంతవరకు చేశావు; నీచేతన్+పోకున్నన్+ ఏమిచేయుదు?= నీకు శక్యము కానిదానికి నీవేమి చేయగలవు?; నేను తపంబు పెంపునన్= తపశ్శక్తిచేత; భీష్ముని వధించెదన్; జన్మ+అంతరంబునన్+ఐనన్= మరొక జన్మలోనైనా; చలంబు సాధ్యంబు చేయుదున్= పంత మీడేర్చుకుంటాను; అటుచూడుము= నీవు చూస్తూ ఉండుము; అని పలికిపోయెన్; తద్+అనంతరంబ= అంబ వెళ్లిన తరువాత; ఆ మునిజన+ పితృదేవతా సమూహంబును= ఆ జమదగ్ని, పితృదేవతా వర్గం; భృగునందనున్= పరశురాముడిని; నన్నున్= నన్ను; ఆమంత్రణంబు చేసి= పోయి వస్తామని మమ్ము వదలి; అంతర్ధానంబు చేసెన్= మరుగైపోయారు; భార్గవుండును= పరశురాముడునూ; నన్నున్; వీడ్కొలిపి= పోయిరమ్మని చెప్పి; మున్ను= పూర్వం; తనతో వచ్చిన; తపోధన వర్గమున్= మునిసమూహమును; (తపోధనుడు - తపమే ధనంగా కలవాడు= ఋషి); తానును; మహేంద్ర శైలంబునకున్ చనియెన్; నేను; మగిడి= మరలి; ఎడన్+ఎడన్= అక్కడక్కడ, ఉర్వీసురుల= బ్రాహ్మణుల యొక్క; ఆశీర్వాదంబులున్= దీవనలు; సంభావన వచనంబులున్= ఆదరంతో కూడిన పలుకులు; ప్రస్తుతి వాక్యంబులున్= పొగడ్తమాటలు; కర్ణంబులకున్= చెవులకు; ఇంపుచేయన్= ఆహ్లాదం కూర్పగా; ఇటవచ్చి= హస్తినాపురికి చనుదెంచి; సత్యవతికిన్; నమస్కారపూర్వకంబుగాన్= తొలుత నమస్కరించి; అంతయున్; ఎఱింగించినన్; ఆ+దేవి; అభినందించెన్= నన్ను మెచ్చుకొన్నది.

తాత్పర్యం: అని పలికి పరశురాముడి దగ్గరకు ఎనమండుగురు భూసురోత్తములు, నారదమునీంద్రుడు, జమదగ్ని, పితృదేవతా వర్గం, గంగాదేవి వెళ్ళారు. వెళ్ళి భీష్ముడు నీకడ విద్యనేర్చుకొన్నాడు. అతడు నీ శిష్యుడు. వాని యెడ నీకు కోపం తగునా? అతడు న్యాయవిహీనమైన పని చేయటాని కిష్టపడక నీతో కలహించాడు. అంతేకాని, నీకు పగవాడు కాడు. వాడిని కృపతో చూడుమని భృగురాముడికి చెప్పి అతడి చెంతకు రమ్మన్నారు. నేను వెళ్ళి ఆ మహానుభావుడికి సాష్టాంగంగా సాగిలపడి నమస్కరించాను. ఆయన దీవించి నన్ను గ్రుచ్చి లేవనెత్తి కౌగిలించుకొన్నాడు. 'గాంగేయా! నీ శక్తికీ భక్తికీ సంతోషించాను' అంటూ స్నేహయుక్తంగా పలికి నన్ను మన్నించాడు. ఆ తరువాత అంబను జూచి 'నన్ను భీష్ముడు జయించాడు. నేను చేయగల్గిన దింతే. నీ వింక నీకు తోచినదారి చూచుకో. వెళ్ళు' మని చెప్పాడు. ఆమె పరశురాముడితో 'దేవా! నా ప్రాప్తమింతే. నీ చేతనైనంతవరకు చేశావు. నీవలన కానిదానిని నీవు మాత్రమేమి చేయగలవు? నేను తపోబలంచేత భీష్ముడిని వధిస్తాను. మరొక జన్మలోనైనా నా పగ తీర్చుకొంటాను చూడు'మని పలికి అక్కడ నుండి వెళ్ళిపోయింది. అటు తరువాత నారదాది మునులు, జమదగ్ని, పితృదేవతలు పరశురాముడినీ, నన్నూ చూచి వెళ్ళివస్తామని పలికి మాయమయ్యారు. భృగురాముడు నన్ను ఆగుమనిచెప్పి, తనతో వచ్చిన ఋషి సమూహంతో మహేంద్రగిరికి వెళ్ళాడు. నేనున్నూ అక్కడ నుండి బయలుదేరి, దారిలో అక్కడక్కడ బ్రాహ్మణుల ఆశీర్వాదాలు, ఆదరపూర్వక వచనాలు, పొగడ్త మాటలు వీనులకు విందుసేయగా హస్తినకు వచ్చి, మా జనని సత్యవతీ దేవికి నమస్సులర్పించి జరిగినదంతా విన్నవించాను. అందుకు ఆ దేవి సంతోషించింది.

నారదుఁడు భీష్మున కంబవృత్తాంతం బంతయుఁ జెప్పుట (సం. 5-187-16)

తే. అంబ వృత్తాంత మరయంగ ననుదినంబుఁ । దగిన వారలఁ బుచ్చుచుఁ దలఁకుచుందు
నేను నది యాదిగాఁ జింత నేపు దక్కి । స్రుక్కియుండియు రాజుల నుక్కుమడఁతు. 361

ప్రతిపదార్థం: అంబవృత్తాంతమున్= అంబయొక్క సమాచారాన్ని; అరయంగన్= తెలిసికొనటానికి; అనుదినంబున్= ప్రతిదినం; తగిన వారలన్= అర్హులను; పుచ్చుచున్= పంపుతూ; తలఁకుచున్+ఉందున్= భయపడుతుంటాను; నేనున్= నేను; అది+ఆదిగాన్= అది మొదలుకొని; చింతన్= విచారంచేత; ఏపు+తక్కి= ఉత్సాహం కోల్పోయి; స్రుక్కి+ఉండియున్= తగ్గిపోయినప్పటికినీ; రాజులన్= భూపతులను; ఉక్కు మడఁతున్= పొగరణగిస్తాను.

తాత్పర్యం: అంబ వృత్తాంతం తెలిసికొనటానికై ప్రతిదినం తగినవారిని పంపుతూ భయపడుతుంటాను. ఆమె తపోబలంతో నన్ను నిర్మూలిస్తానని పల్కిందిమొదలు నేను చింతతో కృశించినప్పటికినీ శత్రురాజుల మదమణగిస్తూనే ఉన్నాను.

వ. ఒక్కనాఁడు పారాశర్య నారదులంగని యక్కార్యంబు భయంబు దోఁప విన్నవించిన వారలు 'దైవాధీనంబగు దాని మానుషంబున మానిపింప వశంబుగా; దా చింత విడువు'మని రందు నారదుం 'డక్కాశీశ్వర కన్యక తెఱంగు విను'మని యిట్లనియె. 362

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు; పారాశర్య; నారదులన్= పరాశరముని పుత్రుడైన వ్యాసునీ, నారదునీ; కని= చూచి; ఆ కార్యంబు భయంబు+తోఁపన్= అంబ తలపెట్టిన తపము వలన భీతి కలుగగా; విన్నవించినన్= నేను మనవి చేయగా; వారలు; దైవ+అధీనంబు+అగుదానిన్= దైవము చేతిలోనున్న పనిని; మానుషంబునన్= మనుష్య యత్నముచే; మానిపింపన్ వశంబు+కాదు; ఆ చింతన్ విడువుము; అనిరి; అందున్= వారిలో; నారదుండు; ఆ+కాశీ+ఈశ్వర కన్యక+తెఱంగు= ఆ కాశీరాజు పుత్రిక యొక్క వైనము; వినుము; అని ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నే నొకనాడు వ్యాస నారద మునీంద్రులను చూచి అంబవిషయమై నాకు భయమగుచున్నదని మనవి చేశాను. వారు దైవము తలపెట్టిన పనిని మానవ యత్నంతో మరలించడం శక్యం కాదు. నీవు ఈ విచారం విడిచిపెట్టుమని చెప్పారు. కాని నారద మహర్షి నాకు ఆ కాశీరాజపుత్రి విధం వినుమని ఇట్లా చెప్పినాడు:

సీ. 'ఆ తన్వి యమునా నదీ తీరమున కేఁగి । యత్యుగ్రమగు తప మాచరించి
యందుండి కౌశికు నావాస మాదిగాఁ । గలుగు సిద్ధాశ్రమంబులకు నెల్లఁ
జని చని తత్ప్రదేశంబుల నిష్ఠుర । వ్రతములు సలుపంగ వచ్చి నీదు
జనని జాహ్నవి 'యిట్లు వనితల కతి దుష్క । రములగు బహునియమములు నీకు

తే. నడపఁ గత మేమి?' యనుడు నన్నాతి పలుకుఁ । 'దద్ద యవమాన పడితి శాంతనవు చేత;
నపరజన్మంబునం దైన నతనిఁ జంప । నేను జాలుటకై యిట్టిదాన నైతి. 363

ప్రతిపదార్థం: ఆ+తన్వి= ఆ తరుణి; యమునా నదీ తీరమునకున్= యమునా నది యొక్క తటమునకు; ఏఁగి= వెళ్ళి; అతి+ఉగ్రము+అగు+తపము= మిక్కిలి ఘోరమైన తపస్సు; ఆచరించి= చేసి; అందున్+ఉండి= ఆ యమునా తీరమునుండి;

కౌశికు+ఆవాసము= విశ్వామిత్ర మహర్షి నివసించే ప్రదేశం; ఆదిగాన్+కలుగు= మొదలుగా ఉన్నటువంటి; సిద్ధ+ఆశ్రమంబులకున్+ఎల్లన్= తపస్సు ఫలించునట్టి ఆశ్రమాలన్నింటికినీ; చని చని= వెళ్ళి వెళ్ళి; తద్+ప్రదేశంబులన్= ఆయా తావులందు; నిష్ఠురవ్రతములు= కఠిన నియమాలతో కూడిన వ్రతాలు; చలుపంగన్= చేస్తూ ఉండగా; నీదు జనని జాహ్నవి వచ్చి= నీ తల్లిఅయిన గంగాదేవి అంబ కడకువచ్చి; ఇట్లు= ఈ విధంగా; వనితలకున్= ఆడువారికి; అతి దుష్కరములు+అగు= మిక్కిలి శ్రమతో చేయవలసిన; బహునియమములు= అనేకములైన నీమములను; నీకున్= నీకు; నడపన్+కతము+ఏమి?= సాగించడానికి కారణమేమి?; అనుడున్= అని ప్రశ్నించగా; ఆ+నాతి+పలుకున్= ఆ అంబ చెప్పింది; శాంతనవుచేతన్= శంతను పుత్రుడైన భీష్ముడి వలన; తద్ద= మిక్కిలి; అవమానపడితిన్= పరాభవం పొందాను; అపర జన్మంబునందున్+ఐనన్= మీదటి పుట్టువులోనైనా; అతనిన్+చంపన్= అతడిని వధించడానికి; నేను చాలుటకై= నేను సామర్థ్యం కలదాననగుటకై; ఇట్టిదానన్+ఐతిన్= ఇట్లా తపోవృత్తి నవలంబించాను.

తాత్పర్యం: 'అంబ యమునానదీతీరానికి వెళ్ళి అక్కడ ఘోరతపం సాగించింది. అక్కడ నుండి విశ్వామిత్ర మహర్షి నివాసం మొదలుగా ఉన్న సిద్ధాశ్రమాలన్నింటికీ వెళ్ళి వెళ్ళి, ఆయా ప్రదేశాలలో కఠిన నియమాలతో కూడిన వ్రతాలు సల్పుతూ ఉండింది. నీ తల్లి అయిన గంగాదేవి ఒకనా డామె దగ్గరకు వచ్చి 'ఆడువారికి అతి దుష్కరాలైన నియమ వ్రతాలు నీవు నెరపుతున్నావు. కారణమేమి?' అని ప్రశ్నించింది. నేను భీష్ముడిచేత మిక్కిలి పరాభవం పాలైనాను. మరుజన్మలోనైనా అతడిని చంపి పగతీర్చుకొనే సామర్థ్యం సంపాదించాలని ఇట్లా తపోవృత్తి నవలంబించాను' అని అంబ సమాధాన మిచ్చింది.

వ. అనిన విని భాగీరథి 'కుటిల ప్రచారవగుట నీవీ తనువు విడిచి యేఱయి పాఱంగల దాన; వింతియకాని యొండు గానేర' వనిన న వ్వెలంది నవ్వుచు సరకు చేయక యరిగి తొంటికంటెను దీవ్రంబగు తపశ్చరణంబునం బ్రవర్తిల్లుచు మత్స్యదేశ వాసినియై యుండి నాఁడు నిజవ్రత ఫలంబులో సగంబున నంబయను పేర నదియై య మ్మండలంబునం బరఁగియున్న సగంబునను దనరూపు చెడకుండ వహించికొని జాహ్నవీ ప్రభావంబు నాత్మీయ ప్రభావంబున గెలిచి వెండియు. 364

ప్రతిపదార్థం: అనినన్ విని= అంబ పల్కులు ఆలించి; భాగీరథి= గంగాదేవి; కుటిల ప్రచారవు+అగుటన్= నీవు వక్రమైన వర్తనం కలదానవు కావటం వలన; నీవు; ఈ+తనువున్ విడిచి= ఈ శరీరమును వదలి; ఏఱు+అయి+పాఱన్+కలదానవు= నదివై ప్రవహించగలవు; ఇంతియకాని ఒండు కానేరవు= ఇంత దప్ప ఇంకేమీ నీవు చెయ్యలేవు; అనినన్= అని గంగ పలుకగా; ఆ+వెలంది= ఆ మగువ (అంబ); నవ్వుచున్; సరకు చేయక= గంగ మాటలు లెక్కించక; తిరిగి; తొంటి కంటెన్= మునుపటి కంటె; తీవ్రంబు+అగు= కఠినమైన; తపస్+చరణంబునన్= తపస్సు చేయటంలో; ప్రవర్తిల్లుచున్= మెలగుతూ; మత్స్యదేశవాసిని+ఐ+ఉండి= మత్స్యదేశంలో నివసిస్తూ ఉన్నదై; ఒక్కనాఁడు; నిజవ్రత ఫలంబులోన్= తన వ్రతాల యొక్క ఫలమునందు; సగంబునన్= అర్ధభాగంతో; అంబ+అను పేరన్= అంబ అనే నామంతో; నదియై; ఆ+మండలంబునన్= ఆ భూమి భాగంలో; పరఁగి= ఒప్పుతూ; ఉన్న సగంబునను= మిగిలిన తపోమహిమ యొక్క అర్ధభాగంతో; తన రూపు చెడకుండన్= తన స్వరూపం నశించిపోకుండా; వహించుకొని= కాపాడుకొని; జాహ్నవీ ప్రభావంబున్= గంగాదేవి యొక్క మహిమను; ఆత్మీయ ప్రభావంబునన్= తన తపోమహిమ చేత; గెలిచి= జయించినదై; వెండియున్= మరియు.

తాత్పర్యం: అంబ పల్కులు విని గంగాదేవి 'నీవు, వక్రప్రవర్తన కలదానవు కనుక ఈ దేహం వీడి నదివై ప్రవహించగలవు. ఇంతేకాని నీవు మరేమీ చెయ్యలేవు' అని పలికింది. అంబ నవ్వుతూ గంగ మాటలు లక్ష్యపెట్టక

మళ్ళీ మునుపటికంటె తీవ్రమైన తపోవృత్తిలో మెలగుతూ మత్స్యదేశ నివాసినిఅయి ఉండి, ఒకరోజు తన వ్రతఫలంలో అర్ధభాగమున అంబ అనే నామంతో నదిఅయి మత్స్యధరణీ మండలంలో ప్రవహించింది. మిగిలిన సగం తపోబలంతో తన స్వరూపం చెడకుండా నిలుపుకొని గంగాదేవి మహిమను తన తపోమహిమ చేత జయించింది. గంగాదేవి శాపం వలన తన స్వరూపం పూర్తిగా కోల్పోయి ఏరై పారవలసిన అంబ నిజ తపోబలంచేత ఆకారం కోల్పడనందున గంగను గెలువగలిగింది.

క. పుణ్యాశ్రమ దేశముల న । గణ్యంబగు తపము చేయఁగా రుద్రుఁడు గా
రుణ్యము వాత్సల్యము దా । క్షిణ్యము మెఱయంగ నింతికిం బొడసూపెన్. 365

ప్రతిపదార్థం: పుణ్య+ఆశ్రమ దేశములన్= పావనాలైన ఆశ్రమ స్థలాలలో; అగణ్యంబు+అగు= లెక్కింపరానట్టి; తపము చేయఁగాన్= తపస్సు సల్పగా; రుద్రుఁడు= శంభుడు; కారుణ్యము= దయ; వాత్సల్యము= ప్రేమ; దాక్షిణ్యము= సామర్థ్యం; మెఱయంగన్= ప్రకాశించగా; ఇంతికిన్= అంబకు; పొడసూపెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: అంబ పవిత్రములైన ఆశ్రమ స్థలాలలో లెక్కించలేనంత తపస్సు సల్పుతుండగా దయ, ప్రేమ, సామర్థ్యం ప్రకటమయ్యేటట్లు శంకరుడు ఆమెకు ప్రత్యక్షమయ్యాడు.

క. మును లచ్చెరు వంది కనుం । గొన శంభుఁడు నిల్చి 'వరముఁ గోరు' మనుడు 'భీ
ష్ముని నాకుఁ జంపఁగా దొర । కొను నట్లుగ నొసఁగు' మనియెఁ గోమలి యెలమిన్. 366

ప్రతిపదార్థం: మునులు= ఋషులు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది, కనుంగొనన్= వీక్షిస్తూ ఉండగా; శంభుఁడు నిల్చి= ఈశ్వరుడు ఎదుట ప్రత్యక్షమై; వరమున్ కోరుము= వరం కోరుకొమ్ము; అనుడున్= అని పలుకగా; కోమలి= వనితఅయిన అంబ; ఎలమిన్= సంతోషంతో; నాకున్= నాకు; భీష్మునిన్+చంపఁగాన్= భీష్ముడిని వధించటానికి; దొరకొనునట్లుగాన్= పూనుకొనేటట్లు; ఒసఁగుము+అనియెన్= వరం దయచేయు మని పలికింది.

తాత్పర్యం: మును లాశ్చర్యపడి కనుగొనుచుండగా శంకరుడు అంబ యెదుట ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. అంబ భీష్ముడిని తాను చంపుట సమకూడేటట్లు వరం అనుగ్రహించు'మని సంతోషంతో వేడింది.

వ. అనవుడు నద్దేవుం 'డట్ల కాక' యని యనుగ్రహించిన, నంబ 'యెత్తెఱంగున నది యయ్యెడు?' నని యడిగిన- 367

ప్రతిపదార్థం: అనవుడున్= అంబ అట్లు వరం వేడగా; ఆ+దేవుండు= ఆ పరమేశ్వరుడు; అట్లకాక+అని= అట్లే ఇచ్చానని; అనుగ్రహించినన్= దయచూపగా; అంబ; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; అది+అయ్యెడున్+అని+అడిగినన్= భీష్మవధ జరుగగలదని అడుగగా.

తాత్పర్యం: అంబ అట్లా వరం వేడగా పరమేశ్వరుడు 'అట్లే అగుగాక' అని అనుగ్రహించాడు. ఆమె ఆ పని ఎట్లా జరుగగలదని ప్రశ్నించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **ఈ మేను విడిచి నీ వేఁగిన యప్పుడు । ద్రుపద భూవిభునకుఁ దొల్త పుత్రి**
వై పుట్టి పిదపఁ బుత్త్రాకృతిఁగాంచి శి । ఖండినామమున నుద్దండబాహు
బలమునఁ గోదండ పాండిత్యమును బటు । శౌర్యంబు నొప్పఁ బ్రశస్తి కెక్కి
యనిఁ జంపఁ గలదాన వాతని; నా మాట । దప్ప దూఱడు' మని చెప్పి హరుఁడు

తే. **సనియె; నా ప్రొద్దు సమిధలు చాలఁ గూడ । వైచి యనలంబుఁ గూర్చి యవ్వనిత క్రోధ**
దీప్తమూర్తియై 'భీష్ము వధించు దాన' । ననుచు సొదఁ జొచ్చె మునులకు నద్భుతముగ. **368**

ప్రతిపదార్థం: ఈ+మేను విడిచి= ఈ శరీరం వదలి; నీవు+ఏఁగిన+అప్పుడు= నీవు వెళ్ళిన సమయంలో; ద్రుపద భూ విభునకున్= ద్రుపద మహారాజునకు; తొల్తన్= మొదట; పుత్రివి+ఐ+పుట్టి= కూతురుగా జన్మించి; పిదపన్= తరువాత; పుత్త్ర+ఆకృతిన్+కాంచి= కుమార స్వరూపాన్ని ధరించి; శిఖండి నామమునన్= శిఖండి అనే పేరుతో; ఉద్దండ బాహు బలమునన్= మిక్కుటమైన భుజశక్తితోనూ; కోదండ పాండిత్యమును= ధనుర్విద్యయందు నైపుణ్యమునూ; పటు శౌర్యంబున్= దృఢమగు పరాక్రమమునూ; ఒప్పన్= ప్రకాశించగా; ప్రశస్తికిన్+ఎక్కి= ఖ్యాతిగడించి; అనిన్= యుద్ధంలో; ఆతనిన్= దేవవ్రతుడిని; చంపన్+కలదానవు= సంహరించగలవు; నా మాట తప్పదు= నా పలుకు వమ్ముగాదు; ఊఱడుము= ఉపశమించుము; అని చెప్పి= అని పలికి; హరుఁడు= రుద్రుడు; చనియెన్= అంతర్ధానమయ్యాడు; ఆ ప్రొద్దు= ఆ దినం; సమిధలు= కట్టెలు; చాలన్= మిక్కిలి; కూడవైచి= ఒక చోట చేర్చి (ప్రోగుచేసి) అనలంబున్+కూర్చి= అగ్గినంటించి; ఆ+వనిత= ఆ చెలువ; క్రోధ దీప్తమూర్తి ఐ= కోపంచేత ప్రకాశిస్తున్న ఆకారం కలదై; భీష్మున్ వధించుదానన్= భీష్ముడిని నేను సంహరిస్తాను; అనుచున్= అని పలుకుతూ; మునులకున్= అక్కడి ఋషులకు; అద్భుతముగన్= ఆశ్చర్యం కలిగేటట్లు; సొదన్+చొచ్చెన్= చితిలో ప్రవేశించింది.

తాత్పర్యం: నీవు శరీరం విడిచి వెళ్ళేటప్పుడు ద్రుపద భూపతికి మొదట కూతురుగా పుట్టుతావు. తరువాత కుమారుడ వవుతావు. శిఖండి అనే పేరుతో మిక్కుటమైన భుజశక్తి, ధనుర్విద్యా నైపుణ్యం, దిట్టమైన పరాక్రమం అనే వాటితో ప్రకాశిస్తూ ప్రఖ్యాతి గడించి యుద్ధంలో భీష్ముడిని సంహరిస్తావు. నా మాట వ్యర్థం కాదు. ఓర్మి వహించు' అని చెప్పి రుద్రుడు అంతర్ధానమయ్యాడు. ఆ దినమే అంబ కట్టియలు ఒకచోట ప్రోగుగా పేర్చి నిప్పంటించి క్రోధంతో తన రూపం జ్వలిస్తుండగా, అక్కడి మునులు ఆశ్చర్యపడుతుండగా, 'నేను భీష్ముడిని వధిస్తా'నంటూ ఆ చితిమంటలలో ప్రవేశించింది.

వ. **అట్టియెడ ద్రుపదుం డనపత్య యగు తన మహిషి విషాదంబు దీర్పం దివురుటను గాంగేయు తోడి రోషంబునను శివుని నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుండు ప్రత్యక్షంబయి 'వరంబు వేఁడు' మనిన 'భీష్ము వధియించు నట్టివాని నొక్క పుత్త్రుని నొసంగవలయు' ననుడు.** **369**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ తరుణంలో; ద్రుపదుండు; అనపత్య+అగు= బిడ్డలులేని; తన మహిషి విషాదంబు= తన పట్టపురాణి దుఃఖమును; తీర్పన్= తొలగించటానికి; తివురుటను= పూనుకొనటం వలననూ; గాంగేయు తోడి రోషంబునను= భీష్ముడిపై తనకు గల క్రోధంవల్లనూ; శివునిన్+ఉద్దేశించి= శంకరుడి గురించి; తపంబు చేసినన్= తప మొనర్పగా; ఆ+ దేవుండు= పరమేశ్వరుడు; ప్రత్యక్షంబు+అయి= గోచరించి; వరంబు వేఁడుము+అనినన్; భీష్మన్ వధియించునట్టివానిన్= గాంగేయుడిని చంపగలవాడిని; ఒక్క పుత్త్రునిన్= ఒక కుమారుని; ఒసంగవలయున్= నాకీయవలెను; అనుడున్= అని కోరగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అంబ చిత్యగ్నిలో ప్రవేశించిన తరుణంలో ద్రుపదుడు బిడ్డలు లేని తన పట్టపురాణి కోకిలాదేవి దుఃఖం తొలగించటానికై పూనిక వహించిన వాడగుట వల్లనూ, గంగాపుత్త్రుడైన భీష్మడిపై తనకు గల కోపం వల్లనూ శివుడిని గురించి తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షమై వరం వేడుమని ద్రుపదుడిని అడిగాడు. అపుడు పాంచాలరాజు భీష్మడిని చంపగల ఒక కుమారుడిని అనుగ్రహించుమని ప్రార్థించాడు. అందుకు ఈశ్వరు డిట్లా అన్నాడు:

తే. 'కూఁతురై పుట్టి పదపడి కొడుకుఁదనము । గాంచి భీష్ముని నాజిరంగమునఁ జంపు
నట్టి యుజ్జ్వలాపత్యంబు వుట్టు నీకుఁ । దప్ప దిది' యని రుద్రుండు సెప్పి చనియె. 370

ప్రతిపదార్థం: కూఁతురు+ఐ+పుట్టి= మొదట కుమార్తెగా జన్మించి; పదపడి= పిదప; కొడుకుఁదనమున్+కాంచి= కుమారత్వమును పొంది; భీష్మునిన్= శాంతనవుడిని; ఆజిరంగమునన్= రణభూమిలో; చంపునట్టి= వధించగల్గిన; ఉజ్జ్వల+అపత్యంబు= వెలిగిపోయే బిడ్డ; నీకున్= నీకు; పుట్టున్= జన్మిస్తుంది; ఇది తప్పదు= ఇది జరిగి తీరుతుంది; అని= అంటూ; రుద్రుఁడు= ఈశ్వరుడు; చెప్పి చనియెన్= వచించి మరుగయ్యాడు.

తాత్పర్యం: మొదట నీకు పుత్రికగా జన్మించి, ఆ తరువాత కొడుకుగా మారి, భీష్మడిని యుద్ధభూమిలో చంప గల్గిన చక్కని సంతానం నీకు కల్గుతుంది. నా వచనం అమోఘం' అని నుడివి మహేశ్వరుడు అంతర్ధానమయ్యాడు.

వ. ద్రుపదుండును బ్రీతుండయి నిజప్రియకు నవ్విధం బెఱింగించెఁ; దదనంతరంబ కాశీశ్వరకన్యక చైతన్యం బుదరంబు ప్రవేశించిన. 371

ప్రతిపదార్థం: ద్రుపదుండును; ప్రీతుండు+అయి= ఆనందించినవాడై; నిజప్రియకున్= తన భార్యఐన కోకిలాదేవికి; ఆ+విధంబు+ఎఱింగించెన్= ఈశ్వరుడు పలికిన పలుకులు తెలిపాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; కాశీ+ఈశ్వర కన్యక చైతన్యంబు= కాశీరాజపుత్రి అంబ యొక్క చైతన్యం (ప్రాణం); ఉదరంబు ప్రవేశించినన్= ద్రుపద పత్ని గర్భంలో చొరబడగా.

తాత్పర్యం: ద్రుపద మహారాజు సంతోషించి తన ప్రియురాలైన కోకిలాదేవికి ఈశ్వరుడు వరాన్ని అనుగ్రహించిన వైనం తెలియజెప్పాడు, తరువాత కాశీరాజు కూతురైన అంబ యొక్క చైతన్యం రాజమహిషి గర్భంలో ప్రవేశించగా.

క. పాంచాల రాజభార్య స । మంచిత గర్భంబు దాల్చి, మఱువడఁ గూఁతుం
గాంచి, నిజపతియుఁ దానును । వంచనఁ గొడు కనిరి యెల్లవారును వినఁగన్. 372

ప్రతిపదార్థం: పాంచాల రాజభార్య= ద్రుపద మహారాజు పత్ని; సమంచిత గర్భంబున్+తాల్చి= ఒప్పిదంగా కడుపుతో ఉండి; మఱువడన్= రహస్యంగా; కూతున్+కాంచి= కుమార్తెను కని; నిజపతియున్= తన భర్త అగు ద్రుపదుడున్నూ; తానును= తానున్నూ; వంచనన్= కపటంగా; ఎల్లవారును వినఁగన్= లోకులందరూ వినేటట్లు; కొడుకు+అనిరి= తమకు పుత్త్రుడు కలిగాడని అన్నారు.

తాత్పర్యం: పాంచాల భూవల్లభుడైన ద్రుపదుడి పట్టమహిషి చక్కగా గర్భం ధరించి రహస్యంగా కొమార్తెను కన్నది. తానూ, తన మగడూ కపటంగా తమకు పుత్రు డుదయించాడని లోకులందరికి చెప్పారు.

వ. ఇట్లు పుట్టిన బిడ్డకుఁ బుత్త్ర ప్రకారంబున జాతకర్మాది కృత్యంబులు నిర్వర్తించి శిఖండి యనుపేరుపెట్టి యతి ప్రచ్ఛన్నంబుగాఁ బెనిచి రహస్యంబు తెఱం గా కన్నియకుం జెప్పి' యక్షర శిక్షాదు లాచరించి ద్రోణాచార్యుకడ శస్త్రాస్త్ర పరిశ్రమంబు సేయించుచుండ జవ్వనంబు చేరువకుం దఱియగుటయు నమ్మగువం జూచి వగచి తల్లిదండ్రులు తమలో విచారించి 'వేగంబ వివాహంబు సేయవలయుఁ; బరమేశ్వరు వరంబు కొఱంత వడునె? తన నెఱసినప్పుడు నెఱయుంగాక!' యని నిశ్చయించి దశార్ణ దేశాధీశుండగు హేమవర్మ యను రాజు కన్యకం దగిన తెఱంగునఁ బాణిగ్రహణంబు సేయించి తెచ్చియున్నంత. 373

ప్రతిపదార్థం: ఇట్లు పుట్టిన బిడ్డకున్; పుత్రప్రకారంబునన్= కుమారున కెట్లో అట్లు; జాతకర్మ+ఆది+కృత్యంబులు+నిర్వర్తించి= బిడ్డపుట్టినప్పుడు చేయవలసిన శాస్త్రోక్త విధులు చేసి; శిఖండి; అనుపేరు పెట్టి; అతి ప్రచ్ఛన్నంబుగాన్= మిక్కిలి రహస్యంగా; పెనిచి= పెంచి; రహస్యంబు తెఱంగు= ఈ రహస్యానికి గల కారణం; ఆ కన్నియకున్ చెప్పి= ఆ బాలిక కెరింగించి; అక్షర శిక్షా+ఆదులు+ఆచరించి= విద్యాభ్యాసాదులు జరిపించి; ద్రోణాచార్యుకడన్= గురువగు ద్రోణుడి దగ్గర; శస్త్ర+అస్త్ర పరిశ్రమంబు చేయించుచున్+ఉండన్= శస్త్రాస్త్ర విద్యలందు శిక్షణ ఇప్పిస్తుండగా; జవ్వనంబు చేరువకున్= యౌవనం సమీపించుటకు; తఱి+అగుటయున్= సమయ మాసన్నంకాగా; ఆ+మగువన్ చూచి= ఆ పడతినికని; తల్లిదండ్రులు; వగచి= దుఃఖించి; తమలోన్ విచారించి= తమలో తాము ఆలోచించి; వేగంబు+అ= శీఘ్రమే; వివాహంబు చేయన్ వలయున్= పెండ్లి చేయాలి; పరమేశ్వరువరంబు కొఱంత పడునె?= ఈశ్వరుడిచ్చిన వరం లోపించునా?; తన నెఱసినప్పుడు నెఱయున్+కాక= గుట్టు బట్టబయలగునప్పు డగుగాక; అని నిశ్చయించి= అని నిర్ణయం చేసి; దశార్ణ దేశ+అధి+ఈశుండు+అగు= దశార్ణ దేశానికి అధిపతి ఐన; హేమవర్మ+అను= హేమవర్మ అనే పేరు గలిగిన; రాజు కన్యకన్= రాజుయొక్క కొమార్తెను; తగిన తెఱంగునన్= అర్హమైన రీతిలో; పాణిగ్రహణంబు చేయించి= శిఖండి కిచ్చి పెళ్ళి చేయించి; తెచ్చి+ఉన్నంతన్= కోడలిని ఇంటికి కొనివచ్చి ఉండగా.

తాత్పర్యం: ద్రుపద మహారాజు తనకు ఆడుబిడ్డ పుట్టినప్పటికీ మగబిడ్డకు చేయించవలసిన సంస్కార విశేషాలన్నీ చేయించి శిఖండి అనే పేరు పెట్టి అతిరహస్యంగా పెంచుతూ వచ్చాడు. రహస్యానికి గల కారణాన్ని ఆ కన్యకు తెలిపాడు. శిఖండికి అక్షరాభ్యాసం జరిపించి, ద్రోణాచార్యుల దగ్గర క్షత్రియోచితమైన శస్త్రాస్త్ర విద్యాపరిశ్రమ చేయిస్తూ ఉన్నాడు. ఇంతలో యౌవనం చేరువ అయిన తమ బిడ్డను చూచి జననీ జనకులు చింతించారు. వారు తమలో తాము వితర్కించుకొన్నారు. 'తొందరగా కన్యకు పెళ్ళి చేయాలి. ఈశ్వరుడు ప్రసాదించిన వరం వమ్ము కాదు. ఈమెకు మగతనం వచ్చినప్పుడు వచ్చుగాక' అని నిర్ణయించుకొని దశార్ణ దేశాధిపతిఅయిన హేమవర్మ పుత్రితో శిఖండికి ఉపాయంతో పెళ్ళి చేయించి కోడలిని ఇంటికి తెచ్చుకొనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అక్కుమారి చతుర యగుట శిఖండి వ । ర్తనము నెడఁ బ్రమాదమున నెఱింగి
యుగ్గడింప నొల్ల కూరక యెఱుఁగని । యదియ పోలె నుండె నాత్మ నొచ్చి. 374

ప్రతిపదార్థం: ఆ+కుమారి= దశార్ణ దేశాధిపతి కూతురు; చతుర+అగుటన్= నేర్పుగలది కావటం వలన; శిఖండి వర్తనము+ఎడన్= శిఖండి యొక్క ప్రవర్తన పట్ల; ప్రమాదమునన్+ఎఱింగి= అతడి యొక్క పరాకు వలన గ్రహించి; ఆత్మన్+నొచ్చి= మనసులో బాధపడి; ఉగ్గడింపన్+ఒల్లక= చెప్పటానికి ఇష్టపడక; ఊరక= మౌనంగా; ఎఱుఁగన్+అదియ పోలెన్= ఏమీ తెలియని దానివలెనే; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: దశార్ణ దేశ విభుడి పుత్రిక నేర్పుగలది. కనుక శిఖండి వర్తనం అతడు ఏమరి ఉన్నప్పుడు తెలిసికొని మనస్సులో బాధపడి, అతడు పడతి అని గ్రహించికూడా ఇతరు లెవ్వరికినీ చెప్పటానికి ఇష్టపడక ఏమీ ఎరుగనిదానివలెనే ఉండిపోయింది.

వ. ఇట్లు దశార్ణ విభుపుత్రి యెఱింగి శిఖండి పురుషుండు గామి దన దాసికిం జెప్పిన నదియు నప్పు డన్నరనాథున కెఱింగించి, పుచ్చిన, నతండు విషాద రోషంబుల నొంది దూతం బుత్తెంచిన, వాఁడు వచ్చి పాంచాలపతిం గాంచి యిట్లనియె : 375

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దశార్ణ విభు పుత్రి= దశార్ణరాజకుమారి; ఎఱింగి= గ్రహించి; శిఖండి; పురుషుండు కామిన్= మగవాడు కాడని; తన దాసికిన్; చెప్పినన్= తెలుపగా; అదియున్= ఆ దాసి; అప్పుడు= అపుడే; ఆ+నరనాథునకున్= ఆ దశార్ణపతికి; ఎఱింగించి పుచ్చినన్= తెలియజెప్పి పంపగా; అతండు= ఆ రాజు; విషాద రోషంబులన్+ఒంది= తన కూతురు ఆడుదానికి ఆలయినందుకు దుఃఖాన్నీ, తన పుత్రికను పుత్రుడని చెప్పి తనను వంచించినందుకు కోపాన్నీ పొందినవాడై; దూతన్= దూతను; పుత్తెంచినన్= పంపగా; వాఁడు వచ్చి పాంచాలపతిన్; కాంచి= కనుగొని; ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: దశార్ణపతి పుత్రిక శిఖండి మగవాడు కాడని ఎరిగి తన దాసికి చెప్పింది. ఆ పరిచారిక ఆ సంగతి దశార్ణ విభుడికి తెలియజేసింది. అతడు దుఃఖ క్రోధాలను పొంది దూతను పంపగా, వాడు ద్రుపదుడిని చూచి ఇట్లా అన్నాడు:

చ. కొడుకని చెప్పి యిట్లగునె కూఁతు వివాహము చేయ దీన నీ
పడసిన లాభమేమి? నగుఁబాటగు నింతియ కాక యెల్ల నే
ర్పడ నెఱుఁగంగ వచ్చితి; నరాతిభయంకరు హేమవర్మ నా
గడమున గాసిచేసితి మగంటిమి నీదెసనైనఁ జూపుమా! 376

ప్రతిపదార్థం: కొడుకు+అని చెప్పి= కుమారుడని పలికి; కూఁతున్= కొమార్తెను తీసికొనివచ్చి; ఇట్లు+వివాహము చేయన్+అగునె?= ఇట్లా పెండ్లి చేయటం తగునా?; నగుఁబాటు+అగున్= నీకు తలవంపులౌతుంది; ఇంతియకాక= ఇంతకుమించి; దీనన్= ఇట్లు చేసినందువలన; నీ పడసిన లాభము+ఏమి?= నీవు పొందిన ప్రయోజనమేముంది?; ఎల్లన్= ఉన్న విషయమంతయు; ఏర్పడన్= తెల్లముగా; ఎఱుఁగంగన్+వచ్చితిన్= తెలిసికొనటానికి వచ్చాను; అరాతి భయంకరున్= శాత్రవులకు భీతి గొలుపునట్టి; హేమవర్మన్= హేమవర్మను; ఆగడమునన్= అకార్యముచే; గాసి చేసితి(వి)= బాధపెట్టావు; నీ దెసన్+ఐనన్= నీ విషయంలోనైనను; మగంటిమి= మగతనం; చూపుమా= కనబరచుము.

తాత్పర్యం: కొడుకని చెప్పి కొమార్తెను తీసుకొనివచ్చి నా పుత్రికతో వివాహం జరిపించావు. ఇట్లా చేయటం వల్ల తలవంపులు దప్ప నీవు సాధించిన ప్రయోజన మేముంది? ఈ విషయమెల్ల విస్పష్టంగా తెలిసికొనటానికి వచ్చాను. హేమవర్మ శత్రు భయంకరుడని నీకు తెలియదా? అకార్య మొనర్చి ఆయనకు బాధ కల్గించావు. పోనీ నీ విషయంలోనైనా మగతనం చూపవలసినది. (రణరంగంలో ఆతన్నెదుర్కొని నీ పౌరుషం ప్రకటించవలసినదని చమత్కారం.)

విశేషం: మగంటిమి నీ దెసనైనఁ జూపుమా - నీ సంతానానికి ఎట్లాగూ మగతనం లేదు. నీకయినా మగతనం ఉంటే మా రాజుతోడి యుద్ధంలో ప్రదర్శించుము - అని దూతవాక్యంలో చమత్కారం.

ఆ. అనిన నగుచు వాని కను ద్రుపదుం 'డివి । యేటిమాట? లిట్టు లేల చేయ
వచ్చు? నింత వెఱ్ఱివారును గలరె? యి । త్తెఱఁగు వొసఁగ కునికి యెఱుఁగ రాదె?' 377

ప్రతిపదార్థం: అనినన్= అని దూత పలుకగా; ద్రుపదుండు= ద్రుపద మహారాజు; నగుచున్= నవ్వుతూ; వానికిన్+అనున్= వాడితో ఇట్లా అన్నాడు; ఇవి+ఏటి మాటలు?= ఇవెట్టి మాటలు?; ఇట్టులు= ఈ ప్రకారం; ఏల చేయన్ వచ్చున్?= ఎందుకు చేస్తాము?; ఇంత వెఱ్ఱివారును కలరె?= లోకంలో ఇంత పిచ్చివారుంటారా?; ఈ+తెఱఁగు= నీవు నుడివిన విధం; పొసఁగక+ ఉనికి= అసంభవమని; ఎఱుఁగన్+రాదె?= తెలియవలదా?

తాత్పర్యం: దూత మాటలకు ద్రుపదుడు నవ్వుతూ- 'ఆహా! ఇవేటి మాటలు? ఇట్లా ఎందుకు చేస్తాము? ఇంత వెర్రి వారుంటారా? ఇట్లా ఎక్కడా జరగదని గ్రహించుము.'

వ. అని వెండియు నేర్పునం దీర్పుమాట లనేకంబులాడి నిక్కం బరయం జూచిన వానికిం జొరవ యీక త్రోపుసేసి వీడ్కొలిపి పుచ్చినం బోయి వాఁడును నిజనాథున కవ్విధంబు విన్నవించిన. 378

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల; నేర్పునన్= చాతుర్యంతో; తీర్పుమాటలు= పొందిక మాటలు; అనేకంబులు+ఆడి= పెక్కువచించి; నిక్కంబు+అరయన్= నిజం గ్రహించటానికి; చూచినన్= దూత యత్నించగా; వానికిన్= అతడికి; చొరవ+ ఈక= అవకాశం కల్గించక; త్రోపుచేసి= త్రోసిపుచ్చి; వీడ్కొలిపి పుచ్చినన్= పోయిరమ్మని పలికి పంపగా; పోయి= వెళ్ళి; వాఁడును= ఆ దూత; నిజనాథునకున్= తన ఏలికయైన హేమవర్మకు; ఆ+విధంబు= ద్రుపదుడు పల్కిన తీరు; విన్నవించినన్= విజ్ఞప్తి చేయగా.

తాత్పర్యం: అని మళ్ళీ ద్రుపదుడు నేర్పుతో పెక్కు పొందిక మాటలు పలికాడు. నిజం వెలికి తీయటం కొరకు దూత యత్నించగా అట్టి అవకాశ మీయక త్రోసివేసి అతడికి వీడ్కోలిచ్చాడు. వాడు వెళ్ళి తన ఏలిక హేమవర్మకు పాంచాలు డాడిన పలుకులన్నీ విన్నవించగా.

క. కోపోద్రేకంబున నతఁ । డా పాంచాలపతిమీఁద నతులిత సైన్యా
టోపమున వచ్చి పురి పరి । ఖా పరిసర తలము చుట్టుఁ గైకొని విడిసెన్. 379

ప్రతిపదార్థం: అతఁడు= హేమవర్మ; కోప+ఉద్రేకంబునన్= క్రోధావేశంతో; ఆ పాంచాల పతి మీఁదన్= ఆ ద్రుపద మహారాజు మీద; అతులిత= సాటిలేని; సైన్య+ఆటోపమునన్= సేనల యొక్క విజృంభణంతో; వచ్చి= చనుదెంచి; పురి పరిఖా పరిసర తలము చుట్టున్= రాజధానీ నగరం యొక్క అగడ్త సమీప భూమి చుట్టూ; కైకొని= ఆక్రమించి; విడిసెన్= దండు దిగినాడు.

తాత్పర్యం: హేమవర్మ కోపావేశంతో ద్రుపదుడి మీదికి సైన్యసన్నాహంతో వచ్చి అతడి పట్టణపు అగడ్త చుట్టూ ఉన్న ప్రదేశాన్ని ఆక్రమించి ముట్టడి చేశాడు.

వ. ఇట్లు విడిసిన. 380

తాత్పర్యం: హేమవర్మ తన సేనలతో ద్రుపదుడి పట్టణాన్ని ముట్టడించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పట్టు వడ్డ మ్రుచ్చు పగిదిఁ బాంచాల భూ। నాయకుండు తనకు నానచేటు
రాక కుమ్మలించి యేకాంతమునఁ బత్ని। యొక్కతియును గొల్వ నూరకుండె. 381

ప్రతిపదార్థం: పాంచాల భూనాయకుండు= పాంచాల దేశాధీశుడైన ద్రుపదుడు; పట్టు+పడ్డ= దొరకి పోయిన; మ్రుచ్చు పగిదిన్= దొంగవలె; తనకున్= తనకు; నానచేటు రాకకున్= సిగ్గుచేటు స్థితి దాపురించినందుకు; ఉమ్మలించి= దుఃఖించి; ఏకాంతమునన్= ఒంటరిగా; పత్ని+ఒక్కతియును= భార్య ఒక్కతియే; కొల్వన్= సేవిస్తుండగా; ఊరక+ఉండెన్= మౌనంగా ఉన్నాడు.

తాత్పర్యం: ద్రుపద మహారాజు దొరకిపోయిన దొంగవలె తనకు సిగ్గుచేటు దుర్దశ దాపురించినందుకు దుఃఖించి, భార్య యొక్కతే తనను సేవిస్తుండగా ఒంటరిపాటున ఒకచోట మౌనంగా ఉండిపోయాడు.

వ. తదీయ దండనాథులు సమరోత్సాహంబునం బ్రవర్తిల్లి; రంత సూర్యాస్తమయ సమయం బగుటయు రెండు వీళ్లును భండనంబు తోడి వేడుకం జేసి వేగుటకు వేచియుండె. 382

ప్రతిపదార్థం: తదీయ దండనాథులు= ద్రుపదుడి సేనాపతులు; సమర+ఉత్సాహంబునన్= యుద్ధమునందలి పూనికతో; ప్రవర్తిల్లిరి= మెలగినారు; అంతన్= అంతట; సూర్య+అస్తమయ సమయంబు+అగుటయున్= ప్రొద్దుగ్రుంకేవేళ ఆసన్నం కాగా; రెండు వీళ్లును= ఉభయ సేనాపక్షాలు; భండనంబుతోడి వేడుకన్+చేసి= సంగ్రామం సల్పటంలోని ఉత్సాహంతో; వేగుటకున్= తెల్లవారుటకు; వేచియుండెన్= కనిపెట్టుకొని ఉన్నవి.

తాత్పర్యం: ద్రుపదుడి సేనానాయకులు రణసన్నాహంలో ఉండగా సూర్యు డస్తమించాడు. ఇరు పక్షాలవారు యుద్ధం చేసే కౌతుకంతో ఎప్పుడు తెల్లవారుతుందా అని కాచుకొని ఉన్నారు.

క. అప్పుడు శిఖండి మరణము। దప్పఁగ నడి కొండు ప్రతివిధానము సేయుం
జొప్పడమిఁ దలఁచి యొరులకుఁ। జెప్పక వెస నరిగెఁ బురము చెంత యడవికిన్. 383

ప్రతిపదార్థం: అప్పుడు= అట్టి సమయంలో; శిఖండి= శిఖండి; మరణము తప్పఁగన్= చావు వినా; నడికిన్= నిందకు; ఒండు ప్రతివిధానము= మరొకమారు చేత; చేయన్= చేయటానికి; చొప్పడమిన్= వీలులేమి; తలఁచి= భావించి; ఒరులకున్+చెప్పక= ఇతరులకు ఎవ్వరికీ చెప్పకుండా; పురము చెంత+అడవికిన్= పట్టణ సమీపంలోని అరణ్యమునకు; వెసన్+అరిగెన్= శీఘ్రంగా వెళ్ళాడు.

తాత్పర్యం: అప్పుడు శిఖండి తనకు మరణం వినా నిందను పోగొట్టుకొనటానికి మరో మార్గం లేకుండటం గ్రహించి ఇతరు లెవ్వరికీ చెప్పకుండ గుట్టు చప్పుడుకాకుండా నగరం చెంతనున్న అరణ్యంలోనికి శీఘ్రంగా వెళ్ళాడు.

శిఖండి యక్షునివలనఁ బురుషత్వంబునొందిన వృత్తాంతము (సం. 5-192-20)

వ. అవ్విపినంబు స్థూలకర్ణుం డను నొక్క యక్షునికి నివాసంబై యునికిం జేసి నిర్జనంబై యుండు; శిఖండియు నత్తెఱం గెఱుంగుం గావున నతని నుద్దేశించి యందుఁ జొచ్చి తత్ప్రదేశంబున మహనీయ సుందరంబగు తదీయ మందిరంబున కరిగి, యచ్చటఁ బ్రాణవియోగం బగు విధం బాచరింపం బూనిన. 384

ప్రతిపదార్థం: ఆ+విపినంబు= ఆ వనం; స్థూలకర్ణుండు అను ఒక్క యక్షునికిన్; నివాసంబు+ఐ; ఉనికిన్+చేసి= ఉండటం వలన; నిర్జనంబు+ఐ+ఉండున్= మనుషులు లేనిదై ఉంటుంది; శిఖండియున్; ఆ+తెఱంగు+ఎఱుంగున్= ఆ విషయం తెలిసిన వాడు; కావునన్; అతనిన్+ఉద్దేశించి= ఆ యక్షుడిని దృష్టిలో ఉంచుకొని; అందున్+చొచ్చి= ఆ కాననంలో ప్రవేశించి; తద్+ప్రదేశంబునన్= ఆ అరణ్య భూమిలో; మహనీయ సుందరంబు+అగు= గొప్పది, అందమైనది అయిన; తదీయ మందిరంబునకున్= ఆ యక్షుని సౌధంలోనికి; అరిగి= వెళ్ళి; అచ్చటన్; ప్రాణ వియోగంబు+అగు విధంబు= ప్రాణాలతో ఎడబాటు కలిగే సంవిధానం; ఆచరింపన్+పూనినన్= చేయటానికి పూనుకొనగా.

తాత్పర్యం: ఆ వనం స్థూలకర్ణుడనే ఒకయక్షుడు కాపురముండే చోటు. కనుక అక్కడ మనుష్య సంచారం ఉండదు. శిఖండికి ఆ విషయం తెలుసు. కనుక యక్షుడిని ఉద్దేశించి శిఖండి ఆ కానలో ప్రవేశించాడు. మహనీయమూ, మనోహరమూ అయిన స్థూలకర్ణుడి మందిరానికి వెళ్ళి అక్కడ తన ప్రాణం తీసికొనే ప్రయత్నంలో శిఖండి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. యక్షుఁ డెఱింగి వచ్చి 'యిటు లాఱడి చావఁగ నేల చెప్పు మ
బ్జాక్షి! భవన్మనోరుజకు నౌషధ మే నొనరింతు' నన్న 'ఫా
లాక్షుఁడు దక్క నొడ్లకును నా పని సేయఁగరాదు; నాదు చి
త్తక్షతి పుంస్త్వ మేను దగఁ దాల్పక మానదు గుహ్యకోత్తమా!' 385

ప్రతిపదార్థం: యక్షుఁడు= స్థూలకర్ణుడు; ఎఱింగి= శిఖండి ప్రయత్నం తెలిసికొని; వచ్చి= అక్కడి కేతెంచి; ఇటులు= ఈ ప్రకారం; ఆఱడి చావఁగన్+ఏల?= వ్యర్థంగా చనిపోవటమెందుకు?; అబ్జ+అక్షి!= తామర రేకుల వంటి కన్నులు గల కాంతా!; చెప్పుము= తెల్పుము; భవత్+మనః+రుజకున్= నీ మనోవ్యాధికి; ఔషధము= మందు; ఏన్= నేను; ఒనరింతున్= సమకూరుస్తాను; అన్నన్= అని గుహ్యకుడు పలుకగా; గుహ్యక+ఉత్తమా!= యక్షులలో శ్రేష్ఠుడా!; ఫాల+అక్షుఁడు+తక్కన్= నొసట కన్నుగల పరమేశ్వరుడికి తప్ప; ఒడ్లకును= ఇతరులకు; ఆ+పని చేయఁగన్+రాదు= ఆ కార్యం సంఘటింప శక్యము కాదు; పుంస్త్వము= మగతనం; ఏను= నేను; తగన్= చక్కగా; తాల్పక= ధరించక; నాదు చిత్తక్షతి= నా మనస్సునందలి గాయం; మానదు= తొలగదు.

తాత్పర్యం: శిఖండి ప్రాణాలు తీసికొనటానికి ప్రయత్నిస్తున్నాడని యక్షుడు తెలిసికొని అక్కడికి వచ్చి, 'ఓ కాంతా! ఈ విధంగా నీవు వ్యర్థంగా మరణించటానికి కారణమేమో చెప్పు. నీ మనోవ్యాధికి తగుమందు నే నిస్తాను' అని పలికాడు. అందుకు శిఖండి మహేశ్వరునకు తప్ప ఇతరులకు ఈ కార్యం సంఘటింప సాధ్యం కాదు. నాకు మగతనం లభిస్తేగాని నా మనసులోని గాయం మానదు.

క. **అని తన వృత్తాంతం బా । తని కెఱిఁగించుటయు, నతఁడుఁ దనదగు చిత్తం**
బునఁ గరుణ పుట్టి 'యెంతటి । పని యిది? యే నిత్తు సమయపరిపాలనతోన్. 386

ప్రతిపదార్థం: అని; తన వృత్తాంతంబు= తన సంగతి; ఆతనికిన్= ఆ స్థూలకర్ణుడికి; ఎఱిఁగించుటయున్= తెలుపగా; అతఁడు= ఆ యక్షుడు; తనది+అగు+చిత్తంబునన్= తన మనస్సులో; కరుణ+పుట్టి= దయ జనించి; ఇది+ఎంతటి పని?= ఇదేమి ఘనకార్యం? సమయ పరిపాలనతోన్= ఒడంబడికను పాటించే నియమంతో; నేను+ఇత్తున్= నా పుంస్త్వం నీకిస్తాను.

తాత్పర్యం: శిఖండి తన విషయమంతా యక్షుడికి నివేదించాడు. అతడు తన మనసులో దయ జనించగా 'ఇదెంత పని? నా మగతనం నీకిస్తాను. అందుకు గడువు పెడతాను.

క. **నా పురుషత్వము గైకొని । వే పోయి దశార్ణపతికి వెలయించిన మీ**
యాపదలు దొలఁగి చనఁ, బొడ । సూపుము పదినాళ్లయంత సూనృత మొప్పన్. 387

ప్రతిపదార్థం: నా పురుషత్వము= నా మగతనం; కైకొని= స్వీకరించి; వే పోయి= శీఘ్రంగా వెళ్ళి; దశార్ణపతికిన్= హేమవర్మకు; వెలయించినన్= నీ పురుషత్వం నిరూపిస్తే; మీ+ఆపదలు= మీకు వచ్చిన కష్టాలు; తొలఁగి చనన్= తీరిపోగా; సూనృతము+ఒప్పన్= సత్యం తప్పకుండా; పది నాళ్ళ అంత= పది దినాల వ్యవధి గడవగనే; పొడచూపుము= నాకు కనిపించుము.

తాత్పర్యం: శిఖండీ! నా మగతనం స్వీకరించి వెంటనే వెళ్ళి దశార్ణ విభునకు నేను పురుషుడనని రుజువుపరిచి మీ కష్టాలు తీరిన తర్వాత పది రోజులు గడవగనే మాట తప్పకుండా వచ్చి నాకు కనిపించు.

క. **అంతవునంతకు నీదగు । కాంతారూపంబు నేను గైకొనియెద; ని**
శ్చింతమున మగుడఁ జను' మని । యింతికిఁ బురుషత్వ మిచ్చె నెంతయు వేడ్కన్. 388

ప్రతిపదార్థం: అంత+అవునంతకున్= ఆ పది నాళ్ళ మితివరకు; నీదగు= నీదైన; కాంతా రూపంబున్= స్త్రీ రూపాన్ని; నేను= నేను; కైకొనియెదన్= గ్రహిస్తాను; నిశ్చింతమునన్= నిర్విచారంగా; మగుడన్+చనుము+అని= మరల ఇంటికి వెళ్ళుమని; ఇంతికిన్= శిఖండి నామంతో ఉన్న ద్రుపద పుత్రికి; ఎంతయున్+వేడ్కన్= మిక్కిలి ప్రీతితో; పురుషత్వము+ఇచ్చెన్= యక్షుడు తన పుంస్త్వము నిచ్చాడు.

తాత్పర్యం: నేటినుండి పది దినాల వరకు నేను నీ కాంతాస్వరూపాన్ని గైకొంటాను. నీవు నిర్విచారంగా నీ గృహానికి వెళ్ళు'మని యక్షుడు మిక్కిలి సంతోషంతో శిఖండికి తన మగతన మనుగ్రహించాడు.

తే. **ఇచ్చి తాను భామాకృతి నెలమిఁ దాల్చి । వీడుకొల్ప శిఖండియు వీటి కేఁగు**
దెంచి నిజమందిరంబు సొత్తెంచి తల్లి । దండ్రులకు మ్రొక్కి నిలిచి ముదం బెలర్ప. 389

ప్రతిపదార్థం: ఇచ్చి= తన పురుషత్వ మొసగి; తాను= యక్షుడు; భామా+ఆకృతిన్= స్త్రీ రూపాన్ని; ఎలమిన్= సంతోషంతో; తాల్చి= ధరించి; వీడుకొల్పన్= సాగనంపగా; శిఖండియున్= శిఖండియూ; వీటికిన్= నగరానికి; ఏఁగుదెంచి= వచ్చి; నిజమందిరంబు+చొత్తెంచి= తన భవనానికి చేరి; తల్లిదండ్రులకున్= మాతాపితలకు; ముదంబు+ఎలర్పన్= సంతోషం అతిశయించగా; మ్రొక్కి నిలిచి= నమస్కరించి నిలబడి.

తాత్పర్యం: యక్షుడు తన పురుషత్వ మొసగి తాను స్త్రీరూపం గైకొని అతనిని సాగనంపాడు. శిఖండి నగరం ప్రవేశించి తన మందిరానికి వచ్చి, అచ్చట జననీ జనకులకు ఆనంద మతిశయించగా నమస్కరించి నిలిచి.

క. తన తెఱఁ గంతయు నెఱిఁగిం । చిన నద్భుత హర్షమగ్న చేతసులై త
జ్జననీ జనకులు బహువిధ । వినుతులఁ గొనియాడి; రంత వేకువ యయ్యెన్. 390

ప్రతిపదార్థం: తన తెఱఁగు+అంతయున్= తన విషయమంతా; ఎఱిఁగించినన్= తెలుపగా; అద్భుత హర్షమగ్న చేతసులు+ఐ= ఆశ్చర్యంలో ఆనందంలో మునిగిన మనసులు కలవారై; తద్+జననీ జనకులు= ఆతడి తల్లిదండ్రులు; బహువిధ వినుతులన్= అనేక రీతులైన పొగడ్తలతో; కొనియాడిరి= తమ బిడ్డను మెచ్చుకొన్నారు; అంతన్= అంతట; వేకువ+అయ్యెన్= వేగుజామైనది.

తాత్పర్యం: శిఖండి జరిగిన వృత్తాంతమంతా తన తలిదండ్రులకు తెలిపాడు. వారు సంతోషాశ్చర్య మగ్న హృదయులై అనేక విధాల అతడిని ప్రశంసించారు. ఇంతలో వేకువ జామైనది.

వ. తదనంతరంబ సూర్యోదయం బగుటయుఁ గాలోచిత కరణీయంబులు నిర్వర్తించి, పాంచాల విభుండు సంబంధితో వలయు మాట లాడందగు వారలం బనిచి, రావించి సంభ్రమంబు లేక వేగిరపడక నాగరిక ప్రకారంబున శిఖండి పురుషత్వంబు దేటపఱిచి యతని మాట గీడ్పఱిచి, సపరివారంబుగా నద్దశార్ణపతికి విందువెట్టి కట్టనిచ్చి, యతని యనునయాలాపంబు గైకొని యనిచి పుచ్చిన, నతండు తన్నుందాన నిందించు కొనుచు నిజపురంబునకుం బోయె; నట్టియెడ నయ్యక్షవరుమందిరంబు చక్కటికిం గ్రీడార్థంబు గిన్నర విభుండు విమానారూఢుం డయి చని దాని యొప్పు గనుంగొని యగ్గించుచు నిల్చి యొక్కింత సేపునకుం జుట్లనున్న గుహ్యకులతో నిట్లనియె. 391

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే; సూర్య+ఉదయంబు+అగుటయున్= ప్రొద్దు పొడువగా; కాల+ఉచిత కరణీయంబులు= ప్రాతఃకాలకృత్యాలు; నిర్వర్తించి= నెరవేర్చి; పాంచాల విభుండు= ద్రుపద మహారాజు; సంబంధితోన్= వియ్యంకుడితో; వలయు మాటలు= తగిన మాటలు; ఆడన్+తగువారలన్= పలుకగలవారిని; పనిచి= పంపి; రావించి= హేమ వర్మను రప్పించి; సంభ్రమంబు లేక= తొట్రుపాటు నొందక; వేగిరపడక= తొందరపడక; నాగరిక ప్రకారంబునన్= సభ్యతతో; శిఖండి పురుషత్వంబు= శిఖండి యొక్క మగతనం; తేటపఱిచి= స్పష్టమొనరించి; అతని మాట= శిఖండి పురుషుడు కాడు, ఆడుది అనినట్టి హేమవర్మ వాక్యం; కీడ్పఱిచి= తప్పని నిరూపించి (అనుచిత మని తేల్చి); సపరివారంబుగాన్= పరిజనంతో కూడ; ఆ+దశార్ణపతికిన్= హేమవర్మకు; విందుపెట్టి= భోజనమిడి; కట్టన్+ఇచ్చి= ధరించటానికి నూత్నవస్త్రాలొసగి; అతని+అనునయ+ఆలాపంబులు= హేమవర్మ యొక్క ప్రార్థనాపూర్వకాలైన వాక్యాలు; కైకొని= గ్రహించి; అనిచి పుచ్చినన్= సాగనంపగా; అతండు= హేమవర్మ; తన్నున్+తాన; నిందించు కొనుచున్= దూషించుకొంటూ; నిజపురంబునకున్ పోయెన్; అట్టి+ఎడన్; ఆ యక్షవరుమందిరంబు చక్కటికిన్= ఆ స్థూలకర్ణుడి సౌధం దగ్గరకు; క్రీడా+అర్థంబు= వినోదం కొరకై; కిన్నర విభుండు= కుబేరుడు; విమాన+ఆరూఢుండు+అయి= విమానం ఎక్కినవాడై; చని= వెళ్ళి; దాని+ఒప్పున్= స్థూలకర్ణుడి భవనము యొక్క అందాన్ని; కనుంగొని; అగ్గించుచున్= శ్లాఘిస్తూ; నిల్చి= ఆగి; ఒక్కింత సేపునకున్= కొంచెం సేపటికి; చుట్లన్+ఉన్న= తన చుట్టూ చేరిఉన్న; గుహ్యకులతోన్= యక్షులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అంతట ప్రొద్దు పొడువగా ద్రుపదుడు కాలకృత్యాలు నిర్వర్తించి, వియ్యంకుడితో తగుమాట లాడగల వారిని పంపి అతడిని రప్పించి, ఏమాత్రం తొట్రుపాటు చెందక, తొందరపడక సభ్యంగా శిఖండి పురుషత్వం

స్పష్టపరచి, వియ్యంకుడి మాట తప్పని తేల్చి, పరిజనంతో ఆయనకు విందొసగి, ధరించుటకు దుకూలాలిచ్చి దశార్ణపతి వేడికోలు మాటలు మన్నించి సాగనంపాడు. హేమవర్మ తాను శిఖండిపై మోపిన నిందకు తనను తాను దూషించుకొంటూ నిజపురికి వెళ్ళాడు. అట్టి సమయంలో స్థూలకర్ణుడి భవన సమీపానికి క్రీడార్థంగా విమానారూఢుడై కుబేరుడు వచ్చాడు. స్థూలకర్ణుడి సౌధ సౌందర్యానికి మెచ్చుతూ కుబేరుడు కొంచెంసేపు అచ్చట నిలిచి తన చుట్టునున్న యక్షులతో ఇట్లా అన్నాడు:

క. 'మన మిచట నిలిచియుండఁగ । మనమున శంకింప కిట్లు మసలిన వాఁ డీ
తని గర్వ మేల యిక్కడఁ । జనుదేరఁగనిచ్చు నెట్లు సైపఁగ వచ్చున్?' 392

ప్రతిపదార్థం: మనము= మనం; ఇచటన్= ఇక్కడ; నిలిచి+ఉండఁగన్= తనకొరకై వేచిఉండగా; మనమునన్= హృదయంలో; శంకింపక= జంకక; ఇట్లు మసలినవాఁడు= ఈ రీతిని స్థూలకర్ణుడు ఆలసిస్తున్నాడు; ఈతని గర్వము= ఇతడి పొగరు; ఇక్కడన్= ఇక్కడికి; ఏల చనుదేరఁగన్+ఇచ్చున్= ఎందుకు రానిస్తుంది; ఎట్లు= ఏ విధంగా; సైపఁగన్+వచ్చున్?= ఇతడిని క్షమింపవచ్చును?

తాత్పర్యం: మనం ఇక్కడ తన కొరకు వేచియుండగా మదిలో జంకులేక తాను జాగు చేస్తున్నాడు. ఇతడి కింత పొగ రెందుకు? ఈ పొగరు అతడి నిక్కడి కెట్లా రానిస్తుంది? ఇతడి తప్పు సహించట మెట్లా?

వ. అని పలికి యలుక మొగంబున ముడివడ నున్నంతఁ గిన్నరు లా గుహ్యకు నరసి తద్వృత్తాంతం బంతయు నెఱింగించి 'దేవా! సిగ్గుపెంపున రానేరకున్నవాఁ' డని విన్నవించిన. 393

ప్రతిపదార్థం: అలుక= కోపం; మొగంబునన్; ముడి+పడన్= వ్యాపించగా; ఉన్న+అంతన్= ఉండగా; కిన్నరులు(కించిత్+నరులు)= కొంచెం నరాకారం కలవారు (గుఱ్ఱం ముఖం కలవారు); ఆ గుహ్యకున్= యక్షుడైన స్థూలకర్ణుడిని; అరసి= విచారించి; తద్+వృత్తాంతంబు+అంతయున్= ఆతడి సమాచార మంతయూ; ఎఱింగించి= కుబేరుడికి తెలిపి; దేవా; సిగ్గుపెంపునన్= లజ్జాతిశయంవలన; రానేరక+ఉన్నవాఁడు= మీ సముఖమునకు రాజాలకున్నాడు; అని; విన్నవించినన్= మనవి చేయగా.

తాత్పర్యం: అని పలికి కుబేరుడు తన ముఖంలో క్రోధ మావరింపగా అక్కడ నిల్చిఉండగా, కిన్నరులు భవనంలోనికి వెళ్ళి స్థూలకర్ణుడి వృత్తాంతం తెలిసికొన్నారు. వారు అతడి సంగతినంతా కుబేరుడికి నివేదించి, ప్రభూ! 'స్థూలకర్ణుడు లజ్జాభరంతో మీ దగ్గరకు రాలేకున్నా' డని మనవి చేయగా.

ఆ. 'అయిన నేమి పిలువుఁ' డని పిలిపించిన । వచ్చి మ్రొక్కుటయును వనితయైన
యతనిఁ జూచి 'యింక నవుదాని కిట్టుల । యుండుఁగాక'! యని విభుండు పలికె. 394

ప్రతిపదార్థం: అయినన్+ఏమి= ఆడుది అయిన అవుగాక; పిలువుఁడు= వాడి నిక్కడికి పిలుచుక రండి; అని పిలిపించినన్= అని కుబేరుడు పిలిపించగా; వచ్చి= స్థూలకర్ణ డేతెంచి; మ్రొక్కుటయును= నమస్కరించగా; వనిత+ఐన= ఆడుదిగా మారిన; అతనిన్+చూచి= స్థూలకర్ణుడిని కనుగొని; ఇంకన్= మున్ముందు; అవుదానికిన్= జరుగనున్న కార్యానికి; ఇట్టుల+ఉండున్+కాక!= ఇతడిట్లే ఆడుదిగా నుండుగాక!; అని= అంటూ; విభుండు= కుబేరుడు; పలికెన్= వచించాడు.

తాత్పర్యం: 'ఆడుది అయిన మాత్రాన నేమి? వాడిని పిలవండి' అని కుబేరుడు పిలిపించగా, స్థూలకర్ణుడు వచ్చి నమస్కరించాడు. ఆడుదిగా మారిన అతడిని చూచి యక్షరాజు 'జరుగబోయే పనికి అనుకూలంగా ఇత డిట్లే వనితగా ఉండుగాక!' అని పలికాడు.

స్థూలకర్ణునకుఁ గుబేరుని వలన స్త్రీత్వము గలుగుట (సం. 5-193-39)

వ. స్థూలకర్ణుండును దలరి దండప్రణామంబులు సేసియుండె; నప్పుడు గొలిచియున్న దొరలు ధనదునకుం గృప వుట్ట నల్లన తెలిపిన నట్లేని 'వీడు శిఖండి యాయువు గలంతకాలంబున గాంతాకృతియై యుండి, పదంపడి నిజరూపంబు దాల్చుంగాక!' యని యనుగ్రహించి యరిగిన. 395

ప్రతిపదార్థం: స్థూలకర్ణుండును; తలరి= దుఃఖపడి; దండప్రణామంబులు చేసి= సాగిలపడి నమస్కరించి; ఉండెన్= మౌనంగా ఉండిపోయాడు; అప్పుడు; కొలిచియున్న దొరలు= కుబేరుడిని సేవిస్తున్న నాయకులు; ధనదునకున్= కిన్నరేశ్వరునకు; కృప+ పుట్టన్= కరుణ కలిగేటట్లు; అల్లన= మెల్లగా; తెలిపినన్= చెప్పగా; అట్లు+ఏనిన్= అట్లయితే; వీఁడు= ఇతడు; శిఖండి+ఆయువు+ కల+అంతకాలంబును= శిఖండికి ఆయుష్యమున్నంత వరకూ; కాంతా+ఆకృతి+ఐ= స్త్రీ రూపం కలవాడై; ఉండి; పదంపడి= ఆ తరువాత; నిజరూపంబున్= తాల్చున్+కాక= తన సహజస్వరూపాన్ని ధరించగలడు; అని; అనుగ్రహించి= శాపావసానమును ప్రసాదించి; అరిగినన్= అలకాపురికి వెళ్ళగా.

తాత్పర్యం: స్థూలకర్ణుడు దుఃఖపడి కుబేరుడికి సాగిలబడి నమస్కరించి మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు కిన్నరేశ్వరుని కొలిచియున్న నాయకులు అతడికి కరుణ కలిగేటట్లు నెమ్మదిగా మంచి మాటలు చెప్పారు. అట్లయితే వీడు ఆ శిఖండి బ్రతికిఉన్నంతకాలం పడతిగానే ఉండి, ఆ పిదప నిజస్వరూపం గైకొనగలడు' అని శాపవిముక్తి ప్రసాదించి తన అలకాపురికి వెళ్ళిపోయాడు.

తే. గుహ్యకుండు విషాదంబు గూరియుండ । నచ్చటికిఁ గొన్ని దినముల కరుగుదెంచెఁ
దల్లిదండ్రుల కెఱిఁగించి తగవు మెఱయ । సమయనిష్ఠ వాటించి పాంచాలసుతుఁడు. 396

ప్రతిపదార్థం: గుహ్యకుండు= కుబేరుని అనుచరుడు; విషాదంబు+కూరి+ఉండన్= దుఃఖభరితుడై ఉండగా; అచ్చటికిన్= ఆతడి నివాసానికి; కొన్ని దినములకున్= కొన్నాళ్ళకు; పాంచాల సుతుఁడు= ద్రుపదుడి పుత్త్రుడైన శిఖండి; తల్లిదండ్రులకున్= జననీ జనకులకు; ఎఱిఁగించి= తెలిపి; తగవు మెఱయన్= న్యాయం వెలయగా; సమయనిష్ఠ+పాటించి= ప్రతిజ్ఞ యొక్క నియమాన్ని ఆదరించి; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: స్థూలకర్ణుడు కుబేరుడిశాపంతో చింతాక్రాంతుడై ఉన్నాడు. శిఖండి తన తల్లిదండ్రులకు చెప్పి న్యాయం తప్పక, ఏర్పరచుకొన్న నియమం ప్రకారం పదిరోజులు ముగియగానే అతడి మగతనం అతడికి తిరిగి ఇచ్చి వేయటం కోసం స్థూలకర్ణుడి గృహానికి వచ్చాడు.

క. వచ్చినఁ గనుఁగొని 'నీ దెసఁ । బొచ్చెము లే; దిట్ల మగిడి పొ:మ్మిది విధి నీ
కిచ్చిన రూ'పని గుహ్యకుఁ । డచ్చుపడం బలికి యెల్ల నతనికిఁ జెప్పెన్. 397

ప్రతిపదార్థం: వచ్చినన్= శిఖండిరాగా; కనుఁగొని= చూచి; నీ దెసన్= నీ యెడ; పొచ్చెము లేదు= దోషం లేదు; ఇట్లు+అ= వచ్చినవాడవు వచ్చినట్లుగానే; మగిడి పొమ్ము= తిరిగి వెళ్లుము; ఇది; విధి= దైవం; నీకున్= నీకు; ఇచ్చిన రూపు= అనుగ్రహించిన రూపం; అని= అనుచు; గుహ్యకుఁడు= యక్షుడు; అచ్చుపడన్+పలికి= విస్పష్టంగా వచించి; ఎల్లన్= జరిగినదంతయూ; అతనికిన్= శిఖండికి; చెప్పెన్= తెలిపాడు.

తాత్పర్యం: సమయ నిష్ఠ పాటించి తన దగ్గరకు వచ్చిన శిఖండిని చూచి గుహ్యకుడు 'నీయెడ ఏ దోషం లేదు. వచ్చినవాడివి వచ్చినట్లుగానే ఇంటికి మరలిపొమ్ము. ఇది దైవం నీ కనుగ్రహించిన రూపం' అంటూ జరిగిన విషయం తేటతెల్లంగ అతడికి తెలిపాడు.

వ. చెప్పి వీడుకొలిపిన శిఖండి యత్యంత ప్రమోదంబునం దండ్రి కడకు వచ్చి యత్తెఱం గెఱింగించిన నాతండు ప్రీతుండయి దేవగురుద్విజపూజనంబు లాచరించి ద్రోణాచార్యుపాల సవిశేషంబుగా శిష్యభావంబు ప్రతిష్ఠించె'. 398

ప్రతిపదార్థం: చెప్పి= స్థూలకర్ణు డట్లా పలికి; వీడుకొలిపినన్= సాగనంపగా; శిఖండి; అత్యంత ప్రమోదంబునన్= మిక్కిలి హర్షంతో; తండ్రి కడకున్; వచ్చి; ఆ+తెఱంగు= అక్కడ జరిగిన సంగతి; ఎఱింగించినన్; ఆతండు= ద్రుపదుడు; ప్రీతుండు+ అయి= సంతోషించినవాడై; దేవగురు ద్విజ పూజనంబులు= దేవతలకు, గురువులకు, విప్రులకు పూజలు; ఆచరించి= చేసి; ద్రోణాచార్యుపాలన్= ద్రోణుడి దగ్గర; సవిశేషంబుగన్= అసాధారణంగా; శిష్యభావంబున్= శిష్యత్వమును; ప్రతిష్ఠించెన్= స్థిరంగా నెలకొల్పాడు.

తాత్పర్యం: స్థూలకర్ణు డట్లా తెలిపి సెలవొసంగగా, శిఖండి మిక్కిలి సంతోషంతో తన తండ్రి దగ్గరకు వచ్చి జరిగిన విషయమంతా తెల్పాడు. ద్రుపదుడు హర్షించి, దేవతలను గురువులను బ్రాహ్మణులను పూజించి, తన పుత్రుడైన శిఖండిని ద్రోణాచార్యులవారికి అసాధారణ శిష్యుణ్ణి కావించాడు.'

క. అని చెప్పి నారదుఁడు దా । నును సత్యవతీ సుతుండునుం దమ యిచ్చం
జనిరి; శిఖండి చరిత్రము । జనకర్ణ పరంపరం బ్రశస్తం బయ్యెన్. 399

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లు తెలిపి; నారదుఁడున్= నారద మహర్షి; తానును= తానూ; సత్యవతీ సుతుండునున్= సత్యవతీ దేవి కుమారుడైన వ్యాసుడూ; తమ+ఇచ్చన్+చనిరి= తమ దారిని తాము వెళ్ళారు; శిఖండి చరిత్రము= శిఖండి కథ; జనకర్ణపరంపరన్= లోకులు ఒకరికొకరు చెప్పుకొంటూఉండగా; ప్రశస్తంబు+అయ్యెన్= వెల్లడైనది.

తాత్పర్యం: భీష్ముడికి నారదు డిట్లా చెప్పి, తానూ వ్యాసుడూ తమ దారిని తాము వెళ్ళారు. లోకులు ఒకరికొకరు చెప్పుకొనగా శిఖండి వృత్తాంతం వెల్లడి అయింది.

వ. ఇవ్విధంబునఁ గాశీపతికన్యక సిద్ధమూర్తి యయి నెగడె; నేను నంగనల నంగనాపూర్వుల నంగనాభిధానుల నంగనాకారులను వధియింపకుండ వ్రతంబు పూనినవాఁడం గావున నంగనాపూర్వుండగు శిఖండి నాకు భండనంబునం గోదండపాండిత్యంబు మెఱసినను జంపను నొంపనుఁ; గడంగితిన యేని నింతకంటె దుర్యశంబు గలదె? యెట్లయిన నగుదుంగాని భగ్నవ్రతుండ నగుట కోర్వ నిది నా తెఱంగు.' 400

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కాశీపతి కన్యక= కాశీరాజపుత్రి అంబ; సిద్ధమూర్తి+అయి+నెగడన్= తపస్సిద్ధి కలిగినదై విరాజిల్లింది; నేనున్; అంగనలన్= స్త్రీలను; అంగనాపూర్వులన్= తొలుత ఆడువారిగా ఉన్నవారిని; అంగనా+అభిధానులన్= ఆడుపేరులు కలవారిని; అంగనా+ఆకారులను= ఆడువారి ఆకారమువంటి ఆకారం కలవారిని; వధియింపకుండన్= చంపకుండేటట్లు; వ్రతంబు పూనినవాఁడన్= నియమం వహించాను; కావునన్= కాబట్టి; అంగనాపూర్వుండు+అగు= ముందు ఆడుదిగాఉన్న; శిఖండి; నాకున్; భండనంబునన్= యుద్ధమునందు; కోదండ పాండిత్యంబు= ధనుర్విద్యాకౌశలం; మెఱసినను= ప్రకటించినను; చంపను= సంహరించటానికీ; నొంపను= బాధించుటకును; కడంగితిన+ఏనిన్= పూనుకొంటినేని; ఇంతకంటెన్; దుర్యశంబు+కలదె?= అపకీర్తి ఉన్నదా?; ఎట్లు+అయినన్+అగుదున్+కాని= నేనేమైపోతే పోతానుకాని; భగ్న వ్రతుండన్= నియమం చెరచుకొన్నవాడను; అగుటకున్+ఓర్వన్= కావటానికి సహించలేను; ఇది నా తెఱంగు= నా పద్ధతి యిది.

తాత్పర్యం: ఈ విధంగా కాశీరాజకుమారి అంబ తపశ్శక్తిచేత నన్ను సాధించేదిగా వెలసింది. నేను ఆడువారిని, మొదట ఆడువారిగా ఉండినవారిని, ఆడువారి పేరులు పెట్టుకొన్నవారిని, ఆడువారివంటి ఆకారం కలిగిన వారిని చంపనని నియమం వహించి ఉన్నాను. శిఖండి మొదట ఆడుదిగా ఉండి పురుషుడైనాడు గనుక అతడు యుద్ధంలో నామీద తన కోదండ పాండిత్యం ఎంత ప్రకటించినా అతడిని నేను వధించను, బాధించను. అట్లా చేస్తే అంతకన్న నాకు అపకీర్తి వేరే ఉండదు. నేనేమైపోతే పోతానుగాని వ్రతభంగం మాత్రం చేసుకోలేను. ఇది నా నిశ్చయం.'

క. అని చెప్పిన దేవవ్రతు । వినుత వచనములు విభుండు విని తన చిత్తం
బున నొక్కింత వగచి' యీ । తనికి మగతనంబు పూన్కి తగు'నని పలికెన్. 401

ప్రతిపదార్థం: అని చెప్పిన= అని పల్కిన; దేవవ్రతు వినుత వచనములు= భీష్ముడి యొక్క కొనియాడబడిన మాటలు; విభుండు= దుర్యోధనుడు; విని= ఆలించి; తన చిత్తంబునన్= తన మనస్సులో; ఒక్క+ఇంత వగచి= ఇంచుక చింతించి; ఈతనికిన్= ఈ భీష్ముడి కొక్కడికే; మగతనంబు పూన్కి= పౌరుషం చెల్లించుకొనటం; తగున్+అని+పలికెన్= తగియున్నదని పలికాడు.

తాత్పర్యం: అని చెప్పిన భీష్ముడి మెచ్చదగిన పలుకులు దుర్యోధను డాలకించాడు. తన మనసులో ఇంచుక దుఃఖించి, 'మగటిమి నిలుపుకొనటం ఈ మహనీయుడి కొక్కడికే చెల్లిన'దని పలికాడు.

వ. తదనంతరంబ కొలువునం గలయ సమర విషయంబు లయిన సల్లాపంబులు సెలుచుండఁ గొండొకసేపు వినుచుండి సుయోధనుండు సురనదీసూనున కిట్లనియె: 402

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; కొలువునన్= సభలో; కలయన్= అంతట; సమర విషయంబులు+ అయిన= యుద్ధానికి సంబంధించిన; సల్లాపంబులు= పరస్పర సంభాషణలు; చెల్లుచున్+ఉండన్= సాగుతుండగా; కొండొకసేపు= ఒకించుక తడవు; వినుచున్+ఉండి= ఆలిస్తూ ఉన్నవాడై; సుయోధనుండు; సురనదీసూనునకున్= మందాకినీ కుమారుడైన భీష్మడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అటు పిమ్మట సభలో యుద్ధానికి సంబంధించిన విషయాలను గూర్చి వీరులు పరస్పరం సంభాషించుకొనుచుండగా దుర్యోధనుడు కొంచెంసేపు ఆలకించి గాంగేయుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'పాండవులకుఁ గలుగు బలము లన్నియు సమ। యింప నీకు దినము లెన్నివట్టు
గురుఁడుఁ గృపుఁడు గురుని కొడుకుఁ గర్ణుండు నెం। తెంత మానమున వధింతు రనఘ?' 403

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యుడా!; పాండవులకున్= పాండునందనులకు; కలుగు బలములు= ఉన్న సేనలు; అన్నియున్= అన్నింటినీ; సమయింపన్= చంపటానికి; నీకున్= నీకు; ఎన్ని దినములు+పట్టున్?= ఎన్ని రోజులు సరిపోతాయి?; గురుఁడున్= ద్రోణుడు; కృపుఁడున్= కృపాచార్యుడు; గురుని కొడుకున్= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; కర్ణుండున్= రాధేయుడు; ఎంత+ఎంత మానమునన్= ఎంతెంత కాలంలో; వధింతురు?= చంపగలరు?

తాత్పర్యం: 'పితామహా! పాండవుల కున్న సేనలన్నింటినీ చంపటానికి నీ కెన్ని రోజులవుతాయి? ద్రోణాచార్యులు, కృపాచార్యులు, అశ్వత్థామ, కర్ణుడు ఎంతెంత కాలంలో కౌంతేయుల సేనలను సంహరించగలరో చెప్పుము.'

వ. అనిన విని గాంగేయుం డతని కిట్లనియె : 404

తాత్పర్యం: అట్లా దుర్యోధనుడు అడుగగా విని భీష్ము డిట్లా అన్నాడు:

క. 'అనిఁ బాండవ సేనలఁ జం। పను జెఱుపను నేము చాలు భంగుల నీ కి
ట్లనుమానము వాయఁగ నడు। గన తగుఁ; గడు లెస్స! విందు గాక నరేంద్రా! 405

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; పాండవ సేనలన్= పాండవుల సైన్యాలను; చంపను= చంపటానికి; చెఱుపను= భగ్నం చేయటానికి; ఏము= మేము; చాలు భంగులన్= శక్తి గలిగినతీరులను; నీకున్= నీకు; అనుమానము+పాయఁగన్= ఏర్పడిన సందేహం తొలగటానికై; ఇట్లు+అడుగన+తగున్= ఇట్లా అడగటం ఉచితమే; కడున్ లెస్స= అది మిక్కిలి మంచిది; నర+ ఇంద్రా!= ఓ రాజా!; విందు(వు)కాక= ఆలకించుము.

తాత్పర్యం: 'పాండవ సేనలను యుద్ధ భూమిలో వధించటానికి, చెరచటానికి మాకు గల శక్తియుక్తు లెట్టివో సందేహం తొలగించుకొనటానికై నీ వడగటం సముచితమే. రాజా! నే చెప్పేది బాగా విను.

వ. ఏను నా సాలెడు కొలంది సెప్పెదఁ; దక్కటివారుఁ దమ తమ చాలుటలు దార చెప్పెద; రది యెల్లను బిదప విందుగాని; మున్ను నీ కొక్క బాస యిచ్చెద నాకర్ణింపుము. 406

ప్రతిపదార్థం: ఏను= నేను; నా చాలెడు కొలంది+చెప్పెదన్= నా సామర్థ్యం యొక్క ప్రమాణమెంతో చెప్పుతాను; తక్కటివారున్= మిగిలిన ద్రోణాదులు; తమ తమ చాలుటలు= తమ తమ సామర్థ్యాలు; తారు+అ= తామే; చెప్పెదరు; అది+ఎల్లను; పిదపన్; విందు(వు)కాని; మున్ను= ముందుగా; నీకున్; ఒక్క బాస+ఇచ్చెదన్= ఒక్క ప్రతిజ్ఞ చేస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: నేను నా సామర్థ్యపు ప్రమాణమెంతో చెప్పుతాను. మిగిలినవారు తమ తమ సమర్థతలను గురించి వారే చెప్పుకొంటారు. అన్నీ నీవు విందువుగాని, ముందుగా నా ప్రతిజ్ఞ వినిపిస్తాను. వినుము.

క. మీఁటుగల రాజరథికుల। నాఁటికి వేవుర వధింతు; నరుశరములు నో
నాఁటి పడవైచునంతకు। వేఁటాడెదఁ బ్రతిబలంబు వీరుల నెల్లన్. 407

ప్రతిపదార్థం: మీఁటు+కల= పెంపు వహించిన; రాజరథికులన్= రథికులైన రాజులను; నాఁటికిన్= దినానికి; వేవురన్= వెయ్యిమందిని; వధింతున్= చంపగలను; నరుశరములు= అర్జునుడి బాణాలు; నోనాఁటి= నొచ్చునట్లు నా శరీరంలో గ్రుచ్చుకొని; పడన్+వైచునంతకున్= నన్ను నేలగూల్చేదాక; ప్రతిబలంబు వీరులన్+ఎల్లన్= శత్రు సైన్యంలోని శూరు లందరినీ; వేఁటాడెదన్= వధిస్తాను.

తాత్పర్యం: నేను పెంపుగల రథికులను రోజుకు వెయ్యిమందిని చంపుతాను. అర్జునుడి శరాలు నొచ్చేటట్లు నా అవయవములందు నాటుకొని నన్ను నేలమీద పడవేసేవరకు శాత్రవసేనలోని శూరులను వధిస్తాను.

వ. అట్లుగాక నా కయ్యంబు సేయు దివసంబులోన. 408

ప్రతిపదార్థం: అట్లుగాక= అంతేకాక; నా కయ్యంబు+చేయు= నేను యుద్ధం చేసే; దివసంబులోనన్= దినంలో.

తాత్పర్యం: సుయోధనా! ఆ విధంగా నేను యుద్ధం చేసే రోజులలో.

క. పదివేలఁ జంపఁగా నో । పుదు నే నను నెత్తికోలు పుట్టిన యది నీ
పదునొకఁ డక్షౌహిణులను । జదురున నడపింతు నెదిరి సైన్యము గలఁతున్.' 409

ప్రతిపదార్థం: పదివేలన్= పదివేల మందిని; నేను= నేను; చంపఁగాన్+ఓపుదున్= సంహరింపజాలుదును; అను= అనునట్టి; ఎత్తికోలు= సంకల్పం; పుట్టిన అది= కలుగుతున్నది; నీ పదునొకఁడు+అక్షౌహిణులను= నీ కున్న పదకొండక్షౌహిణుల సేనను; చదురునన్+నడపింతున్= నేర్పుతో యుద్ధం చేసేటట్లు చేస్తాను; ఎదిరి సైన్యము= శత్రుసేనను; కలఁతున్= చీకాకు పరుస్తాను.

తాత్పర్యం: దినమునకు వెయ్యిమందినిగాదు, పదివేల మందిని చంపగలుగుదుననే సంకల్పం కలుగుతున్నది. నీ పదకొండక్షౌహిణుల సైన్యాన్ని చాతుర్యంతో నడిపించగలను. శాత్రవ సేనలను సంక్షోభింపచేయగలను.'

వ. అని పలికి వెండియు. 410

తాత్పర్యం: అని సుయోధనునిడితో పలికి మరల భీష్ము డిట్లా అన్నాడు.

క. 'నీ వడిగిన పని యేర్పడఁ । గా విను "మేనొక్క నెలఁ' దెగంజేయుదు నా
నావిధ దివ్యాస్త్రంబుల । లావున నప్పాండవుల బలంబుల నెల్లన్.' 411

ప్రతిపదార్థం: నీవు= నీవు; అడిగినపని= నన్నడిగిన కార్యాన్ని; ఏర్పడఁగాన్ వినుము= స్పష్టంగా తెలిసికొనుము; నానా విధ= పలు రకాలైన; దివ్య+అస్త్రంబుల లావునన్= దివ్యశరాల శక్తిచేత; ఆ+పాండవుల బలంబులన్+ఎల్లన్= ఆ పాండు నందనుల సేనల నన్నింటినీ; ఏను= నేను; ఒక్కనెలన్= ఒక నెలరోజులలో; తెగన్+చేయుదున్= నరికి వేయగలను.'

తాత్పర్యం: 'నీవు నన్నడిగిన పనిని గూర్చి స్పష్టంగా వినుము. పలు రకాలైన దివ్యాస్త్రాల శక్తిచేత ఆ పాండు కుమారుల బలగాల నన్నింటినీ ఒక నెలరోజులలో ఖండించి వేయగలను.'

వ. అనవుడు గురుకృపాశ్వత్థామ కర్ణులం గలయం గనుంగొని గాంధారీనందనుండు 'మీమీ చందంబులెట్లు? నిన నాచార్యుండు మందస్మితాననుం డగుచు నిట్లనియె. 412

ప్రతిపదార్థం: అనవుడున్= అని భీష్ముడు పలుకగా; గురుకృప+అశ్వత్థామ కర్ణులన్; కలయన్+కనుంగొని= తేరిపారచూచి; గాంధారీ నందనుండు= గాంధారి కొడుకు సుయోధనుడు; మీమీ చందంబులు+ఎట్లు= మీమీ శక్తి సామర్థ్యాలు ఎట్టివి; అనినన్= అని ప్రశ్నించగా; ఆచార్యుండు= ద్రోణుడు; మందస్మిత+ఆననుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడౌతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడు పలికిన తరువాత సుయోధనుడు ద్రోణ కృపాశ్వత్థామ కర్ణులను కలయ జూచి, మీమీ సామర్థ్యా లెటువంటివో తెలపం'డని ప్రశ్నించగా, మొగాన చిరునవ్వు మోసులెత్తగా ద్రోణాచార్యు డిట్లా అన్నాడు:

తే. 'ఏను ముదిసిన వాఁడ మహీశ! యెట్టు । లయిన నోపిన భంగి నీ యనుఁగుఁ దాత
సాలి నన్నిదినంబులఁ జాలవచ్చు । నబ్బలంబుల నని సమయంగఁ జేయ.' 413

ప్రతిపదార్థం: మహీ+ఈశ!= భూపతీ!; ఏను= నేను; ముదిసిన వాఁడన్= ముసలి వాడిని, ఎట్టులు+అయినన్= ఎట్లాగయినా; ఓపిన భంగిన్= శక్తి ఉన్నంతమేరకు; ఆ+బలంబులన్= ఆ పాండవుల సేనలను; అనిన్= యుద్ధంలో; సమయంగన్+చేయన్= సంహరించుటకు; నీ+అనుఁగున్+తాత= నీ యందు ప్రేమగల్గిన పితామహుడు; చాలిన+అన్ని దినంబులన్= చంపగలనన్న నెలరోజులలో; చాలన్+వచ్చున్= నేను చంపవచ్చును.

తాత్పర్యం: 'రాజా! నేను ముసలి వాడిని. ఎట్లాగయినా శక్తి ఉన్నంతమేరకు పోరాడుతాను. నీయెడ ప్రేముడిగల నీ తాతకు పట్టినట్లు నాకూ పాండవ సేనలను నిర్మూలించటానికి నెల రోజులు పట్టవచ్చు.'

క. అనినఁ గృపాచార్యుం 'డీ । యినుమడి దివసములఁ దీర్ప నేనోపుదు' నా
విని గురుతనూభవుఁడు 'పది । దినములఁ గడతేర్తు' ననియె ధీరవిచారా! 414

ప్రతిపదార్థం: ధీరవిచారా!= ధైర్యంతో కూడిన ఆలోచనగల జనమేజయ మహారాజా!; అనినన్= అని ద్రోణుడు పలుకగా; కృప+ఆచార్యుండు= కృపాచార్యులవారు; ఈ+ఇనుమడి దివసములన్= భీష్మ ద్రోణులు తెల్పిన దినాలకు రెట్టింపు దినాలలో; ఏన్= నేను; తీర్పన్+ఓపుదున్= శాత్రవ సేనలను కడతేర్చగలను; నాన్= అని చెప్పగా; విని= ఆలించి; గురు తనూభవుఁడు= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; పది దినములన్= పది రోజులలో; కడతేర్తున్+అనియెన్= సమయించగలనని పలికాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆకర్ణింపు మని వైశంపాయన మహర్షి పలుకుతున్నాడు: 'ద్రోణుడు నెలరోజులలో పాండవసైన్యాన్ని పరిమార్చగల' నని పలికిన తరువాత కృపాచార్యులు అంతకు రెట్టింపు దినాలలో సమయిస్తా నన్నాడు. కృపుడు చెప్పిన తర్వాత అశ్వత్థామ తాను పది రోజులలో పాండవ సైన్యాన్ని హతమార్చగలనన్నాడు.

వ. అందఱ పలుకు లాకర్ణించి కర్ణుండు. 415

ప్రతిపదార్థం: కర్ణుండు; అందఱ పలుకులు; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: అందరి మాటలు విన్న తరువాత కర్ణుడు. (ఇట్లా అన్నాడు:).

క. 'నానాస్త్ర శస్త్ర చయ బల । బానలముం గవియఁ జేసి యత్యుగ్రత నే
నేనాళ్లన యప్పాండవ । సేనా సాగరము నివురఁ జేయుదు నధిపా!" 416

ప్రతిపదార్థం: అధిపా!= దుర్యోధన మహారాజా!; నానా+అస్త్ర శస్త్ర చయ= పలు రకాలైన అస్త్రముల యొక్క, ఆయుధాల యొక్క సముదాయమనెడు; బడబా+అనలమున్= బడబాగ్నిని; కవియన్+చేసి= క్రమ్ముకొనేటట్లు చేసి; అతి+ఉగ్రతన్= మిక్కిలి భయంకరత్వంతో; నేను; ఏనాళ్ళన్+అ= ఐదు దినాలలోనే; ఆ+పాండవ సేనా సాగరమున్= పాండవుల సేనఅనే సముద్రాన్ని; ఇవురన్+చేయుదున్= ఇంకిపోయేటట్లు చేస్తాను.

తాత్పర్యం: పలు రకాలైన దివ్యాస్త్రాలు, ఆయుధాలు అనే బడబాగ్నిని క్రమ్ముకొనజేసి అతి భయంకరంగా నేను ఐదు రోజులలో పాండవుల సేన లనెడు సాగరాన్ని ఇంకిపోయేటట్లు చేస్తాను.'

విశేషం: అలం: రూపకం.

వ. అని ప్రతిన సేసినఁ గలకల నవ్వి గాంగేయుండు. 417

ప్రతిపదార్థం: అని; ప్రతిన చేసినన్= ప్రతిజ్ఞ చేయగా; కలకల నవ్వి= పకపక నవ్వి; గాంగేయుండు= భీష్ముడు.

తాత్పర్యం: అని కర్ణుడు ప్రతిజ్ఞ చేయగా పకపక నవ్వుతూ భీష్ముడు.

చ. 'పలికిన నేమి యన్నియును బల్క నగున్ మనరాజు నొద్ద మా
ర్పలికెడు వారు లేరు విను పాండవమధ్యము గాండివంబు దీ
ప్తుల మిఱుమిట్లుఁ గొన్న కనుదోయి గుణధ్వని వ్రయ్యలైన వీ
నులు నయినన్ బలే పలుకు నూల్కొనకుండుదు సూతనందనా! 418

ప్రతిపదార్థం: సూతనందనా!= సూతపుత్రా! కర్ణా!; మనరాజు+ఒద్దన్= మన ప్రభువు దగ్గర; పలికినన్+ఏమి?= చెప్పగానే సరిపోయిందా?; అన్నియును పల్కన్+అగున్= ఎన్ని మాటలైనా నుడువ వచ్చును; మార్పలికెడువారు లేరు= బదులు చెప్పేవారెవ్వరూ లేరు; విను= నా మాట లాలకించుము; పాండవ మధ్యము= పాండవులలో నడిమివాడైన విజయుడి యొక్క; గాండివంబు దీప్తులన్= గాండీవ చాపము యొక్క కాంతులచేత; మిఱుమిట్లు కొన్న= చీకిలించుక పోయిన; కనుదోయి= కన్నుల జంట; గుణధ్వనిన్= అల్లెత్రాటి మ్రోతచేత; వ్రయ్యలు+ఐన= బ్రద్దలైన; వీనులున్+అయినన్= చెవులు కలవాడ వైనప్పుడు; బలే= అవురా; పలుకు నూల్కొనక+ఉండుదు= మాట్లాడటానికి ప్రయత్నం చెయ్యవు. (అంతవరకూ ఇట్లాగే వాగుతుంటావు అని భావం.)

తాత్పర్యం: 'సూతపుత్రా! చెప్పగానే సరిపోయిందా? ఎన్ని మాటలైనా పలుకవచ్చు. మన రాజు దగ్గర బదులు పలికేవారు లేరు గదా! ఈ మాట వినుము. అర్జునుడి గాండీవ కాంతులతో కనులు చీకిలించుకపోయినప్పుడు, అల్లెత్రాటి మ్రోతచేత చెవులు బ్రద్దలైనప్పుడు గాని, నీవు ఇట్లా మాటాడటం మానుకోవు. అందాకా ఇట్లానే వాగుతుంటావు.

వ. అనియె; నివ్విధంబున నీ కొడుకు కడం బుట్టిన విశేషంబులు ధర్మతనయుండు చారులవలన విని తమ్ముల రాఁబనిచి వారలతో నిట్లనియె. 419

ప్రతిపదార్థం: అనియెన్= అని భీష్ము డన్నాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; నీ కొడుకు కడన్= నీ కుమారుడి దగ్గర; పుట్టిన విశేషంబులు= కలిగిన వింతలు; ధర్మతనయుండు; చారుల వలనన్= వేగులవారివలన; విని; తమ్ములన్= రాన్+పనిచి= రప్పించుకొని; వారలతోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ము డిట్లా కర్ణుడిని వారించాడు. నీ కొడుకు దగ్గర ఇట్లా జరిగిన విశేషాలన్నీ వేగుల వలన విని ధర్మజుడు తన తమ్ములను చెంతకు పిలిపించుకొని వారితో ఇట్లా అన్నాడు:

సీ. 'మన చారు లిప్పుడు చనుదెంచి రావీట । నుండి; దుర్బుద్ధి సుయోధనుండు
గొలువున గాంగేయ కుంభసంభవ కృపా । శ్వత్థామ కర్ణుల వలను చూచి
యనిఁ బాండవుల బల మంతయు సమయింపఁ । జాలుదు రెంతేసి కాలమాన
మున? నన్న భీష్ముండు దన కొక్క నెలవట్టు । ననియాడె; ద్రోణుండు నట్ల పలికెఁ;

ఆ. గృపుఁడు రెట్టి సెప్పెఁ; గృపి కొడు కోపుదుఁ । బది దినముల ననియె బాహువీర్య
ఘనుఁడు గాన సూతతనయుఁ డేనాళ్లన । తీర్ప నేర్తు నని ప్రతిజ్ఞ చేసె.' 420

ప్రతిపదార్థం: మన చారులు= మన వేగులవారు; ఆ వీటన్+ఉండి= కౌరవుల స్కంధావారం నుండి; ఇప్పుడు చనుదెంచిరి= ఇప్పుడే వచ్చారు; దుర్బుద్ధి సుయోధనుండు= చెడు బుద్ధిగల దుర్యోధనుడు; కొలువునన్= సభలో; గాంగేయ; కుంభ సంభవ కృప+అశ్వత్థామ కర్ణుల వలను= గంగాపుత్రుడైన భీష్ముడు, కలశం నుండి జనించిన ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు అనేవారలవైపు; చూచి= కనుంగొని; అనిన్= రణంలో; పాండవుల బలము+అంతయున్= పాండవుల సైన్యం అంతటినీ; ఎంతేసి కాలమానమునన్= ఎంతెంత కాలంలో; సమయింపన్+చాలుదురు?= చంపే శక్తి కల్గి ఉన్నారు? అన్నన్= అని ప్రశ్నించగా; భీష్ముండు= గాంగేయుడు; తనకున్+ఒక్క నెల పట్టును! అని+ఆడెన్= తన కొక మాసం పట్టుతుందని పలికాడు; ద్రోణుండున్= ద్రోణాచార్యుడు; అట్ల పలికెన్= భీష్ముడు చెప్పినట్లే నెలపడుతుందని చెప్పాడు; కృపుఁడు= కృపాచార్యుడు; రెట్టి చెప్పెన్= (రెట్టింపు కాలం)రెండు మాసములౌతుందని అన్నాడు; కృపి కొడుకు= అశ్వత్థామ; పది దినములకున్= పది రోజులకు; ఓపుదున్= చాలుదును; అనియెన్= అన్నాడు; బాహువీర్య ఘనుఁడు కానన్= భుజవిక్రమంచేత దొడ్డవాడు గనుక; సూతతనయుఁడు= కర్ణుడు; ఏనాళ్లన= ఐదు రోజులలోనే; తీర్పన్+నేర్తున్= నిర్మూలించజాలుదును; అని+ అనుచు; ప్రతిజ్ఞ చేసెన్= ప్రతిన చేశాడు.

తాత్పర్యం: 'మన వేగులవారు ఇపుడే దుర్యోధనుడి స్కంధావారం నుండి వచ్చారు. దుష్టచిత్తుడైన దుర్యోధనుడు కొలువులో భీష్ముడిని, ద్రోణుడిని, కృపుడిని, అశ్వత్థామను, కర్ణుడిని చూచి 'మీ రెంతెంత కాలంలో పాండవ సేననంతటినీ ప్రత్యేకంగా నిర్మూలించగల?'రని ప్రశ్నించాడట. అందుకు సమాధానంగా భీష్ముడు తన కొక నెల పడుతుందన్నాడు. ద్రోణాచార్యుడు అట్లే ఒక మాస మన్నాడు. కృపాచార్యుడు రెండునెల లన్నాడు. అశ్వత్థామ పదిరోజులన్నాడు. భుజవిక్రమాఢ్యుడైన కర్ణుడు మాత్రం ఐదు రోజులలో మన బలాలనన్నింటినీ సంహరించగలనని ప్రతిజ్ఞ చేశాడట.'

వ. అని చెప్పి యర్జునుం గనుంగొని 'వారు తమ తమ యోపిన చందంబులు సెప్పిరి; నీచేతం గౌరవ బలంబు లెంత దడవునకుం దెగు? నాకుం జెప్పు' మనిన నతం డిట్లనియె. 421

ప్రతిపదార్థం: అని చెప్పి; అర్జునున్; కనుంగొని; వారు; తమ తమ; ఓపిన చందంబులు= చాలినరీతులు; చెప్పిరి; నీ చేతన్= నీ వలన; కౌరవ బలంబులు= కురుసేనలు; ఎంత తడవునకున్= ఎంత కాలంలో; తెగున్= నశించునో; నాకున్; చెప్పుము; అనినన్= అని ధర్మజు డనగా; అతండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధర్మజుడు పలికి పార్థుడిని కనుంగొని, 'వారు తమ తమ శక్తులు ఏపాటివో చెప్పారు. నీచేత కురుసైన్యం ఎన్నాళ్ళలో హతం కాగలదో నాకు తెల్పు'మని అడుగగా అర్జును డిట్లా అన్నాడు:

తే. 'వార లంతకుఁ జాలని వారె? నీ బ । లముల సమయింపఁ జాలెడు లావు వెరవుఁ
గలర కాక! యా రాజుతోఁ బలికి బాస । దప్పవచ్చునె వారికి ధరణినాథ!' 422

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; వారలు= భీష్మాదులు; అంతకున్+చాలనివారె?= చెప్పినట్లు చేయలేనివారా?; నీ బలములన్= నీ సేనలను; సమయింపన్= వధించటానికి; చాలెడు= కావలసిన; లావున్= బలమూ; వెరవున్= ఉపాయమూ; కలరకాక= ఉన్నవారే అగుదురుగాని; ఆ రాజుతోన్= తమ ప్రభువైన దుర్యోధనుడితో; పలికి= చెప్పి; వారికిన్= వారలకు; బాస= ప్రతిజ్ఞ; తప్పన్ వచ్చునె?= నెరవేర్చకుండటం న్యాయమా? (వారు తమ బాసను ఏనాటికీ నిలబెట్టుకోలేరని భావం.)

తాత్పర్యం: 'భీష్మాదులు గొప్ప శక్తియుక్తులు కలవారే. నీ సేనలను కూల్చదగిన పరాక్రమం ఉపాయం ఉన్నవారే అగుదురుగాక! కాని ఏలిక కిచ్చిన మాట నెరవేర్చుకొనాలి గదా!' (అది వారి తరం కాదని తాత్పర్యం.)

వ. అని దరహాసోల్లాస భాసిత వదనుండై. 423

ప్రతిపదార్థం: అని; దరహాస+ఉల్లాస+భాసిత వదనుండై= చిరునగవు యొక్క ప్రకాశంచేత ఒప్పుతున్న ముఖంకలవాడై.

తాత్పర్యం: అని అర్జునుడు చిరునవ్వుతో ఒప్పుతున్న ముఖంకలవాడై.

మ. 'అనుమానం బదియేల? నీమది మదీయ స్ఫార బాహాబలం
బు నిరూపింప దలంచి తేని విను; మేపుం జేవయుం జూపి కృ
ష్ణుని తోడ్పాటునఁ బేర్చి యేఁ గడగినం జూర్ణంబు గావింతు నొ
క్కనిమేషంబున దేవదానవులతోఁ గూడం ద్రిలోకంబునున్. 424

ప్రతిపదార్థం: నీ మదిన్= నీ మనస్సులో; అనుమానంబు+అది+ఏల?= సందేహ మెందుకు?; మదీయ= నా యొక్క; స్ఫార= అధికమైన; బాహాబలంబు= భుజ శక్తి; నిరూపింపన్= నిరూపణ చేయవలెనని; తలంచితి(వి)+ఏనిన్= నీవు భావించినట్లయితే; వినుము= చెప్పుతున్నాను ఆలకించుము; ఏపున్= విజృంభణం; చేవయున్= ధైర్యం; చూపి= కనబరచి; కృష్ణుని తోడ్పాటునన్= గోపాలదేవుడి సహాయంతో; పేర్చి= చెలరేగి; ఏన్= నేను; కడఁగినన్= పూనుకొంటే; ఒక్క నిమేషంబునన్= ఒక నిముసంలో; దేవదానవులతోన్+కూడన్= దేవతలతో రాక్షసులతో కూడ; త్రిలోకంబునన్= ముజ్జగాలను; చూర్ణంబు కావింతున్= పిండి చేస్తాను.

తాత్పర్యం: 'నీ మనసులో సందేహ మెందుకు? నా విస్తారమైన భుజశక్తి ఏపాటిదో తెలియవలెనని నీవు భావిస్తే చెప్పుతున్నాను వినుము. నా విజృంభణం, ధైర్యం కనబరచి శ్రీకృష్ణుడి సాయంతో చెలరేగి నేను కయ్యానికి పూనుకొంటే ఒక్క నిముసంలో సురాసురులతో కూడ మూడులోకాలను పిండిచేస్తాను.

వ. **అది యెట్లంటేని౹ గృత్రిమ కిరాతుండైన పశుపతి మెచ్చి జగత్సంహార సమయంబునం దాను బ్రయోగించునట్టి పాశుపత మహాస్త్రంబు నాకిచ్చె; నది నాయందు సన్నిహితంబయి యున్నయది గావున శత్రునిరాసం బనాయాసంబై యుండు; నప్పాశుపత మహనీయ ప్రభావంబు భీష్ముండున్నరూపెఱుంగఁడు, ద్రోణ కృపాశ్వత్థామలు నెఱుంగరు, కర్ణున కెఱుంగ నెంతదవ్వట్టి ఘోర సాధనంబున సమస్తంబును సమయించుట యుక్తంబు గాదు తక్కిన యాయుధంబులం బోరి వైరులం బరిమార్చినం బౌరుషంబు దీపించు నని తలంచెద; నప్పటికి వలయు విధం బయ్యెడు; నది యట్లుండె; నీవా రక్కడి వారికిం దక్కువవారే? భీమసేనుండు కవ లభిమన్యుండు ద్రౌపదేయులు సాత్యకి విరాట ద్రుపదులు ధృష్టద్యుమ్నుండు శిఖండి యుత్తమౌజుండు యుధామన్యుండు ఘటోత్కచుండు మొదలైన జగజెట్లున్నవారు; మఱియు ననేకులు వీరల యట్టివారలు కలరు; వారల నందఱం జెప్పనేల? యేనుంగువోలె నీలావు నీవెఱుంగవు దివిజులకు నజేయుండవు నీయొక్కనికిఁ ద్రిభువనంబు నెదురె నీవు నిక్కం బలుగవుగాక; నీ వలిగిన నెవ్వ రెట్లయ్యెదరో యటు సూడుము; నీ సైన్యంబుల నెవ్వరికి నేమి చేయవచ్చు మనకు విజయానందంబు సులభంబ' యని పలికె నని సంజయుండు ధృతరాష్ట్రున కెఱింగించె' నని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పుటయు.** **425**

ప్రతిపదార్థం: అది ఎట్లు+అంటేనిన్= ఎట్లా చూర్ణం చేయగలవని నీ వడిగితే; కృత్రిమ కిరాతుండు+ఐన= మాయాకిరాతుడైన (కపట కిరాత వేషంలో వచ్చిన); పశుపతి= పరమేశ్వరుడు; మెచ్చి= ప్రీతినొంది; జగత్+సంహార సమయంబునన్= లోకాలను సంహరించే ప్రళయకాలంలో; తాను; ప్రయోగించునట్టి; పాశుపత మహా+అస్త్రంబు; నాకున్; ఇచ్చెన్; అది; నాయందున్; సన్నిహితంబు+అయి+ఉన్నయది= సమీపించి ఉన్నది; కావునన్; శత్రునిరాసంబు= విరోధులను వధించటం; అనాయాసంబు+ఐ+ఉండున్= నాకు శ్రమలేనిదై ఉంటుంది; ఆ+పాశుపత మహనీయ ప్రభావంబున్= ఆ పాశుపతాస్త్రం యొక్క గొప్ప మహిమను; భీష్ముండు; ఉన్నరూపు+ఎఱుంగఁడు= కలరూపు తెలిసినవాడు కాడు; ద్రోణ కృప+అశ్వత్థామలున్; ఎఱుంగరు; కర్ణునకున్; ఎఱుంగన్+ఎంత దవ్వు?= తెలియుట అశక్యం; అట్టి; ఘోరసాధనంబునన్= భయంకరమైన అస్త్రంచేత; సమస్తంబును; సమయించుట= నిర్మూలించడం; యుక్తంబు+కాదు= సమంజసం కాదు; తక్కిన= మిగిలిన; ఆయుధంబులన్= యుద్ధోపకరణాల చేత; పోరి= పోరాడి; వైరులన్= విరోధులను; పరిమార్చినన్= చంపితే; పౌరుషంబు దీపించున్= నా పరాక్రమం ప్రకాశిస్తుంది; అని తలంచెదన్; అప్పటికిన్= ఆ సమయానికి; వలయు విధంబు+అయ్యెడున్= జరుగవలసినదేదో జరుగుతుంది; అది+అట్లుండెన్= ఆ విషయం ఆట్లా ఉండనీ; నీవారు= నీ సేనలోని వారు; అక్కడి వారికిన్= కౌరవసేనలో ఉన్న వారికంటె; తక్కువవారె?; భీమసేనుండు; కవలు= నకుల సహదేవులు; అభిమన్యుండు; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; సాత్యకి; విరాట ద్రుపదులు; ధృష్టద్యుమ్నుండు; శిఖండి; ఉత్తమౌజుండు; యుధామన్యుండు; ఘటోత్కచుండు; మొదలైన; జగజెట్లు+ఉన్నవారు= శూరాగ్రేసరులున్నారు; మఱియున్; అనేకులు= పలువురు; వీరల అట్టివారలు కలరు= భీమాదుల వంటివారున్నారు; వారలన్+అందఱన్+చెప్పన్+ఏల?= వారందరినీ పేరు పేరున పేర్కొనట మెందుకు?; ఏనుంగు పోలెన్= గజంవలె; నీ లావు= నీ శక్తి; నీవు+ఎఱుంగవు; దివిజులకున్= వేల్పులకు; నీవు అజేయుండవు= గెలువరానివాడవు; నీ+ఒక్కనికిన్; త్రిభువనంబు= ముజ్జగాలు; ఎదురె?= అడ్డమా?; నీవు; నిక్కంబు= నిజంగా; అలుగవు+కాక; అలిగినన్= కోపిస్తే; ఎవ్వరు+ఎట్లు+అయ్యెదరో+అటు+చూడుము= ఎవరు ఎట్లా నాశనమవుతారో ఆ తరువాత చూడుము; నీ సైన్యంబులన్; ఎవ్వరికిన్; ఏమి చేయన్‌వచ్చున్;

మనకున్; విజయ+ఆనందంబు= గెలుపు వలని సంతోషం; సులభంబ= తేలికగా సమకూడగలదు; అని పలికెన్+అని= అర్జునుడు ఇట్లా పలికినాడని; సంజయుండు ధృతరాష్ట్రునకున్; ఎఱింగించెన్ అని; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజ పుత్రుడైన జనమేజయుడికి; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: విజయానందం తేలికగా మన కెట్లా కలుగుతుందని నీవు సందేహిస్తే చెప్పుతాను వినుము. 'కపట కిరాతుడై వచ్చిన ఈశ్వరుడు నాతో పోరాడి మెచ్చి, సకల భువనాలను సంహరించటానికి ప్రళయ కాలంలో ప్రయోగించే పాశుపతాస్త్రాన్ని నా కనుగ్రహించాడు. అది నా దగ్గర సిద్ధంగా ఉన్నది. కనుక శత్రు నిర్మూలనానికి నేను శ్రమపడనక్కర లేదు. పాశుపతాస్త్ర మహా మహిమ ఎట్లాంటిదో భీష్ముడికి తెలియదు. ద్రోణాచార్యులకూ, కృపుడికీ, అశ్వత్థామకూ తెలియదు. కర్ణుడికి అసలే తెలియదు. అంత భయంకరమైన ఆ మహాస్త్రంతో అందరినీ దగ్ధం చేయటం సమంజసం కాదు. తక్కిన ఆయుధాలతో విరోధుల నెదిరించి చంపితే మన పరాక్రమ మెటువంటిదో లోకానికి వెల్లడవుతుంది అని నా అభిప్రాయం. ఆ సమయానికి జరగవలసిన దేదో జరుగుతుంది. ఇపు డా విషయ మెందుకు? నీ సైన్యంలోని వీరులు కురుసేనలోని శూరుల కంటె తక్కువ వారని తలంచవద్దు. భీమసేనుడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ద్రౌపది కుమారులు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, ఘటోత్కచుడు మొదలైనవారంతా జగజెట్లు. వీరివంటి వారెందరో మన పక్షంలో ఉన్నారు. అందరినీ పేరు పేరున పేర్కొనలేను. ఏనుగువలె నీ శక్తి ఏమిటో నీ వెరుగవు. నిన్ను దేవతలు కూడా జయించలేరు. ముల్లోకాలు నీముందు నిలిచి నిన్నెదిరించలేవు. నీకు నిజంగా కోపం రాదు. వస్తే ఎవరేమవుతారో చెప్పనక్కరలేదు. మనకు విజయానందం సులువుగా చేకూరుతుంది' అని అర్జునుడు ధర్మజుడితో పలికాడని సంజయుడు ధృతరాష్ట్రుడికి వినిపించిన విషయం వైశంపాయన మహర్షి జనమేజయుడికి చెప్పాడు.

విశేషం: పాశుపతాస్త్ర లాభం: పాండవులు ద్వైతవనంలో నివసిస్తుండగా వ్యాసమునీంద్రుడు వచ్చి 'ప్రతిస్మృతి' అనే యోగవిద్యను ధర్మజుడికి ఉపదేశించి, ఈ విద్యవలన అర్జునుడు అధిక తపోవీర్యవిభవుడై ఇంద్రవరుణ కుబేరాది దేవతలనూ, ఈశ్వరుడినీ ప్రత్యక్షం చేసికొని, వారి వలన దివ్యాస్త్రాలు పొంది శత్రువులను జయిస్తాడని చెప్పాడు. పాండవులు ద్వైతవనం విడిచి కామ్యక వనం చేరారు. ధర్మజుడక్కడ అర్జునుడికి ప్రతిస్మృతి నుపదేశించి ఉత్తర దిశగా వెళ్ళి తపోయోగ బలంతో ఇంద్రుడిని ప్రత్యక్షం చేసికొని ఆయుధాలను గడించి ఈశ్వరుడిని ఆరాధించుమని బోధించి పంపాడు. అర్జునుడు ఇంద్రకీలాద్రి మీద ఇంద్ర దర్శనం చేశాడు. పరమాస్త్ర లాభానికై పరమేశ్వరుడిని ప్రసన్నుడిని చేసికొనుమని సురపతి చెప్పగా విజయుడు తపశ్చర్యకై హిమశైల శిఖరానికి వెళ్ళాడు. అక్కడ పాండవ మధ్యముడు కఠోరతపం సాగిస్తుండగా మునులు విస్మయపడి పార్థుడి కోరిక తీర్చి తపోభారాన్ని వారించుమని శంకరుడిని వేడుకొంటారు.

వెంటనే పరమేశ్వరుడు మాయా కిరాతుడయ్యాడు. పార్వతి బోయతగా మారుతుంది. భూతగణాలు ఎరుకలయ్యారు. వేట నెపంతో వారు అర్జునుడి ఆశ్రమ భూమిలో ప్రవేశించారు. ఈశ్వరచోదితుడై మూకాసురుడు సూకరమై సవ్యసాచిని చంపటానికి రాగా అతడా పందిపై బాణం విడిచాడు. అపుడే కిరాతరాజు కూడా ఆ వరాహం మీద అదే సమయంలో బాణం విడిచాడు. ఇరుశరాలు నాటగా మూకాసురుడు సూకరరూపం వదలి అదృశ్యమయ్యాడు. అర్జునుడు ఆశ్చర్యపడుతుండగా కపట కిరాతుడు ఎదుట నిలిచాడు. 'నేను కొట్టిన పందిని కొట్టి మృగయాధర్మం అతిక్రమించావు కనుక నిన్ను నా నిశిత శరాల పాటు చేస్తా'నని అర్జును డన్నాడు. 'నేనే ఆ మృగాన్ని ముందు కొట్టాను. అది నా బాణం చేతనే నిహతమైంది. ముందు కొట్టానని లేని శౌర్యం ఎందుకు ప్రకటించుకొంటావు? వీరుడివైతే నాతో కదనం సల్పు' మంటూ పినాకి కిరీటి మీద బాణాలు

వేశాడు. అర్జునుడు ఎన్నో వాడి సాయకాలు కిరాతుడి మీద ప్రయోగించాడు. బోయ ఏమాత్రం చలించలేదు. మరెన్నో దివ్యబాణాలు పార్థుడు వర్షించాడు. అన్నీ వ్యర్థమయ్యాయి. అగ్నిదేవు డిచ్చిన అక్షయ బాణతూణీరాలలో అతడికి అమ్ములు కనిపించలేదు. గాండీవ మెత్తుకొని కపర్దిపైకి దుమికాడు. అది కూడా మాయమైంది. ఖడ్గంతో బోయ తలపై వ్రేటు వేశాడు. నిరుపయోగమయింది. వృక్షాలతో రాళ్ళతో తలపడ్డాడు. ప్రయోజనం లేకపోయింది. కడకు కపట కిరాతుడిని పెనగి పట్టుకొని ముష్టియుద్ధానికి దిగాడు. ఈశ్వరుడు తన దివ్యదేహంతో అర్జునుడి దేహాన్ని మర్దించాడు. పార్థుడు నేలబడి మూర్ఛిల్లాడు. చంద్రధరుడు నిజరూపంతో సవ్యసాచిమ్రోల నిలిచి 'నీవంటి శౌర్య ధైర్యవంతులు క్షత్రియులలో మరెవ్వరూ లేరు. నీ తపస్సుకు మెచ్చి వరమివ్వటానికి వచ్చాను. కోరుకొమ్మ'న్నాడు. అర్జునుడు పరమ శివుడిని ప్రస్తుతించి 'పాశుపతాన్ని ప్రసాదిస్తే దానితో దైత్యదానవ యక్షరాక్షసగణాన్నీ, భీష్మద్రోణాదులనూ జయిస్తాను. కర్ణుడిని వధిస్తాను. అనుగ్రహించు' మని వేడుకొన్నాడు. విశుద్ధచిత్తుడైన పార్థునకు సంధాన మోక్షణ సంహార సహితంగా పశుపతి పాశుపతాస్త్రమిచ్చి 'అర్జునా! దీనికి ఎక్కడా అసాధ్యం లేదు. అల్పుల మీద ప్రయోగిస్తే జగత్సంహారం చేస్తుంది. ఈ దివ్యాస్త్రంతో నీవు సమస్త లోకాలను జయిస్తా' వని చెప్పి అంతర్ధానమయ్యాడు.

ఆశ్వాసాంతము

చ. కమల భవాది దైవత ముఖ స్ఫుట నిర్గళిత ప్రశస్త వా
గమృత రసప్రసార కలితాంచిత సేకవిధి ప్రకర్ష సం
గమ సముదీరితోల్లసన కందళిత ప్రహసద్దయాలతా
సుమహ దుపాశ్రయ ప్రమద శోభిత విశ్వజగన్మధువ్రతా! 426

ప్రతిపదార్థం: కమలభవ+ఆది= నారాయణుడి నాభి పద్మం నుండి జన్మించిన బ్రహ్మదేవుడు మొదలుగాగల; దైవత= వేల్పుల యొక్క; ముఖ= మోముల నుండి; స్ఫుట= విశదంగా (నిరర్గళంగా); నిర్గళిత= వెడలిన; ప్రశస్తవాక్= ప్రసిద్ధిగాంచిన వచనము లనెడి; అమృతరసప్రసార= సుధాద్రవం యొక్క ప్రవాహంతో; కలిత= కూడినట్టి; అంచిత సేకవిధి= చక్కగా తడుపుట అనేపనియొక్క; ప్రకర్ష= విశేషమైన; సంగమ= పొందికతో; సముదీరిత= లెస్సగా వెలువడిన; ఉల్లసన= వికాసంతో; కందళిత= అంకురించినట్టి; ప్రహసత్= పూస్తున్నట్టి; దయాలతా= కారుణ్యమనెడు తీగకు; సుమహత్+ఉపాశ్రయ= మిక్కిలి గొప్ప ఆధారంగా ఉండటం వలన కలిగిన; ప్రమద= సంతోషంచేత; శోభిత= అలరారుతున్న; విశ్వజగత్= సమస్త ప్రపంచమనెడు; మధువ్రతా!= తుమ్మెదగలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! పరమేష్ఠి ప్రముఖులైన దేవతలు శ్రేష్ఠములైన తమ వాక్కులతో నిన్ను కొనియాడుతుంటారు. వారొనరించే స్తోత్రాలు సుధాద్రవరూపాలు. వారి వచనామృతంతో మిక్కిలి తడుపబడటం వలన నీ కరుణ అనే తీగ అంకురించి, వికసించి, విరబూస్తుంది. కారుణ్యలతకు నీవు ఆధారభూతుడవైనందున సమస్త ప్రపంచము తుమ్మెదవలె నిన్ను ఆశ్రయించి, సేవించి సంతోషంతో అలరారుతుంది.

విశేషం: లత అంకురించి పుష్పించటానికి జలసేచనం ముఖ్యం. హరిహరనాథుడి కరుణాలత బ్రహ్మాది దేవతల స్తోత్రవచనాలనే అమృతరస సేకంతో పెంపొందుతుంది. పుష్పాల యొక్క సౌగంధ్య మకరందాదులచేత తుమ్మెదలు ఆకర్షించబడి లతను ఆశ్రయించినట్లు సకల లోకాలు హరిహరనాథుడి కృపనాశ్రయించి ఆనందంతో విలసిల్లుతున్నవని మనోజ్ఞమైన రూపకంతో తిక్కన సోమయాజి హరిహరాత్మకమైన పరబ్రహ్మను కీర్తించాడు.

క. సమయ బహుత్వారణ్య । భ్రమణ పరిశ్రామ్య దంతరంగ నితాంతో
త్తమ సరళమార్గ దర్శన । సమర్థ పుణ్యాభిధాన సకృదుచ్చరణా! 427

ప్రతిపదార్థం: సమయ బహుత్వ= బహుళాచారాలనెడి (నియమాల యొక్క విస్తృతి అనే); అరణ్య= అడవులలో; భ్రమణ= సంచరించటంచేత; పరిశ్రామ్యత్= అలసట చెందిన; అంతరంగ= హృదయానికి; నితాంత= అధికమైన; ఉత్తమ= శ్రేష్ఠమైన; సరళమార్గ దర్శన= ఋజువైనదారిని చూపటంలో; సమర్థ= శక్తిగలిగిన; పుణ్య+అభిధాన= పావనమైన నామముయొక్క; సకృత్+ఉచ్చరణా!= ఒకే ఒకసారి ఉచ్చరించుట కలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! పరమ పురుషార్థమైన ముక్తిని సాధించటానికి అనేక సిద్ధాంతాలు, శాస్త్ర నియమాలు అనే అరణ్యాలలో సంచరించి సంచరించి నా హృదయం బడలిక చెందింది. చిట్టచివరకు నీ నామం ఒక్కసారి నోటితో పలకటమే ముక్తికి సులభోపాయమని తోచింది.

విశేషం: అనేక శాస్త్ర నియమాలను అనుసరించటం శ్రమతో కూడినపని. ఒక్కసారి హరిహరనాథ నామమును నోటితో ఉచ్చరిస్తే చాలు. మనుజుడు ముక్తుడౌతాడనీ, ఆ నామాని కంతటి మహిమ కలదనీ, నామోచ్చారణ మాత్రాననే దైవం ప్రసన్నుడగుననీ, భవసంతరణానికి నామస్మరణకంటె అన్యమగు సులభోపాయం లేదని తిక్కన విశ్వసించాడు.

మాలిని.

అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారో
త్సవ గురుకరుణా విస్తార గాఢ ప్రశాంతి
ప్రవణ హృదయ పద్మోద్భాసి విజ్ఞానసారా
వ్యవహిత పరమానందానుభూత్యేకరూపా! 428

ప్రతిపదార్థం: అవగమిత= తెలియజేయబడిన; రహస్య= గూఢమైన; అష్ట+అంగ= యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణ సమాధులను ఎనిమిదంగాలతో కూడిన యోగం యొక్క; సమ్యక్+ప్రకార= చక్కని విధమనెడు; ఉత్సవ= ఆనందంకల; గురుకరుణా= గురువు యొక్క దయచేత; విస్తార= మిక్కుటమైన; గాఢప్రశాంతి= పరమశాంతికి; ప్రవణ= ఉన్ముఖమైన; హృదయ పద్మ= మనఃకమలమందు; ఉద్భాసి= లెస్సగా వెలుగొందునట్టి; విజ్ఞానసార= అనుభవసహితమైన జ్ఞానసారమునకు; అవ్యవహిత= ఎడం లేని; పరమ+ఆనంద= బ్రహ్మానందము యొక్క; అనుభూతి= అనుభవమే; ఏకరూపా!= ముఖ్యమైన స్వరూపంగా కలవాడా!

తాత్పర్యం: దేవా! యోగివర్యులు ఆచార్యుడి అనుగ్రహ విశేషం వల్ల అష్టాంగ విద్యారహస్యాలను చక్కగా గ్రహించిన వెంటనే వారి హృదయాలలో పరమ శాంతి, పరమ విజ్ఞానం నెలకొంటాయి. ఆ వెంటనే వారు నీ స్వరూపమైన అవ్యయానందాన్ని అనుభవిస్తారు.

విశేషం: అష్టాంగయోగానుష్ఠానం వలన గాఢమైన హృదయశాంతి ఏర్పడి పరమాత్మ యొక్క విజ్ఞానానందస్వరూపానుభూతి లభిస్తుంది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున నుద్యోగ పర్వమునందు సర్వంబును జతుర్థాశ్వాసము.

శ్రీ మదాంధ్ర మహాభారతము ఉద్యోగపర్వము సమాప్తము; ఆదిపంచకము సంపూర్ణము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవులకు చెలికాడు, కొమ్మన మంత్రికి కుమారుడు, పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడు అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని ఉద్యోగపర్వంలోని నాల్గవ ఆశ్వాసం ముగిసింది. ఉద్యోగపర్వం సమాప్తమయింది.

ఉద్యోగపర్వంలోని చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలోని ఉద్యోగపర్వం ముగిసింది.

ఆదిపంచకం సంపూర్ణం.

\- - -

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

పద్య - గద్య ప్రథమపాద సూచి

ధ

న

ప